ఈనాడు
అల్లూరి సీతారామరాజు

కాలం చెల్లిన బండి.. మార్చాలండీ!

పద్మాపురం ఉద్యానంలో కాలం చెల్లిన టాయ్‌ట్రైన్‌ని మార్చాలని పర్యాటకులు కోరుతున్నారు. ఈ ఉద్యానంలో సందర్శకులు విహరించేందుకు టాయ్‌ట్రైన్‌ని సుమారు 15 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. నాటి నుంచి దీన్నే వినియోగిస్తున్నారు. ఇది ప్రస్తుతం మూలకు చేరింది. కొత్తది ఏర్పాటు చేయకుండా పాతదానికే మరమ్మతులు చేసేందుకు అధికారులు సిద్ధపడుతున్నారు. ప్రస్తుతం టాయ్‌ట్రైన్ లేకపోవటంతో పర్యాటకులు నిరాశగా వెనుదిరుగుతున్నారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్పందించి నూతన టాయ్‌ట్రైన్‌ని ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

– అరకులోయ, న్యూస్‌టుడే

10 నుంచి 'పోస్టల్' టోర్నమెంట్

విశాఖపట్నం, న్యూస్‌టుడే: తపాలా ఉద్యోగులకు జాతీయ సాయి టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నట్లు పోస్టుమాస్టర్ జనరల్ వి.ఎస్.జయశంకర్ తెలిపారు. ఎంవీపీకాలనీ జిల్లా ప్రధాన తపాలా కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పోటీల లోగో, టీజర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు ఎంవీపీకాలనీ ఎస్-3 స్పోర్ట్స్ ఎరినాలో పోటీలు జరుగుతాయన్నారు. 14 రాష్ట్రాల నుంచి 3వేల మంది క్రీడాకారులు హాజరవుతారని చెప్పారు. అసిస్టెంట్ డైరెక్టర్ కె.వి.డి. సాగర్, సీనియర్ పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ ఎన్.వి.ఎస్.ఎన్.రాజు పాల్గొన్నారు.

శివోహం.. భజేహం

కాశీపట్నం శివాలయం వద్ద వరుసలో వేచి ఉన్న భక్తులు

అనంతగిరి, న్యూస్‌టుడే: కార్తిక రెండో సోమవారాన్ని పురస్కరించుకుని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రముఖ పుణ్యక్షేత్రం కాశీపట్నంలోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయానికి విజయనగరం, శృంగవరపుకోట, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు. గోస్తనీ నది వద్ద పూజలు చేశారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ఎస్సై శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

కట్టుదిట్టమైన బందోబస్తు

పాడేరు, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ ఘటన నేపథ్యంలో జిల్లాలోని శైవక్షేత్రాల్లో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అమిత్ బర్దార్ పేర్కొన్నారు. రెండో కార్తిక సోమవారం సందర్భంగా పాడేరు, హుకుంపేట, సీలేరు ప్రాంతాల్లోని ప్రధాన శివాలయాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పాడేరు పట్టణంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. సంగోడి గ్రామంలోని శివాలయాన్ని భక్తుల తాకిడి పెరిగింది.

కొండచరియలు అడ్డం.. కదలదే వాహనం!

అనంతగిరి, న్యూస్‌టుడే

మొంథా తుపాను ప్రభావం తగ్గి నాలుగు రోజులు అవుతున్నప్పటికీ.. అది మిగిల్చిన గాయాలు మాత్రం కళ్లెదురుగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా రహదారులపై తుపాను పంజా విసిరింది. గ్రామాలకు చేరుకునే రహదారులపైకి కొండచరియలు జారిపడి రాకపోకలు నిలిచిపోయాయి. వాటిని తొలగించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

దిగువశోభ- ఎగువశోభల మధ్య రోడ్డుపై కొండచరియలు

అనంతగిరి మండలం ఎగువశోభ రహదారిలో గత నెల 29న వర్షాల కారణంగా కొండచరియ జారి మట్టి, బండరాళ్లు పడ్డాయి. ఎగువశోభ, దిగువశోభ గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పర్యాటక కేంద్రం బొర్రాగుహలకు ఈ రహదారి మీదుగా నేరుగా బీసుపురం చేరుకోవచ్చు. స్థానికులు, పర్యాటకులు అనంతగిరి మీదుగా చుట్టూ తిరిగి రాకపోకలు సాగించాల్సి వస్తోంది

అధికారులు స్పందించాలి

రహదారులపై కొండ చరియలు ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు నాలుగు రోజులు గడిచినా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. స్థానికులతోపాటు పర్యాటకులకు ఇబ్బందులు తప్పటం లేదు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– మట్టం శ్యామ్, ఎగువశోభ

బొర్రా మార్గంలో..

ప్రముఖ పర్యాటక కేంద్రం బొర్రా గుహలకు వెళ్లే మార్గంలో తుపానుకు ముందే కొంత మట్టి జారిపడింది. తుపానులో మరికొంత జారిపోయాయి. రైల్వే గేటుకు కూతవేటు దూరంలో ఇది జరగ్గా.. ఒకవైపు రహదారి మొత్తం మూసుకుపోయింది. అధిక వాహనాలు వచ్చే సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తున్నాయి. ఈ కొండచరియ జారిన ప్రాంతానికి సమీపంలోనే పెద్ద వృక్షం పడిపోయేందుకు సిద్ధంగా ఉండి ప్రయాణికులను ఆందోళనకు గురి చేస్తోంది. ఈ ప్రదేశం రైల్వేశాఖకు చెందినదని స్థానిక అధికారులు.. తమది కాదని రైల్వే శాఖ సిబ్బంది చెబుతున్నారు. దీనిపై ఎటువంటి చర్యలు చేపట్టకుండా వదిలివేశారు.

★ పెదకోట పంచాయతీ చటాకంబ గ్రామానికి వెళ్లే రహదారిలోనూ కొండచరియలు రహదారిపైకి జారిపడ్డాయి. పెద్దపెద్ద బండరాళ్లు నేటికీ రహదారిపైనే ఉండటంతో రాకపోకలు నిలిచిపోయాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొనలేం.. తినలేం!

పెరిగిన కూరగాయల ధరలు

పాడేరు పట్టణం, రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఉత్పత్తులు తగ్గిపోయాయి. దీంతోపాటు కార్తిక మాసం నేపథ్యంలో కూరగాయలకు డిమాండ్ పెరిగింది. మార్కెట్‌లో కూరగాయల ధరలు మండుతున్నాయి. కొనలేక వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు.

★ వారం రోజుల క్రితం వరకు కిలో రూ 40, రూ 50 ఉన్న కూరగాయల ధరలు ఇప్పుడు రెట్టింపయ్యాయి. ఏజెన్సీలో పలు మండలాల్లో స్థానికంగా పండే కూరగాయలే కాక.. ఇతర ప్రాంతాల నుంచి ఉల్లిపాయలు, ఇతర ఉత్పత్తులు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. రవాణా ఛార్జీలు కూడా ధరల పెరుగుదలపై ప్రభావం చూపుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

కూరగాయల ధరలు (కేజీకి రూ. లలో)

రకం	ధర
చిక్కుడుకాయలు	160
అల్లం	120
బీరకాయలు	80
బెండకాయలు	80
వంకాయలు	60
టమాటాలు	60
దొండకాయలు	60
క్యారెట్	80
ఉల్లిపాయలు	30
బంగాళాదుంపలు	40
చేమదుంపలు	80
ఆకుకూరల కట్ట	30

★ ప్రాంతాన్ని బట్టి కిలో రూ.5 నుంచి రూ.10 వరకు వ్యత్యాసం ఉంటుంది.

చర్మ సంబంధ సమస్యలా.. వైద్యుల్లేరు!

రంపచోడవరం, ఎటపాక, న్యూస్‌టుడే

డివిజన్ కేంద్రాలుగా ఉన్న రంపచోడవరం, చింతూరు ఆసుపత్రుల్లో చర్మ వ్యాధుల వైద్యనిపుణుల్లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వారంతా అటు భద్రాచలమో, ఇటు రాజమహేంద్రవరమో వెళ్లి ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోంది. అంతదూరం వెళ్లలేక కొందరు ఆర్‌ఎంపీలు, నాటు వైద్యులను సంప్రదిస్తున్నారు. వారిచ్చే మందులు వాడినా తగ్గడం లేదని వాపోతున్నారు.

★ ప్రాంతీయ ఆసుపత్రుల్లో తప్పనిసరిగా చర్మ వ్యాధుల వైద్య నిపుణులు ఉండాలి. రంపచోడవరం ఆసుపత్రిలో గతంలో పనిచేసిన వైద్యులు రెండు నెలల కిందట బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేసే డాక్టరే చింతూరు ఆసుపత్రిలోనూ వారంలో రెండు రోజులు సేవలందించే వారు. ఆయన బదిలీతో రెండు చోట్లా సేవలు నిలిచిపోయాయి. ఆసుపత్రికి వచ్చే రోగులను జనరల్ ఫిజీషియన్లు పరీక్షించి మందులు ఇస్తున్నారు.

ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

★ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ వైద్య సేవలు సక్రమంగా అందడం లేదు. చింతూరు డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు 12 ఉన్నాయి. గౌరిదేవిపేట ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులున్నారు. 40కి పైగా గ్రామాల నుంచి రోగులు వైద్య సేవల కోసం ఇక్కడకు వస్తుంటారు. ప్రసవాలు, పాముకాటు, అత్యవసర సేవలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది రిస్క్ తీసుకునే పరిస్థితి లేదు. నెల్లిపాక ఆరోగ్య కేంద్రం పరిధిలో 53 గ్రామాలున్నాయి. ఇద్దరు వైద్యులకు ఒక్కరే ఉన్నారు. లక్ష్మీపురం పీహెచ్‌సీ పరిధిలో 23 గ్రామాలు ఉండగా.. అక్కడా ఇదే పరిస్థితి.

బాధితుల్లో వసతిగృహ విద్యార్థులే అధికం

★ రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రికి చర్మ సంబంధ వ్యాధులతో బాధపడుతున్న రోగులు ప్రతిరోజు 70 మంది వరకు వచ్చేవారు. వీరిలో ఎక్కువగా ఆశ్రమ, గురుకుల పాఠశాలల విద్యార్థులే ఉండేవారు. రెండు నెలలుగా వైద్యుడు లేకపోవడంతో వారంతా ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. సమస్య తగ్గకపోగా చేతిచమురు వదులుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రాంతీయ ఆసుపత్రుల్లో వైద్యుల పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని వారంతా కోరుతున్నారు.

కారుచీకటిలో కలప అక్రమ రవాణా

ముంచంగిపుట్టు మండలంలోని ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాల్లో కలప అక్రమ రవాణా గుట్టుచప్పుడు కాకుండా జోరుగా సాగుతోంది. వనుగుమ్మ పంచాయతీ పరిధిలోని డుడుమ జలాశయం మీదుగా ప్రతిరోజూ భారీగా కలప ట్రాక్టర్లలో తరలిపోతోంది. ఈ ప్రాంతంలో రాత్రివేళ అధికారుల నిఘా ఉండదు. దీనిని అవకాశంగా చేసుకుని ఒడిశాలోని లమతపుట్‌కు వీటిని తరలిస్తున్నట్లు సమాచారం. రోజూ పలు ట్రాక్టర్లు తరలిపోతున్నా అధికారులు నిఘా పెట్టకపోవడం గమనార్హం.

–ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే

రెండు గంటల్లోనే విద్యార్థినుల ఆచూకీ గుర్తింపు

చింతపల్లి, న్యూస్‌టుడే: సంక్షేమ ఆశ్రమాల విద్యార్థినులు ఉపాధ్యాయులకు చెప్పాపెట్టకుండా బయటకు వెళ్లిపోతున్నారు. అది కూడా మహిళలకు ప్రభుత్వం కల్పించిన ఉచిత బస్సుల్లో కావడం ఆందోళన కలిగిస్తోంది. రెండు రోజుల క్రితం గూడెంకొత్తవీధి మండలం రింతాడ గిరిజన సంక్షేమ ఆశ్రమానికి చెందిన ముగ్గురు విద్యార్థినులు సిబ్బందికి చెప్పకుండా ఉచిత బస్సు ఎక్కి విశాఖపట్నం వెళ్లిపోయారు. పోలీసులు చొరవ తీసుకుని వారి ఆచూకీని కనుగొని క్షేమంగా ఉపాధ్యాయులకు అప్పగించిన విషయం తెలిసిందే. సరిగ్గా ఇటువంటి ఘటనే సోమవారం చింతపల్లి మండలంలోనూ జరిగింది. వంగసార గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఐదుగురు విద్యార్థినులు ఎవరికీ చెప్పకుండా బయటకు వచ్చేశారు. ఈ విషయాన్ని సకాలంలో గుర్తించిన సిబ్బంది వెంటనే చింతపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తక్షణమే స్పందించిన పోలీసులు ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల్లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఐదుగురు విద్యార్థినులు ఉచిత బస్సుల్లో కనిపించగా వారిని పట్టుకుని రెండు గంటల వ్యవధిలోనే తిరిగి పాఠశాల సిబ్బందికి అప్పగించినట్లు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. చేతిలో ఖర్చులకు డబ్బులు లేకపోయినా బస్సుల్లో మహిళలకు ఉచితంగా రవాణా కల్పించడంతో కొందరు విద్యార్థులు తెలిసీ తెలియని వయసులో ఇలా బయటకు వెళ్లిపోతున్నారని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఆందోళన చెందుతున్నారు.

కళా ఉత్సవ్‌తో ప్రతిభకు ప్రోత్సాహం

ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్యవిన్యాసం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: గిరిజన విద్యార్థుల ప్రతిభా పాటవాలను ప్రోత్సహించేందుకే కళా ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు గురుకులాల సంయుక్త కార్యదర్శి వై.వి.ఎస్.ప్రసాద్ చెప్పారు. మారేడుమిల్లిలో మూడు రోజులపాటు జరగనున్న 'ఏకలవ్య పాఠశాలల కళా ఉత్సవ్-2025' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంపీపీ లలితకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నెస్ట్ ప్రతినిధి కృష్ణారావు, ఏడీఎంహెచ్‌ఓ సరిత తదితరులు ప్రసంగించారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. సర్పంచి జాకబ్, వైస్ ఎంపీపీ రవికుమార్, గురుకులాల డిప్యూటీ కార్యదర్శులు కిశోర్‌బాబు, మధుసూదన్‌వర్మ, ఉప సంచాలకులు రుగ్మంగదయ్య, ప్రిన్సిపల్ శంకరప్రసాద్, ఎంపీడీఓ రవికిశోర్, తహసీల్దారు బాలాజీ, సీఐ గోపీనరేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సంప్రదాయ వస్త్రధారణలో బాలికలు

ఆసుపత్రికి వెళ్లే దారిలేక ఆగిన ఊపిరి

అనంతగిరి, న్యూస్‌టుడే: గెడ్డ ఉద్ధృతితో ఆసుపత్రి చేరే దారిలేక నాలుగు రోజుల క్రితం ఓ వృద్ధుడు మరణించిన ఘటన మరువక ముందే అదే గ్రామంలో మరో సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదకోట పంచాయతీ చింతలపాలెం గ్రామానికి చెందిన సప్పి గంగమ్మ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం ఆయాగా పనిచేస్తోంది. కొద్దిరోజులుగా ఈమె అనారోగ్యంతో బాధపడుతోంది. ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు గెడ్డ ఉద్ధృతి తగ్గకపోవటంతోపాటు మరో మార్గం లేకపోవడంతో బంధువులు ఇంటి వద్దనే ఉంచేశారు. వైద్యం అందించే అవకాశం లేకపోవడంతో పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి మృతి చెందినట్లుగా స్థానికులు తెలిపారు. రహదారి సౌకర్యం లేని కారణంగా ఇబ్బందులు పడుతున్నామని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు.

ఏయూలో కెరీర్ ప్లానింగ్ కేంద్రం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కెరీర్ ప్లానింగ్ డెవలప్‌మెంట్ సెంటర్ (సీపీడీసీ)ని సోమవారం ప్రారంభించారు. సాగరతీరంలోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ సీపీడీసీ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆచార్యులు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఉద్యోగాలు కల్పించే సంస్థల ఆలోచనా విధానంలో ఎన్నో మార్పులు వస్తున్నాయన్నారు. వాటికి అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలు, సామర్థ్యాలను వృద్ధి చేసుకోవాలని చెప్పారు. ప్రాథమిక సాంకేతిక అంశాలపై అవగాహన, సమస్యలను పరిష్కరించే సామర్థ్యాలు, సరైన దృక్పథం, నేర్చుకునే మనస్తత్వం, కష్టపడి పనిచేసే స్వభావం..తదితర అంశాలు కెరీర్ ప్లానింగ్‌లో కీలకపాత్ర పోషిస్తాయని చెప్పారు. ప్లేస్‌మెంట్ అధికారి వి.ఆర్.రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఇంటర్న్‌షిప్ సమయంలో ఉద్యోగావకాశాలు కూడా లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.కింగ్, ప్రిన్సిపాళ్లు ఆచార్య జి.శశిభూషణరావు, ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్య జి.గిరిజా శంకర్, ఆచార్య ఎంవీఆర్ రాజు, ఆచార్య కె.సీతామణిక్యం, ఆచార్య ఆర్.పద్మశ్రీ పాల్గొన్నారు.

సమయానికి రాకుంటే చిక్కులే!

ఉపాధ్యాయుల ముఖ హాజరుపై ఆరా

పాడేరు/పట్టణం, న్యూస్‌టుడే

సర్కార్ బడుల సంస్కరణలో భాగంగా విద్యాశాఖ పలు కీలక నిర్ణయాలకు పదును పెడుతోంది. ఇప్పటికే పాఠశాలలో విద్యార్థుల ప్రగతికి సంబంధించి వినూత్న నిర్ణయాలను అమలు చేస్తున్న విద్యాశాఖ తాజాగా ఉపాధ్యాయుల సమయపాలనపై దృష్టి పెట్టింది. ఇకపై ప్రతిరోజూ ఉపాధ్యాయులు నమోదు చేస్తున్న ఫేషియల్ అటెండెన్స్‌ను (ముఖ ఆధారిత హాజరు) కమిషనరేట్ ఆధ్వర్యంలో పర్యవేక్షిస్తుండటం గమనార్హం. పలుచోట్ల ఎటువంటి సాంకేతిక, అంతర్జాల సమస్యలు లేకపోయినా ఉపాధ్యాయులు ఉదయం 9.30 గంటలు దాటిన తర్వాత బడులకు రావడంపై కమిషనరేట్ ఆరా తీస్తోంది. రానున్న రోజుల్లో ఇలాంటి వారి నుంచి వ్యక్తిగత వివరణ కోరేందుకూ సిద్ధమవుతున్నారు.

పనిదినాల పరిశీలన...

విద్యార్థులకు క్రమశిక్షణ, సమయ పాలన నేర్పించాల్సిన ఉపాధ్యాయులే బడులకు ఆలస్యంగా వస్తే విద్యార్థులకు ఎటువంటి సంకేతాలు వెళతాయనే కోణంలో పాఠశాల విద్యాశాఖ ఆలోచన చేస్తోంది. ప్రత్యేక పరిస్థితుల్లో తప్పితే రోజూ ఉపాధ్యాయులు ఉదయం 9.10 గంటల లోపు ఫేషియల్ హాజరు వేయాల్సి ఉంది. సాయంత్రం వేళలో ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్నం 3.30 గంటల దాటిన తర్వాత 'ఔట్-కమ్' హాజరు నమోదు చేయాలి. అదే ఉన్నత పాఠశాలలైతే సాయంత్రం 4.00 గంటలు దాటిన తర్వాత హాజరు వేయాలి. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇప్పటివరకూ వంద రోజుల పని దినాలను కమిషనరేట్ పరిశీలిస్తే వారికి ఆశ్చర్యకరమైన గణాంకాలు బయట పడ్డాయి. ఉదయం 9.30 గంటలు దాటిన తర్వాత హాజరు వేస్తున్న వారే అధికంగా ఉండడాన్ని గుర్తించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు 1.94 లక్షలు మంది ఉంటే బడులు తెరిచిన 100 రోజులు దాటుతున్నా నేటికి వందలాది మంది నిర్ణీత సమయం దాటిన తర్వాతే హాజరు నమోదు చేస్తుండడం విశేషం.

★ జిల్లావ్యాప్తంగా ఉన్న 22 మండలాల్లోనూ మండల కేంద్రాలు తప్పించి మిగిలిన గ్రామాల్లో అంతర్జాల సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. ఈ విషయం పరిగణనలోకి తీసుకోకుండా జిల్లా విద్యాశాఖ మారుమూల గ్రామాల్లో ఉన్న పాఠశాలలకూ ముఖహాజరు తప్పనిసరని ఆదేశించింది. సాంకేతిక సమస్యలు ఉన్న చోట్ల ఉపాధ్యాయులు సకాలంలో బడికి చేరుకున్నా ఆలస్యంగానే చేరుకున్నట్లు నమోదవుతోంది.

జిల్లాలో మండలాలు	అన్నీ యాజమాన్య పాఠశాలలు:	అన్ని యాజమాన్యాల్లో ఉపాధ్యాయులు	విద్యార్థులు :
22	2756	3 వేలకు పైగా	లక్షన్నర వరకూ

పాఠశాల బయట ముఖహాజరుకు ఉపాధ్యాయుల కుస్తీ

★ ముఖ హాజరు విషయంలో విద్యాశాఖ తీసుకున్న కీలక నిర్ణయంతో ఎన్నో ప్రతికూల పరిస్థితులున్న అల్లూరి సీతారామరాజు జిల్లాలకు ఇబ్బందిగా మారనుందని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా పెదబయలు, జి.మాడుగుల, ముంచంగిపుట్టు, గూడెంకొత్తవీధి, అనంతగిరి, కొయ్యూరు మండలాలతో రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలో పలుచోట్ల అంతర్జాల సమస్య తీవ్రంగా ఉంది. ప్రధానంగా జీపీఎస్ పాఠశాలలు లోయల్లో, కొండప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. అటువంటి పాఠశాలలను గుర్తించి వారికి మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రతి మండలంలో ఇలాంటి పాఠశాలలు 30 నుంచి 40 వరకూ ఉన్నాయి.

ప్రణాళిక లేకుండా వికాస్ కేంద్ర నిర్వహణ సాధ్యమా?

సాగర కుసుమగుడలో విస్తర్ల తయారీ యంత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్ తదితరులు

డుంబ్రిగుడ, పాడేరు, న్యూస్‌టుడే: గిరిజన మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ఏర్పాటు చేసిన వన్‌ధన్ వికాస కేంద్రాలను ప్రణాళిక లేకుండా నిర్వహించడం సాధ్యమేనా అని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ప్రశ్నించారు. అరుకులో వన్‌ధన్ వికాస్ కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిరుధాన్యాలతో బిస్కెట్ల తయారీకి వినియోగించే యంత్రాల పనితీరుతోపాటు తయారీ విధానం, ఉత్పత్తిని అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ప్రణాళికలు లేకుండా వీటిని నడపడం సాధ్యపడదని, తూతూమంత్రంగా శిక్షణ ఇప్పిస్తే ఉపయోగం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘ మహిళలకు పూరిస్థాయిలో శిక్షణ ఇప్పించి వారికి ఉపాధినిచ్చేలా తోడ్పాటునివ్వాలని ఆదేశించారు. సాగర కుసుమగుడలోని వన్‌ధన్ వికాస కేంద్రాలను తనిఖీ చేశారు. విస్తర్ల తయారీపై ఆరా తీశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళి, సర్పంచులు శారద, తౌడమ్మ, ఎంపీటీసీ సభ్యుడు దేవదాసు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

★ పాడేరులోని ఐటీడీఏ కాఫీ హౌస్‌లో భగవాన్ బిర్సాముండా 150వ జయంత్యుత్సవాల సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లాలో వన్‌ధన్ వికాస్ కేంద్రాలు బలోపేతం చేసి మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. వన్‌ధన్ వికాస్ కేంద్రాల నిధులను దుర్వినియోగం చేస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. జిల్లాలో 106 వికాస్ కేంద్రాలు పని చేస్తున్నాయని పేర్కొన్నారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి తిరుమణి శ్రీపూజ మాట్లాడుతూ.. జన్ జాతీయ గౌరవ దివస్‌లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు పరిష్కారం చూపండి : పీఓ

రంపచోడవరం, న్యూస్‌టుడే: సమస్యలపై గిరిజనులు అందించే వినతులకు సంబంధిత అధికారులు పరిష్కారం చూపాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్‌రాజ్ ఆదేశించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏపీవో రమణ, ప్రత్యేక ఉప కలెక్టర్ అంబేడ్కర్‌తో కలిసి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. పందిరిమామిడి నుంచి చవిటిదిబ్బల వరకు బీటీ రహదారి నిర్మాణం అటవీ అభ్యంతరాలతో పది కిలోమీటర్ల వరకు నిలిచిపోయిందని మడిచర్ల, గుంజుగూడెం, కోట గిరిజనులు పేర్కొంటూ పూర్తి చేయాలని వినతిపత్రం ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి దేవీపట్నం మండలంలో ముంపునకు గురవుతున్న గ్రామాల ప్రజలు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇప్పించాలని విన్నవించారు. పింఛన్లు, రేషన్‌కార్డులు, తాగునీటి వసతి, రోడ్ల నిర్మాణంపై పలువురు వినతులు ఇచ్చారు. గిరిజన సంక్షేమశాఖ ఈఈ శ్రీనివాసరావు, వెటర్నరీ డీడీ షరీఫ్, డివిజనల్ పంచాయతీ అధికారి కోటేశ్వరరావు, పంచాయతీరాజ్ డివిజనల్ ఇంజినీర్ వెంకటరమణ, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, డీడీ కార్యాలయ పర్యవేక్షకులు కిషోర్, సీడీపీఓ ఉమా పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీఓ స్మరణ్‌రాజ్

వసతుల కల్పనకు చర్యలు

బిర్సాముండా 150వ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని గిరిజనులకు మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు ఐటీడీఏ ఏపీఓ రమణ చెప్పారు. స్థానిక వైటీసీ ఆయా శాఖల ఇంజినీర్లు, ఉపాధిహామీ, వెలుగు, ఐసీడీఎస్, డ్వాక్రా మహిళలతో సమావేశమయ్యారు. ఈఈలు శ్రీనివాసరావు, రవికుమార్, డ్వామా ఏపీడీ శ్రీనివాస విశ్వనాథ్, ఎంపీడీఓలు రాజు, సాల్మన్‌రాజు, యాదగిరీశ్వరరావు, వెలుగు ఏపీడీ డేగలయ్య, ఏపీఎంలు పాల్గొన్నారు.

(c) eenadu

హెల్మెట్ ధరిస్తేనే జిల్లాలోకి అనుమతి

పాడేరు, న్యూస్‌టుడే: ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరిస్తేనే జిల్లాలోకి అనుమతి ఇవ్వాలని కలెక్టర్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం రహదారి భద్రతపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనం నడుపుతున్న వారిని జిల్లాలోకి అనుమతించొద్దని ఆదేశించారు. జిల్లా, మండల కేంద్రాల్లో రద్దీగా ఉన్న స్థలాల్లో జీపులు, ఆటోలు నిలుపరాదన్నారు. కేటాయించిన స్థలాల్లోనే పార్కింగ్ చేయాలని ఆదేశించారు. ఆర్టీసీ డిపోల్లో ప్రయాణికులకు సరిపడా బస్సులు ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ సర్వీసుల కొరతపై నివేదిక సమర్పించాలని డీపీఎంను ఆదేశించారు. పర్యాటకుల తాకిడి పెరుగుతున్నందున మరిన్ని భద్రతా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఎస్పీ అమిత్ బర్దార్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్ని ప్రైవేటు వాహనాలకు రిజిస్ట్రేషన్ ఉందని ఆరా తీశారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఐటీడీఏ పీఓ తిరుమణి శ్రీపూజ, డీఎస్పీ షహబాజ్ అహ్మద్, జిల్లా రహదారులు, భవనాల శాఖ అధికారి బాలసుందరబాబు, జిల్లా రవాణా శాఖ అధికారి కె.వి.ప్రకాశ్‌రావు, అదనపు వైద్యాధికారి డాక్టర్ ప్రతాప్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్.. చిత్రంలో ఎస్పీ అమిత్ బర్దార్, అధికారులు

■ పెదబయలు మండలం వన్నాడ గ్రామంలోని గిరిజన సంక్షేమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు మరమ్మతులు చేపట్టేందుకు కలెక్టర్ దినేష్‌కుమార్ కొంత ఆర్థికసాయం అందించారు. సోమవారం తనను కలిసిన హెచ్‌ఎం పలాసి నవీన్‌కుమార్, మాతృభాషా వాలంటీరుకు ఈమొత్తాన్ని అందించారు.

బుట్ట 'బంతి' రూ.150

సీతమ్మ కాటుక రకానికి డిమాండు

పాడేరు, న్యూస్‌టుడే: పండగ సమయాల్లో ఇంటి గుమ్మానికి బంతిపూల తోరణాలు కడతారు. గృహప్రవేశమైతే బంతి పూలు ఉండాల్సిందే. అయ్యప్ప దీక్షా స్వాములు పూజా కార్యక్రమాలకు ఎక్కువగా వీటినే వాడుతుండటంతో కార్తిక మాసంలో గిరాకీ ఎక్కువగా ఉంటోంది. పాడేరు మన్యంలో సాగు మొదలు మార్కెటింగ్ వరకు అన్ని పనులను మహిళలే చక్కబెడుతున్నారు.

బుట్టల్లో పూలు తెచ్చిన గిరిజనులు

★ పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల, పెదబయలు మండలాల్లో ఎక్కువగా సీతమ్మ కాటుక రకం (చిన్న బంతి) పూలు వందల ఎకరాల్లో మెట్ట కొండపోడు భూముల్లో మహిళా రైతులు సాగు చేస్తున్నారు. కార్తిక మాసం ప్రారంభానికి ముందు నుంచే దిగుబడులు ప్రారంభమయ్యాయి.

రైతేరాజు

★ ఈ పూలకు మన్యంలో కంటే మైదాన ప్రాంతాల్లోనే అధిక డిమాండు ఉంది. అక్కడి నుంచి వచ్చే వ్యాపారులు పూలు కొనుగోలు చేసి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశా, తుని, రాజమహేంద్రవరం, విజయవాడ, హైదరాబాద్ ఎగుమతి చేస్తున్నారు. ★ ఏటా సెప్టెంబర్ చివర వారం నుంచి డిసెంబర్ నాలుగో వారం వరకు వ్యాపారం జరుగుతుంది. బుట్ట పూల ధర రూ.120 నుంచి రూ.150 వరకు ధర పలుకుతోందని దేగలమీది గ్రామానికి చెందిన మహిళా రైతు రేగం కొండమ్మ చెబుతున్నారు.

నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం వ్యాప్తంగా రైతులు అధికంగా బొప్పాయి సాగు చేస్తుంటారు. చిన్నవంగలితో పాటు సమీపంలోని గ్రామాలైన వైఎస్సార్ కడప జిల్లా కనగానపల్లె, కృష్ణాపల్లె గ్రామాల్లో 1200 ఎకరాల్లో పండిస్తారు. - న్యూస్‌టుడే, చాగలమర్రి

విదేశాలకు బొప్పాయి పాలు..

విత్తనం నాటిన కాలం నుంచి తొమ్మిది నెలలకు పంట చేతికొస్తుంది. పండ్ల సేకరణ అనంతరం 13 నెలల తర్వాత మిగిలిన, ముదురు కాయలకు గాట్లు పెట్టి పాలను సేకరిస్తున్నారు. తెల్లవారుజాము సమయంలోనే కాయలకు గాట్లు పెడితే కేవలం రెండు గంటల్లోనే పాలు ఊరుతుంది. ఇలా సేకరించిన దాన్ని రాయచోటి, రాజంపేటకు చెందిన వ్యాపారులు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల పాలు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 4 డ్రమ్ముల పాలు సేకరిస్తున్నారు. ఎకరానికి పాల సేకరణ ద్వారా రైతుకు రూ.24 వేల ఆదాయం వస్తుంది. సేకరించిన పాలను పరిశ్రమల్లో మందులు, కాస్మెటిక్స్, సబ్బుల తయారీలో ఉపయోగిస్తున్నారు. బెంగళూరు, చెన్నైలతో పాటు నాణ్యతను బట్టి విదేశాలకు సైతం పాలను ఎగుమతి చేస్తున్నారు. బొప్పాయి సాగులో ఎప్పుడైనా ధర పడిపోయినప్పుడు బొప్పాయి పాల సేకరణతో నష్టాల నుంచి రైతులు బయటపడుతున్నారు.

ఆయిల్‌పామ్‌లో.. కూరగాయల సాగు

ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటలుగా కూరగాయల సాగు అదనపు ఆదాయ వనరుగా మారింది. ఖరీఫ్‌లో వర్షాధారంగా, రబీలో పంపుసెట్ల కింద ఏటేటా పొడవైన బెండ, వంగ, టమాటా సాగు చేస్తున్నారు. -న్యూస్‌టుడే, గొలుగొండ

● ఆయిల్‌పామ్ రైతుల్లో చాలామంది కూరగాయలు, ఆకుకూరలు పండించేందుకు తోటలను కౌలుకు ఇస్తున్నారు. నీటి సదుపాయం ఉండటంతో 90 రోజుల్లో దిగుబడులు వస్తున్నాయి. పంట మార్పిడి విధానంలో ఏడాదికి ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెడితే ఖర్చులు పోను రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఆదాయం ఉంటోందని లింగంపేటకు చెందిన కౌలు రైతు ఎం.స్వామినాయుడు చెబుతున్నారు. అర ఎకరా ఆయిల్‌పామ్ తోటను కౌలుకు తీసుకుని రెండేళ్లు కూరగాయలు పండిస్తున్నట్లు పేర్కొన్నారు. పంట మార్పిడి విధానం వల్ల తెగుళ్ల బెడద తగ్గిందన్నారు.

గింజర్తి దరి ఆయిల్‌పామ్‌లో బెండ తోట

రైతు ప్రశ్న - నిపుణుల సలహా

? వరి కంకి దశలో ఉంది. నీట మునిగింది. నష్ట నివారణకు ఏం చేయాలి. – గంగరాజు, జి.మాడుగుల

✔: నీరు నిలిచిన పొలాల్లో వరి పంట నీట మునిగినా కంకుల్లో మొలకలు కనబడితే ఉప్పు కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి. 50 గ్రాముల ఉప్పును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయడం వల్ల మొలకలు రాకుండా ఉండటంతోపాటు గింజ రంగుమారకుండా ఉంటుంది.

? ఇటీవల కురిసిన వర్షాలకు వరి పంట నీట మునిగింది. దిగుబడులపై ప్రభావం పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి. – రామ్మూర్తి, తాజంగి

✔: పొలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. అవసరమైతే కాలువలు తీసి నీటిని బయటకు పంపాలి. వీలుకాకుంటే మోటార్లు ఏర్పాటు చేసి తోడేయాలి.

వరి కంకులపై ఉప్పు ద్రావణం పిచికారీ

? రెండు ఎకరాల్లో రాజ్‌మా వేశా. తుపాను ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల పంటకు ఏమైనా నష్టం కలుగుతుందా. – రమణ, దేవరాపల్లి

✔: పంట దశలో ఉండగా తేలిక పాటి వర్షాలు కురిసినా పెద్దగా నష్టం ఉండదు. గింజ కట్టే దశలో అధిక వర్షాల వల్ల కొంత ఇబ్బంది ఉంటుంది. గింజ రంగు మారడం, మాగుడు తెగులు, మానిపండు తెగులు ఆశించే ఆస్కారముంది. నివారణకు 200 మి.లీ. ప్రోపికోన జోల్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

రైతుల ప్రశ్నలు, సందేహాలకు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం ఏడీఆర్ **డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి** సమాధానాలు ఇచ్చారు. – న్యూస్‌టుడే, చింతపల్లి

సాగులో సందేహాలా.. ఫోన్ చేయండి

రైతుల ప్రశ్నలు, సందేహాలకు అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త దాడి ఉమామహేశ్వరరావు, సమాధానాలిస్తారు. మంగళవారం ఉ. 10 - సా. 4 గంటల వరకు **93472 94459** నంబరుకు ఫోన్‌చేయవచ్చు.

డ్రాగన్ తోటలో.. అంతర సేద్యం

కె.కోటపాడు, న్యూస్‌టుడే: ఎ.కోడూరులోని వ్యవసాయ క్షేత్రంలో రైతు లెక్కల కోటేశ్వరరావు డ్రాగన్ ఫ్రూట్‌తోపాటు కొబ్బరి, మామిడి, అరటి, ఆకుకూరలు, కూరగాయలు సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు.

★ 2022లో 3.5 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేపట్టారు. 2023 నుంచి పండ్ల దిగుబడులు వస్తున్నాయి. ఈ ఏడాది తోటలో ఖాళీ ఉన్న చోట కొబ్బరి, మామిడి, అరటి మొక్కలు నాటారు. సేంద్రియ విధానంలో ఆకుకూరలు, కాయగూరలు పండిస్తున్నారు. నీటి తడులు అందించేందుకు రెండు బోర్లు తవ్వించి తుంపర సేద్యం పరికరాలను ఏర్పాటు చేశారు.

తగ్గిన రంగు, నాసి రకం బెల్లం ధరలు

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి మార్కెట్‌లో గత వారం రోజులుగా రంగు, నాసి రకం బెల్లం ధరలు తగ్గాయి. రంగులు వంద కేజీలకు రూ.480, నాసి రకాలు రూ.190 ధరలు తగ్గాయి. మధ్య రకాలు రూ.110 ధర పెరిగింది.

రకం	రంగులు	మధ్య	నాసి
గత వారం (రూ.)	5,130	4,280	3,820
ఈ వారం (రూ.)	4,650	4,390	3,630

కష్టపడి పనిచేసే వారికే గుర్తింపు : ఎమ్మెల్యే

రంపచోడవరం, ఎటపాక, రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: తెదేపాలో కష్టపడి పనిచేసే వారికే గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే శిరీషాదేవి చెప్పారు. రాజవొమ్మంగి, ఎటపాక మండలాలకు పార్టీ అధ్యక్షులుగా గొల్లపూడి పెద్దిరాజు, బొల్ల పుల్లయ్యను అధిష్ఠానం ఎంపిక చేసిందన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు శ్రీనివాసయాదవ్ సోమవారం ప్రకటించి నియామక పత్రాలు అందజేశారు. వారిని సత్కరించారు. నాయకులు విజయభాస్కర్, సుభాన్ పాల్గొన్నారు.

★ పెద్దిరాజు ఎంపికపై సర్పంచి రమణి, శివరామకృష్ణరాజు, ఏఎంసీ ఛైర్మన్ లక్ష్మణరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కేశవ్ హర్షం వ్యక్తం చేశారు.

★ ఎటపాక మండలం గౌరిదేవిపేట పంచాయతీ బాడిసవారి గుంపు ప్రాంతానికి చెందిన వైకాపా నాయకులు తుర్రం చిట్టయ్య వంద మంది అనుచరులతో తెదేపాలో చేరారు. రంపచోడవరంలో ఎమ్మెల్యే శిరీషాదేవి వారికి తెదేపా కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

పెద్దిరాజు, పుల్లయ్యలను సన్మానించిన ఎమ్మెల్యే శిరీషాదేవి, పరిశీలకులు శ్రీనివాసయాదవ్

కష్టాలు తీర్చేది కూటమి సర్కారే!

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: ప్రజల కష్టాలు తీర్చేది కూటమి ప్రభుత్వమేనని తెదేపా మండల అధ్యక్షుడు బొర్రా నరేశ్ వివరించారు. రేఖపల్లిలోని పార్టీ కార్యాలయంలో సోమవారం మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తోందన్నారు. పరిహారం జమ చేస్తోందని పేర్కొన్నారు. అనంతరం పీఎం, సీఎం, ఉప ముఖ్యమంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూనవరం, న్యూస్‌టుడే: గోదావరి వరదల సమయంలో 2022లో ఇక్కడకు వచ్చిన చంద్రబాబుకు టేకుబాక గ్రామస్థులు కష్టాలు చెప్పుకొన్నారు. అధికారంలోకి రాగానే బాధలు తొలగిస్తానని నాడు చెప్పిన ఆయన నేడు చేసి చూపారని తెదేపా మండల అధ్యక్షుడు ఎడవల్లి భాస్కరరావు పేర్కొన్నారు. అనంతరం ప్రధాని, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి చిత్ర పటాలకు గ్రామస్థులతో కలిసి పాలాభిషేకం చేశారు. సర్పంచి లక్ష్మి, అప్పారావు, సత్యనారాయణ, భాస్కరరావు, సుదర్శనరావు, బుచ్చిరాజు, వేణు, వెంన్న, చిన్న పాల్గొన్నారు.



రేఖపల్లిలో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం

అవినీతి, అక్రమాలపై ఫిర్యాదు చేయండి

చింతూరు, న్యూస్‌టుడే: సమాజంలో అవినీతి, అక్రమాలు, నేర సంబంధ ఘటనలపై నిర్భయంగా ఫిర్యాదు చేయాలని ఎస్సై రమేశ్ సూచించారు. విజిలెన్సు వారోత్సవాల్లో భాగంగా స్థానిక డిగ్రీ కళాశాలలో సోమవారం 'అప్రమత్తత అందరి బాధ్యత' అంశంపై అవగాహన సదస్సులో మాట్లాడారు. సంఘ వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతుంటే ప్రతిఘటించడంతోపాటు పోలీసుల దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపల్ రత్నమాణిక్యం, శేఖర్, అప్పనమ్మ, శకుంతల పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై

ఆత్మరక్షణ విద్యపై అవగాహన

అడ్డతీగల, న్యూస్‌టుడే: బాలికలు ఆత్మరక్షణ విద్య నేర్చుకోవాలని ఎస్సై వినోద్ కుమార్ సూచించారు. స్థానిక జడ్పీ పాఠశాలలో రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ సంస్థ డైరెక్టర్లు రవి, లక్ష్మి ఆధ్వర్యంలో కరాటే ఆవశ్యకతపై సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటైంది. కరాటే మాస్టర్ సూరిబాబు విద్యార్థులకు డెమో ఇచ్చారు. సర్పంచి చిట్టమ్మ, హెచ్‌ఎం వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాలికలతో మాట్లాడుతున్న ఎస్సై వినోద్‌కుమార్

సచివాలయ సిబ్బందికి వ్యతిరేకంగా ధర్నా

చింతూరు, న్యూస్‌టుడే: సిబ్బంది పనితీరును నిరసిస్తూ కల్లేరు సచివాలయం ఎదుట మదుగూరు, సూరన్నగొంది గ్రామస్థులు సోమవారం ధర్నాకు దిగారు. సచివాలయంలో విధులకు కొందరే వస్తున్నారని, వారూ సమయపాలన పాటించడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి సిబ్బంది అందరూ సచివాలయానికి వచ్చేలా చర్యలు చేపట్టాలని డిమాండు చేశారు.

ధర్నా చేస్తున్న గ్రామస్థులు

తగ్గుతున్న గోదావరి

దేవీపట్నం, న్యూస్‌టుడే: గండిపోశమ్మ అమ్మవారి ఆలయం వద్ద గోదావరి ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. పోశమ్మగండి - నాగలపల్లి మార్గంలో వరద తొలగడంతో సోమవారం మధ్యాహ్నం నుంచి వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. పోశమ్మగండి నుంచి ఓ పర్యాటక బోటులో పాపికొండల విహారయాత్రకు సందర్శకులు వెళ్లారని కంట్రోల్ రూం అధికారులు చెప్పారు.

సకాలంలో మెరుగ్గా వైద్యసేవలు

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రుల సమన్వయకర్త (డీసీహెచ్ఎస్) డాక్టర్ నీలవేణిదేవి ఆదేశించారు. స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిని సోమవారం సందర్శించారు. వార్డులకు వెళ్లి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. గర్భిణులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గైనకాలజిస్టులు మోమీనా, వనజాక్షి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాంతీయ ఆసుపత్రిలో గర్భిణులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ నీలవేణిదేవి

తహసీల్దారుతో నిరసనకారుల వాదులాట

వంతెన నిర్మాణం చేపట్టాలని నిరసన

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: అన్నవరం వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని ఎంపీపీ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి డిమాండు చేశారు. సీపీఎం, వైకాపా ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో సోమవారం వాగు ఒడ్డున నిరసన కార్యక్రమం చేపట్టారు. తహసీల్దారు సరస్వతి, ఎస్సై సంతోశ్‌కుమార్ వారికి నచ్చచెప్పి, అక్కడి నుంచి పంపే ప్రయత్నం చేశారు. నిరసనకారులు వినకపోవడంతో విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సంతోశ్, సరోజిని, బుచ్చమ్మ, ప్రదీప్, లీలాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలి

దేవీపట్నం, న్యూస్‌టుడే: వచ్చే మూడు రోజుల్లో వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులంతా అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. ఇందుకూరుపేటలో సోమవారం పర్యటించారు. పొలాల్లో ఆరబోసిన ధాన్యం రాశులను పరిశీలించి రైతులు పలు సూచనలు చేశారు. ఇప్పటికే కోతలు పూర్తిచేసిన రైతులు ధాన్యం, అపరాలను తడవకుండా సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వర్షాలు తగ్గిన అనంతరం పంట కోతలు చేపట్టాలన్నారు. వర్షాలు అధికంగా ఉండి వరి పనలు వాలిపోతే గింజలు మొలకెత్తకుండా ఐదుశాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. మడుల్లో వర్షపు నీరు నిల్వలేకుండా ఎప్పటికప్పుడు బయటకు పంపాలన్నారు.

ఇందుకూరుపేటలో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు

తహసీల్దారుగా శ్రీనివాసరావు

ఎటపాక, న్యూస్‌టుడే: ఎటపాక తహసీల్దారుగా కె.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన కారం సుబ్బారావు చింతూరు సబ్ కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. కూనవరం మండలం నుంచి కె.శ్రీనివాసరావు ఇక్కడకు వచ్చారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఎటపాక, న్యూస్‌టుడే: పురుషోత్తపట్నం సమీపంలో గోదావరి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లరను రెవెన్యూ సిబ్బంది సోమవారం వేకువజామున పట్టుకున్నారు. ముందస్తు సమాచారంతో తహసీల్దారు సుబ్బారావు సిబ్బందితో దాడులు చేసి రెండు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మొక్కలతో పర్యావరణానికి మేలు

కొయ్యూరు, న్యూస్‌టుడే: రొబ్బసింగి, గదబపాలెం గ్రామాల్లో గిరిజనులకు జీవన వృక్ష ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు పంపిణీ చేశారు. విద్యార్థులకు జామ మొక్కలు అందించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు అందజేస్తున్నామని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. ట్రస్ట్ అధ్యక్షుడు రమణబాబు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

గదబపాలెంలో మొక్కలు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

అవినీతిరహిత సమాజ నిర్మాణానికి కృషి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అవినీతిరహిత సమాజ నిర్మాణానికి యువత కృషి చేయాలని అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భరత్‌కుమార్ నాయక్ అన్నారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా కళాశాలలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేటి సమాజంలో అవినీతి పరిస్థితులు, అభివృద్ధికి ఆటంకాలు తదితర అంశాలను వివరించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అంతకుముందు ఆచార్య అమర్త్యకుమార్‌సేన్ జయంతిని నిర్వహించారు. రాజనీతిశాస్త్రం అధ్యాపకులు నాగబాబు, ఎన్ఎస్ఎస్ పీఓలు విజయలక్ష్మి, అనితకుమారి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ భరత్‌కుమార్ నాయక్

భూ తగాదాలో గాయపడిన మహిళ మృతి

జి.మాడుగుల, న్యూస్‌టుడే: గడుతూరు పంచాయతీ బొబ్బంపాడులో జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడిన మహిళ మృతి చెందింది. ఈనెల 2న బొబ్బంపాడు గ్రామంలో భూ తగాదా నేపథ్యంలో జరిగిన కొట్లాటలో గెమ్మెలి సత్తిబాబు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఆయన భార్య గెమ్మెలి నీలమ్మను పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగిస్తామన్నారు. భార్యాభర్తలు మృత్యువాత పడడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

JOBS

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యూయర్స్. ఏజ్: 22-35. ఫ్రెషర్స్ కూడా కావలెను. ✆ 6281037879.

అంతా కల్తీ.. తింటే సుస్తీ!

యథేచ్ఛగా నిల్వ, కాలంచెల్లిన ఆహారం విక్రయాలు

అంతంతమాత్రంగానే తనిఖీలు

ఈనాడు డిజిటల్, అనకాపల్లి

ఉరుకుల పరుగుల జీవితంలో అందరూ బిజీ అయిపోయారు. ఇంట్లో వండుకునే సమయం లేక, కొందరికి ఓపిక లేక.. ఆహార పదార్థాలను బయట కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. ఇదే కొందరు వ్యాపారులకు వరంగా మారింది. ఇష్టమొచ్చినట్లు కల్తీ చేసి వ్యాపారం సాగిస్తున్నారు. రోజుల తరబడి దుకాణాల్లో నిల్వ ఉన్నా.. వాటిని బయట పారేయకుండా వంటకాల్లో ఉపయోగిస్తున్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే రంగులు, టేస్టింగ్ సాల్ట్ ఇష్టారాజ్యంగా వాడేస్తున్నారు. దీంతో చాలా మంది ఆహార పదార్థాల తిని అనారోగ్యం బారిన పడుతున్నారు.

● అనకాపల్లి, ఎలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీలతోపాటు గ్రామీణ ప్రాంతాల పరిధిలో కలిపి మొత్తం 1500పైగా హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లున్నాయి. కానీ జిల్లాలో 350 హోటళ్లకు మాత్రమే అనుమతులు ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. సగానికి పైగా దుకాణాలకు అనుమతులు లేకపోయినా.. నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. జిల్లా పరిధిలోని జాతీయ రహదారి పొడవునా రాత్రింబవళ్లు దాబాలు నిర్వహిస్తున్నారు. రిఫ్రిజిరేటర్లలో నిల్వఉంచి మరీ అమ్మకాలు చేస్తున్నారు.

అనకాపల్లిలోని ఓ హోటల్ వంటశాలలో తనిఖీ చేస్తున్న అధికారులు

■ అనకాపల్లి పట్టణం రింగురోడ్డులోని ఓ సూపర్ మార్కెట్‌లో ఇటీవల ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. సోయా మిల్క్, లస్సీ, చాక్లెట్లు, ఇన్‌స్టంట్ న్యూడిల్స్, వంటనూనె ప్యాకెట్లు కాలం చెల్లినవి విక్రయిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు.

■ అనకాపల్లి పట్టణం నూకాలమ్మ ఆలయం సమీపంలో క్యాటరింగ్ చేసే దుకాణంలో తనిఖీలు చేశారు. కల్తీ అయిన నెయ్యి వినియోగిస్తున్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేశారు.

అవగాహన సదస్సులేవీ? కల్తీ సరకుల కొనుగోలు, నాసిరకం ఆహారం తినడం వల్ల ఎదురయ్యే అనారోగ్య సమస్యలపై ప్రజలకు ఆహార భద్రతా అధికారులు అవగాహన కల్పించాలి. ఎక్కడైనా నిల్వ, కాలం చెల్లిన పదార్థాలు అమ్మినా ఫిర్యాదు చేయడం ఎలానో వివరించాలి. ఈ ఏడాది జిల్లాలో ఇప్పటివరకు అవగాహన కార్యక్రమాలు జరగకపోవడం గమనార్హం. అధికారులు తనిఖీలు చేయకపోవడానికి కారణం కొందరు వ్యాపారుల నుంచి రెండు, మూడు నెలలకోసారి మామూళ్లు అందుతుండటమే. ఒక్కో దుకాణం నుంచి రూ. 1000 నుంచి రూ. 2 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

మొక్కుబడిగా తనిఖీలు... జిల్లాలో అధికారుల తనిఖీలు మొక్కుబడిగా మారాయి. హడావుడిగా నమూనాలు సేకరించి పరీక్షలకు పంపిస్తూ.. చేతులు దులుపుకొంటున్నారు. ఒక్కో ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రతి నెలా హోటళ్లు, దుకాణాలు, దాబాల్లో తనిఖీలు చేసి 10వరకు నమూనాలను నాణ్యతా పరీక్షలకు పంపించాలి. కానీ.. ఇలా ఎక్కడా చేయడం లేదు. కార్యాలయాలకే పరిమితం అవుతున్నారు. ఫిర్యాదులు అందితే.. అడపాదడపా తనిఖీలు చేసి కేసులు కడుతున్నారు.

▌ పది నెలల్లో 300 వరకు నమూనాలు పరీక్షలకు పంపించారు. ఇందులో 15 దాంట్లో నాణ్యత లోపం ఉన్నట్లు గుర్తించి కేసులు పెట్టారు.

తరచూ తనిఖీలు చేస్తున్నాం ... జిల్లాలో తరచూ తనిఖీలు చేస్తున్నాం. నిబంధనల ప్రకారం నమూనాలు సేకరించి.. నిర్ధారణ పరీక్షలకు పంపిస్తున్నాం. నిబంధనలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలపై కేసులు పెడుతున్నాం. అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నాం. – సతీష్, జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్, అనకాపల్లి

సమస్యల పరిష్కారమే ధ్యేయం

నక్కపల్లి, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా దర్బార్ చేపట్టినట్లు హోం మంత్రి అనిత పేర్కొన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు స్వయంగా ఫిర్యాదులు స్వీకరించేందుకు వచ్చినట్లు చెప్పారు. గ్రామస్థాయిలో ఇబ్బందులను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పెదతీనార్లలో సుమారు 20 ఎకరాల భూమి ఆక్రమణలో ఉందని ఎంపీటీసీ సభ్యుడు మేరుగు నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ముకుందరాజుపేటలో ఒకరికి బదులు మరొకరికి తల్లికి వందనం పడిందని, వేంపాడులో సహకార సంఘానికి నూతన భవనం మంజూరు చేయాలని సొసైటీ అధ్యక్షుడు దార్ల కృష్ణ, వెలగా శ్రీను కోరారు.

చోడవరంలో ఉద్యోగమేళా రేపు

అనకాపల్లి, న్యూస్‌టుడే: చోడవరంలో బుధవారం ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం జాబ్ మేళా గోడప్రతులను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 9 గంటలకు మేళా ప్రారంభం అవుతుందన్నారు. 17 కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటాయని పేర్కొన్నారు. 1500 ఖాళీలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు.

పంట రుణాలపై ఆరా

కోటవురట్ల, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో నకిలీ పత్రాలతో పంట రుణాలను కాజేసిన వారిపై క్రిమినల్ కేసులకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) ఛైర్మన్ కోన తాతారావు తెలిపారు. సోమవారం కోటవురట్ల శాఖను సందర్శించారు. కోటవురట్ల, మాకవరపాలెం, నాతవరం, నర్సీపట్నం శాఖల సిబ్బందితో సమావేశమై బ్యాంకుల్లో జరుగుతున్న లావాదేవీలపై ఆరా తీశారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	111	105
లైవ్	138	125
డ్రెస్‌డ్	200	220
స్కిన్‌లెస్	228	230

(c) eenadu

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: లోతుగెడ్డ కూడలి వద్దనున్న ఆర్టీసీ బస్టాప్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. చెత్త, మద్యం సీసాలు పేరుకుపోయాయి. - సాయి, లోతుగెడ్డ కూడలి, ✓: బస్టాప్‌లో చెత్త, మద్యం సీసాలను పంచాయతీ సిబ్బందితో తొలగిస్తాం - కుమార్, పంచాయతీ కార్యదర్శి, పెదబరడ

మేమున్నాం.. మీకు తోడుగా

పాడేరు 89853 66570 | అరకులోయ: 63034 86346 | రంపచోడవరం: 94908 77172

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి నుంచి చింతూరు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిలో వాలమూరు వద్ద పాములేరు వాగుపై నిర్మించిన వంతెన ప్రమాదకరంగా ఉంది. - పల్లాల బాలకృష్ణరెడ్డి, వాలమూరు

✓: వంతెన మరమ్మతుకు చర్యలు చేపడతాం. - ప్రదీప్, ఏఈ, ర.భ.శాఖ

పర్యాటకాభివృద్ధితో స్థానికులకు ఉపాధి

అరకులోయ, న్యూస్‌టుడే: పర్యాటకాభివృద్ధితో స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఆర్టీసీ జోన్ ఛైర్మన్ దొన్నుదొర అన్నారు. మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్ వద్ద వాహనాల పార్కింగ్ స్థలాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అరకులోయ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉందన్నారు. మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ బొరిబొరి లక్ష్మి పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలాన్ని ప్రారంభిస్తున్న దొన్నుదొర

రహదారులున్నాయ్.. రవాణా సేవలేవీ?

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

మన్యంలో రూ.కోట్ల నిధులతో రహదారులు నిర్మించి.. రవాణా సేవలు విస్తరించకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. పాడేరు ఐటీడీఏ పరిధిలో 11 మండలాల్లోని మారుమూల గ్రామాలకు పీఎం జన్‌మన్, పీఎంజీఎస్‌వై, నాబార్డు తదితర పథకాల్లో భాగంగా రహదారులు నిర్మించారు. పదేళ్ల వ్యవధిలో దాదాపు 600 గ్రామాలకు రోడ్డు సదుపాయం సమకూరింది. ముంచంగిపుట్టు మండలంలోని లక్ష్మీపురం, బరడ, లుక్కూరు, కదుతుల, దోడిపుట్టు, సుజనపేట, గూడమలిపుట్టు, బాబుసాల, డముకులాడీ, జర్జుల, పెదతమింగులా, చినతమింగులా, రంగబయలు, వనుగుమ్మ, బుంగాపుట్టు తదితర 120 గ్రామాలకు రోడ్లు నిర్మించారు. లక్ష్మీపురం పంచాయతీలో రూ.12 కోట్ల ఖర్చుతో వంతెనలు, రోడ్లు నిర్మించి రవాణా సేవలు మాత్రం విస్తరించలేదు. పెదబయలు, హుకుంపేట, డుంబ్రిగుడ మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది.

పడాల్‌పుట్టు గ్రామానికి నిర్మించిన తారురోడ్డు

గుర్రాలే ఆధారం

తప్పనిసరి పరిస్థితుల్లో తారురోడ్లలోనూ గిరిజనులు గుర్రాలతో ప్రయాణాలు సాగిస్తున్నారు. సరకుల రవాణాకు, ప్రజలు ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లేందుకు వీటిని వినియోగిస్తున్నారు. ప్రస్తుతం పక్కా ఇళ్ల నిర్మాణానికి కావలసిన సిమెంటు, ఇటుక, ఇసుక వంటి సామగ్రి, అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను తరలించేందుకు గుర్రాలనే ఆశ్రయిస్తున్నారు.

★ గిరిజన ఉపప్రణాళిక నిధులతో పాడేరు ఐటీడీఏ ద్వారా రహదారులున్న అన్ని గ్రామాలకు మినీ బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తామని గతంలో అధికారులు, పాలకులు ప్రకటించారు. కానీ కార్యరూపం దాల్చలేదు.

అదనపు సర్వీసులతో ఆదాయం

ఆర్టీసీ అధికారులు ముంచంగిపుట్టు మండలంలోని కుమడ, లక్ష్మీపురం, జర్జుల, దోడిపుట్టు, సుజనకోట ప్రాంతాలకు అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయడం వల్ల సంస్థకు ఆదాయం పెరుగుతుంది. 200 గ్రామాలకు రవాణా సేవలు సమకూరుతాయి. పెదబయలు మండలంలో సీకరి, రూఢకోట, కొరవంగి, గోమంగి మీదుగా జి.మాడుగుల ప్రాంతానికి బస్సు సర్వీసులు అందుబాటులోకి తీసుకొస్తే సంస్థకు ఆదాయంతోపాటు మరో 80 గ్రామాలకు రవాణా సేవలు మెరుగవుతాయి.

అనుమతుల్లేకుండా డ్రోన్లు ఎగరేస్తే చర్యలు

అరకులోయ, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా డ్రోన్లు ఎగరేస్తే కఠిన చర్యలు తప్పవని అరకులోయ సీఐ హిమగిరి హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. కొంతమంది కావాలనే ప్రజలను రెచ్చగొట్టాలనే ఉద్దేశంతో డ్రోన్లని ఎగురవేస్తున్నారన్నారు. గ్రామాల్లో హైడ్రోపవర్ ప్రాజెక్టు కోసం డ్రోన్లతో సర్వే చేస్తున్నారని గిరిజనులు ఆందోళన చెందుతున్నారన్నారు. హైడ్రోపవర్ ప్రాజెక్టు సర్వే పనులను నిలిపివేస్తున్నట్లు మంత్రి సంధ్యారాణి ప్రకటించారన్నారు. పెసా అనుమతులు లేకుండా గిరిజన ప్రాంతంలో ఎటువంటి ప్రాజెక్టులు ఉండవని, గిరిజనులు అపోహ చెందొద్దని కోరారు.

పెసా కమిటీ ఎన్నికలు నేడు

చింతపల్లి, న్యూస్‌టుడే: తాజంగి పంచాయతీకి సంబంధించి మంగళవారం పెసా కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. తాజంగి, లబడంపల్లి, వంతమామిడి బలభద్రం, సప్పిడిమెట్ట గ్రామాల్లోని పెసా కమిటీలకు గ్రామసభ నిర్వహించి.. ఉపాధ్యక్షులు, కార్యదర్శులను ఎన్నుకుంటారన్నారు.

సంపద కేంద్రాలకు చెదలు

పంచాయతీలకు ఆదాయం, పారిశుద్ధ్య నిర్వహణ ప్రధాన లక్ష్యంగా గ్రామాల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలను రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించారు. ప్రస్తుతం కేంద్రాలను నిర్వహణను పట్టించుకోకపోవడంతో అవి నిరుపయోగంగా మారి చెదలుపట్టుతున్నాయి. హుకుంపేట శివారులో రాళ్లగెడ్డ వద్ద నిర్మించిన కేంద్రం మందుబాబులకు అడ్డాగా మారింది. మండల కేంద్రంలో సేకరించిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులు ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. వీటిని వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు. - హుకుంపేట, న్యూస్‌టుడే

హుకుంపేటలో నిరుపయోగంగా ఇలా..

ప్రమాదమని తెలిసినా పట్టదా?

మన్యంలోని ప్రతి ఆశ్రమ పాఠశాలలో వసతిగృహ నిర్వహణకు మూడు అంతస్తుల భవనాలు నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్ వద్ద గోడలకు ఇనుప చువ్వలతోపాటు రక్షణ కంచె ఏర్పాటు చేశారు. పైరెండు అంతస్తులకు కంచె నిర్మాణం మరిచారు. ముంచంగిపుట్టు, పనసపుట్టు, లబ్బూరు, జోలాపుట్టు గ్రామాల్లో నిర్మించిన భవనాలకు కంచె ఏర్పాటు చేయలేదు. దీంతో విద్యార్థులు భవనం గోడపై కూర్చొని ప్రమాదమని తెలిసినా కాలక్షేపం చేస్తున్నారు. ముంచంగిపుట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాల వసతి గృహ భవనం రెండో అంతస్తులో విద్యార్థులు గోడ అంచుపై కూర్చున్న దృశ్యమిది. గతంలో పెదబయలు మండలంలో గోడపై ఉన్న విద్యుత్తు తీగలు తగిలి ఒక విద్యార్థి మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. భవనాల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. - ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

వసతిగృహ భవనం గోడపై కూర్చొన్న విద్యార్థులు

హట్‌బజార్లు అందుబాటులోకి వచ్చేనా?

మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు.. స్వయం సహాయక, గ్రామైక్య సంఘాలకు ప్రోత్సాహం అందించి నిర్మించిన హట్‌బజార్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. స్థానికంగా లభ్యమయ్యే అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించేలా పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల్లో ఈ భవనాలు నిర్మించారు. మరుగుదొడ్లు, నీటి సదుపాయం కల్పించారు. ప్రతి భవనం నిర్మాణానికి ఎస్‌సీఏ నిధులు రూ.5 లక్షలు చొప్పున ఖర్చు చేశారు. ముంచంగిపుట్టు, బరడ, అడుగులపుట్టు గ్రామాల్లో నిర్మించిన భవనాలు ఏళ్లు గడుస్తున్నా వినియోగంలోకి రాలేదు. గిరిజన ప్రాంతంలో లభ్యమయ్యే చింతపండు, రాజ్‌మా చిక్కుళ్లు, పసుపు తదితర ఉత్పత్తులను ప్యాకెట్లగా తయారు చేసి.. స్వయంసహాయక సంఘం మహిళలు విక్రయించాల్సి ఉంది. ఆ దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. - ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే

ముంచంగిపుట్టులో నిరుపయోగంగా హట్‌బజార్ కేంద్రం

అంచుల్లో అపాయం

పెదబయలు నుంచి పాడేరు వెళ్లే మార్గంలో కస్తూర్బా విద్యాలయం నుంచి ముసిడిపుట్టు, కిత్తుకొండ, పన్నెడ, బంగారుమెట్ట వరకు ఐదు కిలోమీటర్ల రహదారికిరువైపులా కోతకు గురైంది. గోతులు పడి నీరు నిల్వ ఉండిపోవడంతో అంచుల వెంటే అనేక సంగతులుగా మారింది. వాహనదారులు నానా అవస్థలు పడి రాకపోకలు సాగిస్తున్నారు. ఏదైనా ప్రతిపాదనలు పంపామని చెబుతున్నారు తప్ప పనులు చేయడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కనీసం గోతులను పూడ్చాలని కోరుతున్నారు. - పెదబయలు, న్యూస్‌టుడే

బంగారుమెట్ట వద్ద ఇదీ పరిస్థితి..

అ వీ ఇ వీ

తెదేపా సీనియర్ నాయకురాలి మృతి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: తెదేపా సీనియర్ నాయకురాలు, చింతపల్లి పార్టీ గ్రామ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బేతా నూకరత్నం సోమవారం మృతి చెందారు. ఒంట్లో నలతగా ఉందని స్థానిక ఏరియా ఆసుపత్రికి వెళ్లారు. వైద్యులు వైద్యపరీక్షలు చేస్తుండగా గుండెపోటుతో ఆమె మరణించారు. తెదేపా ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటూ బలోపేతానికి కృషి చేశారు. గతంలో వార్డు సభ్యురాలిగా పనిచేశారు. ఆమె మృతికి తెదేపా మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, రీమల ఆనంద్ సంతాపం తెలిపారు.

పెదబయలులో భారీ వర్షం

పెదబయలు, న్యూస్‌టుడే: పెదబయలులో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం ఎండ రావడంతో వారపు సంతకు వ్యాపారులు, రైతులు అధికసంఖ్యలో వచ్చారు. సాయంత్రం భారీ వర్షం కురవడంతో వారంతా అవస్థలు పడ్డారు. సామగ్రి తడిచిపోయాయి.

జూనియర్ కళాశాల ఏర్పాటుకు వినతి

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: గుర్తేడులో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు సర్పంచి దుష్యంతుడు ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేశారు. గుర్తేడు పరిధిలో ఐదు పంచాయతీలు ఉన్నాయని, ఈ ఏడాది పదో తరగతిలో 300 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. వీరందరికీ ఉపయుక్తంగా ఉండేలా జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని విన్నవించారు.

గిరిజనేతర భూముల సాగుపై ఫిర్యాదు

కూనవరం, న్యూస్‌టుడే: పరిహారం పొందిన గిరిజనేతర భూముల్లో ఇప్పటికీ వలస రైతులు సేద్యం చేస్తున్నారంటూ చింతూరు ఐటీడీఏ పీవో కార్యాలయంలో ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. భూమి వివరాలు, ప్రస్తుతం సాగు చేస్తున్న రైతు వివరాలు అందజేసినట్లు పేర్కొన్నారు.

ఫిర్యాదు చేస్తున్న నాయకులు

సర్వసభ్య సమావేశం నేడు

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 4వ తేదీ ఉదయం 11 గంటల నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తేజరతన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల మండలస్థాయి అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

పరమేశ్వరా.. పాహిమాం

రంపచోడవరం, రాజవొమ్మంగి, వీఆర్ పురం, న్యూస్‌టుడే: కార్తిక మాసం రెండో సోమవారం శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే రద్దీ కొనసాగింది. రాజవొమ్మంగిలో రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి, జడ్డంగిలో స్వయంభూ భ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామి, అమ్మిరేకులలో మల్లీశ్వరి సమేత ధారరామలింగేశ్వర స్వామి, లబ్బర్తి, వాతంగి శివాలయాల్లో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిగాయి. కాశీబుగ్గలో తొక్కిసలాట ఘటనను దృష్టిలో ఉంచుకుని పోలీసులు రంప శివాలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. కొండపై శివాలయం, జలపాతంతోపాటు దిగువనున్న మల్లికార్జునస్వామి ఆలయాల వద్ద క్యూలైన్లు పరిశీలించారు. శబరి, గోదావరి నదులకు వరద రావడంతో భక్తులు ఇళ్ల వద్దే వేకువజామున స్నానాలు ఆచరించి ఆలయాల్లో కార్తిక దీపాలు వెలిగించారు. వడ్డిగూడెం శివాలయం భక్తులతో కిటకిటలాడింది.

చింతపల్లి/గ్రామీణం, కొయ్యూరు, సీలేరు, న్యూస్‌టుడే: వంగసార, అంతర్ల, బౌడ శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. కొయ్యూరు మల్లికార్జున ఆలయంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ధారకొండ శివాలయంతోపాటు సీలేరులోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయాలు సోమవారం వేకువజాము నుంచి కిటకిటలాడాయి.

హుకుంపేట, పెదబయలు, న్యూస్‌టుడే: హుకుంపేట మండలంలోని మత్స్యగుండంకు భక్తులు పోటెత్తారు. సీఐ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. పెదబయలు, అరడకోట, గలగండ శివాలయాల్లో శంభో శంకర నామస్మరణ మార్మోగింది.

వడ్డిగూడెం ఆలయంలో పూజల్లో మహిళలు

మత్స్యగుండంలో...

రాజవొమ్మంగిలో..

సీలేరులో...

బౌడ శివాలయంలో..

వంతెన లేక యాతన

పెదబయలు, న్యూస్‌టుడే: తారాబు జలపాతానికి వెళ్లే మార్గంలో గెడ్డపై వంతెన నిర్మించాలని గిరిజనులు కోరారు. సోమవారం గెడ్డలో దిగి ఆందోళన చేశారు. వంతెన లేక ఇబ్బందులు పడుతున్నామని, గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థులు అప్పన్నదొర, ఇంద్రకుమారి, వెంకటరావు, మంగళన్నదొర తదితరులు పాల్గొన్నారు.

గెడ్డలో గిరిజనుల ఆందోళన

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల శుభ్రత పాటించడం ద్వారా అందరూ ఆరోగ్యంగా ఉండవచ్చని జీడిగుప్ప పీహెచ్‌సీ వైద్యాధికారి నిరంజన్‌కుమార్ సూచించారు. మొద్దులగూడెంలో సోమవారం విద్యార్థులు, గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

సమ్మెకు కాఫీ కార్మికులు సిద్ధం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 6 నుంచి సమ్మె చేపడుతున్నట్లు కాఫీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొర్రరాజు తెలిపారు. ఏబులంకొడిసింగిలో సోమవారం నిరసన చేపట్టారు. సమస్యల పరిష్కారానికి ఏపీఎఫ్‌డీసీ యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేసి ఇరవై రోజులు గడుస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్మికుల సంఘం ఆర్వీనగర్ డివిజన్ నాయకులు రాజారావు, రామన్న, పడాల్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఏబులంకొడిసింగిలో కాఫీ కార్మిక సంఘం నాయకుల నిరసన

అధికారుల తీరుపై అసంతృప్తి

జి.మాడుగుల, న్యూస్‌టుడే: మండల స్థాయి అధికారుల తీరుపై ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు అసంతృప్తి వ్యక్తం చేశారు. జి.మాడుగులలో సోమవారం ఎంపీపీ ఎల్.అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు రాకుండా.. కిందిస్థాయి సిబ్బందిని పంపడంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులను సమన్వయం చేయకపోవడంతో ఎంపీడీవోపై మండిపడ్డారు. తుపాను ప్రభావంతో ఇళ్లు, రహదారులు, వంతెనలు, కల్వర్టులు ధ్వంసమయ్యాయని, తమ గోడును ఎవరితో చెప్పుకోవాలని ఎంపీడీవోను ప్రశ్నించారు. సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీటీసీ సభ్యులకు రెండేళ్లుగా గౌరవ వేతనం మంజూరు చేయలేదన్నారు. అధికారులు లేని సమావేశాలు ఎందుకని సభ్యులందరూ బహిష్కరించారు. ఈ వారంలో మారోమారు సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఉప ఎంపీపీ సత్యనారాయణ, తహసీల్దారు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు

సక్రమంగా సరకుల పంపిణీ

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రేషన్ లబ్ధిదారులకు నిత్యావసర సరకుల పంపిణీ సక్రమంగా చేయాలని తహసీల్దారు శంకరరావు పేర్కొన్నారు. చింతపల్లి, చౌడుపల్లి, బయలుకించంగి జీసీసీ డిపోలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిపోలోనున్న బియ్యం నిల్వలు పరిశీలించి.. విక్రయాలపై ఆరా తీశారు. సకాలంలో బియ్యం, పంచదార, పప్పులు అందేలా చర్యలు తీసుకోవాలని, రోజూ క్రమం తప్పకుండా డిపో తెరవాలన్నారు. అనంతరం తుపానుకు శిథిలమైన ఇళ్లను పరిశీలించారు. ఆర్ఐ కృష్ణమూర్తి, వీఆర్వో పండన్న పాల్గొన్నారు. ★ మండలంలో భూ బదలాయింపు చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని ఎంపీపీ కోరాబు అనూషాదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య కోరారు. చింతపల్లి తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన శంకరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. కోఆప్షన్ సభ్యుడు నాజర్‌వలీ, జల్లి సుధాకర్, గంగన్నపడాల్ పాల్గొన్నారు.

చింతపల్లి జీసీసీ డిపోను తనిఖీ చేస్తున్న తహసీల్దారు శంకరరావు

నైపుణ్యాల మెరుగుతో ఉద్యోగావకాశాలు

చింతపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరచుకోవడం ద్వారా అనేక రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయని చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. విజయభారతి అన్నారు. డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పొందిన మొదటి ఏడాది విద్యార్థులతో పరిచయ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా పోటీతత్వాన్ని పెంచుకోవాలన్నారు. ఏఐ, రోబో టెక్నాలజీ వంటి రంగాల్లో నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. అధ్యాపకులు డాక్టర్ రమణ, జగదీష్, సతీష్, కెజియారాణి, లీలాపావని, జగత్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.

★ ప్రిన్సిపల్ విజయభారతి ఈనెల 7, 8 తేదీల్లో శ్రీలంకలోని కొలంబో విశ్వవిద్యాలయంలో ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన జరగనున్న అంతర్జాతీయ సదస్సులో పాల్గొననున్నారు.

వేదికపై డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయభారతి, అధ్యాపకులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మారుమూల గ్రామాల గిరిజనులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు దినేష్‌కుమార్ అన్నారు. గొందిపాకలులో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వర్షాలు, వాతావరణ మార్పుల కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశముందని, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిల్వ పదార్థాలను తినొద్దన్నారు. హెల్త్ అసిస్టెంట్ వెంకటరావు, హెచ్‌వీ లక్ష్మి, హెచ్ఎస్ వెంకటేశ్వర్లు, రిబికా, కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిని పరీక్షిస్తున్న వైద్యుడు దినేష్‌కుమార్

వాటా చెల్లింపులో నిర్లక్ష్యం తగదు

అనంతగిరి, న్యూస్‌టుడే: బొర్రాగుహలకు సమకూరే ఆదాయం నుంచి పంచాయతీకి వాటాను తక్షణమే చెల్లించాలని బొర్రా సర్పంచి అప్పారావు, పాలకవర్గసభ్యులు కోరారు. ఈ మేరకు పర్యాటక శాఖ ఎండీకి లేఖ రాశారు. మొంథా తుపాను కారణంగా బొర్రా పంచాయతీకి నష్టం వాటిల్లిందని.. పర్యాటక శాఖ తమకు చెల్లించాల్సిన వాటాలో ప్రస్తుతానికి రూ. కోటి ఇవ్వాలన్నారు. ఈ నిధులతో పంచాయతీని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఇటువంటి సందర్భాల్లోనూ పంచాయతీకి వాటా చెల్లింపులో నిర్లక్ష్యం తగదన్నారు. ఈ లేఖను బొర్రాగుహలు యూనిట్ మేనేజరు గౌరీశంకర్‌కు అందించారు. వార్డు, పెసా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మేనేజరుకు లేఖ అందిస్తున్న సర్పంచి తదితరులు

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై ఉద్యమం

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్య కళాశాలల పీపీపీ విధానాన్ని తిప్పికొట్టాలని ఎంపీ తనూజారాణి, ఎమ్మెల్యే మత్స్యలింగం పిలుపునిచ్చారు. గుంటసీమ పంచాయతీ కేంద్రంలో సర్పంచి నాగేశ్వరరావు ఆధ్వరాన సోమవారం కోటి సంతకాల సేకరణతోపాటు రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు అడ్డుకునేందుకు వైకాపా ప్రజా ఉద్యమం చేపడుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకునే వరకు పోరాటం చేస్తామన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర, ఎంపీపీ ఈశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, రోషిణి, ఉప ఎంపీపీ ఆనందరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం, చిత్రంలో ఎంపీ తనూజారాణి, జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర

బిల్లులు చెల్లించక లబ్ధిదారుల ఇబ్బందులు

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: పీఎం జన్‌మన్ గృహ నిర్మాణ లబ్ధిదారులకు వెంటనే బకాయి బిల్లులను విడుదల చేయాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో ముంచంగిపుట్టు, పెదబయలు మండలాలకు చెందిన సంఘ నాయకులు సోమవారం సమావేశమయ్యారు. నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ప్రకటించిన రూ. లక్ష కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రెండు నెలలుగా బిల్లులు మంజూరు చేయకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్. ధర్మానపడాల్, సర్పంచి కె. త్రినాథ్, కె. నర్సయ్య, బి. గంగాధర్ పాల్గొన్నారు.

సమావేశమైన గిరిజన సంఘ నాయకులు

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

కూనవరం, న్యూస్‌టుడే: టేకులబోరు 11 వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచి హేమంత్, ఎంపీటీసీ సభ్యుడు సాంబశివరావు సోమవారం భూమి పూజ చేశారు. గ్రామస్థులు, నాయకులు పాల్గొన్నారు.

భూమిపూజలో సర్పంచి తదితరులు

రంపచోడవరాన్ని జిల్లాగా ప్రకటించాలి

రంపచోడవరం, న్యూస్‌టుడే: జిల్లాల పునర్విభజనలో భాగంగా రంపచోడవరం కేంద్రంగా జిల్లాను ప్రకటించాలని సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ పార్టీ జిల్లా నాయకులు పల్లాల లచ్చిరెడ్డి, కుంజా దూలయ్య డిమాండ్ చేశారు. మార్క్స్ ఏంగిల్స్ భవనం నుంచి మంగళవారం ర్యాలీగా ఐటీడీఏ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. వారిని లోపలకు అనుమతించకుండా ఎస్సై భూషణం సిబ్బందితో అడ్డుకున్నారు. పీవోను కలిసేందుకు కొద్దిమందికే అవకాశం ఇవ్వడంతో జిల్లా ఏర్పాటుపై వినతిపత్రం అందజేశారు. సర్పంచులు విజయభాస్కర్‌రెడ్డి, ఆదిలక్ష్మి, నాయకులు ధర్మారెడ్డి, శ్రీదేవి, బొజ్జిరెడ్డి, అనసూయ, జోగమ్మ, బాలు పాల్గొన్నారు.

★ అల్లూరి జిల్లాను ముక్కలు చేసి రంపచోడవరం నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరంలో కలిపే కుట్రలు జరుగుతున్నాయని ఆదివాసీ సంక్షేమ పరిషత్తు నాయకులు ఆందోళన చేశారు. పరిషత్తు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీను తదితరులు ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి పీవోకు వినతిపత్రం అందజేశారు. బాబూరావు, నూకరాజు, ప్రదీప్‌కుమార్‌దొర, ప్రసాద్‌దొర, అబ్బాయిదొర, శివ, జోగిరాజు, శారదాదేవి పాల్గొన్నారు.

ఐటీడీఏ ఎదుట నిరసనలో ఆదివాసీ సంక్షేమ పరిషత్తు నాయకులు

(c) eenadu

97 శాతం పింఛన్ల పంపిణీ

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకంలో 97 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేశారు. ఈనెల 1, 3 తేదీల్లో గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులు 2,47,138 మందికి రూ.107.78 కోట్లు అందజేశారు. వివిధ కారణాలతో మరో 6,476 మంది పింఛన్లు తీసుకోలేదు. వీరికి డిసెంబరులో రెండు నెలలకు కలిపి పింఛన్ల సొమ్ము పంపిణీ చేయనున్నారు.

ఇన్ఫోసిస్ మహిళా ఉద్యోగ మేళా ప్రారంభం

హాజరైన విద్యార్థినులు

విజనంపాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: మంత్రి నారా లోకేశ్ సహకారంతో వట్టిచెరుకూరు మండలంలోని విజనంపాడు కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్ఫోసిస్ మహిళా ఉద్యోగ మేళా సోమవారం ప్రారంభమైంది. ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లా పరిధిలోని 75 ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన సుమారు 13,655 మంది ఇప్పటి వరకు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఇన్ఫోసిస్, అపిటా సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి తొలిరోజు 2,075 మంది రాత పరీక్షకు హాజరయ్యారు. 5వ తేదీ నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉద్యోగ నియామకపత్రాలు అందించనున్నట్లు కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు తెలిపారు. ముఖ్య మహిళా నిర్వాహకులు తమ కళాశాలను ఎంపిక చేయడంపై కళాశాల కార్యదర్శి కోయి శేఖర్, సంచాలకులు హరిబాబు, ప్రిన్సిపల్ పి.బాబులు ఆయా సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు.

మరింత తగ్గిన కృష్ణా వరద

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది వరద ప్రవాహం సోమవారం మరింత తగ్గింది. ఉదయం ఆరు గంటలకు 1,26,975 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేశారు. సాయంత్రం ఆరు గంటలకు తగ్గుముఖం పట్టింది. 5 గేట్లను రెండు అడుగులు, 64 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 53,410 క్యూసెక్కులు వదిలారు. గుంటూరు చానల్‌కు నీటి విడుదలను పునరుద్ధరించి, 181 క్యూసెక్కులు ఇచ్చారు. మిగతా పంట కాలువలకు కట్టివేసి ఉన్నాయి.

ఈనాడు అమరావతి
గుంటూరు

చిరునేస్తం.. సిరుల అస్త్రం

చిరుధాన్యాలతో పిండి వంటల తయారీలో శిక్షణ

కొర్నెపాడు (వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: వినూత్నంగా ఆలోచిస్తే సాగును లాభాల బాటగా మార్చుకోవచ్చని రైతులకు భరోసా కల్పిస్తోంది.. 'రైతు నేస్తం' ఫౌండేషన్. వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడులో ఉన్న 'రైతు నేస్తం' ఫౌండేషన్‌కు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఎంతో మంది రైతులు ఇక్కడ 'సేంద్రియ సాగు'లో శిక్షణ పొందడంతోపాటు చిరుధాన్యాలతో ఆహార ఉత్పత్తుల తయారీ, వాటి మార్కెటింగ్‌పై అవగాహన పెంచుకుని ఆదాయం పొందుతున్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత యడ్లపల్లి వెంకటేశ్వరరావు తాను పుట్టిపెరిగిన గ్రామంలో ఈ ఫౌండేషన్ స్థాపించి, ఇందులోనే వ్యవసాయ క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు.

వేరుశనగ ఉండలు

నువ్వుల లడ్డూలు

జొన్న బూందీ

సామలు, అండు కొర్రలతో బిర్యానీ, పిండి వంటలు, టమాటా సాస్, కొర్రలతో బూందీ, జొన్నలతో పేలాలు, సేంద్రియ సుగంధ ద్రవ్యాలతో గరం మసాలా, వివిధ రకాల పొడులను తయారు చేయడంపై రైతులకు శిక్షణ ఇస్తున్నారు. వినియోగదారులు ఎక్కువగా కోరుకునే వంటలను అత్యంత నాణ్యతతో వండించి గిరాకీ ఉన్న ప్రాంతాల్లో ఎలా మార్కెటింగ్ చేసుకోవాలో వివరిస్తున్నారు.

570 శిబిరాలు నిర్వహించాం..

ప్రకృతి వ్యవసాయ శిక్షణ కేంద్రం ప్రాంగణంలో 15 ఎకరాల్లో సేంద్రియ సాగు చేపట్టాం. చిరుధాన్యాల పంటలతోపాటు వాటితో ఉప ఉత్పత్తులు తయారు చేయడంలో ఔత్సాహికులకు శిక్షణ ఇస్తున్నాం. ఇప్పటి వరకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 570 శిక్షణ శిబిరాలు నిర్వహించాం.

- యడ్లపల్లి వెంకటేశ్వరరావు, రైతునేస్తం ఫౌండేషన్ ఛైర్మన్

నోరూరించే రుచులు..

చిరు ధాన్యాలైన కొర్రలు, సామలు, రాగులు, సజ్జలు, ఊదలు, అండు కొర్రలు వంటివి ప్రతి సంవత్సరం ఖరీఫ్, రబీ కాలంలో ఈ క్షేత్రంలో పండిస్తున్నారు. ఆయా చిరుధాన్యాలతో లడ్డూలు, చిక్కీలు,

ఎత్తిపోతలతోపాటు ఆధునికీకరణ ముఖ్యమే

కొమ్మమూరు కష్టాల పరిష్కారానికి ఇవే మార్గాలు

ఈనాడు – అమరావతి

కృష్ణా జిల్లాలో కీలకమైన కొమ్మమూరు ప్రధాన కాలువపై ఎత్తిపోతల నిర్మాణానికి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. దీంతో పాటు ఆధునికీకరణ పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. లేదంటే శివార పొలాలకు నీరందని పరిస్థితి కొనసాగుతుందంటున్నారు.

ఎత్తిపోతలు ఇలా...

● కొమ్మమూరు ప్రధాన కాలువ పడి గట్టుపై 60.250 కిలోమీటర్ల వద్ద నిర్మిస్తారు. ● 48.39 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయాలన్నది లక్ష్యం. ● ఇందుకు డీపీఆర్ సిద్ధమైంది. ● నల్లమడ డ్రెయిన్ నుంచి అంతే మొత్తం నీటిని కొమ్మమూరు ప్రధాన కాలువలోకి ఎత్తిపోసేందుకు మరో పథకం నిర్మించనున్నారు. ● వీటికి రూ.92.88 కోట్లు అవసరమని అంచనా. ● పీ4 పథకం అమల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపు మేరకు ప్రసాద్ సీడ్స్ అధినేత కారుమంచి ప్రసాద్ రూ.10 కోట్లు ఇచ్చారు. మిగిలింది భరించి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

ప్రవాహాలు తక్కువగా ఉంటే...

● డీపీఆర్ ప్రకారం.. కొమ్మమూరు ప్రధాన కాలువలో ప్రవాహాలు తక్కువగా ఉన్నప్పుడు అప్పాపురం ప్రధాన కాలువలోకి నీళ్లు తీసుకెళ్లడం కష్టం. ● అప్పాపురం ప్రధాన చానల్‌పై 33.683 కిలోమీటర్ల వద్ద పంపుహౌస్ నిర్మించి 360 క్యూసెక్కులు ఎత్తిపోయాలనేది ఆలోచన. తద్వారా 7, 8, 9 బ్రాంచి కాలువల కింద ఉన్న అయిదు గ్రామాల్లో తాగు, సాగునీటి సమస్యలు పరిష్కారమవుతాయి. ● దీనివల్ల కొమ్మమూరు కాలువపై 62.500 కిలోమీటర్ల వద్ద 48.39 క్యూసెక్కుల ప్రవాహం తగ్గుతుందని అంచనా. అందువల్లనే నల్లమడ వాగులోంచి అంతే మొత్తం నీటిని ఎత్తిపోయాలని ప్రతిపాదిస్తున్నారు.

70 వేల ఎకరాలకు సమస్య

కొమ్మమూరు ప్రధాన కాలువ పరిధిలో 1.40 లక్షల ఎకరాల్లో పంటలున్నాయి. ఆధునికీకరణ లేక 21 గ్రామాల్లోని దాదాపు 70 వేల ఎకరాలకు నీరందడం లేదు. నల్లమడ లాకుల నుంచి చినగంజాం వరకు సమస్య ఉంది. కిందటేడాది ఎగువ, దిగువ ప్రాంతాల రైతుల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడినప్పుడు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ● గతంలో ఎప్పుడో ఆధునికీకరణ పనులు చేపట్టినా గుత్తేదారు మధ్యలో వదిలేశారు. ● తాజాగా నాబార్డు కింద జలవనరులశాఖ రూ.250 కోట్లతో పనులు ప్రతిపాదించింది. ● జలరవాణా కింద ఆధునికీకరణ పనులను కేంద్రం చేయాలన్న ప్రతిపాదనలున్నా సాకారం కాలేదు.

విద్యావనం.. హరితానందం

◆ ఏఎన్‌యూలో చిట్టడవి వృద్ధి
◆ 700 రకాల జాతులతో 50 వేలకు పైగా చెట్లు

"పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు అన్నారు పెద్దలు. ఆ నినాదాన్ని అందిపుచ్చుకుని ప్రాంగణాన్ని హరితమయం చేస్తోంది ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం. ఇది ఏర్పాటైనప్పుడు ఉన్న చెట్లను పరిరక్షించడంతోపాటు ప్రత్యేకంగా మొక్కలు నాటి చిట్టడవిని అభివృద్ధి చేసింది. ప్రస్తుతం 700 రకాల జాతులతో 50 వేలకు పైగా చెట్లతో అలరారుతోంది."

అడవిని తలపిస్తోన్న ఏఎన్‌యూ ప్రాంగణం

ఈనాడు, అమరావతి

గుంటూరు-విజయవాడ నగరాల మధ్య నంబూరు సమీపంలో 1976లో 355 ఎకరాల్లో ఏర్పాటైంది ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం. రోడ్లు, ఇతర పనులకు కొంత భూమి పోగా.. ప్రస్తుతం 280 ఎకరాల్లో విస్తరించి ఉంది. 15 ఏళ్ల క్రితం 6.50 ఎకరాల్లో 6,400 టేకు మొక్కలు నాటగా.. పెరిగిన వృక్షాలతో విద్యాలయానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సహజ సిద్ధంగా పెరిగిన 9 వేల సుబాబుల్ చెట్లు మరో విశేషమే. ఎర్రచందనం, మామిడి వనాలూ ఆకట్టుకుంటున్నాయి.

ఆ రెండూ ప్రత్యేకం: బొటానికల్ గార్డెన్, ఔషధవనం మరో ప్రధాన ఆకర్షణ. సుమారు నాలుగెకరాల్లో 450 రకాల జాతుల మొక్కలున్నాయని అధికారులు చెబుతున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కొన్ని అరుదైన రకాలను తెప్పించి నాటారు. భవనాలను నిర్మించేటప్పుడు అడ్డు వచ్చిన వృక్షాలను వేరే ప్రాంతాల తరలించి పరిరక్షిస్తున్నారు. కూరగాయల తోటలను పెంచడంపైనా దృష్టి పెట్టారు.

ఎస్టీపీల నిర్మాణానికి ప్రతిపాదనలు

పచ్చందాలను పరిరక్షించడంతోపాటు విరివిగా మొక్కల పెంపకానికి నీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఇటీవల కొన్ని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇక్కడి మురుగునీటిని శుద్ధి చేసేందుకు సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్ (ఎస్టీపీ)ల ఏర్పాటుకు డీపీఆర్‌లు రూపొందించారు. వృక్షాల పరిరక్షణలో భాగంగా జియోట్యాగింగ్ చేయించగా.. మిగిలిపోయిన వాటిని ఆ జాబితాలో చేర్చడంపై దృష్టి పెడుతున్నారు.

ఔరా.. సౌర!

కాటూరి మెడికల్ కళాశాల ప్రాంగణంలో పూర్తిగా సౌరపలకలతో నిర్మించిన పార్కింగ్

ఒక ఆలోచన.. అటు వాహనాలకు నీడకు.. ఇటు సౌర విద్యుత్తు ఉత్పత్తికి ఆదరువుగా మారింది. ప్రత్తిపాడు మండలం ఈదురుపాలెం కాటూరి వైద్య కళాశాల యాజమాన్యం 300 వాహనాల పార్కింగ్‌కు సరిపడా 26 వేల చదరపు అడుగుల స్థలాన్ని కేటాయించింది. షెడ్‌గా పూర్తిగా సౌరపలకలను అమర్చింది. అటు వాహనాలకు నీడ ఇవ్వడంతోపాటు ఇటు ఒక మెగావాట్ విద్యుత్తు ఉత్పత్తికీ ఉపయోగపడుతోంది. సగానికి పైగా కరెంటు బిల్లు ఆదా అవుతోందని కళాశాల ప్రతినిధులు చెప్పారు.

- ఈనాడు, గుంటూరు

టెట్-2025 పరీక్షలకు ఉచిత శిక్షణ

నగరంపాలెం, న్యూస్‌టుడే: టెట్-2025 పరీక్షలకు హాజరయ్యే మైనార్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ అందజేస్తున్నట్లు రీజనల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ డీడీ యాకుబ్ బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్-2025 పరీక్షలకు హాజరయ్యే కోస్తా జిల్లాలకు సంబంధించిన ముస్లింలు, దూదేకులు, క్రిస్టియన్(బీసీ-సి), సిక్కులు, నియోబుద్ధులకు గుంటూరులోని రీజనల్ సెంటర్ ఆంధ్రా ముస్లిం కళాశాల క్యాంపస్‌లో నైపుణ్యం, అనుభవం కలిగిన అధ్యాపకులతో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈనెల 5 నుంచి తరగతులు ప్రారంభిస్తామని తెలిపారు. వివరాలకు 95026 66629, 81259 07579 నంబర్లలో సంప్రదించాలన్నారు.

స్వయం ఉపాధి పథకాలపై అవగాహన సదస్సు 5న

జిల్లాపరిషత్తు(గుంటూరు): కేంద్ర ప్రభుత్వం ఎస్సీల అభ్యున్నతికి అమలు చేస్తున్న స్వయం ఉపాధి పథకాల గురించి తెలియజేసేందుకు ఈనెల 5వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు గుంటూరులోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం పక్కనున్న రెవెన్యూ భవన్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె.శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా మొదటి, మూడో బుధవారాలు ఎస్సీ నిరుద్యోగ యువతకు పథకాల గురించి బ్యాంకర్లతో సమన్వయం చేసుకుని అవగాహన కల్పించాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఎండీ ఆదేశించారన్నారు. సదస్సుకు ఎస్సీ నిరుద్యోగ యువత హాజరుకావాలని సూచించారు.

గోపురాన్ని నిలబెట్టిన 'చీకటి కోనేరు'

చీకటి కోనేరు నీటిలో దర్శనమిస్తున్న గాలి గోపురం

మంగళగిరి పానకాల లక్ష్మీనరసింహస్వామి దేవాలయ గోపురం 153 అడుగుల ఎత్తుతో దక్షిణ భారతదేశంలోనే ఎత్తైన వాటిలో ఒకటిగా పేరుగాంచింది. ఈ గాలిగోపురం ఓ పక్కకు ఒరిగిపోతుండగా ఆ భారాన్ని సరిచేయడానికి ఈశాన్య దిక్కున 1912 సంవత్సరంలో గుంటూరుకు చెందిన వింజమూరి భావనాచార్యులు ఆధ్వర్యంలో గోపురం ఎత్తుకు సరిపోయే లోతుకు 153 అడుగుల లోతు (శత వర్ష పుష్కరిణి)లో కోనేరు తవ్వించారు. దీని అడుగు భాగం పైనుంచి కనపడకపోవడంతో దీనికి 'చీకటి కోనేరు' అని పేరు వచ్చిందని దేవాలయ పండితులు చెబుతున్నారు. పూర్వ రోజుల్లో భక్తులు స్వామిని దర్శించుకొని వచ్చి కోనేరు నీటిలో గోపురాన్ని చూసి వెళ్లేవారట. ● ప్రస్తుతం ఈ కోనేరు చుట్టూ చెత్తాచెదారాలు, పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో భక్తులు చూసేందుకు ఆసక్తి చూపడం లేదు. **– ఈనాడు, అమరావతి**

పీఎంఏవై గృహాలు త్వరితగతిన పూర్తి చేయండి

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రధాన మంత్రి ఆవాస యోజన కింద మంజూరైన గృహాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి హౌసింగ్, గ్రామ, వార్డు సచివాలయం, ఉపాధి హామీ, రీసర్వే, రెవెన్యూ అంశాలపై సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులు, ప్రత్యేక అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాకు నిర్దేశించిన పీఎంఏవై గృహాల నిర్మాణ పనులు పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పీఎంఏవై 2.0లో ఇళ్లు నిర్మించుకోవడానికి ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా తల్లికి వందనం, బయోమెట్రిక్ అప్డేషన్, చైల్డ్ ఆధార్, ఈకెవైసీ, కౌసలం సర్వేను పూర్తి చేయాలన్నారు. రీ సర్వే సీఆర్డీఏ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించి అధికారులకు సూచనలు చేశారు. సమీక్షలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఎన్.ఎస్.కె.ఖాజావలి, సీపీవో శేషశ్రీ, డీపీవో నాగసాయి కుమార్, హౌసింగ్ పీడీ ప్రసాద్, డ్వామా పీడీ శంకర్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ యు.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈ ముంపు పాపం ఎవరిది?

ఎత్తు ప్రాంతాలు సైతం మునకలోకే.. ● అస్తవ్యస్త పనులతో జనానికి యాతన

గత రెండు దశాబ్దాల కాలంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సీజన్లో గుంటూరు నగరం వర్షాలకు విలవిల్లాడింది. మురుగుకాలువలు పొంగి.. రహదారులు నదులుగా మారిపోయాయి. జనజీవనం అస్తవ్యస్తమైన సందర్భాలెన్నో. ఒకప్పుడు చుక్కనీరు నిలబడని ప్రాంతాలు నేడు ముంపునకు ఆనవాళ్లుగా ఉన్నాయి. నగరం భౌగోళికంగా ఎత్తుపల్లాలతో ఉన్నా.. ఇంజినీరింగ్ విభాగ వైఫల్యం వల్లనే పరిస్థితి చేయిదాటుతోంది.

141 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న నగర పరిధిలో గత రెండు నెలల కాలంలో ఐదు దఫాలు ఏకధాటిగా వర్షాలు కురిశాయి. ప్రతీసారీ మూడు నుంచి ఐదు రోజులపాటు భారీగా వాన కురిసింది. నెల రోజుల క్రితం అరండల్‌పేట, బ్రాడీపేట, పట్టాభిపురం, మూడు వంతెనలు, కంకరగుంట ఆర్‌యూబీ, ఏటీ అగ్రహారం, మురికిపేట, హనుమాన్‌నగర్ ఇలా... అనేక ప్రాంతాలు చెరువులను తలపించాయి.

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – నగరపాలక సంస్థ (గుంటూరు)

ఇటీవల నీట మునిగిన ఏటీ అగ్రహారం ప్రాంతం

కారణమేమంటే...: ● గతంలో అధికారులు... గుత్తేదారుల ఒత్తిళ్లకు తలొగ్గి ఒక పద్ధతి లేకుండా రోడ్లపై రోడ్లు వేయించడంతో మురుగుకాలువలు పల్లంలోకి వెళ్లిపోయి నీరు ఇళ్లల్లోకి చొచ్చుకొస్తోంది. ● కొన్ని కాలనీల్లో రహదారులతోపాటు మురుగుకాలువలు నిర్మించలేదు. ● నల్లచెరువులో కొబ్బరితోట పరిసరాలు, రైల్వేట్రాక్ వెంబడి శివనాగరాజుకాలనీ, రాజీవ్‌గాంధీనగర్.. ఇలా డ్రెయిన్లు లేని ప్రాంతాల్లో ముంపు సమస్య ఉండేది. ఇప్పుడు ఏటీ అగ్రహారం, రామిరెడ్డినగర్, శ్రీరామనగర్, మిర్చియార్డు పరిసరాల్లోని కాలనీల్లోకి నీరు చేరుతోంది. చివరకు బ్రాడీపేట, అరండల్‌పేటల్లోనూ సమస్య ఉత్పన్నమవుతోంది.

భౌగోళికంగానూ భిన్నమే..

● సముద్ర మట్టానికి గుజ్జనగుండ్ల ప్రాంతం 45 మీటర్ల ఎత్తులో ఉండగా... సమీపంలోనే ఉన్న పట్టాభిపురం 39, కలెక్టరేట్ ప్రాంతం 35, జీజీహెచ్ 39, కార్పొరేషన్ 33, పాతగుంటూరు 29, ఆర్టీసీ బస్టాండు 28, సుద్దపల్లి డొంక 22, ఇన్నర్‌రింగ్‌రోడ్డు 39, బ్రాడీపేట 39 మీటర్ల ఎత్తులో ఉన్నట్టు ట్రోపోగ్రాఫికల్ మ్యాప్‌లో ఉంది. ● వీటి ప్రకారం తూర్పు నియోజకవర్గంలోని అనేక ప్రాంతాలు పశ్చిమతో పోలిస్తే పల్లంలో ఉన్నాయి. ఎత్తులో ఉన్న పశ్చిమ నియోజకవర్గంలోని ఏటీ అగ్రహారం, మిర్చియార్డు చుట్టుపక్కల ప్రాంతాలు వర్షానికి నీట మునుగుతుండడానికి కారణం జీఎంసీ ఇంజినీరింగ్ విభాగంలోని నాటి అధికారుల వైఫల్యాలు.

టాస్క్ పేరుతో మస్కా

◆ సైబర్ నేరగాళ్ల ఉచ్చు
◆ పోలీసులను ఆశ్రయించిన బాధితులు

ఈనాడు – అమరావతి

బాహుబలి ఏ సంవత్సరంలో విడుదలైందో తెలుసా...?
చెబితే వంద రూపాయల నజరానా...
సమాధానం చెప్పలేకపోతున్నారా..?
ఆప్షన్లు వాడుకోవచ్చు... ఇదేదో క్విజ్ పోటీ కాదు... సైబర్ నేరగాళ్లు కొత్తగా విసురుతున్న వల. అమాయకులనే లక్ష్యంగా చేసుకుని.. యాప్‌లో టాస్క్ ఇస్తున్నాం... సరైన సమాధానం చెబితే రూ.50 నుంచి రూ.వంద వరకు గెలుచుకోవచ్చంటూ ముగ్గులోకి లాగుతున్నారు. తరువాత వారి బ్యాంకు ఖాతాల వివరాలు తెలుసుకుని సైబర్ నేరాలకు వినియోగిస్తున్నారు. ఇలా మోసపోయిన ఆరుగురు సోమవారం పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకొచ్చింది.

వల ఇలా....

ఎంపిక చేసుకున్న వ్యక్తులకు ఏపీకే ఫైల్స్ పంపుతున్నారు. వాటిని తెరిచినవారిని యాప్ ద్వారా టాస్క్‌లు ఇస్తామని, పూర్తి చేస్తే సొమ్ము వస్తుందని ఆశ పెడుతున్నారు. చాలా సులభమైన ప్రశ్నలనే ఆప్షన్స్‌తో ఇస్తున్నారు. సరైన సమాధానం ఎంపిక చేసినవారికి వెంటనే రూ.50, రూ.వంద వచ్చినట్టు యాప్‌లో చూపిస్తున్నారు. ఈ మొత్తం అందులో కనిపిస్తుందేగానీ.. విత్‌డ్రా చేయడానికి వీల్లేకుండా చేస్తున్నారు. ఇలా కొంత మొత్తం వచ్చాక ఆ సొమ్మును మీ బ్యాంకు ఖాతాలకు బదిలీ చేస్తామని చెప్పి ఖాతాల నంబర్లు, ఆధార్, ఇతర వివరాలు అడిగి తీసుకుంటున్నారు. సైబర్ మోసాల ద్వారా దారి మళ్లించిన మొత్తాలను ఆ ఖాతాల్లో వేయించుకుని, బదిలీ చేసుకోవడానికి వాడుకుంటున్నారు. మరోవైపు ప్రశ్నలు అడుగుతూ సొమ్ము పొందుతున్నట్లు యాప్ ద్వారా చూపిస్తూనే ఉంటారు. విషయం తెలియగానే పోలీసులు.. బాధితుల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు.

చిరువ్యాపారులే లక్ష్యంగా...

చిన్న వ్యాపారులు, రోజువారీగా పని చేసుకునే వారినే సైబర్ మోసగాళ్లు ఎంపిక చేసుకుంటున్నారు. ఈ వ్యవహారమంతా టెలిగ్రామ్, వాట్సాప్ ద్వారా చేస్తున్నారు. ఇంగ్లిష్, హిందీ రానివారితో తెలుగులోనే చాటింగ్ చేస్తున్నారు. అనవసరమైన ఫైల్స్ తెరవకూడదని, బ్యాంకు ఖాతా, ఆధార్ వివరాలు ఎవరికీ చెప్పొద్దని సైబర్ పోలీసులు సూచిస్తున్నారు.

మహా మర్రి



మార్టూరు మండలం బొల్లాపల్లి గ్రామం వద్ద ఈ మహా వృక్షం ఊడలే ఆధారంగా విస్తరిస్తోంది. 200 ఏళ్ల నాటి మర్రిచెట్టు రహదారి నిర్మాణానికి ఆటంకంగా మారడంతో పూర్వీకులు కొంచెం నరికేశారు. అనంతరం ఊడలే పెనవేసుకుని ఎకరం మేర విస్తరించిందని గ్రామస్థులు చెబుతున్నారు. వాహనదారులకు నీడతో పాటు పచ్చదనంతో ఆహ్లాదం పంచుతోంది.

- ఈనాడు, బాపట్ల, న్యూస్‌టుడే, మార్టూరు

మిర్చి.. మెచ్చేలా ధర

నిల్వ సరకుకు గిరాకీ

ఈనాడు – అమరావతి

డిమాండ్ పలుకుతున్న రకాలు: తేజ, ఆర్మూర్, సీడ్, 341 రకం

మిర్చి ధరలు పెరుగుతున్నాయి. తుపాను ప్రభావంతో చేలు దెబ్బతినడం, వరుస వర్షాలకు దిగుబడులు ఆలస్యమవుతాయన్న సమాచారంతో నిల్వ సరకుకు డిమాండ్ పెరుగుతోంది. మరోవైపు దేశీయంగా కొనుగోళ్లు బాగుండడం మార్కెట్‌కు కలిసొచ్చింది. బంగ్లాదేశ్‌కు సైతం ఎగుమతులు పెరుగుతున్నాయి. 341 రకం నాణ్యమైన కాయలకు క్వింటాలు ధర రూ.16,500కు పైగా పలుకుతోంది. గత వారంతో పోలిస్తే.. అన్ని రకాలకు క్వింటాకు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు ధర పెరిగింది. వచ్చిన సరకు వచ్చినట్టే అమ్ముడవుతోంది. సోమవారం మార్కెట్‌కు 40,415 బస్తాలు రాగా.. 37,640 బస్తాలు అమ్ముడయ్యాయి. పాతవాటితో కలిపి మార్కెట్‌లో 7,834 బస్తాలు నిల్వ ఉన్నాయి. ● గుంటూరు పరిసరాల్లోని శీతల గోదాముల్లో 33 లక్షల బస్తాల వరకు మిర్చి నిల్వలున్నాయి.

రాష్ట్రం మొత్తమ్మీద సుమారు 52 లక్షల బస్తాలుంటాయని అంచనా. కొత్త మిర్చి మార్కెట్‌కు రావడానికి మరో రెండు నెలల సమయం ఉంది. ప్రస్తుతం రోజుకు సగటున 50 వేల బస్తాల వరకు విక్రయాలు నమోదవుతుండడంతో నిల్వలు తరిగిపోతున్నాయి. ● మన రాష్ట్రంలో కర్నూలు జిల్లా నుంచి తొలిపంట వచ్చేది. ఈసారి వర్షాలకు అక్కడి పంట దెబ్బతింది. ● ఈ ఏడాది సాగు విస్తీర్ణం తగ్గడంతోపాటు సీజన్లో ప్రతికూల పరిస్థితులు దిగుబడులను ప్రభావితం చేసే అవకాశం ఉంది. ● దేశంలో ముందుగా మార్కెట్‌కు వచ్చే మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లోనూ మిర్చి వర్షాలకు దెబ్బతింది. తెలంగాణలోని ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి. ● మార్కెట్‌లో కొన్ని రకాల లభ్యత లేక డిమాండ్ పెరుగుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ధరల పెరుగుదల కొంతమేరకే ఉండొచ్చని మార్కెట్‌వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

అప్పుడే కాదు!

పురుషుల పొదుపు సంఘాలకు మంజూరు కాని రుణాలు

న్యూస్‌టుడే – పొన్నూరు

పొన్నూరుకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఆర్.సుబ్బారావు గత మార్చిలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పురుషుల పొదుపు సంఘంలో చేరారు. రుణం మంజూరు చేస్తామని చెప్పిన అధికారులు ఇప్పటి వరకు హామీ నిలబెట్టుకోలేదు. కుటుంబ అవసరాలకు వడ్డీకి రూ.20 వేలు అప్పు తీసుకున్నానని, రుణం మంజూరయ్యాక బకాయి తీరుస్తానని ఆయన చెబుతున్నారు. ఈయనొక్కరి సమస్యే కాదు.. జిల్లాలో ఏర్పాటైన 200 గ్రూపుల్లోని సభ్యులదీ ఇదే పరిస్థితి.

గుంటూరు, మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్లతోపాటు తెనాలి, పొన్నూరు పురపాలక సంఘాల్లోని మెప్మా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండొందల గ్రూపులు ఏర్పడ్డాయి. ఇందులో భవన నిర్మాణ, రిక్షా కార్మికులు, వాచ్‌మెన్లు, జొమాటో, స్విగ్గీ డెలివరీ బాయ్స్, ప్రైవేటు పనులు చేస్తున్నవారు సభ్యులుగా చేరారు. వీరిలో కొంతమంది మూడు నెలలపాటు బ్యాంకులో పొదుపు మొత్తాలు జమ చేశారు.

పొదుపు చెల్లించాక సభ్యులకు ఎలాంటి పూచీకత్తు లేకుండానే బ్యాంకు రుణాలు మంజూరు చేస్తుందని గతంలో మెప్మా అధికారులు ప్రకటించారు. ఇప్పటివరకు ఒక్కరికీ ఇవ్వలేదు. ఈ మేరకు బ్యాంకు అధికారులకు.. మెప్మా ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులు అందలేదని చెబుతున్నారు. రుణాల కోసం గ్రూపుల్లోని సభ్యులు మెప్మా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ● జిల్లా మెప్మా విభాగం ఐబీ టి.హనుమాన్‌నాయక్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే పురుష గ్రూపులకు రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

హోంగార్డు కుటుంబానికి రూ.30 లక్షల బీమా ఇవ్వాల్సిందే

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే

ప్రమాదవశాత్తు మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి బీమా పరిహారం చెల్లించాలని జిల్లా వినియోగదారుల కమిషన్ సోమవారం తీర్పు చెప్పింది. సత్తెనపల్లి మండలం గుడిపూడికి చెందిన మాలే కల్యాణ్ ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పని చేశారు. 2022 జూన్ 16న రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందారు. రూ.30 లక్షల బీమా పరిహారంతోపాటు ఇతర రాయితీలు మంజూరు చేయాలని మృతుడి భార్య జిల్లా పోలీసు యంత్రాంగానికి దరఖాస్తు చేసుకున్నారు. ఇతర రాయితీలు మంజూరు చేసిన యంత్రాంగం.. బీమా పరిహారం ఇవ్వాలని యాక్సెస్ బ్యాంకును కోరింది. గడువు ముగిశాక దరఖాస్తు అందిందంటూ బీమా చెల్లించేందుకు బ్యాంకు నిరాకరించింది. దీంతో ఆమెతోపాటు పోలీసు ఉన్నతాధికారులు జిల్లా వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం.. కల్యాణ్ మృతి చెందిన రోజు నుంచి వడ్డీతో బాధితురాలికి పూర్తి బీమా ఇవ్వాలని, నష్టపరిహారం కింద రూ.25 వేలు, ఖర్చులకు మరో రూ.3 వేలు ఆరువారాల్లోగా చెల్లించాలని కమిషన్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, సభ్యుడు పున్నారెడ్డి తీర్పు చెప్పారు.



దరఖాస్తు ఆలస్యంగా వచ్చిందన్న బ్యాంకు వాదనను తిప్పికొట్టిన వినియోగదారుల కమిషన్

రిజిస్టర్డ్ పోస్టును తిప్పి పంపినందుకు...

పోస్టల్ శాఖకు రూ.10 వేల వడ్డింపు

రిజిస్టర్డ్ పోస్టును చిరునామాలో ఉన్న వ్యక్తికి సక్రమంగా అందించని పోస్టల్‌శాఖ నష్టపరిహారం చెల్లించాలని జిల్లా వినియోగదారుల కమిషనర్ ఆదేశించింది. బుడంపాడుకు చెందిన నలగాల బులి అంకుల్ అనే వ్యక్తి గుంటూరు నగరంలోని లాలాపేటకు చెందిన మహిళకు కొంత నగదు ఇచ్చారు. ఆమె బకాయి చెల్లించేందుకు ఇచ్చిన చెక్ చెల్లలేదు. రుణదాత ఆమెపై కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశారు. నిందితురాలికి కోర్టు రిజిస్టర్ పోస్టులో నోటీసు పంపింది. సదరు వ్యక్తి చిరునామాలో లేరని పోస్టుమేన్ నోటీసును తిరిగి కోర్టుకు పంపేశారు. ఆమె ఆ చిరునామాలోనే ఉన్నారన్న విషయం కోర్టుకు తెలిసి ఓ న్యాయవాది ద్వారా నోటీసు పంపింది. పోస్టుమేన్ ఉద్దేశపూర్వకంగా నిందితురాలికి నోటీసు ఇవ్వలేదని రుణదాత జిల్లా వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం పోస్టల్‌శాఖ రూ.10 వేల నష్టపరిహారంతోపాటు న్యాయవాదికి రూ.వెయ్యి, ఖర్చులకు మరో రూ.2 వేలు ఆరువారాల్లోగా చెల్లించాలని కమిషన్ తీర్పు చెప్పింది.

(c) eenadu

వినతులు@ 409

తొలిసారి భారీగా నమోదైన అర్జీలు

కలెక్టరేట్ వద్ద కౌలు రైతు సంఘం నాయకుల ప్రదర్శన

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: రెండు వారాలుగా పీజీఆర్ఎస్ కార్యక్రమం అనివార్య కారణాలతో రద్దు కావడంతో సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమానికి పెద్ద ఎత్తున అర్జీదారులు తరలివచ్చారు. ఒక్కరోజే 409 అర్జీలు నమోదయ్యాయి. కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియాతో పాటు జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఎన్.ఎస్.కె.ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, శ్రీనివాసరావు, లక్ష్మీకుమారి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బాజీబాబా దర్గాలో ఆక్రమణలు

పెదకాకానిలోని బాజీబాబా దర్గా ఆవరణలో ఓ దాత షెడ్డు నిర్మించారని, దానిలో కొందరు టెంట్ హౌస్ సామగ్రి పెట్టి ఆక్రమించుకుని భక్తులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని భక్తులు వినతిపత్రం అందించారు. దీనిపై వక్ఫ్‌బోర్డు అధికారులు, దర్గా ఈవోకు విన్నవించినా స్పందన లేదన్నారు. కార్యక్రమంలో ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలి, నాయకులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

ఇటీవల వరదల్లో పంట నష్టపోయిన కౌలు రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ పథకాన్ని కూడా కౌలురైతులకు వర్తింపజేయాలని కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు వినతిపత్రం అందించారు. వినతిపత్రం అందించిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఈమని అప్పారావు, డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు. ★ మహాత్మాగాంధీ న్యూ ఇన్నర్ రింగ్‌రోడ్డు మూడో దశలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు.. ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం నాయకులు వినతిపత్రం అందించారు. సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడుతూ పేరేచర్ల వద్ద పీఎంఏవై-ఎన్టీఆర్ నగర్‌లో ఇంటిని నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చి ఐదు నెలలైందన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ ఖాశిం షహీద్, ఆదినికల్సన్, బాధితులు పాల్గొన్నారు. ★ గుంటూరు-నడికుడి మీదుగా సికింద్రాబాద్ డబుల్ లైన్‌లో సిరిపురం, మందపాడు గ్రామాల్లో నివాసాలు, భూములు కోల్పోతున్న వారికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం అందించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్, బాధిత రైతులు వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రామకృష్ణ పాల్గొన్నారు. ★ మంగళగిరిలోని తెనాలి రోడ్డు 60 అడుగుల ప్రతిపాదనను రద్దు చేయాలని తెనాలి రోడ్డు చేనేత పరిరక్షణ, విస్తరణ బాధితుల సంఘం ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం అందించారు. దీనివల్ల చిరువ్యాపారులు, చేనేత దుకాణాలు, ఇళ్లు పూర్తిగా పోతాయన్నారు.

తుపాను గాయం.. సస్యరక్షణతో మాయం

'ఈనాడు' ఫోన్ ఇన్‌లో ఆంగ్రూ వీసీ, శాస్త్రవేత్తలు

ఫోన్‌లో రైతు సందేహాన్ని నివృత్తి చేస్తున్న ఆంగ్రూ వీసీ డాక్టర్ శారద జయలక్ష్మీదేవి, పక్కన లాంఫాం శాస్త్రవేత్తలు, ఆంగ్రూ విభాగాల అధికారులు

ఈనాడు మీతోడు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావంతో కురిసిన అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలను సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా కాపాడుకోవచ్చని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్.ఆర్.శారద జయలక్ష్మీదేవి తెలిపారు. గుంటూరుకు సమీపంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లాంఫాం సమావేశ మందిరంలో 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి రైతులు విశేషంగా స్పందించారు. రైతులు అడిగిన ప్రశ్నలకు వీసీ శారద జయలక్ష్మీదేవితో పాటు వర్సిటీ పరిశోధన సంచాలకుడు పి.వి.సత్యనారాయణ, విస్తరణ సంచాలకుడు జి.శివనారాయణ, లాంఫాం ఏడీఆర్ ఎన్.దుర్గాప్రసాద్, ఆయా విభాగాల శాస్త్రవేత్తలు, డాక్టర్ వైఎస్ఆర్ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు విజయలక్ష్మి, తనూజ సమాధానాలు చెప్పి సందేహాలు నివృత్తి చేశారు. పంటల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని తక్షణం బయటికి పంపాలన్నారు. 40 మంది రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఆయా పంటల్లో తీసుకోవాల్సిన సంరక్షణ చర్యలివీ..

రైతేరాజు

పసుపు: పంటలో 2-3 సార్లు 2 శాతం యూరియా లేదా 1 శాతం పొటాషియం నైట్రేటు ద్రావణాన్ని వారం వ్యవధిలో పిచికారీ చేయాలి. ప్రొపికోనజోల్ 0.1 శాతం, డైఫెన్కోనజోల్ 0.1 శాతం ద్రావణాలను 2-3 సార్లు వారం వ్యవధిలో మార్చి మార్చి పంటపై పిచికారీ చేస్తే.. ఆకుమచ్చ, తాటాకు మచ్చ తెగుళ్ల నివారణ చేయవచ్చు. దుంపకుళ్లు తెగులు నివారణకు 0.3 శాతం కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 1 శాతం బోర్డో మిశ్రమంతో నేలను తడపాలి.

మిరప: పంట ఊరికెత్తి తలలు వాల్చితే లీటరు నీటికి 10 గ్రాముల యూరియా కలిపిన ద్రావణాన్ని వారంలో రెండు సార్లు పిచికారీ చేయాలి. వడలు ఉన్న మొక్కలు లీటరు నీటికి 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపిన ద్రావణం పిచికారీ చేయాలి. ఇనుప ధాతు లోపంతో మొక్కలు పాలిపోయినట్లు కనిపిస్తే.. 10 లీటర్ల నీటికి 50 గ్రాముల అన్నభేది తో పాటు ఒక నిమ్మ చెక్క రసం కలిపి పిచికారీ చేయాలి. ● పైపాటుగా అదనంగా ఎకరానికి 50 కిలోల యూరియా, 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 200 కిలోల వేపపిండి వేయాలి. గొర్రుతో అంతరకృషి చేయాలి. మొక్కలు తేరుకున్న తర్వాత స్థూల పోషకాల మిశ్రమాన్ని (5 గ్రాములు లీటరు నీటికి), సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని (2.5 గ్రాముల లీటరు నీటికి) ఒక దాని తర్వాత ఒకటి వారం వ్యవధిలో 2-3 సార్లు పిచికారీ చేయాలి. బ్యాక్టీరియా ఆకుమచ్చ, కాయకుళ్లు, కాపర్ వంటి తెగుళ్లు ఆశించే అవకాశముంది కాబట్టి ముందు జాగ్రత్త చర్యగా 10 లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపిన ద్రావణం పిచికారీ చేసి వీటి వ్యాప్తిని అరికట్టాలి.

వరి: వర్షాలతో పాటు గాలులు వీయడంతో వరి పంట పూత దశలో ఉన్న గింజలు తాలుగా మారే అవకాశముంది. పాలు పోసుకునే గింజల్లో కూడా రంగు మారుతుంది. ధాన్యం రంగు మారకుండా, వివిధ శిలీంద్రాలు గింజలను ఆశించకుండా, మానిపండు తెగులు ఆశించకుండా ఉండేందుకు ప్రొపికోనజోల్ మందు ఎకరానికి 200 మి.లీ పిచికారీ చేసుకోవాలి. పడిపోయిన పంటను నిలబెట్టి కట్టలు కట్టుకోవాలి. కొన్ని ప్రాంతాల్లో 5 శాతం ఉప్పు ద్రావణాన్ని గింజ మొలకెత్తకుండా ఉండేందుకు పిచికారీ చేయాలి. ● పైపాటుగా యూరియా, పొటాష్ 20 కిలోలు చొప్పున వేసుకోవాలి. తెగుళ్ల నివారణకు వెంటనే ప్రొపికోనజోల్ మందును ఎకరానికి 200 మి.లీ పిచికారీ చేసుకోవాలి. అగ్గి తెగులు ఆశిస్తే వెంటనే ట్రైసైక్లజోల్ మందును 120 గ్రాముల వేయాలి. ఆకుముడత నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాముల లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 60 మి.లీ మందుల్లో ఏదో ఒకటి ఎకరాకు పిచికారీ చేసుకోవాలి. కంకినల్లి నివారణకు ప్రొఫెనోఫాస్ మందును 900 మి.లీ పిచికారీ చేసుకోవాలి.

పత్తి: పంటలో గూడ, కాయ రాలడం ఎక్కువగా ఉంటే ప్లానోఫిక్స్ (4.5 శాతం నాఫ్తలీన్ అసిటిక్ ఆసిడ్) 0.25 మి.లీ. లీటరు మోతాదులో పిచికారీ చేయాలి. కేఎన్03 ఎకరానికి 1-2 కిలోలు కలిపి చల్లాలి. వారం వ్యవధిలో రెండుసార్లు వేయాలి. ● కాయకుళ్లు తగ్గించడానికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ + 0.1 గ్రాముల స్ట్రెప్టోసైక్లిన్ లీటరు నీటికి కలిపి మొక్కలు బాగా తడిసేలా పిచికారీ చేయాలి. వంగిపోయిన మొక్కలను నిలబెట్టి మొదళ్ల చుట్టూ తొక్కించాలి. పంటలో సాళ్లు ఏర్పాటు చేసి మొక్కల్లో గాలి, కాంతి ప్రసరణ పెంచాలి.

మినుము: ఈ పంటకు ఒక శాతం 19:19:19 మందు పిచికారీ చేయాలి. ఆకుమచ్చ తెగుళ్లు, ఇతర తెగుళ్లు ఆశించకుండా కార్బెండజిమ్ + మాంకోజెబ్ 2 గ్రాములు లేదా ప్రొపికోనజోల్ 1 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. మారుక మచ్చల పురుగు నివారణకు లీటరు నీటికి నొవల్యూరాన్ 1.0 మి.లీ లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ లేదా ఫ్లుబెండిఎమైడ్ 0.2 మి.లీ లేదా రైనాక్సీపైర్ 0.3 మి.లీ మందును పిచికారీ చేస్తే పురుగును నివారించవచ్చు.

బొప్పాయి పాలు.. విదేశాలకు

నంద్యాల జిల్లా చాగలమర్రి మండల వ్యాప్తంగా రైతులు అధికంగా బొప్పాయి సాగు చేస్తుంటారు. చిన్నవంగలితో పాటు సమీపంలోని గ్రామాలైన వైఎస్సార్ కడప జిల్లా కానగూడూరు, క్రిష్ణంపల్లె గ్రామాల్లో 1200 ఎకరాల్లో పండిస్తారు. విత్తనం నాటిన కాలం నుంచి తొమ్మిది నెలలకు పంట చేతికొస్తుంది. పండ్ల సేకరణ అనంతరం 13 నెలల తర్వాత మిగిలినవి, ముదురు కాయలకు గాట్లు పెట్టి పాలను సేకరిస్తున్నారు. తెల్లవారుజాము సమయంలోనే కాయలకు గాట్లు పెడితే కేవలం రెండు గంటల్లోనే పాలు ఊరుతుంది. ఇలా సేకరించిన దాన్ని రాయచోటి, రాజంపేటకు చెందిన వ్యాపారులు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల పాలు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 4 డ్రమ్ముల పాలు సేకరిస్తున్నారు. ఎకరానికి పాల సేకరణ ద్వారా రైతుకు రూ.24 వేల ఆదాయం వస్తుంది. సేకరించిన పాలను పరిశ్రమల్లో మందులు, కాస్మోటిక్స్, సబ్బుల తయారీలో ఉపయోగిస్తున్నారు. బెంగళూరు, చెన్నైతో పాటు నాణ్యతను బట్టి విదేశాలకు సైతం పాలను ఎగుమతి చేస్తున్నారు. బొప్పాయి సాగులో ఎప్పుడైనా ధర పడిపోయినప్పుడు బొప్పాయి పాల సేకరణతో నష్టాల నుంచి రైతులు బయటపడుతున్నారు. **- న్యూస్‌టుడే, చాగలమర్రి**

పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం

మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

గోరంట్ల, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ పారిశుద్ధ్య పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలులో నీరు, పారిశుద్ధ్య కమిటీ సమావేశం సోమవారం జరిగింది. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ఎక్కడా బహిరంగ మల విసర్జన లేకుండా చూడాలని, ఓడీఎఫ్‌గా గతంలో ప్రకటించిన గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి పరిస్థితులు గమనించాలన్నారు. ఎక్కడైనా వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్ల అవసరం అనుకుంటే.. మంజూరుకు ప్రతిపాదించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, డీపీవో బి.వి.నాగసాయికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కల్యాణ్ చక్రవర్తి, ఐసీడీఎస్ పీడీ ప్రసూన, డీఏవో అయితా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీపీఈడీ, డీపీఈడీ, ఎంపీఈడీ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యాయామ కళాశాలల్లో బీపీఈడీ, డీపీఈడీ, ఎంపీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్‌ను పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాద్ సోమవారం విడుదల చేశారు. డిసెంబరు 1వ తేదీ నుంచి నిర్వహించే పరీక్షలకు ఈ నెల 20లోపు ఫీజు చెల్లించాలని సూచించారు. రూ.100ల అపరాధ రుసుంతో ఈ నెల 22 వరకు చెల్లించే అవకాశం ఉందని చెప్పారు. బీపీఈడీకి రూ.1450, డీపీఈడీకి రూ.1090, ఎంపీఈడీకి రూ.1540 ఫీజు చెల్లించాలన్నారు.

నానోటెక్నాలజీ పరీక్షల ఫలితాలు: ఏఎన్‌యూలోని సైన్స్ కళాశాల పరిధిలో ఆగస్టులో నిర్వహించిన ఐదో ఏడాది రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాద్ విడుదల చేశారు. మొత్తం 25 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 20 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

ఇద్దరు ఎంపీడీవోలకు శ్రీముఖాలు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి గైర్హాజరైన పల్నాడు జిల్లా రొంపిచర్ల ఎంపీడీవో మాధ్యుబాబు, రెంటచింతల ఎంపీడీవో శ్రీనివాసరావులకు జిల్లాపరిషత్తు సీఈవో వి.జ్యోతిబసు శ్రీముఖాలు జారీ చేశారు. ఆయా మండలాల్లో జరిగిన పీజీఆర్ఎస్‌కు ఇద్దరు ఎంపీడీవోలు హాజరు కాలేదు. దీనిని తీవ్రంగా పరిగణించిన పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆగ్రహం వ్యక్తం చేసి వారికి శ్రీముఖాలు జారీ చేయాలని జడ్పీ సీఈవో జ్యోతిబసును ఆదేశించడంతో సిబ్బంది దస్త్రం పంపారు. ఎంపీడీవోలను సీఈవో వివరణ కోరారు.

వసతిగృహ భవన నిర్మాణానికి విరాళం

చుక్కపల్లి రమేష్‌కు చెక్కు అందజేస్తున్న మన్నవ రామారావు, సూర్యదేవర రమేష్

పట్టాభిపురం, న్యూస్‌టుడే: కమ్మజన సేవా సమితి ఆధ్వర్యంలో అత్యాధునిక వసతులతో గ్రామీణ ప్రాంత పేద విద్యార్థినుల వసతిగృహ భవన నిర్మాణానికి మిర్చి వ్యాపారి మన్నవ రామారావు, కుమార్తె సూర్యదేవర లీలారాణి, అల్లుడు సూర్యదేవర రమేష్ రూ.6 లక్షల విరాళం ఇచ్చారు. దీనికి సంబంధించిన చెక్కును సమితి అధ్యక్షుడు మల్లెల హరీంద్రనాథ్ చౌదరి, ఉపాధ్యక్షుడు చుక్కపల్లి రమేష్‌లకు దాతలు అందజేశారు. గదిపై కుమారులు రాకేష్ చౌదరి, రతేష్ చౌదరి, కుమార్తె రంషిత చౌదరి పేర్లు ఉండాలని కోరారు. గతంలో రూ.4 లక్షలు విరాళం ఇచ్చామని వారు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కన్నెగంటి బుచ్చయ్య చౌదరి, సంయుక్త కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, సభ్యులు వడ్లమూడి శివరామకృష్ణయ్య, కరణం పట్టాభి సీతారామారావు, ప్రత్యేక ఆహ్వానితులు పెద్ది సాంబశివరావు, మైనేని సీతారామయ్య పాల్గొన్నారు.

కాలు లేదన్నా.. కనికరం లేదయ్యా..!

మధుమేహం వ్యాధి బారిన పడడంతో ఏడాదిన్నర క్రితం కుడి కాలును మోకాలి కింద వరకు తొలగించారు. దీంతో జీవనం కష్టంగా మారింది. పింఛను వస్తే ఉపయోగకరంగా ఉంటుందని దరఖాస్తు చేసుకున్నా. తొలుత సదరం పత్రం అడిగారు. అవసరమైన పత్రాలన్నీ సచివాలయంలో అందించినా పట్టించుకోవడం లేదు. నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. అధికారులు స్పందించి పింఛను ఇప్పించాలని గుంటూరుకు చెందిన **జి.భవానీ ప్రసాద్** కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, గోరంట్ల**

ఎలక్ట్రానిక్స్ రంగంలో ఐఈటీఈ కీలక సేవలు

ఐఈటీఈ సీనియర్ సభ్యులను సత్కరిస్తున్న ఏపీ ఎస్ఆర్ఎం వీసీ డా.సీహెచ్ సతీష్ కుమార్, డా.బి సూర్యప్రసాదరావు

తుళ్లూరు: ఎలక్ట్రానిక్స్ రంగంలో అపారమైన అనుభవం ఉన్న మేధావుల మార్గదర్శకత్వాన్ని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీర్స్ (ఐఈటీఈ) అందిస్తోందని ఆ సంస్థ విజయవాడ కేంద్రం ఛైర్మన్ డా.బి.సూర్యప్రసాదరావు పేర్కొన్నారు. రాజధానిలోని ఏపీ-ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో సోమవారం సాయంత్రం ఆ సంస్థ విజయవాడ సెంటర్ 72వ వ్యవస్థాపక వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో కార్యదర్శి డా.షేక్ రియాజుద్దీన్‌లు హాజరై ప్రసాదరావు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఏడు దశాబ్దాల చరిత్ర కలిగిన ఐఈటీఈ జాతి నిర్మాణంలో విశేష సేవలు అందిస్తోందన్నారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఖమ్మం జిల్లాల పరిధిలోని 4 వేల మంది ఇంజినీరింగ్ విద్యార్థులు వీటిని అందుకుంటున్నారని వివరించారు. తమతో పరస్పర భాగస్వామ్య పద్ధతిలో ఏపీ-ఎస్ఆర్ఎం వర్సిటీ పనిచేస్తుందని వీసీ డా.సతీష్‌కుమార్ తెలిపారు. ఈసీఈ విద్యార్థులు స్వయంగా రూపొందించిన నెక్స్‌ట్రానిక్స్ టెక్నాలజీ క్లబ్‌ను ఇన్‌ఛార్జి వీసీ ప్రారంభించారు. లోగోను డీన్ డా.సి.వి టామీ ఆవిష్కరించారు. సర్క్యూట్ మేకింగ్, వర్క్‌షాప్ హ్యాకథాన్‌ల నిర్వహణ వంటి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కార్యక్రమాలను ఈ క్లబ్ ద్వారా నిర్వహించనున్నట్లు ఈసీఈ విభాగాధిపతి కె.ఏ సునీత తెలిపారు. ఐఈటీఈ సీనియర్ సభ్యులు డా.పి.కాళీ ప్రసాద్, డా.ఎం.వేణుగోపాల్‌రావులను సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు.

మంత్రి నారా లోకేశ్ 'ప్రజాదర్బార్' నేడు

తాడేపల్లి, న్యూస్‌టుడే: విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఈ నెల 4వ తేదీ తెదేపా కేంద్ర కార్యాలయంలో 'ప్రజాదర్బార్' నిర్వహించనున్నట్లు మంగళగిరి నియోజకవర్గ తెదేపా కార్యాలయం నుంచి సోమవారం ప్రకటన విడుదలైంది. ఉదయం 8 గంటల నుంచి మంగళగిరిలోని ఆత్మకూరు వద్ద ఉన్న పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చి నేరుగా సమస్యలపై అర్జీలు అందించవచ్చని పేర్కొన్నారు.

నల్లమడ వాగు వరద నివారణకు చర్యలు చేపట్టాలి

కలెక్టరేట్‌కు రైతులతో కలిసి వచ్చిన నల్లమడ రైతు సంఘం నాయకులు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: నల్లమడ వాగు వరద నియంత్రణకు తక్షణం చర్యలు చేపట్టాలని నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్ డిమాండ్ చేశారు. ఈమేరకు పీజీఆర్ఎస్ కార్యక్రమంలో సోమవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా రాజమోహన్ మాట్లాడుతూ గుంటూరు ఛానల్ పొడిగింపు విషయంలో ప్రభుత్వాలు కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నాయన్నారు. వాగు సామర్థ్యానికి మించి వరద నమోదవుతుందని, దీంతో వాగుకు గండ్లు పడ్డాయన్నారు. వరదలు వచ్చినప్పుడల్లా పెదనందిపాడు, ప్రత్తిపాడు, కాకుమాను మండల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. నల్లమడ వాగుకు సంబంధించి గతంలో కమిటీలు ఇచ్చిన సూచనలు అమలు చేయాలన్నారు. వరద బారిన పడకుండా వాగును అభివృద్ధి చేయాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు మన్నవ హరిప్రసాద్, లావు అంకమ్మచౌదరి, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

4.1 మి.మీ. సగటు వర్షపాతం

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు సగటున 4.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అధికంగా తాడికొండ మండలంలో 18.4 మి.మీ. వర్షం కురిసింది. పొన్నూరు 16.2, గుంటూరు తూర్పు 11.8, గుంటూరు పశ్చిమ 7.2, ప్రత్తిపాడు 5, చేబ్రోలు 4.2, కాకుమాను 4.2, తుళ్లూరు 4.2, ఫిరంగిపురం 1.8, పెదకాకాని 1, తాడేపల్లి 0.4 మి.మీ. వర్షపాతం నమోదైంది.

సైబర్ నేరాలకు సహకారం.. ముగ్గురి అరెస్టు

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలకు సహరించిన ముగ్గురు నిందితులను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. వీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారు. పోలీసుల కథనం ప్రకారం.. ఓ ముఠా సభ్యులు హైదరాబాద్‌కు చెందిన బాధితులకు వాట్సాప్ ద్వారా పెట్టుబడుల సలహాదారులుగా పరిచయం చేసుకొని, నమ్మించి డబ్బులు దండుకున్నారు. అలా ముగ్గురి నుంచి రూ.59 లక్షలు కొట్టేశారు. ఈమేరకు బాధితులిచ్చిన ఫిర్యాదుపై సైబర్ సెల్ పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా, తమ్మ రంగారెడ్డి నగర్ ఒకటో లేన్‌లో నివాసి, నిరుద్యోగి మడతాల రమేశ్‌రెడ్డి (25), విశాఖపట్నం, ఇంద్రానగర్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి గండి శ్రీను, విజయవాడ, గొల్లపూడి, కృష్ణమల్లి రెసిడెన్సీ నివాసి, లోన్ ప్రొవైడర్‌గా పని చేస్తున్న గుర్రపుకొండ శ్రీధర్‌లను నిందితులుగా గుర్తించారు. వీరు సైబర్ మోసగాళ్లతో చేతులు కలిపి, వివిధ బ్యాంకుల్లో ఖాతాలు తెరిచారు. వాటి వివరాలను మోసగాళ్లకు చేరవేశారు. ఆ ఖాతాలో జమయ్యే మొత్తానికి రమేశ్‌రెడ్డి, గండి శ్రీను, గుర్రపుకొండ శ్రీధర్‌లకు 15 నుంచి 20 శాతం కమీషన్‌లు అందుతున్నాయని పోలీసులు గుర్తించారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్స్ ఏసీపీ శివమారుతి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ ఎస్.నరేశ్ బృందం నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి మొబైల్ ఫోన్, పోకో హ్యాండ్‌సెట్, డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

మిర్చి యార్డు సమాచారం (నిన్నటి ధరలు)



వచ్చిన బస్తాలు:	40,415
అమ్మకాలు:	37,640
నిల్వలు:	7,834

నాన్ ఏసీ కామన్ వెరైటీ (క్వింటా రూ..ల్లో)

334	10,000-15,000
నంబర్ 5	10,000-14,200
341	10,000-15,800

నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	10,000-15,000
బాడిగ	10,500-15,200
దేవనూరు డీలక్స్	10,000-14,700
ఆర్మూర్	10,000-12,700

ఏసీ కామన్ వెరైటీ

334	10,500-15,200
నంబర్ 5	10,000-14,300
341	10,000-16,000
సూపర్10	10,000-14,800

ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	10,000-15,000
బాడిగ	10,000-15,300
దేవనూరు డీలక్స్	10,500-14,800
తాలు	5,300-8,000

- న్యూస్‌టుడే, మిర్చియార్డు

ఆ రైళ్లను గుంటూరులో ఆపండి

ఈనాడు, అమరావతి: సత్యసాయి శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక రైళ్లకు గుంటూరులో హాల్ట్ ఇవ్వాలని రైలు వినియోగదారులు అభ్యర్థిస్తున్నారు. ఈ మేరకు సోమవారం దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులకు లేఖ రాశారు. శ్రీకాకుళం, కటక్, భువనేశ్వర్, సంబల్పూర్ నుంచి వచ్చే సదరు రైళ్లకు విజయవాడ తరవాత నంద్యాలను హాల్ట్‌గా ఇచ్చారని, గుత్తి, ధర్మవరం వంటి చిన్న స్టేషన్లలోనూ ఆగే అవకాశం కల్పించి.. డివిజనల్ ప్రధాన కేంద్రం, రాజధాని అమరావతికి ముఖ్య నగరమైన గుంటూరును విస్మరించడం తగదని పేర్కొన్నారు. బెంగళూరు వెళ్లే ప్రత్యేక రైళ్లకూ మార్కాపురం రోడ్ స్టాపింగ్ ఇవ్వాలని ఆ అభ్యర్థనలో పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ఒక్కింటికి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 121, రిటైల్ ధర - 148, చికెన్ విత్‌స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్ - 244.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 252 చికెన్ స్కిన్‌లెస్ - 262.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 575 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.96/-.

91.9 FM Vijayawada ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులో/ ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) Ⓟ 87907 41166.

బంగారం బ్యాంకులో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నచో విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీనివాస గ్రూప్, VJA, వృద్ధులకు, పేషెంట్లకు [illegible] 9553786677/ 9640496677.

REAL ESTATE

HOUSE FOR SALE

GENERAL

గుంటూరు సిటీ SVN [illegible] 9849502430, 8341342696.

PLOT FOR SALE

GENERAL

మంగళగిరి గాలి గోపురం దగ్గరలో [illegible] 60.5 గజాల స్థలం అమ్మబడును. Ph: 83319 89433.

JOBS

గుంటూరు: మా సంస్థలో CRDA [illegible] 98498 86249.

Wanted female nurse for home patient. Exp: BSc nursing & food and Nutrition. Timings: morning 6am to 6pm pls send ur Biodata with photo to following mail ID (staffbala5@gmail.com)

Senior Qualified lab Technician Wanted to work on Fully automatic analyser. 62815 06491.

ఫీల్డ్ ఆఫీసర్, [illegible] HDFC/ AXIS [illegible] 8297675825.

WANTED HDFC BANK కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ [illegible] లలితా ఫైనాన్స్ లింక్స్ 9951001348

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ [illegible] 6281037879.

R.K ఇంజనీరింగ్ [illegible] 97014 73399.

రావుల ఆటో హైబ్రిడ్ [illegible] Ph: 91009 27415, 91547 46824.

గుంటూరు, ఆటోనగర్ HP పెట్రోల్ బంక్‌లో [illegible] 77996 89889, 80745 46302.

DSA ఏజెన్సీ [illegible] 99489 35879, 80081 00872.

ప్రముఖ బ్యాంక్ [illegible] 70323 51666.

మాచర్లలోని ఫైనాన్స్ [illegible] Ph: 78937 94796, 72074 94496, 81212 94296, 73373 94936.

WALK - IN - INTERVIEW విజన్ ఆటో మోటివ్స్ అపె ఆటో షోరూమ్ గుంటూరు, తెనాలి, నరసరావుపేట, మంగళగిరి, పిడుగురాళ్ళ నందు పనిచేయుటకు ★ సేల్స్ మేనేజర్స్- 4 ★ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ - 15 ★ అకౌంటెంట్స్ -2 ★ సర్వీసు మేనేజర్ -1 ★ సర్వీసు సూపర్‌వైజర్స్- 4 ★ మెకానిక్స్- 6 కావలెను. విజన్‌ఆటో మోటివ్స్, D.No. 18-4-23. బ్రహ్మానందరెడ్డి స్టేడియం దగ్గర గుంటూరు. ఇంటర్వ్యూ తేది: 04-11-25 నుండి 07-11-2025 వరకు. ఫోన్/ వాట్సప్: 77999 09045, 77999 09055. ఇమెయిల్: visionauto.guntur@gmail.com

గుంటూరు జిల్లా [illegible] 94903 09033 (F), 97058 34803 (M).

ప్రముఖ కంపెనీలో [illegible] Ph: 9710545017.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/- 5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/- ప్రకటనలపై 5% జి.ఎస్.టి. అదనం

గమనిక [illegible]

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వడం పూర్తి వివరాలకు సంప్రదించండి 8008510541

తెనాలి
•తెనాలి •పొన్నూరు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పొన్నూరు పట్టణ పరిధిలోని 28వ వార్డులో సీసీ రోడ్డు నిర్మించలేదు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - **షేక్ సత్తార్**
✔ నిధులు రాగానే రోడ్డు నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటాం. - **షేక్ హసీనా, పురపాలక సంఘం సహాయ ఇంజినీరు**
? పొన్నూరు పట్టణ పరిధి నేతాజీ నగర్‌లోని మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకున్నాయి. - **ఎ.రామారావు** ✔ పారిశుద్ధ్య కార్మికులతో వాటిని తీయిస్తాం. - **శ్రీనివాసులు, ప్రజారోగ్యశాఖాధికారి**
? తెనాలిలోని చినరావూరు రావిచెట్టు ప్రాంతంలో రోడ్డు లోతట్టుగా ఉంది. చిన్నపాటి వాన పడినా మునిగిపోతుంది. ఇక్కడ కుక్కల బెడద కూడా అధికంగా ఉంది. - **దుర్గాప్రసాద్, చినరావూరు**
✔ ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
? తెనాలి పట్టణంలోని చెంచుపేట డొంక రోడ్డు, ఐతానగర్, సిద్ధార్థ కాలనీల్లో వీధి దీపాలు వెలగడం లేదు. - **స్థానికులు**
✔ సత్వరం మరమ్మతులు చేయిస్తాం. - **పై ప్రశ్నలకు మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు సమాధానాలిచ్చారు.**

స్పందనకు వందనం

✦ 'మేమున్నాం... మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. పట్టణ పరిధిలోని 19వ వార్డు శివారులో పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులతో తీయించారు. ✦ 6వ వార్డులో పాడైపోయిన వీధి దీపానికి మరమ్మతులు చేయించారు. - **న్యూస్‌టుడే, పొన్నూరు**
✦ తెనాలిలోని చెంచుపేట డొంక రోడ్డులో నెల రోజులుగా నిలిపి ఉన్న ట్రాక్టర్, ఇతర వాహనాలతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా పోలీసులకు తెలిపారు. త్రీ టౌన్ సీఐ సాంబశివరావు స్పందించి వాహనాలను తీయించారు. ✦ తెనాలిలోని యడ్లలింగయ్య కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేక దోమలు అధికంగా ఉన్నాయని స్థానికులు 'మేమున్నాం... మీకు తోడుగా' ద్వారా మున్సిపల్ అధికారులకు తెలిపారు. స్పందించిన ఆరోగ్య విభాగ సిబ్బంది కాలువల్లో వ్యర్థాలను తొలగింపజేశారు. - **న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

అయ్యప్ప మాలధారులకు భిక్ష
తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే : అయ్యప్ప మాలధారులకు ఈ నెల 16 నుంచి 26 వరకు భిక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు శ్రీస్వామి అయ్యప్ప భక్త బృందం సేవా సమితి నిర్వాహకులు సత్యనారాయణ, నరేంద్ర, సురేష్, వెంకట్రామయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సోమేశ్వరుని సేవలో ఎమ్మెల్యేలు
భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పంచారామక్షేత్రం గునుపూడి సోమేశ్వర జనార్దన స్వామిని గుంటూరు జిల్లా పొన్నూరు, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, పులపర్తి రామాంజనేయులు సోమవారం రాత్రి దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు శేషవస్త్రం అందించారు. ధూళిపాళ్లకు ఎమ్మెల్యే రామాంజనేయులు ఆలయం తరఫున సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు క్యూ లైన్లలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్వామి దర్శనం కల్పించాలని ధర్మకర్తల మండలి ఛైర్మన్, సభ్యులకు, ఆలయాధికారులను సూచించారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాలకు అనుమతి
తెనాలి టౌన్, న్యూస్‌టుడే : హ్యాపీ హెల్త్‌కేర్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ, తెనాలి ఆధ్వర్యంలో హ్యాపీ హెల్త్ కేర్ సైన్సెస్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, తెనాలిని మంజూరు చేస్తూ వైద్య ఆరోగ్య శాఖ సోమవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ కళాశాలలో 45 సీట్లు ఉండనున్నట్లు అధికారులు సదరు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తెనాలి మార్కెట్ యార్డులో..
నిమ్మకాయల ధరలు రూ.. (క్వింటా)

అత్యధికం	1,400
అత్యల్పం	1,000
సగటు	1,200

– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

దయచేసి వినండి.. ఇక్కడ అన్నీ సమస్యలేనండి! \ అవస్థలు పడుతున్న ప్రయాణికులు
తెనాలి టౌన్, న్యూస్‌టుడే

విజయవాడ- చెన్నై మార్గంలో తెనాలి రైల్వే జంక్షన్ కీలకమైంది. ఈ స్టేషన్ మీదుగా ప్రతి రోజూ 160 రైళ్ల రాకపోకలు సాగిస్తాయి. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించే క్రమంలో వారి అవసరాలు తెలుసుకోవడానికి రైల్వే విభాగం గత నెల 22న తెనాలి రైల్వే స్టేషన్లో ప్రయాణికులు, సంఘాలు, ఇతర ప్రతినిధులతో సమావేశమయ్యింది. దీనికి ఉన్నతాధికారులు హాజరై ప్రయాణికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా వివరాలు ఇలా ఉన్నాయి..

●● స్టేషన్‌లోని 3, 4 ప్లాట్‌ఫాంలపై బోగీల వివరాలు తెలిపే బోర్డులు లేవు. 1, 2, 5 ప్లాట్‌ఫాంలపై ఉన్నా సరిగా పని చేయవు.
●● ఒకటో నంబరు ప్లాట్‌ఫాం చిన్నగా ఉండడంతో రైళ్లు ఎక్కడానికి ఇబ్బందిగాఉంది.
●● ఆరో నంబరు ప్లాట్‌ఫాం నిర్మాణం కొన సాగుతూనే ఉంది. త్వరగా పూర్తి చేయాలి.
●● స్టేషన్‌కు రెండో వైపు ఉన్న టికెట్

ప్లాట్‌ఫాంపై పని చేయని డిజిటల్ బోర్డులు

కేంద్రం పరిమిత సమయాల్లోనే పని చేస్తుంది. 24 గంటలూ ఉండేలా చూడాలి.
●● ప్లాట్‌ఫాంలపై మరుగుదొడ్లు లేవు. షెడ్ల నుంచి నీరు కారుతుంది. రాత్రి సమయంలో ప్రయాణికులు వేచి ఉండడానికి తగిన ఏర్పాట్లు చేయాలి.
●● స్టేషన్ రెండో వైపు సరైన వెలుగు లేక బహిరంగ మద్యపానం, ఆకతాయిల బెడద ఉంది. సీసీ కెమెరాలు తగినన్ని లేవు.
●● సికింద్రాబాద్- తిరుపతి వందేభారత్ రైలు నుంచి తెనాలి మీదుగా వెళ్తున్నా ఇక్కడ ఆగడం లేదు. హాల్ట్ కల్పిస్తే మేలు.
●● గతంలో తిరుపతి- కాకినాడ ప్యాసింజర్ రైలు ఉండేది, దాని ఎక్స్‌ప్రెస్ చేశారు. ప్యాసింజర్‌ను తిరిగి ఏర్పాటు చేయాలి.
●● కొవిడ్‌కు ముందు తెనాలి- ఒంగోలు ప్యాసింజర్ ఉండగా దాన్ని రద్దు చేశారు. వందలాది మందికి ఉపయోగపడే దాన్ని తిరిగి ఏర్పాటు చేయాలి.
●● విశాఖపట్టణం- విజయవాడ రైలును తెనాలి వరకు పొడిగించాలి.
●● గుంటూరు నుంచి పయనిస్తున్న పల్నాడు ఎక్స్‌ప్రెస్ తెనాలి నుంచి నడపాలన్న ప్రతిపాదనలు గతం నుంచి ఉన్నాయి. దాని పరిశీలించాలి.

ప్రాధాన్యం మేరకు పరిష్కారం
ప్రయాణికులు తెలిపిన ప్రతి అంశాన్ని నమోదు చేసుకున్నా. ఉన్నతాధికారులకు నివేదిక కూడా అందించాం. ప్రాధాన్యం మేరకు సమస్యలు పరిష్కారమవుతాయి. మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. - **వెంకటరమణ, స్టేషన్ మేనేజర్**

కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు

ఏఎన్‌యూలో శిల్పాధికారంపై కార్యశాల
ఏఎన్‌యూ, న్యూస్‌టుడే : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని నృత్య విభాగంలో సోమవారం శిల్పాధికారంపై ఒకరోజు కార్యశాల నిర్వహించారు. దీనికి తమిళనాడులోని తిరువల్లూరు విశ్వవిద్యాలయం సహాయాచార్యులు రూప హాజరై ప్రసంగించారు. శిల్పాధికారం గ్రంథంలో సాహిత్య, సాంస్కృతిక, తత్వానికి సంబంధించిన విలువలను సమగ్రంగా పొందుపర్చారన్నారు. తమిళ సాహిత్యంలో శిల్పాధికారానికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సురేష్ కుమార్, విభాగాధిపతి ఆచార్య వరప్రసాదమూర్తి మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు కాశయ్య, పవన్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ మార్కెటింగ్‌పై శిక్షణ తరగతులు
ఏఎన్‌యూ, న్యూస్‌టుడే : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని అంతర్జాతీయ వ్యాపారం, ఎంబీఏ విభాగం విద్యార్థులకు డిజిటల్ మార్కెటింగ్‌పై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. వీటిని రెక్టార్ ఆచార్య శివరామ్ ప్రసాద్ సోమవారం ప్రారంభించారు. సంప్రదాయ, డిజిటల్ మార్కెటింగ్ తేడాలు, వెబ్‌సైట్ల అవగాహన, ఆన్ పేజ్, ఆఫ్ పేజ్, గూగుల్ యాడ్స్‌లో మెలకువలు, సామాజిక మాధ్యమం, ఈ- మెయిల్, ఇన్ఫ్లుయెన్సర్ మార్కెటింగ్, వెబ్ అనలిటిక్స్, కాపీరైటింగ్ మార్కెట్‌పై శిక్షణ ఇస్తున్నట్టు రెక్టార్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఎక్సెల్ ఆర్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ సీఎస్ఆర్ నిధులతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. బెంగళూరుకు చెందిన డిజిటల్ మార్కెటింగ్ నిపుణుడు వినోద్ కుమార్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు.

ఏడు రోజుల్లో తెలియజేయాలి
తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే : భవనాల నిబంధనలు- 2017కు కొన్ని సవరణలు చేస్తూ ప్రకటించిన ముసాయిదా నోటిఫికేషన్ అభ్యంతరాలు, సూచనలు, సలహాలు ఏడు రోజుల్లో లిఖిత పూర్వకంగా తెలియజేయాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ మొవ్వా ఏసుబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

తుపానుతో నష్టపోయిన రైతులకు పరిహారం అందించండి
తెనాలి టౌన్, న్యూస్‌టుడే : తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు మొత్తం 20 అర్జీలు ఇచ్చారు. సబ్ కలెక్టర్ సంజనా సింహ దరఖాస్తుదారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. తెనాలి ఎన్జీవో సంఘ ప్రస్తుత కార్యవర్గ గడువు ముగిసినా ఎన్నికలు నిర్వహించడం లేదని సంఘ సభ్యులు ఆమెకు విన్నవించారు. తుపాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చూడాలని రైతు సంఘ ప్రతినిధులు కోరారు. కొలకలూరులో పారిశుద్ధ్య సమస్య, కుక్కల బెడద, ఖాజీపేటలో ఇరుగు పొరుగు గొడవ తదితర అంశాలపై నాలుగు అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ గోపాలకృష్ణ చెప్పారు.

సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎన్జీవో సంఘ ప్రతినిధులు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే : స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సహాయ కమిషనర్ డాక్టర్ మొవ్వా ఏసుబాబు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మేనేజర్ విల్సన్ జయకర్, ఏసీపీ వాణి పాల్గొన్నారు.

తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలో..

మద్యం దుకాణం ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దు
పొన్నూరు, న్యూస్‌టుడే : మండల పరిధి ములుకుదురులో నిర్వహిస్తున్న మద్యం దుకాణాన్ని పట్టణ శివారులో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, దానికి ఎటువంటి అనుమతులు ఇవ్వొద్దని కట్టెంపూడి, తాళ్లపాలెం, పట్టణంలోని పలు వార్డుల రైతులు, 31 వార్డు మాజీ కౌన్సిలర్ తోట ప్రసాద్ ఆధ్వర్యంలో తహసీల్దారు మహమ్మద్ జియావుల్‌హక్‌ను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. శివారులో దుకాణం ఏర్పాటు చేస్తే రాకపోకలు నిర్వహించడం ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నాలుగు అర్జీలు వచ్చినట్టు తహసీల్దారు తెలిపారు.

తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న ప్రసాద్

ఆక్రమణలను అడ్డుకోవాలని వినతి
పెదకాకాని, న్యూస్‌టుడే : పల్లాలమ్మ చెరువు నిండినప్పుడు నీరు బయటకు వెళ్లే కాలువ, శంకర కంటి ఆసుపత్రి ఎదుట ఆక్రమణకు గురవుతోందని, వెంటనే ఆపాలని పెదకాకాని సీపీయం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ పరాశరం కృష్ణకాంత్‌కు ఫిర్యాదు చేశారు. శివాజీ మాట్లాడుతూ కొందరు కాలువను ఆక్రమించి కొత్త రోడ్డు వేయాలని యత్నిస్తున్నారని చెప్పారు.

మనది స్వయం ఆధారిత భారతదేశం
కొల్లిపర, న్యూస్‌టుడే : ఇంటింటా స్వదేశీ అమలు చేద్దామని భాజపా చీఫ్ స్పోక్స్ పర్సన్ వి. జయప్రకాష్ నారాయణ అన్నారు. సోమవారం కొల్లిపర గ్రామంలో కార్యకర్తలతో కలిసి ఆయన పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమాన్ని వారికి తెలిపారు. స్వయం ఆధారిత భారత దేశం మనందరి లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. విదేశీ వనరులపై ఆధార పడవద్దన్నారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు మండ్రు రాజా, మునగాల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న భాజపా నాయకులు

పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయులు కీలకం
కొల్లిపర, న్యూస్‌టుడే : పదో తరగతి విద్యార్థుల పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డిప్యూటీ డీఈవో జి.శాంతకుమారి అన్నారు. సోమవారం కొల్లిపర జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో ఆమె సమావేశమయ్యారు. సమయపాలన పాటించాలని, సెలవులకు దూరంగా ఉండాలని కోరారు. పాఠశాల అభివృద్ధి పనుల్లో, ప్రత్యేక తరగతుల నిర్వహణలో ఉపాధ్యాయుల సూచనలు స్వీకరించాలని హెచ్‌ఎం ఎం.సౌజన్యకు సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న శాంతకుమారి

బాల కోటేశ్వర స్వామి

వడ్లమూడి: శివలింగాకారంలో దీపాలు



సహస్ర లింగేశ్వర స్వామి

పెదకాకానిలో మహిళల పూజలు

పొన్నూరు శివాలయంలో..

శివాలయాల్లో కార్తిక శోభ
చేబ్రోలు, న్యూస్‌టుడే : కార్తిక మాసం సందర్భంగా మండలంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చేబ్రోలులోని నాగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి లక్ష బిల్వార్చన చేపట్టారు. సోమవారం తెల్లవారు జాము నుంచే మహిళా భక్తులు అక్కడకు చేరుకుని కార్తిక దీపాలు వెలిగించారు. వడ్లమూడిలోని క్వారీ బాల కోటేశ్వరాలయంలో స్వామి వారికి విశేష అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

పొన్నూరు, న్యూస్‌టుడే : పట్టణంలోని శివాలయాల్లో భక్తుల సందడి నెలకొంది. తెల్లవారుజామునే సహస్ర లింగేశ్వర స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పలువురు మహిళలు దీపారాధన చేశారు.

పెదకాకాని: స్థానిక మల్లేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులు దీపాలు వెలిగించారు. అనంతరం స్వామిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఈవో గోగినేని లీలాకుమార్ తెలిపారు. పెదకాకాని సీఐ నారాయణస్వామి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం
పొన్నూరు, న్యూస్‌టుడే : పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు సందర్భంగా సోమవారం స్వామి వారి కల్యాణం నిర్వహించారు. దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణం తిలకించారు.

అనుసంధానం చేయండి.. వెతలు తీర్చండి
పొన్నూరు, న్యూస్‌టుడే

పట్టణ పరిధిలోని వడ్డిముక్కల రోడ్డు, నిడుబ్రోలు, జీబీసీ రహదారి, వీవర్స్ కాలనీ, టీచర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో అధికారులు రూ.లక్షలు ఖర్చు చేసి సిమెంటు రోడ్లు నిర్మించారు. ఆ సమయంలో రహదారుల మధ్య అనుసంధానం చేయలేదు. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పెద్ద వాహనాలు వెళ్లడానికి వీలు లేకపోవడంతో చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వీవర్స్ కాలనీలో రోడ్డు మధ్యలో నిలిచిన వర్షపు నీరు

పట్టణం	పొన్నూరు
వార్డులు	31
జనాభా	61,500
కుటుంబాల సంఖ్య	19,075
సిమెంటు రోడ్ల పొడవు	130 కి.మీ

ఫిర్యాదు చేసినా..
వర్షం కురిసినప్పుడు రహదారుల మధ్యలో నీరు నిలుస్తోంది. ఆ సమయంలో అటు వైపు వెళ్లే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆ రోడ్లను అనుసంధానం చేయాలని స్థానికులు పలుమార్లు పురపాలక సంఘ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే త్వరితగతిన నిధులు కేటాయించి సమస్యను పరిష్కరించాలని పుర ప్రజలు కోరుతున్నారు.

నిధుల మంజూరుకు కృషి
రహదారులు అనుసంధానం చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసి నిధులు మంజూరుకు కృషి చేస్తాం. అవి రాగానే పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం. - **పి.వెంకయ్య, పురపాలక సంఘం డీఈ, పొన్నూరు**

తైక్వాండో పోటీల్లో ప్రతిభ
తెనాలి టౌన్, న్యూస్‌టుడే : విజయవాడలో ఈ నెల 2న జరిగిన 9వ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తమ విద్యార్థులు 8 బంగారు, 4 రజత, 4 కాంస్య పతకాలు సాధించినట్లు తెనాలి హరిహంసిక తైక్వాండో ఇనిస్టిట్యూట్ గురువు చిన్నా సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విజేతలను అభినందించారు.

పతకాలు, ధ్రువపత్రాలతో విజేతలు

కొరవడిన పర్యవేక్షణ
ఖాళీ కొబ్బరి బొండాలను శేకూరు క్వారీ గుంతల్లో తోలాలని దుకాణదారులకు మున్సిపల్ అధికారులు సూచించినా ఆర్‌అండ్‌బీ రోడ్ల వెంట కుమ్మరించటం పరిపాటిగా మారింది. వీటిలో దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. వీటిని తొలగించటానికి అయ్యే ఖర్చు గ్రామ పంచాయతీలకు భారంగా మారిందని సర్పంచ్‌లూ వాపోతున్నారు. గతంలో ఖాళీ కొబ్బరి బొండాలను మున్సిపల్ ట్రాక్టర్లలో తరలించేవారు. ఇందుకుగాను దుకాణదారుల నుంచి రుసుము వసూలు చేసేవారు. ఆ నగదులో ఎక్కువ మొత్తాన్ని పారిశుద్ధ్య అధికారులు తమ జేబులో వేసుకునేవారు. దీంతో బొండాలను బాడుగ ట్రాక్టర్లలోనే శేకూరులోని క్వారీ గుంతల్లో తోలాలని మున్సిపల్ అధికారులు వ్యాపారులకు సూచించగా అంగీకరించారు. 30 మంది పైన ఉన్న వ్యాపారుల్లో కొందరు అధికారుల కళ్లుగప్పి గ్రామాల్లోని ఆర్‌అండ్‌బీ రోడ్ల వెంట పోస్తున్నారు. వీరిపై మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఇటీవల కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌ల ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు బుర్రిపాలెం రోడ్డు వెంట పోసిన కొబ్బరి బొండాలను తొలగించారు. దీనికి రూ.50 వేలు ఖర్చుకాగా, రూ.లక్ష ఖర్చు చేసినట్టు దస్త్రాల్లో రాశారని విమర్శలు వచ్చాయి. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి కొబ్బరి బొండాల నుంచి పీచు తయారీ ప్లాంటు ఏర్పాటు చేయాలని భావించినా విజయవంతం కాలేదు. మున్సిపల్ అధికారులు తీసుకొచ్చిన యంత్రం అలంకార ప్రాయంగా మారింది. తర్వాత సామర్థ్యం పెంచి కొత్తది బిగించినా ఇదీ పని చేయడంలేదని అధికారులు తేల్చారు. రహదారుల వెంట కొబ్బరి బొండాలు పోయకుండా కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.
- తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే

ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఖాళీ బొండాలను పోస్తున్న ట్రాక్టర్ చోదకుడు

పోలింగ్ కేంద్రాల్లో మార్పులు
కొల్లిపర, న్యూస్‌టుడే : పోలింగ్ కేంద్రాల్లో మార్పులపై రాజకీయ పార్టీ నాయకుల సూచనలు స్వీకరించామని తహసీల్దార్ సిద్ధార్థ తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలోని తొమ్మిది పోలింగ్ బూత్‌లలో కొద్దిపాటి మార్పులకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. భీమవరపు చినకోటిరెడ్డి, కళ్లం వెంకటప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీ నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్

పేదల సమస్యలపై అనేక పోరాటాలు
తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే : పేదలకు మౌలిక వసతుల కల్పన కోసం సీపీఎం నిర్వహించిన అనేక ప్రజా పోరాటాల్లో దివంగత నాయకుడు పి. కృష్ణమూర్తి ముందుండి నడిపించారని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. వీరు సోమవారం తెనాలిలో నిర్వహించిన ఆయన వర్ధంతి సభలో మాట్లాడారు. రైతాంగ, ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే వరకు పోరాడారని గుర్తు చేసుకున్నారు. తొలుత ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కె.బాబూప్రసాద్, ఎస్. సుబ్రహ్మణ్యం, జి.రవీంద్ర, పి.జోనేష్, కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

కృష్ణమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అంతరిస్తున్న పల్లె కళలకు జీవం
కొల్లిపర, న్యూస్‌టుడే : అంతరించి పోతున్న కళలకు పల్లెజాతరలు జీవం పోస్తున్నాయి. గంగానమ్మ కొలుపుల్లో భాగంగా కొల్లిపర గ్రామంలో నిర్వహించిన పంబలోళ్ల నృత్య రూపకం ఇందుకు నిదర్శనం. సోమవారం తల్లి వైభవాన్ని కొనియాడుతూ తోలుతిత్తి వాయిద్యాలు, తప్పెట మోతలతో కళాకారుల చేసిన నృత్యరూపకం ఆహుతులను ఆకట్టుకుంది. గంగానమ్మ తల్లికి ప్రతిరూపమైన ఘటంకుండకు భక్తులు పసుపు నీరువారపోస్తు, అన్నప్రసాదాలను సమర్పించారు.

పంబలోళ్ల నృత్యం

పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యం
మంగళగిరి గ్రామీణం: మంగళగిరి ఆటోనగర్ ఐటీ పార్క్‌లో ఎఫెక్ట్రానిక్స్ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం సీఎస్ఆర్ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మంగళగిరిలోని వివిధ ఐటీ సంస్థల ప్రతినిధులు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. గుంటూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎం.ఎల్ నరసింహారావు, మంగళగిరి ఐఏఎల్ఏ కమిషనర్ అబ్దుల్ రహీం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ మౌలిక సదుపాయాల అభివృద్ధి, పరిశ్రమల మధ్య భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారని వివరించారు.

CHANGE OF NAME
I, **KOLAKALURI VENKATAPPARAO** (Old Name) S/o. **VENKATESWARLU**, R/o, D. No: 20-26-122, Chinaravuru station road, Near Telugu Baptist church, Tenali, Guntur (Dist), A. P. I have changed my name as **KOLAKALURI PAUL** (New Name) S/o. **VENKATESWARLU**. Hereafter my name is knownas **KOLAKALURI PAUL** (New Name) S/o. **VENKATESWARLU**.

ఒంటరి వృద్ధ మహిళలను బెదిరించి నగదు వసూలు
తెనాలి టౌన్, న్యూస్‌టుడే : ఒంటరిగా నివాసం ఉంటున్న ఇద్దరు వృద్ధ మహిళలను గుర్తు తెలియని వ్యక్తి బెదిరించి నగదు వసూలు చేసిన ఘటనపై ఫిర్యాదు అందిందని తెనాలి రెండో పట్టణ పోలీసులు సోమవారం తెలిపారు. స్థానిక బస్టాండ్ రోడ్డు, గంగానమ్మపేటలో ఒంటరిగా నివాసముంటున్న వృద్ధురాళ్ల వద్దకు వచ్చిన అతను రూ.లక్ష విలువైన టీవీ, ఫ్రిజ్ వంటివి ప్రభుత్వ పథకం ద్వారా తక్కువ ధరకే వచ్చాయంటూ మాటలు కలిపాడు. అనంతరం ఒకరి వద్ద రూ.40 వేలు, మరొకరి వద్ద రూ.30 వేలు వసూలు చేసి పారిపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు అద్దాలు పగలగొట్టి చోరీకి యత్నం
తెనాలి టౌన్, న్యూస్‌టుడే : స్థానిక చెంచుపేట డొంక రోడ్డులో నివాసాల ముందు నిలిపిన రెండు కార్ల అద్దాలను గుర్తు తెలియని దుండగులు ఆదివారం అర్ధరాత్రి పగలగొట్టారు. లోపల డ్యాష్ బోర్డులు తెరిచి విలువైన వస్తువులు ఏమైనా ఉన్నాయా? అని వెతికినట్లు కార్ల యజమానులు గుర్తించారు. గతంలోనూ ఈ ప్రాంతంలో ఇదే తరహా ఘటనలు చోటు చేసుకున్నాయి. పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు
తెనాలి టౌన్, న్యూస్‌టుడే : వివాహిత తన భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి పట్టణ పరిధి గంగానమ్మపేటలోని పుట్టింటికి కొద్దిరోజుల కిందట వచ్చారు. అక్కడ దంపతులు గొడవ పడిన అనంతరం పెద్దలను తీసుకు వస్తానంటూ భర్త అతని ఊరు మిర్యాలగూడెం వెళ్లారు. ఈ నేపథ్యంలో ఈ నెల ఒకటో తేదీన అల్పాహారం తీసుకు వస్తానంటూ ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆమె సోమవారం వరకు తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

పట్టణంలోని లాడ్జిల్లో తనిఖీలు
తెనాలి టౌన్, న్యూస్‌టుడే : పట్టణంలోని పలు లాడ్జిల్లో త్రీ టౌన్ పోలీసులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. కొన్నిచోట్ల విద్యార్థులను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు. వారికి గదులు ఇవ్వవద్దని నిర్వాహకులకు సూచించారు.

NOTICE
IN THE COURT OF THE I ADDL.CIVIL JUDGE(JUNIOR DIVISION):: TENALI
E.P.No.108/2024 in O.S.No.650/2021
Between:
Tadisetti Christhu Dasu. ...D.Hr
And
Vudatha Madhava Rao. ...J.Dr.
To,
Vudatha Madhava Rao, S/o.V. Anjaneyulu, Kathevaram Gramam Sivaru, Kopalle Village, Tenali(Md), Guntur Dist.
పై నెంబరు ఇ.పి.లో జె.డి.ఆర్. అయిన మీకు పై కోర్టు వారి నుండి ఎన్ని సార్లు నోటీసులు పంపించినను ముట్టనందున మీకు నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు **ది.24-11-2025**కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజు **ఉ.గం.10-30ని.**లకు పై కోర్టు వారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
వాయిదా తేది:24-11-2025.
SAGARVALA LOKESWARA SINGH,
బి.హెచ్.ఆర్.తరపు అడ్వకేట్, నడింపల్లి వారి వీధి, గుంటూరు, సెల్: 8919228054

(c) eenadu

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

భాజపా బలోపేతమే లక్ష్యం

మేడికొండూరు, న్యూస్‌టుడే: కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఆధ్వర్యంలో దేశం ఎంతో అభివృద్ధి సాధిస్తోందని జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు పేర్కొన్నారు. మేడికొండూరులో సోమవారం కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతిరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పార్టీ జెండాలు ఎగరాలన్నారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహకాలపై చర్చించారు. భాజపా నాయకులు వైవీ సుబ్బారావు, షేక్ బాషా, వెంకటేశ్వర్లు, శేషగిరి, రోజారెడ్డి, నరసింహారావు, అజ్రత్ అలీ, సుబ్బారావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యం

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరి ఆటోనగర్ ఐటీ పార్కులో ఎపెక్సెల్ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం సీఎస్ఆర్ పార్టనర్‌షిప్ డ్రైవ్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మంగళగిరిలోని వివిధ ఐటీ సంస్థల ప్రతినిధులు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. గుంటూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎం.ఎల్ నరసింహారావు, మంగళగిరి ఏపీఐఐసీ కమిషనర్ అబ్దుల్ రహీం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ మౌలిక సదుపాయాల అభివృద్ధి, పరిశ్రమల మధ్య భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారని వివరించారు. ఐటీ, తయారీ, ఎలక్ట్రానిక్ రంగాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

హాజరైన ప్రతినిధులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరి పట్టణం నుంచి నిడమర్రు వెళ్లే ప్రధాన రహదారి బ్యాంకు కాలనీలో మురుగు నీరు స్తంభించింది. మొంథా తుపాను ప్రభావానికి వర్షాలు తీవ్రంగా కురవడంతో దుర్వాసన వస్తుందని చిరు వ్యాపారులు తెలిపారు. శానిటైజేషన్ సెక్రటరీ ఇందు వివరణ కోరగా.. వెంటనే స్పందించి జేసీబీ సహాయంతో పూడిక తీయించి, దుర్వాసన రాకుండా బ్లీచింగ్ చల్లించారు.

స్పందనకు వందనం

తుళ్లూరు, న్యూస్‌టుడే: తుళ్లూరు గ్రామానికి మంచినీరు సరఫరా చేసే మోటార్లు కాలిపోయి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. 'మేమున్నాం.. మీకు తోడుగా' కార్యక్రమం ద్వారా సమస్యను గ్రామస్థులు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి ఎం.రమణ వెంటనే పంచాయతీ సిబ్బందిని పంపి మోటార్లకు మరమ్మతులు చేయించి సరఫరా పునరుద్ధరించారు.

తుళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని రాయపూడి గ్రామం నుంచి వెలగపూడి వెళ్లే రహదారి మధ్యలో వర్షాలు 'పేరుకుపోతున్నాయని 'మేమున్నాం మీకు తోడుగా' కార్యక్రమం ద్వారా సమస్యను గ్రామస్థులు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన కార్యదర్శి సిబ్బంది పారిశుద్ధ్య కార్మికులను పంపి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు.

తాడికొండ, న్యూస్‌టుడే: తాడికొండ గ్రామ శివారు ప్రధాన మురుగు కాలువలోకి వ్యర్థాలు చేరాయి. మురుగునీరు నిల్వ చేరి పంట పొలాల్లోకి ప్రవహిస్తోంది. ఈ సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా ఎంపీడీవో సమతావాణి దృష్టికి తీసుకువెళ్లగా.. ఆమె స్పందించి జేసీబీ సహాయంతో మురుగు కాలువను శుభ్రం చేయించారు.

ఆలయ ప్రాంగణం.. ఇక రక్షణ వలయం

భక్తుల భద్రతకు ముందస్తు చర్యలు

తుళ్లూరు, న్యూస్‌టుడే

దైవ దర్శనాలకు ఆలయాలకు వెళ్లే భక్తుల భద్రతకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోంది. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయ ఘటన నేపథ్యంలో అలాంటివి పునరావృతం కాకుండా ముందు జాగ్రత్తల కోసం ప్రణాళిక తయారు చేయాలని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు రాజధాని పరిధిలో ఉన్న తుళ్లూరు మండలంలోని ఆలయాలపై పోలీసు అధికారులు దృష్టిసారించారు. మండలంలోని తాళ్లాయపాలెం శైవ క్షేత్రానికి ప్రతి ఏడాది 2 లక్షలకు పైగా భక్తులు దర్శనం కోసం వస్తున్నారు. కార్తిక మాసంలో గత సంవత్సరం 80 వేల మంది భక్తులు ఈ క్షేత్రానికి వచ్చారు. మహా శివరాత్రి పర్వదినం రోజు ఒక్క రోజు మాత్రమే దర్శనమిచ్చే ఆత్మలింగ దర్శనం కోసం గత ఏడాది లక్ష మంది రాగా కేవలం 34 వేల మంది మాత్రమే దర్శించుకోగలిగారు. అదే విధంగా వెంకటపాలెం, అనంతవరం గ్రామాల్లో తితిదే ఆధ్వర్యంలో కొనసాగుతున్న వేంకటేశ్వరస్వామి ఆలయాలకు ఏటా భారీగా భక్తులు తరలి వచ్చి పూజలు నిర్వహిస్తున్నారు. పండగలు, నూతన సంవత్సరం, ఆలయ వార్షికోత్సవాలు, బ్రహ్మోత్సవాలు, ఫాల్గుణ మాసంలో అనంతవరం శ్రీవారి తిరునాళ్ల సందర్భంగా రోజూ వేల సంఖ్యలో భక్తులు వచ్చి పూజలు నిర్వహిస్తున్నారు. దేవాలయాల్లో గతంలో జరిగిన కార్యక్రమాలకు ఎంత మంది హాజరయ్యారు. రాబోయే రోజుల్లో ఎంత మంది హాజరయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అక్కడ ఎలాంటి భద్రతా చర్యలు ఉన్నాయి.. ప్రైవేటు ఆలయాలను ఎవరు నిర్వహిస్తున్నారు.? ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. భద్రతా సిబ్బంది ఎంత మంది ఉన్నారు..? తదితర సమాచారాన్ని పోలీసులు, రెవెన్యూ సిబ్బంది సేకరిస్తున్నారు.

కార్తిక మాసం నేపథ్యంలో వెంకటపాలెం శ్రీవారి ఆలయం ముంగిట బారికేడ్ల ఏర్పాటు

ఏయే అంశాలు సేకరిస్తున్నారంటే..

★ ఆలయాల్లో క్యూలైన్ల ఏర్పాటు, రాకపోకలకు వేర్వేరు దారులు, రాత్రి వేళ విద్యుత్ దీపాల సౌకర్యం ★ కృష్ణానది ఘాట్‌ల వద్ద నదీ స్నానాలు చేసే సమయంలో అక్కడ బారికేడ్ల ఏర్పాటు ★ అందుబాటులో ఉన్న గజ ఈతగాళ్లు ★ అగ్నిమాపక పరికరాలు, భక్తులు వెళ్లే మార్గంలో గాలి, వెలుతురు స్థాయి. ★ ఏదైనా ఆపద వస్తే తక్షణ సహాయం పొందేందుకు ఫోన్ నంబర్లతో కూడిన బోర్డులు ★ ఘాట్ రోడ్డుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు ★ అన్నదాన కార్యక్రమాల నిర్వహణ ★ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తీసుకున్న చర్యలు తదితర వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

ప్రణాళిక తయారు చేస్తున్నాం..

పర్వదినాల్లో మండలంలోని దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాలతో పాటు ప్రైవేటు ఆలయాలకు భక్తులు వేల సంఖ్యలో వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. సేకరించిన వివరాలతో ప్రణాళిక తయారు చేస్తున్నాం.

-కె.శ్రీనివాసరావు, తుళ్లూరు ఎస్‌హెచ్‌వో

గండి పూడ్చండి సారూ..

దెబ్బతిన్న రోడ్డును చూపుతున్న సీపీఎం నాయకులు

మంగళగిరి, న్యూస్‌టుడే: చినకాకానిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సర్వీసు రోడ్డులో గండి పడింది. దాన్ని పూర్తిగా పూడ్చకపోవడం వల్ల గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఎం నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన జిల్లా పార్టీ సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, స్థానిక నాయకులతో కలిసి ఆ ప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు. గండి పూడ్చకపోతే రాత్రి వేళల్లో జనం ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. నగరపాలక అధికారులు స్పందించి రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మంగళగిరి గ్రామీణం: నవులూరు గ్రామ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తెదేపా నాయకులు రుద్ర కోటేశ్వరరావు, మల్లవరపు వెంకట్ సోమవారం ప్రారంభించారు. సీఆర్డీఏ ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలతో ఈ భవనం రూపుదిద్దుకుంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తల్లులందరూ తమ పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. పాలు, గుడ్లు, బాలామృతం, ఇతర పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా నోడల్ అధికారి శ్రీవాణి మాట్లాడుతూ ఆటపాటలతో కూడిన విద్య పిల్లల సమగ్రాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. సీడీపీవో సరిత, కార్యకర్తలు ఉషారాణి, ప్రవీణ, ప్రసన్న, సుభాష్, జాన్‌బాబు పాల్గొన్నారు.

కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తెదేపా నాయకులు

తుపాను బాధితులకు చేయూత

పెదనందిపాడు, న్యూస్‌టుడే: మొంథా తుపాను కారణంగా పెదనందిపాడులో పునరావాస కేంద్రాలలో ఉన్న 41 కుటుంబాల వారికి సోమవారం నల్లమడ వాగుకట్ట వద్ద తెదేపా నాయకులు రూ. 1.08 లక్షల ప్రభుత్వ సహాయాన్ని అందజేశారు. నాయకులు ఎన్. శ్రీనివాసరావు, నవీన్, దిలీప్, ఆర్. శివరామకృష్ణయ్య, నాగరాజు, అర్ధ అబీద్‌అలీ, వీఆర్వో అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నగదు అందజేస్తున్న తెదేపా నాయకులు

10 సెంట్లు స్థలం కేటాయింపు

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పొనుగుపాడుకు చెందిన తెదేపా కార్యకర్తలు గ్రామ అభివృద్ధికి ముందుకు వచ్చారు. గ్రామంలో 10 సెంట్ల స్థలాన్ని బడుగు బలహీనవర్గాల ప్రజల ఉపయుక్తం సామాజిక భవన నిర్మాణానికి ఉచితంగా అందజేయనున్నట్లు సోమవారం ప్రకటించారు. దీంతో దాతలకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళల రక్షణకు చర్యలు

తుళ్లూరు, న్యూస్‌టుడే: తుళ్లూరులో సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో సోమవారం సామాజిక సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో మహిళల రక్షణపై (జెండర్ కమిటీ) అవగాహన సదస్సు జరిగింది. గతంలో రాజధాని 29 గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన జెండర్ కమిటీల సభ్యులు 30 మంది సమావేశానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి సీఆర్డీఏ సామాజిక సంక్షేమ విభాగం డీసీడీవో బొద్దా శ్రీనివాసరావు, జెండర్ స్పెషలిస్ట్ సీ. హెచ్. నిశిత హాజరై బాల్య వివాహాల నిషేధం, గృహ హింస, లైంగిక వేధింపుల నివారణ, లింగ సమానత్వం, పిల్లల రక్షణ తదితర చట్టాలపై అవగాహన కల్పించారు.

హాజరైన జెండర్ కమిటీ సభ్యులు

కార్తిక దీపోత్సవం.. దేదీప్యమానం

మంగళగిరి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కార్తిక మాసం రెండో సోమవారం పురస్కరించుకుని మంగళగిరి, ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గాల వ్యాప్తంగా శివాలయాలు, పలు దేవాలయాలు కిటకిటలాడాయి. వేకువజాము నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని ఏకాదశ చేశారు. ఉదయం నుంచి ఉపవాసాలు ఉండి.. సాయంత్రం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు చేసిన అలంకరణలు ఆకట్టుకున్నాయి. - న్యూస్‌టుడే బృందం

పెదనందిపాడులో..

దుగ్గిరాల శివాలయంలో..

విజనంపాడులో ..

నృసింహుని సన్నిధిలో..

తాడేపల్లి, మంగళగిరి: మంగళగిరి శ్రీపానకాల లక్ష్మీనృసింహస్వామి సన్నిధి కోటిదీపకాంతుల వెలుగులతో ధగధగలాడింది. కార్తిక సోమవారం సందర్భంగా నంబూరు వద్ద ఉన్న వీవీఐటీ విద్యార్థినులు సోమవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించారు.

అత్యవసరమైతే ఎలా వెళ్లాలి..?

ఎయిమ్స్‌లో ఎమర్జెన్సీకి దారి చూపుతూ బోర్డు ఏర్పాటు చేశారు. ఇంత వరకు బాగానే ఉంది. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారు బోర్డును చూసి ఎమర్జెన్సీ వార్డుకు వెళ్లాలని ప్రయత్నిస్తే రెండు దార్లు మూసివేసి బారికేడ్లు, తాడుతో అడ్డుగా కట్టారు. అలాంటప్పుడు ఈ బోర్డు ఏర్పాటు చేయడం ఎందుకని వైద్యశాలకు వచ్చిన వారు నిట్టూరుస్తున్నారు. ఆసుపత్రి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, తాడేపల్లి, మంగళగిరి

గోతులన్నా ఉలకరు.. కష్టమన్నా పలకరు

ప్రత్తిపాడు నుంచి గుంటూరుకు వెళ్లే ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిలో కోయవారిపాలెం వద్ద చప్టా ఉంది. అక్కడ రహదారికి మధ్యలో గుంత పడింది. గుంటూరు, ప్రత్తిపాడు నుంచి వాహనాలు ఆ గుంత వద్దకు రాగానే రోడ్డు అంచుకు వెళ్లాల్సి వస్తుంది. అక్కడే తక్కువ వెడల్పుతో చప్టా ఉంది. రహదారి అంచుకు వెళ్లిన వాహనాలు చప్టా వద్ద అదుపుతప్పుతున్నాయి. కానీ అధికారుల్లో మాత్రం ఉలుకూపలుకు లేదు. వేలాది వాహనాలు ఆ గుంత వద్దకు రాగానే ఎటు వైపు వెళ్లాలా అనే సందిగ్ధంలో అపసవ్య దిశలో వస్తున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ప్రత్తిపాడు (కాకుమాను)

'కట్ట'జారి గల్లంతయ్యిందే..!

మొంథా తుపాను ప్రభావంతో కాలువల్లో పూడిక

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే

మొంథా తుపాను ప్రభావంతో కాలువల కట్టలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వర్షం నీటిలో నానిపోయి పలు చోట్ల కాలువలోకి జారిపోయాయి. దీంతో నీటి ప్రవాహానికి అడ్డంకి ఏర్పడుతోంది. గుంటూరు వాహినికి అనంతవరప్పాడు నుంచి విజనంపాడు సూపర్ పాసేజ్ వరకు పలు చోట్ల కట్టల మట్టి రెండు మీటర్ల ఎత్తున జారి పోయాయి. అప్పాపురం ప్రధాన వాహినిలో ముట్లూరు ప్రాంతం నుంచి వట్టిచెరుకూరు గ్రామం వరకు ఇదే పరిస్థితి నెలకొంది.

విజనంపాడు వంతెన సమీపంలో జారిన గుంటూరు వాహిని కట్ట

★ గుంటూరు వాహిని కృష్ణానది వద్ద ప్రారంభమై మంగళగిరి, పొన్నూరు, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో విస్తరించింది. అప్పాపురం కాలువ పొన్నూరు, ప్రత్తిపాడు నియోజకవర్గాలకు సాగు, తాగు నీరు అందిస్తోంది.

నిర్వహణ వదిలేశారు...: గత వైకాపా హయాంలో ఆయా కాలువల కట్టలు దెబ్బతిని ప్రవాహానికి అడ్డంకి ఏర్పడితే తొలగింపు పనులు చేపట్టలేదు. తాజా తుపానుతో సమస్య మరింత జటిలమైంది.

అప్పాపురం ప్రధాన వాహినిలో..

ఇలా వదిలేస్తే ఎలా'గండి'..

పెదనందిపాడు: ఉప్పలపాడు, జరుగులవారిపాలెం రైతులు పొలాలకు వెళ్లే రహదారికి భారీ వర్షం కారణంగా గండి పడి రాకపోకలకు అవరోధం ఏర్పడింది. దాదాపు 300 ఎకరాలకు చెందిన రైతులు ఇటుగా పొలాలకు వెళ్తుంటారు. కొప్పర్రు, సందెపూడి, గణేశునివారిపాలెం, ఏలూరు, తుర్లపాడు ఈ దారి కీలకం. సంబంధిత అధికారులు స్పందించి ఇబ్బందులు తొలగించాలని, ఆ ప్రాంతంలో తూములు ఏర్పాటు చేసి వర్షపు నీరు వాగులోకి వెళ్లేలా చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వాన నీరు నిలిచి ఇబ్బందులు

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిలుస్తుందని సోమవారం ఆ కళాశాల సిబ్బంది, విద్యార్థులు గ్రీవెన్స్‌లో తహసీల్దార్ హేనాప్రియ, ఇన్‌ఛార్జి ఎంపీడీవో స్వామిరెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. కళాశాల వెనుక ఆట స్థలంలో మోకాళ్ల లోతు నీరు నిలుస్తుందని, సమస్య పరిష్కారానికి కాలువ తీయించాలని కోరారు. ప్రిన్సిపల్ వీరరాఘవయ్య, ఎన్‌సీసీ అధికారి పాతూరి శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

గౌరవ వేతనం ఇప్పించండి

పెదనందిపాడు, న్యూస్‌టుడే: తమకు రావాల్సిన గౌరవ వేతనం బకాయిలు చెల్లించాలని పెదనందిపాడు మండలంలోని 13 మసీద్‌లలో ఇమామ్‌లు, మౌజాన్‌లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తమకు పది నెలల నుంచి గౌరవ వేతనం అందడం లేదని సోమవారం వారు విలేకరులకు తెలిపారు.

చేనేత కార్మికులను ఆదుకోండి

తాడేపల్లి, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావం వల్ల నష్టపోయిన చేనేత కార్మికులను ఆదుకోవాలని చేనేత జౌళిశాఖ మంత్రి సవితకు చేనేత సంఘాలు సోమవారం విన్నవించాయి. తాడేపల్లి మండలం కొలనుకొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆ సంఘం నాయకులు బాలకృష్ణ, నాగేశ్వరరావు, పూర్ణచంద్రరావు, కోటేశ్వరరావు, బాలాజీ తదితరులు మంత్రిని కలసి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ప్రతి చేనేత కార్మికుడికి రూ.20 వేలు అందించాలన్నారు. చేనేతకు ప్రభుత్వం ప్రకటించిన రాయితీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రి సవితతో మాట్లాడుతున్న నాయకులు

రూ.2.3 కోట్ల వ్యయంతో విద్యుత్తు లైన్

మేడికొండూరు, ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు చర్యలు చేపట్టిందని విద్యుత్తు శాఖ ఎస్ఈ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఫిరంగిపురం, మేడికొండూరులో సోమవారం విద్యుత్తు శాఖ అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిరంగిపురం నుంచి మేడికొండూరు మండలం భీమినేనివారిపాలెం వరకు 14.5 కిలో మీటర్ల మేర కొత్తగా 33 కేవీ విద్యుత్తు లైను ఏర్పాటు చేసి అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇందుకు గాను రూ.2.3 కోట్లు ఖర్చు అయ్యిందన్నారు. ఈఈలు హరిబాబు, ఏడుకొండలు, డీఈలు సుబ్బారావు, గురునాథరావు, ఏఈలు దుర్గా ప్రసాద్, పుల్లారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిరంగిపురం విద్యుత్తు ఉప కేంద్రం వద్ద అధికారులు

'బోధనేతర కార్యక్రమాలు చేసేది లేదు'

దుగ్గిరాల, న్యూస్‌టుడే: బోధనేతర కార్యక్రమాలు చేసేది లేదని దుగ్గిరాల మండల ఫ్యాప్టో నాయకులు సోమవారం ఎంఈవో కాజ శ్రీనివాసరావుకు అర్జీ ఇచ్చారు. విద్యాశక్తి, వీరగాథ, ఎస్ఏఎస్ఏ వంటి కార్యక్రమాలు, జీఎస్టీ 2.0 మాదిరి ప్రచారాలు తాము చేయలేమని తేల్చి చెప్పారు. అదనపు అంశాల వల్ల బోధన సమయం తగ్గిపోతోందని, ఈ కార్యక్రమాలు చేయాలనే ఒత్తిడి తగదని వారన్నారు. యూటీఎఫ్, ఎస్టీయూ, ఏపీటీఎఫ్ బాధ్యులు బి.చలపతి రాజు, సంజీవరావు, ఉన్నం ప్రసాద్, ఎం.మోహన్‌కృష్ణ, సీహెచ్ దుర్గారావు, ఆర్‌వీప్రసాద్, కరీముల్లా, గయాసుద్దీన్, రాంబాబు, విజయబాబు, శ్రీనివాసప్రసాద్, నాగపున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోకు అర్జీ ఇస్తున్న నాయకులు

పాడి గేదె మృతితో రైతు విలవిల

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: పల్లపాడుకు చెందిన పాడి రైతు ఎర్రిబోయిన శ్రీనివాసరావుకు చెందిన గేదె గత నెల 27న తుపాను ప్రభావంతో కురిసిన వర్షానికి కొండవాగులో మునిగి గల్లంతైంది. ఈ నెల 1వ తేదీ సాయంత్రం కళేబరం దొరికింది. గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని, రోజూ సంగం డెయిరీకి పాలు పోసి వచ్చే ఆదాయంతో జీవిస్తున్నానని, తనను ఆదుకోవాలని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింటు అయిన గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, కుంచనపల్లి గ్రామం, అమరావతి అపర్ణ అపార్ట్మెంట్స్ కాపురస్తుడు అబ్బినేని రవికుమార్ వర్మ గారి కుమారుడు అబ్బినేని చంద్రనాగ్ అబ్బినేని గారి నుండి ఇన్‌స్ట్రక్షన్స్ పొంది యావన్మందికి తెలియజేయునది.

కృష్ణా జిల్లా, విజయవాడ టౌన్, మొగల్‌రాజపురం గ్రామ కాపురస్తురాలు కాట్రగడ్డ రమేష్ గారి భార్య అరుణ గారు దిగువ షెడ్యూల్ దాఖలా కాజ గ్రామం తాలూకు సర్వే నెం. 149/1B లో గల ప్లాట్స్ నెం. 8&9 రుగా గల 728.8 చ.గ. స్థలమును పంది వెంకటేశ్వర్లు వగైరాల వద్ద నుండి క్రయం పొంది దీ. 09-03-1989 మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో విక్రయ దస్తావేజు నెం. 884/1989 రుగా కాబడిన ఆస్తిని మా క్లయింటుకు విక్రయించుటకు ఖరారుపడి మా క్లయింటు పేరిటకు రిజిష్టరు చేయుటకు సిద్ధపడియున్నారు.

కావున సదరు దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తి ప్లాట్స్ నెం. 8&9, సర్వే నెం. 149/1B లో 728.8 చ.గ. విషయమై గాని, కాట్రగడ్డ రమేష్ గారి భార్య అరుణ గారు మా క్లయింటు అయిన అబ్బినేని చంద్రనాగ్ గారి పేరిటకు రిజిష్టరు చేయు విషయమై గాని ఎవరికైనను ఏవిధమైన క్లెయిములు గాని, అభ్యంతరములు గాని ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన వారం దినములలోగా మా క్లయింటుకు గాని, మాకు గాని వ్రాత పూర్వకముగా తెలియపరచవలసినదిగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు : గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ డి.యిలాకా, మంగళగిరి మండలం, కాజ గ్రామం, సర్వే నెం. 149/1B లో 728.8 చ.గ. గల ప్లాట్స్ నెం. 8&9 భూమికి హద్దులు. తూర్పు: అ.24 వెడల్పు గల రోడ్డు హద్దు. అ. 80, దక్షిణం: అ. 24 వెడల్పు గల రోడ్డు హద్దు. అ. 80, పడమర: ప్లాట్స్ నెం. 10&11 హద్దు. అ. 80, ఉత్తరం: ప్లాట్ నెం. 7 హద్దు. అ. 82.

మంగళగిరి — లంకా శివరామ్‌ప్రసాద్, లంకా వంశీకృష్ణ
Dt. 03-11-2025 — గద్దె రవికిరణ్, అడ్వకేట్స్, మంగళగిరి

విద్యార్థుల ప్రతిభకు సానబెట్టాలి

రేవేంద్రపాడు (దుగ్గిరాల): విద్యార్థుల ప్రతిభకు సానబెట్టాలని జీసీడీవో సుజాత అన్నారు. సమగ్ర శిక్ష తోడ్పాటుతో సోమవారం మండలంలోని పాఠశాలల్లో నైపుణ్య ప్రదర్శనలు నిర్వహించారు. రేవేంద్రపాడులో హెచ్ఎం బీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను ఆమె పరిశీలించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్, అపరెల్ అండ్ మేడ్ అప్, ఆటోమోటివ్ ట్రేడ్ విభాగాలకు చెందిన విద్యార్థులు సృజనాత్మకత చాటారు. శిక్షకులు ఝాన్సీ, కల్యాణి, జనార్దనరావు పాల్గొన్నారు. దుగ్గిరాల బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని శోభాదేవి ఆధ్వర్యంలో బ్యూటీ అండ్ వెల్‌నెస్ విభాగంలో పోటీ జరిగింది.

రేవేంద్రపాడులో సైన్సు ప్రాజెక్టు పరిశీలిస్తున్న జీసీడీవో సుజాత

హ్యాండ్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపిక

దుగ్గిరాల, న్యూస్‌టుడే: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు హ్యాండ్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు హెచ్ఎం శోభాదేవి సోమవారం తెలిపారు. 14 ఏళ్ల లోపు విభాగంలో అక్షయ, సువర్ణ, 17 ఏళ్ల లోపు విభాగంలో వెంకటలక్ష్మి ఎంపికయ్యారన్నారు. క్రీడాకారిణుల్ని, పీడీలను హెచ్ఎం అభినందించారు.

ఎంపికైన క్రీడాకారిణులతో హెచ్ఎం శోభాదేవి

అయ్యప్ప మహా పడి పూజ నేడు

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరి పట్టణ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో మంత్రి లోకేశ్ సహకారంతో మంగళవారం సాయంత్రం అయ్యప్ప మహా పడి పూజ నిర్వహిస్తున్నట్లు భక్త బృందం తెలిపింది. మంత్రి లోకేశ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. మధు నంబూద్రి గురుస్వామి ఆధ్వర్యంలో 18 పడి మెట్లకు విశేష పూజలు, డప్పు శ్రీను బృందం భజన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. పడిపూజ అనంతరం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింటు అయిన గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, కుంచనపల్లి గ్రామం, అమరావతి అపర్ణ అపార్ట్మెంట్స్ కాపురస్తురాలు అబ్బినేని చంద్ర నాగ్ గారి భార్య అబ్బినేని అనూష గారి నుండి ఇన్‌స్ట్రక్షన్స్ పొంది యావన్మందికి తెలియజేయునది.

దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని గుంటూరు జిల్లా, చేబ్రోలు గ్రామ కాపురస్తుడు సూర్యదేవర లక్ష్మి నారాయణ ప్రసాద్ గారి కుమారుడు భరత్‌కుమార్ గారు కాజ గ్రామం తాలుకా ప్లాట్ నెం. 10, సర్వే నెం. 149/1B లో 364 చ.గ. ప్లాట్‌ను పంది వెంకటేశ్వర్లు వగైరాల వద్ద నుండి క్రయం పొంది దీ. 19-06-1989 మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో విక్రయ దస్తావేజు నెం. 2651/1989 రుగా కాబడిన ఆస్తిని మా క్లయింటుకు విక్రయించుటకు ఖరారుపడి మా క్లయింటు పేరిటకు రిజిష్టరు చేయుటకు సిద్ధపడి యున్నారు.

కావున సదరు దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని ప్లాట్ నెం. 10, సర్వే నెం. 149/1B లో 364 చ.గ. ప్లాట్ విషయమై గాని సదరు ఆస్తిని సూర్యదేవర భరత్ కుమార్ గారు మా క్లయింటుకు విక్రయించి రిజిష్టరు చేయు విషయమై ఎవరికైనను ఏవిధమైన క్లెయిములు గాని, అభ్యంతరములు గాని ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన వారం దినములలోగా మా క్లయింటుకు గాని, మాకు గాని వ్రాతపూర్వకముగా తెలియపరచవలసినదిగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు : గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ డి. యిలాకా, మంగళగిరి మండలం, కాజ గ్రామం డి.నెం. 149/1B రు బాపతు 364 చ.గ. గల ప్లాట్ నెం. 10 భూమికి హద్దులు. తూర్పు: ప్లాట్ నెం. 10 హద్దు. అ. 40, దక్షిణం: 24 వెడల్పు గల రోడ్డు హద్దు, అ. 82, పడమర: 24 వెడల్పు గల రోడ్డు హద్దు. అ. 40, ఉత్తరం: ఉదయ రాజ్యలక్ష్మి గారి ప్లాట్ నెం. 11 హద్దు. అ. 82.

మంగళగిరి — లంకా శివరామ్ ప్రసాద్, లంకా వంశీకృష్ణ
Dt. 01.11.2025 — గద్దె రవికిరణ్, అడ్వకేట్స్, మంగళగిరి

(c) eenadu

గుంటూరు తూర్పు

చిత్రలేఖనంలో ప్రతిభావంతులు

విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపల్ గంగాధరరావు

గుంటూరు పశ్చిమ, న్యూస్‌టుడే: బుడంపాడులోని ప్రోడిజీ విద్యాలయంలో విద్యార్థులకు సోమవారం 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'మీకు ఇష్టమైన పండగ' అనే అంశంపై నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సీహెచ్. జశ్వంతి (7వ తరగతి), పి.గాయత్రి (9వ తరగతి), వై.మోషిత (9వ తరగతి)లు వరుస స్థానాల్లో నిలిచారు. విజేతలకు డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

స్పందనకు వందనం

★ మద్దిరాల కాలనీ 5వ లైన్‌లో రెండు రోజులుగా చెత్త తీయడం లేదు. ఈ ప్రాంతం అపరిశుభ్రంగా మారిందని స్థానికుడు శ్యాంబాబు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లడంతో ట్రాక్టర్ సిబ్బందిని పంపి చెత్త తీయించి తరలించారు.

★ బాలాజీనగర్ 2వ లైను సైడు కాలువల్లో పూడికలు చేరి మురుగునీరు నిలిచిపోయి దోమల వ్యాప్తి అధికంగా ఉంటోందని స్థానికుడు సతీష్‌కుమార్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను ప్రజారోగ్య విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కాలువల్లో పూడిక తీయించారు.

- న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ

సచివాలయాలు.. చెప్పుకోలేని కష్టాలు

ఉద్యోగులు ఉండరు... సేవలు అందవు

న్యూస్‌టుడే - పట్నంబజారు

ఉద్యోగుల్లేక సచివాలయం వద్ద జనం పడిగాపులు

నగరంలోని కొన్ని సచివాలయాల్లో ఉద్యోగులు సమయపాలన పాటించటం లేదు. వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు అధికారుల రాక కోసం గంటలకొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితి. తూర్పు నియోజకవర్గపరిధిలోని కొన్ని సచివాలయాల్లో తగినంత సిబ్బంది లేరు. ఉన్న కొద్ది మందిని కొన్ని సచివాలయాలకు ఇన్‌ఛార్జిలుగా నియమించారు. పింఛన్ల పంపిణీ సందర్భంగా పాతగుంటూరులోని కొందరు వృద్ధులు తమకు అవి అందలేదంటూ 17వ సచివాలయం వద్దకు మధ్యాహ్నం వచ్చి సాయంత్రం వరకు వేచి చూసినా అధికారుల జాడ లేదు. వారంతా నిరాశతో ఇళ్లదారి పట్టాల్సి వచ్చింది. ఉన్న ఒకరిద్దరు ఉద్యోగులను అధికారుల గురించి వాకబు చేయగా, ఎలాంటి సమాచారం రాలేదని వారు వాపోయారు. సచివాలయాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో కొందరు ఉద్యోగులు ఆడిందే ఆటగా పరిస్థితి ఉంటోంది. కొన్ని సచివాలయాల్లో కొంతమంది ఉద్యోగులు నిత్యం హాజరు వేయించుకొని వెళ్లిపోయి పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తున్నారు.

గతంలో జగనన్న కాలనీల్లో స్థలాలు మంజూరైన లబ్ధిదారులు శనివారం నుంచి ఆన్‌లైన్‌లో ఆదాయ, కుల ధ్రువీకరణపత్రాలతోపాటు ఆధార్, పాన్ నంబర్లను అప్‌లోడ్ చేయించుకోవాల్సి ఉంది. దీంతో వారంతా ఆ పత్రాలను దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాలకు వస్తున్నారు. కొన్ని సచివాలయాల్లో అధికారులు లేరని సమాధానం రావడంతో సాయంత్రం వరకు వేచి చూసి ఇంటికెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి.. సచివాలయాల ఉద్యోగుల పనితీరును క్రమబద్ధీకరణ చేయాల్సిన అవసరం ఉంది.

అర్జీ స్వీకరిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

నిబంధనల ఉల్లంఘన కానరాదా?

న్యూస్‌టుడే - నగరపాలక సంస్థ

తెరిచి ఉన్న అన్నపూర్ణ కమర్షియల్ కాంప్లెక్స్

జాతీయ రహదారి పక్కన ఉన్న అన్నపూర్ణ వాణిజ్య సముదాయం వద్ద నిబంధనల ఉల్లంఘన జరుగుతున్నా.. జీఎంసీ అధికారులకు పట్టడం లేదు. ఇటీవల కమిషనర్ శ్రీనివాసులతోపాటు అధికారులు ఈ దుకాణ సముదాయం వద్ద అనధికారికంగా వ్యాపారాలు చేయరాదని హెచ్చరికలు జారీ చేశారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు గత నెల 10న దుకాణ సముదాయాన్ని మూసేయించి సీజ్ చేసినట్టు ప్రకటించారు. అయినా.. అక్కడ ప్రధాన ద్వారం తెరిచి కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. జీఎంసీకి చెందిన కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వద్దే వ్యాపారాలు చేయాలని రైతులు, వ్యాపారులు అందరూ నిబంధనలు పాటించాల్సిందేనని ఉన్నతాధికారులు స్పష్టం చేసినా.. బహిరంగంగానే ఉల్లంఘిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన జీఎంసీ రెవెన్యూ విభాగం సిబ్బంది, అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. మరోవైపు కొల్లి శారద మార్కెట్లో దుకాణాలు దక్కించుకున్న వారు బయట జరుగుతున్న అనధికార వ్యాపారంపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేశారు. దీనివల్ల తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయన్నది వారి ఆవేదన.

విద్యార్థులను ప్రోత్సహించాలి

నగరపాలక సంస్థ: వికసిత్ భారత్ బిల్డ్ ఎ థాన్ వేదికను ఉపయోగించుకుని విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ప్రోత్సహించాలని ఎంఈవో హవీలా సూచించారు. సోమవారం పరీక్ష భవన్‌లో శిక్షణ కార్యక్రమం జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్‌మీరా ఆధ్వర్యంలో ప్రారంభమైంది. విద్యార్థులతో బృందాలను ఏర్పాటు చేసి వారి ఆలోచనల నివేదికలను పంపాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మల్లికార్జునరావు, వెంకటేశ్వరరావు, అటల్ టింకరింగ్ ల్యాబ్ మెంటార్స్ వేణు, వెంకట్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: జీఎంసీకి వస్తున్న ప్రజాఫిర్యాదులను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో 25 ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని ఆయా విభాగాల అధికారులకు పంపి పరిష్కారానికి ఆదేశించారు. అనంతరం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 39 అర్జీలు స్వీకరించారు. అర్జీల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డీసీ బి.శ్రీనివాసరావు, సీపీ రాంబాబు, ఇన్‌ఛార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత గడువులోగా పనుల పూర్తి

ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో రహదారులు, మురుగుకాలువల పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతతో నిర్మించాలని కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కమిషనర్ ఏటీ అగ్రహారం, నగరంపాలెం, బృందావన్‌గార్డెన్స్, కృష్ణనగర్, గుజ్జనగుండ్ల, ఎస్వీఎన్ కాలనీలో రహదార్లు, డ్రెయిన్‌ల నిర్మాణ పనులు పరిశీలించారు. ఎస్వీఎన్ కాలనీ రహదారిలో ఆక్రమణలు తొలగించాలన్నారు. అనంతరం ఆర్టీవో కార్యాలయం వద్ద అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు.

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

తెదేపాకు కార్యకర్తలే ఊపిరి

ఎన్టీఆర్ సర్కిల్: తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే ఊపిరి అని, వారి కుటుంబాలకు ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. వల్లూరివారితోటకు చెందిన కార్యకర్త గురవయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు తెదేపా సంక్షేమ నిధి నుంచి వచ్చిన రూ.5 లక్షల చెక్కును సోమవారం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముప్పవరపు భారతి, తెదేపా నాయకులు గోళ్ల ప్రభాకర్, వంగర ఏడుకొండలు, బొంతల సాయి, దినేష్, మధు, ప్రభాకర్, రమేష్ పాల్గొన్నారు.

ఆస్తులు తీసుకున్నారు.. అన్నం పెట్టడం లేదు

అర్జీ స్వీకరించిన డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆస్తులు తీసేసుకుని అన్నం పెట్టకుండా గెంటేశారని ఓ వృద్ధుడు... గేదెలు పెంపకం ద్వారా పాలు అమ్ముకుని చిట్టీలు కడితే డబ్బులు ఇవ్వకుండా నిర్వాహకురాలు బెదిరిస్తోందని పండుటాకులు సోమవారం పోలీసు కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. నడవలేని వారి వద్దకొచ్చిన డీఎస్పీ శ్రీనివాసరెడ్డి అర్జీలు స్వీకరించి, వాటి పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ రమణమూర్తి, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, మధుసూదనరావు, బెల్లం శ్రీనివాసరావు ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారానికి ఆదేశించారు.

● ముప్పంగికి చెందిన శేషురెడ్డి అర్జీలో...: ఇద్దరమ్మాయిలు, అబ్బాయి ఉన్నారు. పెంచి పెద్ద చేసి వివాహాలు చేశాక ఆస్తులు తీసుకున్నారు. నా భార్య చనిపోయింది. నిమ్ము, ఆయాసంతో ఇబ్బంది పడుతున్నా. పిల్లలు అన్నం పెట్టడం లేదు. నా భార్య పేరుతో ఉన్న 80 సెంట్ల స్థలాన్ని చిన్నమ్మాయి తీసుకుని బస్తా బియ్యం కూడా ఇవ్వడం లేదు. ఆ పొలం నాకు ఇప్పిస్తే కౌలుకు ఇచ్చుకుని జీవిస్తా.

● నల్లపాడుకు చెందిన దంపతులు వెంకట్రావు, వెంకటరత్నం అర్జీలో...: గేదెల పెంపకం ద్వారా పాలు అమ్మి జీవిస్తున్నాం. ఓ మహిళ వద్ద రూ.3 లక్షల చొప్పున రెండు చిట్టీల్లో మమ్మల్ని చేర్చుకుంది. ప్రతి నెలా రూ.30 వేల చొప్పున కట్టించుకుంది. చిట్టీల గడువు ముగిసి ఏడాది గడిచినా డబ్బులు ఇవ్వడం లేదు. అదేమని అడిగితే బెదిరిస్తోంది. పోలీసుల చుట్టూ నెలలుగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు.

తప్పుడు పత్రాలతో లక్షలు కొట్టేశారు

యడ్లపాడుకు చెందిన ఓ వ్యక్తి అదే గ్రామంలో 2.61 ఎకరాలను రూ. 80 లక్షలకు ఇస్తానని చెప్పి రూ. 50 లక్షలకు 2024లో మేలో నల్లపాడులో రిజిస్ట్రేషన్ చేశారు. మూడు నెలలు తర్వాత అక్కడికెళ్లి చూస్తే ఎవరో గోడ కట్టారు. పొలం అమ్మిన వ్యక్తిని అడిగితే ఎవరో పొరపాటున కట్టారు తీయిస్తానని చెప్పాడు. మాకు అమ్మిన పొలంలో 1.50 ఎకరాలను 2008లోనే వేరే వారికి అమ్మినట్టు మా విచారణలో తెలిసింది. పక్కనేఉన్నవారి పొలం కలిపి 2.61 ఎకరాలకు తప్పుడు పత్రాలు సృష్టించి మాకు అమ్మాడు. మా డబ్బులు తిరిగి ఇవ్వమంటే బెదిరిస్తున్నాడు.

- వెంకట రామారావు, జేకేసీరోడ్డు

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వండి

మాట్లాడుతున్న ప్రసాద్. జమలయ్య, జగన్నాథం, రాధాకృష్ణమూర్తి, అరుణ్‌కుమార్

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: కౌలు రైతులకు గుర్తింపుకార్డుల జారీలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జమలయ్య విమర్శించారు. సోమవారం కొత్తపేటలోని కార్యాలయంలో కౌలు రైతుల సమస్యలపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జమలయ్య మాట్లాడుతూ అధిక కౌలు రేట్లు, ప్రైవేట్ వడ్డీ భారంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, పలు సంఘాల నాయకులు జగన్నాథం, అరుణ్‌కుమార్, సత్యనారాయణ, రంగారెడ్డి, శివాజీ, విఠల్‌రెడ్డి, చౌతన్య, రవికుమార్ పాల్గొన్నారు.

జడ్పీలో సిబ్బందికి సీట్ల కేటాయింపు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాపరిషత్తు కార్యాలయంలో సిబ్బందికి సీట్లను కేటాయించారు. వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు ఇటీవలే జడ్పీకి తిరిగి రావడంతో వారికి వేర్వేరు విభాగాల్లో సీట్లను కేటాయిస్తూ సీఈవో జ్యోతిబసు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మరికొందరు ఉద్యోగులను వేరే విభాగాలకు మార్చారు.

ఏఎన్ఎంలను విధుల్లోకి తీసుకోండి

డీఎంహెచ్‌వో విజయలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న నేతాజీ తదితరులు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: అర్బన్ హెల్త్ సెంటర్లలో తొలగించిన ఏఎన్ఎంలను న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు తిరిగి కొనసాగించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నేతాజీ కోరారు. సోమవారం డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మిని కలిసి వినతిపత్రం అందించారు. నేతాజీ మాట్లాడుతూ రెండు దశాబ్దాల పాటు ఏఎన్ఎంలుగా పనిచేసినవారిని 2022లో వైకాపా ప్రభుత్వం అన్యాయంగా తొలగించిందన్నారు. బాధితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. పలువురిని తిరిగి సర్వీసులోకి తీసుకోవాలని కోర్టు ఉత్తర్వులిచ్చినట్లు చెప్పారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి అధికారుల సలహా మేరకు చర్యలు తీసుకుంటామన్నారని తెలిపారు.

గుంతలమయంగా రహదారి

కొత్తపేట బోసుబొమ్మ సిగ్నల్స్ వద్ద రహదారి పాడైపోవడంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ రోడ్డుపై వరుసగా గుంతలు పడ్డాయి. చిన్నపాటి వర్షం పడినా అందులోకి మురుగునీరు చేరుతోంది. అక్కడ గుంతలు ఉన్నట్టు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనచోదకులు వాపోతున్నారు. **- న్యూస్‌టుడే, గుంటూరు నేరవార్తలు**

కనులపండువగా పుష్పయాగ మహోత్సవం

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: నెహ్రూనగర్ 2వ వీధిలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం రాత్రి శ్రీవారి పుష్పయాగ మహోత్సవం కనులపండువగా నిర్వహించారు. శ్రీవారికి దీవి నృశింహగోపాలాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు శ్రీభాష్యం లక్ష్మణాచార్యుల బృందం శాస్త్రోక్తంగా పూజాది కార్యక్రమాలు, పుష్పయాగం నిర్వహించారు. ఆలయ పర్యవేక్షకులు పసుపులేటి సాంబశివరావు, సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జాతీయ కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బహుమతులు గెలుపొందిన విద్యార్థులు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: విజయవాడ రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఈ నెల 2న నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో గుంటూరు రామకృష్ణ శారద విద్యాలయ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విజేతలను సోమవారం పాఠశాలలో అభినందించారు. మహిళా పోలీసుస్టేషన్ సీఐ నారాయణ వారికి బహుమతులు అందజేసి ప్రశంసించారు. కరాటే శిక్షకులు లక్ష్మీప్రసన్నకుమారి, రవికుమార్‌లను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బోధమయ ప్రాణమాతాజీ, ఉప ప్రధానోపాధ్యాయులు కల్యాణాత్మక ప్రాణ మాతాజీ పాల్గొన్నారు.

కిక్కిరిసిన ఆలయాలు

కొత్తపేట శివాలయంలో స్వామివారు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: కార్తిక సోమవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. చేనేతకాలనీ, మంగళదాస్‌నగర్, బుచ్చయ్యతోట, నెహ్రూనగర్, వసంతరాయపురం, రైలుపేట, శ్రీనగర్, పొట్టి శ్రీరాములునగర్, కొత్తపేట, ఆర్టీసీకాలనీ, పరమయ్యకుంట పరిసర ప్రాంతాల్లోని ఆలయాలకు వేకువజాము నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. శివయ్యను దర్శించుకొని పూజలు చేశారు.

విద్యాహక్కు చట్టాన్ని సవరించాలి

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకు వినతిపత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: పార్లమెంట్ సమావేశాల్లో విద్యాహక్కు చట్టానికి సవరణలు చేసి సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించేలా చూడాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా నాయకులు కోరారు. సోమవారం నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పెదబాబు, డీకే సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం అమల్లోకి వచ్చిన 2010కి ముందే నియమితులై పనిచేస్తున్న ఇన్‌సర్వీస్ టీచర్లందరూ టెట్ ఉత్తీర్ణత సాధించాలన్న సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలన్నారు. రాష్ట్రంలో 1.20 లక్షల మంది ఉపాధ్యాయులు టెట్‌పై ఆందోళన చెందుతున్నారన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ప్రసాదరావు, రాష్ట్ర కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు శ్యాంబాబు, పి.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఎంసీహెచ్ బ్లాక్‌లో ప్రత్యేక పూజలు

నగరంపాలెం, న్యూస్‌టుడే: గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో రూ.127 కోట్లతో నిర్మిస్తున్న ఎంసీహెచ్ బ్లాక్‌లో అంతర్గత పనులు చేపట్టేందుకు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ మాట్లాడుతూ జీజీహెచ్ ఆవరణలోని ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణం దాదాపుగా పూర్తి కావచ్చిందని, త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్తిక సోమవారం కావడంతో అంతర్గత పనులు చేపట్టేందుకు పూజలు చేసినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక పూజలో జింకానా అధ్యక్షుడు డాక్టర్ రామకోటేశ్వరరావు, సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ రమణ, జింకానా సమన్వయకర్త డాక్టర్ బాలభాస్కర్, డాక్టర్ హనుమంతరావు సతీసమేతంగా పాల్గొన్నారు. గైనకాలజీ, పీడియాట్రిక్, పీడియాట్రిక్ సర్జరీ, మత్తు విభాగాధిపతులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

మా క్లయింట్ అయిన పంచుమర్తి వెంకటేశ్వరరావు, S/o.లేటు. వాసుదేవ రావు గారి రిజిస్టర్డ్ జి.పి.ఏ. ఏజంట్ అయిన కె.బాపనయ్య, ఐతానగర్, తెనాలి, గుంటూరు జిల్లా వారి ఇన్‌స్ట్రక్షన్స్ ప్రకారం యావన్మందికి తెలియజేయునది: గుంటూరు జిల్లా, కొల్లూరు(మం),చిలుమూరు గ్రామ వాస్తవ్యురాలైన ముప్పా శైలజా W/o. కొలసాని శ్రీరామమూర్తి, అను వారు ఆమె ది.09.10.1991వ తేదీన రిజిష్టరు దస్తావేజు నెం.7504/1991, యస్.ఆర్.ఓ. గుంటూరు, ద్వారా కొనుగోలు చేసిన దిగువ షెడ్యూలు ఆస్థికి ఆమే హక్కుదారు అని, మరియు యజమాని అని, సదరు ఆస్తిలో ఆమె యొక్క అనుభవమునకు ఆటంకములు కలిగించరాదని మా క్లయింట్ పై వారి కుటుంబ సభ్యులపై మరియు ఒకరిపై గుంటూరు [illegible]

G.V. RAMANA, K.PADMASRI, J.B.RAMANA KUMAR, Advocates.
1st Line, Gunturuvarithota, Guntur.-1, Cell No.9848231931.

క్వార్టర్ ఫైనల్స్‌కు స్నూకర్ పోటీలు

పోటీలో తలపడుతున్న క్రీడాకారుడు

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: ఎల్వీఆర్ సన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సాగుతున్న ఏపీ రాష్ట్ర బిలియర్డ్స్, స్నూకర్ ర్యాంకింగ్ పోటీలు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఎల్వీఆర్ సన్స్ క్లబ్ క్రీడాకారులు శంకరరావు, స్వామి, యోగి, కల్యాణ వర్మ, సాగర్ జైన్, పండరీ కిశోర్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. పండరీ కిశోర్ 4-3 స్కోర్‌తో సోమేశ్వరరావుపై, స్వామి 4-2 స్కోర్‌తో హేమంత్‌పై విజయం సాధించారని టోర్నమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి పులివర్తి అజార్ తెలిపారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితాలు నాశనం

నగరంపాలెం, న్యూస్‌టుడే: ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని డీఎస్పీ కె.అరవింద్ తెలిపారు. గుంటూరు వైద్య కళాశాలలో సోమవారం ర్యాగింగ్‌పై నిర్వహించిన అవగాహన సదస్సు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే వెంటనే ప్రిన్సిపల్‌కు, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ర్యాగింగ్ చేసే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి మాట్లాడుతూ ర్యాగింగ్ అనాగరిక చర్య అని, సాటి మనిషిని మరో మనిషి బాధపెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. ర్యాగింగ్ లేని గుంటూరు వైద్య కళాశాలగా తీర్చిదిద్దేందుకు అధ్యాపకులు, విద్యార్థులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం డీఎస్పీ అరవింద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్(అడ్మిన్) డాక్టర్ శ్రీధర్, వైస్ ప్రిన్సిపల్ (అకడమిక్) డాక్టర్ మాధవి, జింకానా సభ్యుడు కరణం రాజా, ఆచార్యులు, సహాచార్యులు, సహాయ ఆచార్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

గోరంట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో పత్తి కొనుగోలుకు సంబంధించి మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలులో సోమవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రైతులు సీఎం యాప్‌లో నమోదు చేసుకోవాలని, కపాస్ కిసాన్ యాప్‌లో జిన్నింగ్ మిల్లు, విక్రయ తేదీలను ఎంపిక చేసుకుని స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రైలుపట్టాలపై మృతదేహం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నల్లపాడు.. బండారుపల్లి మధ్య రైల్వేట్రాక్‌పై 35 ఏళ్ల వ్యక్తి మృతదేహం ఉందని సోమవారం జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ అంజిబాబు, ఎస్సై సుబానీ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. అతను ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని ప్రాథమిక దర్యాప్తులో గుర్తించినట్టు సీఐ తెలిపారు. వివరాలు తెలిసినవారు రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ పోలీసులను సంప్రదించాలన్నారు.

యువకుడి అదృశ్యం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: లక్ష్మీనగర్‌కు చెందిన పూర్ణకిశోర్ అదృశ్యమైనట్టు సోమవారం నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. బీటెక్ పూర్తి చేసిన అతను సోమవారం నుంచి కనిపించడం లేదని తండ్రి రామ్మోహనరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

ప్రథమ వర్ధంతి

శ్రీ గల్లా వెంకట రమణారావు గారు
గుజ్జనగుండ్ల, గుంటూరు.
జననం : 6-10-1970 మరణం : 4-11-2024

మంచికి మారుపేరుగా,
సహనానికి నిలువెత్తురూపంగా నిలిచారు,
కుటుంబ సభ్యులకు అభిమానపాత్రునిగా మెలిగి
మా ఇంటి పెద్దవారుగా ఎనలేని సేవలందించి,
అప్యాయతానురాగాలను పంచిన మీరు మా నుండి
దూరమై నేటికి సంవత్సర కాలం గడచినప్పటికీ
మీ మధుర స్మృతులను మరువలేకున్నాము.
మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని
భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య : గల్లా నాగలక్ష్మి
తల్లి : గల్లా విజయలక్ష్మి తండ్రి : గల్లా కృష్ణారావు (లేటు)

కుమారుడు - కోడలు : గల్లా సాయి హేమంత్, లక్ష్మీ సమీర;
రెండవ కుమారుడు : గల్లా రేవంత్ కుమార్

తమ్ముడు - మరదలు : గల్లా కిషోర్ కుమార్, భార్గవదీప్తి
కుమారుడు : గల్లా జైదీప్

చెల్లెళ్ళు - బావలు : అనూరాధ, అబ్బు శ్రీనివాస బాబా;
శ్రీకాంతి రేఖ, చేతిరెడ్డి క్రిష్ణా
మేనకోడళ్ళు : అశ్రిత, శ్రీహిత, క్రిత్య

(c) eenadu

గుంటూరు పశ్చిమ

మహిళల్ని ప్రోత్సహిస్తే అద్భుతాలు సాధిస్తారు

బాణసంచా కాలుస్తున్న ఎమ్మెల్యే మాధవి, తెలుగు మహిళలు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: మహిళల్ని ప్రోత్సహించి సరైన అవకాశాలు కల్పిస్తే.. అద్భుతాలు సాధిస్తారని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. భారత మహిళ క్రికెట్ జట్టు ప్రపంచకప్‌లో ఘన విజయం సాధించిన సందర్భంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం విజయోత్సవాలు నిర్వహించారు. తెలుగు మహిళలతో కలిసి ఆమె కేకు కోసి.. బాణసంచా కాల్చి ఆనందాన్ని పంచుకున్నారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ మహిళల వరల్డ్‌కప్‌లో మన జట్టు విజయం సాధించడం ప్రతి భారతీయ మహిళకు గర్వకారణం అన్నారు. సెమీఫైనల్స్‌లో అసాధారణ ప్రతిభతో జట్టును ఫైనల్స్‌కు తీసుకొచ్చిన జెమీమా రోడ్రిగ్స్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్, ఫైనల్స్‌లో అదరగొట్టిన షెఫాలీ వర్మ, దీప్తి శర్మతో పాటు స్మృతి మంధాన, తెలుగమ్మాయి శ్రీచరణిలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భారత్ జట్టు విజయం సాధించాలని ప్రార్థించారన్నారు. దేవదేవుని ఆశీస్సులతో మహిళా క్రికెటర్ల కృషితో ఈ విజయం సాధ్యమైందన్నారు. నారా భువనేశ్వరి లండన్‌లో గోల్డెన్ పీకాక్ అవార్డు అందుకున్నందుకు ఎంతో గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పంచుమర్తి కల్పన, న్యాయవాది ముత్తినేని శివలీల తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80086 22566, 97042 53525, 80085 74897

? ఏటీ అగ్రహారం 15వ లైన్‌లో కాలువలు వ్యర్థాలతో పూడుకుపోయి మురుగు ముందుకు కదలడంలేదు. -స్థానికులు

✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువల్లో పూడిక తీయిస్తాం. -అంగడి రాజేష్, శానిటరీ సూపర్‌వైజర్

చెత్త తొలగింపు: ఎస్వీ బంగ్లా రోడ్డులో చెత్తతో కూడిన వ్యర్థాలు ఎక్కువగా ఉండడంతో దోమల బెడద ఎక్కువైంది. సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా జీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి పారిశుద్ధ్య సిబ్బందితో వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకున్నారు. - న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం

స్పందనకు వందనం

జడ్పీలో సిబ్బందికి సీట్ల కేటాయింపు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాపరిషత్తు కార్యాలయంలో సిబ్బందికి సీట్లను కేటాయించారు. వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు జడ్పీకి తిరిగి రావడంతో వారికి వేర్వేరు విభాగాల్లో సీట్లను కేటాయిస్తూ సీఈవో జ్యోతిబసు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్ఎంసీహెచ్ బ్లాక్‌లో ప్రత్యేక పూజలు

పూజలో డాక్టర్ రమణ, డాక్టర్ రామకోటేశ్వరరావు, సమన్వయకర్త బాలభాస్కర్, హనుమంతరావు దంపతులు

నగరంపాలెం, న్యూస్‌టుడే: గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో రూ.127 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఎస్ఎంసీహెచ్ బ్లాక్‌లో అంతర్గత పనులు చేపట్టేందుకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ మాట్లాడుతూ జీజీహెచ్ ఆవరణలోని ఎస్ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణం దాదాపు పూర్తి కావస్తుందని, త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్తిక సోమవారం కావడంతో అంతర్గత పనులు చేపట్టేందుకు పూజలు చేసినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక పూజల్లో జింకానా అధ్యక్షుడు డాక్టర్ రామకోటేశ్వరరావు, సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ రమణ, జింకానా సమన్వయకర్త డాక్టర్ బాలభాస్కర్, డాక్టర్ హనుమంతరావు సతీసమేతంగా పాల్గొన్నారు. పూజల్లో గైనకాలజీ, పీడియాట్రిక్, పీడియాట్రిక్ సర్జరీ, మత్తు విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

జిల్లాలో పత్తి కొనుగోలుకు సంబంధించి మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలులో సోమవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రైతులు సీఎం యాప్‌లో నమోదు చేసుకోవాలని, కపాస్ కిసాన్ యాప్‌లో జిన్నింగ్ మిల్లు, విక్రయ తేదీలను ఎంపిక చేసుకుని స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, గోరంట్ల

జీజీహెచ్‌లో ఆగని వాహనాల చోరీలు

'బాబాయికి ఆరోగ్యం బాగోక జీజీహెచ్‌లో చేర్పించాం. మధ్యాహ్నం భోజనం తీసుకొచ్చి పార్కింగ్ స్థలంలో వాహనం పెట్టి 104 వార్డులో వారికి ఇచ్చి తిరిగి వచ్చేసరికి బండి మాయమైంది. టోకెన్ ఇచ్చారు కదా.. బైకు ఏదని అడిగినా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. చివరికి కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశా.'.. - శ్రీనివాసరావు, సత్తెనపల్లి

ఇది ఒక్క శ్రీనివాసరావు సమస్యే కాదు. జీజీహెచ్‌లో రోగులకు సహాయకులుగా వచ్చిన వారిలో వాహనాలు పోగొట్టుకుంటున్నవారి ఆవేదన.

నగరంపాలెం, న్యూస్‌టుడే

ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వైద్యం కోసం రోగులు సర్వజనాసుపత్రికి వస్తుంటారు. వారితో పాటు సహాయకులు, చూడడానికి దూరప్రాంతాల నుంచి వచ్చేవారు ఇక్కడ ఏదైనా అవసరానికి ఉపయోగపడుతుందని ఇంటి నుంచి ద్విచక్రవాహనాన్ని తీసుకొస్తుంటారు. రోగిని చూసి వచ్చేలోపు దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఆసుపత్రి

బెంబేలెత్తుతున్న రోగుల సహాయకులు

ఆవరణలో పార్కింగ్ చేసిన వాహనాలు చోరీకి గురవుతుండడంతో రోగుల సహాయకులు లబోదిబోమంటున్నారు. ప్రతి నెలా పదుల సంఖ్యలో వాహనాలు మాయం అవుతున్నాయని, వాహనాలకు కనీస రక్షణ కరవైందని వాహనదారులు వాపోతున్నారు. వివిధ విభాగాల్లో చికిత్స పొందే బంధువులను పరామర్శించేందుకు వచ్చే సహాయకుల వాహనాలు చోరీకి గురికావడంతో ఏం చేయాలో దిక్కుతోచక అయోమయంలో పడిపోతున్నారు. సెక్యూరిటీ సిబ్బందిని అడగడం, స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడానికి నానా తిప్పలు పడుతున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో కనీస రక్షణ లేకుండా పోయిందని రోగుల సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వార్డుల్లోనూ వస్తువులు మాయం

వార్డులో కూడా రోగులు, సహాయకులకు చెందిన విలువైన చరవాణులు, నగదును కూడా తస్కరించుకుపోతున్నారు. ఆసుపత్రిలోని ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది ఏం విధులు నిర్వహిస్తున్నారో అర్థం కావడంలేదంటున్నారు. వ్యాధి నయం చేయించుకునే దానికి పెద్దాసుపత్రిని ఆశ్రయిస్తే, ఇక్కడ విలువైన వస్తువులు కోల్పోయి ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందంటున్నారు.

అత్యవసర వైద్య సేవల విభాగం సమీపంలో వాహన పార్కింగ్

★ ద్విచక్రవాహన పార్కింగ్ ఇటీవల నూతన గుత్తేదారుకు అప్పగించారు. వాహనం పార్కింగ్ చేస్తే ముందుగా అక్కడి సిబ్బంది టోకెన్ ఇస్తారు. టోకెన్ తీసుకున్న తర్వాత వాహనం చోరీకి గురైతే గుత్తేదారుడే బాధ్యత తీసుకోవాల్సి ఉన్నా.. వారు సమాధానం చెప్పడంలేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీజీహెచ్ ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వాహనాలు, చరవాణులు అపహరణకు గురి కాకుండా భద్రత పెంచాలని రోగులు, సహాయకులు వేడుకుంటున్నారు.

ధర వరలు

కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు (కిలో రూ.ల్లో): టమాట 28, వంగ 63, బెండ 43, పచ్చిమిర్చి 26, కాకర 50, బీర 49, క్యాబేజి 28, క్యారెట్ 78, దొండ 35, బంగాళదుంప 28, ఉల్లిపాయలు 24, గోరుచిక్కుళ్లు 48, దోస 22, సొర 30, పొట్ల 34, అరటికాయ 7, పెద్దచిక్కుళ్లు 74, చామదుంప 24, మునగ 10, బీట్‌రూట్ 44, కీరదోసకాయ 34, బీన్స్ 94, క్యాప్సికమ్ 79, కొత్తిమీర 30, ఆకుకూరలు 18, నిమ్మకాయలు 28, అల్లం 80, వెల్లుల్లి 110.

- న్యూస్‌టుడే, పట్టాభిపురం

పోలీసులు విచారిస్తున్న ఎంపీడీవో దంపతులు ఎవరు?

జిల్లాపరిషత్తు(గుంటూరు): ఆర్టీసీ బస్సులో తోటి ప్రయాణికురాలి పర్సును కొట్టేసిన ఎంపీడీవో భార్యను పోలీసులు విచారిస్తున్న విషయం బయటకు రావడంతో జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ఉద్యోగులను ఉలిక్కి పడేలా చేసింది. అక్టోబరు 29న విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో ఎంపీడీవో.. భార్య, కుమార్తెతో గుంటూరు వెళ్లే బస్సు ఎక్కేటపుడు ప్రయాణికురాలైన స్టాఫ్‌నర్స్ పర్సును ఎంపీడీవో భార్య అపహరించారు. గుంటూరులో బస్సు దిగిన తర్వాత పర్స్ కనిపించకపోవడంతో నర్సు తిరిగి విజయవాడ వెళ్లి కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సీసీ కెమెరా పరిశీలించినపుడు ఎంపీడీవో భార్య పర్సును తస్కరించినట్లు గుర్తించారు. భార్య పర్సు కొట్టేసినట్లు గుర్తించినా.. ఆ ఎంపీడీవో మౌనంగా ఉండడంతో.. వారిని పోలీసులు పిలిపించి విచారణ చేశారనే విషయం తెలిసి అందరూ ముక్కున వేలేసుకున్నారు. గౌరవప్రదమైన ఉద్యోగంలో ఉన్న అధికారి.. భార్య చేసిన చోరీని నివారించకుండా మౌనంగా ఉన్నారనే విషయంపై సర్వత్రా చర్చకు దారితీసింది. పల్నాడు జిల్లాలో పని చేస్తున్న ఆయన గుంటూరులో నివాసం ఉంటూ రాకపోకలు సాగిస్తున్నట్లు తెలియడంతో ఎవరనే దానిపై అటు అధికారులతో పాటు ఇటు సిబ్బంది ఆరా తీస్తున్నారు.

అలరించిన అన్నమాచార్య సంకీర్తనామృతం

గానం చేస్తున్న భజన బృందం సభ్యులు

గుంటూరు సాంస్కృతికం: బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై సోమవారం రాత్రి సూరపనేని శ్రీకాంత్ పేరున ధార్మిక కార్యక్రమం జరిగింది. తొలుత ఆలయ పాలకమండలి ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెనాలి శ్రీవత్స భజనమండలి, కొండిపర్తి వసుంధర బృందం సభ్యులు అన్నమాచార్య సంకీర్తనలను గానం చేశారు.

కక్ష సాధింపు చర్యలకు దూరం

పట్టాభిపురం: కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పూర్తిగా దూరంగా ఉంటుందని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కసుకుర్తి హనుమంతరావు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడిన కల్తీ మద్యం వ్యవహారంలో ఎంతటి వారున్నా శిక్ష అనుభవించక తప్పదన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితాలు నాశనం

పశ్చిమ డీఎస్పీ అరవింద్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారి తదితరులు

నగరంపాలెం, న్యూస్‌టుడే: ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని గుంటూరు పశ్చిమ డీఎస్పీ కె.అరవింద్ తెలిపారు. గుంటూరు వైద్య కళాశాలలో సోమవారం ర్యాగింగ్‌పై నిర్వహించిన అవగాహన సదస్సు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే వెంటనే ప్రిన్సిపల్‌కు, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ర్యాగింగ్ చేసేవారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్య విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి మాట్లాడుతూ ర్యాగింగ్ అనాగరిక చర్య అని, సాటి మనిషిని మరో మనిషి బాధపెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. ఇలాంటి చర్యలకు ఎవరూ పాల్పడవద్దని సూచించారు. ర్యాగింగ్ లేని గుంటూరు వైద్య కళాశాలగా తీర్చిదిద్దేందుకు అధ్యాపకులు, విద్యార్థులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం డీఎస్పీ అరవింద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్(అడ్మిన్) డాక్టర్ శ్రీధర్, వైస్ ప్రిన్సిపల్ (అకడమిక్) డాక్టర్ మాధవి, జింకానా సభ్యుడు కరణం రాజా, ఆచార్యులు, సహాచార్యులు, సహాయ ఆచార్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటారు.. ప్రశంసలు పొందారు..

బహుమతులు అందుకున్న బాలికలతో ప్రిన్సిపల్ మల్లేశ్వరి

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: పట్టాభిపురంలోని బాష్యం హైస్కూల్‌లో 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు సోమవారం నిర్వహించారు. 'మీకు ఇష్టమైన పండగ' అనే అంశంపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో పండగ విశేషాలు తెలియజేస్తూ విద్యార్థులు చిత్రాలు గీసి ఆకట్టుకున్నారు. పట్టాభిపురంలోని బాష్యం హైస్కూల్‌లో షేక్ సిలబీ (9వ తరగతి), పి.వి.దివ్య (8వ తరగతి), షేక్ మస్కాని (9వ తరగతి)కు ప్రధానోపాధ్యాయిని ఎం.మల్లేశ్వరి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయుడు నాగేంద్ర విద్యార్థులను అభినందించారు.

ఆస్తులు తీసుకున్నారు.. అన్నం పెట్టడం లేదు

శేషురెడ్డి, మున్నంగి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆస్తులు తీసుకుని అన్నం పెట్టకుండా గెంటేశారని ఓ వృద్ధుడు.. గేదెలు పెంపకం ద్వారా పాలు అమ్మకుని చిట్టీలు కట్టిన డబ్బులు ఇవ్వకుండా నిర్బంధించారు ఓ బెదిరిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టాభిపురం డీసీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. మొత్తం వందకుపైగా అర్జీలు వచ్చాయి. తమ సమస్య పరిష్కారం కాలేదని ఆర్జీదారులు వాపోయారు. డీసీపీ శ్రీనివాసరెడ్డి వాటిని స్వీకరించి, వాటి పరిష్కారానికి ఆదేశించారు.

★ **మున్నంగికి చెందిన శేషురెడ్డి అర్జీలో...:** ఇద్దరబ్బాయిలు, అబ్బాయిలు ఉన్నారు. పెంపి పెద్ద చేసి వివాహాలు చేశాక ఆస్తులు తీసుకున్నారు. నా బాధ్యత చూడటంలేదు. నెమ్మదిగా ఆయాసంతో ఇబ్బంది పడుతున్నాను. పిల్లలు అన్నం పెట్టడం లేదు. నా భార్య పేరుతో ఉన్న 80 సెంట్ల స్థలాన్ని చిన్నమ్మాయి తీసుకుని ఎప్పుడు మాకు పెడుతుందని అడిగితే స్పందించడం లేదు. ఆ పొలం నాకు ఇప్పిస్తే కౌలుకు ఇచ్చుకుని జీవిస్తా.

★ నల్లపాడుకు చెందిన దంపతులు వెంకట్రావు, వెంకటరత్నం అర్జీలో...: గేదెల పెంపకం ద్వారా పాలు అమ్మి జీవిస్తున్నాం. ఓ మహిళ వద్ద రూ.3 లక్షల చొప్పున రెండు చిట్టీలో మమ్మల్ని చేర్చుకుంది. ప్రతి నెలా రూ.30 వేల చొప్పున కట్టించుకుంది. చిట్టీ గడువు ముగిసి ఏడాది గడిచినా డబ్బులు ఇవ్వడం లేదు. అడిగితే అదిగో ఇదిగో అని బెదిరిస్తోంది. పోలీసులు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు.

మురుగు నిలిచి.. దోమలకు ఆవాసాలుగా మారి..

నగరంపాలెం, న్యూస్‌టుడే: అశోక్‌నగర్ కాలనీ ప్రాంతంలో కాలువలు సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రహదారిపై పొంగి పొర్లుతూ దుర్గంధం వెదజల్లుతోంది. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఇళ్లలో వాడుకున్న నీరు రహదారులపై చేరి ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో దోమల బెడద ఎక్కువైంది. అశోక్ నగర్ ప్రాంతంలో కాలువలు నిర్మించేందుకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభించలేదని స్థానికులు పేర్కొంటున్నారు. దీనిపై శానిటరీ సూపర్‌వైజర్ ఎస్‌వీఎస్ ప్రసాద్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. వెంటనే పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి కాలువలో పేరుకుపోయిన మురుగును తొలగించి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

రహదారి ఇలా.. వాహనాలు వచ్చేదెలా..?

చిన్నపాటి వర్షానికే జీజీహెచ్ అత్యవసర వైద్యసేవల విభాగం సమీపంలోని మట్టి రహదారి పూర్తిగా బురదమయంగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తోంది. శంకర్‌విలాస్ వంతెన నిర్మాణం నేపథ్యంలో జీజీహెచ్ అత్యవసర వైద్యసేవల విభాగం ప్రధాన గోడలను కూల్చివేసి ఆసుపత్రిలోకి కొత్తవి నిర్మిస్తున్నారు. ప్రధానంగా రెండు ఇనుప గేట్లు ఉండగా.. ఒకటి మూసివేసి గోడల నిర్మాణం చేపట్టారు. రెండో గేట్ సమీపంలోని రహదారి మట్టిది కావడంతో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి బురదమయంగా మారిపోయింది. దీంతో బురదలో ఆటోలు, అంబులెన్స్‌లు ఇరుక్కుపోతున్నాయని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై కంకర వేసి మెరుగుపర్చాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, నగరంపాలెం

చెత్త డంప్ తొలగించారు

స్పందనకు వందనం

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: సంతోష్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లో భారీగా చెత్త డంపింగ్ చేస్తుండడంతో 'ఈనాడు'లో 'రహదారిలోనే చెత్త.. రాకపోకలు సాగించేదెలా..?' శీర్షికతో సోమవారం చిత్రకథనం ప్రచురితమైంది. దీనికి ప్రజారోగ్య విభాగం అధికారులు స్పందించారు. చెత్త కుప్పలు అక్కడి నుంచి తొలగించారు. అదే రహదారిలో మిగిలిన చెత్తకుప్పలు తొలగించి రహదారి సరిచేయించి రాకపోకలకు వీలు కల్పించాలని స్థానికులు కోరారు.

చెత్తకుప్పలు తొగించిన ప్రాంతం

నిర్దేశిత గడువులోగా పనుల పూర్తి

నగరపాలక సంస్థ: నగరంలో రహదారులు, మురుగుకాలువల పనులను నిర్దేశిత గడువులోగా నిర్మించాలని కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కమిషనర్ ఏటీ అగ్రహారం, నగరంపాలెం, బృందావన్‌గార్డెన్స్, కృష్ణనగర్, గుజ్జనగుండ్ల, ఎస్‌వీఎన్ కాలనీలో రహదార్లు, డ్రెయిన్‌ల నిర్మాణ పనులు పరిశీలించారు. ఎస్‌వీఎన్ కాలనీ రహదారిలో ఆక్రమణలు తొలగించాలన్నారు.

నేత్ర వైద్యుడు మృతి


మాధవసాయి (పాతచిత్రం)

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి మండలం పాగోలు గ్రామానికి చెందిన ప్రముఖ నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ చిరుమామిళ్ల మాధవసాయి(84) సోమవారం మృతిచెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. విజయవాడలోని కుమారుడి నివాసంలో తుదిశ్వాస విడిచారు. మాధవసాయి గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో హెచ్‌వోడీగా సేవలందించారు. ఉద్యోగ విరమణ అనంతరం పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. జన్మభూమిపై మమకారంతో ప్రతినెలా పాగోలు గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. మాధవసాయి భౌతికకాయానికి స్వచ్ఛ సుందర చల్లపల్లి రథసారథి డాక్టర్ డీఆర్కే ప్రసాద్, వివేకానంద డిగ్రీ కళాశాల డైరెక్టర్ యార్లగడ్డ శివప్రసాద్ తదితరులు నివాళులర్పించారు.

'జోగి అవినీతి చరిత్ర అందరికీ తెలిసిందే'

పట్టాభిపురం, న్యూస్‌టుడే: చంద్రబాబునాయుడు ఇంటిపై దాడి చేయడానికి జోగి రమేష్‌ని పంపించినప్పుడు, కొల్లు రవీంద్ర, అయ్యన్నపాత్రుడులను అక్రమంగా అరెస్టు చేసినప్పుడు వైకాపా అధినేత జగన్ రెడ్డికి బీసీ కులం గుర్తుకు రాలేదా అని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె.శ్రీనివాసరావు ప్రశ్నించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. విద్యుత్తు సబ్ స్టేషన్లలో షిఫ్ట్ ఆపరేటర్ల ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి గౌడ, ఎస్సీ యువకుల వద్ద రూ.లక్షలు వసూలు చేసిన జోగి రమేష్.. నేడు కులం గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. తెలంగాణలో తక్కువ ధరకు మద్యం కొని.. సీసాలు, లేబుల్స్ మార్చి వాటిని ఎక్కువ ధరకు ఏపీలో అమ్మిన జోగి సోదరుల చరిత్ర అందరికీ తెలిసిందేనన్నారు.

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం

కబడ్డీ జట్టుకు ధ్రువపత్రాలు అందజేస్తున్న రాయపాటి అమృతరావు

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని తెలుగు విద్యార్థి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపాటి అమృతరావు పేర్కొన్నారు. జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికైన వారికి ధ్రువపత్రాలు సోమవారం అందజేశారు. ఈసందర్భంగా అమృతరావు మాట్లాడుతూ ఈనెల 7, 8 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు విజయం సాధించాలని ఆకాంక్షించారు. మహిళా క్రికెటర్లు కలిసికట్టుగా ఆడి ప్రపంచ కప్‌ను కైవసం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్, కార్యదర్శి అజయ్‌కుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడు దాసు తదితరులు పాల్గొన్నారు.

క్వార్టర్ ఫైనల్స్‌కు స్నూకర్ పోటీలు

పోటీలో తలపడుతున్న క్రీడాకారుడు

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: ఎల్వీఆర్ సన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సాగుతున్న ఏపీ రాష్ట్ర బిలియర్డ్స్, స్నూకర్ ర్యాంకింగ్ పోటీలు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఎల్వీఆర్ సన్స్ క్లబ్ క్రీడాకారులు శంకరరావు, స్వామి, యోగి, కల్యాణ వర్మ, సాగర్ జైన్, పండరీ కిశోర్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. పండరీ కిశోర్ 4-3 స్కోర్‌తో సోమేశ్వరరావుపై, స్వామి 4-2 స్కోర్‌తో హేమంత్‌పై విజయం సాధించారని టోర్నమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి పులివర్తి అజార్ తెలిపారు.

వచ్చిందెంత.. పోయేదెంత..?

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ స్టేడియంలో ఇటీవల రూ.లక్షలు వెచ్చించి రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నారు. పనులు ఇంకా పూర్తికాలేదు. ఇక్కడ ఆదివారం రాత్రి బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఒక్కసారిగా వర్షం పడింది. తడిగా ఉన్నప్పుడు రన్నింగ్ ట్రాక్‌లో వాహనాలు రాకపోకలు సాగించకూడదని తెలిసినా నడిపారు. దీంతో ట్రాక్‌లో వాహనాల టైర్ల చారలు పడి అధ్వానంగా తయారైంది. డ్రెయిన్లపై పెట్టిన గ్రిల్స్ చెల్లాచెదురుగా పడిపోయాయి. బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించినందుకు తీసుకున్న మొత్తం కంటే.. ఈ రన్నింగ్ ట్రాక్ బాగు చేసేందుకు ఎక్కువ అవుతుందని సభ్యులు వాపోతున్నారు.

వాహనాల రాకపోకలతో రన్నింగ్ ట్రాక్ దుస్థితిలా..

పబ్లిక్ నోటీసు

మా క్లయింట్ అయిన పంచుమర్తి వెంకటేశ్వరరావు, S/o.లేటు. వాసుదేవ రావు గారి రిజిస్టర్డ్ జి.పి.ఏ. ఏజంట్ అయిన కె.బాపనయ్య, ఐతానగర్, తెనాలి, గుంటూరు జిల్లా వారి ఇన్‌స్ట్రక్షన్స్ ప్రకారం యావన్మందికి తెలియజేయునది: గుంటూరు జిల్లా, కొల్లూరు(మం),చిలుమూరు గ్రామ వాస్తవ్యురాలైన ముప్పా శైలజా W/o. కొలసాని శ్రీరామమూర్తి, అను వారు ఆమె ది.09.10.1991వ తేదీన రిజిస్టరు దస్తావేజు నెం.7504/1991, యస్.ఆర్.ఓ. గుంటూరు, ద్వారా కొనుగోలు చేసిన దిగువ షెడ్యూలు ఆస్తికి ఆమే హక్కుదారు అని, మరియు యజమాని అని, సదరు ఆస్థిలో ఆమె యొక్క అనుభవమునకు ఆటంకములు కలిగించరాదని మా క్లయింట్ పై వారి కుటుంబ సభ్యులపై మరియు ఒకరిపై గుంటూరు 1వ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు OS.No.01/2013 అను దావాను దాఖలు చేయగా సదరు కోర్టు వారు అన్ని సాక్ష్యాధారములు క్షుణ్ణముగా పరిశీలించి సదరు ముప్పా శైలజా ది.09.10.1991వ తేదీ గల రిజిస్టరు దస్తావేజు నెం.7504/1991 ద్వారా కొనుగోలు చేసారని చెబుతున్న షెడ్యూలు ఆస్థి వాస్తవముగా భూమిపైలేదని, కావున ఆమె దాఖలుచేసిన OS.No.01/2013 దావాను ది.22.01.2024న, ఖర్చులతో డిస్మిస్ చేసియున్నారు. సదరు తీర్పుపై ముప్పా శైలజా గుంటూరు 4వ అదనపు జిల్లా జడ్జి కోర్టు నందు A.S.No.85/2024 గా అప్పీలు చేయగా అది నిల్వలో ఉండి ఉన్నది.సదరు O.S.No.01/2013 తీర్పు తదనంతరము, ముప్పా శైలజా మరియు ఆమె తాలూకు మనుషులు జులై, 2024వ సంవత్సరములో మా క్లయింట్ కు చెందిన అగతవరప్పాడు డి.నెం. 67/2Bలో ఉన్న చ.గ.774.4 లు ఖాళీ స్థలమును దౌర్జన్యముగా ఆక్రమించి, అక్రమ కట్టడములు చేయుచుండగా మా క్లయింట్ సంబంధిత అధికారులకు వారిపై తగు చర్యలు తీసుకోమని అర్జీలు పెట్టియున్నారు. ఇట్లుండగా ముప్పా శైలజా వారి కుటుంబ సభ్యులలో ఒకరు ప్రభుత్వ అధికారిగా ఉన్నత స్థానములో పనిచేయుచూ, వారికి ఉన్న పరపతితో సదరు షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించిన దస్తావేజులో ఉదహరించిన అగతవరప్పాడు డి.నెం.74ను, డి.నెం.67/2B గా మార్పులు చేయుటకు ప్రయత్నించుచున్నారని తెలిసి మా క్లయింటు ది.31.10.2025వ తేదీన రిజిస్టరు లీగల్ నోటీసు ద్వారా స్థానిక రెవిన్యూ మరియు ఇతర అధికారులకు, షెడ్యూలు దాఖలా ఆస్థి కోర్టు వివాదములో ఉన్నదని షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించిన ది.09.10.1991వ తేదీన గల రిజిస్టర్డ్ దస్తావేజు నెం. 7504/1991 లోని డి.నెంబరు గురించి ఎటువంటి మార్పులు, చేర్పులు చేయరాదని తెలియజేసి యున్నారు.ముప్పా శైలజా మరియు ఆమె తాలూకా మనుషులు దౌర్జన్యముగా ఆక్రమించిన మా క్లయింట్ యొక్క పైన పేర్కొన్న డి.నెం. 67/2Bలో ఉన్న లో చ.గ.774.4 లు ఖాళీ నివేశన స్థలములో వారికి కూడా స్థలము ఉన్నట్లుగా వారి వారి దస్తావేజులలో మార్పులు, చేర్పులు చేసి ఇతరులకు విక్రయించుటకు ప్రయత్నములు చేయుచున్నారని తెలిసి మా క్లయింట్ ఈ పబ్లిక్ నోటీసు ద్వారా యావన్మందికి ఈ షెడ్యూలు దాఖలా భూమి గురించి ఎటువంటి క్రయ విక్రయాలు చేయరాదని సదరు షెడ్యూలు ఆస్థి కోర్టు వివాదములో పెండింగ్లో ఉన్నదని, అందులకు విరుద్ధముగా ఎవ్వరైన ముప్పా శైలజా మరియు వారి తాలూకు మనుషుల నుండి ఎటువంటి క్రయ విక్రయాలు చేసిన యెడల అవి మా క్లయింటును బైండు చేయజాలవని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు:గుంటూరు జిల్లా, పెదకాకాని సబ్.డి. అగతవరప్పాడు గ్రామ పంచాయితీ, అగతవరప్పాడు గ్రామ డి.నెం.74రు లో య. 4.94 సెంట్లు లో య.0.56 సెంట్లు, ప్లాటు నెం. 46, 47 ర్లు ఖాళీ నివేశన స్థలమునకు **హద్దులు:తూర్పు:**అట్ల కృష్ణా రెడ్డి వగైరాల భూమి హద్దు, 43.6లు,**దక్షిణం:**ప్లాటు నెం.46రు హద్దు, అ.98లు, **పడమర:**అ.25 లు వెడల్పు గల రోడ్డు,అ43.6లు,**ఉత్తరం:**కొలసాని రామమూర్తి గారి ప్లాటు నెం.48 కొంత వరకు అ.64లు, అక్కడ నుండి కొలసాని ఉమా గారి ప్లాటు నెం. 49-అ.40 వెరశి మొత్తం అ.105లు.ఈ హద్దుల మధ్య చ.గ.490 లు లేక చ.మీ.409.73 ర్లు గల ఖాళీ నివేశన స్థలము.

G.V. RAMANA, K.PADMASRI, J.B.RAMANA KUMAR, Advocates.
1st Line, Gunturuvarithota, Guntur.-1,Cell No.9848231931.

ప్రథమ వర్ధంతి

శ్రీ గల్లా వెంకట రమణారావు గారు
గుజ్జనగుండ్ల, గుంటూరు.
జననం : 6-10-1970 మరణం : 4-11-2024

మంచికి మారుపేరుగా, సహనానికి నిలువెత్తురూపంగా నిలిచారు. కుటుంబ సభ్యులకు అభిమానపాత్రునిగా మెలిగి మా ఇంటి పెద్దవారుగా ఎనలేని సేవలందించి, ఆప్యాయతానురాగాలు పంచిన మీరు మా నుండి దూరమై నేటికి సంవత్సర కాలం గడచినప్పటికీ మీ మధుర స్మృతులను మరువలేకున్నాము. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య: గల్లా నాగలక్ష్మి
తల్లి: గల్లా విజయలక్ష్మి తండ్రి: గల్లా కృష్ణారావు (లేటు)

కుమారుడు - కోడలు: గల్లా సాయి హేమంత్, లక్ష్మీ సమీర; రెండవ కుమారుడు: గల్లా రేవంత్ కుమార్

తమ్ముడు - మరదలు: గల్లా కిషోర్ కుమార్, భార్గవదీప్తి; కుమారుడు: గల్లా జైదీప్

చెల్లెళ్ళు - బావలు: అనూరాధ, అబ్బు శ్రీనివాస బాబా; శ్రీకాంతి రేఖ, చేతిరెడ్డి క్రిష్ణా; మేనకోడళ్ళు: అశ్రిత, శ్రీహిత, క్రితి

రేపు 'ఈటీవీ' కార్తిక దీపోత్సవం

నేడు ఎంట్రీ పాసుల పంపిణీ

సమయం: ఈ నెల 5న (బుధవారం) సాయంత్రం 5.30 గంటలకు

స్థలం: విజయవాడ మొగల్రాజపురం పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానం.

ఈ ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారం 5న సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ | ఈటీవీ తెలంగాణ | ఈటీవీ Life

విశేషమైన ఇద్దరికీ ఎంతో ప్రీతికరమైన కార్తిక మాసం. దీంతో సమానమైన మాసం, గంగతో సమానమైన తీర్థం లేదని పురాణోక్తి. విశేష పుణ్య సంపదను ప్రసాదించే ఈ మాసంలో దీపారాధనకు ఉన్న ప్రాధాన్యం అసమానమైంది. 'ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ, ఈటీవీ లైఫ్' చానళ్ల ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే మహిళలకు పూజ సామగ్రి నిర్వాహకులే సమకూరుస్తారు. ఎంట్రీ పాసులు ఒక రోజు ముందుగా అంటే మంగళవారం ఉదయం 11 గంటల నుంచి విజయవాడ పిన్నమనేని పాలీక్లినిక్‌రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానం వద్ద పంపిణీ చేస్తారు. పరిమిత సంఖ్యలోనే పాసులు ఉంటాయి. చిన్నపిల్లలకు అనుమతి లేదు. నేలపై కూర్చోగలిగే వారు మాత్రమే హాజరు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు.

-విజయవాడ సిటీ,న్యూస్‌టుడే

స్కాన్ చెయ్.. పన్ను చెల్లించు

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో అన్ని రకాల పన్నులను క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చెల్లించవచ్చని కలెక్టర్ డీకే బాలాజీ చెప్పారు. 'స్వర్ణ పంచాయతీ' నిముషాల్లో పన్నులు చెల్లించండి' పేరుతో రూపొందించిన గోడపత్రికలను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. జేసీ నవీన్, సహాయ కలెక్టర్ ఫర్హాన్‌జాహిద్, డీపీఓ అరుణ, అధికారులు పాల్గొన్నారు.

హాకీ శతాబ్ది వేడుకల పోస్టర్ ఆవిష్కరణ.. దేశంలో హాకీ క్రీడ ప్రారంభమై వందేళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్‌లో శతాబ్ది వేడుకల గోడపత్రికలను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. గూడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నవంబరు 7న శతాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా హాకీ అసోసియేషన్ ప్రతినిధులు నాగసాయి శ్రీనివాస్, హరికృష్ణ తెలిపారు.

తాతలనాటి చెట్టు.. తరతరాలు నిలిచేట్టు..

ఇంటిపై అందంగా..

మధ్య అంతస్తుల్లో..

విజయవాడ నగరం సత్యనారాయణపురం శివాలయం వీధిలోని ఇరుకు సందులో రెండస్తుల మేడపై కొబ్బరి చెట్టు ఆకర్షణీయంగా కనిపిస్తోంది. భవన నిర్మాణం సమయంలో అడ్డొస్తే చెట్టు తొలగించేందుకు ఏమాత్రం ఆలోచించరు. అలాంటిది ఇంటి యజమాని మాణిక్యాలరావు ఉన్నది తక్కువ స్థలమే అయినా భవన నిర్మాణానికి ముందు తమ తాత నాటిన కొబ్బరిచెట్టుతో ఉన్న అనుబంధాన్ని మరిచిపోలేదు. దానికి చోటిచ్చాకే ఇలా రెండస్తుల భవనాన్ని నిర్మించుకున్నారు. అందుకే వీధిలో ఇప్పటికీ ఈ ఇల్లు ప్రత్యేకంగా కనిపిస్తోంది.

- ఈనాడు, అమరావతి

జలపుష్పం.. సేవల చిహ్నం

మచిలీపట్నం బస్టాండ్ భవనంపై ఇలా...

కొవిడ్ ఎంత విలయం సృష్టించిందో అందరికీ తెలుసు. ఆ సమయంలో కొవిడ్ వారియర్స్‌గా ఆర్టీసీ కార్మికుల సేవలు ప్రశంసనీయం. రోగులను క్వారంటైన్‌కు తరలించడంతో పాటు ఆసుపత్రులకు అవసరమైన సామగ్రిని సరఫరా చేశారు. దూరం పాటించాలన్న ఆదేశాలతో బస్సుల్లో కొన్ని సీట్లు తొలగించారు. అలా వచ్చిన ఇనుప వ్యర్థాలతో మచిలీపట్నం నగరాన్ని స్ఫూరించేలా తీర్చిదిద్దిన చేప ఆకృతి వెనుక ఆర్టీసీ సేవలు దాగి ఉన్నాయి. డిపో మేనేజర్ పెద్దిరాజుకు వచ్చిన ఆలోచనకు రూపమే ఈ జలపుష్పం. ఆర్టీసీ సేవలకు స్మారక చిహ్నంగా లోహ వ్యర్థాలతో జలపుష్పాన్ని తీర్చిదిద్దామని ఆయన తెలిపారు.

- ఈనాడు, అమరావతి
- న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

మరింత తగ్గిన కృష్ణా వరద

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది వరద ప్రవాహం సోమవారం మరింత తగ్గింది. ఉదయం ఆరు గంటలకు 1,26,975 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేశారు. సాయంత్రం ఆరు గంటలకు తగ్గుముఖం పట్టింది. 5 గేట్లను రెండు అడుగులు, 64 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 53,410 క్యూసెక్కులు వదిలారు. గుంటూరు ఛానల్‌కు నీటి విడుదలను పునరుద్ధరించి, 181 క్యూసెక్కులు ఇచ్చారు. మిగతా పంట కాలువలు కట్టివేసి ఉన్నాయి.

దాచుకున్నది.. దాసోహం కాణీకు

వృద్ధులు, విశ్రాంత ఉద్యోగులపై సైబరాసురుల కన్ను

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

మచిలీపట్నానికి చెందిన ఓ విశ్రాంత లెక్చరర్‌కు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి మీ నంబర్ ద్వారా పలువురు మహిళలకు అశ్లీల సందేశాలు వెళ్లాయని డిజిటల్ అరెస్టు పేరుతో సుమారు రూ.కోటి లాగేశారు.

పెనమలూరుకు చెందిన ఓ వృద్ధుడికి షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలంటూ సామాజిక మాధ్యమాల్లో లింక్ పంపి రూ.40 లక్షలు కొట్టేశారు.

మచిలీపట్నం ఇనకుదురుపేటకు చెందిన వ్యక్తికి ఏపీకే లింక్ పంపి నకిలీ బ్యాంకు యాప్‌ను ప్లేస్టోర్‌లో చూపించి డౌన్‌లోడ్ చేయించి రూ.లక్షలు కాజేశారు.

పూటకో పద్ధతిలో..

సైబర్ నేరగాళ్ల పూటకో విధానం.. గంటకో రీతిలో వృద్ధులు.. విశ్రాంత ఉద్యోగులే లక్ష్యంగా మోసాలకు తెగబడుతున్నారు. తినీ తినక దాచుకున్న సొమ్మంతా కేటుగాళ్ల వశమవుతోంది. 'నీ పేరున ఉన్న నంబర్‌తో అశ్లీల సందేశాలు వెళ్లాయని.. మానవ అక్రమ రవాణా చేసే అంతర్జాతీయ నిందితుడి నుంచి నీ బ్యాంకు ఖాతాలు డబ్బులు పడ్డాయని.. మీ పేరున మాదకద్రవ్యాల పార్శిళ్లు వచ్చాయంటూ డిజిటల్ అరెస్టు' అని వీడియోకాల్లో పోలీసు దుస్తుల్లో ప్రత్యక్షమవుతారు.

గుర్తించండిలా.. ● నిజమైన పోలీసులెవరూ డిజిటల్ అరెస్టు చేయరు. ● ఖాతాలు చెక్ చేస్తామని డబ్బులు పంపని అడగరు. వీడియోకాల్లో మాట్లాడరు. ● తక్కువ పెట్టుబడితో అతి తక్కువ సమయంలో అధిక లాభాలంటే మోసాలుంటాయి. ● పాటలు వింటూ.. వీడియోలు చూస్తే డబ్బులంటే నమ్మకండి.

ఏపీకే ఫైల్స్.. అధిక లాభాలంటే జాగ్రత్త

డబ్బులే డబ్బును సంపాదించాలని షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టేందుకు సామాజిక మాధ్యమాల్లో తెగ వెతికేస్తుంటారు. ఈ ప్రయత్నంలో తప్పటడుగులు చేసి మోసగాళ్ల వలలో చిక్కుతున్నారు. మొదట ఎక్కువ లాభాలు చూపించగానే పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టి నిండా మునుగుతున్నారు. ఇదే తరహాలో వర్క్‌ఫ్రం హోం.. పార్ట్ టైం జాబ్.. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఏపీకే లింకులు ప్రమాదకరం. యాప్ ఓపెన్ చేయగానే మన ఫోన్ ఆపరేటింగ్ అంతా కేటుగాళ్ల చేతుల్లోకి తీసుకొని బ్యాంకు, వ్యక్తిగత వివరాలు కాజేసి.. ఖాతాలు ఖాళీ చేసేస్తున్నారు. ఇటీవల ప్లేస్టోర్‌లో అసలును పోలిన నకిలీ బ్యాంకు యాప్‌లు కనిపిస్తున్నాయి. డెవలపర్ ఎవరో చూడకుండా డౌన్‌లోడ్ చేసుకుంటే సొమ్ము కేటుగాళ్ల పాలే.

పండుటాకులపై మోసాలు

ఏడాది	నమోదైన కేసులు	కోల్పోయిన సొమ్ము (రూ.కోట్లలో)
2024	48	1.53
★2025	188	10.68

అవగాహనే రక్షణ మంత్రం:

– ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

మోసగాళ్లు నిత్యం జిత్తులమారి ఎత్తులు వేసి మోసాలకు పాల్పడుతున్నారు. దీనికి స్వీయ అవగాహనే రక్షణ మంత్రం. పోలీసులమని వీడియో కాల్స్ చేసినా.. లింకులతో వచ్చే ఏపీకే ఫైల్స్.. ఫోన్ చేసి డబ్బులు అడిగితే మోసగాళ్లని గుర్తించండి. వెంటనే 139కు ఫిర్యాదు చేయండి.

డిసెంబరులో జాతీయ స్థాయి కూచిపూడి నాట్యోత్సవాలు

కూచిపూడి, న్యూస్‌టుడే: కూచిపూడిలో ఈ ఏడాది డిసెంబరులో జాతీయ స్థాయిలో కూచిపూడి నాట్యోత్సవాలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డాక్టర్ డి.మునిరత్నంనాయుడు తెలిపారు. గత నెల 23న విశ్వవిద్యాలయం వీసీగా బాధ్యతలు చేపట్టాక.. తొలిసారిగా కూచిపూడి శ్రీసిద్ధేంద్రయోగి నాట్య కళాపీఠంను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2025-2026 విద్యా సంవత్సరానికి మూడు పీఠాలలోని అన్ని కోర్సులతో పాటు కూచిపూడి నాట్య కళాపీఠంలో నాట్య, సంగీత కోర్సుల నిర్వహణకు నోటిఫికేషన్ ఇవ్వగా ఐదు రోజుల్లో 25 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. గతంలో ఎంపీఏ కోర్సుకు రూ.12వేలు రుసుం ఉండగా దాన్ని రూ.5వేలకు తగ్గించినట్లు పేర్కొన్నారు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని(రాజమహేంద్రవరం) ప్రపంచ వ్యాప్తం చేసేందుకు కృషి చేస్తానన్నారు. నాట్యాన్ని, సంగీతాన్ని, తెలుగు భాషను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం ప్రధాన కేంద్రంగా రాజమహేంద్రవరం, శ్రీశైలం, కూచిపూడి పీఠాల్లో కోర్సుల నిర్వహణతో పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఓఎస్డీ ఆచార్య వి.నిరీక్షణబాబు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చింతా రవిబాలకృష్ణ పాల్గొన్నారు. అనంతరం కళాపీఠం సిబ్బందితో సమావేశం నిర్వహించి భవిష్యత్తు ప్రణాళికపై చర్చించారు.

మాట్లాడుతున్న తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ మునిరత్నంనాయుడు, పక్కన ఆచార్య నిరీక్షణబాబు, డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, రవిబాలకృష్ణ

రూ.10.5 కోట్ల నష్టపరిహారం అందజేత

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఏడు నెలల కిందట జగ్గయ్యపేట శివారులోని సాయి తిరుమల కోల్డ్‌స్టోరేజ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో సంభవించి మిర్చి, అపరాలు కాలిపోయాయి. సుమారు 207 మంది రైతులు భారీగా నష్టపోయారు. దీంతో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యంతో మాట్లాడి వారికి నష్టపరిహారం వచ్చే విధంగా కృషి చేశారు. సోమవారం రూ.10.5 కోట్ల నష్టపరిహారంగా రైతులకు అందించారు. ఈ సందర్భంగా రైతులు.. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు.

శ్రీకృష్ణపారిజాతంలో శ్రీకృష్ణుడిగా పెద సత్యం

వెండితెరపై కూచిపూడి వెలుగులు

జిల్లాలో కుగ్రామమైన కూచిపూడి పేరు నాట్యంతో ప్రపంచ వ్యాప్తంగా వినిపిస్తోంది. కూచిపూడి (భాగవతులు) నాట్యాచార్యులు దీనిని వెండితెరపై రెపరెపలాడించారు. తదుపరి సినిమా రంగంలో వేదాంతం రాఘవయ్య, వెంపటి సత్యనారాయణ (పెద సత్యం), మహంకాళి వెంకయ్య, పసుమర్తి కృష్ణమూర్తి, వెంపటి చిన సత్యం, వేదాంతం జగన్నాథశర్మ తదితరులు రాణించారు. నేటితరం యువ నాట్యాచార్యుడు బిస్మిల్లాఖాన్ యువ పురస్కార గ్రహీత డాక్టర్ వేదాంతం వెంకటాచలపతి (వెంకు) కొరియోగ్రాఫర్‌గా తనవృత్తిని ప్రారంభించి స్త్రీ

శుభప్రదం సినిమాకు నృత్య దర్శకత్వం వహిస్తున్న వేదాంతం వెంకటా చలపతి

సాహసం, దేవదాసు, అన్నదాత, అనార్కలి, ప్రేమపాశం తదితర సినిమాలకు దర్శకత్వం వహించారు. వేదాంతం జగన్నాథశర్మ చెంచులక్ష్మి వంటి పలు సినిమాలకు నృత్య దర్శకత్వం వహించారు. వెంపటి పెదసత్యం, చినసత్యం దర్శకుడిగా, నర్తకులుగా వెండితెరపై వెలుగులద్దారు. వెంకట నాగచలపతి (వెంకు) శుభప్రదం సినిమాకు నృత్య దర్శకత్వం వహించారు.

- న్యూస్‌టుడే, కూచిపూడి

ఓటరు కార్డులో

చిరునామా మారుస్తున్నారా..!

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

సాధారణంగా చాలా మంది ఓటరు కార్డును ఎన్నికల సమయాల్లోనే ఉపయోగపడుతుందని అనుకుంటారు. కానీ దానిని వ్యక్తిగత గుర్తింపు కార్డుగా వినియోగించుకోవచ్చు. అలాగే అద్దెకు ఉండే వారు తరచూ ఇళ్లు మారుతుంటారు. ఇలాంటి వారు ఆ కార్డులో చిరునామాను మార్చుకోవాల్సి ఉంటుంది. గుర్తింపు కార్డుగా దాని ప్రాధాన్యం తెలిసిన వారు అప్‌డేట్ చేసుకుంటారు. మరికొందరు ఆసక్తి చూపించరు. అందులోని చిరునామా (ఫారం-8) మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ఒకప్పుడు ఎన్నికల సంఘం నియమిత సమయంలో మాత్రమే అనుమతించేది. తాజాగా ఆన్‌లైన్‌లో (voters services portal) ఎప్పుడైనా మార్చుకునే వెసులుబాటు కల్పించారు.

పేరులో స్వల్పంగా తేడా ఉన్నా...

ఆన్‌లైన్‌లో ఓటరు కార్డు చిరునామా మార్చుకునేందుకు ఆధార్, పాస్‌పోర్ట్, పాన్ కార్డు తదితర గుర్తింపు కార్డులను అనుమతిస్తారు. ఆధార్ కార్డులో పేరు ఎలా ఉందో.. అలాగే ఓటరు కార్డులోనూ ఉండాలి. చిన్నపాటి మార్పు ఉన్నా దరఖాస్తు రిజెక్ట్ అవుతుంది. ఒక యువకుడి పేరు ఆధార్‌లో 'సాయిపవిత్రన్' అని ఉంది. కానీ ఓటరు కార్డులో 'సాయి పవిత్రన్' అని పేరులో ఖాళీ ఉంది. ఆన్‌లైన్‌లో ఫారం 8 దరఖాస్తు మొత్తం పూర్తి చేసిన తర్వాత చివరలో ఓటీపీ వెరిఫికేషన్, 'ఈ-సైన్' చేయాల్సి ఉంటుంది. దాన్ని క్లిక్ చేయగానే 'పేరులో మార్పు ఉందని దరఖాస్తు రిజెక్ట్ అవుతుంది. అదే విధంగా పేరులో స్పెల్లింగ్ తప్పులతో ఒక్క అక్షరం తేడా ఉన్నా.. రిజెక్ట్ అవుతుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూరించే ముందే ఆధార్, ఓటరు కార్డుల్లో పేర్లు ఒకేలా ఉండాలని సూచన వస్తోంది. పేరులో తేడా ఉంటే ముందుగా పేరును సరిచేసుకుని.. ఆ తర్వాత చిరునామా మార్చుకోవాలని చెబుతోంది. తేడా ఉన్న వారు బీఎల్‌వోను సంప్రదించాలి.

ఈ జాగ్రత్తలు తీసుకోండి

ఆధార్, ఓటరు కార్డులో పేర్లు ఒకేలా ఉండాలని ముందుగానే ఇలా సూచిస్తుంది...

ఆఫ్‌లైన్‌లోనే చేసుకోవాలి...

రెండూ కార్డుల్లోనూ పేర్లు ఒకేలా ఉన్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో మార్చుకోవచ్చు. దరఖాస్తు రిజెక్ట్ అయిన వారు స్థానిక బి.ఎల్.ఓ.ను సంప్రదించాలి. వారు తమ ప్రాంత సచివాలయంలో ఉన్న బూత్ లెవల్ అధికారిని సంప్రదించి చిరునామా మార్పునకు తగిన పత్రాలు ఇస్తే ఆఫ్‌లైన్‌లో దరఖాస్తును పూరించి చిరునామా మారుస్తారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ జరుగుతోంది. ఆఫ్‌లైన్‌లో చిరునామా మార్చుకోవాలనుకుంటే.. ఇప్పుడే దరఖాస్తు చేసుకుంటే ఓటరు కార్డులో చిరునామా మారుతుంది. కార్డు డౌన్‌లోడ్ చేసుకుంటే గుర్తింపు కార్డుగా ఉపయోగించుకోవచ్చు.

అమ్మ తేజస్సు.. ప్రకృతి ఉషస్సు

ఈనాడు, అమరావతి

ఆకట్టుకుంటున్న గొట్టుముక్కల జలపాతం

జలపాతంలో స్నానం చేస్తున్న పర్యాటకులు

ప్రకృతి పరిమళం.. జలపాత సడుల ప్రవాహం.. ఆధ్యాత్మిక తన్మయం.. వెరసి కొండపల్లి అటవీ ప్రాంతం ప్రకృతి సోయగాలకు చిరునామాగా నిలుస్తోంది. పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అక్కడే వనదేవత మద్దులమ్మ కొలువై ఉండడంతో ఆధ్యాత్మిక అటవీ పర్యాటక కేంద్రంగా మారుతోంది. ప్రస్తుతం కార్తిక మాసం కావడంతో వన సమారాధనల తాకిడి పెరుగుతోంది.

ప్రత్యేక ఆకర్షణగా.. విజయవాడకు 30 కి.మీ దూరంలోని కొండపల్లి అటవీ ప్రాంతంలో కంచికచర్ల మండలం గొట్టుముక్కలలో జలపాతం కనువిందు చేస్తోంది. నేరుగా కారు, బైక్, ప్రైవేటు వాహనాల్లో చేరుకునేందుకు అడవిలో మార్గం ఉంది. సామాజిక మాధ్యమాల్లో రీల్స్ ప్రాచుర్యం పొందడంతో సందర్శకుల సంఖ్య బాగా పెరిగింది. ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో 500 వరకు ద్విచక్ర వాహనాలు, 100 కార్లు, ఆటోల్లో పర్యాటకులు తరలి వస్తున్నారు. జలపాతంలో ఈత కొట్టి సేద తీరుతున్నారు. కొందరు సమూహాలుగా ఏర్పడి ట్రెక్కింగ్ చేస్తూ ఆనందిస్తున్నారు. ఇక్కడ లఘు చిత్రాల చిత్రీకరణ చేసే వారి సంఖ్య బాగా పెరిగింది. ఫొటో షూట్లు నిత్యకృత్యమయ్యాయి. ఇప్పటికే కార్తిక వన సమారాధనలు మొదలయ్యాయి.

వరద పాయసం

జలపాతం సమీపంలోనే ఉన్న మద్దులమ్మ ఆలయానికి సైతం భక్తులు భారీగా తరలి వస్తున్నారు. 200 ఏళ్ల కిందట గ్రామంలో తాటుకూరు కోటయ్య అనే వ్యక్తికి కలలో అమ్మవారు దర్శన మిచ్చారని.. స్వప్నంలో చెప్పిన ప్రాంతంలో వెతకగా మద్దులమ్మ విగ్రహం దొరికినట్లు స్థానికులు చెబుతారు. చుట్టుపక్కల గ్రామాల్లో వర్షాలు లేక పంటలకు ఇబ్బంది కలిగినప్పుడు అమ్మవారికి పూజలు చేసి పాయసం తయారు చేయించి జలపాతం కొండపై నుంచి పాయసం పోయడం ఆనవాయితీ. ఈ విధానాన్ని వరద పాయసం అంటారు. ఈ వరద పాయసం పోస్తే తప్పకుండా వానపడుతుందని ఆయా గ్రామాల వారి నమ్మకం. వరద పాయసం పోసిన రోజు వర్షం పడినట్లు కొందరు గ్రామస్థులు చెబుతున్నారు.

వనదేవత మద్దులమ్మ

ప్రయోగం.. సఫలం

జాతీయ స్థాయి కాంక్రీట్ క్యూబ్ టెస్టు పోటీల్లో పీవీపీ ఎస్ఐటీ సివిల్ విద్యార్థుల ప్రతిభ

ఇండియన్ కాంక్రీట్ ఇనిస్టిట్యూట్ (ఐసీఐ), ఆర్‌డీసీ కాంక్రీట్ ఇండియా లిమిటెడ్ సంయుక్తంగా నిర్వహించిన నేషనల్ కాంక్రీట్ క్యూబ్ టెస్టు సీజన్-3 పోటీల్లో కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ విభాగం విద్యార్థులు ప్రతిభ చాటి జాతీయ స్థాయిలో మొదటిస్థానంలో నిలిచారు. మొదటి దశలో ఈ పోటీలకు దేశవ్యాప్తంగా 484 జట్లు నమోదు చేసుకున్నాయి. వీటిలో 37 కళాశాలలకు చెందిన 149 జట్లు తుదిదశ పోటీలకు చేరాయి.

ప్రతిభ చాటారిలా.. పీవీపీ సిద్ధార్థ సివిల్ విభాగం చివరి సంవత్సరం చదువుతున్న కె.దినేష్, ఎంగోవర్ధన్, ఎం.వరప్రసాద్ బృందం పోటీల్లో తుదిదశకు చేరుకుంది. వీరికి సివిల్ విభాగాధిపతి వెంగల జగదీష్ సాంకేతిక సహకారం అందించారు. ఇందులో భాగంగా జూన్ 1న వీరంతా కలిసి సిమెంటు, ఇసుక, గ్రావెల్, ఫ్లైయాష్, జీబీబీఎస్, మైక్రోసిలికా వంటి పదార్థాలను కలిపి ఐదు ట్రయల్ మిశ్రమాలు తయారు చేశారు. జులై 12న వీటిలో ఉత్తమమైన దాన్ని ఎంపిక చేసుకున్నారు. ఈ మిశ్రమంతో తయారైన 150 మిల్లీమీటర్ల కాంక్రీట్ క్యూబ్‌లను 14 రోజుల పాటు శాస్త్రీయంగా క్యూర్ చేసి, నిర్దిష్ట బలం, మన్నిక సాధించేలా చేశారు. జులై 26న సమర్పించిన క్యూబ్‌లు, మిశ్రమ వివరాల వీడియోను నిర్వాహకులకు సమర్పించారు. ఆగస్టు 9న నిర్వహించిన అధికారిక పరీక్షల్లో వారి కాంక్రీట్ మిశ్రమానికి గుర్తింపు వచ్చింది. నవంబరు 1న చెన్నై ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో కాంక్రీట్ క్యూబ్ టెస్టు పోటీల్లో జాతీయ స్థాయిలో మొదటి బహుమతిగా రూ.లక్ష చెక్కు అందుకున్నారు.

దినేష్ బృందం సభ్యులు తయారు చేసిన కాంక్రీట్ క్యూబ్‌ను పరిశీలిస్తున్న సివిల్ విభాగాధిపతి జగదీష్

సవాళ్లను అధిగమించి విజయం.. ట్రయల్స్ కాంబినేషన్లు చేసే సమయంలో ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. ప్రతి ప్రయత్నం నుంచి కొత్త విషయం నేర్చుకుని సమగ్రంగా కృషి చేశాం. సివిల్ విభాగాధిపతి జగదీష్, ప్రిన్సిపల్ కొండపల్లి శివాజీబాబు సహకరించారు. సంస్థ తక్కువ సిమెంటు వినియోగించి సామర్థ్యం ఉన్న కాంక్రీట్ క్యూబ్‌లను రూపొందించాం. వారి అంచనాలకు, నిర్దేశించిన సామర్థ్య విలువలకు దగ్గరగా క్యూబ్‌లు తయారు చేసి జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచాం - **దినేష్, బృంద నాయకుడు**

-కానూరు, న్యూస్‌టుడే

అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: జిల్లాలో ఇటీవల కాలంలో ప్రతిపాదించిన అభివృద్ధి పనుల ప్రతిపాదనలపై దృష్టి సారించాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఆయన మాట్లాడారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇచ్చిన హామీ మేరకు కోడూరు మండలం పాలకాయతిప్ప అవుట్‌ఫాల్ స్లూయిస్ నిర్మాణానికి సంబంధించిన రూ.39 కోట్ల ప్రతిపాదనలపై తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. గూడూరు మండలం కప్పలదొడ్డిలో ఉపరితల జలాశయం, కంకటావలో కొత్త వంతెన నిర్మాణ పనులు, నాగవరంలో తాగునీటి పైపులైన్ పనులపై ఆరా తీశారు. కలెక్టర్‌తో పాటు జేసీ నవీన్, ఇతర ముఖ్య అధికారులు, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరించారు.

★ తుపాను కారణంగా దెబ్బతిన్న కౌలు రైతులను ఆదుకునేలా నిబంధనలు సవరించడంతో పాటు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా వారికి రూ.20వేల ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘ నాయకులు శివనాగేంద్ర, లక్ష్మణస్వామి తదితరులు వినతిపత్రం అందజేశారు.

★ తుపాను వల్ల దెబ్బతిన్న పంటను పూర్తిగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించాలని కోరుతూ రైతు నాయకులు నాగేశ్వరరావు తదితరులు అర్జీ అందజేశారు.

★ ఉయ్యూరు మండలం గండిగుంటకు చెందిన దివ్యాంగురాలు ఝాన్సీరాణి తన కుమారుడు రెండేళ్ల కిందట అనాథాశ్రమంలో చేర్పించి నెలనెలా వారికి నగదు చెల్లిస్తున్నారని, ఇటీవల తన పేరుతో ఉన్న స్థలం అమ్మాలని ఒత్తిడి చేస్తూ ఆశ్రమం వారికి నెలవారీ మొత్తం చెల్లించకపోవడంతో తనకు దిక్కు లేకుండా పోయిందని చెప్పడంతో స్పందించిన కలెక్టర్ సీనియర్ సిటిజన్ కింద కేసు నమోదు చేయించాలని ఉయ్యూరు ఆర్డీవోను ఆదేశించారు.

★ చల్లపల్లి మండల పరిధిలో తుపాను కారణంగా పంట నేలవాలిందని, ఎన్యూమరేషన్ సక్రమంగా నిర్వహించి రైతులను ఆదుకోవాలని లంకపల్లి నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు చలపతిరావు, రైతులు పెదబాబు, నాగేశ్వరరావు తదితరులు కలెక్టర్‌ను కోరారు. వివిధ వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన దాదాపు 121 అర్జీలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, జేసీ నవీన్, అధికారులు

నకిలీ మద్యం వ్యాపారంలో జనార్దనరావుకు జోగి అండ

తనకు చెప్పేవాడని విచారణలో వెల్లడించిన శ్రీనివాసరావు

ఈనాడు - అమరావతి: తమ అక్రమ మద్యం వ్యాపారానికి వైకాపా నేత జోగి రమేష్ అండదండలు ఉన్నాయని తనకు జనార్దనరావు పలుసార్లు చెప్పారని నిందితుడు తిరుమలశెట్టి శ్రీనివాసరావు (ఏ13) ఇంటరాగేషన్‌లో వెల్లడించాడు. రాజకీయ అండతో తన వ్యాపారానికి ఢోకా లేదని తరచూ చెప్పేవాడని విచారణలో చెప్పినట్లు తెలిసింది. నకిలీ మద్యం కేసులో అరెస్టయి నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న నిందితుడిని ఇటీవల ఐదు రోజుల కస్టడీకి కోర్టు ఇచ్చింది. కస్టడీ సోమవారంతో పూర్తయింది. దీంతో నిందితుడిని సోమవారం విజయవాడలోని ఎక్సైజ్ కోర్టులో న్యాయాధికారి ఎదుట హాజరుపర్చారు. అనంతరం ఆయన ఆదేశాలతో రిమాండ్ నిమిత్తం నెల్లూరు తరలించారు.

ఏకంగా కార్గోలో సరఫరా.. కస్టడీలో శ్రీనివాసరావును పలు అంశాలకు సంబంధించి సిట్ అధికారులు ప్రశ్నించారు. హైదరాబాద్ నుంచి మద్యం తరలించి ఇబ్రహీంపట్నంలో అమ్మకాలు సాగించేందుకు సాయపడినట్లు అంగీకరించాడు. హైదరాబాద్‌లో ఎన్డీపీఎల్ మద్యాన్ని క్యాన్లలో నింపి.. అక్కడి నుంచి ఆర్టీసీ కార్గో ద్వారా ఇబ్రహీంపట్నం చేర్చేవాడు. జనార్దనరావుకు బాలాజీ పరిచయమైన తర్వాత నకిలీ మద్యం తయారీని ప్రారంభించినట్లు విచారణలో తెలిపాడు.

★ బాలాజీ ద్వారా గోవాలో లేబుల్స్‌ను డిజైన్ చేయించి, ప్రింటింగ్ కూడా చేసినట్లు వెల్లడించాడు. వచ్చిన లేబుల్స్.. అచ్చం అసలు బ్రాండ్లకు సరిపోలేలా జగన్మోహన్‌రావు క్షుణ్నంగా పరిశీలించేవాడని చెప్పినట్లు తెలిసింది. ఏఎన్ఆర్ బార్‌కు వచ్చిన బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా వచ్చిన సరకు బ్యాచ్‌నెంబర్లను ప్రింట్ చేయించేవారు. వైకాపా హయాంలో స్కానర్లు సరిగా పనిచేయకపోవడంకూడా తమకు కలిసి వచ్చిందని విచారణలో సిట్ అధికారులకు వివరించాడు. మొత్తం ఎనిమిది బ్రాండ్లకు సంబంధించి నకిలీ లేబుళ్లను ముద్రించినట్లు చెప్పాడు. పోలీసుల ఎదుట లొంగిపోయేందుకు ఆఫ్రికా నుంచి జనార్దనరావు వచ్చే సమయంలో శ్రీనివాసరావుకు ఫోన్ చేశాడు. ముంబయిలో తాను దిగుతాననీ, అక్కడ తనను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసే వీలుందన్నాడు. తాను విమానం దిగాక వస్తే.. తన బ్యాగేజీ అప్పగిస్తా అని చెప్పడంతో. అక్కడకు వెళ్లి తీసుకున్నట్లు ఇంటరాగేషన్‌లో సిట్ అధికారులకు వివరించాడు.

శ్రద్ధాంజలి



మా మాతృమూర్తి శ్రీమతి మత్తి శేషారత్నం గారు తేది.3-11-2025న స్వర్గస్తులైనారు.

అంత్యక్రియల యాత్ర బుధవారం, 5-11-2025 ఉదయం 9:00 గంటలకు మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్స్, లంగర్‌హౌజ్, హైదరాబాద్ నుండి మహాప్రస్థానం జూబ్లీహిల్స్ వైపు ప్రారంభమవుతుంది

వారి ఆత్మకు శాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...

ఇట్లు
కుటుంబ సభ్యులు

శ్రీమతి మత్తి శేషారత్నం గారు
W/o. మత్తి కామేశ్వరరావు (లేటు)
1941 - 2025

ఫోన్ : 9246577217 / 9371083969

(c) eenadu

వైభవంగా పాండురంగ ఉత్సవం

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: మచిలీపట్నంలో ప్రసిద్ధి చెందిన పాండురంగ స్వామి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నగరంలోని నాగులేరు వద్ద ప్రత్యేకంగా తీర్చిదిద్దిన పడవలో రుక్మిణీ సమేత పాండురంగస్వామికి ఆలయ నిర్వాహకులు టేకి నరసింహం, వేదపండితుల ఆధ్వర్యంలో విశేష పూజలు జరిపించారు. మంత్రి కొల్లు రవీంద్ర దేవతామూర్తులకు హారతులు ఇచ్చి పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలని, దేశప్రజలు అందరూ సంతోషంగా ఉండేలా పాండురంగడు దీవించాలని ఆకాంక్షించారు. ఉత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తెదేపా రాష్ట్ర నాయకులు గొర్రెపాటి గోపీచంద్‌తో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

నాగులేరు వద్ద తెప్పోత్సవం

దేవతామూర్తులకు హారతులు ఇస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

కూచిపూడిలో మువ్వల సవ్వడి

కూచిపూడి, న్యూస్‌టుడే : ఆధ్యాత్మిక ప్రవచనకర్త, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావుకు నాట్యక్షేత్రమైన కూచిపూడిలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. సోమవారం ఆయన నాట్యాచార్యుల ఇలవేల్పు అయిన బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి వార్లను శిష్యులతో కలిసి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, నాయకులు గోపాలకృష్ణ, పాండు, కమిటీ సభ్యులు చాగంటిని సత్కరించారు. ఈ సందర్భంగా కూచిపూడి శ్రీసిద్ధేంద్రయోగి నాట్యకళా వేదికపై నిర్వహించిన కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కూచిపూడి నాట్యాంశాలను చాగంటి తిలకించారు. కళాకారులకు ఆలయ ట్రస్టీ తరపున చాగంటి చేతుల మీదుగా జ్ఞాపికలు అందించారు. ఆలయ కమిటీ కావూరి భానుమూర్తి, భాగవతుల బాలకృష్ణప్రసాద్, నాగజగన్‌మోహనరావు, పసుమర్తి నారాయణమూర్తి, భాగవతుల సీతారామారావులు పాల్గొన్నారు.

సమ్మోహనం శ్రీకరి నాట్యం.... కళావేదికపై చాగంటి మనవరాలు శ్రీకరి(కాకినాడ) ప్రదర్శించిన కూచిపూడి నాట్యం కళాభిమానులను ఆకట్టుకుంది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కూచిపూడి నాట్యకళాపీఠం విద్యార్థులు.. కళాపీఠం వైస్ ప్రిన్సిపల్ చింతా రవిబాలకృష్ణ నృత్యీకరణలో చిన్నారులు ప్రదర్శించిన మోహినీ భస్మాసుర నృత్యరూపకం కరతాళధ్వనులను అందుకుంది. భస్మాసురుడిగా జల్లూరి శరణ్య, మోహినిగా ముళ్లపూడి ఈశ్వరి, శివుడిగా నూరుకుర్తియశ్రీ, విష్ణుమూర్తిగా చరితశ్రీ, లక్ష్మీదేవిగా తపస్వీని, పార్వతిగా భువనలతోపాటు పలువురు నర్తించారు. హైదరాబాద్ విద్యార్థిని లలిత ప్రదర్శన అలరించింది.

మోహినీభస్మాసుర నృత్యరూపకం

కోటేశ్వరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా తదితరులు

డ్రగ్స్ తరలిస్తున్న యువకుల అరెస్ట్

విశాఖపట్నం: డ్రగ్స్ తరలింపులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, ఇందులో ఓ వైకాపా నేత కూడా ఉన్నట్లు డీసీపీ మేరీ ప్రశాంతి పేర్కొన్నారు. విశాఖ మద్దిలపాలేనికి చెందిన పులగం కొండారెడ్డి (23) వైకాపా విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. ఇతడికి బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న కృష్ణా జిల్లా గుడివాడ సమీప బేతవోలుకు చెందిన మురాడ గీత్ చరణ్ (21), శ్రీకాకుళం పట్టణానికి చెందిన తంగి హర్షవర్ధన్ నాయుడు (22) స్నేహితులు. మద్యం, గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడి తరచూ వాటి కోసం కలుసుకుంటున్నారు. ఇందులో భాగంగా బెంగళూరులో ఉన్న సంతన్ అనే వ్యక్తి నుంచి మత్తు పదార్థాలకు చెందిన ఎల్ఎస్‌డీ స్ట్రిప్స్ తెప్పించాలని కొండారెడ్డి భావించాడు. ఇందుకోసం గీత్ చరణ్‌కు ఈ పని అప్పగించి రూ.25వేల నగదు, విమానం, రైలు టికెట్లు సమకూర్చాడు. ఆ మేరకు చరణ్ గత నెల 31వ తేదీన విమానంలో బెంగళూరు వెళ్లాడు. అదే సమయంలో కొండారెడ్డి తన స్నేహితుడైన దొంక గణేష్ ద్వారా సంతన్‌కు రూ.25వేలు ఫోన్‌పే చేయించాడు. వీరి నుంచి అందుకున్న డబ్బుతో సంతన్ 50 స్ట్రిప్స్ కొనుగోలు చేసి వాటిలో 48 గీత్‌చరణ్‌కు అందించి, రెండు తన వద్ద ఉంచుకున్నాడు. తర్వాత చరణ్ ఆ స్ట్రిప్స్‌తో బెంగళూరు నుంచి రైలులో బయలుదేరి ఈనెల 2వ తేదీన నగరానికి చేరుకున్నాడు. రైల్వేస్టేషన్ వద్ద వాటిని గీత్‌చరణ్ నుంచి కొండారెడ్డి, హర్షవర్ధన్ తీసుకుంటున్న సమయంలో టాస్క్‌ఫోర్స్, నాలుగోపట్టణ పోలీసులు నిందితులు ముగ్గురినీ అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

శతమానం వేడుక.. గురువుకు కానుక

గుడివాడ, న్యూస్‌టుడే: చిన్నప్పుడు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతికి కారకులైన గురువు వందో జన్మదిన వేడుకను ఏజీకే పురపాలక ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఏజీకే ఉన్నత పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పీసపాటి అనంత శాస్త్రి వందో జన్మదిన వేడుకను ఆయన స్వగృహంలో వివిధ ప్రాంతాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతశాస్త్రి దంపతులకు పాద పూజచేసి, పట్టు వస్త్రాలు, బహుమతులు అందజేశారు. కేక్ కోశారు. తమ ఉన్నతికి కారకులైన గురువు ఆయురారోగ్యాలతో జీవించాలని దేవుడిని ప్రార్థించారు.

అనంతశాస్త్రి దంపతులను సత్కరిస్తున్న ఏజీకే ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

వైద్య శిబిరానికి పోటెత్తిన ప్రజలు

పోలీసుల చొరవతో తప్పిన తొక్కిసలాట

రామవరప్పాడు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సమీప ఎనికేపాడులోని ఓ ఆసుపత్రి వద్ద సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజలు భారీగా తరలి వచ్చారు. వైద్య శిబిరం గురించి విడుదల చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో దూర ప్రాంతాల నుంచి కూడా ప్రజలు వచ్చారు. ఆసుపత్రి ప్రాంగణంతో పాటు జాతీయ రహదారి కూడా నిండిపోయింది. ఓపీ అయిపోతుందని జనాలు ఒకరినొకరు నెట్టుకున్నారు. ఒకానొక దశలో తొక్కిసలాట జరుగుతుందేమోనని భయపడ్డారు. విషయం తెలుసుకున్న పటమట సీఐ పవన్ కిషోర్ 40 మంది పోలీస్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తొక్కిసలాట జరగకుండా బారికేడ్లు, రోప్‌లు ఏర్పాటు చేసి జాగ్రత్తలు తీసుకున్నారు. మైక్‌ల సహాయంతో జనాలకు విజ్ఞప్తి చేసి నియంత్రించారు. ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి 10 గంటల నుంచి సోమవారానికి ఓపీ ఆపివేసి కొంతమందికి మంగళవారానికి రాయించడంతో వారు వెళ్లిపోయారు.

పెద్ద ఎత్తున హాజరైన ప్రజలు

మొంథా గాయం.. సస్యరక్షణతో మాయం!

● ఘంటసాల కేవీకే సమన్వయకర్త డి.సుధారాణి
● 'ఈనాడు మీతోడు' ఫోన్‌ఇన్‌కు విశేష స్పందన

రైతేరాజు

రైతుల సందేహాలకు సమాధానాలిస్తున్న కేవీకే సీనియర్ శాస్త్రవేత్త సుధారాణి, వివరాలు నమోదు చేసుకుంటున్న శాస్త్రవేత్తలు

ఘంటసాల, న్యూస్‌టుడే

మొంథా తుపాను కారణంగా వీచిన ఈదురు గాలులు, భారీ వర్షాలకు వరి, మినుము, చెరకు, పలు ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో వాటిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త, సీనియర్ శాస్త్రవేత్త డి. సుధారాణి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ విషయమై 'ఈనాడు-మీతోడు' ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఉమ్మడి కృష్ణా జిల్లాతో పాటు పలు ప్రాంతాల నుంచి 80 మందికి పైగా రైతులు ఫోన్లు చేశారు. వారి సందేహాలను డాక్టర్ సుధారాణి నివృత్తి చేశారు. కేవీకే శాస్త్రవేత్తలు కె. రేవతి, ఎం. వెంకటలక్ష్మి, వి. మంజువాణి, బి. నవీన్, జె. యశంత్‌కుమార్‌లు రైతుల సమస్యలు నమోదు చేసుకున్నారు.

ఈనాడు మీతోడు

వరిలో మానిపండు తెగుల నివారణ

ప్రస్తుతం వరిపైరు పాలుపోసుకునే దశలో ఉంది. అధిక వర్షాలకు మానిపండు తెగులు అధికంగా వ్యాప్తి చెందుతుంది. పొలంలో మురుగు నీటిని త్వరగా బయటకు తీయాలి. తెగులునివారణకు 200మి.లీ ప్రొపికొనజోల్ మందును డ్రోన్‌తో పిచికారీ చేయాలి. గింజ గట్టిపడే దశలో పలు రకాల శిలీంద్రాలు ఆశించి నల్లటి మచ్చలు ఏర్పడతాయి. వాటి నివారణకు ప్రొపికొనజోల్ 1.0మి.లీ. లీటరు నీటిలో కలిపి చల్లుకోవాలి.

చెరకులో ఇలా చేయండి..

అధిక వర్షాలకు ముంపునకు గురైన చెరకు పంటలో వడలు తెగులు ఆశించే అవకాశం ఉంది. నివారణకు 3గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 1.0 మి.లీ. ప్రొపికొనజోల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తెల్లదోమ, దూదేకుల తెగులు ఉధృతంగా ఉంటే.. ఎకరానికి ఇమిడాక్లోప్రిడ్ 50 మి.లీ. లేదా ఎసిటామి 40 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలి.

కందలో కాండం మొదలు కుళ్లు తెగులు

భారీ వర్షాలకు నేలలో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో కంద పంటలో మొదలు కుళ్లు తెగులు సోకుతుంది. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు, లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్లు తడుపుకోవాలి.

బొప్పాయిలో పండుఈగ యాజమాన్యం

బొప్పాయితోటలో కలుపు లేకుండా చేయాలి. పండు ఈగ ఎరలను ఎకరానికి 4 చొప్పున అమర్చుకోవాలి. కుళ్లిన రాలిన కాయలను ఎప్పటికప్పుడు తీసి నాశనం చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఎసిఫట్రట్ 1.5 గ్రాములు లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పసుపులో దుంపకుళ్లు

అధిక వర్షాలకు పసుపు మొక్కలు కోలుకోడానికి మాంకోజెబ్50గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నేలలో తేమ శాతం అధికంగా ఉండటంతో దుంపకుళ్లు తెగులు వ్యాప్తి చెందుతుంది. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3.0 గ్రాములు లీటరు నీటిలో కలిపి చల్లుకోవాలి.

మొక్కజొన్న కోలుకోవాలంటే..

అధిక వర్షాలకు మొక్కజొన్న మొక్కలు కోలుకోవడానికి మల్టీకే 50 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కరివేపాకు ఆకులపై మచ్చల నివారణ

కరివేపాకు ఆకులపై అప్పుడప్పుడు తెగుళ్ల మచ్చలు సోకుతాయి. వీటి నివారణకు 2.0 సాఫ్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

మినుములో రకాలు.. విత్తన శుద్ధి.. తెగుళ్లు

మాగాణి పొలాల్లో మినుము సాగు చేసే వారు ఎల్‌బీజీ-752, ఎల్‌బీజీ-787, ఎల్‌బీజీ-884, ఎల్‌బీజీ-904, ఎల్‌బీజీ-932, ఎల్‌బీజీ-942, టీబీజీ-104 తదితర రకాలు సాగుచేసుకోవచ్చు. మినుములో రసం పీల్చే పురుగులతో వ్యాప్తి చెందే వైరస్ తెగుళ్లను నివారించేందుకు ఇమిడాక్లోప్రిడ్ 5మి.లీ. లేదా థయోమిథాక్సమ్ 5గ్రాములు, కిలో విత్తనంలో కలుపుకొని విత్తన శుద్ధి చేసుకోవాలి. కాండం గజ్జి తెగులు ఆశించి మొక్కలు చనిపోతాయి. దీని నివారణకు కిలో విత్తనంలో ట్రైకోడెర్మావిరిడీ 10గ్రాములు కలుపుకొని విత్తన శుద్ధి చేయాలి.

బొప్పాయి పాలు.. విదేశాలకు

నంద్యాల జిల్లా చాగలమర్రి మండల వ్యాప్తంగా రైతులు అధికంగా బొప్పాయి సాగు చేస్తుంటారు. చిన్నవంగలితో పాటు సమీపంలోని గ్రామాలైన వైఎస్సార్ కడప జిల్లా కానగూడూరు, క్రిష్ణంపల్లె గ్రామాల్లో 1200 ఎకరాల్లో పండిస్తారు. విత్తనం నాటిన కాలం నుంచి తొమ్మిది నెలలకు పంట చేతికొస్తుంది. పండ్ల సేకరణ అనంతరం 13 నెలల తర్వాత మిగిలినవి, ముదురు కాయలకు గాట్లు పెట్టి పాలను సేకరిస్తున్నారు. తెల్లవారుజాము సమయంలోనే కాయలకు గాట్లు పెడితే కేవలం రెండు గంటల్లోనే పాలు ఊరుతుంది. ఇలా సేకరించిన దాన్ని రాయచోటి, రాజంపేటకు చెందిన వ్యాపారులు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల పాలు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 4 డ్రమ్ముల పాలు సేకరిస్తున్నారు. ఎకరానికి పాల సేకరణ ద్వారా రైతుకు రూ.24 వేల ఆదాయం వస్తుంది. సేకరించిన పాలను పరిశ్రమల్లో మందులు, కాస్మోటిక్స్, సబ్బుల తయారీలో ఉపయోగిస్తున్నారు. బెంగళూరు, చెన్నైతో పాటు నాణ్యతను బట్టి విదేశాలకు సైతం పాలను ఎగుమతి చేస్తున్నారు. బొప్పాయి సాగులో ఎప్పుడైనా ధర పడిపోయినపుడు బొప్పాయి పాల సేకరణతో నష్టాల నుంచి రైతులు బయటపడుతున్నారు. - న్యూస్‌టుడే, చాగలమర్రి

పాడి ఆవుల ఎంపికలో మెలకువలు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే

పశు పోషకులు పాడి ఆవుల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకుంటే మంచి గోవులను పొందే అవకాశం ఉంటుందని పశు వైద్యాధికారి జంగా ప్రకాష్‌బాబు తెలిపారు. ఆయన సూచనలు ఇలా.. ప్రధానంగా పాల ఉత్పత్తి ఉన్న వాటిని ఎంపిక చేసుకోవాలి. ఈత సామర్థ్యంతో పాటు ఆరోగ్యంగా చురుగ్గా ఆకర్షణీయంగా, నిండు ఆడ లక్షణాలు కలిగిన ఆవులను కొనాలి. శరీరం త్రికోణాకారంగా, కాంతివంతమైన కన్నులు కలిగి, సన్నని మెడ ఉండే వాటిని ఎన్నుకోవాలి. పశువుల నాణ్యత, చరిత్రను దృష్టిలో ఉంచుకోవాలి. పాల దిగుబడిని మూడు వేళ్లలో లెక్కించి సగటున ఎన్ని పాలిస్తున్నాయన్నది లెక్క కట్టి అవగాహనకు రావాలి. పాలు పితకడానికి ఎవరినైనా దగ్గరకు రానిచ్చే ఆవులను ఎంచుకోవాలి. ప్రధానంగా అక్టోబర్- నవంబరు నెలల్లో కొనాలి.

ఎయిడ్స్ నియంత్రణకు పటిష్ఠ చర్యలు

కలెక్టరేట్ (మచిలీపట్నం): జిల్లాలో ఎయిడ్స్‌ను పూర్తిగా నివారించేలా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ కమిటీ సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీఆర్ కృష్ణయ్యతో కలిసి సమీక్ష నిర్వహించారు. మచిలీపట్నంలో ఏఆర్టీ సెంటరును ఆధునికీకరించారని, గుడివాడ కేంద్రానికి సరైన భవనం లేదని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వాటి ఏర్పాటుకు సీఎస్ఆర్ నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. న్యాయమూర్తి కేవీఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితుల కుటుంబాల్లో అవసరమైనవారు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చన్నారు. ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జేడీ కామేశ్వరప్రసాద్, డీఎంహెచ్‌వో యుగంధర్, డీసీహెచ్ఎస్ శేషు, టీబీ నియంత్రణాధికారి వెంకట్రావు, సంబంధిత అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 575 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.96/-.

బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ

మచిలీపట్నం క్రైం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. తన భార్య చనిపోయిన నాటి నుంచి ఉన్న ఆస్తిని తమ పేరున రాయాలంటూ ఇద్దరు సంతానం వేధిస్తున్నారని.. న్యాయం చేయాలని కోరుతూ కోడూరు ప్రాంతానికి చెందిన గంగాధరరావు అనే వృద్ధుడు ఫిర్యాదు అందజేశారు. తోట్లవల్లూరు ప్రాంతానికి చెందిన వివాహిత ప్రమీల వరకట్న బాధల నుంచి రక్షణ కల్పించాలని, మద్యానికి బానిసైన భర్త వేరుగా జీవిస్తున్న తనను, పిల్లలను మానసికంగా చిత్రహింసలకు గురిచేస్తున్నాడని అవనిగడ్డకు చెందిన రమ్య ఫిర్యాదు చేశారు. తన ఇద్దరు బిడ్డలకు ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ సమీప బంధువు రూ.10లక్షలు తీసుకుని మోసం చేశాడని, న్యాయం చేయాలని కోరుతూ ఒకరు అర్జీ సమర్పించారు. వీరితో పాటు వివిధ వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోరుతూ వేర్వేరు ప్రాంతాలకు చెందిన వారు ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ వాటిని విచారించి చట్ట పరిధిలో తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు.

న్యాయం చేయాలంటూ మహిళ ఆత్మహత్యాయత్నం

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం, న్యూస్‌టుడే కలెక్టరేట్ : ఎక్కడికి వెళ్లినా తనకు న్యాయం దక్కడం లేదంటూ ఓ మహిళ అధికారుల ముందు ఆత్మహత్యాయత్నం చేసింది. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో కలెక్టర్ బాలాజీ, ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తుండగా యనమలకుదురుకు చెందిన తోట కృష్ణవేణి అర్జీ ఇచ్చారు. తన భర్త మృతి చెందగా బీమా డబ్బులు తమకు రాకుండా కుటుంబీకులు, మరో వ్యక్తి అడ్డుకుంటున్నారని వాపోయారు. ఫిర్యాదును పరిశీలించి ఏం జరిగిందో తెలుసుకున్న కలెక్టర్ ఆధారాలుంటే చూపించాలన్నారు. ఏ బీమా కంపెనీ, పత్రాలు, వాటికి సంబంధించిన వివరాలను అడిగారు. మాట్లాడుతున్న క్రమంలోనే తమ వద్ద ఆధారాలు లేవంటూ ఎలాగైనా న్యాయం చేయాలని అధికారుల ముందు ఒంటిపై పెట్రోల్ పోసుకుని బలవన్మరణానికి యత్నించారు. గమనించిన పోలీసులు ఆమె వద్ద ఉన్న పెట్రోల్ సీసా స్వాధీనం చేసుకున్నారు. ఎందుకలా చేశారో వివరాలు తెలుసుకున్నారు.

మహిళ వద్ద నుంచి పెట్రోల్ సీసా తీసుకుంటున్న పోలీస్ అధికారి

బీమా డబ్బులు ఇప్పించమని.. 'భర్త చనిపోయాక రావాల్సిన సాధారణ, మెకానికల్ బీమా సొమ్ము నామినీగా ఉన్న నాకు, నా పిల్లలకు దక్కనీయకుండా మా ఆయన తరపు బంధువులు రాజేంద్రప్రసాద్ అనే వ్యక్తి సహకారంతో వేధిస్తున్నారు. బీమాకు సంబంధించిన పత్రాలు వారి వద్ద దాచుకొని పిల్లలను హాస్టల్లో పడేస్తామని.. నన్ను పుట్టింటికి వెళ్లిపోమంటూ వేధిస్తున్నారు. రేషన్‌కార్డు కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా పలు కారణాలతో మంజూరు చేయలేదు. నాకు నా పిల్లలకు న్యాయం జరగలేదన్న మనస్తాపంతో అధికారుల ముందు చనిపోవాలని నిర్ణయించుకున్నా' అని కృష్ణవేణి తెలిపారు.

బీమాకు సంబంధించి పత్రాలు లేవు

కృష్ణవేణి సమస్యను అడిగి తెసుకున్నా. ఆమె వద్ద బీమాకు సంబంధించిన ఎటువంటి పత్రాలు లేవు. గతంలో వారికి గృహం ఉండటం.. విద్యుత్తు అధిక వినయోగం కారణంగా రేషన్ కార్డు మంజూరు అవ్వలేదని తెలిసింది. వాస్తవాలు పరిశీలించి రేషన్ కార్డు ఇచ్చేలా చూడాలని అధికారులకు సూచించాం.

ఈత కొలనులో మునిగి ఇద్దరు చిన్నారుల మృతి

జిన్నారం (అమీన్‌పూర్), న్యూస్‌టుడే: గేటెడ్ కమ్యూనిటీలోని ఈత కొలనులో మునిగి ఇద్దరు చిన్నారులు మృత్యువాత పడిన ఘటన అమీన్‌పూర్ ఠాణా పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ నరేశ్ కథనం ప్రకారం.. అమీన్‌పూర్ అర్బన్ రైజ్ స్ప్రింగ్ ఇన్ ది ఎయిర్ గేటెడ్ కమ్యూనిటీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు షణ్ముఖ కుమార్, విజయ్ రెడ్డి నివసిస్తున్నారు. ఆదివారం సాయంత్రం షణ్ముఖ కుమార్, కుమార్తె ప్రజ్ఞ (9), విజయ్‌రెడ్డి కుమార్తె ఆద్వికారెడ్డి(8)లు కమ్యూనిటీలోని స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు వెళ్లారు. అయితే పిల్లల ఈత కొలనుకు బదులు పెద్దల కొలనుకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీటి మునిగారు. గమనించిన సిబ్బంది వెంటనే బయటకు తీసి స్థానిక ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి 11 గంటలకు ప్రజ్ఞ, సోమవారం తెల్లవారుజామున ఆద్వికారెడ్డి మృతి చెందింది. షణ్ముఖకుమార్ స్వస్థలం విశాఖపట్నం కాగా, ప్రజ్ఞ మియాపూర్‌లోని ప్రైవేటు పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. విజయ్‌రెడ్డి స్వస్థలం కృష్ణా జిల్లా కాగా, ఆద్వికారెడ్డి చందానగర్‌లో మూడో తరగతి చదువుతోంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ప్రజ్ఞ ఆద్వికారెడ్డి

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

LIC HFL LIC HOUSING FINANCE LTD with you, for your dream home

ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
విజయవాడ ఏరియా ఆఫీస్: #27-10-1/1, ఫస్ట్ ఫ్లోర్, ఉమియా నివాస్, అత్తారత్తయ్య స్ట్రీట్, గవర్నర్‌పేట, విజయవాడ-520002.

ఇ-వేలం అమ్మకం ప్రకటన

ఎల్.ఐ.సి. హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (LIC HFL) వారి యొక్క అధీకృత అధికారిగా ఉన్న ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 నందు చెప్పబడిన నిబంధనలు మరియు అందలి సెక్షన్ [illegible]

లోన్ నెం. 711400000188 ...	[illegible]	రూ. 19,53,000/-	రూ. 1,95,300/-	Beneficiary Name: LIC Housing Finance Ltd; Branch Name: HDFC BANK; Account Number: LHFLVW711400008188; IFSC Code: HDFC0000109; Property Id: VW711400008188

ఇ-వేలం యొక్క వెబ్‌సైట్	https://www.bankeauctions.com
ఆస్తి తనిఖీ కొరకు తేది & సమయము	27-11-2025
బిడ్డర్ / కేవైసి సమర్పించవలసిన చివరి తేది	16-12-2025
ఇ-వేలం తేది మరియు సమయము	17-12-2025

[illegible]

తేది: 03.11.2025, ప్రదేశము: విజయవాడ | సం/- అధీకృత అధికారి, ఎల్.ఐ.సి. హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (LIC HFL)

EENADU e Classifieds

AUTO

VEHICLES FOR SALE

2022 Model Kubota MU4501 4WD Tractor Regd No AP 39US 4635 for Sale in as is Where is Condition. Sundaram Finance Ltd ✆ 89859 66475, 94409 09726.

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధికధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 87907 41166

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీనివాస గ్రూప్, VJA, వృద్ధులకు, పేషెంట్లసేవకు, ఇంటి/ వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 95537 86677/96404 96677

BOOK YOUR COLOUR CLASSIFIED ₹ 1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

JOBS

Wanted Real Estate Marketing Executives and Female Telecallers. LIC Colony, Vijayawada. ✆ 94324 54545.

Wanted Female Telecallers / Data Entry / Freshers / Experience. Qul: Inter / any Graduate. Salary: 10k to 18k. Timing: 9:30 to 6:30. ✆ 99080 98305

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యూయర్స్. ఏజ్: 22-35. ఫ్రెషర్స్ కూడా కావలెను. ✆ 62810 37879.

R.K ఇంజనీరింగ్ కాలేజీ నందు పనిచేయుటకు ఎలక్ట్రీషియన్స్ కావలెను. అనుభవమును బట్టి జీతం+ భోజనం+ ఉచిత వసతి కల్పించబడును. కేతనకొండ, ఇబ్రహీంపట్నం మండలం, విజయవాడ, 97014 73399.

గుణదల పడవల రేవు సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీ పిచ్చమ్మతల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో అర్చకులు కావలెను. సంప్ర ✆ 94409 45604

ప్రముఖ ఆటోఫైనాన్స్ ఆఫీస్‌కి అనుభవంగల కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. A:25-30Y, Sal:18-25k Qul: డిగ్రీ. ✆ 99495 58181, 81215 58181

మీకు లైఫ్ ఇన్సూరెన్స్ రంగంలో ఆసక్తి ఉందా? ఇన్సూరెన్స్ అమ్మకాలు మీరు స్వయంగా చేయకుండానే స్థిరమైన ఆదాయం పొందవచ్చు. ✆ 90305 12580,95731 42460

గుంటూరు జిల్లా పట్టమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ హాస్టల్‌లో ఉండి పనిచేయుటకు వార్డెన్స్ కావలెను. (పురుషులు/ స్త్రీలు) డిగ్రీ/ పీజీ అర్హత. కాంటాక్ట్- 94903 09033 (F), 97058 34803 (M)

రిటైర్డ్, VRS, గృహిణులకు పెట్టుబడి లేని గొప్ప వ్యాపారావకాశం. P/F టైం. జీతం + Inc +PF కలవు. ప్రముఖ MNC కంపెనీలో ✆ 94905 03345.

ప్రముఖ దినపత్రిక నందు పనిచేయుటకు యువతీ, యువకులు కావలెను. అర్హత: 10 పాస్, వయస్సు: 19 నుండి 30 సం॥లోపు, జీతము మరియు టీఏ, డీఏ సదుపాయం కలదు. సంప్రదించవలసిన నెం: 91543 32118.

MARKETING/ SALES

Wanted Marketing Executives qly- degree, exp- 5 yrs, 30,000 p.m + T.A, D.A cell: 62814 37559.

DRIVERS

విజయవాడ ఏలూరు రోడ్డులో వ్యాలెట్ పార్కింగ్ నందు పని చేయుటకు డ్రైవర్స్ కావలెను. ✆ 98486 11113 / 96183 82562

SECURITY GUARDS

సెక్యూరిటీ గార్డులు కావలెను. చిన్నమనేని పాలీ క్లీనిక్ ఏరియాలో ప్రముఖ జ్యూయలరీ మాల్‌కు. జీతము: 15,000/- + ఫుడ్, PF, ESI ఫెసిలిటి కలదు. ✆ 80994 44758, 96401 48367.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

నూతన ఆలయ నిర్మాణానికి నాంది

మాట్లం వినాయకుడి ఆలయంలో పూజలు

మాట్లం (కృత్తివెన్ను), న్యూస్‌టుడే: మండలంలోని మాట్లం గ్రామ పంచాయతీలో వందేళ్ల నాటి పురాతన వినాయకుని ఆలయాన్ని తొలగించి, కొత్త ఆలయం నిర్మాణానికి గ్రామస్థులు నాంది పలికారు. సోమవారం ప్రత్యేకంగా హోమగుండం వేసి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పురోహితుడు కొండూరి సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో వేదపండితుల సమక్షంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

అండగా ఉంటాం.. ఆదుకుంటాం

నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న పోతనస్వామి, నాయకులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటాం... ఆదుకుంటామని డీసీ ఛైర్మన్ పోతన లక్ష్మీనరసింహస్వామి అన్నారు. సోమవారం మల్లవోలు గ్రామంలో నేత కార్మికులకు ప్రభుత్వం అందించిన బియ్యం, నిత్యావసర సరకుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తుపాను కారణంగా పేదలు ఇబ్బందులు పడకుండా అందరికీ వెంటనే నిత్యాసర సరకులు పంపిణీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. మాజీ సర్పంచి కూనపరెడ్డి పెద్దిరాజులు, కూటమి నాయకులు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

❖ నగరంలో చిలకలపూడికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన సర్కారుతోట ప్రాంతంలో చెట్లకొమ్మల వ్యర్థాలను రోడ్ల పక్కన గుట్టలుగా వేసి వదిలేశారు. దీంతో స్థానికులతో పాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. సమస్యను స్థానికులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకురాగా కమిషనర్ బాపిరాజుకు వివరించడంతో సిబ్బందిని పంపగా వ్యర్థాలను ట్రాక్టర్‌లో తరలించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు.

స్పందనకు వందనం

❖ నగరంలోని కార్మికశాఖ కార్యాలయానికి వెళ్లే రహదారి పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న చెత్తమేటను తొలగించకపోవడంతో స్థానికులతో పాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను ఆ ప్రాంతవాసులు మేమున్నాం మీకుతోడుగా దృష్టికి తీసుకురాగా 'ఈనాడు'లో వార్త ప్రచురించి, అధికారులకు వివరించగా సిబ్బందిని పంపి చెత్త తొలగించేలా చర్యలు తీసుకున్నారు.



? నగరంలోని కొబ్బరితోట 6/241, 6/242 విద్యుత్ స్తంభాలకు ఉన్న తీగలు గత కొంతకాలంగా వేలాడుతున్నాయి. **-స్థానికులు**

✔ సిబ్బందిని పంపి వెంటనే మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటాం. **-రవికుమార్, డివిజన్ విద్యుత్‌పాల పర్యవేక్షకులు -మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే**

? పెడన-గుడివాడ రహదారి రైల్వే డంపింగ్ యార్డ్ చెత్త రోడ్డుపైకి వస్తోంది. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **-శ్రీను.**

✔ చెత్త రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకుంటాం. **-హరి కిశోర్, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్**

? మద్యాన్ని ఎదురుగా రోడ్డుపై మురుగు స్తంభించింది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **-అబ్దుల్ జిలాని**

✔ మురుగు మళ్లించేందుకు చర్యలు తీసుకుంటాం.-హరికిశోర్, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్. **పెడన గ్రామీణం, న్యూస్‌టుడే**

? కొంగంచర్ల ప్రధాన రహదారి ఒక కి.మీ మేర సగం వేసి వదిలేశారు. దారి వేయాల్సి ఉంది. **-స్థానికులు**

✔ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.**-వై. ధర్మయ్య, పీఆర్ ఏఈ, పెడన మండలం**

? గ్రామ కొంగంచర్ల, కుమ్మరిగుంట అంగన్‌వాడీ కేంద్ర భవనాలు వర్షం పడితే ఇబ్బందిగా ఉంది. మరమ్మతులు చేయించాలి. **-స్థానికులు**

✔ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

-లోయ రాజేశ్వరి, సర్పంచి కొంగంచర్ల

భవన కార్మికుడికి సాయం

గూడూరు, న్యూస్‌టుడే: చిన ఆకులమన్నాడు ఎస్సీకాలనీకి చెందిన బొడ్డు అశోక్ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ ఇటీవల ప్రమాదానికి గురికావడంతో ఇంటి వద్దనే ఉంటున్నారు. ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న మేమున్నాం సేవా సంస్థ ఛైర్మన్ వీణం శ్రీనివాస్ తమ సభ్యులతో కలిసి 25కేజీల బియ్యం, నిత్యావసరాలు, రూ.3,500 అందించారు.

లారీ స్వాధీనం

పెడన, న్యూస్‌టుడే: పెడన మార్కెట్ కమిటీ పరిధిలోని వడ్లమన్నాడు చెక్ పోస్టును ఛైర్‌పర్సన్ భీముని అనంతలక్ష్మితో కలిసి కార్యదర్శి సోమవారం తనిఖీ చేస్తున్న సమయంలో ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీని గుర్తించారు. సెస్‌పై డ్రైవర్‌ను ప్రశ్నించగా లారీ వదిలేసి వెళ్లిపోయాడు. లారీని స్వాధీనం చేసుకుని స్థానిక మార్కెట్ కమిటీకి తరలించారు. అపరాధ రుసుం సెస్ చెల్లించిన తర్వాత విడుదల చేస్తామని కార్యదర్శి చెప్పారు.

ఈ-వ్యర్థం.. సేకరణ ప్రహసనం..

న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

స్వచ్ఛతాహి సేవలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ-వ్యర్థాల సేకరణ కార్యక్రమం ప్రారంభంలో సక్రమంగా జరిగినా తరవాత అధికారులు పట్టించుకోకపోవడంతో నీరుగారిపోతోంది. బందరు, పెడన నియోజకవర్గాల్లో ప్రస్తుతం ఎక్కడా ప్రక్రియ సాగకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అలంకారమేనా... అక్కరకు వచ్చేనా?

స్వచ్ఛతాహిసేవ కార్యక్రమంలో భాగంగా ప్రతి ప్రాంతం పరిశుభ్రంగా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ప్రస్తుత సమాజంలో ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం విపరీతంగా పెరిగింది. వాటి వల్ల పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించి ప్రభుత్వం వాటిని సేకరించి రీసైక్లింగ్ చేయాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా ఇ-వ్యర్థాలు సేకరించేలా చర్యలు తీసుకున్నారు. బందరు నగరంతో పాటు పెడన పట్టణం, రెండు నియోజకవర్గాల్లోని పంచాయతీల్లోనూ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నగరంతో పాటు వివిధ మండలాల్లోని మేజర్ పంచాయతీల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. విడతల వారీగా అన్ని పంచాయతీల్లో ఏర్పాటు చేసే దిశగా కార్యాచరణ చేపట్టారు. ఆ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవు. ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనూ ఈ వ్యర్థాల సేకరణ నిలిచిపోవడంతో అలంకారప్రాయంగా మారిపోయాయి. బందరు, పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పలు గ్రామాల్లో అసలు ఈ వ్యర్థాల సేకరణే జరగలేదని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు.



బందరు: పోతేపల్లిలో పనిచేయని కేంద్రం

పట్టించుకుంటేనే ఫలితం

ప్రతి ఇంట్లోనూ పాడైపోయిన టీవీలు, చరవాణులు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, కుక్కర్లు, మిక్సీలు తదితర పరికరాలు ఉంటున్నాయి. వాటిని ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. తడి, పొడి చెత్త సేకరిస్తున్న వాటిలో ఎలక్ట్రానిక్ పరికరాలు ఉంటున్నాయని పారిశుద్ధ్య సిబ్బంది వాపోతున్నారు. అవి ప్రమాదకరమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఇటీవల బందరు నగరం ఈడేపల్లిలో ప్రైవేటు వ్యక్తులు నిర్వహించే స్క్రాప్ దుకాణంలో ఎలక్ట్రానిక్ వస్తువులు పేలి ఒకరు గాయాలపాలవడం, ఆ ప్రాంత వాసుల్లో ఆందోళన కలిగించింది. దీంతో ఆ దుకాణాన్ని అక్కడి నుంచి తరలించాలని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యర్థాల్లో ఉండే క్యాడ్మియం, లెడ్ తదితరాలను సేకరించి సంపద సృష్టించాలన్నది ప్రభుత్వ ఆశయం. అధికారులు ఇప్పటికైనా స్పందించి పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించి ఈ-వ్యర్థాల సేకరణ ప్రక్రియ సమర్థంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చెన్నూరు సొసైటీని అగ్రపథాన నిలపాలి

త్రిసభ్య కమిటీ ఛైర్మన్, సభ్యులను అభినందిస్తున్న కూటమి నేతలు

పెడన, న్యూస్‌టుడే: మండలంలోని చెన్నూరు పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ సోమవారం బాధ్యతలు చేపట్టింది. కమిటీ ఛైర్మన్‌గా యర్రంశెట్టి దేవేంద్ర ప్రసాద్, సభ్యులుగా దొండపాటి శివనాగరాజు, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావుప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలను స్వీకరించారు. ఈసొసైటీ పరిధిలోని చెన్నూరు, ఉరివి పంచాయతీల్లో 900 మంది రైతులు సభ్యులుగా ఉండగా రూ.25కోట్ల వార్షిక టర్నోవర్ జరుగుతోంది. మండలంలో నందమూరు తర్వాత పెద్దదైన చెన్నూరు సొసైటీని అగ్రపథాన నడిపించాలని ఈకార్యక్రమానికి హాజరైన మండల జడ్పీటీసీ అర్జా నగేశ్ సూచించారు.

బాధ్యతల స్వీకరణ

ప్రమాణ స్వీకారం చేస్తున్న అంగర రంగనాథ్

బంటుమిల్లి, న్యూస్‌టుడే : బంటుమిల్లికి చెందిన తెదేపా నాయకుడు, న్యాయవాది అంగర రంగనాథ్ సోమవారం విజయవాడలో బీసీ సంక్షేమ శాఖ భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. మంత్రి సవితను ఈ మేరకు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్, ఆయనను అభినందించారు.

ప్రతిభ చాటేందుకు పోటీలు దోహదం

చిలకలపూడి పాండురంగ స్కూల్లో విజేతలతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రతిభ చాటుకోవడానికి పోటీలు ఎంతగానో దోహదపడతాయని నగరంలోని చిలకలపూడి పాండురంగ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జి.వెంకటేశ్వరరావు అన్నారు. ఈనాడు, ఈటీవీ ఆధ్వర్యంలో 'మీకు ఇష్టమైన పండగ' అనే అంశంపై పాఠశాలలో సోమవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని వివిధ రకాల చిత్రాలు గీసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలను విద్యార్థులు అందరూ వినియోగించుకోవాలన్నారు. పోటీల్లో జి.సిరిమేఘన (9వ తరగతి), ఎస్‌కే షాగుఫ్తా(9వ తరగతి), టి.జోసఫ్(9వ తరగతి) విద్యార్థులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు పి.సుబ్రహ్మణ్యం, టి.గంగరాజు, కె.నాగజ్యోతి తదితరులు బహుమతులు అందించి అభినందనలు తెలిపారు.

❖ నగరంలోని జవ్వారుపేట రామకృష్ణ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ సీహెచ్ రామకృష్ణ మాట్లాడుతూ చిత్రలేఖనం ద్వారా ఏకాగ్రత పెంపొందుతుందని, తద్వారా చదువులోనూ మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. పోటీల్లో ఎండీ హఫ్సా(9వ తరగతి), ఎస్.లోకేష్‌బాబు(10వ తరగతి), ఎండీ ఆయేషా (8వ తరగతి)లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. పోటీల్లో ప్రతిభ చాటుకున్నవారికి కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపల్ సీహెచ్ సంధ్యారాణి, ఉపాధ్యాయిని జి.ప్రసన్న బహుమతులు అందజేశారు. పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామకృష్ణ పబ్లిక్ స్కూల్లో బహుమతులు అందుకున్నవారితో కరస్పాండెంట్ తదితరులు

పెదతుమ్మిడి సమస్యలు పరిష్కరించండి

బ్రహ్మం చౌదరికి వినతిపత్రం ఇస్తున్న వసంతకుమార్

బంటుమిల్లి, న్యూస్‌టుడే : మండలంలోని పెదతుమ్మిడిలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెదేపా కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు సోమవారం కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మంచౌదరికి వినతిపత్రం అందించారు. బొల్లా వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కుటుంబాలకు నిత్యావసరాల అందజేత

పెడన: మొంథా తుపానుకు ఉపాధిని కోల్పోయిన చేనేత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం నిత్యావసరాలను ఉచితంగా అందజేస్తోంది. చేనేత జౌళి శాఖ అధికారులు జిల్లాలో 3900 చేనేత కుటుంబాలు ఉన్నట్లు రెవెన్యూ శాఖకు జాబితా అందజేశారు. దీని ఆధారంగా ఒక్కో కుటుంబానికి 50 కిలోల బియ్యం, కిలో వంతున కందిపప్పు, పామాయిల్, చక్కెర, బంగాళదుంపలు, ఉల్లిపాయలను రేషన్ షాపుల ద్వారా అందజేస్తున్నారు. జిల్లాలో చేనేత ప్రధాన కేంద్రమైన పెడనలో 1600, గూడూరు మండలంలో 1400 కుటుంబాలకు పంపిణీ చేస్తుండగా చల్లపల్లి, అవనిగడ్డ, కాజ, తదితర చేనేత కేంద్రాల్లో మరో 900 మందిని గుర్తించారు. తుపాను ప్రభావిత కుటుంబాలకు ఈ నిత్యావసరాలతో పాటు 25 కిలోల బియ్యం పంపిణీ చేయగా నేతన్నలకు రెట్టింపు 50 కిలోలు ఇచ్చినట్లు చేనేత జౌళి శాఖ జిల్లా ఏడీ సాయి ప్రసాద్ చెప్పారు.

పెడనలో పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలు

పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీవో, డీవైఈవో తదితరులు

గూడూరు, న్యూస్‌టుడే: క్రీడల ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని డీవైఈవో శేఖర్‌సింగ్ అన్నారు. గూడూరు జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14, 17 బాల బాలికల డివిజన్ స్థాయి కబడ్డీ జట్ల ఎంపిక పోటీలను ఆయన ఎంపీడీవో శైలజాకుమారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు అనేక వసతులు కల్పిస్తున్నందున వినియోగించుకోవాలని సూచించారు. సర్పంచి లింగం సులోచనరాణి విద్యార్థులను అభినందించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి మత్తి అరుణ తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు పోటీలను పర్యవేక్షించారు.

శ్మశానవాటికలో ఆక్రమణ తొలగించండి

లక్ష్మీపురం ఎస్సీవాడలో గ్రామస్థుల నిరసన

లక్ష్మీపురం ఎస్సీవాడ (కృత్తివెన్ను), న్యూస్‌టుడే: లక్ష్మీపురం గ్రామ పంచాయతీ ఎస్సీకాలనీ శ్మశాన వాటికకు సంబంధించిన భూమిని ఇద్దరు ఆక్రమించి చేపల చెరువు తవ్వారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. శ్మశానంలోకి లారీలు తీసుకెళ్లి సమాధులను తొక్కిస్తూ తమ మనోభావాలను దెబ్బతీస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలని వారు కోరారు.

గూడూరులో జగన్ పర్యటన నేడు

పెడన, న్యూస్‌టుడే: గూడూరు మండలంలో వైకాపా అధినేత వైఎస్ జగన్ మంగళవారం పర్యటిస్తారని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఉప్పాల రాము తెలిపారు. ఉదయం 9.30కు తాడేపల్లిలోని నివాసం నుంచి బయలుదేరి 11గంటలకు గూడూరు మండలం తరకటూరు చేరుకుంటారని, అక్కడి నుంచి రామరాజుపాలెం వచ్చి తుపానుకు నష్టపోయిన వరి రైతులను పరామర్శిస్తారని చెప్పారు.

పటిష్ట బందోబస్తు: జగన్ రాక నేపథ్యంలో పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. మచిలీపట్నం డీఎస్పీ చప్పిడి రాజా పర్యవేక్షణలో ఇప్పటికే బందోబస్తు సిద్ధం చేశారు. ఇతర సబ్‌డివిజన్లకు చెందిన డీఎస్పీలు, సీఐలు ఎస్సైలు సిబ్బంది ఈ బందోబస్తులో పాల్గొంటారు. గతంలో జరిగిన ఘటనల నేపథ్యంలో పోలీసులు అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. దాదాపు 500 మంది పోలీసులు జిల్లా వ్యాప్తంగా తరలివస్తున్నారు.

అడ్డంగా కూలింది.. ఆరు రోజులైంది..

స్థానిక 14వ వార్డు ఎన్టీఆర్ పార్కులోని ఒక వృక్షం తుపానుకు కూలింది. గత మంగళవారం ఈ చెట్టు కూలిపోగా ఆరు రోజుల తర్వాత కూడా ఆ చెట్టును తొలగించలేదు. **-పెడన, న్యూస్‌టుడే**

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

ఎస్.ఎన్.గొల్లపాలెం: సోమేశ్వరస్వామి | మంగినపూడి: నగరేశ్వరస్వామి | రామలింగేశ్వర స్వామి | రసలింగేశ్వరస్వామికి అలంకారం | కాలేఖాన్‌పేట ఆలయంలో శివుడు | ఐదుగుళ్లపల్లిలో సోమేశ్వరస్వామి

మచిలీపట్నం (గొడుగుపేట), గూడూరు, న్యూస్‌టుడే: కార్తిక సోమవారం సందర్భంగా బందరు, పెడన నియోజకవర్గాల్లోని వివిధ శివాలయాల్లో కార్తిక మాసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని రామలింగేశ్వర స్వామి, బచ్చుపేట మల్లేశ్వరస్వామి, ఖొజ్జిల్లిపేట నగరేశ్వరస్వామి తదితర ఆలయాల్లో విశేష పూజలు అభిషేకాలు చేశారు. గూడూరులోని రామలింగేశ్వరస్వామి ఆలయంతో పాటు ఐదుగుళ్లపల్లి, తరకటూరు, మద్దిపట్ల తదితర గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు చేయగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మచిలీపట్నంరూరల్, న్యూస్‌టుడే: ఎస్.ఎన్.గొల్లపాలెంలోని శ్రీఉమా సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజామున మహాన్యాస పూర్వక ఏకరుద్ర అభిషేకం, భస్మాభిషేకం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మంగినపూడిలో నగరేశ్వరస్వామి, పోతేపల్లిలో విజయకనకదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయాల్లో స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెడన, న్యూస్‌టుడే: శ్రీగంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. దాదాపు 10వేల మంది స్వామివారిని దర్శించినట్లు ఆలయ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ బళ్ల ప్రసాద్ చెప్పారు. ట్రస్ట్ బోర్డ్ సభ్యులు స్వచ్ఛందంగా భక్తులకు సేవలందించారు. ప్రధాన అర్చకుడు గూడూరి అగస్త్యేశ్వర శర్మ అర్చకత్వంలో ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ❖ కొంకేపూడి రాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అభిషేకాలు జరిపారు. సర్పంచి దావు భైరవలింగం, పీఏసీఎస్ అధ్యక్షుడు కట్టా నాగరాజు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. చెన్నూరు, చేవేంద్ర, ఉరివి, మడకల్లోని శైవాలయాల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి.

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5న మచిలీపట్నంలోని ఖొజ్జిల్లిపేట నాగేశ్వరస్వామి ఆలయంలో కార్తిక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రతినిధి తురగా ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆలయంలో సంస్థ సభ్యులు, భక్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రోజు సాయంత్రం 6గంటలకు దీపోత్సవం ప్రారంభం అవుతుందని, పాల్గొనే భక్తులకు ప్రమిదలు, వత్తులతో పాటు, నూనె కూడా సంస్థ ఆధ్వర్యంలో అందజేస్తామన్నారు. ఈ ఉత్సవంలో పాల్గొనేవారికి ప్రసాదంతో పాటు తులసిమొక్క అందజేస్తామని పేర్కొన్నారు.

బంటుమిల్లి: ఆంజనేయస్వామి పల్లకి సేవ

గుడిదిబ్బ(కృత్తివెన్ను),న్యూస్‌టుడే: కృత్తివెన్ను గుడిదిబ్బలో దుర్గాపార్వతీ సమేత నాగేశ్వర స్వామి దేవస్థానంలో కార్తిక సోమవారాన్ని పురస్కరించుకొని ఆలయం శివనామస్మరణతో మారుమోగింది. సోమవారం ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, ఛైర్మన్ చేకూరి వెంకట్రావు, ట్రస్టు సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు పాలు పంపిణీ చేశారు.

బంటుమిల్లి,న్యూస్‌టుడే : పాశ్చాపురంలోని శ్రీ సువర్చలా సమేత ఆంజనేయస్వామి వారి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా ముగిశాయి. ఉత్సవాలలో చివరి రోజు అయిన సోమవారం అర్చకులు వెంకట హనుమంతాచార్యులు పర్యవేక్షణలో సామూహిక హనుమద్ వ్రతాలు జరిగాయి. అనంతరం అన్నసమారాధన జరిగింది. రాత్రి పల్లకీసేవ, ద్వాదశ ప్రదక్షిణలు జరగ్గా పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పెడన: అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

కార్తిక దీపోత్సవం బ్యానర్ ప్రదర్శిస్తున్న ధర్మప్రచార పరిషత్ ప్రతినిధులు

బంటుమిల్లి: పూజా క్రతువును వీక్షిస్తున్న ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

గూడూరు, న్యూస్‌టుడే: మచిలీపట్నంకు చెందిన పి.వెంకటరాజు(35) గూడూరుకు చెందిన మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై సోమవారం రాత్రి గూడూరు నుంచి ద్విచక్ర వాహనంపై బందరుకు బయలుదేరారు. రామరాజుపాలెం వద్ద ప్రమాదవశాత్తూ డివైడర్‌ను ఢీకొన్నారు. వెంకటరాజు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు గాయాల పాలయ్యారు.

బైక్‌పై నుంచి పడి గాయాలు

పెడన, న్యూస్‌టుడే: బైక్‌పై నుంచి జారిపడి మహిళకు గాయాలైన ఘటన స్థానిక గుడివాడ రోడ్డులో ప్రభుత్వాసుపత్రి ఎదురుగా జరిగింది. ముదినేపల్లి మండలం చిగురుకోటకు చెందిన మహిళ జి.వెంకటేశ్వరమ్మ(52) కుమారుడి బైక్‌పై సోమవారం మచిలీపట్నం వెళ్తుండగా ప్రమాదవశాత్తూ జారి కింద పడ్డారు. గాయాలైన ఆమెను మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్లు అయిన మచిలీపట్నం టౌన్ కాపురస్థులు సబ్బినేని సాంబశివరావు గారి కుమారుడు రవి కిషోర్ గారి సంజాయిషీ మేర ఇచ్చు ప్రకటన ఏమనగా..

నా క్లయింట్లు యీ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ఎస్.ఎన్.గొల్లపాలెం కాపురస్థులు, కోన రాజేశ్వరరావు గారి భార్య కోన సుందరమ్మ మరియు వారి కుటుంబ సభ్యులు వద్ద నుండి కొనుగోలు చేయు నిమిత్తమై ఒప్పందము కుదుర్చుకొని యున్నారు. సదరాస్తి కోన రాజేశ్వరరావు 2004వ సంవత్సరంలో కొనుగోలు చేసి ఉన్నారు. ఈ మధ్య కాలంలో కోన రాజేశ్వరరావు గారు చనిపోయినారు. అప్పటి నుంచి ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని కోన సుందరమ్మ మరియు వారి కుటుంబ సభ్యులు అనుభవిస్తున్నారు. కావున అట్టి ఆస్తిపై ఎవరికైనా ఏవిధమైన ఎగ్రిమెంట్లు గానీ, వారసత్వపు హక్కులు గానీ, మరి యే యితర లావాదేవీలు గానీ వున్న యెడల 7 రోజులలోపు వ్రాత పూర్వకంగా తెలుపగలరు. అట్లు రాని యెడల సదరాస్తి ఏవిధమైన వివాదం లేని ఆస్తిగా పరిగణించి నా క్లయింట్లు రిజిస్ట్రేషన్ పొందగలరు. దర్మిలా వచ్చు అభ్యంతరాలు చెల్లనేరవు మరియు నా క్లయింట్లను బైండు చేయజాలవు అని ఇందుమూలంగా తెలియజేయటమైనది.

షెడ్యూలు దాఖలా ఆస్తి : Item No.1:- కృష్ణా జిల్లా మచిలీపట్నం సబ్ రిజిస్ట్రార్ వారి యిలాకా బందరు మండలం, ఎస్.ఎన్.గొల్లపాలెం గ్రామ పంచాయతీలో చేరిన ఎస్.ఎన్. గొల్లపాలెం గ్రామంలో ఉన్నటువంటి ఆర్.ఎస్.నెం. 92/1లో 0.25 సెంట్లు శేరి పల్లం భూమికి **హద్దులు: తూర్పు:** తలుపుల సరస్వతి అండ్ అదర్స్ గారి భూమి, **పడమర:** డొంక (సర్కారు వారి భూమి), **ఉత్తరం:** కొల్లూరు సురేష్ గారి భూమి, **దక్షిణం:** తరకటూరి రాజేశ్వరరావు గారి భూమి.

Item No.2:- కృష్ణా జిల్లా మచిలీపట్నం సబ్ రిజిస్ట్రార్ వారి యిలాకా బందరు మండలం, ఎస్.ఎన్.గొల్లపాలెం గ్రామ పంచాయతీలో చేరిన ఎస్.ఎన్. గొల్లపాలెం గ్రామంలో ఉన్నటు వంటి ఆర్.ఎస్ నెం 92-2-Aలో 0.21 సెంట్లు, ఆర్.ఎస్.నెం. 92-3లో 0.04 సెంట్లు వెరసి మొత్తం 0.25 సెంట్లు శేరి పల్లం భూమికి **హద్దులు: తూర్పు:** కొండేటి రత్నమాణిక్యం గారి భూమి, **పడమర:** డొంక (సర్కారు వారి భూమి), **ఉత్తరం:** సాచి ప్రాజెక్ట్ వారి భూమి, **దక్షిణం:** సాచి ప్రాజెక్ట్ వారి భూమి.

ఇట్లు
G. Hema Srinivas, M.B.A, LL.B.
అడ్వకేట్, మచిలీపట్నం
సెల్: 91006 03366, 77802 26019
మచిలీపట్నం, ది. 03.11.2025

కార్తిక పౌర్ణమి స్నానాలకు పకడ్బందీగా ఏర్పాట్లు

మంగినపూడి (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: కార్తిక పౌర్ణమి సందర్భంగా ఈ నెల 5న మంగినపూడిలో జరిగే సముద్ర స్నానాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డి.కె.బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఇతర అధికారులతో కలిసి మంగినపూడి బీచ్‌ను కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. 5న తెల్లవారుజామున సముద్ర హారతి ఇచ్చే వేదికను ప్రమాదాలకు తావు లేకుండా ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల సౌకర్యం కోసం సంచార మరుగుదొడ్లు, మహిళల కోసం దుస్తులు మార్చుకునే గదులను కల్పించాలని కోరారు. భక్తులు సముద్రం లోపలికి వెళ్లకుండా లోటైడ్, హైటైడ్ బారికేడ్‌లను గుంజలు పాతి జెండాలు, గట్టి వలలతో ఏర్పాటు చేయాలని సూచించారు. బారికేడ్ల అవతల 10 పడవలను, వాటిలో ఇద్దరు చొప్పున గత ఈతగాళ్లను, 4 లైఫ్ జాకెట్లు, లైవ్ బాయిస్‌ను సిద్ధంగా అందుబాటులో ఉంచాలన్నారు. పెదపట్నం బీచ్‌లో కూడా ప్రమాదాల నివారణకు 4 పడవలు, గత ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మాట్లాడుతూ బీచ్‌లో 6 వాచ్‌టవర్లను, 10 డ్రోన్లను, పబ్లిక్ అడ్రస్ సిస్టంతో సహా ఏర్పాటు చేయాలన్నారు. ఫాల్కన్ వాహనాన్ని విజయవాడ నుంచి రప్పించి ఎక్కడ ప్రమాదం జరిగే అవకాశం ఉన్నా వెంటనే పసిగట్టి నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో స్వాతి, మత్స్యశాఖ జేడీ నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సోమశేఖర్, డీపీవో డాక్టర్ జె.అరుణ, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి ఏసురత్నం, జిల్లా పర్యాటక శాఖాధికారి రామ్‌లక్ష్మణ్, ఆర్టీసీ డీఎం పెద్దిరాజు పాల్గొన్నారు.

మంగినపూడి బీచ్‌లో ఎస్పీ, అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ బాలాజీ

విదేశీ వద్దు.. స్వదేశీకే జైకొట్టు

మేకావానిపాలెం (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: స్వదేశీ ఉత్పత్తులనే ప్రజలు వినియోగించాలని భాజపా రాష్ట్ర నాయకుడు పంతం గజేంద్రరావు పిలుపునిచ్చారు. మేకావానిపాలెం పంచాయతీ శ్రీనివాసనగర్‌లో సోమవారం భాజపా మండల అధ్యక్షుడు కంచర్లపల్లి వెంకటరామారావు ఆధ్వర్యంలో మండల సమావేశం జరిగింది. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఇంటింటా స్వదేశీ స్టిక్కర్, కరపత్రాల పంపిణీ, సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గజేంద్రరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ పిలుపు మేరకు స్వదేశీ వస్తువులనే ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల మహిళా మోర్చా నాయకురాలు నల్లగోపుల అమ్మాజీ, జిల్లా నాయకులు వేములపల్లి వెంకటరమణ, బొమ్మిడి నారాయణస్వామి, గొర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో గజేంద్ర తదితరులు

బంటుమిల్లి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ పూర్తిగా స్వదేశీ వస్తువులనే వినియోగించాలని భాజపా నాయకులు అన్నారు. సోమవారం బంటుమిల్లిలో భాజపా మండల అధ్యక్షుడు జల్లూరి కిరణ్‌గుప్త ఆధ్వర్యంలో భాజపా శ్రేణులు ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా పర్యటించి కరపత్రాలు అందించారు. నియోజకవర్గ కో కన్వీనర్ మాగంటి గంగరాజు, పుప్పాల యేసు, ప్రభుకుమార్, వల్లభు రంగయ్య, కంతేటి ఆంజనేయ పాల్గొన్నారు.

కరపత్రాలతో భాజపా నాయకులు తదితరులు

సముద్ర స్నానం వేళ.. భద్రం సుమా..

మంగినపూడి (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: మచిలీపట్నం ఉత్తర మండలంలోని గిరిపురం, సత్రవపాలెం బీచ్‌లలో ప్రమాదం పొంచి ఉన్నందున అక్కడ ఎవరూ సముద్ర స్నానాలకు దిగవద్దని గిలకలదిండి కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్ సీఐ కె.వంశీకృష్ణ హెచ్చరించారు. కార్తిక సోమవారం సందర్భంగా మంగినపూడి బీచ్‌లో పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ గిరిపురం, సత్రవపాలెం బీచ్‌లలో సముద్రం కోతకు గురై పెద్ద నాలా మరియు గోతులు ఏర్పడ్డాయన్నారు. కార్తికపౌర్ణమి సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మంగినపూడి, పెదపట్నం బీచ్‌లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సిబ్బందిని లైఫ్ జాకెట్స్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌తో సిద్ధంగా ఉంచామన్నారు. సముద్రంలో నడుము లోతు దాటి వెళ్లరాదని, దీపాలు వెలిగించే సమయంలో పక్కన ఉన్న వ్యక్తులకు అంటుకోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలలు ఉద్ధృతంగా ఉన్న సమయంలో బీచ్‌లలో విధి నిర్వహణలో ఉన్న మెరైన్ భద్రతా సిబ్బంది, గజ ఈతగాళ్ల సూచనలు కచ్చితంగా పాటించాలన్నారు.

భక్తులకు సూచనలు చేస్తున్న సీఐ వంశీకృష్ణ

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్య వ్రతం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: పెరికీడు ముక్తేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. అర్చకులు కుందుర్తి సీతారామయ్య ఆధ్వర్యంలో పలు జంటలు వ్రతాన్ని ఆచరించాయి. నిర్వాహకులు నండూరి శర్మ, నక్కా బాబు, మెరుగుమాల వేణు, పుట్టి వీర్రాజు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ

పోరంకి, న్యూస్‌టుడే: పోరంకి కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా సోమవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వీటిలో విద్యార్థినులు ప్రతిభ చూపారు. 'ప్రకృతి అందాలు' అనే అంశంపై నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ఎ.నిహారిక, సాహితి, సాయిశ్రీలకు ప్రిన్సిపల్ వి.భూలక్ష్మి, స్వాతి, పాతిమా బహుమతులు అందజేశారు.

విజేతలతో ప్రిన్సిపల్ భూలక్ష్మి తదితరులు

నేడు విచారణకు రానున్న జిల్లా పంచాయతీ అధికారి

ఉయ్యూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గండిగుంట పంచాయతీ పరిధిలో కామన్ సైట్ (ఓపెన్ స్పేస్) విక్రయాలపై ఈ నెల 1న 'ఈనాడు'లో 'గండిగుంట..మిగలకుండా' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనికి జిల్లా పంచాయతీ అధికారి స్పందించారు. మంగళవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించడానికి వస్తున్నారు. ఈ రికార్డులను సిద్ధం చేయమని పంచాయతీ కార్యదర్శి కుమార్, మండల పరిషత్ కార్యాలయ డిప్యూటీ ఎంపీడీవోకు ఆదేశాలు జారీ చేశారు.

తుపాను నష్టం.. ఆదుకునేందుకు సిద్ధం

న్యూస్‌టుడే, హనుమాన్ జంక్షన్

మొంథా తుపానుతో పంట నష్టపోయిన రైతులకు చేయూత ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం సత్వర కార్యాచరణ చేపట్టింది. పంట నష్టం వివరాల నమోదు వేగవంతం చేసింది. ఇందుకు మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రకృతి విపత్తుల వేళ పంట దెబ్బ తిన్నప్పుడు గతంలో అనుసరిస్తున్న నిబంధనలే కొనసాగించినా, పరిహారం పెంపు, యాప్ ద్వారా చకచకా నమోదు వంటివి కర్షకులకు సానుకూలంగా మారాయి.

దారుణంగా దెబ్బతింది.. జిల్లావ్యాప్తంగా తుపాను ప్రభావంతో వరిలో గింజ పాలు పోసుకునే దశలో ఉన్న పొలాలు అధికంగా దెబ్బతిన్నాయి. గాలులు, జల్లుల ధాటికి పైరు నేల వాలింది. విషయాన్ని వ్యవసాయ శాఖ అధికారులు గమనించారు. వర్షాలు ఆగి వారమైనా ఇంకా చాలాచోట్ల పైరు అలాగే ఉంది. మరోపక్క మినుము పంట తడిసి మొలకలు వస్తున్నాయి. వర్షాల తీవ్రతకు గింజ రాలిపోయింది. చెరకు, అరటి, మొక్కజొన్న తదితర పంటలకూ నష్టం వాటిల్లింది. వీటిని పరిగణనలోకి తీసుకుంటూ ప్రభుత్వం పరిహారం అందించేలా చర్యలు చేపట్టింది

యాప్‌లో చకచకా వివరాల నమోదు

పరిహారం పెంచిన ప్రభుత్వం

నష్టం వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

పంట నష్టం వివరాలను వ్యవసాయ శాఖకు చెందిన 'ఏపీ ఎయిమ్స్' యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ- పంటను ప్రాతిపదికగా తీసుకుని దెబ్బతిన్న రైతుల వివరాలు ఇందులో పొందుపరుస్తున్నారు. రైతుల నుంచి ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు ఖాతా వివరాలు, కౌలు రైతులైతే కౌలు గుర్తింపు కార్డు తీసుకుంటున్నారు. గతంలో ఉన్న 33 రకాల వివరాలను యథాతథంగా నమోదు చేయిస్తున్నారు. ఆరంభంలో యాప్ పనితీరులో కొంత సాంకేతిక ఇబ్బందులు తలెత్తినా తర్వాత సాఫీగా పని చేసింది. ఒకట్రెండు రోజుల వ్యవధిలోనే నష్టం వివరాలు ప్రభుత్వానికి నివేదించనున్నారు.

పెరిగిన పరిహారం : పెట్టుబడి వ్యయం, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని పరిహారం మొత్తాన్ని ప్రభుత్వం పెంచింది. గతంలో వరికి హెక్టారుకు రూ.17 వేలు, మినుముకు రూ.10 వేలు చొప్పున ఇచ్చేవారు. ఇప్పుడు వరికి రూ.25 వేలు, మినుముకు రూ.15 వేలు ఇవ్వాలని నిర్ణయించింది. మిగతా పంటలకు పరిహారం మొత్తాన్ని ఇదేలా పెంచారు. ఒక్కో రైతుకు గరిష్ఠంగా 5 ఎకరాల వరకు పరిహారం చెల్లించనున్నారు. నమోదు ప్రక్రియ దాదాపుగా కొలిక్కి వచ్చిందని, రెండ్రోజుల వ్యవధిలో 100 శాతం పూర్తవుతుందని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు సునీల్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

వంశీ షరతుల బెయిల్ సడలింపు పిటిషన్ వాయిదా

పటమట, న్యూస్‌టుడే: వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ షరతుల బెయిల్ సడలింపుపై వేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి ఈ నెల 5వ తేదీకి వాయిదా వేశారు. సత్యవర్ధన్ కిడ్నాప్, దాడి కేసులో విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ కోర్టు వంశీకి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా వంశీ నెలలో ప్రతి శనివారం పటమట పోలీస్ స్టేషన్‌లో సంతకం చేయాలి. అనారోగ్య సమస్యల కారణంగా ఈ సంతకాలు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని మూడు నెలల క్రితం న్యాయస్థానంలో ఆయన పిటిషన్ దాఖలు చేశారు. దీంతో నెలలో ప్రతి రెండు, నాల్గవ శని వారాలు సంతకం చేయాలంటూ అప్పుడు న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. అనంతరం నెలలో ఆ రెండు శనివారాలు కూడా సంతకాల నుంచి మినహాయింపు ఇవ్వాలని వంశీ తాజాగా పిటిషన్ దాఖలు చేశారు. ఇది సోమవారం విచారణకు రాగా దీనిని వ్యతిరేకిస్తూ పటమట పోలీసులు కౌంటర్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో విచారణను ఈ నెల 5కు వాయిదా వేస్తూ న్యాయాధికారి భాస్కరరావు తీర్పునిచ్చారు.

నిర్మాణం నిలిచింది.. నిర్లక్ష్యం కనిపిస్తోంది

పెనమలూరు: వైకాపా ప్రభుత్వంలో పెదపులిపాక శ్రీనగర్‌కాలనీలో మంచి నీటి ట్యాంకు నిర్మాణానికి రెండేళ్ల క్రితం శంకుస్థాపన చేసి నిర్మాణం ప్రారంభించగా పనులు పిల్లర్ల దశ దాటలేదు. అప్పటి ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పనులకు శంకుస్థాపన చేశారు. జడ్పీ నుంచి రూ.10 లక్షలు, మండల పరిషత్ రూ.10 లక్షలు, పంచాయతీ రూ.5 లక్షలు మంజూరు చేయాల్సి ఉంది. ఇది నిర్మాణం పూర్తయితే శ్రీనగర్‌కాలనీ, ఎన్టీఆర్‌నగర్, గణపతినగర్, ఎంవీ ఆర్‌నగర్ ప్రాంతాల్లోని దాదాపు 4 వేల మందికి తాగునీటి సౌకర్యం కలుగుతుంది. ట్యాంకు నిర్మాణం చేపట్టాలని అధికారులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదని సర్పంచి గుంటూరు శ్రీనివాసరావు పేర్కొన్నారు. పంచాయతీ నిధులతో పూర్తి చేసుకుంటాం.. అనుమతులివ్వాలని కోరుతున్నా అధికారుల నుంచి స్పందన లేదని తెలిపారు.

పిల్లర్ల దశలో నిలిచిన పనులు

ముంచెత్తిన వర్షం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: హనుమాన్ జంక్షన్‌లో సోమవారం కుండపోతగా కురిసిన వర్షానికి ఆ ప్రాంతం జలమయమైంది. మధ్యాహ్నం 2 గంటల వరకు తీవ్ర ఎండ, ఉక్కపోతతో ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మధ్యాహ్నం జల్లులతో ప్రారంభమైన వాన, సాయంత్రం 4 గంటల తర్వాత జోరుగా పడుతూనే ఉంది. లోతట్టు ప్రాంతాలు, ప్రధాన, అంతర్గత రహదారులపై వర్షపు నీరు స్తంభించిపోయింది. మరోవైపు మొంథా తుపాను ప్రభావం నుంచి ఇప్పుడే తేరుకుంటున్న రైతులకు తాజా వర్షం మరోసారి నష్టం చేకూర్చింది.

హనుమాన్ జంక్షన్‌లో స్తంభించిన నీరు

అరటి ఆకుల వ్యాపారి అనుమానాస్పద మృతి

పెనమలూరు: అరటి తోటలో ఆకులు కోయడానికి వెళ్లిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. చింత మల్లికార్జునరావు (49) తాడిగడప ఎస్వీ ప్రసాద్ ఆసుపత్రి వద్ద నివసించేవాడు. ఇతను అరటి ఆకుల వ్యాపారి. ఆదివారం ఆకులు కోయడానికి తోటలోకి వెళ్లాడు. కొంతసేపటి తర్వాత అటుగా వెళ్లిన నాగరాజు తోటలో మల్లికార్జునరావు పడిపోయి ఉండటాన్ని గుర్తించాడు. వెంటనే అతని కుమారుడు లిలీకు తెలిపాడు. అతను వచ్చి పరిశీలించగా అప్పటికే తండ్రి మృతి చెందినట్లు గుర్తించాడు. ఆదివారం పెనమలూరు పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేశారు. ఇతను గుండెపోటు లేదా పాముకాటుతో మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి దుర్మరణం

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే: విద్యుదాఘాతం కారణంగా మల్లవల్లిలో సోమవారం ఒకరు దుర్మరణం చెందారు. స్థానికంగా ఉన్న పారిశ్రామికవాడను ఆనుకుని ఉన్న పెంధుకోస్తు ప్రార్థనా మందిరంలో సోమవారం పనులు చేస్తుండగా.. మున్నంగి యోహాను(40)కు ఒక్కసారిగా షాక్ కొట్టింది. దీంతో ఇతడిని సమీపంలో ఉన్న మీర్జాపురంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే యోహాను ప్రాణాలు కోల్పోయారు. ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లికి చెందిన ఇతడు ప్రార్థనా మందిరంలో పనులు చేసేందుకు వచ్చి ఇలా మృతి చెందడంతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. వీరవల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం.. నలుగురు అరెస్టు

పెనమలూరు, న్యూస్‌టుడే: పోరంకిలో పెనమలూరు పోలీసులు నలుగురిని అరెస్టు చేసి కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి పోరంకిలో గస్తీ తిరుగుతున్న పోలీసులకు బీజేఆర్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఏడుగురు తారసపడ్డారు. వీరిలో ముగ్గురు పరారయ్యారు. నలుగురిని సోదా చేయగా వీరి నుంచి రూ.7 వేల విలువైన కిలోన్నర గంజాయి దొరికింది. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. వీరిలో నంద్యాలకు చెందిన కన్నిబోయిన వెంకట పార్థసారథి, మన్నే అకేష్ (నున్న), నందేటి సాత్విక్ (పోరంకి), మరో బాలుడు ఉన్నారు. సోమవారం వారిని కోర్టులో హాజరుపరిచారు.

ఆడపిల్లలూ.. అప్రమత్తత తప్పనిసరి

ఉయ్యూరు, న్యూస్‌టుడే : నేడు పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, ముఖ్యంగా ఆడపిల్లలు అప్రమత్తంగా ఉండాలని ఉయ్యూరు పట్టణ సీఐ టి.వి.వి.రామారావు అన్నారు. స్థానిక ఎం.కె. విద్యాసంస్థల డైరెక్టర్ ఎం.కె.బాబు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన 'బ్యాడ్ టచ్' కార్యక్రమంలో ఆయన పాల్గొని జాగ్రత్తలు వివరించారు. [illegible] ఉండాలని చెప్పారు. ఎవరిపైనా అనుమానం కలిగితే వెంటనే తల్లిదండ్రులకు, పోలీసులకు తెలపాలని కోరారు. నడవడికలో జాగ్రత్తలు తీసుకోవాలని, చెడు వ్యసనాలకు బానిసలు కలిగిన యువతకు దూరంగా ఉండాలని చెప్పారు.

ప్రసంగిస్తున్న సీఐ రామారావు

గ్రామాల అభివృద్ధికి తోడ్పడండి

తాడిగడప (కానూరు), న్యూస్‌టుడే: ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సమాజ సేవ చేస్తూ గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని సిద్ధార్థ డీమ్డ్ విశ్వ విద్యాలయం ఉప కులపతి పి.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం తాడిగడపలో ఎన్ఎస్ఎస్ సేవా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆధార్ అప్లికేషన్ సర్వే, ప్రభుత్వ పథకాల అవగాహన సర్వే, మిల్లెట్స్ అవగాహన ప్రచారం చేపడుతున్నారని చెప్పారు. [illegible] తరం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలపై ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అవగాహన చేపట్టారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త శివరాంప్రసాద్, కె.మాధవి, సుష్మా చౌదరి, కొల్లా నరేంద్ర పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న ఉప కులపతి వెంకటేశ్వరరావు

మాక్ అసెంబ్లీలో మా ఎమ్మెల్యే అక్షయ

ఉయ్యూరు, న్యూస్‌టుడే : శాసనసభలో నవంబరు 26 రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో పెనమలూరు నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉయ్యూరు జడ్పీ విద్యార్థిని ఉప్పల అక్షయ పాల్గొననున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.వి.నాగేశ్వరరావు తెలిపారు. పాఠశాలలో సోమవారం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో తమ పాఠశాల విద్యార్థిని అక్షయ ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఆమెను ఉప విద్యాశాఖాధికారిణి పద్మారాణి, ఉయ్యూరు ఎంఈవో సుధారాణి, హెచ్‌ఎం. నాగేశ్వరరావు అభినందించారు.

అక్షయను అభినందిస్తున్న ఎంఈవో సుధారాణి

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ఆకునూరు (ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే : ఆకునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న టి.ధనుంజయ్, వి.రాజశేఖర్ నవంబరు 25 నుంచి 30 వరకు హర్యానా రాష్ట్రంలోని భివానీలో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఫిజికల్ డైరెక్టర్ కె.వి.నారాయణరావు తెలిపారు. ఇటీవల ఏలూరు జిల్లా పెదవేగిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి పోటీల్లో అథ్లెటిక్స్ అండర్-19 విభాగంలో టి.ధనుంజయ్ వంద మీటర్ల పరుగులో ప్రథమ, 200 మీటర్ల పరుగులో ద్వితీయ, 4×100 రిలేలో ప్రథమ స్థానం, వి.రాజశేఖర్ 4×100 మీటర్ల రిలే పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. వీరు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టులో పాల్గొంటారని చెప్పారు. క్రీడాకారులను సోమవారం కళాశాలలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి ఎస్.సరళకుమారి, ప్రిన్సిపల్ వి.ఎస్.బి.రామలక్ష్మి అభినందించారు.

విద్యార్థులతో డీఐఈఓ సరళకుమారి, ప్రిన్సిపల్ రామలక్ష్మి, నారాయణరావు

కరాటేలో దూకుడు

కంకిపాడు : 'నిస్కిన్ మంక్స్' మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో విజయవాడలోని రవీంద్ర కన్వెన్షన్‌లో 2న నిర్వహించిన కరాటే పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి పలు పతకాలు సాధించారని కంకిపాడు సెయింట్ మేరీస్ హైస్కూల్ కరస్పాండెంట్ ముప్పల సాల్మన్‌రాజు, ప్రిన్సిపల్ చిత్ర తెలిపారు. పతకాలు సాధించిన వారిలో జూనియర్స్ విభాగంలో యు.జస్వంత్, పి.విరాట్‌కృష్ణ, వి.రూపిక ప్రజ్వల, సీహెచ్ రుద్రాక్ష సబ్ జూనియర్స్ విభాగంలో ఎ.అక్ష ఉన్నారని పేర్కొన్నారు. సోమవారం పాఠశాలలో వారిని, శిక్షకులను అభినందించారు.

పతకాలు సాధించిన విద్యార్థులతో పాఠశాల ప్రతినిధులు

వెయిట్ లిఫ్టింగ్‌లో ఎంపికలు

పోరంకి, న్యూస్‌టుడే : పోరంకి సాలిపేటలో కృష్ణా జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ నేతృత్వంలో క్రీడాకారుల ఎంపిక చేపట్టారు. సోమవారం 48 కిలోల విభాగంలో నాగఅను, 63 కిలోల విభాగంలో గాయత్రి, 77 కిలోల విభాగంలో ఝాన్సీ, 101 కిలోల విభాగంలో విష్ణువర్ధిన్ ఎంపికయ్యారని ఏపీ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.దామోదర్ తెలిపారు. ఈ నెల 14, 15 తేదీల్లో విజయనగరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వీరికి శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి గుర్రాల రవి, ఎం.వెంకటేశ్వరరావు, లింగేశ్వరరావు, త్రినాథ్, వినోద్, టి.అశోక్ పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన చిన్నారులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడలో జరిగిన అస్మాకప్ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో గన్నవరం మండలం ముస్తాబాదకు చెందిన నవభారత్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మొత్తం 15 మంది కాంస్య పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ షేక్ ఇమామ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విజేతలను సోమవారం అభినందించారు.

తైక్వాండోలో పతకాల పంట

ఉయ్యూరు : ఒంగోలులో తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి 23వ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఉయ్యూరు శ్రీనివాస అక్షరాలయ విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. పదేళ్లలోపు విభాగంలో సాకేత్, ఎం.దీవెన, సుమిత్, పునీత్, సాహన్, తనూజ్, 12 ఏళ్ల విభాగంలో సాయిచరణ్, జె.ప్రభు, నాగత్రిలోక్, 14 విభాగంలో సాకేత్, సందీప్ పతకాలు సాధించారు. వీరిని సోమవారం పాఠశాలలో విద్యాసంస్థ అధినేత డాక్టర్ పరుచూరి శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ నీలిమ, కోచ్ శ్రీనివాస్ అభినందించారు.

విజేతలతో ఉపాధ్యాయులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

కనకదుర్గమ్మ ఆలయంలో 7న గాజుల అలంకరణ

యనమలకుదురు, న్యూస్‌టుడే : యనమలకుదురు లాకుల కూడలిలోని కనకదుర్గమ్మ ఆలయంలో 7 శుక్రవారం అమ్మవారికి గాజుల అలంకరణ చేస్తున్నట్లు ఆలయ ఈవో యువీ ప్రసాదరావు తెలిపారు.

మత్స్యకారులకు బియ్యం పంపిణీ

మద్దూరు (కంకిపాడు), న్యూస్‌టుడే : వరుస వరదలతో ఉపాధి కోల్పోయిన మద్దూరుకు చెందిన 242 మంది మత్స్యకారులకు 50 కిలోల చొప్పున బియ్యాన్ని సోమవారం పంపిణీ చేశారు. వీఆర్వో చైతన్య, సర్పంచి చిప్పల రాందాస్, తెదేపా నాయకులు యనమదల మదన్ మోహన్, వెంకటేశ్వరరావు, రావి సుబ్బారావు, వల్లె నరసింహారావు, తీట్ల మధుబాబు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

నున్న, న్యూస్‌టుడే: నున్న వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో రాయల్ క్లబ్ అమరావతి, జాతీయ సేవా సమితి సంయుక్తంగా సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించాయి. సుమారు 50 మంది రక్తదానం చేశారు. 97 యూనిట్ల రక్తాన్ని బ్లడ్ బ్యాంక్ వారు సేకరించారు. కళాశాల సెక్రటరీ సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపల్ డా.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్

కానూరు, న్యూస్‌టుడే : స్థానిక నారాయణ ఈ టెక్నో పాఠశాలలో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమం సోమవారం ఉత్సాహంగా సాగింది. పాఠశాలలో చిన్నారులు తాము నేర్చుకున్న పాఠాలను తల్లిదండ్రులకు వివరించారు. చిన్నారులు ఉపాధ్యాయుల

అవీ ఇవీ

పాత్రలో తమ తల్లిదండ్రులకు పాఠాలు చెప్పారు. ఆర్‌అండ్‌డీ మారియా, క్లస్టర్ ప్రిన్సిపల్ ముత్తారెడ్డి, కిడ్స్ కో- ఆర్డినేటర్ సరళ, ప్రిన్సిపల్ హేమంత్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ మేరీ, మాధురి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దీక్షాపరులకు అన్నదానం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: అయ్యప్ప దీక్షాధారులకు కొయ్యూరు చంద్రశేఖరస్వామి ఆలయంలో ఏటా 41 రోజులు నిరంతరాయంగా అన్నదానం చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. సోమవారం జరిగే 33వ రోజుకు అన్నదానం బాపులపాడుకు చెందిన కొల్లి రవి, మోహనజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించారు. దీపక్ నెక్స్‌జెన్ పరిశ్రమ తోడ్పాటు, ఇతర దాతలు, అయ్యప్పలతో పాటు, భవానీ, శివ దీక్షలు చేపట్టిన వారికి గత ఎనిమిదేళ్లుగా అన్నదానం నిర్వహించడంపై దీక్షాధారులు ఆనందం వ్యక్తం చేశారు.

వ్యాధుల నియంత్రణపై అవగాహన

కేసరపల్లి (గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే: గన్నవరం మండలం కేసరపల్లి శివారు డా.ఎన్టీఆర్ వెటర్నరీ పశువైద్య కళాశాల ఆవరణలో జూనోటిక్ వ్యాధులపై సోమవారం అవగాహన కల్పించారు. జాతీయ సాంక్రమిక వ్యాధుల నియంత్రణ సంస్థ, భారత ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పశువైద్య సూక్ష్మ, జీవశాస్త్ర విభాగాధిపతి డా.ఆనంద్‌కుమార్ వివిధ అంశాలు, వ్యాధుల నియంత్రణపై అవగాహన కల్పించారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు. రైతులు, డా.మస్తాన్‌బి, డా.జితేంద్ర, డా.పి.శిరీష తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కల్పిస్తున్న ఆనంద్‌కుమార్

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

ఉంగుటూరు మండలం పెద్దఅవుటపల్లి సెయింట్ జార్జ్ ఆర్‌సీఎం పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. దీనిని ఎంఈవో సాంబశివరావు.. మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు కొండేటి వెంకటేశ్వరరావు, సీబీఎన్ ఫోరం అధ్యక్షుడు కలపాల కిరణ్, సొసైటీ అధ్యక్షుడు ఆళ్ల చిరంజీవి, ప్రిన్సిపల్ ప్రతిమశ్యామలతో కలిసి ప్రారంభించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అతిథులు అభినందించారు. తెదేపా నాయకులు తంబి తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, పెద్దఅవుటపల్లి(గన్నవరం గ్రామీణం)

లారీ ఢీకొని తీవ్ర గాయాలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : 16వ జాతీయ రహదారిపై అంపాపురం వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో తేలప్రోలుకు చెందిన గోవాడ అనిల్ తీవ్రంగా గాయపడ్డాడు. తేలప్రోలుకు చెందిన గోవాడ అనిల్ స్థానికంగా ఉన్న పరిశ్రమలో పనిచేస్తుంటారు. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో ఇతడు అంపాపురం వైపు నుంచి సర్వీసు రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన అనిల్‌ను అత్యవసర వాహనంలో తొలుత చిన్నఅవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ ఆసుపత్రికి ఆ తర్వాత విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వీరవల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శివాలయాల్లో ఆధ్యాత్మిక శోభ

పెనమలూరు, హనుమాన్ జంక్షన్, కంకిపాడు గ్రామీణ, గన్నవరం గ్రామీణ, న్యూస్‌టుడే : కార్తికమాసం, సోమవారాన్ని పురస్కరించుకొని జిల్లాలో శివాలయాలకు వేకువజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పూజలు చేశారు. మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు.

విశేషాలంకరణలో భీమేశ్వరస్వామి



పెరికీడులో ముక్తేశ్వరస్వామి

కంకిపాడులో

గన్నవరంలో..

బాపులపాడులో మల్లికార్జునస్వామి

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
RASMEC-22005, డి.నెం.15-8-210/1, ఖానాపురం హవేలి పోలీస్ స్టేషన్ ఎదురుగా, శ్రీనగర్ కాలనీ, వైరా రోడ్డు, ఖమ్మం-507002, తెలంగాణ.
☎08742-258633, ఫ్యాక్స్ : 254621, email : sbi.22005@sbi.co.in

అనుబంధం – IV-A [నిబంధన 8(6) అంశాలు చూడండి]

స్థిరాస్తులు అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

స్థిరాస్తులు అమ్మకానికి 2002 నాటి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు లోని నిబంధన 8(6) అంశాలతో చదువుకొనేలా 2002 నాటి సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం క్రింద ఇవ్వబడిన ఈ-వేలం అమ్మకం ప్రకటన.
రుణదాతకు తనఖాపెట్టిన / ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిచే భౌతికంగా స్వాధీనం చేసుకోబడిందని, సదరు ఆస్తులను రుణదాతచే "ఎక్కడ ఉన్నది అక్కడే" "ఉన్నది ఉన్నట్లే" మరియు "యథాతథం" ప్రాతిపదికపై **రూ. 39,58,875/- (అక్షరాల ముప్పై తొమ్మిది లక్షల యాభై ఎనిమిది వేల ఎనిమిది వందల డెబ్బై ఐదు రూపాయలు మాత్రమే) కు తేది.20.11.2025న** విక్రయించబడునని, **ది.16.05.2025 నాటికి బకాయిపడిన లోన్ ఔట్‌స్టాండింగ్ మొత్తం రూ.47,71,536/-** మరియు అదనపు వడ్డీ, మొత్తం ఖర్చులు మొ॥ వాటితో సహా గల మొత్తాన్ని వసూలు చేయుటకై ఆస్తులు విక్రయించబడుచున్నవని **ఋణగ్రస్తుడు: శ్రీ మట్టా రఘురామ్, తండ్రి: కాశీవిశ్వనాథరావు,** హెచ్.నెం.2-15, మెయిన్ రోడ్డు, బేతుపల్లి, ఖమ్మం-507303 కు సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రస్తుడు(లు) మరియు హామీదారుడు(లు) లకు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.

స్థిరాస్తుల వివరములు

గుండాల జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ నందు రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు నెం. 8838/2019 ద్వారా శ్రీ మట్టా రఘురామ్‌కు చెందిన ఆస్తి. ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, విజయవాడ రూరల్ మండలం, ఎనికెపాడు జీపి లిమిట్స్, అసెస్‌మెంట్ నెం.1873, వార్డు నెం.7, ఆర్.సర్వే నెం. 204/10రు నందు 171.00 చ॥గ॥ / 142.97 చ॥మీ॥ విస్తీర్ణముగల స్థలము మరియు అందులో 792.00 చ॥అ॥ / 73.57 చ॥మీ॥ విస్తీర్ణముగల వాస్తవ ప్లింత్ ఏరియాలోని ఆర్‌సిసి రూఫ్ భవనము హెచ్.నెం. 7-113 (పాతది), 10-24 (క్రొత్తది) కి సంబంధించిన యావదాస్తి.
దీనికి హద్దులు: ఆస్తి యొక్క హద్దులు: తూర్పు: శ్రీ దాసరి పూర్ణయ్య యొక్క ఆస్తి 35 అ॥ వెడల్పు; **పడమర:** గ్రామపంచాయతీ రోడ్డు 32 అ॥ వెడల్పు; **ఉత్తరం:** శ్రీ గాజుల ఉమా మహేశ్వరరావు యొక్క ఆస్తి 45.6 అ॥ వెడల్పు; **దక్షిణం:** గ్రామపంచాయతీ రోడ్డు 46.9 అ॥ వెడల్పు.

రిజర్వుధర, బయానా వివరములు మరియు ఇ-వేలం తేది & సమయం

క్ర సం.	వేలం వేయు స్థిరాస్తి	వేలం వేయు తేది & సమయం	ఆస్తి రిజర్వుధర క్రింద తెలిపిన ధరకు తగ్గంచి విక్రయించబడదు (రూ.లలో)	బయానా చేయు మొత్తం (రూ.లలో)	బిడ్ పెంపుదల (రూ.లలో)
1	రెసిడెన్షియల్ ఆస్తి	20.11.2025 ఉ॥ 11 గం॥ నుండి మ॥ 2 గం॥ వరకు	రూ.39,58,875/-	రూ.3,95,888/-	రూ.25,000/-

బిడ్ అప్లికేషన్ తీసుకొనుటకు చివరి తేది: 20.11.2025 ఉదయం 11.00 గం.ల వరకు
విక్రయానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెక్యూర్డ్ క్రెడిటార్ వెబ్‌సైట్ : https://baanknet.com ని సంప్రదించవచ్చును.

తేది : 01.11.2025
ప్రదేశము : ఖమ్మం
సం/– అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

SBI భారతీయ స్టేట్ బ్యాంక్
హోమ్ లోన్ సెంటర్-2 (ఆర్‌ఎసిపిసి-2), డోర్ నెం: 59-13-4, ఘంటసాలవారి వీధి, గాయత్రి నగర్, విజయవాడ-520008

స్వాధీనత ప్రకటన

APPENDIX IV (రూలు-8(1) (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం-2002 (నెం.54 ఆఫ్ 2002) ప్రకారం భారతీయ స్టేట్ బ్యాంక్, హోమ్ లోన్ సెంటర్-2 (ఆర్‌ఎసిపిసి-2), విజయవాడ, యన్‌టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క సెక్షన్ 13(12) 3వ నిబంధన క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపు నోటీసులో తెలిపిన మొత్తము బకాయి ది.14-07-2025 నాటికి **రూ.34,49,663/-** (అక్షరాల ముప్పైనాలుగులక్షల నలభైతొమ్మిదివేల ఆరువందల అరవైమూడు రూపాయిలు మాత్రమే) మరియు ది:15-07-2025 నుండి చెల్లించవలసిన వడ్డీ, ఖర్చులతో సహా చెల్లించమని కోరుతూ ఋణగ్రహీత: **శ్రీ పొన్నూరు లక్ష్మీపతి, తండ్రి:** బ్రహ్మాచారి, కందుకూరు, వేమ్‌సూర్ మండలం, ఖమ్మం జిల్లా, తెలంగాణ-507164. **హెచ్‌యల్ నెంబర్లు: 40915167146, 40929607036** వీరిని కోరుతూ **ది:14-07-2025** వ తేదీన డిమాండు నోటీసును మరియు **ది:22-08-2025** న పత్రికా ప్రకటన జారీచేయడమైనది.

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో ఋణగ్రహీత విఫలమైనందున సదరు రూల్ "8"తో చదువుకొనవలసిన సదరు చట్టం ద్వారా సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన స్థిరాస్తిని సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 ప్రకారం ఈ దిగువ సంతకందారు ఈ రోజున సింబాలిక్ స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీతకు / తనఖాదారు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఈ స్థిరాస్తితో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని, ఏవేని లావాదేవీలు జరిపిన పక్షంలో అవి భారతీయ స్టేట్ బ్యాంక్ యొక్క ఛార్జికి మొత్తం బకాయి 14-07-2025 నాటికి మొత్తము బకాయి **రూ.34,49,663/-** మరియు తదుపరి వడ్డీ + ఖర్చులు మొదలగువాటికి లోబడి ఉంటాయని ఋణగ్రహీతకు/తనఖాదారుకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియపరచటమైనది.

ఋణగ్రహీతలు సదరు చట్టంలో సబ్ సెక్షన్(8) ఆఫ్ సెక్షన్ 13 ప్రకారం తనఖా ఆస్తిని గడువులోపల విడిపించుకొనుటకు గాను దృష్టి సారించవలసి ఉన్నది.

తనఖాపెట్టిన స్థిరాస్తి వివరము

యన్‌టీఆర్ జిల్లా, విజయవాడ రూరల్, నున్న గ్రామ పంచాయితి, ఆర్‌యస్ నెం.797/1, సమీప డోర్ నెం.15-45, టీకెఆర్ టవర్స్ అపార్ట్‌మెంట్, ఫ్లాట్ నెం.315, రెండవ అంతస్థు, ప్లింత్ ఏరియా 907 చ॥అడుగులు, కామన్ ఏరియా 141 చ॥అడుగులు, పార్కింగ్ ఏరియా 125 చ॥అడుగులతోపాటు మొత్తం విస్తీర్ణం 4791.60 చ॥గ॥లలోని అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపపు భాగము 52 చ॥గ॥లు కలిగిన భవనము శ్రీ పొన్నూరు లక్ష్మీపతి, తండ్రి: బ్రహ్మాచారి గారికి చెందిన రిజిష్టర్డ్ సేల్‌డీడ్ నెం.1377/2022, తేది:12-04-2022, నున్న జెయస్‌ఆర్ఓ, విజయవాడ రూరల్, యన్‌టీఆర్ జిల్లా. **అపార్ట్‌మెంట్ హద్దులు:** తూర్పు: వేమా నారాయణరెడ్డి గారి ఆస్తి, దక్షిణం: ముస్తాబాద రోడ్డు, పడమర: కుందావారి కంద్రిక పొలిమేర, ఉత్తరం: మెస్సర్స్ యంయస్‌బిటి భగవతి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ యల్‌యల్‌పి యొక్క ఆస్తి.
ఫ్లాట్ హద్దులు: తూర్పు: ఉమ్మడి వరండా, దక్షిణం: మెట్లు మరియు ఓపెన్ టు స్కై, పడమర: ఓపెన్ టు స్కై ఉత్తరం: ఓపెన్ టు స్కై.

తేది : 29-10-2025
ప్రదేశం: విజయవాడ
అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

అన్నదానం ట్రాలీలు.. హుండీల బహూకరణ

అన్నదాన ట్రాలీలను అందజేస్తున్న దాతలు

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఉపయోగించే నాలుగు ట్రాలీలను కోడూరుకు చెందిన శిద్దినేని వంశీ మణికంఠ-సాయిలక్ష్మీప్రసన్న కుటుంబ సభ్యులు సోమవారం ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాద్‌కు వితరణగా అందజేశారు. ➡ నిత్యాన్నదానశాలలో ఏర్పాటు చేసేలా రెండు కానుక హుండీలను గుంటూరు జిల్లా తెనాలికి చెందిన తాడివాక చిన్నిశేషతల్పసాయి-రమాదేవి కుటుంబ సభ్యులు బహూకరించారు.

డిప్యూటీ ఎంపీడీవోగా చంద్రశేఖర్

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: అవనిగడ్డ మండలం డిప్యూటీ ఎంపీడీవోగా డి.చంద్రశేఖర్ నియమితులయ్యారు. కాకినాడ జిల్లా పెద్దాపురం ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ సహాయకునిగా పనిచేస్తున్న చంద్రశేఖర్ అవనిగడ్డకు ఉద్యోగోన్నతిపై వచ్చారు.

అర్బన్ బ్యాంకుకు ఎన్నికలు నిర్వహించండి

గుడివాడ, న్యూస్‌టుడే: ది గుడివాడ కో- ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు పాలకవర్గానికి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని గుడివాడ పట్టణ సీపీఎం కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చరిత్ర కలిగిన బ్యాంకుకు చాలాకాలంగా ఎన్నికలు నిర్వహించకపోవడం దారుణమని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

గుడివాడ: 89775 35999 పామర్రు : 80085 74684 అవనిగడ్డ: 80085 74679

★ గుడివాడ పట్టణ శివారు బేతవోలు సాయిబాబా గుడి రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించారు. ★ గుడివాడ పట్టణ గౌరీశంకరపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద చెట్టు కూలేందుకు సిద్ధంగా ఉందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించారు. ★ గుడివాడ పట్టణ శివారు నిమ్మతోట ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో విద్యుత్తు స్తంభానికి పిచ్చి మొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా మారిందని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా. అధికారులు స్పందించి తొలగించారు. ★ గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం వ్యాయామశాలలో పరికరాలు తుప్పుపట్టి, ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగి సాధకులకు ఇబ్బందిగా ఉందని 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. అధికారులు సమస్య పరిష్కరించారు.
-గుడివాడ(సత్యనారాయణపురం), న్యూస్‌టుడే

? గుడివాడ పట్టణంలోని రాజేంద్రనగర్‌లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రాత్రి పూట వెంటపడుతున్నాయి. పురపాలక అధికారులు చర్యలు తీసుకోవాలి. -ఎ.శ్రీనివాస్, రాజేంద్రనగర్ ✔ చట్ట ప్రకారం కుక్కల సంతానోత్పత్తి నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. -పి.శ్రీనివాసరావు, సహాయ కమిషనర్ -గుడివాడ, న్యూస్‌టుడే

మంజూరు 49.. పూర్తయినవి 16!

అవనిగడ్డ, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామంటూ ఆర్భాటంగా ప్రారంభించిన ఆరోగ్య కేంద్రాల భవనాల నిర్మాణాలు లక్ష్యానికి దూరంగా నిలిచాయి.

అవనిగడ్డ నియోజకవర్గంలో 49 కేంద్రాలు మంజూరు చేయగా, కేవలం 16 మాత్రమే పూర్తిచేయగలిగారు. వీటి నిర్మాణానికి అప్పట్లో రూ.17.5 లక్షల చొప్పున మంజూరు చేశారు. అవి సరిపోలేదు. అనంతరం అదనంగా మరో రూ.2 లక్షలు మంజూరు చేస్తామన్నారు. అయినప్పటికీ నిర్మాణాలు ముందుకు సాగలేదు. కొన్ని పునాది స్థాయిలోనే ఆగిపోగా.. మరికొన్ని వివిధ దశల్లో నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో పలు గ్రామాల్లో అద్దె గృహాల్లో కేంద్రాలు నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా ఆయా భవనాలను పూర్తి చేసి, పేదలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

నియోజకవర్గంలో భవనాల నిర్మాణం ఇలా..

మండలం	మంజూరు	పూర్తి	అసంపూర్తిగా ఉన్నవి
అవనిగడ్డ	08	05	03
చల్లపల్లి	11	02	09
ఘంటసాల	08	01	07
కోడూరు	05	02	03
మోపిదేవి	08	01	07
నాగాయలంక	09	05	04

అవనిగడ్డ ఆరోగ్య కేంద్ర భవనం నిర్మాణం

పౌర్ణమి స్నానాలకు అనుమతి

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: కార్తిక పౌర్ణమి సందర్భంగా పాలకాయతిప్ప వద్ద ఈ నెల 5న సముద్రస్నానాలకు అనుమతి ఇవ్వాలని సోమవారం కోడూరు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన వివిధ శాఖల సమావేశంలో నిర్ణయించారు. అంతకుముందు సముద్రం వద్ద పరిస్థితిని పోలీసు, మెరైన్ అధికారులు పరిశీలించారు. సంగమ ప్రదేశానికి ఎవరికీ అనుమతి లేదన్నారు. సముద్రంలో కూడా నడుం లోతుకు మించి వెళ్లరాదన్నారు. సమావేశంలో తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి, ఎంపీడీవో సుధాప్రవీణ్, పోలీసు,మెరైన్ సీఐలు యువకుమార్, సురేష్‌రెడ్డి, ఎస్ఐ చాణక్య, పూర్ణమాధురి పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలో ప్రతిభ

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన చిత్రలేఖన పోటీకి విశేష స్పందన లభించింది. ప్రకృతి అందాలు (పర్వతాలు, నదులు, చెట్లు, జంతువులు, పక్షులు) అనే అంశంపై నిర్వహించిన పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అందమైన చిత్రాలు గీసి, రంగులు అద్ది ఆకట్టుకున్నారు. ఎం.ప్రమోద్, ప్రథమ, బి.గగన సాయి ప్రజ్వల ద్వితీయ, ఎస్.విక్కీ తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. ప్రిన్సిపల్ దొరబాబు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు.

బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపల్ దొరబాబు

దివిసీమ ఆధ్యాత్మిక పర్యటన సఫలం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: దివిసీమ ఆధ్యాత్మిక పర్యటన సఫలమైందని ప్రముఖ ప్రవచనకర్త, ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు చెప్పారు. సోమవారం ఆయన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గృహానికి విచ్చేశారు. తన వెంట ఉంటూ.. సహాయ సహకారాలు అందించారని బుద్ధప్రసాద్‌కు ఆయన తనయుడు వెంకట్రామ్‌కు చాగంటి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా ఆయన ఆశీస్సులు తీసుకుని ఘనంగా సత్కరించారు. దేశ భాషలందు తెలుగు లెస్స అనే పుస్తకాన్ని బహూకరించారు.

కోటేశ్వరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

కోడూరు (అవనిగడ్డ): కార్తిక సోమవారం సందర్భంగా చాగంటి కోటేశ్వరరావు ప్రముఖ పుణ్యక్షేత్రం హంసలదీవి వేణుగోపాలస్వామి, సాగరసంగమ ప్రదేశాలను దర్శించుకున్నారు. సాగరం వద్ద పండితుల ఆశీర్వాదం తీసుకుని, పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆలయ విశిష్టతను వివరించారు. పోలీసు అధికారులు దుశ్శాలువాలతో చాగంటిని ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ జనసేన నాయకులు మండలి వెంకట్రామ్, సీఐ యువకుమార్, మెరైన్ సీఐ సురేష్‌రెడ్డి, ఎస్సై చాణక్య, మెరైన్ ఎస్సై పూర్ణమాధురి పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

వేకనూరు కాశీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి

చల్లపల్లి మండలం లక్ష్మీపురంలో అర్ధనారీశ్వర అలంకారంలో సోమేశ్వరస్వామి

అంగలూరు అమరేశ్వరాలయంలో సర్వాలంకరణ

నిమ్మకూరులో..

పమిడిముక్కలలో గాజుల అలంకారంలో పార్వతీదేవి

కార్తిక సోమవారం సందర్భంగా గుడివాడ, అవనిగడ్డ, పామర్రు నియోజకవర్గాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్తిక దీపాలు వెలిగించారు. -న్యూస్‌టుడే, బృందం

రామలింగేశ్వరుడికి రుద్రాక్షలతో అభిషేకం

నాగాయలంక, న్యూస్‌టుడే: నాగాయలంకలోని శ్రీరామపాద క్షేత్రం పుష్కర ఘాట్ కృష్ణానది ఒడ్డున కొలువైన గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామికి సోమవారం ఆంబా సాయికిరణ్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, నవ జ్యోతులు సమర్పించారు. 10,800 రుద్రాక్షలతో అభిషేకం చేసి అలంకరించారు. భక్తులు కార్తిక దీపాలు వెలిగించారు.

నాగాయలంకలో..

గుడివాడలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

రామలింగేశ్వరుడికి రుద్రాక్షలతో అభిషేకం చేస్తున్న ఆగమ పండితులు, ఆలయంలో భక్తజన సందోహం

ఘనంగా ప్రతిష్ఠోత్సవాలు

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: స్థానిక మంచినీటి చెరువు సమీపంలో గ్రామస్థులు, దాతల విరాళాలు సుమారు రూ.45 లక్షలతో పునర్నిర్మించిన గంగానమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముహూర్త సమయంలో గంగానమ్మ, పోతురాజుస్వామి విగ్రహాలు, ఆలయ శిఖర ప్రతిష్ఠలు చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. మహిళలు పాలపొంగళ్లు వండి ప్రదర్శనగా అమ్మవారి ఆలయానికి వచ్చి కుంభం పోశారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

పాలపొంగళ్లతో మహిళల ప్రదర్శన

అభయాంజనేయ స్వామి సన్నిధిలో వర్ల కుమార్ రాజా

పెదపారుపూడి, న్యూస్‌టుడే : మండలంలోని పాములపాడులో నూతనంగా నిర్మించిన ఆలయంలో కార్యసిద్ధి అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన యాకమూరు రామబ్రహ్మం, రాము జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు, గ్రామస్థుల సహకారంతో ఆలయాన్ని నిర్మించారు. ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

వృద్ధురాలి నేత్రాలు దానం

నిర్మల(పాతచిత్రం)

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: విశ్రాంత ఉపాధ్యాయుడు సూరపనేని పరంధామయ్య భార్య నిర్మల(83).. వయోభారంతో సోమవారం తెల్లవారుజామున మృతిచెందారు. ఆమె భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తెల అంగీకారంతో తాడిగడప ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది వచ్చి.. రెండు కార్నియాలను సేకరించారు. నిర్మల మృతదేహానికి లయన్స్ మాజీ గవర్నర్ వైవీపీ ప్రసాద్, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మోహన్‌రావు, చాపరాల బాలాజీ తదితరులు నివాళులర్పించారు.

అభివృద్ధి పనులకు రూ.8 కోట్లు

రహదారులు, డ్రెయిన్లు, పార్కుల మెరుగుకు కేటాయింపు

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ పట్టణంలో ప్రజా సమస్యల పరిష్కారానికి, పలు అభివృద్ధి పనులకు క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఆర్‌డీఏ) సుమారు రూ.8 కోట్లు కేటాయించింది. దీంతో టిడ్కో కాలనీలో నీటి సమస్య పరిష్కారానికి సుమారు రూ.40 లక్షలతో బోర్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభించారు. అలాగే పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు డ్రెయిన్ల నిర్మాణానికి రూ.3.20 కోట్లు కేటాయించారు. దీనిలో భాగంగా రాజేంద్రనగర్‌లో ప్రధాన రహదారి నిర్మాణం, ఆర్డీవో కార్యాలయం మార్గం విస్తరణ, గౌరీశంకరపురంలో ప్రధాన దారి, విజయవాడ మార్గాన్ని అభివృద్ధి చేయనున్నారు. రూ.3.50 కోట్లతో బైపాస్ రోడ్డుకు ఇరువైపులా చింతల కాలువ వరకూ డ్రెయిన్ల నిర్మాణం చేస్తారు. బంటుమిల్లి రోడ్డులో మురుగు కాలువలో వరద సాఫీగా పారేలా విస్తరణ కల్వర్టు, సైఫన్ల ఏర్పాటు చేస్తారు. వర్షానికి ముంపు బారిన పడుతున్న సత్యనారాయణపురంలో డ్రెయిన్లు, మూడు రహదారుల నిర్మించనున్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న తుమ్మల సీతారామబ్రహ్మం మున్సిపల్ పార్కు అభివృద్ధికి రూ.1.17 కోట్లు విడుదలయ్యాయి. చాలా పనులకు టెండర్లు పూర్తయ్యాయి. అవి పూర్తయితే పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం దొరకుతుంది.

అభివృద్ధి చేయనున్న తుమ్మల రామబ్రహ్మం పార్కు

సత్యనారాయణపురంలో జలమయమైన రోడ్డు

భారత రాజ్యాంగం ఓ దిక్సూచి

గుడివాడ, న్యూస్‌టుడే : దేశంలోని ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగం ఓ దిక్సూచి లాంటిదని.. ఎలా జీవించాలి, ఎలా జీవించరాదో దీని ద్వారా తెలుసుకోవచ్చని మండల విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు సోమవారం వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపిన అక్షిత (ఏకేటీపీ పురపాలక బాలికల ఉన్నత పాఠశాల గుడివాడ) ప్రథమ, నూర్జహాన్ (ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అంగలూరు) ద్వితీయ, సింహాద్రి (ఏజీకే పురపాలక ఉన్నత పాఠశాల, గుడివాడ) తృతీయ స్థానాలు పొంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దీంతో విజేతలను గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండల విద్యాశాఖ అధికారులు సీహెచ్ రజిని, బి.బాలాజీ, కె.శ్రీనివాస్, జి.డేవిడ్ రాజు, గోపాలరావు తదితరులు అభినందించారు.

విజేతలతో మండల విద్యాశాఖ అధికారులు

పంచాయతీ నిధులు దుర్వినియోగం.. జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : తోట్లవల్లూరు పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై జూనియర్ అసిస్టెంట్ ఎన్.సునీల్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ డీపీవో జె.అరుణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అక్టోబరులో 'పంచాయతీ నిధులు దుర్వినియోగం' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై డీపీవో ఆదేశాల మేరకు డీఎల్‌పీవో సంపత్‌కుమారి విచారణ చేసి నివేదిక అందజేశారు. విచారణలో తోట్లవల్లూరులో 14 పంచాయతీ దుకాణాల అద్దె రూ.1,49,600 వసూలు చేసి పంచాయతీకి జమ చేయకుండా జూనియర్ అసిస్టెంట్ సొంతానికి వాడుకున్నట్లు తేలింది. దీంతో డీపీవో జూనియర్ అసిస్టెంట్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

ఘంటసాల, న్యూస్‌టుడే: లంకపల్లి-మాజేరు రోడ్డులో ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగ తగిలి ఇటీవల మృతిచెందిన కుంపటి కోటయ్య కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శీలం నారాయణరావు, ఆ పార్టీ ఘంటసాల మండల కార్యదర్శి మేడంకి వెంకటేశ్వరరావు సోమవారం డిమాండ్ చేశారు. కోటయ్య పొలం వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు వారు వివరించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


వెంకటేశ్వరరావు (పాత చిత్రం)

శివరామపురం (మోపిదేవి), న్యూస్‌టుడే: కాళ్లు కడుక్కునేందుకు చెరువులోకి దిగిన వ్యక్తి మృతిచెందిన సంఘటన పెదప్రోలు పంచాయతీ శివారు శివరామపురంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మేకా వెంకటేశ్వరరావు(65).. పొలం వెళ్లి తిరిగి వస్తూ అతడి ఇంటికి సమీపంలోని చెరువులో కాళ్లు కడుక్కునేందుకు దిగుతుండగా కాలుజారి పడిపోయాడు. లోతు ఎక్కువగా ఉండటంతో ఊపిరి ఆడక చనిపోయాడు. దీనిపై మృతుడి కుమారుడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళల క్రికెట్ ప్రపంచకప్ విజయంపై సంబరాలు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: మహిళా క్రికెటర్ల చిరకాల కోరిక ప్రపంచ కప్‌ను కైవసం చేసుకున్న సందర్భంగా స్థానిక వంతెన కూడలిలో తెదేపా, జనసేన పార్టీల ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా తెలుగు మహిళలు, వీర మహిళలు పెద్ద కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. భారత మహిళా క్రికెట్ జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు యాసం చిట్టిబాబు, మత్తి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో బండే కనకదుర్గ, రేపల్లె బాలమ్మ, వి.పాప, బచ్చు కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

కేక్ కోస్తున్న తెదేపా, జనసేన మహిళలు

నదిలో కొట్టుకుపోయిన వ్యక్తి కాపాడిన మత్స్యకారులు

దక్షిణచిరువోలులంక (అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: కృష్ణా నదిలో ప్రమాదవశాత్తు పడి కొట్టుకుపోతున్న వ్యక్తిని మత్స్యకారులు రక్షించి.. వారి బంధువులకు అప్పగించిన సంఘటన అవనిగడ్డ మండలంలోని నదీగర్భ గ్రామమైన దక్షిణ చిరువోలు లంకలో సోమవారం చోటుచేసుకుంది. దక్షిణ చిరువోలులంకలోని పుష్కర స్నానఘట్టం వద్ద రామచంద్రపురం గ్రామానికి చెందిన బచ్చు మురళీ.. కార్తిక స్నానం చేసేందుకు నదిలో దిగాడు. ప్రవాహం అధికంగా ఉండటంలో కొట్టుకు పోయాడు. ఆ ప్రాంతంలో ఉన్న చెరువులకు కాపలా ఉండే వెంకన్న గమనించి.. సమీప వడుగువారిపాలెంలోని మత్స్యకారులకు చెప్పడంతో వారు రెండు బృందాలుగా పడవలపై వెళ్లి.. కొట్టుకుపోతున్న మురళీని వి.కొత్తపాలెం వద్ద పట్టుకుని రక్షించారు. అనంతరం అతడిని బంధువులకు అప్పగించారు. వ్యక్తి ప్రాణం కాపాడిన మత్స్యకారులు కొక్కిలిగడ్డ సత్తులబాబు, మోపిదేవి ప్రశాంత్, నడకుదిటి నరేంద్ర, వెంకన్నలను పలువురు అభినందించారు.

పోటీల్లో ప్రతిభ

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : నియోజకవర్గ స్థాయిలో రాజ్యాంగ దినోత్సవ పోటీలు విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. వీటిలో తోట్లవల్లూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నుంచి 10వ తరగతి విద్యార్థిని పాముల బిందు ప్రథమ, వీరంకి వెంకట బాలాజీ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఎంఈవో- 1 వెంకటేశ్వరరావు, ఎంఈవో-2 సురేష్ వారిని సోమవారం అభినందించారు. వీరు నవంబరు 26న శాసనసభలో మాట్లాడనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు ఫణి రాజమోహన్ తెలిపారు.

విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యార్థినులతో ప్రధానోపాధ్యాయిని నాగరత్నకుమారి

మాక్ అసెంబ్లీకి ఎంపిక

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నవంబర్ 26న అమరావతిలో నిర్వహించే మాక్ అసెంబ్లీకి.. అవనిగడ్డ నియోజకవర్గం నుంచి కోడూరు మండలం లింగారెడ్డిపాలెం జడ్పీ పాఠశాల విద్యార్థినులు కడవకొల్లు హేమాంజలి, గాదె కావ్యలు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని కోడూరు నాగరత్నకుమారి తెలిపారు.

యువకుడి అదృశ్యం

గుడివాడ, న్యూస్‌టుడే : ఓ యువకుడు పనికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని అతని సోదరుడు గుడివాడ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు.. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన రాజులపాటి వెంకటేశ్వరరావు (24) మార్కెట్ సెంటర్లో ఓ మెకానిక్ వద్ద పని చేసేవాడు. గత నెల 31న షెడ్డుకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అతని సోదరుడు దుర్గాప్రసాద్ రెండు రోజులు వెతికి ఆచూకీ లభించక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హెడ్‌కానిస్టేబుల్ గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రముఖ నేత్ర వైద్యుడు మాధవసాయి మృతి

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి మండలం పాగోలు గ్రామానికి చెందిన ప్రముఖ నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ చిరుమామిళ్ల మాధవసాయి(84) సోమవారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. విజయవాడలోని కుమారుడి నివాసంలో తుదిశ్వాస విడిచారు. మాధవసాయి గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో హెచ్‌వోడీగా సేవలందించారు. ఉద్యోగ విరమణ అనంతరం పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. జన్మభూమిపై మమకారంతో ప్రతినెలా పాగోలు గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. మాధవసాయి భౌతికకాయానికి స్వచ్ఛ సుందర చల్లపల్లి రథసారథి డాక్టర్ డీఆర్కే ప్రసాద్, వివేకానంద డిగ్రీ కళాశాల డైరెక్టర్ యార్లగడ్డ శివప్రసాద్ తదితరులు నివాళులర్పించి.. అంతిమ వీడ్కోలు పలికారు.

ద్విచక్ర వాహనం చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

కోసూరు (కూచిపూడి), న్యూస్‌టుడే : మొవ్వ మండలం కోసూరులో ద్విచక్ర వాహనం చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి మొవ్వ కోర్టులో హాజరు పరిచామని కూచిపూడి ఎస్సై కె.ఎన్.విశ్వనాథ్ సోమవారం తెలిపారు. కోసూరు గ్రామానికి చెందిన వంకాయల వీరబాబుకు చెందిన ద్విచక్ర వాహనం గత నెల 24న చోరీకి గురైంది. ఈ కేసులో అదే గ్రామానికి చెందిన పెదపూడి రత్నగిరి, డోక్కు సుధాకర్, బొర్రా సాయిబాబును నిందితులుగా గుర్తించి అరెస్టు చేసినట్లు చెప్పారు. మొవ్వ విద్యుత్తు ఉప కేంద్రం సమీపంలో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

మద్యం మత్తులో స్నేహితుడిపై దాడి

గుడివాడ, న్యూస్‌టుడే : మద్యం మత్తులో స్నేహితుడిపై ఓ వ్యక్తి దాడి చేశాడు. టూ టౌన్ పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని రైలుపేటకు చెందిన వేల్పుల ఏసుబాబు, అతని స్నేహితుడు పండుబాబు ఆదివారం రాత్రి మద్యం తాగి ఇంటికి వెళుతూ గొడవపడ్డారు. ఈక్రమంలో పండుబాబు కర్రతో ఏసుబాబుపై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై పి.లోవరాజు కేసు నమోదు చేశారు.

'దివ్య సీమ ఖ్యాతి వెంకటకృష్ణారావుదే'

కోసూరుపాలెం (మోపిదేవి), న్యూస్‌టుడే: దివిసీమను దివ్య సీమగా మార్చి.. విద్యాపరంగా ఖ్యాతి తీసుకొచ్చిన ఘనత మండలి వెంకట కృష్ణారావుకే దక్కుతుందని కూటమి నాయకులు పేర్కొన్నారు. వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఆయన కాంస్య విగ్రహానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. 1977 ఉప్పెన సమయంలో ఆపదలో ఉన్న వారిని ఆదుకున్నారన్నారు. సాంబశివరావు, కోసూరు నాగమల్లేశ్వరరావు, భోగిరెడ్డి సాంబశివరావు, రాజేష్, జనార్దనరావు, రామాంజనేయులు పాల్గొన్నారు.

వెంకటకృష్ణారావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కూటమి నాయకులు

పోయినవి

గుడివాడ పట్టణ పాటిమీద శ్రీనివాస ఎన్‌క్లేవ్ ప్లాటు నెం: 103 చెందిన గురిజాల రామారావు గారి కుమారుడు గురిజాల తిరుమల వెంకట రమణకు చెందిన HDFC బ్యాంకు Ltd. Folio No: 0477047 సర్టిఫికేట్ నెం: 000007882 Distinctive No: 11394771 - 11395770 షేర్స్ No:1000 Dt. 25-10-2025 జిరాక్స్ నిమిత్తం వెళుతుండగా దారి మధ్యలో టైలరింగ్ వీధిలో పోయినవి. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు తెలియచేయగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.
ఇట్లు: **గురిజాల తిరుమల వెంకట రమణ S/o. రామారావు**, శ్రీనివాస ఎన్‌క్లేవ్, పాటిమీద, ప్లాటు నెం: 103 గుడివాడ
సెల్: **92999 95119**

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

రేపు 'ఈటీవీ' కార్తిక దీపోత్సవం

నేడు ఎంట్రీ పాసుల పంపిణీ

శివకేశవులు ఇద్దరికీ ఎంతో ప్రీతికరమైనది కార్తిక మాసం. దీంతో సమానమైన మాసం, గంగతో సమానమైన తీర్థం లేదని పురాణోక్తి. విశేష పుణ్య సంపదను ప్రసాదించే ఈ మాసంలో దీపారాధనకు ఉన్న ప్రాధాన్యం అసమానమైనది. 'ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ, ఈటీవీ లైఫ్' ఛానళ్ల ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే మహిళలకు పూజ సామగ్రి నిర్వాహకులే సమకూరుస్తారు. **ఎంట్రీ పాసులు ఒక రోజు ముందుగా అంటే మంగళవారం ఉదయం 11 గంటల నుంచి విజయవాడ పిన్నమనేని పాలీక్లినిక్‌రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానం** వద్ద పంపిణీ చేస్తారు. పరిమిత సంఖ్యలోనే పాసులు ఉంటాయి. చిన్నపిల్లలకు అనుమతి లేదు. నేలపై కూర్చోగలిగే వారు మాత్రమే హాజరు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు.

-విజయవాడ సిటీ,న్యూస్‌టుడే

సమయం: ఈ నెల 5న (బుధవారం) సాయంత్రం 5.30 గంటలకు

స్థలం: విజయవాడ మొగల్రాజపురం పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానం.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ | ఈటీవీ తెలంగాణ | ఈటీవీ Life

ఈ ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారం 5న సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు.

బాధ్యతల స్వీకరణ

సీపీకి మొక్క అందిస్తున్న డీసీపీలు లక్ష్మీనారాయణ, కృష్ణప్రసన్న

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ అయిన డీసీపీలు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సీఐడీ ఎస్పీగా పనిచేస్తున్న కృష్ణప్రసన్న ఎన్టీఆర్ జిల్లా సైబర్ క్రైం డీసీపీగా, డీజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న బి.లక్ష్మీనారాయణను రూరల్ డీసీపీగా నియమించారు. సోమవారం వారు తమ తమ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందించి కృతజ్ఞతలు తెలిపారు.

తాతలనాటి చెట్టు.. తరతరాలు నిలిచేట్టు..

ఇంటిపై అందంగా..

మధ్య అంతస్తుల్లో..

విజయవాడ నగరం సత్యనారాయణపురం శివాలయం వీధిలోని ఇరుకు సందులో రెండస్తుల మేడపై కొబ్బరి చెట్టు ఆకర్షణీయంగా కనిపిస్తోంది. భవన నిర్మాణం సమయంలో అడ్డొస్తే చెట్టు తొలగించేందుకు ఏమాత్రం ఆలోచించరు. అలాంటిది ఇంటి యజమాని మాణిక్యాలరావు ఉన్నది తక్కువ స్థలమే అయినా భవన నిర్మాణానికి ముందు తమ తాత నాటిన కొబ్బరిచెట్టుతో ఉన్న అనుబంధాన్ని మరిచిపోలేదు. దానికి చోటిచ్చాకే ఇలా రెండస్తుల భవనాన్ని నిర్మించుకున్నారు. అందుకే వీధిలో ఇప్పటికీ ఈ ఇల్లు ప్రత్యేకంగా కనిపిస్తోంది.

- ఈనాడు, అమరావతి

జలపుష్పం.. సేవల చిహ్నం

మచిలీపట్నం బస్టాండ్ భవనంపై ఇలా...

కొవిడ్ ఎంత విలయం సృష్టించిందో అందరికీ తెలుసు. ఆ సమయంలో కొవిడ్ వారియర్స్‌గా ఆర్టీసీ కార్మికుల సేవలు ప్రశంసనీయం. రోగులను క్వారంటైన్‌కు తరలించడంతో పాటు ఆసుపత్రులకు అవసరమైన సామగ్రిని సరఫరా చేశారు. దూరం పాటించాలన్న ఆదేశాలతో బస్సుల్లో కొన్ని సీట్లు తొలగించారు. అలా వచ్చిన ఇనుప వ్యర్థాలతో మచిలీపట్నం నగరాన్ని స్ఫురించేలా తీర్చిదిద్దిన చేప ఆకృతి వెనుక ఆర్టీసీ సేవలు దాగి ఉన్నాయి. డిపో మేనేజర్ పెద్దిరాజుకు వచ్చిన ఆలోచనకు రూపమే ఈ జలపుష్పం. ఆర్టీసీ సేవలకు స్మారక చిహ్నంగా లోహ వ్యర్థాలతో జలపుష్పాన్ని తీర్చిదిద్దామని ఆయన తెలిపారు.

- ఈనాడు, అమరావతి -న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

మరింత తగ్గిన కృష్ణా వరద

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది వరద ప్రవాహం సోమవారం మరింత తగ్గింది. ఉదయం ఆరు గంటలకు 1,26,975 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేశారు. సాయంత్రం ఆరు గంటలకు తగ్గుముఖం పట్టింది. 5 గేట్లను రెండు అడుగులు, 64 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 53,410 క్యూసెక్కులు వదిలారు. గుంటూరు ఛానల్‌కు నీటి విడుదలను పునరుద్ధరించి, 181 క్యూసెక్కులు ఇచ్చారు. మిగతా పంట కాలువలు కట్టివేసి ఉన్నాయి.

అనుమతిచ్చాక.. అడ్డుపడ్డారు..!

- తితిదే స్థలంపై నాడు కన్నేసిన వైకాపా నేతలు
- దుర్గగుడి అభివృద్ధికి కేటాయిస్తే కొట్టేసే కుట్ర

ఈనాడు, అమరావతి

"**ఇం**ద్రకీలాద్రిపై ఉన్న దుర్గగుడికి సమీపంలోనే కుమ్మరిపాలెం జంక్షన్‌లో తిరుమల తిరుపతి దేవస్థానానికి (తితిదే) చెందిన 2.8 ఎకరాల స్థలం ఖాళీగా ఉంది. దీన్ని దుర్గగుడికి కేటాయిస్తే.. అక్కడ వాహనాల పార్కింగ్, కాటేజీలు, కల్యాణ మండపాలను కట్టుకోవచ్చని.. గత తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రణాళికలు రూపొందించారు. నాటి చంద్రబాబు సర్కారు స్పందించి.. ఆ భూమిని దుర్గగుడికి కేటాయిస్తూ జీవో ఇచ్చింది."

"**వి**జయవాడలో మరోచోట దుర్గగుడి భూమిని తితిదేకు ఇచ్చేలా.. ఒప్పందం చేసుకున్నారు. ఆపై రూ.2 కోట్లతో ఆ స్థలం మొత్తాన్ని చదును చేశారు. కొన్నాళ్లు వాహనాల పార్కింగ్‌కు వాడారు. కానీ.. వైకాపా సర్కారు వచ్చాక.. ఈ స్థలాన్ని దుర్గగుడి నుంచి బలవంతంగా లాగేసుకుంది. ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టడానికి వీల్లేదని బోర్డు పెట్టి తాళాలు వేసేశారు. నాటి వైకాపా పాలకులు.. రూ.కోట్ల విలువైన ఈ స్థలంపై కన్నేశారనే విమర్శలు వెల్లువెత్తాయి."

కుమ్మరిపాలెంలోని తితిదేకు చెందిన ఖాళీ స్థలం

కుమ్మరిపాలెంలో ఉన్న ఈ స్థలం దుర్గగుడికి కేటాయిస్తే.. దేశవిదేశాల నుంచి వచ్చే భక్తులకు అనేక సౌకర్యాలను కల్పించొచ్చు. ఆ ఉద్దేశంతోనే నాటి ప్రభుత్వం కేటాయించగా.. రూ.6 కోట్లతో కల్యాణ మండపం కట్టాలని ప్రతిపాదించారు. అతిథి గృహాలు, పార్కింగ్‌కు నమూనాలు సిద్ధం చేశారు. దీనికి బడ్జెట్ అంచనాలు రూపొందించి అనుమతుల కోసం దేవాదాయ శాఖ కమిషనర్‌కు పంపారు. కానీ.. ప్రణాళికలు పట్టాలెక్కే దశలో వైకాపా పాలకులు గండి కొట్టేశారు. దీంతో ఇప్పటికీ.. దుర్గగుడికి కాటేజీలు, పార్కింగ్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది.

ఏటా రెండు కోట్ల మంది భక్తులు..

దుర్గగుడికి నిత్యం 30 వేల మంది, వారాంతాల్లో 50 వేల మందికి పైగా భక్తులొస్తారు. దసరాల్లో 15-20 లక్షల మంది తరలివస్తారు. భవానీ దీక్షలు, ఇతర వేడుకలకు లక్షలాదిగా దుర్గమ్మను దర్శిస్తారు. కానీ.. ఆలయానికి ఇప్పటికీ ఒక్క కాటేజీ సరైంది లేదు. దీంతో భక్తులు దర్శనం తర్వాత వెళ్లిపోవడమే తప్ప.. ఆలయ పరిసరాల్లో ఉండే వసతి లేదు. ఒకవేళ ఉండాలన్నా.. విజయవాడలో ప్రైవేటు హోటళ్లే దిక్కు. కనీసం వారి వాహనాల పార్కింగ్‌కూ జాగా లేదు.

వేడుకల వేళ అర్జీ పెట్టి..

ప్రస్తుతం దసరా సహా వేడుకల సమయంలో కుమ్మరిపాలెం స్థలం కోసం తితిదేకు అర్జీ పెట్టుకుని తాత్కాలికంగా ఇక్కడ పార్కింగ్‌కు వినియోగిస్తున్నారు. తిరిగి వేడుకలు ముగిశాక ఈ స్థలానికి తాళం వేసేస్తున్నారు. వాస్తవంగా ప్రభుత్వం ఎప్పుడో ఈ స్థలాన్ని దుర్గగుడికి కేటాయిస్తూ ఆదేశాలు ఇచ్చింది. అయినా వాడుకునేందుకు లేకుండాపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. ఇక్కడ ఏర్పాట్లు చేస్తే.. అనేక సమస్యలు తీరతాయి.

దుర్గాఘాట్‌లో పుణ్యస్నానాలు..

పాత శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

శివయ్యకు క్షీరాభిషేకం

కార్తిక దీపం.. శోభాయమానం

కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు తెల్లవారుజామునే దుర్గాఘాట్‌లో స్నానాలు చేశారు. నదిలో దీపాలు వదిలారు. నగరంలోని పాత శివాలయంలో భక్తులు పెద్దఎత్తున పూజలు చేసి దీపాలు వెలిగించారు.

- ఈనాడు, అమరావతి

పర్యాటక అభివృద్ధికి సహకరించండి

పాయకాపురం, న్యూస్‌టుడే : జిల్లాలో హస్తకళలు, పర్యాటక అభివృద్ధికి స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ (ఎస్‌పీఏ) కళాశాల చేయూత, భాగస్వామ్యం అవసరమని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. జిల్లాలో పలు పాఠశాలల ప్లానింగ్‌కు ఎస్‌పీఏ సహకారం అందించింది. ఈ క్రమంలో సోమవారం ఆయన కలెక్టరేట్‌లో ఆ సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. కొండపల్లి బొమ్మల ఎక్స్‌పీరియన్స్ సెంటర్ అభివృద్ధిపై చర్చించారు. దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన కొండపల్లి బొమ్మల ఔన్నత్యాన్ని నేటి తరానికి చాటిచెప్పాలని కోరారు. ఎస్‌పీఏ ప్రతినిధులు స్పందించి.. ప్రత్యేక నిపుణులతో కమిటీగా ఏర్పడి అవసరమైన నివేదిక తయారు చేస్తామని తెలిపారు. కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు మూర్తి, జగత్‌కుమారి పాల్గొన్నారు.

శ్రీకృష్ణపారిజాతంలో శ్రీకృష్ణుడిగా పెద సత్యం

వెండితెరపై కూచిపూడి వెలుగులు

జిల్లాలో కుగ్రామమైన కూచిపూడి పేరు నాట్యంతో ప్రపంచ వ్యాప్తంగా వినిపిస్తోంది. కూచిపూడి (భాగవతులు) నాట్యాచార్యులు దీనిని వెండితెరపై రెపరెపలాడించారు. తదుపరి సినిమా రంగంలో వేదాంతం రాఘవయ్య, వెంపటి సత్యనారాయణ (పెద సత్యం), మహంకాళి వెంకయ్య, పసుమర్తి కృష్ణమూర్తి, వెంపటి చిన సత్యం, వేదాంతం జగన్నాథశర్మ తదితరులు రాణించారు. నేటితరం యువ నాట్యాచార్యుడు బిస్మిల్లాఖాన్ యువ పురస్కార గ్రహీత డాక్టర్ వేదాంతం వెంకటాచలపతి (వెంకు) కొరియోగ్రాఫర్‌గా తనవృత్తిని ప్రారంభించి స్త్రీ సాహసం, దేవదాసు, అన్నదాత, అనార్కలి, ప్రేమపాశం తదితర సినిమాలకు దర్శకత్వం వహించారు. వేదాంతం జగన్నాథశర్మ చెంచులక్ష్మి వంటి పలు సినిమాలకు నృత్య దర్శకత్వం వహించారు. వెంపటి పెదసత్యం, చినసత్యం దర్శకుడిగా, నర్తకులుగా వెండితెరపై వెలుగులద్దారు. వెంకట నాగచలపతి (వెంకు) శుభప్రదం సినిమాకు నృత్య దర్శకత్వం వహించారు.

శుభప్రదం సినిమాకు నృత్య దర్శకత్వం వహిస్తున్న వేదాంతం వెంకటా చలపతి

- న్యూస్‌టుడే, కూచిపూడి

ఓటరు కార్డులో

చిరునామా మారుస్తున్నారా..!

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

ఈ జాగ్రత్తలు తీసుకోండి

సాధారణంగా చాలా మంది ఓటరు కార్డును ఎన్నికల సమయాల్లోనే ఉపయోగపడుతుందని అనుకుంటారు. కానీ దానిని వ్యక్తిగత గుర్తింపు కార్డుగా వినియోగించుకోవచ్చు. అలాగే అద్దెకు ఉండే వారు తరచూ ఇళ్లు మారుతుంటారు. ఇలాంటి వారు ఆ కార్డులో చిరునామాను మార్చుకోవాల్సి ఉంటుంది. గుర్తింపు కార్డుగా దాని ప్రాధాన్యం తెలిసిన వారు అప్‌డేట్ చేసుకుంటారు. మరికొందరు ఆసక్తి చూపించరు. అందులోని చిరునామా (ఫారం-8) మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ఒకప్పుడు ఎన్నికల సంఘం నియమిత సమయంలో మాత్రమే అనుమతించేది. తాజాగా ఆన్‌లైన్‌లో (voters services portal) ఎప్పుడైనా మార్చుకునే వెసులుబాటు కల్పించారు.

పేరులో స్వల్పంగా తేడా ఉన్నా...

ఆన్‌లైన్‌లో ఓటరు కార్డు చిరునామా మార్చుకునేందుకు ఆధార్, పాస్‌పోర్ట్, పాన్ కార్డు తదితర గుర్తింపు కార్డులను అనుమతిస్తారు. ఆధార్ కార్డులో పేరు ఎలా ఉందో.. అలాగే ఓటరు కార్డులోనూ ఉండాలి. చిన్నపాటి మార్పు ఉన్నా దరఖాస్తు రిజెక్ట్ అవుతుంది. ఒక యువకుడి పేరు ఆధార్‌లో 'సాయిపవిత్రన్' అని ఉంది. కానీ ఓటరు కార్డులో 'సాయి పవిత్రన్' అని పేరులో ఖాళీ ఉంది. ఆన్‌లైన్‌లో ఫారం 8 దరఖాస్తు మొత్తం పూర్తి చేసిన తర్వాత చివరలో ఓటీపీ వెరిఫికేషన్, 'ఈ-సైన్' చేయాల్సి ఉంటుంది. దాన్ని క్లిక్ చేయగానే పేరులో మార్పు ఉందని దరఖాస్తు రిజెక్ట్ అవుతుంది. అదే విధంగా పేరులో స్పెల్లింగ్ తప్పులతో ఒక్క అక్షరం తేడా ఉన్నా.. రిజెక్ట్ అవుతుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూరించే ముందే ఆధార్, ఓటరు కార్డుల్లో పేర్లు ఒకేలా ఉండాలని సూచన వస్తోంది. పేరులో తేడా ఉంటే ముందుగా పేరును సరిచేసుకుని.. ఆ తర్వాత చిరునామా మార్చుకోవాలని చెబుతోంది. తేడా ఉన్న వారు బీఎల్‌వోను సంప్రదించాలి.



ఆధార్, ఓటరు కార్డులో పేర్లు ఒకేలా ఉండాలని ముందుగానే ఇలా సూచిస్తుంది...

ఆఫ్‌లైన్‌లోనే చేసుకోవాలి...

రెండు కార్డుల్లోనూ పేర్లు ఒకేలా ఉన్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో మార్చుకోవచ్చు. దరఖాస్తు రిజెక్ట్ అయిన వారు స్థానిక బి.ఎల్.ఓ.ను సంప్రదించాలి. వారు తమ ప్రాంత సచివాలయంలో ఉన్న బూత్ లెవల్ అధికారిని సంప్రదించి చిరునామా మార్పునకు తగిన పత్రాలు ఇస్తే ఆఫ్‌లైన్‌లో దరఖాస్తును పూరించి చిరునామా మారుస్తారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ జరుగుతోంది. ఆఫ్‌లైన్‌లో చిరునామా మార్చుకోవాలనుకుంటే.. ఇప్పుడే దరఖాస్తు చేసుకుంటే ఓటరు కార్డులో చిరునామా మారుతుంది. కార్డు డౌన్‌లోడ్ చేసుకుంటే గుర్తింపు కార్డుగా ఉపయోగించుకోవచ్చు.

అమ్మ తేజస్సు.. ప్రకృతి ఉషస్సు

ఆకట్టుకుంటున్న గొట్టుముక్కల జలపాతం

ఈనాడు, అమరావతి

జలపాతంలో స్నానం చేస్తున్న పర్యాటకులు

ప్రకృతి పరిమళం.. జలపాత సడుల ప్రవాహం.. ఆధ్యాత్మిక తన్మయం.. వెరసి కొండపల్లి అటవీ ప్రాంతం ప్రకృతి సోయగాలకు చిరునామాగా నిలుస్తోంది. పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అక్కడే వనదేవత మద్దులమ్మ కొలువై ఉండడంతో ఆధ్యాత్మిక అటవీ పర్యాటక కేంద్రంగా మారుతోంది. ప్రస్తుతం కార్తిక మాసం కావడంతో వన సమారాధనల తాకిడి పెరుగుతోంది.

ప్రత్యేక ఆకర్షణగా.. విజయవాడకు 30 కి.మీ దూరంలోని కొండపల్లి అటవీ ప్రాంతంలో కంచికచర్ల మండలం గొట్టుముక్కలలో జలపాతం కనువిందు చేస్తోంది. నేరుగా కారు, బైక్, ప్రైవేటు వాహనాల్లో చేరుకునేందుకు అడవిలో మార్గం ఉంది. సామాజిక మాధ్యమాల్లో రీల్స్ ప్రాచుర్యం పొందడంతో సందర్శకుల సంఖ్య బాగా పెరిగింది. ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో 500 వరకు ద్విచక్ర వాహనాలు, 100 కార్లు, ఆటోల్లో పర్యాటకులు తరలి వస్తున్నారు. జలపాతంలో ఈత కొట్టి సేద తీరుతున్నారు. కొందరు సమూహాలుగా ఏర్పడి ట్రెక్కింగ్ చేస్తూ ఆనందిస్తున్నారు. ఇక్కడ లఘు చిత్రాల చిత్రీకరణ చేసే వారి సంఖ్య బాగా పెరిగింది. ఫొటో షూట్లు నిత్యకృత్యమయ్యాయి. ఇప్పటికే కార్తిక వన సమారాధనలు మొదలయ్యాయి.

వరద పాయసం

జలపాతం సమీపంలోనే ఉన్న మద్దులమ్మ ఆలయానికి సైతం భక్తులు భారీగా తరలి వస్తున్నారు. 200 ఏళ్ల కిందట గ్రామంలో తాటుకూరు కోటయ్య అనే వ్యక్తికి కలలో అమ్మవారు దర్శనమిచ్చారని.. స్వప్నంలో చెప్పిన ప్రాంతంలో వెతకగా మద్దులమ్మ విగ్రహం దొరికినట్లు స్థానికులు చెబుతారు. చుట్టుపక్కల గ్రామాల్లో వర్షాలు లేక పంటలకు ఇబ్బంది కలిగినప్పుడు అమ్మవారికి పూజలు చేసి పాయసం తయారు చేయించి జలపాతం కొండపై నుంచి పాయసం పోయడం ఆనవాయితీ. ఈ విధానాన్ని వరద పాయసం అంటారు. ఈ వరద పాయసం పోస్తే తప్పకుండా వానపడుతుందని ఆయా గ్రామాల వారి నమ్మకం. వరద పాయసం పోసిన రోజు వర్షం పడినట్లు కొందరు గ్రామస్థులు చెబుతున్నారు.

వనదేవత మద్దులమ్మ

ప్రయోగం.. సఫలం

జాతీయ స్థాయి కాంక్రీట్ క్యూబ్ టెస్టు పోటీల్లో పీవీపీ ఎస్ఐటీ సివిల్ విద్యార్థుల ప్రతిభ

దినేష్ బృందం సభ్యులు తయారు చేసిన కాంక్రీట్ క్యూబ్‌ను పరిశీలిస్తున్న సివిల్ విభాగాధిపతి జగదీష్

ఇండియన్ కాంక్రీట్ ఇనిస్టిట్యూట్ (ఐసీఐ), ఆర్‌డీసీ కాంక్రీట్ ఇండియా లిమిటెడ్ సంయుక్తంగా నిర్వహించిన నేషనల్ కాంక్రీట్ క్యూబ్ టెస్టు సీజన్-3 పోటీల్లో కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ విభాగం విద్యార్థులు ప్రతిభ చాటి జాతీయ స్థాయిలో మొదటిస్థానంలో నిలిచారు. మొదటి దశలో ఈ పోటీలకు దేశవ్యాప్తంగా 484 జట్లు నమోదు చేసుకున్నాయి. వీటిలో 37 కళాశాలలకు చెందిన 149 జట్లు తుదిదశ పోటీలకు చేరాయి.

ప్రతిభ చాటారిలా.. పీవీపీ సిద్ధార్థ సివిల్ విభాగం చివరి సంవత్సరం చదువుతున్న కె.దినేష్, ఎంగోవర్ధన్, ఎం.వరప్రసాద్ బృందం పోటీల్లో తుదిదశకు చేరుకుంది. వీరికి సివిల్ విభాగాధిపతి వెంగల జగదీష్ సాంకేతిక సహకారం అందించారు. ఇందులో భాగంగా జూన్ 1న వీరంతా కలిసి సిమెంటు, ఇసుక, గ్రావెల్, ఫ్లయాష్, జీబీటీఎస్, మైక్రోసిలికా వంటి పదార్థాలను కలిపి ఐదు ట్రయల్ మిశ్రమాలు తయారు చేశారు. జులై 12న వీటిలో ఉత్తమమైన దాన్ని ఎంపిక చేసుకున్నారు. ఈ మిశ్రమంతో తయారైన 150 మిల్లీమీటర్ల కాంక్రీట్ క్యూబ్‌లను 14 రోజుల పాటు శాస్త్రీయంగా క్యూర్ చేసి, నిర్దిష్ట బలం, మన్నిక సాధించేలా చేశారు. జులై 26న సమర్పించిన క్యూబ్‌లు, మిశ్రమ వివరాల వీడియోను నిర్వాహకులకు సమర్పించారు. ఆగస్టు 9న నిర్వహించిన అధికారిక పరీక్షల్లో వారి కాంక్రీట్ మిశ్రమానికి గుర్తింపు వచ్చింది. నవంబరు 1న చైన్నై ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో కాంక్రీట్ క్యూబ్ టెస్టు పోటీల్లో జాతీయ స్థాయిలో మొదటి బహుమతిగా రూ.లక్ష చెక్కు అందుకున్నారు.

సవాళ్లను అధిగమించి విజయం.. ట్రయల్స్ కాంబినేషన్లు చేసే సమయంలో ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. ప్రతి ప్రయత్నం నుంచి కొత్త విషయం నేర్చుకుని సమగ్రంగా కృషి చేశాం. సివిల్ విభాగాధిపతి జగదీష్, ప్రిన్సిపల్ కొండపల్లి శివాజీబాబు సహకరించారు. సంస్థ తక్కువ సిమెంటు వినియోగించి సామర్థ్యం ఉన్న కాంక్రీట్ క్యూబ్‌లను రూపొందించాం. వారి అంచనాలకు, నిర్దేశించిన సామర్థ్య విలువలకు దగ్గరగా క్యూబ్‌లు తయారు చేసి జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచాం - **దినేష్, బృంద నాయకుడు**

-కానూరు, న్యూస్‌టుడే

ఇది కాదా.. నిలుపు దోపిడీ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

- బ్లాక్‌లిస్టులో పెట్టినా చక్రం తిప్పిన పాత లీజుదారుడు
- కార్పొరేషన్ ఆదాయానికి తూట్లు

నాయకులు, వారి అనుయాయులు వాహన పార్కింగ్‌లను అడ్డాగా చేసుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. లీజు వేలంలో పోటీ లేకుండా, కార్పొరేషన్‌కు ఆదాయం రాకుండా అడ్డుపడుతున్నారు.

పాతబస్తీ బీఆర్‌పీ రోడ్డు, ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి పార్కింగ్ లీజులు ఆగస్టుతో ముగిసిపోయాయి. 2024లో ఏడాదికి ఆ రెండు పార్కింగ్‌లను వైకాపా కార్పొరేటర్‌గా గెలిచిన ఒకరు.. బినామీ పేరిట లీజుకు దక్కించుకున్నాడు. కార్లు, ద్విచక్ర వాహన పార్కింగ్‌దారుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయించాడు. కారుకు(3 గంటలకు) రూ.30 వసూలు చేయాల్సి ఉన్నా.. బెదిరించి రూ.100, రూ.200 వసూలు చేయించాడు. దీనిపై ఫిర్యాదులు రావడంతో అధికారులు తనిఖీ చేసి అతడిని బ్లాక్‌లిస్టులో పెట్టారు. దీంతో కక్ష పెంచుకుని ఆ పార్కింగ్‌కు లీజుటెండర్లు దాఖలు కాకుండా అడ్డుకుంటున్నట్లు ప్రచారం ఉంది. ఈ-వేలం పోర్టల్ ద్వారా ఆగస్టులో టెండర్లు పిలవగా ఒక్క టెండరు కూడా దాఖలు కాకుండా చేయగలిగాడు. సెప్టెంబరు 24న మళ్లీ ఈ-వేలం కింద షార్టు టెండరు పిలవగా అతితక్కువ ధరకు సింగిల్ టెండరు దాఖలైంది. అప్‌సెట్ ధర కన్నా కేవలం రూ.20 వేలు ఎక్కువ కోట్ చేయగా దానిని ఆమోదించేందుకు పాలకులు యత్నిస్తున్నారు.

బీఆర్‌పీ రోడ్డులో కార్ల పార్కింగ్

నిబంధనలకు పాతర

రెండు పార్కింగ్‌లకు కలిపి రూ.49,11,062 అప్‌సెట్ ధర నిర్ణయించగా.. సింగిల్ టెండరులో ఒకరు రూ.49,31,062 మాత్రమే కోట్ చేశారు. నిర్ణయించిన అప్‌సెట్‌పై కనిష్ఠంగా 11 శాతం(రూ.5,40,216) ఆదాయం ఎక్కువ రావాలి. భిన్నంగా తక్కువ కోట్ చేసిన సింగిల్ టెండరుదారుకు పార్కింగ్‌లీజు కట్టబెట్టేందుకు పాలకపక్షం ప్రయత్నిస్తోంది. ★ ఆయా సింగిల్ టెండరు ప్రతిపాదన ఆమోదానికి స్థాయీ సంఘం ముందుకు తేగా.. కమీషన్ల కోసం వాయిదా వేసినా ఆ తదుపరి సమావేశంలో ఆమోదించనున్నట్లు ప్రచారం సాగుతోంది.★ సింగిల్ టెండర్ దాఖలైతే రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలవాల్సి ఉన్నా అందుకు భిన్నంగా కార్పొరేషన్ ఆదాయానికి గండి కొట్టేలా పాలకులు వ్యవహరిస్తున్నారు. ★ ఇక సింగిల్ టెండరు లీజుదారుకు పార్కింగ్ ఫీజుపై జీఎస్టీ మినహాయింపు ఇవ్వనున్నారు.★ లీజుదారు రూ.49,31,062 ఆఫర్ చేసినా ఆ సొమ్ము 12 వాయిదాల్లో(రూ.4,10,922)గా చెల్లించే వెసులుబాటు కల్పిస్తున్నారు.

నకిలీ మద్యం వ్యాపారంలో జనార్దనరావుకు జోగి అండ

తనకు చెప్పేవాడని విచారణలో వెల్లడించిన శ్రీనివాసరావు

ఈనాడు - అమరావతి: తమ అక్రమ మద్యం వ్యాపారానికి వైకాపా నేత జోగి రమేష్ అండదండలు ఉన్నాయని తనకు జనార్దనరావు పలుసార్లు చెప్పారని నిందితుడు తిరుమలశెట్టి శ్రీనివాసరావు (ఏ13) ఇంటరాగేషన్‌లో వెల్లడించాడు. రాజకీయ అండతో తన వ్యాపారానికి ఢోకా లేదని తరచూ చెప్పేవాడని విచారణలో చెప్పినట్లు తెలిసింది. నకిలీ మద్యం కేసులో అరెస్టయి నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న నిందితుడిని ఇటీవల ఐదు రోజుల కస్టడీకి కోర్టు ఇచ్చింది. కస్టడీ సోమవారంతో పూర్తయింది. దీంతో నిందితుడిని సోమవారం విజయవాడలోని ఎక్సైజ్ కోర్టులో న్యాయాధికారి ఎదుట హాజరుపర్చారు. అనంతరం ఆయన ఆదేశాలతో రిమాండ్ నిమిత్తం నెల్లూరు తరలించారు.

ఏకంగా కార్గోలో సరఫరా.. కస్టడీలో శ్రీనివాసరావును పలు అంశాలకు సంబంధించి సిట్ అధికారులు ప్రశ్నించారు. హైదరాబాద్ నుంచి మద్యం తరలించి ఇబ్రహీంపట్నంలో అమ్మకాలు సాగించేందుకు సాయపడినట్లు అంగీకరించాడు. హైదరాబాద్‌లో ఎన్డీపీఎల్ మద్యాన్ని క్యాన్లలో నింపి.. అక్కడి నుంచి ఆర్టీసీ కార్గో ద్వారా ఇబ్రహీంపట్నం చేర్చేవాడు. జనార్దనరావుకు బాలాజీ పరిచయమైన తర్వాత నకిలీ మద్యం తయారీని ప్రారంభించినట్లు విచారణలో తెలిపాడు.

★ బాలాజీ ద్వారా గోవాలో లేబుల్స్‌ను డిజైన్ చేయించి, ప్రింటింగ్ కూడా చేసినట్లు వెల్లడించాడు. వచ్చిన లేబుల్స్.. అచ్చం అసలు బ్రాండ్లకు సరిపోలేలా జగన్మోహన్‌రావు క్షుణ్నంగా పరిశీలించేవాడని చెప్పినట్లు తెలిసింది. ఏఎన్ఆర్ బార్‌కు వచ్చిన బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా వచ్చిన సరకు బ్యాచ్‌నంబర్లను ప్రింట్ చేయించేవారు. వైకాపా హయాంలో స్కానర్లు సరిగా పనిచేయకపోవడంకూడా తమకు కలసి వచ్చిందని విచారణలో సిట్ అధికారులకు వివరించాడు. మొత్తం ఎనిమిది బ్రాండ్లకు సంబంధించి నకిలీ లేబుళ్లను ముద్రించినట్లు చెప్పాడు. పోలీసుల ఎదుట లొంగిపోయేందుకు ఆఫ్రికా నుంచి జనార్దనరావు వచ్చే సమయంలో శ్రీనివాసరావుకు ఫోన్ చేశాడు. ముంబయిలో తాను దిగుతాననీ, అక్కడ తనను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసే వీలుందన్నాడు. తాను విమానం దిగాక వస్తే.. తన బ్యాగేజీ అప్పగిస్తా అని చెప్పడంతో.. అక్కడకు వెళ్లి తీసుకున్నట్లు ఇంటరాగేషన్‌లో సిట్ అధికారులకు వివరించాడు.

శ్రద్ధాంజలి



మా మాతృమూర్తి శ్రీమతి మత్తి శేషారత్నం గారు తేది.3-11-2025న స్వర్గస్తులైనారు.

అంత్యక్రియల యాత్ర బుధవారం, 5-11-2025 ఉదయం 9:00 గంటలకు మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్స్, లంగర్‌హౌజ్, హైదరాబాద్ నుండి మహాప్రస్థానం జూబ్లీహిల్స్ వైపు ప్రారంభమవుతుంది వారి ఆత్మకు శాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...

శ్రీమతి మత్తి శేషారత్నం గారు
W/o. మత్తి కామేశ్వరరావు (లేటు)
1941 - 2025

ఇట్లు
కుటుంబ సభ్యులు
ఫోన్ : 9246577217 / 9371083969

(c) eenadu

ప్రపంచకప్ విజయంపై సంబరాలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: భారత మహిళా క్రికెట్ జట్టు.. ప్రపంచ కప్‌ను సాధించడంపై ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పోలీసులు సంబరాలు చేశారు. సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ ఎస్.వి.రాజశేఖర బాబు మహిళా పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి కేకు కోశారు. ఆయన మాట్లాడుతూ.. మహిళలు తలుచుకుంటే ఎన్ని కష్టాలు ఎదురైనా ఎన్ని ఇబ్బందులు, సవాళ్లు ఎదురైనా తమ సంకల్పాన్ని ఆయుధంగా చేసి కచ్చితంగా విజయం సాధిస్తారనేందుకు ఈ ప్రపంచ కప్ విజయమే నిదర్శనమని కొనియాడారు. సంక్రాంతి నేపథ్యంలో మహిళల్లో ఉన్న క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు డిసెంబరు నెలలో గ్రామీణ, మండల, జిల్లా స్థాయిలో మహిళలకు క్రీడా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీలు కె.జి.వి.సరిత, ఉదయరాణి, ఏసీపీలు కె.లతాకుమారి, స్రవంతిరాయ్, మహిళా ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారుల చిత్రాలతో..

మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది సమక్షంలో కేకు కోస్తున్న సీపీ రాజశేఖరబాబు

ఎంపీ కార్యాలయంలో...

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే: నగరంలోని ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో సోమవారం వరల్డ్ కప్ సంబరాలు ఘనంగా జరిగాయి. జిల్లా క్రికెట్ సంఘానికి చెందిన పలువురు మహిళా క్రికెటర్లతో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ కేక్ కోసి ప్రజలందరి తరఫున భారత మహిళా క్రికెటర్లకు అభినందనలు తెలిపారు. ఎంపీ మాట్లాడుతూ.. ఆంధ్రా క్రికెట్ సంఘం మహిళా క్రికెటర్లను ప్రోత్సహించడానికి ఎప్పుడూ ముందుంటుందన్నారు. విశాఖలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఒక గ్యాలరీకి మిథాలీ రాజ్ పేరు, ఒక గేటుకు రావి కల్పన పేర్లు పెట్టడం జరిగిందన్నారు. కేడీసీఏ తరఫున ఆడుతున్న మహిళా క్రికెటర్లకు అండగా ఉంటామన్నారు. జిల్లా జట్టు కెప్టెన్ సౌమ్య, రాష్ట్ర స్థాయి క్రికెటర్ ధాత్రి, కోచ్ నాగూర్, బాపిరాజు, కేడీసీఏ ఉమెన్ క్రికెట్ మెంబర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

క్రికెటర్ ధాత్రికి కేకు తినిపిస్తున్న ఎంపీ శివనాథ్

మొంథా గాయం.. సస్యరక్షణతో మాయం!

- ఘంటసాల కేవీకే సమన్వయకర్త డి.సుధారాణి
- 'ఈనాడు మీతోడు' ఫోన్‌ఇన్‌కు విశేష స్పందన

రైతేరాజు

రైతుల సందేహాలకు సమాధానాలిస్తున్న కేవీకే సీనియర్ శాస్త్రవేత్త సుధారాణి, వివరాలు నమోదు చేసుకుంటున్న శాస్త్రవేత్తలు

ఘంటసాల, న్యూస్‌టుడే

మొంథా తుపాను కారణంగా వీచిన ఈదురు గాలులు, భారీ వర్షాలకు వరి, మినుము, చెరకు, పసుపు ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో వాటిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త, సీనియర్ శాస్త్రవేత్త డి. సుధారాణి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ విషయమై 'ఈనాడు-మీతోడు' ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. **ఉమ్మడి కృష్ణా జిల్లాతో పాటు పలు ప్రాంతాల నుంచి 80 మందికి పైగా రైతులు ఫోన్లు చేశారు.** వారి సందేహాలను డాక్టర్ సుధారాణి నివృత్తి చేశారు. కేవీకే శాస్త్రవేత్తలు కె.రేవతి, ఎం.వెంకటలక్ష్మి, వి. మంజులాదేవి, బి.నవీన్, జె.యశంతకుమార్‌లు రైతుల సమస్యలను నమోదు చేసుకున్నారు.

ఈనాడు మీతోడు

వరిలో మానిపండు తెగుల నివారణ

ప్రస్తుతం వరిపైరు పాలుపోసుకునే దశలో ఉంది. అధిక వర్షాలకు మానిపండు తెగులు అధికంగా వ్యాప్తి చెందుతుంది. పొలంలో ముదురు నీలిని త్వరగా బయటకు తీయాలి. తెగులునివారణకు 200మి.లీ ప్రొపికొనజోల్ మందును డ్రోన్‌తో పిచికారీ చేయాలి. గింజ గట్టిపడే దశలో పలు రకాల శిలీంధ్రాలు ఆశించి నల్లటి మచ్చలు ఏర్పడతాయి. వాటి నివారణకు ప్రొపికొనజోల్ 1.0మి.లీ.. లీటరు నీటిలో కలిపి చల్లుకోవాలి.

చెరకులో ఇలా చేయండి..

అధిక వర్షాలు ముంపునకు గురైన చెరకు పంటలో వడలు తెగులు ఆశించే అవకాశం ఉంది. నివారణకు 3గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 1.0 మి.లీ. ప్రోపికొనజోల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తెల్లదోమ, దూదేకుల తెగులు ఉధృతంగా ఉంటే.. ఎకరానికి ఇమిడా క్లోప్రిడ్ 50 మి.లీ. లేదా అసిటామి 40 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలి.

కందలో కాండం మొదలు కుళ్లు తెగులు

భారీ వర్షాలకు నేలలో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో కంద పంటలో మొదలు కుళ్లు తెగులు సోకుతుంది. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు, లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్లు తడుపుకోవాలి.

బొప్పాయిలో వందశాతం యాజమాన్యం

బొప్పాయితోటలో కలుపు లేకుండా చేయాలి. పండు ఈగ ఎరలను ఎకరానికి 4 చొప్పున అమర్చుకోవాలి. కుళ్లిన రాలిన కాయలను ఎప్పటికప్పుడు తీసి నాశనం చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలుపుకుని పిచికారీ చేయాలి.

పసుపులో దుంపకుళ్లు

అధిక వర్షాలకు పసుపు మొక్కలు కోలుకోవడానికి మల్టీకే-50గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నేలలో తేమ శాతం అధికంగా ఉండటంతో దుంపకుళ్లు తెగులు వ్యాప్తి చెందుతుంది. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3.0 గ్రాములు లీటరు నీటిలో కలిపి మొక్కల చుట్టూ పోయాలి.

మొక్కజొన్న కోలుకోవాలంటే..

అధిక వర్షాలకు మొక్కజొన్న మొక్కలు కోలుకోవడానికి మల్టీకే 50 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కరివేపాకు ఆకులపై మచ్చల నివారణ

కరివేపాకు ఆకులపై అప్పుడప్పుడు తెగుళ్ల మచ్చలు సోకుతాయి. వీటి నివారణకు 2.0 సాఫ్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

మినుములో రకాలు.. విత్తన శుద్ధి.. తెగుళ్లు

మాగాణి పొలాల్లో మినుము సాగు చేసే వారు ఎల్‌బీజీ-752, ఎల్‌బీజీ-787, ఎల్‌బీజీ-884, ఎల్‌బీజీ-904, ఎల్‌బీజీ-932, ఎల్‌బీజీ-942, టీబీజీ-104 తదితర రకాలు సాగుచేసుకోవచ్చు. మినుములో రసం పీల్చే పురుగులతో వ్యాప్తి చెందే వైరస్ తెగుళ్లను నివారించేందుకు ఇమిడాక్లోప్రిడ్ 5మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 5గ్రాములు, కిలో విత్తనంలో కలుపుకుని విత్తన శుద్ధి చేసుకోవాలి. కాండం గజ్జి తెగులు ఆశించే మొక్కలు చనిపోతాయి. దీని నివారణకు కిలో విత్తనంలో ట్రైకోడెర్మావిరిడి 10గ్రాములు కలుపుకొని విత్తన శుద్ధి చేయాలి.

బ్రాయిలర్ ధరలు (కిలో చొ. రూ.లలో)

విజయవాడ: బ్రాయిలర్ ఫారం లైవ్ -115 లేయర్ రూ 142 చికెన్ స్కిన్ లెస్ -206, విత్ స్కిన్ -234. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బ్రాయిలర్ ఫారం లైవ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 విత్ స్కిన్ - 260.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

వంద గుడ్లు రూ. 575 (వ్యాపారులు & చిల్లర సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.96/-.

ఎలక్ట్రానిక్స్ రంగంలో ఐఈటీఈ కీలక సేవలు

తుళ్లూరు, న్యూస్‌టుడే: ఎలక్ట్రానిక్స్ రంగంలో ఆధునిక అనుభవం ఉన్న మేధావుల మార్గదర్శకత్వాన్ని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలి కమ్యూనికేషన్ ఇంజినీర్స్ (ఐఈటీఈ) అందిస్తోందని ఆ సంస్థ విజయవాడ కేంద్రం చైర్మన్ డా. బి.సూర్యప్రసాదరావు పేర్కొన్నారు. రాజధానిలోని ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీలో సోమవారం సాయంత్రం ఆ సంస్థ విజయవాడ సెంటర్ 72వ వ్యవస్థాపక వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో కార్యదర్శి డా. షేక్ రియాజుద్దీన్ హాజరై ప్రసాదరావు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఏడు దశాబ్దాల చరిత్ర కలిగిన ఐఈటీఈ జాతి నిర్మాణంలో విశేష సేవలు అందిస్తోందన్నారు. కృష్ణ, గుంటూరు, ప్రకాశం, ఖమ్మం జిల్లా పరిధిలోని 4 వేల మంది ఇంజినీరింగ్ విద్యార్థులు వీటిని అందుకుంటున్నారని వివరించారు. తమతో పరస్పర భాగస్వామ్య పద్ధతిలో ఎస్ఆర్ఎమ్ వర్సిటీ పనిచేస్తుందని వీసీ డా.సతీష్ కుమార్ తెలిపారు. ఈసీఈ విద్యార్థులు స్వయంగా రూపొందించిన నెక్స్ట్‌జెన్ టెక్నాలజీ క్లబ్‌ను ఇన్‌ఛార్జి వీసీ ప్రారంభించారు. లోగోను డీన్ డా.సి.వి టామీ ఆవిష్కరించారు.

ఐఈటీఈ సభ్యులను సత్కరిస్తున్న సతీష్ కుమార్, సూర్యప్రసాదరావు తదితరులు

కెనరా బ్యాంక్ Canara Bank

ప్రాంతీయ కార్యాలయం : విజయవాడ
డోర్ నెం. 54-15-18/6, యలమంచిలి కాంప్లెక్స్ (స్పెన్సర్స్) ఎదురుగా, విజయవాడ-520008. ఫోన్: 0866-2468600

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

టు:

1. M/s Virtue ఇండస్ట్రీస్, రిజిస్టర్డ్ ఆఫీస్: ఆర్ ఎస్ నెం.313/A, 333/1, 333/2, క్వారీ స్ట్రీట్, పరిటాల, కంచికచర్ల (గ్రామం మరియు మండలం), ఆంధ్రప్రదేశ్-521180.
2. M/s Virtue ఇండస్ట్రీస్, కార్పొరేట్ ఆఫీస్: డి. నెం.59-5-1/2, శాంతి నిలయం, MRF షోరూమ్ ఎదురుగా, ప్రభుత్వ I.T.I కళాశాల పక్కన, రమేష్ హాస్పిటల్ రోడ్, అశోక్ నగర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520010.
3. శ్రీ మునునూరు శివ రామ కృష్ణ, తండ్రి : మల్లికార్జున రావు, డి నెం.59-5-1/2, రమేష్ హాస్పిటల్ రోడ్, ITI కళాశాల పక్కన, అశోక్ నగర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520010.
4. శ్రీమతి మునునూరు పుష్ప లత, భర్త : ఎమ్. శివ రామ కృష్ణ, డి నెం.59-5-1/2, రమేష్ హాస్పిటల్ రోడ్, ITI కళాశాల పక్కన, అశోక్ నగర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520010.
5. శ్రీ మునునూరు రాజీవ్ కృష్ణ, తండ్రి : ఎమ్. శివ రామ కృష్ణ, డి నెం.59-5-1/2, రమేష్ హాస్పిటల్ రోడ్, ITI కళాశాల పక్కన, అశోక్ నగర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520010.
6. శ్రీ మునునూరు తేజ కృష్ణ, తండ్రి : ఎమ్. శివ రామ కృష్ణ, డి నెం.59-5-1/2, రమేష్ హాస్పిటల్ రోడ్, ITI కళాశాల పక్కన, అశోక్ నగర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520010.
7. శ్రీ మునునూరు శివ రామ కృష్ణ, తండ్రి : మల్లికార్జునరావు, ఫ్లాట్ నెం.T-2, 3వ అంతస్తు, డి నెం.40-25-15, డి నెం.40-25-15A, శ్రీ సత్య టవర్స్ అపార్ట్‌మెంట్, జాస్తి వారి వీధి, ఆశ్రమ రోడ్డు, పటమట లంక, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520010.

డియర్ సర్ / మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.

మా కెనరా బ్యాంక్, ఆటో నగర్ బ్రాంచ్ (స్పెషలైజ్డ్ SME) విజయవాడ బ్రాంచ్ (డిపి 4470) నుండి M/s Virtue ఇండస్ట్రీస్ పొందిన లోన్ వివరములు:

లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం.	లోన్ మొత్తం మరియు లోన్ తేదీ / రెన్యువల్ తేదీ	ఈ తేది నాటికి వడ్డీతో కలిపి బకాయి మొత్తం	వడ్డీ రేటు (2% పీనల్ వడ్డీతో కలిపి) (సం॥కి)
OCC/OD లోన్ అకౌంట్ నెం.4470261000056	రూ.10,00,00,000/- తేది. 14.08.2025	రూ. 10,27,21,639/-	12.75%
GECL 1.0 (ఎక్స్‌టెన్షన్) నెం.170003005800	రూ.1,10,00,000/- తేది. 29.11.2021	రూ. 54,41,762.47/-	10.85%

మాకు తనఖా పెట్టిన వ్యక్తి/వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు/ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ **సదరు ఋణాన్ని తేది 24.10.2025 న నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ)గా వర్గీకరించింది.** అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా **రూ.10,81,63,401.47/- (అక్షరాల పది కోట్ల ఎనభై ఒక్క లక్షల అరవై మూడు వేల నాలుగు వందల ఒక్క రూపాయి నలభై ఏడు పైసలు మాత్రమే)** + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.

SARFAESI చట్టం సందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు పుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

చరాస్తులు : 1) క్రషర్ I వద్ద ప్లాంట్స్ & మిషనరీస్ హైపోథికేషన్ చేయబడినవి (కృష్ణా జిల్లా, పరిటాల గ్రామం, ఆర్ ఎస్ నెం.313/1A, 333/1) & క్రషర్ II (కృష్ణా జిల్లా, పరిటాల గ్రామం, ఆర్ ఎస్ నెం.333/2) CERSAI ID: **400051596239, టైటిల్ హోల్డర్ :** M/s Virtue ఇండస్ట్రీస్.

2) క్రషర్ I వద్ద నిల్వలు & పుస్తక నిల్వలు హైపోథికేషన్ చేయబడినవి (కృష్ణా జిల్లా, పరిటాల గ్రామం, ఆర్ ఎస్ నెం.313/1A, 333/1) & క్రషర్ II (కృష్ణా జిల్లా, పరిటాల గ్రామం, ఆర్ ఎస్ నెం.333/2) CERSAI ID: **400051596550, టైటిల్ హోల్డర్ :** M/s Virtue ఇండస్ట్రీస్.

స్థిరాస్తులు : 1) కృష్ణా జిల్లా, ఇబ్రహీంపట్నం, ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి గ్రామ పంచాయితీ ఏరియా, ఆర్.ఎస్ నెం.278, ఉప-విభజన తరువాత ఆర్. ఎస్ నెం.278/2 నందు విస్తీర్ణం 1645.6 చ॥గ॥లు. **హద్దులు : తూర్పు :** S/o ఇరుకులపాటి బుచ్చయ్య గారి ఆస్తి, **దక్షిణం :** గంగానమ్మ దిబ్బ మరియు తండ్రి : పి. అచ్యుత రావు గారి ఆస్తి, **పడమర :** దారి, **ఉత్తరం :** దాత యొక్క ఆస్తి.

CERSAI ID: **400013583709, టైటిల్ హోల్డర్ : శ్రీ మునునూరు శివరామ కృష్ణ, తండ్రి : మల్లిఖార్జున రావు**

2) కృష్ణా జిల్లా, ఇబ్రహీంపట్నం, ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి గ్రామ పంచాయితీ ఏరియా, ఆర్.ఎస్ నెం.278, ఉప-విభజన తరువాత ఆర్. ఎస్ నెం.278/2 నందు విస్తీర్ణం 363 చ॥గ॥లు. **హద్దులు : తూర్పు :** పూరుపూడి రామమోహన రావు గారి ఆస్తి, **దక్షిణం :** దాతకు చెందిన ఆస్తి, **పడమర :** మునునూరి రాంబాబు మరియు ఇతరులు యొక్క ఆస్తి, **ఉత్తరం :** N H రోడ్డు.

CERSAI ID: **400013583709, టైటిల్ హోల్డర్ : శ్రీ మునునూరు శివరామ కృష్ణ, తండ్రి : మల్లిఖార్జున రావు**

3) కృష్ణా జిల్లా, కంచికచెర్ల సబ్-రిజిస్ట్రీ, పరిటాల గ్రామపంచాయితీ, పరిటాల గ్రామం యొక్క డి నెం. 333/1 నందు విస్తీర్ణం ఎకరా 1.00. **హద్దులు : తూర్పు :** N S P కాలువ, **దక్షిణం :** దేవినేని వెంకట రమణ ఇతరులు యొక్క భూమి, **పడమర :** ఎమ్. శివ రామ కృష్ణ గారి ఆస్తి, **ఉత్తరం :** కొనుగోలుదారుని భూమి.

CERSAI ID: **400013582767, టైటిల్ హోల్డర్ : శ్రీమతి మునునూరు పుష్పలత, భర్త : శ్రీ ఎమ్. శివ రామ కృష్ణ**

4) కృష్ణా జిల్లా, కంచికచెర్ల సబ్-రిజిస్ట్రీ, పరిటాల గ్రామపంచాయితీ, పరిటాల గ్రామం యొక్క డి నెం.333/1 నందు విస్తీర్ణం ఎకరా 1.52. **హద్దులు : తూర్పు :** మునునూరు శివ రామ కృష్ణ గారి భూమి, **దక్షిణం :** కొనుగోలుదారుని భూమి, **పడమర :** మునునూరు శివ రామ కృష్ణ గారి ఆస్తి, **ఉత్తరం :** మాగంటి నరసింహా రావు గారి భూమి.

CERSAI ID: **400013582767, టైటిల్ హోల్డర్ : శ్రీమతి మునునూరు పుష్పలత, భర్త : శ్రీ ఎమ్. శివ రామ కృష్ణ**

5) కృష్ణా జిల్లా, కంచికచెర్ల సబ్-రిజిస్ట్రీ, పరిటాల గ్రామపంచాయితీ, పరిటాల గ్రామం యొక్క డి నెం. 313/1A నందు విస్తీర్ణం ఎకరా 0.54 **హద్దులు : తూర్పు :** డొంక రోడ్డు, **దక్షిణం :** దేవినేని వెంకట రమణ గారి భూమి, **పడమర :** కొనుగోలుదారుని భూమి, **ఉత్తరం :** ఎమ్. పుష్పలత గారి భూమి.

CERSAI ID: **400013585638, టైటిల్ హోల్డర్ : శ్రీ మునునూరు శివరామ కృష్ణ, తండ్రి : మల్లిఖార్జున రావు**

6) కృష్ణా జిల్లా, కంచికచెర్ల సబ్-రిజిస్ట్రీ, పరిటాల గ్రామపంచాయితీ, పరిటాల గ్రామం యొక్క డి నెం. 333/1A నందు విస్తీర్ణం ఎకరా 0.50 **హద్దులు : తూర్పు :** డొంక రోడ్డు, **దక్షిణం :** కె. కోటేశ్వర రావు గారి భూమి, **పడమర :** పడ్లమూడి దుర్గ రామ కృష్ణ ప్రసాద్ గారి భూమి, **ఉత్తరం :** చింత వెంకటేశ్వర రావు గారి భూమి.

CERSAI ID: **400013585638, టైటిల్ హోల్డర్ : శ్రీ మునునూరు శివరామ కృష్ణ, తండ్రి : మల్లిఖార్జున రావు**

7) కృష్ణా జిల్లా, కంచికచెర్ల సబ్-రిజిస్ట్రీ, పరిటాల గ్రామపంచాయితీ, పరిటాల గ్రామం యొక్క ఆర్ ఎస్ నెం.333/2 (ఉప-విభజన తరువాత 333/2D నందు విస్తీర్ణం ఎకరా 2.74. **హద్దులు : తూర్పు :** కోగంటి కోటేశ్వర రావు మరియు పడ్లమూడి దుర్గ రామ కృష్ణ ప్రసాద్ గార్ల ఆస్తి, **దక్షిణం :** కోగంటి విజయ లక్ష్మి గారి ఆస్తి, **పడమర :** కోగంటి విజయ లక్ష్మి గారి ఆస్తి, **ఉత్తరం :** పల్లభనేని వెంకటేశ్వర రావు మరియు లక్ష్మి పరిపూర్ణమ్మ ఇతరులు యొక్క ఆస్తి.

CERSAI ID: **400023862933, టైటిల్ హోల్డర్ : శ్రీ మునునూరు శివరామ కృష్ణ, తండ్రి : మల్లిఖార్జున రావు**

8) కృష్ణా జిల్లా, కంచికచెర్ల సబ్-రిజిస్ట్రీ, పరిటాల గ్రామపంచాయితీ, పరిటాల గ్రామం యొక్క ఆర్ ఎస్ నెం. 333/2 (ఉప-విభజన తరువాత 333/2B నందు విస్తీర్ణం ఎకరా 0.26. **హద్దులు : తూర్పు :** కోగంటి నాగేశ్వర రావు గారి ఆస్తి, **దక్షిణం :** పాములపాటి అమ్మారావు గారి ఆస్తి, **పడమర :** మాగంటి అమ్మారావు గారి ఆస్తి, **ఉత్తరం :** పల్లభనేని వెంకటేశ్వర రావు మరియు లక్ష్మి పరిపూర్ణమ్మ ఇతరులు యొక్క ఆస్తి.

CERSAI ID: **400023861877, టైటిల్ హోల్డర్ : శ్రీ మునునూరు శివరామ కృష్ణ, తండ్రి : మల్లిఖార్జున రావు**

9) విజయవాడ, పటమట లంక, ఆశ్రమం రోడ్డు, జాస్తి వారి వీధి, డి నెం.40-25-15 & డి నెం. 40-25-15A, ప్రస్తుత మున్సిపల్ వార్డు నెం.28, ఆర్ ఎస్ నెం.31/5 నందు మొత్తం విస్తీర్ణం 721 చ॥గ॥లు లేదా 602.828 చ॥మీ॥లులోని అవిభాజ్యమైన ఉమ్మడి వాటా 40 చ॥గ॥లు లేదా 33.44 చ॥మీ॥తో "శ్రీ సత్య టవర్స్" అపార్ట్‌మెంట్ యొక్క మూడవ అంతస్తులోని 775 చ॥అ॥లుతో ఫ్లాట్ నెం.T-2 తో కలదు. **అపార్ట్‌మెంట్ హద్దులు : తూర్పు :** మున్సిపల్ రోడ్డు, **దక్షిణం :** ఉమ్మడి బజార్, **పడమర :** కత్తవల్లి లక్ష్మి గారి ఆస్తి, **ఉత్తరం :** మున్సిపల్ రోడ్డు. **ఫ్లాట్ నెం.T-2 హద్దులు : తూర్పు :** ఓపెన్ టు స్కై, **దక్షిణం :** ఓపెన్ టు స్కై మరియు ఫ్లాట్ నెం.T-3, **పడమర :** కామన్ కారిడార్ మరియు ఫ్లాట్ నెం.T-1, **ఉత్తరం :** ఓపెన్ టు స్కై.

CERSAI ID: **100001104275, టైటిల్ హోల్డర్ : శ్రీ మునునూరు శివరామ కృష్ణ, తండ్రి : మల్లిఖార్జున రావు**

10) కృష్ణా జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, మూలపాడు వద్ద ఆర్ ఎస్ నెం.6/2B, 6/2C నందు వ్యవసాయేతర భూమి విస్తీర్ణం ఎకరా 90 సెంట్లు లేదా 43565 చ॥గ॥లులోని భూమి. **హద్దులు : తూర్పు :** గొల్లపూడి రామకోటయ్య గారి ఆస్తి, **దక్షిణం :** రోడ్డు, **పడమర :** పొలిమేర డొంక, **ఉత్తరం :** కోర లక్ష్మి సుజాత గారి ఆస్తి.

CERSAI ID: **400039513139, టైటిల్ హోల్డర్ : శ్రీ మునునూరు శివరామ కృష్ణ, తండ్రి : మల్లిఖార్జున రావు**

తేది: 27.10.2025, ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

రూ.10.5 కోట్ల నష్టపరిహారం అందజేత

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఏడు నెలల కిందట జగ్గయ్యపేట శివారులోని సాయి తిరుమల కోల్డ్‌స్టోరేజ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో సంభవించి మిర్చి, అపరాలు కాలిపోయాయి. సుమారు 207 మంది రైతులు భారీగా నష్టపోయారు. దీంతో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యంతో మాట్లాడి వారికి నష్టపరిహారం వచ్చే విధంగా కృషి చేశారు. సోమవారం రూ.10.5 కోట్ల నష్టపరిహారంగా రైతులకు అందించారు. ఈ సందర్భంగా రైతులు.. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నగదు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

బొప్పాయి పాలు.. విదేశాలకు

నంద్యాల జిల్లా వాగలమర్రి మండల వ్యాప్తంగా రైతులు అధికంగా బొప్పాయి సాగు చేస్తున్నారు. చిన్నవంగలిలోని గ్రామంలోని వైఎస్సార్ కడప జిల్లా కాసుగూడూరు, క్రిష్ణాపల్లె గ్రామాల్లో 1200 ఎకరాల్లో పండిస్తారు. విత్తనం నాటిన కాలం నుంచి తొమ్మిది నెలలకు పంట చేతికొస్తుంది. పండ్ల సేకరణ అనంతరం 13 నెలల తర్వాత మిగిలిన, ముదురు కాయలకు గాట్లు పెట్టి పాలను సేకరిస్తున్నారు. తెల్లవారుజాము సమయంలోనే కాయలకు గాట్లు పెడితే కేవలం రెండు గంటల్లోనే పాలు ఊరుతాయి. ఇలా సేకరించిన దానిని ఎండబెట్టి, రాయచోటి, రాజంపేటకు చెందిన వ్యాపారులు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల పాలు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 4 డ్రమ్ముల పాలు సేకరిస్తున్నారు. ఎకరానికి పాల సేకరణ ద్వారా రైతుకు రూ.24 వేల ఆదాయం వస్తుంది. సేకరించిన పాలను పరిశ్రమల్లో మందులు, కాస్మోటిక్స్, సబ్బుల తయారీలో ఉపయోగిస్తున్నారు. బెంగళూరు, చెన్నైతో పాటు నాణ్యతను బట్టి విదేశాలకు సైతం పాలను ఎగుమతి చేస్తున్నారు. బొప్పాయి సాగులో ఎప్పుడైనా ధర పడిపోయినప్పుడు బొప్పాయి పాల సేకరణతో నష్టాల నుంచి రైతులు బయటపడుతున్నారు. – న్యూస్‌టుడే, వాగలమర్రి

పాడి ఆవుల ఎంపికలో మెలకువలు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే

పశు పోషకులు పాడి ఆవుల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకుంటే మంచి గోవులను పొందే అవకాశం ఉంటుందని పశు వైద్యాధికారి జంగా ప్రభాకరరావు తెలిపారు. ఆయన సూచనలు ఇవే.. ప్రధానంగా పాల ఉత్పత్తి ఉన్న వాటిని ఎంపిక చేసుకోవాలి. ఈత సామర్థ్యంతో పాటు ఆరోగ్యంగా చురుగ్గా ఆకర్షణీయంగా, నిండు ఉదర భాగంగా కలిగిన వాటిని ఎంచుకోవాలి. శరీరం త్రికోణాకారంగా, కాంతివంతమైన కన్నులు కలిగి, సన్నని మెడ ఉండే వాటిని ఎన్నుకోవాలి. పశువుల నాణ్యత, చరిత్రను దృష్టిలో ఉంచుకోవాలి. పాల దిగుబడిని మూడు వేళ్లలో లెక్కించి సగటున ఎన్ని పాలిస్తున్నాయన్నది లెక్క కట్టి అవగాహనకు రావాలి. పాలు పితకడానికి ఎవరినైనా దగ్గరకు రానిచ్చే ఆవులను ఎంచుకోవాలి. ప్రధానంగా అక్టోబర్- నవంబరు నెలల్లో కొనాలి.

జైలుకు జోగి బ్రదర్స్..

నకిలీ మద్యం కేసులో ఆదివారం అరెస్టయిన వైకాపా నేత, మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు జోగి రామును ఆదివారం రాత్రి ఎక్సైజ్ కోర్టులో హాజరుపర్చగా వాదోపవాదాల అనంతరం జడ్జి రిమాండ్ విధించారు. దీంతో సోమవారం తెల్లవారుజామున విజయవాడ జైలుకు, అనంతరం అక్కడి నుంచి నెల్లూరు జైలుకు తరలించారు. **-ఈనాడు, అమరావతి**

కోర్టు నుంచి విజయవాడ జైలుకు జోగి రమేష్, జోగి రామును తరలిస్తూ..

జైలు లోపలికి వెళ్లిన వేళ..

అలసత్వం సహించను : కలెక్టర్

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఇలక్కియా తదితరులు

పాయకాపురం, న్యూస్‌టుడే : ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీల పరిష్కారంలో అలసత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోనని, అవి పునరావృతం కాకుండా చూడాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సంబంధిత అధికారులను హెచ్చరించారు. అనుమతి లేకుండా గ్రీవెన్స్‌కు గైర్హాజరైతే చర్యలు తప్పవని పేర్కొన్నారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కారం అవుతాయని అర్జీదారులు నమ్మకంతో మనవద్దకు వస్తారని, వారి నమ్మకానికి బలం చేకూరేలా సమస్యలు సకాలంలో తీర్చాలని పేర్కొన్నారు. బాధ్యతగా భావించి, అనుశీలన చేయాలని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్‌కు ప్రజల నుంచి మొత్తం 194 అర్జీలు వచ్చాయి. జేసీ ఇలక్కియా, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, డీఆర్డీఏ పీడీ ఎ.ఎన్.వి.నాంచారరావు, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి హామీ

ఈనాడు కథనానికి స్పందన

మైలవరం, న్యూస్‌టుడే : ఈనెల 7వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు సీసీఐ అధికారులు హామీ ఇచ్చినట్లు మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకులు కె. శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'సీసీఐ జాడ లేదు.. గ్రామాల్లో ధర లేదు' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించి, కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. సోమవారం గుంటూరులో నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో 7న కేంద్రాలను తెరిచేందుకు సీసీఐ జనరల్ మేనేజర్ హామీ ఇచ్చినట్లు వివరించారు.

టెట్-2025 పరీక్షలకు ఉచిత శిక్షణ

గుంటూరు (నగరంపాలెం): టెట్-2025 పరీక్షలకు హాజరయ్యే మైనార్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ అందజేస్తున్నట్లు రీజనల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ డీడీ యాకుబ్ బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్-2025 పరీక్షలకు హాజరయ్యే కోస్తా జిల్లాలకు సంబంధించిన ముస్లింలు, దూదేకులు, క్రిస్టియన్(బీసీ-సి), పార్శీకులు, సిక్కులు, నియోబుద్ధులకు గుంటూరులోని రీజనల్ సెంటర్ ఆంధ్రా ముస్లిం కళాశాల క్యాంపస్‌లో నైపుణ్యం, అనుభవం కలిగిన అధ్యాపకులతో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈనెల 5 నుంచి తరగతులు ప్రారంభిస్తామని తెలిపారు. వివరాలకు 95026 66629, 81259 07579 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ముక్క చీరలతో మోసం చేస్తే చర్యలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ముక్క చీరలతో భక్తులను మోసం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ పేర్కొన్నారు. ఈనెల 7న నిర్వహించనున్న పాలకమండలి సమావేశాన్ని దృష్టిలో పెట్టుకొని సభ్యులతో పాలకమండలి ఛైర్మన్ ట్రయల్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఎజెండాకు సంబంధించిన అంశాలను సభ్యులకు మూడు రోజులు ముందుగా అందజేయాలని అధికారులకు సూచించారు. అనంతరం దేవస్థానంలో ముక్క చీరలతో భక్తులను మోసం చేస్తున్న దుకాణాలను తనిఖీ చేశారు. భక్తులను ఇబ్బంది పెట్టకుండా కనకదుర్గానగర్‌లో దుకాణాల ముందు ఫుట్‌పాత్ ఆక్రమించకుండా రెయిలింగ్ ఏర్పాటు చేయాలని సభ్యులు ఛైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రసాదాల పోటు, అన్నప్రసాద పంపిణీ భవనం, ఎలివేటెడ్ క్యూలైన్ల నిర్మాణ పనులు పరిశీలించారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు బి.ధర్మారావు, జి.సరోజనీదేవి, పద్మావతి ఠాకూర్, ప్రధానార్చకులు దుర్గాప్రసాద్, ప్రత్యేక ఆహ్వానితులు శంకరబాబు, రామబ్రహ్మం పాల్గొన్నారు.

విక్రయాలు పరిశీలిస్తున్న దుర్గగుడి ఛైర్మన్ రాధాకృష్ణ, సభ్యులు

సైబర్ నేరాలకు సహకారం.. ముగ్గురి అరెస్టు

రమేశ్‌రెడ్డి శ్రీను శ్రీధర్

హైదరాబాద్: ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలకు సహరించిన ముగ్గురు నిందితులను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. వీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారు. పోలీసుల కథనం ప్రకారం.. ఓ ముఠా సభ్యులు హైదరాబాద్‌కు చెందిన బాధితులకు వాట్సాప్ ద్వారా పెట్టుబడుల సలహాదారులుగా పరిచయం చేసుకొని, నమ్మించి డబ్బులు దండుకున్నారు. అలా ముగ్గురి నుంచి రూ.59 లక్షలు కొట్టేశారు. బాధితులిచ్చిన ఫిర్యాదుపై సైబర్ సెల్ పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. గుంటూరు జిల్లా, తమ్మ రంగారెడ్డినగర్‌కు చెందిన మడతాల రమేశ్‌రెడ్డి (25), విశాఖపట్నం ఇంద్రానగర్‌కు చెందిన గండి శ్రీను, విజయవాడ, గొల్లపూడి, కృష్ణమల్లి రెసిడెన్సీ నివాసి, గుర్రపుకొండ శ్రీధర్‌లను నిందితులుగా గుర్తించారు. వీరు సైబర్ మోసగాళ్లతో చేతులు కలిపి, వివిధ బ్యాంకుల్లో ఖాతాలు తెరిచారు. వాటి వివరాలను మోసగాళ్లకు చేరవేశారు. ఆ ఖాతాలో జమయ్యే మొత్తంలో రమేశ్‌రెడ్డి, శ్రీను, శ్రీధర్‌లకు 15 నుంచి 20 శాతం కమీషన్‌లు అందుతున్నాయని పోలీసులు గుర్తించారు. ఏసీపీ శివమారుతి నేతృత్వంలోని బృందం నిందితులను అరెస్టు చేశారు. వారి ఫోన్లు, డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

91.9FM Vijayawada

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU e Classifieds

AUTO

VEHICLES FOR SALE

2022 Model Kubota MU4501 4WD Tractor Regd No AP 39US 4635 for Sale in as is Where is Condition. Sundaram Finance Ltd ✆ 89859 66475, 94409 09726.

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధికధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 87907 41166

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీనివాస గ్రూప్, VJA. వృద్ధులకు, పేషెంట్లసేవకు, ఇంటి/ వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 95537 86677/96404 96677

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

JOBS

Wanted Real Estate Marketing Executives and Female Telecallers. LIC Colony, Vijayawada. ✆ 94324 54545.

Wanted Female Telecallers / Data Entry / Freshers / Experience. Qul: Inter / any Graduate. Salary: 10k to 18k. Timing: 9:30 to 6:30. ✆ 99080 98305

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యూయర్స్. ఏజ్: 22-35. ఫ్రెషర్స్ కూడా కావలెను. ✆ 62810 37879.

R.K **ఇంజినీరింగ్** కాలేజీ నందు పనిచేయుటకు ఎలక్ట్రీషియన్స్ కావలెను. అనుభవమును బట్టి జీతం+ భోజనం+ ఉచిత వసతి కల్పించబడును. కేతనకొండ, ఇబ్రహీంపట్నం మండలం, విజయవాడ, 97014 73399.

గుణదల పడవల రేవు సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీ పిచ్చమ్మతల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో అర్చకులు కావలెను. సంప్ర ✆ 94409 45604

ప్రముఖ ఆటోఫైనాన్స్ ఆఫీస్‌కి అనుభవంగల కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. A:25-30Y, Sal:18-25k Qul: డిగ్రీ. ✆ 99495 58181, 81215 58181

మీకు లైఫ్ ఇన్సూరెన్స్ రంగంలో ఆసక్తి ఉందా? ఇన్సూరెన్స్ అమ్మకాలు మీరు స్వయంగా చేయకుండానే స్థిరమైన ఆదాయం పొందవచ్చు. ✆ 90305 12580,95731 42460

గుంటూరు జిల్లా వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ హాస్టల్‌లో ఉండి పనిచేయుటకు వార్డెన్స్ కావలెను. (పురుషులు/ స్త్రీలు) డిగ్రీ/ పీజీ అర్హత. కాంటాక్ట్- 94903 09033 (F), 97058 34803 (M)

రిటైర్డ్, VRS, గృహిణులకు పెట్టుబడి లేని గొప్ప వ్యాపారావకాశం. P/F టైం. జీతం + Inc +PF కలవు. ప్రముఖ MNC కంపెనీలో ✆ 94905 03345.

ప్రముఖ దినపత్రిక నందు పనిచేయుటకు యువతీ, యువకులు కావలెను. అర్హత: 10 పాస్, వయస్సు: 19 నుండి 30 సం॥లోపు, జీతము మరియు టీఏ, డీఏ సదుపాయం కలదు. సంప్రదించవలసిన నెం: 91543 32118.

MARKETING/ SALES

Wanted Marketing Executives qly- degree, exp- 5 yrs, 30,000 p.m + T.A, D.A cell: 62814 37559.

DRIVERS

విజయవాడ ఏలూరు రోడ్డులో వ్యాలెట్ పార్కింగ్ నందు పని చేయుటకు డ్రైవర్స్ కావలెను. ✆ 98486 11113 / 96183 82562

SECURITY GUARDS

సెక్యూరిటీ గార్డులు కావలెను. పిన్నమనేని పాలీ క్లినిక్ ఏరియాలో ప్రముఖ జ్యూయలరీ మాల్‌కు. జీతము: 15,000/- + ఫుడ్, PF, ESI ఫెసిలిటీ కలదు. ✆ 80994 44758, 96401 48367.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

విద్యుత్తు సమస్యలా? తెలియజేయండి

ఈనాడు మీతోడు — డయల్ యువర్ డీఈఈ రేపు



గ్రామాల్లో ప్రజలకు, రైతులకు నిత్యం అనేక విద్యుత్తు సమస్యలు ఎదురవుతున్నాయి. ఇటీవల మొంథా తుపానుతో పలు ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తాయి. ఆయా ఇబ్బందులను విద్యుత్తు అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించుకోవడంలో భాగంగా ఈనాడు ఆధ్వర్యంలో విద్యుత్తుశాఖ మైలవరం సబ్ డివిజన్ డీఈఈ ఐ.సుధాకర్‌తో ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. సబ్ డివిజన్ పరిధిలో గల మైలవరం, జి.కొండూరు మండలాల్లోని ప్రజలు తమ సమస్యలను నేరుగా ఆయన దృష్టికి తీసుకెళ్తే పరిష్కారానికి కృషి చేస్తారు. చేయాల్సిందల్లా కింది సెల్ నంబర్లకు సూచించిన సమయంలో ఫోన్ చేయడమే. **- న్యూస్‌టుడే, మైలవరం**

94910 66103
80085 74705

తేదీ: బుధవారం 05-11-2025

సమయం: ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు

చిత్రాలు గీశారు.. బహుమతులు పొందారు

బహుమతులు సాధించిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

విస్సన్నపేట: విజేతలతో ప్రిన్సిపల్ కృష్ణమాచారి, అధ్యాపకులు

మైలవరం, న్యూస్‌టుడే: ప్రతిభతో చక్కటి చిత్రాలను గీసిన విద్యార్థినులు బహుమతులు సాధించారు. ప్రశంసా పత్రాలను అందుకున్నారు. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభాపాటవ పోటీల్లో భాగంగా సోమవారం స్థానిక బాలికోన్నత పాఠశాల ప్లస్‌లో 'మీకు ఇష్టమైన పండగ' అంశంపై చిత్రలేఖన పోటీలను పెట్టగా విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారిలో అందులో 7వ తరగతి విద్యార్థినులు సీహెచ్ దివ్యశ్రీ, ఎ.లిల్లీశరన్, బి.గగనప్రియలు వరుసగా తొలి మూడు స్థానాలు సాధించారు. వారికి ప్రధానోపాధ్యాయుడు వై.రాజశేఖర్, ఉపాధ్యాయినులు జి.వాణిశ్రీ, కె.సుందరి, కె.సారిక, ఎం.శిరీష, ఎం.తులసిలు బహుమతులు అందజేసి అభినందించారు.

ప్రతిభతోనే ప్రశంసలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విద్యార్థుల్లోని సృజనశక్తులను వెలికి తీయడానికి ఈనాడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీలు తోడ్పడతాయని వికాస్ విద్యాసంస్థల డైరెక్టర్ నరెడ్ల నర్సిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వికాస్ జూనియర్ కళాశాలలో మీకు ఇష్టమైన పండగ..విశిష్టతపై చిత్రలేఖన పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారిలో ఎంపీసీ ద్వితీయ సంవత్సర విద్యార్థులు సంగోజు భావన, బరమచారు ఉప్పలత, బిల్లా వెంకటకృష్ణలు ప్రతిభచూపి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వారికి ప్రిన్సిపల్ వి కృష్ణమాచారి బహుమతులు అందజేసి అభినందించారు. అధ్యాపకులు బి ధర్మయ్య, బి చిన్న రవి, సీహెచ్ సాయి రేఖ, యు.నాగలక్ష్మి పాల్గొన్నారు.

స్పందించారు..శుభ్రం చేయిస్తున్నారు

ఈనాడు కథనానికి స్పందన

కొండపల్లి 29వ డివిజన్ అరుణానగర్ ఖాళీ స్థలాల్లో ముళ్ల చెట్లు పెరిగిపోయాయి. వర్షం పడిన సందర్భంలో ఇళ్లల్లోకి పాములు, పురుగులు రావడంతో ఇబ్బందిగా ఉందని స్థానికులు తెలిపిన సమస్యలపై ఈనాడులో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నేపథ్యంలో పురపాలిక కౌన్సిల్ సమావేశంలో ఈ విషయాన్ని వైస్ ఛైర్మన్ శ్రీను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వారు స్పందించగా సోమవారం జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమాన్ని ఛైర్మన్ చిట్టిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ రమ్యకీర్తన తదితరులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, కొండపల్లి**

పనులు పర్యవేక్షిస్తున్న ఛైర్మన్ చిట్టిబాబు తదితరులు

అన్నదాతల సంక్షేమానికి ప్రాధాన్యం

రైతుల పంట కొనేందుకు వడివడిగా చర్యలు

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే

తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో ఖరీఫ్ వరి నూర్పిడులు ప్రారంభమయ్యాయి. రైతులు పండించిన ధాన్యం ప్రభుత్వ కేంద్రాల్లో మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఇప్పటికే తిరువూరు, విస్సన్నపేట మండల్లాలోని పలువురు రైతులు యంత్రాలతో ధాన్యం నూర్పిడి చేయించారు. గ్రామాల్లో వీఏఏల ద్వారా షెడ్యూల్ ఖరారు చేసుకుని కేంద్రాల్లో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నారు. మరోవైపు అధికారులు నిర్దేశిత పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్‌ల ద్వారా ధాన్యం కొనుగోలుకు అవసరమైన తేమ పరీక్ష యంత్రాలు, ధాన్యం నింపేందుకు గోనె సంచులు, తూకం వేసేందుకు ఎలక్ట్రానిక్ కాటాలు కేంద్రాల్లో ఉంచారు.

48 గంటల్లోపు సొమ్ము జమ

రెవెన్యూ డివిజన్‌లో ఈ ఏడాది ఖరీఫ్‌లో 21,084 హెక్టార్లలో వరి సాగు చేయగా దిగుబడి 1,56,327 మెట్రిక్ టన్నులు ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు దిగుబడిలో 60 శాతం వరకు పంటను కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని లక్ష్యంగా ఉంది. ఈ నేపథ్యంలో డివిజన్‌లోని ఐదు మండలాల నుంచి 1,31,197 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సి ఉంది. ఇప్పటికే 3,67,500 గోనె సంచులు కేంద్రాలకు సరఫరా చేశారు. కొనుగోలు చేసిన ధాన్యం తరలించేందుకు ఎ.కొండూరు మండలంలో 2, తిరువూరు, విస్సన్నపేట మండలాల్లో మూడేసి రైస్ మిల్లులను ఎంపిక చేశారు. రైతులు జీపీఎస్ నమోదు చేసుకుని సొంత వాహనాల్లో కూడా ధాన్యం మిల్లులకు తరలించవచ్చు. రైతులకు 24 నుంచి 48 గంటల లోపు సొమ్మును బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తారు.

ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర (రూ.లో) ఇలా

రకం	క్వింటాల్	75 కిలోలకు
సాధారణ	2369	1777
ఎ.గ్రేడ్	2389	1792

గతేడాది రికార్డు అధిగమించాలి

తిరువూరు రెవెన్యూ డివిజన్‌ల 2024 ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని లక్ష్యాన్ని అధిగమించి ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోలు చేశారు. ఆర్డీవో కె.మాధురి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ధాన్యం కొనుగోలులో తిరువూరు డివిజన్‌ను జిల్లాలోనే ముందంజలో నిలిపారు. గతేడాది 40 వేల మెట్రిక్ టన్నుల పంట కొనుగోలు లక్ష్యంగా ఉండగా డిసెంబరు మొదటి పక్షానికే లక్ష్యాన్ని చేరుకుని రికార్డు నెలకొల్పారు. రెవెన్యూ అధికారులు అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా లక్ష్యం మేరకు మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తే రైతులకు మేలు చేసినట్లే.

తిరువూరు చింతలపాడులో ఆరబోసిన వడ్లు

తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో)	కేంద్రాలు	గోనె సంచులు
తిరువూరు	7379	54583	18	1,70,500
గంపలగూడెం	3907	29000	11	47,500
విస్సన్నపేట	3606	26782	9	45,000
రెడ్డిగూడెం	3399	25191	9	45,000
ఎ.కొండూరు	2796	20276	12	59,500

శుద్ధజల యంత్రం వితరణ

దాతలు శివ నాగేశ్వరరావు, కరుణ ప్రసాదుతో నాయకులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట తెదేపా మండల కార్యాలయానికి రూ.50,000 విలువ గల శుద్ధజల యంత్రాన్ని స్థానిక నివాసితులు నందిగం శివ నాగేశ్వరరావు, కుమారుడు నందిగం కరుణ ప్రసాదు అందజేశారు. తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు, నాయకులు వారికి అభినందనలు తెలిపారు.

ప్రజల దాహార్తి తీర్చిన దాత

విస్సన్నపేట, న్యూస్‌టుడే: తాతకుంట్ల గౌరవపాలెం ముస్లిం బజారు నివాసితులకు మంచి నీటిని అందించే మోటార్ ఇటీవల తుపానుకు మరమ్మతులకు గురైంది. ఈ తరుణంలో దాత ఎన్టీ వెంకటేశ్వరరావు రూ.20,000 వితరణ చేసి బాగు చేయించారు. స్థానిక ప్రజలు దాతను అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

కొండపల్లి: 8008574656, జి.కొండూరు 9063144762

? ఎస్వీఎస్ నగర్‌లో ఉమా కిరాణా సమీపంలో గల వీధి కుళాయి చుట్టూ పిచ్చి చెట్లు పెరగడంతో నీళ్లు పట్టుకోవడానికి ఇబ్బందిగా ఉంది. **- సత్యవతి, మైలవరం** ✔ పిచ్చి చెట్ల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. **- ఉమామహేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్** ? వెల్లటూరు గ్రామంలోని ఎస్సీ ఏరియాలో ఇటీవల కురిసిన వర్షాలకు పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారై దోమలతో అవస్థలు పడుతున్నాం. **- రాంబాబు, గ్రామస్థుడు** ✔ సిబ్బందితో తక్షణమే పారిశుద్ధ్య చర్యలు చేపట్టి దోమల నివారణ చర్యలు తీసుకుంటాం. **- మురళి పంచాయతీ కార్యదర్శి**

స్పందనకు వందనం

◆ స్థానిక పంచాయతీలోని పలు అంతర్గత రహదారుల వెంట మురుగు కాలువల నుంచి తొలగించిన వ్యర్థాలు తొలగించకపోవడంతో ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షిక ద్వారా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సోమవారం పలు ప్రాంతాల్లో ఉన్న వ్యర్థాలను శుభ్రం చేయించారు. ◆ దుగ్గిరాలపాడు గ్రామంలోని కాలువల్లో పూడిక పేరుకుపోయి మురుగు పారక అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్య 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన 3వ తేదీన ప్రచురితమవగా పంచాయతీ కార్యదర్శి మనోజ్ స్పందించారు. సిబ్బందితో కాలువను శుభ్రం చేయించి..దోమల నివారణకు చర్యలు చేపట్టారు. ◆ కొండపల్లి ఆరు పంపులకు వెళ్లే మూల మలుపులో చెత్త తొలగించలేదని, కాలువలో మురుగు తీయలేదని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగా తెలిపిన సమస్యపై పారిశుద్ధ్య సిబ్బంది స్పందించారు. ఆ ప్రాంతంలో శుభ్రం చేయించారు. ◆ స్థానిక పంచాయతీలోని 9 వార్డులో రహదారి వెంట డ్రెయినేజీ పూడికతో నిండి మురుగు ప్రవాహానికి ఆటంకంగా ఉందని స్థానికులు తెలిపిన సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావుకు తెలియజేయగా స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం, కొండపల్లి** ◆ స్థానిక నరసాపురం గ్రామ పంచాయతీ ప్రదాన వీధుల్లో ఇటీవల తుపాను వర్షాలకు అధ్వానంగా మారడంతో శుభ్రం చేయించాలని నివాసితులు చేస్తున్న ఫిర్యాదుపై కార్యదర్శి జి.స్వాతి స్పందించారు. సిబ్బంది సాయంతో వీధులను శుభ్రం చేయించి, బ్లీచింగ్ చల్లించారు. **- న్యూస్‌టుడే, విస్సన్నపేట** ◆ పట్టణంలోని 14వ వారులో చెత్త పేరుకుపోయిందని స్థానికుడు దుర్గారావు ఫిర్యాదు చేయగా శానిటరీ అధికారి సంతోష్ స్పందించారు. సిబ్బందిని పంపి చెత్త ఊడ్పించారు. ◆ పట్టణంలోని 16వ వార్డులో డ్రెయినేజీల్లో మట్టి, బురద పేరుకుపోయి మురుగు పారడంలేదని స్థానికుడు సోమశేఖర్ చేసిన ఫిర్యాదుపై శానిటరీ అధికారులు స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్, విస్సన్నపేట**

అర్హులకి పింఛను అందించాలి

విస్సన్నపేట, న్యూస్‌టుడే: అర్హత కలిగిన పింఛనుదారులు తమకు పింఛను మంజూరు చేయాలని విస్సన్నపేట సీపీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. మండల కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో ఎంపీడీవో చిన్నరాట్నాలుకి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జ్ఞానరత్నం, ఏడుకొండలు, రంగారాణి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల ఆశలను కొలికపూడి నిర్వీర్యం చేశారు'

మాట్లాడుతున్న రాజేశ్వరరావు, పక్కన నాయకులు

గంపలగూడెం, న్యూస్‌టుడే: తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పనితీరుతో తెదేపా నాయకులు, కార్యకర్తలు అధికారంలో ఉన్నామనే మనోధైర్యాన్ని కోల్పోయారని మండల పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన మొదటి రోజు నుంచి ఇతర నాయకులు, కార్యకర్తలకు దగ్గరై తెదేపా కార్యకర్తలు ఆయనపై ఉంచిన ఆశలను నిర్వీర్యం చేశారన్నారు. ఎమ్మెల్యే నుంచి పార్టీని రక్షించాలని, క్యాడర్‌ను కాపాడాలని కోరుతూ తెదేపా కేంద్ర కార్యాలయానికి వెళ్లి వేడుకోవాలని మండల పార్టీ నాయకులు తీర్మానం చేశారు. మండలంలోని తోటమూలలో సోమవారం రాత్రి పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మానుకొండ రామకృష్ణ అధ్యక్షతన మండల పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రాజేశ్వరరావు, మండల శాఖ మాజీ అధ్యక్షుడు ఆర్.వీరారెడ్డి మాట్లాడుతూ తెదేపా ఆవిర్భవించాకే రాజకీయాల్లో, పదవుల్లో కులమతాలకు అతీతంగా ప్రాధాన్యత లభించిందన్నారు. రాష్ట్రాన్ని జగన్ పాలనను రక్షించాలని, రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబును సీఎం చేయాలనే ఆశయంతో నియోజకవర్గంలో తెదేపా యంత్రాంగం అహర్నిశలు శ్రమించి కొలికపూడిని గెలిపించారన్నారు. ఆయన అవన్నీ మర్చిపోయి పార్టీని, కార్యకర్తలను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కె.శ్రీనివాసరావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు పి.కొండలరావు, డీవీ.కృష్ణారావు, లీగల్ సెల్ కార్యదర్శి కె.ఆనంద్‌స్వరూప్, తెలుగు మహిళా అధ్యక్షురాలు ఎన్.రాఘవమ్మ తదితరులు పాల్గొన్నారు.

గెలిచారు.. అభినందనలు అందుకున్నారు..

జి.కొండూరు, న్యూస్‌టుడే: కవులూరులోని భోగినేని రాజగోపాలరావు పుష్పావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం జీవీ రామకృష్ణ సోమవారం తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన డివిజన్ స్థాయి పోటీల్లో డీ.విక్రమ్ అండర్-14, 400 మీటర్ల పరుగు పందెంలో రెండవ స్థానం, కే సిద్ధార్థ అండర్-17, 5 కిలోమీటర్ల వాకింగ్‌లో రెండవ స్థానం, జీ సురేంద్ర అండర్-17 హర్డిల్స్‌లో జిల్లాకు ఎంపికయ్యారన్నారు. క్రీడాకారులకు, పీడీ శ్రీలతకు పలువురు అభినందనలు తెలిపారు. ◆ వెలగలేరు చనమోలు ఫకీర్రాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు యు.రాజేంద్ర, సీహెచ్ మనికంత జి.తరుణ్‌కుమార్, సుచరిత, సుదీప్ హైజంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రోలో సత్తాచాటి జిల్లాకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కె.పద్మ తెలిపారు. వారికి, పీడీ పురుషోత్తంను పలువురు అభినందించారు.

వెల్వడం(మైలవరం), న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి అండర్ 16 కబడ్డీ పోటీలకు మండలంలోని వెల్వడం ఎల్‌పీఎం హైస్కూల్ విద్యార్థులు ఎం.వరుణ్, పి.లోకేశ్‌లు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు టి.బసవారావు, పీడీ బి.నాగమణి తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

కవులూరు: క్రీడాకారులతో రామకృష్ణ, పీడీ శ్రీలత

మైలవరం విద్యార్థులతో ఉపాధ్యాయులు

సేవా కార్యక్రమాలకు పెద్దపీట

బ్రోచర్ ఆవిష్కరిస్తున్న జిల్లా గవర్నర్, నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా లయన్స్‌క్లబ్‌ల ద్వారా విస్తృత సేవలు అందించాలని లయన్స్ జిల్లా గవర్నర్ వీవీవీఎస్ ఆంజనేయులు సూచించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా లయన్స్‌క్లబ్ రెండో క్యాబినెట్ సమావేశాన్ని ఆదివారం రాత్రి స్థానిక ఎస్వీఎస్ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా లయనిజం ఉందని, సేవా కార్యక్రమాలకు పెద్దపీటగా నిలుస్తోందన్నారు. అనంతరం సేవా కార్యక్రమాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐపీఎంసీసీ డి.శ్రీశాంతి, మొదటి, రెండవ గవర్నర్‌లు ఎన్‌వీవీఎస్ ప్రసాద్, సీహెచ్ శ్రీనివాసరెడ్డి, క్యాబినెట్ సభ్యుడు బాలగోపాలరెడ్డి, శ్రీధర్, కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, మైలవరం క్లబ్ నాయకులు నాగభూషణం, రామిరెడ్డి, హరీష్‌గుప్తా పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతం

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో కార్తిక మాసం సోమవారం సందర్భంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు గోపాలాచార్యులు వ్రత కథా వృత్తాంతాలను వివరించారు. వివిధ గ్రామాలకు చెందిన 34 మంది దంపతులు పీటలపై ఆశీనులై క్రతువులో పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనర్ ఎన్.సంధ్య, పాలకమండలి అధ్యక్షురాలు కె.శశిరేఖ, సభ్యురాలు జి.వెంకటరమణ, గుడి కమిటీ మాజీ అధ్యక్షులు బి.మధుసూదనరావు, వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రతువులో పాలకవర్గం, అధికారులు, తెదేపా నాయకులు

రాష్ట్ర స్థాయికి ఎంపిక

మైలవరం, న్యూస్‌టుడే: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా సోమవారం నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఎంఈఓ ఎల్.బాలు తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థిని ఎస్.కె.గుల్షన్ ఆరా, స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.కె నాగుల్ షరీఫ్, కొండపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని ఎం.మేఘనలు వరుసగా మొదటి మూడు స్థానాలను సాధించినట్లు వివరించారు. విద్యార్థులకు బహుమతులు, ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వరదా శ్రీనివాసరావు, సాక్ డైరెక్టర్ శ్రీసాయి విజయ్, కోఆర్డినేటర్లు సత్యనారాయణ, శివకృష్ణ, క్లబ్ లీడర్ కల్యాణ్, కో లీడ్ శశాంక్ పాల్గొన్నారు.

విద్యార్థులతో ఎంఈఓ, ఉపాధ్యాయులు

విద్యార్థులకు క్విజ్ పోటీలు

మైలవరం, న్యూస్‌టుడే: కేఎల్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని స్మార్ట్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని చంద్రాల హైస్కూల్‌లో క్విజ్ పోటీలను నిర్వహించారు. ఆయా విభాగాల్లో విజేతలైన

విజేతలతో నిర్వాహకులు

రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: మూలపాడు శివారు త్రిలోచనపురం వాసులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న మురుగు కాలువలు, రహదారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు గ్రామ వ్యవసాయ పరపతి సహకార సంఘం అధ్యక్షుడు గరికపాటి శ్రీనివాసరావు తెలిపారు. గ్రామంలో మురుగు కాలువల నిర్మాణానికి రూ.40 లక్షలు, సీసీ రహదారుల ఏర్పాటుకు రూ.10 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ పనులను చేసేందుకు సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సర్పంచి చింతల భూలక్ష్మి, జడ్పీటీసీ శ్రీదేవి, నాయకులు నాగేశ్వరరావు, గంజి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజలో నాయకులు, అధికారులు

కారు ఢీకొని ఒకరి మృతి

జి.కొండూరు, న్యూస్‌టుడే: కారు ఢీకొన్న ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు పినపాక గ్రామానికి కోసూరు బాబురావు(57) సోమవారం మధ్యాహ్నం పినపాక శివారు విద్యానగరం సమీపంలో తన సైకిల్‌పై పొలానికి వెళుతున్నాడు. ఈ క్రమంలో జాతీయరహదారి-30 వద్ద యూటర్న్ తీసుకుని వెళ్తున్న క్రమంలో ఇబ్రహీంపట్నం వైపు నుంచి వస్తున్న కారు అదుపు తప్పి బాబురావు సైకిల్‌ను ఢీకొంది. దీంతో అతడు రహదారిపై పడిపోగా తలకు తీవ్ర గాయమవడంతో ఢీకొన్న కారులోనే విజయవాడ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. భార్య దుర్గ ఫిర్యాదు మేరకు ఎస్సై కే.సతీష్‌కుమార్ కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో మరొకరు..

హనుమాన్‌జంక్షన్: విద్యుదాఘాతం కారణంగా మల్లవల్లిలో సోమవారం ఒకరు దుర్మరణం చెందారు. స్థానికంగా ఉన్న పారిశ్రామికవాడను ఆనుకుని ఉన్న పెంథుకోస్తు ప్రార్థనా మందిరంలో విద్యుత్తు పనులు చేస్తుండగా.. మున్నంగి యోహాను(40)కు ఒక్కసారిగా షాక్ కొట్టింది. దీంతో ఇతడిని సమీపంలో ఉన్న మీర్జాపురంలోని ఓ ఆసుపత్రికి.. ఆ తర్వాత నూజివీడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే యోహాను ప్రాణాలు కోల్పోయారు. ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లికి చెందిన ఇతడు ప్రార్థనా మందిరంలో పనులు చేసేందుకు వచ్చి ఇలా మృతి చెందడంతో స్థానికంగా విషాద ఛాయలు అలముకున్నాయి. వీరవల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తూ జారిపడి వృద్ధురాలు..

తిరువూరు టౌన్: స్థానిక జైబావి సెంటర్ వద్ద ఆగి ఉన్న ఆర్టీసీ బస్సు దిగుతూ గంపలగూడెం మండలం కనుమూరుకు చెందిన యార్లగడ్డ రోశమ్మ(84) ప్రమాదవశాత్తు జారిపడి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తైక్వాండో పోటీల్లో అక్కాచెల్లెళ్ల ప్రతిభ

ఇబ్రహీంపట్నం(గ్రామీణం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం జూపూడికి చెందిన అక్కాచెల్లెళ్లు తైక్వాండో పోటీల్లో సత్తాచాటి పతకాలు సాధించారు. రాష్ట్ర పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 2, 3 తేదీల్లో అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరులో నిర్వహించిన అండర్ 17 బాలికల విభాగంలో కలతోటి దామిని ప్రతిభ చూపి బంగారు పతకం సాధించగా..నిర్వాహకులు అరుణాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ బాలిక ప్రస్తుతం డాన్‌బాస్కో పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఇదే పోటీల్లో దామిని సోదరి కలతోటి హాసిని అండర్ 19 విభాగంలో రజత పతకం అందుకుంది. ఈమె గుంటూరులోని భాష్యం కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ సందర్భంగా వీరిని, శిక్షకులు అంకమ్మరావు, గౌరీశంకర్‌లను పాఠశాల, కళాశాల యాజమాన్యాలు, గ్రామస్థులు అభినందించారు.

5న గిరిప్రదక్షిణ

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలను సమీప మెట్టగుట్ట గజలక్ష్మి సమేత శేషాచల శ్రీనివాస ఆలయంలో కార్తిక పూర్ణిమ సందర్భంగా ఈ నెల 5వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు గిరిప్రదక్షిణ, సాయంత్రం 6 గంటలకు కృతిక జ్యోతి దీపోత్సవం నిర్వహిస్తామని గుడి అభివృద్ధి కమిటీ సభ్యులు, అర్చకులు తెలిపారు.

జోగి రమేష్ అరెస్టును ఖండిస్తున్నాం

జి.కొండూరు: మాజీ మంత్రి జోగి రమేష్‌ను కల్తీ మద్యం కేసులో అక్రమంగా అరెస్టు చేశారని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ ఆరోపించారు. ఆమె నివాసంలో వైకాపా మండల నాయకులతో కలిసి సోమవారం విలేకర్లతో మాట్లాడారు. కల్తీ మద్యం కేసుతో ఆధారాలు లేకుండా జోగి రమేష్‌ను అరెస్టు చేయడం దారుణమన్నారు.

ఘనంగా భూమిపూజ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ముచ్చనపల్లి, రెడ్డిగూడెం గ్రామాల్లో వడ్డె ఓబన్న విగ్రహ ఏర్పాటుకు ఘనంగా సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ వడ్డెర సంక్షేమ సంఘం, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ మల్లే ఈశ్వరరావు, ఆ సంఘం నాయకులు సత్యనారాయణ, వేములబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ పునఃప్రతిష్ఠ

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: గ్రామ ఆధ్యాత్మిక, సాంస్కృతిక సమైక్యతలుగా దేవాలయాలు నిలవాలని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. ఇబ్రహీంపట్నం గంగానమ్మ తల్లి నూతన ఆలయ పునఃప్రతిష్ఠా కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

అధికారుల బృందం సందర్శన

విస్సన్నపేట, న్యూస్‌టుడే: కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు మండలంలోని దేవాలయాలను పలు శాఖలతో కూడిన అధికారుల బృందం సోమవారం సందర్శించింది. ఆలయాల్లో మౌలిక వసతులు, పర్వదినాల్లో వచ్చే భక్తుల సంఖ్య, కావలసిన రక్షణ ఏర్పాట్ల గురించి నిర్వాహణ కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రజలతో చర్చించారు. ఎంపీడీవో విజయ్ భాస్కర్, [illegible] పాల్గొన్నారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda — బ్యాంక్ ఆఫ్ బరోడా

గూడవల్లి బ్రాంచ్, డోర్ నెం.1-17, రెడ్డి వీధి, గూడవల్లి, విజయవాడ రూరల్, ఎన్‌టిఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 521104. Email Id: Vjguda@bankofbaroda.com

స్కాన్ చేయగలరు — నియమ నిబంధనల కొరకు

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన (APPENDIX- IV-A [See proviso to Rule 8 (6)]

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002తో కలిపి చదవబడే సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) లోని నిబంధనలు ప్రకారం స్థిరాస్తుల అమ్మకము కొరకు అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకమునకు మరియు ముఖ్యంగా ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)లకు తెలియజేయునది ఏమనగా ఈ దిగువ వివరించబడిన స్థిరాస్తి సెక్యూర్డ్ క్రెడిటార్ గారికి తనఖా/ఛార్జ్‌డ్ చేయబడి బ్యాంక్ ఆఫ్ బరోడా యొక్క అధీకృత అధికారిచే (సెక్యూర్డ్ క్రెడిటార్) స్వాధీనము చేసుకొనబడి ఈ దిగువ చెప్పబడిన ఖాతా(లు) యొక్క మొత్తములు తగిన వసూలు చేసికొనుటకు సదరు స్థిరాస్తులను "ఎక్కడ ఏమి ఉన్నదో అదే" "అక్కడ ఏమి ఉన్నదో అదే" [illegible]

ఋణగ్రహీత(లు)/హామీదారు(లు)/తనఖాదారుని పేర్లు మరియు చిరునామా	స్థిరాస్తి వివరాలు (గిరీష్ కుమార్ గారి తనఖా పెట్టినారు)	డిమాండ్ నోటీసు తేది, బకాయి మొత్తం	ఇ-వేలం తేది మరియు సమయం	రిజర్వు ధర, ధరావతు, బిడ్ పెంపుదల
ఋణగ్రహీత: శ్రీ గిరీష్ కుమార్, [illegible] 521228 [illegible]	[illegible]	తేది.31.10.2025, రూ.21,55,674.06 [illegible]	24-11-2025 ఉ॥ 02.00 గం॥ల నుండి సా॥ 06.00 గం॥ల వరకు [illegible]	రిజర్వు ధర: రూ.21,38,000/-, ధరావతు: రూ.2,13,800/-, బిడ్ పెంపుదల: రూ.25,000/-

స్వాధీనత స్వభావం: భౌతిక

ఆస్తులను పరిశీలన తేది.17-11-2025 ఉ॥11.00 గం.ల నుండి మ॥02.00 గం.ల వరకు [illegible]

[illegible] https://www.bankofbaroda.in/e-auction.htm [illegible] https://Baanknet.com [illegible] 94419 63666 [illegible]

తేది: 03-11-2025, ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా, గూడవల్లి బ్రాంచ్

విజయవాడ తూర్పు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80085 74652

స్పందనకు వందనం

★ 11వ డివిజన్ పటమట కరణంగారి బజారులో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పొంగుతున్నాయని స్థానిక నివాసి జాస్తి సురేష్.. 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె యంత్ర సాయంతో పూడిక తీయించారు.

★ మూడో డివిజన్ శ్రీరామచంద్రనగర్‌లో దోమలు ఎక్కువగా ఉన్నాయని స్థానిక నివాసి సుంకర కోటేశ్వరరావు.. మలేరియా అధికారి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందిని పంపి దోమల నివారణ మందులు చల్లించారు.

★ 4వ డివిజన్ సుబ్బారావు కాలనీ 4-7/130 విద్యుత్తు స్తంభానికున్న వీధి దీపం వెలగకపోవడంతో స్థానిక నివాసి వెలగపూడి సుబ్బారావు.. ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు. - న్యూస్‌టుడే, కరెన్సీనగర్

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: విద్యుత్తు తీగల మరమ్మతుల నేపథ్యంలో బృందావన్ కాలనీ ఉపకేంద్రం పరిధిలో మంగళవారం ఉదయం 8 నుంచి 11 గంటల మధ్య పటేల్ గూడెం కాలువ గట్టు ఏరియా, బృందావన్ కాలనీ, ఏ కన్వెన్షన్ రోడ్డు, సింధు భవనం రోడ్డు, సిరిసరాజ్ రోడ్డు, ఎలక్ట్రానిక్ రోడ్డు, పటేల్‌గూడెం రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ పి.రవీంద్రబాబు తెలిపారు.

శివారు కాలనీలపై నిర్లక్ష్యమేల ?

కరెన్సీనగర్, న్యూస్‌టుడే

తూర్పు నియోజకవర్గ పరిధిలో శివారు కాలనీలపై అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. అసంపూర్తి డ్రెయిన్ల నిర్మాణం, కానరాని కాలువలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షమొస్తే కాలువలు పొంగి పొర్లడం పరిపాటిగా మారింది. సీసీ రహదారులు నిర్మిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. పక్కా కాలువలు లేని రోడ్లు ఏవిధంగా మన్నిక వస్తాయో వారికే తెలియాలి.

● మూడో డివిజన్ శివారు కాలనీలు కరెన్సీనగర్, శ్రీరామచంద్రనగర్, కనకదుర్గ నగర్, నాగార్జుననగర్, గణేష్ కాలనీలున్నాయి. ప్రధానంగా లోతట్టు రహదారులు ఉండటంతో ఇటీవల వచ్చిన కూటమి ప్రభుత్వం పక్కా సీసీ రహదారులను ఏర్పాటు చేసింది. ఇంకా కొన్ని నిర్మాణ, శంకుస్థాపన దశలో ఉన్నాయి. మరి కొన్ని టెండర్లు పూర్తయినా పట్టాలెక్కలేదు. గతంలో నిర్మించిన రహదారులకు ఇరువైపులా సీసీ డ్రెయిన్లు నిర్మించారు. వీటిని ప్రధాన డ్రెయిన్‌కు అనుసంధానం చేయలేదు. కరెన్సీనగర్ విస్తరి రోడ్డు నుంచి బాయన బాబూజీ రహదారి కింది నుంచి పంటకాలువ డ్రెయిన్‌కు అనుసంధానం చేయాల్సి ఉన్నా తూముల ద్వారా మళ్లిస్తున్నారు. ఈ ప్రాంతంలో చిన్నపాటి వర్షానికే వరద నీరు వచ్చి చేరి రోడ్లపైకి వస్తోంది. గతంలో నాగార్జుననగర్, శ్రీరామచంద్రనగర్‌లో ఉన్న డ్రెయిన్లు లోతట్టుగా ఉన్నాయి. కొన్ని డ్రెయిన్లు కనపడకుండా పోయాయి. వీటిలో పూడిక తీయడం లేదు. దీంతో వర్షపునీరు తిష్ట వేసి దోమల ఉద్ధృతితో రాత్రిళ్లు కునుకు ఉండటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మలేరియా విభాగం తూతూమంత్రంగా దోమల మందు పైపైన చల్లి వెళ్లిపోతున్నారు.

బాయన బాబూజీ రహదారి కలిసే ప్రాంతంలో అసంపూర్తి డ్రెయిన్ నిర్మాణం

మురుగు పారుదలకు ఆటంకం లేకుండా చర్యలు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని అన్ని డ్రెయిన్లలో వ్యర్థాలను తొలగించి మురుగునీటి పారుదలకు ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. పాతబస్తీ, కేటీ రోడ్డు, గణపతిరావు రోడ్డు, చిట్టినగర్, ఊర్మిళాసుబ్బారావు నగర్, రామరాజునగర్, కబేళా, ఎర్రకట్ట, గాంధీనగర్ ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు. పలు ప్రాంతాల్లోని డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకుపోయినట్లు గుర్తించి బాధ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణకు ఏమాత్రం ఆటంకాలు లేకుండా చూడాలని, రహదారులపై గుంతలు లేకుండా పూడ్చాలని ఆదేశించారు. నిత్యం తాగునీటి పరీక్షలు నిర్వహించాలని, మొక్కలు ఎక్కువగా పెంచాలని తెలిపారు. గాంధీనగర్ అన్న క్యాంటీన్‌ను పరిశీలించి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని తెలిపారు.

ఎంపీ శివనాథ్‌ను కలిసిన ప్రెస్ అకాడమీ ఛైర్మన్లు

పటమట, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్, తెలంగాణ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డిలు సోమవారం ఎంపీ శివనాథ్‌ను విజయవాడ గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో కలిశారు. ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే నేతలతో కలిసి ప్రస్తుతం మీడియాలో నెలకొన్న పరిస్థితులు, పలు రాజకీయ అంశాలపై ఎంపీతో చర్చించుకున్నారు. ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందరరావు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కంచల జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్‌ల అందజేత

పాయకాపురం, న్యూస్‌టుడే: విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని కలెక్టరేట్‌లో దివ్యాంగ విద్యార్థులకు కలెక్టర్ జి. లక్ష్మీశ, జేసీ ఎస్.ఇలక్కియాలు ల్యాప్‌టాప్‌లు అందజేశారు. ఒక్కొదాని విలువ సుమారు రూ. 1.40 లక్షలు ఉంటుందని చెప్పారు. వినికిడి లోపం, కంటి చూపు సమస్య, శారీరక వైకల్యం కలిగిన పీహెచ్‌డీ, డిగ్రీ, బీటెక్ విద్యార్థులకు అందజేశారు.

ప్రజాసమస్యలకు శాశ్వత పరిష్కారం

అర్జీ పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: కార్పొరేషన్‌లో ప్రజా సమస్యలను సంబంధిత విభాగాధిపతులే పరిశీలించి పరిష్కరించాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి పలు సమస్యలపై 17 వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు క్షేత్ర స్థాయిలో సమస్యలను పరిశీలించి ఫిర్యాదుదారులతో మాట్లాడాలని, గడువులోపు పరిష్కరించి నివేదిక పంపాలని అన్నారు. అన్ని సమస్యలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని తెలిపారు. సిమెంట్ రోడ్లు నిర్మించాలని, చెత్త తొలగించాలని, టీడీఆర్ బాండ్లు జారీ చేయాలని, అనుమతిలేని కిటికీలు తొలగించాలని ఫిర్యాదులు అందాయి. డ్రెయిన్లు పూడికలు, పార్కు నిర్వహణ, రహదారి ఆక్రమణ, మంచినీటి సరఫరా, అక్రమ నిర్మాణాలు, ఆస్తి పన్ను, డబుల్ అసెస్‌మెంట్, వర్షపునీటి నిల్వలు, పారిశుద్ధ్య సమస్యలు, హోటల్ కార్మికులకు ఆవాసం, ఓపెన్ డ్రెయిన్లు వంటి సమస్యలపై వినతులు అందాయి. అధికారులు రవీంద్రరావు, చంద్రశేఖర్, అర్జునరావు, లత, సృజన, శ్రీధర్, సత్యకుమారి, కామేశ్వరరావు, చంద్రశేఖర్, మాల్యాద్రి, సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో గృహిణుల పాత్ర అమూల్యం

మాట్లాడుతున్న రాయపాటి శైలజ

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: కుటుంబం, సమాజాభివృద్ధిలో గృహిణుల పాత్ర అమూల్యమని ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. మొగల్రాజపురం సిద్ధార్థ పార్వతి కళాశాలలో మార్పు ట్రస్టు, మహిళా స్టడీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జాతీయ గృహిణుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శైలజ మాట్లాడుతూ గృహిణులు వంటింటికే పరిమితంకావాలనే భావన నుంచి బయటపడాలని, వారి శ్రమలో కుటుంబ సభ్యులు కూడా భాగస్వాములు కావాలన్నారు. మహిళల్లో చాలామందికి పోషకాహారం లోపం ఉందని, వారి ఆరోగ్యానికి కుటుంబ సభ్యులు, ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. మహిళలు, బాలికలు సైబర్ నేరాలపై పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వరల్డ్ కప్ విజేతగా నిలిచిన మహిళ క్రికెట్ టీమ్‌కు అభినందనలు తెలిపారు. మార్పు ట్రస్టు నిర్వాహకురాలు ఆర్.సూయజ్, కళాశాల ప్రిన్సిపల్ ఎ.సునీత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సాయం

మొగల్రాజపురం(విజయవాడ సిటీ): లయోలా కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నిఖిత తండ్రి ఇటీవల మృతి చెందారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆమె చదువు మానేయాలనుకుంది. సహ విద్యార్థిని ఆయేషా ఈ విషయాన్ని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫరూక్ షిబ్లీ దృష్టికి తీసుకెళ్లింది. ఆయన వెంటనే స్పందించారు. సోమవారం మొగల్రాజపురంలోని కార్యాలయంలో నిఖితకు రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందించారు.

వీరులపాడులో 52 మి.మీ.వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. వీరులపాడు 52 మి.మీ., వత్సవాయి 29.8, కంచికచర్ల 13.6, ఇబ్రహీంపట్నం 11.6, జి.కొండూరు 3.6, పెనుగంచిప్రోలు 3.4, నందిగామలో 1.6 మిల్లీ మీటర్ల మేర వర్షం పడింది.

నడకదారినీ ఆక్రమించేశారు..

కృష్ణలంక, న్యూస్‌టుడే

గుడ్‌మార్నింగ్ హోటల్ సమీపంలో పేవర్ బ్లాక్స్‌పై వాహనాలు, బడ్డీలు

పర్యావరణ పరిరక్షణతో పాటు రహదారులకు అందమైన మార్జిన్లు, ప్రజల రాకపోకలకు సౌకర్యంగా ఉండాలన్న సంకల్పంతో నగర పరిధిలో పలుచోట్ల వీఎంసీ పేవర్‌బ్లాక్స్ ఏర్పాటు చేసింది. దీంతో రాకపోకలు మరింత సౌకర్యవంతంగా ఉండాల్సింది పోయి ఆక్రమణలు మరింత పెరిగిపోవడం విమర్శలకు దారితీస్తోంది. రాణిగారితోట సర్వీసు రోడ్డుకు ఒక పక్కన సుమారు 1.5 కిలోమీటర్ల పరిధిలో 2023లో పేవర్ బ్లాక్స్ నిర్మాణాన్ని చేపట్టి సుందరంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం వీటిని వాహనాల పార్కింగ్‌కు, బడ్డీలకు, మెకానిక్ షెడ్లకు, చిరుహోటళ్ల ఏర్పాటుకు వినియోగిస్తున్నారు. వీటి ఏర్పాటు వల్ల ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేకపోగా ఇందుకోసం వెచ్చించిన ప్రజాధనం దుర్వినియోగం అయ్యిందన్న అభిప్రాయాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

వాకింగ్ కూడా సాధ్యపడడం లేదు : 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన పేవర్‌బ్లాక్ నిర్మాణాలపై కనీసం వాకింగ్ కూడా వీలుపడడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంత ప్రజలు వాకింగ్ నిమిత్తం వీటిని వినియోగించవచ్చని తొలుత భావించారు. అందుకు భిన్నంగా ఏర్పాటు అనంతరం రాణిగారితోట 17వ డివిజన్ గుడ్‌మార్నింగ్ హోటల్ సెంటర్ మొదలు 16వ డివిజన్ సత్యనారాయణనగర్ వరకు ఏర్పాటు చేసిన పేవర్‌బ్లాక్స్ మొత్తం ఆక్రమణల పాలయ్యాయి. నగరానికి చెందిన ఆయా ప్రాంతాలవారు తమ వాహనాలను తెచ్చి వీటిపై రోజంతా అనధికార నిలుపుదల చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ ఆక్రమణలను తొలగించాల్సిందిగా కోరుతున్నారు.

‘అంబేడ్కర్ అంటే జగన్‌కు గౌరవం లేదు’

విజయవాడ (సూర్యారావుపేట), న్యూస్‌టుడే : వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికి అంబేడ్కర్ అంటే కనీస గౌరవం లేదని, అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పేరు పెట్టుకున్నారని సమతా సైనిక్ దళ్ నేత పిల్లి సురేంద్ర విమర్శించారు. రాష్ట్రంలో కుల మతాలను రెచ్చగొట్టి విగ్రహ రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ విగ్రహ రాజకీయాలను వ్యతిరేకిస్తూ సోమవారం విజయవాడలోని అంబేడ్కర్ స్మృతివనంలో నిరసన వ్యక్తం చేశారు. సురేంద్ర మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డి విధ్వంసకర పాలనకు ప్రజలు స్వస్తి పలికి.. 151 సీట్ల నుంచి 11 సీట్లకే పరిమితం చేశారని గుర్తు చేశారు. అతని అనుచరులకే స్మృతివనం నిర్వహణ బాధ్యతలు అప్పగించారని తెలిపారు. కావాలనే పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు ఇవ్వకుండా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మృతివనం నిర్వహణ సంస్థ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వైకాపా నాయకులే అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి రాజకీయం చేయాలని చూశారన్నారు. చంద్రబాబుకు అంబేడ్కర్ అంటే గౌరవం ఉందని.. అందుకే రాజధానిలో అంబేడ్కర్ స్మృతివనం నిర్మించాలని చూస్తే.. దాన్ని జగన్ చెడగొట్టారని గుర్తు చేశారు. ఇప్పటికైనా జగన్‌మోహన్‌రెడ్డి విగ్రహ రాజకీయాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు.

తుపాను తగ్గినా వీడని వర్షం నీరు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: మొంథా తుపానుకు కురిసిన భారీ వర్షాలకు నాలుగో డివిజన్ సీటీవో కాలనీలో నీరు ఇంకా బయటకు వెళ్లలేదు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఎక్కడి నీరు అక్కడే ఇంకాల్సి వస్తోంది. నివాసులు ఆ నీటిలోనే జీవనం సాగిస్తున్నారు. వ్యాధులు ప్రబలే సమయంలో ఇలా వర్షం నీటిలో మగ్గుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

మూడో డివిజన్ కరెన్సీనగర్ సర్వీస్ రోడ్లు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. మురుగునీటి పారుదల వ్యవస్థ అధ్వానంగా ఉంది. కాలువల పక్క నుంచి వెళ్లాలంటే దుర్గంధం భరించలేకున్నామని పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మలేరియా విభాగం వారు పైపైన మందులు చల్లినా ఉపయోగం ఉండడం లేదు. పూడిక తీయాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కరెన్సీనగర్**

అధ్వాన రహదారులతో అవస్థలు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే

భారీ గుంతలతో దాసాంజనేయ ఆలయం రోడ్డు

మూడో డివిజన్ కరెన్సీనగర్‌లో ఆర్భాటంగా చేసిన శంకుస్థాపనలు ముందుకు సాగడం లేదు. ఆరు నెలలు కావొస్తున్నా నిర్మాణాలకు నోచుకోవడం లేదు. నగరపాలక సంస్థ అధికారులు సాకులు చెబుతూ కాలాన్ని వెళ్లదీస్తున్నారు. చిన్నపాటి వర్షానికే మోకాల్లోతు నీటిలో సంచరించాల్సి వస్తోందని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. మూడో డివిజన్ కరెన్సీనగర్‌లోని దాసాంజనేయ ఆలయం రోడ్డుతో పాటుగా మరికొన్ని రోడ్ల పనులకు సుమారు రూ.కోటి అంచనా వ్యయంతో శంకుస్థాపన చేశారు. ఈ ఏడాది మే నెలలో స్థానిక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శిలాఫలకాన్ని నాటించారు. అప్పటి నుంచి ఎప్పుడు పనులు మొదలు పెడతారా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఆరుమాసాలుగా పదిసార్లకు పైగా వర్షాలు కురిసి మోకాలు లోతున నీరు రోడ్డు పైకి చేరింది. ఈ సమయంలో యంత్రాలతో తోడించడం పరిపాటిగా మారింది. మొంథా తుపానులో వారం పాటుగా రహదారిలో రాకపోకలు సాగలేదు. వర్షపునీటి నిల్వతో దుర్వాసనతో ఉండలేక పోతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. దీంతో పాటుగా భారీ గుంతలు ఏర్పడి రాత్రి వేళ వాహనాలతో పడిపోతున్నారు. దీనిపై సర్కిల్- 3 ఈఈ సామ్రాజ్యాన్ని అడుగగా గుత్తేదారును పిలిపి స్పామని లేని పక్షంలో తొలగించి టెండర్లు రివైజ్ చేస్తామని చెప్పారు.

ఫార్మసీ రంగంలో ఉపాధి అవకాశాలు మెండు

మాట్లాడుతున్న బసవేశ్వరరావు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: ఫార్మసీ రంగంలో అపారమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని ప్రొ.ఎంవీ బసవేశ్వరరావు అన్నారు. సోమవారం మొగల్రాజపురంలో సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో బి.ఫార్మసీ, ఫార్మాడీ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు దీక్షారంభ-2025 నిర్వహించారు. ప్రొ.బసవేశ్వరరావు, ఔషధ నియంత్రణ విభాగం డిప్యూటీ డైరెక్టర్ కె.అనిల్‌కుమార్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై విద్యార్థులు ఫార్మసీ రంగంపై అవగాహన కల్పించారు. కళాశాల కన్వీనర్ అరుణ్‌కుమార్, ప్రిన్సిపల్ సునీత, కార్యక్రమ కార్యనిర్వహణాధికారి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

వంశీ షరతుల బెయిల్ సడలింపు పిటిషన్ వాయిదా

పటమట, న్యూస్‌టుడే: వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ షరతుల బెయిల్ సడలింపుపై వేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి ఈ నెల 5వ తేదీకి వాయిదా వేశారు. సత్యవర్ధన్ కిడ్నాప్, దాడి కేసులో విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ కోర్టు వంశీకి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా వంశీ నెలలో ప్రతి శనివారం పటమట స్టేషన్‌లో సంతకం చేయాలి. అనారోగ్య సమస్యల కారణంగా ఈ సంతకాలు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని మూడు నెలల క్రితం న్యాయస్థానంలో ఆయన పిటిషన్ దాఖలు చేశారు. దీంతో నెలలో ప్రతి రెండు, నాల్గవ శనివారాలు సంతకం చేయాలంటూ అప్పుడు న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. అనంతరం నెలలో ఆ రెండు శనివారాలు కూడా సంతకాల నుంచి మినహాయింపు ఇవ్వాలని వంశీ తాజాగా పిటిషన్ దాఖలు చేశారు. ఇది సోమవారం విచారణకు రాగా దీనిని వ్యతిరేకిస్తూ పటమట పోలీసులు కౌంటర్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో విచారణను ఈ నెల 5కు వాయిదా వేస్తూ న్యాయాధికారి భాస్కరరావు తీర్పునిచ్చారు.

నేత్ర వైద్యుడి మృతి



డాక్టర్ మాధవ సాయి (పాతచిత్రం)

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి మండలం పాగోలు గ్రామానికి చెందిన ప్రముఖ నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ చిరుమామిళ్ల మాధవసాయి(84) సోమవారం మృతిచెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. విజయవాడలోని కుమారుడి నివాసంలో తుదిశ్వాస విడిచారు. మాధవసాయి గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో హెచ్‌వోడీగా సేవలందించారు. ఉద్యోగ విరమణ అనంతరం పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. జన్మభూమిపై మమకారంతో ప్రతినెలా పాగోలు గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. మాధవసాయి భౌతికకాయానికి స్వచ్ఛ సుందర చల్లపల్లి రథసారథి డాక్టర్ డీఆర్కే ప్రసాద్, వివేకానంద డిగ్రీ కళాశాల డైరెక్టర్ యార్లగడ్డ శివప్రసాద్ తదితరులు నివాళులర్పించి.. అంతిమ వీడ్కోలు పలికారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ ఛాంపియన్‌షిప్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో రాష్ట్ర విలువిద్య సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులు జరిగిన 42వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్(అండర్-18) బాల బాలికల ఆర్చరీ ఛాంపియన్‌షిప్ సోమవారం ముగిసింది. మూడో రోజైన సోమవారం ఇండియన్ రౌండ్‌లో పోటీలు నిర్వహించారు. బాలుర విభాగంలో 54, బాలికల విభాగంలో 42 మంది తలపడ్డారు. బాలికల విభాగంలో వై.దేతిచంద్రిక, కేవీస్ సుజయ్, కేవీస్ మనస్విని, కె.లోహితారెడ్డి, బాలుర విభాగంలో జీవీ లోకేష్, సీహెచ్ మోహిత్, జి.మహీధర్, వి. లలిత సాయి తేజలు వరుసగా తొలి నాలుగు స్థానాల్లో నిలిచారు. వీరంతా రాష్ట్ర ఇండియన్ రౌండ్ జట్టుకు ఎంపికయ్యారని రాష్ట్ర విలువిద్య సంఘం ప్రధాన కార్యదర్శి బెవర వెంకట రమణ తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని ఇటానగర్‌లో ఈ నెల 22వ తేదీ నుంచి జరిగే 42వ జాతీయ సబ్ జూనియర్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన ఆర్చర్లకు రాష్ట్ర విలువిద్య సంఘం ఛైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు జి.ప్రేమ్‌కుమార్, బొమ్మదేవర శ్రావణ్‌కుమార్, శాప్ పరిశీలకుడు నవీన్‌కుమార్‌లు పతకాలు బహూకరించారు.

వైభవంగా కార్తిక పూజలు

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: కార్తిక రెండో సోమవారం సందర్భంగా మొగల్రాజపురంలోని శివగిరిపై పూజలు, అభిషేకాలు, హోమాలు చేశారు. మహిళలు దీపాలు వెలిగించారు. శివగిరి క్షేత్ర స్థాపకులు మల్లికార్జున శర్మ పర్యవేక్షించారు.

తోపుడు బండి అందజేత

కృష్ణలంక, న్యూస్‌టుడే: సంక్షేమ పథకాలు అందించడం, విపత్తులను ఎదుర్కోవడం ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థతకు నిదర్శనమని తెదేపా నాయకుడు గద్దె క్రాంతికుమార్ అన్నారు. కృష్ణలంక 21వ డివిజన్ శంకర మఠం వద్ద తెదేపా నాయకుడు చెంబేటి కృష్ణబాబు రూ. 15 వేలతో తయారు చేయించిన తోపుడు బండిని క్రాంతి కుమార్ ప్రారంభించి ఆకురాతి శ్రీనివాసరావుకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు చంద్రబాబు పెట్టిందిపేరన్నారు. కూటమి నాయకులు గొరిపర్తి నామేశ్వరరావు, కొవ్వూరి కిరణ్, కేశనం భావన్నారాయణ, వేముల దుర్గారావు, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: గురునానక్‌నగర్‌లోని నెక్ట్స్‌జెన్ స్కూల్‌కు చెందిన విద్యార్థి ఎల్.సిద్ధార్థ్ రాజు కరాటేలో మెరుగైన ప్రతిభను ప్రదర్శించి కాంస్య పతకం కైవసం చేసుకున్నాడని ప్రిన్సిపల్ సమ్రానా పర్వీన్ తెలిపారు. ఈ నెల 2న గుంటుపల్లిలో జరిగిన 24వ జాతీయ ఓపెన్ కరాటే పోటీల్లో సిద్ధార్థ్ రాజు అండర్-10 బాలుర కటాలో తలపడి తృతీయ స్థానంలో నిలిచాడని పేర్కొన్నారు. సోమవారం అతడిని ఛైర్మన్ వి.వంశీకృష్ణ, డైరెక్టర్ శాంతి, సీఈవో గౌతమి, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

ఇంద్రకీలాద్రిపై సహస్ర లింగార్చన

కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్న దుర్గగుడి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ తదితరులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: కార్తిక మాసం రెండో సోమవారం పురస్కరించుకొని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరాలయం లో సహస్ర లింగార్చన, సహస్ర దీపాలంకృత స్టాండ్ వద్ద దీపార్చన, ఊంజల్ సేవల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మల్లేశ్వర స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ పూజలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన కర్ణాటక బృందం

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: కర్ణాటక ఉడిపి జిల్లా శాలి గ్రామ పంచాయతీ ప్రతినిధులు, అధికారులు విజ్ఞానయాత్ర పేరిట సోమవారం నగరంలో పర్యటించారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పలు ప్లాంట్లను పరిశీలించారు. కార్పొరేషన్ అధికారులు వారికి పలు వివరాలు అందించారు. శాలి గ్రామ పంచాయతీ ప్రతినిధులు అజిత్‌సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంటు స్క్రాప్ పార్కు, హనుమాన్‌పేట వాహన డిపో ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ప్రధాన కార్యాలయంలో వీరు కమిషనర్ ధ్యానచంద్రతో సమావేశమై చర్చించారు. నగరపాలక సంస్థ అనుసరిస్తున్న విధానాలు, తీసుకుంటున్న నిర్ణయాలు, అభివృద్ధి పనుల అమలు, వివిధ ప్లాంట్ల ఏర్పాటు, వ్యర్థాల నిర్వహణ, డ్రోన్ల సర్వేలైన్సు వంటి అనేక అంశాలను కమిషనర్ వారికి వివరించారు. కర్ణాటక బృందంలో అజయ్ బండార్కర్, సుకన్యశెట్టి, గిరిజాపూరి, అనసూయ, శాలిగ్రామ పంచాయితీ ప్రతినిధులు పాల్గొన్నారు. కార్పొరేషన్ అధికారులు రవీంద్రరావు, చంద్రశేఖర్, గోపాలకృష్ణనాయక్ వారి వెంట ఉన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రతిపాదనలు

విజయవాడ క్రీడలు: శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు సోమవారం దిల్లీ పర్యటన సందర్భంగా రాష్ట్ర క్రీడాభివృద్ధి దిశగా పలు ముఖ్య ప్రతిపాదనలతో కూడిన వినతి పత్రాన్ని ఖేలో ఇండియా సంయుక్త కార్యదర్శికి అందజేసినట్లు శాప్ కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది. స్థానిక ఐజీఎంసీ స్టేడియాన్ని ఖేలో ఇండియా పథకం కింద ఆధునిక క్రీడా సదుపాయాలతో అభివృద్ధి చేయాలని, రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో అదనంగా క్రీడా కేంద్రాలను ఏర్పాటు చేయాలని, కాకినాడ, గుంటూరు నగరాల్లో ఎన్‌సీవోఈలను ఏర్పాటు చేయాలని, తిరుపతిలో అథ్లెటిక్స్, తైక్వాండో క్రీడాంశాల్లో వసతి కేంద్రాలను నెలకొల్పాలని, గుంటూరులోని బీఆర్ స్టేడియం పునర్నిర్మాణం, అభివృద్ధి పనులకు రూ. 170 కోట్లు మంజూరు చేయాలని కోరారు. వీటితో పాటు అదనంగా రూ. 676 కోట్ల విలువైన 56 ప్రాజెక్టుల ప్రతిపాదనలు రాష్ట్రం తరపున సమర్పించి.. వాటిని ఆమోదించాల్సిందిగా విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

సీతారామపురం, న్యూస్‌టుడే : శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సీతారామపురానికి సమీపంలో 167బి జాతీయరహదారిపై గేదెలను ఢీకొని కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. విజయవాడ నుంచి శైవక్షేత్రాలను దర్శించుకునేందుకు కొందరు కారులో సీతారామపురం వైపు వస్తున్నారు. ఈక్రమంలో రహదారిపై వెళుతున్న గేదెలను ఢీకొని అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. కారులో ఐదారుగురు ఉన్నట్లు తెలిసింది. ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ముఖ్యం

ధ్రువపత్రాలు అందుకున్న ఉద్యోగులతో డీఆర్‌ఎం మోహిత్ సొనాకియా

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: రైల్వే ఉద్యోగులకు సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని డీఆర్‌ఎం మోహిత్ సొనాకియా పేర్కొన్నారు. జాతీయ సైబర్ భద్రతా అవగాహన మాసోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం డీఆర్‌ఎం కార్యాలయంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సెల్‌ఫోన్లకు వచ్చే ప్రతి సందేశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీలు ఇతరులతో పంచుకోవద్దని చెప్పారు. సైబర్ నేరగాళ్ల బారిన పడితే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ఆన్‌లైన్ లావాదేవీల విషయంలోనూ జాగ్రత్తలు అవసరమని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం కొండా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



(c) eenadu

5న తిరుపతమ్మకు దీపాల అలంకరణ

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: కార్తిక పౌర్ణమి సందర్భంగా శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ఈనెల 5న గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవార్లకు దీపాలతో అలంకరిస్తారని ఆలయ ఈవో కిశోర్‌కుమార్ తెలిపారు. సాయంత్రం 6:30 గంటలకు ప్రధాన ఆలయంలో కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం మునేరులో నది హారతులు, దీపోత్సవం జరుగుతుందని తెలిపారు.

వెండి కవచం బహూకరణ

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ముక్త్యాలలోని కోటిలింగాల హరిహర మహాక్షేత్రంలో కామాక్షి సమేత పంచముఖ లింగేశ్వరస్వామికి ఏలూరుకు చెందిన సుబ్బలక్ష్మి జ్ఞాపకార్థం సోదరి బుద్ధి రాజు, లలితసుందరి వెండి కవచం బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దాతలతో ప్రత్యేక పూజలు చేయించారు.

నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

రైతుల ఆమోదంతో భూసేకరణ చేయాలి

జుజ్జూరు (వీరులపాడు), న్యూస్‌టుడే : మండల పరిధిలోని వివిధ గ్రామాల మీదుగా ఏర్పాటు చేసే రైల్వేలైన్ భూసేకరణ సంబంధించిన నిర్ణయాలను నిష్పక్షపాతంగా తీసుకోవాలని జుజ్జూరులోని తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు పి.రవికుమార్‌కు రైతులు సోమవారం వినతిపత్రం అందజేశారు. రైల్వే లైన్ అలైన్‌మెంట్ గురించి సామాజిక మాధ్యమాల్లో వార్తలు వస్తున్న నేపథ్యంలో మండల పరిధిలోని పెద్దాపురం, చెన్నారావుపాలెం, నరసింహారావుపాలెం గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూసేకరణ చేయాలని అనుకుంటే రైతుల సమక్షంలో గ్రామసభలు నిర్వహించి.. తమ ఆమోదంతో చేయాలని అన్నారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ.. రైతులు ఆందోళన చెందవద్దని, అందరికీ ఆమోదయోగ్యంగానే భూసేకరణ చేస్తామని తెలిపారు.

చిత్రం గీసి.. బహుమతులు పట్టారు

బహుమతులు సాధించిన శ్రీచైతన్య ఆంగ్ల మాధ్యమ పాఠశాల విద్యార్థులతో ప్రిన్సిపల్ రమేష్, డీన్ జాన్‌బాబు

శ్రీగౌతమ ఆంగ్ల మాధ్యమ పాఠశాల విద్యార్థులతో ప్రిన్సిపల్ సాయి అఖిల్

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : నందిగామ శ్రీచైతన్య, శ్రీగౌతమి ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలల్లో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు 'మీకు ఇష్టమైన పండగ' అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీల్లో శ్రీచైతన్య ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాల విద్యార్థులు సీహెచ్ సుప్రియ (తొమ్మిదో తరగతి), ఎన్.స్నేహ (తొమ్మిదో తరగతి), ఎం.సింధు (ఎనిమిదో తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులను పాఠశాల ప్రిన్సిపల్ రమేష్ వవారి, డీన్ జాన్‌బాబు అందజేశారు. ★ శ్రీగౌతమ ఆంగ్లమాధ్యమ ఉన్నత పాఠశాల విద్యార్థులు కె.యోగశ్రీ (పదో తరగతి), వి.భవ్యశ్రీ (తొమ్మిదో తరగతి), ఎ.గోవిని (ఎనిమిదో తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ సరికొండ సాయి అఖిల్ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

భద్రత.. బండరాళ్ల నడుమ సమాధి

- క్వారీల్లో తరచూ ప్రమాదాలు
- మృత్యువాత పడుతున్న కార్మికులు

కంచికచర్ల, న్యూస్‌టుడే

క్వారీ కార్మికుల భద్రత గాలిలో దీపంలా మారింది. పొట్టకూటి కోసం పొరుగు రాష్ట్రాల నుంచి క్వారీల్లో పనులకు వచ్చిన కార్మికుల జీవితాలు బండరాళ్ల నడుమ సమాధి అవుతున్నాయి. క్వారీ యజమానులు నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిన అనధికారికంగా క్వారీలు నిర్వహించడం, పర్యవేక్షించాల్సిన అధికారులు సహకరిస్తుండడంతో ఏటా పదుల సంఖ్యలో కార్మికులు గాయపడుతున్నారు. మృత్యువాత పడి కుటుంబాలకు యజమానులు అరకొర సాయం చేస్తున్నారు.

కాచవరం సమీపంలో క్వారీలో ప్రమాద దృశ్యం (పాతచిత్రం)

★ గత ఏడాది జూలై 15న పరిటాల సమీపంలోని ఓ క్వారీలో క్రషర్ యూనిట్ వద్ద పనులు చేస్తున్న ముగ్గురు పొరుగు రాష్ట్రాల కార్మికులు కొండపై నుంచి భారీ బండరాళ్లు జారి పడటంతో వాటి కింద సమాధి అయ్యారు. కార్మిక సంఘాల ఆందోళనతో చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు క్వారీ యాజమాన్యం ఆర్థిక సాయం అందించి చేతులు దులిపేసుకుంది. తర్వాత ఈ ప్రాంతంలో పలువురు ప్రమాదాల బారిన పడటం, యాజమాన్యాలు అరకొర సాయం అందించడం పరిపాటిగా మారింది. ఇటీవల కాచవరం సమీపంలోని క్వారీలో భారీ బండరాళ్లు జారి పడి అక్కడ ఉన్న యంత్రాలు, ట్రాక్టర్, ద్విచక్ర వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. ఘటన జరిగిన సమయంలో అక్కడ కార్మికులు లేక పెను ప్రమాదం తప్పింది.

★ పరిటాల, దొనబండ, కాచవరం తదితర గ్రామాల్లో దాదాపు 100కు పైగా క్వారీలు అధికారికంగా, మరో 50 అనధికారికంగా నిర్వహిస్తున్నారు. వీటిలో పని చేసే వారి తలకు హెల్మెట్లు, చేతులకు గ్లౌజులు, కాళ్లకు బూట్లు వంటి కనీస రక్షణ పరికరాలు యాజమాన్యాలు ఇవ్వడం లేదు. క్వారీల్లో కనీసం ప్రాథమిక చికిత్స ఏర్పాట్లు లేవు. ప్రమాదం జరిగిన సందర్భంలో అధికారులు తాత్కాలికంగా హడావుడి చేయడం మినహా చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్వారీల్లో భద్రతపై చర్యలు తీసుకోవాలని, కార్మికులకు ప్రమాద బీమా, ఆరోగ్య వసతులు వంటివి కల్పించేలా యాజమాన్యాలపై ఒత్తిడి పెంచాలని కార్మికులు కోరుతున్నారు.

సీఎం సహాయనిధి నుంచి వైద్యానికి సాయం

నందిగామ, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వైద్యానికి వెంటనే నిధులు మంజూరు చేస్తున్నారని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య తెలిపారు. స్థానిక కాకానినగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం నియోజకవర్గానికి చెందిన 37 మందికి రూ.24.17 లక్షలు సీఎం సహాయ నిధులు మంజూరు పత్రాలను ఆమె లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు సీఎంఆర్ఎఫ్ నిధులను అడిగిన వెంటనే ఇస్తున్నారని చెప్పారు. నిరంతరం సీఎం ప్రజల పక్షాన ఉంటూ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, యార్డు ఛైర్మన్ కోగంటి బాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వాసిరెడ్డి ప్రసాదు, పార్టీ అధ్యక్షుడు మేకల సుధాకర్, యేచూరి రామకృష్ణ పాల్గొన్నారు.

నష్టపోయాం.. ఆదుకోండి

తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

జుజ్జూరు (వీరులపాడు), న్యూస్‌టుడే : అధిక వర్షపాతంతో పత్తి పంటకు నష్టం కలిగిందని, రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై పెద్దాపురం గ్రామ రైతులు జుజ్జూరులోని తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు పి.రవికుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెద్దాపురం గ్రామ రైతులు మాట్లాడుతూ.. మండల పరిధిలోని అల్లూరు, గూడెం మాధవరం, జయంతి, పెద్దాపురం గ్రామాల రెవెన్యూ పరిధిలో అధికంగా పత్తి పంట సాగు చేశామన్నారు. మొంథా తుపాను ప్రభావంతో పత్తి దిగుబడి తగ్గిందని, ఎకరాకు రూ.50 వేలు ఖర్చు పెట్టినా కనీసం రూ.10 వేలు కూడా వచ్చే పరిస్థితి రైతుకు లేదన్నారు. ప్రభుత్వం బీమా చెల్లించని కారణంగా రైతులకు నగదు చెల్లించే స్థోమత లేకపోవడం, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కౌలు రైతులకు వర్తించక పోవడంతో రైతులకు పరిహారం రాదని వాపోయారు. ఇన్‌పుట్ సబ్సిడీ ఎకరాకు రూ.15 వేలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు నిమ్మల రాజేంద్ర, కె.శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరరావు, టి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

కంచికచర్ల, న్యూస్‌టుడే : మొంథా తుపాను కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. మండలంలోని పరిటాల, కీసర గ్రామాల్లో తుపాను తీవ్రతకు పాడైన పత్తి, వరి పంటలను ఆయన సోమవారం పరిశీలించారు. పత్తి తీతకు వచ్చిన సమయంలో తుపాను రావడంతో పత్తి పనికి రాకుండా పోయిందని, అడుగు భాగంలో ఉన్న పత్తి కాయలు కుళ్లి పోతున్నాయని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనాలని కోరారు. పలు చోట్ల వరి నేల వాలడంతో గింజ రాలిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు అధైర్యపడొద్దని.. వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టంపై అంచనాలు రూపొందిస్తున్నారని, త్వరలోనే బాధిత రైతులకు పరిహారం అందిస్తామని అన్నారు. నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, నందిగామ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు డా.ఐ.కె.శ్రీనివాస్, మండల వ్యవసాయశాఖాధికారి కె.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాడైన పత్తి కాయలు పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

మాక్ అసెంబ్లీకి కోనాయపాలెం విద్యార్థి

నందిగామ, న్యూస్‌టుడే : నందిగామ నియోజకవర్గం నుంచి భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించే మాక్ అసెంబ్లీకి కోనాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వల్లెపు అరవింద్ ఎంపికయ్యాడు. ఏపీ అసెంబ్లీలో ప్రతిభావంతులైన విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం నందిగామలో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య విద్యార్థికి శాలువా కప్పి అభినందించారు. నందిగామ నియోజకవర్గ సమస్యలను మాక్ అసెంబ్లీల్లో ప్రస్తావించాలని ఆమె సూచించారు. సొసైటీ అధ్యక్షుడు వాసిరెడ్డి ప్రసాదు, ఎస్ఎంసీ ఛైర్మన్ ఎం.జాన్‌కోటయ్య, ప్రధానోపాధ్యాయుడు డి.వి.ఎల్. నారాయణ, ఉపాధ్యాయుడు పాల్ పాల్గొన్నారు.

అరవింద్‌ను సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ సౌమ్య

గోడ కూలింది.. రక్షణ కరవైంది

ముప్పాళ్ల బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రహరీ కూలి విద్యార్థినులకు రక్షణ కరవైంది. ఈ ఏడాది అధిక వర్షాలకు భూమిలో తేమ శాతం పెరిగి సెప్టెంబరు 11న ప్రహరీ నేలవాలింది. దీంతో ప్రిన్సిపల్ లోపలికి ఎవరూ ప్రవేశించకుండా నర్సరీలకు వాడే నెట్‌ను అడ్డంగా కట్టించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. పాఠశాలలో ఆరు తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బాలికలు వసతి గృహంలో ఉంటూ విద్య అభ్యసిస్తున్నారు. ప్రధాన రహదారి వెంట గోడ కూలడంతో వీరి రక్షణపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే ప్రహరీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. **-చందర్లపాడు, న్యూస్‌టుడే**

రహదారి.. ప్రమాదకరంగా మారి

రాఘవాపురం- కమ్మవారిపాలెం ఆర్అండ్‌బీ రహదారి గుంతలతో ప్రమాదకరంగా మారింది. రహదారి అంచులు కోతకు గురయ్యాయి. నందిగామ- మధిర క్రాస్‌రోడ్డు వద్ద కల్వర్టు రహదారిపై గుంతలు పడి ప్రమాదకరంగా ఉంది. వాహనాలు వెళ్లడానికి వీలు పడక చోదకులు అవస్థలు పడుతున్నారు. కొండమలుపులో గుంతలు పడి వర్షంనీరు నిలిచాయి. రహదారిపై పలుచోట్ల గుంతలతో రూపు కోల్పోయింది. రహదారికి రెండు వైపులా కంప పెరిగి అసౌకర్యంగా మారింది. రహదారిని అభివృద్ధి చేయాలని వాహనదారులు కోరుతున్నారు. **- నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే**

అకాల వర్షం.. మరింత పంట నష్టం

మండల పరిధిలో ఆదివారం కురిసిన అకాల వర్షంతో రైతులు మరింత నష్టపోయారు. మొంథా తుపాను ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న వారికి ఆదివారం కురిసిన వర్షం పత్తి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా 115.6 ఎం.ఎం. వర్షపాతం నమోదవగా ఒక్క వీరులపాడు మండలంలోనే 55 ఎం.ఎం. కురవడం గమనార్హం. కాయ పగిలి పత్తి తీతకు సిద్ధంగా ఉన్న సమయంలో వర్షం పడగా పత్తి తడిసింది. దిగుబడి తగ్గటంతో పాటు పత్తి నాణ్యత కోల్పోయి, తేమ శాతం పెరగడంతో ధర తగ్గుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. **-వీరులపాడు, న్యూస్‌టుడే**

జుజ్జూరులో తడిసిన పత్తి

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనకు వందనం

★ స్థానిక ఆర్అండ్‌బీ బైపాస్ రోడ్డు పక్కన మురుగు కాల్వలో పిచ్చిమొక్కలు పెరిగాయి. దీని వల్ల అపరిశుభ్రంగా ఉంటుందని, దుర్వాసన వస్తోందని సర్పంచి వేల్పుల పద్మకుమారి దృష్టికి స్థానికులు తీసుకొచ్చారు. స్పందించిన ఆమె కార్మికులతో శుభ్రం చేయించారు. ★ పెనుగంచిప్రోలులో తూర్పుబజారులో ఎస్సీ కాలనీలో డ్రెయిన్ వద్ద వ్యర్థాలు వేయడంతో ఇబ్బందిగా ఉందని సర్పంచి పద్మకుమారి దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే స్పందించి పూడిక తీయించారు. ★ పెనుగంచిప్రోలులో పోలీసుస్టేషన్ సెంటర్‌లో రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఈ విషయాన్ని ఎస్సై అర్జున్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే చర్యలు తీసుకున్నారు. సిబ్బందితో ట్రాఫిక్ సమస్య పరిష్కరించారు. ★ స్థానిక పోలీసుస్టేషన్ సెంటర్‌లో రోడ్డు పక్కన చెత్త కుప్పలు వేశారు. ఈ విషయాన్ని పంచాయతీ ఈవో శ్యామ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా కార్మికులతో శుభ్రం చేయించారు. – న్యూస్‌టుడే, పెనుగంచిప్రోలు

తపాలా వ్యవస్థతో మెరుగైన సేవలు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా తపాలా వ్యవస్థ ప్రజలకు సమాచార మార్పిడికి వేదికగా నిలుస్తుందని, అందుకు గ్రామీణ స్థాయి ఉద్యోగులు, కార్మికులే కారణమని భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు రఘురాం పేర్కొన్నారు. జగ్గయ్యపేట ఉప తపాలా కార్యాలయంలో సోమవారం భారతీయ పోస్టల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (బీపీఈఎఫ్), భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్)లు సంయుక్తంగా నిర్వహించిన ద్వైవార్షిక మహాసభల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పోస్ట్‌మ్యాన్, ఎంటీఎస్ సర్కిల్ కార్యదర్శి వీవీ వసంతరావు అధ్యక్షతన జరిగిన సభలో పలు కీలక అంశాలను చర్చించారు. కార్యక్రమంలో ఏపీ సర్కిల్ కార్యదర్శి సీహెచ్.వెంకయ్య, సూపర్‌వైజర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు, సర్కిల్ కార్యదర్శి కె.మురళీకృష్ణ, భారతీయ గ్రామీణ డాక్ కర్మచారి సంఘం (బీజీడీకేఎస్) సర్కిల్ కార్యదర్శి వెంకట్రామరెడ్డి, జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, సాహెబ్, ఇస్మాయిల్, మాధవ్, మన్నె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర నాయకులు

నైపుణ్యాల పెంపునకు స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : నందిగామ నారాయణ ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో సోమవారం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమాన్ని పాఠశాల ఆర్ఎన్‌డీ హెడ్ వాణి, క్లస్టర్ ప్రిన్సిపల్ శివరామకృష్ణ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లస్టర్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు అయిదు మాసాల్లో నేర్చుకున్న విద్యను ప్రాజెక్టుగా రూపొందించి తల్లిదండ్రులకు వివరిస్తారని చెప్పారు. దీనివల్ల వారిలో నైపుణ్యం పెరగడంతో పాటు ఆత్మవిశ్వాసం కలుగుతుందని అన్నారు. ప్రిన్సిపల్ కుమారస్వామి, ఈ- ఛాంప్స్ కో-ఆర్డినేటర్ రోజా, వైస్ ప్రిన్సిపల్ సాయిశ్రీ, ఏవో మహేష్ పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న క్లస్టర్ ప్రిన్సిపల్ శివరామకృష్ణ

సేవా కార్యక్రమాలకు లయన్స్ క్లబ్ పెద్దపీట

సేవా కార్యక్రమాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న జిల్లా గవర్నర్, నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా లయన్స్‌క్లబ్‌ల ద్వారా విస్తృత సేవలు అందించాలని లయన్స్ జిల్లా గవర్నర్ వీవీపీఎస్ ఆంజనేయులు సూచించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా లయన్స్‌క్లబ్ రెండో క్యాబినెట్ సమావేశాన్ని ఆదివారం రాత్రి స్థానిక ఎస్వీఎస్ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా లయనిజం ఉందని, సేవా కార్యక్రమాలకు పెద్దపీటగా నిలుస్తోందన్నారు. అనంతరం సేవా కార్యక్రమాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐపీఎంసీసీ డి.శ్రీశాంతి, మొదటి, రెండవ గవర్నర్‌లు ఎన్‌వీవీఎస్ ప్రసాద్, సీహెచ్ శ్రీనివాసరెడ్డి, క్యాబినెట్ సభ్యుడు బాలగోపాలరెడ్డి, శ్రీధర్, కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, మైలవరం క్లబ్ నాయకులు పాల్గొన్నారు.

అధికారుల బృందం సందర్శన

విస్సన్నపేట, న్యూస్‌టుడే: కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు విస్సన్నపేట మండలంలో దేవాలయాలను పలు శాఖలతో కూడిన అధికారుల బృందం సోమవారం సందర్శించింది. ఆలయాల్లో మౌలిక వసతులు, పర్వదినాల్లో వచ్చే భక్తుల సంఖ్య, చేయాల్సిన రక్షణ ఏర్పాట్ల గురించి నిర్వహణ కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రజలతో చర్చించారు.

వేంకటేశ్వర స్వామి సేవా సంఘం ఏర్పాటు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: తితిదే, హిందు ధార్మిక పరిషత్ ధర్మ ప్రచారకులు వల్లాపురపు వెంకటబాబు నేతృత్వంలో జగ్గయ్యపేట పట్టణంలో సోమవారం వేంకటేశ్వరస్వామి సేవా సమితిని ఎన్నుకున్నారు. అనంతరం ప్రతినిధులు సంతాన వేణుగోపాల స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బాధ్యతలు స్వీకరించారు.

ఆలయం ముందు ఎన్నికైన సంఘ సభ్యులు

మాలధారులకు అన్నదానం

భోజనం వడ్డిస్తున్న లక్ష్మీ నరసింహశాస్త్రి

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: స్థానిక అయ్యప్ప దేవాలయంలో స్వాములకు 60 రోజులపాటు ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన గాయత్రి ఆశ్రమ వ్యవస్థాపకుడు చిట్టా లక్ష్మీనరసింహశాస్త్రి కార్తిక సోమవారాన్ని పురస్కరించుకొని ప్రారంభించారు. ఈ సమారాధనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని శాస్త్రి పిలుపునిచ్చారు. 11 ఏళ్లుగా ఏటా ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. వనపులి వాహన అయ్యప్ప సేవాసమితి, ధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయ కమిటీలు సంయుక్తంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో మొదటి రోజు పెద్దసంఖ్యలో స్వాములు పాల్గొన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు శ్రీరాం చినబాబు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాఘవాపురం : పుష్పాలంకరణలో రామలింగేశ్వరస్వామి మూలమూర్తి

మాగల్లు శివాలయంలో భ్రమరాంబ

దాములూరు పుష్పాలంకరణలో సంగమేశ్వరస్వామి

పల్లగిరిపై భవానీ శంకరుని వాయులింగం

సిద్ధిలింగేశ్వరస్వామికి గంధంతో అలంకరణ

నృత్య పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

పురస్కారం అందుకుంటున్న ప్రణతి, తన్మయ

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: శ్రీశివసాయి కూచిపూడి నృత్య కళాక్షేత్రం 3వ వార్షికోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరంలో నిర్వహించిన దక్షిణ భారత స్థాయి నాట్య పోటీల్లో జగ్గయ్యపేటకు చెందిన నాగార్జున స్కూల్ విద్యార్థిని ప్రణతి జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతితో పాటు పారిజాత పురస్కారం, అదే పాఠశాలకు చెందిన తన్మయి తృతీయ స్థానంతో నాట్య ప్రజ్ఞ పురస్కారాన్ని అందుకుంది. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపల్ సిహెచ్.కృష్ణయ్య, తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు.

గోగ్రాసం సేకరణ

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: స్థానిక తిరుపతమ్మ అమ్మవారి గోశాలలో గోవులకు అవసరమైన గోగ్రాసం కోసం ఉచితంగా వరి గడ్డి ఇవ్వొచ్చని ఆలయ ఈవో కిశోర్‌కుమార్ తెలిపారు. సార్వా వరిగడ్డిని అమ్మవారి భక్తులు తమ స్థోమత మేరకు గోవులకు గడ్డి అందించాలని కోరారు.

ఆలయాలకు కార్తిక శోభ

మార్మోగిన శివనామ స్మరణ

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : కార్తికమాస రెండో సోమవారాన్ని పురస్కరించుకుని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. తెల్లవారుజామునే భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి శివాలయాలను దర్శించుకున్నారు. మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు. నందిగామ శివాలయంలో రామలింగేశ్వరస్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు ఇబ్బంది పడకుండా ఎస్సైలు శాతకర్ణి, సూర్యవంశీ, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈవో సురేష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. పల్లగిరిపై భవానీ శంకరుని వాయులింగానికి, రైతుపేట డౌన్ విజ్ఞాన నందీశ్వరస్వామికి రుద్రాభిషేకం చేశారు. రాఘవాపురం శివాలయంలో రామలింగేశ్వరస్వామికి, మాగల్లు శివాలయంలో చంద్రమౌళీశ్వరస్వామికి, గోళ్లమూడి శివాలయంలో శంభు లింగేశ్వరస్వామికి, దాములూరు కూడలి శివాలయంలో సంగమేశ్వరస్వామికి, అంబారుపేట శివాలయంలో ఓంకారేశ్వరస్వామికి, పాతకంచల శివాలయంలో కథలిఖేశ్వరస్వామికి రుద్రాభిషేకం నిర్వహించి తామర పుష్పాలు, బిల్వపత్రాలతో అలంకరణ చేశారు. భక్తుల శివనామస్మరణ మార్మోగింది.

చంద్రమౌళీశ్వరుడికి లక్ష బిల్వార్చన

కంచికచర్ల : కార్తిక సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. కంచికచర్ల శివసాయి క్షేత్రం, పాత శివాలయం, మున్నలూరు, మోగులూరు శివాలయాల్లో భక్తులు దీపాలు వెలిగించారు.

జగ్గయ్యపేట : కార్తికమాస రెండో సోమవారాన్ని పురస్కరించుకొని జగ్గయ్యపేటలోని శివాలయాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. చంద్రమౌళీశ్వరాలయంలో నూతనంగా ఎన్నికైన పాలకవర్గం ఆధ్వర్యంలో ఘనంగా లక్ష బిల్వార్చన నిర్వహించారు. పట్టణంలోని పాత కూరగాయల మార్కెట్‌లోని సిద్ధిలింగేశ్వరాలయంలో సోమవారం 21 కిలోల గంధంతో స్వామివారిని అభిషేకించి పూజలు చేశారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

కంచికచర్లలో.. పూజలు

5న గిరి ప్రదక్షిణ

గంపలగూడెం : పెనుగొలను సమీప మెట్టగుట్ట గజలక్ష్మి సమేత శేషాచల శ్రీనివాస ఆలయంలో కార్తిక పూర్ణిమ సందర్భంగా 5న మధ్యాహ్నం 3 గంటలకు గిరిప్రదక్షిణ, నిర్వహిస్తామని గుడి అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతం

నెమలి(గంపలగూడెం) : మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు గోపాలాచార్యులు వ్రత కథా వృత్తాంతాలను వివరించారు. వివిధ గ్రామాలకు చెందిన 34 మంది దంపతులు క్రతువులో పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనర్ ఎన్.సంధ్య, పాలకమండలి అధ్యక్షురాలు కె.శశిరేఖ, సభ్యురాలు జి.వెంకటరమణ, గుడి కమిటీ మాజీ అధ్యక్షులు బి.మధుసూదనరావు, వి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగి మృతికి సంతాపం

వత్సవాయి న్యూస్‌టుడే : మక్కపేటకు చెందిన కన్నెగంటి సత్యనారాయణ సోమవారం మృతి చెందారు. టెలిఫోన్ డిపార్ట్‌మెంటులో 40 ఏళ్లుగా పని చేశారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతి పట్ల అయ్యప్ప స్వాములు, మక్కపేట గ్రామస్థులు సంతాపం తెలిపారు.

పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ మరియు డిగ్రీ మార్కుల లిస్ట్ పోయినవి

సూర్యదేవర భవ్య D/o. సూర్యదేవర శ్రీనివాసరావు, D.No. 2-273, మున్నలూరు గ్రామం, కంచికచర్ల మండలం, NTR జిల్లా వాస్తవ్యురాలైన నేను యావన్మందికీ తెలియజేయునది ఏమనగా..

ది. 01-10-2025న నా యొక్క 10వ తరగతి మరియు ఇంటర్మీడియట్ మరియు డిగ్రీ మార్కుల లిస్ట్ నెం., 10వ తరగతి మార్కుల లిస్ట్ నెం: 00178568, ఇంటర్మీడియట్ మార్కుల లిస్ట్ నెం: Q161496, డిగ్రీ మార్కుల లిస్ట్ నెం: JKC 12175 కంచికచర్ల బస్టాండ్ సెంటర్‌లో గల జిరాక్స్ షాపునకు జిరాక్స్ తీయించుటకు వెళ్తుండగా కవరుతో సహా పడిపోయినవి. ఎంత వెతికిననూ దొరకలేదు. దయచేసి ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు తెలియజేయవలసినదిగా కోరుతున్నాను.

సూర్యదేవర భవ్య
మున్నలూరు, సెల్: 93467 81843

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

విజయవాడ పశ్చిమ

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

స్పందనకు వందనం

★ పాతబస్తీ రథంసెంటర్‌లో రోడ్డు పక్కనున్న చెత్త తరలించడం లేదని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనికి స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో చెత్త తరలించారు. ★ కొత్తపేట కుమ్మరివీధుల్లోని మొదటి లైన్‌లో కుక్కల బెడద అధికంగా ఉందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇవ్వగా, స్పందించిన వెటర్నరీ విభాగం అధికారులు కుక్కలను పట్టారు. - **న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

? భవానీపురం ఐరన్‌యార్డు లోని రోడ్లు గుంతలమయంగా ఉన్నాయి. ప్రమాదాలకు నిలయంగా మారాయి. **- రాము, స్థానికుడు.** ✔ పరిశీలించి వాటిని పూడ్చి వేస్తాం. **- శ్రీనివాస్, ఈఈ, సర్కిల్-I**

? చిట్టినగర్ రైల్వేయార్డులో గల అమ్మవారి గుడి వీధిలో రాత్రుల్లో పలువురు యువకులు గంజాయి తాగుతున్నారు. **- విష్ణువర్ధన్‌రావు, స్థానికుడు** ✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- చినకొండలరావు, 2వ పట్టణ పోలీసు స్టేషన్ సీఐ**

? చిట్టినగర్ పెట్రోల్‌బంక్ ఎదురు వీధిలో కుక్కల బెడద అధికంగా ఉంది. రాకపోకల సమయంలో ఇబ్బందిగా ఉంది. **- గోవిందరావు, స్థానికుడు.** ✔ పరిశీలిస్తాం. **- సోమశేఖర్, అసిస్టెంట్ వెటర్నరీ అధికారి.** – న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం

కేదారేశ్వరపేట, న్యూస్‌టుడే: పశ్చిమ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే సుజనాచౌదరి పేర్కొన్నారు. సోమవారం 34, 35 డివిజన్లలోని కేదారేశ్వరపేట, పండ్ల మార్కెట్, సీకే రెడ్డి రోడ్, ఆంజనేయస్వామి ఆలయం వరకు రూ.87 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్న స్థానిక కార్పొరేటర్, డివిజన్ అధ్యక్షుల ద్వారా ఎమ్మెల్యే కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

భవనం నిర్మిస్తే.. బహుళ ప్రయోజనాలు

గతంలో రూ.8.5 కోట్లతో అంచనాలు ★ పట్టించుకోని వైకాపా ప్రభుత్వం

చిట్టినగర్, న్యూస్‌టుడే

కేఎల్‌రావునగర్ కుమ్మరివీధిలోని నగరపాలక సంస్థకు చెందిన గుజ్జారి ఎల్లారావు కూరగాయల మార్కెట్ శిథిలావస్థకు చేరింది. రేకుల షెడ్లు అధ్వానంగా మారాయి. ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దానిలో పది దుకాణాలు కూడా వినియోగంలో లేవు. వచ్చే ఆదాయం కూడా శూన్యం. 2019లో అప్పటి తెదేపా ప్రభుత్వం నూతన భవన సముదాయాన్ని నిర్మించాలని అంచనాలు రూపొందించి పనులు ప్రారంభించింది. అనంతరం వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రజలు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకుండా ఐదేళ్లు వదిలేశారు. దీంతో మార్కెట్ అధ్వాన స్థితిలో ఉండడమే కాకుండా అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అధ్వానంగా లోపలి పరిసరాలు

డివిజన్: 47వ డివిజన్
మార్కెట్ విస్తీర్ణం: సుమారు 2 వేల గజాలు
మొత్తం దుకాణాలు: 75 ప్రస్తుతం ఉన్నవి: 10
2019లో నిర్మాణం అంచనా: రూ.8.5 కోట్లు
భవనం నిర్మాణం: జి+2 అంతస్తులు
ప్రయోజనం: సుమారు 50 వేల మందికి

ప్రభుత్వం దృష్టి పెడితే మేలు: అభివృద్ధిని కాంక్షించే కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తే 2 వేల గజాలు ఉన్న ఈ మార్కెట్ స్థలంలో రైతుబజారు, సామాజిక భవనం, మహిళలకు ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ భవనం నిర్మిస్తే ఎన్నో కుటుంబాలకు జీవనోపాధి కల్పించవచ్చు. పేదలు, సామాన్య వర్గాల జీవితాల్లో వెలుగులు చూడవచ్చు. పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి, పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ దృష్టి సారించి పాత భవనాన్ని పూర్తిగా తొలగించి నూతన భవన సముదాయం నిర్మిస్తే బహుళ ప్రయోజనం చేకూరుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

★ ఈ విషయమై సర్కిల్-1 ఈఈ శ్రీనివాసరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. గతంలో ప్రతిపాదనలు, అంచనాలు సిద్ధం చేశాం. కమిషనర్ ధ్యానచంద్ర దృష్టిలో పెడతాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చిస్తాం. ప్రజలకు మేలు జరిగేందుకు కృషి చేస్తాం.

ఎమ్మెల్యే సుజనాచౌదరిని కలిసిన ప్రెస్ అకాడమీ ఛైర్మన్లు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రెస్ అకాడమీ ఛైర్మన్లు ఆలపాటి సురేష్ కుమార్, కె.శ్రీనివాసరెడ్డి కానూరులోని పశ్చిమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సుజనాచౌదరిని మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ పరిస్థితులపై వారు ఎమ్మెల్యేతో ముచ్చటించారు. **- న్యూస్‌టుడే, విద్యాధరపురం**

రూ.42 లక్షలతో అభివృద్ధి పనులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: గట్టువెనక ప్రాంతంలో రూ.42 లక్షలతో మూడు రోడ్లకు పేవర్ బ్లాక్సు ఏర్పాటు చేసేందుకు పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి సోమవారం శంకుస్థాపన నిర్వహించారు. శంకుస్థాపన అనంతరం కాంట్రాక్టరు నరసింహారావును మూడు రోడ్లకు పేవర్ బ్లాక్సు ఏర్పాటు చేయడానికి రూ.42 లక్షలు ఎందుకు ఖర్చు అవుతుందని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై మూడో పార్టీతో ఎంక్వైరీ చేయిస్తానని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే టెండరులో పాల్గొన్నానని గుత్తేదారు చెప్పారు. అయితే బిల్లులు ఎప్పుడు వస్తాయని అడగ్గా ఏడాదికి పైన పడుతుందని సమాధానం ఆయన చెప్పారు. దీనిపై ఇంజినీరింగ్ అధికారులను అడగ్గా.. వారు మాట దాటవేశారు. కేసీ పబ్లిక్ స్కూల్ రోడ్డు, క్వారీ వీధి, కేవీఆర్ బిల్డింగ్ రోడ్డులో ఇరువైపుల పేవర్ బ్లాక్సు ఏర్పాటు చేస్తే బాగుంటుందని స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, గుండారపు హరిబాబు, నాగుల్‌మీరా, శివకుమార్, కార్పొరేటరు గుడివాడ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో సమాజంలో మార్పు

భవానీపురం, న్యూస్‌టుడే: సమాజంలో పేద ప్రజలకు సాయపడే విధంగా సేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. భవానీపురం హెచ్‌బీ కాలనీలో ఏర్పాటు చేసిన సూఫీ సేవా సదన్ కార్యాలయాన్ని ఎంపీ కేశినేని శివనాథ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. సమాజంలో మార్పుకు సేవా కార్యక్రమాలు దోహదం చేస్తాయని తెలిపారు. కొన్నేళ్లుగా సూఫీ సేవా సదన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టడం సంతోషకరమని వెల్లడించారు. సూఫీ సేవా సదన్ ఛైర్మన్ ఫైజాన్ మాట్లాడుతూ.. పేద ప్రజలకు అనేక విధాలుగా సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. మున్ముందు మరిన్ని కార్యక్రమాలను చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు రఘురామరాజు, దేవదత్, ఎరుబోతు రమణరావు, హసన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయంలో ఎంపీ కేశినేని శివనాథ్, నాయకులు

ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం కృషి

మహిళకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సుజనాచౌదరి

భవానీపురం, న్యూస్‌టుడే: పేద ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం కృషి చేస్తుందని పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులు భవానీపురంలోని కార్యాలయంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం, సుజనా ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలో విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. 36 మంది లబ్ధిదారులకు రూ.26.86 లక్షల విలువైన చెక్కులు అందజేశారు. అనంతరం సుజనామిత్ర లకు దుస్తులు అందించారు.

విద్యాధరపురం: విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేసేలా నూతన పథకాలను అందిస్తామని ఎమ్మెల్యే సుజనా చౌదరి సూచించారు. కబేళా సెంటరు సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.12 లక్షలతో సుజనా ఫౌండేషన్, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన సైన్సు ల్యాబ్‌ను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ల్యాబ్ లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మాజీ కార్పొరేటరు బాదర్, ప్రిన్సిపల్ హనీఫ్ అహ్మద్ తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ మాజీ ఎండీ కర్నాటి రామ్మోహనరావు ముందుకు రావడం స్ఫూర్తిదాయకం అన్నారు. నాయకులు మైలవరపు కృష్ణ, తిరుపతి అనూష, పైలా సురేష్, సుజనా ఫౌండేషన్ ప్రతినిధులు వీరమాచినేని కిరణ్, హరీష్, కార్పొరేటరు మాధురి లావణ్య పాల్గొన్నారు

దుర్గగుడి నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

దాతలు పవన్ హర్షిత్ శ్రీరామ్, సుబ్రహ్మణ్య శర్మ కుటుంబ సభ్యులకు అమ్మవారి ప్రసాదం, చిత్రపటం అందజేస్తున్న ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి ముగ్గురు దాతలు రూ.3,02,232 విరాళాన్ని సోమవారం అందజేశారు. విద్యాధరపురం లక్ష్మీనగర్ నివాసి ఎం.అప్పాజీరావు రూ.1,01,116, అయోధ్యనగర్ నివాసి కె.వి.ఆర్. సుబ్రహ్మణ్యశర్మ రూ.1,01,116, భవానీపురానికి చెందిన బి.పవన్ హర్షిత్ శ్రీరామ్ రూ.లక్ష వేర్వేరుగా అందజేశారు. దాతల కుటుంబాలకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. దేవస్థానం ఈవో శీనానాయక్, సూపరింటెండెంట్ చందు శ్రీనివాస్ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

దాత అప్పాజీరావు దంపతులకు విరాళం రసీదు అందజేస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రిపై సహస్ర లింగార్చన

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: కార్తికమాసం రెండో సోమవారం పురస్కరించుకొని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరాలయంలో సహస్ర లింగార్చన, సహస్ర దీపాలంకృత స్టాండ్ వద్ద దీపార్చన, ఊంజల్ సేవల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మల్లేశ్వర స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ పూజలో పాల్గొన్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

పాలఫ్యాక్టరీ వద్ద ఆలయంలో..

చిట్టినగర్, న్యూస్‌టుడే: కార్తికమాసం సందర్భంగా పశ్చిమ నియోజక వర్గం వ్యాప్తంగా పలు ఆలయాల్లో సోమవారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ✦ ఆంజనేయవాగు సెంటర్‌లోని వీరాంజనేయ స్వామివారి దేవస్థానంలో భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో స్వామివారికి వివిధ ద్రవ్య రసాలతో పంచామృత అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావుశర్మ ప్రసాదాలు అందించారు. ఆలయ ఆవో వై.సీతారామయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. ✦ పాలఫ్యాక్టరీ సమీపంలోని విజయదుర్గ రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో రామలింగేశ్వరస్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, నాగ వెంకట పవనకుమారశర్మ సుమారు 1000 మంది భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.

ఆంజనేయవాగు సెంటర్‌లో..

వైభవంగా.. దీపోత్సవం

చిట్టినగర్, న్యూస్‌టుడే: స్థానిక నగాల్లో సీతారామస్వామి మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో కార్తిక మాస పూజలు, దీపోత్సవం సోమవారం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శివలింగాకారంలో దీపాలు ఏర్పాటు చేసి పలువురు దంపతులు, యువతులు, ఆలయ కమిటీ సభ్యులు వెలిగించారు.

శివాలయాల్లో భక్తుల సందడి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: కార్తిక మాసం రెండో సోమవారం పురస్కరించుకొని పాతబస్తీలోని భ్రమరాంబ, మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం(పాతశివాలయం), విజయేశ్వరాలయం, వసంత మల్లికార్జున స్వామి వారి ఆలయం, కామకోటినగర్‌లోని శంకర మఠంలో శివయ్యకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పాత శివాలయంలో భ్రమరాంబ దేవిని గిరిజాదేవిగా అలంకరించి కుంకుమార్చన చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవోలు నటరాజన్ షణ్ముఖం, వెంకటరెడ్డి, విజయేశ్వరాలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ పిల్లా సుదర్శనరావు పాల్గొన్నారు.

భ్రమరాంబ దేవి

మహిళల వన్డే ప్రపంచ కప్ విజయంతో సంబరాలు

భవానీపురం, న్యూస్‌టుడే: భారత క్రికెట్ మహిళా జట్టు ప్రపంచ కప్ గెలవడంతో విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు సోమవారం సంబరాలు చేసుకున్నారు. భాజపా ఏపీ అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ సమక్షంలో మహిళలు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ.. భారత మహిళా క్రీడాకారిణిలు మన కీర్తిని విశ్వవ్యాప్తం చేశారని పేర్కొన్నారు. మున్ముందు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. భాజపా మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిషీదారాజు, నిర్మలా కిషోర్, బొడ్డు నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భాజపా రాష్ట్ర కార్యాలయం వద్ద కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

కొత్తపేట సీఐకు సత్కారం

చిట్టినగర్, న్యూస్‌టుడే: కొత్తపేట పోలీస్‌స్టేషన్ సీఐ చినకొండలరావు 'సైక్లోన్ మొంథా ఫైటర్' అవార్డు అందుకోవడం ఎందరికో స్ఫూర్తిదాయకమని లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ స్మైల్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు, కార్యదర్శి ఎన్.వి.రావు, బి.శివకుమార్ పట్నాయక్ పేర్కొన్నారు. సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ స్మైల్స్ ఆధ్వర్యంలో సీఐ చిన కొండలరావును పోలీస్‌స్టేషన్‌లో అభినందించారు. ఈ సందర్భంగా వారిద్దరు మాట్లాడుతూ.. కొండ ప్రాంతవాసులను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించడంలో సీఐ, సిబ్బంది చురుకైన పాత్ర పోషించారని కొనియాడారు. అనంతరం సీఐను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వై.బాబూరావు, మాజీ అధ్యక్షుడు ఎస్.ఈశ్వరరావు, ఎన్.అప్పారావు, మాజీ కార్యదర్శి వి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

చినకొండలరావును సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

వైద్య పరికరాల అందజేత

విజయవాడ బస్‌స్టేషన్, న్యూస్‌టుడే: పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లోని ఆర్టీసీ డిస్పెన్సరీకి నూతన వైద్య పరికరాలను వైద్యాధికారి అనిల్‌కు అందించినట్లు ఆర్టీసీ కార్మిక పరిషత్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి, కంట్రోలర్ యార్లగడ్డ రమేష్ తెలిపారు. కార్యక్రమంలో కార్మిక పరిషత్ పీఎన్‌బీఎస్ అధ్యక్షుడు యార్లగడ్డ విష్ణు, జాయింట్ సెక్రటరీ జి.వి.నారాయణ, విజయవాడ డిపో సెక్రటరీ సగ్గుర్తి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి సామగ్రి అందిస్తున్న కంట్రోలర్ రమేష్

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

జగన్మాత సేవలో మంత్రి సంధ్యారాణి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాతను రాష్ట్ర మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఈవో శీనానాయక్ వారికి అమ్మవారి చిత్రపటం, పట్టు వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానార్చకుడు దుర్గాప్రసాద్, ట్రస్టుబోర్డు ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకరబాబు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

సినిమాలు

జాతర: శైలజ, ఊర్వశి ఐనాక్స్ (గాంధీనగర్), రవీంద్ర సినిమాస్ (పాయకాపురం), రామ్ సినిమాస్ (గుణదల), రాజకుమారి, సాయిరామ్, సౌమ్య (వన్‌టౌన్), స్వాతి (భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్ (బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్ (క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్ (పటమట), పవర్ వన్ మాల్ (కానూరు). **తెలుసు కదా, మిత్రమండలి, డ్యూడ్:** జీ-3 (రాజ్-యువరాజ్), మిరాజ్, ఊర్వశి ఐనాక్స్ (గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్ (గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్ (పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), రాజకుమారి, సాయిరామ్, సౌమ్య (వన్‌టౌన్), స్వాతి (భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్ (బందరు రోడ్డు). **- న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

సైబర్ నేరాలపై అవగాహన ముఖ్యం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: రైల్వే ఉద్యోగులకు సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని డీఆర్ఎం మోహిత్ సొనాకియా పేర్కొన్నారు. జాతీయ సైబర్ భద్రతా అవగాహన మాసోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం డీఆర్ఎం కార్యాలయంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సెల్‌ఫోన్లకు వచ్చే ప్రతి సందేశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీలు ఇతరులతో పంచుకోవద్దని చెప్పారు. సైబర్ నేరగాళ్ల బారిన పడితే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ఆన్‌లైన్ లావాదేవీల విషయంలోనూ జాగ్రత్తలు అవసరమని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు అందుకున్న ఉద్యోగులతో డీఆర్ఎం మోహిత్ సొనాకియా

విద్యార్థులను ప్రోత్సహించాలి

చిట్టినగర్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు కేవలం బోధకులుగా కాకుండా, విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని సంరక్షించే ఛాంపియన్లుగా మారాల్సిన అవసరం ఉందని మనోవిజ్ఞాన వేత్త, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ టి.డి.విమల సూచించారు. కొత్తపేట ఎస్ఆర్.ఎస్.వి.బీఈడీ కళాశాల ఆధ్వర్యంలో 'ఎంపవరింగ్ టీచర్స్ మెంటల్ హెల్త్ ఛాంపియన్స్ ఫర్ స్టూడెంట్స్' అనే అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు చదువుపై దృష్టి సారించడంలో ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. దీని వల్ల వారు మానసిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఉపాధ్యాయులు విద్యార్థులకు అండగా ఉండాలని సూచించారు. వివిధ రంగాల్లో ప్రవేశించే విధంగా వారిని ప్రోత్సహించాలని చెప్పారు. అనంతరం విద్యార్థులు రాసిన పరిశోధన పత్రాలను ఆవిష్కరించారు. సదస్సులో బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ ఆకెళ్ల సూర్య కనకదుర్గ, కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మోహనరావు, మాజేటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హాజరైన బీఈడీ విద్యార్థులు, అధ్యాపకులు

మాట్లాడుతున్న ప్రొఫెసర్ విమల

అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో పడి యువకుడి మృతి

భవానీపురం, న్యూస్‌టుడే: కాలువలో పడి యువకుడు చనిపోయిన ఘటన విద్యాధరపురం సితార సెంటర్ సమీపంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. విద్యాధరపురం రమణ బడ్డీకొట్టు వద్ద కూనేపల్లి ఏసు (32) కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటూ తాపీ పని చేస్తుంటారు. అతడికి వివాహం కాలేదు. సోమవారం మధ్యాహ్నం సితార సెంటర్ సమీపంలోని అవుట్‌ఫాల్ డ్రెయిన్ వద్దకు మూత్ర విసర్జనకు వెళ్లి కాలు జారి డ్రెయిన్‌లో పడిపోయాడు. కొద్దిసేపటి తర్వాత స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపారు. వారొచ్చి చూడగా మృతి చెందారు. తల్లి అమ్మాజీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి తాళం పగలగొట్టి దొంగతనం

చిట్టినగర్, న్యూస్‌టుడే: పట్టపగలు ఇంటి తాళం పగలగొట్టి దొంగతనానికి పాల్పడిన ఘటన సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వైఎస్ఆర్ కాలనీలో షేక్ నాగూర్‌బీ, మస్తాన్ దంపతులు నివాసం ఉంటున్నారు. భర్త ఫర్నిచర్ దుకాణంలో పని చేస్తుండగా, భార్య ఇళ్లలో పని చేస్తుంది. సోమవారం పిల్లలు పాఠశాలకు.. భార్యభర్తలు పనులకు వెళ్లారు. నాగూర్‌బీ మధ్యాహ్నం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా.. బీరువా కూడా తాళం పగలగొట్టి సామగ్రి చిందరవందరగా పడేసి ఉన్నాయి. బీరువాలో తెరిచి చూస్తే రూ.13 వేలు నగదు, బంగారం వస్తువులు ఉంగరం, చెవి దిద్దులు, మాటీలు, వెండి పట్టీలు 15 తులాలు, మరొక జత వెండి పట్టీలు 10 తులాలు చోరీకి గురయ్యాయని గుర్తించారు. ఈ మేరకు కొత్తపేట నేరవిభాగం పోలీసులకు నాగూర్‌బీ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ చిన కొండలరావు తెలిపారు.

అనాథ పిల్లలను ఆదుకుంటాం

పెజ్జోనిపేట, న్యూస్‌టుడే: రైల్వేస్టేషన్ పరిసరాల్లో అనాథ పిల్లలు కనిపిస్తే తమకు సమాచారం అందించాలని నవజీవన్ బాలభవన్ సంస్థ మేనేజర్ ఎం.డి.వసంతకుమారి కోరారు. సోమవారం విజయవాడ రైల్వేస్టేషన్ వద్ద క్లీనింగ్ సోప్ ఫర్ వైజాగ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనాథలకు తాము సహాయం చేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సోంబాబు, అనిల్, బాషా తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వసంతకుమారి

నగరంలో అభివృద్ధి పనుల పరిశీలన

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: కర్ణాటక ఉడిపి జిల్లా శాలి గ్రామ పంచాయతీ ప్రతినిధులు, అధికారులు విజ్ఞానయాత్ర పేరిట సోమవారం నగరంలో పర్యటించారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పలు ప్లాంట్లను పరిశీలించారు. కార్పొరేషన్ అధికారులు వారికి పలు వివరాలు అందించారు. శాలి గ్రామ పంచాయతీ ప్రతినిధులు అజిత్‌సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంటు స్క్రాప్ పార్కు, హనుమాన్‌పేట వాహన డిపో ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ప్రధాన కార్యాలయంలో వీరు కమిషనర్ ధ్యానచంద్రతో సమావేశమై చర్చించారు. నగరపాలక సంస్థ అనుసరిస్తున్న విధానాలు, తీసుకుంటున్న నిర్ణయాలు, అభివృద్ధి పనుల అమలు, వివిధ ప్లాంట్ల ఏర్పాటు, వ్యర్థాల నిర్వహణ, డ్రోన్ల సర్వేలైన్సు వంటి అనేక అంశాలను కమిషనర్ వారికి వివరించారు. కర్ణాటక బృందంలో అజయ్ బండార్కర్, సుకన్యశెట్టి, గిరిజాపూరి, అనసూయ, శాలిగ్రామ పంచాయితీ ప్రతినిధులు పాల్గొన్నారు. కార్పొరేషన్ అధికారులు రవీంద్రరావు, చంద్రశేఖర్, గోపాలకృష్ణనాయక్ వారి వెంట ఉన్నారు.

కమిషనర్‌తో శాలి పంచాయతీ ప్రతినిధులు

ప్రజల సమస్యలు పరిష్కరించండి

చిట్టినగర్, న్యూస్‌టుడే: కొండ ప్రాంతాల్లోని సమస్యలు పరిష్కరించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు వినతిపత్రం అందించారు. 50వ డివిజన్ కొండ ప్రాంతంలో రిటైనింగ్ గోడలు నిర్మించాలని కోరారు. మొంథా తుపాను వల్ల పడిపోయిన గోడ నిర్మాణం చేపట్టాలని కోరారు. గొల్లపాలెంగట్టు ప్రాంతంలో సామాజిక భవనం, జడా పాపయ్య వీధిలో సీసీ రోడ్డు, ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న చెట్లు తొలగించి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరినట్లు తెలిపారు. ఆయా సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో 50వ డివిజన్ నాయకులు, ప్రజలు ఉన్నట్లు తెలిపారు.

కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం ఫ్లోర్‌లీడర్ సత్యబాబు, స్థానికులు

అంతిమయాత్ర



ఉన్నతమైన వ్యక్తిత్వం గల మహా మనిషి, పూజ్యులు
గార్లపాటి వేంకట సత్య గురునాధరావు గారు
ది. 03-11-2025 సోమవారం స్వర్గస్తులైనారు.
ది. 04-11-2025 మంగళవారం ఉ. 11.30 ని॥లకు
విజయవాడ, చుట్టుగుంట, BSNL ఆఫీస్ వెనుక
సందు సర్దార్ పటేల్ రోడ్‌లో శ్రీ గురురత్న భవన్
మా స్వగృహము నుండి అంతిమయాత్ర బయలుదేరును.
కావున తెలియపరచడమైనది.

కీ॥శే॥ గార్లపాటి వేంకట సత్యగురునాధరావు గారు
జననం: 01-05-1941 మరణం: 03-11-2025

భార్య: గార్లపాటి రత్నకుమారి
కుమారుడు: గార్లపాటి శ్రీకాంత్
కోడలు: గార్లపాటి శిరీష
కుమార్తెలు: అనుపమాదేవి USA, పుష్పలత USA
మనుమడు: జయేష్
మనుమరాండ్రు: ప్రత్యూష - విపిన్ USA
సోనిక సాయి USA
ముని మనుమడు: అర్జున్ USA
మరియు బంధుమిత్రులు

విజయవాడ మధ్య

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
సీతారాంపురం–63036 11232, పాయకాపురం– 90631 44761

? వాంబేకాలనీ నుంచి శాంతినగర్ వెళ్లే రహదారి గుంతలమయంగా ఉంది. – షభాన, స్థానికురాలు
✔ పరిశీలించి గుంతలు పూడ్చివేస్తాం. – సతీష్, ఏఈ, సర్కిల్–2
? నందమూరినగర్ కృష్ణాకాలనీలో చెత్త సేకరణకు సిబ్బంది రావడం లేదు. – సునిల్, స్థానికుడు
✔ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.
– బాబూ శ్రీనివాసన్, ఏఎంవోహెచ్, సర్కిల్–2
– న్యూస్‌టుడే, పాయకాపురం

వీరులపాడులో 52 మి.మీ.వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. వీరులపాడు 52 మి.మీ., వత్సవాయి 29.8, కంచికచర్ల 13.6, ఇబ్రహీంపట్నం 11.6, జి.కొండూరు 3.6, పెనుగంచిప్రోలు 3.4, నందిగామలో 1.6 మిల్లీమీటర్ల మేర వర్షం పడింది.

ధర వరలు

వంకాయలు-48/52, టమాటా-30, బెండ-44, పచ్చిమిర్చి-28, కాకర-42, బీర-42/46, క్యాలీ ఫ్లవర్-20/25, క్యాబేజి-28, క్యారెట్-56/78, దొండ-34, బంగాళదుంప-30, ఉల్లిపాయలు-24, గోరుచిక్కుళ్లు-44, దోస-22, సొర-25, పొట్ల-28/25, అరటికాయ-5/6, చామదుంప-28, అల్లం-80, మునగ-10/8, ఆకు కూరలు (కట్ట)-4/10, కంద-46, బీట్ రూట్-50, కీరదోస-38, బీన్స్-85/95, క్యాప్సికమ్-80, చింతకాయలు-70, నిమ్మ (డజను)-24/30, కొత్తిమీర-13/26, పుదీనా-5/20, ముల్లంగి-10, పచ్చిమామిడి-20/15 (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. – **ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ**

వ్యాపార కేంద్రంలో గందరగోళం
అర్ధరాత్రి తోపుడు బళ్లు ప్రత్యక్షం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

నగరంలోని బెసెంట్‌రోడ్డు నుంచి కారల్ మార్క్స్ రోడ్డులోకి వెళ్లే మార్గంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత 10 తోపుడు బళ్లు గుర్తు తెలియని వ్యక్తులు పెట్టి హడావుడి సృష్టించారు. ఉదయం చూసేసరికి వరుసగా బళ్లు ఉండటంతో స్థానికులు కంగుతిన్నారు. వాటిపై ఎలాంటి సరుకులేదు.. వాటి తాలూకా మనుషులూ లేకపోవడంతో స్థానికులు అర్థంకాని పరిస్థితి నెలకొంది. సోమవారం రాత్రి వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. అవి ఎవరివి? ఎవరు పెట్టారో తెలియక.. స్థానికంగా ఉన్న చిరువ్యాపారులు గందరగోళానికి గురయ్యారు. ముందుగా తోపుడు బళ్లు పెట్టి, ఎవరూ పట్టించుకోకపోతే వాటిని అద్దెకు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసుకుని ఉండొచ్చని స్థానికులు అంటున్నారు. ఇదే అదనుగా భావించిన కొందరు స్థానిక వ్యాపారులు.. తమ సొంత బళ్లను సైతం అక్కడి వరుసలో పెట్టేశారు. తమకేమీ తెలియదన్నట్లు ఊరుకున్నారు.

పోలీసుల రంగ ప్రవేశం

ఎవరివో తెలియని తోపుడు బళ్లు ఒక్కసారిగా ప్రత్యక్షమవడంతో స్థానికులు హడావుడి చేశారు. పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. దుకాణాలు తమవని ఎవరూ ముందుకు రాకపోవడంతో తిరిగివెళ్లారు. అక్కడే రక్షక్ వాహనాన్ని ఉంచారు. ఎవరైనా వచ్చి హడావుడి చేసే శాంతిభద్రతల సమస్య తలెత్తే ప్రమాదం ఉండటంతో పోలీస్ నిఘా ఉంచారు.

కొత్తగా వెలిసిన తోపుడు బళ్లు ఇవే..

అజిత్‌సింగ్‌నగర్ వ్యక్తుల పనేనా?

అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన ఆయుధ గురు వ్యక్తులు ఈ తోపుడుబళ్లను గుట్టు చప్పుడు కాకుండా తెచ్చి పెట్టినట్లు గుప్పుమంది. అధికార పార్టీ నేతల అండదండలతో ఒక్కో బండి స్థలాన్ని తర్వాత అమ్ముకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు స్థానిక వ్యాపారులు అంటున్నారు. గతంలో బీసెంట్‌రోడ్డులో ఇలాగే తోపుడు బళ్లు పెట్టగా.. పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయి. పోలీసులు రోజుల తరబడి పికెట్లు పెట్టారు. తాజాగా మరోసారి బీసెంట్‌రోడ్డుకు పక్కనే ఉన్న లెనిన్‌కూడలి సమీపంలో రాత్రికి రాత్రి దుకాణాలు రావడంతో ఏం జరుగుతుందోనని అందరూ ఆందోళన చెందుతున్నారు. టౌన్ ప్లానింగ్ ఇన్‌స్పెక్టర్ గిరిని వివరణ కోరగా.. 'బీసెంట్‌రోడ్డులో తోపుడు బళ్లు పెట్టినట్లు నాకు ఫిర్యాదు వచ్చింది. మంగళవారం వాటిని పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని' తెలిపారు.

దివ్యాంగ విద్యార్థులకు చేయూత

పాయకాపురం, న్యూస్‌టుడే : విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని కలెక్టరేట్‌లో దివ్యాంగ విద్యార్థులకు కలెక్టర్ జి.లక్ష్మీశ, జేసీ ఎస్.ఇలక్కియాలు ల్యాప్‌టాప్‌లు అందజేశారు. ఒక్కో దాని విలువ సుమారు రూ.1.40 లక్షలు ఉంటుందని చెప్పారు. వినికిడి లోపం, కంటి చూపు సమస్య, శారీరక వైకల్యం కలిగిన పీహెచ్‌డీ, డిగ్రీ, బీటెక్ విద్యార్థులకు అందజేశారు.

ల్యాప్‌టాప్‌లు అందిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఇలక్కియా తదితరులు

నియంత్రికల పరిసరాలు శుభ్రం

స్పందనకు వందనం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : గవర్నర్‌పేట గోపాలకృష్ణయ్య వీధిలో పిచ్చిమొక్కలతో నిండిపోయిన విద్యుత్తు నియంత్రికల పరిసరాలను అధికారులు శుభ్రం చేయించారు. ఈ వీధిలో నియంత్రికల నిర్వహణ సక్రమంగా లేక పిచ్చిమొక్కలతో నిండిపోయి ప్రమాదకరంగా మారింది. దీనిపై నవంబరు 2న 'నియంత్రికలు.. ప్రమాద ఘంటికలు..' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. గవర్నర్‌పేట విద్యుత్తు సెక్షన్ ఏఈ సురేష్.. పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేయించారు. మరో నియంత్రిక వద్ద పేర్చిన పెట్టెలు, మంచాలు తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

గవర్నర్‌పేట, : కార్తికమాసం సోమవారం సందర్భంగా గవర్నర్‌పేటలోని కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానం భక్తులతో కిటకిటలాడిపోయింది. వేకువజాము నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి స్వామి వారికి అభిషేకాలు చేశారు. ఈవో యడ్లపల్లి సీతారామయ్య నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ప్రాంగణంలో కార్తిక దీపాలు వెలిగించారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు.

అలంకరణలో స్వామి

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం

చుట్టుగుంట, న్యూస్‌టుడే : మధ్య నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక 25వ డివిజన్ పాత ఉపాధి కల్పన కార్యాలయం రోడ్డులో కల్వర్టు నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత 17 నెలల్లో రూ.300కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఆర్‌యూబీలు, ఆర్వోబీల నిర్మాణాలపై దృష్టి సారించామన్నారు. గుణదల వద్ద ఆగిపోయిన ఆర్వోబీ నిర్మాణం కోసం ఎంపీ కేశినేని శివనాథ్ రైల్వే మంత్రిని కలిసి నిధులు మంజూరు చేయించారని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. దేవీనగర్ నుంచి మధురానగర్, దేవీనగర్ నుంచి వాంబే కాలనీకి వెళ్లే దారిలో ఆర్‌యూబీ నిర్మాణానికి అనుమతి లభించిందన్నారు. రవాణా సౌకర్యాలు మెరుగుపరుస్తామని వివరించారు. డివిజన్ అధ్యక్షుడు మాచర్ల గోపీనాథ్, ప్రధాన కార్యదర్శి నాగ సాయిబాబు, ఇన్‌ఛార్జి సుబ్బారావు, పావని, దొంగర ఆంజనేయులు పాల్గొన్నారు.

పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా

జాతీయ సమ్మేళనం జయప్రదానికి పిలుపు

గాంధీనగర్ : మతోన్మాదానికి వ్యతిరేకంగా ఈ నెల 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే జయహో మూడో జాతీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. సోమవారం ప్రెస్ క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. మతాల మధ్య చిచ్చు పెడుతూ కొందరు విద్వేషాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల స్ఫూర్తితో దేశ సమైక్యతకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘం నాయకులు శ్రీనివాస్, రాజమణి, రజాక్, నాగలక్ష్మి, శివ, తోట వెంకట్రావు, కోరాడ నాగు, బి.రాము, పి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రవీంద్రనాథ్, రాజమణి, రజాక్ తదితరులు

14న వాగ్గేయకారుల సంస్మరణోత్సవాలు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : శాస్త్రీయ సంగీత పరిరక్షణకు పెద్దపీట వేస్తూ డిసెంబరు 14న వాగ్గేయకారుల సంస్మరణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ప్రధాన కార్యదర్శి సి.వి.రావు ఓ ప్రకటనలో తెలిపారు. వీణావాదనం, వాగ్గేయకారుల కృతులు ఆలపించేందుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 20వ తేదీలోపు 98668 64340 నంబర్‌కు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

'నగరపాలక సంస్థ బిల్లులు చెల్లించడం లేదు'

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : 'విజయవాడ నగరపాలక సంస్థకు చెందిన వాహనాలకు మరమ్మతులు చేసి ఇచ్చాను. వాటికి సంబంధించిన బిల్లులు చెల్లించలేదు. కార్పొరేషన్ స్క్రాప్ వాహనాల టెండరులో పాల్గొని పాడుకున్నా.. కొన్ని వాహనాలు మాత్రమే ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ వాడిన కారును స్క్రాప్ కింద టెండరులో 2024, ఏప్రిల్ 28న దక్కించుకున్నా ఇప్పటి వరకు అప్పగించలేదు...' అంటూ గుత్తేదారు షేక్ సద్దాం హుస్సేన్ పేర్కొన్నారు. సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఆయన ఫిర్యాదు చేశారు. డీసీపీ ఉదయరాణి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 124 ఫిర్యాదుల్లో అత్యధికంగా భూ, ఆస్తి, నగదు లావాదేవీలపై 70 వచ్చాయి. కుటుంబ కలహాలు 10, మహిళా సంబంధ నేరాలు 14, మోసాలు 4, దొంగతనాలు 3, కొట్లాట 1, ఇతర వివాదాలు 22 చొప్పున వచ్చాయి. వాటిని సంబంధిత పోలీస్‌స్టేషన్లకు పంపించి సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు.

మహిళ సమస్య వింటున్న డీసీపీ ఉదయరాణి

కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ వైద్యం

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం.. సర్కారు ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయిలో ఆధునికీకరించి పేదలకు వైద్యం అందిస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని తెదేపా కార్యాలయంలో.. పలు డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు రూ.9.27 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వైద్యం అందుబాటులో లేక ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. కుటుంబ ఆర్థిక ఇబ్బందులను అధిగమించడానికి ముఖ్యమంత్రి సహాయ నిధి దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, కార్యాలయ కార్యదర్శి కృష్ణమోహన్, డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోండి

మాచవరం, న్యూస్‌టుడే : స్థానిక ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ప్రచార పత్రాలను సోమవారం కళాశాలలో తెదేపా నాయకుడు వల్లభనేని సతీష్, ప్రిన్సిపల్ కె.భాగ్యలక్ష్మి తదితరులు ఆవిష్కరించారు. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, కలెక్టర్, వీఎంసీ కమిషనర్, ఇతర ప్రముఖులు పాల్గొంటారన్నారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, 30కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 90326 33548 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు. తోట పాండు, ఆకుల సూర్యప్రకాష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానంద కళావేదికపై ఘంటసాల స్వర రాగాలతో సోమవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. ఒంగోలు సంస్థ వారి సౌజన్యంతో తెలుగు కళావాహిని, పోలవరపు సాంస్కృతిక సమితి, కళాభారతి సంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. గాయకులు సుమలత, మల్లాది స్వాతి, కె.వి.బి.ఆనంద్, దుర్గారావులు ఘంటసాల పాటలను పాడి సంగీత ప్రియులను ఆకట్టుకున్నారు. చింతకాయల చిట్టిబాబు, కె.డేవిడ్‌రాజు, బి.ఆంజనేయరాజులు గాయకులను సన్మానించారు. ఉగాది పురస్కార గ్రహీత నాగేశ్వరమ్మ, నటుడు రాజవీర తదితరులు పాల్గొన్నారు.

'జోగి.. బీసీల ద్రోహి'

పాయకాపురం, న్యూస్‌టుడే : వైకాపా నాయకుడు, మాజీ మంత్రి జోగి రమేష్ ఓ అరాచక వ్యక్తి అని తెదేపా 61వ డివిజన్ మహిళా అధ్యక్షురాలు డి.శివకుమారి ఆరోపించారు. శాంతినగర్‌లోని తెదేపా కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. బీసీ కార్డును అడ్డంపెట్టుకుని రాజకీయం చేస్తున్నారని, అతని వెంట బీసీలు ఉండరని పేర్కొన్నారు. బీసీల ద్రోహి అని దుయ్యబట్టారు. తెదేపా కార్యాలయంపై దాడికి వచ్చినప్పుడు ఆయన మంచితనం ఏమయిందని ప్రశ్నించారు. నాయకులు ఆకుల సూర్యప్రకాష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శిథిల మెట్లతో భయాందోళన

పాయకాపురం, శాంతినగర్ పార్కు సమీపంలోని మంచినీటి ట్యాంకు మెట్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఒకసారి మంచినీటి విభాగం అధికారులు కిందపడిపోయారు. స్థానిక నాయకులు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లి.. నూతన మెట్లు ఏర్పాటు చేయించారు. కానీ ప్రమాదకరంగా ఉన్న మెట్లను తొలగించలేదు. రోడ్డుపై నడక సాగించే వారిపై పెచ్చులు ఊడి పడుతున్నాయి. చిన్నచిన్న గాయాలవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. పెద్ద ప్రమాదం చోటు చేసుకోక ముందే సంబంధిత అధికారులు స్పందించి.. వాటిని తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, పాయకాపురం**

అంతర్గత వీధులు ఛిద్రం

ఉడా కాలనీలలో అంతర్గత వీధులన్నీ ఛిద్రం అయ్యాయి. అడుగుకో గుంత దర్శనమిస్తోంది. ఎమ్ఐజీ, ఎల్ఐజీ ప్రాంతాల్లో సుమారు 30కి పైగా వీధుల్లోని దారులు దారుణంగా ఉన్నాయి. కంకర పైకి లేచి ప్రమాదకరంగా ఉన్నాయి. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖాధికారులు సకాలంలో స్పందించి.. మరమ్మతు పనులు చేయాలని, కొత్త రోడ్లు నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, పాయకాపురం**

'అంబేడ్కర్ అంటే జగన్‌కు గౌరవం లేదు'

విజయవాడ (సూర్యారావుపేట), న్యూస్‌టుడే : వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి అంబేడ్కర్ అంటే కనీస గౌరవం లేదని, అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పేరు పెట్టుకున్నారని సమతా సైనిక్‌దళ్ నేత పిల్లి సురేంద్ర విమర్శించారు. రాష్ట్రంలో కుల మతాలను రెచ్చగొట్టి విగ్రహ రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ విగ్రహ రాజకీయాలను వ్యతిరేకిస్తూ సోమవారం విజయవాడలోని అంబేడ్కర్ స్మృతివనంలో నిరసన వ్యక్తం చేశారు. సురేంద్ర మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డి విధ్వంసకర పాలనకు ప్రజలు స్వస్తి పలికి.. 151 సీట్ల నుంచి 11 సీట్లకే పరిమితం చేశారని గుర్తు చేశారు. అతని అనుచరులకే స్మృతివనం నిర్వహణ బాధ్యతలు అప్పగించారని తెలిపారు. కావాలనే పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు ఇవ్వకుండా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మృతివనం నిర్వహణ సంస్థ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వైకాపా నాయకులే అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి రాజకీయం చేయాలని చూశారన్నారు. చంద్రబాబుకు అంబేడ్కర్ అంటే గౌరవం ఉందని.. అందుకే రాజధానిలో అంబేడ్కర్ స్మృతివనం నిర్మించాలని చూస్తే.. దాన్ని జగన్ చెడగొట్టారని గుర్తు చేశారు. ఇప్పటికైనా జగన్‌మోహన్‌రెడ్డి విగ్రహ రాజకీయాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు.

అంబేడ్కర్ స్మృతివనంలో నిరసన వ్యక్తం చేస్తున్న సమతా సైనిక్‌దళ్ నాయకులు

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

మధురానగర్, న్యూస్‌టుడే : ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై గుణదల పోలీసులు కేసు నమోదు చేశారు. మధురానగర్ కొబ్బరితోటకు చెందిన మెండిడాల వాసు (38) పాలిష్ పనులు చేస్తుంటారు. సోదరుడు శ్రీనుతో కలిసి ఉంటున్నారు. శనివారం రాత్రి 8.30 గంటల సమయంలో శ్రీను ఇంటికి వచ్చారు. సోదరుడు ఉండే గదిలో లైట్లు వేయకుండా చీకటిగా ఉండడంతో.. లోపలకు వెళ్లి చూశారు. ఫ్యాన్‌కు ఉరేసుకున్న సోదరుడిని చూసి చుట్టుపక్కల వారి సాయంతో కిందకు దింపారు. అప్పటికే చనిపోయి ఉండడంతో.. గుణదల పోలీసులకు శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగదు.. నగలు తీసుకుని పరారీ

మధురానగర్, న్యూస్‌టుడే : మహిళతో సన్నిహితంగా ఉంటూ.. ఆమె వద్ద నుంచి నగదు, బంగారు ఆభరణాలు, ద్విచక్రవాహనం తీసుకుని పరారైన దంపతులపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. మాకం లక్ష్మి (45) అనే మహిళ బుడమేరు మధ్యకట్టలో సొంత ఇంట్లో ఉంటున్నారు. కిరాణా దుకాణం నిర్వహిస్తుంటారు. ఆమె ఇంట్లో కందుల కమలవర్ధన్, భాను దంపతులు అద్దెకు దిగారు. ఆమెతో సన్నిహితంగా ఉంటూ.. కుటుంబ సభ్యుల్లా మెలిగేవారు. ఈ క్రమంలో లక్ష్మి వద్ద నుంచి పలుమార్లు డబ్బులు అప్పుగా తీసుకున్నారు. ఒకసారి తమ కుమారుడికి ఆరోగ్యం బాగోలేదని చెప్పటంతో.. లక్ష్మి తన బంగారునగలు ఇచ్చి, తాకట్టు పెట్టుకోమని ఇచ్చింది. ద్విచక్రవాహనం కూడా వాడుకునేవారు. గత నెల 27న వేడుకకు వెళ్లాలని చెప్పి.. నాలుగున్నర కాసుల బంగారు ఆభరణాలు తీసుకున్నారు. తర్వాత నుంచి ఇంటికి రాలేదు. ద్విచక్రవాహనం తీసుకుని పోవటంతో.. దంపతులపై లక్ష్మి అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

ఫ్లాట్లు ఇస్తామని మోసం

మధురానగర్, న్యూస్‌టుడే : స్థలాన్ని అభివృద్ధి చేసి, ఫ్లాట్లు ఇస్తామని వృద్ధురాలిని మోసం చేసిన ఎస్ఎల్‌వీ డెవలపర్స్‌పై గుణదల పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం... శ్రీరామచంద్రనగర్‌కు చెందిన కొండపనేని వాణి (63)కి ఇన్నర్ రింగ్‌రోడ్డులో 30 సెంట్ల స్థలం ఉంది. దీనిని తీసుకుని డెవలప్ చేసి 5 ఫ్లాట్లు ఇస్తామంటూ ఎస్ఎల్‌వీ డెవలపర్స్ ఆమెతో ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ డాక్యుమెంట్లలో 29 సెంట్ల స్థలం మాత్రమే అని రాశారని, ఒప్పందం ప్రకారం తనకు ఇస్తానన్న 5 ఫ్లాట్లు ఇవ్వలేదని ఆమె చెబుతున్నారు. దీంతో సంస్థ ఎండీ పి.శ్రీనివాసరాజుతో పాటు సాయి రంగరాజు, రామలింగరాజులను ప్రశ్నించారు. వారు ఆమెను దుర్భాషలాడి, తీవ్రమైన పరిణామాలుంటాయని బెదిరించారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వాణి పేర్కొన్నారు. దీనిపై గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాస్టర్స్ అథ్లెట్‌కు అభినందన

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 5 నుంచి నిర్వహించే 23వ ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌నకు ఆలిండియా రైల్వే పింఛనుదారుల సంక్షేమ సంఘం నాయకుడు కంది గంగాధరరావు అర్హత సాధించారు. భారత మాస్టర్స్ 85+ కేటగిరీలో తలపడనున్న గంగాధరరావును సోమవారం డీఆర్ఎం కార్యాలయం సమీపంలోని సంక్షేమ సంఘ కార్యాలయంలో సంక్షేమ సంఘం డివిజన్ కార్యదర్శి పీఎం ఖాన్, పలువురు పింఛనుదారులు అభినందించారు.

బుడమేరులో యువకుడి గల్లంతు

మధురానగర్, న్యూస్‌టుడే : ఓ యువకుడు ప్రమాదవశాత్తు బుడమేరులోకి జారిపడిపోయి కనిపించకుండా పోయిన ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పల్లెపోగు రాజేష్ (35) రాడ్ బైండింగ్ పని చేస్తుంటారు. బుడమేరు పక్కనే ఉండే ఇంట్లో భార్య పుష్పలతతో కలిసి ఉంటున్నారు. సోమవారం మధ్యాహ్నం బాత్రూంకు వెళ్లి కాలుజారి బుడమేరులో పడిపోయాడు. నీటి శబ్దం రావడంతో ఇంట్లో ఉన్న అతని భార్య బయటకు వచ్చి చూడగా.. భర్త నీటిలో కొట్టుకుపోతుండగా చూశారు. చుట్టుపక్కల వారి సాయంతో వెతికినా ఉపయోగం లేకపోవటంతో అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బలగాలను రంగంలోకి దించి గాలింపు చర్యలు చేపట్టారు.

రాజేష్ (పాత చిత్రం)

దివీస్ సహకారం అభినందనీయం

విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే: దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ సంస్థ ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తుందని విజయవాడ మధ్య నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం నగరంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రిలో ఆ సంస్థ ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్ డా.ఏవీ రావుతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. దివీస్ సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా రూ.66.67లక్షలతో వెయ్యి లీటర్ల సామర్థ్యం ఉన్న మూడు ఆర్వో ప్లాంట్‌లను అందజేసినట్టు వివరించారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డా.మంగాదేవి, సైకియాట్రీ విభాగం హెచ్‌వోడీ డా.రాఘవరావు, గైనిక్ హెచ్‌వోడీ డా.హిమబిందు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.సునీత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

సత్యనారాయణపురం(గాంధీనగర్): విద్యుత్తు లైన్ల మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10 వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పి.రవీంద్రబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాడంకి వారి వీధి, రామాలయం వీధి, గడియారం వీధి, అబ్బూరు వారి వీధి, వ్యాకరణం వీధి, ముదిగొండ వీధి, తిరుమలశెట్టి వీధుల్లో విద్యుత్తు ఉండదని ఆయన వివరించారు.

స్థలం కేటాయించాలని విజ్ఞప్తి

పాయకాపురం, న్యూస్‌టుడే : గిరిజన భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ గోపిరాజులు సోమవారం జేసీ ఇలక్కియాకు వినతిపత్రం అందజేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : గవర్నర్‌పేట రాజగోపాలచారివీధి, ప్రకాశంరోడ్డు కూడలిలో సోమవారం తెల్లవారుజామున ఆటో బీభత్సం సృష్టించింది. మితిమీరిన వేగంతో వచ్చి విద్యుత్తు స్తంభాన్ని ఢీ కొట్టింది. ఆటో ముందు భాగం దెబ్బతింది. సీటు ఎగిరి పడింది. ఫ్యూజ్ బాక్సు ధ్వంసమైంది. ఫ్యూజులు బయటపడ్డాయి. బాక్సు లేకపోతే.. డ్రైవర్ విద్యుదాఘాతం ఎదుర్కొనేవాడని స్థానికులు పేర్కొన్నారు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిపోయింది. ప్రమాదం తర్వాత వాహనాన్ని అక్కడే వదిలి వెళ్లిపోయారు.

దెబ్బతిన్న ఆటో, ధ్వంసమైన ఫ్యూజ్ బాక్సు

నగరంలో అభివృద్ధి పనుల పరిశీలన

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: కర్ణాటక ఉడిపి జిల్లా శాలి గ్రామ పంచాయతీ ప్రతినిధులు, అధికారులు విజ్ఞానయాత్ర పేరిట సోమవారం నగరంలో పర్యటించారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పలు ప్లాంట్లను పరిశీలించారు. కార్పొరేషన్ అధికారులు వారికి పలు వివరాలు అందించారు. శాలి గ్రామ పంచాయతీ ప్రతినిధులు అజిత్‌సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంటు స్క్రాప్ పార్కు, హనుమాన్‌పేట వాహన డిపో ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ప్రధాన కార్యాలయంలో వీరు కమిషనర్ ధ్యానచంద్రతో సమావేశమై చర్చించారు. నగరపాలక సంస్థ అనుసరిస్తున్న విధానాలు, తీసుకుంటున్న నిర్ణయాలు, అభివృద్ధి పనుల అమలు, వివిధ ప్లాంట్ల ఏర్పాటు, వ్యర్థాల నిర్వహణ, డ్రోన్ల సర్వేలెన్సు వంటి అనేక అంశాలను కమిషనర్ వారికి వివరించారు. కర్ణాటక బృందంలో అజయ్ బండార్కర్, సుకన్యశెట్టి, గిరిజాపూరి, అనసూయ, శాలిగ్రామ పంచాయితీ ప్రతినిధులు పాల్గొన్నారు.

❖ నగరంలోని అన్ని డ్రెయిన్లలో వ్యర్థాలను తొలగించి మురుగునీటి పారులకు ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. పాత బస్తీ, కేటీ రోడ్డు, గణపతిరావు రోడ్డు, చిట్టినగర్, ఊర్మిళాసుబ్బారావునగర్, రామరాజ్యనగర్, కబేళా, ఎర్రకట్ట, గాంధీనగర్ ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు.

కమిషనర్ ధ్యానచంద్రతో శాలి గ్రామ పంచాయతీ ప్రతినిధులు, అధికారులు

అంతిమయాత్ర

ఉన్నతమైన వ్యక్తిత్వం గల మహా మనిషి, పూజ్యులు
గార్లపాటి వేంకట సత్య గురునాధరావు గారు
ది. 03-11-2025 సోమవారం స్వర్గస్థులైనారు.
ది. 04-11-2025 మంగళవారం ఉ. 11.30 నిలకు
విజయవాడ, చుట్టుగుంట, BSNL ఆఫీస్ వెనుక సందు సర్దార్ పటేల్ రోడ్ లో శ్రీ గురుదత్త భవన్ మా స్వగృహము నుండి అంతిమయాత్ర బయలుదేరును.
కావున తెలియపరచడమైనది.



భార్య: గార్లపాటి రత్నకుమారి
కుమారుడు: గార్లపాటి శ్రీకాంత్
కోడలు: గార్లపాటి శిరీష
కుమార్తెలు: అనిమాదేవి USA, పుష్పలత USA
మనుమడు: ఆయుష్ USA
మనుమరాండ్రు: ప్రత్యూష - విపిన్ USA, సోనిక సాయి USA
ముని మనుమడు: అర్జున్ USA
మరియు బంధుమిత్రులు

కీ.శే. గార్లపాటి వెంకట సత్యగురునాధరావు గారు
జననం: 01-05-1941 మరణం: 03-11-2025

(c) eenadu

జాతీయ జలపాత రహదారి

అనకాపల్లి-ఆనందపురం రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా ఫ్లైఓవర్ వద్ద వర్షపు నీరు పోవడానికి జాతీయ రహదారి అధికారులు చూపిన నిర్లక్ష్యంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్లంబింగ్ పనులు చేసి.. నీరు దిగువకు పారే ఏర్పాటు చేయకుండా రంధ్రాలు పెట్టి ఊరుకున్నారు. అనకాపల్లిలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి ఫ్లైఓవర్ నుంచి జలపాతాన్ని తలపించేలా రహదారిపైకి నీరు పడింది. ఇక్కడి పరిస్థితిని చక్కదిద్దేందుకు చొరవ చూపాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ కోరారు. - అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

మీ రక్షణ మా విధి.. అందుకు ఆయుధమిది!

ఆయుధాల వివరాలు విద్యార్థులకు వెల్లడిస్తున్న ఎస్పీ

పోలీస్ అమరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. పోలీసులు వినియోగించే ఆయుధాలు, భద్రతా పరికరాలు, క్లూస్‌టీంలపై పలువురు విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీసుల ఆయుధాలను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. వీరి సందేహాలను ఎస్పీ తుహిన్‌సిన్హా స్వయంగా నివృత్తి చేశారు. - అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

అంతా కల్తీ.. తింటే సుస్తీ!

యథేచ్ఛగా నిల్వ, కాలంచెల్లిన ఆహారం విక్రయాలు

అంతంతమాత్రంగానే తనిఖీలు

ఈనాడు డిజిటల్, అనకాపల్లి

ఉరుకుల పరుగుల జీవితంలో అందరూ బిజీ అయిపోయారు. ఇంట్లో వండుకునే సమయం లేక, కొందరికి ఓపిక లేక.. ఆహార పదార్థాలను బయట కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. ఇదే కొందరు వ్యాపారులకు వరంగా మారింది. ఇష్టమొచ్చినట్లు కల్తీ చేసి వ్యాపారం సాగిస్తున్నారు. రోజుల తరబడి దుకాణాల్లో నిల్వ ఉన్నా.. వాటిని బయట పారేయకుండా వంటకాల్లో ఉపయోగిస్తున్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే రంగులు, టేస్టింగ్ సాల్ట్ ఇష్టారాజ్యంగా వాడేస్తున్నారు. దీంతో చాలా మంది ఆహార పదార్థాలు తిని అనారోగ్యం బారిన పడుతున్నారు.

● అనకాపల్లి, ఎలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీలతోపాటు గ్రామీణ ప్రాంతాల పరిధిలో కలిపి మొత్తం 1500పైగా హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లున్నాయి. కానీ జిల్లాలో 350 హోటళ్లకు మాత్రమే అనుమతులు ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. సగానికి పైగా దుకాణాలకు అనుమతులు లేకపోయినా.. నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. జిల్లా పరిధిలోని జాతీయ రహదారి పొడవునా రాత్రింబవళ్లు దాబాలు నిర్వహిస్తున్నారు. రిఫ్రిజిరేటర్లలో నిల్వఉంచి మరీ అమ్మకాలు చేస్తున్నారు.

అనకాపల్లిలోని ఓ హోటల్ వంటశాలలో తనిఖీ చేస్తున్న అధికారులు

■ అనకాపల్లి పట్టణం రింగురోడ్డులోని ఓ సూపర్ మార్కెట్‌లో ఇటీవల ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. సోయా మిల్క్, లస్సీ, చాక్లెట్లు, ఇన్‌స్టంట్ నూడిల్స్, వంటనూనె ప్యాకెట్లు కాలం చెల్లినవి విక్రయిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు.

■ అనకాపల్లి పట్టణం నూకాలమ్మ ఆలయం సమీపంలో క్యాటరింగ్ చేసే దుకాణంలో తనిఖీలు చేశారు. కల్తీ అయిన నెయ్యి వినియోగిస్తున్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేశారు.

అవగాహన సదస్సులేవీ? కల్తీ సరకుల కొనుగోలు, నాసిరకం ఆహారం తినడం వల్ల ఎదురయ్యే అనారోగ్య సమస్యలపై ప్రజలకు ఆహార భద్రతా అధికారులు అవగాహన కల్పించాలి. ఎక్కడైనా నిల్వ, కాలం చెల్లిన పదార్థాలు అమ్మినా ఫిర్యాదు చేయడం ఎలానో వివరించాలి. ఈ ఏడాది జిల్లాలో ఇప్పటివరకు అవగాహన కార్యక్రమాలు జరగకపోవడం గమనార్హం. అధికారులు తనిఖీలు చేయకపోవడానికి కారణం కొందరు వ్యాపారుల నుంచి రెండు, మూడు నెలలకోసారి మామూళ్లు అందుతుండటమే. ఒక్కో దుకాణం నుంచి రూ. 1000 నుంచి రూ. 2 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

మొక్కుబడిగా తనిఖీలు... జిల్లాలో అధికారుల తనిఖీలు మొక్కుబడిగా మారాయి. హడావుడిగా నమూనాలు సేకరించి పరీక్షలకు పంపిస్తూ.. చేతులు దులుపుకొంటున్నారు. ఒక్కో ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రతి నెలా హోటళ్లు, దుకాణాలు, దాబాల్లో తనిఖీలు చేసి 10వరకు నమూనాలను నాణ్యతా పరీక్షలకు పంపించాలి. కానీ.. ఇలా ఎక్కడా చేయడం లేదు. కార్యాలయాలకే పరిమితం అవుతున్నారు. ఫిర్యాదులు అందితే.. అడపాదడపా తనిఖీలు చేసి కేసులు కడుతున్నారు.

పది నెలల్లో 300 వరకు నమూనాలు పరీక్షలకు పంపించారు. ఇందులో పదిహేనింటిలో నాణ్యత లోపం ఉన్నట్లు గుర్తించి కేసులు పెట్టారు.

తరచూ తనిఖీలు చేస్తున్నాం ... జిల్లాలో తరచూ తనిఖీలు చేస్తున్నాం. నిబంధనల ప్రకారం నమూనాలు సేకరించి.. నిర్ధారణ పరీక్షలకు పంపిస్తున్నాం. నిబంధనలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలపై కేసులు పెడుతున్నాం. అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నాం. - సతీష్, జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్, అనకాపల్లి

కోనేటి రాయుడి కల్యాణ వైభోగం

శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న తితిదే అర్చకులు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: తనను తలచి.. పిలిచిన భక్తులందరినీ అనుగ్రహించే అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం నర్సీపట్నం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో సోమవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వేలాదిగా భక్తులు తరలిరావడంతో స్టేడియం కిక్కిరిసింది. కోలాట బృందాల సందడి, శ్రీవారి సేవకుల గోవింద నామస్మరణల మధ్య శ్రీవారి శోభాయాత్ర శ్రీకన్య కూడలి నుంచి స్టేడియం వరకు కనులపండువగా సాగింది. అనంతరం ఎస్.వి. సంగీత, నృత్య కళాశాల విద్యార్థుల సంప్రదాయ మేళం, అన్నమయ్య సంకీర్తనలతో అలరించారు. తితిదే అర్చకుడు సాయిస్వామి మేళం, నాదం, మంత్రాల సామరస్య పూర్వక సమ్మేళనంతో ఆకట్టుకున్నారు. శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ దంపతులు, కౌన్సిలర్ విజయ్‌కు అర్చకులు వేదికపై తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అయ్యన్న ప్రసంగిస్తూ సాక్షాత్తూ వేంకటేశ్వరస్వామి తిరుమల నుంచి నర్సీపట్నం తరలిరావడం భక్తుల అదృష్టమన్నారు. కల్యాణం ఆద్యంతం తిలకించడం తనకెంతో ఆనందం కలిగించిందని పేర్కొన్నారు. హౌసింగ్ బోర్డు ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, దాడి రత్నాకర్, డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్డీఓ రమణ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం తిలకిస్తున్న అయ్యన్న దంపతులు, డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు, పట్టణ ప్రజలు

డీసీసీబీలో భారీగా బోగస్ సభ్యత్వాలు: కోన

కోటవురట్ల, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో నకిలీ పత్రాలతో పంట రుణాలను కాజేసిన వారిపై క్రిమినల్ కేసులకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) ఛైర్మన్ కోన తాతారావు తెలిపారు. సోమవారం కోటవురట్ల శాఖను సందర్శించారు. కోటవురట్ల, మాకవరపాలెం, నాతవరం, నర్సీపట్నం శాఖల సిబ్బందితో సమావేశమై బ్యాంకుల్లో జరుగుతున్న లావాదేవీలపై ఆరా తీశారు. అలసత్వం వహిస్తున్న సిబ్బందిని హెచ్చరిస్తే, వారు రాజకీయ ఒత్తిళ్లు తీసుకొస్తున్నారని బ్యాంకు మేనేజర్లు ఛైర్మన్‌తో చెప్పారు. ఎవరికీ లొంగాల్సిన పనిలేదని.. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. వైకాపా కార్యకర్తలు నకిలీ పత్రాలను సృష్టించి బ్యాంకు రుణాలను తీసుకున్నారని, అటువంటి వారిని గుర్తించి నోడల్ అధికారులతో విచారణ చేయించి, క్రిమినల్ కేసులు పెట్టడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం సున్నా వడ్డీ రుణాలు అందించడానికి చర్యలు తీసుకుందని తెలిపారు. జిల్లాలో 98 బ్రాంచులున్నాయని, కొత్తగా మరో ఆరు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. బ్యాంకులో 4.90 లక్షల మంది సభ్యత్వాన్ని కలిగి ఉన్నారని.. అందులో లక్షవరకూ బోగస్ సభ్యత్వాలేనని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌కు రూ. 572 కోట్లు రైతులకు రుణాలుగా అందించామన్నారు. వరి పంట సాగు చేసే రైతులకు, ఎకరాలకు రూ. 54 వేలు, ఇతర అవసరాలకు రూ. 5 లక్షల రుణం అందిస్తున్నామన్నారు. వడ్డీ లేని రుణంగా డ్వాక్రా మహిళలకు రూ. 20 లక్షలు, మరణించిన సొసైటీ సభ్యుల కుటుంబాలకు రూ. 20 లక్షల బీమా చెక్కులను అందించారు. పీఏసీఎస్ ఛైర్మన్ జనార్దన్, నాయకులు కాశీనాయుడు, శ్రీనివాస్, సూర్యారావు, సూర్యచంద్ర పాల్గొన్నారు.

మహిళలకు నగదు అందిస్తున్న డీసీసీబీ ఛైర్మన్ తాతారావు

చిన్నారులకు చక్కటి వైద్యం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

✦ రాంబిల్లికి చెందిన నాలుగేళ్ల చిన్నారికి కడుపు నొప్పి వచ్చింది. ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్తే రెండు రోజులపాటు చికిత్స అందించి రూ. 40 వేలు బిల్లు వేశారు. తగ్గకపోవడంతో అనకాపల్లి ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ ఉచితంగా చికిత్స అందించి నయం చేశారు.

✦ చోడవరానికి చెందిన చిన్నారికి జ్వరం వచ్చింది. ప్లేట్‌లెట్స్ పడిపోయాయని.. ప్రైవేటు ఆసుపత్రిలో వేలాది రూపాయలు ఫీజు వసూలు చేశారు. ఎంతకీ తగ్గకపోవడంతో అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్సకు తీసుకురావడంతో నయమైంది.

చంటిబిడ్డకు చికిత్స అందిస్తున్న వైద్యులు

పిల్లలు ఆరోగ్యం బాగోకపోతే తల్లిదండ్రులు ఎంతో కలత చెందుతారు. దీనిని ప్రైవేటు వైద్యులు ఆసరాగా తీసుకుని వేల నుంచి లక్షలాది రూపాయలు లాగేస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని చిన్నారులకు మెరుగైన వైద్యసేవలు అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో ఎస్ఎన్‌పీయూ విభాగానికి ఆధునిక పరికరాలతోపాటు ప్రత్యేక వైద్యురాలు, సిబ్బందిని నియమించారు. సివిల్ సర్జన్, డిప్యూటీ సివిల్ సర్జన్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులను భర్తీ చేశారు. నలుగురు నిపుణులతో మెరుగైన వైద్యం అందిస్తున్నారు.

● అప్పుడే పుట్టిన పిల్లలకు వచ్చే పచ్చకామెర్లు, బరువు తక్కువగా పుట్టిన, ఉమ్మనీరు తాగిన, తీవ్ర ఆరోగ్య సమస్యలు ఉన్న చిన్నారులకు ఎస్ఎన్‌సీయూలో చికిత్స అందిస్తున్నారు. వీటికి ప్రైవేటుగా అయితే వేలాది రూపాయలు బిల్లులు చేస్తున్నారు. చిన్నారులకు జ్వరం వచ్చి ప్లేట్‌లెట్స్ తగ్గినా, ఇతర అనారోగ్య సమస్యలు వచ్చినా చికిత్స అందించడానికి పిల్లల ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు.

● జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి రోజుకు 70 నుంచి 100 మంది చిన్నారులు ఓపీకి వస్తున్నారు. దీంతో పాటుగా ఎస్ఎన్‌సీయూలో ఆసుపత్రిలో డెలివరీ అయిన చంటిబిడ్డలతోపాటు మిగిలిన చిన్నారులు రోజుకు 50 మంది వరకు చికిత్స పొందుతున్నారు. 24 గంటలు వైద్యుల పర్యవేక్షణలో చిన్నారులకు అందిస్తున్న వైద్యం నిరుపేదలకు ఉపయోగకరంగా ఉంటుంది.

ఆసుపత్రిలో ఆధునిక పరికరాలు...

చిన్నారుల వైద్యసేవలకు ఆసుపత్రిలో ఆధునిక పరికరాలు సమకూర్చారు. నలుగురు వైద్యులతో ఇక్కడ సేవలు అందిస్తున్నాం. ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వైద్యం అందించి నయం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. అప్పుడే పుట్టిన చిన్నారులకు ఇక్కడే మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. వీటిని సద్వినియోగం చేసుకోవాలి. వర్షాలు పడుతున్న నేపథ్యంలో చిన్నారుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి. - బి.వెంకటేశ్, చిన్నపిల్లల సివిల్ సర్జన్, అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి

చోడవరంలో ఉద్యోగమేళా రేపు

కలెక్టరేట్, చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: చోడవరంలో బుధవారం ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం జాబ్ మేళా గోడప్రతులను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 9 గంటలకు మేళా ప్రారంభం అవుతుందన్నారు. 17 కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటాయని పేర్కొన్నారు. 1500 ఖాళీలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. 18 నుంచి 35 ఏళ్ల వయసు ఉండి, పదోతరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లమో, డిగ్రీ, పీజీ పూర్తి చేసినవారు అర్హులన్నారు. ముందుగా నైపుణ్యం యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 94947 919350 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గోవిందరావు, ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

భవితకు ఉపకారం

విద్యార్థుల నుంచి పెరిగిన స్పందన

నర్సీపట్నం, న్యూస్‌టుడే

జాతీయ ఉపకార వేతనాల పరీక్షలకు మంచి స్పందన లభించింది. జిల్లాలో మునుపెన్నడూ లేని విధంగా అధికశాతం విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. ఏటా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది వీటికి హాజరయ్యేవారికి రిజిస్ట్రేషన్లకు వీలుగా వీలుగా నమోదు గడువును గతనెల 31 వరకు పెంచుతూ వచ్చారు. మొత్తం 3,997 మంది ఈ పరీక్షలు రాయడానికి ముందుకొచ్చారు.

↑ సన్నద్ధమవుతున్న విద్యార్థులు

✦ ఏడో తరగతిలో 55 శాతం మార్కులు అలాగే ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులకు 50 శాతం మార్కుల ఉన్నవారు రాత పరీక్షలో నెగ్గితే వీటికి ఎంపిక కానున్నారు. ఓసీ, బీసీ విద్యార్థుల రూ.100 చొప్పున, ఎస్సీ, ఎస్టీలు రూ.50 చొప్పున ఫీజు చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. పలు పర్యాయాలు గడువు వాయిదా వేసి ఎక్కువ మందికి అవకాశం కలిగేలా చూడటంతో ఈ ఏడాది అభ్యర్థుల సంఖ్య బాగా పెరిగింది.

✦ ఆర్థికంగా వెనుకబడిన తెలివైన విద్యార్థులు చదువుకు దూరం కాకుండా ఉండాలనే ఉద్దేశంతో కేంద్రం ఉపకార వేతనాలు అందిస్తోంది. ప్రభుత్వ బడుల్లో డ్రాపౌట్లను తగ్గించేందుకు కొన్నేళ్లుగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం అమలవుతోంది. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచే వారికి ఏడాదికి రూ.12 వేలు చొప్పున నాలుగేళ్ల పాటు అందజేయనున్నారు. జిల్లా పరిషత్తు, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్తు ప్రాథమికోన్నత, ఆదర్శ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న వారందరికి పరీక్షలు రాయడానికి అవకాశం కల్పిస్తున్నారు.

✦ జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం రెవెన్యూ డివిజన్లలో కేంద్రాలు ఏర్పాటు చేసి ఈ పరీక్షలు చేపట్టనున్నారు. అనకాపల్లిలో 2,016 మంది నర్సీపట్నంలో 1,981 మంది పరీక్ష రాయనున్నారు. వీరి కోసం కేంద్రాల ఏర్పాటు తదితర వాటిపై విద్యా శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. వచ్చే డిసెంబర్‌లో పరీక్షల తేదీ ప్రకటించనున్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో 3,141 మంది పరీక్ష రాయగా 161 మంది ఎంపికయ్యారు. గత ఏడాది 2,800 మంది హాజరు కాగా 137 మంది ఉత్తీర్ణులయ్యారు. కేంద్రం నుంచి ఆదేశాల జారీ అయిన వెంటనే పరీక్షలు నిర్వహించడానికి వీలుగా అన్నీ సిద్ధం చేస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి **అప్పారావు** తెలిపారు.

నడుంలోతు బురద.. నడవాలన్నా బెడద!

రోలుగుంట ఆర్ల, శరభవరం పంచాయతీ పరిధిలో రాజన్నపేట, గదబపాలెం, గుర్రాలబైలు గ్రామాలకు వెళ్లే రోడ్డు బోడుమెట్ట వద్ద బురద ఊబిని తలపిస్తోంది. పీఎంఆర్‌జేవైలో భాగంగా ఈ గ్రామాలకు తారురోడ్డు నిర్మించారు. నల్లరాయి క్వారీ నుంచి వచ్చే భారీ వాహనాల కారణంగా ఈ రహదారి దారుణంగా తయారైంది. కనీసం రహదారి రూపురేఖలు కూడా కనిపించడం లేదు. ఈ రహదారి దుస్థితిపై గిరిజన గ్రామాల ప్రజలు సోమవారం మోకాళ్లలోతు బురదలో దిగి నిరసన వ్యక్తం చేశారు. - రోలుగుంట, న్యూస్‌టుడే

10 నుంచి 'పోస్టల్' టోర్నమెంట్

విశాఖపట్నం, న్యూస్‌టుడే: తపాలా ఉద్యోగులకు జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నట్లు పోస్టుమాస్టర్ జనరల్ వి.ఎస్.జయశంకర్ తెలిపారు. విశాఖ జిల్లా ప్రధాన తపాలా కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పోటీల లోగో, టీజర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు ఎంవీపీకాలనీ ఎస్-3 స్పోర్ట్స్ ఎరినాలో పోటీలు జరుగుతాయన్నారు.

అడ్డంగా నరికేశారు.. అడ్డుగా పడేశారు!

విద్యుత్తు లైన్లకు అడ్డంగా ఉన్న చెట్లను తూర్పుప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ తొలగిస్తూ ఉంటుంది. కొన్నిసార్లు ఈ కార్యక్రమం ప్రహసనంలా మారుతోంది. చోడవరంలోని ద్వారకానగర్ మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల చెట్టు ఆదివారం నరికేశారు. కనీసం వాటి కొమ్మలను, మానును తొలగించకుండా అక్కడే వదిలి వెళ్లిపోయారు. యథావిధిగా సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు చెట్టు అడ్డంగా ఉండటంతో ఏమి చేయాలో తెలియలేదు. నానాతిప్పలు పడి తరగతి గదుల్లోకి వెళ్లారు - చోడవరం, న్యూస్‌టుడే

WANTED
ప్రముఖ 2 వీలర్ ఫైనాన్స్ నందు తుని, పాయకరావుపేట, నర్సీపట్నం మరియు అడ్డరోడ్డు బ్రాంచిలలో బిజినెస్ మరియు కలెక్షన్ చేయుటకు ఎగ్జిక్యూటివ్స్ కావలెను
ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్స్
విష్ణుసాయి ఫైనాన్స్ కార్పొరేషన్
లక్ష్మీ థియేటర్ దగ్గర, పాయకరావుపేట
85006 44978
88863 33600

మీరు సిద్ధంగా ఉంటే సీఎం వద్దకు తీసుకెళతా

రాజయ్యపేట వాసులకు మంత్రి భరోసా

నక్కపల్లి, న్యూస్‌టుడే: బల్క్‌డ్రగ్ పార్కు విషయంలో మీరంతా ఇప్పటికైనా సిద్ధంగా ఉంటే సీఎం చంద్రబాబు వద్దకు తీసుకెళతానని హోం మంత్రి వంగలపూడి అనిత రాజయ్యపేట వాసులకు భరోసా ఇచ్చారు. ఈ గ్రామానికి చెందిన మత్స్యకార నాయకులు పలువురు సోమవారం మంత్రిని నక్కపల్లిలో కలిసి బల్క్‌డ్రగ్ పార్కు రాకుండా చూడాలని కోరారు. ఈ సందర్భంగా గతంలో జరిగిన అంశాలపైనా కొద్దిసేపు చర్చ జరిగింది. అప్పట్లో మీరు నన్ను ఆపినా, ఇటీవల జాతీయ రహదారి దిగ్బంధించినా మీరంతా నావాళ్లగా భావించి మీపై ఎలాంటి చర్యలకు ఆదేశించలేదన్నారు. నెలల తరబడి మీరంతా ఆందోళనకు కూర్చోవడం బాధగా ఉందన్నారు. పార్టీలు పక్కనపెట్టి అంతా వస్తే ముఖ్యమంత్రి దగ్గరకు వెళదామని, దీనికి తగిన పరిష్కారం దొరుకుతుందన్నారు. ప్రస్తుతం స్టీల్‌ప్లాంటుకు సంబంధించి 20 వేల మంది అవసరమని, ఇందుకోసం ముందుగా మన వద్ద ఉన్న యువత వివరాలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రిని కలిసేందుకు తాము కమిటీ ఏర్పాటు చేసుకుంటామని అంతవరకు పనులు పూర్తిగా ఆపాలని మత్స్యకారులు కోరగా, రెవెన్యూ పరిధిలో ఎలాంటి పనులు జరగకుండా చూస్తానని త్వరగా కమిటీ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. సమావేశంలో బాబ్జి, మహేశ్, సోమేశ్, కాశీ, స్వామి పాల్గొన్నారు.

మత్స్యకార నాయకులతో మాట్లాడుతున్న మంత్రి అనిత

రాష్ట్రంలో పరిశ్రమలకు అనుకూల వాతావరణం

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

కశింకోట, న్యూస్‌టుడే: భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి పథంలో పరుగులు తీయడానికి పరిశ్రమలే కీలకపాత్ర పోషిస్తాయని, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణం ఉందని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. కశింకోట మండలం తాళ్లపాలెంలో ఎన్‌సీఎల్ కర్మాగారం నూతనంగా ఏర్పాటు చేసిన సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం కర్మాగారంలో వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడారు. ఇక్కడి ప్రజల మనోభావాలను గౌరవించి విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయకుండా కేంద్ర ప్రభుత్వం అధీనంలో కొనసాగిస్తున్నామన్నారు. ఉక్కు పరిశ్రమను గాడిలో పెట్టడానికి, పటిష్ఠం చేయడానికి ప్రభుత్వం రూ. 11,400 కోట్లు ప్యాకేజీ అందించిందన్నారు. 2029 నాటికి నక్కపల్లి స్టీల్‌ప్లాంట్ పూర్తిస్థాయిలోకి అందుబాటులోకి వస్తుందని వివరించారు. ఎన్‌సీఎల్ సంస్థ ప్లాంట్ వైకాపా హయాంలోనే ప్రారంభం కావాల్సి ఉన్నా సరైన సహకారం అందించకుండా ఇబ్బందులు పాలు చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన కొద్ది నెలల్లోనే పనులు ప్రారంభించి ప్లాంట్‌ను అందుబాటులోకి తెచ్చారని అభినందించారు. ఎన్‌సీఎల్ కర్మాగారాల వైస్ ఛైర్మన్ కె.రవి మాట్లాడుతూ ఈ పరిశ్రమ వార్షికంగా 6,60,000 టన్నుల సామర్థ్యంతో స్థాపించి.. నాలుగు మిలియన్ టన్నులకు తీసుకెళ్లామని వివరించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు ప్రసాద్ అర్జున, హెడ్ నర్సింగరావు, ప్రాజెక్టు హెడ్ కిరణ్, జీఎం రవిశంకర్ పాల్గొన్నారు.

సిమెంట్ కర్మాగారాన్ని సందర్శిస్తున్న కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తదితరులు

కేంద్రమంత్రికి ఘన సన్మానం... తాళ్లపాలెంలో కేంద్ర సహాయమంత్రి శ్రీనివాసవర్మను భాజపా ఘనంగా సన్మానించారు. అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, నాయకులు పొన్నగంటి అప్పారావు, అప్పికొండ అప్పారావు, నడిపల్లి సన్యాసిరావు తదితరులు సత్కరించారు.

సందర్భమేదైనా ఈనాడును చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

వేడుక ఏదైనా.. ఈనాడును చేసుకోండి వేదిక
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

కైలాసగిరిపై నిర్మించిన అద్దాల వంతెన రాత్రి వేళ వెలుగు జిలుగుల్లో ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఆ చెంతనే ఉన్న రాడార్ కేంద్రం కూడా సోమవారం రాత్రి విద్యుద్దీపాల కాంతుల్లో తళుకులీనింది. దూరం నంచి చూస్తే.. కైలాసగిరి మీదుగా అద్దాల వంతెనను చందమామ చూస్తుందా? అన్నట్లు మెరిసిపోయింది. ఈ రెండింటిని సందర్శకులు ఆసక్తిగా తిలకించారు.

–ఈనాడు, విశాఖపట్నం

అర్జీదారులకు సరైన పరిష్కారం చూపండి

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు భారీగా అర్జీదారులు తరలివచ్చారు. కలెక్టర్‌తోపాటు సంయుక్త కలెక్టర్ జాహ్నవి, ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి సుబ్బలక్ష్మి వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు వ్యక్తిగతంగా క్షేత్రస్థాయిలో పర్యటించి అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలన్నారు. సమస్య పరిష్కారం అవుతుందని ఎంతో ఆశతో అర్జీదారులు వస్తున్నారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాలన్నారు. పరిష్కారం కాని వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. 1100 నంబరుకు ఫోన్ చేసి స్థితిగతులు తెలుసుకోవచ్చన్నారు. వివిధ సమస్యలపై 292 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ 141, పంచాయతీ రాజ్ 45, పోలీసు 27, సర్వే 24 అర్జీలు ఉన్నాయి. వీటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించారు.

యువతలో క్రీడలపై ఆసక్తి పెంచాలి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: యువతలో క్రీడలను ప్రోత్సహించి, మంచి క్రీడాకారులను తయారు చేయాలని కలెక్టర్ క్రీడాభివృద్ధి అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి క్రీడాభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి వారికి సరైన ప్రోత్సాహం అందించాలన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. దురలవాట్లు, మత్తు పదార్థాలకు బానిస కాకుండా క్రీడల వైపు మొగ్గు చూపే విధంగా మైదానాలు సిద్ధం చేయాలన్నారు. 24 మండల కేంద్రాల్లో 25 క్రీడా ప్రాంగణాలను 25 సెంట్ల చొప్పున భూమిని సేకరించాలని జిల్లా పరిషత్తు ముఖ్యకార్యనిర్వహణాధికారి నారాయణ మూర్తిని ఆదేశించారు. 10 నుంచి 15 సెంట్ల విస్తీర్ణంలో జిల్లాలోని 24 మండలాల పరిధిలో 31 క్రీడా ప్రాంగణాలను నిర్మించడానికి ప్రతిపాదించిన స్థలాన్ని మండల ప్రత్యేక అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పరిశీలించి సాధ్యాసాధ్యాలపై నివేదిక ఇవ్వాలన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారిణి శైలజ, జిల్లా గ్రామ/వార్డు సచివాలయ అధికారి మంజులవాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పూర్ణిమాదేవి పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాల సందర్శనకు ప్రత్యేక ప్యాకేజీలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: కార్తికమాసం నేపథ్యంలో ఏపీ పర్యాటకశాఖ పుణ్యక్షేత్రాల సందర్శనకు ప్రత్యేక ప్యాకేజీలు అందుబాటులోకి తెచ్చిందని ఆశాఖ డివిజనల్ మేనేజర్ జగదీష్ తెలిపారు. పంచారామాలు, వాడపల్లి వేంకటేశ్వర స్వామి, అన్నవరం దేవాలయాల సందర్శన ఉంటుందన్నారు. పంచారామాల ప్యాకేజ్ కింద బస్సు రాత్రి 7.30 గంటలకు బయలుదేరి, రెండో రోజు రాత్రి 8.30 గంటలకు తిరిగి విశాఖ చేరుకుంటుందన్నారు. పెద్దలకు రూ.3,250, పిల్లలకు రూ.2,640 టికెట్ ధరలుగా నిర్ణయించామన్నారు. వాడపల్లి వేంకటేశ్వరస్వామి, అన్నవరం దేవాలయాల ప్యాకేజీ కింద ఉదయం 5 గంటలకు బస్సు బయలుదేరి అదే రోజు రాత్రి 7.30 గంటలకు విశాఖ చేరుకుంటుందన్నారు. పెద్దలకు రూ.1,870, పిల్లలకు రూ.1,540 టికెట్ ధరలుగా నిర్ణయించామన్నారు. వివరాలకు 98480 07022, 98488 13584, 98480 23948 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

ప్రైవేటు వాహనాలకూ విద్యుత్తు ఛార్జింగ్

విశాఖపట్నం, న్యూస్‌టుడే: పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులో నడిచే విద్యుత్తు డబుల్‌డెక్కర్ బస్సుల ఛార్జింగ్ కేంద్రంలో ప్రైవేట్ ఎలక్ట్రిక్ కార్లు, బస్సులకు ఛార్జింగ్ పెట్టుకోవడానికి అవకాశం కల్పిస్తున్నారు. ఈ మేరకు ఆయా వాహనాల నిర్వాహకులు నిర్దేశిత రుసుం డిజిటల్ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి సాగర్‌నగర్ ప్రాంత ఈపీడీసీఎల్ కార్యాలయం సమీప ఛార్జింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా జీవీఎంసీ, టూరిజం ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారని స్థానిక కేంద్రం పర్యవేక్షణ సిబ్బంది పేర్కొన్నారు.

డ్రగ్స్ తరలిస్తున్న నిందితుల అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ మేరీ ప్రశాంతి

విశాఖపట్నం, న్యూస్‌టుడే: నగరంలో సంచలనం రేకెత్తించిన డ్రగ్స్ తరలింపులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, ఇందులో ఓ వైజాగ్ నేత కూడా ఉన్నట్లు డీసీపీ మేరీ ప్రశాంతి పేర్కొన్నారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె వెల్లడించిన వివరాలివీ.. మద్దిలపాలేనికి చెందిన పులగం కొండారెడ్డి (23) ఎంబీఏ రెండో ఏడాది చదువుతూ వైజాగ్ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. ఇతడికి బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న కృష్ణా జిల్లా గుడివాడ సమీప బేతవోలుకు చెందిన మురాద గీత్ చరణ్ (21), శ్రీకాకుళం పట్టణానికి చెందిన తంగి హర్షవర్ధన్ నాయుడు (22) స్నేహితులు. ఈ ముగ్గురూ మద్యం, గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడి తరచూ వాటి కోసం కలుసుకుంటున్నారు. ఇందులో భాగంగా బెంగళూరులో ఉన్న సంతన్ అనే వ్యక్తి నుంచి ఎల్ఎస్‌డీ స్ట్రిప్స్ తెప్పించాలని కొండారెడ్డి భావించాడు. ఇందుకోసం గీత్ చరణ్‌కు ఈ పని అప్పగించి రూ.25వేల నగదు, విమానం, రైలు టికెట్లు సమకూర్చాడు. ఆ మేరకు చరణ్ గత నెల 31వ తేదీన విమానంలో బెంగళూరు చేరుకున్నాడు. అదే సమయంలో కొండారెడ్డి తన స్నేహితుడైన దొంక గణేష్ ద్వారా సంతన్‌కు రూ.25వేలు ఫోన్‌పే చేయించాడు. వీరి నుంచి అందుకున్న డబ్బుతో సంతన్ 50 స్ట్రిప్స్ కొనుగోలు చేసి వాటిలో 48 గీత్‌చరణ్‌కు అందించి, రెండు తన వద్ద ఉంచుకున్నాడు. తర్వాత చరణ్ ఆ స్ట్రిప్స్‌తో బెంగళూరు నుంచి రైలులో బయలుదేరి ఈనెల 2న తేదీన నగరానికి చేరుకున్నాడు. రైల్వే స్టేషన్ వద్ద వాటిని గీత్‌చరణ్ నుంచి కొండారెడ్డి, హర్షవర్ధన్ తీసుకుంటున్న సమయంలో టాస్క్‌ఫోర్స్, నాలుగోపట్టణ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి 48 స్ట్రిప్స్, మూడు చరవాణులు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన సంతన్‌ను త్వరలో పట్టుకుంటామని ఆమె పేర్కొన్నారు.

బుట్ట 'బంతి' రూ.150
సీతమ్మ కాటుక రకానికి డిమాండు

బుట్టల్లో పూలు తెచ్చిన గిరిజనులు

పాడేరు, న్యూస్‌టుడే: పండగ సమయాల్లో ఇంటి గుమ్మానికి బంతిపూల తోరణాలు కడతారు. గృహ ప్రవేశమైతే బంతి పూలు ఉండాల్సిందే. అయ్యప్ప దీక్షా స్వాములు పూజా కార్యక్రమాలకు ఎక్కువగా వీటినే వాడుతుండటంతో కార్తిక మాసంలో గిరాకీ ఎక్కువగా ఉంటోంది. పాడేరు మన్యంలో సాగు మొదలు మార్కెటింగ్ వరకు అన్ని పనులను మహిళలే చక్కపెడుతున్నారు.

★ పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల, పెదబయలు మండలాల్లో ఎక్కువగా సీతమ్మ కాటుక రకం (చిన్న బంతి) పూలు వందల ఎకరాల్లో మెట్ట కొండపోడు భూముల్లో మహిళా రైతులు సాగు చేస్తున్నారు. కార్తిక మాసం ప్రారంభానికి ముందు నుంచే దిగుబడులు ప్రారంభమయ్యాయి.

రైతేరాజు

★ ఈ పూలకు మన్యంలో కంటే మైదాన ప్రాంతాల్లోనే అధిక డిమాండు ఉంది. అక్కడి నుంచి వచ్చే వ్యాపారులు పూలు కొనుగోలు చేసి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశా, తుని, రాజమహేంద్రవరం, విజయవాడ, హైదరాబాద్ ఎగుమతి చేస్తున్నారు. ★ ఏటా సెప్టెంబర్ చివరి వారం నుంచి డిసెంబర్ నాలుగో వారం వరకు వ్యాపారం జరుగుతుంది. బుట్ట పూల ధర రూ.120 నుంచి రూ.150 వరకు ధర పలుకుతోందని దేగలవీధి గ్రామానికి చెందిన మహిళా రైతు రేగం కొండమ్మ చెబుతున్నారు.

ఆయిల్‌పామ్‌లో.. కూరగాయల సాగు

ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటలుగా కూరగాయల సాగు అదనపు ఆదాయ వనరుగా మారింది. ఖరీఫ్‌లో వర్షాధారంగా, రబీలో పంపుసెట్ల కింద ఏడాది పొడవునా బెండ, వంగ, టమాటా సాగు చేస్తున్నారు.

–న్యూస్‌టుడే, గొలుగొండ

● ఆయిల్‌పామ్ రైతుల్లో చాలామంది కూరగాయలు, ఆకుకూరలు పండించేందుకు తోటలను కౌలుకు ఇస్తున్నారు. నీటి సదుపాయం ఉండటంతో 90 రోజుల్లో దిగుబడులు వస్తున్నాయి. పంట మార్పిడి విధానంలో ఏడాదికి ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెడితే ఖర్చులు పోను రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఆదాయం ఉంటోందని లింగంపేటకు చెందిన కౌలు రైతు ఎం.స్వామినాయుడు చెబుతున్నారు. అర ఎకరా ఆయిల్‌పామ్ తోటను కౌలుకు తీసుకుని రెండేళ్లు కూరగాయలు పండిస్తున్నట్లు పేర్కొన్నారు. పంట మార్పిడి విధానం వల్ల తెగుళ్ల బెడద తగ్గిందన్నారు.

గింజర్తి దరి ఆయిల్‌పామ్‌లో బెండ తోట

నంద్యాల జిల్లా చాగలమర్రి మండల వ్యాప్తంగా రైతులు అధికంగా బొప్పాయి సాగు చేస్తుంటారు. చిన్నవంగలితోపాటు సమీపంలోని గ్రామాలైన వైఎస్సార్ కడప జిల్లా కానగూడూరు, క్రిష్ణంపల్లె గ్రామాల్లో 1200 ఎకరాల్లో పండిస్తారు.

– న్యూస్‌టుడే, చాగలమర్రి

విదేశాలకు బొప్పాయి పాలు..

విత్తనం నాటిన కాలం నుంచి తొమ్మిది నెలలకు పంట చేతికొస్తుంది. పండ్ల సేకరణ అనంతరం 13 నెలల తర్వాత మిగిలినవి, ముదురు కాయలకు గాట్లు పెట్టి పాలను సేకరిస్తున్నారు. తెల్లవారుజాము సమయంలోనే కాయలకు గాట్లు పెడితే కేవలం రెండు గంటల్లోనే పాలు ఊరుతుంది. ఇలా సేకరించిన దాన్ని రాయచోటి, రాజంపేటకు చెందిన వ్యాపారులు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల పాలు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 4 డ్రమ్ముల పాలు సేకరిస్తున్నారు. ఎకరానికి పాల సేకరణ ద్వారా రైతుకు రూ.24 వేల ఆదాయం వస్తుంది. సేకరించిన పాలను పరిశ్రమల్లో మందులు, కాస్మెటిక్స్, సబ్బుల తయారీలో ఉపయోగిస్తున్నారు. బెంగళూరు, చెన్నైతో పాటు నాణ్యతను బట్టి విదేశాలకు సైతం పాలను ఎగుమతి చేస్తున్నారు. బొప్పాయి సాగులో ఎప్పుడైనా ధర పడిపోయినప్పుడు బొప్పాయి పాల సేకరణతో నష్టాల నుంచి రైతులు బయటపడుతున్నారు.

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

? వరి కంకి దశలో ఉంది. నీట మునిగింది. నష్ట నివారణకు ఏం చేయాలి.
– గంగరాజు, జి.మాడుగుల

✔: నీరు నిలిచిన పొలాల్లో వరి పంట నీట మునిగినా కంకుల్లో మొలకలు కనబడితే ఉప్పు కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి. 50 గ్రాముల ఉప్పును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయడం వల్ల మొలకలు రాకుండా ఉండటంతోపాటు గింజ రంగుమారకుండా ఉంటుంది.

? ఇటీవల కురిసిన వర్షాలకు వరి పంట నీట మునిగింది. దిగుబడులపై ప్రభావం పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి.
– రామ్మూర్తి, తాజంగి

✔: పొలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. అవసరమైతే కాలువలు తీసి నీటిని బయటకు పంపాలి. వీలుకాకుంటే మోటారు ఏర్పాటు చేసి తోడేయాలి.

వరి కంకులపై ఉప్పు ద్రావణం పిచికారీ

? రెండు ఎకరాల్లో రాజ్మా వేశా. తుపాను ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల పంటకు ఏమైనా నష్టం కలుగుతుందా.
– రమణ, దేవరాపల్లి

✔: పంట దశలో ఉండగా తేలికపాటి వర్షాలు కురిసినా పెద్దగా నష్టం ఉండదు. గింజ కట్టే దశలో అధిక వర్షాల వల్ల కొంత ఇబ్బంది ఉంటుంది. గింజ రంగు మారడం, మాగుడు తెగులు ఆశించే ఆస్కారముంది. నివారణకు 200 మి.లీ. ప్రొపికొనజోల్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

రైతుల ప్రశ్నలు, సందేహాలకు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం ఏడీఆర్ డాక్టర్ అల్లు అప్పలస్వామి సమాధానాలు ఇచ్చారు. – న్యూస్‌టుడే, చింతపల్లి

సాగులో సందేహాలా.. ఫోన్ చేయండి

రైతుల ప్రశ్నలు, సందేహాలకు అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఉమామహేశ్వరరావు సమాధానమిస్తారు. మంగళవారం ఉ. 10 - సా. 4 గంటల వరకు 93472 94459 నంబరుకు ఫోన్‌చేయవచ్చు.

కె.కోటపాడు, న్యూస్‌టుడే: ఎ.కోడూరులోని వ్యవసాయ క్షేత్రంలో రైతు లెక్కల కోటేశ్వరరావు డ్రాగన్ ఫ్రూట్‌తోపాటు కొబ్బరి, మామిడి, అరటి, ఆకుకూరలు, కూరగాయలు సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు.

డ్రాగన్ తోటలో.. అంతర సేద్యం

★ 2022లో 3.5 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేపట్టారు. 2023 నుంచి పండ్ల దిగుబడులు వస్తున్నాయి. ఈ ఏడాది తోటలో ఖాళీ ఉన్న చోట కొబ్బరి, మామిడి, అరటి మొక్కలు నాటారు. సేంద్రియ విధానంలో ఆకుకూరలు, కాయగూరలు పండిస్తున్నారు. నీటి తడులు అందించేందుకు రెండు బోర్లు తవ్వించి తుంపర సేద్యం పరికరాలను ఏర్పాటు చేశారు.

తగ్గిన రంగు, నాసి రకం బెల్లం ధరలు

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి మార్కెట్‌లో గత వారం రోజులుగా రంగు, నాసి రకం బెల్లం ధరలు తగ్గాయి. రంగులు వంద కేజీలకు రూ.480, నాసి రకాలు రూ.190 ధరలు తగ్గాయి. మధ్య రకాలు రూ.110 ధర పెరిగింది.

రకం	రంగులు	మధ్య	నాసి
గత వారం (రూ.)	5,130	4,280	3,820
ఈ వారం (రూ.)	4,650	4,390	3,630

సింహాద్రి ఎన్టీపీసీ నుంచి బూడిద తుంపర్లు

పరవాడ, న్యూస్‌టుడే: సింహాద్రి ఎన్టీపీసీ బూడిద కాలుష్యంతో వాడచీపురుపల్లి, నాయుడుపాలెం పంచాయతీ ప్రజలు సోమవారం ఇబ్బంది పడ్డారు. ప్లాంట్ నుంచి ఫ్లైయాష్ (బూడిద) చిన్న చిన్న తుంపర్లుగా గ్రామాలపైకి వచ్చి పడిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోయారు. రాకపోకలు సాగించే సమయంలో వాహనాలపై, పాదచారుల దుస్తులపై, ఇంటి బయట ఉన్న వస్తువులపై బూడిద పడినట్లు తెలిపారు. బూడిద కారణంగా పంటలు, భూగర్భ జలాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా మెస్సర్స్ బివిఎస్ఆర్ (జెవి) సర్వే నెంబరు. **136/2**లో విస్తీర్ణం: 4.20 హెక్టార్లలో, **అందలాపల్లి** గ్రామం, **అచ్యుతాపురం** మండలము, **అనకాపల్లి** జిల్లా, **ఆంధ్రప్రదేశ్**, పర్యావరణ అనుమతులు యొక్క ఆర్డర్ నం: SEIAA/ AP/MIN/ EC/AK/09/2025/1812/ 273.11 & 273.09, తేది:28-10-2025 మొర్రం/గ్రావెల్ మరియు ఆర్డినరీ ఎర్త్ తవ్వకం కోసం SEIAA, ఆంధ్రప్రదేశ్ నుండి పర్యావరణ అనుమతులు పొందియున్నారు. ఆ ప్రతులు పరివేష్ పోర్టల్, పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (MoEF & CC), వెబ్‌సైట్ నందు లభించును.

ఇట్లు.. **మెస్సర్స్ బివిఎస్ఆర్ (జెవి)**

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక

రగ్బీపోటీల విజేతలతో చౌడువాడ గ్రామస్థులు

కె.కోటపాడు, అచ్యుతాపురం, న్యూస్‌టుడే: చౌడువాడలో ఉమ్మడి విశాఖజిల్లా స్థాయి అండర్-14 రగ్బీ పోటీలు సోమవారం జరిగాయి. ఇందులో 200 మందికిపైగా పోటీల్లో పాల్గొనగా 24 మంది బాలబాలికలు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి కె.ఎం.నాయుడు, ప్రధానోపాధ్యాయుడు రాజు తెలిపారు. వీరంతా ఈ నెల 7, 8 తేదీల్లో గన్నవరంలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారన్నారు. సర్పంచి దాడి ఎరుకునాయుడు, ఎంపీటీసీ సభ్యులు రాజేశ్, సూర్యనారాయణ, విశాఖడెయిరీ డైరెక్టరు సుందరపు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. అచ్యుతాపురానికి చెందిన ముగ్గురు అనిమిరెడ్డి అర్చన, లాలం చైత్రి, కట్టుమూరి లాస్యశ్రీలు ఎంపికైన వారిలో ఉన్నారు.

★ రామన్నపాలేనికి ధర్మిరెడ్డి నందన, శ్రీవైష్ణవి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈనెల 2న గాజువాకలో జరిగిన కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని రజత పతకాన్ని పొందారు.

రాష్ట్ర కబడ్డీ పోటీలకు..

అనకాపల్లి పట్టణం, కొత్తూరు (అనకాపల్లి): అనకాపల్లి జీవీఎంసీ గాంధీనగరం ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు ఎన్ హర్షవర్ధన్, టి.లోవరాజు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 7నుంచి 9 వరకు కర్నూలులో జరిగే పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారు. ఈ విద్యార్థులను ప్రధానోపాధ్యాయిని సంధ్యారాణి, ఎన్‌సీసీ అధికారి నేతాజీ, ఉపాధ్యాయులు అభినందించారు. కూండ్రం ఉన్నత పాఠశాల విద్యార్థులు వి.వర్షిత (8వ తరగతి), ఎస్.చాందిని (10వ తరగతి), ఎం.దివ్య ప్రహర్షిని (10వ తరగతి) సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొనే జిల్లాజట్టుకు ఎంపికయ్యారు. సోమవారం పాఠశాల ఆవరణలో జరిగిన సమావేశంలో వీరిని పలువురు అభినందించారు.

కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో వ్యాయామ ఉపాధ్యాయుడు నూకరాజు

కశింకోట, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వెదురుపర్తి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కె.కుందన, ఎన్.పూజి ఎంపికయ్యారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో తుమ్మపాలలో జరిగిన ఈ పోటీలు జరిగాయి. ఈ విద్యార్థులు ఈ నెల 7, 8, 9 తేదీల్లో కర్నూలు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతారని వ్యాయామ ఉపాధ్యాయుడు ఎ.నూకరాజు తెలిపారు.

6న స్థాయీ కమిటీ సమావేశాలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్తు స్థాయీ కమిటీ సమావేశాలు ఈనెల 6న జడ్పీ సమావేశ మందిరంలో జరగనున్నాయి. ఉదయం 10 గంటల నుంచి ఆరంభమవుతాయని సీఈఓ నారాయణమూర్తి చెప్పారు.

వడ్డాది వంతెనపై స్తంభించిన ట్రాఫిక్

నిలిచిపోయిన వాహనాలు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: వడ్డాది వంతెనపై సోమవారం సాయంత్రం భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. వాహనచోదకులు చాలాసేపు ట్రాఫిక్‌లో ఇరుక్కొని ఇబ్బందులు పడ్డారు. బీఎన్ రోడ్డులో విజయరామరాజుపేట దగ్గర కాజ్‌వే కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోవడంతో వాహనాలన్నీ గౌరీపట్నం మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. చోడవరం, నర్సీపట్నం వైపు వెళ్లే వాహనాలన్నీ ప్రస్తుతం ఒకే మార్గంలో తిరుగుతున్నాయి. మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు వడ్డాది దగ్గర పెద్దేరుపై కాజ్‌వే కూడా స్వల్పంగా దెబ్బతిన్నది. దీంతో వాహనాలన్నీ పాతవంతెనపైకి రావడంతో వాహనాల రద్దీ నెలకొంది. దీనికి తోడు శిథిలావస్థలో ఉన్న ఈ వంతెనపైకి భారీ వాహనాలు ప్రవేశించకుండా భారీ బండరాళ్లను అడ్డంగా పెట్టారు. దాదాపు గంటసేపు పైగానే సోమవారం సాయంత్రం ట్రాఫిక్ నిలిచిపోయింది. తర్వాత పోలీసులు వచ్చి క్లియర్ చేశారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

BUSINESS OFFER

వైజాగ్ డైమండ్ పార్క్ దగ్గర నెలకు 5-6 లక్షల బిజినెస్ గల రన్నింగ్ రెస్టారెంట్ సామాన్లు అన్నిటితో కలిపి 15లక్షలు మాత్రమే. మంచి అవకాశం. 9849724947, 7799338085.

PERSONAL CLASSIFIEDS

LOST

DOCUMENTS MISSING

I, MOHAMMAD RUSTAM MOHIDDIN ANWAR, residing at # 31-33-46/1/6, C2 Neelu Heights, Leela-mahal Road, Visakha-patnam-530020, lost / misplaced my original Sale Deed Documents No.236/2010 dated 11-01-2010, while I was travelling by bike from Madhurawada to Allipuram.
If anybody found, may please handover the said documents to the undersigned.
Ph: 99129 51870

REAL ESTATE

FLAT FOR SALE

SEETHAMMADHARA

Rs.6999/Sft Luxury 3BHK 2450 Sft New Flat. North East Facing. 100% Vastu, Lift, Generator, 2 Parkings. Ph: 7893126804

HOUSE FOR SALE

SUJATHANAGAR

వేపగుంట BRTS రోడ్డుకి అతి చేరువలో తక్కువ ధరకే Indp. హౌస్ & గ్రూప్ హౌస్‌లు 2BHK, 3BHK ఇళ్లు అమ్మకమునకు కలదు. ✆ 8374373299.

PLOT FOR SALE

BHOGAPURAM

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గర్లో స్విమ్మింగ్‌పూల్, క్లబ్‌హౌస్, బ్యాంక్‌లోన్ సదుపాయంతో VUDA అప్రూవల్ ప్లాట్లు అమ్మకం. ✆ 8686997700.

TO LET

JAGADAMBA

4500sft for rent/lease for just 75k p.m, at jagadamba. Call: 8374816236

JOBS

Wanted Sales Executives Freshers for 2 Whlr Showroom, Tally Computer Operator (Female) Mechanics @ Dondaparthy. ✆ 6301919238, 7702107279.

Wanted Wash Care Laundry & Dry Cleaning Pickup, Delivery, Marketing Boys, Muralinagar. ✆ 9494563814.

WANTED
TELE CALLERS - (F): 10 Nos
Work from Home Opportunity
Qlf : Inter / Any Degree.
Salary : 15k to 30k. PM
Job Location: Vizag.
Kalyani, Nr. NAD Kotha Road.
Contact HR between 10am to 7pm
83096 55089 / 77803 59852

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యూయర్స్. ఏజ్: 22-35. ఫ్రెషర్స్ కూడా కావలెను. ✆ 6281037879.

BPO **కాల్** సెంటర్స్‌లో పనిచేయుటకు టెలికాలర్స్, కస్టమర్ సర్వీస్, డేటా ఎంట్రీ, టెక్నికల్ సపోర్ట్ Q.A., టీమ్ లీడర్స్, Qlf: 10th- డిగ్రీ, MBA, జీతం: 18K-30K. ✆ 9121044796, 9573635594.

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ ప్రారంభించబోవు M.V.P కాలనీ ఆఫీసు కొరకు టీం లీడర్లు మరియు మేనేజర్లు కావలెను. ✆ 9701598389.

రైల్వేన్యూకాలనీలో టూవీలర్ సర్వీస్ సెంటర్ నందు పనిచేయుటకు 3 నుండి 5 సం॥ అనుభవం గల టూ వీలర్ మెకానిక్స్ కావలెను. సెల్ ✆ 9393107888.

ప్రముఖ బ్యూటీ సెలూన్ నందు పనిచేయుటకు 30 సం॥లోపు గల ఫిమేల్ అసిస్టెంట్స్ కావలెను. జీతం: 18K. వసతి సౌకర్యం కలదు. Ph: 9347168811.

MARKETING/ SALES

Hyd. based Tissue Mfg. Company needs Sales Marketing Teams 9 Nos. includes PDM/ SE/SO. ✆ 7997990685, abhilash@peaceforever.in

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కొక్కిరాపల్లి ఘటనలో క్షతగాత్రులకు వైద్యసేవలు

క్షతగాత్రుడితో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ఎలమంచిలి కొక్కిరాపల్లి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులకు ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స అందించారు. కొక్కిరాపల్లి కూడలిలో జాతీయ రహదారిపై సోమవారం టాటా మ్యాజిక్ వాహనం ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మృతి చెందగా, 12 మందికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో కూనిశెట్టి కనక (మాకవరపాలెం), విశాఖ నగరంలోని మల్కాపురానికి చెందిన బండి జాస్మిన్, బండి విజయకుమారి, బండి కరుణ, ఎర్రవరానికి చెందిన సీహెచ్ జస్వంత్, సీహెచ్.రమణమ్మ, విశాఖ నగరానికి చెందిన పక్కుర్తి అప్పలరాజు, ఎన్.విజయ, ఎస్.రాజకుమారిలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఆళ్ల రామచంద్రరావు పరామర్శించి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించేలా చర్యలు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు మృతి

కశింకోట, అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు సోమవారం మృతిచెందాడు. ఏఎస్సై రమణమ్మ కథనం ప్రకారం.. కశింకోటకు చెందిన శిలపరశెట్టి రాజ్‌కుమార్ (43) కొత్తపల్లిలోని కర్మాగారంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. గతనెల 28న కర్మాగారంలో విధులు నిర్వహించుకొని ద్విచక్రవాహనంపై వస్తుండగా మార్గ మధ్యలో పంది అడ్డంగా రావడంతో తప్పించబోయి బోల్తాపడి తీవ్రంగా గాయపడ్డాడు. అనకాపల్లి ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య మంగ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై చెప్పారు.

ఒకరికి గాయాలు : రామాపురం కాలనీ వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. జగన్నాథం ప్రకాష్ రోడ్డుపై నడిచివెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఇతనిని కేజీహెచ్‌లో తరలించి చికిత్స అందిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఎస్సై శేఖరం తెలిపారు.

గంజాయితో నలుగురి అరెస్టు

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ఎనిమిది కేజీల గంజాయితో నలుగురు వ్యక్తులు సోమవారం సాయంత్రం నాతవరం పోలీసులకు పట్టుబడ్డారు. ఎస్సై తారకేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. చమ్మచింత వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా అటుగా వచ్చిన నలుగురు అనుమానాస్పదంగా కనిపించారు. తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి లభ్యమైంది. అల్లూరి జిల్లాలోని ధారకొండ ప్రాంతంలో కొనుగోలు చేసి అడ్డదారిలో కాకినాడ జిల్లా తుని రైల్వేస్టేషన్‌కు తరలించే క్రమంలో పోలీసులకు చిక్కారు. నిందితులు తమిళనాడుకు చెందిన డి.దీపక్‌బాబు, ఆర్.గౌతమ్, ఎ.హరీష్, కాకినాడ జిల్లా తునికి చెందిన తుమ్మ అప్పారావుగా గుర్తించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	111	105
లైవ్	138	125
డ్రెస్డ్	200	220
స్కిన్‌లెస్	228	230

(c) eenadu

అనకాపల్లి
• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: **మాస్ జాతర,** సత్యనారాయణ స్క్రీన్2: **డ్యూడ్,** పర్తిసాయి: **కె-ర్యాంప్** షిర్డిసాయి: **బైసన్,** రామచంద్ర: **కర్మణ్యే వాధికారస్తే,** సత్యనారాయణ స్క్రీన్1: **బాహుబలి,** వెంకటేశ్వర: **కాంతార చాప్టర్1,**
అచ్యుతాపురం: ఎస్‌టీబీఎల్ సినీవరల్డ్ స్క్రీన్-1 **బాహుబలి** స్క్రీన్-2: **మాస్ జాతర**

పాఠశాలకు వితరణ

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: కొక్కిరాపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన అవధానుల వేణు లాన్స్ ఫౌండేషన్ ద్వారా రూ. 15 వేల విలువ గల బీరువా, సౌండ్ సిస్టం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో దాతల సహకారంతో మౌలిక సదుపాయాల సమకూరుతున్నాయని హెచ్‌ఎం విశ్వేశ్వరరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ, ఉపాధ్యాయులు బాబూరావు, పాపాజీరావు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఎస్.రాయవరం సమీపంలో దుస్తుల కంపెనీ బస్సు అదుపుతప్పి కల్వర్టు మీదుగా నీటిలోకి దూసుకెళ్లింది. ఎస్.రాయవరం నుంచి సోమవారం ఉదయం ధర్మవరం-అగ్రహారం వైపు వస్తున్న బస్సు.. డ్రైవర్ నిద్రమత్తు కారణంగా అదుపుతప్పింది. బస్సు సగభాగం రోడ్డుపై, మిగతా భాగం కాలువలో ఉండిపోయింది. డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఆ సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. పోలీసులు క్రేన్ల సాయంతో బస్సును బయటకు తీయించారు.

కాలువలోకి దూసుకెళ్లిన బస్సు

అ వీ ఇ వీ

రూ. 1.5 కోట్లతో రఘురాం కాలనీ అభివృద్ధి

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లిలోని రఘురాం కాలనీలో రూ.1.50 కోట్లతో నిర్మించే రహదారులు, కాలువ పనులకు కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి సోమవారం భూమి పూజ చేశారు. తెదేపా వార్డు ఇన్‌ఛార్జి మాదంశెట్టి నీలిబాబు, వార్డు అధ్యక్షులు తలారి ప్రసాదు, ప్రధాన కార్యదర్శి సాలాపు మోహన్, నాయకులు కోట్ని రామకృష్ణ, రాంబాబు పాల్గొన్నారు.

తమలపాకు రైతులను ఆదుకోవాలి

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: తుపాను తాకిడికి నష్టపోయిన తమలపాకు రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని వైకాపా జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ కోరారు. సత్యవరం గ్రామంలో ఆయన పర్యటించి తమలపాకు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు 300 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు రైతులు తెలిపారని, ప్రతి రైతుకు న్యాయం జరిగేలా పరిహారం అందించాలన్నారు. నాయకులు కంబాల జోగులు, బొడ్డేడ ప్రసాద్, చిక్కాల రామారావు, గెడ్డమూరి శ్రీనివాసరావు, దనిశెట్టి బాబూరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తోందని నాటక అకాడమీ డైరెక్టర్ పల్లా విలియంకేరీ చెప్పారు. ఇందిరా కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సోమవారం బ్యాగులు, పుస్తకాలు, పెన్సిళ్లు, పలకలు పంపిణీ చేశారు. న్యాయవాది నెలపర్తి నాగేశ్వరరావు, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, లైన్‌మెన్ సత్యనారాయణ, దుర్గాప్రసాద్, చంటి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో బాలలతో విలియం కేరీ

ఇసుక తవ్వకాలపై విచారణ

కోటవురట్ల, న్యూస్‌టుడే: గొట్టివాడ వరాహనదిలో ఇసుక అక్రమ తవ్వకాలపై అందిన ఫిర్యాదు మేరకు జిల్లా మైనింగ్ అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. నదిలో జరిగిన తవ్వకాలను, నిల్వ చేసిన ప్రదేశాలను పరిశీలించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదికను అందిస్తామని చెప్పారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఏపీటీఎఫ్ నాయకుడు బి.వెంకటపతిరాజు అన్నారు. సంఘ ప్రతినిధులతో కలిసి సోమవారం మామిడిపాలెం, సీతానగరం, రామాపురం, కూండ్రం తదితర జడ్పీ పాఠశాలల ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడారు. పీఎఫ్ సమస్యలు లేకుండా ఉమ్మడి జిల్లా పరిషత్ కార్యాలయంలో మార్పులు తీసుకువచ్చామన్నారు. మండల శాఖ అధ్యక్షుడు కొణతాల గణేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో మహిళా కార్యదర్శి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి భద్రత

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

- అనకాపల్లికి చెందిన డ్వాక్రా మహిళకు దగ్గు వచ్చేది. మందుల దుకాణంలో మందులు వాడుతూ కాలయాపన చేసింది. ఎంతకీ తగ్గకపోవడంతో పరీక్ష చేయగా టీబీ అని తేలింది.
- 82వ వార్డుకు చెందిన మహిళకు ఛాతి నొప్పి వస్తుండడంతో పెయిన్ కిల్లర్లు వేసుకుంటూ కాలయాపన చేసింది. పరీక్ష చేయగా రొమ్ము క్యాన్సర్‌గా తేలింది.

డ్వాక్రా సంఘాల మహిళలు

ఎంతో మంది మహిళలు తమ ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదు. నెలసరి సమస్యలను నిర్లక్ష్యం చేయడంతో రక్తహీనతకు గురవుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మహిళా ఆరోగ్యం కోసం కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సఖీ సురక్ష పేరుతో అనకాపల్లిలో ఇటీవల నిర్వహించిన వైద్యశిబిరంలో డ్వాక్రా మహిళలకు వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన 713 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు.

2016లో డ్వాక్రా మహిళల ఆరోగ్యాన్ని పర్యవేక్షించేలా హెల్త్ రిసోర్స్ పర్సన్లను అప్పటి తెదేపా ప్రభుత్వం నియమించింది. వైకాపా అధికారంలోకి వచ్చాక వీరిని తొలగించారు. డ్వాక్రా సంఘాల మహిళలు ప్రతినెలా సమావేశం ఏర్పాటు చేసుకుని సభ్యుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసేవారు. అవసరమైన వారికి రక్తపరీక్షలు, చేయించి ఆసుపత్రిలో వైద్య సేవలు అందించేవారు. గత ప్రభుత్వ హయాంలో వీరిని తొలగించడంతో కూటమి ప్రభుత్వం వచ్చాక తిరిగి నియమించారు.

అనకాపల్లి పట్టణంలో 1604 సంఘాలు ఉన్నాయి. వీటిలో 17 వేలకు పైగా సభ్యులు ఉన్నారు. 15 సమూఖ్యలకు ఒక హెల్త్ రిసోర్స్ పర్సన్ చొప్పున అనకాపల్లిలోని 44 సంఘాలకు ముగ్గురిని నియమించారు. ఇటీవల జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధుల సహకారంతో రెండు చోట్ల వైద్యశిబిరాలను నిర్వహించి డ్వాక్రా మహిళల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించారు. ప్రతినెల నిర్వహించే సమావేశాల్లో మహిళా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

వైద్యసేవలు అందిస్తాం..: డ్వాక్రా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు వీరి ఆరోగ్య భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. హెల్త్ రిసోర్స్ పర్సన్లతో పరిశీలన చేస్తున్నాం. ప్రతి నెల సమావేశాల్లో ఆరోగ్య విషయాలపై వీరు చర్చిస్తారు. అవసరమైన వారికి దగ్గరుండి వైద్యసేవలు అందిస్తాం. ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బాగుంటుంది. నిర్లక్ష్యం చూపకుండా సకాలంలో మహిళలు వైద్యసేవలు పొందేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల అనకాపల్లిలో వైద్య శిబిరాలు నిర్వహించాం.
– వై. సంతోష్‌కుమార్, యుసీడీ, ఏపీడీ.

చిత్రలేఖనంలో అదుర్స్

బొమ్మలు గీస్తున్న విద్యార్థులు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: చిత్రలేఖనంలో పేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. 'ఈనాడు-ఈటీవీ' ప్రతిభాపాటవ పోటీలు పట్టణంలోని ఎస్.ఆర్.ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగాయి. చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చక్కటి చిత్రాలు గీచి ప్రశంసలు అందుకున్నారు. ఎస్.భారతి, ఎం.కార్తిక్, పి.అంజలి విజేతలుగా నిలిచి బహుమతులు గెలుచుకున్నారు. ప్రిన్సిపల్ కె.శైలజ, ఆర్.దేవన్న, యు.సింహాచలం, జి.సుజాత, సీహెచ్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు పొందిన విజేతలతో ప్రిన్సిపల్ తదితరులు

భారత రాజ్యాంగంపై అవగాహన కీలకం

మునగపాక: ప్రతి విద్యార్థి చదువుతోపాటు భారత రాజ్యాంగంపై అవగాహన అవసరమని ఎంఈఓ వేణుగోపాలరావు సూచించారు. మునగపాక మండల వనరుల కేంద్రంలో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన నందవరపు జశ్వంత్ (గణపర్తి), ఆదిరి భవ్యశ్రీ (మునగపాక), బొడ్డేడ బద్రీనాథ్(పాటిపల్లి)ను ఎంఈఓలు వేణుగోపాలరావు, శివనాయుడు అభినందించారు. వీరికి ఈనెల 26న జరిగే రాజ్యాంగ దినోత్సవంలో బహుమతులు అందజేస్తామని తెలిపారు.

గొడిచెర్లలో స్కిల్‌డే వేడుకలు

నక్కపల్లి, న్యూస్‌టుడే: గొడిచెర్ల ఉన్నత పాఠశాలలో వృత్తి విద్య బోధనలో భాగంగా విద్యార్థులకు సోమవారం స్కిల్‌డే వేడుకలు జరిపారు. తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు వివిధ సాంకేతిక, ఎలక్ట్రానిక్ అంశాలకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. దీంతో పాటు విద్యార్థులు ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రతిభ చూపిన వారిని జిల్లాస్థాయికి ఎంపిక చేస్తామని హెచ్‌ఎం సత్యకుమార్ తెలిపారు.

జానపద గీతాల పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థినులు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: జానపద గీతాల పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థినుల బృందం ప్రథమ స్థానంలో నిలిచింది. భారత్ వికాస్ పరిషత్ తిరుపతి ప్రాంత్ ఆధ్వర్యంలో ఈ నెల 2న ఈ పోటీలు తిరుపతిలో జరిగాయి. కె.పౌలిన్ కెల్లీ, ఎం.దేవి దీప్షిక, ఎస్.శ్రీలాస్య, ఎం.లక్ష్మిని కిత, లాస్యత్రివేణి, ఎస్.సత్యశ్రీఅశ్విత, యు.లాస్యప్రియ బృందం ప్రతిభ చూపారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన బృందాలు ఈ పోటీల్లో పోటీ పడ్డాయి. తెలుగు జానపద గీతాల్లో ప్రాంత్ స్థానాల్లో ప్రథమస్థానం, హిందీ, సంస్కృతం పాటల పోటీల్లో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను విద్యాసంస్థల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపల్ మూర్తి, అకడమిక్ ఇన్‌ఛార్జి ప్రసూనమౌళి అభినందించారు.

తుపాను బాధితులకు నిత్యావసర సరకులు

పాయకరావుపేట/ గ్రామీణం, న్యూస్‌టుడే: నక్కపల్లి, న్యూస్‌టుడే: పేటలో చేనేత కార్మికులకు కూటమి నాయకులు నిత్యావసర సరకులు సోమవారం అందజేశారు. తహసీల్దారు మహేశ్వరరావు, తెదేపా మండల శాఖ అధ్యక్షుడు చించలపు ప్రదీప్, యాళ్ల వరహాలబాబు, పెదిరెడ్డి చిట్టిబాబు, తోట నగేష్, పల్లా విలియంకేరీ తదితరులు పాల్గొన్నారు. రత్నాయంపేటలో మత్స్యకారులకు 50 కేజీల బియ్యం, కందిపప్పు, పంచదార, నూనె అందజేశారు. నాయకులు మహేశ్‌రెడ్డి, రమణ, గోవింద్‌రెడ్డి, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు. నక్కపల్లిలోని పలువురు చేనేత కార్మికులకు తహసీల్దారు ఆర్.నరసింహమూర్తి, నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్, గింజాల లక్ష్మణరావు, వీసం రాజు, నానేపల్లి రాఘవ సరకులు అందించారు.

సరకులు అందజేస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారమే ధ్యేయం: అనిత

ప్రజాదర్బార్‌లో మంత్రి అనిత, అధికారులు

నక్కపల్లి, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాదర్బార్ చేపట్టినట్లు హోం మంత్రి అనిత పేర్కొన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో నియోజకవర్గస్థాయి ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు స్వయంగా ఫిర్యాదులు స్వీకరించేందుకు వచ్చినట్లు చెప్పారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పెదతీనార్లలో సుమారు 20 ఎకరాల భూమి ఆక్రమణలో ఉందని ఎంపీటీసీ సభ్యుడు మేరుగు నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. బుచ్చిరాజుపేటలో భూఆక్రమణలపై గొర్ల బాబూరావు, కాగితలో చెరువు కబ్జాపై అడపా గణేష్ ఫిర్యాదు చేశారు. ఏపీఐఐసీ తీసుకున్న భూములకు సంబంధించి పరిహారాలు రాలేదని, డీఎల్‌పురంలో సీసీ రోడ్డు నిర్మించాలని, పదోన్నతులు కల్పించాలని పోలీసు కానిస్టేబుళ్లు వినతులు ఇచ్చారు. ఇటీవల రాజయ్యపేట కార్యదర్శి సత్యంపై దాడికి యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఉద్యోగులంతా వినతిపత్రం అందజేశారు. తీరగ్రామాల్లో మత్స్యకారులతో పాటు మిగిలిన వర్గాలకు తుపాను సాయం అందించాలని పలువురు విన్నవించారు. ప్రభుత్వం మాట్లాడి పరిష్కరిస్తున్నారు. భూసరిహార సమస్యలకు సంబంధించి ఓ రోజు ప్రత్యేకంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. అంతకుముందు నియోజకవర్గస్థాయిలో విజన్ 2047 కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రత్యేకాధికారులు శచీదేవి, విజయ, ఎంపీడీఓ సీతారామరాజు, తహసీల్దారు ఆర్.నరసింహమూర్తి, నాయకులు వెంకటేష్, లక్ష్మణరావు, మార్కెట్టు యార్డు ఛైర్మన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

నక్కపల్లి, న్యూస్‌టుడే: పాయకరావుపేట మండలం గోపాలపట్నానికి చెందిన గీత కార్మికుడు యండ్రు సూరిబాబు కుటుంబానికి మంత్రి అనిత నక్కపల్లిలోని తన క్యాంపు ఆఫీసులో సోమవారం రూ. 40 వేల చెక్కును అందించారు. నూకరాజు ఇటీవల మరణించడంతో జిల్లా సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుత్తర్తి పాండురంగ ఈ చెక్కును మంత్రి చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు ఇప్పించారు. అనకాపల్లిలో జరుగుతున్న బుక్ ఫెస్టివల్ కార్యక్రమానికి మంత్రిని సొసైటీ అధ్యక్షుడు కె.లక్ష్మయ్య తదితరులు కలిసి ఆహ్వానించారు.

కుమారపురంలో పారిశుద్ధ్య లోపం

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కుమారపురంలో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉంది. తుపాన్ మొదలు గ్రామంలో చెత్త, వ్యర్థాల తొలగింపు పనులు చేపట్టలేదని గ్రామస్థులు చెబుతున్నారు. కాలువల్లో పూడిక పేరుకుపోయి మురుగు ముందుకు కదలక దోమల వ్యాప్తి అధికమైందని వాపోతున్నారు. అధికారులు స్పందించి పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గ్రామంలో తొలగించని చెత్త

క్రికెట్ అభిమానుల సంబరాలు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: భారత మహిళల క్రికెట్ జట్టు ప్రపంచకప్ గెలిచిన నేపథ్యంలో పేటలో అభిమానులు సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు. త్రివర్ణ పతాకానికి గౌరవ వందనం చేశారు. సీనియర్ క్రికెటర్లు నాగు, చలపతి, బాబీ, చిన్నా, కల్యాణ్, నూకరాజు, బుజ్జి, మణికంఠ, నూకేష్ పాల్గొన్నారు.

నక్కపల్లి, న్యూస్‌టుడే: మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భారత్ విశ్వవిజేతగా నిలవడంతో నక్కపల్లిలో హాకీ క్రీడాకారులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక మైదానంలో క్లబ్ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు ఆధ్వర్యంలో క్రీడాకారులంతా జాతీయ పతాకాలు, హాకీ బ్యాట్లు చేతబట్టి జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు. కార్యదర్శి తాతాజీ, కోచ్ రాంబాబు, రంజిత్, సాయి పాల్గొన్నారు.

జాతీయ పతాకాలతో నక్కపల్లి క్రీడాకారులు

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

లక్ష్మీదేవి పేట(అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి తహసీల్దార్‌గా **గారా ఆనందరావు** సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అల్లూరి జిల్లా చింతపల్లి తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇన్‌ఛార్జి తహసీల్దార్ శాంతిభూషణ్ బాధ్యతలను అప్పగించారు. ఆర్ఐ శివకుమార్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ మండల పరిషత్ సమావేశ మందిరంలో పట్టణ, గ్రామీణ వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

సేవలకు సత్కారం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: మొంథా ఫైటర్ పురస్కారం అందుకున్న పేట తహసీల్దారు మహేశ్వరరావును కూటమి నాయకులు సత్కరించారు. తుపాను సమయంలో మెరుగైన పనితీరు చూపినందుకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. నాయకులు చించలపు ప్రదీప్, తోట నగేష్, పెదిరెడ్డి చిట్టిబాబు, యాళ్ల వరహాలబాబు, నారాయణరావు పాల్గొన్నారు.

సత్కరిస్తున్న నాయకులు

హరహర మహాదేవ

అనకాపల్లి సాంబశివ ఆలయంలో లలితా పారాయణం

అనకాపల్లి గ్రామీణం, కొత్తూరు, నెహ్రూచౌక్, న్యూస్‌టుడే: కార్తికమాసం రెండో సోమవారం సందర్భంగా వాడవాడలా శివాలయాలు భక్తులతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. అనకాపల్లి శ్రీ చౌడేశ్వరి సాంబశివ ఆలయంలో ధర్మ ప్రచార వేదిక ఆధ్వర్యంలో 170 మంది మహిళలతో సామూహిక లలితా సహస్ర నామ పారాయణం, నిర్వహించారు. సిద్ధి లింగేశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకాలు నిర్వహించారు. భోగలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పంచదార్లలో..

అచ్యుతాపురం, రాంబిల్లి, న్యూస్‌టుడే: కొండకర్ల, యర్రవరం, ఎం.జగన్నాథపురం, పెదపాడు, పూడిమడక, దోసూరు, మడుతూరు, నునపర్తి గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పంచదార్ల పుణ్యక్షేత్రం భక్తుల శివనామస్మరణతో నిండిపోయింది.

పాయకరావుపేట/గ్రామీణం, నక్కపల్లి, ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: పేట పట్టణంలోని లింగాలతోట కాలనీ, రాజుగారిబీడు, కట్రాళ్లకొండ, గోపాలపట్నంలోని సీతమ్మవారి కొండతో పాటు పెంటకోట, సత్యవరం, నామవరం గ్రామల్లోని శివాలయాలకు భక్తుల రద్దీ పెరిగింది. సీతమ్మవారి కొండపై, నామవరంలో అన్నప్రసాద వితరణ చేశారు. ఉపమాక, గొడిచెర్ల, ఎస్.రాయవరంలోని ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేసి పూలతో అలంకరించారు. ఉపమాకలో మధ్యాహ్నం అన్నదానం జరిగింది.

భోగలింగేశ్వర ఆలయంలో దీపారాధన

సాంబమూర్తిదేవునికి ఎమ్మెల్యే విజయకుమార్ పూజలు

అనకాపల్లిలో..

మునగపాకలో..

నామవరం శివాలయం వద్ద అన్నసమారాధన

వైభవంగా శూలాల ఉత్సవం

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాకలో సాంబమూర్తిదేవుని శూలాల ఉత్సవం సోమవారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. శైవభక్తులు ఉదయం నుంచి ఉపవాసంతో సాంబశివుడిని దర్శించుకొన్నారు. రాత్రి పది గంటలకు శరీరం అంతటా ఇనుప చువ్వలు గుచ్చుకొని శివునికి రక్తతర్పణం చేశారు. శైవభక్తుడు మావూరిరాజు శరీరం అంతా 101 శూలాలు ధరించారు. రంగురంగుల నూలు దారాలతో 15 అడుగుల ఎత్తున ఆకర్షణీయంగా రెండంతస్తుల గుమ్మటాన్ని రూపొందించారు. గుమ్మటంలో శివపార్వతుల విగ్రహాలను నెలకొల్పి వీధుల్లో ఊరేగించారు. శూలాలు ధరించిన భక్తులు గుమ్మటం ఎదుట నృత్యప్రదర్శనలు చేశారు. ఉత్సవాన్ని తిలకించేందులకు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంది. ఉత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్పీ తుహిన్‌సిన్హా పర్యవేక్షించారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. భారీ ఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

101 శూలాలు ధరించి నృత్యం చేస్తున్న రాజు

ఆకట్టుకున్న వేషధారణలు

కశింకోట, న్యూస్‌టుడే: తాళ్లపాలెం శివారు బంగారయ్యపేటలో సాంబమూర్తివారి శూలాల మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీసాంబమూర్తి సేవాసంఘం ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. రోజంతా ఉపవాసం చేసిన భక్తులు రాత్రికి శూలాలను ధరించి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. బాణసంచా కాల్పులతో, డప్పువాయిద్యాలతో ఊరేగింపు సాగింది.

మహారాజశ్రీ అనకాపల్లి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P 81/2023 IN O.S 220/2020
పడాల శేషు .... DHR
VS
పడాల అప్పారావు ..... JDR
వేలం ప్రకటన
పై నెంబరు అమలులో DHRకు చెల్లించ వలసిన అమలు బాకీ JDR చెల్లించక [illegible] 24-11-2025 [illegible] 10:30 [illegible]
[illegible] T.S No 832, [illegible] 10870 0867, [illegible]
DHR విలువ: Rs.3,00,000/-
అమీన విలువ: Rs.50,00,000/-
మార్కెట్ విలువ: Rs.10,06,860/-
P.A సదానంద
[illegible] Cell-9440025466.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722 | పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726

పాయకరావుపేట, పాయకరావుపేటలోని ప్రధాన రహదారిపై రాత్రి పూట పశువులు ఉంటున్నాయి. రోడ్డుపై గుంపులుగా పడుకుంటున్నాయి. ఒక్కోసారి ఒకదానితో ఒకటి కొట్లాటకు దిగుతున్నాయి. వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. – రవి, స్థానికుడు
✓: పశువుల యజమానులకు నోటీసులు ఇస్తాం. రోడ్లపై ఉంచకుండా చర్యలు చేపడతాం. – కె.డేవిడ్, ఈవో

అనకాపల్లి, న్యూస్‌టుడే అనకాపల్లి గవరపాలెం పరమేశ్వరి ఆలయ ప్రాంతంలో కుక్కలు పెరిగిపోయాయి. – బొడ్డేడ శివ, అనకాపల్లి,
✓: కుక్కలకు కు.ని. ఆపరేషన్ చేయిస్తాం. – కె.చక్రవర్తి, జోనల్ కమిషనర్

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే అనకాపల్లి చవితినవీధిలో కాలువలు లేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. – వరలక్ష్మి, అనకాపల్లి,
✓: కాలువ నిర్మాణాలు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం. – గోపాలకృష్ణ, జీవీఎంసీ డీఈ

అచ్యుతాపురం, న్యూస్‌టుడే పెదపాడు-కశింకోట రోడ్డులో తుప్పలు పెరిగిపోయాయి. – సంతోష్, తిమ్మరాజుపేట,
✓: రోడ్డులో వెంటనే తుప్పలు తొలగిస్తాం. – నాయుడు, ఏఈ

పంచాయతీ కార్యాలయం ముందు మహిళ దీక్ష

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అన్యాయంగా తొలగించిన పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం నుంచి తిరిగి ఇవ్వాలని కొత్తూరు పంచాయతీ కార్యాలయం వద్ద శారదానగర్ ఒకటో వీధి చెందిన సమీహ మహమ్మద్ సోమవారం మౌన దీక్ష చేపట్టారు. ముందుగా ఆమె పంచాయతీ కార్యాలయం ప్రధాన గేటుకు తాళం వేశారు. ఆమె వద్ద పెట్రోల్ సీసా, అగ్గిపెట్టె, కత్తి ఉండటంతో సమాచారం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మహిళా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆమెను స్టేషన్‌కు తరలించారు.

పక్కాగా అభ్యర్థుల జాబితా

కశింకోట, న్యూస్‌టుడే: సంస్థాగత ఎన్నికలలో పోటీచేసే సభ్యుల జాబితా పక్కాగా ఉండేలా కృషిచేయాలని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొణతాల రాజాబాబు అన్నారు. కశింకోటలో మండల అధ్యక్షులు అప్పికొండ అప్పారావు అధ్యక్షతన సోమవారం మండల స్థాయి విస్తృత సమావేశానికి జరిగింది. జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొన్నగంటి అప్పారావు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కోవడానికి సంసిద్ధం

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం మండల అభివృద్ధి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తుపాను ప్రభావిత గ్రామాలు, లోతట్టు ప్రాంతాల వివరాలు పక్కాగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ముందుగానే అప్రమత్తం చేయాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో తాగునీటి పథకాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సఖ్యత పెంచేందుకు, సంబంధాలు మెరుగుపరచడానికి జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో కార్తిక వనభోజనాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయిలో 11న నిర్వహిస్తున్నామని చెప్పారు. జడ్పీ డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, డ్వామా పీడీ పూర్ణిమాదేవి, గ్రామ, వార్డు సచివాలయ అధికారిణి మంజులవాణి, డీపీఓ సందీప్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

నేడు సమైక్యతా ర్యాలీ

కలెక్టరేట్, న్యూస్‌టుడే: సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని అనకాపల్లిలో మంగళవారం సమైక్యతా ర్యాలీ నిర్వహిస్తున్నామని కలెక్టర్ విజయకృష్ణన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు శారదానది వంతెన నుంచి సుంకరమెట్ట కూడలి సూర్యనారాయణ స్వామి ఆలయం వరకూ ఈ ర్యాలీ సాగుతుందన్నారు. ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పాల్గొంటారన్నారు.

(c) eenadu

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

ఉత్సవ చిత్రాలు.. ప్రతిభకు అద్దాలు

బొమ్మలు గీస్తున్న విద్యార్థులు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ శేషు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: విద్యార్థుల చేతుల్లో రూపుదిద్దుకున్న పండగ చిత్రాలు సంప్రదాయ వేడుకల సంబరాలకు అద్దం పట్టాయి. భాష్యం ఉన్నత పాఠశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటైన ప్రతిభా పాటవ పోటీల్లో ఏడు నుంచి పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. 'మీకు ఇష్టమైన పండగ' అంశంపై పోటీలు నిర్వహించారు. తెలుగు పండగలతో పాటు కేరళలోని ఓనం ఉత్సవాన్ని ప్రతిబింబించేలా చక్కని చిత్తరువులతో విద్యార్థుల ప్రతిభ చాటారు. న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు తోట ప్రసాద్, బి.మన్మథరావు వ్యవహరించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచిన ఎం.వైభవి, ఎ.లిఖిలాశ్రీ, కె.జాహ్నవిలకు స్కూల్ ప్రిన్సిపల్ ఉప్పల శేషు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయుడు మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి ఉట్టిపడేలా..

విజేతలతో ప్రధానోపాధ్యాయుడు ఏసుదాసు తదితరులు

పోటీల్లో విద్యార్థులు

చోడవరం, న్యూస్‌టుడే: పండుగల విశిష్టతను అద్దం పట్టేలా విద్యార్థులు చిత్రాలు గీసి సత్తా చాటారు. లక్ష్మీపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'మీకు ఇష్టమైన పండుగ' పేరిట నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో అందరూ సంక్రాంతి పండగ శోభను ఇనుమడింప జేసేలా చక్కటి ప్రతిభను కనబరిచారు. తెల్లకాగితంపై సంక్రాంతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ అంతా ఒకరితో ఒకరు పోటీ పడ్డారు. ఈ పోటీల్లో ఎం.కావ్య, పి.ద్రక్ష, జె.పూజిత విజేతలుగా నిలిచారు. ప్రధానోపాధ్యాయుడు వారికి బహుమతులు అందించారు. పోటీలకు చిత్రలేఖనం ఉపాధ్యాయురాలు బండారు దేవి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. తెలుగు ఉపాధ్యాయుడు సూర్యనారాయణ సహకరించారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల శ్రమదానం

కె.కోటపాడు, న్యూస్‌టుడే: పలుగు, పారలు పట్టుకుని సోమవారం కింతాడ జోగన్నపాలెం గ్రామాలలో స్వచ్ఛందంగా అయ్యన్న డిగ్రీ, జూనియర్ కళాశాలల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కింతాడ, జోగన్నపాలెం గ్రామాల్లో శ్రమదానం చేశారు. రోడ్లకు ఇరువైపులా పెరిగిన తుప్పలు తొలగించారు. ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించి రోగులకు మందులు అందచేశారు. ఈ కార్యక్రమాలలో అయ్యన్న విద్యాసంస్థల అధినేత ఖాసీం, ఉప సర్పంచి బండారు ముత్యాలనాయుడు, ఎన్ఎస్ఎస్ పోగ్రం అధికారులు గాడి అప్పారావు, సీమసిరి రమణ తదితరులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1: బాహుబలి, ఆడి2: మాస్ జాతర రతిదేవి: డ్యూడ్ బంగార్రాజు: మాస్ జాతర, రాజు: బాహుబలి చోడవరం: శ్రీసాయిలక్ష్మి: కె. ర్యాంప్, సాయిలక్ష్మి: బాహుబలి, పూర్ణ: మాస్ జాతర

నిరంతర విద్యుత్తు సరఫరాకు వేళాయె..

కె.కోటపాడు, న్యూస్‌టుడే

మండలంలోనే అత్యధిక జనాభా గల చౌడువాడ మేజర్ పంచాయతీకి నిరంతరం ఈనెల 5 నుంచి విద్యుత్తు వెలుగులు ఉండనున్నాయి. ఇదివరకు ఇక్కడ విపరీతంగా ఉన్న విద్యుత్తు సమస్యలు, వినియోగదారుల ఇబ్బందులు, ఇతర సమస్యలను ప్రస్తావిస్తూ 2019వ ఏడాది నుంచి 'ఈనాడు' పత్రికలో అనేకసార్లు వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. అప్పటి ప్రభుత్వం ఇక్కడ విద్యుత్తు ఉపకేంద్రం ఏర్పాటుకు రూ.2.50 కోట్లు మంజూరు చేసింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా సర్కారు పూర్తిగా విస్మరించింది. ఉపకేంద్రం ఏర్పాటుకు స్థలం అనువుగా లేకపోవడంతో అధికారులు దీన్ని ఎలమంచిలికి తరలించారు.

★ 2024మే 6న మరోసారి 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి స్పందించిన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చొరవ చూపడంతో ఏపీఈపీడీసీఎల్ ఉన్నతాధికారులు స్పందించి రూ.3.70 కోట్లతో చౌడువాడలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదించగా నిధులు విడుదలై పనులు పూర్తయ్యాయి. దీన్ని రాష్ట్ర విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించనున్నారు.

చౌడువాడలో ప్రారంభం కానున్న విద్యుత్తు ఉప కేంద్రం

★ చౌడువాడ 33-11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి చౌడువాడ గ్రామానికి ప్రత్యేకంగా ఒక ఫీడర్ లైనును ఏర్పాటు చేశారు. దీని ద్వారా 24గంటలూ విద్యుత్తు సరఫరా కానుంది. గుల్లిపల్లి, చోడవరం మండలం రాయపురాజుపేట మీదుగా విద్యుత్తు సరఫరాకు లైన్లు ఏర్పాటు చేశారు. చౌడువాడ ఉపకేంద్రం పరిధిలో చౌడువాడ, గరుగుబిల్లి, మల్లంపాలెం, పైడమ్మపేట, పాచిలివానిపాలెం, గుల్లిపల్లి, చోడవరం మండలం రాయపురాజుపేట, శేమునాపల్లి, నరసాపురం గ్రామాలుంటాయి.

మాకు ఇబ్బందులు తొలగుతాయి :



విద్యుత్తు ఉపకేంద్రం ఏర్పాటు కాకపోవడం వల్ల లోఓల్టేజీ సమస్య ఎక్కువగా ఉండేది. దీంతో ఇంట్లో ఫ్యాన్లు, టీవీలు, ఫ్రిజ్‌లు తదితర వస్తువులు పాడయ్యేవి. సర్వీసులు ఎక్కువగా ఉన్నందున ఒక దగ్గర సమస్య ఉంటే గ్రామానికంతటికీ విద్యుత్తును నిలిపివేశారు. ఇకపై ఈ సమస్యలుండవని భావిస్తున్నాం. – కొమార అప్పారావు, చౌడువాడ



★ ప్రజలు సహకరించడంతో ఇక్కడ కూటమి ప్రభుత్వం ద్వారా సీఎం చంద్రబాబు సహకారంతో చౌడువాడలో విద్యుత్తు ఉపకేంద్రం ఏర్పాటు చేయగలిగాం. ఈ గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు చేసేందుకు కృషి చేస్తాను. – బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్యే, మాడుగుల

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణల తొలగింపు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూములను ఆక్రమించి నాటిన మొక్కలను సోమవారం రెవెన్యూ సిబ్బంది తొలగించారు. పోలేపల్లి సర్వే నెంబరు 156లో 216 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. వీటిని కొంతమంది కూటమి నాయకులు కబ్జా చేశారు. యంత్రాలతో భూములను చదును చేయించి యూకలిప్టస్ మొక్కలను నాటించారు. ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై పత్రికల్లో కథనాలు రావడంతో తహసీల్దారు లక్ష్మి స్పందించి ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను తొలగించడానికి చర్యలు తీసుకున్నారు. ఆక్రమిత భూముల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. తహసీల్దారు ఆదేశాలతో ఆర్ఐ శ్రీనివాసరావు, అన్ని గ్రామాల వీఆర్వోలు, వీఆర్ఏలు కలిసి ఆక్రమణదారులు నాటించిన మొక్కలన్నింటినీ తొలగించారు.

పోలేపల్లి భూముల్లో మొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

యూరియా పంపిణీ చేయాలని ఆందోళన

మాకవరపాలెం, న్యూస్‌టుడే: యూరియా నిల్వలు ఉన్నా.. ఎందుకు పంపిణీ చేయడం లేదంటూ రైతులు ఆందోళనకు దిగారు. తామరం పీఏసీఎస్ గోడౌనుకు 15 రోజుల కిందట యూరియా వచ్చినా.. ఇప్పటివరకు ఇవ్వలేదని పేర్కొన్నారు. 270 బస్తాలు ఉండటంతో పేర్ల నమోదుకు పోటీ పడ్డారు. స్వల్పంగా తోపులాట చోటుచేసుకోవడంతో పోలీసులు వచ్చి రైతులను క్యూలో నిలబెట్టారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వద్దు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: అసంపూర్తిగా ఉన్న వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయవద్దని మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. కొండల అగ్రహారంలో సోమవారం కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ సర్వేశ్వరరావు, నాయకులు యర్రాపాత్రుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరా నిలుపుదల నేడు

రావికమతం, న్యూస్‌టుడే: కొత్తకోట విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో మంగళవారం ఆర్‌డీఎస్ఎస్ పనులు, కొత్తగా బ్రేకర్ల అమర్చడం, సబ్‌స్టేషన్ మరమ్మతు పనులు చేపడుతున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ ఏఈ వి.వి.ఎస్.ఎం అప్పారావు చెప్పారు. పైన తెలిపిన పనుల నిమిత్తం కొత్తకోట సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

కళ్యాణపులోవ నీటి విడుదల

రావికమతం, న్యూస్‌టుడే: కళ్యాణపులోవ జలాశయం నుంచి సోమవారం నీటిని విడుదల చేశారు. గరిష్ఠ మట్టం 460 అడుగులు కాగా సోమవారం 458. 9 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో 200 క్యూసెక్కులు వస్తోంది. రెండు గేట్లు ఎత్తి 250 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచి పెడుతున్నట్లు ఏఈ సూర్య తెలిపారు.

చదవడం మాకు ఇష్టం

రోలుగుంట, న్యూస్‌టుడే: చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని సోమవారం స్థానికశాఖ గ్రంథాలయంలో నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకాలు చదవడం, స్టోరీ టెల్లింగ్ నిర్వహించారు. వివిధ అంశాలపై గ్రూపుగా సన్నద్ధమవుతున్న శివ స్వాతంత్ర్య ఉద్యమ నాయకుల చరిత్రపై అధికారి రాజబాబు అవగాహన కల్పించారు.

రాజ్యాంగ దినోత్సవ పోటీలు

రోలుగుంట : మండలస్థాయి రాజ్యాంగ దిన ఉత్సవాల్లో రోలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన రైటింగ్, డిబెట్, క్విజ్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ జగ్గారావు, ఉపాధ్యాయులు శేషగిరిరావు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో మద్దతు ధరల వెల్లడి

గోడపత్రికలు చూపుతున్న ఛైర్మన్ రమణ తదితరులు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: వ్యవసాయ ఉత్పత్తులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలను రైతులకు తెలుసుకోవాలని మార్కెట్ కమిటీ ఛైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ కోరారు. ధరల వివరాలను అన్ని రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ఆర్థిక శాఖ సర్క్యులర్ ద్వారా 9.12 క్వింటాళ్ల జీడిపప్పు సెస్సు చెల్లించకుండా రవాణా జరుగుతున్నట్లు గుర్తించి రూ.60,973 సెస్సుగా వసూలు చేసినట్లు పేర్కొన్నారు. రోజుకు రూ. 2500 విలువైన వ్యవసాయ ఉత్పత్తులు వాణిజ్యం చేసేవారంతా తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సు తీసుకోవాలన్నారు. యార్డులోని దుకాణాలు, గోదాముల మరమ్మతుల సహాయానికి అయ్యన్నపాత్రుడు రూ. 43 లక్షలు మంజూరు చేయించారని చెప్పారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభమవుతాయన్నారు. రైతుబజారును పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. వాణిజ్య దుకాణ సముదాయ నిర్మాణానికి రూ. 95 లక్షలు అవసరమని ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. కమిటీ కార్యదర్శి భువనేశ్వరి, వైస్ ఛైర్మన్ కన్నయ్య నాయుడు పాల్గొన్నారు.

తుప్పలు తొలగించాలి

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మాడుగుల, ఖండివరం గ్రామాలకు వెళ్లేదారిలో రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోతున్నాయి. ప్రమాదకరంగా ఉన్న మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనదారులు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. దీనికి సంబంధించిన అధికారులు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: జమిలిపాటి వీధుల్లో రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. చాలాకాలం నుంచి తీగలతో అల్లుకొని ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఈ మార్గంలోని స్థానికులు, చిన్నారులు నడుస్తుండటంతో నిత్యం వారికి ప్రమాదాన్ని గుర్తు చేస్తోంది. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఏ ప్రమాదం జరుగుతుందో అని భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్తు శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

భూసంబంధ వినతులే అధికం

నర్సీపట్నం, న్యూస్‌టుడే: సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆర్డీఓ రమణ నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 21 వినతులు వచ్చాయి. వీటిలో భూసంబంధ సమస్యలే అధికంగా ఉన్నాయని అధికారులు చెప్పారు. మున్సిపాలిటీలో కాలువలో పూడికతీత పనులు చేపట్టాలని పలువురు వినతిపత్రాలు అందజేశారు. ఏఎంఆర్ సంస్థ పేరుతో ఆకతాయిలు డబ్బులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీలోని ట్రాక్టర్లు, పొక్లెయిన్ యజమానులు, డ్రైవర్లు ఆర్డీఓకు విజ్ఞప్తి చేశారు. కార్యాలయ పాలనాధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు కేజీబీవీ బాలికలు

దేవరపల్లి న్యూస్‌టుడే: బ్యూటీ అండ్ వెల్నెస్ ట్రేడ్‌కు చెందిన విద్యార్థినులకు నైపుణ్య ప్రతిపాదికపై స్కిల్ కాంపిటీషన్ పోటీలు సోమవారం కస్తూర్బా బాలిక గురుకుల పాఠశాలలో జరిగాయి. ఈ పోటీల్లో ప్రతిభ చూపించిన ఎనిమిది మంది బాలికలు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరికి ప్రిన్సిపల్ భువన మాధురి బహుమతులు అందజేశారు. ఫేషియల్, త్రెడింగ్ తదితర విభాగాల్లో గ్రూపుల వారీగా పోటీలు నిర్వహించినట్లు వృత్తివిద్య ఉపాధ్యాయిని ఎల్.సునీత తెలిపారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ భువన మాధురి

ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ

రావికమతం శివాలయంలో

చంద్రయ్యపేటలో..

గౌరీ పరమేశ్వరుల ఆలయంలో

మాడుగులలో మహిళల పూజలు

కార్తికమాసం రెండో సోమవారం సందర్భంగా అంతటా ఆధ్యాత్మిక వాతావరణం అలముకుంది. వేకువజామునే శివాలయాల్లో హరనామస్మరణ మార్మోగింది. చన్నీటి స్నానాలు ఆచరించి భక్తులు ఆలయాల్లో మొక్కులు చెల్లించుకున్నారు. నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని ఆలయాల్లో కార్తికపూజలు జరిగాయి. న్యూస్‌టుడే బృందం


శ్రీవామలింగేశ్వరస్వామి

చోడవరం శివాలయంలో భక్తజనం

బలిఘట్టం శివాలయంలో భక్తుల పూజలు

తిమిరాంలో అభిషేకం

భాజపా బలోపేతంపై దృష్టి

సమావేశంలో భాజపా నాయకులు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: రానున్న మున్సిపల్, పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై ఇప్పట్నుంచే దృష్టి సారించాలని భాజపా నాయకులు కేవీ సత్యనారాయణ, శీరంరెడ్డి సూర్యనారాయణ కోరారు. నర్సీపట్నం పురపాలక, గ్రామీణ మండల కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. పర్యవేక్షకులుగా విచ్చేసిన రామునాయుడు, భరత్ పార్టీ నిర్మాణంపై చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. త్వరితంగా కమిటీల నియామకం పూర్తి చేయాలని సూచించారు. పురపాలక కమిటీ అధ్యక్షుడు బోళెం అప్పనదొర, గ్రామీణ అధ్యక్షుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మేడివాడ విద్యార్థిని

రావికమతం, న్యూస్‌టుడే: మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని **మోపాడ భాగ్యశ్రీ** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో అండర్-17 విభాగంలో 100, 200 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచింది. విశాఖపట్నం కైలాసగిరిలోని సోమవారం ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ మైదానంలో ఈపోటీలు జరిగాయి. మూడు విభాగాల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు మధుసూదనరావు, విశ్వనారాయణ రాజ్ తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు వంకాయల రామారావు, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

గ్రావెల్ తరలింపు అడ్డగింత

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా గ్రావెల్‌లోడుతో వెళ్తున్న ట్రాక్టర్లను మైనింగ్ చెక్‌పోస్టు సిబ్బంది నిలిపివేశారు. చిన్నప్పన్నపాలెం దగ్గర కొవ్వూరాళ్ల మెట్ట నుంచి గ్రావెల్ తవ్వి తరలిస్తున్నారు. వరుసగా పది ట్రాక్టర్లతో ఒకేసారి గ్రావెల్‌ను తీసుకెళుతుండగా బంగారుమెట్ట కూడలి వద్ద చెక్‌పోస్టు సిబ్బంది ట్రాక్టర్లను అడ్డుకుని తనిఖీలు చేశారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో అక్కడే నిలిపివేశారు. విజయరామరాజుపేట దగ్గర కాజ్‌వే మరమ్మతుల కోసం తీసుకెళుతున్నామని బదులివ్వగా ఉన్నతాధికారుల నుంచి తమకు ఆదేశాలు వస్తేనే వాహనాలను విడిచిపెడతామని సిబ్బంది చెప్పారు. తర్వాత ఎమ్మెల్యే ద్వారా మైన్స్ అధికారులకు ఫోన్ చేయించడంతో ట్రాక్టర్లను వదిలిపెట్టారు.

వైద్యశిబిరాలతో నిరుపేదలకు మేలు

కె.కోటపాడు, న్యూస్‌టుడే: ఉచిత నేత్రవైద్య శిబిరాలు నిరుపేద రోగులకు ఎంతగానో ఉపయోగపడతాయని మండల తెదేపా ప్రధాన కార్యదర్శి జూరెడ్డి రాము సర్పంచి పైల కోటేశ్వరరావులు పేర్కొన్నారు. రొంగలినాయుడుపాలెంలో సోమవారం హెల్ప్ ఫుల్ హేండ్స్ సామాజిక వారధి స్వచ్ఛంద సంస్థ శ్రీరామా మత్స్యకార సహకార సంఘాల ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఈ కార్యక్రమం జరిగింది. రొంగలి అప్పలనాయుడు, బేరా శ్రీను, బేరా రాము, లలిత వర్షిణి, అశ్వనీకుమార్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

పెద్ద చెరువులో శివపార్వతుల విగ్రహాలు

భోజనం వడ్డిస్తున్న విజయ్, సువర్ణ దంపతులు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ట్యాంకు బండ్ తరహాలో అభివృద్ధి చేయనున్న పెద్ద చెరువులో శివపార్వతుల విగ్రహాలను ఏర్పాటు చేయనున్నట్లు తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ చెప్పారు. 'అన్నపూర్ణ అక్షయ పాత్ర ట్రస్టు' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో సోమవారం విజయ్, సువర్ణ దంపతులు పాల్గొన్నారు. ఉచిత వైద్య శిబిరాల ద్వారా ఇప్పటివరకు 1200 మందికి సేవలు అందించినట్లు వెల్లడించారు. కౌన్సిలర్ పద్మావతి, నూకాంబికా ఆలయ ఛైర్మన్ శ్రీను, 24వ వార్డు కౌన్సిలర్ మధు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743	చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74740	చీడికాడ - 80085 74742

గొలుగొండ, న్యూస్‌టుడే: బొడ్డేరు నదిలో ఇసుక తవ్వకాలతో చోద్యం, రామచంద్రపాలెం వద్ద వంతెనలకు ముప్పు వాటిల్లనుంది. ఇప్పటికే రక్షణ గోడలు దెబ్బతినడంతోపాటు పునాదులకు బీటలు కనిపిస్తున్నాయి. దీనిపై 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన గత నెల 28న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన రెవెన్యూ అధికారులు వంతెనలు, నీటి పథకాల చెంత ఇసుక తవ్వకుండా సచివాలయ సిబ్బందితో కాపలా ఏర్పాటు చేయడంతో తవ్వకాలకు అడ్డుకట్ట పడింది.

గొలుగొండ, న్యూస్‌టుడే: చోద్యం - కృష్ణదేవిపేట మధ్య రామచంద్రపాలెం దరి ప్రధాన రహదారిలో గొయ్యి ప్రమాదకరంగా ఉంది. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదానికి గురవుతున్నారు. – **జి.రామారావు, సామాజిక కార్యకర్త**, ✔: సమస్య మా దృష్టికి వచ్చింది. గోతులు పూడ్చే కార్యక్రమం చేపట్టాం. – **ప్రసాదరావు, జేఈ, ర.భ.శా.**

స్పందనకు వందనం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: రద్దీ కూడళ్లలో ప్రమాదకరంగా వాలిన సౌర శక్తి బ్లింకర్లపై 'నిలబెట్టాలి... ప్రమాదాలను అరికట్టాలి' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ సురేంద్ర సమక్షంలో సిబ్బంది సోమవారం తొలగించారు. అబీద్ కూడలిలో అంబేడ్కర్ విగ్రహం పక్కన వాలిపోగా, బ్రహ్మంగారి ఆలయం వద్ద అడుగుభాగం దెబ్బతింది. వీటికి మరమ్మతు చేయించి త్వరలోనే ఏర్పాటు చేస్తామని కమిషనర్ చెప్పారు. తొలగింపు పనులను ఎస్సై ఉమామహేశ్వరరావు పర్యవేక్షించారు.

పోస్టుకార్డు ఉద్యమానికి పిలుపు

ఎనిమిదో రోజు దీక్షలో హరినాథ్, మహాలక్ష్మినాయుడు

చోడవరం, న్యూస్‌టుడే: మూడు జిల్లాలను అనుసంధానం చేసే బి-ఎన్ రహదారి అభివృద్ధి విషయమై అందరూ పోస్టు కార్డు ఉద్యమం చేపడదామని జిల్లా ఆమ్‌ఆద్మీ పార్టీ అధ్యక్షుడు కె.హరినాథ్‌బాబు అన్నారు. రహదారి అభివృద్ధి విషయమై పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం ముందు నిరవధిక దీక్షలు చేపట్టారు. ఎనిమిది రోజులైన సందర్భంగా చోడవరం నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త వేగి మహాలక్ష్మినాయుడుతో కలిసి ఆయన మాట్లాడారు. దీక్ష చేపట్టి ఎనిమిది రోజులైనా కూటమి నేతలు, అధికారుల్లో చలనం రాకపోవడం విచారకరమన్నారు. రహదారి పనులు చేపట్టే వరకు దీక్షలు కొనసాగుతాయన్నారు.

7న మండల సమావేశం

రావికమతం, న్యూస్‌టుడే: రావికమతం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఈ నెల 7న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఓ. మహేష్ తెలిపారు. ఎంపీపీ పైల రాజు అధ్యక్షతన శుక్రవారం ఉదయం 10 గంటలకు వెలుగు కార్యాలయం సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్నిశాఖల మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఎంపీడీవో మహేష్ కోరారు.

నైపుణ్యాల మెరుగుతో ఉద్యోగావకాశాలు

చింతపల్లి: విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరచుకోవడం ద్వారా అనేక రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయని చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. విజయభారతి అన్నారు. డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పొందిన మొదటి ఏడాది విద్యార్థులతో పరిచయ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా పోటీతత్వాన్ని పెంచుకోవాలన్నారు.

అత్యాచార ఘటనలను నిరసిస్తూ ర్యాలీ

నర్సీపట్నం: మహిళలు, విద్యార్థినులపై హెచ్చుమీరుతున్న అత్యాచార ఘటనలను నిరసిస్తూ కళాశాల విద్యార్థులు సోమవారం ర్యాలీ చేశారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టరేట్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వద్దకు ర్యాలీగా చేరుకుని మానవహారంగా ఏర్పడ్డారు. అక్కడి నుంచి సబ్ కలెక్టరేట్‌కు వచ్చి ఆర్డీవో రమణకు వినతిపత్రం అందజేశారు. విద్యార్థి సంఘ నాయకులు గీతాకృష్ణ, ప్రవీణ్, మోహన్ సాయి, సత్యనారాయణ, జనార్దన్, రాయుడు, వరహాలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల నిరసన ర్యాలీ

సాగు పట్టాలివ్వాలని గిరిజనుల ధర్నా

సబ్ కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న గిరిజనులు, సీపీఐ నాయకులు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: ఏళ్ల తరబడి సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండు చేస్తూ మాడుగుల మండలం ఎల్. పొన్నవోలు పంచాయతీకి చెందిన గిరిజనులు సోమవారం ధర్నా చేపట్టారు. సీపీఐ ఆధ్వర్యంలో సబ్ కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేశారు. సబ్ డివిజన్ రికార్డు తయారు చేసిన అధికారులు పట్టాల జారీలో జాప్యం చేస్తున్నారని వాపోయారు. వెంకటరమణ, రామునాయుడు, శివలంక కొండలరావు, కొండబాబు పాల్గొన్నారు.

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు

లక్ష్మీకాంత్ స్క్రీన్-1
మాస్ జాతర

స్క్రీన్-2
కె ర్యాంప్

పి.భోనంగిలో పశువైద్యశిబిరం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం పి.భోనంగి గ్రామంలో సోమవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పరవాడ సబ్ డివిజన్ పశు వైద్య సహాయ సంచాలకులు రామకృష్ణ శిబిరాన్ని ప్రారంభించారు. వాడచీపురుపల్లి పశువైద్యాధికారి, తదితరులు పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పాల దిగుబడిని పెంచే మినరల్ మిక్చర్ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆయా సచివాలయాల పశు వైద్య సహాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 93వ వార్డు గొల్లనారాయణపురంలో 7ఎ/1, 7ఎ/2 వీధి దీపాలు నెల రోజులుగా వెలగడం లేదు. – **ఆర్.శంకర్రావు.** ✓: వెలగని దీపాలకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తాం. – **హరిబహదూర్, ఏఈ జీవీఎంసీ**

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండలం గొర్లెవానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ వద్ద బస్ షెల్టర్ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. – **రమణ.** ✓: ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బస్ షెల్టర్ నిర్మాణానికి కృషి చేస్తాం. – **రమేశ్ నాయుడు, ఎంపీడీవో, పరవాడ.**

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం మండలం పెదనాయుడుపాలెం కొత్తరోడ్డుకు సమీపంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసన వస్తోంది. – **ఎన్.అర్జున.** ✓: వ్యర్థాలను తొలగిస్తాం. – **వై.రాజేశ్వరరావు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం**

?: సబ్బవరం మండలం రావులమ్మపాలెం ప్రధాన రహదారి నుంచి బీసీ వసతి గృహానికి వెళ్లేందుకు సరైన రహదారి లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. – **ఎస్.రాము నాయుడు.** ✓: రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. – **ఎస్.నారాయణ మూర్తి, గ్రామ సర్పంచి, అంతకాపల్లి.**

యూజీడీ ప్రాజెక్టుకు డీపీఆర్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జోన్-2 మధురవాడ ప్రాంతంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ ప్రాజెక్టుతోపాటు, జీవీఎంసీ పరిధిలో అసంపూర్తి యూజీడీ పనులు చేపట్టడానికి డీపీఆర్ (సవివర పథక నివేదిక)ను ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఏపీయూఐఏఎంఎల్)ద్వారా తయారు చేయించనున్నట్లు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రాజెక్టు ప్రపంచ బ్యాంకు పరిధిలోని ఐఎఫ్‌సీ (ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్) రూ.553 కోట్ల సహకారం అందిస్తుండగా, అనుసంధాన పనులను అమృత్ 2.0 పథకం ద్వారా నిధులు అందిస్తున్నారు. ఆయా ప్రాజెక్టు, పనులకు సంబంధించి డీపీఆర్ తయారీతోపాటు, ప్రాజెక్టు టెండర్లు పూర్తి చేసే బాధ్యతను ఏపీయూఐఏఎంఎల్‌కు అప్పగించింది. ప్రాజెక్టు నిధుల్లో 1.45 శాతం నిధులు ఆ విభాగానికి ఇవ్వాలని సంబంధిత ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడికి రిమాండ్

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం బాటజంగాలపాలెంలో బెల్టు దుకాణం నిర్వహిస్తున్న సుంకర జితేంద్ర పోలీసులు నిర్వహించిన సోదాల్లో పట్టుబడ్డాడు. ఈ మేరకు అతని నుంచి 18 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సునీల్ తెలిపారు. కేసు నమోదు చేసి అనకాపల్లి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

ఇసుకతో దారులు.. ఆగని ప్రమాదాలు

బీఆర్టీఎస్ మార్గం ఇలా..

వేపగుంట, న్యూస్‌టుడే : మట్టి, ఇసుక, బొగ్గును తరలించే వాహనాలు నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణం సాగిస్తున్నాయి. అధికంగా లోడ్ చేసి సరఫరా చేస్తున్నారు. లోడ్ చేసిన తరువాత వాహనంపై ఎటువంటి టార్పాలిన్‌లు కట్టడం లేదు. దీంతో వాహనంలోని సరకు ఒరిగి రోడ్లపై కుప్పలుగా పడిపోతుంది. గాలికి ఎగిరి వాహనదారుల కళ్లల్లో పడి ప్రయాణించలేకపోతున్నారు. కుప్పలుగా పడేస్తున్న ఇసుక, మట్టిని తరలించేందుకు పారిశుద్ధ్య కార్మికులు అష్టకష్టాలు పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..: బీఆర్టీఎస్ రహదారి పొడవునా ఎక్కడికక్కడే మట్టి కుప్పలు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం సబ్బవరం- రాయ్‌పూర్ జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నిర్మాణానికి కావాల్సిన డెబ్రిస్, ఇతర ఇసుక సామగ్రిని రాత్రివేళల్లో ఈ మార్గంలో లారీలతో తరలిస్తున్నారు. ఈ క్రమంలో దారి పొడవునా మట్టి చల్లుకుంటూ వెళ్లిపోతున్నారు. కొద్ది రోజులుగా ఇదే పరిస్థితి ఉండడంతో రహదారి దారుణంగా మారింది.

పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

ఈ నేపథ్యంలో పారిశుద్ధ్య కార్మికులు సోమవారం ఓ వాహనాన్ని అడ్డుకున్నారు. డ్రైవర్‌ను నిలువరించి గట్టిగా ప్రశ్నించారు. ఈ మేరకు అతను తనకు ఎటువంటి సంబంధం లేదని.. లోడ్ చేసేవారు ఎక్కువగా చేస్తున్నారని చెప్పడంతో కార్మికులు మిన్నకుండిపోయారు. స్థానిక పెట్రోల్ బంక్ నుంచి వేపగుంట మీదుగా చింతలగ్రహారం రైల్వేగేటు వరకు ఈ మట్టి పడిందని.. తొలగించేందుకు నానా యాతన పడాల్సి వస్తోందని పలువురు పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన చెందారు.

అధిక బరువుతో ఛిద్రం

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి బీఆర్టీఎస్ రహదారిలో సోమవారం పెద్దఎత్తున జిప్సం పొడి పేరుకుపోయింది. ఎన్ఏడీ కూడలి నుంచి సబ్బవరం టిప్పర్ల ద్వారా తరలిస్తున్న జిప్సం పొడి వాహనాల నుంచి రోడ్డుపై పడింది. రాత్రివేళ తిరుగుతున్న ఈ భారీ వాహనాల్లో జిప్సం, క్రషర్ పొడి, ఐరన్ ఓర్ వంటివి తరలిస్తున్నారు. పోలీసుల పర్యవేక్షణ లేని సమయం కావడంతో ఇష్టారాజ్యంగా లోడ్‌లో నింపుతున్నారు. ట్రాలీని మంచి లోడు నింపి దానిపై టార్పాలిన్‌లు కప్పుతున్నారు. వేగంగా వెళ్తున్న వాహనాల నుంచి తరలిస్తున్న లోడు కిందపడి రోడ్లు దారుణంగా తయారవుతున్నాయి.

టిప్పర్ లారీ సీజ్: బీఆర్టీఎస్‌లో జిప్సం పొడి పెద్దఎత్తున ఎగిరిపడిన నేపథ్యంలో పెందుర్తి ట్రాఫిక్ సీఐ నరసింగరాజు తక్షణమే స్పందించారు. ఓ టిప్పర్ లారీని స్వాధీనం చేసుకున్నారు. వాహనం యజమానిని రప్పించి అపరాధ రుసుము వసూలు చేసినట్లు ఆయన తెలిపారు. పునరావృతం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేసిన టిప్పర్

చక్కని చిత్రాలు.. దక్కెను బహుమతులు

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

పెందుర్తి, న్యూస్‌టుడే: పిల్లల ఆలోచనా శక్తిని, మనో వికాసాన్ని పెంచేందుకు చిత్రలేఖనం ఎంతో ఉపయోగపడుతుందని పెందుర్తి పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్.చిన్నమ్మాయి అన్నారు. సోమవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 'మీకు ఇష్టమైన పండగ' అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. విద్యార్థులు జి.పవిత్ర (ప్రథమ), ఎల్.ఆశ్రిత (ద్వితీయ), కె.సంధ్య (తృతీయ) స్థానాల్లో నిలిచారు. ఈ మేరకు విజేతలకు ప్రధానోపాధ్యాయిని చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

విజేతలకు బహుమతులందిస్తున్న ప్రధానోపాధ్యాయిని చిన్నమ్మాయి, ఉపాధ్యాయులు

ప్రతిభావంతులకు సత్కారం

గానప్రియను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: వివిధ రంగాల్లో ప్రతిభ చూపుతున్న పలువురిని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సత్కరించారు. స్థానిక రత్నగిరినగర్‌లోని క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఇటీవల పార్లమెంటులో ప్రసంగించిన యువతి మడుతూరి గానప్రియ, 95 సార్లు రక్తదానం చేసిన కోనేటి ఆదినారాయణ, అంబులెన్సులకు దారి ఇవ్వాలంటూ అవగాహన కల్పిస్తున్న సినిమా స్టంట్ మాస్టర్ బద్రిను దుశ్శాలువతో సత్కరించారు. ★ పెందుర్తి రైల్వేస్టేషన్ రోడ్డులోని పాస్టర్స్ లీడర్స్ అసోసియేషన్ వార్షికోత్సవంలో పాల్గొని కేకు కోసి ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'అభియోగాలకు వివరణ ఇవ్వండి'

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థలో సహాయ ఇంజినీరుగా విధులు నిర్వహిస్తున్న కె.వి.మాధవరావుపై అనిశా నమోదు చేసిన అభియోగాలకు వివరణ ఇవ్వాలని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. 2016లో ఆదాయానికి మించి ఆస్తులున్నాయని ఆయనపై అనిశా కేసు నమోదు చేసింది. ఈ సందర్భంగా సంబంధిత అభియోగాలకు రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలని కోరుతూ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

ఇళ్ల నిర్మాణాలకు సహకరించాలి

నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల, మేయరు పీలా శ్రీనివాసరావు

ప్రహ్లాదపురం(వేపగుంట), న్యూస్‌టుడే: చిన్న విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకునే వారికి సహకరించాలని రెవెన్యూ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సూచించారు. సోమవారం 93వ వార్డులో మేయర్ పీలా శ్రీనివాసరావుతో కలిసి ఆయన పర్యటించారు. ప్రహ్లాదపురం పల్లినారాయణపురంలో ఓ ఇంటి నిర్మాణానికి రెవెన్యూ, పట్టణ ప్రణాళిక విభాగం, దేవస్థానం అధికారులు అభ్యంతరం చెబుతున్నారని నిర్మాణదారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనికి వెంటనే ఆయన స్పందించి సంబంధిత విభాగాల అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రహ్లాదపురం ప్రధాన రహదారిని ఆనుకొని నిర్మిస్తున్న ఇంటికి ప్లాన్ ఇవ్వడం లేదని.. మరో చోట వితంతు పింఛను ఆపేశారని ఓ వృద్ధురాలు ఎమ్మెల్యే ముందు మొరపెట్టుకున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

రేడియాలజీ విభాగ పీజీలకు బంగారు పతకాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రేడియాలజీ వైద్యుల రాష్ట్ర స్థాయి సదస్సులో ఆంధ్ర వైద్య కళాశాల రేడియాలజీ విభాగ పీజీలు రాణించారు. రాష్ట్ర స్థాయిలో 180 పరిశోధన పత్రికలు సమర్పించగా ఏఎంసీ రేడియాలజీ విభాగానికి చెందిన డాక్టర్ జి.పుష్పిత ప్రథమ స్థానంలో నిలిచి ప్రతిష్ఠాత్మక వైజాగ్ సిటీ సబ్‌ఛాప్టర్ అవార్డు, బంగారు పతకం అందుకున్నారు. సదస్సులో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు మరో 150 పరిశోధన పత్రాలు సమర్పించగా, రేడియాలజీ విభాగ పీజీ డాక్టర్ జయగురు సంబశివ ద్వితీయ బహుమతి గెలుపొందారు. డాక్టర్ రాజారెడ్డి బంగారు పతకం కైవసం చేసుకున్నారు. ఇదే కేటగిరీలో డాక్టర్ మేఘన ప్రత్యేక ప్రశంసాపత్రాన్ని పొందారు. ఈ మేరకు సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో విజేతలను ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యాదేవి, కింగ్ జార్జి ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ ఐ.వాణి అభినందించారు.

మరమ్మతు చేసినా షరా మామూలే..!

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి - విశాఖ బీఆర్టీఎస్ సేవా మార్గంలో పెద్ద ఎత్తున మంచి నీరు వృథాగా పోతుంది. ఇక్కడ ఇటీవల పైపులైను లీకేజీ గుర్తించి, సిబ్బంది మరమ్మతు చేశారు. కొద్ది రోజులు మాత్రమే లీకేజీ అరికట్టగలిగారు. మళ్లీ సమస్య పునరావృతమైంది. గత కొన్ని రోజులుగా నీరు వృథాగా పోతోంది. మరమ్మతు చేసినా సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారం కాకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పదే పదే రోడ్డు తవ్వడంతో పాడైపోయి వాహనచోదకులు, పాదచారులకు ఇబ్బంది తప్పడం లేదని పలువురు వాపోయారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో మరమ్మతు చేయించాలని కోరారు.

కురిసిన వర్షం.. పొంగిన మురుగు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి పరిసర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వానతో రహదారులన్నీ జలమయమయ్యాయి. పెందుర్తి కూడలిలో పెద్దఎత్తున వరద నీరు నిలిచిపోయింది. రహదారికి ఇరువైపులా డ్రెయిన్ల నుంచి పెద్ద ఎత్తున మురుగు పొంగి రావడంతో తీవ్రమైన దుర్వాసన వచ్చింది. దీంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. సేవా మార్గంలో నిలిచిన మురుగు, నడక మార్గంలో ఆక్రమణలు ఉండడంతో పాదచారులు వెళ్లేందుకు తిప్పలు తప్పలేదు. అపరిశుభ్రత నడుమ రాకపోకలు సాగించాల్సి వచ్చింది. వర్షం కురిసిన ప్రతిసారీ ఇదే పరిస్థితి నెలకొంటుందని వాపోయారు.

పీజీఆర్ఎస్‌కు అర్జీల వెల్లువ

వేపగుంట, న్యూస్‌టుడే : వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్) వచ్చిన అర్జీలను ఇన్‌ఛార్జి జెడ్సీ శంకర్రావు స్వీకరించారు. కృష్ణరాయపురం ఎన్ఏడీ పార్కు గేటు సమస్య పరిష్కరించాలని, పశువుల వ్యర్థాలతో అసౌకర్యంగా ఉంటుందని, సచివాలయాల్లో ప్లానింగ్ సెక్రటరీల పనితీరు సక్రమంగా లేదని, వృద్ధాప్య పింఛను అందేలా చర్యలు తీసుకోవాలని, జనతా కాలనీలో మురుగు సమస్యతో దోమలు పెరిగిపోయాయని వంటి పలు అర్జీలు అందాయి. పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సమస్య తెలుసుకుంటున్న ఇన్‌ఛార్జి జెడ్సీ శంకర్రావు

వినతులు స్వీకరిస్తున్న సబ్బవరం తహసీల్దార్ బి.చిన్నికృష్ణ

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ 28 అర్జీలు వచ్చాయి. తహసీల్దారు బి.చిన్నికృష్ణ వాటిని స్వీకరించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పీజీఆర్ఎస్‌కు ఒక దరఖాస్తు వచ్చినట్లు ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. ఈ మేరకు ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్, ఎంపీడీవో అర్జీదారులకు హామీ ఇచ్చారు. ● సబ్బవరం మండలం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పీజీఆర్ఎస్‌కు పెందుర్తి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ వచ్చారు. ఈ మేరకు పలువురి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్జీదారుల నుంచి దరఖాస్తులు తీసుకొని తహసీల్దార్‌కు అందించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను కోరారు. ప్రతీవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌కు వారానికి ఓ మండలం చొప్పున వెళ్తానని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వచ్చే వారం పరవాడ వెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

విశాలాక్షీ విశ్వేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే పంచకర్ల

సుజాతనగర్ హరిహర క్షేత్రంలో..

పరవాడలోని మల్లికార్జునస్వామి

ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రంలో..

దేశపాత్రునిపాలెంలోని ఉమారామలింగేశ్వరస్వామి

దేవీపురంలో..

స్వయంభూవరంలో..

తాడి గ్రామంలోని ఉమానీలకంఠేశ్వరస్వామి

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

పెందుర్తి, న్యూస్‌టుడే: కూలి పనికి వెళ్లిన భర్త తిరిగి రాలేదని పెందుర్తి పోలీసులకు ఓ మహిళ ఫిర్యాదు చేసింది. సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బంటా కాలనీకి చెందిన **శిష్ట రమణ (37)** కూలీ పనులు చేస్తుంటాడు. గత నెల 31న ఉదయం పనికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో ఆయన భార్య దేవి సోమవారం పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై సీఐ అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్వతీ మనోహరా.. భక్తజన కృపాకర

జన సందోహంగా శివాలయాలు

శ్రమశక్తినగర్‌లో..

పెందుర్తి, పరవాడ, వేపగుంట, సబ్బవరం, న్యూస్‌టుడే: కార్తిక మాసం రెండో వారాన్ని పురస్కరించుకొని సోమవారం పెందుర్తి నియోజకవర్గంలోని శివాలయాలు భక్తజన సందోహంగా మారాయి. వేకువజాము నుంచి భక్తులు ఆలయాలకు చేరుకొని పార్వతీ మనోహరుడిని ఆరాధించారు. ఆలయ ప్రాంగణాల్లోని ధ్వజస్తంభాలు, రావిచెట్ల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు విశేష ఏర్పాట్లు జరిపారు. సాయంత్రం కార్తిక దీపారాధనలు జరిగాయి. ★ జీవీఎంసీ 95వ వార్డు రత్నగిరినగర్ సమీపంలోని విశాలాక్షీ విశ్వేశ్వర స్వామిని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు దర్శించుకున్నారు. ★ 97వ వార్డు చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు జరిగాయి. ★ 97వ వార్డు సుజాతనగర్ హరిహర క్షేత్రంలో కొలువైన కేదారేశ్వరస్వామిని పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు దర్శించుకున్నారు. ★ వేంకటాద్రి ఘాట్ రోడ్డులోని శ్రీమహాకామేశ్వరి సహిత ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రంలో పన్నెండు శివలింగాలకు భక్తులు స్వయంగా అభిషేకాలు చేశారు. ★ 96వ వార్డు పెందుర్తి ప్రశాంతినగర్‌లోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయానికి భక్తులు తరలివచ్చారు. ★ సరిపల్లిలోని స్వయంభూ మల్లీశ్వరస్వామి, పినగాడిలో చోడేశ్వర స్వామి, దువ్వపాలెంలోని భీమేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిగాయి.

ప్రశాంతినగర్‌లో...

రామలింగేశ్వర స్వామి సన్నిధిలో భక్తులు

పరవాడ మండలంలో.. అప్పికొండ సోమేశ్వరాలయం, మల్లికార్జునాలయం, తాడి నీలకంఠేశ్వరాలయం, భరణికంలోని సోమేశ్వరాలయం, స్వయంభూవరంలోని స్వయంభూలింగేశ్వరాలయం, దేశపాత్రునిపాలెం ఉమారామలింగేశ్వరాలయం, ఫార్మాసిటీలోని శివాలయాలు భక్తులతో నిండిపోయాయి. దాతల సహాయంతో అప్పికొండ సోమేశ్వరాలయం వద్ద భారీ అన్నసమారాధన జరిగింది.

వేపగుంటలోని .. వేపగుంట పరిసర ప్రాంతాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నరవ ఉమానాగలింగేశ్వరస్వామి స్వయంభూదేవాలయానికి నరవ, కోటనరవ, సత్తివానిపాలెం, గవరజగ్గయ్యపాలెం, కొత్తపాలెం, ఇప్పిలివానిపాలెం, నందవరపువానిపాలెం, చింతగట్ల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు గండ్రెడ్డి మహాలక్ష్మీనాయుడు పర్యవేక్షణలో భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. వేపగుంట మెట్టపై ఉన్న శివాలయాన్ని, ముత్యమాంబ అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని శివాలయాన్ని శనాతివానిపాలెం, వెంకటసాయినగర్, తదితర ప్రాంతాల ప్రజలు దర్శించుకున్నారు.

అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయం వద్ద..

నరవ స్వయంభూదేవాలయంలో..

సబ్బవరం మండలంలో.. దేవీపురం కొండ దిగువున దక్షవాటిలోను, కొండపై ఉన్న శివాలయంలో పంచామృతాభిషేకాలు జరిగాయి. రామలింగేశ్వస్వామి ఆలయానికి, పెదనాయుడుపాలెం మల్లికార్జునాలయానికి, ఇరువాడ, వంగలి శివాలయాలకు భక్తులు తరలివచ్చారు. లింగాల తిరుగుడు సోమలింగేశ్వర స్వామి ఆలయాన్ని సీఐ రామచంద్రరావు దర్శించుకున్నారు.

PUBLIC NOTICE

Public are hereby informed that this public notice is issued on the instructions of my client Sri Baire Murali Krishna, residing at Rainbow Aistas Cybercity, Opp. IDL Factory, Moosapet, Balanagar, K.V.Rangareddy, Telangana and he is intending to sell the property to Smt. Bandaru Demudamma.

My client acquired the schedule property vide sale deed dated 08.12.2014 Doc.No.5496/2014 executed by Smt. B.Vasanthi, rep. by her GPA holder. Smt.Vasanthi acquired the property vide Sale deed dated 20.06.2013 Doc.No. 2779/2013 executed by Sri N.Chandramouli who acquired the property vide sale deed dated 15.05.2012 Doc.No. 2266/2012. It is to state that original of Doct. No.2266/2012 is misplaced and could not be found inspite of diligent search. A police compliant is also given.

Hence, if any member of the Public got any right, claim, objections of whatsoever nature over the below schedule property they shall come forward with their claims within one week from the date of this publication failing which it will be deemed that the lost document is beyond recovery and future transactions will be done basing on certified copy by my clients.

SCHEDULE

Site measuring an extent of 166.66 sq.yds or 139.349 sq.mts of F Mark, together with R.C.C. Slabbed House with a plinth area 900 sft., bearing Door No.21-68/26, being Inam Patta T.D. No.2700, covered by S.No.107/24 of Pendurthi Village, within the limits of Greater Visakhapatnam Municipal Corporation, Pendurthi Joint S.R.O limits, Visakhapatnam District and property bounded by:
East: Layout of Janachaitanya, **South:** K. Mark of Naveti Chandramouli an extent of 166.66 sq.yds, **West:** G Mark Site, **North:** 20 Feet Road.

I. SATYASAI RAM, Advocate
D.No.17-73, Prahladapuram, Visakhapatnam-27. **Cell: 92907 81381**

రేపు దీపోత్సవ సన్నాహక సమావేశం

పద్మనాభం: దీపోత్సవ సన్నాహక సమావేశం ఈ నెల 5న నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పీఎల్ఎన్.రాజు తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని సామాజిక భవనంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, స్థానిక గ్రామాల నాయకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు హాజరుకావాలని సూచించారు.

5వ వర్ధంతి

మంచిని, మమతానురాగాలను మాకు పంచి, నీవు మా అందరినుండి దూరమై నేటికి 5 సం॥లు గడిచాయి. నిరంతరం నీ జ్ఞాపకాలతో జీవిస్తూ... నీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

కీ॥శే॥ **అనంతారపు రమణమ్మ**
జననం: 1-1-1976 మరణం: 4-11-2020

భర్త: అనంతారపు నర్సింగరావు
కుమార్తె: Ch. ధనలక్ష్మి
అల్లుడు: Ch. రాంప్రసాద్
మనుమరాలు: Ch. షాన్వి
మనుమడు: Ch. శ్రీయాన్

గ్రామాల్లో నెరవేరనున్న సొంతింటి కల

ఈ నెల 5 వరకు దరఖాస్తుల స్వీకరణ

పరవాడ, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో సొంత స్థలం ఉండి ఇళ్లు కట్టుకోలేని పేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ (పీఎంఏవైజీ) పథకం కింద ఇళ్లు మంజూరుకు గ్రామాల్లో అవగాహన కల్పిస్తోంది. ఈ నెల 5లోపు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హులైన వారు ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లను కలిసి అన్ని ధ్రువపత్రాలను అందించాలి.

ఈ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి

గ్రామీణ ప్రాంతాల్లో సొంత స్థలం ఉండి ఇళ్లు కట్టుకోలేని వారికి ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారు. పురాతన నివాసాలు, పునాదులు, పెంకిటిళ్లు, పూరిళ్లు ఉన్నవారు కూడా దీనికి అర్హులు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, స్థల ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. గృహ నిర్మాణ పథకంలో భాగంగా గతంలో ఇళ్లు మంజూరు కాని వారు మాత్రమే ప్రస్తుతం దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు.

నిర్మాణానికి నిధులు ఇలా..

మొత్తం రూ.1.59లక్షలు మంజూరుచేస్తారు. ఇంటి నిర్మాణానికి రూ.1.20వేలు, స్వచ్ఛభారత్ కింద మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12వేలు, ఉపాధిహామీ పథకం కింద రూ.27వేలు అందజేస్తారు. ఇప్పటికే దీని నమోదుకు యాప్‌ను అందుబాటులో ఉంచారు. త్వరలో సర్వే చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి..

పేదలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అర్హులైనవారంతా ఆయా గ్రామాల పరిధిలోని సచివాలయాలకు వెళ్లి ఇంజినీరింగ్ సహాయకులను సంప్రదించాలి. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లకు సచివాలయ సిబ్బంది వచ్చి సర్వే చేసి యాప్‌లో వివరాలను పొందుపరుస్తారు.
– ఎంఎస్ ఎస్ఎన్.రెడ్డి, గృహనిర్మాణ శాఖ ఇన్‌ఛార్జి, ఏఈ

హృదయపూర్వక శుభాభినందనలు

ఎగ్రికల్చర్ & సోషల్ సర్వీస్‌లో మీరు చేసిన కృషికి గుర్తింపుగా ఒడిశా న్యాయశాఖ మంత్రివర్యులు గౌ॥ శ్రీ పృథ్వీరాజ్ హరిచందన్ గారి చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ అందుకున్న విశాఖ నగర వాస్తవ్యులు డా॥ వల్లూరి శేషగిరిరావు గార్కి మా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ... మీరు భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పురస్కారాలు అందుకోవాలని కోరుకుంటూ...

డా॥ **వల్లూరి శేషగిరిరావు** గారు
డాక్టరేట్ అవార్డు గ్రహీత

అభినందనలతో...
మీ.. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

(c) eenadu

ఈనాడు
అనంతపురం
మంగళవారం నవంబరు 4, 2025

శరణు...శంకరా!

కార్తిక సోమవారం సందర్భంగా తాడిపత్రిలోని బుగ్గరామలింగేశ్వర స్వామిని ప్రత్యేక అలంకరించి.. అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు కార్తికదీపాలను వెలిగించి స్వామిని దర్శించుకున్నారు.

-న్యూస్‌టుడే, తాడిపత్రి

దైవరూపం.. బాలానందం

సోమందేపల్లిలోని అంబాభవాని ఆలయం వద్ద బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్యదర్శనం కొనసాగుతోంది. సోమవారం రాత్రి లక్ష్మీనారాయణ, రాధాకృష్ణులు, సీతారాముల వేషధారణలతో బాలికలు విశేషంగా ఆకట్టుకున్నారు. దేవతామూర్తుల రూపంలో కనువిందు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన నృత్య ప్రదర్శన ప్రత్యేకంగా నిలిచింది. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఎంతో ఆసక్తి తిలకించి పులకించిపోయారు.

-న్యూస్‌టుడే, సోమందేపల్లి

అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ శివనారాయణశర్మ

అర్జీల స్వీకరణలో గందరగోళం

బాధితులపై జేసీ అసహనం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: సుదూర ప్రాంతాల నుంచి ఎన్నో వ్యయ, ప్రయాసాలకోర్చి తమ గోడును విన్నవించడానికి వచ్చిన బాధితులపై జేసీ శివనారాయణ శర్మ అసహనం, విసుగు చెందడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. సోమవారం రెవెన్యూ భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో అర్జీలు స్వీకరించారు. జేసీతోపాటు సహాయ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్‌ఓ మాలోల, ప్రత్యేక ఉప కలెక్టర్లు ఆనంద్, రమేశ్ రెడ్డి, జేడీఏ ఉమామహేశ్వరమ్మ తదితరులు వినతులు తీసుకున్నారు. 435 మంది బాధితులు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. జిల్లా నలుమూలల నుంచి జనాలు అధికంగా తరలి రావడంతో కలెక్టరేట్ ఆవరణ, రెవెన్యూ భవన్ కిక్కిరిసిపోయింది. జనం ఎక్కువగా తరలి రావడంతో జేసీలోనూ అసహనం కనిపించింది. అర్జీలు తీసుకుని పంపించేస్తున్నారు. ఎవరైన సమస్య చెప్పడానికి ప్రయత్నించినా బలవంతంగా పంపించిన తీరుపై బాధితులు తీవ్ర ఆవేదన, అసంతృప్తి వెలిబుచ్చారు. పలు ప్రజా సంఘాల నాయకులు సైతం అర్జీల స్వీకరణ సరిగా లేదంటూ నిరసన తెలిపారు.

జన సమీకరణపై జాగ్రత్త

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో దేవాలయాలు, జాతరా.. వంటి పెద్ద పెద్ద పండగల్లో జన సమీకరణ జరిగితే ముందస్తు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని జేసీ శివనారాయణ శర్మ అన్నారు. ఏటా ఏ రోజు.. ఎక్కడెక్కడ జనం గుమిగూడే అవకాశం ఉంటుంది. ఎంత మంది రావచ్చు. అక్కడి సౌకర్యాలు.. వంటి వాటిపై ముందస్తు నివేదిక పంపాలి. దీన్నిబట్టి పోలీసు, ఇతరత్రా భద్రత, జాగ్రత్త చర్యలు తీసుకోవానికి అవకాశం ఉంటుందన్నారు. నిర్దేశిత శాఖలు, అధికారులు తగిన నివేదికలు పంపాలని జేసీ చెప్పారు.

భద్రతకు భరోసా ఏదీ?



- రోడ్డు ప్రమాదాలతో వీధినపడుతున్న వందలాది కుటుంబాలు
- ప్రకటనలకే పరిమితమవుతున్న నియంత్రణ చర్యలు

ఈనాడు, అనంతపురం: రోడ్డుపైకి వస్తే సురక్షితంగా ఇంటికి చేరతామా.. అనే సంశయం తలెత్తుతోంది. ఏ వైపు నుంచి ప్రమాదం ముంచుకొస్తుందో అంచనా వేయలేని పరిస్థితి. ఎక్కడ ఏ గుంత నోరు తెరుచుకుని.. వాహనదారులను మింగేస్తుందో తెలియడం లేదు. రెప్పపాటులో సంభవిస్తున్న ప్రమాదాలు ఎన్నో కుటుంబాలను వీధిన పడేస్తున్నాయి. ఏటా వందల సంఖ్యలో దుర్ఘటనలు జరుగుతున్నా భద్రతపై అధికారులు దృష్టి పెట్టడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ప్రమాదాలు జరిగిన పుడు మాత్రమే పోలీసు, రవాణా శాఖ అధికారులు హడావుడి చేస్తున్నారు. తర్వాత షరా మామూలే. ఉమ్మడి అనంత జిల్లాలో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

జాతీయ రహదారిలోని కీలక కూడళ్ల వద్ద ట్రాఫిక్ నియంత్రణను గాలికొదిలేశారు. చాలాచోట్ల సర్వీస్ రోడ్లు లేకపోవడం వల్ల స్థానికులు వ్యతిరేక దిశలో ప్రయాణం సాగిస్తున్నారు.

● కూడళ్ల నుంచి గ్రామాలకు వెళ్లే ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. చాలా సందర్భాల్లో డ్రైవరుకు రెండువైపులా కూర్చోబెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు. ఇలాంటి సందర్భాల్లో వాహనాన్ని నియంత్రించలేక ప్రమాదాలు జరుగుతున్నాయి.

పనిచేయని స్పీడ్‌గన్లు

ఉమ్మడి జిల్లా పరిధిలో 600 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు విస్తరించి ఉన్నాయి. వేగ నియంత్రణకు స్పీడ్ గన్లు ఉపయోగించడం లేదు. ఉన్న రెండూ పని చేయకపోవడంతో మూలనపడేశారు. కొత్తవాటి కోసం ప్రతిపాదనలు పంపినా మోక్షం లభించలేదు.

ప్రతిపాదనలు పట్టాలెక్కేనా..

ప్రమాదాలు ఎక్కడ జరిగినా ఆర్ అండ్ బీ లేదా ఎన్‌హెచ్‌ఏఐ ఇంజినీర్లు, రోడ్డు రవాణాశాఖ ఎంవీఐ, పోలీసు అధికారి కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. నిర్మాణ లోపమా? వాహన కండిషన్‌లో లేదా? మానవ తప్పిదమా? నిర్లక్ష్యమా? తదితర అంశాలను నివేదికలో పొందుపరచాలి. వీటిపై ప్రతినెలా జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో సమీక్షించాలి. రహదారి డిజైన్‌లో లోపం ఉంటే మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు సమావేశాలు జరుగుతున్నా

అనంతపురం జిల్లాలో ఇలా..

ఏడాది	ప్రమాదాలు	మృతులు
2022	540	331
2023	532	350
2024	544	343
2025	299	164

(అక్టోబరు వరకు)

అందులో ప్రతిపాదించే అంశాలు చాలావరకు అమల్లోకి రావడం లేదు.

బ్లాక్‌స్పాట్‌లు ఎక్కడంటే..

1 ఎన్‌హెచ్ 44 (హైదరాబాద్-బెంగళూరు): గుత్తి చౌరస్తా, పామిడి, కల్లూరు, గార్లదిన్నె, తపోవనం, రాప్తాడు, రామినేపల్లి, సీకే పల్లి, పెనుకొండ, సోమందేపల్లి, పాలసముద్రం, కొడికొండ చెక్‌పోస్ట్.

2 ఎన్‌హెచ్ 42 (బళ్లారి-కదిరి): పాల్తూరు, ఉరవకొండ, విన్నమ్ముడూరు, పంగల్‌రోడ్డు, మదిగుబ్బ, పట్నం

3 ఎన్‌హెచ్ 67 (బళ్లారి-తాడిపత్రి): కొత్తపేట, టి.కొత్తపల్లి క్రాస్, పంగూరు, అల్ట్రాస్ స్టీల్ ప్లాంట్, చుక్కలూరు, రాయలచెరువు

4 ఎన్‌హెచ్ 544డి (అనంతపురం-తాడిపత్రి): ఎర్రగుంటపల్లి, వెంకటరెడ్డిపల్లి

తగిన చర్యలు తీసుకుంటున్నాం

- జగదీశ్, ఎస్పీ, అనంతపురం

రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ప్రతిపాదించిన వీలైనంత వరకు అమలు చేస్తున్నాం. ప్రమాదాల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవలే బ్లాక్‌స్పాట్‌ల వద్ద సీసీ కెమెరాలు, లైటింగ్, సూచిక బోర్డులు ఏర్పాటు చేశాం. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం.

సంఘాల సభ్యులను విచారిస్తున్న బ్యాంకు రీజినల్ అధికారులు

డ్వాక్రా సొమ్ము రూ.31 లక్షలు కాజేత

వైకాపా సానుభూతిపరుడు బ్యాంకు కరస్పాండెంట్‌గా ఉంటూ మోసం!

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: డ్వాక్రా సంఘ మహిళలను నమ్మిస్తూ డిగా ఉంటూ బ్యాంకు కరస్పాండెంట్ ఒకరు రూ.31 లక్షలకుపైగా సొమ్ము కాజేశాడు. ఈ ఘటన శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం ప్రసన్నాయపేట గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. డ్వాక్రా సంఘాల మహిళలు, వెలుగు సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. ప్రసన్నాయపేటకు చెందిన వైకాపా సానుభూతిపరుడు కృష్ణారెడ్డి కనుముక్కల ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు శాఖలో బీసీ (బిజినెస్ కరస్పాండెంట్)గా పని చేస్తున్నాడు. గ్రామంలోని డ్వాక్రా సంఘాల మహిళలు తాము తీసుకున్న రుణాలు చెల్లించే నెలవారీ కంతుల సొమ్మును కృష్ణారెడ్డికి అందజేసేవారు. నగదు తీసుకుని పుస్తకంలో నమోదు చేసేవాడు కాదు. దానికి రసీదు ఒక నెల ఇస్తే మరో నెల ఇచ్చేవాడు కాదు. ఒత్తిడి తెస్తే ఏవో సాకులు చెప్పి దాటవేసేవాడు. వెలుగు సీసీ రమేశ్, డ్వాక్రా సంఘాల రుణాలు, వాయిదా చెల్లింపులను పరిశీలించారు. సభ్యులు చెల్లించామని చెబుతున్న నగదుకు, వాస్తవ రుణ నిల్వకు చాలా వ్యత్యాసం ఉండటంతో పరిస్థితి వారికి వివరించారు. వారు బ్యాంకుకు వెళ్లి నగదు చెల్లింపులపై ఆరా తీయగా వీరు ఇలాను అధికారులు అందించారు. దీనిపై కృష్ణారెడ్డిని అడిగేందుకు మహిళలు అతని ఇంటి వద్దకు వెళ్లగా అందుబాటులో లేడు. దీంతో అతడే మోసానికి పాల్పడినట్లు నిర్ధారించుకున్నారు. బ్యాంకు రీజినల్ అధికారులు గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టగా రెండేళ్ల నుంచి రూ.31 లక్షలకుపైగా మోసం జరిగినట్లు గుర్తించారు. వీటిని ఉన్నతాధికారులకు నివేదిస్తామని బ్యాంకు అధికారులు తెలిపారు. మోసం విషయం వెలుగులోకి రావడంతో కృష్ణారెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం.

కళ్లు మూసుకుంటాం.. తవ్వుకోండి!

పది అడుగుల మేర తవ్వడంతో ఏర్పడిన గుంతలు

అటవీ ప్రాంతంలో మట్టి అక్రమ తవ్వకాలు

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ శివారులోని బొందనకల్లు అటవీ ప్రాంతంలో అడ్డగోలుగా మట్టిని తవ్వి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణానికి ఆనుకుని కుంటి మారెమ్మ ఆలయం ఎదురుగా.. రైల్వే ట్రాక్ పక్కన రెండువైపులా పది అడుగుల మేర మట్టిని తవ్వి తరలించారు. తవ్విన ప్రాంతాల్లో లేకుండా ముళ్లకంచలు అడ్డు వేశారు. మరో ప్రాంతంలో పది అడుగుల మేర తవ్వకాలు చేశారు. టిప్పర్ మట్టి తరలించాలన్నా అనుమతి తీసుకుని.. రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఇక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

ఎత్తుగా ఉండటంతో..

రైల్వే ట్రాక్ సుమారు ఇరవై అడుగుల మేర ఎత్తు ఉండటంతో అక్రమార్కులకు కలిసివస్తోంది. అటవీ ప్రాంతంలో మొక్కలు నాటిన చోట పొక్లెయిన్‌తో మట్టిని తవ్వి తరలించినట్లు ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

● పట్టణ శివారులో రైల్వే ట్రాక్ బల్లేపేటానికి పనులు జరుగుతున్నాయి. గుత్తేదారు అనుమతులు తీసుకుని చెరువులో తరలించాల్సి ఉన్నా నిబంధనలు పట్టించుకోకుండా రాత్రి వేళ తరలించినట్లు స్థానికులు చెబుతున్నారు.

కేసులు నమోదు చేస్తాం

-దామోదర్‌రెడ్డి, డీఆర్‌వో, రాయదుర్గం

క్షేత్రస్థాయిలో పరిశీలించి మట్టిని తరలించిన వారిపై కేసులు నమోదు చేస్తాం. అవసరమైతే ఉన్నతాధికారుల అనుమతితో ఆ ప్రాంతానికి కంచె ఏర్పాటు చేసి తవ్వకాలు జరపకుండా చర్యలు తీసుకుంటాం.

సీఎంఎస్-03 ప్రయోగంలో ధర్మవరం పాత్ర

అంబటి ప్రవీణ్‌కుమార్

ధర్మవరం, న్యూస్‌టుడే: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన సీఎంఎస్-03 ఉపగ్రహ ప్రయోగం విజయవంతంలో పట్టణానికి చెందిన ఇస్రో ఇంజినీర్ అంబటి ప్రవీణ్‌కుమార్ పాలుపంచుకున్నారు. ఆదివారం శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ ప్రయోగ వేదిక నుంచి సీఎంఎస్-03 నింగిలోకి దూసుకెళ్లిన విషయం తెలిసిందే. పట్టణంలోని సాయినగర్‌కు చెందిన అంబటి శ్రీనివాసులు, చంద్రకళ కుమారుడైన ప్రవీణ్‌కుమార్ కొన్నేళ్లుగా ఇస్రోలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ధర్మవరం పురపాలక వైస్ చైర్మన్‌గా పనిచేసిన అంబటి శ్రీనివాసులు ఇటీవల మృతి చెందారు. ప్రయోగం విజయవంతంలో అంబటి ప్రవీణ్‌కుమార్ పాత్రపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు ఇక్కడి నుంచి అభినందనలు వెల్లువెత్తాయి.

మేళాలో నమూనాలను తిలకిస్తున్న ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్

సనాతన ధర్మంలో శాస్త్రీయ దృక్పథం

ఆకట్టుకున్న విజ్ఞాన మేళా

పుట్టపర్తి, న్యూస్‌టుడే: 'ఆధ్యాత్మికతలో పొందుపరిచిన శాస్త్రీయత.. సర్వ మానవాళి శ్రేయస్సుకు దోహదపడే ఆవిష్కరణలతో విజ్ఞానం వికసిస్తుంది' అనే సత్యాన్ని హృదయాలను హత్తుకునేలా బాలవికాస్ చిన్నారులు ప్రదర్శించిన విజ్ఞాన మేళా అమితంగా ఆకట్టుకుంది. పట్టణంలోని హయ్యర్ సెకండరీ స్కూల్‌లో సోమవారం సనాతన ధర్మం, శాస్త్రీయ దృక్పథంతో కూడిన విజ్ఞాన మేళాను ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జేరత్నాకర్ ప్రారంభించారు. రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన 150 మంది బాలవికాస్ గురువులు, 250 మంది చిన్నారులు సృజనాత్మకత, భక్తి, శాస్త్రీయతను మేళవించి ప్రదర్శించిన 170 వినూత్న నమూనాలను తిలకించి వారిని అభినందించారు. మేళాలో సత్యసాయి ఆధ్యాత్మిక సందేశాలు, ప్రేమ, శాంతి, సేవాతత్త్వం, శాస్త్రీయత ఉట్టిపడే దివ్య ఉపన్యాసాలు, చిన్న చిన్న కథల నుంచి శాశ్వత సత్యాలను వెలికితీసి, వాటిని సులభంగా అర్థమయ్యే దృశ్యరూపంలో ఆకర్షణీయంగా ప్రదర్శించారు. రెండు రోజుల పాటు ఈ మేళా సాగనుంది. కార్యక్రమంలో సత్యసాయి సేవాసంస్థల జాతీయ సేవా విభాగం సమన్వయకర్త కోటేశ్వరరావు, శశిబాల, రాష్ట్రసాయి సంస్థల అధ్యక్షుడు లక్ష్మణరావు, బాలవికాస్ గురువులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భగ్గుమంటున్న కూరగాయల ధరలు

సామాన్యులు ఉక్కిరిబిక్కిరి

ధర్మవరం పట్టణం, అనంతపురం, న్యూస్‌టుడే: మార్కెట్లో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. ఏదీ కొనాలన్నా కిలో రూ.100 పలుకుతున్నాయి. గతంలో ఎన్నడూలేని విధంగా ధరలు పెరగడంతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. కేవలం పది రోజుల వ్యవధిలోనే ధరలు పెరగడం గమనార్హం. ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల్లో నీరు చేరి కూరగాయల, ఆకుకూరల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. నీరు తగ్గకపోవడంతో పంటలకు తెగుళ్లు సోకి పాడయ్యాయి. దీంతో మార్కెట్లకు ఆశించిన మేర దిగుబడి రావడం లేదు. కూరగాయలు స్థానికంగా దొరక్కపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని, దాంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.

కూరగాయలు (కిలో రూ.ల్లో)

	ప్రస్తుతం ధర	గత వారం
బీన్స్	90	60
బీరకాయ	70	50
క్యారెట్	100	80
వంకాయలు	60	40
ఆలుగడ్డ	40	30
కాకర	65	40
బెండకాయ	60	40

● ఏడేళ్ల కిందట జిల్లా వ్యాప్తంగా సుమారు 32 వేల హెక్టార్లలో కూరగాయలు సాగు చేసేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 18 వేల ఎకరాలలోపు ఉన్నట్లు ఉద్యాన శాఖాధికారులు గణాంకాలు చెబుతున్నాయి.

సంచి నిండటం లేదు - నారాయణమ్మ, పుట్టపర్తి

మార్కెట్‌కు రూ.500 తీసుకెళ్తే చిన్న సంచికి కూడా కూరగాయలు రావడం లేదు. వంటలు రుచిగా వండాలంటే పోషకాలతో కూడిన మంచి కూరలు ఉండాల్సిందే. ప్రతి రోజు తాజా కూరగాయలు అవసరం. అందుకే ధర పెరిగినా తప్పని పరిస్థితుల్లో కొంటున్నాం. ఇలాగైతే సామాన్యులు బతకలేని పరిస్థితి.

నైపుణ్యం.. కొలువుకు సోపానం

ఐటీఐ విద్యార్థులకు జర్మన్ భాషపై శిక్షణ

న్యూస్‌టుడే, ఉరవకొండ: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి మార్గం సుగమం చేస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ ఐటీఐల్లోని విద్యార్థులకు చదువు పూర్తవగానే ఉద్యోగావకాశాలు కల్పనే లక్ష్యంగా శిక్షణ ఇప్పిస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో చదువుతున్న విద్యార్థులకు జర్మన్ భాషపై ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. ప్రతి సోమ, బుధవారాల్లో అమరావతి నుంచి జూమ్, వీడియో లింకేజీ ద్వారా ప్రత్యేక శిక్షణ కొనసాగుతోంది.

అదే ఎందుకంటే?

ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థులకు జర్మనీలో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా ఎలక్ట్రికల్ పూర్తి చేసి కనీసం రెండేళ్ల పని అనుభవంతో వెళ్తే మొదటి నెల వేతనం సుమారు రూ.1.20 లక్షలు వస్తుంది. వీసా, విమాన ఛార్జీలు ఇతరత్రా ఖర్చులు అక్కడికి వెళ్లాక కంపెనీ వెనక్కి చెల్లిస్తుంది. దీంతో ఆ భాషను నేర్పించడానికి సర్కారు శ్రీకారం చుట్టింది.

కేటగిరీల ప్రకారం..

ఏ1, ఏ2 స్థాయిలోని విద్యార్థులకు రోజు వారీ తరగతులతోపాటు వారంలో రెండు సార్లు ఆన్‌లైన్ ద్వారా బోధిస్తున్నారు. విద్యార్థులు శ్రద్ధగా పాఠాలు విని పరీక్షలు కూడా రాస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఐదు ప్రభుత్వ ఐటీఐల్లో 14 ట్రేడులు ఉన్నాయి. ఒక్కో ట్రేడు నుంచి పది మంది చొప్పున 1600 మంది, శ్రీసత్యసాయి జిల్లా నుంచి 200 మందిని ఈ శిక్షణకు ఎంపిక చేశారు. నిర్దేశిత సమయంలో వర్చువల్ విధానంలోనూ జర్మనీ భాష నేర్చుకునేలా కళాశాలల సిబ్బంది చొరవ చూపుతున్నారు.

సద్వినియోగం చేసుకునేలా.. - రాయపరెడ్డి, ఐటీఐల జిల్లా కన్వీనర్

విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి. జర్మన్ భాషపై పూర్తిస్థాయిలో పట్టు సాధించేలా కృషి చేస్తున్నాం. విద్యార్థుల నైపుణ్యానికి అనుగుణంగా ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు.

ecoren WALK-IN INTERVIEWS
Ecoren Energy is looking for experienced professionals for Wind and Solar Power Projects in Kurnool, Anantapur and Kadapa.
: Positions :
Civil Engineers, Electrical Engineers, Site Managers
: Experience :
2–12 years in Wind/Solar Project Execution
Interview Dates :
08th November 2025 — 09:00 AM to 06:00 PM
09th November 2025 — 09:00 AM to 01:00 PM
Venue : HOTEL ALEXANDER, Saptagiri Circle, Anantapur
Contact : 7331122450, Email: hr@ecorenenergy.com

మఠం ఆస్తుల కబ్జా

యథేచ్ఛగా ఇంటి నిర్మాణాలు

దాసరి కాలనీలో వెలసిన నిర్మాణాలు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తి పట్టణంలో రూ.కోట్లు విలువచేసే మఠం ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయి. ప్రధానంగా గుత్తి నడిబొడ్డున ఉన్న సర్వేనంబరు 377లోని 4.37 ఎకరాలు పుష్పగిరి శంకరాచార్యుల మఠం స్థలాన్ని కొందరు కబ్జా చేశారు. సదరు స్థలంలో గుడిసెలు, నివాస గృహాలు వెలిశాయి. ఇక్కడ సెంటు రూ.10 లక్షలు పలుకుతోంది.

గుడిసెలు వేసి..

సర్వేనంబరు 569లో 8.80 ఎకరాలు కొండ విరిక్కి మఠానికి చెందిన భూమిపై కొందరు కన్నువేశారు. నాలుగు నెలల కిందట స్థలాన్ని ఆక్రమించారు. ఓ పార్టీ నాయకుల సహకారంతో స్థానికులు గుడిసెలు వేసుకున్నారు. వారికి పట్టాలు ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేస్తున్నారు. పట్టణంలో సొంత ఇళ్లు ఉన్నవారు, లేని వారు కూడా పోటీపడి గుడిసెలు వేసుకున్నారు.

పట్టాలు జారీ

మఠం ఆస్తులను రెవెన్యూ అధికారులు ఇళ్లపట్టాలు మంజూరు చేస్తున్నారు. దస్త్రాలు పరిశీలించకుండానే ఇచ్చేస్తున్నారు. దీంతో మఠం స్థలాలపై హక్కులు సాధించారు. తర్వాత అనేక మంది ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయించారు. సర్వేనంబరు 327లోని 4.37 ఎకరాల విస్తీర్ణంలోని స్థలం కబ్జాకు గురైంది. ఆలస్యంగా గుర్తించిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు రిజిస్ట్రేషన్లు చేయడం లేదు. రెవెన్యూ అధికారులు మాత్రం ఏడాది కిందట వరకు పట్టాలు పేర్లుమార్పు చేశారు. తాజాగా పట్టణ శివారులోని భూమి ఆక్రమణలకు గురైంది. పట్టణంలోని రెండు చోట్ల స్థలం ఆక్రమార్కుల చేతుల్లోకి వెళ్తున్నా అతీగతి లేకుండా పోతోంది.

సమాచారం ఇచ్చాం..

-నాగేంద్రుడు, ఈవో, గ్రూప్ టెంపుల్స్, గుత్తి

మఠం ఆస్తుల అన్యాక్రాంతంపై తాము నిర్వాహకులకు సమాచారం ఇచ్చాం. పోలీసుల సాయంతో మఠం ఆస్తులను స్వాధీనం చేసుకోవచ్చు. శంకరాచార్యుల మఠం ఆస్తుల ఆక్రమణదారులపై పోలీసులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కడపలోని మఠం అధికారులు ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదులకు జవాబుదారీగా ఉండాలి

ఫిర్యాదును పరిశీలిస్తున్న ఎస్పీ జగదీశ్

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: సమస్య పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్‌లకు వచ్చే బాధితుల ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపేలా జవాబుదారీగా ఉండాలని ఎస్పీ జగదీశ్ అధికారులను సూచించారు. ఫిర్యాదుదారుల సంతృప్తే లక్ష్యంగా సాయిని పెంచేలా పరిష్కారం ఉండాలన్నారు. స్థానిక పోలీస్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమాన్ని సోమవారం ఎస్పీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎస్పీ 105 ఫిర్యాదులను స్వీకరించారు. పిటిషనర్లతో ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలు విని అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. భార్యాభర్తల గొడవలు, కుటుంబ సమస్యలు, రస్తా వివాదాలు, తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అనంతపురం మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ కుటుంబమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

పూర్తి వివరములకు: 8008709784

దారి మళ్లిన రూ.6 లక్షలు

●రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో అవినీతి

శింగనమల, న్యూస్‌టుడే : శింగనమల మండలంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో అవినీతి తాజాగా వెలుగులోకి వచ్చింది. రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో మహిళా రైతులకు వచ్చే ఎఫ్‌ఈవో నిధులను దారి మళ్లించి వెలుగు ఉద్యోగి బ్యాంకు ఖాతాకు బదిలీ చేశారు. ఆమె మరణించడంతో డబ్బు ఉపసంహరణకు ముప్పుతిప్పలు పడుతుండటంతో విషయం వెలుగులోకి వచ్చింది.

అసలు ఏం జరిగిందంటే?

శింగనమల మండలంలో డ్వాక్రా సంఘాలకు అనుబంధంగా రైతుఉత్పత్తి దారుల సంఘాలను ఏర్పాటు చేశారు. రైతులకు పంటల సాగుకు రుణాలు అందించి, వ్యవసాయ అభ్యున్నతికి సహాయ పడటం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. రైతులకు ఎఫ్‌ఈవో నిధులను రుణాలుగా ఇచ్చి నెల వాయిదాల్లో తక్కువ వడ్డీ వసూలు చేస్తారు. అయితే వెలుగు కార్యాలయంలో పని చేసే మహిళా ఉద్యోగి బ్యాంకు ఖాతాలోకి కొద్ది నెలల క్రితం ఎఫ్‌ఈవో నిధులను మూడు సార్లు రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.6 లక్షలు బదిలీ చేశారు. సాధారణంగా సంఘాలకు రుణాలు ఇవ్వాలంటే గ్రామ సంఘాల లీడర్లు, యానిమేటర్, సీసీ, ఏపీఎం సంతకాలను మినిట్స్ బుక్‌లో నమోదు చేసిన తర్వాతే రుణాలను బదిలీ చేస్తారు. అయితే రూ.6 లక్షల బదిలీ విషయంలో ఈ నిబంధన లేవీ పాటించలేదని తెలుస్తోంది.

ఖాళీ చెక్కులపై సంతకాలు

రైతు ఉత్పత్తిదారుల సంఘాల లీడర్లతో ఖాళీ చెక్కులపై సంతకాలు తీసుకుని నేరుగా నాలుగు నెలల కిందట మూడు దఫాలుగా వెలుగు ఉద్యోగి ఖాతాలకు బదిలీ చేశారు. ఈ నిధుల బదిలీ విషయంలో శింగనమల వెలుగు అధికారులు, కెనరాబ్యాంకు అధికారుల పాత్ర ఉందని స్పష్టమవుతోంది. నగదు బదిలీ చేసిన తర్వాత ఇటీవల వెలుగు ఉద్యోగి అనారోగ్యంతో మరణించడంతో బదిలీ చేసిన డబ్బులు పంచుకోవడంలో ఇబ్బందులు తలెత్తడంతో అవినీతి విషయం వెలుగులోకి వచ్చింది.

ఏపీఎం ఏమన్నారంటే?

ఏపీఎం ఈశ్వరయ్య శింగనమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన స్పందిస్తూ రూ.6 లక్షలు మరణించిన ఉద్యోగి ఖాతాలో జమా అయిన విషయం వాస్తవమేనని అంగీకరించారు. నా సంతకాలు లేకుండానే రూ.6 లక్షలు బదిలీ అయ్యాయని, ఇప్పటికీ మరణించిన ఉద్యోగి ఖాతాలోనే డబ్బులు ఉన్నాయని గుర్తించామన్నారు.

పందిరి పద్ధతి.. మేలైన దిగుబడి!

☛ కాసులు కురిపిస్తున్న కాకర

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: తీగజాతి కాకర పంటను పందిరి పద్ధతిలో సాగు చేస్తూ అధిక దిగుబడులతో పాటు అదే స్థాయిలో లాభాలు ఆర్జిస్తున్నారు. ఆయనే కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది గ్రామానికి చెందిన రైతు నారాయణ. మూడు, నాలుగు నెలల పాటు కోతలు వస్తాయి. పందిరి రెండేళ్ల వరకు ఉంటుందని, ఇందులోనే మరోసారి పంటలు సాగు చేసుకొనేందుకు అనువుగా ఉంటుందని చెబుతున్నారు.

పందిరి విధానంలో పంట సాగు

రూ.3 లక్షల పైనే ఆదాయం

మూడు నెలల కిందట ఒకటిన్నర ఎకరాలో కాకర పంట సాగు చేశారు. కళ్యాణదుర్గంలోని ఎరువుల దుకాణంలో కిలో విత్తనాలు, సాళ్ల పై వేసే కవర్లు, కర్ర, దారాలు, కూలీలకు రూ.1.50 లక్ష పెట్టుబడి పెట్టారు. పంట సాగు చేసిన రెండు నెలలకే కోతలు మొదలయ్యాయి. వారానికి ఒక కోత రాగా 1,500 కిలోల దిగుబడి వస్తోంది. ఇప్పటి వరకు 8 కోతలు పూర్తయ్యాయి. మార్కెట్లో కిలో ధర రూ.20-25 పలుకుతోంది. సుమారుగా రూ.2.60 లక్షల వరకు ఆదాయం వచ్చింది. మరో 8 వరకు కోతలు వస్తాయని, దాదాపు రూ.3 లక్షలకు పైగానే లాభాలు వస్తాయని రైతు చెబుతున్నారు.

మార్కెట్ సౌకర్యం..

● అనంతపురం, హైదరాబాద్, నాగపూర్, బెంగళూరు నగరాలకు వ్యాపారులు తోట వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. దీని వల్ల రవాణా ఖర్చులు మిగులుతున్నాయి.

ఆశాజనకంగా లాభాలు

- నారాయణ, ఒంటిమిద్ది

గతంలో పలు రకాల పంటలు సాగు చేసి నష్టాలు చవిచూశా. మొదటి సారిగా పందిరి పద్ధతిలో కాకర పంట సాగు చేశా. మొదటి నుంచి కంటికి రెప్పలా చూసుకుంటూ రాగా అదే స్థాయిలో దిగుబడులతో లాభాలు వస్తున్నాయి. ఈ పంట ఎంతో ఊరట కలిగిస్తోంది. మరో మూడు ఎకరాల్లో పంట సాగు చేసేలా అన్ని సిద్ధం చేస్తున్నాం. కాకర అన్ని రకాలుగా కలిసొచ్చింది.

రైతేరాజు

సమస్య సమాధానం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలో వివిధ రకాల పంటలు సాగుచేసిన రైతులు పంటల సాగులో ఎలాంటి సందేహాలున్నా రేకులకుంట వ్యవసాయ శాస్త్రవేత్త నారాయణస్వామి నంబరు: 62812 84235 ఫోన్‌చేసి సలహాలు, సూచనలు పొందవచ్చు.

సమస్య : ప్రస్తుత రబీ వ్యవసాయ సీజన్‌లో వేరుసెనగ పంటను సాగు చేయాలనుకున్నాం. అధిక దిగుబడులు ఇచ్చే విత్తన రకాలు తెలపండి. **-నరసింహులు, బండ్లపల్లి**

సమాధానం: ప్రస్తుత రబీ వ్యవసాయ సీజన్‌లో కదిరి-6, కదిరి-9, టీఏజీ-24 రకం వేరుసెనగ విత్తనాలతో పంటను సాగుచేస్తే అధిక దిగుబడులు పొందవచ్చు.

సమస్య : పత్తి పంటకు పిండినల్లి తెగులు ఆశించింది. ఈ తెగులు నివారణకు మార్గం తెలపండి. **- నాగభూషణ, రేగడికొత్తూరు**

సమాధానం: పత్తిపంటలో పిండినల్లి తెగులు నివారణకు ప్రొఫినోఫాస్ 3 మి.లీ చొప్పున లీటరు నీటికి పిచికారీ చేస్తే తెగులు నివారించవచ్చు.

రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు కృషి: ఎంపీ

భూమిపూజ చేస్తున్న ఎంపీ, తెదేపా నాయకులు, నిర్వాహకులు

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఉన్న రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు కృషి చేస్తానని ఎంపీ బీకే పార్థసారథి పేర్కొన్నారు. సోమవారం హిందూపురం పట్టణంలోని సూగూరు ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న 45 అడుగుల ఏకశిల ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు 'పురం'లో నిలపకపోవడంతో రైల్వే మంత్రి సోమన్న దృష్టికి తీసుకెళ్లగా పది రోజుల్లో నిలిపే ఏర్పాట్లు చేస్తామని చెప్పారన్నారు. చాకర్లపల్లి రైల్వేస్టేషన్‌లోనూ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ అనిల్‌కుమార్, కౌన్సిలర్ ఎన్ఆర్ రాఘవేంద్ర, అభయాంజనేయ స్వామి సేవా ట్రస్ట్ ఛైర్మన్ వై.చంద్రశేఖర్, సభ్యుడు రాయల్ గోపాల్, భక్తులు పాల్గొన్నారు.

ఏడు నెలల సాధనతోనే బాలుడికి ఫిడే రేటింగ్

నిహాల్ నయనంజన్

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: కేవలం ఏడు నెలల సాధన చేసిన ఆ బాలుడు ఫిడే ర్యాపిడ్ రేటింగ్‌లో చోటు సంపాదించాడు. సోమవారం విడుదల చేసిన జాబితాలో తపోవనానికి చెందిన రాఘవేంద్రబాబు, పల్లవిల కుమారుడు ఎస్.నిహాల్ నయనంజన్ ఫిడే రేటింగ్‌లో 1505వ స్థానం సాధించాడు. నగరంలోని ఏ1 చెస్ అకాడమీలో ఈ ఏడాది ఫిబ్రవరిలో చేరిన ఈ ఎనిమిదేళ్ల బాలుడు కర్ణాటకలో నిర్వహించిన అండర్-8 చెస్ పోటీల్లో మూడోస్థానం సాధించడంతో ఫిడే రేటింగ్‌లో చోటు లభించింది. బాలుడికి ఆర్బిటర్ ఉదయ్‌కుమార్‌నాయుడు శిక్షణ ఇచ్చారు.

EENADU eClassifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ : 7382114647.

JOBS

Wanted: Telecallers, Custodians (Ladies) Montessori Elite EM School, Gollapalli, Rapthadu, ATP. Call: 8886654850, 9100281294.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యూయర్స్. ఏజ్: 22-35. ఫ్రెషర్స్ కూడా కావలెను. ✆ : 6281037879.

అనంతపురం పట్టణం నందు ప్రముఖ Company నందు టెలికాలర్స్‌గా పనిచేయుటకు ఆసక్తిగల తెలుగు, కన్నడ యువతులు కావలెను. జీతం: 9,000-12,000. ఇన్సెంటివ్స్ సెల్: 9398063479

FACULTY/ TEACHERS

Wanted Experienced Female Staff for Science and English Subject (3 to 5 Classes) to Work in Blossoms School, Aravind Nagar, ATP. Mob: 9030777676

WANTED Teachers: English, Mahths Subjects For 6 to 10 th EM Classes. Cont: Vignan EM High School, Somandepalli, SSS (Dist) 8309913221, 9347986668

SECURITY GUARDS

సెక్యూరిటీగార్డ్స్, ASOలు ధర్మవరం, హైదరాబాద్‌లో పనిచేయుటకు కావలెను. జీతం: 15,000- 20,000/-. రూం & భోజనం ఫ్రీ. సంప్ర: 6302549622, 9573095856

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

శాంతినారాయణకు అమృతలత జీవన సాఫల్య పురస్కారం

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సాహిత్య ప్రపంచంలో ప్రతిష్ఠాత్మకమైన 'అమృతలత జీవన సాఫల్య పురస్కారం' 2024 సంవత్సరానికి సంబంధించి సుప్రసిద్ధ కథానవలా రచయిత, సాహిత్య ప్రముఖుడు డా.శాంతినారాయణ సోమవారం అందుకున్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూరులో జరిగిన పురస్కారాల పంపిణీ కార్యక్రమానికి కేంద్ర సాహిత్య అకాడమీ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కన్వీనర్ డా.సి మృణాళి, పురస్కార ప్రదాత డా.అమృతలత ముఖ్య అతిథిలుగా హాజరై పురస్కార గ్రహీతను సన్మానించి జ్ఞాపికతోపాటు రూ.25 వేలు నగదు బహుకరించారు. డా. శాంతినారాయణ పురస్కారం అందుకోవడం పట్ల స్థానిక సాహిత్య ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

పురస్కారం అందుకుంటున్న శాంతినారాయణ

ప్రయాణికుల భద్రతపై దృష్టి పెట్టండి : డీఆర్‌ఎం

రైల్వే సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు, న్యూస్‌టుడే : ప్రమాదాలు జరగలేదులే అనే భావనను పక్కనపెట్టి నిరంతరం రైల్వే ప్రయాణికుల భద్రతపై సిబ్బంది దృష్టి పెట్టాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అన్నారు. రైల్వే డివిజన్‌లో గత నెలలో రైళ్లు, గూడ్సులు ప్రమాదాలకు గురికాకుండా నిలువరించిన నలుగురు సిబ్బందికి ఆయన సోమవారం డీఆర్ఎం కార్యాలయంలో మ్యాన్ ఆఫ్‌ద మంత్ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడారు. అడ్డదారుల్లో విధులు నిర్వహించకుండా రైల్వేబోర్డు ఆదేశించిన విధంగా పనులు చేయాలని చెప్పారు. ఇద్దరు స్టేషన్ మాస్టర్లు, గేట్‌మెన్, ట్రాక్‌మెన్లు ప్రమాదాలను నిలువరించారు. వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. తరువాత డివిజన్‌లో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన వారికి రైల్వే ఇవ్వాల్సిన బకాయిలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, కోఆర్డినేషన్ శ్రీనివాస్, సీనియర్ డీఓఎం శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తడబడి తేరుకున్న ఆంధ్ర జట్టు

తేజ

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: అంతర్రాష్ట్ర కల్నల్ సీకే నాయుడు అండర్-23 నాలుగు రోజుల క్రికెట్ పోటీలో ఆంధ్ర జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో కష్టాల నుంచి గట్టెక్కి భారీస్కోరు దిశగా పయనిస్తోంది. సోమవారం రాయలసీమ క్రికెట్ మైదానంలో జరుగుతున్న పోటీలో ఆంధ్ర జట్టు పుదుచ్చేరి జట్టుపై రెండోరోజు ఆటముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. ఉదయం ఓవర్‌నైట్ స్కోరు 268/4తో తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్ కొనసాగించిన పుదుచ్చేరి జట్టు 110.4 ఓవర్లలో 337 పరుగులకు ఆలౌటైంది. తొలిరోజు పటిష్ఠంగా కనిపించిన పుదుచ్చేరి జట్టు చివరి ఆరు వికెట్లు 69 పరుగులకే కూలాయి. ఆంధ్ర బౌలర్లు రాజు, సుమిత్, ఆదిత్యరెడ్డి చెలరేగడంతో వికెట్లు వెనువెంటనే పడ్డాయి. బ్యాటర్లు పృథ్వీ రాజన్‌ఖన్నా (60), నితిన్ ప్రణవ్ (49) పోరాడటంతో ఆ మాత్రం స్కోరు సాధించింది. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టుకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. కేవలం 69 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును జీవీస్పీ తేజ శతకంతో ఆదుకున్నాడు. అభినవ్ (44) సమయస్ఫూర్తిగా బ్యాటింగ్ చేయడంతో నాలుగో వికెట్‌కు అవకాశం లేకుండా పోయింది. మంగళవారం ఆంధ్ర జట్టు సమయోచితంగా ఆడితే మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యత సాధిస్తుంది. భారమంతా బ్యాటర్లపైనే ఉంది.

కదిరి ఆలయ సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం 6 గంటలకు దర్శనం మొదలవుతుంది. 7 నుంచి 9 గంటల మధ్య అభిషేకాలు, పూజా కార్యక్రమాలు, 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటలు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు దైవ దర్శనం ఉంటుంది. ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, రాత్రి 7.30 గంటలకు వెండి రథోత్సవం నిర్వహిస్తారు.

వేరుసెనగలో యాజమాన్య పద్ధతులు

సాగులో వేరుసెనగ పంట

నార్పల, న్యూస్‌టుడే : జిల్లాలో రబీ వ్యవసాయ సీజన్‌లో వేరుసెనగ సాగు చేసే రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త విజయ్‌శంకర్‌బాబు తెలిపారు. నవంబరు 15వ తేదీ వరకు రైతులు వేరుసెనగ విత్తుకోవచ్చన్నారు. విత్తుకు ముందు పొలాన్ని రెండుసార్లు కలియ దున్నుకుని ఆఖరు దుక్కిలో ఎకరాకు 4 టన్నుల పశువుల ఎరువు వేసుకోవాలన్నారు. ఎకరాకు 100 కిలోల సూపర్‌పాస్ఫేట్, 33 కిలోల పొటాష్, 18 కిలోల యూరియా విత్తనం విత్తే సమయంలో పొలంలో చల్లుకోవాలన్నారు. పూత దశలో పంట ఉన్నపుడు 200 కిలోల జిప్సం వేసుకోవాలని సూచించారు. పంట 45 రోజులు, 90 రోజుల దశలో ఉన్నపుడు నీటి తడులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. తద్వారా పంట దిగుబడి పెరిగి రైతులకు అధిక లాభాలు వస్తాయని శాస్త్రవేత్త తెలిపారు.

చిట్కా

బొప్పాయి పాలు.. విదేశాలకు

నంద్యాల జిల్లా చాగలమర్రి మండల వ్యాప్తంగా రైతులు అధికంగా బొప్పాయి సాగు చేస్తుంటారు. చిన్నవంగలితో పాటు సమీపంలోని గ్రామాలైన వైఎస్సార్ కడప జిల్లా కానగూడూరు, క్రిష్ణంపల్లె గ్రామాల్లో 1200 ఎకరాల్లో పండిస్తారు. విత్తనం నాటిన కాలం నుంచి తొమ్మిది నెలలకు పంట చేతికొస్తుంది. పండ్ల సేకరణ అనంతరం 13 నెలల తర్వాత మిగిలినవి, ముదురు కాయలకు గాట్లు పెట్టి పాలను సేకరిస్తున్నారు. తెల్లవారుజాము సమయంలోనే కాయలకు గాట్లు పెడితే కేవలం రెండు గంటల్లోనే పాలు ఊరుతుంది. ఇలా సేకరించిన దాన్ని రాయచోటి, రాజంపేటకు చెందిన వ్యాపారులు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల పాలు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 4 డ్రమ్ముల పాలు సేకరిస్తున్నారు. ఎకరానికి పాల సేకరణ ద్వారా రైతుకు రూ.24 వేల ఆదాయం వస్తుంది. సేకరించిన పాలను పరిశ్రమల్లో మందులు, కాస్మోటిక్స్, సబ్బుల తయారీలో ఉపయోగిస్తున్నారు. బెంగళూరు, చెన్నైతో పాటు నాణ్యతను బట్టి విదేశాలకు సైతం పాలను ఎగుమతి చేస్తున్నారు. బొప్పాయి సాగులో ఎప్పుడైనా ధర పడిపోయినప్పుడు బొప్పాయి పాల సేకరణతో నష్టాల నుంచి రైతులు బయటపడుతున్నారు.

– న్యూస్‌టుడే, చాగలమర్రి

పశువులకు గాలికుంటు వ్యాధి వస్తే?

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : శీతాకాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించడం ద్వారా మరణాలు సంభవించకుండా నివారించవచ్చని బుక్కరాయసముద్రం పశువైద్యశాఖ సహాయ సంచాలకులు రత్నకుమార్ తెలిపారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో కాలి గిట్టల మధ్య పుండ్లు, నోటిలో పుండ్లు ఏర్పడి నురగ వస్తుందన్నారు. దీంతో పశువుల్లో పాల దిగుబడి 50 శాతం తగ్గుతుందన్నారు. అన్ని ప్రభుత్వ పశువైద్యశాలలో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

ప్రైవేట్ వాహనాల యాజమాన్యం నిబంధనలు పాటించాలి

మాట్లాడుతున్న డీటీసీ వీర్రాజు

లక్ష్మీనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ స్కూల్ బస్సులు, కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులు, ప్రైవేట్ వాహనాల యాజమాన్యాలు కచ్చితంగా నిబంధనలు పాటించాలని డీటీసీ వీర్రాజు తెలిపారు. సోమవారం అనంతపురంలోని ఉపరవాణాశాఖ కార్యాలయంలో ప్రైవేట్ వాహనాల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కర్నూలు, మహారాష్ట్ర, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో జరిగిన బస్సు ప్రమాదాల్లో ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. ఇలాంటి ఘటనలు ఎందుకు జరుగుతున్నాయో గుర్తించి, నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల డ్రైవర్లు ఎమర్జెన్సీ డోర్ పని చేస్తుందా లేదా అనే విషయాన్ని పరిశీలిస్తుండాలన్నారు. అత్యవసర ద్వారం వద్ద అదనపు సీట్లు ఏర్పాటు చేసినా, రవాణ మెటీరియల్ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బస్సు బ్రేక్‌లు, టైర్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలని, అలాగే విద్యార్థులు బస్సు ఎక్కి దిగే సమయంలో గమనిస్తుండాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సీట్లను ఆల్ట్రేషన్ చేయకూడదని వివరించారు. ప్రమాదాలు జరగకుండా వాహన యజమానులు తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఎంవీఐలు శ్రీనివాసులు, సునీత, రఘునాథ్, సూపరింటెండెంట్‌లు కామరాజు, రాకేష్, మధుకర్‌బాబు పాల్గొన్నారు.

'కార్మిక హక్కులు కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం'

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: కార్పొరేటు ప్రయోజనాల కోసం కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు ధ్వజమెత్తారు. హిందూపురంలోని అంబేడ్కర్ భవనంలో పట్టణ కన్వీనర్ వి.ఆర్.రాము అధ్యక్షతన రెండో రోజు సోమవారం జరిగిన ముగింపు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల కార్మికుల హక్కులను వ్యతిరేకిస్తూ పని గంటలను పెంచుతూ వారి శ్రమను కంపెనీలకు కట్టబెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆధీనంలో నడిచే సంస్థలను ప్రైవేటు పరం చేయడంతో ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్యను కుదిస్తూ కేంద్ర, రాష్ట్రాలు అన్యాయం చేస్తున్నాయన్నారు.

శ్రీసత్యసాయి జిల్లా కమిటీ ఎన్నిక

ఈ సందర్భంగా 43 మందితో సీఐటీయూ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మరోసారి జడ్.పి.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా జి.ఎల్.నరసింహులు, కోశాధికారిగా లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, దిల్షాద్, శ్రీదేవి,బాబా, ఉషారాణి, అయూబ్‌ఖాన్, ముత్యాలు, కార్యదర్శులుగా సాంబశివ, రాము, సౌభాగ్య, గంగాధర్ నియమితులయ్యారు.

మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

రైతు బలవన్మరణం

రొద్దం: మండలంలోని తురకలాపట్నం గ్రామంలో అంజనప్ప(55) అనే రైతు తన కుమారుడికి ఉద్యోగం రాలేదని మనస్తాపంతో సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భార్య సరోజమ్మ, అంజనప్పలకు ఇద్దరు కుమారులు. ఇటీవల అనారోగ్యంతో పెద్ద కుమారుడు మృతి చెందాడు. రెండో కుమారుడు షణ్ముఖను ఉన్నత చదువులు చదివించారు. రెండేళ్ల నుంచి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేసినా రాలేదని, ఆస్తిపాస్తులు పెద్దగా లేవని మనస్తాపం చెంది అంజనప్ప సోమవారం ఇంటి నుంచి వెళ్లారు. సాయంత్రం తన పొలంలోని విద్యుత్తు నియంత్రిక వద్ద ఉరేసుకొని మృతిచెందినట్లు కాపర్లకు కనిపించడంతో వారు కుటుంబ సభ్యులకు తెలిపారు. భార్య, కుమారుడు ఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. పోలీసులను వివరణ కోరగా ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు వెల్లడిస్తామన్నారు.

చికిత్స పొందుతూ సీఐటీయూ నాయకుడి మృతి

ధర్మవరం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడి, తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పట్టణానికి చెందిన ఉమ్మడి జిల్లా సీఐటీయూ జిల్లా నాయకుడు హైదర్‌వలి(56) సోమవారం మృతి చెందారు. ఆరు రోజుల క్రితం ఆయన ద్విచక్రవాహనంలో అనంతపురం వెళ్లి తిరిగి వస్తుండగా మన్నీల వద్ద ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఆయనను వైద్యం నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా చనిపోయినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆయన మృతిపట్ల సీఐటీయూ నాయకులు సంతాపం తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఇద్దరు వ్యవసాయ కూలీల దుర్మరణం

పుట్టపర్తి పట్టణం: మండలంలోని పెడపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కూలీలు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై లింగన్న తెలిపిన వివరాల మేరకు.. పెడపల్లికి చెందిన వ్యవసాయ కూలీలు సాకల మహేష్(30), మాల రంగప్ప (31) పనులు ముగించుకుని ద్విచక్రవాహనంపై గ్రామానికి బయలుదేరారు. వైఎస్సార్ కాలనీ దాటిన తర్వాత పుట్టపర్తి నుంచి వేగంగా వస్తున్న ఇన్నోవా వారి ద్విచక్రవాహనాన్ని ఢీకొని వెళ్లిపోయింది. మహేష్, రంగప్పలు తీవ్రంగా గాయపడ్డారు. స్పందించిన స్థానికులు వారిని 108 వాహనంలో పుట్టపర్తి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. మహేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలుండగా, రంగప్ప అవివాహితుడు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై అక్కడ లభించిన ఇన్నోవా నంబర్ ప్లేట్ ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామన్నారు. కుటుంబానికి ఆధారమైన ఆ ఇద్దరి మృతితో వారి కుటుంబ సభ్యులు విషాదంలో మునిగారు.

హగరినదిలో కొట్టుకుపోయిన యువకులు

స్పందించి ప్రాణాలు కాపాడిన స్థానికులు

స్థానికులు అందించిన తాడు సాయంతో నదిలో నుంచి వస్తున్న యువకులు

బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే : మండలంలోని వేపులపర్తి సమీపంలో వేదావతి హగరిపై రాత్రి బీటీ ప్రాజెక్టు గేట్లు నుంచి దిగువకు వచ్చిన నీటి ఉద్ధృతితో రోడ్డు కోతకు గురైంది. సోమవారం తెల్లవారు జామున రాయదుర్గం వైపు నుంచి ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంలో వస్తూ ప్రమాదవశాత్తు హగరి నదిలో పడ్డారు. కొంత దూరం వరకు వాహనంతో పాటు వారు కొట్టుకు పోయారు. ఓ చోట వాహనం చిక్కుకొని అక్కడే ఆగిపోయి రక్షించాలని గట్టిగా అరుస్తూ వేడుకొన్నారు. అటుగా వస్తున్న స్థానికులు గమనించి తాళ్ల సాయంతో వారిని బయటకు లాగి రక్షించి ప్రాణాలు కాపాడారు. ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్న వీరిద్దరు విధుల నిమిత్తం వేపులపర్తికి ఉదయాన్నే వెళ్తుండగా ప్రమాదంలో చిక్కుకున్నారు. స్థానికులు చూపిన చొరవకు పలువురు అభినందించారు. అధికారులు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేలా చూడాలని మండల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

సీఎండీ దృష్టికి విద్యుత్తు సమస్యలు

అనంతపురం(విద్యుత్తు): తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో సీఎండీ శివశంకర్ సోమవారం నిర్వహించిన డయల్ యువర్ సీఎండీ కార్యక్రమానికి ఉమ్మడి అనంత జిల్లాల నుంచి పలువురు విద్యుత్తు వినియోగదారులు ఫోన్లు చేసి సమస్యల గురించి తెలియజేసినట్లు ఆ శాఖ ఎస్ఈలు శేషాద్రిశేఖర్, సంపత్‌కుమార్ తెలిపారు. అన్ని జిల్లాల నుంచి సీఎండీకి 87 ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. ఇందులో కొన్ని ఉమ్మడి అనంత జిల్లా నుంచి అందాయన్నారు. విద్యుత్తు లైన్లు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయని, గడువులోపు నియంత్రికలు విడుదల చేయలేదని, కాలిన నియంత్రికలను సకాలంలో మార్చటం లేదని, తరచూ విద్యుత్తు అంతరాయాలు ఏర్పడుతున్నాయని ఫిర్యాదులు చేశారు. వాటిని పరిశీలించి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని ఎస్ఈలు తెలిపారు.

యువతిపై వైకాపా నేత అత్యాచారయత్నం

నల్లచెరువు, న్యూస్‌టుడే: నల్లచెరువు మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిపై అదే గ్రామ వైకాపా నాయకుడు రామాంజినేయులు అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి బయట పనులు చేసి లోపలికి వెళ్లిన యువతిని రామాంజినేయులు గమనించాడు. వెంటనే ఆమెను పట్టుకొని నోటిలో వస్త్రాలు కుక్కి చెంపలపై కొట్టడంతో గట్టిగా కేకలు వేసింది. వాటిని విని ఇంటి పక్కన పశువుల పాకలో ఉన్న యువతి తండ్రి రావడం గమనించిన నిందితుడు పారిపోవడానికి ప్రయత్నించాడు. చుట్టుపక్కల వారు అతడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మగ్బూల్‌బాషా వివరించారు.

బాలికపై అసభ్య ప్రవర్తన..

నిందితుడికి ఐదేళ్ల జైలు

అనంతపురం(లీగల్), న్యూస్‌టుడే: బస్సులో ప్రయాణిస్తున్న బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి చినబాబు సోమవారం తీర్పు ఇచ్చారు. కేసు వివరాలు ఇలా.. అనంతపురానికి చెందిన బాలిక తన తల్లితో కలిసి 2022 ఏప్రిల్ 18న ఓ ప్రైవేటు బస్సులో హైదరాబాద్ నుంచి అనంతపురానికి బయలుదేరింది. అదే బస్సులో శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం మరువపల్లికి చెందిన ముడియం అమర్నాథరెడ్డి కూడా ఎక్కాడు. అతడు అర్ధరాత్రి బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. గమనించిన బాలిక తల్లి అతన్ని మందలించింది. అనంతపురంలో బస్సు దిగాక పోలీసులకు ఫిర్యాదు చేయగా మహిళా పోలీసు స్టేషన్ అధికారులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టి నివేదికను కోర్టుకు అందజేశారు. ఈ కేసులో కోర్టు ఇరువర్గాల వాదనలను పరిశీలించింది. ప్రాసిక్యూషన్ తరఫున ప్రత్యేక పీపీ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో ఐదేళ్ల జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన డీఎస్పీ మహబూబ్‌బాషా, సీఐ భాస్కర్‌రెడ్డి, కోర్టు లైజనింగ్ అధికారి శ్రీనివాసులును ఎస్పీ జగదీశ్ అభినందించారు.

(c) eenadu

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

ఘనంగా వాల్మీకి జయంతి

కుందుర్పి, న్యూస్‌టుడే: మండలంలోని మాయదార్ల పల్లి గ్రామంలో మహర్షి వాల్మీకి జయంతిని గ్రామస్థులు సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వాల్మీకి మహర్షి విగ్రహాన్ని పూలమాలలతో అందంగా అలంకరించారు. అనంతరం మహిళలు కలశాలతో వాల్మీకి విగ్రహాన్ని ఊరేగించారు. గ్రామంలో అన్నదానం చేశారు.

కలశాలతో మహిళల ఊరేగింపు

వేదవతి హగరి తాత్కాలిక రోడ్డుకు మరమ్మతులు

కణేకల్లు, న్యూస్‌టుడే : వేదవతి హగరిలో బీటీపీ వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో కోతకు గురైన చోట సోమ వారం మరమ్మతులు చేశారు. మండలంలోని కణేకల్లు-మాల్యం వద్ద కణేకల్లు తెదేపా నాయకులు సొంత ఖర్చుతో సోమవారం ట్రాక్టర్లు, పొక్లెయిన్‌తో మట్టి తరలించి మరమ్మతులు చేపట్టారు. ప్రవాహం పూర్తిగా తగ్గాక బస్సుల రాకపోకలు పునరుద్ధరించేలా చొరవ తీసుకుంటామని వివరించారు.

మట్టి వేయిస్తున్న తెదేపా నాయకులు

రాయదుర్గం పట్టణంలోని 74ఉడేగోళం పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతుల పాట్లు

యూరియా పంపిణీలో గందరగోళం

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కోతి గుట్ట వద్ద గల 74ఉడేగోళం ప్రాథమిక సహకార సంఘంలో యూరియా పంపిణీలో అధికారుల ముందస్తు ప్రణాళికలు లేక పోవడంతో రైతులు ఆందోళన చేశారు. పీఏసీఎస్‌కు రెండు లారీలు 560 బస్తాల యూరియా వచ్చింది. అధికారులు సోమ వారం పంపిణీ చేస్తారనే సమాచారంతో వేకువజామున 5గం టల నుంచి వందలాదిగా రైతులు తరలివచ్చి యూరియా కోసం వేచి ఉన్నారు. రైతులకు స్లిప్పులు ఇచ్చారు. అధికారులు ఒక వ్యక్తికి అధిక మోతాదులో యూరియా ఇవ్వడంతో రైతులు ఆందోళన చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సొసైటీ అధికారు లను రైతులు నిలదీయగా, గందరగోళ పరిస్థితులు నెలకొ న్నాయి. దీంతో రాయదుర్గం సీఐ జయనాయక్ పోలీసులతో కలిసి పీఏసీఎస్ వద్దకు చేరుకొని రైతులకు సర్ది చెబుతూ క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రైతులకు ఒక పాసు పుస్తకానికి రెండు బస్తాల వంతున యూరియా పంపిణీ చేశారు.

నాడు సేవలు.. నేడు నిరుపయోగం

● అధికారులు స్పందిస్తే వాడుకలోకి..

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: దాదాపు రెండున్నర దశాబ్దాలుగా రాయదుర్గం పట్టణానికి తాగునీరు అందించిన సిద్దలింగప్ప బావి నేడు నిరుపయోగంగా ఉంది. 1978లో అప్పట్లో తాగునీటిని సరఫరా చేసేందుకు పట్టణ సమీపంలో బళ్లారి రోడ్డులోని కుంటిమారెమ్మ దేవాలయం ఎదురుగా ఉన్న సిద్దలింగప్ప బావిలో మోటార్లు ఏర్పాటు చేశారు. నీరు రుచిగా ఉండటంతో బావికి సమాంతరంగా రించ్ తవ్వి సుమారు 25 ఏళ్ల పాటు తాగునీటిని అందించారు. తర్వాత భూపసముద్రం నుంచి హగరి నీటిని పట్టణానికి తీసుకొచ్చినా కొద్ది రోజుల పాటు శాంతినగర్, పార్వతి నగర్ తదితర ప్రాంతాలకు ఈ బావి నీటినే సరఫరా చేశారు. అప్పటి నుంచి బావిని పట్టించుకోక పోవడంతో నిరుపయోగంగా తయారైంది.

చెత్తను వేసి పూడ్చుతూ..

గతంలో వైకాపా అధికారంలో ఉన్న సమయంలో పట్టణంలో పోగవుతున్న చెత్తను తీసుకెళ్లి బావి చుట్టూ నిల్వ చేస్తుండగా ప్రస్తుత ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి ఈ పవిత్ర స్థలంలో చెత్తను వేయడం సరైంది కాదని, చెత్తను తొలగించాలని డిమాండ్ చేయడంతో అప్పటికప్పుడు తొలగించినా పూర్తి స్థాయిలో తొలగించలేదు. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో బావిలో నీరు ఇంకిపోవడంతో అధికారులు సైతం పట్టించుకోలేదు. ప్రస్తుతం భూగర్భ జలాలు పెరగడంతో బావిలో నీరు నిండుగా తొణికిసలాడుతోంది. ప్రస్తుతం పట్టణానికి కణేకల్లు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి తాగునీరు పంపిణీ చేయడంతో ఆలస్యమవుతోంది. దీంతో కొన్ని ప్రాంతాల్లో అయిదు, ఆరు రోజులకు ఒకసారి నీరు వదలడం లేదు. అధికారులు స్పందించి, ప్రత్యామ్నాయంగా సిద్దలింగప్ప బావిలో నీటిని సరఫరా చేస్తే తాగునీటి సమస్య తీరే అవకాశం ఉంది.

బావికి సమాంతరంగా తవ్వించిన రించ్‌లో నీరు

ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డిని వివరణ కోరగా ప్రస్తుతం పైపు లైన్లన్నీ ధ్వంసమయ్యాయి. వేసవి కాలంలో బావిలో నీటి లభ్యత తక్కువగా ఉండటంతో ఆర్థిక భారం పెరుగుతుందనే కారణంగా ఈ నీటిని వాడుకోవడం లేదని చెప్పారు.

క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలకు

ఉరవకొండ, న్యూస్‌టుడే: క్రీడల్లో ప్రతిభ చాటితే ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి అవకాశం ఉంటుందని హెచ్‌ఎంలు రాజేశ్వరి, సత్యనారాయణ, ఎంఈవోలు ఈశ్వరప్ప, రమాదేవి, సెపక్‌తక్రా క్రీడా విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని జడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో చేపట్టిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలు సోమవారంతో ముగిశాయి. అండర్-19 బాలుర విభాగంలో విజేతగా కృష్ణా, రన్నర్‌గా అనంతపురం, బాలికల విభాగంలో విజేత కృష్ణా, రన్నర్‌గా అనంతపురం జిల్లా జట్లు నిలిచాయి. అండర్-14 బాలుర విభాగంలో విజేత తూర్పు గోదావరి, రన్నర్‌గా పశ్చిమ గోదావరి, బాలికల విభాగంలో విజేత పొట్టిశ్రీరాములు నెల్లూరు, రన్నర్‌గా పశ్చిమ గోదావరి జిల్లా జట్లు నిలిచాయి. ఆయా జట్లకు అధికారులు ట్రోఫీలు అందించారు. టోర్నీ పరిశీలకులు రమేశ్, కార్యదర్శి మారుతీప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు రాఘవేంద్ర, నాగరాజు, ప్రభాకర్, సంజీవకుమార్, నాగేంద్ర, జనార్దన తదితరులు పాల్గొన్నారు.

బాలికల విభాగంలో రన్నర్స్ ట్రోఫీని అందుకుంటున్న అనంతపురం జిల్లా జట్టు

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: మా గ్రామంలోని నీటి బోరు పని చేయడం లేదు. మరమ్మతులు చేయించి నీటిని సరఫరా చేయండి **- స్థానికులు, చాబాల గ్రామం**

సమాధానం: పరిశీలించి.. మరమ్మతులు చేయిస్తాం. **- నాగరాజు, గ్రామ కార్యదర్శి**

- న్యూస్‌టుడే, వజ్రకరూరు

భాజపా బలోపేతానికి కృషి చేయండి

కణేకల్లు, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను, చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి భాజపా బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సంధిరెడ్డి శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక చిక్కణ్ణేశ్వర వేడుకల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భాజపా నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాయదుర్గం అసెంబ్లీ కన్వీనర్ హీరోజీరావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు నరేంద్రరావు, మండల అధ్యక్షుడు తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలపై దృష్టి సారించాలి

ఉరవకొండ, న్యూస్‌టుడే: డిగ్రీ పూర్తి చేసుకుంటున్న విద్యార్థులు ఉద్యోగ అవకాశాలపై దృష్టి సారించాలని ప్రిన్సిపల్ ఆదినారాయణ సూచించారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు, ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. చక్కటి ప్రణాళికతో పోటీ పరీక్షలకు సిద్ధం అవుతూనే, వాటి సాధనే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అధ్యాపకులు నీలి వెంకటేశ్, సుధాకర్, సిరాజ్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలో గ్రామస్థులు

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

కణేకల్లు, న్యూస్‌టుడే : మాల్యం గ్రామంలో సోమవారం కల్లేశ్వర ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. ఉదయాన్నే యంత్ర ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు. హోమాలు, అశ్వర్థ నారాయణ కల్యాణోత్సవం నిర్వహించి మంగళహారతి ఇచ్చారు. భక్తులు ధ్వజస్తంభాన్ని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ధ్వజస్తంభ దాత కొళ్లూరు గిరిరాజ జ్యోతిని ఆలయ కమిటీ ఛైర్మన్ విజయ్ కుమార్, ఈఓ దేవదాసు, నాయకులు మహేష్ గౌడ, శరబనగౌడ, అశోక్‌గౌడ తదితర గ్రామస్తులు సత్కరించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బీఎన్‌హళ్లి గ్రామంలో రూ.43.60 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సోమవారం ప్రారంభించారు. తెదేపా మండల కన్వీనర్ హనుమంతు, మండల పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు కాలవను ఎడ్లబండిపై ఊరేగించారు. కాలవ మాట్లాడుతూ ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకమైన సేవలు అందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని తెలిపారు. రాయదుర్గం నియోజకవర్గంలో ప్రజల ఆరోగ్యం కోసం కూటమి ప్రభుత్వం రూ.7.88 కోట్లతో పీఎం అభిం, 15 ఆర్థిక సంఘం నిధులు, నేషనల్ హెల్త్ మిషన్ పథకాల ద్వారా 35 గ్రామీణ హెల్త్ క్లీనిక్‌లు మంజూరయ్యాయని, త్వరలో నిర్మిస్తామని చెప్పారు. మండల తెదేపా నాయకులు కాటా వెంకటేశులు, తిప్పేస్వామి, మండల ఉపాధ్యక్షుడు తిమ్మారెడ్డి, వీరేష్ స్వామి, సోమశేఖర్, గ్రామ సర్పంచులు జి.వన్నూరుస్వామి, రాజశేఖర్‌రెడ్డి, మల్లేశప్ప, హెచ్.వన్నూరుస్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎడ్లబండిపై ఊరేగింపుగా వెళ్తున్న ప్రభుత్వ విప్ కాలవ

రేపటి నుంచి గజగౌరీ దేవి ఉత్సవాలు

బొమ్మనహాళ్ : కర్ణాటక సరిహద్దు మండలాల్లో కార్తిక పౌర్ణమి సందర్భంగా మూడు రోజులు పాటు మహిళలు అత్యంతం వైభవంగా జరపుకొనే గజగౌరీ దేవి, కడ్లే గౌరమ్మ ఉత్సవాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. కర్ణాటక సరిహద్దు మండలాలైన బొమ్మనహాళ్, కణేకలు, రాయదుర్గం, డి.హీరేహాళ్, కణేకల్లుతో పాటు మడకశిర, కళ్యాణదుర్గం, హిందూపురం, కర్నూలు జిల్లాలోని ఆలూరు, ఆదోని, మంత్రాలయం తదితర నియోజకవర్గాల్లో ఒక్కో రకంగా పిలిచే గజగౌరీ దేవి, కడ్లే గౌరమ్మ ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరపుకొంటారు. తెలంగాణలో సమ్మక్క, సారక్క ఉత్సవాలు మాదిరిగా ఇక్కడ గౌరీ దేవి ఉత్సవాలను మహిళలు జరపుకోవడం విశేషం.

'నారా లోకేశ్ పర్యటనలో ఇబ్బందులు రాకూడదు'

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం 8న అధికారికంగా నిర్వహిస్తున్న భక్త కనకదాస జయంతి వేడుకల్లో రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ హాజరవుతున్నారని, ఏర్పాట్ల విషయంలో సమస్య రాకూడదని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. సోమవారం స్థానిక కంబదూరు బైపాస్ సర్కిల్‌లో కనకదాస విగ్రహం, అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. విగ్రహం ఏర్పాటుతో పాటు, మంత్రి సర్కిల్‌కు కనకదాస సర్కిల్‌గా నామకరణం చేస్తారన్నారు. ఆర్డీవో వసంత్‌బాబు, డీఎస్పీ రవిబాబు, తహసీల్దారు భాస్కర్, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, నాయకులతో కలిసి ఏర్పాట్లపై చర్చించారు.

● ఈనెల 13న అమరావతిలో హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే మెగా జాబ్‌మేళాకు సంబంధించి గోడ ప్రతులను సంఘం సభ్యులతో కలిసి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆవిష్కరించారు.

అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

శెట్టూరు, న్యూస్‌టుడే : శెట్టూరు మండలం చెర్లోపల్లి ప్రధాన రోడ్డు నుంచి కైరేవు గ్రామం వరకు తారు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గ్రామస్థులకు ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నట్లు తెలిపారు. డీఎంఫ్ నిధులు రూ.కోటితో ఒకటిన్నర కిలోమీటరు తారు రోడ్డును అత్యంత నాణ్యతతో వేయిస్తామన్నారు. నియోజకవర్గంలో రోడ్లు బాగా లేని ప్రతి గ్రామానికి దశల వారీగా రోడ్లు వేయిస్తామని, ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా సుముఖంగా ఉన్నారన్నారన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

బెళుగుప్ప, న్యూస్‌టుడే: మండలంలోని బూదవర్తి గ్రామానికి చెందిన యువతి అదృశ్యం అయినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. అనంతపురంలోని ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ఈక్రమంలో నెల రోజుల నుంచి ఇంటి వద్దనే ఉంటోంది. ఈనెల 2 నుంచి కనపడటంలేదని తల్లి ఉమక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు.

జూదరుల అరెస్టు

కంబదూరు, న్యూస్‌టుడే: మండలంలోని పలు జూద స్థావరాలపై దాడులు జరిపి ముగ్గురిని అరెస్ట్ చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. సోమవారం ఎస్సై లోకేశ్ సిబ్బందితో కలిసి జూద స్థావరాలపై దాడులు జరిపారు. ముగ్గురిని పట్టుకుని తహసీల్దారు బాలకిషన్ ఎదుట హాజరుపరిచారు. మండలంలో ఎక్కడా అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూస్తామన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీవో వసంతబాబు, ఇతర అధికారులు

పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరం

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే : పొగాకు ఉత్పత్తులు వాడటం ఆరోగ్యానికి హానికరమని ఆర్డీవో వసంతబాబు అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం నిర్వహించారు. వైద్య సిబ్బంది ఆర్డీవో వసంతబాబు, ఇతర అధికారులతో పొగాకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి రాజేష్‌కుమార్, సీడీపీవో ప్రసన్నలక్ష్మీ, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ, ఈవోఆర్డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులనే వాడుదాం

కుందుర్పి, న్యూస్‌టుడే: కుందుర్పిలో భారతీయ జనతాపార్టీ నియోజకవర్గ కన్వీనర్ ముప్పూరి దేవరాజ్, కోకన్వీనర్ గంగాధర్ ఆధ్వర్యంలో సోమవారం ఆత్మనిర్భర్ సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నాయకులు అవగాహన చేశారు. ప్రతి ఒక్కరూ దేశంలో తయారు చేసిన వస్తువులను వినియోగించాలని, భారత్ ఉత్పత్తులను విరివిగా వినియోగించేందుకు కృషి చేయాలని సూచించారు. స్వదేశీ వస్తువులను వాడుతూ, దేశ ఉన్నతిని అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం ఇంటింటికీ ఆత్మనిర్భర్ సంకల్ప్ అభియాన్ స్టిక్కర్లు కరిపించారు. ఈకార్యక్రమంలో మండల భాజపా అధ్యక్షుడు శివశంకర్, బ్రహ్మాస ముద్రం కన్వీనర్ పాతన్న, నాయకులు సజ్జల వెంకటేశ్, రవి, వన్నూరుస్వామి, మంజునాథ, కృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓ ఇంటికి స్టిక్కరు అతికిస్తున్న భాజపా నాయకులు

కదలవు.. అడ్డు తొలగవు

బళ్లారి రోడ్డులోని నీలకంఠేశ్వర స్వామి ఆలయం ఎదురుగా సోమవారం మధ్యాహ్నం ఇలా పశువులు సేద తీరుతున్నాయి. సంబంధిత అధికారులు పశువులు రోడ్డుకు అడ్డు లేకుండా తరలించాలని ప్రజలు కోరుతున్నారు. మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డిను వివరణ కోరగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

- న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం

ఎట్టకేలకు పరిశుభ్రం

వజ్రకరూరు, న్యూస్‌టుడే: వజ్రకరూరు మండలం గడేహోతూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వెనుక ఉన్న సిమెంటు రోడ్డును శుభ్రం చేసి కాలువ ఏర్పాటు చేశారు. 'ఈనాడు'లో ఈనెల 25న 'కురుస్తున్న వానలు.. లోపిస్తున్న పారిశుద్ధ్యం' శీర్షికన ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించి.. సమస్యను పరిష్కరించారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

కంబదూరు, న్యూస్‌టుడే: రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, 17 క్రీడా పోటీల్లో కంబదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కబడ్డీ టీం సభ్యులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు అమర్‌నాథ్, వ్యాయామ ఉపాధ్యాయులు అప్సర్, లలిత తెలియజేశారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం, పాఠశాల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు అభినందించారు.

కరవు మండలంగా ప్రకటించాలి

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఈఏడాది ఖరీఫ్‌లో వేరుసెనగతో పాటు ఇతర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి పేర్కొన్నారు. ఉరవకొండను కరవు మండలంగా ప్రకటించి, రైతులను ఆదుకోవాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటనష్ట పరిహారం మంజూరయ్యే విధంగా చూడాలని కోరారు. సంఘం నాయకులు సిద్దప్ప, జ్ఞానమూర్తి, శీనప్ప, మురళీ తదితరులు పాల్గొన్నారు.

'బలవంతపు భూ సేకరణ ఆపండి'

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలోని కళ్యాణదుర్గం, కంబదూరు, బెళుగుప్ప, కణేకల్ మండలాల్లో వివిధ గ్రామాల్లో జరుగుతున్న బలవంతపు భూ సేకరణను ఆపాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.హెచ్.రాయుడు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయానికి వచ్చి వినతిపత్రం అందజేశారు. ఆయా మండలాల్లో సోలార్ ప్రాజెక్టు పేరుతో జరుగుతున్న భూసేకరణతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. ఈకార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రామచంద్ర, నటరాజు, రాఘవేంద్ర, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో విశేష పూజలు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం మేడా వీధిలోని పేటా బసవేశ్వరస్వామి ఆలయం, కోట వీధిలోని భవాని శంకర దేవాలయం, మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న శివాలయం, బావి బసవేశ్వరస్వామి ఆలయంలోని స్ఫటిక లింగానికి ప్రత్యేక పూజలు చేశారు. శివలింగాలకు పంచామృతాభిషేకం చేసి పలు రకాల పూజలతో విశేషంగా అలంకరించారు.

అలంకరణలో శివలింగం

విడపనకల్లు, న్యూస్‌టుడే: విడపనకల్లు మండలం ఉండబండ భద్రకాళి సమేత శ్రీవీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

వజ్రకరూరు, న్యూస్‌టుడే: కార్తిక సోమవారం సందర్భంగా జరుట్ల రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకం, బిల్వార్చనలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

నేడు ఆంజనేయస్వామి రథోత్సవం

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని 74ఉడేగోళం గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో 3వ వార్షికోత్సవం పురస్కరించుకొని మంగళవారం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు రాయదుర్గం దేవాదాయశాఖ ఈఓ నరసింహారెడ్డి, గ్రామ ప్రజలు తెలిపారు.

శ్రమదానంతో కోనేరు శుభ్రం

కంబదూరు, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా స్థానిక పురాతన మల్లేశ్వరస్వామి ఆలయం కోనేరును సోమవారం హిందూ దైవ సేవకుల స్వచ్ఛందంగా శుభ్రం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దైవ సేవకులందరూ ఖాళీ బకెట్లతో అడుగులో ఉన్న నీటిని తీసివేసి కొలనును శుభ్రం చేశారు. వీరిని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అభినందించారు.

కోనేరును శుభ్రం చేసిన హిందూ దైవ సేవకులు

బంధువుల దాడి.. నలుగురికి తీవ్రగాయాలు

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఆవులదట్ల గ్రామానికి చెందిన గోపాల్ నాయక్, తండ్రి జయరాం నాయక్, తల్లి ప్రమీళాబాయి, సోదరి లక్ష్మీబాయిపై ఉరవకొండ మండలం వెంకటంపల్లి తండాకు చెందిన బంధువులు దాడి చేయడంతో తీవ్రగాయాల పాలయ్యారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. ఆవులదట్ల గ్రామానికి చెందిన గోపాల్ నాయక్‌కు ఉరవకొండ మండలం వెంకటంపల్లి తండాకు చెందిన రాధికబాయితో గత సంవత్సరం వివాహమైంది. ఆమె ప్రస్తుతం గర్భిణి. రెండు కుటుంబాల నడుమ కొద్ది రోజులుగా తీవ్ర మనస్పర్థలు ఉన్నాయి. దీంతో భార్య రాధికాబాయితో పాటు వెంకటంపల్లికి చెందిన బంధువులు గోపాల్‌నాయక్, రాజేష్‌నాయక్, వెంకటేశులునాయక్, సోమ్లానాయక్, సుక్కీబాయి, రాజేశ్వరీబాయి తదితరులు ద్విచక్ర వాహనాల్లో ఆదివారం ఆవులదట్ల గ్రామానికి వచ్చి ఇంటిలో ఉన్న తమపై దాడిచేసి గాయపరచినట్లు బాధితులు రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మొలక దశలోనే ముంచింది!

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలకు చాలా ప్రాంతాల్లో మొలక దశలో ఉన్న పప్పుసెనగ పంట దెబ్బతినింది. నష్టాన్ని అంచనా వేసే దిశగా వ్యవసాయ యంత్రాంగం చర్యలు చేపట్టకపోవడంతో రైతులు ఆందోళన పడుతున్నారు. ఉరవకొండ వ్యవసాయ డివిజన్ పరిధిలోని ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు, గుంతకల్లు మండలాల్లో రబీలో 36,447 ఎకరాల్లో పంట సాగయింది. ఎకరాకు సగటున రూ.6 వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. మొలక దశలో భారీ వర్షాలు పడ్డాయి.

● పప్పుసెనగ రైతుల ఆందోళన

ఉరవకొండ శివారులో చెరువులా మారిన పప్పుసెనగ పొలం

● పలు లోతట్టు పొలాల్లో నీరు నిలిచిపోవడంతో చెరువులను తలపిస్తున్నాయి. దీంతో మొలక దెబ్బతినింది. అధిక వర్షాల తరువాత పగటి ఉష్ణోగ్రత విపరీతంగా పెరిగింది. సుమారు 5,400 పైగా ఎకరాల్లో పంట నష్టాన్ని రైతులు చవి చూడాల్సి వస్తోంది.

● దెబ్బతిన్న పంట వివరాలను క్షేత్ర స్థాయిలో అధికారులు అంచనా వేయడం లేదని రైతులు వాపోతున్నారు. పూర్తిగా దెబ్బతిన్న పంట స్థానంలో మరోసారి విత్తనం వేయడానికి అవసరమైన విత్తనాన్ని వందశాతం రాయితీతో ఇవ్వాలని కోరుతున్నారు.

తిరిగి విత్తనం వేసుకుంటే మేలు

-సత్యనారాయణ, ఏడీ,

మొలక దశలో దెబ్బతిన్న పంటకు నష్ట పరిహారం రాదు. బాధిత రైతులు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ సెనగ విత్తనాన్ని పొంది.. తిరిగి విత్తుకోడం మంచిది. అలాగే సెనగ మొక్కలపై 2శాతం యూరియా ద్రావణాన్ని పిచికారీ చేస్తే.. భూమిలోని పోషకాలను మొక్కలు వేగంగా తీసుకుని ఎదిగే అవకాశం ఉంటుంది.

రూ.78 వేలు ఖర్చు చేశా..

-సూరిబాబు, రైతు

13 ఎకరాల్లో సెనగ పంట సాగు చేశా. ఇందుకు రూ.78వేలు ఖర్చు పెట్టాను. వర్షాలకు పంట మునిగి దెబ్బతినింది. మళ్లీ విత్తనం, ఎరువులు కొనుగోలు చేస్తే మరింత ఆర్థిక భారం తప్పేలా లేదు.

'రోగుల ప్రాణాలతో చెలగాటం'

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే : పట్టణంలోని పెద్దాసుపత్రిలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి గోపాల్, ప్రజా సంఘాల నాయకులు ఆర్‌కే.రాజు, తిప్పేస్వామినాయక్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు ఆర్డీవో వసంతబాబుకు వినతిపత్రం అందజేశారు. ఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సాకే గురుమూర్తి, ఎస్సీఎస్టీ ఐకాస నాయకులు చెలిమప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ గోపాల్, ప్రజా సంఘాల నాయకులు

బస్సులు కండీషన్‌లో ఉండేలా చూడాలి

అవగాహన కల్పిస్తున్న రవాణాశాఖ ప్రాంతీయ అధికారి రమేశ్

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రైవేట్ బస్సులు విద్యార్థులను, ప్రయాణికులను గమ్యస్థానాలు చేర్చే విషయంలో జాగ్రత్తగా ఉండాలని రవాణాశాఖ ప్రాంతీయ అధికారి రమేశ్ అన్నారు. సోమవారం స్థానిక మార్కెట్ యార్డులోని రవాణా శాఖ కార్యాలయంలో ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యం, ప్రైవేట్ బస్సుల యజమానులకు వాహన రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యం, ప్రైవేట్ బస్సుల యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు కాలువలు శుభ్రం చేయరూ!

ఉరవకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న మురుగు కాలువలను శుభ్రం చేయించాలని ఎంపీటీసీ సభ్యుడు వన్నూర్‌సాబ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్లకార్డును ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలో ఆహ్లాదకర వాతావరణం కోసం పార్కులను ఏర్పాటు చేయాలని కోరారు.

ద్విచక్రవాహనం దగ్ధం.. తప్పిన ప్రమాదం

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే : బొమ్మనహాళ్-బళ్లారి అంతర్రాష్ట్ర సరిహద్దులో సోమవారం సాయంత్రం ద్విచక్రవాహనానికి నిప్పు అంటుకుని దగ్ధమైంది. ఉంతకల్లు గ్రామానికి చెందిన విజయ్ బొమ్మనహాళ్ సమీపంలోని సరిహద్దులో పెట్రోల్ పోయించుకుని వస్తుండగా ఆంధ్రా సరిహద్దులో ద్విచక్రవాహనానికి మంటలు చెలరేగి పెట్రోల్ ట్యాంకుకు నిప్పు అంటుకుంది. వెంటనే తేరుకొని దూకేయడంతో అతడు క్షేమంగా బయటపడ్డారు.

(c) eenadu

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

వీరభద్రస్వామికి కార్తికమాస పూజలు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: పెద్దవడుగూరు సమీపంలో వెలసిన వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం కార్తికమాస పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామిని పూలు,ఆకులతో అలంకరించగా వచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు ఆచరించారు. స్వామి దర్శనానికి ఉదయాన్నే భక్తులు విశేషంగా తరలివచ్చారు. ఈనెల 5న లక్షదీపోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పూజలందుకుంటున్న వీరభద్రస్వామి మూలవిరాట్

ప్రతిభావంతులకు అభినందన

గుంతకల్లు, న్యూస్‌టుడే : తిమ్మాపురం గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తెలుగు భాషలో ప్రతిభ చాటడం ఎంతో గర్వంగా ఉందని ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు చంద్రమోహన్ అన్నారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు జ్యోత్స్న, హంపయ్య జాతీయ స్థాయి కవితల పోటీల్లో ప్రతిభను కనబర్చడంతో సోమవారం అభినందనలు, బహుమతులు అందుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది ఖమ్మం జిల్లాకు చెందిన ఉరిమళ్ల ఫౌండేషన్ వారు కవితల పోటీలను నిర్వహించారన్నారు. తాజాగా విడుదల చేసిన ఫలితాల్లో విద్యార్థులు ఇరువురు బహుమతులు సాధించారన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు భోజరాజు, మేరీ, జ్యోతి, సత్యమాధవి, సుజాత, పుష్పావతి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ఎమ్మెల్యే అసంతృప్తి

పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రం మేజర్ పంచాయతీలో పారిశుద్ధ్య పనులు నిర్వహించేది ఇలాగేనా అని ఎమ్మెల్యే శ్రావణిశ్రీ పంచాయతీ అధికారి పెద్దశ్రీనివాసులుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే పంచాయతీలోని విజయనగర్‌కాలనీ, అనంతసాగర్‌కాలనీల్లో ఆకస్మికంగా పర్యటించారు. కాలనీలో రహదారులపై ఏరులై పారుతున్న మురుగునీరు చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీలో ఇలా మురుగు ఉంటే ప్రజలు ఎలా రోడ్లపై తిరుగుతారని మండిపడ్డారు. ప్రజలు దోమలతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వెంటనే పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయాన్ని కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. రెండు కాలనీల్లో తాగునీటి సమస్య ఉందని, పరిష్కారానికి చొరవ తీసుకుంటామన్నారు. ఆమె వెంట ఎంపీపీ సునీత, తెదేపా నాయకులు ఓబుళపతి, రవీంద్ర, జనసేన నాయకులు చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనలో వెనుకబాటు!

పడిపోయిన ఆస్తుల క్రయవిక్రయాలు

గుత్తి, గుంతకల్లు, న్యూస్‌టుడే : ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని గుత్తి, గుంతకల్లు రిజిస్ట్రేషన్ అధికారులు సాధించలేకపోతున్నారు. మూడేళ్లల్లో ఏయేడాది కూడా లక్ష్యాన్ని చేరుకోలేదు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ధరలకు విపరీతంగా పెంచడంతో సామాన్యులు దూరంగా ఉంటున్నారు. దాన విక్రయం కింద రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. దాన విక్రయం కింద రుసుము తక్కువగా ఉంటోంది. అందుకే చాలా మంది తమ వారసులకు, బంధువులకు తమ ఆస్తులను దాన విక్రయంతోనే రిజిస్ట్రేషన్లు చేయిస్తూ వస్తున్నారు. ఈకారణంగా ప్రభుత్వానికి ఆదాయం తగ్గుతోంది.

రిజిస్ట్రేషన్ల ధరలు పెరగడంతో..

● గుత్తిలోని కార్యాలయానికి పెద్దవడుగూరు, గుత్తి, గుంతకల్లు గ్రామీణంలోని పలు గ్రామాల

పట్టణం	సంవత్సరం	ప్రభుత్వ లక్ష్యం (రూ.కోట్లలో)	సాధించిన ప్రగతి	రిజిస్ట్రేషన్లు
గుత్తి	2023-24	23.35	15.20	11,405
	2024-25	21.70	12.71	6,505
గుంతకల్లు	23-24	31.14	22.58	16,435
	24-25	33.65	21.95	7,511

ప్రజలు, రైతులు తమ ఆస్తుల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లకు వస్తుంటారు. కార్యాలయం నిత్యం రద్దీగా ఉంటోంది. పట్టణంలోని కార్యాలయం బ్రిటిష్ కాలంలో నిర్మించినది కావడంతో చిన్నదిగా ఉంది. పైగా వర్షం వస్తే కారుతోంది. గుంతకల్లులో అద్దె భవనంలోనే కార్యాలయం నడుస్తోంది. ప్రజలు కార్యాలయం వద్ద రిజిస్ట్రేషన్లకు గంటలు తరబడి నిరీక్షించాల్సి ఉంది. ఎకరా రిజిస్ట్రేషన్‌కు గతంలో రూ.1.32లక్షలు ఉండగా ఇప్పుడు రూ.2లక్షలు అయింది. ఇంటికైతే గజానికి రూ.500 ఉండగా తాజాగా రూ.800 చేశారు. ప్రభుత్వం ఆదాయానికి పెద్దపీట వేస్తోంది. సామాన్యుల పాట్లు పట్టించుకోవడంలేదన్న విమర్శలు ఉన్నాయి.

● గుంతకల్లు పెద్దపట్టణం అయినా రిజిస్ట్రేషన్లు పెద్దగా జరగడం లేదు. ఆస్తుల విలువలను పెంచడంతోనే రిజిస్ట్రేషన్లు స్తంభిస్తున్నాయి.

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

సమస్య: గుంతకల్లులోని కూరగాయల మార్కెట్‌లో మాంసం విక్రయాలు జరిగే చోట అపరిశుభ్రత నెలకొంది. **- రాజేశ్**

సమస్య: గుంతకల్లులో మెయిన్ రోడ్డులో పల్లవి హోటల్ దగ్గర డివైడర్ ప్రాంతంలో చెత్తను శుభ్రం చేయటం లేదు. **- కుమార్**

సమాధానం: క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. **- రాజా, శానిటేషన్ కార్యదర్శి, 18వ సచివాలయం**

– న్యూస్‌టుడే గుంతకల్లు పట్టణం

సమస్య: పామిడిలోని వెంగమనాయుడు, పి.కొత్తపల్లి, చైతన్యకాలనీల్లో పలు చోట్ల విధి దీపాలు కొన్నాళ్లుగా వెలగడం లేదు.- లక్ష్మీ, స్థానికురాలు

సమాధానం: వీధి దీపాలు వెలగని ప్రాంతాలను పరిశీలించి వెంటనే దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- అశ్వర్థమనాయుడు, ఈవో, పామిడి**

సమస్య : పామిడిలోని పి.కొత్తపల్లి గ్రామంలో మూడు రోజులుగా కుళాయిలకు నీరు రావడం లేదు. ఒకవేళ నీరు వదిలినా వేళలు పాటించడం లేదు. **- పుష్పావతి**

సమాధానం : నీటి సరఫరా చేసే మోటారు పనిచేయకపోవడంతో సమస్య వచ్చింది. మోటారుకు మరమ్మతులు చేశాం. వెంటనే కొత్తపల్లి గ్రామానికి నీరు సరఫరా చేస్తాం. **- అశ్వర్థనారాయుడు, ఈవో, పామిడి**

– న్యూస్‌టుడే పామిడి

మహిళా క్రికెటర్ల విజయంపై సంబరాలు

తాడిపత్రిలో.. కేకు కోస్తున్న తెదేపా మహిళా నాయకురాళ్లు

మహిళా జట్టు వరల్డ్‌కప్ సాధించడంతో సోమవారం తాడిపత్రిలో తెదేపా మహిళా నాయకులు పెద్దఎత్తున సంబరాలు జరుపుకొన్నారు. ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ఆధ్వర్యంలో మహాత్మ గాంధీ కూడలిలో కేక్ కోసి మిఠాయిలు పంచుతూ సంబరాలు చేశారు. మున్సిపల్ వైస్‌ఛైర్మన్ పేళ్లావతి, తలారి అరుణ, మార్కెట్‌యార్డు ఛైర్మన్ నాగరాణి, కస దుర్గ ఆలయ డైరెక్టర్ జింకా లక్ష్మీదేవి, హజ్ కమిటీ సభ్యురాలు రేష్మాపర్వీన్ పాల్గొన్నారు.

గుంతకల్లు, న్యూస్‌టుడే: భారత మహిళా క్రికెట్ జట్టు ప్రపంచకప్ పోటీలో విజయం సాధించినందుకు తెదేపా పట్టణ నాయకులు సోమవారం రాత్రి పట్టణంలో కేకు కోసి సంబరాలు చేశారు. యాదవ ఫెడరేషన్ డైరెక్టర్ మస్తాన్ యాదవ్, సింగిల్ విండో అధ్యక్షుడు మస్తాన్నా, తెదేపా మండల అధ్యక్షుడు రామన్నచౌదరి, మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు సరోజమ్మ, భాజపా నాయకుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

గుంతకల్లు : సంబరాలు జరుపుకొంటున్న తెదేపా నాయకులు

తాడిపత్రి, న్యూస్‌టుడే: భారత క్రికెట్

మట్కా నిర్వాహకుల అరెస్టు

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి ఆర్.ఎస్. తొండపాడు గ్రామాలకు చెందిన ఇద్దరు మట్కా నిర్వాహకులను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. కంబగిరి, అంజనేయులు గుత్తి శివారులోని ఓవంతెన్ హాల్ వెనుక మట్కా చీటీలు రాస్తుండగా సీఐ రామారావు, ఎస్ఐ సురేశ్‌బాబు తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. నిర్వాహకులను అరెస్టు చేసి వారి నుంచి రూ.52,060 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆసుపత్రిలో మెరుగైన వసతులు కల్పించాలి

ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలో ఉన్న వైద్యవిధాన ఆసుపత్రిలో రోగులకు సరైన వసతులు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడిపత్రి వైద్య విధాన ఆసుపత్రికి మూడు జిల్లాల ప్రజలు వందల సంఖ్యలో రోజూ వైద్యం కోసం వస్తుంటారని తెలిపారు. గత వైకాపా ప్రభుత్వంలో ఎలాంటి వసతులు ఏర్పాటు చేయకుండా ప్రారంభించారని, ఇప్పటికీ అదే పరిస్థితి ఉందన్నారు. చిన్నపాటి రోగాలతో వచ్చిన వారిని కూడా వైద్యులు అనంతపురానికి సిఫార్సు చేస్తున్నారని తెలిపారు. వైద్య సిబ్బంది కొరతను తీర్చాలన్నారు. నాయకులు చిరంజీవి, నాగేంద్ర, సూరి, ఆబ్రహం, రత్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సుల్లో భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: ప్రైవేటు బస్సుల్లో ప్రయాణికుల, విద్యార్థుల భద్రత ముఖ్యమని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజాబాబు పేర్కొన్నారు. సోమవారం గుంతకల్లులో హౌసింగ్ బోర్డులో ఎంవీఐ కార్యాలయంలో ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం, ప్రిన్సిపల్, కరస్పాండెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంవీఐ మాట్లాడుతూ బస్సుల లైట్లు, ఇండికేటర్, బస్సుల కండిషన్, బ్రేకుల సిస్టం, టైర్ల పరిస్థితి, వేగం, డ్రైవర్ల ఆరోగ్య తదితర పది అంశాలపై చర్చించారు. బస్సుల కండీషన్లను ఈ నెల 10తేదీ లోపల సరి చేసుకోవాలన్నారు.

ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రాజాబాబు

తాడిపత్రి, న్యూస్‌టుడే : ప్రైవేట్ పాఠశాల బస్సుల్లో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని, బస్సు కండిషన్‌లో ఉండేవిధంగా చూసుకోవాలని ఎంవీఐలు శ్రీనివాసులు, రాజగోపాల్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంవీఐ కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలల యజమానులతో సమావేశం నిర్వహించారు.

పప్పుసెనగ విత్తనాల పంపిణీ

యల్లనూరు(పుట్లూరు), న్యూస్‌టుడే: యల్లనూరు మండలంలోని పాతపల్లి గ్రామంలో సోమవారం రైతులకు పప్పుసెనగ విత్తనాలు పంపిణీ చేసినట్లు ఏఓ కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. యల్లనూరు, జంగంపల్లి, వెన్నపూసపల్లి గ్రామాల రైతులకు కూడా పప్పు సెనగలు అందించామన్నారు. ఒక్కో రైతుకు గరిష్ఠంగా 5 బస్తాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. రాయితీ పోగా క్వింటా ధర రూ.5850తో విత్తనాలు అందించినట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ఫోన్‌నంబరును తీసుకుని సమీప రైతుసేవాకేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలని వివరించారు.

పప్పుసెనగలను పరిశీలిస్తున్న రైతులు, అధికారులు

భక్తిశ్రద్ధలతో కార్తిక దీపోత్సవం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : పాత గుంతకల్లులో సూర్యసింహాసనం మఠంలో సోమవారం వీరశైవ సంఘం అధ్వర్యంలో కార్తికదీపోత్సవం ఘనంగా జరిగింది. ఈకార్యక్రమానికి ఉరవకొండ గవిమఠం ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్ర మహాస్వాములు హాజరయ్యారు. మఠంలో గణపతిపూజ, ఉమామహేశ్వర వ్రతం జరిగింది. రాజేంద్రస్వాములు, మఠం స్వాములు శివలింగానికి విశేష పూజలు చేశారు. తరువాత ఆవరణలో కార్తిక జ్యోతులు వెలిగించి దీపోత్సవం గురించి భక్తులకు వివరించారు.

వాహనాలను కట్టడి చేయరూ!

తాడిపత్రిలోని యల్లనూరు రోడ్డులో దారిపొడువునా వాహనాలు నిలుపుతున్నారు. చౌడేశ్వరి దేవాలయం వద్ద నుంచి గౌరీశంకర్ ఆలయం వరకు రహదారి పురపాలిక పరిధిలో వస్తుంది. అక్కడ విభాగిని నిర్మించకపోవడంతో వాహనాలు నిలుపుతున్నారు. దీంతో మలుపు తిరిగే వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అక్కడ విభాగిని నిర్మించి వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. దీనిపై మున్సిపల్ ఏఈ నాగేంద్రను వివరణ కోరగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.–న్యూస్‌టుడే, తాడిపత్రి

సచివాలయ భవన అద్దాలు ధ్వంసం

కడవకల్లు గ్రామ సచివాలయం అద్దాలు పగిలిపోయాయి. వీటి మరమ్మతుల విషయాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఏడాదిన్నర క్రితం కొందరు ఆకతాయిలు మద్యం మత్తులో గ్రామ సచివాలయ అద్దాలు ధ్వంసం చేశారు. తిరిగి పునరుద్ధరించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిదులు స్పందించలేదు. ఇప్పటికైనా స్పందించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, పుట్లూరు

వ్యర్థాలతో దుర్గంధం

తాడిపత్రిలోని యల్లనూరు రోడ్డు బైపాస్‌లో దారిపొడువునా వ్యర్థాలు పడేశారు.. అంతేకాకుండా పట్టణంలో చనిపోయిన జంతువులను దారిపక్కలోనే పడేయడంతో దుర్వాసన వస్తోంది. దారిలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. యల్లనూరు వద్ద రోడ్డు దాటాలంటే ముక్కుమూయాల్సిందేనని వాహనదారులు వాపోతున్నారు. దీనిపై మున్సిపల్ ఏఈ నాగేంద్రను వివరణ కోరగా వెంటనే పరిసరాలను పరిశీలించి శుభ్రత పనులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తామన్నారు. –న్యూస్‌టుడే, తాడిపత్రి

మురుగు కాలువలు నిర్మించరూ!

గుత్తిలోని జంగాల కాలనీలో మురుగు కాలువలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. మురుగు ఒకే చోట నిల్వ ఉండటంతో దోమల బెడద అధికంగా ఉంది. దీంతో కాలనీ ప్రజలు రోగాల భారిన పడుతున్నారు. కొన్నేళ్ల నుంచి కాలువలు శిథిలమైనా అధికారులు, ప్రజల ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. మౌలిక వసతులు కల్పించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, గుత్తి గ్రామీణం

అన్నప్రసాద గోడపత్రాల ఆవిష్కరణ

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: శబరిమల అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు అఖిలభారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టే అన్నదాన కార్యక్రమ గోడపత్రాలను సోమవారం ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి చేతుల మీదుగా కమిటీవారు విడుదల చేశారు. ట్రస్ట్ ట్రెజరర్ ఈశ్వరయ్య మాట్లాడుతూ అయ్యప్పస్వామి దర్శనం కోసం వెళ్లే ప్రతి భక్తునికి శబరిమలలోని ఎరిమేలి సమీపంలో పేరునాడు, పంబవాలి దగ్గర ఈనెల 16వ తేదీ నుంచి జనవరి 20వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ట్రస్ట్ జాతీయ ఉపాధ్యక్షుడు నరసింహా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాము, పాల్గొన్నారు

నకిలీ ఎరువుల విక్రయాలను నిరసిస్తూ ధర్నా

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : గుంతకల్లులో కల్తీ విత్తనాలు, నకలీ రసాయన మందులు, ఎరువులను పంటలకు వినియోగించి రైతులు త్రీవంగా నష్టపోతున్నారని, వీటిని విక్రయిస్తున్న ఫర్టిలైజర్స్ దుకాణాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు అధికారులను డిమాండు చేశారు. సోమవారం సీపీఎం నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

పుట్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని కడవకల్లు గ్రామంలోని ఉన్నత పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు శంకరరెడ్డి పేర్కొన్నారు. 14 సంవత్సరాల బాలికల పోటీల్లో అథ్లెటిక్స్, షాట్‌పుట్ విభాగంలో నందక్క 6.79 మీటర్లు విసిరి ప్రథమస్థానం సాధించినట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం సంతోషకరమని చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయుడు గంగరాజు, ఎంఈఓ శ్రీదేవి పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

5న లక్ష దీపారాధన మహోత్సవం

పామిడి, న్యూస్‌టుడే : పామిడిలో స్వయంభూగా వెలసిన గేశ్వరస్వామి ఆలయంలో 5న లక్ష దీపారాధన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కృష్ణయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం గణపతిపూజ, రుద్రాబిషేకం, బిల్వార్చన ,మహామంగళ హారతి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ లక్ష దీపారాధన మహోత్సవంలో పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రైవేట్ ఉద్యోగి ఇంట్లో చోరీ

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని కృష్ణాపురం 5వ రోడ్డుకు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగింది. పట్టణంలోని ఓ కళాశాలలో పనిచేస్తున్న మహమ్మద్ రఫీ ఊరికి వెళ్లడంతో అతని ఇంటి తలుపులు గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి బీరువాలోని ఒకటిన్నర తులం బంగారు గొలుసు, రూ.15 వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆరోహనరావు తెలిపారు.

రాళ్లదాడి ఘటనలో 26 మందిపై కేసు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని పోరాట కాలనీలో ఆదివారం జరిగిన రాళ్ల దాడిలో తెదేపా, వైకాపా వర్గీయులపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో తెదేపాకు సంబంధించి షబ్బీర్, పెద్దయ్య మరో 13మంది, వైకాపాకు చెందిన కంచం రామ్మోహన్‌రెడ్డి, గడ్డం పరమేష్ మరో 13మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఆరోహన్‌రావు తెలిపారు. ఎలాంటి గొడవలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని, శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వివాహిత ఆత్మహత్య

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులో మోదీనాబాదులో సువర్ణ(48) అనారోగ్య కారణాలతో సోమవారం మధ్యాహ్నం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఒకటో పట్టణ పోలీసులు పేర్కొన్నారు. హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు సువర్ణకు రెండేళ్ల కిందట అపెండిక్స్ ఆపరేషన్ జరిగింది. ఆరు నెలల కిందట గర్భసంచిని తొలగించారు. అప్పటి నుంచి కడుపునొప్పితో బాధపడుతూ ఉండేదన్నారు. ఆనొప్పి భరించలేక జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఫ్యాన్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. భర్త కృష్ణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు వివరించారు.

రెడ్డిపల్లిలో ఇరువర్గాల ఘర్షణ

నలుగురికి గాయాలు

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే : రెడ్డిపల్లి గ్రామంలో పొలం గట్టుపై పశువులు మేసే విషయంలో ఇరువర్గాల మధ్య సోమవారం ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలు కాగా, ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రెడ్డిపల్లికి చెందిన సోదరులు అమర్నాథ్‌రెడ్డి, ప్రబోధర్‌రెడ్డి పొలం సమీపంలోకి అదే గ్రామానికి చెందిన రాజశేఖర్ మేతకు పశువులను తీసుకెళ్లాడు. పొలం గట్టుపై మేత మేస్తూ పశువులు పొలంలోకి వెళ్లి పైపులను తొక్కుతుండంతో పగిలిపోతున్నాయని, పొలంలోకి పశువులను రాకుండా చూసుకోవాలని ప్రబోధర్‌రెడ్డి రాజశేఖర్‌ను మందలించాడు. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. ఇరు వర్గాల్లోని కుటుంబ సభ్యులకు తెలియడంతో కర్రలు, రాళ్లతో దాడి చేసుకున్నారు. రాజశేఖర్ వర్గీయులు కొడవలితో దాడి చేయడంతో అమర్నాథ్‌రెడ్డి, ప్రబోధర్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. రాజశేఖర్, తులసమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. ఇరు వర్గాల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగేంద్రప్రసాద్ తెలిపారు.

రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడిగా వెంకటప్ప

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే: గుత్తి మండలంలోని పి.ఎర్రగుడి గ్రామానికి చెందిన వెంకటప్పను పదవి వరించింది. రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడిగా వెంటప్పను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఉత్వర్వులు సోమవారం విడుదల చేసింది. గుత్తి మండలంలోని పి.ఎర్రగుడి గ్రామానికి చెందిన వెంకటప్ప కొన్నేళ్ల నుంచి తెదేపాకు సేవలందించారు. దీంతో ఆయన కష్టం గుర్తించి ప్రభుత్వం ఆయనకు ఈ పదవి అప్పగించింది. ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఎస్టీ కమిషన్ సభ్యుడిగా అవకాశం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఎస్టీ కుటుంబాల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు.

నారాలోకేశ్‌తో వెంకటప్ప

విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్న లారీ

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలోని పత్తికొండరోడ్డులో సోమవారం ఉదయం విద్యుత్తు స్తంభం పడిపోయింది. ఓ లారీ స్తంభాన్ని ఢీకొనడంతో కూలినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. స్తంభం పడినప్పుడు అక్కడ ఎవరూలేకపోవడంతో ప్రమాదం తప్పింది. స్తంభం పడినప్పుడు అక్కడి సమీపంలో ఉన్న ప్రజలు పరుగులు పెట్టారు. పురపాలిక అధికారులు యుద్ధప్రాతిపదికపై స్తంభాన్ని తీసేశారు.

అతిగా మద్యం తాగి ఒకరి మృతి

పుట్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని అరకటవేముల గ్రామంలో ఓ వ్యక్తి అతిగా మద్యం తాగి మృతి చెందినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన కె.ఓబుళనాయుడు (39) డ్రైవరుగా, వ్యవసాయకూలీగా పని చేస్తూ జీవనాన్ని సాగించేవాడు. ఆదివారం రాత్రి అతిగా మద్యం తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. తాడిపత్రి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాల్సిందే!

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రం పంచాయతీలో పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాల్సిందేనని సీపీఐ జిల్లా కార్యదర్శి పాణ్యం నారాయణస్వామి డిమాండు చేశారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఏళ్లుగా బుక్కరాయసముద్రం పంచాయతీలోని వీరభద్రకాలనీ, ఐలమ్మ, బర్దన్, కేవీఎస్, గిరిప్రసాద్‌నగర్ కాలనీలో ప్రజలు నివాసాలు ఏర్పాటు చేసుకుని నివాసం ఉంటున్నారన్నారు. ఇళ్లపట్టాలు ఇవ్వక పోవడంతో ప్రజలు ప్రభుత్వ పథకాలకు అర్హత కోల్పోతున్నారని వాపోయారు. అనంతరం తహసీల్దారు శ్రీధరమూర్తికి వినతిపత్రం ఇచ్చారు. సీపీఐ నాయకులు నారాయణస్వామి, రామకృష్ణ, హరికృష్ణ, రామాంజనేయులు, ఆనంద్‌కుమార్, సుంకన్న, తిరుపతయ్య, శివయ్య పాల్గొన్నారు.

ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి

‘స్వదేశీ వస్తువులు వాడండి’

నార్పల, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ స్వదేశంలో తయారయ్యే వస్తువులు వాడి, దేశ అభివృద్ధిలో భాగం కావాలని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన భాజపా నాయకులతో కలిసి నార్పలలో స్వదేశీ వస్తువులు వాడాలని ఇంటింటా ప్రచారం చేశారు. అనంతరం భాజపా మండల నాయకులతో సమావేశమై వచ్చే స్థానిక సంస్థల నాటికీ పార్టీని గ్రామాల వారీగా బలోపేతం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో భాజపా నాయకులు ప్రభాకర్‌రెడ్డి, దామోదర్, కాశీవిశ్వనాథ్, నాగేంద్ర, వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరవు జిల్లాగా ప్రకటించాలి

శింగనమలలో.. మాట్లాడుతున్న చిన్నప్పమాదవ్

శింగనమల (బుక్కరాయసముద్రం), న్యూస్‌టుడే: అనంతపురం జిల్లాను వెంటనే కరవు జిల్లాగా ప్రకటించి, రైతులను ఆధుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్ డిమాండు చేశారు. సోమవారం నార్పల తహసీల్దారు కార్యాలయం వద్ద రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. అన్ని రకాల పంటరుణాలను మాఫీ చేయాలన్నారు. అనంతరం తహసీల్దారుకు వినతి పత్రం ఇచ్చారు. రైతుసంఘం నాయకులు గంగాధర్, రామాంజి, సుధాకర్, పెద్దయ్య, నారాయణప్ప, సూరి, శివశంకర్, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: పెద్దవడుగూరు మండలాన్ని కరవు మండలంగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం నాయకులు కోరారు. సోమవారం సీపీఎం నాయకులు దస్తగిరి, ఈశ్వరరెడ్డి, రాజా, బాలరాజు, పూలకృష్ణ తదితరులు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దారు ఉషారాణికి అందజేశారు.

పామిడి, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని మండలాలను కరవు మండలాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం మండల కమిటీ సభ్యులు సోమవారం తహసీల్దారు షర్మిలకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శి మల్లేశ్, సీనియర్ నాయకుడు అనిమిరెడ్డి, శివకుమార్, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

ENDOWMENTS DEPARTMENT
SRI SAMBASIVA SWAMY TEMPLE
Singavaram (V), Yellanur (M), Ananthapur District
e-Procurement Tender
NIT.No.P/COE/1218/2025 Dt: 15.10.2025
E-Tenders are Invited through the e-Procurement Portal for **Re-Construction of Temple.** Interested Bidders may Visit the Official Website **www.apeprocurement.gov.in** for detailed Information, Eligibility Criteria, and Submission guidelines.
Executive Officer

అనంతపురం

•అనంతపురం •రాప్తాడు

విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం విద్య: విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కేఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జీపుజాతా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ వసతిగృహాల్లో ఉండే విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాతపద్ధతిలోనే మెస్‌ఛార్జీలు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. మౌలిక వసతులు కరవయ్యాయన్నారు. కేజీబీవీ, గురుకుల పాఠశాలలు సమస్యలకు నిలయంగా మారాయన్నారు. జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల కొరత నెలకొందన్నారు. డిగ్రీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పరమేష్, గిరి, శివ, భీమేష్, సూర్యప్రకాష్, వంశీ, హరూన్‌రషీద్ పాల్గొన్నారు.

అత్యవసర సేవలపై అవగాహన

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ అత్యవసర సేవల గురించి తెలుసుకోవాలని తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఎంపీడీవో లక్ష్మీనరసింహ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అత్యవసర సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. 108, డయల్ 100తోపాటు చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం 1098, మహిళల కోసం 181, వైద్య సేవలకు 104, సైబర్ నేరాలకు 1930, అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు 101, గ్యాస్ లీకేజీ కోసం 1906, రోడ్డు ప్రమాదాల హెల్ప్‌లైన్ కోసం 1073కి ఫోన్ చేసి సాయం తీసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో నరసింహారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీవాణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అశోక్‌నగర్: 9440247485
తపోవనం: 8008573010
రుద్రంపేట: 8008550310

సమస్య: కమలానగర్‌లోని డీసీఎంఎస్ సమీపంలో శ్రీనివాస డెంటల్ ఆసుపత్రి వద్ద లైటు వెలగడం లేదు. **- సూర్యనారాయణ**

సమాధానం: సిబ్బందిని పంపి లైటు వెలిగే విధంగా చర్యలు తీసుకుంటాం.

సమస్య: భవానీనగర్ ప్రధాన రోడ్డులో ఆవులు అడ్డంగా వస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- శ్రీధర్**

సమాధానం: ఆవుల యజమానులకు నోటీసులు ఇస్తాం.

సమస్య: అశోక్‌నగర్‌లో చెత్త ఎత్తి బ్లీచింగ్ పౌడరు చల్లకుండా వదిలేయడంతో దుర్వాసన, దోమలు వస్తున్నాయి. **- నాగరాజు**

సమాధానం: పూర్తిగా శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడరు చల్లే విధంగా చర్యలు తీసుకుంటాం.

(పై ప్రశ్నలకు నగరపాలక ప్రజారోగ్య అధికారి నరసింహా, డీఈ దాక్షాయణి సమాధానాలు ఇచ్చారు.)

- న్యూస్‌టుడే, అశోక్‌నగర్

సమస్య: రాప్తాడు వ్యవసాయ కార్యాలయంలో అధికారులు ఎవరు ఉండటం లేదు. పని మీద వెళ్లిన ప్రతిసారి కార్యాలయానికి తాళాలు వేసి ఉంటున్నాయి. **- శేఖర్, రాప్తాడు**

సమాధానం: ఈక్రాప్ బుకింగ్, డ్రిప్ ఇరిగేషన్ కోసం గ్రామాలకు వెళ్తున్నాం. మధ్యాహ్నం ఉండేలా చర్యలు తీసుకుంటాం. **- గిరి, వ్యవసాయ అధికారి, రాప్తాడు**

- న్యూస్‌టుడే, రాప్తాడు

కొత్త రుణాల మంజూరుకు కొర్రీలు!

న్యూస్‌టుడే, అశోక్‌నగర్

• పీఎం స్వనిధికి అడ్డుపుల్ల • కార్యాలయాల చుట్టూ వీధి వ్యాపారుల ప్రదక్షిణలు

ప్రధానమంత్రి వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ నిధి/పీఎం స్వనిధి 2.0/ లోక్‌కళ్యాణ్ మేళా లబ్ధిదారులకు కొత్త రుణాల కోసం బ్యాంకర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. 'మీరు గతంలో తీసుకున్న రుణం చెల్లించారు. కొత్తగా మళ్లీ రుణం తీసుకోవచ్చు' అని నేరుగా బ్యాంకుల నుంచి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. అయితే నగరంలోని బ్యాంకులు చుట్టూ తిరుగుతున్నారు. సమాచారం ఇచ్చారు. అయితే వారు గడుస్తున్నా రుణం మాత్రం ఇవ్వడం లేదు. పలు రకాల కారణాలు చెబుతూ జాప్యం చేస్తున్నారు. ఫలితంగా లబ్ధిదారులు బ్యాంకులు, నగర పాలకలోని పట్టణ పేదరిక నిర్మూలన కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

రిజిస్ట్రేషన్‌కు బారులు తీరిన వీధి వ్యాపారులు

వెంటాడుతున్న సాంకేతిక చిక్కులు

లబ్ధిదారునికి బ్యాంకు నుంచి రుణం మంజూరు కాకుండానే అయినట్లు మెప్మా నుంచి బ్యాంకుకు వెళ్లింది. దీంతో రుణం ఇవ్వమని బ్యాంకర్లు చెబుతున్నారు. ఇలాంటి వారు వందల్లో ఉన్నారు. బ్యాంకు నుంచి రుణం మంజూరైనట్లు ఫోన్ చేయడంతో ఎంతో ఆశతో వెళుతున్న వారికి చివరికి నిరాశే ఎదురవుతోంది. లాగిన్‌లో సాంకేతిక చిక్కులు రావడంతో నెల తర్వాత వస్తామని చెబుతుండటంతో బయట అప్పులు చేయాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీధి వ్యాపారులకు ఎక్కువ మందికి ప్రయోజనం చేకూర్చాలని, వేగంగా రుణాలు ఇవ్వాలని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి విడత రూ.15 వేలు, రెండో విడతలో రూ.25 వేలు, మూడో విడతలో ఏకంగా రూ.50 వేల వరకు ఇచ్చి వీధి వ్యాపారులను ఆదుకోవాలని నిర్ణయించారు. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా పలు కారణాలతో అడ్డుపుల్ల వేస్తుండటంతో లబ్ధిదారులు విసిగెత్తుతున్నారు.

కొరవడిన సమన్వయ లోపం

పీఎం స్వానిధి 2.0 పై బ్యాంకర్లకు, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)/, లబ్ధిదారులకు మధ్య సమన్వయం లోపించినట్లు స్పష్టంగా కనిపిస్తుంది. గతంలో పీఎంస్వానిధి 1.0 మధ్యలో కొన్ని రోజులపాటు ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కదలిక వచ్చింది. ఒక్కసారిగా బ్యాంకులు, మెప్మా కార్యాలయం వద్దకు లబ్ధిదారులు భారీగా వస్తున్నారు. జిల్లా కేంద్రం కావడంతో 9,500 మంది వరకు వీధి వ్యాపారులు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 4వేలకు పైగా గుర్తింపు కార్డులు ఇచ్చారు. 8 వేల మందికి పైగా అర్హులను గుర్తించి లక్ష్యాన్ని నిర్దేశించి రుణం దశల వారీగా ఇవ్వాల్సి ఉంటుంది.

సమస్య పరిష్కరిస్తాం

ఆర్పీలు ప్రతి నెలా లక్ష్యం మేరకు రుణాలు మంజూరు చేయించాలని నిర్ణయించాం. కొన్ని బ్యాంకులు వేగంగా చేస్తున్నాయి. మరికొన్ని ఆలస్యం చేస్తున్నాయి. నేరుగా బ్యాంకులకు వెళ్లి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం. లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా చొరవ చూపుతాం. **- సుబ్బరాయుడు, మెప్మా టీపీఆర్‌వో**

బహుమతులు అందుకున్న విజేతలతో కళాశాల ప్రిన్సిపల్ దుర్గేష్

ప్రతిభా పోటీలు.. విజ్ఞాన దీపికలు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ప్రతిభాపాటవ పోటీలు విజ్ఞాన దీపికలని శ్రీచైతన్య జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ దుర్గేష్ పేర్కొన్నారు. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో స్థానిక శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్ విద్యార్థులకు 'ప్రకృతి అందాలు' అనే అంశంపై చిత్రలేఖన పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు భువనేశ్వరి ప్రథమ, జెనిని ద్వితీయ, సోయా తృతీయ బహుమతులు దక్కించుకున్నారు. విజేతలకు ప్రిన్సిపల్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

బాలల సంరక్షణ కేంద్రాలపై నిఘా

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో ఉన్న బాలల సంరక్షణ కేంద్రాలపై నిరంతరం నిఘా, పర్యవేక్షణ ఉండాలని జేసీ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో బాలల సంరక్షణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పది అర్హత కలిగిన పిల్లల రక్షణ కేంద్రాలు(సీసీఐ) అనుమతి కోసం ఆమోదం తెలుపుతున్నట్లు చెప్పారు. గుంతకల్లు కేంద్రంలో ఏర్పాటైన ఐసీడీఎస్‌పై మరోమారు తనిఖీ చేయాలని అధికారులను సూచించారు. పిల్లల సంరక్షణ విషయంలో అజాగ్రత్త, అలసత్వం ఉండకూడదన్నారు. కేంద్రాల పనితీరుపై నిరంతరం తనిఖీ చేయాలన్నారు. ఏ పిర్యాదు వచ్చినా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని జేసీ హెచ్చరించారు. సమావేశంలో సీడబ్ల్యూసీ ఛైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, ఐసీడీఎస్ ఇన్‌ఛార్జి పీడీ అరుణకుమారి, డీసీపీఓ మంజునాథ్, జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ అర్జున తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల క్రీడల క్రికెట్, అథ్లెటిక్స్ జట్ల ఎంపిక

అండర్-14 జిల్లా జట్టు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడల రాష్ట్రస్థాయి క్రికెట్, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా అండర్-14 జట్లను సోమవారం ఎంపిక చేశారు. ఆర్డీటీ మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహించి అందులో ప్రతిభ పాటవాలు చూపిన ఆటగాళ్లను తుది జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా పాఠశాల క్రీడల సమాఖ్య కార్యదర్శులు శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని ప్రకటించారు.

క్రికెట్ జట్టు: అక్రమ్, జగదీష్, యాదవ్, తన్వీర్, తౌఫిక్, కన్నన్, అభినవ్, దీపక్, స్నేహిత్ సింహా, అలి తేజకిరణ్, పవన్, రామ్‌చరణ్, చరణ్‌తేజ్, కౌశిక్‌కుమార్, మోహిత్‌రెడ్డి, క్రితిన్ కార్తికేయ, తమోజ్ఞ.

అథ్లెటిక్స్ బాలుర జట్టు: శ్రీనాథ్ (100 మీ.), పి.రితీష్‌రెడ్డి (200 మీ.), ఎస్.యశ్వంత్ (400 మీ.), సి.పవన్ (600 మీ.), శ్రీనాథ్ (లాంగ్‌జంప్), సి.లోకేష్ (హైజంప్), బి.సమరసింహా (షాట్‌పుట్), జి.ఆనంద్ (డిస్కస్‌త్రో).

బాలికల జట్టు: జి.దేవిక (100 మీ.), కె.భవ్య (200 మీ.), ఎ.రిధి (400, 600 మీ.), ఎన్.అవంతి (లాంగ్‌జంప్), జీవన్ గగన (హైజంప్), వై.నందిక్ష (షాట్‌పుట్), పి.హేమశ్రీ (డిస్కస్‌త్రో).

పేదల గుడిసెలు కూల్చడం అన్యాయం

అనంతపురం(శ్రీనివాసనగర్), న్యూస్‌టుడే: కూడేరు మండలం బ్రహ్మణపల్లి గ్రామంలో శోత్రియం భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలను అన్యాయంగా కూల్చివేయడం గర్హనీయమని అఖిల భారత రైతుకూలి సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా కార్యదర్శి నాగరాజు తీవ్రంగా ఖండించారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ అక్కడ వేలాది శోత్రియం భూములు ఉన్నాయి. అక్రమార్గంలో కొంత మంది రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసి రూ.కోట్లు సంపాదించారని ఆరోపించారు. ఆ భూమిలో కొంత కేటాయించి పేదల ఇళ్లకు అవకాశం ఇవ్వాలని తాము డిమాండ్ చేస్తున్నా పట్టించుకోలేదన్నారు. విధిలేని పరిస్థితిలో పేదలు గుడిసెలు వేసుకుంటే రియల్ ఎస్టేట్ వ్యాపారులతో అధికారులు కుమ్మక్కై గుడిసెలను తొలగించడం అన్యాయమన్నారు. సత్వరమే భూకబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, పేదలకు అదే స్థలంలో పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత జేసీకి వినతి పత్రం అందించారు. ఈ నిరసనలో ఏఐకేఎంఎస్ నాయకులు కృష్ణ, రమణ, రామాంజనేయులు, శివయ్య, చంద్రయ్య, రంగనాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ కార్యదర్శి నాగరాజు

ఆలయాలకు కార్తిక శోభ

నగరంలోని ఆలయాలు కార్తిక శోభను సంతరించుకున్నాయి. కార్తిక మాసం రెండో సోమవారం కావడంతో మహిళలు దీపాలు వెలిగించారు. ఆయా ఆలయాల కమిటీ సభ్యులు దీపోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. **- అనంత సాంస్కృతికం**

ఉసిరి మొక్కల పంపిణీ

అనంత సాంస్కృతికం: నగరంలోని శ్రీనివాసనగర్ సీతారామాంజనేయస్వామి దేవాలయంలో కార్తిక రెండో సోమవారం పురస్కరించుకుని 600 మంది భక్తులకు ఉచితంగా ఉసిరి మొక్కలు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త అళ్లగడ్డ రాము ఆధ్వర్యంలో దాత హనుమంతు చేతులమీదుగా మొక్కలు పంపిణీ జరిగింది. శ్రీవారి సేవకులు అనిల్, ముఖేష్, శివ, సురేష్, ప్రకాష్, శ్రీనివాసరావు, సుంకిరెడ్డి, నాగరాజు, రాజేశ్‌లతో పాటు సనాతన ధర్మం కమిటీ సభ్యులు చేయూతనందించారు.

సమగ్రశిక్షాలో అక్రమాలపై విచారణకు డిమాండ్

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా కార్యాలయంలో గత మూడేళ్లలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని రిజర్వేషన్ సాధికారిక పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఉజ్వల్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ భవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమగ్రశిక్షా కార్యాలయంలోని ఇంజినీరింగ్ అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. నిధులు తమ సొంత ఖాతాకు జమ చేసుకున్నారని ఆరోపించారు. రూ.కోట్ల దుర్వినియోగం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.

నరసనేకుంటను కాపాడండి

నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: అనంత గ్రామీణ మండలం నరసనేకుంట గ్రామాన్ని కాపాడాలని ఆ ప్రాంత ప్రజలు ప్రజా వేదిక వేదికలో అర్జీ ఇచ్చారు. పంచాయతీ తీర్మానాలు లేకుండానే బ్లాస్టింగ్ చేసి మైనింగ్ చేస్తున్నారని ఆరోపించారు. పదేళ్లుగా కొనసాగుతున్నా ఎవరూ పట్టించుకోలేదంటూ ఆక్రోశం వెళ్లగక్కారు. వీరందరూ వినతి ఇవ్వడానికి వెళ్లినప్పుడు కొంత గందరగోళం తలెత్తింది. ఇదే క్రమంలోనే ఏఈఓ రామచంద్ర సస్పెన్షన్‌ను రద్దు చేయాలంటూ రెవెన్యూ భవన్‌లో నిరసన గళం విప్పారు. ప్రణాళిక ప్రకారం ఎస్సీ, ఎస్టీ అధికారులను సస్పెండ్ చేస్తున్నారంటూ ఆరోపించారు. హేలు దద్దరిల్లేలే అరిచారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తీవ్ర చర్యలు తీసుకోవడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. ఈ నిరసనలో ప్రజా సంఘాల నాయకులు నారాయణస్వామి, నరేంద్ర ఎల్లన్న, మండల రమేష్, చిన్న పెద్దన్న, ఓబుళపతి, సాకే చిరంజీవి, తిరుపాల్, ఉజ్వల్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇదే క్రమంలో పాపంపేట కబ్జాకోరులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంఘాల ఐకాస అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. అనంతరం జేసీకి వినతి అందజేశారు.

తాగునీటి వృథాకు అడ్డుకట్ట

కమలానగర్, న్యూస్‌టుడే: నగర శివారులోని రుద్రంపేట పంచాయతీ పరిధిలో ఉన్న ఎంపీయూపీ పాఠశాల సమీపంలో తాగునీటి పైపు మరమ్మతుకు గురైంది. నెల రోజులపాటు నీరు వృథా అవుతూ దారి మొత్తం బురదమయంగా మారింది. దీన్ని గమనించిన తెదేపా సీనియర్ నాయకుడు చెరుకూరి సుధాకర్ తన సొంత ఖర్చులతో కొత్త పైపు వేయించి చేసినట్లు తెలిపారు. ఈ పైపు ద్వారా సుమారు 2 వేల ఇళ్లకు నీరు సరఫరా అవుతోంది.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

తపోవనం(అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా సామాజిక రుగ్మతలను తొలగించడానికి పాటుపడాలని స్వాతంత్ర్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ భవానీ రవికుమార్ పిలుపునిచ్చారు. ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో వారం రోజుల పాటు కురుగుంటలో నిర్వహించిన ప్రత్యేక శిబిరం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులందరూ గ్రామాల్లో పర్యటించి పెంపొందించడం, శ్రమదానం ద్వారా కాలువలు, రహదారులు శుభ్రపరచడం, మూఢనమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ పద్మశ్రీ, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు రమేష్, ఎన్ఎస్ఎస్ అధికారిణి విష్ణుప్రియ, రెడ్‌క్రాస్ ఉప ఛైర్మన్ లక్ష్మీప్రసాద్, కార్యదర్శి మోహనకృష్ణ, పీఆర్ఓ జీవన్ కుమార్, మైభారత్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు.

జ్ఞాపికలు అందజేస్తున్న స్వాతంత్ర్య రాష్ట్ర డైరెక్టర్ భవానీ రవికుమార్

పట్టు తప్పితే ప్రమాదమే

కమలానగర్ నుంచి పోలీసు వెల్ఫేర్ కాంప్లెక్స్ మీదుగా గడియార స్తంభం రోడ్డులోకి వెళ్లే దారి ఇది. నిత్యం వాహన చోదకులతో రద్దీగా ఉంటుంది. అబ్బర్ షాపింగ్ వద్ద ఇటు మురుగు కాలువ మీద నిర్మించిన పలకలు పక్కకు జరిగాయి. అందులో ద్విచక్రవాహనం వెళితే కాలువలో పడే ప్రమాదం పొంచి ఉంది. నగరపాలక యంత్రాంగం తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, అశోక్‌నగర్**

వయస్సు తగ్గించి.. బోగస్ పత్రాలు సృష్టించి

సవాల్‌గా మారిన అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక

> "ఒక క్రికెటర్ వయసు వాస్తవానికి 16 ఏళ్లు. ఆ బాలుడు ధర్మవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో జన్మించిన ధ్రువపత్రం సృష్టించి వయస్సును రెండేళ్లు తగ్గించుకున్నాడు. అదే క్రికెటర్ బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలో పుట్టినట్లు, వయస్సు 14 ఏళ్లు అన్నట్లుగా మరొక పత్రం సమర్పించాడు. ఇటీవల జరిగిన అండర్-14 విభాగం క్రికెట్ పోటీల్లో ఈ బాలుడు మంచి స్కోర్లు సాధించాడు. స్కోరును బట్టి ఇతడికి జట్టులో స్థానం ఇవ్వాల్సిందే. అయితే మూడు వయస్సు ధ్రువ పత్రాలు సమర్పించడం వివాదంగా మారింది. తన కుమారుడిని జట్టుకు ఎంపిక చేయపోతే పెట్రోలు పోసుకొని ఆత్మహత్య చేసుకుంటానని ఆతని తండ్రి బెదిరింపులకు దిగాడు."

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: అండర్-14, 16 విభాగాల్లో క్రికెట్ జట్టు ఎంపిక ఒక సవాల్‌గా మారింది. బోగస్ వయస్సు ధ్రువపత్రాలతో జిల్లా క్రికెట్ సంఘం సభ్యులు తలలు పట్టుకుంటున్నారు. పత్రాలు చూడకుండా ఆటలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తే ఆ విభాగంలో ఉన్న కొందరు ప్రతిభావంతులు నష్టపోతారు. గత ఏడాది అండర్-14 విభాగంలో స్టాండ్‌బైగా ఉన్న ఒక క్రికెటర్‌కు తుది జట్టులో స్థానం కల్పించలేదు. మూడు మ్యాచ్‌లు ఆడించారు. తాజాగా జరిగిన జట్టు ఎంపిక పోటీల్లో 30 ఓవర్లు బౌలింగ్ చేసినా ఒక వికెట్ మాత్రమే ఆ బాలుడికి తీశాడు. ఈ బాలుడిని తుది జట్టుకు ఎంపిక చేయలేదని తండ్రి తప్పుడు ప్రచారం మొదలెట్టాడు. జట్టు ఎంపికలో అనేక అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు చేస్తున్నాడు. ప్రస్తుతం కడపలో అండర్-14 అంతర్ జిల్లా క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. అక్కడికి కూడా తల్లిదండ్రులు వెళ్లి పిర్యాదులు చేయడం సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎంపిక చేశారు. అందరి తల్లిదండ్రులు తమ కుమారులను ఎంపిక చేయాలని నానా యాగీ చేస్తూ తలనొప్పులు తెస్తున్నారు.

నిబంధనల మేరకే..

ఒక క్రికెటర్ బోగస్ వయస్సు ధ్రువపత్రం సమర్పించిన విషయం వాస్తవమే. దీనిపై విచారణ జరిపించి అతని ఎంపికను రద్దు చేశాం. సాధన పోటీల్లో కొందరు ప్రతిభ చూపకపోయినా జట్టుకు ఎంపిక చేయాలని డిమాండ్ చేస్తున్నారు. జట్టు ఎంపికలో నిబంధనలు పాటిస్తాం. కొందరు పగబట్టుకుని విమర్శలు చేస్తున్నారు.

- భీమలింగారెడ్డి, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి

అనేక ప్రమాణాలు పాటిస్తూ..

ఒక క్రికెట్ జట్టును ఎంపిక చేయాలంటే అనేక ప్రమాణాలు పాటిస్తారు. గతంలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వారికి మొదటి ప్రాధాన్యం ఇస్తారు. తర్వాత జోన్, జిల్లా జట్లకు ఆడిన వారికి రెండో ప్రాధాన్యం ఇవ్వడం ఆనవాయితీ. సెలక్షన్ ట్రయల్స్ ద్వారా మిగతా వారిని

ఎస్టీ కమిషన్ సభ్యుడిగా వెంకటప్ప



రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడిగా గుంతకల్లుకు చెందిన పి.వెంకటప్పకు అవకాశం కల్పించారు. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వెంకటప్ప తెదేపాలో తెలుగు విద్యార్థి నాయకుడిగా, టీఎన్ఎస్ఎఫ్ లో జిల్లా అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. తనకు అవకాశం కల్పించినందుకు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించండి

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించారు. మొదటగా వ్యవసాయ మార్కెట్ యార్డుపై ఎమ్మెల్యే సమీక్షిస్తూ.. యార్డులో సంతలు జరుగుతున్నాయి. రుసుం వసూళ్ల రికార్డులన్నీ పక్కాగా ఉండాలన్నారు. అదనంగా వసూళ్లు చేయకుండా ప్రత్యక్షంగా యార్డును తనిఖీ చేస్తామని, రికార్డుల్లో తేడా వస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం బీసీ సంక్షేమ వసతి గృహాలు ఎన్ని ఉన్నాయి, ఎంత మంది విద్యార్థులున్నారు, వారికి సదుపాయాలపై ఆరా తీశారు. వార్డెన్లు నిరంతరం నిఘా ఉంచాలన్నారు. పాతూరు సీడీ ఆసుపత్రితో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరుగుతున్న పెండింగ్ పనులు సత్వరమే పూర్తి చేయాలని ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్లను ఆదేశించారు.

విద్యార్థులు సేవా దృక్పథం అలవరచుకోవాలి

ఎస్కేయూ, న్యూస్‌టుడే: విద్యార్థులు సేవాదృక్పథం అలవరచుకోవాలని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మహమ్మద్ షఫీ పేర్కొన్నారు. కేఎస్ఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ బృందం, ది ఐడియల్ లివింగ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛత పనులు చేశారు. లెనిన్‌నగర్‌లో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. సైకాలజిస్ట్ సురేష్‌కుమార్ శిక్షణ ఇచ్చారు. అధ్యాపకులు పర్వీన్, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీరంగయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉద్యోగ మేళా

ఎస్కేయూ: కమలానగర్‌లోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో నేడు మంగళవారం ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ దామోదరరెడ్డి తెలిపారు. ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ, బీటెక్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వృద్ధురాలి మెడలో గొలుసు అపహరణ

అనంత నేరవార్తలు: ఆదర్శనగర్‌లో సోమవారం గొలుసు చోరీ జరిగింది. పద్మజ అనే వృద్ధురాలు ఇంట్లో ఉన్న ఆలయానికి వెళ్లింది. తిరిగి ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా వెనుక నుంచి వచ్చిన ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని బంగారు గొలుసును తెంచుకుని పరారయ్యాడు. గొలుసు సుమారు రెండు తులాలు ఉంటుంది. బాధితురాలి పిర్యాదు మేరకు గ్రామీణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కుక్కల నియంత్రణ వేగంగా చేపట్టండి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: కుక్కలను శస్త్రచికిత్సలు చేసి వాటి సంతానోత్పత్తిని తగ్గించాలని మేయర్ వసీం, పలువురు కార్పొరేటర్లు కమిషనర్ బాలస్వామిని కోరారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. నగరంలో రోజు రోజుకు కుక్కల బెడద అధికంగా ఉందన్నారు. ఇటీవల మొదటి డివిజన్ పరిధిలోని మహాత్మాగాంధీ కాలనీలో ఓ చిన్నారికి కుక్క కరవడంతో చెవి తెగిపోయిందన్నారు. వెంటనే శస్త్రచికిత్సల ప్రక్రియ ప్రారంభించాలన్నారు. రెవెన్యూ, పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించి మొత్తం 12 ఫిర్యాదులు అందాయి. జేఎన్‌టీయూ రోడ్డులో ఉన్న హిందూ శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్సీ నాయకులు, మొదటి, రెండో రోడ్డు వద్ద సమీపంలో ఉన్న ఫ్లైఓవర్ కింద ఎన్‌క్యాప్ నిధులతో పనులు ప్రారంభించాలని తెదేపా నాయకులు మధు కోరారు.

కమిషనరుకు విన్నవిస్తున్న మేయర్ వసీం, కార్పొరేటర్లు

వ్రతం ఆచరిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో వ్రతం

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలోని అశోక్‌నగర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం రాత్రి 16 సోమవారాల వ్రతం నేత్రపర్వంగా జరిగింది. కార్తిక మాసం పురస్కరించుకుని ఆలయ కమిటీ అధ్యక్షుడు అంజలి పణిరాజ్ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఈ వ్రతంలో పలు ప్రాంతాల మహిళా భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

వరద నీటి ప్రవాహానికి దారేది?

రుద్రంపేట, న్యూస్‌టుడే: రుద్రంపేట పంచాయతీ పరిధి విశ్వశాంతినగర్, గొరవహోమ్స్‌తో పాటు పైభాగంలో ఉన్న నివాస సముదాయాల చుట్టూ వరద నీరు ప్రవహిస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా ప్రాంతాల చెరువు ప్రవాహాన్ని ప్రవహిస్తున్న వరద నీరు ప్రైవేట్ భూముల్లోకి చేరుతోంది. రెండు చెరువుల నుంచి వరద నీరు ప్రవహించేందుకు రుద్రంపేట వైపు వంక సహజంగానే ఉన్నాయి. అయితే ఆ భూమి అన్యాక్రాంతం కావడంతో వంక జాడ లేకుండా పోయింది. ఉన్నఫలంగా వర్షాలు కురిసినప్పుడు పైనుంచి కింది వైపు ప్రవహిస్తున్న వరద నీరు ఏకంగా ఇళ్లలోకి చేరుతోంది. రెవెన్యూ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ జారీ

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లాలో భర్తీ కాని 11 మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఓపెన్ కేటగిరీలో ఎనిమిది దుకాణాలు ఉండగా.. వాటిలో తాడిపత్రి మున్సిపాలిటీలో 3, గుత్తి రూరల్‌లో 2, కళ్యాణదుర్గం, పామిడి, పెద్దవడుగూరు మండలాల్లో ఒకటి చొప్పున దుకాణాలకు దరఖాస్తులు చేసుకోవచ్చు. గీతకార్మికుల కేటగిరీలో కంబదూరు మండలంలో 1, రాయదుర్గం మున్సిపాలిటీలో 1, తాడిపత్రి మున్సిపాలిటీలో ఒకటి చొప్పున దరఖాస్తులు చేసుకోవచ్చు. చివరి తేదీ నవంబరు 10 కాగా లాటరీ 12న తీస్తారు.

కార్తికం.. దీప శోభితం

వాల్మీకిపురం: విశేషాలంకరణలో అర్ధనారీశ్వరస్వామి

ములకలచెరువు: మల్లయ్య కొండపై ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వాల్మీకిపురం: సామూహిక నోములకు హాజరైన భక్తులు

పవిత్ర కార్తిక మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా శైవాలయాలు దీప శోభితంతో ప్రకాశించాయి. భక్తులు వేకువజామునే ఆలయాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దీపాలు వెలిగించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. శైవ క్షేత్రాలు శివ నామ స్మరణతో మార్మోగాయి. - న్యూస్‌టుడే, వాల్మీకిపురం, ములకలచెరువు

నేడు జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశం

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశం రాయచోటిలోని కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బి.సి. జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా ఉన్నతాధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధిపై చర్చ ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

అవును.. నకిలీ మద్యానికి స్పిరిట్ తెచ్చాం

గుట్టుగా మదనపల్లెలో విచారణ

ఈనాడు, కడప, న్యూస్‌టుడే- ములకలచెరువు, మదనపల్లె నేరవార్తలు: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన నకిలీ మద్యం తయారీ కేసులో మరో ముగ్గురు నిందితులను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని మదనపల్లెలో గుట్టుచప్పుడు కాకుండా విచారిస్తున్నట్లు సమాచారం. గత నెల 26న తండ్రీకొడుకులైన బాలాజీ(ఏ 15), సుదర్శన్(ఏ 20)లను ములకలచెరువు ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గోవాలో ఉన్న జితిన్ అనే వ్యక్తి బెంగళూరులోని బాలాజీకి స్పిరిట్ సరఫరా చేసినట్లు వారిచ్చిన వాంగ్మూలంలో తెలిపారు. ఈ మేరకు జితిన్‌తో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

● **కేరళలో అదుపులోకి...:** నకిలీ మద్యం తయారీకి అవసరమైన స్పిరిట్ సరఫరాకు జితిన్ అంగీకరించాడు. బాలాజీ ఇబ్రహీంపట్నంకు తన వాహనంలో 15 క్యాన్ల స్పిరిట్‌ను సరఫరా చేశాడు. ఆ తర్వాత ఈ కేసులో ఏ1 జనార్దన్‌రావు ఆదేశాల మేరకు కట్టా రాజు, సయ్యద్ హాజీల సాయంతో ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ ప్రారంభించారు. బాలాజీ వాంగ్మూలంతో కేరళలో రెండు రోజుల కిందట జితిన్‌తో పాటు మరో ఇద్దరిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఆదివారం రాత్రి మదనపల్లె తీసుకొచ్చారు. మదనపల్లె ఎక్సైజ్ కార్యాలయంలో రహస్యంగా వీరి ముగ్గురిని విచారిస్తున్నారు. వీరి విచారణలో మరిన్ని అంశాలు వెలుగు చేసే అవకాశం ఉంది.

నిందితులను విచారిస్తున్న మదనపల్లె ఎక్సైజ్ కార్యాలయం

ట్రిపుల్ ఐటీల్లో ఆహార నాణ్యతపై అభిప్రాయాల సేకరణ

నూజివీడు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీల అభివృద్ధికి ఈ ఏడాది రూ. 200 కోట్ల బడ్జెట్ రూపొందించినట్లు ఉప కులపతి ఎం.విజయకుమార్ తెలిపారు. నూజివీడులో ఆయన విలేకరులతో సోమవారం మాట్లాడారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు బయాలజీ సబ్జెక్టును ఈ ఏడాది నుంచి కలుపుతున్నామన్నారు. ఏకరూప దుస్తులు సిద్ధం అవుతున్నాయని, త్వరలోనే విద్యార్థులకు అందిస్తామని చెప్పారు. ఆహారం నాణ్యత లేకపోవడం, మెనూ పాటించకపోవడంపై ఆన్‌లైన్‌లో విద్యార్థుల అభిప్రాయాలు సేకరిస్తామన్నారు. నాణ్యత విషయంలో రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్ సంద్ర అమరేంద్రకుమార్‌కు సూచించారు.

కమనీయం.. శ్రీవారి కల్యాణం

ప్రత్యేక అలంకరణలో దేవేరులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట మండలం బోయనపల్లిలోని 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద శ్రీవారి కల్యాణం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. తొలుత నూతనంగా నిర్మించిన ఆలయంలో కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని అత్యంత వైభవంగా ప్రతిష్ఠించారు. తితిదే వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఈ క్రతువు భక్తి శ్రద్ధలతో సాగింది. తితిదే జేఈవో వీరబ్రహ్మం ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో శ్రీశైలం ఆలయ ట్రస్టు ఛైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, తితిదే డిప్యూటీ ఈవోలు ప్రశాంతి, శివప్రసాద్, ఎస్ఈ మనోహర్, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ విజయసాగర్ తదితరులు పాల్గొన్నారు.

కలశాలు తీసుకొస్తున్న వేద పండితులు, తితిదే జేఈవో

కల్యాణాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

ఇంతింతై.. ప్రపంచ కప్ అంతై

ఈనాడు, కడప: కడప క్రీడలు, న్యూస్‌టుడే

శ్రీచరణి.. ఎక్కడా తగ్గేదే లేదు

పుట్టి పెరిగింది చిన్న పల్లెటూరు. ఆడేందుకు మౌలిక సదుపాయాల్లేవు. ఆ బాలికకేమో క్రికెట్ అంటే ఎనలేని మక్కువ. ఆడేందుకు అడుగులేస్తే తొలుత తండ్రి నుంచి వ్యతిరేకత ఎదురైంది. ఒప్పించి.. అమ్మ, మామల ప్రోత్సాహంతో బంతి చేతబట్టింది. కలిసి ఆడేందుకు ఆ పల్లెల్లో ముందుకొచ్చిన బాలికల్లేరు. అయినా ఎక్కడా వెనక్కి తగ్గలేదు. గ్రామంలోని బాలురతో క్రికెట్ ఆడుతూ పట్టుపట్టింది. ఆటపై మక్కువ.. అకుంఠిత దీక్ష.. పట్టుదల వెరసి ఇప్పుడు ఆ యువతిని క్రీడా శిఖరాగ్రాన నిలిపాయి.

వెన్ను తట్టిన కుటుంబం

వైయస్సార్ కడప జిల్లా వీరపునాయునిపల్లె మండలం యర్రమల్లపల్లె గ్రామానికి చెందిన నల్లపురెడ్డి శ్రీచరణి మధ్య తరగతి కుటుంబం. నాన్న చంద్రశేఖర్‌రెడ్డి ఆర్టీపీపీ ఉద్యోగి, అమ్మ రేణుక గృహిణి. అక్క వైష్ణవి చరిత ఎంఎస్ పూర్తి చేసి యూఎస్‌లో ఉద్యోగం చేస్తున్నారు. శ్రీచరణికి ఆటలంటే చాలా ఇష్టం. పాఠశాల స్థాయిలో ఖోఖో, బ్యాడ్మింటన్ ఆడిన ఆమె ఆ తర్వాత క్రికెట్ వైపు దృష్టి సారించింది. నాన్న ఒప్పుకోలేదు. అయినా ఆమె క్రికెట్ ఆడాలని గట్టిగా పట్టుబట్టింది. అమ్మ రేణుక, మామ కిశోర్‌కుమార్‌రెడ్డిలతో కలిసి తండ్రిని ఒప్పించింది. తొలుత ప్రొద్దుటూరులో, ఆపై హైదరాబాద్‌లో శిక్షణ పొందింది.

ఇదీ క్రికెట్ ప్రస్థానం

● 2017-18లో జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక కావడంతో క్రికెట్ ప్రస్థానం మొదలైంది. ● 2022లో ఆంధ్ర సీనియర్ జట్టులో చోటు దక్కించుకుంది. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ రాణించింది. ● 2024లో ఉమెన్స్ ఐపీఎల్‌లో దిల్లీ జట్టు కొనుగోలు చేసింది. ● 2025లో భారత జట్టులో చోటు దక్కించుకుంది. అదే ఏడాది ఉమెన్స్ వరల్డ్‌కప్‌లో తన ఆట తీరుతో జట్టు ఛాంపియన్‌గా నిలిచేందుకు కృషిచేసింది.

● ప్రాథమిక విద్య ఆర్టీపీపీ అనుబంధ డీఏవీ పాఠశాలలో సాగింది. ● ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో చదివింది. ● ప్రస్తుతం డిగ్రీ వీరపునాయునిపల్లెలోని వీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో చదువుతోంది. ● భారత జట్టు ప్రపంచ కప్‌ను ముద్దాడటం, ఆ జట్టులో తమ కుమార్తె ఉండటం చూసి తల్లిదండ్రులు, గ్రామస్థులు సంబరాలు చేసుకున్నారు. ● కడప జిల్లాకు చెందిన తొలి మహిళా క్రికెటర్ శ్రీచరణి. ● జట్టు కప్ గెలవగానే కుటుంబ సభ్యులంతా మిఠాయిలు పంచుకుని సంతోషం పంచుకున్నారు. జిల్లా వాసులు కూడా తమ ఇంటి యువతే ఆడి గెలిచినంత ఆనందం వ్యక్తం చేశారు.

నవ్విన చోటే పువ్వులు

శ్రీచరణికి ఉమెన్స్ వరల్డ్ కప్‌లో చోటు దక్కినప్పుడు జిల్లా వాసులు ఎంతో సంబరపడ్డారు. చాలా మంది క్రికెట్ పెద్దలు మాత్రం అనుభవం లేని ఆమెకు చోటు కల్పించడంపై పెదవి విరిచారు. వారి అంచనాలను తలకిందులు చేస్తూ.. శ్రీలంకతో సాగిన మ్యాచ్‌లో అద్భుతంగా బౌలింగ్ చేసింది. కేవలం 37 పరుగులే ఇచ్చి 2 వికెట్లు పడగొట్టి సత్తా చాటింది. లెఫ్ట్ ఆర్మ్ బౌలర్ అయిన ఆమె చక్కటి లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేస్తూ పరుగులను నియంత్రించడమే కాకుండా కీలక సమయాల్లో ప్రత్యర్థుల వికెట్లు తీస్తూ వచ్చింది. వరల్డ్ కప్‌లో ఇప్పటి వరకు 9 మ్యాచ్‌లు ఆడి 14 వికెట్లు తీసింది.

ప్రతి పాఠశాలకు ఓ అధికారి

పీలేరు, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టిసారించింది. పదో తరగతిలో ఉత్తీర్ణత పెంపు లక్ష్యంగా అడుగులేస్తోంది. ఇందులో భాగంగా 'నా పాఠశాల.. నాకు గర్వకారణం' (మై స్కూల్.. మై ప్రైడ్' పేరుతో కలెక్టర్ నిశాంత్ కుమార్ ఓ వినూత్న విధానానికి శ్రీకారం చుట్టారు. ప్రతి పాఠశాల పర్యవేక్షణ బాధ్యతలను ఒక గెజిటెడ్ అధికారికి కేటాయించారు. ఈ మేరకు మండల విద్యాశాఖాధికారి ద్వారా ఉన్నత పాఠశాలలకు డీఈవో సుబ్రహ్మణ్యం సమాచారం అందించారు.

పదిలో ఉత్తీర్ణత పెంపునకు చర్యలు

పీలేరు ప్రధాన ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు

● **ఇవీ పర్యవేక్షించే అంశాలు:** ● అధికారులు వారంలో రెండు పర్యాయాలు పాఠశాలను సందర్శిస్తారు. ● 9, 10 తరగతుల విద్యార్థులకు విద్యా సంబంధిత సూచనలు చేస్తారు. ● పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించేందుకు చర్యలు తీసుకుంటారు. ● మధ్యాహ్న భోజన సౌకర్యం, రికార్డులు పరిశీలించి, మరుగుదొడ్ల సౌకర్యం తనిఖీ చేసి పాఠశాల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. ● ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్ష ఫలితాలను అనుసరించి, చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించేలా చూస్తారు. ● జిల్లా విద్యాశాఖాధికారి కూడా ప్రతి పాఠశాలలో కార్యక్రమం అమలవుతున్న తీరును ఆకస్మికంగా తనిఖీ చేస్తారు. ● నియమిత అధికారి పాఠశాలలో 45 నిమిషాలు గడిపి 20 నిమిషాలు తొమ్మిదో తరగతి, 25 నిమిషాలు పదో తరగతిలో గడుపుతారు. ● విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తారు. ● ఉత్తీర్ణత సాధించేలా వారిలో నమ్మకాన్ని పెంపొందిస్తారు.

ఆధ్యాత్మిక శాంతి శిఖరం అమీన్ పీర్ దర్గా

కడప చిన్నచౌకు, బిల్టప్, న్యూస్‌టుడే: వైఎస్సార్ కడప జిల్లాలోని అమీన్ పీర్ దర్గా(పెద్ద దర్గా) ఉరుసు ఉత్సవాలు ఏటా నవంబరు మాసంలో నిర్వహించడం ఆనవాయితీ. ఈ నెల 5వ తేదీ నుంచి అయిదు రోజుల పాటు ఉరుసు కొనసాగుతుందని దర్గా నిర్వాహకులు తెలిపారు. 5న గంధం, 6న ఉరుసు, 7న ముషాయిరా ఉంటాయని, 8న పెద్ద ఎత్తున ఖవ్వాలీ, 9న నగరంలో పీఠాధిపతి ఊరేగింపు వైభవంగా నిర్వహించనున్నట్లు వివరించారు. ఉత్సవాలకు దేశంలోని నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. ఊరేగింపుతో ఉరుసు ముగుస్తుంది.

● **16వ శతాబ్దంలో పునాది:** 16వ శతాబ్దంలో కర్ణాటకలోని బీదర్ ప్రాంతం నుంచి మహా ప్రవక్త మహమ్మద్ వంశస్థులైన ఖ్వాజాయే ఖాజుగా నాయబే రసూల్ అతాయే రసూలుల్లా హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా పీరుల్లా మాలిక్ సాహెబ్ తన సతీమణి ఇరువురు కుమారులు, ఫకీర్లు, ఖలీఫాలతో కలిసి ఆధ్యాత్మిక బోధనలు చేస్తూ కడప ప్రాంతానికి వచ్చారు. అప్పట్లో నవాబు నేక్‌నామ్‌ఖాన్ ఈ గురువుల మహిమల గురించి విని స్వయంగా దర్శించుకుని ప్రియ భక్తుడిగా మారారు. అమీన్ పీర్ దర్గా వ్యవస్థాపకుడు హజరత్ పీరుల్లా మాలిక్. ఇక్కడ పెద్ద ఉరుసును మాత్రం సూఫీ సర్ మస్తానీ ఆరీఫుల్లా మొహమ్మద్ మొహమ్మదుల్ హుస్సేనీ చిష్టివుల్ ఖాద్రి పేరిట నిర్వహిస్తారు. కాలక్రమేణా అమీన్ పీర్ దర్గాగా పేరొందింది. ప్రస్తుతం ఈ దర్గా 11వ పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరీఫుల్లా మొహమ్మద్ మొహమ్మదుల్ హుస్సేనీ చిష్టివుల్ ఖాద్రి ఆధ్వర్యంలో దినదినాభివృద్ధి చెందుతోంది.

● **ప్రముఖుల సందర్శన:** మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, సినీ నటులు అమితాబ్ బచ్చన్, రజనీకాంత్, ఆమిర్‌ఖాన్, రాంచరణ్, ప్రముఖ సంగీత దర్శకుడు రెహమాన్‌తో పాటు ఎంతో మంది ప్రముఖులు, సినీనటులు, రాజకీయ నాయకులు దర్గాను ఇప్పటి వరకు సందర్శించారు.

ప్రచార పత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

అపోహలు తొలగిద్దాం.. చికిత్స అందిద్దాం

రాయచోటి, న్యూస్‌టుడే: కుష్ఠు నిర్మూలనే లక్ష్యంగా వైద్యాధికారులు పని చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు. కుష్ఠుపై సర్వే నిర్వహణకు సంబంధించిన ప్రచార గోడపత్రాలను రాయచోటిలోని కలెక్టరేట్‌లో ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ నెల 17వ తేదీ నుంచి 30 వరకు జిల్లాలో సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. బాధితులను గుర్తించి ప్రభుత్వ పరంగా అందించే సేవలను తెలియజేయాలని చెప్పారు. అపోహలు తొలగించి చికిత్స అందించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రతి ఒక్కరినీ క్షుణ్నంగా పరీక్షించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసయ్య, జిల్లా టీబీ నియంత్రణ అధికారిణి రాధిక, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైతేరాజు 6లో

బీడు భూముల్లో సౌర వెలుగులు

● **లక్ష్యం:** వ్యవసాయ కనెక్షన్లకు పగటి వేళల్లో సరఫరాతో పాటు విద్యుత్తు కొనుగోలు వ్యయాన్ని తగ్గించుకోవడం.

రూ. 695 కోట్ల పనులు.. 139 మెగావాట్లు

● **పథకం:** ప్రధానమంత్రి కిసాన్ ఉర్జా సురక్షా ఉత్థాన్ మహాభియాన్(పీఎం కుసుమ్) కేంద్ర ప్రాయోజిత పథకం

● **అమలు:** ప్రభుత్వ, ప్రైవేట్ బీడు భూముల్లో మినీ సోలార్ ప్లాంట్ల ఏర్పాటు.

● **ఇదీ ఒప్పందం:** వైఎస్సార్ కడప జిల్లాలో రూ. 600 కోట్లతో 120 మెగావాట్లు, అన్నమయ్య జిల్లాలో రూ. 95 కోట్లతో 19 మెగావాట్లు సౌర విద్యుత్తు ఉత్పత్తి ప్రాజెక్టులను వేర్వేరుగా మేఘ ఇంజినీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ, ఇగ్నేర్ కంపెనీలు చేపట్టేలా ఎస్పీడీసీఎల్‌తో పని ఒప్పందం.

● **రూ. 5 కోట్లు కానున్న వ్యయం:** 1 మెగావాట్ సౌర విద్యుత్తు తయారీకి రూ. 5 కోట్లు చొప్పున వ్యయం కానుంది. 2026 మార్చిలోపు పనుల పూర్తికి గడువు నిర్దేశించారు.



దువ్వూరులోని గుట్ట కింద సమీపంలో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు చేపట్టిన డ్రిల్లింగ్ పనులు

● అన్నమయ్య జిల్లా పరిధిలోని పుల్లంపేటలో 9 మెగావాట్లకు 45 ఎకరాలు, నందలూరులో 10 మెగావాట్లకు 50 ఎకరాల భూముల్లో సోలార్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయనున్నారు. ● ఈ ప్రభుత్వ బీడు భూములకు రెవెన్యూ అధికారులు ఎన్‌వోసీ ఇచ్చారు. దీంతో ఆయా చోట్ల మినీ సోలార్ ప్రాజెక్ట్ పనుల్లో నిమగ్నమయ్యారు. ● కడప జిల్లా పరిధిలో 300 ఎకరాల ప్రభుత్వ భూములు, 301 ప్రైవేట్ బీడు భూముల్లో మొత్తం 120 మెగావాట్లు సౌర విద్యుదుత్పత్తికి ఆమోదం మంజూరైంది. ● న్యాయస్థానాల్లో, వివాదం లేని సర్కారు బీడు భూములను త్వరితగతంగా అప్పగించాలని తహసీల్దార్లకు కలెక్టరు ఆదేశాలు జారీ చేశారు. ● కడప జిల్లా దువ్వూరులోని గుట్ట కింద కేటాయించిన 25 ఎకరాల పరిధిలోని నిరుపయోగ భూములను గత నెల 17న ఎస్పీడీసీఎల్ సీఎండీ లోతేటి శివశంకర్ ఇటీవల పరిశీలించారు. ఇక్కడి రాతి గుట్టలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు యంత్రంతో డ్రిల్లింగ్ పనులు చేపడుతున్నారు. ● ప్రభుత్వ పరిధిలోని బీడు భూములను నేరుగా కాకుండా నెడ్‌క్యాప్ సంస్థ పర్యవేక్షణలో గుత్తేదారుకు బదలాయింపు ప్రక్రియ చేపడుతున్నారు.

- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు గ్రామీణ

గ్రామం	దువ్వూరు	చెర్లోపల్లి	పాడదుర్తి	చిలమకూరు	వేముల	వేముల	వేముల
మండలం	దువ్వూరు	పోరుమామిళ్ల	కమలాపురం	ఎర్రగుంట్ల	మీదిపెంట్ల	వేముల	వేల్పుల
విస్తీర్ణం (ఎకరాల్లో)	25	30	25	25	25	25	11

డీఆర్‌డీఏలో పీఎం హోదా మార్పు

డీడీవో కార్యాలయంగా మారిన జీవనోపాధుల కల్పన భవనం

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లా గ్రామీణాభివృద్ధి(డీఆర్‌డీఏ) సంస్థలో పని చేసే ప్రాజెక్ట్ మేనేజరు(పీఎం) హోదాను మార్పు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా డీఆర్‌డీఏలో పనిచేసే సదరు హోదా ఉద్యోగులను ఏపీడీగా మార్పు చేసి స్థాన చలనం కల్పించింది. ఈ మేరకు మదనపల్లె పట్టణంలోని జీవనోపాధుల కల్పన కార్యాలయాన్ని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కార్యాలయంగా పేరు మార్చారు. పట్టణంలోని జీవనోపాధుల కల్పన భవనంలో గతంలో ఉపాధి హామీ పథకం క్లస్టర్ కార్యాలయంతో పాటు నీటి యాజమాన్య సంస్థ కార్యాలయాలున్నాయి. తాజాగా డీఎల్‌డీవోకు బదులు డీడీవోలను నియమించడంతో ఈ భవనాన్ని ఆ పేరున మార్పు చేశారు.

ecoren WALK-IN INTERVIEWS
Ecoren Energy is looking for experienced professionals for Wind and Solar Power Projects in Kurnool, Anantapur and Kadapa.
: Positions :
Civil Engineers, Electrical Engineers, Site Managers
: Experience :
2–12 years in Wind/Solar Project Execution
Interview Dates :
08th November 2025 — 09:00 AM to 06:00 PM
09th November 2025 — 09:00 AM to 01:00 PM
Venue : HOTEL ALEXANDER, Saptagiri Circle, Anantapur
Contact : 7331122450, Email: hr@ecorenenergy.com

పూలరైతుకు పండగొచ్చింది

కార్తిక మాసం పూల రైతులకు కలిసొచ్చింది. మొన్నటి వరకు గిట్టుబాటు కావడం లేదంటూ పలువురు రైతులు రహదారి పక్కన పారబోశారు. ఇప్పుడు వాటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నిన్నటి వరకు కిలో రూ. 800గా ఉన్న కదిరి మల్లె పూల ధర ఇప్పుడు రూ. 1200కు చేరింది. కాగడాలు కిలో రూ. 800, చామంతి రూ. 300, బంతిపూలు రూ. 70 పలుకుతున్నాయి. కమలాపురం నియోజకవర్గంలో వందల ఎకరాల్లో చామంతి సాగు చేస్తున్నారు. ఇవన్నీ పూలతో కళకళలాడుతున్నాయి. - ఈనాడు, కడప

త్వరలో నిత్యాన్నదాన కేంద్రం

కేంద్ర పురావస్తుశాఖ నుంచి సానుకూలత

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయం దర్శనం కోసం వస్తున్న భక్తుల ఆకలి తీర్చడానికి త్వరలో నిత్యాన్నదానం కేంద్రాన్ని ప్రారంభిస్తామని తితిదే సంయుక్త కార్యనిర్వహణాధికారి వల్లూరు వీరబ్రహ్మం తెలిపారు. రామయ్య క్షేత్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గర్భాలయంలో కొలువైన సీతారామలక్ష్మణమూర్తులను దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కేంద్రం కోసం ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈవో వీరబ్రహ్మం 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. ఇక్కడ పనులు చేపట్టడానికి కేంద్ర పురావస్తు శాఖ అధికారుల నుంచి ఇటీవల సానుకూలత వ్యక్తం చేశారని తెలిపారు. ఇప్పటికే మౌలిక వసతులు కల్పించడానికి పరిపాలన అనుమతి ఇచ్చినట్లు వివరించారు. తిరుమల తరహాలో ఇక్కడ కూడా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి అన్నం అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ఒకేసారి 200 మంది కూర్చుని భోజనం చేసేలా తాత్కాలిక సౌకర్యాలు కల్పించాలని సివిల్ విభాగం ఎస్ఈ మనోహరం, డీఈ నాగరాజును ఆదేశించారు. ప్రమాద రహిత జర్మనీ షెడ్డును పొడవు 60 అడుగులు, వెడల్పు 40 అడుగుల వైశాల్యంతో ఏర్పాటు చేయాలని సూచించారు. వంటశాలకు కావాల్సిన అదనపు సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. ఏర్పాట్లలో రాజీపడొద్దని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.

తాత్కాలిక అన్నప్రసాద కేంద్రం ఏర్పాటు చేయనున్న స్థలాన్ని పరిశీలిస్తున్న జేఈవో వీరబ్రహ్మం, పక్కనే ఎస్ఈ మనోహరం, డీఈ నాగరాజు

జ్ఞాపకాల మదిలో...
జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృత్యస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి
మీరు చూపిన ఆత్మీయత ..
అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట
మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.
ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని
భావాలను అక్షర రూపంలో
నివేదించడం తప్ప
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం
స్మృతి, వర్ధంతి, జయంతి ప్రకటనల వివరాలకు
ఈనాడు కార్యాలయము, ఆలంఖాన్‌పల్లి, కడప.
కడప: 99899 97626
మదనపల్లి: 80080 01768

(c) eenadu

ప్రతి అర్జీకి పరిష్కారం చూపాల్సిందే

అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. అంతకు ముందు అధికారులతో ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను అలాగే వదిలేయకుండా.. పరిష్కార మార్గం చూపినప్పుడే ప్రజలకు ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుందన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు. వినతులు ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్‌లో ఉంచొద్దన్నారు. నిర్దిష్ట గడువులోపు పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. సీఎం కార్యాలయం నుంచి పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై నిత్యం పరిశీలన జరుగుతోందన్నారు. అధికారులు ఆ విషయాన్ని గుర్తించి అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కారం చూపాలన్నారు. క్షేత్ర స్థాయికి వెళ్లి ప్రతి అర్జీదారుడిని పలకరించి పరిష్కారం చూపి నివేదికను జిల్లా కేంద్రానికి పంపాలన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పెద్ద చెరువుకు జలకళ

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోట పట్టణంలోని పెద్ద చెరువుకు జలకళ సంతరించుకుంది. చెరువు మొరవ నీరు సోమవారం ఉదయం 10గంటల నుంచి స్థానిక దిగువకు పారుతూ కాలువలోకి వెళ్లింది. ఐదేళ్ల తర్వాత భారీ వర్షాలకు పట్టణ పరిసర ప్రాంతాల్లో ఉన్న చెరువులు నిండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కురబల అభివృద్ధికి నిధులు కేటాయించండి

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: కురబల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్లు వల్లిగట్ల వెంకటరమణ, సుబ్రహ్మణ్యం గౌడ్ కోరారు. ఈ మేరకు సోమవారం అమరావతి క్యాంపు కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను కలిసి వినతిపత్రం అందించారు. కురబల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి చెప్పారు.

మంత్రి సవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్లు

చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించాలి

రాయచోటి, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారం కోసం అర్జీల పేరిట పోలీసు స్టేషన్లకు వచ్చే బాధితుల సమస్యలను చట్ట పరిధిలో తక్షణ పరిష్కారం చూపించి న్యాయం చేయాలని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం చేయొద్దని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలన్నారు. కుటుంబ కలహాలు, సైబర్ నేరాలు, భూ-ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్, ప్రేమపేరుతో మోసాలు వంటి సమస్యలపై ఎస్పీకి బాధితులు ఫిర్యాదులు అందజేశారు. భూ సమస్యలకు రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. బాధితులు పోలీసు స్టేషన్‌కు వచ్చినప్పుడు మర్యాదపూర్వకంగా మాట్లాడి వారి సమస్యను సావధానంగా తెలుసుకోవాలన్నారు. వృద్ధులు, దివ్యాంగుల సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

వృద్ధుల సమస్యలు తెలుసుకొంటున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

సుస్థిర వ్యవసాయ పద్ధతులపై రైతుల్లో అవగాహన పెంచండి

రాయచోటి, న్యూస్‌టుడే : సుస్థిర వ్యవసాయ పద్ధతులపై రైతుల్లో అవగాహన పెంచాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయంలో పీ-4 అమలు చేసి ఆదర్శ రైతులను మార్గదర్శకులుగా చూపాలని అధికారులకు సూచించారు. భూసారం పెంచడం, ఎరువుల వాడకాన్ని తగ్గించడం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించేలా చూడాలన్నారు. వ్యవసాయ, కృషి విజ్ఞాన కేంద్రం, ఉద్యాన శాఖల అధికారులు విభిన్న వ్యవసాయ పద్ధతులను తెలియజేయాలన్నారు. సహజ ఎరువుల వినియోగాన్ని తగ్గించి వ్యవసాయ ఉత్పాదకతను పెంచిన రైతులను గుర్తించాలన్నారు. ఆదర్శ రైతుల ద్వారా మిగిలిన రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివన్నారాయణ, ఉద్యాన అధికారులు, భూమాత రక్షణ కార్యక్రమం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతేరాజు
బొప్పాయిలో చీడ పీడ వదిలిద్దాం

పూత రాలిపోవడంతో మధ్యలో ఖాళీగా ఉన్న కాండం

కడప, న్యూస్‌టుడే: బొప్పాయిలో ఔషధాలు మెండుగా ఉంటాయి. ఈ ఫలం ఆరోగ్యదాయిని. ఈ ఏడాది రైతులు సాగు చేసిన పంటను తెగుళ్లు ఆశించి నష్టాన్ని కలిగిస్తున్నాయి. రసం పీల్చే పురుగులు, రింగ్ స్పాట్ వైరస్, మొదలు కుళ్లు, నులి పురుగులు, పిండినల్లి, పండు ఈగ పంట ఎదుగుదల, దిగుబడికి ప్రతిబంధకంగా మారాయి. సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎస్. మానస సూచించారు.

పండు ఈగ: కాయలు పక్వానికి వచ్చిన తర్వాత ఆశిస్తే నష్టం కలుగుతుంది. తోటలను శుభ్రంగా ఉంచాలి. చెట్ల కింద రాలిపోయిన, చెట్లపైన పండుబారిన వాటిని ఏరి వేయాలి. మిథైల్ యూజినాల్ ఎర బుట్టలను ఏర్పాటు చేయాలి. ఆకర్షించిన మగ పురుగులను నాశనం చేయాలి. ఈ బుట్టను 15 రోజులకు ఒకసారి మార్పు చేయాలి.

నులి పురుగులు: నులి పురుగుల నివారణకు నారు సంచుల్లో 1 గ్రాము కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను విత్తనాలు మొలకెత్తిన తర్వాత వేయాలి. నులి పురుగులు సోకిన తోటల్లో మొక్కకు 240 గ్రాముల వేప పిండి, నులి పురుగుల బెడద ఉన్న ప్రాంతాల్లో ఒక్కొక్క మొక్కకు 250 గ్రాములు వేపపిండి, కార్బోఫ్యూరాన్ 3 గుళికలు 25-30 గ్రాములు, సుడోమోనాస్ ఫ్లోరిసెన్స్ 4 గ్రాములు ఒక్కో చెట్టుకు చొప్పున వేయాలి.

తామర పురుగులు: రాతి మంగు, పిందె రాలడానికి కలుగజేస్తాయి. ఎకరాకు 10-20 నీలం రంగు జిగురు అట్టలు పెట్టుకోవాలి. ఫిప్రోనిల్ 2 మి.లీ లేదా థయోమిథాక్సామ్ 0.4 గ్రాముల లీటరు నీటికి పూలు బాగా తడిచేలా పిచికారీ చేయాలి.

కాండం మొదలు కుళ్లు: నర్సరీల్లో ఎక్కువగా నష్టాన్ని కలిగిస్తాయి. వేర్లు, మొదలు మొత్తగా మారి కుళ్లిపోతాయి. కాయలున్న చెట్లకు ఆశిస్తే నష్టం అధికంగా ఉంటుంది. నివారణకు మొక్కల మొదళ్ల వద్ద నీరు నిల్వ లేకుండా చూడాలి. బోర్డో మిశ్రమం 1 శాతం లేదా అలియేట్ 2 గ్రాములను ఒక లీటరు నీటిలో తడపాలి. తెగులు ఉద్ధృతి ఎక్కువగా ఉంటే రిడోమిల్ ఎం.జడ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి చెట్ల మొదళ్లలో, కాండాన్ని మందుతో తడపాలి.

ఆ పాలు.. విదేశాలకు

నంద్యాల జిల్లా చాగలమర్రి మండల వ్యాప్తంగా రైతులు అధికంగా బొప్పాయి సాగు చేస్తుంటారు. చిన్నవంగలితో పాటు సమీపంలోని గ్రామాలైన వైఎస్సార్ కడప జిల్లా కానగూడూరు, క్రిష్ణంపల్లె గ్రామాల్లో 1200 ఎకరాల్లో పండిస్తారు. విత్తనం నాటిన కాలం నుంచి తొమ్మిది నెలలకు పంట చేతికొస్తుంది. పండ్ల సేకరణ అనంతరం 13 నెలల తర్వాత మిగిలినవి, ముదురు కాయలకు గాట్లు పెట్టి పాలను సేకరిస్తున్నారు. తెల్లవారుజాము సమయంలోనే కాయలకు గాట్లు పెడితే కేవలం రెండు గంటల్లోనే పాలు ఊరుతుంది. ఇలా సేకరించిన దాన్ని రాయచోటి, రాజంపేటకు చెందిన వ్యాపారులు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల పాలు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 4 డ్రమ్ముల పాలు సేకరిస్తున్నారు. ఎకరానికి పాల సేకరణ ద్వారా రైతుకు రూ.24 వేల ఆదాయం వస్తుంది. సేకరించిన పాలను పరిశ్రమల్లో మందులు, కాస్మోటిక్స్, సబ్బుల తయారీలో ఉపయోగిస్తున్నారు. బెంగళూరు, చెన్నైతో పాటు నాణ్యతను బట్టి విదేశాలకు సైతం పాలను ఎగుమతి చేస్తున్నారు. బొప్పాయి సాగులో ఎప్పుడైనా ధర పడిపోయినప్పుడు బొప్పాయి పాల సేకరణతో నష్టాల నుంచి రైతులు బయటపడుతున్నారు. **- న్యూస్‌టుడే, చాగలమర్రి**

అరటిలో సిగటోక, ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు మార్గాలివి

చిట్కా

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వాతావరణంలో వచ్చిన మార్పులతో అరటి తోటలను సిగటోక ఆకుమచ్చ తెగులు ఆశించినట్లు ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మానస చెప్పారు. జీ9 రకంలో ఎక్కువగా ఈ చీడ కనిపిస్తుంది. గాలిలో తేమ ఉంది. పొగ మంచు కురుస్తుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతల్లో తేడా ఉంది. ఆకుమచ్చ తెగులు బాగా వ్యాప్తి చెందుతుంది. పొలంలో వర్షపు నీరు నిల్వ లేకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. తోటలో కలుపు లేకుండా చెట్లు, సాళ్ల మధ్యలో శుభ్రం చేయాలి. తెగులు లక్షణాలు కనిపిస్తే మ్యాంకోజెబ్ 2.5 గ్రాములు లేదా క్లోరోథలోనిల్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తోటలో తెగులు వ్యాప్తి చెందినట్లు గమనించిన వెంటనే ప్రొపికొనజోల్ మందును 1 మి.లీ లీటరు నీటికి కలిపి 10 మి.లీ మినరల్ ఆయిల్‌తో కలిపి 25 రోజుల వ్యవధిలో మూడు సార్లు పిచికారీ చేసుకోవాలి. పైన సూచించిన మందులను గెలల కోత 45 రోజులకు ముందు పిచికారీ చేయాలి. **- న్యూస్‌టుడే, ఒంటిమిట్ట**

ప్రశ్న : అరటి పంటకు తెల్లదోమ ఆశించింది. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుపగలరు?
- రామచంద్రరాజు, రైతు, చెర్లోపల్లి గ్రామం

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

సమాధానం: అరటిలో తెల్లదోమ నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా థయోమిథాక్సమ్ 0.2 గ్రాములను లీటర్ నీటిలో కలిపి ఆరు రోజుల వ్యవధిలో రెండు లేదా మూడు సార్లు పిచికారీ చేయాలి.
- సునీల్, ఉద్యాన శాఖ అధికారి
రాజంపేట - న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

గుమ్మడి.. లాభాలు దండి

రైతు సాగు చేసిన గుమ్మడి తోట

సక్సెస్

రామసముద్రం, న్యూస్‌టుడే: రామసముద్రం మండలం దిన్నిపల్లెకు చెందిన యువ రైతు పృథ్వీరాజ్ గుమ్మడి సాగులో లాభాల పంట పండిస్తున్నారు. తనకున్న నాలుగు ఎకరాల విస్తీర్ణంలో గుమ్మడి సాగు చేపట్టారు. అయిదు ట్రాక్టర్ లోళ్ల పశువుల ఎరువును దుక్కిలో కలిపారు. దుక్కిని పదిహేను రోజుల పాటు ముగ్గబెట్టారు. అనంతరం 3×3 అడుగుల వెడల్పుతో బెడ్లు ఏర్పాటు చేశారు. అనంతరం బిందు సేద్యం పరికరాలు అమర్చారు. అందులో 0.5 కిలోల హైబ్రిడ్ రకం గుమ్మడి విత్తనాలు విత్తారు. వారం రోజులకే మొలకెత్తాయి. మొక్కల ఎదుగుదలకు 50 కిలోల పోషక ఎరువులను బిందు సేద్యం ద్వారా అందించారు. కేవలం నెల వ్యవధిలోనే పూత ప్రారంభమైంది. పూత దశలో తోటకు క్రిమి కీటకాలు ఆశించకుండా ఒక్కసారి క్రిమి సంహారక మందు పిచికారీ చేశారు. పిందె ఎదుగుదలకు తిరిగి మరో మారు 50 కిలోల పోషక ఎరువులు అందించారు. మూడు నెలలకే దిగుబడులు వచ్చాయి. సాగుకు కేవలం రూ.లక్ష ఖర్చు చేశారు. నాలుగు ఎకరాలకు 45 టన్నుల దిగుబడి వచ్చింది. తోట వద్దే కిలో రూ.14 చొప్పున ధర పలికింది. మొత్తంగా సాగు వ్యయం రూ.లక్ష పోనూ రూ.5.30 లక్షల రాబడి సమకూరింది.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE : RAJAMPETA
EP No. 11/2022
D.R.K. No. 83/2020
M/s Margadarsi Chitfund Pvt.Ltd., Rep by its Manager/Foreman, Kadapa - Petitioner/DHr
Vs
B.C.Sirivennela & Others - Respondents / JDr's
JDr's No. 2,3 & 7 under order 21 Rule - 37 Notice
JDr. No. 2: N.Damodar Reddy, S/o N.Balireddy, age 43 Years, M/s Hampi Restaurant, Old Busstand, Rajampeta, Annamayya Dist, Kadapa.
JDr. No. 3 : T.Venugopal Reddy, S/o T.Ramireddy, age 38 years, M/s Bhoomi Builders and Developers, Rajampeta, Annamayya Dist. Kadapa.
JDr. No. 7 : S.Raghurami Reddy, S/o S.Rajareddy, age 37 years, Contractor, Residing D.No. 6/969-B-C, Noonevaripalli, Rajampeta, Annamayya Dist, Kadapa.
పిటీషనర్ బాకీ మొత్తం వసూలు చేసుకొనుటకు గాను మీ పైన దాఖలు చేసిన ఇ.పి.లో 2,3 & 7 JDr's అయిన మీరు 28.11.25 తేదీన హాజరగుటకు గాను వాయిదా ఉన్నది. పై దినం ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు వారి ఎదుట ఖుద్దున మీరు గానీ, మీ తరపు వకీలు గానీ హాజరై మీ అక్షేపణలు తెలుపుకొనవలెను. అట్లు లేనిచో మీపైన E.Pని పరోక్షముగా తీర్మానించెదరు.
(By order of the Hon'ble Court)
Sri. G.Srinivasulu Naidu
Sri. V.Nageswar Rao Chowdary
Advocates, Rajampeta, Kadapa.

ప్రపంచ కప్ విజేతలకు జేజేలు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : క్రికెట్ ప్రపంచ కప్ పోటీల్లో విజేతగా నిలిచిన మహిళా జట్టుకు మదనపల్లె ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు అభినందనలు తెలిపారు. సోమవారం పోర్డు సంస్థ డైరెక్టర్ లలితమ్మ, రేవతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రామ్మూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు శంకర్, పోర్డు సంస్థ సభ్యులు నరసింహులు, సుభాషిణి, అల్తాఫ్‌బాషా, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా క్రికెట్ జట్టుకు జై కొడుతున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు

ప్రభుత్వ ఆసుపత్రి ఆక్సిజన్ ప్లాంట్ తనిఖీ

మదనపల్లె వైద్యం, న్యూస్‌టుడే : మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలోని లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్, సిబ్బంది సోమవారం పరిశీలించారు. 'మదనపల్లె ఆసుపత్రికి తప్పిన పెను ప్రమాదం' అన్న వార్త ఈనాడులో ప్రచురితమైంది. స్పందించిన సూపరింటెండెంట్ ఉదయాన్నే ట్యాంకును తనిఖీ చేసి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆక్సిజన్ ట్యాంకు నింపే సమయంలో కొంత ఒత్తిడి పెరగడంతో సిబ్బంది గుర్తించి సమస్య పరిష్కరించారన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ధైర్య సాహసాలకు ప్రతీక గైడ్ కెప్టెన్లు

రాయచోటి, న్యూస్‌టుడే : ధైర్య సాహసాలకు గైడ్ కెప్టెన్లు ప్రతీకగా నిలిస్తున్నారని లీడర్ ఆఫ్ ది కోర్సు శిక్షకురాలు కస్తూరిసుధాకర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక డైట్ కేంద్రంలో ప్రారంభమైన గైడ్ కెప్టెన్ల ఏడు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికల్లో సేవా భావం, క్రమ శిక్షణ, ధైర్య సాహసాలు, మానవీయ విలువలను పెంపొందించడంలో గైడ్ కెప్టెన్ల పాత్ర ఎనలేనిదన్నారు. భవిష్యత్తు నిర్మాణంలో వారి కృషి మరింత పెరగాలన్నారు. గైడ్ కెప్టెన్ల విద్యార్థులను క్రమ శిక్షణ కలిగిన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని జిల్లా స్కౌట్స్ కార్యదర్శి ఎం.నరసింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అడ్వాన్స్ గైడ్ కెప్టెన్ సుజాత, జిల్లాలోని 55 మంది బేసిక్ గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కస్తూరిసుధాకర్

సత్వర పరిష్కారం లక్ష్యంగా నోడల్ అధికారులు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ లోతేటి అన్నారు. సోమవారం తిరుపతిలోని కార్యాలయంలో తొలిసారిగా నిర్వహించిన డయల్ యువర్ సీఎండీ కార్యక్రమానికి వినియోగదారుల నుంచి మంచి స్పందన లభించింది. ఇందులో భాగంగా డిస్కం పరిధిలోని జిల్లా నుంచి 87 మంది వినియోగదారులు ఫోన్‌చేసి తమ సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని సత్వరమే పరిష్కరించడమే లక్ష్యంగా తొమ్మిది జిల్లాల పరిధిలో ప్రతి జిల్లాకు సీజీఎం/జీఎం స్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియమించినట్లు సీఎండీ తెలిపారు. వారు జూనియర్ లైన్‌మెన్ల నుంచి ఎస్ఈ అధికారుల వరకు పనితీరును పర్యవేక్షిస్తారని వెల్లడించారు. డైరెక్టర్లు అయూబ్‌ఖాన్, గురవయ్య, రామ్మోహన్, సీజీఎంలు జానకీరామ్, రమణాదేవి, ఆదిశేషయ్య, ఉమాపతి, మురళీకుమార్, జీఎంలు రామచంద్రరావు, చక్రపాణి, సురేంద్రరావు, భాస్కర్‌రెడ్డి, జగదీష్, ఎస్ఈ చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

వివాహిత బలవన్మరణం

మౌనిక (పాత చిత్రం)

సంబేపల్లె, న్యూస్‌టుడే : మండలంలోని దేవపట్ల గ్రామం అంబేడ్కర్ కాలనీకి చెందిన వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. అంబేడ్కర్ కాలనీకి చెందిన దేవరింటి కన్నయ్య, భాగ్యమ్మ దంపతులకు నలుగురు కుమార్తెలు. నాల్గో కుమార్తె మౌనిక (25)ను రెండు సంవత్సరాల కిందట కడప జిల్లా అట్లూరు మండలం ఎస్.వెంకటాపురం గ్రామానికి చెందిన సునీల్‌తో వివాహం చేశారు. వీరికి ఆరు నెలల కుమారుడు ఉన్నాడు. మౌనిక రెండు నెలల కిందట పుట్టింటికి వచ్చింది. భర్త తమ ఇంటికి వెళదామని పిలవగా వేరు కాపురం విషయమై ఇరువురి మధ్య వాగ్వాదం జరగడంతో మౌనిక తల్లిదండ్రులు అల్లుడికి నచ్చజెప్పి కాపురానికి పంపుతామని తెలిపారు. దీంతో మనస్తాపానికి గురైన మౌనిక ఆదివారం రాత్రి విషద్రావణం తాగడంతో గుర్తించిన తల్లిదండ్రులు రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో కడపకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మనస్తాపంతో కూలీ ఆత్మహత్య

మదనపల్లె నేరవార్తలు : మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మదనపల్లె మండలం చిలకవారిపల్లెకు చెందిన సి.రమణ (55) కూలీపనులు చేసుకుని జీవనం సాగించేవాడు. ఈ నెల 1వ తేదీ ఉదయాన్నే మద్యం తాగి ఇంటికి రావడంతో కుమారుడు మందలించాడు. మనస్తాపానికి గురైన అతడు సీటీఎం క్రాస్‌రోడ్డులోకి వెళ్లి విషద్రావణం తాగాడు. కుటుంబ సభ్యులు గుర్తించి మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ రమణ మృతి చెందాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

EENADU eClassifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

EDUCATION
కడప & ప్రొద్దుటూరులో గల కళాశాలలో మెడికల్, డిప్లొమా కోర్సులు DMLT, DOA, DOM, DECG, DRGA, DMST (ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్), DMIT-(CT/MRT టెక్నీషియన్), DMPHA (M) శానిటరి ఇన్‌స్పెక్టర్ అడ్మిషన్లు జరుగుచున్నవి. అర్హత: ఇంటర్ (ఎనీ గ్రూప్). Cell: 7416623777, 7416523777. అర్హత గల వారికి స్కాలర్‌షిప్ కలదు. చివరి తేదీ: 10-11-2025.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 350/- మాత్రమే
Contact:
KDP: 9989997626, 8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

JOBS
Wanted Experienced Drivers and Security persons for a Reputed Educational Institution in Rayachoty. Contact: 8217200025, 7093473533.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యుయర్స్. ఏజ్: 22-35. ఫ్రెషర్స్ కూడా కావలెను. ✆ 6281037879.

FACULTY/ TEACHERS
Wanted Teachers: Pre- Primary & Primary (All Subjects). Qua: Any Degree. Receptionist (Lady), Driver. 8074875926, 8074511299.

HOSPITALITY
కడప నగరం, హిమాలయ ఆసుపత్రి నందు పనిచేయుటకు నర్సింగ్ స్టాఫ్, వార్డుబాయిలు, ఆయమ్మలు కావలెను. సెల్: 9100745905.

SECURITY GUARDS
కడప, పులివెందుల రోడ్, సాక్షి ఆఫీస్ దగ్గరగల కాలనీలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్సు కావలెను. డ్యూటీ 12 గంటలు, జీతం: 10,000, ప్రవీణ్: 7997661292.

గమనిక క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్, ఖోఖో ఎంపికలు
● స్కూల్ గేమ్స్ ఎంపికలకు 550 మంది హాజరు

హైజంప్ విభాగంలో సత్తాచాటుతున్న క్రీడాకారిణి

కడప క్రీడలు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్‌లో భాగంగా సోమవారం నిర్వహించిన అథ్లెటిక్స్, ఖోఖో కడప డివిజనల్ స్థాయి ఎంపికలకు 550 మంది హాజరయ్యారు. వైఎస్సార్ క్రీడా పాఠశాలలో అథ్లెటిక్స్, కడప మున్సిపల్ ఉర్దూ హైస్కూల్‌లో ఖోఖో ఎంపికలు జరిగాయి. ఎస్‌జీఎఫ్ కడప డివిజనల్ కోఆర్డినేటర్ షేక్ సాజిద్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఈ ఎంపికలకు సెలెక్షన్ కమిటీ సభ్యులుగా జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు బి.శివశంకర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, చరణ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తిరుమలయ్య, సతీష్‌రెడ్డి, ఓబులేసు, మహబూబ్‌బాషా, పవన్‌కుమార్, ఏజాజ్ అహ్మద్, గణేష్‌లు వ్యవహరించారు. ఈ సందర్భంగా కడప డివిజనల్ కోఆర్డినేటర్ సాజిద్ మాట్లాడుతూ.. స్కూల్ గేమ్స్‌లో భాగంగా అండర్-14, 17 వయసు విభాగాల వారికి కడప డివిజనల్ స్థాయిలో అథ్లెటిక్స్, ఖోఖో ఎంపికలకు చేపట్టామన్నారు. కడప డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లో ఎంపికైన వారు డివిజనల్ స్థాయి ఎంపికలకు వచ్చారన్నారు. ప్రతిభ కనబరచిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేశామన్నారు. ఎంపికలను పూర్తి పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు.

బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక

మదనపల్లె విద్య : మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-19 బాలబాలికల ఖోఖో జట్లను సోమవారం ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బాబు తెలిపారు. పలు మండలాల నుంచి క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. ఇందులో సత్తా చాటిన వారిని ఎంపిక చేశారు. క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలల్లో జిల్లా తరఫున ఆడనున్నారు. వీరికి ఉపాధ్యాయులు, నిర్వాహకులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి నాగరాజు, సెలెక్షన్ కమిటీ సభ్యులు నిరంజన్, సరిత, శేఖర్, లత, వరలక్ష్మీ, డివిజన్ సమన్వయకర్త భద్రయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు అన్సర్, సుధాకర్, బాలాజీ, మురళీధర్, దేవకమ్మలు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులతో వ్యాయామ ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

గాలివీడు, న్యూస్‌టుడే : గాలివీడు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.మహమ్మద్ అయూబ్ సెపక్‌తక్రా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పీడీ గంగరాజు సోమవారం తెలిపారు. ఈ నెల 2, 3న అనంతపురం జిల్లా ఉరవకొండలో పోటీలు నిర్వహించారు. పోటీలో పాల్గొన్న ఎస్.మహమ్మద్ అయూబ్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జాతీయ స్థాయిలో రాణించేందుకు విద్యార్థికి తగిన తర్ఫీదు ఇస్తామని హెచ్ఎం జాఫర్ హుస్సేన్ తెలిపారు.

ముగిసిన అంతర జిల్లాల ఎస్‌జీఎఫ్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్

కొవ్వూరు పట్టణం : శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంచి ఉజ్వల భవితకు క్రీడా ప్రావీణ్యం పునాదిగా నిలుస్తుందని అవంతి సంస్థల అధినేత అల్లూరి ఇంద్రకుమార్ అన్నారు. 69వ ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల ఎస్‌జీఎఫ్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు సోమవారంతో ముగిశాయి. కొవ్వూరులోని అల్లూరి వెంకటేశ్వరరావు క్రీడా మైదానంలో 13 ఉమ్మడి జిల్లాల పరిధిలో అండర్-17 విభాగంలో బాలికలు, బాలుర జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. తుది పోరులో విజయనగరం (బాలురు), విశాఖపట్టణం (బాలికలు) జట్లు ఛాంపియన్లుగా నిలిచాయి. జాతీయస్థాయి పోటీలకు బాలురు, బాలికల జట్లను ప్రతిభ ఆధారంగా ఎంపిక చేశారు. జాతీయస్థాయిలో వాలీబాల్ ఆడే అండర్-17 బాలికల జట్టులో తొండవరపు భువనేశ్వరి (కడప), ఒమ్మి చరిష్మ (విశాఖపట్టణం), పొట్నూరు దివ్యధాత్రి (విశాఖపట్టణం), బూడి భార్గవి (కడప), కనిపాటి దేవి (విశాఖపట్నం), ఆర్.ఈశ్వరి (విశాఖపట్నం), ఎం.దుర్గాభవాని (పశ్చిమగోదావరి), ఉప్పు నోమిత (కడప) తదితరులున్నారు.

విజేత జట్టుకు జ్ఞాపిక అందిస్తున్న కొవ్వూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, అధికారులు, నాయకులు

చికిత్స పొందుతూ ఒకరి మృతి

విజయకుమార్ (పాత చిత్రం)

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో గాయపడిన హోమియో కాంపౌండర్ చికిత్స పొందుతూ మృతి చెందారు. మదనపల్లె మండలం సీటీఎం గ్రామానికి చెందిన విజయకుమార్ (47) ములకలచెరువు హోమియో ఆసుపత్రిలో కాంపౌడర్‌గా పనిచేస్తున్నారు. గుర్రంకొండ మండలం తరిగొండ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో సిబ్బంది లేకపోవడంతో అక్కడికి డిప్యుటేషన్‌పై వెళ్లారు. ఈ నేపథ్యంలో గత నెల 25న మదనపల్లెకు వచ్చి తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కొత్తవారిపల్లె పంచాయతీ గుడిసివారిపల్లె సమీపంలో ద్విచక్రవాహనానికి కోతులు అడ్డుగా రావడంతో అదుపుతప్పి రోడ్డు పక్క ఉన్న చెట్టును ఢీకొట్టారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన్ను స్థానికులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

మదనపల్లె

•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని సన్మానించి ఆహ్వానిస్తున్న జంగాలశివరామ్, నాయకులు

మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆహ్వానం

మదనపల్లె పట్టణం, గ్రామీణ, న్యూస్‌టుడే : మదనపల్లె మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం ఛైర్మన్‌గా ఎంపికైన జంగాల శివరామ్ తిరుపతి నగరంలోని పద్మావతి అతిథిగృహంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. మదనపల్లె మార్కెట్ యార్డులో ఈ నెల 13న నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెదేపా పుంగనూరు ఇన్‌ఛార్జి చల్లాబాబును ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రెడ్డప్ప, జగదీష్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

మాట్లాడుతున్న ఎస్‌ఐ రమేష్‌బాబు

రామసముద్రం, న్యూస్‌టుడే: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ రమేష్‌బాబు సూచించారు. అరికెల ఉన్నతపాఠశాలలో సోమవారం చట్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు, పోక్సో, గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్, రోడ్డు భద్రత నియమాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో బాధ్యతగా చదివి జీవిత లక్ష్యాన్ని ఛేదించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటచలపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజన ప్రజా సమాఖ్య నూతన కమిటీ ఎన్నిక

నూతనంగా ఎంపికైన కమిటీ ఇదే

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : గిరిజన ప్రజా సమాఖ్య (జీపీఎస్) మదనపల్లె డివిజన్, నియోజకవర్గ, పట్టణ నూతన కమిటీలను ఎంపిక చేసినట్లు గిరిజన ప్రజా సమాఖ్య రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు ప్రసాద్‌నాయక్ తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గిరిజన ప్రజా సమాఖ్య డివిజన్ అధ్యక్షుడిగా మంగునాయక్, యూత్ అధ్యక్షుడిగా మల్లేశ్వర్‌నాయక్, కార్యదర్శిగా మునుస్వామినాయక్, మదనపల్లె నియోజకవర్గ అధ్యక్షుడిగా నరసింహనాయక్, పట్టణ అధ్యక్షుడిగా లక్ష్మానాయక్, కార్యదర్శిగా రమణానాయక్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారికి నియామకపత్రాలు అందజేశారు. గిరిజనుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక 5న

కంభంవారిపల్లి (న్యూస్‌టుడే) : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 5న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నరేంద్ర కుమార్ తెలిపారు. ఇందుకు జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని చెప్పారు. దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా స్థానికంగా ఈ వేదిక ఏర్పాటు చేశామని ప్రజలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

సమస్యలు ఆలకించి.. పరిష్కారానికి ఆదేశించి..!

సబ్ కలెక్టరేట్‌ను ఆశ్రయించిన బాధితులు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: మండల స్థాయిలో సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో బాధితులు సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణికి ఫిర్యాదు చేశారు. సోమవారం సబ్‌కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు డివిజన్‌లోని మండలాల నుంచి 86 మంది రెవెన్యూ, ఇతర సమస్యలపై 30 మంది అర్జీదారులు వినతులు సమర్పించారు. వీటిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

❖ మదనపల్లెకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు సరోజిని 8 నెలల కిందట కాలుకు గాయం కావడంతో శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఇందుకు సంబంధించి రూ.4 లక్షల ఖర్చు అయింది. మెడికల్ బిల్లులు రీయింబర్స్‌మెంట్ మంజూరు కాలేదని సబ్‌కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.

సరోజినితో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణి

విచారించి న్యాయం చేయండి

ప్రజాప్రయోజనాల నిమిత్తం కేటాయించిన భూములు కబ్జాకు గురవుతున్నాయి. కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి నకిలీ పట్టాలు సృష్టించి భూ వివాదాలు సృష్టిస్తున్నారు. అమ్మచెరువుమిట్టలో ప్రభుత్వ భూమిలో దందాలు చేస్తున్నారు. దీంతో నిజమైన లబ్ధిదారులకు నష్టం కలుగుతోంది. దీనిపై విచారించి న్యాయం చేయండి. **- పునీత్‌కుమార్**

పాసుపుస్తకానికి డబ్బు అడుగుతున్నారు

కొత్తకోట మండలం గట్టుగ్రామంలో కొనుగోలు చేసిన వ్యవసాయ భూమికి సంబంధించి పాసుపుస్తకం ఇవ్వడం లేదు. ఆన్‌లైన్ చేసేందుకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. డబ్బులు ఇవ్వలేదనే కారణంగా దస్త్రం పెండింగ్‌లో పెట్టారు. పాసుపుస్తకాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు.

- హరినాథ్‌రెడ్డి, బయ్యప్పగారిపల్లె, కొత్తకోట

పరిహారం కోసం ఇక్కట్లు

నా పేరుతో గ్రామంలో 1.88 ఎకరాల డీకేటీ భూమి ఉంది. 2014లో హంద్రీ-నీవా కాలువ నిర్మాణం నిమిత్తం భూమి స్వాధీనం చేసుకున్నారు. పరిహారం రూ.6,84,320 మంజూరు చేసినా ఇంకా జమ చేయలేదు. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం కావడం లేదు.

- సాబ్‌జాన్, కందుకూరు, పెద్దతిప్పసముద్రం

అధికారులు పట్టించుకోలేదు

నీరుగట్టువారిపల్లె మాయాబజారులో నా పేరుతో ఇల్లు ఉంది. ఇంటికి సంబంధించిన అన్ని రిజిస్ట్రేషన్ దస్త్రాలున్నాయి. పురపాలక సంఘంలో ఇతరుల పేరుతో ఇంటి పన్ను నమోదైంది. దీన్ని ప్రశ్నిస్తే ఇతరులు కొనుగోలు చేసినట్లుగా అధికారులు చెబుతున్నారు. కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పరిష్కరించడం లేదు. **- శ్రీరాములు, నీరుగట్టువారిపల్లె, మదనపల్లె**

అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు

ఇసుక నిల్వ చేసే ప్రాంతాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీరాములునాయక్, ఎస్సై హరిహరప్రసాద్

ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: పీటీఎం మండలం టి.సదుం సమీపంలోని పాపాఘ్ని నది నుంచి ఇసుకను సరిహద్దులో ఉన్న కర్ణాటక రాష్ట్రం చేలూరు, పరిసర ప్రాంతాలకు తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ శ్రీరాములునాయక్, ఎస్సై హరిహరప్రసాద్‌లు హెచ్చరించారు. ఇక్కడ ఇసుక అక్రమంగా తరలిస్తుండటంతో సోమవారం ఈనాడులో 'వైకాపా పెత్తనం.. ఇసుకాసురుల ఆగడం' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన తహసీల్దార్ శ్రీరాములునాయక్, ఎస్సై హరిహరప్రసాద్‌లు ఇసుక నిల్వ చేసే ప్రాంతాలను పరిశీలించారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే సమాచారం ఇవ్వాలని గ్రామస్థులకు తెలియజేశారు.

విద్యుత్తు స్తంభానికి మరమ్మతులు

మదనపల్లె గ్రామీణ : మండలంలోని మేకలవాండ్లపల్లె గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఆ శాఖ అధికారులు మరమ్మతులు చేశారు. ఇక్కడి సమస్యపై ఈ నెల 3న మేమున్నాం మీకుతోడుగా భాగంగా ప్రచురితమైంది. ఏఈ రమేశ్ స్పందించి స్తంభానికి మరమ్మతులు చేయించారు.

ఈశ్వరమ్మకాలనీలో పారిశుద్ధ్య పనులు

మదనపల్లె గ్రామీణ: ఈశ్వరమ్మకాలనీలో పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పంచాయతీలోని రెహ్మత్‌నగర్, మసీదు ప్రాంగణాలు, చెంబుకూరు రహదారుల్లోని సమస్యలపై ఈ నెల 3న 'రహదారులు అధ్వానం.. పారిశుద్ధ్యం అస్తవ్యస్తం' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో తాజ్‌మస్రూర్ పారిశుద్ధ్య పనులు చేయించాలని కార్యదర్శి షర్ఫుద్దీన్‌కు ఆదేశించారు. ఆయన పంచాయతీ సిబ్బందితో పనులు చేయించారు. సీసీ రహదారుల నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరయ్యాయని త్వరలో పనులు చేయిస్తామన్నారు.

ఆలయాలకు కార్తిక శోభ

ములకలచెరువు, కలికిరి, కలికిరి గ్రామీణ, వాల్మీకిపురం, పీలేరు, కలకడ, నిమ్మనపల్లె, మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే : కార్తిక సోమవారం సందర్భంగా ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లయ్యకొండకు వచ్చిన భక్తులు దీపాలు వెలిగించారు. వాల్మీకిపురం లక్ష్మీకామేశ్వరస్వామి, పీలేరు కాశీవిశ్వేశ్వర, కలకడ సిద్దేశ్వరాలయం, మదనపల్లెలోని ఆలయాల్లో నోముల వ్రతం నిర్వహించారు. కలికిరిలో అయ్యప్ప మాలవేసుకున్న భక్తులకు ముస్లిం సోదరులు అన్నదానం చేశారు. నిమ్మనపల్లె మండలంలోని నేలమల్లేశ్వరస్వామి, కలకడ పరిధిలోని ఝరిలో కార్తిక పౌర్ణమి సందర్భంగా లక్షదీపోత్సవం ఉంటుందని నిర్వాహకులు వెల్లడించారు.


నిమ్మనపల్లె: నేలమల్లేశ్వరస్వామి

మల్లయ్యకొండలో భజనను తిలకిస్తున్న భక్తులు

పీలేరు కాశీవిశ్వేశ్వర ఆలయంలో భక్తులు

పొలాలకు దారి చూపించాలని విన్నపం

గండబోయనపల్లె(వాల్మీకిపురం),న్యూస్‌టుడే : తమ భూముల వద్దకు వెళ్లేందుకు ఉన్న దారిని కొంత మంది వ్యక్తులు కబ్జా చేశారని మండలంలోని గండబోయనపల్లె పంచాయతీలోని కొత్త చెరువు ఆయకట్టుదారులు సోమవారం తహసీల్దార్ పామిలేటికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కొత్త చెరువు కింద 80 ఎకరాల ఆయకట్టులో రైతులందరూ వరి సాగును చేపట్టారని, కోతల సమయంలో యంత్రాలు వెళ్లేందుకు, దిగుబడి తీసుకొచ్చేందుకు దారి లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు వెంకట్రమణ, శ్రీరాములు, రమణ, గంగులప్ప, చిన్నక్క, శాంతమ్మ, రమ్య, గురుప్రసాద్, రెడ్డెమ్మ, సరోజమ్మ, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ పామిలేటికి వినతిపత్రం అందిస్తున్న రైతులు

జిల్లా సాధన కమిటీ సమావేశం 9న

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : మదనపల్లె జిల్లా ఉద్యమ ప్రతినిధులు సమావేశాన్ని ఈ నెల 9వ తేదీ నిర్వహిస్తున్నట్లు సాధన సమితి కన్వీనర్ పీటీఎం శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోండి

అత్యవసర సమావేశంలో కౌన్సిలర్ల ధ్వజం

సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ ఖాజా

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని పలువురు కౌన్సిలర్లు ఛైర్‌పర్సన్‌ను కోరారు. సోమవారం సాయంత్రం పురపాలకసంఘం కార్యాలయంలో కౌన్సిల్ అత్యవసర సమావేశం ఛైర్‌పర్సన్ వి.మనూజ అధ్యక్షతన జరిగింది. కర్నూలు వద్ద జరిగిన బస్సు ప్రమాదం, శ్రీకాకుళం జిల్లా బుగ్గకాశీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారి సంతాప తీర్మానాన్ని 6వ వార్డు కౌన్సిలర్ ప్రసాద్ ప్రవేశపెట్టగా కౌన్సిలర్లు వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. అనంతరం ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో తాగునీరు సరఫరాపై ఫిర్యాదులొస్తున్నాయని, సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. 18వ వార్డు కౌన్సిలర్ ఖాజా మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్యం పనులు చాలా అధ్వానంగా ఉన్నాయని చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై కమిషనర్ ప్రమీల సమాధానమిస్తూ పారిశుద్ధ్యం పనులు నిర్వహణకు అదనంగా 80 మందిని తీసుకోవడానికి, అలాగే కాలువల్లోని పూడిక తీయడానికి రూ.40లక్షలతో టెండర్లు పిలిచామని, గత కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాలను అజెండాలో పెట్టగా అనుమతి మంజూరు కాలేదన్నారు. వచ్చే కౌన్సిల్‌లో వాటికి అనుమతి తీసుకుంటామన్నారు. తాగునీటి సరఫరా రెండు రోజులకొకసారి ఇవ్వాల్సి ఉండగా 5 లేదా 6 రోజులకు ఇస్తున్నారని పలువురు కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. సమావేశంలో అజెండాలోని 6 అంశాలకు కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం పొందాయి. సమావేశంలో కౌన్సిలర్లు రాజేశ్, సుగుణమ్మ, శ్రీనివాసులు, శివయ్య, డీఈఈ శ్రావణి, ఏఈఈ రవీంద్ర నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య, ఆర్.ఐ. తిరుమల తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి లైన్‌మెన్ ఆకస్మిక మృతి

రామసముద్రం, న్యూస్‌టుడే: కుదురుచీమనపల్లె ఇన్‌ఛార్జి లైన్‌మెన్ బసవరాజ (48) సోమవారం ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందారు. గంపనపల్లెలోని తన ఇంటిలో గుండెపోటు రాగా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారు. మృతుడికి భార్య మంజుల, కుమారుడు సురేష్, కుమార్తె మౌనిక ఉన్నారు. మృతదేహానికి మదనపల్లె ఏడీ హరికుమార్, ఏఈ మస్తాన్‌వలీ పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఆటో బోల్తా.. నలుగురికి తీవ్రగాయాలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆటో బోల్తా పడి నలుగురు తీవ్రంగా గాయపడిన ఘటన మదనపల్లె మండలంలో సోమవారం ఉదయం జరిగింది. గుర్రంకొండ మండలం టి.రాసిపల్లెకు చెందిన సిద్దారెడ్డి, ఆయన కుమార్తె అనుసూయమ్మ, మనవరాలు సాయివాణిలు మదనపల్లెలోని హోమియో ఆసుపత్రిలో చికిత్స కోసం గ్రామానికే చెందిన రెడ్డెప్పరెడ్డి ఆటోలో బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న ఆటో మదనపల్లె మండలం ఆరోగ్యవరం సమీపంలోకి వచ్చే సరికి కుక్క అడ్డు రావడంతో తప్పించే క్రమంలో అదుపుతప్పి వాహనం బోల్తా పడింది. ప్రమాదంలో ఆటోలో ఉన్న నలుగురు గాయపడ్డారు. మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

రామసముద్రం, న్యూస్‌టుడే: బాలిక అదృశ్యంపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (17) ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు బంధువులు, చుట్టు పక్కల గ్రామాల్లో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్రంకొండలో చోరీ

గుర్రంకొండ, న్యూస్‌టుడే: స్థానిక మాసూదియా వీధిలోని వసీం ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితుడు సోమవారం ఎస్సై రఘురామ్‌కు ఫిర్యాదు చేశారు. వసీం కుటుంబ సభ్యులతో కలిసి బెంగళూరుకు వెళ్లాడు. ఈ క్రమంలో తాళాలు పగులగొట్టి ఇంట్లోని 3 గ్రాముల బంగారం, 250 గ్రాములు వెండి, రూ.40 వేల నగదు ఎత్తుకెళ్లారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు డిమాండ్

మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: పీలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పీలేరులో రెవెన్యూ డివిజన్ సాధన సమితి అధ్యక్షుడు సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో రిలే దీక్షలు సోమవారం కొనసాగాయి. ఇందుకు మద్దతుగా అఖిలపక్ష విద్యార్థి సంఘాలు నేతలు సుంకర చక్రధర్, భానుప్రకాశ్, అమృతతేజ, శ్రీకాంత్, తదితరులు విద్యార్థులతో పీలేరు పుర వీధుల్లో భారీ ర్యాలీగా వచ్చి నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించారు. అఖిలపక్ష పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెకు రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలి రాక

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్ర మహిళా కమిషనర్ సభ్యురాలు డాక్టర్ షేక్ రోకియాబేగం సోమవారం చిత్తూరు పర్యటన అనంతరం మదనపల్లె ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకున్నారు. ఐసీడీఎస్ సీడీపీవో నాగవేణి, సూపర్‌వైజర్లు ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ మంగళవారం ఉదయం 10 గంటలకు మదనపల్లెలోని స్త్రీశిశుసంక్షేమశాఖ వసతిగృహాల పరిశీలన, సీడీపీవో కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తారన్నారు. పలు కార్యాక్రమాల్లో పాల్గొంటారని వివరించారు.

రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రోకియాబేగంతో మాట్లాడుతన్న సీడీపీవో నాగవేణి, సూపర్‌వైజర్లు

ఉపకార వేతనాలకు ఎంపిక

ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులతో వీసీ యువరాజ్

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : మిట్స్ డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు వీసీ డాక్టర్ సి.యువరాజ్ సోమవారం తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అందించే ఉపకార వేతనాలకు సాయానికి 34 మంది ఎంపికయ్యారు. ఎంసీఏ, ఎంబీఏ చదువుతున్న 32 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.75 వేలు, ఇద్దరు బీటెక్ విద్యార్థులకు రూ.50వేలు చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులను వీసీ, ఛాన్సలర్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదేళ్ల, ఎంసీఏ విభాగాధిపతి నవీన్‌కుమార్, స్టూడెంట్ అఫైర్స్ సీనియర్ మేనేజర్ పి.అథాహర్ సమీనా, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

అక్రమ నిర్మాణదారులకు నోటీసులు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోట బీసీకాలనీలో అనుమతి లేకుండా షెడ్ల నిర్మాణం కొనసాగుతోంది. నగర పంచాయతీ టౌన్‌ప్లానింగ్ నుంచి అనుమతులు తీసుకోకుండా అక్రమంగా పనులు కొనసాగుతున్నట్లు సోమవారం నగర పంచాయతీ కమిషనరు పల్లవికి స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో నిర్మాణాలు చేపట్టిన వారికి కమిషనరు నోటీసులను జారీ చేశారు.

రూ.5.28 కోట్లకు ఐపీ?

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : బంగారు నగల దుకాణం నిర్వాహకులు ఐపీ బాంబు పేల్చారు. మదనపల్లె పట్టణానికి చెందిన బంగారు దుకాణ నిర్వాహకులు రూ.5.28 కోట్లకు మదనపల్లె కోర్టులో ఐపీ దాఖలు చేశారు. వీరు మదనపల్లెలో పలువురి వద్ద అప్పులు చేశారు. అలాగే బంగారు నగలు చేయిస్తామని డబ్బు, బంగారు తీసుకుని పది రోజులుగా దుకాణం మూసేశారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేస్తుండగానే సోమవారం కోర్టులో ఐపీ దాఖలు చేసినట్లు సమాచారం రావడంతో మోసపోయినట్లు బాధితులు లబోదిబోమంటున్నారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) MADANAPALLE
O.S.No.7/2025
Plaintiffs: Bhandari Vijay Kumar and Another
Versus
Defendants: Konaji Suresh Kumar and Others
NOTICE TO THE DEFENDANT NOs 1 AND 2
1. Konaji Suresh Kumar, S/o Konaji, aged about 39 years
2. Konaji Chitra Ram @ K.Chatra Ram, S/o Konaji, aged about 33 years
The Defendants 1 and 2 are are residing at Door No.8-359, Nehru Bazaar, Madanapalle Town and Post, Annamayya District.,
Sir's,
Please take notice that the plaintiffs have filed the above suit seeking for grant of Specific Performance of the Contract and other reliefs in respect of the suit schedule property against you No. 1 and 2 and Others in furtherance of the registered Agreement to Sell dated 25-02-2020. The above suit is posted to 18-11-2025 for your (You No. 1 and 2) appearance by 10.30 a.m in the above said Court. Hence you can appear either in person or through your counsel and file your objections if any. Failing which the matter will be decided in your absence.
// By order of the Court //
S.Rajendra, B.A, LL.B., Advocate for Plaintiffs, Madanapalle.

మృతదేహం వెలికితీతపై విచారణ

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : మృతదేహం వెలికితీతపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామని మదనపల్లెరూరల్ సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె మార్గంలో ఉన్న శ్మశాన వాటికలో పూడ్చి పెట్టిన మృతదేహాన్ని ఆదివారం జైపూర్‌కు చెందిన గోవింద వెలికి తీసిన విషయం విదితమే. ఈ కేసులో పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు. ప్రస్తుతానికి గోవింద అని చెబుతున్న వ్యక్తి ఏమి మాట్లాడటం లేదన్నారు. అతని మానసిక స్థితి సక్రమంగా లేనట్లు ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు వివరించారు.

తాగేందుకు నీరు లేదు.. నడిచేందుకు రోడ్లు లేవు

మదనపల్లె కాలనీల్లో గృహ లబ్ధిదారులకు ఇక్కట్లు

ఇళ్ల చుట్టూ నిలిచిన వాననీరు

మదనపల్లె పట్టణం, గ్రామీణ, న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వంలో మదనపల్లె పురపాలకసంఘంలో పేదలకు స్థలమిచ్చి.. ఇల్లు నిర్మించేందుకు రూ.1.80 లక్షలు మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో కాలనీలను అభివృద్ధి చేయడానికి రూ.కోట్లు ఖర్చు చేశారు. అయితే ఒక్క కాలనీలో కూడా పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు లేవు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుని గృహప్రవేశాలు చేసుకున్న వారికి మాత్రం కష్టాలు తప్పడం లేదు.

❖ మదనపల్లె పురపాలకసంఘంలో అర్హులైన పేదప్రజలకు ఇళ్లు మంజూరు చేయడానికి పురపాకలసంఘం పరిధిలో 24 కాలనీల్లో 10 వేల మందికిపైగా లబ్ధిదారులకు స్థలాలు కేటాయించారు. ఇందులో తాగునీరు, రహదారులు లేవు. ప్రస్తుతం వర్షం కురవడంతో నడిచి వెళ్లేందుకు వీల్లేదు. అప్పులు చేసి ఇంటిని పూర్తి చేసుకున్న లబ్ధిదారులు గృహప్రవేశం చేసినా వసతులు లేక ఇక్కట్లు పడుతున్నారు.

❖ పురపాలకసంఘం పరిధిలోని 24 జగనన్న లేఅవుట్లలో ఒక్క దానిలో కూడా పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించలేదు. కనీసం తాగేందుకు నీటి వసతి కల్పించలేదు. దీంతో స్థానికంగా నివాసముంటున్న ప్రజలు నీటిని కొనుక్కోవాల్సి వస్తోంది. ఒకవేళ బోరు మోటార్లు మరమ్మతుకు గురైతే పట్టించుకునే వారు లేరు. వీధుల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు పూర్తిగా వెలగడంలేదు. వర్షం వచ్చిందంటే ఇళ్లచుట్టూ వర్షం నీరు చేరుతోంది. వర్షాకాలంలో రహదారులపై అడుగు వేయలేని పరిస్థితి. కోళ్లబైలు పంచాయతీ అమ్మచెరువుమిట్టలో ఏర్పాటు చేసిన కాలనీలు గుట్ట ప్రాంతంలో ఉండటంతో లబ్ధిదారులకు అవస్థలు తప్పడం లేదు. అలాగే పోతబోలు లేఅవుట్‌లో 3 వేలకు పైగా ఇళ్లు మంజూరు చేశారు. 50 శాతం పైగా లబ్ధిదారులు నిర్మాణాలు పూర్తి చేసుకుని నివాసం ఉంటున్నారు. కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

పోతబోలు జగనన్న కాలనీలోని ప్రధాన రహదారి దుస్థితి

కల తీరెలే కప్పందగా.. జగజ్జేత భారత్
భారత మహిళల జట్టు వన్డేల్లో తొలి ప్రపంచకప్పును అందుకున్న శుభ సందర్భంగా మా హృదయపూర్వక శుభాకాంక్షలు.
కీ॥శే॥ డా॥ సుంకు బలరాం గారు
సుంకు జూనియర్ కాలేజ్
(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తింపు పొందినది)
బెంగళూరు రోడ్డు, బి.కొత్తకోట, సెల్ : 94416 53255

మన వనిత... విశ్వవిజేత
శ్రీ మధురై మీనాక్షి డిగ్రీ కళాశాల
M.N.Chandrasekhar Reddy B.A., Chairman Cell : 9440459484
S.Javed Dada Saheb M.Com., N.C.F.M., Secretary & Correspondent

జయహో భారత్
భారత మహిళల జట్టు తొలి వన్డే ప్రపంచ కప్ అందుకున్న శుభ సందర్భంగా మా హృదయపూర్వక శుభాభినందనలు.
శ్రీ సాయి చైతన్య జూనియర్ కాలేజ్
Cell : 8309440507, 9052058884.

9వ వర్ధంతి
మా అందరి హృదయాలలో చెరగని ముద్రవేసిన నీవు మానుండి దూరమై 9 సం॥లు గడిచినను నీ మధురస్మృతులు మా మదిలో చిరస్మరణీయం. దైవ సన్నిధిలో మీ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని



భార్య : టి.ఈశ్వరమ్మ
జననం : 1957 మరణం : 04.11.2016

(c) eenadu

5న తెదేపా కార్యకర్తలతో సభ

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే : ఈ నెల 5వ తేదీన మండలంలోని కస్తూరిరాజుగారిపల్లె పంచాయతీ దేవళంపల్లెలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కార్యకర్తలతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారని తెదేపా మండల అధ్యక్షుడు యనమల మదన్‌మోహన్, మాజీ డీసీసీ డైరెక్టర్ పోలిరెడ్డి సుబ్బారెడ్డి తెలపారు. సోమవారం స్థానిక తెదేపా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. లక్కిరెడ్డిపల్లె మండలంలో వైకాపా నుంచి తెదేపాలోకి పలువురు చేరుతారన్నారు. ప్రతి కార్యకర్త ఈ బహిరంగ సభకు హాజరు కావాలన్నారు. అనంతరం మంత్రి సోదరుడు, తెదేపా నియోజకవర్గ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెదేపా నాయకులతో కలిసి దేవళంపల్లెలో సభ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఉమాపతిరెడ్డి, మండల మైనార్టీ యువ నాయకుడు షేక్ ఆరీఫ్, బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విజయభాస్కర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాజేంద్రారెడ్డి, వాసుదేవుడు, ముక్తియార్, నసిరుద్దీన్, వెంకటేశ్ పాల్గొన్నారు.

రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

చిట్వేలి కేజీబీవీలో జిల్లా స్థాయి నైపుణ్య పరీక్షలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపక బృందం

చిట్వేలి (పుల్లంపేట), న్యూస్‌టుడే : నైపుణ్య పరీక్షల్లో ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు చిట్వేలి కేజీబీవీ ప్రిన్సిపల్ తులసి తెలిపారు. సోమవారం పాఠశాల స్థాయిలో విద్యార్థినులకు వివిధ రకాల నైపుణ్యాలు ప్రదర్శించినట్లు తెలిపారు. పరీక్షల్లో ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేశారన్నారు. నవంబర్ 7న జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో చిట్వేలి కేజీబీవీ విద్యార్థులు పాల్గొంటారన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM to 1 PM)
రాజంపేట : 9441872651
రాయచోటి : 9703622242
రైల్వేకోడూరు : 9703572572

- న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ

?: పట్టణంలోని పాతరాయచోటి ప్రాంతంలో ఇప్పటికీ మట్టిదారులే దిక్కు. వర్షం వస్తే బురదమయంగా మారి ఇబ్బందికరంగా ఉంటోంది. అధికారులు స్పందించి సీసీ రోడ్లు నిర్మించాలి.
- శీను, ఉపాధ్యాయుడు. పాతరాయచోటి

✓: పురపాలకలో సీసీ రోడ్లు లేని ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే రోడ్ల నిర్మాణం చేపడతాం. - రవి, పురపాలక కమిషనర్, రాయచోటి

మూడు రోజుల వాన.. మూడు నెలలు కష్టాలు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే : రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ రామయ్యపాలెం - బంగ్లామిట్ట గిరిజన కాలనీల మధ్య ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వర్షం నీరు నిలుస్తుండటంతో రాకపోకలు సాగించేందుకు చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం నీరు ఉన్నంత కాలం రాకపోకలు స్తంభిస్తున్నాయి. ఇక్కడ రైల్వే గేటు ఉండేది. రైళ్ల రాకపోకల సమయంలో గేటు వేస్తుండటంతో ప్రజలు తిరగడానికి, వ్యవసాయ ఉత్పత్తులు తరలించడానికి సమస్యలు ఏర్పడేవి. గేటు వేసినంతసేపూ గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. దీంతో వంతెన నిర్మించాలని ప్రజలు పలుమార్లు విన్నవించుకోవడంతో సుమారు పదిహేనేళ్ల కిందట బ్రిడ్జి నిర్మించారు. ఉద్దేశం మంచిదే అయినా నిర్మాణ లోపంతో ఆ వంతెన ప్రజలకు ఏడాదిలో ఎండాకాలం మినహా పనికిరావడంలేదు. ఎందుకంటే జూన్, జులై నెలల్లో కురిసే వర్షాలకు వంతెన నీటితో నిండిపోతోంది. చుట్టూ కొండలు, గుట్టలు ఉండటంతో ఎగువన కురిసే జలం వంతెన కిందకే వచ్చేస్తోంది. ఆ నీటిని ట్రాక్టరుకు మోటార్లు ఏర్పాటు చేసి తోడటం మొదలు పెడితే రెండు, మూడు నెలలకు గాని దారి కనిపించదు. ఈలోపు అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో కురిసే వర్షానికి పరిస్థితి చెప్పనక్కర్లేదు. ఇలా ఎండాకాలం దారి - వానాకాలం గోదారిలా మారిందీ వంతెన.

రామయ్యపాలెం - బంగ్లామిట్ట మధ్య రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఆగిన వర్షం నీరు

● రైల్వేకోడూరు - కె.బుడుగుంటపల్లె మధ్య రూ.8 కోట్ల వ్యయంతో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మిస్తున్నారు. గత నెలాఖరులో కురిసిన వర్షాలకు ఈ వంతెన కూడా నీటి కొలనులా మారింది. అయితే ఇక్కడ పనులు ఇంకా పూర్తి కాలేదు. వంతెనకు అనుసంధానంగా రాతి కట్టడంతో సంపు నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం నీటిని మోటార్లతో తోడేసి, ప్రజల రాకపోకలకు వీలు కల్పించారు. వర్షాలు ఆగితే సంపు నిర్మాణ పనులు చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఇలా రూ.కోట్ల వ్యయంతో ప్రజాప్రయోజనార్థం నిర్మిస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జిలు వానాకాలంలో ఎవరికీ ఉపయోగపడటం లేదు. ఎటు తిరిగి రైలు పట్టాలు దాటుకుంటూ ప్రయాణించడమే ప్రత్యామ్నాయంగా మారుతోందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

ఏడాదిగా నీటి వృథా.. ఎవరికీ పట్టదా!

రాయచోటి పట్టణంలోని డీఈవో కార్యాలయ సమీపంలో వెలిగల్లు ప్రధాన పైపులైన్ వాల్వు దెబ్బతిని ఏడాదవుతోంది. ఏడాది నుంచి ఈ ప్రాంతంలో నీరు వృథాగా పోతోంది. ఈ ప్రాంతం పురపాలక కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఉంది. నీటి వృథాపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు. పట్టణ ప్రజల అవసరాలకు రోజూ సుమారు 2 కోట్ల లీటర్ల తాగునీరు అవసరం. ఇందులో ప్రస్తుతం వెలిగల్లు జలాశయం నుంచి 90 లక్షల లీటర్ల నీరు మాత్రమే పట్టణానికి సరఫరా చేస్తున్నారు. అసలే పట్టణ అవసరాలకు సరిపడా నీటి సరఫరా జరగడం లేదు. నీటి సరఫరాలో సుమారు 30 శాతం మేర నీరు వృథాగా పోతోంది. పరిశీలిస్తే రోజూ వేల లీటర్ల నీరు వృథా అవుతోంది. సమస్యను రాయచోటి మున్సిపల్ ఏఈ విశ్వకీర్తి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పరిశీలించి సిబ్బందితో మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. నీటి వృథాను అరికడతామన్నారు. - న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ

దేవర చెరువుకు పూజలు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే : ఆగస్టులో వెలిగల్లు ప్రాజెక్టు కుడి కాలువ నుంచి నీటిని లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాలకు రాష్ట్ర రవాణా క్రీడా యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విడుదల చేశారు. ఆ నీరు లక్కిరెడ్డిపల్లె గ్రామ సమీపంలోని దేవరచెరువుకు చేరుకోవడంతో సోమవారం శ్రీ మాతాంగ మహాపీఠం పీఠాధిపతి మతాంగనందగిరిస్వామి గంగ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరచెరువు నిండితే లక్కిరెడ్డిపల్లె ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఉండవన్నారు. భూగర్భ జలాలు పెరగడంతో రెండేళ్లపాటు బోరు బావుల్లో సంవృద్ధిగా నీరు వస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు గొర్ల మోహన్‌రెడ్డి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, భక్తులు పాల్గొన్నారు.

గంగ పూజ చేస్తున్న పీఠాధిపతి మాతానందగిరిస్వామి

గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే : గిరిజన నాయకుడు, స్వాతంత్య్ర సమరయోధుడు భగవాన్ శ్రీబీర్సా ముండా పేరున ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకు జన్ జాతీయ గౌరవ దినోత్సవ వేడుకలు నిర్వహించాలని గిరిజన సంక్షేమశాఖ రాష్ట్ర డైరెక్టర్ పీవీఎస్ నాయుడు ఆదేశించారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సభాభవనంలో అన్ని శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని బి.యర్రగుడి, లక్కిరెడ్డిపల్లె గ్రామాలను ఎంపిక చేశామని, వాటిని అభివృద్ధి పరుస్తామన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడుతోందన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ అధికారిణి తేజస్విని, ఎంపీడీవో రెడ్డెయ్య, ఈవోపీఆర్డీ ఉషారాణి, పంచాయతీ కార్యదర్శులు ఎం.సుదర్శన్‌రెడ్డి, రజినీశ్‌రెడ్డి, నాగమణి, వెంకటరమణ, నరసింహులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పీవీఎస్ నాయుడు

అన్నప్రసాద వితరణకు చేయూత

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే : మండలంలోని గద్దగుండ్లరాచపల్లెకు సమీపంలోని నామాలగుట్ట వద్ద వెలిసిన వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం భిక్ష (అన్నప్రసాద) కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు గురుస్వాములు చెల్లు గంగరాజు, సోడి వెంకటేశ్వర తెలిపారు. ఈ సందర్భంగా గురుస్వాములు మాట్లాడుతూ దప్పేపల్లెకు చెందిన కృష్ణమోహన్‌రెడ్డి 10 బస్తాలు బియ్యం, వసంత కార్తీక్‌రెడ్డి రూ. 10,116 నగదు విరాళం చేశారన్నారు. రాయచోటి పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర ఐటీఐ కళాశాల కరస్పాండెంట్ రామరాజు 15 కిలోల నూనె డబ్బాలు 6 వితరణ చేశారన్నారు. అలాగే లక్కిరెడ్డిపల్లెకు చెందిన డెకరేషన్ మల్లి 41 రోజుకు పాటు, పెరుగు సరిపడా నగదు అందజేశారన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి ఊరేగింపు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే : మండలంలోని అయ్యప్ప మాలాధారణ గురుస్వాములు రమణ, వెంకటేశ్, గంగయ్య, గంగరాజు సోమవారం అయ్యప్ప మాలా దీక్ష నిర్వహించారు. స్వామి విగ్రహాన్ని అనంతపురం గొల్లపల్లె నుంచి నామాల గుట్ట వద్ద వెలిసిన వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు ఊరేగించారు. ఊరేగింపులో నాయకులు మౌర్యారెడ్డి, మదన్ మోహన్ పాల్గొని పల్లకీ మోశారు.

అయ్యప్పస్వామి పల్లకీ మోస్తున్న భక్తులు

ఆలయ పునఃప్రారంభ పూజలు

భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ పునఃప్రారంభ పూజలు

సుండుపల్లి, న్యూస్‌టుడే : ముడుంపాడు గ్రామం కురవపల్లిలోని 13వ శతాబ్దానికి చెందిన భ్రమరాంబ, మల్లికార్జునస్వామి ఆలయ జీర్ణోద్ధరణ అనంతరం పునఃప్రారంభ పూజలు సోమవారం సంప్రదాయబద్ధంగా ప్రారంభమయ్యాయి. ఆకేపాడుకు చెందిన పురోహితులు భానుమూర్తి శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. రాత్రి హోమాలు జరిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

మునగ సాగు రైతులకు లాభదాయకం

మాట్లాడుతున్న జిల్లా జీవనోపాధుల ప్రాజెక్టు మేనేజరు గంగాధర్, ఏపీఎం, ఏపీవో తదితరులు

వీరబల్లి, న్యూస్‌టుడే : రైతులకు ఇతర పంటల కన్నా మునగసాగు ఎంతో లాభదాయకమని జిల్లా జీవనోపాధుల ప్రాజెక్టు మేనేజరు గంగాధర్ అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో అనుబంధ సంస్థల, అధికారుల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి పథకం ద్వారా ఒక ఎకరా మునగ సాగు చేస్తే రూ.1.17 లక్షలు రైతులకు అందజేస్తారన్నారు. ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామన్నారు. తమిళనాడు నుంచి మేలు రకం విత్తనాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక మండల వ్యవసాయాధికారి స్వాతి, ఏపీఎం ఖాదర్‌వలీ, ఉపాధి ఏపీవో చంద్రకళ, సీసీలు గంగాధర్, సుధాకర్, నాగేంద్ర, యాంకర్ పర్సన్ అనిత, సీఆర్పీలు జ్యోతి, రెడ్డెమ్మ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్స్ అసెంబ్లీ సమావేశాలకు విద్యార్థిని

మాసాపేట (రాయచోటి), న్యూస్‌టుడే : రాయచోటి పట్టణం మాసాపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని **నాగూరు సుష్మాతాజ్** శాసనసభలో విద్యార్థి ఎమ్మెల్యేగా పాల్గొనబోతున్నారు. ఈ నెల 26న భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఈ కార్యక్రమం జరుగుతుందని ప్రధానోపాధ్యాయుడు మనోహర్‌బాబు తెలిపారు. భారత రాజ్యాంగంపై జరిగిన క్విజ్ పోటీల్లో రాయచోటి నియోజకవర్గంలో సుష్మాతాజ్ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. తమ పాఠశాల విద్యార్థిని ఎంపిక కావడం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. సుష్మాతాజ్‌ను పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ ఆనంద్ బాబు, ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.

మానవతా విలువలపై అవగాహన

పుల్లంపేట, న్యూస్‌టుడే : పాఠశాల స్థాయి నుంచే మానవతా విలువలను పెంపొందించుకోవాలని మానవతా సేవా సంస్థ ఛైర్మన్ శ్రీనివాసులునాయుడు పేర్కొన్నారు. సోమవారం పుల్లంపేట మండలం వత్తలూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మానవతా విలువలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులు వేణుగోపాల్‌నాయుడు, రామచంద్రనాయుడు, అబ్దుల్లా, నరసింహమూర్తి, ప్రధానోపాధ్యాయుడు మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారం

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే : రాయచోటిలోని దివ్యతేజ హైస్కూల్‌లో 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'మీకు ఇష్టమైన పండగ' అనే అంశంపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. 9వ తరగతి విద్యార్థులు రుచిత, మక్తుంబీ, ఎనిమిదో తరగతి విద్యార్థిని శ్రీచేతన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల కరస్పాండెంట్ నాగేశ్వర్ రావు బహుమతులు, ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పాటవ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న పాఠశాల కరస్పాండెంట్ నాగేశ్వర్‌రావు

సుండుపల్లి తహసీల్దారుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

సుండుపల్లి, న్యూస్‌టుడే : సుండుపల్లి తహసీల్దారు అవినీతి, అధికార దుర్వినియోగంపై సోమవారం జిల్లా కలెక్టర్‌కు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అసోసియేషన్ రాయలసీమ ఇన్‌ఛార్జి పి.రెడ్డిశేఖర్ ఫిర్యాదు చేశారు. తహసీల్దారు రెవెన్యూ శాఖకు సంబంధం లేని వ్యక్తులకు బాధ్యతలు అప్పగించి. . అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. సమగ్ర విచారణ జరిపి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

వ్యవసాయ పరికరాల దుకాణాన్ని ప్రారంభిస్తున్న యజమాని సుబ్రహ్మణ్యం

అందుబాటులో వ్యవసాయ యంత్ర పరికరాలు

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు ఎంజీ ఆటో నగర్‌లో శ్రీ విజయదుర్గా ఆగ్రో పరిశ్రమ దుకాణం ఏర్పాటు చేశారు. దీనిని సోమవారం ఆ దుకాణ యజమాని బి.సుబ్రహ్మణ్యం దంపతులు ప్రారంభించారు. మొదట దేవతా పటాలకు పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పరికరాలైన రోటావేటర్, హార్వెస్టర్ టిల్లర్, బేలర్, స్ప్రేయర్లు, సీడ్ డ్రిల్, పవర్ టిల్లర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కత్తార్ హార్వెస్టర్ రాయలసీమ డిస్ట్రిబ్యూటర్‌గా తాము సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రొటోకింగ్ రోటావేటర్ ఎండీ ఎంఎం పటేల్, ధీరజ్‌రెడ్డి, హార్వెస్టర్ వైస్ ప్రెసిడెంట్ ఐ.మనోహర్, వెలవలి మౌళాలి, బనగానపల్లె బయన్న, హరివరం హుస్సేన్ తొండలదిన్నె భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని డిమాండ్

రాజంపేట, న్యూస్‌టుడే : రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ విభిన్న ప్రతిభావంతుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ బస్టాండు నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు విభిన్న ప్రతిభావంతులు ర్యాలీ నిర్వహించారు. అక్కడ సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి శ్రీధర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. జాతీయ రహదారులు, రైలు మార్గాలతోపాటు విమానాశ్రయానికి దగ్గరగా ఉన్న రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదర్ డిమాండు చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజంపేట, నందలూరు, పుల్లంపేట ప్రాంతాల నుంచి వచ్చిన విభిన్న ప్రతిభావంతుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవో శ్రీధర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న విభిన్న ప్రతిభావంతులు

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు మోటకట్ల విద్యార్థులు

నంబేవల్లె, న్యూస్‌టుడే : రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ క్రీడా పోటీలకు మోటకట్ల హైస్కూల్ విద్యార్థులు 9 మంది ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని పద్మజ తెలిపారు. సోమవారం ఎంపికైన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. రాయచోటిలో జరిగిన రాష్ట్ర స్థాయి ఎంపికల్లో సాఫ్ట్ బాల్ అండర్-14 విభాగంలో మోక్షజ్ఞ, బాలికల విభాగంలో నాగదీపిక, అండర్-17 బాలుర విభాగంలో వెంకట్, మనోజ్, బాలికల విభాగంలో హర్షిత ఎంపికయ్యారన్నారు. బేస్ బాల్ అండర్-14 విభాగంలో మోక్షజ్ఞ, బాలికల విభాగంలో నాగదీపిక, అండర్-17 బాలుర విభాగంలో వెంకట్, బాలికల విభాగంలో హర్షిత ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు వేణుమాధవ రాజును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిదంబర్ రెడ్డి, పద్మావతి, నాగశేషారెడ్డి, నాగేశ్వర నాయక్, భాస్కర్, ప్రసాద్ రాజు, నరసింహులు, కృష్ణవేణి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

మృత్యు రహదారి ప్రభుత్వానికి పట్టదా?

రాజంపేట, న్యూస్‌టుడే : కడప - రేణిగుంట జాతీయ రహదారి మృత్యుమార్గంగా మారిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పూల భాస్కర్ అన్నారు. సోమవారం రాజంపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిత్యం వేలాది వాహనాలు తిరిగే జాతీయ రహదారిలో అడుక్కో గుంత ఉందని, ఆదమరిస్తే మృత్యును కౌగిలించుకున్నట్లేనన్నారు. నిత్యం ఈ మార్గంలో తిరుగుతున్న అధికారులకు, ప్రజా ప్రతినిధులకు రోడ్డు దుస్థితి కనిపించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి మరమ్మతులు చేయించకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరికలు చేశారు.

6న నిఘా అవగాహనపై క్విజ్ పోటీలు

రాజంపేట, న్యూస్‌టుడే : నిఘా అవగాహన వారోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 6న రాజంపేట పట్టణంలోని మన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏపీ రాయలసీమ గ్రామీణ బ్యాంకు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు, పోటీలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రశంసా పత్రం, బహుమతి అందజేయనున్నట్లు చెప్పారు.

టెట్‌పై ప్రభుత్వం రివ్యూ పిటీషన్ వేయాలి

సుండుపల్లి, న్యూస్‌టుడే : ఇన్ సర్వీస్ టీచర్లు కూడా టెట్ పాస్ కావాలని సూచిస్తూ రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసిన జీవో నం:36ను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని, దానిపై రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటీషన్ వేయాలని రాష్ట్ర ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు అంకం శివారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సుండుపల్లిలోని పలు ఉన్నత పాఠశాలల్లో ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాయ నాయకులు ఆరిఫుల్లా, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎస్‌ఏ మున్వర్‌బాషా, సీపీఎస్ కన్వీనర్ రంజాద్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, RAYACHOTY
I.A. No. /2024
O.S. No. 20/2024
Tammata Prameela, W/o Chandra, Hindu, aged 40 years, Native of Nakkavandlapalli, Diguva Abbavaram Village, Rayachoty Mandal, Kadapa District (Now Annamayya District).
...Petitioner/Plaintiff
Vs
1) Derangula Nagamma, W/o Late D.Gurraiah, aged about 60 years, Homemaker, Resident of Nakkavandlapalli Village, Abbavaram Post, Rayachoty Mandal, Annamayya District.
2) Derangula Raja Sekhar (Now died), S/o Late D.Gurraiah, Hindu, Resident of Nakkavandlapalli Village, Abbavaram Post, Rayachoty Mandal, Annamayya District.
3) Derangula Mallikarjuna, S/o Late D.Gurraiah, Hindu, aged about 38 years, Resident of Nakkavandlapalli Village, Abbavaram Post, Rayachoty Mandal, Annamayya District.
4) Bathala Nagamani, W/o B.Sankaraiah, D/o Late D.Gurraiah, Hindu, aged about 36 years, Resident of Nakkavandlapalli Village, Abbavaram Post, Rayachoty Mandal, Annamayya District.
5) Syed Fazulul Rahiman, S/o Syed Rasheed Ahammed, Muslim, aged about 50 years, Residing at Near Junior College, Trunk Road, Rayachoty Town & Mandal, Annamayya District.
...Respondents/Defendants
NOTICE TO RESPONDENTS No.3 & 4 / DEFENDANTS No.3 & 4
Please take notice that the Hon'ble Court has Ordered for notice to the Respondents No.3 & 4 / Defendants No.3 & 4 to appear on 11-11-2025 at 10:30 A.M. in the above Court, failure to appear by you the matter will be decided exparte.
//BY ORDER OF THE HON'BLE COURT//
Sd/- ANDE SUBRAMANYAM
Advocate for Plaintiff, KADAPA.

శివుని అలంకారం.. నయనానందకరం

నక్కలపల్లెలో భవానీ శంకరుడు

చిట్వేలి : ప్రత్యేక అలంకరణలో శ్యామలాంబ

కార్తీక సోమవారం పురస్కరించుకుని రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని శైవ క్షేత్రాలు శివనామ స్మరణతో మార్మోగాయి. ఆయా ఆలయాల్లో తెల్లవారుజామునే స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శోభాయమానంగా స్వామిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.
- న్యూస్‌టుడే బృందం

రైల్వేకోడూరు : ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

చిట్వేలి : కార్తీకదీపాలను వెలిగించి నమస్కరిస్తున్న యువత

రాయచోటి : అఘోరలింగేశ్వరాలయ ప్రాంగణంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

గొలుసు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

వీరబల్లి: మండలంలో గొలుసు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ నరసింహారెడ్డి అన్నారు. సోమవారం గడికోటలోని యడబల్లిలో అక్రమంగా విక్రయిస్తున్న 80 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, విక్రేత శంకర బాలకృష్ణను అరెస్టు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థుల ఘర్షణ - కేసు నమోదు

రాజంపేట గ్రామీణ: బోయనపల్లి ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థుల మధ్య ఘర్షణపై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రసాద్‌రెడ్డి చెప్పారు. పోలీసులకు అందించిన సమాచారం మేరకు.. అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న శాంతన్‌రెడ్డికి నితిన్, సాయి మధ్య గొడవ జరిగింది. గతంలో శాంతన్‌రెడ్డి మరొకరితో దాడి చేశారు. దీంతో శాంతన్‌రెడ్డిపై కక్ష పెంచుకున్న నితిన్, సాయి, మరి కొందరు కలసి ఆదివారం రాత్రి దాడి చేశారన్నారు.

మహారాజశ్రీ రాజంపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No. 24/2024 in O.S.No. 186/2018
యనిమినేని వెంకటయ్య, తండ్రి చిన్న వెంకటస్వామి, డి.నెం. 6/171, ముకుందారగడ్డ వీధి, రాజంపేట టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా. ...DHR/వాది
Vs
షేక్ షకీల బాను, భర్త అమీర్ బాషా, డి.నెం.6/168, ముకుందారగడ్డ, వీధి, రాజంపేట టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా. ...JDR /ప్రతివాది
వేలం ప్రకటన
[illegible]
SCHEDULE
Property situated at Annamayya District, (Erstwhile Kadapa District), Rajampet Sub District, Rajampet Mandal, Rajampet Village, Rajampet Village fields, Kuchivaripalli Panchayat, D.B.N.Palli area, Sy. No. 703/2, an extent of Ac. 0.06 cents 988 Square links. Boundaries : East : 25 links Road, West : Land of Daggupati Krishnaiah, North : Site of Kandukuru Subrahmanyam Reddy, South : Land of Kovvuri Mallikarjuna Naidu. Measurements : East-West : Northern Side 57 feet, Southern Side 57 feet, North-South : Eastern Side 53.4 feet, Western Side 53.4 feet.
అసలు విలువ రూ. 63,00,000/- మార్కెట్ విలువ రూ. 10,14,600/-
By Order of the Court
శ్రీ పి.వల్లభరావు, అడ్వకేట్, రాజంపేట.

(c) eenadu

ఈనాడు బాపట్ల
మంగళవారం నవంబరు 4, 2025

మహా మర్రి.. ఊడలు విస్తరించి..

మార్టూరు మండలం బొల్లాపల్లి గ్రామం వద్ద ఈ మహా వృక్షం ఊడలే ఆధారంగా విస్తరిస్తోంది. 200 ఏళ్ల నాటి మర్రిచెట్టు రహదారి నిర్మాణానికి ఆటంకంగా మారడంతో పూర్వీకులు కొంచెం నరికేశారు. అనంతరం ఊడలే పెనవేసుకుని ఎకరం మేర విస్తరించిందని గ్రామస్థులు చెబుతున్నారు. వాహనదారులకు నీడతో పాటు పచ్చదనంతో ఆహ్లాదం పంచుతోంది.
- ఈనాడు, బాపట్ల, న్యూస్‌టుడే, మార్టూరు

కార్తిక పౌర్ణమికి బీచ్‌ల మూసివేత

బాపట్ల, న్యూస్‌టుడే: సముద్రంలో పెద్ద గోతులు ఏర్పడి సముద్ర స్నానాలకు పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో కార్తిక పౌర్ణమికి జిల్లాలోని బీచ్‌లు మూసి వేయాలని అధికారులు నిర్ణయించారు. తొలుత సోమ, మంగళవారాలు మూసివేస్తున్నట్లు ఆర్డీవోలు, డీఎస్పీలు ప్రకటించారు. బుధవారం పౌర్ణమి గడియల్లో సముద్రస్నానం చేయడానికి పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున సూర్యలంక, వాడరేవు, రామాపురం, నిజాంపట్నం, దిండి, పెదగంజాం పల్లెపాలెం తీరాల్లో స్నానానికి అనుమతించరాదని నిర్ణయం తీసుకున్నారు. పరిస్థితిని అర్థం చేసుకుని అందరూ సహకరించాలని బాపట్ల ఆర్డీవో గ్లోరియా కోరారు. తదుపరి అనుమతి ఇచ్చే వరకు బీచ్‌లకు భక్తులు, పర్యాటకులు రావద్దని చెప్పారు.

కనులారా వేడుక చూసి.. రెప్పపాటులో అసువులుబాసి

కంటైనర్‌ను కారు ఢీకొని నలుగురి దుర్మరణం

సంగీత్ వేడుకలో సంతోషంగా గడిపారు
బంధువులతో కలిసి ఆనందం పంచుకున్నారు
అనంతరం తిరిగిరాని లోకాలకు పయనం ఉంటుందని ఊహించలేదు
రోడ్డుపై మృత్యువు ఎదురొస్తుందని
ప్రయాణిస్తున్న కారే ప్రాణం తీస్తుందని
మూడు కుటుంబాల్లో విషాదం నింపుతుందని
అంతులేని వేదన మిగుల్చుతుందని
చివరకు అనుకోనిదే జరిగింది
కన్నీటిధారలు ప్రవహించాయి
బంధువుల గుండెల్లో భారాన్ని నింపాయి
విధి ఆడిన వింత నాటకంలో
నలుగురు ప్రాణాలు గాలిలో కలిశాయి

రొయ్యల కంటైనర్

బాపట్ల, కర్లపాలెం, న్యూస్‌టుడే

కర్లపాలేనికి చెందిన బేతాళం బలరామరాజు(65), లక్ష్మి(60) దంపతులు. విజయవాడలోని బంధువుల ఇంట్లో ఆదివారం శుభకార్యానికి వెళ్లారు. రాత్రికి బాపట్లలో తమ అల్లుడు, మేనకోడలు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు, హరికుమారి దంపతుల కుమారుడు రాకేష్‌వర్మ వివాహం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సంగీత్ వేడుకకు బంధువు ముదునూరి శ్రీనివాసరాజు కారులో వచ్చి హాజరయ్యారు. వధువు, వరుడిని ఆశీర్వదించి బంధువులతో కలిసి ఉల్లాసంగా గడిపారు. వేడుక అనంతరం వియ్యపురాలు గాదిరాజు పుష్పవతి(60), మనవడు గాదిరాజు జయంత్‌వర్మ, గాదిరాజు వైష్ణవితో కలిసి కారులో కర్లపాలెం బయలుదేరారు. సత్యవతిపేట సమీపంలో ముందున్న కారును అధిగమించే ప్రయత్నంలో నరసాపురం నుంచి కేరళ వెళ్తున్న రొయ్యల కంటైనర్‌ను వారు ప్రయాణిస్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. ఘటనలో తలకు తీవ్ర గాయాలైన బలరామరాజు, లక్ష్మి దంపతులు వారి వియ్యపురాలు పుష్పవతి అక్కడికక్కడే మృతి చెందారు. కారు నడుపుతున్న శ్రీనివాసరాజుకు తీవ్రగాయాలయ్యాయి. చిన్నారులు జయంత్‌వర్మ, వైష్ణవి గాయపడ్డారు. వెనుక వేరే కార్లలో వస్తున్న బంధువులు ప్రమాదాన్ని గమనించి కారు స్టీరింగ్ వద్ద ఇరుక్కుపోయిన శ్రీనివాసరాజును అతికష్టం మీద బయటకు తీసి చికిత్స కోసం బాపట్ల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలో మృతి చెందారు. ఆయన కుమారుడి వివాహం ఈ నెల 26న నిశ్చయమైనట్లు తెలిసింది. శ్రీనివాసరాజు మరణంతో ఆ కుటుంబం దుఃఖసాగరంలో మునిగిపోయింది. మృతదేహాన్ని స్వస్థలం విజయవాడలోని ముత్యాలంపాడుకు తరలించారు. మిగిలిన ముగ్గురి మృతదేహాలను కర్లపాలెంలోని గృహానికి తీసుకెళ్లారు. గాయపడిన చిన్నారులకు ప్రాథమిక చికిత్స చేసి వేర్వేరు ఆసుపత్రులకు తరలించారు.

మరో ఐదు నిమిషాల్లో ఇంటికి వెళ్లేలోగా..

వేడుక నుంచి బయలుదేరినవారు మరో ఐదు నిమిషాల్లో కర్లపాలెంలో ఇంటికి చేరుకుంటారనేలోగా విధి వక్రించింది. కారు నడుపుతున్న శ్రీనివాసరాజు ముందున్న కారును అధిగమించే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న రొయ్యల కంటైనర్‌ను ఢీకొట్టాడు. కారు, కంటైనర్ రోడ్డుకు చెరో వైపునకు వెళ్లాయి. బెలూన్లు తెరుచుకున్నా తీవ్రగాయాలై కారు ముందు సీట్లో ఉన్న బలరామరాజు, ఆయన వెనక సీట్లో కూర్చొన్న లక్ష్మి, పుష్పవతి, డ్రైవింగ్ సీట్లో ఉన్న శ్రీనివాసరాజు ప్రాణాలు విడిచారు. మనవడు, మనవరాలు గాయాలతో బయటపడ్డారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన పుష్పవతి కుమారుడు అనిల్‌వర్మ జమ్మూకశ్మీర్‌లో ప్రముఖ సంస్థలో పైలెట్‌గా పని చేస్తున్నారు. వివాహ వేడుకల్లో పాల్గొనడానికి మనవడు, మనవరాలితో కలిసి పుష్పవతి ఆత్మకూరు నుంచి కర్లపాలెంలోని బలరామరాజు ఇంటికి వచ్చారు. బంధువుల మృతదేహాలను చూసి ఎమ్మెల్యే నరేంద్రవర్మ, సతీమణి హరికుమారి విలపించారు. మృతదేహాలకు సోమవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. కర్లపాలెంలో విషాదఛాయలు అలముకున్నాయి.


బలరామరాజు

లక్ష్మి

పుష్పవతి

శ్రీనివాసరాజు
(పాత చిత్రాలు)

ఎత్తిపోయాలి.. ఆధునికీకరణతో మురవాలి

కృష్ణా డెల్టాలో కీలకమైన కొమ్మమూరు ప్రధాన కాలువపై ఎత్తిపోతల నిర్మాణానికి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. దీంతోపాటు ఆధునికీకరణ పనులూ చేపట్టాలని రైతులు కోరుతున్నారు. లేదంటే శివారు పొలాలకు నీరందని పరిస్థితి కొనసాగుతుందంటున్నారు.

కొమ్మమూరు కష్టాల పరిష్కారానికి ఇవే మార్గాలు

ఈనాడు అమరావతి

కొమ్మమూరు ప్రధాన కాలువ కుడి గట్టుపై 60.250 కిలోమీటర్ల వద్ద నిర్మిస్తారు. ✦ 48.39 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయాలన్నది లక్ష్యం. ఇందుకు డీపీఆర్ సిద్ధమైంది. ✦ నల్లమడ డ్రెయిన్ నుంచి అంతే మొత్తం నీటిని కొమ్మమూరు ప్రధాన కాలువలోకి ఎత్తిపోసేందుకు మరో పథకం నిర్మించనున్నారు. ✦ దీనికి రూ.32.88 కోట్లు అవసరమని అంచనా. ✦ పీ4 పథకం అమల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపు మేరకు ప్రసాద్ సీడ్స్ అధినేత కారుమంచి ప్రసాద్ రూ.10 కోట్లు ఇచ్చారు. మిగిలింది భరించి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

ప్రవాహాలు తక్కువగా ఉంటే...

★ డీపీఆర్ ప్రకారం.. కొమ్మమూరు ప్రధాన కాలువలో ప్రవాహాలు తక్కువగా ఉన్నప్పుడు అప్పాపురం ప్రధాన కాలువలోకి నీళ్లు తీసుకెళ్లడం కష్టం. ★ అప్పాపురం ప్రధాన ఛానల్‌పై 33.683 కిలోమీటర్ల వద్ద పంపుహౌస్ నిర్మించి 360 క్యూసెక్కులు ఎత్తిపోయాలనేది ఆలోచన. తద్వారా 7, 8, 9 బ్రాంచి కాలువల కింద ఉన్న అయిదు గ్రామాల్లో తాగు, సాగునీటి సమస్యలు పరిష్కారమవుతాయి. ★ దీనివల్ల కొమ్మమూరు కాలువపై 62.500 కిలోమీటర్ల వద్ద 48.39 క్యూసెక్కుల ప్రవాహం తగ్గుతుందని అంచనా. అందువల్లనే నల్లమడ వాగులోంచి అంతే మొత్తం నీటిని ఎత్తిపోయాలని ప్రతిపాదిస్తున్నారు.

❖ కొమ్మమూరు ప్రధాన కాలువ పరిధిలో 1.40 లక్షల ఎకరాల్లో పంటలున్నాయి. ఆధునికీకరణ లేక 21 గ్రామాల్లోని దాదాపు 70 వేల ఎకరాలకు నీరందడం లేదు. నల్లమడ వాగుల నుంచి చినగంజాం వరకు సమస్య ఉంది. కిందటేడాది ఎగువ, దిగువ ప్రాంతాల రైతుల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడినపుడు జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ❖ గతంలో ఎప్పుడో ఆధునికీకరణ పనులు చేపట్టినా గుత్తేదారు మధ్యలో వదిలేశారు. ❖ తాజాగా నాబార్డు కింద జలవనరులశాఖ రూ.250 కోట్లతో పనులు ప్రతిపాదించింది. ❖ జలరవాణా కింద ఆధునికీకరణ పనులను కేంద్రం చేయాలన్న ప్రతిపాదనలున్నా సాకారం కాలేదు.

పొలమా.. చెరువా!

కనుచూపు మేర నీరే.. రైతన్నకు మొంథా తుపాను మిగిల్చిన కన్నీటి వ్యథ ఇది. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి, 60 రోజులపాటు పంటను కాపాడుకున్న రైతులు తుపానుతో తీవ్రంగా నష్టపోయారు. కారంచేడు మండలంలోని 7500 ఎకరాల్లో పంట ఇంకా నీటిలోనే నానుతోంది. దిగువకు నీటి ప్రవాహం లేక చెరువులను తలపిస్తోంది. తుపాను ప్రభావం తగ్గి ఐదు రోజులు అవుతున్నా.. వరి పొలాల్లో నిలిచిన నీటిని దిగువకు పంపేందుకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ఇటువంటి పరిస్థితులు తలెత్తాయని రైతులు వాపోతున్నారు. మరో నాలుగు రోజులపాటు ఇలానే పొలాల్లో నీరు నిలిస్తే పంట కుళ్లిపోతుందని చెబుతున్నారు.
- న్యూస్‌టుడే, కారంచేడు

కారంచేడులో వరి పొలాలు ఇలా..

అప్రోచ్ రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు

మోదేపల్లి (అద్దంకి), న్యూస్‌టుడే: తుపాను కారణంగా దెబ్బతిన్న మోదేపల్లి, పేరాయపాలెం వంతెనల అప్రోచ్ రహదారులను ర.భ. శాఖ ఎస్‌ఈ రవి నాయక్ సోమవారం పరిశీలించారు. రెండు అప్రోచ్ రోడ్లకు సుమారు రూ.25 లక్షల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఆ మేరకు యుద్ధప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతులు జరిపించి, రాకపోకలు పునరుద్ధరించాలని స్థానిక డీఈ సుబ్బారావు, ఏఈ శివన్నారాయణకు సూచించారు. సుమారు 20 అడుగుల లోతులో గొయ్యి ఏర్పడినందున చీమకుర్తి నుంచి బండరాళ్లు తెచ్చి, పూడ్చిన అనంతరం కొండగ్రావెల్ తోలి రవాణాను పునరుద్ధరిస్తామన్నారు. దోర్నపు వాగు మరమ్మతులు పూర్తయిన అనంతరమే చిలకలేరు వాగు మరమ్మతులు జరిపించాలని ఎస్‌ఈ సూచించారు.

చిలకలేరు వంతెన భాగాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఈ రవినాయక్

6లో సస్యరక్షణ చర్యలతో పంటలు కాపాడుకోవచ్చు
రైతేరాజు

విద్యావనం.. హరితానందం

ఈనాడు, అమరావతి

పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు అన్నారు పెద్దలు. ఆ నినాదాన్ని అందిపుచ్చుకుని ప్రాంగణాన్ని హరితమయం చేస్తోంది ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం. ఇది ఏర్పాటైనప్పుడు ఉన్న చెట్లను పరిరక్షించడంతోపాటు ప్రత్యేకంగా మొక్కలు నాటి చిట్టడవిని అభివృద్ధి చేసింది. ప్రస్తుతం 700 రకాల జాతులతో 50 వేలకుపైగా చెట్లతో అలరారుతోంది.

గుంటూరు - విజయవాడ నగరాల మధ్య నంబూరు సమీపంలో 1976లో 355 ఎకరాల్లో ఏర్పాటైంది ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం. రోడ్లు, ఇతర పనులకు కొంత భూమిపోగా.. ప్రస్తుతం 280 ఎకరాల్లో విస్తరించి ఉంది. 15 ఏళ్ల క్రితం 6.50 ఎకరాల్లో 6,400 టేకు మొక్కలు నాటగా.. పెరిగిన వృక్షాలతో విద్యాలయానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సహజ సిద్ధంగా పెరిగిన 9 వేల సుబాబుల్ చెట్లు మరో విశేషమే. ఎర్రచందనం, మామిడి వనాలూ ఆకట్టుకుంటున్నాయి.

ఆ రెండూ ప్రత్యేకం.. బొటానికల్ గార్డెన్, ఔషధవనం మరో ప్రధాన ఆకర్షణ. సుమారు నాలుగెకరాల్లో 450 రకాల జాతుల మొక్కలున్నాయని అధికారులు చెబుతున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కొన్ని అరుదైన రకాలను తెప్పించి నాటారు. భవనాలను నిర్మించేటప్పుడు అడ్డు వచ్చిన వృక్షాలను వేరే ప్రాంతాల తరలించి పరిరక్షిస్తున్నారు. కూరగాయల తోటలను పెంచడంపైనా దృష్టి పెట్టారు.

ఎస్టీపీల నిర్మాణానికి ప్రతిపాదనలు.. పచ్చందాలను పరిరక్షించడంతోపాటు విరివిగా మొక్కల పెంపకానికి నీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఇటీవల కొన్ని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇక్కడి మురుగునీటిని శుద్ధి చేసేందుకు సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్ (ఎస్‌టీపీ)ల ఏర్పాటుకు డీపీఆర్‌లు రూపొందించారు. వృక్షాల పరిరక్షణలో భాగంగా జియోట్యాగింగ్ చేయించగా.. మిగిలిపోయిన వాటిని ఆ జాబితాలో చేర్చడంపై దృష్టి పెడుతున్నారు.

పర్యాటకాభివృద్ధికి భూముల అన్వేషణ

న్యూస్‌టుడే, బాపట్ల

జిల్లాలో పర్యాటకరంగంలో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారు. తీరంలో మూడు, నాలుగు నక్షత్రాల హోటళ్లు, రిసార్టుల నిర్మాణానికి ఆసక్తి చూపుతున్నారు. బాపట్ల, చీరాల నియోజకవర్గాల్లో సముద్ర తీర ప్రాంతాల్లో భూములు కేటాయించాలని కోరుతున్నారు. ప్రభుత్వ, పట్టా భూముల వివరాలు అధికారులు సేకరిస్తున్నారు.

నక్షత్రాల హోటళ్లు.. రిసార్టుల నిర్మాణంపై ఆసక్తి

సూర్యలంకలో రూ.97.52 కోట్లతో పర్యాటకాభివృద్ధి పనులకు ఇటీవలే శ్రీకారం చుట్టారు. కారవాన్, హౌస్ బోటింగ్ టూరిజాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. బాపట్ల, చీరాల, వేటపాలెం మండలాల తీరాల్లో కొత్తహోటళ్లు, రిసార్టుల నిర్మాణం చేపట్టారు. కొత్త వాడరేవు వద్ద యాగంగి గ్రూప్ రూ.250 కోట్లతో నిర్మించిన నాలుగు నక్షత్రాల హోటల్‌ను ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విజయవాడ నుంచి వర్చువల్‌గా సీఎం చంద్రబాబు ప్రారంభించారు. సమీపంలో రూ.200 కోట్లతో మరో రెండు పెద్ద రిసార్ట్‌లు నిర్మాణంలో ఉన్నాయి. ❖ తీరంలో మడ అడవుల అందాలు, కేరళ అలెప్పీ తరహాలో సముద్ర వెనుకజలాలు, ప్రకృతి రమణీయ దృశ్యాలు పర్యాటకులను అలరిస్తున్నాయి. నిజాంపట్నం మండలం దిండి వద్ద పర్యాటకరంగం కోసం 50 ఎకరాల భూమిని ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించింది. అయితే దిండికి రవాణా సౌకర్యాలు పెద్దగా లేవని, బాపట్ల, చీరాలకు రైలు, రోడ్డు మార్గాల్లో సులువుగా పర్యాటకులు చేరుకుంటున్నారని ఈ ప్రాంతంలోనే భూములు కావాలని కోరుతున్నారు. వీటి నిర్మాణానికి అవసరమైన భూముల అన్వేషణలో రెవెన్యూ అధికారులు ఉన్నారు. రెండు నుంచి ఐదు, పది ఎకరాలు కేటాయించాలని పెట్టుబడిదారులు కోరుతున్నారు. తమకు కేటాయిస్తే టెంట్, హోమ్‌స్టే టూరిజం నిర్మాణాలు చేపడతామని ప్రతిపాదిస్తున్నారు. కొత్త హోటళ్లు, రిసార్టుల నిర్మాణం జరిగితే పర్యాటకులకు వసతి సౌకర్యాలు మెరుగవటంతోపాటు ఎక్కువ మందికి ఉపాధి లభిస్తుంది.

దిండి వద్ద కేటాయించిన భూమి

వారాంతంలో రద్దీ

జిల్లాలో బీచ్ టూరిజం వేగంగా అభివృద్ధి చెందుతోంది. హైదరాబాద్, విజయవాడ, గుంటూరు నుంచి వ్యాపారవేత్తలు, టెకీలు, ఉన్నతాధికారులు వారాంతంలో కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి సూర్యలంక, కొత్త వాడరేవు, రామాపురం బీచ్‌లలో విహారానికి వస్తున్నారు. నెలలు ముందుగానే హోటళ్లు, రిసార్టులలో గదులు బుక్ చేసుకుంటున్నారు. వివాహాలకు ముందు మెహందీ, సంగీత్ వేడుకలు బీచ్ ఒడ్డున రిసార్ట్‌లలో నిర్వహిస్తున్నారు. డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు వేదికలవుతున్నాయి. ఆక్యుపెన్సీ సైతం బాగుంటోంది. రాజధాని అమరావతి నిర్మాణం పూర్తయితే బాపట్ల, చీరాల బీచ్‌లలో భవిష్యత్తులో పర్యాటక రంగం బాగా అభివృద్ధి చెందుతుందన్న అంచనాతో పెట్టుబడిదారులు ఇటువైపు దృష్టి సారిస్తున్నారు.

అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం

బాపట్ల: పీజీఆర్‌ఎస్‌లో ప్రజలు సమస్యలపై ఇచ్చే అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ఆమేరకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జేసీ భావన అన్నారు. కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ప్రజల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన కౌలురైతులకు పరిహారం అందజేసి ఆదుకోవాలని జేసీకి రైతు సంఘాల ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. జేసీ మాట్లాడుతూ తుపాను వల్ల నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. విపత్తు సమయంలో అంకితభావంతో విధులు నిర్వహించిన 95 శాతం పింఛన్లు పంపిణీ చేసిన దరివాదకొత్తపాలెం వార్డు సచివాలయ సిబ్బంది చిమట వెన్నెలను అభినందించారు. జేసీ, అధికారులు శాలువాతో సత్కరించారు. డీఆర్వో గంగాధర్‌గౌడ్, డీపీవో ప్రభాకర్, డ్వామా పీడీ విజయలక్ష్మి, డీఆర్డీఏ పీడీ లవన్న, ఐసీడీఎస్ పీడీ రాధామాధవి, డీటీవో పరంధామరెడ్డి, గృహనిర్మాణ శాఖ పీడీ వెంకటేశ్వరరావు, మార్కెటింగ్ శాఖ ఏడీ రమేష్ పాల్గొన్నారు.

రెండ్రోజుల సెలవులో కలెక్టర్

బాపట్ల, న్యూస్‌టుడే: కలెక్టర్ వినోద్‌కుమార్ వ్యక్తిగత పనుల నిమిత్తం రెండ్రోజులు సెలవు తీసుకున్నారు. ఆయన బుధవారం తిరిగి విధుల్లో చేరనున్నారు. తాత్కాలికంగా బాధ్యతలను జేసీ భావనకు అప్పగించారు.

15 సెంట్లు.. 25 రకాల పంటలు

ముప్పాళ్ల, న్యూస్‌టుడే



పదిహేను సెంట్ల వ్యవసాయ భూమి.. 25 రకాల పంటలు.. తక్కువ విస్తీర్ణంలో ఇన్నేసి పంటలు సాగు చేస్తున్నారు. పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం నార్నెపాడుకు చెందిన మహిళా రైతు కాకుమాను పూజ మూస పద్ధతిలో పంటల సాగుకు స్వస్తి పలికి ఏటీఎం విధానాన్ని అవలంబిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగు చేస్తున్నారు. విత్తనాలు నాటిన 45 రోజుల తరువాత నుంచి ఆదాయం పొందుతున్నారు. గత ఏడాది 15 సెంట్ల భూమిలో 20 రకాల పంటల సాగుకు రూ.8,635 పెట్టుబడిగా పెట్టగా.. రూ.85 వేల ఆదాయం వచ్చిందని పూజ చెప్పారు. ఈ ఏడాది బీట్‌రూట్, ముల్లంగి, క్యారెట్, పసుపు, ఉల్లి, పాలకూర, తోటకూర, చుక్కకూర, ఎర్ర తోటకూర, మెంతికూర, కొత్తిమీర, పుదీనా, చెట్టు చిక్కుడు, గోరుచిక్కుడు, బెండ, వంగ, టమాటా, క్యాబేజి, క్యాలీఫ్లవర్, బీర, సొర, కాకర, పొట్ల, తంబకాయ, నేతి బీర (25 రకాల పంటలు) సాగు చేస్తున్నట్లు వివరించారు. వీటితో పాటు మొక్కజొన్న సాగు చేస్తున్నానన్నారు. వీటి సాగుకు రూ.10 వేలు పెట్టుబడి అయ్యిందని.. రూ.లక్షకు పైగా ఆదాయం వస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అన్నట్లు ప్రకృతి వ్యవసాయం విభాగంలో మెంటార్‌గా పని చేస్తున్న ఈమె గత ఏడాది స్వాతంత్య్ర దిన వేడుకల్లో ఉత్తమ మెంటార్‌గా రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ నుంచి అవార్డు అందుకున్నారు.

ఎరువు తయారు చేస్తున్న పూజ

బీపీఈడీ, డీపీఈడీ, ఎంపీఈడీ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యాయామ కళాశాలల్లో బీపీఈడీ, డీపీఈడీ, ఎంపీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్‌ను పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాద్ సోమవారం విడుదల చేశారు. డిసెంబరు 1వ తేదీ నుంచి నిర్వహించే పరీక్షలకు ఈ నెల 20లోపు ఫీజు చెల్లించాలని సూచించారు. రూ.100ల అపరాధ రుసుంతో ఈ నెల 22 వరకు చెల్లించే అవకాశం ఉందని చెప్పారు. బీపీఈడీకి రూ.1450, డీపీఈడీకి రూ.1090, ఎంపీఈడీకి రూ.1540 ఫీజు చెల్లించాలన్నారు.

నానోటెక్నాలజీ పరీక్షల ఫలితాలు .. ఏఎన్‌యూలోని సైన్స్ కళాశాల పరిధిలో ఈ ఏడాది ఆగస్టులో నిర్వహించిన ఐదో ఏడాది రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాద్ విడుదల చేశారు. మొత్తం 25 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 20 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

మిర్చి.. మెచ్చేలా ధర

నిల్వ సరకుకు డిమాండ్

ఈనాడు, అమరావతి

డిమాండ్ పలుకుతున్న రకాలు: తేజ, ఆర్మూర్, సీడ్, 341 రకం.

మిర్చి ధరలు పెరుగుతున్నాయి. తుపాను ప్రభావంతో చేలు దెబ్బతినడం, వరుస వర్షాలకు దిగుబడులు ఆలస్యమవుతాయన్న సమాచారంతో నిల్వ సరకుకు డిమాండ్ పెరుగుతోంది. మరోవైపు దేశీయంగా కొనుగోళ్లు బాగుండడం మార్కెట్‌కు కలిసొచ్చింది. బంగ్లాదేశ్‌కు సైతం ఎగుమతులు పెరుగుతున్నాయి. 341 రకం నాణ్యమైన కాయలకు క్వింటాలు ధర రూ.16,500కు పైగా పలుకుతోంది. గత వారంతో పోలిస్తే.. అన్ని రకాలకు క్వింటాకు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు ధర పెరిగింది. వచ్చిన సరకు వచ్చినట్టే అమ్ముడవుతోంది. సోమవారం మార్కెట్‌కు 40,415 బస్తాలు రాగా.. 37,640 బస్తాలు అమ్ముడయ్యాయి. పాతవాటితో కలిపి మార్కెట్‌లో 7,834 బస్తాలు నిల్వ ఉన్నాయి. ❖ గుంటూరు పరిసరాల్లోని శీతల గోదాముల్లో 33 లక్షల బస్తాల వరకు మిర్చి నిల్వలున్నాయి. రాష్ట్రం మొత్తమ్మీద సుమారు 52 లక్షల బస్తాలుంటాయని అంచనా. కొత్త మిర్చి మార్కెట్‌కు రావడానికి మరో రెండు నెలల సమయం ఉంది. ప్రస్తుతం రోజుకు సగటున 50 వేల బస్తాల వరకు విక్రయాలు నమోదవుతుండడంతో నిల్వలు తరిగిపోతున్నాయి. ❖ మన రాష్ట్రంలో కర్నూలు జిల్లా నుంచి తొలిపంట వచ్చేది. ఈసారి వర్షాలకు అక్కడి పంట దెబ్బతింది. ❖ ఈ ఏడాది సాగు విస్తీర్ణం తగ్గడంతోపాటు సీజన్లో ప్రతికూల పరిస్థితులు దిగుబడులను ప్రభావితం చేసే అవకాశం ఉంది.
❖ దేశంలో ముందుగా మార్కెట్‌కు వచ్చే మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లోనూ మిర్చి వర్షాలకు దెబ్బతింది. తెలంగాణలోని ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి. ❖ మార్కెట్‌లో కొన్ని రకాల లభ్యత లేక డిమాండ్ పెరుగుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ధరల పెరుగుదల కొంతమేరకే ఉండొచ్చని మార్కెట్‌వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

స్వయం ఉపాధి పథకాలపై అవగాహన సదస్సు 5న

గుంటూరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఎస్సీల అభ్యున్నతికి అమలు చేస్తున్న స్వయం ఉపాధి పథకాల గురించి తెలియజేసేందుకు ఈనెల 5వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు గుంటూరులోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం పక్కనున్న రెవెన్యూ భవన్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె.శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా మొదటి, మూడో బుధవారాలు ఎస్సీ నిరుద్యోగ యువతకు పథకాల గురించి బ్యాంకర్లతో సమన్వయం చేసుకుని అవగాహన కల్పించాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఎండీ ఆదేశించారన్నారు. సదస్సుకు ఎస్సీ నిరుద్యోగ యువత హాజరుకావాలని సూచించారు.

ఆరు రోజులుగా నిలిచిన తపాలా సేవలు

అద్దంకి, న్యూస్‌టుడే: మొంథా తుపాను కారణంగా అద్దంకి తపాలా కార్యాలయంలో సేవలు నిలిచాయి. భవనానికి లీకులున్న కారణంగా కేబుల్ వ్యవస్థ దెబ్బతింది. దీంతో ఆరు రోజులుగా ప్రజలు, వినియోగదారులకు నగదు జమ చేయడం, విత్‌డ్రా చేసుకోవడం, పార్సిళ్ల బుకింగ్ వంటి కీలక సేవలు నిలిచాయి. నాలుగు రోజుల నుంచి దాచుకున్న డబ్బులు తీసుకునేందుకు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నామని, ఎవర్ని అడిగినా ఇదిగో.. అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని వినియోగదారులు షేక్ హసన్, తిరుపతమ్మ, అంజమ్మలు వాపోయారు. కార్యాలయానికి అనుసంధానంగా ఉన్న బీఎస్‌ఎన్‌ఎల్ కేబుల్ వ్యవస్థ దెబ్బతినడంతో సేవలు నిలిచినట్లు సీనియర్ పోస్టుమాస్టర్ చంద్రశేఖరరావు తెలిపారు. సాధ్యమైనంత త్వరగా మరమ్మతులు పూర్తి చేయిస్తామన్నారు. రామ్‌నగర్ బ్రాంచి నుంచి సేవలు అందిస్తున్నట్లు వివరించారు.

(c) eenadu

వైభవంగా రామలింగేశ్వరస్వామి శతాబ్ది ప్రతిష్ఠోత్సవాలు

హోమాలు చేస్తున్న వేద పండితులు

సామూహిక కుంకుమ పూజల్లో భక్తులు

బాపట్ల, బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎస్ఎన్‌పీ అగ్రహారం రామలింగేశ్వరాలయంలో శతాబ్ది ప్రతిష్ఠోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు చేశారు. వేదపండితులు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. సామూహిక కోటి కుంకుమార్చనలో భారీగా భక్తులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ, భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడు అన్నం సతీష్ ప్రభాకర్ ఆలయంలో పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద సంతర్పణ ప్రారంభించారు. సతీష్ ప్రభాకర్ మాట్లాడుతూ ఆలయాన్ని నిర్మించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఉత్సవాన్ని నిర్వహించటం అభినందనీయమన్నారు.

మూర మల్లె రూ.100

ధేనువకొండలో సిద్ధం చేసిన మల్లెలు

అద్దంకి, న్యూస్‌టుడే: మొంథా తుపానుతో పూల ధరలు కొండెక్కాయి. మూర మల్లె ధర రూ.100 పలుకుతోంది. కిలో కాగడా మల్లెల ధర రూ.వెయ్యికి చేరింది. దూరప్రాంతాల నుంచి దిగుమతి చేసుకునే గులాబీ, చామంతుల ధరలు కొంతమేర పెరిగాయి. బాపట్ల జిల్లా అద్దంకి మండలం ధేనువకొండ, పేరాయపాలెం, ఉప్పుమిల్లి నేనివారిపాలెం, ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం గుళ్లపల్లి, వెల్లంపల్లి, కొలసనకోట తదితర గ్రామాల్లో సుమారు 300 ఎకరాల్లో మల్లె తోటలు సాగు చేస్తున్నారు. ఏటా ఫిబ్రవరి నుంచి నవంబరు నెలాఖరు వరకు మల్లె పూత వస్తుంది. కార్తికమాసం కావడంతో మల్లె పూలకు మంచి డిమాండ్ ఉంది. ఉత్సవాలు, శుభముహూర్తాల సమయంలో కిలో రూ.500 దాటని మల్లెపూల ధరలు ప్రస్తుతం రైతు దగ్గరే రూ.700 విక్రయిస్తున్నారు. వినియోగంలోకి వస్తే ఏకంగా మూర రూ.100 పలుకుతున్నాయి. కిలో మల్లెపూలతో సుమారు 25 మూరల వరకు కట్టవచ్చు. ఈ లెక్కన మల్లె పూల ధరలు వినియోగదారులకు చేరేసరికి ఎంత అవుతున్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇక పోతే కాగడా మల్లెపూలను హిందూపురం, తూముకూరు(కర్ణాటక) ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటారు. కిలో గులాబీలు రూ.250, చామంతి రూ.300 పలుకుతున్నాయి.

చట్ట పరిధిలో విచారించాలి

అర్జీదారుల సమస్య వింటున్న ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల, న్యూస్‌టుడే: సమస్యలపై ప్రజలు పీజీఆర్ఎస్‌లో ఇచ్చిన అర్జీలను చట్ట పరిధిలో సత్వరమే విచారించాలని పోలీసు అధికారులను ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 83 అర్జీలు వచ్చాయి. అర్జీదారుల సమస్యలను ఎస్పీ స్వయంగా విన్నారు. ఆయన మాట్లాడుతూ అర్జీలు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. మహిళలు, వృద్ధుల సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారానికి చేపట్టిన చర్యల నివేదికను సీఐలు, ఎస్సైలు డీపీవోకు పంపించాలని చెప్పారు. భూ వివాదాలు, ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక లావాదేవీలు, మోసాలపై ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయి. సీసీఎస్ డీఎస్పీ జగదీష్‌నాయక్, పీజీఆర్ఎస్ సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాలుర సబ్ జూనియర్ జిల్లా కబడ్డీ జట్టు శిక్షణ ప్రారంభం

శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై రమేష్

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో బాపట్ల జిల్లా బాలుర సబ్ జూనియర్ కబడ్డీ ప్రాబబుల్స్ శిక్షణను చినగంజాం ఎస్సై శీలం రమేష్ సోమవారం సాయంత్రం ప్రారంభించారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం జరిగిన ఎంపికల్లో 16 మందిని ఎంపిక చేసినట్లు జట్టు శిక్షకుడు కోట హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ నెల 6 వరకు క్రీడాకారులకు శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం తుది జట్టుకు 14 మందిని ఎంపిక చేస్తామని చెప్పారు. ఎంపికైన జట్టు ఈ నెల 7, 8, 9 తేదీల్లో కర్నూలులో జరిగే 35వ అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటుందని కబడ్డీ సంఘం జిల్లా కార్యదర్శి మంతెన సుబ్బరాజు, శిక్షకుడు హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

కలెక్టరేట్ ఆవరణలో ఆత్మహత్యాయత్నం

ఆసుపత్రిలో కోలుకున్న బెన్నీ

బాపట్ల, న్యూస్‌టుడే: చినగంజాంలో తన రొయ్యల చెరువు లీజుకు తీసుకుని ఆక్రమించిన సునీల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ కలెక్టరేట్ ఆవరణలో మార్పు బెన్నీ అనే వ్యక్తి సోమవారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది వెంటనే స్పందించి ప్రాంతీయ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. కోలుకున్న అనంతరం బెన్నీ మాట్లాడుతూ రొయ్యల చెరువుల ఆక్రమణపై పీజీఆర్ఎస్‌లో రెండు వారాల క్రితం ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. చినగంజాం పోలీస్‌స్టేషన్లోనూ ఫిర్యాదు చేశానన్నాడు. ఆక్రమణ దారుడిని ఇంకొల్లు సీఐ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి మాట్లాడి వదిలేశారని, కేసు నమోదు చేయలేదన్నారు. సమగ్ర విచారణ చేసి తన రొయ్యల చెరువు తిరిగి ఇప్పించాలన్నారు.

ఆరోగ్య కేంద్ర ఆవరణలో వరాహాలు

జె.పంగులూరు, న్యూస్‌టుడే: పంగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలు వరాహాల సంచారానికి నిలయంగా మారిందని రోగులు, వైద్యశాల సిబ్బంది వాపోతున్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా మారి దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడం కష్టంగా మారిందని వైద్య సిబ్బంది వాపోతున్నారు. దీనిపై వైద్యాధికారి శివచెన్నయ్యను వివరణ కోరగా పరిసరాల్లో పందులు సంచరించడంతో ఇబ్బందిగా ఉందని, వాటి యజమానులకు పలుమార్లు తెలిపిన పెడచెవిన పెడుతున్నారని తెలిపారు.

బ్యాంకు రుణాల పేరుతో మోసం

బాపట్ల, న్యూస్‌టుడే: బ్యాంకు రుణాలు మంజూరు చేయిస్తామని మోసం చేశారని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. చెరుకుపల్లి మండలం తూర్పుపాలెం గ్రామ పంచాయతీ మత్తివారిపాలేనికి చెందిన మత్తి బాలాజీ డబ్బులు వసూలు చేశారని బాధితులు వాపోయారు. రాజుబాబు, వెంకటలక్ష్మి, బుజ్జి, చిట్టి మాట్లాడుతూ ఒక్కొక్కరి నుంచి రూ.30 వేలు చొప్పున వసూలు చేసి బ్యాంకులో రూ.లక్ష చొప్పున రుణం మంజూరు చేయిస్తానని చెప్పారని, నగదు తీసుకుని 9 నెలలు అవుతున్నా ఇప్పించలేదని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుని తమ నగదు ఇప్పించాలని కోరారు.

సస్యరక్షణ చర్యలతో పంటలు కాపాడుకోవచ్చు

'ఈనాడు' ఫోన్ ఇన్‌లో ఆంగ్రూ వీసీ, శాస్త్రవేత్తలు

ఫోన్‌లో రైతు సందేహాలు నివృత్తి చేస్తున్న ఆంగ్రూ వీసీ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి, పక్కన లాంఫాం శాస్త్రవేత్త, ఆంగ్రూ విభాగాల అధికారులు

ఈనాడు మీతోడు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావంతో కురిసిన అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలను సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా కాపాడుకోవచ్చని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్.ఆర్.శారద జయలక్ష్మీదేవి తెలిపారు. గుంటూరులో సమీపంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లాంఫాం సమావేశ మందిరంలో 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి రైతులు విశేషంగా స్పందించారు. రైతుల సందేహాలకు వీసీ శారద జయలక్ష్మీదేవితో పాటు వర్సిటీ పరిశోధన సంచాలకుడు పి.వి.సత్యనారాయణ, విస్తరణ సంచాలకుడు జి.శివనారాయణ, లాంఫాం ఏడీఆర్ ఎన్.దుర్గాప్రసాద్, ఆయా విభాగాల శాస్త్రవేత్తలు, డాక్టర్ వైఎస్ఆర్ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు విజయలక్ష్మి, తనూజ సమాధానాలు చెప్పి సందేహాలు నివృత్తి చేశారు. పంటల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని తక్షణం బయటకు పంపాలన్నారు. 40 మంది రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఆయా పంటల్లో తీసుకోవాల్సిన సంరక్షణ చర్యలివీ..

రైతేరాజు

వరి: వర్షాలతో పాటు గాలులు వీయడంతో వరి పంట పూత దశలో ఉన్న గింజలు తాలుగా మారే అవకాశముంది. పాలు పోసుకునే గింజల్లో కూడా రంగు మారుతుంది. ధాన్యం రంగు మారకుండా, వివిధ శిలీంద్రాలు గింజలను ఆశించకుండా, మానిపండు తెగులు ఆశించకుండా ఉండటానికి ప్రొపికొనజోల్ మందు ఎకరాకు 200 మి.లీ చొప్పున పిచికారీ చేసుకోవాలి. పడిపోయిన పంటను నిలబెట్టి కట్టలు కట్టుకోవాలి. పొలంలో నీరు బయటకు పంపే అవకాశం లేని ప్రాంతాల్లో 5 శాతం ఉప్పు ద్రావణాన్ని గింజ మొలకెత్తకుండా ఉండేందుకు పిచికారీ చేయాలి. ● పైపాటుగా యూరియా, పొటాష్ 20 కిలోల చొప్పున వేసుకోవాలి. తెగుళ్ల నివారణకు వెంటనే ప్రొపికొనజోల్ మందును ఎకరానికి 200 మి.లీ పిచికారీ చేసుకోవాలి. అగ్గి తెగులు ఆశిస్తే వెంటనే ట్రైసైక్లజోల్ మందును 120 గ్రాములు చేయాలి. ఆకుమచ్చ నివారణకు కార్బెండజిమ్ మాంకోజెబ్ 400 గ్రాములు లేదా క్లోరోథలోనిల్ ... ప్రోపికొనజోల్ 60 మి.లీ మందుల్లో ఏదో ఒకటి ఎకరాకు పిచికారీ చేసుకోవాలి. కంకినల్లి నివారణకు ప్రొఫెనొఫాస్ మందును 900 మి.లీ పిచికారీ చేసుకోవాలి.

పసుపు: పంటలో 2-3 సార్లు 2 శాతం యూరియా లేదా 1 శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని వారం వ్యవధిలో పిచికారీ చేయాలి. ప్రొపికొనజోల్ 0.1 శాతం, హెక్సాకొనజోల్ 0.1 శాతం ద్రావణాలను 2-3 సార్లు వారం వ్యవధిలో మార్చి మార్చి పంట పైన పిచికారీ చేస్తే.. ఆకుమచ్చ, తాటాకు మచ్చ తెగుళ్లు నివారించవచ్చు. దుంపకుళ్లు తెగులు నివారణకు 0.3 శాతం కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 1 శాతం బోర్డో మిశ్రమంతో నేలను తడపాలి.

మిరప: పంట ఉరకెత్తి తలలు వాల్చితే లీటరు నీటికి 10 గ్రాముల యూరియా కలిపిన ద్రావణాన్ని వారంలో రెండు సార్లు పిచికారీ చేయాలి. వడలిన మొక్కలకు లీటరు నీటికి 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపిన ద్రావణం పిచికారీ చేయాలి. ఇనుప ధాతు లోపంతో మొక్కలు పాలిపోయినట్లు కనిపిస్తే.. 10 లీటర్ల నీటికి 50 గ్రాముల అన్నభేదితో పాటు ఒక నిమ్మ చెక్క రసం కలిపి పిచికారీ చేయాలి. ● పైపాటుగా ఆకురాల్ ఎకరానికి 50 కిలోల యూరియా, 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 200 కిలోల వేపపిండి వేయాలి. గొర్రుతో అంతరకృషి చేయాలి. మొక్కలు తేరుకున్న తర్వాత స్థూల పోషకాల మిశ్రమాన్ని (5 గ్రాములు లీటరు నీటికి), సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని (2.5 గ్రాముల లీటరు నీటికి) ఒకదాని తర్వాత ఒకటి వారం వ్యవధిలో 2-3 సార్లు పిచికారీ చేయాలి. బ్యాక్టీరియా ఆకుమచ్చ, కాయకుళ్లు వంటి తెగుళ్లు ఆశించే అవకాశముంది కాబట్టి ముందు జాగ్రత్త చర్యగా 10 లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, 1 గ్రాము ప్లాంటోమైసిన్ కలిపి పిచికారీ చేస్తే వ్యాప్తిని అరికట్టొచ్చు.

పత్తి: పంటలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. కాయ రాలడం ఎక్కువగా ఉంటే ప్లానోఫిక్స్ (4.5 శాతం నాఫ్తలీన్ అసిటిక్ ఆసిడ్) 0.25 మి.లీ. లీటరు మోతాదులో పిచికారీ చేయాలి. కేఎన్03 ఎకరాకు 1-2 కిలోలు కలిపి చల్లాలి. వారం వ్యవధిలో రెండుసార్లు చేయాలి. ● కాయకుళ్లు తగ్గించడానికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ + 0.1 గ్రాముల స్ట్రెప్టోసైక్లిన్ లీటరు నీటికి కలిపి మొక్కల కింది భాగపు కొమ్మలు, పచ్చటి కాయలు తడిసేలా పిచికారీ చేయాలి. వంగిపోయిన మొక్కలను నిలబెట్టి మొదళ్ల చుట్టూ మట్టిని ఎగదోయాలి. పంటలో సాళ్ల మధ్య ఏర్పాటు చేసి మొక్కలలో గాలి, కాంతి ప్రసరణ పెంచాలి.

మినుము: ఈ పంటకు ఒక శాతం 19:19:19 మందు పిచికారీ చేయాలి. ఆకుమచ్చ తెగుళ్లు, ఇతర తెగుళ్లు ఆశించకుండా కార్బెండజిమ్ + మాంకోజెబ్ 2 గ్రాములు లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. మారుకమచ్చల పురుగు నివారణకు లీటరు నీటికి నొవాల్యురాన్ 1.0 మి.లీ లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ లేదా ఫ్లుబెండమైడ్ 0.2 మి.లీ లేదా రైనాక్సిపైర్ 0.3 మి.లీ మందును పిచికారీ చేస్తే పురుగును నివారించవచ్చు.

బొప్పాయి పాలు.. విదేశాలకు

నంద్యాల జిల్లా చాగలమర్రి మండల వ్యాప్తంగా రైతులు అధికంగా బొప్పాయి సాగు చేస్తుంటారు. చిన్నవంగలితో పాటు సమీపంలోని గ్రామాల్లో వైవిధ్యంగా కడప జిల్లా కాసులపాడు, బ్రహ్మంగారి మఠం గ్రామంలో 1200 ఎకరాల్లో పండిస్తారు. విత్తనం నాటిన కాలం నుంచి తొమ్మిది నెలలు పంట చేతికొస్తుంది. పండ్ల సేకరణ అనంతరం 13 నెలల తర్వాత మిగిలిన, ముదురు కాయలకు గాట్లు పెట్టి పాలను సేకరిస్తున్నారు. తెల్లవారుజాము సమయంలోనే కాయలకు గాట్లు పెడితే కేవలం రెండు గంటల్లోనే పాలు ఊరుతుంది. ఇలా సేకరించిన దాన్ని రాయచోటి, రాజంపేటకు చెందిన వ్యాపారులు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల పాలు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 4 డ్రమ్ముల పాలు సేకరిస్తున్నారు. ఎకరానికి పాల సేకరణ ద్వారా రైతుకు రూ.24 వేల ఆదాయం వస్తుంది. సేకరించిన పాలను పరిశ్రమల్లో మందులు, కాస్మోటిక్స్, సబ్బుల తయారీలో ఉపయోగిస్తున్నారు. బెంగళూరు, చెన్నైలో పాలు నాణ్యతను బట్టి విదేశాలకు సైతం పాలను ఎగుమతి చేస్తున్నారు. బొప్పాయి సాగులో ఎప్పుడైనా ధర పడిపోయినప్పుడు బొప్పాయి పాల సేకరణతో నష్టాల నుంచి రైతులు బయటపడుతున్నారు. - న్యూస్‌టుడే, చాగలమర్రి

విద్యుత్తు నవీకరణ పనులు ప్రారంభం

మార్టూరు, న్యూస్‌టుడే: నాలుగు దశాబ్దాల నాడు ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభాలు దెబ్బతినడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఆర్డీఎస్ పథకం కింద గ్రామాల్లో కొత్త స్తంభాల ఏర్పాటుకు పనులు ప్రారంభమయ్యాయి. మండలంలోని కోనంకి ఫీడర్ పరిధిలో ఉన్న జొన్నతాళి, ఇసుక దర్శి గ్రామాల్లోని పాత స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి, కండక్టర్లు ఏర్పాటు చేసేలా పనులు వేగవంతం చేశామని ఆ శాఖ అద్దంకి ఈఈ ఎన్.మస్తానరావు తెలిపారు. ముందుగా ఇసుకదర్శి వద్ద తెదేపా నేతలు కామేపల్లి హరిబాబు, శానంపూడి చైతన్యతో కలిసి సోమవారం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు.

కాలువలో పడి యువకుడి మృతి

చీరాల అర్బన్: ప్రమాదవశాత్తు యువకుడు కాలువలో పడి మృతి చెందిన ఘటన సోమవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం... కొత్తపాలేనికి చెందిన మీసాల ఉమ (32) కలువ పూలను మార్కెట్‌లో విక్రయించి, ఉపాధి పొందుతాడు. ఈనేపథ్యంలో ఆదివారం వాటికోసం వెళ్లాడు. రాత్రికి ఇంటికి రాలేదు. ఉదయం దండుబాట-స్వర్ణ రోడ్డులో ఉన్న కాలువలో మృతదేహం కనపడటంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం ఏరియా వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

మేదరమెట్ల, అద్దంకి: ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఒకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కొరిశపాడు మండలం మేదరమెట్ల జాతీయ రహదారి బైపాస్‌లో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. అద్దంకి పట్టణానికి చెందిన ఎం.మల్లికార్జునరావు ద్విచక్ర వాహనంపై మేదరమెట్ల నుంచి అద్దంకి వస్తుండగా ఇది జరిగింది. క్షతగాత్రుడిని 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో/ ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును(స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీనివాస గ్రూప్, VJA, వృద్ధులకు, పేషెంట్లసేవకు, ఇంటి/ వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 9553786677/ 9640496677.

REAL ESTATE

HOUSE FOR SALE

GENERAL

గుంటూరు సిటీ SVNకాలనీ నందనవనంలో 466గ॥ ఇల్లు పడమర,దక్షిణం రోడ్లతో అమ్మకానికి కలదు. నోబ్రోకర్స్, డైరెక్ట్ 9849502430, 8341342696.

PLOT FOR SALE

GENERAL

మంగళగిరి గాలి గోపురం దగ్గరలో పోలేరమ్మ గుడి పక్క సందులో షాపులు నిర్మించుటకు అనువైన 60.5 గజాలు స్థలం అమ్మబడును. Ph: 83319 89433.

గుంటూరు: మా సంస్థలో CRDA అప్రూవ్డ్ ప్లాట్లు మార్కెటింగ్ చేయుటకు టీం లీడర్, ఎగ్జిక్యూటివ్ కావలెను. కమీషన్ + ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. 98498 86249.

JOBS

Wanted female nurse for home patient. Exp: BSc nursing & food and Nutrition. Timings: morning 6am to 6pm pls send ur Biodata with photo to following mail ID (staffbala5@gmail.com)

Senior Qualified lab Technician Wanted to work on Fully automatic analyser. 62815 06491.

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్/ మణప్పురం స్టాఫ్ HDFC/ AXIS బ్యాంక్, క్లర్క్‌లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆ 8297675825.

WANTED HDFC BANK కొరకు గుంటూరు & ప్రకాశంజిల్లాల్లో పనిచేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. DRA సర్టిఫికెట్ కలిగినవారికి తొలి ప్రాధాన్యత. వెంటనే సంప్రదించండి. లలితా ఫైనాన్స్ లింక్స్ కాంగ్రెస్ ఆఫీస్ రోడ్, విజయవాడ. ✆9951001348

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యూయర్స్. ఏజ్: 22-35. ఫ్రెషర్స్ కూడా కావలెను. ✆ 6281037879.

R.K ఇంజినీరింగ్ కాలేజీ నందు పనిచేయుటకు ఎలక్ట్రీషియన్స్ కావలెను. అనుభవము బట్టి జీతం + భోజనం + ఉచిత వసతి కల్పించబడును. కేతనకొండ, ఇబ్రహీంపట్నం మండలం, విజయవాడ, 97014 73399.

రాఘవ ఆటో ఫైనాన్సియర్స్, తెనాలి, బాపట్ల, చిలకలూరిపేట, నరసరావుపేటలో కలెక్షన్ చేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ కావలెను. శాలరీ: 15K-16K, TA, ఇన్సెంటివ్స్. వ: 21-35 సం॥. అర్హత: ఇంటర్ ఆపైన. టూ వీలర్ తప్పనిసరి. 91009 27415, 91547 46824.

గుంటూరు, ఆటోనగర్ HP పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు మేనేజర్, పంపు బాయ్స్/ గర్ల్స్ కావలెను. పార్ట్/ ఫుల్ టైమ్. 77996 89889, 80745 46302.

DSA ఏజన్సీ నందు పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం: 12 వేలు. సంప్ర: 99489 35879, 80081 00872. గుంటూరు.

ప్రముఖ ఐస్‌క్రీమ్ కంపెనీ నందు పనిచేయుటకు లేడీ రిసెప్షనిస్ట్ కం కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. అ: డిగ్రీ, ట్యాలీ. జీ: 15 - 20K. నల్లపాడు, గుంటూరు. 70323 51666.

మాచర్లలోని ఫైనాన్షియల్ ఆర్గనైజేషన్ నందు పనిచేయుటకు బ్రాంచ్ మేనేజర్, లోన్ ఆఫీసర్స్ కావలెను. అర్హత: డిగ్రీ/ పిజి రిటైర్డ్ బ్యాంకింగ్/ NBFC ఎంప్లాయిస్‌కి మరియు లోకల్ వారికి ప్రాధాన్యత. Ph: 78937 94796, 72074 94496, 81212 94296, 73373 94936.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/- 5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/- ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

WALK - IN - INTERVIEW విజన్ ఆటో మోటీవ్స్ అపె ఆటో షోరూమ్ గుంటూరు, తెనాలి, నరసరావుపేట, మంగళగిరి, పిడుగురాళ్ళ నందు పనిచేయుటకు ★ సేల్స్ మేనేజర్స్- 4 ★ సేల్స్ ఎగ్జిక్యూటీవ్స్ - 15 ★ అకౌంటెంట్స్ -2 ★ సర్వీసు మేనేజర్ -1 ★ సర్వీసు సూపర్‌వైజర్స్- 4 ★ మెకానిక్స్- 6 కావలెను. విజన్ఆటో మోటీవ్స్, D.No. 18-4-23. బ్రహ్మానందరెడ్డి స్టేడియం దగ్గర గుంటూరు. ఇంటర్వ్యూ తేది: 04-11-25 నుండి 07-11-2025 వరకు. ఫోన్/ వాట్సాప్: 77999 09045, 77999 09055. ఇమెయిల్: visionauto.guntur@gmail.com

గుంటూరు జిల్లా వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ హాస్టల్‌లో ఉండి పనిచేయుటకు వార్డెన్స్ కావలెను. (పురుషులు/ స్త్రీలు) డిగ్రీ/ పీజీ అర్హత. కాంటాక్ట్- 94903 09033 (F), 97058 34803 (M).

ప్రముఖ కంపెనీలో స్కానింగ్ కోసం అభ్యర్థులు అవసరం. అర్హత: ఇంటర్/ ఏదైనా డిగ్రీ, నరసరావుపేట. Ph: 9710545017.

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

గుంతల్లో పడ్డ లారీ.. ఊడిన చక్రం

రోడ్డుపై నిలిచిన లారీ

ఊడిన చక్రం

మేదరమెట్ల, న్యూస్‌టుడే: కొరిశపాడు మండలం మేదరమెట్ల- అద్దంకి రోడ్డులోని జాతీయ రహదారి వంతెన కింద రోడ్డుపై గుంతలు పడి చోదకులకు చుక్కలు చూపిస్తున్నాయి. సోమవారం ఉదయం హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న లారీ ఆ గుంతల్లో పడి చక్రం ఊడిపోయింది. సరిగ్గా మలుపులో ఇది జరగడంతో వెనుక నుంచి వచ్చే వాహనాలు చాలా సేపు అక్కడే నిలిచిపోయాయి. ఆ గుంతలు పూడ్చాలని పలుమార్లు జాతీయ రహదారి అధికారులకు చెప్పినప్పటికి ఎటువంటి ప్రయోజనం లేదు. ఇప్పటికైనా మరమ్మతులు చేయించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

బాపట్ల, న్యూస్‌టుడే: రైళ్లలో గంజాయి అక్రమ రవాణా ఆగటం లేదు. పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో బాపట్ల-చీరాల రైల్వేస్టేషన్ల మధ్య ఎస్పీ, ఈగల్, రైల్వే పోలీసులు సంయుక్త ఆపరేషన్ నిర్వహించి రెండు కేజీల గంజాయిని సోమవారం పట్టుకున్నారు. రైలులో పోలీసు జాగిలాలతో పోలీసు అధికారులు, సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బ్యాగులో తరలిస్తున్న గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా రాష్ట్రం బరంపూర్ నుంచి గంజాయి తరలిస్తున్న తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన సురేష్‌నాయక్, ఫణికుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్పీ సీఐ రాంబాబు తెలిపారు. గంజాయి అక్రమ రవాణా చేసినా, విక్రయించినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆపుకోవాల్సిందే... లోపలికి వెళ్లలేం!

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: కస్తూర్బా బాలికోన్నత పాఠశాల గోడ వెంట ఆర్ఆర్ రోడ్డులోని మూత్రశాల లోపలకు వెళ్లలేని పరిస్థితి. పురపాలక సంఘం ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంకు సోషల్ ఫౌండేషన్ చీరాల శాఖ సౌజన్యంతో రూ.2 లక్షలతో దీన్ని ఏర్పాటు చేశారు. 2022 అక్టోబరు 27న ప్రారంభించారు. కొన్నాళ్లు దీని నిర్వహణ మున్సిపల్ పారిశుద్ధ్య విభాగం అధికారులు చూశారు. ఆ తరువాత పట్టించుకోవడం మానేశారు. ఫలితంగా దుర్వాసన వెదజల్లుతోంది. నిత్యం అనేక మంది పట్టణంలోకి ఇతర ప్రాంతాలకు చెందినవారు వస్తుంటారు. వారు అత్యవసరమై అందులోకి వెళదామని చూస్తే ఆపుకోవడమే తప్ప లోపలికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తే వెంటనే బాగుచేస్తున్నారు. మళ్లీ యథాస్థితికి చేరుతోంది. అధికారులు స్పందించి దీన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హత్యాయత్నం కేసులో ఏడేళ్ల జైలు

మేదరమెట్ల, న్యూస్‌టుడే: హత్యాయత్నం కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ అద్దంకి కోర్టు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి వెంకటనాగలక్ష్మి సోమవారం తీర్పు వెలువరించారు. కొరిశపాడు ఎస్సై సురేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. కొరిశపాడు మండలం కృష్ణంరాజు వారిపాలెం(రెడ్డిపాలెం) గ్రామానికి చెందిన మోదుగుల సోమిరెడ్డి అదే గ్రామానికి చెందిన భవనం చిన్నారెడ్డిని 2020 మేలో దాడి చేసి, గాయపరిచాడు. చిన్నారెడ్డి ఫిర్యాదు మేరకు సోమిరెడ్డిని అరెస్టు చేసి, రిమాండుకు పంపించారు. ఆ కేసుకు సంబంధించి తుదితీర్పు వచ్చింది. ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ మొయిన్ ఆధ్వర్యంలో అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్సై సురేష్‌బాబు, కోర్టు కానిస్టేబుల్ ఆనంద్ కేసు దర్యాప్తు వేగంగా చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేశారు. కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన నాటి ఎస్సై, ప్రస్తుతం కంభం సీఐగా పనిచేస్తున్న కె.మల్లికార్జునరావును ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ప్రమాదంపై కేసు

అద్దంకి: ద్విచక్ర వాహనంపై వెళుతున్న దంపతుల్ని పాల వాహనం ఢీకొన్న సంఘటనపై పోలీసుస్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. శిక్షణ ఎస్సై వెంకటేశ్వరరెడ్డి అందించిన సమాచారం మేరకు.. ఆదివారం ఉదయం అల్పాహారం కోసం ద్విచక్ర వాహనంపై వెళుతున్న మధుసూదనాచారి దంపతుల్ని పాల ఆటో ఢీకొట్టింది. క్షతగాత్రుల్ని చికిత్స నిమిత్తం ఒంగోలు వైద్యశాలకు తరలించారు. మధుసూదనాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 121, రిటైల్ ధర - 148, చికెన్ విత్‌స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్ - 244.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234. [illegible]

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర [illegible]

91.9FM Vijayawada ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమం	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ.5 - ఉ.7
ఈ-హార్మనీస్	ఉ.7 - ఉ.11
నువ్వా నేనా	ఉ.11 - మ.2
సత్యభామ	మ.2 - సా.5
లైట్ తీస్కో	సా.5 - రా.9
సరదా కాఫీస్	రా.9 - రా.12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా.12 - తె.5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు Cell: 80085 10541 ఈనాడు ప్రతినిధిని సంప్రదించండి Cell: 80085 14589

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

ఆరాధ్య దైవాలకు ఆభరణాల వితరణ

కానుకలు అందజేస్తున్న పోతురాజు దంపతులు

కొల్లూరు, న్యూస్‌టుడే: అనంతభోగేశ్వరస్వామికి రూ.40,000 విలువైన వెండి మారేడు దళాల దండ, పార్వతీ అమ్మవారికి రూ.65,000 విలువైన బంగారు గాజులు, పట్టీలను శ్రీనివాస రెస్టారెంట్ గ్రాండ్ యజమాని యరగుళ్ల పోతురాజు, లలిత దంపతులు సోమవారం కానుకగా సమర్పించారు. అర్చకులు కొమ్మూరు వెంకట శివప్రసాద్, గాడేపల్లి శివ పోతురాజు దంపతులకు ఆశీస్సులు అందించారు.

చిత్రాలు గీశారు.. విజేతలయ్యారు

బాపట్ల, న్యూస్‌టుడే: ఈనాడు ఆధ్వర్యంలో లిటిల్ ఏంజెల్స్ ఉన్నత పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీలు సోమవారం నిర్వహించారు. చిత్రలేఖనం పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులు మీరా జాస్మిన్ ప్రథమ, చక్రిక ద్వితీయ, సజ్మా చషీన్ తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ సెబాస్టియన్, ఉపాధ్యాయులు సులోచనరాణి, సుధారాణి బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ సెబాస్టియన్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

? చెరుకుపల్లి మసీదు పక్కనే సిమెంటు రోడ్డుపై నీళ్లు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. నీళ్లు డ్రైనేజీలోకి పోయేలా చర్యలు తీసుకోవాలి. -ప్రసాద్, చెరుకుపల్లి ✔ నిల్వ నీటిని పంపి డ్రైనేజీలోకి పోయేలా చర్యలు తీసుకుంటాం. -మల్లికార్జునరావు, పంచాయతీ కార్యదర్శి, చెరుకుపల్లి – న్యూస్‌టుడే, చెరుకుపల్లి

? రేపల్లె నాలుగోవార్డు గోవాడవారివీధిలో రెండు చేతిపంపులు పనిచేయడంలేదు. -సాంబశివరావు, స్థానికుడు. ✔ వెంటనే చేతిపంపులకు మరమ్మతులు చేయిస్తాం. -శామ్యూల్, మున్సిపల్ ఏఈ రేపల్లె ? రేపల్లె గదువులో ద్దులో పలుచోట్ల చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. -రాఘవయ్య, స్థానికుడు ✔ తుపానుకు విరిగిపడిన చెట్ల కొమ్మల్ని తొలగించేలా చర్యలు తీసుకుంటాం. -రామచంద్రరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, రేపల్లె – న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్

? పిట్టలవానిపాలెం ప్రధాన రహదారి నుంచి పంచాయతీ కార్యాలయానికి వెళ్లే రహదారిపై కొద్దిపాటి వర్షానికే నీరు నిలుస్తుండటంతో వాహనదారులు, గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. - సురేష్, పీవీపాలెం ✔ పరిశీలించి నీరు నిలవకుండా చర్యలు తీసుకుంటాం. - ప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి, పీవీపాలెం –న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం

చక్కెరకేళి చేదెక్కి.. రైతు గుండె బరువెక్కి

2 వేల ఎకరాల్లో దెబ్బతిన్న అరటి

రేపల్లె అర్బన్, కొల్లూరు, న్యూస్‌టుడే

మొంథా తుపాను అరటి రైతులకు అంతులేని ఆవేదన మిగిల్చింది. తుపాను ప్రభావంతో వీచిన ఈదురు గాలులకు తోటలు విరిగిపడ్డాయి. ఎకరాకు దాదాపు రూ.50 నుంచి రూ.60 వేల వరకు పెట్టుబడి పెట్టారు. పంట చేతికొచ్చే సమయంలో కూలిన తోటలను చూసి కంట నీరు పెడుతున్నారు. కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె, కర్లపాలెం, దుగ్గిరాల, మంగళగిరి మండలాల రైతులు కర్పూర, చక్కెరకేళి రకాలు సాగు చేశారు. బాపట్ల జిల్లాలో మొత్తం 4,700 ఎకరాల్లో అరటి సాగుచేశారు. తుపాను ప్రభావానికి జిల్లాలో 2 వేల ఎకరాల్లో అరటి తోటలు దెబ్బతింటే అందులో కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోనే 1900 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు ఉద్యానశాఖ అధికారులు అంచనాలు తయారు చేశారు.

కొల్లూరులో నేలకొరిగిన అరటి తోట

నష్టం నమోదుపై అభ్యంతరం

అరటి పంట కాలం రకాలను బట్టి ఏడు నుంచి ఎనిమిది నెలలు పడుతుంది. పంట ప్రస్తుతం కాయదశలో ఉంది. పంట ఆరంభం నుంచి ఇప్పటి వరకు దుక్కి దున్నడం, పిలకలు కొనుగోలు, ఎరువులు, ఇతర ఖర్చులు కలిపి ఎకరాకు రూ.70 వేల వరకు పెట్టుబడి పెట్టారు. కౌలు రైతుకు రూ.50 వేలు అదనంగా ఖర్చు వచ్చింది. పంట చేతికొచ్చే సమయంలో వచ్చిన విపత్తుతో పూర్తిగా నష్టపోయామని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే నష్టం అంచనాలో అధికారులు నిబంధనల పేరుతో కొంత మాత్రమే నమోదు చేస్తున్నారని, దీనివల్ల ఎక్కువ నష్టం తప్పదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పడిపోయిన అరటి బొత్తలను తొలగించేందుకు భారం పడుతుందని, దీన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలని విమర్శిస్తున్నారు.

8 ఎకరాల్లో పంట నష్టం

రెండు ఎకరాలు సొంతంగా, ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని అరటి తోట సాగు చేశాను. కాయ పక్వానికి వచ్చిన నాలుగు ఎకరాలకు రూ.2.40 లక్షలు, లేత తోట నాలుగు ఎకరాలకు రూ.1.25 లక్షలు పెట్టుబడి పెట్టాను. గాలివాన ఎనిమిది ఎకరాల్లో పంట పూర్తిగా పడిపోయింది. విరిగిన బొత్తలను తొలగించేందుకు రూ.50 వేలు ఖర్చు అవుతుంది. వాటిని తొలగించకుంటే రెండో పంట వేసే అవకాశం ఉండదు. నిబంధనల ప్రకారం పక్వానికి వచ్చిన అరటితోటకు మాత్రమే నష్ట పరిహారం వస్తుందని అధికారులు చెబుతున్నారు. -నాదెళ్ల ప్రకాశరావు, రైతు, జువ్వలపాలెం.

బీమా సదుపాయం కల్పించాలి

1.24 ఎకరాల్లో అరటి పంట సాగు చేసి రూ.80 వేలు పెట్టుబడి పెట్టా. తుపానుతో తోట మొత్తం విరిగి పడిపోయింది. నాన్ నోటిఫైడ్ క్రాప్ కింద అధికారులు నమోదు చేశారు. ఇలా చేయడం వల్ల ఎకరాకు రూ.14 వేలు మాత్రమే పరిహారం అందుతుంది. అదేమని అడిగితే నిబంధనల ప్రకారం నమోదు చేశామని అంటున్నారు. విపత్తు కారణంతో దెబ్బతిన్న అరటితోటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద పరిహారం ఇస్తే రైతులకు మేలు జరుగుతుంది.

–మోర్ల శ్రీవెంకటరమణ, రైతు, వేజెళ్లవారిలంక

పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యం

రేపల్లె అర్బన్, నగరం, న్యూస్‌టుడే: పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. రేపల్లె తెదేపా కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న 23 మందికి వైద్యం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.64.32 లక్షల చెక్కులు, మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ✦ రేపల్లె తెదేపా కార్యాలయంలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని అనేక మంది ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై అర్జీలు అందజేశారు. పరిశీలించిన మంత్రి వెంటనే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

చెక్కు మంజూరు పత్రం అందజేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

సత్యసాయిబాబుకు అభినందన.. కళాకారులు దేశ సంపదని రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సజ్జావారిపాలెం గ్రామానికి చెందిన వల్లభనేని సత్యసాయిబాబు ఇటీవల యూఎస్‌ఏ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం దక్కించుకున్నాడు. పనికి రాని కొబ్బరి చిప్పలతో వివిధరకాల కళారూపాలు రూపొందించిన సత్యసాయిబాబును రాష్ట్ర మంత్రి సత్యప్రసాద్ రేపల్లె పార్టీ కార్యాలయంలో సోమవారం ఘనంగా సత్కరించి అభినందించారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి

రేపల్లె అర్బన్, వేమూరు, కర్లపాలెం, న్యూస్‌టుడే: విద్యార్థులకు గుణాత్మక విద్య అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని బాపట్ల జిల్లా ఉప విద్యాశాఖాధికారి సురేష్ సూచించారు. రేపల్లె మండలం పేటేరు ప్రాథమిక పాఠశాలను సోమవారం మండల అకడమిక్ ఫోరం కమిటీ సందర్శించింది. పిల్లల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. తొలుత పిల్లల అభ్యసన ప్రక్రియను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఫోరం సభ్యులు సుధాకర్, ప్రభాకరరావు, ప్రధానోపాధ్యాయులు బాబూజీ, శ్రీనివాసరావు తదితరులున్నారు.

పిల్లలతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో సురేష్

నైపుణ్యంపై అవగాహన.. విద్యార్థులకు వృత్తి విద్య నైపుణ్యంపై అవగాహన అవసరమని ప్రధానోపాధ్యాయుడు బదరీనారాయణ తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో జంపని ఉన్నత పాఠశాలలో వృత్తి విద్య కోర్సులో చదువుతున్న విద్యార్థులకు వృత్తి విద్య నైపుణ్యంపై పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు.

దాతల సహకారం అవసరం.. ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెందాలంటే దాతల సహకారం ఎంతో అవసరమని నర్రావారిపాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాంచారయ్య పేర్కొన్నారు. భారత సైన్యంలో విధులు నిర్వహిస్తున్న మరక మాధవ గోపి కుమారుడు ప్రియాంష్ సాయి కృష్ణ జన్మదినం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నూతన వస్త్రాలు అందించారు.

పంట నష్టం నమోదుపై ఆగ్రహం

కొల్లూరు, న్యూస్‌టుడే: మొంథా తుపానుకు పంట నష్టం అపారంగా ఉంటే అధికారులు నమోదు అరకొరగా ఉందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని బొద్దులూరుపాడు, యాదవపాలేనికి చెందిన కొందరు రైతులు జాబితా తయారీలో లోపాలు ఉన్నాయని సోమవారం తెదేపా మండల కన్వీనర్ మైనేని మురళీకృష్ణకు చెప్పారు. వ్యవసాయాధికారి నరేంద్రబాబే కారణమని ఆరోపించారు. వారంతా కలిసి తహసీల్దార్‌కు వివరించారు. ఎంఏవోపై విరుచుకుపడ్డారు. తహసీల్దార్ వెంటనే ఏడీఏ లక్ష్మికి ఫోన్‌ద్వారా ఈ విషయాన్ని వివరించగా వీఏవోల ద్వారా పంట నష్టపోయిన పేర్లు నమోదు చేయించాలని సూచించడంతో రైతులు అక్కడ నుంచి వెళ్లిపోయారు.

అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

బాపట్ల, న్యూస్‌టుడే: ప్రైవేటు కంపెనీ విక్రయించిన నాసిరకం విత్తనాల వల్ల నష్టపోయిన కొల్లూరు మండలం అనంతరం రైతులు, కౌలురైతులకు ఎకరాకు రూ.50 వేలు చొప్పున పరిహారం అందజేసి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య డిమాండ్ చేశారు. రైతులతో కలిసి కలెక్టరేట్ వద్ద సీపీఎం, రైతు సంఘం నేతలు సోమవారం ఆందోళన చేశారు.

ఇసుపల్లి: చెన్నమల్లేశ్వరస్వామి

అల్లూరులో దీపారాధన

కార్తిక సోమవారం.. భక్తుల పరవశం

న్యూస్‌టుడే, బృందం: బాపట్ల, వేమూరు, రేపల్లి నియోజకవర్గాల్లోని పలు ఆలయాల్లో సోమవారం కార్తిక పూజలు వైభవంగా నిర్వహించారు. దేవతలను ప్రత్యేకంగా అలంకరించగా పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దీపారాధనలు, అభిషేకాల అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు అందుకున్నారు.

రాజోలు శివాలయంలో భక్తుల పూజలు

బాపట్ల: అలంకరణలో వేంకటేశ్వరస్వామి

నేడు చెకుముకి పోటీలు

గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా మంగళవారం మండల స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు వేదిక మండల అధ్యక్షుడు కాటూరి నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 1.30గంటల నుంచి గుళ్లపల్లి జడ్పీఉన్నత పాఠశాలలో పోటీలు జరుగుతాయన్నారు. గత నెలలో పాఠశాలల్లో నిర్వహించిన ప్రతిభ పోటీల్లో విజేతలు పాఠశాల బృందంగా ఈ పోటీల్లో పాల్గొన్నాలని ఆయన కోరారు. విజేతలు ఈనెల 23న బాపట్లలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

భర్త పింఛన్ భార్యకు అవకాశం

చెరుకుపల్లి: ఈనెలలో మండలంలోని 9,840 మంది లబ్ధిదారులకు 9548 మందికి మాత్రమే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. లబ్ధిదారు పింఛను పొందుతూ మరణిస్తే అతని భార్యకు పింఛన్ ఇచ్చేలా ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. దరఖాస్తులను సచివాలయంలోని సంక్షేమ సహాయకునికి అందించాలన్నారు.

ఎవరో వస్తారని ఎదురు చూడక

గూడవల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో ఇప్పటికే గూడవల్లి ప్రాంతంలో వరి పైర్లు నేలవాలాయి. దీనికి తోడు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో భారీగా నీరు చేరింది. దీంతో గూడవల్లి - పాంచళవరం ఆర్ అండ్‌బీ రహదారి మార్గంలో మురుగు పోయే తూముల్లో పూడికతో నీటితో నిచిలిపోయింది. గమనించిన రైతులు సోమవారం ఉదయం జేసీబీ సాయంతో తూములున్న ప్రాంతంలో రహదారిపై గుంతను తవ్వారు. అక్కడ తూముల్లో అడ్డంకులను తొలగించే పనులను చేపట్టారు. నీళ్లు తగ్గిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

తూములున్న రోడ్డుపై గుంత తీస్తున్న జేసీబీ

ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందన

విజేతలతో ప్రధనోపాధ్యాయుడు నిరీక్షణరావు, ఉపాధ్యాయులు

అమృతలూరు, న్యూస్‌టుడే: వేమూరు నియోజకవర్గంలోని అమృతలూరు జిల్లాపరిషత్తు ఉన్నతపాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మాక్ అసెంబ్లీ నిర్వహించేందుకు ఒక్కొక్క నియోజకవర్గం నుంచి ముగ్గురు విద్యార్థులను ఎంపికచేసి అమరావతి సచివాలయానికి పంపించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈనేపథ్యంలో మండలస్థాయిలో జరిగిన పోటీల్లో ముగ్గురు విజేతలను ఎంపికచేసి సోమవారం వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీలకు పంపారు. అమృతలూరు మండలం నుంచి విజేతలుగా నిలిచిన స్థానిక ఉన్నతపాఠశాల విద్యార్థులు ముగ్గురు పాల్గొన్నారు. వీరు మళ్లీ నియోజకవర్గ స్థాయిలో విజేతలుగా నిలిచారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

రాష్ట్ర సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపిక

భట్టిప్రోలు: టీఎంరావు ఉన్నత పాఠశాల విద్యార్థిని పులివర్తి వందన రాష్ట్ర సాఫ్ట్‌బాల్ జట్టుకి ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు రామకోటేశ్వరరావు తెలిపారు. అండర్-14 బాలికల విభాగంలో జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో రాష్ట్ర స్థాయి జట్టులో చోటు సంపాదించిందన్నారు. స్థానిక పాఠశాల ఆవరణలో సోమవారం అభినందన సభ నిర్వహించారు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు మహమ్మద్ అనిల్‌హక్, చేబ్రోలు శ్రీనివాసరావు ప్రతిభ చూపిన విద్యార్థినిని కరస్పాండెంట్ మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు అభినందలు తెలిపారు.

సమన్వయ లోపం.. పనులకు శాపం

నగరం, న్యూస్‌టుడే: జియో కాలనీ వాసులకు మురుగు కాలువ కడుతున్నారన్న ఆనందం ఆదిలోనే ఆవిరైంది. 20 ఏళ్లుగా కాలువ నిర్మించాలని స్థానికులు చేసిన ప్రయత్నాలు కూటమి ప్రభుత్వంలో ఫలించాయి. కాలువ నిర్మాణ పనులు పట్టాలెక్కాయి. గుత్తేదారుడు పనులు ప్రారంభించగానే తుపాను కారణంగా వర్షాలు పడ్డాయి. రెండు రోజుల పాటు కాలువ తవ్వి బెడ్ వేశారు. ఇంతలో ఏఈ, గుత్తేదారుకు వివాదం తలెత్తడంతో పనులు నిలిచాయి. ఇళ్ల ముందు కాలువ తవ్వి వదిలేయడంతో స్థానికులు పడరాని పాట్లు పడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు రోడ్డుకు రావాలంటే అవస్థలు పడుతున్నారు. కొందరు నిచ్చెన సాయంతో రాకపోకలు నిర్వహించాల్సి వస్తోంది. ఈ విషయమై ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ వర్షాలకు పనులు నిలిచాయని, రెండు రోజుల్లో పనులు చేపడుతామన్నారు.

నిచ్చెన సాయంతో ఇంట్లోకి వెళుతున్న మహిళ

మహిళలకు క్రికెట్ శిక్షణ ఇస్తాం

గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ): వేసవి నుంచి బాలబాలికలతోపాటు మహిళలకు ప్రత్యేకంగా క్రికెట్‌లో శిక్షణ అందిస్తామని చెరుకుపల్లి క్రికెట్ క్లబ్ కార్యదర్శి గండె శ్రీనివాసరావు అన్నారు. వన్‌డే ప్రపంచ కప్‌ను భారత మహిళల జట్టు గెలుపొందిన సందర్భంగా సోమవారం గుళ్లపల్లిలోని క్లబ్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ప్రపంచ కప్‌తో దేశ మహిళల సత్తా లోకానికి తెలిసిందన్నారు. తల్లిదండ్రులు ఆడామగ అని తేడాలేకుండా పిల్లలను సమానంగా చూడాలన్నారు. విజేత జట్టులో తెలుగమ్మాయి శ్రీచరణిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు చీకోటి కిషోర్, కందుల శ్రీనివాస్, చక్రి, రాజు, కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే: దుకాణం ముందు నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాన్ని పట్టపగలే దొంగ ఎత్తుకుపోయిన ఘటన సీసీటీవీ ఫుటేజ్‌లో నిక్షిప్తమైంది. తెనాలిరోడ్డులోని హోటల్ యజమాని సుధాకర్ ఆదివారం స్కూటర్ పార్క్‌చేసి లోపలకు వెళ్లారు. రాత్రి వాహనం కనిపంచలేదని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. హోటల్‌లో భోజనం చేసిన వ్యక్తి ఒకరు తీసుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీసీటీవీలో నమోదైన దృశ్యం

కార్తిక పౌర్ణమికి ముందస్తు ఏర్పాట్లు చేయాలి

పొన్నపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా ఆలయాల వద్ద దీపోత్సవాకు ఏర్పాట్లు చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ అన్నారు. ఫౌండేషన్ నగరం మండల సమావేశాన్ని ఆయన సోమవారం మండలంలోని పొన్నపల్లి ఎస్టీకాలనీ శ్రీకోదండరామాలయం వద్ద నిర్వహించారు. ఈనెల 5న కార్తిక పౌర్ణమి సందర్భంగా ఆలయాల్లో సామూహిక హారతి కార్యక్రమాలను నిర్వహించాలని, ఆలయాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో నేతలు జంజనం హేమశంకరరావు, చింతల మురళీకృష్ణ, అర్చకస్వామి నంబూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన అవసరం

కర్లపాలెం: తుపాను తర్వాత సంభవించే అసంక్రమిత వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పర్యవేక్షణ అధికారి డాక్టర్ లోకేశ్ పేర్కొన్నారు. పెదగొల్లపాలెం పంచాయతీ పరిధిలోని యారం వారిపాలెం ఆయుస్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టాస్క్‌ఫోర్సు సభ్యులు సోమవారం సందర్శించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. పర్యావరణ, వాతావరణ కాలుష్యాలను విద్యార్థులకు తెలియజేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి గోపినాథ్, సామాజిక ఆరోగ్య అధికారి మల్లికార్జునరావు, జిల్లా మేనేజర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

కాలు కదపలేం.. వీధుల్లో తిరగలేం

బాపట్ల పట్టణ శివారు కాలనీలో సమస్యల తిష్ఠ ✦ సీసీ రోడ్లు, కాలువలు నిర్మించాలని వేడుకోలు

న్యూస్‌టుడే, బాపట్లటౌన్

బాపట్ల పట్టణ శివారులో ఉన్న పీఎం గృహకల్పనగర్‌లో సమస్యలు తిష్ఠవేశాయి. కనీస సదుపాయాలు లేక స్థానికులు నరకయాతన పడుతున్నారు. రోడ్లులేకపోవడంతో వర్షం వచ్చిన ప్రతిసారీ కాలనీ వీధులు నీళ్లు, బురదతో నిండిపోతున్నాయి. సైడు కాలువలు లేక పోవడంతో ఇళ్లచుట్టూ మురుగు నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. మురుగు, తాగునీటి సమస్యతో అవస్థలు పడుతున్నారు. వైకాపా ప్రభుత్వంలో పీఎం గృహకల్ప నగర్‌లో సుమారు 1,800 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఇక్కడ ఇళ్లు నిర్మించుకున్న వారికి సంతోషం లేకుండా పోయింది. కాలనీలో ఎక్కడా సీసీ రోడ్లు నిర్మించలేదు. సైడు కాలువలు లేవు. తాగే నీటికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వర్షం కురిస్తే ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి. వీధుల్లో ఉన్న గుంతల్లో నీళ్లు చేరి చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. విషపురుగులు వస్తుండటంతో స్థానికులు హడలిపోతున్నారు. రాత్రిపూట దోమలు, దుర్వాసనతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. తరచూ అనారోగ్యం పాలవుతున్నా పట్టించుకునేవారు లేరని వాపోతున్నారు.

చెరువును తలపిస్తున్న కాలనీలోని ప్రధాన వీధి

ఇళ్లచుట్టూ మురుగునీరు

కాలనీకి మున్సిపాలిటీ నీళ్లు వారానికి ఒకసారి వస్తున్నాయి. బోర్లు వేసుకున్నప్పటికీ ఉప్పునీళ్లు కావడంతో తాగడానికి పనికిరావు. ఇళ్ల చుట్టూ మురుగు నీరు నిల్వ ఉండటంతో ఇబ్బందులు పడుతున్నాం. బురద కారణంగా కాలనీలోకి ఆటోలు రావడంలేదు. ద్విచక్రవాహనాలు కూడా వీధుల్లో తిరగలేని పరిస్థితి. మౌలిక సదుపాయాలు కల్పించాలి. -శ్రీదేవి, స్థానికురాలు

బురదనీటితో అవస్థలు

ప్రభుత్వం ఇచ్చిన నగదు సరిపోక రూ.10 లక్షలు అప్పుచేసి ఇల్లు నిర్మించుకున్నాం. మౌలిక వసతులు లేకపోవడంతో కాలనీలో ఉండలేని పరిస్థితి నెలకొంది. మొత్తం 500 కుటుంబాలు ఇక్కడ నివాసం ఉంటున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదు. పాఠశాల విద్యార్థులు బురదలో పడిపోతున్నారు. సాయంత్రం 5 దాటితే దోమలు బెడద ఎక్కువగా ఉంటోంది. సమస్యలను వెంటనే పరిష్కరించాలి. - నాగేశ్వరమ్మ

ప్రథమ వర్ధంతి

ప్రేమతో, ఆప్యాయతతో అందరి మనస్సులను ఆకట్టుకున్న మీరు మమ్మల్ని విడిచి సంవత్సర కాలం గడిచిననూ మీతో గడిపిన జ్ఞాపకాలు పదిలం..

మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ సూర్యదేవర గోపాలరావు గారు

జననం: 03-01-1930

మరణం: 14-11-2024

భార్య: వెంకటసుబ్బమ్మ (లేటు)

కుమార్తెలు - అల్లుళ్ళు

పరుచూరి రత్నకుమారి (లేటు) - పిచ్చియ్య

యార్లగడ్డ లలితకుమారి - మల్లిఖార్జునరావు

వేములపల్లి రమాదేవి - తులేరావు

యనమదల సూర్యావతి - భాస్కరరావు

పరుచూరి వింధ్యారాణి - రామమోహనరావు

మునిమనుమలు, మునిమనుమరాండ్రు:

అనిక రత్న, రిత్విక్ శివ, కీర్తిక, శ్రీహర్ష, శ్రీసౌమ్య, సాయి దీక్షిత, తరుణ్‌సాయిబాబు, నిహితసాయి, మీనాక్షి, అమృత, అర్జున్, మానస, లాస్య, లోకాదిత్య, దేవాన్ష్, దిత్య, తారక్

మనుమలు, మనుమరాండ్రు:

వెంకటకృష్ణ, శ్రీవల్లి, శ్రీలక్ష్మి, రాజేశ్వరి, శిరీష, శ్రీరాకేష్, రాజేష్, అవినాష్, సరిత, సతీష్

ది.04-11-2025 (మంగళవారం)న భట్టిప్రోలు మండలం, ఓలేరు శివారు తూర్పుపాలెం గ్రామంలోని మా స్వగృహమునందు జరుగును.

(c) eenadu

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? స్థానిక బీసీ కాలనీలో మూడు వీధి దీపాలు వెలగడం లేదు. దీపాలను వినియోగంలోకి తేవాలి. - స్థానికులు, కొప్పరం

✔ ఇంజినీరు పరిశీలిస్తాం. వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తెస్తాం. - శివరామప్రసాద్, ఈవోఆర్డీ, సంతమాగులూరు - న్యూస్‌టుడే, సంతమాగులూరు

వ్యర్థాల తొలగింపు.. మేదరమెట్ల, న్యూస్‌టుడే: కొరిశపాడు మండలం రావినూతలలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. సమస్యను పరిష్కరించాలని కోరుతూ అక్టోబరు 24న మేమున్నాం..మీకు తోడుగాలో వార్త ప్రచురితమైంది. స్పందించిన డిప్యూటీ ఎంపీడీవో చంద్రసేనన్ సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే గ్రామంలో కుక్కల బెడద తొలగేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ✦ పి.గుడిపాడు గ్రామంలో చెరువు పక్కన వ్యర్థాలు తొలగించాలని స్థానికులు గతనెల 26న మేమున్నాం..మీకు తోడుగా దృష్టికి తీసుకురాగా, వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి ఆజయ్‌బాబు కార్మికులతో వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

కాలువలు శుభ్రపరిచారు.. పర్చూరు, న్యూస్‌టుడే: పర్చూరు-చీరాల రహదారిలోని నాగులపాలెం సైడ్ కాలువలో మురుగుపారుదల లేదని సమస్యపై సోమవారం 'మేమున్నాం..మీకుతోడుగా'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ అధికారులు కాలువలో చెత్తాచెదారం తొలగించి, బ్లీచింగ్ చల్లించారు.

స్పందనకు వందనం

రాజగోపురాలు, ప్రాకారం మార్పుపై పీఠాధిపతికి విన్నపాలు

శింగరకొండ (అద్దంకి), న్యూస్‌టుడే: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం రాజగోపురాలు, ప్రాకార మండపం మార్పు విషయమై శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీ తీర్థస్వామీజీని ఆలయ సహాయ కమిషనర్, పాలకమండలి ఛైర్మన్, అర్చకులు కలిశారు. రాతి ముఖమండపం నిర్మాణం పూర్తయిన తరువాత దానికి అనుగుణంగా ప్రాకారం, రాజగోపురాలు వాస్తుకు అనుగుణంగా మార్పుచేయదలచినట్లు పాలకమండలి ఛైర్మన్ మందారి మురళీసుదర్శనరావు వివరించారు. దీంతో పాటు గోశాల నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. గోశాల నిర్మాణానికి అయ్యే ఖర్చును భరించేందుకు దాత సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. రాజగోపురాలు, ప్రాకార మండపం నిర్మాణానికి దాతల సహకారం తీసుకుంటున్నట్లు వివరించారు. చేపట్టనున్న వాటి గురించి నివేదికలను పీఠాధిపతికి చూపారు. అంగీకారం తెలిపిన ఆయన తాము ఇచ్చే అనుమతితో పాటు రెండు రోజుల్లో దయాగ్రం తయారుచేసి ఇస్తానని వెల్లడించారు. సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడు, వేద పండితులు వంగల హరిశంకరశర్మ, అర్చకులు కోట లక్ష్మీనారాయణ, వేలూరి శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్తు కార్యాలయం చుట్టూ ఇలాగేనా?

అద్దంకి మండల పరిషత్ కార్యాలయం చుట్టూ దట్టంగా చిల్ల చెట్లు పెరిగాయి. గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని ఉపన్యాసాలిచ్చే అధికారులు తమ కార్యాలయం చుట్టూ ఉన్న చెట్లను తొలగించేందుకు ముందుకు రాకపోవడం గమనార్హం. 26 గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నా, ప్రభుత్వ కార్యాలయాలను పట్టించుకోకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. - న్యూస్‌టుడే, అద్దంకి

శునకాల దాడులు.. వానరాల ఆగడాలు

మేదరమెట్ల, చినగంజాం, న్యూస్‌టుడే

గ్రామాల్లో కుక్కలు, కోతుల బెడద ఎక్కువైంది. వీటి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వీటి నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో రద్దీగా ఉండే కూడళ్లు, సంతలు, దుకాణ సముదాయాలు, హోటళ్ల సమీపంలో తిష్టవేసి చిన్నారులు, వృద్ధులు, మహిళలపై దాడులు చేస్తున్నాయి. ఒక్క మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే నెలకు 15కు పైగా కుక్క కాటు కేసులు నమోదవుతున్నాయంటే సమస్య తీవ్రత అర్థం చేసుకోవచ్చు. చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 2024-25లో యాంటీ రేబిస్ టీకాలు 593 మందికి వేశారు. 2025లో ఇప్పటి వరకు 405 మందికి వేశారు. ప్రస్తుతం పీహెచ్‌సీలో 99 టీకాలు అందుబాటులో ఉన్నట్లు వైద్యాధికారి శ్రీచరణ్ తెలిపారు.

మేదరమెట్లలో రాత్రి వేళలో రోడ్డుపై కుక్కలు

అద్దంకి పట్టణం, మేదరమెట్ల గ్రామాల్లో వానరమూకలు ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. అడవుల్లో సంచరించాల్సిన కోతులు గుంపులుగా ఆహార అన్వేషణ కోసం వనం వీడి జనం చెంతకు చేరుతున్నాయి. ఇళ్ల సమీపంలోని చెట్లపై తిష్టవేసి అవకాశం చిక్కినప్పుడల్లా తమ చేష్టలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. గోడలపై తిరుగుతూ ఇళ్లలోకి వస్తున్నాయి. వండిన ఆహార పదార్థాలు మొదలు, పండ్లు, నిత్యావసరాలతో పాటు దొరికిన ప్రతి వస్తువు ఎత్తుకెళుతున్నాయి. ఎవరైనా వీటిని అదిలిస్తే ఎదురు తిరుగుతున్నాయి. ముఖ్యంగా ఇళ్ల దగ్గర ఉండే మహిళలు, చిన్నారులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఇంటి పైన ఉండే ట్యాంకుల్లో దిగి, తాగే నీటిని కలుషితం చేస్తున్నాయి.

ఇబ్బందులు పడుతున్నాం

పగలు, రాత్రి అనే తేడా లేకుండా కుక్కలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కుక్కల కారణంగా పిల్లలను బయటికి ఒంటరిగా పంపించలేకపోతున్నాం. రాత్రి వేళ పశువులపై దాడి చేస్తున్నాయి. కొద్దిరోజుల క్రితం మా ఇంటి సమీపంలో కట్టేసిన గేదెపై కుక్కలు గుంపుగా దాడి చేసి, గాయపరిచాయి. కోతుల బెడద ఎక్కువగా ఉంది. ఇంటిపై ఆరేసుకున్న దుస్తులు, ఇంట్లో ఉన్న వస్తువులు తీసుకెళుతున్నాయి. అధికారులు స్పందించి వీటి ఆగడాల నుంచి రక్షించాలి. - ఎస్.వెంకటేష్, మేదరమెట్ల

యథాస్థానంలో నియంత్రిక

జె.పంగులూరు, న్యూస్‌టుడే: మండలంలోని కొండమూరులో 'గాలులకు కూలిన నియంత్రిక' అనే శీర్షికన ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి సోమవారం ఆ శాఖ అధికారులు స్పందించారు. కూలిన నియంత్రికను అమర్చి, వ్యవసాయ పంపు సెట్టుకు నిలిచిన విద్యుత్తును పునరుద్ధరించారు. సమస్య పరిష్కారం కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈనాడు స్పందన

వైభవంగా సీతారామస్వామి ఆలయ శంకుస్థాపన

చినగంజాం: చినగంజాంలోని శ్రీసీతారామస్వామి నూతన ఆలయ శంకుస్థాపన పూజలు సోమవారం వైభవంగా జరిగాయి. పర్చూరు శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మోటుమర్రి రామసుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన సభలో ఏలూరి మాట్లాడుతూ.. సుమారు 200 ఏళ్లపై చరిత్ర కలిగిన గుడిలోని దేవేరుల విగ్రహాలు చెక్కుచెదరని తేజస్సుతో ఉన్నాయన్నారు. గుడి నిర్మాణానికి, అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. పూజల్లో ధర్మకర్త మోటుమర్రి రామసుబ్బారావు, రాజ్యలక్ష్మి, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పరిటాల వెంకట రామానుజం, లక్ష్మి దంపతులు పాల్గొన్నారు. గుంటూరు దేవాదాయ, ధర్మాదాయ శాఖ డీఈ సీహెచ్ శ్రీనివాసరావు, బాపట్ల ఏఈ కె.మధు, మండలంలోని పలు శాఖల అధికారులు, తెదేపా నాయకులు, వేలాది మంది భక్తులు హాజరయ్యారు. సుమారు 3,000 మందికి అన్నప్రసాద వితరణ చేసినట్లు రామసుబ్బారావు, రామానుజం తెలిపారు.

శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే సాంబశివరావు

పూజల సమయంలో.. ఉదయం 10.43 గంటలకు ఆలయ శంకుస్థాపన పూజలు జరుగుతున్న సమయంలో గుడి ప్రాంతం పైన ఆకాశంలో సుమారు పండు గద్దలు గుంపుగా వచ్చి కొన్ని నిమిషాలపాటు తిరుగాడాయి. ఆ సమయంలో భక్తులు జైశ్రీరామ్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

45 సెంట్ల స్థలం గుర్తింపు

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి-గుండ్లకమ్మ రహదారిలోని ర.భ. స్థలాన్ని సోమవారం అధికారులు కొలిచారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతుందని స్థానికుల ఫిర్యాదు మేరకు యంత్రాంగం స్పందించింది. పురపాలక పట్టణ అభివృద్ధి అధికారిణి లక్ష్మి ఆధ్వర్యంలో రెవెన్యూ, నీటి పారుదల, ర.భ అధికారులు సర్వేలో పాల్గొన్నారు. మొత్తం 45 సెంట్ల ర.భ స్థలాన్ని గుర్తించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

చెస్, యోగా రాష్ట్ర స్థాయి పోటీలు

జె.పంగులూరు: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు ఈ నెల 7,8,9 తేదీల్లో పార్వతీపురం మన్యం జిల్లా జోగంపేటలోను, రాష్ట్ర స్థాయి యోగా పోటీలు ఈ నెల 23, 24, 25 తేదీల్లో పంగులూరు మండలంలోని చందలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కొండా ప్రతిమ తెలిపారు.

బొమ్మ గీసి.. బహుమతి పట్టి

గొరకాయపాలెం (అద్దంకి), న్యూస్‌టుడే: అద్దంకి పట్టణం గొరకాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని ఎల్.సుజాత ఆధ్వర్యంలో విద్యార్థులకు వారికి ఇష్టమైన పండుగపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలుగా మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జె.రవిచంద్ర, డి.ఆనంద్, డి.శ్రీలక్ష్మిలకు 'ఈనాడు' తరఫున బహుమతులు అందించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, ఉపాధ్యాయులు ఎల్.భారతి, టి.శారద, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

మురుగు నిలిచి.. దుర్గంధం వెదజల్లి

భగవాన్‌రాజుపాలెం వద్ద జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో డ్రైనేజీ నిర్మాణం చేపట్టకపోవడంతో మురుగు నిలిచిపోతోంది. ఎస్సీ కాలనీలోని మురుగు కాలువల నుంచి వచ్చిన మురుగు ముందుకు వెళ్లడానికి కాలువ లేక ఎక్కడిది అక్కడే నిలిచిపోయి, దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో నరకప్రాయంగా మారిందని కాలనీవాసులు వాపోతున్నారు. మంత్రి గొట్టిపాటి సమస్యను పరిష్కరించాలని హైవే అధికారులను ఆదేశించిన పరిష్కరించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, జె.పంగులూరు

నిరుపయోగంగా మాగాణి భూమి

నామ్ రహదారి వెంబడి చక్రాయపాలెం గ్రామానికి చెందిన రైతు పొలం.. నాటి లైలా తుపాను నుంచి నేటి మొంథా వరకు నిరుపయోగంగా మారింది. ఎలాంటి పరిహారం ఇవ్వకపోవడం, భూమిలో కొండమట్టి, రాళ్లు తేలి ఉండటంతో నిరుపయోగంగా మారిందని రైతు వాపోతున్నారు. - న్యూస్‌టుడే, చక్రాయపాలెం(అద్దంకి)

స్తంభాలు నిలబెట్టారు

కొండమూరు ఎన్‌ఎస్పీ కాలువ కట్ట మీద స్తంభాలు ఒరిగిపోవడంతో ఎప్పుడు పడిపోతాయోనని కర్షకులు ఆందోళనలో ఉండేవారు. సుదీర్ఘకాలంగా ఈ సమస్య ఉంది. మొంథా తుపాను ప్రభావంతో నష్టపోయిన పంటలను రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పంటలను పరిశీలిస్తున్న సమయంలో ఈ స్తంభాలను గమనించారు. వీటిని పరిష్కరించాలని ఈఈ మస్తాన్‌రావును ఆదేశించారు. స్పందించిన సిబ్బంది నిలబెట్టారు. సమస్య పరిష్కారం కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, జె.పంగులూరు

బొప్పాయి రైతుకు దిగులు

బొప్పాయి సాగుచేసిన రైతులకు దిగులు మిగిలింది. మండలంలోని చిన్నకొత్తపల్లి గ్రామానికి చెందిన రైతు ఎం.రామాంజనేయులు 1.35 ఎకరాల్లో బొప్పాయి సాగు చేశారు. మొంథా తుపానుతో వరద నీరు చేనును ముంచెత్తింది. రెండు రోజుల పాటు మొక్కలు నీళ్లలోనే ఉండిపోయాయి. దీంతో కొన్ని మొక్కలు ఎండుముఖం పట్టగా మరికొన్ని నేలకొరిగాయి. ఎదుగుదల నిలిచిపోతుందని, పంట చేతికొచ్చే వరకు నమ్మకం లేదని రైతు వాపోతున్నారు. - న్యూస్‌టుడే, చిన్నకొత్తపల్లి (అద్దంకి)

వరద పాపం గత ప్రభుత్వానిదే: ఎమ్మెల్యే

స్వర్ణలో రైతులతో మాట్లాడుతున్న శాసనసభ్యుడు ఏలూరి

పర్చూరు, కారంచేడు, న్యూస్‌టుడే: గత పాలకుల నిర్లక్ష్యమే వరద విపత్తులకు కారణమని, కాలువల నిర్వహణ, ఆధునికీకరణకు నోచక వరద సమయంలో కట్టలు తెగి, వరద పొలాలను ముంచెత్తడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విమర్శించారు. సోమవారం కారంచేడు, పర్చూరు మండలాల్లోని వరి పొలాలను, వాగులను, పిడుగురాళ్ల - వాడరేవు జాతీయ రహదారిపై తిమ్మరాజుపాలెం వద్ద తొండివాగును పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంటల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు. పొలాలు ముంపునకు గురికాకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కొమ్మమూరు కాలువకు గండ్లు పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. స్వర్ణ- రంగప్పనాయుడువారిపాలెం పొలాల్లో రైతు నాగరాజు డ్రోన్ ద్వారా ఎరువులు పిచికారీ చేసే విధానాన్ని తిలకించారు. తెదేపా నేతలు పాల్గొన్నారు.

నిర్మానుష్యంగా తీరం

చీరాల అర్బన్, వేటపాలెం, న్యూస్‌టుడే: కార్తిక మాసంలో సముద్ర స్నానాలకు ఎంతో విశిష్టత ఉంది. పౌర్ణమి రోజున చుట్టుపక్కల ప్రాంతాల నుంచి దాదాపు లక్ష మంది వరకు తీరంలో స్నానాలు చేసేవారు. ఈ మాసం ప్రారంభం నుంచి అల్పపీడన ప్రభావాలతో తరచూ వర్షాలు కురుస్తున్నాయి. మొన్న మొంథా తుపానుకు చీరాల తీర ప్రాంతంలోని కఠారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం, రామాపురం, వాడరేవు ప్రాంతాలను కలుపుతూ నిర్మించిన రహదారికి పలుచోట్ల గుంతలు పడ్డాయి.

రామాపురం తీరంలో పోలీసు హెచ్చరిక ఫ్లెక్సీ

అంతేకాకుండా సముద్రంలో గుంతలు పడటంతో స్నానాలు చేయడానికి అనుకూలం కాక ముందస్తుగా రెవెన్యూ, పోలీసు అధికారులు వీటిని పూర్తిగా నిషేధించడంతో తీరం నిర్మానుష్యంగా మారింది. ఇక సూర్యలంకలోనూ ఇదే పరిస్థితి ఉండటంతో అక్కడ బీచ్ మూసివేశారు. దీనివల్ల ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు పూర్తిగా నిలిచిపోయారు. ఫలితంగా ఒకప్పుడు నిత్యం సందర్శకులతో సందడిగా ఉండే ఈ ప్రాంతం నేడు బోసిపోయింది. పోలీసులు మాత్రం బీచ్‌లకు చేరుకునే అన్నిదారులను మూసివేసి బందోబస్తు కాస్తున్నారు. మరో రెండు వారాలు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం కనిపిస్తోంది.

భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వినతి

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: నా పేరు బుర్ల చిన్నసోమయ్య.. నాకు వేటపాలెం మండలం నాయునిపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో 1.20 ఎకరాల భూమి ఉంది. దీన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడికి సోమవారం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మల్లెల అంజమ్మ జిల్లా వ్యాప్తంగా ఉన్న మైనింగ్ వివరాలు కావాలని విన్నవించారు. ఈ సందర్భంగా ఆరు వినతులను ఆర్డీవో స్వీకరించారు.

రహదారుల నిర్మాణానికి..

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఇంకొల్లు-కడవకుదురు రహదారిలోని రామ్‌నగర్ కాలనీలో రహదారులు అధ్వానంగా ఉన్నాయని, వెంటనే సీసీ రోడ్లు నిర్మించాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎంపీడీవో శ్రీనివాసరావుకు కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. కాలనీ ఏర్పాటై మూడు దశాబ్దాలు గడిచినా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రోడ్లు, కాలువలు లేవని వినతి పత్రంలో పేర్కొన్నారు. వర్షం కురిస్తే గృహాల్లోకి నీరు చేరుతోందని, అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పేదలకు దుప్పట్ల వితరణ

దగ్గుబాడు (ఇంకొలు): మండలంలోని దగ్గుబాడులో పొన్నం శివకుమార్ వర్ధంతి సందర్భంగా శివకుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు వెంకట్రావు, సుకుమార్, సుబ్బారావు, ప్రతాప్, సోమయ్య, రామాంజనేయులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం

యద్దనపూడి, న్యూస్‌టుడే: తుపాను కారణంగా గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ప్రభుత్వానికి నివేదించి, పరిహారం అందేలా శ్రద్ధ చూపుతామని ఏవో కుమారి తెలిపారు. యద్దనపూడి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మినుము, పత్తి దెబ్బతిన్నట్లు ఏవో చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 33 శాతానికి పైగా దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రబీలో సాగు చేసిన పంటలను ఈ-పంట కింద నమోదు చేసుకోవాలని వెల్లడించారు. గ్రామాల్లో ఉపాధి పనుల ద్వారా వలసల నివారణ చేపట్టేలా ప్రభుత్వం త్వరలో కార్యాచరణ చూపుతుందని ఏపీవో వెంకట్రావు వెల్లడించారు. గ్రామాల్లో తాగునీరు, ఆరోగ్యం, విద్య అంశాలపై చర్చించారు. ఎంపీపీ పి.రజనీ, ఎంపీడీవో జావెద్ పాల్గొన్నారు.

చీరాల: విజేతలతో ఉపాధ్యాయులు

అద్దంకిలో బహుమతులు అందిస్తున్న ఎంఈవోలు

నియోజకవర్గ స్థాయి క్విజ్ విజేతలు వీరే

చీరాల అర్బన్: రాజ్యాంగ దినోత్సవ క్విజ్ పోటీలు నియోజకవర్గస్థాయిలో సోమవారం మండల వనరుల కేంద్రంలో ఎంఈవో టి.రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలుగా ఎన్‌ఆర్అండ్‌పీఎం, పందిళ్లపల్లి, ఈపూరుపాలెం (బాలికలు) ఉన్నత పాఠశాలలకు చెందిన పి.మోనిష్ జోయల్, జె.భాగ్యశ్రీ, జి.అక్షయలుగా నిలిచారు. న్యాయనిర్ణేతలుగా విశ్రాంత ఉపాధ్యాయులు బొడ్డు బాలచంద్రరావు, పాండురంగారావులు వ్యవహరించారు. అమరావతిలో జరిగే కార్యక్రమంలో చీరాల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు.

పర్చూరులో..

అద్దంకి: స్థానిక మండల విద్యావనరుల కేంద్రం వద్ద జరిగిన కార్యక్రమంలో జె.పంగులూరు మండలం బూదవాడ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎన్.యాస్మిన్, కొండమంజులూరు విద్యార్థి కె.జపన్య, పెదఅంబడిపూడి విద్యార్థిని కె.గీతి కామాధురిలు వరుసగా మూడు స్థానాల్లో నిలిచారు. అద్దంకి, బల్లికురవ, జె.పంగులూరు ఎంఈవో-2లు కేవీ.శ్రీనివాసరావు, కాకాని రమేష్, జి.వీరాంజనేయులుతో పాటు బొమ్మనంపాడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.వి.శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

పర్చూరు: స్థానిక వైఆర్ పాఠశాలలో జరిగిన పోటీల్లో ఇంకొల్లు మండలం పావులూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని టి.చంద్రహాసిని(ప్రథమ), కడవకుదురు పాఠశాలకు చెందిన కె.తుషార(ద్వితీయ), చినగంజాం విద్యార్థిని జి.అమృతహర్షిణి(తృతీయ)లు గెలుపొందారు.

ఎంఈవో శివకోటేశ్వరరావుకు సత్కారం

పర్చూరు, న్యూస్‌టుడే: అంకితభావంతో పనిచేసే ప్రతి ఒక్కరికి గుర్తింపు, అవార్డులు లభిస్తాయనడానికి ఎంఈవో అల్లూరి శివకోటేశ్వరరావు నిదర్శనమని మండలంలోని పలు యాజమాన్య పాఠశాలల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విశ్వజననీ ఫౌండేషన్ ఆయనకు సేవారత్న అవార్డు ఇవ్వడంపై సోమవారం సాయంత్రం స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఉపాధ్యాయులు ఆయన్ను సత్కరించారు.

గుండ్లకమ్మ నదిలో మృతదేహం లభ్యం

అద్దంకి, న్యూస్‌టుడే: గుండ్లకమ్మ నదిలో ఓ మృతదేహం లభ్యమైంది. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం నందిపాడు సమీపంలో ఇది కనిపించింది. స్థానికులు ఆదివారం రాత్రే అద్దంకి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా, గతనెల 30న పట్టణానికి చెందిన వ్యక్తి గుండ్లకమ్మ నదిలో దూకిన విషయమై అద్దంకి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైన సంగతి పాఠకులకు విదితమే. నందిపాడు వద్ద లభించిన మృతదేహం, నదిలో దూకిన వ్యక్తిగా భావిస్తూ పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

వేటపాలెంలో..

మార్టూరులో..

కారంచేడులో..

కొణిదెనలో..

వెల్లలచెరువులో..

శివాయ.. శివ శంకరాయ

చీరాల అర్బన్, వేటపాలెం, అద్దంకి, మార్టూరు, పర్చూరు,ఇంకొల్లు, యద్దనపూడి, కారంచేడు, బల్లికురవ, సంతమాగులూరు, న్యూస్‌టుడే: కార్తిక రెండో సోమవారం పురస్కరించుకుని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా గరళకంఠుడుకి వివిధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. రాత్రికి ఇళ్లల్లో కేదారేశ్వరస్వామి వ్రతాలు ఆచరించి, అనంతరం దేవాలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో దీపారాధనలు చేశారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు

వేటపాలెం, న్యూస్‌టుడే: కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దంపతులచేత అర్చకులు వ్రతాలను ఆచరింపజేశారు. మధ్యాహ్నం సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆర్య వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

తుపానుకు దెబ్బతిన్న రథం షట్టరు

అద్దంకి: తుపాను ప్రభావంతో గాలి చొచ్చుకు వచ్చిన కారణంగా పాత శివాలయం ఎదుట ఉన్న రథం గదికి గల ఇనుప షట్టరు దెబ్బతింది. దాతల సహకారంతో దీనికి మరమ్మతులు చేయిస్తున్నట్లు ట్రస్టీ రామలింగేశ్వరరావు తెలిపారు.

108లో ప్రసవం

జె.పంగులూరు, న్యూస్‌టుడే: మండలంలోని కొండమూరు గ్రామానికి చెందిన గర్భిణి సంపెగల ప్రవళికకు ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. ఆమెను 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో ఆడబిడ్డకు జన్మనిచ్చిందని ఈఎంటీ నాగరాజు, పైలెట్ వాసు తెలిపారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. వీరిని అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

బియ్యం, నిత్యావసరాల పంపిణీ

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: తుపాను ప్రభావానికి గురైన పేదలకు సోమవారం చీరాల మండలంలోని అన్ని గ్రామాల్లో బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. పునరావాస కేంద్రాలకు వచ్చి ఆశ్రయం పొందిన వారికి 50, ఇతరులకు 25 కిలోల చొప్పున బియ్యం అందించినట్లు తహసీల్దార్ గోపికృష్ణ తెలిపారు.

అవీ ఇవీ

ఆరు అర్జీల దాఖలు

చీరాల గ్రామీణం: చీరాల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈసందర్భంగా ఆరు అర్జీలు అందాయి. గృహ సంబంధిత 3, సర్వే కోసం 2, ఆన్‌లైన్ పేరు మార్పు కోసం ఒకటి అందినట్లు తహసీల్దార్ గోపికృష్ణ తెలిపారు.

భాజపా బలోపేతానికి కృషి

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: భాజపా బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని సీనియర్ నేత బండారుపల్లి హేమంత్‌కుమార్ అన్నారు. చీరాల మండలం దేవాంగపురిలో సోమవారం పార్టీ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ.. ప్రధాని మోదీ భావజాలాన్ని అందరికి చేరవేయాలన్నారు.

నీట మునిగిన పంటల పరిశీలన

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: చీరాల పరిధిలో తుపాను కారణంగా నీట మునిగిన పంట పొలాలను సోమవారం వైకాపా నాయకుడు కరణం వెంకటేష్, ఇతర నాయకులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్ట పరిహారం అందించాలన్నారు.

బిర్సా ముండా సేవలు మరువలేనివి

పర్చూరు: పర్చూరు జడ్పీఉన్నత పాఠశాలలో భారతీయ ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జయంతిని సోమవారం నిర్వహించారు. జిల్లా సమగ్రశిక్షా కో-ఆర్డినేటర్ వి.సత్యసాగర్, హెచ్ఎం నాగిరెడ్డిలు బిర్సా ముండా దేశానికి చేసిన సేవలను వివరించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

కారంచేడు: కుంకలమర్రులో ఆదివారం గ్రామస్థులు కె.పిచ్చయ్య, కె.అనురాధలు స్థల వివాదంలో ఒకరిపై ఒకరు పరస్పరం దాడి చేసుకున్నట్లు ఫిర్యాదులు అందాయని ఎస్సై ఖాదర్ బాషా సోమవారం రాత్రి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పూలకుండీలు ధ్వంసంపై ఫిర్యాదు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: బస్టాండ్ వద్ద ఉన్న ఆర్వోబీపై ఉంచిన పూలకుండీలను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత ధ్వంసం చేశారు. కావాలని చేశారా.. . తాగిన మత్తులో పగలగొట్టారో తెలియడంలేదని కమిషనరు అబ్దుల్ రషీద్ పేర్కొన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

వృద్ధుడు అదృశ్యం

అద్దంకి,న్యూస్‌టుడే: మండలంలోని కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన 90 ఏళ్ల వృద్ధుడు మతిస్థిమితం కోల్పోయి ఈనెల ఒకటో తేదీ నుంచి కనిపించడం లేదని, కుమారులు గాలిస్తున్నారు. చుట్టు పక్క గ్రామాల్లో బంధువులు డ్రోన్ కెమెరాతో వెతుకుతున్నారు.

(c) eenadu

జంబుకేశ్వరా.. నమోస్తుతే!



కార్తిక సోమవారం సందర్భంగా నాయుడుపేట మండలంలోని తిమ్మాజికండ్రిగ సమీపంలో స్వర్ణముఖి తీరంలో వెలసిన మల్లేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని జంబుకేశ్వరుడిగా అలంకరించారు. భక్తులు నదిలో స్నానాలు ఆచరించి పూజలు చేసి దీపాలు వెలిగించారు.
- న్యూస్‌టుడే, నాయుడుపేట

సత్వర పరిష్కారమే లక్ష్యంగా నోడల్ అధికారులు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ లోతేటి అన్నారు. సోమవారం తిరుపతిలోని కార్యాలయంలో తొలిసారిగా నిర్వహించిన డయల్ యువర్ సీఎండీ కార్యక్రమానికి వినియోగదారుల నుంచి మంచి స్పందన లభించింది. డిస్కం పరిధిలోని జిల్లాల నుంచి 87 మంది వినియోగదారులు ఫోన్‌చేసి తమ సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని సత్వరమే పరిష్కరించడమే లక్ష్యంగా తొమ్మిది జిల్లాల పరిధిలో ప్రతి జిల్లాకు సీజీఎం/జీఎం స్థాయివారిని నోడల్ అధికారులుగా నియమించినట్లు సీఎండీ తెలిపారు. వారు జూనియర్ లైన్‌మెన్ల నుంచి ఎస్ఈల అధికారుల వరకు పనితీరును పర్యవేక్షిస్తారని వెల్లడించారు. డైరెక్టర్లు అయూబ్‌ఖాన్, గురవయ్య, రామ్మోహన్, సీజీఎంలు జానకిరామ్, రమణాదేవి, ఆదిశేషయ్య, ఉమాపతి, మురళీకుమార్, జీఎంలు రామచంద్రరావు, చక్రపాణి, సురేంద్రరావు, భాస్కర్‌రెడ్డి, జగదీష్, ఎస్ఈ చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

డయల్ యువర్ సీఎండీ కార్యక్రమంలో శివశంకర్ లోతేటి

వేటు పడుతున్నా.. కాసుల వేట

నిఘా

- దోపిడీకి 'ఎర్త్' పెట్టిన పూర్వ సీఎండీ సంతోషరావు
- రూ.2.50 కోట్ల మాయాజాలం తాజాగా వెలుగులోకి

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: వైకాపా హయాంలో నాటి పెద్ద మంత్రి అండదండలతో ఎస్పీడీసీఎల్‌లో కొందరు ఉన్నతాధికారులు అడ్డగోలుగా వ్యవహరించారు.. వారిలో కీలకమైన ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావును కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు గత నెల 10న తప్పించింది. పదవీ కాలం ఈ ఏడాది ఏప్రిల్ 20తో ముగిసినా పలు కారణాలతో అదే హోదాలో మరో ఆరు నెలలు కొనసాగిన ఆయన తీరు మాత్రం మారలేదు.. ఎస్పీడీసీఎల్‌లో పర్చేజింగ్ సహా అన్ని విభాగాలను తన గుప్పిట్లో ఉంచుకుని అవసరం లేకున్నా ఎర్త్‌వైర్ పైపుల కొనుగోలు ముసుగులో అవినీతికి పాల్పడినట్లు తాజాగా వెల్లడైంది.

అవసరం లేకపోయినా..

కూటమి ప్రభుత్వం తనను తప్పిస్తుందని తెలిసినప్పటికీ సంతోషరావు అడ్డగోలు నిర్ణయాలకు ఏ మాత్రం వెరవలేదు. పదవి నుంచి తప్పించడానికి 10-15 రోజులకు ముందు అడ్డగోలు నిర్ణయాలు తీసుకుని తన అక్రమాలను దర్జాగా కొనసాగించారు. అవసరం లేకపోయినప్పటికీ రూ. కోట్లు దోచుకోవడానికి 25 వేల ఎర్త్ పైపులు కొనుగోలుకు ఆమోదం తెలిపారు. దీంతో ఎస్పీడీసీఎల్‌కు పెద్దఎత్తున నష్టం మిగిల్చారు. ఎర్త్ పైపుల కొనుగోలులో పేరుకే టెండర్లు.. ఆపై అంతా మాయ చేసేశారు. పైపునకు రూ.వెయ్యి చొప్పున రూ.2.50 కోట్లు దోపిడీ చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ధర, దోపిడీ ఇలా..

- బహిరంగ మార్కెట్‌లో ఎర్త్ పైపు ధర: రూ. 2,000 -2,100
- కొనుగోలు ధర: రూ. 3,100
- టెండర్లలో పాల్గొన్న కంపెనీలు: ఏడు
- పని దక్కించుకున్నవి: సెల్‌వెల్, ఎస్ఎస్ ఇన్‌ఫాటెక్, కల్యాణ గారు ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్

ఆరా తీయని పర్చేజింగ్ విభాగం

ఎస్పీడీసీఎల్‌లో పర్చేజింగ్ హెచ్‌వోడీ అనుమతితోనే కొనుగోళ్లు జరగాలి. సీఎండీ తనకు అనుకూలమైన కంపెనీలకు ఈ ఎర్త్‌వైర్ పైపుల సరఫరా కట్టబెట్టాలని హుకుం జారీ చేయడంతో పర్చేజింగ్ విభాగం తలదించేసింది. మూడు కంపెనీలు రూ.3,300 కోట్ చేయగా మిగిలినవి రూ.3,100కే తమ బిడ్ ఈపీసీలో దాఖలు చేశాయి. అయితే సదరు మూడు కంపెనీలు సీఎండీ చెప్పినవి కావడం, అదే రూ.3,100కు తామూ సరఫరా చేస్తామని రాసివ్వడంతో పర్చేజింగ్ విభాగానికి ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. బహిరంగ మార్కెట్‌లో ధర ఎంతనే విషయమై సదరు విభాగం ఆరా తీయకుండా అధిక ధర కోట్ చేసిన, సీఎండీకి అనుకూలమైన కంపెనీలకు కట్టబెట్టడం గమనార్హం.

వీడని వైకాపా వాసనలు

కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టి 17 నెలలు గడిచినా నేటికీ ఎస్పీడీసీఎల్‌లో కొన్ని కీలక స్థానాల్లో వైకాపా హవానే కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం అన్ని శాఖల్లో ప్రక్షాళన దిశగా సాగుతుండగా ఇక్కడ మాత్రం కీలక స్థానాల్లో వైకాపా పాలనలో నాటి మంత్రితో అంటకాగిన అధికారులే కొనసాగుతుండటం గమనార్హం.

గంగమ్మ పైపైకి

- ఇటీవల కురిసిన వర్షాలతో పెరిగిన భూగర్భ జలాలు

జీడీనెల్లూరు మండలంలోని వీరకనెల్లూరు చెరువు

న్యూస్‌టుడే, చిత్తూరు కలెక్టరేట్: వైవిధ్య వాతావరణంలో ఉన్న జిల్లాలో వర్షపాతంలో ఏటా హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. తూర్పున మండలాల్లో భూగర్భ జలమట్టం కాస్త పర్వాలేదనిపించినా పడమటి మండలాల్లో నీటి మట్టం బాగా పడిపోయింది. గత రెండు నెలల్లో కురిసిన వర్షాలతో చాలాచోట్ల చెరువులు నిండాయి. భూమిలోకి నీరు ఇంకడంతో జిల్లాలోని పలు మండలాల్లో భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. భవిష్యత్ అవసరాల కోసం జలవనరులను సంరక్షించుకోవడం ఇప్పుడు మనందరి బాధ్యత.

- జిల్లాలో చెరువులు: 4,122
- నీటి నిల్వ సామర్థ్యం: 15,135 ఎంసీఎఫ్‌టీ
- ప్రస్తుత నిల్వ: 11,127 ఎంసీఎఫ్‌టీ
- పూర్తిగా నిండిన చెరువులు: 1,434
- 75 శాతం నిండినవి: 717
- 50 శాతం: 1,032
- 25 శాతం: 549

కొన్నిచోట్ల నీటి మట్టాలు ఇలా (మీటర్లలో)..

మండలం	జులై	అక్టోబరు
చిత్తూరు గ్రామీణం	8	1.18
చిత్తూరు నగరం	14	10.00
గుడిపాల	8	2.52
జీడీనెల్లూరు	9.35	2.78
పెనుమూరు	13	3.96
బంగారుపాళ్యం	15	6.86
ఐరాల	11	6.00
కుప్పం	22	13.00
గంగవరం	8	1.55
రొంపిచెర్ల	11	4.69
సదుం	11	4.00

ఇదీ ప్రభావం..

భూమిలో నీటి మట్టం లోతును నేల మట్టానికి దిగువన మీటర్లలో(ఎంబీజీఎల్) కొలుస్తారు. ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి లోతులో మార్పులు ఉంటాయి. వర్షపాతం, భూగర్భ జల వెలికితీత కారణంగా భూగర్భ జల స్థాయిలు కాలానుగుణంగా హెచ్చుతగ్గులు కనిపిస్తాయి. జూన్ నుంచి ఆగస్టు వరకు శీలిస్తే నీటి మట్టం పడిపోయింది. సెప్టెంబరు, అక్టోబరులో కురిసిన వర్షాలతో భూగర్భ జలమట్టం పైకి ఎగబాకడం కాస్త ఉపశమనం కలిగించే విషయం.

గోవులకే జీతం.. జీవితం

- ప్రతి లేగదూడకు నామకరణం

గోవుల వద్ద దంపతులు, పిల్లలు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: ఆయనో ప్రభుత్వ చిరుద్యోగి. తిరుమల కొండపై ప్రొటోకాల్ వీఆర్వో. నెలకు వేతనం రూ.57 వేలు. ఈ మొత్తం గోశాలకే కేటాయిస్తున్నారు. ఈయన భార్య నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టులో ప్రాసెస్ సర్వరు. ఈమె నెల జీతాన్ని కుటుంబ పోషణకు ఖర్చు చేస్తున్నారు. వీరి కుమార్తెలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బీబీఏ, బీసీఏ తృతీయ ఏడాది చదువుతున్నారు.

నాయుడుపేట మండలం పుదూరుకు చెందిన అల్లాడి శేషగిరి దంపతులు పదేళ్లుగా గోశాల నిర్వహిస్తున్నారు. కుటుంబ సభ్యులు ఉదయం, సాయంత్రం గోశాలలోని పనుల అనంతరం వారి పనుల్లో నిమగ్నమవుతారు. గోశాల్లోని లేగ దూడలకు దంపతుల కుమార్తెలు సాయి పావని, చంద్రికా మహారాణిలు నామకరణం చేస్తారు.

గోశాల పేరు: మాతా అల్లాడి ట్రస్టు
విస్తీర్ణం: 2.5 ఎకరాలకు పైగా. గోవులు: 85

దూడలే పాలు తాగేలా..

దూడలకు ప్రత్యేక గదుల్లో పంకాలు ఏర్పాటు చేసి సంరక్షిస్తున్నారు. ఆవుల పాలను దూడలే తాగేలా చూస్తారు. దాతల సాయంతో వసతులు కల్పిస్తున్నారు. కార్తిక మాసంలో వన భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు.

ఉద్యోగం పేరిట బురిడీ

రూ.17.99 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: ఉద్యోగం పేరిట సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తిని బురిడీ కొట్టించి రూ.17.99 లక్షలు కాజేశారు. అలిపిరి ఎస్సై లోకేష్‌బాబు వివరాల మేరకు.. నగరంలోని మాధవనగర్‌కు చెందిన ఎస్. పవన్ (47)కు ప్రియ అనే ఫేస్‌బుక్ ఖాతా ద్వారా ఒకరు పరిచయం అయ్యారు. వారి టెలిగ్రామ్, వాట్సప్ నంబర్ల ద్వారా 'ఎస్కార్ట్ సర్వీసు, ప్లేబాయ్ జాబ్' పేరుతో ఉద్యోగ ఆఫర్లు వచ్చాయి. మొదట రిజిస్ట్రేషన్ ఫీజు, సెక్యూరిటీ డిపాజిట్, రూమ్ ఛార్జీలు, జీఎస్టీ సాకుతో పలుమార్లు డబ్బులు వేయించుకున్నారు. తర్వాత ఫొటోలు, సంతకం తీసుకుని.. వాటిని ఎడిట్ చేసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తామని బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేశారు. 171 ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా రూ.17.99 లక్షలను వివిధ బ్యాంకు ఖాతాలు, యూపీఐ ఐడీలకు జమచేయించుకున్నారు. అటు ఉద్యోగం ఇప్పించక.. డబ్బు తిరిగి ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సిమెంటు రాలిపోయి కనిపిస్తున్న కడ్డీలు

పైన భళా.. కింద డీలా

చిత్తూరు నగరంలోని కాణిపాకం రోడ్డులోని సంతపేట వద్ద ఉన్న లిల్లీ వంతెన శిథిలావస్థకు చేరుకుంటోంది. వంతెన పైభాగం బాగానే ఉన్నా.. కింద ఎక్కడికక్కడ సిమెంటు రాలిపోయి కడ్డీలు కనిపిస్తున్నాయి. నది వెంట అటూఇటుగా ప్రజలు జీవనం సాగిస్తున్నారు. రాకపోకల సమయాల్లో పెచ్చులు పడుతున్నాయని భయంభయంగా వచ్చి వెళ్తున్నామని స్థానికులు చెబుతున్నారు. **-ఈనాడు, చిత్తూరు**

చేతివృత్తులకు ఆదరణ-3

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో లక్షమందికి ప్రయోజనం

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: చేతివృత్తులకు ఆదరణ లభించనుంది. 2017-18లో ఆదరణ-2 పథకం కింద నాటి సీఎం చంద్రబాబు పరికరాలు అందజేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ చేతి వృత్తులను ప్రోత్సహించేలా, అందుకు నూతన సాంకేతిక పరికరాలు అందించాలనే ఉద్దేశంతో ఉంది. ఈ మేరకు సీఎం చంద్రబాబు ఆదరణ-3 పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు.

12 విభాగాలుగా..

చేతివృత్తుల వారిని 12 విభాగాలుగా విభజించారు. రజక, నాయీబ్రాహ్మణ, పద్మశాలి కులస్థులకు విడివిడిగా పరికరాలు ఇవ్వాలని, మిగిలిన వెనుకబడిన వర్గాల చేతివృత్తుల వారికి ఎంచుకున్న రంగం, కోరుకున్న పరికరాలు ఇవ్వాలని నిర్ణయించారు. సోమవారం బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఆదరణ-3పై ప్రకటన చేయడంతో ఈ పథకం కింద ఉమ్మడి జిల్లాలో లక్ష మందికి పైగా ప్రయోజనం కలగనున్నట్లు అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

ఆదరణ-2లో 64 వేల దరఖాస్తులు..

2017-18లో ఉమ్మడి జిల్లాలో ఆదరణ-2 కింద 64 వేల దరఖాస్తులు అందాయి. అందులో 32 వేల మంది వాటాగా పది శాతం చెల్లించారు. 24 వేల మందికి పరికరాలు పంపిణీ చేశారు. పరికరాలు రాకపోవడంతో ఆరువేల మందికి వాటా ధనాన్ని వెనక్కి ఇచ్చారు. బ్యాంకు ఖాతా నంబర్లు లేని మరో రెండువేల మందికి చెందిన రూ.20 లక్షలు బీసీ కార్పొరేషన్ ఖాతాలో ఉన్నాయి.

ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షను ప్రారంభిస్తున్న వీసీ ఉమ

ఏపీఆర్‌సెట్‌కు 90% హాజరు

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: పీహెచ్‌డీలో ప్రవేశాలకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ నిర్వహిస్తున్న ఏపీఆర్‌సెట్-2024-25 సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైంది. వర్సిటీ వీసీ ఆచార్య ఉమ, రిజిస్ట్రార్ రజని ఆన్‌లైన్ ద్వారా పరీక్షను ప్రారంభించారు. సోమవారం నుంచి ఈనెల 7 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 13 కేంద్రాల్లో, తెలంగాణలో మరో కేంద్రంలో పరీక్షలు జరగనున్నట్లు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి తెలిపారు. మొదటిరోజు 90 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు.

సెలవులో అధికారులు.. స్తంభించిన సేవలు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: చిత్తూరు రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పలుసేవలు స్తంభించాయి. సబ్‌రిజిస్ట్రార్ రెంద్రోజులు సెలవు పెట్టడం, సీనియర్ అసిస్టెంట్ సెలవుపై వెళ్లడం సమస్యకు కారణం. సోమవారం స్థిరాస్తి లావాదేవీలు జోరుగా సాగుతాయి. ముందస్తుగా స్లాట్ బుకింగ్ చేసుకున్నవారు నిర్ణీత సమయానికి వచ్చారు. అధికారులు లేకపోవడంతో అందరూ నిరాశతో వెనుదిరిగారు. మరోవైపు ఈసీ, నకలుపత్రాల జారీకి సైతం దరఖాస్తులు స్వీకరించలేదని వినియోగదారులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రిజిస్ట్రేషన్ సేవల్లో ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని క్రయవిక్రయదారులు కోరుతున్నారు.

మామిడి బకాయిలు చెల్లించాలి

చిత్తూరు (వ్యవసాయం): మామిడి బకాయిలు చెల్లించాలని సోమవారం మామిడి రైతులు స్థానిక బైపాస్ రోడ్డులోని హయత్ మామిడి గుజ్జు పరిశ్రమ వద్ద ధర్నా నిర్వహించారు. రైతులు మాట్లాడుతూ బంగారుపాళ్యం ఎఫ్‌పీవో(రైతు ఉత్పత్తిదారుల సంఘం) ద్వారా 2023లో మామిడి కాయలు సరఫరా చేశామన్నారు. మూడేళ్లుగా ఎఫ్‌పీవో, రైతులకు బకాయిలు చెల్లించక పరిశ్రమ యజమాన్యం కాలయాపన చేస్తోందన్నారు. వారం రోజుల్లో చెల్లించకపోతే పరిశ్రమ వద్దే నిర్బంధిస్తామని చెప్పారు.

రేపు తిరుమలలో పౌర్ణమి గరుడసేవ

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో బుధవారం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు కార్తిక పౌర్ణమి గరుడసేవ జరగనుంది.

గురిపెట్టారు.. ప్యాకేజీ పట్టారు

విద్యార్థినులకు నియామకపత్రం అందజేస్తున్న ప్రిన్సిపల్ పద్మావతమ్మ

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: వారందరూ పేద, మధ్య తరగతికి చెందినవారు. తల్లిదండ్రుల కష్టాన్ని చూసి లక్ష్యం నిర్దేశించుకుని ప్రాంగణ నియామకాలపై గురి పెట్టారు. చదువుతుండగానే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించారు. శ్రీపద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాల డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజినీరింగ్ (డీసీఎంఈ) విద్యార్థినులు 12 మంది ఇటీవల చెన్నైకు చెందిన థాట్ వర్క్స్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఏడాదికి రూ.8 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారు.

అదనంగా రెండు గంటలు..

ఉద్యోగ సాధనకు అవసరమైన నైపుణ్యాలపై అధ్యాపకులు ఆరునెలలపాటు శిక్షణ ఇచ్చారు. రోజూ అదనంగా రెండు గంటలపాటు రీజినింగ్, ఆప్టిట్యూడ్, గణితం సాధన చేశాం. ప్రణాళికతో చదవడంతో ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగం సాధ్యమైంది. 19 ఏళ్లకే కొలువు సాధించడం ఆనందంగా ఉంది. **- కె.భానువర్షిణి, జి.సుస్మిత**

ప్రాథమిక అంశాలపై పట్టు

ప్రస్తుతం బీటెక్ చేసేవారి సంఖ్య పెరగడంతో ఉద్యోగాలు సులువుగా దొరకడం లేదు. డిప్లొమాలో బేసిక్స్ మొత్తం నేర్చుకోవచ్చు. దీంతో మంచి సబ్జెక్ట్ నాలెడ్జ్ ఉంటుంది. అందుకే సులువుగా ఉద్యోగాలు లభిస్తున్నాయి. కళాశాల శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉద్యోగం సాధించాం. **- ఎం.రామకీర్తన, ఎం.దీపిక**

కేవీకేలో పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

రేణిగుంట, న్యూస్‌టుడే: తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన 18 సంవత్సరాలు నిండిన వారికి పుట్టగొడుగుల పెంపకంపై ఈ నెల 13 నుంచి 15 వరకు స్థానిక కేవీకేలో శిక్షణ ఇస్తున్నట్లు రాస్ కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ఎస్. శ్రీనివాసులు తెలిపారు. ఔత్సాహికులు ఈ నెల 8లోగా తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. మరింత సమాచారానికి గృహ విజ్ఞాన విభాగ శాస్త్రవేత్త దివ్య సుధా (94901 58595)ను సంప్రదించాలన్నారు.

మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

త్వరలో ఏడువేల మందికి ఉద్యోగోన్నతి

☛ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిత్తూరు(కొంగారెడ్డిపల్లి): ఆర్టీసీ అభ్యున్నతికి కృషి చేస్తామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో వైద్యశాల భవనాన్ని ఆయన ప్రారంభించారు. రోజూ 8 మందికి ఈసీజీ, 30 మందికి ల్యాబ్ టెస్టులు, డ్రెస్సింగ్, మరికొన్ని సేవలు అందిస్తామన్నారు. 1,450 నూతన బస్సులు కొనుగోలు చేశామని, త్వరలోనే ఏడువేల మందికి ఉద్యోగోన్నతులు కల్పించనున్నట్లు వివరించారు. ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, ఆర్టీసీ ఛైర్మన్ నారాయణరావు, వైస్‌ఛైర్మన్ మునిరత్నం, జోనల్ మేనేజర్ జోన్-4, జిల్లా ప్రజా రవాణా అధికారి రాము పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని అనుబంధం

పదినిమిషాల వ్యవధిలోనే అన్నదమ్ముల మృతి



పురుషోత్తంశెట్టి, రాధాక్రిష్ణయ్యశెట్టి (పాతచిత్రాలు)

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: అన్నదమ్ములిద్దరూ అరగంట వ్యవధిలోనే మృత్యుఒడికి చేరుకున్న ఘటన పట్టణంలోని బజారు వీధిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. ఏటవాకిలి గ్రామానికి చెందిన చెంగల్రాయశెట్టి, లక్ష్మీదేవమ్మల కుమారులు పురుషోత్తంశెట్టి (75), రాధాకృష్ణయ్యశెట్టి (67) కలిసి ఉంటూ పట్టణంలోని బజారువీధిలో నిత్యావసర వస్తువుల దుకాణం నడుపుతున్నారు. పురుషోత్తంశెట్టికి పిల్లలు లేరు. రాధాకృష్ణయ్యశెట్టితో కలిసి ఉమ్మడి కుటుంబంగా జీవిస్తున్నారు. సోమవారం రాత్రి బాత్‌రూంలోకి వెళ్లిన తమ్ముడు కాలుజారిపడి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వెంటనే స్పందించిన అన్న తన తమ్ముడిని బయటకు తీసుకువస్తున్న క్రమంలో బాత్‌రూం తలుపు గడియ తలకు బలంగా తగలడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే కుటుంబ సభ్యులు పురుషోత్తంశెట్టిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స నిర్వహిస్తుండగా మృతిచెందారు. సోదరులు ఒకేసారి మృతి చెందడంతో బజారు వీధిలోని అందరూ శోకసంద్రంలో మునిగిపోయారు.

జిల్లాకు ప్రత్యేక నిధులు రూ.1.83 కోట్లు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ కింద ఉమ్మడి జిల్లాలో వివిధ మండలాల్లో అభివృద్ధి పనుల నిమిత్తం రూ.1.83 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రహదారుల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ప్రహరీల నిర్మాణం, తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణాలకు ఈ నిధులు కేటాయించినట్లు సదరు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకుని ఇద్దరి దుర్మరణం

గోవిందప్ప, కుట్టి(పాత చిత్రాలు)

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: వన్యప్రాణులను హతమార్చేందుకు వేటగాళ్లు అమర్చిన విద్యుత్తు తీగల ఉచ్చుకు. ఇద్దరు వేటగాళ్లు చిక్కుకుని దుర్మరణం పాలైన ఘటన సోమవారం వెలుగుచూసింది. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. మండలంలోని బండ్లదొడ్డికి చెందిన నాదముని, బాలాజీ, శ్రీనివాసులుకు చెందిన మామిడి తోటలో గుర్తుతెలియని వ్యక్తులు వన్యప్రాణుల వేటకు విద్యుత్తు తీగలు అమర్చారు. అదే గ్రామానికి చెందిన గోవిందప్ప(32), కుట్టి(32) ఆదివారం రాత్రి వన్యప్రాణుల వేటకు పెద్ద టార్చిలైటు, ఇనుప కమ్మీలు తీసుకెళ్లారు. అక్కడ అమర్చిన విద్యుత్తు తీగలు గమనించక అవి వారికి తగలడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ఇది జరిగిన ప్రాంతానికి కొద్దిదూరంలోనే ఓ అడవి పంది విద్యుదాఘాతానికి గురై మరణించింది. సోమవారం కొందరు పశువుల కాపరులు దీన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో డీఎస్పీ ప్రభాకర్, సీఐ శ్రీనివాసులు, ఎస్సై ప్రసాద్ అక్కడకు వచ్చి పరిశీలించారు. మృతుల వద్ద ఉన్న పెద్ద టార్చిలైట్, ఇనుప కమ్మీలు స్వాధీనం చేసుకుని మృతదేహాలను బంగారుపాళ్యం ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేశామని సీఐ శ్రీనివాసులు తెలిపారు.

వేటగాళ్లు అమర్చిన విద్యుత్తు తీగలు

రైతేరాజు 6లో

104FM Tirupati
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
ఈనాడు క్లాసిఫైడ్స్
లీగల్ ప్రకటనలు
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
పెళ్లి పెరోజు శుభాకాంక్షలు
పుట్టినరోజు శుభాకాంక్షలు
అంత్యక్రియలు, దశదిన, వర్ధంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

మల్బరీ సాగు.. ఇంటింటా బాగు

మండలం : చౌడేపల్లె
పంచాయతీ: గడ్డంవారిపల్లె
గ్రామం : తెల్లనీళ్లపల్లె
కుటుంబాలు: 100, మల్బరీ సాగు చేసే కుటుంబాలు: 80.. మల్బరీ సాగు విస్తీర్ణం: సుమారు 150ఎకరాలు.. ప్రతి నెలా సరాసరి దిగుబడి: పట్టుగూళ్ల సుమారు 5000కేజీలు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: సాధారణ పంటలకు స్వస్తి పలికి మల్బరీ సాగుతో రైతులు ఆదాయాలను పొందుతున్నారు తెల్లనీళ్లపల్లె రైతులు. ఒకరు కాదు.. ఇద్దరు కాదు గ్రామంలో 100కుటుంబాలు ఉంటే 80శాతం రైతులు సాగు చేస్తున్నారు. ఉన్నత చదువులు చదివిన యువకులు సైతం మల్బరీ సాగులో రాణిస్తున్నారు.

సాగే జీవితం.. మల్బరీ సాగు జీవితాన్ని ఇచ్చింది. బెల్లం, వరి, వేరు సెనగ తదితర పంటలు సాగు చేసి పెట్టిన ఖర్చు రాకపోవడంతో మల్బరీ సాగుకు ప్రాధాన్యతనిచ్చా. సంవత్సరానికి ఎనిమిది పంటలు దిగుబడి సాధిస్తున్నా. **- వెంకట్రమణారెడ్డి**

జీవనంలో మార్పు వచ్చింది

మల్బరీ సాగులో 40సంవత్సరాలు అనుభవం ఉంది. తొలిసారిగా ఆకు కొనుగోలు చేసి 50గుడ్లు పెంచా. కాలక్రమేణ అర్ధ ఎకరాలో స్వొంతగా సాగు చేశా. ప్రస్తుతం 2.5ఎకరాల్లో మల్బరీ సాగు చేశా. రెండు వందల గుడ్లు పెంచుతున్నాను. ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువ రావడంతో అదే పంటను నమ్ముకున్నాను. సొంతంగా ఇళ్లు నిర్మించుకున్నా. కుమార్తెకు పెళ్లికి చేసిన అప్పులు తీర్చా. బీఎస్సీ పూర్తి చేసిన కుమారుడు సైతం ఇందులోనే పని చేస్తున్నాడు. స్టాలు లేని పంట. ఇబ్బందులుండవు. **- తిమ్మారెడ్డి**

పాల దిగుబడి మెరుగుకు తోడ్పాటు

పుత్తూరు, న్యూస్‌టుడే: మేలు జాతి గేదెల ద్వారా పాల ఉత్పత్తి పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పరమేశ్వరమంగళం పశువైద్యాధికారిణి శ్రీదేవి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్ర ప్రభుత్వం ఏబీఐపీ-ఎస్ఎస్ఎస్-ఆర్ జీఎమ్ పథకం అమలు చేస్తోంది. ప్రస్తుత విధానం ద్వారా నల్ల జాతి పశువులు(గేదెలు) ఆడ, మగ రెండు రకాల దూడలకు జన్మనిస్తుంటాయి. వాటిల్లో మగ దూడల పెంపకం పశుపోషణకులకు భారంగా మారుతోంది. వాటి ద్వారా పాల ఉత్పత్తి ఉండదు. ఫలితంగా పాడి పరిశ్రమ దెబ్బతింటోంది. ప్రభుత్వం వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ఈ కొత్త పథకం తీసుకొచ్చింది. దీని ద్వారా గేదెలకు మేలు జాతి ఆడ దూడలు మాత్రమే పుట్టేలా లింగనిర్ధరణ చర్యలు తీసుకున్నారు. గేదె ఎదకు వచ్చిన సమయంలో కృత్రిమ గర్భధారణ ద్వారా లింగ నిర్ధరణ చేయబడిన ఇంజెక్షన్ ఇస్తారు. ప్రభుత్వం 50శాతం రాయితీపై ఒక్కొక్క ఇంజెక్షన్ రూ.150 అందిస్తోంది. ప్రస్తుతం అన్ని పశువైద్యశాలల్లో ఇది అందుబాటులో ఉందని వెల్లడించారు. ఈ విధానం ద్వారా పుట్టిన సంతతి రోజుకు 10 లీటర్ల పైగా పాలిస్తుంది.

రైతేరాజు

ప్రశ్న జవాబు

రేణిగుంట, న్యూస్‌టుడే: ప్రశ్న: ఎకరా వరి పంటకు ఎన్ని యూరియా బస్తాలు వాడాలి? అవి ఎప్పుడెప్పుడు వాడాలి?
- రమేష్‌రాజు, రైతు, కరకంబాడి

జవాబు: స్వల్ప కాలిక రకాలకు ఒక ఎకరానికి రెండు యూరియా బస్తాలు, దీర్ఘ కాలిక రకాలకు మూడు యూరియా బస్తాలను మూడు నుంచి నాలుగు దఫాలుగా చల్లుకోవాలి. మొదటిది 20-25 రోజులకు, రెండోది 40-45 రోజులకు, మూడోది 55-60 రోజుల మధ్యలో చల్లుకోవాలి. ఇలా చేస్తే అధిక దిగుబడి వస్తుంది. అధిక మోతాదులో యూరియా వాడకంతో పురుగులు ఎక్కువగా ఆశించి పంట నాణ్యత తగ్గడమే కాకుండా రైతుకు పెట్టుబడి ఖర్చు అధిక అవుతుంది. **- సునీల్‌కుమార్, ఏవో**

బొప్పాయి పాలు.. విదేశాలకు

నంద్యాల జిల్లా చాగలమర్రి మండల వ్యాప్తంగా రైతులు అధికంగా బొప్పాయి సాగు చేస్తుంటారు. చిన్నవంగలితో పాటు సమీపంలోని గ్రామాలైన వైఎస్సార్ కడప జిల్లా కానగూడూరు, క్రిష్ణంపల్లె గ్రామాల్లో 1200 ఎకరాల్లో పండిస్తారు. పండ్ల సేకరణ అనంతరం 13 నెలల తర్వాత మిగిలిన ముదురు కాయలకు గాట్లు పెట్టి పాలను సేకరిస్తున్నారు. తెల్లవారుజాము సమయంలోనే కాయలకు గాట్లు పెడితే కేవలం రెండు గంటల్లోనే పాలు ఊరుతాయి. ఇలా సేకరించిన దాన్ని రాయచోటి, రాజంపేటకు చెందిన వ్యాపారులు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల పాలు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 4 డ్రమ్ముల పాలు సేకరిస్తున్నారు. ఎకరానికి పాల సేకరణ ద్వారా రైతుకు రూ.24 వేల ఆదాయం వస్తుంది. బెంగళూరు, చెన్నైతో పాటు నాణ్యతను బట్టి విదేశాలకు సైతం పాలను ఎగుమతి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, చాగలమర్రి**



జాగ్రత్తలతో వరిని కాపాడుకోవచ్చు

చిత్తూరు ఏరువాక సమన్వయ కర్త రామకృష్ణారావు

పుత్తూరు, తిరుపతి(వ్యవసాయం), న్యూస్‌టుడే: మొంథా తుపాన్ కారణంగా విస్తారంగా వర్షాలు కురిసిన నేపథ్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వివిధ దశల్లో వరి పంటను చిన్న చిన్న జాగ్రత్తలతో కాపాడుకోవచ్చని చిత్తూరు ఏరువాక కేంద్రం సమన్వయ కర్త రామకృష్ణారావు పేర్కొన్నారు. ■ పొట్ట దశలో వర్షాలు పడితే పొలంలో నీటిని అంతర్గత కాలువల ద్వారా తొలగించాలి. గింజలు రంగు మారటంతో పాటు తెగులు సోకే ప్రమాదం ఉందన్నారు. తెగులు వ్యాప్తి చెందకుండా ఎకరాకు 200మి.లీ ప్రొపికొనజోల్ పిచికారీ చేయాలి. గింజ పట్టేదశ ఉంటే నీటిని తొలగించడంతో పాటు పడిపోయిన పంట గిలకల్లో మొలకలు కనిపిస్తే ఐదు శాతం ఉప్పు ద్రావణం (50గ్రాముల ఉప్పు లీటరు నీటికి) పిచికారీ చేయాలి. మొలకల రంగు మార్పును తగ్గిస్తుంది. ■ అంకురం నాటిన పంట(పిలక దశ) వర్షపు నీరు సాధారణ రోజుల్లో అయిదు రోజుల్లో, వరదను తట్టుకునే రకాల్లో 7-10రోజులు నిలిచినప్పటికీ నీటిని తీసి పంట పునరుద్ధరణకు ఎకరాకు యూరియా 20 కిలోలు, మ్యూరెట్ ఆఫ్ పొటాష్ 20 కిలోలు, బూస్టర్ మోతాదుగా వేయాలి.

తెగుళ్ల నియంత్రణకు చర్యలు.. వర్షాలకు బ్యాక్టీరియా ఎండాకు తెగులు కనిపిస్తే ప్లాంటోమైసిన్ 1.0మి.లీ/లీటరు, కొసైడ్(కాపర్ హైడ్రాక్సైడ్) 2.0గ్రా/లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నీరు తగ్గిన తర్వాత హెక్సాకోనాజోల్ 400మి.లీ/ఎకరాకు లేదా ప్రొపికొనజోల్ 200మి.లీ/ఎకరాకు పిచికారీ చేయాలి.

కోత సమయంలో... గింజ గట్టిపడే దశ లేదా కోత దశలో అకాల వర్షాలతో ముక్క పడిపోయి నేలకు ఒరిగిపోతుంది. పడిపోయిన చేల నుంచి వచ్చే ధాన్యం మిల్లింగ్ సమయంలో విరిగిపోయి నూక ఎక్కువగా వస్తుంది. కోత కోసిన పొలంలోని పనలు తడిసినప్పటికీ నీరు పూర్తిగా బయటకు పోవటానికి కాలువలు ఏర్పాటు చేయాలి. గింజ మొలకెత్తకుండా ఉండటానికి ఐదు శాతం ఉప్పు ద్రావణం పనలపై పిచికారీ చేయాలి. ■ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నారుమడి నీట మునిగిన పరిస్థితిలో వర్షపునీరు ఐదు రోజుల్లో తగ్గితే ఐదు సెంట్ల నారుమడికి యూరియా ఒక కిలో, మ్యూరెట్ ఆఫ్ పొటాష్ ఒక కిలో బూస్టర్ మోతాదుగా వేయాలి. నారుమడి కుళ్లిపోకుండా నివారించడానికి కార్బండిజమ్ 1.0గ్రాములు/లీటరు లేదా కార్బండిజిమ్, మాంకోజెబ్ 2.0గ్రా/లీటరు పిచికారీ చేయాలి.

మాట్లాడుతున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరాం, పక్కన ఎమ్మెల్యే జగన్మోహన్

బయోమైనింగ్ పనుల్లో వేగం ఏదీ?

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: నగరపాలక పరిధిలోని డంపింగ్ యార్డులో పేరుకున్న వ్యర్థాలను డిసెంబరుకల్లా తొలగించాలని, జనవరి నుంచి గ్రీనరీ పనులు చేపట్టాలని అధికారులను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరాం ఆదేశించారు. చిత్తూరులో ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముందుగా ఎమ్మెల్యే జగన్మోహన్‌తో కలిసి సంతపేట డంపింగ్‌యార్డును తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. బయోమైనింగ్ కోసం రూ.13 కోట్లు ఖర్చుపెడుతుండగా పనుల్లో వేగం ఎందుకులేదని ప్రశ్నించారు. ప్రతి వారం తనిఖీ చేసి, డ్రోన్ సర్వేతో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. 24 గంటల్లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సాఫ్ట్‌వేర్‌తో అనుసంధానమై పనుల వివరాలను అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. మేయరు అముద, డిప్యూటీ మేయరు రాజేష్‌కుమార్‌రెడ్డి, కమిషనర్ నరసింహప్రసాద్, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, నగరపాలక అధికారులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. ముంచుతున్న జలం

చిత్తూరు-తిరుపతి ఆరు వరుసల జాతీయ రహదారి పక్కన వర్షపు నీటి ప్రవాహంతో పేట అగ్రహారం పొలాలు చెరువును తలపిస్తున్నాయి. జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వీస్ రోడ్డు నిర్మాణ ప్రణాళిక సక్రమంగా లేకపోవడంతో రోడ్డుపై వర్షపు నీరు పక్కన ఉన్న పొలాల్లోకి ప్రవహించి చెరువులా మారింది. దీంతో వందెకరాల వ్యవసాయ భూముల్లో నీరు నిలిచిందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు పలుమార్లు పరిశీలించినా చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, పూతలపట్టు**

అంతర్జాతీయ ప్రకృతి మేళాలో పెనుమూరు రైతు

మేళాలో హరికృష్ణారెడ్డి (ఎర్ర చొక్కా వ్యక్తి)

పెనుమూరు, న్యూస్‌టుడే: న్యూదిల్లీలో నాలుగు రోజులపాటు జరిగిన అంతర్జాతీయ ప్రకృతి వ్యవసాయ మేళాలో మండలంలోని దాసరపల్లెకు చెందిన అభ్యుదయ రైతు ఈ హరికృష్ణారెడ్డి పాల్గొన్నారు. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, రైతులతో కలిసి జ్యోతి వెలిగించడం తదితర కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయంపై మాట్లాడారు.

జో అచ్యుతానంద.. జోజో

శ్రీవారి దర్శనార్థం రోజూ వేలమంది భక్తులు తిరుమలకు వస్తుంటారు. గంటలతరబడి క్యూలైన్‌లో వేచిఉండి దర్శనం చేసుకున్నాక శ్రీవారి ఆలయం ఎదుట కొంతసేపు సేదతీరుతారు. ఈ సందర్భంగా శ్రీవారి వైభవాన్ని చూస్తూ తనివితీరా ఆధ్యాత్మిక చైతన్యం పొందుతుంటారు. ఇందులో భాగంగా ఓ కుటుంబం ఆలయం ఎదుట సేదతీరుతూ చీరతో బారికేడ్లకు ఊయలు కట్టి బిడ్డను కొంతసేపు జోకొట్టారు.
- న్యూస్‌టుడే, తిరుమల

జ్ఞాపికలు, పతకాలతో విద్యార్థులు

ఐసర్ @ ఆరోగ్యం

అధునాతన సదుపాయాలు.. ఆకట్టుకుంటున్న వ్యాయామశాలలు

ఐసర్‌లో విద్యార్థుల సంఖ్య: 1432
ఆచార్యులు, సిబ్బంది: 200
కుటుంబ సభ్యులు: 300 మంది

ఏర్పేడు, న్యూస్‌టుడే: నిత్యం పుస్తకాలతో కుస్తీపడుతూ ఉండే తిరుపతి భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ విద్యార్థులతోపాటు ఆచార్యులు, సిబ్బంది వ్యాయామం చేస్తూ శారీరక దారుఢ్యాన్ని పొందుతున్నారు. అధునాతన హంగులతో ఇన్‌డోర్, అవుట్‌డోర్ స్టేడియాలు, వ్యాయామశాలలు అందుబాటులో ఉండటంతో ఉదయం, సాయంత్రం వాటిల్లో కొంత సమయం గడుపుతూ శారీరక, మానసిక ఉల్లాసాన్ని పొందుతున్నారు.

అవుట్‌డోర్ గేమ్స్ ఆడేవారికి.. క్రికెట్ ప్రాక్టీస్ నెట్ (చిన్నది), అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రికెట్ మైదానం, ఫుట్‌బాల్ గ్రౌండ్, రెండు వాలీబాల్, లైటింగ్‌తో కూడిన బాస్కెట్‌బాల్ కోర్ట్, కబడ్డీ, ఖోఖో కోర్టులు, 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్ అందుబాటులో ఉన్నాయి.

ఇండోర్ క్రీడా సదుపాయాలు

టెబుల్ టెన్నిస్ టేబుల్స్-5, స్క్వాష్ కోర్టులు-2, బ్యాడ్మింటన్ కోర్టులు-5(ప్రత్యేక కోర్టులు-2, మల్టీపర్పస్ కోర్టులు-3), బాస్కెట్‌బాల్, జిమ్నాసియం, కబడ్డీకోర్టు, యోగాసెంటర్లు ఉన్నాయి. వసతి గృహాల్లోనూ టెబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్ బోర్డులు, ప్రాథమిక జిమ్నాసియంలు, యోగాసెంటర్, డంబెల్స్, మినీమల్టీజిమ్ స్టేషన్, ట్రెడ్‌మిల్స్ ఉన్నాయి.

ట్రెడ్ మిల్లపై విద్యార్థుల వ్యాయామం

శిక్షకుల పర్యవేక్షణలో..

మహిళలు, పురుషులకు వేర్వేరుగా వ్యాయామశాలలు ఉన్నాయి. నిపుణుల శిక్షణలో ట్రెడ్‌మిల్, క్రాస్‌ట్రైనర్స్ కార్డియో వ్యాయామాలు నేర్పిస్తున్నారు.

విజేతలుగా నిలుస్తూ.. ఇక్కడ పలు రకాల క్రీడల్లో శిక్షణ ఇస్తుండటంతో విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటూ విజేతలుగా నిలుస్తున్నారని ఐసర్ డైరెక్టర్ ఎస్.భట్టాచార్య తెలిపారు.

ఆదరిస్తే మనోళ్లూ ఆల్‌రౌండర్లే..!

■ జిల్లాలో పరిమిత సంఖ్యలో మహిళా క్రికెటర్లు
■ ప్రోత్సాహం లేక సాధనకు దూరంగా..

చిత్తూరు (క్రీడలు), న్యూస్‌టుడే: కపిల్‌దేవ్ జట్టు తరహాలో.. భారత మహిళల జట్టు క్రికెట్‌లో మొదటిసారి విశ్వవిజేతగా నిలవడంతో యావత్ ప్రపంచం మనవైపు తిరిగి చూసింది. ఇతర క్రీడల్లో మహిళల ప్రాతినిధ్యం ఉన్నా.. క్రికెట్ సంగతికి వచ్చేసరికి పెద్దగా కన్పించడం లేదు. ఆడాలన్న ఆసక్తి ఉన్నా.. శిక్షణ లేక క్రికెట్‌పై ఆశల్ని వదిలేసుకుంటున్నారు. ఐదేళ్లలో ఐదారుగురు తప్ప.. పెద్దగా మహిళా క్రికెటర్లు లేకపోవడం గమనార్హం. వీరికీ ఆదరణ కల్పిస్తే.. శ్రీచరణి, జమీమా తరహాలో అదరహో అనిపిస్తారని క్రీడాభిమానులు అంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో అడ్డంకులివీ..

- శిక్షణకు క్రీడాప్రాధికార సంస్థ తరపున కోచ్ లేకపోవడం.
- శిక్షణార్థుల సంఖ్య ఐదారుగురికి మించకపోవడం.

సరైన ప్రోత్సాహం లేదు

బాలికలు క్రికెట్ ఆడాలని ఎంతో ఆసక్తితో ఉన్నా సరైన శిక్షణ, అవకాశాల్ని చూపించేవారు లేకపోవడం పెద్ద లోటు. నేను ఐదేళ్లుగా క్రికెట్ ఆడా. బౌలింగ్ చేస్తా. యూనివర్సిటీ స్థాయి, జోనల్స్ క్రీడల్లో జిల్లా తరపున తలపడ్డా. రాష్ట్ర స్థాయి ప్రాబబుల్స్‌కు ప్రాతినిధ్యం వహించా. ప్రోత్సాహం లేక తదుపరి స్థాయికి వెళ్లలేకపోయాం. డిగ్రీ చదివి చిత్తూరులోనే ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నా. బాలికలు క్రికెట్‌లో రాణించేలా అవకాశాలు కల్పిస్తే ప్రతిభావంతులను వెలికితీయవచ్చు. **- ఛరీష్మా, చిత్తూరు**

శిక్షణ ఇవ్వలేమని నిరాశపరిచినా సాధన

బాల్యం నుంచి క్రికెట్ అంటే మక్కువే అయినా పదో తరగతి నుంచి ఆడాలన్న ఆసక్తి మరింత పెరిగింది. బాలికలకు శిక్షణ ఇవ్వలేమని మొదట్లో నిరాశపరిచారు. వేసవి శిక్షణ శిబిరాలకు వెళ్లి ప్రాథమిక అంశాల్ని నేర్చుకున్నా. తల్లిదండ్రులు, శిక్షకుల ప్రోత్సాహంతో ఫిట్‌నెస్ మెరుగుపరచుకుని జిల్లాస్థాయి పోటీలకు బ్యాటర్‌గా ఎంపికయ్యా. అండర్-19, ఎస్వీయూ, ఇంటర్ జోనల్ స్థాయి మ్యాచ్‌ల్లో తలపడ్డా. రాష్ట్ర స్థాయి ప్రాబబుల్స్ పోటీల వరకూ వెళ్లగలిగా. ప్రస్తుతం డిగ్రీ పూర్తయింది. బీసీఏ కోర్సు చేశా. శిక్షణకు అవకాశం లేకపోవడంతో హైదరాబాద్‌లో ఉద్యోగాన్వేషణలో ఉన్నా. జిల్లాలో సౌకర్యాలు కల్పిస్తే ప్రతిభావంతులు వెలుగులోకి వస్తారు. **- భవ్య, చిత్తూరు**

ప్రకృతి వ్యవసాయంపై రైతుల దృష్టి మళ్లించాలి

మాట్లాడుతున్న జేడీఏ మురళీకృష్ణ

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతుల దృష్టి మళ్లించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ కోరారు. స్థానికంగా ఓ ఫంక్షన్ హాలులో నూతనంగా ఎంపికైన ఐసీఆర్‌పీ(క్షేత్రస్థాయి సిబ్బంది)లకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు భవిష్యత్తులో మంచి డిమాండ్ ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించి మార్పు చేయాలని సూచించారు. ఉద్యాన శాఖ డీడీ మధుసూదనరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ఉద్యాన పంటల సాగు ఎంతో లాభదాయకమన్నారు. ప్రకృతి వ్యవసాయ పథకం జిల్లా మేనేజరు వాసు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. 219మంది ఐసీఆర్‌పీలను నాలుగు బ్యాచ్‌లుగా ఏర్పాటు చేసి తొలి బ్యాచ్‌కు శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణలో ప్రకృతి వ్యవసాయ పథకం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు అండగా ఉంటాం

జిల్లా కారాగారాన్ని సందర్శిస్తున్న మహిళా కమిషన్ సభ్యురాలు షేక్ రోకేయా బేగం

చిత్తూరు (నేరవార్తలు), విద్య, న్యూస్‌టుడే: స్థానిక మురకంబట్టులోని సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యార్థిని నందినీరెడ్డి ఆత్మహత్యాయత్నంపై సోమవారం రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు షేక్ రోకేయా బేగం విచారణ చేపట్టారు. విద్యార్థిని ల్యాబ్ రికార్డులు సమర్పించలేదనే కారణంగా అధ్యాపకులు దండించడంతో ఆ విద్యార్థిని మనోవేదనకు గురై కళాశాల మూడో అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కళాశాల యాజమాన్యం కారణంగానే ఈ ఘటన జరిగిందని, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆపై విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడి పలు సమాచారం సేకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర మహిళలకు మహిళా కమిషన్ అండగా ఉంటుందని, ఎవరూ భయపడొద్దని, సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. ఈ ఘటనపై సమాచారం సేకరించామని, నివేదికను కమిషన్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. జిల్లా కారాగారాన్ని సందర్శించి మహిళా ఖైదీలకు అందుతున్న సేవలు, వసతులపై ఆరా తీశారు.

అర్జీదారులు పోటెత్తారు..!

కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 380 వినతులు

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అర్జీదారులు పోటెత్తారు. గ్రీవెన్స్ హాల్ వారితో నిండిపోయింది. దీంతో తలుపులు మూసేసి విడతల వారీగా అర్జీదారులను లోపలకు పంపారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. మొత్తం 380 వినతులు అందాయి. శిక్షణ కలెక్టర్ నరేంద్ర పాడల్, డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

■ సాగునీటి ప్రాజెక్టుకు భూములిచ్చిన తమకు పరిహారం అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామని రొంపిచెర్ల మండలం పెద్దగొట్టిగల్లు రైతులు వాపోయారు.

■ దారి సమస్యకు పరిష్కారం చూపాలని గంగవరం మండలం బి.జరవారపల్లి గ్రామస్థులు విన్నవించారు. దారి సెటిల్‌మెంట్ భూమి అని కొందరు అంటున్నారని, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారిస్తే వాస్తవాలు వెలుగు చూస్తాయన్నారు.

■ పింఛను రద్దుపై జారీ చేసిన నోటీసులు పునఃసమీక్షించాలని దివ్యాంగులు డిమాండ్ చేశారు. అర్హులకు పింఛను నగదు తగ్గింపుపై ఇచ్చిన నోటీసులు వెనక్కి తీసుకోవాలని, అర్హత పరీక్ష పారదర్శకంగా నిర్వహించాలని కోరారు.

పింఛను ఇప్పించండి..

90 శాతం వైకల్యం ఉన్న తన కుమారుడు గౌతమ్‌కుమార్‌కు దివ్యాంగ పింఛను ఇప్పించాలని విన్నవించారు ఐరాల మండలం నెల్లిమందపల్లికి చెందిన తాతయ్య. బిడ్డ పోషణ చూసుకోవడానికి ఒకరు తోడు ఉండాల్సిందేనని వాపోయారు. పింఛను వస్తే ఔషధాలకు ఉపయోగపడుతుందని అర్థించారాయన.

ఒంటరి మహిళకు కలెక్టర్ చేయూత

అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఒంటరి మహిళనైన తనకు పింఛను మంజూరు చేయడం లేదని పలమనేరు మండలం గంటావూరు యానాదుల కాలనీకి చెందిన వెంకటమ్మ ఆవేదన వ్యక్తం చేశారు తన నిధుల నుంచి రూ.4 వేలు నగదు చెక్కు రూపంలో కలెక్టర్ అందజేశారు.

పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్‌కు 47 ఫిర్యాదులు

బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్‌డూడి

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్‌కు 47 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ తుషార్‌డూడి ఫిర్యాదులను స్వీకరించి బాధితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని ఆపై జూమ్ సమావేశం ద్వారా పోలీసు అధికారులతో మాట్లాడారు. ఫిర్యాదుల్లో కుటుంబ సమస్యలు 19, వేధింపులు 3, భూ సమస్యలు, దారి గొడవలు, నగదు సమస్యలు 25 చొప్పున 47 ఫిర్యాదులు రాగా వాటిని సంబంధిత స్టేషన్‌లకు సిఫార్సు చేశారు. వాటిని పరిష్కరించి వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

మద్యం దుకాణానికి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: పెద్దపంజాణి మండలంలో గౌండ్ల ఉపకులానికి కేటాయించిన మద్యం దుకాణానికి దరఖాస్తులు ఆహ్వానించామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం నుంచి ఈ నెల 10వ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తు రుసుము రూ.2 లక్షలని, ఈ నెల 12న కలెక్టరేట్‌లో నిర్వహించే అదృష్ట పరీక్ష ద్వారా దుకాణాలు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు మద్యం దుకాణానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కాలువకు గండిపై పోలీసులకు ఫిర్యాదు

గండి కొట్టడంతో వృథాగా పోతున్న నీరు

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: మండలంలోని మొట్లచెరువు సమీప వర్షపు నీటి కాలువ సిమెంట్ గోడకు శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గండికొట్టారు. దీంతో నీరు వృథాగా పోతోంది. ఈ విషయాన్ని ఆయకట్టు రైతులు జలవనరుల శాఖ ఏఈ విజయకుమార్‌కు విన్నవించగా ఆయన సీఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. అధికారులు చర్యలు తీసుకుని నీటి వృథా అరికట్టాలని రైతులు కోరారు. వర్షపు నీటి కాలువలు, చెరువులకు గండి కొడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని సీఐ హెచ్చరించారు. గండికొట్టిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

'ఈ బ్యాంకు మేనేజర్ మాకొద్దు'

మేనేజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళలు

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని కావేటిగారిపల్లె పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లెలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఉమామహేశ్వరరావు పనితీరు సరిగాలేదంటూ, ఈ బ్యాంకు మేనేజర్ మాకొద్దని ఆరోపిస్తూ పరిసర ప్రాంతాల రైతులు, డ్వాక్రా సంఘాలు మహిళలు, ఖాతాదారులు మండిపడ్డారు. సోమవారం కొమ్మిరెడ్డిగారిపల్లె శాఖ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఎదుట బైఠాయించి వారు పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. పంట రుణాలు చెల్లిస్తున్నా కొత్తవాటి కోసం నెలలతరబడి తిరగాల్సి వస్తోందని ఆగ్రహించారు. డ్వాక్రా సంఘాల సకాలంలో పూర్తిగా చెల్లించినా, మళ్లీ రుణం తీసుకోవాలంటే రూ.20 వేలు బ్యాంకులో డిపాజిట్ చేయాలని బ్యాంకు మేనేజర్ నిబంధనలు పెట్టి తిప్పుకొంటున్నారని మహిళలు వాపోయారు. మేనేజర్ ఉమామహేశ్వరరావు సమాధానమిస్తూ సప్తగిరి గ్రామీణ బ్యాంకుగా ఉన్న తమ బ్యాంకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మారడంతో కొత్తగా కొన్ని నిబంధనలు అమలు చేసినట్లు పేర్కొన్నారు. కల్లూరు ఎస్సై వెంకటేశ్వర్లు, ట్రైనీ ఎస్సై మధుసూదన్‌లు రైతులు, డ్వాక్రా సంఘాల మహిళలతో మాట్లాడారు. రెండురోజుల్లో ఖాతాదారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్య లేకుండా చేస్తామని ఆర్ఎం ఫోన్‌లో చెప్పడంతో వారు శాంతించారు.

EENADU Classifieds

EDUCATION
TUITIONS
TUTIONS తిరుపతిలో ఖాదీకాలనీ నుండి ఆన్‌లైన్ (ZOOM) ద్వారా పిల్లలకు హిందీ నేర్పించబడును. Cont: ✆ 94411 88043.

HEALTH & CARE
PAEDIATRIC
శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పురిటి బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

REAL ESTATE
FLAT FOR SALE
GENERAL
తిరుపతి, తిరుచానూరు రోడ్డులోని పద్మావతిపురంలో టెంపుల్ వ్యూ రెసిడెన్సీలో ఫ్లాట్ నెం:102, 1600 sqft 3BHK అమ్మబడును. ధర: 60 లక్షలు, Negotiable డా॥ నారాయణ రాజు, కోడూరు.90521 60690, వాచ్‌మెన్ 63095 85533.

PLOT FOR SALE
GENERAL
INVESTMENT PLOTS/ Farm House Plots/ Villa Plots for Sale: Lucky Ventures (India's No-1 Real Estate Company). ✆ 91145 61456.

JOBS
PART TIME Jobs for Teachers with Experience and Fresher Wisdom Academy, SV Nagar, Tirupati. ✆ 98660 87500, 83415 54014.
WANTED: Immediately High School English and Social for a Reputed School in Mangalam, Tirupati. Cont: ✆ 81794 67247.
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యూయర్స్. ఏజ్: 22-35. ఫ్రెషర్స్ కూడా కావలెను. ✆ 6281037879.
తిరుపతి, తిరుమల బైపాస్‌రోడ్డు, ప్రముఖ A/c రెస్టారెంట్‌లో అనుభవం గల స్టీవార్డ్స్, క్యాషియర్, రుబ్బింగ్ మాస్టర్, స్టాల్‌బాయ్ కావలెను. ✆ 87901 22006, 76038 68950.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU THE EASY WAY CLASSIFIEDS
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

చిత్తూరు
•చిత్తూరు • పూతలపట్టు •గంగాధరనెల్లూరు • నగరి

కలిగిరి శ్రీనివాసుని సేవలో శిక్షణ కలెక్టర్

పెనుమూరు: కలిగిరికొండ వెంకటేశ్వర స్వామిని శిక్షణ కలెక్టర్ నరేంద్ర పాడెల్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన శ్రీదేవి భూదేవి సమేత స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అడిగి ఆలయ చరిత్ర తెలుసుకున్నారు.

విద్యా ప్రదాత కె.ఎం.రెడ్డి

గుడిపాల: బొమ్మసముద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వ్యవస్థాపకులు కె.ఎం.రెడ్డి విద్యాదాత అని కళాశాల ప్రిన్సిపల్ సబ్బాన్ అన్నారు. సోమవారం ఆయన 60వ వర్ధంతి నిర్వహించారు. కళాశాల ఆవరణలోని ప్రతిమకు నివాళులర్పించారు. కె.ఎం.రెడ్డి ట్రస్టు అధ్యక్షుడు మదుసూదనరెడ్డి, అధ్యాపకులు రెడ్డెప్పరెడ్డి, ఓబులేసు, జ్యోతిర్మయి, తిరుమల సెల్వి పాల్గొన్నారు.

5న అన్నాభిషేకం

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: కార్తిక మాస పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం శ్రీ నాగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 5న సాయంత్రం అన్నాభిషేకం ఉత్సవం జరగనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు విచ్చేయాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 9866112017
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 9505557466

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం: సమస్య: గిరింపేట బొందుపీలీలోని కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. **- స్థానికులు**
సమాధానం: డ్రైనేజీ కాలువలో పూడికతీత పనులు చేపడతాం. **-లోకేష్, ఆరోగ్యాధికారి, నగరపాలక సంస్థ**

న్యూస్‌టుడే, పాలసముద్రం: సమస్య: బాలక్రిష్ణాపురం పంచాయతీ ఆముదాలతోట్టకు వెళ్లే మార్గంలో ముళ్ల కంపలు పెరిగి పాదచారులు, వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. **-గ్రామస్థుడు**
సమాధానం: ప్రధాన రోడ్డు నుంచి గ్రామానికి వెళ్లే మార్గంలో పెరిగిన ముళ్లకంపలు వెంటనే తొలగింపజేస్తాం. **- సత్యనారాయణ, కార్యదర్శి**

న్యూస్‌టుడే, తవణంపల్లె: సమస్య: ద్వారకాపురంలో కొన్ని రహదారులు అధ్వానంగా ఉన్నాయి. **-స్థానికులు**
సమాధానం: అధికారులతో మాట్లాడి అవసరమైన వీధుల్లో సీసీ రహదారులు నిర్మింపజేస్తాం. **- హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో**

న్యూస్‌టుడే, నగరి: సమస్య: ఏకాంబరకుప్పం దళితవాడలో మురుగునీరు నడి వీధిలో పారుతుండటంతో అవస్థలు పడుతున్నాం. **-శేఖర్, నగరి**
సమాధానం: సమస్య పరిశీలించి చర్యలు చేపడతాం. **-రవీంద్రరెడ్డి, డీఈఈ**

న్యూస్‌టుడే, పుత్తూరు: సమస్య: వాటర్ ట్యాంకు వీధి వద్ద మురుగునీటి కాలువలో తీసిన మట్టి కుప్పగా పోశారు. వర్షం వస్తే ఆ మట్టి మళ్లీ కాలువలోకి చేరి మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. **-స్థానికులు**
సమాధానం: మురుగునీటి కాలువలో తొలగించిన మట్టిని తీసేలా చర్యలు తీసుకుంటాం. **-మోహన్‌కృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పుత్తూరు**

ప్రణాళికతో చదవాలి

విజయోత్సవ కేకు కోస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రణాళికతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కోరారు. చిత్తూరులోని జీవకారుణ్య అన్నదాన సమాజం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 100 మంది మెరిట్ విద్యార్థులకు ఉపకార వేతనాల రూపంలో మొత్తం రూ.2.25 లక్షలు సోమవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే జగన్మోహన్, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రాజసింహులు, ఈవో తిమ్మారెడ్డి పాల్గొన్నారు. **చిత్తూరు విద్య:** భారత మహిళా జట్టు ప్రపంచకప్ విజేతగా నిలిచి చరిత్ర సృష్టించిందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మహిళా జట్టు ప్రపంచకప్ విజేతగా నిలిచిన సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్‌తో కలిసి విజయం కేకును విద్యార్థులతో కలిసి కోశారు. విజయోత్సవ కేకును విద్యార్థుల సమక్షంలో కోసి అందరికీ పంచిపెట్టారు. మాజీ చైర్‌పర్సన్ హేమలత, మాజీ ఎమ్మెల్యే దొరబాబు, తెదేపా పుంగనూరు ఇన్‌ఛార్జి చల్లా బాబు, విజయం విద్యాసంస్థల చైర్మన్ తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టర్ తేజా మూర్తి పాల్గొన్నారు. **చిత్తూరు(సేవావర్గాలు):** జిల్లా పర్యటన నిమిత్తం వచ్చిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని ఎస్పీ తుషార్‌డూడి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి పరిచయం చేసుకున్నారు.

ఇంకెన్నాళ్లు తిరగాలి స్వామీ..!

- వ్యయప్రయాసలకోర్చి వచ్చాం
- బాధితుల వేడుకోలు

న్యూస్‌టుడే, చిత్తూరు(మిట్టూరు), కలెక్టరేట్: తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నాం.. పట్టించుకునే వారే లేరు.. మండలాల్లో తమ గోడు ఆలకించే వారే కరవయ్యారని పలువురు అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బంది చొరవ చూపడం లేదని, తమ బాధలు ఆలకించే వారే లేరని వాపోయారు.. దీంతో చేసేదేమీలేక విసిగివేసారి ఎంతో శ్రమకోర్చి చిత్తూరులోని కలెక్టరేట్‌కు వచ్చామన్నారు.. మీరైనా దృష్టిసారించి తమ న్యాయమైన సమస్యలకు పరిష్కారం చూపాలని పలువురు బాధితులు తమ ఆవేదన వెలిబుచ్చారు.. తమను కరుణించాలని అధికారులను వేడుకున్నారు.

దారి సౌకర్యం కల్పించండి..

తమ కాలనీకి దారి సౌకర్యం కల్పించాలని ఎస్సీకాలనీ మండలం బసివిరెడ్డిపల్లి పంచాయతీ ఎస్సీ కాలనీ వాసులు అధికారులకు విన్నవించారు. మెయిన్ రోడ్డు నుంచి తమ కాలనీకి వెళ్లే దారి ఆక్రమణలకు గురైందన్నారు. దారి లేకపోవడంతో తాము నిత్యం నానా అవస్థలు పడుతున్నామని వాపోయారు. దారి, వీధి దీపాలు, డ్రైనేజీ వసతులు కల్పించాలని అధికారులకు విన్నవించారు.

ఆక్రమణ తొలగించండి

బంగారుపాళ్యం మండలం కీరమంద ఆది ఆంధ్రవాడ శ్మశాన భూమిలో ఆక్రమణలు తొలగించాలని గ్రామస్థులు మునస్వామి, కన్నయ్య అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఆదిఆంధ్రవాడలో 15 కుటుంబాలు ఉన్నాయన్నారు. ఇక్కడ శ్మశానం నిమిత్తం ఎకరం భూమి ఉండేదని, తమ గ్రామానికి ఓ వ్యక్తి అందులో అరెకరం భూమిని దర్జాగా ఆక్రమించాడన్నారు. సదరు ఆక్రమణలు తొలగించి న్యాయం చేయాలని వేడుకున్నారు.

ఇల్లు మంజూరు చేయండి..

ఇటీవలి వర్షాలకు ఇళ్లు ఉరుస్తున్నాయని, ఇంటి అడుగు భాగం ఊట పట్టి కాపురం ఉండలేక అవస్థలు పడుతున్నామని పులిచెర్ల మండలం చల్లావారిపల్లె పంచాయతీ శ్రీనివాసపురం వాసులు కన్నీటిపర్యంతమయ్యారు. యానాది కులానికి చెందిన తాము కూలి పనులకు వెళ్తూ జీవిస్తున్నామన్నారు. ఇంటి నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటంతో వర్షాలకు ఉరుస్తున్నాయని చెప్పారు. ఫలితంగా తాము అక్కడ జీవించలేక పోతున్నామని వాపోయారు. ఇళ్ల మంజూరుతో పాటు తమను ఆర్థికంగా ఆదుకోవాలని అధికారులకు వినతిపత్రం అందజేశారు.

పరీక్షిస్తున్న వైద్యురాలు కల్పన

కళ్ల విషయంలో అప్రమత్తత అవసరం

పుత్తూరు, న్యూస్‌టుడే: కంటి ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని కంటి వైద్య నిపుణురాలు కల్పన పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో వాసన్ ఐకేర్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 147 మందికి పరీక్షలు చేసి 27మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు వారు తెలిపారు. తహసీల్దార్ జీసీ వెంకటేశ్వర్లు, రెడ్‌క్రాస్ సొసైటీ జీవితకాల సభ్యుడు మునికృష్ణయ్య, ఉషోదయా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోనేటి రవిరాజు, వెంకటేశులు, శ్రుతి పాల్గొన్నారు.

నగరి: ఎంపికైన విద్యార్థులతో ఎంఈవో శ్రీదేవి, అధ్యాపకులు

విద్యార్థులకు పోటీలు

నగరి, న్యూస్‌టుడే: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ స్థాయిలో సోమవారం విద్యార్థులకు పోటీలు నిర్వహించామని ఎంఈవో శ్రీదేవి తెలిపారు. వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి ఆరుగురిని ఎంపిక చేశామన్నారు. ఎస్.పరిమళను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని చెప్పారు. ఎంఈవో నమశ్శివాయం, అధ్యాపకులు అలెగ్జాండర్, బాలాజీ, శ్రీనివాసులు, పురుషోత్తం పాల్గొన్నారు. **గంగాధరనెల్లూరు :** చిన్నతనం నుంచే విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించాలని ఎంఈవో ఆంజనేయులశెట్టి ఉపాధ్యాయులను, పిల్లల తల్లిదండ్రులను కోరారు. రాజ్యాంగ దినోత్సవంపై నియోజకవర్గస్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన ఆరుగురు విద్యార్థులకు క్విజ్ పోటీలు స్థానిక హైస్కూలు ఆవరణలో నిర్వహించారు ప్రథమ, ద్వితీయ స్థానాల్లోని శశిర, గోవర్ధన్(కార్వేటినగరం మండలం), తృతీయ స్థానంలో నిలిచిన లిఖిత్(జీడీనెల్లూరు మండలం)ను రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతూ, వారికి బహుమతులు అందజేశారు. హెచ్‌ఎంలు సుబ్బరామయ్య, కేశవరెడ్డి, సమన్వయకర్తలు రవి, గోవిందరెడ్డి పాల్గొన్నారు. **కార్వేటినగరం :** రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన అవసరమని ప్రధానోపాధ్యాయుడు చెంగల్రాజు అన్నారు. కత్తెరపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని శశిర నియోజకవర్గ స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించిందని ఆయన తెలిపారు.

స్వదేశీ వస్తువులు వినియోగిద్దాం

పెనుమూరు : భారతీయులుగా అందరం స్వదేశీ వస్తువులనే వినియోగించాలని భాజపా మండల నాయకులు కోరారు. సోమవారం వారు పెనుమూరు ముత్యాలమ్మ ఆలయం వద్ద సమావేశం నిర్వహించి కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం గాంధీనగర్‌లో ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించారు. మండల పార్టీ అధ్యక్షురాలు ఉషారాణి, నాయకులు చిట్టిబాబు, రవి పాల్గొన్నారు.

ఎన్‌టీఏ చిత్తూరు అధ్యక్షురాలిగా దేవకి

దేవకి

ప్రతాప్‌కుమార్

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్‌టీఏ) చిత్తూరు నగర కార్యవర్గం ఏర్పాటైందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్‌నాయుడు తెలిపారు. నగరంలోని దుర్గానగర్ కాలనీలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో నూతన కార్యవర్గ పునర్వ్యవస్థీకరణ సోమవారం చేపట్టారు. నగర అధ్యక్షురాలిగా దేవకి, ప్రధాన కార్యదర్శిగా ప్రతాప్‌కుమార్, గౌరవాధ్యక్షులుగా గీతాంజలి, ఆర్థిక కార్యదర్శిగా రుక్మాంగద, సహాధ్యక్షులుగా ప్రసన్నకుమారి, జ్యోత్స్న, ఉపాధ్యక్షులుగా లావణ్య, రంగనాయకమ్మ, జిల్లా కౌన్సెలర్లుగా శ్రీనివాసులు, గిరిజ ఎన్నికయ్యారని చెప్పారు.

పల్లవికి నగదు అందజేస్తున్న కృష్ణారెడ్డి

విద్యార్థినికి నగదు బహుమతి

యాదమరి, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల్లో మండల పరిధిలో అత్యధిక మార్కులు(561) సాధించిన పల్లవికి విశ్రాంత ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి రూ.20 వేలు నగదు బహుమతి అందజేశారు. సోమవారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో పల్లవి తల్లిదండ్రులు షణ్ముగం, సుభాషిణిని సత్కరించారు. ఏటా పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన వారికి నగదు ప్రోత్సాహం అందిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. హెచ్.ఎం. హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలరించిన బృంద కోలాటం.. వెదురుకుప్పం: పచ్చికాపల్లంలో సోమవారం కళాకారులు ప్రదర్శించిన బృంద కోలాటం అలరించింది. దామరకుప్పం సమీప పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో యోగాభ్యాసకులు, శిక్షకులు శాఖాహార ప్రాముఖ్యత వివరిస్తూ ప్రదర్శన చేపట్టారు. కళాకారులతో పచ్చికాపల్లం కూడలిలో కోలాట ప్రదర్శన చేపట్టి ధ్యానం, యోగా, శాకాహారం వల్ల కలిగే ప్రయోజనాలు ప్లకార్డులతో ప్రదర్శించారు.

కార్తికం.. దీప శోభితం

పుత్తూరు ఈశ్వరాలయంలో ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పుత్తూరు, పాలసముద్రం, బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: పుత్తూరు పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరాలయంలో కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం, అర్చన నిర్వహించారు. మహిళలు ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణ పరిధిలోని చిన్నబ్బనాయుడు కండ్రిగ సమీప శ్రీగంగా నాగలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.


పాలసముద్రం: ప్రత్యేక అలంకరణలో బాలగురునాథీశ్వర స్వామి ఉత్సవర్లు

బంగారుపాళ్యం: మొగిలీశ్వరస్వామి ఆలయంలో నందీశ్వరుని వద్ద పిండి దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ప్రయాణం.. ప్రమాదం

ఇటీవలి వర్షాలతో అగరమంగళం చెరువు కట్ట కోతకు గురైంది. పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో 9 గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వీరితో పాటు ఆటోల్లో అక్కదేవతల కండ్రిగ ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులు సైతం నిత్యం ప్రమాదకర ప్రయాణం చేస్తున్నారు. చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, గంగాధరనెల్లూరు

ఈ తాళాలు ఎన్నాళ్లకు తీస్తారో..?

తిరుమలకుప్పంలో గ్రామ సచివాలయ భవనాన్ని రూ.43 లక్షలతో నిర్మించి 2024 జనవరి ఏడో తేదీన ప్రారంభించారు. అప్పటి నుంచి భవనానికి తాళాలు వేశారు. ఇప్పటివరకు ఆ భవనంలో విధులు నిర్వహించడం లేదు. దీన్ని మూత వేసిన ఘనత పంచాయతీరాజ్‌శాఖ అధికారులకే దక్కుతుంది. భవనం శిథిలావస్థకు చేరకముందే దీన్ని అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

- న్యూస్‌టుడే, పుత్తూరు

రైతులకు భరోసా ఇచ్చేదెపుడు..?

గత వైకాపా ప్రభుత్వ హయాంలో 189.కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు చిత్తూరు-వేలూరు మార్గంలోని కిలారిపల్లె క్రాస్ వద్ద ఐదేళ్ల క్రితం రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణాన్ని చేపట్టారు. సంబంధిత గుత్తేదారు 80 శాతం పూర్తి చేసి వదిలేశాడు. దీంతో భవనాన్ని పిచ్చిమొక్కలు కమ్ముకుంటున్నాయి. భవనం పూర్తికాక స్థానిక రైతులు రెండు కిలోమీటర్లు వెళ్లి అవసరమైన ఎరువులు, వేరుసెనగ విత్తనాలు తెచ్చుకుంటున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని ఈ భవనాన్ని పూర్తిచేసి తమకు మెరుగైన సేవలు అందించాలని రైతులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, గుడిపాల

కలుషిత నీరే దిక్కు

మండలంలో ఓవర్‌హెడ్ ట్యాంకుల ద్వారా సరఫరా చేసిన నీటిని ప్రజలు తాగే పరిస్థితి కనిపించడం లేదు. వీటి నిర్వహణను గాలికొదిలేశారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ట్యాంకుల్లో చాలావరకు దెబ్బతిన్నప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. స్థానిక ఏఏడబ్ల్యూ కాలనీలోని వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. దీన్ని 20 ఏళ్ల క్రితం నిర్మించారు. ట్యాంక్ బాగా దెబ్బతినడంతో నీరు వృథా సహా కలుషితమవుతోంది. ఇలా ఉండటంతో శుభ్రం చేయడం మానేశారు. దీంతో ఆ కాలనీవాసులకు కలుషిత నీరే దిక్కవుతోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి బాగు చేయాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, వడమాలపేట**

రైతులకు న్యాయం చేయాలి

గుడిపాల: పళ్ల గుజ్జు పరిశ్రమలు మామిడి రైతులకు న్యాయం చేయాలని జిల్లా రైతు సంఘం నాయకులు కోరారు. సోమవారం తాసా పళ్లగుజ్జు పరిశ్రమ వద్ద నిరసన వ్యక్తం చేశారు. చిత్తూరు రూరల్‌లోని ఆర్‌ఎంఎం పళ్లగుజ్జు పరిశ్రమ నుంచి ద్విచక్ర వాహనాల్లో ర్యాలీగా వచ్చి తాసా పరిశ్రమ వద్ద నిరసన వ్యక్తం చేశారు. జిల్లా రైతు నాయకుడు హరిబాబు నాయుడు, మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచకప్ సాధన గర్వకారణం

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: మహిళా వన్‌డే ప్రపంచకప్ క్రికెట్ టోర్నీ గెలిచి దేశానికి గర్వకారణంగా మహిళా క్రీడాకారులు నిలిచారని తెలుగుమహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వై.వి.రాజేశ్వరి పేర్కొన్నారు. సోమవారం ఆమె స్వగ్రామమైన రామానాయుడుపల్లెలో మాట్లాడుతూ అవకాశాలు కల్పిస్తే మహిళలు ఏ రంగంలోనైనా దీటుగా రాణిస్తారన్నారు.

చెత్తకుప్పల తొలగింపు

కార్వేటినగరం రోడ్డులో చెత్త కుప్పలు తొలగించాలనే సమస్యపై స్పందించిన కమిషనర్ మంజునాథగౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మోహన్‌కృష్ణ తమ సిబ్బందితో చెత్తకుప్పలు తొలగింపజేశారు. **-న్యూస్‌టుడే, పుత్తూరు**

తొలగిన మురుగు

పాపసముద్రం వద్ద రోడ్డుపై నిలిచిన మురుగునీటి సమస్యపై స్పందించి జేసీబీ సాయంతో పంచాయతీ కార్యదర్శి తొలగింపజేశారు. **- న్యూస్‌టుడే, గుడిపాల**

స్పందనకు వందనం

‘అభివృద్ధిని అడ్డుకోవడం మాజీ మంత్రి రోజా నైజం’

పుత్తూరు, న్యూస్‌టుడే: అభివృద్ధి పనులు అడ్డుకోవడం మాజీ మంత్రి రోజా నైజమని పద్మశాలి, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లు గంజి మాధవయ్య, షణ్ముగరెడ్డి, పుత్తూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ గణేష్, పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం ఆరోపించారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పుత్తూరు అభివృద్ధి కోసం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ రూ.2కోట్లు మంజూరు చేయించి, 27 వార్డులకు సమానంగా కేటాయిస్తే ఆయా పనులు ఆమోదించక పోవడం దారుణమన్నారు. తెదేపా నాయకులపై అసత్య ప్రచారాలు చేస్తే ప్రజలు నమ్మరని, ఇది అభివృద్ధిని అడ్డుకోవడం కాదా అని ప్రశ్నించారు. మాజీ మంత్రి రోజా వైకాపా పాలకవర్గాన్ని అడ్డుపెట్టుకుని నీచ రాజకీయాలు చేస్తున్నారని, గతంలో పుత్తూరు మున్సిపల్ భవన నిర్మాణాన్ని అడ్డుకున్నది వాస్తవం కాదా అన్నారు. చెర్లోపల్లి రోడ్డు నిర్మాణంలో కాసులకు కక్కుర్తిపడి పనులు నిలిపారన్నారు. అభివృద్ధి అంటే తెదేపాదేనని, ఆ విషయం వైకాపా నాయకులు గుర్తించాలన్నారు. పట్టణ ప్రధాన కార్యదర్శి ధనపాల్, కౌన్సిలర్ కేశవాచారి, నాయకులు బాబునాయుడు, బాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను అభినందిస్తున్న ఇస్మాయిల్ కుటుంబసభ్యులు

ప్రాణభిక్ష పెట్టారు.. జీవిత కాలం రుణపడి ఉంటాం

పుత్తూరు, న్యూస్‌టుడే: ప్రాణభిక్ష పెట్టారు.. జీవిత కాలం సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు రుణపడి ఉంటామని ఇస్మాయిల్ కుటుంబసభ్యులు పేర్కొన్నారు. తిరుపతిలో ఎమ్మెల్యేను ఆయన నివాసంలో సోమవారం కలిసి సత్కరించారు. వారు మాట్లాడుతూ గత నెల 8న గుండెజబ్బుతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఇస్మాయిల్ చేరాడని, వెంటనే ఆపరేషన్ చేయకుంటే కష్టమేనని డాక్టర్లు చెప్పడంతో దిక్కుతోచక ఎమ్మెల్యేను కలవగా ఆయన 24 గంటల్లో సీఎం సహాయ నిధి ద్వారా రూ.4.50 లక్షలు మంజూరు చేయించడంతో ఆపరేషన్ జరిగి ప్రస్తుతం ఆరోగ్యం బాగుందన్నారు. ● **ఘనంగా కుంభాభిషేకం..** తిరుమలకుప్పం అంకాళ పరమేశ్వరీదేవి ఆలయ కుంభాభిషేకం జరిగింది. ఆలయంలో అంబళ్లు పోశారు. అన్నదానం చేశారు. ఎమ్మెల్యే భానుప్రకాష్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయన్ను నిర్వాహకులు సత్కరించారు. అమ్మవారిని పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య దర్శించుకున్నారు. ● **నిండ్ర:** స్థానిక దళితవాడకు చెందిన హెడ్‌కానిస్టేబుల్ పిచ్చియ్య తల్లి అంకమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె భౌతికకాయానికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్.. పూలమాల వేసి నివాళులర్పించారు.

వైద్యుడి పూర్తి పింఛను పునరుద్ధరణ

తిరుపతి(వైద్యవిభాగం) : చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం విశ్రాంత పరిపాలన అధికారి ఎస్.అరుణాచలం పూర్తి పింఛన్లను పునరుద్ధరించి బకాయిలతోపాటు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ పేర్కొన్నారు. ఆ మేరకు సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. తప్పుడు మెడికల్ రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్ చేసి ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలతో ఆయనపై విచారణ జరిపి శాశ్వతంగా పెన్షన్‌లో 5 శాతం కోత విధించారు. దీనిపై బాధితుడు ట్రైబ్యునల్‌ను ఆశ్రయించడంతో ఊరట లభించింది.

బస్సును ఢీకొన్న పాలవ్యాను.. బంగారుపాళ్యం: చిత్తూరు-పలమనేరు హైవేలో వినాయకపురం వద్ద సోమవారం చిత్తూరు నుంచి పలమనేరు వెళ్తున్న ఆర్టీసీ బస్సును వెనుక వస్తున్న పాల ట్యాంకరు ఢీకొంది. బస్సు వెనక దెబ్బతినగా ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. పాల వ్యాను ముందు భాగం దెబ్బతిని అందులో క్లీనరు ఇరుక్కుపోయాడు. పోలీసులు అతడిని గునపాల సాయంతో బయటకు తీశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: తుపాయనపల్లె మిట్టూరుకు చెందిన వరదరాజులు గత నెల 19న గ్రామంలో చెత్తబండి తీసుకెళ్తుండగా ఆ బండి నుంచి బురద అదే గ్రామానికి చెందిన చంద్రయ్యపై పడింది. ఈ విషయమై చంద్రయ్య, అతడి అనుచరులు అశోక్, మోహన్, జనార్దన్.. వరదరాజులతో ఘర్షణ పడ్డారు. ఆపై కొద్దిరోజులకు వరదరాజులు తిరుపతి స్విమ్స్‌లో చేరి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడని, దీనిపై అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాసులు తెలిపారు. **రోడ్డు ప్రమాదంలో.. నగరి:** పట్టణ శివారులో నెత్తంకండ్రిగ వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో, తిరుపతి బైరాగిపట్టెడకు చెందిన ఖాజామోహిద్దీన్(26) మృతి చెందాడని సీఐ విక్రమ్ తెలిపారు. చెన్నైలో ఒక కార్యక్రమానికి హాజరై తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనంపై వస్తుండగా, జాతీయ రహదారిలోని స్పీడ్‌బ్రేకర్ వద్ద అదుపుతప్పి ప్రమాదం జరిగి అతడు మృతి చెందాడు. వెనుక వస్తున్న అతడి స్నేహితులు వెంటనే అతడిని నగరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధరించారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

గాంధీపురం వద్ద కొండచిలువ

యాదమరి, న్యూస్‌టుడే: గాంధీపురం బస్టాపు వద్ద సోమవారం సాయంత్రం కొండ చిలువ హల్‌చల్ చేసింది. చిత్తూరు గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిలో అటుగా వెళ్తున్న వాహనదారులు కొండ చిలువను చూసి భయభ్రాంతులకు గురయ్యారు. కొద్దిసేపటికి అది సమీప పొదల్లోకి వెళ్లిపోయిందని స్థానికులు తెలిపారు.

స్త్రీశక్తి.. నారీయుక్తి

- స్వయం ఉపాధితో భవిష్యత్తుకు బాసట
- చిత్తూరు మహిళలు ఆదర్శం

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

పురుషులతో సమానంగా విభిన్న వ్యాపారాల్లో రాణిస్తున్నారు పలువురు మహిళామణులు.. వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తూ పురుషులకు దీటుగా తామేమీ తీసిపోమని నిరూపిస్తున్నారు.. వేన్నీళ్లకు చన్నీళ్లలా భర్త సంపాదనకు, కుటుంబ నిర్వహణలో తమ బాధ్యత, భాగస్వామ్యాన్ని విజయవంతంగా నిర్వర్తిస్తున్నారు.. బ్యాంకు లింకేజీ ద్వారా అందుతున్న రుణాలు సద్వినియోగం చేసుకుంటున్నారు చిత్తూరు నగరానికి చెందిన పలు స్వయం సహాయక సంఘాల మహిళలు.

ఆత్మవిశ్వాసంతో అడుగు..

నగరంలోని సత్యనారాయణపురానికి చెందిన చూడామణి కాలనీలో కిరాణా దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నారు. పద్మావతి స్వయం సహాయక సంఘంలో సభ్యురాలు. బ్యాంకు లింకేజీ ద్వారా రూ.2లక్షలు రుణం తీసుకున్నారు. నిత్యావసర వస్తువులు కావడంతో వ్యాపారం లాభసాటిగా కొనసాగుతోందని నెలకు రూ.15 వేలు ఆదాయం వస్తోందని ఆమె పేర్కొన్నారు. కుటుంబ ఆదాయానికి తన సంపాదన ఎంతో కొంత ఉపయోగపడుతోందని ఆనందం వ్యక్తం చేశారు. ఉద్యోగ అవకాశాలు పెద్దగా లేవనుకున్న సమయంలో సొంత వ్యాపారంతో ఆత్మవిశ్వాసం పెరిగిందని ధీమా వ్యక్తం చేశారు.

కిరాణా.. భవితకు జమానా



స్థానిక భరత్‌నగర్‌కు చెందిన ఇందిరా విమోచన సంఘం సభ్యురాలు బి.లక్ష్మి స్థానికంగానే కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. వివాహమైన తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆదాయం కుటుంబ నిర్వహణకు సరిపోక స్వయం ఉపాధిపై దృష్టి సారించారు. మెప్మా ద్వారా బ్యాంకు లింకేజీ రుణం రూ.2లక్షలు తీసుకున్న ఆమె వ్యాపారంపై పెట్టుబడి పెట్టారు. తద్వారా నెలకు రూ.15 వేలు సంపాదిస్తున్నానని పేర్కొన్నారు. వచ్చిన ఆదాయాన్ని కుటుంబ నిర్వహణకు వెచ్చిస్తూ వ్యాపారాన్ని దినదినాభివృద్ధి చేసుకుంటున్నారు. కొద్దివరకే చదువుకున్న తాను ఆర్థిక సమస్యల్ని ఎలా గట్టెక్కాలో తెలియని సందర్భంలో స్వయం ఉపాధితో ముందుకు సాగుతున్నానని చెబుతున్నారు.

కుటుంబానికి అండగా..

కొంగారెడ్డిపల్లి శేషపిల్లర్ వీధికి చెందిన ఎం.లావణ్య దర్జీ వృత్తితో స్వయం ఉపాధి పొందుతున్నారు. శ్రీశక్తి అమ్మన్ మహిళా పొదుపు సంఘ సభ్యురాలైన ఆమె వ్యాపార అభివృద్ధికి బ్యాంకు లింకేజీ ద్వారా రూ.లక్ష రుణం పొంది నూతన దర్జీ యంత్రాలు కొనుగోలు చేసి వ్యాపారాన్ని విస్తరించారు. చేతి వృత్తి నేర్చుకుని దర్జీ మిషన్ కొనుగోలుతో మహిళలు, యువతులు, పిల్లల దుస్తులు కుట్టి స్వయం ఉపాధి ఎంచుకున్నారు. తనకు వచ్చే ఆదాయంతో కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండాలన్న ఉద్దేశంతో స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా కొనసాగుతున్నారు. దర్జీ వృత్తి ద్వారా నెలకు రూ.15 వేలు ఆదాయాన్ని కళ్లజూస్తున్నానని లావణ్య చెబుతున్నారు. కుటుంబ నిర్వహణకు తన ఆదాయాన్ని వెచ్చిస్తున్నానని చెప్పారు.

(c) eenadu

పలమనేరు

•పలమనేరు •కుప్పం •పుంగనూరు

ప్రజల నుంచి వినతి పత్రం స్వీకరిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

సమస్యలు సత్వరమే పరిష్కరించండి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ప్రజల నుంచి వస్తున్న వినతులను ఆయా శాఖాధికారులు పరిశీలించి, సత్వరమే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కడా పీడీ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 13 వినతులు వచ్చినట్లు తెలిపారు.

మహిళా కమిషన్ సభ్యురాలికి ఆహ్వానం పలుకుతున్న పోలీసులు

కేసులపై సమీక్ష

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని పోలీసు స్టేషన్‌ను రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుకియాబేగం సందర్శించారు. సోమవారం ఆమె స్టేషన్‌లో వివిధ కేసులను సంబంధించి సమీక్ష చేపట్టారు. ఈ ఏడాదిలో 34 మహిళల మిస్సింగ్, పోక్సో, వేధింపుల కేసులు నమోదయ్యాయని సీఐ మురళీమోహన్ ఆమెకు తెలిపారు.

పొదల చాటున ట్యాంకు

శాంతిపురం మండలం కొలమడుగు పంచాయతీ అమ్మవారిపేటలోని రక్షిత మంచి నీటి పథకం ట్యాంకు చుట్టూ పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు అల్లుకుపోతున్నాయి. ట్యాంకును శుభ్రం, క్లోరినేషన్ చేయాలన్నా ముళ్ల పొదలను దాటుకుని వెళ్లాల్సిన పరిస్థితి. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని డిప్యూటీ ఎంపీడీవో ఈశ్వరన్ తెలిపారు. - న్యూస్‌టుడే, శాంతిపురం

వంతెనపై రక్షణ ఏది?

పట్టణంలోని తిరుపతి రోడ్డు మార్గంలో రాయలదిన్నె వద్ద నిర్మించిన వంతెన పిట్టగోడ దెబ్బతింది. రెండేళ్ల కిందట కురిసిన వర్షాలతో వంతెన రక్షణ గోడ దెబ్బతినడంతో పిట్టగోడను తాత్కాలికంగా నిర్మించారు. అయితే దీన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వంతెనపై రక్షణ కరవైంది. భద్రతా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పుంగనూరు

కుళాయిలు ఇలా.. అవసరాలు తీరేదెలా?

పట్టణంలోని కోర్టు రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల వసతి గృహంలో సుమారు 50 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ తాగునీటి కుళాయిలు విరిగిపోయి, ప్రస్తుతం నీరు రావడం లేదు. దీంతో విద్యార్థులు దైనందిన అవసరాలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై ఏఎస్‌డబ్ల్యూవో శ్రీరాములు నాయక్‌ను వివరణ కోరగా త్వరలో కుళాయిలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. - న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ

చెరువులో బోర్లు.. అందని తాగునీరు

దిగువపల్లె పంచాయతీ మాదవారిపల్లె, దారాల పంచాయతీ జంగాలపల్లె గ్రామాలకు తాగునీరు అందించడానికి సమీపంలోని చెరువులో బోర్లు వేసి, పైపులైన్లు ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుల్లో నీరు చేరడంతో మోటార్లు నీట మునిగి, గ్రామాలకు తాగునీరు అందక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏఈ చందనను వివరణ కోరగా మాడవారిపల్లెకు కొత్త మోటారు ఏర్పాటు చేసి నీటిసరఫరా చేస్తామని పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, చౌడేపల్లె

నిర్లక్ష్యం మానైంది

మండలంలోని మద్దిరాళ్ల కుడిపల్లె ఉర్దూ ప్రాథమిక పాఠశాల వద్ద భారీ వృక్షం ప్రమాదకరంగా మారింది. ఇలాగే వదిలేస్తే ఏదైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. భవనంపై భారీ కొమ్మలు వాలడంతో కూలేలా కనిపిస్తోంది. దీనిపై ఎంఈవో కేశవరెడ్డిని వివరణ కోరగా తక్షణ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. -న్యూస్‌టుడే, చౌడేపల్లె

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

పేదరిక నిర్మూలనే సీఎం లక్ష్యం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ4 కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టినట్లు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పీ4 రిసోర్స్ పర్సన్స్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ మార్గదర్శిగా రాయితీపురం మండలాన్ని దత్తత తీసుకుంటుందని చెప్పారు. కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: గుడ్లనాయనపల్లె పంచాయతీలో సోమవారం తెదేపా సమస్యల కమిటీ సమావేశంలను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించారు. రాజగోపాల్, శ్రీనివాసులు, సాంబశివం, రామచంద్రన్, మహేంద్ర, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కుప్పాన్ని దేశంలోనే ప్రథమంగా నిలుపుతాం

పలమనేరు: మాట్లాడుతున్న పట్టాభిరామ్

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కుప్పం పర్యటనలో భాగంగా స్థానిక కడా కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతలో కుప్పాన్ని దేశంలోనే ప్రథమంగా నిలిపేందుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. కుప్పం పురపాలికకు ఇంటిగ్రేటెడ్ ట్రీట్‌మెంట్‌ను మంజూరు చేసినట్లు, త్వరలో ప్రారంభం కానున్నట్లు తెలిపారు. పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కార్మికులతో శానిటరీ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. అంతకు ముందు ఆయన కంపోస్టు యార్డును సందర్శించారు. కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విస్మరించి.. వినియోగానికి నోచుకోక

❖ అసంపూర్తిగా సామాజిక భవనాల నిర్మాణాలు

శాంతిపురం, పుంగనూరు, న్యూస్‌టుడే: కుప్పం, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో సామాజిక భవనాలు విస్మరణకు గురై వినియోగానికి నోచుకోలేదు. వీటి నిర్మాణం కోసం రూ.కోట్లలో నిధులను ఖర్చు చేశారు. ఒక్కో భవనానికి రూ.20 లక్షల నుంచి గరిష్ఠంగా రూ.కోటి వరకు వెచ్చించారు. కురుబ, వాల్మీకి, వన్నెకుల క్షత్రియ, వడ్డెర తదితర సామాజిక వర్గాలకు చెందిన భవనాల నిర్మాణం ఎక్కడా సాగుతోంది. పలుచోట్ల జనావాసాలకు దూరంగా నిర్మించిన భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. కొన్నిచోట్ల పశువుల పాకలుగా మారిన పరిస్థితి.

ప్రశ్నార్థకంగా పటిష్టత

గ్రామస్థాయిలో మహిళా స్వయం సహాయక సంఘాల సమావేశాల కోసం ఏడేళ్ల కిందట పెద్ద ఎత్తున సామాజిక భవనాలను నిర్మించారు. ఒక్కో భవనానికి రూ.20 లక్షల అంచనాలతో నిధులు కేటాయించారు. చాలాచోట్ల గోడలు, పైకప్పు దశలో నిర్మాణాలు ఆగిపోయాయి. తెదేపా పాలనలో ప్రారంభించిన నిర్మాణాలను వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. కనీసం పెండింగ్ బిల్లులను చెల్లించలేదు. ఏళ్ల తరబడి అలాగే వదిలేయడంతో భవన పటిష్టత ప్రశ్నార్థకంగా మారింది. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులను కేటాయించి భవనాల నిర్మాణం పూర్తిచేస్తే సామాజిక కార్యకలాపాలకు ఉపయోగపడే అవకాశం కలుగుతుంది.

ముగింపు దశలో ఆగి

పుంగనూరు పట్టణ పరిధి దోబీ కాలనీలో వైకాపా ప్రభుత్వం రూ.5 లక్షలతో నిర్మించిన సామాజిక భవనం ముగింపు దశలో ఆగిపోయింది. బిల్లుల చెల్లింపులో జాప్యం వల్ల నిర్మాణం పూర్తికి నోచుకోలేదు. స్థానిక స్వయం సహాయక సంఘాల సమావేశాలు ఆలయాలు, చెట్ల నీడన నిర్వహించుకోవాల్సిన దుస్థితి.

అలంకార ప్రాయం

కుప్పం నియోజకవర్గంలో వాల్మీకి సామాజిక వర్గం సౌకర్యార్థం గత తెదేపా పాలనలో చేపట్టిన కమ్యూనిటీ భవన నిర్మాణం పూర్తికి నోచుకోలేదు. గుడుపల్లె మండలంలోని నలగాంపల్లె మిట్టలో జాతీయ రహదారి పక్కన అలంకార ప్రాయంగా మారింది. వైకాపా హయాంలో కొద్దిపాటి నిర్మాణం చేపట్టినా, ముగింపు దశ పనుల్ని విస్మరించడంతో వినియోగానికి నోచుకోలేదు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) పలమనేరు: 80085 74580 కుప్పం పట్టణం: 80085 73490 పుంగనూరు: 80085 74622

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సమస్య: చంద్రమాకులపల్లె గ్రామంలో కాలువలు శుభ్రం చేయాలి. – సుబ్రహ్మణ్యం, స్థానికుడు

సమాధానం: గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. – వెంకటరత్నమ్మ, పంచాయతీ కార్యదర్శి

పుంగనూరు, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని సూర్యానగర్, కొత్తఇండ్లులో వీధిదీపాలు వెలగక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. – రాయాంజులు, కొత్తఇండ్లు

సమాధానం: వీధి దీపాలకు మరమ్మతు చేయిస్తాం. – మహేష్, డీఈఈ

పలమనేరు, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని టీఎస్ అగ్రహారం రోడ్డులో మురుగు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. – మురళీ, పలమనేరు

సమాధానం: సిబ్బందిని పంపి కాలువలను శుభ్రం చేయిస్తాం. – ఎన్వీ రమణారెడ్డి, కమిషనర్

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మేమున్నాం మీకుతోడుగా దృష్టికి తీసుకువచ్చారు. కమిషనరు మధుసూదనరెడ్డి స్పందించి పరిష్కరించారు. గత నెల 30న ఎంఎస్ఆర్ వీధిలో, ఈ నెల 2న బీడీ కాలనీలో వీధిదీపాలు వెలగడం లేదని ప్రచురితం కావడంతో సోమవారం ఆయా దీపాలను మరమ్మతు చేయడంతో వెలుగుతున్నాయి.

స్పందనకు వందనం

బహుమతులు పొందిన బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ❖ సాయిమేధా విద్యార్థులు

బొమ్మలేశారు.. బహుమతులు పొందారు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, సాయిమేధా పాఠశాల విద్యార్థులకు ఈనాడు ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు సోమవారం నిర్వహించారు. రెండు పాఠశాలల్లో కలిపి మొత్తం 194 మంది విద్యార్థులు చిత్రలేఖన పోటీలో పాల్గొన్నారు. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు చెందిన నందిని(9వ తరగతి), అశ్రఫ్‌భాను(8వ తరగతి), హారతి(10వ తరగతి) విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. ప్రధానోపాధ్యాయిని సుజాత బహుమతులు పంపిణీ చేశారు. సాయిమేధా పాఠశాలకు చెందిన శివాణి(10వ తరగతి), వజ్రాల జమీహ(8వ తరగతి), భవ్యశ్రీ(7వ తరగతి) విద్యార్థులకు ప్రధానోపాధ్యాయిని కల్యాణి బహుమతులు పంపిణీ చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పుంగనూరు గ్రామీణ, రొంపిచెర్ల: రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు నియోజకవర్గం నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో నటరాజరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీలో విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన వ్యాస, వకృత్త్వ, క్విజ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా పూజ, నిఖిల్, మేఘన నిలిచినట్లు పేర్కొన్నారు. వీరు 24న రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. పలమనేరు, బైరెడ్డిపల్లె: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ పోటీల్లో పరిణీత(పి.సి.గుంట), హాసిని(బైరెడ్డిపల్లె గురుకుల పాఠశాల), నందిని(గందారమాకులపల్లె) గెలుపొందారు. కుప్పం పట్టణం: నియోజకవర్గ స్థాయిలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సోమవారం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. పోటీల్లో నేత్రావతి, శృతి, లోకేశ్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లు ఎంఈవో రాజారామ్ తెలిపారు. లక్ష్మయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎవరి ప్రమేయం ఉన్నా చర్యలు తప్పవు.. పలమనేరు, న్యూస్‌టుడే: పెద్దపంజాణి మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక ఆత్మహత్య కేసులో ఎవరి ప్రమేయం ఉందని ఆధారాలు లభించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ పరశురామ్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన ఇక్కడ మీడియా సమావేశాన్ని నిర్వహించారు.

అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

సోమల, న్యూస్‌టుడే: మండల, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల నుంచే వచ్చే అర్జీలపై అలసత్వం వహించకుండా సకాలంలో పరిష్కరించాలని తహసీల్దార్ మధుసూదన్ పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆర్ఐ సుబుక్తుల్లా, అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు హరిత, భారతి పాల్గొన్నారు.

ఏనుగుల గుంపు స్వైరవిహారం

వెంకట సుబ్రహ్మణ్యం తోటలో విరచేసిన మామిడి కొమ్మలు

కల్లూరు, న్యూస్‌టుడే: పాళెం పంచాయతీలోని కోటపల్లె పొలాల్లో 17 ఏనుగుల గుంపు స్వైరవిహారం చేస్తున్నాయి. ఆదివారం రాత్రి కోటపల్లె పొలాల్లో పడ్డ ఏనుగుల గుంపు వెంకటసుబ్రహ్మణ్యం పొలంలోని 20 ఏళ్ల మామిడి చెట్ల కొమ్మలను విరిచేశాయి. కోటపల్లెకు చెందిన మురళీనాయుడు, గంగాధర నాయుడు, వీరభద్ర నాయుడు, బాబు నాయుడు, మురళీనాయుడు, జూపల్లెవారిపల్లెలోని కళావతి, రెడ్డమ్మ, రామ్మోహన్, సుబ్బరత్న, కల్లూరులోని సయ్యద్ బాషా పంటలను నాశనం చేశాయి. సాయంత్రం పాళెం అటవీ ప్రాంతంలో ఏనుగులను గుర్తించేందుకు డ్రోన్ కెమెరాల ద్వారా తిరుపతి జిల్లా పనబాకం, చిత్తూరు తూర్పు విభాగం రేంజ్ సెక్షన్ అధికారిణి భారతి, ఎఫ్‌బీవో జమున, మధు, ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ బృందం గాలించారు.

బాలికలకు సమాజంపై అవగాహన అవసరం

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: బాలికలకు సమాజం పై అవగాహన అవసరమని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు రుఖియాబేగం తెలిపారు. సోమవారం స్థానిక కస్తూర్బా విద్యాలయాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఎంఈవో నటరాజరెడ్డి, ప్రిన్సిపల్ వసియా ఫరాహత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు గడువు పొడిగింపు

పుంగనూరు, న్యూస్‌టుడే: అనుమతి లేని ప్లాట్లు, లేఔట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవడానికి జనవరి 23 వరకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని కమిషనరు మధుసూదనరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో అనధికార లేఔట్ల యజమానులు 30 అడుగుల రోడ్డు, తాగునీటి గొట్టాలు, కాలువల నిర్మాణానికి తగిన స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణాలు చేపట్టాలని కోరారు.

‘ఉద్యోగాలు అమ్ముకునే సంస్థ కాదు’

కాల్ రికార్డు చూపుతున్న రెస్కో ఛైర్మన్ వీజీ ప్రతాప్ కుమార్ తదితరులు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో విద్యుత్ సహకార సంస్థగా ఉన్న రెస్కోను ఉద్యోగాలు అమ్ముకునే స్థాయికి దిగజార్చారని, ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో అలా జరగదని రెస్కో ఛైర్మన్ వీజీ ప్రతాప్ కుమార్ స్పష్టం చేశారు. స్థానిక రెస్కో కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కొందరు రెస్కోలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలమనేరులో కొందరి వద్ద రూ.4 లక్షలు డిమాండ్ చేసినట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. ప్రజలు ఇలాంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్త వహించాలన్నారు. పాలకవర్గ సభ్యులు తులసీనాథ్, అనసూయ, ఆర్ముగం, శివ ఉన్నారు.

రైతు బజారు ఏర్పాటుకు కృషి

పుంగనూరు: రైతులు, వినియోగదారుల సౌకర్యార్థం పట్టణ పరిధిలో రైతు బజారు ఏర్పాటుకు కృషి చేస్తానని ఏఎంసీ ఛైర్మన్ సమీపతి యాదవ్ అన్నారు. సోమవారం ఆయనకు స్థానిక కూరగాయల వ్యాపారులు దుకాణాల నిర్వహణకు స్థలాలు కేటాయించాలని వినతులు ఇచ్చారు. సమస్యలను చల్లా రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

తితిదే కల్యాణ మండపం ఎదుట ధర్నా

ప్రధాన ద్వారం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పుంగనూరు, న్యూస్‌టుడే: స్థానిక తితిదే కల్యాణ మండపం బుకింగ్‌లో సంబంధిత కాంట్రాక్టరు నిబంధనలు పాటించడంలేదని సోమవారం కల్యాణ మండపం ప్రధాన ద్వారం ఎదుట ప్రజాసంఘాల నాయకులు ధర్నా చేశారు. వివాహాలు ఇతర శుభకార్యాలకు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని దళిత సంఘాల నాయకులు రాజ, శంకరప్ప ఆరోపించారు. అధిక మొత్తంలో వసూలు చేస్తున్న సిబ్బందిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని వారు డిమాండు చేశారు.

పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసి బ్యాంకులో రుణం కోసం దరఖాస్తు చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు మోదుగులపల్లె పంచాయతీ పూజగానిపల్లెకు చెందిన నాగప్ప కుమారుడు కె.వెంకటరమణ బ్యాంకులో రుణం పొందేందుకు ఓనర్ సర్టిఫికేట్ కోసం 25 రోజుల క్రితం మోదుగులపల్లె సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఇంటికి సంబంధించి ఎలాంటి పత్రాలు జతచేయలేదు. అలాగే ధ్రువపత్రం ఇవ్వడానికి తనకు ఎలాంటి అనుమతులు లేవని మోదుగులపల్లె పంచాయతీ కార్యదర్శి జీ.వెంకటరమణ తెలపడంతో పూజగానిపల్లె కె.వెంకటరమణ పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి, నకిలీ సీలు వేసి ధ్రువపత్రాన్ని బ్యాంకుకు సమర్పించారని పంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారించి చర్యలు చేపడతామని ఎస్సై హరిప్రసాద్ పేర్కొన్నారు.

డ్రైవర్ క్యాష్ బ్యాగ్ చోరీ

ఒంగోలు నేరవిభాగం: ఆర్టీసీ బస్సులో డ్రైవర్ వద్దఉన్న క్యాష్‌బ్యాగ్‌ను అపహరించి పారిపోతున్న చిత్తూరు జిల్లా గుడిపల్లె గ్రామానికి యువకుడిని సిబ్బంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఒంగోలు ఆర్టీసీ బస్టాండులో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు పొదిలి వైపు నుంచి ఒంగోలు వస్తున్న బస్సులో మర్రిచెట్ల పాలెం వద్ద యువకుడు ఎక్కి ఒంగోలుకు టిక్కెట్ తీసుకున్నాడు. బస్సు స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకుని కార్గో పాయింట్ వద్ద సరకు దింపుతుండగా డ్రైవర్ ఎస్.వి.ఆంజనేయులు తన క్యాష్‌బ్యాగ్‌ను బ్యానెట్‌పై ఉంచగా యువకుడు బ్యాగ్‌ను తీసుకుని ఉడాయించాడు. కాని స్టేబుల్ షేక్ షకీర్ వెంబడించి దొంగను పట్టుకున్నారు.

తేనెటీగల దాడి

మదనపల్లె నేరవార్తలు: తేనెటీగల దాడిలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన ఘటన చౌడేపల్లె మండలంలో సోమవారం జరిగింది. కాటిపేరి గ్రామానికి చెందిన చౌడమ్మ (80) చెట్టు కింద కూర్చొని ఉండగా కొమ్మ విరిగి కిందపడింది. కొమ్మకు తేనెతుట్టి ఉండటంతో అవి వృద్ధురాలిపై దాడి చేసి గాయపరిచాయి.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామకుప్పం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన సోమవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గత నెల 14న వీర్ణమల తండాకు చెందిన ఒక వ్యక్తి అంత్యక్రియలకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా దేవానాయక్(47) ఎస్ గొల్లపల్లి అటవీ ప్రాంతంలో బైక్‌కు జింక అడ్డురావడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వాహనదారులు గుర్తించి పీఈఎస్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

గుడుపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని బోయనపల్లెకు చెందిన ప్రియా (28) అనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఇంట్లో ఉరి వేసుకొని చనిపోయి ఉండటాన్ని గుర్తించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. ఆమె మృతికి కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకుమార్తెలకు తీవ్రగాయాలు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణంలోని గోకుల్ కూడలిలో టైలర్‌గా పనిచేస్తున్న దేవిక (35), కుమార్తె భవ్య (19)లు ద్విచక్రవాహనంపై సోమవారం చౌడేపల్లె మండలం పెద్దూరు గ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో తల్లి, కుమార్తెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

బోరుబావి వైర్ల చోరీకి దుండగుల యత్నం

కల్లూరు, న్యూస్‌టుడే: పులిచెర్ల మండలం వెంకటదాసరిపల్లె పంచాయతీ ఆర్.కుమ్మరపల్లె గ్రామంలోని ప్రభుత్వ బోరుబావి వైరును చోరీ చేసేందుకు ముగ్గురు దుండగులు యత్నిస్తుండగా గ్రామస్థులు గుర్తించారు. వారిని పట్టుకునేందుకు ప్రయత్నించేలోగా దుండగులు పరారైన సంఘటన సోమవారం జరిగింది. ముగ్గురు దుండగుల్లో ఒకడు దగ్గరలో ఉన్న స్కూటీతో ఉడాయించాడు. మిగిలిన ఇద్దరు చేతిలో ఉన్న బ్యాగు, బోరుబావి వైరు, కొడవళ్లు పొలాల్లోకి విసిరేసి గుట్టల్లోకి పరారయ్యారు. గ్రామస్థులు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చరవాణి ద్వారా సమాచారం అందించారు.

ఇద్దరు జూదరుల అరెస్టు

రొంపిచెర్ల, న్యూస్‌టుడే: మండలంలో కోడి పందెం ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై సుబ్బారెడ్డి తెలిపారు. బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలోని రామాపురం వద్ద కోడిపందెం ఆడుతుండగా అరెస్టు చేసి వారి నుంచి రెండు కోడిపుంజులు, రూ.2100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పల్లెలకు నిరంతర వెలుగులు

❖ త్వరలో అమలుకానున్న త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా

రాయలపేట వద్ద ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో సిబ్బంది

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణాలతో పాటు పల్లెల్లోనూ త్రీఫేజ్ విద్యుత్తు సరఫరాకు వేగంగా అడుగులు పడుతున్నాయి. పల్లెల్లోనూ 24 గంటల వెలుగులకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. విద్యుత్తు పునర్వ్యవస్థీకరణ పథకం (ఆర్‌డీఎస్ఎస్)లో భాగంగా 24 గంటల విద్యుత్తు సరఫరాకు ప్రత్యేక త్రీఫేజ్ తీగల ఏర్పాటు పనులను గత వైకాపా ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసింది.

చురుగ్గా పనులు

ఫలితంగా పుంగనూరు డివిజన్ పరిధిలోని పుంగనూరు, సదుం, పలమనేరు సబ్‌డివిజన్లలో 14 సెక్షన్లలోని 11 కేవీ సబ్‌స్టేషన్లు 354లో, 33 కేవీ సబ్‌స్టేషన్లు 46లో వ్యవసాయ ఫీడర్లతో అనుసంధానమైన గ్రామీణ ప్రాంతాలు నిరంతర వెలుగులకు నోచుకోలేదు. దీంతో చిన్న తరహా పరిశ్రమలు, గిడ్డంగులు, ఆహార శుద్ధి కేంద్రాలు సరిగా పనిచేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులు చురుగ్గా సాగుతున్నాయి.

చిన్న తరహా పరిశ్రమలకు ప్రయోజనం

ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న ఆర్‌డీఎస్ఎస్ పనులతో చిన్నతరహా పరిశ్రమలకు ప్రయోజనం చేకూరుతోంది. ఈ పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల్లోనూ 24 గంటలు త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా అవుతుంది. చిన్న తరహా పరిశ్రమలు, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. ఔత్సాహికులు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. ఇప్పటికే పుంగనూరు డివిజన్‌లో 40 ఫీడర్లలో త్రీఫేజ్ విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి.

సకాలంలో పూర్తి

పుంగనూరు విద్యుత్తు డివిజన్ పరిధిలోని పుంగనూరు, సదుం, పలమనేరు సబ్‌డివిజన్లలో ఆర్‌డీఎస్ఎస్ పనులు సకాలంలో పూర్తవుతాయి. తరచూ ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నారు. క్షేత్రస్థాయి పర్యటనతో పనుల వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. - శ్రీనివాసమూర్తి, ఈఈ, విద్యుత్తుశాఖ, పుంగనూరు

మాలమహానాడు సభను విజయవంతం చేయాలి

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: మదనపల్లె డివిజన్ కేంద్రంలో 16న జరిగే మాలమహానాడు రాష్ట్ర మహాసభను విజయవంతం తచేయాలని మండల మాలమహానాడు అధ్యక్షుడు మంజునాథ్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి గోడప్రతులను ఆవిష్కరించారు. తిప్పయ్య, వెంకటేష్, రంగప్ప, కృష్ణప్ప, జయప్ప, శివయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

యూరియాకు రైతన్నల పాట్లు

శాంతిపురం మండల పరిధిలో ప్రభుత్వం రాయితీ ధరకు అందజేస్తున్న యూరియా కోసం అన్నదాతలు ఎగబడుతున్నారు. సోమవారం కర్లగట్ట, కడపల్లె, నడింపల్లె, తుమ్మిశి, చిన్నారిదొడ్డి, మొరసనపల్లె తదితర పంచాయతీలకు అబకలదొడ్డి రైతు సేవా కేంద్రంలో యూరియాను పంపిణీ చేయడంతో వందలాదిగా రైతులు తరలి వచ్చారు. రైతులు గంటల తరబడి నిరీక్షించి ఒక్కో బస్తా వంతున కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. – న్యూస్‌టుడే, శాంతిపురం.

(c) eenadu

మార్మోగిన పంచాక్షరీ నామం

భీమేశ్వరుడికి జలాభిషేకం చేస్తున్న పురోహితులు

పంచారామాల్లో ప్రసిద్ధిగాంచిన ద్రాక్షారామలో కార్తికమాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని అడుగడుగునా పంచాక్షరీ నామ జపం మార్మోగింది. నాలుగు గంటల నుంచే భక్తులు దర్శనానికి తరలివచ్చారు. రద్దీ మధ్యాహ్నం ఒంటిగంట వరకు, తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి యాత్రికుల తాకిడి మొదలైంది. రాష్ట్ర నలుమూలల నుంచి 200 వరకు యాత్ర బస్సుల్లో భక్తులు విచ్చేశారు. పలువురు సప్తగోదావరి నదిలో స్నానమాచరించి దర్శనాలకు వెళ్లగా మహిళలు అరటిదొప్పల్లో కార్తికదీపాలు వెలిగించి నదిలో వది లారు. శంకరనారాయణ వృక్షం వద్ద దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ధాన్యం వర్తక సంఘం సభ్యులు అన్న ప్రసాదాలు సమకూర్చారు. వాహనా లను జగన్నాయకుల మెడ నుంచి బస్టాండు వైపు, పోలీసు స్టేషన్ నుంచి పీహెచ్‌సీ మీదుగా మళ్లిం చారు. - న్యూస్‌టుడే, ద్రాక్షారామ

ఎస్ఐఎఫ్‌టీకి జాతీయస్థాయి గుర్తింపు

కాకినాడ నగరం: కాకినాడలోని రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ (ఎస్ఐఎఫ్‌టీ)కు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఇక్కడ ల్యాబ్‌ల్లో ఐఎస్ఐ ప్రమాణాలతో నిర్వహిస్తున్న పరీక్షలకుకు జాతీయ అక్రెడిషన్ బోర్డు (ఎన్ఏబీఎల్) గుర్తింపు లభించిందని ఎస్ఐఎఫ్‌టీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. అంజలి తెలిపారు. ఇక్కడి ల్యాబ్‌ల్లో నీరు, మట్టి విశ్లేషణ, సూక్ష్మజీవ, వ్యాధి నిర్ధారణ, మాలిక్యులర్ లెవల్ డయాగ్నోసిస్ (సీపీఆర్), మేత నాణ్యత విశ్లేషణలు నిర్వహిస్తారు. వీటితో పాటే మరో రెండు ల్యాబ్‌లున్నాయి. వాటిలో యాంటిబయాటిక్స్, పెస్టిసైడ్స్ పరీక్షలు చేస్తారు. అత్యుత్తమ స్థాయిలో పరీక్షించిన మత్స్య ఉత్పత్తులనే విదేశాలకు ఎగుమతి చేసే అవకాశముంటుంది.

నేడు అంతర్వేదిలో మహాశాంతి హోమం

అంతర్వేది, న్యూస్‌టుడే: మొంథా తుపాన్ వల్ల ఏవిధమైన నష్టం కలగకుండా కాపాడిన భక్తుల కొంగు బంగారం అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారికి రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు నేడు మహాశాంతి హోమం నిర్వహిస్తున్నారు. కల్యాణ మండపం షెడ్‌లో ఇప్పటికే హోమగుండాలు ఏర్పాటు చేసి భక్తులు హోమంలో పాల్గొనేలా గ్యాలరీలను నిర్మించారు. స్వామివారి కటాక్షం నిరంతరం భక్తులపై ఉండాలని ఈ హోమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట హోమం జరుగుతుంది. అల్పాహారం, అఖండఅన్నసమారాధన కార్యక్రమం ఉంటుంది. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ పెదకాపు, తెదేపా మండలశాఖ అధ్యక్షుడు నాని, వి.మూలాస్వామి, పి.కృష్ణ, బల్రేశీను, తదితరులు పాల్గొన్నారు.

వెన్నుతట్టే విజయం.. బ్యాటుపట్టే సమయం

■ మహిళల క్రికెట్ జట్టు ప్రపంచ కప్ సాధనతో కొత్త ఆశలు
■ జిల్లాలో శిక్షణకు సదుపాయాలు అంతంతే..!

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

ఒక విజయం లక్షల మందికి స్ఫూర్తిగా నిలుస్తుంది. ఉజ్వల భవితకు బాటలు వేస్తుంది. కొత్త అవకాశాలను చెంతకు చేర్చుతుంది. కష్టానికి తగిన ప్రతిఫలం దక్కేలా చేస్తుంది. అపోహలను, అసత్య ప్రచారాలను పటాపంచలు చేస్తుంది. భారత మహిళా క్రికెట్ జట్టు విశ్వ విజేతగా నిలిచిన వేళ.. గల్లీ నుంచి దిల్లీ వరకు బాలికల్లో ఈ క్రీడపై కొత్త ఆశలు రేకెత్తుతున్నాయి. భవిష్యత్తు అవకాశాలపై అంచనాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో బాలికల క్రికెట్‌కు సంబంధించి శిక్షణ, సదుపాయాలు, అడ్డంకులపై కథనం.

రాజమహేంద్రవరంలో క్రికెట్ క్రీడలో శిక్షణ తీసుకుంటున్న బాలికలు

భద్రత, రవాణాయే సమస్య

శిక్షణ కేంద్రాలు దూర ప్రాంతాల్లో ఉండటంతో బాలికలు ఒంటరిగా వెళ్లలేని పరిస్థితి. శిక్షణ తీసుకునే వారితో పాటుగా వారి కుటుంబ సభ్యుల్లో ఒకరు వీరి కోసం పూర్తి సమయం వెచ్చించాల్సి వస్తోంది. బాలికలు క్రమం తప్పకుండా శిక్షణకు వస్తే ఏడాదిలో ప్రతిభను నిరూపించుకోవచ్చని కోచ్ నాగ వెంకటేష్ తెలిపారు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లోని కట్టుబాట్లు సైతం ఈ క్రీడవైపు అమ్మాయిలు అడుగులు వేసేందుకు అడ్డంకిగా మారుతున్నాయని అభిప్రాయ పడుతున్నారు.

వసతుల లేమి

ఉమ్మడి జిల్లాలో కేవలం నాలుగు ప్రాంతాల్లో మాత్రమే మైదానాలు అందుబాటులో ఉన్నాయి. శిక్షణ తీసుకోవాలంటే సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రతి డివిజన్ కేంద్రంలోనూ ఒక మైదానం ఏర్పాటు చేసి శిక్షకులను నియమిస్తే ఎంతో మంది ప్రతిభావంతులు తయారయ్యే అవకాశం ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

శిక్షణ కేంద్రం	క్రీడాకారిణులు
కాకినాడ	4
అంబాజీపేట	2
పెద్దాపురం	4
రాజమహేంద్రవరం	30

జాతీయ స్థాయిలో రాణింపు

రాజమహేంద్రవరంలో శిక్షణ పొందిన పలువురు బాలికలు జాతీయ స్థాయిలో అండర్-17, 19 పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొన్నారు. ఈ నెల 6, 7 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే జిల్లా పోటీల్లో ప్రతిభ చూపితే ఆంధ్రా రంజీ జట్టుకు ఎంపిక చేసే అవకాశం ఉందని కోచ్ అక్రం తెలిపారు.

విభాగాలు ఇలా: ● జిల్లా స్థాయి ● నార్త్ జోన్ ● రాష్ట్ర స్థాయి ● రాష్ట్ర స్థాయిలో: అండర్ 15, 19, 23

ప్రతిభ చూపితే ప్రత్యేక శిక్షణ

జిల్లాలో ప్రతిభ చూపి జాతీయ స్థాయిలో పోటీలకు ఎంపికైన వారు మంగళగిరిలోని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌లో ఉచితంగా శిక్షణ పొందవచ్చు. అక్కడే వసతి, భోజన సదుపాయం కల్పించడంతో పాటు అంతర్జాతీయ స్థాయి శిక్షకులు, మాజీ ఆటగాళ్లతో ప్రత్యేక తర్ఫీదు ఇస్తారు.

ఈ విజయం స్ఫూర్తిదాయకం

భారత మహిళా జట్టు ప్రపంచ కప్ గెలవడం ఎంతో స్ఫూర్తిని చ్చింది. రాజమహేంద్రవరంలో కోచ్ అక్రం వద్ద ఆరేళ్లగా శిక్షణ తీసుకుంటున్నా. నేషనల్, అండర్-19 విభాగంలో ఆంధ్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నా. -వీన విద్యాశ్రీ

ఉపాధికి వరదపోటు

వేట సాగక మత్స్యకారుల ఆవేదన

న్యూస్‌టుడే, పి.గన్నవరం

సాధారణంగా గోదావరిలో మత్స్యకారులు జూన్ నుంచి సెప్టెంబరు వరకు మత్స్యసంపద వేటాడేందుకు వీలుపడదు. ప్రస్తుతం వరదల సీజన్ కావడంతో ఎగువను ప్రవహిస్తూ సముద్రంలో కలుస్తోంది. ఈ జలాలు ఉప్పగా కాలం వేటాడేందుకు వీలుండదు. ఈ సమయంలో పులసలు లభ్యమవుతాయి. గత ఆరేళ్ల నుంచి ఇదికూడా నామమాత్రం కావడంతో వేట మానేసిన పరిస్థితులు నెలకొన్నాయి. అక్టోబరు మొదటి వారం నుంచి తేటనీరు ప్రవహించాలి. అంటే వరదనీరు తగ్గిపోయి సాధారణ స్థితికి రావాలి. తేటనీరు ప్రవహిస్తే సముద్రం నుంచి కొయ్యింగలు, పండుగొప్పలు, రొయ్యలు, వివిధ రకాల చేపలు ప్రవేశిస్తాయి. మే చివరి వరకు కట్టిపరుగులు, వడిసెలు విస్తారంగా లభిస్తాయి. వాస్తవానికి పది రోజుల క్రితం తేటనీరు ప్రవహించడంతో ఇక వరద నీరు రాదని జిల్లాలో వశిష్ఠ, వైనతేయ, గౌతమి, వృద్ధ గౌతమి పాయలను ఆనుకుని ఉన్న మత్స్యకారులు కొయ్యంగల వేటకు సన్నద్ధమయ్యారు. వీటికి సంబంధించి వలలు సిద్ధం చేసుకున్నారు. కొన్నిచోట్ల వేట కూడా మొదలు పెట్టారు. తీరా నాలుగు రోజుల నుంచి మళ్లీ వరదనీరు తగలడంతో ఉపాధికి ఆటంకం ఏర్పడిందని ఆవేదన చెందుతున్నారు. ఈ ప్రభావం ఈ మాసాంతం వరకు ఉంటుందని వాపోతున్నారు. జిల్లాలో గోదావరి నదీపాయల్లో వేటాడే మత్స్యకారులు సుమారు పదివేల మంది వరకు ఉన్నారు. వీరంతా ప్రస్తుతం పడవలకు లంగరేసి ఉంచేశారు. కొంత మంది వేరేదారి లేక ఉపాధి కోసం పంటకాలువల్లో వేటాడుతున్నారు.

జొన్నలంక వద్ద వైనతేయ ఒడ్డున లంగరేసిన పడవలు

నింగిలో శీర్షాసనం నెత్తిపై గండం

తాళ్లరేవు మండలంలోని ఇంజరం వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఓ కొబ్బరి చెట్టు ఒంపులు తిరిగి పెరిగింది. మొదలు రహదారి పక్కన ఉండగా.. తల భాగం రోడ్డుపైకి వంగి రెండు విద్యుత్తు లైన్ల మధ్య నిటారుగా నిలబడింది. దూరం నుంచి చూస్తే గాలిలో తేలినట్టు కనిపిస్తోంది. భారీ తుపానులు సైతం తట్టుకుని నిలిచింది. చెట్టు ఎక్కేందుకు వీలుగాలేక కొబ్బరి బొండాలు ఎవరూ దించడం లేదు. బొండాలు, ఎండిన ఆకులు కిందపడుతున్నాయి. వాటితో యానాం- ద్రాక్షారామ మార్గంలో వెళ్లే వాహనచోదకులకు ప్రమాదం పొంచి ఉంది. -న్యూస్‌టుడే, కోనసీమ

పట్టుబడితే కఠిన చర్యలు

అమలాపురం (గ్రామీణం): పాఠశాలలు, కళాశాలల బస్సులు భద్రత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు సూచించారు. అమలాపురంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సుల ఇన్‌ఛార్జులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆకస్మిక తనిఖీల్లో పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులూ.. పారాహుషార్

సర్పవరం(కాకినాడ గ్రామీణం): ఇటీవల రాష్ట్రంలోని సముద్ర తీరాల్లో జరుగుతున్న ప్రమాదాల్లో పర్యాటకులు ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో సోమవారం కాకినాడ కోస్టల్ సెక్యూరిటీ(మెరైన్) పోలీస్ స్టేషన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తుపాను ప్రభావంలో సముద్ర తీర ప్రాంతాల్లోని జలాల్లో చాలాచోట్ల భారీ గుంతలు ఏర్పడ్డాయని, కార్తిక మాసంలో సముద్ర స్నానాలు, పూజలకు వచ్చేవారు పోలీసుల సూచనలు తప్పక పాటించాలని సూచించారు. సూర్యారావుపేట, ఎన్టీఆర్, నేమాం సముద్రతీరం, ఉప్పలంక రేవులు, సుబ్బంపేట, పెరుమాళ్లపురం తీరాల్లో మాత్రమే స్నానాలు ఆచరించాలన్నారు.

తుది దశలో పంట నష్టం నమోదు

ముమ్మిడివరం: మొంథా తుపాను కారణంగా నష్టపోయిన రైతులను త్వరితగతిన ఆదుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం పంట నష్టం నమోదు ప్రక్రియను వేగవంతం చేసింది. జిల్లాలో రైతు సేవా కేంద్రాల స్థాయిలో గ్రామ, మండల, డివిజన్ స్థాయి కమిటీలు గత ఐదు రోజులుగా పంట నష్టం అంచనా వేస్తున్నాయి. రైతు ఆధార్ సంఖ్య, ఈ క్రాప్ నమోదైన వివరాల ఆధారంగా క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి అక్కడ 33 శాతం కంటే ఎక్కువ నష్టం జరిగితే యాప్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లాలో 1.61 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరుగుతోంది. ఇప్పటి వరకు 28,400 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. ముమ్మిడివరం, ఐ.పోలవరం, కపిలేశ్వరపురం తదితర మండలాల్లో ఇంకా గుర్తించవలసి ఉంది. ఈ నెల 4వ తేదీకి పూర్తి చేసి జిల్లా వ్యాప్తంగా అన్ని రైతు సేవా కేంద్రాల్లో జాబితాలను ప్రచురించనున్నారు. వీటిపై వచ్చిన అభ్యంతరాల ఆధారంగా మార్పులు, చేర్పులు చేపట్టనున్నారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి తుది జాబితాను కమిషనరేట్‌కు పంపనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి వి.బోసు బాబు తెలిపారు. నష్టపోయిన రైతులకు పెట్టుబడి సాయంగా ఎకరాకు రూ.10వేలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

నేటితో పూర్తి చేసేందుకు చర్యలు

మండపేట: తాపేశ్వరంలో పంట నష్టం నమోదు

రైతేరాజు
అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

కాటన్ అక్విడక్టు రోడ్డు బ్రిడ్జిపై కొంతమేర అడ్డుగా ఉన్న కట్టడాలు

తొలగిస్తారా.. వదిలేస్తారా!

న్యూస్‌టుడే, పి.గన్నవరం

పి.గన్నవరం వద్ద వైనతేయ గోదావరి నదీపాయపై ఉన్న డొక్కా సీతమ్మ అక్విడక్టు-కం-రోడ్డు బ్రిడ్జికి రూ.49.03 లక్షల నిధులతో త్వరలో మరమ్మతు పనులు మొదలు పెడతామని ఇప్పటికే జలవనరుల శాఖ ఇంజినీరింగ్ అధికారులు వెల్లడించారు. ఆ సమయంలో పాదచారులను సైతం అనుమతించకుండా 42 రోజుల పాటు రాకపోకలు నిలుపుదల చేస్తారు. ఈ నేపథ్యంలో దీనికి చేరువలో ఉన్న కాటన్ అక్విడక్టు రోడ్డు బ్రిడ్జిపై రాకపోకలు కల్పిస్తామని వెల్లడించారు.

వృథాగా మారాయి

ప్రధానంగా కాటన్ అక్విడక్టు రోడ్డు బ్రిడ్జిని ఆనుకుని ఉన్న రోడ్డు బ్రిడ్జికి సంబంధించి రోడ్డుపై సుమారు 15 సంవత్సరాల క్రితం టూరిజం పేరుతో కొంతమేర కట్టడాలు నిర్మించారు. ఇవి ఏమాత్రం అందాన్ని తీసుకురాలేదు. కాలక్రమేణా దెబ్బతిన్నాయి. వీటివల్ల ఇక్కడ ఎలాంటి ప్రయోజనం లేదు. కొంతమేర దీనిపై కట్టిన కట్టడాల వద్ద వెడల్పు తగ్గిపోయి బస్సులు వంటి వాహనాలు రాకపోకలు సాగించేందుకు వీలుపడదు. ఈ నేపథ్యంలో వీటిని తొలగించాలి. లంకలగన్నవరం, పి.గన్నవరం వైపు కొన్ని ఆక్రమణలు కూడా తొలగించాల్సి ఉంది. ప్రత్యామ్నాయ మార్గంగా 42 రోజుల పాటు వినియోగించుకోవాలంటే భద్రతా పరంగా జాగ్రత్తలు వహించాలి. ఒ.ఎన్.జి.సి., లోడు లారీలు, టిప్పర్లు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఇప్పటి నుంచే కార్యాచరణ

డొక్కా సీతమ్మ అక్విడక్టు రోడ్డు బ్రిడ్జి మరమ్మతుకు సంబంధించి గుత్తేదారు ఖరారు కావడం, పనులు చేసేందుకు ఒప్పందం పూర్తికావడం జరిగింది. త్వరలో పనులు మొదలు పెట్టనున్న నేపథ్యంలో ఇప్పటినుంచే ప్రత్యామ్నాయ మార్గంలో చేయాల్సిన ఏర్పాట్లను పూర్తిచేయాలి. ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాట్లను పూర్తి చేసేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

గప్‌చుప్.. గూడుపురాని..!

జగనన్న ఇళ్ల అనర్హులపై చర్యలు శూన్యం

న్యూస్‌టుడే, అల్లవరం

బోడసకుర్రులో ఏర్పాటు చేసిన జగనన్న లేఔట్

వైకాపా హయాంలో జగనన్న కాలనీలకు సంబంధించి భూముల కొనుగోలు నుంచి ఇళ్ల స్థలాల కేటాయింపు వరకు అనేక అవకతవకలు చోటు చేసుకున్నాయి. జగనన్న లే అవుట్‌లలో స్థలాలను చాలా వరకు అనర్హులకు కట్టబెట్టారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై ఈ ఏడాది ఫిబ్రవరిలో కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

జిల్లాలో ఇలా..

జిల్లాలో మొదటి విడతలో 766 లే అవుట్‌లను ఏర్పాటు చేశారు. అందులో 67,418 మందికి రెండేసి సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు పంపిణీ చేశారు. వీరిలో చాలా వరకు అప్పటి వైకాపా నాయకులు సిఫార్సు చేసిన వారి అర్హతను పరిశీలించకుండా ఇళ్ల స్థలాలు కేటాయించారు. 1,062 మందిని అనర్హులుగా అధికారులు తేల్చారు. నిబంధనల ప్రకారం పరిశీలిస్తే మరింత మంది బోగస్ లబ్ధిదారులు బయటకు వస్తారని అర్హులైన నిరుపేదలు అభిప్రాయ పడుతున్నారు.

ముందే సమాచారం..

అనర్హుల ఏరివేతకు కూటమి ప్రభుత్వం చేపట్టిన సర్వే సమాచారం కొంత మంది గ్రామ స్థాయి అధికారులు లబ్ధిదారులకు ముందే చేరవేశారనే ఆరోపణలు ఉన్నాయి. పట్టాలు చేతులు మారిన వారు ఎవరి వద్ద కొనుగోలు చేశారో వారిని పిలిపించి అధికారులు సర్వేకు వచ్చిన సమయంలో అందుబాటులో ఉండేలా చూసుకున్నారు. దీంతో అసలైన లబ్ధిదారుల వద్దనే ఇళ్ల స్థలాలు ఉన్నట్లు నమోదు చేశారు. ఈ ప్రక్రియలో కొనుగోలు చేసినవారు సర్వేకు వచ్చిన అధికారులకు ముడుపులు ముట్టచెప్పారనే ఆరోపణలు ఉన్నాయి.

22 మండలాలు
766 లేఔట్‌లు
67,418 పట్టాలు
1,062 గుర్తించిన అనర్హులు

అడ్డుపడుతున్నది ఎవరు..?

లబ్ధిదారుల్లో అనర్హులుగా తేల్చిన 1062 మందిపై చర్యలు తీసుకోకుండా అడ్డుపడుతున్నది ఎవరనేది చర్చనీయాంశంగా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచినా అధికారులు ఇంకా వైకాపా నాయకుల కనుసన్నల్లోనే విధులు నిర్వహిస్తున్నారా? కొంత మంది కూటమి నాయకులే అడ్డుపడుతున్నారా..? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్

అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజలు ఇస్తున్న అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ మహేష్ కుమార్ అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఎస్పీ రాహుల్ మీనా, జేసీ నిశాంతి, డీఆర్వో కె.మాధవి, ఇతర అధికారులతో కలిసి వినతుల స్వీకరించారు. సుమారు 270 మంది తమ సమస్యలపై వినతులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

ప్రయాసబడి

మామిడికుదురు మండలం ఈదరాడ పరిధి నడిమిలంక నుంచి వేగివారిపాలెం వైపు రాకపోకలు సాగించే మార్గం 600 మీటర్ల మేర గుంతలు పడి వర్షం నీటితో బురదమయమైంది. పాఠశాల విద్యార్థులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేకపోతోంది. ఏఈ ఆనంద్ దృష్టికి తీసుకువెళ్లగా రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు చేసి పంపిస్తామన్నారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

పక్షి ప్రేమికుడు

ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం గుత్తులు

వాతావరణం కాలుష్యానికి తోడు సరైన ఆహారం దొరకక పలు రకాల పక్షు జాతులు అంతరించిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పక్షి ప్రేమికుడైన కాకినాడ కస్టమ్స్ ఘాటీ(ఎస్పీఎఫ్) కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న జి.శ్రీధర్ తనవంతు బాధ్యతగా వాటి కోసం నీరు, ఆహారం అందేలా కృషిచేస్తున్నారు. కార్యాలయ ఆవరణలో ప్రత్యేకంగా తయారు చేసిన లాంతరు లాంటి డబ్బాలను నాలుగైదు చోట్ల ఏర్పాటు చేసి గింజలు ఉంచుతారు. ధాన్యం గుత్తులను చెట్ల వద్ద.. తాళ్ల సహాయంతో వేలాడదీస్తున్నారు. పిచ్చుకలు, రామ చిలుకలు, పావురాలు వంటివి పెద్దసంఖ్యలో ఇక్కడకు వచ్చి వాటిని తింటాయి. ఇది తనకెంతో ఆనందాన్నిస్తుందని శ్రీధర్ పేర్కొన్నారు.

గింజలు తింటున్న రామ చిలుకలు

-న్యూస్‌టుడే, సాంబమూర్తి నగర్(కాకినాడ)

మాట్లాడుతున్న మంత్రి సుభాష్, ఎంపీ, ఎమ్మెల్సీ

బాధిత కుటుంబానికి.. ఇంటి స్థలం, రూ.5 లక్షలు

ఐ.పోలవరం న్యూస్‌టుడే: మండలంలో బాలిక అత్యాచార ఘటనలో బాధిత కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరంతో కలిసి వారు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆ కుటుంబానికి ఇంటి స్థలం, రూ.5 లక్షల ఆర్థిక సాయం, బాలిక తల్లికి ఔట్ సోర్సింగ్‌లో ఉద్యోగం కల్పిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారని మంత్రి వెల్లడించారు. సాగిరాజు సూరిబాబురాజు, చెల్లి అశోక్, సాకా సీతాదేవ తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని గిరిప్రదక్షిణకు వేళాయె!

న్యూస్‌టుడే, అన్నవరం

కార్తిక పౌర్ణమి సందర్భంగా ఈనెల 5న (బుధవారం) అన్నవరం సత్యనారాయణ స్వామి గిరిప్రదక్షిణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అన్నవరం గ్రామంలోని తొలిపావంచాల వద్ద ప్రదక్షిణ ప్రారంభమవుతుంది. ప్రధాన మార్గం మీదుగా సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, సుబ్బరాయపురం, సాక్షిగణపతి ఆలయం నుంచి జాతీయ రహదారిపైకి చేరుకుని.. అక్కడినుంచి బెండపూడి కూడలికి ముందు పోలవరం కాలువ గట్టు మీదుగా పంపా సరోవరం చెంతకు వస్తుంది. ఇక్కడి నుంచి ఘాట్ మీదుగా (రత్న, సత్యగిరులను చుడుతూ) దిగువ ఘాట్‌రోడ్డుపై సాగుతూ తొలిపావంచాల వద్ద ముగుస్తుంది.

8.2 కి.మీ ప్రశాంతంగా సాగేలా ఏర్పాట్లు

గతయేడాది గిరిప్రదక్షిణలో భక్తులు

అర్ధరాత్రి 1 గంట నుంచే వ్రతాలు

బుధవారం కార్తిక పౌర్ణమి సందర్భంగా మంగళవారం రాత్రి 10 గంటల నుంచే వ్రత టికెట్లు విక్రయిస్తారు. అర్ధరాత్రి 1 గంట నుంచి వ్రతాలు, 2 గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభిస్తారు.

- ప్రదక్షిణ మార్గం మొత్తం: 8.2 కి.మీ. (తారురోడ్డు 3.9 కి.మీ, గ్రావెల్‌రోడ్డు 4.3కి.మీ.)
- తొలిపావంచా – హైవే ఆర్చి గేటు వరకు: 2.1 కి.మీ.
- ఆర్చిగేటు–పోలవరం కాలువ: 1.3 కి.మీ.
- పోలవరం కాలువ కూడలి– దిగువ ఘాట్‌రోడ్డు కూడలి: 4.3 కి.మీ.
- దిగువ ఘాట్‌రోడ్డు కూడలి –తొలిపావంచా: 0.5 కి.మీ.
- సమయం: ఈనెల 5న మధ్యాహ్నం 2 గంటలకు కొండ దిగువ తొలిపావంచాల వద్ద సత్యరథం ప్రారంభం. సాయంత్రం 5-6 గంటలకు గిరిప్రదక్షిణ ముగిసే ఆస్కారం. ఉదయం 8.30కు స్వామి, అమ్మవార్లను గిరుల చుట్టూ తిప్పుతారు.
- భద్రత: ఇద్దరు డీఎస్పీలు, 8 మంది సీఐలు, 16 మంది ఎస్సైలు, సుమారు 300 మంది సిబ్బంది, దేవస్థానం భద్రతా సిబ్బంది
- స్టాల్స్: 12 (పండ్లు, ప్రసాదం, తాగునీరు, మజ్జిగ, బిస్కెట్లు, పాలు పంపిణీ)
- పార్కింగ్: కొండ పైన, కొండ దిగువన జూనియర్ కళాశాల మైదానం
- వైద్యశిబిరాలు: 4 వేదికలు : 4 సేవలందించేందుకు ప్రతి కి.మీ.కు దేవస్థానం అధికారులు, సిబ్బంది ఉంటారు. అక్కడే విరామ స్థలాలు ఉంటాయి.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

WANTED
రాజమండ్రిలో ప్రముఖ 2 వీలర్ షోరూమ్ SRI RK HONDAలో పనిచేయుటకు ఈ క్రింది స్టాఫ్ కావలెను
✦ స్పేర్స్ మేనేజర్
✦ కంప్యూటర్ ఆపరేటర్
ఇంటర్వ్యూ: 4, 5, 6 November 2025 తేదీలలో 10 AM to 5 PM వరకు
SRI RK HONDA
D.No.6-16-1, దారవాడవారి వీధి, రోడ్ కమ్ రైల్వే బ్రిడ్జికి వెళ్లే రోడ్డులో, కోటిపల్లి బస్టాండ్ దగ్గర రాజమండ్రి, 8297713999

(c) eenadu

కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకుంటున్న కె.మాధవి (అమలాపురం ఆర్డీవో), శ్రీకర్ (ఆర్డీవో కొత్తపేట), అఖిల (ఆర్డీవో రామచంద్రపురం), సలీంబాషా (డీఈవో), శ్రీవాన్ (జిల్లా సమాచారశాఖ అధికారి), అదపా ఉదయభాస్కర్ (డీసీవో), పీవీ శ్రీనివాసరావు (మత్స్యశాఖ అధికారి), జేవీ రమణ (ఉద్యానశాఖ అధికారి), మురళీకృష్ణ (సీపీవో), దుర్గారావు దొర (డీఎంహెచ్‌వో), కార్తీక్ (డీసీహెచ్ఎస్)

సేవలకు సత్కారం

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: మొంథా తుపాను సమయంలో నిబద్ధతతో విధులు నిర్వహించిన పలువురు అధికారులను అవార్డులు వరించాయి. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, సిబ్బందికి కలెక్టర్ మహేష్‌కుమార్ ప్రశంసా పత్రాలు, పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి అధికారి నుంచి గ్రామాల్లోని సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించడంతో ముప్పును సమర్థంగా ఎదుర్కొన్నామన్నారు. అయిదు రోజుల పాటు ఉద్యోగులు నిర్విరామంగా పనిచేశారని అభినందించారు. ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించడం వల్ల నష్టం తీవ్రత తగ్గిందన్నారు. జేసీ నిశాంతి, ఆర్డీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం 58 మంది అధికారులు, సిబ్బందికి అవార్డులను ప్రదానం చేశారు.

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీటవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్‌ఫేస్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
ఆఫీస్ చిరునామా: డి.నెం.6-12-5/1, 2వ అంతస్తు, ఓరుగంటివారి స్ట్రీట్, ఇన్నీసుపేట, కోటిపల్లి బస్టాండ్ ఎదురుగా, రాజమహేంద్రవరం-533101.

(రూల్ 8(1) ప్రకారం) **భౌతిక స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

రిఫరెన్స్: లోన్ అకౌంట్ నెం. RAJA2TF2210300004

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్') (గౌరవనీయులైన ఎన్.సి.ఎల్.టి చెన్నై ఆదేశాల మేరకు 09-11-2022 న సి.పి.నెం.69-76 ఆఫ్ 2022లో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌ను శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌తో విలీనం చేయబడినది. తదనంతరం ది.30-11-2022 నుండి మెస్సర్స్ శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ పేరు మార్పుకు అనుగుణంగా ఇన్‌కార్పొరేషన్ సర్టిఫికేట్ & కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కింద కంపెనీల రిజిస్ట్రార్ ధృవీకరించిన ప్రకారం మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చబడింది). మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ది ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన రూల్ 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీతలు:**

1) **దుగ్గిరాల సత్య వెంకట బ్రహ్మానందరావు, తండ్రి: శేషగిరిరావు,** సాయి సత్య దేవ ఏజెన్సీస్ వ్యాపారం, నివాస చిరునామా: డి.నెం.23-3-12/1, తమ్మవారి స్ట్రీట్, మండపేట - 533308, తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుతము డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.
2) **దుగ్గిరాల మనమ్మ, భర్త: శేషగిరిరావు,** గృహిణి, డి.నెం.23-3-12/1, తమ్మవారి స్ట్రీట్, మండపేట - 533308, తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుతము డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.
3) **పెండ్యాల సాయి వీరేంద్ర అమర్‌బాబు, తండ్రి: కనకరాజు,** డి.నెం.22-3-10, తమ్మవారి స్ట్రీట్, మండపేట - 533308, తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుతము డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

వారు చెల్లించవలసిన బకాయిమొత్తం **రూ.53,03,887/- (అక్షరాల యాభై మూడు లక్షల మూడు వేల ఎనిమిది వందల ఎనభై ఏడు రూపాయలు మాత్రమే)** + వడ్డీ మరియు జరిమానాలతో గల కాంట్రాక్టువల్ ఛార్జీలతో కలిపి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.25.06.2024న డిమాండ్ నోటీసు** జారీ చేయబడింది.

ఋణగ్రహీతలు బకాయిసొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) ప్రకారం గౌరవనీయులైన ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కమ్ ఛీఫ్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్, రాజమహేంద్రవరంలో **సిఆర్ఎల్.ఎమ్. పి.నెం. 412/2025, తేది: 26-09-2025** ద్వారా సదరు చట్టములోని సెక్షన్ 14కు అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూల్ 9 ప్రకారము దిగువ పేర్కొన్న ఆస్తిని **తేది. 30 అక్టోబర్ 2025న భౌతికంగా స్వాధీనత తీసుకోవడమైనదని** ఋణగ్రహీతలకు ప్రత్యేకంగా మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందులమూలముగా తెలియజేయునది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా ప్రస్తుతం చెల్లించవలసిన బకాయిమొత్తం **రూ.53,03,887/- (అక్షరాల యాభై మూడు లక్షల మూడు వేల ఎనిమిది వందల ఎనభై ఏడు రూపాయలు మాత్రమే)** + ఇప్పటి వరకు వడ్డీ మరియు ఇతర కాస్టులు, ఛార్జీలు మరియు ఖర్చులతో కలిపి మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి ఛార్జికి లోబడి ఉండునని ప్రత్యేకించి ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

ఆస్తి యొక్క షెడ్యూలు

మండపేట యస్ఆర్ఓ నందు డాక్యుమెంట్ నెం. 9118/2022 (MOD) ద్వారా దుగ్గిరాల శేషగిరిరావు గారి భార్య: దుగ్గిరాల మనమ్మగారిచే ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్‌కు తనఖావుంచబడిన స్థిరాస్తి యొక్క వివరములు

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండపేట మండలం, మండపేట సబ్-జిల్లా, మండపేట మునిసిపల్ ఏరియా, 8వ వార్డు, 13వ బ్లాక్, యస్.నెం.550/1A1 నందు (మండల సర్వేయర్ రిపోర్ట్ ప్రకారము) ఆర్‌సిసి భవనము మూడు ఐటమ్స్‌గా ఈ దిగువన:

ఐటమ్ నెం.01: 378 1/4 చ॥అ॥ ప్లింత్ ఏరియాకు కొలతలు మరియు హద్దులు: (42.03 చ॥గ॥). **తూర్పు:** తమ్మిశెట్టికి చెందిన స్థలము - 22.0 అ॥; **దక్షిణం:** యమ్.కృష్ణారావుకు చెందిన గోడ - 18.0 అ॥; **పడమర:** లేన్ - 22.6 అ॥; **ఉత్తరం:** ఐటమ్ నెం.02 క్రింద కవర్ చేయబడిన ఆస్తి - 16.0 అ॥.

ఐటమ్ నెం.02: 248 చ॥అ॥ విస్తీర్ణమునకు కొలతలు మరియు హద్దులు: (27.56 చ॥గ॥). **తూర్పు:** తమ్మిశెట్టికి చెందిన స్థలము - 16.0 అ॥; **దక్షిణం:** ఐటమ్ నెం.01 క్రింద కవర్ చేయబడిన ఆస్తి - 16.0 అ॥; **పడమర:** లేన్ - 16.0 అ॥; **ఉత్తరం:** ఐటమ్ నెం.03 క్రింద కవర్ చేయబడిన ఆస్తి - 15.0 అ॥.

ఐటమ్ నెం.03: 65 చ॥అ॥ విస్తీర్ణమునకు కొలతలు మరియు హద్దులు: (7.22 చ॥గ॥). **తూర్పు:** తమ్మిశెట్టికి చెందిన స్థలము - 06.0 అ॥; **దక్షిణం:** ఐటమ్ నెం.02 క్రింద కవర్ చేయబడిన ఆస్తి - 10.6 అ॥; **పడమర:** లేన్ - 07.0 అ॥; **ఉత్తరం:** ఆర్.పర్వతాలుకు చెందిన గోడ - 15.0 అ॥.

ఐటమ్ నెం.1 నుండి 3 వరకు మొత్తం 691 1/4 చ॥అ॥ లేదా 77 చ॥గ॥ లేదా 64.68 చ॥మీ॥ గ్రౌండ్ మరియు ఫస్ట్ ఫ్లోర్ కలిగిన ఇల్లు అన్ని అనుషంగిక హక్కులతో సహా.

ప్రదేశం: రాజమహేంద్రవరం **సం/- అధీకృత అధికారి**
తేది: 30.10.2025 **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**

ఎన్టీఆర్ ఆశయాలు యువతకు స్ఫూర్తి

రామచంద్రపురం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ ఆశయాలు యువతరానికి స్ఫూర్తి కావాలని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురం పట్టణంలోని ఒకటో వార్డు కొత్తూరులో సోమవారం ఎన్టీఆర్ విగ్రహాన్ని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరంతో కలిసి ఆవిష్కరించారు. తెలుగుదేశం స్థాపించి రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు తీసుకొచ్చిన మహనీయుడిని స్మరించుకుంటూ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సీనియర్ నాయకులు గంగిశెట్టి సూర్యనారాయణ, గ్రామ పెద్దలను మంత్రి అభినందించారు. నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజశేఖరం మాట్లాడుతూ కిలో రెండు రూపాయలకే బియ్యం, మహిళలకు ఆస్తిలో హక్కు కల్పించిన గొప్పనేత ఎన్టీఆర్ అని కొనియాడారు. [illegible]

ఎన్టీఆర్ విగ్రహానికి గజమాల వేస్తున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

సముద్రంలోకి 2,51,364 క్యూసెక్కులు విడుదల

పిఠాపురం, న్యూస్‌టుడే: గోదావరిలో వరద నీరు క్రమేపీ తగ్గుతోంది. సోమవారం సాయంత్రం 6 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సముద్రంలోకి 2,51,364 క్యూసెక్కులు విడిచిపెట్టారు. ధవళేశ్వరం ఆర్మ్ నుంచి 1,25,788, ర్యాలి నుంచి 51,857, మద్దూరు నుంచి 27,441, విజ్జేశ్వరం నుంచి 46,278 క్యూసెక్కుల చొప్పున దిగువకు వదిలారు. బ్యారేజీ దిగువన ఉన్న వశిష్ఠ, వైనతేయ, గౌతమి, వృద్ధగౌతమి నదీపాయల్లో ప్రవాహం కొనసాగుతోంది. బూరుగులంకరేవులో మరపడవలు తిరుగుతున్నాయి. లంకగ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. గత ఏడాది ఇదే రోజున సముద్రంలోకి 54,555 క్యూసెక్కులు విడిచిపెట్టారు. మధ్య డెల్టాకు వెయ్యి, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కుల సాగునీరు పంపిణీ చేశామని హెడ్‌వర్క్స్ జె.ఇ. డి.రాధాకృష్ణ తెలిపారు.

ప్రకృతి వైపరీత్యాలపై సర్వే

సఖినేటిపల్లి: మొంథా తుపాను, ప్రకృతి వైపరీత్యాల నివారణపై ఇన్‌కాయిస్ సంస్థ ప్రాజెక్టు శాస్త్రవేత్త శివకుమార్, వెంకటేశ్వరరావు బృందం పల్లిపాలెం, అంతర్వేది దేవస్థానంలో జీపీఎస్ సర్వే చేపట్టారు. ఈ సంస్థ మత్స్యకారులకు సముద్ర సమాచారం ఎప్పటికప్పుడు అందించేందుకు ముందుగానే సెలైన్‌సెల్ సందేశం, వాయిస్‌కాల్ ద్వారా అందజేస్తుందని చెప్పారు. మరోసారి తుపాను వచ్చినప్పుడు ఏ ప్రాంతంలో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలనే దానిపై సర్వే చేస్తున్నట్లు వారు వెల్లడించారు. ఆచార్యులు, కృష్ణంరాజు, ఆదినారాయణ పాల్గొన్నారు.

అరెకరంలో ఆరోగ్య ఫలాలు

న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలను వృథాగా వదిలేయకుండా మొక్కలు పెంచి ఆరోగ్యకర ఉత్పత్తులు పొందుతున్నారు ఉండ్రాజవరానికి చెందిన కుడుప నారాయణరావు. రైతు కుటుంబానికి చెందిన ఈయన మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం సమయాన్ని వివిధ రకాల మొక్కల పెంపకానికి కేటాయించారు. ఇంటిపక్కనే ఖాళీగా ఉన్న 50 సెంట్లలో సుమారు 45 రకాల మొక్కలు నాటారు. కొంత భాగంలో చెరువు తవ్వి చేపలు పెంచుతున్నారు. సేంద్రియ పద్ధతిలో దిగుబడులు సాధిస్తున్నారు.

పెంచుతున్న వివిధ రకాల మొక్కలు

స్ఫూర్తి: వ్యవసాయాధికారులు పరిశీలించి ఆదర్శంగా తీసుకుంటున్నారు.

ఎన్నో రకాలు..

తైవాన్ జామ, వంద్లోడు మామిడి 365 రోజులు పొడవుగా కాయలు కాస్తున్నాయి. యాపిల్‌బేర్, బత్తాయి, గులాబీజామ, రేగు, విస్తవ్వాయ, దానిమ్మ, ఆల్‌సీతా, రామ, లక్ష్మణ, సీతాఫలాలు, వాక్కాయ సాగు చేస్తున్నారు. రైతులతో పాటు

ఆన్‌లైన్‌లో పరిశీలించి..

మధుమేహం, రక్తపోటు తదితర వ్యాధిగ్రస్తులకు ఈ ఫలాలు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. బంధుమిత్రులతో పాటు దూరప్రాంతాల్లో ఉన్న అనేకమందికి పంపిస్తున్నారు. కుటుంబ సభ్యులు సహకరిస్తున్నారు. ఆన్‌లైన్‌లో పరిశీలించి మేలైన మొక్కలు తీసుకొస్తున్నారు.

- కుడుప నారాయణరావు, ఉండ్రాజవరం

రైతేరాజు

పట్టు రైతులకు రాయితీపై ఉపకరణాలు

గొల్లప్రోలు: మల్బరీ సాగు చేస్తూ పట్టు పురుగులు పెంచే రైతులు ఆధునిక పరికరాల వినియోగంతో నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చు. పట్టు రైతులు రాయితీపై ఉపకరణాలు అందించనున్నట్లు పట్టు పరిశ్రమలశాఖ జిల్లా అధికారి రాజేంద్రప్రసాద్‌బాబు తెలిపారు. అందించే పరికరాలు, రాయితీ వివరాలను ఆయన వివరించారు. పట్టు పరిశ్రమల శాఖ సిబ్బంది ద్వారా దరఖాస్తు అందించాలన్నారు.



- బీడర్, బ్రష్‌కట్టర్, పవర్ స్ప్రేయర్లు, పవర్ టిల్లర్ వంటివి అందిస్తారు.
- యూనిట్ విలువ రూ.లక్షగా నిర్ణయించి రూ.50 వేలు రాయితీ ఇస్తారు. రూ.లక్ష కన్నా తక్కువైతే దానిలో 50 శాతం రాయితీ ఇస్తారు. రూ.లక్ష కన్నా ఎక్కువైనా రూ.50 వేలు మాత్రమే రాయితీ కల్పిస్తారు.

జగ్గంపేటలో ఏర్పాటు చేసిన పెట్టెలు

లాభదాయకం.. తేనెటీగల పెంపకం

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: తేనెటీగల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎంఐడీహెచ్ (మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్) పథకం ద్వారా రాయితీలు అందిస్తోందని జగ్గంపేట ఉద్యానాధికారిణి పి.శ్రీవల్లి తెలిపారు. ఎస్సీ రైతులకు ఒక యూనిట్‌కి రూ.24 వేలు అందిస్తున్నారు. ముందుగా మేలైన తేనెటీగలను, అనువైన స్థలాన్ని ఎంపిక చేసుకుని పెంపకానికి అవసరమైన పరికరాలు సమకూర్చుకోవాలి. మకరందం, పుప్పొడిని అందించే మొక్కలు దగ్గరలో పెంచాలి. తేనెటీగలు మొక్కలు, పంటలకూ పరాగసంపర్కానికి, దిగుబడి పెంచేందుకు సహాయపడతాయి. వీటి పెంపకంతో మహిళలు, యువతకు ఉపాధి లభిస్తుంది. ప్రభుత్వాలు, అనేక సంస్థలు ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వం తేనె, మైనానికి మార్కెట్‌లో మంచి గిరాకీ ఉండటంతో పలువురు వీటి పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు.

మీ కోసం

బొప్పాయి పాలు.. విదేశాలకు

చాగలమర్రి (నంద్యాల), న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా చాగలమర్రి మండల వ్యాప్తంగా రైతులు అధికంగా బొప్పాయి సాగు చేస్తుంటారు. చిన్నవంగలితో పాటు సమీపంలోని గ్రామాల్లో వ్యాపారులు కడప జిల్లా కాశినాయన, క్రిష్ణంపల్లె గ్రామాల్లో 1200 ఎకరాల్లో పండిస్తారు. విత్తనం నాటిన కాలం నుంచి తొమ్మిది నెలలకు పంట చేతికొస్తుంది. పండ్ల సేకరణ అనంతరం 13 నెలల తర్వాత బొప్పాయి కాయలకు గాట్లు పెట్టి పాలను సేకరిస్తున్నారు. తెల్లవారుజాము సమయంలోనే కాయలకు గాట్లు పెడితే కేవలం రెండు గంటల్లో పాలు ఊరతాయి. ఇలా సేకరించిన దాన్ని రాజుపేటకు చెందిన వ్యాపారులు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల పాలు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 4 డ్రమ్ముల పాలు సేకరిస్తున్నారు. ఎకరానికి పాల సేకరణ ద్వారా రైతుకు రూ.24 వేల ఆదాయం వస్తుంది. సేకరించిన పాలను ప్లాస్టిక్ డ్రమ్ముల్లో కంటైనర్లు, సబ్బుల తయారీలో ఉపయోగిస్తున్నారు. బెంగళూరు, చెన్నైతో పాటు నాణ్యతను బట్టి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. బొప్పాయి పాలను ఎగుమతి చేస్తున్నారు. బొప్పాయి సాగులో ఎప్పుడైనా ధర పడిపోయినప్పుడు బొప్పాయి పాల సేకరణతో నష్టం నుంచి రైతులు బయటపడుతున్నారు.

చలికాలం.. పశువులు పదిలం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: చలికాలం ప్రారంభమైనందున పశువుల పెంపకంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని ర్యాలి పశువైద్యాధికారి మౌనిక వివరించారు. పాడిపశువుల వరిగలను బారిన పడకుండా పశుశాలల్లో కట్టాలి. దాణాలో మాంసకృత్తులు తక్కువగా, పిండి పదార్థాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. జీర్ణక్రియ సక్రమంగా ఉండేందుకు ఓ పూట పచ్చిమేత, మరోపూట ఎండుమేత ఇవ్వడం శ్రేయస్కరం. శీతాకాలంలో లభించే పచ్చగడ్డిలో కాల్షియం, ఇతర ఖనిజ లవణాలు తక్కువగా ఉంటాయి. అందువల్ల దాణాతో పాటు విటమిన్లతో కూడిన ఖనిజ లవణాలు అందించాలి. ఈ ప్రాంతంలో అధికంగా జ్వరం, పాలజ్వరం, పడక జబ్బు వంటి రుగ్మతలను నివారించవచ్చు. చలిపట్ల పొదుగు వాపు, పరుశ్య ఏర్పడి పుండ్లుగా మారే ప్రమాదం ఉంది. బోరిక్ పౌడర్ పూస్తే ఆ సమస్యను నివారించవచ్చు. పశువులను పాకలో ఉంచాలి. పశువులను పగటివేళల్లో మాత్రమే దూర ప్రాంతాలకు రవాణా చేయాలి.

పశువుల శాల

అప్పటి నుంచి అలాగే...

సిరంగా కోనసీమ కొబ్బరి మార్కెట్

న్యూస్‌టుడే, అంబాజీపేట

ఏటా దీపావళి వెళ్లిన తరువాత కోనసీమ కొబ్బరి మార్కెట్‌లో సాధారణంగానే ధరలు మందగిస్తాయి. ఈ ఏడాది పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. పండగ ముందే ఎగుమతులు భారీగా జరగడంతో ఉత్తరాది రాష్ట్రాల్లో ఇప్పటికే కాయల కొరత లేకుండాపోయింది. దీంతో ధరల తగ్గుదలను ఇటు రైతులు, ఇటు వర్తకులు భావించిన స్థిరంగానే కొనసాగుతున్నాయి.

కార్తికం కావడంతో..

ప్రస్తుతం కార్తిక మాసం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కాయల అవసరం ఏర్పడింది. మంజూనాడకు ఆలయాల్లో సమర్పించేందుకు భక్తులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో అవసరం మేరకు ప్రాంతీయ మార్కెట్‌లో లభించే కాయలు సరిపోవడంతో ధరలు నిలకడగానే ఉన్నాయి. పొరుగు రాష్ట్రాల్లో మందగమనం సాగే వ్యాపారాలతో అక్కడి వర్తకులు కోనసీమ నుంచి కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు.

లారీకి కాయలు లోడ్ చేస్తున్న కార్మికులు

ప్రస్తుతం వెయ్యింటికి..

ప్రస్తుతం పచ్చి కాయలు వెయ్యింటికి రూ.23 వేల నుంచి రూ.24 వేలు పలుకుతున్నాయి. దీపావళి ముందు కూడా ఇవే ధరలు పలికాయి. కొత్తకొబ్బరి, కురిడీ ధరలు కాస్త అటుఇటుగా స్థిరంగా ఉన్నాయి. తోటల నుంచి ఉత్పత్తి తగ్గడంతో పాటు స్థానిక మార్కెట్ల నుంచి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు ఎగుమతులు జరగడమే ప్రస్తుత పరిస్థితికి కారణమని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గతేడాది దీపావళి తరువాత మాత్రం ధరలు భారీగా దిగజారిపోవడం గమనార్హం.

4.6 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

రావులపాలెం పట్టణం: రావులపాలెం జాతీయరహదారిపై అక్రమంగా తరలిస్తున్న 4.6 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని, టాటా ఏస్ వాహనాన్ని సీజ్‌చేసినట్లు రావులపాలెం ఎస్సై వంటి తెలిపారు. పాలకొల్లు నుంచి ఆలమూరు మండలం జొన్నాడకు ఓ వాహనంలో 94 బస్తాలు రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా సోమవారం విజిలెన్స్ అధికారులు రావులపాలెంలో పట్టుకున్నారు. దీనిపై కేసునమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఉద్యోగుల సేవలు అభినందనీయం

అంబాజీపేట: మొంథా తుపాను సమయంలో మార్కెట్ కమిటీ ఉద్యోగులు, సిబ్బంది అందించిన సేవలు అభినందనీయమని జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి కేవీఎస్ విశాలాక్షి అన్నారు. అంబాజీపేట మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం ఛైర్మన్ చిట్టూరి శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా విశాలాక్షితో పాటు కార్యదర్శి వి.రమేష్‌ను పాలకవర్గ సభ్యులు సత్కరించారు. వైస్ ఛైర్మన్ మాట్లాడుతూ ముక్తేశ్వరంలో గోదాముల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపేందుకు తీర్మానం చేశామని అన్నారు. అంబాజీపేట యార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, గ్రామాల్లో పంటలకోర్ల నిర్మాణానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామన్నారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ కొర్లపాటి వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి వి.రామకృష్ణ, యూడీసీ ప్రశాంత్‌కుమార్, కమిటీ పర్యవేక్షకులు శేషు, పరశురాముడు పాల్గొన్నారు.

జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి విశాలాక్షిని సత్కరిస్తున్న ఏఎంసీ ఛైర్మన్ శ్రీనివాస్, సభ్యులు

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	22,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	22,000-23,000
కొత్త (పచ్చి) కాయ	23,000-24,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	115-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

బాస్కెట్‌బాల్ విజేత రామచంద్రపురం జట్టు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో మూడు రోజులుగా గన్నమని భానుమతి మెమోరియల్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరుగుతున్నాయి. మహిళలు, పురుషుల విభాగాల్లో రామచంద్రపురం జట్లే ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి. మహిళల విభాగంలో పిఠాపురం ద్వితీయ, డీఎస్ఏ కాకినాడ తృతీయ స్థానంలో నిలిచాయి. పురుషుల విభాగంలో డీఎస్ఏ కాకినాడ ద్వితీయ, సీబీసీ రాజమహేంద్రవరం తృతీయ స్థానంలో నిలిచాయని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి తెలిపారు. విజేతలకు మంత్రి సుభాష్, కూటమి పార్టీ నాయకులు వాసంశెట్టి సత్యం, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్ బహుమతులు అందించారు.

విజేత జట్టు సభ్యులతో సత్యం తదితరులు

వైద్య సేవలు మెరుగుపడాలి: కలెక్టర్

అమలాపురం కలెక్టరేట్: అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని కలెక్టర్ మహేష్‌కుమార్ వైద్యులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రాంతీయ ఆసుపత్రి వైద్యాధికారులు, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రి సేవలపై ఫిర్యాదులు వస్తున్నాయని వాటిని పరిష్కరించి వైద్యులు పనితీరును మెరుగు పరుచుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న ఈ ఆసుపత్రిలో నెలకు 120 ప్రసవాలు మాత్రమే చేయడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సంఖ్య 1500కు పెరిగేలా ప్రసూతి విభాగాన్ని అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల ఆసుపత్రిలో జిల్లా స్థాయి అధికారులు పరిశీలన చేసినా సేవల్లో పురోగతి కనిపించడం లేదన్నారు. కార్యక్రమంలో జేసీ నిశాంతి, డీఎంహెచ్‌వో దుర్గారావు దొర, డీసీహెచ్ఎస్ కార్తీక్, ఆసుపత్రి సూపరింటెండెంట్ శంకర్రావు, అధికారులు పాల్గొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ వై. కిరణ్ చంద్ (చీఫ్ మేనేజర్) మొబైల్ నెం.91609 49910,
ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, ఆస్తి తనిఖీ కొరకు : 9866027578

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 9(1)తో చదువబడు 8(6) నిబంధనలతో చదువబడు (సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన స్థిరాస్తుల అమ్మకము)

SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు లాంఛనాత్మక స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖాపెట్టిన ఆస్తి/ఆస్తుల ఈ-వేలం (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీత(లు) : శ్రీ సాకా లక్ష్మీ నారాయణ, తండ్రి : శ్రీ సాకా జనార్ధనరావు, డి.నెం.6-60, సాకా వారి వీధి, సోమేశ్వరం, రాయవరం మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533261. వేరొక చిరునామా : శ్రీ సాకా లక్ష్మీ నారాయణ, తండ్రి : జనార్ధనరావు, డి.నెం.7-1 & 7-2, కాపుల రామాలయం దగ్గర, సోమేశ్వరం, రాయవరం మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533261. శ్రీమతి సాకా వెంకట దుర్గ, భర్త : శ్రీ సాకా లక్ష్మీ నారాయణ, డి.నెం.6-60, సాకా వారి వీధి, రామాలయం దగ్గర, సోమేశ్వరం, రాయవరం మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533261. **డిమాండ్ నోటీసు తేది: 01-07-2022**

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం : తేది.16.06.2022 నాటికి రూ.4,40,56,912/- + తేది.17.06.2022 నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి.

ప్రస్తుత బకాయి మొత్తం: తేది.31-10-2025 నాటికి రూ.5,48,81,949/- + తేది.01.11.2025 నుండి భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి (మునుపటి జమలు మినహాయించిన తరువాత).

షెడ్యూల్ ఆస్తి వివరములు:

బ్లాక్ నెం.7, ఆర్.ఎస్.నెం.318/5, డి.నెం.7-1&7-2 లోని 191.77 చ॥గ॥ల విస్తీర్ణంలో గల నివాస భవనం (జిఎఫ్ + ఎఫ్ఎఫ్ + ఎస్ఎఫ్) యావత్తు ఆస్తి షెడ్యూలు డాక్యుమెంట్ ప్రకారం దిగువ తెలుపబడినది.

రిజిష్టర్డు సేల్ డీడ్ నెం.5266/2014, తేది.18.12.2014 ప్రకారం: తూర్పు గోదావరి జిల్లా, రామచంద్రాపురం సబ్-రిజిస్ట్రీ, సోమేశ్వరం పంచాయితీ, బ్లాక్ నెం.7, సోమేశ్వరం గ్రామం, ఆర్.ఎస్.నెం.318/5 లోని (65.77 + 11.67 = 77.44) చ॥గ॥ల విస్తీర్ణంలో సంబంధిత డి.నెం.7-1తో గల ఆస్తి. హద్దులు : ఐటమ్ నెం.1: తూర్పు : సాకా జానకి రామయ్య గారికి చెందిన గోడ, పడమర : ప్రభుత్వ వీధి, దక్షిణం: ఈ ఇంటికి మరియు గరగ జానకమ్మ గారికి చెందిన ఇంటికి ఉమ్మడి గోడ, ఉత్తరం : ఇక్కడ గల ఐటమ్ నెం.2 కొంతమేర మరియు పెద్దిరెడ్డి జానకమ్మ గారికి చెందిన స్థలం కొంతమేర.
పైన తెలిపిన హద్దులలో 65.77 చ॥గ॥ల విస్తీర్ణం అన్నీ ఈజిమెంట్ హక్కులతో కలదు.
ఐటమ్ నెం.2: తూర్పు : సాకా జానకి రామయ్య గారికి చెందిన గోడ, పడమర : పెద్దిరెడ్డి జానకమ్మ గారికి చెందిన స్థలం, దక్షిణం: ఇక్కడ గల ఐటమ్ నెం.1, ఉత్తరం : ఉమ్మడి గోడ దారి మార్గం.
పైన తెలిపిన హద్దులలో 11.67 చ॥గ॥ల విస్తీర్ణం అన్నీ ఈజిమెంట్ హక్కులతో కలదు.

రిజిష్టర్డు సేల్ డీడ్ నెం.4638/2015, తేది.24.09.2015 ప్రకారం: తూర్పు గోదావరి జిల్లా, రామచంద్రాపురం సబ్-రిజిస్ట్రీ, సోమేశ్వరం పంచాయితీ, బ్లాక్ నెం.7, సోమేశ్వరం గ్రామం, ఆర్.ఎస్.నెం.318/5 లోని (65.77 + 11.67 = 77.44) చ॥గ॥ల విస్తీర్ణంలో సంబంధిత డి.నెం.7-1తో గల ఆస్తి. హద్దులు : ఐటమ్ నెం.1: తూర్పు : సాకా జానకి రామయ్య గారికి చెందిన గోడ, పడమర : ప్రభుత్వ వీధి, దక్షిణం : ఈ ఇంటికి మరియు గరగ జానకమ్మ గారికి చెందిన ఇంటికి ఉమ్మడి గోడ, ఉత్తరం : ఇక్కడ గల ఐటమ్ నెం.2 కొంతమేర మరియు పెద్దిరెడ్డి జానకమ్మ గారికి చెందిన స్థలం కొంతమేర.
పైన తెలిపిన హద్దులలో 65.77 చ॥గ॥ల విస్తీర్ణం అన్నీ ఈజిమెంట్ హక్కులతో కలదు.
ఐటమ్ నెం.2: తూర్పు : సాకా జానకి రామయ్య గారికి చెందిన గోడ, పడమర : పెద్దిరెడ్డి జానకమ్మ గారికి చెందిన స్థలం, దక్షిణం : ఇక్కడ గల ఐటమ్ నెం.1, ఉత్తరం : ఉమ్మడి గోడ దారి మార్గం.
పైన తెలిపిన హద్దులలో 11.67 చ॥గ॥ల విస్తీర్ణం అన్నీ ఈజిమెంట్ హక్కులతో కలదు.

రిజిష్టర్డు సేల్ డీడ్ నెం.1284/2016, తేది.18.03.2016 (36.89 చ॥గ॥లు) ప్రకారం: తూర్పు గోదావరి జిల్లా, రామచంద్రాపురం సబ్-రిజిస్ట్రీ, సోమేశ్వరం పంచాయితీ, బ్లాక్ నెం.7, సోమేశ్వరం గ్రామం, ఆర్.ఎస్.నెం.318/5 లోని 36.89 చ॥గ॥ల విస్తీర్ణంలో సంబంధిత డి.నెం.7-1 మరియు 7-2లతో గల ఆస్తి. హద్దులు : తూర్పు : సాకా జానకి రామయ్య గారికి చెందిన గోడ, పడమర : ప్రభుత్వ వీధి, దక్షిణం : అమ్మకందారు నుండి సుంకర శ్రీనివాసరావు గారు కొనుగోలు చేసిన స్థలం, ఉత్తరం : కొనుగోలుదారుని స్థలం.
పైన తెలిపిన హద్దులలో 36.89 చ॥గ॥ల విస్తీర్ణం అన్నీ ఈజిమెంట్ హక్కులతో కలదు.
మొత్తం 191.77 చ॥గ॥ల స్థలం అందు గల నివాస (GF + FF + SF) భవనం.

రిజర్వు ధర : రూ.1,04,75,000/- ధరావత్తు : రూ.10,47,500/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేదీ : 09-12-2025 సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

అస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది:04-11-2025 నుండి 08-12-2025 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింకును రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఇయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను సంప్రదించండి.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.

గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలని సూచించటమైనది.

గమనిక -2 : ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 194-1A ప్రకారం అమ్మకంలో భాగంగా అమ్మకం విలువ రూ.50,00,000/- (యాభై లక్షల రూపాయలు) మరియు అంతకంటే ఎక్కువ ఉన్నచో సదరు మొత్తముపై TDS @ 1% వర్తిస్తుంది. కావున సఫలీకృత బిడ్డరు/కొనుగోలుదారు గవర్నమెంట్ గైడ్‌లైన్స్ ధర లేదా అమ్మకం ధరలో ఏది ఎక్కువైతే దానిలో 1% TDS ను తగ్గించుకొని సదరు మొత్తమును ఆదాయపు పన్ను డిపార్ట్‌మెంట్ యొక్క ఫారం నెం.16-బి నందు జమచేయవలెను మరియు సదరు ఒరిజినల్ TDS సర్టిఫికెట్‌ను బ్యాంకు వారికి సమర్పించవలెను.(వ్యవసాయ భూమి కాకుండా కేవలం స్థిరాస్తికి మాత్రమే వర్తించును).

తేది:31-10-2025, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

శ్రీ శ్రీనివాస గోల్డ్ తాకట్టులో ఉన్న బంగారం ఏబ్యాంక్, ప్రైవేట్ సంస్థల నుండి అయిన విడిపించి ఆరోజు మార్కెట్ రేటుకే కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 94933 38823

JOBS

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యూయర్స్. ఏజ్: 22-35. ఫ్రెషర్స్ కూడా కావలెను. ✆ 6281037879.

రామకృష్ణ గ్రూప్, Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటిపని, వంటపని, బేబికేర్ కొరకు స్త్రీ/పు కావలెను. బో+ వ+ జీతం: 16-18K. ✆ 97040 51122, 90106 80011.

అకడమిక్ ఇన్‌ఛార్జ్ కావలెను. నిడదవోలు ఒక ప్రముఖ పాఠశాలలో పనిచేయుటకు అనుభవజ్ఞులైనవారు కావలెను. ✆ 63009 53243, కాల్ టైమింగ్స్: 9 am to 7 pm.

రాజమండ్రిలో ప్రముఖ కలెక్షన్ ఏజెన్సీ నందు పనిచేయుటకు కలెక్షన్ & రికవరీ ఎగ్జిక్యూటివ్స్ మరియు టీం లీడర్స్ కావలెను. Contact: 99634 07777.

వంట మనిషి కావలెను ఫర్ గర్ల్స్ హాస్టల్ భార్యాభర్తలు రూమ్ అండ్ ఫుడ్ ఇస్తాము. కాల్ ఇన్ హైదరాబాద్. సంప్రదించండి: 8688823404, 9963880880.

WANTED Accountant Male/Female
Sri Maruthi Agencies
Hukumpeta, Rajahmundry
Cell: 98481 38203

FACULTY/ TEACHERS
Walk-in Interviews for Teachers of All Subjects at Cherukuri Vidyalayam, Korukonda. Contact: 8897516535.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-80 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

మాల సామాజిక వర్గం సమస్యల పరిష్కారానికి కృషి

మలికిపురం: నియోజకవర్గంలో మాల సామాజిక వర్గం ఎదుర్కొం టున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. విశ్వేశ్వరాయ పురంలో దళిత నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గెడ్డం సింహా నివాసం వద్ద ఆయన అధ్యక్షతన సోమ వారం జరిగిన మాలల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ దళి తులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. గెడ్డం మహాలక్ష్మీప్రసాద్, తాడి సత్యనారాయణ, మోహన్, నల్లి శివ, పోలమూరి శ్యాంబాబు, బందెల పద్మ, రాపాక ఆనందకుమార్, రేవు జ్యోతి, నక్కా రామా రావు, జాన్‌బాబు, బత్తుల లక్ష్మణరావు తదితరులు పలు సమస్యలను ఎమ్మెల్యేకి వివరించారు.

విద్యార్థుల్లో సేవాభావం పెంపొందించాలి

మాట్లాడుతున్న డీఈవో సలీంబాషా

రావులపాలెం పట్టణం: విద్యార్థుల్లో దేశభక్తి, సేవాభావం పెంపొందేలా ఉపా ధ్యాయులు కృషిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా కోరారు. రావుల పాలెం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గైడ్ కెప్టెన్స్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీఈవో మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో భారత్ స్కౌట్ మరియు గైడ్స్ ట్రూప్స్‌ను ఏర్పాటుచేశామ న్నారు. గత సంవత్సరం సాధారణ శిక్షణ తీసుకున్న వారికి ప్రస్తుతం అడ్వాన్స్ కోర్సుపై శిక్షణ ఇస్తునామన్నారు. శిక్షణా కేంద్రం కోఆర్డినేటర్ పి.రాంబాబు, ఉమాదేవి, సుశీల, రజియాబేగం, జానకీదేవి పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు పశ్చిమగోదావరి జిల్లా వీరవా సరం మండలం నందమూరిగరువుకు చెందిన పంజా జయరామ్ కుటుంబ సభ్యులు రూ.50,116 విరాళం సోమవారం సమర్పించారు. వీరికి స్వామి వారి చిత్రపటం అందజేసి దేవస్థానం ప్రతినిధి శ్రీనివాస్ అభినందించారు. **వాడపల్లి:** మలికిపురంలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కండె బాలరాజు, చంద్రకళ దంపతులు రూ.10,116ల విరాళంగా సమర్పించారని ఆలయ ధర్మకర్త హరిప్రసాదరావు సోమవారం చెప్పారు.

కుంగ్‌ఫూ, తైక్వాండోలో పతకాలు

మామిడికుదురు, న్యూస్‌టుడే: జాతీయస్థాయిలో విజయవాడలో ఆది వారం జరిగిన కుంగ్‌ఫూ ఛాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక దీప్తి కళాశాల చెందిన ఇద్దరు విద్యార్థినులు ప్రతిభ చూపారు. 9వ తరగతి చదువుతున్న ఓడూరి మనోజ్ఞశ్రీ బంగారు, 6వ తరగతి చదువుతున్న కడలి శ్యామశ్రీ రజత పతకం సాధించారు. కళాశాల కరస్పాండెంట్ డి.వి.వి.సత్యనారా యణ, హెచ్‌ఎం వై.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు వారిని అభినందించారు. **రాజోలు:** తైక్వాండో పోటీల్లో రాజోలు జడ్పీ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న యెడబండి గంగాభవాని ప్రతిభ కనబరిచింది. ఏలూ రులో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ ఫెడరేషన్ పోటీల్లో రజత పతకం సాధిం చింది. ప్రధానోపాధ్యాయురాలు సుహాసిని, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

ప్రజలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యానందరావు

రావులపాలెం (గ్రామీణం(ఆలమూరు): ప్రజలకు అవసరమైన ప్రోత్సాహాలను అందించి పారిశ్రా మిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరు మండలం చెముడులంకలో సోమవారం నిర్వహించిన ఎంఎస్‌ఎంఈ అవగాహన సదస్సులో సత్యానంద రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంతోపాటు యువత, మహిళలు పారిశ్రామికాభివృద్ధిపై దృష్టిసారించాలన్నారు. ఈ ప్రాంతంలో లభించే కొబ్బరి, అరటితో పరిశ్రమలు ఏర్పాటుచేసేలా కృషిచేయాలన్నారు. మహిళలకు ఇప్పుడు స్వయం వృద్ధి అవకాశాలు పెరిగాయని వాటిని వారు అందిపుచ్చుకుని ముందుకు సాగాలన్నారు. డీఆర్డీఏ పీడీ సాయి జయచంద్ర, ఇండస్ట్రియల్ ఎండీ ఆదిలు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, శ్రీనివాస్, స్వామినాయుడు, ఎంపీపీ రాజు, తహసీల్దార్ ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి నిధులు

అంబాజీపేట, న్యూస్‌టుడే: పాఠశాలల అభివృద్ధి పనులకు నిధులు కేటా యిస్తున్నట్లు ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి అన్నారు. అంబాజీపేట మండలం వెన్నెపువారిపాలెంలో మండల పరిషత్ పాఠశాల సమగ్రశిక్ష పథకంలో వివిధ అభివృద్ధి పను లకు సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి పేరాబత్తుల దొరబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రహరీ నిర్మాణానికి రూ.9.37 లక్షలు, బాలుర మరుగుదొడ్లకు రూ.3.80 లక్షలు, భవనం మరమ్మతుకు రూ.6 లక్షలు మంజూరైనట్లు ఎంఈవోలు కె.వెంకటే శ్వరరావు, మోకా ప్రకాష్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వాకపల్లి దొరబాబు, క్లస్టర్ ఛైర్మన్ కడలి సాయిరాం పాల్గొన్నారు.

ఆశల వారధి.. ఆలస్యం తగదు..

– న్యూస్‌టుడే, ఆత్రేయపురం

డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కీలకమైన వారధుల్లో ఒకటైన ఆత్రేయపురం శివారు ముక్తేశ్వరం కాలువపై 1883లో నిర్మించిన బ్యాంక్ కెనాల్ లాకుల వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరు కుంది. అడుగు భాగంలో శ్లాబు పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటకు రావడంతో ప్రమాదక రంగా మారింది. ఇరువై పులా నిర్మించిన రెయి లింగ్, రక్షణ గోడ దెబ్బ తిన్నాయి. గతంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ కొత్త వంతెన నిర్మి స్తానని ఇచ్చిన హామీని అమలు చేయలేకపో యారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కొత్త వంతెన నిర్మాణానికి చొరవ చూపుతున్నారు. అసెంబ్లీ సమావేశంలో ప్రభుత్వం దృష్టికి తీసుకె ళ్లారు. ఈ నేపథ్యంలో ఆలస్యం చేయకుండా కొత్త వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతు న్నారు. వంతెన ఇరుకుతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. 14 మీటర్ల వెడల్పున వంతెన, ఇతర కట్టడాల నిర్మాణానికి రూ.75 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించా మని ఇరిగేషన్ ఏఈ సాయి మాదవ ప్రసన్న తెలిపారు.

అడుగు భాగంలో శ్లాబు నుంచి బయటకు వచ్చిన ఇనుప చువ్వలు

శిథిలమైన బ్యాంక్ కెనాల్ వంతెన

వాడపల్లికీ ఇదే మార్గం..

కోనసీమకు ఆయువుపట్టుగా ఉన్న వంతెన నిర్మాణంలో జాప్యం తగదు. రాజమహేంద్రవరం, నిడదవోలు, ధవళేశ్వరం, కొవ్వూరు తదితర పట్టణాలకు చెందిన వాహనదారులు ఈ వంతెనపై నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. వాడపల్లి వేంకటేశ్వరస్వామివారి ఆల యానికి ప్రతీ శనివారం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు కూడా వస్తుం టాయి. వంతెన శిథిలావస్థకు చేరి రోజు రోజుకు ప్రమాదకరంగా మారుతోంది. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి. – కరుటూరి వరప్రసాదు, రైతు, అంకంపాలెం

చర్యలు తీసుకోవాలి..

ప్రభుత్వం వంతెన పునర్నిర్మాణానికి చొరవ చూపాలి. వంతెన కింది శ్లాబు, రక్షణ గోడలు సమూ లంగా పాడయ్యాయి. ప్రస్తుతం దీనిపై ప్రజలు బిక్కుబిక్కు మంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. అక్కడ ఇరుకుతో పాటు మలుపు కూడా ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటు న్నాయి. కాలువలో పడి పలువురు మృత్యువాత కూడా పడ్డారు. వెంటనే నిధులు మంజూరు చేయాలి. – చవ్వాకుల గంగరాజు, ఆత్రేయపురం

రావులపాలెంలో మెగా జాబ్ మేళా

రావులపాలెం పట్టణం: వికాస, సంహితా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో 5వ తేదీన రావులపాలెంలో సంహిత డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని కళాశాల ఛైర్మన్ దినేష్‌బాబు అన్నారు. సోమవారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ డెక్కన్ కెమికల్, ఇసుజు మోటార్స్, ఫాక్స్‌కాన్ కంపెనీల ప్రతినిధులు బుధవారం ఉద్యో గాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని, అర్హతలు 10వ తరగతి, డిప్లొమో, ఐ.టి.ఐ, బీటెక్ ఉత్తీర్ణులై, 35 సంవత్సరాలలోపు వయసు గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

వీఆర్వోపై చర్యలు తీసుకోవాలి

మలికిపురం: గుడిమెల్లంకలో మొంథా తుపాను బాధితుల జాబితా తయారీలో వీఆర్వో ఇష్టారాజ్యంగా వ్యవహరించడంపై స్థానిక కూటమి నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. జాబితాలో నిజమైన అర్హులైన తమ పేర్లు లేకుండా వీఆర్వో తన ఇష్టమొచ్చిన వారిని అనర్హుల పేర్లు చేర్చారన్నారు. వీఆర్వో కార్యాల యానికి వచ్చి ఆయనపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేని కోరుతూ నినాదాలు చేశారు. కట్టా వెంకటరమణ, రాము, గవరాజు ఉన్నారు.

శాంతి హోమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆల యంలో మంగళవారం జరిగే మహాశాంతి హోమంలో నియోజకవర్గం నుంచి ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ విజ్ఞప్తి చేశారు. విశ్వేశ్వ రాయపురంలోని క్యాంపు కార్యాలయంలో సోమ వారం ఆయన మాట్లాడారు. మొంథా తుపాను నుంచి నియోజకవర్గాన్ని కాపాడింది అంతర్వేది లక్ష్మీనరసింహస్వామే అన్న ప్రగాఢ విశ్వాసంతో ఆ దేవునికి కృతజ్ఞతలు చెప్పుకోవాలన్న ప్రజల అభీష్టం మేరకు హోమం ఏర్పాటుచేశామన్నారు. ఈ మేరకు ఆలయంలో పోలీసులు, వాలంటీర్లను నియమిస్తున్నామని, ఎవరికీ ఎలాంటి భయం లేకుండా బందోబస్తు ఉంటుందన్నారు.

అంతర్వేదికి ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు..

నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల నుంచి హోమంలో పాల్గొనేందుకు వచ్చే భక్తులకు ఉచితంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. కరవాక, రాజోలు, తాటిపాక, సఖినేటిపల్లి నుంచి బస్సులు నడుపుతున్నట్లు పేర్కొ న్నారు. రాజోలు నుంచి మలికిపురం-మోరి-శృంగవరప్పాడు మీదుగా, గోగ న్నమఠం నుంచి రాజోలు మీదుగా అంతర్వేదికి తిరుగుతాయన్నారు.

ఆలమూరులో పెట్రోలు బంకు ఏర్పాటుకు స్థల పరిశీలన

ఆలమూరు, న్యూస్‌టుడే: పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆలమూరులో ఐ.ఒ.సి పెట్రోలు బంకును ఏర్పాటుచేసేందుకు అధికారులు సోమ వారం స్థల పరిశీలన చేశారు. ఆలమూరులోని పోలీసుస్టేషన్ పక్కన ఉన్న ఖాళీస్థలాన్ని ఏఆర్ డీఎస్పీ సుబ్బారావు, సీఐ విద్యాసాగర్, ఆల మూరు ఎస్సై నరేష్, ఐ.ఒ.సి ప్రతినిధులు పరిశీలించారు.

విశేష అలంకరణలో వాడపల్లి అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి

మాచవరంలోని పార్వతీ రాజేశ్వరస్వామికి క్షీరాభిషేకం

రావులపాలెంలోని పార్వతీ రామలింగేశ్వరస్వామి

లక్షపత్రి పూజ అనంతరం మందేశ్వర స్వామి

నర్సిపూడిలోని ఉమాపార్వతీ సమేత సోమేశ్వరస్వామి

నేదునూరులో చెన్న మల్లేశ్వరస్వామి

హరోం హర.. శివ శివ..

రాజోలు, ఆత్రేయపురం, మలికిపురం, అంబాజీపేట, పి.గన్నవరం, మామిడికుదురు, రావులపాలెం పట్టణం, గ్రామీణం, కొత్తపేట, అయినవిల్లి, న్యూస్‌టుడే: కార్తికమాసం రెండో సోమవారం శైవక్షేత్రాలు శివనామ స్మరణతో మార్మోగాయి. తెల్లవారు జాము నుంచి భక్తులు ఆలయాలకు బారులుతీ రారు. పలు ఆలయాల్లోని విగ్రహాలకు అష్టోత్తర శతనామావళి పూజలు, అభిషేకాలు, లక్షపత్రి పూజలు, కల్యాణాలు, క్షీరాభిషేకాలు జరిగాయి. అంబాజీపేట శివారు కొర్లపాటివారిపాలెంలోని భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో దీపోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు చెరువుల్లో, ఘాట్లలో దీపాలు వదిలారు.

ర్యాలి కాలువలో దీపాలు వదులుతున్న భక్తులు

సోము వీర్రాజుకు సత్కారం

పి.గన్నవరం: భాజపా శాసనమండలి ఫ్లోర్‌లీడర్‌గా ఎన్నికైన ఎమ్మెల్సీ సోము వీర్రాజును సోమవారం రాజమహేంద్రవరం గ్రామీణం కొంత మూరులో మాజీ ఎమ్మెల్యే, భాజపా జాతీయ కార్యమండలి సభ్యుడు మానేపల్లి అయ్యాజీవేమా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్మనిర్భర్ కన్వీనర్, మాజీ సర్పంచి చీకరమెల్లి శ్రీనివా సరావు, గంట పెద్దిరాజు, కోటిపల్లి సాయిరామ్ పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

అంబాజీపేట: మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు నీట మునిగిన కాలనీల్లో పారిశుద్ధ్య లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు తెలిపారు. తొండవరంలో సర్పంచి పేరాబత్తుల రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ముంపునీ టిని బయటకు మళ్లించారు. పరిసరాలను శుభ్రం చేయంచి బ్లీచింగ్ చల్లించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.లోవబాబు పాల్గొన్నారు.

కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న సఖినేటిపల్లి తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎస్సై దుర్గాశ్రీనివాస్, కేశవదాసుపాలెం వీఆర్వో నాగరాజు, రాజోలు తహసీల్దార్ భాస్కర్, మలికిపురం తహసీల్దార్ టి.శ్రీనివాసరావు, పశువైద్యాధికారి డి.శివకుమార్, వీఆర్వో పి.హరికిషన్, పి.గన్నవరం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కల్యాణచక్రవర్తి, హెడ్‌వర్క్స్ ఈఈ గంగుమళ్ల శ్రీనివాస్, పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు, జలవనరుల శాఖ ఏఈ నవీన్‌కుమార్, అంబాజీపేట విద్యుత్తుశాఖ ఏఈ పి.కవిత, జిల్లా మార్కెటింగ్ అధికారి కెఎస్‌వీ.విశాలాక్షి, కొత్తపేట తహసీల్దార్ రాంబాబు

ఉత్తమ సేవలకు పురస్కారాలు

సఖినేటిపల్లి, కొత్తపేట, రాజోలు, మలికిపురం, పి.గన్నవరం, అంబాజీపేట, న్యూస్‌టుడే: మొంథా తుపాను సమయంలో బాధిత ప్రాంతాల్లో ప్రజల భద్రత, పునరావాస చర్యలు, రక్షణ కార్యక్రమాల్లో చేసిన అత్యుత్తమ సేవలను గుర్తిస్తూ అధికారులకు ఉత్తమ సేవా పురస్కారాలు సోమవారం అందించారు. అమలాపురంలో కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్‌మీనా చేతులమీదుగా పలువురు అధికారులు ఉత్తమ సేవా పురస్కారాలను అందుకున్నారు.

చెత్తకు నిప్పు.. విద్యుత్తు స్తంభానికి ముప్పు

కొత్తపేటలో పెద్ద అగ్ని ప్రమాదం త్రుటిలో తప్పిందని విద్యుత్తు శాఖ ఏఈ ఎస్.రామకృష్ణ అన్నారు. సోమవారం మధ్యాహ్నం కొత్తపేటలోని శ్రీకరి శుభకరి కన్వెన్షన్ హాలు రోడ్డులో నరేన్ డెంటల్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న విద్యుత్తు స్తంభం పక్కన చెత్తకుప్పకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు వేగంగా చెలరేగి ప్రక్కన గల విద్యుత్తు స్తంభానికి, ప్రధాన విద్యుత్తు వైర్లకు వ్యాపించడంతో వైర్లు కాలిపోయాయి అని తెలిపారు. విద్యుత్తు శాఖ ఏఈ మాట్లాడుతూ తమకు సమాచారం అందిన వెంటనే స్పందించి ఆ ప్రాంతానికి విద్యుత్తు సర ఫరాను నిలిపివేయడం వలన షార్ట్‌సర్క్యూట్ అయ్యే ప్రమాదం తప్పిందని తెలిపారు. - న్యూస్‌టుడే, కొత్తపేట

శంకరగుప్తంలో ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

మలికిపురం: లక్కవరం ఎస్‌ఏవీఎం డిగ్రీ కళాశాల ఎస్ ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో శంకరగుప్తం గ్రామంలో గత వారం రోజుల క్రితం చేపట్టిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం సోమవారం ముగిసింది. ప్రజలు ఆరోగ్యం పట్ల తీసుకోవా ల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సర్పంచి రాపాక ఆనందకుమార్‌ను శాలువాతో సన్మానించారు. కరస్పాండెంట్ ఎం.వి.సత్యప్రసాద్, కార్యదర్శి సీతారామరాజు, డైరెక్టరు ఏబీ నాయుడు, ఎన్‌ఎస్‌ఎస్ పీవో యడ్ల శివాజి పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం అండ

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేటలోని దొమ్మేటి ఏడుకొండలు చౌకధరల దుకాణం వద్ద సోమ వారం తుపాన్ బాధిత చేనేత కార్మికుల కుటుంబాలకు 50 కిలోల బియ్యం, కందిపప్పు, నూనె, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు పంపిణీ చేశారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర జలవనరుల కార్పొరేషన్ డైరె క్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు అరి గెల సూరిబాబు, ఏఎంసీ వైస్ ఛైర్మన్ కొర్లపాటి వెంక టేశ్వరరావు, కూటమి నేతలు కొర్లపాటి గోపి, మహి పాల తాతాజీ, రవణం రాము పాల్గొన్నారు.

విజ్ఞానదాయకంగా నైపుణ్య పోటీలు

మామిడికుదురు, న్యూస్‌టుడే: మామిడికుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలో వృత్తి విద్యా శిక్షణలో భాగంగా నైపుణ్య పోటీలు సోమవారం విజ్ఞానదాయకంగా జరిగాయి. ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, రిటైల్ వృత్తి కోర్సుల్లో ఈ ప్రదర్శనలు ఏర్పాటయ్యాయి. మండల స్థాయిలో ప్రతిభ చూపిన మూడు విభాగాల నుంచి ఆరు బృందాలను ఎంపిక చేసి జిల్లా స్థాయికి పంపించినట్లు హెచ్‌ఎం బి.చిరంజీవిరావు తెలిపారు.

నేడు కొత్తపేటలో అవగాహన సదస్సు

కొత్తపేట: కొత్తపేట బులిసత్యం చంద్రావతి కాపు కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధ్యక్షతన ఎమ్ఎస్ఎమ్ఈ అవగాహన సదస్సు నిర్వహి స్తున్నామని తెదేపా నాయకుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు కోరారు. ఇంటికి ఒక పారి శ్రామికవేత్తని తయారు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పాన్ని పరిశ్రమలు స్థాపిం చాలనుకుంటున్న యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పుష్కరఘాట్‌లో గుర్తుతెలియని మృతదేహం

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీ పేట మండలంలోని వాకలగరువు పుష్క రఘాట్ వద్ద సోమవారం సాయంత్రం స్థానికులు గుర్తుతెలియని వ్యక్తి మృతదే హాన్ని గుర్తించారు. 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు ఉంటుందని చెబుతు న్నారు. గోదావరి నదిలో కొట్టుకు వచ్చి నట్లు భావిస్తున్నారు. దీనిపై తమకు ఎలాంటి సమాచారం లేదని ఎస్సై కె. చిరంజీవి విలేకరులకు తెలిపారు.

వీరవేణు కుటుంబానికి అండగా ఉంటాం

మామిడికుదురు, న్యూస్‌టుడే: మండలంలోని మాకనపాలెంలో తుపాను కారణంగా తాటిచెట్టు పడి మృతి చెందిన గూడపల్లి వీరవేణు కుటుంబానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుం దని నాయీబ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ రుద్రకోటి సదాశివం అన్నారు. కార్పొరేషన్ డైరెక్టర్లతో కలిసి సోమవారం మృతురాలి కుటుం బాన్ని పరామర్శించి ఆమె చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. తనవంతు సాయంగా రూ.5 వేలు అందజేశారు. కార్పొరేషన్ డైరెక్టర్లు కె.నూకరాజు, ఎల్.రత్నరావు, వై.ఏసు, సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు గోపాలకృష్ణ, ఎమ్.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి సన్నిధిలో
మహాశాంతి హోమ మహోత్సవ ఆహ్వానం
ది. 4-11-2025 మంగళవారం ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు
మహాశాంతి హోమం జరుపబడును. మొంథా తుపాను ఉధృతి నుండి అంతర్వేది,
పరిసర గ్రామాలను అనూహ్యంగా రక్షించిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారికి కృతజ్ఞతాభావంతో
మహాశాంతి హోమంలో పాల్గొనడానికి మన రాజోలు
నియోజకవర్గం నుండి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి మహాశాంతి హోమాన్ని
జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను.
భక్తులందరికీ అన్నసమారాధన చేయబడును.



దేవ వరప్రసాద్, IAS Retd,
శాసనసభ్యులు
రాజోలు
నియోజకవర్గం

(c) eenadu

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

విజేతలకు నగదు పురస్కారం

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా అమరావతిలో నిర్వహించిన క్రీడా పోటీలు-2025లో విజయం సాధించిన వారికి సోమవారం కలెక్టర్ మహేష్‌కుమార్ చేతుల మీదుగా నగదు పురస్కారం అందించారు. బాడ్మింటన్ సింగిల్స్‌లో వై.నందకిశోర్, డబుల్స్‌లో ఆదిత్యరామ్, గౌతమ్ కుమార్‌కు మొదటి స్థానం, బాక్సింగ్‌లో ద్వితీయ స్థానంలో 67కేజీల విభాగంలో ఎన్. దిలీప్, 71 కేజీల విభాగంలో మోహన్ రాజులు విజయం సాధించినట్లు అధికారులు తెలిపారు. వీరిని కలెక్టర్ అభినందించారు. జిల్లా క్రీడాప్రాధికారిక సంస్థ అధికారి వైకుంఠరావు, భీమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జయహో భారత నారీ

కాట్రేనికోన, న్యూస్‌టుడే: దేశానికి మహిళా క్రికెట్ ప్రపంచకప్‌ను అందించిన భారతమహిళల జట్టుకు అభినందనలు తెలుపుతూ చిత్రకారుడు ఆకొండి అంజి చిత్రం గీశారు. రానున్న రోజుల్లో ఎందరో మహిళలు, చిన్నారులు వీరి విజయాన్ని ఆదర్శంగా తీసుకుని తమకు నచ్చిన రంగంలో మరింత ముందుకు దూసుకువెళ్లనున్నారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

అంజి గీసిన చిత్రం

నిందితులకు శిక్ష పడేలా చేస్తాం

శ్రీనివాస్ భార్య లక్ష్మి, కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి సుభాష్, ఎంపీ హరీష్ మాథుర్

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: కంచిపల్లి శ్రీనివాస్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించేలా చేస్తామని మంత్రి సుభాష్, ఎంపీ హరీష్ మాథుర్ పేర్కొన్నారు. కొంకాపల్లిలో శ్రీనివాస్ భార్య లక్ష్మి, కుటుంబ సభ్యులను వారు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు చేసి నివాళి అర్పించారు. వైకాపా గుండాలు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా న్యాయం చేసేలా చూస్తామన్నారు. నేరస్థులు, గుండాలకు ఫ్లెక్సీలు కట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ చిక్కాల గణేష్, బొర్రా ఈశ్వరరావు, అబ్బులు, చిక్కాల రాంబాబు పాల్గొన్నారు.

సృజన.. వైజ్ఞానిక ప్రదర్శన

విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న జీసీడీవో భీమారావు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో సృజనాత్మకత, కొత్త అంశాల్ని కనిపెట్టాలనే జిజ్ఞాస, వైజ్ఞానిక అంశాలపై ఆసక్తి కలిగించేలా నైపుణ్య పోటీలను నిర్వహిస్తున్నామని జిల్లా ఒకేషనల్ కోఆర్డినేటర్ రమేష్ తెలిపారు. అమలాపురం పట్టణంలోని జడ్పీ బాలుర హైస్కూల్‌లో జీసీడీవో భీమారావు ఆధ్వర్యంలో వృత్తివిద్య కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. హెచ్ఎం రామకృష్ణ, రాజేశ్వరరావు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పౌర సేవలకు పరుగులు

టిడ్కో వాసుల అవస్థలు

న్యూస్‌టుడే, అల్లవరం

పట్టణాల్లో నివాసం ఉంటున్న పేదలకు సొంత గూడు ఉండాలనే లక్ష్యంగా 2017లో అప్పటి తెదేపా ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. వీటి నిర్మాణం పూర్తి చేసి, అన్ని సౌకర్యాలకు కల్పించి లబ్ధిదారులకు అందించే సమయానికి ప్రభుత్వం మారిపోయింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వీటిని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో ఇక్కడ నివాసం ఉంటున్న వారికి పాట్లు తప్పడం లేదు.

అమలాపురం పురపాలిక పరిధిలో..

అమలాపురం పురపాలిక పరిధిలోని పేదలకు అల్లవరం మండలం బోడసకుర్రులో 52 బ్లాకుల్లో 1632 ప్లాంట్లు నిర్మించారు. వీటి వద్ద కనీస వసతులు పూర్తి చేయకుండానే వైకాపా ప్రభుత్వం లబ్ధిదారులకు అందించింది. అప్పటి నుంచి వీరికి ఏవిధమైన సౌకర్యాలు లేవు. మురుగు కదలక, తాగు నీరు పూర్తి స్థాయిలో అందక, వ్యర్థాలను సక్రమంగా తొలగించక నివాసితులు ఇబ్బంది పడుతున్నారు.

700 కుటుంబాలు

బోడసకుర్రు టిడ్కో గృహాల వద్ద ప్రస్తుతం 700 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వీరంతా ప్రస్తుతం అమలాపురం పురపాలిక పరిధిలోని 15వ వార్డు సచివాలయాల పరిధిలో నమోదై ఉన్నారు. వీరు ప్రభుత్వ సేవలు పొందాలంటే సుమారు 12 కి.మీ. దూరం ప్రయాణించి అమలాపురంలోని సచివాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. కుల, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, పలు పథకాలకు సంబంధించి ఈ-కేవైసీ ప్రక్రియలు పూర్తి చేయించుకునేందుకు, ఇతర అవసరాల నిమిత్తం ఎన్నో వ్యయప్రయాసలకోర్చి అమలాపురం వెళ్తున్నారు.

మురుగు నీటిలో అస్తవ్యస్తంగా ఉన్న టిడ్కో గృహ సముదాయం

సచివాలయం ఏర్పాటు చేయక..

2019లో వైకాపా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చినా టిడ్కో గృహాల వద్ద కార్యాలయం ఏర్పాటు చేయలేదు. ఇక్కడి నుంచి కనీస రవాణా సదుపాయం లేక ఇక్కట్లు తప్పడం లేదు. వీరు అమలాపురం రావాలంటే సుమారు 3కి.మీ నడిచి జాతీయ రహదారికి చేరుకుంటున్నారు. అక్కడి నుంచి ఆటోలు, ఇతర వాహనాలను ఆశ్రయిస్తున్నారు. అధికారులు స్పందించి తమకు ప్రత్యేక గ్రామ సచివాలయం ఏర్పాటు చేయాలని, లేకుంటే సమీపంలోని బోడసకుర్రు సచివాలయంలోనైనా కలపాలని కోరుతున్నారు.

స్థానికంగానే పింఛన్లు

గత నెల నుంచి పింఛన్లను టిడ్కో గృహాల వద్దనే అందిస్తున్నాం. వారికి అవసరమైన పౌర సేవలకు మాత్రం అమలాపురం వస్తున్నారు. ప్రత్యేకంగా సచివాలయం ఏర్పాటు అనేది కలెక్టర్ స్థాయి అధికారులు తీసుకోవాల్సిన అంశం. వారిని బోడసకుర్రు సచివాలయంలో హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నాం.

-నిర్మల్ కుమార్, కమిషనర్ అమలాపురం

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

అమలాపురం పట్టణం: 79939 35935, గ్రామీణం: 91000 20948
అల్లవరం: 91548 46718, ముమ్మిడివరం: 80085 74166
కాట్రేనికోన: 79950 67044 ఉప్పలగుప్తం: 91548 46716

పూడిక తీశారు..

సమస్య: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని కొండాలమ్మచింత ప్రాంతంలో డ్రెయిన్ పూడిపోవడంతో నీరు ముందుకు పారక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. -పి.నారాయణరావు, స్థానికుడు

సమస్య: నగర పంచాయతీ పరిధిలోని మార్కెట్ ప్రాంతంలో డ్రెయిన్‌లో చెత్త పడి దుర్వాసన వస్తోంది. డ్రెయిన్‌లో పూడికలను తొలగించి సమస్యను పరిష్కరించాలి.

-ఎం.నాగేశ్వరరావు, స్థానికుడు

పరిష్కారం: నగర పంచాయతీ పరిధిలోని కొండాలమ్మచింత, మార్కెట్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలను కమిషర్ రవివర్మ దృష్టికి తీసుకెళ్లగా పారిశుద్ధ్య కార్మికులను పంపి సమస్యను పరిష్కరించారు.

-న్యూస్‌టుడే, ముమ్మిడివరం

పరిహారంలో నిర్లక్ష్యం చేశారని ఫిర్యాదు

అల్లవరం, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో ఇబ్బందులు పడిన తమకు పరిహారం అందించడంలో రెవెన్యూ అధికారులు, గ్రామ సర్పంచి నిర్లక్ష్యం వహించారని ఓడలరేవు గ్రామస్థులు సోమవారం అమలాపురం ఆర్డీవో కె.మాధవికి ఫిర్యాదు చేశారు. పునరావాస కేంద్రంలో సుమారు 400 మందికి భోజన వసతి కల్పించారన్నారు. నగదు పరిహారానికి గ్రామంలో పూరిళ్లలో ఉన్నవారిని మాత్రమే నమోదు చేశారన్నారు.

కార్తిక సోమవార పూజలు

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం సోమవారం శివనామస్మరణతో మారుమోగింది. ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. సుమారు 10 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు అంచనా. శ్రీసాయి ఆక్వా ఏజెన్సీ సంస్థ ద్వారా అన్నప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

యానాం డీటీ బాధ్యతల స్వీకరణ

యానాం: పుదుచ్చేరి రెవెన్యూ, ప్రకృతి వైపరీత్య నిర్వహణశాఖ నిర్వహించిన డిప్యూటీ తహసీల్దారు పరీక్షలో ఎంపికైన జువ్వల బాలశ్రీ సోమవారం డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. 30 మంది అభ్యర్థులకు పోస్టింగులు కేటాయిస్తూ కలెక్టర్ కుళోత్తుంగన్ గతవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతవరకు రెవెన్యూశాఖ డీటీగా బాధ్యతలు నిర్వహించిన ఆర్.జోతి వెంకటేశ్వరరావు ఇక నుంచి తూనికలు కొలతలుశాఖ డీటీగా బాధ్యతలు నిర్వహిస్తారు.

రహదారా.. డంపింగ్ యార్డా..?

అమలాపురం నల్లవంతెన బైపాస్‌రోడ్డులో వ్యర్థాలు పడేయడంతో డంపింగ్‌యార్డును తలపిస్తోంది. ఇక్కడ చెత్త వేస్తున్నారని మున్సిపల్ కమిషనర్ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో చెత్తను తొలగించి మొక్కలు నాటించారు. అయినా అక్కడే చెత్త వేస్తున్నారు. కొద్ది దూరంలోనే డంపింగ్‌యార్డు ఉండగా బాధ్యత లేకుండా ఇక్కడ చెత్త వేస్తుండటం గమనార్హం. అధికారులు, ప్రజా ప్రతినిధులు నిత్యం తిరిగే ఈ రహదారైనా పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

ఈ నిర్మాణాలు పూర్తయ్యేదెన్నడో..?

కాట్రేనికోన-4 గ్రామ సచివాలయానికి సంబంధించి గచ్చకాయలపోరలో నిర్మాణం చేపట్టిన భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. మూడున్నరేళ్ల క్రితం చేపట్టిన గ్రామసచివాలయం, రైతుసేవా కేంద్రం భవనాల నిర్మాణాలు స్లాబ్ పూర్తయ్యాక నిలిచాయి. గోడలు నిర్మించి మిగిలిన పనులు పూర్తి చేయాల్సి ఉంది. స్థానిక తుపాను రక్షిత భవనంలో గ్రామసచివాలయ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. అధికారులు స్పందించి ఈ నిర్మాణం పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, కాట్రేనికోన

గుర్రపుడెక్క కమ్మేసింది

మురుగు కాలువల్లో గుర్రపుడెక్క పేరుకుపోయి ముంపు దిగేందుకు ఆటంకంగా మారుతోంది. గడిచిన పదేళ్లుగా కాలువల్లో తట్టమట్టి తీసిన పరిస్థితి లేదు. దీంతో గుర్రపుడెక్క, తూడు పేరుకుపోయి ముంపు సమయాల్లో కాలువల్లో నీరు దిగడం లేదు. ముమ్మిడివరంలోని వృద్ధ గౌతమి డ్రెయిన్‌లో గుర్రపుడెక్క పేరుకుపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు ముంపు దిగక రైతులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. తొలగింపు పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, ముమ్మిడివరం

ఆదమరిస్తే అంతే..!

అమలాపురంలోని ఎర్రవంతెన నుంచి ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే రోడ్డులో గుంత పడింది. అటుగా వెళ్లే ప్రయాణికులు, స్థానికులు ఆదమరిచి వెళ్తే పెను ప్రమాదమే. పురపాలక అధికారులు గుంతను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

ఉత్తమ సేవలకు పురస్కారం

అల్లవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం: మొంథా తుపాను సమయంలో క్షేత్రస్థాయిలో మెరుగైన సేవలందించిన అధికారులు, సిబ్బందికి ప్రభుత్వం పురస్కారాలను అందజేసింది. సోమవారం అమలాపురంలో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వీరికి అవార్డులు బహూకరించారు.

కలెక్టర్ మహేష్‌కుమార్ నుంచి పురస్కారాలను అందుకొంటున్న నరసింహారావు(తహసీల్దార్- అల్లవరం), దివాకర్(తహసీల్దార్- అమలాపురం). వీవీఎస్ఎన్ మూర్తి(మెరైన్ సీఐ, ఓడలరేవు), విశ్వేశ్వరరావు (కలెక్టరేట్ ఏవో). రాజేష్(ఉప్పలగుప్తం ఎస్సై). నాగలక్ష్మమ్మ (తహసీల్దార్- కలెక్టరేట్), రామిరెడ్డి (సమాచార శాఖ డివిజనల్ అధికారి). నాగరాజు , సతీష్ (ఫొటో గ్రాఫర్లు). నరసింహ(వీడియోగ్రాఫర్), శివకుమార్(సమాచార శాఖ), సర్వేశ్వరరావు(కలెక్టరేట్) విజయేంద్ర(డీఆర్‌డీఏ ఏపీఎం) రవికిరణ్(తహసీల్దారు కాట్రేనికోన) అవినాష్(ఎస్సై- కాట్రేనికోన), రవివర్మ(కమిషనర్- ముమ్మిడివరం నగర పంచాయతీ), కృష్ణ(ఎంపీడీవో- ఉప్పలగుప్తం) (కుడి నుంచి ఎడమ)

ఉత్సాహంగా జోనల్ అథ్లెటిక్స్ పోటీలు

షాట్‌పుట్ విసురుతున్న విద్యార్థిని

యానాం, న్యూస్‌టుడే: యానాం జోనల్ స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో సోమవారం ఉత్సాహభరితంగా జరిగాయి. రెండు రోజుల జరిగే ఈ పోటీల్ని ఎస్పీపీపీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్, జోనల్ గేమ్స్ పరిశీలకుడు పీవీఎస్ ప్రకాష్ ప్రారంభించారు. జోనల్ గేమ్స్ కార్యదర్శి కొప్పనాతి భాస్కర్, కోచ్ పబ్బినీడి , వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల అందజేత

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన చెక్కులను ఎంపీ హరీష్ మాథుర్ సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. అమలాపురంలోని ఎంపీ నివాసంలో 8 మందికి రూ.17,27,533 చెక్కులను పంపిణీ చేశారు.

సాయం పంపిణీ

తుపాను బాధిత కుటుంబానికి నగదు సాయం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

ముమ్మిడివరం: తుపాను కారణంగా ఇళ్లను వదిలి పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న కుటుంబాలకు అండగా ఉండేందుకు బియ్యం, నిత్యావసర వస్తువులు, నగదు సాయం అందజేస్తున్నట్లు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు తెలిపారు. సీహెచ్ గున్నేపల్లిలో 35 కుటుంబాలకు బియ్యం, నిత్యావసర వస్తువులు, నగదు సాయం పంపిణీ చేశారు.

17 ఏళ్ల బాలిక అదృశ్యం

ముమ్మిడివరం: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యంపై ముమ్మిడివరం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. 17 ఏళ్ల ఆ బాలిక వాడపల్లిలోని వేంకటేశ్వరస్వామి గుడికి వెళ్లి వస్తానని ఈ నెల ఒకటిన తిరిగిరాలేదని బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికకు మానసిక స్థితి సరిగా లేదని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.జ్వాలాసాగర్ తెలిపారు.

నిందితుడిని శిక్షించాలని డిమాండ్

అమలాపురం పట్టణం: ఐ.పోలవరం మండలంలో బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడు రాయపురెడ్డి వెంకట సత్యకృష్ణను కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. అమలాపురం గడియారస్తంభం కూడలిలో ప్రజా సంఘ నాయకులు, సీపీఎం, మహిళ, ఉద్యోగ సంఘాల నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు.

విజేతలతో హెచ్ఎం గౌరీశంకర్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, నాగవల్లి, తదితరులు , చిత్రాలు గీస్తున్న విద్యార్థినులు

పోటీలతో విద్యార్థులకు ప్రోత్సాహం

అమలాపురం పట్టణం న్యూస్‌టుడే: చిత్రలేఖన పోటీలతో ఈ కళపై విద్యార్థులకు ఆసక్తి పెరుగుతుందని ప్రధానోపాధ్యాయుడు డి.గౌరీశంకర్ పేర్కొన్నారు. అమలాపురంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో విద్యార్థినులకు 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 8, 9, 10 తరగతుల విద్యార్థినులు 'మీకు ఇష్టమైన పండుగ' అనే అంశంపై చిత్రలేఖన పోటీలలో పాల్గొన్నారు. పి.రూపశ్రీ, ఎన్.లక్ష్మశ్రీ, కె.ఉమ వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను, ప్రశంసా పత్రాలను హెచ్ఎం గౌరీశంకర్, ఉపాధ్యాయులు ఎన్.వెంకటేశ్వర్లు, ఎస్.నాగవల్లి, ఎం.శాంతికుమారి, ఈశ్వరి, సునీత, జ్ఞాన్సీరాణి, సత్యవేణి అందజేశారు.

★ పోటీలతో ప్రతిభకు పదును పెట్టవచ్చని నాథ్ పాఠశాల ప్రిన్సిపల్ పి.విశ్వనాథ్ పేర్కొన్నారు. అమలాపురం పట్టణం కాలేజీరోడ్డులోని నాథ్ పాఠశాలలో విద్యార్థులకు 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు 'మీకు ఇష్టమైన పండుగ' అనే అంశంపై చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్నారు. కె.నందినికృష్ణ, జి.జ్యోతిర్మయి, ఎస్.మహాలక్ష్మి వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను, ప్రశంసా పత్రాలను స్కూల్ ఇన్‌ఛార్జి పి.రత్నకుమారి, ఉపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు అందజేశారు.

నాథ్ పాఠశాలలో చిత్రాలను గీస్తున్న విద్యార్థినులు, విజేతలతో ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు

ఎస్పీ కార్యాలయానికి 40 అర్జీలు

ఆరుద్రతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ రాహుల్‌మీనా, ఏఎస్పీ ప్రసాద్ వినతులు స్వీకరించారు. 40 మంది అర్జీలు అందజేశారు. వైకాపా ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావుతో తనకు, తన కుమారైకు ప్రాణహాని ఉందని రాజులపూడి ఆరుద్ర ఫిర్యాదు చేశారు. తమను వేధిస్తున్న రామ్మోహనరావు, పృథ్వీ శ్రీనివాసరావులపై చర్య తీసుకోవాలని కోరారు. * నీలపల్లిశాఖ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో తన ఖాతా నుంచి రూ.5,49,000 గుర్తుతెలియని వ్యక్తులు తీసేశారని పేకేరుకు చెందిన బత్తుల సంజయ్‌కుమార్ ఫిర్యాదు చేశారు.

హెచ్ఐవీ నియంత్రణ సేవలకు వాహనం

అమలాపురం కలెక్టరేట్: గ్రామీణ ప్రాంతాలకు హెచ్ఐవీ నియంత్రణకు సంబంధించిన సేవలు అందించేందుకు జిల్లాకు ప్రత్యేక వాహనం అందుబాటులోకి వచ్చినట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. ఈవాహనాన్ని సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ప్రారంభించారు. జిల్లా వైద్యాధికారి దుర్గారావు దొర, సిబ్బంది పాల్గొన్నారు.

శాసన వ్యవస్థలపై అవగాహన అవసరం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులకు పార్లమెంట్, అసెంబ్లీ వ్యవహారాలపై అవగాహనకు పరీక్షలు నిర్వహించినట్లు ఉప విద్యాశాఖాధికారి జి.సూర్యప్రకాశం తెలిపారు. అమలాపురంలోని జడ్పీ బాలుర హైస్కూల్‌లో సోమవారం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామకృష్ణ, బ్రహ్మానందం, రాణి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధికి నిధులివ్వాలని వినతి

యానాం, న్యూస్‌టుడే: యానాంలో పర్యాటక ప్రాజెక్టుల అభివృద్ధికి, నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయించాలని పుదుచ్చేరి ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ సుమన్ బిల్లాను కోరారు. సోమవారం దిల్లీలో సుమన్ బిల్లాను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

నేటి నుంచి ప్రత్యేక ఓటర్ల గణన

యానాం: యానాంలో మంగళవారం నుంచి ప్రత్యేక విస్తృత ఓటర్ల గణన జరగనుందని ఓటర్ల నమోదు అధికారి, పరిపాలనాధికారి అంకిత్‌కుమార్ కోరారు. సోమవారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 33 పోలింగ్ బూత్ అధికారులు 40,043మంది ఓటర్లున్న 2025 జాబితాను 2002 జాబితాతో సారూప్యత కోసం తనిఖీ చేస్తారు. ఓట్ల వివరాలు నమోదుకు దరఖాస్తులు ఇస్తారని, పూర్తి చేసిన దరఖాస్తుల ఆధారంగా ముసాయిదా జాబితా డిసెంబరు 9కి సిద్ధం చేస్తారన్నారు. 22 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న విస్తృత గణన కోసం పరిశీలనలో పాల్గొనే బీఎల్‌వోలు వివిధ పార్టీల తరపున సహకరించే బూత్ ఏజెంట్లకు ఎస్సార్కే ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శిక్షణ ఇచ్చారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

చెయ్యేరు బ్రాంచి, చెయ్యేరు, తూర్పుగోదావరి జిల్లా .

సంక్షిప్త డిమాండ్ నోటీసు

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 సెక్షన్ 13(2) క్రింద - జారీ చేయబడిన నోటీసు 2002.)

I) ఋణగ్రహీత పేరు మరియు చిరునామా: (లేటు) శ్రీ అడబాల శ్రీరామశేషావతారం, తండ్రి: నారాయణస్వామి,
చట్టపరమైన వారసుల పేర్లు & చిరునామా (1) శ్రీమతి అడబాల స్వర్ణలత, తండ్రి: నారాయణస్వామి, డోర్ నెం. 9-59/ఎ, కాలవగట్టు, వినాయకుడి గుడి వద్ద, చెయ్యేరు, కాట్రేనికోన మండలం, తూర్పుగోదావరి జిల్లా. (2) శ్రీ అడబాల ఉదయభాస్కర్, తండ్రి: శ్రీరామ శేషావతారం, డోర్ నెం. 9-59/ఎ, కాలువగట్టు, వినాయకుడి గుడి దగ్గర, చెయ్యేరు, కాట్రేనికోన మండలం, తూర్పుగోదావరి జిల్లా. (3) శ్రీమతి భీమనాధుని శ్రీవేణి, భర్త: వి.సత్యనారాయణ, డోర్ నెం. 9-59/ఎ, కాలవగట్టు, వినా యకుడి గుడి దగ్గర, చెయ్యేరు, కాట్రేనికోన మండలం, తూర్పుగోదావరి జిల్లా. (4) శ్రీమతి చుట్ట రామసుశ్మిత, భర్త: ప్రమోద్, డోర్ నెం. 9-59/ఎ, కాలువగట్టు, వినాయకుడి గుడి దగ్గర, చెయ్యేరు, కాట్రేనికోన మండలం, తూర్పుగోదావరి జిల్లా.
సహఋణగ్రహీత : శ్రీ అడబాల ఉదయభాస్కర్, తండ్రి: శ్రీరామ శేషావతారం, డోర్ నెం. 9-59/ఎ, కాలువగట్టు, వినాయకుడి గుడి దగ్గర, చెయ్యేరు, కాట్రేనికోన మండలం, తూర్పుగోదావరి జిల్లా.

II) లోన్ ఖాతా మరియు అకౌంట్ నెం: Housing Loan 62419815077

III) చెల్లించవలసిన బాకీ మొత్తము : తేది.09-10-2025 నాటికి 10,84,047/- (పది లక్షల ఎనభై నాలుగు వేల నలభై ఏడు రూపాయలు మాత్రమే) + కాంట్రాక్టువల్ రేటు ప్రకారం భవిష్య వడ్డీ, వ్యయాలు, కాస్ట్ ఛార్జీలు, ఇతర ఖర్చులు మొదలైనవి.

IV) డిమాండ్ నోటీసు తేది : 09-10-2025 NPA Date : 02-05-2022.

V) ఆస్తి వివరములు : శ్రీ అడబాల శ్రీరామశేషావతారం, తండ్రి: నారాయణస్వామి, Doc.No. 227/2009
తూర్పుగోదావరి జిల్లా, కాట్రేనికోన మండలం, చెయ్యేరు గ్రామం, ముమ్మిడివరం ఎస్.ఆర్.వో.వద్ద ఆర్.ఎస్. నెం. 542/7బి/2నందు జిరాయితీ మాగాణి ఎ.0.05 సెంట్లు, ఆర్.ఎస్.నెం. 542/7ఇ/2 నందు జిరాయితీ మాగాణి ఎ.0-04 సెంట్లు వెరశి ఎ.0.09 సెంట్లు విస్తీర్ణం గల భూమి తోపాటు ఆర్.సి.సి. భవనం, డోర్ నెం. 9-66 గల ఆస్తి యావత్తు వాటికి హద్దులు. తూర్పు: ఆర్.ఎస్.నెం 568/4 నందు అడబాల నారాయణస్వామి ఆస్తి. అడబాల భద్రవేణి నుండి అభివృద్ధి చెందినది; దక్షిణం : ఈ ఆస్తి నందు ప్రహరీగోడ & తదుపరి ఆస్తి సూదా సూర్యనారాయణ మూర్తి క్రయింటారు వగైరాలు; పడమర: ఈ ఆస్తి యందు ప్రహరీ గోడ & తదుపరి ఆస్తి సూదా సూర్యనారాయణమూర్తి, సూదా సరస్వతి వగైరాలు; ఉత్తరం: 10 అడుగుల వెడల్పు గల దారి (అనుమతి పొందిన బ్లూ ప్రింట్ ప్రకారం) ఈ ఆస్తినందు ప్రహరీగోడ మరియు తదుపరి ఆస్తి సూదా సరస్వతి నిర్వహణదారు భూమి.

పైన చెప్పబడిన ఋణ గ్రహీత స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, చెయ్యేరు బ్రాంచి, చెయ్యేరు, తూర్పుగోదావరి జిల్లా వారి నుండి ఋణం పొంది ఉన్నారు. సదరు ఋణమునకు పైన పేర్కొన్న ఆస్తిని హామీగా ఇచ్చియున్నారు. ఋణము యొక్క నియమనిబంధనలనుసరించి సకాలంలో చెల్లించకపోవుటచే సదరు ఖాతాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి నియమనిబంధనల ప్రకారము నిరర్థక ఖాతాగా పరిగణింపబడినది. బ్యాంకు వారు రిజిస్టర్ పోస్టుద్వారా పంపించిన డిమాండు నోటీసుకు సంబంధించిన తిరుగు రశీదులు/ ఋణగ్రహీత సంతకములు సరిగా లేనందున పత్రికా మూలకముగా మీకు మరల నోటీసు జారీ చేయడమగుచున్నది. కావున సదరు ఋణగ్రహీత పైన పేర్కొన్న మొత్తములను ఈ ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా, వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా చెల్లించవలసినదిగా కోరడమైనది. లేని పక్షంలో పైన పేర్కొన్న చట్టము ప్రకారము బ్యాంకు బకాయిని రాబట్టుకొను నిమిత్తం తదుపరి చర్యలు గైకొనుట దిగువ సంతకందారునికి అనివార్యమవుతుంది.

తేది : 03-11-2025 అధీకృత అధికారి
ప్రదేశం : చెయ్యేరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

మండపేట
• మండపేట • రామచంద్రపురం

చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం అండ

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేటలోని దొమ్మేటి ఏడుకొండలు చౌకధరల దుకాణం వద్ద సోమవారం తుపాను బాధిత చేనేత కార్మికుల కుటుంబాలకు 50 కిలోల బియ్యం, కందిపప్పు, నూనె, ఉల్లిపాయలు, బంగాళదుంపలు పంపిణీ చేశారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర జలవనరుల కార్పొరేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు అరిగెల సూరిబాబు, ఏఎంసీ వైస్ ఛైర్మన్ కొర్లపాటి వెంకటేశ్వరరావు, కూటమి నేతలు కొర్లపాటి గోపి, మహిపాల తాతాజీ, రవణం రాము పాల్గొన్నారు.

400 మీటర్ల పరుగు పోటీలకు మహేశ్ ఎంపిక

రాయవరం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి 400 మీటర్ల పరుగు పోటీలకి రాయవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి చెన్నూరి మహేశ్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం వి.శాంతిసునీత తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ కాకినాడలో జిల్లా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 9వ తరగతి విద్యార్థి మహేష్ 4100 మీటర్ల రిలే విభాగంలో ప్రతిభచాటాడని, ఈనెల ఏడో తేదీన శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు. విద్యార్థితో పాటు వ్యాయామ శిక్షకులు అజ్జిబాబు, శ్రీనివాస్‌ను రాయవరం గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ వుండవిల్లి రాంబాబు, ఎస్‌ఎంసీ ఛైర్మన్ దేవిశెట్టి చిన్ని, ఉపాధ్యాయులు అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 | మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు | మండపేట: 80085 74183 | రామచంద్రపురం: 80085 74191

స్పందనకు వందనం

వ్యర్థాలు తొలగించారు..

సమస్య: మండపేట మండలం మారేడుబాక మహిళానగర్ చివరివీధిలో రహదారి పక్కన వ్యర్థాలు పోస్తున్నారు. దీంతో దుర్వాసనతో పాటు దోమల బెడద ఎక్కువగా ఉంది. – పి.సుబ్బారావు, మారేడుబాక

పరిష్కారం: సమస్యపై పంచాయతీ కార్యదర్శి వర్మ వెంటనే స్పందించారు. సిబ్బందిని పంపించి వ్యర్థాలను తొలగించే పనులు చేయించారు. - న్యూస్‌టుడే, ద్వారపూడి

రోడ్లు అధ్వానం..

సమస్య: కె.గంగవరం మండలం సుందరపల్లి గ్రామానికి వెళ్లే ర.భ. శాఖ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఎటు నుంచి వచ్చినా గుంతలు తప్పడంలేదు. ఇటీవలే ఏటిగట్టు రోడ్డు మీద గుంతల్లో ద్విచక్రవాహనం మీద నుంచి పడి తలకు తీవ్రగాయంతో ఓ మహిళ మృతిచెందింది – వీరవెంకట సత్యనారాయణ, సుందరపల్లి

సమాధానం: రాబోయే పుష్కరాల గ్రాంట్ నుంచి అన్ని రహదారులను మెరుగుపర్చాలని ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఏటిగట్టు రోడ్డులో గుంతలను తాత్కాలికంగా పూడ్చించాం. నిధులు విడుదలయ్యేలోగా సుందరపల్లి రోడ్డులో మరమ్మతులు చేయిస్తాం. – టి.వి.సూర్యనారాయణ, డీఈ, ఆర్‌అండ్‌బీ

- న్యూస్‌టుడే, పామర్రు

అభివృద్ధి పనులు.. గడప దాటేదెప్పుడు..?

– న్యూస్‌టుడే, మండపేట

గత వైకాపా ప్రభుత్వం 'గడపగడపకు మన ప్రభుత్వం' పేరుతో చేపట్టిన అభివృద్ధి పనులు గడప దాటలేదు. అప్పట్లో ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరిస్తూ పట్టణంలోని అన్ని వార్డుల్లో ఇంటింటా ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యటించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలు, తాము గుర్తించినవి పరిష్కరించేందుకు వార్డుకు రూ.20 లక్షల చొప్పున కేటాయించారు. ఒకవేళ పనులు అవసరం లేకపోతే ఆ నిధులను సమీప వార్డుకి సర్దుబాటు చేయాలని ఏర్పాట్లుచేశారు. తొలివిడతగా పట్టణంలోని 14 వార్డు సచివాలయాలకు ఏడు సచివాలయాలకు రూ.1.40 కోట్లు మంజూరుచేశారు. ఆ వార్డుల్లో గుర్తించిన సీసీరహదారులు, డ్రెయిన్లు, రక్షితనీటి పైపులైన్లు తదితర పనులను గుర్తించి ప్రారంభించారు. రెండో విడతలో కూడా గుర్తించిన 47 పనులకు రూ.1.77 కోట్లు కేటాయించారు. తొలి విడతలో టెండర్లు దక్కించుకున్న గుత్తేదార్లు పనులు పూర్తిచేసినా నిధుల విడుదలలో జాప్యంతో తదుపరి పనులపై ఆ ప్రభావం కనిపించింది. దీంతో ఎక్కడికక్కడ పనులు నిలిచిపోయాయి. కేవలం 51 శాతం పనులు మాత్రమే పూర్తిచేయగలిగారు. ఇప్పటివరకు పూర్తయిన 27 పనులకు రూ.1.48 కోట్లు చెల్లించగా పూర్తికాని పనులు 20 వరకు ఉన్నాయి. వీటి విలువ రూ.1.28 కోట్లుగా అంచనా వేశారు. అసంపూర్తి పనులతో పట్టణ వాసులకు అవస్థలు తప్పడం లేదు.

పట్టణంలోని 8వ వార్డులో రద్దయిన డ్రెయినేజీ పనులు

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు..

ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేయడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ప్రజలకు సంబంధించిన సమస్యలు కావడంతో కూటమి ప్రభుత్వం అసంపూర్తి పనులను పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు వీటిలో 6వ వార్డులో రూ.3 లక్షలతో కల్వర్టు, 4వ సచివాలయం పరిధిలో రూ.7 లక్షలతో సీసీ డ్రెయిన్, 8వ వార్డులో రూ.3.80 లక్షలతో సీసీ డ్రెయిన్, 13వ వార్డులో శెట్టిబలిజ కల్యాణ మండపానికి ప్రహరీ, 20వ వార్డులో రూ.11 లక్షలతో సీసీ రహదారులు, 21వ వార్డులో రూ.4.50 లక్షలతో సిమెంట్ కాలువ, ఆర్‌సీసీ కవర్ స్లాబుల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. రద్దయిన మిగిలిన పనులన్నీ డ్రెనేజిలు, కవర్ స్లాబుల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. వాటిని ప్రాధాన్యతా క్రమాన్ని బట్టి ఒకేసారి కాకపోయినా విడతల వారీగా పూర్తి చేయాలని కోరుతున్నారు. మున్సిపల్ సాధారణ లేదా ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే అవకాశం ఉందని వార్డు సభ్యులు చెబుతున్నారు.

నిధులు మంజూరుచేయాలి..

గత ప్రభుత్వ హయాంలో ప్రత్యేక గ్రాంట్ ద్వారా ఆ పథకానికి నిధులు విడుదల చేశారు. అప్పటి పనులను సాధారణ నిధులతో ప్రస్తుతం పూర్తిచేసే అవకాశం లేదు. ప్రజల ఇబ్బందులను గుర్తించి పనులు పూర్తిచేయాలంటే ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాలి. - టి.వి.రంగారావు, మున్సిపల్ కమిషనర్, మండపేట

పంట నష్టం అంచనా పూర్తి

అంగర, న్యూస్‌టుడే: మొంథా తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతుల జాబితాలను రైతు సేవా కేంద్రాల వద్ద ప్రచురించామని మండల వ్యవసాయ అధికారి బలుసు రవి చెప్పారు. కపిలేశ్వరపురంలో సోమవారం ఆయన మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా చేపట్టిన నమోదు ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. సంబంధిత రైతులు జాబితాలో పేర్లు చూసుకుని లేకపోతే గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. పంట నష్టంపై వివరాలను కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. ప్రభుత్వం మంజూరుచేసే సాయాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేస్తారని వివరించారు.

ఆలమూరులో పెట్రోలు బంకు ఏర్పాటుకు స్థల పరిశీలన

ఆలమూరు, న్యూస్‌టుడే: పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆలమూరులో ఐ.ఒ.సి పెట్రోలు బంకును ఏర్పాటుచేసేందుకు అధికారులు సోమవారం స్థల పరిశీలన చేశారు. ఆలమూరులోని పోలీసుస్టేషన్ పక్కన ఉన్న ఖాళీస్థలాన్ని ఏఆర్ డీఎస్పీ సుబ్బారావు, సీఐ విద్యాసాగర్, ఆలమూరు ఎస్సై నరేష్, ఐ.ఒ.సి ప్రతినిధులు పరిశీలించారు.

మానవ మనుగడకు చెట్లే ఆధారం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: మానవ మనుగడకు చెట్లే ఆధారమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. సోమవారం రామచంద్రపురంలోని బాలాత్రిపురసుందరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయం ఎదుట నందివనం సత్యనారాయణరావు ఉద్యానవనంలో కార్తికమాసం రెండో సోమవారం సందర్భంగా మంత్రి 108 మారేడు మొక్కలు నాటారు. మొక్కలు పెంచి పెద్దవి అయ్యేంత వరకు సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ కె.వి.ఆర్.ఆర్.రాజు, జనసేన ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఎస్‌కేపీ ట్రస్ట్ ఛైర్మన్ సలాది నాయుడు, శివాలయం ట్రస్ట్‌బోర్డ్ ఛైర్మన్ చెరుకుమిల్లి గణేశ్వర్, భక్తులు పాల్గొన్నారు. అనంతరం 2026 సంవత్సరం క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు.

శివాలయం పార్కులో మొక్క నాటుతున్న మంత్రి సుభాష్

బాధిత మహిళకు ఆర్థికసాయం

కాజులూరు: కాజులూరు మండలం చేదివాడ గ్రామానికి చెందిన ఇళ్ల నాగమణి రోడ్డు ప్రమాదంలో కాలికి తీవ్రగాయమై శస్త్రచికిత్స చేయించుకుని ఆర్థిక సమస్యలతో బాధపడుతోందని స్థానికులు తెలిపిన సమాచారంతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పందించారు. సోమవారం ఆమెకు రూ.20 వేలు ఆర్థికసాయాన్ని అందించారు. అవసరమైన చికిత్స చేయిస్తామని, ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రతిభకు నైపుణ్యం.. విజేతలకు పురస్కారం

చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

విజేతలకు బహుమతులు అందించిన ప్రిన్సిపల్ అప్పలరాజు

మండపేట, న్యూస్‌టుడే: 'ఈనాడు ఈటీవీ' ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌వీఎస్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రతిభాపాటవ పోటీల్లో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రకృతి అందాలు అనే అంశంపై ఏర్పాటుచేసిన చిత్రలేఖనం పోటీలో ఎంపీసీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఆర్.మౌనిక ప్రథమ బహుమతికి ఎంపికయ్యారు. ద్వితీయ సంవత్సరం చదువుతున్న జి.సురేఖ ద్వితీయ బహుమతి, బైపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎం.ప్రతిభ తృతీయ బహుమతి సాధించారు. వీరికి 'ఈనాడు' సమకూర్చిన బహుమతులను కళాశాల ప్రిన్సిపల్ కె.అప్పలరాజు అందజేశారు. పోటీలకు మాక్, ఏవీఐవీ బాలాజీ, ఎస్‌వీ ప్రసాద్‌రెడ్డి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

బాధిత కుటుంబాలకు ఆసరా

పామర్రు, న్యూస్‌టుడే: పేదరికంలో మగ్గుతూ.. కుటుంబానికి అండగా నిలిచే పెద్ద అనూహ్యంగా మృతి చెందితే రోడ్డున పడే కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నామని కె.గంగవరం మండల జనసేన అధ్యక్షుడు చిర్రా రాజకుమార్ చెప్పారు. నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పి.సుబ్బారావు జ్ఞాపక సేవా సంస్థ, డొక్కా సీతమ్మ ఆసరా పథకం నుంచి ఏడు కుటుంబాలకు నిత్యావసర వస్తువులను సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సిర్రా లక్ష్మణుడు (కుందూరు), జుత్తుక సత్యం (పాణంగిపల్లి), ముండపల్లి సుబ్బాయమ్మ (అముజూరు), బొమ్మితుల వడపల్లమ్మ (పామర్రు), దారాపు సుభద్ర (తామరపల్లి), బోడపాటి చంద్రరావు (గంగవరం), అల్లంపల్లి వాడపల్లి (బట్లపాలిక) ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందగా వారి కుటుంబాలకు సాయం అందించారు. ట్రస్ట్ సమన్వయకర్త గుబ్బల శ్రీనివాస్, ముంగి రమేష్ బాబు, పోలిశెట్టి పెదబాబు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పామర్రులో నిత్యావసరాలు అందించిన నిర్వాహకులు

పసలపూడిలో నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

రాయవరం, న్యూస్‌టుడే: పసలపూడిలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మంగళవారం పర్యటించనున్నారు. రామచంద్రపురం నీటి సంఘం ఛైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో రూ.25 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ, డ్రెయినేజీల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేస్తారని పేర్కొన్నారు.

విశ్వ విజేతలకు అభినందన..

మండపేట: మహిళల క్రికెట్ ప్రపంచకప్ పోటీలో గెలుపొందిన భారత మహిళల క్రికెట్ జట్టుకు రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. మన క్రీడాకారులు ప్రపంచానికి సత్తా చాటారని పేర్కొన్నారు.

రావులపాలెంలో మెగా ఉద్యోగ మేళా

రావులపాలెం పట్టణం: విశాఖ, సంహిత డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో 5వ తేదీన రావులపాలెంలోని సంహిత డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని కళాశాల ఛైర్మన్ దినేష్‌బాబు అన్నారు. సోమవారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ డెక్కన్ కెమికల్, జనుజా మోటార్స్, ఫాక్స్‌కాన్ కంపెనీల ప్రతినిధులు బుధవారం ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని, అర్హతలు 10వ తరగతి, డిప్లొమా, ఐ.టీ.ఐ, బీటెక్ ఉత్తీర్ణులై, 35 సంవత్సరాలలోపు వయసు గల అభ్యర్థులు వినియోగించుకోవాలని కోరారు.

సూర్యానగర్ మూడో రోడ్డు.. శివారు చూడు..

రామచంద్రపురం పట్టణంలోని సూర్యానగర్ మూడో రోడ్డు శివారు పరిసరాలు అధ్వానంగా మారాయి. ఇక్కడ 100 మీటర్ల రోడ్డు అత్యంత అసౌకర్యంగా ఉంటుంది. వర్షం వస్తే రోడ్డంతా నీటితో నిండిపోయి చెరువును తలపిస్తోంది. దిగువ ప్రాంతం కావడంతో నిల్వనీరు ఎటూ వెళ్లక ఎక్కడికక్కడ నిలిచిపోతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్.రాజును వివరణ కోరగా త్వరలో ప్రతిపాదనలు సిద్ధం చేసి రోడ్డును అభివృద్ధి వేస్తామని చెప్పారు. - న్యూస్‌టుడే, రామచంద్రపురం

ట్రాఫిక్ చిక్కుముడి

రాయవరం మండలం సోమేశ్వరం వంతెన కూడలి (మాచవరం జంక్షన్)లో రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీ నెలకొంటోంది. ఈ సమయంలో ఏ వాహనం ఎటు వెళ్తుందో తెలియక పాదచారులు, వాహనచోదకులు అయోమయానికి గురవుతున్నారు. మండల కేంద్రం నుంచి రామచంద్రపురం, మండపేట వెళ్లేందుకు, కాకినాడ నుంచి రావులపాలెం, రాజమహేంద్రవరం వెళ్లే కెనాల్ రహదారి, ఇతర ప్రాంతాల నుంచి రాయవరం, బిక్కవోలు, అనపర్తి మండలాలకు ఇదే ప్రధాన మార్గం కావడంతో కూడలిలో ట్రాఫిక్ వలలో ఎక్కువమంది చిక్కుకుంటున్నారు. ఈ కూడలిలో పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, రాయవరం

అసంపూర్తి పనులు.. విరిగిపోతున్న గొట్టాలు

జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఉండాలనే సంకల్పంతో చేసిన నిర్మాణ పనులతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆయా పనులు ఇంకా పూర్తికాకుండానే గొట్టాలు విరిగిపోతున్నాయి. రామచంద్రపురం మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సరఫరా నిమిత్తం పైపులైన్లు వేశారు. అన్నాయిపేట బొందులగూడెంలో వేసిన పైపులు భూగర్భంలో పూర్తిగా పూడ్చకుండా వదిలేయడంతో రోడ్డుపై వాహనాల రాకపోకలకు పగుల్తున్నాయి. వాటి నుంచి విలువైన తాగునీరు వృథాగా పోతుంది. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాహుల్‌ను వివరణ కోరగా ఇంకా పనులు పూర్తికాలేదని, సంబంధిత గుత్తేదారుతో మళ్లీ పైపులు వేయిస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, ద్రాక్షారామ

ద్రాక్షారామ, హసనబాదలో ఆత్మనిర్భర్ కార్యక్రమాలు

మాట్లాడుతున్న చిట్టిబాబు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ఆత్మనిర్భర్ భారత్ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ద్రాక్షారామ, హసనబాద గ్రామాల్లో సోమవారం ఇంటింటా స్వదేశీ, ప్రతి ఇంటా స్వదేశీ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి కర్రి చిట్టిబాబు, జిల్లా భాజపా అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ మాట్లాడుతూ ఆత్మనిర్భర్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. స్వదేశీ వస్తువుల వాడకంపై ప్రతిజ్ఞ చేయించారు. ఇంటింటా తిరిగి స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో హసనబాద సర్పంచి నాగిరెడ్డి సతీష్‌రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు వాడ్రేవు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అలంకరణలో అగస్త్యేశ్వరస్వామి

వల్లూరులో ప్రత్యేక అలంకరణ

సోమేశ్వరంలో హారతిస్తున్న వేదపండితుడు

రామచంద్రపురంలో..

శివనామస్మరణ.. మార్మోగిన ఆవరణ

మండపేట, మండపేట గ్రామీణం, రామచంద్రపురం, అంగర, పామర్రు, రాయవరం, న్యూస్‌టుడే: కార్తిక రెండో సోమవారం సందర్భంగా శివనామస్మరణ మార్మోగింది. మండపేట అగస్త్యేశ్వరాలయంలో శివలింగాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పూజల్లో పాల్గొన్నారు. ● కపిలేశ్వరపురం మండలం పడమర ఖండ్రిక కణ్వలింగేశ్వరస్వామి, కోరుమిల్లి సోమేశ్వరస్వామి, పాపవినాశేశ్వరస్వామి, వల్లూరు అగస్త్యేశ్వరస్వామి, తాతపూడి మల్లేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ● అష్టసోమేశ్వరాలయాలైన సోమేశ్వరం, వెంటూరు, చెల్లూరు అగస్త్యేశ్వరస్వామి, నదురుబాద, వెదురుపాక, రాయవరం, లొల్ల, మాచవరం, పసలపూడి, కూర్మాపురం భక్తులతో కిటకిటలాడాయి. ● అగస్త్య మహాముని ప్రతిష్ఠించిన తాపేశ్వరం, అర్తమూరు శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఏడిదలోని స్వయంవర పార్వతీ సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు జరిపించారు. ద్వారపూడి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, పాలతోడు రామలింగేశ్వరస్వామికి పూజలు చేశారు. ● రామచంద్రపురంలోని బాలాత్రిపురసుందరి సమేత అగస్త్యేశ్వరస్వామివారి ఆలయంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ ● హసనబాద మాణిక్యాంబ సమేత భీమేశ్వరాలయంలో విశేష పూజలు నిర్వహించారు. ● ప్రముఖ శైవక్షేత్రం కోటిపల్లిలోని గౌతమీ గోదావరి తీరంలో తెల్లవారుజాము భక్తులు పవిత్ర స్నానాలు చేశారు. ఛాయాసోమేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. యండగండి, పామర్రు, అముజూరు, కె.గంగవరం, కోట, మసకపల్లి ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

ఏడిదలో పార్వతీ సమేత సంగమేశ్వరస్వామి

ఉత్తమ సేవలకు పురస్కారాలు

కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న కమిషనర్ రంగారావు, ఆర్‌అండ్‌బీ డీఈ సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ రాజు (కుడి నుంచి ఎడమకు)

మండపేట, న్యూస్‌టుడే: మొంథా తుపాను సమయంలో ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు రాత్రీపగలు సిబ్బందిని అందుబాటులో ఉంచి అప్పటికప్పుడు స్పందించిన తీరును గుర్తించి మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావుకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ప్రత్యేక పురస్కారం అందించారు. సోమవారం అమలాపురంలోని కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డు, ప్రశంసాపత్రాన్ని కమిషనర్ అందుకున్నారు. కలెక్టరుతో పాటు జాయింట్ కలెక్టర్ నిశాంతి, పలువురు అధికారులు ఉన్నారు.

రామచంద్రపురం: రామచంద్రపురం డివిజన్ రోడ్లు, భవనాల శాఖ డీఈ సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్. రాజు మొంథా తుపాను సమయంలో అందించిన ఉత్తమ సేవలకు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు. రాయవరం తహసీల్దారు భాస్కర్ కూడా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఓటర్ల గణన

యానాం: యానాంలో మంగళవారం నుంచి ప్రత్యేక విస్తృత ఓటర్ల గణన(స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్) జరగనుందని ఓటర్ల నమోదు అధికారి, పరిపాలనాధికారి అంకిత్‌కుమార్ కోరారు. సోమవారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 33 పోలింగ్ బూత్ అధికారులు 40,043మంది ఓటర్లున్న 2025 జాబితాను 2002 జాబితాతో సారూప్యత కోసం తనిఖీ చేస్తారు. ఓట్ల వివరాలు నమోదుకు దరఖాస్తులు ఇస్తారని, పూర్తి చేసిన దరఖాస్తుల ఆధారంగా ముసాయిదా జాబితా డిసెంబరు 9కి సిద్ధం చేస్తారన్నారు. 22 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్న విస్తృత గణన కోసం పరిశీలనలో పాల్గొనే బీఎల్‌వోలు వివిధ పార్టీల తరపున సహకరించే బూత్ ఏజెంట్లకు ఎస్సార్కే ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శిక్షణ ఇచ్చారు.

హెచ్‌ఐవీ నియంత్రణ సేవలకు వాహనం

అమలాపురం కలెక్టరేట్: గ్రామీణ ప్రాంతాలకు హెచ్‌ఐవీ నియంత్రణకు సంబంధించిన సేవలు అందించేందుకు జిల్లాకు ప్రత్యేక వాహనం అందుబాటులోకి వచ్చినట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. ఈవాహనాన్ని సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ప్రారంభించారు. జిల్లా వైద్యాధికారి దుర్గారావు దొర, సిబ్బంది పాల్గొన్నారు.

శాసన వ్యవస్థలపై అవగాహన అవసరం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులకు పార్లమెంట్, అసెంబ్లీ వ్యవహారాలపై అవగాహనకు పరీక్షలు నిర్వహించినట్లు ఉప విద్యాశాఖాధికారి జి.సూర్యప్రకాశం తెలిపారు. అమలాపురంలోని జడ్పీ బాలుర హైస్కూల్‌లో సోమవారం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణ, బ్రహ్మానందం, రాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంచాల అందజేత

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండపేట మండలం కేశవరం మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం చోడే కృష్ణమూర్తి సొంత నిధులతో విద్యార్థులకు సమకూర్చిన స్టీల్ కంచాలను సోమవారం ఎంఈవోలు అందించారు. రూ.11 వేల విలువైన భోజనం ప్లేట్లు విద్యార్థులకు, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు రూ.6000 విలువైన మిక్సీని సమకూర్చారు. వీటిని విద్యాశాఖాధికారులు నాయుడు రామచంద్రరావు, చింతా వెంకటసోమిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

ఆరోగ్యంతో ఫిట్ ఇండియా

ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి ఆరోగ్య దేశాన్ని తయారు చేయాలనే సంకల్పంతో మండపేట మండలం తాపేశ్వరం చైతన్య పాఠశాలలో సోమవారం ఫిట్ ఇండియా మూవ్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెలా నిర్వహించే స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా విద్యార్థులతో ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటుచేశామని ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ తెలిపారు. ఆరోగ్య దేశం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

షెడ్డు లేదు.. సైకిళ్లకు రక్షణ కరవు

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని పలు ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సైకిళ్లకు రక్షణ కల్పించే షెడ్లులేవు. దీంతో ఎండకు ఎండుతూ.. వర్షంలో తడుస్తూ మరమ్మతులకు గురవుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని పామర్రు, హసనబాద, కె.గంగవరం ఉన్నత పాఠశాలల్లో పూర్వ విద్యార్థులు సైకిల్ షెడ్లు నిర్మించారు. మొత్తం 27 ఉన్నత పాఠశాలల్లో కేవలం ఆరు పాఠశాలల్లోనే ఇవి ఉన్నాయి. సత్యవాడ, ద్రాక్షారామ, సుందరపల్లి తదితర దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల సైకిళ్లు ఎండలోనే ఉంటున్నాయి. ఈ విషయాన్ని ఎంఈవో అలజంగి నాగరాజు దృష్టికి తీసుకువెళ్లగా ఇప్పటికే వినతులు అందాయని, ఉన్నతాధికారులకు తెలియజేశామని చెప్పారు. షెడ్ల నిర్మాణానికి నిధులు రావని, గ్రామంలోని దాతల సాయంతోనే వీటిని నిర్మించుకోవాల్సి ఉంటుందన్నారు. పాఠశాలల ఖాతాల్లో నిధులు ఉంటే నిర్మాణం చేసుకోవచ్చని తెలిపారు. - న్యూస్‌టుడే, పామర్రు

ఆరుబయట నిలిపిన సైకిళ్లు

(c) eenadu

మహిళలు వెలిగించిన కార్తిక దీపాలతో కాంతులీనుతున్న రాజమహేంద్రవరం మున్సిపల్ స్టేడియం (డ్రోన్ చిత్రం)

గోదావరి తీరం.. అఖండ దీపం..

భక్తి శ్రద్ధలతో పూజచేస్తున్న మహిళ

● వైభవంగా 'ఈటీవీ లైఫ్, ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ' కార్తిక దీపోత్సవం

జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి, రాజమహేంద్రవరం గ్రామీణం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, కంబాలచెరువు, ఏవీఏ రోడ్డు: శివుడి తలపై నుంచి భువికి దిగిన దక్షిణ గంగ.. గోదావరి కెరటాల ఝురిలో... బంగారు కాంతులీనుతున్న కార్తిక దీపాల వెలుగుల్లో రాజమహేంద్రవరం మెరిసింది. 'న కార్తికే సమో మాసః న గంగా సదృశం తీర్థం' శ్లోకాన్ని నిజం చేస్తూ పవిత్ర గోదావరి తీరాన 'ఈటీవీ లైఫ్, ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ' ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ మైదానంలో కార్తిక దీపోత్సవం నిర్వహించారు. రాజమహేంద్రవరం గ్రామీణం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కలెక్టర్ కీర్తి చేకూరి, ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు, 'ఈనాడు' రాజమహేంద్రవరం యూనిట్ ఇన్‌ఛార్జి ఐ.వి.శ్రీనివాస సుబ్రహ్మణ్యం తదితరులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. హరహర మహాదేవ. శంభో శంకర నామస్మరణతో మైదానం మార్మోగింది. వేలాది మంది భక్తజనంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. దీపాల వెలుగుల్లో దేదీప్యమానంగా సాంస్కృతిక నగర శోభ విరాజిల్లింది.

పూజలు చేస్తున్న ఫణికుమారశర్మ, అర్చక బృందం

గో రక్షణతోనే సిరిసంపదలు..

గోదావరి నది ప్రాశస్త్యాన్ని, కొవ్వూరు గోష్పాద క్షేత్రం విశిష్టత గురించి ఆర్షవిద్య తపస్వి పళ్లపాటి శ్రీనివాస బంగారయ్య శర్మ భక్తులకు వివరించిన తీరు అందర్నీ ఆలోచింపజేసింది. లక్ష్మీదేవి గోవు రూపంలోనే నిశ్చలంగా ఉంటుందని, ఇతర ప్రాంతాల్లో చంచలంగా ఉంటుందని, లక్ష్మీ కటాక్షం కావాలనుకునేవారు గోరక్షణ చేపట్టాలని సూచించారు.

జ్ఞాపికల అందజేత..

దీపోత్సవానికి సహకారం అందించిన పలు వ్యాపార, వాణిజ్య సంస్థల ప్రతినిధులకు ముఖ్యఅతిథులు ఎమ్మెల్సీ సోమువీర్రాజు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఏఎస్పీలు మురళీకృష్ణ, సుబ్బరాజు జ్ఞాపికలు అందజేశారు. శ్రీ వెంకటేశ్వర ఫైనాన్స్, హిందూస్థాన్ ఆగ్రో ప్రొడక్ట్స్ ప్రతినిధి మేడపాటి వెంకటరెడ్డి, ఏఎస్ బ్రాండ్ పూజా నువ్వులనూనె సంస్థ ప్రతినిధి పీవీ నారాయణరావు జ్ఞాపికలు అందుకున్న వారిలో ఉన్నారు. తిరుమల ఐఐటీ, మెడికల్ అకాడమీ, కేఎల్ యూనివర్సిటీ విజయవాడ, శ్రీకౌ అండ్ కాఫ్ రైస్ అండ్ ఇడ్లీ రవ్వ, కామధేను మిల్క్, జున్ను పౌడర్ సంస్థలు సహకరించాయి.

స్పాన్సర్లకు జ్ఞాపికలు బహూకరిస్తున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, వేదికపై ఏఎస్పీలు మురళీకృష్ణ, సుబ్బరాజు, 'ఈనాడు' రాజమహేంద్రవరం యూనిట్ ఇన్‌ఛార్జి శ్రీనివాస్ సుబ్రహ్మణ్యం..

గణపతి పూజతో శ్రీకారం..

వైదిక నిర్వాహకులు పులుపుల ఫణికుమార శర్మ బృందం ఆధ్వర్యంలో దీపోత్సవానికి గణనాథుని పూజతో శ్రీకారం చుట్టారు. అంతకుముందు రాజమహేంద్రవరంలోని పందిరి మహదేవుడు స్మార్త వేదపాఠశాల పండితులు పురాణపండ మాధవానందశర్మ, శిష్య బృందం వేదపఠనం చేసింది. ముఖ్య అతిథులకు పండితులు ఆశీర్వచనం అందించారు. వ్యాఖ్యాతగా సుజిత వ్యవహరించారు. కార్యక్రమానికి పోలీసులు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ● ఎమ్మెల్సీ సోమువీర్రాజు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఇద్దరు ఏఎస్పీలు మురళీకృష్ణ, సుబ్బరాజు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.

దీపోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

అత్యవసర వైద్యం.. ఎంతెంత దూరం..?

సా..గుతున్న భవన నిర్మాణ పనులు

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం వైద్యం

అత్యవసర వైద్యం సకాలంలో అందితేనే రోగుల ప్రాణాలు నిలుస్తాయి. కొవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లో వైద్యానికి ఎన్ని ఇబ్బందులు ఎదురయ్యాయో తెలిసిందే. మళ్లీ అలాంటి పరిస్థితులు ఎదురైతే గతంలో మాదిరి నష్టం జరగకూడదని కేంద్ర ప్రభుత్వం ప్రతి జిల్లా కేంద్రంలో అత్యాధునిక వసతులతో కూడిన క్రిటికల్ కేర్ బ్లాకులు నిర్మిస్తోంది. మొదటి విడతలో భాగంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలో నాలుగంతస్తుల భవనం రూ.23 కోట్లతో నిర్మిస్తున్నారు. ఇది ఈ ఏడాది ఆగస్టులోపే పూర్తి చేయాల్సి ఉన్నా నేటికీ అందుబాటులోకి రాలేదు. భననం పూర్తి చేయడానికి మరో నెల సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

భవనం : సీసీబీ (క్రిటికల్ కేర్ బ్లాక్)
నిర్మాణ వ్యయం : రూ.15 కోట్లు
పరికరాల వ్యయం : రూ.8 కోట్లు
పడకల సామర్థ్యం: 80
అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు : 2

ఇదీ పరిస్థితి..

సీసీబీకి సంబంధించి సీలింగ్, విద్యుత్తు సంబంధిత పనులు పూర్తి చేయాల్సి ఉంది. శస్త్ర చికిత్స పరికరాలు, ఇతర సామగ్రి అందుబాటులో లేవు. నిర్మాణ పనులకు అడ్డుగా ఉన్న లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్‌ను మార్చాల్సి ఉంది. ఇప్పటికే అధికారులు దీనిపై సూపరింటెండెంట్‌కు లేఖ ఇచ్చినా మార్చకపోవడంతో భవనం ఎడమ వైపు పనుల్లో జాప్యం నెలకొంది.

ఏం ఉంటాయంటే..

● అత్యవసర విభాగం ● రెండు అధునాతన మాడ్యులర్ ఓటీలు ● 20 పడకల ఐసీయూ ● పది పడకల హెచ్‌డీయూ ● 6 పడకలతో అత్యవసర పరిస్థితుల్లో వచ్చే గర్భిణులు చికిత్స పొందడానికి ప్రత్యేక బ్లాకు ● నాలుగు పడకల డయాలసిస్ యూనిట్‌లు

జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌కు వినతులు

కలెక్టరేట్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు వినతులు వెల్లువెత్తాయి. రెండు వారాలుగా పీజీఆర్ఎస్ జరగకపోవడంతో ఈ వారం జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో అర్జీదారులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ఉన్నతాధికారులకు మొత్తం 205 వినతులు అందించారు. అత్యధికంగా రెవెన్యూ శాఖ పరిధిలో పరిష్కరించాల్సినవి 88 ఉండగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 47, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పోలీసు శాఖకు 17, అర్బన్ డెవలప్‌మెంట్‌కు 13, మిగతావి ఇతర శాఖల పరిధిలో పరిష్కరించాల్సిన అర్జీలు వచ్చాయి. కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ మేఘాస్వరూప్, డీఆర్వో సీతారామమూర్తి, సీపీవో అప్పలకొండ, ఇతర అధికారులు అర్జీలు స్వీకరించారు.

పర్యాటకులూ.. పారాహుషార్

ఇటీవల రాష్ట్రంలోని వివిధ జిల్లాల పరిధి సముద్ర తీరాల్లో జరుగుతున్న ప్రమాదాల్లో పర్యాటకులు ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో సోమవారం కాకినాడ కోస్టల్ సెక్యూరిటీ(మెరైన్) పోలీస్ స్టేషన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తుపాను ప్రభావంలో సముద్రతీర ప్రాంతాల్లోని జలాల్లో చాలాచోట్ల భారీ గుంతలు ఏర్పడ్డాయని, కార్తిక మాసంలో సముద్ర స్నానాలు, పూజలకు వచ్చేవారు పోలీసుల సూచనలు తప్పక పాటించాలని సూచించారు. - న్యూస్‌టుడే, సర్పవరం

ఎస్ఐఎఫ్‌టీకి జాతీయస్థాయి గుర్తింపు

కాకినాడ నగరం: కాకినాడలోని రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ (ఎస్ఐఎఫ్‌టీ)కు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఇక్కడ ల్యాబ్‌ల్లో ఐఎస్ఐ ప్రమాణాలతో నిర్వహిస్తున్న పరీక్షలకు జాతీయ అక్రిడేషన్ బోర్డు (ఎన్ఏబీఎల్) గుర్తింపు లభించిందని ఎస్ఐఎఫ్‌టీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.అంజలి తెలిపారు. ఇక్కడి ల్యాబ్‌ల్లో నీరు, మట్టి విశేషణ, సూక్ష్మ జీవ, వ్యాధి నిర్ధారణ, మాలిక్యులర్ లెవల్ డయాగ్నోసిస్ (సీపీఆర్), మేత నాణ్యత విశ్లేషణలు నిర్వహిస్తారు. వీటితో పాటే మరో రెండు ల్యాబ్‌లున్నాయి. వాటిలో యాంటీబయాటిక్స్, పెస్టిసైడ్స్ పరీక్షలు చేస్తారు. అత్యుత్తమ స్థాయిలో పరీక్షించిన మత్స్య ఉత్పత్తులనే విదేశాలకు ఎగుమతి చేసే అవకాశముంటుంది.

రైతేరాజు
అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

స్వయం సహాయక సంఘాల సభ్యులు

అతివల అభ్యున్నతికి 'ఉన్నతి'..!

ఎస్సీ, ఎస్టీ మహిళలకు వడ్డీ లేని రుణాలు

గోపాలపురం, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉన్నతి పథకం ద్వారా వడ్డీ లేని రుణాలు బ్యాంకు ద్వారా ఇస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన మహిళలకు రూ.30 వేల నుంచి రూ.5లక్షల వరకూ ప్రభుత్వం రుణాలు అందిస్తుంది.

నియోజకవర్గం	లక్ష్యం (రూ.లక్షల్లో)	ఇప్పటి వరకు తీసుకున్నది	ఇచ్చిన రుణాలు (లక్షల్లో)
గోపాలపురం	150	60	47.85
నిడదవోలు	150	53	35.50
రాజానగరం	150	58	47.15
రాజమండ్రి రూరల్	50	2	1.00
అనపర్తి	150	35	24.50

వాయిదాల రూపంలో..

గ్రామ సంఘంలో తీర్మానం చేసి అర్హులను ఎంపిక చేసి రుణాలు ఇస్తారు. రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు 24 నెలలు, లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ 48 నెలల్లో వాయిదాల రూపంలో రుణం చెల్లించాలి

జిల్లాలో ఇలా..

రాజమహేంద్రవరం అర్బన్ మినహా మిగిలిన నియోజకవర్గాల్లో 1600 మందికి ఉన్నతి పథకం ద్వారా రుణం మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటి వరకు జిల్లాలో 339 మందికి గాను రూ.2,39,50,000 మంజూరు చేశారు.

'ఉన్నతి పథకంపై అవగాహన కల్పిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా విధించిన లక్ష్యం పూర్తి చేయడానికి ఉన్నతి పథక కోఆర్డినేటర్లు, ఆయా మండలాల్లో ఏపీఎంలు సిబ్బంది ఎస్సీ, ఎస్టీ మహిళల్లోని అర్హులను గుర్తిస్తున్నారు. తొందరలో లక్ష్యం పూర్తి చేస్తాం.' అని పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి అన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

వెన్నుతట్టే విజయం.. బ్యాటుపట్టే సమయం

లెగ్ స్పిన్‌తో తిప్పేస్తూ..



రాజమహేంద్రవరానికి చెందిన రాజభార్గవి లక్ష్మి డిగ్రీ చదువుతోంది. తండ్రి ఎస్‌వీఎన్ ప్రసాద్‌కు క్రికెట్ అంటే ఇష్టం కావడంతో కుమార్తెను శిక్షణలో చేర్చారు. ఆరేళ్ల నుంచి కోచ్ హకీం పాషా వద్ద శిక్షణ పొందుతోంది. లెగ్ స్పిన్నర్, బ్యాటర్‌గా సత్తాచాటుతుంది. ఇటీవల జరిగిన ఎంపిక మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీసి, అండర్-19 రాష్ట్ర మహిళా జట్టులో స్థానం దక్కించుకుంది. ఇండియా జెర్సీ ధరించాలనేది తన ధ్యేయమని పేర్కొంది.

స్మృతి మంధానా.. హర్మన్‌ప్రీత్ కౌర్.. జెమీమా రోడ్రిగ్స్.. భారత మహిళా క్రికెట్ జట్టు ప్రపంచకప్ గెలుచుకోవడంతో అందరి నోళ్లలో నానుతున్న పేర్లివి. ఒకప్పుడు పురుషులకే పరిమితమైన క్రికెట్‌లో ఇప్పుడు మహిళలు వారికి దీటుగా సత్తా చాటుతున్నారు. ఉమ్మడి జిల్లాలోనూ బాలికలు, యువతులు క్రికెట్‌లో శిక్షణ తీసుకుంటున్నా వారి సంఖ్య మరింత పెరగాల్సి ఉంది. తల్లిదండ్రులూ పిల్లల్లో ప్రతిభను గుర్తించాలి. ప్రపంచ కప్ విజయం స్ఫూర్తితో మంధానా, హర్మన్‌లను ప్రోత్సహిద్దాం.. గుర్తిద్దాం.

–న్యూస్‌టుడే, శ్యామలా సెంటర్

ఉచిత శిక్షణ పొందుదాం.. రండి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలబాలికలకు పదేళ్ల నుంచి ఉచితంగా క్రికెట్‌లో శిక్షణ ఇస్తున్నారు.

రాజమహేంద్రవరం: లలితానగర్‌లోని సీజీటీఎం పాఠశాల మైదానంలో 2021 నుంచి ప్రత్యేకంగా బాలికలకు మాత్రమే శిక్షణ ఇస్తున్నారు. కోచ్ హకీమ్ (9948612786)

ఉమ్మడి జిల్లాలో కేవలం నాలుగు ప్రాంతాల్లో మాత్రమే మైదానాలు అందుబాటులో ఉన్నాయి. శిక్షణ తీసుకోవాలంటే సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రతి డివిజన్ కేంద్రంలోనూ ఒక మైదానం ఏర్పాటు చేసి శిక్షకులను నియమిస్తే ఎంతో మంది ప్రతిభావంతులు తయారయ్యే అవకాశం ఉంటుంది.

రాజమహేంద్రవరంలో శిక్షణ తీసుకుంటున్న బాలికలు

ఏం కావాలంటే..

● క్రికెట్ ఆడే మహిళల్లో 90 శాతం మంది పేద క్రీడాకారిణులే. ఖరీదైన బ్యాట్‌తో పాటు హెల్మెట్, లెగ్ ప్యాడ్ ఇతర సామగ్రికి ఒక్కో క్రీడాకారిణికి రూ.30 వేల వరకు కావాలి.
● దశాబ్దం కిందట ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ప్రతిభావంతులైన క్రీడాకారులకు నెలకు రూ.1500 నుంచి రూ.3వేల వరకు అందించేవారు. గతేడాది నుంచి నగదు ప్రోత్సాహకాలు అందించడం లేదు.
● రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలంటే జిల్లాలో లీగ్ మ్యాచ్‌లు నిత్యం నిర్వహిస్తుండాలి.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

శిక్షణ కేంద్రం	క్రీడాకారిణులు
కాకినాడ	4
అంబాజీపేట	2
పెద్దాపురం	4
రాజమహేంద్రవరం	30

జాతీయ స్థాయిలో రాణింపు

రాజమహేంద్రవరంలో శిక్షణ పొందిన పలువురు బాలికలు జాతీయ స్థాయిలో అండర్-17, 19 పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొన్నారు. ఈ నెల 6, 7 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే జిల్లా పోటీల్లో ప్రతిభ చూపితే ఆంధ్రా రంజీ జట్టుకు ఎంపిక చేసే అవకాశం ఉందని కోచ్ అక్కిం తెలిపారు.

విభాగాలు ఇలా: ● జిల్లా స్థాయి ● నార్త్ జోన్ ● రాష్ట్ర స్థాయి ● రాష్ట్ర స్థాయిలో: అండర్ 15, 19, 23

పక్షి ప్రేమికుడు

ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం గుత్తులు

వాతావరణం కాలుష్యానికి తోడు సరైన ఆహారం దొరకక పలు రకాల పక్షు జాతులు అంతరించిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పక్షి ప్రేమికుడైన కాకినాడ కస్టమ్స్ ఘాటీ(ఎస్పీఎఫ్) కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న జి.శ్రీధర్ తనవంతు బాధ్యతగా వాటి కోసం నీరు, ఆహారం అందేలా కృషిచేస్తున్నారు. కార్యాలయ ఆవరణలో ప్రత్యేకంగా తయారు చేసిన లాంతరు లాంటి డబ్బాలను నాలుగైదు చోట్ల ఏర్పాటు చేసి గింజలు ఉంచుతారు. ధాన్యం గుత్తులను చెట్ల వద్ద.. తాళ్ల సహాయంతో వేలాడదీస్తున్నారు. పిచ్చుకలు, రామ చిలుకలు, పావురాలు వంటివి పెద్దసంఖ్యలో ఇక్కడకు వచ్చి వాటిని తింటాయి. ఇది తనకెంతో ఆనందాన్నిస్తుందని శ్రీధర్ పేర్కొన్నారు.

గింజలు తింటున్న రామ చిలుకలు

-న్యూస్‌టుడే, సాంబమూర్తి నగర్(కాకినాడ)

కొవ్వూరు రైల్వేస్టేషన్‌కు పునర్వైభవం : ముప్పిడి

కొవ్వూరు పట్టణం : కొవ్వూరు రైల్వే స్టేషన్‌కు పునర్వైభవం తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీరు శ్రీనివాస్ సోమవారం కొవ్వూరు స్టేషన్‌ను సందర్శించారు. ఎమ్మెల్యే ఆయనతో కలిసి స్టేషన్ ఆవరణ, పరిసరాలను పరిశీలించారు. కొవ్వూరు స్టేషన్లో అభివృద్ధి పనులకు రూ.17 కోట్లతో ప్రతిపాదనలు చేస్తున్నామన్నారు. కరోనా విపత్తుతో ముఖ్య రైళ్లు ఆగక సుమారు 120 గ్రామాల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరలోనే ముఖ్య రైళ్లు కొవ్వూరులో ఆగడంతో పాటు స్టేషన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

ఎం'చెక్కా' ఆకృతులు

రెండంతస్తుల భవంతి

సుందరంగా చెక్క కుర్చీ

సృజన

ఆసక్తితో ఆకట్టుకునే కళాఖండాలను సృష్టిస్తున్నారు ఉండ్రాజవరం మండలం వేలివెన్నుకు చెందిన యార్లగడ్డ ప్రసాద్. ఇంటర్ వరకు చదువుకున్న ఆయన ఇళ్ల డిజైన్లు రూపొందిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. విద్యార్థి దశ నుంచే తాను చూసిన, తనకు తట్టిన ఆలోచనలకు ఆకృతి ఇస్తూ.. ఇప్పటికే చెక్కతో పలు రకాల వస్తువులు తయారు చేశారు. వీటిలో రెండంతస్తుల భవనం నమూనా ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. జెండా స్తంభం, ఫొటో స్టాండు, మోటారు వాహనం, కుర్చీ, పెన్నులు పెట్టుకునే చెక్కతొట్టె.. ఇలా సుమారు 100 రకాలకు పైగా వస్తువులు తయారు చేశారు. ఇంటికొచ్చే వారంతా వాటిని తిలకించి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రసాదు తండ్రి వెంకటేశ్వరరావు వడ్రంగి పనులు చేస్తుంటారు. ఆయనను నిత్యం గమనిస్తుండడం వల్ల చెక్కతో వస్తువుల తయారీపై ఆసక్తి పెరిగిందని, తండ్రి సహకారంతో విభిన్న ఆకృతులు రూపొందించడం నేర్చుకున్నట్లు ఆయన తెలిపారు. ఆదాయం కోసం కాకుండా ఇష్టంతో వీటిని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు.

ప్రసాదు

- న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

సత్యదేవుని గిరిప్రదక్షిణకు వేళాయె!

8.2 కి.మీ ప్రశాంతంగా సాగేలా ఏర్పాట్లు

న్యూస్‌టుడే, అన్నవరం

కార్తిక పౌర్ణమి సందర్భంగా ఈనెల 5న (బుధవారం) అన్నవరం సత్యనారాయణ స్వామి గిరిప్రదక్షిణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అన్నవరం గ్రామంలోని తొలిపావంచాల వద్ద ప్రదక్షిణ ప్రారంభమవుతుంది. ప్రధానమార్గం మీదుగా సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, సుబ్బరాయపురం, సాక్షిగణపతి ఆలయం నుంచి జాతీయ రహదారిపైకి చేరుకుని.. అక్కడినుంచి బెండపూడి కూడలికి ముందు పోలవరం కాలువ గట్టు మీదుగా పంపా సరోవరం చెంతకు వస్తుంది. ఇక్కడి నుంచి ఘాట్ మీదుగా (రత్న, సత్యగిరులను చుడుతూ) దిగువ ఘాట్‌రోడ్డుపై సాగుతూ తొలిపావంచాల వద్ద ముగుస్తుంది.

అర్ధరాత్రి 1 గంట నుంచే వ్రతాలు

బుధవారం కార్తిక పౌర్ణమి సందర్భంగా మంగళవారం రాత్రి 10 గంటల నుంచే వ్రత టికెట్లు విక్రయిస్తారు. అర్ధరాత్రి 1 గంట నుంచి వ్రతాలు, 2 గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభిస్తారు.

☛ ప్రదక్షిణ మార్గం మొత్తం: 8.2 కి.మీ. (తారురోడ్డు 3.9 కి.మీ, గ్రావెల్‌రోడ్డు 4.3కి.మీ.)
☛ తొలిపావంచా – హైవే ఆర్చి గేటు వరకు: 2.1 కి.మీ.
☛ ఆర్చిగేటు–పోలవరం కాలువ: 1.3 కి.మీ.
☛ పోలవరం కాలువ కూడలి– దిగువ ఘాట్‌రోడ్డు కూడలి: 4.3 కి.మీ.
☛ దిగువ ఘాట్‌రోడ్డు కూడలి –తొలిపావంచా: 0.5 కి.మీ.
☛ సమయం: ఈనెల 5న మధ్యాహ్నం 2 గంటలకు కొండ దిగువ తొలిపావంచాల వద్ద సత్యరథం ప్రారంభం. సాయంత్రం 5-6 గంటలకు గిరిప్రదక్షిణ ముగిసే ఆస్కారం. ఉదయం 8.30కు స్వామి, అమ్మవార్లను గిరుల చుట్టూ తిప్పుతారు.
☛ భద్రత: ఇద్దరు డీఎస్పీలు, 8 మంది సీఐలు, 16 మంది ఎస్సైలు, సుమారు 300 మంది సిబ్బంది, దేవస్థానం భద్రతా సిబ్బంది
☛ స్టాల్స్: 12 (పండ్లు, ప్రసాదం, తాగునీరు, మజ్జిగ, బిస్కెట్లు, పాలు పంపిణీ)
☛ పార్కింగ్: కొండపైన, కొండ దిగువన జూనియర్ కళాశాల మైదానం
☛ వైద్యశిబిరాలు: 4 వేదికలు : 4 సేవలందించేందుకు ప్రతి కి.మీ.కు దేవస్థానం అధికారులు, సిబ్బంది ఉంటారు. అక్కడే విరామ స్థలాలు ఉంటాయి.

WANTED
రాజమండ్రిలో ప్రముఖ 2 వీలర్ షోరూమ్ SRI RK HONDAలో పనిచేయుటకు ఈ క్రింది స్టాఫ్ కావలెను
✦ స్పేర్స్ మేనేజర్
✦ కంప్యూటర్ ఆపరేటర్
ఇంటర్వ్యూ: 4, 5, 6 November 2025 తేదీలలో 10 AM to 5 PM వరకు
SRI RK HONDA
D.No.6-16-1, ధారావారిపేట వీధి, రోడ్ కమ్ రైల్వే బ్రిడ్జికి వెళ్లే రోడ్డులో, కోటిపల్లి బస్టాండ్ దగ్గర రాజమండ్రి, 8297713999

(c) eenadu

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ వై. కిరణ్ చంద్ (చీఫ్ మేనేజర్) మొబైల్ నెం.91609 49910, ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, ఆస్తి తనిఖీ కొరకు : 9866027578

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 9(1)తో చదువబడు 8(6) నిబంధనలతో చదువబడు (సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన స్థిరాస్తుల అమ్మకము)

SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు లాంఛనాత్మక స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖాపెట్టిన ఆస్తి/ఆస్తుల ఈ-వేలం (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీత(లు) : శ్రీ సాకా లక్ష్మీ నారాయణ, తండ్రి : శ్రీ సాకా జనార్ధనరావు, డి.నెం.6-60, సాకా వారి వీధి, సోమేశ్వరం, రాయవరం మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533261. వేరొక చిరునామా : శ్రీ సాకా లక్ష్మీ నారాయణ, తండ్రి : జనార్ధనరావు, డి.నెం.7-1 & 7-2, కాపుల రామాలయం దగ్గర, సోమేశ్వరం, రాయవరం మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533261. శ్రీమతి సాకా వెంకట దుర్గ, భర్త : శ్రీ సాకా లక్ష్మీ నారాయణ, డి.నెం.6-60, సాకా వారి వీధి, రామాలయం దగ్గర, సోమేశ్వరం, రాయవరం మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533261. డిమాండ్ నోటీసు తేది: 01-07-2022

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం : తేది.16.06.2022 నాటికి రూ.4,40,56,912/- + తేది.17.06.2022 నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి.

ప్రస్తుత బకాయి మొత్తం: తేది.31-10-2025 నాటికి రూ.5,48,81,949/- + తేది.01.11.2025 నుండి భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి (మునుపటి జమలు మినహాయించిన తరువాత).

షెడ్యూల్ ఆస్తి వివరములు:

బ్లాక్ నెం.7, ఆర్.ఎస్.నెం.318/5, డి.నెం.7-1&7-2 లోని 191.77 చ॥గ॥ల విస్తీర్ణంలో గల నివాస భవనం (జిఎఫ్ + ఎఫ్ఎఫ్ + ఎస్ఎఫ్) యావత్తు అస్తి షెడ్యూలు డాక్యుమెంట్ ప్రకారం దిగువ తెలుపబడినది.

రిజిస్టర్డు సేల్ డీడ్ నెం.5266/2014, తేది.18.12.2014 ప్రకారం: తూర్పు గోదావరి జిల్లా, రామచంద్రాపురం సబ్-రిజిస్ట్రీ, సోమేశ్వరం పంచాయితీ, బ్లాక్ నెం.7, సోమేశ్వరం గ్రామం, ఆర్.ఎస్.నెం.318/5 లోని (65.77 + 11.67 = 77.44) చ॥గ॥ల విస్తీర్ణంలో సంబంధిత డి.నెం.7-1తో గల ఆస్తి. హద్దులు : ఐటమ్ నెం.1: తూర్పు : సాకా జానకి రామయ్య గారికి చెందిన గోడ, పడమర : ప్రభుత్వ వీధి, దక్షిణం: ఈ ఇంటికి మరియు గరగ జానకమ్మ గారికి చెందిన ఇంటికి ఉమ్మడి గోడ, ఉత్తరం : ఇక్కడ గల ఐటమ్ నెం.2 కొంతమేర మరియు పెద్దిరెడ్డి జానకమ్మ గారికి చెందిన స్థలం కొంతమేర.

పైన తెలిపిన హద్దులలో 65.77 చ॥గ॥ల విస్తీర్ణం అన్నీ ఈజిమెంట్ హక్కులతో కలదు.

ఐటమ్ నెం.2: తూర్పు : సాకా జానకి రామయ్య గారికి చెందిన గోడ, పడమర : పెద్దిరెడ్డి జానకమ్మ గారికి చెందిన స్థలం, దక్షిణం: ఇక్కడ గల ఐటమ్ నెం.1, ఉత్తరం : ఉమ్మడి గోడ దారి మార్గం.

పైన తెలిపిన హద్దులలో 11.67 చ॥గ॥ల విస్తీర్ణం అన్నీ ఈజిమెంట్ హక్కులతో కలదు.

రిజిస్టర్డు సేల్ డీడ్ నెం.4638/2015, తేది.24.09.2015 ప్రకారం: తూర్పు గోదావరి జిల్లా, రామచంద్రాపురం సబ్-రిజిస్ట్రీ, సోమేశ్వరం పంచాయితీ, బ్లాక్ నెం.7, సోమేశ్వరం గ్రామం, ఆర్.ఎస్.నెం.318/5 లోని (65.77 + 11.67 = 77.44) చ॥గ॥ల విస్తీర్ణంలో సంబంధిత డి.నెం.7-1తో గల ఆస్తి. హద్దులు : ఐటమ్ నెం.1: తూర్పు : సాకా జానకి రామయ్య గారికి చెందిన గోడ, పడమర : ప్రభుత్వ వీధి, దక్షిణం : ఈ ఇంటికి మరియు గరగ జానకమ్మ గారికి చెందిన ఇంటికి ఉమ్మడి గోడ, ఉత్తరం : ఇక్కడ గల ఐటమ్ నెం.2 కొంతమేర మరియు పెద్దిరెడ్డి జానకమ్మ గారికి చెందిన స్థలం కొంతమేర.

పైన తెలిపిన హద్దులలో 65.77 చ॥గ॥ల విస్తీర్ణం అన్నీ ఈజిమెంట్ హక్కులతో కలదు.

ఐటమ్ నెం.2: తూర్పు : సాకా జానకి రామయ్య గారికి చెందిన గోడ, పడమర : పెద్దిరెడ్డి జానకమ్మ గారికి చెందిన స్థలం, దక్షిణం : ఇక్కడ గల ఐటమ్ నెం.1, ఉత్తరం : ఉమ్మడి గోడ దారి మార్గం.

పైన తెలిపిన హద్దులలో 11.67 చ॥గ॥ల విస్తీర్ణం అన్నీ ఈజిమెంట్ హక్కులతో కలదు.

రిజిస్టర్డు సేల్ డీడ్ నెం.1284/2016, తేది.18.03.2016 (36.89 చ॥గ॥లు) ప్రకారం: తూర్పు గోదావరి జిల్లా, రామచంద్రాపురం సబ్-రిజిస్ట్రీ, సోమేశ్వరం పంచాయితీ, బ్లాక్ నెం.7, సోమేశ్వరం గ్రామం, ఆర్.ఎస్.నెం.318/5 లోని 36.89 చ॥గ॥ల విస్తీర్ణంలో సంబంధిత డి.నెం.7-1 మరియు 7-2లతో గల ఆస్తి. హద్దులు : తూర్పు : సాకా జానకి రామయ్య గారికి చెందిన గోడ, పడమర : ప్రభుత్వ వీధి, దక్షిణం : అమ్మకందారు నుండి సుంకర శ్రీనివాసరావు గారు కొనుగోలు చేసిన స్థలం, ఉత్తరం : కొనుగోలుదారుని స్థలం.

పైన తెలిపిన హద్దులలో 36.89 చ॥గ॥ల విస్తీర్ణం అన్నీ ఈజిమెంట్ హక్కులతో కలదు.

మొత్తం 191.77 చ॥గ॥ల స్థలం అందు గల నివాస (GF + FF + SF) భవనం.

రిజర్వు ధర : రూ.1,04,75,000/- ధరావత్తు : రూ.10,47,500/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేదీ : 09-12-2025 సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది:04-11-2025 నుండి 08-12-2025 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఐయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను సంప్రదించండి.

2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.

గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలనీ సూచించటమైనది.

గమనిక -2 : ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 194-1A ప్రకారం అమ్మకంలో భాగంగా అమ్మకం విలువ రూ.50,00,000/- (యాభై లక్షల రూపాయలు) మరియు అంతకంటే ఎక్కువ ఉన్నచో సదరు మొత్తముపై TDS @ 1% వర్తిస్తుంది. కావున సఫలీకృత బిడ్డరు/కొనుగోలుదారు గవర్నమెంట్ గైడ్‌లైన్స్ ధర లేదా అమ్మకం ధరలో ఏది ఎక్కువైతే దానిలో 1% TDS ను తగ్గించుకొని సదరు మొత్తమును ఆదాయపు పన్ను డిపార్ట్‌మెంట్ యొక్క ఫారం నెం.16-బి నందు జమచేయవలెను మరియు సదరు ఒరిజినల్ TDS సర్టిఫికెట్‌ను బ్యాంకు వారికి సమర్పించవలెను.(వ్యవసాయ భూమి కాకుండా కేవలం స్థిరాస్తికి మాత్రమే వర్తించును).

తేది:31-10-2025, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మాక్సిమస్ ARC లిమిటెడ్

కార్పొరేట్ ఆఫీస్: # 302బి, జైన్ సద్గురు ఇమేజెస్ క్యాపిటల్ పార్క్, ఇమేజ్ గార్డెన్స్ రోడ్, విఐపి హిల్స్, మాదాపూర్, హైదరాబాద్, తెలంగాణ – 500081. ఫోన్: 040-49951666, E-mail: co@maximusarc.com

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 6 (2) మరియు 8(6) యొక్క నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన. సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు గ్యారంటర్(ల)కు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్ (M/s మాక్సిమస్ ARC లిమిటెడ్)కు తనఖా పెట్టబడిన/ఛార్జిచేయబడిన మరియు M/s మాక్సిమస్ ARC లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిచే భౌతిక స్వాధీనత చేపట్టబడిన దిగువ తెలిపిన స్థిరాస్తి, M/s మాక్సిమస్ ARC లిమిటెడ్‌కు 30.09.2025 నాటికి ఉన్న మొత్తం బకాయి రూ.14,50,72,971/- (పద్నాలుగు కోట్ల యాభై లక్షల డెబ్బై రెండు వేల తొమ్మిది వందల డెబ్బై ఒక్క రూపాయలు మాత్రమే) మరియు చెల్లింపు తేదీ వరకు తదుపరి వడ్డీ, ఛార్జీలు, వ్యయాలను (సదరు బకాయి 01.09.2023 తేదీ నాటి అసైన్‌మెంట్ అగ్రిమెంట్ ద్వారా మెసర్స్ పృథ్వీ ఆసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీచే M/s మాక్సిమస్ ARC లిమిటెడ్‌కు అప్పగించబడింది) M/s సుమ రిఫైనరీస్ లిమిటెడ్ (రుణగ్రహీత), శ్రీ ఉప్పులూరి వెంకట సత్యనారాయణ మరియు శ్రీమతి ఉప్పులూరి వీర వెంకట కాశీ నాగ కుమారి (గ్యారంటర్లు) నుండి రాబట్టుకునేందుకు "ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలానే" ప్రాతిపదికన 11.12.2025న విక్రయించబడును.

రిజర్వు ధర: లాట్ 1కి రూ. 135 లక్షలు, లాట్ 2కి రూ.400 లక్షలు మరియు లాట్ 3కి రూ.205 లక్షలు.

ధరావతు: లాట్ 1కి రూ.13.50 లక్షలు, లాట్ 2కి రూ.40 లక్షలు, లాట్ 3కి రూ.20.50 లక్షలు

స్థిరాస్తి సంక్షిప్త వివరము

క్ర.సం | ఆస్తుల వివరము

లాట్-1: మెసర్స్ సుమ రిఫైనరీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కి చెంది, ఆంధ్రప్రదేశ్, తూర్పు గోదావరి జిల్లా, రాజానగరం మండలం, చక్రద్వారబంధం గ్రామ పంచాయతీ, వెలుగుబంద గ్రామం, ఆర్ఎస్ నెం.663 వద్ద సుమ రిఫైనరీస్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క ఆవరణలో ఉన్న ఫ్యాక్టరీ వద్ద గల భూమికి అతికించిన ప్లాంట్ & మెషినరీ యావత్తు.

క్ర.సం.	వివరాలు	పరిమాణం
1	స్టోరేజి ట్యాంకులు 2, 1 లీటర్ పౌచ్ ప్యాకింగ్ మెషిన్ 1నం., టిన్ ఫిల్లింగ్ మెషిన్ 1 నం., స్ట్రాపింగ్ మెషిన్ 1నం., బ్యారల్ ఫిల్లింగ్ మెషిన్ 1 నం., టేబుళ్ళు, ఎలక్ట్రికల్ మోటార్లు, పంపుసెట్లు, ప్యాకింగ్ మెటీరియల్ మొదలుగునవి గల ప్యాకింగ్ సెక్షన్,	1 సెట్
2	DO యూనిట్ బూస్టర్లు	2 సెట్లు
3	[illegible]	[illegible]
4	[illegible]	1 సెట్
5	[illegible]	2 సెట్లు
6	[illegible]	1 సెట్
7	10 హెచ్‌పి మోటార్లు	2 నం
8	[illegible]	3 సెట్లు
9	[illegible]	3 నం.లు
10	[illegible]	1 సెట్
11	ఎయిర్ కంప్రెసర్	1 సెట్
12	12 హెచ్‌పి మోటార్	1 నం
13	[illegible]	1 నం
14	20 హెచ్‌పి మోటార్ల పంపులతో	3 సెట్లు
15	[illegible]	1 నం
16	[illegible]	2 నం.లు
17	[illegible]	[illegible]
18	[illegible]	1 సెట్
19	[illegible]	1 సెట్
20	[illegible]	1 లాట్
21	[illegible]	2 నం.లు
22	12 హెచ్ మోటార్ గేర్ బాక్సుతో	1 నం
23	ఎస్ఎస్ స్క్రాప్	1 లాట్
24	మోటారు మరియు పంపుతో స్టోరేజి ట్యాంకు	1 నం
25	స్టీరిక్ ఆసిడ్ ఆయిల్ ప్యాకింగ్ యూనిట్	1 నం
26	హైడ్రోజెన్ గ్యాస్ యూనిట్	1 సెట్
27	అన్ని ఉపకరణాలతో బాయిలర్	1 సెట్
28	[illegible]	[illegible]
29	[illegible]	[illegible]
30	[illegible]	[illegible]
31	[illegible]	[illegible]
32	[illegible]	[illegible]
33	[illegible]	[illegible]
34	[illegible]	[illegible]
35	[illegible]	[illegible]
36	[illegible]	[illegible]
37	[illegible]	[illegible]
38	[illegible]	[illegible]
39	[illegible]	[illegible]
40	[illegible]	[illegible]
41	[illegible]	[illegible]
42	[illegible]	[illegible]
43	[illegible]	[illegible]
44	[illegible]	[illegible]
45	[illegible]	[illegible]
46	[illegible]	[illegible]

రిజర్వు ధర: రూ.135 లక్షలు ధరావతు: రూ.13.50 లక్షలు

లాట్-2: [illegible]

రిజర్వు ధర: రూ.400 లక్షలు; ధరావతు: రూ.40 లక్షలు

లాట్-3: [illegible]

రిజర్వు ధర: రూ.205 లక్షలు; ధరావతు: రూ.20.50 లక్షలు

తెలిసిన వేరే ఎన్‌కంబరెన్సులు: లేవు

ఆస్తుల తనిఖీ తేదీ మరియు సమయం: 01.12.2025 & 02.12.2025 ఉ.11.00 గం. నుండి సా.4.00 గం. మధ్య

వేలం నిర్వహణ: ఆన్‌లైన్ ఇ-వేలం https://auctionbazaar.com ద్వారా

అన్ని లాట్లకు ధరావతు చెల్లింపు మరియు బిడ్ దాఖలుకు చివరి తేదీ మరియు సమయం: 10.12.2025 సా.5.00 గం. లోపు

ఇ-వేలం తేదీ: లాట్-1కి: 11-12-2025 ఉ.11.00 గం. నుండి మ.1.00 గం. మధ్య

లాట్-2కి: 11.12.2025న ఉ.11.00 గం. నుండి మ.12.00 గం. మధ్య లాట్-3కి: 11.12.2025న మ.12.00 గం. నుండి మ.01.00 గం. మధ్య

బిడ్ పెంపుదల: లాట్-1కి రూ.2,00,000/-, లాట్-2కి రూ.5,00,000/-, లాట్-3కి రూ.2,00,000/-

[illegible] www.maximusarc.com/tenders [illegible]

తేదీ: 01.11.2025 ప్రదేశం: హైదరాబాద్ సం/- (ఆర్.వి.రాజు) చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి మాక్సిమస్ ARC లిమిటెడ్ - +91 98481 70245

పోటీలను ప్రారంభిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

నన్నయలో రెజ్లింగ్ పోటీలు

రాజానగరం: నన్నయ విశ్వవిద్యాలయంలో రెజ్లింగ్ మెన్ అండ్ ఉమెన్ అంతర్ కళాశాల కమ్ విశ్వవిద్యాలయం జట్టు ఎంపిక పోటీలను సోమవారం వీసీ ఎస్.ప్రసన్నశ్రీ ప్రారంభించారు. ఉమెన్ ఫ్రీస్టైల్ 50 నుంచి 76 విభాగం వరకు నిర్వహించారు. వీటిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను విశ్వవిద్యాలయం జట్టుగా ఎంపిక చేసి రాజస్థాన్ కోటా విశ్వవిద్యాలయంలో ఈ నెల 27 నుంచి 30 వరకు నిర్వహించే సౌత్‌జోన్ పోటీలకు హాజరవుతారు. ● మెన్ పోటీలు ఫ్రీస్టైల్‌లో 57 కేజీల నుంచి 125 కేజీల వరకు, గ్రీకోరోమన్ విభాగంలో 55 కేజీల నుంచి 130 కేజీల వరకు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను ఎంపిక చేసి చండీగఢ్ యూనివర్సిటీలో నిర్వహించే సౌత్ జోన్ పోటీలకు పంపిస్తారు.

మొక్కలు చూపిస్తున్న అధికారులు

కలువగట్లపై నాటేందుకు అరుదైన వెదురుజాతి మొక్క

రాజానగరం: రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా వినియోగంలోకి తీసుకురావాలనుకుంటున్న బాంబూసా తుల్దా అనే అరుదైన వెదురు జాతిని కలువ గట్లపై పెంచాలని తూర్పుగోదావరి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ మురాళిశెట్టి సునీల్ కుమార్, వైస్ ఛైర్మన్ తమలంపూడి సుధాకర్‌రెడ్డి అన్నారు. దివాన్‌చెరువు అభయారణ్యంలో ఏపీ రాష్ట్ర అటవీ అకాడమీలో డీఎఫ్ఓ శ్రీనివాసరావు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ అరుదైన వెదురుజాతికి సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. సునీల్ కుమార్, సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈజాతి వెదురు... కాలువ గట్లపై నాటిన నాటి నుంచి ఏడాది ఇలా 40 సంవత్సరాల వరకు ఆదాయం ఇస్తుందన్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గ్రేట్ గ్రీన్‌వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారన్నారు. దీనికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు.

అరెకరంలో ఆరోగ్య ఫలాలు

న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలను వృథాగా వదిలేయకుండా మొక్కలు పెంచి ఆరోగ్యకర ఉత్పత్తులు పొందుతున్నారు ఉండ్రాజవరానికి చెందిన కుదప నారాయణరావు. రైతు కుటుంబానికి చెందిన ఈయన మెకానికల్ ఇంజినీరుగా పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం సమయాన్ని వివిధ రకాల మొక్కల పెంపకానికి కేటాయించారు. ఇంటిపక్కనే ఖాళీగా ఉన్న 50 సెంట్లలో సుమారు 45 రకాల మొక్కలు నాటారు. కొంత భాగంలో [illegible] దిగుబడులు సాధిస్తున్నారు.



పెంచుతున్న వివిధ రకాల మొక్కలు

స్ఫూర్తి: వ్యవసాయాధికారులు పరిశీలించి ఆదర్శంగా తీసుకోవాలంటున్నారు.

ఎన్నో రకాలు..

తైవాన్ జామ, పంద్రోడు మామిడి 365 రోజుల పొడవునా కాయలు కాస్తున్నాయి. యాపిల్‌బెర్రి, బత్తాయి, గులాబ్‌జామ, రేగు, విప్పపువ్వు, దానిమ్మ, అల్లనేరేడు, రామ, లక్ష్మణ, సీతాఫలాలు, వాక్కాయ సాగు చేస్తున్నారు. రైతులతో పాటు [illegible]

ఆన్‌లైన్‌లో పరిశీలించి..

మధుమేహం, రక్తపోటు తదితర వ్యాధిగ్రస్తులకు ఈ ఫలాలు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. బంధుమిత్రులతో పాటు దూరప్రాంతాల్లో ఉన్న అనేకమందికి పంపిస్తున్నాను. కుటుంబ సభ్యులు సహకరిస్తున్నారు. ఆన్‌లైన్‌లో పరిశీలించి మేలైన మొక్కలు తీసుకొస్తున్నాను.

- కుదప నారాయణరావు, ఉండ్రాజవరం

రైతేరాజు

పట్టు రైతులకు రాయితీపై ఉపకరణాలు

గొల్లప్రోలు: మల్బరీ సాగు చేస్తూ పట్టు పురుగులు పెంచే రైతులు ఆధునిక పరికరాల వినియోగంతో నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చు. పట్టు రైతులకు రాయితీపై ఉపకరణాలు అందిస్తున్నట్లు పట్టు పరిశ్రమలశాఖ జిల్లా అధికారి రాజేంద్ర ప్రసాద్‌బాబు తెలిపారు. అందించే పరికరాలు, రాయితీల వివరాలను ఆయన వివరించారు. పట్టు పరిశ్రమల శాఖ సిబ్బందిని కలిసి వివరాలు తెలుసుకుని దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ● వీడర్, బ్రష్‌కట్టర్, పవర్ స్ప్రేయర్లు, పవర్ టిల్లర్ వంటివి అందిస్తారు. ● యూనిట్ విలువ రూ.లక్షగా నిర్ణయించి రూ.50 వేలు రాయితీ ఇస్తారు. ●యూనిట్ విలువ రూ.లక్ష కన్నా తక్కువైతే దానిలో 50 శాతం రాయితీ ఇస్తారు. రూ.లక్ష కన్నా ఎక్కువైనా రూ.50 వేలు మాత్రమే రాయితీ కల్పిస్తారు.

జగ్గంపేటలో ఏర్పాటు చేసిన పెట్టెలు

లాభదాయకం.. తేనెటీగల పెంపకం

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: తేనెటీగల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎంఐడీహెచ్(మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్) పథకం ద్వారా రాయితీలు అందిస్తోందని జగ్గంపేట ఉద్యానాధికారిణి పి.శ్రీవల్లి తెలిపారు. ఎస్టీ రైతులకు ఒక యూనిట్‌కి రూ.24 వేలు అందిస్తుందన్నారు. ముందుగా మేలైన తేనెటీగలను, అనువైన స్థలాన్ని ఎంపిక చేసుకుని పెంపకానికి అవసరమైన పరికరాలు సమకూర్చుకోవాలి. మకరందం, పుప్పొడిని అందించే మొక్కలు దగ్గరలో పెంచాలి. తేనెటీగలు మొక్కలు, పండ్లతోటల్లో పరాగసంపర్కానికి, దిగుబడి పెంచేందుకు సహాయపడతాయి. వీటి పెంపకంతో మహిళలు, యువతకు ఉపాధి లభిస్తుంది. ప్రభుత్వాలు, అనేక సంస్థలు ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం తేనె, మైనానికి మార్కెట్‌లో మంచి గిరాకీ ఉండటంతో పలువురు వీటి పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు.

మీ కోసం

బొప్పాయి పాలు.. విదేశాలకు

చాగలమర్రి (నంద్యాల), న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా చాగలమర్రి మండల వ్యాప్తంగా రైతులు అధికంగా బొప్పాయి సాగు చేస్తుంటారు. చిన్నవంగలితో పాటు సమీపంలోని గ్రామాలైన వైఎస్సార్ కడప జిల్లా కానగూడూరు, క్రిష్ణంపల్లె గ్రామాల్లో 1200 ఎకరాల్లో పండిస్తారు. విత్తనం నాటిన కాలం నుంచి తొమ్మిది నెలలకు పంట చేతికొస్తుంది. పండ్ల సేకరణ అనంతరం 13 నెలల తర్వాత మిగిలినవి, ముదురు కాయలకు గాట్లు పెట్టి పాలను సేకరిస్తున్నారు. తెల్లవారుజాము సమయంలోనే కాయలకు గాట్లు పెడితే కేవలం రెండు గంటల్లోనే పాలు ఊరతాయి. ఇలా సేకరించిన దాన్ని రాయచోటి, రాజంపేటకు చెందిన వ్యాపారులు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల పాలు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 4 డ్రమ్ముల పాలు సేకరిస్తున్నారు. ఎకరానికి పాల సేకరణ ద్వారా రైతుకు రూ.24 వేల ఆదాయం వస్తుంది. సేకరించిన పాలను పరిశ్రమల్లో మందులు, కాస్మోటిక్స్, సబ్బుల తయారీలో ఉపయోగిస్తున్నారు. బెంగళూరు, చెన్నైతో పాటు నాణ్యతను బట్టి విదేశాలకు సైతం పాలను ఎగుమతి చేస్తున్నారు. బొప్పాయి సాగులో ఎప్పుడైనా ధర పడిపోయినప్పుడు బొప్పాయి పాల సేకరణతో నష్టాల నుంచి రైతులు బయటపడుతున్నారు.

చలికాలం.. పశువులు పదిలం

పశువుల శాల

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: చలికాలం ప్రారంభమైనందున పశువుల పెంపకంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని ర్యాలి పశువైద్యాధికారి మౌనిక వివరించారు. పాడిపశువులు చలిగాలుల బారిన పడకుండా పరిశుభ్రమైన కొట్టాల్లో కట్టాలి. దాణాలో మాంసకృత్తులు తక్కువగా, పిండి పదార్థాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. జీర్ణక్రియ సక్రమంగా ఉండేందుకు ఓ పూట పచ్చిమేత, మరోపూట ఎండుమేత ఇవ్వడం శ్రేయస్కరం. శీతాకాలంలో లభించే పచ్చగడ్డిలో కాల్షియం, ఇతర ఖనిజ లవణాలు తక్కువగా ఉంటాయి. అందువల్ల దాణాతో పాటు విటమిన్లతో కూడిన ఖనిజ లవణాలు అందించాలి. తద్వారా పాలజ్వరం, పడక జబ్బు వంటి రుగ్మతలను నివారించవచ్చు. చలివల్ల పొదుగుపై పగుళ్లు ఏర్పడి పుండ్లుగా మారే ప్రమాదం ఉంది. బోరో గ్లిసరిన్ పేస్టును పైపూతగా పూసి సమస్యను నివారించవచ్చు. పశువులను పగటివేళల్లో మాత్రమే దూర ప్రాంతాలకు రవాణా చేయాలి.

వ్రతమాచరిస్తున్న భక్తులు

సత్యదేవుని సన్నిధిలో కార్తిక సందడి

అన్నవరం: పవిత్ర కార్తికమాస సోమవారం సందర్భంగా సత్యదేవుని దర్శనానికి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. తెల్లవారుజామున 1 గంట నుంచి వ్రతాలు, 2 గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. మధ్యాహ్నం వరకు రద్దీ కొనసాగింది. ఆరు వేల వ్రతాలు జరిగాయి. రావిచెట్టు వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా భద్రతా ఏర్పాట్లు చేసి పర్యవేక్షించారు. తూర్పురాజగోపురం ముందు మెట్ల మార్గం నుంచి కేవలం రూ.200, వ్రత టికెట్లు భక్తులను మాత్రమే అనుమతించారు. ఉచిత దర్శనాలకు పశ్చిమరాజగోపురం నుంచి షోల్డింగ్ పాయింట్ల నుంచి క్యూలైన్లలోకి అనుమతించారు.

ముగిసిన వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు

విజేత విజయనగరం జట్టుకు జ్ఞాపిక అందిస్తున్న ఇంద్రకుమార్, రత్నకుమారి, తదితరులు

కొవ్వూరు పట్టణం: 69వ ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల ఎస్‌జీఎఫ్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు సోమవారంతో ముగిశాయి. కొవ్వూరులోని అల్లూరి వెంకటేశ్వరరావు క్రీడా మైదానంలో 13 ఉమ్మడి జిల్లాల పరిధిలో అండర్-17 విభాగంలో బాలికలు, బాలుర జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. తుది పోరులో విజయనగరం (బాలురు), విశాఖపట్టణం (బాలికలు) జట్లు ఛాంపియన్లుగా నిలిచాయి. జాతీయ స్థాయి పోటీలకు బాలురు, బాలికల జట్లను ప్రతిభ ఆధారంగా ఎంపిక చేశారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమాకి ముఖ్యఅతిథిగా అవంతి సంస్థల అధినేత అల్లూరి ఇంద్రకుమార్ హాజరై ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్, డీఈవో వాసుదేవరావు, ఎస్‌జీఎఫ్ అధికారులు, నాయకుల సమక్షంలో ఛాంపియన్లకు జ్ఞాపికలు, పతకాలు, ప్రశంసా పత్రాలు అందించారు. గౌతమి వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పరిమి హరిచరణ్, సూరపనేని చిన్ని, అంతర్జాతీయ క్రీడాకారుడు సీహెచ్‌వీ కృష్ణంరాజు, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు ఏవీడీ ప్రసాద్, కొయ్యల ప్రసాద్, జిల్లా పీడీల సంఘ అధ్యక్షుడు నాగరాజు, గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్.సురేష్, వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి కొయ్యల ప్రసాద్ పర్యవేక్షించారు.

మీ టీవీ బాగుచేయడానికి వచ్చాం..

వృద్ధురాలిని బెదిరించి మంగళసూత్రాల చోరీ

తాళ్లపూడి, న్యూస్‌టుడే: మీ టీవీ పని చేయడం లేదని ఫిర్యాదు వచ్చింది, బాగుజేయడానికి వచ్చామంటూ ముగ్గురు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి వృద్ధురాలి మెడలో మంగళసూత్రాలు చోరీ చేశారు. ఎస్సై టి.రామకృష్ణ, ట్రైనీ ఎస్సై టి.ఆదిత్య శ్రీనివాసు వివరాలు ప్రకారం... తాళ్లపూడి మండలం గజ్జరంలో 70 ఏళ్ల గన్నిన నర్సమాంబ, ఆమె భర్త కేశవరావు ఉంటున్నారు. భర్త బయటకు వెళ్లడంతో ఇంటరిగా ఉన్న నర్సమాంబ వద్దకు గత నెల 8న రాజమహేంద్రవరానికి చెందిన షేక్ సుభానీ జానీ, వడ్డి శరణ్‌రాజు, బొమ్మూరుకు చెందిన దేశగిరి గంగరాజు వచ్చారు. టీవీ పక్కన నిలబడితే ఫొటో తీసుకుని, తమ కార్యాలయంలో చూపిస్తామని చెప్పడంతో ఆమె అంగీకరించారు. ఒకరు ఫొటో తీస్తుండగా...మరొకరు దగ్గరకు వచ్చి అరిస్తే చంపేస్తామని బెదిరించి ఆమె మెడలో ఉన్న సుమారు రూ.3.80 లక్షలు విలువచేసే మంగళసూత్రాల తాడును లాక్కొని పరారయ్యారు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

120 సీసీ కెమెరాలు పరిశీలించి..

తాళ్లపూడి నుంచి గోపాలపురం, కొవ్వూరు మండలాల మీదుగా రాజమహేంద్రవరం వరకు 120 సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుల ఆచూకీ గుర్తించారు. బల్లిపాడు గోదావరి ర్యాంపు వద్ద ఆ ముగ్గురిని సోమవారం అదుపులోకి తీసుకుని, చోరీ సొత్తు, ఉపయోగించిన ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. గంగరాజుపై బొమ్మూరులో పాత చోరీ కేసు ఉందన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్ళలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	22,000
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	22,000-23,000
కొత్త (పచ్చి) కాయ	23,000-24,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	115-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

అనుమానించాడని.. చున్నీ మెడకు బిగించి హత్య..!

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: తనను అనుమానించిన వ్యక్తి మెడకు ఓ మహిళ చున్నీ బిగించి హత్య చేసిన ఘటన రాజమహేంద్రవరం రెండో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ధవళేశ్వరానికి చెందిన ఉసుమర్తి ధర్మరాజు డీసీసీబీ బ్యాంకు డ్రైవర్‌గా పని చేస్తూనే ఖాళీ సమయాల్లో ఆటో నడుపుతుంటారు. అతనికి భార్య భవాని ఉన్నారు. ఇతనికి విశాఖపట్నానికి చెందిన సత్య అనే మహిళతో పరిచయం ఉంది. ఆమె గత నెల 29న ధర్మరాజు ఇంటికొచ్చారు. ఆమె తీరుపై దంపతులు గొడవ పడుతుండటంతో 31న ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఈ నెల 1న ధర్మరాజు భార్యకు ఫోన్ చేసి సత్య విషయంపై వాగ్వాదానికి దిగారు. అదే రోజు రాత్రి 11 గంటల సమీపంలో హోటల్ గదిలో 'నీ భర్త చేయి కోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు' అని ధర్మరాజు భార్య భవానికి ఫోన్ చేసి సత్య చెప్పారు. భవానీ తన సోదరుడితో వచ్చి లాడ్జిలో చూడగా మృతి చెంది ఉన్నాడు. ఒంటిపై గాయాలున్నాయి. దీనిపై పోలీసులు ఈ నెల 2న ఆత్మహత్య కేసు నమోదు చేశారు. అనుమానాస్పదంగా ఉన్న సత్యను పోలీసులు విచారించగా తనను అనుమానించడంతోనే చున్నీతో బిగించి ధర్మరాజును హత్య చేసినట్లు అంగీకరించిందని పోలీసులు తెలిపారు. సోమవారం ఆత్మహత్య కేసును హత్య కేసుగా మార్పు చేసినట్లు సీఐ పి.శివగణేష్ తెలిపారు.

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

శ్రీ శ్రీనివాస గోల్డ్ తాకట్టులో ఉన్న బంగారం ఏబ్యాంక్, ప్రైవేట్ సంస్థల నుండి అయిన విడిపించి ఆరోజు మార్కెట్ రేటుకే కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 94933 38823

JOBS

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యూయర్స్. ఏజ్: 22-35. ఫ్రెషర్స్ కూడా కావలెను. ✆ 6281037879.

రామకృష్ణ గ్రూప్, Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటిపని, వంటపని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు కావలెను. భో+ వ+ జీతం: 16-18K. ✆ 97040 51122, 90106 80011.

అకడమిక్ ఇన్‌ఛార్జ్ కావలెను. నిడదవోలు ఒక ప్రముఖ పాఠశాలలో పనిచేయుటకు అనుభవజ్ఞులైనవారు కావలెను. ✆ 63009 53243, కాల్ టైమింగ్స్: 9 am to 7 pm.

రాజమండ్రిలో ప్రముఖ కలెక్షన్ ఏజెన్సీ నందు పనిచేయుటకు కలెక్షన్ & రికవరీ ఎగ్జిక్యూటివ్స్ మరియు టీం లీడర్స్ కావలెను. Contact: 99634 07777.

వంట మనిషి కావలెను ఫర్ గర్ల్స్ హాస్టల్ భార్యాభర్తలు రూమ్ అండ్ ఫుడ్ ఇస్తాము. కాల్ ఇన్ హైదరాబాద్. సంప్రదించండి: 8688823404, 9963880880.

WANTED Accountant Male/Female Sri Maruthi Agencies Hukumpeta, Rajahmundry Cell: 98481 38203

FACULTY/ TEACHERS Walk-in Interviews for Teachers of All Subjects at Cherukuri Vidyalayam, Korukonda. Contact: 8897516535.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర ★ For the Information of Trade & Industry ★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-80 పై॥ అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

రాజమహేంద్రవరం

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లో)

దేవీచౌక్, న్యూస్‌టుడే: టమాట-20, వంకాయలు నలుపు-36/గులాబీ-66/తెలుపు-38/దొమ్మేరు-64, బెండ-50, కాకర-32, బీర పందిరి-50, దొండ-34, క్యారెట్-54, బీట్‌రూట్-50, గోరు చిక్కుళ్లు-42, దోస-28, ఆనబ -26/28, చిక్కుళ్లు-80/100, పచ్చి మిర్చి-28/లావులు-26, బంగాళదుంపలు-24, ఉల్లిపాయలు-22.

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

దేవీచౌక్, న్యూస్‌టుడే: అత్యవసర మరమ్మతులకు ఈ నెల 5న పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కళ్యాణ్‌నగర్, ఆదర్శనగర్, జంగాలకాలనీ, ఉద్యోగుల కాలనీ, నాలుగో వంతెన ప్రాంతం, శేషాద్రి లేఔట్, క్వారీ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 83282 39927, 80089 02897

సమస్య: స్థానిక ఏవీఏరోడ్డు జయశ్రీగార్డెన్ మూడో వీధిలో మంచినీటి పైపులైను లీకవుతోంది. – గౌరీశంకర్, స్థానికుడు

సమాధానం: పైపులైను మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. – సత్యనారాయణ, డీఈ, వాటర్‌వర్క్స్

సమస్య: విద్యుత్తు కాలనీ ఆరో వీధిలో సీసీరోడ్డుపై చెత్త పేరుకుపోయింది. – వెంకట్రావు, స్థానికుడు

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి సమస్యలు పరిష్కరిస్తాం. – వినూత్న, ఎంహెచ్‌వో

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

ప్రోత్సహిస్తే సత్తా చాటుతాం..!

క్రికెట్‌లో ప్రతిభ చూపుతున్న మహిళా క్రీడాకారులు

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే : ప్రపంచ క్రికెట్ చరిత్రలో మహిళా క్రీడాకారులు చరిత్ర సృష్టించారు. విశ్వ విజేతలుగా నిలిచి భావి మహిళా క్రీడాకారుల్లో స్ఫూర్తి రగిలించారు. రాజమహేంద్రవరం నగరానికి చెందిన క్రీడాకారిణులు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. ఈ సందర్భంగా వారి లక్ష్యాలు న్యూస్‌టుడేకు వివరించారు.

భారత జట్టులో స్థానం సంపాదించటమే లక్ష్యం

నా పేరు **ఎస్.హారిక.** నాన్న ప్రసాద్ ఫ్రిజ్ మెకానిక్. తండ్రి గతంలో క్రికెట్ ఆడేవారు. ఆయన స్ఫూర్తితోనే గత ఆరేళ్లగా క్రికెట్ నేర్చుకుంటున్నాను. డిగ్రీ చదువుతున్న సమయంలోనే మూడేళ్ల నన్నయ వర్సిటీ తరపున సౌత్ జోన్ క్రికెట్ ఆడటంతోపాటు 2023లో ఆలిండియా పోటీల్లో పాల్గొన్నా. అండర్-19 రాష్ట్రస్థాయి పోటీలు ఆడాను. భారత మహిళల జట్టులో చోటు సంపాదించడమే లక్ష్యం.

ప్రత్యేకత చాటి..

నా పేరు **జి.చరిష్మా.** తండ్రి ఎల్ఐసీ ఏజెంట్ 2023లో అండర్-15, 2024-25 సీజన్‌లో ఏపీఎల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రత్యేకత చాటా. అండర్-19 స్టేట్ ప్రాబబుల్స్ ఆడాను. క్రికెట్ అంటే ఆసక్తి. అన్నయ్య ప్రతి రోజు గ్రౌండ్‌కు వెళ్లి క్రికెట్ ఆడుతుంటే వారితోపాటు వెళ్లి చూడటంతో ఆసక్తి పెరిగింది. ఎప్పటికైనా అండర్-19 వరల్డ్‌కప్ ఆడాలని నా లక్ష్యం.

అక్క స్ఫూర్తితో..

నా పేరు **ఎస్.పూజిత.** తండ్రి కిరణ్ మెకానిక్, ఆరేళ్లగా క్రికెట్ సాధన చేస్తున్నా. తండ్రి కల నెరవేర్చాలని క్రికెట్‌లో శిక్షణ తీసుకుంటున్నా. 2022లో అండర్-15 స్టేట్, 2024లో అండర్-19 స్కూలుగేమ్స్ జాతీయస్థాయి పోటీల్లో ఆడాను. మహిళలకు బీసీసీఐ ప్రోత్సాహం అందించాలి. అప్పుడే మహిళలు ముందుకు వస్తారు. ఎప్పటికైనా ఇండియా జట్టులో చోటు దక్కించుకోవాలి.

ఉత్తమ బౌలర్‌గా రాణిస్తున్నా..

నా పేరు **ఎస్.భార్గవి** లక్ష్మి. అక్క ఎస్.హారిక. ఇద్దరం క్రికెట్‌లో రాణిస్తున్నాం. గతేడాది ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)లో ఉత్తమ బౌలర్‌గా అవార్డు దక్కటంతోపాటు రూ.40వేల నగదు బహుమతి కూడా ఏసీఏ నుంచి అందుకున్నాను. ఇది నేను ఎప్పటికీ మర్చిపోలేని సంఘటన. ప్రస్తుతం డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాను. అండర్-19 వరల్డ్‌కప్‌కు ఆడాలని నా కోరిక.

నార్త్‌జోన్‌కు ఎంపికయ్యా

నా పేరు **ఎస్‌కే సలేహా.** తండ్రి ఎస్‌కే వల్లి ఆటోడ్రైవర్. అయిదేళ్లగా క్రికెట్ నేర్చుకుంటున్నాను. అండర్-17 స్కూలుగేమ్స్ జాతీయస్థాయి పోటీలు ఆడాను. అండర్-15 జిల్లాకు ఆడుతూ నార్త్‌జోన్ జట్టుకు ఎంపికయ్యాను. ఏసీఏ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు లీగ్ మ్యాచ్‌లు నిర్వహిస్తే మాలోని ప్రతిభకు మరింత బయటకు వస్తుంది.

బాలికల పాఠశాలకు బీరువాలు అందజేత

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : గౌతమఘాట్‌లోని రాజమహేంద్రవరం వర్తకుల స్వచ్ఛంద సేవా సంస్థ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ ఉచిత సేవల్లో భాగంగా కోటిపల్లి బస్టాండ్‌లోని ప్రభుత్వ బాలికల పాఠశాలకు అవసరమైన వస్తువులు అందజేశారు. సోమవారం రూ.58వేల విలువైన రెండు బీరువాలు, ఆరు టార్పాలిన్లు, మెగా ఫోను అందించారు.

అధ్యయన సామగ్రిని సద్వినియోగం చేసుకోండి

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: పదో తరగతి సాంఘికశాస్త్రం స్టడీ మెటీరియల్‌ను డీఎస్ఈవో వాసుదేవరావు సోమవారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు తయారు చేసిన మెటీరియల్‌తో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలన్నారు. ప్రధానోపాధ్యాయుల సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు కోలా సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు రమణారావు, ఎస్ఎల్ రమేష్, ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు. ● రాజేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. అక్కడ పిల్లలకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

విపత్తు అనంతర నిర్వహణ ప్రణాళిక సిద్ధం : కలెక్టర్

కలెక్టరేట్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: విపత్తు అనంతర నిర్వహణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. మొంథా తుపాను తర్వాత నష్టాల అంచనా, సహాయక చర్యలు, పునరుద్ధరణ, మౌలిక సదుపాయాల పునర్నిర్మాణం వంటి కార్యకలాపాలను క్రమబద్ధీకరించడానికి ప్రణాళికను రూపొందిస్తున్నటు చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లో తుపాను అనంతరం పరిస్థితులపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. మొంథా తుపాను కారణంగా నష్టపోయిన పంటల వివరాలను త్వరితగతిన నమోదు చేసి రైతులకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ నరసింహకిషోర్ నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ నరసింహకిషోర్

✦ రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. ఆయా సమస్యలపై 46 మంది ఫిర్యాదు చేశారు.

'జల్‌జీవన్ మిషన్' పనుల వేగవంతానికి చర్యలు

కలెక్టరేట్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: జిల్లాలో జల్‌జీవన్ మిషన్, స్వచ్ఛభారత్ మిషన్ కింద చేపట్టిన పనుల వేగవంతానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీపీడబ్ల్యూఎస్ పథకాలు, చేతిపంపుల నిర్వహణ, జల్‌జీవన్ మిషన్, స్వచ్ఛభారత్ మిషన్ పనుల పురోగతిపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జల్‌జీవన్ మిషన్ కింద మొత్తం రూ.2,315 కోట్లతో 1,168 పనులు మంజూరు కాగా రూ.1,938 కోట్లతో 731 పనులు ప్రారంభమయ్యాయన్నారు. ఇప్పటి వరకు 541 పనులు పూర్తికాగా 190 పనులు పురోగతిలో ఉన్నాయని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ గిరి, డీఆర్‌డీఏ పీడీ మూర్తి, జడ్పీ డిప్యూటీ సీఈవో రాంగోపాల్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా సత్యనారాయణ

రాజమహేంద్రవరం వైద్యం: రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ పీవీవీ సత్యనారాయణను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన సౌభాగ్యలక్ష్మి గత నెల 31న ఉద్యోగ విరమణ చేశారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

టి.నగర్: వీధి కుక్కల నియంత్రణకు కృషి చేస్తున్నామని కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. సోమవారం క్వారీ సెంటర్‌లో ఏబీసీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పశు వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకొన్నారు. సమస్యలు ఉంటే తక్షణం దృష్టికి తీసుకురావాలన్నారు. ఎంహెచ్‌వో వినూత్న, ఈఈ మదర్సా అలీ , ఇంజినీర్లు పాల్గొన్నారు. అంతకు ముందు సుబ్రహ్మణ్య మైదానాన్ని పరిశీలన చేశారు.

పేదలకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ తదితరులు

'స్వర్ణాంధ్రా' సేవలు ఆదర్శనీయం : ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సాంస్కృతికం: రాజమహేంద్రవరం నగరంలో 27 వసంతాలుగా స్వర్ణాంధ్రా సేవా సంస్థ ద్వారా అందిస్తున్న సేవలు అందరి మన్ననలు పొందాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్వర్ణాంధ్రా మొబైల్ అన్నదాన సేవలు ఆరో వసంతంలోకి అడుగు పెట్టిన సందర్భంగా సోమవారం పుష్కరఘాట్ శివలింగం వద్ద నిర్వహించిన నిత్యాన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు అందిస్తున్న సేవలు ఆదర్శనీయమన్నారు. 250 మందికి పండ్లు, రగ్గులు, ప్రత్యేక భోజనం అందజేశారు. పడాల రామిరెడ్డి, నిమ్మలపూడి గోవింద్, నయనాల కృష్ణారావు పాల్గొన్నారు.

కార్తిక పూజలు

పుష్కర ఘాట్‌లో మహిళలు పూజలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: కార్తిక దీపాలతో పుష్కరఘాట్ శివలింగం సోమవారం సాయంత్రం కాంతులీనింది. మదర్ స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులు షేక్ సుబానీ, శ్రీకాంత్, ఉమా, దివాకర్, వేమన రాజేష్ తదితరుల నిర్వహణలో కార్తిక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. పుష్కరఘాట్ వద్ద ఉన్న భారీ శివలింగం చుట్టూ దీపాలు వెలిగించారు.

ఏవీఏ రోడ్డు: పవిత్రమైన కార్తిక మాసం సోమవారం కావడంతో నగరంలోని రేవుల వద్ద వేకువజాము నుంచే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. పట్టణంలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఆలయాల వద్ద వేకువజాము నుంచి భక్తుల రద్దీ నెలకొంది. పుష్కరాల రేవులో వీరభద్రుని సంబరాలు, భక్తుల పూజలతో నదీతీరమంతా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. గౌతమీ ఘాట్ ఓంకారేశ్వరునికి భక్తులు 108 బిందెల గోదావరి జలంతో అభిషేకించారు.

ఓంకారేశ్వరుని అభిషేకానికి జలాలు తీసుకెళ్తున్న మహిళలు

నీట మునిగిన పంట పొలాల పరిశీలన

సీతానగరం(కోరుకొండ), న్యూస్‌టుడే: సీతానగరం మండలంలోని పలు గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను అధికారులు సోమవారం పరిశీలించారు. నల్గొండ, రాపాక, రఘుదేవపురం ప్రాంతాల్లో మొంథా తుపానుకు నీట మునిగిన పొలాలను ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, ఏవో గౌరీదేవి పరిశీలించి రైతులతో మాట్లాడారు.

ఈపీఎఫ్‌వో ప్రాంతీయ కార్యాలయానికి గుర్తింపు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం అఖిల భారత స్థాయిలో గుర్తింపు సాధించింది. దీని పరిధిలోని భీమవరం జిల్లా పీఎఫ్ కార్యాలయం ఉత్తమ పనితీరు కనబరిచి అఖిల భారతస్థాయిలో పురస్కారాన్ని పొందింది. ఈపీఎఫ్‌వో వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ నెల 1న న్యూదిల్లీలో జరిగిన కార్యక్రమంలో పురస్కారాన్ని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి చేతుల మీదుగా భీమవరం పీఎఫ్ జిల్లా కార్యాలయం ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి ఎలీషారావుతో కలిసి రాజమహేంద్రవరం ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్-2 వెంకటేశ్వర్లు అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక ఈపీఎఫ్‌వో ప్రాంతీయ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో మాట్లాడారు. సహాయ భవిష్యనిధి అధికారి రాధానాథ్‌పట్నాయక్, ఇతర పీఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోడు వినండి పరిష్కారం చూపండి

వారంతా అర్జీదారులు.. టిడ్కో గృహాలకు కొందరు.. మౌలిక వసతుల సమస్యలతో ఇంకొందరు పింఛన్లు ఇతర సంక్షేమ పథకాలు అందటం లేదంటూ కలెక్టరేట్‌కు వచ్చారు. సోమవారం ఇక్కడ జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు తమ గోడు విన్నించారు. అనేక సార్లు అర్జీలు అందించినా.. క్షేత్ర స్థాయిలో పరిష్కారం కావడం లేదని పలువురు వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని అర్జీలు ఇచ్చారు.

– న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరం వద్ద బారులుదీరిన ప్రజలు

విష కీటకాల బెడదతో భయాందోళన

స్థానిక 27వ డివిజన్ ఇన్నీసుపేటలోని వీటీ జూనియర్ కళాశాల ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగి విష కీటకాలు విజృంభిస్తున్నాయని నవీన్ కల్యాణ్ అధికారులకు వివరించారు. 2023 ఆగస్టులో వీటీ జూనియర్ కళాశాల ప్రహరీ సగం వరకు కూలిపోవడంతో మిగిలిన గోడను కూడా తొలగించార, ఇప్పటివరకు ప్రహరీ పునఃనిర్మాణం చేయలేదని ఫిర్యాదు చేశారు.

టిడ్కో ఇళ్లు ఎప్పుడు అప్పగిస్తారు..?

టిడ్కో గృహాలు కేటాయించినా.. ఏళ్లతరబడి తమకు అప్పగించకపోవడంతో అద్దె ఇళ్లలో ఉంటూ అవస్థలు పడాల్సి వస్తోందని టిడ్కో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని సీతంపేట ఎన్టీఆర్ కాలనీకి చెందిన పలు కుటుంబాలకు కలెక్టరేట్ సమీపంలోని టిడ్కో గృహసముదాయాల్లో ప్లాట్లు కేటాయించారన్నారు. అయినా అద్దె ఇళ్లల్లో ఉండాల్సి వస్తోందని వాపోయారు. త్వరగా టిడ్కో గృహాలు అప్పగించాలని కోరుతూ అర్జీలు అందించారు.

ఎన్నిసార్లు విన్నవించినా..

ఆవేదన వ్యక్తం చేస్తున్న దుర్గాభవాని

'గత ప్రభుత్వంలో రీ సర్వే చేసి, నా భూమిని వేరొకరి పేరుతో ఆన్‌లైన్ చేశారు. దీనిని సరి చేయాలని పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా పరిష్కారం కాలేదు.' అని కాతేరుకు చెందిన వంకా దుర్గాభవానీ ఆందోళన వ్యక్తం చేశారు. కొంతమూరులో 35 ఏళ్ల కిందట అయిదు సెంట్ల భూమి కొనుగోలు చేశామని, రీ సర్వేలో వేరొకరి పేరుతో నమోదు చేశారని వాపోయారు. దీనిపై పీజీఆర్ఎస్‌లో అధికారులకు అర్జీ అందించారు.

జయహో భారతనారీ

విద్యార్థినుల ప్రదర్శన

రాజమహేంద్రవరం సాంస్కృతికం: విశ్వవిజేతగా నిలిచిన భారత మహిళా జట్టు విజయం దేశానికి గర్వకారణమని రాజమహేంద్రి విద్యాసంస్థల ఛైర్మన్ టి.కె.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం గోకవరం బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు విద్యార్థినులు ర్యాలీ చేశారు. జయహో భారతనారీ అని నినదిస్తూ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ✦ కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ కళాశాల విద్యార్థినులు దానవాయిపేట వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ రాఘవ కుమారి తదితరులు పాల్గొన్నారు.

నన్నయలో నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

రాజానగరం, న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో కేంద్ర ప్రభుత్వ పథకం (పీఎం ఉష) రూ.9.35 కోట్ల నిధుల అంచనాతో నిర్మించనున్న సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ నూతన భవన నిర్మాణానికి వీసీ ఎస్.ప్రసన్నశ్రీ సోమవారం శంకుస్థాపన చేశారు. వీసీ మాట్లాడుతూ..ఎనిమిది తరగతి గదులు, ఆక్వాకల్చర్, ఫుడ్ సైన్స్, జియాలజీ, మూక్ స్టూడియో, ఏఆర్, వీఆర్ ల్యాబ్ మొదలైన ప్రయోగశాలలతో జీ ప్లస్ టు భవన నిర్మాణం జరుగుతుందన్నారు.

లింగరాజు సేవలు చిరస్మరణీయం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : స్వాతంత్ర్య సమరయోధుడిగా, అనువాద రచయితగా, ప్రజాప్రతినిధిగా క్రొవ్విడి లింగరాజు చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు నగర ప్రముఖులు అన్నారు. లింగరాజు జయంతి సందర్భంగా ఆర్యాపురం డాక్టర్ ఎ.బి.నాగేశ్వరరావు పార్కులోని లింగరాజు విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఆంధ్ర కేసరి యువజన సమితి ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ భవనంలో జరిగిన కార్యక్రమంలో అశోక్ కుమార్‌జైన్ మాట్లాడారు. గోర్కి నవల మదర్‌ను అమ్మ పేరుతో లింగరాజు తెలుగులో అనువదించారన్నారు. ఆ నవల చదివిన ఎంతో మంది కమ్యూనిజం వైపు వెళ్లారన్నారు. పాత్రికేయుడు, రచయిత బి.వి.రాఘవరావును క్రొవ్విడి లింగరాజు స్మారక పురస్కారంతో సత్కరించారు. క్రొవ్విడి సుబ్రహ్మణ్యం, భాస్కరరావు, దేశిరెడ్డి బలరామ నాయుడు, దూర్వాసుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సుష్మప్రియకు అభినందన

రాజానగరం: నన్నయ విశ్వవిద్యాలయం నుంచి ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీస్ అండ్ ఇన్నోవేషన్ కాన్క్లేవ్ (ఈఎస్‌టీఐసీ-2025)ఫిజిక్స్ విభాగ అధ్యాపకురాలు వై.సుష్మప్రియ హాజరైనందుకు వీసీ ఎస్.ప్రసన్నశ్రీ సోమవారం అభినందించారు. ఈ కార్యక్రమం భారత ప్రభుత్వ ప్రధాన సలహాదారుల కార్యాలయం మార్గదర్శకత్వంతో శాస్త్ర, సాంకేతికశాఖ ఆధ్వర్యంలో సీఎస్ఐఆర్, డీఏఐ, ఐసీఎంఆర్, డీఆర్‌డీవో విద్యామంత్రిత్వశాఖ, అంతరిక్ష విభాగాల సహకారంతో నవంబరు మూడు నుంచి ఐదో తేదీ వరకు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహిస్తున్నారు.

జిల్లా వ్యవసాయ అధికారిని సత్కరిస్తున్న ఉద్యోగ సంఘు నాయకులు

ఉద్యోగుల సమన్వయ కృషితోనే గుర్తింపు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: మొంథా తుపాను సమయంలో కింది స్థాయి ఉద్యోగుల నుంచి డివిజన్ స్థాయి అధికారుల వరకు సమన్వయంతో పనిచేసి పంట నష్టాలు తగ్గించడంతో జిల్లా వ్యవసాయశాఖకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చిందని వ్యవసాయ శాఖ అధికారి(డీఏవో) ఎస్.మాధవరావు అన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో పలువురు ఉద్యోగులు, వ్యవసాయ ఉద్యోగుల సంఘ నాయకులు డీఏవోను కలిశారు. ఇటీవల అభినందన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న డీఏవోను సత్కరించారు. ఈ సందర్భంగా ఏఈవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వేణుమాధవ్ మాట్లాడారు.

విద్యార్థుల వారపత్రిక ఆవిష్కరణ

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: విద్యార్థులు వారపత్రికను నడపటం అభినందనీయమని సిటీ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి మాటూరి రంగారావు అన్నారు. వంకాయల వారి వీధిలోని సిటీ మున్సిపల్ పాఠశాల విద్యార్థి శ్యామ్యూల్ ప్రవీణ్ పాఠశాలలో జరిగే కార్యక్రమాలను ఆంగ్ల వారపత్రికగా రూపొందించారు. ప్రధానోపాధ్యాయులు దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారపత్రిక ప్రతిని రంగారావు ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల స్థాయిలో ఒక విద్యార్థి వార పత్రికను ప్రారంభించడం అభినందనీయమన్నారు. 22వ వార్డు ఇన్‌ఛార్జి శెట్టి జగదీష్, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్‌పర్సన్ ఎ.శ్రీదేవి, మాటూరి సిద్ధార్థ, ఎం.నారాయణరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వారపత్రిక ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

తుపాను బాధితులకు ఆర్థిక సాయం

హుకుంపేటలో నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

ధవళేశ్వరం: మొంథా తుపాను ప్రభావిత పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న 28 కుటుంబాలకు నిత్యావసర సరకులు పంపిణీ చేయడంతో పాటు ఆర్థికసాయం అందించినట్లు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. ఆల్కాట్ గార్డెన్స్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాజమహేంద్రవరం గ్రామీణ నియోజకవర్గ పరిధిలో 221 కుటుంబాలకు రూ.3.61లక్షల ఆర్థిక సాయం అందజేశామన్నారు. పునరావాస కేంద్రాలలో ఉన్న ప్రతి ఒక్కరికీ రూ.1000, ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది సభ్యులు ఉన్న కుటుంబాలకు రూ.3000లు చొప్పున ఆర్థిక సాయం అందించామన్నారు. కడియం, హుకుంపేట, రాజమహేంద్రవరం గ్రామీణం తదితర ప్రాంతాలలో ప్రజలకు ఇప్పటికే నిత్యావసర సరకులు పంపిణీ చేశామన్నారు. అర్బన్ తహసీల్దారు పాపారావు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

రాజమహేంద్రవరంలోని వై జంక్షన్ నుంచి నందంగనిరాజు సెంటర్ వైపు వెళ్లే మార్గంలో డివైడర్ మలుపులో మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. దీనిలోకి వర్షపు నీరు చేరడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అదే మలుపు వద్ద రహదారి గుంతలుగా ఉండటంతో చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

– న్యూస్‌టుడే, కోటగుమ్మం

మార్గం..అధ్వానం

రాజమహేంద్రవరం గ్రామీణం కొంతమూరులో నిత్యం రద్దీగా ఉండే ఎయిర్‌పోర్టు ప్రధాన రహదారిపై పెద్ద గుంత ఏర్పడింది. స్థానికులు దీనికి అడ్డుగా కుర్చీ పెట్టారు. రాజమహేంద్రవరం-కోరుకొండ ప్రధాన రహదారిలో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. గుంత వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. రహదారికి మరమ్మతులు చేపట్టాలని చోదకులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, దేవీచౌక్

ఫ్యూజ్ బాక్స్ ఏర్పాటు

స్పందనకు వందనం

'భద్రతలేని ఫ్యూజ్ బాక్సులు' శీర్షికన 'ఈనాడు'లో ఈ నెల 1నన ప్రచురితమైన వార్తకు విద్యుత్తు శాఖ అధికారులు స్పందించారు. రాజమహేంద్రవరం గ్రామీణం భవానీపురంలో ఫ్యూజ్ బాక్స్ వెనుక భాగం తుప్పుపట్టింది. దీని స్థానంలో కొత్త బాక్స్ ఏర్పాటు చేశారు.

– న్యూస్‌టుడే, దేవీచౌక్

సూచనలు పట్టవా..

పవిత్రమైన కార్తిక మాసం కావడంతో భక్తులు గోదావరి నదిలో వేకువజాము నుంచే పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు. సోమవారం వీరి సంఖ్య అధికంగానే ఉంటుంది. భక్తుల సౌకర్యార్థం నగరపాలక సంస్థ ఘాట్‌ల వద్ద భద్రత ఏర్పాట్లు చేశారు. నదిలో దుస్తులు ఉతకరాదు, సబ్బులు వాడరాదు అంటూ మైక్‌లో సూచనలు చేస్తున్నా. కొందరికి ఇవేమీ పట్టడం లేదు.

– న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

వీధుల్లో అంధకారం

నగరంలో నిత్యం రద్దీగా ఉండే కందకం రహదారిపై రాత్రుళ్లు ప్రయాణించాలంటే నగరవాసులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

WANTED
ప్రముఖ 2 వీలర్ ఫైనాన్స్ నందు రాజమండ్రిలో పనిచేయుటకు
✦ కంప్యూటర్ ఆపరేటర్ (Female)
కావలెను. టైపింగ్ మరియు Excelలో అనుభవం కలిగియుండాలి.
జీతం: 12000/- నుంచి 18000/- వరకు
విష్ణుసాయి ఫైనాన్స్ కార్పొరేషన్
బైపాస్ రోడ్, రాజమండ్రి
85006 44978

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

జిల్లా పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్ శివాజీ, ఉపాధ్యాయులు

కోరుకొండ: గుమ్ములూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం జరిగిన కబడ్డీ, ఖోఖో పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ చూపారు. శ్రీరంగపట్నం సరస్వతి విద్యానికేతన్‌కు చెందిన జి.లాస్యదేవి, పి.హేమ, కె.షణ్ముఖ, చంద్రిక, ప్రవల్లిక, వై.పూర్ణ, కె.రుద్ర హాసిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కరస్పాండెంట్ శివాజీ, హెచ్ఎం రాజు, రూప, కుమారి ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

నీట మునిగిన పంట పొలాల పరిశీలన

పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త శ్రీనివాస్

సీతానగరం(కోరుకొండ), న్యూస్‌టుడే: సీతానగరం మండలంలోని పలు గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను అధికారులు సోమవారం పరిశీలించారు. నల్గొండ, రాపాక, రఘుదేవపురం ప్రాంతాల్లో మొంథా తుపానుకు నీట మునిగిన పొలాలను ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, ఏవో గౌరీదేవి పరిశీలించి రైతులతో మాట్లాడారు.

నన్నయలో నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

రాజానగరం, న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో కేంద్ర ప్రభుత్వ పథకం (పీఎం ఉష) రూ.9.35 కోట్ల నిధుల అంచనాతో నిర్మించనున్న సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ నూతన భవన నిర్మాణానికి వీసీ ఎస్.ప్రసన్నశ్రీ సోమవారం శంకుస్థాపన చేశారు. వీసీ మాట్లాడుతూ..ఎనిమిది తరగతి గదులు, ఆక్వాకల్చర్, ఫుడ్ సైన్స్, జియాలజీ, మూక్ స్టూడియో, ఏఆర్, వీఆర్ ల్యాబ్ మొదలైన ప్రయోగశాలలతో జీ ప్లస్ టు భవన నిర్మాణం జరుగుతుందన్నారు. రిజిస్ట్రార్ కేవీ స్వామి, ఆర్అండ్‌బీ ఎస్ఈ కాంతు, డీఈఈ మధు, ఏఈఈ కిరణ్, విశ్వవిద్యాలయం ఇంజినీర్లు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్ ధనరాజు

రాజానగరం, న్యూస్‌టుడే : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని గైట్ పార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.డి.ధనరాజు అన్నారు. కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం వనసమారాధన నిర్వహించారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని ధనరాజు పిలుపునిచ్చారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

జీజీయూ లో 17 నుంచి ఎఫ్‌డీపీ ప్రారంభం

రాజానగరం, న్యూస్‌టుడే: జీజీయూలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో క్లీన్ మొబిలిటీ రెవల్యూషన్ - ఎలక్ట్రిక్ అండ్ హైడ్రోజన్ పవర్ వెహికల్స్ అనే అంశంపై ఏఐసీటీఈ - అటల్ ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డీపీ) ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్నామని విశ్వవిద్యాలయం కులపతి కె.వి.వి.సత్యనారాయణ రాజు (చైతన్యరాజు) తెలిపారు. దీనికి సంబంధించి గోడపత్రికను సోమవారం విశ్వవిద్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన ఆచార్యులు డా.కౌశిక్‌రాజశేఖర్ (అమెరికా), డా.అమర్‌నాద్ వర్మ (దక్షిణ కొరియా), ఎ.శ్రీకాంత్ (యుకె), డా.ఎం.వి.రెడ్డి (కెనడా) పాల్గొంటారన్నారు.

ఎఫ్‌డీపీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చైతన్యరాజు తదితరులు

భయపెడుతున్న రహదారులు

పరిశీలన

రాజమహేంద్రవరం గ్రామీణ పరిధిలోని పలు ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. అడుగుకో గుంత తలపించడంతో వర్షపునీరు నిల్వ ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నా సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదాల బారిన పడుతూ..

మోరంపూడి పై వంతెన దిగువ గుంతలు పడిన రోడ్డు

మోరంపూడి, ధవళేశ్వరం, కడియం న్యూస్‌టుడే: మోరంపూడి గ్రామంనుంచి గాదాలమ్మ నగర్‌ను కలిపే ప్రధాన రహదారిలో నిత్యం భారీ, నుంచి అతి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అడుగుకొక గుంతలు పెద్దగా ఉండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ★ జాతీయ రహదారిని కలుపుకొని, గాదాలమ్మ నగర్ నుంచి బుచ్చయ్యనగర్ మీదుగా పిడింగొయ్యి గ్రామం శాటిలైట్ సిటీ వరకు సుమారు 3 కి.మీ మేర రోడ్డు అస్తవ్యస్తంగానే ఉంది. మోరంపూడి పైవంతెన నిర్మించిన తరువాత దిగువ రోడ్డును వేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ★ బొమ్మూరు, బాలాజీపేట, కేశవరం వెళ్లే రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అధ్వానంగా మారింది. రమాదేవి గార్డెన్స్ సమీపంలో రహదారిపై రెండుచోట్ల తారుకొట్టుకుపోయి 500 మీటర్ల పరిధిలో, బాలాజీపేటలో కరూర్ వైశ్యాబ్యాంకు నుంచి కల్వర్టుకు వెళ్లే 300 మీటర్ల పొడవునా భారీ గుంతలు ఏర్పాడ్డాయి.

ప్రయోజనం లేని మరమ్మతులు

కడియం నుంచి వీరవరం మీదుగా దుళ్ల వెళ్లే తొమ్మిది కిలోమీటర్ల రహదారి దుస్థితిని చూసి వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రహదారిలో ఉన్న భారీ గుంతలను తాత్కాలిక మరమ్మతులు చేపట్టింది. వానల అనంతరం రాళ్లు పైకి తేలి గుంతలమయంగా తిరిగి దర్శనమిస్తోండటంతో మరోసారి వారంతా ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు.

నీరు నిల్వతో ఇక్కట్లు

గోకవరం: రంపయర్రంపాలెం రోడ్డులో ఎక్కడికక్కడ రాళ్లు లేవడంతో పూర్తిగా ఛిద్రమైంది. గోకవరం నుంచి రంపయర్రంపాలెం వరకు మూడు కిలోమీటర్లు ఉన్న ఈరోడ్డు నిర్మాణానికి 2019లోనే తెదేపా హయాంలో నిధులను కేటాయించి శంకుస్థాపన చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ఆ నిధులను నిలిపివేయడంతో పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఈ రోడ్డులో ప్రయాణమంటే వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చొరవతో ఇటీవలే నిధులను మంజూరు చేశారు.

రంపయర్రంపాలెం రోడ్డులో నిల్వ ఉన్న వర్షపునీరు

అగ్నిప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే

పెదపూడి, న్యూస్‌టుడే: అచ్యుతాపురత్రయం గ్రామంలో సోమవారం తెల్లవారుజామున వల్లూరి మాచరమణికి చెందిన తాటాకిల్లు అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా కాలిబూడిదైంది. విషయం తెలిసిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి 25కేజీల బియ్యం, తెదేపా నేత ఆరుమిల్లి సత్యభారతి ప్రసాద్ ఇచ్చిన రూ.2వేల నగదు ఆమె కుటుంబసభ్యులకు అందజేశారు. తహసీల్దారు సీతాపతిరావు, నేతలు ఉన్నారు.

అనపర్తి గ్రామీణం: బిక్కవోలు పునరావాసకేంద్రంలో ఉంటున్న మేడపాటి శ్రీనును గుండెనొప్పితో బాధపడుతుండగా అనపర్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అతన్ని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిని పరిశీలించారు. ★ అనపర్తి ఏఎన్ఎస్ఆర్ కల్యాణ మండపంలో తుపాను సమయంలో విశేష కృషి చేసిన నాయకులకు, అధికారులకు అభినందన సభ ఎమ్మెల్యే రామకృష్ణా రెడ్డి ఏర్పాటు చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

సీతానగరం(కోరుకొండ): సీతానగరంలో 2 టన్నుల రేషన్ బియ్యాన్ని సోమవారం అధికారులు పట్టుకున్నారు. ఇనుగంటివారిపేటలో కొనుగోలు చేసి అక్కడ నుంచి కోరుకొండకు ఓ వ్యాన్‌లో 40 బస్తాలను తరలిస్తుండగా పట్టుకున్నట్లు పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దారు ఎం.నాగలక్ష్మి తెలిపారు. సంబంధిత వ్యక్తులను పోలీసులకు అప్పగించామన్నారు.

సుష్మప్రియకు అభినందన

రాజానగరం: నన్నయ విశ్వవిద్యాలయం నుంచి ఎమర్జింగ్ సైన్స్ టెక్నాలజీస్ అండ్ ఇన్నోవేషన్ కాంక్లేవ్ (ఈఎస్‌టీఐసీ-2025)కి పీజీ విభాగ అధ్యాపకురాలు వై.సుష్మప్రియ హాజరైనందున వీసీ ఎస్.ప్రసన్నశ్రీ సోమవారం అభినందించారు. ఈ కార్యక్రమం భారత ప్రభుత్వ ప్రధాన సలహాదారుల కార్యాలయం మార్గదర్శకత్వంలో శాస్త్ర, సాంకేతికశాఖ ఆధ్వర్యంలో సీఎస్ఐఆర్, డీఏఐ, ఐసీఎంఆర్, డీఆర్‌డీవో విద్యామంత్రిత్వశాఖ, అంతరిక్ష విభాగాల సహకారంతో నవంబరు మూడు నుంచి ఐదో తేదీ వరకు న్యూడిల్లీలోని భారత్ మండపంలో నిర్వహిస్తున్నారు.

వైభవంగా కోటి దీపోత్సవం

కడియం, రాజానగరం, రంగంపేట, బిక్కవోలు, న్యూస్‌టుడే: కడియపులంక అభయాంజనేయస్వామి ఆలయ ఆవరణలో కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని కోటి దీపోత్సవ వేదిక భక్తిశ్రద్ధలతో ఆలయ కమిటీ ఛైర్మన్ పల్ల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. తాడాల వీరవెంకట్రావు గురుస్వామి నేతృత్వంలో పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ పల్ల సత్తిబాబు, సుబ్రహ్మణ్యం, గణపతి కుటుంబ సభ్యులు పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో దీపోత్సవాన్ని ప్రారంభించారు. అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామికి జన్మ నక్షత్ర పూజలు నిర్వహించారు. చివరిగా చేసిన శివపార్వతుల కల్యాణం భక్తులకు కనువిందు చేసింది. ● కడియపులంక శ్రీహరిహర మహాక్షేత్రంలో కొలువైన అపర్ణ సమేత అనంతేశ్వరస్వామి ఆలయంలో పూజలు జరిగాయి. ● రాజానగరంలోని గ్రామదేవత ముత్యాలమ్మతల్లిని వివిధ రంగుల 1700 డజన్ల (20,040)గాజులతో అలంకరించారు. ● రంగంపేట, వడిశలేరు, పెదరాయవరం, జి.దొంతమూరు, ముకుందవరం, వీరంపాలెంలో పూజలు నిర్వహించారు. ● బలభద్రపురంలో నూతనంగా నిర్మించిన ద్వాదశలింగాల, అష్టాదశ శక్తి పీఠాల దేవాలయాలు భక్తులతో కళకళలాడాయి. ● బిక్కవోలులో దాదాపు నెల రోజుల పాటు పూజలందుకున్న గోరింటపల్లి సోమవారం సాగనంపారు. ●కొంకుదురు వీరేశ్వరస్వామి దేవాలయంలో లక్షబిల్వార్చన పూజ జరిగింది. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

కడియపులంకలో శ్రీఅనంతేశ్వరస్వామి

కడియపులంకలో నిర్వహించిన కోటి దీపోత్సవంలో భక్తులు

రాజానగరంలో గాజుల అలంకరణలో ముత్యాలమ్మతల్లి

విశ్వవిజేతగా నిలవడం గర్వకారణం

కడియం: మహిళల ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో ఉత్కంఠభరిత ఫైనల్‌లో తొలిసారి విశ్వవిజేతగా భారత మహిళలు నిలవడం గర్వకారణమని గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఈ మేరకు ఆయన తన నివాసం వద్ద జరిగిన మహిళా సంఘాల విజయోత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మ, సూర్యకళ తదితరులు బాణసంచా కాల్చి వేడుకలు నిర్వహించుకున్నారు.

కోటి సంతకాల కార్యక్రమం

కోరుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని బూరుగుపూడిలో సోమవారం వైకాపా ప్రజా ఉద్యమం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ సంఘ మండలి మాజీ సభ్యుడు కంటే వినయ్‌తేజ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో మహిళలతో రచ్చబండ నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి సంతకాల సేకరణ చేపట్టారు. వైకాపా మండల అధ్యక్షుడు గణేశుల పోసియ్య, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పిల్లా కృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

సేవలకు సత్కారం

రాజానగరం: ఉపాధ్యాయునిగా పీవీవీ భీమేశ్వరరావు మాస్టారు సేవలు నేటి యువ ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయమని రాజానగరం ఎమ్ఈవోలు రామన్నదొర, జ్యోతిప్రసాద్ అన్నారు. 41 సంవత్సరాలుగా ఉపాధ్యాయునిగా, ఎల్‌ఎఫ్ఎల్ హెచ్ఎంగా విలువైన సేవలు అందించడమే కాకుండా ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారన్నారు. భీమేశ్వరరావును రాజానగరం నంబర్ టు ఆదర్శ పాఠశాలలో విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, జ్ఞాపికలు, దుశ్శాలువాలతో వీడ్కోలు సన్మానం నిర్వహించారు. ఎస్టీయు రాష్ట్ర ఎయిడెడ్ విభాగ కన్వీనర్ ఎస్‌జే త్రినాథ్ బాబు, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధర్మరాజు, సుబ్రహ్మణ్యం, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

చేతికందే ఎత్తులో ప్రమాదం

పిడింగొయ్యి పంచాయతీ, బాపూజీ నగర్ నీరు ట్యాంక్ వీధిలో విద్యుత్తు ఫ్యూజ్ బాక్స్ చేతికందే ఎత్తులో ఉంది. నిత్యం చిన్నారులు అటుగా వెళ్లి ఆటలు ఆడుతుంటారు. ఎటువంటి రక్షణలేకుండా ప్రమాదకరంగా ఉండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మోరంపూడి

నిర్లక్ష్యపు వెలుగులు

పిడింగొయ్యి పంచాయతీ, గణేష్‌నగర్, వేంకటేశ్వర నగర్‌లో పగలు సైతం వీధి దీపాలు వెలుగుతున్నాయి. దీంతో అతి తక్కువ రోజుల్లోనే మరమ్మతులకు గురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మోరంపూడి

నీటి వృథా అరికట్టరూ..

అనపర్తి పాతవూరులోని నారయ్యనూతి వీధిలోని మంచి నీటి కొళాయి పైపులైను విరిగింది. దీంతో నీరు వృథాగా పోయి రోడ్డుమీదకు వస్తోంది. గతంలో తూతూమంత్రంగా మరమ్మతులు చేపట్టడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి ఫణికుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణమే సిబ్బందిని పంపి సమస్యను పరిష్కరిస్తామన్నారు. –న్యూస్‌టుడే, అనపర్తి గ్రామీణం

చెత్త తొలగించారు

శాటిలైట్ సిటీ బీ బ్లాక్‌లో ప్రధాన రహదారి పక్కనే వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి. దీంతో కుక్కలు రోడ్లపైకి లాగేస్తుండడంతో రోడ్డు అపరిశుభ్రంగా మారింది. ఈ సమస్యపై ఈనాడులో 'రహదారిపై వ్యర్థాలు' అనే శీర్షికన చిత్ర వార్త సోమవారం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు ఆ ప్రాంతమంతా శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, మోరంపూడి

స్పందనకు వందనం

ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు సత్కారం

సోము వీర్రాజును సత్కరిస్తున్న అయ్యాజీవేమా

పి.గన్నవరం: భాజపా శాసనమండలి ఫ్లోర్‌లీడర్‌గా ఎన్నికైన ఎమ్మెల్సీ సోము వీర్రాజును సోమవారం రాజమహేంద్రవరం గ్రామీణం కొంతమూరులో మాజీ ఎమ్మెల్యే, భాజపా జాతీయ కార్యమండలి సభ్యుడు మానేపల్లి అయ్యాజీ వేమా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్మనిర్భర్ కన్వీనర్, మాజీ సర్పంచి చీకరమెల్లి శ్రీనివాసరావు, గంట పెద్దిరాజు, కోటిపల్లి సాయిరామ్ పాల్గొన్నారు.

ఓం శివశక్తి పీఠంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు శ్రీకారం

పీఠంలో హోమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండ మండలం గాదరాడలోని ఓం శివశక్తి పీఠంలో సోమవారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పీఠంలోని 54 దేవాలయాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, వెంకటలక్ష్మి దంపతులు హోమాది కార్యక్రమాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన

గోకవరం, న్యూస్‌టుడే: ఎన్నికల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రంపయర్రంపాలెం జడ్పీఉన్నత పాఠశాలలో మాక్‌పోలింగ్‌ను నిర్వహించారు. ఉపాధ్యాయులు పెదిరెడ్ల రాజు, పి.బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మాక్‌పోలింగ్ నిర్వహిస్తున్న విద్యార్థులు

కాటన్ మ్యూజియం వద్ద విద్యార్థులు ఉపాధ్యాయులు

విహారయాత్రకు వెళ్లిన విద్యార్థులు

అనపర్తి గ్రామీణం: ద్వారంపూడి బుల్లెమ్మాయి జడ్పీఉన్నతపాఠశాల విద్యార్థినులకు పీఎమ్‌శ్రీ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో విజ్ఞాన విహారయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలుపాధ్యాయులను వారిని బస్సుపై ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజ్, మ్యూజియం, ఇస్కాన్ టెంపుల్, ఉజ్జయిని మహాకాళేశ్వరం మందిరాలకు తీసుకువెళ్లారు. హెచ్ఎం కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులు

మోరంపూడి, న్యూస్‌టుడే: కొంతమూరు పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వొకేషనల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా విద్యార్థులకు నైపుణ్య పోటీలను నిర్వహించామని పాఠశాల హెచ్ఎం బీ.రత్నకళ తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఎలక్ట్రికల్ విభాగంలో 8, 9వతరగతి విద్యార్థులు పాల్గొన్నారన్నారు. అద్భుతమైన ప్రదర్శన చేసిన వారిని మూడు గ్రూపులుగా 12 మందిని ఎంపిక చేశామన్నారు.

విద్యార్థుల ప్రదర్శనను పర్యవేక్షిస్తున్న హెచ్ఎం రత్నకళ

శివాలయంలో చోరీ

గోకవరం, న్యూస్‌టుడే: మల్లవరం గ్రామంలోని ఉమా మల్లేశ్వరస్వామివారి దేవస్థానంలో చోరీ జరిగింది. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు ఆలయంలోకి ప్రవేశించి అక్కడ ఉన్న నాలుగు హుండీలలో మూడు హుండీలను పగలగొట్టి సొమ్ములను ఎత్తుకెళ్లారు. వాటిలో ఒక హుండీని గ్రామశివారున పడేశారు. సోమవారం వేకువజామున ఆలయం తలుపులు తీసిన నిర్వాహకులు హుండీలలో సొమ్ము చోరీ జరిగినట్లు గుర్తించారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

WANTED
ప్రముఖ 2 వీలర్ ఫైనాన్స్ నందు రాజమండ్రిలో పనిచేయుటకు
✦ కంప్యూటర్ ఆపరేటర్ (Female)
కావలెను. టైపింగ్ మరియు Excelలో అనుభవం కలిగియుండాలి.
జీతం: 12000/- నుంచి 18000/- వరకు
విష్ణుసాయి ఫైనాన్స్ కార్పొరేషన్
బైపాస్ రోడ్, రాజమండ్రి
85006 44978

తుపాను బాధితులకు ఆర్థికసాయం

హుకుంపేటలో బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావిత పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న 28 కుటుంబాలకు నిత్యావసర సరకులు పంపిణీ చేయడంతో పాటు ఆర్థికసాయం అందించినట్లు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు.ఆయన మాట్లాడుతూ.. రాజమహేంద్రవరం గ్రామీణ నియోజకవర్గ పరిధిలో 221 కుటుంబాలకు రూ.3.61లక్షల ఆర్థిక సాయం అందజేశామన్నారు. పునరావాస కేంద్రాలలో ఉన్న ప్రతి ఒక్కరికీ రూ.1000, ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది సభ్యులు ఉన్న కుటుంబాలకు రూ.3000లు చొప్పున ఆర్థిక సాయం అందించామన్నారు. కడియం, హుకుంపేట, రాజమహేంద్రవరం గ్రామీణం తదితర ప్రాంతాలలో ప్రజలకు ఇప్పటికే నిత్యావసర సరకులు పంపిణీ చేశామన్నారు. అర్బన్ తహసీల్దారు పాపారావు, స్థానిక ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్‌వో ప్రాంతీయ కార్యాలయానికి గుర్తింపు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం అఖిల భారత స్థాయిలో గుర్తింపును సాధించింది. దీని పరిధిలోని భీమవరం జిల్లా పీఎఫ్ కార్యాలయం ఉత్తమ పనితీరు కనబరిచి అఖిల భారతస్థాయిలో పురస్కారాన్ని పొందింది. ఈపీఎఫ్‌వో వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ నెల 1న న్యూదిల్లీలో జరిగిన కార్యక్రమంలో పురస్కారాన్ని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి చేతుల మీదుగా భీమవరం పీఎఫ్ జిల్లా కార్యాలయం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎలీషారావుతో కలిసి రాజమహేంద్రవరం ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్-2 వెంకటేశ్వర్లు అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక ఈపీఎఫ్‌వో ప్రాంతీయ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో మాట్లాడారు. సహాయ భవిష్యనిధి అధికారి రాధానాథ్ పట్నాయక్, ఇతర పీఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

అనపర్తిలో సరకులు అందజేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ సాయంతో నష్టపోయిన రైతులను ఆదుకునే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన చేస్తున్నారని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనపర్తి, బిక్కవోలు మండలాల్లో మొంథా తుపాను బాధితులకు ఆయన ఆర్థిక సహాయం అందజేశారు. అనపర్తి మండలంలోని 408మందికి, బిక్కవోలు మండలంలో 81 మందికి రూ.1000చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రైతులు ఎటువంటి సమస్యలు వచ్చినా అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి రాజారమేష్, తహసీల్దార్ అనీల్ కుమార్, ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, ఏఎమ్‌సీ ఛైర్మన్ సూర్యకుమారి, ఆత్మకమిటీ ఛైర్మన్ సత్తిబాబు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 95333 66637

సమస్య: వడిశలేరులో వీధి దీపాల నిర్వహణ సరిగాలేక అంధకారం అలముకుంటోంది. మెయిన్ రోడ్డుని రూ.కోటి అంచనా వ్యయంతో అభివృద్ధి చేస్తుండగా కొన్ని లైట్లు వెలగక ప్రమాదాలు జరుగుతున్నాయి.

– వి.సూర్యభాస్కరరావు, స్థానికుడు

సమాధానం: వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – వి.సాయిబాబు, ఎంపీడీవో, రంగంపేట

- న్యూస్‌టుడే, రంగంపేట

సమస్య: ధవళేశ్వరం సాయిప్రియాంక కాలనీలో మురుగు కాలువల నిమిత్తం రహదారిని తవ్వినప్పుడు తాగునీటి పైపులైన్లు దెబ్బతిన్నాయి. వాటిని మార్చకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. – కె.వి.రామ్, విశ్రాంత ఉద్యోగి స్థానికుడు

సమధానం: తాగునీటి పైపులైన్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి మరమ్మతులు చేపడతాం.

– వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి

–న్యూస్‌టుడే, ధవళేశ్వరం

పబ్లిక్ నోటీస్

మహారాజశ్రీ పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

Creditor I.P. 8/2025

Between:

గోపిశెట్టి నాగేశ్వరరావు, S/o లేట్ అప్పారావు, అనపర్తి, అనపర్తి మండలం ... పిటీషనరు

And

1. ప్రగడరెడ్డి గౌరీ శంకర నాథ్, S/o గంగరాజు, నల్లమిల్లి, రంగంపేట మండలం.
2. నామా శ్రీకృష్ణ, S/o నారాయణమూర్తి, నల్లమిల్లి, రంగంపేట మండలం.
3. The Official Receiver, East Godavari District, Rajamahendravaram ...రెస్పాండెంట్లు

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకమునకు తెలియజేయునదేమనగా పై నంబరు గ్రంథములో 1వ రెస్పాండెంట్‌ను Insolventగా డిక్లేర్ చేయమని మరియు 1వ రెస్పాండెంట్ 2వ రెస్పాండెంట్ పేరుపై వ్రాసిన రిజిస్టర్డ్ Sale Deed నంబరు 336/2025 of SRO, బిక్కవోలుగా గల డాక్యుమెంట్‌ను రద్దు పరిపించమని పిటీషనరు పై కోర్టు వారి యెదుట పై నంబరు గ్రంథము దాఖలు చేసినందున సదరు విషయమై ఎవరికైననూ ఎటువంటి అభ్యంతరములు వున్న యెడల దివి. 05-11-2025 సం॥ తేదీన ఉదయం 10.30 ని॥లకు పై కోర్టు వారి యెదుట హాజరు అయ్యి వారి యొక్క ఆక్షేపణలు తెలియపరచుకోవలెను లేనియెడల పరోక్షమున తీర్మానించబడునని ఈ ప్రకటన ద్వారా శ్రీ కోర్టువారి ఆర్డరుతో తెలియజేయడమైనది.

పి.నారాయణమూర్తి, అడ్వకేట్, రామారావుపేట పెద్దాపురం, సెల్: 99491 32087

(c) eenadu

నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘ నాయకులు

పంట నష్టపరిహారం అందించాలి

చాగల్లు: మొంథా తుపాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని కౌలురైతు సంఘం జిల్లా కన్వీనర్ గారపాటి సుబ్బారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట సోమవారం రైతులతో కలిసి నిరసన తెలిపి, తహసీల్దార్ ఎం.మెరికమ్మకు వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వం తెచ్చిన కౌలు చట్టాన్ని రద్దు చేయాలని, భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు అందించాలని కోరారు.

నేడు, రేపు తాడిమళ్లలో క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

నిడదవోలు: మండలంలోని తాడిమళ్ల పీహెచ్‌సీలో ఈనెల 4, 5వ తేదీల్లో డొక్కా సీతమ్మ తల్లి అన్నదాన ట్రస్ట్, తిమ్మరాజుపాలెం లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కొండూరి నారాయణమూర్తి, బండి వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్, రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ వైద్యులు ఈ వైద్య శిబిరంలో పాల్గొంటారన్నారు.

విజయదుర్గాదేవి గ్రామోత్సవం

నల్లజర్ల, న్యూస్‌టుడే: ఆవపాడులో విజయదుర్గాదేవి ఉత్సవ విగ్రహంతో సోమవారం గ్రామోత్సవం చేశారు. ఉదయం అమ్మవారికి గణపతి పూజ, పంచామృతాభిషేకం, సాయంత్రం లక్ష దీపోత్సవం నిర్వహించారు. మహిళలు లలితాసహస్రనామం పఠించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పౌర హక్కుల పరిరక్షణ దినం నిర్వహించాలి

నిడదవోలు: ప్రతి నెలా 28న ఒక గ్రామంలో అన్ని సామాజికవర్గాలతో కలిపి పౌర హక్కుల పరిరక్షణ దినోత్సవం (సివిల్ రైట్స్ డే) నిర్వహించాలని కోరుతూ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కేవీపీఎస్ నాయకుడు జువ్వల రాంబాబు కలెక్టర్ కీర్తి చేకూరికి వినతిపత్రాన్ని అందించారు. సివిల్ రైట్స్ డే జరపాలని జీవో నం-105 చెబుతుండగా జిల్లాలో రెవెన్యూ, పోలీసు అధికారులు అమలు చేయడం లేదన్నారు.

చిత్రలేఖనంలో మెరుపులు

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పోటీలు

చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో పంగిడిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'మీకు ఇష్టమైన పండగ' అనే అంశంపై విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు జరిగాయి. 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొని అందమైన చిత్రాలతో అందరినీ ఆకట్టుకున్నారు. ఎస్కే నూర్జహాన్ (8వ తరగతి), ఎం.నవ్య (10వ తరగతి), కె.వీరనాగలక్ష్మి (8వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయిని కె.లక్ష్మి అరుణకుమారి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలతో ప్రధానోపాధ్యాయిని లక్ష్మి అరుణకుమారి తదితరులు

ఆట.. భవితకు బాట

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభ వెలికితీసి వారిలో నైపుణ్యాలకు పదును పెట్టేందుకు ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) వేదికగా నిలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చక్కగా చదువుతూ వాలీబాల్ క్రీడలో విద్యార్థులు ప్రావీణ్యం పొందుతున్నారు. ఆత్మస్థైర్యంతో ఆటలో రాణిస్తూ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకుంటూ తోటి వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వాలీబాల్ క్రీడకు ఖార్ఖానాగా పిలిచే కొవ్వూరులో మూడ్రోజుల పాటు జరిగిన 69వ అంతర జిల్లాల వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ముగిశాయి. రాష్ట్రంలో ఉమ్మడి 13 జిల్లాల నుంచి 312 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అండర్-17 విభాగంలో బాలురు, బాలికల రాష్ట్ర జట్టు ఎంపికవ్వగా వీరు జాతీయ స్థాయిలో ఉత్తర ప్రదేశ్‌లోని బరేలీలో జరిగే పోటీలకు రాష్ట్రం తరఫున ఆడనున్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఈ ఆటతో తమకు భవిష్యత్తు ఉందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

అండర్-17 రాష్ట్ర బాలికల వాలీబాల్ జట్టు

సీనియర్ నేషనల్స్ ఆడాలని..

తోటి విద్యార్థులను చూసి 8వ తరగతిలో వాలీబాల్ ఆడడం మొదలెట్టా. నాన్న అప్పలరెడ్డి తాపీ పని, అమ్మ మంగమ్మ కూరగాయలు అమ్ముతూ నన్ను, చెల్లిని చదివిస్తున్నారు. మూడుసార్లు రాష్ట్ర జట్టులో ఆడా. సీనియర్ నేషనల్స్‌లో ఆడి. పోలీసు అధికారిగా ఉద్యోగం సాధించాలని పట్టుదలతో ఉన్నాను. – జి.నవదీప్

దేశస్థాయిలో సత్తా చాటుతా..

అయిదో తరగతి నుంచే వాలీబాల్ ఆటపై ఇష్టం పెంచుకున్నా. ఇప్పటి వరకు రెండుసార్లు రాష్ట్రస్థాయి జట్టులో ఆడాను. తొలిసారి జాతీయ స్థాయికి ఎంపికవ్వడం ఆనందంగా ఉంది. ఇదే స్ఫూర్తితో వాలీబాల్‌లో రాణించి దేశస్థాయిలో ఆడి రైల్వే శాఖలో ఉద్యోగం చేయాలన్నది నా సంకల్పం. నాన్న భీమశంకరం రైతు, అమ్మ బుచ్చమ్మ గృహిణి. మా ఊరికి, జిల్లాకు పేరు తెస్తాను. – ఆర్.వంశీ

కేంద్ర ప్రభుత్వోద్యోగం సాధిస్తా..

ఆరో తరగతిలో వాలీబాల్ ఆడడం నేర్చుకున్నాను. వ్యాయామోపాధ్యాయుల ప్రోత్సాహంతో రాణిస్తున్నాను. రాష్ట్ర స్థాయిలో విజయనగరం, అరకు, విశాఖలలో ఆడాను. ప్రస్తుతం నాలుగోసారి రాష్ట్ర జట్టు ద్వారా జాతీయ పోటీలకు వెళుతున్నాను. తండ్రి రాజు కార్మికుడిగా, తల్లి నిర్మల నర్సుగా పనిచేస్తూ కష్టమైనా నన్ను ప్రోత్సహిస్తున్నారు. మా అక్క కూడా ఈ ఆటలో ప్రతిభ చూపిస్తోంది. క్రీడా కోటాలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తాను. – మాణికల మహాలక్ష్మి

నాన్నే నేర్పించారు..

అమ్మానాన్న మురళి, రంజని ఇద్దరూ పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తున్నారు. 8వ తరగతిలో ఉండగా నాన్న వాలీబాల్ నేర్చుకోవాలని ప్రోత్సహించి స్వయంగా నేర్పించారు. ఆ తర్వాత నాకు ఆసక్తి పెరిగింది. జాతీయస్థాయిలో రెండు, రాష్ట్రస్థాయిలో మూడుసార్లు వాలీబాల్ పోటీలకు వెళ్లి ప్రతిభ చూపించాను. తాజాగా రాష్ట్ర బాలికల జట్టుకు ఎంపికవడం ఆనందంగా ఉంది. ఏరోనాటికల్ ఇంజినీరు కావాలని అనుకుంటున్నాను. – ఒమ్మి చరిష్మ

పోస్ట్‌మాస్టర్‌కు సత్కారం

నిడదవోలు: నిడదవోలు ప్రధాన తంతి తపాలా కార్యాలయం పోస్ట్‌మాస్టర్ శ్రీనివాసను సోమవారం పట్టణ ప్రముఖులు దుస్సా రాజేశ్వరరావు, భాజపా కార్యవర్గ సభ్యుడు రంగా వెంకటేశ్వరరావు సత్కరించారు. కార్యక్రమంలో పిసిశెట్టి సూర్యచంద్రరావు, కొండపాటి గంగరాజు, తోరం శ్రీనివాస్, భాజపా పట్టణ అధ్యక్షుడు మోర్త ప్రమోద్‌కుమార్, భాజపా పట్టణ మాజీ అధ్యక్షుడు నీలం రామారావు తదితరులు పాల్గొన్నారు.

స్వీయ రక్షణ కలిగి ఉండాలి

ఉండ్రాజవరం: ఒంటరిగా నివాసం ఉంటున్న వారంతా స్వీయ రక్షణ కలిగి ఉండాలని ఎస్సై డి.రవికుమార్ అన్నారు. ఉండ్రాజవరం తదితర గ్రామాల్లో సోమవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. కుటుంబ సమేతంగా ఊరెళితే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇస్తే భద్రత చేకూరుతుందన్నారు. సాంకేతికతను వినియోగించుకుని ఇళ్ల వద్ద చోరీలు అరికట్టటానికి చేయూతనివ్వాలన్నారు. నాయకులు, పోలీసులు పాల్గొన్నారు.

గ్రంథాలయ కమిటీ ప్రమాణస్వీకారం

పెరవలి: తీపర్రు శాఖా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా గ్రంధి శ్రీరామచంద్రమూర్తి, ఉపాధ్యక్షుడిగా భోగవల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి మిరియాల ధనప్రియ, సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

విద్యార్థులకు పోటీలు

నిడదవోలు: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిడదవోలు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రధానాచార్యురాలు బి.మేరీసుజాత అధ్యక్షతన సోమవారం వివిధ అంశాలపై పోటీలు నిర్వహించారు. వ్యాస రచన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో రుష్యాంత్, సాయి, మధు, వక్తృత్వ పోటీల్లో గణసాయి, వసంత, నవనీత్, క్విజ్ పోటీల్లో చందు, సతీష్, నవనీత్‌లు విజేతలుగా నిలిచారన్నారు.. వీరు ఈనెల 5న జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తాళ్లపూడి: 80085 74498, ఉండ్రాజవరం: 80085 74503, నల్లజర్ల: 97011 37112

స్పందనకు వందనం

పరిసరాల శుభ్రం..

తాళ్లపూడి: ప్రక్కిలంకలోని ఎస్సీ, కాలింగుల కాలనీల్లో డ్రెయిన్లు వ్యర్థాలతో నిండిపోయి, రహదారుల వెంబడి చెత్త చెదారం పేరుకుపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి నందిరాజు దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. కాలువల్లో పూడికతీత, రహదారులపై చెత్తచెదరాన్ని సోమవారం తొలగించారు.

దుర్వాసనతో అవస్థలు..

సమస్య: చీపురుగూడెంలోని విన్ ఆఫ్ ప్రేయర్ హౌస్ వీధిలో డ్రెయిన్ పూడుకుపోవడంతో మురుగు పారడం లేదు. దుర్వాసన వెల్లువెత్తుతోంది. – స్థానికులు

సమాధానం: డ్రెయిన్‌ను పరిశీలించి శుభ్రం చేయిస్తాం. – రామారావు, పంచాయతీ కార్యదర్శి

– న్యూస్‌టుడే, నల్లజర్ల

సమస్య: తాళ్లపూడి నుంచి వేగేశ్వరపురం వెళ్లే రహదారిలో వ్యర్థాలు పేరుకుపోయాయి. వాటి నుంచి దుర్వాసన వస్తుండడం, పందులు సంచరిస్తుండడంతో అటుగా రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. – స్థానికుడు

సమాధానం: చెత్త తొలగించి, శుభ్రం చేయిస్తాం. – వీరన్న, పంచాయతీ కార్యదర్శి

– న్యూస్‌టుడే, తాళ్లపూడి

ప్రతి ధాన్యం గింజకు గిట్టుబాటు ధర

దేవరపల్లి: రైతు పండించిన ప్రతి ధాన్యం గింజకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. దేవరపల్లి మండలంలోని కురుకూరు, పల్లంట్లలోని ఆర్ఎస్‌కేల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు తడిసి రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. మినుము పంట ముంపునకు గురైన విషయం పలువురు ఆయన దృష్టికి తీసుకురాగా మార్క్‌ఫెడ్ ద్వారా మినుముల కొనుగోలుకు కృషి చేస్తామన్నారు. ఇటీవల కురుకూరులో జరిగిన అగ్నిప్రమాదంలో నివాసాన్ని కోల్పోయిన చదలవాడ చెల్లమ్మకి సొంత సొమ్ము రూ.10 వేలు అందించారు. కలగర కుటుంబం ఏర్పాటు చేసిన వన భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. కొయ్యలమూడి చిన్నబాబు, సుధారాణి, సొసైటీ ఛైర్మన్లు యలమాటి భాస్కరరావు, ఉప్పులూరి రామారావు, కొయ్యలమూడి గాంధీ, వెంకట కృష్ణారావు తదితరులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

కురుకూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు

మత్స్యకార కుటుంబాలు లైసెన్సులు పొందాలి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: చేపల వేట వృత్తిగా జీవించే వారంతా లైసెన్సులు తీసుకోవాలని.. ప్రభుత్వ పథకాలు, సంక్షేమానికి అవి ప్రామాణికమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మొంథా తుపాను కారణంగా వృత్తి నష్టపోయిన 995 మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం, ఇతర నిత్యావసర సామగ్రి సోమవారం పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 1330 మంది మత్స్యకార కుటుంబాలకుగాను 145 కుటుంబాలకే లైసెన్సులు ఉన్నాయన్నారు. అందరికీ లబ్ధి చేకూరాలని ఆర్డీవో ద్వారా జిల్లా కలెక్టరును కోరగా కిట్లు పంపించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఆర్డీవో రాణి సుస్మిత, మత్స్యశాఖ ఏడీ దిర్షాద్, భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, నాయకులు సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, పిల్లలమర్రి మురళీకృష్ణ, తహసీల్దారు ఎం.దుర్గాప్రసాద్, సీఎస్ డీటీ సునీత తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సామగ్రి అందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

సరైన ఆధారాలతోనే జోగి రమేష్ అరెస్టు

మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్టును రాజకీయం చేయడం, కులాలు ఆపాదించడం సిగ్గుచేటని.. లిక్కర్ కేసులో ఆధారాలతోనే ఆయనను అరెస్టు చేశారని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కొవ్వూరులో మాట్లాడుతూ పులివెందుల రాజ్యాంగంతో రాష్ట్రాభివృద్ధిని 20 ఏళ్లు వెనక్కి తీసుకుపోయారన్నారు. జె బ్రాండ్లతో నకిలీ మద్య తయారు చేసి రూ. కోట్లు సంపాదించారని, ఎందరో ప్రాణాలను బలిగొన్నారన్నారు. తప్పు చేసిన వారందరికీ శిక్ష పడుతుందన్నారు. వైకాపా నాయకుల వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు ఉందన్నారు. చేయని నేరాలకు తెదేపా అధినేత, నాయకులను అక్రమంగా అరెస్టు చేయలేదా అని ప్రశ్నించారు.

పందలపర్రు రోడ్డుపై పాట్లు

నిడదవోలు మండలం పురుషోత్తపల్లి నుంచి పందలపర్రు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. పురుషోత్తపల్లికి చెందిన పలువురు రైతులు పంట పొలాలకు, పందలపర్రుకు చెందిన పలువురు విద్యార్థులు పురుషోత్తపల్లిలోని ఉన్నత పాఠశాలకు ఈ రహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. పందలపర్రు, పురుషోత్తపల్లి ఇసుక ర్యాంపునకు వాహనాలు ఇదే రహదారిపై తిరుగుతుంటాయి. ఇంత ప్రాధాన్యమున్న రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నిడదవోలు

అసంపూర్తిగా వదిలేశారు..!

రైతులు పంట ఉత్పత్తులు నిల్వ చేసుకోవడానికి వీలుగా గత ప్రభుత్వ హయాంలో వెంకటాయపాలెం, వాదాలకుంటలో గోదాముల నిర్మాణం ప్రారంభించారు. పునాదిగ, మధ్యదశ వరకు పనులు చురుగ్గా సాగాయి. తర్వాత నిలిచిపోయాయి. పట్టించుకున్న వారు లేరు. గోదాములు లేక పంట ఉత్పత్తులు నిల్వ చేసుకునేందుకు రైతులు ఇబ్బందిపడుతున్నారు. నిధులు విడుదల కాకపోవడంతో పనులు ఆగిపోయాయని, ఉన్నతాధికారులకు తెలియజేసి వారి ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపడతామని ఉపాధిహామీ ఏపీవో రమణ తెలిపారు. – న్యూస్‌టుడే, గోపాలపురం

వ్యర్థాలు తొలగక.. అవస్థలు పట్టక

దేవరపల్లిలోని చంద్రబాబు నాయుడు కాలనీలోని గణపతి ఆలయం సమీపంలో గుట్టలుగా వ్యర్థాలు పేరుకుపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. దుర్వాసనతోపాటు దోమలు విజృంభిస్తున్నాయని వారు వాపోతున్నారు. సమీపంలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు ఉండడంతో అటుగా విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దీనిపై ఈవోపీఆర్డీ వై.రాజారావును వివరణ కోరగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. –న్యూస్‌టుడే, దేవరపల్లి

సేవా కార్యక్రమాలు అభినందనీయం

తాళ్లపూడి: తుపాన్ ప్రభావంతో ఇళ్లు కోల్పోయిన అన్నదేవరపేట, రావూరుపాడు, మలకపల్లికి చెందిన తొమ్మిది కుటుంబాలకు గెడ్డం విలియమ్స్ తన ఇఫ్రాయిమ్ గ్లోబల్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.5 వేలు చొప్పున నగదు, రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రూ.1.20 లక్షలు విలువ చేసే 3 ఏసీలు సోమవారం అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీలావణ్య, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, రాగోలపల్లి సొసైటీ అధ్యక్షుడు అనపర్తి ప్రసాద్, నాయకులు సిద్దా దుర్గారావు, గంటా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

గోపాలపురం బ్రాంచ్ (21290), మెయిన్ రోడ్డు, గోపాలపురం, తూర్పుగోదావరి జిల్లా, ఆం.ప్ర-534316

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 సెక్షన్ 13(2) క్రింద - జారీ చేయబడిన నోటీసు

(I) ఋణగ్రహీతల పేర్లు మరియు చిరునామా : శ్రీ దిర్సిపోం సుబ్బారావు, తండ్రి : డి. గోతియ్య, డోర్ నెం.8-243, కరెంట్ ఆఫీస్ దగ్గర, బి.సి.కాలనీ, గోపాలపురం గ్రామం & మండలం, తూర్పు గోదావరి జిల్లా-534316.
హౌసింగ్ లోన్ ఖాతా నెం.42128279065 & సురక్ష లోన్ ఖాతా నెం.42157616542 & హోమ్-టాప్-అప్ లోన్ ఖాతా నెం.42350678100

(II) బకాయి మొత్తం: తేది.11.08.2025 నాటికి మొత్తం రూ.30,71,086/- (అక్షరాల ముప్పై లక్షల డెబ్బై ఒక్క వేల ఎనభై ఆరు రూపాయలు మాత్రమే) + తేది.12.08.2025 నుండి పైన పేర్కొన్న మొత్తానికి కాంట్రాక్చువల్ రేటు ప్రకారం భవిష్య వడ్డీతో కలిపి ఇతర ఖర్చులు, కాస్ట్స్, ఛార్జీలు, మొ॥వితో కలిపి చెల్లించవలెను.

(III) డిమాండ్ నోటీసు తేది: 13.08.2025 NPA తేది: 10.08.2025

షెడ్యూలు ఆస్తి వివరములు

పశ్చిమ గోదావరి జిల్లా, వేగేశ్వరపురం సబ్ రిజిస్ట్రీ, గోపాలపురం మండలం, గోపాలపురం గ్రామం & గ్రామ పంచాయితీ, కరెంట్ ఆఫీస్ దగ్గర, వార్డు నెం.13, సమీప డోర్ నెం.8-243 వద్ద ఆర్.ఎస్ నెం.218/7 నందు విస్తీర్ణం ఎకరా 0.06 సెంట్లు లేదా 291 చ॥గ॥లు స్థలంలోని ఆర్‌సిసి రూఫ్ గ్రౌండ్, మొదటి అంతస్తు మరియు రెండవ అంతస్తు (సగం రూమ్) రెసిడెన్షియల్ భవనం శ్రీ దిర్సిపోం సుబ్బారావు, తండ్రి : గోతియ్య గారికి చెందినది (రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెం.2151/2015, తేది.15.10.2015 & రెక్టిఫికేషన్ డీడ్ నెం.180/2017, తేది.03.02.2017 ప్రకారం) హద్దులు : తూర్పు : రాజవీధి, దక్షిణం : బంత లక్ష్మీ గారి ఇల్లు మరియు స్థలం, పడమర : రాయుడు సుజాత గారి ఇల్లు మరియు స్థలం, ఉత్తరం : రాజ వీధి.

పైన చెప్పబడిన ఋణగ్రహీత/హామీదారు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గోపాలపురం బ్రాంచ్, గోపాలపురం, తూర్పు గోదావరి జిల్లా వారి నుండి ఋణము పొందియున్నారు. సదరు ఋణమునకు పైన పేర్కొన్న ఆస్తిని హామీగా ఇచ్చియున్నారు. ఋణము యొక్క నియమ నిబంధనలననుసరించి సకాలంలో చెల్లించకపోవటచే సదరు ఖాతాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి నియమ నిబంధనల ప్రకారం నిరర్థక ఖాతాగా పరిగణించబడినది. బ్యాంకువారు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించిన డిమాండ్ నోటీసులు తిరిగి వచ్చినందున / ఋణగ్రహీత/హామీదారుల సంతకములు సరిగా లేనందున పత్రికా మూలకముగా మీకు మరల నోటీసు జారీచేయడమగుచున్నది. కావున మీరు పైన పేర్కొన్న మొత్తములను ఈ పత్రికా ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా వడ్డీ & ఇతర ఖర్చులతో కలిపి మొత్తమును చెల్లించవలసినదిగా కోరడమైనది. లేని పక్షంలో పైన పేర్కొన్న చట్టము ప్రకారము బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయిని రాబట్టుకొను నిమిత్తం తదుపరి చర్యలు గైకొనుట ఋణగ్రహీత సంతకందారునికి అనివార్యమవుతుంది.

తేది: 04.11.2025, ప్రదేశం: గోపాలపురం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఆర్థిక సాయం అందజేత

గోపాలపురం: మండల పరిధిలోని 58 తుపాన్ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం విడుదల చేసిన రూ1.15 లక్షల సాయాన్ని సోమవారం గోపాలపురంలో అందించారు ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు జ్యేష్ఠ శ్రీధర్, బూరెడ్డి వాసు, పడమటి శ్రీనువాసరావు, కుందుల నారాయణరావు, ఉండవల్లి ప్రసాద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండల పరిధిలో 46 కుటుంబాలకు రూ 1.17 లక్షలు అందించినట్లు తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాదు తెలిపారు. బియ్యం, సరకులు కూడా సమకూర్చామన్నారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు, వీఆర్వోలు పాల్గొన్నారన్నారు.

పెరవలి: తీపర్రు తదితర గ్రామాల్లోని బాధితులకు నిత్యావసర సరకులు అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు కంటిపూడి సూర్యనారాయణ, నాయకులు సింహాద్రి సత్యనారాయణ, ప్రత్తిపాటి ప్రసాద్‌కుమార్, తహసీల్దార్ నిరంజన్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా అర్జీల పరిష్కారం

కొవ్వూరు పట్టణం: ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను బాధ్యతాయుతంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని కేఆర్‌సీసీ తహసీల్దారు పి.అచ్యుతకుమారి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం 21 అర్జీలను స్వీకరించారు. రహదారుల నిర్మాణం, భూమి సరిహద్దులు, ఆన్‌లైన్లో పేర్ల నమోదు, సంక్షేమ పథకాలకు అర్హత, ఆక్రమణలు తొలగించాలని, నష్టపరిహారం విషయంలో విచారణ చేపట్టాలని అర్జీలు రాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా శాఖలకు పంపించారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరి అరెస్టు: 25 లీటర్ల సారా స్వాధీనం

గోపాలపురం: ముందస్తు సమాచారం మేరకు గోపాలపురం గ్రామ శివారులో దాడులు నిర్వహించి నాటు సారా తయారు చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని, 25 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పి.మనోహర్ సోమవారం తెలిపారు. నిందితులను కొవ్వూరు కోర్టులో హాజరుపరిచామన్నారు.

• క్షేత్రం ప్రధాన రేవులో భక్తుల పుణ్య స్నానాలు • శివాలయంలో నందీశ్వరుని వద్ద దీపారాధనలు • నిడదవోలు గోలింగేశ్వరస్వామి ఆలయంలో.. • గోపాలపురంలో శ్రీకృష్ణుడికి పూజలు

ఓం నమశ్శివాయ.. హర.. హరా...

తాళ్లపూడి: దీపాలంకరణ

ఓం నమశ్శివాయ.. హర.. హరా.. అంటూ భక్తజనం పరవశించింది.. కార్తికంలో పరమ శివుడికి ప్రీతికరమైన సోమవారం సందర్భంగా శివాలయాల వద్ద పంచాక్షరీ మంత్రం ప్రతిధ్వనించింది. తెల్లవారుజామునే భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి ఆలయాలను దర్శించుకుని పూజలు చేశారు. ★ కొవ్వూరు గోష్పద క్షేత్రం ప్రధాన రేవులోని శివలింగం, శివాలయంలోని నందీశ్వరుని వద్ద దీపాలు వెలిగించారు. క్షేత్రంలోని సుందరేశ్వర, చోడేశ్వర, గోష్పదేశ్వర, పంచాయతన శివాలయాల్లో స్వామివార్లకు పంచామృత, మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు చేశారు. అమ్మవార్లకు సహస్ర నామ కుంకుమార్చనలు, విశేషాలంకరణలు చేశారు. ఆలయాల ప్రాంగణాల్లో ప్రదోష కాలంలో ధ్వజస్తంభానికి కట్టిన కార్తిక దీపాన్ని తిలకించారు. ★ నిడదవోలులోని గోలింగేశ్వర, సోమేశ్వరస్వామి వార్లను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాటకోటేశ్వరం ఉమా కాటకూటేశ్వరస్వామి ఆలయంలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ★ ఉండ్రాజవరం మండలం వడ్లూరు, కె.సావరం, దమ్మెన్ను, మోర్త, వెలగదుర్రు, తాడిపర్రు, పసలపూడి, చిలకపాడు శివాలయాల్లో స్వామివారికి అభిషేకాలు, పూజలు, విశేష అలంకరణ చేశారు. ★ గోపాలపురం మండల పరిధిలోని శివాలయాల్లోను, శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. – న్యూస్‌టుడే బృందం

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు చాగల్లు విద్యార్థులు

చాగల్లు, న్యూస్‌టుడే: విజయవాడలో మంగళవారం నుంచి జరిగే రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు చాగల్లు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని వి.వాసవి తెలిపారు. గత నెలలో ఏలూరు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో బాలుర విభాగంలో ఎస్.బాలానంద కిషోర్, ప్రశాంత్, రితీష్, బాలికల విభాగంలో జి.బేబి లావణ్య ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. క్రీడాకారులను ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు అభినందించారు.

ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు వాసవి

కాశీబుగ్గ మృతులకు నివాళి

నల్లజర్ల, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ తొక్కిసలాటలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మండలంలోని చీపురుగూడెంలో వైకాపా ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మాజీ హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ దేవుడి దర్శనానికి వెళ్లి 9 మంది మృతి చెందడం బాధాకరం అన్నారు. భక్తులు ఎక్కువగా వస్తారని తెలిసి కూడా ప్రభుత్వం అక్కడ ముందస్తు చర్యలు తీసుకోకుండా వదిలేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

ర్యాలీలో మాజీ హోంమంత్రి వనిత, వైకాపా శ్రేణులు

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

గోపాలపురం బ్రాంచ్ (21290), మెయిన్ రోడ్డు, గోపాలపురం, తూర్పుగోదావరి జిల్లా, ఆం.ప్ర-534316

ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) యొక్క చట్టరీత్యా వారసులు కొరకు నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 సెక్షన్ 13(2) క్రింద - జారీ చేయబడిన నోటీసు

(I) ఋణగ్రహీతల పేర్లు మరియు చిరునామా : 1) శ్రీ జొన్నలగడ్డ సూర్యారావు, H/o (లేటు) శ్రీమతి జొన్నలగడ్డ శేషరత్నం. 2) మిస్ జొన్నలగడ్డ లిఖిత, D/o. (లేటు) శ్రీమతి జొన్నలగడ్డ శేషరత్నం. [illegible]
హౌసింగ్ లోన్ ఖాతా నెం.39657663394

(II) బకాయి మొత్తం: తేది.14.10.2025 నాటికి మొత్తం రూ.9,64,044/- [illegible]

(III) డిమాండ్ నోటీసు తేది: 16.10.2025 NPA తేది: 06.10.2025

షెడ్యూలు ఆస్తి వివరములు

[illegible]

తేది: 04.11.2025, ప్రదేశం: గోపాలపురం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

నేడు 'ఈటీవీ' కార్తిక దీపోత్సవం

శివకేశవులు ఇద్దరికీ ఎంతో ప్రీతికరమైనది కార్తిక మాసం. దీంతో సమానమైన మాసం, గంగతో సమానమైన తీర్థం లేదని పురాణోక్తి. విశిష్ట పుణ్యం సంపదను ప్రసాదించే ఈ మాసంలో దీపారాధనకు ఉన్న ప్రాధాన్యం అనుపమానమైనది. 'ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ, ఈటీవీ లైఫ్' ఛానళ్ల ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవం నిర్వహించనున్నారు. ఈ దీపోత్సవంలో పాల్గొనే మహిళలకు పూజ సామగ్రి నిర్వాహకులే సమకూర్చనున్నారు. ఎంట్రీ పాసులు కావాల్సిన వారు మంగళవారం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 మధ్యలో తణుకు పట్టణంలోని నూలి గ్రౌండ్స్, జ్యూయల్ హోమ్స్ పక్కన, ఎస్ఎన్వీటీ జూనియర్ కాలేజ్ వద్ద పంపిణీ చేస్తారు. పరిమిత సంఖ్యలోనే పాసులు ఉంటాయి. చిన్నపిల్లలకు అనుమతి లేదు. నేలపై కూర్చోగలిగే వారు మాత్రమే హాజరు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు. - ఈనాడు, తణుకు

పరిమిత సంఖ్యలో నేడు ఎంట్రీ పాసుల పంపిణీ

సమయం: ఈరోజు (మంగళవారం) సాయంత్రం 5 గంటలకు

స్థలం: నూలి గ్రౌండ్స్, జ్యూయల్ హోమ్స్ పక్కన, ఎస్ఎన్వీటీ జూనియర్ కాలేజ్ వద్ద, తణుకు

ఈ ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారం నేటి సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ | ఈటీవీ తెలంగాణ | ఈటీవీ లైఫ్

నేడు డీసీసీబీ సర్వసభ్య సమావేశం

ఏలూరు వన్టౌన్, న్యూస్టుడే: స్థానిక క్రాంతి కల్యాణ మండపంలో మంగళవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు సీఈవో సింహాచలం తెలిపారు. డీసీసీబీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అధ్యక్షత వహించనున్నారు. సొసైటీ అధ్యక్షులు, కార్యదర్శులు, అధికారులు విధిగా హాజరు కావాలని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

11న జడ్పీ... ఏలూరు వన్టౌన్, న్యూస్టుడే: స్థానిక జడ్పీ కార్యాలయంలో ఈ నెల 11న ఉదయం 10 గంటలకు ఉమ్మడి జిల్లా ప్రజా పరిషత్తు 1 నుంచి 7 వరకు స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సీఈవో ఎం.శ్రీహరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు సర్వసభ్య సమావేశం ఉంటుందని చెప్పారు.

భజే రుద్రం

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్టుడే: కార్తిక మాసం రెండో సోమవారం సందర్భంగా పంచారామ క్షేత్రం గునుపూడి సోమేశ్వర జనార్దన స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామికి అభిషేకాలు చేశారు. ఆర్టీసీ పంచారామ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 15 వేల మంది తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అంతరాలయం ఎదుట, అన్నపూర్ణమ్మవారి దర్శనానికి భక్తులు బారులుతీరారు.

కార్తిక జల్లులు.. కానరావేమీ!

పోలవరం, న్యూస్టుడే: గోదావరికి వీడని వరద, ప్రమాదకరంగా మారిన రేవులను దృష్టిలో ఉంచుకుని పట్టిసీమ రేవులో కార్తిక మాసంలో భక్తులు జల్లు స్నానాలు చేయడం కోసం అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. రెండో కార్తిక సోమవారం వారం వచ్చినా రేవులో పనులు పూర్తిచేయకపోవడంతో పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రూ.లక్ష ఖర్చుచేసి ట్యాంకు, షవర్లు, గోదావరిలో మోటారు దింపి అక్కడి నుంచి పైపులైన్ ద్వారా నీటి సరఫరాకు ఏర్పాటు చేసి ఉపయోగం ఏమిటని స్థానికులతోపాటు భక్తులు ప్రశ్నిస్తున్నారు.

అంతు లేని బాగోతాలు

ఈనాడు-ఏలూరు

స్థలం ధరకు మించి రుణాలు ఇవ్వటం, వాటి చెల్లింపునకు ఓటీఎస్ సౌకర్యం కల్పించటంతో ఆర్థికంగా సహకార బ్యాంకులకు నష్టం వాటిల్లింది. ఈ అక్రమ, అవినీతి బాగోతాలు వైకాపా హయాంలో తాడేపల్లిగూడెం బజార్, మెయిన్ బ్రాంచుల్లో చోటుచేసుకున్నాయి.

- వైకాపా హయాంలో సహకార బ్యాంకుల్లో అక్రమాలు
- స్థలం విలువకు మించి రుణాలు
- బ్యాంకు గ్యారంటీ లేకుండా మంజూరు

సహకార శాఖలో అక్రమాల బాగోతాలు అంతే లేనట్లు ఉంది. ఇష్టానుసారం రుణాల జారీతోపాటు రికవరీలకు అడ్డదిడ్డంగా ఓటీఎస్ వర్తింపజేయటంతో తాడేపల్లిగూడెం బ్రాంచుల్లో రూ.16 కోట్ల దాకా ఆర్థిక నష్టం వాటిల్లింది. ఈ అక్రమాలపై తాజాగా ఆప్కాబ్‌కు చెందిన అధికారుల బృందం విచారణ చేసి నివేదికను డీసీసీబీ ఉన్నతాధికారులకు, బ్యాంకు ఛైర్మన్‌కు అందజేసింది. యలమంచిలిలో బ్యాంకు గ్యారంటీ లేకుండానే రెండు రైస్‌మిల్లులకు రూ.కోట్లలో రుణాలిచ్చినట్లు తేల్చారు. ఏలూరు ప్రధాన బ్రాంచిలో అక్రమాలపై విచారణ చేస్తున్నారు.

ఏమైతే మాకేం అన్నట్లు తాడేపల్లిగూడెం బస్టాండ్ వెనక ఓ ఖాళీ స్థలం విలువ రూ.30 లక్షలు కాగా దానిపై రూ.60 లక్షల రుణమిచ్చారు. ఒక్క రూపాయి చెల్లించలేదు. దాన్ని వేలం వేస్తే రూ.40 లక్షలకు మించి వచ్చే పరిస్థితి లేదని అంచనాకు వచ్చారు. తహసీల్దార్ కార్యాలయం ఎదురు సందులో రూ.50 లక్షల స్థలంపై రూ.90 లక్షల రుణమిచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డులో రూ.30 లక్షల స్థలంపై రూ.50 లక్షలు రుణమిచ్చారు. స్థలం ధరకు మించి అదనంగా వ్యక్తిగత రుణాలిచ్చిన ఉదంతాలు ఆ రెండు బ్రాంచీల్లో కోకొల్లలుగా ఉన్నాయి. అదనంగా రుణాలే కాదు ఆప్కాబ్ అనుమతి లేకుండా ఓటీఎస్ సౌకర్యం కల్పించి బ్యాంకులు నష్టపోయేలా వ్యవహరించారు.

మా పేరుపై ఉన్నాయా?.. ఒక్కొక్కరికి రూ.2.50 లక్షల చొప్పున వందల సంఖ్యలో ముద్రా రుణాలిచ్చారు. రుణాలు పొందిన వారిలో చాలా మంది చెల్లించలేదు. వారి గురించి ఆరా తీస్తే వారు ఎక్కడ ఉంటున్నారో తెలియటం లేదు. ఇలా బకాయిలు భారీగా పేరుకుపోయాయి. వారికి నోటీసులు పంపితే కొందరు తమకు రుణం వచ్చిన విషయమే తెలియదని ఇటీవల ఆప్కాబ్ ఛైర్మన్‌ను కలిసి మొరపెట్టుకున్నారు. మరి ఈ రుణాలు మధ్యేమార్గంగా ఎవరు నొక్కేశారన్నది తేలాల్సి ఉంది.

చర్యలు తీసుకుంటాం.. వైకాపా హయాంలో తాడేపల్లిగూడెంలోని ఆ రెండు బ్రాంచిల్లో ఇష్టానుసారం రుణాలిచ్చారు. ఈ అక్రమాలపై చర్చించి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవటానికి మంగళవారం పాలకమండలి సమావేశం కాబోతుంది. **- గన్ని వీరాంజనేయులు, ఆప్కాబ్ ఛైర్మన్**

స్త్రీనిధి రుణ చెల్లింపుల్లో గోల్‌మాల్ చేయలేరిక!

కాప్స్ రికవరీ యాప్‌తో నేరుగా జమ

నూజివీడు, న్యూస్టుడే: స్త్రీనిధి నుంచి తీసుకున్న రుణంలో సభ్యులు చెల్లించిన వాయిదా మొత్తంలో సగం కట్టి మిగతా సగం ఇతర వాటికి వినియోగించుకోవడం.. ఒకరు చెల్లించిన మొత్తాన్ని మరొకరి పేరు మీద జమ చేయడం.. స్త్రీ నిధి మొత్తాన్ని ఉన్నతి రుణానికో.. వీవో చెల్లింపులకో వినియోగించడం, సభ్యురాలు కట్టినా.. వెలుగు మిత్రలు, పొదుపు సంఘాల లీడర్లు బ్యాంకులో జమ చేయకుండా చేతివాటం ప్రదర్శించడం.. వంటివి ఇప్పటివరకు డ్వాక్రా సంఘాల్లో వెలుగు చూస్తున్న అక్రమాలు. తాజాగా వీటికి అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం 'కాప్స్ రికవరీ' యాప్‌ను తెచ్చింది. దీని ద్వారా ఇతరుల ప్రమేయం లేకుండా సభ్యురాళ్లే నేరుగా నెల వాయిదా చెల్లించొచ్చు

జిల్లా సమాచారం..
స్వయం సహాయక సంఘాలు: 41,533
సభ్యులు: 4,06,660
ఈ ఏడాది స్త్రీనిధి రుణ మంజూరు లక్ష్యం: రూ.294 కోట్లు
ఇప్పటి వరకు ఇచ్చింది: రూ.145 కోట్లు
రుణం పొందిన వారు: 17,576

వాయిదాల సమాచారం.. ఫోన్‌లో స్త్రీనిధి 'కాప్స్ రికవరీ' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సభ్యురాలి ఫోన్ నంబరు ద్వారా లాగిన్ అవ్వాలి. ఎస్‌హెచ్‌జీ ఆధారంగా సభ్యురాలు పేరు క్లిక్ చేస్తే చెల్లించాల్సిన వాయిదా మొత్తం కనిపిస్తుంది. దానిని క్యూ ఆర్ కోడ్ ఆధారంగా ఫోన్ పే, గూగుల్ పే ద్వారా చెల్లించాలి. నగదు బదిలీ కాగానే రసీదు వస్తుంది. దానిలో ఇంకా ఎన్ని వాయిదాలు కట్టాలి, తదితర వివరాలు ఉంటాయి.

పూర్తి పారదర్శకత.. ఫోన్‌లో స్త్రీనిధి 'కాప్స్ రికవరీ' యాప్‌తో అక్రమాలకు అవకాశం ఉండదు. రుణ చెల్లింపుల్లో పూర్తి పారదర్శకత ఉంటుంది.
- చెన్నకేశవులు, స్త్రీనిధి ఏజీఎం, ఏలూరు.

ఆశలకు ఆయువునిచ్చారు.. ఆటలకు బాటలేశారు!

మహిళా జట్టు విజయం స్ఫూర్తిదాయకం

- న్యూస్టుడే, ఏలూరు నగరం, భీమవరం పట్టణం

భారత మహిళా క్రికెటర్లు తమ ఆశలకు ఆయువునిచ్చారు. ఇకపై మరింత ముమ్మరంగా ఆటలాడేందుకు బాటలేశారు. తమ భవిష్యత్తుకు కొంగొత్త ధీమానిచ్చారు. వారి విజయం యావత్తు దేశానికి స్ఫూర్తిదాయకం. ఇప్పుడిప్పుడే అండర్-19, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నాం. ఇదే తరహాలో తాము క్రికెట్‌లో మరింత సాధన చేస్తాం.. గొప్ప విజయాలు సాధిస్తాం అని పలువురు ధీమా వ్యక్తం చేస్తున్నారు. క్రికెట్‌లో సత్తా చాటుతున్న ఉమ్మడి జిల్లాలోని క్రీడాకారిణులపై కథనం.

మరింత బలాన్నిచ్చింది.. మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్ కైవసం చేసుకోవడం నాకు మరింత బలాన్నిచ్చింది. అంతర్జాతీయ మైదానాల్లో భారత జెర్సీ ధరించి.. జట్టుకు విజయాలు అందించాలన్నది నా ధ్యేయం. తదనుగుణంగా కష్టపడి సాధన చేస్తున్నా. తల్లిదండ్రులు, శిక్షకుల ప్రోత్సాహం ఎనలేనిది. అండర్-19 క్రికెటర్‌గా రాణిస్తున్నా. తొమ్మిదో ఏట నుంచే క్రికెట్‌లో శిక్షణ పొందుతున్నా. ఫాస్ట్ బౌలర్‌గా జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయిల్లో సత్తా చాటా. **- మావూరి మోక్షిత శివ, ఏలూరు**

నెరవేరిన కల.. క్రికెట్ మహిళా వన్డే ప్రపంచ కప్‌లో భారత జట్టు క్రీడాకారిణులు చిరస్మరణీయం విజయం సొంతం చేసుకున్నారు. సమష్టిగా రాణించి.. దేశ ప్రజల కల నెరవేర్చారు. నేను పాఠశాల స్థాయి నుంచే క్రికెట్ ఆడుతున్నా. అండర్-15 జట్టు తరఫున గతేడాది గుజరాత్‌లో ఆడా. ఓపెనింగ్ బ్యాటర్‌గా రాణిస్తున్నా. జాతీయ జట్టులో స్థానమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నా. ప్రతి మ్యాచ్ నుంచి కొత్త విషయాలు తెలుసుకుంటూ.. లోపాలు సరిచేసుకుంటా. తాజాగా అండర్-19 జట్టు వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యా. **- ఓరుగంటి సాహితీ, దేవరపల్లి**

పట్టుదల.. ప్రేరణతో.. భారత క్రికెట్ మహిళా జట్టు మైదానాల్లో ఆడుతుంటే ప్రత్యక్షంగా చూస్తుంటాం. వారిలా జాతీయ జట్టులో స్థానం దక్కించుకోవాలన్న లక్ష్యంతో అడుగులేస్తున్నాం. మాకు స్మృతి మంధాన ఆట ప్రేరణ. అంతర్ జిల్లాల పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర జట్టులో స్థానం దక్కించుకున్నాం. ఇక్కడ సత్తా చాటి జాతీయ జట్టులో మెరికల్లా తయారవుతాం. **- కె.వై.ఎం.వల్లీ, తణుకు, పి.రిషి కృష్ణన్, తాడేపల్లిగూడెం**

ధాన్యం కొనుగోలుకు చర్యలు: జేసీ

ఏలూరు కలెక్టరేట్, న్యూస్టుడే: జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టాలని జేసీ అభిషేక్ గౌడ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లు, లారీ సంఘ ప్రతినిధులతో సోమవారం సమావేశమై మాట్లాడారు. గతేడాది కన్నా ఈ సంవత్సరం లక్ష టన్నుల ధాన్యం అదనంగా కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. జిల్లాలోని 234 రైతు సేవా కేంద్రాల్లో 85 లక్షల గోనె సంచులు సిద్ధం చేశామన్నారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లోపు రైతుల వ్యక్తిగత ఖాతాల్లో సొమ్ము జమ చేయాలన్నారు. ధాన్యాన్ని మిల్లులకు చేర్చేలా లారీల యజమానులతో మాట్లాడాలని రైస్ మిల్లర్ల సంఘ నాయకులు కోరగా.. జేసీ సానుకూలంగా స్పందించారు.

24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ: మంత్రి

రైతు ఏడుకొండలుతో మనోహర్ తదితరులు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్టుడే: రైతుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం తాడేపల్లిగూడెం పట్టణం, గ్రామీణ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు పలువురు ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. పట్టణంలోని ఎస్వీఆర్ సర్కిల్‌లోని హౌసింగ్‌బోర్డు కాలనీ రోడ్డులో నూతన రైతుబజార్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మండలంలోని ఆరుగొలనులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పశ్చిమ కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ మునుపెన్నడూలేని విధంగా రైతులు ధాన్యం అమ్మిన 24 గంటల్లోగా వారి ఖాతాల్లో నగదు నగదు జమవుతుందన్నారు. యాప్ ద్వారా రైతులు ధాన్యాన్ని అమ్ముకోవచ్చన్నారు. ధాన్యం విక్రయించడానికి వచ్చిన రైతు ఏడుకొండలుతో మంత్రి మాట్లాడారు. మంత్రి అక్కడ ఉండగానే ఆ రైతు బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ కావడం గమనార్హం.

కార్మికునికో కార్డు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ-శ్రమ్ పోర్టల్‌లో ఉచిత నమోదుకు అవకాశం కల్పించాయి. తద్వారా సంక్షేమ కార్యక్రమాలు, బీమా పథకాలను వర్తింపజేయనున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 14 లక్షల మంది కార్మికులు వివిధ రంగాల్లో పని చేస్తున్నారు. ఇప్పటి వరకు వారిలో 8,32,548 మంది మాత్రమే నమోదై గుర్తింపు కార్డులు పొందారు. ఉపాధి హామీ పథకంలో 50 పనిదినాలు పూర్తి చేసిన కార్మికులు కూడా ఇందులో ఉచితంగా రిజిస్టరు చేసుకోవచ్చన్నారు.

ఎవరు అర్హులు 18-59 ఏళ్ల వయసున్న కార్మికులు ఈ-శ్రమ్ కార్డులకు అర్హులు. ఇప్పటి వరకూ కొన్ని పథకాలు కుటుంబంలో ఒక్కరికే వర్తించేవి. ఫలితంగా కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది కార్మికులుంటే నష్టపోయే పరిస్థితి. ఈ-శ్రమ్‌తో ప్రతి అసంఘటిత కార్మికుడికి పథకాలు అందుతాయి.

దరఖాస్తులు ఇలా..
- ఈ-శ్రమ్ గుర్తింపు కార్డు కోసం చరవాణి లేదా కంప్యూటర్‌లో గూగుల్ ద్వారా సొంతంగా దరఖాస్తు చేసుకోవచ్చు.
- కార్మిక శాఖ కార్యాలయాలు, సీఎస్‌ఈ, సచివాలయాలు, మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రయోజనాలు...
- ప్రతి అసంఘటిత రంగ కార్మికుడికి ఏడాదిపాటు సురక్షా బీమా యోజన ద్వారా రూ.2 లక్షలు ప్రమాద, మరణ, అంగవైకల్య బీమా ఉచితంగా వర్తిస్తుంది.
- వలస కార్మికులు ఎక్కడున్నారో గుర్తించి వారికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటారు.
- కార్మికుడు ప్రమాదవశాత్తు చనిపోతే చంద్రన్న బీమా కింద రూ.5 లక్షలు అందజేస్తారు.
- కార్మికుడి కుమార్తె, కార్మికురాలి వివాహ సందర్భంగా రూ.20 వేలను మూడేళ్ల తర్వాత ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో అందజేస్తారు.

ఉమ్మడి జిల్లాలో అసంఘటిత రంగ కార్మికులు: 14 లక్షలు

	పశ్చిమ	ఏలూరు
నమోదు చేయించుకున్న వారు	6,97,157	1,35,391

మాన్‌ధనం
- పీఎం-శ్రమ యోగి మాన్‌ధన్ (పీఎంఎస్‌వైఎం) పథకానికి 18-40 ఏళ్ల వయసున్న కార్మికులు అర్హులు.
- కార్మికులు వయసు ప్రకారం కొంత నగదు చెల్లిస్తే అందుకు సరిపడా డబ్బును ప్రభుత్వాలు చెల్లిస్తాయి. రూ.55 నుంచి రూ.200 వరకు చెల్లించాల్సి ఉంటుంది.
- 61 ఏళ్లు దాటిన తర్వాత వారికి పింఛను వస్తుంది.

'మీ కోసం'లో 454 వినతులు

సిబ్బందితో అర్జీలు రాయించుకుంటున్న ప్రజలు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్టుడే: స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(మీ కోసం)కు వినతులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు తరలివచ్చారు. కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ అభిషేక్ గౌడ, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఉప కలెక్టర్ దేవకీదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు తదితరులు పాల్గొని వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మీ కోసంలో అత్యధికంగా 454 అర్జీలు వచ్చాయన్నారు. వాటన్నింటినీ నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఎస్టీ కమిషన్ సభ్యురాలిగా లక్ష్మి

ఏలూరు అర్బన్, న్యూస్టుడే: ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యురాలిగా పోలవరం నియోజకవర్గానికి చెందిన కాకి లక్ష్మి నియమితులయ్యారు. ఎస్టీ కమిషన్‌కు నూతన కమిటీని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీలో ఛైర్మన్‌తోపాటు అయిదుగురు సభ్యులకు చోటు కల్పించింది.

8 నుంచి విద్యార్థులకు పోటీలు

ఏలూరు అర్బన్, న్యూస్టుడే: హేలాపురి బాలోత్సవంలో భాగంగా ఈ నెల 8, 9 తేదీల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం బాలోత్సవం ఆహ్వాన సంఘ సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్థానిక సెయింట్ జేవీఆర్ ఉన్నత పాఠశాలలో మైక్రో ఆర్ట్స్, మ్యాజిక్ పేపర్ క్రాఫ్ట్స్, ఆధునిక వస్త్రధారణ, పద్యాలు, చిత్రలేఖనం తదితర అంశాల్లో పోటీలుంటాయన్నారు. అనంతరం గోడపత్రాలు విడుదల చేశారు. కమిటీ ప్రతినిధులు గోపాలకృష్ణయ్య, డి.వెంకటేశ్వర్లు, ఎల్వీ సాగర్, కృష్ణారావు, హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేతకు దరఖాస్తులు

ఏలూరు అర్బన్, న్యూస్టుడే: యువత, కిశోర బాలికల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎన్జీవోలకు ఆర్థిక చేయూతనివ్వడానికి కేంద్ర ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోందని జిల్లా యువజన సేవల శాఖ సీఈవో ప్రభాకరరావు తెలిపారు. ఔత్సాహికులు https://youth.yas.gov.in/scheme/npyed/ngo/ లాగిన్ ద్వారా నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బడికెళ్తాం.. అక్కడే తింటాం!

- పిల్లలకు రుచించేలా మధ్యాహ్న భోజనం
- హాజరు 97 శాతానికి పైనే..

గత వైకాపా ప్రభుత్వ విధానాలతో విద్యారంగ ప్రగతి కుంటు పడింది. విద్యార్థుల హాజరుతో పాటు మధ్యాహ్న భోజనం తినేవారి సంఖ్య తగ్గుముఖం పట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ అంశంపై ఆరాతీయగా 2024 అక్టోబరు ఆరంభంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 19 శాతం మంది విద్యార్థులు బడికి గైర్హాజరైనట్లు తేలింది. పాఠశాలల్లో 50 శాతం మంది విద్యార్థులు కూడా మధ్యాహ్న భోజనం తినడం లేదని అప్పటి ఆర్జేడీ ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ప్రస్తావించారు.

పాలకొల్లు, భీమవరం పట్టణం, పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థుల హాజరుతో పాటు

యలమంచిలి పాఠశాలలో వడ్డించిన భోజనంతో విద్యార్థులు

మధ్యాహ్న భోజనం తినే వారి సంఖ్య పెరిగింది. నిత్యం సగటున 97 శాతం మంది విద్యార్థులు బడికి హాజరవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

మార్పులు ఇలా.. జూన్ ఆరంభం నుంచి మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం వినియోగించడం, స్థానిక అభిరుచులకు మెనూలో ప్రాధాన్యతనివ్వడంతో పిల్లలు కడుపునిండా తింటున్నారని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. పిల్లలకు అవసరమయ్యే పోషకాల నిమిత్తం పోర్టిఫైడ్ రైస్‌ను కలిపి సరఫరా చేయడంతో భోజనం నాణ్యత పెరిగింది. క్రమం తప్పకుండా కోడిగుడ్లను వడ్డిస్తున్నారు.

జిల్లా	ఏలూరు	పశ్చిమ
మొత్తం పాఠశాలలు	1,710	1,384
విద్యార్థుల హాజరు	84,989	73,281
భోజనం చేసినవారు	83,210	70,949
శాతం	97.9	96.8

కొన్ని పాఠశాలల్లో శతశాతం..

యలమంచిలి మండలం వైవీ లంక, మేడపాడు, చించినాడ, యలమంచిలి, కాజ తూర్పు ఉన్నత పాఠశాలల్లో సోమవారం పరిశీలించగా హాజరైన విద్యార్థులంతా మధ్యాహ్న భోజనం చేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 71 ఉండగా 50 చోట్ల వందశాతం విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిన్నారు.

- భీమవరం పీఎస్ఎం బాలికోన్నత పాఠశాలలో గతేడాది 70 శాతం విద్యార్థినులు మాత్రమే మధ్యాహ్న భోజనం తినేవారు. సోమవారం పరిశీలించగా 940 మందికి 906 మంది, పెనుగొండ మండలం దేవ ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులకు గాను 195 మంది బడి భోజనం తిన్నారు.

పోటీ పరీక్షార్థులకు శిక్షణ

ఏలూరు అర్బన్, న్యూస్టుడే: ఏపీ టెట్, డీఎస్సీ, ఎస్సై, కానిస్టేబుల్ కొలువులకు నిర్వహించే పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే మైనార్టీ అభ్యర్థులకు సీఈడీఎం ద్వారా ఉచితంగా శిక్షణనివ్వనున్నట్లు మైనార్టీల ఆర్థిక సంస్థ ఇన్‌ఛార్జి కార్యనిర్వాహక సంచాలకుడు ప్రభాకరరావు తెలిపారు. ఔత్సాహికులు www.apcedmmwd.org వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు 0866-2970567 నంబరును సంప్రదించాలని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రైతేరాజు
పండిస్తూ.. పంచి పెడుతూ!
బొప్పాయి పాలు.. విదేశాలకు
వరి, మొక్కజొన్నలో జాగ్రత్తలు అవసరం
6లో

డిజిటల్ అరెస్టులో ఉండగానే నిందితుడి పట్టివేత

ఈనాడు-ఏలూరు

జిల్లాకు చెందిన మహిళా న్యాయవాది డిజిటల్ అరెస్టు ఉదంతం సంచలనమైంది. ఈ కేసులో ఆమె డిజిటల్ అరెస్టులో ఉండగానే పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఓ నిందితుడిని పట్టుకున్నారు. ఇతను ఇచ్చిన సమాచారంతో సైబర్ నేరగాళ్ల ముఠా గుట్టంతా రట్టయింది. ఒకవైపు నేరగాళ్లతో మాట్లాడిస్తూనే మరోవైపు నుంచి నిందితులను పట్టుకునేందుకు పోలీసులు పక్కా ప్రణాళికతో వ్యవహరించారు. ఆమె నుంచి నేరగాళ్లు కొల్లగొట్టిన మొత్తాన్ని క్రిప్టో కరెన్సీ రూపంలో వేరే ఖాతాలకు చేరకుండానే బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసి చివరకు సైబర్ నేరగాళ్లకే ఝలక్ ఇచ్చారు. ఈ కేసులో నిందితుల ముఠా వివరాలను శనివారం అమరావతిలో పోలీసులు వెల్లడించారు.

డిజిటల్ అరెస్టులో ఉన్న ఆ మహిళా న్యాయవాది కొద్దిరోజుల క్రితం రాత్రి 11 గంటల సమయంలో ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్‌కు మొరపెట్టుకున్నారు. తనను డిజిటల్ అరెస్టు పేరుతో నేరగాళ్లు బెదిరిస్తున్నారని, డబ్బులు బ్యాంకు ఖాతాలో వేయించుకున్నారని, ఇంకా డబ్బులు వేయాలని బెదిరిస్తున్నారని సమాచారం పంపారు. స్పందించిన ఎస్పీ ఆ రాత్రి సమయంలోనే టూటౌన్ స్టేషన్‌కు చేరుకుని సివిల్ దుస్తుల్లో కొందరు పోలీసులను పంపారు. అప్పటికీ ఆమెతో సైబర్ నేరగాళ్ల ముఠా బెదిరింపులకు పాల్పడుతూనే ఉంది. అది చూసిన పోలీసులు వీడియోకాల్‌లో వారికి కనిపించకుండా ఆమెతో మాట్లాడిస్తూ మరోవైపు ఆమె నుంచి ఏయే బ్యాంకుఖాతాలకు డబ్బులు జమయ్యాయో తెలుసుకుని అక్కడి నుంచి ఓ బృందం బయటకు వచ్చి ఆరా తీసింది. బెంగళూరులోని ఎస్ బ్యాంకులో ఖాతా కలిగిన హసన్ అనే వ్యక్తికి ఈ డబ్బులు జమయ్యాయని తెలుసుకొంది.

బెంగళూరుకు మన పోలీసులు.. హసన్‌ను అదుపులోకి తీసుకోవటానికి ఎస్పీ బెంగళూరులో ఉన్న తన బ్యాచ్‌మేట్ ఐపీఎస్ అధికారి సహకారం తీసుకున్నారు. అక్కడికి వెళ్లిన ఏలూరు పోలీసు బృందానికి బ్యాంకు రికార్డుల్లో ఉన్న చిరునామాను అక్కడి ఐపీఎస్ అధికారి తెలుసుకుని చెప్పారు. దాని ప్రకారం వెళ్లి చూడగా ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయినట్లు నిర్ధారించుకున్నారు. బ్యాంకుఖాతాలో ఉన్న ఫొటోతో ఆరా తీయగా అక్కడికి రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ఉంటున్నట్లు సమాచారమిచ్చారు. ఓ రోజు నమాజు ప్రదేశానికి రాగానే కాపుకాసి హసన్‌ను పట్టుకుని ఏలూరుకు తీసుకొచ్చారు. ఇలా ఆమెను బెదిరించిన నేరగాళ్లను ఏలూరు పోలీసులు పట్టుకోగలిగారు. వారందరికీ 14 రోజుల రిమాండ్ విధించటంతో ప్రస్తుతం వారందరూ ఏలూరు జిల్లా జైలులో ఉన్నారు.

(c) eenadu

నిబంధనలు గోదారికి.. వసూళ్లు గుత్తేదారుకి!

పట్టిసీమ రేవులో కొరవడిన పర్యవేక్షణ

పోలవరం, న్యూస్‌టుడే: పట్టిసీమ వద్ద గోదావరి మధ్యలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయానికి దూరప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు లాంచిపై నది దాటడం భారంగా మారింది. ఏటా భక్తులను నది దాటించేందుకు పట్టిసీమ పంచాయతీ ఆధ్వర్యంలో రేవు పాట నిర్వహిస్తారు. ఆ సమయంలోనే టిక్కెట్ ధర నిర్ణయించి పాట నిర్వహించడంతోపాటు షరతులతో కూడిన పత్రాలు అందజేస్తున్నారు. పాటదారుడు ఆ షరతులకు లోబడి రేవులో సేవలు అందించాల్సి ఉంటుంది. అయితే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పాటదారుడు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. లాంచీపై రాకపోకలకు ఒకరికి టిక్కెట్ ధర రూ.30 కాగా ఇక్కడ రూ.50 వసూలు చేస్తున్నారు. టిక్కెట్ అడుగుతున్న భక్తులకు అక్కర లేదని అక్కడి సిబ్బంది చెప్పడంతో నగదు చెల్లించి లాంచీ ఎక్కుతున్నారు.

రేవులో లాంచి కోసం నిరీక్షిస్తున్న భక్తులు

టికెట్ ధరకు సంబంధించి హడావుడిగా ఫ్లెక్సీలు కడుతున్న పంచాయతీ సిబ్బంది

అధిక మొత్తంలో వసూళ్లు

టిక్కెట్ ధరకు సంబంధించి 2022లో ఏర్పాటు చేసిన బోర్డు తప్ప.. ఎక్కడా కొత్త బోర్డులు ఏర్పాటు చేయలేదు. కార్తిక సోమవారం సందర్భంగా అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు కొందరికి టిక్కెట్ ధర విషయంలో అనుమానం వచ్చి తెలిసిన అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో పంచాయతీ సిబ్బంది అప్పటికప్పుడు రూ.30 ధర ముద్రించిన ఫ్లెక్సీలను మధ్యాహ్నం 12 గంటలకు తీసుకొచ్చి రేవులో కట్టించారు. అప్పటికే సుమారు వెయ్యి మంది వరకు రూ.50 వంతున చెల్లించి నది దాటారు. పట్టిసీమ రేవుపై అధికారుల పర్యవేక్షణ లేదని ఇబ్బందులు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని భక్తులు ఆవేదన చెందుతున్నారు. వరద తగ్గడంతో ఆలయం వైపు ఇసుక తిన్నెలు బయట పడటంతో లాంచీ నేరుగా వెళ్లే అవకాశం లేక దూరంగా దింపుతున్నారు. దీంతో కిలోమీటర్ దూరం నడిచి ఆలయానికి చేరుకోవాల్సి వస్తోందని భక్తులు వాపోతున్నారు. లాంచీ కోసం రేవులో మెట్లపై పడిగాపులు కాస్తున్నారు. ఈ పరిస్థితిపై పంచాయతీ కార్యదర్శి యు.రాజారావును సంప్రదించగా రేవు పాట దారుడి వద్ద టిక్కెట్లు ఉన్నాయని, భక్తులకు ఇవ్వడం లేదన్నారు. రూ.50 వసూలు చేస్తున్న విషయాన్ని పైఅధికారులకు తెలియజేయడంతోపాటు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామని చెప్పారు.

పండిస్తూ.. పంచి పెడుతూ!

ఆదర్శంగా నిలుస్తున్న యువ రైతు

వేలేరుపాడు, న్యూస్‌టుడే: ఏడాది పొడవునా సేంద్రియ పద్ధతిలో వివిధ రకాల కూరగాయలు పండిస్తున్నారు వేలేరుపాడు మండలం భూదేవిపేటకు చెందిన యువరైతు బడిగంటి వెంకటేశ్వరరావు. ఇంటి ఆవరణలోని 15 సెంట్ల భూమిలో 12 రకాల కూరగాయలు, ఆకు కూరలు పండించడమేకాక ఉచితంగా పంచి పెడుతున్నారు.

తోట పనిలో వెంకటేశ్వరరావు

వ్యవసాయ కుటుంబానికి చెందిన వెంకటేశ్వరరావు కొన్నేళ్లుగా గ్రామంలో పురుగు మందుల దుకాణం నిర్వహిస్తున్నారు. కొన్నేళ్లపాటు పత్తి, మినుము, కంది, వరి, మిరప పంటలు సాగు చేశారు. ఏటా వరదలతో పంటలు దెబ్బతిని తీవ్ర నష్టం వాటిల్లడంతో పదేళ్ల కిందట ఎరువులు, పురుగు మందుల దుకాణాన్ని ఏర్పాటు చేశారు. అయినా సాగుపై మక్కువతో ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలంలో బోరు ఏర్పాటు చేయించి కాలంతో పని లేకుండా అన్నిరకాల కూరగాయల పాదులు వేయడం ప్రారంభించారు. నిత్యం మొక్కలకు నీరు పెట్టడం, కలుపు మొక్కలు తొలగించడం వంటి పనులు చేస్తుంటారు. రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా పశువుల పెంటతో ఆరోగ్యకరమైన కూరగాయలను పండిస్తున్నారు. ఇంటి అవసరాలకు పోను మిగిలిన వాటిని విక్రయించకుండా బంధువులు, స్నేహితులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

రైతేరాజు

బొప్పాయి పాలు.. విదేశాలకు

నంద్యాల జిల్లా చాగలమర్రి మండల వ్యాప్తంగా రైతులు అధికంగా బొప్పాయి సాగు చేస్తుంటారు. చిన్నవంగలితో పాటు సమీపంలోని గ్రామాలైన వైఎస్సార్ కడప జిల్లా కానగూడూరు, క్రిష్ణంపల్లె గ్రామాల్లో 1200 ఎకరాల్లో పండిస్తారు. విత్తనం నాటిన కాలం నుంచి తొమ్మిది నెలలకు పంట చేతికొస్తుంది. పండ్ల సేకరణ అనంతరం 13 నెలల తర్వాత మిగిలినవి, ముదురు కాయలకు గాట్లు పెట్టి పాలను సేకరిస్తున్నారు. తెల్లవారుజాము సమయంలోనే కాయలకు గాట్లు పెడితే కేవలం రెండు గంటల్లోనే పాలు ఊరుతుంది. ఇలా సేకరించిన దాన్ని రాయచోటి, రాజంపేటకు చెందిన వ్యాపారులు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల పాలు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 4 డ్రమ్ముల పాలు సేకరిస్తున్నారు. ఎకరానికి పాలసేకరణ ద్వారా రైతుకు రూ.24వేల ఆదాయం వస్తుంది. సేకరించిన పాలను పరిశ్రమల్లో మందులు, కాస్మోటిక్స్, సబ్బుల తయారీలో ఉపయోగిస్తున్నారు. బెంగళూరు, చెన్నైలతో పాటు నాణ్యతను బట్టి విదేశాలకు సైతం పాలను ఎగుమతి చేస్తున్నారు. బొప్పాయి సాగులో ఎప్పుడైనా ధర పడిపోయినప్పుడు అన్నదాతలు బొప్పాయి పాలసేకరణతో నష్టాల నుంచి బయటపడుతున్నారు. **- న్యూస్‌టుడే, చిన్నవంగలి(చాగలమర్రి)**

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం: డీఏవో

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: రసాయనిక ఎరువులు, మందుల్లేకుండా సాగు చేసే ప్రకృతి వ్యవసాయమే లాభదాయకమని డీఏవో హబీబ్ బాషా అన్నారు. స్థానిక జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో అయిదు రోజులపాటు జరగనున్న టీ-ఐసీఆర్‌పీఎస్(ట్రైనీ ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్)కు సమగ్ర శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రసాయన ఎరువులు, మందులు వాడి పండించిన ఆహార ఉత్పత్తులు తీసుకోవడం ద్వారా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయం డీపీఎం వెంకటేశ్ మాట్లాడుతూ.. జిల్లాలో 142 మందిని ఎంపిక చేశామన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, సూత్రాలు, నమూనాలు తదితరాలపై అవగాహన కల్పించారు.

మాట్లాడుతున్న హబీబ్ బాషా

క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

రమణీయం.. శోభనాచలుని కల్యాణం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహోత్సవాలు, కృత్తిక దీపోత్సవం వైభవంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజు సోమవారం కార్తిక శుద్ధ త్రయోదశి సందర్భంగా స్వామికి విశేష అలంకరణ, శాంతి కల్యాణం, శ్రీలక్ష్మీ నృసింహ సుదర్శన మూల మంత్ర శాంతి హోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు ఆలయ ఈవో సీహెచ్ సాయి పర్యవేక్షణలో అర్చకులు నిర్వహించారు.

సత్వరం ప్రజా సమస్యల పరిష్కారం: ఎస్పీ

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తెలిపారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మీ కోసం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పలువురు తరలివచ్చి తమ సమస్యలపై ఏకరవు పెట్టారు. ఇటీవల సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరించి డబ్బులు దోచుకున్నారని ఏలూరు మాదేపల్లి రోడ్డులో నివాసముంటున్న విశ్రాంత ఉపాధ్యాయుడు రాఘవేంద్రరావు ఫిర్యాదు చేశారు. ఎస్పీ తక్షణం స్పందించి గ్రామీణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేయించి, ఆ నగదును హోల్డ్‌లో పెట్టించారు. ప్రతాప్ శివకిశోర్ మాట్లాడుతూ.. చట్టంలో ఎక్కడా డిజిటల్ అరెస్టుల్లేవన్నారు.

వరి, మొక్కజొన్నలో జాగ్రత్తలు అవసరం

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: అధిక వర్షాల నేపథ్యంలో వరి, మొక్కజొన్న పంటల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి సి.పవన్‌కుమార్ తెలిపారు. వరి పొలాల్లో ముంపు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపాలి. ఎకరాకు 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ ఎరువులను పైపాటుగా వేయాలి.

★ వరిలో దుబ్బు చేసే దశ నుంచి ఆకులపై మచ్చలు ఏర్పడి క్రమేపీ ఎండిపోయే పాము పొడ తెగులును అధిగమించేందుకు ప్రోపికోనజోల్ 1 మి.లీ లేక వాలిడామైసిన్ 2 మి.లీ లేక హెక్సాకోనజోల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి దుబ్బుకు తగిలేలా 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. ★ అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా లేదా కాసుగామైసిన్ 2మి.లీ లేదా వ్యాజి వన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ★ దోమ ఉద్ధృతి ఎక్కువైనప్పుడు నివారణకు ఇథోపెన్ప్రాక్స్ 2మి.లీ లేదా 1.5గ్రా ఎసిపేట్ లేదా 0.25 మి.లీ అమిడాక్లోప్రిడ్ లేదా 0.20 గ్రా థయోమిదో కామ్ లేదా 2.మి.లీ. బి.పి.ఎం.సి లేదా మోనోక్రోటోఫాస్ 2.2 మి.లీ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయడంతోపాటు పొలాన్ని అడపాదడపా ఆరబెట్టాలి. ★ మొక్కజొన్న పైరుకు ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువును పైపాటుగా వేయాలి. కాండం తొలుచే పురుగు, ఆకు ఎండు తెగులు ఎక్కువ రావడానికి అవకాశం ఉంది. దాని నివారణకు ఎకరాకు 200 లీటర్ల నీటిలో 400 మి.లీ ప్రొఫెనోఫాస్ మరియు ప్రోపికోనజోల్ 200 మి.లీ కలిపి చేను బాగా తడిసేట్లు చల్లాలి. వర్షాలు తగ్గిన 3-4 రోజుల తర్వాత వరసల మధ్య భాగాన్ని గుంటక లేదా గొప్పు ద్వారా సేద్యం చేయాలి.

జంగారెడ్డిగూడెం: రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి

ఉద్యాన విశ్వవిద్యాలయం న్యూస్‌టుడే

ప్రశ్న: అధిక వర్షాలకు అరటి సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు తెలపండి.

- జనర్దానరావు, వేల్పూరు

సమాధానం: అరటిలో సిగటోకా ఆకుమచ్చ తెగులు వృద్ధి చెందకుండా ప్రోపికోనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. దుంప కుళ్లు తెగులు రాకుండా 25 గ్రాములు బ్లీచింగ్ లీటరు నీటికి కలిపి మొదళ్లలో పోయాలి. సూడోమోనాస్ 50 గ్రాములు, వేప పిండి 250 గ్రాములు కలిపి మొక్క మొదళ్లలో వేయాలి.

డా. పి.విజయలక్ష్మి, ప్రధాన శాస్త్రవేత్త కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట్రామన్నగూడెం

మీరూ అడగొచ్చు ✆ చరవాణి 73826 33692

పంచారామం చెంతనే.. త్రిలింగ క్షేత్రాలు

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: త్రిలింగ క్షేత్రాలుగా అలరారుతున్న శివదేవుని చిక్కాల, దిగమర్రు శివాలయాలు పంచారామ క్షేత్రం పాలకొల్లుకు సమీపాన ఉన్నాయి. మరో క్షేత్రమైన శివకోడు కోనసీమ జిల్లా రాజోలు మండలంలో ఉంది. కార్తికమాసంలో క్షీరారామాన్ని దర్శించే భక్తులు ఈ ఆలయాలను కూడా దర్శించుకుంటారు. ఈ క్షేత్రాలలో కార్తికమాసోత్సవాలతో పాటు మహాశివ రాత్రి వేడుకలను వైభవంగా నిర్వహిస్తారు.

పురాణాల ప్రకారం.. త్రేతాయుగంలో రావణబ్రహ్మ సంహారం అనంతరం దోష నివారణార్థం శ్రీరాముడు కోటి లింగాల ప్రతిష్ఠకు ఉపక్రమించారు. దీని నిమిత్తం రాముడి ఆజ్ఞ ప్రకారం.. భక్తాంజనేయుడు కాశీ వెళ్లి శివలింగాలను చిక్కంలో పెట్టుకుని వస్తుండగా ఈ ప్రాంతం వచ్చే సరికి సూర్యోదయమైంది. సూర్య ఉపాసన కోసం ఆంజనేయుడు చిక్కంలో ఉన్న శివలింగాలను నేలపై ఉంచి అనంతరం సమీప కోనేరుకు వెళ్లారు. తిరిగి వచ్చాక ముహూర్త బలం ప్రభావంతో హనుమ ఇక్కడ శివలింగాన్ని ప్రతిష్ఠించారని.. చిక్కంలో వెలసిన శివయ్యగా ఈ గ్రామానికి శివదేవుని చిక్కాల పేరు స్థిరపడిందని పండితులు చెబుతున్నారు. ఆంజనేయుడుకు దిగమర్రు ప్రాంతంలో మరో శివలింగాన్ని ప్రతిష్ఠించగా స్వామి ఉమా సోమేశ్వరుడిగా పూజలందుకుంటున్నారు. వాయుపుత్రుడు ప్రతిష్ఠించడంతో ఈ క్షేత్రాలను వాయు త్రిలింగ క్షేత్రాలుగా పిలుస్తారు. శివదేవుని చిక్కాల ఆలయ ప్రాంగణంలో కొబ్బరి మొక్క నాటితే సంతానం యోగం కలుగుతుందని భక్తుల నమ్మకం.

ఇలా చేరుకోవచ్చు.. పాలకొల్లు పరిధిలో నరసాపురం రోడ్డు మీదుగా నాలుగు కిలోమీటర్లు ప్రయాణిస్తే దిగమర్రు చేరుకోవచ్చు. భీమవరం రోడ్డులో ఎనిమిది కిలోమీటర్ల దూరంలో శివదేవునిచిక్కాల ఆలయం ఉంది. ఈ రెండు క్షేత్రాలకు పాలకొల్లు నుంచి బస్సులు, ఆటోల్లో చేరుకోవచ్చు.

శివదేవస్వామి ఆలయం ★ స్వామివారు

దిగమర్రులో కొలువైన ఉమా సోమేశ్వరస్వామి

కార్తికం.. దర్శనీయం

రొయ్యను బతికిద్దాం..!

యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: వాతావరణ మార్పులతో ఆక్వా చెరువుల్లోని రొయ్యలకు తెగుళ్లు సోకి మృత్యువాత పడుతున్నాయి. ఈక్రమంలో చెరువుల నిర్వహణలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే నష్టాలు నివారించవచ్చని భీమవరానికి చెందిన ఆక్వా నిపుణుడు అడబాల గోపాలరావు సూచించారు. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతుండటం, అధిక వర్షాలకు నీటిలో మార్పులు సంభవించి ఆక్సిజన్ శాతం తగ్గడం, అమ్మోనియా, నైట్రైట్, హైడ్రోజన్ సల్ఫైడ్‌లు వంటివి తగ్గడంతో విషవాయువులు ఉత్పత్తి అవుతున్నాయి. దీంతోపాటు వైరస్ తెగుళ్లు సోకుతున్నాయి. వీటి ప్రభావంతో చెరువుల్లో రొయ్యలు ఒక్కసారిగా మృత్యువాత పడుతున్నాయి.

నివారణ ఇలా.. చెరువు నీటిని ఉదయమే సేకరించి ఆక్వా ల్యాబ్‌లలో పరీక్షలు చేయించుకోవాలి. అమ్మోనియా, నైట్రైట్, హైడ్రోజన్ సల్ఫైడ్ వంటి విషవాయువులు ఉన్నట్లు గుర్తిస్తే వాటి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి. ఆక్సిజన్ శాతం పెంచేందుకు నిరంతరం ఏరియేటర్లు తిప్పాలి. జియోలైట్, గ్యాస్‌క్యూర్ వంటి పొడులను నీటిలో, ఇసుకలో కలిపి చల్లాలి. ఆక్సిజన్ శాతం పెంచేందుకు చెరువులో ట్యాబ్లెట్లు, పలుకులను రాత్రి 12, తెల్లవారుజామున 4 గంటలకు చల్లాలి. రిజర్వు ట్యాంకుల సౌకర్యం ఉన్న రైతులు వాటిలోని నీటిని చెరువుల్లోకి మార్పిడి చేయాలి. వైరస్ తెగుళ్లు సోకి రొయ్యలు మృత్యువాత పడుతుంటే జాప్యం చేయకుండా పట్టుబడి చేయాలి. ఆ చెరువులోని నీటిని శుభ్రం చేసి బయటకు వదలాలి. అనంతరం చెరువును శుభ్రం చేసి నేల కనపడేలా ఆరబెట్టి తిరిగి సాగుకు సిద్ధం చేయాలని గోపాలరావు రైతులకు సూచించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరి మృతి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం ఢీకొని మర్రిబంధంకు చెందిన లింగడాల వెంకటేశ్వరరావు(54) మృతి చెందిన సంఘటన ఆ గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. రూరల్ ఎస్సై జ్యోతి బాసు కథనం ప్రకారం.. రాత్రి గ్రామంలో కిరాణా దుకాణం వద్ద బిస్కెట్లు కొనుక్కుని నడచుకుంటూ హనుమాన్ జంక్షన్ వైపు ఇంటికి తిరిగి వెళుతున్న వ్యక్తిని నూజివీడు వైపు నుంచి హనుమాన్ జంక్షన్ వైపుగా వెళుతున్న ద్విచక్రవాహనం ఢీకొందన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని పిన్నమనేని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. వెంకటేశ్వరరావుకు భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కిలేడీ.. ఘరానా చోరీ

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: పట్టపగలే ఓ కిలాడీ లేడీ ఇంట్లో ప్రవేశించి బంగారం అపహరించిన ఘటన ఆగిరిపల్లి మండలం కొత్తఈదర గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. గ్రామంలోని హనుమాన్ నగర్‌లో బెక్కం పెద్ద సీత నివాసం ఉంటున్నారు. బుధవారం ఉదయం 9 గంటల సమయంలో అదే వీధిలో పాలు తీసుకువచ్చేందుకు మరొకరి ఇంటికి వెళ్లి వచ్చే సరికి ఇంట్లో నుంచి ఓ మహిళ బయటకు రావడం చూశారు. ఆమెను పట్టుకునే ప్రయత్నం చేయగా ద్విచక్రవాహనంపై పరారయ్యింది. అనంతరం ఇంట్లోకి వెళ్లి చూడగా సుమారు నాలుగు కాసులు బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శుభశేఖర్ తెలిపారు. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల ఆధారంగా చోరీ చేసింది ఏలూరు ప్రాంతానికి చెందిన ఓ హిజ్రాగా పోలీసులు గుర్తించారు.

వ్యర్థం.. పర్యావరణహితం

విజయవాడ డివిజన్‌లో పరిధిలోని ఏలూరుతో సహా 19 రైల్వేస్టేషన్లలో ఐఎస్‌వో ప్రమాణాల మేరకు పర్యావరణ గృహ నిర్వహణను అమలుచేస్తున్నారు. జాతీయ హరిత న్యాయస్థానం(నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) ఆదేశాల మేరకు ఆయా స్టేషన్లలో ప్లాస్టిక్ బాటిల్ క్రషింగ్ యంత్రంతో చిన్నచిన్న ముక్కలుగా చేసి రీసైకిలింగ్‌కు పంపిస్తున్నారు. వేస్ట్ టు కంపోస్ట్ మిషన్‌తో ఆహార వ్యర్థాలను ఎరువుగా మార్చి మొక్కలకు వేస్తున్నారు. స్టేషన్ ఆవరణను యంత్రాలతో శుభ్రపరిచే ఉత్పత్తులూ పర్యావరణ హితమైనవి వినియోగిస్తున్నారు. ప్రతిమూడునెలలకోసారి గాలి, నీరు, శబ్ద కాలుష్యాన్ని పరీక్షిస్తారని ఏలూరు రైల్వేస్టేషన్ చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ మామిళ్లపల్లి నానాజీ తెలిపారు. స్టేషన్ ఆవరణలో 50కేఎల్‌డీ సామర్థ్యమున్న మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణంలో ఉందన్నారు. **- ఈనాడు, ఏలూరు**

వేస్ట్ టు కంపోస్ట్ యంత్రంతో ఆహార వ్యర్థాలను ఎరువుగా మార్చుతూ..

ప్లాస్టిక్ సీసాలను యంత్రంతో చిన్నచిన్న ముక్కలు చేస్తూ..

ట్రిపుల్ ఐటీల అభివృద్ధికి రూ.200 కోట్ల బడ్జెట్

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీల అభివృద్ధికి ఈ ఏడాది రూ.200 కోట్ల బడ్జెట్‌ను ఖర్చు చేస్తున్నట్లు ఉప కులపతి ఎం.విజయకుమార్ తెలిపారు. సోమవారం నూజివీడు ట్రిపుల్ ఐటీకి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం మంగళవారం అమరావతిలో జరగనుందని వివరించారు. పీయూసీలో ఇంటర్ పుస్తకాలతో పాటు సీబీఎస్ఈ స్టాండర్డ్స్‌ను అమలు చేస్తున్నామన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు బయాలజీ సబ్జెక్టును ఈ ఏడాది నుంచి కలుపుతున్నామన్నారు. ప్రస్తుతం నూజివీడులో నడుస్తున్న శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌ల విద్యార్థులు పీ 1, 2 తరగతుల అనంతరం తిరిగి వారి క్యాంపస్‌లకు వెళ్లిపోతారన్నారు. ఏకరూప దుస్తులు సిద్ధం అవుతున్నాయని, త్వరలోనే విద్యార్థులకు అందిస్తామన్నారు. ల్యాప్‌టాప్‌లు ఇచ్చేందుకు బడ్జెట్ లేదని.. దీనిపై గవర్నింగ్ కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆహారం నాణ్యత లేకపోవడం, మెనూ పాటించకపోవడంపై వస్తున్న వార్తలపై ఆన్‌లైన్‌లో విద్యార్థుల అభిప్రాయాలు సేకరిస్తామన్నారు. నాణ్యత విషయంలో రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్ సంద్ర అమరేంద్రకుమార్‌కు సూచించారు. నూజివీడు క్యాంపస్‌లో హెల్పింగ్ హ్యాండ్స్ పేరుతో అందుతున్న చికెన్ తదితరాలు విద్యార్థులకు సరిపోకపోవడంపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్లేస్‌మెంట్స్ విషయంలో 40 శాతం భర్తీ చేస్తున్నామని, దీనిని 50 శాతానికి తీసుకుని రావాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందుకోసం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు.

మాట్లాడుతున్న విజయకుమార్

అడవి పంది బీభత్సం

వారం వ్యవధిలో మహిళ మృతి, మరొకరికి గాయాలు

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: అడవి పంది దాడిలో గిరిజన మహిళ మృతిచెందిన ఘటన వేలేరుపాడు మండలం మారుమూల గిరిజన గ్రామమైన చింతలపాడులో గత నెల 31న చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాడుకు చెందిన సోడే బుల్లమ్మ(38), ఆమెతో మరొకరు గ్రామ సమీపంలోని పంట పొలాల వద్ద పశువులను మేపటానికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో అడవి పంది ఆమెపై దాడి చేసింది. బుల్లమ్మ నడుముపై బలమైన గాయమవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. అప్రమత్తమైన మరో వ్యక్తి చెట్టు ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నాడు.

గాయపడిన సత్యం

బుల్లమ్మ (పాత చిత్రం)

శునకాలే ప్రాణాలు నిలబెట్టాయి.. గత నెల 27వ తేదీన గుట్ట చిగురుమామిడికి చెందిన కుంజా సత్యం పశువులు మేపటానికి అదే ప్రాంతానికి వెళ్లాడు. అడవి పంది తొడపై, కాలుపై తీవ్రంగా దాడి చేసింది. పక్కనే ఉన్న అతని పెంపుడు కుక్కలు పందిపై ప్రతిదాడి చేశాయి. దీంతో అది పరుగులు పెట్టింది. లేదంటే ప్రాణాలు దక్కేవి కావని సత్యం తెలిపారు. అప్పటి నుంచి పొలం పనులకు వెళ్లేందుకు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్నా.. అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలకు సమయం ఆసన్నమైందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ పేర్కొన్నారు. ఇఫ్టూ రాష్ట్ర రాజకీయ తరగతుల్లో భాగంగా నగరంలో సోమవారం సాయంత్రం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి మర్చంట్ ఛాంబర్ వరకు ప్రదర్శన సాగింది. వందలాది మంది కార్మికులు ఎర్ర వస్త్రాలు ధరించి, జెండాలు చేత పట్టి నినాదాలు చేస్తూ ముందుకుసాగారు. అనంతరం మర్చంట్ ఛాంబర్ కల్యాణ మండపంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసాద్ మాట్లాడారు. నాడు ప్రభుత్వ- ప్రైవేటు రంగాలు సమాంతరంగా నడిస్తే.. నేటి పాలకులు పూర్తిగా ప్రైవేటు కార్పొరేట్ రంగానికి పెద్దపీట వేస్తున్నారని విమర్శించారు. వివిధ సంఘాల నాయకులు అప్పలనాయుడు, కె.పోలారి, టి.సుధాకర్, సోమయ్య, వెంకట్రావు, ఆర్.హరికృష్ణ, ఆదినారాయణ, జ్యోతి పాల్గొన్నారు.

ప్రదర్శనలో సంఘ నాయకులు

స్ఫూర్తినిచ్చిన మహిళా క్రికెట్ జట్టు: ఎంపీ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: మహిళల క్రికెట్ వన్డే ప్రపంచ కప్‌ను భారత జట్టు కైవసం చేసుకొని ఎందరో క్రీడాకారిణులకు స్ఫూర్తినిచ్చిందని ఎంపీ మహేశ్ కుమార్ అన్నారు. ప్రభుత్వం తరఫున నార్వేలో పర్యటిస్తున్న ఆయన.. భారత మహిళా జట్టుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఓటముల నుంచి పాఠాలు నేర్చుకొని.. ఎంతో పట్టుదలతో ఆడి కప్‌ను ముద్దాడటం గొప్ప విషయమని ఆయన కొనియాడారు.

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ రిటైల్ లెండింగ్ అండ్ పేమెంట్ గ్రూప్ (సౌత్ జోనల్ కార్యాలయం/ శాఖ): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, అగ్రి ఏరియా ఆఫీస్, డి.నెం.5/25/92 (3/7), బ్రాడీపేట, సాయి బాబా టెంపుల్ సమీపాన, గుంటూరు – 522002.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, 3వ అంతస్తు, గిగాప్లెక్స్, ఎన్‌పిసి-1, టిటిసి ఇండస్ట్రియల్ ఏరియా, ముగల్సాన్ రోడ్, ఏరోలి, నవీ ముంబాయి-400708. నమోదిత కార్యాలయం: 'త్రిశూల్', 3వ అంతస్తు, సమర్థేశ్వర్ టెంపుల్ లా గార్డెన్ ఎదురుగా, ఎల్లిస్‌బ్రిడ్జి, అహ్మదాబాద్-380006.

స్థిరాస్తి అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8 (6)లోని నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

రిజర్వు ధర (రూ.లో)	రూ.63,92,247/-
ధరావతు (రూ.లో)	రూ.6,39,225/-
బిడ్ పెంపుదల మొత్తం	రూ.25,000/-
ధరావతుతో బిడ్/ టెండరు దాఖలు చివరి తేదీ, సమయం మరియు ప్రదేశం	05.12.2025 సా.5.00 గం.ల
ఇ-వేలం తేదీ, సమయం మరియు ప్రదేశం	06.12.2025 ఉ.11.00 గం.ల నుండి మ.12.00 గం. https://www.bankeauctions.com

స్థిరాస్తి వివరాలు

https://www.axisbank.com/auction-retail

https://www.bankeauctions.com

తేదీ: 04-11-2025
ప్రదేశం: పశ్చిమ గోదావరి

సం/- అధీకృత అధికారి
యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (క్యాష్...) Ph: 8142292071.

SECOND SALE

భీమవరంలో పద్మశ్రీయ ఫైనాన్స్‌నందు ... ☎ 93924 88877, 99851 61166

వాషింగ్‌మెషిన్స్, LED TV, ఫ్రిజులు, ఇన్వర్టర్స్, AC ... ☎ 87121 68544.

... 90632 40899.

REAL ESTATE

... DTCP ... Individual Buildings ... 98662 92016.

JOBS

Wanted English Speaking teachers for 10th Maths, English Speaking teachers for Lower Classes. Rs:15000/- Per month. AYEM High School, Kombotlapalem ☎ 83416 28723

... 86888 23404, 99638 80890.

LAND FOR SALE

... 37281, 90145 26077

TO LET

... ☎ 6281037679.

COMMERCIAL

... 9704051122, 9010660011.

... 9490309033 (F), 9705834803 (M)

Cont: 88663 44499.

గమనిక

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర ... రూ. 5.80 ... 08819-224254

ఏలూరు

• ఏలూరు • దెందులూరు • ఉంగుటూరు

మంత్రి నాదెండ్లకు స్వాగతం

భీమడోలు, న్యూస్‌టుడే: విజయవాడ నుంచి తాడేపల్లిగూడెం వెళ్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్‌కు మార్గం మధ్యలోని భీమడోలు రైల్వే గేటు వద్ద ఘన స్వాగతం లభించింది. జనసేన మండలాధ్యక్షుడు ప్రత్తి మదన్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు, వీర మహిళలు తరలివచ్చి మంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. పలువురు మహిళలు ఆయనకు హారతులు పట్టారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో మంత్రి కాసేపు ముచ్చటించారు.

శాంతిభద్రతల సమస్యలున్నాయా?

నిడమర్రు సీఐతో ఫోన్ ఇన్ నేడు

గణపవరం, న్యూస్‌టుడే: నిడమర్రు పోలీసు సర్కిల్‌లో శాంతి భద్రత సమస్యలున్నాయా.. జూద క్రీడలు పెరిగిపోయాయా.. మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిపోయిందా.. అతివలపై ఆకతాయిల వేధింపులు ఎదురవుతున్నాయా.. ఆయా ఇబ్బందులకు పరిష్కార మార్గం చూపనుంది 'ఈనాడు'. పోలీసు శాఖ పరంగా గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు మండలాల్లో ఎదురవుతున్న సమస్యలను నిడమర్రు సీఐ రజినీకుమార్ దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కారం పొందవచ్చు. మీరు చేయాల్సిందల్లా ఇక్కడ పేర్కొన్న తేదీన, నిర్దిష్ట సమయానికి ఫోన్ చేయడమే!

తేదీ: 4.11.20125 (మంగళవారం) | సమయం: సాయంత్రం 3 నుంచి 4 గంటల మధ్య | ఫోన్ నంబరు: 70939 81613

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు టూటౌన్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు గ్రామీణం:	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

గణపవరం, న్యూస్‌టుడే: ? చినరామచంద్రపురం కాకర్లవారి వీధిలో విద్యుద్దీపాలు వెలగడం లేదు. రాత్రివేళ అంధకారం అలముకుంటోంది. ఇళ్లలోకి పాములు వస్తున్నాయి. **- కుమార్**

✔ ఇటీవల వర్షాలకు దీపాలు పాడయ్యాయి. ప్రాధాన్య క్రమంలో మరమ్మతులు చేస్తున్నాం. రెండు, మూడ్రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం. **- డీఎస్ఆర్ ప్రసాద్, ఈవో**

? సరిపల్లె రుద్రరాజు కల్యాణ మండపం పక్క వీధిలో మురుగు, వర్షపు నీరు రోడ్డుపైకి చేరుతోంది. రోజుల తరబడి నిలిచిపోవడంతో దుర్వాసన వస్తోంది. దోమల బెడద విపరీతంగా ఉంటోంది. **- అయ్యప్ప, స్థానికుడు**

✔ డ్రెయిన్ సమస్య పరిష్కరిస్తాం. రోడ్డుపై మురుగు నిలవకుండా చూస్తాం. **- రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి**

విజయ స్ఫూర్తి.. చైతన్య దీప్తి

- ప్రపంచకప్ గెలుపుపై హర్షాతిరేకాలు
- దిక్సూచిగా నిలిచిందంటోన్న క్రీడాకారిణులు

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: ఒక గెలుపు.. ఒక కప్పు.. క్రీడాకారిణులకు భరోసానిచ్చింది.. వారి భవితకు దిక్సూచిగా నిలిచింది. తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచింది. సమాజంలోనూ మార్పు తీసుకురానుంది. ఆడ పిల్లలకు ఆటలెందుకన్న ఆలోచనలో మార్పు తేనుంది. ఇకపై క్రీడల్లో మహిళా ప్రాతినిధ్యం పెంచనుంది. మహిళా క్రికెట్ వన్డే ప్రపంచ కప్‌లో భారత జట్టు విజయ తీరాలకు చేరడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ స్ఫూర్తితో తాము ఎంచుకున్న క్రీడాంశాల్లోనూ రాణిస్తామని పలువురు క్రీడాకారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

వెనక్కి పంపేవారు

నా పేరు కంకిపాటి ప్రజ్ఞ. ఏలూరులో తొమ్మిదో తరగతి చదువుతున్నా. అథ్లెటిక్ క్రీడాకారిణిని. అప్పుడప్పుడు అన్నయ్యతో క్రికెట్ ఆడేదాన్ని. బ్యాటింగ్ ఆడాలి.. బౌలింగ్ చేయాలన్న ఆశ ఉండేది. కానీ, అన్నయ్య మిత్రులు అడ్డు చెప్పేవారు. ఆడ పిల్లనని.. ఆడలేవని వెనక్కి పంపేవారు. దాంతోనే అథ్లెటిక్స్‌ను ఎంచుకున్నా. తాజాగా మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్ సాధించడంతో.. ఎందరో క్రికెట్‌ను ఎంచుకొని.. రాణించేందుకు వీలు కలిగింది.

మరువలేని అనుభూతి

నా పేరు భవాని. మాది ఏలూరు. బాస్కెట్‌బాల్ జాతీయ స్థాయి క్రీడాకారిణిని. ఓ పాఠశాలలో పీడీగా పని చేస్తున్నా. క్రికెట్‌లో భారత మహిళా జట్టు ప్రపంచకప్‌ను ముద్దాడటం మరిచిపోలేని అనుభూతి. ఎన్నో ఏళ్ల కలను హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని జట్టు సాకారం చేసింది. ఈ గెలుపు చరిత్రలో నిలిచిపోతుంది. మాలాంటి క్రీడాకారులకు ఈ విజయం స్ఫూర్తినిస్తుంది.

సమష్టి కృషితోనే..

నా పేరు ఎ.టాలీ అనిత. బాస్కెట్ బాల్ క్రీడాకారిణిని. డిగ్రీ పూర్తి చేశా. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సొంతం చేసుకున్నా. తాజా మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్ గెలవడం అమితానందాన్నిస్తోంది. జట్టు సమష్టి కృషితోనే విజయం సొంతమైంది. ఈ స్ఫూర్తితో మేమూ ఎన్నుకున్న రంగంలో ముందుకు వెళతాం.

భావితరాలకు..

నా పేరు ఇనుకొండ సింధూర. ఏలూరు సుబ్బమ్మదేవి పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. ఖోఖోలో శిక్షణ పొందుతున్నా. క్రికెట్ ఆటన్నా మక్కువే. ప్రస్తుతం మహిళా క్రికెట్ జట్టు అద్భుత ఆటతీరుతో విశ్వవిజేతగా నిలవడం గొప్ప విషయం. ఈ విజయం భావితరాలకు దిక్సూచిగా నిలవడం ఖాయం.

నేడు చేబ్రోలులో వైద్య శిబిరం

ఉంగుటూరు, న్యూస్‌టుడే: చేబ్రోలులో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచి రాంధే లక్ష్మీసునీత తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన వేద ఆసుపత్రి వెన్నెముక వైద్యుడు తేజో ఫణీంద్ర, సిబ్బంది పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. శిబిరాన్ని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

5న జల్లికొమ్మరలో పశువులకు..

గణపవరం: జల్లికొమ్మర రైతు సేవా కేంద్రంలో బుధవారం పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మెగా పశు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ సహాయ సంచాలకుడు డీఎం నాయక్ తెలిపారు. పశువుల దీర్ఘకాలిక, గర్భకోశ వ్యాధులకు చికిత్స చేయనున్నట్లు చెప్పారు. పేయ దూడల ప్రదర్శన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేస్తామని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆలకించండి.. పరిష్కరించండి!

'మీ కోసం'లో సమస్యల వెల్లువ

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: 'మా సమస్యలు ఆలకిస్తారని.. వాటిని సకాలంలో పరిష్కరిస్తారని ఆశించాం. వ్యయ ప్రయాసలకోర్చి కలెక్టరేట్ గడప తొక్కాం. ఉన్నతాధికారులు బాసటగా నిలిచి.. భరోసానివ్వాలి' అని పలువురు అర్జీదారులు విజ్ఞప్తి చేశారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(మీ కోసం)కు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చారు. తమ సమస్యలు తీర్చాలని ఏకరవు పెట్టారు.

వసతుల కల్పనలో విఫలం

'నా పేరు ఆది సత్యనారాయణ. మాది చింతలపూడి మండలం వెంకటాపురం. మాజీ సర్పంచిగా పని చేశా. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు విఫలమవుతున్నారు. ఎక్కువ శాతం ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సదుపాయాలు మృగ్యమయ్యాయి. మండలంలోని 11 గ్రామాలకు 13 ఏళ్లుగా సరైన రహదారుల్లేవు. దాంతో ఆర్టీసీ యాజమాన్యం బస్సులు నడపడం లేదు. వివిధ రహదారుల నిర్మాణాలకు సుమారు రూ. 20 కోట్లు మంజూరయ్యాయి. గతేడాది శంకుస్థాపనలు చేసి పనులు ఆపేశారు. అధికారులు స్పందించి పునఃప్రారంభించి.. ప్రజల రవాణా కష్టాలు తీర్చాలి'

జీవనాధారం చూపించండి

నా పేరు లక్ష్మీమనోహరం. ఏలూరు నగరంలో నివసిస్తున్నా. భర్త, కుమారుడి మరణంతో ఒంటరిగా జీవిస్తున్నా. బతుకుదెరువులో భాగంగా పత్తేబాద రైతు బజార్‌లో తేనీరు, అల్పాహారం విక్రయిస్తూ జీవనం సాగించేదాన్ని. అక్కడ వ్యాపారం చేయకూడదని అధికారులు పంపించేశారు. ఇప్పుడు జీవనాధారం లేకుండా పోయింది. అనారోగ్య సమస్యలూ వెంటాడుతున్నాయి. అధికారులు స్పందించి జీవనాధారం కల్పించి ఆదుకోవాలి.

సమాజ మార్గదర్శకులు ఉపాధ్యాయులు

సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: సమాజ మార్గదర్శకులు ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్థానిక విడిది కార్యాలయంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్టీఏ) నగరపాలక సంస్థ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సంఘ జిల్లా సహాధ్యక్షుడు బి.రాము, కార్యదర్శి డి.ఇంద్రాణి, నగరాధ్యక్షుడు వి.వెంకటేశ్వరరావు, కోశాధికారి జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం: చింతమనేని

అర్జీ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి(పెదపాడు), న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదవేగి మండలం దుగ్గిరాలలోని విడిది కార్యాలయంలో సోమవారం ఆయన్ను పలువురు కలిశారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీలు సమర్పించారు. చింతమనేని మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సర్కారు తోడ్పాటునిస్తోందన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలన్నారు. ఆయా పల్లెల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

చిత్రలేఖనంలో పాల్గొన్న విద్యార్థులు

విరిసిన సృజన!

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీ

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: స్థానిక ఎస్‌పీడీబీటీ జూనియర్ కళాశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యాన ప్రతిభా పాటవ పోటీ నిర్వహించారు. ప్రకృతి అందాలపై చిత్రలేఖనం పోటీ జరగ్గా.. విద్యార్థిని, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తమలో దాగున్న సృజనను వెలికితీసి ఔరా అనిపించారు. ఎన్.దివ్య, వై.కుమారి, పి.తనూష వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి కళాశాల ప్రధానాచార్యుడు ఆర్‌వీఎస్ఎన్ మూర్తి బహుమతులు అందజేశారు.

విజేతలకు బహుమతులిస్తున్న అధ్యాపకులు

రహదారుల మరమ్మతులు వేగవంతం

సమీక్షిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతిన్న జిల్లా పరిషత్తు రహదారుల మరమ్మతులను వేగవంతం చేయాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ సూచించారు. స్థానిక జడ్పీ కార్యాలయంలోని తన ఛాంబరులో సోమవారం రహదారుల స్థితిగతులపై పీఆర్ అధికారులతో సమీక్షించారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు.

మెరుగైన వైద్యం అందించండి

భీమడోలు, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకొచ్చే రోగులకు మెరుగైన సేవలందించాలని ఎంపీపీ రామయ్య సూచించారు. పూళ్ల, గుండుగొలను పీహెచ్‌సీల్లో సోమవారం అభివృద్ధి కమిటీ సమావేశాలు నిర్వహించారు. సర్పంచి సుజాత, వైద్యాధికారులు అరుణజ్యోతి, జాహ్నవి, విస్తరణాధికారి లక్ష్మణరావు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పాత్ర కీలకం: ఏఎస్పీ

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పిల్లల విద్యా ప్రగతిలో తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలని ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. స్థానిక అమీనాపేటలోని సురేశ్‌చంద్ర బహుగుణ పోలీసు పాఠశాలలో సోమవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. బాల్యంలో చదువుపైనే దృష్టి పెట్టాలని, తద్వారా జీవితాంతం ఆనందంగా ఉండొచ్చన్నారు. విద్య కేవలం ఉద్యోగం కోసమే కాదని సమాజంలో గౌరవప్రదంగా జీవించేందుకూ దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల భవిష్యత్తు నిర్దేశించేలా ప్లకార్డులు ఆవిష్కరించి ప్రదర్శించారు.

రోగులకు దుప్పట్ల పంపిణీ

ఉంగుటూరు, న్యూస్‌టుడే: కాగుపాడు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులకు దాతలు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. వైద్యశాలకు గ్రామానికి చెందిన కడియాల సత్యనారాయణ, ఫణీంద్ర, చరిత బెడ్ షీట్లు అందజేశారు. చేబ్రోలు సొసైటీ ఛైర్మన్ రవిశంకర్, మహీధర్, రత్నాజి, ధనుంజయ్ పాల్గొన్నారు.

ఏలూరు సినిమాలు

అంబిక డీలక్స్	బాహుబలి ఎపిక్
అంబిక మినీ	కాంతార - 2
సాయిబాలాజీ	తెలుసు కదా
బాలాజీ	బాహుబలి ఎపిక్
సత్యనారాయణ ట్రిపుల్ 1	ధామా
సత్యనారాయణ ట్రిపుల్ 2	డ్యూడ్
సత్యనారాయణ ట్రిపుల్ 3	మాస్ జాతర
విజయలక్ష్మి పిమ్మాక్స్ 1	విద్రోహి
విజయలక్ష్మి పిమ్మాక్స్ 2	మైసస్
విజయలక్ష్మి పిమ్మాక్స్ 3	కర్మణ్యే వాధికారస్తే
ఎస్వీసీ మల్టీప్లెక్స్ ట్రిపుల్ 1	మాస్ జాతర
ఎస్వీసీ మల్టీప్లెక్స్ ట్రిపుల్ 2	తెలుసు కదా
ఎస్వీసీ మల్టీప్లెక్స్ ట్రిపుల్ 3	మిత్ర మండలి
ఎస్వీసీ మల్టీప్లెక్స్ ట్రిపుల్ 4	బాహుబలి ఎపిక్

రైతు బజారు.. సేవలందక బేజారు!

పునఃప్రారంభించాలని స్థానికుల విజ్ఞప్తి

పెదపాడు, న్యూస్‌టుడే: మండల కేంద్రం పెదపాడు ప్రజలకు మినీ రైతు బజారు సేవలు అందని ద్రాక్షగా మిగిలాయి. దీన్ని గత తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.10 లక్షలు వెచ్చించి నిర్మించారు. 2019 డిసెంబరులో అప్పటి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఆర్భాటంగా ప్రారంభించారు. అప్పట్లో మార్కెటింగ్ శాఖాధికారులు రాయితీపై కొన్నాళ్లు ఉల్లిపాయలు విక్రయించారు. ఆపై కూరగాయల దుకాణాలు ప్రారంభించారు. కొన్నాళ్లు విక్రయాలు కొనసాగాయి. ఆ తర్వాత ఏమైందో తెలియదు కానీ.. రైతులు దుకాణాలు తెరవలేదు. కొన్ని రోజులకు దుకాణాలు పూర్తిగా ఎత్తేశారు. ఫలితంగా వినియోగదారులకు మినీ రైతు బజారు సేవలు మూన్నాళ్ల ముచ్చటగా మారింది.

రెండు నెలలకే ఖాళీ చేసి..

2021లో మినీ రైతు బజారును అధికారులు పునఃప్రారంభించారు. మళ్లీ రెణ్నెల్లకే దుకాణాలు ఖాళీ చేసేశారు. ఇందుకు రైతులు కాకుండా వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేయడం కారణమని తెలుస్తోంది. ఫలితంగా పెదపాడు వాసులు అధిక నగదు వెచ్చించి బయటే కూరగాయలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం స్పందించి మినీ రైతు బజారును వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. 'మినీ రైతు బజారులో కార్యకలాపాలు సాగడం లేదన్న విషయాన్ని మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వీలైనంత త్వరగా తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం' అని తహసీల్దారు కృష్ణశ్రీ తెలిపారు.

గంగానమ్మ జాతరకు ముడుపు

ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: స్థానిక లక్ష్మీవారపుపేటలో గంగానమ్మ జాతర ప్రారంభ సూచిగా సోమవారం ముడుపు ఉత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులు, ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం చంటి శిరస్సుపై అమ్మవారి ముడుపు తీసుకొచ్చారు. అర్చకులు అందజేశారు. ఇడా ఛైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, భాజపా జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మురుగు తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియం నుంచి మార్కెట్ యార్డుకు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన నిలిచిపోయిన మురుగునీటిని ఎట్టకేలకు తొలగించారు. 'మీకే కాదు.. నాకూ లేదు వెళ్లే దారి' శీర్షికన నవంబరు 1న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, ఉప కమిషనర్ శివారెడ్డి స్పందించారు. వారి ఆదేశానుసారం పారిశుద్ధ్య సిబ్బంది డ్రెయినులో పూడిక తీసి, రోడ్డుపై నిలిచిన మురుగును తొలగింపజేశారు.

విద్యార్థిని ఆచూకీ గుర్తింపు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మాదేపల్లికి చెందిన పన్నెండేళ్ల బాలిక సోమవారం వేకువజామున 3 గంటల నుంచి కనిపించడం లేదంటూ బాధిత తల్లిదండ్రులు ఉదయం 9.59 గంటలకు కంట్రోల్ రూం నంబరు 112కు ఫోన్ చేశారు. గ్రామీణ ఎస్సై నాగబాబు అప్రమత్తమై తన సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకున్నారు. మాదేపల్లి శివారులో బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. వసతి గృహంలో చేరుస్తామని తల్లిదండ్రులు చెప్పడంతో బాలిక మనస్తాపానికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఏలూరులో అవిముక్తేశ్వరుడికి అలంకరణ

ఏలూరు దత్తనాథ క్షేత్రంలో..

గుండుగొలనులో రుద్రాక్ష అలంకారం

మండలపర్రులో నీలకంఠేశ్వరుడు

సర్వేశ్వర.. సకల లోకేశ్వర!

ఆలయాల్లో కార్తిక సోమవారం పూజలు

కార్తిక మాసం రెండో సోమవారం సందర్భంగా.. ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లోని శైవాలయాల్లో ప్రత్యేకాభిషేకాలు, పూజలు, విశేషాలంకరణలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి సర్వేశ్వరుడిని దర్శించుకున్నారు. మహిళలు పిండి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఏలూరు, భీమడోలు, నిడమర్రు, పెదపాడు, పెదవేగి, దెందులూరు తదితర మండలాల్లోని ఆలయాల్లో కార్తిక శోభ నెలకొంది. భక్తులకు ఇబ్బందుల్లేకుండా నిర్వాహకులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

- న్యూస్‌టుడే బృందం

వసంతవాడ సుగ్రీవ లింగేశ్వరాలయంలో దీపోత్సవం

అంజయ్య సేవలు నిరుపమానం

చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

దెందులూరు, ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: వైద్య, ఉద్యోగ సంఘాల నాయకుడిగా బూసి అంజయ్య నిరుపమాన సేవలందించారని పలువురు కొనియాడారు. నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో దెందులూరు మండలం కొవ్వలికి చెందిన మెడికల్ హెల్త్ సర్వీసెస్ విశ్రాంత సంయుక్త సంచాలకుడు అంజయ్య సంస్మరణ సభ సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి పూలమాల వేసి నివాళులర్పించారు. బహుజన ఆఫీసర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు దేవరకొండ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఎన్జీవో సంఘం ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు విద్యాసాగర్, పీఆర్ విశ్రాంత చీఫ్ ఇంజినీర్ రాజేశ్వరరావు, సీఆర్ఆర్ కళాశాల విశ్రాంత ప్రధానాచార్యుడు డేనియల్, అంజయ్య కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ధాన్యం సేకరణ: డీఏవో

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: రైతు సేవా కేంద్రం, సొసైటీ సిబ్బంది సమన్వయంతో పని చేసి.. రైతుల నుంచి పకడ్బందీగా ధాన్యం సేకరించాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా సూచించారు. స్థానిక డీసీఎంఎస్ ఫంక్షన్ హాలులో సిబ్బందికి సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొని వివిధాంశాలపై అవగాహన కల్పించారు. తేమ నిర్ధారణ, రైసు మిల్లులకు ధాన్యం రవాణా, ఆన్‌లైన్ నమోదు తదితరాలపై సూచనలిచ్చారు. ధాన్యం సేకరణలో అన్నదాతల సందేహాలు ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఏడీఏ అనిల్‌కుమారి, ఏవోలు, ఏఏవోలు తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో దాచిన బంగారం మాయంపై కేసు

పెదవేగి(పెదపాడు), న్యూస్‌టుడే: పెదవేగికి చెందిన కొనకళ్ల మహేశ్వరరావు కిరాణా దుకాణం నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయన భార్య సెప్టెంబరు 30న ఇంట్లోని సుమారు రూ.3 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు శుభ్రం చేసి.. దసరా పండగ రోజు వేసుకోవచ్చన్న ఉద్దేశంతో డ్రస్సింగ్ టేబుల్ సొరుగులో దాచారు. అక్టోబరు 2న ఆభరణాలు వేసేకునేందుకు సొరుగు తీసి చూడగా కనిపించలేదు. భర్తకు భయపడి విషయం చెప్పలేదు. 20న దీపావళి రోజు భార్య బంగారు ఆభరణాలు వేసుకోకపోవడంతో మహేశ్వరరావు ఆమెను ప్రశ్నించారు. భార్య అసలు విషయం చెప్పడంతో.. ఓ వ్యక్తిని అనుమానించి పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. అక్కడా విషయం తేలకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు.

తాళం వేసినా.. పెదవేగి: న్యాయంపల్లికి చెందిన ముంద్రు రాంబాబు ఈ నెల 2న ఇంటికి తాళమేసి కుటుంబంతో కలిసి భీమడోలులోని బంధువుల ఇంటికెళ్లారు. తిరిగి రాత్రి ఇంటికి చేరుకోగా, తలుపు తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించారు. లోపలికెళ్లి చూడగా.. బీరువా తెరచి ఉంది. 4 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించారు.

జూద స్థావరంపై దాడి.. పెదవేగి: భోగాపురంలో నిర్వహిస్తున్న జూద స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.40 వేలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ షేక్ హదర్‌సాహెబ్ తెలిపారు.

బాలికా.. వెనకడుగు వేయక!

ఏలూరు ఏఆర్‌డీజీకే నగరపాలకోన్నత పాఠశాల విద్యార్థినులకు ఆత్మరక్షణ విద్యపై శిక్షణనిస్తున్నారు. సమగ్ర శిక్షా జిల్లా ప్రాజెక్టు ఆధ్వర్యాన బాలికలకు కరాటే తర్ఫీదునిస్తున్నారు. ఎవరైనా ఆకతాయిలు దాడి చేస్తే వారిని ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థినులు సైతం ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. **- న్యూస్‌టుడే, ఏలూరు విద్యా విభాగం**

దారంటారా.. దారుణమంటారా

ఏలూరు ఫెన్సన్ లైన్‌లోని ఏఎస్ఆర్ మైదానం వెనుక ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. చిన్నపాటి వర్షానికే భారీగా నీరు నిలిచిపోతోంది. జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి కార్యాలయ సమీపంలో భారీ గోతులు ఏర్పడ్డాయి. రాత్రివేళ ద్విచక్ర వాహనదారులు గుంతలను గమనించకుండా అదుపు తప్పి పడి ఆసుపత్రిపాలవుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు నగరం**

ఆదాయమున్నా.. శుభ్రత సున్నా

ఏలూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో పారిశుద్ధ్యం క్షీణిస్తోంది. ఏటా రూ. కోట్లలో ఆదాయం వస్తున్నా.. డ్రెయిన్లలో కనీసం పూడిక తీయడం లేదు. రోజుల తరబడి మురుగునీరు నిలిచిపోవడంతో రంగు మారి దుర్వాసన వస్తోంది. దోమలు సైతం విజృంభిస్తుండటంతో రైతులు, హమాలీలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు గ్రామీణ**

తుప్పలా.. ప్రమాద హేతువులా

ఏలూరు నగరం గాంధీ మైదానం నుంచి పంపుల చెరువు మీదుగా గులాబీ తోటకెళ్లే కృష్ణా కాలువ రోడ్డు అంచుల్లో ముళ్లచెట్లు, తుప్పలు ఏపుగా పెరిగిపోయాయి. కొమ్మలు రోడ్డుపైకి వస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ విద్యుద్దీపాలు వెలగకపోవడంతో పాదచారులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు వన్‌టౌన్**

వాన కురిసి.. చోదకులు జడిసి

ఏలూరు నగరంలో సోమవారం జడివాన కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రతతో నగరవాసులు అల్లాడిపోయారు. ఆ తర్వాత ఒక్కసారిగా వాతావరణంలో మార్పులొచ్చాయి. ఉరుములు, మెరుపులతో వర్షం ముంచెత్తింది. సుమారు రెండు గంటల పాటు ఏకధాటిగా వాన పడటంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు.

- న్యూస్‌టుడే, ఏలూరు అర్బన్

(c) eenadu

పోలవరం

•పోలవరం •చింతలపూడి

ఆలయంలో బందోబస్తు ఏర్పాట్లపై పరిశీలన

పోలవరం, న్యూస్‌టుడే: పట్టిసీమ రేవులో, ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాట్లను డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు సీఐ బాలసురేష్‌బాబుతో కలిసి పరిశీలించారు. కార్తిక సోమవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనం కోసం తరలివచ్చారు. లాంచీ ఎక్కేందుకు ఒక్క సరిగా భక్తులు వెళ్లకుండా మెట్ల వద్దే క్రమబద్ధీకరించి అంచలంచలుగా పోలీసులు పంపుతున్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్‌లను పరిశీలించారు. దాదాపు రెండు గంటల పాటు డీఎస్పీ ఆలయం వద్దే ఉన్నారు. వారి వెంట ఎస్సై పవన్‌కుమార్ ఉన్నారు.

రహదారి పనులు ప్రారంభం

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లి- లక్కవరం రహదారి పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. రూ. 70 లక్షల వ్యయంతో 1.80 కి.మీ. మేర నూతనంగా రోడ్డు నిర్మించేందుకు అనుమతులు లభించాయి. కాగా చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్‌కుమార్ ఆదేశాల మేరకు సోమవారం యంత్రాల సహాయంతో రహదారి తవ్వకం పనులు చేపట్టినట్లు ర.భ.శాఖ డీఈ హరికృష్ణ తెలిపారు.

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం: 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి: 76759 19086

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ? లక్కవరం పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో డ్రెయిన్లలో చెత్త పేరుకుపోయి మురుగు పారడం లేదు. - రాకేశ్, లక్కవరం
✔ పూడికలు తీయిస్తాం. - కొండలరావు, కార్యదర్శి
చింతలపూడి, న్యూస్‌టుడే: ? సిప్రియన్‌పేటలో ఎక్కడి చెత్త అక్కడే ఉండటంతో నానా ఇబ్బందులు పడుతున్నాం. -నాగరాజు, సిప్రియన్‌పేట
✔ నిత్యం సిప్రియన్‌పేటలో చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తొలగిస్తున్నారు. అవసరమైతే యంత్రం వినియోగించి చెత్త తొలగిస్తాం. - అంబటి రాంబాబు, మున్సిపల్ కమిషనర్
టి.నరసాపురం, న్యూస్‌టుడే: ? కొత్తగూడెం నుంచి కామవరపుకోట వెళ్లే రహదారికి ఇటీవల మరమ్మతులు చేశారు. వెంటనే ఛిద్రంగా మారింది. -చంటి, కొత్తగూడెం
✔ వర్షాల వల్ల అది పాడయ్యింది. వెంటనే మరమ్మతులు చేయిస్తాం. - హరికృష్ణ, ఆర్అండ్‌బీ డీఈ, జంగారెడ్డిగూడెం

విజయ దీప్తి..!

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటుతామంటున్న విద్యార్థినులు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మన భారత మహిళా క్రికెట్ క్రీడాకారిణులు దక్షిణాఫ్రికా జట్టుపై జరిగిన ఫైనల్స్‌లో విజయం సాధించి ప్రపంచకప్ కైవసం చేసుకున్నారు. జంగారెడ్డిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో విలువిద్యలో రాణిస్తున్న విద్యార్థినులు భారత క్రీడాకారిణుల స్ఫూర్తితో తాము రాణిస్తామని చెబుతున్నారు. వీరంతా ఈ నెల 7, 8, 9 తేదీల్లో పాడేరులో జరగనున్న రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. పీడీలు సాయి శ్రీనివాస్, కామేశ్వరి, భూదేవి తదితరులు వీరితో కఠోర సాధన చేయిస్తున్నారు.

నిత్యం సాధన..

ప్రతి రోజు మేము కనీసం రెండు గంటలు తగ్గకుండా విలువిద్య సాధన చేస్తున్నాం. ఆటపై మరింత ఇష్టం పెరిగింది. రాష్ట్ర పోటీల్లో విజయం సాధిస్తాం. భవిష్యత్తులో జాతీయ క్రీడాకారిణులం కావాలని ఆకాంక్షిస్తున్నాం. - ఎం.సృజన, ఎస్.ఆయేషా సిద్దిక్

ఆర్చరీ కిట్ కూడా..

ఆర్చరీ కిట్ రూ.లక్షకు పైగా ఉంటుందంట. మా పీడీ జయరాజు మాస్టారే దానిని తెచ్చి శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికవడం ఆనందంగా ఉంది. నేషనల్స్‌కు ఆడాలని ఆకాంక్షిస్తున్నా. -పెనుమత్స తూనూశ్రీ

వారే స్ఫూర్తి..

ఇండియన్ విభాగంలో.. విలువిద్య ఇండియన్ విభాగంలో నేను అండర్ 17 ఎస్‌జీఎఫ్ రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యా. మహిళా క్రికెట్ క్రీడాకారిణి శ్రీచరణి నాకు స్ఫూర్తి. క్రీడలపై ఆసక్తితో కొద్ది నెలల కిందట ఆర్చరీలో చేరా. జిల్లా స్థాయిలో గెలుపొంది, రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యా. జాతీయ స్థాయిలోను రాణించి మంచి క్రీడాకారిణి కావాలని ఆకాంక్షిస్తున్నా. - ఉరదండి శ్రావ్య

హర్మన్ ఆదర్శం..

క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ అంటే నాకు ఇష్టం. భారత జట్టు స్ఫూర్తితో నేను రాష్ట్ర స్థాయిలో ఈ నెల 7 నుంచి 9 వరకు జరగనున్న ఎస్‌జీఎఫ్ ఆర్చరీ పోటీల్లో రాణించాలని ఆశపడుతున్నా. చదువులోను బాగా చదవి డాక్టర్ కావాలన్నది నాలక్ష్యం. - ఏలూరి వైష్ణవి

వారి ప్రోత్సాహంతోనే..

అండర్ 14లో మేము రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాం. విలువిద్య ఇండియన్ విభాగంలో ప్రతిభ చూపాం. మాకు శిక్షణ ఇవ్వడమే కాక పోటీలకు కూడా పీడీలే తీసుకెళ్లారు. ఈ కారణంగా మేము రాష్ట్ర పోటీలకు ఎంపికవ్వగలిగాం. - ఎం.యోగిశ్రీభవాని, బి.లీలాశ్రీనివాస శశి

రెవెన్యూ సమస్యలపై వినతులు

గంగిరెడ్డిపాలెం వాసులు అందించిన వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన మీ కోసం కార్యక్రమంలో పలు రెవెన్యూ సమస్యలపై ప్రజలు ఆర్డీవో ఎంవీ రమణకు వినతులు అందజేశారు. టి.నరసాపురం మండలం గంగిరెడ్డిపాలెం అడవులలో పోడు వ్యవసాయం చేస్తున్న భూముల సమస్యకు సంబంధించి పెద్దఎత్తున సాగుదారులు ఫిర్యాదులు చేశారు. టి.నరసాపురం మండలంలో అటవీ హక్కుల చట్టానికి సంబంధించి సుమారు 124 ఎకరాలకు ఒకే పట్టాను ప్రభుత్వం జారీ చేసింది. దీనిని ఒక్కొక్కరికీ వ్యక్తిగతంగా పట్టాలు ఇవ్వడం కోసం భారీగా గిరిజనులు వ్యక్తిగత క్లెయిమ్‌లు దరఖాస్తు చేశారు. తనను కొడుకులు కొడుతున్నారని వేగవరం గ్రామానికి చెందిన చిట్టూరి నాగయ్య ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులతో మాట్లాడిన ఆర్డీవో ఎంవీ రమణ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కామవరపుకోటలో నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ.. పూల దుకాణం నిర్వహిస్తున్నారని తలారి ప్రకాశ్ ఫిర్యాదు చేశారు. పైడిపాక ఆర్అండ్ఆర్ కాలనీలో అనుమతులు లేకుండా కట్టడాలు కడుతున్నారని నిర్వాసితులు నిరోష తదితరులు ఫిర్యాదు చేశారు. రోడ్డు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని మైసన్నగూడెం గ్రామానికి చెందిన పిల్లి అంజయ్య ఫిర్యాదు చేశారు. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ బస్టాండ్ పక్కన రోడ్డు ఆక్రమించి కార్లు పార్కింగ్ చేసి వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని రాంబాబు ఫిర్యాదు చేశారు.

ఎవరో వస్తారని... ఏదో చేస్తారని ఎదురు చూడక

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా చేయీ చేయీ కలిపి రహదారి మరమ్మతులకు శ్రీకారం చుట్టారు రామవరం గ్రామస్థులు. వర్షాలకు వారి గ్రామానికి వెళ్లే రహదారి

అధ్వానంగా మారడంతో 100 కుటుంబాలున్న ఆ గ్రామంలో ప్రతి ఇంటి నుంచి రూ.100 చందా వేసుకున్నారు. చిన్న పెద్ద ఏకమై సోమవారం గోతుల్లో మట్టిని పోసి చదును చేశారు.

మేము సైతం అంటూ..

కామవరపుకోట, న్యూస్‌టుడే: ఏలూరు-జంగారెడ్డిగూడెం మార్గంలో ఏర్పడిన భారీ గుంతలను తడికలపూడి తెదేపా నేతలు ఆదివారం యంత్రాలతో పూడ్చించారు. సోమవారం వీరిశెట్టిగూడెం తెదేపా నేతలు చలపతి, మల్లికార్జున తడికలపూడి యువకులు జగదీష్, విస్సులు కలిసి మహిళా ప్రాంగణం సమీపంలో రెండు ప్రదేశాల్లోని భారీ గోతులను యంత్రాలతో పూడ్చించారు.

రక్తదానంతో ప్రాణదానం

రక్తదానం చేసిన మహిళకు పండ్లు అంజేస్తున్న రోషన్ కుమార్

చింతలపూడి, పట్టణం, కామవరపుకోట, న్యూస్‌టుడే: యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీతో కలిసి పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణదాతలు కావచ్చని వివరించారు. ఈ సందర్భంగా సీఐ క్రాంతికుమార్, ఎస్సై సతీశ్‌తో పాటు కానిస్టేబుల్స్, యువత రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చారు. 70 మంది రక్తదానం చేశారు. ●కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎస్సై చెన్నారావు, సర్పంచి కేశవరావు తదితరులు పాల్గొన్నారు. ● ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతు, కౌలు రైతు సంఘం నాయకులు ఎమ్మెల్యేకు క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

ఆయిల్‌పామ్ రైతుల ఆందోళన

కామవరపుకోట, న్యూస్‌టుడే: ఆయిల్‌పామ్ గెలల తూకంలో మోసం చేస్తున్నారంటూ కామవరపుకోట పంచాయతీ కార్యాలయంలో ఉన్న వేబ్రిడ్జి వద్ద సోమవారం రాత్రి రైతులు ఆందోళనకు దిగారు. కొంత కాలంగా వేబ్రిడ్జిలో తేడా కారణంగా గెలలు తూకం తక్కువ వస్తుందనే అనుమానంతో రైతులు అక్కడున్న ఎలక్ట్రానిక్ కాటా మీద 1000 కిలోల తూకం రాళ్లు ఉంచారు. 990 కిలోలు మాత్రమే తూకం చూపించింది. దీంతో టన్నుకు 10 కిలోల వంతున తక్కువగా తూకం చూపిస్తోందని, ఇలా ఎంత కాలంగా తూకంలో తేడా జరుగుతుందో తేల్చాలంటూ పాతూరుకు చెందిన రైతులు మంగా గోపి, రెబ్బా వరప్రసాద్ రావు, పాతపాటి సుధీర్ బాబు తదితరులు ఆందోళనకు దిగారు. సోమవారం గెలల సేకరణ కేంద్రానికి రైతులు 90 టన్నుల సరఫరా చేశారు. ప్రస్తుతం గెలలు టన్ను ధర రూ.19,636. ఈ ఒక్క రోజే కాటా తూకం తేడా కారణంగా గెలలు సరఫరా చేసిన రైతులకు దాదాపు రూ.20,000 నష్టం వాటిల్లింది. ఇలా ఎంత కాలంగా తూకంలో తేడా జరుగుతుందో నిగ్గు తేల్చాలని పట్టుబట్టారు. రాత్రి పొద్దు పోయే వరకూ ఆందోళన కొనసాగిస్తూనే ఉన్నారు.

రూ.1.92 కోట్ల పరిహారం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు పరిధిలోని నిర్వాసితులు 37 మందికి పెండింగ్ పడిన పరిహారం ఐటీడీఏ విడుదలైంది. వీరికి రూ.1.92 కోట్లు రెవెన్యూ అధికారులు అందజేశారు. పోలవరం మండలంలోని గాజులగొంది, సరుగుడు, యడ్లవరం, శివగిరి, టేకూరు, తెల్లవరం, వాడపల్లి, కొత్తూరు తదితర గ్రామాల నిర్వాసితులు 24 మందికి కాంపెన్సెంట్ రూ.1.48 కోట్లు, మిగిలిన వారికి సొంతంగా ఇంటి నిర్మాణం, ఒన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద అందజేశారు.

వరద బాధితులకు సాయం అవసరం

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో పునరావాస కేంద్రాలకు తరలించిన వారికి ప్రభుత్వం ప్రకటించిన సాయం అందించాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో బాధితులు చింతలపూడి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కన్వీనర్ పాండురంగారావు మాట్లాడారు.

ఆదివాసీల అభ్యున్నతికి కృషి: చిర్రి

ర్యాలీలో ఎమ్మెల్యే, పీవో, శాప్ డైరెక్టర్

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం ప్రాంతాల్లోని ఆదివాసీల ప్రగతికి కూటమి ప్రభుత్వం మరింత కృషి చేస్తోందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. ఈ నెల 15న గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద గిరిజన స్వాభిమాన్ ఉత్సవాలు- 2025 (జన్ జాతీయ గౌరవ్ దివస్)ను సోమవారం ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అంతకుముందు విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు నిర్వహించిన చైతన్య ర్యాలీలో పాల్గొన్నారు. ఐటీడీఏ ప్రాంగణంలో మొక్కలు నాటారు. గిరిజన పోరాట యోధుల విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మన్యంలో గిరిజన పోరాట యోధుల కుటుంబాలకు చెందిన కారుకొండ అబ్బాయిరెడ్డి (కొరుటూరు), పూరెం సీతారామయ్య (కాచారం), నడపల లక్ష్మమ్మ (ఉప్పరిల్ల)లను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన ప్రసంగించారు. ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి, పీవో రాములు నాయక్, జేసీ డైరెక్టర్ మడకం కన్నపరాజు, సర్పంచి ఉయిక బొజ్జి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే బాలరాజు 'స్వర్ణ పోలవరం విజన్ యాక్షన్ పుస్తకం'ను ఆవిష్కరించారు. వెదురు, నారతో తయారు చేసిన గృహోపకరణాల ప్రదర్శన తిలకించారు. గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలల విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

పొలాల్లో రాగి తీగల చోరీ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలంలోని తిమ్మాపురం రైతుల పొలాల్లో మోటార్లకు సంబంధించిన రాగి తీగలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఒకే రోజు పది మంది రైతుల పొలాల్లో వరస దొంగతనాలు జరిగాయి. దీంతో వారంతా సోమవారం పోలీసులను ఆశ్రయించారు.

అడుసులో ప్రయాణం.. ఆసుపత్రికి పయనం..

తాడువాయి (జంగారెడ్డిగూడెం గ్రామీణ), న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాలైన వేలేరుపాడు, కుక్కునూరు, పోలవరం నిర్వాసితులకు జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి పంచాయతీ చల్లవారిగూడెంలో మూడేళ్ల కిందట పునరావాసం కల్పించారు. అక్కడ పూర్తిస్థాయిలో మౌలిక వసతులు లేక నిర్వాసితులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి బురదమయంగా మారింది. దీంతో వాహనాలు దిగబడటం, జారిపోవడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని చెబుతున్నారు.

ప్రమాదమన్నా.. ఆగరేమన్నా..!

కామవరపుకోట, న్యూస్‌టుడే: కళ్లచెరువు సమీపంలోని గుండేరు వాగుపై దెబ్బతిన్న వంతెనపై ప్రయాణాలు నిషేధించినట్లు ర.భ.శాఖ అధికారులు ప్రకటించారు. ఆ మేరకు రెండు రోజుల కిందట సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. వంతెనపై నుంచి వరద వెళ్లటం నిలిచింది. వంతెన కుంగి ప్రమాదకరంగా ఉన్నప్పటికీ రెండు రోజులుగా దానిపైగానే వాహనాలు తిరుగుతుండటంతో పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు జారీ చేసిన నిషేధాజ్ఞలు ఉల్లంఘించి ద్విచక్ర వాహనాలతోపాటు ఆటోలు, పాఠశాల బస్సులు, భారీ వాహనాలు సైతం ప్రయాణిస్తున్నాయి.

గుంతలు.. చింతలు..

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పట్టణంలోని 19వ వార్డు పరిధిలోని షిర్డీ సాయిబాబా ఆలయం రోడ్డు అధ్వానంగా తయారైంది. ఎక్కడికక్కడ గుంతలు పడి, వాటిలో వర్షపు నీటితో మడుగులా తయారైంది. పైగా సరైన డ్రెయినేజీ కూడా లేకపోవడంతో ఈ వీధిలోని ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయిబాబా గుడి నుంచి అశ్వారావుపేట రోడ్డులోకి వెళ్లే ఈ దారిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. రహదారి బాగు చేయిస్తామని పురపాలక కమిషనర్ కేవీ రమణ పేర్కొన్నారు.

బోరుమంటున్న జనం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే : ఉప్పలమెట్టలోని ఈ నీటి ట్యాంక్ 2లక్షల లీటర్ల సామర్థ్యం కలిగి ఉంది. దీని నుంచే పట్టణంలోని సగం ప్రాంతానికి తాగు నీరు సరఫరా అవుతుంది. చాలా ఏళ్లుగా ఇదే పరిస్థితి. ట్యాంకు సమీపంలోనే ఉన్న బోరు నీటిని ట్యాంకులో నింపి విడుదల చేసేవారు. అయితే ప్రస్తుతం ఉప్పలమెట్టలో జలాలు కలుషితమై బోర్ల నుంచి నూనె తెట్టులాంటి నీరు వస్తోంది. ఇక్కడి బోర్ల నీరు తాగడానికి పనికి రావడం లేదు. దీని వల్ల ఇప్పటికే రెండు బోర్లు మూసేశారు. గతంలో ఈ బోరు నీరు కూడా తాగినా ప్రస్తుతం తాగేలా లేదు. దీంతో ఈ బోరు నీటిని పైప్‌ల ద్వారా నేరుగా వాడకం నీటికి వినియోగించుకునేలా పంపింగ్ చేస్తున్నారు. ఈ ట్యాంకు నింపడానికి కిలో మీటరు దూరంలోని జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న బోరు నుంచి పైప్‌లైన్ వేసి తోడుతున్నారు. ఈ ట్యాంకు దూరమే కాకుండా ఎత్తైన ప్రదేశంలో ఉండటంతో పురపాలక సంఘానికి భారీ వ్యయం అవుతుంది. కాలుష్య జలాల సమస్యతో ఇబ్బందులు తలెత్తాయి. భారమైనా ఇలా నీటిని తోడి సరఫరా చేయాల్సి వస్తుందని మున్సిపల్ కమిషనర్ రమణ పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఎంపికైన నిర్మల, చరణ్

చింతలపూడి, న్యూస్‌టుడే: ప్రగడవరం ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న పి.నిర్మల, డి.చరణ్‌లు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయురాలు పి.రాణి తెలిపారు. టి.నరసాపురం జిల్లా ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో వీరు గెలుపొందడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు.

కబడ్డీ జట్లు.. టి.నరసాపురం, న్యూస్‌టుడే: జిల్లా కబడ్డీ అసోషియేషన్ ఆధ్వర్యంలో టి.నరసాపురంలో సోమవారం నిర్వహించిన సబ్‌జూనియర్ బాలబాలిక కబడ్డీ జట్ల ఎంపిక పూర్తయినట్లు అసోషియేషన్ కార్యదర్శి కె.రంగారావు తెలిపారు. జిల్లాల నుంచి 200 మందిపైగా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 7నుంచి 9వరకు కర్నూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

కప్ అందుకుంటున్న శ్రీ విశ్వ

చదరంగంలో.. జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన చెస్ క్రీడాకారుడు మల్లంపల్లి కుషాంక్ శ్రీవిశ్వ తాడేపల్లిగూడెంలో జరిగిన ఏపీ రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో విశేష ప్రతిభ కనబరిచారు. సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో 2వ స్థానం కైవసం చేసుకున్నాడు. విజయవాడలో జరగబోయే ఇకోరెన్ ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు క్రీడాకారుడు కోచ్ సరళా మాధవి సోమవారం తెలిపారు.

సేవాతత్వం అలవాటు చేసుకోవాలి: ఎంపీడీవో

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: యువత సేవాదృక్పథాన్ని అలవాటు చేసుకోవాలని కొయ్యలగూడెం ఎంపీడీవో కిరణ్‌కుమార్ అన్నారు. గ్రామంలోని ప్రకాశం డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవాపథకం(ఎన్ఎస్ఎస్)లో భాగంగా పరింపూడిలో వారం రోజులుగా నిర్వహించిన కార్యక్రమాల ముగింపు రోజున సోమవారం ఆయన పాల్గొని మొక్కలు నాటారు.

పట్టిసీమకు పోటెత్తిన భక్తులు

పోలవరం, కొయ్యలగూడెం, ద్వారకాతిరుమల, టి.నరసాపురం, న్యూస్‌టుడే: పట్టిసీమలోని భద్రకాళీసమేత వీరేశ్వర స్వామి ఆలయానికి సోమవారం భక్తులు భారీగా తరలివచ్చారు. మొదటి సోమవారం మొంథా తుపాను కారణంగా లాంచీ రాకపోకలు నిలిపివేయడంతో రెండో వారం భక్తుల రద్దీ పెరిగింది. స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మొన్నటి వరకు గోదావరికి వరద కారణంగా నేరుగా ఆలయ మెట్ల వరకూ లాంచీ వెళ్లేది. ప్రస్తుతం వరద తగ్గి ఇసుక తిన్నెలు బయట పడటంతో దూరంగా తీసుకెళ్లి దింపుతుండటంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. ★ కొయ్యలగూడెం శివారు అంకాలగూడెం శివాలయంలో ఉమా సమేత భోగలింగేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొని దీపదానాలు చేశారు. ★ ద్వారకాతిరుమల క్షేత్రపాలకుడైన శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆలయ ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. ★ టి.నరసాపురంలోని అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరుడి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమార్చనలు చేశారు. అనంతరం ఆలయం వద్ద దాతల సహకారంతో భక్తులకు అన్నసమారాధన చేశారు.

ద్వారకాతిరుమలలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

'పంట భూముల్లో ఆయుధ డిపో వద్దు'

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: ఆదివాసీ కుటుంబాలకు జీవనాధారమైన పంట భూముల్లో నౌకాదళ ఆయుధ డిపోను నిర్మించవద్దని పలువురు వామపక్ష పార్టీల రాష్ట్ర నాయకులు కోరారు. జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెం పంచాయతీ పరిధిలోని మడకంవారిగూడెం, కొత్త చీమలవారిగూడెం, దాట్లవారిగూడెం గ్రామాల్లో నాయకుల బృందం సోమవారం పర్యటించారు. దాట్లవారిగూడెంలో ఏర్పాటైన సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సీపీఐ కేంద్ర కమిటీ సభ్యురాలు అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు కారం రాఘవ తదితరులు పాల్గొన్నారు.

భాజపాతోనే దేశ సమగ్రత

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: భాజపాతోనే దేశ సమగ్రత సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలిగ్రామ లక్ష్మీప్రసన్న తెలిపారు. మండల కమిటీ సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొని ఆమె ప్రసంగించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొల్లిన నిర్మలాకిశోర్, పార్టీ మండల అధ్యక్షుడు గొలిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సుడిగాలి సుధీర్

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో సినీ నటుడు సుడిగాలి సుధీర్ సోమవారం సందడి చేశారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనకు ఆలయ అర్చకులు, పండితులు వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. తర్వాత ఆయన అభిమానులకు సెల్ఫీలు ఇస్తూ సందడి చేశారు. ఆయన్ను చూసేందుకు, సెల్ఫీలు దిగేందుకు అభిమానులు పోటీ పడ్డారు. అనంతరం ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురం శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు.

హనుమకు లక్ష తమలపాకుల పూజ

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం లక్ష తమలపాకులతో అర్చన ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం ఒక్కరోజే వివిధ సేవల రూపేణా రూ. 1,03,348 ఆదాయం సమకూరినట్లు ఈవో ఆర్వీ చందన తెలిపారు.

రహదారి ప్రమాదంలో ఒకరి మృతి

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: జీలుగుమిల్లి మండలం రమణక్కపేట సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందారు. స్థానికుల సమాచారం ప్రకారం.. జంగారెడ్డిగూడెం వైపు నుంచి జీలుగుమిల్లి వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న ఒక వ్యక్తి ఈ ఘటనలో అక్కడికక్కడే మృతి చెందారు. ఆగి ఉన్న లారీని ప్రమాదవశాత్తు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. జీలుగుమిల్లి పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు జంగారెడ్డిగూడెం మండలం చల్లవారిగూడెం పునరావాస కాలనీలో నివాసం ఉంటున్న వేలేరుపాడు మండలం కొయిదాకు చెందిన రవి(35)గా గుర్తించినట్లు తెలిపారు.

మద్యం, నాటుసారా స్వాధీనం

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి మండలంలో నాటుసారా, గొలుసు దుకాణాలపై దాడులు చేసినట్లు ఎక్సైజ్ సీఐ అశోక్ సోమవారం తెలిపారు. ఈ దాడుల్లో మండలంలోని నాగిరెడ్డిగూడేనికి చెందిన మహిళ రమ్యను అరెస్టు చేసి నాలుగు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. రేచర్ల గ్రామంలో గొలుసు దుకాణంపై దాడిచేసి ధనలక్ష్మిని అరెస్టు చేశామన్నారు. ఆమె నుంచి ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నాగిరెడ్డిగూడేనికి చెందిన చిలకమ్మ నాటుసారా కేసులో పాత ముద్దాయి కావడంతో చింతలపూడి తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు ఆయన పేర్కొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన అవసరం

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొల్లి నిర్మలాకిశోర్ తెలిపారు. జంగారెడ్డిగూడెం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొయ్యలగూడెంలోని వీఎస్ఎన్ కళాశాల వద్ద సోమవారం క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన నిర్మలాకిషోర్ మాట్లాడారు. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన సిబ్బంది పరీక్షలు చేశారు. భాజపా నాయకులు కారింకి శ్రీనివాస్, కొండేపాటి రామకృష్ణ, క్లబ్ అధ్యక్షుడు దాసరి శేషుకుమార్ పాల్గొన్నారు.

'పది' పరీక్ష కేంద్రాల పరిశీలన

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్ష కేంద్రాలను జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఆర్.ఆషా సోమవారం పరిశీలించారు. పరింపూడి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, కొయ్యలగూడెం, పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కన్నాపురం జడ్పీ ఉన్నత పాఠశాల, కేఆర్‌పురం ఐటీడీఏ సమీపంలోని ఏపీఆర్‌టీడబ్ల్యూ గురుకుల పాఠశాలలను కొయ్యలగూడెం డీవైఈవో రామన్నదొరతో కలిసి ఆమె సందర్శించారు. ఒకే ప్రాంగణంలో ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్ష కేంద్రాలు ఉంటే తలెత్తే ఇబ్బందులపై ఉన్నతాధికారులకు నివేదిస్తానని ఆమె తెలిపారు.

పోలవరాన్ని జిల్లా చేయాలి: ఏవీఎస్పీ

వేలేరుపాడు గ్రామీన, న్యూస్‌టుడే: పోలవరం నియోజకవర్గాన్ని ప్రత్యేక ఆదివాసీ జిల్లాగా ఏర్పాటు చేసి పూరెం సింగరాజు దొర పేరు పెట్టాలని ఏవీఎస్పీ మండల అధ్యక్షుడు సోడే సీతారామయ్య కోరారు. పూచిరాలలో సోమవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

మహాగణపతి విగ్రహ ప్రతిష్ఠ

కామవరపుకోట, న్యూస్‌టుడే: తాడిచర్ల 25 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద సోమవారం మహాగణపతి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. సర్పంచి పసుమర్తి పార్థసారధి ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా గ్రామోత్సవం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: కార్తిక సోమవారం సందర్భంగా ద్వారకాతిరుమల క్షేత్రపాలకుడైన శ్రీభ్రమరాంబమల్లేశ్వరస్వామివారి గ్రామోత్సవం నేత్రపర్వంగా జరిగింది. తొలుత స్వామి, అమ్మవార్లను నంది వాహనంపై కొలువు తీర్చి విశేషంగా అలంకరించారు. అర్చకులు స్వామివారికి హారతి ఇచ్చి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామివారు నంది వాహనంపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు పోటీ పడ్డారు.

(c) eenadu

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

కాశీవిశ్వేశ్వరుడికి విశేష పూజలు

కోరుకొల్లు: దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కోరుకొల్లు (కలిదిండి), న్యూస్‌టుడే: కార్తిక మాసం రెండో సోమవారం పురస్కరించుకుని కోరుకొల్లులో శ్రీఅన్నపూర్ణాంబ కాశీ విశ్వేశ్వర స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకుడు ఓమ్ ఆధ్వర్యంలో మహిళలు శివలింగాకారంలో దీపాలు వెలిగించారు.

రాష్ట్ర స్థాయికి ఎంపిక

మండవల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు లోకుమూడి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఫలంగ వెంకటేశ్వరరావు తెలిపారు. గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 09న నిర్వహించిన ఖోఖో పోటీల్లో అండర్‌-17 విభాగంలో సంజన, అండర్‌-14లో టన్నీ కమల, మహిమ ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పీడీ వేణుబాబును సర్పంచి నాగమణి, సునీత, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎంపికైన వారితో వేణుబాబు

కార్తికం.. శివోహం

కైకలూరు, న్యూస్‌టుడే: కార్తిక మాసం రెండో సోమవారం కావడంతో మండలంలోని వివిధ క్షేత్రాలు శివ నామస్మరణతో మార్మోగాయి. స్థానిక శ్రీశ్యామలాంబ అమ్మవారి దేవస్థానం సముదాయంలో ఉన్న రామలింగేశ్వర, రామేశ్వర, కనకలింగేశ్వర స్వామి వార్లకు అర్చకులు బస్వాభిషేకం, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు జరిపారు. ఈవో పీవీఎస్ శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ★ గోనెపాడు స్వయంభూ శ్రీగంగాపార్వతీ సమేత జలలింగేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు వైభవోపేతంగా జరిపారు. ★ మండలంలోని సీతనపల్లి, రామవరం, దొడ్డిపట్ల, వదర్లపాడు, భుజబలపట్నం, ఆటపాక శివాలయాల్లోనూ ప్రత్యేక పూజలు, సహస్ర నామార్చన, క్షీరాభిషేకాలు చేశారు.

కైకలూరు: జలలింగేశ్వరస్వామి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని శివాలయాల్లో శివనామస్మరణ మార్మోగింది. గురజ, పెదపాలపర్రు, సింగరాయపాలెం, వణుదుర్రు, అల్లూరు, దేవపూడి, ప్రొద్దువాక శివాలయాల్లో వేకువజాము నుంచే భక్తులు పోటెత్తారు. మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేశారు. బిల్వార్చనలు, మహారుద్రాభిషేకం నిర్వహించారు.

వైభవంగా.. ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లిలోని గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, దుర్గా పార్వతీ సమేత మల్లికార్జున స్వామి శివాలయాల్లో కార్తిక శుద్ధ త్రయోదశి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. పంచామృత, ఫలామృత అభిషేకాలను ఆలయ ఈవో సీహెచ్ సాయి పర్యవేక్షణలో అర్చకులు దేవులపల్లి శ్రీనివాసమూర్తి నిర్వహించారు. రాత్రి సమయంలో ఆకాశదీపం వెలిగించారు.

బలివే శివాలయంలో రద్దీ.. ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం బలివే రామలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. తమ్మిలేరులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఈవో సీతారామయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

చాట్రాయి, న్యూస్‌టుడే: సూరంపాలెం ఉపకేంద్రం పరిధిలో సాంకేతిక పనులు నిర్వహిస్తున్న దృష్ట్యా మంగళవారం చనుబండ, కృష్ణారావుపాలెం గ్రామాల్లో సాయంత్రం వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సంజయ్ తెలిపారు.

చెత్త తొలగింపు

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు 2వ వార్డులో కొన్ని రోజులుగా చెత్త సేకరణ చేయకపోవడంతో ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్గంధం వస్తుందని స్థానికుడు కేశవ సోమవారం 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ ఈవో ప్రసాద్ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన చెత్త వ్యర్థాలను తొలగింపజేశారు.

మనలోనూ కబోయే విశ్వవిజేతలు

జాతీయ స్థాయిలో రాణిస్తున్న విద్యార్థులు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: అబ్బాయిలకు దీటుగా అమ్మాయిలు కూడా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. 'అమ్మాయిలు ఇంటికే పరిమితం' అనే నానుడిని తిరగరాస్తూ.. చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటుతున్నారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ పాఠశాల విద్యార్థులు నిత్యం సాధన చేస్తూ.. జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్నారు. మహిళ క్రికెట్ జట్టు విశ్వవిజేతగా నిలిచిన నేపథ్యంలో మన క్రీడాకారిణులపై ప్రత్యేక కథనం.

ఏకాగ్రత పెరుగుతోంది..

నా పేరు గీత. మాది విజయవాడ. అమ్మ, నాన్న చనిపోయారు. హీల్ పాఠశాలలోనే ఉంటూ 9వ తరగతి చదువుతున్నా. ఖోఖోలో జాతీయ స్థాయిలో తలిస్థానం, షార్ట్‌పుట్‌లో పలు పతకాలు సాధించా. కలెక్టర్ అవ్వాలనేదే నా లక్ష్యం. క్రీడల్లో రాణించడంతో ఏకాగ్రత పెరుగుతోంది.

పీఈటీ అవుతా..

నా పేరు సంజన. మాది చిలకలూరిపేట. 9వ తరగతి చదువుతున్నా. నాన్న మరణించారు. అమ్మ వెంకాయమ్మ కూలి పనులు చేస్తోంది. రాష్ట్ర స్థాయి వాలీబాల్, జాతీయ స్థాయి అథ్లెటిక్స్, ఖోఖోలో ప్రతిభ కనబరిచా. బాస్కెట్‌బాల్‌లో రాష్ట్రస్థాయిలో తొలి స్థానం సాధించా. పీఈటీ అవుతా.

వ్యాయామ ఉపాధ్యాయిని కావాలని..

నా పేరు షైనీ చందన. మా ఊరు ఏలూరు. 8వ తరగతి చదువుతున్నా. నాన్న చనిపోయారు. అమ్మ రత్నకుమారి కూలి పనులు చేస్తోంది. సాఫ్ట్‌బాల్, ఫుట్‌బాల్ జాతీయ స్థాయిలో, అథ్లెటిక్స్‌ 100మీ పరుగు పందెంలో పతకాలు సాధించా. ఖోఖో ఇండియా యూత్ గేమ్స్‌లో జాతీయ స్థాయిలో సత్తా చాటా. ప్రభుత్వ వ్యాయామోపాధ్యాయిని కొలువు సాధిస్తా.

క్రీడా కోటాలో..

నా పేరు లక్ష్మీ కావ్య. మాది కర్నూలు. 8వ తరగతి చదువుతున్నా. తండ్రి రాజశేఖర్ ప్రైవేటు ఉద్యోగం చేస్తారు. తల్లి సుబ్బమ్మ మరణించారు. ఖోఖోలో ఏపీ, తెలంగాణలో జరిగిన పలు పోటీల్లో ప్రతిభ చాటా. 2024, 2025లో హర్యానా, అయోధ్యల్లో జరిగిన జాతీయ స్థాయి ఖోఖో, అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించా. క్రీడా కోటాలో ఉద్యోగం సాధిస్తా.

పతకాలు సాధించా..

నా పేరు జ్యోతి లక్ష్మి. మా ఊరు కోటప్పకొండ. 8వ తరగతి చదువుతున్నా. తండ్రి బాలాజీ, తల్లి మీనాక్షి కూలి పనులు చేస్తారు. ఖోఖోలో జాతీయ స్థాయిలో సత్తా చాటా. రాష్ట్ర స్థాయి 200, 500 మీటర్ల పరుగు పందెంలో పతకాలు సాధించా. ఐపీఎస్ అధికారి అవుతా.

మంత్రి అభినందనలు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: విశ్వవిజేతగా నిలిచిన భారత మహిళా జట్టుకు మంత్రి కొలుసు పార్థసారథి సోమవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. ★ నూజివీడులోని తెదేపా కార్యాలయంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ బొబ్బిలి రూపాశ్రీరాణి, తెదేపా నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కోశారు. మాజీ కౌన్సిలర్లు కృష్ణకుమారి, గొల్లు దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

కేకు కోసిన రూపాశ్రీరాణి తదితరులు

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని నూజివీడు డైట్‌లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో అనిత (రమణక్కపేట, జడ్పీహెచ్‌ఎస్), దివ్యశ్రీ (రమణక్కపేట, జడ్పీహెచ్‌ఎస్), గోపి నాగశ్రీకృష్ణ (గోపవరం, జడ్పీహెచ్‌ఎస్) విద్యార్థులు దక్కించుకున్నారని డైట్ సుధాకర్ తెలిపారు. ఎంఈవోలు ప్రసాదరావు, బ్రహ్మాచారి, సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ముఖ్యం: కామినేని

కైకలూరు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను పరిష్కరించడమే ముఖ్యమని, ఆ దిశగా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతాంగం ఎదుర్కొంటున్న ఎల్పీ నంబర్ల, ఇతర సమస్యలను పరిష్కరించాలని జిల్లా యంత్రాంగంతో మాట్లాడతామన్నారు. డీఈవో అనూరాధ మాట్లాడుతూ.. పోలరాజ్, కాంటూర్ బెల్ట్ పంట కాలువ ఆధునికీకరణ పనులు త్వరలోనే ప్రారంభిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఎంపీపీ కృష్ణ పాల్గొన్నారు.

అధికారులు పని సత్వరం.. నాయకుడు సమర్థుడు అయితే పాలనా వ్యవస్థ ఎంత బలంగా ఉంటుందో తెలిసేందుకు మొంథా తుపానులో ముఖ్యమంత్రి చంద్రబాబు, అధికార యంత్రాంగం పని తీరే నిదర్శనమని ఎమ్మెల్యే శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయ వేదికలో ప్రాణ, ఆస్తి నష్టం తలెత్తకుండా ప్రజలకు అవగాహన కల్పించిన నాలుగు మండలాలకు చెందిన అధికారులను ఎమ్మెల్యే సత్కరించారు. డీపీవో అనూరాధ, డీఎల్‌పీవో అమ్మాజీ, డీసీచైర్మన్ వాసురాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

రోడ్డు నిర్మించాలి.. మండవల్లి, న్యూస్‌టుడే: చింతపాడు ఆంజనేయస్వామి ఆలయం నుంచి స్థానిక సచివాలయం వరకు రోడ్డును నిర్మించాలని గ్రామస్థులు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌ను కోరారు. సోమవారం ఓ ప్రైవేటు కార్యక్రమానికి గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను వారు కలిసి సమస్యను విన్నవించారు. రోడ్డు శిథిలావస్థకు చేరడంతో ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. దీనిపై కామినేని స్పందిస్తూ.. రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. నాయకులు బలే యేసురాజు, మండల కొండలు, జయమంగళ వీరాజు తదితరులు పాల్గొన్నారు.

వరికి రక్షణ కల్పించండి

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్థానిక కలెక్టరేట్ ఎదుట ఆగిరిపల్లి మండలంలోని పలు గ్రామాల రైతులు ఆందోళనకు దిగారు. ముంపుతో దెబ్బతిన్న వరి కంకులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. సగ్గూరు చెరువు కారణంగా వరి చేలు ముంపు బారిన పడుతున్నాయన్నారు. చెరువు కల్వర్టు ఎత్తు తగ్గించాలని జలవనరుల శాఖాధికారులను కోరినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ ఏడాది చెరువును చేపల సొసైటీ వేలం పాడిందని.. సాగర్ జలాలతో తటాకం నింపి రైతులకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వికి వినతి పత్రం అందజేశారు.

దెబ్బతిన్న కంకులతో నిరసన తెలుపుతున్న రైతులు

'మీ కోసం'లో వినతుల వెల్లువ

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: వివిధ శాఖల పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కారం చూపించాలని సంబంధిత అధికారులకు సబ్‌ కలెక్టరు వినూత్న తెలిపారు. స్థానిక సబ్‌ కలెక్టరు కార్యాలయంలో సోమవారం ఆమె మీ కోసం కార్యక్రమంలో పాల్గొని.. ఫిర్యాదుదారుల నుంచి 95 అర్జీలను స్వీకరించారు. ★ నూజివీడులో నిర్మించిన రైతు సేవా కేంద్రం, సచివాలయం, హెల్త్ సెంటర్ల బిల్లులు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని గుత్తేదారు శ్రీనివాసరావు కోరారు. ★ నూజివీడు పట్టణంలో ఆర్ఎస్ నం.499లోని ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూమిని ఇల్లు లేని నిరుపేదలకు కేటాయించాలని కౌన్సిలర్ కొమ్మన విజయ కోరారు. ఇటువంటి సమస్యలు అనేకం సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆమె ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

అర్జీని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ వినూత్న

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

కైకలూరు, న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంత అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అత్యవసర వైద్య సేవలు పొంది సీఎం సహాయనిధికి దరఖాస్తులు చేసుకున్న 16 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.10,20,965 నగదు చెక్కులను సోమవారం స్థానిక ట్రావెలర్స్ బంగ్లాలో కూటమి నాయకులతో కలిసి బాధితులకు అందజేశారు.

మహాసభను విజయవంతానికి పిలుపు

ముసునూరు, న్యూస్‌టుడే: డిసెంబర్ 6, 7 తేదీల్లో కడపలో జరిగే 8వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎంఎల్ లిబరేషన్ మండల కార్యదర్శి మేముల బర్మయ్య పిలుపునిచ్చారు. సోమవారం ముసునూరు మండల గుళ్లపూడిలో కిసాన్ మహాసభ మండల కార్యదర్శి పామర్తి రామారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కరపత్రాలు పంచుతూ.. ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బర్మయ్య మాట్లాడుతూ.. మొంథా తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుని నష్టపరిహారం చెల్లించాలన్నారు. భవానీ, రాణి, సాయిరాం, రాజేశ్వరి పాల్గొన్నారు.

మండవల్లి ఎంపీడీవోగా రమణబాబు

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండల పరిషత్తు అభివృద్ధి అధికారిగా రమణబాబు సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. 18 నెలల క్రితం ఎంపీడీవో శేషగిరిరావు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఇన్‌ఛార్జులతోనే నెట్టుకొస్తున్నారు. మచిలీపట్నం జడ్పీ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న రమణను పదోన్నతిపై ఇక్కడికి కేటాయించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన రమణబాబును కార్యదర్శులు స్వాగతం పలికారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యదర్శులు

చువ్వలు.. ప్రమాద ఘంటికలు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: దేవపూడి-ఈడేపల్లి ఉన్న పెదలంక డ్రెయిన్‌పై వంతెన శిథిలావస్థకు చేరింది. దేవపూడి పీహెచ్‌సీ, అల్లూరు ఉన్నత పాఠశాల, పీఏసీఎస్‌లకు వెళ్లడానికి ఆ రెండు గ్రామాలతో పాటు బొమ్మినంపాడు, అల్లూరు, ములకలపల్లి, కొర్రగుంటపాలెంకు ఇదే ప్రధాన వంతెన. పెచ్చులూడి చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. నూతన వారధి నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై డ్రెయినేజీ ఏఈ భోగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. నూతన వంతెన నిర్మాణానికి గతంలోనే రూ.3.5 కోట్లతో అంచనాలు, డిజైన్ రూపొందించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తే.. దానికి సంబంధించిన మట్టి పరీక్షల నివేదిక కావాలన్నారన్నారు. అంత బడ్జెట్ లేకపోవడంతో పరీక్షలు చేయించలేదన్నారు.

బయటకు వచ్చి ప్రమాదకరంగా ఇలా..

ఆరబెట్టిన ధాన్యం.. వానొస్తే కలవరం

చాట్రాయి, న్యూస్‌టుడే: ఆకస్మికంగా మారిన వాతావరణంతో మెట్ట ప్రాంత రైతుల్లో తీవ్రమైన ఆందోళన నెలకొంది. మొంథా ప్రభావం తగ్గిన నేపథ్యంలో కోతలు కోసి ధాన్యం రాశులను తేమ శాతం తగ్గించేందుకు ఆరపెట్టారు. సోమవారం మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు రావడంతో రైతులు ఆ రాశుల వద్ద పట్టాలతో వర్షమొస్తే రక్షణ చర్యల ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. మళ్లీ తుపాను సూచనతో రైతుల్లో కలవరం నెలకుంది. ధాన్యం అమ్మకాలు పూర్తయ్యే వరకు వరుణ దేవుడు కరుణించాలని కోరుకుంటున్నారు.

ఆడితే వ్యాధులొస్తాయని మాకేం తెలుసు!

మండవల్లి మండలం కొవ్వాడలంకలో డ్రెయినేజీలు పొంగిపొర్లడంతో మొదటి సిమెంట్ రోడ్డులో భారీఎత్తున మురుగునీరు వచ్చి చేరింది. సిమెంటు రోడ్డు కిందకు ఉండటం(లోలెవల్)తో పక్కనే ఉన్న ఆక్వా సాగుదారులు నీటిని బయటకు తోడిన ప్రతిసారీ ఇలాగే మునిగిపోతోంది. పదేపదే రోడ్డు ముంపుతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాధులు ప్రబలుతాయని ఆందోళన చెందుతున్నారు. చిన్నారులు సైతం ఆ నీటిలో ఆటలాడుతూ.. అనారోగ్యానికి గురవుతున్నారని వాపోతున్నారు. ఈ విషయమై కార్యదర్శి రాము మాట్లాడుతూ.. మురుగునీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, మండవల్లి**

నగదు అందించిన అధికారులు, నాయకులు

ఆర్థికసాయం అందజేత

కైకలూరు, న్యూస్‌టుడే: కూటమి పేదల ప్రభుత్వమని ఎంపీపీ అడవి వెంకటకృష్ణ, తెదేపా మండలాధ్యక్షుడు పెన్మత్స త్రినాథరాజు అన్నారు. మొంథా బాధితులకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి, ముగ్గురి కంటె ఎక్కువ మంది ఉంటే రూ.3 వేల ఆర్థిక సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ రామకృష్ణారావు, కూటమి నాయకులు బాధిత కుటుంబాలకు నగదు అందించారు. వైస్ ఎంపీపీ రామకృష్ణ, డీసీ ఛైర్మన్ వాసురాజు తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం గుర్తింపు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణంలోని చిన్న వంతెనపై నుంచి యనమదుర్రు కాలువలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన కలిదిండి మండలం పెదపుట్లపూడి గ్రామానికి చెందిన నడికుదిటి దేశం గిరాజు(65) మృతదేహం దొరికిందని పోలీసులు తెలిపారు. కొంత కాలం నుంచి క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన భీమవరం ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అక్టోబరు 31న బయటకు వెళ్లిపోయి కాలువలోకి దూకినట్లు అతని కుమార్తె లక్ష్మీపార్వతి ఇచ్చిన ఫిర్యాదుపై హెడ్‌కానిస్టేబుల్ భూషణం కేసు నమోదు చేశారు. సోమవారం మొగల్తూరు మండలం పాతపాడు దగ్గర మృతదేహాన్ని కాలువలో గుర్తించామన్నారు.

లైంగిక వేధింపులపై వివాహిత ఫిర్యాదు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: లైంగిక వేధింపులపై ఓ వివాహిత పోలీసులను ఆశ్రయించిన ఘటన ఇది. ఎస్సై లక్ష్మణ్‌బాబు కథనం ప్రకారం.. యనమదలకు చెందిన ఓ వివాహితను అదే గ్రామానికి చెందిన మరిది వరసయ్యే ఎం.శ్రీకాంత్ వేధిస్తున్నాడు. దీనిపై ఆమె ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

పురుగు మందు తాగేందుకు యత్నం.. దీనిని పోలీసు స్టేషన్ బయట పెద్దల సమక్షంలో పంచాయితీ చేస్తుండగా శ్రీకాంత్ పురుగు మందు తాగేందుకు యత్నించాడు. గమనించిన పెద్దలు ఆపారు. 'పెద్దల సమక్షంలో చర్చలు జరుగుతున్నాయి. ఇది స్టేషన్ బయట జరిగిందేమో మాకు సమాచారం లేదు.' అని ఎస్సై తెలిపారు.

కొన్ని చకచకా.. మరికొన్ని నత్తనడక

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ 16 నెలల్లో నూజివీడు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. ఒక్క నూజివీడు మండలంలోనే రూ.కోటికి పైగా వెచ్చించి సిమెంటు రహదారులను నిర్మించారు. పలు గ్రామాల్లో డ్రెయిన్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి వచ్చిన పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. నిధులు విడుదల అయ్యేలా చొరవ చూపుతున్నారు. ప్రధానంగా నూజివీడు నుంచి ఏలూరు జిల్లాకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి, నూజివీడు నుంచి ఈదులగూడెం మీదుగా ఆగిరిపల్లి విజయవాడ, నూజివీడు నుంచి చంద్రాల వెల్వడం మీదుగా మైలవరం రహదార్లు పూర్తిగా శిథిలమయ్యాయి. ఈ పనులు నత్తనడకన సాగడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. పురపాలక సంఘం పరిధిలో రహదార్లు వీటికి ఏ మాత్రం తీసిపోని విధంగా ఉన్నాయి.

పోలసానపల్లిలో ప్రారంభమైన మురుగు కాలువ పనులు

నూజివీడు మండలంలో డ్రెయిన్ల నిర్మాణానికి నిధులు మంజూరవడంతో పనులు ప్రారంభమయ్యాయి. పోలసానపల్లిలో రూ.4 లక్షలు, రామన్నగూడేనికి రూ.4.9లక్షలు పనులు ప్రారంభమయ్యాయి. సుంకొల్లు 5 పనులకు రూ. 25లక్షలు, పోతురెడ్డిపల్లిలో రెండు పనులకు రూ.10 లక్షలు, బత్తులవారిగూడెంలో మూడు పనులు రూ.6 లక్షలు పనులు పూర్తయ్యాయి. పాతరావిచర్లలో 3 వర్క్‌లకు రూ.7 లక్షలు, ఈస్ట్ దిగవల్లిలో ఒక పనికి రూ. 4.90 లక్షలు, మర్రిబంధంలో 3 పనులకు రూ.11 లక్షలు, జంగంగూడేనికి రూ.4 లక్షలు, రేగుంటకు రూ.24లక్షలు, యనమదలకు రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది.

సమయపాలన పాటించకుంటే చర్యలు

చాట్రాయి, న్యూస్‌టుడే: సమయపాలన పాటించకపోతే చర్యలు తీసుకుంటామని, విధిగా ప్రతి ఒక్కరూ సచివాలయానికి వచ్చాక గ్రామంలో సందర్శన చేయాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. బూరుగుగూడెం సచివాలయాన్ని సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. తాను ఇకపై ప్రతి రోజూ సచివాలయాలను సందర్శిస్తానని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తెలిపారు. నరసింహారావుపాలెం సచివాలయాన్ని సందర్శించి విధులపై సూచనలు అందించారు.

మాట్లాడుతున్న సత్యనారాయణ

గడ్డివాము దగ్ధం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: బొమ్మినంపాడు శివారు జానకిగూడెంలో సోమవారం తెల్లవారుజామున విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో సాయికి చెందిన పశువుల పాక, గడ్డి వాము దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న కైకలూరు అగ్నిమాపకశాఖ అధికారి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు. పశువులు పాక్షికంగా గాయపడ్డాయి. సుమారు రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు.

భూమిని పంచాయతీకి అప్పగించాలని వినతి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: వంద సంవత్సరాల ప్రభుత్వ భూమికి పట్టాను మంజూరు చేయడంపై రావిచర్ల సర్పంచి కాపా శ్రీనివాసరావు సోమవారం సబ్‌కలెక్టరు వినూత్నకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో సర్వే నం.422లో 0.15 ఎకరాల ప్రభుత్వ స్థలం బంజరు భూమిగా పంచాయతీ ఆధీనంలో ఉందన్నారు. 15 సంవత్సరాల కిందట ఆ స్థలంలో బోరు, విద్యుత్తు మోటారు ఏర్పాటు చేసి ప్రజలకు నీటి సరఫరా చేస్తున్నామన్నారు. ఎస్సీ సామాజిక వర్గంలో ఎవరైనా చనిపోతే ఈ బావి వద్ద స్నానాలు చేసి ఇళ్లకు వెళ్లడం ఆచారంగా సాగుతోందన్నారు. ఇటీవల గ్రామ వీఆర్వో 10 సెంట్ల భూమిని ప్రైవేటు వ్యక్తులకు పట్టా, ఎల్‌పీఎం చేశారని, సదరు ప్రభుత్వ అధికారిపై చర్యలు తీసుకోవాలని, భూమిని పంచాయతీకి అప్పగించాలని కోరారు.

నూజివీడు-ఏలూరు రహదారికి మరమ్మతులు

ముసునూరు, న్యూస్‌టుడే: అధ్వానంగా తయారైన నూజివీడు నుంచి పోతురెడ్డిపల్లి, సింహాద్రిపురం, ముసునూరు, గోపవరం, వేల్పుచర్ల మీదుగా ఏలూరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారికి సోమవారం మరమ్మతులు చేశారు. రహదారి దుస్థితిపై గత నెల 23న 'ఈనాడు'లో 'దారులు దారుణం.. ప్రయాణం ప్రమాదకరం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దానికి స్పందించిన మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాలతో ఆర్‌అండ్‌బీ డీఈ బాబూరావు, తెదేపా మండలాధ్యక్షుడు గద్దె రఘు ఆధ్వర్యంలో సోమవారం రహదారికి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. గుంతలు పూడ్చివేతతో వాహనదారులకు కొంత ఊరట లభించింది.

సింహాద్రిపురం వద్ద పనులు చేస్తున్న యంత్రం

మంత్రి సేవలు అభినందనీయం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్న వారికి అన్ని విధాలా అండగా ఉంటున్న మంత్రి పార్థసారథి సేవలు అభినందనీయమని తెదేపా నాయకుడు)పామర్తి నరసయ్య అన్నారు. ఆగిరిపల్లి తెదేపా సీనియర్ నాయకుడు బట్టుమర్తి రవీంద్ర సోదరుడి కుమారుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మంత్రి ఆదేశాలతో నెరుసు సతీశ్ రూ.25 వేల నగదును బాధితుడికి సోమవారం అందజేశారు. విక్టర్‌బాబు, శ్రావణ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని విజ్ఞప్తి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ రీ ఆర్గనైజ్‌డ్ టీచర్స్ యూనియన్ ఉపాధ్యాయులు కలెక్టరుకు సోమవారం ఏలూరులో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాణిజ్య, విద్యాసంబంధాలు అధికంగా ఉన్న విజయవాడకు దీనిని అనుసంధానం చేయడం సబబు అని పేర్కొన్నారు. ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో ఎన్టీఆర్ జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. వీవీఎస్సార్ ప్రసాద్, శ్రీనివాసరావు, నాగేంద్రరావు, జోసఫ్, బీవీవీఎస్‌వీ ప్రసాద్, హేమసుందరరావు, అబ్దుల్ కరీమ్, బీమ్లా నాయక్, పీవీఆర్ రవికుమార్, వీవీ ఈశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు నీడ.. రైతుకు అండ

నియోజకవర్గానికి 150 గోకులం షెడ్ల మంజూరు

చాట్రాయి, న్యూస్‌టుడే: మూగ జీవాలకు నీడ.. పాడి రైతుకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎండా.. వానా కాలాల్లో మూగజీవాలు ఆరుబయట ఉండటంతో వ్యాధులు వ్యాపించి పాల ఉత్పత్తిపై ప్రభావం పడుతుంది. ఫలితంగా పశు పోషణ రైతుకు భారమవుతుంది. దీని నివారణకు పాడి రైతులకు ప్రోత్సాహం అందించేలా.. గోకులం పథకంలో షెడ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం నిధులు ఇస్తోంది. నూజివీడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 150 గోకులాలను మంజూరు చేశారు. ఉపాధి హామీ నిధులను ఒక్కో గోకులానికి.. రూ.20,700 లను కేటాయించగా.. రూ.2,300 లబ్ధిదారుల వాటా ధనంగా నిర్ణయించారు. వీటిని వారు చెల్లించకుండానే మినహాయించి నగదు మంజూరు చేసే సమయంలో మినహాయిస్తారు. త్వరలో లబ్ధిదారుల ఎంపిక మొదలుకానుంది.


చనుబండలో నిర్మించిన షెడ్డు

మండలం	మంజూరైన గోకులాలు	నిధులు (రూ.లక్షల్లో)
నూజివీడు	41	94.30
ఆగిరిపల్లి	34	77.75
చాట్రాయి	35	80.80
ముసునూరు	40	92.00

అర్హతలు ఇలా..

- ➤ లబ్ధిదారునికి 4-6 పశువులు ఉండాలి.
- ➤ కనీసం అయిదెకరాల్లోపు స్థలం ఉండాలి. వేరే వ్యక్తి స్థలంలో నిర్మించరాదు.
- ➤ గతంలో లబ్ధిదారుడిగా ఉండరాదు. రేషన్ కార్డు అవసరం.
- ➤ పాడి రైతుగా గుర్తిస్తూ పశు వైద్యులు ధ్రువీకరించాలి.

(c) eenadu

శివరూపం.. భువి కైలాసం

దుర్గాడ శివాలయంలో విశేష అలంకరణ

సామర్లకోట భీమేశ్వరాలయంలో అభిషేకం

కార్తిక సోమవార పూజలు అంతటా భక్తిశ్రద్ధలతో జరిపించారు ఉదయాన్నే పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాల్లో అభిషేకాలు చేయించారు. శివయ్యను వేడుకుని మహిళలు తమ ఇంటిల్లిపాదినీ చల్లగా చూడాలని వేడుకున్నారు. శివలింగాలకు అలంకరణలు చేసి తరించారు.

– న్యూస్‌టుడే, పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట

పర్యాటకులూ.. పారాహుషార్

ఇటీవల రాష్ట్రంలోని వివిధ జిల్లాల పరిధి సముద్ర తీరాల్లో జరుగుతున్న ప్రమాదాల్లో పర్యాటకులు ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో సోమవారం కాకినాడ కోస్టల్ సెక్యూరిటీ(మెరైన్) పోలీస్ స్టేషన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తుపాను ప్రభావంలో సముద్రతీర ప్రాంతాల్లోని జలాల్లో చాలాచోట్ల భారీ గుంతలు ఏర్పడ్డాయని, కార్తిక మాసంలో సముద్ర స్నానాలు, పూజలకు వచ్చేవారు పోలీసుల సూచనలు తప్పక పాటించాలని సూచించారు.

– న్యూస్‌టుడే, సర్పవరం

మంధాన.. హర్మన్.. మీ ఇంట్లోనూ ఉన్నారు!

ప్రోత్సహిస్తే క్రికెట్ మెరికలే

స్మృతి మంధానా.. హర్మన్ ప్రీత్ కౌర్.. జెమీమా రోడ్రిగ్స్.. భారత మహిళా క్రికెట్ జట్టు ప్రపంచకప్ గెలుచుకోవడంతో అందరి నోళ్లలో నానుతున్న పేర్లివి. ఒకప్పుడు పురుషులకే పరిమితమైన క్రికెట్‌లో ఇప్పుడు మహిళలు వారికి దీటుగా సత్తా చాటుతున్నారు. ఉమ్మడి జిల్లాలోనూ బాలికలు, యువతులు క్రికెట్‌లో శిక్షణ తీసుకుంటున్నా వారి సంఖ్య మరింత పెరగాల్సి ఉంది. తల్లిదండ్రులూ పిల్లల్లో ప్రతిభను గుర్తించాలి. ప్రపంచకప్ విజయం స్ఫూర్తితో మంధానా, హర్మన్‌లను ప్రోత్సహిద్దాం.. గుర్తిద్దాం.

–న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

లెగ్ స్పిన్‌తో తిప్పేస్తూ..

రాజమహేంద్రవరానికి చెందిన రాజభార్గవి లక్ష్మి డిగ్రీ చదువుతోంది. తండ్రి ఎస్‌వీఎస్ ప్రసాద్‌కు కికెట్ అంటే ఇష్టం కావడంతో కుమార్తెను క్రికెట్ కోచింగ్‌లో చేర్చారు. ఆరేళ్ల నుంచి కోచ్ హకీం పాషా వద్ద శిక్షణ పొందుతోంది. లెగ్ స్పిన్నర్, బ్యాటర్‌గా సత్తా చాటుతుంది. ఇటీవల జరిగిన ఎంపిక మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీసి, అండర్-19 రాష్ట్ర మహిళా జట్టులో స్థానం దక్కించుకుంది. ఇండియా జెర్సీ ధరించాలనేది తన ధ్యేయమని పేర్కొంది.

ఉచిత శిక్షణ పొందుదాం.. రండి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలబాలికలకు పదేళ్ల నుంచి ఉచితంగా క్రికెట్‌లో శిక్షణ ఇస్తున్నారు. కాకినాడలో ప్రధాన కేంద్రం, రాజమహేంద్రవరం, పెద్దాపురం, అంబాజీపేటలో సబ్ సెంటర్లు ఉన్నాయి.

- **కాకినాడ:** రంగరాయ వైద్య కళాశాల క్రీడా మైదానంలో బాలురుతో పాటు బాలికలకు కూడా క్రికెట్‌లో శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం సుమారు 10 మంది వరకూ బాలికలు తర్ఫీదు పొందుతున్నారు. వివరాలకు కోచ్ ఇజ్రాయెల్ రాజు 9032277135 నెంబర్‌ను సంప్రదించాలి.
- **పెద్దాపురం:** శ్రీ ప్రకాశ్ స్కూల్ ప్రాంగణంలో శిక్షణ ఇస్తున్నారు. ఇద్దరు అమ్మాయిలు రాష్ట్ర స్థాయి పోటీల్లో, ఏపీఎల్ తదితర పోటీల్లో పాల్గొన్నారు. కోచ్ దుర్గాప్రసాద్ (9848664468).
- **రాజమహేంద్రవరం:** లలితానగర్‌లోని సీజీటీఎం పాఠశాల మైదానంలో 2021 నుంచి ప్రత్యేకంగా బాలికలకు మాత్రమే శిక్షణ ఇస్తున్నారు. కోచ్ హకీమ్ (9948612786).
- **అంబాజీపేట:** జెడ్పీ హైస్కూల్ మైదానంలో బాలబాలికలకు క్రికెట్‌లో శిక్షణ ఇస్తున్నారు. కోచ్ వెంకటనగేష్ (7382110517)

మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే..

జిల్లాలో ఇప్పటివరకు కేవలం 300 మంది మాత్రమే శిక్షణ తీసుకున్నారు. సుమారు 15 మంది రాష్ట్రస్థాయి క్రికెట్ జట్లకు ఎంపికయ్యారు. కొంతమంది యూనివర్సిటీ స్థాయిలో ఆడగా, కొందరు జిల్లా స్థాయిలో మరికొంత మంది ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ జాతీయస్థాయిలో ప్రాతినిధ్యం వహించారు. జిల్లాలో మరిన్ని మైదానాలు అందుబాటులోకి తీసుకొచ్చి, క్రికెట్ కిట్లు అందజేస్తే మరింత మంది బాలికలు ఉత్సాహం చూపిస్తారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

8 ఏళ్ల వయస్సు నుంచి బాలికలు శిక్షణ పొందొచ్చు. జిల్లా జట్టు తరఫున ఇతర ప్రాంతాలకు మ్యాచ్‌లకు వెళితే ప్రయాణ ఖర్చు, వసతులు కల్పిస్తాం. ఈ అవకాశాన్ని అందరూ అందిపుచ్చుకోవాలి.

- నక్కా వెంకటేష్, కార్యదర్శి, జిల్లా క్రికెట్ అసోసియేషన్

అటు బ్యాటింగ్.. ఇటు కీపింగ్

ఇంటర్ చదువుతున్న వీర విద్యశ్రీ గత ఐదేళ్ల నుంచి ఆర్‌ఎంసీలో కోచింగ్ తీసుకుంటోంది. ఓపెనింగ్ బ్యాటర్, వికెట్‌కీపర్‌గా రాణిస్తోంది. అండర్-15, అండర్-19 జిల్లా జట్లకు కెప్టెన్‌గా వ్యవహరించింది. అండర్-15 రాష్ట్ర మహిళా జట్టుకు రెండుసార్లు ప్రాతినిధ్యం వహించింది. 2022లో ఏసీఏ మహిళా ప్రీమియర్ లీగ్‌లో ఆడింది. ఇప్పుడు మరోసారి అండర్-19 రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. జాతీయ జట్టుకు ఆడాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుంది.

పక్షి ప్రేమికుడు

వాతావరణం కాలుష్యానికి తోడు సరైన ఆహారం దొరకక పలు రకాల పక్షు జాతులు అంతరించిపోతున్నాయి. ఈ నేపథ్యంలో కాకినాడ కస్టమ్స్ హౌస్(ఎన్సీఎఫ్) కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎ. శ్రీధర్ తనవంతు బాధ్యతగా వాటి కోసం నీరు, ఆహారం అందేలా కృషిచేస్తున్నారు. కార్యాలయ ఆవరణలో ప్రత్యేకంగా తయారు చేసిన లాంతరు లాంటి డబ్బాలను నాలుగైదు చోట్ల ఏర్పాటు చేసి గింజలు ఉంచుతారు. ధాన్యం గుత్తులను చెట్ల వద్ద. . తాళ్ల సహాయంతో వేలాడదీస్తున్నారు. పిచ్చుకలు, రామచిలుకలు, పావురాలు వంటివి పెద్దసంఖ్యలో అక్కడకు వచ్చి వాటిని తింటాయి. ఇది తనకెంతో ఆనందాన్నిస్తుందని శ్రీధర్ పేర్కొన్నారు.

–న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

నీళ్లు రావాలంటే నిధులు పారాలి!

పల్లెల్లో అసంపూర్తిగా జల్‌జీవన్ పనులు

ఈనాడు, కాకినాడ: ప్రతి ఇంటికీ రక్షిత నీటి కుళాయి, రోజుకు తలసరి 55 లీటర్ల నీటి సరఫరా జల్‌జీవన్ మిషన్ పథకం లక్ష్యం. గత ప్రభుత్వం ఈ పథకాన్ని సక్రమంగా అమలుచేయలేకపోయింది. పనులు గుత్తేదారులకు అప్పగించడమే తప్ప పూర్తిచేసేలా శ్రద్ధ చూపలేదు. ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న వీటిని ప్రాధాన్య క్రమంలో పట్టాలెక్కించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కాకినాడ జిల్లాలో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.498 కోట్ల విలువైన 1,007 పనులు మంజూరు చేశారు. 50 శాతం పూర్తిచేసినట్లు దస్త్రాల్లో చూపుతున్నా చాలా నీటి పథకాలు ఉత్సవ విగ్రహాలే. రోడ్లు తవ్వేసి పైపులు వేయకుండానే వదిలేశారు. కుళాయిలను నీటి పథకంతో అనుసంధానించలేదు. గుత్తేదారులకు రూ.56 కోట్ల బకాయిలు చెల్లించాలి. అవి ఇచ్చేవరకు మిగతా పనులు చేపట్టబోమని వారు ఆందోళన చేస్తున్నారు.

తాళ్లరేవు మండలం జార్జిపేటలోని ఓ వీధిలో పైపులు ఇలా సగం వేసి వదిలేశారు

క్షేత్రస్థాయిలో ఇదీ పరిస్థితి

తాళ్లరేవు: ఈ మండలంలోని చొల్లంగి, చొల్లంగిపేట, జి. వేమవరం, పటవల, కోరింగ, పోలేకుర్రులో గోతులు తీసి వదిలేశారు.

శంఖవరం: 42 పనులు మంజూరు చేస్తే 12 చేశారు. జి.కొత్తపల్లి, పెద్దమల్లాపురం, వెంటకుపురంలో ట్యాంకులు కట్టినా వినియోగంలోకి తేలేదు.

రౌతులపూడి: 68 మంజూరు చేస్తే 14 పూర్తయ్యాయి. లచ్చిరెడ్డిపాలెం, పారుపాక, ఎస్‌పీ నగరం, శృంగవరంలో పూర్తయినట్లు చూపిస్తున్నా కదలిక లేదు.

తొండంగి: 25 నీళ్ల ట్యాంకులు నిర్మించినా పూర్తిస్థాయిలో కొళాయిలకు నీరివ్వలేకపోతున్నారు.

పిఠాపురం: భోగాపురం, చిత్రాడ, ఎ. తిమ్మాపురం, నవఖండ్రవాడ, రాపర్తిలో పనులు అసంపూర్తిగానే ఉన్నాయి.

గొల్లప్రోలు: దుర్గాడ, వన్నెపూడి, తాటిపర్తిలో చాలా పనులు మొదలుకాలేదు. చిన జగ్గంపేట, ఏపీ మల్లవరంలోనూ ఆగాయి.

అన్నీ మొదలవుతాయి..

బకాయిల చెల్లింపులకు ప్రభుత్వం సానుకూలంగా ఉంది. వారం పది రోజుల్లో కొంతమేర నిధులు అందుబాటులోకి రానున్నాయి. కార్పొరేషన్ ద్వారా మిగతావి పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. త్వరలోనే పట్టాలెక్కుతాయి.

-అబ్దుల్ మతిన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌ఛార్జి ఎస్ఈ, కాకినాడ

జల్‌జీవన్ పురోగతి ఇలా	మంజూరైన పనులు	అంచనా విలువ	ఖర్చు	పూర్తయినవి	పురోగతిలో ఉన్నవి
	1007	రూ.498.59 కోట్లు	రూ.198.65 కోట్లు	567	440

బెల్లం గారెల చిరునామా.. పెరుమాళ్లపురం..!

మన ప్రత్యేకం

పెరుమాళ్లపురం బెల్లం గారెలంటే ప్రతి ఒక్కరైనా లొట్టలేసుకుని తింటారంటే అతిశయోక్తి కాదు. 1948లో పేరూరి అప్పయ్యమ్మ ప్రారంభించిన బెల్లం గారెల తయారీ ఇప్పటికీ అదే రుచితో ఆమె మనవడు రాంబాబు కొనసాగిస్తుండడం విశేషం. మినపప్పును రుబ్బి గారెలు వేసి వాటిని బెల్లం పాకంలో నానబెట్టి డబ్బాలో పెట్టి విక్రయిస్తారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల వారు సైతం ఈ బెల్లం గారెలను ఆర్డర్‌పై తీసుకెళ్తారు. వివిధ శుభకార్యాల్లో ఇదో రకం స్వీటు కింద వడ్డించడం సంప్రదాయంగా మారింది. అప్పట్లో ఈ ప్రాంతానికి వచ్చిన ఎన్టీ రామారావు, జమున, చిరంజీవి, తదితర ప్రముఖులెందరో వీటి రుచి చూసిన వారేనని నిర్వాహకులు చెబుతున్నారు. కాకినాడ బీచ్ రహదారి పెరుమాళ్లపురం గ్రామం మీదుగా వెళ్తుంది. ఈ మార్గంలో వెళ్లేవారు ఇక్కడ ఆగి మరీ బెల్లం గారెలు తిని వెళ్తారు. రోజూ 1000 నుంచి 1500 గారెలు విక్రయిస్తుంటారు.

– న్యూస్‌టుడే, తొండంగి

రైతేరాజు
అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

సత్యదేవుని గిరిప్రదక్షిణకు వేళాయె..

8.2 కి.మీ ప్రశాంతంగా సాగేలా ఏర్పాట్లు

న్యూస్‌టుడే, అన్నవరం

కార్తిక పౌర్ణమి సందర్భంగా ఈనెల 5న (బుధవారం) అన్నవరం సత్యనారాయణ స్వామి గిరిప్రదక్షిణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అన్నవరం గ్రామంలోని తొలిపావంచాల వద్ద ప్రదక్షిణ ప్రారంభమవుతుంది. ప్రధాన మార్గం మీదుగా సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, సుబ్బరాయపురం, సాక్షిగణపతి ఆలయం నుంచి జాతీయ రహదారిపైకి చేరుకుని.. అక్కడినుంచి బెండపూడి కూడలికి ముందు పోలవరం కాలువ గట్టు మీదుగా పంపా సరోవరం చెంతకు వస్తుంది. ఇక్కడి నుంచి ఘాట్ మీదుగా (రత్న, సత్యగిరులను చుడుతూ) దిగువ ఘాట్‌రోడ్డుపై సాగుతూ తొలిపావంచాల వద్ద ముగుస్తుంది.

గతేడాది హాజరైన భక్తులు

- ప్రదక్షిణ మార్గం మొత్తం: 8.2 కి.మీ. (తారురోడ్డు 3.9 కి.మీ, గ్రావెల్‌రోడ్డు 4.3కి.మీ.)
- తొలిపావంచా – హైవే ఆర్చి గేటు వరకు: 2.1 కి.మీ.
- ఆర్చిగేటు–పోలవరం కాలువ: 1.3 కి.మీ.
- పోలవరం కాలువ కూడలి– దిగువ ఘాట్ రోడ్డు కూడలి: 4.3 కి.మీ.
- దిగువ ఘాట్‌రోడ్డు కూడలి –తొలిపావంచా: 0.5 కి.మీ.
- భద్రత: ఇద్దరు డీఎస్పీలు, 8 మంది సీఐలు, 16 మంది ఎస్సైలు, సుమారు 300 మంది సిబ్బంది, దేవస్థానం భద్రతా సిబ్బంది
- సమయం: ఈనెల 5న మధ్యాహ్నం 2 గంటలకు కొండ దిగువన తొలిపావంచాల వద్ద సత్యరథం ప్రారంభం. సాయంత్రం 5-6 గంటలకు గిరిప్రదక్షిణ ముగిసే అవకాశం. వైదిక పరంగా ఉదయం 8.30 గంటలకు పల్లకీలో స్వామి, అమ్మవార్లను గిరుల చుట్టూ తిప్పుతారు.
- స్టాల్స్: 12 (పండ్లు, ప్రసాదం, తాగునీరు, మజ్జిగ, బిస్కెట్లు, పాలు పంపిణీ)
- పార్కింగ్: కొండపైన, కొండ దిగువన జూనియర్ కళాశాల మైదానం
- వైద్యశిబిరాలు: 4, వేదికలు : 4
సేవలందించేందుకు ప్రతి కిలోమీటరుకు దేవస్థానం అధికారులు, సిబ్బంది ఉంటారు. అక్కడే విరామ స్థలాలు ఉంటాయి.

వైద్యం ఆధునికం.. సేవలు ఉచితం

పేద, మధ్య తరగతి ప్రజలకు అనారోగ్యం వచ్చిందంటే తల్లడిల్లాల్సిందే. ప్రైవేటు ఆసుపత్రులకు వెళితే ఫీజులు, వైద్య పరీక్షలకు వేలాది రూపాయలు వసూలు చేస్తారు. దీంతో చాలామంది ప్రభుత్వ ఆసుపత్రి వైపే చూస్తుంటారు. అందులోనూ ఉభయగోదావరి జిల్లాల ఆరోగ్య ప్రదాయినిగా పేరుగాంచిన కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి(జీజీహెచ్)లో ఎన్నో ఖరీదైన వైద్య పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయి. పైసా ఖర్చు లేకుండానే ఆధునిక సేవలు ఇక్కడ లభ్యమవుతున్నాయి.

- న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

- కాకినాడ జీజీహెచ్‌కు రోజూ ఓపీకి సుమారు 2500 మంది, ఐపీకి 1500 మంది వస్తుంటారు.

పేదల ఆరోగ్య ప్రదాయినిగా జీజీహెచ్

జీజీహెచ్‌లో స్పీచ్ థెరపీ విభాగం

‘బిరా’తో ఆధునిక వినికిడి పరీక్షలు

ఈఎన్‌టీ విభాగంలో ఇటీవల కొత్తగా బిరా (బ్రెయిన్‌స్టెమ్, ఇవోక్డ్ రెస్పాన్స్ ఆడియోమెట్రీ యూనిట్) టెస్ట్ అందుబాటులోకి వచ్చింది. వినికిడి సమస్యలున్న వారికి ఏ మోతాదులో ఉందో, బ్రెయిన్‌కు సిగ్నల్స్ అందుతున్నాయో లేదో తెలుసుకునేందుకు ఈ పరీక్ష చేస్తారు. నవజాత శిశువుల్లో వినికిడి లోపాన్ని త్వరగా గుర్తించవచ్చు. వికలాంగుల ధ్రువీకరణ, పునరావాస ప్రణాళికలో కీలక పాత్ర పోషిస్తుంది. శ్రవణమార్గ నాడీ సంబంధిత వ్యాధుల నిర్ధారణలో సహాయపడుతుంది. రోజుకు సుమారు 20 మందికి ఈ పరీక్షలు చేస్తున్నారు. దీనికి బయట రూ.2500 - రూ.3000 వరకు తీసుకుంటున్నారు.

ఎంఆర్ఐ

గతంలో ప్రైవేట్, పబ్లిక్ పార్టనర్‌షిప్(పీపీపీ) పద్ధతిలో ఎంఆర్ఐ సేవలు అందేవి. ఈ ఏడాది నుంచి ప్రభుత్వం కొత్త యంత్రం అందుబాటులోకి రావడంతో జీజీహెచ్ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం రోజుకు 25 మంది వరకు పరీక్షలు చేస్తున్నారు. బయట ఈ స్కానింగ్‌కు రూ.5వేలు నుంచి రూ.10వేల వరకు ఖర్చు అవుతుంది.

ఎంఆర్ఐ స్కానింగ్ చేస్తూ..

అల్ట్రా సౌండ్ పరీక్షలు..

ఎవరికైనా కడుపు నొప్పి, గ్యాస్ట్రిక్ తదితర ఇబ్బందులున్న వారు, గర్భిణులు తదితరులకు ఈ స్కానింగ్ చేస్తారు. జీజీహెచ్‌లో నాలుగు అల్ట్రాసౌండ్ యంత్రాలు అందుబాటులో ఉండగా, రోజుకు సుమారు 400 మందికి తగ్గకుండా స్కానింగ్ చేస్తున్నారు. బయట ల్యాబ్‌ల్లో రూ.1000 నుంచి రూ.1500 ఖర్చు అవుతుంది.

సీటీ స్కాన్

గత మే నెలలో కొత్త సీటీ స్కాన్ యంత్రం అందుబాటులోకి వచ్చింది. పీపీపీ పద్ధతిన దీనిని నిర్వహిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల బారిన పడిన వారు, తల, చేతులు, కాళ్లకు దెబ్బలు తగిలిన, ఊపిరితిత్తుల సమస్యలు ఉన్న వారికి, క్యాన్సర్ రోగులు, న్యూరాలజీ, ఆర్థో, న్యూరోమెడిసిన్, యురాలజీ తదితర రోగులకు ఇది ఉపయోగపడుతుంది. ప్రతిరోజు 120 నుంచి 150 వరకు స్కానింగ్‌లు చేస్తుంటారు. బయట ఈ సిటీ స్కానింగ్‌కు రూ.3వేలు నుంచి రూ.10వేల వరకూ ఖర్చు అవుతుంది.

ఏలేరు కాలువకు ఏడు గండ్లు

గొల్లప్రోలు పిడిందొడ్డి దగ్గర పడిన గండి

గొల్లప్రోలు: ఏలేరు రిజర్వాయర్ నుంచి అదనపు నీటి విడుదలతో నెలకొన్న వరదలకు కాలువలకు గండ్లు పడ్డాయి. గొల్లప్రోలు శివారున టోల్‌ప్లాజా సమీపంలోని పిడిందొడ్డి ప్రాంతంలో కాలువకు ఏడు గండ్లు పడినట్లు జలవనరులశాఖ అధికారులు గుర్తించారు. పిడిందొడ్డి రెగ్యులేటరీ ప్రాంతంలో గట్టు కోతకు గురైంది. ఈ ఏడు గండ్లు పూడ్చే పనులకు రూ.70 లక్షలు అవసరమవుతాయని జలవనరులశాఖ ఏఈ ప్రసన్నకుమార్ తెలిపారు. పూర్తి స్థాయిలో నీరు తగ్గిన తరువాత ఏలేరు కాలువ, ఉప కాలువలకు మరిన్ని గండ్లు బయటపడే అవకాశం ఉందన్నారు. గొల్లప్రోలు శివారు నక్కలఖండి ప్రాంతంలో కాలువ గట్టుకు గండిపడిందని, వెంటనే వాటిని పూడ్చి కాలువ గట్లను పటిష్ఠపరిచే పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. లేకుంటే దాళ్వా పొలాలకు సాగునీరందే పరిస్థితి ఉండదని వారు ఆందోళన చెందుతున్నారు.

నిండుకుండలా జలాశయం

ఏలేశ్వరంలోని ఏలేరు జలాశయం నుంచి దిగువకు ముందు జాగ్రత్త చర్యగా సోమవారం 3 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పరివాహక ప్రాంతం నుంచి ప్రాజెక్టుకు 2,475 క్యూసెక్కులు చేరుతున్నాయి. ఎడమ ప్రధాన కాలువ ద్వారా విశాఖ నగరానికి 175 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని అధికారులు తెలిపారు. రాబోయే రోజుల్లో వర్షాలు పడనున్నాయనే సమాచారంతో పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

–న్యూస్‌టుడే, ఏలేశ్వరం

ఇదీ లెక్క ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం.. 86.56 మీటర్లు (24.11 టీఎంసీలు)
ప్రస్తుతం నీటి నిల్వ..85.61 మీటర్లు

కాకినాడ ఎస్ఐఎఫ్‌టీకి జాతీయస్థాయి గుర్తింపు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: కాకినాడలోని రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ (ఎస్ఐఎఫ్‌టీ)కు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఇక్కడ ల్యాబ్‌ల్లో ఐఎస్ఐ ప్రమాణాలతో నిర్వహిస్తున్న పరీక్షలకు జాతీయ అక్రిడేషన్ బోర్డు (ఎన్ఏబీఎల్) గుర్తింపు లభించిందని ఎస్ఐఎఫ్‌టీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.అంజలి తెలిపారు. ఇక్కడి ల్యాబ్‌ల్లో నీరు, మట్టి విశేషణ, సూక్ష్మజీవ, వ్యాధి నిర్ధారణ, మాలిక్యులర్ లెవల్ డయాగ్నోసిస్ (సీపీఆర్), మేత నాణ్యత విశ్లేషణలు నిర్వహిస్తారు. వీటితో పాటే మరో రెండు ల్యాబ్‌లున్నాయి. వాటిలో యాంటీబయాటిక్స్, పెస్టిసైడ్స్ పరీక్షలు చేస్తారు. అత్యుత్తమ స్థాయిలో పరీక్షించిన మత్స్య ఉత్పత్తులనే విదేశాలకు ఎగుమతి చేసే అవకాశముంటుంది. ఆ పరీక్షలు ఇక్కడ చేస్తారు.

WANTED
రాజమండ్రిలో ప్రముఖ 2 వీలర్ షోరూమ్ SRI RK HONDAలో పనిచేయుటకు ఈ క్రింది స్టాఫ్ కావలెను
✦ స్పేర్స్ మేనేజర్
✦ కంప్యూటర్ ఆపరేటర్
ఇంటర్వ్యూ: 4, 5, 6 November 2025 తేదీలలో 10 AM to 5 PM వరకు
SRI RK HONDA
D.No.6-16-1, దారవాడవారి వీధి, రోడ్ కమ్ రైల్వే బ్రిడ్జికి వెళ్లే రోడ్డులో, కోటిపల్లి బస్టాండ్ దగ్గర
రాజమండ్రి, 8297713999

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

పంటదక్కే దశ.. ఆవిరైన ఆశ..!

ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, కలెక్టరేట్, గొల్లప్రోలు, పెదపూడి

మొంథా తుపాను అన్నదాతలను నిలువునా ముంచేసింది. పంట పాలుపోసుకుని, గింజ గట్టిపడే దశలో 52 వేల ఎకరాలకు పైగా వరి పంట నీట మునిగింది. వర్షాలతో నష్టపోయిన కర్షకుల్లో 80 శాతంపైగా కౌలు రైతులే ఉన్నారు. కౌలు డబ్బులు కాదు కదా పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సామర్లకోట మండలం వేట్లపాలెం సమీపంలో నేలకొరిగిన వరిపైరు

ఖరీఫ్ సీజన్‌లో	
జిల్లాలో సాగు చేసిన వరి	2,14,925 ఎకరాలు
నమోదైన ఈ-పంట	సుమారు 2,00, 000
కౌలు రైతులు	90,000

నేలమట్టమైన కష్టం

ఎకరా భూమి కౌలుకు తీసుకుని స్వర్ణ రకం వేశాను. కోతకు సిద్ధమవుతున్న సమయంలో వర్షాలు వచ్చాయి. గాలులతో పంటంతా నేలకొరిగిపోయింది. కంకులన్నీ బురదలో కూరుకుపోయాయి. సుమారు రూ.25 వేలు నష్టపోయా.

-తోటకూర చక్రరావు, కుమారప్రియం, పెదపూడి మండలం

నమోదులోనూ చిక్కులు

పంట నష్ట పరిహారం నమోదులోనూ చిక్కులు ఎదురవుతున్నాయి. కౌలు రైతులకు కాకుండా భూయజమానుల పేర్లు ఈ-క్రాప్‌లో కనిపిస్తుండటంతో పరిహారమైనా అందుతుందా లేదోనని ఆందోళన చెందుతున్నారు. ఈ-పంటను సాకుగా చూపి, భూ యజమానుల పేరున పరిహారం చెల్లిస్తే లేనిపోని వివాదాలకు అధికారులే ఆజ్యం పోసినట్లవుతుందని కౌలు రైతులంటున్నారు.

సీసీఆర్ కార్డుల జారీలోనూ నిర్లక్ష్యం

ఖరీఫ్ సీజన్‌కు 55,745 మంది కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు జారీ చేశారు. వీరిలో కేవలం 26,220 మందికి రూ.120 కోట్ల మేర పంట రుణాలు మంజూరు చేశారు. జిల్లాలో దాదాపు 90,000కు పైగా కౌలురైతులు ఉంటారని అంచనా, కానీ 69,000 సీసీఆర్‌సీ కార్డుల పంపిణీ వరకే లక్ష్యాన్ని నిర్దేశించడం గమనార్హం. రెవెన్యూ, వ్యవసాయ శాఖ నిర్లక్ష్యంతో నూరుశాతం ప్రగతిని సాధించలేకపోయారు. కౌలు రైతుల పరిహారం విషయంలో సమస్యలు లేకుండా చూస్తామని వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ అన్నారు.

(c) eenadu

హతవిధీ.. కదలి కోతకు రుజువిది..

ఈ చిత్రంలో నేలకూలిన సిమెంట్ రోడ్డును చూస్తే ఉప్పాడ తీరంలో కడలి కోత ఏ స్థాయిలో ఉందో తెలుస్తుంది. గ్రామం నుంచి సుమారు 100 మీటర్ల వరకున్న రోడ్డు కోతకు గురై ఇలా ముక్కలు ముక్కలుగా నేలకూలింది. రెండేళ్ల కాలంలో అలల తీవ్రత ఎక్కువగా ఉండడంతో కోత సమస్య ఎక్కువైంది. ప్రస్తుతం రోడ్డు మరింత కోతకు గురవుతోంది. - న్యూస్‌టుడే, కొత్తపల్లి

సత్యదేవుని సన్నిధిలో కార్తిక సందడి

వ్రతమాచరిస్తున్న భక్తులు

అన్నవరం: పవిత్ర కార్తిక మాస సోమవారం సందర్భంగా సత్యదేవుని దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. తెల్లవారుజామున 1 గంట నుంచి వ్రతాలు, 2 గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. మధ్యాహ్నం వరకు రద్దీ కొనసాగింది. ఆరు వేల వ్రతాలు జరిగాయి. రావిచెట్టు వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా భద్రతా ఏర్పాట్లు చేసి పర్యవేక్షించారు. తూర్పురాజగోపురం ముందు మెట్ల మార్గం నుంచి కేవలం రూ.200, వ్రత టికెట్టు భక్తులను మాత్రమే అనుమతించారు. ఉచిత దర్శనాలకు పశ్చిమరాజగోపురం నుంచి షోల్డింగ్ పాయింట్ల నుంచి క్యూలైన్లలోకి అనుమతించారు.

భక్తులను ఇబ్బందులకు గురిచేయొద్దు

గిరిప్రదక్షిణ మార్గాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

అన్నవరం, న్యూస్‌టుడే: ఈ నెల 5న కార్తిక పౌర్ణమి సందర్భంగా అన్నవరం సత్యదేవుని దర్శనానికి 1.50 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా. కొండపై రద్దీ తెల్లవారుజామున ప్రారంభమై సాయంత్రం వరకు కొనసాగుతుంది. గిరిప్రదక్షిణలో సుమారు మూడు లక్షల మంది భక్తులు పాల్గొంటారని అంచనా. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదు. అన్ని సౌకర్యాలు పకడ్బందీగా ఉండాలి. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయండి. ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా, భక్తులకు ఇబ్బందులు కలిగినా కఠిన చర్యలు తీసుకుంటామని దేవాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ హెచ్చరించారు. ఈవో సుబ్బారావు, ఆర్‌జేసీ (రాజమహేంద్రవరం) వి.త్రినాథరావు, డీసీ బాబూరావు, డిప్యూటీలపై విధుల్లో ఉన్న డీలు రమేష్‌బాబు, విశ్వనాథరాజు, వర్షనరావు, ఈకులు, ఏఈఓలతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రత్యేక పర్యవేక్షకుల ప్రాంతీయ జాయింట్ కమిషనర్ (రాజమహేంద్రవరం) వి.త్రినాథరావును నియమిస్తూ ఆదేశాలిచ్చారు. 4, 5 తేదీల్లో స్వయంగా హాజరై పర్యవేక్షించాలని పేర్కొన్నారు. గిరిప్రదక్షిణ ప్రారంభ సమయంలో వ్యక్తిగతంగా పర్యవేక్షించాలన్నారు. ఈవో కొండపైనే ఉండి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గిరిప్రదక్షిణ ఏర్పాట్లుపై జిల్లా ఎస్పీ బిందు మాధవ్ పర్యవేక్షించారు. డీఎస్పీ శ్రీహరిరాజు, సిఐ సూర్య అప్పారావు, ఎస్సై శ్రీహరిబాబు, ఈవో వి.సుబ్బారావులతో మార్గాన్ని పరిశీలించారు. సీసీ కెమెరాలు, ట్రాఫిక్ నియంత్రణ, సైన్ బోర్డులు తదితర భద్రతా ఏర్పాట్లుపై పలు ఆదేశాలిచ్చారు.

7న ఐటీఐలో ఉద్యోగమేళా

గాంధీనగర్, న్యూస్‌టుడే: నెల్లూరు శ్రీసిటీలోని ఆటోమొబైల్ సంస్థ ఇసుజు మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలకు ఈ నెల 7న కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపల్ ఎం.వి.జి.వర్మ తెలియజేశారు. 2022 నుంచి 2025 సంవత్సరాల్లో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ చదివి ఉత్తీర్ణులైన విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 98487 38841, 94900 77115 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి LiFE Lifestyle for Environment
ప్రాంతీయ కార్యాలయం : కాకినాడ
ప్లాట్ నెం.2, ఐడిఎ, రమణయ్యపేట, కాకినాడ-533005.

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ రీ షెడ్యూల్ ప్రకటన

మెస్సర్స్ యస్‌కె టెర్రా మైన్స్ & మినరల్స్ యల్‌యల్‌పి వారు కాకినాడ జిల్లా, రౌతులపూడి మండలం, యస్.పైడిపాల గ్రామం, సర్వే నెం.15/పి లోని 3.440 హెక్టార్ల విస్తీర్ణములో రోడ్ మెటల్ మైన్ కొరకు ప్రతిపాదించబడిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ది:28-10-2025న జరగవలసివుండగా ది:19-11-2025కు వాయిదా వేయబడినది. దీనికి సంబంధించి ది:28-10-2025న సవరణ ప్రచురించబడినది. కావున పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ది:19-11-2025న తిరిగి రీ షెడ్యూల్ చేయబడినది. ప్రాజెక్టు యొక్క ప్రదేశం మరియు ఇతర వివరములు ది:27-09-2025న పత్రికా ప్రకటనలో ప్రచురించబడిన విధంగా ఉన్నవి.

సం/- పర్యావరణ ఇంజినీరు,
ఆంధ్రప్రదేశ్ కాలుష్యనియంత్రణ మండలి,
ప్రాంతీయ కార్యాలయం, కాకినాడ

ప్రదేశం: కాకినాడ
తేది : 03-11-2025

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి LiFE Lifestyle for Environment
ప్రాంతీయ కార్యాలయం : కాకినాడ
ప్లాట్ నెం.2, ఐడిఎ, రమణయ్యపేట, కాకినాడ-533005.

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ రీ షెడ్యూల్ ప్రకటన

మెస్సర్స్ యస్‌కె టెర్రా మైన్స్ & మినరల్స్ యల్‌యల్‌పి వారు కాకినాడ జిల్లా, రౌతులపూడి మండలం, డి.పైడిపాల గ్రామం సర్వే నెం.59/పి లోని (0.507 హెక్టార్లు), ములగపూడి గ్రామం సర్వే నెం.1/పి లోని (0.858 హెక్టార్లు), యస్.పైడిపాల గ్రామం సర్వే నెం.15/పి లోని (1.735 హెక్టార్లు) మొత్తం 3.100 హెక్టార్ల విస్తీర్ణములో రోడ్ మెటల్ మైన్ కొరకు ప్రతిపాదించబడిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ది:28-10-2025న జరగవలసివుండగా ది:19-11-2025కు వాయిదా వేయబడినది. దీనికి సంబంధించి ది:28-10-2025న సవరణ ప్రచురించబడినది. కావున పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ది:19-11-2025న తిరిగి రీ షెడ్యూల్ చేయబడినది. ప్రాజెక్టు యొక్క ప్రదేశం మరియు ఇతర వివరములు ది:27-09-2025న పత్రికా ప్రకటనలో ప్రచురించబడిన విధంగా ఉన్నవి.

సం/- పర్యావరణ ఇంజినీరు,
ఆంధ్రప్రదేశ్ కాలుష్యనియంత్రణ మండలి,
ప్రాంతీయ కార్యాలయం, కాకినాడ

ప్రదేశం: కాకినాడ
తేది : 03-11-2025

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్సడ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ వై. కిరణ్ చంద్ (చీఫ్ మేనేజర్) మొబైల్ నెం.91609 49910,
ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, ఆస్తి తనిఖీ కొరకు : 9866027578

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 9(1)తో చదువబడు 8(6) నిబంధనలతో చదువబడు (సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకుసకు తనఖా చేసిన స్థిరాస్తుల అమ్మకము)

SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు లాంఛనాత్మక స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖాపెట్టిన ఆస్తి/ఆస్తుల ఈ-వేలం (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీత(లు) : శ్రీ సాకా లక్ష్మీ నారాయణ, తండ్రి : శ్రీ సాకా జనార్ధనరావు, డి.నెం.6-60, సాకా వారి వీధి, సోమేశ్వరం, రాయవరం మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533261. వేరొక చిరునామా : శ్రీ సాకా లక్ష్మీ నారాయణ, తండ్రి : జనార్ధనరావు, డి.నెం.7-1 & 7-2, కాపుల రామాలయం దగ్గర, సోమేశ్వరం, రాయవరం మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533261. శ్రీమతి సాకా వెంకట దుర్గ, భర్త : శ్రీ సాకా లక్ష్మీ నారాయణ, డి.నెం.6-60, సాకా వారి వీధి, రామాలయం దగ్గర, సోమేశ్వరం, రాయవరం మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533261. **డిమాండ్ నోటీసు తేది: 01-07-2022**

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం : తేది.16.06.2022 నాటికి రూ.4,40,56,912/- + తేది.17.06.2022 నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి.

ప్రస్తుత బకాయి మొత్తం: తేది.31-10-2025 నాటికి రూ.5,48,81,949/- + తేది.01.11.2025 నుండి భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి (మునుపటి జమలు మినహాయించిన తరువాత).

షెడ్యూల్ ఆస్తి వివరములు:

బ్లాక్ నెం.7, ఆర్.ఎస్.నెం.318/5, డి.నెం.7-1&7-2 లోని 191.77 చ॥గ॥ల విస్తీర్ణంలో గల నివాస భవనం (జిఎఫ్ + ఎఫ్ఎఫ్ + ఎస్ఎఫ్) యావత్తు ఆస్తి షెడ్యూలు డాక్యుమెంట్ ప్రకారం దిగువ తెలుపబడినది.

రిజిష్టర్డు సేల్ డీడ్ నెం.5266/2014, తేది.18.12.2014 ప్రకారం: తూర్పు గోదావరి జిల్లా, రామచంద్రాపురం సబ్-రిజిస్ట్రీ, సోమేశ్వరం పంచాయితీ, బ్లాక్ నెం.7, సోమేశ్వరం గ్రామం, ఆర్.ఎస్.నెం.318/5 లోని (65.77 + 11.67 = 77.44) చ॥గ॥ల విస్తీర్ణంలో సంబంధిత డి.నెం.7-1తో గల ఆస్తి. హద్దులు : ఐటమ్ నెం.1: తూర్పు : సాకా జానకి రామయ్య గారికి చెందిన గోడ, పడమర : ప్రభుత్వ వీధి, దక్షిణం: ఈ ఇంటికి మరియు గరగ జానకమ్మ గారికి చెందిన ఇంటికి ఉమ్మడి గోడ, ఉత్తరం : ఇక్కడ గల ఐటమ్ నెం.2 కొంతమేర మరియు పెద్దిరెడ్డి జానకమ్మ గారికి చెందిన స్థలం కొంతమేర.

పైన తెలిపిన హద్దులలో 65.77 చ॥గ॥ల విస్తీర్ణం అన్నీ ఈజిమెంట్ హక్కులతో కలదు.

ఐటమ్ నెం.2: తూర్పు : సాకా జానకి రామయ్య గారికి చెందిన గోడ, పడమర : పెద్దిరెడ్డి జానకమ్మ గారికి చెందిన స్థలం, దక్షిణం: ఇక్కడ గల ఐటమ్ నెం.1, ఉత్తరం : ఉమ్మడి గోడ దారి మార్గం.

పైన తెలిపిన హద్దులలో 11.67 చ॥గ॥ల విస్తీర్ణం అన్నీ ఈజిమెంట్ హక్కులతో కలదు.

రిజిష్టర్డు సేల్ డీడ్ నెం.4638/2015, తేది.24.09.2015 ప్రకారం: తూర్పు గోదావరి జిల్లా, రామచంద్రాపురం సబ్-రిజిస్ట్రీ, సోమేశ్వరం పంచాయితీ, బ్లాక్ నెం.7, సోమేశ్వరం గ్రామం, ఆర్.ఎస్.నెం.318/5 లోని (65.77 + 11.67 = 77.44) చ॥గ॥ల విస్తీర్ణంలో సంబంధిత డి.నెం.7-1తో గల ఆస్తి. హద్దులు : ఐటమ్ నెం.1: తూర్పు : సాకా జానకి రామయ్య గారికి చెందిన గోడ, పడమర : ప్రభుత్వ వీధి, దక్షిణం : ఈ ఇంటికి మరియు గరగ జానకమ్మ గారికి చెందిన ఇంటికి ఉమ్మడి గోడ, ఉత్తరం : ఇక్కడ గల ఐటమ్ నెం.2 కొంతమేర మరియు పెద్దిరెడ్డి జానకమ్మ గారికి చెందిన స్థలం కొంతమేర.

పైన తెలిపిన హద్దులలో 65.77 చ॥గ॥ల విస్తీర్ణం అన్నీ ఈజిమెంట్ హక్కులతో కలదు.

ఐటమ్ నెం.2: తూర్పు : సాకా జానకి రామయ్య గారికి చెందిన గోడ, పడమర : పెద్దిరెడ్డి జానకమ్మ గారికి చెందిన స్థలం, దక్షిణం : ఇక్కడ గల ఐటమ్ నెం.1, ఉత్తరం : ఉమ్మడి గోడ దారి మార్గం.

పైన తెలిపిన హద్దులలో 11.67 చ॥గ॥ల విస్తీర్ణం అన్నీ ఈజిమెంట్ హక్కులతో కలదు.

రిజిష్టర్డు సేల్ డీడ్ నెం.1284/2016, తేది.18.03.2016 (36.89 చ॥గ॥లు) ప్రకారం: తూర్పు గోదావరి జిల్లా, రామచంద్రాపురం సబ్-రిజిస్ట్రీ, సోమేశ్వరం పంచాయితీ, బ్లాక్ నెం.7, సోమేశ్వరం గ్రామం, ఆర్.ఎస్.నెం.318/5 లోని 36.89 చ॥గ॥ల విస్తీర్ణంలో సంబంధిత డి.నెం.7-1 మరియు 7-2లతో గల ఆస్తి. హద్దులు : తూర్పు : సాకా జానకి రామయ్య గారికి చెందిన గోడ, పడమర : ప్రభుత్వ వీధి, దక్షిణం : అమ్మకందారు నుండి సుంకర శ్రీనివాసరావు గారు కొనుగోలు చేసిన స్థలం, ఉత్తరం : కొనుగోలుదారుని స్థలం.

పైన తెలిపిన హద్దులలో 36.89 చ॥గ॥ల విస్తీర్ణం అన్నీ ఈజిమెంట్ హక్కులతో కలదు.

మొత్తం 191.77 చ॥గ॥ల స్థలం అందు గల నివాస (GF + FF + SF) భవనం.

రిజర్వు ధర : రూ.1,04,75,000/- ధరావత్తు : రూ.10,47,500/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేదీ : 09-12-2025 సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది:04-11-2025 నుండి 08-12-2025 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఐయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను సంప్రదించండి.

2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.

గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలనీ సూచించటమైనది.

గమనిక -2 : ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 194-1A ప్రకారం అమ్మకంలో భాగంగా అమ్మకం విలువ రూ.50,00,000/- (యాభై లక్షల రూపాయలు) మరియు అంతకంటే ఎక్కువ ఉన్నచో సదరు మొత్తముపై TDS @ 1% వర్తిస్తుంది. కావున సఫలీకృత బిడ్డరు/కొనుగోలుదారు గవర్నమెంట్ గైడ్‌లైన్స్ ధర లేదా అమ్మకం ధరలో ఏది ఎక్కువైతే దానిలో 1% TDS ను తగ్గించుకొని సదరు మొత్తమును ఆదాయపు పన్ను డిపార్ట్‌మెంట్ యొక్క ఫారం నెం.16-బి నందు జమచేయవలెను మరియు సదరు ఒరిజినల్ TDS సర్టిఫికెట్‌ను బ్యాంకు వారికి సమర్పించవలెను. (వ్యవసాయ భూమి కాకుండా కేవలం స్థిరాస్తికి మాత్రమే వర్తించును).

తేది:31-10-2025, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అర్జీదారులతో కలెక్టరేట్ కిటకిట

వినతులు స్వీకరిస్తున్న అధికారులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్ సోమవారం అర్జీదారులతో కిటకిటలాడింది. గత వారం తుపానుతో పీజీఆర్ఎస్ రద్దు చేయడంతో ఈ వారం పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. మొత్తం 571 మంది వినతులు అందజేశారు. కలెక్టర్, జేసీ, డీఆర్వో, అసిస్టెంట్ కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో హౌసింగ్ పీడీ సత్యనారాయణ, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.శ్రీధర్, సమగ్ర శిక్షా ఏపీసీ పి.వేణుగోపాలరావు, కేఆర్‌సీ ఎస్‌డీసీ జి.రత్నమణి, సీపీవో పి.త్రినాథ, డీపీవో వి.రవికుమార్ అర్జీలు తీసుకుని, సంబంధిత శాఖల జిల్లాస్థాయి అధికారులతో సమీక్షించారు.

ఎస్పీ కార్యాలయంలో 65 ఫిర్యాదుల స్వీకరణ

మసీదుసెంటర్(కాకినాడ): పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలని కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్‌అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 65 మంది ఫిర్యాదుదారులు హాజరై వినతులు అందజేశారు. సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి, సకాలంలో సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు, సూచనలు ఇచ్చారు.

అరెకరంలో ఆరోగ్య ఫలాలు

న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

పెంచుతున్న వివిధ రకాల మొక్కలు

స్ఫూర్తి

అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలను వృథాగా వదిలేయకుండా మొక్కలు పెంచి ఆరోగ్యకర ఉత్పత్తులు పొందుతున్నారు ఉండ్రాజవరానికి చెందిన కుడప నారాయణరావు. రైతు కుటుంబానికి చెందిన ఈయన మెకానికల్ ఇంజినీరుగా పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతర సమయాన్ని వివిధ రకాల మొక్కల పెంపకానికి కేటాయించారు. ఇంటిపక్కనే ఖాళీగా ఉన్న 50 సెంట్లలో సుమారు 45 రకాల మొక్కలు నాటారు. కొంత భాగంలో చెరువు తవ్వి చేపలు పెంచుతున్నారు. సేంద్రియ పద్ధతిలో దిగుబడులు సాధిస్తున్నారు.

ఎన్నో రకాలు..

తైవాన్ జామ, పండ్రోడు మామిడి 365 రోజుల పొడవునా కాయలు కాస్తున్నాయి. యాపిల్‌బెర్రి, బత్తాయి, గులాబ్‌జామ, రేగు, విప్పపువ్వు, దానిమ్మ, అల్లనేరేడు, రామ, లక్ష్మణ, సీతాఫలాలు, వాక్కాయ సాగు చేస్తున్నారు. రైతులతో పాటు వ్యవసాయాధికారులు పరిశీలించి ఆదర్శంగా తీసుకుంటున్నారు.

ఆన్‌లైన్‌లో పరిశీలించి..

మధుమేహం, రక్తపోటు తదితర వ్యాధిగ్రస్థులకు ఈ ఫలాలు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. బంధుమిత్రులతో పాటు దూరప్రాంతాల్లో ఉన్న అనేకమందికి పంపిస్తున్నాను. కుటుంబ సభ్యులు సహకరిస్తున్నారు. ఆన్‌లైన్‌లో పరిశీలించి మేలైన మొక్కలు తీసుకొస్తున్నాను.

- కుడప నారాయణరావు, ఉండ్రాజవరం

రైతేరాజు

పట్టు రైతులకు రాయితీపై ఉపకరణాలు

గొల్లప్రోలు: మల్బరీ సాగు చేస్తూ పట్టు పురుగులు పెంచే రైతులు ఆధునిక పరికరాల వినియోగంతో నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చు. పట్టు రైతులకు రాయితీపై ఉపకరణాలు అందించనున్నట్లు పట్టు పరిశ్రమలశాఖ జిల్లా అధికారి రాజేంద్ర ప్రసాద్‌బాబు తెలిపారు. అందించే పరికరాలు, రాయితీల వివరాలను ఆయన వివరించారు. పట్టు పరిశ్రమల శాఖ సిబ్బందిని కలిసి వివరాలు తెలుసుకుని దరఖాస్తు అందించాలన్నారు.

- వీడర్, బ్రష్‌కట్టర్, పవర్ స్ప్రేయర్లు, పవర్‌టిల్లర్ వంటివి అందిస్తారు.
- యూనిట్ విలువ రూ.లక్షగా నిర్ణయించి రూ.50 వేలు రాయితీ ఇస్తారు.
- యూనిట్ విలువ రూ.లక్ష కన్నా తక్కువైతే దానిలో 50 శాతం రాయితీ ఇస్తారు. రూ.లక్ష కన్నా ఎక్కువైనా రూ.50 వేలు మాత్రమే రాయితీ కల్పిస్తారు.

జగ్గంపేటలో ఏర్పాటు చేసిన పెట్టెలు

లాభదాయకం.. తేనెటీగల పెంపకం

జగ్గంపేట (గ్రామీణం), న్యూస్‌టుడే: తేనెటీగల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎంఐడీహెచ్(మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్) పథకం ద్వారా రాయితీలు అందిస్తోందని జగ్గంపేట ఉద్యానాధికారిణి పి.శ్రీవల్లి తెలిపారు. ఎస్సీ రైతులకు ఒక యూనిట్‌కి రూ.24 వేలు అందిస్తున్నారు. ముందుగా మేలైన తేనెటీగలను, అనువైన స్థలాన్ని ఎంపిక చేసుకుని పెంపకానికి అవసరమైన పరికరాలు సమకూర్చుకోవాలి. మకరందం, పుప్పొడి అందించే మొక్కలు దగ్గరలో పెంచాలి. తేనెటీగల మొక్కలు, పంటపొలాల్లో పరాగసంపర్కానికి, దిగుబడి పెంచేందుకు సహాయపడతాయి. వీటి పెంపకంతో మహిళలు, యువతకు ఉపాధి లభిస్తుంది. ప్రభుత్వాలు, అనేక సంస్థలు ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం తేనె, మైనానికి మార్కెట్‌లో మంచి గిరాకీ ఉండటంతో పలువురు వీటి పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు.

మీ కోసం

బొప్పాయి పాలు.. విదేశాలకు

చాగలమర్రి (నంద్యాల), న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా చాగలమర్రి మండల వ్యాప్తంగా రైతులు అధికంగా బొప్పాయి సాగు చేస్తుంటారు. చిన్నవంగలితో పాటు సమీపంలోని గ్రామాలైన వైఎస్సార్ కడప జిల్లా కానగూడూరు, క్రిష్ణంపల్లె గ్రామాల్లో 1200 ఎకరాల్లో పండిస్తారు. విత్తనం నాటిన నాటి నుంచి తొమ్మిది నెలలకు పంట వస్తుంది. సేకరించిన పాలను పరిశ్రమలకు చేరవేస్తారు. పండ్ల సేకరణ అనంతరం 13 నెలల తర్వాత మిగిలినవి, ముదురు కాయలకు గాట్లు పెట్టి పాలను సేకరిస్తున్నారు. తెల్లవారుజాము సమయంలోనే కాయలకు గాట్లు పెడితే కేవలం రెండు గంటల్లోనే పాలు ఊరతాయి. ఇలా సేకరించిన దాన్ని రాయచోటి, రాజంపేటకు చెందిన వ్యాపారులు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల పాలు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 4 డ్రమ్ముల పాలు సేకరిస్తున్నారు. ఎకరానికి పాల సేకరణ ద్వారా రైతుకు రూ.24 వేల ఆదాయం వస్తుంది. సేకరించిన పాలను పరిశ్రమల్లో మందులు, కాస్మొటిక్స్, సబ్బుల తయారీలో ఉపయోగిస్తున్నారు. బెంగళూరు, చెన్నైలో పాలు నాణ్యతను బట్టి విదేశాలకు సైతం పాలను ఎగుమతి చేస్తున్నారు. బొప్పాయి సాగులో ఎప్పుడైనా దర పడిపోయినప్పుడు బొప్పాయి పాల సేకరణతో నష్టాల నుంచి రైతులు బయటపడుతున్నారు.

చలికాలం.. పశువులు పదిలం

పశువుల శాల

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: చలికాలం ప్రారంభ మైనందున పశువుల పెంపకంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని ర్యాలి పశువైద్యాధికారి మౌనిక వివరించారు. పాడిపశువులు చలిగాలులు బారిన పడకుండా పరిశుభ్రమైన కొట్టాల్లో కట్టాలి. దాణాలో మాంసకృత్తులు తక్కువగా, పిండి పదార్థాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. జీర్ణక్రియ సక్రమంగా ఉండేందుకు ఓ పూట పచ్చిమేత, మరోపూట ఎండుమేత ఇవ్వడం శ్రేయస్కరం. శీతాకాలంలో లభించే పచ్చగడ్డిలో కార్బియం, ఇతర ఖనిజ లవణాలు తక్కువగా ఉంటాయి. అందువల్ల దాణాతో పాటు విటమిన్లతో కూడిన ఖనిజ లవణాలు అందించాలి. తద్వారా పొదుగువాపు, పసక జబ్బు వంటి రుగ్మతలను నివారించవచ్చు. చలివల్ల పొదుగుపై పగుళ్లు ఏర్పడి పుండ్లుగా మారే ప్రమాదం ఉంది. బోరో గ్లిసరిన్ పేస్టును పైపూతగా పూసి సమస్యను నివారించవచ్చు. పశువులను పగటివేళల్లో మాత్రమే దూర ప్రాంతాలకు రవాణా చేయాలి.

శిశుమరణాల నివారణకు కృషి చేయండి

సమీక్షలో పాల్గొన్న వైద్యాధికారులు, సిబ్బంది

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: జిల్లాలో శిశుమరణాల నివారణకు వైద్యసిబ్బంది చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో డీఐవో డా.సుబ్బరాజు అధ్యక్షతన జిల్లా కబ్ కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో 48 శిశు మరణాలకు గల కారణాలను విశ్లేషించారు. గర్భిణులు రక్తహీనత లేకుండా చూసుకోవడం, ఇనుము, ఫోలిక్ యాసిడ్ సప్లిమెంట్లు తీసుకోవడం, ప్రమాదకర స్థితిలో ఉన్న గర్భిణులను ముందుగా గుర్తించి వారికి చికిత్స అందించడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు అయ్యేలా చూడటం, ప్రసవానంతరం సేవలు కచ్చితంగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. సబ్‌కమిటీ సభ్యులు డా.విల్సన్, జీజీహెచ్ చిన్నపిల్లల వైద్యనిపుణులు రాంబాబు, డా.ఆలీషా, డా.సురేష్‌కుమార్, గైనిక్ వైద్యులు డా.స్వాతి, డా.సుబ్రహ్మణ్యం, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రిలో వ్యక్తి మృతిపై విచారణ

జగ్గంపేట, జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: జగ్గంపేటలోని ప్రైవేటు ఆసుపత్రిలో వ్యక్తి మృతిచెందిన ఘటనపై డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ ప్రశాంతి సోమవారం విచారణ చేపట్టారు. ఈనెల 1న రాత్రి గండేపల్లి మండలం నాయకంపల్లి గ్రామానికి చెందిన కంటే వెంకట్రావు మృతిచెందారు. జగ్గంపేటకు చెందిన బీఎస్పీ జిల్లా సలహాదారు జుత్తుక నాగేశ్వరరావు పీజీఆర్‌యస్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆసుపత్రికి విచ్చేసిన జిల్లా వైద్యాధికారి రోగి మృతికి గల కారణాలను ప్రైవేటు ఆసుపత్రి ప్రధాన వైద్యుడు నుంచి సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. ఈమె వెంట కాట్రావులపల్లి పీహెచ్‌సీ వైద్యులు తదితరులు ఉన్నారు.

విపత్తుల సమయంలో జగన్ క్షేత్రస్థాయి పర్యటనలు చేశారా..?

మాజీ ఎమ్మెల్యే వర్మ ప్రశ్న

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో విపత్తుల సమయంలో ఎప్పుడైనా జగన్ క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లారా? అని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ వర్మ నిలదీశారు. గాల్లో తిరగటం తప్ప బాధితులతో ఎప్పుడైనా మాట్లాడారా? అని ప్రశ్నించారు. ఇటీవల చంద్రబాబుపై మాజీ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చేసిన వ్యాఖ్యలపై వర్మ ఘాటుగా స్పందించారు. సోమవారం కాకినాడలో ఆయన మాట్లాడుతూ సీఎంగా జగన్, వ్యవసాయ మంత్రిగా కన్నబాబు రాష్ట్రానికి ఏం చేశారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. వైకాపా పాలనలో జగన్ ప్యాలెస్‌కే పరిమితమైతే ప్రస్తుతం చంద్రబాబు, పవన్, లోకేశ్‌లు నిత్యం ప్రజల్లోనే ఉంటున్నారన్నారు. కష్టం వస్తే అక్కడ చంద్రబాబు ప్రత్యక్షమవుతున్నారని వివరించారు. గతంలో తెదేపా హయాంలో రైతులకు రూ.20 వేల పరిహారం ఇస్తే రూ.15వేలకు కుదించిన ఘనత జగన్‌దన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ రూ.15వేలను రూ.25వేలకు పెంపుదల చేశారని చెప్పారు. కూటమి ప్రభుత్వంపై బురద జల్లేందుకు వైకాపా కుట్రలు పన్నుతోందని ఆరోపించారు.

తుపాను బాధిత రైతులను సత్వరం ఆదుకోవాలి



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: తుపానుతో నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని కేంద్ర మాజీ మంత్రి ఎం.ఎం.పళ్లంరాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తుపాను ప్రభావంతో అన్ని విధాలా నష్టపోయిన బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని అందించాలన్నారు. ప్రజా సమస్యలపై కాంగ్రెస్ కార్యకర్తలు పోరాడాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందం, దాట్ల గాంధీరాజు, మల్లిపూడి రాంబాబు, చెక్కా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	22,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	29,000
గటగట	27,000
కొత్తకాయ: గండేరా	28,000
గటగట	26,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	22,000-23,000
కొత్త (పచ్చి) కాయ	23,000-24,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	115-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

పంచాయతీరాజ్‌లో ఉద్యోగోన్నతులు అధికం

సామర్లకోట: పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగోన్నతి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణలను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని విస్తరణ శిక్షణ కేంద్రం(ఈటీసీ) ప్రిన్సిపల్ ప్రసాదరావు సూచించారు. సామర్లకోట ఈటీసీలో సోమవారం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలో డిప్యూటీ ఎంపీడీవోలకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజులు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులకు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపల్ రమణ, డీడీవో శ్రీనివాసరావు, ఎంపీడీవోలు శర్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు

సర్పవరం: కాకినాడ గ్రామీణంలోని సర్పవరం భావనారాయణస్వామి ఆలయ భూముల పరిరక్షణకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని ఈవో శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆలయంలో ఆయన మాట్లాడుతూ ఆలయానికి చెందిన సుమారు 5.52 ఎకరాలు క్రయవిక్రయాల ద్వారా అన్యాక్రాంతం చేయడానికి కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని, రక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన నంద పాండురంగడు కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కలెక్టర్, దేవాదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేస్తున్నామని ఈవో తెలిపారు.

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

శ్రీ శ్రీనివాస గోల్డ్ తాకట్టులో ఉన్న బంగారం ఏ బ్యాంక్, ప్రైవేట్ సంస్థల నుండి అయిన విడిపించి ఆరోజు మార్కెట్ రేటుకే కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 94933 38823

JOBS

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యూయర్స్. ఏజ్: 22-35. ఫ్రెషర్స్ కూడా కావలెను. ✆ 6281037879.

రామకృష్ణ గ్రూప్, Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటిపని, వంటపని, బేబికేర్ కొరకు స్త్రీ/పు కావలెను. బో+ వ+ జీతం: 16-18K. ✆ 97040 51122, 90106 80011.

అకడమిక్ ఇన్‌ఛార్జ్ కావలెను. నిడదవోలు ఒక ప్రముఖ పాఠశాలలో పనిచేయుటకు అనుభవజ్ఞులైనవారు కావలెను. ✆ 63009 53243, కాల్ టైమింగ్స్: 9 am to 7 pm.

రాజమండ్రిలో ప్రముఖ కలెక్షన్ ఏజెన్సీ నందు పనిచేయుటకు కలెక్షన్ & రికవరీ ఎగ్జిక్యూటివ్స్ మరియు టీం లీడర్స్ కావలెను. Contact: 99634 07777.

వంట మనిషి కావలెను ఫర్ గర్ల్స్ హాస్టల్ భార్యాభర్తలు రూమ్ అండ్ ఫుడ్ ఇస్తాము. కాల్ ఇన్ హైదరాబాద్. సంప్రదించండి: 8688823404, 9963880880.

WANTED Accountant Male/Female
Sri Maruthi Agencies
Hukumpeta, Rajahmundry
Cell: 98481 38203

FACULTY/ TEACHERS
Walk-in Interviews for Teachers of All Subjects at Cherukuri Vidyalayam, Korukonda. Contact: 8897516535.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-80 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

కాకినాడ

తుపానుతో నగరపాలక సంస్థకు రూ.11 కోట్ల నష్టం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థకు మొంథా తుపానుతో రోడ్లు, విద్యుత్తు లైన్లు, తాగునీటి పైపులైన్లతో పాటు ఇతర విభాగాలకు నష్టం వాటిల్లింది. వీటి అంచనాలను నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం సేకరించింది. అన్ని విభాగాలకు కలిపి రూ.11 కోట్ల వరకు నష్టం జరిగినట్లు అంచనా వేశారు. కేవలం రోడ్లకే రూ.7 కోట్ల వరకు నష్టం జరిగినట్లు తేల్చారు. ఎస్ఈ వెంకట్రావు ఆధ్వర్యంలో అంచనాలను సేకరించి నష్టం ఎంత మొత్తంగా తేలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు పునఃప్రారంభం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: తుపాను నేపథ్యంలో మూతపడిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు తిరిగి ప్రారంభించారు. గతనెల 22న జిల్లా వ్యాప్తంగా 269 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అయిదు రోజులపాటు వీటిని నిర్వహించారు. తుపాను రావడంతో మూసివేశారు. అప్పటికే 3.2 టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించారు. సోమవారం నుంచి అన్నిచోట్ల కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశామని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు ఎం.దేవులానాయక్ తెలిపారు. ధాన్యాన్ని కొన్న 48 గంటల్లో రైతుల ఖాతాలకు సొమ్ములు చెల్లించే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ. 10 - మ. 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:

కాకినాడ నగరం: 80085 74157

సాంబమూర్తినగర్: 91548 46719, మసీదుసెంటర్: 91541 18210

గాంధీనగర్: 80085 74159, బాలాజీచెరువు: 80085 74154

పూడికను తొలగించారు..

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ లక్ష్మీనారాయణనగర్‌లో రహదారి పక్కన కాలువలో పూడిక తీయక అధ్వానంగా దర్శనమిస్తోంది. దోమల వ్యాప్తి చెందడంతో పాటు దుర్వాసన వెదజల్లుతోందని 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సిబ్బందితో పూడిక తీయించారు.

వృథాను అరికట్టారు..

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ, శాంతినగర్‌లో పగటిపూట వీధిదీపాలు వెలుగుతూ విద్యుత్తు వృథా అవుతోంది. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించారు.

గుంతలు.. వాహనాల గంతులు

న్యూస్‌టుడే, కాకినాడ నగరం

ఈనాడు పరిశీలన

మొంథా తుపానుతో కురిసిన వర్షాలకు నగర పరిధిలో పలు రోడ్లు దారుణంగా తయారయ్యాయి. దీంతో రహదారులపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా, రోడ్లు భవనాల శాఖ, ఇతర విభాగాలకు సంబంధించిన రహదారులున్నాయి. వాహనాలు ఆ గుంతల్లో పడటంతో నడుములు విరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయ రోడ్డులో ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు

ఆరు నెలల కిందటే మరమ్మతులు

కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆరునెలల కిందట గుంతల రహిత రహదారుల కార్యక్రమంలో భాగంగా నగర పరిధిలో 30కిపైగా రోడ్లను గుర్తించారు. 300కు పైగా చిన్నా, పెద్ద గుంతలకు అప్పట్లో మరమ్మతులు చేశారు. వాటి పనుల్లో నాణ్యత లోపాల కారణంగా ఆరోపణలున్నాయి. దీంతో ఆరునెలలు తిరగకుండానే పరిస్థితి యథాస్థితికి చేరింది. మళ్లీ గుంతలు తేలాయి. ఆ మార్గాల్లో ప్రయాణానికి నగరవాసులు బెంబేలెత్తుతున్నారు.

అధ్వానంగా శాంతినగర్ ప్రధాన రహదారి

చర్యలు తీసుకుంటాం..

నగర పరిధిలో నగరపాలక సంస్థకు చెందిన రహదారుల్లో గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం. గతంలో మరమ్మతులను పూర్తి పారదర్శకతతో చేపట్టాం. వర్షం నీరు నిలవడంతో వాహనాల తాకిడికి కొన్ని చోట్ల దెబ్బతిన్నాయి.

- మత్స్యరాజు, ఈఈ, నగరపాలక సంస్థ, కాకినాడ

ఎక్కడెక్కడంటే..

▲ మెయిన్ రోడ్డులో టూటౌన్ నుంచి జగన్నాథపురం వంతెన వరకు అనేక చోట్ల గుంతలు తేలాయి. జగన్నాథపురంలో ఎన్టీఆర్ వారధి నుంచి మోటీ సెంటర్ వరకు రోడ్డుపై అనేక చోట్ల ఇదే పరిస్థితి.

▲ జడ్పీ సెంటర్ నుంచి వార్ఫు రోడ్డు మీదుగా జగన్నాథపురం వారధి వరకు అనేక చోట్ల గోతులున్నాయి. ఈ రోడ్డు వర్షపోయే బస్సులు, ఇతర వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. దీంతో వాహనదారులు నానా ఇక్కట్లు పడుతున్నారు.

▲ అంబేడ్కర్ భవన్ నుంచి యూటీఎఫ్ హోం మీదుగా ఇంద్రపాలెం వంతెన వరకు గల రోడ్డు పూర్తిగా పాడైంది. ఈ రోడ్డుపై గతంలో మరమ్మతులు చేశారు.

▲ భానుగుడి కోకిల సెంటర్ నుంచి శ్రీనగర్ మీదుగా ఆదిత్య కళాశాల వైపు వెళ్లే దారి దారుణంగా ఉంది.

▲ జిల్లా పరిషత్ కార్యాలయం దారిలో పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి కొండయ్యపాలెం ఆర్వోబీ వైపు వెళ్లేదారిలో అనేక చోట్ల గుంతలున్నాయి.

▲ పీఆర్ కళాశాల ఉత్తర వైపు రోడ్డు నుంచి డీఎంహెచ్‌వో కార్యాలయం వైపు వెళ్లే దారిలో అనేక చోట్ల గుంతలున్నాయి. పీఆర్ కళాశాల ఎదురుగా గల రోడ్డు లోకా శాంతిభవన్ ఫూలే విగ్రహం వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డును కూడా గతంలో మరమ్మతులు చేయడం గమనార్హం.

కరవు భత్యం వెంటనే ప్రకటించాలి

గాంధీనగర్: రాష్ట్ర ప్రభుత్వం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచడంతోపాటు, కరవు భత్యం కూడా పెంచకుండా కార్మికులు, ఉద్యోగులు, పెన్షనర్లను మోసం చేస్తుందని సీఐటీయూ నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కే కన్నారెడ్డి పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణలు ఆరోపించారు. సోమవారం కలెక్టరేట్ వద్ద వారు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

పార్కులను ప్రైవేటీకరించవద్దు

కాకినాడ కలెక్టరేట్: కాకినాడ నగరంలోని పార్కులను ప్రైవేటీకరించవద్దని, కార్పొరేషన్ ద్వారా యథావిధిగా నిర్వహించాలని మాజీ కౌన్సిలర్ జీవీఎస్ శర్మ కోరారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో ఆయన హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

కాకినాడ నగరం: నగరపాలక సంస్థ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చొరవ తీసుకుంటున్నట్లు కమిషనర్ కేటీ సుధాకర్ తెలిపారు. సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఉప కమిషనర్ కె.శ్రీనివాస్, ఎస్ఈ పి.వెంకట్రావు, డీసీపీ కృష్ణారావు, టీపీఆర్ జైలు పాల్గొన్నారు.

నాటికల పోటీల్లో విజేతలు వీరే

కలియుగ కౌసల్య కన్నాంబ అవార్డును అందుకుంటున్న రూపశ్రీ

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఎస్వీ రంగారావు కళాసమితి ఆధ్వర్యంలో దంటు కళాక్షేత్రంలో నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ ప్రథమ బహుమతిని తితిక్ష, ద్వితీయ బహుమతిని వేదాంతం నాటికలు దక్కించుకున్నాయి. ఉత్తమ జ్యూరీ అవార్డును సాహితీసుగంధం గెలుచుకుంది. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి), ఎస్వీ రంగారావు మనుమడు జూనియర్ ఎస్వీ రంగారావుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఉత్తమ నటిగా ఎంపికైన విజయవాడకు చెందిన రూపశ్రీకి కలియుగ కౌసల్య కన్నాంబ అవార్డు, నగదు అందించారు. కూర్పకవి అధ్యక్షుడు పి.జే. చంటిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.వెంకట్రావు, సభ్యులు పాల్గొన్నారు.

మత్స్యశాఖ జేడీ కృష్ణారావుకు సత్కారం

కృష్ణారావును సత్కరిస్తున్న మత్స్యకార సంఘాల నాయకులు

కాకినాడ నగరం: మత్స్యశాఖ జేడీ వి.కృష్ణారావును సోమవారం మత్స్యకార సంఘ నాయకులు సత్కరించారు. ఇటీవల మొంథా తుపానులో మత్స్యకార రంగానికి ఎటువంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవటంలో ఆయన చేసిన కృషిని అభినందించారు. ఉమ్మడి జిల్లా మత్స్యకార సహకార సంఘాల అధ్యక్షుడు బలసాడి రంగారావు, బలసాడి తాతీలు, చింతా పేర్రాజు, ఎం.నటరాజు, ఆర్.రాము తదితరులు పాల్గొన్నారు.

రామారావుపేట శివాలయంలో విశ్వేశ్వరస్వామికి పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పెద్ద శివాలయంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

[illegible]

మత్స్యావతారంలో సీతారామస్వామి

ఓం నమఃశివ రుద్రాయ

గాంధీనగర్, న్యూస్‌టుడే: కార్తికమాసం రెండో సోమవారం నగరంలోని శివాలయాలన్నీ తెల్లవారుజామున మూడు గంటల నుంచే భక్త జనంతో కిక్కిరిశాయి. తెల్లవారుజాము నుంచే మహిళలు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి కార్తికదీపాలను వెలిగించి తరించారు. ఉదయం ఆలయాల్లో శివలింగాలకు పంచామృతాలు, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. పెద్ద శివాలయంలో భీమేశ్వరస్వామికి అభిషేకాలు, లక్ష బిల్వార్చనలు జరిగాయి. శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామికి పంచామృతాలు, పవిత్ర నదీ జలాలతో అభిషేకాలు జరిపారు. రామారావుపేట శివాలయంలో స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. భానుగుడి సెంటర్ బాలభోగేశ్వరస్వామి ఆలయం భక్తజనంతో నిండిపోయింది. సూర్యారావుపేట, జగన్నాథపురం, శ్రీనగర్, సాంబమూర్తినగర్, మెహర్‌నగర్ తదితర ప్రాంతాల్లోని శివాలయాల్లో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు జరిగాయి భక్తులు భారీగా తరలివచ్చారు. ● కార్తిక మాసం సందర్భంగా సోమవారం దేవాలయ వీధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో వరాహావతారంలో స్వామివారు పూజలందుకున్నారు. మెయిన్‌రోడ్డులోని శ్రీసీతారామాలయంలో మత్స్యావతారంలో అలంకరించారు.

కొనసాగుతున్న శానిటేషన్ వర్కర్ల ఆందోళన

మసీదు సెంటర్ (కాకినాడ): పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, నూతన కాంట్రాక్ట్ సంస్థ కార్మికులతో వేతన ఒప్పందం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కాకినాడ జీజీహెచ్ శానిటేషన్ వర్కర్లు చేపట్టిన ఆందోళన సోమవారం కూడా కొనసాగింది. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ, యూనియన్ సీనియర్ మెంబర్ భాగ్యవతి, పలివెల వీరబాబు, సభ్యులు మంగతాయారు, వెంకటలక్ష్మి, రమేష్, వాసు, రవి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న కార్మికులు

ఆర్థిక సాయం అందజేస్తున్న యాదవ సంఘ ప్రతినిధులు

బాధిత కుటుంబానికి సాయం అందజేత

కాకినాడ కలెక్టరేట్: తుపాను నేపథ్యంలో బోటును కట్టడానికి వెళ్లి గల్లంతై మరణించిన స్థానిక దుమ్ములపేట మత్స్యకారుడు వర్రసి రాజబాబు మృతి చెందారు. శనివారం బీసీ పార్టీ అధ్యక్షుడు బి.రామచంద్రయాదవ్ ఆదేశాల మేరకు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. సోమవారం ఆయన పంపిన రూ.లక్ష నగదును యాదవ సంఘం నాయకులు కర్ణం పోతురాజు యాదవ్ ద్వారా అందజేశారు. బీసీ నాయకులు గొంప శివకుమార్, శీరం శ్రీను, ఆర్‌కే రామకృష్ణ, గొర్ల కుమార్, మల్లె రాజు, తదితరులు పాల్గొన్నారు.

మరణ ధ్రువపత్రం జారీ చేయాలని వినతి

కాకినాడ కలెక్టరేట్: గద్దేపల్లి సాయిరాంకు సంబంధించి మరణ ధ్రువపత్రం, పోస్టుమార్టం రిపోర్టులను సత్వరమే జారీ చేయాలని ఫిషర్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రెసింగి ఆదినారాయణ, బాధిత కుటుంబసభ్యులు సోమవారం పీజీఆర్ఎస్‌లో వినతి పత్రం అందజేశారు.

ఇలా వదిలేస్తే.. ఎలా?

కాకినాడ రేచర్లపేట రైల్వేగేటు వద్ద ఇటీవల పట్టాల మరమ్మతులు చేపట్టారు. అనంతరం రాళ్లు పైకి లేచి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. పట్టాలతోపాటు రోడ్డుపై కంకర రాళ్లు చిందరవందరగా ఉండటంతో రాత్రి సమయంలో వాహనంపై వెళ్లే మహిళలు, వృద్ధులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఓ వ్యక్తి పట్టాల వద్ద పట్టుతప్పి పడటంతో ఆస్పత్రి పాలయ్యాడు. సంబంధిత అధికారులు స్పందించి రాళ్లను సరిచేయించాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, భానుగుడి సెంటర్

స్పందించారు.. సరిచేశారు

నగరంలోని టూటౌన్ సాయిబాబా గుడి సమీపంలో రోడ్డు మధ్యలో మంచినీటి పైపులైన్ పగిలి గత నెలరోజులుగా నీరంతా వృథాగా పోతుంది. దీనిపై సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి నగరపాలక సంస్థ అధికారులు స్పందించారు. పైపులైన్‌ను గుర్తించి మరమ్మతులు చేపట్టారు.

– న్యూస్‌టుడే, గాంధీనగర్

ప్రమాదకరంగా ఫ్యూజ్ బాక్స్..

కాకినాడ పరలోవపేటలో ప్రధాన రహదారి పక్కన మూతలు లేకుండా ఫ్యూజ్ బాక్స్ ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. గతకొంత కాలంగా ఇదే పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. చిన్నారులకు సైతం అందే ఎత్తులో ఉందని వాపోతున్నారు. పెనుప్రమాదం జరగకముందే సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

స్లాబురాయి ఏర్పాటు చేయరూ..

కాకినాడ పల్లంరాజునగర్‌లోని మూడో వీధిలో కాలువపై స్లాబురాయి విరిగి ప్రమాదకరంగా ఉంది. పెద్ద వాహనాలు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం బారిన పడతామోనని స్థానికులు, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి స్లాబురాయిని ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

చెత్తకు నిప్పు.. తీగలకు మంటలు

మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

సాంబమూర్తినగర్, మసీదుసెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ గొడారిగుంట నాలుగు రోడ్ల కూడలి సమీపంలోని ఓ బహుళ అంతస్తుల సముదాయం వద్ద ఉన్న విద్యుత్తు స్తంభం కింద భాగాన చెత్తకు నిప్పంటించడంతో స్వల్ప అగ్ని ప్రమాదం సంభవించింది. మంటలు వ్యాపించడంతో కేబుల్ వైర్లు అంటుకుని కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలు ఆర్పారు. పక్కనే ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్తు తీగలకు వ్యాపించకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. విద్యుత్తు శాఖ డీ3 ఏఈ సునీల్ మాట్లాడుతూ సమాచారం అందిన వెంటనే విద్యుత్తు సరఫరా నిలిపి వేశామని, కేవలం కేబుళ్లు మాత్రమే దగ్ధమయ్యాయన్నారు.

ప్రజలకు సురక్షిత తాగునీరు సరఫరా

కాకినాడ నగరం: నగర ప్రజలకు సురక్షిత తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ కేటీ సుధాకర్ తెలిపారు. సోమవారం ఆయన నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. కుళాయి చెరువు ఆవరణలో విక్టోరియా వాటర్ వర్క్స్‌ను సందర్శించారు. అక్కడి నీటి శుద్ధి వ్యవస్థను పరిశీలించారు. నీటి సరఫరా విషయంలో ఎటువంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. అనంతరం నగరంలో పలు వార్డుల్లో పర్యటించి పారిశుద్ధ్య చర్యలను పరిశీలించారు. చెత్త తరలింపుపై సిబ్బందికి సూచనలు చేశారు.

చెత్త తరలింపును పరిశీలిస్తున్న కమిషనర్ సుధాకర్

కాకినాడ నగరం: తుపాను నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుని నగరంలో ఎటువంటి ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా చూసిన కమిషనర్ సుధాకర్‌ను సోమవారం మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు ఆధ్వర్యంలో సత్కరించారు.

సృజనను వెలికితీయాలి

ప్రదర్శన తిలకిస్తున్న తల్లిదండ్రులు

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: కాకినాడ లక్ష్మీనారాయణ నగర్‌లో గల నారాయణ పాఠశాలలో వినూత్నంగా 1, 2 తరగతుల విద్యార్థులకు 'స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్(ఎస్ఎల్‌సీ) కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ కవిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏజీఎం రాఘవేంద్రరావు, కోఆర్డినేటర్ రామతులసి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ ఎంతో విలువైనది

మాట్లాడుతున్న భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ రామకృష్ణ

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: విద్యార్థి దశ అత్యంత విలువైందని, ఈ దశలోనే చదువుపై సమయాన్ని వినియోగించాలని భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. కాకినాడ కాపు కల్యాణ మండపంలో సోమవారం జిల్లాలోని పదోతరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నిమిషం సద్వినియోగం చేసుకోవాలన్నారు మేనేజింగ్ డైరక్టర్ భాష్యం సాకేత్‌రామ్, మైఖేల్‌రాజ్, జోనల్ ఇన్‌ఛార్జి వి.గోవిందరాజు, వి.ఆంజనేయులు, వివిధ బ్రాంచిల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన

కాకినాడ రంగరాయ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసన్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం 'వన్ వరల్డ్-వన్ హెల్త్'లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని ప్రిన్సిపల్ డాక్టర్ విష్ణువర్ధన్ ప్రారంభించి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యతతోపాటు సమాజంలో ఆరోగ్య అవగాహనను పెంచుతాయన్నారు. క్విజ్, వాక్‌థాన్, రీల్స్, షార్ట్ వీడియో తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్స్ డా.విజయశేఖర్, డా.శశి, ఎస్పీఎం హెచ్ఓడీ డా.సుజాత, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డా.సౌమ్య, డా.తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

రెజ్లింగ్‌లో విద్యార్థినులకు పతకాలు

పతకాలు సాధించిన విద్యార్థినులతో ప్రమీలరాణి

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఈ నెల 3న రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ నిర్వహించిన రెజ్లింగ్ పోటీలో కాకినాడ జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు పతకాలు సాధించారు. కె.ధన సాయి లక్ష్మి బంగారు, ఎస్.మౌనిక కాంస్యం, ఎం.గంగారత్నం, కె.శాంతి రజత పతకాలు సాధించినట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్, కెప్టెన్ డా.జి.ప్రమీలరాణి తెలిపారు. ధనసాయిలక్ష్మి రాజస్థాన్‌లో జరిగే అంతర్‌యూనివర్సిటీ పోటీలకు ఎంపికైంది. ప్రిన్సిపల్ డా.వి.అనంతలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ ఎం.సువర్చల తదితరులు విజేతలను అభినందించారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE : KAKINADA
E.P.No.55/2022 in O.S.No.243/1996
Between:
Amjuri Rama Naga Srinivas ...DHR
and
Amjuri Venkataramana and Others ..JDR's
6th JDr :- Doddi Kodanda Ramamurthy, S/o.Ramarao,D.No.21-4-1, Salipeta, Kakinada.
7th JDr :- Doddi Umamaheswara Apparao, S/o.Ramarao,D.No.21-4-1, Salipeta, Kakinada.
8th JDr:- Doddi Kanta Kumar, S/o. Ramarao, D.No.21-4-1, Salipeta, Kakinada.
పై నెంబరు పిటీషన్‌లో 6,7,8 JDr's కు ఎన్నిసార్లు సమస్లు పంపినసూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పై కోర్టువారి ఎదుట ది. 19-11-2025 తేదీన ఉదయం గం. 10-30 ని॥ల స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరు అయ్యి ఆక్షేపణలు తెలియచేసుకోవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.
MVJR ASSOCIATES,
BINDU SREE VEMURI, Advocates
D.No.70-7-16/9, T.S.R.Nagar, Road No.2, Beside Alayam Homes, Kakinada-5
Cell: 9491624206, 9346677673

అక్రమాలు అరికట్టండి.. ఆపన్నహస్తం అందించండి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: అక్రమంగా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారని, రీ-సర్వే పేరుతో భూములను దోచేస్తున్నారని, ప్రభుత్వ శాఖల్లో అక్రమాలను అరికట్టాలని, సదరంధ్రువపత్రం ఇవ్వక పింఛను కోల్పోతున్నామని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, తుపాను సాయం అందించాలని.. ఇలా అనేక సమస్యలను సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ప్రజలు ఏకరువు పెట్టారు. అధికారులు చొరవ తీసుకుని సాంత్వన చేకూర్చాలని వేడుకున్నారు.

ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్‌లో మాయాజాలం

కాకినాడ ఆర్టీసీ బస్టాండ్‌లో కాకినాడ-విశాఖపట్నం నాన్‌స్టాప్ టిక్కెట్ల కౌంటర్లలో ప్రయాణికుల నుంచి అదనంగా సొమ్ములు లాగేస్తున్నారు. రిజర్వేషన్ ఛార్ట్ ప్రకారం ఒక టిక్కెట్‌ధర రూ.310 ఉండగా, కరెంట్ రిజర్వేషన్ పేరుతో రూ.330 వసూలు చేస్తున్నారు. ఈ అక్రమాలపై ఫిర్యాదులొస్తే కేవలం కౌంటర్లలో పనిచేసే సిబ్బందిని తప్పించి, చేతులు దులుపుకొన్నారు. దీనిపై ఏసీబీ అధికారులతో సమగ్ర విచారణ జరిపించాలి. అక్రమార్కులపై చర్యలు చేపట్టాలి. దీనిపై ఫిర్యాదు చేశానని, ఆర్టీసీ అధికారులు నాపై కక్షసాధింపులకు పాల్పడుతున్నారు.

- పులి లోవరాజు, ఆర్టీసీ డ్రైవర్

సదరం పరీక్ష చేయకుండా..

ప్రమాదంలో కాలుకు తీవ్ర గాయమై కాకినాడ జీజీహెచ్‌లో చేరగా తిరుపతి ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. అక్కడి నుంచి చెన్నై ఆసుపత్రికి తరలించారు. తిరిగి కాకినాడ జీజీహెచ్‌కు పంపించగా, ఇక్కడ శస్త్ర చికిత్స చేశారు. కాలు లేని నేను దివ్యాంగ పింఛను కోసం సదరం పరీక్షలకు వెళితే చెన్నై నుంచి సర్టిఫికెట్ తెచ్చుకోమంటున్నారు. అక్కడి వెళ్లే ఆర్థిక స్థోమత మాకు లేదు. నా తల్లి కూలీ పనులు చేసి పోషిస్తోంది. తండ్రి అనారోగ్యంతో ఉన్నాడు. ఇక్కడ పరీక్షలు నిర్వహించి, పింఛను ఇప్పించండి.

- వేమగిరి దుర్గబాబు, కలరాపాకలు, రేచర్లపేట

కాలువ గట్టు భూమిని కాపాడండి

సామర్లకోటలోని శ్రీమాండవ్య నారాయణ స్వామి వారి ఆలయం పక్కన ఉన్న నీటిపారుదల శాఖకు చెందిన కాలువ గట్టు భూమిని ఆక్రమించారు. దీనిపై గతంలో ఫిర్యాదు చేసినా సక్రమంగా సర్వే నిర్వహించలేదు. రీ-సర్వే చేసి ఈ భూమిని కాపాడాలి. ఈ కాలువగట్టుకు చెందిన 60 సెంట్ల భూమిని కబ్జా చేసి రియల్ ఎస్టేట్‌వ్యాపారం చేస్తున్నారు, ప్లాట్లు కింద విభజించి అమ్మేస్తున్నారు. ఈ భూమిని కాపాడాలి. రైతులు, ప్రజల సమక్షంలో రీ-సర్వే చేయాలి.

- బిక్కిన శ్రీరంగనాయకులు, నేతల హరిబాబు, సామర్లకోట

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మసీదుసెంటర్: నూకాలమ్మ మాన్యం వద్ద రోడ్డు పక్కన కాలువలో పడి ఓ గుర్తుతెలియని సుమారు 55 ఏళ్ల వయస్సు గల వ్యక్తి సోమవారం మృతిచెందాడు. స్థానిక వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు 9440796541 నెంబర్‌కు సమాచారం అందించాలని కాకినాడ టూటౌన్ సీఐ అప్పలనాయుడు తెలిపారు.

డాక్యుమెంట్స్ పడిపోయినవి
1) శ్యామల మధుకుమార్, తండ్రి: శ్యామల గోవిందస్వామి మరియు 2) శ్యామల అరుణ, భర్త: శ్యామల మధుకుమార్, హైదరాబాద్, KPHP ఫేజ్-4, కూకట్‌పల్లి, డోర్ నెం.15-31-6B-2200 Lodha Brezza Apartment-LHC కాపురస్తులు అయిన మా పేరిట గల చిత్తూరు జిల్లా, చంద్రగిరి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిష్టర్ కాబడిన ఒరిజినల్ డాక్యుమెంట్ నెం.2150/2003 తేది.30-08-2003, డాక్యుమెంట్ నెంబర్:1584/2005 తేది.11-05-2005, మరియు 2153/2003 తేది.30-08-2003 రిజిష్టరు కాబడినవి. సదరు ఆస్తికి సంబంధించిన 3 ఒరిజినల్ దస్తావేజులు లోన్ నిమిత్తం కాకినాడ తీసుకుని వెళ్లగా ది.15-10-2025 తేదీన జిరాక్స్ తీయు నిమిత్తం కాకినాడ దుమ్ములపేట ఏరియా గల జెరాక్స్ షాపునకు వెళ్ళినపుడు జెరాక్స్ షాపు వద్ద కవరులో ఉన్న దస్తావేజులు పడిపోయినవి. ఎంతవెదికినను దొరకలేదు. సదరు దస్తావేజులు ఎవరికైననూ దొరికిన యడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేసినచో తగిన పారితోషికం ఇవ్వబడును.
శ్యామల మధుకుమార్,
తండ్రి: శ్యామల గోవిందస్వామి
ఫోన్: 86393 30162

(c) eenadu

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

ఆరోగ్యం బాలేదు.. బిడ్డను ఆదుకోండి..

తాళ్లరేవు, న్యూస్‌టుడే: మెదడు సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న తమ కుమారుడు జయవిజయ్‌ను ఆదుకోవాలని మాదవరాయునిపేటకు నురుకుర్తి రామకృష్ణ, మహాలక్ష్మి దంపతులు కోరారు. ఇప్పటికే వైద్యానికి రూ.8లక్షలు ఖర్చుచేసినట్లు తల్లి మహాలక్ష్మి సోమవారం తెలిపారు. తాళ్లరేవు వచ్చిన ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుకు గోడు చెప్పుకొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కుల పంపిణీ

గొల్లప్రోలు: గొల్లప్రోలులో అయిదుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను జనసేన క్రియాశీల కార్యకర్తలు సోమవారం పంపిణీ చేశారు. పలువురికి రూ.5,94,863 మేర సాయం అందించారు. పవన్‌కల్యాణ్‌ ఆదేశాల మేరకు ఎంపిక చేసిన క్రియాశీల వాలంటీర్లు చెక్కులు అందుకున్నారు. గొల్లప్రోలులో మేడిశెట్టి నాగమణి, మర్రి కనక చక్రసత్యనారాయణ బాధిత కుటుంబాలకు 12 మందికి రూ.6,37,393 పంపిణీ చేశారు. ✦ **కొత్తపల్లి:** యండపల్లిలో మురాలశెట్టి వెంకటసుబ్బారావు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ప్రభుత్వం నుంచి ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.2.52 లక్షలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును జనసేన సీనియర్‌ నాయకుడు గుండ్ర కిషోర్‌ చేతులమీదుగా సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు.

అర్జీలు పరిష్కరిద్దాం

పిఠాపురం: పీజీఆర్‌ఎస్‌లో ఇచ్చిన అర్జీల స్థితిని 1100కు కాల్ చేసి తెలుసుకోవచ్చని పాడా పీడీ చైతన్యలక్ష్మి తెలిపారు. సోమవారం పిఠాపురంలోని తన కార్యాలయంలో పీజీఆర్‌ఎస్‌లో 57 అర్జీలు స్వీకరించారు. అధికారులతో మాట్లాడి కొన్ని సమస్యలు పరిష్కరించారు. ఏడీ వసంత మాధవి, తహసీల్దారు గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బలోపేతం చేద్దాం

గొల్లప్రోలు: పోలింగ్ బూత్ స్థాయి నుంచి భాజపా బలోపేతానికి చర్యలు చేపడుతున్నట్లు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రవణం సుబ్రహ్మణ్యం తెలిపారు. గొల్లప్రోలులో పార్టీ బూత్ కమిటీ అధ్యక్షులతో సోమవారం సమీక్షించారు. పట్టణ అధ్యక్షుడు చిట్టా మధు, జిల్లా నాయకులు కర్రి సత్యనారాయణ, కోశెట్టి ఆదవిరాజు, బాబూరావు, రాములు, బాస్కరరావు, కల్యాణ్ పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉందాం

పిఠాపురం: ప్రతి కుటుంబంలోనూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుందని ఇన్‌ఛార్జి కమిషనర్ పి.రాజు, మెప్మా సీఎంఎం వెంకటలక్ష్మి పేర్కొన్నారు. పిఠాపురం రథాలపేటలోని అంబేడ్కర్‌భవన్‌లో సఖి సురక్ష మహిళల ఆరోగ్యానికి సురక్ష కవచం అనే కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు.

భరోసాకు విన్నపం

గొల్లప్రోలు: చేనేత కార్మికులకు ఏడాదికి రూ.25 వేలు అందించే నేతన్న భరోసా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంక్షేమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సూరిశెట్టి సత్య కృష్ణ కోరారు. చేబ్రోలులో సోమవారం విలేకరులతో మాట్లాడారు. మగ్గాలున్న చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మర మగ్గాలున్నవారికి 500 యూనిట్లు ఉచిత విద్యుత్తు కల్పించాలన్నారు.

చికిత్సకు సాయం

పిఠాపురం: అప్పు చేసి కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నవారికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే వర్మ పేర్కొన్నారు. సోమవారం పిఠాపురంలో పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు పట్టణ, మండలాలకు చెందిన 52 మందికి రూ.28 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందించారు.

వ్యయం.. నిష్ప్రయోజనం!

న్యూస్‌టుడే, గొల్లప్రోలు

పురపాలిక హోదాతో గొల్లప్రోలు నగర పంచాయతీగా ఉన్నతీకరణ చెంది 15 ఏళ్లవుతున్నా ఆ దిశగా అభివృద్ధి పనులు జరగడం లేదు. పట్టణం మధ్యలో 13 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మొగలిసూర్యుడు మంచినీటి చెరువును నడకదారి, వ్యాయామశాల, పచ్చదనంతో అభివృద్ధిపరచాలని 25 ఏళ్లగా ప్రతిపాదనలు రూపొందించినా కార్యరూపం దాల్చలేదు. 15 ఏళ్ల క్రితం చెరువు గట్లను పటిష్ఠపరిచేందుకు చుట్టూ కాంక్రీటు వేసే పనులు రూ.10 లక్షలతో చేశారు. వైకాపా ప్రభుత్వంలో రూ.80 లక్షలతో ఈ చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా నడకదారి, చుట్టూ పెన్సింగ్ పనులు చేపట్టారు. కానీ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. గత తెదేపా ప్రభుత్వంలో చెరువు చుట్టూ ప్రహరీ నిర్మాణం రూ.40 లక్షలతో చేపట్టి సగంలో వదిలేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత నడకదారి మార్గంలో పిచ్చిమొక్కలు తొలగించి కొంత మేర గ్రావెల్ రోడ్డు నిర్మించే పనులను రూ.4 లక్షలతో చేశారు. రూ.లక్షలు వెచ్చించినా సూర్యుడుచెరువు ఆధునికీకరణకు నోచుకోక వినియోగంలోకి రాలేదు. నడకదారి మార్గంలో మళ్లీ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి పాములు సంచరిస్తున్నాయి. చుట్టూ సరైన రక్షణలేక పలువురు ఈ చెరువులో పడి మృత్యువాతపడుతున్నారు.

గొల్లప్రోలులో అభివృద్ధికి నోచుకోని సూర్యుడు చెరువు

అధ్వానంగా చెరువులు..

గొల్లప్రోలులో పశువులకు తాగునీరు అందించేందుకు, భూగర్భ జలాలు పెరిగేందుకు అవకాశం ఉన్న రంగప్పచెరువు, రాజుచెరువు అధ్వాన స్థితికి చేరాయి. రంగప్పచెరువు పూర్తిగా గుర్రపు డెక్కతో మూసుకుపోయింది. రాజుచెరువు పూడుకుపోయి పసరు నీటితో దుర్వాసనవస్తోంది. స్థానిక ఈబీసీకాలనీ, ఎస్సీపేటల్లో మూడు చెరువులు గుర్రపుడెక్కతో పూడుకుపోయి వినియోగంలో లేకుండాపోయాయి.

పనులకు ప్రతిపాదనలు

గొల్లప్రోలులో రాజుచెరువు, రంగప్పచెరువులను అభివృద్ధిపరిచేందుకు రూ.5 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేశాం. ఈ చెరువుల్లో గుర్రపుడెక్క, మురుగు నీటిని తొలగించే పనులు చేపడతాం. సూర్యుడు చెరువును పూర్తి స్థాయిలో ఆధునికీకరించేందుకు అమృత్ పథకంలో ప్రతిపాదనలు రూపొందించారు.

- మహమ్మద్ అలీషా, ఇన్‌ఛార్జి కమిషనర్

ఆపన్నులకు ఆర్థిక చేయూత

కాజులూరు: చేదువాడకు చెందిన ఇళ్ల నాగమణి రోడ్డు ప్రమాదంలో కాలికి తీవ్రగాయమై శస్త్రచికిత్స చేయించుకుంది. ఆమెకు మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం రూ.20 వేలు సాయంగా అందించారు. చికిత్స చేయిస్తామని హామీ ఇచ్చారు. ● **తాళ్లరేవు:** పాత కోరింగకు చెందిన అరుబరుకుల లక్ష్మి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. కొత్త కోరింగ సహకార సంఘంలో సభ్యురాలిగా ఉండటంతో ప్రమాద బీమా కింద రూ.2లక్షల చెక్కును మృతురాలి కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, కొప్పిశెట్టి బాబి సోమవారం అందజేశారు.

నగదు ఇస్తున్న మంత్రి సుభాష్

జనసేనలో పలువురి చేరిక

సర్పవరం: తిమ్మాపురం రేపాక గార్డెన్‌లో కాలనీ సంఘం ప్రతినిధులు పలువులు గ్రామకమిటీ జనసేన అధ్యక్షుడు మాదారపు తాతాజీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానాజీ సమక్షంలో సోమవారం జనసేనలో చేరారు. నానాజీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు సంక్షేమాభివృద్ధి పథకాలు అందిస్తుండడంతోనే ప్రజలు జనసేనలో చేరుతున్నారన్నారు.

ఎమ్మెల్యే నానాజీతో కాలనీవాసులు

పాడి రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

సర్పవరం: తుపాను ప్రభావంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఉచితంగా పశువుల దాణా అందిస్తోందని ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. వాకలపూడిలో పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా దాణా పంపిణీ చేశారు. అనంతరం మరో కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వం పేద ప్రజలకు ఇళ్ల పట్టాలు అందించిన లేఅవుట్‌లలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా నిర్లక్ష్యం చేసి అవినీతికి పాల్పడిందన్నారు.

కార్తిక దీపం.. భక్తపావనం

సర్పవరం: కాకినాడ గ్రామీణం, అర్బన్ ప్రాంతాల్లోని శివాలయాల్లో కార్తిక సోమవారం పురస్కరించుకుని భక్తులు దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. ✦ **కరప:** కరప రామదాసు గారివీధిలో కోటి దీపోత్సవం జరిగింది. కరప, నడకుదురు, చిన మామిడాడ, వేళంగి, వేములవాడ, పెద్దాపురప్పాడు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ముక్కంటికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. ✦ **గొల్లప్రోలు:** శివాలయంలో భక్తుల రద్దీ నెలకొంది. దుర్గాడ శివాలయంలో దీపాలంకరణ అలరించింది. ✦ **సామర్లకోట:** భీమేశ్వరాలయం భక్తుల శివనామస్మరణతో మార్మోగింది. ✦ **పిఠాపురం:** పాదగయ క్షేత్రానికి కార్తిక మాస రెండో సోమవారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. ✦ **తాళ్లరేవు:** పాత, కొత్త కోరింగలోని ఆలయాల్లో పూజలు జరిగాయి.

పెద్దాపురం: పెద్దాపురం మెయిన్‌రోడ్డులో సోమవారం రాత్రి అయ్యప్ప స్వాములతో లక్ష బిల్వార్చన వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చినరాజప్ప, డీసీసీబీ ఛైర్మన్ రామస్వామి, పురపాలిక మాజీ అధ్యక్షుడు రాజాసూరిబాబురాజు, పట్టణ జనసేన పార్టీ అధ్యక్షుడు సత్తిబాబు, సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురప్పాడులో..

రమణయ్యపేటలో ఏకామ్రేశ్వరుడు

కరపలో కోటి దీపోత్సవం

పాదగయలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పెద్దాపురంలో పాల్గొన్న స్వాములు

గొల్లప్రోలు: గొల్లప్రోలులోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ శాఖలో ఏర్పాటు చేసిన 25 అడుగుల మహాదివ్య శివలింగాన్ని ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ సోమవారం రాత్రి దర్శించుకున్నారు. సహస్రలింగ దర్శనం, ఆధ్యాత్మిక చిత్ర ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఈ నెల పదో తేదీ వరకూ కొనసాగించనున్నట్లు బ్రహ్మకుమారీల కాకినాడ జోన్ ఇన్‌ఛార్జి రజనీ తెలిపారు. శ్రీనివాస్, శివ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీలతో ఎమ్మెల్యే సత్యప్రభ తదితరులు

అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

పెదపూడి, న్యూస్‌టుడే: అచ్యుతాపురత్రయం గ్రామంలో సోమవారం తెల్లవారుజామున వల్లూరి మాచరమణికి చెందిన తాటాకిల్లు అగ్నిప్రమాదానికి గురై పూర్తిగా కాలిబూడిదైంది. విషయం తెలిసిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి 25కేజీల బియ్యం, తెదేపా నేత ఆరుమిల్లి సత్యభారతి ప్రసాద్ ఇచ్చిన రూ.2వేల నగదు ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. తహసీల్దారు సీతాపతిరావు, నేతలు ఉన్నారు.

బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

ఆట.. భవిష్యత్తు బాట

పిఠాపురం: అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో అక్టోబరు 31 నుంచి నవంబర్ 2 వరకు జరిగిన గన్నమనేని భానుమతి మెమోరియల్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్త్రీ, పురుషుల బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పిఠాపురం మహిళల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. వీరిని సోమవారం పిఠాపురంలో సత్కరించారు. ✦ **పెద్దాపురం:** స్థానిక మహారాణి కళాశాల మైదానంలో డివిజన్ స్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 బాలబాలికల క్రీడా పోటీలు సోమవారం నిర్వహించారు. కబడ్డీ, అథ్లెటిక్స్, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో 750 మంది ఆడారు. శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్ ఆవరణలో ఈ నెల 5న అండర్-15 బాలురు, బాలికల విభాగంలో కాకినాడ జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడాకారులను ఎంపిక చేస్తున్నామని టీటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విజయప్రకాష్ తెలిపారు. ✦ **పిఠాపురం:** విరవ జడ్పీ పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. 13 పాఠశాలల నుంచి 500 మంది హాజరయ్యారు. పీఈటీ రాంబాబు, ప్రధానోపాధ్యాయుడు జనార్దనరావు పాల్గొన్నారు.

జట్టు సభ్యులను అభినందిస్తున్న అసోసియేషన్ నాయకులు

ఇలా.. నిలిపితే ఎలా..?

గొల్లప్రోలులోని రాయవరం రోడ్డుపై ఇరుపక్కలా వాహనాలు నిలిపి ఉంచడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డుపై భారీ లోడు వాహనాలు వచ్చిన సమయంలో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. రోడ్డు పక్కన వాహనాలు నిలపకుండా చూడాలని కోరుతున్నారు. చర్యలు చేపడతామని ఎస్సై రామకృష్ణ తెలిపారు. **- న్యూస్‌టుడే, గొల్లప్రోలు**

సాంకేతికతా.. ఏంటీ వెత

కరప మండల పరిషత్తు కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు సాంకేతిక సమస్యలతో మరమ్మతులకుగురై నిరుపయోగంగా మారడంతో అధికారులు ఇక్కట్లు పడుతున్నారు. దీనిపై ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ తాను రెండురోజుల క్రితమే విధుల్లో చేరానని, మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. **- న్యూస్‌టుడే, కరప**

బాబోయ్.. ఇది బండేనా..!

ప్రమాదం చెప్పి రాదంటారు. మన జాగ్రత్తలో మనం ఉండాలి. స్కూటర్లపై ఇద్దరికంటే ఎక్కువ మంది ప్రయాణించకూడదనే నిబంధనలున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో ఎవరూ పాటించడం లేదు. పెద్దాపురం మెయిన్‌రోడ్డులో సోమవారం స్కూటర్‌పై ఇద్దరు పెద్దవాళ్లతోపాటు నలుగురు చిన్నారులతో ప్రయాణిస్తున్న చిత్రమిది. **- న్యూస్‌టుడే, పెద్దాపురం**

చెకుముకి సైన్స్ సంబరాలు

నేడు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు గొల్లప్రోలు జడ్పీ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు జరుగుతాయని జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఏలేటి నానిబాబు, చెకుముకి కన్వీనర్ అనిశెట్టి సీతారామరాజు సోమవారం తెలిపారు.

సఖి సురక్ష శిబిరం

సామర్లకోట: సామర్లకోట రైతు భవన్‌లో సఖి సురక్ష వైద్యశిబిరం మంగళవారం ఉదయం 9.30కి నిర్వహిస్తున్నామని పురపాలిక కమిషనర్ శ్రీవిద్య తెలిపారు. స్వయం సహాయక సంఘాల్లోని 30 ఏళ్లుపైబడిన సభ్యులకు 16 రకాల రక్త పరీక్షలు చేస్తారన్నారు. రూ.5 లక్షల విలువ కలిగిన ఆరోగ్య బీమా కల్పిస్తారని తెలిపారు.

భాజపా బలోపేతమే లక్ష్యం

పెద్దాపురం: భాజపా పిలుపు మేరకు పెద్దాపురం మండలం తిరుపతి, చదలాడ గ్రామాల్లో సోమవారం భాజపా ఆవాస్ యోజన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ రామ్‌కుమార్ తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వర్మ, మండల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్, మంగరాజు, ఆరుమిల్లి గోపీ, యన్నం మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325 పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

సమస్య: స్థానిక అంకయ్యపేటలో రహదారిపై చెత్తకుప్పలున్నాయి. పురపాలిక అధికారులు చర్యలు తీసుకోవాలి. **- నారాయణరావు**

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణకు తెలుపగా చెత్త తొలగింపజేశారు. **- న్యూస్‌టుడే, పెద్దాపురం**

సమస్య: కాకినాడ అర్బన్ వైద్య నగర్‌లో మురుగు కాలువలో పూడిక తీయడం లేదు. **- సత్యరాణి**

పరిష్కారం: పారిశుద్ధ్య బాధ్యుడు జగన్‌కు తీసుకువెళ్లగా శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, రమణయ్యపేట**

సమస్య: కొత్తపల్లి గ్రామం ముత్యాలమ్మ చెరువు సెంటర్‌లో చెత్త పేరుకుపోయింది. **- స్థానికులు**

పరిష్కారం: కార్యదర్శి సత్యనారాయణ సిబ్బందిని పంపి చెత్త తొలగింపజేశారు. **- న్యూస్‌టుడే, కొత్తపల్లి**

అవీ ఇవీ అన్నీ

కాలువ గట్టు ఆక్రమణపై ఫిర్యాదు

సామర్లకోట: సామర్లకోట మాండవ్య నారాయణస్వామి ఆలయం సమీపంలో గోదావరి కాలువ గట్టును ఆక్రమించి లేఅవుట్‌లో కలిపేసుకున్నారని కాకినాడలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. సామర్లకోట రిక్షా సంఘం అధ్యక్షుడు రంగనాయకులు, పురపాలిక కౌన్సిలర్ హరిబాబు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు పత్రం ఇచ్చారు.

పంట నష్టం.. పరిహారానికి వినతి

గొల్లప్రోలు: తుపాను కారణంగా భారీ వర్షాలు, ఈదురుగాలులతో పంట నాశనమై నష్టపోయామని, ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని రైతులు మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ సిబ్బందికి దరఖాస్తులు అందించారు.

అందరికీ న్యాయం చేయాలి

కొత్తపల్లి: తుపాను నేపథ్యంలో బాధితులందరికీ కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని మూలపేటలో బాధితులు సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు.

త్వరితగతిన పనులు

గొల్లప్రోలు: గొల్లప్రోలులో సిమెంటు రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం రూ.కోటి ప్రత్యేక నిధులు మంజూరు చేసిందని, ఈ నిధులతో త్వరితగతిన అభివృద్ధి పనులు నిర్వహించేలా పర్యవేక్షిస్తున్నట్లు తెదేపా నాయకులు తెలిపారు. 16వ వార్డులో సిమెంటురోడ్డును సోమవారం పరిశీలించారు. సుబ్బారావు, మాణిక్యం, శ్రీనివాస్, తాతాజీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం

పెద్దాపురం: పెద్దాపురం ది మినీ గూడ్స్ వెహికల్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా యాళ్ల వీరబాబు, అధ్యక్షుడిగా పూసపాటి వాసు, కార్యదర్శిగా సిమ్మ నూకరాజు, సభ్యులుగా నెక్కల వెంకటేష్, కోమాటి శేషగిరి, గొర్రెల శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. వారిని ఎమ్మెల్యే చినరాజప్ప అభినందించారు.

సభ్యులకు వైద్య పరీక్షలు

పెద్దాపురం: పెద్దాపురంలోని స్వయంశక్తి మహిళాగ్రూపు సంఘాల సభ్యులకు సోమవారం స్థానిక అంబేడ్కర్ సామాజిక భవనంలో సఖి సురక్ష ఆరోగ్యశిబిరం ద్వారా 480 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు.

నూతన భవనాలు నిర్మించాలి

పెద్దాపురం: పట్టణంలో శిథిలావస్థలో ఉన్న ఎస్సీ బాలుర కళాశాల, ఎస్సీ బాలికల పాఠశాల వసతిగృహాలను తొలగించాలని జిల్లా మానవహక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు అప్పలకొండ కోరారు. కొత్త భవనం కట్టాలని ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

సహాయకుడిపై చర్యలు తీసుకోండి

కరప: తప్పుడు మస్తర్లు వేసి వేతనాలు కాజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని విజయరాయుడుపాలేనికి చెందిన పలువురు కోరారు. కరపలో సోమవారం ఎం.రాజశేఖర్, బి.రాజు, ఆర్‌వీవీ నాగేశ్వరరావు, డి.సత్తిబాబు తదితరులు మాట్లాడారు.

డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

పెద్దాపురం: స్థానిక యాసలపు సూర్యారావు స్మారక భవనంలో సోమవారం డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. జెండాను బంగారాజు ఆవిష్కరించారు. అల్లూరి సీతారామరాజు విగ్రహానికి రొంగల ఆనంద్, లక్ష్మణ్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కృష్ణ, వీర్రాజు, అప్పన్న, నరసింహమూర్తి, సూరిబాబు, సత్యనారాయణ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ నిర్ణయం తగదు

పిఠాపురం: రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి వంగా గీత కోరారు. సోమవారం పిఠాపురంలో సంతకాల సేకరణ నిర్వహించారు.

'పదవికి విలువ ఇవ్వడం లేదు'

తాళ్లరేవు: ఆసుపత్రికి వచ్చే రోగులకు సేవలందించేందుకు ఇచ్చిన పదవికి విలువ లేకుండా అవమానించడం దారుణమని తాళ్లరేవు సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యురాలు వాకపల్లి సరోజిని సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE : KAKINADA
E.P.No.55/2022 in O.S.No.243/1996

Between:
Amjuri Rama Naga Srinivas ...DHR
and
Amjuri Venkataramana and Others ...JDR's
6th JDr :- Doddi Kodanda Ramamurthy, S/o.Ramarao, D.No.21-4-1, Salipeta, Kakinada.
7th JDr :- Doddi Umamaheswara Apparao, S/o.Ramarao, D.No.21-4-1, Salipeta, Kakinada.
8th JDr:- Doddi Kanta Kumar, S/o. Ramarao, D.No.21-4-1, Salipeta, Kakinada.

పై నెంబరు పిటీషన్‌లో 6,7,8 JDr'sకు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పై కోర్టువారి ఎదుట **ది. 19-11-2025 తేదీన ఉదయం గం. 10-30 ని॥ల** స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరు అయ్యి ఆక్షేపణలు తెలియచేసుకోవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

MVJR ASSOCIATES,
BINDU SREE VEMURI, Advocates
D.No.70-7-16/9, T.S.R.Nagar, Road No.2, Beside Alayam Homes, Kakinada-5
Cell: 9491624206, 9346677673

మృతుల ఆత్మశాంతికి ర్యాలీ

సామర్లకోట: వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఇటీవల తొక్కిసలాటలో మృతిచెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని వైకాపా నాయకులు కొవ్వొత్తులతో సోమవారం సామర్లకోటలో శాంతి ర్యాలీ నిర్వహించారు. దొరబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

గొల్లప్రోలు: గొల్లప్రోలు శివారు బైపాస్ రోడ్డు కూడలి దాటుతున్న ఇసుకపల్లికి చెందిన సత్యనారాయణ, అతన్ని ఢీకొట్టిన ద్విచక్ర వాహనదారు గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించారు.

ఇసుక టిప్పర్ బోల్తా

పెద్దాపురం: పట్టణ సమీప ఏడీబీ రోడ్డుపై సోమవారం ఇసుక లోడు టిప్పర్ బోల్తా పడింది. ఇతర వాహనాలేమీ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. కేసు నమోదు చేశామని ఎస్సై మౌనిక తెలిపారు.

ప్రభుత్వ స్థలం.. పరుల పరం

కరప, న్యూస్‌టుడే: కరప మండలంలోని ఉప్పలంక శివారు మొండి గ్రామంలో ప్రభుత్వానికి చెందిన భూమిలో కొందరు దళారులు తప్పుడు సర్వే నంబర్లు సృష్టించి అమాయకులకు అమ్ముకుంటున్నా.. పంచాయతీ, రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఆ భూమి ఖాళీగా ఉండడంతో అక్రమార్కులు అడ్డూ అదుపూలేకుండా స్థలాలను ఆక్రమించుకుని వ్యాపారాలు నిరాటంకంగా సాగిస్తున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై గ్రామస్థులు విమర్శిస్తున్నారు. మొండిలో కాలభైరవస్వామి ఆలయానికి చేర్చి, చొల్లంగి బ్రిడ్జి మధ్యలో ఉన్న స్నానాల రేవుగా పిలిచే ప్రాంతంలో సర్వే నంబరు 106/2లో 3.85 ఎకరాల రెవెన్యూకు చెందిన ప్రభుత్వం స్థలం ఉంది. ఇందులో మత్స్యకారులు తాము వేటాడి తెచ్చుకున్న ఉత్పత్తులను ఎండబెట్టుకునేందుకు 20 సెంట్ల భూమిని మత్స్యశాఖకు అప్పగించగా అందులో ప్రభుత్వం ప్లాట్‌ఫాం నిర్మాణం చేపట్టింది. మిగిలిన స్థలంపై కన్నేసిన కొందరు ఆక్రమించుకుని తప్పుడు సర్వే నంబర్లతో దొడ్డిదారిన రిజిస్ట్రేషన్లు చేయించుకుని నిర్మాణాలు, అమ్మకాలు చేపడుతున్నారు. ఒక సామాన్యుడు ప్రభుత్వ స్థలంలో చిన్న పూరిగుడిసె వేస్తే నానా హడావుడి చేసి ఇల్లు పీకి పందిరేసే అధికారులు.. అక్రమార్కులు దర్జాగా నిర్మించిన గృహాలను సామాన్యులకు అమ్మేసినా, గృహ నిర్మాణాలు చేపడుతున్నా చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్థులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

మొండి గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు

ఉప్పలంక శివారులో గృహాలు ఇలా..

ఇప్పటికే నిర్మించిన గృహాలకు సంబంధించి కొంతమంది నుంచి ఇంటి పన్నులెలా కట్టించుకుంటున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి అమ్మకాలు చేస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆయా స్థలాలు కాపాడుతాం..

స్థలాలకు సంబంధించి పూర్తి స్థాయిలో సర్వే చేయిస్తాం. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారులకు తెలిపి విచారణ చేయిస్తాం. **- దుర్గాప్రసాద్, తహసీల్దార్**

శ్రీ శృంగార వల్లభ స్వామి వారి దేవస్థానం

దేవదాయ ధర్మదాయ శాఖ, తొలి తిరుపతి గ్రామం, పెద్దాపురం మండలం, కాకినాడ జిల్లా.

సీల్డ్ టెండరు కొరకు ప్రకటన

కాకినాడ జిల్లా, పెద్దాపురం మండలం, తొలి తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీ శృంగార వల్లభ స్వామి వారి దేవస్థానంనకు 2025 సంవత్సరములో ధనుర్మాసం ముక్కోటి ఏకాదశి అనగా ది.30-12-2025 మంగళవారం నుండి ది. 1-1-2026 గురువారం వరకు అనగా 3 రోజులు ఈక్రింది వివరించిన అంశములు సప్లయి చేయుటకు ది. 19-11-2025 బుధవారం ఉదయం 10:00 గంటలు వరకు సీల్డు టెండర్లు స్వీకరించబడుచున్నవి. సీలు వేసిన టెండర్లు అదేరోజు ఉదయం 11-00 గంటలకు దేవదాయ ధర్మదాయశాఖ అధికారుల సమక్షములో తెరువబడును.

వ.నెం.	వివరం	టెండర్	కాలపరిమితి	ధరావత్తు	టె.షె.ఖరీదు
1.	పూల అలంకరణ	సీల్డ్ టెండర్	30-12-2025 టు 1-1-2026 (3రోజులు)	రూ.5000/-	రూ.300/-
2.	టెంట్ హౌస్ సామాగ్రి	సీల్డ్ టెండర్	30-12-2025 టు 1-1-2026 (3రోజులు)	రూ.5000/-	రూ.300/-
3.	క్యూలైన్స్ నిర్మాణం	సీల్డ్ టెండర్	30-12-2025 టు 1-1-2026 (3రోజులు)	రూ.5000/-	రూ.300/-
4.	ఎలక్ట్రికల్ డెకరేషన్	సీల్డ్ టెండర్	30-12-2025 టు 1-1-2026 (3రోజులు)	రూ.5000/-	రూ.300/-

ముఖ్య షరతులు :- (1) ఆసక్తి గల టెండరుదారులు టెండరు షెడ్యూలు రూ. 300/- నగదు చెల్లించి రశీదు పొందవలెను. (2) మిగిలిన వివరములు దేవస్థానం కార్యాలయం పనిచేయు వేళలలో తెలుసుకొనగలరు.

తొలి తిరుపతి,
తేది: 4-11-2025.

వడ్డి శ్రీనివాసరావు
కార్యనిర్వహణాధికారి, గ్రేడ్-1

తుని

• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

రక్తదాన శిబిరం

తుని, న్యూస్‌టుడే: తలసేమియా వ్యాధిగ్రస్తులైన పిల్లల కోసం పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రత్యేక రక్తదాన శిబిరం సోమవారం నిర్వహించారు. అనేక మంది విద్యార్థులు ముందుకు వచ్చి రక్తదానం చేశారు .కాకినాడ రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు ద్వారా వ్యాధిగ్రస్త పిల్లలకు అందిస్తారని కళాశాల ప్రిన్సిపల్ ఎంఎన్ వీజీఏ దీప్తి తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ జి.మణియ్య, ఎన్ఎస్ఎస్ పీవోలు తమ్మారావు, బాంధవి, ఏవో ఎ.సుధాకర్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఏడు నిఘా నేత్రాలు

ఎన్.సూరవరం జడ్పీ పాఠశాలలో కెమెరాలను పర్యవేక్షిస్తున్న హెచ్ఎం రూపాదేవి

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయి. విద్యార్థులకు బోధన, నడవడికను పర్యవేక్షించేందుకు పాఠశాల ప్రాంగణం మొత్తం నిఘా నేత్రాలతో పర్యవేక్షించే విధంగా ఏర్పాట్లు చేయడం విశేషం. మండలంలోని ఎన్.సూరవరం జడ్పీ పాఠశాలలో 200 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. పాఠశాల ప్రాంగణంలోని విద్యార్థుల తీరును పరిశీలించడంతోపాటు గ్రామానికి చెందిన తెదేపా నాయకుడి సహకారం, బ్యాంకువారి ఆర్థిక సహకారంతో పాఠశాల ప్రాంగణంలో ఏడు కెమెరాలను ఏర్పాటు చేశామని హెచ్ఎం రూపాదేవి తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066
ఉ॥ 10 - మ॥ 1

విద్యుత్తు దీపాలు వెలిగించాలి

సమస్య: సీతంపేట గ్రామంలో జగనన్న కాలనీ వద్ద విద్యుత్తు దీపాలు లేక రాత్రి సమయాల్లో ఇబ్బందులు పడుతున్నాం. – బాలు, స్థానికుడు.

సమాధానం: కాలనీ వద్ద కొన్నిచోట్ల ఇబ్బంది ఉంది. నూతన లైను ఏర్పాటుచేసి సమస్య పరిష్కరిస్తాం. – చాందిని, కార్యదర్శి, సీతంపేట.

న్యూస్‌టుడే, శంఖవరం.

పూడికలు తొలగింపు..

స్పందనకు వందనం

జగ్గంపేట గ్రామీణం: మల్లిసాల బీసీ కాలనీలో పలు వీధుల్లో పూడికలు పేరుకుపోయి మురుగు సమస్య ఏర్పడింది. వర్షం వచ్చినపుడు రోడ్లపైకి మురుగు చేరి అవస్థలు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. సమస్యను గ్రామ సర్పంచి సర్వసిద్ధి నూకరత్నం దృష్టికి తీసుకెళ్లగా యంత్రాన్ని సమకూర్చి పూడికలు తొలగింపు చర్యలు చేపట్టారు.

అర్హుల లెక్క తేలింది..

మొంథా నష్టాలు యాప్‌లో నమోదు

గండేపల్లి, న్యూస్‌టుడే: మొంథా..కలిగించిన నష్టం అంతాఇంతా కాదు. చేతికొచ్చిన పంట నేలమట్టమై, గింజల నుంచి మొలకలు రావడంతో రైతుకు అపార నష్టం వాటిల్లింది. నష్టపరిహారం అందించాలనే ప్రభుత్వ నిర్ణయంతో అధికారులు పంట వద్దకు వెళ్లి గణించి యాప్‌లో నమోదు చేశారు.

పంట నష్టాన్ని యాప్‌లో నమోదు చేస్తున్న అధికారులు

నష్టపరిహారం ఇలా..

నష్టపోయిన పంటలకు ప్రభుత్వం వరి హెక్టారుకు రూ.25వేలు, మినుముకు రూ.15వేలు, కూరగాయలకు రూ.25వేలు, మిర్చికి రూ.35వేలు ఇవ్వనుంది.

నష్టం వివరాలు ఇలా..

మండలం	రైతులు	వరి	మొక్కజొన్న	మినుములు	మొత్తం హెక్టార్లు
జగ్గంపేట	247	112	4	18	134
గండేపల్లి	798	190	4	170	364
ఏలేశ్వరం	1093	523	–	–	523
ప్రత్తిపాడు	780	250	–	–	330
కిర్లంపూడి	3034	1045	–	–	1045

మూడు రోజుల పాటు సర్వే

నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందజేయాలని ఏపీ ఎఐఎంఎస్ పంట యాప్‌లో నమోదు చేశాం. పంట నష్టాన్ని నేరుగా వెళ్లి సర్వే నంబర్లు, పంటను అప్లోడ్ చేసి అర్హులను గుర్తించాం.
– శ్రీనివాస్, ఏడీ, జగ్గంపేట

కాంగ్రెస్ పార్టీ సంతకాల సేకరణ

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన ఓటు చోరీపై కాంగ్రెస్ సంతకాల సేకరణ ప్రత్తిపాడు నియోజకవర్గంలో పూర్తిచేసినట్లు డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు ధరణాలకోట శ్రీను తెలిపారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎన్‌వీవీ సత్యనారాయణ నేతృత్వంలో సేకరించిన 10,200 సంతకాల పుస్తకాన్ని కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పళ్లంరాజు, డీసీసీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావుకు సోమవారం అందజేశామన్నారు.

కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజుకు సంతకాల పుస్తకం అందిస్తున్న డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను

పార్కింగ్‌కు స్థలమెక్కడ..?

అన్నవరం: కార్తికమాసంలో రద్దీ ఎక్కువ. శని, ఆది, సోమవారాల్లో వందలాది వాహనాలు కొండపైకి వస్తాయి. పార్కింగ్‌కు ఇబ్బందులు లేకుండా ఖాళీ స్థలాలను వివాహాలకు ఈ సమయంలో కేటాయించొద్దని కమిషనర్ ఆదేశాలున్నాయి. అయినా సత్యగిరిపై హరిహరసదన్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని ఈ నెల 8న రాత్రి జరిగే ఓ వివాహానికి అద్దెకు ఇచ్చేశారు. దీనిపై కమిషనర్ కూడా ఆరా తీశారు. ఓ ప్రముఖుడు ఒత్తిడితో కేటాయించినట్లు తెలిసింది. ఈ వివాహానికి గదులకు పలువురు ప్రజా ప్రతినిధుల నుంచి సిఫార్స్ లేఖలు కూడా వచ్చినట్లు సమాచారం. దీంతో చేసేది లేక పార్కింగ్‌కు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు.

హరిహరసదన్ ఎదురుగా పార్కింగ్ ప్రదేశం

26న కాకినాడలో రాజ్యాంగ రక్షణ సమరభేరి సభ

శంఖవరం, న్యూస్‌టుడే: ఈ నెల 26న కాకినాడలో నిర్వహించే రాజ్యాంగ రక్షణ సమరభేరి సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షుడు గుణపర్తి అపురూప్ పిలుపునిచ్చారు. రాజ్యాంగ ప్రాముఖ్యాన్ని వివరిస్తూ గ్రామాల్లో పర్యటనలు చేపడుతున్నామని జిల్లా అధ్యక్షుడు మాత సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం శంఖవరం కరపత్రాలను ఆవిష్కరించారు. బీఎస్పీ జిల్లా సభ్యులు నాగేశ్వరరావు, జాన్, రమణ, మణిబాబు, చక్రరావు పాల్గొన్నారు.

చిత్రాలు గీసి.. విజేతలుగా నిలిచి..

● 'ఈనాడు, ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తుని, న్యూస్‌టుడే: 'ఈనాడు, ఈటీవీ' ఆధ్వర్యంలో పట్టణంలోని గాయత్రి జూనియర్ కళాశాలలో సోమవారం ప్రతిభాపాటవ పోటీలు జరిగాయి. 'ప్రకృతి అందాలు' అనే అంశంపై నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో అనేక మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అందమైన రంగుల చిత్రాలు వేసి ఔరా అనిపించుకున్నారు. కళాశాల అధ్యాపకులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి విజేతలను ఎంపిక చేశారు. ఈ పోటీల్లో ఎల్.క్రిష్ణ, డి.శ్రీనిధి, ఎ.విజయ్ కుమార్ వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ పి.తాతాజీ, అధ్యాపకులు ఎస్.రాజార్ లక్ష్మి, ఎస్.ప్రియాంక బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

బహుమతులు, ప్రశంసా పత్రాలు అందుకున్న విజేతలు

పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లు

జగ్గంపేట, జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పేదప్రజలు, బాటసారుల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లు ఉపయోగపడుతున్నాయని తెదేపా రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వీయస్ అప్పలరాజు అన్నారు. ప్రధానరోడ్డులో ఎన్టీఆర్ స్మారక భవనం వద్ద సోమవారం ప్రముఖ వైద్యులు గోలి సత్యకృష్ణ జ్ఞాపకార్థం కుటుంబసభ్యుల ఆర్థిక సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, కొత్త కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

కనుల కైలాసం.. భక్త మానసం

నందనవనంలో స్వామి

ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి, తొండంగి, శంఖవరం, తుని గ్రామీణం, జగ్గంపేట గ్రామీణం, కిర్లంపూడి, న్యూస్‌టుడే: ఆలయాల్లో కార్తిక దీపాల వెలుగుతో శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. రాచపల్లి శ్రీరామ సేవాశ్రమంలో వెలసి ఉన్న శ్రీఅపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వర క్షేత్రానికి భక్తులు సోమవారం పోటెత్తారు. ప్రత్తిపాడులో కోటి దీపోత్సవం కనుల వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే సత్యప్రభ పాల్గొని దీపాలు వెలిగించారు. గ్రామోత్సవంతో నగరసంకీర్తన జరిగింది. ● తిరుమాలిలో తెదేపా సీనియర్ నేత సూతి బూరయ్య ఆధ్వర్యంలో వన సమారాధన జరిగింది. నాయకులు జ్యోతుల పెదబాబు, బొదిరెడ్డి గోపాలకృష్ణ, పెంటకోట శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ఏలేశ్వరం శ్రీరాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి, తేటగుంట, తిమ్మాపురం, హంసవరం గ్రామాల్లోని పురాతన శివాలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ● రౌతులపూడి శ్రీ మారామలింగేశ్వరస్వామి, నందనవనంలో శ్రీఉమావర్ధిని నాగలింగేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. తొండంగి, ఎ.కొత్తపల్లి, ఒంటిమామిడి, పీఈచిన్నాయిపాలెం, శృంగవృక్షం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ● కత్తిపూడి, శంఖవరం, వేళంగి ధారక్షేత్రంలో అభిషేకాలు జరిగాయి. ● ముంగుపూడి, బెండపూడి గ్రామంలో కార్తిక వనసమారాధన సందడి నెలకొంది. తెదేపా నేత పర్వత సురేష్ సుమారు 500 మంది అయ్యస్వాములకు అన్నదానం ఏర్పాటు చేశారు. ● ఇర్రిపాకలో శ్రీరామరాజు భీమ సమేత మల్లికార్జునస్వామి, శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి క్షేత్రానికి భక్తులు తరలి వచ్చారు. ● కిర్లంపూడిలో ఉమావైద్యనాథేశ్వరస్వామివారి ఆలయంలో స్వామికి పంచామృతాభిషేకం, విభూదార్చన నిర్వహించారు.

కోటి దీపోత్సవంలో జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

రాచపల్లి ఆంధ్రా అరుణాచలంలో జనమేశ్వరునికి అభిషేకాలు చేసిన భక్తులు

గౌరీదేవి అమ్మవారి ఊరేగింపు

తుని పట్టణం: పట్టణంలో సోమవారం రాత్రి శ్రీగౌరీదేవి అమ్మవారి ఊరేగింపు జరిగింది. సీతారాంపురంలోని వాసవి కల్యాణ మండపం నుంచి భక్తులు అమ్మవారిని పాయకరావుపేట మండలానికి తీసుకెళ్లారు. కార్తిక పౌర్ణమికి ముందు విగ్రహం తయారు చేసి ఇచ్చే సాంప్రదాయం 1918 నుంచి కొనసాగుతుందని సీతారామయ్య మనవడు, ప్రస్తుత శిల్పి శివరామకృష్ణప్రసాద్ తెలిపారు.

పురవీధుల్లో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

అవార్డు గ్రహీతకు అభినందనలు

తుని గ్రామీణం: మొంథా తుపాను సమయంలో ప్రజలకు విశేష సేవలందించినందుకు గాను సీఎం చంద్రబాబు నుంచి అవార్డు అందుకున్న పెదమల్లాపురం పంచాయతీ కార్యదర్శి వీరలక్ష్మీని తుని మండల పరిషత్తు సిబ్బంది సన్మానించారు. ఎంపీడీవో సాయిపవన్, ఎంపీవో రాము, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపక నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

జగ్గంపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈకనామిక్స్ అతిథి అధ్యాపకుని ఖాళీ భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు 8లోగా దరఖాస్తులను కళాశాలలో అందజేయాలి.

పోటీ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

కిర్లంపూడి: నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన రాజ్యాంగంపై నిర్వహించిన పోటీ పరీక్షల్లో తామరాడ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన దూబ రామంజనేయులు, అంకం కనక లక్ష్మి ప్రతిభ చూపారు. వీరు 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అమరావతిలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. విద్యార్థులను హెచ్‌ఎం కృష్ణ సోమవారం అభినందించారు.

ఎండిన వృక్షం..పడితే ప్రమాదమే..!

అన్నవరం-తొండంగి ప్రధాన రహదారిలో ఎ.కొత్తపల్లి వద్ద ఎండిన భారీ వృక్షం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. ఈ మార్గం మీదుగా రోజూ వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎవరి మీద పడుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ర.భ శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

న్యూస్‌టుడే, తొండంగి



పగలు వెలుగులు...బిల్లు భారం



ఎన్ఎస్వీ నగరం, రాజుపేట, హెచ్. కొత్తూరు తదితర గ్రామాల్లో పగలు, రాత్రి తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతున్నాయి. దీంతో పంచాయతీలకు విద్యుత్తు బిల్లులు పెరిగి ప్రజాధనం దుర్వినియోగమవుతుంది. విద్యుత్తును ఆదా చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, తుని గ్రామీణం

శిథిలావస్థలో పశువైద్యశాల

పాలెం గ్రామంతోపాటు పది గ్రామాలకు పశు వైద్యసేవలు అందించే వైద్యశాల శిథిలావస్థలో ఉంది. ఆసుపత్రి పైకప్పు శ్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. దీంతో వైద్యులు, సిబ్బంది ఆసుపత్రిలో విధులు నిర్వహించేందుకు భయపడుతున్నారు. దుస్థితిలో ఉన్న ఆసుపత్రికి కొత్తభవనం నిర్మించి సౌకర్యాలు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకవాలని రైతులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కిర్లంపూడి

మలుపు వద్ద జాగ్రత్త

కిర్లంపూడి నుంచి ప్రత్తిపాడు వెళ్లే ప్రధాన ర.భ. రహదారిలో జగపతినగరం గ్రామశివారు సింహాద్రిపురం జంక్షన్ వద్ద మలుపు ప్రమాదకరంగా మారింది. రోజూ వేల సంఖ్యలో వాహనాలు తిరిగే రోడ్డులో మలుపు ప్రదేశంలో అక్రమ నిర్మాణాలతో మరింత ఇబ్బందిగా మారింది. ర.భ.శాఖ అధికారులు స్పందించి మలుపు వద్ద ప్రమాద తీవ్రతను తెలియజేసే బోర్డులను ఏర్పాటుచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కిర్లంపూడి

ముంపు నివారణకు చర్యలు

ఈనాడు కథనానికి స్పందన

ప్రత్తిపాడులో ర.భ రహదారి వెంబడి ఫైర్ ఆఫీస్ సమీపంలో పూడిక తీయించారు. వర్షం నీరు వెళ్లే మార్గాలను ప్రణాళికాబద్ధంగా పునరుద్ధరిస్తామని గ్రామ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు తెలిపారు. 'తూములు మూసి..కాలువలు చెరిపేసి' శీర్షికన ఈనాడులో సోమవారం ప్రచురించిన కథనానికి స్పందించారు. జలమయం అయ్యే రహదారి ప్రాంతాన్ని చక్కదిద్దారు – న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

ఎంపికైన ఏపీ ఎన్‌జీజీవో కార్యవర్గసభ్యులు

ఏపీఎన్‌జీజీవో నూతన కార్యవర్గం ఎంపిక

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: ఏపీఎన్‌జీజీవో తుని తాలుకా నూతన కార్యవర్గ ఎన్నికలు జిల్లా సంయుక్త కార్యదర్శి పి.చార్లెస్ పర్యవేక్షణలో సోమవారం తుని మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించారు. తుని తాలుకా అధ్యక్షుడిగా టీవీవీ సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడిగా కేవీపీ ప్రసాద్, ఉపాధ్యక్షులుగా జి.శ్రీనివాసరావు, కె.సత్యకుమారి, ఎంవీవీఎస్పీ మోహన్, ఎం.వీరలక్ష్మీ, కార్యదర్శిగా బి.క్రాంతికుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా జీవీవీఎస్ ప్రసాద్ తదితరులు ఎంపికైనట్లు జిల్లా అధ్యక్షుడు జి.రామ్మోహనరావు తెలిపారు.

క్రీడా పోటీలకు ఎంపిక

సుషిత

రాజేశ్

అవినాష్

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే అండర్-17 పోటీల్లో ప్రత్తిపాడు మినర్వా విదార్థులు జిల్లా జట్లకు ఎంపికయ్యారు. షాట్‌పుట్‌లో సుషిత, కబడ్డీ జట్టుకు రాజేష్, షాట్‌పుట్‌కు అవినాష్ ఎంపికయ్యారని పీఈటీ రాజీవ్ కుమార్ తెలిపారు. కాకినాడలో జరిగిగే డీఎస్ఏ మైదానంలో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. కరస్పాండెంట్ మురళీకృష్ణ, హెచ్ఎం మహేశ్వరి విద్యార్థులను అభినందించారు.

హోరాహోరీగా వాలీబాల్

తుని పట్టణం, న్యూస్‌టుడే: వివిధ జట్ల మధ్య వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సోమవారం జరిగాయి. రోటరీ యువజనోత్సవాల్లో భాగంగా శ్రీప్రకాష్ విద్యానికేతన్ ఆవరణలో జూనియర్స్ విభాగంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. అనేక పాఠశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ ఆటతీరును ప్రదర్శించారు. అనంతరం సాయంత్రం రోటరీ హాల్లో వక్తృత్వ పోటీలు నిర్వహించగా విద్యార్థులు ప్రతిభచూపారు. కార్యక్రమాల్లో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పి.నాగిరెడ్డి, ప్రసన్నకుమార్, యంగ్‌జనరేషన్ మంత్ ఛైర్మన్ దండెం మధుసూదన్, వర్మ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ఎటుచూసినా చెత్తే..!

ఏలేశ్వరం: రోజూ 20 వార్డుల నుంచి 8 మెట్రిక్ టన్నుల చెత్త వస్తుంది. అధికారుల ఉదాసీనతతో పలు ప్రాంతాల్లో అపరిశుభ్రత కనిపిస్తోంది. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఏలేశ్వరం ప్రధాన రహదారి చెంతనే చెత్త

కుండీలు నిండినా పట్టింపులేదు..

పలు ప్రాంతాల్లో చెత్త వేసేందుకు ఇనుప కుండీలు ఏర్పాటు చేశారు. బాగానే ఉంది. అవి నిండినా వాటిని తరలించేవారు లేరు. అపరిశుభ్రతతో పందుల సమస్య అధికమైంది. పారిశుద్ధ్య నిర్వహణను సక్రమంగా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇలా ఉంటే రోగాలు రావా..?

పుర వీధుల్లో కాలుష్యభరిత వాతావరణం

న్యూస్‌టుడే- తుని

తుని పట్టణంలోని అనేక ప్రాంతాల్లో మురుగుతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రామకృష్ణా కాలనీ, బ్యాంకుకాలనీ, సాయినగర్ శివారు, కొండవారిపేట తదితర ప్రాంతాల్లో జనావాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు కాలుష్యభరితంగా మారాయి. పురపాలక అధికారులు స్పందించి వ్యర్థాలు తొలగించడంతో పాటు నీరు నిలిచిపోకుండా మట్టివేసి చదును చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సలీమ్‌ను వివరణ కోరగా తక్షణం చర్యలు తీసుకుంటామన్నారు.

బ్యాంకు కాలనీ ఉన్నత పాఠశాల పక్కన ఇలా..

అదృశ్యమైన బాలిక 8 గంటల్లో గుర్తింపు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: అలిగి ఇల్లు విడిచి వెళ్లిన బాలిక ఆచూకీని పోలీసులు 8 గంటల వ్యవధిలో కనుగొని తండ్రికి అప్పగించారు. ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం తెలిపిన వివరాలివీ.. ప్రత్తిపాడుకు చెందిన బాలికను సరిగా చదవటం లేదని మందలించారని, దీంతో మనస్తాపం చెంది ఆదివారం మధ్యాహ్నం ఇంట్లోంచి వెళ్లింది. పసిడి ఆభరణాలు, నగదు వెంట తీసుకెళ్లింది. తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. సీఐ సూర్యఅప్పారావు పర్యవేక్షణలో గాలింపు చర్యలు చేపట్టారు. చరవాణి సాంకేతికతతో భీమవరంలో ఉన్నట్లు గుర్తించి ఆమెను తెచ్చి తండ్రికి అప్పగించామన్నారు. బాలిక అభద్రతకు లోనవ్వకుండా ఆమె ఇంట్లో వారికి కౌన్సిలింగ్ ఇస్తామని ఎస్సై పేర్కొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్లు 15 నుంచి 20 శాతానికి పెంచాలి

తొండంగి: ఎస్సీ రిజర్వేషన్లు 15 నుంచి 20 శాతానికి పెంచాలని జైభీమ్ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు టి.కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం శృంగవృక్షంలో ఆ సంఘం నాయకులతో సమావేశమై మాట్లాడుతూ.. 26న దిల్లీ జంతరమంతర్ వద్ద రాజ్యాంగ హక్కుల సాధన సభ 13 డిమాండ్లతో జరగనుంది. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు పెయ్యల సూర్యారావు, నేపా కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా క్రీడా వికాస భవనం..?

జగ్గంపేట (గ్రామీణం, న్యూస్‌టుడే) గ్రామీణ ప్రాంతంలో క్రీడల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని 2017 ఆగస్టు 15న అప్పటి సీఎం చంద్రబాబు రూ.2 కోట్లు కేటాయిస్తూ ఓపెన్ ఆడిటోరియం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వం దీన్ని పట్టించుకోలేదు. భవనం అందుబాటులోకి వస్తే మెట్టప్రాంతంలో ఎంతో మంది ప్రతిభగల క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో తలపడే అవకాశం ఉంటుంది. భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలి. దీనిపై డీఎస్‌డీవో సతీష్‌కుమార్ మాట్లాడుతూ..ప్రహరీ నిర్మాణానికి రూ.30 లక్షలు అవసరమని పనులు పూర్తిచేసి త్వరలోనే వినియోగంలోకి తెస్తామన్నారు. – న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

జగ్గంపేట: క్రీడా వికాస కేంద్రం భవనం

గంజాయితో ఉన్న నలుగురు వ్యక్తుల అరెస్టు

నర్సీపట్నం గ్రామీణం: ఎనిమిది కిలోల గంజాయితో నలుగురు వ్యక్తులు సోమవారం నాతవరం పోలీసులకు పట్టుబడ్డారు. ఎస్సై తారకేశ్వరరావు తెలిపిన వివరాలివీ.. చమ్మచింత వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా నలుగురు అనుమానాస్పదంగా కనిపించారు. తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి లభ్యమైంది. అల్లూరి జిల్లాలోని ధారకొండ ప్రాంతంలో కొనుగోలు చేసి అడ్డదారిలో కాకినాడ జిల్లా తుని రైల్వేస్టేషన్‌కు తరలించే క్రమంలో పోలీసులకు చిక్కారు. నిందితులు తమిళనాడుకు చెందిన డి.దీపక్‌బాబు, ఆర్.గౌతమ్, ఎ.హరీష్, తునికి చెందిన తుమ్మ అప్పారావుగా గుర్తించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గోనేడ మాజీ సర్పంచి మృతి

కిర్లంపూడి: గోనేడ మాజీ సర్పంచి నీలం వెంకాయమ్మ(బేబీ)(80) సోమవారం ఉదయం అకస్మికంగా మృతి చెందారు. ఆమె 1996 నుంచి 2001 వరకు సర్పంచిగా చేశారు. ఎమ్మెల్యే నెహ్రూ, ఎంపీపీ రవి తదితరులు నివాళి అర్పించారు.

భక్తుల ఆత్మకు శాంతి కోరుతూ ర్యాలీ

ఏలేశ్వరం: కాశీబుగ్గలో జరిగిన తొక్కిసలాట ఘటన విచారకరమని వైకాపా ప్రత్తిపాడు ఇన్‌ఛార్జి ముద్రగడ గిరిబాబు అన్నారు. మృతి చెందిన భక్తుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ సిరిపురంలో సోమవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. వైకాపా నాయకులు గొల్లపల్లి సురేష్, కాశీ తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా నిర్వహణ

స్థానికులకు తప్పని ఇబ్బంది

తొండంగి, న్యూస్‌టుడే: జాతీయ రహదారి నిర్వహణ అంతంతమాత్రంగా ఉండడంతో వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో అన్నవరం నుంచి తమ్మయ్యపేట వరకు 7 కి.మీ. జాతీయ రహదారి ఉంది. ఈ మార్గంలో బెండపూడి, తమ్మయ్యపేట, రావికంపాడు గ్రామాలకు వెళ్లే కూడళ్లు ఉన్నాయి. ఈ మూడు గ్రామాల ప్రజలు రోజూ పట్టణానికి వెళ్లేందుకు ఎన్‌హెచ్ మీదుగా గమ్యానికి చేరాలి. అనేక మంది ద్విచక్ర వాహనాలు, రహదారికి దగ్గరగా ఉన్నవారు నడకదారిలో రాకపోకలు సాగిస్తారు.

కొరవడిన శ్రద్ధ

హైవే అధికారులు, సిబ్బంది ఎన్‌హెచ్ నిర్వహణపై శ్రద్ధ చూపడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొంతకాలంగా ఎన్‌హెచ్‌పై చిన్న చిన్న సమస్యలు సైతం పరిష్కారం కావడం లేదు. వేగంగా వచ్చే వాహనాలు కొన్ని సందర్భాల్లో రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఇనుపగ్రిల్స్‌ను ఢీకొడుతున్నాయి. అవి నడకదారిలో పడి నెలలు గడుస్తున్నా వాటిని మళ్లీ అమర్చడం లేదు. అదేతీరుగా నడకదారిలో ఉన్న సిమెంటు పలకలు సైతం ఊడిపోతున్నాయి. దీంతో పాదచారులకు ఇబ్బందిగా ఉంది. హైవే అధికారులు స్పందించి ఈ సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

బెండపూడి హైవే వద్ద ఇనుప గ్రిల్స్ ఇలా..

WANTED
ప్రముఖ 2 వీలర్ ఫైనాన్స్ నందు తుని, పాయకరావుపేట, నర్సీపట్నం మరియు అడ్డరోడ్డు బ్రాంచిలలో బిజినెస్ మరియు కలెక్షన్ చేయుటకు ఎగ్జిక్యూటివ్స్ కావలెను
ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్
విఘ్నసాయి ఫైనాన్స్ కార్పొరేషన్
లక్ష్మీ థియేటర్ దగ్గర, పాయకరావుపేట
85006 44978
88863 33600

(c) eenadu

తెలివి.. తెల్లారినట్లే!

తలపై మూకుడుతో పసుపు చొక్కా వ్యక్తి

ఈనాడు, బెంగళూరు : బెంగళూరు వాసుల ట్రాఫిక్ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఏమాత్రం ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించినా చలానా చేతిలో పెట్టేందుకు అడుగడుగునా పోలీసులు సిద్ధంగా ఉంటారు. వీటికి భయపడిన హెల్మెట్ లేని వ్యక్తి ఒకరు తలపై మూకుడు పెట్టుకుని ప్రయాణించాడు. బెంగళూరులోని రూపేణ అగ్రహార వద్ద కనిపించిన ఈ దృశ్యాన్ని నెటిజన్ ఒకరు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేయగా వైరల్ అయ్యింది. పీక్ బెంగళూరు మూమెంట్ అంటూ చేసిన ఈ పోస్ట్ నవ్వు తెప్పించేదే కాదు ట్రాఫిక్ సమస్యల తీవ్రతను అద్దం పడుతున్నట్లు నెటిజన్లు కామెంట్స్ చేశారు. పెరిగిన వాహనాలతో ట్రాఫిక్ నియంత్రణ పోలీసులకు కూడా మించిన భారంగా మారింది. పోలీసుల కళ్లుగప్పి తిరిగినా సిగ్నల్స్ వద్ద ఏర్పాటు చేసిన నిఘా కెమెరాలు ఇట్టే పట్టేస్తూ తమ మొబైల్‌కు చలానా సందేశాలు పంపుతుంటాయి. ఇటీవల చలానా మొత్తంలో 50శాతం రాయితీ ప్రకటించిన బెంగళూరు పోలీసులు కేవలం మూడు నెలల్లో రూ.15 కోట్లను జరిమానా రూపంలో రాబట్టి రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే.

ఇష్టానుసారం ధరలు పెంచితే ఎలా?

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : మల్టీప్లెక్స్‌లలో సినిమా టికెట్ల ధరలను ఇష్టం వచ్చినట్లు పెంచకుండా ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను ప్రశ్నిస్తూ హొంబాళె ఫిలింస్, కొన్ని మల్టీప్లెక్స్ థియేటర్ల యాజమాన్యాలు సర్వోన్నత న్యాయస్థానంలో దావా వేశాయి. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా విచారణ పూర్తి చేశారు. టికెట్ ధరలను ఇష్టం వచ్చినట్లు పెంచడం, నీరు, తినుబండారాలను అసాధారణ ధరలకు విక్రయించడాన్ని ధర్మాసనం తప్పుబట్టింది. ధరలను తగ్గించకపోతే మల్టీప్లెక్స్‌లకు వచ్చి సినిమాలు చూసేవారి సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని హెచ్చరించింది. మల్టీప్లెక్స్‌ల తరఫున న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదిస్తూ, థియేటర్లతో పోల్చితే మల్టీప్లెక్స్‌లలో సదుపాయాలు, భద్రత ఎక్కువని, ప్రభుత్వానికి చెల్లిస్తున్న పన్నులు కూడా ఎక్కువేనని పేర్కొన్నారు. చిన్న థియేటర్ల సంఖ్య గణనీయంగా తగ్గిపోతున్న నేపథ్యంలో మల్టీప్లెక్స్‌లు కూడా ధరలను తగ్గించాలని, ప్రభుత్వ ఆదేశాలను అమలు అయ్యేలా చూడాలని న్యాయమూర్తులు ఆదేశించారు.

అధిష్ఠానం.. చెబితే వినాలి

నాయకత్వ మార్పుపై సిద్ధు

ఈనాడు, బెంగళూరు : నాయకత్వ మార్పుపై నిత్యం అడిగే ప్రశ్నలతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విసుగెత్తిపోతున్నారు. సోమవారం పాత్రికేయులతో మరింత అసహనంతో రగిలిపోయారు. అడిగేందుకు మీ వద్ద వేరే ప్రశ్నలు లేవా అంటూ మరోసారి మండిపడ్డారు. బిహార్ నేతలు, ఒకట్రెండు సిద్ధరామయ్య తర్వాత ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ కానున్నట్లు నినదిస్తున్నారని అడగ్గా.. కోపంతో ఊగిపోయారు. అధిష్ఠానం ఎవరిని ప్రశ్నించిన ముఖ్యమంత్రి.. సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గేల్ ఎవరైనా మాట్లాడారా? అని అడిగారు. వీరు కాకుండా ఎవరు మాట్లాడినా విలువలేదని కొట్టిపారేశారు. ఇదే సందర్భంగా మంత్రివర్గ విస్తరణ ప్రశ్నించగా బిహార్ ఎన్నికల తర్వాత ఆ విషయం మీతో చెబుతానన్నారు. మరోవైపు బిహార్ ఎన్నికల ప్రచారానికి వెళ్లిన డీకే శివకుమార్.. అక్కడ మహాఘట బంధన్ పార్టీ ఒకటవ్వ విశ్వాసంతో ఉన్నారని వివరించారు. ముఖ్యమంత్రిగా తేజస్వీ యాదవ్, ప్రధానిగా రాహుల్‌గాంధీని చూడాలన్నదే మా లక్ష్యమని ప్రకటించారు. ఈ సమావేశంలో స్థానిక నేతలు తదుపరి కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అంటూ నినదించటం గమనార్హం.

నేతల నోట అదే..

నాయకత్వ మార్పుపై పార్టీ నేతల ధోరణిలో ఏమాత్రం మార్పు కనిపించటం లేదు. ప్రతి సందర్భాన్ని ఆసరాగా చేసుకుని 'నవంబరు మార్పు'పై ప్రస్తావిస్తున్నారు. ఇటీవల గృహ నిర్మాణ శాఖ మంత్రి జమీర్ అహ్మద్ మాట్లాడుతూ 2028 వరకు ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య కొనసాగుతారని సెలవిచ్చారు. ఆ తర్వాత ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ఉండాలని మేము కోరుకుంటున్నట్లు ప్రకటించారు. వాస్తవానికి జమీర్ అహ్మద్.. సిద్ధరామయ్య మద్దతుదారుల్లో ఒకరుగా ఉంటున్నా తొలిసారిగా డీకే నాయకత్వం కావాలని ప్రకటించిన వార్తల్లో నిలిచారు. మరోవైపు ముఖ్యమంత్రి రేసులో ఉన్న మంత్రి సతీశ్ జార్కిహొళి సోమవారం దిల్లీకి వెళ్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. చివరి నిమిషంలో తన ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. తాను ఎప్పుడు వెళ్లాలనుకుంటే అప్పుడు దిల్లీకి వెళ్తానని చెప్పారు. ఇందులో రహస్యం ఏముందని ఆయన ప్రశ్నించారు. ఇక తదుపరి ముఖ్యమంత్రి డీకే అన్న నినాదంపై మాట్లాడుతూ ఆయన అభిమానులు అలా కోరుకోవటంతో తప్పేముందన్నారు. మరో మంత్రి ప్రియాంక్ ఖర్గే సైతం మా మంత్రులు, నాయకులు దిల్లీకి వెళ్లటం- అధిష్ఠానంతో చర్చించటం సాధారణ విషయమే కదా అని వ్యాఖ్యానించారు. రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గేతో కాకుండా మోహన్ భగవత్, దత్తాత్రేయ హోసబళెతో భేటీ కావాలా? అంటూ ఎదురు ప్రశ్న వేశారు.

సిద్ధుపై వ్యంగ్యాస్త్రాలు సంధిస్తూ భాజపా పోస్ట్ చేసిన ఏఐ చిత్రం

భాజపా ఏఐ చిత్రం

ఇక.. రాష్ట్ర కాంగ్రెస్‌లో ముదిరిన నాయకత్వ మార్పు అంశంపై భాజపా సృష్టించిన ఏఐ చిత్రం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. 'ఇక్కడ ముఖ్యమంత్రి దుస్తుల స్పెషలిస్ట్ ఉన్నారు! మా వద్ద ప్రమాణ స్వీకారానికి అవసరమైన దుస్తులు కుట్టి ఇస్తాం' అంటూ సతీశ్ జార్కిహొళి, మల్లికార్జున ఖర్గే, డీకే శివకుమార్, డా.జి.పరమేశ్వర్ చిత్రాలతో కూడిన చిత్రాన్ని పోస్ట్ చేశారు.

నితీశ్‌కు సిద్ధాంతాల్లేవ్

సిద్ధరామయ్య ధ్వజం

ఈనాడు, బెంగళూరు : బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు ఓ సిద్ధాంతమంటూ లేదని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ధ్వజమెత్తారు. ఆయన సోమవారం మైసూరులో బిహార్ ఎన్నికలపై మాట్లాడుతూ నితీశ్.. ఓసారి భాజపాతో, మరోసారి కాంగ్రెస్‌తో, ఇంకోసారి లాలూ ప్రసాద్‌తో పొత్తు పెట్టుకుంటారు. తనకంటూ ప్రత్యేక సిద్ధాంతాలు లేవన్నారు. ఆయన ఎక్కువ కాలం పాటు ముఖ్యమంత్రిగా ఉన్నా బిహార్‌లో పేదరికాన్ని నిర్మూలించలేకపోయారని నిందించారు. పేదలు, దళితులు, మహిళలందరూ ఆయన పాలనపై విసిగెత్తి పోయారని వ్యాఖ్యానించారు. ఈసారి వీరంతా ఇండియా కూటమిని గెలిపిస్తారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కర్ణాటకలోని గ్యారంటీ పథకాలను చూసి అక్కడి మహిళలకు రూ.పది వేలు ఇస్తామని ప్రకటించినా ఆ పథకాన్ని సజావుగా అమలు చేయలేకపోయారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ మాత్రమే ఇచ్చిన హామీలు నెరవేర్చగలదని అక్కడి ప్రజలకు తెలిసొచ్చిందన్నారు. కర్ణాటకలో ఉన్న బిహారీలు తమ ఓటు హక్కును వినియోగించుకుని ఇండియా కూటమిని గెలిపించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ పెద్దలు ఆదేశిస్తే తాను కూడా అక్కడి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటానని ఓ ప్రశ్నకు బదులిచ్చారు.

మంత్రులతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న సిద్ధరామయ్య

15న దిల్లీ చలో

మైసూరు, న్యూస్‌టుడే : మంత్రివర్గంలో మార్పులు చేర్పులకు సంబంధించి పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో చర్చించేందుకు ఈ నెల 15న దిల్లీకి వెళుతున్నానని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చెప్పారు. మైసూరు పర్యటన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్రనేతల సూచనలకు అనుగుణంగా తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. మైసూరు జిల్లాలో అడవులకు సమీపంలో ఉన్న గ్రామాలపైకి వన్యప్రాణులు రావడం దురదృష్టకరమన్నారు. రిసార్టుల నిర్మాణం, సఫారీలు పెరగడం, అడవుల నిర్మూలన తదితర కారణాలతో ఇలా జరుగుతోందన్నారు. ఏనుగులు, పులులు, చిరుత, అడవిపంది, అడవి దున్న, జింకలు ఇతర ప్రాణులు నీరు, ఆహారం కోసం జనావాసాల్లోకి వస్తున్నాయని చెప్పారు. ఈసారి రాజ్యోత్సవ పురస్కారాలకు అర్హులనే ఎంపిక చేశామన్నారు. సామాజిక న్యాయం, భౌగోళిక ప్రాధాన్యతలకు అనుగుణంగా, ప్రతి జిల్లా నుంచి సాధకులను ఎంపిక చేశామని వివరించారు.

'ఎకో వాలా' అంకురం..
చిట్టి వ్యాపారులకు సంబరం

చిన్నారి వ్యాపారవేత్తలు వీరే

ఈనాడు, బెంగళూరు : మేధావులతో చర్చలు, భారీ ప్రచారం అసలే లేదు. పెట్టుబడి కూడా అంతంతే. వారి వ్యాపార సూత్రం పెద్ద వ్యాపారవేత్తలనూ ముచ్చటగొలుపుతోంది. బెంగళూరుకు చెందిన ముగ్గురు చిన్నారులు ప్రారంభించిన 'ఎకో వాలా' అంకుర సంస్థ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. విషయానికొస్తే.. బెంగళూరులోని బసవేశ్వరనగర్‌కు చెందిన ఎనిమిదేళ్ల శారద, నచికేత్, సుమద్యత.. ఓ చిన్న అంకుర సంస్థను ఏర్పాటు చేసి 'ఎకో వాలా' అని పేరు పెట్టారు. బంక, టేపు లేకుండా, కత్తెర వాడకుండా తయారు చేసే కాగితం సంచులు ఈ సంస్థ తయారు చేస్తుంది. వీరి వ్యాపార సూత్రం ప్రకారం నెలకు రూ.10 కడితే చాలు వీరే ఇంటికి వచ్చి ఆ సంచులు అందజేస్తారు. వారమంతా చదువుకునే వీరు ఆదివారాల్లో ఈ వ్యాపారం చేయాలని నిర్ణయించారు. ఆదివారం ఓ పార్కులో ఈ పర్యావరణ హిత సంచులు అమ్ముతుండగా ఓ పాదచారి వీరితో పలుకరించి ఆ వీడియోను సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేయగా వైరల్‌గా మారింది. శారద ఈ సంస్థకు వ్యవస్థాపకురాలిగా, నచికేత మేనేజర్‌గా, సముద్యత సహ మేనేజర్లుగా పరిచయం చేసుకుంటూ కాగితం మీద రాసిన తమ ఫోను నంబరు కూడా ఇచ్చారు. మీ కార్యాలయం ఎక్కడుందని అడగ్గా.. తడబడుతూనే మా ఆఫీసు ఎక్కడుండో ఇప్పుడే చెప్పలేమని ముద్దుగా చెప్పటం నెటిజన్లను ఆకట్టుకుంది. ఈ వీడియోను ప్రముఖ వ్యాపారవేత్త ఆర్‌పీజీ గ్రూప్ ఛైర్మన్ హర్ష గోయెంక తన ఎక్స్ ఖాతాలో ట్యాగ్ చేసి 'షార్క్ ట్యాంక్, ఐడియాబజ్‌లన్నీ మరచిపొండి. వీరి పిచ్ (వ్యాపార ఆలోచనలు చేసే వేదిక) నా హృదయాన్ని దోచుకుంది' అని వ్యాఖ్యానించారు. ఈ చిన్నారుల అమాయకత్వం, వ్యాపార సూత్రం స్ఫూర్తిగా నిలిచినట్లు నెటిజన్లు వ్యాఖ్యానించారు.

అదిగదిగో.. గులాబీ మెట్రో!

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నగర సంచార రద్దీ నియంత్రణలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న నమ్మ మెట్రో కొత్తగా గులాబీ మార్గంలో వచ్చే ఏడాది మే నుంచి సేవలు ప్రారంభించనుంది. ఈ సేవలు మరెంతో దూరంలో లేవని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సోమవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. కాళేనాఅగ్రహార నుంచి నాగవార రింగ్‌రోడ్డు వరకు 13.76 కిలోమీటర్ల గులాబీ సొరంగ మార్గం పనులు చేపట్టిన విషయం తెలిసిందే. ఆ మార్గం దక్షిణ నుంచి ఉత్తర ప్రాంతాలను కలుపుతుంది. దీని పరిధిలో 18 మెట్రో స్టేషను నిర్మిస్తున్నారు. పూర్తిస్థాయిలో సొరంగ మార్గం కావడంతో సురక్షితమైన చర్యలు చేపట్టారు. ప్రస్తుతం 85 శాతం పనులు పూర్తి చేశామని, సొరంగ పనులు కొలిక్కి వచ్చాయని డీకే వివరించారు. పనులన్నీ పూర్తయితే వచ్చే ఏడాది మే నెల నుంచి సంచారాన్ని ప్రారంభిస్తామని ప్రకటించారు.

ఉద్యోగ భాగ్యం ఏదయా?

స్వాతంత్ర్య ఉద్యానవనంలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : అటవీశాఖ ఉద్యోగ నియామకాల్లో తమకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బెంగళూరులోని స్వాతంత్ర్య ఉద్యానవనంలో బీఎస్‌సీ అటవీ కోర్సు డిగ్రీ విద్యార్థులు సోమవారం ధర్నాకు దిగారు. డిగ్రీ చేసిన తమకు ఉద్యోగ నియామకాల్లో అన్యాయం జరుగుతుందని విద్యార్థులు ఆక్రోశం వ్యక్తం చేశారు. అటవీ కోర్సుల్లో డిగ్రీ పూర్తి చేసిన తమకు ఆ శాఖలో ఉద్యోగావకాశాలు ఉన్నాయని, తమను పక్కన పెట్టి సాధారణ డిగ్రీ పూర్తి చేసిన వారికి అవకాశాలు కల్పించడం అన్యాయమన్నారు. అటవీశాఖ ఉద్యోగ నియామకాల్లో తమకూ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఖర్గే తీరుపై రవికుమార్ మండిపాటు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌పై నిషేధాన్ని విధించాలని కోరే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎప్పుడైనా పీఎఫ్‌ఐ, ఎస్‌డీపీఐ సంఘాలపై నిషేధాన్ని విధించాలని ఎందుకు కోరారని ఎమ్మెల్సీ రవికుమార్ ప్రశ్నించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఓటు బ్యాంకును కాపాడుకునేందుకే కాంగ్రెస్ ముందు నుంచి ప్రయత్నిస్తూ వస్తోందని, డీజేహళ్లి, కేజీ హళ్లి ఠాణాలపై జరిగిన దాడులకు కారకులైన వారిపై ప్రభుత్వం పలు కేసులు ఉపసంహరించుకుందని గుర్తు చేశారు.

వేదికపై సంప్రదాయ నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారిణులు

మురిసిన వెండితెర తారలు!

పురస్కార గ్రహీతలతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు

మైసూరు, న్యూస్‌టుడే : కన్నడనాట ఆరేళ్ల కిందట (2019) సెన్సారు పూర్తి చేసుకున్న లేదా విడుదలైన చిత్రాలకు రాచనగరిలో సోమవారం రాత్రి పురస్కారాలను ప్రదానం చేశారు. నటుడు సుదీప్ అత్యుత్తమ నటునిగా, 2018 ఏడాదికి జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రకటించి.. ప్రదానం చేశారు. నటుడు శ్రీనివాసమూర్తికి డాక్టర్ రాజ్‌కుమార్ పురస్కారాన్ని, దర్శకుడు పి.శేషాద్రికి పుట్టణ్ణ కణగాల్ పురస్కారాన్ని, నిర్మాత బీఎస్ బసవరాజుకు విష్ణువర్ధన్ పురస్కారాన్ని ప్రదానం చేశారు.

- ఇకపై ఏటా రాష్ట్ర చలనచిత్ర పురస్కారాలను ప్రదానం చేసేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భరోసా ఇచ్చారు. తమ ప్రభుత్వం అధికారం కోల్పోవడంతో 2018, 2019 ఏడాదులకు పురస్కారాలు ఇవ్వలేదని, అనంతరం కరోనా మహమ్మారి, అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యంతో పురస్కారాల ప్రదానం జాప్యమైందన్నారు. త్వరలో 2020-21వ ఏడాదికి పురస్కారాలు ఇస్తామని చెప్పారు. తాను చదువుకునే సమయంలో నిత్యం ఒక సినిమా చూసేవాడినని, ఇప్పుడు సమయం లేక, ఏ సినిమా చూడాలో తెలియకపోవడంతో వాటికి దూరం అయ్యానని చెప్పారు. సామాజిక బాధ్యత తను ప్రబోధించే చిత్రాల సంఖ్య ఎక్కువగా రావాలన్నారు. మేరు నటుడు డాక్టర్ రాజ్‌కుమార్ తెరపై, నిజజీవితంలో విలువలు కాపాడుకుంటూ వచ్చారని గుర్తు చేశారు. అందుకే ఆయనను ఇప్పటికీ ప్రజలు గుర్తుంచుకున్నారని తెలిపారు. త్వరలో కాంతార ఛాప్టర్-1 చిత్రాన్ని చూస్తానని కార్యక్రమానికి హాజరైన నట, దర్శకుడు రిషబ్ శెట్టికి ఇదే సందర్భంగా హామీనిచ్చారు. రాయితీల కోసం సినిమాలు తీయవద్దని, మంచి చిత్రాలను తీసి కన్నడ చిత్ర పరిశ్రమకు మంచి పేరు తీసుకురావాలని పరిశ్రమ ప్రతినిధులను కోరారు.

నారీవిజయం.. అపూర్వం!

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : భారత మహిళా క్రికెట్ జట్టు తొలిసారి ప్రపంచకప్‌ను సాధించి కొత్త చరిత్ర సృష్టించినట్లు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రతిస్పందించారు. జట్టు విజయంపై సోమవారం ఆయన ఎక్స్ ఖాతాలో తన సంతోషం వ్యక్తం చేశారు. తుదిపోరులో విజయం ఓ అద్భుత ఘట్టమని ప్రస్తుతించారు. ప్రపంచ కప్ కిరీటాన్ని ధరించి కోట్ల మంది అభిమానుల మన్ననలు పొందారని జట్టు సభ్యులను అభినందించారు. క్రమశిక్షణ, పట్టుదలతో కలను నెరవేర్చారని విశ్లేషించారు. క్రికెట్ అభిమానిగా ఈ విజయాన్ని చక్కగా ఆస్వాదించినట్లు ప్రకటించారు. అత్యంత ఆనందాన్ని కల్గించిన సంబరంగా వివరించారు. ఈ మధుర క్షణాలు దేశంలోని ప్రతి క్రీడాభిమానికీ సొంతమన్నారు. రాష్ట్రానికి చెందిన పలువురు ప్రముఖులూ క్రికెట్ జట్టును అభినందించారు. ఆ వివరాలు.. వారి మాటల్లోనే..

- డీకే శివకుమార్ (ఉప ముఖ్యమంత్రి) : భారత మహిళల జట్టు సాధన అద్భుతం. ఈ ఆనందం మాటలకందనిది. టీం ఇండియా విజయం యువతులకు స్ఫూర్తిగా నిలవాలి.
- అశ్వినీ పునీత్‌రాజ్‌కుమార్ (సినీ నిర్మాత) : ప్రపంచకప్ ఫైనల్స్‌లో గెలుపొంది కొత్త చరిత్ర సృష్టించిన భారత మహిళల క్రికెట్ జట్టుకు అభినందనలు.
- రిషబ్‌శెట్టి (కథానాయకుడు): మహిళా క్రికెట్ జట్టు శక్తిసామర్థ్యాలు అంచనాలకు అందనివి. కలిసికట్టుగా విజయం సాధించారు. అందులో ఎంతో కఠోరశ్రమ దాగుంది. భారతీయులు మెచ్చుకోదగ్గ గొప్ప విజయం.

ప్రమిదలే ప్రాకారం.. శివగణారాధనకు శ్రీకారం

శంకరుడి అర్ధాంగి పార్వతీదేవికి అలంకరణ

దొడ్డ బసవన్నకు విశేష పుష్పాలంకారం

పరమశివుడికి జంతికల హారాలు

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : రాష్ట్ర వ్యాప్తంగా కార్తిక రెండో సోమవార వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శివ భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. బెంగళూరులోని అనేక శివాలయాల్లో ఉదయాన్నే అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. మనసులకు ఆహ్లాదం కలిగేలా శివుడిని వైవిధ్యమయ అలంకారాలతో తీర్చిదిద్దారు. హనుమంతనగర్‌లోని బలమురి శేష మహాగణపతి ఆలయంలో శివుడికి, పార్వతీదేవికి అలంకరించిన తీరే ప్రత్యేకంగా ఉంది. జంతికలు, కొబ్బరి, ఆరటి ఆకులనే ఆభరణాలుగా మలిచి నిర్వహించిన అలంకారం అబ్బురమే. ఇతర శివాలయాల్లో దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి. మంగళూరు మంగళాదేవి ఆలయ ప్రాంగణంలో తులసి చెట్టుకు సుందర దీపాలతో అలంకరించి పూజలు చేశారు. బసవనగుడిలోని బుల్‌టెంపుల్‌లో దొడ్డ బసవన్నకు ప్రత్యేక అలంకరణ అందరినీ ఆకట్టుకుంది.

హంపీ విరూపాక్షేశ్వర ఆలయంలో సంధ్యా సమయాన దీపకాంతులు

సొరంగ పనులకు స్పందన కరవు

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే : రాజధాని నగరంలో సిల్క్‌బోర్డు నుంచి హెబ్బాళ వరకు రూ.17,800 కోట్లతో 17 కి.మీ. పొడవునా సొరంగ మార్గం నిర్మాణానికి టెండర్లు వేసుకునే అవధిని ప్రభుత్వం ఈ నెల 11 వరకు విస్తరించింది. సొరంగం వద్దంటూ విపక్షాలు డిమాండు చేస్తుండగా.. ప్రభుత్వం మాత్రం ఈ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఇప్పటి వరకు ఎవరూ టెండర్లు వేయకపోవడంతో అవధిని విస్తరించారు. పనులు పూర్తి చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. పనులను రెండు దశల్లో పూర్తి చేసేలా ప్రభుత్వం టెండర్లను ప్రభుత్వం పిలిచింది. పనులు చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని భాజపా నాయకులు ఇప్పటికే ఉన్నత న్యాయస్థానంలో దావా వేసిన విషయం తెలిసిందే.

ఆరోపణలు భరించలేక మాస్టారు ఆత్మహత్య

మైసూరు, న్యూస్‌టుడే : ఒక విద్యార్థిని (16) గర్భిణి అయ్యేందుకు కారకుడని ఆరోపణలు ఎదుర్కొంటున్న పీటీ మాస్టార్ రాము (27) బెట్టద తుంగా కాలువలో దూకి సోమవారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. తాను పని చేస్తున్న పాఠశాలలో విద్యార్థినితో మాట్లాడడమే నేరమా అని ప్రశ్నిస్తూ వాయిస్ నోట్‌ను రికార్డు చేశాడు. ఆమె గర్భందాల్చేందుకు తనకు ఎటువంటి సంబంధం లేదని, డీఎన్ఏ పరీక్ష చేయిస్తే వాస్తవాలు బయటపడతాయని అందులో పేర్కొన్నాడు. కొందరు స్నేహితులకు ఆ నోట్‌ను పంపించి, శుక్రవారం సాయంత్రం నుంచి కనిపించకుండా వెళ్లాడు. పిరియాపట్టణ తాలూకా కుడకూరు సమీపంలోని బెట్టద తుంగా కాలువలో అతని మృతదేహాన్ని సోమవారం గుర్తించారు. పిరియాపట్టణ గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రాయితీ పేరిట వంచన

కలబురగి, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం నుంచి పెద్ద మొత్తంలో రాయితీ ఇప్పిస్తామని బసవరాజు అనే యువ పారిశ్రామికవేత్తను కొందరు వంచించారు. జౌళి పరిశ్రమ ఏర్పాటుకు కేంద్రం నుంచి 90 శాతం రాయితీ ఇప్పిస్తామని వంచకులు నమ్మించారు. వారి మాటలు విశ్వసించి నివేశనాలు, ఇతర ఆస్తులను తాకట్టుపెట్టి రూ.3.35 కోట్లను వారికి అప్పగించాడు. నగదుతో వారు పరారైన అనంతరం.. తాను మోసపోయానని గుర్తించిన బాధితుడు కలబురగి నగర ఠాణాలో ఫిర్యాదు చేశారు. శరణబసణ్ణ, పాటిల్, చంద్రకళ, కిరణ్, విజయలక్ష్మి, వారి ముగ్గురు అనుచరులు ప్రధాన నిందితులుగా పోలీసులు గుర్తించారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు తీవ్రం చేశారు.

దర్శన్ కేసు విచారణ వాయిదా

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : చిత్రదుర్గకు చెందిన రేణుకా స్వామి హత్య కేసులో నటులు దర్శన్, పవిత్రా గౌడ, ఇతర నిందితులపై ప్రత్యేక దర్యాప్తు దళం దాఖలు చేసిన అభియోగపత్రంపై విచారణ ప్రారంభించే అంశాన్ని 64వ సీసీహెచ్ న్యాయస్థానం నవంబరు 10కి వాయిదా వేసింది. నిందితులు అందరినీ న్యాయస్థానం ముందు సోమవారం హాజరుపరిచారు. దర్శన్ ఈ కేసు నుంచి బయటపడాలని కోరుకుంటూ ఆయన భార్య విజయలక్ష్మి ఆలయాలను చుట్టి వస్తున్నారు. తాను నమ్ముకున్న దేవుడు న్యాయం కల్పిస్తాడని ఆమె తన సామాజిక మాధ్యమం ద్వారా ధీమా వ్యక్తం చేశారు. అభియోగపత్రంలోని ప్రధాన అంశాలను న్యాయమూర్తి నిందితులకు చదివి వినిపించగా.. అందులో వాస్తవం లేదని దర్శన్, పవిత్రాగౌడ తరఫు న్యాయవాదులు అభ్యంతరం తెలిపారు. తమ కక్షిదారులతో మాట్లాడేందుకు కొంత సమయం కేటాయించాలని కోరగా, న్యాయమూర్తి అందుకు అంగీకరించారు. న్యాయస్థానంలో విచారణ అనంతరం నిందితులను భద్రత నడుమ పరప్పన అగ్రహార కారాగారానికి తీసుకువెళ్లారు. న్యాయస్థానంలో తన వెనుక నిలబడిన పవిత్రాగౌడను ముందుకు రమ్మని దర్శన్ సూచించాడు. పక్కనే వచ్చి నిలబడిన పవిత్రాగౌడతో న్యాయమూర్తి వచ్చేంత వరకు దర్శన్ మాట్లాడుతూ నిలబడ్డాడు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 9121167525

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 9945050116

(c) eenadu

గంజాయి.. సరిహద్దులు దాటొస్తోందోయ్!

స్వాధీనం చేసుకున్న గంజాయి పార్శిల్

పశ్చిమబెంగాల్ రాష్ట్రం నుంచి రైలులో తరలింపు

బళ్లారి, న్యూస్‌టుడే: దేశ, రాష్ట్రాల సరిహద్దులను దాటి ప్యాసింజర్ రైళ్ల ద్వారా కర్ణాటకలోకి గంజాయి దాటుకొని నిరాటంకంగా చేరుతోంది. గంజాయి రవాణాలో పాల్గొన్న వారిని గుర్తించడానికి, రవాణాను నిరోధించడానికి రైల్వే పోలీసులు నిరంతరం ప్రత్యేక నిఘా పెట్టారు. రాష్ట్రంలో మాదక ద్రవ్యాల విక్రయాలను నిషేధించిన విషయం తెలిసిందే. గంజాయితో సహా ఇతర మాదక ద్రవ్యాలను చట్టవిరుద్ధంగా విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నా.. సరిహద్దులను దాటి బళ్లారికి చేరుకుంటోంది. గంజాయి స్వాధీనం చేసుకుంటున్నా రవాణా చేస్తున్న వారు సులభంగా తప్పించుకుంటున్నారు. స్వర్ణపథ పోలీసు శాఖ ప్రత్యేక నిఘా పెట్టినా ప్యాసింజర్ రైళ్లలో ప్యాక్ చేసి పార్శిళ్లను చేరవేస్తున్నారు. ఇది రైల్వే పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది. గంజాయిని తరలించే వారిని గుర్తించడానికి అధునాతన పద్ధతులను వినియోగిస్తున్నారు.

రైళ్లలోనే సరకు తరలిస్తున్నారు

ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి రాకపోకలను కల్పించడానికి రైల్వేశాఖ ఉపయోగపడుతున్నా.. దీన్ని ఆసరాగా తీసుకున్న కొంత మంది గంజాయిని రవాణా చేయడానికి దుర్వినియోగం చేస్తున్నారు. వారానికి ఒకసారి పశ్చిమ బెంగాల్ నుంచి బెంగళూరులోని యశ్వంత్‌పురకు ఓ రైలు వస్తోంది. ఇందులోనే అత్యధిక సంఖ్యలో గంజాయి పార్శిళ్లు వస్తున్నట్లు గుర్తించారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని సాలీమార్, టాటానగర్, సరిహద్దులో ఉన్న బంగ్లాదేశ్ దేశం నుంచి కూడా దేశంలోకి వస్తున్నట్లు నిఘావర్గాల సమాచారం. రైళ్ల ద్వారా గుంతకల్లు నుంచి బళ్లారి, బెంగళూరు, ధార్వాడ, బెళగావి, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు అక్రమంగా గంజాయి సరఫరా అవుతున్నట్లు రైల్వే పోలీసులు విచారణలో గుర్తించారు. పలు రైళ్ల ద్వారా గుంతకల్లుకు చేరుకుని అక్కడి నుంచి వివిధ రోడ్డు మార్గాల్లో బళ్లారికి తరలిస్తున్నట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఇక్కడి నుంచే తరలిస్తున్నారా?

పశ్చిమ బెంగాల్‌లోని సాలీమార్-యశ్వంత్‌పుర అనుసంధానించే ప్యాసింజర్ రైలులో గంజాయిని రవాణా చేసే నెట్‌వర్క్ వివిధ మార్గాలను అనుసరిస్తోంది. పోలీసుల కళ్లుగప్పి ప్లాస్టిక్ సంచుల్లో చుట్టి ప్రయాణికులు తీసుకెళ్లే సంచులు లేదా దుస్తులు, ఇతర వస్తువులున్న సంచుల్లో, మరుగుదొడ్లలో గంజాయిని ఉంచుతున్నారు. ప్రయాణికుల సీట్ల కింద అక్కడక్కడా చెల్లాచెదురుగా పారేస్తున్నారు. వారానికి ఒకసారి నడిచే ఈ రైలును రైల్వే పోలీసులు నిరంతరం తనిఖీ చేస్తున్నారు.

సాలీమార్ నుంచి రవాణా

పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని సాలీమార్ నుంచి బళ్లారి మీదుగా యశ్వంత్‌పురకు వెళ్లే ప్యాసింజర్ రైలు ద్వారా గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించాం. ఆగస్టు, అక్టోబరు, నవంబరు నెలల్లో మొత్తం 58 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. దాడులు నిరంతరం కొనసాగుతున్నాయి.

- సిద్ధలింగప్ప, ఆర్.పి.ఎఫ్, సీఐ, బళ్లారి

జాగిలంతో తనిఖీలు చేస్తున్న పోలీసులు

58 కిలోలు పట్టివేత

బళ్లారి జిల్లా రైల్వేస్టేషన్‌లో గడిచిన మూడు నెలల్లో రైల్వే పోలీసులు 58 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బళ్లారి రైల్వే పోలీసులతో పాటు, ఆర్.పి.ఎఫ్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకుంటున్నారు. ఆగస్టులో 36 కిలోల ముడి గంజాయిని, అక్టోబరు 22న రెండు కిలోలు, 25న 15 కిలోలు, 30న 100 గ్రాముల సరకు పట్టుకున్నారు. ఈనెల 1న 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆ సరకంతా పశ్చిమ బెంగాల్‌లోని సాలీమార్-యశ్వంత్‌పుర రైల్వే నంబరు 18111లో ఉండటం విశేషం. పోలీసుల దాడిలో గంజాయి కట్టలో మారణాయుధాలు, తూకం యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఐసీసీ సమావేశం తర్వాత నిర్ణయం తీసుకుందాం

సమావేశంలో మాట్లాడుతున్న సంఘం సభ్యులు

బళ్లారి, న్యూస్‌టుడే: తుంగభద్ర జలాశయం కింద ఉన్న ఆయకట్టుకు రెండో పంట రబీకి సాగునీటిని కాలువలకు విడుదల చేయడంపై ఆందోళన ఊపందుకుంటున్నాయి. ఆయకట్టుకు నీటి విడుదలపై రాష్ట్ర రైతు సంఘం, హసిరు సేనె సంఘటన ఆధ్వర్యంలో రైతులతో సోమవారం సమావేశం నిర్వహించారు. బళ్లారి నగరం డా.రాజ్‌కుమార్ రహదారిలోని నూతన ప్రభుత్వ సంకీర్ణ భవనం సమీపంలోని ప్రభుత్వ అతిథిగృహం ముందు వివిధ తాలూకాల రైతులతో సమావేశం నిర్వహించి, రైతుల నుంచి వివరాలను రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కరూరు మాధవరెడ్డి, సభ్యులు లేపాక్షి, బినారెడ్డి, ముద్దుకుమార సూరిబాబు, బసవరాజ స్వామి, సురేంద్ర, ఈరన్న మూలిమని, గణేష్‌స్వామి, పంపనగౌడ, తిమ్మారెడ్డి, ఉమాపతిగౌడ, మేటి నాగరాజుగౌడ, చెన్నారెడ్డి, బసరెడ్డి, రమణగౌడ, పంపాపతి, శ్రీశైల అంబట్టి తదితరులు తెలుసుకుని సమావేశంలో మాట్లాడారు. తుంగభద్ర జలాశయంలో వరదనీరు నిల్వ, గేట్ల మరమ్మతులు, కాలువలకు నీటి విడుదలపై ఈ నెల 5న బెంగళూరులో నీటిపారుదల సలహా కమిటీ(ఐసీసీ) సమావేశం జరగనుంది. ఈ సమావేశం అనంతరం కాలువలకు నీటి విడుదలపై సరైన నిర్ణయం తీసుకోకుంటే భవిష్యత్తు ప్రణాళిక సిద్ధం చేద్దామని పలువురు రైతులు తీర్మానం చేశారు. అంత వరకు రైతులు సహనం పాటించాలని సూచించారు.

5న బెంగళూరులో తుంగభద్ర ఐసీసీ సమావేశం

హొసపేటె, న్యూస్‌టుడే: తుంగభద్ర ఆయకట్టు భూములకు రెండో పంట (రబీ)కి సాగునీరిచ్చే అంశంపై చర్చలు జరిపేందుకు 5వ తేదిన బెంగళూరులో నీటిపారుదల సలహా సమితి(ఐసీసీ) సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటలకు విధానసౌధలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి ఉపముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ అధ్యక్షత వహిస్తారు. రాయచూరు, కొప్పళ, విజయనగర జిల్లాల బాధ్యమంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, రైతులు పాల్గొంటారు. ప్రస్తుతం జలాశయంలో 80 టీఎంసీల నీరునిల్వ ఉండి, ఎగువ ప్రాంతాల నుంచి 10వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోందని, రెండో పంటకు సునాయాసంగా నీరివ్వవచ్చని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సమావేశం కీలకం కానుంది. తుంగభద్రకు కొత్త గేట్ల బిగింపు అంశంపైనా చర్చలు జరిగే అవకాశం ఉంది.

నిర్వాసితులపై నిర్లక్ష్యమేల?

పట్టణ శివారు ఏపీఎంసీ కూడలిలో భోజనం చేస్తున్న నిరసనకారులు

హొసపేటె, న్యూస్‌టుడే: తుంగభద్ర జలాశయం నిర్మాణం సమయంలో భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం ముఖ్యులు దుయ్యబట్టారు. హొసపేటె తాలూకా పరిధి మరియమ్మనహళ్లి, డణాయకనకెరె ప్రాంతాల్లో నిర్వాసిత రైతుల పేరిట భూమి హక్కు పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సంఘం ఆధ్వర్యంలో ఆ ప్రాంతాల రైతులు సోమవారం మరియమ్మనహళ్లి నుంచి హొసపేటె వరకూ పాదయాత్ర చేపట్టారు. సాయంత్రం జిల్లా పాలనాధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. డ్యాం నిర్మాణం సమయంలో మమ్మల్ని ఖాళీ చేయించి, వేరే చోట్ల వ్యవసాయ భూములు కేటాయించారు, కాని ఇప్పటి వరకూ వాటికి హక్కుపత్రాలు మంజూరు చేయలేదని విచారం వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులను కలిసి సమస్య వివరించినా ఫలితంలేదని వాపోయారు. రాబోయే రోజుల్లో జాతీయ రహదారిపై బైఠాయిస్తామని హెచ్చరించారు. ప్రముఖులు గోణిబసప్ప, గంటె సోమశేఖర తదితరులు పాల్గొన్నారు. పాదయాత్రలో భాగంగా ఏపీఎంసీ కూడలి వద్ద రోడ్డుపైన బైఠాయించి భోజనం చేసి నిరసన వ్యక్తం చేశారు.

అలనాటి.. శవ పేటిక!

వివిధ భగ్న పలకలను జోడిస్తే పేటిక తయారయ్యిందిలా..

చూడబోతే.. ఇదేదో ఏనుగు బొమ్మలా ఉంది కదూ.. అది కానేకాదు.. క్రీస్తు పూర్వం 1500 సంవత్సరాల నాటి శవపేటిక ఇదీ! బళ్లారి నగరంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న రాబర్ట్ బ్రూస్ ఫూట్ సంగనకల్లు ప్రాచీన వస్తు ప్రదర్శనశాలలో దీన్ని చూడవచ్చు. మట్టి పలకలను కాల్చి.. ఇలా పేటికగా మార్చారు. కాలగతిలో అది భగ్నమైనా.. చరిత్ర పరిశోధకులు వెలికితీసి.. ఇలా పునరుద్ధరించారు. బళ్లారి తాలూకా కుడతిని సమీపాన విద్యుత్తు కేంద్రం నిర్మాణ సమయంలో దక్షిణ భారతదేశంలో అతి పెద్దదిగా పేరు పొందిన బూదిదిబ్బ వెలుగుచూసింది. ఆ శిథిలాల్లోనే శవపేటిక వెలుగుచూడగా. దీనికి 'సార్కో ఫెగస్' అని పేరుపెట్టారు. ఆనాడు లభించిన పేటికలో భద్రపరచిన ఏడేళ్ల బాలుడి అస్థిపంజర శిథిలాలనూ నిపుణులు సేకరించి, బళ్లారి ప్రదర్శనశాలలో భద్రపరిచారు. పేటిక, అస్థిపంజరాన్ని 2020 వరకు ధార్వాడలోని కర్ణాటక విశ్వవిద్యాలయ ప్రత్యేక కేంద్రంలో ప్రదర్శనకు ఉంచారు. బళ్లారి జిల్లా పాలనాధికారిగా పనిచేసిన ఎస్.ఎస్. నకుల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఇక్కడే పురావస్తు ప్రదర్శనశాల ప్రారంభించి.. ఆ పేటికను తెప్పించారు. క్రీస్తుపూర్వ జనజీవన సామాజిక వ్యవహారాలను విశ్లేషిస్తే.. పదేళ్లలోపు బాలల శవ సంస్కారం కోసం మట్టి శవపేటికలను ఉపయోగించేవారని చరిత్రకారులు వివరించారు. దీనిపై అనేకానేక దేశాల చరిత్ర పరిశోధక విద్యార్థులు, విశ్లేషకులు వివరాలు సేకరించి భద్రపరుస్తున్నారు.

-న్యూస్‌టుడే, బళ్లారి

నేటికీ భద్రం: శవపేటికలో గుర్తించిన ఎముకలు, పుర్రె భాగాలు ఇవిగో..

ఘనంగా అన్నమయ్య ఆరాధనా మహోత్సవం

పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్పనాయక్ కుటుంబ సభ్యులు

మాన్వి: పట్టణంలోని కొండపై గుహలో ఉన్న అన్నమయ్య తాత ఆరాధనా మహోత్సవం ఘనంగా జరిగింది. మహాహఠయోగిగా పేరున్న అన్నమయ్య 40వ ఆరాధనా ఉత్సవ కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. ఈ క్రమంలో ఉదయం నుంచి రాత్రి వరకు మాన్వి కొండ గుహ వద్ద పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. పట్టణ ప్రజలతో బాటు అన్నమయ్య తాత సన్నిహితులు, భక్తులు భారీగా హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్పనాయక్ కుటుంబసభ్యులతో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

దివాన్-ఎ.మస్తాన్ దర్గా కమిటీ ఎన్నికకు చర్యలు

బళ్లారి: సిరుగుప్ప పట్టణం, కౌల్‌బజార్ ప్రాంతంలోని వక్ఫ్ సంస్థ దివాన్-ఎ.మస్తాన్ దర్గా (సున్నీ) వక్ఫ్ సంస్థ కోసం కొత్త కమిటీ ఏర్పాటుకు మంగళవారం నుంచి ఈనెల 22 వరకు ఎన్నికలు నిర్వహిస్తామని వక్ఫ్ కార్యాలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు 4న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 వరకు బళ్లారి వక్ఫ్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను పొంది పూర్తి చేసి సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు అధికారులను సంప్రదించాలన్నారు.

పశువులను వీధుల్లోకి వదలకండి

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర పరిధిలో వీధుల్లోకి పశువులను వదలకుండా ఇంటి వద్ద కట్టివేయాలని బళ్లారి నగర పాలికె కమిషనర్ మంజునాథ ఒక ప్రకటనలో కోరారు. పశువులు రహదారులపై విడిచిపెట్టడంతో రహదారులు, కూడళ్లలో పండుకోవడం, నిలబడిపోవడంతో ట్రాఫిక్ అంతరాయంతో పాటు, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పశువుల యజమానులు వాటిని ఇంటి వద్ద ఉంచుకోవాలని, వీధుల్లో విడిచిపెడితే నిబంధనల ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

బళ్లారి, న్యూస్‌టుడే: సిరుగుప్ప తాలూకా హలేకోటె గ్రామానికి చెందిన జ్యోతి(19) అనే మహిళ అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు తెక్కలకోటె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదృశ్యమైన యువతి 5.2 అడుగుల ఎత్తు, గోధుమ రంగు, గుండ్రని ముఖం, తదితర గుర్తులు ఉన్నాయి. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

15న మేయర్, ఉపమేయర్ ఎన్నిక

బళ్లారి: బళ్లారి నగర పాలికె 24వ మేయర్, ఉపమేయర్, స్థానిక సమితి అధ్యక్ష స్థానాలకు ఈ నెల 15న మధ్యాహ్నం 12.30 గంటలకు నగర పాలికె ఆవరణలోని శ్రీకృష్ణదేవరాయ సభాభవనంలో కలబురగి ప్రాదేశిక కమిషనర్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మంజునాథ ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర జెస్కాం ఉపవిభాగం-2 వ్యాప్తిలో మరమ్మతులు జరుగుతుండటంతో మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఎదురవుతుందని జెస్కాం అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం పరిధిలోకి వచ్చే తాళూరు రహదారి, స్నేహకాలనీ, శ్రీనగర, రేణుకానగర, భగత్‌సింగ్ నగర, కన్నడనగర, మహానంది కొట్టం, పార్వతినగర, వాల్మీకి కూడలి, శాస్త్రినగర, బ్యాంకు కాలనీ, బసవనకుంటె, సిరుగుప్ప రహదారి, రామనగర, హవంబావి కాలనీల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వివరించారు.

అమ్మో.. కారు

బెంగళూరు నగర ప్రమాదాలు వేటికవే విపరీతంగా భయపెడుతుంటాయి. అలాంటిదే ఓ ప్రమాదం చిక్కలసంద్ర వీధుల్లో సోమవారం హడలెత్తించింది. ఉదయవేళ.. ఆ వీధిలో అడ్డగోలుగా దూసుకొచ్చిన కారు.. అదుపు తప్పి పూల దుకాణాల పైకి దూకింది. అక్కడొక విద్యుత్తు స్తంభాన్ని తాకి ఆగిపోయింది. ఆ స్తంభం అడ్డంగా వాలిపోగా.. వేరెవరూ గాయపడకపోవడంతో అక్కడివారు ఊపిరి పీల్చుకున్నారు. నడివీధిలో నడుస్తుంటేనే ప్రమాదాలు ఎదురుకావు.. ఇలా దూరంగా ఉన్నా ఒక్కోసారి ముప్పు ముంచుకొస్తుంటుంది. సామాన్యులూ.. జాగ్రత్త! - న్యూస్‌టుడే, బెంగళూరు

నైజీరియా మహిళ అరెస్టు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : నగరంలో వివిధ ప్రాంతాల్లో మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న నైజీరియా దేశానికి చెందిన స్టెఫిన్(35) అనే మహిళను కోడుగెహళ్లి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఆమె నుంచి విలువైన 35 గ్రాముల మత్తుపదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. 2021లో బెంగళూరు నగరానికి వచ్చిన ఆమె థణిసంద్రలో ఉంటూ.. మత్తు వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు.

స్నేహితురాలి సాన్నిహిత్యానికే డాక్టర్ కృతికారెడ్డి హత్య

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : రాజధాని నగరంలో ఇటీవల సంచలనానికి కారణమైన వైద్యురాలు కృతికారెడ్డి హత్య కేసులో ఆమె భర్త మహేంద్రరెడ్డి విచారణను పోలీసులు తీవ్రం చేశారు. 'నీ కోసమే నా భార్యను హత్యచేశా'నంటూ ఆయన తన స్నేహితురాలికి సెల్‌ఫోన్ మెసేజ్ పంపాడని మారతహళ్లి పోలీసులు గుర్తించారు. నిందితుడి చరవాణి, ల్యాప్‌టాప్ తదితరాలను వారు క్షుణ్నంగా పరిశీలిస్తున్నారు. ఆ స్నేహితురాలితో మహేంద్ర నిత్యం చాటింగ్ చేస్తున్నాడని తేలింది. భార్యను కడతేర్చాక పంపిన మెసేజ్‌ను డిలీట్ చేయకపోవడాన్ని గుర్తించారు. కృతికారెడ్డికి అధిక మోతాదులో మత్తు మందును ఇచ్చి. . హత్య చేసిన విషయం తెలిసిందే.

కేరళలో మెడికో విద్యార్థి మృతి

మహ్మద్ అఫ్రజ్ (పాతచిత్రం)

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: హిరియూరు టీచర్స్ కాలనీకి చెందిన మహ్మద్ అఫ్రజ్(23) కేరళలో సముద్రంలో నీటమునిగి మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం వారు తెలిపిన వివరాల మేరకు.. వైద్యవిద్యలో పీజీ చదువుతున్న మహ్మద్ అఫ్రజ్ స్నేహితులతో కలిసి కణ్ణూరు వద్ద ఉన్న పయ్యాంబళం బీచ్‌కు పర్యటనకు వెళ్లారు. సముద్రంలో దిగి నీటిలో ఆటలాడుకొంటుండగా నీటి అలలకు విద్యార్థి కొట్టుకుపోయినట్లు పేర్కొన్నారు. హిరియూరులో నివాసముంటున్న అన్వర్ బాషా కుమారుడు అఫ్రజ్. విషయం తెలుసుకొన్న కుటుంబ సభ్యులు కేరళకు బయలుదేరారు.

కనీస వేతనాలు చెల్లించాలని ధర్నా

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: అక్షర దాసోహ పథకం కింద ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే వారికి ప్రభుత్వం కనీస వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేశ్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో అక్షర దాసోహ సహాయక డైరెక్టర్ గురురాజ్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23 ఏళ్లుగా పనిచేస్తున్న వంట పనివారికి కనీస వేతనాలుగాని, ఉద్యోగ భద్రతగాని ప్రభుత్వం కల్పించలేదన్నారు. పలువురు వంటపనివారు నిరసనలో పాల్గొన్నారు.

పెంపుడు శునకానికి నరకం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : పెంపుడు శునకాన్ని ఓ పని మనిషి కొట్టి హత్య చేసిన సంఘటన బెంగళూరు నగర బాగలూరు పోలీసురాణా పరిధిలో కలకలం రేపింది. ఈ సంఘటనకు సంబంధించి పని మనిషి పుష్పలతను స్థానిక పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎంబీఏ కోర్సు చేస్తున్న మంగళూరు విద్యార్థిని ఒకరు బెంగళూరు బెళ్లిహళ్లిలోని ఓ అపార్ట్‌మెంట్లో ఉంటున్నారు. ఆమె ఓ ఖరీదైన శునకాన్ని పోషిస్తున్నారు. దాని బాగోగులు చూసేందుకు తమిళనాడు నివాసి పుష్పలతను పనిమనిషిగా పెట్టుకున్నారు. ఆమె కూడా విద్యార్థినితోటే ఉంటోంది. అక్టోబరు 31న రాత్రి లిఫ్ట్‌లో శునకాన్ని విపరీతంగా కొట్టి హత్య చేసినట్లు సీసీ కెమెరాల్లో గుర్తించిన ఆ విద్యార్థిని వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసుకుని పని మనిషిని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

EENADU Classifieds

JOBS

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యూయర్స్. ఏజ్: 22-35. ఫ్రెషర్స్ కూడా కావలెను. ✆ : 6281037879.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్లారి : 9121167525

బెంగుళూరు : 9121167527

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

కనీస వసతులు కల్పించకుంటే చర్యలు

ఏపీఎంసీల్లో కనీస సౌకర్యాలను సమీక్షిస్తున్న పాలనాధికారి సురేశ్ ఇట్నాళ

గంగావతి, న్యూస్‌టుడే: వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ సమితుల్లో రైతులకు కనీస సౌకర్యాలు కల్పించకుంటే కార్యదర్శులపై చర్యలు తప్పవని కొప్పళ జిల్లా పాలనాధికారి సురేశ్ హిట్నాళ హెచ్చరించారు. ఆయన సోమవారం జిల్లాలోని ఏపీఎంసీల్లో కనీస సౌకర్యాలను సమీక్షించారు. ఏపీఎంసీల ఆవరణలో వాహనాల పార్కింగ్, వీధిదీపాలు, మరుగుదొడ్లు, తాగునీరు, ఇతర సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇవి లేకుంటే పల్లెల నుంచి వచ్చే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. పలుచోట్ల స్వచ్ఛత లోపించిందన్న ఫిర్యాదులు ఉన్నాయన్నారు. బెళవినాళ ఏపీఎంసీలో రహదారులు నిర్మించాలన్నారు. దావణగెరా జీరో ఘన వ్యర్థాల నిర్వహణ చేపట్టాలన్నారు. రైతుల నుంచి కమీషన్లు తీసుకోరాదని నామఫలకాలు వేయించాలని సూచించారు. ఏపీఎంసీ స్థలాల్లో నియమాలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పన్నులను సక్రమంగా వసూలు చేయాల్సి ఉంటుందన్నారు. నమోదు చేసుకున్న, చేసుకోని హమాలీలందరికీ కార్మిక శాఖ నుంచి సదుపాయాలు అందించాల్సి ఉంటుందన్నారు. ప్రతిచోట వేబ్రిడ్జ్‌లు తప్పనిసరన్నారు. పశువుల సంతల్లో సైతం కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. వ్యవసాయశాఖ ఉప సంచాలకుడు ఎల్.సిద్ధేశ్వర, వ్యవసాయ మార్కెట్ అధికారి వీరభద్రయ్య హిరేమఠ, కార్మిక శాఖ అధికారి సుధా గరగ, ఏపీఎంసీ కార్యదర్శి సిద్ధయ్యస్వామి, లీడ్‌బ్యాంక్ మేనేజర్ మారుతి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక సోమవారం పూజలు

ఈశ్వర దేవాలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు

పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

చెళ్లకెర(చిత్రదుర్గం), న్యూస్‌టుడే: కార్తిక సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం వందల మంది భక్తులు ఈశ్వర దేవాలయాలను సందర్శించి దీపారాధనలో పాల్గొన్నారు. దేవాలయ ప్రాంగణంలో నెయ్యి, నూనె దీపాలను వెలిగించి మొక్కులను తీర్చుకొన్నారు.

వాననీటిని భద్రపరిస్తే.. భూగర్భమే జలభాండం

మురుగునీటిని శుద్ధీకరించి.. పునః వినియోగానికి పెద్దపీట

నగరశివారు : శుద్ధీకరించిన నీటితో నిండిన చెరువు

నీరు.. రాజధాని నగర వాసిని అన్నివేళలా చుట్టుముట్టే ప్రధాన సమస్య. వానాకాలం వస్తే ముంచెత్తే నీరు.. ఎండాకాలానికి చుక్కలు చూపించడం బెంగళూరువాసికి తరచుగా ఎదురయ్యే సమస్య. చినుకులు రాలినప్పుడు ఒడిసి పట్టుకుని.. ఎండలు మండినప్పుడు సద్వినియోగం చేసుకునే దిశగా నిపుణులు సూచించిన అనేక అంశాలు వాస్తవ రూపం దాల్చుతున్నాయి.

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : బెంగళూరు నగర ప్రజలు పూర్తిగా కావేరి నదీ జలాలపై ఆధారపడిన వేళ.. తాగునీటి కొరత తరచుగా వెంటాడుతోంది. ఆ ఇక్కట్లను అధిగమించడానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. భూగర్భజలాల మట్టాన్ని పెంచేలా అనేకానేక కార్యక్రమాలను చేపట్టాలని 'బ్రాండ్ బెంగళూరు' పథకంలో భాగంగా నిర్ణయించారు. ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో 'జలసురక్షా బెంగళూరు' అనే అంశానికి ఆరువేల మంది వివిధ సూచనలు చేశారు. వాననీటి సంరక్షణ, నీటి పొదుపు తదితరాలకు ఆహ్వానం పలికారు. వాననీటి సంరక్షణ మినహా నగరానికి ప్రత్యామ్నాయ వ్యవస్థ అసాధ్యమని నిపుణులు నొక్కి చెప్పారు. ప్రధానంగా బహుళ అంతస్తుల భవంతుల వద్ద తప్పనిసరిగా మురుగునీటి శుద్ధీకరణ కేంద్రాలను ఏర్పాటు చేయాలనేది కీలకాంశం. అలా శుద్ధీకరించిన నీటిని సమీప చెరువులకు సరఫరా చేయాలి. భూగర్భ జలాల వినియోగాన్ని నియంత్రించాలనేది మరో సూచన. అక్రమ బోరుబావులను నియంత్రించక తప్పని పరిస్థితి. వాననీటి సంరక్షణ చర్యల్లో భాగంగా ఎక్కువగా ఇంకుడు గుంతలు ఏర్పాటుకు ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించినట్లు బెంగళూరు జలమండలి చీఫ్‌ఇంజిజినీరు కె.ఎన్.రాజీవ్ 'న్యూస్‌టుడే'కి వివరించారు. నగర ప్రజలు తాగునీటి కోసం కావేరి నది నుంచి 19 టీఎంసీలు సేకరిస్తుండగా.. ఆ నీటి ఆధారంగా 28 లక్షల కుళాయిలు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉపయోగించాక.. నిత్యం 1250 ఎంఎల్‌డీ నీటిని శుద్ధీకరించి నగరానికి గొట్టాల సాయంతో కోలారు జిల్లాలోని చెరువులకు సరఫరా చేస్తున్నారు. అందులో 250 ఎంఎల్‌డీ నీరు అంతర్జాతీయ విమానాశ్రయం, భారతీయ వైమానిక యుద్ధ విమానాశ్రయ పరిసరాల్లో మొక్కల పెంపకం తదితరాలకు ఉపయోగిస్తున్నట్లు అధికారులు వివరించారు. నగర వ్యాప్తంగా కొత్త ఇళ్ల నిర్మాణాలు చేపట్టేవారు వాననీటి చర్యలు చేపట్టాలనే నిబంధన అమలు చేస్తున్నారు. ఇంకుడు గుంతలు, వాననీటి తొట్టెలు అందులో భాగంగా నిర్మిస్తున్నారు.

ఓ బోరుబావికి అనుబంధంగా వాననీటి సంరక్షణ చర్యలు

గణేష్ మందిర వార్డు: వాననీటి కాలువలోనే ఒదిగిపోయిన ఇంకుడు గుంతలు

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

పంటల తెగుళ్లపై రైతులకు అవగాహన

సిరివార, (మాన్వి): రాయచూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థుల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కృషి కార్యానుభవ శిబిరాన్ని తాలూకాలోని మాడగిరి గ్రామంలో నిర్వహించారు. పంటలనాశించే వివిధ రకాల తెగుళ్లు, సేంద్రియ ఎరువుల తయారీ పద్ధతి, వినియోగం, బ్రహ్మాస్త్ర, అగ్నిఅస్త్ర, క్రిమికీటకాల నిర్మూలన, గోమూత్రంపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు, శిబిరం సంయోజకులు డాక్టర్ డి.ఎస్.అశ్వత్ నారాయణ, డాక్టర్ శశిధర్ కె.కె., డాక్టర్ సంగీత మచ్చి తదితరులు పాల్గొన్నారు.

హొళల్కెరలో ఆర్ఎస్ఎస్ ప్రదర్శన

చెళ్లకెర(చిత్రదుర్గం), న్యూస్‌టుడే: ఆర్ఎస్ఎస్ ప్రారంభమై వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రంలో నిర్వహిస్తున్న విజయదశమి ప్రదర్శనను హొళల్కెరలో నిర్వహించారు. సోమవారం వందలాది మంది ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు గణవేషధారణలో ప్రదర్శనలో పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ఎం.చంద్రప్ప ముందుండి వారిని నడిపించారు. పట్టణంలోని పలు వీధుల్లో కార్యకర్తలు పర్యటించి దేశ భక్తిని చాటి చెప్పారు.

ఆర్ఎస్ఎస్ ప్రదర్శనలో పాల్గొన్న ఎమ్మెల్యే చంద్రప్ప

కుష్టువ్యాధి నిర్మూలనకు సహకరించాలి

జాతాను ప్రారంభిస్తున్న తాలూకా ఆరోగ్యాధికారి డాక్టర్ శరణబసవరాజ్ పాటిల్

మాన్వి, న్యూస్‌టుడే: కుష్టు వ్యాధిని సంపూర్ణంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ శరణబసవరాజ్ పాటిల్ సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రి వద్ద కుష్టు వ్యాధి నియంత్రణ జాతాను ప్రారంభించి మాట్లాడారు. నవంబర్ 19 వరకు వాడవాడలా కుష్టువ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో ఆశా, అంగన్‌వాడీలు ఇంటింటా సర్వే పనులు చేస్తారని వారికి సహకరించాలని కోరారు. ఈ వ్యాధిపై పూర్తి అవగాహన కల్పిస్తారని తెలిపారు. చర్మంపై వచ్చే ఏ చిన్న మచ్చనీ నిర్లక్ష్యం చేయొద్దన్నారు. దీన్ని సంపూర్ణంగా నిర్మూలించేందుకు ఇప్పుడు ఔషధాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వివిధ వార్డుల్లో జాతా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప ఆరోగ్య శిక్షణాధికారి బసయ్య, డాక్టర్ శిల్పానాయక్, శివరాజ్, చైత్ర, సుధీర్‌బాబు, బాబు చిన్ను, ఆరోగ్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పైవంతెనపై రాకపోకలు.. తొలగిన ట్రాఫిక్ చిక్కులు..

హలకుంది బైపాస్ వంతెనను పరిశీలిస్తున్న సీఐ అయ్యనగౌడ పాటీల్

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగరం శివారుల్లోని హొసపేటె బైపాస్ నుంచి రైల్వే ట్రాక్ దాటుకునే బెంగళూరు రహదారి.. గుగ్గరహట్టి వద్ద భారీ వాహనాల రాకపోకలతో నిత్యం గంటల తరబడి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడేది. ఫలితంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ట్రాఫిక్ పోలీసులు, గ్రామీణ పోలీసులకు వాహనాల క్రమబద్ధీకరణ వ్యవహారం తలనొప్పిగా తయారయ్యేది. భారీ వాహనాలతో ఈ ప్రాంతంలో రహదారులు గుంతలు పడి.. కంకర తేలి దుమ్ము, ధూళితో చుట్టుపక్కల ప్రజలు శ్వాసకోస వ్యాధులతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం బళ్లారి - బెంగళూరు రహదారిపై హలకుంది వద్ద నిర్మించిన పైవంతెన ప్రారంభం కావడంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు.

హొసపేటె నుంచి రైల్వే ట్రాక్ దాటి బెంగళూరు రహదారి కలిసే మార్గం

24 కిలోమీటర్ల వరకు సాఫీగా ప్రయాణం

హొసపేటె, హుబ్బళ్లి, ధార్వాడ, గదగ, బెళగావి, బళ్లారి జిల్లాలోని జిందాల్, కేపీటీసీఎల్, ఏసీసీ సిమెంట్, ఇతర స్పాంజ్ ఐరన్ పరిశ్రమల నుంచి వచ్చే వాహనాలను వేణివీరాపురం సమీపంలోని కంట్రీక్లబ్ నుంచి ఉన్న బైపాస్‌కు చేరుకుంటాయి. అదే మార్గంపై హలకుంది, హౌసింగ్ బోర్డు, మించేరి, తిరుమలనగర, తదితర గ్రామాల శివార్లలోని గోడెహళ్ల వరకు వెళ్లి 63వ రహదారికి (అనంతపురం) చేరుకుంటాయి. అనంతపురం, గుంతకల్లు, కర్నూలు, హైదరాబాద్, విజయవాడ నుంచి వచ్చే భారీ వాహనాలు నగరంలోకి రాకుండా ఈ బైపాస్ మీదుగా, వేణివీరాపురం సమీపంలోని 63వ జాతీయ రహదారికి చేరుకుంటాయి. ఈ మార్గంలో 24 కిలోమీటర్ల దూరం ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా వాహనాలు వెళ్లడానికి అనుకూలంగా మారడంతో ట్రాఫిక్, గ్రామీణ పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.

ఎంతో అనుకూలం

కొన్నేళ్లుగా పారిశ్రామిక ప్రాంతంలోని బైపాస్ నుంచి బెంగళూరు రహదారికి చేరే ప్రదేశం, గుగ్గరహట్టి వద్ద నిత్యం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడేది. హలకుంది వద్ద బైపాస్ ప్రారంభం కావడంతో ట్రాఫిక్ చిక్కులకు పరిష్కారం దొరికింది. సోమవారం బైపాస్‌కు చేరుకుని పరిశీలించాం. భారీ వాహనాలు నగరంలోకి రాకుండా వంతెనపై వెళ్లవచ్చు. వాహనదారులు పోలీసులతో సహకరించాలి. - **అయ్యనగౌడ పాటీల్, ట్రాఫిక్ సీఐ, బళ్లారి**

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

టీకా వేసిన పశువులతో నెక్కంటి సత్యనారాయణ, ఇతర అధికారులు

హొసకేర క్యాంపు (శ్రీరామనగర్), న్యూస్‌టుడే: గంగావతి తాలూకా హొసకేర క్యాంపులో సోమవారం పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు వేశారు. రాబకొవి జిల్లా పాల సంఘాల సహకార సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షుడు నెక్కంటి సత్యనారాయణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఇది ఒక అంటు వ్యాధి. పశువులకు టీకాలు వేయించడమే వ్యాధి నియంత్రణకు మార్గం. 8వ విడత గాలికుంటు వ్యాధి టీకా కార్యక్రమంవచ్చే నెల 2 వరకు 30 రోజులపాటు ఉంటుంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ జాతీయ పశు రోగ నియంత్రణ కార్యక్రమాన్ని పశు సంవర్ధక శాఖ, రాబకొవి పాల సంఘాల సమాఖ్య సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. పశు వైద్యుడు మహేశ్, పాల సంఘం కార్యదర్శి ఎన్.వెంకటేశ్వర రావు, షామిద్ అలీ, పశు సఖి జ్యోతి పాల్గొన్నారు.

కుష్టువ్యాధి రహిత దేశంగా మార్చాలి

బళ్లారి, న్యూస్‌టుడే: కుష్టు ప్రాణాంతక వ్యాధి కాదు. ఇది నయం చేయగల వ్యాధి. ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కుటుంబసభ్యులకు పరీక్షలు నిర్వహించాలని నగర పాలికె మాజీ మేయర్, కార్పొరేటర్ ఇబ్రహీంబాబు అధికారులు, సిబ్బందికి సూచించారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో స్థానిక 13వ వార్డు మిల్లర్‌పేటె నగర ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కుష్టువ్యాధి నిర్మూలన (నవంబరు 3 నుంచి నవంబరు 19 వరకు) నిర్వహణ అభియాన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలో ప్లేగు, కలరా వంటి వ్యాధులను నివారించాం. 2027 నాటికి కుష్టు వ్యాధి రహిత దేశంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రస్తుతం ఇంటింటికీ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. జిల్లా కుష్టువ్యాధి నిర్మూలన అధికారి డా.వీరేంద్రకుమార్ మాట్లాడుతూ కుష్టువ్యాధి సూక్ష్మ క్రిమి వల్ల కలిగే వ్యాధి అని, రోగి దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు వీచే గాలి బిందువుల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తిస్తుందని తెలిపారు. ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స చేయడం ద్వారా పూర్తిగా నయం చేసుకోవచ్చని తెలిపారు. జిల్లాలో మొత్తం 1,87,327 కుటుంబాలకు వెళ్లి పరీక్షలు నిర్వహించాలన్నారు. సర్వే నిర్వహించడానికి 667 బృందాలను ఏర్పాటు చేసినట్లు సమావేశంలో ఆయన వివరించారు. త్వరగా సర్వే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు అబ్దుల్లా, శోభ, హరీష్, ఖుర్షీద్‌బేగం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణపై సిద్ధం చేసిన గోడపత్రికలను విడుదల చేస్తున్న మాజీ మేయర్ ఇబ్రహీంబాబు, డా.వీరేంద్రకుమార్, డా.అబ్దుల్లా తదితరులు

నీరిలా.. తాగేదెలా?

బళ్లారి నగర పాలికె 36వ వార్డులోని శాస్త్రినగర 2వ క్రాస్‌లోని కుళాయిలో మురుగునీరు వస్తున్నాయి. ఐదు నుంచి ఏడు రోజులకు ఓ సారి తాగునీటిని విడుదల చేస్తున్నా... మొదట గంట పాటు మురుగునీరు వస్తున్నాయి. అనంతరం మంచి నీరు వస్తున్నాయని స్థానికులు తెలియజేస్తున్నారు. ఆరు నెలల నుంచి నగర పాలికె అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా శుద్ధమైన నీటిని ఇవ్వాలని కోరుతున్నారు. **- బళ్లారి, న్యూస్‌టుడే**

వారధి.. నిర్మించండి

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: గంగావతి తాలూకా కోటయ్య క్యాంపు - హసకేర మార్గంలోని 25వ నంబరు తుంగభద్ర వితరణ కాలువపై ఉన్న వంతెన ఇటీవల వర్షాలకు కూలిపోయింది. కాలువకు ఇరువైపులా ఉన్న గ్రామాలు, క్యాంపుల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. కాలువకు ఇరువైపులా ఉన్న వ్యవసాయ భూములకు వెళ్లాలంటే రైతులు తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. అధికారులు నూతన వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

కూలిపోయిన వంతెన

ఒత్తిళ్లకు స్పందించిన సర్కారు

నీటి విషయాన్ని తేల్చి చెబితే రైతులు కుదుటపడతారని బెంగళూరులో సీఎంకు వివరిస్తున్న సింధనూరు శాసనసభ్యుడు బాదర్లి

సింధనూరు, న్యూస్‌టుడే: రెండో పంటకు సాగునీరు ఇవ్వాలని రైతులు, ప్రజాప్రతినిధులు, సంఘాలతోపాటు స్థానిక ఎమ్మెల్యే బాదర్లి హంపనగౌడ, విధాన పరిషత్ సభ్యుడు బసనగౌడ బాదర్లి విడివిడిగా బెంగళూరులో ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి తెచ్చారు. సోమవారం ఎమ్మెల్యే బాదర్లి నేరుగా ముఖ్యమంత్రిని కలిసి తుంగభద్ర జలాశయం నీటిని రెండో పంటకు ఇచ్చే అవకాశం ఉందో లేదో తేల్చి చెప్పాలని విన్నవించారు. మరోవైపు ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లి ఇదే అంశంపై సరైన వివరణ ఇవ్వాల్సిందే అంటూ.. ముఖ్యమంత్రి అదనపు ముఖ్యకార్యదర్శి అంజుమ్ పర్వేజ్‌ను సోమవారం కలిసి లేఖ సమర్పించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. రెండో పంటకు నీళ్లు ఉంటాయిలే.. అంటూ అనేక మంది రైతులు నారుమళ్లు వేస్తున్నారు.. దీనిపై స్పష్టత లేకుంటే రైతులు నష్టపోతారని వివరించారు. స్పందించిన నాయకులు బెంగళూరులో ఈ నెల అయిదున తుంగభద్ర ఐసీసీ సమావేశం ఏర్పాటుకు సూచనలు ఇచ్చారు.

మాట్లాడుతున్న మాజీ శాసనసభ్యుడు ఎం.ఎస్.సోమలింగప్ప

నీరివ్వకపోతే పోరాటమే

సిరుగుప్ప, న్యూస్‌టుడే: తుంగభద్ర ఆయకట్టు కింద రెండో పంటకు నీరు విడుదల చేయాలని, లేకుంటే పోరాటం చేస్తామని మాజీ శాసనసభ్యుడు ఎం.ఎస్.సోమలింగప్ప హెచ్చరించారు. ఆయన సోమవారం సాయంత్రం ప్రభుత్వ అతిథి గృహంలో రైతులు, వ్యాపారులతో కలిసి మాట్లాడారు. ఖరీఫ్‌లో సాగు చేసిన వరి, పత్తి, మిరప పంటలన్నీ వర్షాలకు దెబ్బతిని రైతులు నష్టపోయారన్నారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు ఇంత వరకు పంటల సర్వే చేపట్టలేదని ఆరోపించారు. ప్రభుత్వం రైతులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. తుంగభద్ర డ్యాంలో రెండో పంటకు సరిపడా నీరు నిల్వ ఉన్నా గేట్లు పెట్టలేదనే నెపంతో రెండో పంటకు నీరివ్వమని చెప్పడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే ఐసీసీ సమావేశం ఏర్పాటు చేసి, రెండో పంటకు నీరు విడుదల చేస్తామని ప్రకటించాలని, లేకుంటే పెద్దఎత్తున పోరాటం చేస్తామని పేర్కొన్నారు. భాజపా తాలూకా అధ్యక్షుడు కుంటనాళ్ మల్లికార్జున స్వామి, బియ్యం మిల్లుల సంఘం ప్రతినిధులు మాణిక్యరెడ్డి, చాగి సుబ్బయ్య శెట్టి పాల్గొన్నారు.

రెండో పంటకు నీరివ్వాలని రైతుల ధర్నా

కంప్లి, న్యూస్‌టుడే: రెండో పంటకు నీరు విడుదల చేయాలని డిమాండు చేస్తూ రైతు సంఘం, హసిరు సేన నేతృత్వంలో రైతులు సోమవారం కంప్లి బంద్ జరిపి ధర్నా నిర్వహించారు. సాంగ్రత్రయ సంస్కృత పాఠశాల నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ప్రదర్శన జరిపి ధర్నా చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వి.గౌడ తదితరులు మాట్లాడుతూ రెండో పంటకు నీటి విడుదల విషయంలో రాజకీయం వద్దు. జలాశయంలో నీటి నిల్వ ఉన్న దృష్ట్యా రెండో పంటకు నీరు వదిలి మార్చి నుంచి క్రస్ట్ గేట్లు ఏర్పాటు చేయాలి. ఈ విషయమై త్వరలో ఐసీసీ సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోవాలన్నారు. కొంతసేపు రాస్తారోకో చేసి తహసీల్దార్ మంజు నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. నాయకులు భరమ రెడ్డి, వీరేశ్, తిమ్మప్ప నాయక్, మురారి, హేమయ్య స్వామి, ఎం.సుధీర్, నారాయణ రెడ్డి, డి.వి. సుబ్బారావు, వెంకటరామ రాజు, సి.డి.మహదేవ పాల్గొన్నారు.

అంబేడ్కర్ కూడలిలో ధర్నా చేస్తున్న రైతులు

వృత్తివిద్యా కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

బళ్లారి, న్యూస్‌టుడే: సండూరు తాలూకా తోరణగల్లు ఓపీజీ కేంద్రంలో యువతి, యువకుల సబలీకరణ కోసం వృత్తివిద్యా కోర్సులైన కుట్టు మిషన్, చరవాణి మరమ్మతు, వాహనాల డ్రైవింగ్ వంటి వృత్తి విద్యా కోర్సులను జె.ఎస్.డబ్ల్యు. ఫౌండేషన్ అధ్యక్షురాలు సంగీత జిందాల్ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు ఉపాధి, జీవనోపాధి కోసం ప్రారంభించిన వృత్తివిద్యా కోర్సుల శిక్షణ శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. తమ సంస్థ నిర్వహించిన వివిధ సామాజిక కార్యక్రమాలను వివరించారు. సంస్థ సీఈవో పవిత్రకుమార్ మాట్లాడుతూ ఈ పోటీ ప్రపంచంలో ఉన్నత విద్యాభ్యాసంతో పాటు వృత్తి విద్యా కోర్సులు, నైపుణ్య శిక్షణ చాలా అవసరమవుతుందన్నారు. మూడు నెలల కుట్టు మిషన్ శిక్షణ, రెండు నెలలపాటు డ్రైవింగ్ శిక్షణ, 45 రోజులపాటు చరవాణి శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతినిధులు మురళీరావ్, గోపాల్ మణి, కార్తికేయ మిశ్రా, సునిల్‌రావ్, చంద్రన్, మహేశ్ శెట్టి, సురేశ మేటి పాల్గొన్నారు.

డ్రైవింగ్ శిక్షణను పరిశీలిస్తున్న జె.ఎస్.డబ్ల్యు. ఫౌండేషన్ అధ్యక్షురాలు సంగీత జిందాల్

వైభవంగా ఓంకారేశ్వర ఆలయ వార్షికోత్సవం

ఓంకారేశ్వర ఉత్సవ మూర్తి ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

హొసపేటె, న్యూస్‌టుడే: పట్టణంలోని వాల్మీకి కూడలిలో కొలువుదీరి ఉన్న ఓంకారేశ్వర ఆలయ 75వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారి ఆలయ ఆవరణాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామికి విశేష అలంకరణ చేసి పూజించారు. ప్రముఖ వీధుల్లో ఉత్సవ మూర్తి ఊరేగింపు జరిగింది. కలశ, కుంభాలతో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

అనుమానాస్పద స్థితిలో అన్నదాత మృతి

హొసపేటె, న్యూస్‌టుడే: పొలానికి వెళ్లిన శంకర్‌నాయక్ (55) అనే రైతు అనుమానాస్పద స్థితిలో పొలం పక్కన ఉన్న బండరాళ్ల నడుమ పడి మృతిచెందిన ఘటన కూడ్లిగి పట్టణ పరిధి గోవిందగిరి తండాలో జరిగింది. పొలానికి నీరు పారించి వస్తానని ఇంట్లో చెప్పివెళ్లిన రైతు మధ్యాహ్నమైనా తిరిగిరాలేదు. అనుమానం వ్యక్తం చేసిన కుమారుడు వెతుక్కుంటూ వెళ్లగా బండరాళ్ల నడుమ తండ్రి మృతదేహం కనిపించింది. ఘటనా స్థలాన్ని పరిశీలించిన కూడ్లిగి పోలీసులు మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతికింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బళ్లారి గ్రామీణ : నాగేశ్వర స్వామికి విశేష అలంకరణ

బళ్లారి గ్రామీణ : కాశీవిశ్వనాథుడికి పుష్పాలంకరణ

బళ్లారి గ్రామీణ : అమృతేశ్వరుడికి పుష్పాలంకరణ

నాగేశ్వరుడికి కార్తికశోభ

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని నాగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం చేశారు. పుష్పాలతో అలంకరించి రుద్ర పఠనం చేపట్టారు. ఇంటూరి నగర్‌లోని కాశీవిశ్వేశ్వరుడికి, అవ్వంబావి కోదండరామాలయంలో శివయ్యకు, బాలాజీ క్యాంపు అమృతేశ్వరస్వామికి, నీలకంఠుడికి, కోటమల్లేశ్వరస్వామికి, విశేషంగా అలంకరించి పూజలు చేపట్టారు. కోదండరామాలయం, బాలాంజనేయస్వామి ఆలయంలో కార్తిక దీపాలు వెలిగించారు.

అభయ వరదాంజనేయస్వామి ఆలయంలో తులసీ దామోదరులకు హారతి ఇస్తున్న మహిళలు

వైభవోపేతం..తులసీదామోదర కల్యాణం

బళ్లారి గ్రామీణ: కార్తిక ద్వాదశిని పురస్కరించుకుని సోమవారం వెంకటేశ్వరనగర్ అభయ వరదాంజనేయ స్వామి ఆలయంలో తులసి, దామోదర కల్యాణం వైభవోపేతంగా జరిపారు. తులసిమొక్క, ఉసిరిచెట్టుకు అలంకరించి శాస్త్రోక్తంగా నాగరాజు స్వామి కల్యాణం జరిపారు. ఆలయ ధర్మకర్త పాలడగు ధనంజయ మాట్లాడుతూ కార్తిక మాసంలో లక్ష్మీ విష్ణుస్వరూపులైన తులసీదామోదర కల్యాణం జరిపి అన్నదానం చేస్తే శుభఫలితమన్నారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలోనూ తులసీ దామోదరుల కల్యాణ తంతును మైసూరు రాజేశ్ ఆచార్ నిర్వహించారు. కార్తిక పురాణాన్ని చదివి విన్పించారు.

శివునికి కుంకుమ అలంకారం

సింధనూరు, న్యూస్‌టుడే: పవిత్ర కార్తికమాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని సింధనూరు తాలూకా గాంధీనగర్, వేంకటేశ్వరపైక్యాంపు ఆలయాల్లో గర్భగుడిలోని పరమశివునికి కుంకుమతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. గాంధీనగర్ శ్రీవిశ్వేశ్వర పంచాయతన క్షేత్రంలో శివుని అలంకారానికి క్యాంపు పెద్దలు సుణ్ణం శ్రీనివాస్, ఈడ్పుగంటి మురళీకృష్ణ కుటుంబాలు అలంకార సేవకు ప్రాయోజికత్వం వహించాయి. కుంకుమ మంగళకరమైందని స్వామికి ఈ అలంకారం చేసినట్లు ఆలయ పెద్దలు తెలిపారు. గాంధీనగర్ సమీపంలోని వేంకటేశ్వరపైక్యాంపులోని శ్రీవాసవీ సహిత హరిహరాత్మజ క్షేత్రంలోనూ కార్తిక దామోదరునికి కుంకుమ అలంకారం చేసి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు.

గాంధీనగర్ శివాలయంలో కుంకుమ అలంకారంలో విశ్వేశ్వరుడు

వేంకటేశ్వరపైక్యాంపులో పరమ శివునికి కుంకుమ అలంకారం

భక్తిశ్రద్ధలతో తులసి పూజలు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి తులసి పూజలు మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. గౌరి పండగకు మూడు రోజుల ముందు వచ్చే భక్తులు ఉసిరి కొమ్మను తులసి మొక్క వద్ద ఉంచి విశేషంగా అలంకరించి దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తులసి పూజలు చేస్తున్న భక్తులు

విజేతలతో మాస్టర్ మృత్యుంజయస్వామి

కరాటేలో బళ్లారి సత్తా

బళ్లారి, న్యూస్‌టుడే: హుబ్బళ్లి వాసవి మహల్‌లో కరాటే అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో బళ్లారి పంచాక్షరి మార్షల్ ఆర్ట్స్ ట్రస్ట్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వివిధ విభాగాల్లో రితీశా, అభయ్, మనోజ్, గిరీశ్, పరిణికా, లిఖిత్‌కుమార్, శివా, నక్షత, తరుణ్, నందీశ్, రోహిత్ రాణించారు. విద్యార్థులను బండ్రాళ్ మృత్యుంజయస్వామి, వాసుదేవరాజులు, విక్రమ్ మహిపాల్, శబరి రవిచంద్రన్ తదితరులు అభినందించారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

03-11-2025 (ఉ. 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1626.06	1632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	11,953	15,140
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	11,697	14,780
నీటి నిల్వ (టి.ఎం.సి)	80.003	101.773

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

(c) eenadu

మంచుసంద్రంలో సాహస వీరుడు!

స్ఫూర్తిదాయకంగా కల్యాణ్ సేవలు

ఓ వేదికపై పతకాలు అందుకుంటున్న కల్యాణ్

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ధైర్యం, క్రమశిక్షణ, సైనికుడి అజేయ స్ఫూర్తిని ప్రదర్శించి, పదవీ విరమణ అనంతరమూ లెఫ్టినెంట్ కల్నల్ ఓపీఎన్ కల్యాణ్ (76) పౌర సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే ఆయన తండ్రి ఓపీవీ చారి భారతీయ సైన్యంలో మేజర్‌గా సేవలందించారు. సోదరుడు రాజగోపాలన్ గూర్ఖా రైఫిల్స్‌లో పని చేశారు. వారి నుంచి పొందిన స్ఫూర్తితో అప్పటి కింగ్ జార్జ్ పాఠశాల, ఇప్పటి రాష్ట్రీయ మిలటరీ స్కూల్‌లో విద్యాభ్యాసం అనంతరం 1969 జూన్ 15న మద్రాస్‌లోని ఓటీఎస్ ద్వారా ఆర్మీ సర్వీస్ కార్ప్స్‌లో చేరారు. చేరిన రెండేళ్లలోనే ఇండో-పాక్ యుద్ధంలో పాల్గొని 310 పెట్రోలియం ప్లాటూన్ ఏఎస్‌సీకి నాయకత్వం వహించారు. కఠినమైన పోరాట పరిస్థితుల్లో తన సైనికులను తూర్పు పాకిస్థాన్ (ఇప్పటి బంగ్లాదేశ్)లోకి నడిపించారు. ఆ యుద్ధంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా 2022లో ఢాకాలో నిర్వహించిన బంగ్లాదేశ్ 51వ విజయ దినోత్సవ వేడుకలకు ప్రత్యేక ఆహ్వానం అందుకున్న 35 మంది భారత సాయుధ దళాల అధికారుల్లో ఆయన ఒకరు. పారాట్రూపర్‌గా 1987-89 వరకు సియాచిన్ బ్రిగేడ్‌కు నేతృత్వం వహించడంతో పాటు మొత్తం 38 ఏళ్లు సేవలు అందించి పదవీ విరమణ చేశారు. వివిధ కార్యాచరణలు, సేవలకు 12 పతకాలతో పాటు, ఆర్మీ చీఫ్, సదరన్ ఆర్మీ కమాండర్, అండమాన్ అండ్ నికోబార్ కమాండ్ నుంచి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. సైనికాధికారిగా, పదవీ విరమణ అనంతరం హాంగ్‌కాంగ్, సింగపూర్ మలేషియాలలో నిర్వహించిన అంతర్జాతీయ వెటరన్స్ అథ్లెటిక్ మీట్‌లలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి, నాలుగు పతకాలు దక్కించుకున్నారు. సర్వీసెస్ తైక్వాండో జట్టు మేనేజరుగా చెన్నైలో 2006లో జరిగిన జాతీయ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో జట్టును విజయపథంలో నడిపించారు. నేషనల్ మాస్టర్స్ అక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో కర్ణాటకకు 2006-12 మధ్యలో ప్రాతినిధ్యం వహించి, ఈతలో 10 పతకాలు సాధించారు. పదవీ విరమణ అనంతరం బెంగళూరు ఏఎస్‌సీ మ్యూజియంలో క్యూరేటర్‌గా 2008-2023 వరకు స్వచ్ఛందంగా సేవలు అందించారు. తనలోని సాహస ప్రవృత్తిని సంతృప్తి పరచుకునేందుకు ఇటీవలే జనావాసాలు లేని 22 ఆర్కిటిక్ యాత్రలు చేశారు. దక్షిణ సముద్రం, ఆర్కిటిక్ మహాసముద్రాల్లో పోలార్ ప్లంజ్ చేశారు. గత ఏడాది ఆగస్టు 18న నార్వేలోని టోన్స్‌బర్గ్ స్కైడైవింగ్ క్లబ్‌లో ఏడు వేల అడుగుల ఎత్తు నుంచి స్కైడైవింగ్ చేశారు. గత ఏడాది అక్టోబరు 24న హై ఆల్టిట్యూడ్ తవాంగ్ మారథాన్‌లో పాల్గొని యువతకు స్ఫూర్తిగా నిలిచారు. యువత దేశ సేవకు ముందుకు వచ్చేలా స్ఫూర్తిని అందించడంతో పాటు, శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవలసిన అవసరాన్ని తెలిపే లక్ష్యంతో ఆయా పోటీలు, యాత్రల్లో పాల్గొంటున్నానని ఆయన తెలిపారు.

ఆర్కిటిక్ మంచులో ఓపీఎన్ కల్యాణ్



సమవస్త్రాల్లో నిత్య యవ్వనుడు

సాధించిన వాటిలో ఓ అరుదైన పతకం

మురుగునీటిని శుద్ధీకరించి.. పునః వినియోగానికి పెద్దపీట

నగరశివారు : శుద్ధీకరించిన నీటితో నిండిన చెరువు

వాననీటిని భద్రపరిస్తే.. భూగర్భమే జలభాండం

నీరు.. రాజధాని నగర వాసిని అనివేళలా చుట్టుముట్టే ప్రధాన సమస్య. వానాకాలం వస్తే ముంచెత్తే నీరు.. ఎండాకాలానికి ముక్కులు చూపించడం బెంగళూరువాసికి తరతరాలుగా ఎదురయ్యే సమస్య. చినుకులు రాలినప్పుడు ఒడిసి పట్టుకుని.. ఎండలు మండినప్పుడు సద్వినియోగం చేసుకునే దిశగా నిపుణులు సూచించిన అనేక అంశాలు వాస్తవ రూపం దాల్చుతున్నాయి.

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : బెంగళూరు నగర ప్రజలు పూర్తిగా కావేరి నదీ జలాలపై ఆధారపడిన వేళ.. తాగునీటి కొరత తరచూగా వెంటాడుతోంది. ఆ ఇబ్బందుల అధిగమించడానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. భూగర్భజలాల మట్టాన్ని పెంచేలా అనేకానేక కార్యక్రమాలను చేపట్టాలని 'బ్రాండ్ బెంగళూరు' పథకంలో భాగంగా నిర్ధరించారు. ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో 'జలసురక్షా బెంగళూరు' అనే అంశానికి ఆరువేల మంది వివిధ సూచనలు చేశారు. వాననీటి సంరక్షణ, నీటి పొదుపు తదితరాలకు ఆహ్వానం పలికారు. వాననీటి సంరక్షణ మినహా నగరానికి ప్రత్యామ్నాయ వ్యవస్థ అసాధ్యమని నిపుణులు నొక్కి చెప్పారు. ప్రధానంగా బహుళ అంతస్తుల భవంతుల వద్ద తప్పనిసరిగా మురుగునీటి శుద్ధీకరణ కేంద్రాలను ఏర్పాటు చేయాలనేది కీలకాంశం. అలా శుద్ధీకరించిన నీటిని సమీప చెరువులకు సరఫరా చేయాలి. భూగర్భ జలాల వినియోగాన్ని నియంత్రించాలనేది మరో సూచన. అక్రమ బోరుబావులను నియంత్రించక తప్పని పరిస్థితి. వాననీటి సంరక్షణ చర్యల్లో భాగంగా ఎక్కువగా ఇంకుడు గుంతలు ఏర్పాటుకు ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించినట్లు బెంగళూరు జలమండలి చీఫ్‌ఇంజినీరు కె.ఎన్.రాజీవ్ 'న్యూస్‌టుడే'కి వివరించారు. నగర ప్రజలు తాగునీటి కోసం కావేరి నది నుంచి 19 టీఎంసీలు సేకరిస్తుండగా.. ఆ నీటి ఆధారంగా 28 లక్షల కుళాయిలు ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఇంకా అదనంగా.. నిత్యం 1250 ఎంఎల్‌డీ నీటిని శుద్ధీకరించి నగరానికి గొట్టాల సాయంతో కోలారు జిల్లాలోని చెరువులకు సరఫరా చేస్తున్నారు. అందులో 250 ఎంఎల్‌డీ నీరు అంతర్జాతీయ విమానాశ్రయం, భారతీయ వైమానిక యుద్ధ విమానాశ్రయ పరిసరాల్లో మొక్కలు పెంపకం తదితరాలకు ఉపయోగిస్తున్నట్లు అధికారులు వివరించారు. నగర వ్యాప్తంగా కొత్త ఇళ్ల నిర్మాణాలు చేపట్టేవారు వాననీటి చర్యలు చేపట్టాలనే నిబంధన అమలు చేస్తున్నారు. ఇంకుడు గుంతలు, వాననీటి తొట్టిలు అందులో భాగంగా నిర్మిస్తున్నారు.

ఓ బోరుబావికి అనుబంధంగా వాననీటి సంరక్షణ చర్యలు

గణేష్ మందిర వార్డు: వాననీటి కాలువలో ఒదిగిపోయిన ఇంకుడు గుంతలు

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	65
క్యారెట్-	75
బీరకాయలు-	50
క్యాబేజి-	25
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	20
సొరకాయ-	40
దొండకాయలు-	35
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	155
కాకర కాయలు-	50
టమాటా(నాటు)-	25
టమాటా(సాధారణ)-	20
గుమ్మడి-	35
ఆలుగడ్డ-	25
ఉల్లి(మేలురకం)-	25
ఉల్లి(సాధారణ)-	20
వెల్లుల్లి-	150
సాంబారు ఉల్లి-	165
బీట్‌రూట్-	45
వంకాయలు-	60
బెండకాయలు-	45
ముల్లంగి-	55
నిమ్మకాయ-	170

పండ్లు, ఫలాలు ధరలు

వాషింగ్టన్ ఆపిల్-	385
సిమ్లా ఆపిల్-	135
గ్రీన్ ఆపిల్-	295
అరటి కాయలు-	35
సపోటా-	65
పైనాపిల్-	65
బొప్పాయి-	35
ఆరంజి-	65
బత్తాయి-	55

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

ముగ్గురిని బలిగొన్న ప్రమాదం

ఆ కుటుంబంలో కట్టలు తెగిన కన్నీరు

మృతులు.. శివమూర్తి, సిద్ధార్థ, చెన్నాజమ్మ

మైసూరు, న్యూస్‌టుడే: చాముండి టౌన్‌షిప్ వద్ద రైల్వే ఉపరితల వంతెనపై ఆదివారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరణించారు. చామరాజనగర తాలూకా ఉద్దనూరు గ్రామానికి చెందిన శివమూర్తి (52), ఆయన భార్య చెన్నాజమ్మ (46), వారి కుమారుడు సిద్ధార్థ (15)ను మృతులుగా గుర్తించారు. మైసూరులో ఒక కార్యక్రమానికి హాజరై ద్విచక్ర వాహనంపై ఊరికి తిరిగి వెళుతున్న సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో సిద్ధార్థ అక్కడికక్కడే మరణించగా.. ఆసుపత్రికి తరలించే మార్గంలో శివమూర్తి కన్నుమూశారు. చెన్నాజమ్మ చికిత్స పొందుతూ సోమవారం వేకువ జామున మరణించిందని నంజనగూడు ట్రాఫిక్ ఠాణా పోలీసులు తెలిపారు.

అలనాటి.. శవ పేటిక!

వివిధ భగ్న పలకలను జోడిస్తే పేటిక తయారయ్యిందిలా..

చూడబోతే.. ఇదేదో ఏనుగు బొమ్మలా ఉంది కదూ.. అది కానేకాదు.. క్రీస్తు పూర్వం 1500 సంవత్సరాల నాటి శవపేటిక ఇదీ! బళ్లారి నగరంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న రాబర్ట్ బ్రూస్ ఫూట్ సంగనకల్లు ప్రాచీన వస్తు ప్రదర్శనశాలలో దీన్ని చూడవచ్చు. మట్టి పలకలను కాల్చి.. ఇలా పేటికగా మార్చారు. కాలగతిలో అది భగ్నమైనా.. చరిత్ర పరిశోధకులు వెలికితీసి.. ఇలా పునరుద్ధరించారు. బళ్లారి తాలూకా కుడతిని సమీపాన విద్యుత్తు కేంద్రం నిర్మాణ సమయంలో దక్షిణ భారతదేశంలో అతి పెద్దదిగా పేరు పొందిన బూదిదిబ్బ వెలుగుచూసింది. ఆ శిథిలాల్లోనే శవపేటిక వెలుగుచూడగా. దీనికి 'సార్కో ఫెగస్' అని పేరుపెట్టారు. ఆనాడు లభించిన పేటికలో భద్రపరచిన ఏడేళ్ల బాలుడి అస్థిపంజర శిథిలాలనూ నిపుణులు సేకరించి, బళ్లారి ప్రదర్శనశాలలో భద్రపరిచారు. పేటిక, అస్థిపంజరాన్ని 2020 వరకు ధార్వాడలోని కర్ణాటక విశ్వవిద్యాలయ ప్రత్యేక కేంద్రంలో ప్రదర్శనకు ఉంచారు. బళ్లారి జిల్లా పాలనాధికారిగా పనిచేసిన ఎస్.ఎస్. నకుల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఇక్కడే పురావస్తు ప్రదర్శనశాల ప్రారంభించి.. ఆ పేటికను తెప్పించారు. క్రీస్తుపూర్వ జనజీవన సామాజిక వ్యవహారాలను విశ్లేషిస్తే.. పదేళ్లలోపు బాలల శవ సంస్కారం కోసం మట్టి శవపేటికలను ఉపయోగించేవారని చరిత్రకారులు వివరించారు. దీనిపై అనేకానేక దేశాల చరిత్ర పరిశోధక విద్యార్థులు, విశ్లేషకులు వివరాలు సేకరించి భద్రపరుస్తున్నారు.

-న్యూస్‌టుడే, బళ్లారి

నేటికీ భద్రం: శవపేటికలో గుర్తించిన ఎముకలు, పుర్రె భాగాలు ఇవిగో..

పెంపుడు శునకానికి నరకం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : పెంపుడు శునకాన్ని ఓ పని మనిషి కొట్టి హత్య చేసిన సంఘటన బెంగళూరు నగర బాగలూరు పోలీసుఠాణా పరిధిలో కలకలం రేపింది. ఈ సంఘటనకు సంబంధించి పని మనిషి పుష్పలతను స్థానిక పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎంబీఏ కోర్సు చేస్తున్న మంగళూరు విద్యార్థిని ఒకరు బెంగళూరు బెళ్లిహళ్లిలోని ఓ అపార్ట్‌మెంట్లో ఉంటున్నారు. ఆమె ఓ ఖరీదైన శునకాన్ని పోషిస్తున్నారు. దాని బాగోగులు చూసేందుకు తమిళనాడు నివాసి పుష్పలతను పనిమనిషిగా పెట్టుకున్నారు. ఆమె కూడా విద్యార్థినితోటే ఉంటోంది. అక్టోబరు 31న రాత్రి లిఫ్ట్‌లో శునకాన్ని విపరీతంగా కొట్టి హత్య చేసినట్లు సీసీ కెమెరాల్లో గుర్తించిన ఆ విద్యార్థిని వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసుకుని పనిమనిషిని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

అమ్మో.. కారు

బెంగళూరు నగర ప్రమాదాలు వేటికవే విపరీతంగా భయపెడుతుంటాయి. అలాంటిదే ఓ ప్రమాదం చిక్కలసంద్ర వీధుల్లో సోమవారం హడలెత్తించింది. ఉదయమేళ.. ఆ వీధిలో అడ్డగోలుగా దూసుకొచ్చిన కారు.. అదుపు తప్పి పూల దుకాణాల పైకి దూకింది. అక్కడొక విద్యుత్తు స్తంభాన్ని తాకి ఆగిపోయింది. ఆ స్తంభం అడ్డంగా వాలిపోగా.. వేరెవరూ గాయపడక పోవడందతో అక్కడివారు ఊపిరి పీల్చుకున్నారు. నడివీధిలో నడుస్తుంటేనే ప్రమాదాలు ఎదురుకావు.. ఇలా దూరంగా ఉన్నా ఒక్కోసారి ముప్పు ముంచుకొస్తుంటుంది. సామాన్యులూ.. జాగ్రత్త!

- న్యూస్‌టుడే, బెంగళూరు

మహా మైసూరు ప్రణాళిక షురూ

నగర విస్తరణకు సీఎం ఆదేశం

అరసు విగ్రహం వద్ద ముఖ్యమంత్రి, ఇతర నాయకులు

మైసూరు, న్యూస్‌టుడే : 'గ్రేటర్ మైసూరు' అవసరం ఉందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. నగర ఘనత, సంస్కృతి, సంప్రదాయాలకు సమస్య ఎదురు కాకుండా చూడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందన్నారు. మైసూరు జిల్లాధికారి కార్యాలయంలో ఆవరణలో కొత్తగా ఏర్పాటు చేసిన దేవరాజ అరసు విగ్రహాన్ని, వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకాన్ని ఆయన సోమవారం ఆవిష్కరించారు. అనంతరం అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులతో సమావేశమయ్యారు. 'గ్రేటర్ మైసూరు' ఏర్పాటైతే బెంగళూరు తరహాలో వాహన రద్దీ, పదేపదే పాదచారి మార్గం, రహదారులు మరమ్మతులు, తాగునీటి సమస్యలు రాకుండా చూడవలసిన అవసరం ఉందన్నారు. గ్రేటర్ మైసూరు ఏర్పాటుకు బ్లూప్రింట్ సిద్ధం చేయాలని జిల్లా పాలన యంత్రాంగానికి సూచించారు. రాచనగరిలో మరో బాహ్య వలయ వర్తుల రహదారి అవసరం అవుతుందని, ఉద్యానవనాలు, లేఅవుట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవలసి ఉందన్నారు. వ్యర్థాల నిర్వహణకు పెద్ద పీట వేయాలన్నారు. జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచవలసిన అవసరం ఉందన్నారు. దేవరాజ అరసు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అసమానతల నివారణకు పెద్దపీట వేస్తూ పేదల కోసం పలు పథకాలను అమలులోకి తీసుకువచ్చారని గుర్తు చేశారు. మైసూరు రాష్ట్రాన్ని 'కర్ణాటక'గా నామకరణం చేయడంలో అరసు కీలక పాత్ర పోషించారని తెలిపారు. మంత్రులు వెంకటేశ్, మహదేవప్ప, ఎమ్మెల్యేలు పుట్టరంగశెట్టి, తన్వీర్ సేఠ్, ఎమ్మెల్సీ విశ్వనాథ్, అరసు కుమార్తె భారతి అరస్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

భారతి అరసుతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న సిద్ధరామయ్య

అరసు.. సంక్షేమ రథానికి ఇరుసు

మైసూరు, న్యూస్‌టుడే : దివంగత ముఖ్యమంత్రి దేవరాజ్ అరసును నాయకులంతా ఆదర్శంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పిలుపునిచ్చారు. సంక్షేమ రథానికి ఆయన ఇరుసు లాంటి వారని, అవకాశాలు లేని వారిని గుర్తించి, వారికి సదుపాయాల్ని కల్పించి, సమాజంలో ముందంజలోకి వచ్చేందుకు ఆయన తీసుకున్న చర్యలే కారణమన్నారు. మైసూరు జిల్లాధికారి కార్యాలయం ఆవరణలో అరసు విగ్రహాన్ని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. విద్య, ప్రతిభ ఒక్కరి సొత్తు కాదని గుర్తించాలని అంబేడ్కర్, వాల్మీకి, వ్యాసుడు ఇందుకు ఉదాహరణ అని చెప్పారు. తాను రాజకీయాల్లోకి రావడానికి అరసు ప్రేరణ అని గుర్తు చేసుకున్నారు. మంత్రి మహదేవప్ప, అరసు కుమార్తె భారతి అరసు, ఎమ్మెల్యేలు తన్వీర్ సేఠ్, పుట్టరంగశెట్టి, రవిశంకర్, ఎమ్మెల్సీలు విశ్వనాథ్, తిమ్మయ్య, మంజేగౌడ, యతీంద్ర, శివకుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మోసపోయిన ఉపాధ్యాయుడు

దావణగెరె, న్యూస్‌టుడే : కొత్తగా వస్తున్న కంపెనీల్లో వాటా (షేర్లు) కొనుగోలు చేస్తే దానిపై నెలకు 300 శాతం లాభాలు వస్తాయని కొందరు వంచకులు ఒక ఉపాధ్యాయుడ్ని వంచించారు. హొన్నాళికి చెందిన బాధితుడి నుంచి రూ.11.93 లక్షలను వంచకులు తమ ఖాతాలకు వేయించుకున్నారు. మొదట ఆ ఉపాధ్యాయుడ్ని ఒక వాట్సప్ గ్రూపులో చేర్పించారు. లాభాలు వస్తున్నాయని అందులో సభ్యులు అడ్మిన్‌ను పొగడ్తలతో ముంచెత్తడంతో దాన్ని విశ్వసించి దశల వారీగా నగదు మదుపు చేశారు. హఠాత్తుగా వాట్సప్ గ్రూపు మాయం కావడం, ఎన్నిసార్లు ఫోన్ చేసినా అడ్మిన్ స్పందించకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

నిర్వాసితులపై నిర్లక్ష్యమేలా?

హొసపేటె, న్యూస్‌టుడే: తుంగభద్ర జలాశయం నిర్మాణం సమయంలో భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం ముఖ్యులు దుయ్యబట్టారు. హొసపేటె తాలూకా పరిధి మరియమ్మనహళ్లి, డణాయకనకెరె ప్రాంతాల్లో నిర్వాసిత రైతుల పేరిట భూమి హక్కు పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సంఘం ఆధ్వర్యంలో ఆ ప్రాంతాల రైతులు సోమవారం మరియమ్మనహళ్లి నుంచి హొసపేటె వరకూ పాదయాత్ర చేపట్టారు. సాయంత్రం జిల్లా పాలనాధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. డ్యాం నిర్మాణం సమయంలో మమ్మల్ని ఖాళీ చేయించి, వేరే చోట్ల వ్యవసాయ భూములు కేటాయించారు, కాని ఇప్పటి వరకూ వాటికి హక్కుపత్రాలు మంజూరు చేయలేదని విచారం వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులను కలిసి సమస్య వివరించినా ఫలితంలేదని వాపోయారు.

విద్యార్థులపై తేనెటీగల దాడి

మడికేరి, న్యూస్‌టుడే : విరాజపుర నగరంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో విద్యార్థులు సోమవారం ఉదయం ప్రార్థన చేసుకుంటున్న సమయంలో తేనెటీగలు దాడి చేశాయి. ప్రధానోపాధ్యాయురాలు అన్నమ్మతో పాటు, 30 మంది విద్యార్థులు దాడిలో గాయపడ్డారు. బాధితులకు చికిత్స కోసం స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. ఎవరికీ ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. విరాజపేట ఠాణా పోలీసులు, విద్యాశాఖ అధికారులు ఆసుపత్రికి వచ్చి విద్యార్థులను పరామర్శించారు.

స్నేహితురాలి సాన్నిహిత్యానికే కృతికారెడ్డి హత్య

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : రాజధాని నగరంలో ఇటీవల సంచలనానికి కారణమైన వైద్యురాలు కృతికారెడ్డి హత్య కేసులో ఆమె భర్త మహేంద్రరెడ్డి విచారణను పోలీసులు తీవ్రం చేశారు. 'నీ కోసమే నా భార్యను హత్యచేశా'నంటూ ఆయన తన స్నేహితురాలికి సెల్‌ఫోన్ మెసేజ్ పంపాడని మారతహళ్లి పోలీసులు గుర్తించారు. నిందితుడి చరవాణి, ల్యాప్‌టాప్ తదితరాలను వారు క్షుణ్నంగా పరిశీలిస్తున్నారు. ఆ స్నేహితురాలితో మహేంద్ర నిత్యం చాటింగ్ చేస్తున్నాడని తేలింది. భార్యను కడతేర్చాక పంపిన మెసేజ్‌ను డిలీట్ చేయకపోవడాన్ని గుర్తించారు. కృతికారెడ్డికి అధిక మోతాదులో మత్తు మందును ఇచ్చి.. హత్య చేసిన విషయం తెలిసిందే.

నైజీరియా మహిళ అరెస్టు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : నగరంలో వివిధ ప్రాంతాల్లో మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న నైజీరియా దేశానికి చెందిన స్టెఫిన్(35) అనే మహిళను కోడుగెహళ్లి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఆమె నుంచి విలువైన 35 గ్రాముల మత్తుపదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. 2021లో బెంగళూరు నగరానికి వచ్చిన ఆమె థణిసంద్రలో ఉంటూ. . మత్తు వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు.

EENADU Classifieds
JOBS
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యూయర్స్. ఏజ్: 22-35. ఫ్రెషర్స్ కూడా కావలెను. ✆ : 6281037879.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
బళ్ళారి : 9121167525
బెంగుళూరు : 9121167527
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

వర్తూరు పోలీసులపై ఫిర్యాదు

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే : వర్తూరు ఠాణా పోలీసులు తనతో అనుచితంగా ప్రవర్తించి, ఇష్టం వచ్చినట్లు కొట్టారని పశ్చిమ బంగాల్‌కు చెందిన సుందరి బీబీ అనే మహిళ ఆరోపించింది. బాధితురాలు వర్తూరు పరిధిలోని ఒక అపార్ట్‌మెంట్‌లో పని చేసేది. అక్కడ దొంగతనం చేసిన ఆరోపణలపై ఒక ఫ్లాట్‌లో ఉంటున్న వారు ఆమెను కొట్టి, పోలీసులకు అప్పగించారు. పోలీసులు తనను కొట్టడంతో పాటు, అనుచితంగా ప్రవర్తించారని పశ్చిమ బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి బాధితురాలు లేఖ రాసింది. తీవ్రంగా గాయపడిన బాధితురాలికి చికిత్స ఇప్పించేందుకు చర్యలు చేపట్టామని అక్కడి వలస కార్మికుల సంక్షేమ మండలి అధ్యక్షుడు సమీర్ ఉల్ తెలిపారు.

కనీస వసతులు కల్పించకుంటే చర్యలు

గంగావతి,న్యూస్‌టుడే: వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ సమితుల్లో రైతులకు కనీస సౌకర్యాలు కల్పించకుంటే కార్యదర్శులపై చర్యలు తప్పవని కొప్పళ జిల్లా పాలనాధికారి సురేశ్ హిట్నాళ హెచ్చరించారు. ఆయన సోమవారం జిల్లాలోని ఏపీఎంసీల్లో కనీస సౌకర్యాలను సమీక్షించారు. ఏపీఎంసీల ఆవరణలో వాహనాల పార్కింగ్, వీధిదీపాలు, మరుగుదొడ్లు, తాగునీరు, ఇతర సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇవి లేకుంటే పల్లెల నుంచి వచ్చే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. పలుచోట్ల స్వచ్ఛత లోపించిందన్న ఫిర్యాదులు ఉన్నాయన్నారు. బెళవినాళ ఏపీఎంసీలో రహదారులు నిర్మించాలన్నారు. దావణగెరా జీరో ఘన వ్యర్థాల నిర్వహణ చేపట్టాలన్నారు. రైతుల నుంచి కమీషన్లు తీసుకోరాదని నామఫలకాలు వేయించాలని సూచించారు. ఏపీఎంసీ స్థలాల్లో నియమాలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పన్నులను సక్రమంగా వసూలు చేయాల్సి ఉంటుందన్నారు. నమోదు చేసుకున్న, చేసుకోని హమాలీలందరికీ కార్మిక శాఖ నుంచి సదుపాయాలు అందించాల్సి ఉంటుందన్నారు. ప్రతిచోట వే‌బ్రిడ్జ్‌లు తప్పనిసరన్నారు. పశువుల సంతల్లో సైతం కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. వ్యవసాయశాఖ ఉప సంచాలకుడు ఎల్.సిద్ధేశ్వర, వ్యవసాయ మార్కెట్ అధికారి వీరభద్రయ్య హిరేమఠ, కార్మిక శాఖ అధికారి సుధా గరగ, ఏపీఎంసీ కార్యదర్శి సిద్ధయ్యస్వామి, లీడ్‌బ్యాంక్ మేనేజర్ మారుతి పాల్గొన్నారు.

ఏపీఎంసీల్లో కనీస సౌకర్యాలను సమీక్షిస్తున్న పాలనాధికారి సురేశ్ ఇట్నాళ

డీకే హైరానా ఏలనో?

సదాశివనగర, న్యూస్‌టుడే : బిహారులో ఎన్నికల్లో తమ పార్టీని గెలిపించుకునేందుకు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ హైరానా పడుతున్నారని జనతాదళ్ కర్ణాటక శాఖ ఎద్దేవా చేసింది. కర్ణాటకలోని బిహారీ సంఘాలు భవంతి నిర్మాణానికి నివేశనం, నిధులు కేటాయిస్తామని డీకే శివకుమార్ ఇచ్చిన హామీని తప్పుపట్టింది. కర్ణాటకలోని రైతులు, కన్నడ సంఘాలకు ఎటువంటి మేలు చేయకుండా, బిహారీలకు ప్రయోజనం చేసేందుకు ప్రజలు చెల్లించిన పన్నులు వినియోగించుకుంటామంటే అంగీకరించమని, దీనిపై ప్రజా పోరాటం చేస్తామని హెచ్చరికలు జారీ చేసింది.

(c) eenadu

శ్రీకృష్ణమఠానికి రానున్న ప్రధాని మోదీ

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే: ఉడుపి శ్రీకృష్ణ మఠంలో జరుగనున్న లక్ష కంఠాల గీతా పారాయణానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల 28న విచ్చేయనున్న నేపథ్యంలో సోమవారం ప్రత్యేక ముందస్తు సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా పాలనావిభాగం, జిల్లా పోలీసు సీనియర్ అధికారులు, ప్రజాప్రతినిధులు, మఠాధిపతి పర్యాయ పీఠాధిపతి శ్రీసుగుణేంద్రతీర్థ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశ్‌పాల్ సువర్ణ మాట్లాడుతూ మోదీ రాకతో జిల్లా అభివృద్ధికి మరింత బలం చేకూరుతుందని ఇందుకు ప్రజా ప్రతినిధులు పార్టీలకతీతంగా సహకరించాలని కోరారు. సమావేశంలో ఉడుపి జిల్లాధికారి, ఎమ్మెల్యే సునీల్‌కుమార్, బీజేపీ అధ్యక్షుడు నవీన్‌శెట్టి, రెవెన్యూ ఉప కమిషనర్ రష్మీ, తహసీల్దార్ గురురాజ్ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు

• బెంగళూరు • కోలారు • మైసూరు • హోసూరు • చిక్కబళ్లాపుర • తుమకూరు

ఉడుపిలో వైభవంగా తులసి మహోత్సవం

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే: ఉడుపి శ్రీకృష్ణుడి ఆలయంలో సోమవారం తులసి వివాహ మహోత్సవాన్ని ఘనంగా ఆచరించారు. పర్యాయ పుత్తిగె మఠం నేతృత్వంలో కార్తికమాసంలో ప్రత్యేకత సంతరించుకొన్న ఉత్థానద్వాదశి తులసి వివాహమహోత్సవాన్ని మఠాధిపతి శ్రీసుగుణేంద్రతీర్థ శ్రీపాదరు, జూనియర్ స్వామి శ్రీసుశీంద్రతీర్థ స్వామి ఘనంగా నిర్వహించారు. ద్వాదశి నేపథ్యంలో వందల మంది భక్తులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

తులసి పూజ చేస్తున్న శ్రీసుగుణేంద్రతీర్థస్వామి

హోసూరు కబుర్లు

ఎన్నికల సన్నాహక సమావేశం

హోసూరు,న్యూస్‌టుడే: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు 2026 ఏప్రిల్, మేలో జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం సోమవారం శిక్షణ శిబిరాన్ని ప్రారంభించింది. ఎన్నికలను స్వేచ్ఛగా నిర్వహించేందుకు తొలి దశగా బూత్ ఏజెంట్లకు, మేనేజర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. హోసూరు అసెంబ్లీ స్థానానికి సంబంధించిన బూత్ ఏజెంట్లకు శిక్షణ ఇవ్వడానికి హోసూరు సబ్‌కలెక్టర్ ఆకృతి సేథి నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. ప్రధాన రాజకీయ పార్టీలైన డి.ఎం.కె., ఎ.ఐ.ఎ.డి.ఎం.కె., కాంగ్రెస్ తదితర పార్టీల బూత్ ఏజెంట్లు, ఓటర్ల జాబితాల పరిశీలన, ఏజెంట్ల బాధ్యతలు తదితరాలపై డిప్యూటీ తహసీల్దార్ జయప్రియ వివరించారు. ఏజెంట్లు అడిగిన సందేహాలను వివరంగా జవాబులిచ్చారు. ఎ.ఐ.ఎ.డి.ఎం.కె. నాయకుడు సోకసపల్లి బాబు వెంకటాచలం మాట్లాడుతూ హోసూరు, వేపనహళ్లి, తళి బర్గూరు అసెంబ్లీ స్థానాల్లో తెలుగు, కన్నడ, మాట్లాడే ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్నందున ఓటరు జాబితాను తెలుగు, కన్నడ భాషల్లో ముద్రించాలని సూచించారు. కార్యక్రమంలో హోసూరు తహసీల్దారు గుణశివ, హోసూరు కార్పొరేషను టౌన్ ప్లానింగ్ అధికారి నారాయణన్, డిప్యూటీ తహసీల్దారు పెరుమాళ్, రెవిన్యూ అధికారి రమేశ్, కాంగ్రెసు నాయకురాలు ఇంద్రాణి, సాదిక్ ఖాన్, ప్రవీణ్‌కుమార్, ఎ.ఐ.ఎ.డి.ఎం.కె. నాయకులు జూజువాడి అశోకరెడ్డి, రవికుమార్, హరీష్‌రెడ్డి, హేమకుమార్, డి.ఎం.కె. ప్రముఖులు ఎ.రామమూర్తి తదితరులు పాల్గొన్నారు

వేదిక మీద హోసూరు సబ్‌కలెక్టర్ ఆకృతి సేథి, ఎన్నికల అధికారులు

అంబరాన్నంటిన సంబరాలు

విచిత్ర వేషధారణలో విద్యార్థులు

కర్ణాటక పతాకం రంగుల వస్త్రాలతో విద్యార్థులు

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే: నగరంలోని శ్రీ కృష్ణ ఇంటర్నేషనల్ విద్యాసంస్థ సోమవారం 70వ కర్ణాటక రాజ్యోత్సవ సంబరాలను ఘనంగా ఆచరించింది. కార్యక్రమంలో విజయ కళాశాలకు చెందిన ఆచార్య డా.వాదిరాజు అధ్యక్షత వహించారు. ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ దేశ భాషల మన సంస్కృతి సంప్రదాయాల గురించి స్ఫూర్తిదాయకంగా వివరించారు. అనుప్ యాదవ్ సారథ్యంలో విదేశాల నుంచి ముఖ్య అతిథులు విచ్చేశారు. దుబాయ్‌కి చెందిన రోజ్‌స్టార్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ అఫ్తార్ ఖాన్, అమెరికన్ విశ్వవిద్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జనిత సూరానా, అక్షర పర్వీన్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆసాంతం ఉర్రూతలూగించాయి. నృత్య, నాటక, విచిత్ర వేషధారణ, గీతాలాపన, ఉపన్యాస పోటీలు తదితర కార్యక్రమాలు ఆహూతులను ఆనందపరిచాయి. సంస్థ చైర్మన్ డా. రుక్మాంగదనాయుడు, ప్రిన్సిపల్ డా.ఉషాకుమారి, డా.యోగేశ్వరి, ఆయ శీల తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరి మాత చిత్రపటం వద్ద సంస్థ ప్రతినిధులు, పాలక నాయకులు

భాషను కాపాడుకోవడం అందరి బాధ్యత

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే: మాతృభాషను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నాడోజ హంప నాగరాజయ్య పేర్కొన్నారు. మన పెద్దలు భాషా ప్రతిపదికన రాష్ట్రాన్ని ఏర్పాటు చేసేందుకు పడిన శ్రమను అనుక్షణం గుర్తు చేసుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. రాజ్యోత్సవాలను పురస్కరించుకుని బసవనగుడి నేషనల్ కళాశాల ఆవరణలో కన్నడ పతాకాన్ని ఎగురవేసి, భువనేశ్వరి మాత చిత్రపటానికి పూజ చేసి మాట్లాడారు. ఇంటితో పాటు వృత్తి, ఉద్యోగాలు చేసే చోటా సాధ్యమైనంత మేర కన్నడలోనే మాట్లాడేందుకు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ హెచ్.ఎన్.సుబ్రహ్మణ్య, ఇతర ప్రతినిధులు వి వెంకట శివారెడ్డి, తల్లం ఆర్ ద్వారకానాథ్, కేఎస్ రామ్మోహన్, ఆదినారాయణ శెట్టి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నూతన దంపతులకు ముఖ్యమంత్రి ఆశీస్సులు

మైసూరు, న్యూస్‌టుడే: సుగ్గనహళ్లిలో తన ఆప్తుల కుటుంబంలో జరుగుతున్న వివాహానికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సోమవారం హాజరయ్యారు. హెచ్‌బీ మీనాక్షి, కె మరిస్వామిగౌడ దంపతుల కుమారుడి వివాహానికి హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు. కల్యాణ మండపంలో తనకు పరిచయం ఉన్న వారితో కొంత సమయం సీఎం ముచ్చటిస్తూ గడిపారు.

నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న సిద్ధరామయ్య

అబ్బిగిరె ఆలయ పూజల్లో మంత్రులు

బెంగళూరు (పీణ్యాదాసరహళ్లి), న్యూస్‌టుడే: అబ్బిగిరెలోనే పురాతన, ప్రసిద్ధి శ్రీవేంకటేశ్వర, శ్రీరామాంజనేయస్వామి ఆలయ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉపముఖ్యమంత్రి డి.కె.శివకుమార్, రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో భక్తులకు ఆశీర్వచనాలు ఇచ్చారు. అనంతరం దేవాలయ పెద్దలు మాజీ విద్యాసమితి అధ్యక్షుడు నాగభూషణం, రాజణ్ణ, విశ్వనాథ్ నాయకులను సత్కరించి వారికి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు రాజణ్ణ, కె.నాగభూషణం, విశ్వనాథ్, మంజునాథ్, పెద్దలు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రి శివకుమార్‌ను మేళతాళాలతో ఆహ్వానిస్తున్న దేవాలయపెద్దలు

5న ప్రత్యేక కార్తిక పూజలు

హోసూరు,న్యూస్‌టుడే: ప్రసిద్ధ 108 శివపార్వతి లింగాల కమలశివశక్తి ఆలయంలో ఈనెల 5న బుధవారం కార్తిక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టు వర్గాలు తెలిపాయి. ఈ పూజలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు కానున్న నేపథ్యంలో వసతితో పాటు అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా 108 శివపార్వతి లింగాలకు అన్నాభిషేకం ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు.

కమలశివశక్తి ఆలయంలో 108 శివపార్వతుల లింగాలు

టమాటా ధరలపై రైతుల గగ్గోలు

ముళబాగిలు, న్యూస్‌టుడే: టమాటా ధరలు నిలకడ లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అసలే వర్షాలతో దిగుబడులు దెబ్బతిన్నాయి. ఈ తరుణంలో ధరలు లేక రైతులు సతమతమవుతున్నారు. పెట్టుబడులు వస్తే చాలని పలువురు రైతులు ఆశిస్తున్నారు. వర్షాలతో కాయలకు మచ్చలు రావడంతో కోసిన దిగుబడుల్లో సగానికి పైగా పడేయాల్సి వస్తోంది. 30 కిలోల పెట్టె కనీసం రూ.500 తగ్గకుండా ధర పలికితేనే పెట్టుబడులు దక్కే అవకాశం ఉంటుంది. అదే మార్కెట్లకు తరలిస్తే రవాణా, కమీషన్, కూలీల ఖర్చు.. జాక్‌పాట్‌తో ప్రస్తుత ధర ప్రకారం మిగిలేదే ఉండదని వాపోతున్నారు. దాంతో రైతులు తోటల దగ్గరే విక్రయిస్తున్నారు. స్థానిక ఎన్.వడ్డహళ్లి టమాటా మార్కెట్లో 30 కిలోల పెట్టె సోమవారం రూ.450 మాత్రమే పలికింది. అక్టోబర్ 1న ఈ ధర రూ.300గా ఉంది.

ఎన్.వడ్డహళ్లి మార్కెట్లో రాసులుగా ఉన్న టమాటా

నంగలి సరస్సును పరిశీలించిన అధికారులు

ముళబాగిలు, న్యూస్‌టుడే: తాలూకాలోని నంగలి సరస్సు సరిహద్దు గోడ కూలిపోయిన నేపథ్యంలో చిన్ననీటి పారుదలశాఖ అసిస్టెంట్ ఇంజినీర్ హరికృష్ణ సోమవారం పరిశీలించారు. కేసీ వ్యాలీ ప్రాజెక్టు కింద ఈ సరస్సు 400 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంది. ఇటీవల సరస్సు గోడ కూలిపోయి నీరు పొంగిపొర్లిపోతుంది. ప్రతిరోజు వందలాది మంది సరస్సు చూడ్డానికి వస్తుంటారు. కనీసం హెచ్చరిక బోర్డు లేక ఈతకు వెళ్లిన బాలుడొకరు మృత్యువాత పడ్డారని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని జేడీఎస్ యువనాయకుడు నంగలి కిశోర్ తీవ్రంగా ఆరోపణలు చేశారు. దాంతో ఇంజినీరింగ్ అధికారులు సరస్సు పరిశీలనకు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

పొంగిపొర్లుతున్న నీరు

చోరీకి గురైన 67 చరవాణుల అప్పగింత

చిత్రదుర్గం,న్యూస్‌టుడే: జిల్లాలో వివిధ చోట్ల చోరీకి గురైన రూ. 6.70 లక్షల విలువయిన 67 చరవాణులను సైబర్ పోలీసు ఠాణా అధికారులు వివిధ రాష్ట్రాల్లో గుర్తించి వాటిని నిందితుల వద్ద నుంచి స్వాధీనం చేసుకొన్నారు. సోమవారం ఇక్కడ తన కార్యాలయంలో వాటిని సొంతదారులకు జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్ బండారు అందజేశారు. చరవాణులను పోగొట్టుకొన్న వారు సీఈఐఆర్ పోర్టల్‌లో రిపోర్టు చేయాలని కోరారు.

యజమానులకు అందజేస్తున్న జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్ బండారు

సొగసు కన్నడ భాషకే సొంతం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: కన్నడ నాడగీతలో భారతదేశ వర్ణన ఉంటుందని, మరే ఇతర భాషల్లోని గీతాల్లో ఇటువంటి సొగసు కనిపించదని అభ్యుదయవాది, సాహితీవేత్త, ప్రజావాణి సంపాదకుడు సీహెచ్ రఘునాథ్ పేర్కొన్నారు. సౌందర్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ సైన్స్ కళాశాలలో సత్కారం స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు.

నగరంలో జాతీయ పైథియన్ క్రీడా పోటీలు

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే: దేశంలోని వివిధ ప్రాంతాల కళలు, గ్రామీణ క్రీడలు, సంప్రదాయాలను ప్రదర్శించే రెండో జాతీయ సాంస్కృతిక పైథియన్ క్రీడా పోటీలు-2025కు బెంగళూరు సిటీ యూనివర్సిటీ ఆతిథ్యం ఇస్తోంది. అంతర్జాతీయ పైథియన్ కౌన్సిల్ నేతృత్వంలో నవంబరు7-9 వరకు పోటీలు ఉంటాయని నిర్వాహక ప్రతినిధి బిజేందర్ గోయల్ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా తెర వెనక్కు వెళ్లిపోయిన ఆటల్ని గుర్తు చేసేలా ఈ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సంగీతం, నాటకం, రథం లాగడం, కుస్తీ, ముగ్గులు వేయడం, తదితరాలను ఈ పోటీల్లో భాగంగా ఉంటాయని వివరించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారులు బీహెచ్ అనిల్ కుమార్, శాంతను అగ్రహారితో పాటు నిర్వాహక ప్రతినిధులు స్నేహా వెంకట రమణి, ఎస్.శివకుమార్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

రంగుల ముగ్గు వేస్తున్న మహిళ

శివాలయాల్లో భక్తజన సందోహం

బసవన దేవస్థానంలో అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

ముళబాగిలు: సోమేశ్వరపాళ్య దేవాలయంలో విశేషాలంకరణ

బెంగళూరు (సాంస్కృతికం), ముళబాగిలు, న్యూస్‌టుడే: కార్తిక మాసం రెండో సోమవారం సందర్భంగా శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, అభిషేకాలతో భక్తులు తమ ఇష్టదైవాన్ని శ్రద్ధాసక్తులతో కొలిచారు. ఈ అభిషేకాలను వీక్షించి తరించటానికి అసంఖ్యాకంగా జనం బారులు తీరారు. ఉదయం, సాయంత్రం ఆయా ఆలయాల్లో అర్చనలు, దీపారాధనలు వైభవంగా కొనసాగాయి.

సింగసంద్రలో నందన ప్యాలెస్ ప్రారంభం

బెంగళూరు(న్యాతిప్ప సంద్ర), న్యూస్‌టుడే: నగరంలోని ఆంధ్ర శైలి ఆహార రుచులకు ఖ్యాతి పొందిన నందన ప్యాలెస్ 29వ శాఖ సింగసంద్రలో ప్రారంభమైంది. సోమవారం ఇక్కడ హోసూరు రోడ్డులో కొత్త శాఖను రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. నందన ప్యాలెస్ ఆహార రుచులు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయని, తాను కూడా ఇక్కడి ఆహారాన్నే ఎక్కువ ఇష్టపడతానని తెలిపారు. సంస్థ సీఎండీ డాక్టర్ ఆర్.రవిచందర్ మాట్లాడుతూ వినియోగదారులు విశ్వాసం వల్ల తమ శాఖలను విస్తరిస్తున్నామన్నారు. 1989 నుంచి రుచికరమైన ఆహార పదార్థాలను వినియోగదారులకు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి, ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎన్.వి.నరసింహరాజు, బీహెచ్‌ఏ అధ్యక్షుడు పీసీరావు, కెఎస్‌హెచ్‌ఏ అధ్యక్షుడు జీకేశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న రవాణాశాఖమంత్రి రామలింగారెడ్డి, ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి, డాక్టర్ రవిచందర్ తదితరులు

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే: యశ్వంతపుర విధానసభా క్షేత్రంలో అభివృద్ధికి నోచుకోని హెరోహళ్లి వార్డులో ప్రజా సేవకుడిగా అనేక అభివృద్ధి పనులు పూర్తి చేశామని క్షేత్రం ఎమ్మెల్యే ఎస్.టి.సోమశేఖర్ తెలిపారు. సోమవారం వార్డు పరిధిలో ఈస్ట్‌వెస్ట్ కళాశాల రోడ్డు, బిళికల్లు, బీఈఎల్ తొలి రెండు స్టేజీల్లో చేపట్టిన తారు రోడ్డు పనులకు ఆయన పచ్చజెండా ఊపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హెచ్.శ్రీధర్, ప్రధానకార్యదర్శి ఎం.గంగరాజు, ఎస్.టి.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తారురోడ్డు పనులు ప్రారంభిస్తున్న సోమశేఖర్ తదితరులు

ఇ-స్వత్తును సద్వినియోగం చేసుకోండి

పావగడ,న్యూస్‌టుడే: తాలూకాలోని 34 గ్రామ పంచాయతీల్లోని ప్రజలు ఇళ్లు, స్థలాలను ఇ-స్వత్తుగా మార్చుకోవాలని ఈఓ బి.కె.ఉత్తమ్ కోరారు. తాజా అభియాన్ కార్యక్రమంలో ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకొని వారి ఇంటి, నీటి పన్నులను చెల్లించి ఇ-స్వత్తుగా మార్చుకోవచ్చన్నారు. తాలూకాలో మొత్తం 90768 స్థలాలకు గాను 30,414 స్థలాలకు ఇ-స్వత్తు ఇచ్చామన్నారు.

అండర్-19 మహిళా జట్టు కెప్టెన్‌గా వందితారావు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: కోల్‌కతాలో ఈనెల 6 నుంచి 12 వరకు జరగనున్న అండర్-19 టీ-20 మహిళల క్రికెట్ పోటీలో పాల్గొంటున్న కర్ణాటక జట్టుకు వందితా కె.రావు కెప్టెన్‌గా ఎంపికయింది. సోమవారం ఈ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర జట్టు వివరాలను కర్ణాటక క్రికెట్ సంఘం ప్రకటించింది. జట్టు: రచిత, శ్రేయాచౌవాన్-ఇద్దరు వికెట్‌కీపర్లు, లియాంకశెట్టి, కశ్వికం దికుప్ప, దీక్ష, కమికా కార్తీక్, శ్రీనిధి పి.పై, ప్రియాచవాన్, వేదవర్షిణి, నందినీ చౌహన్, సికిన్‌పాటిల్, ఆర్.శుక్లా, సీడీదీక్ష, కె.వి.దీక్ష.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని వినతి

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: పేదలకు ఇళ్ల స్థలాన్ని కేటాయించాలని కర్ణాటక దళిత సంఘర్ష సమితి పదాధికారులు సోమవారం ఇక్కడ శాసనసభ్యుడు విశ్వనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సింగనాయకనహళ్లిలో పేదలకు కోసం నిర్మిస్తున్న పక్కాగృహాలను పేదలకు పంపిణీ చేసే విధంగా చర్య తీసుకోవాలని సమితి సంయోజక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అశ్వత్‌నారాయణ డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సమితి నేతలు శైలజ, శోభ, హనుమంతయ్య, లక్కప్ప, రవికుమార్, ఎ.ఎన్.ప్రసాద్ తదితరులు ఉన్నారు.

5 నుంచి సంగీతోత్సవం ప్రారంభం

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే: ఈ నెల ఐదో తేదీ నుంచి తొమ్మిది వరకు ఐదురోజులపాటు సంగీత ప్రియులకు వీనుల విందు కల్గించే సంగీతోత్సవాలు ప్రారంభంకానున్నాయి. కేకేమూర్తి స్మారక సంగీతోత్సవ, అకాడమి ఆఫ్ మ్యూజిక్ చౌడయ్య ప్రశస్తి సంస్థలు ఈ సంగీతోత్సవాన్ని నగరంలోని చౌడయ్య మెమోరియల్ హాలులో నిర్వహిస్తారు.

రంగసంభ్రమలో రోటరీక్లబ్‌కు బహుమతులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: ధర్మస్థలకు చెందిన ఉజిరే భంట్వాళలో రంగసంభ్రమ పేరిట నిర్వహించిన జోనల్‌స్థాయి సాంస్కృతిక వేడుకల్లో బెళ్తంగడీ రోటరీ క్లబ్‌కు బహుమతుల పంట పండింది. ప్రొ.ప్రకాష్ ప్రభు అధ్యక్షుడిగా ఉన్న ఈ క్లబ్ నుంచి 40 మంది పాల్గొని వివిధ విభాగాల్లో బహుమతులు అందుకున్నారు. బి.సి.రోడ్ సిటీ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో లొరెట్టో చర్చి సభాభవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్పెండ్ ఆఫ్ కామిడి పోటీల్లో ప్రొ.ప్రకాష్‌ప్రభు తొలి స్థానం పొందగా, డ్యుయేట్ సాంగ్‌లో ప్రకాష్‌ప్రభు-గీతాప్రకాష్ ప్రభు రెండోస్థానం, సోలో సాంగ్‌లో ఇంచర-మూడో స్థానం, యుగళగీత నృత్యంలో రేష్మా హెగ్డే, రిత్వీకారంత్ మూడోస్థానం, బృంద నృత్యంలో బెళ్తంగడీ రోటరీ క్లబ్ మూడోస్థానం సాధించాయి.

సాంస్కృతిక వేడుకల్లో విజేతల బృందం

జాతరలో కేంద్రమంత్రి ప్రత్యేక పూజలు

బెంగళూరు(పీణ్యాదాసరహళ్లి), న్యూస్‌టుడే: కమ్మగుండనహళ్లిలో జనప్రియ యువజన సంఘం నేతృత్వంలో నిర్వహించిన అణ్ణమ్మదేవి, సర్కల్ మారమ్మ, శక్తిమారెమ్మ దేవి జాతర మహోత్సవంలో కేంద్రమంత్రి శోభాకరంద్లాజే, దాసరహళ్లి నియోజకవర్గ శాసనసభ్యుడు ఎస్.మునిరాజు హాజరై ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి అశీస్సులు పొందారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఆర్.శబరి మంజునాథ్ ఆధ్వర్యంలో మంత్రి, ఎమ్మెల్యేలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పదాధికారులు కె.భాస్కర్, గిరిశ్, దక్షణామూర్తి, యువకులు, భక్తులు పాల్గొన్నారు

సన్మానం స్వీకరిస్తున్న కేంద్రమంత్రి శోభాకరంద్లాజే, ఎమ్మెల్యే తదితరులు

అ వీ.. ఇ వీ.. అ న్నీ..

కాంగ్రెస్ వదంతులే..

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే: బెంగళూరులో వాహన రద్దీ సమస్యలను తప్పించేందుకు ప్రభుత్వం నిర్మించతలపెట్టిన సొరంగ మార్గానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అనుమతి మంజూరు చేశారని కాంగ్రెస్ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని ఎంపీ తేజస్వి సూర్య స్పష్టం చేశారు. విలేకరులతో మాట్లాడుతూ ఆయన ప్రజలను దారి తప్పించేందుకు, అధికార పార్టీ నేతలే వదంతులను ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. సొరంగ మార్గం నిర్మిస్తే ఎదురయ్యే సమస్యలను తాము ఇప్పటికే ఉన్నత న్యాయస్థానానికి వివరించామని గుర్తు చేశారు.

జరిమానాను రద్దు చేసిన న్యాయమూర్తి

బెంగళూరు (రామమూర్తినగర), న్యూస్‌టుడే: జాలీ ఎల్‌ఎల్‌బీ-3 సినిమాలో న్యాయవ్యవస్థను కించపరిచే సన్నివేశాలు ఉన్నాయని, ఆ చిత్రంపై నిషేధం విధించాలని మంజునాథనగర నివాసి సయ్యద్ నీలోఫర్ అనే యువకుడు గతంలో ఉన్నత న్యాయస్థానంలో అర్జీ వేశారు. న్యాయస్థానం విలువైన సమయాన్ని వృథా చేసేందుకు అర్జీ దాఖలు చేశావంటూ అతనికి రూ.50 వేల జరిమానాను విధించారు. జరిమానా రద్దు చేయాలని కోరుతూ బాధితుడు వేసిన మరో అర్జీని జస్టిస్ విభు బఖ్రు, జస్టిస్ సీఎం జోషిల ధర్మాసనం విచారణ చేపట్టింది. తన కక్షిదారుడు ఇటీవల ఉద్యోగంలో చేరాడని, తండ్రి కూడా కొద్దికాలం క్రితం మరణించడంతో మానసికంగా కుంగిపోయాడని అతని తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. అతని తప్పును మన్నించి, జరిమానా రద్దు చేయాలని కోరగా, ధర్మాసనం అందుకు అంగీకరించింది. మరోసారి న్యాయస్థానం విలువైన సమయాన్ని వృథా చేయవద్దని హెచ్చరించింది.

వీడియో కాన్ఫరెన్సు ద్వారా విచారణకు అనుమతి

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: తన భర్త తనతో దౌర్జన్యానికి పాల్పడడం, అసహజ లైంగిక క్రియకు ఒత్తిడి చేయడం, నగ్న చిత్రాలను అంతర్జాలంలో ఉంచిన ఆరోపణలకు సంబంధించి వివేకనగర ఠాణాలో ఫిర్యాదు చేసిన మహిళ వీడియో కాన్ఫరెన్సు ద్వారా విచారణకు హాజరయ్యేందుకు ఉన్నత న్యాయస్థానం అనుమతించింది. తన భర్తపై కేసు పెట్టి, విడాకులకు అర్జీ వేసిన ఆ గృహిణి ప్రస్తుతం అమెరికాలో ఉంటోంది. దిగువ న్యాయస్థానం అనంగీకారం తెలుపుతూ ఇచ్చిన తీర్పును ప్రశ్నిస్తూ అమెరికాలోని తన నివాసం నుంచి విచారణకు హాజరయ్యేందుకు అనుమతించాలని ఆమె వేసిన అర్జీని జస్టిస్ శంకర్ మగదమ్ పరిష్కరించారు. వీడియో కాన్ఫరెన్సు సమయంలో అంతరాయం ఉండదని, ఒకవేళ ఏదైనా అంతరాయం కలిగితే, ఆమె వాంగ్మూలాన్ని, దాఖలు చేసిన సాక్ష్యాలను తిరస్కరించే హక్కు మేజిస్ట్రేట్ కోర్టుకు ఉంటుందని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

ఇంటి ఆవరణలో గంజాయి మొక్కల సాగు

మండ్య, న్యూస్‌టుడే: శ్రీరంగపట్టణ తాలూకా శ్రీనివాస అగ్రహార నివాసి సురేశ్ తన ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు పెంచుతున్నాడని గుర్తించి పోలీసులు దాడి చేశారు. ఏపుగా పెరిగిన ఐదు గంజాయి మొక్కలు తొలగించి, సురేశ్‌ను అరెస్టు చేశారు. అవి బంతి మొక్కలని భావించానని, నిందితుడు చెప్పాడు. ఆ మొక్కలకు ఉన్న 9 కిలోల గంజాయి ఆకుల విలువను రూ.3 లక్షలుగా అంచనా వేశారు.

కట్టుదిట్టమైన నిఘా మధ్య పరీక్ష

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్ల నియామకానికి అర్హత పరీక్ష కె-సెట్‌ను రాష్ట్ర వ్యాప్తంగా 11 జిల్లాల్లో, ప్రధాన నగరాల్లో 316 కేంద్రాలలో ఆదివారం నిర్వహించారు. కర్ణాటక పరీక్ష ప్రాధికారకు చెందిన అధికారులు, పరీక్ష కేంద్రాలపై నిఘా ఉంచారు. మొత్తం 34 అంశాలపై నిర్వహించిన పరీక్షకు 1.34 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 90 శాతం అభ్యర్థులు హాజరయ్యారని పరీక్ష ప్రాధికార అధికారి హెచ్.ప్రసన్న తెలిపారు.

బీమా పరిధిలోకి మామిడి

రామనగర, న్యూస్‌టుడే: కర్ణాటకలో సాగవుతున్న 2.5 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి పండ్లను కొనుగోలు చేసేందుకు కేంద్రం అంగీకరించింది. క్వింటాల్ పండ్లకు 1,616 చొప్పున ధర చెల్లించి కొనుగోలు చేస్తామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాజీ ప్రధాని దేవేగౌడకు రాసిన లేఖలో భరోసా ఇచ్చారు. కర్ణాటకలో మామిడి తోటలను బీమా పరిధిలోకి తీసుకురావడంతో పాటు బీమా, ఫలసాయాన్ని కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని దేవేగౌడ రాజ్యసభలో డిమాండ్ చేశారు.

కేఎల్‌ఇ న్యాయ కళాశాలలో ముగిసిన యునైటెడ్ సదస్సు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే: కెంగేరిలో ఉన్న కె.ఎల్.ఇ. న్యాయకళాశాలలో ఏర్పాటు చేసిన ఏడో వార్షిక మోడల్ యునైటెడ్ సదస్సు సోమవారం ముగిసింది. కళాశాలలో ఏర్పాటైన ఈ కార్యక్రమంలో దొడ్డబళ్లాపుర విధానసభా క్షేత్రం ఎమ్మెల్యే ధీరజ్‌మునిరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మరో ముఖ్య అతిథిగా విధానపరిషత్ సభ్యుడు కేశవప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.జి.ఎం.మల్లికార్జునయ్య, ఐక్యూఏసీ సంచాలకుడు డా.మనోజ్‌కుమార్ హిరేమఠ్ పాల్గొన్నారు.

వేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధీరజ్‌మునిరాజు

పొగాకు వద్దని ముమ్మర ప్రచారం

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే: బహిరంగ ప్రదేశాలు, విద్యాసంస్థలకు చుట్టుపక్కల ప్రాంతాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయం, వినియోగాన్ని అడ్డుకునేందుకు జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు జాగృతిని ముమ్మరం చేశారు. ఆ శాఖ అధికారులు ఎంఆర్ మంజునాథ్, నారాయణ స్వామి, ప్రియ, సామాజిక కార్యకర్త మంజునాథ్‌లు ఎంజీ రోడ్డు సమీప ప్రాంతాల్లో దుకాణాల వద్ద జాగృతి కల్పించారు. ధూమపానం నిరోధక ఫలకాన్ని ఏర్పాటు చేసుకోకపోతే దుకాణదారులకు రూ.వెయ్యి వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పొగాకు, అనుబంధ ఉత్పత్తులు విక్రయించే దుకాణాల వద్ద ఈ ప్రకటన ఏర్పాటు చేసుకోవడం తప్పనిసరి అని స్పష్టం చేశారు.

వంతెనపై గుంతలు పూడ్చివేత

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: నగరంలోని హెబ్బాళ్ ఉపరితల వంతెనపై పడిన గుంతల పూడ్చివేత పనులను గ్రేటర్ బెంగళూరు ప్రాధికార చేపట్టింది. గుంతలు వంతెన ఉనికికే ప్రమాదమని వాహనదారులు హెచ్చరించారు. నిత్యం వాహన సంచారం వల్ల గుంతలు మరింత పెద్దవి కావడంతో జనం ఒత్తిడి మేరకు అధికారులు స్పందించి పూడ్చివేత పనులను చేపట్టారు. సోమవారం ఉదయం నుంచి వంతెనపై గుంతలకు తారువేస్తూ పూడ్చివేయడం మొదలు పెట్టారు. నిత్యం ఈ వంతెన పై నుంచి అంతర్జాతీయ విమానాశ్రయం, చిక్క-బళ్లాపుర, అనంతపురం, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వేలాది వాహనాలు సంచరిస్తుంటాయి.

గుంతలకు తారుపూత

(c) eenadu

పాత్రికేయులకు దత్తనిధి పురస్కారాలు

రాయచూరు, న్యూస్‌టుడే: పాత్రికేయులకు 2025-దత్తనిధి పురస్కారాలు ఇవ్వటానికి కర్ణాటక మాధ్యమ అకాడమీ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. సామాజిక సమస్యలను ప్రతిబింబించిన కథనాలకు అభిమాన, మానవీయ కోణంలోని వార్తలకు మైసూరు దిగంత, అణగారిన వర్గాల అగచాట్ల లేఖలకు అభిమన్యు, ప్రజా ఇబ్బందులపై వెలువడిన కథనాలకు ప్రజా సందేశ ప్రశస్తులను ప్రకటిస్తారు. ఎంపికైన వాటికి రూ.10 వేల నగదు బహుమతిని అందజేస్తారు. జనవరి 1 నుంచి అక్టోబరు 25 వరకు ప్రచురించిన క్లిప్పింగులు, వీడియోలను పరిగణలోకి తీసుకుంటారు. దరఖాస్తుకు జత చేసి 'కార్యదర్శి, కర్ణాటక మాధ్యమ అకాడమీ, అంబేడ్కర్ వీధి, బెంగళూరు' చిరునామాకు ఈ నెల 12 లోపు పంపుకోవాలని కార్యదర్శి సహానా కోరుతున్నారు.

బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు • కొప్పళ • విజయనగర • చిత్రదుర్గ

5న బెంగళూరులో తుంగభద్ర ఐసీసీ సమావేశం

హొసపేటె, న్యూస్‌టుడే: తుంగభద్ర ఆయకట్టు భూములకు రెండో పంట (రబీ)కి సాగునీరిచ్చే అంశంపై చర్చలు జరిపేందుకు 5వ తేదీన బెంగళూరులో నీటిపారుదల సలహా సమితి (ఐసీసీ) సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటలకు విధానసౌధలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి ఉపముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ అధ్యక్షత వహిస్తారు. రాయచూరు, కొప్పళ, విజయనగర జిల్లాల బాధ్యమంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, రైతులు పాల్గొంటారు. ప్రస్తుతం జలాశయంలో 80 టీఎంసీల నీరునిల్వ ఉండి, ఎగువ ప్రాంతాల నుంచి 10వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోందని, రెండో పంటకు సునాయాసంగా నీరివ్వవచ్చని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సమావేశం కీలకం కానుంది. తుంగభద్రకు కొత్త గేట్ల బిగింపు అంశంపైనా చర్చలు జరిగే అవకాశం ఉంది.

అంబులెన్స్ సేవలను పునరుద్ధరించరూ!

రాయచూరు, న్యూస్‌టుడే: దేవదుర్గ తాలూకా గబ్బూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంబులెన్స్(108) సేవలను త్వరగా పునరుద్ధరించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ప్రముఖుడు రాజప్ప డిమాండ్ చేశారు. ఆయన సోమవారం పత్రికా భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 50 గ్రామాల ప్రజలు ఆధారపడిన ఈ కేంద్రంలో అంబులెన్స్ సేవలను నిలిపివేయడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త అంబులెన్స్‌ను మంజూరు చేయాలని వైద్యశాఖ అధికారులను కోరారు.

మోసపోయిన ఉపాధ్యాయుడు

దావణగెరె, న్యూస్‌టుడే : కొత్తగా వస్తున్న కంపెనీల్లో వాటా (షేర్లు) కొనుగోలు చేస్తే దానిపై నెలకు 300 శాతం లాభాలు వస్తాయని కొందరు వంచకులు ఒక ఉపాధ్యాయుడ్ని వంచించారు. హొన్నాళికి చెందిన బాధితుడి నుంచి రూ.11.93 లక్షలను వంచకులు తమ ఖాతాలకు వేయించుకున్నారు. మొదట ఆ ఉపాధ్యాయుడ్ని ఒక వాట్సప్ గ్రూపులో చేర్పించారు. లాభాలు వస్తున్నాయని అందులో సభ్యులు అడ్మిన్‌ను పొగడ్తలతో ముంచెత్తడంతో దాన్ని నమ్మి నగదు మదుపు చేశారు. హఠాత్తుగా వాట్సప్ గ్రూపు మాయం కావడం, ఎన్నిసార్లు ఫోన్ చేసినా అడ్మిన్ ఎత్తకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

సీసీఐ ప్రవేశం.. రైతన్నలకు సువర్ణావకాశమేనా!

ఏపీఎంసీ అధ్యక్షుడికి వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

రాయచూరు, న్యూస్‌టుడే: తెల్ల బంగారాన్ని కొనుగోలు చేసేందుకు సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) మార్కెట్లోకి ప్రవేశించింది. స్థానిక హైదరాబాద్ రహదారి దగ్గరలోని ఆర్‌ఏపీఎంసీ (రాయచూరు అగ్రికల్చరల్ ప్రొడ్యూస్ మార్కెటింగ్, ప్రాసెసింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్) కార్యాలయం ఆవరణలో సోమవారం ఎండీ షేక్ హుస్సేన్ కేంద్రాలను ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 9 కేంద్రాలను తెరుస్తామని జిల్లా పాలనాధికారి నితీష్ వెల్లడించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే సహకార కేంద్రంలో తీశారు. తొలి రకం క్వింటాలుకు రూ.8110, రెండో రకానికి రూ.7710 చెల్లిస్తారు. గూగుల్ ప్లే స్టోర్స్, యాపిల్ స్టోర్ యాప్‌లో కపాస్ కిసాన్ అప్లికేషన్ డౌన్ లౌడ్ చేసుకుని వివరాలు నమోదు చేయాలి. భూమి దాఖలాలు, పంట సాగు చేసినట్లు రెవెన్యూ శాఖ ధ్రువీకరించిన పత్రాలు, ఆధార్ కార్డు, ఎఫ్ఐడీ సంఖ్యను, పాస్‌పోర్ట్ ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. అనంతరం పంటను కేంద్రానికి తీసుకెళ్లాలి. జిల్లాలోని ప్రభుత్వ ఏపీఎంసీల తర్వాత సహకార కేంద్రమైన ఆర్‌ఏపీఎంసీ పెద్దది. రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధ్యక్షుడు జయంతరావ్ పతంగి కోరుతున్నారు. ఇంతవరకూ 12 వేల మంది తమ వివరాలు నమోదు చేశారు. ఎక్కువెక్కువ కేంద్రాలు స్థాపిస్తూ జిల్లా యంత్రాంగం ప్రకటించాలని రైతులు కోరుతున్నారు.

రాయచూరు ఏపీఎంసీలో ధర ఏది?

ఏపీఎంసీ పరిధిలోని కాటన్ మార్కెట్‌లో సోమవారం 27,981 క్వింటాళ్ల హైబ్రిడ్ పత్తి విక్రయాలు జరిగాయి. కనిష్ఠంగా క్వింటాలుకు రూ.6500, గరిష్ఠంగా రూ.7600, మాదిరి రూ.7300కు అమ్ముకున్నారు. కేంద్రం నిర్ణయించిన మద్దతు ధర కంటే తక్కువకే పోయింది. గిట్టుబాటు ధర దక్కేందుకు సీసీఐ త్వరగా కేంద్రాలను తెరవాలని రైతు సంఘాలు కోరుతున్నాయి. రైతులు ఇబ్బడి ముబ్బడిగా పంటను తెస్తున్నారు. అయితే కొంత మంది మిల్లులకు తీసుకెళ్తున్నారు. దీనివల్ల ఏపీఎంసీ ఆదాయం కోల్పోతోంది.

దేవదుర్గ తాలూకాలో ఎప్పుడు!

దేవదుర్గలో ఇంకా కేంద్రాలు తెరవలేదు. ఆన్‌లైన్ ప్రక్రియలో ఏర్పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలి. ఇప్పటికే నమోదు చేసిన వారి నుంచి పంటను కొనుగోలు చేయాలని 'అఖిల భారత రైతు వ్యవసాయ జిల్లా సంఘటన' ఏపీఎంసీకి విజ్ఞప్తి చేసింది. జిల్లా కార్యదర్శి మల్లన గౌడ నాయకత్వంలో అన్నదాతలు సోమవారం అధ్యక్షుడు మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు.

కాటన్ మార్కెట్‌లో పత్తి బేళ్లు

అదనపు ఛార్జీలు మోపొద్దు

అన్ లోడింగ్, తూకపు ఛార్జీలను రైతుల ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ నియమాల ప్రకారం మార్కెట్‌లో వర్తకులు, సీసీఐ భరించాలి. తెలంగాణ నుంచి తెస్తున్న పంటను మార్కెట్‌కు కాకుండా మిల్లర్ల వద్దకు తీసుకెళ్తున్నారు. దీన్ని అడ్డుకుంటే ఏపీఎంసీకి ఆదాయం పెరుగుతుంది.

-లక్ష్మణగౌడ(జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు)

ప్రశస్తిని అందుకున్న కలబురగి వైద్యుడు

కలబురగి(రాయచూరు), న్యూస్‌టుడే: పారంపరిక వైద్యుడు, హిందూ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దినకరరావ్ నారాయణరావ్ కులకర్ణి కన్నడ రాజ్యోత్సవ పురస్కారాన్ని స్వీకరించారు. హుబ్బళిలోని మూజగం సభా భవనంలో ఏర్పాటైన వేడుకల్లో విశ్వ కన్నడ బృందం సంస్థాపక అధ్యక్షుడు సదాశివ చౌశెట్టి, ప్రతినిధులు గోవింద జోషి, రమేశ్, మల్లికార్జున షావుకార్ ప్రశస్తిని ప్రదానం చేశారు. విశ్వ కన్నడ బృందం ఏటా పురస్కారాలకు సాధకులను ఎంపిక చేస్తోంది. ఈసారి కలబురగి విభాగం నుంచి దినకరరావ్ పేరును పరిగణనలోకి తీసుకున్నారు. ఆయనను కలబురగిలో పలువురు ప్రముఖులు అభినందించారు.

ప్రముఖుల చేతుల మీదుగా పురస్కారాన్ని స్వీకరిస్తున్న దినకరరావ్

పంటల తెగుళ్లపై రైతులకు అవగాహన

సిరివార, (మాన్వి): రాయచూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థుల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కృషి కార్యానుభవ శిబిరాన్ని తాలూకాలోని మాడగిరి గ్రామంలో నిర్వహించారు. పంటలనాశించే వివిధ రకాల తెగుళ్లు, సేంద్రియ ఎరువులు తయారీ పద్ధతి, వినియోగం, బ్రహ్మాస్త్ర, అగ్నిఅస్త్ర, క్రిమికీటకాల నిర్మూలన, గోమూత్రంపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు, శిబిరం సంయోజకులు డాక్టర్ డి.ఎస్.అశ్వథ్ నారాయణ, డాక్టర్ శశిధర్ కె.కె., డాక్టర్ సంగీత మచ్చ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్గిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

ఒత్తిళ్లకు స్పందించిన సర్కారు

సింధనూరు, న్యూస్‌టుడే: రెండో పంటకు సాగు నీరు ఇవ్వాలని రైతులు, ప్రజాప్రతినిధులు, సంఘాలతోపాటు స్థానిక ఎమ్మెల్యే బాదర్లి హంపనగౌడ, విధాన పరిషత్ సభ్యుడు బసనగౌడ బాదర్లి విడివిడిగా బెంగళూరులో ప్రభుత్వ పెద్దలపై ఒత్తిడి తెచ్చారు. సోమవారం ఎమ్మెల్యే బాదర్లి నేరుగా ముఖ్యమంత్రిని కలసి తుంగభద్ర జలాశయం నీటిని రెండో పంటకు ఇచ్చే అవకాశం ఉందో లేదో తేల్చి చెప్పాలని విన్నవించారు. మరోవైపు ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లి ఇదే అంశంపై సరైన వివరణ ఇవ్వాల్సిందే అంటూ..ముఖ్యమంత్రి అదనపు ముఖ్యకార్యదర్శి అంజుమ్ పర్వేజ్‌ను సోమవారం కలసి లేఖ సమర్పించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలసి పరిస్థితిని వివరించారు. రెండో పంటకు నీళ్లు ఉంటాయిలే.. అంటూ అనేక మంది రైతులు నారు మళ్లు వేస్తున్నారు.. దీనిపై స్పష్టత లేకుంటే రైతులు నష్టపోతారని వివరించారు. స్పందించిన నాయకులు బెంగళూరులో ఈ నెల 5న తుంగభద్ర ఐసీసీ సమావేశం ఏర్పాటుకు సూచనలు ఇచ్చారు.

సీఎంకు వివరిస్తున్న సింధనూరు శాసనసభ్యుడు బాదర్లి

అలరించిన సామాజిక నాటకం

రాయచూరు, న్యూస్‌టుడే: అన్నదాతల సమస్యలపై ఆదివారం రాత్రి స్థానిక రంగమందిరంలో ప్రదర్శించిన 'హిలియోథిస్' అనే సామాజిక నాటకం రక్తి కట్టించింది. ఈ ప్రాంతానికి చెందిన ప్రముఖ కవి మహంతేశ్ రచించిన 'భారత భాగ్య విదాత' అనే కథలోని అంశాలను ఎంపిక చేసుకుని నాటకాన్ని రూపొందించారు. కొన్ని క్రిమి సంహారక మందుల కంపెనీలు మేధావులతో కలిసి అన్నదాతలను దోచుకోవడం, తద్వారా ఆర్థికంగా చితికిపోతున్న రైతుల కుటుంబాలు దయనీయ పరిస్థితులు ఆకట్టుకున్నాయి. ప్రేక్షకులను ఆలోచింపజేశాయి. సముదాయ బృందం ప్రతినిధి లక్ష్మణ మండలగేరా దర్శకత్వం వహించారు. కళాకారులు నాగరాజ్, వెంకట నరసింహులు, హేమంత్, హనుమయ్య సహకారం అందించారు. కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు చిదానంద సాలి, జిల్లా కసాప మాజీ అధ్యక్షుడు మహంతేశ్ మస్కి, సాహితీవేత్తలు వీర హనుమాన్, బాబు భండారి గల్, జర్నలిజం కోర్సు అధ్యాపకుడు విజయ్ సరోదా హాజరయ్యారు.

ఆర్థికంగా నష్టపోయి రోదిస్తున్న రైతు మహిళ

ముగ్గురిని బలిగొన్న ప్రమాదం

ఆ కుటుంబంలో కట్టలు తెగిన కన్నీరు

మైసూరు, న్యూస్‌టుడే: చాముండి టౌన్‌షిప్ వద్ద రైల్వే ఉపరితల వంతెనపై ఆదివారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరణించారు. చామరాజనగర తాలూకా ఉద్దనూరు గ్రామానికి చెందిన శివమూర్తి (52), ఆయన భార్య చెన్నాజమ్మ (46), వారి కుమారుడు సిద్ధార్థ (15)ను మృతులుగా గుర్తించారు. మైసూరులో ఒక కార్యక్రమానికి హాజరై ద్విచక్ర వాహనంపై ఊరికి తిరిగి వెళుతున్న సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో సిద్ధార్థ అక్కడికక్కడే మరణించగా.. ఆసుపత్రికి తరలించే మార్గంలో శివమూర్తి కన్ను మూశారు. చెన్నాజమ్మ చికిత్స పొందుతూ సోమవారం మరణించింది.

మృతులు.. శివమూర్తి, సిద్ధార్థ, చెన్నాజమ్మ

నైజీరియా మహిళ అరెస్టు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : నగరంలో వివిధ ప్రాంతాల్లో మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న నైజీరియాకు చెందిన స్టెఫిన్(35) అనే మహిళను కొడుగెహళ్లి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఆమె నుంచి 35 గ్రాముల మత్తుపదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. 2021లో బెంగళూరు వచ్చిన ఆమె ధణిసంద్రలో ఉంటూ.. మత్తు వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు.

నిర్వాసితులపై నిర్లక్ష్యమేల?

హొసపేటె, న్యూస్‌టుడే: తుంగభద్ర జలాశయం నిర్మాణం సమయంలో భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం ముఖ్యులు దుయ్యబట్టారు. హొసపేటె తాలూకా పరిధి మరియమ్మనహళ్లి, డణాయకనకెరె ప్రాంతాల్లో నిర్వాసిత రైతుల పేరిట భూమి హక్కు పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సంఘం ఆధ్వర్యంలో ఆ ప్రాంతాల రైతులు సోమవారం మరియమ్మనహళ్లి నుంచి హొసపేటె వరకూ పాదయాత్ర చేపట్టారు. సాయంత్రం జిల్లా పాలనాధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. డ్యాం నిర్మాణం సమయంలో మమ్మల్ని ఖాళీ చేయించి, వేరే చోట్ల వ్యవసాయ భూములు కేటాయించారు, కాని ఇప్పటి వరకూ వాటికి హక్కుపత్రాలు మంజూరు చేయలేదని విచారం వ్యక్తం చేశారు. పలు మార్లు అధికారులను కలిసి సమస్య వివరించినా ఫలితంలేదని వాపోయారు.

ఘనంగా అన్నమయ్య ఆరాధనా మహోత్సవం

మాన్వి,న్యూస్‌టుడే: పట్టణంలోని కొండపై గుహలో ఉన్న అన్నమయ్య తాత ఆరాధనా మహోత్సవం ఘనంగా జరిగింది. మహాహఠయోగిగా పేర్గాంచిన అన్నమయ్య 40వ ఆరాధనా ఉత్సవ కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. ఈ క్రమంలో ఉదయం నుంచి రాత్రి వరకు మాన్వి కొండ గుహ వద్ద పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. పట్టణ ప్రజలతో బాటు అన్నమయ్య తాత సన్నిహితులు, భక్తులు భారీగా హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే రాజా వెంకటప్పనాయక్ కుటుంబ సభ్యులతో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజావెంకటప్పనాయక్ కుటుంబ సభ్యులు

భయం వద్దు.. నయం ఖాయం

రాయచూరు, న్యూస్‌టుడే: కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న అభియాన్ సోమవారం మొదలైంది. ఈ నెల 19 వరకు గుర్తింపు కార్యక్రమం కొనసాగుతుంది. రాయచూరు నగర పాలక సంస్థ కార్పొరేటర్ ఉమా జహీరాబాద్ ఆరోగ్య కేంద్రం వద్ద ప్రారంభానికి పచ్చజెండా ఊపారు. ఈ సందర్భంగా డీహెచ్ఓ డాక్టర్ సురేంద్రబాబు మాట్లాడుతూ కుష్టు నయం కాగల జబ్బు అయినందున రోగులు భయపడొద్దన్నారు. ఆరు నెలల నుంచి ఏడాది పాటు చికిత్స తీసుకుంటే నిర్మూలన సాధ్యమని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా మందులు ఇస్తారని వెల్లడించారు. రెండు వారాలకు మించి దగ్గు ఉంటే క్షయగా అనుమానించి రక్త పరీక్ష చేయించాలని సూచించారు. రోగం నిర్ధారణ అయిన వారు ఆరు నెలలు మందులు వాడితే నయం అవుతుందని చెప్పారు. జిల్లా ఆర్‌సీహెచ్ అధికారిణి డాక్టర్ నందితా, వైద్యాధికారులు మహ్మద్ షాకీర్, పరహా, శ్వేతాంబరి, ఆరోగ్య శిక్షణాధికారి ఈశ్వర్ దానప్ప పాల్గొన్నారు.

అభియాన్‌లో ఉపన్యసిస్తున్న సురేంద్రబాబు

విద్యార్థులపై తేనెటీగల దాడి

మడికేరి, న్యూస్‌టుడే : విరాజపుర నగరంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో విద్యార్థులు సోమవారం ఉదయం ప్రార్థన చేసుకుంటున్న సమయంలో తేనెటీగలు దాడి చేశాయి. ప్రధానోపాధ్యాయురాలు అన్నమ్మతో పాటు, 30 మంది విద్యార్థులు దాడిలో గాయపడ్డారు. బాధితులకు చికిత్స కోసం స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. ఎవరికీ ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. విరాజపేట ఠాణా పోలీసులు, విద్యా శాఖ అధికారులు ఆసుపత్రికి వచ్చి విద్యార్థులను పరామర్శించారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

03-11-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1626.06	1632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	11,953	15,140
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	11,697	14,780
నీటి నిల్వ (టి.ఎం.సి)	80.003	101.773

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

వందశాతం లక్ష్యానికి సహకారం అవసరం

రాయచూరు, న్యూస్‌టుడే: ఈశాన్య ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గం ఎన్నికలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని జిల్లా విద్యా శాఖ ఉప నిర్దేశకుడు కె.డి.బడిగేరా కోరారు. వందశాతం లక్ష్యాన్ని చేరుకునేందుకు జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషికి విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, బోధకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నగరంలోని బెస్ట్ పీయూసీ కళాశాలలో సోమవారం ఓటర్ల మెరుపు నమోదు మూడో అభియాన్ జరిగింది. కార్యక్రమాన్ని ప్రారంభించిన బడిగేరా మాట్లాడుతూ అర్హత కల్గిన వారిని ఓటరు జాబితాలో చేర్పించేందుకే విస్తృత ప్రచారం చేపట్టినట్లు వివరించారు. పాత జాబితాలో పేరు ఉన్న వారు కూడా నమూనా 19 ఫారాన్ని భర్తీ చేయాలని సూచించారు. ఓటర్ల సాక్షరాస్యత క్లబ్ నోడల్ అధికారి దండప్ప బిరాదార్ ఉపన్యసిస్తూ నవంబరు 1నాటికి ఆరేళ్లలో మూడేళ్లు బోధనా వృత్తిలో కొనసాగిన వారు అర్హులని తెలిపారు. విద్యా సంస్థ ఇచ్చే అనుబంధ పత్రం 2, ముఖ్యుడి ధ్రువీకరణ పత్రాన్ని జత చేయాలని సూచించారు. పీయూసీ శాఖ ఉప నిర్దేశకుడు సోమశేఖరప్ప, వ్యాయమ విభాగం అధికారి రంగస్వామి, ప్రభుత్వ పీయూసీ కళాశాల (మాన్వి) కుంటప్ప వేదికపై ఆసీనులయ్యారు.

కార్యక్రమంలో ప్రసంగిస్తున్న బడిగేరా

మంచుసంద్రంలో సాహస వీరుడు!

స్ఫూర్తిదాయకంగా కల్యాణ్ సేవలు

పతకాలు అందుకుంటున్న కల్యాణ్

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : ధైర్యం, క్రమశిక్షణ, సైనికుడి అజేయ స్ఫూర్తిని ప్రదర్శించి, పదవీ విరమణ అనంతరమూ లెఫ్టినెంట్ కల్నల్ ఓపీఎన్ కల్యాణ్ (76) పౌర సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే ఆయన తండ్రి ఓపీవీ చారి భారతీయ సైన్యంలో మేజర్‌గా సేవలందించారు. సోదరుడు రాజగోపాలన్ గూర్ఖా రైఫిల్స్‌లో పని చేశారు. వారి నుంచి పొందిన స్ఫూర్తితో అప్పటి కింగ్ జార్జ్ పాఠశాల, ఇప్పటి రాష్ట్రీయ మిలటరీ స్కూల్‌లో విద్యాభ్యాసం అనంతరం 1969 జూన్ 15న మద్రాస్‌లోని ఓటీఎస్ ద్వారా ఆర్మీ సర్వీస్ కార్ప్స్‌లో చేరారు. చేరిన రెండేళ్లలోనే ఇండో-పాక్ యుద్ధంలో పాల్గొని 310 పెట్రోలియం ప్లాటూన్ ఏఎస్‌సీకి నాయకత్వం వహించారు. కఠినమైన పోరాట పరిస్థితుల్లో తన సైనికులను తూర్పు పాకిస్థాన్ (ఇప్పటి బంగ్లాదేశ్)లోకి నడిపించారు. పారాట్రూపర్‌గా 1987-89 వరకు సియాచిన్ బ్రిగేడ్‌కు నేతృత్వం వహించడంతో పాటు మొత్తం 38 ఏళ్ల సేవలు అందించి పదవీ విరమణ చేశారు. వివిధ కార్యాచరణలు, సేవలకు 12 పతకాలతో పాటు, ఆర్మీ చీఫ్, సదరన్ ఆర్మీ కమాండర్, అండమాన్ అండ్ నికోబార్ కమాండ్ నుంచి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. సైనికాధికారిగా, పదవీ విరమణ అనంతరం హాంగ్‌కాంగ్, సింగపూర్ మలేషియాలలో నిర్వహించిన అంతర్జాతీయ వెటరన్స్ అథ్లెటిక్ మీట్‌లలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి, నాలుగు పతకాలు దక్కించుకున్నారు. సర్వీసెస్ తైక్వాండో జట్టు మేనేజరుగా చెన్నైలో 2006లో జరిగిన జాతీయ తైక్వాండో ఛాపియన్‌షిప్‌లో జట్టును విజయపథంలో నడిపించారు. నేషనల్ మాస్టర్స్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో కర్ణాటకకు 2006-12 మధ్యలో ప్రాతినిధ్యం వహించి, ఈతలో 10 పతకాలు సాధించారు. పదవీ విరమణ అనంతరం బెంగళూరు ఏఎస్‌సీ మ్యూజియంలో క్యూరేటర్‌గా 2008-2023 వరకు స్వచ్ఛందంగా సేవలు అందించారు. తనలోని సాహస ప్రవృత్తిని సంతృప్తి పరచుకునేందుకు ఇటీవలే జనావాసాలు లేని 22 ఆర్కిటిక్ యాత్రలు చేశారు. దక్షిణ సముద్రం, ఆర్కిటిక్ మహాసముద్రాల్లో పోలార్ ప్లంజ్ చేశారు. గత ఏడాది ఆగస్టు 18న నార్వేలోని టోన్స్‌బర్గ్ స్కైడైవింగ్ క్లబ్‌లో ఏడు వేల అడుగుల ఎత్తు నుంచి స్కైడైవింగ్ చేశారు. గత ఏడాది అక్టోబరు 24న హై ఆల్టిట్యూడ్ తవాంగ్ మారథాన్‌లో పాల్గొని యువతకు స్ఫూర్తిగా నిలిచారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు సమష్టి కృషి

మాన్వి,న్యూస్‌టుడే: కుష్టు వ్యాధిని సంపూర్ణంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ శరణబసవరాజ్ పాటిల్ సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రి వద్ద కుష్టు వ్యాధి నియంత్రణ జాతాను ప్రారంభించి మాట్లాడారు. నవంబరు 19 వరకు వాడవాడలా కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ క్రమంలో ఆశా, అంగన్‌వాడీలు ఇంటింటా సర్వే పనులు చేస్తారని వారికి సహకరించాలని కోరారు. ఈ వ్యాధిపై పూర్తి అవగాహన కల్పిస్తారని తెలిపారు. చర్మంపై వచ్చే ఏ చిన్న మచ్చనీ నిర్లక్ష్యం చేయొద్దన్నారు. దీన్ని సంపూర్ణంగా నిర్మూలించేందుకు ఇప్పుడు ఔషధాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వివిధ వార్డుల్లో జాతా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప ఆరోగ్య శిక్షణాధికారి బసయ్య, డాక్టర్ శిల్పానాయక్, శివరాజ్, చైత్ర, సుధీర్‌బాబు, బాబు చిన్ను, ఆరోగ్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతాను ప్రారంభిస్తున్న తాలూకా ఆరోగ్యాధికారి డాక్టర్ శరణబసవరాజ్ పాటిల్

శివునికి కుంకుమ అలంకారం

సింధనూరు, న్యూస్‌టుడే: పవిత్ర కార్తికమాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని సింధనూరు తాలూకా గాంధీనగర్, వేంకటేశ్వరపైక్యాంపు ఆలయాల్లో గర్భగుడిలోని పరమశివునికి కుంకుమతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. గాంధీనగర్ శ్రీవిశ్వేశ్వర పంచాయతన క్షేత్రంలో శివుని అలంకారానికి క్యాంపు పెద్దలు సుజ్జం శ్రీనివాస్, ఈడ్పుగంటి మురళీకృష్ణ కుటుంబాలు అలంకార సేవకు ప్రాయోజకత్వం వహించాయి. కుంకుమ మంగళకరమైందని స్వామికి ఈ అలంకారం చేసినట్లు ఆలయ పెద్దలు తెలిపారు. గాంధీనగర్ సమీపంలోని వేంకటేశ్వరపైక్యాంపులోని శ్రీవాసవీ సహిత హరిహరాత్మజ క్షేత్రంలోనూ కార్తిక దామోదరునికి కుంకుమ అలంకారం చేసి వచ్చిన భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు.

గాంధీనగర్ శివాలయంలో కుంకుమ అలంకారంలో విశ్వేశ్వరుడు

వేంకటేశ్వరపైక్యాంపులో పరమ శివునికి కుంకుమ అలంకారం

ఉద్యోగ భాగ్యం ఏదయా?

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : అటవీశాఖ ఉద్యోగ నియామకాల్లో తమకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బెంగళూరులోని స్వాతంత్ర్య ఉద్యానవనంలో బీఎస్‌సీ అటవీ కోర్సు డిగ్రీ విద్యార్థులు సోమవారం ధర్నాకు దిగారు. డిగ్రీ చేసిన తమకు ఉద్యోగ నియామకాల్లో అన్యాయం జరుగుతుందని విద్యార్థులు ఆక్రోశం వ్యక్తం చేశారు. అటవీ కోర్సుల్లో డిగ్రీ పూర్తి చేసిన తమకు ఆ శాఖలో ఉద్యోగావకాశాలు ఉన్నాయని, తమను పక్కన పెట్టి సాధారణ డిగ్రీ పూర్తి చేసిన వారికి అవకాశాలు కల్పించడం అన్యాయమన్నారు. అటవీశాఖ ఉద్యోగ నియామకాల్లో తమకూ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

స్వాతంత్ర్య ఉద్యానవనంలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఈనాడు కర్నూలు

భూ బాధితులు.. కదిలిస్తే కన్నీరు

■ న్యాయం చేయాలని వేడుకోలు

'మా పెద్దలు కష్టపడి సంపాదించిన భూములను మేము సాగు చేసుకుంటున్నాం. ఆ భూమే మాకు జీవనాధారం. మాకు తెలియకుండా ఇతరుల పేరుతో ఆన్‌లైన్ చేశారు. ఇదేమని అడిగితే దౌర్జన్యం చేస్తున్నారు. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాం. నిత్యం కార్యాలయాల వద్ద నిరీక్షిస్తున్నాం. అయినా మాగోడు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇకనైనా స్పందించి న్యాయం చేయాలి' అని పలువురు బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. తమ భూములు ఇప్పించాలంటూ వారు సోమవారం కలెక్టరేట్‌కు చేరుకుని అధికారులకు సమస్య విన్నవించారు.

– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

దొంగ పత్రాలతో కాజేశారు

– గిడ్డయ్య, సుంకన్న, ఈరన్న, దర్గయ్య

మాది నందవరం మండలం టి.సోమలగూడూరు. మాకు మిట్టసోమాపురం గ్రామంలో 17.53 ఎకరాల భూమి పెద్దల నుంచి వారసత్వంగా వచ్చింది. ఇది పట్టా భూమి. ఇతరుల నుంచి మా పెద్దలు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. బతుకుదెరువు కోసం వలస వెళితే మిట్టసోమాపురం గ్రామానికి చెందిన పలువురు మా భూమికి దొంగ పత్రాలు సృష్టించి వారి పేర్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారు. ఈ భూమి కోసం పదేళ్లకుపైగా పోరాడుతున్నాం. అడిగితే చంపేస్తామని బెదిరిస్తున్నారు.

నాలుగేళ్లుగా ప్రదక్షిణలు

– చంద్రశేఖర్‌రెడ్డి, నెట్టేకల్

ఆదోని మండలం నెట్టేకల్ పరిధిలో నా తండ్రి హనుమంతరెడ్డికి వారసత్వంగా సంక్రమించిన 51 సెంట్ల భూమిని ఈరమ్మ పేరుతో ఆన్‌లైన్‌లో అక్రమంగా నమోదు చేశారు. నా తండ్రి పేరుతో నమోదు చేయాలంటూ నాలుగేళ్లుగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఆదోని సబ్ కలెక్టర్ వద్ద ఆర్‌వోఆర్ కేసు విచారణ జరగ్గా.. మాదే అని తేల్చారు. నాలుగేళ్లుగా తిరిగేందుకే రూ.60 వేల వరకు ఖర్చైంది. ఈ భూమిని ఆన్‌లైన్ చేసేందుకు రెవెన్యూ అధికారులు మరో రూ.50 వేలు లంచం అడుగుతున్నారు. మాకు వెంటనే న్యాయం చేయాలి.

అక్కల గెలుపు.. చెల్లెళ్లకు మలుపు

అమ్మాయిలు అదరగొట్టారు.. ముంబయి వేదికగా సాగిన ప్రపంచ కప్ క్రికెట్ తుది పోరులో గెలుపుతీరం దాటారు. దేశమంతా విజయ'పతాకం' రెపరెపలాడుతోంది.. అక్కల గెలుపు మాలో స్ఫూర్తి నింపిందని క్రీడాకారిణులు అభిప్రాయపడ్డారు. రెండు జిల్లాలకు చెందిన పలువురు బాలికలు పరుగుల వరద పారిస్తున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో మెరిశారు. ప్రపంచ కప్ గెలుపు మరింత ఆత్మస్థైర్యం నింపిందంటున్నారు.

– న్యూస్‌టుడే నంద్యాల పాత పట్టణం

బౌలింగ్‌లో 'మేఘనా'పాటి

ఆదోని పట్టణానికి చెందిన వై. మేఘనారెడ్డి పేస్ బౌలర్‌గా రాణిస్తోంది. ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతోంది. గత మూడేళ్లుగా బాల జీరావు వద్ద ప్రత్యేక శిక్షణ తీసుకుంటోంది. ఇన్‌స్వింగ్, ఔట్‌స్వింగ్ వేయడంలో ఈ బాలిక ప్రత్యేకత.. వరుసగా 2024, 2025 సంవత్సరాల్లో అండర్-15 జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తూ రాష్ట్ర స్థాయి పోటీలకు సన్నద్ధమవుతోంది. త్వరలో జరుగనున్న సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక చేసే జట్టు ప్రాబబుల్స్‌లో చోటు సంపాదించుకుంది.

– న్యూస్‌టుడే, ఆదోని క్రీడలు

శరణ్య.. పోరాటం అనన్యం

కర్నూలుకు చెందిన శరణ్య నాలుగో తరగతి చదువుతున్నప్పటి నుంచే క్రికెట్‌లో శిక్షణ తీసుకున్నారు. అండర్ జట్టు తరఫున నాలుగుసార్లు ఆడి ప్రతిభ చాటారు. బౌలింగ్‌లో లెగ్ స్పిన్నర్‌గా రాణిస్తున్నారు. ఇప్పటికే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. భారత జట్టులో చోటు సంపాదించేందుకు అవసరమైన నాలుగు చాలెంజ్ మ్యాచ్‌ల్లో ఆడి ప్రతిభ చాటారు. 2019-20లో అండర్-19 జట్టుకు కెప్టెన్‌గా ఉంటున్నారు. 2023-24లో అండర్-23 జట్టుకు కెప్టెన్‌గా సారథ్యం వహించారు. ఆలిండియా స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించారు. గతేడాది డిసెంబరులో కోల్‌కతాలో జరిగిన రంజీ పోటీల్లో 24 వికెట్లు పడగొట్టి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ ఏడాది జనవరిలో జరిగిన ఇండియా చాలెంజర్స్ పోటీల్లో భాగంగా 4 మ్యాచ్‌ల్లో 10 వికెట్లు పడగొట్టారు.

–న్యూస్‌టుడే, నంద్యాల క్రీడలు

సోదరీమణులు అదుర్స్

ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన రిశ్వహర్షిణి కీపర్‌గా జట్టులో కీలక భూమిక పోషిస్తోంది. గతేడాది డిసెంబరులో మంగళగిరిలో రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున ఎంపికైంది. కీపర్‌గా మూడు మ్యాచుల్లో ఆరు క్యాచ్‌లు అందుకుని భళా అనిపించింది. గత జూన్‌లో నెల్లూరులో జరిగిన జోన్-4 క్రికెట్ పోటీల్లో అండర్-17 విభాగంలో జిల్లా జట్టు తరఫున ఆడింది. గత నెలలో జరిగిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభ చాటి జిల్లా జట్టులో స్థానం సుస్థిరం చేసుకొంది. రిశ్వహర్షిణి చెల్లి మధుహర్షిణి క్రికెట్‌లో రాణిస్తోంది. అక్టోబరు 29న జిల్లాస్థాయి పోటీల్లో రాణించి జిల్లా జట్టులో స్థానం పదిలం చేసుకొంది. సౌత్ జోన్ పోటీలకు సిద్ధం అవుతోంది.

– న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

సహస్ర 'పరుగులు'

కర్నూలు నగరానికి చెందిన సహస్రరెడ్డి ఓపెనర్‌గా బరిలో దిగి పరుగుల వరద పారిస్తోంది. జాతీయస్థాయి క్రికెటర్ అయిన ఆమె తండ్రి కృష్ణారెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని రాణిస్తోంది. 2024 నవంబరులో గుంటూరులో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-17 జిల్లాస్థాయికి సారథ్యం వహించారు. నాలుగు మ్యాచ్‌లలో 193 పరుగులు సాధించింది. ముందుండి జట్టును విజయ పథంలో నడిపించి జిల్లాకు ట్రోఫీ అందించింది. 2024 డిసెంబరులో రాజస్థాన్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 క్రికెట్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ఆడింది. ఆరు మ్యాచ్‌లలో 120 పరుగులు చేసింది. 2025 ఆగస్టు 13న విశాఖపట్నంలో జరిగిన క్రికెట్ పోటీల్లో దక్షిణ మండలానికి ప్రాతినిధ్యం వహించింది.

– న్యూస్‌టుడే, కర్నూలు క్రీడలు

ఆల్‌రౌండర్ అమృత

పత్తికొండ పట్టణానికి చెందిన అమృత నాలుగో తరగతి నుంచే క్రికెట్ బ్యాట్ పట్టడం ప్రారంభించింది. ఆ బాలిక ఆసక్తి గమనించిన తల్లిదండ్రులు శిక్షణ కేంద్రంలో చేర్పించారు. ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది. అండర్-15, 17, 19 విభాగాల్లో కర్నూలు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తోంది. జట్టులో ఆల్‌రౌండర్‌గా ప్రతిభ చాటుతోంది. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కర్నూలు జిల్లా తరఫున అండర్-19 మహిళా జట్టుకు ఎంపికైంది.

–న్యూస్‌టుడే, పత్తికొండ గ్రామీణ

గెలుపు 'లిఖిత'ం

పత్తికొండకు చెందిన లిఖిత పదో తరగతి చదువుతోంది. పదో తరగతి చదువుతున్న ఈ బాలిక నాన్న వద్దే శిక్షణ పొందుతోంది. 2024-25 స్కూల్ గేమ్స్‌లో అండర్-14 విభాగంలో జిల్లా జట్టులో ఆడి పరుగుల వరద పారించింది. ప్రస్తుతం అండర్-17 విభాగంలో కర్నూలు జిల్లా జట్టు తరఫున ఆడుతోంది. అండర్-15 విభాగంలో ఏపీ రాష్ట్ర మహిళల ప్రాబబుల్స్ జట్టులో స్థానం సంపాదించింది. జాతీయ జట్టులో స్థానం దక్కించుకోవటమే లక్ష్యంగా సాధన చేస్తున్నానని చెబుతోంది లిఖిత.

–న్యూస్‌టుడే, పత్తికొండ గ్రామీణ

ప్రవళిక.. భళా

ఎమ్మిగనూరుకు చెందిన ప్రవళికారెడ్డి పదో తరగతి చదువుతోంది. వాలీబాల్ క్రీడాకారిణి అయిన తల్లి హేమలత కుమార్తెను క్రీడల్లో ప్రోత్సహించారు. ఆమెను జాతీయస్థాయి క్రికెటర్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో శిక్షణ ఇప్పిస్తున్నారు. కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న శిబిరంలో చేర్పించారు. అక్కడి శిక్షకుల సలహా మేరకు ప్రవళిక బౌలింగ్‌పై దృష్టి పెట్టింది. లెగ్ స్పిన్ సాధన చేసి బంతిపై పట్టు సాధించింది. 2025 సెప్టెంబరు 2 నుంచి 15వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగిన ఆంధ్రా ఉమెన్స్ టీ20 లీగ్- 2025లో రాయలసీమ రాణి జట్టు తరఫున నాలుగు మ్యాచ్‌లు ఆడిన ప్రవళిక లెగ్ స్పిన్నర్‌గా రాణించి 12 వికెట్లు తీసింది.

– న్యూస్‌టుడే, కర్నూలు క్రీడలు

కలశ వైభవం

ఉచ్చీరప్ప తాత ఆలయ గోపురంపై ప్రతిష్ఠించిన కలశాలు

పెద్దహోతూరులో ఉచ్చీరప్పతాత ఆలయ గోపురంపై కలశ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మొదటగా గ్రామంలోని పెద్దదేవుడు ఉచ్చీరప్పతాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పండితుల మంత్రోచ్ఛారణల మధ్య కలశ ప్రతిష్ఠాపన గావించారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే విరూపాక్షి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే

దారిలో యమకంకరులు

■ ఎన్‌హెచ్-40పై టిప్పర్ల పరుగులు

పాణ్యం, పాణ్యం గ్రామీణ, న్యూస్‌టుడే : ప్రధాన రహదారులపై టిప్పర్లు దూసుకెళ్తున్నాయి. వాహనదారులు, పాదచారుల ప్రాణాలను బలిగొంటున్నాయి. పరిమితికి మించిన లోడుతో వెళతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. తెలంగాణ రాష్ట్రం మీర్జాగూడ వద్ద ఆర్టీసీ బస్సును కంకర తీసుకెళ్తున్న టిప్పర్ ఢీకొని బస్సుపై పడి 19 మంది చనిపోయారు. ఇక్కడా జాతీయ రహదారి (ఎన్‌హెచ్-40)పై ఇలానే పరుగులు పెడుతున్నాయి.

గుట్టల నుంచి గుట్టుగా

● పాణ్యం మండల పరిధిలోని తమ్మరాజుపల్లె వద్ద 15కుపైగా స్టోన్ క్రషర్లు ఉన్నాయి. నియోజకవర్గ పరిధిలో ఎర్రమట్టి గనులు ఉన్నాయి. ప్రతి రోజూ వందల సంఖ్యలో టిప్పర్లలో కంకర, ఎర్రమట్టి తరలుతోంది.

● తమ్మరాజుపల్లె నుంచి నంద్యాల, కర్నూలు వైపు ప్రతి రోజూ పెద్దసంఖ్యలో టిప్పర్లు తిరుగుతున్నాయి.

● పాణ్యం రైల్వేస్టేషన్ నుంచి జిందాల్ పరిశ్రమకు నిత్యం స్లాగ్‌ను తరలిస్తుంటారు. రహదారులపై టిప్పర్లు కనిపిస్తేచాలు.. జనం హడలిపోతున్నారు. తమపైకి దూసుకొస్తాయనని పక్కకు దిగేస్తుంటారు.

▸ మిల్లులు, టిప్పర్ల యజమానులతో పలువురు అధికారులకు మంచి సంబంధాలున్నాయన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో నిబంధనలు పాటించనివారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

▸ పరిమితికి మించి లోడుతో టిప్పర్లు వెళతున్నా ఎక్కడా కేసులు నమోదు చేయడం లేదు. పాణ్యం, సుగాలిమెట్ట, పాణ్యం డొంగు, ఆర్జీఎం కళాశాల, బలపనూరు, వెంకటేశ్వరపురం, ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో నిత్యం రద్దీ ఉన్నప్పటికీ టిప్పర్ల వేగానికి కళ్లెం పడటం లేదు.

అనుభవం లేకపోయినా..

భారీ వాహనాలు నడపాలంటే తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు ఉండాలి. వివిధ వాహనాలు నడిపిన అనుభవం గడించి ఉండాలి. కానీ టిప్పర్లు, కంకర మిల్లుల యజమానులు వీటిని పట్టించుకోవడం లేదు. అనుభవం లేకపోయినా వాహనాన్ని చేతికిచ్చేస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్సు లేకున్నా పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో వారు చెలరేగిపోతున్నారు. వాహనాలను ప్రధాన రహదారులపై ఇష్టానుసారంగా.. అతివేగంగా నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు.

ఎన్నో ప్రమాదాలు..

▸ 2021లో పాణ్యం ప్రాంతంలోని నూలుమిల్లు వద్ద గొర్రెల మందపై టిప్పరు దూసుకెళ్లడంతో ఇద్దరు వ్యక్తులతోపాటు 20 గొర్రెలు, మేకలు మృత్యువాత పడ్డాయి.

▸ 2022లో అదే నూలుమిల్లు వద్ద ఓ టిప్పరు ఆవుల మందపైకి దూసుకురావడంతో 5 మృతి చెందాయి. అదే ఏడాది తమ్మరాజుపల్లె వద్ద గొర్రెల మందపైకి వెళ్లడంతో 20 జీవాలు ప్రాణాలు కోల్పోయాయి.

▸ 2023లో బలపనూరు మెట్ట సమీపంలో గొర్రెల మందను టిప్పరు ఢీకొన్న ఘటనలో 25 గొర్రెలు మృతి చెందాయి.

▸ 2023లో నెరవాడమెట్ట వద్ద కళాశాల బస్సును టిప్పరు ఢీకొట్టడంతో బస్సు క్లీనర్ మృతి చెందారు. 2024లో పాణ్యం బస్టాండ్ వద్ద ఆకాశవంతెనపై ద్విచక్రవాహనాన్ని టిప్పరు ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు.

శ్రీగిరి క్షేత్రం.. దేదీప్యమానం

ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రం.. సోమవారం భక్తులతో కళకళలాడింది. తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు శ్రీగిరికి తరలివచ్చారు. తెల్లవారుజామున నుంచే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం కార్తిక దీపాలు వదిలారు. శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లను దర్శించుకున్నారు. క్యూలైన్లలో ఉన్న భక్తులకు దేవస్థానం తరఫున శివసేవకులు అల్పాహారం, పాలు, మంచినీరు పంపిణీ చేశారు. గంగాధర మండపం, నంది మండపంతో పాటు వీధుల్లోనూ భక్తులు పెద్దఎత్తున కార్తిక దీపాలు వెలిగించారు.

– న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం

6న ఉద్యోగ మేళా

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : నగరంలో ఈనెల 6వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారిణి పి.దీప్తి తెలిపారు. రిలయన్స్ కన్జ్యూమర్ ప్రోడక్ట్స్ లిమిటెడ్‌లో మ్యానుఫ్యాక్చరింగ్ ఆపరేటర్ ఉద్యోగాలు 120 ఉన్నాయన్నారు. డిప్లొమా, ఐటీఐ చదివిన అనుభవం కలిగిన 24 ఏళ్ల వయసున్న అభ్యర్థులు అర్హులన్నారు. కనీస వార్షిక వేతనం రూ.3 లక్షలు నిర్ణయించారన్నారు. నిరుద్యోగ అభ్యర్థులు తమ వివరాలను www.nic.gov.in లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ధ్రువపత్రాలు, ఫొటోలతో ఉద్యోగ మేళాకు హాజరుకావాలన్నారు.

మేధో వికాసం ఏఐ ఆహ్వానం

డోన్ పట్టణం, న్యూస్‌టుడే : ప్రపంచమంతా కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్- ఏఐ) దిశగా పరుగెడుతోంది. ఈ నేపథ్యంలో యువతను ప్రోత్సహించేందుకు కేంద్రం యువ ఏఐ గ్లోబెల్ యూత్ ఛాలెంజ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతిభావంతులకు ప్రోత్సహించడమేకాక వారికి మెరుగైన అవకాశాలు కల్పించాలని నిర్ణయించింది.

నగదు బహుమతుల వివరాలు

✤ యువ ఏఐ గ్లోబెల్ యూత్ ఛాలెంజ్ పోటీల్లో ప్రథమంలో నిలిచిన మూడు బృందాలకు రూ.15 లక్షలు, ద్వితీయ స్థానంలో నిలిచిన మూడు బృందాలకు రూ.10 లక్షలు, ప్రత్యేక బహుమతి కింద రెండు బృందాలకు రూ.5 లక్షల చొప్పున అందజేస్తారు.

✤ 13-17 ఏళ్లలోపు వారికి తల్లిదండ్రుల ఖాతాల్లో నగదు జమ చేస్తారు.

✤ 18-21 ఏళ్ల వయస్సువారికి బృంద సారథి ఖాతాలో నగదు జమ చేస్తారు.

✤ సమ్మిట్‌కు హాజరయ్యే విద్యార్థులు, యువతీయువకులకు ప్రయాణ, వసతి సౌకర్యాలు కల్పిస్తారు.

అర్హులెవరంటే..

యువ ఏఐ గ్లోబెల్ యూత్ ఛాలెంజ్‌లో పాల్గొనేందుకు 13 నుంచి 21 ఏళ్ల లోపు 8వ తరగతి నుంచి పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్ విద్యార్థులు, యువతీ యువకులు అర్హులు.

దరఖాస్తు విధానం

యువ ఏఐ గ్లోబెల్ యూత్ ఛాలెంజ్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థులు, యువతీ యువకులు ఈనెల 30వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీఎస్:///ఐఎంపీఏసీటీ.ఐన్‌డీఐఏఏఐ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇవి రూపొందించాలి

టెక్నాలజీ, ఓపెన్ ఇన్నోవేషన్, పర్యావరణ పరిరక్షణ, ప్రజలు, సామాజిక సాధికారత, ప్రాథమిక రంగాలు (వ్యవసాయం, పరిశ్రమలు, రవాణా), గ్రీన్ ఎనర్జీ, స్మార్ట్ ఎకో సిస్టమ్స్, సుస్థిర నగరాలు వంటి అంశాలపై ప్రాజెక్టులు రూపొందించి అందించాల్సి ఉంటుంది.

ఎంపిక ఇలా..

ప్రాథమిక ఎంపిక, ప్రాజెక్టు మెరుగుదల, ఇంటర్వ్యూ ద్వారా విజేతలను ఎంపిక చేస్తారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే గ్లోబెల్ ఏఐ సమ్మిట్‌లో ప్రదర్శించేందుకు అవకాశం కల్పిస్తారు.

కార్యశాలకు ఆహ్వానం

కృత్రిమ మేధో పరిజ్ఞానం, సృజనాత్మకత ఆలోచనలు, బాధ్యతాయుత వినియోగ పద్ధతులకు చెందిన ఆలోచనలు చేసే అవకాశం ఉంది. వీటి ద్వారా నగదు బహుమతి అందుకునే చక్కటి అవకాశాన్ని కల్పిస్తోంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (దిల్లీ) ఆధ్వర్యంలో నిర్వహించే ఏఐ నిపుణుల కార్యశాలలో పాల్గొనే అవకాశం ఉంది.

బి.తాండ్రపాడులో అప్రెంటిస్‌షిప్ మేళా

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : నగర పరిధిలోని బి.తాండ్రపాడులో ఉన్న ప్రభుత్వ బాలికల ఐటీఐలో ఈనెల 10వ తేదీన అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ నాగరాజు తెలిపారు. ఐటీఐ పూర్తి చేసిన ఆసక్తిగల అభ్యర్థులు apprenticeshipindia.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

కలుపుతో కంది పోనీయొద్దు

రాయితీతో పాడి రైతులకు చేయూత

6

ecoren WALK-IN INTERVIEWS
Ecoren Energy is looking for experienced professionals for Wind and Solar Power Projects in Kurnool, Anantapur and Kadapa.
: Positions :
Civil Engineers, Electrical Engineers, Site Managers
: Experience :
2–12 years in Wind/Solar Project Execution
Interview Dates :
08th November 2025 — 09:00 AM to 06:00 PM
09th November 2025 — 09:00 AM to 01:00 PM
Venue : HOTEL ALEXANDER, Saptagiri Circle, Anantapur
Contact : 7331122450, Email: hr@ecorenenergy.com

సమస్యలు వింటారు.. వేగంగా పరిష్కరిస్తారు

■ 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూం ఏర్పాటు ■ టోల్‌ఫ్రీ నంబరు 1800 425 4299

ఈనాడు, కర్నూలు : జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని.. వేగంగా పరిష్కరించాలన్న లక్ష్యంతో కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి నూతన వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. 24 గంటల పాటు అందుబాటులో ఉండే విధంగా 'ప్రత్యేక కంట్రోల్ రూం'ను ఏర్పాటు చేశారు. దీనికి టోల్‌ఫ్రీ నంబరు 1800 425 4299 కేటాయించారు.

నాలుగు కీలక విభాగాలపై దృష్టి

❑ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, వసతిగృహాలు, పారిశుద్ధ్యం, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై మొదట దృష్టిపెట్టాలని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. మొదట ఈ నాలుగు విభాగాల పనితీరును మెరుగుపర్చాలని చెప్పారు.

❑ ప్రతివారం తమకు అప్పగించిన మండలం, నియోజకవర్గానికి వెళ్లి ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలు, వసతిగృహాలను పరిశీలించి సేవలు మెరుగయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రత్యేకాధికారులను కలెక్టర్ ఆదేశించారు.

వీటినీ అనుశీలన చేస్తారు

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులపై టీవీల్లో వచ్చే స్క్రోలింగ్‌లు, కథనాలు, పత్రికల్లో ప్రచురితమయ్యే కథనాలను కంట్రోల్ రూం సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలించి సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తారు. ఆయా కథనాల ఆధారంగా ప్రభుత్వపరంగా చేపట్టాల్సిన చర్యలను వేగవంతం చేస్తారు.

మూడు షిఫ్టుల్లో విధులు

▸ సచివాలయాల్లో మిగులు సిబ్బందిని ఇందులో నియమించారు. 23 మంది సిబ్బంది మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తిస్తారు.

▸ టోల్‌ఫ్రీ నంబరుకు వచ్చిన ఫిర్యాదును వెంటనే సంబంధిత అధికారులకు పంపుతారు. ఆయా అధికారులు వాటిని సాధ్యమైనంత వేగంగా పరిష్కరించాలి.

▸ నిధులు అవసరం లేని సమస్యలైతే అదేరోజు పరిష్కరించాలి.

ఫిర్యాదుదారులకు జవాబు

నిధులు అవసరమయ్యే వాటిని ఎన్ని రోజుల్లో పరిష్కరిస్తారన్న విషయాన్ని కలెక్టర్‌కు నివేదిక ఇవ్వాలి. ఆ నివేదిక ప్రకారం కంట్రోల్ రూం సిబ్బంది ఫిర్యాదుదారులకు ఫోన్‌చేసి సమస్య ఎన్నిరోజుల్లో పరిష్కారం అవుతుందో సమాచారం ఇస్తారు.

సంతృప్తికరమైన సేవలు అందించాలి

- డాక్టర్ ఎ.సిరి, కలెక్టర్

ప్రజలకు సంతృప్తికరమైన సేవలు అందించాలన్న లక్ష్యంతో టోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటు చేశాం. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, ప్రభుత్వ వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిబంధనల ప్రకారం నాణ్యమైన సేవలు అందాలి. సేవా లోపాలపై ప్రజలు టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరిస్తాం. జిల్లాలో ఎక్కడైనా పారిశుద్ధ్య సమస్యలు తలెత్తినా ఫిర్యాదు చేయవచ్చు. యుద్ధప్రాతిపదికన పనులు చేపడతాం.

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ డా.సిరి

ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణ

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ప్రకృతి వ్యవసాయంతో రైతుల ఆర్థికాభివృద్ధి, ప్రజారోగ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని కలెక్టర్ డా.ఎ.సిరి పేర్కొన్నారు. స్థానిక ఎ.క్యాంపులోని ఉద్యానభవన్‌లో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయంపై క్లస్టర్ రిసోర్స్‌పర్సన్లకు ఐదు రోజులపాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రసాయన ఆధారిత వ్యవసాయంతో భూసారం తగ్గిపోతోందన్నారు. పాడి పశువుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రుణాలు అందిస్తోందని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

జ్ఞాపకాల మదిలో...
జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృత్యస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి
మీరు చూపిన ఆత్మీయత ..
అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట
మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.
ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని
భావాలను అక్షర రూపంలో నివేదించడం తప్ప
స్మృతి, వర్ధంతి, జయంతి
ప్రకటనల వివరాలకు
కర్నూలు: 99899 97628
80080 12489
నంద్యాల: 90007 66039, ఆదోని: 80087 09793

(c) eenadu

మహానందిలోని నాగులకట్ట వద్ద కార్తికదీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఓంకార క్షేత్రంలో విల్వార్చన చేస్తున్న భక్తులు

కార్తికశోభతో మహానంది కళకళ

మహానంది, బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రం కార్తికమాసం రెండో సోమవారం వేలాది మంది భక్తులు గంగా కామేశ్వరీదేవి సహిత మహా నందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. స్వామి వారిని అభిషేకించి పూజలు చేసుకున్నారు. పవిత్ర రుద్రగుండం పుష్కరిణి, చిన్న కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించారు. క్యూ లైన్లలో దర్శనాలు చేసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈవో ఎర్రమల మధు, పర్యవేక్షకులు అంబటి శశిధరరెడ్డి, నీలకంఠరాజు, ప్రోటోకాల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

గంగా హారతి: మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రంలో దేవస్థానం ఆధ్వర్యంలో చిన్న కోనేరులో ప్రవహిస్తున్న గంగమ్మకు గంగా హారతి వేడుక ఘనంగా జరిగింది. కార్తికమాసం రెండో సోమవారం సందర్భంగా ప్రధానార్చకులు అర్జునశర్మ, వేదపండితులు రవిశంకరఅవధాని, నాగేశ్వరశర్మ, శాంతారామ్‌భట్లు ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, నంద్యాల రామకృష్ణా విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డితో పాటు పలువురు దాతలు, భక్తులు పూజలు చేసి.. గంగా హారతులు ఇచ్చారు.

మహానందిలో గంగా హారతి ఇస్తున్న అర్చకులు, పండితులు

యాగంటిలో భక్తుల సందడి

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కార్తిక మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో వరుసలన్నీ కిక్కిరిసిపోయాయి. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి కార్తిక దీపాలు వెలిగించారు. ఆలయంలోని వేంకటేశ్వరస్వామి, అగస్త్యముని గుహలు వద్ద భక్తుల రద్దీ నెలకొంది. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయాధికారి పాండురంగారెడ్డి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

క్యూలైన్లలో భక్తులు

కోనేరులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ఆత్మవిశ్వాసంతో ముందడుగేయాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: విభిన్న ప్రతిభావంతులు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని కలెక్టర్ డా.ఎ.సిరి సూచించారు. నగరంలోని కలెక్టరేట్‌లో ఉన్న సునయన ఆడిటోరియంలో సోమవారం విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్లు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ దివ్యాంగులకు ట్యాబ్ ఫోన్లు, వీల్‌ఛైర్లు, ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా ప్రతిభావంతులకు సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌వో వెంకటనారాయణమ్మ, విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్లు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయీస్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ట్యాబ్ ఫోన్లు అందిస్తున్న కలెక్టర్ డా.సిరి

పత్తి దిగుబడులు ఎత్తుకెళ్లారని ఫిర్యాదు

సమస్య వింటున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: తమ పొలంలో ఆరబెట్టిన 220 బస్తాల పత్తిని ఎత్తుకెళ్లిన వారిపై చర్యలు తీసుకోవాలని దేవనకొండ మండలం అలారుదిన్నెకు చెందిన వీరభద్రగౌడ్ ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు విన్నవించారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 97 మంది బాధితులు ఎస్పీకి ఫిర్యాదులు అందజేశారు. కర్నూలు మండలం మిలిటరీకాలనీ సమీపంలోని సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని నంద్యాలకు చెందిన దుర్గాప్రసాద్ రూ.1.80 లక్షలు తీసుకుని మోసగించాడని నూతనపల్లెకు చెందిన లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశారు. ప్రేమ వివాహం చేసుకున్న తనకు భర్త నుంచి ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని ఉల్చాలకు చెందిన ఓ వివాహిత కోరారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న తన భర్త ఆచూకీ కనిపించడం లేదని ప్రకాశం జిల్లా కంబం గ్రామానికి చెందిన సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. కర్నూలులోని షరాఫ్‌బజార్‌కు చెందిన నగేష్, ప్రవీణ్‌లు తన 22 తులాల బంగారాన్ని తాకట్టు పెట్టుకుని రూ.10 లక్షలు ఇచ్చారని, వడ్డీతో సహా మొత్తం చెల్లించినా బంగారం ఇవ్వకుండా అదృశ్యమయ్యారని శాలివాహనకాలనీకి చెందిన రమేష్ విన్నవించుకున్నారు. సమస్యలు విన్న ఎస్పీ మాట్లాడుతూ విచారణ జరిపించి చట్ట పరిధిలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

వేరుసెనగ వర్షార్పణం

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో అకాల వర్షంతో వ్యవసాయ మార్కెట్ యార్డులో టెండర్ కోసం ఉంచిన వేరుసెనగ దిగుబడులు తడిసి రైతులు ఇబ్బందులు పడ్డారు. సోమవారం మధ్యాహ్నం ఆకస్మాత్తుగా వర్షం కురిసింది. రైతులు టార్పాలిన్లు తెచ్చి, కుప్పలపై కప్పి.. దిగుబడిని కాపాడుకునే యత్నం చేశారు. దిగుబడులు పూర్తిగా తడిసిపోయాయి. వరద నీటిలో కొట్టుకుపోతున్న వేరుసెనగ కాయలను కూలీలు సంచుల్లోకి ఎత్తుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

వేరుసెనగను చాటతో ఎత్తుతున్న మహిళా కూలీలు

కలుపుతో కంది పోనీయొద్దు

సాగు చేసిన కంది పంట

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: పప్పు ధాన్యాల్లో కంది పంట ప్రధానం. ప్రొటీన్లు, విటమిన్లు సమృద్ధిగా లభించే కంది కర్నూలు, నంద్యాల జిల్లాలో రబీలో అధికంగా సాగు చేస్తున్నారు. కంది పంట సాగు చేయడంతో నేలలో సేంద్రియ పదార్థాన్ని మెరుగుపరిచి భూమిని సారవంతంగా మార్చవచ్చు. పంటలో సస్యరక్షణ పోషణ, కలుపు నివారణతో మంచి దిగుబడి సాధించవచ్చని ఆళ్లగడ్డ వ్యవసాయ సహాయ సంచాలకుడు కిశోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

విత్తన శుద్ధి: విత్తనంతో వ్యాపించే తెగుళ్లు తగ్గించేందుకు కిలో విత్తనానికి సుమారు పది గ్రాముల ట్రైకోడెర్మా విరిడి పొడరును కలపాలి. ఈ జీవశిలీంధ్రం వల్ల ఎండు తెగులు వంటి ప్రమాదకర పరిస్థితులను ముందుగానే నివారించవచ్చు. రబీలో హెక్టారుకు 12-15 కిలోల వరకు విత్తనాలు వేయవచ్చు. నాగలి వెంట లేదా సాళ్లలో గొర్రుతో కాని సీడ్ డ్రిల్‌తో విత్తనాలు విత్తుకోవాలి.

ఎరువుల వాడకం: ఎకరానికి రెండు టన్నుల సేంద్రియ ఎరువు వినియోగించాలి. రసాయన ఎరువులు హెక్టారుకు 20 కిలోల నత్రజని, 50 కిలోల భాస్వరం వాడాలి. పంట 35-40 రోజుల దశలో 20 కిలోల నత్రజని వేసుకోవాలి.

నీటి నిర్వహణ: పైరు ఎదుగుదల దశ (70-80 రోజులు), కాయ ఏర్పడే దశలో రెండు తేలికపాటి తడులు ఇవ్వాలి. నీరు అధికంగా నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

ఇలా చేయాలి..: ఎకరాకు 200 లీటర్ల నీటిలో లీటరు పెండిమిథాలిన్ 30% 1-1.5 కలిపి విత్తు విత్తిన వెంటనే లేదా మరుసటి రోజు పిచికారీ చేయాలి. కలుపు పెరిగితే 30, 60 రోజులకు గొర్రుతో అంతర కృషి చేయాలి. గడ్డి జాతి, వెడల్పు ఆకు కలుపుల నివారణకు ఎకరాకు 200 లీటర్ల నీటిలో 300 మి.లీ. ఇమాజితాపిర్ 5% మందు కలిపి పిచికారీ చేయాలి. అంతర పంటలుగా పెసర, మినుము, వేరుసెనగ, సోయాచిక్కుడు సాగు చేసుకోవాలి.

రైతేరాజు

రాయితీతో పాడి రైతులకు చేయూత

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ డాక్టర్ వసంతలక్ష్మి

రాయితీ వివరాలు	
విస్తీర్ణం (సెంట్లు)	అందే సాయం (రూ.లలో)
50	32.992
40	26.394
30	19.790
20	13.195
10	6.559

వెలుగోడు, న్యూస్‌టుడే: జాతీయ ఉపాధి హామీ పథకం కింద పాడి రైతులు పశుగ్రాసం సాగు చేసుకునేందుకు వందశాతం రాయితీతో గరిష్ఠంగా 50 సెంట్ల వరకు అనుమతి లభించింది. ఈ పథకం పరిధిలో పశుగ్రాసం సాగు చేసుకునేందుకు రైతులకు కొన్ని అర్హతలు తప్పనిసరి. జాబ్‌కార్డు ఉండాలి, ఐదు ఎకరాలలోపు పొలం ఉండాలి, రైతు సేవా కేంద్రం, మండల పశు వైద్యాధికారిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని పశువైద్య సహాయ సంచాలకురాలు డాక్టర్ వసంతలక్ష్మి తెలిపారు. సన్న, చిన్న కారు రైతులకు పచ్చగడ్డి సాగు చేసుకొనేందుకు ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తోందని రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధికారులు రైతుల దరఖాస్తులు పరిశీలించి, అర్హత ఉండి, నీటి వసతి కలిగిన రైతులను ఎంపిక చేస్తారని ఆమె తెలిపారు.

మొక్కజొన్న విత్తుకోవచ్చు

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో రబీ మొక్కజొన్నను నవంబరు 15 వరకు విత్తుకునేందుకు అనుకూలమని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి తెలిపారు. విత్తనం ఎకరానికి హైబ్రిడ్ రకాలు 8-10 కిలోలు దేశీ రకాలు 12-15 కిలోలు అవసరమన్నారు. వరుసల మధ్య 60 సెం.మీ. మొక్కల మధ్య 20 సెం.మీ. దూరం విత్తుకోవాలన్నారు. ఎకరానికి 33వేల నుంచి 35వేల మొక్కలు ఉండేలా చూడాలన్నారు. ఎకరానికి 55 కిలోల యూరియా, భాస్వరం 76 కిలోలు, పొటాష్ 58 కిలోలు వేసుకోవాలన్నారు. యూరియా ఎకరానికి 25-30, 45-50, 60-65 రోజుల దశలో మూడు దఫాలుగా వేసుకోవాలి. మూడేళ్ల (మూడు పంటలకు) ఒకసారి 20కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి. కలుపు నివారణకు విత్తిన వెంటనే ఎకరానికి అట్రాజిన్ మందు కిలో నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

సందేహాలు సమాధానాలు

?: కుసుమ పంట రబీలో ఎప్పటి వరకు విత్తుకోవచ్చు.
– రామచంద్రుడు, హాల్వి

✓: రబీలో కుసుమ నవంబరు నెలాఖరు వరకు వేసుకోవచ్చు. అనువైన రకాలు ఐఎస్ఎఫ్764, డీఎస్‌హెచ్-85. ఎకరానికి 4 కిలోల విత్తనం విత్తాలి. ఎకరానికి 6-7 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.
– ధనలక్ష్మి, కేవీకే శాస్త్రవేత్త, బనగానపల్లి

వరి పంట.. కాస్త జాగ్రత్త

హాలహర్వి, న్యూస్‌టుడే: జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు పంట నేలవాలింది. వివిధ దశల్లో ఉన్న వరి పంటను చిన్నపాటి జాగ్రత్తలతో కాపాడుకోవచ్చని హాలహర్వి మండల వ్యవసాయధికారి జిలానీబాషా తెలిపారు. తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు పలు సూచనలు చేశారు.

- పాల దశలో ఉన్న వరి పంట నేలవాలితే.. పొలంలో నీటిని చిన్నపాటి కాల్వల ద్వారా తొలగించాలి. గింజలు మారడం, మాగుడు, మాని పండు తెగులు వ్యాప్తి నివారణకు ఎకరానికి 200 మి.లీ. ప్రొపికోనజోల్ పిచికారీ చేయాలి.
- గింజ పట్టే దశలో ఉంటే నీటిని తొలగించడంతో పాటు వాలిన పంటలో కంకిలో మొలకలు కనిపిస్తే నైదు శాతం ఉప్పు ద్రావణం కలిపి పిచికారీ చేయాలి. ఇది మొలకల్లో రంగు మార్పును తగ్గిస్తుంది.
- ఆలస్యంగా నాటిన పంట ప్రస్తుతం పిలక దశలో ఉంది. నీరు తగినంతంగా ఉండేలా చూసుకోవాలి. నీటి నిల్వ తగ్గించాలి. పంట పూర్తిగా మునిగితే నీరు తొలగించి, పునరుద్ధరణ కోసం యూరియా 20 కిలోలు, మ్యూరెట్ ఆఫ్ పొటాష్ 20కిలోలు బూస్టర్ మోతాదుగా వేయాలి.
- పంటలను నిత్యం పరిశీలిస్తుండాలి. బ్యాక్టీరియా ఎండాకు తెగులు కనిపిస్తే.. లీటరు నీటికి పామ్‌టోమైసిన్ 1.0 మి.లీ., లీటరు నీటికి కోసైడ్ (కాపర్ హైడ్రాక్సైడ్) 2.0 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. పొలంలో నీరు తగ్గిన తర్వాత హెక్సాకోనా జోల్ 400 మి.లీ. లేదా ప్రొపికొనజోల్ 200 మి.లీ. ఎకరాకు పిచికారీ చేయడం వల్ల మాగుడు తెగులు వ్యాప్తి తగ్గుంతుందని వివరించారు.



నేలవాలిన వరి

బస్సు ప్రమాద ఘటనపై కేంద్ర బృందం విచారణ

బస్సు ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న కమిటీ ప్రతినిధులు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : కర్నూలు శివారులో చిన్నటేకూరు-చెట్లమల్లాపురం గ్రామాల మధ్య గతనెల 24వ తేదీ తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై కేంద్ర బృందం సోమవారం విచారణ ప్రారంభించింది. కేంద్ర రవాణాశాఖ ఉన్నతాధికారులు విచారణ బాధ్యతను సేవ్ లైఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు మల్లికార్జున్ పాటిల్‌తో పాటు మరో ముగ్గురు సభ్యులకు అప్పగించారు. రోడ్డు ప్రమాదాల విశ్లేషణలో అనుభవం కలిగిన కమిటీ సభ్యులు సోమవారం ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ఉదయం రెండు గంటల పాటు ఘటనా స్థలాన్ని, ప్రమాదానికి గురైన బస్సును పరిశీలించారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు మరోసారి బస్సును అన్ని కోణాల్లో పరిశీలించి ఫొటోలు తీసుకున్నారు. బస్సు దగ్ధమైన చోట జాతీయ రహదారి నాణ్యతను పరిశీలించారు. పోలీసు అధికారులతో మాట్లాడి ఎఫ్ఐఆర్ కాపీ, ప్రమాదం నుంచి బయటపడిన వారి వివరాలు, వారి ఫోన్ నంబర్లు సేకరించారు. కార్యక్రమంలో పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య, ఉలిందకొండ ఎస్సై ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు తిరుపతి, ఒంగోలులో శిక్షణ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి సివిల్ కానిస్టేబుళ్లుగా ఎంపికైన అభ్యర్థుల శిక్షణకు ఉన్నతాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎంపికైన వారిలో 88 మందిని ఒంగోలు పోలీసు శిక్షణ కేంద్రానికి, 196 మందిని తిరుపతి పోలీసు శిక్షణ కేంద్రానికి కేటాయించారు. వీరు ఆయా కేంద్రాల్లో తొమ్మిది నెలల పాటు శిక్షణ పొందనున్నారు. శిక్షణ ప్రారంభించే తేదీల వివరాలను ఉన్నతాధికారులు త్వరలో వెల్లడిస్తారు.

డిసెంబరు 13న జాతీయ లోక్ అదాలత్

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : డిసెంబరు 13వ తేదీన జిల్లాలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి తెలిపారు. నగరంలోని న్యాయ సేవా సదన్‌లో సోమవారం ఆయన ఆబ్కారీశాఖ అధికారులతో సమావేశమయ్యారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని చెప్పారు. జీవో 417 ప్రకారం కాంపౌండ్ స్థాయి ఆబ్కారీ కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. సహాయ పర్యవేక్షణాధికారి రామకృష్ణారెడ్డి, సీఐలు చంద్రహాస్, మంజుల పాల్గొన్నారు.

విజయదుర్గా ఆగ్రో పరిశ్రమ దుకాణం ప్రారంభం

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు ఎంజీ ఆటో నగర్‌లో శ్రీ విజయదుర్గా ఆగ్రో పరిశ్రమ దుకాణం ఏర్పాటు చేశారు. దీనిని సోమవారం ఆ దుకాణ యజమాని బి.సుబ్రహ్మణ్యం దంపతులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పరికరాలైన రోటావేటర్, హార్వెస్టర్ టిల్లర్, బేలర్, స్ప్రేయర్లు, సీడ్ డ్రిల్, పవర్ టిల్లర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కత్తార్ హార్వెస్టర్ రాయలసీమ డిస్ట్రిబ్యూటర్‌గా తాము సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రొటోకింగ్ రోటావేటర్ ఎండీ ఎంఎం పటేల్, ధీరజ్‌రెడ్డి, హార్వెస్టర్ వైస్ ప్రెసిడెంట్ ఐ.మనోహర్, వెలవలి మౌళాలి, బనగానపల్లె బయన్న, హరివరం హుసేన్ తొండలదిన్నె భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాల దుకాణాన్ని ప్రారంభిస్తున్న యజమాని సుబ్రహ్మణ్యం

డ్రగ్ ఏడీ బాధ్యతల స్వీకరణ

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : జిల్లా డ్రగ్ ఏడీగా రమేష్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఔషధ దుకాణదారులు వైద్యులు రాసిచ్చిన చీటీ లేకుండా మందులు విక్రయించకూడదన్నారు. మందుల షాపుల్లో ఫార్మసిస్టులు కచ్చితంగా ఉండాలని స్పష్టం చేశారు.

అలరించిన పౌరాణిక నాటకాలు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : కర్నూలు టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న 'కర్నూలు ఉత్సవ్'లో భాగంగా మూడోరోజు సోమవారం ప్రదర్శించిన పౌరాణిక, సాంఘిక నాటకాలు అలరించాయి. గయోపాఖ్యానం, శ్రీకృష్ణ తులాభారం, బాలనాగమ్మ, రామాంజనేయ యుద్ధం, చింతామణి తదితర నాటకాలను కళాకారులు ప్రదర్శించారు. అంతకుముందు రవీంద్ర పాఠశాల విద్యార్థులు తెలుగుతల్లి వైభవాన్ని కీర్తిస్తూ ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. నృత్యంలో విశిష్ట సేవలు అందించిన నాట్యాచార్యులు నారాయణస్వామి, విజయలక్ష్మి, మల్లేశ్వరి, కరీముల్లా, రోహిత్‌కుమార్ తదితరులను డిప్యూటీ కలెక్టర్ కొండయ్య, కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సభ్యులు గాండ్ల లక్ష్మన్న, సంగా ఆంజనేయులు తదితరులు సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

నాట్యాచార్యుడు రోహిత్‌కుమార్‌ను సత్కరిస్తున్న డిప్యూటీ కలెక్టర్ కొండయ్య, కళాక్షేత్రం ప్రతినిధులు ఓబులయ్య, లక్ష్మన్న తదితరులు

డిప్యుటేషన్‌పై విధులు కేటాయింపు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : జిల్లా పరిషత్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల్లో 12 మందిని డీడీవో కార్యాలయాల్లో డిప్యుటేషన్‌పై నియమించినట్లు సీఈవో నాసరరెడ్డి తెలిపారు. ఆదోని, పత్తికొండ, డోన్, ఆత్మకూరు కేంద్రాల్లో విధులు నిర్వహించాలని వారిని ఆదేశించామన్నారు.

విశ్రాంత వైద్యులపై చర్యలకు ఉత్తర్వులు

కర్నూలు వైద్యం, న్యూస్‌టుడే : కర్నూలు, ఆదోనిలో అనర్హులు నర్సింగ్‌హోంలు, ఆసుపత్రులు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో విజిలెన్స్ అధికారులు 2017లో నిర్వహించిన దాడుల ఆధారంగా బాధ్యులైన 19 మందిపై చర్యలు తీసుకుంటూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలులోని జేపీ చిల్డ్రన్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఆదోనిలోని విజయగౌరి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో అప్పట్లో తనిఖీలు నిర్వహించి అక్రమాలు నిర్ధారించారు. ఆ నివేదికల ఆధారంగా 19 మందిపై చర్యలు తీసుకున్నారు. అప్పట్లో కర్నూలు జీజీహెచ్ సర్జన్ డాక్టర్ కృష్ణనాయక్, నాటి తిరుపతి ఈఎస్ఐ ఆసుపత్రి స్పెషల్‌గ్రేడ్ సివిల్ సర్జన్ డాక్టర్ సీకే రమేశ్‌కుమార్, నాటి కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ జె.వీరాస్వామి తదితరులు బాధ్యులని నిర్ధారించారు. వారు ముగ్గురూ ఉద్యోగ విరమణ చేయడంతో వారి పింఛనులో ప్రతినెలా 9 శాతం చొప్పున మూడేళ్లపాటు కోతపెట్టాలని ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది.

పత్తి రైతుల ఆందోళన

■ ఎంపీ చొరవతో కొనుగోళ్లు

గూడూరు, న్యూస్‌టుడే: పెంచికలపాడు సమీపంలోని సీసీఐ కేంద్రం వద్ద సోమవారం పత్తి రైతులు ఆందోళన చేశారు. కేంద్రానికి తెచ్చిన పత్తిని కొనుగోలు చేయాలని వేడుకున్నారు. స్లాట్ బుకింగ్ అయిన వారిది మాత్రమే కొనుగోళ్లు చేస్తామని అధికారులు చెప్పారు. చరవాణికు సందేశం రావడంతో పత్తి దిగుబడులు తీసుకొచ్చామని.. ఇప్పుడు మీరు బుక్ చేసుకోలేదంటే ఎలా అంటూ కర్నూలు- బళ్లారి రహదారిపై రైతులు బైఠాయించారు. అదే దారి నుంచి వెళ్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజుకు రైతులు సమస్యను విన్నవించుకున్నారు. ఆయన కేంద్రంలోకి వెళ్లి అధికారులతో మాట్లాడారు. కలెక్టరుకు చరవాణిలో సమస్య వివరించగా ఆమె ఆదేశాలతో.. చరవాణులకు సందేశాలు వచ్చిన వారి పత్తిని కొనుగోళ్లు చేయడంతో రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ నాగరాజు

పత్తిలో తేమ శాతం 12 లోపు ఉండాలి

పెంచికలపాడు(గూడూరు గ్రామీణం),న్యూస్‌టుడే: గూడూరు మండలంలోని పెంచికలపాడు గ్రామం శివారులో ఉన్న మన్జీత్ పత్తి మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మీ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పత్తిలో తేమ శాతం 8 నుంచి 12శాతం వరకు ఉండేలా చూసుకోవాలన్నారు. సీఎం యాప్, కపాస్ కిసాన్ యాప్‌ల సర్వర్‌కు సంబంధించిన సమస్యలపై రైతులకు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీసాలురెడ్డి, మండల వ్యవసాయాధికారి దస్తగిరి రెడ్డి, వ్యవసాయ సహాయకులు గిరి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీఎం విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: ఐఐటీఎంలో చదువుతున్న ఓ విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించిన ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల వివరాల మేరకు... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కర్నూలు జిల్లాకు చెందిన భాస్కర్ రెడ్డి కుమార్తె శివకుమారి(25) చెన్నై కొట్టూర్‌పురంలోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ ఐఐటీఎంలో ఎంటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈమె గత కొన్ని రోజులుగా మానసిక ఒత్తిడిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం హాస్టల్ గదిలోని స్నానాల గదిలో ఉన్న 'డెటాల్' ద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించింది. తర్వాత విషయాన్ని తనతో పాటు గదిలో ఉంటున్న స్నేహితురాలికి చెప్పడంతో ఆమె వెంటనే ఆళ్వార్‌పేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డెంగీతో బాలుడి మృతి

కోడుమూరు, న్యూస్‌టుడే: కోడుమూరు పట్టణంలో ఓ బాలుడు(8) డెంగీ బారినపడి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. గోనెగండ్ల మండలం ఎర్రబాడు గ్రామానికి చెందిన బాలుడి కుటుంబం గత కొంత కాలంగా కోడుమూరులో నివాసం ఉంటున్నారు. తమ కుమారుడు డెంగీ బారినపడటంతో తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రిలో కోలుకోలేక మృత్యువాతపడ్డాడు. బాలుడు రెండో తరగతి చదువుతున్నాడు. బాలుడి సొంత గ్రామంలోని ఎర్రబాడులో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

బహిరంగ ప్రకటన

కర్నూలు జిల్లా, కర్నూలు మండలం, గొందిపర్ల గ్రామం ఆంధ్రప్రదేశ్ వద్ద గల టి.జి.వి.ఎస్.ఆర్.ఎ.ఎ.సి లిమిటెడ్ తమ క్లోరో-ఆల్కలి ఉత్పత్తులను 1420 టి.పి.డి నుండి 1620 టి.పి.డి వరకు మరియు సింథటిక్ ఆర్గానిక్ కెమికల్స్ 333.48 టి.పి.డి నుండి 507.58, పి.టి.ఎఫ్.ఈ 40 టి.పి.డి, సి.పి.వి.సి 200 టి.పి.డి, పి.ఎ.సి 100 టి.పి.డి మరియు హైడ్రోజన్ పెరాక్సైడ్ 100 టి.పి.డి వరకు విస్తరించుటకు పర్యావరణం అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ (ఎం.ఓ.ఇ.ఎఫ్ మరియు సిసి), భారత ప్రభుత్వం న్యూఢిల్లీ వారిచే పర్యావరణ అనుమతి ఇవ్వబడినది. అని ఇందుమూలంగా ప్రజానీకానికి తెలియజేయడమైనది.

సదరు పర్యావరణ శాఖ వారి అనుమతి పత్రము ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి/కమిటీ వద్ద లభిస్తుంది. మరియు సదరు నకలును పర్యావరణ మంత్రిత్వ అటవీ శాఖ మరియు వాతావరణ మార్పు యొక్క వెబ్‌సైట్ నందు సందర్శించవచ్చును. https://parivesh.nic.in

31.10.2025
స్థలం: కర్నూలు

సం/- సి.శ్రీనివాస బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్
టి.జి.వి.ఎస్.ఆర్.ఎ.ఎ.సి లిమిటెడ్

చికిత్స పొందుతూ..

కర్నూలు నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా మానవపాడు మండలం కొర్రిపాడుకు చెందిన ఎం.కోటేశ్వరరావు(21) చికిత్స పొందుతూ మృతి చెందారు. ఇతడు కర్నూలు నగర శివారులోని రేడియోస్టేషన్ సమీపంలో మెకానిక్‌గా పనిచేస్తుండేవారు. ఇతనికి వాహన డ్రైవరుగా పనిచేసే రామ్‌నాయక్‌తో స్నేహం ఏర్పడింది. రామ్‌నాయక్ పదో తరగతి చదివే ఓ బాలికను ప్రేమించాడు. సదరు బాలిక అక్టోబరు 28 నుంచి కనిపించడం లేదు. ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అదేనెల 29న కర్నూలు నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. తమ కుమార్తెను రామ్‌నాయక్ తీసుకెళ్లి ఉంటాడని వారు అనుమానం వ్యక్తం చేశారు. ఈమేరకు పోలీసులు రామ్‌నాయక్ స్నేహితుడైన కోటేశ్వరరావును అదుపులోకి తీసుకుని విచారించారు. ఆ సమయంలో క్రైం పార్టీ కానిస్టేబుల్ తనను కొట్టాడని మనస్తాపం చెందిన కోటేశ్వరరావు ఈనెల 1వ తేదీన గడ్డిమందు తాగినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. స్థానికులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము స్పాట్ క్యాష్/ షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

EDUCATION

కడప & ప్రొద్దుటూరులో గల కళాశాలల్లో మెడికల్, డిప్లొమా కోర్సులు DMLT, DOA, DOM, DECG, DRGA, DMST (ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్), DMIT-(CT/MRT టెక్నీషియన్), DMPHA (M) శానిటరి ఇన్‌స్పెక్టర్ అడ్మిషన్లు జరుగుచున్నవి. అర్హత: ఇంటర్ (ఏనీ గ్రూప్). Cell : 74166 23777, 74165 23777. అర్హత గల వారికి స్కాలర్‌షిప్ కలదు. చివరి తేదీ: 10-11-2025.

JOBS

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యూయర్స్. ఏజ్: 22-35. ఫ్రెషర్స్ కూడా కావలెను. ✆ 6281037879.

వాంటెడ్ సిస్టర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్, డ్యూటీ డాక్టర్స్, ఫార్మసిస్ట్, హాస్పిటల్ మేనేజర్, రిసెప్షనిస్టు కావలెను. శ్రీ గాయత్రి హాస్పిటల్స్, కొత్తబస్టాండు దగ్గర, కర్నూలు. ✆ 08518-256664.

నవోదయ సైనిక్ స్కూల్ కోచింగ్ చెప్పుటకు అర్థమేటిక్ రీజనింగ్ ఇంగ్లీష్ GK అనుభవం గల ఫ్యాకల్టీ కావలెను. భోజన వసతి, రూం ఫ్రీ, జీతం. 20000. ✆ 97051 76401.

FACULTY/ TEACHERS

Wanted Science & Computer Science Teachers with B.Ed. Qualification for well known Upper Primary School. English Fluency is Must. ✆ 83095 95455, 96662 84139. Kurnool.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

సీసీఐ పత్తికొనుగోలు కేంద్రాల వద్ద ధర్నా

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే : పత్తి రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండు చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదోని పట్టణంలోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం వద్ద నాయకులు, రైతులు ధర్నా చేపట్టారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, అధ్యక్షుడు నాగేంద్రయ్య, జిల్లా కార్యదర్శి పంపన్నగౌడు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య మాట్లాడారు. అనంతరం సీసీఐ అధికారికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, సహాయ కార్యదర్శి యల్లప్ప, సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు వీరేశ్, కల్లుబావిరాజు, బసాపురం గోపాల్, గంగన్న, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విక్రయానికి నమోదు తప్పనిసరి

చిన్నహుల్తి (పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: పత్తి పండించిన రైతులు తమ దిగుబడులు అమ్ముకొనేందుకు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో తప్పని సరిగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకటరాముడు కోరారు. చిన్నహుల్తి, జూటూరు, దూదేకొండ, హోసూరులో రైతు సేవా కేంద్రాల్లోని నమోదు ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 80085 73822

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: ఆదోని పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గుంతల్లో నీరు నిలిచి, ప్రమాదకరంగా మారింది. సమస్య పరిష్కరించాలి.
– చంద్రకాంత్, హౌసింగ్‌బోర్డు కాలనీ
✔: వర్షాలు తగ్గుముఖం పట్టాక, గుంతలు పూడ్చివేత పనులు చేపడతాం.
– కృష్ణ, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ?: ఆంజనేయ నగర్ సమీపంలో నిత్యం వ్యర్థాలు వేస్తున్నారు వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగించాలి.
– సమీప కాలనీవాసులు, పత్తికొండ
✔: సమీప కాలనీ వాసులే కొందరు రాత్రి సమయాల్లో వ్యర్థాలు అక్కడ వేస్తున్నారు. తక్షణమే పారిశుద్ధ్య చర్యలు చేపడతాం.
– మద్రిస్వామి, పారిశుద్ధ్య విభాగపు బాధ్యుడు

మద్దికెర, న్యూస్‌టుడే: ?: మద్దికెర బస్టాండు నుంచి జెండాకట్టకు వెళ్లే ప్రధాన రహదారిలో గుంతలు పడి నీరు నిలిచింది. – రంగయ్య, మద్దికెర
✔: పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
– వెంకటేశ్వర్లు, ఏఈ, మద్దికెర

మద్దికెర, న్యూస్‌టుడే: ?: మద్దికెరలోని కవిరెడ్డి వీధికి వెళ్లే ప్రధాన రహదారిలో భారీగా గుంతలు పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. – కృష్ణ, మద్దికెర
✔: పరిశీలించి గుంతలు పూడ్చేలా చర్యలు తీసుకుంటాం. – శివకుమార్, పంచాయతీ కార్యదర్శి, మద్దికెర

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: ఆదోని పట్టణంలోని భార్‌పేట పురపాలక పాఠశాల ప్రాంతంలో రహదారిపై మురుగు పారుతోంది. – మోహన్, ఆదోని
✔: ప్రజారోగ్య విభాగం ద్వారా సమస్య పరిష్కరిస్తాం.
– కృష్ణ, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

రబీకి సాగునీరు అందించాలని తీర్మానం

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: రబీ సీజన్‌లో సాగుకు ఎల్లెల్సీకి నీరు విడుదల చేయాలని తుంగభద్ర ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ టిప్పుసుల్తాన్ అన్నారు. ఆదోని పట్టణంలోని ఎల్లెల్సీ డివిజన్ కార్యాలయంలో ఈఈ పాండురంగయ్య అధ్యక్షతన డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్లు, డీఈలు, ఏఈలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తుంగభద్ర డ్యామ్‌లో ఎల్లెల్సీ వాటా కింద ఉన్న 10.04 టీఎంసీల నీటిని మార్చి మొదటి వారం వరకు, రబీ పంటలకు అందించి కాపాడాలని కోరారు. ఈ నెల 4వ తేదీన జిల్లా కలెక్టరును కలిసి ప్రత్యేక తీర్మానం చేయాలని కోరుతామన్నారు. సమావేశంలో ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ హుసేన్‌సాబ్, డీసీ కమిటీ ఛైర్మన్లు ప్రసాద్, రమాకాంత్‌రెడ్డి, అనంతసేనారెడ్డి, బోయ కాశీం, గోవర్ధన్‌రెడ్డి, హుసేన్, మహేశ్వర్‌రెడ్డి, సోమశేఖర్, ధర్మారెడ్డిలతో పాటు డీఈలు షఫిఉల్లా, సుబ్బారాయుడు, నారాయణ, ఏఈలు ఈశ్వర్, సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లెల్సీ ఈఈ పాండురంగయ్య

పట్టణం ముంగిట జలగండం

■ జలాశయం మరమ్మతులపై దృష్టి ■ పురవాసులకు ఇబ్బందులు

ఆదోని పట్టణంలో తాగునీటి ముప్పు ముంచుకొస్తోంది. పట్టణానికి ప్రధాన తాగునీటి వనరైన బసాపురం నీటి కుంట ఇదివరకే దెబ్బతింది. పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేసుకోలేని పరిస్థితి. ఇలాంటి సమయంలో తుంగభద్ర జలాశయం నుంచి దిగువ కాల్వకు ఈ ఏడాది డిసెంబరు మధ్యలో నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు సమాచారం. జలాశయం గేట్లు మరమ్మతులు చేసేందుకు నీటి విడుదల నిలిపివేయనున్నారు. సుమారు మూడు నెలల పాటు పనులు కొనసాగే అవకాశం ఉందంటున్నారు. ఈ నేపథ్యంలో వేసవి కాలం రాకముందే నీటి సరఫరా నిలిపివేస్తే.. తాగునీటి పరిస్థితేంటని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బసాపురం నీటి కుంట పూర్తిస్థాయి పునర్నిర్మాణానికి రూ.70 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అనుమతి వచ్చే వరకు నీటి కుంటలో మూడు వైపులా దెబ్బతిన్న 330 మీటర్లు వరకు తాత్కాలికంగా ఇసుక బస్తాలతో అడ్డుకట్ట పనులు చేపట్టి, ఉన్న వరకు నీరు నిలుపుకోవాలనే ఆలోచన చేస్తున్నారు. దీని కోసం రూ.1.25 కోట్లు వ్యయం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, ఆదోని పురపాలకం

ప్రత్యామ్నాయ ప్రణాళిక

ఎల్లెల్సీ నీరు నిలిపివేసే లోపు కుంటలో తాత్కాలిక పనులు పూర్తిచేయాసుకోవాలని అధికారులు భావిస్తున్నారు. కుంట పూర్తి సామర్థ్యం 3,110 మిలియన్ లీటర్లు. తాత్కాలిక అడ్డుకట్ట పనులు వల్ల 70 శాతం మేర నీరు నింపుకోవచ్చని అంచనా. ఈ నీరు 80-90 రోజులకు సరిపోతుంది. ఇప్పటికే వర్షాలకు నిండుకుండలా మారిన రాంజల చెరువులో 40 రోజులకు సరిపడేంత నీటి నిల్వ ఉంది. మొత్తం కలుపుకొంటే.. 120 రోజులకు సరిపోతాయని భావిస్తున్నారు. అదనపు చేతి పంపులు అందుబాటులోకి తేవడం, మినీ ట్యాంకులు మరమ్మతులు చేయించుకోవడం, పూడిపోయిన బోర్లు వినియోగంలోకి తేవడం, నీటి ట్యాంకర్లు సిద్ధం చేసుకోవడం వంటివి ప్రత్యామ్నాయంగా నీటి వనరులు సమకూర్చుకోవాలనుకుంటున్నారు.

■ పట్టణంలో వార్డులు: 42
■ జనాభా: 2.50లక్షలు
■ నీటి కుళాయిలు: 24,500
■ సరఫరా చేస్తున్న నీరు: 24-25 ఎం.ఎల్.డి.

దెబ్బతిన్న బసాపురం నీటి కట్ట

నీటి సరఫరాపై ప్రభావం

పట్టణంలో 42 వార్డులుంటే.. గత పాలకుల తప్పిదాలు, ముందు చూపు లేకపోవడం వల్ల నేటికీ రెండు, మూడు రోజులకోసారి నీటి సరఫరా చేయాల్సి వస్తోంది. మరమ్మతుల కారణంగా నాలుగైదు రోజులకు పెంచే దిశగా యోచిస్తున్నారు. నీటిని పొదుపుగా వాడుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించడం, నీటి సరఫరా గంటలను కుదించడం వంటివి చేయాలని భావిస్తున్నారు. ఇక జిల్లా ఉన్నతాధికారులకు సమస్యను నివేదించి.. ఏఎస్సీ నిధులు విడుదల చేయించుకుని.. కొంత ఊరట పొందాలని ఆలోచన చేస్తున్నారు. మరి ఎంత వరకు సఫలీకృతులవుతారో? ప్రజలకు ఎంత మేర నీటి కష్టాలు తీరుస్తారో.. వేచిచూడాల్సి ఉంది.

కాపు బలిజ సంఘం నూతన కార్యవర్గం

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని నియోజకవర్గం కాపు బలిజ సంఘం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. స్థానిక విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో సంఘం మాజీ అధ్యక్ష, కార్యదర్శులు ఆదిశేషు, కడిమెట్ల ఈరన్న, చంద్రశేఖర్, న్యాయవాది లోకేశ్‌కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా దశరథరాముడు, ప్రధాన కార్యదర్శిగా కడిమెట్ల రామకృష్ణ, కోశాధికారిగా వెల్లింగ రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా బండి తిమ్మప్ప, గుండా మోహన్, నాగులు వీరేశ్, సమీర్, ఆనందరావు, సహాయ కార్యదర్శులుగా నాగరాజు, బండి రవి, ప్రసాద్, బండి చంద్రశేఖర్, ఆనంద్, యూత్ అధ్యక్షుడిగా వీరరాజు, ప్రధాన కార్యదర్శిగా నాగార్జున, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు లోకేశ్‌కుమార్, గౌరవ సలహాదారులు బసవరాజు, రాధాకృష్ణ, చక్రవర్తి, సభ్యులు మురారి రాఘవేంద్ర, కడిమెట్ల ఆంజనేయులు, అంజి, కేశవ పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. రోడ్డున పడినట్టే

దారిపై తారు చెదిరిపోయింది. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. ప్రాణాలు పణంగా పెట్టాల్సిందే. మద్దికెర- తుగ్గలి ప్రధాన రహదారి దుస్థితి ఇది. ఈ గుంతల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రైల్వే స్టేషన్‌కు తిరిగే మలుపులో ఉన్న గోతిలో పడితే ప్రాణాపాయం తప్పదని వాహనదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. – న్యూస్‌టుడే, మద్దికెర

రైలు ఎక్కాలంటే.. బురద తొక్కాల్సిందే

హాలహర్వి మండలం బేవినహాల్ గ్రామ శివారులోని రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారి ఇది. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో దారి గుంతలు పడి నడిచేందుకు వీల్లేకుండా మారింది. నిత్యం ఈ స్టేషన్ మీదుగా ఎనిమిది రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. బేవినహాల్ గ్రామస్థులతో పాటు కొక్కరచేడు, శ్రీధరహాల్, గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం గుంతకల్లు, బళ్లారికి రాకపోకలు సాగిస్తుంటారు. ఈ దారిలో వెళ్లాలంటే గ్రామీణ ప్రజలు జంకుతున్నారు. నానా అవస్థలు పడుతున్నారు. – న్యూస్‌టుడే, హాలహర్వి

కాలచక్రం కుంటుతోంది

ఆదోని పురపాలక సంఘంలోని చెత్త తరలింపు ట్రాక్టర్లు మరమ్మతులకు గురవుతున్నాయి. ఓ ట్రాక్టరు ముందు చక్రం మొత్తం అరిగిపోయి, లోపలి భాగం తేలి, గాలి లేక కుంటుతూ.. రహదారులపై వెళ్లలేక వెళ్తోంది. బ్రేకులు మొదలుకుని ఇంజిన్ ఆయిల్ వరకు అన్నీ ఇబ్బందులే. వీటిని వీధుల్లో చెత్త తరలింపునకు వినియోగిస్తున్నారు. నిత్యం ఆందోళనతోనే విధులు నిర్వహిస్తున్నారు. వీటి నిర్వహణ పట్టించుకునేవారు కరవయ్యారు. – న్యూస్‌టుడే, ఆదోని పాతపట్టణం

నాలుగేళ్లు.. బావికి చేరిన నీళ్లు

పత్తికొండ బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న పాత శివాలయం బావి జలకళ సంతరించుకుంది. ఒట్టిపోయి ఉన్న బావి సుమారు నాలుగేళ్ల తర్వాత నిండుకుండలా మారింది. దీంతో బావి జలాన్ని శివాలయంలోని వివిధ పూజలకు వినియోగిస్తున్నారు. మాలాధారులు స్నానాలు ఆచరిస్తున్నారు. పట్టణంలోని పలువురు పిల్లలు, యువకులు బావిలో సరదాగా ఈత కొడుతున్నారు. నిండుకుండలా ఉన్న బావిని చూసి భక్తులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, పత్తికొండ గ్రామీణం

గ్రామాల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

కటారుకొండ (కృష్ణగిరి), న్యూస్‌టుడే: అభివృద్ధి పనులు పరుగులు పెట్టించడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని, ఆయన ఆశీస్సులతో కృష్ణగిరి మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ దారులు నిర్మించామని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. మండలంలోని ఆలంకొండ, కటారుకొండ, బోయబొంతిరాళ్ల, పెద్దొడ్డి గ్రామాల్లో నిర్మించిన సీసీ దారులను పత్తికొండ మార్కెట్ యార్డు ఛైర్మన్ నబిసాహెబ్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మద్రి మోహన్‌రెడ్డి తదితరులతో కలిసి సోమవారం ప్రారంభించారు. కటారుకొండ, బోయబొంతిరాళ్ల గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు నక్కి లెనిన్‌బాబు, రవిమోహన్, షహనాబీ, తెదేపా నాయకులు మద్రి శ్రీరాములు, దామోదర్‌నాయుడు, ఎల్వీ ప్రసాద్, రఫీ, మురళీమోహన్‌రెడ్డి, సురేష్, తెదేపా నాయకులు, మండల అధికారులు పాల్గొన్నారు.

బోయబొంతిరాళ్లలో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న కేఈ శ్యాంబాబు, తదితరులు

పల్లె కబుర్లు

చెరుకులపాడు(వెల్దుర్తి), న్యూస్‌టుడే: చెరుకులపాడు గ్రామంలోని శివాలయంలో పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సోమవారం పూజలు చేశారు.

వెల్దుర్తి, న్యూస్‌టుడే: బీఎస్‌ఎన్ఎన్ సిమ్‌లు రూ.1కే ప్రజలకు అందిస్తున్నామని సంస్థ ఎస్‌డీఈ రాజశేఖర్‌గుప్తా, జేటీవో గోపాల్ తెలిపారు. స్థానిక పాతబస్టాండులో బీఎస్ఎన్ఎల్ సిమ్‌ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కృష్ణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మిరెడ్డిపల్లి(వెల్దుర్తి), న్యూస్‌టుడే: బొమ్మిరెడ్డిపల్లిలో ఉలిందకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఆనందరావు సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. టీబీ, రక్తహీనత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఎస్ నాగరాజు, ఎంఎల్‌హెచ్‌పీ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి, న్యూస్‌టుడే: మండలంలో ఈ నెల 6, 7 తేదీల్లో 33 గ్రామాల్లో జీపుజాత చేపట్టి, ప్రజల నుంచి వచ్చిన వినతులపై ఈ నెల 9, 10 తేదీల్లో ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీపీఎం మండల కార్యదర్శి బాలకృష్ణ తెలిపారు.

విద్యార్థుల చిత్రాలు.. విజయాల బాటలు

☛ 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతిభా పాటవ పోటీలతో విద్యార్థుల్లో దాగిన సృజనాత్మకతను వెలికితీయొచ్చని పత్తికొండ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు అన్నారు. 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం పాఠశాలలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పండగల ప్రాశస్త్యం వివరిస్తూ చిత్రాలు గీశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన బి.ప్రకాశ్, నరేంద్రకుమార్, మోక్షవర్ధన్‌కు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ నారాయణ, ఉపాధ్యాయ బృందం రామాంజనేయులునాయక్, రవికుమార్, వీరశేఖర్, దివాకర్‌నాయుడు, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ నాగేశ్వరరావు తదితరులు

రైల్లో చోరీకి గురైన ఫోన్లు అప్పగింత

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: రైల్వే ప్రయాణికులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రైల్వే పోలీసులు సోమవారం వారికి తిరిగి అందించినట్లు గుంతకల్లు రైల్వే డీఎస్పీ శ్రీనివాస ఆచారి తెలిపారు. స్థానిక రైల్వే పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 17 మంది బాధితులకు రూ.లక్ష విలువ చేసే ఫోన్లు అందించినట్లు తెలిపారు. అనంతరం ఆదోని రైల్వే పోలీసు స్టేషన్, ఆర్‌పీఎఫ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైల్వే పోలీసులు, ఆర్‌పీఎఫ్ సిబ్బందితో కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. స్టేషన్లలో సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. రైల్వే ప్రయాణికుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈయన వెంట ఎస్సై గోపాల్ ఉన్నారు.

ఆదోని రైల్వే పోలీసు స్టేషన్‌లో దస్త్రాలు పరిశీలిస్తున్న గుంతకల్లు రైల్వే డీఎస్పీ శ్రీనివాస ఆచారి

యువకుడిపై పోక్సో కేసు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణం హనుమాన్‌నగర్‌కు చెందిన దర్శన్‌పై బాలిక కిడ్నాప్, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు మూడో పట్టణ ఎస్సై రామస్వామి తెలిపారు. గత నెల 29న ఓ బాలికను దర్శన్ అనే యువకుడు కిడ్నాప్ చేయడంతో పాటు అసభ్యకరంగా ప్రవర్తించాడని బాలిక, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

తుగ్గలి, న్యూస్‌టుడే: ఎద్దులదొడ్డి - తుగ్గలి రైల్వే స్టేషన్ల మధ్యలో 335/1-2 కి.మీ. రాయి వద్ద ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి పట్టాల మధ్యలో పడి చనిపోయినాడని డోన్ రైల్వే జీఆర్‌పీ పోలీసులు సోమవారం తెలిపారు. వయస్సు 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటాయని, గీతల చొక్కా ధరించి ఉన్నాడన్నారు. తలకు, ముఖంపై రక్తగాయాలు ఉన్నాయన్నారు. ఘటనా స్థలంలో లభించిన చరవాణి ఆధారంగా మృతుడి పేరు వెంకటేష్, బళ్లారి అని తెలిసిందన్నారు.

పంట పొలంలో ఆటో దగ్ధం

కుంకనూరు (దేవనకొండ) న్యూస్‌టుడే: మండలంలోని కుంకనూరు, పొట్లపాడు సమీపంలోని ఓ పంట పొలంలో సోమవారం ఓ ఆటో దగ్ధం కావడం చర్చనీయాంశంగా మారింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. జొన్నగిరికి చెందిన నెట్టేకల్ అనే వ్యక్తి ఆ గ్రామాలకు కూలీలను ఆటోలో తీసుకొచ్చారు. ఆటోను పక్కనున్న పంట పొలంలో నిలిపాడు. ఆటో అగ్నికి ఆహుతి అవుతూ కనిపించింది. కాసేపటికే మొత్తం కాలిపోయింది. ప్రమాదవశాత్తు జరిగిందా, ఎవరైనా కావాలనే చేశారా అనేది విచారణలో తేలాల్సి ఉంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆలూరు అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్దాం

ఆలూరు, న్యూస్‌టుడే: ఆలూరు నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్దామని ఆలూరు నియోజకవర్గం తెదేపా, జనసేన ఇన్‌ఛార్జులు వైకుంఠం జ్యోతి, తెర్నేకల్లు వెంకప్ప పేర్కొన్నారు. స్థానిక వైకుంఠం జ్యోతి నివాసంలో సోమవారం జనసేన నాయకులతో ఆమె సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

సమావేశంలో పాల్గొన్న వైకుంఠం జ్యోతి, తెర్నేకల్లు వెంకప్ప తదితరులు

శ్మశాన వాటిక ముందు నిర్మాణాలు చేపట్టొద్దు

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెరలోని ముస్లిం ప్రధాన శ్మశాన వాటిక ముందు ఎలాంటి నిర్మాణాలు, బంకులు ఏర్పాటు చేయరాదని కోరుతూ ఆందోళన చేపట్టారు. స్థానిక మద్దమ్మకుంటకు ఎదురుగా ఉన్న శ్మశాన వాటిక ముందు సోమవారం కొత్తపల్లికి చెందిన ఓ వ్యక్తి పంచాయతీ అధికారుల అనుమతితో వెల్డింగ్ దుకాణం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. దీన్ని వ్యతిరేకిస్తూ పలువురు ముస్లింలు పనులు అడ్డుకున్నారు. శ్మశాలన స్థలం కావడం వల్ల ఇక్కడ ఎలాంటి అనుమతులు ఇవ్వరాదని వారు ఆరోపిస్తున్నారు. అనంతరం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దారు గుండాల నాయక్‌కి వినతిపత్రం అందజేశారు. విచారించి అవసరమైన చర్యలు చేపడతామని తహసీల్దారు వారికి హామీ ఇచ్చారు.

నైపుణ్యం పెంపొందించుకోవాలి

ఆలూరు, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఆలూరు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ వీరేశ్ పేర్కొన్నారు. వృత్తి విద్యలో భాగంగా స్థానిక పాఠశాలలో సోమవారం 9, పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు నైపుణ్య పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పలు రకాల నమూనాలు రూపొందించగా..వాటిని ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పరిశీలించారు. వృత్తి విద్య అధ్యాపకులు ప్రకాశ్, శివ ప్రాజెక్టు వర్క్ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు.

విద్యార్థులు రూపొందించిన నమూనాలు

మైదానంలో పరుగులు.. వరించెను విజయాలు

చిన్నతనం నుంచే క్రికెట్ క్రీడలో మక్కువ పెంచుకున్న వీరు నిత్య సాధనతో విజయాలు సాధిస్తున్నారు. ఏపీ రాష్ట్ర మహిళా క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. పత్తికొండ, ఆదోని క్రీడాకారులు నిత్య సాధన చేస్తున్నారు. మహిళా క్రికెటర్లు ప్రపంచ కప్ సాధించిన నేపథ్యంలో స్థానిక క్రీడాకారిణులపై కథనం.

- న్యూస్‌టుడే, పత్తికొండ గ్రామీణం, ఆదోని క్రీడలు

ముబీనా.. అలుపెరగని సాధన

పత్తికొండ పట్టణానికి చెందిన ఖాజాబీ, సలాం దంపతుల కుమార్తె ఎస్.ముబీనా. బాలిక తల్లి ఖాజాబీ తోపుడు బండిపై పండ్లు విక్రయిస్తూ చిరు వ్యాపారం చేసుకుంటోంది. ఐదో తరగతి నుంచే క్రికెట్‌పై ఆసక్తి పెంచుకున్న కుమార్తెను తల్లి ప్రోత్సహించారు. పాఠశాల స్థాయిలోనే జిల్లా, సౌత్‌జోన్, రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-17, 19 విభాగాల్లో ప్రతిభ కనబరుస్తోంది. ప్రస్తుతం గుంటూరులో ఇంటర్ చదువుతున్న ముబీనా నిత్యం క్రికెట్ సాధన చేస్తోంది. ఇటీవల మంగళగిరిలో జరిగిన రాష్ట్ర మహిళా జట్టు ఎంపికలో భాగంగా స్టాండ్‌బై జాబితాలో పేరు సుస్థిరం చేసుకుంది.

శర్వాణి.. క్రికెట్ రారాణి

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: ఆల్‌రౌండర్‌గా పేరు తెచ్చుకున్న భారత మహిళా క్రికెటర్ అంజలీ శర్వాణి సొంతూరు ఆదోని. భారత జట్టు తరఫున టి-20 మహిళా క్రికెట్ జట్టుకు ఆడిన ఈమె ప్రస్తుతం ఐపీఎల్ యూపీ వారియర్స్ జట్టు తరఫున ఆడుతోంది. రైల్వే ఉద్యోగిగా.. క్రికెటర్‌గా రాణిస్తోంది. ఆదోని పట్టణం శ్రీరాంనగర్‌లో నివాసం ఉంటున్న కె.వి.రమణారావు, అనురాధ దంపతుల కుమార్తె అంజలీ శర్వాణి. రమణారావు అరేకల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అంజలి ఆసక్తిని గమనించి, క్రికెట్ శిక్షణ ఇప్పించారు. లెఫ్ట్‌ఆర్మ్ బౌలర్‌గా.. బ్యాటర్‌గా ఆల్‌రౌండ్ ప్రతిభ చాటుతూ మహిళా క్రికెట్‌లో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. పాఠశాల స్థాయి నుంచే అండర్-14, అండర్-17, అండర్-19 జిల్లా, రాయలసీమ, రాష్ట్ర స్థాయి, సౌత్‌జోన్, జాతీయ స్థాయి క్రికెట్‌లో రాణించింది. 2022 సంవత్సరంలో దేశావళిలో జరిగిన పోటీల్లో అంజలీ శర్వాణి ఆ టోర్నమెంట్‌లో ఏకంగా 35 వికెట్లు సాధించి అంతరి దృష్టిని ఆకర్షించి..

భారత మహిళా జట్టుకు ఆల్‌రౌండరుగా ఎంపికైంది. 2022 డిసెంబరులో భారత-ఆస్ట్రేలియా మహిళా జట్టు టీ-20 సిరీస్‌కు ఎంపికై తన ప్రతిభ చాటింది. అక్కడితో ఆగక భారత రైల్వే శాఖలో ఉద్యోగం సాధించడంతో పాటు రైల్వేస్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తోంది. మూడేళ్లుగా ఐపీఎల్ యూపీ వారియర్స్ జట్టునూ ముందుకు నడిపిస్తోంది. గత మే నెలలో నీ సర్జరీ చేయించుకుంది. ప్రస్తుతం మైదానంలో దిగి సాధన చేస్తోంది.

గూడు చెదిరె.. నీడ కరవాయె

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఓ నిరుపేద గూడు నేల కూల్చారు. నీడ కరవై బోరున విలపించారు. పత్తికొండ పట్టణంలోని కుమ్మరిగేరి వీధి సమీపంలో ఇంటి పక్కనే వేసుకున్న గుడిసెను ఓ వ్యక్తి అన్యాయంగా కూల్చివేశాడని దివ్యాంగుడు సుధాకర్ పోలీసు స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. తన ఇంటి పక్కనే ఉన్న స్థలాన్ని రూ.6లక్షలకు కొనుగోలు చేశానని, ఇందుకు సంబంధించి భగవాన్ అనే వ్యక్తికి అడ్వాన్సు కింద రూ.3.50లక్షలు చెల్లించానన్నారు. సామాన్లన్నీ సోమవారం బయట పారేసి, గుడిసె కూల్చాడన్నారు. పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయమై సీఐ జయన్నతో ప్రస్తావించగా.. ఇరువురినీ పిలిపించి విచారణ చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

కూల్చిన గుడిసెను చూపుతున్న సుధాకర్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యురాలు మాలతి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: గురుకుల, కస్తూర్బా ఇతర వసతిగృహాలతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యురాలు జి.మాలతి అన్నారు. పత్తికొండలోని కస్తూర్బా, బాలికల గురుకుల పాఠశాలలను ఆమె సోమవారం పరిశీలించారు. అక్కడ విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గురుకులంలోని బాలికలతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆర్డీవో, తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాలను పరిశీలించారు. అక్కడి అధికారులతో సమావేశమయ్యారు. ఎస్సీ ఎస్టీ వర్గాలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. భాజపా మండల శాఖ సమావేశంలో పాల్గొని ప్రవాస యోజన కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికి చేరేలా భాజపా నాయకత్వం దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో భాజపా నాయకులు గోవర్ధన్‌నాయుడు, నరేశ్, దండిమల్లికార్జున, పూనా మల్లికార్జున, శంకరయ్య, గోరంట్ల, రామాంజనేయులు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని పట్టణం బండిమెట్ట ప్రాంతంలో ఈ నెల 1న జరిగిన అగ్నిప్రమాదంలో భారీగా నష్టపోయిన బాధితులు వీరేశ్, చిట్టెమ్మ దంపతులకు పారిశ్రామికవేత్త, భాజపా రాష్ట్ర నాయకుడు విట్టారమేశ్ రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట జనసేన మండల అధ్యక్షుడు తాహెర్‌వలి, భాజపా నాయకుడు శ్రీనివాస ఆచారి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు వేగవంతం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యపనులు వేగంగా చేపడుతున్నట్లు పంచాయతీ ఈవో లక్ష్మీనాథ్ అన్నారు. 14వ వార్డులో కాల్వలు లేక మురుగు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి యంత్రాలతో వాటిని శుభ్రం చేయించారు. వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచి నాయకంటి శ్వేత తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

రహదారుల సమస్యలు పరిష్కరించండి

ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజినీరుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కోడుమూరు, న్యూస్‌టుడే: కోడుమూరు నియోజకవర్గంలో పలుచోట్ల రోడ్లు అధ్వానంగా మారాయని, ప్రజలు అవస్థలు పడుతున్నారని, ఆర్టీసీ బస్సులు తిప్పడానికి ఇబ్బందులు పడుతున్నారని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సోమవారం ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజినీరు శ్రీనివాస రెడ్డికి విన్నవించారు. కర్నూలు పట్టణంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కోడుమూరు నియోజకవర్గంలోని మండలాలకు అనుసంధానంగా ఉన్న రోడ్ల సమస్యలపై ఆయనతో చర్చించారు. సమస్యలను త్వరలో పరిష్కరించాలని కోరారు.

సీసీఐ కేంద్రాన్ని తనిఖీ చేసిన జేడీ

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేస్తున్న శివ జిన్నింగ్ మిల్లును సోమవారం సాయంత్రం జేడీ సుధాకర్ తనిఖీ చేశారు. ఎంత మంది రైతుల నుంచి పత్తి కొన్నారన్న వివరాలను సీసీఐ, మార్కెట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జేడీ మాట్లాడుతూ కొనుగోలును వేగవంతం చేయాలని ఆదేశించారు. వెంట ప్రత్యేక శ్రేణి కార్యదర్శి చంద్రమౌళి, సీసీఐ ప్రతినిధి శివరామ్, మహబలేశ్వర్ తదితరులు ఉన్నారు.

పత్తిని పరిశీలిస్తున్న జేడీ సుధాకర్

ఎకరాకు 6 క్వింటాళ్ల పత్తి కొనుగోలు

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: సీసీఐ ద్వారా పత్తి మొదటి విడతగా ఎకరానికి 6క్వింటాళ్లు, రెండో విడతలో 4క్వింటాళ్లు కొంటారని సోమవారం ఏడీఏ ఎస్.మహమ్మద్‌ఖాద్రీ, ఏవో శివశంకర్ తెలిపారు. ఒకే విడతలో పది క్వింటాళ్ల పత్తి కొనరని.. రెండు విడతలుగా కొంటారని చెప్పారు. పంట వేసిన ప్రతి రైతు నుంచి సీసీఐ పత్తి కొంటుందని ఆందోళన చెందవద్దన్నారు. రైతుసేవా కేంద్రాల్లో సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకొన్న తర్వాత ఏడు రోజుల లోపు కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలన్నారు.

విద్యకు ప్రోత్సాహం అందిస్తాం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఉన్నత విద్య కోసం ఆర్థికంగా వెనుకబడిన వారికి చేయూత అందిస్తామని దూదేకుల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రుక్మాన్ అన్నారు. ఆ సంఘానికి చెందిన కొందరు ఉద్యోగాలు సాధించిన వారిని సోమవారం సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడి పేదల కోసం సాయం అందిస్తామన్నారు.

నేతల స్ఫూర్తితో హక్కులు సాధిద్దాం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై పోరాటాలు చేసిన ఉద్యమ నేతలను స్ఫూర్తిగా తీసుకొని హక్కులు సాధిద్దామని ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఏసేపు పేర్కొన్నారు. చంద్రపుల్లారెడ్డి వర్గీయులు ఆధ్వర్యంలో సోమవారం అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించారు. కార్మికులు, రైతుల హక్కులను పూర్తిగా విస్మరించాయన్నారు.

పుడుతున్నాయ్.. కుడుతున్నాయ్

◆ దోమలతో వ్యాధుల బారినపడుతున్న ప్రజలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: వర్షాకాలం వచ్చిందంటే చాలు దోమలు విజృంభిస్తున్నాయి. ఇళ్ల మధ్యన మురుగు కుంటలు, చెత్తాచెదారం, కొబ్బరి చిప్పలు, నీటి ట్యాంకులు, చేతి పంపుల వద్ద మురుగులో, వ్యర్థాలను ఆవాసాలుగా మార్చుకొని దోమలు పెరుగుతున్నాయి. దీంతో ప్రజలకు వ్యాధులబారినపడుతూ ఆసుపత్రి పాలవుతున్నారు. దోమల బెడదను నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం తాత్కాలిక చర్యలతో సరిపెడుతోంది. ఎమ్మిగనూరు పట్టణంలో ఫాగింగ్, బ్లీచింగ్, ఇతర వాటి కోసం ఏడాదికి రూ.5లక్షలకు పైగానే ఖర్చు చేస్తున్నా.. ఫలితం కానరావడం లేదు. ఫాగింగ్, నీటి మడుగులో రసాయనాల పిచికారీ, ఆయిల్ బాల్స్ వేయడం వంటి పనులు చేపట్టాల్సి ఉంది. అయితే అరకొర సిబ్బందితో పనులన్నీ చేయడానికి సరిపోవడం లేకపోవడంతో నామమాత్రపు చర్యలు సరిపెడుతున్నారు.

మూడు వందలకు పైగా ఓపీ

ఎమ్మిగనూరు పట్టణంలో 34 వార్డుల్లో 1.30లక్షల జనాభా నివసిస్తోంది. సీజనల్ వ్యాధులతో ప్రస్తుతం ఎమ్మిగనూరు పట్టణంలో ప్రతి రోజూ పెద్ద ఆసుపత్రిలో మూడు వందలకు పైగానే ఓపీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో కనీసం 10 నుంచి 45 మంది వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. ఇళ్ల మధ్యన ఉన్న మురుగు కుంటలతో దోమలు పెరిగి ప్రజలు డెంగీ, గన్యా, జ్వరాలు, ఇతర వ్యాధుల బారినపడుతున్నారు. మురికివాడల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోవడంతో సామాన్యులు ఆసుపత్రి పాలవుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోజూ 600కి పైగానే ఓపీ నిర్వహిస్తుండగా ఇందులో దాదాపు 300 మందికిపైగానే జ్వరాలు, కీళ్లు, కాళ్ల నొప్పులతో వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. ప్రజల ఆరోగ్యం దెబ్బతినడంతో ఆర్థిక భారం పడుతోంది.

సాయినగర్ కాలనీలో ఉన్న మురుగు కుంట

ఎక్కడెక్కడ మురుగు కుంటలు

పట్టణంలో సాయినగర్, లక్ష్మణ్‌టాకీస్ ఏరియా, చంద్రకొట్టాల, మునెప్పనగర్, రాఘవేంద్ర కాలనీ, సోమప్ప కూడలి, శాంతి నగర్ తదితర కాలనీలో ఇళ్ల మధ్యనే మురుగు నీటి కుంట ఉన్నాయి. కాలనీ ప్రజలు ప్రతి రోజూ బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. గుంతలు దోమలకు ఆవాసాలుగా మారాయి. ప్రతి రోజూ జ్వరాల బారిన పడి సగటున ఒక మనిషి రూ. 400 నుంచి రూ. 9వేల వరకు ఖర్చు పెడుతున్నారు. పట్టణ జనాభాకు అనుగుణంగా 8 ఫాగింగ్ యంత్రాలు అవసరం కాగా.. మూడు మాత్రమే ఉన్నాయి. వాటిని కూడా వినియోగించడం లేదు.

జనాభా: 1.30 లక్షలు
ఫాగింగ్ యంత్రాలు: 3
ఏటా నిర్వహణ ఖర్చులు:
రూ.5 లక్షలు(ఫాగింగ్, ఇతర ఖర్చులకు)
మురికివాడలు: 64
పారిశుద్ధ్య కార్మికులు: 177

ఫాగింగ్ చేస్తాం - గంగిరెడ్డి, పురపాలక కమిషనర్, ఎమ్మిగనూరు

గుంతల్లో ఉన్న నీటిలో ఆయిల్ బాల్ వేయిస్తాం. మురికివాడల్లో బ్లీచింగ్ పౌడర్ వేశాం. ఆయా కాలనీల్లో పర్యవేక్షించి సమస్యలు తీరుస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు గ్రామీణం 80085 73794
కోసిగి 9550434095

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: మునెప్పనగర్ కాలనీలో చెత్తకుండీ శుభ్రం చేయడం లేదు. దుర్వాసన వస్తోంది. -పరమేశ్, కాలనీవాసి

✔: సిబ్బందిని పంపించి కాల్వలను శుభ్రం చేయిస్తాం. -శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: మల్లారవీధిలో రోడ్డు గుంతలు పడి ప్రమాదాలకు దారి తీస్తోంది. చర్యలు చేపట్టండి -సోమేశ్, స్థానికుడు

✔: రహదారికి మరమ్మతులు చేయిస్తాం -గంగిరెడ్డి, పురపాలక కమిషనర్

గూడూరు గ్రామీణం,న్యూస్‌టుడే: ?: పట్టణంలోని తెలుగు వీధి కాలనీలో కాల్వల్లో మురుగు ముందుకు కదలక పోవడంతో రహదారిపైకి చేరుతోంది. -శ్రీనువాసులు, స్థానికుడు

✔: కాలనీలో పర్యటించి సమస్యను పరిష్కరిస్తాం. -రాఘవేంద్ర.శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: పట్టణంలోని ఎస్సీ కాలనీలో కాల్వల్లో మురుగు తీయకపోవడంతో దోమల బెడద అధికంగా ఉంది. వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. -అశోక్

✔: పారిశుద్ధ్య కార్మికులను పంపి మురుగు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. -రాఘవేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్

కోసిగి, న్యూస్‌టుడే: ?: కోసిగి మండల కేంద్రం స్థానిక దుర్గమ్మ అవ్వ ఆలయం వెనకాల ఉన్న కాలనీలో విద్యుత్తు మెన్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. -అనిల్, స్థానికుడు

✔: లైన్‌మెన్‌ను పంపించి సమస్యను పరిష్కరిస్తాం. -ఈరేష్, విద్యుత్‌శాఖ ఏఈ, కోసిగి

కౌతాళం న్యూస్‌టుడే: ?: కౌతాళం మండలంలోని హాల్వి గ్రామంలో కటిక వీధిలో మురుగు కాల్వలు నిండి రహదారి పైనే పారుతోంది. దీంతో కాలనీ వాసులంతా మురుగు నీటిలో నడవాల్సి వస్తోంది. -శ్రీధర్ హాల్వి గ్రామం

✔: హాల్వి గ్రామంలో వారం రోజుల వ్యవధిలో మురుగు కాల్వల పరిశుభ్రత పనులను చేపడతాం. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం. - అబ్దుల్ కరీం, గ్రామ పంచాయతీ కార్యదర్శి, హాల్వి గ్రామం.

కౌతాళం: బ్రహ్మసూత్ర శివలింగం

సి.బెళగల్: కాశీవిశ్వేశ్వరుడి ఆలయంలో పూజలు చేస్తూ..

గూడూరు గ్రామీణ: ఉత్సవమూర్తులను పట్టణంలో ఊరేగిస్తూ..

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

కౌతాళం, గూడూరు గ్రామీణం, కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: కౌతాళంలో వెలసిన శ్రీరామలింగేశ్వమి ఆలయంలో నూతనంగా బ్రహ్మసూత్ర శివలింగాన్ని సోమవారం ఉదయం ప్రతిష్ఠించారు. ఆలయంలో గత మూడు రోజుల నుంచి ప్రత్యేక హోమాలు, గణపతి, లక్ష్మీ, నవగ్రహ పూజలు నిర్వహించారు. గూడూరు పట్టణంలోని సంజీవయ్య నగర్ కాలనీలో వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామి అమ్మవార్ల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పట్టణ పుర వీధుల్లో ఊరేగింపుగా పల్లకి సేవ నిర్వహించారు. కోడుమూరు పట్టణంలో కొండపై వెలసిన ఉమామహేశ్వర స్వామి 14వ వార్షికోత్సవం పురస్కరించుకుని సోమవారం ఉమా మహేశ్వర స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు.

శ్రీమఠంలో ద్వాదశి పూజలు

మంత్రాలయ, న్యూస్‌టుడే: ద్వాదశి పురస్కరించుకుని శ్రీమఠంలో సోమవారం జలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించి, బంగారు, నవరత్న కవచాలు, విశేష పూలతో అలంకరించి మూల బృందావనానికి హారతి ఇచ్చారు. ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయల విగ్రహాన్ని బంగారు పల్లకిలో ఉంచి శ్రీమఠం ప్రాకారంలో వైభవంగా ఊరేగించారు.

బంగారు పల్లకి సేవలో భక్తులు

శివనామస్మరణ చేస్తున్న భక్తులు

యాగశాలలో శివుడికి అభిషేకం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కార్తిక సోమవారం భక్తులతో వీవర్స్‌కాలనీ మైదానం కిటకిటలాడింది. 87వ ప్రపంచశాంతి హోమంలో భాగంగా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. యాగశాలల్లో శివుడికి అభిషేకాలు నిర్వహించారు. సహస్ర కలశార్చన కార్యక్రమంలో పండితులు పూజలు జరిపారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి దంపతులు హోమంలో పాల్గొన్నారు. సాయంత్రం స్వామి శ్రీకృష్ణచైతన్య స్వరూపనందస్వామి భక్తుల ఉద్దేశించి ప్రసంగించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

మురుగు తరలింపు

స్పందనకు వందనం

గూడూరు గ్రామీణం,న్యూస్‌టుడే: పట్టణంలోని ఎమ్మిగనూరుకు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే కాల్వల నుంచి తీసిన మురుగును డంపుయార్డుకు తరలించకపోవడంతో వాహనదారులకు ఇబ్బందికరంగా ఉందని 'ఈనాడు'లో ఈనెల 3న మేమున్నాం మీకు తోడుగాలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులను పంపి మురుగును డంపుయార్డుకు తరలించేలా చర్యలు తీసుకున్నారు.

సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ఎమ్మిగనూరు,న్యూస్‌టుడే: విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ప్రధానోపాధ్యాయులు నాగభూషణంరెడ్డి అన్నారు. వీవర్స్‌కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆటోమెటిక్, రీటైల్, ఎలక్ట్రానిక్స్‌పై ప్రదర్శనలు నిర్వహించారు. ఉపాధ్యాయులు ఈరన్న, వంశీ, హరి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు సామర్థ్యలను పెంపొందించడానికి పాఠశాల స్థాయి నైపుణ్య పరీక్షలు(స్కిల్ టెస్ట్) అవసరమని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఆశాజ్యోతి అన్నారు. సోమవారం కోడుమూరు పట్టణ పరిధిలోని ఆదర్శ పాఠశాలలో నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. బోధకులు వరుణ్, ఇంద్రాణి, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కోడుమూరు, న్యూస్‌టుడే: మత్తు పదార్థాల వాడకం మానసిక వైకల్యానికి దారి తీస్తుందని ఈగల్ టీం ఎస్సై మణికంఠ పేర్కొన్నారు. పట్టణంలోని స్థానిక సాయిరాం డిగ్రీ కళాశాల, కేవీఆర్ మెమోరియల్ జూనియర్ కళాశాలల్లో సోమవారం ఈగల్ ఐజీపీ ఆకె రవికృష్ణ ఆదేశాల మేరకు 'డగ్స్ వద్దు బ్రో' అవగాహన కార్యక్రమం ఈగల్ బృందం నిర్వహించింది. కళాశాలల ప్రిన్సిపళ్లు, కర్నూలు ఈగల్ టీం హెడ్ కానిస్టేబుల్ ఎలీషా, మురారి పాల్గొన్నారు.

నిధులు లేక.. నిర్మాణం సాగక

మండలంలోని ముచ్చిగేరి గ్రామంలో గత వైకాపా పాలనలో రెండో విడత నాడు-నేడు కింద రూ.24 లక్షలతో చేపట్టిన అదనపు గదుల నిర్మాణాలు నిధులు లేక మధ్యలో నిలిచిపోయాయి. పనులు ప్రారంభించి మూడేళ్లు కావస్తోంది. కింద, పైన సుమారు 4 గదులు నిర్మిస్తున్నారు. నిధులు లేక పనులు నిలిచిపోయాయి. పాఠశాలలో సుమారు 200 మంది విద్యార్థులు ఉన్నారు. గదులు లేక విద్యార్థులు అసంపూర్తి గదుల్లో విద్యనభ్యసించే దుస్థితి ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.–న్యూస్‌టుడే, పెద్దకడబూరు

నీటి ప్రవాహానికి అడ్డుపడి..

గోనెగండ్ల మండలానికి ఎమ్మిగనూరు నుంచి తుంగభద్ర దిగువ కాల్వ ద్వారా సాగు నీటి సరఫరా జరుగుతోంది. ఈ ఏడాది ప్రారంభం నుంచి కాల్వలో ఎగువ ప్రాంతం నుంచి గుర్రపు డెక్క భారీ స్థాయిలో కొట్టుకువచ్చి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతోంది. సోమవారం గోనెగండ్లలోని వంతెన వద్ద ప్రధాన పంట కాల్వలో గుర్రపు డెక్క కొట్టుకొచ్చి భారీగా నిలిచిపోయింది. రైతుల సూచనల మేరకు ఎల్ఎల్‌సీ సిబ్బంది జేసీబీతో పిచ్చి మొక్కల తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ ఏడాదిలో గుర్రపు డెక్క మొక్కల తొలగింపునకు వ్యయ ప్రయాసలు పడుతున్నామని సిబ్బంది వాపోయారు. –న్యూస్‌టుడే, గోనెగండ్ల

కల్వర్టు ధ్వంసం.. రాకపోకలు ప్రమాదకరం

గూడూరు నుంచి మునుగాల వెళ్లే రహదారిలోని కల్వర్టుపై గుంతపడి ప్రమాదకరంగా మారింది. వాహనదారులకు రాత్రివేళల్లో కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ మార్గంలో మండల కేంద్రం నుంచి మునుగాల, మల్లాపురం, కొత్తకోట, సుంకేసుల గ్రామాలకు నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని పలువురు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, గూడూరు గ్రామీణం

నీడ లేక.. ప్రయాణికులకు పాట్లు

కోడుమూరు మండలం వర్కూరు గ్రామంలో బస్‌షెల్టర్ నిరుపయోగంగా మారింది. గతంలో తెదేపా అధికారంలో ఉన్నప్పుడు జిల్లాలోని ప్రధాన రహదారుల వెంట ప్రతి గ్రామంలోనూ ఇలాంటి బస్‌షెల్టర్లు నిర్మించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన పార్టీలు వీటి నిర్వహణ గాలికొదిలేశారు. దీంతో ఇవి నిరుపయోగంగా మారాయి. కొన్ని చోట్ల ప్రయాణికులు కూర్చోవడానికే వీలు లేకుండా బస్ షెల్టర్ల ముందు దుకాణాలు, బంకులు ఏర్పాటు చేసుకోగా మరికొన్ని ప్రాంతాల్లో పశువుల పాకగా వినియోగిస్తున్నారు. వీటిని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, కోడుమూరు

విద్యార్థులు సృజనాత్మకత పెంచుకోవాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రాజెక్టులు ఉపయోగపడతాయని పాఠశాల ఏజీఎం రమేష్ అన్నారు. నారాయణ పాఠశాలలో సోమవారం స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ సురేష్‌కుమార్, ఏఓ జాకీర్ హుసేన్, మహమ్మద్, డీన్ గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత పాటించకపోతే చర్యలు

మాధవరం(మంత్రాలయ), న్యూస్‌టుడే: మధ్యాహ్నం భోజనంలో నాణ్యత పాటించకపోతే చర్యలు తప్పవని ఎంఈవో రాఘన్న సూచించారు. మండలంలోని 52 బసాపురం, మాధవరంలోని ప్రాథమిక పాఠశాలలను సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు.

ముగిసిన నైపుణ్య పోటీలు

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నైపుణ్య పోటీలు సోమవారం ముగిశాయి. పాఠశాల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఐటీ-ఐటీ ఈ ఎస్, బీఎఫ్ఎస్ఐ, ఎలక్ట్రానిక్ సబ్జెక్టులకు సంబంధించిన ప్రాజెక్టులను విశ్లేషించారు. ప్రత్యేక ఆకర్షణకు నిలిచిన ప్రాజెక్టులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు హెచ్ఎం రామచంద్రుడు తెలిపారు.

మందుబాబులకు అడ్డాగా రైతు భరోసా కేంద్రం

కోసిగి, న్యూస్‌టుడే: నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం ప్రారంభం కాకముందే మందుబాబులకు అడ్డాగా మారింది. కోసిగిలోని భుగేని చెరువు సమీపంలో దాదాపు రూ.46 లక్షలతో నిర్మించిన నూతన రైతు భరోసా కేంద్రంను నిరుపయోగంగా వదిలేశారు. దీంతో తాళాలు తీసి అందులో మద్యం తాగుతున్నారు. దీని పక్కన నిర్మిస్తున్న మరో సచివాలయం భవనం కూడా మందుబాబులకు అడ్డాగా మారిందని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

రైతు భరోసా కేంద్రంలో సీసాలు

క్రీడల్లో రాణిస్తున్న ఉరుకుంద విద్యార్థులు

కౌతాళం, న్యూస్‌టుడే: కౌతాళం మండలంలోని ఉరుకుంద ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారు. మండల, నియోజకవర్గం నుంచి జిల్లా స్థాయి ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన నియోజకవర్గ స్థాయి క్రీడల్లో 400 మీటర్ల పరుగు పందెంలో దిద్ది నాగరాజు, లాంగ్‌జంప్‌లో ఎం.గణేష్, కబడ్డీలో కె.అక్షిత జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయుడు హరిప్రసాద్, పీడీ వరలక్ష్మి, పీటీ రమేష్, ఉపాధ్యాయులను తల్లిదండ్రులు అభినందించారు.

విద్యార్థులు నాగరాజు, గణేష్‌లతో ఉపాధ్యాయులు వరలక్ష్మి, రమేష్

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని చేనేత సంఘం తాలూకా అధ్యక్షులు కాలప్ప ఆరోపించారు. చేనేత సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ర్యాలీగా నిర్వహించి ధర్నా చేపట్టారు. చేనేత కార్మికులకు 50 ఏళ్ల అయినా పింఛను సౌకర్యం, ప్రమాద బీమా, మరణిస్తే రూ.లక్ష, నేతన్న నేస్తం కింద రూ.24వేలు సాయం, ప్రతి కార్మికుడికి 50శాతం రాయితీ కింద ముద్ర రుణాలు పంపిణీలో జాప్యం చేసిందన్నారు. సంఘం నాయకులు లక్ష్మన్న, కృష్ణ, గోవిందు, రాముడు, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ డిపోలో రెండేళ్లుగా కొత్త చార్ట్ వేయక డ్రైవర్, కండక్టర్లను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న డిపో మేనేజరుపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎంయూ డిపో అధ్యక్షుడు రఫీక్ కోరారు. డిపో ఎదుట సోమవారం ఎర్ర బ్యాడ్జిలు ధరించి నిరసనలు చేపట్టారు. రఫీక్ మాట్లాడుతూ ఆన్‌కాల్ డ్రైవర్లకు అనుకూలంగా ఉంటూ రెగ్యులర్ డ్రైవర్లకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ముస్తాక్ అహ్మద్, సురేష్ బాబు, వెంకటేశ్వర్లు, ఖాజావలి, సాదిక్, లలితమ్మ, సలీమా బేగం, మంజుల, ఇస్లాం, తదితరులు పాల్గొన్నారు.

రెండో పంటకు సాగు నీరు అందించాలి

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: తుంగభద్ర దిగువ కాల్వ ద్వారా రెండో పంటకు సాగు నీరు అందించాలని నీటి సంఘం అధ్యక్షుడు రమాకాంతరెడ్డి పేర్కొన్నారు. ఆదోనిలో సోమవారం నిర్వహించిన తుంగభద్ర ప్రాజెక్టు కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు గేట్ల మరమ్మతుల సమస్యను దృష్టిలో ఉంచుకొని రబీలో మార్చి ఆఖరు వరకు నీరు అందించాలని కోరారు. లేదంటే రైతులు నష్టాల నుంచి గట్టెక్కడం కష్టంగా ఉందని పేర్కొన్నారు.

మైనార్టీ కాలనీలో ఏళ్లుగా ఇబ్బందులు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్లలోని మైనార్టీ కాలనీలో కనీస వసతులు లేక ఏళ్ల తరబడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు కాశింసాహెబ్, సాదిక్‌వలి, అబ్దుల్, ఫక్రుద్దీన్, మాబి, కాసింబీ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీవో మణిమంజరికి వినతి పత్రం ఇచ్చారు.

రహదారులను పరిశీలించిన ఆర్అండ్‌బీ సీఈ

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉప విభాగంలోని ముగతి-నాగలదిన్నె, మాధవరం రహదారి, నాగలదిన్నె వంతెనను సోమవారం ఆర్అండ్‌బీ సీఈ ఎల్.శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. రహదారుల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నాగలదిన్నె రహదారిని చూస్తున్న సీఈ ఎల్.శ్రీనివాసరెడ్డి

ఆక్రమణలు తొలగించండి

సి.బెళగల్ గ్రామీణం, న్యూస్‌టుడే: సి.బెళగల్ తహసీల్దార్ కార్యాలయం మైదానం ఆక్రమాలకు అడ్డాగా మారింది. కార్యాలయం ముందు రహదారి వెంట దుకాణాలు వెలిశాయి. మూడు రోజుల కిందట మరో రెండు బంకులు ఏర్పాటు చేశారు. ఎర్రమట్టిని సైతం తరలించి చదును చేసుకున్నారు. దీంతో పాటు పదుల సంఖ్యలో ప్రైవేటు వాహనాలు కార్యాలయం ఎదుట నిలుపుతున్నారు. దీంతో అత్యవసరాలకు అంబులెన్సులు కూడా వెళ్లలేని పరిస్థితి. దీంతో కొంత మంది స్థానికులు ఆక్రమణలపై సోమవారం తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. దీంతో బంకులను తొలగించి ప్రైవేటు వాహనాలు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక వీఆర్వోకు సూచించారు.

ఏర్పాటు చేసిన రేకుల బంకు

వృత్తి విద్యతో ఉపాధి బాట

◆ కళారూపాల తయారీలో రాణిస్తున్న విద్యార్థినులు

ఎమ్మిగనూరు గ్రామీణం, గోనెగండ్ల, న్యూస్‌టుడే: బాలికల అభ్యున్నతి కోసం పాఠశాలలో వృత్తి విద్యపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. శిక్షణలో తర్ఫీదు పొందిన విద్యార్థినులు ఉపాధ్యాయురాలి సలహాలతో పనికి రాని వస్తువులతో మంచి కళారూపాలు తయారుచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గోనెగండ్ల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 256 మంది వసతి పొందుతున్నారు. పాఠశాలలో ఆరు నుంచి ఇంటర్ వరకు చదివేందుకు వసతి ఉంది. చదువుతో పాటు బాలికలకు వృత్తి విద్యపై ఉపాధ్యాయురాలు నాగరత్నమ్మ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. వృత్తి విద్య బాలికలకు భవిష్యత్తులో జీవనోపాధి పొందే అవకాశం ఉంటుందని ప్రిన్సిపల్ విద్యావతి పేర్కొన్నారు.

చదువుతో పాటు..

పాఠశాలలో చదివే విద్యార్థినులకు వృత్తి విద్య ద్వారా ఎంబ్రాయిండింగ్, టైలరింగ్, వాల్ ప్లేట్లు, అల్లికలు, బొమ్మలు తయారుచేయడం తదితర వాటిపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. వృత్తి విద్య ఉపాధ్యాయురాలు నాగరత్నమ్మ ప్రోత్సాహంతో బాలికలు నైపుణ్యాలను పెంచుకుంటున్నారు. అందుబాటులో సులభంగా దొరికే వస్తువులతో అలంకరణకు ఉపయోగించే బొకేలు, పూల మొక్కలు తదితర వాటిని పిల్లలతోనే తయారు చేయిస్తున్నారు. సులువుగా వృత్తి విద్యలో బాలికలు రాణిస్తున్నారు.

పాఠశాలలో బాలికలకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయురాలు

కుట్టుమిషన్ శిక్షణ ఎంతో ఉపయోగకరం

- జ్యోతి, 7వ తరగతి, గోనెగండ్ల

మా తల్లిదండ్రులకు వ్యవసాయ పనులే జీవనాధారం. చదువు ముగిసిన తర్వాత కుట్టు మిషన్, అల్లికలు నేర్చుకోవాలంటే ప్రత్యేకంగా డబ్బులు ఖర్చు చెల్లించాల్సిందే. పాఠశాలలో వృత్తి విద్య ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగకరం. రెండేళ్లుగా ఉపాధ్యాయురాలు ఇచ్చిన శిక్షణతో నైపుణ్యం సాధించాం. కొత్త ఆలోచనలతో చీరలపై కొత్తరకం డిజైన్లు వేస్తున్నాం. కుట్టుమిషన్ శిక్షణతో పట్టు సాధించాం.

బుట్టల అల్లిక నేర్చుకున్నా .. -మంజుల, 9వ తరగతి

పాఠశాలలో చేరిన తర్వాత చదువుతో పాటు వృత్తి విద్య శిక్షణపై ప్రత్యేక దృష్టి సారించాను. కుట్టుమిషన్, అల్లికలు, బొమ్మలు తయారు చేయడంపై శిక్షణ ఇచ్చారు. ఉలాన్, రిబ్బన్, గాజులు, పూసలతో మంచి డిజైన్ వస్తువులు తయారు చేశాం. వృత్తి విద్య ఉపాధ్యాయురాలు ఇచ్చిన శిక్షణతో చిత్రలేఖనం, బొమ్మలు తయారు చేయడంతో ఆసక్తి పెరిగింది.

సంక్షిప్త సమాచారం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రులు ప్రజలను ఆసరాగా తీసుకొని దందాలు సాగిస్తున్నాయని డీవైఎఫ్ఐ నాయకులు సురేష్ ఆరోపించారు. ఆ సంఘం ఆధ్వర్యంలో జెండా ఎగరవేశారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పంట కోత ప్రయోగాలతో దిగుబడులను అంచనా వేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి రవిప్రకాశ్ తెలిపారు.

సి.బెళగల్: తహసీల్ కార్యాలయంలో తహసీల్దారు వెంకటలక్ష్మీ అధ్యక్షతన నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు నాలుగు వినతులు వచ్చినట్లు తెలిపారు.

గూడూరు గ్రామీణం: ప్రజాసమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు వెంకటేశ్‌నాయక్ పేర్కొన్నారు. ఐదు వినతులు వచ్చినట్లు తెలిపారు.

కైరవాడి(గోనెగండ్ల): కైరవాడిలో ఈనెల 5వ తేదీన కార్తిక మాసం సందర్భంగా కాశీ అన్నపూర్ణదేవి ఆలయంలో వనభోజన కార్యక్రమం జరుగుతున్నట్లు ఆలయ ధర్మకర్త హనుమంతు, కమిటీ సభ్యులుతెలిపారు.

కోడుమూరు, న్యూస్‌టుడే: పట్టణంలో ఓ వ్యక్తి సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టును నిరసిస్తూ..బాధ్యుడిపై చర్యలు తీసుకోవాలని ఓ వర్గం వారు పోలీసుస్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎస్సై డీవై స్వామికి ఫిర్యాదు చేశారు.

(c) eenadu

కర్నూలు

•కర్నూలు •పాణ్యం

కుష్ఠు నిర్మూలనకు కృషి చేద్దాం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : జిల్లాలో కుష్ఠువ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ డా.ఎ.సిరి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం కుష్ఠు రోగులను గుర్తించే కార్యక్రమంపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించి, అపోహలు తొలగించాలన్నారు. ఈనెల 17 నుంచి 30వ తేదీ వరకు 14 రోజులపాటు వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి అందరినీ పరీక్షించాలన్నారు. కుష్ఠు వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి తక్షణమే వైద్యం అందేలా చూడాలని చెప్పారు. అనంతరం కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పించే గోడపత్రాలను కలెక్టర్, జేసీ నూరుల్ ఖమర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో, జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి డా.ఎల్.భాస్కర్, జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్తు అంతరాయం

కర్నూలు వెంకటరమణ కాలనీ : నగరంలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్యలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు కర్నూలు డివిజన్ ఈఈ శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. రహదారి విస్తరణ పనుల్లో భాగంగా సుంకేసుల రహదారి, ఎస్బీఐకాలనీ, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632,
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : ?: అశోక్‌నగర్‌లో రైల్వే వంతెన కింద అండర్‌పాస్ రహదారిలో మురుగునీరు నిలిచింది. - **ప్రణీత్**

?: కృష్ణానగర్, అబ్బాస్‌నగర్‌లలో మురుగు కాలువలు పూడిపోయాయి. శుభ్రం చేయాలి. - **స్థానికులు**

✔: సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తాం.

- **నగరపాలక అధికారులు**

బొమ్మలు గీశారు.. బహుమతులు అందుకున్నారు

బహుమతులు అందుకున్న విజేతలు... పోటీల్లో చిత్రాలు గీస్తున్న అబ్దుల్ కలాం పాఠశాల విద్యార్థులు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా నగరంలోని డా.ఏపీజే అబ్దుల్ కలాం స్మారక నగరపాలక పాఠశాలలో సోమవారం చిత్రలేఖనం పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రకృతి అందాలపై చిత్రాలు గీశారు. బి.ఇంద్రనీలాధర్ (ఎనిమిదో తరగతి), బి.మోక్షిత (ఏడో తరగతి), కె.హరిత (ఎనిమిదో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.మాబు హుసేన్, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

బహుమతులు అందుకున్న విద్యార్థినులు... పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : పాతనగరం పూలబజారు సమీపంలోని సాగమండి వీధిలో ఉన్న భారత్ ఆంగ్ల మాధ్యమం పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు జరిగాయి. షేక్ బీబీ ఆయిషా, షేక్ ముబాస్‌హీరా (తొమ్మిదో తరగతి), తెలుగు భవిత (ఏడో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల ప్రిన్సిపల్ మహమ్మద్ ఇమ్రాన్, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

సుందరీకరణ.. నిధుల మేతకేనా

రూ.16 కోట్లు ఖర్చయినా ప్రయోజనం శూన్యం ◆ నిర్వహణ లోపంతో నీరుగారిన లక్ష్యం

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : కర్నూలు నగరంలో సుందరీకరణ పేరుతో రూ.కోట్లు ఖర్చుచేసి చేపట్టిన పనులు ప్రస్తుతం ఎందుకూ కొరగాకుండా పోయాయి. వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన బొమ్మలు, కళాఖండాలు రంగులు వెలిసిపోయి కళావిహీనంగా మారాయి. ఫౌంటెన్లు ఒట్టిపోయాయి. పూల మొక్కలు ఎండిపోయి కుండీలు ఖాళీగా మిగిలాయి. విభాగినులపై పచ్చదనం కరవైంది. నగరాన్ని అందంగా తీర్చిదిద్దుతామని చెబుతున్న పాలకులు.. నిధుల వ్యయంపై పెట్టిన శ్రద్ధ పనుల్లో నాణ్యత, నిర్వహణపై పెట్టడం లేదు. దీంతో నిధులు పక్కదారి పట్టి నగర సుందరీకరణ కలగానే మిగిలింది.

కొత్త బస్టాండు సమీపంలోని ఇందిరాగాంధీనగర్‌కు వెళ్లే రహదారి కూడలిలో కొన్నేళ్ల కిందట సుందీకరణ పనుల్లో భాగంగా బొమ్మలను ఏర్పాటు చేశారు. ఇక్కడ వివిధ ఆకృతుల్లోని కూజాలను ఏర్పాటు చేసి వీటిలోంచి నీళ్లు ఎగిసిపడేలా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నీటి సవ్వళ్లు ఆగిపోయాయి. బొమ్మలు రంగులు వెలిసిపోయి కళావిహీనంగా మిగిలాయి.

● గుత్తిరోడ్డులో 'గేట్ వే ఆఫ్ రాయలసీమ' పేరుతో కూడలిని అభివృద్ధి చేసి అక్కడ భూగోళం (గ్లోబ్) అమర్చారు. ఆ గోళం తిరుగుతూ చూపరులను ఆకట్టుకునేది. ఈ కూడలి అభివృద్ధికి దాదాపు రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు. ప్రస్తుతం ఆ గ్లోబ్ తిరగడం లేదు.

నగరపాలక కార్యాలయానికి వెళ్లే దారిలోని కూడలిలో టీ కప్పు.. కెటిల్ ఆకృతులను తీర్చిదిద్దారు. కెటిల్ నుంచి కప్పులో నీళ్లు ధారగా పడేలా చేసిన ఏర్పాటు నగర ప్రజలను ఆకర్షించేది. ఇందుకోసం సుమారు రూ.4 లక్షలు వెచ్చించినట్లు సమాచారం. కొన్ని నెలలుగా నీటి ధార నిలిచిపోయి ఇది దిష్టిబొమ్మలాగ మారింది.

కొరవడిన పర్యవేక్షణ

కర్నూలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సుందరీకరణ కోసం భారీగా నిధులు ఖర్చు చేశారు. ఆరేళ్ల కాలంలో రూ.16 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు సమాచారం. కూడళ్లు, విభాగినులకు రంగులు వేయడం, స్మార్ట్ స్ట్రీట్, ఖానా ఖజానా, క్లాక్ టవర్, బొమ్మల ఏర్పాటు, ఇతర పనులు చేశారు. ఈ పనులు నాసిరకంగా చేయడంతో కొన్నాళ్లకే అధ్వానంగా మారాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● నగరపాలక అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా నగర సుందరీకరణ ప్రహసనంగా మారింది. బొమ్మలు దుమ్ము, ధూళి పట్టి అధ్వానంగా మారాయి. బొమ్మలు విరిగిపోయాయి. ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. సిబ్బంది ఉన్నా వారితో సక్రమంగా పనిచేయించకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంబరాల్లో పాల్గొన్న విద్యార్థినులు

విద్యార్థినుల విజయోత్సవాలు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: భారత మహిళల క్రికెటు జట్టు వరల్డ్‌కప్ సాధించిన నేపథ్యంలో సోమవారం దూపాడు సమీపంలోని అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు. మహిళల క్రికెటు జట్టు విజయం ఎంతో మంది మహిళలకు స్ఫూర్తిదాయకమని కళాశాల అధ్యాపక బృందం తెలిపారు.

ప్రపంచ కప్ విజేతలకు అభినందనలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : మహిళల వన్డే క్రికెట్ ప్రపంచ కప్‌ను భారత జట్టు సొంతం చేసుకోవడం పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఎ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాల విద్యార్థినులు భారత మహిళా క్రికెటర్లను అభినందిస్తూ సోమవారం పాఠశాల నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రోఫీలు, ప్లకార్డులతో విద్యార్థినుల ప్రదర్శన

ప్రజా సమస్యలు త్వరగా పరిష్కరించాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ డా.ఎ.సిరి అధికారులను ఆదేశించారు. కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కలెక్టర్, జేసీ నూరుల్ ఖమర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీ వచ్చిన వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో దివ్యాంగుల కోసం ర్యాంపులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌వో వెంకటనారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, ఉప కలెక్టర్లు కొండయ్య ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ డా.సిరి, జేసీ నూరుల్ ఖమర్

తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టండి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ డా.ఎ.సిరి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. కర్నూలు కలెక్టరేట్ నుంచి సోమవారం ఆమె తాగునీరు, పారిశుద్ధ్యం, వ్యవసాయం, జీఎస్‌డబ్ల్యూఎస్ సర్వీసులు, పీజీఆర్ఎస్ తదితర అంశాలపై మండల ప్రత్యేకాధికారులు, డివిజన్, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గ్రామాల్లో నీటి సమస్యలపై పత్రికల్లో వార్తలు రాకముందే వాటిని గుర్తించి పరిష్కరించాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న కౌశలం సర్వేని త్వరగా పూర్తి చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది కచ్చితంగా పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ చేయాలని చెప్పారు. తనిఖీలు చేయని వారికి నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జేసీ నూరుల్ ఖమర్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

లలితాపీఠంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పాతబస్తీలోని భద్రావతి ఆలయంలో...

భక్తిశ్రద్ధలతో కార్తిక సోమవారం పూజలు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : కార్తిక మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని కర్నూలు నగరంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు దీపాలు వెలిగించారు. ఆలయాల్లో నిర్వహించిన పూజల్లో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు వారికి తీర్థ ప్రసాదాలు అందచేశారు.

బుగ్గ రామేశ్వరుడికి అభిషేకాలు

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: కార్తిక మాసం రెండో సోమవారం సందర్భంగా ఓర్వకల్లు మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాల్వబుగ్గలో బుగ్గరామేశ్వరస్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు, చిన్నారులు పుష్కరిణుల్లో స్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవో మద్దిలేటి, ఆలయ కమిటీ ఛైర్మన్ నారాయణ ఏర్పాట్లు చేశారు.

కాల్వబుగ్గలో పూజలు చేస్తున్న మహిళలు

ఆడిట్ అభ్యంతరాలకు బదులివ్వడంలో జాప్యమెందుకు

స్పందనకు వందనం

కర్నూలు జడ్పీ, న్యూస్‌టుడే : ఆడిట్ అధికారుల అభ్యంతరాలకు బదులివ్వడంలో జాప్యమెందుకు జరుగుతోందని జిల్లా పంచాయతీ అధికారు జి.భాస్కర్ పంచాయతీ కార్యదర్శులు, డిప్యూటీ ఎంపీడీవోలను ప్రశ్నించారు. ఏళ్ల తరబడి స్పందించక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'లెక్క చెప్పరు.. బదులివ్వరు' శీర్షికన ఈనెల 1న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి డీపీవో స్పందించారు. జిల్లాలోని మేజర్ పంచాయతీ కార్యదర్శులు, డిప్యూటీ ఎంపీడీవోలు, డీఎల్‌పీవోలతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆడిట్ తనిఖీల్లో అభ్యంతరాలకు నిర్ణీత సమయంలో సమాధానం ఇవ్వాలని చెప్పారు. పంచాయతీ ఎన్నికల్లోగా ఆడిట్ అభ్యంతరాలను పరిష్కరించుకోవాలని స్పష్టం చేశారు. లేని పక్షంలో సర్పంచులకు జారీచేసే సర్‌ఛార్జీలను సంబంధిత కార్యదర్శులు భరించాల్సి వస్తుందని హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు డీఎల్‌పీవో లక్ష్మి, ఆదోని డీఎల్‌పీవో తిమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై తప్పిన ప్రమాదం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు మండలం దిన్నెదేవరపాడు రింగ్‌రోడ్డు వద్ద 44వ జాతీయ రహదారిపై సోమవారం ఉదయం పెద్ద ప్రమాదం తప్పింది. నంద్యాల, డోన్ వైపు నుంచి వస్తున్న రెండు కార్లు ఢీకొన్నాయి. వాటిలో ప్రయాణిస్తున్న నంద్యాలకు చెందిన మహ్మద్‌రఫీ కుటుంబ సభ్యులు, అనంతపురం జిల్లా గంజికుంటకు చెందిన ఆదినారాయణ కుటుంబ సభ్యులకు స్వల్ప గాయాలయ్యాయి. అదే సమయంలో కర్నూలు నుంచి డోన్‌వైపు వెళ్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి అక్కడ ఆగి ప్రమాదం గురించి ఆరా తీశారు. బాధితులకు అవసరమైన సహాయం అందించాలని హైవే గస్తీ పోలీసులకు సూచించారు.

రైలు ప్రయాణికుల సమస్యలు పరిష్కరించండి

మహాధర్నాలో పాల్గొన్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : కర్నూలు నగరంలోని రైలు ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మలమ్మ డిమాండ్ చేశారు. నగర ప్రజల సౌకర్యార్థం కర్నూలు నుంచి విజయవాడకు ఇంటర్ సిటీ రైలు నడపాలని కోరుతూ సీపీఎం నాయకులు సోమవారం కర్నూలు రైల్వేస్టేషన్ వద్ద మహాధర్నా నిర్వహించారు. సీపీఎం నగర కార్యదర్శి రాముడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు పూర్తిచేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, కొత్త రైల్వే లైన్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పీఎస్ రాధాకృష్ణ, ఆనంద్‌బాబు, అంజిబాబు, అలివేలు, నగేష్, విజయ్, రామాంజనేయులు, సుధాకరప్ప, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యంతో రూ.కోట్లు కొల్లగొట్టారు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఆ పార్టీ వారు కల్తీ మద్యం వ్యాపారం చేసి రూ.వేల కోట్లు కొల్లగొట్టారని కుడా ఛైర్మన్, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఆరోపించారు. నగరంలోని తన నివాసంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వంలో ప్రభుత్వ దుకాణాల్లో జే బ్రాండ్ మద్యం విక్రయించి లక్షలాది మంది అనారోగ్యం బారినపడేందుకు కారణమయ్యారని పేర్కొన్నారు. ఈ అక్రమాల్లో భాగమైన మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్టు సక్రమమేనని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

చిన్న పరిశ్రమలకు రాయితీలు ఇవ్వాలి

ఆందోళన చేస్తున్న చిన్న పరిశ్రమల నిర్వాహకులు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : చిన్న పరిశ్రమలకు 20 శాతం రాయితీ ఇవ్వాలని పారిశ్రామికవేత్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తమకు రాయితీ ఇవ్వాలని కోరుతూ మంగళవారం వారు జిల్లా పరిశ్రమల కేంద్రం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ నిరసన తెలిపారు. చిన్న పరిశ్రమల యజమానుల సంఘం నాయకుడు పి.దస్తగిరి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిన్న పరిశ్రమల యాజమాన్యాలకు రాయితీ విడుదల చేస్తామని దీపావళి రోజున ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ప్రసాద్, నాగరాజు, రామకృష్ణ, చెన్నకేశవులు, దాసరి రాజేష్, మాధవుడు, లింగం సురేష్, నల్లమల జనార్దన్, హరికృష్ణ, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: నూతన రహదారుల కోసం నిధులు మంజూరు చేయాలని కర్నూలు నగరానికి సోమవారం విచ్చేసిన ఆర్‌అండ్‌బీ, ఎస్‌హెచ్‌అండ్‌ఎండీ, ఏపీఆర్డీసీ చీఫ్ ఇంజినీర్ ఎల్.శ్రీనివాసరెడ్డి అధికారులకు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి విజ్ఞప్తి చేశారు. పాణ్యం నియోజకవర్గంలోని రహదారుల పరిస్థితులపై ఎమ్మెల్యే వారికి వివరించారు.

బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని పూడిచెర్ల సమీపంలో ఏర్పాటు చేసిన సిలికా శాండ్ పరిశ్రమతో సమీపంలోని పంటలు దెబ్బతింటున్నాయని, పరిశ్రమ యాజమాన్యం బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. పూడిచెర్లలోని పంట పొలాలను ఆయన సీపీఎం బృందంతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమ నుంచి వస్తున్న దుమ్ముధూళి పంటలపై పడి నాశనమైపోతున్నాయన్నారు. పరిశ్రమకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. పరిశ్రమకు అవసరమైన ముడి సరుకు కోసం బోర్ బ్లాస్టింగ్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని బాధిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగన్న, కృష్ణ, వెంకటేశ్వర్లు, సంజన్న, రామనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: చదువుల రామయ్య కాలనీలో సీసీ రోడ్డు వేయాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి డిమాండు చేశారు. నగరపాలక కార్యాలయం ఎదుట సోమవారం సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప డిమాండు చేశారు. నగరపాలక కార్యాలయంలో సోమవారం అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణకు వినతిపత్రం ఇచ్చారు.

నాయకల్లు (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే: : పశువులకు వచ్చే వ్యాధులను ముందుగానే గుర్తించి టీకాలు వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డా.పి.దీప్తి సూచించారు. నాయకల్లు గ్రామంలో అపార్డ్, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు.

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: న్యూ గ్రేటర్ కర్నూలు కాంట్రాక్టర్స్, వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ప్రకాష్‌నగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నుకున్నారు.

కర్నూలు నగరపాలక సంస్థ : మున్సిపల్ పరిపాలన శాఖ ప్రాంతీయ సంచాలకులు నాగరాజు సోమవారం కర్నూలు నగరపాలక కార్యాలయంలో విచారణ చేపట్టారు. పట్టణ ప్రణాళిక విభాగంలో జరిగిన అవినీతి, టీడీఆర్ బాండ్ల జారీ తదితర అంశాలపై విచారించారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : చిన్నటేకూరు- చెట్లమల్లాపురం మధ్య ఇటీవల బస్సు ప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలో సోమవారం ఓ ఆటో కారును ఢీకొట్టింది. కర్నూలు నుంచి వెల్దుర్తికి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో ముందు వెళ్తున్న కారును ఢీకొట్టింది. ఆటో ప్రయాణిస్తున్న పలువురు గాయపడ్డారు.

గుంతలు తీశారు.. గండాల్లో తోశారు

●అసంపూర్తిగా సీసీ రహదారి విస్తరణ పనులు

సెట్కూరు కార్యాలయం, అన్న క్యాంటీన్ నుంచి భగవాన్ నగర్ మార్గంలో అసంపూర్తి పనులు

సీసీ రహదారుల విస్తరణ పేరుతో కల్లూరు పట్టణ ప్రాంతంలోని ప్రధాన రహదారులను తవ్వేశారు. దుకాణాలు, ఇళ్ల ముందు మోకాలి లోతు గోతుల కారణంగా ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే.. ప్రధాన రోడ్లను ఒకవైపు తవ్వేసి నెల రోజులు గడిచిపోయినా పనుల మాటే మరిచారు. వారం కిందట కొన్నిచోట్ల కాంక్రీటుతో ఒక లేయర్ వేసి వదిలేశారు. దీంతో ఇంటి నుంచి బయటికి వెళ్లలేక.. బయటికెళ్లిన వారు ఇంటికి చేరుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనదారులు నరకం అనుభవిస్తున్నారు.

– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

సెట్కూరు కార్యాలయం నుంచి ముజఫర్‌నగర్ వైపు వెళ్లే దారిలో..

రాకపోకలకు ఇబ్బందులు

కల్లూరు ఎస్టేట్, పారిశ్రామికవాడలో వివిధ పరిశ్రమలకు నిత్యం లారీలు, భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. చెన్నమ్మ కూడలి నుంచి ఎస్టేట్ మీదుగా.. ముజఫర్‌నగర్, పందిపాడు, లక్ష్మీపురం మీదుగా కోడుమూరు మండలం అనుగొండకు వెళ్లే ప్రధాన రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. కల్లూరు ఎస్టేట్ రోడ్డు అంచుల్లో గుంతలు తీయడంతో చింతలమునినగర్ తదితర వీధులకు వాహనాలపై వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

ఎక్కడెక్కడ సమస్య

◆ కల్లూరు పారిశ్రామికవాడ సమీపంలోని జిల్లా యువజన సంక్షేమశాఖ సెట్కూరు కార్యాలయం నుంచి భగవాన్‌నగర్ వరకు నెల రోజుల కిందట రహదారి విస్తరణ కోసం గుంతలు తీశారు.

◆ భగవాన్‌నగర్ నుంచి కల్లూరు చెన్నమ్మ కూడలి వరకు నాలుగు వారాల కిందట రహదారి పొడవునా గుంతలు తీశారు. ఒక లేయర్ వేసి వదిలేశారు.

◆ సెట్కూరు కార్యాలయం, అన్న క్యాంటీన్ నుంచి కల్లూరు చెన్నమ్మ కూడలి వరకు ఇదే పరిస్థితి.

వ్యాపారుల ఆవేదన

ఈ రహదారులకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో దుకాణాలు ఉన్నాయి. వాటి ముందు రోడ్డును తవ్వేయడంతో వినియోగదారులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వినియోగదారుల వాహనాలు నిలిపేందుకు స్థలం లేకుండాపోయింది. రోడ్డు వెంట గుంతలు తీయడంతో తమ వ్యాపారాలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు పనులు చేపట్టినా పూర్తయ్యేందుకు మరో నెల రోజుల పడుతుందని స్థానికులు చెబుతున్నారు. సీసీరోడ్లను త్వరగా విస్తరించి సమస్యలు పరిష్కరించాలని కల్లూరు వాసులు కోరుతున్నారు.

చెన్నమ్మ కూడలి సమీపంలో ప్రధాన రహదారి దుస్థితి

జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించాలి

ఆందోళన చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : వెనుకబడిన కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.20 వేల కోట్ల నిధులు కేటాయించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, శ్రీనివాసులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాకు నిధులు కేటాయించాలని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు బి.నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నగర నాయకులు శ్రీకాంత్, చంటి, అఖిల్, సురేంద్రయాదవ్, రసూల్, నాగేశ్వరరావు, ప్రభాకర్, కాశీం, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల ముప్పును అరికట్టడమే లక్ష్యం

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : మానవ, జంతు, పర్యావరణ ఆరోగ్యాన్ని అనుసంధానం చేస్తూ వ్యాధుల ముప్పును అరికట్టేందుకు రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానమే వన్ హెల్త్ అప్రోచ్ అని జీజీహెచ్ పర్యవేక్షకుడు డాక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక సర్వజన వైద్యశాల ఎదుట నేషనల్ మెడికల్ కౌన్సిల్, ఐసీఎంఆర్ సూచనల మేరకు వన్ హెల్త్ అప్రోచ్ ఆరోగ్య విధానంపై సోమవారం వైద్యులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కమ్యూనిటి మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ సుధాకుమారి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సిందియా శుభప్రద, సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ డాక్టర్ పద్మజ, డాక్టర్ రేణుక, నోడల్ ఆఫీసర్ డాక్టర్ వైష్ణవి, అధ్యాపకుడు సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందినట్లు ఉలిందకొండ ఎస్సై ధనుంజయ ఒక ప్రకటనలో తెలిపారు. దూపాడు సమీపంలో అక్టోబరు 10వ తేదిన ఉదయం గుర్తు తెలియని వాహనం ఓ వ్యక్తిని ఢీ కొట్టింది. చికిత్స నిమిత్తం ఆయనను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో తరలించారు. అక్కడ కోలుకోలేక ఈ నెల 2న మృతిచెందారు. మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ రూంలో ఉంచినట్లు తెలిపారు.

● లక్ష్మీపురం పరిధిలోని హంద్రీ నీవా కాలువలో గుర్తు తెలియని మృతదేహం సోమవారం లభ్యమయ్యింది. మరణించిన వ్యక్తి గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నాడు. మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచినట్లు తెలిపారు. మరణించిన వ్యక్తుల వివరాలు తెలిస్తే పోలీసుస్టేషన్‌ను సంప్రదించాలన్నారు.

(c) eenadu

ప్రమాదం అంచున ప్రయాణం

మొంథా తుపాను సృష్టించిన తాకిడితో చామ కాల్వ ఉప్పొంగింది. రహదారిని ముంచెత్తింది. నంద్యాలలో ప్రథమనంది ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి దెబ్బతింది. రోడ్డు పక్కన మట్టి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. కార్తిక మాసం నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. వాహనాలు ఎదురెదురుగా వస్తే ప్రమాదం తప్పదు. – న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

రోడ్డు దాటలేక.. బడిబాట పట్టలేక

పాణ్యం మండలం బలపనూరుమెట్ట వద్ద జాతీయ రహదారికి ఇరువైపులా గ్రామాలున్నాయి. పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులు రోడ్డు దాటాల్సిన పరిస్థితి. ఈ మార్గంలో ప్రతిరోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వంతెన నిర్మించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

అక్కల గెలుపు.. చెల్లెళ్లకు మలుపు

అమ్మాయిలు అదరగొట్టారు.. ముంబయి వేదికగా సాగిన ప్రపంచ కప్ క్రికెట్ తుది పోరులో గెలుపుతీరం దాటారు. దేశమంతా విజయ 'పతాకం' రెపరెపలాడుతోంది.. అక్కల గెలుపు మాలో స్ఫూర్తి నింపిందని క్రీడాకారిణులు అభిప్రాయపడ్డారు. రెండు జిల్లాలకు చెందిన పలువురు బాలికలు పరుగుల వరద పారిస్తున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో మెరిశారు. ప్రపంచ కప్ గెలుపు మరింత ఆత్మస్థైర్యం నింపిందంటున్నారు. – న్యూస్‌టుడే నంద్యాల పాత పట్టణం

బౌలింగ్‌లో 'మేఘనా'పాటి

ఆదోని పట్టణానికి చెందిన వై.మేఘనారెడ్డి పేస్ బౌలర్‌గా రాణిస్తోంది. ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతోంది. గత మూడేళ్లుగా బాలాజీరావు వద్ద ప్రత్యేక శిక్షణ తీసుకుంటోంది. ఇన్-స్వింగ్, ఔట్-స్వింగ్ వేయడంలో ఈ బాలిక ప్రత్యేకత.. వరుసగా 2024, 2025 సంవత్సరాల్లో అండర్-15 జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తూ రాష్ట్ర స్థాయి పోటీలకు సన్నద్ధమవుతోంది. త్వరలో జరగనున్న సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక చేసే జట్టు ప్రాబబుల్స్‌లో చోటు సంపాదించుకుంది. – న్యూస్‌టుడే, ఆదోని క్రీడలు

శరణ్య.. పోరాటం అనన్యం

కర్నూలుకు చెందిన శరణ్య నాలుగో తరగతి చదువుతున్నప్పటి నుంచే క్రికెట్‌లో శిక్షణ తీసుకున్నారు. ఆంధ్రా జట్టు తరఫున నాలుగుసార్లు ఆడి ప్రతిభ చాటారు. బౌలింగ్‌లో లెగ్ స్పిన్నర్‌గా రాణిస్తున్నారు. ఇప్పటికే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. భారత జట్టులో చోటు సంపాదించేందుకుగాను ఇప్పటివరకు నాలుగు ఛాలెంజ్ మ్యాచ్‌లలో ఆడి ప్రతిభ చాటారు. 2019-20లో అండర్-19 జట్టుకు కెప్టెన్‌గా ఉంటున్నారు. 2023-24లో అండర్-23 జట్టుకు కెప్టెన్‌గా సారథ్యం వహించారు. ఆలిండియా స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించారు. గతేడాది డిసెంబరులో కోల్‌కతాలో జరిగిన రంజీ పోటీల్లో 24 వికెట్లు పడగొట్టి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ ఏడాది జనవరిలో జరిగిన ఇండియా ఛాలెంజర్స్ పోటీల్లో భాగంగా 4 మ్యాచ్‌లలో 10 వికెట్లు పడగొట్టారు. –న్యూస్‌టుడే, నంద్యాల క్రీడలు

సోదరీమణులు అదుర్స్

ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన రిశ్వహర్షిణి కీపర్‌గా జట్టులో కీలక భూమిక పోషిస్తోంది. గతేడాది డిసెంబరులో మంగళగిరిలో రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున ఎంపికైంది. కీపర్‌గా మూడు మ్యాచుల్లో ఆరు క్యాచ్‌లు అందుకుని భళా అనిపించింది. గత జూన్‌లో నెల్లూరులో జరిగిన జోన్-4 క్రికెట్ పోటీల్లో అండర్-17 విభాగంలో జిల్లా జట్టు తరఫున ఆడింది. గత నెలలో జరిగిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభ చాటి జిల్లా జట్టులో స్థానం సుస్థిరం చేసుకొంది. రిశ్వహర్షిణి చెల్లి మధుహర్షిణి క్రికెట్‌లో రాణిస్తోంది. అక్టోబరు 29న జిల్లాస్థాయి పోటీల్లో రాణించి జిల్లా జట్టులో స్థానం పదిలం చేసుకొంది. సౌత్ జోన్ పోటీలకు సిద్ధం అవుతోంది. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

సహస్ర 'పరుగులు'

కర్నూలు నగరానికి చెందిన సహస్రరెడ్డి ఓపెనర్‌గా బరిలో దిగి పరుగుల వరద పారిస్తోంది. జాతీయస్థాయి క్రికెటర్ అయిన ఆమె తండ్రి కృష్ణారెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని రాణిస్తోంది. 2024 నవంబరులో గుంటూరులో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-17 జిల్లాస్థాయికు సారథ్యం వహించారు. నాలుగు మ్యాచ్‌లలో 193 పరుగులు సాధించింది. ముందుండి జట్టును విజయ పథంలో నడిపించి జిల్లాకు ట్రోఫీ అందించింది. 2024 డిసెంబరులో రాజస్థాన్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 క్రికెట్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ఆడింది. ఆరు మ్యాచ్‌లలో 120 పరుగులు చేసింది. 2025 ఆగస్టు 13న విశాఖపట్నంలో జరిగిన క్రికెట్ పోటీల్లో దక్షిణ మండలానికి ప్రాతినిధ్యం వహించింది. – న్యూస్‌టుడే, కర్నూలు క్రీడలు

ఆల్‌రౌండర్ అమృత

పత్తికొండ పట్టణానికి చెందిన అమృత నాలుగో తరగతి నుంచే క్రికెట్ బ్యాట్ పట్టడం ప్రారంభించింది. ఆ బాలిక ఆసక్తి గమనించిన తల్లిదండ్రులు శిక్షణ కేంద్రంలో చేర్పించారు. ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది. అండర్-15, 17, 19 విభాగాల్లో కర్నూలు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తోంది. జట్టులో ఆల్‌రౌండర్‌గా ప్రతిభ చాటుతోంది. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కర్నూలు జిల్లా తరఫున అండర్-19 మహిళా జట్టుకు ఎంపికైంది. –న్యూస్‌టుడే, పత్తికొండ గ్రామీణ

గెలుపు 'లిఖిత'ం

పత్తికొండకు చెందిన లిఖిత పదో తరగతి చదువుతోంది. పదో తరగతి చదువుతున్న ఈ బాలిక నాన్న వద్దే శిక్షణ పొందుతోంది. 2024-25 స్కూల్ గేమ్స్‌లో అండర్-14 విభాగంలో జిల్లా జట్టులో ఆడి పరుగుల వరద పారించింది. ప్రస్తుతం అండర్-17 విభాగంలో కర్నూలు జిల్లా జట్టు తరఫున ఆడుతోంది. అండర్-15 విభాగంలో ఏపీ రాష్ట్ర మహిళల ప్రాబబుల్స్ జట్టులో స్థానం సంపాదించింది. జాతీయ జట్టులో స్థానం దక్కించుకోవటమే లక్ష్యంగా సాధన చేస్తున్నానని చెబుతోంది లిఖిత. –న్యూస్‌టుడే, పత్తికొండ గ్రామీణ

ప్రవళిక.. భళా

ఎమ్మిగనూరుకు చెందిన ప్రవళికారెడ్డి పదో తరగతి చదువుతోంది. వాలీబాల్ క్రీడాకారిణి అయిన తల్లి హేమలత కుమార్తెను క్రీడల్లో ప్రోత్సహించారు. ఆమెను జాతీయస్థాయి క్రికెటర్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో శిక్షణ ఇప్పిస్తున్నారు. కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న శిబిరంలో చేర్పించారు. అక్కడి శిక్షకుల సలహా మేరకు ప్రవళిక బౌలింగ్‌పై దృష్టి పెట్టింది. లెగ్ స్పిన్ సాధన చేసి బంతిపై పట్టు సాధించింది. 2025 సెప్టెంబరు 2 నుంచి 15వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగిన ఆంధ్రా ఉమెన్స్ టీ20 లీగ్- 2025లో రాయలసీమ రాణి జట్టు తరఫున నాలుగు మ్యాచ్‌లు ఆడిన ప్రవళిక లెగ్ స్పిన్నర్‌గా రాణించి 12 వికెట్లు తీసింది. – న్యూస్‌టుడే, కర్నూలు క్రీడలు

శ్రీగిరి క్షేత్రం.. దేదీప్యమానం



కార్తిక దీపాలతో శోభాయమానంగా దర్శనమిస్తున్న ఆలయ పుష్కరిణీ

హారతి ఇస్తున్న అర్చకులు

పాతాళగంగలో దీపాలు వదులుతున్న మహిళలు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రం.. సోమవారం భక్తులతో కళకళలాడింది. తెల్లవారుజామున నుంచి భక్తులు పాతాళ గంగలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లను దర్శించుకున్నారు. కార్తిక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

సెస్సు ఏమిర్చి

- వ్యాపారుల మాయాజాలం
- గోదాముల వద్దే కొనుగోళ్లు

శీతల గోదాము వద్ద మిర్చి కొనుగోళ్లు

జిల్లాలో శీతల గోదాములు కేంద్రంగా మిర్చి కొనుగోళ్ల మాయాజాలం జరుగుతోంది. నిబంధనల ప్రకారం మార్కెట్‌యార్డుల్లో క్రయవిక్రయాలు జరగాల్సి ఉన్నా.. గోదాముల వద్దే దందా సాగుతోంది. మరోవైపు అక్రమార్కులు సరకును రైతు పేరుతో తరలించేస్తూ పెద్దఎత్తున సెస్సు ఎగ్గొడుతున్నారు. జిల్లాలో 11 శీతల గోదాములుండగా.. సగటున ఒక్కో గోదాములో రూ.60 కోట్ల విలువ చేసే మిరప దిగుబడులు ఉన్నాయి. ఈ లెక్కన రూ.660 కోట్ల మిర్చి దిగుబడులు ఉండగా వీటి విక్రయాల ద్వారా ప్రభుత్వానికి సెస్సు రూపంలో ఏడాదికి రూ.6 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశముంది. దళారులు గోదాముల వద్దే సరకు కొనుగోలు చేస్తుండటంతో ప్రభుత్వానికి భారీ నష్టం జరుగుతోంది. – న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

ట్రేడ్ లైసెన్సులు లేకుండానే 'బేరాలు'

- నిబంధనల ప్రకారం రైతులు మిర్చిని యార్డుకు తీసుకొచ్చి ప్రభుత్వ లైసెన్సు పొందిన కమీషన్ ఏజెంట్ల ద్వారా విక్రయించాలి.
- నంద్యాల మార్కెట్ యార్డులో మాత్రమే మిర్చి యార్డు ఉంది. ప్రత్యేకంగా రెండేళ్ల కిందట మిర్చి రైతుల కోసమే ఈ యార్డును ఏర్పాటుచేసి 20 మంది ఏజెంట్లకు లైసెన్సులు ఇచ్చారు.
- రైతు నుంచి కొనుగోలు చేసే మొత్తానికి ఏజెంట్లు రసీదులు ఇస్తారు. ఇదే సమయంలో క్రయవిక్రయాలతో యార్డుకు ఒక శాతం సెస్సు రూపంలో జమవుతుంది. సంబంధిత ఏజెంటు కొనుగోలు చేసిన మొత్తానికి చెల్లించిన సెస్సు వివరాలు ఉండడంతో రైతుకు చెల్లించాల్సిన డబ్బుకు ఒక రకంగా గ్యారెంటీ ఉంటుంది. ఇవన్నీ ప్రైవేటు గోదాముల వద్ద ఉండవు.

ధర తగ్గిందని దాచుకొంటే

- నంద్యాల, కోవెలకుంట్ల, గడివేముల, పాణ్యం, మిడుతూరు, నందికొట్కూరు, వెలుగోడు, మహానంది, చాగలమర్రి, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో రైతులు విస్తారంగా మిర్చి సాగు చేస్తున్నారు. గత రెండేళ్లుగా ఈ పంటకు తగిన గిట్టుబాటు ధర లభించడం లేదు.
- గతంలో కిలో రూ.280 వరకు ధర పలకగా. ప్రస్తుతం రూ.125 నుంచి రూ.140కు పడిపోయింది. పలువురు రైతులు సరకును రెండేళ్లపాటు గోదాముల్లో నిల్వ ఉంచినప్పటికీ ఆశించిన ధర లభించడం లేదు. దీనికి తోడు మిర్చిపై నల్లటి పొర వస్తుండటంతో దాచిన సరకును రైతులు విక్రయించేస్తున్నారు. ఇదే అదనుగా మధ్య దళారులు రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని గోదాముల వద్దే మిర్చి కొనుగోలు చేస్తున్నారు.

శీతల గోదాములు : 11
ఒక్కోదాని సామర్థ్యం : 1.20 లక్షల సంచులు

అక్రమాలకు దారి

- గోదాముల వద్ద మిర్చి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు కాటాల్లోనూ మోసాలకు పాల్పడుతున్నారన్న అనుమానాలున్నాయి. మరోవైపు రైతుల నుంచి మిర్చి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు వారి పేరుతోనే గుంటూరు యార్డుకు తరలిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వానికి ఒక్క పైసా ఆదాయం రావడం లేదు.
- "రెండేళ్ల కిందట శీతల గోదాములో 66 బస్తాల మిర్చి నిల్వ చేశా. అప్పుడు కిలో రూ.180 మాత్రమే పలుకుతుండటంతో ధర లేదన్న ఉద్దేశంతో నిల్వ చేశా. ప్రస్తుతం రూ.125కే అమ్ముతున్నా. గోదాముల్లో రెండేళ్ల కంటే ఎక్కువగా నిల్వ చేయలేం. ఇప్పటికే మిరపపై కొంతమేర నల్లటి రంగు కనిపిస్తోంది. యార్డుకు తీసుకెళ్లలేక గోదాము వద్దనే అమ్ముకుంటున్నట్లు" పాణ్యానికి చెందిన ఎల్లప్ప వాపోయారు.

మేధో వికాసం ఏఐ ఆహ్వానం

డోన్ పట్టణం, న్యూస్‌టుడే : ప్రపంచమంతా కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్- ఏఐ) దిశగా పరుగెడుతోంది. ఈ నేపథ్యంలో యువతను ప్రోత్సహించేందుకు కేంద్రం యువ ఏఐ గ్లోబెల్ యూత్ ఛాలెంజ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతిభావంతులకు ప్రోత్సహించడమేకాక వారికి మెరుగైన అవకాశాలు కల్పించాలని నిర్ణయించింది.

నగదు బహుమతుల వివరాలు

- యువ ఏఐ గ్లోబెల్ యూత్ ఛాలెంజ్ పోటీల్లో ప్రథమంలో నిలిచిన మూడు బృందాలకు రూ.15 లక్షలు, ద్వితీయ స్థానంలో నిలిచిన మూడు బృందాలకు రూ.10 లక్షలు, ప్రత్యేక బహుమతి కింద రెండు బృందాలకు రూ.5 లక్షల చొప్పున అందజేస్తారు.
- 13-17 ఏళ్లలోపు వారికి తల్లిదండ్రుల ఖాతాల్లో నగదు జమ చేస్తారు.
- 18-21 ఏళ్ల వయస్సువారికి బృంద సారథి ఖాతాలో నగదు జమ చేస్తారు.
- సమ్మిట్‌కు హాజరయ్యే విద్యార్థులు, యువతీయువకులకు ప్రయాణ, వసతి సౌకర్యాలు కల్పిస్తారు.

అర్హులెవరంటే..

యువ ఏఐ గ్లోబెల్ యూత్ ఛాలెంజ్‌లో పాల్గొనేందుకు 13 నుంచి 21 ఏళ్ల లోపు 8వ తరగతి నుంచి పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్ విద్యార్థులు, యువతీయువకులు అర్హులు.

దరఖాస్తు విధానం

యువ ఏఐ గ్లోబెల్ యూత్ ఛాలెంజ్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థులు, యువతీ యువకులు ఈనెల 30వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీఎస్:///ఐఎంపీఏసీటీ.ఐఎన్‌డీఐఏఏఐ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇవి రూపొందించాలి

టెక్నాలజీ, ఓపెన్ ఇన్నోవేషన్, పర్యావరణ పరిరక్షణ, ప్రజలు, సామాజిక సాధికారత, ప్రాథమిక రంగాలు (వ్యవసాయం, పరిశ్రమలు, రవాణా), గ్రీన్ ఎనర్జీ, స్మార్ట్ ఎకో సిస్టమ్స్, సుస్థిర నగరాలు వంటి అంశాలపై ప్రాజెక్టులు రూపొందించి అందించాల్సి ఉంటుంది.

ఎంపిక ఇలా..

ప్రాథమిక ఎంపిక, ప్రాజెక్టు మెరుగుదల, ఇంటర్వ్యూ ద్వారా విజేతలను ఎంపిక చేస్తారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే గ్లోబెల్ ఏఐ సమ్మిట్‌లో ప్రదర్శించేందుకు అవకాశం కల్పిస్తారు.

కార్యశాలకు ఆహ్వానం

కృత్రిమ మేధో పరిజ్ఞానం, సృజనాత్మకత ఆలోచనలు, బాధ్యతాయుత వినియోగ పద్ధతులకు చెందిన ఆలోచనలు చేసే అవకాశం ఉంది. వీటి ద్వారా నగదు బహుమతి అందుకునే చక్కటి అవకాశాన్ని కల్పిస్తోంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (దిల్లీ) ఆధ్వర్యంలో నిర్వహించే ఏఐ నిపుణుల కార్యశాలలో పాల్గొనే అవకాశం ఉంది.

జిల్లాలో ఈవీ ఛార్జింగ్ కేంద్రాలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాలలో ఈవీ ఛార్జింగ్ కేంద్రాల స్థాపనకు అనువైన ప్రదేశాలను గుర్తించాలని ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. 100 శాతం రాయితీతో ఛార్జింగ్ కేంద్రాలు నెలకొల్పే అవకాశం ఉందన్నారు.

పర్యాటక ప్రాంతాల్లో హోం స్టే విధానం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం హోం స్టే, బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ విధానాలను ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. యజమానులు తమ ఇంటిలో కనీసం ఒక గది నుంచి ఆరు గదుల వరకు పర్యాటకులకు అద్దెకు ఇవ్వవచ్చన్నారు. నమోదుకు ఏపీ పర్యాటక శాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా కానీ జిల్లా పర్యాటక శాఖ కార్యాలయాన్ని గానీ సంప్రదించవచ్చన్నారు.

రైతేరాజు 6లో

ecoren WALK-IN INTERVIEWS
Ecoren Energy is looking for experienced professionals for Wind and Solar Power Projects in Kurnool, Anantapur and Kadapa.
: Positions :
Civil Engineers, Electrical Engineers, Site Managers
: Experience :
2–12 years in Wind/Solar Project Execution
Interview Dates :
08th November 2025 — 09:00 AM to 06:00 PM
09th November 2025 — 09:00 AM to 01:00 PM
Venue : HOTEL ALEXANDER, Saptagiri Circle, Anantapur
Contact : 7331122450, Email: hr@ecorenenergy.com

దారిలో యమకంకరులు

పాణ్యం, పాణ్యం గ్రామీణ, న్యూస్‌టుడే : ప్రధాన రహదారులపై టిప్పర్లు దూసుకెళ్తున్నాయి. వాహనదారులు, పాదచారుల ప్రాణాలను బలిగొంటున్నాయి. పరిమితికి మించిన లోడుతో వెళ్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. తెలంగాణ రాష్ట్రం మీర్జాగూడ వద్ద ఆర్టీసీ బస్సును కంకర తీసుకెళ్తున్న టిప్పర్ ఢీకొని బస్సుపై పడి 19 మంది చనిపోయారు. ఇక్కడా జాతీయ రహదారి (ఎన్‌హెచ్-40)పై ఇలానే పరుగులు పెడుతున్నాయి.

- మిల్లులు, టిప్పర్ల యజమానులతో పలువురు అధికారులకు మంచి సంబంధాలున్నాయన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో నిబంధనలు పాటించనివారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.
- పరిమితికి మించి లోడుతో టిప్పర్లు వెళుతున్నా ఎక్కడా కేసులు నమోదు చేయడం లేదు. పాణ్యం, సుగాలిమెట్ట, పాణ్యం డొంగు, ఆర్జీఎం కళాశాల, బలపనూరు, వెంకటేశ్వరపురం, ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో నిత్యం రద్దీ ఉన్నప్పటికీ టిప్పర్ల వేగానికి కళ్లెం పడటం లేదు.

గుట్టల నుంచి గుట్టుగా

- పాణ్యం మండల పరిధిలోని తమ్మరాజుపల్లె వద్ద 15కు పైగా స్టోన్ క్రషర్లు ఉన్నాయి. నియోజకవర్గ పరిధిలో ఎర్రమట్టి గనులు ఉన్నాయి. ప్రతి రోజూ వందల సంఖ్యలో టిప్పర్లలో కంకర, ఎర్రమట్టి తరలుతోంది.
- తమ్మరాజుపల్లె నుంచి నంద్యాల, కర్నూలు వైపు ప్రతి రోజూ పెద్దసంఖ్యలో టిప్పర్లు తిరుగుతున్నాయి.
- పాణ్యం రైల్వేస్టేషన్ నుంచి జిందాల్ పరిశ్రమకు నిత్యం స్లాగ్‌ను తరలిస్తుంటారు. రహదారులపై టిప్పర్లు కనిపిస్తేచాలు.. జనం హడలిపోతున్నారు. తమపైకి దూసుకొస్తాయనని పక్కకు దిగేస్తుంటారు.

అనుభవం లేకపోయినా..

భారీ వాహనాలు నడపాలంటే తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు ఉండాలి. వివిధ వాహనాలు నడిపిన అనుభవం గడించి ఉండాలి. కానీ టిప్పర్లు, కంకర మిల్లుల యజమానులు వీటిని పట్టించుకోవడం లేదు. అనుభవం లేకపోయినా వాహనాన్ని చేతికిచ్చేస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్సు లేకున్నా పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో వారు చెలరేగిపోతున్నారు. వాహనాలను ప్రధాన రహదారులపై ఇష్టానుసారంగా.. అతివేగంగా నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు.

ఎన్నో ప్రమాదాలు..

- 2021లో పాణ్యం ప్రాంతంలోని నూలుమిల్లు వద్ద గొర్రెల మందపై టిప్పరు దూసుకెళ్లడంతో ఇద్దరు వ్యక్తులతోపాటు 20 గొర్రెలు, మేకలు మృత్యువాత పడ్డాయి.
- 2022లో అదే నూలుమిల్లు వద్ద ఓ టిప్పరు ఆవుల మందపైకి దూసుకురావడంతో 5 మృతి చెందాయి. అదే ఏడాది తమ్మరాజుపల్లె వద్ద గొర్రెల మంద పైకి వెళ్లడంతో 20 జీవాలు ప్రాణాలు కోల్పోయాయి.
- 2023లో బలపనూరు మెట్ట సమీపంలో గొర్రెల మందను టిప్పరు ఢీకొన్న ఘటనలో 25 గొర్రెలు మృతి చెందాయి.
- 2023లో నెరవాడమెట్ట వద్ద కళాశాల బస్సును టిప్పరు ఢీకొట్టడంతో బస్సు క్లీనర్ మృతి చెందారు. 2024లో పాణ్యం బస్టాండ్ వద్ద ఆకాశ వంతెనపై ద్విచక్రవాహనాన్ని టిప్పరు ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు.

కొడుకు నిర్దాక్షిణ్యం.. తల్లడిల్లిన ప్రాణం



మల్లెపోగు పుల్లమ్మ

నవమాసాలు మోసి ఐదుగురు కొడుకులకు జన్మనిచ్చింది. వేలు పట్టుకుని నడిపించింది. ప్రయోజకులను చేసి పెళ్లిళ్లు చేసింది. చిన్న కుమారుడిపై మమకారంతో ఎక్కువ ఆస్తి ఇస్తానని చెప్పింది. అతని వద్దే ఉంటోంది.. వయస్సు మీరి.. కళ్లు కనపడని తల్లి ఆస్తిపై అతను కన్నేశాడు. ఆస్తి రాసేసుకుని ఇంటి నుంచి తరిమేశాడు.. అడిగితే ఆమె ఇచ్చిన ఆస్తికన్నా ఎక్కువే పెట్టానంటూ చెప్పుకొచ్చాడు. దిక్కుతెలియని ఆ తల్లి తనకు న్యాయం చేయాలంటూ వేడుకుంది.. బండిఆత్మకూరు మండలం యర్రగుంట్ల గ్రామానికి చెందిన మల్లెపోగు పుల్లమ్మ వయస్సు 90 ఏళ్లు. ఐదుగురు సంతానం. పేద కుటుంబంలో పుట్టిన పుల్లమ్మ.. మరో పేద ఇంటికి కోడలైంది. భర్తతో కలిసి కుటుంబ భారాన్ని మోసింది. తమ రెక్కల కష్టంతో కొంత పొలం కొనుగోలు చేశారు. ఈ క్రమంలోనే 50 ఏళ్ల కిందట భర్త కాలం చేశారు. అయినప్పటికీ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని ఆర్థికంగా నిలబెట్టింది. అందరికీ వివాహాలు చేసింది.

రెక్కల కష్టం చేసి..: రెక్కల కష్టంతో సంపాదించిన 4 ఎకరాల్లో తలా అర ఎకరం ఇచ్చింది. చిన్న కుమారుడికి అర ఎకరా పొలంతోపాటు తన పేరిట ఉన్న 1.50 ఎకరా నీకే ఇస్తానని చెప్పింది. ప్రతి నెలా వస్తున్న వృద్ధాప్య పింఛన్‌ను సైతం చిన్న కుమారుడికే ఇస్తోంది. ఈ క్రమంలో అతను తన తల్లి పేరున ఉన్న పొలాన్ని కొద్ది నెలల కిందట తన పేరుతో రాయించుకున్నాడు. ఆ తర్వాత నుంచి తల్లిని నానా ఇబ్బందులు పెట్టడం ప్రారంభించాడు. రెండు వారాల కిందట ఏకంగా ఇంట్లో నుంచి బయటకు వెళ్లగొట్టారు. ఇదేమని మిగిలిన కుమారులు ప్రశ్నిస్తే వారిపైనా తిరగబడ్డాడు. చివరికి నడవలేని పరిస్థితుల్లో సోమవారం కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. వృద్ధురాలైన తనను నిర్దాక్షిణ్యంగా బయటకు గెంటేశాడని వాపోయింది. ఐదుగురు కొడుకులున్నా ఆదరించేవారే కరవయ్యారని.. తనకు న్యాయం చేయాలని కన్నీళ్లు పెట్టుకుంది. – న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

జ్ఞాపకాల మదిలో...
జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృత్యస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి
మీరు చూపిన ఆత్మీయత ..
అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట
మీరు భౌతికంగా దూరమైనా మా వెంత ఉన్నట్లే ఉంది.
ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని
భావాలను అక్షర రూపంలో నివేదించడం తప్ప
స్మృతి, వర్ధంతి, జయంతి
ప్రకటనల వివరాలకు
కర్నూలు: 99899 97628
80080 12489
నంద్యాల: 90007 66039, ఆదోని: 80087 09793

మహానందిలోని నాగులకట్ట వద్ద కార్తికదీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఓంకార క్షేత్రంలో బిల్వార్చన చేస్తున్న భక్తులు

కార్తికశోభతో మహానంది కళకళ

మహానంది, బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రం కార్తికమాసం రెండో సోమవారం వేలాది మంది భక్తులు గంగా కామేశ్వరీదేవి సహిత మహా నందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. స్వామి వారిని అభిషేకించి పూజలు చేసుకున్నారు. పవిత్ర రుద్రగుండం పుష్కరిణి, చిన్న కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించారు. క్యూ లైన్లలో దర్శనాలు చేసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈవో ఎర్రమల మధు, పర్యవేక్షకులు అంబటి శశిధరరెడ్డి, నీలకంఠరాజు, ప్రోటోకాల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

గంగా హారతి: మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రంలో దేవస్థానం ఆధ్వర్యంలో చిన్న కోనేరులో ప్రవహిస్తున్న గంగమ్మకు గంగా హారతి వేడుక ఘనంగా జరిగింది. కార్తికమాసం రెండో సోమవారం సందర్భంగా ప్రధానార్చకులు అర్జునశర్మ, వేదపండితులు రవిశంకరఅవధాని, నాగేశ్వరశర్మ, శాంతారామ్‌భట్‌లు ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, నంద్యాల రామకృష్ణా విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డితో పాటు పలువురు దాతలు, భక్తులు పూజలు చేసి.. గంగా హారతులు ఇచ్చారు.

మహానందిలో గంగా హారతిని ఇస్తున్న అర్చకులు, పండితులు

యాగంటిలో భక్తుల సందడి

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కార్తిక మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలోని వరుసలన్నీ కిక్కిరిసిపోయాయి. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి కార్తిక దీపాలు వెలిగించారు. ఆలయంలోని వేంకటేశ్వరస్వామి, అగస్త్యముని గుహలు వద్ద భక్తుల రద్దీ నెలకొంది. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయాధికారి పాండురంగారెడ్డి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

క్యూలైన్‌లో భక్తులు

(కోనేరులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు)

రైతు సంక్షేమమే నాబార్డు లక్ష్యం

సమావేశంలో మాట్లాడుతున్న వై.నాగేశ్వరరావు యాదవ్

ప్యాపిలి, న్యూస్‌టుడే: నాబార్డు సేవలను వినియోగించుకుని జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలని డీసీఎంఎస్ ఛైర్మన్ వై.నాగేశ్వరరావుయాదవ్ రైతులకు సూచించారు. ప్యాపిలి మండలంలోని పీఆర్ పల్లి గ్రామంలో 'సొసైటీ ఫర్ రూరల్ అండ్ ఎకో డెవలప్‌మెంట్' స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, సింగిల్ విండో సొసైటీ సీఈవో ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రైతులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాబార్డు రైతుల కోసం అందించే వివిధ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో సొసైటీ డైరెక్టర్ రవీంద్ర, తెదేపా నాయకులు శ్రీరాములు, నాగేశ్వరరావు, రామాంజనేయులు, జయరామిరెడ్డి, రామ్మోహన్ పాల్గొన్నారు.

బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఏఎస్పీ యుగంధర్‌బాబు

పోలీస్ పీజీఆర్ఎస్‌కు 102 ఫిర్యాదులు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 102 ఫిర్యాదులు వచ్చినట్లు ఏఎస్పీ యుగంధర్‌బాబు పేర్కొన్నారు. వాటిని ఆయన స్వయంగా బాధితుల నుంచి స్వీకరించి సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. చట్ట పరిధిలో ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని స్పష్టం చేశారు. కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, పొలం, ఆస్తి తగాదాలపై అధిక భాగం అర్జీలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

కర్నూలు జిల్లా, కర్నూలు మండలం, గొందిపర్ల గ్రామం ఆంధ్రప్రదేశ్ వద్ద గల టి.జి.వి.ఎస్.ఆర్.ఎ.ఎ.సి లిమిటెడ్ తమ క్లోరో-ఆల్కలి ఉత్పత్తులను 1420 టి.పి.డి నుండి 1620 టి.పి.డి వరకు మరియు సింథటిక్ ఆర్గానిక్ కెమికల్స్ 333.48 టి.పి.డి నుండి 507.58, పి.టి.ఎఫ్.ఈ 40 టి.పి.డి, సి.పి.వి.సి 200 టి.పి.డి, పి.ఎ.సి 100 టి.పి.డి మరియు హైడ్రోజన్ పెరాక్సైడ్ 100 టి.పి.డి వరకు విస్తరించుటకు పర్యావరణం అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ (ఎంఒఇఎఫ్ మరియు సిసి), భారత ప్రభుత్వం న్యూఢిల్లీ వారిచే పర్యావరణ అనుమతి ఇవ్వబడినది. అని ఇందుమూలంగా ప్రజానీకానికి తెలియజేయడమైనది.

సదరు పర్యావరణ శాఖ వారి అనుమతి పత్రము ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి/కమిటీ వద్ద లభిస్తుంది. మరియు సదరు నకలును పర్యావరణ మంత్రిత్వ అటవీ శాఖ మరియు వాతావరణ మార్పు యొక్క వెబ్‌సైట్ నందు సందర్శించవచ్చును. https://parivesh.nic.in

31.10.2025
స్థలం: కర్నూలు

సం/- సి.శ్రీనివాస బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్
టి.జి.వి.ఎస్.ఆర్.ఎ.ఎ.సి లిమిటెడ్

సాగు చేసిన కంది పంట

కలుపుతో కంది పోనీయొద్దు

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: పప్పు ధాన్యాల్లో కంది పంట ప్రధానం. ప్రొటీన్లు, విటమిన్లు సమృద్ధిగా లభించే కంది కర్నూలు, నంద్యాల జిల్లాలో రబీలో అధికంగా సాగు చేస్తుంటారు. కంది పంట సాగు చేయడంతో నేలలో సేంద్రియ పదార్థాన్ని మెరుగుపరిచి భూమిని సారవంతంగా మార్చవచ్చు. పంటలో సమగ్ర పోషణ, కలుపు నివారణతో మంచి దిగుబడి సాధించవచ్చని ఆళ్లగడ్డ వ్యవసాయాధికారి కిశోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

విత్తన శుద్ధి : విత్తనంతో వ్యాపించే తెగుళ్ల తగ్గించేందుకు కిలో విత్తనానికి సుమారు పది గ్రాముల ట్రైకోడర్మా విరిడి పౌడర్‌ను కలపాలి. ఈ జీవశిలీంధ్రం వల్ల ఎండు తెగులు వంటి ప్రమాదకర పరిస్థితులను ముందుగానే నివారించవచ్చు. రబీలో హెక్టారుకు 12-15 కిలోల వరకు విత్తనాలు వేయవచ్చు. నాగలి వెంట లేదా సాళ్లలో గొర్రుతో కాని సీడ్ డ్రిల్‌తో విత్తనాలు విత్తుకోవాలి.

ఎరువుల వాడకం : ఎకరానికి రెండు టన్నుల సేంద్రియ ఎరువు వినియోగించాలి. రసాయన ఎరువులు హెక్టారుకు 20 కిలోల నత్రజని, 50 కిలోల భాస్వరం వాడాలి. పంట 35-40 రోజుల దశలో 20 కిలోల నత్రజని వేసుకోవాలి.

నీటి నిర్వహణ : పైరు ఎదుగుదల దశ (70-80 రోజులు), కాయ ఏర్పడే దశలో రెండు తేలికపాటి తడులు ఇవ్వాలి. నీరు అధికంగా నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

ఇలా చేయాలి.. : ఎకరాకు 200 లీటర్ల నీటిలో లీటరు పెండి మిథాలిన్ 30% 1-1.5 కలిపి విత్తు విత్తిన వెంటనే లేదా మరుసటి రోజు పిచికారీ చేయాలి. కలుపు పెరిగితే 30, 60 రోజులకు గొర్రుతో అంతర కృషి చేయాలి. గడ్డి జాతి, వెడల్పు ఆకు కలుపుల నివారణకు ఎకరాకు 200 లీటర్ల నీటిలో 300 మి.లీ. ఇమాజితాఫిర్ 5% మందు కలిపి పిచికారీ చేయాలి. అంతర పంటలుగా పెసర, మినుము, వేరుసెనగ, సోయాచిక్కుడు నీటి వసతి చూసుకొని వేసుకోవాలి.

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ డాక్టర్ వసంతలక్ష్మి

రైతేరాజు

రాయితీతో పాడి రైతులకు చేయూత

విస్తీర్ణం (సెంట్లు)	ఆర్థిక సాయం (రూ.లలో)
50	32.992
40	26.394
30	19.790
20	13.195
10	6.559

రాయితీ వివరాలు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: జాతీయ ఉపాధి హామీ పథకం కింద పాడి రైతులు పశుగ్రాసం సాగు చేసుకొనేందుకు వందశాతం రాయితీతో గరిష్ఠంగా 50 సెంట్ల వరకు అనుమతి లభించింది. ఈ పథకం పరిధిలో పశుగ్రాసం సాగు చేసుకొనేందుకు రైతులకు కొన్ని అర్హతలు తప్పనిసరి. జాబ్‌కార్డు ఉండాలి, ఐదు ఎకరాల లోపు పొలం ఉండాలి, రైతు సేవా కేంద్రం, మండల పశు వైద్యాధికారిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని పశువైద్య సహాయ సంచాలకురాలు డాక్టర్ వసంతలక్ష్మి తెలిపారు. సన్న, చిన్న కారు రైతులకు పచ్చగడ్డి సాగు చేసుకొనేందుకు ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తోందని రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధికారులు రైతుల దరఖాస్తులు పరిశీలించి, అర్హత ఉండి, నీటి వసతి కలిగిన రైతులను ఎంపిక చేస్తారని ఆమె తెలిపారు.

మొక్కజొన్న విత్తుకోవచ్చు

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో రబీ మొక్కజొన్న నవంబరు 15 వరకు విత్తుకొనేందుకు అనుకూలమని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి తెలిపారు. విత్తనం ఎకరానికి హైబ్రీడ్ రకాలు 8-10 కిలోలు దేశీ రకాలు 12-15 కిలోలు అవసరమన్నారు. వరుసల మధ్య 60 సెం.మీ. మొక్కల మధ్య 20 సెం.మీ. దూరం ఉండేట్లు విత్తుకోవాలన్నారు. ఎకరానికి 33వేల నుంచి 35వేల మొక్కలు ఉండేలా చూడాలన్నారు. ఎకరానికి 55 కిలోల యూరియా, భాస్వరం 76 కిలోలు, పొటాష్ 58 కిలోలు వేసుకోవాలన్నారు. యూరియా ఎకరానికి 25-30, 45-50, 60-65 రోజుల దశలో మూడు దఫాలుగా వేసుకోవాలి. మూడేళ్లు (మూడు పంటలకు) ఒకసారి 20కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి. కలుపు నివారణకు విత్తిన వెంటనే ఎకరానికి అట్రాజిన్ మందు కిలో నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

సందేహాలు సమాధానాలు

?: కుసుమ పంట రబీలో ఎప్పటి వరకు విత్తుకోవచ్చు.
- రామచంద్రుడు, హొళ్ళి

✓: రబీలో కుసుమ నవంబరు నెలాఖరు వరకు విత్తుకోవచ్చు. అనువైన రకాలు ఐఎస్ఎఫ్764, డీఎస్‌హెచ్-85. ఎకరానికి 4 కిలోల విత్తనం విత్తాలి. ఎకరానికి 6-7 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.
- ధనలక్ష్మి, కేవీకే శాస్త్రవేత్త, బనగానపల్లి

వరి పంట.. కాస్త జాగ్రత్త

హాలహర్వి, న్యూస్‌టుడే: జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు పంట నేలవాలింది. వివిధ దశల్లో ఉన్న వరి పంటను చిన్నపాటి జాగ్రత్తలతో కాపాడుకోవచ్చని హాలహర్వి మండల వ్యవసాయధికారి జిలానీబాషా తెలిపారు. తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు పలు సూచనలు చేశారు.

- పాల దశలో ఉన్న వరి పంట నేలవాలితే.. పొలంలో నీటిని చిన్నపాటి కాల్వల ద్వారా తొలగించాలి. గింజలు మారడం, మాగుడు, మాని పండు తెగులు వ్యాప్తి నివారణకు ఎకరానికి 200 మి.లీ. ప్రాపికోనజోల్ పిచికారీ చేయాలి.
- గింజ పట్టే దశలో ఉంటే నీటిని తొలగించడంతో పాటు వాలిన పంటలో కంకిలో మొలకలు కనిపిస్తే నైదు శాతం ఉప్పు ద్రావణం కలిపి పిచికారీ చేయాలి. ఇది మొలకల్లో రంగు మార్పును తగ్గిస్తుంది.
- ఆలస్యంగా నాటిన పంట ప్రస్తుతం పిలక దశలో ఉంది. నీరు తగినంతంగా ఉండేలా చూసుకోవాలి. నీటి నిల్వ తగ్గించాలి. పంట పూర్తిగా మునిగితే నీరు తొలగించి, పునరుద్ధరణ కోసం యూరియా 20 కిలోలు, మ్యూరెట్ ఆఫ్ పొటాష్ 20కిలోలు బూస్టర్ మోతాదుగా వేయాలి.
- పంటలను నిత్యం పరిశీలిస్తుండాలి. బ్యాక్టీరియా ఎండాకు తెగులు కనిపిస్తే.. లీటరు నీటికి పామ్‌టోమైసిన్ 1.0 మి.లీ., లీటరు నీటికి కోసైడ్ (కాపర్ హైడ్రాక్సైడ్) 2.0 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. పొలంలో నీరు తగ్గిన తర్వాత హెక్సాకోనా జోల్ 400 మి.లీ. లేదా ప్రొపికొనజోల్ 200 మి.లీ. ఎకరాకు పిచికారీ చేయడం వల్ల మాగుడు తెగులు వ్యాప్తి తగ్గుంతుందని వివరించారు.

నేలవాలిన వరి

కిలో పచ్చిమిర్చి రూ.3

■ పంటను తొలగిస్తున్న రైతులు

అన్నదాతలకు ఏటా ఏదో ఒక కారణంతో నష్టాలు వస్తూనే ఉన్నాయి. ఈ ఏడాది పచ్చిమిర్చి పంటకు ధర లేక రైతులు దిగాలు చెందుతున్నారు. దళారులే కూలీలను పీసు కొచ్చి పంటను కోయించుకుని 60 కిలోల సంచికి రూ.200 చెల్లిస్తున్నారన్నారు. దీంతో కిలో రూ.3 మాత్రమే ధర వస్తోందని రైతులు వాపోతున్నారు. రుద్రవరం, ఆర్.నాగులవరం గ్రామాలకు చెందిన రైతులు ఐదెకరాల్లో పంటను ట్రాక్టర్‌తో దున్నేశారు. పెట్టిన పెట్టుబడులు రావడం లేదని దీంతో పంటను మొత్తం దున్నేస్తున్నామని చెప్పారు. మార్కెట్‌లో మాత్రం పచ్చిమిర్చి ధర రూ.30 పలకడం గమనార్హం. - న్యూస్‌టుడే, రుద్రవరం

గ్రామాభివృద్ధికి పెద్దపీట

యనకండ్ల (బనగానపల్లె గ్రామీణం), న్యూస్‌టుడే: గ్రామీణ వృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. యనకండ్ల గ్రామంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్మించిన నూతన భవనాల భూమిపూజ కార్యక్రమానికి మంత్రి బీసీ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాఠశాలలో, గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

భూమి పూజలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులు

సంజామల, న్యూస్‌టుడే: అధికారులు, నాయకులు, ప్రజలు కలిసికట్టుగా పనిచేస్తేనే గ్రామాభివృద్ధి సాధ్యమని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంత్రి సోమవారం కార్యకర్తలతో పాటు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. గిద్దలూరు గ్రామంలో ఉపకేంద్రం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మంచాల మద్దిలేటి రెడ్డి, బెలుం సురేష్‌రెడ్డి, శంకర్ రెడ్డి, మంచాల తులసిరెడ్డి, మల్కి హుసేని పాల్గొన్నారు.

భూ రీసర్వేకు రైతులు సహకరించాలి

బత్తలూరు(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: రైతులు భూముల రీసర్వేకు సహకరించాలని నంద్యాల జిల్లా రీసర్వే నోడల్ అధికారి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆళ్లగడ్డ మండలంలోని బత్తలూరు గ్రామంలో రీసర్వే పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రీసర్వేతో కలిగే లాభాలను రైతులకు వివరించారు. భూ సరిహద్దులను సక్రమంగా నిర్ధారించడం, భూ యాజమాన్య వివరాలను పారదర్శకంగా నమోదు చేయడంతో భవిష్యత్తులో వివాదాలు ఉండవని రైతులకు తెలిపారు. సర్వే పూర్తి చేయాలన్నారు. జిల్లా సర్వే అధికారి రామ్మోహన్, డివిజన్ సర్వే అధికారి నీలకంఠప్ప, మండల భూసర్వే అధికారి జగదీష్, రీసర్వే డీటీ నర్సిరెడ్డి పాల్గొన్నారు.

రీసర్వేను తనిఖీ చేస్తున్న నోడల్ అధికారి శ్రీనివాసరెడ్డి

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎం. బ్రాంచ్
కెవిసి ఆర్కేడ్, 3వ అంతస్తు, 13-1 ఆర్‌సి రోడ్డు, వాణి నగర్, అవిలాల, తిరుపతి-517501. ✆ 7901626759

స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ... [illegible]

ఇ-వేలం తేది & సమయం: 26.11.2025, ఉ. 10.30 గం.ల నుండి ఉ. 11.30 గం.ల వరకు (అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

... RTGS/NEFT ద్వారా తేది: 25.11.2025, సా. 4.00 గం.ల లోపు ... [illegible]

... www.canarabank.com ... BAANKNET ... https://www.baanknet.com/ ఫోన్ నెం: 7046612345 / 6354910172 / 8291220220 / 9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.BAANKNET@psballiance.com

తేది: 01.11.2025, ప్రదేశం: తిరుపతి   సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

వన్యప్రాణులను వేటాడితే చర్యలు

వెలుగోడు, న్యూస్‌టుడే: వన్యప్రాణులను వేటాడితే వారిని ఉపేక్షించేది లేదని స్థానిక అటవీ క్షేత్రాధికారి తాహెర్ తెలిపారు. మిద్దూరు మండలంలోని అలగనూరు శివారులో కొందరు వ్యక్తులు వన్యప్రాణులను వేటాడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు అటవీ సిబ్బందితో వెళ్లి సోమవారం తనిఖీలు నిర్వహించామన్నారు. తనిఖీల్లో అలగనూరు గ్రామానికి చెందిన నాగేశ్వరరావు, నందికోట్కూరుకు చెందిన గోలా శికారి వద్ద మాంసాన్ని గుర్తించామన్నారు. వారిపై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో స్క్వాడ్ రైంజర్ ఎ.రాజు, ఎఫ్ఎస్‌వో మద్దిలేటి, సిబ్బంది శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కాల్వ మరమ్మతులకు నివేదికలు

రుద్రవరం, న్యూస్‌టుడే: తెలుగుగంగ ప్రధాన, ఉప కాల్వలకు సంబంధించి మరమ్మతులు చేసేందుకు నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపుతున్నట్లు తెలుగుగంగ ప్రధాన కాల్వ ఛైర్మన్ సంజీవకుమార్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ తెలుగుగంగ ప్రధాన కాల్వకు కొన్ని చోట్ల, మేజర్ తూముల వద్ద కోతకు గురై కాల్వలు బలహీనంగా మారాయన్నారు. వాటికి మరమ్మతులు చేసేందుకు సోమవారం కొలతలు తీశామని, నివేదికలుగా తయారు చేసి ప్రభుత్వానికి పంపుతామన్నారు.

శ్రీశైలం జలాశయం నీటిమట్టం 883.60 అడుగులు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయం నీటిమట్టం సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి 883.60 అడుగులు, నీటి నిల్వ 207.8472 టీఎంసీలుగా నమోదైంది. జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 44,118 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి వస్తోంది. శ్రీశైలం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 58,815 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

సూర్యఘర్‌పై అవగాహన కల్పించండి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: పీఎం సూర్యఘర్ పథకం సద్వినియోగం చేసుకోవడం ద్వారా 25 ఏళ్ల పాటు ఉచిత విద్యుత్తు పొందే అవకాశముందని.. దీనిపై ప్రజల్లో అవగాహన పెంచాలని కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. శిరివెళ్ల మండలంలోని గోవిందపల్లె, వెలుగోడు మండలంలోని వేల్పనూరు, బనగానపల్లి మండలంలోని నందవరం, నందికొట్కూరు మండలంలోని వడ్డెమాను, డోన్ మండలంలోని చిన్నమల్కాపురం గ్రామాలను సూర్యఘర్ పథకం ఎంపిక చేసినట్లు చెప్పారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ పథకం విజయవంతంగా అమలయ్యేలా తహసీల్దార్లు, ఎంపీడీవోలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. సమావేశంలో జేసీ కార్తీక్, డీఆర్వో రామునాయక్, విద్యుత్తు శాఖ ఎస్ఈ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: నొస్సం, సంజామల రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్ పక్కన గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఖలీల్ సోమవారం తెలిపారు. మృతురాలి వయస్సు 45 నుంచి 55ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. ఆచూకీ తెలిసినవాళ్లు ఫోన్ నెంబర్లు 08514 242941, 9490081633 సంప్రదించాలన్నారు.

వాగులో పడి వ్యక్తి మృతి

సంజామల, న్యూస్‌టుడే: అక్కంపల్లెకు చెందిన కుళ్లాయిరెడ్డి(41) అక్టోబరు 31న అదృశ్యమవ్వగా సోమవారం పాలేరువాగులో శవమై తేలాడు. పోలీసుల వివరాల మేరకు.. గత శుక్రవారం పని నిమిత్తం స్వగ్రామం నుంచి సంజామలకు ద్విచక్ర వాహనంపై వచ్చే క్రమంలో పాలేరు వాగు ఉద్ధృతిలో కొట్టుకుపోయాడు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా.. వంతెన సమీపంలో వాహనాన్ని గుర్తించారు. దీనికి సమీపంలోనే చెట్టుకు తగులుకొని ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పట్టపగలే ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి పట్టణంలోని బీసీ కాలనీ సమీపంలో సోమవారం పట్టపగలే నాగరాజు అనే ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ జరిగింది. ఉదయం ఉపాధ్యాయుడు పాఠశాలకు వెళ్లగా ఆయన భార్య ఇంటికి తాళం వేసి యాగంటికి వెళ్లారు. ఆలయం నుంచి ఇంటికి తిరిగొచ్చిన ఆమె తలుపులకు వేసిన తాళం పగులగొట్టి ఉండటంతో ఆందోళనకు గురయ్యారు. వెంటనే ఇంట్లోకి వెళ్లి బీరువాను పరిశీలించారు. అందులో ఉన్న 15 తులాల బంగారం, రూ.20 వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకొని పోయినట్లు నిర్ధారించుకొని భర్త నాగరాజుకు తెలియజేశారు. సీఐ ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొన్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

EENADU Classifieds

BUSINESS SERVICES
నవోదయ సైనిక్ స్కూల్ కోచింగ్ ... ✆ 97051 76401.

BUSINESS OFFER

FACULTY/ TEACHERS
Wanted Science & Computer Science Teachers with B.Ed. Qualification for well known Upper Primary School. English Fluency is Must. ✆ 83095 95455, 96662 84139. Kurnool.

EDUCATION
కడప ... DMLT, DOA, DOM, DECG, DRGA, DMST ... Cell: 74166 23777, 74165 23777 ... చివరి తేది: 10-11-2025.

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే
ప్రకటనలపై 5% GST వర్తిస్తుంది.
వివరాలకు: 99899 97628

గమనిక

JOBS
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ... ✆ 6281037879 ... కర్నూలు. ✆ 08518-266664.

(c) eenadu

బహుమతులు అందజేసిన ప్రిన్సిపల్ విజయభాస్కర్ నాయుడు

విజేతలకు బహుమతులు అందిస్తున్న మల్లేశ్వర్‌రెడ్డి పాఠశాల యాజమాన్యం

చిత్రలేఖనంలో విరిసిన సృజనాత్మకత

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: చిత్ర లేఖనం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయవచ్చని ఆదిత్య కళాశాల ప్రిన్సిపల్ విజయభాస్కర్ నాయుడు, వైస్ ప్రిన్సిపల్ సుమిత్ర అన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో 'మీకు ఇష్టమైన పండుగ' అనే అంశంపై ఆదిత్య జూనియర్ కళాశాలలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ప్రసాద్, సాదిక్, అబ్దుల్ వాహిద్‌లకు ప్రిన్సిపల్ విజయభాస్కర్ నాయుడు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగార్జున, మౌలాలి, సురేశ్ పాల్గొన్నారు.

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగిన సృజనాత్మకతను వెలికి తీయడానికే చిత్రలేఖన పోటీలు తోడ్పడతాయని మల్లేశ్వర్‌రెడ్డి ఇంగ్లిష్ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివారెడ్డి అన్నారు. పట్టణంలోని మల్లేశ్వర్‌రెడ్డి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో 'మీకు ఇష్టమైన పండుగ' అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి పాజియా, రెండో బహుమతి హర్షిత, మూడో బహుమతి హితేశ్వర్‌రెడ్డి గెలుపొందారు. పాఠశాల ఉపాధ్యాయులు స్వర్ణలత, ఉజ్మా బహుమతులను అందజేశారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: కొణిదేల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని బొమ్మలు గీశారు. సుభాష్‌చంద్రబోస్, శరణ్య, నిహారిక ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామచంద్రమూర్తి, ఉపాధ్యాయులు, దేవప్రకాశ్, ఆనందరావు, పీడీ రవికుమార్ బహుమతులను అందజేశారు.

మహిళా క్రికెట్ జట్టును స్ఫూర్తిగా తీసుకోవాలి

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: క్రికెట్ వరల్డ్‌కప్ సాధించిన మహిళా జట్టును క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలని కెనోయింగ్ రాష్ట్ర లీగ్ అడ్వైజర్ పబ్బుతి అపర్ణ పేర్కొన్నారు. సోమవారం నూనెపల్లె పురపాలక ఉన్నత పాఠశాల మైదానంలో అండర్-14, 17 విభాగాల్లో బాలికలకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆమెతో పాటు ప్రముఖ వైద్యురాలు డా. ఆరిఫాభాను హాజయ్యారు.

నంద్యాల

•నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

హుండీ ఆదాయం రూ.24.69 లక్షలు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎస్. కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి హుండీ లెక్కింపు ద్వారా రూ.24.69 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో రామకృష్ణ తెలిపారు. సోమవారం ఆలయ ప్రాంగణంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన ముడుపులు, కానుకలు లెక్కించారు. భక్తులు రూ.24,69,127 నగదు, 10.5 గ్రాముల బంగారం, 747 గ్రాముల వెండిని కానుకలుగా సమర్పించినట్లు తెలిపారు.

ప్లాస్టిక్ భూతానికి కట్టడి ఏది?

◆ అమలుకాని నిషేధం
◆ పర్యావరణంపై తీవ్ర ప్రభావం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ నిషేధానికి ప్రభుత్వాలు ఆదేశాలిచ్చినా అమలు కావడం లేదు. అధికారులు సైతం తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తూ చేతులు దులుపుకొంటున్నారన్న విమర్శలున్నాయి. దుకాణాలు, హోటళ్లలో నిషేధిత ప్లాస్టిక్ సంచుల వాడకం విచ్చలవిడిగా ఉంది. వాటి వ్యర్థాలు నీటి వనరులను కలుషితం చేయడంతో పాటు కాలుష్యాన్ని పెంచుతున్నాయి. అంతేకాకుండా దోమలు, ఈగలు వంటి కీటకాల వృద్ధి చెంది వ్యాధులు వ్యాపిస్తున్నాయి.

నంద్యాల పురపాలక సంఘంలో..
రోజూ ఉత్పత్తి అయ్యే చెత్త: 110 మెట్రిక్ టన్నులు
ప్లాస్టిక్ వ్యర్థాలు: 10 టన్నులు
ఈ ఏడాది దాడులు: 300
కేసులు: 250
జరిమానా: సుమారు రూ.3 లక్షలు

ప్రజారోగ్యానికి ముప్పు

పట్టణంలో రోజూ 110 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ఇందులో 8-10 టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. ఏ రోడ్డు పక్కన చూసినా, ఖాళీ స్థలాల్లో పాలిథిన్ కవర్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. వీటి కారణంగా వర్షం నీరు భూమిలోకి ఇంకడం లేదు. భూగర్భ జలాలు తగ్గడానికి ఇదొక కారణమని నిపుణులు చెబుతున్నారు.

దేవనగర్‌లో రహదారి పక్కనే వ్యర్థాలు

తనిఖీలు నామమాత్రమే

పురపాలక సంఘంలోని పెద్ద దుకాణాలు, కిరాణా షాపుల్లో మాత్రమే పర్యావరణహితమైన సంచులు అందుబాటులో ఉన్నాయి. చిల్లర వ్యాపారులు, తోపుడు బండ్ల వద్ద పాలిథిన్ సంచుల వినియోగం అధికంగా ఉంటోంది. వ్యాపారులు వీటిని షాపులు, గోదాముల్లో నిల్వ ఉంచి గుట్టుగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. చిల్లర, కిరాణా దుకాణాలపై తప్ప హోల్‌సేల్ వ్యాపారులపై అధికారులు దృష్టి సారించడం లేదనే ఆరోపణలున్నాయి.

ఈ ప్రాంతాల్లో అధికం

పట్టణంలో బైర్మల్ వీధి, సదిగర్, బంగారు అంగళ్ల వీధి, కల్పనా సెంటర్, పద్మావతినగర్, దేవనగర్, బర్మషెల్, సాయిబాబానగర్ వంటి ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా కనిపిస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో వ్యాపార దుకాణాలు అధికంగా ఉండటం ఇందుకు కారణం. ఇక్కడే కాకుండా మద్యం దుకాణాల వద్ద ప్లాస్టిక్ వాటర్ ప్యాకెట్లు, గ్లాసులు, ఖాళీ ఉన్న కాల్వల్లో పడేస్తుండటంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో పాటు మురుగు పారడం లేదు.

● ప్లాస్టిక్ నుంచి విడుదలయ్యే విష పూరిత రసాయనాలు ప్రజల ఆరోగ్యానికి హానికరంగా మారుతున్నాయి. హోటళ్లలో వేడి పదార్థాలను ప్లాస్టిక్ కవర్, పేపర్ ప్లేట్లపై ఇస్తుండటంతో కొంత కరిగి శరీరంలోకి చేరి క్యాన్సర్ సోకే ప్రమాదముంది. సంతానోత్పత్తి సమస్యలు, ఊబకాయం, మధుమేహం, థైరాయిడ్ వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

మిడుతూరు, న్యూస్‌టుడే: ?: మండలంలోని కడుమూరు గ్రామంలో ఉన్నత పాఠశాలకు వెళ్లే దారిలో చెత్తా చెదారం పేరుకుపోయింది. - రషీద్, కడుమూరు

?: కడుమూరు గ్రామంలో దర్గా వద్ద మంచినీటి కుళాయిలను మురుగు కాల్వ పక్కనే ఏర్పాటు చేశారు.
- నాయుడు, కడుమూరు

✔: సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తాం.
- కల్యాణ్ సింగ్, గ్రామ కార్యదర్శి

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని బైర్మల్ వీధిలో కాలువ వ్యర్థాలతో నిండిపోయింది. సాయిబాబానగర్‌లో కాల్వలు శుభ్రం చేయడం లేదు.
- రాజు, లక్ష్మి, స్థానికులు

?: పట్టణంలోని క్రాంతినగర్‌లో వీధికుక్కల బెడద అధికమైంది. బయటికెళ్లాలంటేనే భయంగా ఉంది.
- రమణ, స్థానికుడు

✔: సిబ్బందిని పంపి కాల్వలను శుభ్రం చేయిస్తాం. త్వరలోనే కుక్కలు పట్టించి సమస్య పరిష్కరిస్తాం.
- లక్ష్మీనారాయణ శర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ?: సాయిబాబానగర్‌లో ప్రైవేటు పాఠశాలకు వెళ్లే మార్గంలో వర్షపు నీరు నిలిచి ఉంది. దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే అవకాశముంది. - రమణ, స్థానికుడు

?: ఖల్లా వీధిలో ట్యాంకు వద్ద ఉన్న ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగాయి. విషప్రాణుల సంచరిస్తుండటంతో భయంగా ఉంది. - మాబాషా, స్థానికుడు

✔: మురుగు తొలగింపజేసి బ్లీచింగు పౌడరు చల్లిస్తాం. గడ్డి తొలగింపజేసి సమస్య పరిష్కరిస్తాం.
- జీవన్, శానిటరీ ఇన్‌స్పెక్టరు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: ?: పాణ్యంలోని పాత వైద్యశాల ఎదురుగా చెత్త కుప్పలతో అవస్థలు పడుతున్నాం. - మురళి, స్థానికుడు

✔: చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటాం.
- ఆనందరావు, పంచాయతీ కార్యదర్శి, పాణ్యం

వైభవంగా బాలాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే జయసూర్య

మిడుతూరు, న్యూస్‌టుడే: మండలంలోని చెరుకుచెర్ల బాట సమీపంలో బాలంజనేయ స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జయసూర్య, తెదేపా నంద్యాల పార్లమెంట్ బాధ్యుడు మాండ్ర శివానందరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కాతా రమేష్ రెడ్డి పాల్గొన్నారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేపట్టారు. బ్రాహ్మణకొట్కూరు ఎస్సై తిరుపాలు ట్రాఫిక్‌ను నియంత్రించారు.

సొంత భవనాల్లోనే సేవలు..

నందికొట్కూరు: సచివాలయం, రైతు సేవా కేంద్రాలు సొంత భవనాల నుంచి సేవలు అందుబాటులోకి వచ్చినట్లు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు. జూపాడుబంగ్లా మండలం తాటిపాడులో సోమవారం నూతన సచివాలయం, రైతు సేవా కేంద్రాలను ఎమ్మెల్యే, నంద్యాల పార్లమెంట్ బాధ్యుడు మాండ్ర శివానందరెడ్డి ప్రారంభించారు.

యాంత్రీకరణతో లాభసాటి వ్యవసాయం

నందికొట్కూరు, న్యూస్‌టుడే: వ్యవసాయంలో యాంత్రీకరణను ఉపయోగించుకోవడంతో పెట్టుబడులు తగ్గుతాయని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పేర్కొన్నారు. జూపాడుబంగ్లా మండలం తర్తూరు గ్రామంలో సోమవారం హార్వెస్టర్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యాంత్రీకరణతో వ్యవసాయం లాభసాటిగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాండ్ర శివానందరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కాల్వలో చెట్లు.. ప్రవాహానికి అడ్డు

నంద్యాల పట్టణంలో చామకాల్వలో పిచ్చి మొక్కలు పెరిగాయి. అవి ఏపుగా పెరిగి వృక్షాలుగా మారాయి. నీటి ప్రవాహానికి అడ్డుగా నిలిచాయి. ప్రవాహం తగ్గడంతో ఇటీవల వచ్చిన వరదకు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఫలితంగా ఆ ప్రాంతాల ప్రజలు అవస్థలు పడ్డారు. అధికారులు చర్యలు చేపట్టి కాల్వలోని చెట్లను తొలగించి చామకాల్వను వెడల్పు చేయాల్సిన అవసరం ఉంది.
– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

అడ్డంగా లారీలు.. రాకపోకలకు తిప్పలు

నంద్యాల నుంచి నందికొట్కూరు వెళ్లే రహదారిలో నిత్యం వందల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఆ దారిలో మరమ్మతుల కోసం వరుసగా లారీలు నిలుపుతున్నారు. అవి మిగతా వాహనాలకు అడ్డుగా మారాయి. ఎదురెదురుగా వచ్చే వాహనాలకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి సమయాల్లో వాహనాలు కానరాక ప్రమాదాలు చోటు చేసుకుని, గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి.
– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

దారి ఇలా.. దిగుబడి ఇంటికి వచ్చేదెలా

మొంథా తుపాను వచ్చింది. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. ఫలితంగా మండలంలో పొలాల రహదారుల్లో గుంతలు ఏర్పడ్డాయి. గోతుల్లో నీరు నిలిచి బురదమయంగా మారాయి. పంటకోసే యంత్రాలు, ట్రాక్టర్లు వెళ్లలేని దుస్థితి నెలకొంది. వర్షం వీడి ఐదురోజులైనా. . కోతలు కోయలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పొలాల రస్తాలకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గడివేముల

అసంపూర్తి వేగ నిరోధకాలు

నంద్యాల మండలంలోని అయ్యలూరులో వేగ నిరోధకాలే ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. గ్రామంలో నంద్యాల-గిద్దలూరు జాతీయ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. వేగ నిరోధకాలు అసంపూర్తిగా ఉన్నాయి. గిద్దలూరు వైపు వెళ్లే వాహనాలు ఎడమ వైపు వెళ్లాల్సి ఉంది. కానీ అవి వేగనిరోధకం ఉందని కుడి వైపున వెళ్తున్నాయి. దాంతో ఎదురుగా వచ్చే వాహనాలు ఢీకొంటున్నాయి. ద్విచక్రవాహదారులు, ఆటో చోదకులు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు వేగ నిరోధకాన్ని పూర్తిగా నిర్మించాల్సి ఉంది.
– న్యూస్‌టుడే, అయ్యలూరు(నంద్యాల గ్రామీణం)

కార్తికమాస పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆకాశదీపాన్ని వెలిగిస్తున్న భక్తులు

నంద్యాల: ప్రథమనంది ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

శైవక్షేత్రాల్లో కార్తిక శోభ

కార్తిక మాసం రెండో సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామునుంచే ఆలయాలకు బారులుతీరారు. శివలింగాలకు అభిషేకాలు నిర్వహించారు. మహిళలు కార్తిక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పలు ఆలయాల్లో భక్తులకు అన్నదానం నిర్వహించారు.
– న్యూస్‌టుడే, బండిఆత్మకూరు, నంద్యాల గాంధీ చౌక్, గడివేముల, ఆత్మకూరు పట్టణం, నంద్యాల బొమ్మలసత్రం

ప్రత్యేక అలంకరణలో నాగలింగేశ్వర స్వామి

నంద్యాల పట్టణంలోని సోమనందీశ్వర ఆలయంలో..

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు.

సమస్య తెలుసుకుంటున్న మంత్రి ఫరూక్

మంత్రి ఫరూక్‌ను కలిసిన కుడా ఛైర్మన్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ప్రకాశం జిల్లా కందుకూరు మాజీ ఎమ్మెల్యే దివి శివరాం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన్ను కలిసి వివిధ అంశాలపై చర్చించారు. పలు రాజకీయ అంశాలపైనా చర్చించారు.

భోగేశ్వరం ఆలయ కార్యనిర్వహణాధికారిగా చంద్రుడు

గడివేముల, న్యూస్‌టుడే: దుర్గాభోగేశ్వర ఆలయ కార్యనిర్వహణాధికారిగా చంద్రుడును నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న రామానుజన్ పదవి విరమణ పొందడంతో ఆయన స్థానంలో కోవెలకుంట్ల గ్రూపు ఆలయాల ఈవో చంద్రుడును ఇక్కడ నియమించారు.

సున్నిపెంట సర్కిల్: శ్రీశైలంలోని మేకలబండ చెంచుగూడేనికి చెందిన డి.అంకమ్మ అనారోగ్యంతో సున్నిపెంటలోని ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించగా.. అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స కోసం ఒంగోలుకు తీసుకెళ్లమన్నారు.

సున్నిపెంట సర్కిల్: శ్రీశైలం ఐటీడీఏ పరిధిలో ఉన్న నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాలోని చెంచుగూడెలల్లో నివసిస్తున్న చెంచు గిరిజనులు మొంథా తుపాన్ వల్ల నష్టపోయిన వారి ప్రభుత్వం ఆదుకోవాలని ఐటీడీఏ కార్యాలయంలో ప్రాజెక్టు అధికారి కె.వి.శివప్రసాద్‌కు వినతి పత్రం అందజేసినట్లు చెంచు కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సంఘం అధ్యక్షులు బి.అంకారావు సోమవారం తెలిపారు.

సంక్షిప్త సమాచారం

సున్నిపెంట సర్కిల్: స్థానిక పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇప్పించాలని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులకు వినతి పత్రం కార్మికులు సోమవారం అందజేశారు.

సున్నిపెంట సర్కిల్: సున్నిపెంటలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో స్వాతంత్ర సమరయోధుడు బిర్సా ముండా జయంతి సందర్భంగా నవంబర్ 1 నుంచి 15 తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యూత్ ట్రైనింగ్ సెంటర్ సహాయ ప్రాజెక్టు అధికారి సురేష్‌కుమార్ ఐటీడీఏ పరిధిలోని నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాలకు చెందిన 41 మంది పంచాయతీ కార్యదర్శులకు పీఎం జన్‌మన్, డీఎం-జెజీయూఏపై సోమవారం అవగాహన కల్పించారు.

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ కింద రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాలని ఏపీ కౌలు రైతు సంఘం అధ్యక్షుడు మార్క్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ డిమాండు చేశారు. నంద్యాల కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు ధర్నా చేపట్టారు.

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: సున్నిపెంటలోని ఐటీడీఏ కార్యాలయంలో శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు గంగమ్మను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కె.వి.శివప్రసాద్ సోమవారం శాలువాతో సన్మానించారు. శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యురాలుగా గంగమ్మ ప్రమాణ స్వీకారం చేసి మొదటిసారిగా ఐటీడీఏ కార్యాలయంలో ప్రాజెక్టు అధికారి కె.వి.శివప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: తమకు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడుతున్నారని మండలంలోని కానాలకు చెందిన మహిళలు 10 మంది సోమవారం గ్రామీణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాము ఎక్కడి నుంచి మాట్లాడుతున్నావని అడగ్గా ఒక్కొక్కరికి ఒక్కో ప్రదేశం పేరు చెబుతున్నాడన్నారు. మూడు రోజుల క్రితం గుంతనాల గ్రామస్థులు కూడా తమను గుర్తు తెలియని వ్యక్తి ఫోన్లో బెదిరిస్తూ మాట్లాడినట్లు గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రైవేటు ఫైనాన్స్‌ల ఆగడాలను అరికట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు సోమవారం డిమాండు చేశారు.

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: మహిళల వన్డే ప్రపంచ కప్ గెలిచినందుకు ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు.

ఎమ్మెల్యే బుడ్డాకు సమస్యల ఏకరువు

మహానంది, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి మండలంలోని పలు గ్రామాల ప్రజలు సమస్యలు ఏకరువు పెట్టారు. కార్తిక మాసం రెండో సోమవారం సందర్భంగా ఆయన దైవదర్శనానికి వచ్చారు. దేవస్థానం కాటేజీ వద్ద ఆయన్ను జనం కలిసి సమస్యలు వివరించారు. బసవాపురం చెరువు సమీపంలోని పంట పొలాల సాగు కోసం విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వడానికి రూ. 45 లక్షల ఖర్చును రైతులు భరించాల్సిందిగా నివేదికలు తయారు చేశారు. ఇంతమొత్తం తాము చెల్లించలేమని, ప్రభుత్వం ద్వారానే పనులు చేయించాలని శ్రీశైలం దేవస్థానం మాజీ ధర్మకర్త రవినాథరావు ఆధ్వర్యంలో రైతులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. అడవిలో నుంచి వెదురు తెచ్చుకునేందుకు అనుమతులు ఇప్పించాలని గాజులపల్లె, గాజులపల్లె ఆర్.ఎస్.గ్రామాల ప్రజలు విన్నవించారు. అనంతరం మహా నందీశ్వరస్వామి, కామేశ్వరీదేవి అమ్మవార్లను ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దర్శనానంతరం ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి సత్కరించి జ్ఞాపికను అందజేయగా, వేద పండితులు ఆశీర్వదించారు. ఆయన వెంట నంద్యాల కేసీ కెనాల్ ప్రాజెక్టు ఛైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి, ఆత్మకూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బి.లాలమ్మ, తెదేపా నాయకులు శివశంకరచౌదరి, నరాల చంద్రమౌళీశ్వర రెడ్డి, బి.నాగభూపాల్‌రెడ్డి, మధు తదితరులు ఉన్నారు.

దర్శనానికి వెళుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

నిర్ణీత వ్యవధిలో పరిష్కరించండి

వినతులు పరిశీలిస్తున్న కలెక్టర్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ప్రజల నుంచి స్వీకరించిన వినతులను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. స్థానిక పీజీఆర్ఎస్ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జేసీ కార్తీక్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 266 వినతిపత్రాలు వచ్చినట్లు కలెక్టర్ చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలన్నారు. మొంథా తుపానుతో జరిగిన నష్టంపై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్వో రామునాయక్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురి చేరిక

పార్టీలో చేరిన తెదేపా నాయకులు

మహానంది, న్యూస్‌టుడే: మహానందితో పాటు మండలంలోని బుక్కాపురం గ్రామాలకు చెందిన తెలుగు తమ్ముళ్లు జనసేనలో చేరారు. సోమవారం నంద్యాలలో జనసేన పార్టీ జిల్లా నాయకుడు భవనాశి వాసు సమక్షంలో తెదేపా మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి కాకర్ల శివయ్య, తెదేపా మహానంది గ్రామ కన్వీనర్ రామచంద్రుడు తోపాటు మరికొందరు కార్యకర్తలు జనసేన కండువాలు కప్పుకొన్నారు. అనంతరం వాసు మాట్లాడుతూ.. పార్టీని బలోపేతం చేయడమే కాక ప్రజా సమస్యల పరిష్కారంలో అందరికంటే ముందుందామని విజ్ఞప్తి చేశారు.

చిన్నారి క్రికెటర్లు.. భావి ఆటగాళ్లు

☛ శిక్షణ పొందుతున్న బాలికలు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: గత కొంతకాలంగా మహిళల క్రికెట్‌కు ప్రాచుర్యం బాగా పెరిగిపోయింది. తాజాగా ప్రపంచ కప్ గెలిచి దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేయడమే గాకుండా మహిళా శక్తిని మరోసారి నిరూపించారు. పల్లెలు, పట్టణాల్లోనూ మహిళా క్రికెటర్లు తయారవుతున్నారు. చిన్నారులు క్రీడలోని మెలకువలు తెలుసుకుంటూ నిత్యం కఠోర సాధన చేస్తున్నారు.

పట్టణంలోని రెండు క్రికెట్ కోచింగ్ సెంటర్లలో సుమారు 20 మంది వరకు బాలికలు శిక్షణ తీసుకుంటున్నారు. క్రీడలో రాణించాలనే లక్ష్యంతో రోజూ రెండు గంటల పాటు శిక్షణ తీసుకుంటున్నారు. ఎన్జీవో కాలనీ సమీపంలోని పొన్నాపురం కాలనీలో బెస్ట్ క్రికెట్ అకాడమీ నిర్వహిస్తున్నారు. ఇందులో 50 మంది క్రీడాకారులు ఉండగా వారిలో బాలికలు 8 మంది ఉన్నారు. అలాగే టెక్కెలోని ఎన్ఎస్ఏ క్రికెట్ అకాడమీలో 8 మంది బాలికలు శిక్షణ తీసుకుంటున్నారు.

జిల్లా స్థాయిలో రిషిత ప్రతిభ

పట్టణానికి చెందిన ఎస్.రిషిత గతేడాది నుంచి శిక్షణ తీసుకుంటూ ఫాస్ట్ బౌలర్‌గా రాణిస్తోంది. గత నెల 25 కర్నూలులోని అవుట్ డోర్‌లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో మ్యాచ్‌లో నాలుగు వికెట్లు తీసి ప్రతిభ చూపింది. దీంతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలనే లక్ష్యంతో సాధన చేస్తోంది.

బహుమతి అందుకుంటున్న రిషిత

బ్యాటింగ్‌తో చెలరేగి.. బౌలింగ్‌లో రాణించి

☛ చంద్రలేఖ ప్రతిభ

సాధించిన కప్పులను చూపుతున్న చంద్రలేఖ

నంద్యాల పాత పట్టణం, న్యూస్‌టుడే : కర్నూలుకు చెందిన చంద్రలేఖ.. చిన్నప్పటి నుంచి క్రీడలపై ఎనలేని ఆసక్తి చూపేవారు. వీరి మేనమామ రవిప్రసాద్.. క్రికెట్ అసోసియేషన్‌లో సభ్యుడిగా ఉండేవారు. చిన్నతనంలోనే కోడుమూరులో శిక్షకుడు రఘురామిరెడ్డి వద్ద మెలకువలు ఇప్పించేవారు. ఉత్తమంగా రాణిస్తుండటంతో మెరుగైన శిక్షణ కోసం కర్నూలులోని అవుట్‌డోర్ స్టేడియంలో శిక్షకులు అజ్మతుల్లా, శేఖర్, ప్రసన్నకుమార్ దగ్గర తర్ఫీదు తీసుకోవడం ప్రారంభించారు. అలా అక్కాచెల్లెళ్లిద్దరూ ఆల్‌రౌండర్‌గా రాణిస్తూ ఎన్నో విజయాలు నమోదు చేసుకున్నారు.

క్రికెట్‌తోనే రైల్వేలో ఉద్యోగం

'అండర్-14 నుంచి అండర్-23 వరకు క్రికెట్‌లో రాణించా. 2006 నుంచి 2023 వరకు క్రికెట్ ఆడా. ఆల్‌రౌండర్‌గా ప్రతిభ చాటా. 2016లో మొత్తం 22 వికెట్లు పడగొట్టి టాప్-5 ర్యాంకులో నిలవడం ఎంతో సంతోషం కలిగించింది. 2024లో అండర్-23 జట్టుకు బౌలింగ్ విభాగంలో కోచ్‌గా పనిచేశా. వివాహమైన తర్వాత క్రికెట్‌కు విరామం ఇచ్చా. నాలుగేళ్ల కిందట క్రీడా కోటాలో రైల్వే ఉద్యోగం వచ్చింది.

జాతీయస్థాయి పోటీల్లో రాణించాలి

పోటీలను ప్రారంభిస్తున్న తెదేపా రాష్ట్ర కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: నంద్యాల క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీల్లో రాణించి నంద్యాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకరావాలని తెదేపా రాష్ట్ర కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పేర్కొన్నారు. స్థానిక నంది షటిల్ బ్యాడ్మింటన్ అకాడమీలో సోమవారం ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో అండర్-14, 17 షటిల్, చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆయన నందిపైపుల ఎండీ సుధీర్‌తో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. ప్రతిభ చూపిన క్రీడాకారులకు తగు ప్రోత్సాహం అందిస్తామన్నారు. పోటీల్లో 350 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి విశ్వనాథ్ తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, సురేష్‌నాయుడు, మౌలాలి, సుమలత, వెంకటకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ స్థాయిలో నిర్వహించిన టార్గెట్‌బాల్ పోటీల్లో పాణ్యం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపల్ దినేష్‌బాబు అన్నారు. పాఠశాలలో సోమవారం విద్యార్థులను అభినందించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో నిర్వహించిన జూనియర్ నేషనల్ టార్గెట్ బాల్ చాంపియన్‌షిష్ పోటీలో తమ విదార్థులు ఏపీ తరపున ప్రాతినిధ్యం వహించి కాంస్య పతకం సాధించారన్నారు.

(c) eenadu

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజేతలతో కరస్పాండెంట్ గురుస్వామి, ఉపాధ్యాయులు

ప్రతిభ వెలికితీసేందుకు పరీక్షలు దోహదం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు పోటీ పరీక్షలు దోహదపడతాయని కరస్పాండెంట్ గురుస్వామి పేర్కొన్నారు. కోవెలకుంట్లలోని సాయి చిదానంద పాఠశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'మీకు ఇష్టమైన పండగ' అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పదో తరగతి విద్యార్థి ముజామిల్ మొదటి స్థానం, తొమ్మిదో తరగతి విద్యార్థి నందిని ద్వితీయ స్థానం, ఎనిమిదో తరగతి విద్యార్థిని జోయా తృతీయ స్థానంలో విజేతలుగా నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, బాలు, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

నేడు మండల సర్వసభ్య సమావేశం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం దగ్గర ఉన్న రైతు సేవా కేంద్రంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వరప్రసాదరావు సోమవారం తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల కోఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: ?: మండలంలోని బెలుం శింగవరంలో ప్రధాన రహదారి వెంట విద్యుత్తు దీపాలు వెలగటం లేదు. - లక్ష్మన్న, గ్రామస్థులు
✔: సర్పంచి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తాం. - చంద్రమౌళీశ్వర్, డిప్యూటీ ఎంపీడీవో
బేతంచెర్ల, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ప్రాంతంలో పైపు లీకేజీతో అపరిశుభ్రత నెలకొంది. - శ్రీనివాసులు, బేతంచెర్ల.
✔: పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. - మధుసూదన్‌రెడ్డి, ఏఈ మున్సిపల్.
?: శ్రీనగర్‌కాలనీలో సచివాలయం నుంచి శివమందిర్ వెళ్లే దారిలో వీధి దీపం వెలగడం లేదు. - వెంకటేశ్వర్లు, శ్రీనగర్‌కాలనీ.
✔: విద్యుత్తు లైన్‌మ్యాన్‌తో మరమ్మతులు చేయిస్తాం. - హరిప్రసాద్, కమిషనర్.
శిరివెళ్ల, న్యూస్‌టుడే: ?: మండలంలోని శిరివెళ్ల మహమ్మదీయపేటలో వీధిదీపాలు వెలగడం లేదు. - మహమ్మద్ లతీఫ్.
✔: నూతన వీధి దీపాలను ఏర్పాటు చేయిస్తాం. - అశ్విన్‌కుమార్, ఈవో, శిరివెళ్ల.
కోవెలకుంట్ల (గ్రామీణ), న్యూస్‌టుడే: ?: అమడాల గ్రామంలోని బెస్తపేట చివరి వీధికి విద్యుత్తు లైన్ ఏర్పాటు లేక ఇబ్బంది పడుతున్నారు. - రాముడు, గ్రామస్థుడు
✔: అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. - సుబ్బయ్య, లైన్‌మెన్

అసంపూర్తి భవనాలు.. అందని సేవలు

ప్రారంభానికి నోచుకోని రైతు సేవా కేంద్రాలు

బనగానపల్లి గ్రామీణం, కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: రైతులకు స్థానికంగా అన్ని రకాల వ్యవసాయ సేవలు అందించేందుకు గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను నిర్మించింది. ఎరువులు, మందులు, విత్తనాలు పంపిణీ తదితర వాటిని గ్రామస్థాయిలో అందించాలనే లక్ష్యంతో సేవలు అందిస్తున్నారు. ఈ కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మారుస్తూ కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. చాలా వరకు ఆర్‌ఎస్‌కేలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అలాగే కొన్ని కేంద్రాలు గ్రామానికి దూరంగా ఉండటంతో అన్నదాతలు ఇక్కట్లు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అవసరం ఎంతైనా ఉంది. రైతు సేవా కేంద్రాల్లో నెలకొన్న సమస్యలపై కథనం.

బనగానపల్లిలో చివరి దశలో నిలిచిన ఆర్‌ఎస్‌కే నిర్మాణం

కూటమి ప్రభుత్వం పైనే ఆశలు

● కొలిమిగుండ్ల మండలంలోని కొలిమిగుండ్ల గ్రామంలోని ఆర్‌ఎస్‌కే వద్ద ముళ్లపొదలు నిండి దర్శనమిస్తుంది. ఇది ప్రారంభానికి నోచుకోలేదు.
● అవుకు, కోవెలకుంట్ల మండలాల్లోనూ ఇటువంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. ఈ మండలాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.
● రుద్రవరం మండలంలోని ఆర్.నాగులవరం, ముత్తలూరు, నర్సాపురం గ్రామాల్లో కేంద్రాల నిర్మాణం ఆగి ముళ్లపొదలతో దర్శనమిస్తున్నాయి. దీంతో సచివాలయాల్లోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. దీంతో రైతులకు కొంత ఇబ్బందులున్నాయి.
● దొర్నిపాడు మండలంలోని గుండుపాపల గ్రామంలోనూ ఇటువంటి సమస్యలు ఉన్నాయి. ఏది ఏమైనా ప్రభుత్వం వీటిపై దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఉంది.
● బేతంచెర్ల మండలంలోని గొర్లగుట్ట, కొలుములపల్లె గ్రామాల్లో నిధుల్లేక నిర్మాణాలు ఆగిపోయాయి. ముద్దవరం గ్రామంలో నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టి పనులు పూర్తిచేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

అవస్థలు పడుతున్న అన్నదాతలు

● బనగానపల్లి మండలంలోని పాతపాడు, ఎర్రగుడి, టంగుటూరు, నందవరం గ్రామాల్లో ఆర్‌ఎస్‌కేలు లేకపోవడంతో అన్నదాతలు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. పాతపాడు, నందవరం గ్రామాల్లో కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటంతో ఎరువులు, మందులు నిల్వ ఉంచేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.
● బనగానపల్లె పట్టణంలోని వ్యవసాయ కార్యాలయం సమీపంలో ఆర్‌ఎస్‌కే నిర్మాణం చివరి దశలో నిర్మాణం ఆగి దర్శనమిస్తోంది. దీంతో సిబ్బంది వ్యవసాయ కార్యాలయాన్నే కేంద్రంగా మార్చుకొని సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.
● సంజామల మండలంపేరు సోముల శివారులో దూరంగా కేంద్రం నిర్మించారు. దీంతో రైతులు అక్కడికి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

అవుకు, న్యూస్‌టుడే: కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామంటూ ప్రకటించిన యంత్రాంగం ఆ దిశగా కనీస చర్యలు చేపట్టడం లేదంటూ మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు వాపోతున్నారు. అధిక వర్షాలతో అవుకు మండలంలో మొక్కజొన్న, ఉల్లి, మిరప, పొగాకు, వరి తదితర పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. తడిసిన మొక్కజొన్నను కొనేందుకు వ్యాపారులు ఇష్టపడటం లేదంటూ శింగనపల్లెకు చెందిన కృష్ణారెడ్డి అన్నారు. విదిలేని పరిస్థితుల్లో తక్కువ ధరకే విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సాధారణ మార్కెట్‌లో క్వింటా రూ.2 వేలు ఉండగా.. వ్యాపారులు రూ.1500లకే కొంటున్నారని కొనాపురం గ్రామానికి చెందిన రైతు చిన్నపురెడ్డి అన్నారు. అధికారులు పరిశీలించి వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలంటూ రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: జాతీయ రహదారిలో కర్నూలు జిల్లా ఫంక్షన్‌హాల్ వద్ద బెంగళూరు నుంచి కర్నూలు వైపు వస్తున్న కారు ప్రమాదవశాత్తు సోమవారం బోల్తాపడింది. అటుగా వెళ్తూ గమనించిన ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి తక్షణమే స్పందించి తన వాహనాన్ని నిలిపి, బాధితులను కలిసి వివరాలను తెలుసుకున్నారు. అంబులెన్స్‌కి ఫోన్ చేసి బాధితులను ఆసుపత్రికి తరలించి, సంబంధిత వైద్యుడితో మాట్లాడి చికిత్సలు అందించాలని కోరారు.

బాధితుల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి

వీధి దీపాలకు మరమ్మతులు

గొర్లగుట్ట (బేతంచెర్ల), న్యూస్‌టుడే: గొర్లగుట్ట గ్రామంలో పగలేపూట వీధి దీపాలు వెలుగుతుండటంతో ఈనాడులో గత నెల 28న 'పట్టపగలే విద్యుత్తు వెలుగులు' అనే శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన ఈవోఆర్డీ మల్లికార్జున, సర్పంచి మద్దయ్య దృష్టికి తీసుకెళ్లి వీధి దీపాలకు ఆన్‌ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు.

స్పందనకు పందనం

ముళ్లచెట్ల తొలగింపు

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: కోవెలకుంట్ల నుంచి బనగానపల్లె రోడ్డులో సౌదరదిన్నె, అమడాల గ్రామాల మధ్య రోడ్డు పైకి ముళ్లచెట్లు విస్తరించాయి. దీనిపై అక్టోబరు 9న ఈనాడులో చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు మొక్కలను తొలగించారు.

అద్వితీయం.. మన విజయం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: మహిళా క్రికెట్‌లో విశ్వవిజేతగా భారత్ నిలవడంతో ఆళ్లగడ్డలో సంబరాలు జరుపుకొన్నారు. మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రజ్ఞ పాఠశాలకు చెందిన విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విజేతగా నిలిచిన వారిని ఆదర్శంగా తీసుకుంటామని విద్యార్థులు నినాదాలు చేశారు. మానవతా సేవా సంస్థ కార్యదర్శి టి.అమీర్‌బాషా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహబూబ్ బాషా, రాజు, వరలక్ష్మి, ఇమామ్‌బాషా పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మిద్దెపల్లెలో తాగునీటి తిప్పలు

డోన్ మండలంలోని మిద్దెపల్లె గ్రామంలో తాగునీటి తిప్పలు అధికమయ్యాయి. గ్రామంలో ఉన్న నాలుగు బోర్లకు సంబంధించిన మోటార్లు మరమ్మతులకు గురికావటంతో 10 రోజులకు పైగా తీవ్ర అవస్థలు పడుతున్నామని గ్రామస్థులు పేర్కొన్నారు. దీంతో నీటి అవసరాలు తీర్చుకునేందుకు గ్రామంలోని చేతిపంపులు, వ్యవసాయ బోర్ల వద్దకు బండ్లు, ద్విచక్రవాహనాలు, సైకిళ్లపై వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. అధికారులు ఇప్పటికైనా సమస్యను పరిష్కరించేలా చూడాలన్నారు. - న్యూస్‌టుడే, డోన్

వర్షం తగ్గినా.. వదలని వరద

ఆళ్లగడ్డ పట్టణంలో శివారు కాలనీల్లో ఇంకా వర్షం నీరు నిలిచే ఉంది. ముఖ్యంగా సద్దాం కాలనీ, లక్ష్మీనరసింహనగర్, మైఖేల్ వీధుల్లో వర్షం నీరు ఇళ్ల పరిసరాల్లో నిండి ఉన్నాయి. సద్దాం కాలనీలో హుస్సేన్ మసీదు చుట్టూ వర్షం నీరు ఉండడంతో ప్రార్థనలకు వచ్చేందుకు ముస్లింలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని పుర ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

కార్యాలయంలోకి వెళ్లేందుకు అవస్థలు

డోన్ పట్టణంలోని తపాలాశాఖ కార్యాలయం లోపలికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రహదారికి అడ్డుగా ఇష్టారాజ్యంగా ద్విచక్రవాహనాలను నిలుపుతుండటంతో ఖాతాదారులు అవస్థలు పడుతున్నారు. గేటు వద్ద ద్విచక్రవాహనాల రాకపోకలతో మరీ ఇబ్బందిగా మారుతుంది. నిత్యం కార్యాలయానికి వందల సంఖ్యలో వస్తుంటారు. కార్యాలయంలోనే ఆధార్ కేంద్రం ఉండటంతో రద్దీగా ఉంటోంది. క్రమపద్ధతిలో ద్విచక్రవాహనాలను నిలిపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, డోన్‌పట్టణం

దారిలో అడ్డంకులు.. తొలగించరూ..

ఆళ్లగడ్డ మండలంలోని ఎగువ అహోబిలం రహదారిలో చెట్ల కొమ్మలు విరిగిపడటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తుపాన్ కారణంగా వర్షాలకు చెట్ల కొమ్మలు, కట్టెలు విరిగి రోడ్డుపై పడిపోయాయి. అవి రాకపోకలకు అడ్డుగా మారడంతో భక్తులు అవస్థలు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో అహోబిలానికి తరలివస్తుంటారు. ఆలయ నిర్వాహకులు రోడ్డుపై ఉన్న అడ్డంకులను తొలగించాలని భక్తులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం)

సీఎం సహాయనిధి పేదలకు వరం

బనగానపల్లి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంగా మారిందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎంఆర్ఎఫ్ కింద విడుదలైన రూ.25.98 లక్షల చెక్కులను 41 మంది బాధితులకు మంత్రి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రోగులకు

బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

ఎల్లప్పుడూ అండగా ఉంటారన్నారు. అనంతరం బాధితులతో మాట్లాడిన మంత్రి, కుటుంబ సభ్యుల బాగోగులు తెలుసుకున్నారు.

కార్తికం.. శివ స్వరూపం

కార్తిక మాస సోమవారం కావడంతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు పెద్దఎత్తున వేకువజామునే తరలివచ్చి శివలింగానికి అభిషేకం, కుంకుమార్చన, మహామంగళ హారతి ఇచ్చి పూజలు నిర్వహించారు. - న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ, ఆళ్లగడ్డ గ్రామీణ, కోవెలకుంట్ల గ్రామీణ, అవుకు, చాగలమర్రి, దొర్నిపాడు, కొలిమిగుండ్ల, సంజామల

డోన్: అలంకరణలో పాత బుగ్గ రామలింగేశ్వరస్వామి

ఆళ్లగడ్డ గ్రామీణం: అహోబిలంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

బేతంచెర్ల పట్టణం లింగావధూత ఆశ్రమంలో పూజలు

చాగలమర్రి పట్టణంలో..

ఆళ్లగడ్డ అమృత లింగేశ్వర స్వామి ఆలయంలో..

భక్తిచైతన్య రథానికి స్వాగతం

బేతంచెర్ల, న్యూస్‌టుడే: కర్నూలు నుంచి తిరుపతికి బయలుదేరిన భక్తిచైతన్య పాదయాత్ర రథం సోమవారం బేతంచెర్లకు చేరుకుంది. ఈ సందర్భంగా భక్తులు, భక్తిచైతన్య పాదయాత్రకు స్వాగతం పలికి

పూజల్లో పాల్గొన్న బేతంచెర్ల పట్టణ ప్రజలు

వేంకటేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో భక్తులు పూజలు నిర్వహించారు. 14వ సారి పాదయాత్ర ద్వారా తిరుపతికి వెళ్తున్నట్లు పాదయాత్ర కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు కృష్ణయ్య, తిరుపతిరెడ్డి, మండ్ల మధుమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంకురార్పణ

అవుకు, న్యూస్‌టుడే: అవుకులోని కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న ధ్వజస్తంభం ఉత్సవంలో భాగంగా సోమవారం అంకురార్పణ భక్తిశ్రద్ధలతో కొనసాగింది. మూడు రోజులపాటు పూజల అనంతరం కార్తిక పౌర్ణమి రోజు ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఆలయ అర్చకుడు శంకరశర్మ దాదాపు రూ.2 లక్షలు సొంత నిధులతో కొత్త రాతి స్తంభాన్ని సమకూర్చారు.

రహదారి నిబంధనలు తప్పనిసరి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పాఠశాల బస్సులు రహదారి నిబంధనలు తప్పనిసరి పాటించాలని విద్యా సంస్థల యాజమాన్యాలు, బస్సుల ఇన్‌ఛార్జీలకు ఎంవీఐ టి.క్రాంతి కుమార్ సూచించారు. సోమవారం ఆర్టీవో కార్యాలయంలో డోన్, బేతంచెర్ల పరిధిలోని విద్యా సంస్థల యాజమాన్యాలు,

సమావేశంలో మాట్లాడుతున్న క్రాంతికుమార్

బస్సుల ఇన్‌ఛార్జీలకు భద్రతా చర్యలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సులకు అత్యవసర ద్వారం ఒకటి తప్పనిసరిగా ఉండాలని, లోపల, బయట నుంచి సులభంగా తెరిచేందుకు అందుబాటులో ఉండాలన్నారు. చెక్ లిస్టు ప్రకారం సరి చేసుకునేందుకు 10 రోజులు గడువు ఇచ్చామన్నారు.

ప్రకృతి సాగుతో ప్రయోజనం

చాగలమర్రి, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసి పండించిన ఆకుకూరలు, కూరగాయలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌ఛార్జి నాగేశ్వర్ రెడ్డి, కదిరి బాషాలు తెలియజేశారు. పట్టణంలోని ఎంపీడీవో ఆవరణలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన ఆకుకూరలు, కూరగాయల స్టాల్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అభిషేక్‌రాజ్, నిరంజన్, సురేష్, రవి, బాషా, వీరభద్రుడు పాల్గొన్నారు.

రీసర్వే పనులకు సహకరించండి

రాంపల్లె (చాగలమర్రి), న్యూస్‌టుడే: గ్రామాల్లో రైతులు రీసర్వే బృందాలకు సహకరించాలని రీసర్వే జిల్లా నోడల్ అధికారి శ్రీనివాసరెడ్డి కోరారు. రాంపల్లె గ్రామంలో రీసర్వే ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రీసర్వే ప్రాధాన్యం, జాయింట్ ఎల్పీఎం వల్ల కలిగే నష్టాలని, రీసర్వే వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూసరిహద్దులు సక్రమంగా గుర్తించడం, భూయాజమాన్య వివరాలు పారదర్శకంగా నమోదవ్వడం వల్ల భవిష్యత్తులో వివాదాలు రాకుండా ఉంటాయన్నారు. సర్వే బృందాలు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించి, రీసర్వే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి రామమోహన్, డివిజన్ సర్వే అధికారి నీలకంఠప్ప, మండల సర్వే అధికారి దేవరాజు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులతో చర్చిస్తున్న నోడల్ అధికారి శ్రీనివాసరెడ్డి

బాధిత రైతులను ఆదుకోవాలి

ప్యాపిలి, న్యూస్‌టుడే: తుపాను వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు పేర్కొన్నారు. జలదుర్గం గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో

కార్యక్రమంలో మాట్లాడుతున్న రామచంద్రుడు

ఆయన మాట్లాడుతూ..ప్యాపిలి, డోన్ మండలాల్లోని గ్రామాల్లో అత్యధికంగా నష్టపోయిన పంటలను పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉల్లి పంటను అమ్మేందుకు గిట్టుబాటు ధరలు లేవని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సహాయం క్షేత్రస్థాయిలో అందడం లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి చిన్న రహిమాన్, సీఐటీయూ జిల్లా నాయకులు శివరాం, రామాంజనేయులు, నక్కి శ్రీకాంత్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని వెంటనే తెరవాలని వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమా కిశోర్‌రెడ్డి అన్నారు.

డోన్, న్యూస్‌టుడే: కన్నపకుంట గ్రామంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై వైకాపా ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు.

డోన్ పట్టణం: డోన్ పట్టణం సమీపంలో 132 కేవీ విద్యుత్తు లైన్‌కు సంబంధించి కొత్త టవర్ నిర్మాణానికి మూడు రోజుల పాటు పనులు జరుగుతున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగేంద్ర సోమవారం తెలిపారు.

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: డోన్ పట్టణానికి చెందిన స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో ఓంకారం పుణ్యక్షేత్రంలో యాచకులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. నారాయణస్వామి, దుర్గాదేవి, మహేశ్వరి, సభ్యులు పాల్గొన్నారు.

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: రేకులకుంట గ్రామానికి చెందిన నీలం బన్ని అనే వ్యక్తి యు.కొత్తపల్లి వద్ద పట్టణంలోకి వెళ్లడానికి రహదారి దాటుతున్నాడు. గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. క్షతగాత్రుడిని వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

కైప(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: కైప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కిరణ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఇటీవల బదిలీపై వెళ్లిన పలువురు ఉపాధ్యాయులకు సన్మానం కార్యక్రమం నిర్వహించారు.

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఏటీఎంలో నగదు డ్రా చేయడానికి వెళ్లిన ఆలంకొండ గ్రామానికి చెందిన చంద్రశేఖర్ అనే రైతును అక్కడే ఉన్న ఓ దుండగుడు మోసం చేసి రూ.35వేలు డ్రా చేశాడు. బాధితుడు సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

డోన్‌పట్టణం: వైఎస్ఆర్ నగర్‌లో కాల్వలు లేక మురుగు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఐ పట్టణ కార్యదర్శి మోటా రాముడు పేర్కొన్నారు.

డోన్ నేరవిభాగం: ధర్మవరం గ్రామంలో బోయ మణి ఇంటిలో విద్యుదాఘాతంతో సామగ్రి దగ్ధమైంది.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: తుపాను బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ మండల నాయకులు నవీన్, రామసుబ్బయ్య, రాయలసీమ విద్యార్థి సంఘం నాయకుడు ఓబులేసు డిమాండు చేశారు.

ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి

డోన్, డోన్ పట్టణం, న్యూస్‌టుడే: బీసీలంతా ఐక్యంగా ఉంటేనే అన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర

సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

నాయకులు ఏఈ నాగరాజు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. కొండపేటలోని ఎల్లమాంబేశ్వరి ఆలయం వద్ద ఈనెల 5వ తేదీన బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనభోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వపోటీలు నిర్వహిస్తామన్నారు.

నీటి కుంటకు గండి

దొర్నిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలోని నీటి కుంటకు గుర్తు తెలియని వ్యక్తులు గండి కొట్టారు. కుంట 21 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ కుంట నీటిని భీమునిపాడు, డబ్ల్యూగోవిందిన్నె గ్రామాల రైతులు సాగుకు వినియోగిస్తున్నారు. కుంటకు గండి కొట్టిన వ్యక్తులను చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సుభద్రకు సోమవారం రైతులు ఫిర్యాదు చేశారు.

పాదయాత్రకు న్యాయవాదుల సంఘీభావం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చట్టాలను తేవాలని, ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు అందించాలని డోన్ న్యాయవాదులు లక్ష్మీశెట్టి ప్రసాద్, ఈశ్వరయ్య, సదానందం చేపట్టిన పాదయాత్ర నంద్యాలకు చేరింది. కోవెలకుంట్ల న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఓబులేసు తదితరులు సోమవారం నంద్యాలకు వెళ్లి పాదయాత్రకు సంఘీభావం తెలిపారు.

బయటకొస్తే భయం.. భయం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ పురపాలికలో ప్రతి వీధిలోనూ కుక్కల దెబ్బకు ప్రజలు అల్లాడి పోతున్నారు. నవంబరు 1వ తేదీ ఒక్కరోజే 18 మందిపై మూడు ప్రాంతాల్లో కుక్కలు దాడి గాయపరిచాయి. ఏ వీధిలో చూసినా 10కి తక్కువ కాకుండా కుక్కలు ఉన్నాయి. రాత్రి 8 గంటలు దాటిన తర్వాత పట్టణంలోని కొన్ని వీధుల్లో కుక్కలకు భయపడి ప్రజలు రాకపోకలను సాగించలేని స్థితి ఏర్పడింది.

మున్సిపల్ యంత్రాంగం విఫలం

కుక్కల దాడిలో మూడేళ్ల కిందట పట్టణంలోనే ఓ నాలుగేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటన తర్వాత కుక్కల నియంత్రణకు చర్యలకు ఉపక్రమించారు. అది కూడా ఆరంభ శూరత్వంగానే మారింది. తర్వాత కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగింది. ప్రతి వారం కుక్కల దాడుల్లో పదుల సంఖ్యలో ప్రజలు, పిల్లలు గాయపడుతున్నారు. గతేడాది శునకాల నియంత్రణకు, చికిత్సకు సంబంధించి రూ.3 లక్షల వరకు ఖర్చు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది.

కొత్త మసీదు వీధిలో కుక్కల గుంపు

● ముఖ్యంగా చిన్న పిల్లలు కుక్కలకు భయపడి బయటకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. కుక్కల దాడి గత ఆరు నెలల కాలంలో పట్టణంలో 30 మందికిపైగా గాయపడినట్లు సమాచారం. అయినా చర్యలేవీ తీసుకోకపోవడం గమనార్హం.

కానరాని చర్యలు

జిల్లాలోని ఇతర పురపాలికల్లో అనిమల్ బర్త్ కంట్రోల్ నిర్వహిస్తున్నారు. కుక్కలకు శస్త్రచికిత్సలు చేసి వాటి జనాభా నియంత్రించే ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డలో ప్రారంభం కాలేదు. ఈ మేరకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆదేశాలు ఇచ్చినా అమలు కావడం లేదు. యంత్రాంగం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇటీవల సంఘటనలు

● కొత్త మసీదు వీధిలో శనివారం రాత్రి కుక్కల దాడిలో పది మంది గాయపడ్డారు. పి.చింతకుంటలో ప్రతాపరెడ్డి కాలనీలో అదే రోజు ఆరుగురు గాయపడ్డారు.
● పది రోజుల క్రితం పుల్లారెడ్డి వీధిలో కుక్కల దాడిలో చిన్నారి తీవ్రగాయాలపాలయ్యాడు.
● సద్దాం కాలనీలోనూ ఇలాంటి దాడులు జరిగి నలుగురు పిల్లలు గాయపడ్డారు.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION), ALLAGADDA
E.P.No.24 of 2021 in O.S.No.64 of 2006
Cheppali Reddy Nagi Reddy (Died) by his LRs C.Naramma (Died) by LRs C.Rama Krishna Reddy and others ... **Decree Holders**
Versus
Katha Nageswara Reddy ...**Judgement Debtor**
Pursuant to the orders of the Hon'ble Court in the above Execution Petition, the under mentioned property belonging to the Judegment Debtor will be brought to public auction on 17.11.2025 at 10:30 A.M. in the Court premises of the Civil Judge (Senior Division), Allagadda, to recover the decree amount due to the Decree Holders.
Schedule of Property: Open site situated within the village limits of Gulladurthy Village, Koilakuntla Sub- Registration, Kurnool District. Survey No.: 27
Boundaries: East: House of Katha Machalapuni Venkata Subba Reddy, **West:** House of Katha Chennamma, **North:** Rasta, **South:** Open site of Chireddy Rama Lakshamma.
Measurements: East-West: 11 feet, **North-South:** 65 feet.
Upset Price(Decree Holder's Valuation): ₹ 1,00,000/- (Rupees one lakh only) (Ameen value): ₹ 1,75,000/- (Rupees one lakh seventy five thousand only) (Present market value): ₹ 95,328/- (Rupees ninty five thousand and three hundred and twenty eight only)
By Order of the Court
Civil Judge (Senior Division), Allagadda
sd/-C.V.Ramana Rao, Advocate,
Allagadda. Cell.No.99855 47550

(c) eenadu

ఈనాడు ఒడిశా

మంగళవారం నవంబరు 4, 2025 5

త్రివిక్రమ అవతారంలో పురుషోత్తముడు

స్వామి దర్శనం కోసం నాలుగైదు గంటల నిరీక్షణ

స్వామి దివ్య మంగళ రూపం

గోపాల్‌పూర్, న్యూస్‌టుడే: 'పుండరీకాక్ష..! పురుషోత్తమా..! అభిరాం డకోటి బ్రహ్మాండ నాయకా..! నీలాచల వాసా! ప్రణామమ్మహం' అన్న ప్రార్థనలతో పూరీ శ్రీక్షేత్రం సోమవారం మార్మోగింది. కార్తిక ద్వాదశి ముగిసి త్రయోదశి తిథి ప్రారంభమైన సందర్భంగా గర్భగుడిలో జగన్నాథుడు త్రివిక్రమ అవతారంలో దర్శనమిచ్చారు. ఈ దివ్యరూపం తిలకించడానికి పెద్దసంఖ్యలో భక్తులు ఆలయం వద్ద బారులుతీరారు. తెల్లవారు జామున 3 గంటలకే తలుపులు తెరిచిన సేవాయత్‌లు స్వామి వైదరుల సేవలు పూర్తిచేసిన తర్వాత 6 గంటల నుంచి దర్శనాలకు అనుమతించారు. రాత్రి వరకు కొనసాగాయి.

మార్కెట్ కూడలి వరకు బారికేడ్లు

భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకున్న యంత్రాంగం బారికేడ్లను మార్కెట్ కూడలి వరకు పొడిగించింది. దీంతో స్వామి దర్శనానికి నాలుగైదు గంటల వ్యవధి పడుతుండగా నిల్చొనే ఓపిక లేని వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృశ్యాలు కనిపించాయి. తాగునీటి సౌకర్యం ఉన్నా, ఉక్కపోతతో అల్లాడిపోయారు. తొక్కిసలాట జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకున్నారు.

ఆడపిల్లల్లో హిమోగ్లోబిన్ తగ్గకూడదు

● గవర్నరు హరిబాబు

బాలికలకు జ్యూస్ ఇస్తున్న గవర్నరు హరిబాబు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పెరుగుతున్న ఆడపిల్లల్లో హిమోగ్లోబిన్ శాతం తగ్గకూడదని, సరైన పౌష్టికాహారం తీసుకోవాలని గవర్నరు కంభంపాటి హరిబాబు చెప్పారు. సోమవారం సాయంత్రం భువనేశ్వర్ యూనిట్-2 పరిధిలోని బాలికోన్నత పాఠశాలలో రక్తహీనత నివారణ కార్యక్రమం ప్రారంభించారు. ఇందులో భాగంగా బాలికలకు నిత్యం బీట్‌రూట్, క్యారెట్ జ్యూస్, వేరుశనగ చిక్కిలు పంపిణీ చేస్తారు. ఈ కార్యక్రమాన్ని ఆరంభించిన గవర్నరు రెండు నెలలు ఇది కొనసాగిన తర్వాత బాలికలు హిమోగ్లోబిన్ పెరిగిందా? అన్నది పరీక్షించుకుని, ఇళ్లలో సొంతంగా తయారు చేసుకొని వినియోగించాలన్నారు. రక్తహీనత అనేక వ్యాధులకు కారణమవుతుండగా, బాలికలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా స్కూళ్లలో అమలవుతున్న అమ్మాన్ పథకం, ఇందులో భాగంగా నేత్ర పరీక్షలు జరుగుతుండగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువులతోపాటు క్రీడల్లోనూ బాలికలు రాణించాలని కోరారు. కార్యక్రమంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.తిరుమలనాయక్, సంచాలకుడు నరేంద్ర కర్మర్, విద్యాశాఖ ఇతర అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోసగించిన వారిని తిప్పికొట్టండి

భాజపా పాలనపై నవీన్ మండిపాటు

ప్రజలకు అభివాదం చేస్తున్న నవీన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బూటకపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన భాజపా పాలకులు ప్రజల్ని మోసగించారని మాజీ ముఖ్యమంత్రి, విపక్షనేత నవీన్‌పట్నాయక్ దుయ్యబట్టారు. నువాపడ అసెంబ్లీ ఉప ఎన్నిక నేపథ్యంలో సోమవారం ప్రచారానికొచ్చిన నవీన్ కొమ్మనా సమితి కేంద్రంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. చివరి నిమిషంలో పార్టీ మార్చిన ఉప రజెల్లి (భాజపా తరఫున బరిలో ఉన్న జయడోల్కియాను ఉద్దేశించి అన్నమాటలు) సరైన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బిజద హయాంలో నువాపడ జిల్లాగా అవతరించిన సంగతి గుర్తుచేసిన ఆయన తమ పాలన కాలంలో 18 వేల హెక్టార్ల సాగునీటి సదుపాయం, అన్ని గ్రామాలకు మంచినీరు, మౌలిక సౌకర్యాలు కల్పించామన్నారు. గతేడాది సార్వత్రిక ఎన్నికల సమయంలో భాజపా నేతలిచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. తమ హయాంలో బీఎస్‌కేవై సంజీవనిగా నిలిచిందని, ప్రస్తుతం అమలవుతున్న ఆయుష్మాన్ భారత్ వైద్యసేవలు ఎవరికీ అందడం లేదన్నారు. రూ. 3,500 వృద్ధాప్య, వితంతు పింఛను, 300 యూనిట్ల ఉచిత విద్యుత్తు, ప్రతి పంచాయతీలో 100 మంది యువతీ యువకులకు ఉపాధి అంటూ భాజపా ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అన్నదాతలకు ఎరువుల కొరత, మండీల్లో అవినీతి పెరిగిందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే రాజేంద్ర డోల్కియా నువాపడ అభివృద్ధికి ఎంతో చేశారని, ఆయన లేని లోటు పూడ్చలేనిదన్నారు. బిజద హయాంలో అభివృద్ధి జరగ్గా, భాజపా అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రచారం మినహాయిస్తే ప్రగతి శూన్యంగా మారిందని, నువాపడ ఓటర్లు బిజద అభ్యర్థిని స్నేహాంగిని చురియాను గెలిపించాలన్నారు. ఈ సభలో బిజద నేతలు ప్రసన్న ఆచార్య, దేవీప్రసాద్ మిశ్ర, అరుణ్‌సాహు తదితరులు పాల్గొన్నారు.

సభకు హాజరైన ప్రజలు

కళింగ వైభవానికి ప్రతీక

రేపు ఓడరేవుల్లో నేత్రపర్వంగా ఉత్సవాలు

బొయితా బొందానొ

గోపాల్‌పూర్, న్యూస్‌టుడే: కళింగ సంస్కృతి వైభవం ప్రాముఖ్యం పొందింది. క్రీస్తు పూర్వం ఖారవేల చక్రవర్తి పాలన కాలం నుంచే భాషా, సంస్కృతులు మొగ్గతొడిగాయి. విదేశీ నౌకా వాణిజ్యానికి తెర లేచింది. నాటి వ్యాపారులు పరదీప్, గోపాల్‌పూర్, ధమ్రా తీరాల మీదుగా ఇండోనేషియా, జావా, బలి, సుమిత్ర ద్వీపాలకు నౌకల్లో రాకపోకలు సాగించి వాణిజ్య స్నేహబంధం బలోపేతం చేశారు. ఇందుకు గుర్తుగా ఒడిశా ప్రజలు కార్తిక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం(5న) 'బొయితా బొందానొ' వేడుకలు నిర్వహించుకోనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరదీప్, గోపాల్‌పూర్ తీరాల్లో ఉత్సవాలు చేపడుతోంది. చారిత్రక నగరం కటక్‌లో మహానది ఒడ్డున బలియాత్ర ప్రారంభం కానుంది.

అలనాటి వాణిజ్యానికి ప్రతీక ఈ కార్తిక పడవలు

బాలియాత్ర

ఏర్పాట్లు: రాష్ట్ర ప్రభుత్వం, పరదీప్ ఓడరేవు యంత్రాంగం సంయుక్తంగా పరదీప్‌లో 7 రోజుల కళింగ బలియాత్రా వేడుకలు చేపడుతున్నాయి. గోపాల్‌పూర్‌లో మూడు రోజుల ఉత్సవాలు తెరలేపింది. మరోవైపు కటక్ బలియాత్రా సంఘం, రాష్ట్ర సాంస్కృతిక శాఖలు 7 రోజుల సంబరాలు చేపడుతున్నాయి. ధమ్రా ఓడరేవు, పూరీ జిల్లా యంత్రాంగాలు ఉత్సవాలకు ఏర్పాట్లు చేశాయి. ఆయాచోట్ల ఒర్లెస్ ప్లెక్సీ మేళాలు, మహిళా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శనలు, సాంస్కృతిక వేడుకలు కళాకారుల ఆదినవాలతో కార్తిక పౌర్ణమి వేళ నౌకాసారి నేత్ర పర్వం చేయనుంది.

నౌకా వాణిజ్యం పురాతనం

ఎలాంటి సౌకర్యాలు, సాంకేతిక పరిజ్ఞానం లేని సమయంలో రాష్ట్రానికి చెందిన వ్యాపారులు ఆకులు, వక్కలు, సుగంధ ద్రవ్యాలు విదేశాలకు ఎగుమతి చేసి అక్కడ దొరికే వస్తువులను దిగుమతి చేసుకునేవారు. కార్తిక మాసంలో ఆయా ద్వీపాలకు వెళ్లిన వారంతా వైశాఖంలో ఇళ్లకు తిరుగుముఖం పట్టేవారు. ఇది వేల సంవత్సరాల వైభవం కాగా నెలరోజులు కార్తిక వ్రతాలు, పొంచుక నోములు నోచుకున్న వారంతా పూర్వీకులను (పితృదేవతలు) స్మరిస్తూ సాగర తీరాల్లో పడవలు విడిచి పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఒడిశావాసులకు ఈ పౌర్ణమితో కార్తిక వ్రతాలకు తెరపడుతుంది. పూరీ జగన్నాథ సన్నిధిలో నెలరోజులు వ్రతాలు చేసిన హబిషార్థులు (దీక్షాధారులు) బుధవారం పూర్ణాహుతి చేస్తారు.

చౌద్వార్ జైల్లో ఖైదీ మృతి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కటక్ జిల్లా చౌద్వార్ మండల కారాగారంలో పవిత్రకుమార్ సాహు అనే ఖైదీ అస్వస్థతకు లోనయ్యాడు. ఆయనను కటక్ ఎస్సీబీ వైద్య కళాశాల ఆసుపత్రిలో చికిత్సకు చేర్పించారు. సాయంత్రం మృతి చెందినట్లు చికిత్స చేసిన వైద్యులు తెలిపారు.

నారీశక్తికి జోహార్లు

మహిళల వన్డే క్రికెట్ కప్ భారత్ సొంతమైన నేపథ్యంలో ప్రముఖ శిల్పి సుదర్శన్ పట్నాయక్ భారత్ జట్టుకు శుభాకాంక్షలు తెలుపుతూ సోమవారం పూరీ తీరంలో సైకత శిల్పాన్ని తీర్చిదిద్దారు. –న్యూస్‌టుడే, గోపాలపూర్

గోవిందుడికి 'ముత్యాల కవచం'తో అలంకరణ

ప్రత్యేక అలంకరణలో శ్రీ భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న మహోత్సవాల్లో సోమవారం శ్రీభూ సమేత శ్రీ వేంకటేశ్వరుడ్ని 'ముత్యాల కవచం'తో అలంకరించారు. స్వామివారి నిజ పాద దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చారు. అనంతరం వేంకటేశ్వరునికి తులసీ దళాలతో, శ్రీ మహాలక్ష్మీని కుంకుమలతో అర్చించారు.

భక్తుల సేవలో స్వచ్ఛంద కార్యకర్తలు

ఏటా శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అయిదు రోజులపాటు జరిగే నిజ పాద దర్శన సేవలో స్వచ్ఛంద కార్యకర్తలు విశేష సేవలు అందిస్తున్నారు. భక్తుల రద్దీ నియంత్రణ, వృద్ధులు, దివ్యాంగులకు వారు దగ్గరుండి స్వామిని దర్శించుకునేందుకు సహకరిస్తున్నారు. ఈ ఏడాది మొత్తం 120 మంది స్వచ్ఛంద కార్యకర్తలు సేవలందిస్తున్నారని, మూడు దశాబ్దాలుగా ఈ సేవలో పాల్గొంటున్న కె.హరగోపాల్ సుబుద్ధి 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

దశాబ్దాలుగా సేవలందిస్తున్న స్వచ్ఛంద కార్యకర్తలు

మంచంపై ఆసుపత్రికి గర్భిణి తరలింపు

గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో ఆ గ్రామానికి అంబులెన్స్ చేరుకోలేకపోయింది. దాంతో గత్యంతరం లేక గ్రామస్థులు పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని రెండు కిలోమీటర్లు మంచంపై చరవాణి వెలుగులో మోసుకెళ్లిన ఘటన నవరంగపూర్ జిల్లాలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. సదరు సమితి సిరాగూడపడ గ్రామానికి చెందిన శ్రీదేవి గౌడకు ఆదివారం రాత్రి పురిటినొప్పులు మొదలయ్యాయి. అంబులెన్స్‌ను సంప్రదించగా గ్రామానికి వెళ్లే రహదారి సరిగా లేకపోవడంతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కంగమాఝిగూడ వద్ద అంబులెన్స్ ఉండిపోయింది. ప్రత్యామ్నాయం లేక గ్రామస్థులు మంచంపై ఆమెను మోసుకెళ్లి అంబులెన్స్ వద్ద చేర్చగా, ఆమెను నవరంగపూర్‌లో ఉన్న జిల్లా ప్రధానాసుపత్రికి తరలించారు.

– న్యూస్‌టుడే, నవరంగపూర్

స్వచ్ఛమైన పాలన మా ధ్యేయం

ఉప ముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కాంగ్రెస్, బిజద పాలనలో రాష్ట్రం వెనుకబాటు చవిచూసిందని, ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరలేదని, ఆ లోటు భర్తీ చేయాలన్న సత్సంకల్పంతో తమ ప్రభుత్వం స్వచ్ఛమైన పాలనకు కట్టుబడిందని ఉప ముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ చెప్పారు. ఆదివారం రాత్రి నువాపడ అసెంబ్లీ నియోజకవర్గంలోని కొమ్మనా సమితిలో భాజపా చేపట్టిన ఎన్నికల సభలో సింగ్‌దేవ్ మాట్లాడుతూ గతంలో రాష్ట్రాన్ని పాలించిన అధికారమే పరమావధిగా చేసుకున్నాయని, అభివృద్ధి, సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. అవినీతి వేళ్లూనుకోగా స్వతంత్ర ఒడిశా నిర్మాతల ఆశలు నీరుగారాయని, డబుల్ ఇంజిన్ పాలనలో సమృద్ధి ఒడిశా ధ్యేయంగా కార్యక్రమాలు అమలుపరుస్తున్న నేపథ్యంలో ఓటర్లు భాజపా అభ్యర్థి జయడోల్కియాను గెలిపించాలన్నారు. ఎన్నికల సభలో రెవెన్యూ, విపత్తుల నివారణ శాఖ మంత్రి సురేష్ పూజారి, సంబల్‌పూర్ ఎమ్మెల్యే జయనారాయణ మిశ్ర, భాజపా ఇతర నాయకులు పాల్గొన్నారు.

వేదికపై ఉపముఖ్యమంత్రి సింగ్‌దేవ్, మంత్రి సురేష్, ఇతర నేతలు

బాధితులకు అండగా ఉంటాం

గుడ్డిపద్రలో బాధిత కుటుంబానికి ప్రభుత్వ సాయం అందజేస్తున్న ప్రభుత్వ విప్ అశోక్

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కాశీబుగ్గలోని వేంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన, గాయపడిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఏపీలోని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. సోమవారం గంజాం జిల్లాలోని గుడ్డిపద్ర గ్రామానికి చెందిన రంగాల రూప కుటుంబాన్ని పరామర్శించి, ఆమె తండ్రి ఢిల్లేష్‌కు కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 15 లక్షల చెక్కును అందించారు. ఒడిశా చీకటిపేట ఎమ్మెల్యే సతీమణి మిన్ను సంత్ర, జనసేన ఇచ్ఛాపురం నియోజకవర్గం బాధ్యులు దాసరి రాజు, కవిటి తహసీల్దార్ బి.మురళీమోహనరావు, తెదేపా మండలాధ్యక్షుడు కృష్ణారావు, బాసుదేవు ప్రధాన్, శ్రీనివాస రౌళో, మణిచంద్ర ప్రకాష్ పాల్గొన్నారు.

భాజపా తీర్థం పుచ్చుకున్న అమర్

అమర్‌ను స్వాగతిస్తున్న సీఎం మోహన్. పక్కన సామల్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాజ్యసభ మాజీ ఎంపీ, బిజద సిద్ధాంతకర్త అమర్ పట్నాయక్ సోమవారం భాజపా తీర్థం పుచ్చుకున్నారు. భువనేశ్వర్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి, భాజపా రాష్ట్రశాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, ఇతర నాయకులంతా ఆయనను పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా అమర్ మాట్లాడుతూ ఉన్నతోద్యోగి హోదాలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో విధులు నిర్వహించిన తాను రాష్ట్రానికి సేవ చేయాలన్న ఆశయంతో బిజదలో చేరినట్లు చెప్పారు. తర్వాత కాలంలో ప్రధాని నరేంద్రమోదీ సమృద్ధ భారత్ ధ్యేయంగా చేస్తున్న సేవలకు తాను ఆకర్షితుడినయ్యానని, భాజపాలో చేరాలని నిర్ణయం తీసుకున్నానని, తనకు పార్టీ నాయకత్వం ఏ బాధ్యత అప్పగించినా చిత్తశుద్ధితో చేస్తానన్నారు.

బిజదకు ఎదురుదెబ్బ

నువాపడ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరుగుతున్న వేళ అమర్ బిజద వీడటం ఆ పార్టీకి ఎదురుదెబ్బ. ఇంతవరకు నవీన్‌పట్నాయక్‌కు సన్నిహితంగా ఉన్న ఆయన ప్రాంతీయ పార్టీ సిద్ధాంతకర్తగా, ఐటీ సెల్ అధ్యక్షునిగా క్రియాశీలక పాత్ర పోషించారు. ఆయన భాజపాలోకి చేరిన నేపథ్యంలో ఆ పార్టీ నాయకత్వం కీలక పదవి కేటాయించే అవకాశం ఉంది. ఇదివరకు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌గా వివిధ రాష్ట్రాల్లో విధులు నిర్వహించిన అమర్ 2018లో ఉద్యోగానికి రాజీనామా చేసి బిజదలో చేరారు. 2019లో ఆయనకు నవీన్ రాజ్యసభకు పంపారు. ఇటీవల ఆయన పదవీ కాలం (ఆరేళ్లు) ముగిసింది. దీంతో భాజపాలో చేరారు.

తూర్పు భారత కరాటే బృంద ఛాంపియన్ ఒడిశా

బహుమతులతో రాష్ట్ర క్రీడాకారులు. చిత్రంలో అతిథులు, రిఫరీలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని ఉత్కళ కరాటే స్కూల్‌లో జరిగిన అయిదవ తూర్పు భారత కరాటే పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఇందులో ఒడిశాతోపాటు పశ్చిమబెంగాల్, బిహార్, ఝార్ఖండ్, అండమాన్ నికోబార్‌లకు చెందిన వందలాదిమంది క్రీడాకారులు వివిధ కేటగిరీల్లో పోటీపడ్డారు. వీరిలో ఒడిశా క్రీడాకారులు 74 పసిడి, 57 రజత, 76 కాంస్యపతకాలు గెలుచుకుని మొదటిస్థానంలో నిలవగా పశ్చిమ బెంగాల్ క్రీడాకారులు 43 పసిడి, 55 రజత, 86 కాంస్య పతకాలతో ద్వితీయ స్థానం పొందారు. బిహార్ క్రీడాకారులు 13 పసిడి, 9 రజత, 14 కాంస్య పతకాలు కైవసం చేసుకుని తృతీయస్థానంలో నిలిచారు. పోటీలనంతరం ముగింపు కార్యక్రమంలో అతిథులుగా హాజరైన ఒడిశా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు సమీర్ మహంతి, తూర్పు భారత కరాటే సంఘం అధ్యక్షుడు హన్సీ ప్రేమ్‌జిత్‌లు విజేతలకు బహుమతులందజేశారు. ఒడిశా కరాటే సంఘం అధ్యక్షుడు హరిప్రసాద్ పట్నాయక్, కార్యదర్శి గౌరీ మహంతి, వివిధ రాష్ట్రాల రిఫరీలు తదితరులు పాల్గొన్నారు.

పారా బ్యాడ్మింటన్‌లో దీపక్, ప్రమోద్‌లకు పతకాలు

పతకాలతో దీపక్ బిశోయి, ప్రమోద్ భగత్

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఇండోనేషియాలో ఈ ఏడాది అక్టోబరు 29 నుంచి ఈనెల 2వ తేదీ వరకు జరిగిన ఇండోనేషియా పారా బ్యాడ్మింటన్ అంతర్జాతీయ లెవెల్-1 టోర్నీలో ఇద్దరు రాష్ట్ర క్రీడాకారులు పతకాలు సాధించారు. ఇందులో భారత్ జట్టు తరఫున పోటీపడిన రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు ప్రమోద్ భగత్, దీపక్ బిశోయిలు డబుల్స్ మ్యాచుల్లో ఆడి ఒక పసిడి, రెండు కాంస్య పతకాలు గెలుచుకున్నట్లు రాష్ట్ర క్రీడాశాఖ 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది.

ముగ్గురు చిన్నారుల దుర్మరణం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కటక్ జిల్లా బొడాంబో సమితిలోని రగొడిపద గ్రామంలో సోమవారం మధ్యాహ్నం విషాద ఘటన జరిగింది. గ్రామంలో నిర్మాణంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్ ఆవరణలో ఆడుకుంటున్న బాలురు శుభం నాయక్ (9), అంకిత్ నాయక్ (3), బాలిక శివాని నాయక్ (7) ప్రమాదవశాత్తు ట్యాంకులో పడిపోయారు. గ్రామస్థులు వెంటనే వారిని వెలుపలికి తీసినా అప్పటికే ముగ్గురూ మృతిచెందారు. బొడాంబొ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

జలపాతాలు.. కాకూడదు యమపాశాలు

● అధికారుల నిర్లక్ష్యంతో తరచూ ప్రమాదాలు ● అక్కరకు రాని మౌలిక వసతులు

జలపాతాల వద్ద రక్షణ ఏర్పాట్లు కరవు

పుంజిసీల్‌కు వెళ్లే మార్గం ఇలా..

– న్యూస్‌టుడే, సిమిలిగుడ

ప్రకృతి సౌందర్యానికి, కొండకోనలకు అందమైన ఘాట్ రోడ్, గలగల పారే అందాల జలపాతాలకు నెలవు కోరాపుట్ జిల్లా. ఇక్కడి పర్యాటక ప్రాంతాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ కేంద్రాలకు వెళ్లేందుకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పర్యాటక కేంద్రాలు అభివృద్ధిపై అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారని సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి. నందపూర్ సమీపంలో రాణి దుడుమ, మాచ్‌బండ్ వద్ద దుడుమ, పొడఘడ్ సమీప పుంజిసీల్, పొట్టంగిలో గల్లి గబ్బర్, నారాయణ పట్టణం సమితిలో బారీ, కకిరీగుమ్మలో తలో మీటింగ్, జయపురం ప్రాంతం బగ్ర, సిమిలిగుడ సమితి దుదారి, నందపూర్ సమితి కూడా తదితర జలపాతాలు గత కొద్దిరోజులుగా రద్దీగా కనిపిస్తున్నాయి. కానీ రక్షణ ఏర్పాట్లు లేకపోవడం జలపాతాలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

పర్యాటకుల అవస్థలు

జలపాతం అభివృద్ధికి లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నా రక్షణ ఏర్పాట్లు విషయంలో సంబంధిత విభాగం పట్టించుకోవడం లేదు. జలపాతాల ప్రాంతాలకు వెళ్లేందుకు సరైన రవాణా సదుపాయాలు లేవు. కనీసం సూచిక బోర్డులు లేక పర్యాటకులు దారి తెలియక అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతాలన్నీ ఎత్తైనవి కావడంతో రక్షణగోడలైనా ఏర్పాటు చేయాలి. జలపాతాల వద్ద ప్రమాదకర స్థితిలో ఉన్న ప్రదేశంలో రక్షణ గోడలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేసి గైడ్‌లను నియమించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

10 ఏళ్లలో 90 మంది మృతి

జిల్లాలో ఉన్న పర్యాటక కేంద్రాలపై, జలపాతాలపై పర్యాటక విభాగం తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నట్లు సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి. పర్యాటకులను విశేషంగా ఆకట్టుకున్న ఈ జలపాతాలను చూసేందుకు ప్రతిరోజు అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివస్తున్నారు. దుడుమా, గల్లి గబ్బర్, రాణి దుడుమా జలపాతాల వద్ద రక్షణ ఏర్పాట్లు లేక 10 ఏళ్లలో 90 మంది మృతి చెందారు. మరో 50 మంది వరకు గాయపడ్డారు. ఇటీవల ఒక యూట్యూబర్ దుడుమా జలపాతం వద్ద మునిగిపోయిన దృశ్యం చర్చనీయాంశంగా మారింది.

దుడుమా వద్ద మునిగిపోతున్న యూట్యూబర్ (పాతచిత్రం)

ఇబ్బందులు లేకుండా చూస్తాం..

దీనిపై జిల్లా పర్యాటక అధికారిణి తాలినా ప్రధాన్ వివరణ కోరగా జలపాతాల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేశామని, ఆమోదం వచ్చిన వెంటనే పనులు ప్రారంభించి పర్యాటకులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

కాలుజారి ఒకరు... కాపాడబోయి మరొకరు

ఇద్దరు మహిళల జల సమాధి

మహిళను కాపాడి ఆసుపత్రికి తరలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లాలోని రెండు వేర్వేరు చోట్ల సోమవారం నది, చెరువులో మునిగి ఇద్దరు మహిళలు, ఓ బాలుడు మృతిచెందారు. దిగపొహండి ఠాణా పరిధిలో ఖొంబారిగావ్ పంచాయతీలోని సేవక్ టికరపడ గ్రామంలో వేకువన గ్రామానికి చెందిన సుమారు ముప్పై మంది మహిళలు 'పొంచుక'ను పురస్కరించుకుని శివారులోని ఘొడాహడొ నదిలో స్నానాలకు వెళ్లారు. వీరిలో లలితా పాడి (64) అనే వృద్ధురాలు ఒడ్డున స్నానం చేసి వస్త్రాలు మార్చుకుంటున్న సమయంలో చీర నీటిలో పడిపోయింది. దాన్ని అందుకోబోయి ఆమె జారి పడింది. ఆమెను కాపాడేందుకు ప్రయత్నించిన సమీపంలో ఉన్న సబితా గౌడ (40)కూడా నీటిలో పడిపోయింది. ఒడ్డున ఉన్న తోటి మహిళలు కేకలు వేయడంతో సమీపంలో ఉన్న గ్రామస్థులు నదిలో గాలించారు. సమాచారం అందుకున్న దిగపొహండి అగ్నిమాపక కేంద్రం సిబ్బంది గ్రామానికి చేరుకుని నీటిలో గాలించినా ఫలితం కనిపించలేదు. చివరకు అక్కడికి సుమారు కి.మీ. దూరంలోని గొలండ గ్రామం సమీపాన నది ఒడ్డు సమీపానికి కొట్టుకు వచ్చిన ఇద్దర్నీ బయటకు తీసి దిగపొహండి ఆరోగ్య కేంద్రంలో చేర్పించగా, అప్పటికే ఇద్దరూ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దిగపొహండి ఠాణా పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాల్ని పరీక్షకు తరలించి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

చెరువులో స్నానం చేస్తూ..

గంజాం జిల్లా భంజనగర్ ఠాణా పరిధిలోని బవుంశలొండి గ్రామం మెయిన్ రోడ్డులోని చెరువులో ఉదయం స్నానానికి దిగిన అదే గ్రామానికి చెందిన రుద్ర ప్రసాద్ దాస్ (12) అనే బాలుడు ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిపోయాడు. స్థానికులు బాలుడ్ని కాపాడి భంజనగర్‌లోని ఆసుపత్రిలో చేర్పించగా, అప్పటికే దాస్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పరీక్షకు తరలించి దర్యాప్తు చేపట్టారు.

(c) eenadu

భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో పోటీలు

పోటీలో బృందగానం ఆలపిస్తున్న విద్యార్థినులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: 'భారత వికాస్ పరిషత్' ఒడిశా తూర్పు ఆధ్వర్యంలో ఆదివారం ప్రాంతీయ స్థాయి దేశభక్తి బృంద గానం పోటీలు-2025 జరిగాయి. స్థానిక నీలకంఠనగర్ సరస్వతీ శిశు విద్యా మందిర్ ఆవరణలో రోజంతా నిర్వహించిన ఇందులో తూర్పు ప్రాంత పరిధిలోని పన్నెండు శాఖలు ఎంపిక చేసిన వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని ఒడియా, హిందీ, సంస్కృతంలో బృంద గానాలు ఆలపించారు. సాయంత్రం విజేత బృందాలకు బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ఆయా కార్యక్రమాల్లో సౌమేంద్ర దాస్, సిమాంచల దాస్, పూర్ణచంద్ర ఖుంటియా, నారాయణ పండా తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవల్లో 'మహన్'!

వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు, నిర్వాహకులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: సామాజిక, సేవ, క్రీడ, సాంస్కృతిక, ఆరోగ్య తదితర రంగాల్లో బ్రహ్మపుర నుంచి దిల్లీ వరకూ నాలుగు దశాబ్దాలుగా నిస్వార్థంగా అందిస్తున్న సేవలతో 'మహన్ సంఘ్' అన్న పేరుకు సార్థకత ఏర్పడిందని అతిథులన్నారు. 'మహన్ సంఘ్' 40వ వార్షికోత్సవాలు ఆదివారం రాత్రి స్థానిక గంజాం కళా పరిషత్ ఆవరణలో ఘనంగా జరిగాయి. నిర్వాహక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుశాంత సాబత్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బ్రహ్మపుర పురపాలక సంఘం (బీఈఎంసీ) మేయరు సంఘమిత్ర దొళాయి, బ్రహ్మపుర మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రమేష్‌చంద్ర చ్యవుప ట్నాయక్, ఎమ్కేసీజీ ఆసుపత్రి సూపరింటెండెంటు ఆచార్య దుర్గా మాధవ శత్పథి, హరికృష్ణ పండా తదితరులు పాల్గొన్నారు.

బృంద నృత్యంతో అలరింత

హిందీ అందరూ నేర్చుకోవాలి

● గవర్నరు హరిబాబు

పద్మభూషణ్ లక్ష్మీప్రసాద్‌ను సత్కరిస్తున్న హరిబాబు. పక్కన రాజ్యసభ ఎంపీలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: హిందీ భాష మధురమని, దేశ సమగ్రత, ఐక్యతకు అద్దం పడుతున్న ఈ భాషను అందరూ నేర్చుకోవాలని గవర్నరు కంభంపాటి హరిబాబు కోరారు. ఆదివారం రాత్రి భువనేశ్వర్‌లోని రాజ్‌భవన్ అభిషేక్ హాల్లో హిందీ పరిషత్ ఆధ్వర్యంలో హిందీభాషా ఉత్సవాలు జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గవర్నరు మాట్లాడుతూ హిందీలో అనేక ఉత్తమ గ్రంథాలు ఉన్నాయని, ఇవి మానసిక వికాసానికి, మేధోసంపత్తికి అద్దం పడతాయన్నారు. కార్యక్రమంలో పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డుల గ్రహీత డాక్టర్ వై.లక్ష్మీప్రసాద్‌ను సత్కరించారు. రాజ్యసభ ఎంపీలు మమతా మొహంత, డాక్టర్ వై.లక్ష్మీప్రసాద్, డాక్టర్ బిపిన్‌కుమార్, హిందీ పరిషత్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు విక్రమాదిత్యసింగ్, ఉపాధ్యక్షుడు దేవీప్రసాద్ మిశ్ర పాల్గొన్నారు.

వైభవంగా కార్తికమాస పూజలు

కార్తికమాసం శుక్లపక్ష ద్వాదశి పర్వదినం సందర్భంగా ఆలయాల్లో భక్తులు పూజలు జరిపారు. శైవపీఠాల్లో సోమవారం రద్దీ కనిపించింది. పెద్దసంఖ్యలో భక్తులు వేకువ జామునే మందిరాల వద్దకు చేరుకొని శివలింగాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుపుకొన్నారు. మందిర ప్రాంతాలు శివనామస్మరణతో మోతమోగుతున్నాయి.

– న్యూస్‌టుడే బృందం

పర్లాఖెముండి పట్టణంలో ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు

ఖరగ్‌పూర్‌లో పూజలందుకుంటున్న కృష్ణుడు

గోపాలపూర్: బ్రహ్మగిరిలో మహాలక్ష్మి తల్లి

బ్రహ్మపుర నగరం: మందిరం ఆవరణలో అన్న ప్రసాదాల్లో పాల్గొన్న భక్తులు

రాయగడ, గుణుపురం: గద్దియాకోలా గ్రామంలో లక్ష దీపకాంతులు

సిమిలిగుడ: కీర్తనలు ఆలపిస్తున్న దృశ్యం

అంతర కళాశాల వాలీబాల్ పోటీల విజేత ఫుల్బాణీ

విన్నర్ ట్రోఫీతో ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల జట్టు క్రీడాకారులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: బ్రహ్మపుర విశ్వవిద్యాలయం క్రీడామైదానంలో రెండురోజులు జరిగిన అంతర కళాశాల వాలీబాల్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఇందులో తుదిపోరులో ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల (ఫుల్బాణీ) క్రీడాకారులు 3-2 సెట్లతో ఎమ్కేసీజీ కళాశాల (బ్రహ్మపుర) జట్టు క్రీడాకారులపై గెలుపొందారు. పోటీల అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమంలో అతిథులుగా హాజరైన జిల్లా విశ్రాంత క్రీడాధికారి అక్షయకుమార్ పట్నాయక్, బ్రహ్మపుర క్రీడామైదానం ఇన్‌ఛార్జి ప్రశాంతకుమార్ పాణిగ్రహి, విశ్వవిద్యాలయం క్రీడల మండలి కార్యదర్శి ఆచార్య ధ్రువచరణ్ పండా విన్నర్, రన్నర్ జట్లకు ట్రోఫీలు ప్రదానం చేశారు.

ర్యాంకింగ్ టీటీ పోటీల్లో సార్థక్ ఆర్యకు టైటిల్

విన్నర్ ట్రోఫీతో సార్థక్ ఆర్య

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన యూటీటీ జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ (టీటీ) పోటీల్లో రాష్ట్ర క్రీడాకారుడు సార్థక్ ఆర్య టైటిల్ గెలుచుకున్నాడు. పోటీల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన అండర్-17 యూత్ బాలుర విభాగంలోని సింగిల్స్ తుదిపోరులో సార్థక్ పోటాపోటీగా ఆడి రిత్విక్ గుప్త (జమ్ముకశ్మీర్)పై గెలుపొంది ఛాంపియన్‌గా నిలిచాడు.

పంటలు పాడు చేస్తున్నాయని నాటు తుపాకితో కాల్పులు

● మగ ఏనుగు మృతి ● ఒకరి అరెస్టు

అరెస్టయిన నిందితుడు (ముసుగులో), స్వాధీనం చేసుకున్న నాటు తుపాకులు, ఇతర సామగ్రి. చిత్రంలో అటవీ సిబ్బంది

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ఏనుగులు కళ్లెదుటే పంటలు నాశనం చేస్తున్నాయన్న ఆక్రోశంతో నాటు తుపాకితో వాటిపై జరిపిన కాల్పుల్లో ఒక మగ ఏనుగు మృతిచెందింది. గంజాం జిల్లా ఉత్తర ఘుముసుర అటవీ డివిజన్ ఆధీనంలోని ముజాగడ అటవీ రేంజ్ పరిధిలో ఈ ఘటన జరిగింది. దీనిపై కేసు నమోదు చేసిన అటవీ అధికారులు బాణియాపల్లి గ్రామానికి చెందిన ఉమాకాంత్ ప్రధాన్ అలియాస్ నండా (50)ను అరెస్టు చేసి సోమవారం న్యాయస్థానానికి తరలించారు. నిందితుడి నుంచి మూడు నాటు తుపాకులు, విష పదార్థం పూసి ఉన్న తూటాలు, విస్ఫోటక సామగ్రి స్వాధీనం చేసుకున్నామని ఉత్తర ఘుముసుర అటవీ డివిజన్ అధికారి (డీఎఫ్ఓ) హిమాంశు శేఖర్ మహంతి తెలిపారు. సాయంత్రం ముజాగడ రేంజ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలిపారు.

పంటపొలాల్లో చొరబడ్డ గజరాజుల గుంపు

నిందితుడు నండా తన పంటలను గురువారం రాత్రి కాపలా కాశాడు. తన వెంట బాణసంచా సామగ్రి, తూటాలు నింపిన నాటు తుపాకులు తీసుకెళ్లాడు. 24 ఏనుగుల గుంపు పంటపొలాల్లోకి వచ్చింది. వాటిలో రెండు ఏనుగులు నండా పొలంలో పంట నష్టపరుస్తుండటం గమనించాడు. దీంతో రెండుసార్లు బాణసంచా కాల్చాడు. ఏనుగులు భయపడకపోవడంతో నాటు తుపాకితో కాల్పులు జరిపాడు. అనంతరం నాటు తుపాకులు, ఇతర సామగ్రిని సమీపంలోని ఓ పొదల్లో రహస్యంగా దాచి ఇంటికి తిరిగి వచ్చాడు. శనివారం బాణియాపల్లి రిజర్వు అడవుల్లో 15 ఏళ్ల వయసు గల మగ ఏనుగు కళేబరాన్ని అటవీ సిబ్బంది గుర్తించారు. అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పశు వైద్యునితో దాని కళేబరానికి జరిపించిన పరీక్షల్లో ఏనుగు ముందు కుడి కాలి పక్కన తూటా గాయం వల్ల అది మృతిచెందినట్లు నిర్ధారించారు. నండా కాల్పులు జరిపిన అనంతరం గాయపడిన ఏనుగు అక్కడికి 400 మీటర్ల దూరంలోని రిజర్వు అడవుల్లోకి వెళ్లిన కుప్పకూలి మృతిచెందిందని డీఎఫ్ఓ మహంతి తెలిపారు. వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టి, ఆదివారం బాణియాపల్లి గ్రామంలో దాడి చేసి నిందితుడు నండాను పట్టుకున్నామని, పొలానికి సమీపంలో రహస్యంగా దాచిన నాటు తుపాకులు, ఇతరత్రా సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు మహంతి వివరించారు.

బొరిగుమ్మలో వినతుల స్వీకరణ

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా బొరిగుమ్మ సమితిలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. ఫిర్యాదుదారుల నుంచి అధికారులు 38 వినతులను స్వీకరించారు. కలెక్టర్ మనోజ్ సత్యవాన్, సబ్ కలెక్టర్ సస్యరెడ్డి, ఎస్పీ రోహిత్‌వర్మ పాల్గొని ఫిర్యాదులను నమోదు చేశారు.

ఫిర్యాదుదారుల వద్ద వినతులు స్వీకరిస్తున్న అధికారులు

9న ఆంధ్ర రాష్ట్ర దినోత్సవం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: నవంబర్ 1వ తేదీన నిర్వహించాల్సిన ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం 9వ తేదీన పట్టణంలో నిర్వహిస్తున్నారు. పశ్చిమబెంగాల్ తెలుగు జాతి ఐక్య వేదిక, ఆంధ్రా యువజన సంఘం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి సన్నాహాలు జరుపుతున్నారు.

నాల్కో ఫౌండేషన్, అలింకోల మధ్య ఒప్పందం

ఒప్పంద పత్రాలతో రెండు సంస్థల అధికారులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: 500 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, పునరావాసం కల్పించేందుకు నాల్కో కృషి చేస్తుంది. ఇందులో భాగంగా నాల్కో ఫౌండేషన్ ద్వారా కృత్రిమ అవయవాల తయారీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(అలింకో) సంస్థతో సోమవారం ఒప్పందం కుదుర్చుకున్నారు. అలింకో ద్వారా దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాలను అందించే ఏర్పాట్లపై ఒప్పందం కుదుర్చుకున్నారు. దమన్‌జోడిలో నాల్కో కర్మాగారంలో జరిగిన కార్యక్రమంలో నాల్కో సీఎండీ బీపీ సింగ్, డైరెక్టర్ పి.కె.శర్మ, హెచ్ఆర్ డైరెక్టర్ టి.కె.పట్నాయక్‌తో పాటు అలింకో అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే పవిత్ర

సిమిలిగుడ, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు ఇతర రంగాల్లోనూ రాణించాలని లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత అన్నారు. లక్ష్మీపూర్ హైస్కూల్లో సోమవారం సమితి స్థాయి శిశు మహోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ గెలిచిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవుతారన్నారు. సమితి విద్యాధికారిణి రీటా మహంతి అధ్యక్షతన జిల్లా విద్యాధికారి కరుణాకర్ భోయ్, అదనపు సమితి విద్యాధికారి విభూతి భూషణ్ తరేని తదితరులు పాల్గొన్నారు.

సకల కళా వేదిక సురభి

బహుమతి అందజేస్తున్న అతిథులు

రాయగడ, గుణుపురం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగివున్న కళలు, ప్రతిభను వెలికితీసి, వారిని ప్రోత్సహించేందుకు సురభి వేదిక దోహదపడుతుందని ప్రముఖ వైద్యుడు కృష్ణానంద బెహెరా అన్నారు. ఆదివారం రామన్నగూడలో జరిగిన సురభి శిశు మహోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించిన విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నిర్దేశించిన స్థలాల్లోనే విక్రయించాలి

రాయగడ పట్టణం: జిల్లా కేంద్రంలో కూరగాయలు, పండ్లు వ్యాపారులకు గతంలో నిర్దేశించిన స్థలాల్లోనే విక్రయాలు కొనసాగించాలని పురపాలక సంస్థ తేల్చి చెప్పింది. ఈ మేరకు పురపాలక సిబ్బంది సోమవారం పైవంతెన దిగువన, ఫుట్‌పాత్‌పై విక్రయిస్తున్న చిరు వ్యాపారులకు దిశానిర్దేశం చేశారు. కేటాయించిన ఆర్కే నగర్, కస్తూరీనగర్‌లో బీజు పట్నాయక్ మార్కెట్ కాంప్లెక్స్, తుంబిగూడ సమీపాన ఉన్న ఆర్‌ఎంసీ వద్ద విక్రయాలు కొనసాగించాలన్నారు.

గ్రామాలకు తీరని సమస్య

తాజాగా కురిసిన వర్షాల కారణంగా గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా మారాయి. కొరాపుట్ సమితి జగిగూడ గ్రామానికి వెళ్లే రోడ్ ఇప్పటికీ బురదమయంగానే ఉందని ఈ మార్గంలో ఆటోలు, అంబులెన్స్‌లు వెళ్లడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహన చోదకులు ఈ రోడ్డులో జారి పడిపోతున్నారని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా తమ సమస్యను పట్టించుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కొరాపుట్

వైద్యానికి రూ.95 వేలు అందజేత

రాయగడ, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా పరిషత్ సమావేశ భవనంలో సోమవారం జరిగిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో కలెక్టర్ అశుతోష్ కులకర్ణి పలు సమస్యలను పరిష్కరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న 10 మందికి జిల్లా రెడ్‌క్రాస్ నిధుల నుంచి రూ.95 వేలు ఆర్థిక సహాయం అందించారు. 47 వినతులు రాగా 9 వ్యక్తిగత సమస్యలు ఉన్నాయి. కార్యక్రమంలో ఎస్పీ స్వాతి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమస్య వింటున్న కలెక్టర్ అశుతోష్ కులకర్ణి

ఉత్సాహంగా భగవద్గీత పోటీలు

పాఠశాల ముందు గెలిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం శారదవిహార్‌లో ఉన్న సరస్వతి శిశుమందిర్‌లో సోమవారం సమితిస్థాయిలో భగవద్గీత పోటీలు జరిగాయి. ప్రజ్ఞాన్‌మిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో వివిధ విభాగాల్లో 11 మంది విజేతలుగా నిలిచారు. కమిటీ అధ్యక్షుడు అలోక్ పాణిగ్రహి అధ్యక్షతన విజేతలకు ప్రశంసాపత్రాలు, అవార్డులు అందజేశారు.

భువన్ మోహన్ శత జయంత్యుత్సవాలు

రాయగడ, గుణుపురం, న్యూస్‌టుడే: గుణుపురం ప్రాంతానికి చెందిన ఉద్యమనేత, న్యాయవాది భువన్ మోహన్ పట్నాయక్ శతజయంతి వేడుకలు గుణుపురం వేంకటేశ్వర స్వామి ఆలయ కల్యాణ మండపంలో ఆదివానం ఘనంగా జరిగాయి. అక్షయ్ దాస్, ప్రదీప్‌దాస్, రంజిత్ పాఢి తదితరులు పాల్గొన్నారు. భువన్ మోహన్ పట్నాయక్ కుమారుడు బ్రహ్మానంద పట్నాయక్, కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

భువన్ మోహన్ పట్నాయక్ శత జయంతి వేడుకల్లో పాల్గొన్న కుటుంబ సభ్యులు, అతిథులు

సరస్వతి శిశుమందిర్‌లో విజ్ఞానమేళా

మేళాలో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న విద్యార్థులు

జయపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని పాయిక్‌సాహిలో సరస్వతి శిశుమందిర్‌లో సోమవారం విజ్ఞాన ప్రాజెక్టుల ప్రదర్శన జరిగింది. పాఠశాల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు అనూప్‌కుమార్ సామంత్రాయ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బీఈఓ చందన్‌కుమార్ నాయక్ హాజరై ప్రాజెక్టులను పరిశీలించి, విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు.

నువాపడలో కొరాపుట్ ఎమ్మెల్యే ప్రచారం

గ్రామస్థులతో ఎమ్మెల్యే రఘురాం

జయపురం, న్యూస్‌టుడే: కలహండి జిల్లా నువాపడలో జరగనున్న ఉప ఎన్నిక కోసం వివిధ పార్టీలు జోరుగా ప్రచారాలు చేస్తున్నాయి. కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చొ సోమవారం కోమ్నాలో భాజపా అభ్యర్థి జయ డోల్కియాకు ఓటు వేయాలని ప్రచారం చేశారు.

ఎట్టకేలకు స్పందించిన యంత్రాంగం

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో పురపాలక పరిధిలో గల రతిశర్మ కాలనీకి దగ్గరలో చెత్తను డంప్ చేయడంతో దుర్గంధ భరించలేకపోతున్నామని ఆ కాలనీవారు పలుమార్లు అధికారులను మొరపెట్టుకోవడంతో ఎట్టకేలకు స్పందించారు. ఆ చెత్తను రీసైక్లింగ్ చేపడుతున్నట్లు పురపాలక అధ్యక్షుడు లలాట రంజన్‌సెరి తెలిపారు.

EENADU Classifieds
JOBS
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యూయర్స్. ఏజ్: 22-35. ఫ్రెషర్స్ కూడా కావలెను. ✆ 6281037879.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

రహదారి పక్కన పసికందు మృతదేహం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా కోటినాడ ఠాణా పరిధిలోని అస్కా-బలిపదర్ మార్గంలో భెటనెయి గ్రామం సమీపాన రహదారి పక్కన ఆదివారం సాయంత్రం వస్త్రాల్లో చుట్టి ఉన్న రోజుల ఆడ పసికందును స్థానికులు గుర్తించారు. సర్పంచి ప్రతినిధి టులు జెనా, వార్డు సభ్యుడు పితబాస నాహక్‌లు హుటాహుటిన పసికందును అస్కాలోని సబ్ డివిజన్‌లో ఆసుపత్రిలో చేర్పించగా, అప్పటికే పసికందు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఒక ట్రెండు రోజుల పసికందు ఇదని వైద్యులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న కోటినాడ ఠాణా పోలీసులు ఆసుపత్రికి చేరుకుని, మృతదేహన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

బిశ్వరంజన్ జెనా

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతున్న విద్యార్థిని వెనక నుంచి ట్రాక్టర్ ఢీకొనడంతో ఘటనా స్థలంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. బాలేశ్వర్‌లో సోమవారం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బోధి గ్రామానికి చెందిన బిశ్వరంజన్ జెనా(16) బొడొపొఖరి ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. బొడొపొఖరి బజారులో ఉన్న ఓ బ్యాంకులో నగదు తీసుకునేందుకు భరత్‌కుమార్‌దాస్ అనే స్నేహితుడితో ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మార్గమధ్యలో వీరు ప్రయాణిస్తున్న బైకును ఓ ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జెనా ఘటనా స్థలంలోనే మృతిచెందగా, తీవ్ర గాయాలపాలైన దాస్‌ను సొరొ ఆసుపత్రిలో చేర్పించి, మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు.

యువకుడిని బలిగొన్న రోడ్డు ప్రమాదం



రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా కల్యాణసింగుపూర్ సమితిలో ఇసుక ట్రాక్టర్ ఢీకొని రాజనల మెలక (25) మృతి చెందాడు. సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి కె.సింగుపూర్ ఎస్సై దిలీప్ మాఝి తెలిపిన వివరాల ప్రకారం.. సమితి జగన్నాథపూర్ గ్రామానికి చెందిన రాజనల పూజారిగూడ కూడలి సమీపంలో ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ బైక్‌ను ఢీకొంది. మెలకకు తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాక్టర్ చోదకుడిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నవరంగపూర్‌లో మరో బాలుడు..

నవరంగపూర్, న్యూస్‌టుడే: అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తాపడటంతో బాలుడు మృతిచెందిన ఘటన నవరంగపూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ ఠాణా పరిధిలో దుర్గాగూడ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొందరు బాలురు కలిసి సరదాగా ట్రాక్టర్‌లో కూర్చొని బెహెడా పంచాయతీ లిమాగూడ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా, లిమిగూడ వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. వాహనం కింద డంబరు పూజారి(17) ఇరుక్కుపోయాడు. స్థానికులు బాలుడిని ఆసుపత్రిలో తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు.

బావిలో పడి మహిళ మృతి

జయపురం, న్యూస్‌టుడే: స్నానం చేసేందుకు వెళ్లి కాలు జారి పడి మహిళ మృతిచెందిన ఘటన జయపురం సమితి అంత పంచాయతీ రాణిపుట్ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బిరమ ముదులి(33) సోమవారం గ్రామ శివారులో ఉన్న బావి దగ్గర స్నానం చేస్తుండగా బావిలో పడిపోయింది. ఆమె కేకలు విన్న స్థానికులు ఘటనాస్థలానికి చేరుకొని అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వగా, సిబ్బంది ఆమెను బయటకు తీసి ఆసుపత్రిలో చేర్చారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు.

యువకుడి మృతదేహం లభ్యం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా పట్టపూర్ ఠాణా పరిధిలోని పట్టపూర్-డెంగాబన్తా మధ్యలో రుషికుల్యా సాగునీటి కాలువ ఒడ్డున సోమవారం ఉదయం ఓ గుర్తు తెలియని యువకుడి మృతదేహం కనిపించింది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి వివరాలకు పరిసరాల్లో ఆరా తీసినా వివరాలు తెలియలేదు. దీంతో మృతదేహన్ని పరీక్షా కేంద్రానికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

కారును ఢీకొన్న లారీ.. ముగ్గురికి గాయాలు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సిమిలిగుడ సమీపంలో ఆదివారం రాత్రి కారును లారీ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఠాణా అధికారిని అనితా కుజుర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌కు చెందిన సత్యేంద్ర సింగ్, గౌతమ్‌రావు, ఉత్తమ జెనాలు కారులో విశాఖపట్నం నుంచి ఆదివారం రాత్రి స్వగ్రామానికి వస్తుండగా సిమిలిగుడ సమీపంలో వీరి కారును లారీ ఢీకొట్టింది. కారులో ఉన్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు వారిని సునాబెడ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ముగ్గురిని కొరాపుట్‌లో లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాలకు తరలించారు. ప్రమాదంలో కారు నుజ్జయింది.

యువకుడిపై నాటుబాంబుతో దాడి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర బి.ఎన్.పూర్ ఠాణా పరిధిలోని అంకులి పారిశ్రామికవాడ కూడలిలోని రామ మందిరం వద్ద ఆదివారం రాత్రి నిల్చొన్న ఉన్న శిబ బహాదూర్ అనే యువకుడిపై ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని యువకులు నాటు బాంబుతో దాడి చేసి పరారయ్యారు. దాడిలో బహాదూర్ ఎడమ కాలికి గాయాలవగా, స్థానికులు ఎమ్కేసీజీ ఆసుపత్రిలో చేర్పించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సమీపంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

చోరీకి యత్నించిన ఏడుగురి అరెస్టు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా ఘటాల్ పరిధిలో గల దాస్‌పూర్ ప్రాంత చౌపట్ మైదానంలో ఏడుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా శనివారం రాత్రి తిరగడంతో వారిని పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి ఒక కారు, రెండు ట్రక్కులు, ఒక నాటు తుపాకీ, రెండు తూటాలు స్వాధీనం చేసుకున్నారు. వారు మంచినీటి పథకానికి సంబంధించి ఉంచిన భారీ ఇనుము పైపులను చోరీ చేయడానికి వచ్చి పోలీసులకు చిక్కినట్లు తెలిపారు.

చిరుత చర్మం స్వాధీనం

● ముగ్గురి అరెస్టు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని జయదేవ్ విహార్‌లో క్రైంబ్రాంచ్ స్పెషల్ స్క్వాడ్ అధికారులు ఒక చిరుత చర్మాన్ని స్వాధీనం చేసుకుని, దాని విక్రయానికి ప్రయత్నించిన ముగ్గురు నిందితుల్ని సోమవారం అరెస్టు చేశారు. కర్ణాటక నుంచి ఈ చర్మాన్ని భువనేశ్వర్‌కు తెచ్చిన నిందితులు రూ.30 లక్షలకు విక్రయించడానికి డీల్ కుదుర్చుకున్నట్లు ప్రాథమికంగా తెలిసింది. జయదేవ్ విహార్‌లో ఈ ముఠా ఉన్నట్లు తెలిసిన స్క్వాడ్ అధికారులు కొనుగోలుదారులుగా నటించి వారున్నచోటుకు వెళ్లి కస్టడీలోకి తీసుకున్నారు. ఈ చర్మం కొనుగోలు చేయడానికి డీల్ కుదుర్చుకున్న వ్యక్తి కోసం ఆరా తీస్తున్నారు. చర్మం ఎక్కడి నుంచి తెచ్చారన్నదానిపై ఆరా తీస్తున్నారు.

ఐదో తరగతి విద్యార్థినితో అసభ్య ప్రవర్తన: ఉపాధ్యాయుడి అరెస్టు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా రంభ ఠాణా పరిధిలోని హుమ్మా పోలీసు ఔట్‌పోస్టు పరిధిలోని ఓ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఒంటరిగా ఉన్న ఐదో తరగతి విద్యార్థినికి అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు చాక్లెట్ ఇచ్చి తర్వాత అసభ్యకరంగా ప్రవర్తించాడన్న ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై బాధిత బాలిక ఇంటికి వెళ్లిన తర్వాత జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేయగా, వారు దీనిపై హుమ్మా ఔట్‌పోస్టులో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు జరిపి ఉపాధ్యాయుడ్ని అరెస్టు చేసి ఆదివారం న్యాయస్థానానికి తరలించామని పోలీసు అధికారి సత్యజిత్ బెణియా విలేకరులకు చెప్పారు.

తాళం వేసి ఉన్న ఇళ్లల్లో చోరీలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీకి పాల్పడుతున్న ఝార్ఖండ్‌కు చెందిన ఇద్దరు నిందితులను రవుర్కెలా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జోన్-1 డీఎస్పీ జోగేశ్వర్ పండా మీడియాకు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఝార్ఖండ్‌లోని సింగ్‌భూమ్ జిల్లాకు చెందిన శంభుకుమార్‌సింగ్(45), అంకిత్ రాజ్‌కుమార్(21) ఉక్కు నగరంలో తాళం వేసిన ఇళ్లల్లో చొరబడి దొంగతనానికి పాల్పడుతున్నారు. ఇటీవల ఓ ఇంట్లో చొరబడిన నిందితులు చోరీకి పాల్పడగా, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా ఈ విషయాలు వెలుగుచూశాయి. నిందితుల నుంచి ఏడు బంగారు గొలుసులు, 15 ఉంగరాలు, ఓ నెక్లెస్, వెండి నగలు, రూ.29 వేల నగదు, కారు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు

అక్రమంగా ఇసుక రవాణా

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా కుంద్రా సమితి లిమ గ్రామంలో కురలు నదిలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం గనుల శాఖ స్వాధీనం చేసుకుంది. నదిలో ఇసుకను లోడింగ్ చేస్తుండగా గ్రామస్థులు శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. శాఖాధికారి సౌమ్యరంజన్ సాహు సిబ్బందితో వెళ్లి ట్రాక్టర్‌ను సీజ్ చేశారు.

పోగొట్టుకున్న చరవాణుల అందజేత

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ఝార్సుగుడ జిల్లాలోని వివిధ ఠాణాల పరిధుల్లో పోగొట్టుకున్న, చోరీకి గురైన సుమారు రూ.20 లక్షల విలువైన 101 చరవాణుల్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సాయంత్రం ఝార్సుగుడలోని జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో బాధితులకు వాటిని అందజేసేందుకు చరవాణుల రిటర్న్ మేళా నిర్వహించారు. ఝార్సుగుడ ఎస్పీ రెడ్డి రాఘవేంద్ర గుండాల వాటిని బాధితులకు అందజేశారు.

బాధితుడికి చరవాణి అందజేస్తున్న ఎస్పీ

(c) eenadu

వీళ్లు.. విమానంలో దిల్లీ వెళ్తున్నారు.. రూపాయి ఖర్చులేకుండా

క్వాంటం టెక్నాలజీ గురించి వివరిస్తున్న రోహిత్

ఈ విద్యార్థి పేరు ఎ.రోహిత్. పార్వతీపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి సైన్సు సదస్సులో ప్రథమ స్థానం సాధించాడు. రాష్ట్రస్థాయి పోటీలకు హాజరయ్యాడు. గతంలో జరిగిన ఇన్‌స్పైర్ పోటీలు, సైన్సు ప్రదర్శనలో జిల్లా స్థాయిలో సత్తా చాటాడు. విద్యార్థికి తండ్రి లేరు. తల్లి కేజీబీవీలో వృత్తివిద్య బోధకురాలు.

విద్యార్థిని నిహారిక భామిని మోడల్ పాఠశాలలో పదోతరగతి చదువుతోంది. తండ్రి భగవాన్ స్వీట్ దుకాణంలో పనిచేస్తున్నారు. తల్లి అరుణజ్యోతి గృహిణి. చిన్నతనం నుంచి చదువులో ముందున్న విద్యార్థినిగా గుర్తింపు తెచ్చుకుంది. స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో జాతీయ స్థాయిలో టాప్ 1000లో 180వ స్థానం దక్కించుకుంది. గతేడాది విశాఖలో జరిగిన సైన్స్ టూర్‌కు ఎంపికైంది.

సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన వీరి ధ్రువ విజ్ఞాన ప్రతిభతో అవకాశాలను ఒడిసి పట్టుకుంటున్నారు. త్వరలో దిల్లీలో ఇస్రో నిర్వహిస్తున్న స్పేస్ వర్క్‌షాప్‌నకు ఎంపికయ్యారు. ఇద్దరూ ప్రభుత్వ బడుల్లో చదువుతున్నారు. రూపాయి ఖర్చు లేకుండా విమానంలో దిల్లీ వెళ్తున్నారు. ఎలా అంటే.. ఇస్రో ఈనెల 6 నుంచి మూడు రోజుల పాటు స్పేస్ వర్క్‌షాప్ దిల్లీలో నిర్వహిస్తోంది. దానికి రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు హాజరయ్యేలా సమగ్ర శిక్షా, సైన్సు సిటీ సంయుక్తంగా కృషి చేస్తున్నాయి. ఈ అవకాశాన్ని వీరిద్దరూ దక్కించుకున్నారు. ఇదో గొప్ప అవకాశం అని డీఈవో రాజ్‌కుమార్ అన్నారు. దిల్లీలో వీరు రష్యన్ సెంటర్ ఫర్ సైన్సు అండ్ కల్చర్, నేషనల్ మ్యూజియం, నెహ్రూ ప్లానిటోరియం సందర్శిస్తారని జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు తెలిపారు.

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, భామిని

ఏళ్లుగా ఇంతే.. వందల ఊర్లకు చింతే

గత వైకాపా ప్రభుత్వంలో రహదారుల అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు. ఫలితంగా జిల్లాలో చాలా రోడ్లు నరకంలో నిలిచాయి. గుత్తేదారులకు బిల్లులు చెల్లించక ఎక్కడివేసిన గొంగళి అక్కడే అన్న చందంగా చాలా పనులు ఆగాయి. మరికొన్ని దారుల అభివృద్ధికి అసలు చర్యలే లేవు. దీంతో వేల మంది ప్రజలు నిత్యం నరకం చూస్తున్నారు. అంతేకాదు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం అయినా కదలిక తేవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం

అడుగడుగునా జాప్యమే..!

★ సాలూరు-మక్కువ రహదారి 19.6 కి.మీ మేర ఉంది. దీని బాగుకు గత ప్రభుత్వంలో న్యూడెవలప్‌మెంట్ బ్యాంకు(ఎన్‌డీబీ) నిధులు రూ.56 కోట్లు కేటాయించారు. పనులు కాక.. సొమ్ము వెనక్కి వెళ్లిపోవడంతో 6.9 కి.మీ మేర బాగు చేయడానికి వీలుగా రూ.11 కోట్లకు బడ్జెట్ కుదించారు. ఆపై మిన్నకుండిపోయారు. దీంతో దాదాపు 25 గ్రామాల పరిధిలోని 10 వేల మంది రోజూ ఇబ్బంది పడుతున్నారు. సాలూరు-మక్కువ రోడ్డుకు అదనపు ప్రణాళికలో రూ.3 కోట్లు మంజూరయ్యాయని, దీంతో 5 కి.మీ పనులు చేయొచ్చని ర.భ ఇంజినీరింగు అధికారి రాధాకృష్ణ 'న్యూస్‌టుడే'తో అన్నారు. మిగిలిన పనుల పూర్తికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గోతులతో నిండిన అర్తాం రోడ్డు

ఈ దారిలో నిత్య పోరాటం

చిలకపాలెం-కూనేరు మధ్య రాష్ట్ర ప్రధాన రహదారి 130 కి.మీ ఉంది. రాయపూర్, ఒడిశాకు ఇదే మార్గం. మన్యం జిల్లాలో పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల్లో ఇదే ప్రధాన రోడ్డు. జిల్లా కేంద్రం మీదుగా వెళ్తుంది. పార్వతీపురం నుంచి కూనేరు వరకు ఉన్న 25 కి.మీ పరిస్థితి గోతులతో అధ్వానంగా ఉంది. ఏ సాకెంగా చూసినా.. సుమారు 35 గ్రామాలకు చెందిన దాదాపు 25 వేల మందికిపైగా నిత్యం రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వ పాలనలో ఒడిశా లారీ యజమానులు ఈ రహదారిపై గుంతలు కప్పిన సందర్భాలు ఉన్నాయి. రోడ్డు పూర్తిస్థాయి అభివృద్ధికి ప్రజా ప్రభుత్వ భాగస్వామ్యంలో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించారు. అప్పటివరకు గోతులు పూడ్చడానికి రూ.4 కోట్లు ర.భ.శాఖ మంజూరు చేసిందని, పనులు ప్రారంభిస్తామని ఇంజినీరింగు అధికారులు చెబుతున్నారు.

★ పార్వతీపురం-కొరాపుట్ రహదారి 13 కి.మీ మేర పార్వతీపురం మండలంలో ఉంది. గత ప్రభుత్వంలో దీనికి తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి నిధుల నుంచి రూ.12 కోట్లు కేటాయించారు. గుత్తేదారులు ముందుకు వచ్చి, పనులు చేయగా చెల్లింపులు లేకపోవడంతో ఆపేశారు. అప్పటినుంచి 110 గ్రామాల పరిధిలోని సుమారు 50 వేల మంది తిప్పలు పడుతున్నారు. ★ వెంకంపేట-పార్వతీపురం రహదారి పనులు కూడా మధ్యలో ఆగాయి. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే పనులు ప్రారంభిస్తామని ర.భ.శాఖ అధికారులు చెబుతున్నారు.

★ మారని రహదారుల తీరు
★ ఎక్కడికక్కడ నిలిచిపోయిన పనులు

మధ్యలో ఆగిన పార్వతీపురం-కొరాపుట్ మార్గం పనులు

టైర్ పగిలి.. మినీ లారీ బోల్తా

● ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు
● అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా ఘటన

నాదెండ్ల (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గం పరిధిలో నాదెండ్ల - తిమ్మాపురం మార్గంలో సోమవారం తెల్లవారుజామున ఓ మినీ లారీ టైర్ పగిలి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో అందులో ఉన్న ఒడిశాకు చెందిన కూలి బపున్‌మాలిక్ (25) దుర్మరణం చెందారు. మరో ఇద్దరు కూలీలు ప్రభాత్‌మాలిక్, సర్వేశ్వర్ మాలిక్, డ్రైవరు గాయపడ్డారు. వీరిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఫిరంగిపురం నుంచి సాతులూరు, తూబాడు, నాదెండ్ల, తిమ్మాపురం మీదుగా చిలకలూరిపేటకు మినీ లారీలో 35 బస్తాల రేషన్‌బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. లారీతో పాటు బియ్యం, స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుల్లారావు తెలిపారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం లారీ

ఈ దారికో దండం అడుగుకో గండం..!

పాలకొండ-సీతంపేట ప్రధాన రహదారి అడుగుకో గుంతతో ప్రయాణం గండంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ దారిలో ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా అంతే సంగతి. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నా చర్యలు తీసుకోవడం లేదు. తరచూ మరమ్మతులు చేస్తున్నా ప్రయోజనం లేదు. కల్వర్టుల నిర్మాణం చేయాల్సి ఉన్నప్పటికీ చర్యలు తీసుకోవడం లేదు. 11 కి.మీ. మార్గంలో 15 చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. సీతంపేటలో జరిగిన కార్యక్రమానికి మంత్రి సంధ్యారాణి వస్తున్న కారణంగా శనివారం కొన్ని చోట్ల గుంతల్లో బుగ్గి వేశారు. శాశ్వత చర్యలు తీసుకోవాలని చోదకులు కోరుతున్నారు. పరిశీలించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బీ జేఈ టి.కిరణ్ తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ

ప్రజా భద్రతే ముఖ్యం

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: జన సమూహాలు ఎక్కువగా ఉండే దేవాలయాలు, మతపరమైన సభల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టరు ప్రభాకరరెడ్డి అధికారులను ఆదేశించారు. కార్తిక సోమవారం సందర్భంగా పార్వతీపురం మండలం అడ్డాపుశీలలో ప్రసిద్ధి చెందిన కాశీవిశ్వేశ్వర దేవాలయాన్ని జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. భక్తులతో మాట్లాడి, సమస్యలు తెలుసుకున్నారు. ప్రజా భద్రతే ముఖ్యమని, ఏర్పాట్లు పక్కాగా ఉండాలని దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ ప్రతినిధులకు సూచించారు. ఆపై శివుడికి అభిషేకం చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. డీఆర్వో హేమలత, సబ్‌కలెక్టరు వైశాలి, తహసీల్దారు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో మాట్లాడుతున్న కలెక్టరు ప్రభాకరరెడ్డి

అంతే అందంగా.. ముద్ద మందారంలా..!

ఈ చిత్రంలో కనిపిస్తున్నవి మందార పువ్వులనుకుంటే మీరు పొరబడినట్లే.. ఇచ్ఛాపురం మండలం హరిపురానికి చెందిన వడ్డీన కుమారి ఇంట్లోని గోంగూర మొక్కకు పూసిన పూలు ఇవి. చూడటానికి ఎర్రని రంగులో అందంగా మందారాన్ని పోలి ఉండటంతో అంతా ఆసక్తిగా తిలకిస్తున్నారు. గోంగూర, మందారం (మాల్వేసి ఫ్యామిలీ) ఒకే కుటుంబానికి చెందినవని ఆమదాలవలస వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డా.ఎం.శ్రీనివాస్ (ప్లాంట్ బ్రీడింగ్) తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

పాఠం వినండి.. అప్పుడప్పుడు పైకి చూడండి

శిథిల భవనాల్లో బిక్కుబిక్కుమంటూ చదువులు

– న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం, నరసన్నపేట, జలుమూరు, సారవకోట, పోలాకి

నరసన్నపేట నియోజకవర్గ పరిధిలోని పలు పాఠశాలల్లో దశాబ్దాల కిందట నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవస్థలు తప్పడం లేదు. గత పాలకులు నాడు- నేడులో భాగంగా పాఠశాలల రూపురేఖలు మారుస్తామని గొప్పలు చెప్పారు. రెండు విడతల్లో పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని, సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మట్టవానిపేటలో పెచ్చులూడుతున్న పైకప్పు, గోడ

సారవకోట మండలం బురద కొత్తూరు ప్రాథమిక పాఠశాల పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. పుష్కర కాలం కిందట అదనపు భవనం నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. ఇటీవల పనులు పునఃప్రారంభించారు. రైవాడ, కురిడింగి, రేగులపాడు, గొర్రిబంద ప్రాథమిక పాఠశాలల గోడలు బీటలు వారాయి.

మారని తీరు.. తీరని అవస్థలు

నరసన్నపేట మండలం కొత్తపోలవలస ప్రాథమిక పాఠశాల భవనం గోడలు బీటలు వారడంతో పాటు పైకప్పు పూర్తిగా శిథిలమైంది. వర్షాలు కురుస్తుండటంతో పంచాయతీ భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. మామిడివలసలో గచ్చులు కుంగడంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. బుచ్చిపేటలో రెండు గదులకు ఒకటి పూర్తిగా అధ్వానంగా మారి వినియోగానికి దూరంగా ఉంది. పాక్షికంగా శిథిలమైన రెండో గదిలోనే 45 మందికి పాఠాలు చెబుతుండటంతో గందరగోళం నెలకొంటోంది. మండల కేంద్రంలోని వంశధార కాలనీ పాఠశాలలో మూడు గదులు నిరుపయోగంగా మారడంతో స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో 38 మందికి బోధన జరుగుతోంది.

మామిడివలస ప్రాథమిక పాఠశాలలో కుంగిన గచ్చు

జలుమూరు మండలంలో మట్టవానిపేట, వాసుదేవపురం, గంగన్నపేట ప్రాథమిక పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

పోలాకి మండలంలో కింజరాపువానిపేట, అంబీరుపేట, కొవిరిపేట, గుప్పిడిపేట ప్రాథమిక పాఠశాలల్లో పరిస్థితి ఇలాగే ఉంది.

నియోజకవర్గం వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
నరసన్నపేట	82	4,600
జలుమూరు	81	3,324
సారవకోట	79	3,100
పోలాకి	95	4,192

ఉన్నతాధికారులకు నివేదించాం

తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్న విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపట్టి, అవస్థలు లేకుండా చూస్తాం. - ఉప్పాడ వాసుదేవరావు, బమ్మిడి మాధవరావు, మడ్డు వెంకటరమణ, శ్రీనివాస్ నాయక్, ఎంఈవోలు

కాస్త ఉండు.. దాటుతోంది వానర దండు..!

ఇచ్ఛాపురంలో కోతులు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఎక్కడికక్కడ గుంపులుగా కనిపించి గందరగోళం సృష్టిస్తున్నాయి. మార్కెట్ రోడ్డులో కనిపించిన దృశ్యంలో వానర దండు రహదారిని దాటుతుండటంతో వాటిని గమనించిన వాహనదారులు, పాదచారులు ఎక్కడివారు అక్కడే ఆగిపోయారు. ఇక్కడే కాదు.. పట్టణ వ్యాప్తంగా ఉదయం వేళలో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో నెలకు కనీసం 20 మంది కోతుల దాడి బాధితులు చికిత్స పొందుతున్నారు. రాష్ట్రం నుంచి అనుమతి వచ్చాక చర్యలు తీసుకుంటామని కమిషనర్ నల్లి రమేష్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

బ్రహ్మపుర న్యాయస్థానానికి శంకర్ పృష్టి

శంకర్ పృష్టి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ఒడిశా పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరు (ఎస్సై) నియామక రాత పరీక్షల్లో అక్రమాలకు పథకం రచించిన ప్రధాన సూత్రధారి శంకర్ పృష్టిని క్రైంబ్రాంచి అధికారులు సోమవారం రాత్రి బ్రహ్మపురలోని జేఎంఎఫ్‌సీ (గ్రామీణం) న్యాయస్థానంలో హాజరుపరిచేందుకు గట్టి భద్రత మధ్య తీసుకువచ్చారు. ఆయనతోపాటు అరెస్టు చేసిన మరో నిందితుడు సిలికాన్ సంస్థ యజమాని సురేష్ నాయక్‌ను కూడా అధికారులు బ్రహ్మపురకు తీసుకువచ్చారు. ఎస్సై రాత పరీక్షల కుంభ కోణంలో ఇంతవరకూ 125 మంది అరెస్టయ్యారు. ఈ కుంభకోణంలో అరెస్టయి కారాగారంలో ఉన్న 114 మంది అభ్యర్థులకు బ్రహ్మపురలోని ఎస్‌డీజేఎ న్యాయస్థానం ఇటీవల బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఈ అక్రమాల్లో అరెస్టయిన పలువురు దళారులు ఇంకా బ్రహ్మపుర మండల కారాగారంలో ఉన్న సంగతి విదితమే.

శివాలయం నిర్మాణానికి శంకుస్థాపన

ఎర్రముక్కాంలో శివాలయం నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. పండిత రమేష్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో ఆలయ కమిటీ సభ్యులతోపాటు వివిధ గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణం పూర్తి చేసేందుకు అందరి సహకారం కావాలని కమిటీ ప్రతినిధులు చంద్రమోహన్, పాపారావు, రాజ్‌కుమార్, రాజారావు, ముకుందరావు, బాబూరావు, హేమసుందరరావు కోరారు. పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, సోంపేట

యథావిధిగా ఆర్థిక సాయం అందజేత

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: ఏపీలోని శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వేంకటేశ్వరాలయ ధర్మకర్త హరి ముకుంద పండా తోటకు సోమవారం ఉదయం అంధులు, దివ్యాంగులు వచ్చారు. వీరికి ప్రతి సోమవారం పండా భోజనం పెట్టి దివ్యాంగులకు రూ.300, వృద్ధులకు రూ.400, అంధులకు రూ.600 చొప్పున ఆర్థిక సాయం అందజేస్తారు. ఈ ప్రక్రియ కొన్నేళ్లుగా కొనసాగుతోంది. కొద్ది రోజుల నుంచి గురువారం సైతం నిర్వహిస్తున్నారు. ఈ నెల 1న తోటలోని దేవాలయంలో జరిగిన తొక్కిసలాటలో 9 మంది భక్తులు మృతి చెందిన విషయం విదితమే. దీంతో ఆరోజు నుంచి పోలీసులు తోటలోకి ఇతరులను అనుమతించడం లేదు. ఆలయంలో జరిగిన ప్రమాదం గురించి తెలియక దివ్యాంగులు, అంధులు తోట వద్దకు చేరుకున్నారు. వారిని పోలీసులు లోపలికి వెళ్లకుండా ప్రధాన గేటు వద్ద అడ్డుకున్నారు. అనుమతి ఇవ్వాలని పోలీసులను ముకుంద పండా కోరడంతో విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కొద్దిసేపటికి వారి నుంచి అనుమతి రావడంతో లోపలకు విడిచిపెట్టారు. వచ్చిన వారికి పండా భోజనాలు పెట్టి, ఆర్థిక సాయం అందజేశారు.

తోట బయట ఉదయం 10 గంటలకు దివ్యాంగులు

ఆర్థిక సాయం కోసం బారులు తీరిన దివ్యాంగులు, అంధులు

తొక్కిసలాట మృతురాలి కుటుంబానికి పరామర్శ

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురానికి సమీపంలో ఒడిశా గుడ్డిపద్ర గ్రామానికి చెందిన రంగాల రూప (23) కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసలాట ఘటనలో మృతిచెందారు. ఆ కుటుంబాన్ని వైకాపా నాయకులు నర్తు నరేంద్రయాదవ్, సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. తమ పార్టీ తరఫున పరిహారం అందిస్తామని ప్రకటించారు.

గుడ్డిపద్రలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైకాపా నాయకులు

జీఎస్‌పీఎల్ బ్యాడ్మింటన్ విజేత శ్రీరామ్ వారియర్స్

విన్నర్ ట్రోఫీతో శ్రీరామ్ వారియర్స్ జట్టు క్రీడాకారులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక అందపసర రోడ్డులోని సత్య అన్నపూర్ణ బ్యాడ్మింటన్ అకాడమీ (ఎస్ఏబీఏ)లో మూడు రోజులు నిర్వహించిన గంజాం స్మాష్ ప్రీమియర్ లీగ్ (జీఎస్‌పీఎల్) సీజన్-1 జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఇందులో శ్రీరామ్ వారియర్స్ జట్టు క్రీడాకారులు విజేత ట్రోఫీ అందుకున్నారు. మొదటి రన్నర్‌గా మాక్స్ వారియర్స్, రెండో రన్నర్‌గా బ్రహ్మపుర స్మాషర్స్ జట్లు నిలిచాయి. ఉత్తమ క్రీడాకారుడిగా రుద్ర సామంత, ఎమర్జింగ్ క్రీడాకారుడిగా రవికిరణ్ ప్రత్యేక బహుమతులందుకున్నారు.

పండుతోందనుకుంటే.. కుళ్లుతోంది..

మొంథా ప్రభావంతో లబోదిబోమంటున్న రత్తకన్న రైతులు

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

'ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉన్నా, విద్యుత్తు సరఫరా మెరుగ్గా ఉండటంతో బోర్ల సాయంతో పంట సాగుచేసుకున్నాం. చక్కగా పండుతోంది... మరో 15, 20 రోజుల్లో కోతలు ప్రారంభించాలనుకున్నాం. అంతలోనే భీమ సముద్రం గెడ్డ వరదనీరు ముంచెత్తిందని' రత్తకన్న రైతులు లబోదిబోమంటున్నారు. ఇటీవల మొంథా తుపాను ప్రభావంతో వచ్చిన వరదలకు ఇచ్ఛాపురంలో 1118 హెక్టార్ల పంట నీటమునిగింది. అందులో రత్తకన్న భూములే అత్యధికం.

నీట మునిగిన వరిపంటను చూపుతున్న అన్నదాతలు

● ఈ గెడ్డ పంట సాగుకు ఉపయోగపడకపోగా.. పంట చేతికందే సమయంలో కన్నీరు తెప్పిస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం తగ్గిన తర్వాత కూడా పంట నీటిలోనే ఉండటంతో చేతికి ఫలసాయం వచ్చేలా లేదని వాపోయారు. మొత్తం 500కు పైగా ఎకరాల పంట భూమి నీట మునగడంతో, నీరు వెళ్లేలా కాలువలు తవ్వుతున్నారు. ఆదివారం మళ్లీ వర్షం కురవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చెందుతున్నారు.

● పంటభూములు పల్లపు ప్రాంతంలో ఉండటం, గెడ్డలో నీరు ఉండటం వలన పంట భూముల నుంచి నీరు నెమ్మదిగా కదులుతోంది. పంటను ముంచెత్తేంత వేగంగా, బయటకు నీరు వెళ్లడం లేదని రైతులు చెబుతున్నారు. పొక్లెయిన్‌లతో గెడ్డలోని చెత్తను తొలగించకుంటే, మరింత ప్రమాదం సంభవించే దని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా భీమసముద్రం గెడ్డపై అధ్యయనం చేసి, తొలి నుంచి బాహుదానదికి చేరే వరకు గెడ్డను అభివృద్ధి చేయాలని, నీటిని చెరువులకు మళ్లించే పిల్లకాలువలను తవ్వించాలని కోరుతున్నారు.

కళ్ల ముందే మునిగింది..

మంగళవారం సాధారణ స్థాయిలోనే గెడ్డలో నీరు చేరడంతో ఊరట చెందాం. తీరా మర్నాడే ఉగ్రరూపం దాల్చింది. ఎగువ నుంచి వచ్చి చేరిన నీటితో కలిసి రత్తకన్న, తేలుకుంచి, మండపల్లి ప్రాంతాల్లోని పంటను ముంచేసింది. ఒక్కరోజులోనే.. కళ్ల ముందే ఇలా జరిగింది.

- లాది పాపారావు, రైతు, రత్తకన్న

నీరు తోడించాలి..

పంటభూమిలోకి చేరిన నీటిని కాలువలు, మోటార్ల ద్వారా బయటకు పంపాలి. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది ఉండదు. నీరు తోడించాక, తమ సూచనలు ప్రకారం సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నీరు వెళ్లిన తర్వాత పరిశీలించి, పంట నష్టాన్ని అంచనా వేస్తాం.

– పీపీవీవీ అజయ్‌కుమార్, వ్యవసాయాధికారి, ఇచ్ఛాపురం

సముద్ర స్నానాల్లో సూచనలు పాటించాలి

సోంపేట, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా భక్తులు, పిక్నిక్‌లకు వచ్చే సందర్శకులు సముద్రస్నానాలు చేసేటప్పుడు మెరైన్ పోలీసుల సూచనలు తప్పకుండా పాటించాలని బారువ మెరైన్ సీఐ డీవీ రమణ అన్నారు. నెల్లూరు, ఇతర ప్రాంతాల బీచ్‌ల్లో సముద్ర స్నానాలు చేస్తూ యువత గల్లంతైన సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తీరంలో భద్రతా చర్యలు కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు. బందోబస్తులో ఉన్న సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఘనంగా కార్తిక సోమవారం పూజలు

గోవిందపురం శివాలయంలో బారులు తీరిన భక్తులు

ఉప్పలాం పంచాయతీ తీరంలో మహిళల కార్తిక పూజలు

వజ్రపుకొత్తూరు గ్రామీణం, సోంపేట, న్యూస్‌టుడే: కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం శివాలయానికి భక్తులు పోటెత్తారు. బెండి, పూడిలంక, పీఎంపురం, అమలపాడు, దేవునల్తాడ శివాలయాల్లో భక్తులు భజనలు చేశారు. ★ సోంపేట మండలం ఇసకలపాలెం, గొల్లగండి, బారువ, ఉప్పలాం, సిరిమామిడి పంచాయతీ తీరప్రాంతాల్లో మహిళలు గుంపులుగా ఏర్పడి పూజలు నిర్వహించి, కార్తిక దీపాలు విడిచిపెట్టారు.

(c) eenadu

ఈనాడు పల్నాడు
మంగళవారం నవంబరు 4, 2025

సొమ్మెందుకు తీసుకోవట్లేదు!

4.08 కోట్ల ఖాతాలు.. రూ.67.11 కోట్లు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

పదేళ్లకు మించి లావాదేవీలు లేని ఖాతాలు

ఏళ్ల తరబడి ఆ బ్యాంకు ఖాతాల నిర్వహణ లేదు. వాటిలో నగదు లేదా అంటే రూ. వేలు, లక్షలు, కోట్లున్నా చాలాకాలంగా లావాదేవీలు జరగట్లేదు. ఖాతాల్లో సొమ్ము ఎందుకు తీసుకోవట్లేదనే ప్రశ్న అందరిలోనూ ఉదయిస్తుంది. వీటిని డీఈఏఎఫ్ (డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎవేరెనెస్ ఫండ్) ఖాతాలుగా పిలుస్తారు. పదేళ్లు, అంతకు మించి లావాదేవీలు జరగని ఖాతాల్లో సొమ్మును తిరిగి ఇచ్చేయాలని కేంద్ర ప్రభుత్వం బ్యాంకులకు ఆదేశాలు ఇచ్చింది. ఈ క్రమంలో అర్హులకు సొమ్ము తిరిగి చెల్లించేందుకు బ్యాంకర్లు చర్యలు తీసుకుంటున్నారు. డిసెంబరు నెలాఖరుకు ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో 30 బ్యాంకుల పరిధిలో 300 బ్రాంచిలు ఉండగా.. డీఈఏఎఫ్ ఖాతాలు మొత్తం 4,08,474 ఉన్నట్లు గుర్తించారు. వీటిలో రూ.67.11 కోట్ల సొమ్ము వివిధ బ్యాంకుల్లో భద్రంగా ఉంది. వ్యక్తిగత ఖాతాలు 3,96,988 ఉంటే వాటికి సంబంధించి రూ.57.99 కోట్లు ఉన్నాయి. సంస్థలు, కార్యాలయాల 7,875 ఖాతాల్లో రూ.7.02 కోట్లు, ప్రభుత్వ శాఖలకు సంబంధించి 3,611 ఖాతాల్లో రూ.2.09 కోట్లు ఉన్నాయి. అత్యధికంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలోని 1,58,371 ఖాతాల్లో రూ.21.75 కోట్లు.. ఎస్‌బీఐ 99,861 ఖాతాల్లో రూ.20.79 కోట్లు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు(ఏపీజీబీ) 69,106 ఖాతాల్లో రూ.8.98 కోట్లు, కెనరా బ్యాంకు 24,047 ఖాతాల్లో రూ.2.62 కోట్లు ఉన్నట్లు గుర్తించారు. సొమ్ము చెల్లింపులు పకడ్బందీగా జరిగేలా జిల్లా కలెక్టర్ పర్యవేక్షించనున్నారు.

బ్యాంకు మేనేజర్లు తమ పరిధిలోని ఖాతాదారుడికి వివరాలు తెలియజేసి నగదు వెనక్కి తీసుకోవాలని సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. స్పందన రాకుంటే గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా ఖాతాదారులకు వివరాలు తెలియజేస్తారు.

ఖాతాదారుడు మృతి చెందితే కుటుంబ సభ్యులు మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కె.శ్రీనివాస రాంప్రసాద్ చెప్పారు.

❖ ఫిక్స్‌డ్ డిపాజిట్, సేవింగ్స్, కరెంట్ ఖాతాలకు తిరిగి నగదు తీసుకునే అవకాశం వర్తిస్తుంది. బ్యాంకుకు వెళ్తే క్లెయిం ఫాం నింపి, ఈకేవైసీ పత్రాలు అందిస్తే సొమ్ము తిరిగి ఇచ్చేస్తారు.

రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు: ఎస్‌ఈ

నూజెండ్ల, న్యూస్‌టుడే: మొంథా తుపానుకు దెబ్బతిన్న రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయిస్తామని ఆర్‌అండ్‌బీ సీఈ శ్రీనివాసరెడ్డి అన్నారు. జంగాలపల్లె నుంచి త్రిపురాపురం, గొల్లపాలెం వెళ్లే రహదారిని ఆయన సోమవారం పరిశీలించారు. గుండ్లకమ్మ నదిపై వంతెనకు ఇరువైపులా ఉన్న రహదారి పూర్తిగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. నీటి ఉద్ధృతి కారణంగా రహదారి కొట్టుకుపోయిందని, రవాణా నిలిచిందని డీఈ వెంకటేశ్వరరావు వివరించారు. వారి వెంట ఏఈ నవ్య, సిబ్బంది ఉన్నారు.

ఖతార్‌లో కొలువులకు దరఖాస్తుల ఆహ్వానం

వినుకొండ, న్యూస్‌టుడే: ఖతార్ దేశంలోని ఆయిల్, గ్యాస్ కంపెనీల్లో పనిచేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీరావు ఒక ప్రకటనలో కోరారు. స్ట్రక్చరల్ వెల్డింగ్ సూపర్‌వైజర్, పైప్ ఫిట్టర్, పెయింటింగ్ సూపర్‌వైజర్ ఉద్యోగాలకు 45 ఏళ్లలోపు ఉన్న పురుషులు సంబంధిత ట్రేడ్‌లో డిప్లొమా లేదా సాంకేతిక విద్య ధ్రువీకరణ పత్రాలు ఉన్నవారు అర్హులన్నారు. ఈ నెల 6లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

కొండల్ని కరిగించేస్తున్నారు!

చేజర్ల అటవీ భూముల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట

అటవీ భూముల్లో కొండల్ని పిండి చేస్తూ మట్టిని తవ్వుకుపోతున్నారు. అడిగేవారు.. అడ్డుకునేవారు లేక పోవడంతో అక్రమార్కులకు అడ్డే లేకుండా పోయింది. నకరికల్లు మండలం చేజర్ల, త్రిపురారం కొండల్లో మట్టి తవ్వకం యథేచ్ఛగా సాగుతోంది. త్రిపురారం కొండకు సంబంధించి అనుమతులున్నాయని మైనింగ్ ఏడీ నాగిని చెబుతుండగా.. చేజర్లలో మాత్రం అనుమతుల్లేవు.

కొండపై మట్టి తవ్వకాల ఆనవాళ్లు. (అంతర చిత్రంలో) నిర్మించిన దారి

దారి నిర్మించుకుని.. చేజర్ల కొండల్లో మట్టి రాళ్లగా కాకుండా పొడిపొడిగా ఉంటుంది. అందుకే దీనికి డిమాండ్ ఉంటుంది. బయటకు కనిపించకుండా లోపల తవ్వకాలు చేపడుతున్నారు. ఇందుకు ఎన్నెస్పీ కాలువ నుంచి కొండలోకి ఏకంగా దారి నిర్మించుకున్నారు. కొన్ని కొండల్ని ఆనవాళ్లు లేకుండా ఇప్పటికే కరిగించేశారు. కొన్ని నెలలుగా జరుగుతున్న ఈ తంతుకు సంబంధించి చదునుగా కనిపిస్తున్న ఆనవాళ్లే నిదర్శనం. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో తవ్వకాలకు తాత్కాలికంగా విరామమిచ్చారు.

❖ **టిప్పర్ రూ.12 వేలు..** అక్రమంగా తవ్విన మట్టిని సమీపంలోని నరసరావుపేటకు తరలించి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. టిప్పర్ రూ.12 వేలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

❖ **భారీ గుంతలు..** మట్టి మాఫియా తవ్వకాలతో కొండల్లో పలు అడుగుల మేర గుంతలు ఏర్పడ్డాయి. తవ్వకానికి వాడే పొక్లెయిన్లు కొండకు సమీపంలోనే ఓ తండాలో ఉంచుతారు. రాత్రిపూట తీసుకెళ్లి వినియోగిస్తారు. టిప్పర్ల రాకపోకలతో ఎన్నెస్పీ కాలువ గట్టు ధ్వంసమవుతోంది. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నా మైనింగ్, అటవీ శాఖల అధికారులు అటువైపే చూడటం లేదని విమర్శ వినిపిస్తోంది.

మహా మర్రి

మార్టూరు మండలం బొల్లాపల్లి గ్రామం వద్ద ఈ మహా వృక్షం ఊడలే ఆధారంగా విస్తరిస్తోంది. 200 ఏళ్ల నాటి మర్రిచెట్టు రహదారి నిర్మాణానికి ఆటంకంగా మారడంతో పూర్వీకులు కొంచెం నరికేశారు. అనంతరం ఊడలే పెనవేసుకుని ఎకరం మేర విస్తరించిందని గ్రామస్థులు చెబుతున్నారు. వాహనదారులకు నీడతో పాటు పచ్చదనంతో ఆహ్లాదం పంచుతోంది.

– ఈనాడు, బాపట్ల, న్యూస్‌టుడే, మార్టూరు

అమరేశ్వరుడు

అమరేశ్వర ఘాట్లో కార్తిక స్నానాలు

త్రికోటేశ్వరుడు

ఆదిదేవునికి అభిషేకం.. ఆధ్యాత్మిక వైభవం

అమరావతి, న్యూస్‌టుడే: కార్తిక సోమవారం సందర్భంగా పంచారామ క్షేత్రం అమరావతి బాలచాముండికా సమేత అమరేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. పంచారామాల దర్శనం నిమిత్తం ఆదివారం రాత్రి నుంచే ప్రత్యేక బస్సుల్లో అమరావతి చేరుకున్నారు. సోమవారం వేకువజామున కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసి స్వామి దర్శనానికి బారులు తీరారు. నాలుగు గంటల నుంచి దర్శనానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 12 గంటల వరకు ఆలయంలో రద్దీ నెలకొంది. మహిళలు దీపారాధన చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవో రేఖ పర్యవేక్షించారు.

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: కోటప్పకొండపై త్రికోటేశ్వరస్వామి ఆలయానికి కార్తిక మాసం రెండో సోమవారం సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. వేకువజామున దేవస్థాన అర్చకులు స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణ చేశారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. అభిషేక మండలంలో స్వామివారికి 270 మంది అభిషేకాలు చేశారు. ప్రత్యేక దర్శనం ద్వారా 914 మంది, శీఘ్రదర్శనం ద్వారా 320 మంది స్వామిని దర్శించుకున్నారు. ఈవో చంద్రశేఖరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అభిషేక పూజల్లో భక్తులు

పత్తి కొనుగోలుకు 11 కేంద్రాల ఏర్పాటు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలో పత్తి కొనుగోళ్ల నిబంధనలు, నాణ్యత ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కనీస మద్దతు ధరకు పత్తి కొనుగోలుకు విధి విధానాలు, నాణ్యత ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ముద్రించిన గోడపత్రాల్ని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి కేవీఎస్ ఉపేంద్రకుమార్ మాట్లాడుతూ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 11 చోట్ల జిన్నింగ్ మిల్లుల్లో కేంద్రాలు ఏర్పాటు చేసి త్వరలో కొనుగోళ్లు నిర్వహిస్తామని తెలిపారు. సంయుక్త కలెక్టర్ సూరజ్, జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు, డీఆర్వో మురళి, ఆర్డీవో మధులత తదితరులు పాల్గొన్నారు.

గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి తదితరులు

ఎక్కడెక్కడ..

నాదెండ్ల మండలం గణపవరంలోని శ్రీ వెంకటకృష్ణ ఎంటర్‌ప్రైజెస్, విజయదుర్గ కాటన్ మిల్లు, సత్తెనపల్లిలోని లక్ష్మీ కాటన్ ట్రేడింగ్ కంపెనీ, శ్రీ వెంకట రమణ కాటన్ ట్రేడర్స్, పిడుగురాళ్ల మండలం జానపాడులోని అమరలింగేశ్వర ఎంటర్‌ప్రైజెస్, యడ్లపాడు మండలం తిమ్మాపురంలోని లక్ష్మీగణపతి, శ్రీ నాగలక్ష్మి, తిరుమల కాటన్ అండ్ ఆగ్రో ప్రొడక్ట్స్, దుర్గి మండలం అడిగొప్పులలోని శ్రీలక్ష్మీ నరసింహ జిన్నింగ్ మిల్లు, పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లిలోని లక్ష్మీగణపతి కాటన్ మిల్లు, గురజాలలోని ఉమామహేశ్వర కాటన్ మిల్లు.

❖ కాపస్ కిసాన్, సీఎం యాప్‌లలో గ్రామ వ్యవసాయ సహాయకులు చేపట్టే రిజిస్ట్రేషన్ సమయంలోనే రైతులు కోరుకున్న తేదీల్లో కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లే వెసులుబాటు కల్పిస్తున్నారు.

15 సెంట్లు.. 25 రకాల పంటలు

ముప్పాళ్ల, న్యూస్‌టుడే

పదిహేను సెంట్ల వ్యవసాయ భూమి.. 25 రకాల పంటలు.. తక్కువ విస్తీర్ణంలో ఇన్నేసి పంటలు సాగు చేస్తున్నారు. పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం నార్నెపాడుకు చెందిన మహిళా రైతు కాకుమాను పూజ మూస పద్ధతిలో పంటల సాగుకు స్వస్తి పలికి ఏటీఎం విధానాన్ని అవలంబిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగు చేస్తున్నారు. విత్తనాలు నాటిన 45 రోజుల తరువాత నుంచి ఆదాయం పొందుతున్నారు. గత ఏడాది 15 సెంట్ల భూమిలో 20 రకాల పంటల సాగుకు రూ.8,635 పెట్టుబడిగా పెట్టగా. . రూ.85 వేల ఆదాయం వచ్చిందని పూజ చెప్పారు. ఈ ఏడాది బీట్‌రూట్, ముల్లంగి, క్యారెట్, పసుపు, ఉల్లి, పాలకూర, తోటకూర, చుక్కకూర, ఎర్ర తోటకూర, మెంతికూర, కొత్తిమీర, పుదీనా, చెట్టు చిక్కుడు, గోరుచిక్కుడు, బెండ, వంగ, టమాటా, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బీర, సొర, కాకర, పొట్ల, తంబకాయ, నేతి బీర (25 రకాల పంటలు) సాగు చేస్తున్నట్లు వివరించారు. వీటితో పాటు మొక్కజొన్న సాగు చేస్తున్నానన్నారు. వీటి సాగుకు రూ.10 వేలు పెట్టుబడి అయ్యిందని.. రూ.లక్షకు పైగా ఆదాయం వస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అన్నట్లు ప్రకృతి వ్యవసాయం విభాగంలో మెంటార్‌గా పని చేస్తున్న ఈమె గత ఏడాది స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఉత్తమ మెంటార్‌గా రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ నుంచి అవార్డు అందుకున్నారు.

ఎరువు తయారు చేస్తున్న పూజ

85 పాఠశాలలకు 5 స్టార్ రేటింగ్

నరసరావుపేట, న్యూస్‌టుడే

ప్రభుత్వ, ఎయిడెడ్, గుర్తింపు కలిగిన ప్రైవేటు పాఠశాలల్లో స్వచ్ఛతకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. పాఠశాలల్లో ఆరు అంశాలను పరిశీలించి రేటింగ్ ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పరిశుభ్రత, పచ్చదనం, వసతులు, సౌకర్యాలు మెరుగు రేటింగ్ ప్రధాన లక్ష్యంగా ఉంది. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా పాఠశాలలు స్వీయ రేటింగ్‌లు ఇవ్వగా.. వాటిని సర్వే బృందాలు పునఃపరిశీలించి మదింపు చేశారు. ఇలా 85 పాఠశాలలకు 5 స్టార్ రేటింగ్ లభించింది. వాటిని జాతీయ స్థాయికి పంపనున్నారు. అక్కడా మెరిస్తే రూ.లక్ష నగదు నజరానా అందనుంది. ప్రతి పాఠశాలకు సంబంధించి 60 అంశాల్లో నిర్వహణ తీరు, ఫొటోల్ని అప్‌లోడ్ చేశారు. మార్కుల ఆధారంగా రేటింగ్‌లు ఇచ్చారు. బాలికలు, బాలురకు ప్రత్యేక మరుగుదొడ్లు, చేతుల శుభ్రత, మొక్కల పెంపకం, పిల్లల్లో సత్ప్రవర్తన, విద్యార్థుల నడత, అభ్యసన సామర్థ్యాలను అధికారుల బృందం పరిశీలన, మదింపు పూర్తయ్యింది.

జాతీయ స్థాయికి ఎంపికైతే నగదు నజరానా

పాఠశాలలు : 2,114	
5 స్టార్	85
4 స్టార్	933
3 స్టార్	922
2 స్టార్	147
1 స్టార్	27

సత్తెనపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్తు సుగాలి ఉన్నత పాఠశాల

- 5 స్టార్ రేటింగ్ పాఠశాలల్లో.. 6 నుంచి 8 తరగతులు బోధిస్తున్న బడుల్లో గ్రామీణ ప్రాంతాల్లో మూడు, పట్టణ ప్రాంతాల్లో మూడు, 3 నుంచి 5 తరగతులు బోధిస్తున్న బడుల్లో పట్టణ ప్రాంతాల్లో 3, గ్రామీణ ప్రాంతాల్లో 33 గుర్తించారు. తొమ్మిది నుంచి 12 తరగతులు బోధించే విద్యాలయాల్లో గ్రామీణ ప్రాంతాల్లో 28, పట్టణ ప్రాంతాల్లో 15 బడుల్ని గుర్తించారు. గ్రామీణ ప్రాంతాల్లోని బడులు పచ్చదనం, పరిశుభ్రతలో మెరుగ్గా ఉన్నట్లు మదింపు అధికారులు గుర్తించారు.
- 5 స్టార్ వచ్చిన పాఠశాలల్లో ఎనిమిది విద్యాలయాలకు జిల్లా స్థాయి అవార్డులు అందజేయనున్నారు. దేశ వ్యాప్తంగా 200, రాష్ట్రంలో 50 బడులకు పురస్కారాలు ఇవ్వనున్నారు. వచ్చే ఫిబ్రవరిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛతలో మెరిసిన విద్యాలయాలకు పురస్కారాల్ని అందిస్తాయని సీఎంవో పద్మారావు తెలిపారు.

6లో సస్యరక్షణ చర్యలతో పంటలు కాపాడుకోవచ్చు
రైతేరాజు

జిల్లాలో సరిపడా ఎరువుల నిల్వలు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలో 10,015 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే ఎరువులు విక్రయించాలని, అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు. జిల్లాలో ఇటీవల అధిక వర్షాలు కురిసిన దృష్ట్యా పంటలు ఉరకెత్తకుండా ఉండేందుకు అదనంగా 2 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం అవుతుందని అంచనా వేశామని, గడిచిన రెండు రోజుల్లో 1,500 మెట్రిక్ టన్నులను రైతు సేవా కేంద్రాలు, సొసైటీలు, జీడీఎంఎస్ కేంద్రాలకు సరఫరా చేశామన్నారు. పంటల సాగు మేరకు జిల్లాలో సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని తెలిపారు. జిల్లాలో ఎరువుల సరఫరాలో ఎటువంటి జాప్యం లేకుండా రైతులకు అవసరమైన మేరకు సకాలంలో అందేలా తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మిర్చి.. మెచ్చేలా ధర

ఈనాడు, అమరావతి

మిర్చి ధరలు పెరుగుతున్నాయి. తుపాను ప్రభావంతో చేలు దెబ్బతినడం, వరుస వర్షాలకు దిగుబడులు ఆలస్యమవుతాయన్న సమాచారంతో నిల్వ సరకుకు డిమాండ్ పెరుగుతోంది. మరోవైపు దేశీయంగా కొనుగోళ్లు బాగుండటం మార్కెట్‌కు కలిసొచ్చింది. బంగ్లాదేశ్‌కు సైతం ఎగుమతులు పెరుగుతున్నాయి. 341 రకం నాణ్యమైన కాయలకు క్వింటాలు ధర రూ.16,500కు పైగా పలుకుతోంది. గత వారంతో పోలిస్తే.. అన్ని రకాలకు క్వింటాకు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు ధర పెరిగింది. వచ్చిన సరకు వచ్చినట్టే అమ్ముడవుతోంది. సోమవారం మార్కెట్‌కు 40,415 బస్తాలు రాగా.. 37,640 బస్తాలు అమ్ముడయ్యాయి. పాతవాటితో కలిపి మార్కెట్‌లో 7,834 బస్తాలు నిల్వ ఉన్నాయి.

❖ గుంటూరు పరిసరాల్లోని శీతల గోదాముల్లో 33 లక్షల బస్తాల వరకు మిర్చి నిల్వలు న్నాయి. రాష్ట్రం మొత్తమ్మీద సుమారు 52 లక్షల బస్తాలుంటాయని అంచనా. కొత్త మిర్చి మార్కెట్‌కు రావడానికి మరో రెండు నెలల సమయం ఉంది. ప్రస్తుతం రోజుకు సగటున 50 వేల బస్తాల వరకు విక్రయాలు నమోదవుతుండటంతో నిల్వలు తరిగిపోతున్నాయి.

సాగర్ క్రస్టుగేట్ల మూసివేత

విజయపురి సౌత్, న్యూస్‌టుడే: ఎగువ కృష్ణానది పరీవాహక ప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో దిగువ జలాశయాలకు వరద నీటి చేరిక తగ్గింది. నాగార్జునసాగర్ క్రస్టుగేట్లను సోమవారం పూర్తిగా మూసేశారు. శ్రీశైలం నుంచి 41,915 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. ప్రధాన జలవిద్యుత్తు కేంద్రానికి 33,292, కుడి కాలువకు 8023, ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 600 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయంలో 309.9534 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కాలువలు బాగు చేయిస్తాం: ఈఈ

నూజెండ్ల, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న కాలువలను బాగు చేయిస్తామని ఎన్నెస్పీ ఈఈ శ్రీనివాసరావు అన్నారు. జమ్మలమడక, వేముల మేజర్లను సోమవారం ఆయన పరిశీలించారు. కట్టలు కోతకు గురైనట్లు గుర్తించారు. యూటీలు, లీకుల్ని తనిఖీలు చేశారు. మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలని సిబ్బందిని ఆదేశించారు. డీఈ వెంకటనారాయణ, డీసీ ఛైర్మన్ నక్కా బుల్లీశ్వరరెడ్డి, ఏఈ ప్రసన్నకుమార్, నీటి సంఘం అధ్యక్షుడు నర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కనులారా వేడుక చూసి..

రెప్పపాటులో అసువులుబాసి

కంటైనర్‌ను కారు ఢీకొని నలుగురి దుర్మరణం

బాపట్ల, కర్లపాలెం, న్యూస్‌టుడే: కర్లపాలెం మండలం సత్యవతి పేట సమీపంలో సోమవారం వేకువజామున జరిగిన ప్రమాదం తీవ్ర విషాదం నింపింది. కర్లపాలేనికి చెందిన బేతాళం బలరామరాజు(65), లక్ష్మి(60) దంపతులు. విజయవాడలోని బంధువుల ఇంట్లో ఆదివారం శుభకార్యానికి వెళ్లారు. రాత్రికి బాపట్లలో తమ అల్లుడు, మేనకోడలు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు, హరికుమారి దంపతుల కుమారుడు రాకేష్‌వర్మ వివాహం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సంగీత్ వేడుకకు బంధువు ముదునూరి శ్రీనివాసరాజు కారులో హాజరయ్యారు. వధువు, వరుడిని ఆశీర్వదించి బంధువులతో కలిసి ఉల్లాసంగా గడిపారు. వేడుక ముగిసిన అనంతరం వియ్యపురాలు గాదిరాజు పుష్పవతి(60), మనవడు గాదిరాజు జయంత్‌వర్మ, గాదిరాజు వైష్ణవితో కలిసి కారులో కర్లపాలెం బయలుదేరారు. సత్యవతి పేట సమీపంలో ముందున్న కారును అధిగమించే ప్రయత్నంలో నరసాపురం నుంచి కేరళ వెళ్తున్న రొయ్యల కంటైనర్‌ను వారు ప్రయాణిస్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. ఘటనలో తలకు తీవ్ర గాయాలైన బలరామరాజు, లక్ష్మి దంపతులు వారి వియ్యపురాలు పుష్పవతి అక్కడికక్కడే మృతి చెందారు. కారు నడుపుతున్న శ్రీనివాసరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారులు జయంత్‌వర్మ, వైష్ణవి గాయపడగా గుంటూరు, చీరాల ఆసుపత్రులకు తరలించారు. శ్రీనివాసరాజును చికిత్స కోసం బాపట్ల ప్రాంతీయాసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందారు. ఆయన కుమారుడి వివాహం ఈ నెల 26న నిశ్చయమైనట్లు తెలిసింది. శ్రీనివాసరాజు మరణంతో ఆ కుటుంబం దుఃఖసాగరంలో మునిగిపోయింది. మృతదేహాన్ని స్వస్థలం విజయవాడలోని ముత్యాలంపాడుకు తరలించారు.



బలరామరాజు

లక్ష్మి

పుష్పవతి

శ్రీనివాసరాజు

(పాత చిత్రాలు)

మరో ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుకునేలోగా.. వేడుక నుంచి బయలుదేరిన వారు మరో ఐదు నిమిషాల్లో కర్లపాలెంలో ఇంటికి చేరుకుంటారనేలోగా విధి వక్రించింది. కారు నడుపుతున్న శ్రీనివాసరాజు ముందున్న కారును అధిగమించే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న రొయ్యల కంటైనర్‌ను ఢీకొట్టారు. బెలూన్లు తెరుచుకున్నా తీవ్ర గాయాలై కారు ముందు సీట్లో ఉన్న బలరామరాజు, ఆయన వెనక సీట్లో కూర్చొన్న లక్ష్మి, పుష్పవతి, డ్రైవింగ్ సీట్లో ఉన్న శ్రీనివాసరాజు ప్రాణాలు విడిచారు. మనవడు, మనవరాలు గాయాలతో బయటపడ్డారు. పుష్పవతి కుమారుడు అనిల్‌వర్మ జమ్మూకశ్మీర్‌లోని ప్రముఖ సంస్థలో పైలెట్‌గా పని చేస్తున్నారు. వివాహ వేడుకల్లో పాల్గొనడానికి మనవడు, మనవరాలితో కలిసి పుష్పవతి కర్లపాలెంలో బలరామరాజు ఇంటికి వచ్చారు.

సైన్స్‌లో ప్రతిభ.. విమానం ఎక్కిస్తోంది

సత్తెనపల్లి, మాచర్ల, న్యూస్‌టుడే

జాతీయస్థాయి వర్క్‌షాపునకు ఎంపిక

విమానయానం చాలామంది జీవితకాలపు కల. పాఠశాల స్థాయిలో అదీ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు అవకాశం రావడం అంటే మధుర జ్ఞాపకం. సైన్స్‌లో ప్రతిభ కనబరచడం ద్వారా జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు పైసా ఖర్చు లేకుండా విమానంలో దిల్లీ వెళ్లనున్నారు. సమగ్ర శిక్షా, సైన్స్ సిటీ సంయుక్త ఆధ్వర్యంలో సైన్స్‌లో ప్రతిభావంతుల్ని ఈ నెల 6 నుంచి 8 వరకు దిల్లీలో ఇస్రో ఆధ్వర్యంలో జరిగే స్పేస్ వర్క్‌షాపునకు తీసుకెళ్తున్నారు. దిల్లీలో రష్యన్ సెంటర్ ఫర్ సైన్స్ అండ్ కల్చర్, నేషనల్ మ్యూజియం, నెహ్రూ ప్లానిటోరియంలను సందర్శించనున్నారు. విద్యార్థులు విజ్ఞాన ప్రతిభతో గొప్ప అవకాశాన్ని దక్కించుకున్నారని డీఈవో చంద్రకళ, జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్ తెలిపారు.

స్మార్ట్ వ్యవసాయ ప్రాజెక్టు గురించి వివరిస్తున్న విద్యార్థి నాగార్జున

ఆవిష్కరణల రూపశిల్పి.. విజయపురి సౌత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి పిల్లుట్ల వెంకట నాగార్జున సైన్స్‌లో ప్రతిభ చాటుతున్నాడు. ఇతని తండ్రి వంశీకృష్ణ ఏపీఆర్‌జేసీలో సీనియర్ అసిస్టెంట్, తల్లి శశిరేఖ గృహిణి. సైన్స్‌కు సంబంధించి ఏ పోటీ జరిగినా విజేతగా నిలుస్తున్నాడు. ఇటీవల ఇస్రో నిర్వహించిన యువికాకు ఎంపికయ్యాడు. స్మార్ట్ ఇరిగేషన్ సిస్టమ్ యాప్‌ను రూపొందించాడు. అమరావతి వీవీఐటీలో జరిగిన నాకా హ్యాకథాన్‌లో నవ ఆలోచనతో మెరిశాడు. సైన్స్ సెమినార్లు, వైజ్ఞానిక ప్రదర్శనలు, చెకుముకి పోటీల్లో రాణించాడు. తొలిసారి విమానం ఎక్కబోతుండటం ఉత్సాహంగా ఉందని.. రోబోటిక్ సైంటిస్టు అవ్వాలన్నది తన జీవిత లక్ష్యమని నాగార్జున చెప్పారు.

పోటీల్లో రాణింపు

నాదెండ్ల మండలం కనపర్రు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి కారసాల కార్తిక్ అన్ని సైన్స్ పోటీల్లో ప్రతిభ చాటుతున్నాడు. కార్తిక్ తండ్రి అశోక్ క్రేన్ డ్రైవర్ కాగా, తల్లి జమున గృహిణి. జిల్లా సైన్స్ సెమినార్లు, క్విజ్‌లు, వైజ్ఞానిక ప్రదర్శన, చెకుముకి పోటీల్లో రాణించాడు. జిల్లాలో నిర్వహించిన అన్ని పోటీల్లో రెండు, మూడు స్థానాల్లో నిలిచి ప్రోత్సాహక బహుమతులు అందుకున్నాడు. ఇన్‌స్పైర్‌కు నామినేట్ అయ్యాడు. మధుమేహాన్ని సహజ పద్ధతుల్లో నియంత్రించడంపై ప్రాజెక్టు రూపకల్పన చేశాడు. పరిశోధన రంగంలో ఉత్తమంగా నిలవాలన్నది తన లక్ష్యమని కార్తిక్ తెలిపారు.

(c) eenadu

రెవెన్యూ సమస్యలే అధికం

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా అధికారులు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు 154 అర్జీలు అందించారు. కలెక్టర్‌తో పాటు జేసీ సూరజ్ గనోరే, అధికారులు ఫిర్యాదులు స్వీకరించారు. సర్వే చేయించాలని, మ్యుటేషన్, వెబ్‌ల్యాండ్‌లో నమోదు కోరుతూ అర్జీలు అందాయి. సామాజిక పింఛన్లకు సంబంధించిన సమస్యలు తర్వాతి స్థానంలో ఉన్నాయి. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సత్వరం పరిష్కరించాలన్నారు.

వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోండి

రొంపిచర్ల మండలం మాచవరం వద్ద ఓగేరు వాగుపై వంతెన నిర్మాణం పనులు ప్రారంభించాలని కోరుతూ సీపీఎం నేతలు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే రూ.5కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. నరసరావుపేట మండలం లింగంగుంట్ల కాలనీలో మౌలిక వసతులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఐబీలం తుపాను కారణంగా పట్టణంలో పలు చోట్ల రహదారులు దెబ్బతిన్నాయని మరమ్మతులు చేయించాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, ఉప్పలపాటి రంగయ్య, మహంకాళి సుబ్బారావు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

సచివాలయ ఉద్యోగులను నియమించరూ!

బొల్లాపల్లి మండలం గండిగనుమల, డోమల గుండం పంచాయతీలకు సంబంధించిన సచివాలయంలో సిబ్బంది లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సమస్య పరిష్కరించాలని కలెక్టర్‌కు ప్రజాసంఘాల నేతలు అర్జీ ఇచ్చారు. గండిగనుమలలో సచివాలయం భవనం ఉన్నా సిబ్బంది లేకపోవడంతో బొల్లాపల్లి వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. దీనిపై అధికారులు స్పందించాలని కోరారు.

విపత్తు నిర్వహణ సేవలు భేష్

జేసీ సూరజ్ గనోరేను సత్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ కృష్ణారావు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: విపత్తుల సమయంలో సమష్టిగా విధులు నిర్వహిస్తే ప్రజలకు చక్కగా సేవలందించవచ్చని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. మొంథా తుపాను సమయంలో సమర్థంగా విధి నిర్వహించిన వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులను సోమవారం కలెక్టరేట్‌లో అభినందన సభ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తుపాను సమయంలో ప్రతి అంశంలో జేసీ సూరజ్ గనోరే, డీఆర్వో మురళి, ఎస్పీ కృష్ణారావు పూర్తిగా సహకరించారన్నారు. ముందస్తు చర్యలు, అధికారులు, ఉద్యోగులు క్షేత్రస్థాయిలో చేసిన కృషితో ప్రజలకు వేగంగా సహాయం అందించగలిగామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ సమర్థంగా పనిచేయగలిగిన అధికారులు, సిబ్బంది మనకు ఉన్నారని తుపాను రుజువు చేసిందన్నారు. 13 మంది అధికారులు, 33 మంది ఉద్యోగులు, అయిదుగురు పోలీసులను సత్కరించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆర్డీవో మధులత తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల సంరక్షణ చట్టాన్ని అమలు చేయండి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో వయోవృద్ధుల సంరక్షణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గుంటూరు మహాలక్ష్మమ్మ అనే వృద్ధురాలు తనకు పోషణ ఖర్చులు ఇప్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేసింది. దీనిపై కలెక్టర్ వృద్ధురాలితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. శావల్యాపురం మండలం కారుమంచి గ్రామానికి చెందిన మహాలక్ష్మమ్మ భర్త రామయ్య 2010లో మృతిచెందారు. వీరికి ఇద్దరు సంతానం. పెద్దకుమారుడు సాంబశివరావు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ చేశారు. రెండో కుమారుడు వెంకటేశ్వర్లు కుల వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆమె భర్త జీవించి ఉన్న కాలంలోనే ఆస్తిని పంచారు. కాగా 2024 నుంచి పక్షవాతంతో బాధపడుతూ చిన్న కుమారుడి వద్ద ఉంటున్నానని అతని ఆర్థిక పరిస్థితి దృష్టిలో ఉంచుకుని పెద్దకుమారుడి నుంచి నెలకు రూ.20వేలు ఇప్పించాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, అలాగే ఆస్తి పంపిణీని రద్దు చేయించాలని ఆర్డీవో మధులతకు ఆదేశాలిచ్చారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలు

అండర్-12 బాలికల విభాగంలో మొదటి స్థానం పొందిన పల్నాడు జట్టు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో నిర్వహించిన అండర్-12, 17 రాష్ట్ర స్థాయి బాల బాలికల ఫ్లోర్ బాల్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీలను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సుబ్బరాయగుప్తా ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీల్లో 15 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్-17 బాలుర విభాగంలో తిరుపతి జట్టు విజేతగా నిలవగా, రెండో స్థానాన్ని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ దక్కించుకుంది. మూడో స్థానాన్ని కృష్ణా జిల్లా సొంతం చేసుకుంది. అండర్-17 బాలికల విభాగంలో మొదటి స్థానం తిరుపతి జిల్లా, రెండో స్థానం చిత్తూరు సొంత చేసుకున్నాయి. అండర్-12 బాలుర విభాగంలో మొదటి స్థానం నరసరావుపేట ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్, తిరుపతి 2వ స్థానం, పల్నాడు జిల్లా జట్టు మూడో స్థానం సాధించాయి. అండర్-12 బాలికల విభాగంలో పల్నాడు జిల్లా ప్రథమం, సత్యసాయి, కర్నూలు జిల్లాలు రెండు, మూడు స్థానాల్లో నిలిచినట్లు ఏపీ ఫ్లోర్‌బాల్ సంయుక్త కార్యదర్శి ఎం.కిషోర్‌బాబు తెలిపారు. పోటీలను రత్నకుమార్, బాలునాయక్, ప్రసాద్, సురేంద్ర, బీమా తదితరులు పర్యవేక్షించారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్
(ప్రభుత్వరంగ షెడ్యూల్డ్ బ్యాంక్)
వినుకొండ బ్రాంచి, వినుకొండ, పల్నాడు జిల్లా.
Phone No. 9390478338 Email: bm0038@apgb.bank.in

Lr No. 1/7038/2025-26 Date: 30-10-2025

స్వాధీనత ప్రకటన

[సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క రూల్ 8(1)]
(స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారము **ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, వినుకొండ** బ్రాంచి యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నందలి సెక్షన్ 13(12)తో చదువుకునే నిబంధన 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో దిగువ పేర్కొన్న **ఋణగ్రహీత: 1) శ్రీ గోగుల ప్రసాద్, తండ్రి: వెంకటదాసు,** డోర్ నెం.31-193/C, ఏనుగుపాలెం రోడ్డు, మిర్చి యార్డ్ దగ్గర, వినుకొండ మండలం, పల్నాడు జిల్లా-522647. **2) శ్రీమతి గోగుల పుల్లమ్మ, భర్త: గోగుల ప్రసాద్,** డోర్ నెం. 31-193/C, ఏనుగుపాలెం రోడ్డు, మిర్చి యార్డ్ దగ్గర, వినుకొండ మండలం, పల్నాడు జిల్లా-522647. **సహపూచీదారు/హామీదారు: 3) శ్రీ బండారు వెంకటరావు, తండ్రి: సాయికుమార్,** డోర్ నెం.23-714/B3, రెడ్డి నగర్, వినుకొండ, పల్నాడు-522647. **తనఖాదారు/లు: 1) శ్రీ గోగుల ప్రసాద్, తండ్రి: వెంకటదాసు,** డోర్ నెం. 31-193/C, ఏనుగుపాలెం రోడ్డు, మిర్చి యార్డ్ దగ్గర, వినుకొండ మండలం, పల్నాడు జిల్లా-522647 లను నోటీసులో ఉదహరించబడిన **ఖాతా నంబర్ 703830033188638 & 70380033188874** క్రింద చెల్లించవలసిన బకాయి **రూ.23,54,371.28 (అక్షరాల ఇరవై మూడు లక్షల యాభై నాలుగు వేల మూడు వందల డెబ్బై ఒకటి రూపాయలు మరియు ఇరవై ఎనిమిది పైసలు)** సదరు నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **ది.08.08.2025న డిమాండ్ నోటీసు** జారీచేయబడినది. ఋణగ్రహీత బకాయిసొమ్ము తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీత, సహపూచీదారు / హామీదారు మరియు తనఖాదారుకు మరియు సాధారణ ప్రజానీకమునకు నోటీసు ఇచ్చి, ఈ దిగువ సంతకందారుడు సదరు చట్టములోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన చట్టంతో చదువుకునే రూలు 8 ప్రకారము **30 అక్టోబర్ 2025 తేదీన** దిగువ పేర్కొన్న ఆస్తిని **స్వాధీనత** తీసుకోవడమైనదని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా బ్యాంకు వారికి **చెల్లించవలసిన బకాయిసొమ్ము రూ.24,45,983.28 (అక్షరాల ఇరవై నాలుగు లక్షల నలభై ఐదు వేల తొమ్మిది వందల ఎనభై మూడు రూపాయిలు మరియు ఇరవై ఎనిమిది పైసలు మాత్రమే) మరియు ది.30.10.2025 తేదీనుండి వడ్డీ, మరియు ఇతర ఛార్జీలు** మొ॥నవి **ఆంధ్రప్రదేశ్** గ్రామీణ **బ్యాంక్** వారి నిబంధనలకు లోబడి ఉండునని ఇందుమూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

సదరు చట్టం 13వ విభాగం యొక్క ఉప విభాగం (8) నియమావళి ననుసరించి సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు అవకాశం కలదని ఋణగ్రహీతలకు విన్నవించటమైనది.

ఆస్తి యొక్క షెడ్యూలు

పల్నాడు జిల్లా, వినుకొండ, మిర్చియార్డు దగ్గర, ఏనుగుపాలెం రోడ్డు, డి.నెం.31-193/C, సర్వే నెం.497/C నందు **శ్రీ గోగుల ప్రసాద్‌కి చెందిన** 189.30 చ॥గ॥ విస్తీర్ణము మరియు అందులో గ్రౌండ్ + ఫస్ట్ ఫ్లోర్స్ రెసిడెన్షియల్ భవనమునకు సంబంధించిన యావదాస్తి. **షెడ్యూలు ఆస్తికి హద్దులు: తూర్పు:** 30 లింకుల వెడల్పుగల రోడ్డు; **దక్షిణం:** సోమేపల్లి పోతురాజు యొక్క ఆస్తి; **పడమర:** 30 లింకుల వెడల్పుగల రోడ్డు; **ఉత్తరం:** కోట శ్రీనివాసరావు యొక్క ఆస్తి.

తేది: 30.10.2025 సం/- చీఫ్ మేనేజర్ అండ్ అధీకృత అధికారి
ప్రదేశం: వినుకొండ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్

సస్యరక్షణ చర్యలతో పంటలు కాపాడుకోవచ్చు

'ఈనాడు' ఫోన్ ఇన్‌లో ఆంగ్రూ వీసీ, శాస్త్రవేత్తలు

ఫోన్‌లో రైతు సందేహాన్ని నివృత్తి చేస్తున్న ఆంగ్రూ వీసీ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి, పక్కన లాంఫాం శాస్త్రవేత్త, ఆంగ్రూ విభాగాల అధికారులు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావంతో కురిసిన అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలను సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా కాపాడుకోవచ్చని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి తెలిపారు. గుంటూరుకు సమీపంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లాంఫాం సమావేశ మందిరంలో 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి రైతులు విశేషంగా స్పందించారు. రైతుల ప్రశ్నలకు వీసీ శారద జయలక్ష్మీదేవితో పాటు వర్సిటీ పరిశోధన సంచాలకుడు పి.వి.సత్యనారాయణ, విస్తరణ సంచాలకుడు జి.శివనారాయణ, లాంఫాం ఏడీఆర్ ఎస్.దుర్గాప్రసాద్, ఆయా విభాగాల శాస్త్రవేత్తలు, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు విజయలక్ష్మి, తనూజ సమాధానాలు చెప్పి సందేహాలు నివృత్తి చేశారు. పంటల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని తక్షణం బయటకు పంపాలన్నారు. 40 మంది రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఆయా పంటల్లో తీసుకోవాల్సిన సంరక్షణ చర్యలివీ..

పసుపు: పంటలో 2-3 సార్లు 2 శాతం యూరియా లేదా 1 శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని వారం వ్యవధిలో పిచికారీ చేయాలి. ప్రొపికొనజోల్ 0.1 శాతం, హెక్సాకొనజోల్ 0.1 శాతం ద్రావణాన్ని 2-3 సార్లు వారం వ్యవధిలో మార్చి మార్చి పంట పైన పిచికారీ చేస్తే.. ఆకుమచ్చ, ఆకు మచ్చ తెగుళ్లు నివారించవచ్చు. దుంపకుళ్లు తెగులు నివారణకు 0.3 శాతం కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 1 శాతం బోర్డో మిశ్రమంతో నేలను తడపాలి.

మిరప: పంట ఆరబెట్టి తలలు వాల్చిన లీటరు నీటికి 10 గ్రాముల యూరియా కలిపిన ద్రావణాన్ని వారంలో రెండు సార్లు పిచికారీ చేయాలి. వడలిన మొక్కలకు లీటరు నీటికి 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపిన ద్రావణం పిచికారీ చేయాలి. ఇనుప ధాతు లోపంతో మొక్కలు పాలిపోయినట్లు కనిపిస్తే.. 10 లీటర్ల నీటికి 50 గ్రాముల అన్నభేదితో పాటు ఒక చెక్క నిమ్మ రసం కలిపి పిచికారీ చేయాలి. ● పైపాటుగా ఎకరానికి 50 కిలోల యూరియా, 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 200 కిలోల వేపపిండి వేయాలి. గొర్రుతో అంతరకృషి చేయాలి. మొక్కలు తేరుకున్న తర్వాత స్థూల పోషకాల మిశ్రమాన్ని (5 గ్రాములు లీటరు నీటికి), సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని (2.5 గ్రాములు లీటరు నీటికి) ఒకదాని తర్వాత ఒకటి వారం వ్యవధిలో 2-3 సార్లు పిచికారీ చేయాలి. బ్యాక్టీరియా ఆకుమచ్చ, కాయకుళ్లు వంటి తెగుళ్లు ఆశించే అవకాశముంది కాబట్టి ముందు జాగ్రత్త చర్యగా 10 లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్‌ఆక్సీక్లోరైడ్ కలిపిన ద్రావణం పిచికారీ చేసి వ్యాప్తిని అరికట్టాలి.

వరి: వర్షాలతో పాటు గాలులు వీయడంతో వరి పంట పూత దశలో ఉన్న గింజలు తాలుగా మారే అవకాశముంది. పాలు పోసుకునే గింజల్లో కూడా రంగు మారుతుంది. ధాన్యం రంగు మారకుండా, వివిధ శిలీంద్రాలు గింజలను ఆశించకుండా, మానిపండు తెగులు ఆశించకుండా ఉండేందుకు ప్రొపికొనజోల్ మందు ఎకరాకు 200 మి.లీ చొప్పున పిచికారీ చేసుకోవాలి. పడిపోయిన పంటను నిలబెట్టి కట్టలు కట్టుకోవాలి. పొలంలో నీరు బయటకు పంపే అవకాశం లేని ప్రాంతాల్లో 5 శాతం ఉప్పు ద్రావణాన్ని గింజ మొలకెత్తకుండా ఉండేందుకు పిచికారీ చేయాలి. ● పైపాటుగా యూరియా, పొటాష్ 20 కిలోలు చొప్పున వేసుకోవాలి. తెగుళ్ల నివారణకు వెంటనే ప్రొపికొనజోల్ మందును ఎకరానికి 200 మి.లీ పిచికారీ చేసుకోవాలి. అగ్గి తెగులు ఆశిస్తే వెంటనే ట్రైసైక్లజోల్ మందును 120 గ్రాములు వేయాలి. ఆకుముడత నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు లేదా క్లోరాంట్రనిలిప్రోల్- 60 మి.లీ మందుల్లో ఏదో ఒకటి ఎకరాకు పిచికారీ చేసుకోవాలి. కంకినల్లి నివారణకు ప్రొపెనోఫాస్ మందును 900 మి.లీ పిచికారీ చేసుకోవాలి.



పత్తి: పంటలో గూడ, కాయ రాలడం ఎక్కువగా ఉంటే ప్లానోఫిక్స్ (4.5 శాతం నాఫ్తలీన్ ఎసిటిక్ ఆసిడ్) 0.25 మి.లీ. లీటరు మోతాదులో పిచికారీ చేయాలి. కేఎన్03 ఎకరానికి 1-2 కిలోలు కలిపి చల్లాలి. వారం వ్యవధిలో రెండుసార్లు వేయాలి. ● కాయకుళ్లు తగ్గించడానికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ + 0.1 గ్రాముల స్ట్రెప్టోసైక్లిన్ లీటరు మొక్కల కింది భాగాలు కొమ్మలు, పచ్చటి కాయలు తడిసేలా పిచికారీ చేయాలి. వంగిపోయిన మొక్కలను నిలబెట్టి మొదళ్ల చుట్టూ తొక్కించాలి. పంటలో సాళ్లు ఏర్పాటు చేసి మొక్కల్లో గాలి, కాంతి ప్రసరణ పెంచాలి.

మినుము: ఈ పంటకు ఒక శాతం 19:19:19 మందు పిచికారీ చేయాలి. ఆకుమచ్చ తెగుళ్లు, ఇతర తెగుళ్లు ఆశించకుండా కార్బెండిజమ్ + మాంకోజెబ్ 2 గ్రాములు లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. మారుక మచ్చల పురుగు నివారణకు లీటరు నీటికి నొవల్యూరాన్ 1.0 మి.లీ లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ లేదా ఫ్లుబెండిఎమైడ్ 0.2 మి.లీ లేదా రైనాక్సీపైర్ 0.3 మి.లీ మందును పిచికారీ చేస్తే పురుగును నివారించవచ్చు.

బొప్పాయి పాలు.. విదేశాలకు

నంద్యాల జిల్లా చాగలమర్రి మండల వ్యాప్తంగా రైతులు అధికంగా బొప్పాయి సాగు చేస్తుంటారు. చిన్నవంగలితో పాటు సమీపంలోని గ్రామాలైన వైఎస్సార్ కడప జిల్లా కానగూడూరు, క్రిష్ణంపల్లె గ్రామాల్లో 1200 ఎకరాల్లో పండిస్తారు. విత్తనం నాటిన కాలం నుంచి తొమ్మిది నెలలకు పంట చేతికొస్తుంది. పండ్ల సేకరణ అనంతరం 13 నెలల తర్వాత మిగిలినవి, ముదురు కాయలకు గాట్లు పెట్టి పాలను సేకరిస్తున్నారు. తెల్లవారుజాము సమయంలోనే కాయలకు గాట్లు పెడితే కేవలం రెండు గంటల్లోనే పాలు ఊరుతుంది. ఇలా సేకరించిన దాన్ని రాయచోటి, రాజంపేటకు చెందిన వ్యాపారులు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల పాలు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 4 డ్రమ్ముల పాలు సేకరిస్తున్నారు. ఎకరానికి పాల సేకరణ ద్వారా రైతుకు రూ.24 వేల ఆదాయం వస్తుంది. సేకరించిన పాలను పరిశ్రమల్లో మందులు, కాస్మోటిక్స్, సబ్బుల తయారీలో ఉపయోగిస్తున్నారు. బెంగళూరు, చెన్నైతో పాటు నాణ్యతను బట్టి విదేశాలకు సైతం పాలను ఎగుమతి చేస్తున్నారు. బొప్పాయి సాగులో ఎప్పుడైనా ధర పడిపోయినప్పుడు బొప్పాయి పాల సేకరణతో నష్టాల నుంచి రైతులు బయటపడుతున్నారు. **- న్యూస్‌టుడే, చాగలమర్రి**

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి ఈత పోటీలు

800 మీటర్ల ఫ్రీ స్టైల్ బాలికల విభాగంలో విజేతలకు పతకాలు అందజేసిన అతిథులు

బాలుర విభాగంలో విజేతలు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి అండర్-17 బాల బాలికల ఈత పోటీలు పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో సోమవారం హోరాహోరీగా సాగాయి. ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి ఈత క్రీడాకారులు తరలివచ్చారు. వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి ఎన్.సురేష్‌కుమార్ తెలిపారు. తొలిరోజు 800 మీటర్ల ఫ్రీ స్టైల్ బాలుర విభాగంలో గురుచందు, షణ్ముఖ (కృష్ణా జిల్లా) వరుసగా మొదటి, రెండో స్థానాలు సాధించగా రాజు (అనంతపురం జిల్లా) మూడో స్థానం దక్కించుకున్నారు. బాలికల విభాగంలో నిత్యశ్రీ (చిత్తూరు), ధరిత్రి రామస్వామి (కృష్ణా జిల్లా), ఇషా (శ్రీకాకుళం జిల్లా) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ★ 200 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ బాలుర విభాగంలో యశ్వంత్ (విశాఖ), రిసెంకౌర్ (చిత్తూరు), పూర్ణ (అనంతపురం) వరుసగా మొదటి మూడు స్థానాలు దక్కించుకున్నారు. విజేతలకు వశిష్ట జూనియర్ కాలేజీ డైరెక్టర్ ఎం.నరేష్‌కుమార్, కోచ్ జి.సురేష్, పీడీలు పతకాలు అందజేశారు.

ముమ్మరంగా కుడికాలువ కట్టకు మరమ్మతులు

కట్ట కోతకు గురైన చోట ఏర్పాటు చేసిన సిమెంటు పైపులు

ఈపూరు, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు కోతకు గురైన సాగరు కుడి కాలువ కట్టకు మరమ్మతు పనులు వేగంగా సాగుతున్నాయి. కట్ట కోతకు గురవడంతో కాలువలకు సాగు నీటిని నిలిపివేసి పదిరోజులు దాటింది. ప్రస్తుతం వరిపైరు కంకి, పొట్ట దశలో ఉండటం రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నెస్పీ లింగంగుంట్ల ఎస్ఈ పి.కృష్ణమోహన్ అక్టోబరు 30న సంఘటనా ప్రదేశాన్ని సందర్శించి చేపట్టాల్సిన నివారణ చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముందుగా పెరుమాళ్లపల్లి మేజరు కాలువలో పడిపోయిన మట్టి రాళ్లను తొలగించారు. ముఖ్యమైన కాంక్రీటు పనులను సోమవారం చేపట్టారు. రెండు మూడ్రోజుల్లో పనులు పూర్తవుతాయని, ప్రస్తుతం కుడికాల్వకు నీళ్లు వస్తే మేజరు కాల్వకు నీళ్లు ఇవ్వడానికి ఇబ్బంది లేకుండా పనులు పూర్తిచేసినట్లు ఎన్నెస్పీ ఏఈ యుగంధర్ తెలిపారు. మంగళవారం సాయంత్రానికి కుడి కాల్వకు నీళ్లు పెరిగే అవకాశం ఉందన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

కలెక్టరేట్ ఎదుట కౌలు రైతు సంఘం నేతల ధర్నా

నరసరావుపేట అర్బన్: జిల్లాలో తుపాను కారణంగా నష్టపోయిన కౌలు రైతులను ఆదుకోవాలని కోరుతూ ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కార్యక్రమాన్ని చేపట్టారు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ వర్తింప చేయకపోవడంతో పెట్టుబడి సాయం అందలేదని తెలిపారు. తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు పంటలు తీవ్రంగా నష్టపోయారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. నష్టపరిహారం కింద ఆహార పంటలు సాగు చేసిన వారికి ఎకరాకు రూ.25వేలు, వాణిజ్య పంటలు పత్తి, మిర్చి సాగు చేసిన వారికి రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తుపాను నష్టంపై సర్వే సక్రమంగా నిర్వహించాలని కోరారు. సంఘం నేతలు రాధాకృష్ణ, గోపాలరావు, రామారావు ఉన్నారు.

భూ వివాదాలపై ఫిర్యాదులు

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిష్కరించనున్నట్లు ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. బాధితుల గోడు ఆలకించి సత్వరమే పరిష్కారం చూపుతామన్నారు. కుటుంబ సమస్యలపై-18, పొలం వివాదాలు-58, ఉద్యోగాల పేరిట మోసాలు-05, ఆర్థిక మోసాలు-37, ఇతరాలు -49 మొత్తం 167 అర్జీలు అందినట్లు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ।కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 121, రిటైల్ ధర - 148, చికెన్ విత్‌స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్ - 244.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 252 చికెన్ స్కిన్‌లెస్ - 262.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 575 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.96/-.

91.9FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

EENADU eClassifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును(స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీనివాస గ్రూప్, VJA, వృద్ధులకు, పేషెంట్లసేవకు, ఇంటి/ వంట, బేబీకేర్‌కు వర్కర్లను భారతదేశం అంతటా పంపగలము. ✆ 9553786677/ 9640496677.

REAL ESTATE

HOUSE FOR SALE

GENERAL

గుంటూరు సిటీ SVNకాలనీ నందనవనంలో 466గ॥ ఇల్లు పడమర,దక్షిణం రోడ్లతో అమ్మకానికి కలదు. నోబ్రోకర్స్. డైరెక్ట్ 9849502430, 8341342696.

PLOT FOR SALE

GENERAL

మంగళగిరి గాలి గోపురం దగ్గరలో పోలేరమ్మ గుడి పక్క సందులో షాపులు నిర్మించుటకు అనువైన 60.5 గజాలు స్థలం అమ్మబడును. Ph: 83319 89433.

గుంటూరు: మా సంస్థలో CRDA అప్రూవ్డ్ ప్లాట్లు మార్కెటింగ్ చేయుటకు టీం లీడర్, ఎగ్జిక్యూటివ్ కావలెను. కమీషన్ + ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. 98498 86249.

JOBS

Wanted female nurse for home patient. Exp: BSc nursing & food and Nutrition. Timings: morning 6am to 6pm pls send ur Biodata with photo to following mail ID (staffbala5@gmail.com)

Senior Qualified lab Technician Wanted to work on Fully automatic analyser. 62815 06491.

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్/ మణప్పురం స్టాఫ్ HDFC/ AXIS బ్యాంక్, కర్నూలోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆ 8297675825.

WANTED HDFC BANK కొరకు గుంటూరు & ప్రకాశంజిల్లాలో పనిచేయుటకు **కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్** కావలెను. DRA సర్టిఫికేట్ కలిగినవారికి తొలి ప్రాధాన్యత. వెంటనే సంప్రదించండి. **లలితా ఫైనాన్స్ లింక్స్** కాంగ్రెస్ ఆఫీస్ రోడ్, విజయవాడ. ✆9951001348

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యూయర్స్. ఏజ్: 22-35. ఫ్రెషర్స్ కూడా కావలెను. ✆ 6281037879.

R.K **ఇంజనీరింగ్** కాలేజీ నందు పనిచేయుటకు ఎలక్ట్రీషియన్స్ కావలెను. అనుభవమును బట్టి జీతం + భోజనం + ఉచిత వసతి కల్పించబడును. కేతన కొండ, ఇబ్రహీంపట్నం మండలం, విజయవాడ, 97014 73399.

రాఘవ ఆటో ఫైనాన్సియర్స్, తెనాలి, బాపట్ల, చిలకలూరిపేట, నరసరావుపేటలో కలెక్షన్ చేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ కావలెను. శాలరీ: 15K-16K, TA, ఇన్సెంటివ్స్. వ: 21-35 సం॥. అర్హత: ఇంటర్ ఆపైన. టూ వీలర్ తప్పనిసరి. 91009 27415, 91547 46824.

గుంటూరు, ఆటోనగర్ HP పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు మేనేజర్, పంపు బాయ్స్/ గర్ల్స్ కావలెను. పార్ట్/ ఫుల్ టైమ్. 77996 89889, 80745 46302.

DSA ఏజన్సీ నందు పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం: 12 వేలు. సంప్ర: 99489 35879, 80081 00872. గుంటూరు.

ప్రముఖ ఐస్‌క్రీమ్ కంపెనీ నందు పనిచేయుటకు లేడీ రిసెప్షనిస్ట్ కం కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. అ: డిగ్రీ, ట్యాలీ. జీ: 15 - 20K. నల్లపాడు, గుంటూరు. 70323 51666.

మాచర్లలోని ఫైనాన్షియల్ ఆర్గనైజేషన్ నందు పనిచేయుటకు బ్రాంచ్ మేనేజర్, లోన్ ఆఫీసర్స్ కావలెను. అర్హత: డిగ్రీ/ పిజి రిటైర్డ్ బ్యాంకింగ్/ NBFC ఎంప్లాయిస్‌కి మరియు లోకల్ వారికి ప్రాధాన్యత. Ph: 78937 94796, 72074 94496, 81212 94296, 73373 94936.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/- 5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/- ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

WALK - IN - INTERVIEW విజన్ ఆటో మోటీవ్స్ ఆపె ఆటో షోరూమ్ గుంటూరు, తెనాలి, నరసరావుపేట, మంగళగిరి, పిడుగురాళ్ళ నందు పనిచేయుటకు ★ సేల్స్ మేనేజర్స్- 4 ★ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ - 15 ★ అకౌంటెంట్స్ -2 ★ సర్వీసు మేనేజర్ -1 ★ సర్వీసు సూపర్‌వైజర్స్- 4 ★ మెకానిక్స్- 6 కావలెను. విజన్‌ఆటో మోటీవ్స్, D.No. 18-4-23. బ్రహ్మానందరెడ్డి స్టేడియం దగ్గర గుంటూరు. ఇంటర్వ్యూ తేది: 04-11-25 నుండి 07-11-2025 వరకు. ఫోన్/ వాట్సప్: 77999 09045, 77999 09055. ఇమెయిల్: visionauto.guntur@gmail.com

గుంటూరు జిల్లా వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ హాస్టల్‌లో ఉండి పనిచేయుటకు వార్డెన్స్ కావలెను. (పురుషులు/ స్త్రీలు) డిగ్రీ/ పీజీ అర్హత. కాంటాక్ట్- 94903 09033 (F), 97058 34803 (M).

ప్రముఖ కంపెనీలో స్కానింగ్ కోసం అభ్యర్థులు అవసరం. అర్హత: ఇంటర్/ ఏదైనా డిగ్రీ, నరసరావుపేట. Ph: 9710545017.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

అక్రమ వసూళ్లు ఆపాలి

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : గ్రానైట్ పరిశ్రమలు నిర్వీర్యమయ్యే నిబంధనలు పెడుతున్న ఏఎంఆర్ సంస్థకు తిరిగి అనుమతులు పునరుద్ధరించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రానైట్, క్రషర్లు, కార్మికుల అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు చిలకలూరిపేటలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. పరిశ్రమల యజమానుల ఇబ్బందులను ఏకరవు పెట్టారు. ఏఎంఆర్ అక్రమ వసూళ్లను ఆపాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై సంబంధిత సంస్థతో చర్చిస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అన్ని విధాల సహకారం అందిస్తానన్నారు. అసోసియేషన్ నాయకులు ఒంటిపులి ఆంజనేయులు, చిలుకూరి చైతన్య, సుబ్బారావు, సరిపూడి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి చెకుముకి పోటీలు నేడు

శావల్యాపురం, న్యూస్‌టుడే : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి పోటీలు శావల్యాపురం జడ్పీ పాఠశాలలో మంగళవారం నిర్వహిస్తున్నట్లు మండల కమిటీ గౌరవ అధ్యక్షుడు కె.వి.ఆర్.మోహన్‌చంద్, కమిటీ సభ్యుడు బోయపాటి త్రివిక్రమ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే మండలంలోని 5 జడ్పీ పాఠశాలల్లో జరిగిన పాఠశాల స్థాయి సంబరాల్లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థుల బృందం పాల్గొంటారన్నారు. ఇక్కడ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచే బృందం జిల్లా స్థాయి పోటీలకు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక కమిటీ సభ్యులు ఆరేటి వసంతరావు, జ్యోతి శ్రీనివాసరావు, పసుమర్తి సురేష్, ఎలిక శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? పట్టణంలోని బాలయ్య నగర్ శివారున పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. విద్యుత్తు వృథా అరికట్టండి. - వివేక్, స్థానికుడు
✔ పగలు వీధి దీపాలు వెలగకుండా చర్యలు తీసుకుంటాం.
- చంద్రశేఖర్, వీధిదీపాల నిర్వహణాధికారి
– న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)

? చిలకలూరిపేట పట్టణంలో కల్యాణి హోటల్ నుంచి బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంక్ వైపు వచ్చే జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో కాలువ పక్కన విద్యుత్తు స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. - మాణిక్యరావు ✔ పరిశీలించి విద్యుత్తు స్తంభాలను సరిచేయిస్తాం. - కరుణాకర్, విద్యుత్తుశాఖ ఏఈ
– న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

? యల్లమంద పంచాయతీలోని కోడెల శివప్రసాదరావు కాలనీకి నీళ్ల ట్యాంకులు రాక వారం రోజులైంది. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. - బాజీ ✔ వెంటనే ఆ ప్రాంతానికి తాగునీటి ట్యాంకులు పంపి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.
- కృష్ణకుమారి, ఎంపీడీవో – న్యూస్‌టుడే, నరసరావుపేట సెంట్రల్

ఇదో కన్నీటి వ్యథ

గురుకుల పాఠశాలకు నిలిచిన నీటి సరఫరా
వారం రోజులుగా ఆ అగచాట్లు

న్యూస్‌టుడే, నూజండ్ల

ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న బాలికలు

మండలంలో ఉప్పలపాడు అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో నీటి కోసం విద్యార్థినులు వారం రోజులుగా అవస్థలు పడుతున్నారు. తాగేందుకు, వాడుకొనేందుకు నీరు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలకు గుండ్లకమ్మ నది నుంచి నీరు సరఫరా అవుతోంది. మొంథా తుపాను ప్రభావంతో వీచిన గాలులు, వర్షాలకు ఆ మార్గంలో విద్యుత్తు స్తంభాలు పడిపోయాయి. దీంతో మోటార్లు పనిచేయక నీటి సరఫరా నిలిచి పోయింది. విద్యుత్తు సరఫరా లేక వసతిగృహంలో అంధకారంలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆదివారం సాయంత్రానికి సింగిల్ ఫేజ్ సరఫరా మాత్రం ఇచ్చారు. దీంతో వారం రోజులుగా నీళ్ల లేక విద్యార్థినులు ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను ఎమ్మెల్యే, వినుకొండ మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ట్యాంకర్ ద్వారా సరఫరా చేయించారు. అయితే మూడు ట్యాంకర్లు మాత్రమే ఇవ్వడంతో సుమారు 700 మంది బాలికలు, ఉపాధ్యాయులకు అవి చాలక నానా ఇబ్బందులు పడుతున్నారు. రెండ్రోజులకోసారి స్నానాలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. తాగడానికి నీరందించే ఆర్వో పథకం పది నెలలుగా మూలకు చేరుకోవడంతో తాగునీరు నీరు కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అవి కూడా చాలీచాలకుండా ఉండటంతో పలువురు విద్యార్థినుల తల్లిదండ్రులు ఇంటి వద్ద నుంచి డబ్బాల్లో తాగునీరు తెచ్చివ్వడం గమనార్హం. పరిస్థితి తీవ్రంగా ఉన్నా నేటికీ విద్యుత్తు లైన్ ఏర్పాటు చేయలేదు. ఈ విషయమై ప్రిన్సిపల్ రమణమ్మ మాట్లాడుతూ అదనంగా మూడు ట్యాంకర్లు నీరు ఇవ్వాలని మున్సిపల్ అధికారులను కోరామన్నారు. విద్యుత్తు లైన్ ఏర్పాటు చేయాలని ఏడీఏను కోరినా స్పందన లేదన్నారు. ఆర్వో పథకం పాడవటంతో తాగునీటి సమస్య వచ్చిందన్నారు. అయినా తాగునీటిని కొనుగోలు చేసి విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపుగా కలెక్టర్ కృతికా శుక్లా నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్న అధికారులు మహ్మద్ హుస్సేన్ (తహసీల్దారు, చిలకలూరిపేట), సుభాష్‌చంద్రబోస్ (మున్సిపల్ కమిషనర్, వినుకొండ), శ్రీహరిబాబు (మున్సిపల్ కమిషనర్, చిలకలూరిపేట), రమేష్‌కుమార్ (తహసీల్దారు, నూజండ్ల), పాస్టర్ ప్రభుదాస్, వీఆర్ఏ గౌతమ్ (నూజండ్ల), వీఆర్వో జగన్మోహన్‌రావు (తిమ్మాపురం), శానిటరీ

ఉత్తమ సేవలకు గుర్తింపు

వినుకొండ, చిలకలూరిపేట గ్రామీణ, చిలకలూరిపేట పట్టణం, యడ్లపాడు, నూజండ్ల, న్యూస్‌టుడే : మొంథా తుపాను సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో అత్యవసర సేవలు అందించడంతో పాటు అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా కృషి చేసిన అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా సత్కరించారు. ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు.

విరాళం

వి.రెడ్డిపాలెం (రొంపిచర్ల), న్యూస్‌టుడే: మండలంలోని విప్పర్ల రెడ్డిపాలెంలో దాతల సహకారంతో శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, పక్కనే కల్యాణ మండపం నిర్మిస్తున్న విషయం తెలిసిందే. కల్యాణ మండపానికి అనుసంధానంగా మరో షెడ్డు నిర్మాణం చేపట్టారు. దీనికి గుంటూరుకు చెందిన ఈసీఎస్ కంపెనీ ఎండీ మంజునాథరెడ్డి రూ.1.85లక్షలు అందజేశారని ఆలయ ట్రస్టు సభ్యుడు పొలిమేర వెంకటరెడ్డి సోమవారం తెలిపారు.

క్షేత్రస్థాయి పరిశీలన

రొంపిచర్ల, న్యూస్‌టుడే: మండలంలో పీఎంశ్రీ ఏపీ మోడల్ స్కూల్, కళాశాల విద్యార్థులు పారిశ్రామిక సందర్శనలో భాగంగా ఓ వాహన దుకాణాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాల్లో చదివిన పలు అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే త్వరగా అర్థమవుతుందన్నారు. ఈ సందర్భంగా డీజిల్, పెట్రోల్ ఇంజన్లతో నడిచే వాహనాలు, వాటి పనితీరు, అధునాతన ఎలక్ట్రిక్ వాహనాలను విద్యార్థులు పరిశీలించి వాటి పనితీరు తెలుసుకున్నారు.

నూజండ్ల: రవ్వారం రామలింగేశ్వరుడు | వినుకొండ: విఠంరాజుపల్లిలో బాణలింగేశ్వరుడు | యడ్లపాడు: రాజరాజేశ్వరి ఆలయంలో

అభిషేక ప్రియా.. అంజలులివిగో

నూజండ్ల: అయ్యప్ప ఆలయంలో..

రొంపిచర్ల, చిలకలూరిపేట పట్టణం, చిలకలూరిపేట గ్రామీణ, యడ్లపాడు, వినుకొండ రూరల్, నూజండ్ల, న్యూస్‌టుడే: నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ నియోజకవర్గాల్లోని శైవక్షేత్రాలు కార్తిక మాసం రెండో సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే ఆలయాల వద్ద మహిళలు పెద్ద ఎత్తున దీపారాధనలు చేశారు. లింగాకారంలో దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఏకాహం భజనలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చిలకలూరిపేట: ఉమామహేశ్వరస్వామి | రొంపిచర్ల: విప్పర్లలో వల్లభేశ్వరుడు | రొంపిచర్ల: వడ్లమూడివారిపాలెంలో నీలకంఠేశ్వరుడు

పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తా: బొల్లా

వినుకొండ, న్యూస్‌టుడే: పోలీసులు వైకాపా నాయకులను వేధిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆరోపించారు. తన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలులో భాగంగా తమ కార్యకర్తలను తీసుకొచ్చి ఇష్టానుసారం కొడుతున్నారన్నారు. ఇటీవల ఓ కార్యకర్త అనారోగ్యంతో ఉన్నప్పటికీ హింసించారని ఆరోపించారు. ఇలాగే కొనసాగిస్తే తాము చూస్తూ ఊరుకోమని పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో న్యాయవాది ఎంఎన్ ప్రసాద్, మైనార్టీ సెల్ నాయకుడు పీఎస్ ఖాన్ తదితరులున్నారు.

దౌర్జన్యాలకు కాలం చెల్లింది: తెదేపా

వినుకొండ, న్యూస్‌టుడే: పెళ్లి ఊరేగింపు పేరుతో వైకాపా నాయకులు గొడవ చేస్తుంటే ఆపడానికి వెళ్లిన పోలీసులపై తిరగబడితే ఊరుకోవాలా? ఇదేనా మీరు చెప్పే న్యాయం..అంటూ తెదేపా నాయకులు ప్రశ్నించారు. ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత నెల 16న డీజే పెట్టి తెదేపా నాయకుల ఇళ్ల వద్ద ఆపి రెచ్చగొట్టడం, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకు వ్యతిరేకంగా ఎందుకు నినాదాలు చేశారో చెప్పాలన్నారు. గొడవలు జరగకుండా ఆపడానికి వెళ్లిన పోలీసులపై దాడి చేసి ఇప్పుడు అన్యాయంగా కేసు పెట్టారంటూ మాజీ ఎమ్మెల్యే బొల్లా చెప్పడం హాస్యాస్పదమన్నారు. వైకాపా పాలన తరహాలో ఇప్పుడు దాడులు, దౌర్జన్యాలు చేయాలంటే కుదరదని వారు హెచ్చరించారు. సమావేశంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి షమీమ్‌ఖాన్, లీగల్‌సెల్ రాష్ట్ర నాయకులు, రామకోటేశ్వరరావు, సైదారావు, ఐడీసీ డైరెక్టర్ పెమ్మసాని నాగేశ్వరరావు, మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ మురళీకృష్ణయాదవ్, న్యాయవాది సిద్ధయ్య, ఎస్సీ సెల్ నాయకులు దాసయ్య తదితరులు ఉన్నారు.

మహిళా నేతల సంబరాలు

మహిళా నాయకులతో కలిసి కేక్ కోస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

పండరీపురం(చిలకలూరిపేట పట్టణం), న్యూస్‌టుడే : భారత మహిళా క్రికెటర్లు అద్భుత ప్రతిభ కనబరిచి ప్రపంచ కప్పు గెలిచిన సందర్భంగా చిలకలూరిపేట తెదేపా మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఎస్కే రఫాని, జనసేన ఇన్‌ఛార్జి తోట రాజా రమేష్, మార్కెట్‌యార్డు ఛైర్మన్ కరీ ముల్లా, తెదేపా నాయకులు నెల్లూరి సదాశివరావు, పఠాన్ సమద్‌ఖాన్, రవి, నజీరున్నీసాబేగం తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

కనపర్రు (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే : నాదెండ్ల మండలం కనపర్రులో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాలతో తెదేపా ఆధ్వర్యంలో కాటూరి వైద్య కళాశాల సహకారంతో సోమవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని గ్రామ పెద్దలు ప్రారంభించారు. శిబిరంలో 350 మంది రోగులకు రక్తపోటు, మధుమేహం, ఈసీజీ తదితర వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు అందజేశారు. గ్రామ పెద్దలు వజ్జా సింగయ్య, నాతాని రాఘవయ్య, మల్లవరపు రాజు, పూదోట అంకయ్య, పచ్చ మోహన్‌రావు బండారుపల్లి రమేష్, జాగర్లమూడి రాము, నరిశెట్టి చిన్నయ్య, యంపరాల కృష్ణ తదితరులు సహకరించారు.

బహుమతులు అందుకున్న బాలికలతో మోడరన్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీరాములు

విజేతలతో ప్రధానోపాధ్యాయులు

సృజన చాటి.. బహుమతులు పట్టి

'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు

నరసరావుపేట అర్బన్, చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: పాఠశాల, కళాశాలల విద్యార్థులకు 'ఈనాడు' నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీలు సందడిగా సాగుతున్నాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. జిల్లా కేంద్రం నరసరావుపేటలో ప్రకాశ్‌నగర్‌లోని తిలక్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'మీకు నచ్చిన పండుగలు' అంశంపై సోమవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులు మహాలక్ష్మి (9వ తరగతి), వర్షిత (8వ తరగతి), షేక్ ఫహీమ్ (9వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు ప్రధానోపాధ్యాయులు జీవీ రమణరావు బహుమతులు అందించి అభినందించారు. ఉపాధ్యాయిని పావని పాల్గొన్నారు. ✦ చిలకలూరిపేట మోడరన్ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రకృతి అందాలు (పర్వతాలు, నదులు, చెట్లు, జంతువులు) అంశంపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు తమ సృజనకు పదును పెట్టారు. విద్యార్థినులు ప్రగఢ ధనలక్ష్మి, షేక్ జాస్మిన్, దాసరి వర్ష వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ప్రిన్సిపల్ చేబ్రోలు శ్రీరాములు, ఇన్‌ఛార్జిలు గుమ్మడి రాజు, గోవిందు మహావిష్ణుమూర్తి వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ప్రకృతి వ్యవసాయం లాభసాటి

మాట్లాడుతున్న డీఏవో జగ్గారావు, చిత్రంలో డీపీఎం, తదితరులు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: కల్తీ లేని ఆహారంతో భావితరాలు ఆరోగ్యకరమైన జీవనం సాగించగలరని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు అన్నారు. ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం కింద కొత్తగా ఎంపికైన గ్రామాల్లోని పీఏసీ ఆర్పీలకు రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటైన అయిదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజరు కె.అమలకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో 9 సార్వత్రిక సూత్రాలు అవలంబించాలన్నారు. తద్వారా ఆరోగ్యకరమైన ఉత్పత్తులు, ఖర్చు తగ్గి ఆదాయాన్ని పొందవచ్చునన్నారు. ఏ గ్రేడ్ మోడల్‌లో పంటలను సాగు చేస్తూ 365 రోజులు భూమి పచ్చగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు డీపీఎం ప్రేమ్‌రాజ్, జిల్లా ఎన్ఎఫ్ఏలు సైదయ్య, సౌజన్య, నందకుమార్, మేరీ, అప్పలరాజు, మాస్టర్ ట్రైనర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

టైర్ పగిలి.. మినీ లారీ బోల్తా

✦ ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు
✦ అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా ఘటన

నాదెండ్ల (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: నాదెండ్ల - తిమ్మాపురం మార్గంలో సోమవారం తెల్లవారుజామున ఓ మినీ లారీ టైర్ పగిలి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో అందులో ఉన్న ఒడిశాకు చెందిన కూలి బఫూన్‌మాలిక్ దుర్మరణం చెందాడు. మరో ఇద్దరు కూలీలు ప్రభాత్‌మాలిక్, సర్వేశ్వర్ మాలిక్, డ్రైవర్లు గాయపడ్డారు. వీరిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఫిరంగిపురం నుంచి సాతులూరు, తూబాడు, నాదెండ్ల, తిమ్మాపురం మీదుగా చిలకలూరిపేటకు మినీ లారీలో 35 బస్తాల రేషన్‌బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. లారీతో పాటు బియ్యం, స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుల్లారావు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

కావూరు(చిలకలూరిపేట గ్రామీణ): మండల పరిధిలోని కావూరు వద్ద గత నెల 31న సంభవించిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న తలారి పిచ్చయ్య (45) గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు గ్రామీణ ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. నాదెండ్ల మండలం ఎండుగుంపాలెంకు చెందిన తలారి పిచ్చయ్య, అతని భార్య మరియమ్మ ద్విచక్రవాహనంపై చిలకలూరిపేటకు వస్తుండగా ఆటో ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన ఇద్దరిని గుంటూరు జీజీహెచ్‌లో చేర్పించిన విషయం తెలిసిందే.

కాటికాపరి హత్య కేసులో నిందితుడికి రిమాండ్

నరసరావుపేట లీగల్, న్యూస్‌టుడే: కాటికాపరి హత్య కేసులో నిందితుడికి మొదటి అదనపు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఎ.సలోమి ఆదివారం రాత్రి రిమాండ్ విధించినట్లు గ్రామీణ సీఐ రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గత నెల 18న మండలంలో రావిపాడు రోడ్డులోని స్వర్గపురి-2లో పట్టణంలోని క్రిస్టియన్‌పాలెంకు చెందిన కాటికాపరి ఎఫ్రాన్ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో మృతుడి సహాయకుడు కట్టా నాగరాజును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. కాగా హత్య కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడితో పాటు మరికొంతమంది ఉన్నారనే అనుమానాలు ఉన్నాయని, ఆ కోణంలో దర్యాప్తు చేసి త్వరలో నిందితులను పట్టుకుంటామన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టదా!

పట్టణంలో ఓ ప్రైవేటు సంస్థ ఏర్పాటు చేసిన తీగల మరమ్మతు పేరిట ఇష్టానుసారం గుంతలు తవ్వేస్తున్నారు. దీంతో వాహనచోదకులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. రైల్వేస్టేషన్ రోడ్డు నుండి లింగంగుంట్ల వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డు పక్కన గుంత తవ్వి వదిలేశారు. రోజులు గడుస్తున్నా పూడ్చలేదు. ఆదివారం రాత్రి ఓ ద్విచక్ర వాహనచోదకుడు గుంతలో పడి గాయాలపాలయ్యారు. మరిన్ని ప్రమాదాలు సంభవించక ముందే అధికారులు స్పందించి కనీసం అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. దీనిపై మున్సిపల్ ఏఈ జ్యోతిని వివరణ అడగ్గా గుంతలు త్వరగా పూడ్చాలని సంబంధిత సంస్థకు సూచిస్తామన్నారు. స్పందించకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)

సంప్రదాయబద్ధంగా కార్తిక సమారాధన

శావల్యాపురం, న్యూస్‌టుడే : శావల్యాపురంలో రైల్వే గేటు వద్ద గల శ్రీ కోదండ రామాలయంలో కార్తిక వనసమారాధనను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉసిరి చెట్టు వద్ద శివ పార్వతుల చిత్రపటాన్ని ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు

మదమంచిపాడులో మాజీ ఎమ్మెల్యే పూజలు

వినుకొండ రూరల్: పవిత్ర కార్తిక మాసంలో ఆనవాయితీగా వన సమారాధన నిర్వహించడం అభినందనీయమని జీడీసీసీబీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు అన్నారు. వినుకొండ పట్టణ దాల్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మదమంచిపాడు వీరాంజనేయస్వామి దేవస్థానం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని తొలుత పూజలు చేశారు. ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు గుడివాడ గుర్నాథం, రెడ్డి వెంకటరత్నం, మోటుమర్రి నరసింహారావు, పువ్వాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలోని మసీదుల్లో పేష్కామ్, ఇమాం, మౌజన్‌లుగా పనిచేస్తున్న వారికి వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ కలెక్టర్ కృతికా శుక్లాకు వినతిపత్రం అందజేశారు. కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు వచ్చిన మత పెద్దలు తమకు 14నెలలుగా వేతనాలు రావాల్సి ఉందని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఇమాంలు ముఫ్తీ మహమ్మద్ రైస్, మౌలానా షాహిద్ రెజా, లాల్‌అహ్మద్, ఇమాంబాషా, నాయబ్‌బజారు కమిటీ అధ్యక్షుడు మస్తాన్‌వలి తదితరులు ఉన్నారు.

సేవలకు పురస్కారం

వినుకొండ, న్యూస్‌టుడే: సమాజంలో పలు సేవలకు గుర్తింపుగా యంగ్‌స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్‌కు విశ్వజనని ఫౌండేషన్ సేవారత్న పురస్కారం ప్రకటించింది. ఈమేరకు హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ బొగ్గవరపు బ్రహ్మానందం తదితరులు సేవా సంస్థ సభ్యులు పమిడిపల్లి అనిల్‌రాజ్, గుమ్మడి మనోహర్ బాబుకు శాలువాలు కప్పి జ్ఞాపిక అందజేశారు.

ఆలయ నగదు పక్కదారిపై ఫిర్యాదు

చిరుమామిళ్ల(చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే : నాదెండ్ల మండలం చిరుమామిళ్లలోని శ్రీ త్రికోటేశ్వరస్వామి ఆలయానికి ధూప, దీప నైవేద్యాలకు ప్రభుత్వం ప్రతినెలా ఇచ్చే రూ.10వేలు పక్క దారి పట్టాయి. దీనిపై గ్రామస్థులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఓ వ్యక్తి నకిలీ ధ్రువపత్రాలతో నగదు తన ఖాతాలో పడేలా చేశారని, అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

చుక్క నీరివ్వదు!

మండలంలోని తిమ్మాయిపాలెంలో దొండపాడు రోడ్డు పక్కన చేతిపంపు పాడైంది. విద్యుత్తు లేని సమయంలో స్థానికులు నీటి కోసం ఈ చేతిపంపును ఆశ్రయిస్తారు. కొంతకాలంగా పనిచేయనందున ఇబ్బందులకు గురవుతున్నారు. దీని చుట్టూ గడ్డి పెరిగింది. అధికారులు స్పందించి చేతి పంపునకు మరమ్మతులు చేయించి బిందెలు పెట్టేందుకు వీలుగా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి వెంకటకృష్ణను సంప్రదించగా వెంటనే మరమ్మతులు చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, వినుకొండ రూరల్

ఈ ప్రయాణం సురక్షితమేనా?

ప్రమాదమని తెలిసినా కొందరు రహదారి నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆటోలపై కూర్చుని పట్టణాలకు ప్రయాణాలు సాగిస్తున్నారు. అకస్మాత్తుగా బ్రేక్ వేస్తే అదుపు తప్పి కింద పడటం ఖాయం. వినుకొండ పట్టణంలో వెల్లటూరు రోడ్డులో సోమవారం నాలుగు చక్రాల ఆటోపై అరడజను మంది పైగా ఎక్కి వస్తున్నారు. వారిలో చిన్నారులూ ఉండడం గమనార్హం. – న్యూస్‌టుడే, వినుకొండ

అశ్రుతాంజలి

మంచికి మారుపేరు, సహనశీలి, మహోన్నత వ్యక్తి, పలకరింపుతో అందరి హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు.
ఎంతో మంది విద్యార్థిని విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన మీరు నేడు మా నుండి దూరమైనారు..
మీ మధుర స్మృతులు మా మదిలో పదిలం.
మీ అకాల మరణానికి చింతిస్తూ...
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ పోట్లూరి వరలక్ష్మమ్మ గారు, విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు
జననం: 21-06-1942 నిర్యాణం: 03-11-2025

ఇట్లు
కుమారుడు పోట్లూరి మురళీకృష్ణ
కుమార్తె డా॥ కృష్ణకుమారి
మరియు బంధుమిత్రులు

అంత్యక్రియలు: ది.04-11-2025, మంగళవారం మధ్యాహ్నం 1.00 గంటలకు వినుకొండలోని మా స్వగృహం నుండి బయలుదేరును.

(c) eenadu

సత్తెనపల్లి

•సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

మహిళా క్రికెట్ జట్టుకు అభినందనలు

తెదేపా కార్యాలయంలో వేడుకల్లో నాయకులు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: ఐసీసీ మహిళల ప్రపంచ కప్ గెలుచుకున్న భారత్ జట్టుకు పట్టణంలోని కూటమి మహిళా నాయకురాళ్లు సోమవారం అభినందనలు తెలిపారు. భారత జట్టు దక్షిణాఫ్రికా జట్టుపై 52 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించినట్లు గుర్తు చేశారు. పట్టణంలోని తెదేపా కార్యాలయంలో కేక్ కోశారు.

రెంటచింతలలో నారా రోహిత్

రెంటచింతల, న్యూస్‌టుడే: సినీ నటుడు నారా రోహిత్ సోమవారం రాత్రి రెంటచింతల వచ్చారు. గ్రామానికి చెందిన లేళ్ల నాగేశ్వరరావు కుమార్తె శిరీషను అక్టోబరు 30న హైదరాబాద్‌లో రోహిత్ వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానంతరం వధూవరులు రెంటచింతలకు వచ్చారు. శిరీష కుటుంబ సభ్యులు వారికి స్వాగతం పలికారు.

కుటుంబ సభ్యులతో శిరీష, రోహిత్

రాష్ట్ర కబడ్డీ పోటీలకు ఎంపిక

ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్లు, పీఈటీలు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పట్టణంలోని స్కాలర్స్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు డైరెక్టరు జి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలబాలికల జట్ల ఎంపికలు నరసరావుపేటలో జరిగాయి. బాలికల విభాగంలో కె.రాఘవమ్మ, బాలుర విభాగంలో కె.నాని, ఎం.వెంకట అఖిల్, డి.నరేంద్రరెడ్డి ఎంపికైనట్లు చెప్పారు. ఈనెల 7,8,9 తేదీల్లో కర్నూలులో పోటీలు జరుగుతాయన్నారు. వారిని డైరెక్టర్ జగదీష్‌రెడ్డి, పీఈటీలు అభినందించారు.

* తిరుమల ఆక్స్‌ఫర్డు పాఠశాల విద్యార్థులు కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు డైరెక్టరు గిరిబాబు తెలిపారు. బాలుర విభాగంలో చందు, బాలికల విభాగంలో పుష్పలత ఎంపికైనట్లు వివరించారు.

సైకిల్ తొక్కు.. ఆరోగ్యం దక్కు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: జీవనశైలిలో మార్పులు, ఒత్తిడి, ఆహార అలవాట్లతో దీర్ఘకాలిక వ్యాధులు చుట్టుముడుతున్నాయి. శారీరక, మానసిక సమస్యలతో చాలామంది బాధపడుతున్నారు. దీనికి తోడు వాయు కాలుష్యం ఆరోగ్య సమస్యలకు కారణమవుతోంది. సైక్లింగ్‌తో ఆరోగ్యంతో పాటు కాలుష్యానికి చెక్ పెట్టొచ్చు. అందుకే కొందరు మోటారు వాహనాలను పక్కనపెట్టి సైకిళ్లపై రయ్‌మంటూ వెళ్తున్నారు.

ఆరోగ్య సమస్యలు దరిచేరలేదు

పదేళ్ల నుంచి సైక్లింగ్ చేస్తున్నా. రోజూ మూడు కిలోమీటర్లు సైకిల్ తొక్కుతున్నా. దీనివల్ల ఆరోగ్యంగా ఉంటున్నా. అనారోగ్య సమస్యలు నా దరిచేరలేదు. అలసట, శారీరక బలహీనతలు దూరమయ్యాయి. స్నేహితులకు కూడా సైక్లింగ్ అలవాటు చేస్తున్నా.
– బి.షారోన్‌కుమార్, సీనియర్ డేటా రీసెర్చ్ అనలిస్టు

అవగాహన కల్పిస్తున్నా

సైక్లింగ్‌తో పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు. వాయు కాలుష్యానికి పూర్తిగా చెక్ పెట్టేందుకు ఉపకరిస్తుంది. పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నా.
– ఎస్.నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యాయుడు

చురుగ్గా ఉంటున్నా

బాల్యదశ నుంచే సైక్లింగ్ అలవాటైంది. మధుమేహం, గ్యాస్ సంబంధ సమస్యలు వచ్చిన తరువాత సైకిల్‌తో మరింత అనుబంధం పెంచుకున్నా. జీర్ణ సంబంధ సమస్యలు తొలగిపోయాయి. శరీరానికి శ్రమతోపాటు మెదడు పనితీరు మెరుగ్గా ఉంటుంది. 64 ఏళ్ల వయసులో చురుగ్గా ఉండేందుకు సైక్లింగ్ దోహదం చేస్తోంది.
– జి.వెంకటేశ్వర్లు, ముఠా మేస్త్రి

నాన్న నేర్పిన మంచి అలవాటు

నాన్న నేర్పిన మంచి అలవాట్లలో సైక్లింగ్ ఒకటి. ఐదో తరగతిలోనే నాన్న సైకిల్ కొనిచ్చారు. సైకిల్ తొక్కితే ఉత్తేజం నింపుతుంది. పని ఒత్తిడి.. ఆనందంలో సైక్లింగ్ భాగమైంది. శారీరక, మానసిక ప్రశాంతతకు ఉత్తమ వ్యాయామంగా యువతకు దోహదపడుతుంది.
– జె.శ్రీనివాస్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

అమ్మితే అడవి.. కొంటే కొరివి

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే

అన్నదాత ఆరుగాలం కష్టపడి పండించిన కూరగాయలకు గిట్టుబాటు ధర లభించటం లేదు. వ్యవసాయ ఖర్చులు, కూలీ రేట్లు, ఎరువులు, పురుగు మందుల ధరలు పెరుగుతున్నాయి. ఆ మేరకు కూరగాయలకు రేట్లు పెరగడం లేదు. అన్నదాత పరిస్థితి అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి అనే చందంగా తయారైంది. తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిన్నారు. కూరగాయలకు మచ్చలు ఏర్పడ్డాయని, పురుగు పట్టిందన్న సాకుతో దళారులు రైతులను మోసగిస్తున్నారు. తక్కువ ధరకు కొని, మార్కెట్‌లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. వ్యాపారులు అధిక ధరలకు విక్రయించి జేబులు నింపుకొంటున్నారు. కష్టపడి పండించిన పంట కూలీలకే సరిపోతుందని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూరగాయలు	మార్కెట్ ధర	రైతు వద్ద (రూ.లలో)
టమాట	40	10
దోస	60	30
కాకర	60	30
బెండ	60	25
పచ్చిమిర్చి	50	18
బీరకాయ	60	30

★ జూలకల్లు గ్రామానికి చెందిన ఓ రైతు వర్షానికి ముందు పచ్చి మిరపకాయలు కిలో రూ.30 చొప్పున వ్యాపారులకు విక్రయించారు. శనివారం కాయలు కోయగా కిలో రూ.18కి ఇవ్వాలని వ్యాపారులు చెప్పడంతో దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. ధర తగ్గడంతో రూ.50 వేలు రాబడి కోల్పోయారు. ★ పందిటివారిపాలెం గ్రామానికి చెందిన మరో రైతు మరోరకం పచ్చి మిరపకాయలు గతంలో కిలో 20 చొప్పున అమ్మారు. వర్షం పడిన తర్వాత కిలో రూ.12కే విక్రయించాల్సి వస్తోంది. ★ బెండకాయలు కిలో రూ.25, కాకర రూ.25తో రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు.

బెల్లంకొండ కోటను అభివృద్ధి చేయరూ..

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు విన్నవిస్తున్న నాయకులు

బెల్లంకొండ, న్యూస్‌టుడే: చారిత్రక బెల్లంకొండ కోటను అభివృద్ధి చేయాలని కమిటీ కన్వీనర్ శివారెడ్డి కోరారు. సోమవారం ఆయన గుంటూరు మిర్చియార్డు మాజీ ఛైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మస్తాన్ షరీఫ్, తెదేపా మండల అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, సర్పంచి జ్యోతి సముద్రం తదితరులతో కలిసి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు విన్నవించారు. కోట నిర్మాణాలు పటిష్ఠంగా ఉన్నాయని, పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని విన్నవించారు. ఘాట్ రోడ్డు నిర్మిస్తే పర్యాటకుల సంఖ్య పెరుగుతుందన్నారు.

ఇళ్ల స్థలాలు చూపండి

దాచేపల్లి, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలు చూపించాలంటూ 14వ వార్డు కౌన్సిలర్ షరీఫ్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలోని పేదలకు నివాస స్థలాలు మంజూరు చేసి, సుమారు వెయ్యి మంది లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చారన్నారు. రిజిస్ట్రేషన్ చేసినప్పటికీ స్థలాలకు హద్దులు వేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

సర్వే పూర్తి చేయాలి

కారంపూడి, న్యూస్‌టుడే: జాతీయ ఆరోగ్య కార్యక్రమాల సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా ఉప వైద్యాధికారి పద్మావతి అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే నివేదికలు, గర్భిణులు, శిశువుల వివరాల నమోదు, వ్యాధి నిరోధక టీకాల లక్ష్యాలు, అంగన్వాడీ కేంద్రాల విద్యార్థుల ఆరోగ్య పరిశీలన చర్యలు తదితర వివరాలు సేకరించారు. పలు దస్త్రాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యులు రమ్య, లక్ష్మీమానిక తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో దస్త్రాలు పరిశీలిస్తున్న జిల్లా ఉపవైద్యాధికారి పద్మావతి

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ఇంటింటికీ తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 8వ వార్డులో పార్టీ శ్రేణులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ గెలుపే ధ్యేయంగా సమష్టిగా కృషి చేయాలన్నారు. వార్డులో సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ రామస్వామి, నాయకులు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, ర్యాంబాబు, వెంకటకోటయ్య పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

మొర్జంపాడులో బుగ్గమల్లేశ్వర స్వామి

దైదలో అమరలింగేశ్వరస్వామి

ముప్పాళ్ల: భీమేశ్వరస్వామి

కార్తిక వైభవం

కార్తిక మాసం సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో సందడిగా మారాయి. సోమవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి కార్తిక దీపాలు వెలిగించి, మొక్కులు చెల్లించారు. అమరావతి, సత్రశాల, దైద క్షేత్రాల వద్ద కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు, పోలీసులు పర్యవేక్షించారు.
- న్యూస్‌టుడే, బృందం

పిడుగురాళ్ల: గంగమ్మ తల్లి

న్యూవెల్లంపల్లిలో బొడ్డురాయి ప్రతిష్ఠ

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని న్యూవెల్లంపల్లిలో బొడ్డురాయి ప్రతిష్ఠ సోమవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణ మధ్య ప్రతిష్ఠ, అనంతరం హోమం నిర్వహించారు.

ఖోఖోలో జయకేతనం

రెంటచింతల, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో సెయింట్ జోసెఫ్ ఉన్నతపాఠశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. అండర్-14 విభాగంలో జేమ్స్, శ్యామ్, గీత, నాగలక్ష్మి, అండర్-17 విభాగంలో దివ్య, ధనుష్మైలీ సత్తా చాటారు. కరస్పాండెంట్ గోవింద బాలస్వామి, ప్రధానోపాధ్యాయుడు దుర్గాప్రసాద్ తదితరులు విజేతలను అభినందించారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

పెదకూరపాడు, న్యూస్‌టుడే: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఆధ్వర్యంలో సోమవారం పెదకూరపాడులో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి రమేష్ ఉపాధ్యాయులతో సభ్యత్వాలు నమోదు చేయించారు. ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ పరీక్ష రద్దు చేయాలని, పీఆర్సీని వెంటనే ప్రకటించి, డీఏ బకాయిలు, సరెండర్ లీవ్‌లకు నగదు త్వరితగతిన చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

నాడు కళావిహీనం.. నేడు పచ్చనిహారం

సత్తెనపల్లి రైల్వేస్టేషన్ రోడ్డులోని వావిలాల ఘాట్ గతంలో ముళ్లకంపలు, అక్రమ నిర్మాణాలు, పిచ్చిచెట్లతో కళావిహీనంగా ఉండేది. ఇటీవల రూ.12 కోట్లతో వావిలాల ఘాట్‌ను పార్కుగా, చెరువును తారకరామసాగర్ వాకింగ్ ట్రాక్‌గా అభివృద్ధి చేశారు. పర్యాటకంగా ఎంతో ఆకర్షణీయంగా మారింది. **- న్యూస్‌టుడే, సత్తెనపల్లి**

నడవాలన్నా ఇబ్బందులే

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని 28వ వార్డు దోబీఘాట్‌లో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. మురుగు నీటి కాలువలు లేకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపైనే నీరు నిలిచింది. మురుగు, వర్షపు నీటి నిల్వతో దుర్వాసన వెదజల్లుతోంది. రోడ్లు, కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

తుపాను సహాయక చర్యలు భేష్

గురజాల: గురజాల ఆర్డీవో మురళీకృష్ణ తుపాను సమయంలో తీసుకున్న చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయని కలెక్టరు కృతికా శుక్లా అన్నారు. ఆర్డీవోను సోమవారం కలెక్టరేట్‌లో సన్మానించారు. ఎస్పీ కృష్ణారావు పాల్గొన్నారు.

పాఠశాలకు ల్యాప్‌టాప్ అందజేత

రెంటచింతల, న్యూస్‌టుడే: మంచికల్లు జడ్పీ ఉన్నత పాఠశాలకు ఎంఎల్ఆర్ సేవా సంస్థ ల్యాప్‌టాప్‌ను విరాళంగా అందించినట్లు హెచ్ఎం సిలార్ అహమ్మద్ తెలిపారు. విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యం పెంచేందుకు వినియోగిస్తామన్నారు. సేవాసంస్థ మేనేజరు కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ మనుగడకు నాటకాలు

అమరావతి, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే శంకరరావు రాజకీయ మనుగడ కోసం నాటకాలు వేస్తున్నారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ విమర్శించారు. వైకాపా నేతలకు రైతుల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. అధికారంలో ఉన్నన్నాళ్లు రైతుల గోడు పట్టించుకోకుండా, వారిని వేధించిన చరిత్ర వైకాపా నాయకులది అన్నారు. ఇప్పుడు చుట్టపు చూపుగా వచ్చి వారిపై ప్రేమ ఒలకబోస్తే నమ్మడానికి ఎవరూ సిద్ధంగా లేరని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే రూ.120 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: రబీలో మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు విధిగా విత్తనశుద్ధి చేయాలని ఏరువాక కేంద్రం సమన్వయకర్త నగేష్, ప్రధాన శాస్త్రవేత్త(విస్తరణ) పీవీ సత్యగోపాల్ చెప్పారు. గ్రామీణ అవగాహన కృషి అనుభవ పథకంలో భాగంగా నార్నెపాడులో ఎన్‌జీ రంగా వ్యవసాయ విద్యాలయం విద్యార్థినులు నిర్వహించిన రైతు శిక్షణ శిబిరంలో వారు మాట్లాడారు. ఈనెల 15వ తేదీ వరకు మొక్కజొన్న సాగు చేయవచ్చన్నారు. విత్తన రకాలు, శుద్ధి, చీడపీడలు, సమగ్ర సస్యరక్షణ చర్యలపై అన్నదాతలకు అవగాహన కల్పించారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

స్వయం ఉపాధి పథకాలపై అవగాహన 5న

గుంటూరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఎస్సీల అభ్యున్నతికి అమలు చేస్తున్న స్వయం ఉపాధి పథకాల గురించి తెలియజేసేందుకు ఈనెల 5వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు గుంటూరులోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం పక్కనున్న రెవెన్యూ భవన్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె.శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా మొదటి, మూడో బుధవారాలు అవగాహన కల్పించాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఎండీ ఆదేశించారన్నారు. సదస్సుకు ఎస్సీ నిరుద్యోగ యువత హాజరుకావాలని సూచించారు.

రైల్వేగేటు మూసివేత

రెంటచింతల, న్యూస్‌టుడే: మాచర్ల-నడికుడి రైల్వేస్టేషన్ పరిధిలోని పాలువాయి రైల్వేగేటును రెండ్రోజులు మూసివేస్తున్నట్లు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రాజేష్ తెలిపారు. ట్రాక్ మరమ్మతుల కోసం మంగళ, బుధవారం మూసివేస్తున్నామన్నారు. గుంటూరు-మాచర్ల రోడ్డులో ప్రయాణించే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు, ప్రజలు ప్రత్యామ్నాయ రహదారుల్లో రాకపోకలు సాగించాలని ఆయన సూచించారు. మాచర్ల-గుంటూరు ప్యాసింజరు రైలు యథావిధిగా నడుస్తుంది.

పంట పొలాల పరిశీలన

అమరావతి, న్యూస్‌టుడే: మొంథా తుపానుతో దెబ్బతిన్న పంట పొలాలను మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పరిశీలించారు. నరుకుళ్లపాడు, ధరణికోట, మునగోడు గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించి, రైతులతో మాట్లాడారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

చిత్రలేఖనంలో ప్రతిభ

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

మాచర్ల (కారంపూడి): చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపారు. మాచర్లలోని నారాయణ హైస్కూల్‌లో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులు నేహా, లక్ష్మీహర్షిణి, ప్రవల్లిక ప్రతిభ చాటారు. వీరికి ప్రిన్సిపల్ ఉల్లారెడ్డి, ఉపాధ్యాయులు రవీంద్రనాయక్, ఉదయలక్ష్మి, ఆంజనేయులు బహుమతులు ప్రదానం చేశారు.

నాటుసారా స్వాధీనం

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: మాచర్ల మండలం హస్నాబాద్‌తండాలో 10 లీటర్ల నాటుసారాను స్వాధీనపరచుకున్నట్లు విజయపురిసౌత్ ఎస్సై అశోక్ తెలిపారు. ఎస్సై ఆధ్వర్యంలో నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించారు. 15 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నిందితుడు బాలునాయక్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ దుకాణాల తనిఖీ

దుర్గి, న్యూస్‌టుడే: దుర్గిలోని పలు రేషన్ దుకాణాలను సోమవారం సీఎస్‌డీటీ బాషా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. కార్డుదారులతో మాట్లాడి రేషన్ సరకులు సక్రమంగా అందజేస్తున్నారా? అంటూ ఆరా తీశారు.

ఉపాధ్యాయ దంపతులకు సత్కారం

అవార్డులు అందుకున్న దంపతులు

సత్తెనపల్లి: విద్య, అనుబంధ రంగాల్లో సేవలకుగాను పట్టణానికి చెందిన ఉపాధ్యాయ దంపతులు పెదసింగు, ఏసుమణిలను హైదరాబాద్‌కు చెందిన విశ్వజనని ఫౌండేషన్ సేవారత్న, విద్యాజ్యోతి అవార్డులతో సత్కరించింది. సినీ నటులు గౌతంరాజు, విశ్వ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బ్రహ్మానందం అవార్డులు అందజేశారు.

రైతులను ఆదుకోవాలి

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు వందశాతం రాయితీలు కల్పించి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఇవ్వాలని, పంటలను గిట్టుబాటు ధరలతో కొనుగోలు చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మాచర్లలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తుపానుతో రైతులు నష్టపోయారన్నారు. వర్షాల కారణంగా పంటలకు తెగుళ్లు ఆశించి, దిగుబడి తగ్గుతోందన్నారు.

ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఎన్నిక

దాచేపల్లి, న్యూస్‌టుడే: దాచేపల్లిలో సోమవారం ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ సమావేశం జరిగింది. మండల కార్యదర్శి విక్రం అధ్యక్షత వహించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం పట్టణ కమిటీని 20 మందితో ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా వెంకటేష్, ఉపాధ్యక్షులుగా సమీర్, నాగేంద్రబాబు, కార్యదర్శిగా అన్వర్, సహాయ కార్యదర్శులుగా రసూల్, ఆసిఫ్‌లను ఎన్నుకున్నారు.

యువతిని మోసగించిన యువకుడి అరెస్టు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి మోసం చేసిన యువకుడిని పట్టణ సీఐ వెంకట్రావు అరెస్టు చేశారు. పాతగేశునిపాడు గ్రామానికి చెందిన కె.రాము, పట్టణంలోని ఓ ప్రాంతానికి చెందిన యువతికి రెండేళ్ల కిందట పరిచయమైంది. పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఆ తర్వాత యువతిని దూరం పెటాడు. యువతి ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు పంపారు.

నిధులు మెండుగా.. అభివృద్ధి పండగ

నగర పంచాయతీకి రూ.2.25 కోట్లు మంజూరు

దాచేపల్లి, న్యూస్‌టుడే: దాచేపల్లి నగర పంచాయతీకి కూటమి ప్రభుత్వం అభివృద్ధి పండగ తీసుకొచ్చింది. 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.1.20 కోట్లు, డీఎంఎఫ్‌టీ నుంచి రూ.80 లక్షలు, పూడ గ్రాంటు రూ.25 లక్షలు.. మొత్తంగా రూ.2.25 కోట్లు విడుదల చేశారు. ఈ నిధులతో పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, మురుగు కాలువలు, తరగతి గదులు, కమ్యూనిటీ భవన నిర్మాణాలు తదితర పనులు చేపట్టనున్నారు. అలాగే సుమారు రూ.3 కోట్ల పనులకు కౌన్సిల్ ఆమోదముద్ర వేసింది.

పదో వార్డులో నిర్మించనున్న రోడ్డు

❖ గత వైకాపా హయాంలో దాచేపల్లి నగర పంచాయతీగా మారినా.. అభివృద్ధి గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. కాలనీల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. మురుగు కాలువలు మూసుకుపోయాయి. తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించారు.

చేపట్టే పనులివీ..

❖ రెండో వార్డులో రూ.40 లక్షలతో కాపు కమ్యూనిటీ భవనం, మరో రూ.10 లక్షలతో ప్రహరీ, రూ.10 లక్షలతో ఆదర్శ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం చేపట్టనున్నారు.

❖ ఒకటో వార్డులో రూ.8.60 లక్షలు, మూడో వార్డులో రూ.5.40 లక్షలు, నాలుగో వార్డులో రూ.5 లక్షలు, ఐదో వార్డులో రూ.8.60 లక్షలు, ఆరో వార్డులో రూ.1.80 లక్షలు, ఏడో వార్డులో రూ.2.40 లక్షలు, 8వ వార్డులో రూ.6.50 లక్షలు, 9వ వార్డులో రూ.2.50 లక్షలు, 10వ వార్డులో రూ.14.97 లక్షలు, 12వ వార్డులో రూ.11 లక్షలు, 13వ వార్డులో రూ.3 లక్షలు, 14వ వార్డులో రూ.12 లక్షలు, 15వ వార్డులో రూ.5 లక్షలు, 16వ వార్డులో రూ.4.42 లక్షలు, 17,18,19,20 వార్డుల్లో రూ.29.70 లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య పనులు తదితరాలకు వెచ్చించనున్నారు.

ప్రధాన సమస్యల పరిష్కారం

నగర పంచాయతీలో ప్రధాన సమస్యలను పరిష్కరిస్తాం. ఆర్థిక సంఘం నిధులతో త్వరలో పనులు ప్రారంభిస్తాం. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నాం. ఎమ్మెల్యే యరపతినేని చొరవతో దాచేపల్లిని అభివృద్ధి దిశగా తీసుకెళ్తాం.
- వెంకటేశ్వర్లు, కమిషనర్

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ వెంకటరమణ

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: రోడ్లపై ఇష్టానుసారం ఆటోలు నిలిపి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే డ్రైవర్లపై చర్యలు తీసుకుంటామని మాచర్ల పట్టణ సీఐ వెంకటరమణ హెచ్చరించారు. సోమవారం పట్టణ పోలీసు స్టేషన్లో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు విధిగా లైసెన్స్ కలిగి ఉండాలని, సమదుస్తులు ధరించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించినా, సామర్థ్యానికి మించి ప్రయాణికులను తరలించినా చర్యలు తప్పవన్నారు. అనంతరం పట్టణానికి చెందిన రౌడీషీటర్లను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

(c) eenadu

కనులనిండుగా కార్తిక దామోదరుడు

కార్తిక మాసం రెండో సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు దీపాలు వెలిగించి చెరువులు....నదుల్లో విడిచిపెట్టారు. ఆలయాల్లో శివుడికి అభిషేకాలు నిర్వహించారు. పార్వతీపురం పట్టణం బైపాస్ రోడ్డులో ఉమారామలింగేశ్వర ఆలయంలో శివలింగాన్ని రుద్రాక్షలు, వివిధ రకాల పుష్పాలతో ఇలా అలంకరించారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

నెత్తిన ఎన్నాళ్లీ సమస్య!

నిత్యావసరాలు.. విద్య.. వైద్యం.. అందాలంటే ఇలా ప్రాణాలకు తెగించాల్సిందే. సాలూరు మండలంలోని నెలపర్తి పంచాయతీలోని గిరిజన గ్రామాలు పుల్లేరుగుడ్డివలస, వంగరగెడ్డవలస, బట్టివలస గిరిజనుల దుస్థితి. ఇందుకు నిదర్శనం. సాలూరుకు సుమారు అయిదు కి.మీ. దూరంలో ఉన్న ఈ గ్రామాలకు మధ్య ఒట్టిగెడ్డ ఉంది. ఈ గ్రామస్థులు రేషన్ సరకులు తీసుకోవాలంటే గెడ్డదాటుకుని సాలూరులోని రేషన్ డిపోనకు వెళ్లాలి. ప్రస్తుతం నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తుండడంతో సోమవారం ఇలా నెత్తిన సరకులు పెట్టుకుని గెడ్డదాటేందుకు ఇబ్బందులు పడ్డారు. – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

కళాశాలల్లోనూ ముస్తాబు

పార్వతీపురం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ప్రారంభించిన 'ముస్తాబు' కార్యక్రమాన్ని కళాశాల స్థాయిలో కూడా అమలు చేయాలని కలెక్టర్ కె.ప్రభాకరరెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవోలతో సమావేశమై, మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం అందరికీ అవసరమన్నారు. కాలేజీల్లోనూ అమలైతే పరిశుభ్రత ఆవశ్యకత అందరికీ తెలియజేసినట్లవుతుందన్నారు. గ్రామాలకు రహదారి వేసే కార్యక్రమాన్ని ఎంపీడీవోలు అంకితభావంతో పూర్తి చేయాలన్నారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రోత్సహిస్తే.. రాణిస్తాం.. రాణులుగా వస్తాం

న్యూస్‌టుడే, విజయనగరం క్రీడా విభాగం

ఏళ్లుగా ఎదురు చూసిన మహిళల వరల్డ్ కప్ క్రికెట్ ట్రోఫీని భారత మహిళల జట్టు అందుకుంది. అమ్మాయిలను ఆటల దిశగా ప్రోత్సహించమని ఆడ పిల్లల తల్లిదండ్రులకు ఓ శుభ సందేశాన్ని ఇచ్చింది. మన ఉమ్మడి జిల్లాలోనూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే సత్తాగల అమ్మాయిలు ఎందరో ఉన్నారు. వారికి కావాల్సిందల్లా ప్రోత్సాహమే. ఏ ఆటపరంగా మన క్రీడాకారిణులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. వాటి పరిష్కారానికి జిల్లా యంత్రాంగం, తల్లిదండ్రులు ఏం చేస్తే మన ఇంటా గెలుపు పిలుపు వినిపిస్తుందో ఓసారి చూద్దాం రండి.

★ యూత్ ఛాంపియన్‌షిప్‌లో తొలిసారిగా దేశానికి పతకాన్ని తీసుకువచ్చిన బంగారు ఉషా
★ వాలీబాల్‌లో ఈశ్వరి, ఖోఖోలో వీరమణి, కబడ్డీలో భువన, వాలీబాల్‌లో విజయలక్ష్మి, అథ్లెటిక్స్‌లో శ్రీలక్ష్మి, పారా అథ్లెటుగా కె.లలిత
★ వెయిట్ లిఫ్టింగ్‌లో మత్స సంతోషి, వెంకటలక్ష్మి.. రెడ్డి భవాని

వీళ్లంతా మన ఉమ్మడి జిల్లా అమ్మాయిలే. వీరిలో మీ అమ్మాయి ఉందా..? నిన్న మహిళల క్రికెట్ ఫైనల్ మ్యాచ్ భారత్ గెలిచాక.. క్రీడల్లో మన అమ్మాయి ఉంటే బాగున్ను అని మీకూ అనిపించిందా?

రాష్ట్రస్థాయి అండర్-17 క్రికెట్ పోటీలకు ఎంపిక బాలికల జట్టు

కబడ్డీ సాధనలో అమ్మాయిలు

● ప్రతిభావంతులైన క్రీడాకారిణులను తయారు చేసే విధంగా క్రీడా సౌకర్యాలు లేవన్నది వాస్తవం. అన్నీ క్రీడా విభాగాలకు శిక్షకులను నియమించాలి. క్షేత్ర స్థాయి నుంచి తయారు చేసుకుంటూ రావాల్సి ఉంది.

● అమ్మాయిలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు వెళ్లేటప్పుడు వారి వెంట మహిళా కోచ్, మేనేజర్లు ఉండాలి. కొన్ని జట్లు వెంట ఎటువంటి భద్రత చర్యలు తీసుకోకపోవడం వల్ల తల్లిదండ్రులు పిల్లలను పంపించడానికి ఇష్టపడడం లేదు.

● వాలీబాల్, ఫుట్‌బాల్, హాకీ, హ్యాండ్‌బాల్‌లో ప్రత్యేకంగా మహిళా జట్లు జిల్లాలో ఉండేవి. సరైన ప్రోత్సాహం లేక అక్కడక్కడ అమ్మాయిలు వెలుగులోకి వస్తున్నారు. ఆ దిశగా మళ్లీ ప్రయత్నాలు జరగాలి.

● నియోజకవర్గానికి క్రీడా వికాస కేంద్రమని అప్పట్లో తెరిచారు. ఏళ్లు గడుస్తున్నా అందుబాటులోకి రాలేదు.

● గతంలో ఎత్తేసిన ఖోఖో, కబడ్డీ అకాడమీలు, విజ్జీ మైదానంలో నిలిచిన క్రీడా పాఠశాల పనులు ప్రారంభించడం చాలా అవసరం.

అమ్మాయిలు ఆడేందుకు ముందుకు వస్తున్నా క్రీడా పోటీల సమయంలో వారికి వసతి సౌకర్యం కల్పించే విషయంలో నిర్వాహకులు వివక్ష చూపుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

మన జిల్లా నుంచి రాష్ట్రస్థాయిలో 500 మందికి పైగా, జాతీయస్థాయిలో 200 మందికి పైగా సత్తా చాటుతున్న అథ్లెట్లు, ఖోఖో, కబడ్డీ, బాక్సింగ్, వాలీబాల్, ఫుట్‌బాల్, తైక్వాండో, ఫెన్సింగ్, రెజ్లింగ్, చదరంగం, జుడో, స్విమ్మింగ్, హ్యాండ్‌బాల్, బ్యాడ్మింటన్, స్కేటింగ్, ఆర్చరీ, రైఫిల్ షూటింగ్ క్రీడాకారిణులున్నారు. వీరికి సరైన ప్రోత్సాహం అందిస్తే కచ్చితంగా అంతర్జాతీయ వేదిక మీద రాణించి మరిన్ని పతకాలు తెచ్చుకోగలరని క్రీడా వర్గాలు చెబుతున్నాయి.

● సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో విజ్జీ మైదానం, 9 ఎకరాలలో రాజీవ్, ఒకటిన్నర ఎకరంలో డీఎస్‌ఏ, అర ఎకరంలో స్విమ్మింగ్ పూల్ ఉన్నాయి. ఇవి కాకుండా కొండవెలగాడలో వ్యాయామశాల డీఎస్‌ఏ పరిధిలో ఉంది. పురపాలక సంస్థ ఆధీనంలో కోడి రామ్మూర్తి వ్యాయామశాల, మాన్సాస్ ఆధీనంలో అయోధ్య మైదానం, పోలీసు శాఖ పరిధిలో రెండు అథ్లెటిక్స్ ట్రాక్‌లు ఉన్నాయి. మైదానాలు పెద్ద సంఖ్యలో ఉన్నా ఆటలకు ఆ స్థాయి ప్రోత్సాహం అందడం లేదు.

రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూత

ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయనంతగా క్రీడాకారులకు కూటమి ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటించింది. అంతర్జాతీయ వేదికలపై రాణించేవారికి కోట్ల రూపాయల నగదు, క్రీడా కోటాతో ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు చేపట్టింది.

పండ్లు.. ఫర్నీచర్.. ఏదైనా రైలు పార్సిల్‌లో పంపొచ్చు..

ద్విచక్ర వాహనాలు, పెంపుడు జంతువులు, కాయగూరలు, పండ్లు, ఫర్నీచర్, రిఫ్రిజిరేటర్, టీవీ, కూలర్, వాషింగ్ మిషన్.. ప్రమాదకరమైన పేలుడు స్వభావం లేని ఏ వస్తువునైనా రైలు పార్సిల్‌లో తరలించే సౌకర్యం ఉంది. జవాబుదారీతనం, తక్కువ వ్యయం, సమయపాలనతో రైల్వే ఈ సేవలు అందిస్తోంది.

న్యూస్‌టుడే, విజయనగరం రింగురోడ్డు

గతంలో ఎగుమతులు

గతంలో విజయనగరం నుంచి ఎక్కువగా మామిడి పండ్లు రాయపూర్, బిలాస్‌పూర్ వెళ్లేవి. ఉమ్మడి జిల్లాలో పంట దిగుబడి తగ్గడంతో ఎగుమతులు తగ్గాయి. మార్చి నుంచి జూన్ వరకు గతంలో రోజుకు 500 పైనే బస్తాలు వెళ్లేవి. ఇప్పుడు 100 కూడా మించడం లేదు.

పెంపుడు జంతువులు

ప్రస్తుతానికి కుక్క, పిల్లలను మాత్రమే తరలించే సౌకర్యం ఉంది. కుక్క ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌తో పాటు వ్యాక్సినేషన్ పత్రం చూపాల్సి ఉంటుంది. దాని కోసం ఒక రిజర్వేషన్ టికెట్ తీసి ఇస్తే రైలు వెనక ఉన్న చివరి బోగీలో గార్డు దగ్గర ప్రత్యేకంగా ఒక బాక్సులో పెట్టి పంపిస్తారు. అలా వద్దనుకుంటే ఫస్ట్ క్లాస్ ఏసీ టికెట్ తీసుకుని.. రెండు బెర్తులు బుక్ చేసుకుంటే అనుమతి ఇస్తారు.

బైక్ పంపాలంటే

విజయనగరం నుంచి విజయవాడకు ద్విచక్ర వాహనం పంపించాలంటే సుమారు రూ.1000 ఖర్చవుతుంది. వాహనాన్ని తరలించే ముందు పెట్రోల్ తీసేయాలి. ఆ వాహనం ఎవరి పేరు మీద ఉందో ఆర్‌సీ బుక్, ఆధార్ కార్డు ఉండాలి. వాహనం విలువ, ఫిట్‌నెస్ పత్రం అవసరం. పంపించాల్సిన చోటుకు బైక్ చేరాక దానిని తీసుకెళ్లడానికి సదరు వ్యక్తి రాకపోతే ఆరు గంటలు ఉచితంగా ఉంచుతారు. ఆ తరువాత గంటకు రూ.10 చొప్పున జీఎస్‌టీతో కలిపి వసూలు చేస్తారు.

★ విజయనగరం నుంచి రోజుకు సుమారు 8 నుంచి 10 వాహనాల వరకు ఇతర ప్రాంతాలకు పంపిస్తున్నారు.

దెబ్బతింటే.. : ద్విచక్ర వాహనాల పార్సిల్.. కౌంటర్ దగ్గరే చేయించుకోవాలి. ఒకవేళ అనుకోని ప్రమాదం ఎదురైతే ఆ వాహనానికి రీ వాల్యూ ఇచ్చిన ధ్రువపత్రం ఆధారంగా పరిహారం చెల్లిస్తారు. మిగిలిన వాటికి మాత్రం బీమా సౌకర్యం సాధ్యమైనంత వరకూ ఉండదు.

గృహోపకరణాలు: ఫర్నీచర్, వంట గదికి సంబంధించిన వస్తువులు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు సైతం పంపించవచ్చు. కిలో గ్రాముల చొప్పున లెక్కించి వీటిని పార్సిల్ చేస్తారు. ఉదాహరణకు వాషింగ్ మిషన్ విజయనగరం నుంచి హైదరాబాద్ తీసుకెళ్లాలంటే రూ.300 నుంచి రూ.500 లోపు ఖర్చు అవుతుంది.

24 గంటలూ సేవలు

విజయనగరంతో పాటు చీపురుపల్లి, పార్వతీపురం నుంచి కూడా పార్సిల్ సర్వీస్ ఉంది. 24 గంటలూ సేవలు అందుబాటులో ఉంటాయి. నేరుగా ఇంటికే వచ్చి పార్సిల్ చేసి తీసుకెళ్లే సౌకర్యం కూడా త్వరలో అందుబాటులోకి రానుంది. పార్సిల్ బుక్ చేసుకున్న దగ్గర్నుంచి డెలివరీ అయ్యే వరకూ ప్రతీ సమాచారం ఎస్‌ఎంఎస్ వస్తుంది. – శ్రీనివాసరావు, రైల్వే పార్సిల్ విభాగం, విజయనగరం

రైల్వే స్టేషన్ ప్రాంగణంలో పార్సిల్ విభాగం

రైతేరాజు 6లో

ప్రజా భద్రతే ముఖ్యం

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: జన సమూహాలు ఎక్కువగా ఉండే దేవాలయాలు, మతపరమైన సభల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రభాకరరెడ్డి అధికారులను ఆదేశించారు. కార్తిక సోమవారం సందర్భంగా పార్వతీపురం మండలం అడ్డాపుశీలలో ప్రసిద్ధి చెందిన కాశీవిశ్వేశ్వర దేవాలయాన్ని జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. భక్తులతో మాట్లాడి, సమస్యలు తెలుసుకున్నారు. ప్రజా భద్రతే ముఖ్యమని, ఏర్పాట్లు పక్కాగా ఉండాలని దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ ప్రతినిధులకు సూచించారు. ఆపై శివుడికి అభిషేకం చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. డీఆర్‌వో హేమలత, సబ్‌కలెక్టరు వైశాలి, తహసీల్దారు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

పునాది పెరటితోటైంది..

సాలూరు పట్టణానికి చెందిన పలువురు గృహ లబ్ధిదారుల పరిస్థితి ఇది. గత ప్రభుత్వ హయాంలో 417 మందికి నెలిపర్తి సమీపంలో లేఅవుట్ వేశారు. 120 మంది నిర్మాణాలు పూర్తిచేశారు. మరో 150 వివిధ దశల్లో ఉన్నాయి. రోడ్లు, నీటి సదుపాయం కల్పించకపోవడంతో చాలామంది గృహప్రవేశాలు చేసి, ఇళ్లకు తాళాలేసేశారు. మరికొందరు ఖాళీగా ఉంచడం ఎందుకని ఇదిగో ఇలా కూరగాయలు పండించుకుంటున్నారు. ప్రస్తుతం ఇక్కడ 35 కుటుంబాల వారు ఉంటుండగా.. చందాలు వేసుకుని రోడ్డు నిర్మించుకున్నారు. – న్యూస్‌టుడే, సాలూరు

పరుగులు తీస్తున్నాం.. పట్టించుకోండి!

★ గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన పదేళ్ల బాలిక తీవ్ర ఆయాసంతో పార్వతీపురం ఆసుపత్రిలో చేరింది. రెండు రోజులు వైద్యం అందించినా తగ్గకపోవడంతో నిపుణులు పరీక్షించాల్సిన అవసరం ఉందని విశాఖ కేజీహెచ్‌కు పంపించారు.

★ పార్వతీపురానికి చెందిన వ్యక్తికి కాళ్ల వాపులు రావడంతో జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స అందించినా తగ్గలేదు. మూత్రపిండాల సమస్య ఉందేమోనని విశాఖ పంపించారు.

జిల్లాలో తరచూ ఎంతో మందికి ఇలాంటి పరిస్థితులే ఎదురవుతున్నాయి. ప్రాణాపాయ స్థితిలో కేంద్రాసుపత్రికి వస్తుంటే ఇక్కడ అన్ని రకాల నిపుణులు, పరికరాలు లేక 140 కి.మీ దూరంలోని విశాఖ కేజీహెచ్‌కు పరుగులు తీయాల్సి వస్తోంది. ఈ క్రమంలో రోగులు, వారి కుటుంబీకులు తీరని వేదన అనుభవిస్తున్నారు. జిల్లాలో మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) బృందం పర్యటన నేపథ్యంలో ఇక్కడి సమస్యలు ఒక్కసారి పరిశీలిస్తే.. – న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

నేడు 29 మందితో కూడిన బృందం రాక

జిల్లాలో జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) కార్యక్రమాల అమలు, ఆరోగ్య వ్యవస్థ పనితీరు పరిశీలనకు జాతీయ, రాష్ట్ర బృందం సభ్యులు 29 మంది మంగళవారం రానున్నారు. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని ఈ కామన్ రివ్యూ మిషన్(సీఆర్‌ఎం) బృందం పర్యటించనుంది. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ పోషకాహార, అనుబంధ ఆరోగ్య సేవల ఉప కమిషనరు డాక్టరు జోయా అలీ రిజ్వీ నేతృత్వంలో సభ్యులు నాలుగు రోజులపాటు అన్ని ఆసుపత్రులను క్షేత్రస్థాయిలో చూసి, నివేదిక అందజేస్తారు.

జిల్లాలోని 15 మండలాల్లో 8 పూర్తిగా గిరిజన ప్రాంతంలో ఉన్నాయి. మూడు పాక్షికంగా, నాలుగు మైదాన ప్రాంతంలో ఉన్నాయి. గిరిజన ప్రాంతీయులను రక్తహీనత, మాతా, శిశు మరణాలు, క్షయ, కుష్ఠు, బోద, మలేరియా, డెంగీ, మూత్రపిండాల వ్యాధులు వేధిస్తున్నాయి.

★ జిల్లాలో స్త్రీ వైద్య, చిన్నపిల్లలు, ఆర్థో, జనరల్ ఫిజీషియన్లు తప్ప.. గుండె, మూత్రపిండాలు, న్యూరాలజీ తదితర నిపుణులు లేరు. వారి నియామకం, ప్రత్యేక విభాగాల నిర్మాణం అవసరం.

★ వైద్య కళాశాల ఆవశ్యకత ఎంతో ఉంది. పీపీపీ విధానంలో ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచన చేసినా. . రెండో విడత అనడంతో జిల్లా వాసులు నిరాశకు గురయ్యారు.

జిల్లా ఆసుపత్రిలో వైద్య పరీక్షలకు నిరీక్షిస్తున్న గర్భిణులు

★ మల్టీస్పెషాలిటీ ప్రకటించి అయిదేళ్లైనా సేవలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే.

★ జిల్లాలో ప్రస్తుతం క్షయ బాధితులు 1,200 మంది ఉన్నారు. నేటికీ ప్రత్యేక విభాగం లేదు.

★ దేశంలో ఎక్కడా లేనివిధంగా కుష్ఠు తీవ్రత జిల్లాలో ఉంది. అన్నిచోట్ల 0.5 శాతం ఉంటే మన్యంలో ఒక శాతం కంటే ఎక్కువ కనిపిస్తోంది. నియంత్రణకు ప్రత్యేక విభాగం అవసరం.

★ చిన్న పిల్లల టీకాలకు స్టోరేజీ లేదు. విజయనగరం, శ్రీకాకుళం నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి. నెలకు 8,200 మంది చిన్నారులకు టీకాలు వేస్తున్నారు.

పేదలకు రేషన్ డిపోల ద్వారా రాయితీపై అందజేస్తున్న పంచదార నవంబరు నెలలో సరఫరా కాలేదు. జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, మక్కువ, కురుపాం, బలిజిపేటలోని ప్రధాన పౌరసరఫరాల శాఖ గోదాముల్లో ఆయా ప్యాకెట్లు మూలుగుతున్నాయి. డీడీలు తీసేందుకు సర్వరు పనిచేయలేదని డీలర్లు చెబుతుంటే.. గత నెల కేంద్ర ప్రభుత్వం కమీషన్ ఇవ్వకపోవడంతో డీడీలు చెల్లించలేదని ఆ శాఖ అధికారులు చెప్పడం గమనార్హం. – న్యూస్‌టుడే, బలిజిపేట

ఈనెల నోరుతీపి లేదా?

గోదాముల్లోనే పంచదార ప్యాకెట్లు

చౌక డిపో డీలర్లు ప్రతినెలా 16 నుంచి 22వ తేదీలోపు.. మరుసటి నెలలో కోటా సరకులు పంపిణీ చేసేందుకు డీడీలు తీయాలి. జిల్లావ్యాప్తంగా ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకుల్లోనే ఎక్కువ మంది డీడీలు తీసేవారు. ఆ మేరకు నిర్దేశించిన తేదీల్లో పంచదార ప్యాకెట్ల కోసం వెళ్లగా ఆ శాఖ పోర్టల్ సర్వరు పనిచేయలేదు.

గత నెల కమీషన్ రాక..

ప్రతి నెలా డీలర్లకు కేంద్రం తన వాటాగా ఒక్కొక్క పంచదార ప్యాకెట్‌కు రూ.90 పైసలు, రాష్ట్రం రూ.10 పైసలు కమీషన్‌ను చెల్లిస్తూ వస్తోంది. గత నెలలో జిల్లాలోని 573 మంది డీలర్లకు కేంద్ర ప్రభుత్వం కమీషన్ చెల్లించలేదు. ఇప్పుడు డీడీలు తీయలేని పరిస్థితుల్లో.. కనీసం తమకు రావాల్సిన కమీషన్ ప్రాప్తికైనా పంచదార ప్యాకెట్లను అధికారులు పంపిస్తారని ఒకటో తేదీ వరకు డీలర్లు ఎదురుచూశారు. మరోపక్క కమీషన్ రాకపోవడంతో డీడీలు చెల్లించలేదని, ఈ అంశాన్ని పరిశీలిస్తామని పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజరు శ్రీనివాస్ 'న్యూస్‌టుడే'తో అనడం గమనార్హం.

ఒకవేళ గోదాముల్లోని పంచదారను ఇప్పుడు డీలర్లు తీసుకువచ్చినా.. ఈ-పాస్ యంత్రంలో ఆ వివరాలు నమోదయ్యే అవకాశం లేదు. అంటే నవంబరు నెల కమీషన్ వచ్చే అవకాశం ఉండదు. అధికారులు చొరవ చూపితే సమస్య పరిష్కారం సాధ్యమని, కానీ వారి మధ్యే సమన్వయం ఉండడం లేదని, ముందస్తు చర్యలు తీసుకోలేదని డీలర్ల సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు.

126 మెట్రిక్ టన్నులు పంపాం

జిల్లాలోని డిపోలకు ఈనెలలో సరఫరా చేసేందుకు 150 మెట్రిక్ టన్నులకుగాను 126 మెట్రిక్ టన్నుల పంచదారను మంజూరు చేయించాం. గోదాములకు సకాలంలోనే పంపించాం. – బాలసరస్వతి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిణి

ప్రకృతి గీసిన ముఖచిత్రం

కొండెనక కొండ.. అందులో రెండు పెదాలు.. మరొకటి నుదురు.. ఇంకోటి ముక్కు.. చూసేందుకు ఆ శిఖరాల గుంపు అచ్చం మనిషి ముఖాన్ని పోలి ఉంటుంది. పాచిపెంట మండల కేంద్రానికి సమీపంలోని పెద్దగెడ్డ జలాశయం వెనుక ఈ దృశ్యం దర్శనమిస్తోంది. ప్రాజెక్టు స్పిల్‌వే పైనుంచి చూస్తే ఇలా ప్రకృతి గీసిన ముఖచిత్రం కనిపిస్తుంది. ఇక్కడి వారు దీనిని కొండల రాయుడుగా పిలుస్తుంటారు. – న్యూస్‌టుడే, పాచిపెంట



పది తప్పారా.. ఉంది మరో అవకాశం

న్యూస్‌టుడే– చీపురుపల్లి

గతంలో రెగ్యులర్ విధానంలో పదో తరగతి పాత సిలబస్‌లో చదివి ఉత్తీర్ణులు కాని వారికి ఏపీ సార్వత్రిక విద్యాపీఠం గొప్ప అవకాశాన్ని కల్పిస్తోంది. గతంలో ఉత్తీర్ణులు కాకపోయి, 2025 మార్చిలో పరీక్షలకు హాజరైన విద్యార్థులు మాత్రమే అర్హులు. రెగ్యులర్ విధానంలో తప్పిన సబ్జెక్టులు మాత్రమే 2026 మార్చిలో జరిగే పరీక్షల్లో రాసుకొని ఉత్తీర్ణత పొందొచ్చు.

వాత్సల్యం చూపుతారు..!



అనాథలు, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన వారికి దూరమైన చిన్నారులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాత్సల్యం చూపుతున్నాయి. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య పథకంలో 18 ఏళ్ల లోపు వారికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. దీనికి కేంద్రం 60, రాష్ట్రం 40 శాతం నిధులు సమకూరుస్తున్నాయి. బాధిత పిల్లలు ఆరోగ్య, సురక్షిత బాల్యాన్ని ఆస్వాదించాలన్నది ఈ పథకం ప్రధాన ఉద్దేశం. – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

నిస్సహాయ స్థితిలోని పిల్లలకు ఆర్థిక సాయం

జిల్లాలో పది ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. వీటి పరిధిలో 1,475 ప్రధాన, 600 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయి. మిషన్ వాత్సల్య పథకం కింద 285 మంది అర్హులను ఇప్పటివరకు గుర్తించారు. లబ్ధిదారుల సంఖ్య పెంచేలా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అర్జీలు స్వీకరించనున్నారు. తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు మృతి చెందడం, విడాకులు తీసుకోవడం వల్ల నిస్సహాయ స్థితికి చేరిన 18 ఏళ్లలోపు పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటి వద్ద ఉండి చదువుకునే పిల్లలే అర్హులు. ప్రభుత్వ వసతి గృహాలు, సంరక్షణ సదనాల్లో ఉన్న వారికి వర్తించదు.

విద్య.. ఆరోగ్యానికి..

నిరాదరణకు గురైన బాలల విద్య, ఆరోగ్యం అవసరాలను తీర్చేందుకు మిషన్ వాత్సల్య పథకం తీసుకొచ్చారు. 2023 ఏప్రిల్ నుంచి 2025 జనవరి వరకు మొత్తం రూ.1.60 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమైందని ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ చెప్పారు.

దరఖాస్తు ఇలా..

లబ్ధిదారు నివాసానికి సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తకు దరఖాస్తు ఇవ్వాలి. పిల్లల జనన ధ్రువీకరణ పత్రం, తల్లి లేదా తండ్రి మరణిస్తే ఆ ధ్రువపత్రం, విడాకులు తీసుకుంటే సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, తల్లి లేదా తండ్రి, సంరక్షకుని ఆధార్, రేషన్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరం. బ్యాంకు ఖాతా, పిల్లల స్టడీ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజు ఫొటోలు అందజేయాలి.

నెలకు రూ.4 వేలు

★ అర్హులైన పిల్లలకు నెలకు రూ.4 వేలు చొప్పున ఏడాదికి రూ.48 వేలు సంరక్షకునితో కూడిన లబ్ధిదారుని ఖాతాలో జమచేస్తారు.

★ తల్లి/తండ్రి/సంరక్షకుని ఆదాయం పట్టణాల్లో ఏడాదికి రూ.96 వేలు, గ్రామాల్లో రూ.72 వేలకు మించి ఉండకూడదు.

★ ఆఫ్టర్ కేర్ పథకం కింద ఉన్నత విద్య అభ్యసించే ఎయిడ్స్ బాధితులు (18 ఏళ్లు పైబడిన తల్లి/తండ్రి లేని వారు) అర్హులు.

తొందరపడొద్దు.. తోసుకోవద్దు

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకన్న ఆలయం వద్ద తొక్కిసలాట ఘటన నేపథ్యంలో పలు చోట్ల భక్తుల రద్దీపై ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. కార్తిక మాసం రెండో సోమవారం సందర్భంగా జిల్లాలో పలు ఆలయాల వద్ద రెవెన్యూ, పోలీసు శాఖ భక్తులకు సూచనలు అందించాయి. – న్యూస్‌టుడే, కొమరాడ

కొమరాడ మండలంలో ఓ ఆలయం వద్ద జాగ్రత్తలు చెబుతున్న పోలీసులు

(c) eenadu

శంబలనగరి.. ఆధ్యాత్మిక విహారి!

కార్తిక పౌర్ణమి వేడుకలకు ముస్తాబు

– న్యూస్‌టుడే, శృంగవరపుకోట

హరిహరులకు ప్రీతికరమైన మాసం కార్తికం. అందులోనూ ఈ నెలలో వచ్చే పౌర్ణమిని భక్తులు అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన రాజీపేట గ్రామంలోని 'శంబల నగరి ఆధ్యాత్మిక చైతన్య క్షేత్రం' కార్తిక పౌర్ణమి వేడుకలకు ముస్తాబైంది. ఈమేరకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సమాజానికి ఆధ్యాత్మిక చింతన, భక్తి భావం పెంపొందించే సంకల్పంతో గాయత్రీ ఉపాసకుడు మహర్షి 'ధ్యానం నాన్న' 'శ్రీగాయత్రీ తపస్వి శంబలనగరి ఆశ్రమాన్ని' 2014లో రాజీపేటలో ఏర్పాటు చేశారు. కార్తిక పౌర్ణమి, గురు పౌర్ణమి, మాఘ పౌర్ణమి, గాయత్రీ జయంతి, అట్లతద్ది కార్యక్రమాలను ఏటా ఇక్కడ నిర్వహిస్తారు. ఇందులో కార్తిక పౌర్ణమి ప్రధాన వేడుక. దీనికి దేశం నలుమూలల నుంచి శిష్యులు తరలివస్తారు.

ఆలయంలో తల్లి విగ్రహం

333 కిలోల గంట

9 అడుగుల విగ్రహం ప్రత్యేకం

ఆశ్రమంలో ఏర్పాటు చేసిన తొమ్మిది అడుగుల పంచలోహ గాయత్రీ మాత విగ్రహం ప్రత్యేకం. దీనితో పాటు శివుడు, పార్వతి, వినాయకుడు, సరస్వతి, లక్ష్మి, శక్తిపీఠం, వేంకటేశ్వరుని పాదాలు, అశ్వాలతో సూర్యుడి విగ్రహాలు, పశుపతినాథ ఆలయం, 333 కిలోల గంట ఉన్నాయి.

భారీ అఖండ దీపం.. దేశంలో ఎక్కడా లేని విధంగా కార్తిక పౌర్ణమిని ఇక్కడ ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది నవంబరు 5న వేకువజామున మహర్షి ధ్యానం నాన్న నిర్వహించే హోమంతో వేడుకలకు అంకురార్పణ చేస్తారు. సాయంత్రం అఖండ దీపం వెలిగిస్తారు. 300 కిలోల ఆవు నెయ్యి, 300 కిలోల ఒత్తి, 9 కిలోల కర్పూరం వినియోగిస్తారు. నాలుగు రోజుల పాటు నిరంతరాయంగా వెలుగుతుంది.

పల్లకీ సేవ.. గాయత్రీ పల్లకీ సేవలో ధ్యానం అమ్మ, గాయత్రీ కన్యకా దీక్షలో ఉన్న యువతులు పాల్గొంటారు. అమ్మవారి విగ్రహాన్ని పల్లకీలో మందిరం చుట్టూ ఊరేగిస్తారు.

కబడ్డీ ట్రోఫీ మనదే!!

కొత్తవలస, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్-17 రాష్ట్ర ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు సత్తా చాటింది. ఈనెల 1న ప్రారంభమైన పోటీల్లో పాత 13 జిల్లాల జట్లు తలపడ్డాయి. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో మనోళ్లు విశాఖ క్రీడాకారులతో తలపడి, పైచేయి సాధించారు. ఈమేరకు ట్రోఫీతో పాటు బంగారు పతకాలను గెల్చుకున్నారని పరిశీలకులుగా హాజరైన నెల్లిమర్ల పీడీ, ఎస్‌జీఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి కె.కృష్ణం రాజు, శిక్షకుడు రమణ, రిఫరీ కుమార్ వెల్లడించారు. అవంతి ఫౌండేషన్ ఛైర్మన్ నాని, భారత వాలీబాల్ క్రీడాకారుడు కృష్ణంరాజు, శాప్ డైరెక్టర్ రవీంద్ర, తూర్పుగోదావరి జిల్లా డీఈవో వాసుదేవరావు నుంచి కప్ అందుకున్నట్లు చెప్పారు.

పతకాలు, ట్రోఫీతో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

● నెల్లిమర్ల మండలంలోని పారసాం ఉన్నత పాఠశాలలో గతనెల 28న తాగునీటి, శౌచాలయాల్లోని కుళాయిల వాల్వ్‌లు చోరీకి గురయ్యాయి. సింహద్వారం వద్దగల విగ్రహాలను సైతం కొందరు ధ్వంసం చేశారు.

● ఆ ముందురోజే 27న విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని బీపీఎం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి గదికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. సెలవు కావడంతో ఎవరికీ ప్రమాదం జరగలేదు. కిటికీల తలుపులు, కొన్ని పుస్తకాలు కాలిపోయాయి. బీరువాలు దెబ్బతిన్నాయి. గది మసిబారింది.

అక్షర కాంతిపై అజ్ఞానపు నీడ

– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

విద్యాలయాలను దేవాలయాలుగా భావిస్తారు. ఎంతో మందికి చదువు నేర్పించే క్షేత్రాలవి. కానీ కొందరు ఆకతాయిలు వికృత చేష్టలతో బడులను అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చేస్తున్నారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పరిసరాలను పాడు చేస్తున్నారు. ఇటీవల విజయనగరం, నెల్లిమర్లలో జరిగిన ఘటనలు ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతున్నాయి.

పాఠశాలల్లో ఆకతాయిల వికృత చేష్టలు

విజయనగరంలోని బీపీఎం పాఠశాలలో ఆకతాయిలు నిప్పు పెట్టడంతో మసిబారిన గది

మందుబాబులే ఎక్కువ..

చాలా పాఠశాలలకు ప్రహరీలు లేవు. కాపలాదారులు కూడా కానరావడం లేదు. దీంతో మందుబాబులు, గంజాయి తాగేవారు తిష్ఠ వేస్తున్నారు. సెలవు రోజుల్లో, విద్యార్థులు ఇళ్లకు వెళ్లాక వారు చేరుకుని నానా హంగామా సృష్టిస్తున్నారు. స్థానికులు ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారు. గదులను అపరిశుభ్రం చేయడం, కిటికీలు, తలుపులు, విగ్రహాల ధ్వంసం, పంకాలు, బల్బులను పగలగొట్టడం, బియ్యం, ఇతర సామగ్రి, కంప్యూటర్లు, విలువైన పరికరాలను ఎత్తుకెళ్లడం తదితర చర్యలు కనిపిస్తున్నాయి. గతంలో కుమరాం జడ్పీహెచ్‌ఎస్‌లో కంప్యూటర్లు చోరీకి గురికాగా.. నగరపాలక సంస్థ పరిధిలోని గాజులరేగ విద్యాలయంలో అసాంఘిక కార్యక్రమాలు వెలుగుచూశాయి. దాదాపు అన్నిచోట్లా ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

ప్రహరీలెక్కడ?

విద్యాశాఖ పరిధిలో 1790 పాఠశాలలున్నాయి. వీటిలో 242 బడులకు ప్రహరీలు లేవు. వివిధ పథకాల కింద మంజూరు చేసినా పనులు సాగడం లేదు. కొన్నిచోట్ల ప్రారంభించినా నిధులు రాక నిలిపివేశారు. కంప్యూటర్లు, పాల్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు, విద్యుత్తు, ఫర్నీచర్ ఉన్నచోట్ల కాపలాదారులు తప్పనిసరి. ప్రస్తుతం 38 మంది మాత్రమే రెగ్యులర్ సిబ్బంది ఉన్నారు. మరో 194 మంది పొరుగు సేవల కింద పనిచేస్తున్నారు. వీరిలో కొందరు సక్రమంగా ఉండడం లేదన్న ఆరోపణ ఉంది. మరోవైపు కేటుగాళ్లకు భయపడిన సందర్భాలు సైతం ఉన్నాయి. ఈ నేపథ్యంలో చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. పోలీసుల సహకారంతో నిందితులపై కేసులు పెట్టిస్తామని డీఈవో మాణిక్యం నాయుడు తెలిపారు. తాజా ఘటనలతో మండలాధికారులను అప్రమత్తం చేశామన్నారు.

స్పిల్‌వే గేటుకు మరమ్మతులు.. గంట్యాడ: తాటిపూడి జలాశయం స్పిల్‌వే గేటుకు జలవనరుల శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టారు. 'మొరాయించిన గేట్లు' పేరిట సోమవారం 'ఈనాడు'లో వెలువడిన కథనానికి స్పందించి, బాగు చేశారు. ఇక ఇబ్బంది ఉండదని ఏఈ శంకర్ తెలిపారు.

సచివాలయాల తనిఖీ తప్పనిసరి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: వారానికి నాలుగు సచివాలయాలను సందర్శించాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి మండల ప్రత్యేకాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్ఎస్ అర్జీల ఆడిట్‌పై నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. వినతులను సకాలంలో పరిష్కరించాలని స్పష్టం చేశారు. ★ పీజీఆర్ఎస్‌కు 375 అర్జీలు అందాయి. రెవెన్యూశాఖకు సంబంధించి 223, డీఆర్‌డీఏ 53, పురపాలక 12, గృహనిర్మాణ 11, పంచాయతీ 10, ఇతర శాఖలకు మిగిలినవి వచ్చాయి. జేసీ సేధు మాధవన్, రెవెన్యూ అధికారులు ఎస్.శ్రీనివాసమూర్తి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబానికి వైద్యం.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు దత్తి గ్రామంలోని బంగారు కుటుంబానికి చెందిన పి.ధనుంజయనాయుడుకు వైద్యం చేయాలని డీఎంహెచ్‌వోకు సూచించామని కలెక్టర్ చెప్పారు. విశాఖపట్నంలోని ప్రాంతీయ కంటి ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి తక్షణ చికిత్స అందించాలని ఆదేశించామన్నారు. ★ బంగ్లాదేశ్‌లో చిక్కుకున్న మత్స్యకారుల విడుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ★ మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో రైతులకు మద్దతు ధరలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. తన కార్యాలయంలో సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	125	220	230

9న బాలల ఆహ్వాన నాటక పోటీలు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 9న జిల్లాస్థాయి బాలల ఆహ్వాన నాటక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ తెలిపారు. నగరంలో సోమవారం సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. గురజాడ పాఠశాలలో ఆరోజు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని చెప్పారు. జేవీవీ జాతీయ నాయకుడు కృష్ణాజీ, సంఘం జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కళావతి, కుసుమంచి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుబ్బారావు, వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్లపూడి సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

నెల్లిమర్ల: రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనేందుకు గానూ ఈనెల 8న కొండవెలగాడలో ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి రాము సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు అన్ని ధ్రువపత్రాలతో హాజరు కావాలని, సందేహాలుంటే 93701 98471ను సంప్రదించాలని కోరారు.

ఆలయాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: కార్తికమాసం నేపథ్యంలో శివాలయాల్లో రద్దీ పెరుగుతుండడంతో పూర్తిస్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కె.శిరీష తెలిపారు. సోమవారం నగరంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. ప్రత్యేక సోమవారాలు, పౌర్ణమి, పాడ్యమి తదితర రోజుల్లో బందోబస్తు నిర్వహించాలని పోలీసు శాఖను కోరామన్నారు. ఈమేరకు 9 మంది ఈవోలు, ఆయా ప్రాంతాల్లోని ఎస్సైలు, సీఐలకు సూచనలు చేశామన్నారు. అగ్నిమాపక వాహనాలు, అంబులెన్సులు అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు. జాగ్రత్తలపై మైక్‌ల ద్వారా ప్రచారం చేపడతామన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES | HEALTH & CARE | JOBS

BUSINESS OFFER | NEURO

EDUCATION | PERSONAL CLASSIFIEDS

HOME TUITIONS | CHANGE OF NAME | HOSPITALITY

REAL ESTATE

FLAT FOR SALE

CHANGE OF NAME
I, undersigned KOTTURU SAMBAM MURTHY SANYASI RAJU (Old Name) S/o Kotturu Ramakrishna, plot no: 48, Kusuma Gajapathi Nagar, Cantonment, Vizianagaram - 535003, Andhra Pradesh, changing my name from KOTTURU SAMBAM MURTHY SANYASI RAJU to KOTTURU SAMBA MURTHY SANYASI RAJU (New name), shall henceforth be called KOTTURU SAMBA MURTHY SANYASI RAJU (New name) for all purposes.

Solar Company M/F Accountant. C: 9492731212, 9494703452.

3BHK Flat for sale G2, 1st floor E/F, 1360sft, Bhagyalakshmi enclave easy buy showroom backside, Ring Rd. VZM. ©9182650432.

గమనిక

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /-
(GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

30 సెంట్ల విస్తీర్ణం.. 11 పంటలు

న్యూస్‌టుడే, వీరఘట్టం

తక్కువ పెట్టుబడి, విస్తీర్ణంలో.. వినూత్న పద్ధతులతో విభిన్న పంటలు సాగు చేస్తూ.. లాభాల సిరులు కురిపిస్తున్నారు వీరఘట్టం మండలం కడకెల్ల గ్రామానికి చెందిన బొంగు నారాయణరావు. వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి కేవలం 30 సెంట్ల విస్తీర్ణంలో బహుళ పంటలు కంది, బీర, బెండ, వంగ, బంతి, పచ్చిమిర్చి, జామ, కరివేపాకు, చిక్కుడు, టమాటా, అంగాకర సాగు చేసి నిరంతర ఆదాయం పొందుతున్నారు.

పండించిన కూరగాయలు చూపిస్తున్న నారాయణరావు

సస్యరక్షణ ఇలా..: ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అవలంబిస్తూ కాయగూరల సాగుకు అనుకూలంగా తొలుత భూమిని సిద్ధం చేశారు. పంటను చీడపీడల నుంచి రక్షించుకునేందుకు వీలుగా పొలం చుట్టూ బంతి మొక్కలు నాటారు. ప్రధానంగా ఆవు మూత్రం, పేడ ఉపయోగించి ద్రవ, ఘన జీవామృతాలు సొంతంగా తయారు చేసి మొక్కలకు వేస్తున్నారు. తెగుళ్ల నివారణకు కషాయాలు తయారు చేసి పంటలపై చల్లుతున్నారు. పంటను బట్టి నీటితడులిస్తున్నారు. డీపీఎం శ్రవణ్‌కుమార్ నుంచి సందేహాలు నివృత్తి చేసుకుంటున్నారు.

లాభమిలా..: కూరగాయలు, తీగజాతి, మొక్కజొన్న పంటలకు నారు, దుక్కి, మొక్కలు నాటడానికి సుమారు రూ.14,400 వరకు ఖర్చు చేస్తున్నారు. పంటలకు ఎరువులుగా జీవామృతాల తయారీకి రూ.1500 ఖర్చు చేశారు. 10 సెంట్ల విస్తీర్ణంలో కంది వేయగా 100 కిలోల దిగుబడి వచ్చింది. బీర 3 సెంట్లలో వేయగా 30 కిలోలు, బెండ 3 సెంట్లలో వేస్తే 30 కిలోలు, వంగ 4 సెంట్లలో పండించగా 300 కిలోలు, మిగిలిన 10 సెంట్లలో పచ్చిమిర్చి సాగుతో 40 కిలోలు, చిక్కుడు 200 కిలోలు, టమాటా 120 కిలోల వరకు దిగుబడి వచ్చింది. వీటితోపాటు బంతి, చామంతి, కరివేపాకు, జామ పండిస్తున్నారు. ఏడాదికి మూడు పంటలు వస్తున్నాయి. ఈ సీజన్‌లో పెట్టుబడులు, ఇంటి అవసరాలు పోనూ సుమారు రూ.70 వేలు లాభం అందుకున్నారు.

సేంద్రియంతో మేలు...: ★ సేంద్రియ సాగు వల్ల నాణ్యమైన ఉత్పత్తి వస్తోంది. ★ బహుళ పంటలు వేయడంతో వేర్ల వ్యవస్థ ద్వారా భూమిలో జీవ వైవిధ్యం ఏర్పడుతోంది. ★ భూసారం పెరుగుతుంది. ★ తెగుళ్లు, చీడపీడలు సోకే ప్రమాదం తక్కువ. ★ తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలు వేయడంతో ఇంటి అవసరాలకు ఉపయోగపడుతుంది. ★ మిగిలిన ఉత్పత్తులను విక్రయించి ఆదాయం సంపాదిస్తున్నామని రైతు నారాయణరావు చెబుతున్నారు.

బొప్పాయి పాలు.. విదేశాలకు

నంద్యాల జిల్లా చాగలమర్రి మండల వ్యాప్తంగా రైతులు అధికంగా బొప్పాయి సాగు చేస్తుంటారు. చిన్నవంగలితో పాటు సమీపంలోని గ్రామాలైన వైఎస్సార్ కడప జిల్లా కానగూడూరు, క్రిష్ణంపల్లె గ్రామాల్లో 1200 ఎకరాల్లో పండిస్తారు. విత్తనం నాటిన కాలం నుంచి తొమ్మిది నెలలకు పంట చేతికొస్తుంది. పండ్ల సేకరణ అనంతరం 13 నెలల తర్వాత మిగిలినవి, ముదురు కాయలకు గాట్లు పెట్టి పాలను సేకరిస్తున్నారు. తెల్లవారుజాము సమయంలోనే కాయలకు గాట్లు పెడితే కేవలం రెండు గంటల్లోనే పాలు ఊరుతుంది. ఇలా సేకరించిన దాన్ని రాయచోటి, రాజంపేటకు చెందిన వ్యాపారులు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల పాలు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 4 డ్రమ్ముల పాలు సేకరిస్తున్నారు. ఎకరానికి పాల సేకరణ ద్వారా రైతుకు రూ.24 వేల ఆదాయం వస్తుంది. సేకరించిన పాలను పరిశ్రమల్లో మందులు, కాస్మోటిక్స్, సబ్బుల తయారీలో ఉపయోగిస్తున్నారు. బెంగళూరు, చెన్నైతో పాటు నాణ్యతను బట్టి విదేశాలకు సైతం పాలను ఎగుమతి చేస్తున్నారు. బొప్పాయి సాగులో ఎప్పుడైనా ధర పడిపోయినప్పుడు బొప్పాయి పాల సేకరణతో నష్టాల నుంచి రైతులు బయటపడుతున్నారు.

– న్యూస్‌టుడే, చాగలమర్రి

రైతేరాజు

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

పంటల్లో పురుగుల నివారణకు సరైన సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించొచ్చని విజయనగరం ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త **డా.కె.లక్ష్మణ్** అన్నారు. రైతుల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

?: **ప్రశ్న:** వరి పంట చేతికందే దశలో ఉంది. ఇటీవల వర్షాలకు కొన్నిచోట్ల నీటమునిగాయి, ప్రస్తుతం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? **- శంకరరావు, కొమరాడ**

☛: **సమాధానం:** వర్షాలకు నేలకొరిగిన వరి పైరు, కోసిన పనలు నీట మునిగినప్పుడు గింజలు మొలకెత్తి రంగు మారి బూజు పట్టకుండా జాగ్రత్తలు పాటించాలి. పనలు, కంకులపై 5 శాతం ఉప్పు ద్రావణాన్ని (100 లీటర్ల నీటిలో 5 కిలోల ఉప్పును కరిగించి) చల్లాలి.

?: రెల్లరాల్చు పురుగు నివారణ చర్యలు చెప్పండి? **- చిన్నారావు, పాచిపెంట**

☛: రెల్లరాల్చు, గొంగళి పురుగులు, వరి పంటల్లో గింజ గట్టిపడే దశలో, వెన్నులు కొరికి నష్టాన్ని కలగజేస్తాయి. రాత్రిపూట వీటి ఉద్ధృతి ఎక్కువగా ఉంటుంది. నియంత్రణకు పొలానికి ముందుగా నీరు పెట్టి తీసివేసి, వెంటనే ఒక లీటరు నీటిలో 2.5 మి.లీ.ల క్లోరోపైరిఫాస్ మందు కలిపి పిచికారీ చేయాలి.

?: అపరాలు వేసి 15 రోజులైంది. మొక్క 2, 3 ఆకుల దశలో ఉంది. ఆకులపై ఎక్కువగా గుండ్రని రంధ్రాలు ఏర్పడ్డాయి. నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలి? **- రామారావు, బలిజిపేట**

☛: పైరుపై చిత్త పురుగులు ఆశించడం వల్ల రంధ్రాలు ఏర్పడతాయి. ఈ పురుగులను సకాలంలో నివారించకపోతే 80 శాతం మొక్కలు చనిపోతాయి. వీటి నివారణకు లీటరు నీటికి 2.5 మి.లీ. క్లోరోపైరిఫాస్ లేదా 1 గ్రా. ఎసిపేట్ కలిపి వేయాలి.

ఫోన్ కొట్టు.. సలహా పొందు

చలికాలం సమీపిస్తున్న తరుణంలో జీవాల పెంపకంలో ఎలాంటి సంరక్షణ చర్యలు చేపట్టాలి. లేగ దూడలు, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలకు 8919503675 నంబరును సంప్రదించాలని కురుపాం రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం పశువిభాగం శాస్త్రవేత్త డా.అను తెలిపారు.

నిమ్మలో తెగుళ్ల నివారణ ఇలా..

నిమ్మలో ఆకు ముడత, వేరుకుళ్లు తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉల్లిభద్ర ఉద్యాన కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.యూన్సీరాణి తెలిపారు.

◆ ఆకు ముడత పురుగు లేత ఆకులను ఎక్కువగా, ముదురు ఆకులను అరుదుగా ఆశిస్తుంది. ◆ వెంటనే అజాడిరక్టిన్ (వేప నూనె) 10 వేల పీపీఎం లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ◆ ఉద్ధృతి తీవ్రంగా ఉంటే లీటరు నీటిలో ప్రొఫెనోఫాస్ 2 మి.లీ లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ కలిపి చల్లుకోవాలి. ◆ కొత్త చిగుర్లు వచ్చినప్పుడు పురుగు మందు చల్లాలి. ◆ వేరుకుళ్లు తెగులు ఆశిస్తే పోషక పదార్థాలు, నీరు సక్రమంగా అందక చెట్లు ఎండిపోతాయి. ఇది రాకుండా మాంకోజెట్ 2.5 గ్రా లేదా కార్బండిజమ్ 2 గ్రా. లీటరు నీటిలో కలిపి చెట్టంతా తడిచేలా వేయాలి. ◆ వారం, పది రోజుల తర్వాత పశువుల ఎరువులో అభివృద్ధి చేసిన ట్రైకోడెర్మా కల్చర్‌ను చెట్టుకు 10 కిలోల చొప్పున వేయాలి.

నిమ్మలో ఆకు ముడత తెగులు

– న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

వ్యాధుల కాలం.. అప్రమత్తతతో కళ్లెం

– న్యూస్‌టుడే, బొబ్బిలి

ఇటీవల కురిసిన వర్షాలకు నదులు, చెరువులు నిండి ఊట బావుల్లో నీరు, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. కొందరు ఆ నీటినే తాగుతుండడం.. వాతావరణంలో మార్పులు.. కలుషిత, నిల్వ ఆహార పదార్థాలను తీసుకోవడం తదితర కారణాలతో అతిసారం, సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ఆసుపత్రులు కిక్కిరిసిపోతున్నాయి. ఇటీవల రామభద్రపురం మండలంలోని ముచ్చెర్లవలస, కొండకెంగువ, ఇట్లామామిడిపల్లి, ఆరికతోట తదితర ప్రాంతాల్లో అతిసారం ప్రబలింది. చాలామంది అస్వస్థతకు గురయ్యారు. జాగ్రత్తలు తీసుకోకుంటే మరి కొంతమంది మంచానపడే ప్రమాదముంది.

బొబ్బిలి మండలంలోని పారాదిలో నీటి నాణ్యత పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రబలడానికి కారణాలివే..

★ కలుషిత, నిల్వ నీరు తాగడం ★ ఇళ్ల ముందు మురుగు పేరుకుపోవడం ★ కాలువల్లో వ్యర్థాలు కదలక పోవడం ★ దోమల విజృంభణ ★ పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటించకపోవడం ★ కలుషిత, జంక్, నిల్వ ఉండే ఆహారం తీసుకోవడం ★ ఆరుబయట మలవిసర్జన ★ పొలాలకు వెళ్లే రైతులు చెరువులు, కాలువల్లోని నీరు తాగడం

ఈ జాగ్రత్తలు పాటించాలి..

★ ఎప్పటికప్పుడు సచివాలయాల సిబ్బంది ద్వారా తాగు నీటి నాణ్యతను తెలుసుకోవాలి. ★ రంగు మారితే తాగకూడదు. ★ వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలి. ★ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. ★ శరీరంలో నీరసం, తలనొప్పిగా ఉంటే వైద్యులను సంప్రదించాలి. ★ శీతలీకరణ యంత్రాల్లో ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన ఆహారం తినొద్దు.

శుభ్రత ముఖ్యం.. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. కొంతమంది ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. కలుషిత నీరు, ఆహారం వల్లే అతిసారం వస్తుంది. వ్యక్తిగత శుభ్రత ముఖ్యం. తినేముందు చేతులు శుభ్రంగా కడగాలి. పీహెచ్‌సీల సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. – కృష్ణమహన్, వైద్యనిపుణుడు

సౌకర్యాలు లేక అవస్థలు

వాతావరణంలో మార్పుల కారణంగా అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. బొబ్బిలిలోని ప్రభుత్వాసుపత్రిలో సోమవారం 400 ఓపీ నమోదైంది. జ్వర బాధితులతో అన్ని విభాగాలు కిక్కిరిశాయి. కొన్ని పడకలను అత్యవసర విభాగం బయట వేశారు. కొంతమంది నేలపై పడుకొని కనిపించారు. ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని ఇన్‌ఛార్జి శశిభూషణరావు తెలిపారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి

కాశీబుగ్గ ఘటనపై సకాలంలో చర్యలు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో ఇటీవల జరిగిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో స్పందించి, బాధితులకు అండగా నిలిచిందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. సోమవారం విజయనగరంలోని అశోక్‌బంగ్లాలో విలేకరులతో మాట్లాడారు. విదేశీ పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేశ్, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు వెంటనే చేరుకున్నారని, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు సైతం ఘటనాస్థలానికి వెళ్లారన్నారు. ఇప్పటికే ప్రభుత్వం పరిహారం ఇచ్చిందని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందుతోందని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం పరామర్శకు రాలేదని, వైకాపా నాయకులు ఘటనను రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు.

మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి

ప్రజల్లోనే ఉన్నారు.. ప్రశంస పొందారు

సంతకవిటి, న్యూస్‌టుడే: మొంథా తుపాను సమయంలో ఉత్తమ పనితీరు కనబర్చిన సంతకవిటి మండలం కేఆర్ పురం వీఆర్వో రాజమోహన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రశంసించారు. నాగావళి నదికి ఆనుకుని ఉన్న కొత్తూరు, రామచంద్రాపురం గ్రామాల్లో ఆయన నిత్యం పర్యటిస్తూ.. ఎప్పటికప్పుడు పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేశారు. ముంపు నేపథ్యంలో స్థానికులను అప్రమత్తం చేశారు. సమయస్ఫూర్తితో విధులు నిర్వర్తించినందుకు గానూ ప్రభుత్వం గుర్తించింది. పింఛన్ల పంపిణీ నేపథ్యంలో అమరావతిలో జరిగిన కార్యక్రమానికి వెళ్లలేకపోవడంతో అంతర్జాలంలో పంపించారు. సోమవారం తహసీల్దారు సుదర్శనరావు తదితరులు అభినందించారు.

వీఆర్వోను అభినందిస్తున్న తహసీల్దారు

అయ్యన్నపేట: ఆస్తి, పంట, ప్రాణ నష్ట తీవ్రతను తగ్గించినందుకుగానూ జలవనరులశాఖ ఈఈ వెంకటరమణకు పురస్కారం లభించింది. తాటిపూడి, ఆండ్ర, చంపావతి ప్రాజెక్టుల పరిస్థితి, ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో, గేట్లు ఎత్తడం, వరద తీవ్రత, ముంపు ప్రాంతాలను అప్రమత్తం చేయడం తదితర అంశాల అమలులో ఆయన ముందు వరుసలో నిలిచారు. దీంతో దాదాపు 4 వేలకు పైగా చెరువులకు గండ్లు పడకుండా అడ్డుకోగలిగినట్లు అధికారులు తెలిపారు.

ఆండ్ర జలాశయం వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న ఈఈ వెంకటరమణ

రీసర్వేతో ఇబ్బందులు రాకూడదు

విజయనగరం అర్బన్: రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా రీసర్వే నిర్వహించాలని సర్వే, భూ రికార్డులశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు సీహెచ్‌వీఎస్ఎన్.కుమార్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో మండల సర్వేయర్లు, తహసీల్దార్లతో సమీక్షించారు. మండలాల వారీగా ప్రగతిని తెలుసుకున్నారు. అన్నదాతలకు ఉపయోగపడేలా ఉండాలని, తప్పులు నమోదు చేయొద్దని కోరారు. జిల్లా సహాయ సంచాలకుడు యజ్ఞేశ్వరరావు, పర్యవేక్షకుడు రాంబాబు పాల్గొన్నారు.

(c) eenadu

దారి కష్టాలు తీరేదెప్పుడో?

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట మండలం గుజ్జి కూడలి నుంచి దాసుగుమ్మడ మీదుగా అంబలగండి వరకు ఉన్న రహదారి ప్రయాణికులకు నరకం చూపిస్తోంది. రాళ్లు తేలి పాదచారులు, వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో దాసుగుమ్మడ, అంబలగండి, కుంబి, పెద్దగండి, కుసుమగుడ తదితర గ్రామాల గిరిజనులు ప్రయాణిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు పరిస్థితి మరింత అధ్వానంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ తారురోడ్డు నిర్మాణానికి 2020-21లో ఉపాధి హామీ పథకం నుంచి రూ.396 లక్షలు మంజూరయ్యాయి. గుత్తేదారుడు రూ.55 లక్షలతో రాళ్లు, గ్రావెల్ బుగ్గి వేసి చదును చేయకుండా వదిలేశారు. బిల్లులు రాకపోవడంతో పనులు ఆగాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిన పనులు పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయం గిరిజన సంక్షేమశాఖ డీఈ నాగభూషణరావు వద్ద ప్రస్తావించగా రహదారిపై విజిలెన్స్ విచారణ జరుగుతోందన్నారు. నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రాళ్లు తేలిన దాసుగుమ్మడ-అంబలగండి మార్గం

గుజ్జి సమీపంలో ఇలా..

రద్దీ లేకుండా చూడాలి

పాలకొండ, న్యూస్‌టుడే: కార్తీకమాసంలో శివాలయాల వద్ద రద్దీ లేకుండా చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్ పవార్ స్వప్నిల్ అన్నారు. సోమవారం మండలంలోని అన్నవరం ఉమారామలింగేశ్వర స్వామి ఆలయాన్ని పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు ఏర్పాటు చేసి తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఆపై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్

గిరిజన విద్యాసంస్థల్లో 'విద్యా ప్రగతి'

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమశాఖ విద్యా సంస్థల్లో విద్యార్థుల సామర్థ్యం పెంచేందుకు 'విద్యా ప్రగతి' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డిప్యూటీ డీఈవో రామ్మోహనరావు తెలిపారు. 3-9వ తరగతి విద్యార్థుల సామర్థ్యం తెలుసుకునేందుకు సోమవారం పరీక్ష నిర్వహించామని, దాని ఆధారంగా ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈనెల 4 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 16 వరకు ఈ విధానం అమలు చేయాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ● సీతంపేట, మెళియాపుట్టి, మందస క్లస్టర్లలోని గిరిజన సంక్షేమ విద్యా సంస్థల 8, 9 విద్యార్థులకు ఈనెల 6న వారి పరిధిలో క్రీడా పోటీలు నిర్వహిస్తామని పీవో పవార్, డీడీ ఎం.అన్నదొర, క్రీడాధికారి జాకబ్ దయానందం తెలిపారు. విలువిద్య, జావెలిన్‌త్రో, వాలీబాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, వ్యాసరచన, ఉపన్యాసం పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

నేడు చెకుముకి సంబరాలు

వీరఘట్టం: పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం చెకుముకి సంబరాలు నిర్వహిస్తామని జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేశ్వరరావు, గౌరునాయుడు, సబ్‌కమిటీ కన్వీనర్ ధనుంజయ నాయుడు తెలిపారు. అక్టోబరు 18న నిర్వహించిన పాఠశాల స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన విజేతలు మండల స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఇందులో రాణించిన వారు ఈ నెల 23న జిల్లా స్థాయిలో పాల్గొంటారని తెలిపారు.

ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి

వీరఘట్టం, న్యూస్‌టుడే: వీరఘట్టం మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్)లో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. పాలనాధికారి వెంకటరమణ హాజరయ్యారు. మండల ఇంజినీరింగ్ అధికారిణి కల్యాణిదుర్గ మినహా.. మిగతా అధికారులెవరూ రాలేదు. పంచాయతీ కార్యనిర్వహణాధికారి కూడా గైర్హాజరయ్యారు. దీనిపై ఎంపీడీవో మాట్లాడుతూ.. అధికారులంతా హాజరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

న్యాయం జరగాలంటే.. ఆధారాలతో రండి

కలెక్టర్ ప్రభాకరరెడ్డి

– న్యూస్‌టుడే, పార్వతీపురం

ఏ విషయంలోనైనా న్యాయం జరగాలంటే అర్జీదారులు ఆధారాలతో ఫిర్యాదులను సమర్పించాలని కలెక్టర్ ప్రభాకరరెడ్డి అన్నారు. సోమవారం పీజీఆర్‌ఎస్ మందిరంలో డీఆర్వో హేమలత, డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, గిరిజన సంక్షేమ ఎస్‌డీసీ దిలీప్ చక్రవర్తితో కలిసి వినతులు స్వీకరించారు. మొత్తం 180 మంది అర్జీదారులు తమ వినతులను సమర్పించారు.

రెండేళ్లుగా తిరుగుతున్నా..: పదో తరగతి ధ్రువపత్రంలో తల్లి పేరుకు బదులుగా అమ్మమ్మ పేరు నమోదు చేశారని, రెండేళ్లుగా సవరణకు తిరుగుతున్నా పని మాత్రం పూర్తికాలేదని జె.కుమారి అనే విద్యార్థిని ఫిర్యాదు చేశారు. డిగ్రీలో చేరాలంటే పదో తరగతి మార్కుల మెమో కావాలని, పేరు మార్చి ధ్రువపత్రం ఇవ్వాలని కోరారు.

జీతాలు ఇప్పించండి సర్: బలిజిపేట మండలం గంగాడ పంచాయతీలో పనిచేస్తున్న హరిత రాయబారులు.. తమకు 13 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని ఫిర్యాదు చేశారు.

సాయం అందించరూ: విద్యార్థుల మరణాలపై ఒక్కో ఐటీడీఏలో ఒక్కో విధానం అమలు చేస్తున్నారని గిరిజన సంఘ నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని కోరారు.

దర్యాప్తునకు వినతి: కొమరాడ మండలంలో కంప్యూటర్ ఆపరేటర్లు చేతివాటం ప్రదర్శించి, పంచాయతీ నిధులు తినేశారని పలువురు ఫిర్యాదు చేశారు. కొమరాడ సర్పంచి నిధులు దుర్వినియోగంపై వచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు జరిపి న్యాయం చేయాలని కోరారు.

వినతులు పరిశీలిస్తున్న కలెక్టర్

న్యాయం చేయాలి: కొమరాడ మండలంలో థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి రైతుల నుంచి భూములు కొనుగోలు చేశారని, అప్పట్లో తమకు కొన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని భూముల విక్రేతలు కోరారు.

సరఫరా పునరుద్ధరించాలి: సాలూరు మండలంలో వర్షాలకు పంట పొలాల్లో స్తంభాలు పడిపోయాయని, తొలగించి విద్యుత్తును పునరుద్ధరించాలని కోరారు.

సీసీ ఇబ్బంది పెడుతున్నారు: పాచిపెంట మండలం మోసూరులో తమ సంఘంలో సభ్యురాలిగా ఉన్న మహిళ రుణం తీసుకొని చెల్లించలేదని, దీంతో ఆమెను తొలగించామని సంఘ సభ్యులు తెలిపారు. ఇప్పుడు మళ్లీ రుణపరపతి పొందేందుకు వెలుగు సీసీ ఇబ్బందులకు గురిచేస్తున్నారని కలెక్టరుకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు వేయాలని విన్నపం: తోటపల్లి నిర్వాసిత గ్రామమైన బాసంగిలో సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నామని, ఆ ప్రాంతంలో రహదారులు, కాలువలు నిర్మించాలని గ్రామస్థులు కోరారు. ఇళ్ల నిర్మాణ బిల్లులు పెంచాలన్నారు. గృహ నిర్మాణాలకు చెల్లించాల్సిన మొత్తంపై అనుమతి కోసం ప్రభుత్వానికి లేఖ రాయాలని డీఆర్వోకు కలెక్టరు తెలిపారు.

అవకాశం కల్పించండి: పార్వతీపురం మండలం డీకే పట్నం పాఠశాలలో 14 ఏళ్లుగా వంట పనికి సహాయకురాలిగా పనిచేస్తున్నానని, ఇప్పుడు ప్రధాన వంట మనిషి విధుల నుంచి దూరమయ్యారని, తనకు అవకాశం కల్పించాలని ఓ మహిళ కోరారు. వైదొలిగిన వ్యక్తి బంధువులకే ఆ బాధ్యత అప్పగించేలా ఉపాధ్యాయులు, మరికొందరు ప్రయత్నిస్తున్నారని వాపోయారు.

పింఛను ఇప్పించండి.. స్థలం కేటాయించండి

ఐటీడీఏకు 123 వినతులు

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఐటీడీఏ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజనులు హాజరై వ్యక్తిగత, గ్రామ సమస్యలపై వినతులు అందించారు. ★ సీతంపేట ఎమ్మార్సీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఎంఈవోలు ఎం.ఆనందరావు, సూర్యచంద్రరావు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.పురుషోత్తం కోరారు. ★ విద్యుత్తు స్తంభాలు మార్చాలని గంగమ్మపేట గ్రామస్థులు కోరారు. ★ తాగునీటి సౌకర్యం కోసం కొండబీమునిపేటకు చెందిన దల బెహరా, పంట నష్ట పరిహారం ఇప్పించాలని అంబలగండి కుష్ణయ్య, దివ్యాంగ పింఛను మంజూరు చేయాలని ముకుందాపురానికి చెందిన లోకేశ్వరి విన్నవించారు. ★ సీతంపేట ప్రాంతీయ ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డు ఉద్యోగం ఇప్పించాలని చింతాడకు చెందిన రామారావు పీవోను కోరారు. ★ చీపురుపల్లి కూడలి నుంచి బుల్లి మామిడిగూడ వరకు రోడ్డు మంజూరు చేయాలని ఒబ్బిడిగూడకు చెందిన గంగారావు, పవర్ వీడర్ మంజూరుకు కిండుపుపాడుకు చెందిన పెద్దబాయి, చేప పిల్లలు పంపిణీ చేయాలని పెద్దబంబ శ్రీరాములు అధికారులను కోరారు.

★ మేకల రవికి ఇప్పించాలని మూర్తికొత్తగూడకు చెందిన సుశీల, అటవీ పట్టా మంజూరు చేయాలని నల్లరాయిగూడకు చెందిన రవి, రోడ్డు పనులు పూర్తి చేయాలని గెడేలగూడకు చెందిన సోమయ్య, వరద గోడ నిర్మాణం చేపట్టాలని బొటుకుపాయకు చెందిన శ్యామల రావు, ఇళ్ల నిర్మాణానికి స్థలం ఇప్పించాలని కొత్తగూడకు చెందిన రమణమ్మ వినతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఈఈ రమాదేవి, డిప్యూటీ డీఈవో రామ్మోహనరావు, ఏపీవో శ్రీరామ్, క్రీడాధికారి జాకబ్ దయానందం, డిప్యూటీ డీఎంహెచ్‌వో కె.విజయపార్వతి తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల తొలగింపునకు చర్యలు

సాలూరు గ్రామీణం: మామిడిపల్లిలో రోడ్డు పక్కన అనధికారికంగా ఏర్పాటు చేసిన దుకాణాల తొలగింపునకు అధికారులు సిద్ధమయ్యారు. ఆర్‌అండ్‌బీ ఏఈ విజయ్‌కుమార్ ఈ విషయమై సోమవారం తహసీల్దార్‌కు లేఖ రాశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని, ఆక్రమణలను తొలగించాలని, ఇందుకోసం ఆర్‌అండ్‌బి రహదారి హద్దులను మార్క్‌చేసేందుకు సర్వేయర్‌ను ఇవ్వాలని కోరుతూ లేఖలో పేర్కొన్నారు.

సృజనకు ప్రశంస

పార్వతీపురంలో విజేతలతో ప్రిన్సిపల్ గణేశ్‌కుమార్ తదితరులు

సాలూరులో విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం 'ప్రతిభా పాటవ పోటీలు' జరిగాయి. 'నాకు నచ్చిన పండగ' అనే అంశంపై జరిగిన పోటీల్లో 7, 8, 9, 10వ తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పార్వతీపురం శ్రీకృష్ణ స్కూల్‌లో ఎం.లాస్య(10వ తరగతి), పి.భరత్ (9వ తరగతి), ఎస్.రాణీకుమారి (10వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రిన్సిపల్ గణేష్‌కుమార్, ఉపాధ్యాయులు విద్యాసాగర్, సరోజి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. సాలూరు పట్టణంలోని గాడివీధి కేపీఎన్ పురపాలిక ఉన్నత పాఠశాలలో చిత్రలేఖనం పోటీలు జరిగాయి. ఎన్.చైతన్యలహరి(7వ తరగతి), ఎ.అనిల్ (8వ తరగతి), కె.రాకేష్ (10వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ఉపాధ్యాయులు ఎస్.వేణుగోపాల్, నాగరాజు, శ్రీనివాస్, మణిరాజు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించి అభినందించారు. పాలకొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు బి.హేమలత, ఎస్.నందిని, బి.శ్రావణి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ బి.రేణుక, అధ్యాపకులు బహుమతులు అందించారు.

– న్యూస్‌టుడే, పార్వతీపురం, సాలూరు, పాలకొండ

సాలూరులో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న బాలబాలికలు

పాలకొండ: విజేతలకు బహుమతులు అందించిన ప్రిన్సిపల్ తదితరులు

ప్రత్యేక శ్రద్ధ అవసరం

బెలగాం, న్యూస్‌టుడే: ఖైదీల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరమని న్యాయసేవా సంస్థ విజయనగరం జిల్లా కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన సోమవారం పట్టణంలోని సబ్‌జైలును తనిఖీ చేసి, సిబ్బందికి సూచనలు చేశారు. క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేయాలన్నారు. లోక్ అదాలత్ సభ్యులు టి.జోగారావు, పోలీసులు పాల్గొన్నారు. ★ **కురుపాం గ్రామీణం:** శివన్నపేట ఏకలవ్య, గిరిజన గురుకుల సంక్షేమ బాలికల పాఠశాలలను ఎ.కృష్ణప్రసాద్, కురుపాం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ న్యాయమూర్తి సౌమ్య జోస్ఫిన్ సందర్శించారు. అనంతరం కురుపాంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి, ఉప తహసీల్దారు సురేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

కురుపాం పాఠశాల వద్ద వివరాలు తెలుసుకుంటున్న కృష్ణప్రసాద్ తదితరులు

చెరువుల ఆక్రమణలకు ఏఈలే బాధ్యులు

పార్వతీపురం, న్యూస్‌టుడే: చెరువులు ఆక్రమణలకు గురికాకుండా పరిరక్షించాల్సిన బాధ్యత సంబంధిత సహాయక ఇంజినీర్లదేనని కలెక్టర్ ప్రభాకరరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం పీజీఆర్‌ఎస్ వినతుల పరిష్కారంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో చెరువుల ఆక్రమణలపై వస్తున్న ఫిర్యాదులపై ఏం చర్యలు తీసుకున్నది ఆయన ఆరా తీశారు. ఆక్రమణకు గురైనట్లు సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు గుర్తిస్తే వాటికి సంబంధిత జలవనరుల శాఖ సహాయ ఇంజినీర్లను బాధ్యులను చేయాలన్నారు. వనరులను పరిరక్షించడం అందరి బాధ్యతగా గుర్తించాలని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

శిక్షకుడితో క్రీడాకారులు

పార్వతీపురం పట్టణం, కొమరాడ, న్యూస్‌టుడే: జిల్లాకు చెందిన అయిదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లా అండర్-14, 17 విభాగంలో బాలబాలికలకు సోమవారం విజయనగరం విజ్జీ స్టేడియంలో పోటీలు జరిగాయి. కొమరాడ మండలానికి చెందిన బి.శేఖర్(విక్రంపురం), జి.యోగాచంద్(కోటిపాం) ఎంపికయ్యారు. అదేవిధంగా బి.యామిని, ఎం.దీపన, ఎస్.లిఖిత(విక్రంపురం) అర్హత సాధించారు. రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల 6 నుంచి గుంటూరు జిల్లాలో జరగనున్నాయని స్కూల్ గేమ్స్ కార్యదర్శులు ఎస్.మురళీ, నాగమణి, శిక్షకుడు శ్రీనివాస్ తెలిపారు.

వాలీబాల్‌లో సత్తా

శిక్షకుడు ప్రసాద్‌తో రాము, చరణ్

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ వాలీబాల్ పోటీల్లో సత్తాచాటారు. సోమవారం ఏలూరులో జరిగిన పోటీల్లో పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురం మండలాలు డోకిశీల, కొత్తగూడ గిరిజన పాఠశాలల విద్యార్థులు రాము, చరణ్ పతకాలు సాధించారు. ఉదయపురం పాఠశాల పీడీ ఎం.ప్రసాద్ వీరికి శిక్షకుడిగా వ్యవహరించారు. స్కూల్ గేమ్స్ కార్యదర్శులు, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ వాసుదేవరావు విద్యార్థులను అభినందించారు.

ఆశ్రమ పాఠశాలల్లో సౌకర్యాల కల్పన

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు చేపడుతున్నామని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి తెలిపారు. కొత్తగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆవరణలో రూ.2.17 కోట్లతో అదనపు భవన నిర్మాణ పనులకు సోమవారం భూమిపూజ చేసి, మాట్లాడారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా చాలీచాలని గదుల్లో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడ్డారని, కూటమి ప్రభుత్వం ఆ సమస్యను పరిష్కరిస్తోందని చెప్పారు. సకాలంలో పనులు పూర్తిచేయాలని సూచించారు. ఏఎంసీ ఛైర్మన్ కళావతి, నరేష్, మల్లేశ్వరరావు, భూషణరావు తదితరులు ఉన్నారు. ★ **కురుపాం గ్రామీణం:** కురుపాం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో రూ.2.75 కోట్లతో పీఎం జన్‌మన్ నిధులతో మంజూరైన నూతన భవన నిర్మాణ పనులకు జగదీశ్వరి భూమిపూజ చేశారు. పాఠశాలలో ఆర్వో ప్లాంటును ప్రారంభించారు. విద్యార్థులను అడిగి భోజన నాణ్యత తెలుసుకున్నారు. రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్ పి.లావణ్య, ఏఎంసీ ఛైర్మన్ కళావతి, భారతి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణం ప్రారంభం

శిలాఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే విజయచంద్ర తదితరులు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గానికి ఎన్‌సీపీఎల్ కంపెనీ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే బి.విజయచంద్ర అన్నారు. సోమవారం వెంకంపేట, ఎమ్మార్ నగరం, పెదమరికి, పుట్టూరులో అంగన్‌వాడీ కేంద్ర భవనాల పనులను ప్రారంభించి, మాట్లాడారు. కంపెనీ సామాజిక బాధ్యతలో భాగంగా పార్వతీపురం, పాలకొండలో నాలుగేసి భవనాలను మంజూరు చేసిందని తెలిపారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.26 లక్షలు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. ఐసీడీఎస్ పీవో విజయగౌరి, సిబ్బంది పాల్గొన్నారు.

హరహర మహాదేవ

కార్తికమాసం రెండో సోమవారం సందర్భంగా శివాలయాలు శైవనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే బిల్వపత్రాలు, విభూతి, రుద్రాభిషేకాలు చేశారు. పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. మహిళలు ఆలయాల ప్రాంగణంలో దీపాలు వెలిగించారు. – న్యూస్‌టుడే, జియ్యమ్మవలస, బలిజిపేట, సాలూరు

జియ్యమ్మవలస: రావాడలో జ్యోతిర్లింగాలకు పూజలు

సాలూరు: నగరేశ్వర స్వామికి గంధాభిషేకం

అయ్యప్పకు కలశ పూజ

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: ఎల్విన్‌పేట రామాలయంలో అయ్యప్పస్వామి భక్తులు కలశ పూజ చేశారు. 18 సార్లు మాలధారణ చేసిన జి.శ్రీహరిస్వామి 18 కలశాలను ఏర్పాటు చేయించారు. అధిక సంఖ్యలో స్వాములు హాజరయ్యారు.

కార్తిక మాసం వచ్చింది.. సందడి తెచ్చింది

గరుగుబిల్లి మండలం తోటపల్లి పర్యాటక కేంద్రాలు సోమవారం సందర్శకులతో కళకళలాడాయి. కార్తిక మాసం రెండో సోమవారం కావడంతో పార్వతీపురం, పాలకొండ, వీరఘట్టం, వంగర మండలాల నుంచి ప్రజలు తోటపల్లి దేవస్థానంతో పాటు ఐటీడీఏ ఉద్యాన క్షేత్రాన్ని సందర్శించారు. ఎండ తీవ్రత తగ్గి వాతావరణం చల్లబడబడంతో పార్కులో క్లైంబింగు వాల్, ఉయ్యాలలు, జారుడు, తూగుడు బల్లలు, వ్యాయామ పరికరాలతో చిన్నాపెద్దా తేడా లేకుండా ఆడుతూ సరదాగా గడిపారు. యువత తుల్లింత కేరింతలతో సందడి వాతావరణం నెలకొంది – న్యూస్‌టుడే, గరుగుబిల్లి గ్రామీణం

మహిళల సందడి

క్లైంబింగ్ వాల్ ఎక్కుతున్న చిన్నారులు

ఆక్రమణలపై చర్యలకు వినతి

సాలూరు, న్యూస్‌టుడే: పెద్ద బజారు, దేవాదాయశాఖ స్థలాల ఆక్రమణపై చర్యలు చేపట్టాలని కోరుతూ పుర కమిషనర్ రత్నకుమార్‌కు న్యాయవాది ఆర్.మహేశ్వరరావు సోమవారం ఫిర్యాదు చేశారు.

'వైకాపా తీరు మార్చుకోవాలి'

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రం సాంకేతికంగా, పారిశ్రామికంగా ముందడుగు వేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం పని చేస్తోందని, దీన్ని చూసి ఓర్వలేని వైకాపా నాయకులు శవ రాజకీయాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బి.చిరంజీవులు ఆరోపించారు. ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని కోరారు. సోమవారం కృష్ణపల్లి క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. కాశీబుగ్గ ఘటనపై విచారణ వ్యక్తం చేశారు.

విద్యుత్తుకు అంతరాయం

పార్వతీపురం పురపాలక, కొమరాడ, న్యూస్‌టుడే: పట్టణంలో కొత్తవలస సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త విద్యుత్తు లైన్లు వేస్తున్నందున మంగళవారం ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ దివ్య తెలిపారు.

స్వదేశీ ఉత్పత్తులతో ఆర్థికాభివృద్ధి

గుమ్మలక్ష్మీపురం: స్వదేశీ ఉత్పత్తుల వినియోగంతోనే దేశ ఆర్థికాభివృద్ధి సాధ్యమని భాజపా జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం గుమ్మలక్ష్మీపురంలో స్వదేశీ, విదేశీ ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇళ్లు, దుకాణాలకు వెళ్లి కరపత్రాలు అందించి, వస్తువుల వినియోగం గురించి వివరించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీలో చేరడంతో కండువాలు వేసి, ఆహ్వానించారు.

యాప్‌ల భారం తగ్గించాలి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: పాఠశాలల్లో అమలు చేస్తున్న పలు రకాల యాప్‌ల ద్వారా ప్రతిరోజూ సమాచారం నమోదు చేయాల్సిన భారం ఉపాధ్యాయులపై పెరగడంతో బోధనపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మర్రాపు మహేష్ అన్నారు. పి.ఆమిటి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సోమవారం సందర్శించి, ఉపాధ్యాయులతో మాట్లాడారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని చినమేరంగి ఎస్సై పి.అనీష్ అన్నారు. ఎరుకలపేట వద్ద యువతకు అవగాహన కల్పించారు. మత్తుకు దూరంగా ఉండాలన్నారు.

శక్తియాప్‌పై అవగాహన

పాచిపెంట, న్యూస్‌టుడే: పాచిపెంట కస్తూర్బా విద్యాలయంలో బాలికలకు శక్తి యాప్‌పై ఏఎస్సై శ్రీరాములు అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో శక్తి యాప్ మీకు తోడుగా ఉంటుందంటూ చరవాణుల్లో యాప్ డౌన్‌లోడ్‌పై వివరించారు. ప్రిన్సిపల్ నజియా, హెచ్‌సీ సీతయ్య, బాలికలు పాల్గొన్నారు.

ఖర్చు తగ్గించి.. దిగుబడి పెంచేలా..

బలిజిపేట, న్యూస్‌టుడే: రైతులకు పెట్టుబడులు తగ్గించి, అధిక దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఆ విభాగం జిల్లా ప్రబంధకుడు ఎం.శ్రావణ్‌కుమార్ తెలిపారు. బలిజిపేట శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో అయిదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. రైతు సాధికార సంస్థ, నేషనల్ మిషన్ నేచురల్ ఫార్మింగ్ సహకారంతో జిల్లాలోని 13 మండలాల్లోని 221 పంచాయతీల్లో దీన్ని అమలు చేస్తున్నామన్నారు. సిబ్బంది ఉన్నారు.

కేంద్ర పథకాలతో ప్రయోజనం

మాట్లాడుతున్న పరిపాలనాధికారి సునీల్

సీతంపేట, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ పథకాలతో గిరిజనులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఐటీడీఏ పరిపాలనాధికారి సునీల్ అన్నారు. ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో పీఎం జన్‌మన్, ఆది కర్మయోగి, పీఎం జుగా పథకాలపై పంచాయతీ కార్యదర్శులకు ఓరియంటేషన్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులపై శాఖల వారీగా కార్యాచరణ తయారు చేయాలన్నారు. డిప్యూటీ డీఈవో రామ్మోహనరావు, జిల్లా మాస్టర్ ట్రైనీ రవీంద్ర, ఏఈలు సత్యం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సాధనే ధ్యేయం

పాలకొండ, గ్రామీణం: పాలకొండ ప్రత్యేక జిల్లా సాధనే ధ్యేయంగా పోరాటం చేస్తామని తెదేపా నియోజవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కోటదుర్గమ్మ ఆలయం కూడలి నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించి.. ఆమె మాట్లాడారు. ప్రజల మనోభావాలు గుర్తించి ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. ఏలాం కూడలి వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. సాధన సమితి అధ్యక్షుడు బుడితి అప్పలనాయుడు, గౌరవాధ్యక్షుడు చౌదరినాయుడు, గిరిజన నాయకులు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి

మక్కువ, న్యూస్‌టుడే: పెద్దల చేతుల్లో ఉన్న బంజరు, పోరంబోకు, అసైన్డ్ భూములు పేదలకు పంచాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దందులూరి వర్మ డిమాండు చేశారు. ఆయన ఆధ్వర్యంలో మక్కువలో సోమవారం రైతులు భారీ ర్యాలీగా తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని ధర్నా చేపట్టారు. సమస్యలు పరిష్కరించాలన్నారు. సీబిల్లిపెద్దవలస, శంబర, పనసభద్ర, మార్కొండపుట్టి, దబ్బగడ్డ తదితర గ్రామాల్లో ఈ పరిస్థితి ఉందని పేర్కొన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు.

జీతాలు ఇవ్వకపోతే ఎలా బతకాలి..?

నినాదాలు చేస్తున్న హరిత రాయబారులు

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: పల్లెలో పని చేస్తున్న హరిత రాయబారుల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సిటు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. కుటుంబాన్ని ఎలా పోషించాలని వాపోయారు. ● రైస్ మిల్లులో హమాలీలుగా పని చేస్తున్న వారికి నూతన వేతన ఒప్పందాన్ని అమలు చేయాలని కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. ● కురుపాం మండలం వలసబల్లేరు పంచాయతీ గిరిశిఖర గ్రామం ఆగంగూడకు రోడ్డు సదుపాయం కల్పించాలని గిరిజనులు కోరారు. ● **వీరఘట్టం:** సమస్యలు పరిష్కరించాలంటూ మండల వనరుల కేంద్రం ఆవరణలో మధ్యాహ్న భోజన వంట నిర్వాహకులు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

(c) eenadu

ఈనాడు ప్రకాశం
మంగళవారం 4 నవంబరు 2025

శైవక్షేత్రాలకు కార్తిక శోభ

కార్తిక సోమవారం సందర్భంగా జిల్లాలోని శైవక్షేత్రాలన్నీ భక్తులతో కళకళలాడాయి. ఆలయాలకు వేకువజాము నుంచే పెద్దసంఖ్యలో మహిళలు తరలివచ్చి పలు రకాల చెట్లతో పాటు దక్షిణామూర్తి వద్ద కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో భక్తుల పూజలందుకుంటున్న త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వరస్వామిని చిత్రంలో చూడొచ్చు.

–న్యూస్‌టుడే, త్రిపురాంతకం గ్రామీణం

సర్కారు భూములు కాజేసి.. నష్ట పరిహారానికి ఎరవేసి..!

- సీఎస్‌పురం మండలంలో అడ్డగోలుగా భూ వ్యవహారాలు
- కొంతమంది రెవెన్యూశాఖ అధికారుల అండతో అక్రమాలు

ప్రభుత్వ భూములను ప్రజాప్రయోజనాలకు వినియోగిస్తే ఎవరికి ఎలాంటి నష్టపరిహారం ఇవ్వాల్సిన అవసరం లేదు. కొంతమంది సర్కారు భూములనే తమవిగా రికార్డుల్లోకి ఎక్కించుకుని నష్టపరిహారం కాజేద్దామని పథకం వేశారు. దీనిపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ప్రస్తుతం భూముల చుట్టూ వివాదాలు ముసురుకున్నాయి. ప్రభుత్వ, అటవీ భూములను కొల్లగొట్టడంలో సీఎస్‌పురం మండలం వేదికగా నిలిచింది.

–ఈనాడు, ఒంగోలు

నిర్మాణంలో బెంగళూరు-కడప-విజయవాడ జాతీయ రహదారి

వెల్లువెత్తిన ఫిర్యాదులు

సీఎస్‌పురం మండలం ఎ.కొత్తపల్లిలో బెంగళూరు-కడప-విజయవాడ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూసేకరణలో పలు చోట్ల ప్రభుత్వ భూములను కొంతమంది అక్రమార్కులు వారి పేరిట మార్చుకుని తమవేనంటూ ఏకంగా ప్రభుత్వ దస్త్రాల్లోకి ఎక్కించేశారు. నష్టపరిహారానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయగా, చివరికి అవి ప్రభుత్వ భూములని తేలడంతో పరిహారం నిలిపివేశారు. ఆయా భూములకు సంబంధించి కోకొల్లలుగా ఫిర్యాదులు వెల్లువెత్తుతుండడం గమనార్హం. ఒకే భూమిని పలువురికి పట్టాలిచ్చేయడం, ప్రభుత్వ దస్త్రాల్లో పలు సర్వేనంబర్లతో ఎక్కించడం వంటి అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. వీటిపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. భూముల అక్రమాల్లో అప్పట్లో పనిచేసిన కొంతమంది రెవెన్యూశాఖాధికారుల పాత్ర ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

కబ్జాలు... ఆపై పట్టాలు

సీఎస్‌పురం మండలం రేగులచిలకలోని అటవీ, ప్రభుత్వ భూములను కొంతమంది ఏళ్ల కిందటే ఆక్రమించుకోగా, మరికొంత మంది పట్టాలు సైతం పొందారు. రెవెన్యూ శాఖ అధికారులకు ముడుపులు చెల్లించి ప్రభుత్వ రికార్డుల్లోకి ఎక్కించేశారు. ఇలా 300 ఎకరాల వరకు భూములు వివాదంలో ఉన్నాయి. వీటిపై ఫిర్యాదులు వచ్చినప్పుడు వివాదాస్పద జాబితాలో పెట్టడం, అనంతరం తొలగించడం ఇక్కడ సాధారణమైపోయింది. మైనింగ్, ఇతరేతర కార్యాకలాపాలకు అటవీశాఖ భూమిని తీసుకుంటే ఎకరాకు రెండెకరాల భూమిని ఆ శాఖకు అప్పగించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఇతర ప్రాంతాలకు చెందినవారు ఇక్కడ భూమిని కొనుగోలు చేసి అటవీ శాఖకు అప్పగించారు. వాస్తవానికి ఈ భూమి ప్రభుత్వ, అటవీ శాఖలకు చెందింది కావడం గమనార్హం. లోతుగా పరిశీలిస్తే దశాబ్దాల నాటి అక్రమాలు తాజాగా ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. కొంతమంది స్వార్థంతో చేసిన పనికి అసలైన పేదలు ఇబ్బందులు పాలవుతున్నారు.

ముసి జోరు.. తారుమారు

మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లడంతో రహదారులు ఛిద్రమయ్యాయి. కొండపి మండలం అనకర్ల పూడి-మద్దులూరు మధ్య రహదారిపై ముసి వాగు పొంగి పొర్లడంతో ఇలా తారు కొట్టుకుపోయి భారీ గుంతలేర్పడ్డాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై రహదారులు, భవనాలశాఖ ఏఈఈ దీప్తి మాట్లాడుతూ ఇప్పటికే ఛిద్రమైన రహదారులను పరిశీలించామని, అంచనాలు రూపొందించి మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు. –న్యూస్‌టుడే, కొండపి గ్రామీణం

కౌలు రైతులకు పరిహారం అందించాలి

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: తుపాను కారణంగా పంట నష్టపోయిన కౌలు రైతుల పేర్లు నమోదు చేసి, వారికే పరిహారం చెల్లించాలని కోరుతూ ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ పి.రాజాబాబుకు వినతిపత్రం అందజేశారు. స్థానిక ప్రకాశం భవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పాఠశాల, కళాశాల బస్సులను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించి, వాటి ప్రగతిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ జిల్లా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో ఓబులేసు, ఎస్‌డీసీలు పార్థసారధి, జాన్సన్, విజయజ్యోతి, మాధురి తదితరులు పాల్గొన్నారు.

రాయితీ దాణా... రైతులకు ధీమా

- జిల్లాకు 430 మెట్రిక్ టన్నుల సరఫరా

యరజర్లలో పాడి రైతులకు పశుదాణా పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారులు

పశుగ్రాసం కొరతను నివారించేందుకు కూటమి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా 50 శాతం రాయితీపై ప్రొటీన్‌తో కూడిన దాణాను పంపిణీ చేస్తోంది. తొలి విడగా ఈ ఏడాది మే, జూన్‌లో 419 మెట్రిక్ టన్నులు పంపిణీ చేయగా, తాజాగా రెండో విడత కింద జిల్లాకు 430 మెట్రిక్ టన్నులు సరఫరా చేసింది. జిల్లాలో 38 మండలాలు ఉండగా, 33 మండలాలకు 10 మెట్రిక్ టన్నుల చొప్పున కేటాయించగా, 'మొంథా' తుపాను ప్రభావిత మండలాలైన ఒంగోలు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు, టంగుటూరు, సింగరాయ కొండలకు 20 మెట్రిక్ టన్నుల చొప్పున పంపిణీ చేయనుంది. జిల్లాలో 56,332 ఆవులు, 6,71,812 గేదెలు ఉన్నాయి. ఇటీవల వరకు వర్షాలు లేకపోవడంతో పశుగ్రాసం కొరత కారణంగా పాల దిగుబడి తగ్గుముఖం పట్టింది. గత నెల 28న మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పొలాల్లోకి వరదనీరు చేరడంతో మేతకు సమస్య వచ్చింది. ఈ నేపథ్యంలో పశుసంవర్ధకశాఖ ద్వారా దాణా సరఫరా చేయాలని నిర్ణయించింది. పోషకాలున్న దాణా 50 కిలోల బస్తా రూ.1,110 ఉండగా, 50 శాతం రాయితీపై రూ.555కే సరఫరా చేయనుంది. ఒక్కో కుటుంబానికి 150 కిలోల చొప్పున మూడు నెలలకు సరిపడా దాణాను విడతల వారీగా అందించనుంది. దాణా ద్వారా పాల దిగుబడి పెరగడంతోపాటు వెన్న శాతం పెరిగి రైతులకు గిట్టు బాటు ధర లభిస్తుందని పశువైద్యులు క్షేత్రస్థాయిలో పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వారం రోజుల్లో అన్ని మండలాలకు పశుదాణా సరఫరా చేస్తాంమని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు.

–న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

7న డీఆర్సీ సమావేశం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక ప్రకాశం భవన్‌లో ఈ నెల 7వ తేదీన ఉదయం 11 గంటలకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన జిల్లా సమీక్ష కమిటీ (డీఆర్సీ) సమావేశం నిర్వహించనున్నట్లు సీపీవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధికారులకు సమాచారం అందించినట్లు ఆయన పేర్కొన్నారు.

పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.351

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని రెండు రీజియన్ల పరిధిలోని పొగాకు వేలం కేంద్రాల్లో సోమవారం 2,678 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. ఎస్‌బీఎస్ రీజియన్ పరిధిలోని కేంద్రాలకు 6,417 బేళ్లు రాగా 1,476, ఎస్ఎల్ఎస్ రీజియన్ పరిధిలోని కేంద్రాలకు 4,613 బేళ్లు రాగా 1,202 బేళ్లు తిరస్కరించారు. టంగుటూరు వేలం కేంద్రంలో పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.351 కాగా, మిగతా కేంద్రాల్లో రూ.350 చొప్పున పలికింది.

మొంథా బాధితులకు సాంత్వన!

మొంథా తుపాను జిల్లాను కకావికలం చేసింది. భారీ వర్షాలకు అన్ని ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. వరదలతో నష్టపోయిన వారికి ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. నిత్యావసరాలతో పాటు తక్షణ వరద సాయం అందించి సాంత్వన చేకూర్చింది. ప్రభుత్వ ఆదేశాలపై ఒక్కో తుపాను బాధిత కుటుంబానికి 25 కిలోల చొప్పున బియ్యం, నూనె ప్యాకెట్, కిలో చొప్పున కంది పప్పు, పంచదార, ఉల్లిపాయలు, బంగాళాదుంపలను అందించింది. వలస దారుల కుటుంబాలు, ఏ ఆసరా లేనివారిని క్షేత్రస్థాయిలో గుర్తించి ఎక్కడికక్కడ వరద తగ్గిన మరుసటి రోజు నుంచే పంపిణీకి ప్రణాళిక రూపొందించింది.

–ఈనాడు, ఒంగోలు

సరకుల పంపిణీకి గుర్తించిన కుటుంబాలు 9,051		ఇప్పటి వరకు అందుకున్నవి 6,534
డివిజన్	కుటుంబాలు	ఆర్థిక సాయం (రూ.లక్షల్లో)
మార్కాపురం, కనిగిరి	815	17.47
ఒంగోలు	2,214	50.94

వరద బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే జనార్దన్, పౌరసరఫరాలశాఖ ఎండీ దిల్లీరావు, జేసీ గోపాలకృష్ణ

9వేల మందికి నిత్యావసర సరకులు

3,029 కుటుంబాలకు ఆర్థిక సాయం

- జిల్లాలో నిత్యావసరాల పంపిణీ కార్యక్రమాన్ని ఒంగోలు మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే జనార్దన్ చేతుల మీదుగా ప్రారంభించారు. వరద తాకిడితో నిరాశ్రయులైనవారికి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి అధికార యంత్రాంగం ఆదుకుంది. జిల్లాలో ఎవరైతే తుపాను పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందారో వారందరికి నిబంధనల ప్రకారం అందజేస్తున్నారు. పునరావాస కేంద్రాలకు ఒకరు వస్తే రూ.1,000, ఇద్దరు వస్తే రూ.2 వేలు, ఒకే కుటుంబానికి చెందినవారు ముగ్గురు అంతకంటే ఎక్కువ మంది వస్తే రూ.3 వేలు చొప్పున సాయం అందజేశారు. ఇప్పటికే కలెక్టర్ రాజా బాబు సూచన మేరకు క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం సాయం పంపిణీ ప్రక్రియను పూర్తిచేసింది. వర్షాలతో ఉపాధి కోల్పోయిన మత్స్యకార, చేనేత కుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు.

- భారీ వర్షాలకు ఇళ్లు దెబ్బతిన్నవారికి నష్టపరిహారం అందించేందుకు అధికార యంత్రాంగం సర్వే చేపట్టింది. ఇంట్లోకి నీళ్లు వచ్చి మరమ్మతులకు గురైనా, గోడలు కూలినా వారికి నష్టపరిహారం ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. వర్షాలకు పశువులు చనిపోయినా, ఇతరేతర నష్టాలు చోటుచేసుకున్నా ఆయా శాఖల వారీగా నష్టపరిహారం లెక్కలు వేసే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. వ్యవసాయ శాఖ అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి నివేదిక రూపొందించనున్నారు.

ట్రిపుల్‌ఐటీల అభివృద్ధికి రూ.200 కోట్ల బడ్జెట్

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్‌ఐటీల అభివృద్ధికి ఈ ఏడాది రూ.200 కోట్ల బడ్జెట్‌ను ఖర్చు చేస్తున్నట్లు ఉప కులపతి ఎం.విజయకుమార్ తెలిపారు. సోమవారం నూజివీడు ట్రిపుల్‌ఐటీకి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. పీయూసీలో ఇంటర్ పుస్తకాలతో పాటు సీబీఎస్‌ఈ స్టాండర్డ్స్‌ను అమలుచేస్తున్నామన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు బయాలజీ సబ్జెక్టును ఈ ఏడాది నుంచి కలుపుతున్నామన్నారు. ప్రస్తుతం నూజివీడులో నడుస్తున్న శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌ల విద్యార్థులు పీ 1, 2 తరగతుల అనంతరం తిరిగి వారి క్యాంపస్‌లకు వెళ్లిపోతారన్నారు. ల్యాప్‌టాప్‌లు ఇవ్వడంపై బడ్జెట్ లేదని, దీనిపై గవర్నింగ్ కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆహారం నాణ్యత లేకపోవడం, మెనూ పాటించకపోవడంపై వస్తున్న వార్తలపై ఆన్‌లైన్‌లో విద్యార్థుల అభిప్రాయాలు సేకరిస్తున్నామన్నారు. 'ఫేస్‌మెన్' విషయంలో 40 శాతం ఫీజు చెల్లిస్తున్నారని, దీనిని 50 శాతానికి తీసుకుని రావాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు.

పుల్లలచెరువు మండలంలో మిర్చి పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి గోపీచంద్

517 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో 517 హెక్టార్లలో ఉద్యానపంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు లెక్కలు తేల్చారు. ఉద్యానశాఖ అధికారి పి.గోపీచంద్ నేతృత్వంలో చేపట్టిన రైతు వారీగా పంట నష్టం అంచనాలు సోమవారంతో పూర్తయ్యాయి. ఉద్యాన, రెవెన్యూశాఖల సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి 33 శాతం కన్నా ఎక్కువ దెబ్బతిన్న పంటలను నమోదు చేశారు. వీటికి ప్రభుత్వం పెట్టుబడి రాయితీ కింద సాయం అందించాలని ప్రతిపాదనలు పంపారు. మొత్తం 27 మండలాల్లో 959 మంది బాధిత రైతులు ఉన్నట్లు పేర్కొన్నారు. పంటల వారీగా మిరప 166, ఉల్లి 177, కూరగాయలు 82, పూలు 23, అరటి 42, ఇతర పంటలు 27 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు అందజేశారు.

రైతేరాజు
అరటి తోటల్లో నీరు చేరిందా..?
బొప్పాయి పాలు.. విదేశాలకు
6లో..

అధ్యక్షా...

ఎప్పుడూ తరగతి గదిలో పాఠాలు వినే విద్యార్థులు ఒక్కసారిగా ప్రజాప్రతినిధులుగా మారిపోయారు. కొందరు అధికార పక్షం.. మరికొందరు ప్రతిపక్ష నేతలుగా చర్చల్లో పాల్గొన్నారు. ఆద్యంతం తమదైన శైలిలో ప్రసంగాలతో హోరెత్తించారు. సీఎస్‌పురం మండలం అరివేముల జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన మాక్ అసెంబ్లీ ఆకట్టుకుంది. –న్యూస్‌టుడే, సి.ఎస్.పురం

జలపాతం అంచున ప్రమాదం!

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భైరవకోనలోని జలపాతం వద్ద ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి. ఎవరూ లోపలకు వెళ్లకుండా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. కార్తిక సోమవారం సందర్భంగా క్షేత్రానికి వచ్చిన భక్తులు, పర్యాటకులు పోలీసులు లేని సమయంలో ఇలా ప్రమాదకరంగా జలపాతం వద్దకు చేరుకున్నారు. బారికేడ్లు దూకుతూ...గోడలు, కొండ అంచుల్లో ప్రమాదకరంగా నడుస్తూ వెళ్లారు. ఏమాత్రం అదుపు తప్పినా ప్రమాదం జరిగే అవకాశాలున్నా ఇలా ప్రమాదకరంగా స్నానాలు చేశారు.

–ఈనాడు, ఒంగోలు న్యూస్‌టుడే, సీఎస్‌పురం



కొండ అంచుల్లో ప్రమాదకరంగా నడుస్తున్న యువకులు

కర్రలు అడ్డుపెట్టినా కింద నుంచి దూరి వెళుతున్న మహిళలు

బారికేడ్లు దూకుతూ..

స్వదేశీ వస్తువులే వాడుదాం: భాజపా

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: సంతనూతలపాడులో భాజపా ఆధ్వర్యంలో ప్రతి ఇంటా స్వదేశీ.. ఇంటింటా స్వదేశీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం గ్రామంలో ఇంటింటా తిరిగి ప్రచార పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా భాజపా నాయకులు మాట్లాడుతూ విదేశీ వస్తువులకు ప్రత్యామ్నాయంగా స్వదేశీ వస్తువులను వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో భాజపా మండలాధ్యక్షులు బాలినేని కల్యాణ్‌రెడ్డి, భాజపా నాయకులు గుండా శ్రీనివాసరావు, సంకె సుబ్బారావు, బాలినేని చెంచిరెడ్డి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: 'మొంథా' తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట సోమవారం అఖిల భారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కె.నాంచార్లు మాట్లాడుతూ జిల్లాలోని 25 మండలాల్లో సుమారు 13 వేల మంది రైతులకు చెందిన 23 వేల హెక్టార్లలోని పంటలు దెబ్బతిన్నాయన్నారు. తూర్పు ప్రకాశంలోని మండలాల్లో పొగాకు నారుమడులు ఉరకెత్తినట్లు తెలిపారు. పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండు చేస్తూ జేసీ రోణంకి గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు.

అఖిత భారత రైతుకూలీ సంఘం నాయకుల ఆందోళన

మెరుస్తోంది సగమే!

- 50 శాతం గ్రానైట్ పరిశ్రమలు మూసివేత
- సానుకూల నిర్ణయానికి ఎదురు చూపులు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గ్రానైట్ తదితర చిన్నతరహా ఖనిజాల సీనరేజీ వసూళ్ల ప్రైవేటు సంస్థకు అప్పగించడంతో తలెత్తిన పరిణామాల నేపథ్యంలో ఇప్పటి వరకు 50 శాతం లోపు పరిశ్రమల్లో మాత్రమే కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఏఎంఆర్ సంస్థ సీనరేజీ వసూళ్ల బాధ్యత దక్కించుకోవడం, అక్టోబరు 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు పరిశ్రమల యజమానులు బంద్ పాటించడం, ఆ తర్వాత దీపావళి రావడంతో ఉత్తరాది రాష్ట్రాల కార్మికులు స్వస్థలాలకు వెళ్లిపోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధిక శాతం గ్రానైట్ పరిశ్రమలు మూతపడ్డాయి. – న్యూస్‌టుడే, చీమకుర్తి, ఒంగోలు

- సీనరేజీ వసూళ్ల విషయమై గ్రానైట్ పరిశ్రమల యజమానుల సంఘాల ప్రతినిధులు, ఏఎంఆర్ సంస్థ ప్రతినిధుల మధ్య మూడు దఫాలుగా జరిగిన చర్చలు ఫలించక పోవడం, తమ సొంత రాష్ట్రాలకు వెళ్లిన కార్మికుల్లో అధిక శాతం మంది తిరిగి రాకపోవడంతో 50 శాతం పాలిషింగ్ యూనిట్లలో మాత్రమే పనులు జరుగుతున్నాయి. వీరి మధ్య చర్చలు కొలిక్కి రాకపోవడంతో యాజమాన్యాలు మళ్లీ బంద్ పాటించడం లాంటి కార్యక్రమాలకు వెళ్తారనే అంచనాలతో కార్మికులు వచ్చేందుకు ఇష్టపడడం లేదనే వాదన వినిపిస్తోంది.

- ఏఎంఆర్ సంస్థతో చర్చల విషయమై కొద్ది రోజుల కిందట పరిశ్రమల యజమానులు ఎమ్మెల్యేలు బీఎన్.విజయ్‌కుమార్, ఏలూరి సాంబశివరావులతో కలిసి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి చర్చించారు. సుమారు మూడు గంటల పాటు జరిగిన చర్చల అనంతరం ఈ నెల 4వ తేదీన గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ముఖ్య కార్యదర్శి మీనా, డీఎంజీలతో చర్చలు జరపాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 4వ తేదీన జరిగిన చర్చల్లోనైనా సానుకూల నిర్ణయం వస్తుందా అన్న ఆశతో పరిశ్రమల యజమానులు ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో ఉన్న సంఘాల నుంచి 10 మంది ప్రతినిధులను విజయవాడకు రావాలని మంత్రులు సూచించినట్లు తెలిసింది.

- గుంటూరులోని తెదేపా కార్యాలయంలో మంగళవారం నిర్వహించే ప్రజావేదిక కార్యక్రమానికి పార్టీ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి లోకేశ్ హాజరు కానున్నారనే సమాచారంతో ముందుగా మంత్రిని కలిసి తమ సమస్యలను నేరుగా ఆయన దృష్టికి తీసుకెళ్లాలనే ఆలోచనలో యజమానుల సంఘం ప్రతినిధులు ఉన్నారు. గత నెల రోజులుగా పరిశ్రమల్లో పనులు స్తంభించిపోవడంతో యాజమాన్యాలు ఇబ్బంది పడడమే కాకుండా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉమ్మడి జల్లా వ్యాప్తంగా సుమారుగా 2 లక్షల మంది ఉపాధిపై ప్రభావం చూపుతోంది.

వైద్యులు లేరాయె.. మందులు కరవాయె

- ఇదీ పశ్చిమ ప్రకాశంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల దుస్థితి

పశ్చిమ ప్రకాశంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. సిబ్బందే రోగులకు పరీక్షలు చేసి మందులు ఇచ్చి పంపిస్తున్నారు. మార్కాపురం పట్టణంలోని పూల సుబ్బయ్య కాలనీ, అరవిందఘోష్‌వీధి, జవహర్‌నగర్, గిద్దలూరు పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ, కోటగడ్డ వీధిలో పట్టణ ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఒక్కొక్క కేంద్రం పరిధిలో రోజుకు సరాసరిన 70 నుంచి 120 మంది వరకు ఓపీ నమోదవుతోంది.

–న్యూస్‌టుడే, మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీ, జవహర్‌నగర్‌లోని కేంద్రాల్లో శాశ్వత వైద్యుల్లేరు. ఈ రెండు కేంద్రాలు ఇన్‌ఛార్జులతోనే నడుస్తున్నాయి. ఆయా కేంద్రాలకు వచ్చే రోగులకు సిబ్బందే పరీక్షలు నిర్వహించి మందులిచ్చి పంపిస్తున్నారు. పూల సుబ్బయ్య కాలనీ కేంద్రం పరిధిలో జనవరి నుంచి ప్రస్తుతం వరకు 634 డెంగీ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాల కేసులు నమోదు కాగా, 235 మంది వరకు క్షయవ్యాధిగ్రస్థులున్నారు.

మార్కాపురంలోని పూల సుబ్బయ్య కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న పడకలు

- పట్టణ ఆరోగ్య కేంద్రాలకు మూడు నెలలకొకసారి మందులు పంపిణీ చేస్తున్నారు. ఇవి వచ్చిన నెల దాటిన వెంటనే 90 శాతం వరకు అయిపోతున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. ఉన్న మందులను మూడో నెల వచ్చేవరకు అరకొరగా రోగులకు పంపిణీ చేసి కాలం వెళ్లదీస్తున్నారు. అన్ని కేంద్రాల్లో జ్వరం, బీపీ, మధుమేహం, ఆయాసం, నొప్పులు, డయేరియా ఇలా 170 రకాలకుపైగా మందులు ఉన్నట్లు అధికారులు చెబుతుండగా, పూర్తిస్థాయిలో మందులు, మాత్రలు ఉండడంలేదని రోగులు వాపోతున్నారు. ఈ విషయంపై మార్కాపురం ఇన్‌ఛార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.రాహుల్ మాట్లాడుతూ వైద్యుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

(c) eenadu

అనుసంధానం పూర్తికాక..
చుట్టూ తిరిగి వెళ్లలేక..

● వెల్లంపల్లి వంతెన వద్ద వాహనదారుల ఇక్కట్లు

వంతెన ఎక్కేందుకు ప్రమాదకరంగా ఉన్న రహదారి

జిల్లాలోని త్రిపురాంతకం, కురిచేడు, దొనకొండ మండలాలను కలపడంతో పాటు యర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు గత తెదేపా ప్రభుత్వ హయాంలో త్రిపురాంతకం మండలంలోని వెల్లంపల్లి వద్ద గుండ్లకమ్మ నదిపై వంతెనను నిర్మించారు. రూ.7 కోట్ల ఆర్డీఎఫ్ నిధులతో చేపట్టిన ఈ వంతెనను 2019 మార్చిలో అప్పటి తెదేపా ప్రభుత్వం పూర్తి చేసి ప్రారంభించింది. దీనికి అనుసంధాన రహదారి చేపట్టడంలో అనంతరం వైకాపా ప్రభుత్వం దీన్ని పూర్తిగా పక్కన పడేసింది. దీంతో యర్రగొండపాలెం, త్రిపురాంతకం నుంచి ఒంగోలు వెళ్లేందుకు చుట్టూ తిరిగి 50 కిలో మీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది.

- న్యూస్‌టుడే, త్రిపురాంతకం

రూ.30 లక్షలకుపైగా ప్రజల సొంత నిధుల వ్యయం

కురిచేడు మండలంలోని ముష్ట గంగవరం, త్రిపురాంతకం మండలంలోని పాత ముడివేములతో పాటు పలు గ్రామాల ప్రజలు ముందుకు వచ్చి రూ.30 లక్షలకు పైగా సొంత నిధులు సేకరించి పాత ముడివేముల వద్ద గుండ్లకమ్మపై చప్టాను నిర్మించారు. దీంతో వెల్లంపల్లి వంతెన నిరుపయోగం అని అందరూ అనుకున్నారు. కానీ ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన వర్షంతో పాటు విశ్వనాథపురం వద్ద సాగర్ కాలువ ఎస్కేప్ గేట్లు ఎత్తడంతో పాత ముడివేముల వద్ద గుండ్లకమ్మ ప్రమాద స్థాయిలో పరుగులు పెట్టి రాకపోకలు నిలిచిపోయాయి. ఇప్పటికీ పూర్తి స్థాయిలో గుండ్లకమ్మ నీటి ప్రవాహం తగ్గకపోవడంతో ప్రస్తుతం యర్రగొండపాలెం-ఒంగోలు బస్సు కురిచేడు నుంచి వినుకొండ అడ్డరోడ్డు మీదుగా 40 కిలో మీటర్లకు పైగా అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది.

వాగు ఎంత వచ్చినా ఇబ్బంది ఉండేది కాదు

వెల్లంపల్లి వంతెనకు అనుసంధాన రహదారిని నిర్మించి ఉంటే వాగు ఉద్ధృతి ఎంత వచ్చినా రాకపోకలకు అంతరాయం ఉండేది కాదని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే వెల్లంపల్లి వద్ద వంతెన పైకి ఎక్కే రహదారి ప్రమాదకరంగా ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం వెంటనే ఈ విషయంలో చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

5న భైరవకోనలో మహా రుద్రాభిషేకం

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన శైవ పుణ్యక్షేత్రం భైరవకోనలో కార్తిక పౌర్ణమి సందర్భంగా ఈ నెల 5వ తేదీన అఘోర స్వామీజీతో మహా రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు ఈవో డి.వంశీకృష్ణారెడ్డి తెలిపారు. పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

పామూరు, న్యూస్‌టుడే: పామూరులో సోమవారం రాత్రి దర్శి ఎంవీఐ పి.రవికుమార్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేశారు. పుదుచ్చేరి రిజిస్ట్రేషన్ ఉన్న బస్సులో అత్యవసర ద్వారం ముందు బెర్త్ ఉండడంతో ఆ బస్సును సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిన వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రావెల్స్ బస్సులో అగ్నిమాపక పరికరాన్ని పరిశీలిస్తున్న ఎంవీఐ రవికుమార్

గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజాబాబు, జేసీ గోపాలకృష్ణ, అధికారులు

చట్ట ప్రకారమే పిల్లల దత్తత

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు చట్ట ప్రకారం దత్తత తీసుకోవాలని కలెక్టర్ పి.రాజాబాబు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దత్తత ప్రక్రియపై నవంబర్ నెలలో నిర్వహించనున్న అవగాహన కార్యక్రమాల గోడ ప్రతులను ప్రకాశం భవన్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లలు లేని దంపతులకు దత్తత అనేది దేవుడు ఇచ్చిన వరం; అలాగే రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాల దృష్ట్యా పెట్టుకుని పిల్లల కోసం దళారులను నమ్మి నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, డీఆర్వో ఓబులేసు, జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారిణి సువర్ణ పాల్గొన్నారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 117 వినతులు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం) కార్యక్రమానికి 117 వినతులు అందాయి. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు హాజరయ్యారు. తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. పలువురు అర్జీదారులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. ఆయా సమస్యలపై క్షేత్రస్థాయి అధికారులతో వీక్షణ సమావేశం ద్వారా మాట్లాడారు. పరిష్కారానికి చట్టపరిధికి లోబడి కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పీఎస్ డీఎస్పీ రమణకుమార్; పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, దర్శి, మార్కాపురం, కొండపి సీఐలు వై.రామారావు, పి.సుబ్బారావు, జి.సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

మీ కోసం — రైతేరాజు

సజ్జ కంకులు పరిశీలిస్తున్న ఏవో ప్రసాదరావు

సజ్జ.. సంరక్షిద్దామిలా..!

ఇటీవల సంభవించిన మొంథా తుపాను కారణంగా జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి. వాటిలో సత్వరం సస్యరక్షణ చర్యలు చేపడితే రక్షించుకునే అవకాశం ఉంది. ఎక్కువగా సజ్జ పంటకు నష్టం వాటిల్లింది. జిల్లాలో 1,855 హెక్టార్లలో సజ్జ పంట దెబ్బతింది. తడిసిన కంకులు, పంటచేలను రక్షించుకునేందుకు తక్షణం చేపట్టాల్సిన చర్యల గురించి తాళ్లూరు **మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు** వివరించారు.

- సజ్జ పంటలో నిలిచిన నీటిని వేగవంతంగా బయటకు పంపించాలి. తడికి తావులేకుండా ఏర్పాట్లు చేసుకోవాలి.
- అంకుర, పూత, గింజ పాలుపోసుకునే దశలో పంట ఉంది. నీరు అధికమైనందువల్ల గింజ రంగుమారి నాణ్యత లోపించే ప్రమాదం ఉంది. వర్షాలకు సుంకు పోయినందువల్ల కంకి అంతటా గింజలు ఏర్పడవు.
- తేలిక నేలల్లో అయితే చెదల నివారణ సమస్య ఎదురవుతుంది. ఈ ప్రభావం లేకుండా ఉండేందుకు ఎకరాకు ఎనిమిది కిలోలు రెండు శాతం మిథైల్ పెరాథియాన్ పొడిని చల్లాలి.
- సస్యరక్షణలో మంచి ఫలితాలు పొందడానికి ఎకరాకు రెండు వందల లీటర్లకు తగ్గకుండా సిఫార్సు చేసిన క్రిమి సంహారక మందులను గానీ, శిలీంధ్ర నాశక మందులను కలిపిన ద్రావణాలను పిచికారీ చేయాలి.
- కోతలు పూర్తయి కళ్లాల్లో ఆరబోసిన కంకులు తడిస్తే పూర్తిస్థాయిలో ఎండబెట్టాలి.
- ఇదేరీతిలో జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న పెసర, మినుము, ఆముదాలు, జొన్న, వేరుశనగ, పొగాకు, తదితర పంటల్లో సత్వరం సస్యరక్షణ చర్యలు చేపడితే కొంతమేర రక్షించుకునేందుకు వీలుంటుందని తెలిపారు.

-న్యూస్‌టుడే, తాళ్లూరు

అరటి తోటల్లో నీరు చేరిందా..?

న్యూస్‌టుడే, కంభం

మొంథా తుపాను ప్రభావంతో జిల్లాలో అధిక వర్షాలు కురిశాయి. పశ్చిమ ప్రకాశంలో చెరువులు అలుగు పారుతూ అరటి పంటలను ముంచెత్తుతున్నాయి. ఇలాంటి సమయంలో తోటలను రక్షించుకోవడానికి గిద్దలూరు, కంభం **ఉద్యాన శాఖ అధికారిణి** శ్వేత పలు సూచనలు చేశారు.

- మూడు నెలల కంటే చిన్న మొక్కలను కాపాడుకునేందుకు 4 నుంచి 5 రోజుల పాటు 2 నుంచి 3 అడుగుల లోతు నీటిలో మునిగినప్పుడు వేరు వ్యవస్థ పూర్తిగా కుళ్లిపోతుంది. నీరు ఆరిపోయిన వెంటనే మొక్కలు తీసేసి నేల ఆరిన తర్వాత తేలికపాటి దుక్కిచేసి, ఎంపిక చేసిన రకానికి సిఫారసు చేసిన దూరంలో 45-45-45 సెంటీమీటర్ల పొడవు, వెడల్పు, లోతుతో గుంతలు తీసి టిష్యు కల్చర్ లేదా విత్తన శుద్ధి చేసిన, తెగుళ్లు లేని సూది పిలకలను మళ్లీ నాటుకోవాలి.
- అయిదు నుంచి ఆరు నెలల వయసు ఉండి గెలలు వేసే దశలో ఉన్న మొక్కలు . . 5 రోజుల కంటే ఎక్కువగా, 3 అడుగుల లోతు నీటిలో ఉన్న మొక్కల వేరు వ్యవస్థ పూర్తిగా కుళ్లిపోతుంది. ఈ మొక్కలు నీరు ఆరిన తర్వాత బతకడం కష్టం. 5 రోజుల కంటే తక్కువగా నీటి ముంపునకు గురైనప్పుడు వేరు వ్యవస్థ పాక్షికంగా దెబ్బతింటుంది. గాలిలో అధిక తేమ కారణంగా తెల్ల చెక్కరకేళి, గ్రాండ్‌నైన్, వామన కేళి వంటి రకాల్లో సిగటోకా ఆకుమచ్చ తెగులు అధికంగా ఆశించే అవకాశం ఉంది. సాధ్యమైనంత త్వరగా ముంపు నీటిని బయటకు పంపాలి. నేల ఆరిన తర్వాత గొర్రుతో అంతర సేద్యం చేసి మొక్కకు ఒక్కోదానికి 100 గ్రాముల యూరియా, 80 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను 20 నుంచి 25 రోజుల వ్యవధిలో 2 నుంచి 3 విడతలుగా వేయాలి. ఆకులు తడిసే విధంగా 5 గ్రాముల పొటాషియం నైట్రేట్ ఒక లీటర్ నీటికి తగినంత జిగురు కలిపి వారం రోజుల వ్యవధిలో 3 సార్లు పిచికారీ చేయాలి.
- పూర్తిగా గెలలు విడిచిన, 75 శాతం గెల తయారీకి వచ్చిన దశలో.. ముంపు నీరుతో వేరు వ్యవస్థ పాక్షికంగా, లేదా పూర్తిగా దెబ్బతింటుంది. దాంతో గెల పూర్తిగా తయారు కాకుండా పక్వానికి వచ్చి నష్టం కలుగుతుంది. నివారణకు వరద నీటిని సాధ్యమైనంత త్వరగా తోట నుంచి బయటకు పంపించి భూమి ఆరిపోయే విధంగా చేయాలి. ఆకులు, గెల బాగా తడిసే విధంగా లీటర్ నీటికి 5 గ్రాముల సల్ఫేట్ ఆఫ్ పొటాష్, 5 గ్రాముల పొటాషియం నైట్రేట్ ఎరువులను 3 రోజుల వ్యవధిలో 3 సార్లు ఒక దాని తర్వాత మరొకటి పిచికారీ చేయాలి.

అరటి చెట్ల మధ్య నిలిచిన వర్షపునీరు

బొప్పాయి పాలు.. విదేశాలకు

నంద్యాల జిల్లా చాగలమర్రి మండల వ్యాప్తంగా రైతులు అధికంగా బొప్పాయి సాగు చేస్తుంటారు. చిన్నవంగలితో పాటు సమీపంలోని గ్రామాలైన వైఎస్సార్ కడప జిల్లా కానగూడూరు, క్రిష్ణంపల్లె గ్రామాల్లో 1200 ఎకరాల్లో పండిస్తారు. విత్తనం నాటిన కాలం నుంచి తొమ్మిది నెలలకు పంట చేతికొస్తుంది. పండ్ల సేకరణ అనంతరం 13 నెలల తర్వాత మిగిలినవి, ముదురు కాయలకు గాట్లు పెట్టి పాలను సేకరిస్తున్నారు. తెల్లవారుజాము సమయంలోనే కాయలకు గాట్లు పెడితే కేవలం రెండు గంటల్లోనే పాలు ఊరుతుంది. ఇలా సేకరించిన దాన్ని రాయచోటి, రాజంపేటకు చెందిన వ్యాపారులు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల పాలు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 4 డ్రమ్ముల పాలు సేకరిస్తున్నారు. ఎకరానికి పాలసేకరణ ద్వారా రైతుకు రూ.24వేల ఆదాయం వస్తుంది. సేకరించిన పాలను పరిశ్రమల్లో మందులు, కాస్మోటిక్స్, సబ్బుల తయారీలో ఉపయోగిస్తున్నారు. బెంగళూరు, చెన్నైలతో పాటు నాణ్యతను బట్టి విదేశాలకు సైతం పాలను ఎగుమతి చేస్తున్నారు. బొప్పాయి సాగులో ఎప్పుడైనా ధర పడిపోయినప్పుడు అన్నదాతలు బొప్పాయి పాలసేకరణతో నష్టాల నుంచి బయటపడుతున్నారు.

– న్యూస్‌టుడే, చిన్నవంగలి(చాగలమర్రి)

విభిన్న పంటలు.. నిరంతర సిరులు

విభిన్న పంటలను పండిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకుని ఏడాది పొడవునా ఆదాయాన్ని పొందుతూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు కనిగిరికి చెందిన రైతు వద్దిపాటి శ్రీనివాసులు. సాగులో అనుసరిస్తున్న విధానాలు, ఇతర వివరాలను ఆయన మాటల్లోనే తెలుసుకుందాం. –న్యూస్‌టుడే, కనిగిరి

రైతు శ్రీనివాసులు సాగుచేసిన చుక్కకూర

నేను బీఏ వరకు చదివినా వ్యవసాయం మీద మక్కువతో దీనిపైనే పూర్తిగా దృష్టిపెట్టాను. కాశిరెడ్డినగర్ సమీపంలో మాకున్న ఎనిమిది ఎకరాల పొలంలో పంటల సాగు మొదలు పెట్టాడు. పాత పద్ధతిలా ఒకే పంటను ఏటా సాగు చేస్తూ నష్టాలు చవి చూడకుండా.. వ్యవసాయాధికారుల సూచనల మేరకు విభిన్న రకాల పంటలను సాగు చేయాలని నిశ్చయించాను. మార్కెట్‌లో ఏ పంటలకు మంచి ధర ఉందో తెలుసుకుని వాటికే ప్రాధాన్యం ఇస్తాను. కంది, మిర్చి, మినుము, పెసర పంటలతో పాటు, పుదీనా, పాలకూర, గోంగూర, తోటకూర, చుక్కకూర, చిక్కుడు, బెండ, బీర తదితర కూరగాయలు, ఆకుకూరలను సైతం పండిస్తున్నాం. ఎనిమిదెకరాల్లో అన్ని పంటలకు కలిపి సుమారు రూ. 5 లక్షలు పెట్టుబడి పెడితే. . ఖర్చులు పోను బాగానే ఆదాయం వస్తుంది. భూసారం కాపాడేలా పలు రకాల సేంద్రియ ఎరువులనే ఉపయోగిస్తున్నాం. వ్యవసాయ, ఉద్యాన అధికారుల సూచనలు, సలహాలు తీసుకుంటే సాగు లాభసాటిగా మారుతుంది.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

త్రిభువనశ్రీ, అభిలాష్‌లతో శిక్షకుడు వలీ

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని సాయిబాలాజీ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎస్‌డి.మస్తాన్‌వలీ తెలిపారు. ఆదివారం ఒంగోలు జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో రాణించిన పాఠశాలకు చెందిన డి.త్రిభువనశ్రీ బాలికల విభాగంలో, కె.అభిలాష్ బాలుర విభాగంలో అండర్-17 కింద రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థులతో పాటు శిక్షకులు ఎస్‌కె.వలీని ప్రత్యేక అభినందించారు.

ఎంపికైన బాలికలతో ఉపాధ్యాయులు

హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థినులు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: పాఠశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు సంతనూతలపాడు జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు ఎం.ప్రమోద తెలిపారు. సోమవారం విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కారుమూడివారిపాలెంలో అండర్-17 విభాగంలో వి.వర్షిత, ఎం.అమూల్య, ఆర్.జ్యోత్స్న, ఎం.రమ్యశ్రీలు, అండర్-14 విభాగంలో కె.హేమ, ఐ.సాత్వికలు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అనంతరం విద్యార్థినులను ఎంఈవో వెంకారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పీడీ బి.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముంపులో మోటార్లు.. ఎత్తిపోసేదెలా నీళ్లు?

తూర్పుకంభంపాడులోని ఎత్తిపోతల పథకం మోటార్ల వద్ద చేరిన నీరు

మొంథా తుపాను ప్రభావంతో ముండ్లమూరు మండలంలో భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో రోడ్లు, చెరువులు దెబ్బతిన్నాయి. వాగులపై రైతులు ఏర్పాటు చేసుకున్న మోటార్లు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాయి. మండలంలోని తూర్పుకంభంపాడులో ఉన్న మూడు ఎత్తి పోతల పథకాల్లోకి నీళ్లు చేరాయి. ఈ గ్రామంలో గుండ్లకమ్మ నదిపై మూడు ఎత్తిపోతల పథకాలను 30 ఏళ్ల క్రితం నిర్మించారు. భట్లపల్లి పథకం వద్ద నాలుగు మోటార్లు ఏర్పాటు చేయగా.. దీని పరిధిలో ఆయకట్టు 550 ఎకరాలు ఉంది. మరో పథకం పరిధిలో 200 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇదే గ్రామంలోని శ్రీరామా ఎత్తిపోతల పథకం కింద 325 ఎకరాలకు నీరు అందుతుంది. భారీ వర్షాలకు ఈ మూడు పథకాల్లోకి వరద నీరు చేరడంతో మోటార్లు, ప్యానల్ బోర్డులు మునిగిపోయాయి. గుండ్లకమ్మనది ఉగ్రరూపం దాల్చడంతో మోటార్లున్న భవనాల్లోకి బురద నీరు చేరింది. మోటార్లు మొరాయించకుండా మరమ్మతులు చేయించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ముండ్లమూరు

భట్లపల్లి పథకం వద్ద మోటార్లకు పట్టిన బురదను కడుగుతున్న రైతు

మాజీ సైనికులకు స్థలాలివ్వాలని ఆందోళన

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురంలో అర్హులైన మాజీ సైనికులకు ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా నాయకుడు గాలి వెంకటరామిరెడ్డి, మాజీ సైనికుల సంఘం గౌరవ అధ్యక్షుడు శీలం హరినారాయణరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఉప కలెక్టర్ కార్యాలయం ఎదుట మాజీ సైనికుల సంఘం - మాజీ సైనికుల హౌసింగ్ బోర్డు వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కాపురం పరిసర ప్రాంతాల్లో ఎందరో మాజీ సైనికులు అద్దె నివాసాల్లో ఉంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందులో రూ.10 వేల లోపు పింఛన్ వచ్చే వారున్నారన్నారు. వారి పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. అనంతరం ఇన్‌ఛార్జి ఉప కలెక్టర్ వెంకట శివరామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మర్రిబోయిన చిన్నయ్య, నాయకులు శ్రీనివాసులు, వెంకట నారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, నాగయ్య, పుల్లయ్య, రామకృష్ణారెడ్డి, తిరుపతి రెడ్డి, మాజీ సైనికులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మార్కాపురం: ధర్నా చేస్తున్న మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 575 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.96/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 121, రిటైల్ లైవ్ - 148, చికెన్ విత్ స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్- 244

పిచ్చికుక్క స్వైరవిహారం!

● మార్కాపురంలో 35 మందికి గాయాలు

మార్కాపురం, న్యూస్‌టుడే: ఓ పిచ్చి కుక్క సోమవారం పట్టణ వాసులను బెంబేలెత్తించింది. వివిధ కాలనీల్లో ఉన్న వారిపై దాడి చేయడంతో వారు సర్వజన వైద్యశాలకు పరుగులు పెట్టారు. బాధితుల కథనం మేరకు..పట్టణంలోని రాజ్యలక్ష్మీ కాలనీలోని పిచ్చికుక్క రోడ్డుపై పరుగులు పెడుతూ కనిపించిన వారిపై దాడి చేసింది. అనంతరం జగదీశ్వరి సినిమా థియేటర్ వీధి సమీపంలోని ఓ వస్త్ర దుకాణం వద్ద కొందరిని కరిచింది. తదుపరి ఆర్టీసీ బస్టాండ్ మార్గంలో పలువురిపై దాడి చేసింది. రెండు గంటల వ్యవధిలో పట్టణంలోని వివిధ ప్రాంతాల వారిని బెంబేలెత్తించింది. దీంతో బాధితులంతా స్థానిక సర్వజన వైద్యశాలకు వెళ్లారు. గాయపడిన వారిలో అనంత వెంకటేశ్వర్లు, జె.జయ, షేక్ గుల్జార్, ఈశ్వరయ్య, నాగమ్మ, మస్తాన్ ఇలా సుమారు 35 మంది వరకు ఉన్నారు. మున్సిపల్ కమిషనర్ నారాయణరావు వైద్యశాలకు చేరుకుని బాధితులను పరామర్శించారు. అనంతరం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న కుక్కలను పట్టుకుని రక్షణ ప్రదేశానికి తరలించారు.

బాధితులను పరామర్శిస్తున్న కమిషనర్ నారాయణరావు

ఆర్టీసీ బస్సులో డ్రైవర్ క్యాష్ బ్యాగ్ చోరీ

● నిందితుడిని పట్టుకున్న సిబ్బంది

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో డ్రైవర్ వద్దఉన్న క్యాష్‌బ్యాగ్‌ను అపహరించి పారిపోతున్న చిత్తూరు జిల్లా గుడిపల్లి గ్రామానికి యువకుడిని సిబ్బంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సంఘటన ఒంగోలు ఆర్టీసీ బస్టాండులో ఆదివారం రాత్రి 11.40గంటల సమయంలో జరిగింది. ఒకటో పట్టణ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పొదిలి వైపు నుంచి ఒంగోలు వస్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులో మర్రిచెట్లపాలెం వద్ద ఒక యువకుడు ఎక్కి ఒంగోలుకు టిక్కెట్ తీసుకున్నాడు. బస్సు స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకుని కార్గో పాయింట్ వద్ద సరకు దింపుతుండగా డ్రైవర్ ఎస్.వి.ఆంజనేయులు తన క్యాష్‌బ్యాగ్‌ను బ్యానెట్‌పై ఉంచారు. ప్రయాణికులతోపాటు దిగుతూ ఆ యువకుడు బ్యాగ్‌ను తీసుకుని ఉడాయించాడు. డ్రైవర్ వెంటనే అప్రమత్తమై కేకలు వేయటంతో విధుల్లో ఉన్న ఆర్టీసీ కానిస్టేబుల్ షేక్ షకీర్ వెంబడించి దొంగను పట్టుకున్నారు. నిందితుడిని సెక్యూరిటీ సూపర్‌వైజర్లు కె.వి.రావు, ఎస్.ఎస్.రావులు ఆర్టీసీ ఓపీ సిబ్బందికి అప్పగించారు. అతని వద్ద ఉన్న బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌కు అందజేశారు. అందులో రూ.5,800 నగదు ఉంది. పట్టుబడిన నిందితుడు చిత్తూరు జిల్లా గుడిపల్లి గ్రామానికి చెందిన పి.హరికృష్ణగా గుర్తించారు. ఆర్టీసీ అధికారుల ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మద్దిపాడు, న్యూస్‌టుడే: మండల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మద్దిపాడు ఎస్సై వెంకట సూర్య తెలిపిన సమాచారం ప్రకారం సోమవారం మద్దిపాడు, నందిపాడు గ్రామాల మధ్య గుండ్లకమ్మ ఒడ్డున పొలాల్లో మృతదేహం ఉందని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు స్థానిక వీఆర్‌ఓతో కలిసి సంఘటన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. ఇటీవల మొంథా తుపాను వరదకు ఎగువ ప్రాంతాల నుంచి కొట్టుకువచ్చిన పురుష మృతదేహమని, సుమారు 60 సంవత్సరాల వయస్సు ఉంటుందని తెలిపారు. తుపాను సమయంలో ఎవరైనా అదృశ్యం అయితే, మృతదేహం ఆనవాళ్లు ఉన్న వాళ్ల బంధువులు మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు. వీఆర్‌వో ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్టాండు ప్రాంతంలో వృద్ధుడు

కంభం, న్యూస్‌టుడే : స్థానిక బస్టాండ్ ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వృద్ధుడు (60) సోమవారం మృతి చెందినట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు..సుమారు మూడు నెలల నుంచి బస్టాండ్ ప్రాంతంలోని హోటళ్లు, ఇతర ప్రాంతాల్లో అతను భిక్షాటన చేస్తుండేవాడని తెలిపారు. అనారోగ్యంతో మృతి చెందినట్లు చెప్పారు.

అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి

మీ ఉన్నతికై శ్రమించిన, మీ కుటుంబ సభ్యుల / ఆత్మీయుల అంత్యక్రియలు, నిర్యాణం, వర్ధంతి, జయంతి ప్రకటనలు ఈనాడులో తక్కువ ఖర్చుతో ప్రచురణ కొరకు

వివరాలకు సంప్రదించండి

ఈనాడు ప్రకటనల విభాగం

ఈనాడు కార్యాలయము, పేర్నమిట్ట, ఒంగోలు

★ GST 5% అదనం ✆ 97011 12824

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

REAL ESTATE

FLAT FOR SALE

ఒంగోలు లాయర్‌పేటలో SBI ఎదురుగా నూతనంగా నిర్మించిన అపార్ట్‌మెంట్ 2BHK (1225 sq.ft) ఫ్లాట్ అమ్మకానికి కలదు. Ph: 91215 85925

JOBS

WANTED HDFC BANK కొరకు గుంటూరు & ప్రకాశంజిల్లాలో పనిచేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. DRA సర్టిఫికేట్ కలిగినవారికి తొలి ప్రాధాన్యత. వెంటనే సంప్రదించండి. లలితా ఫైనాన్స్ లింక్స్ కాంగ్రెస్ ఆఫీస్ రోడ్, విజయవాడ. ✆9951001348

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యూయర్స్. ఏజ్: 22-35. ఫ్రెషర్స్ కూడా కావలెను. ✆ 6281037879.

ప్రముఖ క్వాసి బ్యాంక్ ఒంగోలు బ్రాంచ్ నందు పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్స్, సేల్స్ మేనేజర్స్ కావలెను. జీతం రూ. 8000 to 28,000 సంప్ర. ✆ 7075034267

గుంటూరు జిల్లా వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ హాస్టల్‌లో ఉండి పనిచేయుటకు వార్డెన్స్ కావలెను. (పురుషులు/ స్త్రీలు) డిగ్రీ/ పీజీ అర్హత. కాంటాక్ట్- 9490309033 (F), 9705834803 (M)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

మొక్కలు నాటుతున్న విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సూచించారు. దేవరాజుగట్టు జడ్పీ ఉన్నత పాఠశాలలో వారు విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం మొక్కలు నాటించారు.

మార్కాపురం
•మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: సంజీవరాయునిపేట 33 కేవీ విద్యుత్తు లైన్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. సంజీవరాయునిపేట, ఉయ్యాలవాడ విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాల్లో సరఫరా ఉండదన్నారు.

భోజనం రుచి చూస్తున్న ఎంఈవో మధుసూదన్‌రెడ్డి

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం

వేమ్నవారిపేట, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజన నిర్వాహకులు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంఈవో-1 మధుసూదన్‌రెడ్డి అన్నారు. వేమ్నవారిపేట ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి వస్తువులను తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

బొమ్మ గీసి.. ప్రకృతికి జీవం పోసి..

పొదిలి : విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ నరసింహారావు

సత్తాచాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి శ్రీవిశిష్ట జూనియర్ కళాశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'ప్రకృతి అందాలు' అనే అంశంపై వారు గీసిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. వాటికి రంగులద్ది జీవంపోశారు. మొదటి బహుమతి ఎన్.మణిశ్రీ (సెకండ్ ఇయర్), రెండో బహుమతి పి.మిల్కా (సెకండ్ ఇయర్), మూడో బహుమతి ఎం.యశస్విని (ఫస్ట్ ఇయర్) గెలుచుకున్నారు. వారికి పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.నరసింహారావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి.శ్రీను, కిరణ్మయి, మోహనరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. సోమవారం పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా..మొదటి బహుమతిని వై.నందిని (7వ తరగతి), కె.సింధుప్రియ (8వ తరగతి), వై.యేసురాజ్ (8వ తరగతి) గెలుచుకున్నారు. వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలను పాఠశాల హెచ్ఎం నాగరాణి, ఉపాధ్యాయులు టి.చెన్నయ్య, ఇందిరా ప్రియదర్శిని, మురళీమోహన్ అందించారు.

అర్హులకు పొగపెట్టి.. అడవిలో అంటగట్టి..

మార్కాపురం, తర్లుపాడు, న్యూస్‌టుడే:

ఇళ్లు కాదు ఊళ్లే నిర్మిస్తున్నామంటూ గత పాలకులు హడావుడి చేశారు. అయితే గ్రామాలకు సుదూరంగా ఉన్న అటవీ ప్రాంతాల్లో పట్టాలు మంజూరు చేయడంతో ఎవరూ నిర్మించుకోలేదు. దీంతో పశ్చిమ ప్రాంతంలోని మార్కాపురం, తర్లుపాడు తదితర మండలాల్లో లబ్ధిదారులకు నీడ దూరమైంది. మార్కాపురం మున్సిపాలిటీ ఇడుపూరులో రెండు లే అవుట్లు వేశారు. అదేవిధంగా రాజ్యలక్ష్మి కాలనీ, చెన్నరాయునిపల్లెలో మరో రెండు లేఅవుట్లు వేశారు. ఈ ప్రాంతాల్లో దాదాపు నాలుగు వేల మందికి పట్టాలిచ్చారు. అయితే చాలామంది ఇళ్ల నిర్మాణాలు చేసుకోలేదు. ఎక్కువగా పునాది, లింటల్ స్థాయిలోనే నిలిచిపోయాయి. కేవలం అయిదొందల గృహాలు మాత్రమే పూర్తయ్యాయి. ఇక తర్లుపాడు మండలంలో 18 జగనన్న కాలనీల ఏర్పాటుకు రూ.లక్షలు వెచ్చించారు. అయితే అందులో చాలా వరకూ కాలనీల్లో ఒక్క గృహం కూడా నిర్మించకపోవడం గమనార్హం. మీర్జాపేటలోని పేదలకు గొల్లపల్లె చెరువుపై దట్టమైన అటవీ ప్రాంతంలో రూ.లక్షలు ఖర్చు చేసి కాలనీ ఏర్పాటు చేయగా..ఒక్కరు కూడా నిర్మించుకోలేదు. ఇప్పుడా ప్రాంతం చిల్ల చెట్లు, క్రిమి కీటకాలకు నిలయంగా మారింది. శిలాఫలకాలు అక్కడి ముళ్ల పొదల్లో దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. నాగెళ్లముడుపు, చెన్నారెడ్డిపల్లె, కారుమానిపల్లె తదితర ప్రాంతాల్లో కూడా ఇళ్ల నిర్మాణం అన్నదే మొదలుపెట్టలేదు. అందులోనూ అర్హులను కాదని పార్టీ అభిమానులకు చోటు కల్పించారని పలువురు ఆరోపిస్తున్నారు.

మార్కాపురం: ఇడుపూరు జగనన్న కాలనీలో అసంపూర్తిగా ఇళ్లు

మీర్జాపేటలో ముళ్లపొదల మధ్య శిలాఫలకం

నివాస యోగ్యత లేనిచోట..

జగనన్న కాలనీల పేరిట వైకాపా నాయకులు పెద్దఎత్తున నిధులు దోచుకున్నారు. తర్లుపాడులో తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి..తర్వాత ఎక్కువ రేటుకు ప్రభుత్వానికి అంటగట్టారని లబ్ధిదారులు వాపోతున్నారు. దీంతో నివాసయోగ్యత లేని ప్రాంతాల్లో కాలనీలు ఏర్పాటు చేశారని వారంటున్నారు. తమ గూడు కల నెరవేరలేదని వారు వేదన చెందుతున్నారు. కొత్త ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహకాలు కల్పించిందని, అయితే నివాస యోగ్యం లేనిచోట ఇళ్లు కట్టుకుంటే ప్రయోజనం ఏమిటని వారు పెదవి విరుస్తున్నారు.

నీటి వృథాకు అడ్డుకట్ట

మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మార్కాపురం పట్టణం: మార్కాపురం పట్టణం లోని మార్కండేశ్వర స్వామి ఆలయ బజారులో పైపు లీకై మంచి నీరు వృథాగాపోతోంది. దీనిపై 'ఈనాడు'లో వార్త ప్రచురితం కాగా, స్పందించిన మార్కాపురం మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయించి నీటి వృథాను అరికట్టారు.

ఈనాడు కథనానికి స్పందన

'పశ్చిమంలో గొలుసు దుకాణాలకు అడ్డుకట్ట'

మార్కాపురం, న్యూస్‌టుడే: పశ్చిమ ప్రకాశంలో గొలుసు దుకాణాలకు అడ్డుకట్ట వేయాలని ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ సహాయ కమిషనర్ కె.విజయ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ప్రొహిబిషన్- ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కాపురం స్టేషన్ పరిధిలో నమోదైన కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పెండింగ్ లేకుండా చూడాలని సూచించారు. ఎక్కడా గొలుసు దుకాణాలు ఉండకూడదన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లలో ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్ ద్వారా విక్రయాల పరిస్థితిని పరిశీలించాలన్నారు. ప్రతి సీసాను తప్పనిసరిగా స్కాన్ చేసి విక్రయాలు చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జనార్దన్‌రావు, సీఐ వెంకటరెడ్డి, ఎస్సై గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న ఒంగోలు సహాయ కమిషనర్ విజయ

పృథ్వీలింగాకారుడు

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: కార్తిక సోమవారం సందర్భంగా పట్టణంలోని మార్కండేశ్వరస్వామి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జాము నుంచే ప్రమిదలు వెలిగించి ధూప, దీప నైవేద్యాలతో మొక్కులు చెల్లించుకున్నారు. జగదాంబ అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

◗ మార్కండేశ్వర దేవస్థానంలో స్వామివారి పృథ్వీలింగాకారంలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో దీపాలు వెలిగించి, ఉపవాస దీక్షలు చేశారు.

అభిషేకాలు.. అర్చనలు
ఆలయాల్లో కార్తిక సందడి

చిన్నకంభం వద్ద శివలింగాలకు పూజలు

కంభం, న్యూస్‌టుడే : కార్తిక రెండో సోమవారం పురస్కరించుకుని శైవక్షేత్రాలు భక్తులతో కిక్కిరిశాయి. చిన్నకంభంలోని వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రావిపాడు, జంగంగుంట్ల, తురిమెళ్ల తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు దీపాలు వెలిగించారు. వేకువజామున నది స్నానాలు చేశారు.

రాచర్ల : సురభేశ్వర కోన, సత్యవోలు రామలింగేశ్వరాలయం, రామాపురంలోని సిద్ధి భైరవేశ్వరాలయం, రాచర్లలోని రామలింగేశ్వరాలయాల్లో శివునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆకవీడు, చోళ్లవీడు తదితర గ్రామాల్లోని ఆలయాల్లోనూ పూజలు చేశారు.

పొదిలి: పార్వతీసమేత నిర్మమహేశ్వర స్వామిని భక్తులు దర్శించుకున్నారు. మహిళలు ధ్వజస్తంభం, ఉసిరి, రావి చెట్ల వద్ద కార్తిక దీపాలు వెలిగించారు. శివలింగానికి జల, క్షీరాభిషేకాలు చేశారు. మాలధారణ స్వాములు, సాధారణ భక్తులతో దేవాలయం కిక్కిరిసింది. దేవస్థానం ఛైర్మన్ ఒగ్గు వెంకట్రామయ్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

పొదిలి : శివాలయం ఆవరణలో అభిషేకాలు

గిద్దలూరు పట్టణం: పాతాళ నాగేశ్వరస్వామి, కృష్ణంశెట్టిపల్లెలోని ఎగువ భీమలింగేశ్వర స్వామి, పాపులవీడు భైరవేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. పాతాళనాగేశ్వరస్వామి దేవస్థానంలో తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి దంపతులు అభిషేకాలు చేపట్టారు.

త్రిపురాంతకం గ్రామీణం: త్రిపురాంతకేశ్వర స్వామి, బాలాత్రిపురసుందరీదేవి ఆలయాలు సోమవారం భక్తులతో కిక్కిరిశాయి. మేడపి త్రిపుర కోటేశ్వర ఆలయం, గణపవరం శివాలయం, గణకేశ్వరస్వామి ఆలయం, దూపాడులోని చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం, అన్నసముద్రం శివాలయంలోని పురాతన శివాలయాల్లో పూజలను ఘనంగా నిర్వహించారు.

పొదిలి : దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న మహిళలు

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

కొనకనమిట్ల : ఎంపికైన విద్యార్థులు

కొనకనమిట్ల, న్యూస్‌టుడే: వెలిగొండ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఇబ్రహీం సోమవారం తెలిపారు. ఇటీవల నెల్లూరు జిల్లాలో జరిగిన పోటీల్లో వాలీబాల్ అండర్ 14, 17, రగ్బీ విభాగాల్లో రుషి, విష్ణువర్ధన్, శ్రీరామ్, శామ్యూల్ రాజు, వెంకట్రావు, యువరాజ్ ఎంపికయ్యారన్నారు.

చదరంగంలో..: మార్కాపురం పట్టణం: ఒంగోలులో సోమవారం జరిగిన పోటీల్లో పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు షణ్ముఖి, ప్రహేళిక చదరంగం విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అదేవిధంగా జ్యోతి యోగాలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని శ్రీదేవి తెలిపారు.

భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న రాధామనోహర్‌దాస్

సనాతన ధర్మం ఎంతో గొప్పది

కంభం, న్యూస్‌టుడే : సనాతన ధర్మం ఎంతో గొప్పదని ఆధ్యాత్మికవేత్త రాధా మనోహర్‌దాస్ అన్నారు. ఇటీవల కొందరు ధ్వంసం చేసిన స్థానిక వై జంక్షన్ సమీపంలోని వరసిద్ధి వినాయక ఆలయ అరుగు, గుడిని సోమవారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిందువులు ఐక్యంగా ఉండాలని చెప్పారు. దేవాలయాలు నిలబెట్టుకుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. అరుగును ధ్వంసం చేసిన వారు హిందువులేనన్నారు. అందరూ ఆధ్యాత్మిక జీవనాన్ని అలవాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు అయ్యప్ప మాలధారులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముంచెత్తే మురుగు.. పర్యవేక్షణ కనుమరుగు

పెద్దబొమ్మలాపురం పరిధిలోని బ్రహ్మంగారి మఠం గూడెంలో వసతుల లేమితో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వారు ఉండే గృహాలు శిథిలావస్థకు చేరి శ్లాబుల పెచ్చులూడి పడుతున్నాయి. నూతనంగా పీఎం జన్‌మన్ పథకంలో కొందరికే గృహాలు మంజూరయ్యాయని వారు వాపోతున్నారు. డ్రైనేజీలు లేకపోవడంతో మురుగంతా ఇళ్ల పరిసరాలను ముంచెత్తుతోంది. ఐటీడీఏ అధికారులు సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, పెద్దదోర్నాల

ఆక్రమిత కోనేరు పరిశీలన

కోనేరు స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మంజునాథ్‌రెడ్డి తదితరులు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని గ్రంథాలయం పక్కనే ఉన్న కోనేరును సోమవారం తహసీల్దార్ మంజునాథ్‌రెడ్డి రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ కోనేరు స్థలాన్ని కొందరు ఆక్రమించారు. అందులో చెత్తా చెదారం పడేయడంతో దుర్వాసన వస్తుండటంతో గ్రంథాలయానికి వచ్చిన వారు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మండల భాజపా అధ్యక్షుడు సూర్యనారాయణ అధికారులకు విన్నవించారు. ఈ మేరకు స్పందించిన అధికారులు ఆక్రమణదారులతో మాట్లాడారు. గ్రంథపాలకురాలు ఝాన్సీ, భాజపా నాయకుడు సూర్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా ఆన్‌లైన్ చేశారు!

యర్రగొండపాలెం: మిల్లంపల్లె రెవెన్యూ పరిధిలోని సర్వే నం.337, 338, 336లోని 2.75 ఎకరాల భూమిని తమకు తెలియకుండా పేర్లు తొలగించి ఇతరుల పేరుపై ఆన్‌లైన్ చేశారని కాల్వ నరసింహారావు అనే వ్యక్తి సోమవారం వై.పాలెం తహసీల్దార్ మంజూనాథరెడ్డికి ఫిర్యాదు చేశారు. తమకు వారసత్వంగా వస్తున్న వ్యవసాయ భూమిని అప్పట్లో పనిచేసిన తహసీల్దార్ ప్రలోభాలకు గురై బదిలీ అయ్యే రోజే మార్చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

సీఎం సహాయ నిధితో ఊరట

కొనకనమిట్ల, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఊరటనిస్తుందని ఎమ్మెల్యే నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం కొనకనమిట్ల మండలంలోని పలు గ్రామాల్లో బాధితుల నివాసాల వద్దకు వెళ్లి రూ.4,36,778 విలువైన చెక్కులను ఆమె అందించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు బాషాపతి నాయుడు, సర్పంచి సుఖ్‌దేవ్, తెదేపా కన్వీనర్ బాబూరావు, కాటంరాజు తదితరులు పాల్గొన్నారు.

పేరుకే పట్టణం.. చీకట్లతో సతమతం



గిద్దలూరు పట్టణంలోని కుమ్మరామం కట్ట నుంచి ఆర్టీసీ డిపో వరకు ఉన్న ప్రధాన రహదారిలో 2018లో వీధి దీపాలు ఏర్పాటు చేసి నిర్వహణను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. అటు తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో వారు నిర్వహణను గాలికి వదిలివేశారు. ప్రస్తుత పంచాయతీ అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో వీధి దీపాలు పలుచోట్ల వెలగడం లేదు. రాచర్ల కూడలి వద్ద కూడా ఇదే దుస్థితి నెలకొంది. –న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

పొదిలి అభివృద్ధికి కృషి

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి నగర పంచాయతీలో ప్రధాన సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చెప్పారు. సోమవారం పొదిలి రథంరోడ్డులో తెదేపా నాయకులు సామంతపూడి నాగేశ్వరరావు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనలో పొదిలికి వారానికి 28 గంటలు నీళ్లు ఇస్తే తమ ప్రభుత్వం వచ్చాక 42 గంటలు నీళ్ల సరఫరా అయ్యేలా చేశానన్నారు. రూ.121 కోట్లతో అమృత్-2 పథకం ద్వారా నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించనున్నట్లు చెప్పారు. పొదిలికి బైపాస్‌రోడ్డు మంజూరవుతోందన్నారు. అన్న క్యాంటీన్ పొదిలికి మంజూరు చేయిస్తానన్నారు. జనవరి నాటికి సీఎం మార్కాపురం జిల్లా ఏర్పాటును ప్రకటిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. దాన్ని చంద్రన్న జిల్లాగా ఏర్పాటు చేయమని కోరనున్నట్లు చెప్పారు. ఏఎంసీ ఛైర్మన్ సయ్యద్ ఇమాంసాహెబ్, తెదేపా నాయకులు నాగేశ్వరరావు, అంజిరెడ్డి, యల్లమంద, ఖుద్దూస్, అనిల్ తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆర్చి నిర్మాణానికి భూమిపూజ

పొదిలి: పొదిలిలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం వీధిలో ఆర్చి నిర్మాణానికి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి భూమిపూజ చేశారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. సుమారు రూ.40 లక్షల వ్యయంతో వీధికి ఇరువైపులా ఆర్చి నిర్మిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జి.సి.సుబ్బారావు తెలిపారు. జి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ ఉద్యమంతో దేశాభివృద్ధి

రాచర్ల, న్యూస్‌టుడే : దేశాభివృద్ధికి స్వదేశీ ఉద్యమం ఎంతో అవసరమని భాజపా మండల ప్రవాస యోజన కార్యక్రమ ఇన్‌ఛార్జి భవనాసి వెంకట రామాంజనేయులు అన్నారు. ఇంటింటా స్వదేశీ కార్యక్రమంలో భాగంగా రాచర్లలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశీ వస్తువులు వద్దు.. స్వదేశీ సామగ్రినే ముద్దు అని వివరించారు. అనంతరం ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు దూదేకుల మహేష్, కొప్పరపు నాగేశ్వరరావు, ఖాదర్‌వలీ పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న భాజపా నాయకులు

ఎంపికైన విద్యార్థులతో అధికారులు, ఉపాధ్యాయులు

పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గిద్దలూరు పట్టణం: గిద్దలూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ఆవరణలో సోమవారం రాజ్యాంగ దినోత్సవాల సందర్భంగా పోటీలు నిర్వహించి కొందరు విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. జిల్లా పరిషత్ బాలికల పాఠశాలకు చెందిన ఎస్‌కె.నూరానీ, ఎన్.రమ్యశ్రీ, తురిమెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన టి.జె.దినేష్‌నాయుడు రాష్ట్రస్థాయికి అర్హత సాధించారన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు అశ్వనీకుమార్, పోలా నాగభూషణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తర్లుపాడు: కలుజువ్వలపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని **గాయం వర్షిత** రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఎంఈవో అచ్యుత సుబ్బారావు తెలిపారు. సోమవారం మార్కాపురంలో నిర్వహించిన క్విజ్, వక్తృత్వ పోటీల్లో ఆమె ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. ఏపీ మాక్ అసెంబ్లీ స్వయంగా వీక్షించేందుకు అర్హత సాధించిందన్నారు.

'పీపీపీతో ప్రభుత్వ వైద్యం దూరం'

మార్కాపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను పీపీపీకి అప్పగించడమంటే పేదలకు వైద్యం దూరం చేయడమేనని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. సోమవారం స్థానిక గడియార స్తంభం వద్ద వైకాపా ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం తీసుకువచ్చిన వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటుకు అప్పగించేందుకు యత్నిస్తోందన్నారు. ఈ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, మండల వైకాపా కన్వీనర్ చెంచిరెడ్డి, అంజిరెడ్డి, శివకృష్ణారెడ్డి, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాంబాబు, పక్కన వైకాపా నాయకులు

కొలిక్కివచ్చిన సాగర్ గండి పూడ్చివేత

పనులు పర్యవేక్షిస్తున్న ఈఈ విజయలక్ష్మి, డీసీ ఛైర్మన్ చలమయ్య

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే

ముడివేముల మేజర్‌కు సమీపంలో సాగర్ ప్రధాన కాలువ గండి పూడ్చివేత పనులు శరవేగంగా సాగుతూ చివరి దశకు చేరుకున్నాయి. అక్టోబరు 29న మొంథా తుపాను ప్రభావంతో ఎగువ అటవీ ప్రాంతాల్లో కురిసిన వర్షంతో యూటీకి కొద్ది దూరంలో కాలువ కట్టకు గండి పడింది. దీంతో ఎన్నెస్పీ దర్శి ఓ అండ్ ఎం డివిజన్ ఈఈ విజయలక్ష్మి, త్రిపురాంతకం డీసీ ఛైర్మన్ దేవినేని చలమయ్య సోమవారం గండి పూడ్చివేత పనులు పరిశీలించారు. సాగర్ జలాశయం వద్ద నిలిపివేసిన నీటి సరఫరా పునరుద్ధరిస్తున్నారు. దీంతో సాగర్ జలాలు జిల్లాకు చేరేలోగా అన్ని మరమ్మతు పనులు పూర్తి చేస్తామని ఈఈ విజయలక్ష్మి తెలిపారు.

పంటలను వీడని వరద నీరు

పెద్దదోర్నాల: ఇటీవలి వర్షాలతో ముంపునకు గురైన పొలాలు ఇంకా తేరుకోలేదు. తీగలేరు కాలువ సమీపంలో జమ్మిదోర్నాల రైతులకు చెందిన మిరప, పత్తి తదితర పంట పొలాల్లో నీరు ఇంకా అలానే నిల్వ ఉంది. కాలువ ఉప్పొంగడంతో ఈ దుస్థితి ఎదురైందని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు తమ పంటల వైపు కన్నెత్తి చూడటం లేదని వారు విమర్శిస్తున్నారు.

జమ్మిదోర్నాలలో ముంపులోనే మిరప పంట

రాయితీపై శనగల పంపిణీ

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: భూపతిపల్లి పంచాయతీ మిట్టమీదపల్లిలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు శనగ విత్తనాల పంపిణీ చేపట్టారు. మార్కాపురం ఏఎంసీ ఛైర్మన్ ఎం.వెంకటరెడ్డి పాల్గొని రాయితీ విత్తనాలను అందించారు. కార్యక్రమంలో మార్కాపురం, మిట్టమీదిపల్లి సొసైటీ అధ్యక్షులు రామాంజనేయరెడ్డి, నాసర్‌రెడ్డి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

శనగలు అందజేస్తున్న ఏవో బుజ్జిబాయి, ఏఎంసీ ఛైర్మన్ వెంకటరెడ్డి

(c) eenadu

కనిగిరి

•కనిగిరి •దర్శి •కొండపి

బహుమతులు అందజేస్తున్న తాళ్లూరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు

విజేతలతో దర్శి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

చిత్రం గీసి.. సృజన చాటి

కనిగిరి, న్యూస్‌టుడే: మండలంలోని తాళ్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 'మీకు ఇష్టమైన పండగ' అనే అంశంపై సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఇందులో సీహెచ్ ఐశ్వర్య, షేక్ రేష్మ, ఎ.భవ్యలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరికి ప్రధానోపాధ్యాయుడు దొడ్డ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, చెంచురామయ్య, వెంకట్రావు, రాము, సుబ్బారావు, యశోద, ప్రియదర్శిని, వాణి సాయికృష్ణ తదితరులు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

• దర్శి: దర్శి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా బొమ్మలు గీశారు. ప్రతిభ చాటి తొలి మూడు స్థానాల్లో నిలిచిన బి.దారయ్య, టి.నాగపూజ, బి.మహాలక్ష్ములకు హెచ్‌ఎం కాశీవిశ్వనాథ చేతులమీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంగారావు, పెదపునుమయ్య, రవికుమార్, వెంకయ్య పాల్గొన్నారు.

కాకుటూరిపాలెంలో తహసీల్దార్ పరిశీలన

టంగుటూరు: మండలంలోని కాకుటూరిపాలెంలో తలపెట్టిన అంబేడ్కర్ సభా ప్రాంగణ స్థలాన్ని తహసీల్దార్ ఆంజనేయులు తన సిబ్బందితో సోమవారం సందర్శించారు. గ్రామంలోని 531-1 సర్వే నంబరులోని స్థలంలో విద్యుత్తు స్తంభం, ప్రహరీ నిర్మాణంలో జటిల వివాదం చెలరేగింది. దీనిపై గ్రామానికి చెందిన ఇరువర్గాల వారు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పనులను నిలిపివేయాలని ఎస్సీ కాలనీ వాసులకు అధికారులు సూచించారు. ఈ నేపథ్యంలో సోమవారం స్థలాన్ని పరిశీలించి ఇరువర్గాల వారితో మాట్లాడారు. ప్రహరీ నిర్మాణానికి సంబంధించి ఎలాంటి పనులు చేపట్టదని, మంగళవారం సర్వే నిర్వహించి అందరికీ ఆమోదయోగ్యంగా సమస్యను పరిష్కరిస్తామని తెలియజేశారు.

ఆలయ ఆదాయం రూ.1,77,447

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ఆదివారం ఆదాయం రూ. 1,77,447 వచ్చిందని కార్యనిర్వహణాధికారి ఎస్. నరసింహబాబు తెలిపారు. స్వామివారి దర్శన టిక్కెట్ల విక్రయం, లడ్డూ ప్రసాదం అమ్మకం, శాశ్వత అన్నదాన పథకం, పంచామృత అభిషేకాలు విరాళాల ద్వారా ఈ మొత్తం సమకూరినట్లు పేర్కొన్నారు.

గుర్తింపు కార్డుల పంపిణీ

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: విద్యాభివృద్ధికి దాతల సాయం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు అన్నారు. సోమవారం హెచ్ ఎంపాడుకు చెందిన దాత, తెదేపా నాయకుడు గంటా శ్రీనివాసరెడ్డి స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 190 మంది విద్యార్థులకు రూ. 20 వేల విలువైన గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు.

పొగాకు కనిష్ఠ ధర రూ.60

టంగుటూరు, న్యూస్‌టుడే: టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో గరిష్ఠ ధర రూ. 351 పలికింది. జమ్ములపాలెం, తూమాడు గ్రామాలకు చెందిన రైతులు 1,011 బేళ్లను తీసుకురాగా.. 764 బేళ్లు కొనుగోలు చేశారు. మిగిలినవి తిరస్కరణకు గురయ్యాయి. కనిష్ఠ ధర రూ.60, సరాసరి ధర రూ.190 పలికినట్లు వేలం కేంద్ర నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. • కొండపి గ్రామీణం: కొండపి వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకు గరిష్ఠ ధర రూ. 350 పలికిందని నిర్వహణాధికారి సునీల్‌కుమార్ తెలిపారు. జోర్లు పరిధిలోని పైడిపాడు, గోగినేనివారిపాలెం, అన్నెపురెడ్డిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1,290 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. అందులో 1,042 కొనుగోలు చేశారు. మిగిలిన 248 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కిలో పొగాకు కనిష్ఠ ధర రూ.60 పలికిందన్నారు.

ప్రతి నీటి బొట్టునూ వినియోగించుకుంటాం

☛ తూములు, కాలువలు బాగుచేసి పొలాలకు సాగునీరు అందిస్తాం
☛ 'న్యూస్‌టుడే'తో జలవనరుల శాఖ డీఈఈ విజయభాస్కర్‌రెడ్డి

ముఖాముఖి

కనిగిరి అంటేనే కరవు కాటకాలకు పెట్టింది పేరు. వర్షాలు పడితేనే ఇక్కడ పంటలు పండేది. ఇలాంటి పరిస్థితుల్లో ఇటీవల మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి నియోజకవర్గంలోని చెరువులు, రిజర్వాయర్లు జలకళను సంతరించుకున్నాయి. కొన్నిచోట్ల చెరువుకట్టలకు గండ్లుపడి, జలాశయ గేట్లకు లీకులతో నీరు వృథా అయింది. ప్రతి నీటి బొట్టునూ కాపాడుకుంటామని జలవనరుల శాఖ కనిగిరి డీఈఈ కె.విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. జలవనరుల సంరక్షణకు చేపట్టిన చర్యల గురించి 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో వెల్లడించారు. -న్యూస్‌టుడే, కనిగిరి

?: న్యూస్‌టుడే: కనిగిరి నియోజకవర్గంలోని చెరువుల తూములు, కట్టలు ధ్వంసంగా ఉన్నాయా?

✓: డీఈఈ: నియోజకవర్గంలో మొత్తం 134 చెరువులు ఉన్నాయి. తుపాను ప్రభావంతో కనిగిరి, వెలిగండ్ల, సీఎస్‌పురం తదితర ప్రాంతాల్లో కొన్ని చోట్ల కట్టలు దెబ్బతిని గండ్లు పడ్డాయి. కొన్ని చోట్ల లీకేజీలు ఏర్పడ్డాయి. వెంటనే ఆ లీకేజీలను ఇసుక బస్తాలతో అరికట్టాం. కట్టలను సైతం పటిష్ఠం చేశాం. రాబోయే రోజుల్లో ఎంత వర్షం పడినా ఎలాంటి ఇబ్బందులు రావు.

?: మోపాడు, పందువగండి, మారేరు రిజర్వాయర్ల ప్రస్తుత పరిస్థితి?

✓: నియోజకవర్గంలో మోపాడు, పందువగండి, మారేరు, పాలేరు రిజర్వాయర్లు ఉన్నాయి. ఇవి మరమ్మతులు కోరుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షానికి తూములు, అలుగుల వద్ద లీకులు ఏర్పడి కొంత నీరు వృథా అయింది. కొంత మేర అరికట్టాం. వీటి మరమ్మతుల కోసం రూ. 2 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. మంజూరు కాగానే పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయిస్తాం.

?: నీటి వనరుల ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

✓: కనిగిరి, వెలిగండ్ల, పామూరు, సీఎస్‌పురం, హనుమంతునిపాడు మండలాల్లో చెరువులను ఆక్రమించి వ్యవసాయం చేయడం, కొన్ని చోట్ల ప్లాట్లు పెట్టి విక్రయాలు చేస్తున్నట్లు మాకు ఫిర్యాదులు అందాయి. ఎక్కడికక్కడే నీటి వనరులు ఆక్రమిస్తే వాటిని స్వాధీనం చేసుకుని కఠిన చర్యలు తీసుకునేలా ఏఈలకు ఆదేశించాం.

నిండుకుండలా ఎన్.గొల్లపల్లి చెరువు

?: వర్షాలకు ఏ మేరకు నీళ్లు చేరాయి?

✓: కనిగిరి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఇటీవల కురిసిన వర్షాలకు 60 శాతం వరకు జల వనరులు నిండాయి. గత అయిదేళ్లుగా సరైన మరమ్మతులు లేక చెరువులు తూటి కాడలు, చిల్ల చెట్లు, వ్యర్థాలతో నిండిపోయాయి. వర్షాల పడక ముందే వీటిని తొలగించి ఉంటే రైతులకు ఎంతో ప్రయోజనం కలిగేది. ప్రస్తుతం మాకు అందుబాటులో ఉన్న విధంగా చిల్లచెట్లు తొలగించి, తూములు, కాలువలు శుభ్రం చేయించి పొలాలకు నీరు సాఫీగా పోయేలా పనులు చేయిస్తున్నాం. సాగునీటికి ఇబ్బంది రాకుండా చూస్తాం.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

పామూరు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల కబడ్డీ పోటీలకు మండలంలోని వగ్గంపల్లి జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని సవరం మహాలక్ష్మి ఎంపికైనట్లు హెచ్‌ఎం వెంకట నరసరాజు, పీఈటీ నరసింహారావు తెలిపారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో కర్నూలులో జరిగే పోటీల్లో ప్రకాశం జిల్లా జట్టు తరఫున ఈమె పోటీలో దిగనున్నట్లు చెప్పారు. • దర్శి: రాష్ట్రస్థాయి బాలుర హ్యాండ్‌బాల్ పోటీలకు చందలూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.సలోమన్‌రాజ్ ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 1న కారుమూరువారిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. అందులో ప్రతిభ చాటిన అతడు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం గురుప్రసాద్ తెలిపారు. ఈ నెల 27 నుంచి 29 వరకు చిత్తూరు లో నిర్వహించే పోటీల్లో తలపడతాడని వెల్లడించారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బాలుడిని అభినందించారు.

కనిగిరిలో శివలింగాలకు పూజలు చేస్తున్న భక్తులు

నాగేంద్ర హారాయ.. నమశ్శివాయ!

కార్తిక మాసం రెండో సోమవారం సందర్భంగా కనిగిరి, కొండపి, దర్శి నియోజకవర్గాల్లోని శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. జిల్లాలో ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రం భైరవకోనకు వేకువజామున నుంచే భక్తుల తాకిడి మొదలైంది. జలపాతం వద్ద స్నానాలు ఆచరించారు. మహిళలు ఉపవాస దీక్షలతో కార్తిక దీపాలను వెలిగించారు. ఈవో డి.వంశీకృష్ణారెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

సీఎస్‌పురం: భైరవకోన సన్నిధిలో భక్తులు

● కనిగిరి పట్టణంలోని విజయమార్తాండేశ్వర ఆలయం, కాశీవిశ్వేశ్వర దేవస్థానంలోని 101 శివలింగాలకు, శంకరమఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పునుగోడు సిద్ధేశ్వరాలయం, చాకిరాల శివాలయంలోనూ పూజలు చేశారు. ● జమ్ములపాలెంలోని 1,116 శివలింగాలు, పంచముఖేశ్వర స్వామి ఆలయంలో నాగపడియలను అలంకరించారు. ● కొండపిలోని శివాలయం, పొన్నలూరు మండలం సంఘమేశ్వర దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది. ● పామూరులోని శ్రీవల్లీ భుజంగేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులు దీపారాధన చేశారు.

-న్యూస్‌టుడే, బృందం

త్రిముఖ దుర్గాంబ అమ్మవారు

టంగుటూరు: జమ్ములపాలెంలోని పంచముఖేశ్వర స్వామి

కొండపి శివాలయంలో..

మాక్ అసెంబ్లీకి దర్శి విద్యార్థిని

దర్శి, న్యూస్‌టుడే: రాజ్యాంగ దినోత్సవం నేపథ్యంలో నియోజకవర్గ స్థాయి వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు సోమవారం దర్శి జడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. ఇందులో పాఠశాల విద్యార్థిని చిన్మయి ప్రతిభ చాటి విజేతగా నిలిసింది. ఈ నెల 24 నుంచి 26 వరకు రాజధాని అమరావతిలో సీఎం చంద్రబాబునాయుడు సమక్షంలో నిర్వహించే మాక్ అసెంబ్లీలో పాల్గొనేందుకు ఆమె అర్హత పొందినట్లు హెచ్‌ఎం ఖాదర్‌మస్తాన్ తెలిపారు. ఎంఈవో-2 రమాదేవి, ఉపాధ్యాయులు బాలికను అభినందించారు.

ప్రపంచ కప్ కైవసంపై సంబరాలు

దొనకొండ, న్యూస్‌టుడే: మహిళా క్రికెట్ ప్రపంచ కప్‌ను టీమ్ ఇండియా కైవసం చేసుకోవడంపై దొనకొండలోని శ్రీగౌతమీ డిగ్రీ కళాశాల విద్యార్థినులు సోమవారం కేకు కట్‌చేసి సంబరాలు జరుపుకొన్నారు. ప్రిన్సిపల్ నాని మాట్లాడుతూ.. మహిళలు ఏదైనా సాధించగలరని నిరూపించారన్నారు. ఆ జట్టు సభ్యులంతా అందరికీ ఆదర్శంగా నిలిచారని, చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

3,790 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం

దొనకొండ, న్యూస్‌టుడే: మండలంలో ఇటీవల తుపానుకు నష్టపోయిన పత్తిపంటకు పరిహారం కోసం నమోదు చేశామని ఏవో బాలకృష్ణ నాయక్ చెప్పారు. మండలంలో 2,076 మంది రైతులు 3,790 ఎకరాల్లో నష్టపోయారని అంచనాలు వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

కనిగిరి : 8008574114, (10 AM TO 1 PM)
దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

?: కురిచేడు మండలం అలవలపాడు పంచాయతీ పెనగమూరు కాలనీ ప్రధాన వీధిలో కాలువ లేకపోవడంతో నివాసాల్లో నుంచి వచ్చే మురుగునీరు రహదారి పక్కన చేరి ఇబ్బందులు పడుతున్నాం. – నాసరయ్య, స్థానికుడు

✓: కాలువ నిర్మించాలని ప్రతిపాదనలు చేసి, అనుమతులు రాగానే పనులు చేపడతాం.
– కోటేశ్వరరావు, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి

?: హనుమంతునిపాడు మండలం హాజీపురం చెరువుకట్ట కింది నుంచి దొడ్డిచింతల వెళ్లే రహదారి వర్షానికి అధ్వానంగా మారింది. – కె.రమేశ్‌రెడ్డి, స్థానికుడు

✓: అంచనాలు వేశాం. రహదారి మరమ్మతులకు నిధులు మంజూరైతే వెంటనే బాగుచేస్తాం.
– బ్రహ్మయ్య, పంచాయతీరాజ్ ఏఈ

?: సి.ఎస్.పురం మండలం శీలంవారిపల్లి వెళ్లే కూడలి నుంచి నల్లమడుగుల, గుంతచెన్నంపల్లి వరకు ఆర్‌అండ్‌బీ రహదారి గోతులమయమైంది. –ఎన్.వెంకటేశ్వర్లు, నల్లమడుగుల

✓: కొత్తగా తారు రోడ్డు నిర్మించేందుకు అంచనాలు తయారుచేసి నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపాం.
–షేక్ ఫిరోజ్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ, పామూరు

- న్యూస్‌టుడే, కురిచేడు, హనుమంతునిపాడు, సీఎస్‌పురం

స్త్రీశక్తి భవనం.. నిరుపయోగం

పొదుపు సంఘాల మహిళలు సమావేశాలు నిర్వహించుకునేందుకు 2008లో కనిగిరి మున్సిపాలిటీలోని మాచవరం వద్ద సుమారు రూ.7 లక్షల వ్యయంతో స్త్రీశక్తి భవనాన్ని నిర్మించారు. కొద్ది రోజులు అందులో మెప్మా ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. తర్వాత దీనిని ఉపయోగించుకోవడం మర్చిపోయారు. ప్రస్తుతం ఇది చిల్ల చెట్ల మధ్య తాగుబోతులు, జూదరులకు నిలయంగా మారింది. దీనిపై మెప్మా సీఎంఎం ఎలీషాను వివరణ కోరగా.. భవనాన్ని పరిశీలించి ఉపయోగంలోకి తీసుకొస్తామని తెలిపారు. –న్యూస్‌టుడే, కనిగిరి

పొలం దారి.. కొట్టుకుపోయి!

తుపాను ప్రభావంతో ముండ్లమూరు మండలంలోని తూర్పుకంభంపాడులో రెండు దారులు కొట్టుకుపోయాయి. భారీ గండ్లు పడి పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వరద నీటి ప్రవాహానికి గ్రామం నుంచి పొలాలకు వెళ్లే దారిలో రైతులు, పశు పోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఈ మార్గాల్లోనే రైతులు పొలాలకు వెళ్తుంటారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని, అనుమతులు రాగానే రహదారులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. –న్యూస్‌టుడే, ముండ్లమూరు

జలం ఇలా.. పుణ్య స్నానాలు ఎలా?

కనిగిరి దుర్గం దొరువు ఎంతో చరిత్రాత్మకమైంది. వందల ఏళ్ల క్రితం ఇందులోని నీటినే అప్పటి పాలకులు, ప్రజలు తాగేవారు. అనంతర కాలంలో దీనిని మరుగున పడేశారు. పూర్తిగా పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం వ్యర్థాలమయమైంది. కార్తిక మాసం అయినందున భక్తులు స్నానాలు ఆచరించి సమీపంలోని ఆలయాలకు వెళ్లి దీపాలు వెలిగించి పూజలు చేస్తారు. దొరువు శుభ్రంగా లేక పోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వర్షాలకు నీరు చేరడంతో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలన్నీ పైకి తేలాయి. మెట్లు కూడా సరిగా లేవు. దీనిపై మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి వ్యర్థాలను తొలగింపజేయిస్తామని తెలిపారు. -న్యూస్‌టుడే, కనిగిరి

ఇనాం భూముల రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించాలని వినతి

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఇనాం భూముల రిజిస్ట్రేషన్లను పునరుద్ధరించాలని జిల్లా కలెక్టరు రాజాబాబుకు సోమవారం సింగరాయకొండ గ్రామస్థులు మీకోసం కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. పన్నెండేళ్లుగా దేవాదాయ శాఖ అధికారుల తప్పిదాలతో భూముల రిజిస్ట్రేషన్లు నిషేధిత జాబితాలోకి మారడంతో అవస్థలు పడుతున్నామని తెలిపారు. కొన్ని నివాస భవనాలు శిథిలావస్థకు చేరడంతో నూతనంగా నిర్మించుకునేందుకు కొందరు అధికారులు ఆటంకాలు కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూముల క్రయవిక్రయాలు జరగక పిల్లల చదువులు, వివాహాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సుబ్బారావు, శ్రీను, రంగనాయకులు, బాబు, తదితరులు ఉన్నారు.

రఘురామయ్య దంపతులను సత్కరిస్తున్న ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్య సంఘం ప్రతినిధులు

విద్యాభివృద్ధికి కృషి అభినందనీయం

దర్శి, న్యూస్‌టుడే: 30 సంవత్సరాలుగా ఉపాధ్యాయుడిగా, హెచ్‌ఎంగా, ఎంఈవోగా సేవలందించిన రఘురామయ్య అభినందనీయుడని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్య సంఘం సభ్యుడు గుండారెడ్డి కొనియాడారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని రాజంపల్లిలో సోమవారం ఉద్యోగ విరమణ చేసిన ఎంఈవో రఘురామయ్య దంపతులకు ఘనంగా సత్కరించారు. వక్తలు మాట్లాడుతూ. . పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల శ్రేయస్సుకు రఘురామయ్య ఎంతో కృషి చేశారు. సంఘ సభ్యులు కోటిరెడ్డి, రజకేశవరెడ్డి, రామాంజనేయులు, పెద్దిరాజు, రమణారెడ్డి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మోసాలపై అప్రమత్తత అవసరం

కనిగిరి, న్యూస్‌టుడే: కామన్ సర్వీస్ సెంటర్ ఆపరేటర్లు, ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల ఆధ్వర్యంలో పనిచేసే రికవరీ ఏజెంట్లతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ పి.సాయి ఈశ్వర్ యశ్వంత్ సోమవారం రాత్రి సమావేశం ఏర్పాటు చేశారు. ఆధార్ కార్డు, ఇతర కార్డులతో డబ్బులు విత్‌డ్రా చేసే సందర్భాల్లో జరుగుతున్న మోసాలు, లోన్ రికవరీ ఏజెంట్లు నిర్వహించే విధుల గురించి అవగాహన కల్పించారు. అందరూ చట్ట ప్రకారం విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి, పామూరు సీఐలు షేక్ ఖాజావలి, ఎం.శ్రీనివాసరావు, ఎస్సైలు పాల్గొన్నారు.

వృత్తి శిక్షణతో ఎంతో ప్రయోజనం

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: వృత్తి శిక్షణతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని సీఎస్‌పురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని షేక్ ఖాదరున్నీసా బేగం అన్నారు. ఈ పాఠశాలలో వృత్తి విద్యలో భాగంగా నైపుణ్య పోటీలను సోమవారం నిర్వహించారు. 9, 10 తరగతుల విద్యార్థులు వివిధ రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో వృత్తి విద్యా శిక్షకులు బీవీ రాధాకృష్ణ, ఎం.రవి, పి.మహేష్ పాల్గొన్నారు.

ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సచివాలయ ఉద్యోగికి గాయాలు

ముండ్లమూరు, న్యూస్‌టుడే: పసుపుగల్లు గ్రామ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ముండ్లమూరుకు చెందిన వెంకటేశ్వర్లు చింతలపూడి వెళ్లి తిరిగి పసుపుగల్లుకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. అదుపు తప్పి కింద పడిపోయాడు. గాయపడిన అతడిని ముండ్లమూరు పీహెచ్‌సీకి అనంతరం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ నుంచి ప్రైవేటు వైద్యశాలలో చేర్పించగా.. చికిత్స పొందుతున్నాడు.

ఎం.నిడమానూరులో పారిశుద్ధ్య పనులు

టంగుటూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఎం.నిడమానూరు గ్రామంలో సోమవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్ల వెంట వ్యర్థాలు, చెత్త పెద్ద మొత్తంలో పేరుకుపోయాయి. గ్రామ తెదేపా అధ్యక్షుడు కాకుమాని శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి సుబ్బాయమ్మ జేసీబీ సాయంతో చెత్త తొలగింపు పనులు చేపట్టారు. నాయకులు రంగారావు, సాయికృష్ణ, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

కనిగిరి: మున్సిపాలిటీలోని కాశిరెడ్డినగర్‌లో జూదం ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను ఎస్సై టి.శ్రీరామ్ ఆధ్వర్యంలో సోమవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.7,320 నగదు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై తెలిపారు.

ఉద్యోగులు ఆదర్శంగా ఉండాలి

వీసీపల్లి: సమాజంలో ఉద్యోగి జీవితం అందరికీ ఆదర్శవంతంగా ఉండాలని ఎంపీడీవో జీవీ.కృష్ణారావు తెలిపారు. సోమవారం జాతీయ విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఏవో ప్రభాకరశర్మ, డిప్యూటీ ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో రాణిస్తేనే భవిత

కనిగిరి: విద్యార్థులు చదువుతోపాటు పోటీ పరీక్షల్లో రాణించాలని జిల్లా డీసీఈబీ కార్యదర్శి మర్రి శ్రీనివాసులు సూచించారు. ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ స్థాయిలో సోమవారం ఆరుమండలాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వివిధ విభాగాల్లో కనిగిరిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించారు. రాజ్యాంగం గొప్పతనాన్ని విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. అనంతరం వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు సుబ్బారావు, నారాయణరెడ్డి, ఆర్.శ్రీనివాసరరావు, జి.సంజీవి, డి.రామిరెడ్డి, డి.ప్రసాద్, రమణయ్య, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతలుగా నిలిచిన విద్యార్థులతో డీసీఈబీ కార్యదర్శి శ్రీనివాసులు, ఎంఈవోలు

మంచినీరు.. ఎప్పటికి అందిస్తారు?

న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం

☛ పాఠశాలల్లో మూలకు చేరిన ఆర్వోప్లాంట్లు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని చెప్పిన నాటి వైకాపా ప్రభుత్వం నాసిరకం పరికరాలు ఇచ్చి చేతులు దులుపుకొంది. రూ.లక్షల ప్రజాధనం వెచ్చించి కొనుగోలు చేసిన ఆర్వో ప్లాంట్లు.. పాఠశాలలకు అందించిన అతికొద్ది రోజుల్లోనే మొరాయించాయి. అప్పుడు మూలకు చేరిన వాటికి కనీసం మరమ్మతులు చేయించే నాథులేలేరు. ప్రస్తుతం అవి నిరుపయోగంగా పాఠశాలల్లో దిష్టిబొమ్మల్లాగా మిగిలాయి. కొన్ని చోట్ల ఉపాధ్యాయులు చొరవ తీసుకుని తమ సొంత నిధులతో బాగుచేయించినా అంతంత మాత్రంగా పనిచేస్తున్నాయి. ప్లాంట్లకు మరమ్మతులు చేయాలని సంబంధిత కంపెనీ ప్రతినిధులకు తెలియజేసినా వారు పట్టించుకోవడం లేదని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా దృష్టిసారించి విద్యార్థులకు రక్షిత తాగునీటిని అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. వైకాపా పాలనలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 15 ఆర్వో ప్లాంట్లకు గాను రూ. 27 లక్షలు నిధులు వెచ్చించి ఏర్పాటు చేశారు. అయినా ఎక్కడా పనిచేయడం లేదు. ప్రస్తుతం కొన్ని పాఠశాలల్లో దాతల సహకారంతో విద్యార్థులకు తాగునీరు అందిస్తుండగా, మరికొన్ని చోట్ల బాలబాలికలు ఇళ్ల వద్ద నుంచే సీసాలతో మంచినీళ్లు తెచ్చుకుంటున్నారు. పాఠశాలల్లో పనిచేయని ఆర్వో ప్లాంట్లపై ఎంఈవో-1 శ్రీనివాసులును వివరణ కోరగా.. ఉన్నతాధికారులకు నివేదిక అందజేశామన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు.

సింగరాయకొండ ప్రభుత్వ బాలుర పాఠశాలలో పనిచేయని ఆర్వో ప్లాంటు

రాబోయే రోజుల్లో వైకాపా ఖాళీ

కనిగిరి, న్యూస్‌టుడే: మున్సిపాలిటీలోని ఆరో వార్డు వైకాపా కౌన్సిలర్ పోతిరెడ్డి రాజారెడ్డి, వైకాపాకు చెందిన మరో 15 కుటుంబాలు సోమవారం రాత్రి మాచవరంలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సమక్షంలో తెదేపాలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అయిదేళ్ల వైకాపా పాలనలో చేసిన అన్యాయాలు, అక్రమాలు వెంటాడుతున్నాయన్నారు. అధికారంలో ఉండగా విర్ర వీగిన ఒక్కో నాయకుడు ఆధారాలతో చిక్కి జైలు పాలవున్నారన్నారు. రాబోయే రోజుల్లో వైకాపా ఖాళీ అవుతుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని నమ్మి ఎవరూ ఆ పార్టీలో ఉండరన్నారు. అనంతరం పార్టీ కండువా కప్పి అందరినీ తెదేపాలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తెదేపా పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, క్రిస్టియన్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జక్రయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి సమక్షంలో తెదేపాలో చేరిన కౌన్సిలర్ రాజారెడ్డి తదితరులు

రోడ్ల ఆక్రమణలతో ట్రాఫిక్ ఇక్కట్లు..

పట్టణంలోని రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి హెచ్చరించారు. క్లబ్ రోడ్డు నుంచి తీగలగొంది వరకు 12 అడుగుల రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు సాగించడాన్ని ఆయన పరిశీలించారు. ఎవరికి వారు పోటీపడి స్వలాభంతో ఆక్రమించి రాక పోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. దీంతో ట్రాఫిక్ చిక్కులు ఏర్పడుతున్నాయని తెలిపారు. పూర్వపు రికార్డుల ప్రకారం ఎక్కడెక్కడ కాలిబాటలు, రోడ్లు ఉన్నాయో గుర్తించి వెంటనే స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, ఎస్సై శ్రీరామ్, టీపీవో సువర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

• పామూరు: స్థానిక విరాట్‌నగర్‌లో వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానం వార్షికోత్సవం సందర్భంగా మహాకుంభాభిషేకం, ఏకాదశ రుద్రహోమాలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు.

(c) eenadu

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

బొమ్మలు గీశారు.. బహుమతులు పొందారు

● 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న సత్యసాయి సమగ్ర విద్యాకేంద్రం హెచ్.ఎం. అరుణ

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఈనాడు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు చేపట్టిన ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా సోమవారం స్థానిక మంగమూరు రోడ్డులోని సత్యసాయి సమగ్ర విద్యాకేంద్రంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 'మీకు నచ్చిన పండగ అంశం'పై జరిగిన పోటీలో 7,8,9,10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. పదో తరగతి విద్యార్థి జాతావత్ మధుకిరణ్ ప్రథమ, 9వ తరగతి విద్యార్థి తాడి అలేఖ్య ద్వితీయ, పదో తరగతి విద్యార్థి కె.రాధిక తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు హెచ్.ఎం. అరుణ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు ఎస్‌కే మస్తాన్, టి.నాగార్జున, నగేష్ పాల్గొన్నారు.

ధాన్యం నిల్వ చేయాలంటే ఎన్ని పాట్లో..

బారులు తీరిన చౌక బియ్యం లారీలు

న్యూస్‌టుడే, మద్దిపాడు: మద్దిపాడు మండల పరిధిలో ఇటీవల కురిసిన వర్షాలకు చౌకధరల బియ్యం గోదాములకు వెళ్లేందుకు, గ్రామస్థులు ప్రజలు నడిచి వెళ్లేందుకు ఉపయోగపడే రహదారి అధ్వానంగా మారింది. దీంతో సమస్య తప్పడంలేదు. ఒంగోలు రైల్వే స్టేషన్ నుంచి వచ్చే చౌక బియ్యాన్ని మండల పరిధిలోని గాజుల పాలెం రహదారిలో గల గోదాముల్లో నిల్వ చేసి అక్కడ నుంచి గ్రామాల్లో చౌకధరల దుకాణాలకు తరలిస్తారు. గాజుల పాలెం రహదారి నుంచి గోదాముల వరకు సుమారు 500 మీటర్ల రహదారి మట్టి దారి కావడంతో వర్షాలకు పూర్తిగా గుంతలతో నిండిపోయింది. సోమవారం ఒంగోలు రైల్వే వ్యాగన్ నుంచి పదుల సంఖ్యలో లారీలు బియ్యం లోడుతో గోదాములకు వచ్చాయి. బురద దారిలో వెళ్లేందుకు వీలుకాక పోవడంతో అధికారులు అప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టారు. కంకర, గ్రానైట్ వ్యర్థాలతో పూడికలు ప్రారంభించారు. చేసేంది లేక జాతీయ రహదారి సర్వీస్ దారిలో వాహనాలు నిలిచి పోయాయి. దీంతో సర్వీస్ రోడ్డులో వచ్చే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాత్కాలిక మరమ్మతులు కాకుండా శాశ్వత ప్రాతిపదికన రహదారులు నిర్మించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

పారిశుద్ధ్య కార్మికునికి పరామర్శ

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు కె.బాలకృష్ణ (38) ఆదివారం విధుల్లో ఉండగా స్పృహతప్పి పడిపోగా సిబ్బంది కిమ్స్‌లో చేర్చారు. వైద్యులు పరీక్షలు చేసి మెదడు నరాలు చిట్లినట్లు తెలిపారు. వెంటనే శస్త్ర చికిత్స చేశారు. విషయం తెలుసుకున్న కమిషనర్, శానిటరీ విభాగం అధికారులు సోమవారం పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులతో మాట్లాడారు.

డీఆర్వోకు అభినందనలు

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: డీఆర్వోగా ఓబులేసు బాధ్యతలు చేపట్టి, ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా ఏపీఆర్ఎస్ఏ నాయకులు, కలెక్టరేట్ ఉద్యోగులు ఆయనకు సోమవారం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు పి.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

సేవలకు ప్రశంసలు.. సమస్యలపై ప్రశ్నలు

◆ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల తీరు

సమావేశంలో పాల్గొన్న కౌన్సిల్ సభ్యులు, మాట్లాడుతున్న మేయర్ గంగాడ సుజాత

న్యూస్‌టుడే, ఒంగోలు నగరం: మొంథా తుపానును ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నేతృత్వంలో కార్పొరేషన్ సిబ్బంది సమర్థంగా ఎదుర్కొన్నారని, భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో పనిచేయాలని కార్పొరేటర్లు అన్నారు. సోమవారం సాయంత్రం మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మొత్తం 75 అంశాలను చర్చకు పెట్టినప్పటికీ ముందుగా సభ్యులు తుపాను గురించే మాట్లాడారు. ఆస్తి, ప్రాణనష్టం లేకుండా చర్యలు తీసుకున్నందుకు తెదేపా కార్పొరేటర్ దాచర్ల వెంకటరమణయ్య తీర్మానం ప్రవేశపెట్టగా అందరూ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం అజెండాపై చర్చ జరగ్గా డివిజన్లలో నెలకొన్న తాగునీరు, పారిశుద్ధ్యం ఆక్రమణల తొలగింపు అంశాలపై సభ్యులు గళమెత్తారు.

ట్రంక్‌రోడ్డు విస్తరణకు ఆమోదం

ట్రంక్‌రోడ్డును 80 అడుగులకు విస్తరింపజేయడానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. నగదు రూపంలో నష్టపరిహారం ఏ విధంగా ఇస్తారని కొందరు ప్రశ్నించారు. కమిషనర్ కె.వెంకటేశ్వరరావు సమాధానమిస్తూ రెవెన్యూవారు ఇచ్చే ప్రతిపాదనకు అనుగుణంగా కోరుకున్నవారికి కార్పొరేషన్ ద్వారా నగదు చెల్లించవచ్చన్నారు. వ్యాపారులతో సమావేశాలు నిర్వహించాక వారి అభిప్రాయాల మేరకు నష్టపరిహారం చెల్లించవచ్చని డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ అన్నారు. దీనిపై పరిశీలన చేయాలని డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు పేర్కొన్నారు.

ఎవరేమన్నారంటే...

- పాత బైపాస్‌లో కల్వర్టు నిర్మించి నల్ల కాలువకు వరద నీరు తరలించేలా పనులు చేపట్టాలని ఈదర సురేష్‌బాబు కోరారు.
- గ్రీన్‌బెల్ట్ స్థలంలో ఆక్రమణలు తొలగింపు విషయమై అధికారులు స్పందించకపోవడం బాధాకరమని చింతపల్లి గోపీచంద్ అన్నారు.
- ఎస్టీ కాలనీలో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని నాగభూషణం కోరారు. కార్పొరేటర్లు దాచర్ల వెంకటరమణయ్య, టి.రవితేజ, అంబూరి శ్రీనివాస్ వివిధ అంశాలపై మాట్లాడారు. ఎలక్ట్రీషియన్ పోస్టులకు పదోన్నతులు ఇచ్చే అంశాన్ని వాయిదా వేయగా, రోడ్డు నిర్మాణపనుల టెండర్లకు సంబంధించిన ఏడు అంశాలను రద్దు చేశారు.

400 మంది మాలధారులకు అన్న ప్రసాద వితరణ

ఒంగోలు కర్నూలు రోడ్డు, న్యూస్‌టుడే: వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలో కర్నూలు రోడ్డు మారుతీ నగర్ ఒకటో లైన్‌లో 400 మంది మాలధారణ స్వాములకు 41 రోజుల పాటు భిక్ష ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ నిర్వాహకులు వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. అందులో భాగంగా కార్తిక సోమవారం తొమ్మిదో రోజు నిర్వాహకులు మాట్లాడుతూ.. మాల ధారణ స్వాములకు భిక్ష ఇవ్వదలచిన దాతలు ఎవరైనా ఉంటే ట్రస్ట్‌ను సంప్రదించవలసిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు ఒలంపియాడ్ స్కూల్ కరస్పాండెంట్ వెన్నపూస శ్రీరాముల రెడ్డి, 45వ డివిజన్ తెదేపా అధ్యక్షులు చెంచురెడ్డి, 44వ డివిజన్ కార్పొరేటర్ వివేకానంద, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పంపిణీ

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: సంతనూతలపాడు జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు నగదును అందజేశారు. సోమవారం చెన్నైకు చెందిన ఇంటెలెక్ట్ కంపెనీ ఆధ్వర్యంలో ఉల్లాస్ ట్రస్ట్ సహకారంతో జడ్పీహెచ్‌ఎస్‌లో 100 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున రూ.లక్ష నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఉల్లాస్ సంస్థ ప్రతినిధులు ఎన్.శిరీష, ఎం.దిలీప్‌లు మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ఎం.ప్రమోద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు దుప్పట్లు అందజేత

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి క్రిస్టియపాలెంకు చెందిన పలువురు పేద వృద్ధ మహిళలకు అభయ సేవా సంస్థ అధ్యక్షులు మద్దాళి మాధవరావు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. సంఘ కాపరి పాటిబండ్ల కోటేశ్వరరావు, షాలెం రాజు, చిరంజీవి తదితరులు

ఎస్‌బీ సీఐ బదిలీ

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా ఎస్‌బీ సీఐ కె.వి.రాఘవేంద్ర బదిలీ అయ్యారు. ఆయనను వీఆర్ (వేకెన్సీ రిజర్వ్)కు పంపుతూ గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠీ ఉత్తర్వులు ఇచ్చినట్లు సమాచారం.

'ఆరోపణలు చేసిన వారిని శిక్షించండి'

నాగులుప్పలపాడు: తేదేపా నేత నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ దివంగత వీరయ్య చౌదరిపై నిందారోపణలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వీరయ్య సతీమణి ముప్పవరపు సుచిత్ర, ఆమె బంధువులు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కలిసి వినతి పత్రం అందజేశారు.

నల్లవాగుపై వంతెన నిర్మించండి

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: మంగమూరు-ఒంగోలు మధ్య రోడ్డు దెబ్బతిందని, నల్లవాగుపై వంతెన లోతట్టులో ఉందని వీటి నిర్మాణాలు చేపట్టాలని సీపీఎం నాయకులు జేసీ గోపాలకృష్ణకు వినతి పత్రం అందజేశారు. సోమవారం ఒంగోలులో జేసీని కలిసి 200ల మంది సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ వర్షం పడిన ప్రతిసారి నల్లవాగుపై వంతెనపై నీరు పారి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయన్నారు. చంద్రపాలెం-మంగమూరు మధ్యనున్న ఎన్నెస్పీ కాలువపై సైతం రోడ్డు బాగో లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు బంకా సుబ్బారావు, నాయకులు షేక్ మస్తాన్, మంచికలపాటి శ్రీనివాసరావు, పలువురు పాల్గొన్నారు.

జేసీకి సమస్యను వివరిస్తున్న సీపీఎం నాయకులు

వరద బాధితులకు చేయూత

మద్దిపాడు: మండల పరిధిలో రాచవారి పాలెంలో వైసీపీ ఆధ్వర్యంలో వరద బాధితులకు సోమవారం సాయం చేశారు. వైసీపీ నాయకులు సోమవారం వరద ధాటికి నిరాశ్రయులైన ఎస్సీ కాలనీ వాసులకు సుమారు 20 వేల రూపాయల విలువ గల సరకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర మేధావుల ఫోరం కార్యదర్శి కంచర్ల సుధాకర్, ఎస్సీ సెల్ జాయింట్ కార్యదర్శి దుడ్డు వినోద్, మండల యూత్ అధ్యక్షుడు మందా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ● నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: తుపాన్ ప్రభావంతో నీట మునిగిన చదలవాడ ఎస్టీ కాలనీ వాసులకు ప్రభుత్వం నుంచి సరకులు వచ్చాయి. జనసేన నాయకులు పంపిణీ చేశారు. జనసేన నాయకులు పల్లపోతు సాయిచరణ్, శివ, సాయి కిరణ్, నవీన్ పాల్గొన్నారు.

53 ఎకరాల్లో పంట నష్టం

మద్దిపాడు, న్యూస్‌టుడే: మండల పరిధిలో మొంథా తుపాను వల్ల 53 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని మండల వ్యవసాయాధికారి స్వర్ణలత సోమవారం తెలిపారు. మండల వ్యవసాయ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మొక్కజొన్న, వరి, మినుము పైర్లు బాగా దెబ్బ తిన్నాయన్నారు.

దీపాలు వెలిగించి.. మొక్కులు చెల్లించి..

● శివాలయాల్లో వైభవంగా కార్తిక పూజలు

ఆకట్టుకున్న పేర్నమిట్టలోని రామలింగేశ్వరస్వామి

చీమకుర్తి శివాలయంలో మహిళల పూజలు

అలంకరణలో ఎస్.ఎన్.పాడు త్రిపురాంతక స్వామి

చీమకుర్తి, న్యూస్‌టుడే: కార్తిక సోమవారాన్ని పురస్కరించుకొని గెలాక్సీపురిలోని పలు శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. మహిళలు వేకువనే ఆలయాలకు చేరుకుని దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ● సంతనూతలపాడు, న్యూస్‌టుడే: మండలంలోని పలు దేవాలయాల్లో కార్తిక మాస రెండో సోమవారం పూజలను ఘనంగా నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. పేర్నమిట్టలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ అర్చకులు సోమరాజుపల్లి అనిల్‌కుమార్ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సంతనూతలపాడులోని త్రిపురాంతక స్వామి దేవాలయంలో అర్చకులు ఎస్.బుచ్చిబాబుశర్మ శివలింగాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.

విద్య, వైద్య రంగాలకు ఎక్కువ నిధులు అవసరం

సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ప్రభుత్వాలు విద్య, వైద్య రంగాలకు తక్కువ నిధులు కేటాయించడం వల్ల సామాన్యులకు మెరుగైన సేవ లందటంలేదని జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ భవన్‌లో జరిగిన జన విజ్ఞాన వేదిక సమావేశంలో డాక్టర్లు సుధాకర్ రెడ్డి, శేషారెడ్డి, కొల్లా నాగేశ్వరరావులు మాట్లాడారు. దేశంలో రోజురోజుకు పేదల సంఖ్య పెరుగుతున్నందున విద్య, వైద్యం అవసరాలు తీర్చడానికి ఎక్కువ బడ్జెట్టు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు గయాజ్‌బాషా, కొల్లా మధు, కంచర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో నాలుగు మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.కె.ఆయేషా బేగం తెలిపారు. పొదిలి రూరల్, దర్శి రూరల్, కనిగిరి రూరల్, బేస్తవారిపేటలోని దుకాణాలకు ఈ నెల 10వ తేదీ సాయంత్రం అయిదు గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. ఆన్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. 12వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లాటరీ తీసి దుకాణాలు కేటాయిస్తామని పేర్కొన్నారు.

వెంకన్న సన్నిధిలో దామచర్ల

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: తిరుమలలోని శ్రీవేంకటేశ్వరస్వామిని సోమవారం ఉదయం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తోపాటు, ఆయన కుటుంబ సభ్యులు, తెదేపా నాయకులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, తెదేపా నాయకులు బండారు మదన్, కొఠారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి కృషి చేయండి

ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న తెలుగు మహిళలు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: నియోజక వర్గ తెలుగు మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన గంగుల శివ పార్వతి సోమవారం ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కె.వి.శ్రీలత, ఎంపీటీసీ సభ్యురాలు దుర్గా భవాని, తెదేపా నాయకులు కాట్రగడ్డ రమణయ్య, చావా బత్తిన వెంకటేశ్వర్లు, నల్లూరి ఝాన్సీ, మిరియాల రమణమ్మ, పలువురు మహిళలు పాల్గొన్నారు. ● మద్దిపాడు,న్యూస్‌టుడే: రాచవారిపాలెంలో మృతి చెందిన జనసేన మండల కార్యదర్శి తల్లి మృతదేహానికి సంతనూతలపాడు శాసన సభ్యులు బీఎన్ విజయ్‌కుమార్ సోమవారం నివాళులర్పించారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి ఉపకేంద్రం వద్ద లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం పలు గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఆర్.మోహన్‌రావు తెలిపారు. కె.వి.పాలెం, గోనుగుంట, రామచంద్రాపురం, పిడతలపూడి, ఏలూరివారిపాలెం, జీఎల్ పురం, మువ్వవారిపాలెం, మర్రిపాలెం గ్రామాలకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని చెప్పారు.

శ్మశాన స్థల అభివృద్ధికి ప్రతిపాదనలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ఒంగోలు మండలంలోని మండువవారిపాలెం, ఉలిచి గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ శ్మశాన స్థలాల అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేయనున్నట్లు ఎంపీడీవో రాజశేఖర్ తెలిపారు. ఆయా గ్రామాల్లోని శ్మశాన స్థలాలను సోమవారం పరిశీలించారు.

పీఆర్‌సీ నియామకం వెంటనే చేపట్టాలి

ఒంగోలు నగరం: ఉద్యోగ, పింఛనుదారుల దీర్ఘకాలిక సమస్య అయిన పీఆర్‌సీ నియమించి, ఐఆర్ ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల సుబ్బారావు కోరారు. సోమవారం పులివెంకటరెడ్డి కాలనీలోని సంఘ భవనంలో బి.అంకె రెడ్డి అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు.

సీపీఐ బలోపేతానికి కృషి

పేర్నమిట్ట(సంతనూతలపాడు), న్యూస్‌టుడే: పేర్నమిట్టలోని 42వ డివిజన్ సీపీఐ కార్యదర్శిగా పైడి రమేష్, సహాయ కార్యదర్శిగా మిడసల ఫణీంద్రలు ఎంపికయ్యారు. జిల్లా కౌన్సిల్ సభ్యులు కైలా అజయ్ ఆధ్వర్యంలో శాంతినగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఎంపికలు చేపట్టారు. పార్టీ బలోపేతం కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని నూతన కార్యదర్శి, సహాయ కార్యదర్శులు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
కొత్తపట్నం : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

కొత్తపట్నం, న్యూస్‌టుడే:

?: కొత్తపట్నం మండలం పాదర్తి గ్రామంలో మూడు రోజుల నుంచి విద్యుత్తు సక్రమంగా ఉండటం లేదు. రాత్రి వేళ విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నారు. ఇళ్ల వద్ద ఉండాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలి.
- వెంకటేశ్వరమ్మ, రామారావు, కొత్తపట్నం.

✓: తుపాను కారణంగా కొన్ని లైన్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో ఇబ్బందిగా ఉంది. సమస్యను వెంటనే పరిష్కరిస్తాం.
- చంద్రకాంత్, మండల విద్యుత్తు ఏఈ.

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే

?: నగరంలో ధారా వారితోటలో కాలువ నుంచి వ్యర్థాలు తొలగించి రోడ్డుపై వేస్తున్నారు. రోజుల తరబడి ఉంచడంతో సమస్యగా ఉంది. వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నాం.
- రమేష్, స్థానికుడు

✓: సిబ్బందిని పంపి సమస్య పరిశీలిస్తాం. వ్యర్థాలను అక్కడ నుంచి తొలగిస్తాం.
- ఎన్.పిచ్చయ్య, శానిటరీ సూపర్ వైజర్

న్యాయం కోసం ఆందోళన

కలెక్టరేట్ వద్ద నిరసనలో దళితులు

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: మూడు తరాలుగా సాగు చేసుకుంటున్న భూములకు సంబంధించి తమకు న్యాయం చేయాలని కోరుతూ మార్కాపురం పట్టణానికి చెందిన దళితులు స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు చేబ్రోలు ఇస్సాక్ మాట్లాడుతూ, మార్కాపురం పట్టణ పరిధిలోని షరతులతో కూడిన అసైన్‌మెంట్ భూముల్లో సుమారు 41 ఎకరాలకు 1920లో పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. మూడు తరాలుగా సాగు చేసుకుంటున్నా, భూ దస్త్రాలు పరిశీలించకుండా తహసీల్దార్ చిరంజీవి ఉన్నతాధికారులకు సరైన నివేదికలు ఇవ్వడంలేదన్నారు. ఈ మేరకు రెవెన్యూ దస్త్రాలు పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చెరువులు నిండుగా.. సాగుకు పండగ

మినీ జలాశయాన్ని తలపిస్తున్న చీమకుర్తి చెరువు

వర్షాకాలం ఆరంభంలో మొక్కుబడిగా వర్షం పడితే అక్టోబరు నెల అంతా వర్షాలకే సరిపోయింది. తద్వారా కరవు సమస్య తీరిందని రైతులు సంతోషిస్తే.. మొంథా తుపాను ఊహించని స్థాయిలో చెరువులు, కుంటలు నింపేసి అలుగులు పారించింది. దీంతో రైతులు ఖరీఫ్ సాగుకు ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నారు. - న్యూస్‌టుడే, చీమకుర్తి

భారీగా వరద రావడంతో..

తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో సంతనూతలపాడు డివిజన్లోని చెరువులన్నీ జలకళను సంతరించుకుని నిండుకుండల్లా మారాయి. కొండలపైనుంచి భారీగా వచ్చి చేరినవర్షపు నీటితో చీమకుర్తి చెరువు ప్రస్తుతం మినీజలాశయాన్ని తలపిస్తోంది. దీంతో వాటి కింద వరి పంట సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. చీమకుర్తి మండలంలో ఆయా గ్రామాల్లో 20కి పైగా చెరువులున్నాయి. వీటిలో పది నోటిఫైడ్ చెరువులు ఉన్నాయి. ఇవన్నీ సాగు నీటి చెరువులుగా మారాయి.

ఇప్పటికే బోర్లు, బావుల కింద వరినారు సాగు

జిల్లాలో ఖరీఫ్ సీజను ఆలస్యంగా ప్రారంభం అవుతుంది. అక్టోబర్ చివర, నవంబరు మాసంలో వచ్చే తుపాన్ల ప్రభావంతోనే ఆయా చెరువులకు సమృద్ధిగా నీరుచేరుతుంది. అదే రీతిలో ప్రస్తుతం మండలంలోని అన్ని చెరువులు పూర్తిస్థాయిలో జలకళను సంతరించుకున్నాయి. దీంతో అన్నదాతలు పంటల సాగుకు శ్రీకారం చుట్టారు. ఈపాటికే వ్యవసాయ బోర్లు, బావుల కింద వరినార్లు పోసుకొని సిద్ధంగా ఉన్న రైతులు నాట్లు వేస్తున్నారు. రెండు మూడు రోజులుగా దాదాపుగా నియోజకవర్గంలోని చీమకుర్తి, మద్దిపాడు, ఎస్.ఎన్.పాడు, నాగులుప్పలపాడు, అలాగే ఒంగోలు పరిసర ప్రాంతాల్లో అన్ని చెరువుల కింద వరి నాట్లు ప్రారంభం అయ్యాయి. దీంతో వరి నారుకు డిమాండ్ ఏర్పడింది. తద్వారా పెట్టుబడి ఖర్చులు పెరిగి పోతాయని రైతులు పేర్కొంటున్నారు. ఈఏడాది పొగాకు ఆశించిన స్థాయిలో అమ్మకాలు లేకపోవడంతో ప్రస్తుతం పెట్టుబడుల కోసం అన్నదాతలు వరి తదితర ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తున్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

● పలువురికి గాయాలు

చీమకుర్తి, న్యూస్‌టుడే: సరుగుడు తోటలో గొర్రెలు పడి పంటను నాశనం చేశాయనే విషయమై చోటు చేసుకున్న ఘర్షణలో పలువురు గాయపడిన సంఘటన చీమకుర్తి మండలం బండ్లమూడిలో సోమవారం చోటు చేసుకుంది. దీన్లో పలువురు గాయపడ్డారని సీఐ ప్రసాదరావు తెలిపారు. ఆ వివరాల మేరకు బండ్లమూడి ఎస్సీ కాలనీకి చెందిన కంట్లం ఏసుదాసు సరుగుడు తోటలో ఆదివారం గ్రామానికి చెందిన ఎస్.సుబ్బారెడ్డి గొర్రెలు పడి మొక్కలు పాడు చేశాయి. దీనిపై ఆదివారం నుంచి వివాదం నడుస్తోంది. సోమవారం స్థానిక బస్టాండు కూడలిలో ఇరువర్గాల మధ్య మాటా మాటా పెరిగి కర్రలతో దాడులు చేసుకున్నారు. ఈఘర్షణలో ఎస్సీ కాలనీకి చెందిన కంట్లం ఏసుదాసు, కంట్లం ఏసోబు, కంట్లం రామయ్యలకు తల, చేతుల పైన గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన గోపిరెడ్డి బాల ఓబుల రెడ్డి, వనిపెంట శ్రీనివాసరెడ్డి మరొకరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులు చీమకుర్తి సామాజిక వైద్య శాల, ఒంగోలు రిమ్స్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. రెండు వైపుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రసాదరావు తెలిపారు. గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

కార్గో విభాగంలో డెలివరీ కౌంటర్ ప్రారంభం

అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: ఏపీఎస్ఆర్టీసీ ఒంగోలు కార్గో విభాగంలో డెలివరీ కౌంటర్‌ను సీనియర్ ముఠామేస్త్రి జె.తిరుపతయ్య ప్రారంభించారు. రీజినల్ మేనేజర్ ఏటీవో ఏఇ(సివిల్) డీఎం సమక్షంలో కార్యక్రమం జరిగింది. ఒంగోలు డిపో ట్రాఫిక్, గ్యారేజ్, బస్ స్టేషన్ డీసీ ఎర్నింగ్ సెక్షన్ల నుంచి సిబ్బంది ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. పార్శిల్ డెలివరీ కోసం వచ్చే కస్టమర్లు ఇక నుంచి ప్రకాశం హాస్పిటల్ రోడ్డు ద్వారా డెలివరీ కౌంటర్లు చేరుకొని వారి పార్శిల్స్‌ను యల్ఆర్ నంబర్, డెలివరీ కోడ్ తెలపడం ద్వారా కౌంటర్ల నుంచి నేరుగా పొందవచ్చన్నారు.

కార్తిక శోభ

మూలాపేట ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తిక మాసం రెండో సోమవారం సందర్భంగా శివకేశవుల ఆలయాలు దీప కాంతులతో నిండిపోయాయి. దీపాలు వెలిగించి, దానాలు ఇచ్చేందుకు వేలాది మంది భక్తులు ఆలయాలకు తరలివచ్చారు. నెల్లూరు చెరువు ఒడ్డున వెలసిన స్వర్ణాలగేశ్వర స్వామి ఆలయంలో సింహపురి కార్తిక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో మహిళలు ఓంకారం, శంఖుచక్రాల రూపంలో దీపాలు వెలిగించారు. నగరంలోని మూలాపేటలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతులకు పల్లకి సేవ జరిగింది. – న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

వేదగిరిలో పవిత్రోత్సవం

పవిత్రోత్సవాల్లో భాగంగా నెల్లూరు రూరల్ మండలంలోని వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు, హోమాలను నిర్వహించారు. పవిత్ర మాలలు ఊరేగించారు. ఆలయ ఛైర్మన్ శంకర్‌రెడ్డి, ఈవో గోపి పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(రూరల్)

పెంచలకోన ఆలయ పునర్నిర్మాణంపై చర్చ

రాపూరు, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పెంచలకోన ఆలయ పునర్నిర్మాణంపై సోమవారం ఆలయ ఉప కమిషనర్ పి.శ్రీనివాసులురెడ్డి, ప్రధాన పురోహితులు అమరావతిలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి చర్చించారు. ఏయే పనులు చేపట్టాలన్నదానిపై సమీక్షించారు. అనంతరం అధికారులు మంత్రికి మాస్టర్ ప్లాన్‌ను అందజేశారు.

అధికారులతో చర్చిస్తున్న మంత్రి ఆనం

రైతేరాజు 6లో
కరవు నేల.. సిరుల హేల

గోతుల గండం.. మీకో దండం

అధ్వానంగా మారిన పొదలకూరు-సైదాపురం రహదారి

అధ్వానంగా పొదలకూరు–సైదాపురం రహదారి

ఈనాడు, నెల్లూరు

ఏకంగా 20 గ్రామాల ప్రజలకు ఆ రహదారే ప్రధానం. వివిధ వాహనాల్లో నిత్యం అయిదు వేల మందికిపైగా ప్రయాణిస్తుండగా.. అందులో రెండు వేల మంది పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులే ఉండటం గమనార్హం. ఇంతటి ప్రాధాన్యమున్న రోడ్డు గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో అధ్వానంగా మారింది. క్వార్ట్జ్ అక్రమ తరలింపులో భాగంగా అధిక బరువున్న వాహనాలను తిప్పడంతో ఒక్కో ప్రాంతంలో మోకాటి లోతు గుంతలు ఏర్పడ్డాయి. అక్రమార్జన ద్వారా రూ. కోట్లు స్వాహా చేసిన అప్పటి ప్రజాప్రతినిధులు కనీస మరమ్మతులు చేయించలేదు కదా! కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను సద్వినియోగం చేసుకోవడంపైనా శ్రద్ధపెట్టలేదు. కూటమి ప్రభుత్వం అత్యవసర మరమ్మతుల పేరిట నిధులు మంజూరు చేసినా.. నేటికీ అడుగు ముందుకు పడకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సుమారు 18.8 కి.మీ.

నెల్లూరు-పొదలకూరు-సైదాపురం రహదారిని 35/6 నుంచి 54/4 వరకు సుమారు 18.8 కి.మీ మేర వెడల్పు, పునరుద్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం సీఐఆర్ఎఫ్ నిధులు మంజూరు చేసింది. సుమారు రూ. 45 కోట్లతో చేపట్టిన ఈ పనులకు 2022 నవంబరు 18వ తేదీ శిలాఫలకం ఆవిష్కరించినా.. ఆ తర్వాత అడుగు ముందుకు పడలేదు. పైపెచ్చు.. అదే పనికి 2023లో కలిచేడు వద్ద మరోసారి వైకాపా నాయకులు శంకుస్థాపన చేశారు. కలిచేడు, సైదాపురం, ఊటుకూరు, తురిమెర్ల గ్రామాల వద్ద సిమెంట్ రోడ్డును మాత్రమే వేశారు. తురిమెర్ల వద్ద పిన్నేరు వాగు, ఊటుకూరు సమీపంలో మాలేరు వాగు దగ్గర వంతెనలు నిర్మించాల్సి ఉన్నా.. చేయలేదు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 25 శాతం కంటే తక్కువ చేసిన పనులను రద్దు చేయగా.. ఇదీ రద్దయింది.

కూటమి ప్రభుత్వం నిధులిచ్చినా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గుంతల రహిత రహదారులే లక్ష్యంగా నిధులు విడుదల చేసింది. ఇందులో జిల్లాకు మొదటి విడతలో రూ. 87 కోట్లు విడుదల చేయగా.. 82 రోడ్లను అభివృద్ధి చేశారు. తాజాగా గత నెల 9వ తేదీ రెండో విడత నిధులు మంజూరు చేసింది. జిల్లాలో 16 రోడ్ల అభివృద్ధికి రూ. 64.91 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో పొదలకూరు– సైదాపురం రహదారి కూడా ఉంది. కానీ, ఇప్పటి వరకు పనులు ప్రారంభించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పాలకులు, అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● దీనిపై ఆర్‌అండ్‌బీ ఇన్‌ఛార్జి ఎస్ఈ రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. గతంలో సీఆర్ఐఎఫ్ నిధులతో ప్రారంభమైన పనులు రద్దయిన విషయం నిజమే. ప్రస్తుతం ప్రభుత్వం మళ్లీ నిధులు విడుదల చేసింది. చీఫ్ ఇంజినీరు స్థాయిలో టెండర్లు పిలుస్తున్నారు. అవి పూర్తయిన వెంటనే చేస్తామని తెలిపారు.

చదువరి.. మోసపోకు మరి!

● నేను డెన్మార్క్ దేశంలో ఉన్నా. ఇక్కడ నీకు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి కొల్లూరు సుధాకర్ అనే వ్యక్తి రూ. 45 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం కాదు కదా! నగదు కూడా తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. – నెల్లూరు దర్గామిట్టకు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు

● హైదరాబాద్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఓ యువకుడు రూ. 3 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇవ్వకపోగా.. డబ్బు అడిగితే కాలయాపన చేస్తున్నాడు. – మరో యువకుడి ఆవేదన

– ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదులు ఇవి. ఇటీవల కాలంలో ఉద్యోగాల పేరుతో మోసపోయామంటూ ఇక్కడికి, పోలీసు స్టేషన్లకు వస్తున్న వారి సంఖ్య అధికమైంది.

– న్యూస్‌టుడే, నెల్లూరు (నేర విభాగం)

సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న రోజులివి. ప్రాథమిక అవగాహనకు ఏ సమాచారం కావాలన్నా అరచేతిలో ప్రత్యక్షమవుతున్న పరిస్థితి. అయినప్పటికీ కొలువుల పేరుతో కొందరు చదువరులే మోసపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఏ కంపెనీ కూడా రాత పరీక్ష, ముఖాముఖి లేకుండా ఉద్యోగాలు ఇవ్వదు. పైగా పార్ట్‌టైం, ఫుల్‌టైం, వర్క్ ఫ్రం హోమ్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ సైబర్ నేరగాళ్లు అమాయకుల నుంచి డబ్బు దోచుకుంటున్నారు. ఈ క్రమంలో కొందరు బాధితులు ముందుకొచ్చి ఫిర్యాదు చేస్తుండగా.. మరికొందరు చెప్పుకోలేక కుంగిపోతున్నారు. ఈ అంశంపై ఎస్పీ అజిత వేజెండ్ల మాట్లాడుతూ.. ఉద్యోగ ప్రకటన వాస్తవమో కాదో క్షుణ్నంగా పరిశీలించుకోవాలని, అందులో పేర్కొన్న మొబైల్ నంబర్లకు ఫోన్ చేసి వివరాలు కనుక్కోవడమే.. స్వయంగా కార్యాలయాన్ని సంప్రదించడమే చేయాలని సూచిస్తున్నారు. పని కల్పించేందుకు ఏ సంస్థ డబ్బు వసూలు చేయదని, మనం వెళ్లేది పని చేయడానికి. అలాంటప్పుడు డబ్బు ఎందుకు చెల్లించాలని ఎవరికివారం ప్రశ్నించుకోవాలని నిరుద్యోగులకు సూచించారు.

కేసులు ఇలా..

సం॥	మోసం	నమ్మక ద్రోహం
2022	391	94
2023	345	96
2024	456	123
2025	493	132

(ఇప్పటి వరకు)

ఆక్రమణల పాపం.. తలాకొంచెం!

న్యూస్‌టుడే, వెంకటాచలం

జలాశయాన్ని ఆక్రమించి.. సాగు చేసిన వరి పొలాలు

అధికారుల నిర్లక్ష్యం.. కొందరు వ్యక్తుల స్వార్థం కారణంగా సర్వేపల్లి జలాశయం రోజురోజుకూ ఆక్రమణలతో కుంచించుకుపోతోంది. 1.74 టీఎంసీల సామర్థ్యంతో ఆంగ్లేయుల పాలనా కాలంలో ఏర్పాటు చేసిన ఈ జలనిధి ద్వారా వెంకటాచలం, ముత్తుకూరు మండలాల్లోని సుమారు 40 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. పలు ప్రైవేటు సంస్థలకు ప్రత్యేక పైపులైన్ల ద్వారా వెళ్తోంది. ఇలా ఏటేటా నీటి అవసరాలు పెరుగుతున్నా.. ఆక్రమణలతో లోతట్టు విస్తీర్ణం తగ్గిపోతుండటం కలవరపరుస్తోంది.

కట్ట మనుగడకు ముప్పు

పైభాగంలో ఆక్రమించి పొలాలుగా చేసే క్రమంలో కొందరు యంత్రాలతో పెద్ద పెద్ద కట్టలు వేస్తుండగా- ఆ చర్యల కారణంగా జలాశయం విస్తీర్ణం, నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతోంది. ఉన్ననీరు పై వైపునకు వెళ్లి.. కట్టపై ఒత్తిడి పడుతోంది. అసలే వర్షాలకు కోసుకుపోయి బలహీనంగా ఉన్న ఆనకట్ట మనుగడకు ఇది శాపంగా మారింది. ప్రస్తుతం 1.3 టీఎంసీలు కూడా నిల్వ చేసే పరిస్థితి లేదని, ఇదే తీరు కొనసాగితే పరిరక్షణ కష్టమని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. జలాశయం మొత్తం సర్వే చేయించి.. ఆక్రమణలు తొలగించి.. హద్దులు ఏర్పాటు చేయించాలని కోరుతున్నారు. దీనిపై జలాశయం ఏఈ మహేశ్వర్ మాట్లాడుతూ.. ఆక్రమణల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి.. తొలగింపునకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

పొలాలుగా మార్చి..

అనికేపల్లి, గొలగమూడి, తిక్కవరప్పాడు, జోసఫ్‌పేట తదితర చోట్ల జలాశయం పైభాగం ప్రాంతాన్ని ఎక్కడికక్కడ ఆక్రమించి పొలాలుగా మార్చారు. కొందరు ఏకంగా కంచెలు వేసి క్రయ విక్రయాలు జరుపుతున్నారు. అనికేపల్లి, గొలగమూడి సమీపంలోనే వందలాది ఎకరాలు ఆక్రమించారు. మరికొందరు శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. సుమారు 1200 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు చెబుతున్నారు.

మనమిత్ర.. మన తోడుగా

డ్వాక్రా మహిళలకు కొత్త నైపుణ్యాలు

సెల్‌ఫోన్‌లో వివరాలు చూపుతున్న పొదుపు మహిళలు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: పొదుపు మహిళలు శర వేగంగా సాంకేతికతను అందిపుచ్చుకుని ఆర్థికంగా రాణించేందుకు కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. అందులో భాగంగానే పట్టణ ప్రాంత డ్వాక్రా మహిళలకు సరికొత్త నైపుణ్యాలు అందించేందుకు కృత్రిమ మేధ ఆధారిత ఈ- లెర్నింగ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా కోరుకున్న సేవలను అరచేతిలో చూసుకోవచ్చు. సంఘం సభ్యులు.. ఆండ్రాయిడ్ ఫోన్ ఉంటే చాలు.. నైపుణ్యాలు పెంపు, విజ్ఞాన వేదికగా వాడుకునే వెసులుబాటు కల్పించారు. ఇప్పటికే శిక్షణ కూడా ఇవ్వడంతో మనమిత్ర యాప్ ద్వారా 9 రకాల వాట్సాప్ సేవలను విరివిగా ఉపయోగించుకుంటున్నారు.

జిల్లాలో ఇలా..
నగర, పురపాలికలు: 5
సంఘాలు: 15,298
సభ్యులు: 1,52,089

ఏం చేయాలంటే..

మెప్మా పరిధిలో సభ్యులైన వారు వాట్సాప్ నంబరు 9552300009కు హాయ్ అని సందేశం పంపితే.. పలు రకాల ప్రత్యేక సేవలు అందులో కనిపిస్తాయి. మెప్మాకు సంబంధించిన మనమిత్ర ఫ్లాట్‌ఫాంపై క్లిక్ చేస్తే 9 రకాల సేవల్లో కావాల్సిన అంశం.. వివరాలు పొందొచ్చు. సంఘం, ఎస్ఎల్ఎఫ్, టీఎల్ఎఫ్, జెడ్‌యూఎస్ వివరాలు, పొదుపు అంశాలు, తీసుకున్న రుణం, చెల్లించిన వివరాలు, చూసుకోవచ్చు. సంఘానికి సంబంధించిన ఆడిట్ నివేదికను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రజ్ఞా వర్చువల్ ట్రైనింగ్ అకాడమీలో పేర్లు నమోదు చేసుకోవచ్చు.

ధ్రువపత్రం కూడా.. సైబర్ నేరాలు, డిజిటల్ ఆరోగ్యంపై అవగాహన పొందొచ్చు. డిజిటల్, ఆర్థిక అక్షరాస్యత వంటి 12 రకాల కోర్సులను వీలు బట్టి ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్‌లో నేర్చుకోవచ్చు. పలు వీడియోల ద్వారా విన్న వివరాలు ఏ మేరకు అవగాహన వచ్చాయో తెలుసుకునేందుకు ప్రశ్నలు అందుబాటులో ఉంటాయి. వాటిని పూర్తి చేసి ధ్రువపత్రం దిగుమతి చేసుకునే అవకాశం ఉంది.

● మెప్మా పీడీ లీలా రాణి మాట్లాడుతూ.. మన మిత్ర వాట్సాప్ సేవలను ప్రతి సభ్యురాలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపడుతున్నాం. నగర, పురపాలికల్లో శిక్షణలు ఇస్తున్నాం. వర్చువల్ తరగతులు వినే వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సూళ్ళూరుపేట బ్రాంచ్
పొట్టి శ్రీరాములు వీధి, సూళ్ళూరుపేట, తిరుపతి-524121

సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్ 54 ఆఫ్ 2002లోని సెక్షన్ 13(2) క్రింద ప్రకటన (సర్ఫేసి యాక్ట్, 2002)-డిమాండ్ నోటీసు

నుండి : తేది: 25-09-2025
చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, 2002 యొక్క చట్టం 54 ప్రకారం
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సూళ్ళూరుపేట బ్రాంచ్
దిగువ వారికి,

ఋణగ్రహీతలు : 1) మెస్సర్స్ Ecoron ఎనర్జీ ప్రొడక్ట్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ పార్టనర్ శ్రీమతి కొండంరెడ్డి లక్ష్మీ శిరీష, ఫ్లాట్ నెం.యస్-102, సంకల్ప్ రెసిడెన్సీ, బాబా నగర్, వాషింగ్టన్ హోమ్ దగ్గర, నెల్లూరు-524002.
2) మెస్సర్స్ Ecoron ఎనర్జీ ప్రొడక్ట్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ పార్టనర్, శ్రీమతి కొండంరెడ్డి లక్ష్మీ శిరీష, సర్వే నెం. 384-1బి, 384-2ఎ, 384-6బి, కోటపోలూరు, సూళ్లూరుపేట, నెల్లూరు జిల్లా-524123
ఋణగ్రహీత(లు)/ హామీదారు(లు) : 1) శ్రీమతి కొండంరెడ్డి లక్ష్మీ శిరీష (మేనేజింగ్ పార్టనర్), భర్త : శ్రీధర్ రెడ్డి, డి.నెం.: 8-2-603/యు/9, యస్2, జాస్మిన్ బ్లాక్, ఫార్చ్యూన్ ఐకాన్, రోడ్ నెం.10, బంజారాహిల్స్, ఖైరతాబాద్, హైదరాబాద్, తెలంగాణా-500034
2) శ్రీమతి గూడాల ప్రభావతి (పార్టనర్), భర్త : హరి ప్రసాద్ రెడ్డి, ఫ్లాట్ సం. 3, కీర్తి ఎన్‌క్లేవ్, జియన్‌టి రోడ్, పాత కాటన్ మిల్స్, కోటపోలూరు పంచాయతీ, సూళ్లూరుపేట మండలం, తిరుపతి జిల్లా – 524123.
ఋణగ్రహీత(లు)/ హామీదారు(లు)/తనఖాదారులు : 1) శ్రీమతి కొండంరెడ్డి శ్రీలత (పార్టనర్), భర్త : కె. శశిధర్ రెడ్డి, ఫ్లాట్ నం. 209, కావ్య బ్లాక్, పూజిత ఎస్టేట్స్, ఎర్రగడ్డ ఫ్రూట్ మార్కెట్ ఎదురుగా, సుందర్ నగర్, అమీర్‌పేట్, హైదరాబాద్, తెలంగాణ – 500038.
హామీదారు(లు)/తనఖాదారులు : కె.శశిధర్ రెడ్డి, తండ్రి : నారాయణ రెడ్డి, ఫ్లాట్ నెం. 209, కావ్య బ్లాక్, పూజిత ఎస్టేట్స్, ఎర్రగడ్డ ఫ్రూట్ మార్కెట్ ఎదురుగా, సుందర్ నగర్, అమీర్‌పేట్, హైదరాబాద్, తెలంగాణ – 500038
అయ్యా / అమ్మా,

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా మా సూళ్ళూరుపేట బ్రాంచ్ వారి వద్దనున్న మీ మెస్సర్స్ Ecoron ఎనర్జీ ప్రొడక్ట్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ పార్టనర్ శ్రీమతి కొండంరెడ్డి లక్ష్మీ శిరీష డి.నెం.: 8-2-603/యు/9, యస్2, జాస్మిన్ బ్లాక్, ఫార్చ్యూన్ ఐకాన్, రోడ్ నెం.10, బంజారాహిల్స్, ఖైరతాబాద్, హైదరాబాద్ వారి ఋణ ఖాతా బకాయిలను / వడ్డీని చెల్లించుటలో విఫలమైనందున ది.27-08-2025 తేదీన మీ ఋణ ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించబడినది. మీ ఋణ ఖాతా తేది.31-07-2025 నాటికి రూ.79,94,041.88 (అక్షరాలా డెబ్బై తొమ్మిది లక్షల తొంభై నాలుగు వేల నలభై ఒక్క రూపాయల ఎనభై ఎనిమిది పైసలు మాత్రమే) ఉన్న బకాయి వివరములు క్రింద ఇవ్వబడినవి.

ఋణ స్వభావం/ఖాతా నెంబరు	పరిమితి (రూ.)	తేది.31-07-2025 నాటికి బకాయి మొత్తము (రూ.)
CCUNS/107215090000003	రూ.50,00,0000.00	రూ.54,56,322.96
TLP09/107216180000002	రూ.42,24,000.00	రూ.25,37,718.92
మొత్తము	రూ.92,24,000.00	రూ.79,94,041.88

మీకు మేము అనేక మార్లు విన్నపములు చేసినప్పటికి, మీరు మీ ఖాతాలోని బకాయి మొత్తమును ఏ మాత్రము చెల్లించలేదు.

అందువలన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారము మీ యొక్క బకాయి మొత్తము రూ.79,94,041.88 (అక్షరాలా డెబ్బై తొమ్మిది లక్షల తొంభై నాలుగు వేల నలభై ఒక్క రూపాయల ఎనభై ఎనిమిది పైసలు మాత్రమే) ఋణ పత్రములో చెప్పబడిన నియమ నిబంధనలలోనున్న ఒప్పందపు వడ్డీరేటు ప్రకారము నెలవారీ వడ్డీతో సహా ఈ నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసి ఉంటుందని, అట్లు చేయుటలో విఫలమైనచో మీరు మా బ్యాంకుకు హామీ ఇచ్చిన ఆస్తులపై సదరు చట్టప్రకారం లభించు ఏవేని లేదా అన్ని హక్కులను ప్రయోగించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.

సెక్యూర్డు ఆస్తి వివరములు

ఆస్థి 1: నెల్లూరు జిల్లా, ముత్తుకూరు సబ్ రిజిస్ట్రేషన్, నెల్లూరు జిల్లా రిజిస్ట్రేషన్, టి.పి.గూడూరు మండలం, పరిగొండ గ్రామం, సర్వే నెం.లు717(పి) & 718 (పి) లలోని సుందరనగర్ ప్రాజెక్ట్ డిటిసిపి ఎల్.పి.నెం.29/2007/RO/NLR ప్రకారం2400 చ.అ.లు లేదా 266.66 చ.గ.లు మొత్తం విస్తీర్ణంలో ప్లాటు నెం.33 గా గల ఖాళీ స్థలము యావత్తునకు కొలతలు తూర్పు నుండి పడర లేదా ఉత్తరం నుండి దక్షిణం వైపు 60 అడుగులు లేదా 18.298 మీటర్లు, ఉత్తరం నుండి దక్షిణం తూర్పు మరియు పడమర వైపులు : 40 అడుగులు లేదా 12.198 మీటర్లు విస్తీర్ణం ఆస్థిసకు హద్దులు : ఉత్తరం : ప్లాట్ నెం.32 (29/2007/RO/NLR), దక్షిణం : ప్లాట్ నెం.34 (29/2007/RO/NLR), తూర్పు : ప్లాట్ నెం.42(29/2007/RO/NLR), పడమర : 40 అడుగుల వెడల్పు గల రోడ్డు.

ఆస్థి –2 : తిరుపతి జిల్లా – సూళ్లూరుపేట సబ్ రిజిస్ట్రేషన్ – సూళ్లూరుపేట రెవెన్యూ మండలం – కోటపోలూరు గ్రామ పంచాయతీ – పట్టా నెం.1155, 1) సర్వే నెం.382-6బి లోని ఎ.3.66 సెంట్లులోని ఎ.0.08 సెంట్లు, 2) సర్వే నెం.384-1బి ఎ.5.41 సెంట్లులో ఎ.3.60 సెంట్లు, 3) ఎ.384-2ఎ లోని ఎ.1.85 సెంట్లులోని ఎ.0.82 సెంట్లు విస్తీర్ణం మొత్తం ఎ.4.50 సెంట్లు – వ్యవసాయ భూమిని-గూడూరు, సబ్ కలెక్టర్ వారిచే జారీచేయబడిన డి.డిస్.నెం.(బి2) 2864/2012, తేదీ 20.07.2012 ప్రకారం వ్యవసాయేతర భూములుగా మార్చబడిన 317.77 చ.గ.లు ఖాళీ స్థలమునకు హద్దులు : తూర్పు: కె. శశిధర్ రెడ్డి గారి భూమి, దక్షిణం: కె. శశిధర్ రెడ్డి గారి భూమి, పడమర : 25 అడుగుల రోడ్డు వెడల్పు, ఉత్తరం: 40 అడుగుల రోడ్డు వెడల్పు. కొలతలు: తూర్పు: 60 అడుగులు లేదా 18.288 మీటర్లు, దక్షిణం: 54 అడుగులు లేదా 16.459 మీటర్లు, పడమర : 44 అడుగులు లేదా 13.411 మీటర్లు, ఉత్తరం: 56 అడుగులు లేదా 17.069 మీటర్లు.

2860 చదరపు అడుగులు లేదా 317.77 చదరపు గజములు లేదా 265.662 చదరపు మీటర్లు లేదా 39 అంకణములు 52 చదరపు అడుగులు విస్తీర్ణం గల ఖాళీ స్థలం, అన్ని యాజమెంటరీ హక్కులు మరియు ఉమ్మడి నడకమార్గము నందు పడమర వైపు 25 అడుగుల వెడల్పులోని హక్కు, ఉత్తరం వైపున గల రోడ్డులో 40 అడుగులు వెడల్పు హక్కులతో కలదు.

1) మీరు సదరు బకాయిలను 60 రోజులలోగా తిరిగి చెల్లించుటలో విఫలమైనచో, బ్యాంకు వారు సదరు చట్టం ప్రకారం లభించిన అన్ని హక్కులను ఉపయోగించి హామి ఇవ్వబడిన ఆస్తుల విక్రయముతో బకాయిలు పూర్తిగా చెల్లించబడనప్పుడు, మిగిలిన బకాయిసొమ్ము మీ నుండి రాబట్టుకొనుటకు, న్యాయస్థానము / డెబ్ట్ రికవరీ ట్రిబ్యూనల్ ద్వారా మీపై తగు న్యాయ పరమైన చర్యలు తీసుకొనుట మాకు తప్పనిసరి అవుతుంది.
2) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) (సవరణ) రూల్స్ 2002లోని రూల్ 3(5)తో చదవబడే సెక్యూరిటీ ఇంటరెస్ట్ 2002లోని సెక్షన్ 13(8) ప్రకారం బహిరంగ వేలం ద్వారా లేదా ప్రజల నుండి కొటేషన్లు లేదా టెండర్‌లు కోరడం ద్వారా లేదా ప్రైవేటు ఒప్పందం ద్వారా సెక్యూర్డ్ ఆస్తులు లీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం ద్వారా బదిలీ కోసం నోటీసు ప్రచురణ తేదీకి ముందు ఏ సమయములోనైనా సెక్యూర్డు క్రెడిటర్‌కు అయిన అన్ని వ్యయాలు, ఛార్జీలు మరియు ఖర్చులతో సహా సెక్యూర్డ్ క్రెడిటర్ బకాయి మొత్తాలు మీరు చెల్లించేందుకు సర్ఫేసి చట్టంలోని నిబంధనలు గమనించవలసిందిగా మిమ్ములను కోరడం అయినది. మీకు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడం అయినది. పై తెలిపిన విధంగా బహిరంగ వేలం ద్వారా లేదా ప్రజల నుండి కొటేషన్లు లేదా టెండర్ కోరడం ద్వారా ప్రైవేట్ ఒప్పందం ద్వారా సెక్యూర్డు ఆస్తులు లీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం ద్వారా బదిలీ కోసం ప్రచురణ తేదీకి ముందు సెక్యూర్డ్ క్రెడిటర్‌కు అయిన వ్యయాలు, ఛార్జీలతో సహా బకాయి మొత్తం చెల్లించకపోతే, సెక్యూర్డ్ ఆస్తి / ఆస్తులు విడిపించుకొనేందుకు మీకు హక్కులేదని కూడా మీరు గమనించగలరు.
3) సదరు చట్టం యొక్క 13(13) సెక్షన్ ప్రకారము, ఈ నోటీసు పొందిన అనంతరము మీరు పైన చెప్పబడిన ఆస్తులను సాధారణ వ్యాపార కార్యకలాపాలు తప్ప బ్యాంకు వారి అనుమతి లేకుండా విక్రయించరాదు. మరియు లావాదేవీలు జరుపరాదు. సదరు సెక్షన్ యొక్క ఏ విధమైన ఉల్లంఘన జరిపినా తీవ్ర పరిణామాలకు గురిఅవుతారు.

తేది : 25.09.2025 (సం/-చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి)
ప్రదేశం : సూళ్ళూరుపేట యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సూళ్ళూరుపేట బ్రాంచ్

పట్టు.. పతకం కొట్టు

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు వీరు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) డివిజన్ స్థాయి పోటీల్లో భాగంగా ఇలా విజయమే లక్ష్యంగా ఇలా తలపడ్డారు. ఖోఖో పోటీలు కూడా రసవత్తరంగా సాగాయి. జవహర్‌భారతి కళాశాల ప్రాంగణంలోనూ పోటీలు జరిగాయి. విద్యాశాఖాధికారులు, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు క్రీడలను పర్యవేక్షించారు.

సివిల్ ఇంజినీరు.. దొంగగా మారాడు

వివరాలు వెల్లడిస్తున్న చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర రావు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: తల్లిదండ్రులు కష్టపడి.. వ్యవసాయం చేసి.. బీటెక్ చదివిస్తే, ఉన్నత చదువులు చదివి వారి కష్టానికి సార్థకత తను.. వారికి ఊరటను కలిగించాల్సిన ఆ కుమారుడు.. ఆన్‌లైన్ క్యాసినో బెట్టింగ్‌కు అలవాటుపడి.. చివరకు దొంగగా మారాడు. నగదు కోసం మహిళల మెడలో గొలుసులు, ద్విచక్ర వాహనాల దొంగతనాలకు తెగబడ్డాడు. చివరకు నెల్లూరు చిన్నబజారు పోలీసులకు పట్టుబట్టాడు. అతడి నుంచి రెండు గొలుసులు, ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఆయా వివరాలను ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు వెల్లడించారు. అల్లూరు మండలం జమ్మిపాలేనికి చెందిన ఓ కుటుంబం పొదలకూరు సూరాయపాలెంలో స్థిరపడింది. ఆ దంపతుల కుమారుడు శ్రీనాథ్ 2009లో జిల్లాలోని కళాశాలలో బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. నగరంలోని ఓ థియేటరులో ఉద్యోగం చేస్తున్నాడు. ఆన్‌లైన్‌లో క్యాసినోకు అలవాటుపడ్డాడు. సంపాదించిందంతా దానికే వెచ్చిస్తున్న అతడు.. ఆపై సులువుగా నగదు సంపాదించేందుకు దొంగగా మారాడు. ఒంటరి మహిళల మెడలో నుంచి బంగారు సరుడులు, ద్విచక్ర వాహనాలు దొంగలించడం మొదలుపెట్టాడు. గత నెల 23న చాకలి వీధిలో నివాసం ఉంటున్న లక్ష్మమ్మ వద్ద ఇంటి పై పోర్షన్ బాడుగ నిమిత్తం మాట్లాడుతూ.. ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని ఉడాయించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు... ఆ చర్యకు పాల్పడింది శ్రీనాథ్‌గా గుర్తించి.. అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. బుచ్చి, బాలాజీనగర్, చిన్నబజారు, దర్గామిట్ట పోలీసుస్టేషన్ల పరిధిలో జరిగిన ద్విచక్ర వాహనాల దొంగతనాలు తానే చేసినట్లు అంగీకరించడంతో.. వాటన్నింటినీ రికవరీ చేశారు. నిందితుడి నుంచి రూ. 5.15 లక్షల విలువైన ఏడు ద్విచక్ర వాహనాలు, రెండు బంగారు సరుడులు స్వాధీనం చేసుకున్నారు. అతడిని అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన చిన్నబజారు ఎస్సై అయ్యప్ప, సిబ్బందిని ఎస్పీ అజిత అభినందించారు.

అవినీతిపై యుక్తధార

యాప్‌తో సర్వేకు యత్నిస్తున్న ఉపాధి సిబ్బంది

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ): ఉపాధి పనుల్లో.. కొలతల్లో తేడా చూపి.. నిధులు స్వాహా చేసే వారి ఆటలకు అడ్డుకట్ట వేసేందుకు రంగం సిద్ధమైంది. చేసిన పనులనే మళ్లీ చేసినట్లు బిల్లులు పెట్టేందుకు వీలు లేకుండా చర్యలు తీసుకోనున్నారు. అందు కోసం యుక్తధార జియో స్పేషియల్ ప్లానింగ్ పోర్టల్ ద్వారా సర్వే చేపట్టనున్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా ఉపాధి సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు.

తొలుత నాలుగు గ్రామాల్లో..

నూతన ప్రక్రియను తొలుత నాలుగు గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టగా- ప్రస్తుతం జిల్లా మొత్తం అమలు చేస్తున్నారు. 2025-26 సంవత్సర పనుల ప్రణాళికను సైతం ఇందుకు అనుగుణంగానే సిద్ధం చేస్తున్నారు. 160 మంది సాంకేతిక సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. ప్రతి బ్యాచ్‌కు 5 నుంచి 15 మంది చొప్పున బాపట్లలో జరిగే శిక్షణకు పంపుతున్నారు.

ప్రతి 50 మీటర్లకు..

ప్రత్యేక సెల్ యాప్‌తో చేపట్టనున్న ప్రతి పనిని సర్వే చేయనున్నారు. ప్రతి 50 మీటర్లకు ఒక ఫొటో తీసి.. దానికి సంబంధించిన పొడవు, వెడల్పు, లోతుల కొలతలను ఆటోమేటిక్ గూగుల్ ఎర్త్ మ్యాపలతో గుర్తిస్తారు. వాటిని కంప్యూటర్‌లో నమోదు చేసి నిబంధనల ప్రకారం నిధులు మంజూరు చేస్తారు.

● దీనిపై ఉపాధిహామీ పథకం పీడీ గంగాభవాని మాట్లాడుతూ... పనులు నిర్ణయించే సమయంలో కొలతల్లో మార్పులు చేసి.. దొంగ కొలతలు చూపి నిధులు దోచుకునే వారికి అడ్డుకట్ట వేస్తామని అన్నారు.

అక్రమాలకు ఊతం.. వంతెనకు శాపం!

రెయిలింగ్ ధ్వంసం కావడంతో ప్రమాదకరంగా రాకపోకలు

న్యూస్‌టుడే, సంగం

ఇసుకాసురుల అత్యాశ.. బోటు నిర్వాహకుల చర్యలు బీరాపేరుపై వంతెన మనుగడను ప్రశ్నార్థకం చేశాయి. ఇంత జరిగినా జలవనరుల శాఖ అధికారులు కిమ్మనకపోవడం.. . ఇప్పటికే అప్రోచ్ రోడ్డు దెబ్బతినగా- తాజాగా రెయిలింగ్ దెబ్బతినడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

వివరాలు ఇలా..
భూమి పూజ: 1998, జులై 8
అంచనా వ్యయం: రూ. 59.6 లక్షలు
సామర్థ్యం: 25 టన్నులు
ప్రారంభం: 2022, అక్టోబరు 9

నాటి దుర్ఘటనతో...

సంగంకు చెందిన సుమారు 500 ఎకరాల వ్యవసాయ భూములకు రాకపోకలు సాగించే మార్గంలో అడ్డుగా ఉన్న బీరాపేరుపై పురాతన కాలంలో రైతులు నిర్మించుకున్న వంతెన కూలిపోతే.. పునర్నిర్మాణంలో జాప్యం నెలకొంది. ఆ క్రమంలో తాటి దుంగల సాయంతో ఏరు దాటుతున్న ఆరుగురు వ్యక్తులు 1995 సెప్టెంబరు 18న అదుపుతప్పి నీటిలో పడి దుర్మరణం చెందారు. ఆ దుర్ఘటన.. అనంతర పరిణామాలతో ప్రభుత్వం 2002 నుంచి నూతన వంతెనను అందుబాటులోకి తెచ్చింది. ఇంతటి కీలక వంతెన ఊపిరిని గత ఆరేళ్లుగా ఇసుక లారీలు తీస్తుండగా- ఇప్పుడు ఏకంగా పడవలు ధ్వంసం చేశాయి.

భారీ లారీలతో..

పెన్నానదిలో పడవల ద్వారా సేకరించిన ఇసుకను ట్రాక్టర్ల ద్వారా బీరాపేరు వంతెన మీదుగా నిల్వ కేంద్రానికి తరలించాలి. ఇక్కడే నిబంధనలు తుంగలో తొక్కి.. నేరుగా లారీలతో తరలిస్తున్నారు. ఒక్కో దానిలో 40 టన్నుల మేర వేస్తుండటంతో.. 25 టన్నుల సామర్థ్యానికి అనుగుణంగా నిర్మించిన వంతెన ఉనికికే ప్రమాదకరంగా మారింది.

నిర్లక్ష్యం.. రెయిలింగ్ ధ్వంసం

పెన్నాకు వరదలు వస్తుండటంతో.. పడవల ద్వారా ఇసుక తవ్వకాలు జరగడం లేదు. దాంతో యజమానులు వాటిని వంతెన రెయిలింగ్‌కు తాళ్లతో కట్టారు. గత బుధవారం వేకువజామున బీరాపేరులో వరద ప్రవాహం ఉద్ధృతం కాగా.. ఆ ధాటికి రెయిలింగ్‌ను కూడా ఈడ్చుకుంటూ పడవలు బ్యారేజీ వైపు కొట్టుకుపోయాయి. వంతెనపై రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. దీనిపై జలవనరులశాఖ ఏఈ వినయ్‌కుమార్‌తో మాట్లాడగా.. బాధ్యులపై కేసులు పెడతామని, వారితోనే నిర్మాణం చేయిస్తామని అన్నారు.

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: ప్రజలు సంతృప్తి చెందేలా ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జేసీ

ప్రతి అర్జీపై దృష్టి పెట్టాలి: కలెక్టర్

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, అధికారులు

మొగిలి వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్, జడ్పీ సీఈవో మోహన్‌రావు, పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి, డ్వామా పీడీ గంగాభవానీతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి మానవతా దృక్పథంతో పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా భూ సమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.

జనరల్ నోటీసు

ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి మరియు మరికొంత ఆస్తి అనగా **ఎ. 0-45 సెంట్లు సర్వే నెంబరు 207/A1 (సర్వే నెంబరు 207)** కొండాయపాళెం గ్రామమునకు సంబంధించిన భూమిని **నాయుడు జ్ఞానప్ప** గారి తదనంతరం **ఆయన భార్య చిన్నమ్మ మరియు కుమారుడు వెంకటేశ్వర్లు గారికి** సంక్రమించి వారు పూర్తి హక్కులతో అనుభవించుకొనుచుండినారని, వారు **సదరు చిన్నమ్మకు మనుమరాలు, సదరు వెంకటేశ్వర్లు కుమార్తె అయిన పాలేటి లలితమ్మ భర్త శ్యామ్యూల్** గారికి రిజిస్టరు **శెటిల్‌మెంట్ పత్రము** నెం: 313/1988, తేది : 27-01-1988 ద్వారా సంక్రమింపచేసినారని, సదరు **లలితమ్మ** పూర్తి హక్కులతో సదరు ఆస్తిని అనుభవించుకొనుచూ ఉండినారని సదరు ఆస్తిలో కొంత **భూమిని ఎ. 0-18 సెంట్లు** భూమిని సదరు **లలితమ్మ** గారి దగ్గర నుండి 1993వ సం॥లో నేషనల్ హైవే అథారిటీ వారు బైపాస్ నిర్మాణం కొరకు అక్వైర్ చేసినారని, తదుపరి సదరు **లలితమ్మ** గారు చనిపోయిన తరువాత సదరు ఆస్తికి సదరు **లలితమ్మ** గారి వారసులైన **నక్కా ప్రశాంతి, భర్త నక్కా సురేంద్రబాబు, నెల్లూరు ప్రసూన, భర్త నెల్లూరు కిషోర్** గారికి సంక్రమించినదని తదుపరి కొలతలు వేయగా **సర్వే నెం. 207/A1 రులో ఎ. 0-12 సెంట్లు** అనగా 72 అంకణములు మాత్రమే తేలినదని సదరు **శెటిల్‌మెంట్ పత్రము నెం. 313/1998,** తేది : 27-01-1988కి **రిజిస్టరు సవరణ పత్రము నెం. 8327/2025,** తేది : 18-09-2025 చేయుట జరిగినదని, ప్రస్తుతము ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి సదరు **నక్కా ప్రశాంతి భర్త సురేంద్రబాబు, నెల్లూరు ప్రసూన భర్త నెల్లూరు కిషోర్** గార్ల పూర్తి హక్కు అనుభవములో ఉన్నదని చెబుతూ నా కక్షిదారునికి అమ్మ చూపినారు. సదరు నక్కా ప్రశాంతి, నెల్లూరు ప్రసూన గార్ల హక్కుల గురించి ఎవరికైనా ఎలాంటి అభ్యంతరములు ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన 7రోజుల లోపల నాకు వ్రాతమూలముగా తెలుపకొనవలసినది లేనిచో ఎలాంటి ఆక్షేపణలు లేవని భావించి, నా కక్షిదారుడు ఈ క్రింది ఆస్తిని కొనుగోలు చేయగలవారు.

ఆస్తి షెడ్యూలు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు రిజిస్ట్రేషన్ యిలాకా, నెల్లూరు సబ్-రిజిస్ట్రారులో చేరిన, నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో చేరిన, కొండాయపాళెం గ్రామంలోని సర్వే నెంబర్ : 207/A1 రు లో ఎ. 0.12 సెంట్లు లేక 0.0486 హెక్టార్లు లేక 72.6 అంకణములు లేక 580.8 చదరపు గజములు ఖాళీ స్థలమునకు హద్దులు : **తూర్పు :** నెల్లూరు-చెన్నై హైవే రోడ్డు, **దక్షిణం :** దేవిరెడ్డి అభిషేక్, పుచ్చలపల్లి అభివర్షిణి గార్ల స్థలం, **పడమర :** దేవిరెడ్డి అభిషేక్, పుచ్చలపల్లి అభివర్షిణి గార్ల స్థలం, **ఉత్తరం :** దేవిరెడ్డి అభిషేక్, పుచ్చలపల్లి అభివర్షిణి గార్ల స్థలం. సదరు భూమి N.H 16 కి పడమర VPR Villaas కు వాయువ్యదిశలో గణేషం వెంకటేశ్వరరెడ్డి గారి లేఅవుట్‌కు దక్షిణపు దిశలో ఉన్నది.

ఇట్లు : **కొండూరు శేషారెడ్డి,** B.Com., B.L., అడ్వకేట్, నెల్లూరు. Cell: 94402 77290

ప్రజా సేవకే నా జీవితం అంకితం: ఎంపీ

వరికుంటపాడు, న్యూస్‌టుడే: ప్రజా సేవకు తన జీవితం అంకితం చేసేందుకే వీపీఆర్ ఫౌండేషన్‌ను నెలకొల్పినట్లు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వెల్లడించారు. మండలంలోని రామాపురంలో వీపీఆర్ నేత్ర పరీక్షల వాహనాన్ని కోవూరు, ఉదయగిరి ఎమ్మెల్యేలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కాకర్ల సురేష్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. తెదేపా మండల కన్వీనర్ చండ్రా మధుసూదన్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏకార్యక్రమానైనా ఉదయగిరి నియోజకవర్గం నుంచే ప్రారంభిస్తామన్నారు. గతంలో వీపీఆర్ అమృత ధార కార్యక్రమాన్ని కూడా ఇక్కడే మొదలు పెట్టానన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి చిత్రంలో ఎమ్మెల్యేలు ప్రశాంతిరెడ్డి, సురేష్

పేదల కళ్లలో వెలుగులు నింపేందుకు నేత్ర మొబైల్ వాహనాన్ని ఏర్పాటుచేశామన్నారు. దశల వారీగా అన్ని గ్రామాల్లో నేత్ర పరీక్షలు చేసి నాణ్యత కలిగిన కంటి అద్దాలు అందజేస్తామన్నారు. వెలుగొండ జలాలను ఉదయగిరికి తీసుకొస్తామని, సోమశిల హైలెవల్ కెనాల్ పూర్తి చేసి మెట్ట ప్రాంతాన్ని డెల్టాగా మారుస్తామన్నారు. సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, జడ్పీ మాజీ ఛైర్మన్ పొనుగోటి చెంచలబాబుయాదవ్, జడ్పీటీసీ సభ్యులు రావెళ్ల నాగేంద్ర, తెదేపా రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, జనసేన కోఆర్డినేటర్ కొట్టే వెంకటేశ్వర్లు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న సీఎండీ శివశంకర్

విద్యుత్తు సమస్యల పరిష్కారానికి నోడల్ అధికారి

నెల్లూరు(విద్యుత్తు), న్యూస్‌టుడే: ఏపీఎస్పీడీసీఎల్ డయల్ యువర్ సీఎండీ కార్యక్రమంలో భాగంగా సోమవారం తిరుపతి విద్యుత్తు కార్పొరేట్ కార్యాలయం నుంచి వినియోగదారుల సమస్యలను సీఎండీ శివశంకర్ తెలుసుకొని.. పరిష్కార దిశగా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాతోపాటు రాయలసీమ జిల్లాల నుంచి 87 మంది వినియోగదారులు సమస్యలను విన్నవించారని.. వీటి పరిష్కారానికి ప్రతి జిల్లాలో నోడల్ అధికారిని నియమించినట్లు తెలిపారు. ప్రతి సోమవారం జరిగే డయల్ యువర్ సీఎండీ కార్యక్రమానికి వస్తున్న సమస్యలను ఆయన సత్వరమే పరిష్కరిస్తారన్నారు.

కరవు నేల.. సిరుల హేల

న్యూస్‌టుడే, వరికుంటపాడు

ఆకుకూరలు కోస్తున్న కల్యాణి

అసలే మెట్టప్రాంతం.. ఆపై వర్షాలు అంతంతమాత్రమే. పంటలు పండక పొలాలను వదిలేసి జీవనోపాధి కోసం పట్టణాల వైపు పలువురు వలసపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కూరగాయల సాగుపై లాభాలు కురిపిస్తున్నారు మండలంలోని తూర్పుబోయమడుగులకు చెందిన సంక్రాంతి కల్యాణి. వీరికున్న 30 సెంట్ల పొలంలో మూడేళ్లుగా కూరగాయలు పండిస్తున్నారు. 15 సెంట్లలో ఆకు కూరలు, మరో 15 సెంట్లలో కూరగాయలు వేసి నిత్యం రాబడి పొందుతున్నారు. తక్కువ నీటితో బెండ, మొటిక, వంగ, మిరప, గోంగూర, తోటకూర సాగు చేస్తున్నారు. వీటికి రూ. 5 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ఇంటి అవసరాలకు పోను ఏడాదికి రూ. 20 వేలకు పైగా ఆదాయం పొందుతున్నారు.

సేంద్రియ విధానం : సేంద్రియ విధానంలో పండిస్తున్నారు. భూమి సారవంతానికి పశువుల ఎరువు వేస్తున్నారు. తెగుళ్ల నివారణకు కషాయాలు వాడుతున్నారు. దీంతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు పండుతున్నాయి.

సమస్య- సమాధానం

ప్రశ్న: వరి విత్తనశుద్ధికి ఏ మందు వాడాలి? **–బాబు, అల్లూరు**

జవాబు : కార్బండిజం మందుతో శుద్ధి చేసుకోవాలి.

ప్రశ్న : నారుమడికి ఎకరాకు ఎన్ని కేజీల విత్తనాలు అవసరమవుతాయి. **– సతీష్, అల్లూరు**

జవాబు : 25 కేజీలు వేయాలి.

ప్రశ్న: సూపర్‌ఫాస్ఫేట్ ఎన్ని బస్తాలు వేయాలి? **–వెంకటరమణయ్య, అల్లూరు**

జవాబు : ఎకరాకు మూడు బస్తాల వరకు వేసుకోవచ్చు.

ప్రశ్న : తెలంగాణ సన్న రకాలు ఎన్ని రోజుల వయసున్న నారు నాటుకోవచ్చు?

జవాబు : 24 రోజుల లోపు నాటుకోవాలి

(రైతుల సందేహాలకు అల్లూరు వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు సమాధానం ఇచ్చారు.)

– న్యూస్‌టుడే, అల్లూరు

రైతేరాజు

గుమ్మడి.. కాసులు దండి

న్యూస్‌టుడే, చేజర్ల

రైతులకు మూడు నెలల వ్యవధిలో బూడిద గుమ్మడి రెండింతల ఆదాయాన్నిస్తోంది. విజయవాడ నుంచి సంక్రాంతి వరకు స్థానిక మార్కెట్లతో పాటు తమిళనాడులో మంచి గిరాకీ ఉంటుంది. తొలకరి వర్షాలకు పొలాలను సిద్ధం చేసుకొని విత్తనాలు నాటితే దసరా నుంచి కాయలు కోతకొచ్చి మంచి లాభాలు వస్తున్నాయి. ఆత్మకూరు, రాపూరు నియోజకవర్గాల్లో మెట్ట రైతులు బిందు సేద్యం, మల్చింగ్ విధానాల్లో గుమ్మడి సాగు చేసి మంచి రాబడి సాధించారు. చేజర్ల మండలం ఓబులాయపల్లికి చెందిన పి.ప్రతాప్ ఎకరంలో గుమ్మడిపై రూ.1.10 లక్ష ఆదాయాన్ని సాధించారు.

సాగు చేస్తున్నారిలా : దుక్కి చేసి బోదెలు ఏర్పాటుచేశారు. నీటి సరఫరా కోసం బిందు సేద్య పరికరాలు అమర్చి మల్చింగ్ షీటు కప్పేశారు. నీటి బిందువులు పడే చోట గుమ్మడి విత్తనాలు నాటారు. పూత, పిందె సమయంలో ద్రవీకృత ఎరువులను అందించారు. కాయలు నిర్ణీత పరిమాణానికి చేరిన తర్వాత కోసి విక్రయిస్తున్నారు. దుక్కి, విత్తనాలు, మల్చింగ్, బిందుసేద్య పరికరాలు, సస్యరక్షణ, ఎరువుల రూపంలో ఎకరాకు రూ. 40 వేలయ్యాయి. సగటున 13-15 టన్నుల కాయల దిగుబడి వస్తోంది. కిలో రూ. 10 వంతున విక్రయిస్తే ఎకరానికి రూ.1.30 లక్షల నుంచి రూ.1.50 లక్షల రాబడి వచ్చింది. ఖర్చులు రూ. 40 వేలు పోను రూ. 90 వేల నుంచి రూ. 1.10 లక్షల నికర ఆదాయం లభించింది. ఈ ఏడాది పండగల సమయంలో కిలో రూ. 20 వరకు ధర పలికింది. ఈ సమయంలో కాయలు అమ్మిన రైతులకు రెట్టింపు లాభాలు వచ్చాయి. సస్యరక్షణలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే లాభాలు వస్తాయని ప్రతాప్ వివరించారు.

బొప్పాయి పాలు.. విదేశాలకు

నంద్యాల జిల్లా చాగలమర్రి మండల వ్యాప్తంగా రైతులు అధికంగా బొప్పాయి సాగు చేస్తుంటారు. చిన్నవంగలితో పాటు సమీపంలోని గ్రామాలైన వైఎస్సార్ కడప జిల్లా కానగూడూరు, క్రిష్ణపల్లె గ్రామాల్లో 1200 ఎకరాల్లో పండిస్తారు. విత్తనం నాటిన కాలం నుంచి తొమ్మిది నెలలకు పంట చేతికొస్తుంది. పండ్ల సేకరణ అనంతరం 13 నెల తర్వాత మిగిలిన, ముదురు కాయలకు గాట్లు పెట్టి పాలను సేకరిస్తున్నారు. తెల్లవారుజాము సమయంలోనే కాయలకు గాట్లు పెడితే కేవలం రెండు గంటల్లోనే పాలు ఉత్పత్తి అవుతాయి. ఇలా సేకరించిన పాలను రాయచోటి, రాజంపేటకు చెందిన వ్యాపారులు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల పాలు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 4 డ్రమ్ముల పాలు సేకరిస్తున్నారు. ఎకరానికి పాలసేకరణ ద్వారా రైతుకు రూ.24 వేల ఆదాయం వస్తుంది. సేకరించిన పాలను పరిశ్రమల్లో మందులు, కాస్మొటిక్స్, సబ్బుల తయారీలో ఉపయోగిస్తున్నారు. బెంగళూరు, చెన్నైలతో పాటు నాణ్యతను బట్టి విదేశాలకు సైతం పాలను ఎగుమతి చేస్తున్నారు. బొప్పాయి సాగులో ఎప్పుడైనా ధర పడిపోయినప్పుడు అన్నదాతలు బొప్పాయి పాలసేకరణతో నష్టాల నుంచి బయటపడుతున్నారు. –న్యూస్‌టుడే, చిన్నవంగలి(చాగలమర్రి)

చౌడు నేలలు.. యాజమాన్య పద్ధతులు

సీతారామపురం, న్యూస్‌టుడే: చౌడు భూముల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే సాగుకు అనుకూలంగా మార్చుకోవచ్చని కేవీకే శాస్త్రవేత్త **కాసా కిరణ్‌కుమార్‌రెడ్డి** తెలిపారు. ఉప్పు నేలలను గమనించేందుకు రైతులు భూమిపై పేరుకొన్న ఉప్పు (చౌడు)ను పారతో చెక్కి తీసివేయాలి. ముందుగా దున్ని అవసరాన్ని బట్టి చిన్నమడులుగా చేయాలి. ప్రతి మడిలో 15 సెం.మీ లోతులో మంచినీరు నిల్వ చేయాలి. ఈనీటిని నాలుగైదు రోజులు నిల్వ ఉంచి భూమిలో ఇంకిపోనివ్వాలి. తరువాత మురుగునీటిని లోతైన కాలువ ద్వారా తీసేయాలి. వర్షపు నీటిని వినియోగిస్తే మంచి ఫలితాలుంటాయి. ఇలా మూడు, నాలుగుసార్లు చేస్తే చౌడు తీవ్రత తగ్గుతుంది. భూసార పరీక్షల ద్వారా క్షారం అధికంగా ఉంటే సిఫారసు మేరకు జిప్సం వేయాలి. సాగుకు ముందు పశువులు, పచ్చిరొట్ట ఎరువులను వినియోగించాలి. విత్తడానికి ముందు విత్తనాలను 0.1గ్రాముల ఉప్పుద్రావణం (లీటరు నీటిలో ఒక్కగ్రాము)లో 2 నుంచి 3 గంటలు నానబెడితే ఉప్పు ప్రభావాన్ని తట్టుకునే శక్తి వస్తుంది. 25-35 రోజుల నారు ప్రతి కుదురులో ఎక్కువ మొక్కలు నాటాలి. అదనపు నత్రజని ఎరువులు వేయాలి. నాటిన 15, 20 రోజులకు జింక్ సల్ఫేట్ లీటరు నీటికి రెండు గ్రాముల వంతున కలిపి పిచికారీ చేయాలి. వీటితోపాటు భూమిలో ఆమ్ల గుణాన్ని కలిగించే యూరియాను వాడటం కూడా ప్రయోజనకరం. సైనోబ్యాక్టీరియా వేస్తే సోడియం లవణాలతో కలిగే నష్టాన్ని తగ్గించవచ్చు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, డోర్ నెం. 54-20-1B/3F/U6, 3వ అంతస్తు, కెఫెసి మేడమీద, సూర్యప్రకాష్ స్క్వేర్, గురునానక్ నగర్ రోడ్డు, విజయవాడ-520008, ఎన్.టి.ఆర్.జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఫోన్: 0866-2546922. ఇ-మెయిల్ : sbi.64267@sbi.co.in

స్వాధీనత ప్రకటన రూల్-8 (1) (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద దిగువ సంతకందారు **భారతీయ స్టేట్ బ్యాంక్** యొక్క అధీకృత అధికారి అయినందున మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదవబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ **రుణగ్రహీత: శ్రీమతి నలగొట్ల ఝాన్సీరాణి, భర్త ఎన్. దయాకర్ రెడ్డి,** డి.నెం.301-ఎ, పావణి హెూమ్స్, టెక్కిమిట్ట, నెల్లూరు, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా - 524003. **హామీదారులు: 1) శ్రీ వెనాటి బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, తండ్రి కీ॥శే॥ మునిరామి రెడ్డి,** ఫ్లాట్ నెం.101, 2వ అంతస్తు, వాణీమహల్, మాగుంట లేఔట్, నెల్లూరు-524003. **2) శ్రీ వెనాటి లీలా మోహన్, తండ్రి వెనాటి బాలసుబ్రహ్మణ్యం రెడ్డి,** 230, జి1, బిఎంఆర్, హెూమ్స్, 6వ ఎ-క్రాస్, వాటర్ ట్యాంక్ ఎదుట, ఓఎంబిఆర్ లేఔట్, బనాస్‌వాడి, బెంగుళూరు, కర్నాటక-560043. **3) శ్రీమతి వెనాటి హిమజ, భర్త అగస్త్య రవికుమార్ రెడ్డి,** ఫ్లాట్ నెం.118, ఎన్ఆర్ రాయల్ మనోర్ అపార్ట్‌మెంట్, రాయల్ ఎన్‌క్లేవ్, శ్రీరాంపుర, మణ్యతా వెనుక, టెక్‌పార్క్, బెంగుళూరు, పిన్-560021. **రుణఖాతా నెం.లు 39179406475 (ఎబిఎఎల్), 39396445554 (సిసిఇసిఎల్)** వారికి డిమాండ్ నోటీసు **తేది: 05-06-2025** జారీ చేసి సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల లోపు **నోటీసులో పేర్కొన్న మొత్తం రూ.2,83,28,966/- (రెండు కోట్ల ఎనభై మూడు లక్షల ఇరవై ఎనిమిది వేల తొమ్మిది వందల అరవైఆరు రూపాయలు మాత్రమే) 03.06.2025** నాటికి, **04.06.2025** నుండి వర్తింపుతో తదుపరి వడ్డీతో మరియు ఆపై వ్యయాలు కూడా తిరిగి చెల్లించవలసిందిగా మిమ్ములను కోరడమైనది.

రుణగ్రహీత మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నకు చెందిన దిగువ పేర్కొన్న ఆస్తిని దిగువ సంతకందారు స్వాధీన పరుచుకున్నారు, **రుణగ్రహీత: శ్రీమతి నలగొట్ల ఝాన్సీరాణి, భర్త ఎన్. దయాకర్ రెడ్డి, హామీదారులు: 1) శ్రీ వెనాటి బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, తండ్రి కీ॥శే॥ మునిరామిరెడ్డి, 2) శ్రీ వెనాటి లీలా మోహన్, తండ్రి వెనాటి బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, 3) శ్రీమతి వెనాటి హిమజ, భర్త అగస్త్య రవికుమార్ రెడ్డి** లకు 05.06.2025న డిమాండ్ నోటీసు జారీ చేయబడినది, సదరు రూల్స్ యొక్క రూల్ 8 మరియు 9 తో చదవబడే చట్టం యొక్క సెక్షన్ 13 (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను ఉపయోగించుకుంటూ **30వ రోజు అక్టోబర్, 2025న** స్వాధీనం చేసుకోవడం జరిగింది.

ప్రత్యేకించి రుణగ్రహీతలు/గ్యారంటార్లు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపకూడదు. ఒక వేళ ఆస్తితో ఏవైనా లావాదేవీలు జరిపితే, **తేది: 03-06-2025** నాటికి **మొత్తం రూ.2,83,28,966/- (రెండు కోట్ల ఎనభై మూడు లక్షల ఇరవై ఎనిమిది వేల తొమ్మిది వందల అరవై ఆరు రూపాయలు మాత్రమే)** మరియు తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు అనుషంగిక చార్జీలు మొదలగునవి భారతీయ స్టేట్ బ్యాంక్ వారికి చెల్లించవలసి ఉంటుంది.

ఆస్తి యొక్క షెడ్యూలు

(రిజిస్టర్డ్ సెల్ డీడ్ నెం.లు 7528/2017,7529/2017,7420/2017 మరియు 7465/2017, **1) శ్రీ వెనాటి బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, తండ్రి కీ॥శే॥ మునిరామి రెడ్డి, 2) శ్రీ వెనాటి లీలా మోహన్, తండ్రి వెనాటి బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, 3)శ్రీమతి వెనాటి హిమజ, భర్త అగస్త్య రవికుమార్ రెడ్డి** పేరున ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లా - నెల్లూరు సబ్-రిజిస్ట్రేషన్, నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధి, నెల్లూరు బిట్ I ఏరియా, పాత సర్వే నెం.1576/649, క్రొత్త సిఎస్ నెం.463, సిఎమ్ హైస్కూల్ రోడ్డు, ఇంటీరియర్ ఏరియా, వార్డు నెం.22, డి.నెం.556 ఎదుట విస్తీర్ణం 284.65 అంకనాలు లేదా 1904 చ.మీ.లు లేదా 2277.2 చ.గ.ల స్తలం **సరిహద్దులు: తూర్పు:** వెనాటి సుజాతమ్మ మరియు ఇతరుల యొక్క ఆస్తి, **దక్షిణం:** రామిరెడ్డి కాలువ, **పడమర:** సిఎమ్ హైస్కూల్ రోడ్డు, **ఉత్తరం:** సాగునీటి కాలువ,

గమనిక: ఈ ఆస్తి తనఖా యొక్క పెంపు శ్రీమతి వెనాటి హిమజ, భర్త అగస్త్య రవికుమార్ రెడ్డి ఖాతాలో ఉన్నది.

తేది : 30.10.2025 సం/- అధీకృత అధికారి,
ప్రదేశం : నెల్లూరు భారతీయ స్టేట్‌బ్యాంక్, ఎస్ఎఆర్‌బి, విజయవాడ

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, డోర్ నెం. 54-20-1B/3F/U6, 3వ అంతస్తు, కెఫెసి మేడమీద, సూర్యప్రకాష్ స్క్వేర్, గురునానక్ నగర్ రోడ్డు, విజయవాడ-520008, ఎన్.టి.ఆర్.జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఫోన్: 0866-2546922. ఇ-మెయిల్ : sbi.64267@sbi.co.in

స్వాధీనత ప్రకటన రూల్-8 (1) (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద దిగువ సంతకందారు **భారతీయ స్టేట్ బ్యాంక్** యొక్క అధీకృత అధికారి అయినందున మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదవబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ **రుణగ్రహీత: శ్రీమతి వెనాటి హిమజ, భర్త అగస్త్య రవికుమార్ రెడ్డి,** ఫ్లాట్ నెం.118, ఎన్ఆర్ రాయల్ మనోర్ అపార్ట్‌మెంట్, రాయల్ ఎన్‌క్లేవ్, శ్రీరాంపుర, మణ్యతా వెనుక, టెక్‌పార్క్, బెంగుళూరు, పిన్-560021. **హామీదారులు: 1) శ్రీ వెనాటి బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, తండ్రి కీ॥శే॥ మునిరామి రెడ్డి,** ఫ్లాట్ నెం.101, 2వ అంతస్తు, వాణీమహల్, మాగుంట లేఔట్, నెల్లూరు-524003. **2) శ్రీ వెనాటి లీలా మోహన్, తండ్రి వెనాటి బాలసుబ్రహ్మణ్యం రెడ్డి,** 230, జి1, బిఎంఆర్, హెూమ్స్, 6వ ఎ-క్రాస్, వాటర్ ట్యాంక్ ఎదుట, ఓఎంబిఆర్ లేఔట్, బనాస్‌వాడి, బెంగుళూరు, కర్నాటక-560043. **రుణఖాతా నెం.39179316604 (ABAL)** వారికి డిమాండ్ నోటీసు **తేది: 05-06-2025** జారీ చేసి సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల లోపు నోటీసులో పేర్కొన్న **మొత్తం రూ.2,78,75,550/- (రెండు కోట్ల డెబ్బై ఎనిమిది లక్షల డెబ్బై ఐదు వేల ఐదు వందల యాభై రూపాయలు మాత్రమే) తేది: 03-06-2025** నాటికి, 04-06-2025 నుండి వర్తింపుతో తదుపరి వడ్డీతో మరియు ఆపై వ్యయాలు కూడా తిరిగి చెల్లించవలసిందిగా మిమ్ములను కోరడమైనది.

రుణగ్రహీత మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నకు చెందిన దిగువ పేర్కొన్న ఆస్తిని దిగువ సంతకందారు స్వాధీన పరుచుకున్నారు, **రుణగ్రహీత: శ్రీమతి వెనాటి హిమజ, భర్త అగస్త్య రవికుమార్ రెడ్డి, హామీదారులు: 1) శ్రీ వెనాటి బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, తండ్రి కీ॥శే॥ మునిరామిరెడ్డి, 2) శ్రీ వెనాటి లీలా మోహన్, తండ్రి వెనాటి బాలసుబ్రహ్మణ్యం రెడ్డి** లకు 05.06.2025న డిమాండ్ నోటీసు జారీ చేయబడినది, సదరు రూల్స్ యొక్క రూల్ 8 మరియు 9 తో చదవబడే చట్టం యొక్క సెక్షన్ 13 (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను ఉపయోగించుకుంటూ **30వ రోజు అక్టోబర్, 2025న** స్వాధీనం చేసుకోవడం జరిగింది.

ప్రత్యేకించి రుణగ్రహీతలు/గ్యారంటార్లు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపకూడదు. ఒక వేళ ఆస్తితో ఏవైనా లావాదేవీలు జరిపితే, **తేది: 03-06-2025** నాటికి **మొత్తం రూ. 2,78,75,550/- (రెండు కోట్ల డెబ్బై ఎనిమిది లక్షల డెబ్బై ఐదు వేల ఐదు వందల యాభై రూపాయలు మాత్రమే)** మరియు తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు అనుషంగిక చార్జీలు మొదలగునవి భారతీయ స్టేట్ బ్యాంక్ వారికి చెల్లించవలసి ఉంటుంది.

ఆస్తి యొక్క షెడ్యూలు

(రిజిస్టర్డ్ సెల్ డీడ్ నెం.లు 7528/2017,7529/2017,7420/2017 మరియు 7465/2017, **1) శ్రీ వెనాటి బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, తండ్రి కీ॥శే॥ మునిరామి రెడ్డి, 2) శ్రీ వెనాటి లీలా మోహన్, తండ్రి వెనాటి బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, 3)శ్రీమతి వెనాటి హిమజ, భర్త అగస్త్య రవికుమార్ రెడ్డి** పేరున ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లా - నెల్లూరు సబ్-రిజిస్ట్రేషన్, నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధి, నెల్లూరు బిట్ I ఏరియా, పాత సర్వే నెం.1576/649, క్రొత్త సిఎస్ నెం.463, సిఎమ్ హైస్కూల్ రోడ్డు, ఇంటీరియర్ ఏరియా, వార్డు నెం.22, డి.నెం.556 ఎదుట విస్తీర్ణం 284.65 అంకనాలు లేదా 1904 చ.మీ.లు లేదా 2277.2 చ.గ.ల స్తలం **సరిహద్దులు: తూర్పు:** వెనాటి సుజాతమ్మ మరియు ఇతరుల యొక్క ఆస్తి, **దక్షిణం:** రామిరెడ్డి కాలువ, **పడమర:** సిఎమ్ హైస్కూల్ రోడ్డు, **ఉత్తరం:** సాగునీటి కాలువ,

గమనిక: ఈ ఆస్తి తనఖా యొక్క పెంపు శ్రీమతి నలగొట్ల ఝాన్సీరాణి, భర్త ఎన్. దయాకర్ రెడ్డి ఖాతాలో ఉన్నది.

తేది : 30.10.2025 సం/- అధీకృత అధికారి,
ప్రదేశం : నెల్లూరు భారతీయ స్టేట్‌బ్యాంక్, ఎస్ఎఆర్‌బి, విజయవాడ

నక్కలగండికి అడ్డేది?

జలకళతో నక్కలగండి జలాశయం

న్యూస్‌టుడే, వరికుంటపాడు

అది మెట్ట ప్రాంతవాసులకు జీవనాధారం. దశాబ్దాల క్రితం ఏర్పాటుచేసిన నీటి ప్రాజెక్టు. దీనిపై అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. నిర్వహణ, పర్యవేక్షణ మరిచారు. ఫలితంగా అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నిండింది. ఈనీరంతా వృథాగా పోతోంది. అయినా అధికారులు అడ్డుకట్ట వేయడం లేదు. సీజనులో పంటలకు నీరందదని రైతులు వాపోతున్నారు. ఇదీ ఉదయగిరి నియోజకవర్గంలోని వరికుంటపాడు మండలంలో ఉన్న నక్కలగండి జలాశయం పరిస్థితి.

జలాశయ కుడి కాలువ ద్వారా వరికుంటపాడు మండలంలోని వెంగమాంబాపురం, వేంపాడు, అశోక్‌నగర్, భోగ్యంవారిపల్లె, రామాపురం, కాకొల్లువారిపల్లె, తిమ్మారెడ్డిపల్లె, టి.కొండారెడ్డిపల్లె గ్రామాల్లో 1000 ఎకరాలు, ఎడమ కాలువ ద్వారా ప్రకాశం జిల్లా పామూరు మండలం కోడిగుడ్లపాడు, జంగాలపల్లి గ్రామాల్లో 200 ఎకరాలకు సాగునీరు అందేలా 1954లో నిర్మించారు. 1989లో వచ్చిన తుపానుకు కట్ట తెగిపోవడంతో ఏడేళ్ల పాటు పొలాలు బీళ్లుగా మారాయి. 1996లో రూ. 2 కోట్లతో మరమ్మతులు చేశారు. ఐదేళ్ల కిందట వర్షాలు సమృద్ధిగా పడడంతో కొంతమేర పంటలు పండాయి.

జలాశయంలో నీరంతా వృథా

అనంతరం చినుకుల జాడ లేకపోవడంతో మళ్లీ పొలాలు బీళ్లుగా మిగిలిపోయాయి. గత ఏడాది వర్షాలు పడటంతో జలకళ సంతరించుకుంది. కాలువలు సక్రమంగా లేకపోవడంతో ఆ నీరు పొలాలకు చేరక అన్నదాతలు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల వర్షాలకు పూర్తిగా నిండింది. అధికారుల నిర్లక్ష్యంతో తూము షట్టర్ సరిగా దించకపోవడంతో నీరంతా వృథాగా పోతోంది. దీంతోరైతులు ఆందోళనకు గురవుతున్నారు.

చేపల సాగుదారుల కోసమేనా..

జలాశయంలో చేపలు సాగు చేసిన వారి కారణంగానే నీరు వృథాగా పోతోందని రైతులు ఆరోపిస్తున్నారు. అలుగు పారితే ఇవి కొట్టుకుపోతాయని తూము షట్టర్‌ను గతంలో కొంతమేర ఎత్తడంతో ఈ పరిస్థితి నెలకొందని చెబుతున్నారు.

తగ్గితే అడ్డుకట్ట

రమేష్, ఏఈ, ఇరిగేషన్.. జలాశయంలో నీరు చేరింది. దీంతో మరమ్మతులు చేయలేకపోయాం. తూము షట్టర్ గేర్ బాక్సు, రాడ్డు కొత్తది ఏర్పాటు చేశాం. తూము వద్ద లీకులు ఉన్నాయి. వీటికి అడ్డుకట్ట వేయడం సాధ్యం కాదు. నీరు తగ్గితే చేస్తాం.

తీరు మార్చుకోకపోతే బుద్ధి చెబుతాం

వైకాపా నాయకుడు ప్రసన్నకు ఎమ్మెల్సీ గ్రీష్మ హెచ్చరిక

ఈనాడు, అమరావతి: వైకాపా నేత నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మహిళలపై మూర్ఖపు వ్యాఖ్యలు చేస్తున్నారని.. ఆయన తీరు మార్చుకోకపోతే బుద్ధి చెబుతామని తెదేపా ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ హెచ్చరించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఉన్నత కుటుంబంలో పుట్టి పేదల కోసం పనిచేస్తున్న నారా భువనేశ్వరిపై ప్రసన్నకుమార్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తప్పుబట్టారు. మహిళలను అవమానించడం, కించపరిచేలా మాట్లాడడమే వైకాపా నాయకులు పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. జగన్ వెంటనే ప్రసన్నకుమార్‌రెడ్డిని వైకాపా నుంచి సస్పెండ్ చేయాలని, భువనేశ్వరికి ప్రసన్నకుమార్‌రెడ్డి బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వైకాపా నాయకుల ప్రవర్తన ఇలాగే ఉంటే రాబోయే ఎన్నికల్లో ఆ 11 సీట్లు కూడా రావన్నారు. ఎంతో నిష్ఠతో భవానీ దీక్ష చేస్తున్నా.. కానీ రాజకీయ అభిప్రాయాలు చెప్పేందుకు ప్రెస్‌మీట్ పెట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. తెదేపా నాయకులు సిద్ధాంతంతో పనిచేస్తారని, ప్రతి మహిళనూ గౌరవిస్తారని స్పష్టంచేశారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ. 11,619
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 92,952
వెండి గ్రాము :	రూ. 159.10

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	137
లేయర్	120
బ్రాయిలర్స్	246
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	270
లేయర్ మాంసం	204

ఆయిల్ కర్మాగారంలో మంటలు

ముత్తుకూరు : మండలంలోని పంటపాళెం వద్ద ఉన్న పామాయిల్ కర్మాగారంలో సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. లోపల బెల్ట్‌పై వెళ్లే పొట్టుకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. క్షణాల్లో వ్యాపించాయి. దీంతో లోపల లోడింగ్ కోసం ఉంచిన లారీలను హుటాహుటిన బయటకు పంపించారు. ఉద్యోగులు, కార్మికులు ఆందోళనతో పరుగులు తీశారు. అగ్నిమాపక వాహనాల సహాయంతో మంటలను అదుపుచేయటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

గురుకుల విద్యార్థులకు నీట్‌లో ప్రత్యేక శిక్షణ

నెల్లూరు(విద్య) : జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకొని నీట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు గురుకులాల జిల్లా సమన్వయ అధికారిణి డాక్టర్ సి.ప్రభావతమ్మ ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని.. వివరాలకు జిల్లా గురుకులాల సమన్వయ అధికారిణి కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

సముద్ర తీరాల్లో ప్రత్యేక బందోబస్తు

టెలీకాన్ఫరెన్స్‌లో మెరైన్ ఇన్‌ఛార్జి గోపినాథ్ జెట్టి

నెల్లూరు(నేర విభాగం) : కార్తిక పౌర్ణమి సందర్భంగా ఈ నెల 5న సముద్ర తీరాలవద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు విశాఖపట్నం రేంజ్ డీఐజీ, మెరైన్ ఇన్‌ఛార్జి అధికారి గోపినాథ్ జెట్టి పేర్కొన్నారు. మైపాడు బీచ్‌లో ఆదివారం ఈతకెళ్లి ముగ్గురు యువకులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అలాంటి ఘటనలు పునారవృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సోమవారం టెలి కాన్ఫరెన్స్‌లో అధికారులను సూచించారు. మొంథా తుపానుతో బీచ్‌ల్లో అక్కడక్కడ గుంతలు ఏర్పడి ప్రమాదవశాత్తు మునిగిపోయే అవకాశం ఉందని, సముద్ర స్నానాలకు వచ్చే సందర్శకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం శ్రీనివాసులు, పీడీ

ఉలవపాడు, న్యూస్‌టుడే: మండలంలోని కరేడు ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్.యశ్వంత్, బి.వర్షిత, కె.చరిష్మ, కె.సాహితీప్రియ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికలో వీరు ప్రతిభ చూపారన్నారు. ఈ నెల ఆరో తేదీ నుంచి కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని వివరించారు.

జిల్లా జట్టుకు.. వలేటివారిపాలెం : సబ్‌జూనియర్స్ కబడ్డీ జిల్లా జట్టుకు వలేటివారిపాలెం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి మర్రి మనీ విష్ణువర్ధన్ ఎంపికయ్యాడని పాఠశాల ఫిజికల్ డైరెక్టరు కత్తి ఐజాక్ తెలిపారు. కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలో పాల్గొంటారని ఆయన వివరించారు. బాలుడ్ని పలువురు అభినందించారు.

కెనరా బ్యాంక్ Canara Bank

(భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్. బ్రాంచ్
కెవిసి ఆర్కేడ్, 3వ అంతస్తు, 13-1 ఆర్‌సి రోడ్డు, వాణి నగర్, అవిలాల, తిరుపతి-517501. ✆ 7901626759

స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) & 9(1) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/హామీదారులు చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతికంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 26.11.2025 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది: 26.11.2025, ఉ॥ 10.30 గం.ల నుండి ఉ॥ 11.30 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet.com) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములుకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 25.11.2025, సా॥ 4.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఋణగ్రహీతలు/పార్టనర్లు/హామీదారులు: 1. M/s పర్ఫినియా యాంటీ కొరోసివ్ పెయింట్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న వారు పార్ట్‌నర్స్ : శ్రీ సేతుదీప్ చంద్రమౌళి, తండ్రి : డి. సుమిత్రప్ప, 2. శ్రీ వెనుదీప్ చంద్రమౌళి, తండ్రి : డి. సుమిత్రప్ప.

బకాయి మొత్తం: తేది. 31.10.2025 నాటికి రూ. **83,23,592.07/-** + తేది. 01.11.2025 నుండి తదుపరి వడ్డీ, వ్యయాలు & ఇతర ఛార్జీలు.

బ్యాంకుకు తెలిసిన సమాచారం ప్రకారం ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్‌లు లేని స్థిరాస్తి వివరములు :

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, గూడూరు రిజిస్ట్రేషన్ జిల్లా, ఇందుకూరుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధి, నెల్లూరు మున్సిపల్ కార్పోరేషన్, గుడిపల్లిపాడు ఏరియా, పట్టానెం. 56, సర్వే నెం. 70 లో విస్తీర్ణం ఎ. 62.5 అంకణములు లేదా 418.06 చ॥మీ॥ లేదా 500 చ॥గ॥ల నందు దక్షిణం వైపు ఎ. 0.60 సెంట్లు ఖాళీ స్థలం. హద్దులు: తూర్పు: స్వర్ణ సుప్రవీణ యొక్క స్థలం, దక్షిణం: రోడ్డు, పడమర: నేతాజినగర్ కాలనీ వైపు రోడ్డు, ఉత్తరం: స్వర్ణ సుప్రవీణ యొక్క స్థలం.

రిజర్వు ధర: రూ. 91,80,000/-	ధరావత్తు సొమ్ము: రూ. 9,18,000/-

గమనిక: బ్యాంకుకు తెలిసి/తెలియని బకాయిలు/ట్యాక్సులు ఏవైనా ఉన్నచో వేలం కొనుగోలుదారు మాత్రమే వాటిని భరించవలసి ఉంటుంది మరియు చివరి మొత్తం బిడ్డు సొమ్ముకు అది అదనం.

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, తిరుపతి స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 7901626759, 9901574353.

ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (BAANKNET), వెబ్‌పోర్టల్ https://www.baanknet.com/ ఫోన్ నెం: 7046612345 / 6354910172 / 8291220220 / 9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.BAANKNET@psballiance.com

తేది: 01.11.2025, ప్రదేశం: తిరుపతి సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

EENADU e Classifieds

EDUCATION

DISTANCE EDUCATION

10th/Inter, BA, B.Com, B.Sc, BBA, BCA, BLIS, MA, M.Com, M.Sc, MCA, MBA, MLIS, Dip, B.Tech, M.Tech, M.Phil, Ph.D., BNYS, BPT ✆ 9030030125

JOBS

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యూయర్స్, ఏజ్: 22-35. ఫ్రెషర్స్ కూడా కావలెను. ✆ 6281037879.

ప్రముఖ ఆయుర్వేదిక్ కంపెనీ తరఫున పనిచేయుటకు మార్కెటింగ్ మేనేజర్ & ఎగ్జిక్యూటివ్స్ & బిజినెస్ ప్రమోట్ చేయగలిగిన లేడీ టెలికాలర్స్ కావలెను. 7286808808

రియల్ ఎస్టేట్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు గ్రాడ్యుయేట్స్ & పోస్ట్ గ్రాడ్యుయేట్స్, రిటైర్డ్ పర్సన్స్ & లేడీ టెలికాలర్స్ కావలెను. జీతం + ఇన్సెంటివ్స్ ✆ 93469 48665

పూజ్యసాయి మోటార్స్ ముసునూరు స్వరాజ్ ట్రాక్టర్ షోరూం కావలి, ఆత్మకూరు ట్రాక్టర్ మెకానిక్స్ & హెల్పర్స్ కావలెను. కాంటాక్ట్ నెం. Contact ✆ 8179744555

గుంటూరు జిల్లా వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ హాస్టల్‌లో ఉండి పనిచేయుటకు వార్డెన్స్ కావలెను. (పురుషులు/ స్త్రీలు) డిగ్రీ/ పీజీ అర్హత. కాంటాక్ట్- Contact 9490309033 (F), 9705834803 (M)

కావలి, నెల్లూరు ప్రముఖ అగ్రి కంపెనీలో ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత: 10th ఆపైన, 2 వీలర్ తప్పనిసరి. Contact 93467 45423, 91216 67272.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/w 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే వివరాలకు..

నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 600 Colour : రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

కావలి

•కావలి •ఉదయగిరి •కందుకూరు

ప్రాంతీయాసుపత్రిలో పీడియాట్రీషియన్ నియామకం

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రాంతీయాసుపత్రిలో నెల తరబడి ఖాళీగా ఉన్న పీడియాట్రీషియన్‌ను ప్రభుత్వం ఎట్టకేలకు నియమించింది. ఆత్మకూరు జిల్లా ఆసుపత్రిలో చిన్నపిల్లల వైద్యురాలిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఇంద్రాణిని స్పెషల్ కేటగిరీలో బదిలీ చేస్తూ, వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

భైరవకోనకు ప్రత్యేక బస్సు సర్వీసు

ఉదయగిరి, న్యూస్‌టుడే: కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి ప్రకాశం జిల్లా సీఎస్ పురం మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన భైరవకోనకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజరు రమేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పట్టణం నుంచి బయలుదేరి సీతారామపురం మీదుగా భైరవకోనకు చేరుతుందని ఆయన వివరించారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

సీతారామపురం: మండలంలోని దేవమ్మచెరువు మాజీ సర్పంచి భూమయ్యగారి శ్రీనివాసులుకు సీఎం సహాయనిధి కింద రూ.2,76,817 చెక్కును ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సోమవారం అందజేశారు. విజయమూరు సమీపంలోని తెదేపా ప్రధాన కార్యాలయంలో చెక్కును తెదేపా నాయకుల సమక్షంలో శ్రీనివాసులుకు ఇచ్చారు. కార్యక్రమంలో తెదేపా మండల నాయకులు చింతల శ్రీనివాసులు, వి.వెంకటేశ్వర్లు, ఎం.చెన్నకేశవులు, జాషువా, ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)

కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: మొంథా తుపాన్ వెళ్లి వారం దాటినా మా కాలనీలోని వీధుల్లో ఇంకా బురద నీరు ఉంది. **- ఎం.కొండయ్య, ఇందిరమ్మ కాలనీ**

సమాధానం: సిబ్బందితో తొలగిస్తాం. **- సాయిరాం, డీఈఈ, కావలి పురపాలక సంఘం -న్యూస్‌టుడే, కావలి**

? మా గ్రామంలోని పంట కాలువ మురుగు కాలువలా ఉంది. **-శ్రీనివాసులు, మాచవరం**

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- సుధాకర్, పంచాయతీ కార్యదర్శి - కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే**

? మాగ్రామంలోని అంతర్గత రోడ్ల పక్కన కాలువలు లేకపోవడంతో కొద్దిపాటి వర్షానికే భారీగా నీరు చేరుతుంది. నడిచేందుకు నానా అవస్థలు పడుతున్నాం. **- శ్రీనివాసులు, తిమ్మసముద్రం**

✓ కాలువలు ఏర్పాటు చేసి నీరు చేరకుండా చర్యలు తీసుకుంటాం. **-ఎం.బ్రహ్మయ్య, ఎంపీడీవో -జలదంకి, న్యూస్‌టుడే**

? అల్లూరుపేటలోని ఇస్కపల్లి రోడ్డులో తాగునీటి పైపులైనుకు గుంత తవ్వి వదిలివేశారు. దీంతో ప్రమాదాలకు గురవుతున్నాం. **- శశిధర్, అల్లూరు**

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- ఉమామహేశ్వరరావు, నగర పంచాయతీ కమిషనర్, అల్లూరు - అల్లూరు, న్యూస్‌టుడే**

వైభవంగా ముగిసిన తిరునాళ్లు

కలిగిరి : కలిగిరిలోని కొత్తూరులో సీతాలక్ష్మణ హనుమంత సమేత కోదండరామస్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజులుగా జరుగుతున్న తిరునాళ్లు సోమవారం ముగిశాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కలగా వంతెన
కష్టాలు ఈ వంతున

ప్రారంభంలోనే ఆగిన పనులు

కొండాపురం, న్యూస్‌టుడే: వాగుపై వంతెన నిర్మాణం నిలిచిపోవడంతో పలు ప్రాంతాల ప్రజలు నిత్యం నానా ఇబ్బందులు పడుతున్నారు. కొండాపురం మండలంలోని భీమవరప్పాడు గ్రామం మీదుగా ఉప్పుటేరు వెళుతుంది. ఏటా వర్షాలు ఇది ఉద్ధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. భీమవరప్పాడు గ్రామం ఎస్సీ కాలనీ వైపుగా వాగు పోతుంది. సాయిపేట పంచాయతీలోని మజరా గ్రామమైన ఎర్రబాలెం వాగుకు అవతలి వైపు ఉంది. పంచాయతీకి పనులపై ఈ రెండు గ్రామాల వారు వెళ్లాలంటే దశాబ్దాలుగా నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని గమనించి గత తెదేపా హయాంలో దీనిపై వంతెన నిర్మాణానికి రూ. 3.75 లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించారు. రాజకీయ కారణాలతో జాప్యం జరిగింది. ఆ తరువాత వైకాపా పాలనలో పట్టించుకున్న నాథుడే లేడు. దీంతో ధరలు పెరిగాయంటూ టెండరు దక్కించుకున్న గుత్తేదారు పనులు చేయలేనని చేతులెత్తేశారు. ఫలితంగా నిధులు మురిగిపోయాయి. వంతెన నిర్మాణం అటకెక్కింది. వర్షాలు కురిస్తే సుమారు రెండు నెలల పాటు ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎర్రబాలెం, భీమవరప్పాడు ఎస్సీ కాలనీ వాసులు కొండాపురం మీదుగా సాయిపేట దాటుకుని 15 కి.మీ దూరం తిరిగి రావాల్సి వస్తోంది. కందుకూరుకు అడ్డదారిగా ఈ మార్గంలో వేలాది మంది వెళుతుంటారు. రైతులు ఎరువులు తదితరాలు తెచ్చుకోవాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. వీరంతా వర్షాకాలంలో రాకపోకలు సాగక ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే స్పందించి ఉన్నతాధికారులతో మాట్లాడి వంతెన నిర్మాణం చేయించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వర్షపు నీటితో పారుతున్న వాగు

ప్రతిపాదనలు పంపాం

ఎత్తైన వంతెన నిర్మాణానికి ఉపాధి హామీ పథకంలో నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాం. వీటికి అనుమతి రావాల్సి ఉంది. రాగానే పనులు చేస్తాం. **- మణికుమార్, డీఈ, పీఆర్**

కీలకమార్గం.. గుంతలమయం

దగదర్తి, న్యూస్‌టుడే: మండలంలోని చవటపుత్తేడు - కామినేని పాలెం రహదారి గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండున్నర దశాబ్దాల క్రితం వేసిన ఈ మార్గం అధ్వానంగా మారింది. గుంతల్లో చారెడు మట్టి కూడా పోయకపోవడంతో ప్రజల కష్టాలకు అంతులేకుండా ఉంది. వర్షాలకు వీటిలో నీరు చేరి వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులకు ఎన్ని వినతిపత్రాలు ఇచ్చినా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

వర్షాలకు గుంతల్లో చేరిన నీరు

15 కి.మీ దూరం

మండలంలోని చవటపుత్తేడు - కామినేని పాలెం మధ్య 15 కి.మీ రహదారి ప్రయాణికులకు ఎంతో కీలకం. బోగోలుకు వెళ్లేందుకు తక్కువ దూరం. ఐదు పంచాయతీలకు చెందిన వారితో పాటు దినసరి కూలీలు, కార్మికులు, రైతులు నిత్యం నెల్లూరుకు వెళుతుంటారు. దశాబ్దం క్రితం వేసిన రోడ్డు కావడంతో గుంతలమయంగా మారింది. వర్షం కురిస్తే గుంతల్లో నీరు చేరి ప్రయాణికులు నరకం చూస్తున్నారు. గత ప్రభుత్వం ఈ రహదారి దుస్థితిని పట్టించుకోలేదు. రెండు వరుసల రహదారిగా విస్తరించాలని ప్రతిపాదనలున్నా.. అమలుకు నోచుకోలేదు. వెలుపోడు నుంచి ఉన్న రెండు ఆర్టీసీ బస్సులు కూడా ఈ రహదారి నుంచే నెల్లూరుకు వెళ్తాయి. ద్విచక్రవాహనచోదకులు గుంతల్లో పడి తరచూ ప్రమాదాల పాలవుతున్నారు. మొంథా తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు రహదారి మరింత అధ్వానంగా తయారైంది. అధికారులు స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరారు.

ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు

పీఆర్ స్పెషల్ ప్రాజెక్టు కింద ఈరహదారి నిర్మాణం చేపట్టారు. మండల పరిషత్ పరిధిలోకి రాదు. రోడ్డు దుస్థితిపై వారికి తెలియజేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. **- వెంకటేశ్వర్లు, ఎంపీడీవో**

అసలే మలుపు.. ఆపై కంపచెట్లు

వరికుంటపాడు- తూర్పు బోయమడుగుల వెళ్లే రోడ్డులో ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. వరికుంటపాడు సమీపంలో మలుపుల వద్ద కంప చెట్లు రోడ్డుపైకి వచ్చాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కానరాక ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డుపై నిత్యం రాకపోకలు ఎక్కువగా సాగుతున్నాయి. **- న్యూస్‌టుడే, వరికుంటపాడు**

వంతెనపై నీరు.. రాకపోకలకు బేజారు

మండలంలోని ఉడ్‌హౌస్‌పేట వద్ద స్వాంపు వాగు వంతెనపై వర్షపు నీరు చేరింది. దీంతో రాకపోకలకు సమస్యగా మారింది. రాత్రిళ్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. వంతెన దెబ్బతింటుందని స్థానికులు సందేహిస్తున్నారు. బయటకు పోయేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- అల్లూరు, న్యూస్‌టుడే**

ఆట స్థలం లేక.. సాధన చేయలేక

పెంట్రాల ప్రాథమికోన్నత పాఠశాల ఆట స్థలంలో గడ్డి పెరగడంతో విద్యార్థులు సాధన చేయలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల కురిసిన వర్షాలకు గడ్డి దట్టంగా పెరిగింది. విష పురుగులు చేరే ప్రమాదం పొంచి ఉంది. ఆటలకు వీల్లేకపోవడంతో విద్యార్థులకు వ్యాయామం కొరవడింది. అధికారులు స్పందించి గడ్డి తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు. **- లింగసముద్రం, న్యూస్‌టుడే**

బస్టాండ్ చెంతనే చెత్త.. ప్రయాణికుల అవస్థ

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద చెత్త పేరుకుపోయింది. కొన్నాళ్లుగా చెత్త తొలగింపు సజావుగా జరగడం లేదు. దుర్గంధంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలో ఉండే నివాసాల వారు సైతం ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ విషయమై ఆర్టీసీ డీఎం ఆదినారాయణ స్పందిస్తూ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. **- కావలి, న్యూస్‌టుడే**

నడక.. సాగితే ఒట్టు!

గ్రామంలోని కలిగిరమ్మ ఆలయానికి పడమర వైపు వీధిలో ప్రజలు నడిచేందుకూ అగచాట్లు పడుతున్నారు. మెయిన్ రోడ్డు నుంచి వర్షపు నీరు ఈ రోడ్డుపై ప్రవహిస్తుండడంతో కోతకు గురై, రాళ్లు బయటపడ్డాయి. పదునైన రాళ్లు పాదాలకు గుచ్చుకుంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఈ మార్గంలో వెళ్లే కార్లు, ద్విచక్ర వాహనాల టైర్లు పాడవుతున్నాయని చోదకులు తెలిపారు. **- న్యూస్‌టుడే, కలిగిరి**

దివ్యాంగులపై దయ లేదా ?

కావలి, న్యూస్‌టుడే: మా భూమి ఆక్రమించారని, సర్వే చేసి హద్దులు చూపాలని ఓ దివ్యాంగుడు ఏడాదిగా తిరుగుతున్నా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. సోమవారం మరోసారి కావలి ఆర్డీవో ఎం.సన్నీవంశీకృష్ణను కలసి తన మొర వినిపించారు. జలదంకి మండలం చామదల గ్రామానికి చెందిన దేవండ్ల నాగయ్య అనే దివ్యాంగునికి చెందిన అర ఎకరా భూమిలో 30 సెంట్ల వరకు వేరొకరు ఆక్రమించుకున్నట్లు వాపోయారు. రెండురోజుల్లోగా సర్వేయర్‌ను పంపిస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు.

కార్తికం.. దేదీప్యం

సీతారామపురం : పూజలు చేస్తున్న మహిళలు

న్యూస్‌టుడే బృందం, కావలి, కందుకూరు, ఉదయగిరి: కార్తికమాసంలో సోమవారం శివాలయాలు భక్తులతో రద్దీగా మారాయి. కావలి, కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని ఆలయాల్లో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు జరిగాయి. అభిషేకాలు చేశారు. మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు. ఆలయాలన్నీ వీటి వెలుగులతో నిండాయి.

వరికుంటపాడు: అలంకరణలో శివయ్య

కావలి: పాతూరు శివాలయంలో భక్తుల రద్దీ

ఉదయగిరి: శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

చట్టాలను అతిక్రమిస్తే చర్యలు

బిట్రగుంట, న్యూస్‌టుడే: చట్టాలను అతిక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని కావలి గ్రామీణ సీఐ పాపారావు హెచ్చరించారు. సోమవారం రాత్రి బిట్రగుంట పోలీస్‌స్టేషన్, బోగోలులోని పోలీసు అవుట్‌పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకతాయిల అల్లర్లు, చట్టవ్యతిరేక కార్యకలాపాల అణిచివేతపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఆయన వెంట మండల తెదేపా అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, భాజపా జిల్లా నాయకులు నూకసాని శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు.

విద్యాదాతలకు సత్కారం.. విద్యను ప్రోత్సహించడం అభినందనీయమని బోగోలు ఎంఈవో జయమ్మ పేర్కొన్నారు. సోమవారం బోగోలు మండలం తాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 140 మంది విద్యార్థులకు పొదిలి మదన్‌కుమార్, డాక్టర్లు పొదిలి విజయ్‌కుమార్, శశిప్రియ దంపతులు సమకూర్చిన గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. వీరితో పాటు పాఠశాలను ఉన్నత పాఠశాలగా అభివృద్ధి చేసేందుకు తోడ్పడిన ఇండ్ల శ్రీనివాసులు, లక్కాకుల మాధవరావు, పులి సుబ్బారావును సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వీవీ నరేంద్ర, ఎస్ఎంసీ ఛైర్మన్ పి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వరికుంటపాడు: మండలంలోని పెద్దిరెడ్డిపల్లెకు చెందిన డి.లక్ష్మీదేవి అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆకుటుంబం ఆర్థిక ఇబ్బందిని గుర్తించి మానవత సంస్థ తరపున రూ. 5 వేలు, గ్రామంలోని పాఠశాల ఉపాధ్యాయులు రూ. 5 వేలు కలిపి రూ. 10 వేలు సోమవారం ఆమె కుమార్తె మణిచందనకు అందజేశారు.

చిత్రం వేసి.. బహుమతులు పట్టి

బహుమతులిస్తున్న అధ్యాపకులు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని బీఆర్ ఆక్స్‌ఫర్డ్ జూనియర్ కళాశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ప్రకృతి అందాలు' అనే అంశంపై జరిగిన చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని చిత్రాలు వేశారు. ఎం.శ్రీనిధి, ఎల్.నిఖితసాయిప్రియ, పి.కావ్యశ్రీ విజేతలుగా నిలిచారు. వారికి కళాశాల డైరెక్టర్ బెజవాడ నరేంద్ర, డీన్ షాహుల్, ప్రిన్సిపల్ ఇర్ఫాన్ బహుమతులు అందజేశారు.

బిల్లులు ఇవ్వకపోతే పెట్రోల్ పోసుకుంటా

కందుకూరు: చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోతే పెట్రోల్ సోసుకుంటానని గుడ్లూరు మండలంలోని చినలాటరపికి చెందిన తెదేపా నాయకుడు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో హల్‌చల్ చేశారు. స్థానికుల వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన ఓ నాయకుడు 2014-19 మధ్య చేసిన పనులకు రూ.10 లక్షలకు పైగా బిల్లులు ఆగిపోయాయి. ఇటీవల రూ.3.5 లక్షలు వచ్చాయి. మిగిలినవి రావాల్సి ఉంది. దీంతో అతను మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి బిల్లులు ఇవ్వకపోతే పెట్రోలు పోసుకుంటానని సిబ్బందిని బెదిరించారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు పోలీసులకు సమాచారమివ్వగా వచ్చి అతన్ని తీసుకుపోయారు. దీనిపై ఎంపీడీవో వెంకటేశ్వరరావును అడగ్గా..ప్రాధాన్యక్రమంలో బిల్లులు చెల్లిస్తున్నామన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

విడవలూరు : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన వైనమిది. పోలీసుల కథనం మేరకు.. ఉలవపాడు మండలం చాకిచర్ల పెద్దపట్టపుపాలేనికి చెందిన ఆవుల గోపి (37)తన భార్యతో కలిసి మండలంలోని రామతీర్థం శివారులో రొయ్యల చెరువు వద్ద పనికి ఏడాది క్రితం వచ్చారు. ఆదివారం మోటారు మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ..

కందుకూరు పట్టణం : ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు టి.రవితేజ (17) సోమవారం మృతి చెందారు. అక్టోబరు 30న పట్టణానికి చెందిన రవితేజ ద్విచక్రవాహనంపై వెళుతూ ఆటోను ఢీకొని గాయపడ్డారు. ఒంగోలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తల్లి వెంకమ్మ ఏరియా ఆసుపత్రిలో పారిశుద్ధ్య విభాగంలో పని చేస్తుండగా.. అయిదు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. కుమారుడి వైద్య ఖర్చుల కోసం సాయం అందించాలని కోరగా.. స్కంధపురి సేవాసమితి తరపున పువ్వాడి మౌనిక రూ.50 వేలు, ఆసుపత్రి సిబ్బంది రూ.50 వేలు, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షుడు రూ.25 వేలు చొప్పున అందించారు. చికిత్సకు రూ.12.50 లక్షలు అవుతుందని వైద్యులు తెలపడంతో.. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రభుత్వం తరపున ఎల్‌వోసీ ఇప్పించారు. ఇంతలోనే మృతి చెందారు.

గృహోపకరణాలు దగ్ధం

ఉదయగిరి, న్యూస్‌టుడే : మండలంలోని కొండాయపాలెం పంచాయతీ వీరారెడ్డిపల్లి గ్రామ, ఎస్సీ కాలనీలో గృహోపకరణాలు కాలిపోయినట్లు సోమవారం పలువురు వాపోయారు. ఆదివారం రాత్రి నివాసాలకు ఒక్కసారిగా త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా కావడంతో ఏసీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు, టీవీలు తదితర వస్తువులు కాలిపోయాయి. కూలి పనులు చేసి జీవనం సాగించే తాము వాటికి మరమ్మతులు చేయించేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గృహహింస కేసు నమోదు

కావలి : కట్నం తీసుకురావాలని భర్త, అత్త వేధిస్తుండడంపై సోమవారం కావలి గ్రామీణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పట్టణంలోని వాయినందన వీధికి చెందిన సూరిశెట్టి భవాని, అడవిరాజుపాలేనికి చెందిన కూరా అజయ్ మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. రెండోసారి గర్భిణిగా ఉన్న ఆమెపై ఇటీవల కాలంలో అత్తింటి వేధింపులు అధికమయ్యాయి. బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

సీతారామపురం, న్యూస్‌టుడే : 167బి జాతీయరహదారిపై సీతారామపురానికి సమీపంలో గేదెలను ఢీకొని కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. విజయవాడ నుంచి శైవక్షేత్రాలను దర్శించుకునేందుకు కొందరు కారులో సీతారామపురం వైపు వస్తున్నారు. ఈక్రమంలో రహదారిపై వెళుతున్న గేదెలను ఢీకొని అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. కారులో ఐదారుగురు ఉన్నట్లు తెలిసింది. ఎవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

ఇద్దరు జూదరుల అరెస్ట్

లింగసముద్రం, న్యూస్‌టుడే: మండలంలోని పెదపవని సమీపంలో జూదం ఆడుతున్న ఇద్దరిని సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నారాయణ తెలిపారు. వారి నుంచి రూ.19,100 నగదు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

కందుకూరును ప్రకాశంలో కలపాలని వైకాపా వినతి

కందుకూరు పట్టణం : కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలపాలని వైకాపా నాయకులు సోమవారం సబ్‌కలెక్టర్ డి.హిమవంశీని కలసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నెల్లూరులో ఉంచితే నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు పడతారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గంగిరెడ్డి, కిషోర్, ఈదర రమేష్, తోకల కొండయ్య, మాబాషా, రఫి, గోపి, మనోహర్, బ్రహ్మానందం పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు స్థల పరిశీలన

ఉదయగిరి, న్యూస్‌టుడే : దాసరిపల్లిలో పంచాయతీ భవనం, షాదీమంజిల్ నిర్మాణానికి సోమవారం వీఆర్వో వెంకటేశ్వర్లు, గ్రామ సర్వేయర్ మహేష్ స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామానికి రూ.32 లక్షలతో పంచాయతీ భవనం, రూ. 40 లక్షలతో షాదీమంజిల్ మంజూరయ్యాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో 167-బీజీ జాతీయ రహదారి సమీపంలో మసీదుకు ఎదురుగా ఉన్న స్థలాన్ని గుర్తించినట్లు తెలిపారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల అనర్థాలపై ప్రదర్శన

కావలి, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై పట్టణంలో సోమవారం ప్రదర్శన జరిగింది. నేతాజీ స్టూడెంట్స్ ఫెడరేషన్, సేవియర్స్ వాలంటరీ ఆర్గనైజేషన్, నలంద విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కావలి రెండో పట్టణ సీఐ గిరిబాబు మాట్లాడుతూ వ్యసనాలకు లోనై జీవితాలను బుగ్గి చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ మానసిక వైద్యురాలు రమ్య, వసీమ్, నల్లిపోగు ప్రణీత్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జక్కా వెంకయ్య జయంతి

దగదర్తిలో రక్తదానం చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

కావలి, దగదర్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం దివంగత జక్కా వెంకయ్య జయంతి ఘనంగా నిర్వహించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదల సమస్యలపై పోరాటాలు చేసిన యోధుడు జక్కా వెంకయ్య అని మాజీ ఎంపీ మధు కితాబిచ్చారు. దగదర్తిలోని జక్కా వెంకయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన వెంకయ్య జయంతి, గోపసాని వెంకటేశ్వర్లు వర్ధంతి కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. జేవీవీ జనరల్ సెక్రటరీ మోహన్, సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

లింగసముద్రం, న్యూస్‌టుడే: పంచాయతీ విభజనపై పాలకమండలి నిర్ణయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం పెంట్రాల పంచాయతీని రాళ్లపాడు, పెంట్రాల, చీమలపెంట పంచాయతీలుగా విభజించే అంశంపై సచివాలయంలో సర్పంచి బాబూరావు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సర్పంచి, వార్డుల సభ్యుల అభిప్రాయాలను తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

బిట్రగుంట, ఉదయగిరి, న్యూస్‌టుడే: మెడికల్ కాలేజీలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం తగదని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బోగోలులోని వైకాపా కార్యాలయంలో ఏర్పాటైన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైకాపా మండల అధ్యక్షుడు ఎం.వీరరఘు, ఎంపీపీ మేకల సుజాత, జడ్పీటీసీ సభ్యురాలు కీర్తన, మాజీ ఎంపీపీ సులోచనమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ఎం.పద్మ, ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు సుందరరాజ్, యువత అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు. ఉదయగిరిలోని బీసీ కాలనీలోనూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదం అంచున జలాశయం

బిట్రగుంట, న్యూస్‌టుడే

అది రైతులకు వరప్రసాదిని. పంటల సాగుకు ఆధారం. కానీ రైలు పట్టాల పక్కన ఉండడంతో నీరు పొంగితే ట్రాక్‌కు ప్రమాదం పొంచి ఉంది. ఈనేపథ్యంలో దీని నిర్వహణ ఎంతో కీలకం. అయినా ఆదిశగా చర్యలు తీసుకోకపోవడంతో ప్రస్తుతం ప్రమాదకరంగా మారింది. అదే బోగోలు చెరువు. అలల తాకిడికి కట్ట లోపల వైపు పలు చోట్ల కోతకు గురైంది. మళ్లీ తుపాను హెచ్చరికలు ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమశిల జలాశయం నీటితో పాటు నాగులవరం, అక్కరాజువారికండ్రిక చెరువుల నుంచి ఇటీవల పెద్దఎత్తున దీనికి వరద నీరు చేరింది. ఈ క్రమంలో వరద నీటిని కలుజుల నుంచి బయటకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో నీటి మట్టం భారీగా పెరిగింది. అలల తాకిడికి కట్టకు రివిట్‌మెంట్ లేని పలు చోట్ల కోతకు గురైంది. అక్కడక్కడా రివిటమెంట్ రాళ్లు కూడా జారాయి. దీంతో కట్టకు గండి పడే అవకాశాలు ఉన్నాయి. గత నెలంతా వర్షాలు కురవడంతో కట్ట కూడా నెమ్మెక్కింది. మళ్లీ తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిస్తే ముప్పు వాటిల్లే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇలా జరిగితే రైలు కట్టలకు సమీప గ్రామానికి కూడా ముప్పు కలుగుతుందని సందేహిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి ముప్పు నుంచి తప్పించేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయమై సంబంధిత జలవనరుల శాఖ ఏఈ జితేంద్రరెడ్డి స్పందించారు. మంగళవారం పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని వివరించారు.

లోపల వైపు కోతకు గురైన కట్ట

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కావలి మెయిన్ బ్రాంచ్ (858), SPSR నెల్లూరు జిల్లా - 524201. Cell: 96660 63029

లాకర్ బ్రేక్ ఓపెన్ ప్రకటన

ఈ క్రింది పొందుపరచబడిన సేఫ్ డిపాజిట్ లాకరు నెంబరు కిరాయిదారులు లాకరు అద్దె సుదీర్ఘకాలంగా చెల్లించకపోవడం వలన కాని మరియు సుదీర్ఘకాలంగా లాకరు వాడకపోవడం వలన గాని లాకరుని బ్రేక్ ఓపెన్ చేయుటకు బ్యాంక్‌వారు నిర్ణయించినారు. ఈ ప్రకటన వెలువడిన 15 రోజుల లోపల బ్యాంక్‌వారికి తెలియపరచగలరని బ్యాంక్‌వారు కోరుచున్నారు. ఈ క్రింది ప్రకటన ఆధారంగా తేది: 5-11-2025 నుండి తేది: 20-11-2025 లోపు పూర్తి అద్దె బకాయి చెల్లించి లాకరును క్రమబద్ధీకరించుకొనగలరు లేదా స్వాధీన పరచుకోగలరు. లేనియెడల సదరు లాకరు బ్రేక్‌ఓపెన్ చేయబడును.

వ. నెం.	బ్రేక్ ఓపెన్	స్థితి	రిజిస్టర్డ్ పోస్ట్ స్థితి	లాకరు కలిగిన వ్యక్తి పేరు మరియు చిరునామా	చివరిగా తెరచిన తేది	పరిమాణం	లాకర్ అద్దె బకాయి	అకౌంట్ నంబరు
1.	2×3	ఓపెన్	అనెక్చ్యూర్ 3&4, రెండు నోటీసులు పంపబడినది	**షేక్ ఆలిఫ్ బాషా** మరియు **షేక్ నబీనా,** తండ్రి: మస్తాన్‌బాష, 1-90, మహేంద్ర సర్వీసింగ్ సెంటర్, ముసునూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా- 524201.	16-11-2020	చిన్నది	-నిల్-	62060913394
2.	3×9	ఓపెన్	-డిటో-	**కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి** తండ్రి: లేట్ దశరథరామిరెడ్డి, రామమూర్తిపేట, కావలి.ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరుజిల్లా- 524201.	29-01-2014	చిన్నది	4,956	10905737306
3.	9×75	ఓపెన్	-డిటో-	**సయ్యద్ ఖాజా మొహిద్దీన్** తండ్రి: ఎస్‌కె.రహంతుల్లా డి.నెం. 7-14-35, కామాటివారి వీధి, కావలి. ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరుజిల్లా- 524201	24-10-2016	చిన్నది	2,478	52137705851 అకౌంట్ మూసివేయబడినది
4.	12×261	ఓపెన్	-డిటో-	**వకుళాభరణం సత్యనారాయణ ఆచార్యులు,** 11-33-970/2, వెంగళరావునగర్, కావలి. ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు.	09-09-09	మధ్యస్థం	27,210	52137718180
5.	1×14 (సేమ్)	ఓపెన్	-డిటో-	**బాసం నాగేశ్వరరావు,** తండ్రి: బాసం చినసుబ్బారావు, డి.నెం. 11-33-967/ఎ3, వెంగళరావునగర్, కావలి, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరుజిల్లా -524201	11-12-14	చిన్నది	17,346	33426673934
6.	6×210	ఓపెన్	-డిటో- లాకర్ కలిగిన ఇద్దరూ జీవించిలేరు	**చేవూరు పద్మావతి** మరియు **చేవూరు బేబి** తండ్రి: చేవూరు వెంకటరమణయ్య 10-38-9, నార్త్‌జనతాపేట, కావలి. ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా -524201	18-08-2000	చిన్నది	7,434	10905761747
7.	7×70 (సేమ్)	ఓపెన్	-డిటో-	**బాసం నాగేశ్వరరావు,** తండ్రి: బాసం చినసుబ్బారావు, డి.నెం. 11-33-967/ఎ3, వెంగళరావునగర్, కావలి, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరుజిల్లా -524201	27-6-2012	మధ్యస్థం	34,692	33426673934
8.	09×46	ఓపెన్	-నిల్-	**నూతక్కి విజయభారతి**		చిన్నది		30365227162

వ.నెం.	బ్రేక్ ఓపెన్	స్థితి	6.	6×189	ఖాళీ	12.	10×85	ఖాళీ
1.	1×18	ఖాళీ	7.	7×7	ఖాళీ	13.	10×87	ఖాళీ
2.	5×261	ఖాళీ	8	9×7	ఖాళీ	14.	11×29	ఖాళీ
3.	5×262	ఖాళీ	9	9×73	ఖాళీ	15.	11×54	ఖాళీ
4.	5×315	ఖాళీ	10.	10×3	ఖాళీ	16.	12×266	ఖాళీ
5.	6×162	ఖాళీ	11.	10×16	ఖాళీ	17.	12×291	ఖాళీ

ప్రదేశం: కావలి
తేది: 3-11-2025

సం/- **అధీకృత అధికారి,**
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కావలి మెయిన్ శాఖ, నెల్లూరు జిల్లా.

(c) eenadu

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

జలాశయానికి 27,626 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి ఎగువ ప్రాంతాల నుంచి 27,626 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జలాశయంలో 77.988కి 69.916 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 326.325 అడుగుల మేర నీటి మట్టం నమోదైంది. 6వ క్రస్ట్‌గేట్ ద్వారా 10,000, -17, -18 రివర్స్ స్లూయిస్ ద్వారా 50, పవర్ టన్నెల్ ద్వారా 2,600 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. నాన్‌డెల్టాలైన కండలేరు వరద కాలువకు 560, దక్షిణ కాలువకు 200, ఉత్తర కాలువకు 50 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. రోజుకు సగటున 273 క్యూసెక్కులు ఆవిరవుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

కోవూరు, న్యూస్‌టుడే: మండలంలోని వేగూరు విద్యుత్తు ఉపకేంద్రం 33/11కేవీ పరిధిలో ఆర్డీఎస్ఎస్ పనుల నిమిత్తం మంగళవారం సరఫరా నిలిపేస్తున్నట్లు డిస్కం డీఈఈ మధుసూదన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేగూరు, సీతారామపురం, మేడేగుంట, సుబ్బారెడ్డిపురం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఉంటుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు :79950 67034, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: పొదలకూరు రూరల్ పరిధిలోని విఘ్నేశ్వరకాలనీ మూడో వీధిలో వేగనిరోధకాలు అధికంగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. **– అలీ, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి సిబ్బందిని పంపి అనవసరమైన వాటిని తొలగిస్తాం. **– యశ్వంత్ సింగ్, పంచాయతీ కార్యదర్శి**

? సంగం మండలం కొరిమెర్లలో ఎస్సీ బాలుర వసతి గృహానికి వెళ్లే మార్గం వర్షాలతో దెబ్బతింది. **– రామయ్య, కొరిమెర్ల**

✓ పరిశీలించి, మరమ్మతులు చేయిస్తాం. **– సుధాకర్, పంచాయతీ కార్యదర్శి**

? ఏఎస్‌పేట బస్టాండు సెంటరులో బస్సు షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు దుకాణాల చెంత నిరీక్షించాల్సి వస్తోంది. చర్యలు తీసుకోవాలి. **– వెంకటరమణయ్య**

✓ ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరవగానే నిర్మిస్తాం. **– ప్రసన్నకుమారి, ఎంపీడీవో**

? టీపీగూడూరు మండల పరిధిలోని ఇస్కపాలెం-పాపిరెడ్డిపాలెం రోడ్డులో కల్వర్టు వద్ద గుంత పడి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. **– కరుణాకర్, స్థానికుడు**

✓ పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. **– రమేష్, ఏఈ, పంచాయతీరాజ్**

? అనంతసాగరం బొమ్మవరం గ్రామంలోని పలు వీధుల్లో కాలువలు సక్రమంగా లేకపోవడంతో మురుగు రహదారులపై ప్రవహిస్తోంది. **– భాస్కర్, గ్రామస్థుడు**

✓ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిర్మాణం చేపడతాం. **– తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శి**

? పొదలకూరు పట్టణంలోని యాదవవీధిలో చెత్తాచెదారాలు పేరుకుపోయి పందులు స్వైర విహారం చేస్తున్నాయి. **– రాజా**

✓ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం. **– యశ్వంత్‌సింగ్, కార్యదర్శి**

? తోటపల్లిగూడూరు మండలం మల్లికార్జునపురం వద్ద సాగు కాలువలో గుర్రపుడెక్క, పిచ్చి మొక్కలు పెరిగి నీటి పారుదలకు కష్టంగా మారింది. **– రమణయ్య, స్థానికుడు**

✓ పరిశీలించి తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. **– ఖలీల్, ఏఈ, నీటిపారుదలశాఖ**

? చేజర్ల మండలం వావిలేరు ఎస్టీ కాలనీలో మురుగు నీరు నిలిచి దోమల ఉద్ధృతి అధికంగా ఉంది. **– కాలనీవాసులు**

✓ మురుగు నిలవకుండా చర్యలు తీసుకుంటాం. **– శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ**

? మనుబోలులో తరచూ విద్యుత్తు అంతరాయం కలుగుతోంది. సరఫరాలో హెచ్చుతగ్గుల కారణంగా గృహోపకరణాలు కాలిపోతున్నాయి. **– వెంకటేశ్వర్లు, స్థానికుడు**

✓ పరిశీలించి అంతరాయం లేకుండా చూస్తాం. **– అనిల్‌కుమార్, విద్యుత్తుశాఖ ఏఈ**

చిత్రాలు గీసి.. బహుమతులు గెలిచి

బహుమతులు అందజేస్తున్న బీఎస్ఆర్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్లు

ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందుకుంటున్న విజేతలు

ఆత్మకూరు, పొదలకూరులలో పలు కళాశాలల్లో 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ప్రకృతి అందాలు' అనే అంశంపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. – ఆత్మకూరు, పొదలకూరు, న్యూస్‌టుడే

ఆత్మకూరు పట్టణ పరిధిలోని బీఎస్ఆర్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో వై. కల్పన(ప్రథమ), యు. జ్యోతి(ద్వితీయ), కె. ఝాన్సీ(తృతీయ) విజేతలుగా నిలిచారు. వారికి కరస్పాండెంట్లు కె. శ్రీనివాసులునాయుడు, వి. నరసింహానాయుడు, జి. సుబ్బారెడ్డిలు బహుమతులు అందజేశారు.

పొదలకూరు కాకతీయ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో ఎ. నందిని(ప్రథమ), ఆర్. రమ్యశ్రీ(ద్వితీయ), ఎన్. కమలావతి (తృతీయ) స్థానాలు సాధించారు. వీరికి ప్రిన్సిపల్ వేణుగోపాల్ రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక జడ్పీజీహెచ్ఎస్‌లో విద్యార్థినులకు 'మీకు ఇష్టమైన పండగ' అనే అంశంపై పోటీ జరగగా.. టీ.మనివర్ధిని, ఏ.ఆశాజ్యోతి, ఎస్. పెంచలనవ్యలు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి హెచ్ఎం సుజాత బహుమతులు అందించారు.

బహుమతులు అందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

దస్త్రాలు తప్పుల తడక.. రైతులకు అవస్థ

న్యూస్‌టుడే, చేజర్ల

అధికారుల నిర్లక్ష్యంతో రెవెన్యూ దస్త్రాలు తప్పుల తడకగా కనిపిస్తున్నాయి. హెచ్చుతగ్గులు, అదనంగా ఖాతాల్లో భూములు కలవడం, నోషనల్ ఖాతాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా పథకాలు, రుణాలు అందుకోలేకపోతున్నారు.

చేజర్ల రెవెన్యూ పరిధిలోని బోడిపాడుకు చెందిన బి.సుబ్బారెడ్డి, ఆయన సోదరులకు వారసత్వంగా భూములు సంక్రమించాయి. రికార్డుల్లో ఒకరికి ఎక్కువగా మరొకరికి తక్కువగా నమోదయ్యాయి. పైగా అన్ని సర్వే నంబర్లలో అందరూ ఉన్నట్లు ఉంది. ఈ హెచ్చుతగ్గులతో రుణాలుతీసుకోవడం, పంట నమోదులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పొదలకూరు మండలం నావూరుకు చెందిన వెంకటనారాయణ ప్రసాద్‌కు 30 ఎకరాలకు రెండు ఖాతాలు ఉండడంతో ఒకదానికి మాత్రమే ఆధార్ అనుసంధానం అయింది. దీంతో భూమిని తనఖా పెట్టి రుణాలు పొందలేకపోతున్నారు. అదే గ్రామానికి చెందిన వెంకటరెడ్డికి ఏడు ఎకరాలు మెట్ట భూమి నాలుగు సర్వే నంబర్లలో ఉంది. దానికి అదనంగా ఆరు సర్వేనంబర్లు కలవడంతో 13 ఎకరాలు ఉన్నట్లయింది. దీంతో పెన్షన్‌కు అర్హత కోల్పోయారు.

రికార్డులో పెరుగుతున్న విస్తీర్ణం

అడంగల్ నమోదు సక్రమంగా జరగక వాస్తవ విస్తీర్ణం కన్నా కొందరికి ఎక్కువగా భూమి ఉన్నట్లు నమోదయింది. నూతకివారికండ్రిక లోని 98సీ సర్వేనం. 727 ఎకరాలు కాగా, రైతుల పాసుపుస్తకాల ప్రకారం 900 ఎకరాలకుపైగా నమోదైంది. ఎవరికి ఎంత భూమి అనేది రెవెన్యూ యంత్రాంగం తేల్చలేకపోతోంది. దీనికితోడు చాలా మందికి రెండు, మూడు వరకు 1.బీ ఖాతాలు ఉండడంతో వారసత్వ భూముల మార్పిడి జరగడం లేదు.

నోషనల్ ఖాతాలతో..

పలు గ్రామాల్లో రైతుల భూములు నోషనల్ ఖాతాలో చేరాయి. హక్కుదారుల ఖాతాలో చేరాలంటే సంబంధిత పత్రాలు తీసుకురావాలని అధికారులు సూచిస్తున్నారు. వారసత్వంగా వచ్చినవి కావటంతో ఎలాంటి దస్తావేజులేని కారణంగా రైతులు మిన్నకుండి పోతున్నారు. 1బీలో నమోదు కాని కారణంగా అవస్థలు పడుతున్నారు. చేజర్లలోనే వెయ్యికిపైగా సర్వేనం. నోషనల్ ఖాతాల్లో ఉన్నాయి. పొదలకూరు మండలం నావూరు రెవెన్యూ పరిధిలో 950కుపైగా సర్వేనం వాటి సబ్ డివిజన్లు ఈ జాబితాలో ఉన్నాయి.

● రెవెన్యూశాఖ సిబ్బంది నిర్వాకంతో భూములు లేని వారి ఖాతాలో అదనంగా నమోదు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు. రేషను కార్డులు, పెన్షన్లు కోల్పోతున్నారు.

165	646-1	గుదె వెంకటనారాయణప్రసాద్
165	648	గుదె వెంకటనారాయణప్రసాద్
165	656-1	గుదె వెంకటనారాయణప్రసాద్
165	657	గుదె వెంకటనారాయణప్రసాద్
165	806	గుదె వెంకటనారాయణప్రసాద్
165	806	గుదె వెంకటనారాయణప్రసాద్
165	808	గుదె వెంకటనారాయణప్రసాద్
165	809	గుదె వెంకటనారాయణప్రసాద్
165	810	గుదె వెంకటనారాయణప్రసాద్
165	810	గుదె వెంకటనారాయణప్రసాద్
165	895-1	గుదె వెంకటనారాయణప్రసాద్

వెంకటనారాయణప్రసాద్ పేరుపై ఉన్న సర్వేల ఖాతాలు

కలెక్టరు అనుమతితో సరిచేస్తాం

పట్టా భూములుగా ఉన్న నోషనల్ ఖాతాల్లోని భూములను వారసులకు మార్పిడి చేస్తున్నాం. ప్రభుత్వ భూములుగా నమోదై రైతుల అధీనంలో ఉన్న వాటిపై కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవహరిస్తాం.

బి.పావని, ఆర్డీవో ఆత్మకూరు

బస్సుల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: స్కూల్స్ కళాశాలల యాజమాన్యాలు.. బస్సుల నిర్వహణలో నిబంధనలు పాటించాలని ఎంవీఐ రాములు అన్నారు. సోమవారం ఆయన కార్యాలయంలో నిర్వాహకులు, డ్రైవర్లకు అవగాహన కల్పించారు. బస్సు నాలుగువైపులా సిగ్నల్ లైట్లు ఉండాలన్నారు. పరిమితి మించి వేగంగా పోవద్దన్నారు. బస్సుల్లో సహాయకుడు తప్పనిసరిగా ఉండాలన్నారు.

మాట్లాడుతున్న ఎంవీఐ రాములు

ఏకలవ్య పాఠశాలలో భద్రత కల్పించాలి

కొడవలూరు: చంద్రశేఖరపురం ఏకలవ్య గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు భద్రత లేదని పీసీ ఛైర్మన్ చౌటూరు శీనయ్య జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రిన్సిపల్, వార్డన్‌లు సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదని ఆరోపించారు. ఆ మేరకు వినతి పత్రం అందజేశారు. ఎస్టీ నాయకులు సురేంద్ర, పోలయ్య తదితరులున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

రాపూరు,న్యూస్‌టుడే: రసాయన ఎరువులు, పురుగుమందులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ సహాయ సంచాలకులు శివనాయక్ పేర్కొన్నారు. సోమవారం రాపూరులో ఎరువుల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. పలు సూచనలిచ్చారు. ఏవో సోము సుందర్ ఉన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలోని దేవూరులో నిర్వహిస్తున్న కోదండరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. సీతారామ, లక్ష్మణ హనుమంతుల విగ్రహాలు ప్రతిష్ఠించారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కలువాయి, న్యూస్‌టుడే: కుమ్మరపల్లిలో సోమవారం పాడి పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స వైద్యశిబిరం నిర్వహించారు. డిప్యూటీ డైరెక్టర్ నాగమణి పాల్గొని పలు సూచనలు చేశారు. పశువులను పరిశీలించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏడీ గురుజయంతి సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత'

తోటపల్లిగూడూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతుందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం తోటపల్లిగూడూరులో వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. వైకాపా నాయకులు సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి.. హత్యాయత్నం కేసు నమోదు

వెంకటాచలం, న్యూస్‌టుడే: వెంకటాచలంలో వైకాపాకు చెందిన కార్యకర్త బదనాపురి గోపాలయ్యపై ఆదివారం రాత్రి దాడి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. రాజకీయ వైరంతో గ్రామానికే చెందిన మహేశ్, సురేశ్, రమేశ్ మరో ముగ్గురు కలిసి అర్ధరాత్రి సమయంలో గోపాలయ్య ఇంటికి వెళ్లి కులం పేరుతో దూషించి కత్తితో దాడి చేశారు. బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు సోమవారం కులదూషణతోపాటు, హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బారావు తెలిపారు. ● వైకాపా అధికారంలో ఉండగా.. గోపాల్ చేసిన అరాచకాలపై విచారణ జరిపించాలని తెదేపా నాయకులు డిమాండ్ చేశారు. అప్పట్లో గోపాల్ జరిపిన దాడిలో గాయపడిన బాధితులంతా క్షతగాత్రుల ఫొటోలను ఎమ్మెల్యే కార్యాలయం నుంచి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. విరువూరులో అరాచకం సృష్టించి, మహిళలపై దాడులు చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. ఎవరో కడుపు మండి దాడి చేస్తే.. మాజీ మంత్రి కాకాణి తెదేపాకు అంటకట్టడం దారుణమన్నారు. పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విచారణ చేపడితే.. అతని దురాగతాలు బయటపడతాయన్నారు.

మొరాయించిన బస్సు

నెల్లూరు-1 డిపోనకు చెందిన ఆర్టీసీ అల్ట్రా డీలక్స్ బస్సు సోమవారం నెల్లూరు నుంచి కడపకు వెళుతుండగా సంగంకొండ దిగిన తర్వాత నెల్లూరు- ముంబయి జాతీయరహదారిపై అర్ధాంతరంగా ఆగిపోయింది. వన్‌మేన్ సర్వీసుగా నడిచే ఈ బస్సు క్లచ్‌ప్లేటు దెబ్బతినడంతో ముందుకు కదలకుండా మొరాయించింది. దీంతో 21 మంది ప్రయాణికులను ఇతర బస్సుల్లో వారి గమ్యస్థానాలకు తరలించారు. అనంతరం మెకానిక్ వచ్చి మరమ్మతులు చేయడంతో బస్సు అక్కడ నుంచి కదిలింది. - న్యూస్‌టుడే, సంగం

ఈ నీళ్లు తాగితే..వ్యాధులు ఖాయం

పశువుల దాహార్తి తీర్చేందుకు కూటమి ప్రభుత్వం రూ. లక్షలు వెచ్చించి నీటితొట్టెల నిర్మాణం చేపట్టింది. నిర్వహణను పంచాయతీ సిబ్బంది గాలికొదిలేయడంతో విడవలూరులో పెనుగొండమ్మ గుడి సమీపంలో నిర్మించిన నీటి తొట్టె పాచిపట్టింది. దీంతో పశువులు తాగడంలేదని పశుపోషకులు చెబుతున్నారు. నిత్యం ఈ మార్గంలో వందల సంఖ్యలో బర్రెలు, గొర్రెలు, గోవులు మేతకు వస్తుంటాయి. నీళ్లు సరిగా లేక వాటి దాహార్తి తీరడంలేదని అధికారులు శుభ్రం చేయాలని పశుపోషకులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, విడవలూరు

పూడిక తీయక.. మురుగు కదలక

పట్టణంలోని పడుగుపాడు బండారుమాన్యంలో మూడో నంబరు సచివాలయం సమీపంలో మురుగు కాలువలు వ్యర్థాలతో పేరుకుపోయాయి. పూడిక తీయకపోవడంతో దుర్వాసన, దోమల బెడదతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వానొస్తే పరిస్థితి దారుణంగా ఉంటుందని వాపోతున్నారు. విన్నవిస్తున్నా అధికారులకు పట్టడం లేదని విమర్శిస్తున్నారు. – న్యూస్‌టుడే, కోవూరు

బస్సుషెల్టరు నిరుపయోగం

మండలంలోని వరిగొండ గ్రామం రావూరివారికండ్రిగ వద్ద ప్రధాన రహదారిలో నిర్మించిన బస్సుషెల్టరు నిరుపయోగంగా మారింది. పర్యవేక్షణ కొరవడి పిచ్చిమొక్కలకు నిలయంగా దర్శనమిస్తోంది. దాంతో భవనంలో నిరీక్షించడానికి ప్రయాణికులు విముఖత చూపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు

గుంత.. ప్రయాణానికి చింత

మండలంలోని మేకవారిపల్లి ప్రధాన రహదారి గుంతలతో అధ్వానంగా ఉంది. రాకపోకలు సాగించాలంటే గ్రామస్థులు నరకయాతన పడుతున్నారు. వర్షాల పడితే పరిస్థితి మరీ ఇబ్బందికరంగా మారుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి గాయాల పాలవుతున్నారని వాపోతున్నారు. పీఆర్ ఏఈ మమేక్‌రెడ్డి మాట్లాడుతూ ఉన్నతాధికారులకు నివేదికలు పంపామన్నారు.– న్యూస్‌టుడే, అనంతసాగరం

భూ సమస్యలు పరిష్కరించాలి

మర్రిపాడు, న్యూస్‌టుడే: భూ సమస్యలు అధికమయ్యాయని వాటిని పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో రైతులు సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సీపీఎం నాయకుడు మూలి వెంగయ్య మాట్లాడుతూ భూ రికార్డులు సరిచేసి రైతులకు రాయితీలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. **ఆత్మకూరు :** అప్పారావుపాళెంలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ఎస్సీ కాలనీవాసులు సోమవారం ఆర్డీవో పావనికి వినతి పత్రం అందజేశారు. సీపీఎం రూరల్ కమిటీ బాధ్యులు గంటాలక్ష్మీపతి, ఎల్‌కె ప్రసాద్, పెంచలయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు. **సంగం :** తలుపూరుపాడు పొలాల మీదుగా ప్రవహించే చవిటి వాగుకు ఏర్పాటు చేసిన అడ్డంకులు తొలగించాలని ఏఎస్‌పేట మండలం శ్రీకొలను గ్రామ రైతులు సంగంలో తహసీల్దారు సోమ్లానాయక్‌కి వినతి పత్రం అందజేశారు.

ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, రైతులు

పోషకాలతో అధిక దిగుబడి

చేజర్ల : పైర్లలో అధిక దిగుబడి సాధించాలంటే స్థూల, సూక్ష్మ పోషకాలు సరిగా అందించాలని జిల్లా రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయాధికారి చక్రవర్తి వివరించారు. సోమవారం చేజర్లలో సమగ్ర పోషక యాజమాన్యంపై రైతులకు సూచనలు చేశారు. యూరియా, డీఏపీ, పొటాష్‌లతోపాటు జింకు, బోరాన్, ఇనుము, రాగి తగుపాళ్లలో అందిస్తే మొక్కలు మంచి పంటనిస్తాయన్నారు. వ్యవసాయాధికారి హిమబిందు,సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఇందుకూరుపేట, మనుబోలు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఇందుకూరుపేట మండలం కొత్తూరు ఉన్నత పాఠశాల విద్యార్థి అఖిల్ ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున తెలిపారు. ఆదివారం ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి ఎంపికల్లో పాల్గొని అర్హత సాధించారన్నారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో కర్నూల్‌లో జరగనున్న పోటీలకు జిల్లా నుంచి పాల్గొంటారన్నారు. ● జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు అండర్-14 విభాగంలో మనుబోలు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థినులు మిథునశ్రీ, శ్రీకావ్య ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని అమూల్య కుమారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారిని విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

కార్తికం.. దీప శోభితం

కోవూరు శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

విడవలూరు,కోవూరు, సంగం, న్యూస్‌టుడే: కార్తిక మాసం సోమవారం సందర్భంగా ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. కోవూరు పట్టణంలోని గాంధీ పార్క్ వద్ద ఉన్న ఆలయంలో, విడవలూరు మండలం రామతీర్థంలో దీపాలు వెలిగించి పూజలు చేశారు. విడవలూరులోని యలగాలమ్మగుంట వద్ద స్వయంభులింగేశ్వరస్వామి ఆలయంలో భజనలు చేశారు. సంగంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయంలో వేకువజాము నుంచే భక్తుల సందడి ప్రారంభమైంది. **మనుబోలు, పొదలకూరు, తోటపల్లిగూడూరు:** మనుబోలు, వెంకన్నపాలెం, బద్దెవోలు, కటువపల్లి, పిడూరు, మడమనూరు, కొలనుకుదురు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తిశ్రద్ధలతో మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పొదలకూరు శివాలయంలో తెల్లవారుజాము నుంచే భక్తులు కిక్కిరిసిపోయారు. **సైదాపురం:** సైదాపురం సమీపంలోని సిద్దలకొండపై నవకోటిసిద్దేశ్వరస్వామి, నవనాథసిద్దేశ్వరస్వామి వారిశిష్యులు సారంగధరులకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా మహిళలు కార్తిక దీపాల్ని వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

నరుకూరులో సోమిరెడ్డి పూజలు

తోటపల్లిగూడూరు మండలంలోని నరుకూరులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పూజలు చేశారు. ఆలయ నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. తెదేపా మండల అధ్యక్షుడు కొణతం రఘుబాబు, నాయకులు వెంకటేశ్వర్లు, వెంకయ్య, జితేంద్ర గౌడ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు శివాలయ ప్రాంగణంలో

విద్యుదాఘాతంతో కూలీ మృతి

విడవలూరు, సంగం న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో కూలీ మృతి చెందిన ఘటన విడవలూరు మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు ఉలవపాడు మండలం చాకిచర్ల పెద్ద పట్టపుపాలేనికి చెందిన ఆవుల గోపి(37) ఆయన భార్యతో కలిసి విడవలూరు మండలం రామతీర్థం శివారులో రొయ్యల చెరువు వద్ద పనిచేసేందుకు ఏడాది క్రితం వచ్చారు. ఈక్రమంలో ఆదివారం మోటారు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సంగం మండలంలోని మర్రిపాడులో విద్యుదాఘాతంతో రైతు మృతిచెందారు.

సిద్ధవరంలో ద్విచక్ర వాహనదారుడి..

రాపూరు,న్యూస్‌టుడే: కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు మృతిచెందారు. మండలంలోని సిద్ధవరం వద్ద సోమవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు సిద్ధవరం వాసి ఎం. వెంకటేశ్వర్లు(38) తన వాహనంపై ఆగి ఉన్న సమయంలో వెంకటగిరి నుంచి రాపూరు మీదుగా శ్రీశైలం వెళ్లే కారు డ్రైవర్ నిద్రమత్తులో వేగంగా ఢీకొన్నారు. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడ్ని స్థానికులు రాపూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. కాగా ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

ముత్తుకూరు : మండలంలోని జంగాల కండ్రిగ వద్ద సోమవారం ఉదయం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడగా.. మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులు గురవయ్యశాల, నేలటూరుకు చెందిన వారిగా తెలిసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. **మనుబోలు:** గూడూరు వైపు నుంచి వస్తూ మలుపు తిరుగుతున్న కారును నెల్లూరు వైపు వెళుతున్న మరో కారు ఢీకొంది. మండలంలోని కాగితాలపూరు అడ్డరోడ్డు వద్ద జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి.

గేదెను ఢీకొనడంతో..

మర్రిపాడు : మండలంలోని అచ్చిమాంబ గుడి సమీపంలో నెల్లూరు-ముంబయి జాతీయరహదారిపై గేదెను బైక్ ఢీకొన్న సంఘటనలో ఒకరు గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రుడ్ని 108వాహనంలో ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

ఆత్మకూరు : ఆత్మకూరు చెరువులో ఈతకు దిగి గల్లంతైన ఎన్.మహేష్(30) మృతదేహం సోమవారం లభ్యమైంది. మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కాగా పోస్ట్‌మార్టం నిమిత్తం జిల్లా వైద్యశాలకు సీఐ గంగాధర్‌రావు, ఎస్సై జిలానీ తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువు ప్రమాదకరంగా ఉందని ఈతకు ఎవరూ దిగవద్దని హెచ్చరించారు.

విద్యార్థులు.. కబడ్డీలో చిరుతలు

న్యూస్‌టుడే, ఆత్మకూరు

కబడ్డీ.. కబడ్డీ అంటూ కూతకు వెళ్లినా.. ఎవరైనా గిరి దాటి వచ్చినా వారి పట్టుకు పాయింట్ సమర్పించాల్సిందే. బృంద స్ఫూర్తిని ప్రదర్శిస్తూ.. విజేతలుగా నిలుస్తున్నారు ఆ క్రీడాకారులు.. ఇటీవల కర్ణాటక రాష్ట్రం బెళగావిలో దక్షిణ భారతదేశ అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో విక్రమసింహపురి విశ్వవిద్యాలయం జట్టు విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించారు.. ఆత్మకూరు ఎస్ఆర్‌జే డిగ్రీ కళాశాల విద్యార్థులు. సమష్టి కృషితోనే పతకాలు సాధిస్తున్నామని చెబుతున్నారు.

రాష్ట్రజట్టుకు ప్రాతినిధ్యం వహిస్తా

సంగం మండలం దువ్వూరుకు చెందిన తిరగాబత్తిన శ్రీనివాసులు, బీఏ చదువుతున్నారు. గతంలో మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన అండర్-17 జాతీయస్థాయి కబడ్డీ పోటీలో పాల్గొన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో నిర్వహించిన 46వ రాష్ట్రస్థాయి, ప్రకాశం జిల్లాలో నిర్వహించిన 48వ రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొన్నారు. మూడేళ్లుగా దక్షిణ భారతదేశస్థాయి అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో వీఎస్‌యూ తరఫున పాల్గొని ప్రతిభ చూపుతున్నారు. రాష్ట్రజట్టుకు ప్రాతినిధ్యం వహిస్తానని చెబుతున్నారు.

మూడేళ్లుగా విజయాలు

బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన గద్దె కార్తిక్, బీఏ చదువుతున్నారు. కబడ్డీలో శిక్షణ తీసుకుని పట్టు సాధించారు. మూడేళ్లుగా వీఎస్‌యూ జట్టులో ఆడుతూ.. విజయాలు సాధిస్తున్నారు. భవిష్యత్తులో ఇదే పంథా కొనసాగిస్తానని మరింత నైపుణ్యం పెంచుకుంటానని తెలిపారు.

జాతీయస్థాయిలో రాణిస్తా

బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన పాకం సుధీర్, బీఏ చదువుతున్నారు. 2024 రాజమండ్రిలో నిర్వహించిన 50వ స్టేట్ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ చూపి నేషనల్స్‌కు ఎంపికయ్యారు. అదే ఏడాది ఒంగోలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్స్ పోటీలో పాల్గొన్నారు. 2025లో విజయవాడలో నిర్వహించిన ఆంధ్ర యువ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటారు. ఈ ఏడాది బెళగావిలోని రాణి చెన్నమ్మ యూనివర్సిటీలో జరిగిన సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో వీఎస్‌యూ జట్టు తరుపున ఆడి విజేతగా నిలిచారు. జాతీయస్థాయిలో రాణించాలన్నదే లక్ష్యమని చెబుతున్నారు.

గెలుపే లక్ష్యంగా

బుచ్చికి చెందిన ఈదూరు రోహిత్, బీఏ మొదటి ఏడాది చదువుతున్నారు. 2024 జనవరిలో కర్ణాటక రాష్ట్రం మండ్యలో అండర్-19 జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్‌లో రాణించారు. 2024 డిసెంబరులో హరియాణాలో నిర్వహించిన పోటీలో ప్రతిభ చూపారు. ఈ ఏడాది అంతర విశ్వవిద్యాలయాల కబడ్డీ గేమ్‌లో విజేతగా నిలిచారు. గెలుపే లక్ష్యంగా సాగుతానని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

తాటిపర్తిలో చోరీ

పొదలకూరు : తాటిపర్తిలోని దేవాలయాల్లో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. స్థానికంగా ఉన్న పాతమ్మ దేవస్థానంలో హుండీ పగలగొట్టి అందులో ఉన్న సుమారు రూ.1500 నగదు అపహరించారు. వృద్ధాశ్రమంలోని శివాలయంలోని హుండీని సమీపంలోని పొలాల్లోకి తీసుకెళ్లి పగలగొట్టేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. అక్కడే వదిలేసి పారిపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహ్మద్ హనీఫ్ తెలిపారు.

కోళ్ల వ్యర్థాల వాహనాల స్వాధీనం

కోవూరు : జమ్మిపాలెం వైపు కోళ్ల వ్యర్థాలను లారీలో తరలిస్తు ఉండడంతో సోమవారం సీఐ సుధాకర్ రెడ్డి పట్టుకున్నారు. డ్రైవర్ శ్రీహరిని అదుపులోకి తీసుకున్నారు. కోళ్ల వ్యర్థాలను పెన్నానది సమీపంలో పూడ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. **బుచ్చి :** సంగం మండలంలోని చేపలగుంతలకు చికెన్ వ్యర్థాలను తీసుకువెళుతున్న లారీని మినగల్లు వద్ద పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంతోష్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

(c) eenadu

నెల్లూరు

•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం

ముఖ్యఅతిథిని సన్మానిస్తున్న అధ్యాపకులు

మాదకద్రవ్యాల జోలికెళ్లొద్దు

నెల్లూరు(విద్య): నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. మహిళా స్టేషన్ సబ్ఇన్‌స్పెక్టర్ శ్రీహరి మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, మాదక ద్రవ్యాల జోలికి వెళ్లరాదని తెలిపారు. ప్రిన్సిపల్ హజరత్తయ్య, సెటినల్ సీఈవో నాగేశ్వరరావు, మేనేజర్ శ్రీనివాస్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి చంద్రమోహన్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో నందీశ్వరుడికి హారతి

నగరమంతా కార్తిక శోభ

కార్తిక మాసం రెండో సోమవారం నగరంలోని శైవ, విష్ణు ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. దర్గామిట్టలోని శ్రీరాజరాజేశ్వరి ఆలయంలో సుందరేశ్వరస్వామికి ఏకాదశ అభిషేకాలు చేశారు. నందీశ్వరస్వామికి త్రయోదశి పూజలు నిర్వహించారు. అలాగే పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

– న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

చిత్ర కళ.. ప్రతిభ భళా

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా విద్యార్థులకు ప్రకృతి అందాలు (పర్వతాలు, నదులు, చెట్లు, జంతువులు, పక్షులు) ప్రతిబింబించేలా సోమవారం నగరంలోని ఆదిత్య జూనియర్ కళాశాలలో చిత్రలేఖన పోటీలు నిర్వహించగా.. విద్యార్థులు ప్రతిభ చూపారు. కె.భవ్యశ్రీ ప్రథమ, ఎం.సురేఖ ద్వితీయ, హేమహంసిక తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, వైస్ ప్రిన్సిపల్ రమేష్ బహుమతులు అందించారు.

బహుమతులు అందుకుంటున్న ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థులు

ప్రణాళికాబద్ధ పనితోనే పురస్కారం

కమిషనర్‌ను సత్కరిస్తున్న అధికారులు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: తుపాను సమయంలో నెల్లూరు నగరపాలకసంస్థ అన్ని విభాగాల అధికారులు, వార్డు సచివాలయాల కార్యదర్శులు, సిబ్బంది సమన్వయంతో పనిచేశారని కమిషనర్ వైవో నందన్ కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాన్ని అందుకున్న కమిషనర్‌ను సోమవారం కమాండ్ కంట్రోల్ సెంటరులో అన్ని విభాగాల ఉన్నతాధికారులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను సమయంలో ప్రజా జీవనానికి ఆటంకం కలగకుండా నగరపాలకసంస్థ ప్రణాళికాబద్ధంగా చేపట్టిన చర్యలకు 'సైక్లోన్ మొంథా ఫైటర్' అవార్డును ముఖ్యమంత్రి ద్వారా అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, సిటీప్లానర్ హిమబిందు, ఆరోగ్యాధికారి డాక్టర్ కనకాద్రి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల నివేదన.. పరిష్కారానికి నిరీక్షణ

నెల్లూరు(కలెక్టరేట్): ఏ ఆసరా లేని తమకు పింఛన్లు అందించాలని దివ్యాంగులు, వృద్ధులు.. పొలం సమస్యలు పరిష్కరించాలని రైతులు.. ఇంటి స్థలాలు మంజూరు చేయాలని మహిళలు.. ఇలా పలువురు సోమవారం జిల్లా కేంద్రానికి తరలివచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు ఇచ్చి పరిష్కరించమని కలెక్టర్‌ను వేడుకున్నారు.

ఇంటి పట్టాలు ఇవ్వలేదు

ప్రభుత్వం 2002లో జన్మభూమి కార్యక్రమంలో కలువాయి మండలంలో 50 మంది దివ్యాంగులకు ఇంటి స్థలాలు మంజూరు చేసింది. 15 మందికే అందాయి. అప్పటినుంచి కలువాయి మండల కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు న్యాయం చేయడం లేదని దివ్యాంగులు **రేవూరు శ్రీనివాసులు, సుధాకర్** తెలిపారు. రికార్డులు లేవని స్థానిక అధికారులు చెబుతున్నారని, ఉన్నతాధికారులు న్యాయం చేయాలని వేడుకున్నారు.

పంట కాలువల ఆక్రమణ

నెల్లూరు రూరల్ మండలం గొల్లకందుకూరులోని చిన్నచెరువు కింద సుమారు వంద మంది రైతులకు 300 ఎకరాల పొలం ఉంది. రెండు సార్లు వరి పండించుకుని జీవనం సాగిస్తున్నారు. చెరువు నుంచి పొలాలకు నీరు వచ్చే రెండు పంట కాలువలను కొందరు ఆక్రమించారు. చివరి పొలాలకు నీటి రాక ఇబ్బందిగా ఉందని రైతులు **వెంకటసుబ్బయ్య, శివయ్య, మస్తానయ్య, కాంతమ్మ, విఘ్నేష్** వాపోయారు.

వ్యవసాయ రుణం అందక

బుచ్చిరెడ్డిపాలెం మండలం రేబాలకు చెందిన **గుడి అంకయ్య**కు నెల్లూరురూరల్ మండలం వెల్లంటి గ్రామంలో 2.70 ఎకరాల పొలం ఉంది. వ్యవసాయ రుణం కోసం బ్యాంకుల చుట్టూ తిరిగినా ఇవ్వడం లేదని వాపోయారు. అధికారులు స్పందించి రుణం ఇప్పించి ఆదుకోవాలని వేడుకున్నారు.

పొలం తీసుకుని గెంటేశారు

కొడవలూరు మండలం యల్లాపాలెం గ్రామానికి చెందిన **దామర్ల రమణయ్య, శంకరమ్మ** దంపతులకు 98 సెంట్ల భూమి ఉంది. వృద్ధులు కావడంతో ఏ పని చేసుకోలేరు. బాగోగులు చూసుకుంటామనడంతో పొలాన్ని బంధువులకు ఇచ్చారు. ప్రస్తుతం వారు తమను చూడకుండా బయటకు పంపి ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు.

కార్పొరేషన్‌లో 78 అర్జీలు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటరులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కమిషనర్ వైవో నందన్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మొత్తం 78 వినతులు అందుకున్నామని, అర్జీలకు శాశ్వత పరిష్కారం అందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, సిటీప్లానర్ హిమబిందు, ఆరోగ్యాధికారి డాక్టర్ కనకాద్రి, డిప్యూటీ సిటీప్లానర్ రఘునాథరావు, మేనేజర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం: ఎస్పీ

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: పోలీసు కార్యాలయానికి వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అజిత వేజెండ్ల అన్నారు. సోమవారం పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 202 ఫిర్యాదులు వచ్చాయి. తన తండ్రికి ఎక్స్ సర్వీస్ కోటా కింద ఇచ్చిన భూమిని సుబ్బరాయుడు, సుబ్బారావు పొలం సాగు చేసుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు దగదర్తికి చెందిన మహిళ ఫిర్యాదు చేశారు. తన భర్త మృతి అనంతరం అత్తింటి వారు ఆయనకు సంబంధించిన ఆస్తి ఇవ్వకుండా, ఇంట్లోకి రానివ్వకుండా ఇబ్బంది పెడుతున్నట్లు వీవీ పాలెంకు చెందిన మహిళ గోడు వెళ్లబోసుకున్నారు. విజయవాడకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి.. వేటూరు అనే మ్యారేజీ లింక్‌ను అనధికారికంగా నడిపిస్తూ అందులో ఉన్న నకిలీ వివరాలు ద్వారా మోసపోయినట్లు చిన్నబజారుకు చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు.

సమస్య వింటున్న ఎస్పీ

పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరపాలకసంస్థ కమిషనర్ వైవో నందన్ సోమవారం పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా 19, 20 డివిజన్లలోని గోమతినగర్, ఇస్కాన్‌సిటీ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఇసుకను రవాణా చేస్తున్న ఎండ్ల బండ్లను ఆపి యజమానులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఈ రామమోహనరావు పాల్గొన్నారు.

హుండీయే చెత్తడబ్బా..!

నగదుతో నిండాల్సిన హుండీ.. వ్యర్థాలతో నిండిపోయింది. నెల్లూరులోని బారాషహీద్ దర్గా ఆవరణలో చెత్త డబ్బాలు లేకపోవడంతో వ్యర్థాలన్నీ ఎక్కడపడితే అక్కడే వేస్తున్నారు. దీంతో హుండీకి పైన మూతను తొలగించి చెత్త డబ్బాగా వినియోగిస్తున్నారు. అధికారులు చెత్త డబ్బాలను ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

ఆక్రమణల తొలగింపు

పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో సోమవారం కొత్తూరు బాబానగర్ ప్రాంతంలోని ఆక్రమణలు, ట్రంకురోడ్డులో లక్కీ షాపింగ్ మాల్ రోడ్డును ఆక్రమించిన చేపట్టిన ప్రహరీని తొలగించారు. ఈ సందర్భంగా నగరపాలకసంస్థ కమిషనర్ వైవో నందన్ మాట్లాడుతూ ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

ప్రధాన రహదారిపై దుర్గంధం

వెంకటరెడ్డినగర్ ప్రాంతంలో జీఎన్టీ రోడ్డు వెంబడి మురుగునీరు చేరి దుర్గంధంగా తయారైంది. ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరంతా రోడ్డు అంచున చేరుతోంది. భక్తులు, ఆప్రాంతవాసులు రాపోకలకు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి మురుగునీటిని వీధుల్లోకి వదలకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులుకోరుతున్నారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

వీధి కుక్కల పట్టివేత

స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సోమవారం పొదలకూరు రోడ్డు ప్రాంతంలో రోడ్లపై సంచరిస్తున్న 22 వీధి శునకాలను పట్టుకుని పాత మున్సిపల్ కార్యాలయం ఆవరణంలోని ఏబీసీ సెంటరుకు తరలించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ పశువైద్యాధికారి మదన్‌మోహన్ మాట్లాడుతూ రోడ్లపై సంచరిస్తున్న కుక్కలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: నగరంలోని ఎన్టీఆర్‌నగర్ సరస్వతీనగర్‌లో ఎస్ఎన్6/ఎ3-1 స్తంభానికి విద్యుద్దీపం వెలగడం లేదు. రాత్రివేళ ఇబ్బందులు పడుతున్నాం. – **అనిల్‌కుమార్, స్థానికుడు**

? నగరంలోని నవాబుపేట కుమ్మరివీధి వెంకటేశ్వర స్కూల్ సెంటర్‌లో ఎన్‌డబ్ల్యూ/8/ఏ6 స్తంభానికి వీధిదీపం వెలగడం లేదు. రాత్రివేళ రాకపోకలకు కష్టంగా ఉంది. – **వెంకటేశ్వర్లు**

సమాధానం: విద్యుద్దీపాల్ని ఏర్పాటు చేస్తాం. – **ముజాహిద్దీన్, నగరపాలక సంస్థ డీఈ**

? నగరంలోని శ్రామికనగర్‌లో కాలువలు శుభ్రం చేయడం లేదు. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. వ్యాధులు ప్రబలుతున్నాయి. – **శాంతి**

✓ కాలువలను శుభ్రం చేయిస్తాం.

– **డాక్టర్ కనకాద్రి, నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి**

– **న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్, నవాబుపేట)**

కాలు లేక కలత.. ఆసరా కొరత!

ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ.. ఆనందంగా సాగిపోతున్న ఆ కుటుంబాన్ని మధుమేహం కష్టాల కడలిలోకి నెట్టింది. షుగర్ వ్యాధితో కాలు తీసివేయడంతో కుటుంబ పోషణ కష్టంగా మారి పింఛన్ కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్ నగర్‌కు చెందిన **విజయరాఘవులు** ఆటో నడుపుకొంటూ భార్య, పిల్లలను పోషించుకుంటున్నారు. షుగర్ వ్యాధి కారణంగా కాలుకు ఇన్‌ఫెక్షన్ సోకగా.. 20 నెలల క్రితం వైద్యులు తొలగించారు. కుటుంబనావను నడిపేందుకు ఆర్థిక కష్టాలు ఎదురయ్యాయి. కనీసం ప్రభుత్వం అందించే దివ్యాంగుల పింఛను రూ.6వేలు అందిస్తే కుటుంబానికి ఆసరాగా ఉంటుందని వేడుకున్నారు. సదరం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోగా ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్నట్లు చూపుతోందని, పలుమార్లు ప్రభుత్వాసుపత్రికి వెళ్లినా ఫలితం లేదని, సర్టిఫికెట్ ఇప్పించి, పింఛను మంజూరు చేయాలంటూ సోమవారం కలెక్టర్‌కు విన్నవించి కన్నీటి పర్యంతమయ్యారు.

–న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్)

మహాకార్తిక దీపోత్సవం విజయవంతం చేద్దాం

నెల్లూరు(జడ్పీ): సింహపురి కార్తిక దీపోత్స సమితి ఆధ్వర్యంలో నెల్లూరు చెరువు ఒడ్డున గణేశ్ ఘాట్ వద్ద ఈనెల 5,6,7 తేదీల్లో మహాకార్తిక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన గణేశ్ ఘాట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో తెదేపా నేతలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, భానుశ్రీతోపాటు సింహపురి కార్తిక దీపోత్సవ సమితి సభ్యులు బయ్యా మల్లిక, జయప్రద, సుభాషిణి, జయరాం, వ్యాసప్రసాద్, పి.సురేంద్రరెడ్డి, నాగరాజారెడ్డి, జనార్దన్‌రాజు, సురేశ్, విజయకుమార్, నాగరాజరెడ్డి, మండ్ల ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్‌పై శాఖాపరమైన విచారణకు ఆదేశం

నెల్లూరు(జీజీహెచ్): ప్రభుత్వ వైద్య కళాశాలలో పనిచేస్తున్న ప్రొఫెసర్ ఆఫ్ రేడియో డయాగ్నోసిస్ డాక్టర్ డి.ధనలక్ష్మిపై శాఖాపరమైన విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. అనధికారికంగా గైర్హాజరుపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ విచారణ చేయనున్నట్లు తెలిసింది. ఉత్తర్వులు అందుకున్న పది రోజుల్లోపు ఆమె రాత పూర్వకంగా సమాధానం ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి సంక్షేమ పథకాలు

నెల్లూరు(విద్య): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని వాటిని వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని ఐటీడీఏ అధికారి మల్లికార్జునరెడ్డి అన్నారు. గిరిజన నాయకుడు బిర్సా ముండా జయంత్యుత్సవాల్లో భాగంగా సోమవారం నగరంలోని గిరిజన భవన్‌లో గిరిజనులకు అమలవుతున్న పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు గిరిజన నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సింగిల్ నంబర్లాటపై పోలీసుల దాడి

నెల్లూరు (నేర విభాగం): నగరంలోని కతారిపాలెంలో సింగిల్ నంబర్లాట జరుగుతున్నట్లు సోమవారం సంతపేట ఇన్‌స్పెక్టర్ వైవీ సోమయ్యకు సమాచారం అందింది. ఆయన తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. లాటరీ రాస్తున్న ఐదుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10,190 నగదు స్వాధీనం చేసుకున్నారు.

నాలుగో అంతస్తు నుంచి పడి పశ్చిమబెంగాల్ వాసి మృతి

నెల్లూరు(నేర విభాగం): నగరంలోని లీలామహల్ సమీపంలో ఓ డాక్టర్ నూతనంగా భవనం నిర్మిస్తున్నారు. అందులో పశ్చిమబెంగాల్‌కు చెందిన బాదుషా తన ప్రాంతానికి చెందిన పలువురితో టైల్స్ పనులు చేయిస్తున్నారు. సోమవారం నాలుగో అంతస్తులో పనులు చేస్తున్న సజల్ మెహతా(20) ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. చిన్న బజారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురస్కారాలు అందుకున్న మహిళలు

ఘనంగా గృహిణుల పండగ

నెల్లూరు(జడ్పీ): జాతీయ గృహిణుల దినోత్సవం సందర్భంగా సోమవారం నగరంలో వికాస్ సేవా సమితి నిర్వహించిన మహిళలే.. మహరాణులు.. గృహిణులే ప్రతి ఇంటికి వెలుగులనే నినాదంతో విశేష కార్యక్రమం సాగింది. బాలాజీ నగర్‌లో వికాస్ స్కూలు మైదానం ఇందుకు వేదికగా మారింది. ఆ సంస్థ నిర్వాహకులు, తెదేపా నేత కర్తంరెడ్డి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్పొరేషన్‌లో పనిచేస్తున్న డిప్యూటీ డైరెక్టర్ జి.మాధురి, సిటీ ప్లానర్ హిమబిందు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. మహిళా పారిశుద్ధ్య కార్మికులు, వివిధ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు, టీచర్లు, గృహిణులను సత్కరించారు. పుష్పాభిషేకం చేశారు.

ఔషధ నియంత్రణ శాఖ ఏడీగా హరిహర తేజ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: ఔషధ నియంత్రణ శాఖ జిల్లా ఏడీగా డి.హరిహర తేజను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నగరంలోని ఆ శాఖ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ని జిల్లా కెమిస్టు, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రదీప్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి నరేంద్ర కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అమ్మో.. మ్యాన్‌హోల్స్

న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

నెల్లూరు నగరంలో మ్యాన్‌హోల్స్ గుంతలు ప్రమాదకరంగా మారాయి. ప్రతి వీధిలో ఇవి దర్శనమిస్తున్నాయి. వీటితో ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ సమయంలో అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో అస్తవ్యస్తంగా ఏర్పాటయ్యాయి. ఎక్కువ చోట్ల రోడ్డు లెవల్ కన్నా దిగువకు నిర్మించారు. ప్రధానంగా కరెంటాఫీసు, బీవీనగర్, వేదాయపాలెం, మాగుంట లేఅవుట్, బాలాజీ నగర్ ఇలా పలు ప్రాంతాల్లో ఇదే సమస్య నెలకొంది. కొన్ని రోడ్డుకన్నా ఎత్తుగా ఉండగా, మరి కొన్ని గుంతలుగా దర్శనమిస్తున్నాయి. బీవీ నగర్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే వీధిలో అత్యధికంగా ఉన్నాయి.

బీవీనగర్‌లో ప్రమాదకరంగా..

సమస్య జటిలం: వర్షాకాలంలో మ్యాన్‌హోల్స్‌తో మరిన్ని సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. గుంటల్లో నీరు చేరుతుండటంతో వాటిని గుర్తించలేని వాహనచోదకులు గాయాలపాలవుతుండగా, వాహనాలు అందులో పడి మరమ్మతులకు గురవుతున్నాయి. గుంటల్లో చేరిన నీరు వాహనాల తాకిడికి ఎగిరి పాదచారులపై పడుతుండటంతో వారు అసౌకర్యానికి గురవుతున్నారు. కాగా గుంతలుగా ఉన్న చోట మట్టి పోశారు. వర్షాలకు కొట్టుకుపోయి గుంతలు పెద్దవిగా తయారయ్యాయి. అధికారులు స్పందించి మ్యాన్‌హోల్స్‌ను సరిచేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.

హామీల అమలులో విఫలం

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: విద్యార్థులు తలచుకుంటే ప్రభుత్వాలే కూలిపోతాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వలరాజు నాసర్ జీ అన్నారు. సోమవారం నగరంలోని అనిత పంక్షన్ హాలులో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలను పరిష్కరించాలంటూ ఇచ్ఛాపురం నుంచి ప్రారంభించిన బస్సు యాత్ర నెల్లూరు చేరుకున్న సందర్భంగా బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఎన్నో హామీలు ఇచ్చిందని ఒక్కటీ నెరవేర్చలేదని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌షరీఫ్, నగర కార్యదర్శి శివమ్‌వర్మ, జిల్లా సమితి సభ్యులు ఎస్తాని, జీవన్, సాయి, కోటి, సర్దార్, జాహ్నవ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత చాటుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

త్వరితగతిన పట్టాలు అందిస్తాం

నెల్లూరు(గ్రామీణం): నగరంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఇంటిపట్టాలు ఇప్పించాలని ముత్తుకూరు మండలం పిడతపోలూరుకు చెందిన 40 కుటుంబాల వారు ఆర్డీవో అనూషను కలిసి వినతి పత్రం అందించారు. ఆమె మాట్లాడుతూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ వారంలోనే గ్రామసభ నిర్వహించి ఆ పేర్లను కలెక్టరేట్ ద్వారా ఏఆర్సీ కమిటీకి ప్రతిపాదిస్తామని హామీ ఇచ్చారు.

ఉత్తరక్రియలు

మా ఇంటి వెలుగు శ్రీ త్రివేణి ఇండస్ట్రీస్ అధినేత కీ॥శే॥ శ్రీ చిమ్మిరి గోవిందరాజులు గారు తేది 22-10-2025న బుధవారం స్వర్గస్తులైనారు. మీ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని మనసారా భగవంతుని ప్రార్థిస్తూ..

కీ॥శే॥ శ్రీ చిమ్మిరి గోవిందరాజులు గారు మరణం: 22-10-2025

ఇట్లు: కుమారుడు
చిమ్మిరి హర్షవర్ధన్ & కుటుంబ సభ్యులు
& త్రివేణి ఇండస్ట్రీస్ స్టాఫ్

పెద్దకర్మ: తేది: 05-11-2025 బుధవారం, డోర్.నెం. 27-6-117, 6వ పట్టణ పోలీస్‌స్టేషన్ దగ్గర, M.S.R. పార్క్‌ప్రక్కన, A.C.నగర్, నెల్లూరులో మా స్వగృహము నందు జరుగును.

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్
నెల్లూరు బ్రాంచ్, నెల్లూరు జిల్లా, ఫోన్. 8925950064

బహిరంగ ప్రకటన

మా ఖాతాదారులకు మా సేవలను ఏకీకృతం చేసేందుకు మరియు పటిష్టపరిచేందుకు మరియు కొన్ని పాలనాపరమైన సౌకర్యాలు అందించే కృషిలో భాగంగా మా నెల్లూరు బ్రాంచ్, **డి.నెం. 16/3, ఆర్.ఆర్. వీధి, నర్తకి థియేటర్ ఎదురుగా, నెల్లూరు - 524001, ఆంధ్రప్రదేశ్** నుండి **డి.నెం.16/1/120, జొన్నలగడ్డ వారి వీధి, రామ్‌జీ నగర్, నెల్లూరు - 524001, ఆంధ్రప్రదేశ్** నకు తరలించబడుతుంది. సదరు ఆవరణ నుండి పనిచేస్తూ అన్ని రకాల సాధారణ బ్యాంకింగ్ వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తుంది.
మా బ్రాంచ్ యొక్క లాకర్ హోల్డర్ ఖాతాదారులందరికీ ప్రతిపాదిత ఆవరణకు **తేది.10.12.2025**న లాకర్లు తరలించేటప్పుడు అత్యంత జాగ్రత్త తీసుకోబడునని కూడా మేము తెలియజేస్తున్నాము. అయితే, ఎవరైనా కస్టమర్ లాకర్‌లో ఉంచిన వస్తువులను/ఐటమ్‌లను స్వాధీనం చేసుకోవాలనుకుంటే, అతను/ఆమె **తేది.09.12.2025, సాయంత్రం 05.00 గంటలలోపు** స్వాధీనం చేసుకొని, కొత్త ప్రాంగణానికి మారిన తర్వాత వాటిని తిరిగి డిపాజిట్ చేయవచ్చు.
పైన తెలిపిన బదిలీ కొరకు మా ప్రస్తుత లాకర్ అద్దె దారులను సహకరించవలసినదిగా కోరుచున్నాము మరియు మా ఉత్తమమైన సేవలను మీకు అన్ని వేళలా అందించగలమని మేము మీకు హామీ ఇస్తున్నాము.
ప్రదేశం : నెల్లూరు, తేది : **03-11-2025** సం/- బ్రాంచి మేనేజర్

यूनियन बैंक Union Bank of India
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
దర్గామిట్ట బ్రాంచ్-3, నెల్లూరు
దర్గామిట్ట, రెయిన్ స్క్వేర్ దగ్గర, గ్రాండ్ ట్రంక్ రోడ్, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు

స్వాధీనత ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 యొక్క రూల్ 8(1)) (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (యాక్ట్ 54/2002 క్రింద) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 3 తో చదవబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ
ఋణగ్రహీత : **M/s Duke Herbals**, ప్రొప్రయిట్రిక్స్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న: షేక్ సమీనా, డి.నెం.24-1-1819, అంబేద్కర్ నగర్, దర్గామిట్ట, యస్‌పియస్ఆర్ నెల్లూరు-524003. **హామీదారు/తనఖాదారు : లేటు శ్రీ షేక్ షంషీర్ గారి చట్టపరమైన వారసులు, తండ్రి : లేటు షేక్ మొహమ్మద్ సర్వర్ సాహెబ్,** డి.నెం.11-770, కాత్రిపాలెం, మహాలక్ష్మి ఆలయం, సంతపేట, యస్‌పియస్ఆర్ నెల్లూరు-524001.
వార్లను డిమాండ్ నోటీసు అందుకున్న తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో తెలిపిన బకాయి **రూ.6,24,436.52 పై. (అక్షరాల ఆరు లక్షల ఇరవై నాలుగు వేల నాలుగు వందల ముప్పై ఆరు రూపాయలు మరియు యాభై రెండు పైసలు మాత్రమే)** చెల్లించమని కోరుతూ **తేది.14.07.2025**న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.
సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో ఋణగ్రహీతలు విఫలమైనందున సదరు సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్సు 2002 రూల్స్ యొక్క రూల్ 8తో చదువుకొనవలసిన సదరు చట్టం ద్వారా సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు దిగువ వివరించిన ఆస్తిని **తేది.30.10.2025**న స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.
ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) లోని నిబంధనలు గమనించగలరు.
ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా, సదరు ఆస్తితో ఎవరూ ఎట్టి లావాదేవీలు జరుపరాదు. సదరు ఆస్తితో జరిపే ఎటువంటి లావాదేవీలైనా బకాయి మొత్తం వడ్డీ & ఖర్చులతో సహా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఛార్జికి లోబడి ఉంటాయి.
స్థిరాస్తి వివరములు : ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్, నెల్లూరు బిట్-1, సంతపేట, రాజుల షా టెక్కియా వీధి, ప్రస్తుతం కటారిపాలెం, సర్వే నెం.1215 & 1553, పాత వార్డు నెం.5, పాత డి.నెం.43, క్రొత్త వార్డు నెం.11, పాత డి.నెం.340 & క్రొత్త డి.నెం.782 మరియు అసెస్‌మెంట్ నెం.1031013036 వద్ద 24 అంకణములు లేదా 292 చ.గ.లు విస్తీర్ణం గల భూమి అందలి నిర్మించిన ఆర్‌సిసి రెసిడెన్షియల్ భవనము యావదాస్థి లేటు శ్రీ షేక్ షంషీర్, తండ్రి : లేటు సర్వర్ సాహెబ్ గారి పేరున కలదు.
హద్దులు: తూర్పు : ఈ ఆస్థికి మరియు షేక్ అహ్మద్ బాషా గారి ఆస్థికి మధ్య 4.2 అడుగులు వెడల్పు ఉమ్మడి నడకదారి, దక్షిణం : సయ్యద్ ఇస్మాయిల్ గారి ఇల్లు కొంతమేర మరియు లేటు దీపాల బాబురావు గారి ఇల్లు కొంతమేర, పడమర : షేక్ ఆరిఫా గారి ఇల్లు, ఉత్తరం : షేక్ అహ్మద్ బాషా (రాయల్ టైలర్స్) గారి ఇల్లు కొంతమేర మరియు లక్ష్మి బాయి గారి ఇల్లు కొంతమేర.
తేది : 30.10.2025, ప్రదేశం : నెల్లూరు సం/-అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బ్యాంక్ ఆఫ్ బరోడా बैंक ऑफ़ बड़ौदा
బ్యాంక్ ఆఫ్ బరోడా
నెల్లూరు బ్రాంచి, 1వ అంతస్తు, 16-4-426, NR ఎస్టేట్, ఇందిరా భవన్ రోడ్డు, నెల్లూరు-524001, ఆంధ్రప్రదేశ్. ఫోన్స్: 0861-2327269 & 0861-2302727

అమ్మకానికి ముందు నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం-2002 (SARFAESI చట్టం-2002) లోని రూల్ 8(6) లోని నిబంధనల ప్రకారం జారీ చేయబడింది.
టు, M/s.BIOTRIX ఫార్ములేషన్స్ (ఋణగ్రహీత) తరపున యజమాని: శ్రీమతి కటకూర ప్రసూన, R/o.డి-బ్లాక్, 26-6-1001, ఆటోనగర్, మౌర్య నగర్, గవర్నమెంట్ హాస్పిటల్ వెనుక, నెల్లూరు-524002, ఆంధ్రప్రదేశ్. శ్రీమతి కటకూర ప్రసూన (ఋణగ్రహీత), యజమాని: M/s.BIOTRIX ఫార్ములేషన్స్, R/o.డి.నెం.304, శ్రీ లక్ష్మి శ్రీనివాస రెసిడెన్సీ, రత్నం హైస్కూల్ దగ్గర, ఏసి నగర్, నెల్లూరు-524004, ఆంధ్రప్రదేశ్ మరియు హామీదారు: శ్రీ కటకూర వెంకటేశ్వర్లు, తండ్రి: శ్రీ కటకూర పెద్ద రమణయ్య, R/o.27-3-570, డి.నెం.304, శ్రీ లక్ష్మి శ్రీనివాస రెసిడెన్సీ, రత్నం హైస్కూల్ ఎదురు, ఏసి నగర్, నెల్లూరు-524004, ఆంధ్రప్రదేశ్.
డియర్ సార్ / మేడమ్,
విషయము: సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం-2002 (SARFAESI చట్టం-2002) లోని రూల్ 8(6) లోని నిబంధనల ప్రకారం జారీ చేయబడింది.
బ్యాంక్ ఆఫ్ బరోడా, నెల్లూరు బ్రాంచి తరపున ఈ దిగువ తెలిపిన సంబంధిత ఋణ ఖాతాలకు సంబంధించిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు క్రింద తెలియజేసిన మొత్తములు చెల్లించవలసినదిగా చట్టం యు/సెక్షన్ 13(2) కు అనుబంధమైన రూల్ 3 తో చదవబడిన అధికారాలను వినియోగించుకుని డి.26-09-2024 న డిమాండ్ నోటీసు జారీ చేసినారు. ఈ నోటీసు అందిన 60 రోజులలోగా మొత్తాన్ని తిరిగి చెల్లించాలని కోరారు.
ఋణగ్రహీతలు / హామీదారులు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, బ్యాంక్ ఆఫ్ బరోడా, అధీకృత అధికారి, ఆ చట్టంలోని యు/సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూల్ 4 మరియు/లేదా రూల్ 8 ద్వారా ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుని, డి.25.02.2025 నాటి స్వాధీన నోటీసులో పూర్తిగా వివరించిన విధంగా సెక్యూర్డ్ ఆస్తులను (ఇక్కడ పేర్కొన్న ఆస్తి / ఆస్తులు) స్వాధీనం చేసుకున్నారు మరియు SARFAESI చట్టం క్రింద పరిగణించబడిన నియమాలలోని రూల్ 8(1) మరియు రూల్ 8(2) కి అనుగుణంగా, ప్రాంతీయ భాష మరియు ఇంగ్లీషు వార్తా పత్రికలలో ఆయా తేదీలలో సదరు స్వాధీనతా ప్రకటన కూడా ప్రచురించడమైనది.
ఋణగ్రహీత /హామీదారు యొక్క స్థిరాస్తులు స్వాధీనానికి అనుగుణంగా, SARFAESI చట్టం 2002 యు/సెక్షన్ 13(4) (ఎ) క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుని, ఈ దిగువ సంతకందారు క్రింద తెలిపిన ఆస్తులను విక్రయించడం ద్వారా బ్యాంక్ బకాయిలను వసూలు చేయాలని ప్రతిపాదిస్తున్నారు. కావున సబ్జెక్ట్ చట్టంలోని నిబంధనలు మరియు దాని కింద రూపొందించిన నియమాల ప్రకారం, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8(6) కింద అమ్మకానికి ముందు మొత్తం బాధ్యతను నిర్వర్తించడానికి ఈ 30 రోజుల నోటీసును నేను అందిస్తున్నాను.
మీ అందరు ఈ నోటీసు తేది నుండి 30 దినములలోగా దిగువ తెలిపిన పూర్తి బకాయి మొత్తమును ప్లస్ తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి, బ్యాంక్ స్వాధీనంలో నున్న దిగువ చెప్పబడిన ఆస్తిని విడిపించుకోవలసినదిగా చిట్టచివరి అవకాశం ఇవ్వడమైనది. అట్లు చేయడంలో విఫలమైనచో "ఎక్కడ ఏది ఉన్నదో అది", "ఎలా ఉన్నదో అలా" "అక్కడ ఏది ఉంటే అది" మరియు "సహాయం లేకుండా" పద్ధతి ద్వారా నిబంధనలలో పేర్కొన్న రూల్ 8(5) క్రింది పద్ధతుల్లో దేనినైనా అనుసరించడం ద్వారా ఆస్తులు విక్రయించబడతాయి:
(ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులతో లావాదేవీలు చేస్తున్న వ్యక్తుల నుండి కొటేషన్లు పొందుట ద్వారా లేదా
(బి) పబ్లిక్ నుండి టెండర్లు కోరుట ద్వారా లేదా
(సి) ఇ-వేలం పద్ధతి ద్వారాతో పాటు బహిరంగా వేలం నిర్వహించుట ద్వారా లేదా
(డి) ప్రైవేటు ఒప్పందం ద్వారా

సౌకర్యాల వివరాలు	డిమాండ్ నోటీసు తేది	స్వాధీనత తేది	స్వాధీనత నోటీసు ప్రచురించిన తేదీ:	23.09.2024 నాటికి చెల్లించాల్సిన బకాయి మొత్తం
Overdraft Loan (09800500000150)	26.09.2024	25.02.2025	25.02.2025	23.09.2024 నాటికి రూ.48,30,802.73/- (అక్షరాల నలభై ఎనిమిది లక్షల ముప్పై వేల ఎనిమిది వందల రెండు రూపాయలు మరియు డెబ్బై మూడు పైసలు మాత్రమే) + డి.24.09.2024 నుండి చెల్లించని వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొ॥, ఏదైనా ఉంటే, అమలు తేదీ వరకు.

స్థిరాస్తుల వివరణ
షెడ్యూలు-ఎ: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రిజిస్ట్రేషన్, స్టోన్‌హౌస్‌పేట సబ్-రిజిస్ట్రేషన్, నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్, నెల్లూరు బిట్-2 ఏరియా, సర్వే నెం.551 & 554 లోని స్థలమును ఇంటి స్థలములుగా మార్చబడినది, నెల్లూరు సిటీ, ఏ.సి.నగర్ ఏరియా, కోదండరామపురం, మునిసిపల్ వార్డు నెం.27-2, సమీప డోర్ నెం.1063 నందు 29 అంకణములు మరియు 57 చ॥అ॥ విస్తీర్ణము గల ప్లాట్ నెం.17 మరియు 31 అంకణములు మరియు 59 చ॥అ॥ విస్తీర్ణము గల ప్లాట్ నెం.16 నందు మొత్తం 61 అంకణములు మరియు 34 చ॥అ॥ లేదా 411.187 చ॥మీ॥ మొత్తం విస్తీర్ణముగల ఖాళీస్థలము ఈ దిగువ హద్దులలో: తూర్పు: లేఅవుట్ రోడ్డు, పడమర: తుపిలి రంగారెడ్డి యొక్క ఇల్లు మరియు స్థలము, ఉత్తరం: తిరుమల రాజు సరస్వతీ యొక్క ఇల్లు మరియు స్థలము కొంత విస్తీర్ణము మరియు ప్లాట్ నెం.18 లోని ఇల్లు మరియు స్థలము కొంత విస్తీర్ణము, దక్షిణం: చానెల్.
ఈ పై హద్దుల మధ్యలోని 61 అంకణములు మరియు 34 చ॥అ॥ లేదా 411.187 చ॥మీ॥ విస్తీర్ణము గల ఖాళీస్థలముగల ప్లాట్ నెం.16 & 17 నందు 1/18వ వంతు అవిభాజ్యపు మరియు అనిర్దిష్టపు భాగమైన 3.41 అంకణములు లేదా 27.32 చ॥గ॥ లేదా 245.89 చ॥అ॥ లేదా 22.84 చ॥మీ॥ విస్తీర్ణముగల ఖాళీస్థలము అన్ని అనుషంగిక హక్కులతో సహా.
షెడ్యూలు-బి: అసెస్‌మెంట్ / ఐ.డి.నెం.1031074802, డోర్ నెం.27/3/570(304) తో పైన షెడ్యూలు-ఎ ఆస్తిలో నిర్మించిన "యస్.యస్.యస్. హోమ్స్" రెసిడెన్షియల్ కాంప్లెక్స్, మూడవ అంతస్తులో అన్ని కామన్ ఏరియాలు కలుపుకొని 784 చ॥అ॥ లేదా 72.835 చ॥మీ॥ విస్తీర్ణములోని ప్లాట్ నెం.304 ఆస్తికి సంబంధించిన యావదాస్తి. ఈ దిగువ హద్దులలో: తూర్పు: ఈ భవనము స్థలము, పడమర: ఉమ్మడి వరండా నుండి కొంత విస్తీర్ణము మరియు మెట్లు నుండి కొంత విస్తీర్ణము, ఉత్తరం: ఈ ప్లాట్‌కు మరియు ప్లాట్ నెం.303 మధ్యలోని ఉమ్మడి గోడ, దక్షిణం: ఈ భవనము స్థలము.
చట్టం నందు / అమలులోనున్న ఏదైనా ఇతర న్యాయపరిధిలో బ్యాంక్‌కు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా పక్షపాతం లేకుండా ఈ నోటీసు జారీ చేయటమైనది.
తేది : 31-10-2025 సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
ప్రదేశం : నెల్లూరు బ్యాంక్ ఆఫ్ బరోడా

(c) eenadu

డ్వాక్రా సొమ్ము రూ.31 లక్షలు కాజేత

■ వైకాపా సానుభూతిపరుడు బ్యాంకు కరస్పాండెంట్‌గా ఉంటూ మోసం!

ప్రసన్నాయపేట(చెన్నేకొత్తపల్లి), న్యూస్‌టుడే: డ్వాక్రా సంఘాల మహిళలకు నమ్మకస్తుడిగా ఉంటూ బ్యాంకు కరస్పాండెంట్ ఒకరు రూ.31 లక్షలకుపైగా సొమ్ము కాజేశాడు. ఈ ఘటన శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం ప్రసన్నాయపేట గ్రామంలో సోమవారం వెలుగు చూసింది. డ్వాక్రా సంఘాల మహిళలు, వెలుగు సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. ప్రసన్నాయపేటకు చెందిన వైకాపా సానుభూతిపరుడు కృష్ణారెడ్డి కనుముక్కల 'ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు' శాఖలో బీసీ (బిజినెస్ కరస్పాండెంట్)గా పని చేస్తున్నాడు. గ్రామంలోని డ్వాక్రా సంఘాల మహిళలు తాము తీసుకున్న రుణాలకు చెల్లించే నెలవారి కంతుల సొమ్మును కృష్ణారెడ్డికి అందజేసేవారు. నగదు తీసుకుని పుస్తకంలో నమోదు చేసుకునేవాడు. దానికి రసీదు ఒక నెల ఇస్తే మరో నెల ఇచ్చేవాడు కాదు.

సంఘాల సభ్యులను విచారిస్తున్న బ్యాంకు రీజినల్ అధికారులు

ఒత్తిడి తెస్తే ఏవో సాకులు చెప్పి దాటవేసేవాడు. వెలుగు సీసీ రమేష్ డ్వాక్రా సంఘాల రుణాలు, వాయిదా చెల్లింపులను పరిశీలించారు. సభ్యులు చెల్లించామని చెబుతున్న నగదుకు, వాస్తవ రుణ నిల్వకు చాలా వ్యత్యాసం ఉండటంతో పరిస్థితిని వారికి వివరించారు. వారు బ్యాంకుకు వెళ్లి నగదు చెల్లింపులపై ఆరా తీయగా వివరాలను అధికారులు అందించారు. దీనిపై కృష్ణారెడ్డిని అడిగేందుకు మహిళలు అతని ఇంటి వద్దకు వెళ్లగా అందుబాటులో లేడు. దీంతో అతడే మోసానికి పాల్పడినట్లు నిర్ధారించుకున్నారు. బ్యాంకు రీజినల్ అధికారులు గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టగా రెండేళ్ల నుంచి రూ.31 లక్షలకుపైగా మోసం జరిగినట్లు గుర్తించారు. వీటిని ఉన్నతాధికారులకు నివేదిస్తామని విచారణ అధికారులు తెలిపారు. మోసం విషయం వెలుగులోకి రావడంతో కృష్ణారెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం.

సీఎంఎస్-03 ప్రయోగంలో ధర్మవరం పాత్ర

ధర్మవరం, న్యూస్‌టుడే: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన సీఎంఎస్-03 ఉపగ్రహ ప్రయోగం విజయవంతంలో పట్టణానికి చెందిన ఇస్రో ఇంజినీర్ అంబటి ప్రవీణ్‌కుమార్ పాలుపంచుకున్నారు. ఆదివారం శ్రీహరి కోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ ప్రయోగ వేదిక నుంచి సీఎంఎస్-03 నింగిలోకి దూసుకెళ్లిన విషయం తెలిసిందే. పట్టణంలోని సాయినగర్‌కు చెందిన అంబటి శ్రీనివాసులు, చంద్రకళ కుమారుడైన ప్రవీణ్‌కుమార్ కొన్నేళ్లుగా ఇస్రోలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు.

అంబటి ప్రవీణ్‌కుమార్

ధర్మవరం పురపాలక వైస్ ఛైర్మన్‌గా పనిచేసిన అంబటి శ్రీనివాసులు ఇటీవల మృతి చెందారు. ప్రయోగం విజయవంతంలో అంబటి ప్రవీణ్‌కుమార్ పాత్రపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు ఇక్కడి నుంచి అభినందనలు వెల్లువెత్తాయి.

ఫిర్యాదులపై నిర్లక్ష్యం తగదు: కలెక్టర్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: తమ సమస్యలు తీరుతాయన్న ఆశతో వ్యయప్రయాసలకోర్చి ఇక్కడికి వచ్చి ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా నిర్దేశిత గడువులోపు నాణ్యమైన పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సోమవారం ఆయన కలెక్టరేట్‌లో జేసీ మౌర్యభరద్వాజ్‌తో కలిసి ఫిర్యాదుదారుల నుంచి వివిధ సమస్యలపై 306 అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల్లో తెలిపిన సమస్యలను క్షేత్రస్థాయికి స్వయంగా వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ జరిపి, వారు సంతృప్తి చెందేలా తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. సకాలంలో స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒకే సమస్యపై పదేపదే వచ్చిన ఫిర్యాదులకు సంబంధించిన శాఖలపై కఠిన చర్యలుంటాయన్నారు. ప్రతి శాఖ అధికారి బాధ్యతగా సమస్యలను తీర్చాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి, ఆర్డీఓ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలలో కొన్ని..: రొద్దం మండలం భూమిరెడ్డిపల్లికి చెందిన ముత్యాలయ్య అనే వ్యక్తి తన అధీనంలోని భూమిని ఇతరులు కబ్జా చేయడానికి యత్నిస్తున్నారని, పరిశీలించి న్యాయం చేయాలని వేడుకున్నారు. హిందూపురం మండలం చలివెందుల రెవెన్యూ పరిధి రాజుపల్లి గ్రామంలో సర్వే నంబరు 263-2లో తన పేరుతో భూమి ఉందని, కొంతమంది వ్యక్తులు అధికారుల అండతో దౌర్జన్యం చేసి ఆక్రమించుకోవడానికి చూస్తున్నారని రైతు సంజీవరెడ్డి వాపోయారు. తనకు న్యాయం చేయాలని విన్నవించారు.

అర్జీలు పునరావృతం కానివ్వకండి

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులను చట్టపరిధిలో ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, అవి పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా పోలీసు అధికారులదేనని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. సైబర్ నేరాలు, కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు, ఇతర సమస్యలపై జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 72 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో చరవాణిలో మాట్లాడి చట్టపరిధిలో విచారించి సత్వర న్యాయం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు, ఎస్బీ సీఐ వెంకటేశ్వర్లు, న్యాయ సలహాదారు సాయినాథరెడ్డి, సీఐలు ఇస్మాయిల్, లక్ష్మీకాంత్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ సతీష్‌కుమార్

భద్రతకు భరోసా ఏదీ?

- రోడ్డు ప్రమాదాలతో వీధినపడుతున్న వందలాది కుటుంబాలు
- ప్రకటనలకే పరిమితమవుతున్న నియంత్రణ చర్యలు



ఈనాడు, అనంతపురం: రోడ్డుపైకి వస్తే సురక్షితంగా ఇంటికి చేరతామా.. అనే సంశయం తలెత్తుతోంది. ఏ వైపు నుంచి ప్రమాదం ముంచుకొస్తుందో అంచనా వేయలేని పరిస్థితి. ఎక్కడ ఏ గుంత నోరు తెరుచుకుని.. వాహనదారులను మింగేస్తుందో తెలియడం లేదు. రెప్పపాటులో సంభవిస్తున్న ప్రమాదాలు ఎన్నో కుటుంబాలను వీధిన పడేస్తున్నాయి. ఏటా వందల సంఖ్యలో దుర్ఘటనలు జరుగుతున్నా భద్రతపై అధికారులు దృష్టి పెట్టడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే పోలీసు, రవాణా శాఖ అధికారులు హడావుడి చేస్తున్నారు. తర్వాత షరా మామూలే. ఉమ్మడి అనంత జిల్లాలో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

జాతీయ రహదారిలోని కీలక కూడళ్ల వద్ద ట్రాఫిక్ నియంత్రణను గాలికొదిలేశారు. చాలాచోట్ల సర్వీస్ రోడ్లు లేకపోవడం వల్ల స్థానికులు వ్యతిరేక దిశలో ప్రయాణం సాగిస్తున్నారు.

● కూడళ్ల నుంచి గ్రామాలకు వెళ్లే ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. చాలా సందర్భాల్లో డ్రైవర్‌కు రెండువైపులా కూర్చోబెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు. ఇలాంటి సందర్భాల్లో వాహనాన్ని నియంత్రించలేక ప్రమాదాలు జరుగుతున్నాయి.

పనిచేయని స్పీడ్‌గన్లు

ఉమ్మడి జిల్లా పరిధిలో 600 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు విస్తరించి ఉన్నాయి. వేగ నియంత్రణకు స్పీడ్‌గన్లు ఉపయోగించడం లేదు. ఉన్న రెండూ పని చేయకపోవడంతో మూలనపడేశారు. కొత్తవాటి కోసం ప్రతిపాదనలు పంపినా మోక్షం లభించలేదు.

ప్రతిపాదనలు పట్టాలెక్కేనా..

ప్రమాదాలు ఎక్కడ జరిగినా ఆర్ అండ్‌బీ లేదా ఎన్‌హెచ్ఏఐ ఇంజినీర్లు, రోడ్డు రవాణాశాఖ ఎంవీఐ, పోలీసు అధికారి కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. నిర్మాణ లోపమా? వాహన కండిషన్‌లో లేదా? మానవ తప్పిదమా? నిర్లక్ష్యమా? తదితర అంశాలను నివేదికలో పొందుపరచాలి. వీటిపై ప్రతినెలా జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో సమీక్షించాలి. రహదారి డిజైన్‌లో లోపం ఉంటే మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు సమావేశాలు జరుగుతున్నా అందులో ప్రతిపాదించే అంశాలు చాలావరకు అమల్లోకి రావడం లేదు.

అనంత జిల్లాలో (అన్ని ప్రమాదాలు)

ఏడాది	ప్రమాదాలు	మృతులు
2022	540	331
2023	532	350
2024	544	343
2025	299	164

శ్రీసత్యసాయి జిల్లాలో (అతివేగంతో)

ఏడాది	ప్రమాదాలు	మృతులు
2024	22	28
2025	39	44

(అక్టోబరు వరకు)

బ్లాక్‌స్పాట్‌లు ఎక్కడంటే..

1 ఎన్‌హెచ్ 44 (హైదరాబాద్-బెంగళూరు): గుత్తి చౌరస్తా, పామిడి, కల్లూరు, గార్లదిన్నె, తపోవనం, రాప్తాడు, రామినేపల్లి, సీకే పల్లి, పెనుకొండ, సోమందేపల్లి, పాలసముద్రం, కొడికొండ చెక్‌పోస్ట్.

2 ఎన్‌హెచ్ 42 (బళ్లారి-కదిరి): పాల్తూరు, ఉరవకొండ, చిన్నముష్టూరు, పంగల్‌రోడ్డు, ముదిగుబ్బ, పట్నం

3 ఎన్‌హెచ్ 67 (బళ్లారి-తాడిపత్రి): కొత్తపేట, టి.కొత్తపల్లి క్రాస్, వంగనూరు, అర్జాస్ స్టీల్ ప్లాంట్, చుక్కలూరు, రాయలచెరువు

4 ఎన్‌హెచ్ 544డి (అనంతపురం-తాడిపత్రి): ఎర్రగుంటపల్లి, వెంకటరెడ్డిపల్లి

తగిన చర్యలు తీసుకుంటున్నాం

- జగదీశ్, ఎస్పీ, అనంతపురం

రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో ప్రతిపాదనలను వీలైనంత వరకు అమలు చేస్తున్నాం. ప్రమాదాల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవలే బ్లాక్‌స్పాట్‌ల వద్ద సీసీ కెమెరాలు, లైటింగ్, సూచికబోర్డులు ఏర్పాటు చేశాం.

మేళాలో నమూనాలను తిలకిస్తున్న ట్రస్టీ ఆర్‌జేరత్నాకర్

సనాతన ధర్మంలో శాస్త్రీయ దృక్పథం

■ ఆకట్టుకున్న విజ్ఞాన మేళా

పుట్టపర్తి, న్యూస్‌టుడే: 'ఆధ్యాత్మికతలో పొందుపరిచిన శాస్త్రీయత.. సర్వ మానవాళి శ్రేయస్సుకు ఉపయోగపడే ఆవిష్కరణలతోనే విజ్ఞానం వికసిస్తుంది' అనే సత్యాన్ని హృదయాలను హత్తుకునేలా బాలవికాస్ చిన్నారులు ప్రదర్శించిన విజ్ఞాన మేళా అమితంగా ఆకట్టుకుంది. పట్టణంలోని హయ్యర్ సెకండరీ స్కూల్‌లో సోమవారం సనాతన ధర్మం, శాస్త్రీయ దృక్పథంతో కూడిన విజ్ఞాన మేళాను ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జేరత్నాకర్ ప్రారంభించారు. రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన 150 మంది బాలవికాస్ గురువులు, 250 మంది చిన్నారులు సృజనాత్మకత, భక్తి, శాస్త్రీయతను మేళవించి ప్రదర్శించిన 170 వినూత్న నమూనాలను తిలకించి వారిని అభినందించారు. మేళాలో సత్యసాయి ఆధ్యాత్మిక సందేశాలు, ప్రేమ, శాంతి, సేవాతత్వం, శాస్త్రీయత ఉట్టిపడే దివ్య ఉపన్యాసాలు, చిన్న చిన్న కథల నుంచి శాశ్వత సత్యాలను వెలికితీసి, వాటిని సులభంగా అర్థమయ్యే దృశ్యరూపంలో ఆకర్షణీయంగా ప్రదర్శించారు. రెండు రోజుల పాటు మేళా సాగనుంది. కార్యక్రమంలో సత్యసాయి సేవాసంస్థల జాతీయ సేవా విభాగం సమన్వయకర్త కోటేశ్వరరావు, శశిబాల, రాష్ట్రసాయి సంస్థల అధ్యక్షుడు లక్ష్మణారావు, బాలవికాస్ గురువులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనిపిస్తున్నా.. కనికరించరా..?

గోరంట్ల మండలంలోని బూదిలివాండ్లపల్లి గ్రామం.. మేము ఏం పాపం చేశాం? రాకపోకలు సాగించడానికి నరకయాతన పడుతున్నాం. పలుమార్లు అధికారులకు విన్నవించి విసిగిపోయాం. ఇంకెప్పుడు మా కష్టాలను పట్టించుకుంటారు. ఇప్పటికైనా స్పందించరా అంటూ వాపోయారు. గ్రామస్థులు సోమవారం ప్రజాసమస్యల వేదికలో తహసీల్దార్ మారుతి ప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చి. రోడ్డు దుస్థితిపై ఆవేదన వ్యక్తం చేశారు.

- న్యూస్‌టుడే, గోరంట్ల

దైవరూపం.. బాలానందం

సోమందేపల్లిలోని అంబాభవాని ఆలయం వద్ద బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్యదర్శనం కొనసాగుతోంది. సోమవారం రాత్రి లక్ష్మీనారాయణ, రాధాకృష్ణులు, సీతారాముల వేషధారణలతో బాలికలు విశేషంగా ఆకట్టుకున్నారు. దేవతామూర్తుల రూపంలో కనువిందు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన నృత్య ప్రదర్శన ప్రత్యేకంగా నిలిచింది. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఎంతో ఆసక్తి తిలకించి పులకించిపోయారు.

-న్యూస్‌టుడే, సోమందేపల్లి

భగ్గుమంటున్న కూరగాయల ధరలు

సామాన్యులు ఉక్కిరిబిక్కిరి

ధర్మవరం పట్టణం, పుట్టపర్తి, న్యూస్‌టుడే: మార్కెట్లో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. ఏదీ కొనాలన్నా కిలో రూ.100 పలుకుతున్నాయి. గతంలో ఎన్నడూలేని విధంగా ధరలు పెరగడంతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. కేవలం పది రోజుల వ్యవధిలోనే ధరలు పెరగడం గమనార్హం. ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల్లో నీరు చేరి కూరగాయలు, ఆకుకూరల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. నీరు తగ్గకపోవడంతో పంటలకు తెగుళ్లు సోకి పాడయ్యాయి. దీంతో మార్కెట్‌కు ఆశించిన మేర దిగుబడి రావడం లేదు. కూరగాయలు స్థానికంగా దొరక్కపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని, దాంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.

కూరగాయలు (కిలో రూ.ల్లో)

	ప్రస్తుతం ధర	గత వారం
బీన్స్	100	60
ముల్లంగి	100	60
క్యారెట్	160	80
వంకాయలు	80	40
ఆలుగడ్డ	60	40
కాకర	100	60
గోరు చిక్కుడు	100	60

● ఐదేళ్ల కిందట జిల్లా వ్యాప్తంగా సుమారు 32 వేల హెక్టార్లలో కూరగాయలు సాగు చేసేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 18 వేల ఎకరాలలోపు చేరుకుందని ఉద్యాన శాఖాధికారుల గణాంకాలు చెబుతున్నాయి.

సంచి నిండటం లేదు - నారాయణమ్మ, పుట్టపర్తి

మార్కెట్‌కు రూ.500 తీసుకెళ్తే చిన్న సంచికి కూడా కూరగాయలు రావడం లేదు. వంటలు రుచిగా వండాలంటే పోషకాలతో కూడిన మంచి కూరలు ఉండాల్సిందే. ప్రతి రోజు తాజా కూరగాయలు అవసరం. అందుకే ధర పెరిగినా తప్పని పరిస్థితుల్లో కొంటున్నాం. ఇలాగైతే సామాన్యులు బతకలేని పరిస్థితి.

నైపుణ్యం.. కొలువుకు సోపానం

■ ఐటీఐ విద్యార్థులకు జర్మన్ భాషపై శిక్షణ

న్యూస్‌టుడే, ఉరవకొండ: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి మార్గం సుగమం చేస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ ఐటీఐల్లోని విద్యార్థులకు చదువు పూర్తవగానే ఉద్యోగావకాశాల కల్పనే లక్ష్యంగా శిక్షణ ఇప్పిస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో చదువుతున్న విద్యార్థులకు జర్మన్ భాషపై ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. ప్రతి సోమ, బుధవారాల్లో అమరావతి నుంచి జూమ్, వీడియో లింకేజీ ద్వారా ప్రక్రియ కొనసాగుతోంది.

కేటగిరీల ప్రకారం..

ఏ1, ఏ2 స్థాయిలోని విద్యార్థులకు రోజువారీ తరగతులతోపాటు వారంలో రెండు రోజులు ఆన్‌లైన్ ద్వారా బోధిస్తున్నారు. విద్యార్థులు శ్రద్ధగా పాఠాలు విని పరీక్షలు కూడా రాస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఐదు ప్రభుత్వ ఐటీఐల్లో 14 ట్రేడులు ఉన్నాయి. ఒక్కో ట్రేడు నుంచి పది మంది చొప్పున 1600 మంది, శ్రీసత్యసాయి జిల్లా నుంచి 200 మందిని ఈ శిక్షణకు ఎంపిక చేశారు. నిర్దేశిత సమయాల్లో వర్చువల్ విధానంలోనూ జర్మనీ భాష నేర్చుకునేలా కళాశాలల సిబ్బంది చొరవ చూపుతున్నారు.

అదే ఎందుకంటే?

ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థులకు జర్మనీలో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా ఎలక్ట్రికల్ పూర్తి చేసి కనీసం రెండేళ్ల పని అనుభవంతో వెళ్తే మొదటి నెల వేతనం సుమారు రూ.1.20 లక్షలు వస్తుంది. వీసా, విమాన ఛార్జీలు ఇతరత్రా ఖర్చులు అక్కడికి వెళ్లాక కంపెనీ వెనక్కి చెల్లిస్తుంది. దీంతో ఆ భాషను నేర్పించడానికి సర్కారు శ్రీకారం చుట్టింది.

సద్వినియోగం చేసుకునేలా.. - రాయపరెడ్డి, ఐటీఐల జిల్లా కన్వీనర్

విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి. జర్మన్ భాషపై పూర్తిస్థాయిలో పట్టు సాధించేలా కృషి చేస్తున్నాం. విద్యార్థుల నైపుణ్యానికి అనుగుణంగా ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు.

ప్రసంగిస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు శేఖర్

భాజపా బలోపేతమే ధ్యేయం

ధర్మవరం న్యూస్‌టుడే: భాజపా బలోపేతానికి ప్రతి కార్యకర్త పనిచేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ కోరారు. ఆయన సోమవారం పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో ప్రధాని మోదీ అధికారం చేపట్టి 12 ఏళ్లు అవుతోందని, అవినీతికి ఆస్కారం లేకుండా పాలన చేస్తున్నారన్నారు. ఆయన అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయిలో కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పట్టణంలో పార్టీ బలోపేతానికి పోలింగ్ బూత్ కమిటీలు, శక్తి కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని గుర్తుచేశారు. సమావేశంలో భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబిలేసు, జిల్లా కార్యదర్శి డోలా రాజారెడ్డి, నాయకులు పోతుల సురేష్, గిర్రాజు నగేష్, శంకర చంద్రశేఖర్, గుండా పుల్లయ్య, చంద్రమౌళి, ప్రవీణ్, నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోర్‌బాల్‌లో రజత పతకం కైవసం

బుక్కపట్నంలోని ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల బాలికలు రాష్ట్రస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలో ప్రతిభ చాటారు. ఏపీ ఫ్లోర్‌బాల్ సంఘం ఇటీవల నరసరావుపేటలో ఆదివారం రాష్ట్రస్థాయి పోటీలు జరిపింది. అండర్-12 విభాగంలో బుక్కపట్నం విద్యార్థినులు చక్కటి ఆటతీరు కనబరిచి రజత పతకాన్ని సాధించారు. విద్యార్థినులు కావ్య, సుధామణి, లక్ష్మీప్రసన్నలను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

-న్యూస్‌టుడే, బుక్కపట్నం

ecoren WALK-IN INTERVIEWS

Ecoren Energy is looking for experienced professionals for Wind and Solar Power Projects in Kurnool, Anantapur and Kadapa.

: Positions :

Civil Engineers, Electrical Engineers, Site Managers

: Experience :

2–12 years in Wind/Solar Project Execution

Interview Dates :

08th November 2025 — 09:00 AM to 06:00 PM

09th November 2025 — 09:00 AM to 01:00 PM

Venue : HOTEL ALEXANDER, Saptagiri Circle, Anantapur

Contact : 7331122450, Email: hr@ecorenenergy.com

నిధులొచ్చినా శిథిల భవనమే..!

■ వసతిగృహ నిర్మాణంలో తీవ్ర జాప్యం

కొడిగెనహళ్లి (పరిగి), న్యూస్‌టుడే: కొడిగెనహళ్లిలో బీసీ వసతి గృహ నిర్మాణానికి గ్రహణం పట్టుకుంది.. నిధులు విడుదలై ఐదు నెలలైనా నూతన భవనం పనులు ప్రారంభం కాలేదు. వసతి గృహం శిథిలావస్థకు చేరుకొని వర్షం వస్తే భవనం కారుతోంది. దీంతోపాటు గదులు ఇరుకుగా ఉండి, స్నాన వాటికలు పూర్తి స్థాయిలో పాడైపోయాయి. మరుగుదొడ్ల దుస్థితి అధ్వానంగా ఉంది. ఇక్కడి వసతి గృహంలో ఉండే విద్యార్థులు రాత్రి వేళల్లో దోమల బెడదతో నానా ఇబ్బందులు పడుతున్నారు. భోజన వసతి సౌకర్యాలు బాగున్నప్పటికీ విద్యార్థులు సేదతీరేందుకు అనువైన వసతులు లేవు. దుస్థితిలో ఉన్న భవన సముదాయంలోనే వందల మంది విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువులు సాగిస్తున్నారు.

రూ.1.80 కోట్లు విడుదల

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ కొడిగెనహళ్లిలో నూతనంగా వసతి గృహాన్ని నిర్మించేందుకు 5.07.2025న రూ.1.83 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. భవన సముదాయం నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించి ఐదు నెలలు కావస్తున్నా నేటికీ భవన నిర్మాణంలో ఎటువంటి పురోగతి లేదు.

వసతిగృహం గదులు ఇలా..

అద్దె భవనం దొరక లేదట..

మంజూరైన నిధులతో కొత్తగా భవన సముదాయం నిర్మాంచాలంటే ఉన్న భవనాలను, స్నాన వాటికలను పూర్తి స్థాయిలో తొలగించి అదే ప్రదేశంలో నిర్మాంచాల్సి ఉంది. ప్రస్తుతం ఇక్కడున్న విద్యార్థులను వేరే చోటకు తరలించాల్సి ఉంది. అద్దె భవనం దొరకడం లేదని అందుకే ఆలస్యం అవుతోందని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉంది.

టెండర్లు పూర్తయ్యాయి

ఈ విషయమై బీసీ వసతి గృహం వార్డెన్ చిన్నయ్యబాబును వివరణ కోరగా భవన నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయని, తాత్కాలికంగా వసతి గృహం నిర్వహణ కోసం ఏఎం.లింగణ్ణ బీఈడీ కళాశాలలో ఉన్న రెండు భవనాలను అద్దెకు తీసుకున్నామన్నారు. మరో 15 రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయన్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

పూర్తి వివరములకు: 8008709784

దారి మళ్లిన రూ.6 లక్షలు

● రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో అవినీతి

శింగనమల, న్యూస్‌టుడే: శింగనమల మండలంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో అవినీతి తాజాగా వెలుగులోకి వచ్చింది. రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో మహిళా రైతులకు వచ్చే ఎఫ్‌ఈవో నిధులను దారి మళ్లించి వెలుగు ఉద్యోగి బ్యాంకు ఖాతాకు బదిలీ చేశారు. ఆమె మరణించడంతో డబ్బు ఉపసంహరణకు ముప్పతిప్పలు పడుతుండటంతో విషయం వెలుగులోకి వచ్చింది.

అసలు ఏం జరిగిందంటే?

శింగనమల మండలంలో డ్వాక్రా సంఘాలకు అనుబంధంగా రైతుఉత్పత్తి దారుల సంఘాలను ఏర్పాటు చేశారు. రైతులకు పంటల సాగుకు రుణాలు అందించి, వ్యవసాయ అభ్యున్నతికి సహాయ పడటం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. రైతులకు ఎఫ్‌ఈవో నిధులను రుణాలుగా ఇచ్చి నెల వాయిదాల్లో తక్కువ వడ్డీ వసూలు చేస్తారు. అయితే వెలుగు కార్యాలయంలో పని చేసే మహిళా ఉద్యోగి బ్యాంకు ఖాతాలోకి కొద్ది నెలల క్రితం ఎఫ్‌ఈవో నిధులను మూడు సార్లు రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.6 లక్షలు బదిలీ చేశారు. సాధారణంగా సంఘాలకు రుణాలు ఇవ్వాలంటే గ్రామ సంఘాల లీడర్లు, యానిమేటర్, సీసీ, ఏపీఎం సంతకాలను మినిట్స్ బుక్‌లో నమోదు చేసిన తర్వాత రుణాలను బదిలీ చేస్తారు. అయితే రూ.6 లక్షల బదిలీ విషయంలో ఈ నిబంధన లేవీ పాటించలేదని తెలుస్తోంది.

ఖాళీ చెక్కులపై సంతకాలు

రైతు ఉత్పత్తిదారుల సంఘాల లీడర్లతో ఖాళీ చెక్కులపై సంతకాలు తీసుకుని నేరుగా నాలుగు నెలల కిందట మూడు దఫాలుగా వెలుగు ఉద్యోగి ఖాతాలకు బదిలీ చేశారు. ఈ నిధుల బదిలీ విషయంలో శింగనమల వెలుగు అధికారులు, కెనరాబ్యాంకు అధికారుల పాత్ర ఉందని స్పష్టమవుతోంది. నగదు బదిలీ చేసిన తర్వాత ఆ వెలుగు ఉద్యోగి అనారోగ్యంతో మరణించడంతో బదిలీ చేసిన డబ్బులు వెనక్కి తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తడంతో అవినీతి విషయం వెలుగులోకి వచ్చింది.

ఏపీఎం ఏమన్నారంటే?

ఏపీఎం ఈశ్వరయ్య శింగనమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన స్పందిస్తూ రూ.6 లక్షలు మరణించిన ఉద్యోగి ఖాతాలో జమ అయిన విషయం వాస్తవమేనని అంగీకరించారు. నా సంతకాలు లేకుండానే రూ.6 లక్షలు బదిలీ అయ్యాయని, ఇప్పటికీ మరణించిన ఉద్యోగి ఖాతా లోనే డబ్బులు ఉన్నాయని గుర్తించామన్నారు.

పందిరి పద్ధతి.. మేలైన దిగుబడి!

☛ కాసులు కురిపిస్తున్న కాకర

కళ్యాణదుర్గం (గ్రామీణం), న్యూస్‌టుడే: తీగజాతి కాకర పంటను పందిరి పద్ధతిలో సాగు చేస్తూ అధిక దిగుబడులతో పాటు అదే స్థాయిలో లాభాలు ఆర్జిస్తున్నారు. అసలే కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది గ్రామానికి చెందిన రైతు నారాయణ. మూడు, నాలుగు నెలల పాటు కోతలు వస్తాయి. పందిరి రెండేళ్ల వరకు ఉంటుందని, ఇందులోనే మరోసారి పంటలు సాగు చేసుకోనేందుకు అనువుగా ఉంటుందని చెబుతున్నారు.

పందిరి విధానంలో పంట సాగు

రూ.3 లక్షల పైనే ఆదాయం

మూడు నెలల కిందట ఒకటిన్నర ఎకరాలో కాకర పంట సాగు చేశారు. కళ్యాణదుర్గంలోని ఎరువుల దుకాణంలో కిలో విత్తనాలు, స్లాబ్‌పై వేసే కవర్లు, కర్ర, దారాలు, కూలీలకు రూ.1.50 లక్ష పెట్టుబడి పెట్టారు. పంట సాగు చేసిన రెండు నెలలకే కోతలు మొదలయ్యాయి. వారానికి ఒక కోత రాగా 1,500 కిలోల దిగుబడి వస్తోంది. ఇప్పటి వరకు 8 కోతలు పూర్తయ్యాయి. మార్కెట్లో కిలో ధర రూ.20-25 పలుకుతోంది. సుమారుగా రూ.2.60 లక్షల వరకు ఆదాయం వచ్చింది. మరో 8 వరకు కోతలు వస్తాయని, దాదాపు రూ.3 లక్షలకు పైగానే లాభాలు వస్తాయని రైతు చెబుతున్నారు.

మార్కెట్ సౌకర్యం..

● అనంతపురం, హైదరాబాద్, నాగపూర్, బెంగళూరు నగరాలకు వ్యాపారులు తోట వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. దీని వల్ల రవాణా ఖర్చులు మిగులుతున్నాయి.

ఆశాజనకంగా లాభాలు

– నారాయణ, ఒంటిమిద్ది

గతంలో పలు రకాల పంటలు సాగు చేసి నష్టాలు చవిచూశా. మొదటి సారిగా పందిరి పద్ధతిలో కాకర పంట సాగు చేశా. మొదటి నుంచి పంటకి రెప్పలా చూసుకుంటూ రాగా అదే స్థాయిలో దిగుబడులతో లాభాలు వస్తున్నాయి. ఈ పంట ఎంతో ఆశాజనకంగా కలిసొస్తోంది. మరో మూడు ఎకరాల్లో పంట సాగు చేసేలా అన్ని సిద్ధం చేస్తున్నాను. కాకర అన్ని రకాలుగా కలిసొచ్చింది.

రైతేరాజు

సమస్య సమాధానం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: ఉమ్మడి అనంతపురం జిల్లాలో వివిధ రకాల పంటలు సాగుచేసిన రైతులు పంటల సాగులో ఎలాంటి సందేహాలున్నా రేకులకుంట వ్యవసాయ శాస్త్రవేత్త నారాయణస్వామి నంబరు: 62812 84235 ఫోన్‌చేసి సలహాలు, సూచనలు పొందవచ్చు.

సమస్య: ప్రస్తుత రబీ వ్యవసాయ సీజన్‌లో వేరుసెనగ పంటను సాగు చేయాలనుకున్నాం. అధిక దిగుబడులు ఇచ్చే విత్తన రకాలు తెలపండి. -నరసింహులు, బండ్లపల్లి

సమాధానం: ప్రస్తుత రబీ వ్యవసాయ సీజన్‌లో కదిరి-6, కదిరి-9, టీజీ-24 రకం వేరుసెనగ విత్తనాలతో పంటను సాగుచేస్తే అధిక దిగుబడులు పొందవచ్చు.

సమస్య: పత్తి పంటకు పిండినల్లి తెగులు ఆశించింది. ఈ తెగులు నివారణకు మార్గం తెలపండి. - నాగభూషణ, రేగడికొత్తూరు

సమాధానం: పత్తిపంటలో పిండినల్లి తెగులు నివారణకు ప్రొఫెనోపాస్ 3 మి.లీ చొప్పున లీటరు నీటికి పిచికారీ చేస్తే తెగులు నివారించవచ్చు.

రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు కృషి: ఎంపీ

భూమిపూజ చేస్తున్న ఎంపీ, తెదేపా నాయకులు, నిర్వాహకులు

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఉన్న రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు కృషి చేస్తానని ఎంపీ బీకే పార్థసారథి పేర్కొన్నారు. సోమవారం హిందూపురం పట్టణంలోని సూగూరు ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న 45 అడుగుల ఏక శిల ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు 'పురం'లో నిలుపకపోవడంతో రైల్వే మంత్రి సోమన్న దృష్టికి తీసుకెళ్లగా పది రోజుల్లో నిలిపే ఏర్పాట్లు చేస్తామని చెప్పారన్నారు. చార్లపల్లి రైల్వేస్టేషన్‌లోనూ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ అనిల్‌కుమార్, కౌన్సిలర్ ఎన్‌ఆర్ రాఘవేంద్ర, అభయాంజనేయ స్వామి సేవా ట్రస్ట్ ఛైర్మన్ వై.చంద్రశేఖర్, సభ్యుడు రాయల్ గోపాల్, భక్తులు పాల్గొన్నారు.

ఏడు నెలల సాధనతోనే బాలుడికి ఫిడే రేటింగ్

నిహాల్ నయనంజన్

అనంతపురం (క్రీడలు), న్యూస్‌టుడే: కేవలం ఏడు నెలల సాధన చేసిన ఆ బాలుడు ఫిడే ర్యాపిడ్ రేటింగ్‌లో చోటు సంపాదించాడు. సోమవారం విడుదల చేసిన జాబితాలో తాడిపత్రికి చెందిన రాఘవేంద్రబాబు, పల్లవిల కుమారుడు ఎస్. నిహాల్ నయనంజన్ ఫిడే రేటింగ్‌లో 1505వ స్థానం సాధించాడు. నగరంలోని ఏ1 చెస్ అకాడమీలో ఈ ఏడాది ఫిబ్రవరిలో చేరిన ఈ ఎనిమిదేళ్ల బాలుడు కర్ణాటకలో నిర్వహించిన అండర్-8 చెస్ పోటీల్లో మూడోస్థానం సాధించడంతో ఫిడే రేటింగ్‌లో చోటు లభించింది. బాలుడికి ఆర్బిటర్ ఉదయ్‌కుమార్‌నాయుడు శిక్షణ ఇచ్చారు.

EENADU eClassifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం ✆ : 7382114647.

JOBS

Wanted: Telecallers, Custodians (Ladies) Montessori Elite EM School, Gollapalli, Rapthadu, ATP. Call: 8886654850, 9100281294.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యూయర్స్. ఏజ్: 22-35. ఫ్రెషర్స్ కూడా కావలెను. ✆ : 6281037879.

అనంతపురం పట్టణం నందు ప్రముఖ Company నందు టెలికాలర్స్‌గా పనిచేయుటకు ఆసక్తిగల తెలుగు, కన్నడ యువతులు కావలెను. జీతం: 9,000-12,000. ఇన్సెంటివ్స్ సెల్: 9398063479

FACULTY/ TEACHERS

Wanted Experienced Female Staff for Science and English Subject (3 to 5 Classes) to Work in Blossoms School, Aravind Nagar, ATP. Mob: 9030777676

WANTED Teachers: English, Mahths Subjects For 6 to 10 th EM Classes. Cont: Vignan EM High School, Somandepalli, SSS (Dist) 8309913221, 9347986668

SECURITY GUARDS

సెక్యూరిటీగార్డ్స్, ASOలు ధర్మవరం, హైదరాబాద్‌లో పనిచేయుటకు కావలెను. జీతం: 15,000- 20,000/-. రూం & భోజనం ఫ్రీ. సంప్ర: 6302549622, 9573095856

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS 5 లైన్ల ప్రకటన రూ.395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు: 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

శాంతినారాయణకు అమృతలత జీవన సాఫల్య పురస్కారం

పురస్కారం అందుకుంటున్న శాంతినారాయణ

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సాహిత్య ప్రపంచంలో ప్రతిష్ఠాత్మకమైన 'అమృతలత జీవన సాఫల్య పురస్కారం' 2024 సంవత్సరానికి సంబంధించి సుప్రసిద్ధ కథానవలా రచయిత, సాహిత్య ప్రముఖుడు డా. శాంతినారాయణ సోమవారం అందుకున్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూరులో జరిగిన పురస్కారాల పంపిణీ కార్యక్రమానికి కేంద్ర సాహిత్య అకాడమీ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కన్వీనర్ డా.సి మృణాళి, పురస్కార ప్రదాత డా.అమృతలత ముఖ్య అతిథిలుగా హాజరై పురస్కార గ్రహీతను సన్మానించి జ్ఞాపికతోపాటు రూ.25 వేలు నగదు బహుకరించారు. డా. శాంతినారాయణ పురస్కారం అందుకోవడం పట్ల స్థానిక సాహిత్య ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రయాణికుల భద్రతపై దృష్టి పెట్టండి : డీఆర్‌ఎం

రైల్వే సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు, న్యూస్‌టుడే : ప్రమాదాలు జరగలేదులే అనే భావనను పక్కనపెట్టి నిరంతరం రైల్వే ప్రయాణికుల భద్రతపై సిబ్బంది దృష్టి పెట్టాలని డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా అన్నారు. రైల్వే డివిజన్‌లో గత నెలలో రైళ్లు, గూడ్సులు ప్రమాదాలకు గురికాకుండా నిలువరించిన నలుగురు సిబ్బందికి ఆయన సోమవారం డీఆర్‌ఎం కార్యాలయంలో మ్యాన్ ఆఫ్‌ద మంత్ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడారు. అడ్డదారుల్లో విధులు నిర్వహించకుండా రైల్వేబోర్డు ఆదేశించిన విధంగా పనులు చేయాలని చెప్పారు. ఇద్దరు స్టేషన్ మాస్టర్లు, గేట్‌మెన్, ట్రాక్‌మెన్లు ప్రమాదాలను నిలువరించారు. వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. తరువాత డివిజన్‌లో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన వారికి రైల్వే ఇవ్వాల్సిన బకాయిలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధాకర్, కోఆర్డినేషన్ శ్రీనివాస్, సీనియర్ డీఓఎం శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తడబడి తేరుకున్న ఆంధ్ర జట్టు



తేజ

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: అంతర్రాష్ట్ర కల్నల్ సీకే నాయుడు అండర్-23 నాలుగు రోజుల క్రికెట్ పోటీలో ఆంధ్ర జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో కష్టాల నుంచి గట్టెక్కి భారీస్కోరు దిశగా పయనిస్తోంది. సోమవారం రాయలసీమ క్రికెట్ మైదానంలో జరుగుతున్న పోటీలో ఆంధ్ర జట్టు పుదుచ్చేరి జట్టుపై రెండోరోజు ఆటముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. ఉదయం ఓవర్‌నైట్ స్కోరు 268/4తో తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్ కొనసాగించిన పుదుచ్చేరి జట్టు 110.4 ఓవర్లలో 337 పరుగులకు ఆలౌటైంది. తొలిరోజు పటిష్ఠంగా కనిపించిన పుదుచ్చేరి జట్టు చివరి ఆరు వికెట్లు 69 పరుగులకే కూలాయి. ఆంధ్ర బౌలర్లు రాజు, సుమిత్, ఆదిత్యరెడ్డి చెలరేగడంతో వికెట్లు వెనువెంటనే పడ్డాయి. బ్యాటర్లు పృథ్వీ రాజన్‌ఖన్నా (60), నితిన్ ప్రణవ్ (49) పోరాడటంతో ఆ మాత్రం స్కోరు సాధించింది. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టుకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. కేవలం 69 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును జీవీస్పీ తేజ శతకంతో ఆదుకున్నాడు. అభినవ్ (44) సమయస్ఫూర్తిగా బ్యాటింగ్ చేయడంతో నాలుగో వికెట్‌కు అవకాశం లేకుండా పోయింది. మంగళవారం ఆంధ్ర జట్టు సమయోచితంగా ఆడితే మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యత సాధిస్తుంది. భారమంతా బ్యాటర్లపైనే ఉంది.

కదిరి ఆలయ సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం 6 గంటలకు దర్శనం మొదలవుతుంది. 7 నుంచి 9 గంటల మధ్య అభిషేకాలు, పూజా కార్యక్రమాలు, 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటలు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు దైవ దర్శనం ఉంటుంది. ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, రాత్రి 7.30 గంటలకు వెండి రథోత్సవం నిర్వహిస్తారు.

'కార్మిక హక్కులు కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం'

మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: కార్పొరేటు ప్రయోజనాల కోసం కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు ధ్వజమెత్తారు. హిందూపురంలోని అంబేడ్కర్ భవనంలో పట్టణ కన్వీనర్ వి.ఆర్.రాము అధ్యక్షతన రెండో రోజు సోమవారం జరిగిన ముగింపు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల కార్మికుల హక్కులను వ్యతిరేకిస్తూ పని గంటలను పెంచుతూ వారి శ్రమను కంపెనీలకు కట్టబెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆధీనంలో నడిచే సంస్థలను ప్రైవేటు పరం చేయడంతో ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్యను కుదిస్తూ కేంద్ర, రాష్ట్రాలు అన్యాయం చేస్తున్నాయన్నారు.

శ్రీసత్యసాయి జిల్లా కమిటీ ఎన్నిక

ఈ సందర్భంగా 43 మందితో సీఐటీయూ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మరోసారి జడ్.పి.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా జి.ఎల్.నరసింహులు, కోశాధికారిగా లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, దిల్షాద్, శ్రీదేవి,బాబా, ఉషారాణి, అయూబ్‌ఖాన్, ముత్యాలు, కార్యదర్శులుగా సాంబశివ, రాము, సౌభాగ్య, గంగాధర్ నియమితులయ్యారు.

హగరినదిలో కొట్టుకుపోయిన యువకులు

స్పందించి ప్రాణాలు కాపాడిన స్థానికులు

స్థానికులు అందించిన తాడు సాయంతో నదిలో నుంచి వస్తున్న యువకులు

బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే : మండలంలోని వేపులపర్తి సమీపంలో వేదావతి హగరిపై రాత్రి బీటీ ప్రాజెక్టు గేట్లు నుంచి దిగువకు వచ్చిన నీటి ఉద్ధృతితో రోడ్డు కోతకు గురైంది. సోవమారం తెల్లవారు జామున రాయదుర్గం వైపు నుంచి ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంలో వస్తూ ప్రమాదవశాత్తు హగరి నదిలో పడ్డారు. కొంత దూరం వరకు వాహనంతో పాటు వారు కొట్టుకు పోయారు. ఓ చోట వాహనం చిక్కుకొని అక్కడే ఆగిపోయి రక్షించాలని గట్టిగా అరుస్తూ వేడుకొన్నారు. అటుగా వస్తున్న స్థానికులు గమనించి తాళ్ల సాయంతో వారిని బయటకు లాగి రక్షించి ప్రాణాలు కాపాడారు. ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్న వీరిద్దరు విధుల నిమిత్తం వేపులపర్తికి ఉదయాన్నే వెళ్తుండగా ప్రమాదంలో చిక్కుకున్నారు. స్థానికులు చూపిన చొరవకు పలువురు అభినందించారు. అధికారులు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేలా చూడాలని మండల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

సీఎండీ దృష్టికి విద్యుత్తు సమస్యలు

అనంతపురం(విద్యుత్తు): తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో సీఎండీ శివ శంకర్ సోమవారం నిర్వహించిన డయల్ యువర్ సీఎండీ కార్యక్రమానికి ఉమ్మడి అనంత జిల్లాల నుంచి పలువురు విద్యుత్తు వినియోగదారులు ఫోన్లు చేసి సమస్యల గురించి తెలియజేసినట్లు ఆ శాఖ ఎస్‌ఈలు శేషాద్రిశేఖర్, సంపత్‌కుమార్ తెలిపారు. అన్ని జిల్లాల నుంచి సీఎండీకి 87 ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. ఇందులో కొన్ని ఉమ్మడి అనంత జిల్లా నుంచి అందాయన్నారు. విద్యుత్తు లైన్లు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయని, గడువులోపు నియంత్రికలు విడుదల చేయలేదని, కాలిన నియంత్రికలను సకాలంలో మార్చటం లేదని, తరచూ విద్యుత్తు అంతరాయాలు ఏర్పడుతున్నాయని ఫిర్యాదులు చేశారు. వాటిని పరిశీలించి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని ఎస్‌ఈలు తెలిపారు.

యువతిపై వైకాపా నేత అత్యాచారయత్నం

నల్లచెరువు, న్యూస్‌టుడే: నల్లచెరువు మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిపై అదే గ్రామ వైకాపా నాయకుడు రామాంజినేయులు అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి బయట పనులు చేసి లోపలికి వెళ్లిన యువతిని రామాంజినేయులు గమనించాడు. వెంటనే ఆమెను పట్టుకొని నోటిలో వస్త్రాలు కుక్కి చెంపలపై కొట్టడంతో గట్టిగా కేకలు వేసింది. వాటిని విని ఇంటి పక్కన పశువుల పాకలో ఉన్న యువతి తండ్రి రావడం గమనించిన నిందితుడు పారిపోవడానికి ప్రయత్నించాడు. చుట్టుపక్కల వారు అతడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మగ్బూల్‌బాషా వివరించారు.

బాలికపై అసభ్య ప్రవర్తన..

నిందితుడికి ఐదేళ్ల జైలు

అనంతపురం(లీగల్), న్యూస్‌టుడే: బస్సులో ప్రయాణిస్తున్న బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి చినబాబు సోమవారం తీర్పు ఇచ్చారు. కేసు వివరాలు ఇలా.. అనంతపురానికి చెందిన బాలిక తన తల్లితో కలిసి 2022 ఏప్రిల్ 18న ఓ ప్రైవేటు బస్సులో హైదరాబాద్ నుంచి అనంతపురానికి బయలుదేరింది. అదే బస్సులో శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం మరువపల్లికి చెందిన ముడియం అమర్నాథరెడ్డి కూడా ఎక్కాడు. అతడు అర్ధరాత్రి బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. గమనించిన బాలిక తల్లి అతన్ని మందలించింది. అనంతపురంలో బస్సు దిగాక పోలీసులకు ఫిర్యాదు చేయగా మహిళా పోలీసు స్టేషన్ అధికారులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టి నివేదికను కోర్టుకు అందజేశారు. ఈ కేసులో కోర్టు ఇరువర్గాల వాదనలను పరిశీలించింది. ప్రాసిక్యూషన్ తరఫున ప్రత్యేక పీపీ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో ఐదేళ్ల జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన డీఎస్పీ మహబూబ్‌బాషా, సీఐ భాస్కర్‌రెడ్డి, కోర్టు లైజనింగ్ అధికారి శ్రీనివాసులును ఎస్పీ జగదీశ్ అభినందించారు.

వేరుసెనగలో యాజమాన్య పద్ధతులు

సాగులో వేరుసెనగ పంట

చిట్కా

నార్పల, న్యూస్‌టుడే : జిల్లాలో రబీ వ్యవసాయ సీజన్‌లో వేరుసెనగ సాగు చేసే రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త విజయ్‌శంకర్‌బాబు తెలిపారు. నవంబరు 15వ తేదీ వరకు రైతులు వేరుసెనగ విత్తుకోవచ్చన్నారు. విత్తుకు ముందు పొలాన్ని రెండుసార్లు కలియ దున్నుకుని ఆఖరు దుక్కిలో ఎకరాకు 4 టన్నుల పశువుల ఎరువు వేసుకోవాలన్నారు. ఎకరాకు 100 కిలోల సూపర్‌ఫాస్ఫేట్, 33 కిలోల పొటాష్, 18 కిలోల యూరియా విత్తనం విత్తే సమయంలో పొలంలో చల్లుకోవాలన్నారు. పూత దశలో పంట ఉన్నపుడు 200 కిలోల జిప్సం వేసుకోవాలని సూచించారు. పంట 45 రోజులు, 90 రోజుల దశలో ఉన్నపుడు నీటి తడులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. తద్వారా పంట దిగుబడి పెరిగి రైతులకు అధిక లాభాలు వస్తాయని శాస్త్రవేత్త తెలిపారు.

బొప్పాయి పాలు.. విదేశాలకు

నంద్యాల జిల్లా చాగలమర్రి మండల వ్యాప్తంగా రైతులు అధికంగా బొప్పాయి సాగు చేస్తుంటారు. చిన్నవంగలితో పాటు సమీపంలోని గ్రామాలైన వైఎస్సార్ కడప జిల్లా కానగూడూరు, క్రిష్ణంపల్లె గ్రామాల్లో 1200 ఎకరాల్లో పండిస్తారు. విత్తనం నాటిన కాలం నుంచి తొమ్మిది నెలలకు పంట చేతికొస్తుంది. పండ్ల సేకరణ అనంతరం 13 నెలల తర్వాత మిగిలినవి, ముదురు కాయలకు గాట్లు పెట్టి పాలను సేకరిస్తున్నారు. తెల్లవారుజాము సమయంలోనే కాయలకు గాట్లు పెడితే కేవలం రెండు గంటల్లోనే పాలు ఊరుతుంది. ఇలా సేకరించిన దాన్ని రాయచోటి, రాజంపేటకు చెందిన వ్యాపారులు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల పాలు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 4 డ్రమ్ముల పాలు సేకరిస్తున్నారు. ఎకరానికి పాల సేకరణ ద్వారా రైతుకు రూ.24 వేల ఆదాయం వస్తుంది. సేకరించిన పాలను పరిశ్రమల్లో మందులు, కాస్మోటిక్స్, సబ్బుల తయారీలో ఉపయోగిస్తున్నారు. బెంగళూరు, చెన్నైతో పాటు నాణ్యతను బట్టి విదేశాలకు సైతం పాలను ఎగుమతి చేస్తున్నారు. బొప్పాయి సాగులో ఎప్పుడైనా ధర పడిపోయినప్పుడు బొప్పాయి పాల సేకరణతో నష్టాల నుంచి రైతులు బయటపడుతున్నారు.

– న్యూస్‌టుడే, చాగలమర్రి

పశువులకు గాలికుంటు వ్యాధి వస్తే?

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : శీతాకాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించడం ద్వారా మరణాలు సంభవించకుండా నివారించవచ్చని బుక్కరాయసముద్రం పశువైద్యశాఖ సహాయ సంచాలకులు రత్నకుమార్ తెలిపారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో కాలి గిట్టల మధ్య పుండ్లు, నోటిలో పుండ్లు ఏర్పడి నురగ వస్తుందన్నారు. దీంతో పశువుల్లో పాల దిగుబడి 50 శాతం తగ్గుతుందన్నారు. అన్ని ప్రభుత్వ పశువైద్యశాలలో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

ప్రైవేట్ వాహనాల యాజమాన్యం నిబంధనలు పాటించాలి

మాట్లాడుతున్న డీటీసీ వీర్రాజు

లక్ష్మీనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ స్కూల్ బస్సులు, కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులు, ప్రైవేట్ వాహనాల యాజమాన్యాలు కచ్చితంగా నిబంధనలు పాటించాలని డీటీసీ వీర్రాజు తెలిపారు. సోమవారం అనంతపురంలోని ఉపరవాణాశాఖ కార్యాలయంలో ప్రైవేట్ వాహనాల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కర్నూలు, మహారాష్ట్ర, దిల్లీ తదితర ప్రాంతాల్లో జరిగిన బస్సు ప్రమాదాల్లో ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. ఇలాంటి ఘటనలు ఎందుకు జరుగుతున్నాయో గుర్తించి, నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల డ్రైవర్లు ఎమర్జెన్సీ డోర్ పని చేస్తుందా లేదా అనే విషయాన్ని పరిశీలిస్తుండాలన్నారు. అత్యవసర ద్వారం వద్ద అదనపు సీట్లు ఏర్పాటు చేసినా, రవాణ మెటీరియల్ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బస్సు బ్రేక్‌లు, టైర్‌లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలని, అలాగే విద్యార్థులు బస్సు ఎక్కి దిగే సమయంలో గమనిస్తుండాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సీట్లను ఆల్ట్రేషన్ చేయకూడదని వివరించారు. ప్రమాదాలు జరగకుండా వాహన యజమానులు తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఎంవీఐలు శ్రీనివాసులు, సునీత, రఘునాథ్, సూపరింటెండెంట్‌లు కామరాజు, రాకేష్, మధుకర్‌బాబు పాల్గొన్నారు.

రైతు బలవన్మరణం

రొద్దం: మండలంలోని తురకలాపట్నం గ్రామంలో అంజనప్ప(55) అనే రైతు తన కుమారుడికి ఉద్యోగం రాలేదని మనస్తాపంతో సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భార్య సరోజమ్మ, అంజనప్పలకు ఇద్దరు కుమారులు. ఇటీవల అనారోగ్యంతో పెద్ద కుమారుడు మృతి చెందాడు. రెండో కుమారుడు షణ్ముఖను ఉన్నత చదువులు చదివించారు. రెండేళ్ల నుంచి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేసినా రాలేదని, ఆస్తిపాస్తులు పెద్దగా లేవని మనస్తాపం చెంది అంజనప్ప సోమవారం ఇంటి నుంచి వెళ్లారు. సాయంత్రం తన పొలంలోని విద్యుత్తు నియంత్రిక వద్ద ఉరేసుకొని మృతిచెందినట్లు కాపర్లకు కనిపించడంతో వారు కుటుంబ సభ్యులకు తెలిపారు. భార్య, కుమారుడు ఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. పోలీసులను వివరణ కోరగా ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు వెల్లడిస్తామన్నారు.

చికిత్స పొందుతూ సీఐటీయూ నాయకుడి మృతి

ధర్మవరం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడి, తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పట్టణానికి చెందిన ఉమ్మడి జిల్లా సీఐటీయూ జిల్లా నాయకుడు హైదర్‌వలి(56) సోమవారం మృతి చెందారు. ఆరు రోజుల క్రితం ఆయన ద్విచక్రవాహనంలో అనంతపురం వెళ్లి తిరిగి వస్తుండగా మన్నీల వద్ద ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఆయనను వైద్యం నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా చనిపోయినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆయన మృతిపట్ల సీఐటీయూ నాయకులు సంతాపం తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఇద్దరు వ్యవసాయ కూలీల దుర్మరణం

పుట్టపర్తి పట్టణం: మండలంలోని పెడపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కూలీలు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై లింగన్న తెలిపిన వివరాల మేరకు.. పెడపల్లికి చెందిన వ్యవసాయ కూలీలు సాకల మహేష్(30), మాల రంగప్ప (31) పనులు ముగించుకుని ద్విచక్రవాహనంపై గ్రామానికి బయలుదేరారు. వైఎస్సార్ కాలనీ దాటిన తర్వాత పుట్టపర్తి నుంచి వేగంగా వస్తున్న ఇన్నోవా వారి ద్విచక్రవాహనాన్ని ఢీకొని వెళ్లిపోయింది. మహేష్, రంగప్పలు తీవ్రంగా గాయపడ్డారు. స్పందించిన స్థానికులు వారిని 108 వాహనంలో పుట్టపర్తి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. మహేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలుండగా, రంగప్ప అవివాహితుడు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై అక్కడ లభించిన ఇన్నోవా నంబర్ ప్లేట్ ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామన్నారు. కుటుంబానికి ఆధారమైన ఆ ఇద్దరి మృతితో వారి కుటుంబ సభ్యులు విషాదంలో మునిగారు.

హిందూపురం

•హిందూపురం •పెనుకొండ •మడకశిర

అంజన్న ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు, పాల్గొన్న ఎంపీ బీకే పార్థసారథి

హిందూపురం అర్బన్: ఆలయ అభివృద్ధికి నిరంతరం సహాయ సహకారాలు అందిస్తానని, భక్తులకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ఎల్లప్పుడు ముందు ఉంటానని సుగూరు ఆంజనేయస్వామి ఆలయ ఛైర్మన్ వై.చంద్రశేఖర్ పేర్కొన్నారు. సుగూరు ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం నూతన 'పురం' ఎంపీ బీకే పార్థసారథి, జిల్లా దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, కార్యనిర్వహణాధికారి నరసింహరాజు, సమక్షంలో కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు.

పాఠశాల స్థాయిలో నైపుణ్య సముదాయ పోటీలు

రొద్దం, న్యూస్‌టుడే: స్థానిక కేజీబీవీ పాఠశాల ఎస్వో నాగరత్నమ్మ ఆధ్వర్యంలో 9, 8 తరగతి విద్యార్థులకు సోమవారం పాఠశాల స్థాయిలో నైపుణ్య సముదాయం పోటీలు నిర్వహించారు. పోటీల్లో 30 మంది పాల్గొన్నారు. మైనావతి, పూర్ణబిందు, పవిత్ర, తేజశ్విని, లావన్య, ఇంటర్ విద్యార్థులు అక్షిత, మహేశ్వరి, స్నేహ, అశ్విని, శిల్ప, లహరి, శ్వేత గెలుపొందారు. వీరికి జ్ఞాపికలు అందజేశారు. ఈ నెల 7న జరిగే జిల్లా స్థాయిలో పోటీల్లో పాల్గొనున్నట్లు ఎస్వో తెలిపారు.

జ్ఞాపిక అందజేస్తున్న ఎస్వో నాగరత్నమ్మ

కార్తికం.. శివోహం

మెయిన్‌బజార్‌లో నీలకంఠుడు

కార్తిక సోమవారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని కోట, మెయిన్‌బజార్, మేళాపురం, పరిగిరోడ్డు, శ్రీకంఠపురం, సూరప్పకుంట తదితర ఈశ్వరాలయాల్లో బిల్వార్చన, రుద్రాభిషేకం, భస్మాభిషేకం, కుంకుమార్చన చేశారు. మహిళలు కార్తికదీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. -న్యూస్‌టుడే, హిందూపురం అర్బన్

పెనుకొండ: పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో సోమవారం రాత్రి మహిళలు వెయ్యి ఎత్తున దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం రథోత్సవం, బుధవారం 45వ లక్షదీపారాధన మహోత్సవానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులతో సోమవారం డీఎస్పీ నరసింగప్ప సమావేశం నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు.

లేపాక్షి: లేపాక్షి దుర్గా, పాపనాశేశ్వర, వీరభద్రస్వామి ఆలయంలో కమిటీ ఛైర్మన్ రమానందన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

రొళ్ల, న్యూస్‌టుడే: టి.డి.పల్లి గ్రామంలో వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజులుగా హోమాలు చేసి విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టారు. కార్యక్రమానికి స్థానిక భక్తులతో పాటు కర్ణాటక ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హాజరైన భక్తులకు ఆలయ కమిటీ తరుపున అన్నదానం ఏర్పాటు చేశారు.

పుర కార్యాలయం శిథిలం

నిర్మించి ఏడు దశాబ్దాలు.. సిబ్బందికి తప్పని ఇబ్బందులు

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: హిందూపురం మున్సిపల్ కార్యాలయాన్ని 70 ఏళ్ల క్రితం అప్పటి అవసరాలకు అనుగుణంగా నిర్మించారు. ప్రస్తుతం పట్టణ జనాభా రెండు లక్షలకు చేరినా, సిబ్బంది సంఖ్య పెరిగినా, అందుకు అనుగుణంగా నూతన భవనాలను నిర్మించలేదు. దశాబ్దాలు గడుస్తుండడంతో కార్యాలయ భవనాలు పలుచోట్ల పగుళ్లు వచ్చి పెచ్చులు ఊడి పడుతున్నాయి. 20 ఏళ్ల క్రితమే నూతన భవన నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రూ.7 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలన పరమైన ఉత్తర్వులు ఇచ్చింది. అప్పటి మున్సిపల్ పాలక పక్షం నిధులను సద్వినియోగం చేసుకొనే దిశగా చర్యలు చేపట్టకపోవడం, నిర్మాణ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపకపోవడంతో నిధులు విడుదల చేయలేదు. తరువాత నూతన కార్యాలయం నిర్మాణం గురించి ఎవరూ పట్టించుకోలేదు.

శిథిలావస్థకు చేరిన కార్యాలయం

ఇటీవల ఎమ్మెల్యే బాలయ్య గుర్తించి..

ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే బాలకృష్ణ మున్సిపల్ కార్యాలయ దుస్థితిని గుర్తించారు. నూతన భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయించాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. మరోవైపు పురపాలక శాఖ మంత్రితోనూ మాట్లాడారు. వెంటనే మున్సిపల్ కమిషనర్ కన్సల్‌టెంట్లను నియమించి, భవన నిర్మాణ సమగ్ర ప్రణాళికను సిద్ధం చేయించి, రాష్ట్ర ముఖ్య ఇంజినీర్‌కు పంపించారు. అక్కడ ఆమోదం రావడంతో పురపాలక శాఖకు పంపారు. ఇక నిధులు విడుదల అయితే నూతన మున్సిపల్ కార్యాలయం నిర్మాణం సాకరమవుతుంది.

అధునాతన సదుపాయాలతో..

మాస్టర్ ప్లాన్ ప్రకారం ప్రస్తుతం మున్సిపల్ కార్యాలయం మూడు ఎకరాల్లో ఉంది. పాత కార్యాలయాన్ని, ఇతర భవనాలను తొలగించి, అధునాతన భవనాన్ని సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్, మొదటి, రెండు అంతస్తులు నిర్మిస్తారు. సెల్లార్‌లో పార్కింగ్‌తో పాటు పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించిన పరికరాలు, వస్తువులు ఉంచడానికి గోదాములు ఏర్పాటు చేస్తారు. గ్రౌండ్ ఫ్లోర్, మొదటి, రెండవ అంతస్తుల్లో అన్ని మున్సిపల్ విభాగాలకు ప్రత్యేకంగా కార్యాలయ గదులను నిర్మిస్తారు. భారీ కౌన్సిల్ హాల్‌ను, రెండు మినీ సమావేశపు గదులు, విద్యుత్తు కార్యాలయం పైన సౌర పలకలు ఏర్పాటు చేసి ఉత్పత్తి చేసి ఉపయోగించుకుంటారు.

త్వరలోనే నిధుల మంజూరు

ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవ చూపడంతో రూ.18 కోట్లతో మున్సిపల్ కార్యాలయ నిర్మాణానికి పురపాలక శాఖ అనుమతి ఇచ్చింది. సమగ్ర ప్రతిపాదనలతో ప్రణాళిక పంపించాం. త్వరలో నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. నిధులు రాగానే టెండర్లు పిలిచి నిర్మాణాలు ప్రారంభిస్తాం.

-మల్లికార్జున, కమిషనర్, హిందూపురం

అసంపూర్తి డ్రైనేజీతో అవస్థలు

పెనుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని బీటీఆర్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఇటీవల కాలనీలో డ్రైనేజీ నిర్మించినా పూర్తిస్థాయిలో మురుగు బయటకు వెళ్లే విధంగా కాలువ పూర్తి చేయకపోవడంతో మురుగు సిమెంటు రోడ్ల పైకి చేరి దుర్గంధం వెదజల్లుతోంది. కాలనీలోని లోతట్టు ప్రాంతం పోలీస్‌స్టేషన్ వెనుక వైపున, మసీదు వీధిలో ప్రధానంగా మురుగు నిలిచి రోడ్లమీదకు చేరుతోంది. ఎక్కువ రోజులు నిల్వ ఉండటంతో పాచిపట్టి వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలోని మురుగు నీరు మొత్తం హిందూపురం పెనుకొండ ప్రధాన రోడ్డు పక్క నుంచి శివారులోని వంకలోకి వెళ్లాల్సి ఉంది. గత ప్రభుత్వంలో ర.భ.శాఖ రోడ్డు నిర్మించి, డ్రైనేజీ విస్మరించడం కారణంగా ప్రస్తుతం కాలనీలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

బీటీఆర్‌కాలనీలో సిమెంటు రోడ్డు పై చేరిన మురుగు

టెండరు పూర్తవ్వగానే పనులు చేపడతాం

బీటీఆర్ కాలనీలో మురుగుకాలువ సమస్య పరిష్కరించేందుకు ఇటీవల డ్రైనేజీ నిర్మించారు. డ్రైనేజీ నిర్మాణ ప్రక్రియ టెండరు దశలో ఉంది. టెండర్లు పూర్తయి గుత్తేదారు నిర్ణయించిన వెంటనే కాలువ నిర్మాణం చేపట్టి ప్రజల సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతాం. **-సతీశ్‌కుమార్, కమిషనర్, నగరపంచాయతీ, పెనుకొండ**

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎంపిక

లేపాక్షి, న్యూస్‌టుడే: లేపాక్షి మండలం కొండూరు ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న శ్రావణి అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శేషగిరిబాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు శివకుమార్ తెలిపారు. అనంతపురంలో 1న నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో 32 మంది క్రీడాకారులు పోటీ పడగా, అందులో ఐదుగురిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈనెల 7-9 వతేదీ వరకు పార్వతీపురం మన్యం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొననున్నట్లు వారు వివరించారు.

ఎంపికైన విద్యార్థిని శ్రావణితో ఉపాధ్యాయులు

యోగివేమన విగ్రహ ఏర్పాటుకు రూ.లక్ష విరాళం

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్లలో యోగివేమన విగ్రహ ఏర్పాటుకు మల్లాపల్లికి చెందిన వెంకటరెడ్డి రూ.లక్ష విరాళం ఇచ్చారు. మండల రెడ్డిసామాజిక వర్గ సంఘం నాయకులకు నగదు రూపంలో ఈమొత్తాన్ని సోమవారం అందజేశారు. అశ్వర్థరెడ్డి, రాజారెడ్డి, మధుసూధనరెడ్డి, రఘునాథరెడ్డి, నారాయణరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విద్యుత్తు నియంత్రికల పంపిణీ

గోరంట్ల : మండల వ్యాప్తంగా విద్యుత్తు నియంత్రికల కోసం ఎదురుచూస్తున్న రైతుల కలనెరవేరుస్తూ సోమవారం కూటమినాయకులు, మండల ఏఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 15 మందికి నియంత్రికలు అందజేశారు. తెదేపా మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, హస్తకళల కార్పొరేషన్ డైరెక్టర్ సోమశేకర్ పాల్గొన్నారు.

జీవో 4 రద్దు చేయాలని నిరసన

పెనుకొండ, న్యూస్‌టుడే: వైద్యకళాశాలల పీపీపీ విధానాన్ని, విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబరు 4ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఏ(ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ కూడలిలో విద్యార్థి సంఘం నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో శివకుమార్, రమేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కూడలిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఏ నాయకులు

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: కేఎన్‌పల్లి బీసీ కాలనీలో వీధి దీపాలు లేక అంధకారంలో ఉంటున్నాం. **-గిరీశ్**

సమాధానం: రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తాం. **-లక్ష్మీదేవి, సర్పంచి, కేఎన్‌పల్లి**

సమస్య: మోరుబాగల్ ఎస్సీ కాలనీలో మురుగు ప్రవహిస్తోంది. **-మైలారప్ప**

సమాధానం: హరితరాయబారులతో తొలగింపజేస్తాం. **-తిప్పేస్వామి, సర్పంచి, మోరుబాగల్.**

సమస్య: పట్టణంలోని పెనుకొండ రోడ్డులో ఉన్న హోల్‌సెల్ కూరగాయల మార్కెట్‌కు వెళ్లే రహదారిలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. **-సునీల్**

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపి శుభ్రం చేయిస్తా.

-శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, హిందూపురం.

–న్యూస్‌టుడే, గుడిబండ, హిందూపురం అర్బన్

స్పందించారు.. పరిష్కరించారు

హిందూపురం అర్బన్ : 'ఈనాడు'లో ఈనెల 3న ఇలా ఉంటే రోగాలు రావా..! శీర్షికన ప్రచురించమైన చిత్ర వార్తకు సంబంధిత అధికారి స్పందించారు. సోమవారం ఉదయం ఎస్వీడీ రోడ్డులో ఉన్న ప్రధాన తపాలాకార్యాలయం నుంచి సూరప్పకుంటకు వెళ్లే రహదారిలో నిలిచిన మురుగు నీటిను మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ శుభ్రం చేయించి, బ్లీచింగ్ చల్లించారు.

పాలిటెక్నిక్ ఫలితాల్లో పురం విద్యార్థినుల ప్రతిభ

హిందూపురం, న్యూస్‌టుడే: పాలిటెక్నిక్ ప్రథమ సంవత్సరం డి ఫార్మసి విభాగంలో స్థానిక పాలిటెక్నిక్ విద్యార్థినులు ప్రతిభ చాటినట్లు కళాశాల ప్రిన్సిపల్ జి.కృష్ణమూర్తినాయుడు తెలిపారు. ఆదివారం రాత్రి వెలువడిన ఫలితాల్లో కళాశాలలో చదువుతున్న షాజియా భాను 990 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. కళాశాలకు చెందిన మరో తొమ్మిది మంది విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి ఆదర్శంగా నిలిచారన్నారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులకు పతకాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థినులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

ఘనంగా శ్రీనివాసుడి కల్యాణం

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని బెంగళూరు రోడ్డులో ఉన్న గాయత్రీ ఆలయంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన ప్రత్యేకవేదికలో శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీనివాసుని ఉత్సవ మూర్తులను ఉంచి కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నరసింహయ్య, ఆలయ భక్త బృందం, భక్తులు పాల్గొన్నారు.

కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

మత్తుపదార్థాల అక్రమరవాణా, వినియోగం నేరం

పెనుకొండ,న్యూస్‌టుడే: మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగం నేరమని, యువత వీటిని స్వీకరించడం వల్ల కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని పెనుకొండ ఎస్సై వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం స్థానిక జడ్పీ సెంట్రల్‌ఉన్నత పాఠశాలలో పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరం ముగింపు సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ వినియోగం వల్ల యువత పెడదోవ పడుతోందన్నారు. విద్యార్థి దశ నుంచి సామాజిక దృక్పథం అలవర్చుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ అధికారి ప్రతాప్, కళాశాల ప్రిన్సిపల్ జయప్ప, పాఠశాల హెచ్ఎం జ్యోతిలత, చరిత్రకారుడు ఎం.నారాయణస్వామి, పాఠశాల ఉపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వర్లు

'వ్యర్థాలు నదిలోకి వదలొద్దు'

పరిగి, న్యూస్‌టుడే: కాలువపల్లిలో ఉన్న ఓ ప్రైవేటు వస్త్ర పరిశ్రమ నుంచి విడుదల అవుతున్న రసాయనాలతో కూడిన వ్యర్థాలను జయమంగళి నదిలోకి వదలకుండా తగు చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు ఫ్యాక్టరీ మేనేజ్‌మెంట్‌ను కోరారు. సోమవారం సాయంత్రం కాలువపల్లి వద్ద ఉన్న వస్త్ర పరిశ్రమను భాజపా నాయకుడు పరిగి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో కూటమి నాయకులు పరిశీలించారు. పరిశ్రమలో దుస్తులకు రంగులు అద్దిన తరువాత వచ్చే రసాయనాలతో కూడిన వృథా నీటిని తరలించేందుకు ఏర్పాటు చేసిన పైప్‌లైన్ తరచూ పగిలిపోయి విషతుల్యమైన నీరు నదిలో కలుస్తుండటం వల్ల భూగర్భజలాలు కలుషితం అవుతున్నాయి. ఆ నీటిని మూగజీవాలు, ప్రజలు తాగితే రోగాల భారిన పడే ప్రమాదం ఉందని నాయకులు యాజమాన్యం ప్రతినిధి శర్మ, జనరల్‌మేనేజర్ మహదేవ్ దృష్టికి తీసుకెళ్లారు. మూడు నెలల వ్యవధిలో పరిశ్రమ వద్దనే నీటి శుద్ధి ప్లాంటును ఏర్పాటు చేస్తామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాజపా కన్వీనర్ మూర్తి, కొడిగెనహళ్లి ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రొళ్ల ఎస్సైగా వీరేష్



రొళ్ల, న్యూస్‌టుడే: రొళ్ల ఎస్సైగా వీరేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అగళి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వీరేష్ బదిలీపై వచ్చారు. అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించి, ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని పేర్కొన్నారు.

కార్మికుడికి గాయాలు

పెనుకొండ, న్యూస్‌టుడే: కియా అనుబంధ పరిశ్రమ కేఎస్ హెచ్‌లో విధులు నిర్వహిస్తున్న మణి అనే కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన తోటి కార్మికులు వెంటనే కంపెనీ ప్రతినిధులకు సమాచారం ఇచ్చి హిందూపురంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.

ప్రమాదాలపై జాగ్రత్త వహించండి

చిలమత్తూరు, న్యూస్‌టుడే: టిప్పర్ డ్రైవర్లు ప్రమాదాలపై జాగ్రత్త వహించాలని హిందూపురం గ్రామీణ సీఐ జనార్దన్, చిలమత్తూరు ఎస్సై మునీర్‌అహ్మద్ సూచించారు. ఉన్నతాధికారులు సూచనల మేరకు సోమవారం కనుమలో వాహనాలు తనిఖీలు నిర్వహించారు. అధిక లోడ్ వేసుకొని టిప్పర్లు నడపరాదన్నారు. మత్తు పదార్థాలను సేవించి డ్రైవింగ్ చేయరాదని హెచ్చరించారు. వాహనాలను బాధ్యతగా నడపాలని సూచించారు.

టిప్పర్ డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ జనార్దన్

PUBLIC NOTICE

My client proposes to purchase the below-mentioned **agricultural land** from its sole and absolute owner **Sri Venkatakrishna Chunduri,** son of Sri Brahmaiah, R/o No.3-76B, Kamepalli Village, Prakasham Distrct, currently residing at Villa No.7, MIMS Springdale, Happy Valley, Pattandur Agrahara, Whitefield, Bangaluru, who acquired the same under the documents cited below.

The property is situated in **Konduru Village Polam, Lepakshi Mandal, Sri Sathyasai District, Andhra Pradesh.**

S.No.	Vide document No/dated	Sy.No	Extent
1.	12248/2018, dt: 14-12-2018	3-1	2 Acre 52 cents
2.	12248/2018, dt: 14-12-2018	3-1 (3-1A)	2 Acre 51 cents
3.	7311/2022, dt: 21-07-2022	3-2 (3-2A)	62 cents
4.	10703/2022, dt: 20-10-2022	3-2 (3-2B)	62 cents
5.	13291/2024, dt: 13-06-2024	3-2 (3-2C)	47 cents

Any person, institution, or authority having any claim, right, title, interest, lien, or objection in respect of the above property is hereby required to intimate the undersigned advocate in writing, along with documentary proof, within fifteen (15) days from the date of publication of this notice, failing which it shall be presumed that there are no encumbrances or objections, and the transaction will proceed without further reference.

P. UDAY SIMHA REDDY, Advocate, Hindupur.
Cell: +91 99890 65537. Email: udaysimhareddy29@gmail.com
Postal address: Room No.115, Eidgah Building, RPGT Road, Hindupur, Sri Sathyasai District.

దళిత కాలనీకి తాగునీటి అవస్థలు

మాగేచెరువు దళిత కాలనీలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నీటి పథకం స్టార్టర్, మోటారు మరమ్మతులకు గురికావడంతో వ్యవసాయ బోరు బావి వద్దనుంచి నీటిని తెచ్చుకొంటున్నారు. ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మను వివరణ కోరగా మోటారుకు మరమ్మతులు చేయించామని త్రీఫేస్ విద్యుత్తు సరఫరా అయితే తాగునీరు సరఫరా అవుతుందన్నారు. **-న్యూస్‌టుడే, సోమందేపల్లి**

కుళాయి చుట్టూ చెత్త..

సీతారామపురం కాలనీలోని ఉప సర్పంచి ఇంటి సమీపంలోఉన్న కుళాయి చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్రంగా మారింది. నీటిని పట్టుకునేందుకు వీలులేకుండా ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి నారాయణ దృష్టికి తీసుకెళ్లగా చెత్తను తొలగించేందుకు తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు. **-న్యూస్‌టుడే, పరిగి**

బడి తెరిస్తే ఊర్లోనే చదువు

కడతదహళ్లిలో ప్రాథమిక పాఠశాల ఎనిమిదేళ్ల క్రితం పది మంది లోపు విద్యార్థులున్నారని మూసేసి వారిని సమీపంలో ఉన్న పాఠశాలలకు పంపించారు. ప్రస్తుతం గ్రామంలో 25మందికి పైగా విద్యార్థులున్నా పాఠశాల లేకపోవడంతో దూరం వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు. ఎంపీడీవో రామారావును వివరణ కోరగా ఎంఈవోతో మాట్లాడి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. **-న్యూస్‌టుడే, అమరాపురం**

పురుగుమందు సరఫరాకు టెండర్లు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: జిల్లాలోని పట్టు రైతులకు నాణ్యమైన క్రిమి సంహారక మందుల సరఫరాకు ఆసక్తి కలిగిన వారి నుంచి షీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి శోభరాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుగు మందును జిల్లావ్యాప్తంగా వివిధ విభాగాలకు సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. టెండర్ల దాఖలు ప్రక్రియలో నియమ, నిబంధనలు వర్తిస్తాయన్నారు. 3 నుంచి 13వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు జాయింట్ డైరెక్టర్, జిల్లా పరిశ్రమల అధికారి కార్యాలయం, మామిళ్లకుంటక్రాస్, రైల్వేస్టేషన్ పక్కన కార్యాలయంలో టెండర్లను షీల్డ్ కవర్లలో అందజేయాలన్నారు. 15న కమిటీ ఆధ్వర్యంలో వాటిని తెరుస్తామని, మరిన్ని వివరాలకు జిల్లా పట్టుపరిశ్రమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కంకర దారులతో కష్టాలు..

బీటీ మోక్షమెప్పుడో అంటున్న గ్రామస్థులు

మడకశిర గ్రామీణం, గుడిబండ, న్యూస్‌టుడే: ఏళ్లుగా కంకరదారులకు బీటీలు వేయక ప్రయాణం నరకంగా మారింది. గ్రామీణ రహదారుల్లో కిలోమీటర్ల మేరా కంకర తేలడంతో వాహనచోదకులు కంకరపై అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్‌ల పరిధిలో వందకుపైగా కంకర రోడ్లు ఉన్నాయి. గర్భవతులు, బాలింతలు, ప్రమాదాలకు గురైన వారిని, రోగులను అత్యవసరంగా ఆసుపత్రులకు తీసుకెళ్లాలంటే ప్రాణం అరచేతిలో పెట్టుకుని భయంభయంగా ప్రయాణించి గమ్యం చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

◆ గుడిబండ నుంచి పీఎన్ పాళ్యం రోడ్డుకు కంకరపరచి రెండు దశాబ్దాలు కావస్తోంది. మందలపల్లి నుంచి ముతుకూరు వరకు రోడ్డు కంకర తేలి గుంతలమయమైంది. హిరేతుర్పి ఎస్సీ కాలనీ నుంచి దాసరపల్లికి వెళ్లే మూడు కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా ఉంది. బీటీ వేయాల్సి ఉంది.

నిధుల విడుదలైన వెంటనే పనులు చేపడతాం

నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. మంజూరైన వెంటనే పనులు చేపడతాం

-లక్ష్మీనారాయణ, ఆర్అండ్‌బీ డీఈ, మడకశిర



హెచ్‌ఆర్‌పాళ్యం రహదారి దుస్థితి

◆ మడకశిర మండలం ఆమిదాలగొంది నుంచి హెచ్ఆర్ పాళ్యం వరకు 3 కిలోమీటర్ల రోడ్డు కంకర తేలింది. డి.రామగిరి రోడ్డు కిలోమీటరు మేరా కంకర పరిచి ఏడేళ్లుపైబడుతోంది. ఈ రోడ్డుకు మంజూరైన నిధులను వేరేదానికి మళ్లించారని గ్రామ ప్రజలు వాపోతున్నారు. తడకలపల్లి నుంచి ఎల్లోటికి వెళ్లే రోడ్డు నాలుగు కిలోమీటర్లు గుంతలమయమైంది.

కంకరపరిచి వదిలేసిన అమరాపురం మండలం విరుపసముద్రం రోడ్డు

◆ అమరాపురం: మండలంలో శివరం నుంచి రంగాపురం మీదుగా పేలుబండ వరకు 4 కిలోమీటర్ల రోడ్డుకు గత వైకాపా ప్రభుత్వ హయాంలో కంకర పరిచి వదిలేశారు. అమరాపురం నుంచి విరుపసముద్రం మీదుగా కర్ణాటక సరిహద్దు వరకు 8 కిలోమీటర్ల మేరా కంకర పరిచారు. సింగిల్ రోడ్డుగా ఉన్న ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు రూ.22 కోట్లు నిధులు మంజూరయ్యాయి. అయితే గుత్తేదారు కంకర పరచి వదిలేశాడు. అమరాపురం నుంచి పుల్లీకుంట రోడ్డుకు 2019లో ఎన్నికల ముందు రోడ్డు నిర్మాణానికి దాదాపు రూ.2.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా పట్టించుకోలేదు.

ఇసుక ట్రాక్టర్ల జప్తు

పరిగి, న్యూస్‌టుడే: ఊటుకూరు వద్ద పెన్నానది నుంచి సోమవారం ఉదయం అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను జప్తు చేసినట్లు పరిగి ఎస్సై రంగడుయాదవ్ తెలిపారు. నది నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో పోలీసు సిబ్బందితో వెళ్లి ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. జరిమానా విధించేందుకు రెవెన్యూ అధికారులకు సిఫారసు చేశామని ఎస్సై వివరించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

గోరంట్ల : గోరంట్ల రాజీవ్‌కాలనీలో సరైన రోడ్డు, మురుగుకాలువ లేక నీరు రోడ్డుపైనే పారుతున్న నేపథ్యంలో శనివారం మంత్రి సవిత పింఛన్ల పంపిణీ కోసం కాలనీకి వచ్చారు. ప్రజలు సమస్యను మంత్రికి వివరించారు. స్పందించిన మంత్రి సీసీ రోడ్డు ఏర్పాటుకు ఆదేశించారు. దీంతో గ్రామపంచాయతీకి చెందిన రూ.2.5లక్షల నిధులతో నిర్మాణం చేపట్టడానికి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి ఆధ్వర్యంలో సోమవారం భూమిపూజ చేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

(c) eenadu

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు

10న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సమావేశం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శాఖ ఎన్నికల నిర్వహణకు 10న సాధారణ సమావేశం నిర్వహిస్తామని జిల్లా సహకార అధికారి కృష్ణానాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుట్టపర్తి పట్టణంలోని గణేశ్ సర్కిల్‌లోని జిల్లా సహకార అధికారి కార్యాలయంలో సమావేశం ఉంటుందన్నారు. పోషకులు, ఉప పోషకులు, జీవితకాలపు సభ్యులు, జీవితకాల అనుబంధ సభ్యులందరూ తమ ఆధార్, సభ్యత్వ కార్డులతో తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. పదిమంది సభ్యులతో కూడిన కమిటీని ఎన్నుకుంటామని, వీరి నుంచి ఇద్దరిని ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌గా ఎంపిక చేస్తామని అందులో పేర్కొన్నారు.

చంద్రబాబు రాక.. అభివృద్ధికి బాట

కదిరి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నియోజకవర్గానికి రావడంతో అభివృద్ధి పనులపై ప్రజలు, పార్టీ శ్రేణుల్లో నమ్మకం పెరిగిందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. ఆయన సోమవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి పర్యటనను జయప్రదం చేసిన అధికారులు, కూటమి శ్రేణులకు ధన్యవాదాలు తెలియజేశారు. త్వరలోనే కదిరికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వస్తున్నారని, సీఎం పర్యటనలో ఏడీజే కోర్టుపై ప్రకటనతో కదిరి ప్రాంతవాసుల చిరకాల కోరిక నెరవేరనుందన్నారు. మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాలకు నిధులు కేటాయించాలన్నారు. కుటాగుళ్ల, రోడ్లపై సానుకూలంగా స్పందించారని గుర్తుచేశారు. నరసింహస్వామి ఆలయ తిరు వీధులు, ఎక్కాల్ రోడ్డు విస్తరణ పనులకు సానుకూలత తెలిపారన్నారు. తన ఆధ్వర్యంలో సమకూర్చిన వాహనాలను త్వరలోనే పోలీసు శాఖకు అప్పగిస్తామన్నారు.

చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ

విజేతలతో అకడమిక్ డీన్, ప్రిన్సిపల్ తదితరులు

కదిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని నారాయణ పాఠశాల విద్యార్థులు చిత్రలేఖనం పోటీలో ఉత్తమ ప్రతిభ చూపారు. ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో సోమవారం 'మీకు నచ్చిన పండగ' అనే అంశంపై చిత్రలేఖన పోటీలు జరిగాయి. ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు చక్కటి బొమ్మలు గీశారు. వీరిలో మొదటి మూడు స్థానాలను బి.కీర్తన యాదవ్, గుంజన్, పి.మొహమ్మది సాధించి బహుమతులు అందుకున్నారు. విజేతలను అకడమిక్ డీన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపల్ సర్ఫరాజ్, ఉపాధ్యాయులు అభినందించారు.

పేదింటి బిడ్డలు.. క్రీడల్లో దిట్టలు

కదిరి గ్రామీణం, నల్లచెరువు, న్యూస్‌టుడే: కదిరి నియోజకవర్గంలోని పట్నం, నల్లచెరువు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న పేదింటి బిడ్డలు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన డివిజనల్ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తాచాటారు. అండర్-17 జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారి భవిష్యత్తు ప్రణాళిక, లక్ష్యం గురించి వారి మాటల్లోనే తెలుసుకుందాం రండి..

అమ్మను బాగా చూసుకోవాలి

నా పేరు రాహుల్. మాది కదిరి గ్రామీణ మండలం మాచిరెడ్డిపల్లి. పట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నా. నాన్న రామాంజులు నాయక్ చనిపోయారు. అమ్మ కూలాకి బెంగళూరులో కూలీ పనులు చేస్తూ డబ్బులు పంపుతోంది. అవ్వ వద్ద ఉంటున్నా. అమ్మను బాగా చూసుకోవాలన్న కాంక్షతో ఆటల్లో రాణిస్తున్నా. బాగా ఆడితే మంచి ఉద్యోగం వస్తుందని చెప్పారు. డివిజన్ స్థాయి 1500 మీటర్ల పరుగులో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యా. పరుగులో జాతీయ స్థాయిలో మెరవాలని, ప్రభుత్వ ఉన్నతాధికారిగా ఎదగాలని లక్ష్యం.

గేమ్స్ కోటాలో ఉద్యోగం సాధిస్తా

నల్లచెరువులో ఉంటున్నా. నా పేరు షఫియా షేక్. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. అమ్మానాన్నలు సుమియా, షేక్ సుభాహాన్ వ్యవసాయం చేస్తూ నన్ను చదివిస్తున్నారు. చిన్నప్పటి నుంచి పరుగంటే ఇష్టం. నా ఆసక్తి గుర్తించిన పీడీ సార్ వాడల పల్లి షఫీ ప్రోత్సహించారు. డివిజన్ స్థాయి 100 మీటర్ల పరుగులో విజేతగా నిలవడంతో జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. పరుగులో జాతీయ స్థాయిలో మెరవాలని ఉంది. గేమ్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగం తెచ్చుకొని అమ్మానాన్నలను బాగా చూసుకోవాలన్నదే నా లక్ష్యం.

పోలీసు అధికారిగా రాణిస్తా...

నా పేరు గణేశ్‌బాబు. అమ్మానాన్నలు గంగులప్ప, కల్యాణమ్మ వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ నన్ను చదివిస్తున్నారు. పట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. చిన్నప్పటి నుంచి ఆటలంటే ఇష్టం. మా పీడీ సారు ప్రోత్సహించారు. ఇటీవల కదిరి పట్టణంలో జరిగిన మండల, డివిజనల్ స్థాయి హైజంప్ పోటీల్లో విజేతగా నిలవడంతో జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. హైజంప్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించి, పోలీసు అధికారిగా పేదలకు సేవ చేయడమే నా లక్ష్యం.

హైజంప్ పోటీల్లో పాల్గొన్న గణేశ్‌బాబు

మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి : 80085 73033
ధర్మవరం: 99596 98222

సమస్య: లోచర్ల పంచాయతీలోని పాఠశాల వద్ద నున్న మోటారు కాలిపోవడంతో ఆరు రోజులుగా తాగునీటి కొరత తలెత్తింది. **- స్థానికులు, లోచర్ల**

పరిష్కారం: సమస్యను పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి నాగరాజు దృష్టికి తేగా, స్పందించిన ఆయన సర్పంచి గంగులమ్మ, గ్రానీసా ఏఈ ఓబులేసు సహకారంతో సోమవారం సాయంత్రం కొత్త మోటారును తెచ్చి బిగించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.
– న్యూస్‌టుడే, కొత్తచెరువు

సమస్య: కనగానపల్లిలోని ఆదర్శ పాఠశాల, బాలుర వసతి గృహానికి వెళ్లే రహదారికి ఇరువైపులా ముళ్లకంప పెరగడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. **- శ్రీనివాసులు**

సమాధానం: ముళ్లకంపలను తొలగిస్తాం. **- జయచంద్ర, పంచాయతీ కార్యదర్శి**

సమస్య: మండలంలోని మామిళ్లపల్లి ఎస్సీ కాలనీలో నిరుపయోగంగా మారిన చేతిపంపునకు మరమ్మతులు చేపట్టాలి. **- సత్యమయ్య**

సమాధానం: వెంటనే మరమ్మతులు చేయిస్తాం. **- బాబాఫక్రుద్దీన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ**
– న్యూస్‌టుడే, కనగానపలి.

సమస్య: స్థానిక అంబేడ్కర్ కూడలి నుంచి ఎస్‌బీఐ మీదుగా సాగే కదిరి-హిందూపురం ప్రధాన రహదారిపై మురుగు పారుతోంది. పాదచారులు, విద్యార్థులు, ద్విచక్ర వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. **- రాజేష్, స్థానికుడు**

సమస్య: బీసీ కాలనీలో ఇళ్ల వద్ద చెత్తను పది రోజులుగా తొలగించడం లేదు. **- వెంకటేష్, కాలనీవాసి**

సమాధానాలు: కదిరి-హిందూపురం ప్రధాన రహదారిపై ఉన్న హోటళ్ల యజమానులకు వ్యర్థ నీటిని వదలకూడదని ఇప్పటికే నోటీసులిచ్చాం. పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. బీసీ కాలనీకి పారిశుద్ధ్య కార్మికులను పంపించి చెత్తను తీయిస్తాం. **- శంకర్, పంచాయతీ కార్యదర్శి, ఓబుళదేవరచెరువు**
–న్యూస్‌టుడే, ఓబుళదేవరచెరువు

ఆక్రమణలో ప్రభుత్వ భూమి

ప్రత్యేకాధికారి జనార్దన్‌కు ఫిర్యాదు చేస్తున్న కూటమి నాయకులు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ముదిగుబ్బలోని ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిపై విచారించి స్వాధీనం చేసుకోవాలని కూటమి నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం సంఘం కార్యాలయంలో ప్రత్యేకాధికారి జనార్దన్‌కు ఫిర్యాదు చేశారు. 42వ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సంఘానికి 2.40 ఎకరాల భూమి ఉంది. కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆ భూమిలో కొంత భాగాన్ని ఆక్రమించి దుకాణాలు, నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. సర్వే చేసి ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకొని తిరిగి సొసైటీకి అప్పగించాలని వారు కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రమేష్‌బాబు, మనోహర్, ప్రకాష్, రామక్రిష్ణ, నరసింహులు, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక సమస్య తీర్చరూ..

బత్తలపల్లి న్యూస్‌టుడే: మండల, గ్రామీణ ప్రాంతాల్లో శ్మశానవాటికలకు స్థలం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ధర్మవరం నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మధు వాపోయారు. ఆయన సోమవారం పార్టీ నాయకులు, స్థానికులతో కలిసి రెవెన్యూ కార్యాలయం వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దారు స్వర్ణలతకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎవరైనా చనిపోతే కననం చేసేందుకు శ్మశానవాటికలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నచోట ముళ్ల కంపలు పెరిగి అడుగు పెట్టలేని దుస్థితి నెలకొందన్నారు. అధికారులు స్పందించి మరుభూమికి స్థలాలు మంజూరు చేయాలని, ముళ్లకంపలు తొలగించాలని డిమాండ్ చేశారు. నిరసనలో సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యనిర్వాహణ కార్యదర్శి కాటమయ్య, మండల కార్యదర్శి వెంకటేశు, నాయకులు ఓబులేశు, పెద్దన్న, రవి, రమణ తదితరులు పాల్గొన్నారు.

భర్త ఇంటి ఎదుట ధర్నా

తాడిమర్రి: తాడిమర్రిలో సోమవారం సాయంత్రం హిమబిందు అనే వివాహిత ప్రధాన రహదారిపై తన భర్త ఇంటి ముందు నిరసన తెలిపింది. వివరాలు.. గ్రామానికి చెందిన ఓంకారేశ్వర్, హిమబిందు ఏడు నెలల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్నారు. ఇరువురి పెద్దలు అంగీకరించకపోవడంతో అనంతపురంలో ఓ గది అద్దెకు తీసుకుని ఉంటున్నారు. పది రోజుల క్రితం ఓంకారేశ్వర్ భార్య సెల్ ఫోన్ తీసుకొని చెప్పాపెట్టకుండా వెళ్లిపోయాడు. యువతి గ్రామానికి చేరుకుని విచారించగా భర్త అత్తమామల ఇంట్లోనే ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో భర్త ఇంటి ముందు నిరసనకు దిగింది. ఆమె మాట్లాడుతూ భర్తను తన వద్దకు రాకుండా అత్తామామలు అడ్డుకుంటున్నారని ఆరోపించింది. దీనిపై ఆమెకు, భర్త తల్లిదండ్రులతో వాగ్వాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఆమెను తమ వెంట తీసుకెళ్లారు. పోలీసు ఉన్నతాధికారులు ఘటనపై ఆరా తీసి, బాధిత యువతితో వివరాలు తెలుసుకొని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

సాయి నామంతో మార్మోగిన పుట్టపర్తి

శోభయాత్రలో పాల్గొన్న ఎస్పీ సతీష్‌కుమార్, బ్రహ్మకుమారీలు, విద్యార్థులు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సాయి ఓంకార నామస్మరణతో పట్టణ పురవీధులు మార్మోగాయి. ఆధ్యాత్మిక క్షేత్రం పుట్టపర్తి భక్తిభావంతో ఉట్టిపడింది. సోమవారం సత్యసాయి శత జయంతి సందర్భంగా ఓంశాంతి బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో నిర్వహించిన ద్వాదశ జ్యోతిర్లింగాల శోభయాత్రను ఎస్పీ సతీష్‌కుమార్ ప్రారంభించారు. పట్టణ ప్రధాన వీధుల్లో సాయి ఓంకార నామస్మరణ, మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, కోలాటాల నడుమ శోభయాత్ర సాగింది. సత్యసాయి నడిచిన పవిత్ర చిత్రావతి నదిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా భోగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

ప్రత్యేకాలంకారంలో మూలవిరాట్

తాడిమర్రి, న్యూస్‌టుడే: మండలంలోని పిన్నదరిలో సోమవారం భోగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవం వైభవంగా జరిగింది. మూడు రోజులుగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఉదయం స్వామివారిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం మూలవిరాట్‌ను పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామంలో రాతి దూలం పోటీలు ఏర్పాటు చేశారు. విజేతగా నిలిచిన చెన్నప్పకు రూ.50వేలు, వరుసగా రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరో స్థానాల్లో నిలిచిన గార్లదిన్నెకు చెందిన రామాంజినేయులుకు రూ.40వేలు, బళ్లారి వాసులు సిద్దేశ్వరరెడ్డికి రూ.30వేలు, తిరుపాలుకు రూ.20వేలు, గార్లదిన్నె షారూక్‌ఖాన్‌కు రూ.10వేలు, గుత్తి ఎర్రన్నకు రూ.5వేలు నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సత్యసాయి శత జయంతిని ఘనంగా నిర్వహిద్దాం

మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ చిత్రంలో ఎస్పీ సతీష్‌కుమార్, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, జేసీ మౌర్యభరద్వాజ్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రపంచానికే ఆధ్యాత్మిక శోభ చాటేలా సత్యసాయి శత జయంత్యుత్సవాలను సమన్వయంతో నిర్వహిద్దామని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లో శత జయంతి వేడుకల ఏర్పాట్లపై ఎస్పీ సతీష్‌కుమార్, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం జరిపారు. అందరూ సమన్వయంతో ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. 11న ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రుల బృందం వేడుకల ఏర్పాట్లపై సమీక్షిస్తుందన్నారు. ఆయా శాఖలు చేయాల్సిన పనులు, నిధుల కేటాయింపు, సమస్యలుంటే పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, కంట్రోల్ రూమ్, భద్రతా చర్యలు, మౌలిక వసతుల కల్పన తదితరాలపై అధికారులకు స్పష్టత ఉండాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. రూట్ మ్యాప్‌లు, ప్రవేశ, నిష్క్రమణ పాయింట్లు, డ్రోన్లతో పర్యవేక్షణ, క్యూ మేనేజ్‌మెంట్, వాహనాల రాకపోకలు తదితర అంశాల్లో తీసుకునే భద్రతా చర్యల గురించి వివరించారు.

పురుగు మందు సరఫరాకు టెండర్లు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: జిల్లాలోని పట్టు రైతులకు నాణ్యమైన క్రిమి సంహారక మందుల సరఫరాకు ఆసక్తి కలిగిన వారి నుంచి షీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి శోభరాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుగు మందును జిల్లావ్యాప్తంగా వివిధ విభాగాలకు సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. టెండర్ల దాఖలు ప్రక్రియలో నియమ, నిబంధనలు వర్తిస్తాయన్నారు. 3 నుంచి 13వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు జాయింట్ డైరెక్టర్, జిల్లా పరిశ్రమల అధికారి కార్యాలయం, మామిళ్లకుంటక్రాస్, రైల్వే స్టేషన్ పక్కన కార్యాలయంలో టెండర్లను షీల్డ్ కవర్లలో అందజేయాలన్నారు. 15న కమిటీ ఆధ్వర్యంలో వాటిని తెరుస్తామని, మరిన్ని వివరాలకు జిల్లా పట్టుపరిశ్రమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పేదలకు ఇంటి పట్టాలివ్వరా?

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలంటూ సోమవారం కదిరి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆర్‌సీపీఐ నాయకులు ధర్నా చేశారు. సొంతిల్లు లేని పేదలు కదిరి-హిందూపురం రోడ్డులోని ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని ఆ పార్టీ నాయకుడు నాగన్న తెలిపారు. పట్టాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

చేనేతపై జీఎస్టీ రద్దుకు వినతి

ధర్మవరం పట్టణం: చేనేతలకు ఎన్నికల్లో హామీ ఇచ్చిన పథకాలను అమలు చేయాలని కార్మిక సంఘం నాయకులు కోరారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ చేనేతపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని, ధర్మవరంలో ఈడీ కార్యాలయాన్ని నిర్మించాలని, 200 యూనిట్ల ఉచిత కరెంటు సక్రమంగా సరఫరా చేయాలని కోరారు. చేనేతల సమస్యలపై 7వ తేదీన పుట్టపర్తిలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చేనేత సంఘం జిల్లా నాయకులు బాషా, హరికుమార్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులతో సీసీ రోడ్లు

నంబూలపూలకుంట, న్యూస్‌టుడే: మండలంలోని పి.కొత్తపల్లి పంచాయతీ కేంద్రంలో సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లకు సర్పంచి చంద్రకళ సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీలోని అల్లుగుంటి వారిపల్లి, హరిజనవాడ, దిగువతూపల్లి, ఎగువతూపల్లి, బత్తినగారిపల్లి గ్రామాల్లో రూ.2.90 కోట్లు వెచ్చించి సీసీ రోడ్లు వేస్తామన్నారు.

హెచ్ఐవీ బాధితులకు నిత్యావసరాల పంపిణీ

తలుపుల, న్యూస్‌టుడే: తలుపులకు చెందిన పాతికమంది హెచ్ఐవీ బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేసినట్లు గ్రామీణాభివృద్ధి స్నేహితుల సంస్థ అధ్యక్షుడు మన్సూర్ తెలిపారు. ఒక్కొక్కరికి రెండు కిలోల గోధుమపిండి, 2కిలోల రాగిపిండి, అరకిలో చక్కెర, సబ్బు, సర్ఫ్ ప్యాకెట్, 22 షాంపులు, అరకిలో నూనె, పేస్టు, కాఫీపొడి, కారంపొడి, పసుపు, ఉప్పు, సేమియా తదితరాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ హోమియోపతి వైద్యుడు లక్ష్మీనరసయ్య, జన జాగృతి సిబ్బంది, బాధితులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల ఢీ: ఒకరి దుర్మరణం

సుబ్రహ్మణ్యం

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: అయిదు నిమిషాల్లో ఇంటికి చేరుతారనగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరిని మృత్యువు కబళించగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం రాత్రి ముదిగుబ్బ మండలం నాగులగుబ్బ సమీపంలో జరిగింది. ముదిగుబ్బ సీఐ శివరాముడు తెలిపిన వివరాల మేరకు.. ముదిగుబ్బకి చెందిన రాము కుమారుడు సుబ్రహ్మణ్యం(23) దొరిగల్లు దగ్గర ఓ క్వారీలో పొక్లెయిన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. రాత్రి విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో ముదిగుబ్బకు బయల్దేరాడు. అదే సమయంలో దొరిగల్లుకి చెందిన నరేంద్రబాబు, ఎర్రప్ప ముదిగుబ్బకి పని నిమిత్తం వచ్చి ముగించుకొని ద్విచక్ర వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. నాగులగుబ్బ సమీపంలోని జీమాన్ల దగ్గర ఈ రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. తీవ్ర గాయాలతో సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే చనిపోగా, నరేంద్రబాబు, ఎర్రప్పకు బలమైన దెబ్బలు తగిలాయి. క్షతగాత్రులను 108లో చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నరేంద్రబాబు పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనా స్థలాన్ని సీఐ పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. మృతుడు సుబ్రహ్మణ్యం అవివాహితుడు. తల్లిదండ్రులు గుజిరీ వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడంతో వారు రోదిస్తున్న తీరు అక్కడి వారిని కంటతడి పెట్టించింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

ధర్మవరం, న్యూస్‌టుడే: అప్పుల బాధ తాళలేక పట్టణంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ మంజునాథ్(22) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండో పట్టణ పోలీసులు తెలిపిన మేరకు.. మంజునాథ్ కుటుంబం ఉపాధి నిమిత్తం మూడేళ్ల క్రితం ధర్మవరం వైఎస్సార్ కాలనీకి వచ్చింది. పట్టణంలోని ఓ ఫైనాన్స్ సంస్థ దగ్గర మంజునాథ్ అప్పు చేసి ఆటో కొన్నాడు. దాని నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆటోకు కంతులు చెల్లించలేక, బయట చేసిన అప్పులు తీర్చలేక బాధపడేవాడు. ఈ నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరేసుకొని బలవన్మరణం పొందాడు. మృతుడి తల్లి తులసి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నామని రెండో పట్టణ సీఐ రెడ్డెప్ప తెలిపారు.

పట్టుచీరల వ్యాపారిపై దాడి

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం పట్టణంలోని రంగా సినీ కాంప్లెక్స్ వద్ద ఆదివారం రాత్రి ఎర్రజోడు నరేష్ అనే పట్టుచీరల వ్యాపారిపై గోపీనాథ్, వేణు అనే వ్యక్తులు దాడి చేశారు. సినిమాకు వెళ్లిన తనను వేణు బయటకు తేగా, గోపీనాథ్ దాడి చేశాడంటూ బాధితుడు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటో పట్టణ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ: పలువురికి గాయాలు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు మండలం పోతులకుంట గ్రామంలో రెండు కుటుంబాల మధ్య నెలకొన్న వ్యక్తిగత సమస్యపై తలెత్తిన వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. ఇందులో పలువురు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు బీసీ కాలనీకి చెందిన లక్ష్మీదేవి తన తండ్రి బాలినేని ఆదినారాయణ కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేసిందని యూపీఎస్ సీఐ మారుతి శంకర్ తెలిపారు. కర్ణాటకలోని గౌరిబిదునూరులో కుమారుడు రమేష్ దగ్గర ఉంటున్న ఆదినారాయణ, కొత్తచెరువులోని కుమార్తె లక్ష్మీదేవి దగ్గరకు వెళ్లడానికి శనివారం మధ్యాహ్నం బస్సు ఎక్కాడు. సాయంత్రానికి కుమార్తె ఇంటికి చేరుకోవాల్సి ఉండగా రాలేదు. కుటుంబ సభ్యులు ఆయన కోసం వెదికి ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తితిదేకు ఎలక్ట్రిక్ వాహనాల వితరణ

తిరుమల తిరుపతి దేవస్థానానికి ధర్మవరానికి చెందిన వేణు మోటార్స్ అధినేత డి.వేణుగోపాల్ రూ.1.50లక్షల విలువచేసే మూడు ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలను సోమవారం విరాళంగా అందజేశారు. ఆలయం ఎదుట వాటికి పూజలు చేసి, తాళాలను శ్రీవారి ఆలయ ఏఈవో మోహన్‌రాజు, తితిదే ట్రాన్స్‌పోర్ట్ విభాగం ఇన్‌ఛార్జి హరిబాబుకు అందజేశారు.
- న్యూస్‌టుడే, తిరుమల

IN THE COURT OF ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION): MADANAPALLE
I.P.No.29/2025
Petitioner:- Tannir Sreenivasulu
Vs.
Respondents:-
Sri S.Gopal Reddy and others
Notice to 15th Respondent
Sri Marimeni Kullayappa, S/o Late Venkatramana, Nursery Business, R/at D.No.7-398-1, Geetha Nagar, Dharmavaram, Sri Satya Sai district. PIN:515671. Cell No.9966989700.
Sir,
The above matter stands posted to **11-11-2025** for your appearance, hence you have to appear before the above said Court on **11-11-2025** at about **10.30 AM** either in person or through your counsel and file your objections if any, failing which the matter will be decide against you as exparte.
//By order of the Court//
Sd/- M.Lakshmi Kanth,
B.Com, LL.B., Advocate for Petitioner, Madanapalle, Cell No.9440333226

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE, DHARMAVARAM.
S.O.P.No. 2/2025
Between:
1. Anke Harshavardhan, S/o Late Anke Prasad,
2. Anke Venkata Sai, S/o Late Anke Prasad, Rep. by guardian by name 3. Krishnamma, W/o Nagaraju, All are right now residing at D.No.4-3-103, Janashakthi Nagar, Ananthapur Town
...Petitioners
AND
The Authorized person Postal Department, Darsimala Village, Dharmavaram Mandal
...Respondent
ప్రకటన
పై నెంబరు కేసులో అంకె ప్రసాద్ మరియు అంకె కుమారి చనిపోయినందు వలన వారికి Postal Department, Darsimala Village, Dharmavaram Mandal నందు రావలసిన మొత్తమును తీసుకొనుటకు పై కోర్టులో అర్జీదారులు Succession Certificate కొరకు అర్జీ దాఖలు చేసియున్నారు. సదరి కేసు 12-11-2025వ తేది ఉదయం 10.30 గంIIలకు వాయిదా వేసినారు. ఆరోజు ఎవరికైనా ఎటువంటి ఆక్షేపణలు ఉన్నచో స్వతహాగగానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు అర్జీదారులు తరుపున కోర్టువారు తీర్మానించెదరని తెల్పడమైనది.
Schedule
Amount in the custody of Darsimala Post Office, Dharmavaram Mandal, Sri Sathyasai District.. Amount of Rs.60,000 (Sixty Thousand Rupees Only).
(By Order of the Court)
S.Sudarshan Reddy, Advocate
Anantapuramu. Cell No: 8374475384, 8328647008.

అడుగేయాలంటే.. భయపడాల్సిందే!

ఆధ్యాత్మిక కేంద్రంలో ట్రాఫిక్ రద్దీతో కష్టాలు

ప్రధాన రహదారిలో అస్తవ్యస్తంగా వాహనాల రాకపోకలు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం, జిల్లా కేంద్రం పుట్టపర్తిలో నెలకొంటున్న ట్రాఫిక్ రద్దీతో వాహనచోదకులు, స్థానికులు భయాందోళన చెందుతున్నారు. నానాటికి పెరుగుతున్న వాహనాలు, అందుకనుగుణంగా విస్తరణకు నోచని రహదారులు, ప్రణాళికరహిత అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు, సెల్లార్లలో దుకాణాలు ఏర్పాటు చేయడంతో పట్టణంలో ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. ఇక్కడ ఒకటే ప్రధాన రహదారి ఉంది. ఎక్కడా పార్కింగ్ స్థలాలు లేవు. సూపర్ మార్కెట్లు, హోటళ్లు, దుకాణాలకు వెళితే వినియోగదారులు రోడ్డుపైనే వాహనాలను ఉంచాల్సిన దుస్థితి. రాకపోకలకు ఒకటే ప్రధాన రహదారి కావడంతో రోజూ ట్రాఫిక్ రద్దీ తప్పడం లేదు.

పట్టణం: పుట్టపర్తి	
✦ జనాభా:	40 వేలు
✦ ఆటోలు:	750
✦ ద్విచక్రవాహనాలు :	14 వేలు
✦ కార్లు :	1056

భక్తులకు తప్పని తిప్పలు: ప్రశాంతి నిలయంలోకి వెళ్లే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. సత్యసాయి మహాసమాధి దర్శనార్థం వచ్చే భక్తులు వాహనాలు విద్యాగిరి ద్వారం నుంచి సాయి విద్యా సంస్థల వరకు, ఎస్‌బీఐ రహదారి, సాయి టవర్స్ వీధుల్లో నిలుపుతున్నారు. రోడ్లు ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది.

రోడ్డు నిబంధనలు ఎక్కడ?: పట్టణంలో పోలీసు యంత్రాంగం రోడ్డు నిబంధనలను కఠినతరం చేస్తే కొంతైనా ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది. వాహనాల నిలిపేందుకు పార్కింగ్ స్థలాలు చూపాలి. మరోవైపు రోడ్డుకిరువైపులా చిరు వ్యాపారులు తోపుడు బండ్లు పెడుతుండటంతో ఇబ్బందులు పెరుగుతున్నాయి. కర్ణాటకనాగేపల్లి, ఎనుములపల్లి రహదారులపై వారపు సంతల నిర్వహణతోనూ ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు.

వాహనాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

పట్టణంలో ట్రాఫిక్ రద్దీ ఉన్నమాట వాస్తవమే. వాహనచోదకులు రోడ్డు నిబంధనలు పాటించకపోవడంతోనే సమస్య తలెత్తుతోంది. ఈ నేపథ్యంలో నిబంధనల అమలుకు కఠిన చర్యలు తీసుకుంటాం. వాహనాలు రాకపోకలు, పార్కింగ్ ప్రాంతాల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు చేపడతాం. భక్తులు, పర్యాటకులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.
-శివాంజనేయులు, సీఐ, పుట్టపర్తి

మోసంపై అన్నదాతల ఆవేదన

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి పట్టణంలోని ఓ ట్రాక్టర్ షోరూం నిర్వాహకులు తమను మోసం చేసి ట్రాక్టర్లను తీసుకెళ్లారంటూ రైతులు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతరం బాధిత రైతులు విలేకరులకు వివరాలు తెలిపారు. 2022లో కదిరిలోని ఓ ట్రాక్టర్ షోరూంలో 18 మంది కర్షకులు ఎల్అండ్‌టీ ఫైనాన్స్ కంపెనీలో లోన్ తీసుకుని ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. మొదటి కంతు కట్టిన తర్వాత షోరూం నిర్వాహకులు ట్రాక్టర్లలో తయారీ లోపం ఉందంటూ తీసుకెళ్లారు. రెండవ కంతు కోసం ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు రైతులను కలవగా, ట్రాక్టర్లను షోరూం నిర్వాహకులు తీసుకెళ్లారని చెప్పారు. మేం అప్పు ఇస్తే వాహనాలను వారు ఎలా తీసుకెళతారని, డబ్బులు మాకు చెల్లించాలని ఒత్తిడి తెచ్చారు. మోసపోయిన రైతులు షోరూం వద్దకు వెళ్లి అడగగా ట్రాక్టర్లను అమ్మేసినట్లు తెలిసిందన్నారు. దీనిపై కదిరి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసి రెండేళ్లయినా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. మరోవైపు ఫైనాన్స్ సంస్థ డబ్బులు చెల్లించాలని నోటీసులు ఇచ్చిందని వాపోయారు. తమకు న్యాయం చేయాలని ఎస్పీని కోరినట్లు బాధితులు వెల్లడించారు.

ట్రస్టు బోర్డు సభ్యుడిగా లక్ష్మీనారాయణ

లక్ష్మీనారాయణతో నారా రోహిత్ దంపతులు, ఆలయ అధికారులు, కూటమి నేతలు

కొత్తచెరువు, శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: కొత్తచెరువుకు చెందిన తెదేపా నేత చిన్నపోల్ల లక్ష్మీనారాయణ ముక్కంటి ఆలయ ట్రస్టు బోర్డు సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. గత నెల 26న జరిగిన ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం దేవాలయంలోని శ్రీమేధా దక్షిణామూర్తి సన్నిధి వద్ద ఆలయ ఈవో బాపిరెడ్డి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. లక్ష్మీనారాయణ సినీ హీరో నారా రోహిత్ స్నేహితుడి తండ్రి కావడంతో కార్యక్రమానికి తన భార్యతో హాజరయ్యారు. పాలక మండలి ఛైర్మన్ సాయిప్రసాద్ కొత్త సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, ఎంజీఎం అధినేత మల్లికార్జుననాయుడు, రిపబ్లిక్ క్లబ్ అధ్యక్షులు ప్రసాద్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

ఎందుకమ్మా మురుగుపాలు చేశావ్..?

నవ మాసాలు మోసావు..
పురిటి నొప్పులు భరించావు
ఎంత ప్రేమ నా మీద అను
కున్నా..
పొత్తిళ్లను పాన్పు చేస్తావు..
కంటికి రెప్పలా కాపాడతావు
అని ఎన్నో ఊహించుకున్నా..
నీ ముఖం చూడాలని ఆశపడ్డా అమ్మా..
కానీ.. లోకం పోకడ నాకేం తెలుసు..
మా అమ్మ మనసు రాయిలాంటిదని..
కనికరం లేకుండా కాలువలో పడేస్తుందని..
ఆడపిల్లని మొగ్గలోనే తుంచేశావు..
కళ్లు తెరవకుండానే మురుగుపాలు చేశావు..
అమ్మ అనే పదానికి అర్థం మార్చేశావు..

మృతి చెందిన శిశువును పరిశీలిస్తున్న ఎస్‌ఐ హరికృష్ణ

శ్రీకాకుళం నగర పరిధి అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి సమీపంలో ఇంద్ర పుష్కరిణి పక్కనే మురుగు కాలువలో సోమవారం మధ్యాహ్నం ఆడ శిశువు మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పుట్టిన వెంటనే బొడ్డు కూడా తెగి పడక ముందే పడేయడంతో ఆ హృదయ విదారక దృశ్యాన్ని చూసిన వారంతా కన్నీటి పర్యంతమవుతున్నారు. సమాచారం తెలుసుకున్న ఒకటో పట్టణ ఎస్‌ఐ హరికృష్ణ ఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తా విభాగం

మార్మోగిన ముక్కంటి నామస్మరణ..

కార్తిక మాసం రెండో సోమవారం పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగాయి. దారులన్నీ శివుడివైపే దారితీశాయి.. వేకువ జామునుంచే భక్తులు బారులు తీరారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష రుద్రాక్ష, పుష్పాలంకరణ చేశారు. సముద్ర, నదీ తీరాలు, కోనేరుల్లో కార్తిక దీపాలు కనువిందు చేశాయి. టెక్కలిలోని రావివలస ఎండల మల్లన్న క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తుల చిత్రం చూడొచ్చు.
– న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

రోడ్డెక్కిన రెక్కల కష్టం..!

సారవకోట మండలంలో సారవకోట, కొత్తూరు, కుమ్మరిగుంట తదితర గ్రామాల పరిధిలో యంత్రాల సహాయంతో వరి చేను కోత, నూర్పిడి ప్రక్రియ ప్రారంభమైంది. పొడి వాతావరణం నెలకొనడంతో కోత దశకు చేరిన పంటను రైతులు దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ట్రాక్టర్ల సహాయంతో ధాన్యాన్ని తరలించి జాతీయ రహదారికి ఆనుకుని కొందరు, సీర్వసు రోడ్లపై మరి కొందరు ఆరబెడుతున్నారు. సారవకోట నుంచి జగ్గయ్యపేట గ్రామం వరకు 2 కిలోమీటర్ల పొడవునా ఎక్కడ చూసినా ధాన్య రాశులు కనిపిస్తున్నాయి. పచ్చి ధాన్యం 80 కిలోల బస్తా రూ.1,370కు కొనుగోలు చేయడానికి వ్యాపారులు నిర్ణయించడంతో, ఆసక్తి చూపని రైతులు ఆరబెట్టాలని నిర్ణయించారు. ఆరిన తర్వాత విక్రయిస్తే బస్తాకు రూ.400కు పైగా అధిక ధర లభిస్తుందని 8 ఎకరాల పంటను ఆరబెట్టినట్లు కుమ్మరిగుంట రైతు పాగోటి చిన్నారావు తెలిపారు. – న్యూస్‌టుడే, సారవకోట



కూర్మనాథా.. దారుణం కనవా..!

కొందరు వ్యక్తులు స్వార్థంతో ప్రజోపయోగమైన వనరులను నాశనం చేస్తున్నారు. శ్రీకూర్మం సినిమా హాలు నుంచి దువ్వుపేట వెళ్లే మట్టి దారి నీరు నిలిచి బురదమయంగా మారింది. పక్కనే ఉన్న గేదెల డెయిరీ ఫాం వ్యర్థాలు ఈ దారిలోకి విడిచిపెడుతుండటంతో ఇలా తయారైంది. బురదగా మారి దుర్వాసన వస్తున్నా.. కూర్మనాథ స్వామి 'పొలికోత' క్రతువుకి అర్చకులు ఈ దారిలో వెళ్లారు. డెయిరీ ఫాంపై చర్యలు తీసుకుని రోడ్డుని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఉపాధిహామీ క్షేత్ర సహాయకురాలు శిరీష వద్ద ప్రస్తావించగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.
–న్యూస్‌టుడే, గార

కోటబొమ్మాళిలో అన్న క్యాంటీన్ ప్రారంభం

కోటబొమ్మాళి మండల కేంద్రంలో అన్న క్యాంటీన్‌ను కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు సోమవారం ప్రారంభించారు. ప్రజలకు స్వయంగా వడ్డించారు. నాణ్యతతో కూడిన ఆహారం అందించి మోడల్ క్యాంటీన్‌గా మారుస్తామని వారు పేర్కొన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి అక్కడే భోజనం చేశారు.
- న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

ఉచితంగా నీట్ శిక్షణ

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఉచితంగా నీట్ శిక్షణ అందించనుందని ఎస్సీ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయకర్త యశోదలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ గురుకులాలు, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో ఇంటర్ చదివిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 75692 26400, 94412 67323, 97017 36862, 89783 61642 నంబర్లను సంప్రదించాలన్నారు.

వేగం మితిమీరి.. మృత్యువు దరిచేరి..!

■ జిల్లాలో ఇసుక, గ్రానైట్, కంకర, ఇతర సరకుల అధిక లోడుతో కలిగిన మొత్తం 186 లారీలను ఈ ఏడాది రవాణా శాఖ అధికారులు పట్టుకొని జరిమానా విధించారు. వీటిలో అత్యధికంగా ఇసుక, గ్రానైట్ లారీలే ఉన్నాయి. ప్రమాదాలు జరుగుతాయని తెలిసి నప్పటికీ వాహనాలను మితిమీరిన వేగంతో నడుపుతున్నారు.

■ జిల్లాలో 60-80 కి.మీ వేగం మాత్రమే అనుమతి ఉంది. కానీ రాత్రి సమయంలో 100 కి.మీ వేగంతో నడుపుతున్నారు. అధిక లోడుకు తోడుగా మితిమీరిన వేగంతో వాహనాన్ని నియంత్రించలేక ప్రమాదాలు జరుగుతున్నాయి.

■ జిల్లాలో వంశధార, నాగావళి నదుల్లో ఇసుక తవ్వకాలకు అనుమతులు కలిగిన 22 రేవులు ఉన్నాయి. ఒక్కో రేవు నుంచి నిత్యం పదుల సంఖ్యలో ఇసుక లారీలు గ్రామీణ ప్రాంతాల్లో రణరంగం సృష్టిస్తూ రహదారులను ధ్వంసం చేస్తూ పరుగులు పెడుతుంటాయి.

■ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్లు 25-30 టన్నుల సామర్థ్యాన్ని మాత్రమే తట్టుకోగలవు. కానీ లారీలు 35-45 టన్నుల వరకు లోడింగ్ చేస్తున్నారు.

■ ఇప్పటికే ఆమదాలవలస, బూర్జ, నరసన్నపేట, శ్రీకాకుళం మండలాల్లోని పదుల సంఖ్యలో రోడ్లు ఎక్కడికక్కడ దెబ్బతిన్నాయి.

సుభద్రపురం వద్ద జాతీయ రహదారిపై అదుపు తప్పిన ఇసుక లారీ

– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో సోమవారం ఉదయం కంకర లారీ ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో మొత్తం 19 మంది మృతి చెందారు. లారీ పరిమితికి మించి లోడు, వేగం కారణంగానే ప్రమాదం జరిగిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. జిల్లాలోనూ నిత్యం వందల సంఖ్యలో లారీలు కంకర, ఇసుక, గ్రానైట్‌లను పరిమితికి మించి లోడుతో రాకపోకలు సాగిస్తుంటాయి. దీని వల్ల రహదారులు ధ్వంసం కావడంతోపాటు ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు లారీలపై దృష్టిసారించి చర్యలు తీసుకోకపోతే ప్రాణ, ఆస్తి నష్టం తప్పదు.

ఇసుక, గ్రానైట్ లారీల ఇష్టారాజ్యం

◆ ఆరు నెలల క్రితం పెద్దపాడు సమీపంలో అధికలోడుతో ఉన్న గ్రానైట్ లారీ ఆర్టీసీ బస్సును ఢీకొట్టగా.. బస్సు ముందు వెళ్తున్న లారీలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గ్రానైట్ లారీ డ్రైవర్ మృతి చెందగా బస్సులో ఉన్న 16 మంది ప్రయాణికులు గాయపడ్డారు.

అధిక లోడింగ్‌తో జనవరి నుంచి నేటి వరకు జరిమానా విధించిన లారీల వివరాలు



★ టెక్కలి, పాతపట్నం, ఆమదాలవలస, పలాస, శ్రీకాకుళం నియోజకవర్గాల్లో గ్రానైట్ కంకర క్వారీలు అధికంగా ఉన్నాయి. గ్రానైట్ లారీలు 55 టన్నుల సామర్థ్యం కలిగిన వాటిలో కొన్ని సందర్భాల్లో బ్లాక్ కట్ చేయరు. అప్పుడు 60-70 టన్నుల వరకు లారీల్లో తరలిస్తారు. దీని వల్ల ప్రమాదాలు జరిగిన ఉదంతాలు ఉన్నాయి.

'చర్యలు తీసుకుంటాం..: అధిక లోడుతో వాహనాలను నడిపినవి పట్టుబడితే మోటారు వాహనచట్టం సెక్షన్ 200 కింద రూ.20వేలు, టన్నుకు రూ.2వేల చొప్పున సైతం అపరాధరుసుము ఉంటుంది. జిల్లాలో చాలా వాహనాలను తనిఖీల్లో పట్టుకున్నాం.
- విజయసారథి, జిల్లా ఉపర వాణాశాఖ కమిషనర్'

ఆసక్తి మీది.. ఉద్యోగ హామీ మాది..!

– న్యూస్‌టుడే, లావేరు

నిరుద్యోగులకు అండగా ఉండేందుకు ప్రభుత్వం కౌశలం పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇంటి నుంచే పని చేసేలా చర్యలు తీసుకుంటోంది. 18 ఏళ్ల పైబడి, పదో తరగతి, ఆపై చదివిన యువత పూర్తి వివరాలతో నమోదు చేసుకునే అవకాశం ఇవ్వడంతో మంచి స్పందన లభించింది. జిల్లాలో ఇప్పటి వరకు 1,37,745 మంది దరఖాస్తు చేసుకోగా 1,00,274 దరఖాస్తుల పరిశీలన పూర్తయింది.

◆ సర్వే పూర్తయిన తరువాత.. శిక్షణ అందిస్తారు. అనంతరం అర్హతలకు అనుగుణంగా ఆసక్తి చూపితే ఇంటి నుంచి పని చేసే విధంగా ఉపాధి కల్పిస్తారు. లేదంటే పరిశ్రమల్లో అవకాశం ఇస్తారు.

◆ సచివాలయ సిబ్బంది కౌశలం పేరిట గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న యువతకు సంబంధించిన వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నారు.

◆ శిక్షణ కాలంలో ప్రభుత్వం వారికి కొంత మొత్తాన్ని చెల్లిస్తుంది.

◆ నిరుద్యోగుల విద్యార్హతలను ఆధారంగా వారికి ఏ రంగంలో ఆసక్తి ఉందో తెలుసుకుని అవసరమైన శిక్షణలు, కొలువులు కల్పిస్తాం. కౌశలం పథకం నిరుద్యోగులకు ఎంతో ఉపయోగపడుతుంది' అని శ్రీకాకుళం డివిజన్ డీఎల్‌డీవో అరుంధతీదేవి తెలిపారు.

జిల్లాలో విద్యార్హతల ఆధారంగా నమోదు చేసిన వివరాలు

ఐటీఐ	డిప్లొమా	గ్రాడ్యుయేషన్	పోస్టు గ్రాడ్యుయేషన్	పీజీ డిప్లొమా	పీహెచ్‌డీ
1351	775	11,574	1570	15	10

చెరువును వదలం.. కంకర మిగల్చం

నరసన్నపేట... జిల్లాలో ముఖ్యమైన వ్యాపార, వాణిజ్య కార్యకలాపాల కేంద్రం. ఇక్కడ భూములకు విలువ ఎక్కువ. అధికారుల నిర్లక్ష్యం, చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతుండగా కంకర తవ్వకాలు పోలాకి మండలం చిరునామాగా మారింది. ఎవరికి వారు అక్రమార్కులు ఇష్టానుసారంగా ఆక్రమణలు, తవ్వకాలు చేస్తుంటే పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట, పోలాకి

❍ నరసన్నపేటలో గొట్టిపల్లి ప్రాంతంలో సర్వే సంఖ్య 187లో 2.35 ఎకరాల విస్తీర్ణంలో రాతి కర్ర చెరువు ఉండేది. నీటి వనరుగా ఉపయోగ పడిన ఈ చెరువుని కొద్దికొద్దిగా ఆక్రమించి, కప్పేసిన ఆక్రమణదారులు ఇళ్లు, ఇతర నిర్మాణాలు చేపట్టి మారుతీనగర్‌గా మార్చుకున్నారు. దీనిపై గరీబ్ గైడ్ అనే సంస్థ జాతీయ హరిత ట్రైబ్యునల్‌లో కేసు వేయగా విచారణలో ఉంది. ఇక్కడ ఇంకా కొంత స్థలం మిగలడంతో దానిపైన కన్నేసిన ఆక్రమణదారులు వారం రోజులకు భవనం నిర్మించేందుకు పనులు చేయిస్తున్నా. . రెవెన్యూ, పంచాయతీ యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఇక్కడ సెంటు విలువ రూ.20 లక్షలు పలుకుతోంది.

మారుతీనగర్‌లో అక్రమంగా కడుతున్న నిర్మాణం

❍ పోలాకి మండలంలో రాళ్లపాడు, గాతలవలస, చెల్లాయవలస, గంగివలస, పంచాయతీల పరిధిలో కొండలను తవ్వి కంకర కొల్లగొడుతున్నారు. సచివాలయ, రెవెన్యూ సిబ్బంది ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. మూడు ప్రాంతాల్లో కంకర అమ్మకాలు విరివిగా సాగుతున్నాయి. ఖరీఫ్ కాలం ముగింపునకు రావడంతో ట్రాక్టర్లను కంకర తరలింపునకు వినియోగిస్తున్నారు. పునాదులకు, పొలాలకు, ఇతర అవసరాలకు ఉపయోగిస్తుండటంతో గిరాకీ పెరిగింది. దూరం ఆధారంగా ట్రాక్టరు కంకరకు రూ. వెయ్యి నుంచి రూ. 3వేల వరకు వసూలు చేస్తున్నారు. 'అక్రమ తవ్వకాల విషయం నా దృష్టికి రాలేదు. సిబ్బందిని పంపించి చర్యలు తీసుకుంటాను' అని తహసీల్దార్ పి.శ్రీనివాసరావు తెలిపారు.

"చెరువు స్థలాల్లో ఆక్రమణలకు తావులేదు. ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటామని తహసీల్దారు సత్యనారాయణ వెల్లడించగా, ఈ సారి కఠిన చర్యలు తీసుకుంటామని పంచాయతీ ఈవో దాక్షాయిని తెలిపారు."

పోలాకి: కొండను తొలిచి ట్రాక్టరులో వేస్తున్న కంకర

పరిహారం పెంపు..హలధారికి ఊరట..!

– న్యూస్‌టుడే, రణస్థలం

ఆరుగాలం కష్టపడి సాగుచేసి పండించిన పంట ప్రకృతి వైపరీత్యాలకు తీవ్ర నష్టానికి గురవుతోంది. అప్పటివరకు పెట్టిన పెట్టుబడి నేలపాలై రైతన్నలు తీవ్ర కుంగదీస్తోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అన్నదాతకు ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. నష్టానికి గురైన పంటలకు గతంలో కన్నా పరిహారాన్ని పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. పంటలకు సుమారు హెక్టారుకు రూ.7 వేల నుంచి రూ.15 వేల వరకు అదనంగా అందనుంది.

◆ జిల్లాలో వరి 3.80 లక్షల ఎకరాల్లో సాగు చేస్తుండగా మొంథా తుపాను ప్రభావంతో 17 మండలాల్లో 5,792 మంది రైతులకు చెందిన 1,247 హెక్టార్ల వరి పంట నష్టానికి గురైనట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. జీడి 7.53, కూరగాయలు 4.2, హెక్టార్లు, కొబ్బరి 254

జి.సిగడాం మండలం ఆనందపురంలో తుపానుకు నేలకొరిగిన వరి పంట

చెట్లు దెబ్బతిన్నట్లు ఉద్యాన శాఖాధికారులు అంచనా వేశారు.

◆ సంతబొమ్మాళి, నందిగాం, కొత్తూరు, ఎల్‌ఎన్‌పేట, ఇచ్ఛాపురం, సోంపేట, హిరమండలం, పాతపట్నం, మెళియాపుట్టి, మందస తదితర మండలాల్లో వరి పంట అధికంగా నష్టానికి గురైంది. పంట దిగుబడికి 33 శాతానికి మించి నష్టానికి గురైతేనే పరిహారం పొందడానికి అర్హులవుతారని వ్యవసాయశాఖ జేడీ త్రినాథస్వామి తెలిపారు. పంట నష్ట అంచనాలు ఇప్పటికే దాదాపు ఖరారు చేశామని, నివేదిక ప్రభుత్వానికి పంపి పరిహారం విడుదల చేసిన వెంటనే అందజేస్తామని పేర్కొన్నారు.

◆ వరి, బొప్పాయి, కూరగాయలు, చెరకు, పత్తి, వేరుశనగ, మిరప పంటలకు గతంలో రూ. 17 వేలు ఉండగా, ప్రస్తుతం 25 వేలు చేశారు.

పెంచిన పరిహారం వివరాలు (హెక్టార్లలో)

పంట	గతంలో (రూ.)	ప్రస్తుతం
పసుపు	17,000	35,000
అరటి	25,000	35,000
మినుము	10,000	15,000
నువ్వులు	8,500	15,000

అంతరపంటతో ఆదాయం పొందుతున్న మహిళా రైతు చేసిన సూచనలు, బొప్పాయి పాలతో లాభాలు, చేపల పెంపకంలో చిట్కాలు
రైతేరాజు 6లో

ధ్రువపత్రం పోయిందా.. నకలు పొందే దారుంది..!

పది, ఇంటర్ ధ్రువపత్రాలు విద్య, ఉద్యోగ జీవితానికి ఎంతో ముఖ్యమైనవి. మనం ఎక్కడైనా మరిచిపోయినా.. పోగొట్టుకున్నా.. నకలు పొందేందుకు ఇప్పుడు మార్గాలు ఉన్నాయి. అయితే నకలు మన చేతికి రావాలంటే కొన్ని పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. అదేంటో తెలుసుకుందాం.
– పలాస పట్టణం, న్యూస్‌టుడే

10th

❍ పది ధ్రువపత్రం పోగొట్టుకుంటే bse.ap.gov.in వెబ్‌సైట్‌లో వెళ్లి, డూప్లికేట్ ఎస్ఎస్‌సీ దరఖాస్తు ఆప్షన్‌పై క్లిక్ చేస్తే తెరుచుకుంటుంది. ప్రింట్ తీసి వివరాలు నింపాలి.

❍ దరఖాస్తుకు ఫొటో అతికించి సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయునితో సంతకంతో పాటు లేఖను, రూ.50 విలువైన స్టాంపు పేపర్‌పై చేయించిన అఫిడవిట్, సబ్‌ఇన్‌స్పెక్టర్, డిప్యూటీ తహసీల్దారు, అంతకంటే ఎక్కువ స్థాయి కలిగిన అధికారి ఎవరైనా ఇచ్చిన నాట్ ట్రేసింగ్ ధ్రువపత్రం, పోయిన పదోతరగతి ధ్రువపత్రం జిరాక్స్ కాపీలను జతచేయాలి.

❍ రూ.250 విలువైన చలానా తీసి, ఇవన్నీ కలిపి సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ద్వారా డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ వారికి పోస్టు ద్వారా పంపించాలి.

❍ నెలరోజుల్లో ఆ పాఠశాలకు నకలు ధ్రువపత్రం వస్తుంది. విద్యార్థి ఫొటోతో పాఠశాలకు వెళ్తే.. సర్టిఫికేట్‌పై అతికించి హెచ్ఎం సంతకం పెట్టి ఇస్తారు.

Inter

❒ ఇంటర్మీడియట్ ధ్రువపత్రం అయితే.. bieap.apcfss.in వెబ్‌సైట్‌లో స్టూడెంట్ సర్వీసెస్‌లోకి వెళ్లి డూప్లికేట్ లేదా ట్రిప్లికేట్ ఐకాన్‌పై క్లిక్ చేస్తే అప్లికేషన్ ఓపెన్ అవుతుంది. (మొదటిసారి పోతే డూప్లికేట్, రెండోసారి పోతే ట్రిప్లికేట్) అందులో హాల్‌టికెట్ నంబరు, పుట్టినతేదీ, మెయిల్ ఐడీ, నమోదు చేస్తే విద్యార్థి వివరాలు కనిపిస్తాయి.

❒ అవన్నీ పరిశీలించి చరవాణి సంఖ్యను ఎంటర్ చేశాక .. సర్టిఫికేట్ పోయిందా, చిరిగిపోయిందా సెలెక్ట్ చేయాలి. పోయినట్లయితే పోలీస్ ఎఫ్ఐఆర్ కాపీని, చిరిగిపోతే చిరిగిన కాపీని అప్లోడ్ చేయాలి.

❒ ఎఫ్ఐఆర్ కాపీ కోసం దగ్గరలోని మీసేవలో మిస్సింగ్ సర్టిఫికేటు కోసం దరఖాస్తు చేస్తే పొందుకోవచ్చు.

❒ ఆ తర్వాత అఫిడవిట్, ప్రిన్సిపల్‌తో సంతకం చేసిన దరఖాస్తు ఫారాన్ని నింపి అప్లోడ్ చేయాలి. సర్టిఫికేట్ పొందడానికి అవసరాన్ని కూడా నమోదు చేయాలి. తర్వాత చలానా తీసి ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ కొడితే అప్లికేషన్ నంబరు ఓపెన్ అవుతుంది.

❒ ఆ నంబరు ద్వారా అప్లికేషన్ స్థితిని తెలుసుకోవచ్చు. అప్లోడ్ చేసిన ఒక సెట్ పత్రాలను సంబంధిత కళాశాలకు ఇవ్వాలి. అనంతరం డూప్లికేట్ సర్టిఫికేట్ కళాశాలకు వస్తుంది.

పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఏవియేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏవియేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కళాశాలలో చేపడుతున్న పనులను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇది కేవలం మహిళలకు మాత్రమే ఉద్దేశించిన ప్రత్యేక శిక్షణ కేంద్రం అన్నారు. రెండు నెలల పాటు ఎయిర్ లైన్స్ టికెట్ అండ్ రిజర్వేషన్, ఎయిర్‌పోర్టు గ్రౌండ్ ఆపరేషన్ వంటి కోర్సుల్లో తర్ఫీదు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఒక్కో బ్యాచ్‌కు 30 మంది ఉంటారని, ఒకే విడతలో 60 మందికి శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు.

మన దగ్గరా.. జెమీమా..శ్రీ చరణిలు..!

– న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

ఎన్నాళ్లో వేచి చూసిన విజయం భారత మహిళా క్రికెట్ జట్టును వరించింది. చిరస్మరణీయమైన ఈ గెలుపుతో దేశవ్యాప్తంగా సంబరాలు చేసుకోగా.. యువ క్రీడాకారిణుల్లో కొత్త ఆశలు నింపింది. జిల్లాలో కూడా ఇలాంటి మెరికలు ఉన్నారు. అడ్డంకులు ఎదురైనా.. లక్ష్యం దిశగా సాగుతూ.. జెమీమాలా బ్యాట్‌తో.. తెలుగు బిడ్డ శ్రీచరణి రెడ్డిలా బంతితో చెలరేగిపోతున్నారు. అవకాశమిస్తే దేశానికి ప్రాతినిధ్యం వహించే సత్తా వీరికి ఉంది.

● బ్యాట్‌తో పరుగుల వరద పారిస్తుంది. లెగ్ స్పిన్‌తో వికెట్లు తీస్తుంది గార మండలం అంపోలు గ్రామానికి చెందిన **దుడ్డు కుముదిని.** ఆల్‌రౌండర్‌గా సత్తా చాటుతున్న యువ క్రీడాకిరిణి ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతూనే నెట్స్‌లో నిరంతరం శ్రమిస్తోంది. సబ్ పోస్ట్ మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న తండ్రి రమణ, తల్లి తేజేశ్వరి భుజం తట్టడంతో రాణిస్తోంది. అండర్ 19 టీ-20ల్లో టాప్-8, వన్డేల్లో టాప్ 13, సీనియర్స్ విభాగంలో టీ20లో టాప్ 5లో నిలిచి సిక్కోలు తడాఖా చూపించింది. 2023-24 ఏడాదిలో అండర్-15 రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్‌గా నిలిచింది. దేశవాళీ క్రికెట్‌లో భాగమవ్వాలని కృషి చేస్తోంది.

● **బూసి నవ్య** బంతి చేతికిస్తే ఆఫ్‌స్పిన్ మాయాజాలంతో మ్యాచ్‌నే తిప్పేస్తుంది. పోలాకి మండలం ఈదులవలసకు చెందిన ఈమె తండ్రి చిన్నతనంలోనే చనిపోవడంతో తల్లి, మామ ప్రోత్సాహంతో క్రికెట్‌కు పరిచయమైంది. డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నవ్య రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటింది. అండర్ 16లో కేరళపై హ్యాట్రిక్ వికెట్లు, అండర్ 19లో హిమాచల్‌ప్రదేశ్‌పై 5 వికెట్లు తీసి సెలక్టర్లను ఆకట్టుకుంది. ఈ ఏడాది అండర్ 23, సీనియర్ ప్రాబబుల్స్‌లో చోటు దక్కించుకుంది.

● ఈ కోవలోనే హారికా యాదవ్, సౌమ్య, శ్రీలత వంటి మేటి క్రీడాకారిణులు ఉన్నారు. అవకాశాలు రాకపోవడంతో సత్తా చాట లేకపోతున్నారు. సరైన శిక్షణ కేంద్రాలు, నిపుణుల పర్యవేక్షణ, వసతులు కల్పిస్తే అంతర్జాతీయ క్రీడాకారిణులకు ఏ మాత్రం తీసిపోని ప్రదర్శన ఇవ్వగలరు.

● నరసన్నపేట మండలం నారాయణవలస గ్రామానికి చెందిన **ముద్దాడ భానుమతి** ఆల్‌రౌండర్. 8 ఏళ్లుగా ఆడుతున్న ఈమె తల్లిదండ్రులు రోజు కూలీలు బ్యాటింగ్, బౌలింగ్‌తోపాటు ఫీల్డింగ్ అదనపు బలం. జిల్లాస్థాయిలో మంచి ప్రదర్శన ఇస్తోంది. జోన్ పోటీలకు ఎంపికైనా ఆడే అవకాశం రాలేదు. ఎప్పటికైనా ఉత్తమ క్రికెటర్‌గా నిరూపించుకోవాలని శ్రమిస్తోంది.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి
ఈనాడు క్లాసిఫైడ్స్
లీగల్ ప్రకటనలు
జయంతి, వర్ధంతి
అంత్యక్రియలు,
జన్మదిన శుభాకాంక్షలు
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80085 97609

(c) eenadu

2 తరగతులు.. ఇద్దరు విద్యార్థులు

కవిటి మండలం డి.గొనపపుట్టుగ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతోంది. ఇక్కడ ప్రస్తుతం ఒకటో తరగతిలో ఒకరు, రెండో తరగతిలో ఇద్దరు మాత్రమే ఉండటం గమనార్హం. సోమవారం ఒకటో తరగతి విద్యార్థి సెలవు పెట్టడంతో రెండో తరగతిలోని ఇద్దరికి ఉపాధ్యాయుడు పాఠాలు బోధించారు. గతేడాది ఇక్కడ ఒకటి నుంచి ఐదు తరగతులకు 11 మంది విద్యార్థులు ఉండేవారు. దీనిపై ఎంఈవో ధనంజయను వివరణ కోరగా.. పిల్లలు తక్కువగా ఉండటంతో 3, 4, 5 తరగతులను పక్క గ్రామం జల్లుపుట్టుగలో కలిపామని తెలిపారు. సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. - న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

చెయ్యెత్తినా బస్సు నిలపరు

లక్కుపురం కూడలిలో విద్యార్థుల ఆందోళన

బూర్జ, న్యూస్‌టుడే: బస్సులు నిలపడం లేదని రహదారిపై విద్యార్థులు బైఠాయించి నిరసన తెలిపిన ఘటన బూర్జ మండలం లక్కుపురం కూడలిలో సోమవారం చోటుచేసుకుంది. పాలకొండ, ఆమదాలవలస, శ్రీకాకుళం నగరంలోని విద్యాలయాలకు వెళ్లేందుకు సుమారు పది గ్రామాల విద్యార్థులు ఉదయాన్నే కూడలికి చేరుకుంటారు. ఆ సమయంలో బస్సులు ఆపాలని చెయ్యెత్తినా నిలపడం లేదని వాపోయారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుపై సుమారు గంటకు పైగా ఆందోళన చేశారు. శ్రీకాకుళం- పాలకొండ ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్సై ప్రవల్లిక ఘటనా స్థలానికి చేరుకున్నారు. చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారంతా శాంతించారు.

క్రీడా రంగానికి పెద్దపీట

రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్- 19 క్రికెట్ పోటీలు ప్రారంభం

క్రీడా జ్యోతిని వెలిగించిన ఎమ్మెల్యే గొండు శంకర్, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు

పాతబస్టాండ్, ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్రీడా రంగానికి పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని కోడి రామ్మూర్తి క్రీడా మైదానంలో సోమవారం పాఠశాలల క్రీడా పోటీల్లో భాగంగా అండర్- 19 క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ.. ఆటల్లో జయాపజయాలు సర్వసాధారణమని నిరంతర సాధనతో ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని చెప్పారు. జిల్లా విద్యాశాఖ అధికారి రవిబాబు, ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వి.రమణ, పీఈటీ, పీడీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తవిటయ్య పాల్గొన్నారు.

ఎచ్చెర్లలో నిర్వహణ

ఎచ్చెర్ల మండలంలోని డా.బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో పోటీలు జరిగాయి. శ్రీకాకుళం నగరంలోని కోడి రామ్మూర్తి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానాలు ఆడేందుకు అనుకూలంగా లేకపోవడంతో మ్యాచ్‌లను ఎచ్చెర్లలో నిర్వహించారు. తొలిరోజు 8 ఓవర్ల నిర్ణీత మ్యాచ్‌ల్లో శ్రీకాకుళం, విశాఖపట్నం, ప్రకాశం, గుంటూరు జట్లు విజయం సాధించాయి.

కనికరించండి.. కష్టాలు తీర్చండి

మీకోసంలో 92 వినతుల స్వీకరణ

అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఇతర అధికారులు

కలెక్టరేట్(శ్రీకాకుళం), శ్రీకాకుళం నేర వార్తా విభాగం, న్యూస్‌టుడే: జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమానికి 92 అర్జీలు వచ్చాయి. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, సహాయ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, ఇన్‌ఛార్జి డీఆర్‌ఓ లక్ష్మణ మూర్తి ఫిర్యాదులు స్వీకరించారు.

7 నెలలుగా తిరుగుతున్నాం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంఎల్‌టీ వృత్తి విద్యా కోర్సులు పూర్తిచేసిన వారికి రిమ్స్ ఆసుపత్రిలో అప్రెంటిస్ అవకాశం ఇస్తున్నారని, తమను మాత్రం రిమ్స్ అధికారులు 7 నెలలుగా తిప్పిస్తున్నారని పలువురు విద్యార్థులు వాపోయారు.

పింఛను పెంచండి: వాంద్రకు చెందిన ఎం.జగన్నాథం మనవడు అరవిందకు ప్రస్తుతం ఇస్తున్న పింఛను సరిపోవడం లేదు. రూ.15,000 మంజూరు చేయాలని కోరారు. అరవింద్‌కు తల్లిదండ్రులు ఇద్దరూ లేరని తామే చూసుకోవాల్సి వస్తోందన్నారు.

పరిష్కారం చూపండి

★ తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వైకాపా నేత రామ్మోహనరావు, ఇతర నాయకులు కోరారు.

★ నగరంలో ముంపు సమస్యను పరిష్కరించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నేతలు గోవర్ధనరావు తదితరులు పేర్కొన్నారు.

★ తుపాను కారణంగా నష్టపోయిన మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకుడు కె.మోహనరావు తదితరులు అర్జీ అందించారు.

★ ఎచ్చెర్ల మండలం ముద్దాడ- కొత్తపేటకు వెళ్లే రహదారి అధ్వానంగా మారిందని పలువురు గ్రామస్థులు పేర్కొన్నారు. తక్షణమే రోడ్డు నిర్మించాలని కోరారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 52 ఫిర్యాదులు

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి గ్రీవెన్స్ నిర్వహించారు. 52 మంది అర్జీలు అందించారు. ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులను ఆయన సూచించారు.

ఆదిత్యుని సేవలో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణస్వామిని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు, సిబ్బంది స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి ఉన్నారు.

ఉపాధ్యాయుడికి మంత్రి లోకేశ్ అభినందన



పాతపట్నం ఏపీ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న బల్లెడ అప్పలరాజుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎక్స్‌లో అభినందనలు తెలిపారు. బోధనా శైలి చూడముచ్చటగా ఉందని, బోధన సబ్జెక్టు మీదున్న ప్యాషన్ ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన తీరు స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. - న్యూస్‌టుడే, పాతపట్నం

సత్యదేవుని గిరిప్రదక్షిణకు వేళాయె!

అన్నవరం, న్యూస్‌టుడే: కార్తిక పౌర్ణమి సందర్భంగా ఈనెల 5న అన్నవరం సత్యనారాయణ స్వామి గిరిప్రదక్షిణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తొలిపావంచాల వద్ద ప్రదక్షిణ ప్రారంభమవుతుంది. ప్రధానమార్గం మీదుగా సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, సుబ్బారాయపురం, సాక్షిగణపతి ఆలయం నుంచి జాతీయ రహదారిపైకి చేరుకుని.. అక్కడ నుంచి బెండపూడి కూడలికి ముందు పోలవరం కాలువ గట్టు మీదుగా పంపా సరోవరం చెంతకు వస్తుంది. ఇక్కడి నుంచి ఘాట్ మీదుగా (రత్న, సత్యగిరులను చుడుతూ) దిగువ ఘాట్‌రోడ్డుపై సాగుతూ తొలిపావంచాల వద్ద ముగుస్తుంది.

అంతర పంటే.. ఆధారమైంది..!

-న్యూస్‌టుడే, జలుమూరు : అంతర పంటలుగా వివిధ రకాల ఆకు కూరలు, పంటలు ఏక కాలంలో పండిస్తున్నారు రాణా గ్రామానికి చెందిన మహిళా రైతు గుండ వరలక్ష్మి. 50 సెంట్ల మెట్ట భూమిలో క్యాబేజీ తోపాటు ముల్లంగి, తోటకూర, పాలకూర, కొత్తిమీర పంటల వల్ల రోజువారీగా ఆదాయం పొందుతున్నారు. విత్తనం నాటిన నుంచి 110 రోజుల్లో క్యాబేజీ పంట చేతికి వస్తుందన్నారు. పంట ప్రారంభం నుంచి సుమారు 40 రోజుల వరకు పంట తీయొచ్చు. అంతర పంటగా వేసిన ముల్లంగి, తోటకూర, పాలకూర 30 రోజుల్లో చేతికొస్తుంది. వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని పెట్టుబడిగా పెట్టేందుకు ఉపయోగపడుతుంది. విత్తనాలు, మొక్కలు నాటేందుకు, కలుపు తీసేందుకు, మందులు పిచికారీ, పంట విక్రయం వరకు ఒక పంటకు రూ.18 వేలు పెట్టుబడి అవుతుందని తెలిపారు. తోటకూర 800 కట్టలు.. కట్ట రూ.10 చొప్పున రూ.8 వేలు వస్తుంది. ముల్లంగి 700 కట్టలకు రూ.7 వేల వరకు పంట వస్తుంది. క్యాబేజీ పంట 1550 కిలోల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం కిలో రూ.35 పలుకుతుంది. మొత్తం రూ.54,250 వస్తుంది. మూడు పంటలు కలిపి రూ.69,250 ఆదాయం వస్తుంది. పెట్టుబడి మినహా రూ.51,250 దొరుకుతుందని రైతు వెల్లడించారు.

రాణాలో వరలక్ష్మి పొలంలో పెరిగిన క్యాబేజీ

సస్యరక్షణ చర్యలు ఇలా..

మొక్కకు మొక్కకు మధ్య 30 సెంటీమీటర్ల దూరంలో ఉండాలి. డైమండ్ బ్యాక్‌మాత్ పురుగు ఆశిస్తుంది. బ్లాక్‌మచ్చ అనే తెగులు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఉద్యాన శాఖ అధికారిణి సునీత తెలిపారు. నివారణకు హెమామెక్టిన్ బెంజోట్ ఒక లీటరు నీటికి 0.5 మి.లీ. ప్రొఫినోఫాస్ 2 మి.లీ తోపాటు శాఫ్ 2 గ్రాముల మందు మొక్క తడిసేలా పిచికారీ చేయాలి. ఎక్కువగా మెగ్నీషియమ్, బోరాన్, మాంగనీస్ లోపం వల్ల పువ్వు గట్టి పడదు, చిన్నదిగా ఉండిపోవడం జరుగుతుంది. దీని నివారణకు 19-19-19 రకం కాంప్లెక్స్ ఎరువు 15 రోజుల వ్యవధిలో వేయాలి. పురుగు మందు కొట్టిన వారం తరువాత పార్కులు -4.. 5 గ్రాముల పిచికారీ చేస్తే మంచి దిగుబడులు సాధించొచ్చని తెలిపారు.

విక్రయానికి సిద్ధం చేసిన ముల్లంగి

పురుగు బారిన పడకుండా చూడాలి

పంట చేతికి వచ్చిన దగ్గర నుంచి రోజూ ఆదాయం వస్తుంది. ఆకు కూరల విక్రయం ద్వారా వచ్చిన ఆదాయాన్ని కొంత క్యాబేజీ పంటకు పెట్టుబడి పెడతా. మొక్కలు నాటిన నుంచి పంట కోతకు వచ్చే వరకు జాగ్రత్తగా కాపాడుకోవాలి. సకాలంలో నీటి తడులు అందించాలి. కాంప్లెక్స్ ఎరువులతోపాటు సేంద్రియ ఎరువుల వినియోగం ఎక్కువగా ఉండాలి. పురుగు బారిన పడకుండా జాగ్రత్తలు పాటిస్తూ.. గత 25 ఏళ్లుగా ఆకు కూరలనే నమ్ముకున్నా. - జి.వరలక్ష్మి, మహిళారైతు, రాణా

బొప్పాయి పాలు.. విదేశాలకు

నంద్యాల జిల్లా చాగలమర్రి మండల వ్యాప్తంగా రైతులు అధికంగా బొప్పాయి సాగు చేస్తుంటారు. చిన్నవంగలితో పాటు సమీపంలోని గ్రామాలైన వైఎస్సార్ కడప జిల్లా కాసానూరు, క్రిష్ణంపల్లె గ్రామాల్లో 1200 ఎకరాల్లో పండిస్తారు. విత్తనం నాటిన కాలం నుంచి తొమ్మిది నెలలకు పంట చేతికొస్తుంది. పండ్ల సేకరణ అనంతరం 13 నెలల తర్వాత మిగిలిన, ముదురు కాయలకు గాట్లు పెట్టి పాలను సేకరిస్తున్నారు. తెల్లవారుజాము సమయంలోనే కాయలకు గాట్లు పెడితే కేవలం రెండు గంటల్లోనే పాలు ఊరుతుంది. ఇలా సేకరించిన దాన్ని ప్రొద్దుటూరు, రాజంపేటకు చెందిన వ్యాపారులు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల పాలు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 4 డ్రమ్ముల పాలు సేకరిస్తున్నారు. ఎకరానికి పాల సేకరణ ద్వారా రైతుకు రూ.24 వేల ఆదాయం వస్తుంది. సేకరించిన పాలను పరిశ్రమల్లో మందులు, కాస్మోటిక్స్, సబ్బుల తయారీలో ఉపయోగిస్తున్నారు. బెంగళూరు, చెన్నైలతో పాటు నాణ్యతను బట్టి విదేశాలకు సైతం పాలను ఎగుమతి చేస్తున్నారు. బొప్పాయి సాగులో ఎప్పుడైనా ధర పడిపోయినప్పుడు బొప్పాయి పాల సేకరణతో నష్టాల నుంచి రైతులు బయటపడుతున్నారు. - న్యూస్‌టుడే, చాగలమర్రి

అప్రమత్తతతోనే వ్యాధుల దూరం

మేకలకు మందులు వేస్తున్న పశువైద్య సిబ్బంది

పశువులలో గొర్రెలు, మేకల్లో వచ్చే శ్వాసకోశ సంబంధిత వ్యాధులను అప్రమత్తతతో దూరం చేయొచ్చని పశువైద్యాధికారి ముద్దాడ దీప్తి తెలిపారు. రాత్రి వేళలో ఆరుబయట ఉంచితే గొర్రెలు, మేకల్లో న్యూమోనియా వ్యాధి సోకి దగ్గు, ముక్కు కారడం, జ్వరం వంటివి వచ్చి దాణా తీసుకోవడం కష్టంగా మారుతుంది. అలాంటి వాటిని గుర్తించి ఎన్రోఫ్లాక్సాసిన్, టైలోసిన్ వంటి మందులు వేయాలి. జ్వరం తగ్గేందుకు మెలోక్సిక్ మందు రోజుకు రెండు పర్యాయాలు ఐదు రోజుల పాటు వేయాలి. వరి పంట చేతికి వచ్చే సమయం కావడంతో వరి కంకులు, ధాన్యాన్ని తినడంతో.. ధాన్యం తినడం వల్ల కడుపు ఉబ్బరం ఏర్పడి జీవాలు మరణించే అవకాశం ఉంది. ముందుగా గుర్తిస్తే పోకా ఉప్పు 20 నుంచి 30 గ్రాముల నీటిలో కలిపి పట్టాలి. జోబోవిల్ మందు వేస్తే కడుపు ఉబ్బరం తగ్గుతుందని వైద్యాధికారి తెలిపారు. -న్యూస్‌టుడే, జలుమూరు

చేపలు మేత తినడం లేదు

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెరువుల్లో పెంచుతున్న చేపల, రొయ్యల పెరుగుదలకు తీసుకునే జాగ్రత్తలపై ఆమదాలవలస కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్.బాలకృష్ణ పలు సూచనలు చేశారు. రైతులు చరవాణిలో అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

ప్రశ్న: అధిక వర్షాలు కురిసిన తర్వాత చేపలు ఉపరితలంలోకి తిరిగి మేతను తినడం లేదు. ఎలాంటి చర్యలు తీసుకోవాలి. - డి.దినేష్, ఎచ్చెర్ల

సమాధానం: అధిక వర్షాలు కురిసిన రెండు లేదా 3 రోజుల తర్వాత నీటి గుణాల్లో మార్పులు రావడం వల్ల అడుగులోని విషవాయువుల ప్రభావంతో చేపలు ఉపరితలంలోకి వస్తాయి. ఈ సమయంలో ఎకరాకు 10 నుంచి 20 కిలోల జీలైట్ వినియోగిస్తే విషవాయువుల ప్రభావం తగ్గించుకోవచ్చు.

ప్రశ్న: చేపల చర్మంపై నల్లని, ఎర్రటి మచ్చలు ఏర్పడుతున్నాయి, నివారణకు చర్యలు తెలపండి. - నాగుల పూర్ణ, బట్టేరు.

సమాధానం: బ్యాక్టీరియా వల్ల ఈ రకమైన మచ్చలు ఏర్పడతాయి. 50 శాతం బెంజైల్‌కోనియం క్లోరైడ్ లేదా 20 శాతం బ్రోమిన్ ద్రావణాన్ని ఎకరాకు ఒక లీటరు వాడడం ద్వారా ఈ వ్యాధులను నివారించొచ్చు.



ఫోన్ కొట్టు.. సలహా పొందు

వచ్చే వారం సాగులో చీడపీడల నివారణ, కొత్త వంగడాలు, పంటలు ఆశిస్తున్న తెగుళ్లు ఎలా నివారించుకోవాలో తెలుసుకునేందుకు కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.అనూష 9493838010 చరవాణి నంబరుకు సంప్రదించాలి.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

రీజనల్ ఆఫీస్, ఇంటి నెం.8, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బిల్డింగ్, సింహ ద్వారం దగ్గర, వెంకటాపురం, శ్రీకాకుళం. ఫోన్ : 08942 - 270919.

బంగారు నగల వేలం ప్రకటన

ఈ క్రింద ఉదహరించిన ఖాతాదారులు మా బ్యాంకు నందు బంగారు నగలు తనఖా పెట్టి అప్పు తీసుకుని తిరిగి చెల్లించమని నోటీసులు పంపించినను చెల్లించని కారణంగా బ్యాంకు నిబంధనల ప్రకారం ది.14-11-2025 శుక్రవారం ఉ॥11.00 గం॥ల నుండి మ॥2.00 గం॥ల వరకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి బ్రాంచ్ ఆవరణలలో బహిరంగ వేలం వేయబడును. వేలం వేయగా వచ్చిన సొమ్ముతో సదరు అకౌంటు పూర్తిగా చెల్లుబాటు కాని యెడల వారిపై చట్టరీత్యా తగుచర్య తీసుకుని మిగిలిన బకాయి వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి వసూలు చేయబడును. ఈ దిగువ తెలిపిన ఖాతాదారులు ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలం నోటీసు వర్తిస్తుంది. అప్పు నోటీసులు అందని వారికి మరియు నోటీసులను తిరస్కరించిన వారికి పత్రికా ముఖమున చివరిసారిగా ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

క్ర.సం.	బ్రాంచి పేర్లు	ఖాతా నెం.లు	ఋణగ్రహీతల పేర్లు & చిరునామా	ఎన్‌పిఏ తేది
1.	కాశీబుగ్గ	030816540003342	శ్రీ శాసనపురి శ్రీనివాసరావు, తండ్రి : రామేశ్వరరావు (లేటు), ఇ.నెం. 19-2-9-1, ఇందిరా చౌక్, పలాస, కాశీబుగ్గ సిటీ, ఆంధ్రప్రదేశ్ - 532221.	03-09-2024
2.	కాశీబుగ్గ	030816540003344	శ్రీ శాసనపురి శ్రీనివాసరావు, తండ్రి : రామేశ్వరరావు (లేటు), ఇ.నెం. 19-2-9-1, ఇందిరా చౌక్, పలాస, కాశీబుగ్గ సిటీ, ఆంధ్రప్రదేశ్ - 532221.	03-09-2024
3.	కాశీబుగ్గ	030816540003343	శ్రీ శాసనపురి శ్రీనివాసరావు, తండ్రి : రామేశ్వరరావు (లేటు), ఇ.నెం. 19-2-9-1, ఇందిరా చౌక్, పలాస, కాశీబుగ్గ సిటీ, ఆంధ్రప్రదేశ్ - 532221.	03-09-2024
4.	కాశీబుగ్గ	030816540003501	శ్రీ శాసనపురి శ్రీనివాసరావు, తండ్రి : రామేశ్వరరావు (లేటు), ఇ.నెం. 19-2-9-1, ఇందిరా చౌక్, పలాస, కాశీబుగ్గ సిటీ, ఆంధ్రప్రదేశ్ - 532221.	03-09-2024
5.	కాశీబుగ్గ	030816540003627	శ్రీ శాసనపురి శ్రీనివాసరావు, తండ్రి : రామేశ్వరరావు (లేటు), ఇ.నెం. 19-2-9-1, ఇందిరా చౌక్, పలాస, కాశీబుగ్గ సిటీ, ఆంధ్రప్రదేశ్ - 532221.	03-09-2024
6.	అరసవల్లి	211116630002162	శ్రీ నీలాద్రి డిల్లీశ్వరరావు, 1-266, మెయిన్ వీధి, భైరిసింగుపురం, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్ - 532401.	29-08-2025
7.	బలగ	174316540006744	శ్రీ కామినేని శంకరరావు, తండ్రి : బసవనాధం, హోటల్ విజేత ఇన్, 5వ ఫ్లోర్, గొర్లెవారి వీధి, రామాలయం దగ్గర, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్ - 532001.	29-08-2025

నియమ నిబంధనలు: 1) వేలంలో పాల్గొనువారు రూ.10,000/- (అక్షరాల పది వేల రూపాయలు మాత్రమే) ధరావత్తు చెల్లించవలెను. వేలంలో సఫలీకృతం అయిన బిడ్డరు ధరావత్తు సొమ్ము మినహా మిగిలిన సొమ్మును వెంటనే చెల్లించి ఆభరణములను పొందవలెను. వేలంలో సఫలీకృతం కాని బిడ్డరు వారికి ధరావత్తు సొమ్ము వేలం అనంతరం తిరిగి చెల్లించబడును. 2) వేలంలో పాడిన సొమ్మును అంగీకరించుటకు లేక తిరస్కరించుటకు బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. 3) ఏ స్థితిలోనైనా వేలం రద్దు చేయుటకు గాని, నిలుపుదల చేయుటకు గాని, నియమ నిబంధనలు మార్చుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. 4) బిడ్ సొమ్ముపై జి.ఎస్.టి. వర్తించును.

తేది:03-11-2025, ప్రదేశం: శ్రీకాకుళం సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

తీరంలో నిరంతరం గస్తీ చేపట్టాలి

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని సముద్ర తీర ప్రాంతంలో మెరైన్ పోలీసులు నిరంతరం గస్తీ చేపట్టి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చూడాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లాలోని బారువ, భావనపాడు, కళింగపట్నం తీర ప్రాంత మెరైన్ పోలీసులు, అధికారులతో ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. నెల్లూరు జిల్లా మైపాడు తీరంలో రాకాసి అలల తాకిడికి ముగ్గురు యువకులు మృతి చెందిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. జనసంచారం ఉన్న బీచ్‌లలో ప్రతి రోజూ పర్యవేక్షణ ఉండాలన్నారు

15 నుంచి ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

నరసన్నపేట, న్యూస్‌టుడే: గురువులు బోధనకే పరిమితం కాకుండా ఆటవిడుపుగా క్రీడా పోటీలకు విద్యాశాఖ రంగం సిద్ధం చేస్తోంది. ఈ నెల 15, 16 తేదీల్లో మండలస్థాయిలో పోటీలు జరగనున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈవోలు శాంతారావు, దాలినాయుడు పేర్కొన్నారు. పురుష ఉపాధ్యాయులకు క్రికెట్, మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు నిర్వహించనున్నారు. డివిజన్ స్థాయిలో 22, 23 తేదీల్లో, అనంతరం 28 నుంచి 30వ తేదీ జిల్లాస్థాయి పోటీలు జరగనున్నట్లు పేర్కొన్నారు.

శిక్షణతో సరి.. కుట్టు సంగతి మరి..?

కవిటిలో కుట్టు శిక్షణలో మహిళలు

- న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

పేద మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా లక్షల మందికి ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తర్ఫీదు పూర్తి చేశారు. ఇది ముగిసి రెండు నెలలైనా నేటికీ వారికి కుట్టు మిషన్లు ఇవ్వకపోవడం గమనార్హం.

ఇదీ ముఖ్య ఉద్దేశం..

ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 30 మండలాల్లో 31 శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉచిత శిక్షణతో పాటు మిషన్ల అందజేతకు ఒక్కొక్కరికి రూ.25 వేలు వ్యయం అంచనాతో కార్యాచరణ రూపొందించారు. ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యంతో మిషన్లు ఏర్పాటు చేసి మొదటి

మిషన్ల కోసం ఎదురు చూపులు

విడతలో 3,548 మంది మహిళలకు శిక్షణ ఇచ్చారు. వారిలో 1,793 మంది కుట్టు మిషన్లకు అర్హత సాధించారు. కుట్లు, అల్లికలపై ఆసక్తి కలిగి, ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకున్న మహిళలకు మూడు నెలల శిక్షణ పూర్తయితేనే ఉచిత కుట్టు మిషన్ ఇవ్వాలనే నిబంధన ఉంది. దీనికి తోడు అన్ని కేంద్రాల్లో ముఖ ఆధారిత హాజరు ఏర్పాటు చేశారు. అయితే శిక్షణ పూర్తి చేసుకుని రెండు నెలలు కావస్తున్నా నేటికీ కుట్టు మిషన్లు ఇవ్వకపోవడంతో మహిళలు ఇళ్ల వద్ద ఖాళీగా ఎదురు చూడాల్సి వస్తోంది. అంతే కాకుండా శిక్షకులకు నెలకు రూ.10 వేలు చొప్పున ఇవ్వాలని నిర్ణయించారు. వారికి ఇప్పటి వరకు నిధులు విడుదల చేయలేదు.

చర్యలు తీసుకుంటాం

మొదటి విడతలో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి మిషన్లు ఇవ్వాల్సి ఉంది. కేంద్రాల నిర్వాహకులకు సంబంధించి బిల్లులను ఉన్నతాధికారులు మంజూరు చేయాలి. ప్రభుత్వానికి నివేదించాం. వచ్చిన వెంటనే కుట్టు యంత్రాలతో పాటు బిల్లులు పంపిణీకి చర్యలు తీసుకుంటాం.
- గడ్డెమ్మ, ఈడీ, బీసీ కార్పొరేషన్

ఆటో ట్రాలీ ఢీకొని మేస్త్రి మృతి

కీసర, న్యూస్‌టుడే: రెండు వాహనాలు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందారు. ఈ ఘటన సోమవారం కీసర సమీపంలో జరిగింది. కీసర సీఐ ఆంజనేయులు వివరాల ప్రకారం.. మెళియాపుట్టి గ్రామం పొందర వీధికి చెందిన బోను వెంకటరమణ(34) బతుకుదెరువు నిమిత్తం మేస్త్రి పనికి కుటుంబంతో వలస వచ్చారు. చర్లపల్లిలోని ఇందిరా గృహకల్పలో నివసిస్తున్నారు. సోమవారం వనభోజనాలకు కుటుంబ సభ్యులు, బంధువులతో కీసరగుట్టకు వచ్చాడు. ద్విచక్ర వాహనంపై కీసరగుట్ట నుంచి కీసరకు వస్తున్నాడు. కీసర సమీపంలో అతి వేగంగా వచ్చిన ఆటో ట్రాలీ వెనకాల నుంచి ఢీకొట్టింది. రోడ్డుపై పడిన అతని తలకు బలమైన గాయమై అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. భర్త మృతిని తట్టుకోలేక భార్య బోరున విలపించడం పలువురిని కలిచివేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ కేసును కీసర పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తేనెటీగల దాడిలో 15 మందికి గాయాలు

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఉర్లాం బాలత్రిపురాసుందరేశ్వర ఆలయం వద్ద సోమవారం తేనెటీగల దాడిలో 15 మంది గాయపడ్డారు. ఆలయం వద్ద భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరిన సమయంలో అక్కడే ఉన్న రావి చెట్టుపై ఉన్న తేనెతుట్ట నుంచి పెద్ద సంఖ్యలో తేనెటీగలు ఒక్కసారిగా వచ్చాయి. దీంతో అంతా భయంతో బయటకు పరుగులు తీశారు. గాయపడినవారు స్థానిక పీహెచ్‌సీ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	145	245	265

ఆర్డీవోకు నిరసన సెగ

హరిపురం (మందస), న్యూస్‌టుడే: రాంపురం ప్రాంతంలో కార్గో విమానాశ్రయ ఏర్పాటు ప్రాంతంలోని భూ సర్వే కోసం పలాస ఆర్డీవో వెంకటేశ్ సోమవారం వెళ్లారు. విషయం తెలుసుకుని రాంపురం, బిడిమి, గంగువాడకు చెందిన బాధిత రైతులు అక్కడికి చేరుకుని ఆర్డీవో వాహనాన్ని అడ్డుకున్నారు. విమానాశ్రయ ఏర్పాటును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ఆయన వెనుదిరిగారు. తహసీల్దారు శ్రీకాంత్ ఉన్నారు.

పలాస ఆర్డీవో వెంకటేశ్ వాహనాన్ని చుట్టుముట్టిన మహిళలు

విద్యా ప్రగతికి శ్రీకారం

- న్యూస్‌టుడే, పాత బస్టాండ్

ప్రాథమిక స్థాయిలో సామర్థ్యాలు కొరవడిన విద్యార్థి ఉన్నత దశలో తడబాటుకు గురవుతుంటారు. కొవిడ్ అనంతరం గిరిజన పాఠశాల విద్యార్థుల్లో దిగువ తరగతులకు సంబంధించి కనీస విషయ పరిజ్ఞానం లేకపోవడాన్ని అధికారులు గుర్తించారు. విద్యా సంవత్సరం ముగిసే నాటికి 3 నుంచి 9 తరగతులకు చెందిన ప్రతి పిల్లవాడిలో సామర్థ్యాల పెంపునకు చర్యలు తీసుకుంటున్నారు. నేటి నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఐటీడీఏ సీతంపేట పీవో అన్నాదొర 'విద్యాప్రగతి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

పునశ్చరణ తరగతులు: 3 నుంచి 5వ తరగతి వారికి ఈనెల 29, డిసెంబరు 15, 27 తేదీల్లో మధ్యంతర, జనవరి 25, ఫిబ్రవరి 16 తేదీల్లో ముగింపు పరీక్షలు నిర్వహించి పాఠ్యాంశాల్లో పరిణితి సాధించారా.. లేదా.. గుర్తిస్తారు. 2026 జనవరి 27 తేదీ నుంచి ఫిబ్రవరి 13 తేదీ వరకు పునశ్చరణ తరగతులు నిర్వహించనున్నారు.

బలగ పాఠశాలలో విద్యార్థులకు బోధిస్తున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు

60 రోజుల కార్యాచరణ

★జిల్లాలోని 77 గిరిజన విద్యా సంస్థల్లో 20 వేల మంది పిల్లలున్నారు. ఈనెల 4 నుంచి 60 రోజుల పాటు కార్యక్రమం జరుగుతుంది. సోమవారం (3వ తేదీన) సామర్థ్య స్థాయి పరీక్ష నిర్వహించారు. మూల్యాంకనం చేసి ప్రస్తుత పరిస్థితిని గుర్తిస్తారు. ★3 నుంచి 5 చదువుతున్న వారిని 3 స్థాయిలుగా, 6 నుంచి 9 తరగతుల వారిని 4 స్థాయిలుగా విభజిస్తారు. ★ సబ్జెక్టుల వారీగానే కాకుండా ప్రతి ఉపాధ్యాయుడు విద్యా ప్రగతిలో తప్పక భాగస్వామ్యం కావాల్సి ఉంటుంది.

సహకార బ్యాంకు భవన నిర్మాణానికి భూమి పూజ

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కోటబొమ్మాళిలో రూ.39 లక్షలతో చేపడుతున్న సహకార బ్యాంకు నిర్మాణ పనులకు కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు సోమవారం భూమిపూజ చేశారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి రూ.61 లక్షలతో నిర్మించిన అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ పేదలకు పట్టెడన్నం పెట్టే అన్న క్యాంటీన్లను కొనసాగించాలని గత ప్రభుత్వాన్ని వేడుకున్నా పట్టించుకోలేదన్నారు. ఆర్డీవో కృష్ణమూర్తి, తెదేపా నాయకులు ఉన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

JOBS

BUSINESS OFFER

[illegible] 9014039992

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

CHANGE OF NAME
I, Kesamsetti Madhavilatha, W/o. Nagaraju Potnuru, Mother of POTNURU JESHMITA (New Name), Previously called as Potnuru Joshitha Vishnu Sri (Old Name), resident of D.No.2-10, Vadapalem, Kalingapatnam Village, Gara Mandal, Srikakulam District, Pin-532406, Andhra Pradesh. Have changed my Daughter's name from Potnuru Joshitha Vishnu Sri (Old Name) to POTNURU JESHMITA (New Name). Henceforth my Daughter will be called as POTNURU JESHMITA (New Name) for all purposes.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ [illegible] 6281037879.

[illegible] 7799772221, 7799772223 [illegible]

SBI లైఫ్ [illegible] 9701553222.

[illegible] 8277151090, 9491994420.

HOSPITALITY

[illegible] 8639009266

గమనిక
[illegible]

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
కేవలం 315 /-
(GST 5% అదనం)
మాత్రమే
సంప్రదించండి:
8008597609

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

వనంలో విహారం.. పసందైన భోజనం

కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని ఇచ్ఛాపురం బాహుదానదీతీరం, పాతాళహరసిద్ధేశ్వరాలయ వనంలో వనభోజనాల సందడి ఇది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కుటుంబాలు.. నదిలో స్నానం, శివార్చన, వంటావార్పు, ఆటపాటలతో ఉల్లాసంగా గడిపి, సాయంత్రం తిరుగుముఖం పట్టారు. కొందరు చిదంబరేశ్వరాలయం వద్ద పుష్కరిణిలో ధ్యానముద్ర శివయ్య, శుద్ధికొండపై పార్వతీ పరమేశ్వరులు, పుష్పగిరిపై కొలువుతీరిన ఆది దంపతులను పలువురు సందర్శించి, పూజలు చేసి, అక్కడే సేదదీరారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

పోటీతత్వంతోనే విద్యార్థుల ప్రతిభ

పోటీతత్వంతోనే విద్యార్థుల్లో ప్రతిభ బయట పడుతుందని కేజీబీవీ ప్రిన్సిపల్ పొల్లాయి లక్ష్మీదేవి అన్నారు. సోమవారం కొత్తపాలెం కస్తూర్బా పాఠశాలలో వృత్తి విద్యను అభ్యసిస్తున్న తొమ్మిది నుంచి 12వ తరగతి విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. అనంతరం వారు తయారు చేసిన సామగ్రిని ప్రదర్శించారు. శిక్షకురాలు భావన సాయిశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

పాతాళహరసిద్ధేశ్వరస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

నీలకంఠేశ్వరస్వామి

హరోం.. హర..

కార్తిక మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తిక దీపాలు విడిచిపెట్టారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు/గ్రామీణం, సోంపేట, కంచిలి, పలాస, ఇచ్ఛాపురం

ఉప్పలాం పంచాయతీ తీరంలో మహిళలు

కంచిలి: పాతాళేశ్వర ఆలయ పరిసరాల్లో భక్తులు

పలాస సీతారామాలయంలో దీపారాధన

ఆక్రమణలు తొలగించండి... సోంపేట, న్యూస్‌టుడే: సోంపేట గ్రామదేవత జామి ఎల్లమ్మ ఆలయానికి సంబంధించిన స్థలం ఆక్రమణలకు గురైందని, వాటిని తొలగించి అమ్మవారి ఉత్సవాలు సజావుగా నిర్వహించేందుకు అవకాశం కల్పించాలని ఆలయ కమిటీ ప్రతినిధులు అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం కమిటీ ప్రతినిధులు సంగారు గోవిందు, సానా షణ్ముఖరావు, సానా శ్రీను, గురుమూర్తి, భైరిస్వామి, ప్రసాద్‌రావు ఉప తహసీల్దార్ మహేష్‌కు వినతిపత్రం అందజేశారు.

అడగలేదని అలుసా.. నడవలేకపోతున్నాం తెలుసా..

రాళ్లు తేలిన దేవునల్తాడ-కొత్తపేట రోడ్డు

పలాస నియోజకవర్గం పరిధిలో పల్లె పండగ కార్యక్రమం కింద రహదారుల అభివృద్ధి పనులు ప్రారంభంలో బాగానే జరిగినా అనంతరం పడకేశాయి. నియోజకవర్గంలో పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో ఉన్న చాలా గ్రామీణ ప్రాంత రహదారులు పాడై అధ్వానంగా మారడంతో కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆ రోడ్లను అభివృద్ధి పరచాలని నిర్ణయించింది. పల్లె పండగ పేరిట వీటి పనులు ప్రారంభించింది. అందులో కొన్ని పూర్తవగా మరికొన్ని అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ఇటీవల వర్షాలకు రాళ్లుతేలి ప్రయాణానికి ఇబ్బందికరంగా మారాయి. పనులు ప్రారంభించి మెటల్ వేసి వదిలేస్తే ఎలా అంటూ ఇప్పుడు ఆయా గ్రామాల ప్రజలు అధికారులు, నాయకులపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గ వివరాలు

మండలం	మంజూరైన పనులు	పూర్తయినవి	అసంపూర్తిగా మిగిలినవి
పలాస	141	96	45
మందస	117	94	23
వజ్రపుకొత్తూరు	220	131	89

★ వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడ నుంచి కొత్తపేట రోడ్డు వరకు మెటల్ తేలిపోయింది. ఎన్‌పీ రోడ్డు నుంచి ఉద్దానం రాయపాడు వరకు మెటల్ వేసి వదిలేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు మెటల్ కరిగి పొలాల్లో కలిసిపోయింది. ఈ రోడ్డుపై రాళ్లు తేలిపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

★ మందస మండలంలో నారాయణపురం- కేసుపురం రహదారి పనులు మధ్యలో నిలిచిపోవడంతో రాళ్లు తేలి అధ్వానంగా తయారైంది. నడవడానికి కూడా అవ్వడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు సువర్ణపురం, పితాలి, సరియాపల్లి తదితర గ్రామాల రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. పలాస మండలంలో కొత్తూరు, బొడ్డపాడు తదితర గ్రామాల పరిస్థితి ఇలానే ఉంది. నడవలేకపోతున్నామని బాటసారులు వాపోతున్నారు. పల్లిసారధి, గరుడభద్ర గ్రామాల్లో ఈ పనులు ప్రారంభంలోనే నిలిచిపోయాయి.

పూర్తి చేసేందుకు కృషి

'ప్రారంభించిన పనులకు బిల్లులు చెల్లింపుల్లో ఆలస్యం కావడంతో గుత్తేదారు పనులు నిలిపేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తొందర్లోనే పనులు ప్రారంభించి పూర్తి చేసేందుకు కృషి చేస్తామ'ని పలాస పంచాయతీరాజ్ శాఖ డీఈఈ రవిబాబు అన్నారు.

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం, మందస

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9502198883 8008552704

? కృష్ణానగర్ శివారులో కల్వర్టు శిథిలమై, ప్రమాదకరంగా మారింది. - **పి.వాసదేవరావు, ఇచ్ఛాపురం** ★: పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపడతాం. – **ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం** – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

?: పలాస మండలం బొడ్డపాడు కాలనీలో ఆరు వీధి దీపాలు వెలగడం లేదు. - **స్థానికులు** ★: పరిశీలించి, సమస్యను పరిష్కరిస్తాం. - **సుధాకర్, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి, బొడ్డపాడు**

– న్యూస్‌టుడే, పలాస గ్రామీణ

మృతులకు కొవ్వొత్తులతో నివాళి

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కాశీబుగ్గ వేంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాట సందర్భంగా మృతి చెందిన మృతులకు నెలవంకలో తెదేపా నాయకుడు ఎల్.బాలరాజు ఆధ్వర్యంలో కూటమి నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దైవ దర్శనానికి వెళ్లి మృతి చెందడం బాధాకరమని మృతుల కుటుంబాలకు భగవంతుడు మనోధైర్యం ఇవ్వాలని ప్రార్థించారు.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ

లం దారిపుట్టుగ పంచాయతీలో చెత్తను సంపద కేంద్రానికి తరలించేందుకు, పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహణకు ప్రభుత్వం అందించిన ట్రాక్టర్ ఓ చోట ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ నిరుపయోగంగా ఉంది. దీన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో పాడవుతుందని స్థానికులు అంటున్నారు. దీనిపై కార్యదర్శి శ్రీనివాస్‌ను వివరణ కోరగా కొత్తగా వచ్చానని, సర్పంచిని సంప్రదించి షెడ్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

గుంత.. దాటేందుకు చింత..

కొళిగాం, బొడ్డబడ రహదారి మలుపు మార్గంలో గుంత ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. సుమారు రెండడుగుల లోతున్న గుంత దాటితేగాని అక్కడే ఉన్న పీహెచ్‌సీతోపాటు పాఠశాలకు వెళ్లలేని పరిస్థితి. పాఠశాలలో సుమారు 400 మంది విద్యార్థులు చదువుతున్నారు. సైకిళ్లపై వచ్చినప్పుడు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నామని వారు వాపోతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ శాఖ జేఈ విక్రమను వివరణ కోరగా తాత్కాలిక మరమ్మతులు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

కూలేలా ఉంది..

ఇచ్ఛాపురం కంద్రవీధికి వెళ్లే మార్గంలో ఓ విద్యుత్తు స్తంభం అడుగు భాగం పట్టుతప్పి, కాంక్రీట్ ఊడిపోవడంతో ఒకవైపు వాలింది. ఈ మార్గంలో మూడు వార్డుల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను విద్యుత్తు శాఖ ఏఈ గోవిందరావు దృష్టికి తీసుకెళ్లగా, పరిశీలించి, అవసరమైన పనులు చేపడతామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

మూలకు స్వచ్ఛ సంకల్పం

పలాస మండలం బ్రాహ్మణతర్లాలో స్వచ్ఛ సంకల్పం రిక్షా మూలకు చేరింది. దాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఇదే విషయం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా ఆ రిక్షా పాడైందని, మూడు రోజుల్లో దానికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకొస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

అడ్డు పడుతున్నాయి తొలగించండి

బెల్లుపడ నుంచి ఎక్కల గ్రామానికి వెళ్లే మార్గంలో ఇరువైపులా పనికిరాని మొక్కలు ఏపుగా పెరిగి రోడ్డును ఆక్రమించుకుంటుండటంతో ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు తప్పించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీరాజ్‌శాఖ ఏఈ ధనంజయ వద్ద ప్రస్తావించగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

భూ సర్వేకు సహకరించం

అనకాపల్లిలో తహసీల్దార్ సీతారామయ్యను నిలదీస్తున్న రైతులు

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: గ్రామంలో నిర్వహించే భూ సర్వేకు సహకరించబోమని అనకాపల్లి గ్రామస్థులు తేల్చి చెప్పారు. సోమవారం ఆ గ్రామానికి తహసీల్దార్ సీతారామయ్యతోపాటు సర్వే బృందం వెళ్లగా రైతులు అడ్డుకున్నారు. ఇటీవల కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శిరీష, కలెక్టరు స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వద్ద భూ వివరాల్లో తప్పులున్నాయని పలువురు స్థానికులు పేర్కొన్నారు. దీంతో వాటిని సరి చేయాలని ఆదేశాలందినట్లు తహసీల్దార్ చెప్పారు. ఎయిర్ పోర్టు వద్దు.. మా భూములే ముద్దని స్థానికులు నినదించారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటులో భాగంగానే ఇంటింటా భూ సర్వే నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. దీంతో అక్కడ నుంచి తహసీల్దార్ బృందం వెనుదిరిగింది.

బాధితులకు అండగా ఉంటాం

కవిటి గ్రామీణం, ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: కాశీబుగ్గలోని వేంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన, గాయపడిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. సోమవారం ఒడిశా రాష్ట్రంలోని గుడ్డిపద్ర గ్రామానికి చెందిన రంగాల రూప కుటుంబాన్ని పరామర్శించి, ఆమె తండ్రి రంగాల డిల్లేష్‌కు కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.15 లక్షల చెక్కును అందించారు. ఒడిశా చీకటిపేట ఎమ్మెల్యే సతీమణి మిన్ను సంత్ర, జనసేన ఇచ్ఛాపురం నియోజకవర్గం బాధ్యులు దాసరి రాజు, కవిటి తహసీల్దార్ బి.మురళీమోహనరావు, తెదేపా మండలాధ్యక్షుడు కృష్ణారావు, బాసుదేవు ప్రధాన్, శ్రీనివాస రౌళో, మణిచంద్ర ప్రకాష్ పాల్గొన్నారు.

❖ ఆ కుటుంబాన్ని వైకాపా నాయకులు నర్తు నరేంద్రయాదవ్, సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి పరామర్శించారు.

గుడ్డిపద్రలో బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ అశోక్

మాక్ అసెంబ్లీకి సోంపేట మోడల్ స్కూల్ విద్యార్థిని

సోంపేట: సోంపేట మోడల్‌స్కూలు విద్యార్థిని రెయ్యి వెన్నెల అమరావతిలో నిర్వహించనున్న మాక్ అసెంబ్లీ సమావేశాలకు ఎంపిక కావడంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అభినందించారు. సోమవారం బాలికతోపాటు పాఠశాల ఉపాధ్యాయులు ప్రభుత్వ విప్‌ను రామయ్యపట్నంలో కలిశారు. ప్రిన్సిపల్ చిన్నాజీవర్మ, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ ఈశ్వరరావు, తెదేపా మండలాధ్యక్షుడు కుమార్ పాల్గొన్నారు.

యథావిధిగా ఆర్థిక సాయం అందజేత

తోట బయట ఉదయం 10 గంటలకు దివ్యాంగులు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కాశీబుగ్గ వేంకటేశ్వరాలయ ధర్మకర్త ముకుంద పండా తోటకు సోమవారం ఉదయం అంధులు, దివ్యాంగులు వచ్చారు. వీరికి ప్రతి సోమవారం పండా భోజనం పెట్టి దివ్యాంగులకు రూ.300, వృద్ధులకు రూ.400, అంధులకు రూ.600 చొప్పున ఆర్థిక సాయం అందజేస్తారు. ఈ ప్రక్రియ కొన్నేళ్లుగా జరుగుతుంది. కొద్ది రోజుల నుంచి గురువారం సైతం నిర్వహిస్తున్నారు. ఈనెల 1న తోటలోని దేవాలయంలో జరిగిన తొక్కిసలాటలో 9 మంది భక్తులు మృతి చెందిన విషయం విదితమే. దీంతో ఆ రోజు నుంచి పోలీసులు తోటలోకి ఇతరులను అనుమతించడం లేదు. ఆలయంలో జరిగిన ప్రమాదం గురించి తెలియక దివ్యాంగులు, అంధులు యథావిధిగా తోట వద్దకు చేరుకున్నారు. వారు లోపలకు వెళ్లకుండా పోలీసులు ప్రధాన గేటు వద్ద అడ్డుకున్నారు. అనుమతి ఇవ్వాలని పోలీసులను ముకుంద పండా కోరడంతో విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కొద్దిసేపటికి వారి నుంచి అనుమతి రావడంతో లోపలకు విడిచిపెట్టారు. వచ్చిన వారికి పండా భోజనాలు పెట్టి, ఆర్థిక సాయం అందజేశారు.

దాడి కేసుల్లో తీర్పు వెల్లడి

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: దాడి కేసులో నేరం రుజువు కావడంతో సూదికొండకు చెందిన డి.దానయ్య, రాజారావు, పి.షణ్ముఖరావులకు ఒక్కొక్కరికి రూ.1,500 జరిమానా లేదా మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ పలాస జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి సోమవారం తీర్పు ఇచ్చారని సీఐ సూర్యనారాయణ పేర్కొన్నారు. పలాస పురుషోత్తపురానికి చెందిన బి.శ్రీనుపై 2020 సెప్టెంబర్ 17న దాడి చేసినట్లు అందిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై మధుసూదనరావు కేసు నమోదు చేశారని సీఐ తెలిపారు. ❖ కాశీబుగ్గలో హెడ్ కానిస్టేబుల్‌పై దాడి చేశారనే కేసులో నేరం రుజువు కావడంతో బి.రాంబాబుకు మూడు నెలలు జైలు శిక్ష విధిస్తూ పలాస జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి తీర్పు ఇచ్చారని సీఐ తెలిపారు. 2022 మార్చి 16న ట్రాఫిక్ విధులకు ఆటంకం కలిగిస్తూ హెచ్‌సీ శ్రీనివాసరావుపై రాంబాబుతో పాటు మరొకరు దాడి చేసినట్లు ఫిర్యాదు అందగా అప్పటి సీఐ శంకరరావు కేసు నమోదు చేశారని పేర్కొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కాశీబుగ్గ మారుతీనగర్‌లోని ఓ ఇంట్లో సోమవారం గ్యాస్ లీకవ్వగా అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. కాలనీలో కె.సుజాతకు చెందిన ఇంట్లో గ్యాస్‌కు సంబంధించిన రెగ్యులేటర్ పాడవ్వడంతో గ్యాస్ లీకైంది.

ఆలయ ఘటనపై శవ రాజకీయాలా?

పలాస, న్యూస్‌టుడే: ఆలయ ఘటనపై వైకాపా నేతలు శవ రాజకీయాలు చేయడం సిగ్గుచేటని టీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు పేర్కొన్నారు. ఈ మేరకు పలాసలో సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. క్షతగాత్రులు కోలుకున వరకు అండగా నిలుస్తుంటే వైకాపా నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

సముద్ర స్నానాల్లో సూచనలు పాటించాలి

సోంపేట: కార్తిక మాసం సందర్భంగా భక్తులు, పిక్నిక్‌లకు వచ్చే సందర్శకులు సముద్రస్నానాలు చేసేటప్పుడు మెరైన్ పోలీసుల సూచనలు తప్పకుండా పాటించాలని బారువ మెరైన్ సీఐ డీవీ రమణ అన్నారు. నెల్లూరు, ఇతర ప్రాంతాల బీచ్‌ల్లో సముద్ర స్నానాలు చేస్తూ యువత గల్లంతైన సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తీరంలో భద్రతా చర్యలు కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు.

ప్రమాదకరంగా ఉన్న స్తంభం మార్పు

ఇచ్ఛాపురం: గొల్లవీధిలో ఓ ఇంటి వద్ద ప్రమాదకరంగా ఉన్న పాత ఇనుప విద్యుత్తు స్తంభాన్ని తొలగించి, దానికి కొద్దిదూరంలో కొత్త స్తంభాన్ని అమర్చారు. స్థానికుల అభ్యర్థన మేరకు జనసేన నాయకులు దాసరి రాజు, కామేష్ తదితరులు స్పందించి, విద్యుత్తు ఉపకేంద్ర ఏఈ కేవీ గోవిందరావుకు తెలిపారు. ఆయన సమస్యను పరిశీలించి సోమవారం కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయించారు.

తైక్వాండో జాతీయ పోటీలకు ముగ్గురు విద్యార్థులు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: సురంగి రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సూర్యారావు తెలిపారు. నరసారావుపేటలో ఆదివారం జరిగిన తైక్వాండో పోటీల్లో అండర్ 17 విభాగంలో ఆశి రేవంత్‌రెడ్డి, తిప్పన జీవన్‌రెడ్డి, అండర్ 19 విభాగంలో చాట్ల గిరి స్వర్ణాలు అందుకున్నారు. కశ్మీర్, అరుణాచల్‌ప్రదేశ్‌లో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు, చీఫ్ కోచ్ సీహెచ్.దుర్గాప్రసాద్‌ను సత్కరించారు.

గణితంలో భయం పోగొట్టడమే లక్ష్యం

మందస: విద్యార్థులకు గణితంలో భయం పోగొట్టడం లక్ష్యంగా ప్రతిభా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గణిత ఉపాధ్యాయుల ఐక్యవేదిక సభ్యులు రమణబాబు, చక్రధరరావు, భీమారావు తెలిపారు. ఇటీవల నిర్వహించిన గణిత ప్రతిభా పోటీలో జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను సోమవారం హరిపురంలో అభినందించి ప్రోత్సాహకాలు అందజేశారు.

కర్తవ్య నిర్వహణతో ఉజ్వల భవిత

పలాస/పట్టణం: కర్తవ్య నిర్వహణతో ఉజ్వల భవిత ఉంటుందని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ పలాస శాఖ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎన్.నటరాజ్ అన్నారు. పవర్‌గ్రిడ్ ఆధ్వర్యంలో పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల, చిన్నబడాం ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు సోమవారం అందజేశారు. పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో సీహెచ్.షర్మిల, ఆర్.శ్రావణి, వి.సుస్మిత విజేతలుగా నిలిచారు. గ్రిడ్ పలాస శాఖ చీఫ్ మేనేజర్ వీవీఎస్‌ఆర్‌కేవీ శెట్టి, జేఈలు రఘుపతిరావు, అప్పలనాయుడు, కళాశాల ప్రిన్సిపల్ నరసింహమూర్తి, హెచ్‌ఎం ఉషారాణి పాల్గొన్నారు.

ఆశ్రమాల్లో విద్యా ప్రగతికి చర్యలు

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు కనీస అవగాహన పెంచుకోవడానికి 'విద్యా ప్రగతి' అమలు చేశారు. దీన్ని సీతంపేట ఐటీడీఏ పరిధిలోని అన్ని ఆశ్రమ పాఠశాలల్లో సోమవారం నుంచి ప్రారంభించారు. కిల్లోయి ఆశ్రమ పాఠశాలలో బాలికలకు బేస్ లైన్ పరీక్ష నిర్వహించినట్లు హెచ్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. దీన్ని ఐటీడీఏ పీవో పవర్ స్వప్నిల్ జగన్నాథ్ సూచన మేరకు చేపట్టారు. – న్యూస్‌టుడే, మందస

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

జాతీయ న్యాయసేవా దినోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగించేందుకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇచ్ఛాపురం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జ్ఞానభారతి విద్యాసంస్థ ప్రాంగణంలో 'ప్రాథమిక హక్కులు-విధులు, రాజ్యాంగ ఆదేశిక సూత్రాలు'పై పోటీలు జరిగాయి. 8, 9, 10 తరగతుల విద్యార్థులు 250 మంది పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

శివాలయానికి శంకుస్థాపన

సోంపేట: ఎర్రముక్కాంలో శివాలయం నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. పండిత రమేష్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో ఆలయ కమిటీ సభ్యులతో పాటు వివిధ గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణం పూర్తి చేసేందుకు అందరి సహకారం కావాలని కమిటీ ప్రతినిధులు చంద్రమోహన్, పాపారావు, రాజ్‌కుమార్, రాజారావు, ముకుందరావు, బాబూరావు, హేమసుందరరావు కోరారు. పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రుద్రభూమిలో శివుడి విగ్రహ ప్రతిష్ఠ

వజ్రపుకొత్తూరు: డోకులపాడులో సొండి, కోమటి సామాజిక వర్గాలకు సంబంధించిన రుద్రభూమిలో సోమవారం గ్రామానికి చెందిన రత్నాల దశరథరావు అతని తల్లిదండ్రులు వెంకటస్వామి, పద్మావతి జ్ఞాపకార్థంగా శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వేద పండితుడు ధర్మపురి శ్రీనివాసశర్మ సమక్షంలో విగ్రహ ప్రతిష్ఠ చేశారు.

అయ్యప్ప భక్తుల సమావేశం

సోంపేట: లక్కవరంలో పిరియా రాజు గురుస్వామి ఆధ్వర్యంలో 1,200 మంది అయ్యప్ప మాలధారణ భక్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు రుద్రకోటేశ్వరరావు మాట్లాడుతూ కేరళలో జరుగుతున్న అన్యాయాన్ని ఆపాలని, ఇక్కడ నుంచి వెళ్లే భక్తులకు ఆంధ్ర భోజనాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ ఈనెల 16వ నుంచి మూడు పూటల అన్నదానం ఉంటుందన్నారు. దాని కోసం ఐదు మండలాల నుంచి 200 బియ్యం బస్తాలు, రెండు క్వింటాళ్ల కందిపప్పు, క్వింటాల్ పెసరపప్పు, చింతపండు, నగదు అందించారు.

నిరుపేదలకు వితరణ

ఇచ్ఛాపురం గ్రామీణం: నిరుపేదలకు సాయం చేస్తూ అండగా ఉండటమే సంతోషాన్ని ఇస్తుందని యువ సూర్య ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఎం.రాంబాబు పేర్కొన్నారు. మాసోత్సవాల్లో భాగంగా ఎం.తోటూరులో సోమవారం 100 మంది నిరుపేదలకు బియ్యంతోపాటు నిత్యావసర సరకులు అందించారు.

వైకాపా సంతకాల సేకరణ

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెద్దశ్రీరాంపురం, కత్తివరం, జాడుపూడి గ్రామాల్లో వైకాపా నేతలు సంతకాల సేకరణ చేపట్టారు. ఈ మేరకు సోమవారం ఎంపీపీ దేవదాస్‌రెడ్డి, జడ్పీటీసీ ప్రతినిధి కృష్ణారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

నష్ట పరిహారం చెల్లించండి

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: మొంథా తుపానుతో నష్టపోయిన వరి రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండు చేశారు. బెండిలో సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో మహాసభ సమావేశం జరిగింది. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించాలని కోరారు.

పారిశుద్ధ్య లోపం.. ప్రజలకు శాపం

ఎం.తోటూరులో నివాసాల మధ్య చెత్త కుప్పలు, మురుగు

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య లోపం కారణంగా ఎక్కడ చూసినా చెత్త కుప్పలు, మురుగే దర్శనమిస్తున్నాయి. ఆయా ప్రాంతాలు డంపింగ్ యార్డులను తలపిస్తూ పందులు, కుక్కలు, దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. పలు గ్రామాల్లో కాలువలు పూడికతో నిండిపోయాయి. దీంతో ప్రధాన కూడళ్లతోపాటు నివాస ప్రాంతాలు అధ్వానంగా మారుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో సిబ్బంది తూతూమంత్రంగా పనులు చేపడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి.. ఇచ్ఛాపురం మండలం బిర్లంగి, మండపల్లి, ఎం.తోటూరు, కేదారిపురం, బెనుగానిపేట, ముచ్చింద్ర, ఈదుపురం, లొద్దపుట్టి, బూర్జపాడు, పూర్ణాటకం, కవిటి మండలంలో కవిటి బెహరావీధి, మాణిక్యపురం, సోంపేట మండలంలో సోంపేట, నేతాజీ నగర్, కంచిలి మండలంలో అంపురం, శాసనాం తదితర ప్రాంతాల్లో అపరిశుభ్రతే తాండవిస్తోంది. ఆయా ప్రాంతాల ప్రజలు బయటకు రాలేని పరిస్థితి. నెలల తరబడి కాలువల్లో పూడిక ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోందని, పరిసర ప్రాంతాల్లో ఉండలేకపోతున్నామని వాపోతున్నారు.

పనులు చేపడతాం

తుపాను నేపథ్యంలో ప్రతి గ్రామంలో పారిశుద్ధ్యం పనులు చేపడుతున్నాం. దీనిపై ఇది వరకే పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. అన్ని గ్రామాల్లో పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం. స్థానికులు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా.. గ్రీన్ అంబాసిడర్లకే అందజేసి సహకరించాలి.

– వై.ప్రభాకరరావు, ఎంపీడీవో, ఇచ్ఛాపురం

మాస్టారు సేవలు అపూర్వం..

ఇచ్ఛాపురం, కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం సురంగిరాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1977-84 మధ్యకాలంలో ఉపాధ్యాయుడిగా సేవలందించిన ఎంవీఎస్ కామేశ్వరరావు మాస్టారు సేవలు అపూర్వమని, ఆయన ఆత్మకు శాంతికలగాలని పూర్వ విద్యార్థులు కన్నీటి నివాళులర్పించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు కె.సూర్యారావు అధ్యక్షతన ఈ సంస్మరణ కార్యక్రమం సోమవారం జరిగింది. తొలుత మాస్టారు చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి వెలిగించారు. పూర్వ విద్యార్థులు పద్మనాభ సాహు, శంకర్, ఢిల్లీరావు, మోహనరావు, వెంకటరావు, ధనంజయ పాల్గొన్నారు. ❖ కవిటి ఎస్వీజే విద్యాసంస్థల ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు.

నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

(c) eenadu

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

బొమ్మలు గీసి.. అబ్బురపరిచి

సంతబొమ్మాళి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'మీకు ఇష్టమైన పండుగ' అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు జరిగాయి. ఇందులో కె.నీరజ (9వ తరగతి), టి.వర్షిణి (10వ తరగతి), కె.శివకుమార్ (9వ తరగతి) వరుస మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.వెంకటరావు, ఉపాధ్యాయులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

– న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

సృజనకు పదును

విద్యార్థుల్లో పోటీతత్వం ఉంటే మెరుగైన ఫలితాలు ఉంటాయని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రత్నకుమారి అన్నారు. సోమవారం పాఠశాలలో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'మీకు నచ్చిన పండుగ' అన్న అంశంపై జరిగిన పోటీల్లో 8, 9, 10వ తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. తొలి మూడు స్థానాల్లో జి.భార్గవి(10వ తరగతి), జి.గాయత్రి(9వ తరగతి), టి.లోకేశ్ (8వ తరగతి) సత్తాచాటారు. విజేతలకు ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు బి.అప్పలరాజు, ప్రసాద్ తదితరులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. – న్యూస్‌టుడే, పాతపట్నం

బాలల చిత్రాలు భళా

టెక్కలి మండలం పోలవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'మీకు ఇష్టమైన పండుగ' అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు జరిగాయి. ఇందులో నౌపడా లాస్య (7వ తరగతి), సీహెచ్.ప్రవీణ్ (8వ తరగతి), జి.స్వాతి (10వ తరగతి) వరుస మూడుస్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు ఎన్.కృష్ణారావు, ఉపాధ్యాయులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

– న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

పంట తడుస్తోంది.. పంపిణీ చేయండి

న్యూస్‌టుడే, పాతపట్నం

ఎక్కువ కాలం మన్నిక వస్తుండటంతో ప్రభుత్వం రాయితీపై అందించే పరదాలపై రైతులు మొగ్గు చూపుతున్నారు. కొన్ని సంవత్సరాలుగా పంపిణీ నిలిచి పోవడంతో తుపానుల సమయాల్లో రెక్కల కష్టం తడవకుండా కాపాడుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. వేరే దారి లేక ప్రైవేటుగా కొనుగోలు చేస్తున్నారు. ఇవి నాణ్యత లేకపోవడంతో అనతి కాలంలోనే పాడవుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

నియోజకవర్గంలో ఈ ఏడాది 62, 825 ఎకరాల్లో వరి పండిస్తున్నారు. వీటితో పాటు మొక్కజొన్న, కూరగాయలు, ఇతర పంటలు సాగు చేస్తున్నారు. నూర్పిడి సమయాల్లో ధాన్యం తడవకుండా కాపాడుకోవడానికి, కొనుగోలు సమయాల్లో తేమ శాతాన్ని తగ్గించేలా ఎండ బెట్టేందుకు పట్టాలు వినియోగిస్తారు. 2013 వరకు ప్రభుత్వం 90 శాతం రాయితీతో వీటిని పంపిణీ చేసేది.

పాతపట్నం వెలుగు కార్యాలయంలో టార్పాలిన్లు

వైకాపా అధికారంలోకి వచ్చాక దీన్ని పూర్తిగా అటకెక్కించారు. ప్రస్తుతం సివిల్ సప్లయ్ ద్వారా జిల్లాకు మూడు వేల పట్టాలు తక్కువ ధరకే విక్రయించేందుకు మంజూరు చేశారు. వెలుగు కార్యాలయాల ద్వారా అందించే వాటికి రాయితీ రాలేదు.

పాతపట్నం నియోజకవర్గ వివరాలు

మండలం	వరి సాగు (ఎకరాల్లో)
పాతపట్నం	15,350
ఎల్ఎన్‌పేట	9,915
హిరమండలం	7,515
మెళియాపుట్టి	15,560
కొత్తూరు	14,485

చర్యలు చేపడుతున్నాం..

సివిల్ సప్లయ్ ద్వారా పట్టాలు తక్కువ ధరకే విక్రయించేందుకు చర్యలు చేపడుతున్నాం. వ్యవసాయ శాఖ ద్వారా అందించేందుకు ఇప్పటివరకు ఎటువంటి ఆదేశాలు రాలేదు. ఉన్నతాధికారుల సూచనల మేరకు ముందుకెళ్తాం.

- కె.త్రినాథస్వామి, జిల్లా వ్యవసాయాధికారి

నైపుణ్యంతో ఉపాధి మార్గం

విద్యార్థులు నైపుణ్యంతో ఉపాధి మార్గాలను పొందాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.ఆర్ సూచించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ పి.అన్నాజీరావు తదితరులు పాల్గొన్నారు.

–న్యూస్‌టుడే, నరసన్నపేట

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

సమస్య: నందిగాం మండలం పెద్ద తామరాపల్లి - తురుకుకొండ బీటీ రహదారి కల్వర్టు సమీపంలో భారీ వర్షాలకు రోడ్డు తెగిపోయింది. కంకర వేసి రోడ్డు వదిలారు. - వజ్జ శ్యామలరావు, కల్లాడ

సమాధానం: మరో వారం రోజుల్లో బీటీరోడ్డు వేస్తాం.

- హరినాధ్, జేఈ, ఆర్‌అండ్‌బీ శాఖ - న్యూస్‌టుడే, నందిగాం

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం.. పాతపట్నం: పాతపట్నం మేజరు పంచాయతీ పరిధిలో మంగళవారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కార్యదర్శి రామచంద్రరావు తెలిపారు. సబ్‌స్టేషన్ నుంచి ట్యాంకులకు సరఫరా అయ్యే ప్రధాన పైప్‌లైన్ మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు.

పలకలు ఏర్పాటు చేయరూ!

నరసన్నపేట మండలం మామిడివలస ఎస్సీ కాలనీ రహదారిలోని కాలువపై కాంక్రీట్ పలకలు విరిగి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పాఠశాలకు వచ్చే విద్యార్థులతో పాటు పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని, అధికారులు స్పందించి కొత్త పలకలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి లక్ష్మి వద్ద ప్రస్తావించగా అధికారులకు నివేదించి మరమ్మతులకు చర్యలు చేపడతామని తెలిపారు.

– న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

పైపులు పగిలి నీరు వృథా..

నరసన్నపేట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని నీళ్ల ట్యాంకు పైపులు పగిలి పెద్ద ఎత్తున తాగునీరు వృథాగా పోతోంది. ఎంపీడీవో కార్యాలయం ఆవరణ నీరు నిలిచి బురదమయంగా మారింది. 2.25 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఈ ట్యాంకు నుంచి గాంధీనగర్, కొత్తపేట, కలివరపుపేట, మార్కెట్ తదితర ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేయాల్సి ఉంది. దీనిపై ఈవో దక్షాయని వద్ద ప్రస్తావించగా, యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టామని తెలిపారు.

- న్యూస్‌టుడే, నరసన్నపేట

రోడ్డు కప్పేస్తున్నాయ్..

కొత్తూరు మండలంలోని గులివిందలపేట నుంచి లబ్బ మీదుగా వెళ్లే గ్రామీణ రహదారిలో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దారిపొడవునా ఏపుగా రెండువైపులా పరికిణి మొక్కలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని స్థానికులు వాపోతున్నారు. వాటిని తొలగించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. పీఆర్ ఏఈ దుర్గాప్రసాద్ వద్ద ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

కూల్చితేనే మేలు..

నందిగాం పంచాయతీ కొండపేటలో దశాబ్దాల కిందట నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. దాని పక్కనే ఉన్న నిర్మించిన భవనంలో విద్యార్థులకు తరగతులు కొనసాగుతున్నాయి. విరామ సమయంలో, సెలవు రోజుల్లో శిథిల భవనంలో చిన్నారులు ఆటలాడేందుకు వెళ్తుంటారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు వాపోతున్నారు. మండల ఇంజినీరింగ్ అధికారి మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఎంఈవో జి.నరసింహులు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, నందిగాం

రైతు బిడ్డకు ఒకే బ్యాంకులో కొలువులు

ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి): నారాయణవలస పంచాయతీ తుంబయ్యపేటకు చెందిన గొద్దు పావని ఇటీవల విడుదలైన బ్యాంకింగ్ ఫలితాల్లో ఒకే బ్యాంకులో కొలువులు సాధించారు. తాడేపల్లిగూడేంలోని ఐడీబీఐ బ్యాంకులో పీజీడీబీఎఫ్ (పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్)గా చేస్తూ అక్కడే సహాయ మేనేజర్‌గా, సేల్స్ ఎగ్జిక్యూటివ్ అధికారిగా కొలువులు సాధించినట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు శిమ్మన్న, రమణమ్మల కుమార్తె పావని అభినందించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి

పాతపట్నం: వసతి గృహాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సీతంపేట ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. పాతపట్నంలోని సమీకృత వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. సమస్యలు ఉంటే తెలియజేయాలని పేర్కొన్నారు. సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

ఏవో తీరుపై మంత్రి ఆగ్రహం

కోటబొమ్మాళి: కోటబొమ్మాళిలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో టెక్కలి వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తీరుపై పలువురు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. పంటలను పరిశీలించి, వాస్తవాలు గుర్తించి నమోదు చేయాలని ఆదేశించినా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

గత ప్రభుత్వం ఇచ్చినవి పట్టాలుకావు

టెక్కలి: గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల స్థలాల పేరిట ఇచ్చినవి పట్టాలు కావని, హామీ పత్రాలేనని సీపీఎం డివిజన్ కార్యదర్శి నంబూరు షణ్ముఖరావు అన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో లబ్ధిదారులతో కలిసి వినతిపత్రం సమర్పించారు.

పీఏసీఎస్ ఛైర్మన్‌గా బాధ్యతలు

నందిగాం: మండలంలో తెంబూరు పీఏసీఎస్ ఛైర్మన్‌గా పోలాకి చంద్రశేఖరరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

నరసన్నపేట: స్థానిక వి.డి.కాలనీ (వంశధార కాలనీ) పాఠశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, తక్షణమే భవనాలకు మరమ్మతులు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని కోరారు. స్థానిక తెదేపా కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

శ్మశానవాటిక సమస్యలు చూడండి

టెక్కలి పట్టణం: తొలుసూరుపల్లి పంచాయతీ సైనిక్‌నగర్ శ్మశానవాటికలో సమస్యలు పరిష్కరించాలని భాజపా నేతలు కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు జర్జాన రాంజీ, జిల్లా ఉపాధ్యక్షుడు నడుపూరు లక్ష్మీనారాయణ ఈమేరకు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

పాడి రంగానికి పెద్దపీట

ఎల్ఎన్‌పేట: పాడి అభివృద్ధి చేయడంలో భాగంగా ఆడ దూడలు ఉత్పత్తి పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, రైతులు వినియోగించుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సహాయ సర్జన్ పి.రాధకుమారి పేర్కొన్నారు. మండలంలో దబ్బపాడు గ్రామంలో ఉచిత గర్భకోశ పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు.

సొంత నిధులతో మరమ్మతులు

హిరమండలం మేజరు పంచాయతీ మోనింగి వీధిలో ఏబీ రహదారి నుంచి సీసీ రోడ్డులో కొంతభాగం మరమ్మతులకు గురైంది. దీంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై తెదేపా నాయకుడు లాడె శ్రీకృష్ణ స్పందించి రూ.30 వేలు వెచ్చించి రోడ్డు పనులు చేయించినట్లు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, హిరమండలం

రూ.10.60 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభం

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: నాడు-నేడుతో గత ప్రభుత్వం విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించిందని కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. మెళియాపుట్టి మండలంలో రూ.10.60 కోట్లతో పెద్దమడి గిరిజన ఆశ్రమ పాఠశాల, ఏకలవ్య మోడల్ స్కూల్, చాపర జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో అనుబంధ వసతిగృహం(కెజీబీవీ-4) భవనాల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. మెళియాపుట్టి మండల కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటుకు కృషి చేస్తామని, పాతపట్నం నియోజకవర్గం అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని కేంద్ర మంత్రి అన్నారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్, అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కేంద్ర, రాష్ట్ర మంత్రులకు మండలంలో గిరిజన సంప్రదాయాలతో ఘనస్వాగతం పలికారు.

ఏకలవ్య పాఠశాల అదనపు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు, రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, కలెక్టర్, ఎమ్మెల్యే, ఐటీడీఏ పీవో

మత్స్యకారుల అభ్యున్నతే ధ్యేయం

మహిళలకు సరకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి,న్యూస్‌టుడే: మత్స్యకారుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం పోలాకి మండలంలోని రాజారాంపురం, గుల్లవానిపేట, కొత్తరేవు, గుప్పిడిపేట గ్రామాల్లో మత్స్యకారులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, డీటీ రామకృష్ణ, ఈవోఆర్‌డీ బి.పద్మావతి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవనోపాధుల పథకానికి నిధులు

పోలాకి, న్యూస్‌టుడే: మహిళా సంక్షేమ పథకాల్లో భాగంగా జీవనోపాధుల పథకానికి నిధులు విడుదలయ్యాయని డీపీఎం నారాయణరావు అన్నారు. సోమవారం వెలుగు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పోలాకి మండలానికి రూ.111 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. డీఎల్‌పురంలో ఏర్పాటు చేయనున్న కొరమేను పెంపకం కేంద్రాన్ని తనిఖీ చేశారు. సీసీ గోవిందరావు పాల్గొన్నారు.

కొరమేను కేంద్ర నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీపీఎం నారాయణరావు

వైద్య విద్యపై నిర్లక్ష్యం తగదు

కొత్తూరు, నరసన్నపేట, న్యూస్‌టుడే: వైద్య విద్యపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని కడుము, బలద, కౌసల్యాపురం గ్రామాల్లో సోమవారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నరసన్నపేట మారుతీనగర్ కూడలి వద్ద జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి ధర్మాన కృష్ణ చైతన్య పాల్గొని మాట్లాడారు.

బలదలో సంతకాల సేకరణ చేపడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, నాయకులు

శంభో శంకర.. సదా శివా

టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల వ్యాప్తంగా శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. కార్తిక రెండో సోమవారం కావడంతో భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు పోటెత్తారు. దీపాలు వెలిగించి, స్వామికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రసిద్ధ ఆలయాల వద్ద పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు.

- న్యూస్‌టుడే, బృందం

సారవకోట: పుష్పాలంకరణలో

జలుమూరు: పూజలందుకుంటున్న శ్రీముఖలింగేశ్వరుడు


పాతపట్నం నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో..

సహకార సంఘ సభ్యులకు సత్కారం

కోటబొమ్మాళి: కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సహకార సంఘ ఛైర్మన్, సభ్యులు రైతుల సేవలకు ప్రాధాన్యతనిస్తూ ఆదర్శంగా నిలవాలని కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు. సోమవారం కోటబొమ్మాళి సహకార సంఘ ఛైర్మన్‌గా వెలమల విజయలక్ష్మి, సభ్యుల బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో మంత్రులు పాల్గొన్నారు. వారిని సత్కరించారు. నేతలు కింజరాపు ప్రసాదరావు, రమేష్, కామేశ్వరరావు, బగాది శేషు పాల్గొన్నారు.

11 నుంచి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు

పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలోని గిరిజన సామాజిక భవనం ఆవరణలో ఈ నెల 11, 12, 13వ తేదీల్లో రాష్ట్ర స్థాయి సాఫ్ట్ టెన్నిస్ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ వై.శేఖర్‌బాబు పేర్కొన్నారు. ఈ పోటీలకు పలు ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

Before the Hon'ble Court of Principal Judge family Court
Durg C.G. PN2081/2025 C.N.770/2025
// SUMMONS //

Applicant: B. Chinna Rao S/o B. Madhava Rao, Age 34 Years Resident Mahatma Gandhi Nagar, Ward No. 36. Bhilai, Block and District Durg C.G. Mo: 7898637460.

Non-applicant: B. Lavanya (Ramanjali) D/o Laxman Rao, Age 28 Years Resident Subalai Colony, Near Bobby Function Hall, Post Hiramandalam, Block Hiramandalam. Police Station Hiramandalam, District Shrikakulam (Andhra Pradesh) Pin Code 532459, Mob. No. 8985662506.

Because the plaintiff/applicants has filed suit against under Case number C.S. 770/2025 section 13(a) H.M.A. Act after the submission you are ordered by this summons that you may apper.

In this court/office at 11:00 am on the date of the month of 20-11-2025 in person or by any such advocate who had been duly instruction have been given and who can answer all such question you are directed to submit a written statement of you defence on date and to produce on that day all such documents as are in your custody of powers on which your defence of counter claim is based and if you have evidence in support of any other document as required you may enter such document in the list to be attached with the written statement.

You are informed that if you will not appear in this court on the date of appearance aforesaid the subsequent and disposal will be done in your absence today in this date.

Issued today, dated 09-10-2025 the seal of this court and under my hand to be done.

SHRI THOMAS EKKA
Principal Judge
Family Court Durg (C.G.)

Place: Durg
Date: 09-10-2025

సీఏ ఫలితాల్లో సత్తా

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: మేజర్ పంచాయతీ కోటబొమ్మాళికి చెందిన **పైడిశెట్టి చరిష్మా** తాజాగా వెలువడిన సీఏ ఫైనల్ ఫలితాల్లో 157 మార్కులు సాధించి సత్తాచాటారు. నాలుగేళ్లలో సీఏ కోర్సు పూర్తిచేసినట్లు ఆమె పేర్కొన్నారు. సందర్భంగా తల్లిదండ్రులు పైడిశెట్టి రవికుమార్, అరుణ సంతోషం వ్యక్తంచేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో నాగుపాము కలకలం

సంతబొమ్మాళి, ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: సంతబొమ్మాళి మండలం కొల్లిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో నాగుపాము కలకలం సృష్టించింది. సిబ్బంది సోమవారం ఉదయం తలుపులు తెరవగానే గ్యాస్ సిలిండర్ పక్క నుంచి సర్పం బుసలు కొట్టడంతో భయంతో కేకలు వేశారు. కొద్దిసేపటి తర్వాత పాము బయటకు వెళ్లిపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ★ ఎల్ఎన్‌పేట మండలంలోని కోవిలాం శ్రీత్రిశక్తి అమ్మవారి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి నాగుపాము కలకలం సృష్టించింది. భవానీ మాలధారులు సన్నిధానంలో నిద్రిస్తున్న స్థలంలోకి చొరబడింది. స్థానికులు పామును చాకచక్యంగా పట్టుకొని అటవీప్రాంతంలో విడిచిపెట్టారు.

ఉచిత తరగతులు సద్వినియోగించుకోండి.. హిరమండలం: హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచితంగా స్పోకెన్ ఇంగ్లీషు, జనరల్ స్టడీస్ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు టి.కేశవరావు తెలిపారు. పాఠశాల ఆవరణలో ఉదయం, సాయంత్రం తరగతులు నిర్వహిస్తారన్నారు.

జారి పడతారు జాగ్రత్త..

అధ్వానంగా గ్రామీణ రహదారులు

– న్యూస్‌టుడే, సారవకోట, నరసన్నపేట గ్రామీణం, జలుమూరు, పోలాకి

నరసన్నపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వీధి కాలువల వ్యవస్థ సరిగా లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పారిశుద్ధ్యానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తున్నప్పటికీ కొన్ని గ్రామాల్లో మార్పు కనిపించడంలేదు. పలు గ్రామాల రోడ్లపై నుంచి ఏడాది పొడవునా మురుగునీరు ప్రవహిస్తుండగా, చినుకు పడితే కొన్ని చోట్ల వరద నిలిచి రాకపోకలకు అష్టకష్టాలు పడుతున్నారు. దోమల బెడద తప్పడం లేదు. వాహన చోదకులు, బాటసారులు అప్రమత్తంగా లేకపోతే జారిపడే ప్రమాదం ఉంది.

- సారవకోట మండలంలోని గొర్రిబంద గ్రామ శివారు సీసీ రోడ్డుపై నుంచి ఏడాది కాలంగా మురుగునీరు ప్రవహిస్తోంది. ఈ మార్గంలో రాకపోకలు చేసేవారు అరచేతిలో ప్రాణాలు పెట్టుకోవలసి వస్తోంది. 10 మీటర్ల పొడవునా నాచుపట్టి జారుగా ఉండటంతో ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది.
- నరసన్నపేట మండలంలో కుమ్మరిపేట, ఉర్లాం కాపువీధి, సాయివీధి, జల్లువానిపేట తదితర గ్రామాల్లో రహదారులపై మురుగునీరు ప్రవహిస్తోంది. జలుమూరు మండలంలో ఇదే పరిస్థితి నెలకొంది.
- గ్రామాల్లోని కాలువల్లో ఉన్న చెత్త, ఇతర వ్యర్థాలు తొలగించే పరిస్థితి లేకపోవడమే ఈ దుస్థితికి కారణమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలపై అక్రమణ నిర్మాణాలు తొలగించకపోవడంతో అపారిశుద్ధ్యం, దోమలబెడద తప్పడంలేదని వాపోతున్నారు. ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు గ్రామాల్లోకి వస్తున్నారని తెలిస్తే హుటాహుటిన కాలువలు శుభ్రంచేసే పనులు చేయిస్తున్నారని, మిగతా సమయంలో పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

గొర్రిబందలో సీసీ రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న మురుగునీరు

నరసన్నపేట నియోజకవర్గ వివరాలు

మండలాలు	పంచాయతీలు	సమస్య ఉన్న గ్రామాలు
సారవకోట	35	11
నరసన్నపేట	34	10
జలుమూరు	40	15
పోలాకి	31	3

చర్యలు తీసుకుంటాం..

కొన్ని గ్రామాల్లో వీధి కాలువల వ్యవస్థ సరిగా లేదు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని అమలు చేసి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

- అప్పన్న, ప్రవీణ, ఉమామహేశ్వరరావు, పద్మావతి ఈవోపీఆర్డీలు

(c) eenadu

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

మొగదాలపాడు తీరంలో సందర్శకులకు సూచనలు చేస్తున్న మెరైన్ సీఐ ప్రసాదరావు

కడుపుకోత మిగల్చకండి.. జాగ్రత్తలు పాటించండి

గార (మొగదాలపాడు), న్యూస్‌టుడే: సముద్ర స్నానాల్లో జాగ్రత్తలు పాటించాలని మెరైన్ సీఐ ప్రసాదరావు సందర్శకులను కోరారు. గార మండలం మొగదాలపాడు సాగరతీరంలో సోమవారం గస్తీ నిర్వహిస్తూ సందర్శకులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రమాదాల బారిన పడుతూ కుటుంబ సభ్యులకు కడుపు కోత మిగల్చొద్దని, అప్రమత్తంగా ఉండాలన్నారు. కళింగపట్నం, శ్రీకాకుళం గ్రామీణ మండలం పెద్దగనగళ్లపేట, కుందువానిపేట సాగరతీరాలను సందర్శించినట్లు సీఐ తెలిపారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

పొందూరు, న్యూస్‌టుడే: పొందూరు మండలం రాపాక గ్రామంలో ఎస్సీ, మాదిగ కాలనీలో ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశాల మేరకు జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు తాగునీటి బోర్లు ఏర్పాటు చేశారు. గ్రామంలో తాగునీటి సమస్య తీరిందని గ్రామస్థులు తెలిపారు. తెదేపా మండల తెలుగు యువత అధ్యక్షులు కండాపు శ్రీనివాసరావు, జిల్లా తెలుగు యువత జనరల్ కార్యదర్శి శంకర్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

●ఎస్‌వీసీ(రామలక్ష్మణ): బాహుబలి ది ఎపిక్ ●సరస్వతి: మాస్ జాతర ●సూర్యమహల్: తెలుసు కదా ●ఎస్ మూర్తి: డ్యూడ్ ●మారుతి: కాంతారా- చాప్టర్- 1 ●కిన్నెర: కర్మణ్యే వాధికారస్తే ●కీర్తన: [illegible] ●కీర్తిక: బైసన్ – న్యూస్‌టుడే, పాత బస్టాండ్

సృజనకు పదును

అరసవల్లిలోని నగర పాలక ఉన్నత పాఠశాలలో 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'మీకు ఇష్టమైన పండుగ' అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు. ఆర్.భవిత(8వ తరగతి), ఆర్.వర్షిణి(8వ తరగతి), బి. లోహిత్(8వ తరగతి) వరుస మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు శంకరరావు, ఉపాధ్యాయులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. – న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

ఆరని నీరు.. కంట కన్నీరు..!

● తీవ్రంగా దెబ్బతీసిన మొంథా
● ఆదుకోవాలని వేడుకోలు

న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం, సరుబుజ్జిలి

ఆరుగాలం కష్టించి పండించిన పంటంతా ఒక్కసారిగా నీళ్లపాలు కావడంతో రైతన్న కన్నీరుమున్నీరవుతున్నాడు. చేతికందే సమయాన అకాల వర్షాలకు నిలువునా ముంచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొంథా తుపాను కారణంగా ఆమదాలవలస నియోజకవర్గంలో వరి, మొక్కజొన్న, పత్తి, కూరగాయల పంటలు నాశనమయ్యాయి. పాడైన పంటను పరిశీలించేందుకు అధికారులు ఎవరూ రాలేదని ఆరోపిస్తున్నారు. కొన్ని చోట్ల పరిశీలించి వదిలేశారని, తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆమదాలవలస మండలం ఎన్టీవాడ వద్ద నేలకొరిగిన వరి చేను

దెబ్బతిన్న పంటలు..

- ఆమదాలవలస మండలం చెవ్వాకులపేట వద్ద పురుషోత్తపురం- నైరా ఛానల్ పొంగి పొర్లడంతో సుమారు 200 ఎకరాలు వరకు పంటలు ముంపునకు గురయ్యాయి. రామచంద్రాపురం, చెవ్వాకులపేట, ఆనందపురం, పొన్నాంపేట, శ్రీకాకుళం గ్రామీణ మండలం పొన్నాం, బట్టేరు, నవనంబాడు గ్రామాల్లో వరి పొలాలు నేటికీ తేరుకోలేదు.
- పాతూరు, జి.కె.వలస, కొరపాం, కొత్తవలస, దూసి, వంజంగి, వంజంగిపేట, దన్నానపేట, మునగవలస, జొన్నవలస, సైలాడ, కుమ్మరిపేట, వెదుళ్లవలస, కొర్లకోట, చీమలవలస గ్రామాల్లో వరికి తీవ్రంగా నష్టం జరిగింది.
- ఎన్టీవాడ, సీపానపేటలో అరటి, మొక్కజొన్న, చెరకు పంటలు దెబ్బతిన్నాయి.
- సరుబుజ్జిలి: పురుషోత్తపురం, యరగాం, కాగితాపల్లి, మాలపేట, మతలబుపేట, పాలవలస, రావివలస, రొట్టవలసలో వరి దెబ్బతింది.
- బూర్జ: రెల్లిగెడ్డ పొంగడంతో వందల ఎకరాల్లో పొలాలు ముంపునకు గురయ్యాయి. ఇప్పటికీ తేరుకోని పరిస్థితి నెలకొంది.

పూర్తిగా కుళ్లిపోయింది..

పదెకరాల్లో పంట వేశాం. మొంథా తుపాను కారణంగా ఈదురుగాలులకు వరిచేను నేలకొరిగింది. పంటపై నుంచి నీరు ప్రవహించింది. ఐదురోజులుగా నీరు నిల్వ ఉండటంతో మొలకలెత్తేస్తున్నాయి. ఎకరాకు రూ.15 వేల వరకు మదుపు పెట్టాం. అధికారులు స్పందించి నష్టపోయిన పంటలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందించాలి. రంగు మారిన ధాన్యం కొనుగోలు చేయాలి. – ఉష, సర్పంచ్, రామచంద్రాపురం, ఆమదాలవలస మండలం.

పరిహారం అందిస్తాం.. తుపాను కారణంగా నష్టపోయిన అన్ని పంటలకు పరిహారం అందిస్తాం. కొన్నిచోట్ల అధికారులు పర్యటించి అంచనా తయారు చేసి నివేదిక అందించారు. మిగిలిన చోట్లా పర్యటించి నష్టపోయిన పంటలను గుర్తించేలా చర్యలు చేపడతారు. – కూన రవికుమార్,ఎమ్మెల్యే, ఆమదాలవలస

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9502198883 8008552704

సమస్య: దింతాద వారాంతపు సంతలో మురుగు దొడ్డు చుట్టూ తుప్పలు అల్లుకుని అధ్వానంగా ఉన్నాయి. – రాము, స్థానికుడు.

సమాధానం: సమస్య పరిష్కరిస్తాం. – టి.రవి, మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస.

? కృష్ణాపురంలోని వీధిలో [illegible] ఇబ్బందులు పడుతున్నాం. – రమ, స్థానికురాలు.

● ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం. – జాన్సన్, మున్సిపల్ ఏఈ, ఆమదాలవలస

? రైల్వేస్టేషన్ కూడలి వద్ద రహదారికి ఇరువైపులా ఆటోలు నిలుపుతున్నారు. – నాయుడు, స్థానికుడు.

● ఆటోలు నిలపకుండా చర్యలు చేపడతాం. – బాలరాజు, ఎస్ఐ, ఆమదాలవలస – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

గండి పూడ్చారు

స్పందనకు వందనం

గార(అంబటివానిపేట), న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలకు గార మండలం అంబటివానిపేట సమీపంలో నారాయణపురం సాగునీటి కాలువకు పడిన గండిని సోమవారం పూడ్చారు. ఈ నెల 1న 'కాలువకు గండి' శీర్షికతో వార్త వెలువడటంతో ఏఈ రామశివాజీ, నీటి సంఘం సభ్యులు స్పందించారు. సంఘం అధ్యక్షుడు కోరాడ వెంకటరావు, సభ్యులు స్థానిక రైతులు సహకారంతో సమస్యను పరిష్కరించారు.

పదవీ కాలం పొడిగింపు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పదవీ కాలాన్ని ప్రభుత్వం పెంచింది. గత నెలాఖరుతో ఆయన పదవీ కాలం పూర్తి కావడంతో ఈనెల నుంచి ఆరు నెలలు పాటు పెంచుతూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. నగరపాలక సంస్థకు ఎన్నికలు జరిగే వరకు ఆయన ప్రత్యేకాధికారిగా బాధ్యతలు నిర్వహించనున్నట్లు పేర్కొంది.

రైల్వే అండర్ పాసేజీలో చీకట్లు

శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ సమీపంలో అండర్ పాసేజీలో ఏడాది పొడవునా నీరు ఉంటోంది. విద్యుత్తు దీపాలు వెలగకపోవడంతో రాకపోకలు ఇబ్బందులు తప్పడం లేదు. కొందరు ఆకతాయిలు రాత్రి పూట ఒంటరి మహిళలపై దాడులు చేస్తున్నా రైల్వే అధికారులు స్పందించట్లేదని పలువురు పేర్కొంటున్నారు. రైల్వేస్టేషన్ మేనేజర్ ఉమామహేశ్వరావును వివరణ కోరగా సంబంధిత అధికారులకు దృష్టికి తీసుకెళ్లి దీపాలు వెలిగేలా చూస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

శునకాలు వణికిస్తున్నాయి

సరుబుజ్జిలి మండలంలోని పలు గ్రామాల కూడళ్ల వద్ద శునకాల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మధ్య కాలంలో కొత్త కుక్కలు చేరి వెంబడిస్తున్నాయని వాపోతున్నారు. సరుబుజ్జిలి, కొత్తకోట, రొట్టవలస, సవలాపురం కూడళ్ల వద్ద గుంపులుగా తిరుగుతున్నాయని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఈవోపీఆర్డీ రామారావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

గుంతల గండం..రాకపోకలకు దండం..

పొందూరు మండలం కనిమెట్ట గ్రామం నుంచి శ్రీకాకుళం వెళ్లే ప్రధాన రహదారిలో గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 6 నెలలుగా ఇదే పరిస్థితి నెలకొన్న అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

చుట్టుముట్టిన నిర్లక్ష్యం..



లావేరు మండలం లుకలాపుపేట సమీపంలోని విద్యుత్తు స్తంభానికి పనికిరాని మొక్కలు, ముళ్ల కంపలు చుట్టూ అలుముకోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. స్తంభం కనిపించకుండా చుట్టుముట్టడంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. ఈ విషయంపై ఏఈ అప్పన్న వద్ద ప్రస్తావించగా తక్షణమే సిబ్బందిని పంపించి పనికిరాని మొక్కలు తొలగిస్తామన్నారు. – న్యూస్‌టుడే, లావేరు

ప్రమాదమని తెలిసినా పట్టించుకోరా...!

అలికాం- బత్తిలి రహదారిలో కొత్తకోట కూడలికి సమీపంలో కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన కల్వర్టుకు రెండు వైపులా రక్షణ గోడలు పడిపోవడంతో భయాందోళన చెందుతున్నారు. అంతర్రాష్ట్ర రహదారి కావడంతో నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆర్అండ్‌బీ ఏఈ ఆంజనేయనాయక్ వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

విద్యార్థులు సత్ప్రవర్తనతో ఎదగాలి

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు జీవితంలో సత్ప్రవర్తనతో అభివృద్ధి చెందాలని సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్ అన్నారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం మునసబుపేట గాయత్రి కళాశాలలో సోమవారం నిర్వహించిన స్వాగతోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవితం అనేది అంతులేని ప్రయాణం అని, తోటి వారి పట్ల సోదర భావంతో మెలగాలని హితవు పలికారు. గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు, కరస్పాండెంట్ అంబటి రంగారావు, విద్యాసంస్థల సంయుక్త సంచాలకుడు మార్తాండ కృష్ణ పాల్గొన్నారు.

సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్ దంపతులను సన్మానిస్తున్న గురజాడ విద్యాసంస్థల అధినేత స్వామినాయుడు

అవీ..ఇవీ..అన్నీ

ఉద్యాన పంటలతో మేలు

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ఉద్యాన పంటలతో ఎంతో మేలని పెద్దపేట ఉద్యానశాఖ ప్రధాన శాస్త్రవేత్త రాజశేఖర్ అన్నారు. సోమవారం ఆమదాలవలస మండలం శ్రీనివాసాచార్యులపేటలో రైతులకు ఉద్యానసాగుపై శిక్షణ ఇచ్చారు. జీడి మామిడి, చెరకు, అరటి, ఇతర వాణిజ్య పంటలు తక్కువ ఖర్చులు అధిక లాభాలు ఎలా సాధించగలరో రైతులకు వివరించారు. సర్పంచి బొడ్డేపల్లి గౌరీపతి, ఉద్యానాధికారి అయింతీ పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని కార్గిల్ పార్కు పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. పార్కును సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్కును సందర్శకులకు అనువుగా తీర్చిదిద్దాలన్నారు. పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాద్, సుడా ఈఈ పి.సుగుణాకరరావు, నగరపాలక ఈఈ కె.శ్రీనివాసులు ఉన్నారు.

6 నుంచి ఆరాట్టు బ్రహ్మోత్సవాలు

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలోని బలగ ఆదివారం పేట దరి అయ్యప్పస్వామి దేవాలయంలో పది రోజుల పాటు ఆరాట్టు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని అర్చకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6 తేదీ నుంచి 15 వరకు అయ్యప్పస్వామికి పంచామృతాభిషేక పూజలు, సహస్ర కలశాభిషేకం నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

భగవద్గీతపై ప్రచారం

శ్రీకాకుళం సాంస్కృతికం: నగరంలో ఏపీహెచ్‌బీ కాలనీ, కాకివీధి పరిసర ప్రాంతాల్లో ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం త్రైత సిద్ధాంతం భగవద్గీతపై ప్రచారం చేపట్టారు. కార్తిక మాసం విశిష్టత, దీపారాధన ప్రాముఖ్యాన్ని వివరించారు. ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు సంతోష్‌కుమార్, వాసుదేవరావు, అప్పన్న, ఈశ్వర్‌లాల్, వెంకటరావు, ప్రశాంతి, లక్ష్మి, సంతోషి పాల్గొన్నారు.

దస్త్రాల పరిశీలన

జి.సిగడాం: ఉపాధి పథకంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సామాజిక తనిఖీల్లో కొంతమంది సిబ్బంది అవకతవకలు పాల్పడిన దస్త్రాలను సోమవారం జిల్లా విజిలెన్స్ అధికారి లవరాజు పరిశీలించారు. సామాజిక తనిఖీలో తేడాలున్న దస్త్రాలు పరిశీలించి నివేదికలను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ఎంపీడీవో రామకృష్ణ, ఏపీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

సచివాలయానికి భవనం కేటాయింపు అన్యాయం

ఆమదాలవలస పట్టణం: పట్టణంలోని రెల్లి సామాజిక భవనాన్ని సచివాలయానికి కేటాయించడం అన్యాయమని రెల్లి కమ్యూనిటీ సంఘ సభ్యులు సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వారు వినతిపత్రాన్ని అందించారు. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు పునఃపరిశీలన చేయాలని వారు కోరారు.

సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

కలెక్టరేట్(శ్రీకాకుళం): డిగ్రీ చివరి ఏడాది చదువుతున్న ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులకు యూపీఎస్సీ 2026లో నిర్వహించే సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆర్ఆర్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కొమనాపల్లి వెంకట రామరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు 85001 32601, 85001 92022 నంబర్లను సంప్రదించాలని కోరారు.

హర హర మహాదేవ... శంభో శంకర

ఉమారుద్ర కోటేశ్వరాలయంలో అభిషేకం

నక్కవీధి ఉమాజఠలేశ్వరాలయంలో..

గిరివానిపాలెం శివాలయంలో పూజలు

లావేరు: బొడ్డపాడు శ్రీమాత ఆశ్రమంలో శివలింగాన్ని ప్రత్యేక అలంకరణ

కార్తిక మాసం రెండో సోమవారం పురస్కరించుకుని శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గ పరిధిలో శైవక్షేత్రాలకు జనం పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే స్వామికి రుద్రాభిషేకాలు, పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయాలన్నీ శివనామస్మరణతో మారుమోగాయి. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

ఆమదాలవలస: గాజులకొల్లివలస సంగమేశ్వరసామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

మహాసభలు జయప్రదం చేయాలి

రణస్థలం, న్యూస్‌టుడే : సీఐటీయూ అఖిలభారత మహాసభలు డిసెంబరు 31 నుంచి ఐదు రోజుల పాటు విశాఖలో నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని ఆ సంఘ నాయకులు తెలిపారు. ఈమేరకు సోమవారం పైడిభీమవరంలో కరపత్రాలను విడుదల చేశారు. కార్మిక వర్గ హక్కులను హరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని, వాటిని సంఘటితంగా అడ్డుకోవాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్. అమ్మన్నాయుడు, కార్మికులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల మరమ్మతులకు చర్యలు

జి.సిగడాం, న్యూస్‌టుడే: జి.సిగడాం మండలం దేవరవలస ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోవడంతో విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తుంది. ఈ విషయాన్ని ఇటీవల గ్రామాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ఈశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలతో సోమవారం ఎంపీడీవో రామకృష్ణ, ఆర్.డబ్ల్యు.ఎస్. ఏఈ కుసుమ, సిబ్బంది పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీడీవో రామకృష్ణ సిబ్బందికి సూచించారు. సర్పంచి వెంకటరావు, ప్రధానోపాధ్యాయులు డి. గోవిందరావు, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ఆచార్య కె.ఆర్.రజని

జాతీయసమైక్యతా శిబిరానికి బీఆర్ఏయూ విద్యార్థులు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: హరియాణాలోని రొహతక్ పట్టణంలో మహర్షి దయానంద్ యూనివర్సిటీలో ఈనెల 4 నుంచి జరగనున్న జాతీయ సమైక్యత శిబిరంలో బి.ఆర్.అంబేడ్కర్‌విశ్వవిద్యాలయం తరపున పాల్గొనేందుకు విద్యార్థులు సోమవారం పయనమయ్యారు. వీరిని వర్సిటీ వీసీ ఆచార్య కె.ఆర్.రజని అభినందించారు. కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం నుంచి ఎన్.త్రివేణి, కె.పవన్, జి.రవి, జి.శ్రావణి, ఈసీఈ విభాగానికి చెందిన ఎస్.సాయిప్రదీప్, ఎస్.భార్గవి, ఈఈఈ విభాగంలో జి.చంద్రశేఖర్, పి.అభిషేక్, కంప్యూటర్ సైన్స్ విభాగం నుంచి ఎస్.అంకిత, పలాస ఎస్‌బీఎస్‌వైఎం డిగ్రీ కళాశాలకు చెందిన ఎం.పవిత్ర ఎంపికయ్యారు. వర్సిటీ రిజిస్ట్రార్ బిడ్డికి అడ్డయ్య, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డి.వనజ, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీరు సురక్షితమేనా..?

జి.సిగడాం మండల కేంద్రంలో తాగునీటి కుళాయిలు ఇష్టానుసారంగా మురుగు కాలువల వద్ద ఏర్పాటు చేయడంతో తాగునీరు కలుషితమవుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలమైతే కాలువల వద్ద తాగునీరు పట్టుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ విషయంపై ఎంపీడీవో రామకృష్ణతో ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, జి.సిగడాం

మత్స్యకారులకు అదనపు సాయం

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: మొంథా తుపానుతో నష్టపోయిన మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకుంటుందని తహసీల్దారు బలగ గోపాల్ అన్నారు. బడివానిపేట మత్స్యకార గ్రామంలో 50 కిలోల బియ్యం, కందిపప్పు, పంచదార మత్స్యకారులకు అందజేశారు. డీసీఎంఎస్ అధ్యక్షుడు చౌదరి అవినాష్ మాట్లాడుతూ వేటకు వెళ్లలేక ఇంటికే పరిమితమైన మత్స్యకారులను ఆదుకొనేందుకు ప్రభుత్వం సాయం అందించిందన్నారు. తెదేపా మండల అధ్యక్షుడు బెండు మల్లేసు, నేతలు గాలి వెంకటరెడ్డి, వారది ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేస్తున్న తహసీల్దార్ బలగ గోపాల్, కూటమి నేతలు

బీమా చెక్కు అందజేత

రణస్థలం, న్యూస్‌టుడే : వేల్పురాయి గ్రామానికి చెందిన తెదేపా నాయకులు బాలి సింహాచలం ఇటీవల రహదారి ప్రమాదంలో మృతి చెందారు. దీంతో తెదేపా కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి మంజూరైన రూ.5 లక్షలు బీమా చెక్కును విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సోమవారం మృతుడి కుటుంబానికి అందజేశారు. పార్టీలో సభ్యత్వం ఉండటంతో బీమా వచ్చిందని తెలిపారు. కార్యకర్తలకు తెదేపా ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు లంక శ్యామ్, సర్పంచి బాలిశ్రీను, సర్పంచుల సంఘ జిల్లా అధ్యక్షుడు భానోజీనాయుడు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

ఆక్రమణలకు అడ్డేది..?

జి.సిగడాం మండల కేంద్రంలో యథేచ్ఛగా చెరువుల కబ్జా

– న్యూస్‌టుడే, జి.సిగడాం

జి.సిగడాం మండల కేంద్రంలో ఆక్రమణలకు హద్దే లేకుండా పోతోంది. చెరువులను ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకున్న వారే కరవయ్యారు. విలువైన భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ శాఖలో స్పందన లేదు. దందాపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా మండలస్థాయిలో స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చెరువులు కనిపించనంతగా..

మండల కేంద్రంలో రామసాగరం చెరువుకు ఆనుకొని రహదారి పక్కన సుమారు 35 వరకు దుకాణాలు ఏర్పాటు చేశారు. లింగాల చెరువును ఆనుకునీ ఇదే పరిస్థితి. వీటికి ఎలాంటి అనుమతులు లేకున్నా క్రయ, విక్రయాలు చేపడుతున్నారు. నిబంధనల ప్రకారం చెరువు గర్భాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు.

రామసాగరం చెరువు ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణాలు

అసలే ఇరుకు..

రహదారులు ఇరుకుగా ఉండటంతోపాటు ఎదురెదురుగా వస్తున్న వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. దీనికి తోడు ఆక్రమణల కారణంగా మరింత అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. 'ఆక్రమణల విషయం నా దృష్టికి వచ్చింది. పరిశీలించి తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం' అని జి.సిగడాం తహసీల్దారు సరిత తెలిపారు.

లక్ష్మణరావు సేవలు ఎనలేనివి

పాతబస్టాండ్, ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: ఇటీవల మృతి చెందిన న్యాయవాది చౌదరి లక్ష్మణరావు సేవలు ఎనలేనివని బార్ అసోసియేషన్ కార్యవర్గం తెలిపింది. ఆయన సంస్మరణ సభను సోమవారం జిల్లా బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తంగి శివప్రసాదరావు, పిట్టా దామోదరరావు తదితరులు పాల్గొన్నారు. ఆమదాలవలసలో బార్ అసోసియేషన్ సభ్యులు సంతాపం తెలిపారు. కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ సమాజంలో ఉన్న పౌరులను జాగృతం చేస్తూ కార్మికులు, కర్షకులకు అండగా నిలిచేవారిని, ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు.

సంతాపం వ్యక్తం చేస్తున్న బార్ అసోసియేషన్ కార్యవర్గం

నాణ్యత పక్కాగా ఉండాలి

జి.సిగడాం, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఉపాధి పథకంలో చేపట్టే రహదారి పనులు పారదర్శకంగా చేపట్టాలని పంచాయతీరాజ్ డీఈ సనపల శ్రీరాములు అన్నారు. జి.సిగడాం మండల కార్యాలయంలో సోమవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో టెండర్ ప్రకారం రహదారుల నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంటుందని, దీనిపై సిబ్బంది అవగాహన పెంచుకోవాలన్నారు. పనుల్లో నాణ్యత, ప్రమాణాలు పక్కాగా ఉండేలా చూసుకోవాలన్నారు. పంచాయతీరాజ్ ఏఈ లతశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

(c) eenadu

గోపుర కలశాలను పవిత్ర జలాలతో అభిషేకిస్తున్న దృశ్యం ◆ వేడుక తిలకిస్తున్న భక్తులు

ఘనంగా కర్పగ వినాయక ఆలయ కుంభాభిషేకం

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై పట్టణంలోని తిరువూడల్ వీధిలో ఉన్న కర్పగ వినాయక ఆలయంలో మహా కుంభాభిషేకం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన యాగశాలలో వేకువ జామున నాల్గవకాల యాగపూజలు, యాత్రదానం, ప్రత్యేక హోమం, పూర్ణాహుతి తదితర పూజలు జరిగాయి. తర్వాత పవిత్ర జలాలున్న కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్లి గోపుర కలశాలపై అభిషేకించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అవినీతిని కప్పిపుచ్చేందుకే అఖిలపక్ష సమావేశం

● కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్

సైదాపేట, న్యూస్‌టుడే: అఖిలపక్ష సమావేశం పేరుతో ముఖ్యమంత్రి నాటకం ఆడుతున్నారని కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి కేఎన్ నెహ్రూ నిర్వహిస్తున్న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలో జరిగిన అవినీతితో యువతకు డీఎంకేపై వ్యతిరేకత ఏర్పడిందని చెప్పారు. ఈ అవినీతి వ్యవహారాన్ని కప్పిపుచ్చేందుకు ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారన్నారు. ఎస్ఐఆర్ స్వాగతించదగ్గదన్నారు. అందరూ వారి ఓట్లను నిర్ధారించుకోవాలని చెప్పారు. ఆర్కేనగర్ ఎన్నికల సమయంలో నకిలీ ఓటర్లు ఉన్నారని ఆరోపించిన డీఎంకే నేడు ఎస్ఐఆర్‌కి వ్యతిరేకంగా అఖిలపక్ష సమావేశం నిర్వహించడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు.

ఎన్ని కుట్రలు చేసినా.. 2026లో డీఎంకేదే ప్రభుత్వం

చెన్నై, న్యూస్‌టుడే: భాజపా ఎన్ని కుట్రలు చేసినా 2026లో డీఎంకే నేతృత్వంలోని ప్రభుత్వమే ఏర్పాటు కానుందని ముఖ్యమంత్రి స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలపై ఉన్న నమ్మకంతో ఇది చెబుతున్నానని పేర్కొన్నారు. ఆ ఎన్నికలు రాష్ట్రాన్ని భాజపా-అన్నాడీఎంకే ముఠా నుంచి కాపాడేవిగా ఉంటాయన్నారు. ధర్మపురి జిల్లా పెన్నాగరంలో సోమవారం జరిగిన ఎంపీ మణి కుమారుడు ప్రగదీశ్వరన్-మధు ప్రతిక్ష వివాహ కార్యక్రమానికి హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఏడాది శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్ల జాబితాలో ప్రత్యేక ముమ్మర సవరణ(ఎస్ఐఆర్) పేరిట కుట్రపూరిత చర్యకు ఎన్నికల కమిషన్ ప్రణాళిక రూపొందించిందని ఆరోపించారు. దానిని అడ్డుకునే ప్రయత్నంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించి ముఖ్యమైన తీర్మానం నెరవేర్చామన్నారు. ఎన్నికలకు కొద్ది నెలలు మాత్రమే ఉన్న నేపథ్యంలో అర్హులైన ఓటర్లను తొలగించే కుట్రే 'సర్' అని ఆరోపించారు. అఖిలపక్ష సమావేశంలో కొన్ని పార్టీలు పాల్గొనకపోయినా ఎన్నికల కమిషన్‌లో అవి 'సర్'కు వ్యతిరేకత వ్యక్తం చేసినందుకు కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిసామి మాత్రం భాజపాకు భయపడి ఎన్నికల కమిషన్ చర్యలను ప్రత్యక్షంగా వ్యతిరేకించడంలేదని, ఈ విషయంలోనూ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని విమర్శించారు. భాజపా ఎలాంటి కుట్ర చేసినా తమిళనాడులో ఏమీ చేయలేదని దృఢంగా చెబుతున్నానన్నారు. కార్యక్రమంలో వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్, మంత్రులు వేలు, ఎం.ఆర్.కె.పన్నీర్‌సెల్వం, శివ శంకర్, రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన..

ధర్మపురి జిల్లాకు విచ్చేసిన సందర్భంగా రెడ్డిఅల్లి గ్రామంలో రూ.39.14 కోట్లతో నిర్మితమవుతున్న ధర్మపురి మున్సిపల్ కొత్త బస్టాండు, ధర్మపురి సిప్కాట్ ఇండస్ట్రియల్ పార్కులో చేపడుతున్న అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి స్టాలిన్ పరిశీలించారు.

బస్టాండు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న స్టాలిన్ తదితరులు

స్టాలిన్ పాలనలో మహిళలకు భద్రత కరవు

● కోవైలో విద్యార్థినిపై అత్యాచార ఘటనకు పలువురి ఖండన

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోయంబత్తూరులో కళాశాల విద్యార్థినిని కిడ్నాప్ చేసి సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటనను పలువురు ఖండించారు. కోవై పీఎ మేడు భాజపా కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ మాట్లాడుతూ మహిళలకు సురక్షితమైన నగరంగా పరిగణించే కోయంబత్తూరులో ఇలాంటి ఘటన జరగడం దారుణమన్నారు. మహిళలకు భద్రతలో ద్రావిడ మోడల్ ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై హింస పెరుగుతోందని ఆరోపించారు. ఈ ఘటనకు గంజాయి ప్రధాన కారణమని, కోవైలో మత్తు పదార్థాల విక్రయాలను పోలీసులు నియంత్రించలేక పోతున్నారని ఆరోపించారు. నిందితులకు కఠినశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థిని త్వరగా కోలుకోవాలని దేవుని ప్రార్థిస్తున్నానన్నారు.

మాట్లాడుతున్న నయినార్ నాగేంద్రన్

● ప్రభుత్వం భద్రత కల్పించకపోతే, మహిళలు స్వయంగా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ తరఫున నిరసన చేపట్టనున్నాం.
- వానతి శ్రీనివాసన్, కోవై ఎమ్మెల్యే

ట్రిప్లికేన్: మహిళల భద్రతను నిర్ధారించడం, భయం లేకుండా బహిరంగంగా ప్రయాణించగలిగే సురక్షితమైన వాతావరణాన్ని సృష్టించడం ప్రభుత్వ బాధ్యత. మత్తుపదార్థాల వినియోగాన్ని నియంత్రించాల్సిన పోలీసులు చోద్యం చూస్తున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు త్వరగా కోలుకోవాలి.
- ఆదవ్ అర్జున, టీవీకే ఎన్నికల ప్రచార నిర్వహణ ప్రధాన కార్యదర్శి

ఆర్కేనగర్: మహిళలకు భద్రత లేని రాష్ట్రంగా తమిళనాడు మారిందనడానికి కోవై ఘటనే నిదర్శనం. మత్తుపదార్థాలతో యువత నాశనమవుతోందని పదేపదే చెప్పినా సరిలేని అప్పా మోడల్ ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోలేదు. రాష్ట్రంలో పోలీసుశాఖ ఉందా అనేది ప్రశ్నార్థకంగా మారింది
-అరుణ్‌రాజ్, టీవీకే సిద్ధాంత ప్రచార ప్రధానకార్యదర్శి

సైదాపేట: స్టాలిన్ ప్రభుత్వం మహిళల భద్రతను గాలికొదిలేసింది. అన్నాడీఎంకే ప్రభుత్వంలో మహిళలకు వంద శాతం భద్రత నిర్ధారించాం. అత్యాచారానికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేస్తున్నా.
-ఎడప్పాడి పళనిసామి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి

● డీఎంకే పాలనలో మహిళలు, పిల్లలపై లైంగిక వేధింపులు అధికమవుతున్నాయి. గంజాయి తదితర మాదక ద్రవ్యాల చలామణి పెరగడమే ఇలాంటి ఘటనలకు కారణం. విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన మానవ మృగాలను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి.
-అన్బుమణి, పీఎంకే నేత

● డీఎంకే అధికారంలోకి వచ్చిన తర్వాత నేరగాళ్లకు పట్టం, పోలీసులు అంటేనే భయం లేకుండా పోయింది. డీఎంకే మంత్రుల నుంచి పోలీసుల వరకు లైంగిక నేరగాళ్లను కాపాడేందుకే యత్నిస్తున్నారు.
-అన్నామలై, భాజపా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు

టీవీకే ప్రధాన కార్యాలయంలో సీబీఐ దర్యాప్తు

ప్యారిస్, న్యూస్‌టుడే: కరూర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి చెన్నై పనైయూర్‌లోని టీవీకే ప్రధాన కార్యాలయంలో సీబీఐ అధికారి సోమవారం దర్యాప్తు చేశారు. ఈ విషయమై టీవీకే జాయింట్ ప్రధాన కార్యదర్శి నిర్మల్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ ప్రచార వాహనంలో ఉన్న సీసీ కెమెరా రికార్డులు, కొన్ని వివరాలు కోరినట్లు తెలిపారు. వాటిని మూడు రోజుల్లో ఇస్తామని చెప్పామన్నారు. విజయ్, ప్రచార కార్యదర్శి లేదా మరెవరైనా దర్యాప్తుకు హాజరవ్వాలని సమన్లు ఇవ్వలేదని విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. ఇప్పటికే సీబీఐ అధికారులు వేలుసామిపురంలో ఘటనస్థలం సమీపంలో త్రీడీ లేజర్ పరికరాలను ఉపయోగించి కొలతలు తీశారు. స్థానిక దుకాణ నిర్వాహకుల వద్ద వాంగ్మూలం తీసుకున్నారు. ప్రచారానికి అనుమతిచ్చిన కరూర్ నగర ఇన్‌స్పెక్టర్ మణివణ్ణన్ వద్ద రెండు గంటల పాటు దర్యాప్తు చేశారు. తొక్కిసలాటలో మృతుల కుటుంబీకులు, క్షతగాత్రులు, వారి బంధువులు, వారిని సమావేశానికి తీసుకెళ్లిన టీవీకే నేతలు తదితర మొత్తం 306 మందికి సమన్లు జారీ చేశారు. వారిలో ఇప్పటికే 15 మందితో సీబీఐ అధికారులు మాట్లాడారు.

జాలర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి: విజయ్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర జాలర్ల సమస్యకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం చూపాలని టీవీకే అధ్యక్షుడు విజయ్ కోరారు. ఆయన తన ఎక్స్ పేజీలో.. తమిళనాడు, పుదుచ్చేరికి చెందిన జాలర్లు 35 మందిని శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసి, పడవలు స్వాధీనం చేసుకుందన్న సమాచారం మనోవేదనకు గురి చేసిందన్నారు. మత్స్యకారులను వెంటనే విడుదల చేయాలన్నారు. పడవలు తిరిగి ఇప్పించాలన్నారు.

తమిళనాడు క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాసరాజ్

సైదాపేట, న్యూస్‌టుడే: తమినాడు క్రికెట్ సంఘానికి నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. చెన్నై చేపాక్కం క్రికెట్ మైదానంలో జరిగిన ఎన్నికలకు అధికారిగా విశ్రాంత ఐఏఎస్ అధికారి చంద్రశేఖర్ వ్యవహరించారు. కొత్త అధ్యకుడిగా శ్రీనివాసరాజ్, ఉపాధ్యక్షుడిగా కుమరేష్, కార్యదర్శిగా భగవాన్ దాస్ రావు, ఉప కార్యదర్శిగా శ్రీరామ్, సహాయ కార్యదర్శిగా మారీశ్వరన్, కోశాధికారిగా రంగరాజన్ ఎన్నికయ్యారు. శ్రీనివాసరాజ్ మాట్లాడుతూ.. గత నిర్వాహకులు ప్రారంభించిన పనులతో పాటు, క్రికెట్ క్రీడను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. 2026లో జరగనున్న టీ-20 ప్రపంచకప్ కోసం చేపాక్కం మైదానాన్ని పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు. మహిళా క్రికెట్‌కు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. త్వరలో పాఠశాల స్థాయి మహిళా పోటీలు జరుగుతాయన్నారు.

వీధి శునకాల వ్యవహారం

● సుప్రీంకోర్టులో హాజరైన సీఎస్

ప్యారిస్: వీధి శునకాల నియంత్రణకు సంబంధించిన కేసులో తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) మురుగానందం సుప్రీంకోర్టులో హాజరయ్యారు. వీధి శునకాలను నియంత్రించేందుకు మార్గదర్శకాలను రూపొందించే విషయమై ప్రమాణపత్రాలు దాఖలు చేయని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులు నవంబరు 3న హాజరవ్వాలని అక్టోబరులో సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. నేరుగా హాజరయ్యేందుకు మినహాయింపు ఇవ్వాలన్న ప్రధాన కార్యదర్శుల అభ్యర్థనను నిరాకరించింది. ఈ నేపథ్యంలో మురుగానందం హాజరై ప్రభుత్వం తరఫున ప్రమాణపత్రం దాఖలు చేశారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు కూడా హాజరై ప్రమాణ పత్రం దాఖలు చేశారు. కుక్కకాటును నియంత్రించేందుకు రాష్ట్రాలు చేపట్టిన చర్యలను పరిశీలించిన తర్వాతే తదుపరి ఉత్తర్వులు జారీ చేస్తారని, అప్పటివరకు పాత ఆదేశాలు కొనసాగుతాయని సుప్రీంకోర్టు తెలిపి విచారణను 7వ తేదీకి వాయిదా వేసింది.

ప్రచారసభలకు మార్గదర్శకాలపై

పార్టీలతో 6న సమాలోచన

చెన్నై, న్యూస్‌టుడే: రాష్ట్రంలో బహిరంగ సభలు, ప్రచారాల నిర్వహణకు మార్గదర్శకాలు రూపకల్పనపై ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిన పార్లమెంట్, శాసనసభలో ప్రాతినిధ్యం కలిగిన పార్టీల సభ్యులతో 6న సమాలోచన జరగనుంది. కరూర్ తొక్కిసలాట తరహా ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు మార్గదర్శకాలు రూపొందించాలని మద్రాసు హైకోర్టు సూచించింది. ఆ మేరకు రాష్ట్రంలో బహిరంగ సభలు, ప్రచారాలు నిర్వహించడానికి మార్గదర్శకాలు రూపొందించే విషయమై తమ అభిప్రాయాలు, సూచనలు తెలిపేందుకు ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిన పార్టీలు, పార్లమెంట్, శాసనసభలో సభ్యులను కలిగిన పార్టీల ప్రతినిధులతో 6వ తేది ఉదయం 10.30 గంటలకు సచివాలయంలో సమాలోచన జరగనుంది. సీనియర్ మంత్రులు అధ్యక్షత వహించనున్నారు.

పదవికి ముప్పు ఏర్పడుతుందనే తొలగించారు: టీటీవీ దినకరన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తన పదవికి ముప్పు ఏర్పడుతుందనే తనను, శశికళను ఈపీఎస్ అన్నాడీఎంకే నుంచి నుంచి తొలగించారని ఏఎంఎంకే ప్రధానకార్యదర్శి టీటీవీ దినకరన్ తెలిపారు. సోమవారం ఆయన తిరుచ్చిలో విలేకరులతో మాట్లాడారు. బిహార్‌లో నిర్వహించిన 'సర్'లో పలు అవకతవకలు జరిగాయని అంటున్నారన్నారు. అక్కడ భాజపా కూటమి పాలనలో ఉండటమే అందుకు కారణమన్నారు. తమిళనాడులో డీఎంకే పాలన కొనసాగుతోందని, రాష్ట్ర అధికారులే ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ నిర్వహించనున్నారు. దానిని నిజాయితీగా చూద్దామని, భయపడాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలో అన్ని పార్టీలు అప్రమత్తంగా ఉంటాయని చెప్పారు. ఆర్కేనగర్ ఎన్నికల్లో అన్నాడీఎంకేను కాపాడటానికి వచ్చిన వ్యక్తి టీటీవీ దినకరన్ అన్న ఈపీఎస్ వెంటనే తనను పార్టీ నుంచి తొలగించారని తెలిపారు. పార్టీ నుంచి తొలగింపునకు మూడు రోజుల ముందే అందరం కలిసి వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించామని గుర్తు చేశారు. ఆ మూడురోజుల్లో తాను ఏం ద్రోహం చేసి ఉంటానని ప్రశ్నించారు. తాను, శశికళ పార్టీలో ఉంటే ఈపీఎస్ ముఖ్యమంత్రి పదవికి ప్రమాదం ఏర్పడుతుందని తొలగించారన్నారు. ముఖ్యమంత్రిని చేసిన శశికళకే ద్రోహం చేశారని విమర్శించారు. అన్నాడీఎంకే- టీవీకే కూటమి ఏర్పాటై గెలిస్తే విజయ్‌నే ఖాళీ చేసేస్తారన్నారు. సెంగోట్టయన్‌ను తొలగించడానికి ఈపీఎస్ అనర్హులని చెప్పారు.

చెన్నై మహానగర పాలకసంస్థ తరఫున మెరినా బ్లూఫ్లాగ్ బీచ్ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన తమిళనాడు సంప్రదాయ కళా ప్రదర్శనలను ఆసక్తిగా తిలకిస్తున్న నగరవాసులు – న్యూస్‌టుడే, చెన్నై

అన్నాడీఎంకేలోనూ కుటుంబ రాజకీయం

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: అన్నాడీఎంకేలో కూడా కుటుంబ రాజకీయం కొనసాగుతోందని అన్నాడీఎంకే మాజీ మంత్రి సెంగోట్టయన్ తెలిపారు. ఎడప్పాడి పళనిసామి బావమరిది, అల్లుడులాంటి వారు ఎదుగుతున్నారనేది దేశమంతా తెలిసిన విషయమే అన్నారు. ఈరోడ్డు జిల్లా గోపిచెట్టిపాళ్యం నుంచి చెన్నై వెళ్లడానికి కోయంబత్తూరు విమానాశ్రయానికి వచ్చారు. పార్టీ నుంచి తొలగింపు, భవిష్యత్తు కార్యాచరణపై విలేకరుల ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ ఎంజీఆర్ కాలం నుంచి తాను ఇదే వైఖరిలో ఉన్నానని, ఈ ఉద్యమం బలోపేతానికి పూర్తి కృషి అందిస్తున్నానని చెప్పారు. తాము చేయలేనిది చేయగలమని చెప్పి తమను తాము, ఇతరులను మోసం చేసుకునేవారు సమయాన్ని, ఇతరుల కృషిని వృథా చేస్తున్నారని తెలిపారు. ఎడప్పాడి పళనిసామి అలాంటి వ్యక్తే అన్నారు.

మాట్లాడుతున్న సెంగోట్టయన్

డీఎంకే మళ్లీ అవకాశమడిగితే నమ్మొద్దు

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పాలన దారుణంగా ఉందని, ప్రజా వ్యతిరేక డీఎంకే ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలని నటి, అన్నాడీఎంకే ప్రచార ఉప కార్యదర్శి గౌతమి కోరారు. అరియలూరు జిల్లా జయంకొండం వద్ద తా.పళూరు కడైవీధిలో అన్నాడీఎంకే వార్షికోత్సవం సభ ఆదివారం జరిగింది. అన్నాడీఎంకే ప్రభుత్వం తీసుకొచ్చిన అనేక మంచి పథకాలను ముఖ్యమంత్రి స్టాలిన్ పక్కన పెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అస్తవ్యస్తంగా ఉన్నాయని ఆరోపించారు. నాలుగున్నరేళ్లలో రూ.4.5 లక్షల కోట్లు రుణం తీసుకున్నారని, వాటితో ఏం చేశారని అడిగితే సమాధానం లేదన్నారు. మరోసారి అవకాశం ఇవ్వమని అడిగితే నమ్మకూడదని ప్రజలకు సూచించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యపాలన కావాలంటే ఎడప్పాడి నేతృత్వంలోని ప్రభుత్వం అవసరమని చెప్పారు. డీఎంకే పాలనను అంతం చేయడానికి ప్రజలు రాబోయే అసెంబ్లీ ఎన్నికలను ఉపయోగించుకోవాలని కోరారు.

ప్రసంగిస్తున్న నటి గౌతమి

ముంబయి సదస్సులో కామరాజర్ పోర్టుకు

రూ.26 వేల కోట్ల ఒప్పందాలు

టీనగర్, న్యూస్‌టుడే: ముంబయిలో ఇటీవల జరిగిన మారిటైమ్ సదస్సులో తమిళనాడుకు చెందిన కామరాజర్ పోర్టు లిమిటెడ్ తరఫున రూ.26 వేల కోట్ల విలువైన ప్రాజెక్టుకు సంబంధించిన అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు పోర్టు ఎండీ జరీన్ సింధియా తెలిపారు. కేంద్ర పోర్టులు, షిప్పింగ్ జలమార్గాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ముంబయిలో అక్టోబరు 27 నుంచి 31 వరకు జరిగిన అంతర్జాతీయ స్థాయి ఇండియన్ మారిటైమ్ సదస్సులో కామరాజర్ పోర్టు ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. పోర్టు అభివృద్ధికి, కొత్త ప్రాజెక్టుల స్థాపనకు సంబంధించి మొత్తం రూ.26 వేల కోట్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ మేరకు జరీన్ సింధియా ప్రకటన విడుదల చేశారు. ఈ ఒప్పందాల ద్వారా పోర్టు కార్యకలాపాలు మరింత విస్తృతం కానున్నాయని పేర్కొన్నారు.

రూ.296 కోట్ల సంక్షేమ సాయం అందజేత

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా అమ్మూరు సమత్వపురం వద్ద ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ సోమవారం 72,878 మంది లబ్ధిదారులకు రూ.296.46 కోట్ల విలువైన సంక్షేమ సహాయాలు అందించారు. రూ.24,34 కోట్ల విలువైన కొత్త ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు. ఇప్పటికే పూర్తయిన రూ.42.17 కోట్ల ప్రాజెక్టులను ప్రారంభించారు. రాణిపేట మున్సిపల్ కాంప్లెక్స్ ఆవరణలో కామరాజర్ బస చేసిన ఇంటి పునరుద్ధరణ పనులు పూర్తవగా ప్రజల సందర్శనార్థం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ రాణిపేటకు ఆ పేరును సార్థకం చేశారని ఉదయనిధి కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాజుల కంటే రాణులే అధిక సంఖ్యలో ఉన్నారన్నారు. రాణులపేటలా ఈ పట్టణం పండగ వాతావరణం సంతరించుకుందని ఆనందం వ్యక్తం చేశారు. వాలాజాపేట టోల్‌గేట్ వద్ద మంత్రి ఆర్.గాంధీ నేతృత్వంలో నిర్వాహకులు ఉదయనిధికి ఘనస్వాగతం పలికారు.

కామరాజర్ బసచేసిన ఇంటిని ప్రజల సందర్శనార్థం ప్రారంభిస్తున్న ఉదయనిధి తదితరులు

దేశాన్ని మతపరంగా మార్చే

ప్రయత్నమే ఎస్ఐఆర్

తిరుమా

వేలూరు, న్యూస్‌టుడే: ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(ఎస్ఐఆర్) లౌకికదేశాన్ని మతపరంగా మార్చే ప్రయత్నమని వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ ఆరోపించారు. వేలూరు సమీపంలోని పేర్నాంపట్టు వద్ద సోమవారం ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ పార్టీ నిర్వహించిన కార్యక్రమాల్లో తిరుమావళవన్ పాల్గొని మాట్లాడారు. ఎస్ఐఆర్ లక్ష్యం దళిత, మైనారిటీలను ఓటరు జాబితానుంచి తొలగించడమేనని, ఇది రాజ్యాంగ విరుద్ధమని ఆరోపించారు.

పార్టీ విజయాలు ప్రజలకు చేరవేయండి

సైదాపేట, న్యూస్‌టుడే: ఎంజీఆర్, జయలలిత ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు, అన్నాడీఎంకే పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాల జాబితాను సిద్ధం చేసి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరవేయాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి సూచించారు. చెన్నై రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఐటీ వింగ్ నిర్వాహకులతో సమావేశమయ్యారు. జిల్లాల్లో పార్టీకి మద్దతు ఎలా ఉందో ఆరా తీయాలని, ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే సరిచేయాలని సూచించారు. అన్నాడీఎంకే మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు ఐటీ విభాగం కృషి చేయాలన్నారు.

సమావేశంలో ఎడప్పాడి పళనిసామి, సీనియర్ నేతలు

టిక్కెట్ల కోసం తిప్పలు తప్పేలా..

● సెంట్రల్ స్టేషనులో 'ఎం-యూటీఎస్' సేవలు

వడపళని, న్యూస్‌టుడే: దక్షిణ రైల్వే చెన్నై డివిజన్ సహాయక్ పథకంలో భాగంగా ప్రయాణికుల సౌకర్యార్థం సోమవారం 'ఎం-యూటీఎస్(మొబైల్ అన్‌రిజర్వ్‌డ్ టిక్కెటింగ్ సిస్టమ్)' సేవలను డాక్టర్ ఎంజీ రామచంద్రన్ సెంట్రల్ రైల్వే స్టేషనులో ప్రారంభించింది. బుకింగ్ కౌంటర్ల వద్ద ప్రయాణికులు అన్ రిజర్వ్‌డ్ టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చు. ఈ విధానం వల్ల కౌంటర్ల వద్ద రద్దీ సమయాల్లో జనం క్యూలో నిలబడే అవసరం ఉండదని అధికారులు తెలుపుతున్నారు.

'ఎం-యూటీఎస్' ద్వారా టిక్కెట్లు ఇస్తున్న ఉద్యోగి

'ఈసీఆర్'లో అధునాతన బస్టాండ్ నిర్మాణం

● రూ.90.50 కోట్లతో పనులు

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా మహాబలిపురం వద్ద ఈస్ట్ కోస్ట్ రోడ్డు(ఈసీఆర్)లో 6.98 ఎకరాల విస్తీర్ణంలో చెన్నై మహానగర అభివృద్ధి ప్రాధికార సంస్థ(సీఎండీఏ) తరఫున రూ.90.50 కోట్ల వ్యయంతో కొత్తగా అధునాతన బస్టాండ్ నిర్మాణ పనులు 2024లో ప్రారంభమయ్యాయి. బస్టాండ్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌లో 345 ద్విచక్ర వాహనాలు, 150 నాలుగు చక్రాల వాహనాలు పార్క్ చేయవచ్చు. తాగునీరు, మురుగునీటి శుద్ధీకరణ ప్లాంట్ తదితర వసతులను కల్పిస్తున్నారు. 48 బస్సులను నిలిపే విధంగా వసతి కల్పిస్తున్నారు. అంతేకాకుండా టిక్కెట్ కౌంటర్, ఏటీఎం, ప్రయాణికులు వేచి ఉండే గది, మహిళలకు విశ్రాంతి గది, దుకాణాలు గ్రౌండ్ ఫ్లోర్‌లో రానున్నాయి. వీటితో పాటు వంటగదితో కూడిన రెస్టారెంట్, కంట్రోల్ రూం, సిబ్బంది విశ్రాంతి గది తదితర సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. పనులను త్వరగా ముగించాలని సీఎండీఏ అధికారులు గుత్తేదారుడిని ఆదేశించడంతో ముమ్మరంగా జరుగుతున్నాయి.

బస్టాండ్ నమూనా

టెన్నిస్ విజేతలకు ట్రోఫీలు

చెన్నై, న్యూస్‌టుడే: నగరంలో జరిగిన చెన్నై ఓపెన్ ఉమెన్స్ అంతర్జాతీయ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ డబ్ల్యూటీఏ-250 విజేతలకు ముఖ్యమంత్రి స్టాలిన్ ట్రోఫీలు అందించారు. ఈ టోర్నీ మూడేళ్ల తర్వాత చెన్నైలో జరిగింది. నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.12 కోట్ల సహకారం అందించింది. నుంగంబాక్కంలోని తమిళనాడు క్రీడాభివృద్ధి సంస్థకు చెందిన టెన్నిస్ స్టేడియంలో అక్టోబరు 27న ప్రారంభమైన టోర్నీ ఆదివారం ముగిసింది. ఫైనల్‌లో ఇండోనేషియా క్రీడాకారిణి జనిస్ జెన్, ఆస్ట్రేలియా క్రీడాకారిణి కింబెర్లీ బిరెల్ తలపడగా విన్నర్‌గా జనిస్ జెన్, రన్నరప్‌గా కింబెర్లీ బిరెల్ నిలిచారు. ఉత్కంఠభరితంగా కొనసాగిన ఫైనల్ టోర్నీని ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ప్రత్యక్షంగా వీక్షించారు. ఉప ముఖ్యమంత్రి సమక్షంలో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రైజ్‌మనీ, ట్రోఫీలను అందించి అభినందించారు. కార్యక్రమంలో మంత్రులు సుబ్రమణియన్, పి.కె.శేఖర్ బాబు, టీఆర్‌బీ రాజా, చెన్నై మహానగర పాలకసంస్థ మేయర్ ప్రియ, ఎమ్మెల్యే డాక్టర్ ఎళిలన్, డిప్యూటీ మేయర్ మహేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజేతకు చెక్కు అందిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

(c) eenadu

ధాన్యం కొనుగోలు తేమ శాతాన్ని పెంచాలి

ఎంపీ ధనపాల్ వినతిని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో భద్రపరచిన ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. ఇందుకు సంబంధించి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి ఆదేశాల మేరకు ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు ధనపాల్ దిల్లీలో కేంద్ర ఆహారశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈశాన్య రుతు పవనాలు, మొంథా తుపాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురవడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 30 లక్షలకు పైగా ధాన్యం బస్తాలు తడిసి పాడయ్యాయని గుర్తుచేశారు. ప్రధానంగా తిరువళ్లూరు, చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాల్లో 6.50 లక్షల ఎకరాల్లో సాగు చేసిన వరి పంట నీట మునిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కోత కోసి కల్లాల్లో ఆరబెట్టిన 10 లక్షల ధాన్యం బస్తాలు తడిసి మొలకెత్తడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందజేయాలని, ధాన్యం కొనుగోలు తేమ శాతాన్ని 17 నుంచి 22కి పెంచాలని కోరారు.

ఎలుగుబంట్ల సంచారంతో భయాందోళన

టీనగర్, న్యూస్‌టుడే: తిరునెల్వేలి జిల్లా విక్రమసింగపురంలో ఎలుగుబంట్లు సంచరించడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. జిల్లాలోని అంబాసముద్రం సమీపంలోని పశ్చిమ కనుమల్లో జీవిస్తున్న వన్యప్రాణులు అప్పుడప్పుడు ఆహారం, నీటి కోసం జనావాసాల్లోకి ప్రవేశించి, పంటలను నాశనం చేస్తున్నాయి. గొర్రెలు, కోళ్లు, కుక్కలు వంటి పెంపుడు జంతువులను వేటాడి తీసుకెళ్తున్నాయి. అటవీశాఖ సిబ్బంది రాత్రిపూట గస్తీ నిర్వహిస్తున్నా వన్యప్రాణులు చొరబాట్లు ఆగడం లేదు. ముఖ్యంగా విక్రమసింగపురం, పరిసర ప్రాంతాల్లో ఎలుగుబంట్లు దేవాలయాల్లో పూజల కోసం ఉపయోగించే నూనెను తాగుతున్నాయి. ఈ నేపథ్యంలో విక్రమసింగపురం మున్సిపాలిటీ పరిధిలోని శంకరపాండియపురంలో ఆదివారం అర్ధరాత్రి రెండు ఎలుగుబంట్లు తిరుగుతూ కనిపించాయి. స్థానికులు తమ సెల్‌ఫోన్ ద్వారా వీడియో తీయడంతో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఎలుగుబంట్లను బంధించి దట్టమైన అడవిలో విడిచిపెట్టాలని అటవీశాఖ వారిని కోరుతున్నారు.

చిరు వ్యాపారులకు గుర్తింపు కార్డులు అందజేత

మహిళకు కార్డు అందిస్తున్న మంత్రి కేఎన్ నెహ్రూ

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: ఆవడి మున్సిపాలిటీ పరిధిలో ఫుట్‌పాత్‌లపై దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులకు గుర్తింపు కార్డులు అందజేసే కార్యక్రమం ఆదివారం సాయంత్రం నిర్వహించారు. రాష్ట్ర మంత్రి నాజర్ అధ్యక్షత మంత్రి కేఎన్ నెహ్రూ ముఖ్య అతిథిగా పాల్గొని 180 మందికి కార్డులు పంపిణీ చేశారు. పట్టణాభివృద్ధి శాఖ డైరెక్టర్ మధుమదన్, తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ప్రతాప్, ఆవడి మేయర్ ఉదయకుమార్, డిప్యూటీ మేయర్ సూర్యకుమార్, కమిషనర్ శరణ్య పాల్గొన్నారు.

కృష్ణగిరి జిల్లా అరసంపట్టి సమీపం మంజమేడు గ్రామంలో జిల్లా చరిత్ర పరిశోధన, డాక్యుమెంటేషన్ బృందం సర్వే నిర్వహించి కోటీశ్వర నయినార్ ఆలయ వృక్ష కొబ్బరి తోటలో కులోత్తుంగన్-3 కాలం నాటి అమ్మవారి విగ్రహాన్ని గుర్తించింది. - న్యూస్‌టుడే, క్రిష్ణగిరి

పేపర్ తాతా.. నీకు అలుపే రాదా?

☛ 94ఏళ్ల వయసులోనూ చురుగ్గా విధులు ☛ కష్టాన్నే నమ్ముకుని జీవనం

- న్యూస్‌టుడే, విల్లివాక్కం

పేపర్ తాత షణ్ముగసుందరం

మనలో చాలామంది ఉదయం లేవగానే వెతికేది ఇంటి గుమ్మం ముందు పడిన వార్తాపత్రికనే. వాటిని మనకు అందజేయడానికి పేపర్ బాయ్స్ తెల్లవారు జామునే సైకిళ్లపై పరుగులు తీస్తుంటారు. ఏ ఇంటికి ఏ పేపర్ వేయాలో గుర్తుంచుకొని వీధుల్లో చక్కర్లు కొడుతుంటారు. సాధారణంగా పాకెట్ మనీ కోసం పాఠశాల విద్యార్థులే ఈ పనులు చేస్తుంటారు. అయితే 94 ఏళ్ల వయసులోనూ ఓ వ్యక్తి చురుగ్గా పేపర్లు వేస్తూ అబ్బురపరుస్తున్నారు. ఆయనే చెన్నై రాయపేటకు చెందిన 'పేపర్ తాత'గా పేరొందిన షణ్ముగ సుందరం. గోపాలపురం ఈయన రోజూ పేపర్ వేసే ఏరియా.

నిజాయతీగా చేసే ఏ పనైనా పర్వాలేదు

పదో తరగతి వరకు చదువుకున్న షణ్ముగసుందరం 50ఏళ్లపాటు మోటారు వాహనాల రిపేరు వృత్తిలో కొనసాగారు. అనివార్య కారణాలతో ఆ వృత్తికి స్వస్తి పలికారు. తర్వాత ఏం చేయాలా? అని ఆలోచిస్తున్న సమయంలో గోపాలపురంలో పేపర్ వేసే పనిఉన్నట్టు తెలుసుకొని అక్కడికి వెళ్లారు. అది పిల్లలు చేసే పని అని ఏజెంట్ చెప్పడంతో నిజాయతీగా శ్రమించి తినడానికి ఏ పనైనా పర్వాలేదని చెప్పారు. 2000 సంవత్సరం నుంచి పేపర్ వేస్తున్నారు. ఈ సంపాదన సరిపోక ఇంటింటికీ వెళ్లి పాల ప్యాకెట్లు వేస్తున్నారు. అంతేకాకుండా ఓ పూజ మందిరానికి సంరక్షకుడిగా చేరారు. వేకువజామున 3 గంటలకు నిద్రలేచి పూజ హాలు శుభ్రం చేసి పూజ పూర్తి చేసి పేపర్, పాల ప్యాకెట్లు వేయడానికి వెళ్తున్నారు. అనంతరం ఇంటికొచ్చి భార్య లక్ష్మికి అవసరమైన వస్తువులు సమకూర్చి తిరిగి పూజ మందిరానికి వెళతారు. అక్కడే విశ్రాంతి తీసుకొని నిద్రపోతారు.

పింఛనుతో పనిలేదు

షణ్ముగసుందరం ఒక్కసారి కూడా తన విధుల నిర్వహణలో అలసత్వం వహించలేదు. దీని గురించి ఆయన మాట్లాడుతూ.. తనకు ఎలాంటి సమస్యలు లేవని, ఇప్పటికీ సైకిల్‌పైనే అన్ని పనులకు వెళతానని తెలిపారు. తన కుమారుడు, కుమార్తెలు, మనవరాళ్లు బాగా చూసుకుంటారని, తన సంపాదనతో తృప్తిగా జీవిస్తున్నానని చెబుతున్నారు. తాను పేపర్ వేస్తున్న గృహాలలో పలువురు అధికారులు వృద్ధాప్య పింఛను ఇప్పిస్తామని చెప్పారని, కానీ, తనకు వద్దని సున్నితంగా తిరస్కరించినట్లు చెప్పారు. ఇప్పటికీ ఆయనకు సెల్‌ఫోన్ లేకపోవడం ఆశ్చర్యపడాల్సిన విషయం.

జర్మనీ యువతితో తంజావూర్ యువకుడి వివాహం


విలినా మెడలో కుంకుమ పెడుతున్న విఘ్నేశ్వర్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తంజావూర్ జిల్లా పుదుచ్చేరి కూడంకుళం గ్రామానికి చెందిన విఘ్నేశ్వర్ అనే యువకుడు జర్మనీలోని ఓ ఐటీ కంపెనీలో గత 10ఏళ్లుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో అదే కంపెనీలో పనిచేస్తున్న ఆ దేశానికి చెందిన విలినా బెర్కన్ అనే యువతితో ప్రేమలో పడ్డారు. వీరి ప్రేమను ఇరు కుటుంబాలు అంగీకరించాయి. ఈ నేపథ్యంలో తమిళ సాంప్రదాయం ప్రకారం సోమవారం తంజావూరులో వీరి వివాహం ఘనంగా జరిగింది. వధువు తరఫువారు తమిళ సాంప్రదాయ వస్త్రాలు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ప్రత్యేక రైలు సేవలు పొడిగింపు

వడపళని, న్యూస్‌టుడే: న్యూ టిన్‌సుకియా-ఎస్ఎంవీటీ బెంగళూరు-న్యూ టిన్‌సుకియా వీక్లీ ప్రత్యేక రైలు సేవలు పొడిగించినట్లు దక్షిణ రైల్వే సోమవారం ప్రకటన విడుదల చేసింది. ● **05952** న్యూ టిన్‌సుకియాలో 6న(గురు)లో 18.45కు బయలుదేరి నాలుగోరోజు 09.30కి ఎస్ఎంవీటీ బెంగళూరు వస్తుంది. ● **05951** ఎస్ఎంవీటీ బెంగళూరులో 10న(సోమ) 23.50కు బయలుదేరి నాలుగోరోజు 16.25 గంటలకు న్యూ టిన్‌సుకియా చేరుకుంటుంది. ఈ రైలు జోలార్‌పేట్టై, కాట్పాడి, పెరంబూరు మీదుగా వెళ్తుంది.

దిండివనంలో నూతన ఆస్పత్రి భవనాలు నెలాఖరులో ప్రారంభం

కొత్తగా నిర్మించిన ఆసుపత్రి భవనం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: దిండివనంలో రూ.60 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆసుపత్రి భవనాన్ని ఈనెలాఖరులో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. విళుపురం జిల్లా దిండివనంలో సుమారు 50ఏళ్ల క్రితం ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని నిర్మించారు. అందులో సరిపడా వసతులు లేవు. రాష్ట్ర ప్రభుత్వం 2023లో దిండివనం ఆసుపత్రిని జిల్లా ప్రధాన ఆసుపత్రిగా స్థాయి పెంచాలని ఆదేశించింది. అలా స్థాయి పెరిగిన ఆసుపత్రికి కొత్తగా భవనాలను నిర్మించడానికి, మౌలిక వసతులను కల్పించడానికి రూ.60 కోట్ల నిధులను కేటాయించడంతో 2023 జులైలో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం భవనాల నిర్మాణ పనులు తుది దశకు చేరుకోవడంతో ఈ నెలాఖరులోపు ప్రారంభించడానికి ప్రజాపనుల శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

35మంది రాష్ట్ర జాలర్లు అరెస్టు

చెన్నై: సముద్రంలో సరిహద్దు దాటారనే అభియోగంపై ఒకే రోజు 35 మంది రాష్ట్ర జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్టు చేసింది. నాగపట్టినం జిల్లాకు చెందిన 31 మంది జాలర్లు సోమవారం చేపలు పట్టేందుకు సముద్రంలోకి వెళ్లగా సరిహద్దులు దాటారన్న అభియోగంతో వారిని శ్రీలంక నావికాదళం అరెస్టు చేసింది. వారికి చెందిన 3 మరబోట్లనూ స్వాధీనం చేసుకుంది. మరో ఘటనలో రామనాథపురం జిల్లాకు చెందిన నలుగురు జాలర్లను అరెస్టు చేసి వారికి చెందిన ఓ బోటును స్వాధీనం చేసుకుంది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి స్టాలిన్ తక్షణం స్పందిస్తూ.. జాలర్లను, వారి బోట్లను విడిపించడానికి చర్యలు చేపట్టాలని కోరుతూ కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్‌కు లేఖ రాశారు. ఇప్పటికే 114 మంది మత్స్యకారులు, 247 బోట్లు శ్రీలంక నిర్బంధంలో ఉన్నట్లు వెల్లడించారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వడపళని, న్యూస్‌టుడే: విద్యుత్తుశాఖ చేపడుతున్న మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పల్లావరం ప్రాంతంలో సరఫరాలో అంతరాయం కలగనుందని ఆ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది.

'ఎస్ఆర్ఐహెచ్ఈఆర్'లో ఆంకోకేర్ ప్రారంభం

ప్రారంభ కార్యక్రమంలో డాక్టర్ ఇ.హేమంత్‌రాజ్, వీఆర్ వెంకటాచలం, కె.బాలాజీసింగ్, డాక్టర్ ఉమా శేఖర్ తదితరులు

వడపళని, న్యూస్‌టుడే: 'శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్' (ఎస్ఆర్ఐ హెచ్ఈఆర్)లో సోమవారం 'ఆంకో కేర్' విభాగం ఏర్పాటైంది. చెన్నై క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ ఇ.హేమంత్‌రాజ్ కేంద్రాన్ని ప్రారంభించారు. సర్జికల్, మెడికల్, రేడియేషన్, హెమటాలజీ, పీడియాట్రిక్ ఆంకాలజీలతో పాటు పాథాలజీ, రేడియోలజీ, న్యూక్లియర్ మెడిసిన్, పాలియేటివ్ కేర్ వంటి సదుపాయాలున్నాయని హేమంత్‌రాజ్ అన్నారు. వర్సిటీ కులపతి వీఆర్ వెంకటాచలం, ఉపకులపతి డాక్టర్ ఉమా శేఖర్, వైద్య కళాశాల డీన్ డాక్టర్ కె.బాలాజీ సింగ్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్పీ సుధాకరసింగ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నాడీఎంకేలో పలువురి చేరిక

ఓపీఎస్ వర్గీయులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎడప్పాడి పళనిసామి

సైదాపేట, న్యూస్‌టుడే: చెన్నై రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలువురు ఆ పార్టీలో చేరారు. ఓపీఎస్ వర్గీయుడైన ఉత్తర చెన్నై దక్షిణ(తూర్పు) జిల్లా కార్యదర్శి శివా నేతృత్వంలో 50 మందికి పైగా అన్నాడీఎంకేలో చేరగా ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామిని కండువాలు కప్పి ఆహ్వానించారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను లంచం డిమాండ్ చేసిన వ్యవహారం

పచ్చయప్పన్ కళాశాల చరిత్ర విభాగాధిపతి సస్పెన్షన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: చెన్నై పచ్చయప్పన్ కళాశాలలో ఉద్యోగ నియామకానికి అర్హతను నిర్ధారించేందుకు రూ.20లక్షలు లంచం ఇవ్వాలని అసిస్టెంట్ ప్రొఫెసర్‌ని డిమాండ్ చేసిన హిస్టరీ విభాగాధిపతిని సస్పెండ్ చేశారు. చెన్నై పచ్చయప్పన్ కళాశాలలో హైకోర్టు పర్యవేక్షణలో 132మంది ప్రొఫెసర్లను నియమించారు. వీరికి కళాశాల విద్యా డైరెక్టరేట్ ఆమోదంతో గత సెప్టెంబర్‌లో మొదటి వేతనం చెల్లించారు. ఇందులో కళాశాల హిస్టరీ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకటేశన్ నియామకానికి అంగీకారం దక్కకపోవడంతో వేతనం అందలేదు. ఆయన డాక్టోరల్ పరిశోధన చేయలేదని, మద్రాసు వర్సిటీలోని ప్రాచీన చరిత్ర విభాగంలో పరిశోధన చేశారని ఉన్నతాధికారులు కళాశాల విద్యా డైరెక్టరేట్‌కు నివేదిక ఇచ్చారు. దీంతో వెంకటేశన్‌ను విధుల నుంచి తొలగించారు. దీని గురించి వెంకటేశన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అదే విధంగా నియామక అర్హత నిర్ధారించడానికి పచ్చయప్పన్ కళాశాల హిస్టరీ విభాగాధిపతి శరవణన్ తనను రూ.20లక్షలు లంచం డిమాండ్ చేశాడని కళాశాల యాజమాన్యానికి వెంకటేశన్ ఫిర్యాదు చేశారు. దీని గురించి కళాశాల యాజమాన్యం శరవణన్ వివరణ కోరింది. ఆయన ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో తమిళనాడు ప్రైవేట్ కళాశాలల (నియంత్రణ) చట్టం నిబంధనల ప్రకారం వెంటనే శరవణన్‌ని సస్పెండ్ చేస్తూ ప్రకటన విడుదల చేసింది. ఇదిలా ఉండగా వెంకటేశన్ దాఖలు చేసిన పిటిషన్‌ని విచారణకు స్వీకరించిన మద్రాసు హైకోర్టు.. ఆయన ప్రాచీన చరిత్ర పరిశోధన కోర్సును పరిగణలోకి తీసుకొని నియామక అర్హతను నిర్ధారించాలని ఆదేశించింది.

ప్రత్యేక అలంకరణలో మహానంది ● బంగారు వృషభ వాహనంపై ఉన్నాములై సమేత చంద్రశేఖరస్వామి ● పార్వతి సమేత సంగమేశ్వరస్వామి ఊరేగింపు

వైభవంగా ప్రదోషోత్సవం

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయంలో సోమవారం ప్రదోషోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని వేకువజామున తెరిచారు. ఉదయం మూలవర్లకు, సాయంత్రం ఆలయంలో ఉన్న మహానంది సహా అన్ని నంది విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు చేశారు. ఆ సమయంలో ఉత్సవమూర్తులైన ఉన్నాములై సమేత చంద్రశేఖరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి బంగారు వృషభ వాహనంపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. **పళ్లిపట్టు:** తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని పార్వతి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రదోషోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం మూలవర్లకు, సాయంత్రం నంది విగ్రహానికి అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు చేశారు. తర్వాత ఉత్సవ మూర్తులను ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు.

ఘనంగా ఆలయ కుంభాభిషేకం

కుంభాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం. పాల్గొన్న భక్తులు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కడలూర్ జిల్లా చిదంబరం నటరాజస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న తిల్లై గోవిందరాజస్వామి ఆలయం 108 దివ్య దేశాల్లో ఒకటి. ఈ క్షేత్రంలో కొన్ని నెలలుగా పునరుద్ధరణ పనులు జరిగాయి. పనులు పూర్తవడంతో 30ఏళ్ల తర్వాత సోమవారం మహా కుంభాభిషేకం నిర్వహించారు. వేడుకలో జిల్లా ఎస్పీ జయకుమార్, చిదంబరం ఎమ్మెల్యే కేఏ పాండియన్, దేవాదాయశాఖ కమిషనర్ జ్యోతి, పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసన్, పలువురు ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిదంబరం పట్టణంలోని అనేక ప్రాంతాల్లో దాతలు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

* **అరక్కోణం:** రాణిపేట జిల్లా కలవై సమీపంలోని మేల్‌నెల్వీ గ్రామంలో ఉన్న శ్రీ ఇల్లంది అమ్మన్ ఆలయ మహా కుంభాభిషేకం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పవిత్ర జలాలున్న కలశాలను ఊరేగింపుగా తీసుకొచ్చి గోపుర కలశాలపై అభిషేకించారు. అలాగే పరివార దేవతామూర్తులైన వినాయకుడు, బాలమురుగర్, అభిరామి, శ్రీవైష్ణవి, మాదేశ్వరి, చాముండేశ్వరి, దుర్గాదేవి విగ్రహాలను అభిషేకించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వేడుకను తిలకించారు.

నాగపట్నంలోని తమిళనాడు డాక్టర్ జె.జయలలిత మత్స్య విశ్వవిద్యాలయంలో సోమవారం 10వ స్నాతకోత్సవం జరిగింది. గవర్నర్ ఆర్ఎన్ రవి పాల్గొని విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేశారు. - ఆర్కేనగర్, న్యూస్‌టుడే

నటుడు కృష్ణ మళ్లీ పత్రాలు దాఖలు చేయాలి: ఈడీ

ప్యారిస్, న్యూస్‌టుడే: మత్తుపదార్థాల కేసులో అరెస్టయిన నటుడు కృష్ణ సమర్పించిన పత్రాలు స్పష్టంగా లేవని మళ్లీ దాఖలు చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టర్(ఈడీ) అధికారులు అడిగినట్లు సమాచారం వెలువడింది. మత్తుపదార్థాల కేసుతో సంబంధం ఉన్న వ్యక్తులు హవాలా మార్గంలో వాటిని కొనుగోలు చేశారన్న అనుమానంతో ఈడీ అధికారులు కృష్ణ వద్ద గతనెల 29న దర్యాప్తు చేశారు. సుమారు 10 గంటల పాటు అధికారులు ప్రశ్నించారు. ఇదివరకే స్వాధీనం చేసుకున్న పత్రాలు, దర్యాప్తు సమయంలో అతను సమర్పించినవి స్పష్టంగా లేకపోవడంతో మళ్లీ ఇవ్వాలని అడిగినట్లు తెలిసింది. శ్రీకాంత్ నేరుగా హాజరు కాకపోవడంతో ఆయనకు మళ్లీ సమన్లు పంపనున్నట్లు సమాచారం.

ప్రధాన రహదారులకు మరమ్మతులు.. కొత్త రోడ్ల నిర్మాణానికి కసరత్తు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై నగరంలోని కొన్ని కీలక రహదారులు అధ్వాన్నంగా మారాయి. దీంతో రాష్ట్ర హైవేస్ విభాగం ప్రధాన రహదారులకు మరమ్మతులు చేపట్టేందుకు సిద్ధమైంది. ఇటీవల ఓ ఆంగ్ల పత్రికలో వచ్చిన వార్తపై ఆ విభాగం స్పందించింది. అన్నాసాలై (మౌంట్ రోడ్డు), పూనమల్లి హైరోడ్డు, వేళచ్చేరి - తాంబరం హైవే, పాడిలోని చెన్నై-తిరువళ్లూరు హైరోడ్డు, గ్రాండ్ సదరన్ ట్రంక్ రోడ్డు(జీఎస్టీ రోడ్డు) వంటి ప్రధాన మార్గాలను లక్ష్యంగా ఎంచుకుంది. అయ్యప్పన్‌తాంగల్‌లో కొత్త రోడ్డు కూడా వేసింది. ఎగ్మూరు, పూనమల్లి హైరోడ్డులోని అమింజికరై, ఆర్కాట్ రోడ్డులోని వలసరవాక్కం, అన్నాసాలైలోని తేనాంపేట ప్రాంతాల్లో ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను కొంతమేర బాగుచేసింది. గతంలో తాత్కాలికంగా మరమ్మతులు జరిపిన వేళచ్చేరి - తాంబరం రహదారిలో పునరుద్ధరణ పనులు జరిగాయి. ఆదివారం నాటికి మొదటి దశ మరమ్మతు పనులు పూర్తవుతాయని అధికారులు పేర్కొన్నారు. సోమవారం ప్రారంభం కానున్న పనుల్లో మేడవాక్కం, మాంబాక్కం, సెంబాక్కం, కుండ్రత్తూరు లాంటి చోట్ల అంతర్గత రోడ్లపై దృష్టి సారించనున్నారు. పూనమల్లిలోని మౌంట్ - మేడవాక్కం రోడ్డు, చెన్నై-బెంగళూరు బైపాస్‌లో మరమ్మతులు చేయడానికి అధికారులు నిధులు కూడా కేటాయించారు. ఈ పనులకు రెండు వారాల్లో టెండర్లు ఖరారు కానున్నాయి. ఈ క్రమంలో చెన్నై మహానగర కార్పొరేషన్ తమ నిర్మాణ పనుల వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో మరమ్మతులు చేయడానికి సీఎంఆర్ఎల్‌తో చర్చలు జరుపుతోంది.

EENADU Classifieds JOBS
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యూయర్స్. ఏజ్: 22-35. ఫ్రెషర్స్ కూడా కావలెను. ✆ 6281037879.

అన్నాడీఎంకే నుంచి బయటకెళ్లిపోతున్నారు

మాట్లాడుతున్న మంత్రి కేఎన్ నెహ్రూ

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: డీఎంకేలో ఉన్నవారిని భాజపా టార్గెట్ చేసిందని, అందుకు మొదట బలైంది తానేనని పురపాలకశాఖమంత్రి కేఎన్ నెహ్రూ తెలిపారు. తిరువారూర్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ... టర్ల జాబితా సరి చేస్తే సగం గెలిచినట్లేనని చెప్పారు. డీఎంకే కూటమి నుంచి చాలామంది బయటకెళ్లిపోతారని ఈపీఎస్ అన్నారని, ఇప్పుడు అన్నాడీఎంకే నుంచే వెళ్లిపోతున్నారని చెప్పారు. ఆ కూటమిలోని శశికళ, టీటీవీ, సెంగోట్టయన్, ఓపీఎస్ పలు జట్లు విడిపోయారన్నారు. డీఎంకే కూటమిలో అందరూ ఐక్యంగా ఉన్నామన్నారు. స్టాలిన్‌ను రెండోసారి ముఖ్యమంత్రిని చేసి పాలనలోకి రావడమే లక్ష్యమన్నారు.

భవిష్యత్తులో భాజపా తప్పక విజయం సాధిస్తుంది

సైదాపేట, న్యూస్‌టుడే: భవిష్యత్తులో తమిళనాడులో భాజపా విజయావకాశాలు ప్రకాశవంతంగా ఉంటాయని ఆ పార్టీ నిర్వాహకురాలు విజయధరణి తెలిపారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రస్తుతం తిరోగమనంలో ఉందన్నారు. అదే సమయంలో తమిళనాడులో భాజపా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ప్రస్తుతం కాంగ్రెస్‌కు తప్పనిసరిగా కూటమి అవసరమని తెలిపారు. తమకు కూడా కూటమి అవసరమే అయినా భవిష్యత్తులో తమిళనాడులో భాజపా విజయం సాధించే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. తనకు ఎప్పుడు ఏ బాధ్యతలు ఇవ్వాలో అధిష్ఠానానికి తెలుసని తెలిపారు.

ఏకాంబరనాథర్ ఆలయంలో బంధకాలు నాటే కార్యక్రమం

కాంచీపురం: కాంచీపురంలోని ప్రసిద్ధ ఎళవార్‌కుళలి సమేత ఏకాంబరనాథర్ ఆలయంలో రూ.28 కోట్ల వ్యయంతో పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. పనులు తుది దశకు చేరుకోవడంతో డిసెంబరు 8వ తేదీ 17ఏళ్ల తరువాత మహా కుంభాభిషేకాన్ని నిర్వహిస్తామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు కొన్ని రోజుల క్రితం ప్రకటించారు. అందుకు తగ్గట్లు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా కుంభాభిషేకానికి సంబంధించి బంధకాలు నాటే కార్యక్రమాన్ని సోమవారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ శివాచార్యులు ప్రధాన గోపురం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి బంధకాలు నాటారు. వేడుకలో ఆలయ ఈవో ముత్తులక్ష్మి, ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.


చెన్నై రాజాజీ సాలైలోని రిజిస్ట్రేషన్లశాఖ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 25మంది జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి పత్రాలు, మరికొందరికి కారుణ్య నియామకపత్రాలను శాఖ మంత్రి పి.మూర్తి అందజేశారు. - వేళచ్చేరి, న్యూస్‌టుడే

(c) eenadu

రోజా మల్లి కనకాంబరం ఫస్ట్‌లుక్ విడుదల


టీజర్‌లోని ఓ దృశ్యం

చెన్నై, న్యూస్‌టుడే: దర్శకుడు జగన్ యథార్థ ఘటన ఆధారంగా రూపొందించి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'రోజా మల్లి కనకాంబరం'. చిత్రంలో బిగ్‌బాస్ ఫేమ్ విజయ్ వర్మ, సంగీత కల్యాణ్, పిచ్చై కారన్ మూర్తి, దియ, రంజిత్ వేలాయుధం, వెట్రివేల్ రాజా, దిండుగల్ అలెక్స్, ఉరియడి శంకర్ తదితరులు ఇతర ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. ఎం.ఎస్.భాస్కర్ ఓ కీలకపాత్రలో నటిస్తున్నారు. చిత్రీకరణ పనులు తిరుచెందూర్, తూత్తుకుడి, మణపాడు, కులశేఖరపట్టిణం తదితర ప్రాంతాల్లో చేపట్టారు. తుది షెడ్యూల్ చిత్రీకరణను చెన్నైలో ఈ నెల పూర్తిచేసేలా ప్రణాళిక రూపొందించారు. ఈ నేపథ్యంలో చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టరును దర్శకుడు విఘ్నేశ్ శివన్ సోమవారం సాయంత్రం విడుదల చేశారు.

సినిమా ఓ వేడుకగా ఉండాలి

రియో రాజ్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రియో రాజ్

ప్యారిస్, న్యూస్‌టుడే: సినిమా అనేది ఓ వేడుకగా ఉండాలని, అభిమానం శృతి మించకూడదని నటుడు రియో రాజ్ పేర్కొన్నారు. రియో రాజ్ నటించిన 'ఆన్ పావం పొల్లాదదు' సినిమా విడుదలై థియేటర్లలో ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో తూత్తుకుడి జిల్లా కోవిల్పట్టిలోని థియేటర్‌లో సినిమా చూడటానికి వచ్చిన అభిమానులతో సోమవారం చిత్రబృందం ముచ్చటించింది. అనంతరం రియో రాజ్ విలేకరులతో మాట్లాడుతూ... హౌస్‌ఫుల్‌తో సినిమా ప్రదర్శితం కావడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి మంచి కథలతో తదుపరి సినిమాల్లో నటిస్తానని చెప్పారు. ప్రజల అభిరుచులు మారుతున్నాయని, అందుకు తగ్గట్లుగా తామూ మారుతున్నామని తెలిపారు. ఇటీవల నటుడు అజిత్‌కుమార్.. అభిమానులు వేడుక పేరుతో థియేటర్లలో వస్తువులు ధ్వంసం చేయడం గురించి స్పందించారు. సినిమా అనేది ఓ వేడుకగా ఉండాలని, వేడుక కాస్త అదుపుతప్పినా అది అల్లకల్లోలంగా మారుతుందన్నారు. థియేటర్‌లో అందరూ కలిసి సంతోషంగా చూసి వెళ్తే మిగతా అభిమానులు కూడా వస్తారని తెలిపారు. సినిమాను వేడుకగా జరుపుకోవాలని అజిత్ కుమార్ తెలిపారని, అదే తామూ పాటిస్తున్నామని పేర్కొన్నారు.

ఆటోగ్రాఫ్ 14న రీరిలీజ్

చిత్రంలోని ఓ సన్నివేశ దృశ్యం

చెన్నై: దర్శకుడు చేరన్ నిర్మించి దర్శకత్వం వహించి కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఆటోగ్రాఫ్'. స్నేహ, గోపిక, మల్లిక, కనిక, ఇళవరసు తదితరులు ముఖ్యపాత్రల్లో నటించి 2004లో విడుదలైన ఈ చిత్రం సూపర్ హిట్టయ్యింది. మూడు కేటగిరీలలో జాతీయ అవార్డులు సైతం పొందింది. ప్రస్తుతం నాటి హిట్ చిత్రాల రీరిలీజ్ హవా నడుస్తున్న నేపథ్యంలో 21ఏళ్ల తర్వాత 'ఆటోగ్రాఫ్'ను డిజిటల్ రూపంలో రీరిలీజ్ చేయనున్నారు. చిత్రాన్ని ఈ నెల 14న రీరిలీజ్ చేయనున్నట్లు దర్శకుడు చేరన్ ప్రకటించారు.

రెట్టకన్ బ్రిడ్జి మరమ్మతుకు చర్యలు



అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా అరక్కోణం పట్టణంలోని పళణిపేట వద్ద బ్రిటిష్ కాలంలో రెండు ద్వారాలు(రెట్టకన్)తో వంతెన నిర్మించారు. దీనిపైన రైల్వే లైన్ ఉంది. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో విడుదలయ్యే మురుగునీరు వంతెన కింద ద్వారాల గుండా ప్రవహించి చెరువులో కలుస్తుంది. ఈ క్రమంలో పళణిపేట నుంచి సువాల్‌పేట వెళ్లడానికి ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో రెట్టకన్ బ్రిడ్జి కింద నుంచే వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. పట్టణ జనాభా పెరగడంతో వంతెన కింద మురుగునీటి పారుదల పెరిగింది. ఇటీవల కురిసిన వర్షాలకు బ్రిడ్జి కింద నాలుగు అడుగుల మేర నీరు చేరడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. దీంతో బ్రిడ్జిని పునరుద్ధరించాలని స్థానికులు ఆందోళనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఈనెల 2 నుంచి 11వ తేదీ వరకు బ్రిడ్జికి మరమ్మతులు చేపడతామని రైల్వే అధికారులు ప్రకటించారు. కావున ఆ రోజుల్లో వంతెన మూసేస్తున్నట్లు తెలిపారు.

రూటు మార్చిన మాదకద్రవ్యాల స్మగ్లింగ్ ముఠా

కనిపెట్టలేక తలలు పట్టుకుంటున్న కస్టమ్స్ అధికారులు

టీనగర్, న్యూస్‌టుడే: విదేశాల నుంచి చెన్నైకి గంజాయి రవాణా వెనుక ఉన్న అంతర్జాతీయ ముఠాలను గుర్తించడంలో చెన్నై కస్టమ్స్ అధికారులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే సమయంలో స్మగ్లింగ్ పెరగడానికి అధికారుల వైఫల్యమే కారణమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం ద్వారా గంజాయి, మాదకద్రవ్యాల రవాణా ఇటీవల గణనీయంగా పెరిగింది. కస్టమ్స్ అధికారులు స్మగ్లర్లను పట్టుకుని, సరకును స్వాధీనం చేసుకుంటున్నా ఈ దందా వెనుక ఉన్న అసలు సూత్రధారులను మాత్రం గుర్తించలేకపోతున్నారు.

సరికొత్త వ్యూహాలు

స్మగ్లర్లు పర్యాటక వీసాలపై విదేశాలకు వెళ్లి, తిరిగి వచ్చేటప్పుడు కొత్త వ్యూహాలతో గంజాయిని తీసుకువస్తున్నారు. గత ఆగస్టు చివరి వారం నుంచి ఇప్పటివరకు చెన్నై విమానాశ్రయంలో రూ.48 కోట్ల విలువైన అత్యున్నత రకం గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో 11 మంది స్మగ్లర్లను అరెస్టు చేశారు. సాధారణంగా అరెస్టు చేసిన నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి జైలుకు పంపుతారు. ఈ దందా వెనుక ఉన్న కీలక వ్యక్తులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలి. కానీ, చెన్నై కస్టమ్స్ అధికారులు ఈ విషయంలో సరైన ప్రయత్నాలు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే, రాబోయే రోజుల్లో తమిళనాడులో గంజాయి వాడకం మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

శ్రీలంక మీదుగా..

కొందరు కస్టమ్స్ అధికారులు ఈ విషయమై స్పందిస్తూ.. మాదకద్రవ్యాల స్మగ్లర్లకు బంగారం తరలింపుతో పోలిస్తే నాలుగు నుంచి ఐదు రెట్లు అధికంగా కమీషన్ లభిస్తోందని తెలిపారు. అందుకే వారు కొత్త వ్యూహాలను రూపొందిస్తున్నారన్నారు. గతంలో థాయ్‌లాండ్ వంటి నిర్దిష్ట దేశాల నుంచి వచ్చే విమానాలలో ఎక్కువగా గంజాయి పట్టుబడేదని, ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా అధికారులు వాటిని గుర్తించేవారని పేర్కొన్నారు. ప్రస్తుతం స్మగ్లర్లు కొత్త విధానాలను ఎంచుకుంటున్నారని తెలిపారు. ఇదివరకు థాయ్‌లాండ్ నుంచి నేరుగా చెన్నై వచ్చే విమానాలలో రవాణా జరుగుతుండగా ప్రస్తుతం వారు థాయ్‌లాండ్ నుంచి శ్రీలంకకు వెళ్లి, శ్రీలంక మీదుగా చెన్నైకి వస్తున్న విమానాలలో మాదకద్రవ్యాలను తీసుకువస్తున్నట్లు అధికారులు వివరించారు. స్మగ్లర్లను పట్టుకున్నప్పటికీ వారి వెనుక ఉన్న అంతర్జాతీయ నెట్‌వర్క్ వివరాలను కనుగొనడం పెద్ద సవాలుగా మారిందని వెల్లడిస్తున్నారు.

కొత్తగా 54 విద్యుత్ సబ్ స్టేషన్లు

❖ త్వరలో రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణం
❖ రూ.850 కోట్లు మంజూరు చేసిన 'ఆర్‌ఈసీ'

- న్యూస్‌టుడే, వడపళని

రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 54 విద్యుత్తు సబ్ స్టేషన్ల నిర్మాణానికి తమిళనాడు పవర్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (టాన్‌ట్రాన్స్‌కో)కు 'రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్(ఆర్‌ఈసీ)' రూ.850 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి ఆర్‌ఈసీతో ఇటీవల ఒప్పందాలు కూడా జరిగాయని టాన్‌ట్రాన్స్‌కో అధికారి ఒకరన్నారు. త్వరలోనే నిధులు అందనున్నాయని చెప్పారు. చెన్నై సహా రాష్ట్ర వ్యాప్తంగా 110 కేవీ సామర్థ్యంతో కూడిన 54 కొత్త సబ్ స్టేషన్లు రానున్నాయని, ఏటేటా విద్యుత్తు అవసరాలు ఆరు శాతం వరకు పెరుగుతున్నాయని, 2030 నాటికి విద్యుత్తు డిమాండు 27,541 మెగావాట్లు దాటే అవకాశాలున్నాయని తెలిపారు. పెరుగుతున్న డిమాండును తట్టుకునేందుకు మౌలిక సదుపాయాల కల్పన చాలా అవసరమని పేర్కొన్నారు. నిధులు చేతికందగానే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

వడ్డీ రేట్లను తగ్గిస్తే మేలు

9.25శాతం వడ్డీతో చెల్లించే విధంగా రుణం మంజూరైందని, రానున్న అయిదు నుంచి ఏడేళ్లలోపు విద్యుదుత్పత్తి, పంపిణీ, నిల్వ తదితరాలకు విద్యుత్తు రంగానికి పెట్టుబడులు రూ.రెండు లక్షల కోట్లకు పైగా అవసరముంటుందని సీనియర్ అధికారి పేర్కొన్నారు. టాన్‌ట్రాన్స్‌కో, పంపిణీ సంస్థలు రూ.1.7 లక్షల కోట్ల రుణ భారంతో ఉన్నాయని, ఇది కూడా ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర విద్యుత్తు సంస్థల మూలధన వ్యయంలో దాదాపు 80శాతం వరకు ఆర్‌ఈసీ, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ల నుంచి నిధులు అందుతున్నాయని, ఈ సంస్థలు 9.25 నుంచి 12.65 శాతం వరకు వడ్డీ వసూలు చేస్తున్నాయని, ఈ క్రమంలో వడ్డీ రేటు శాతం కూడా ఎక్కువగా ఉందని తెలిపారు. ఈ రెండు సంస్థలకు ఏడాదిలో దాదాపు రూ.7 వేల కోట్ల వరకు వడ్డీ కింద చెల్లిస్తున్నారని, బ్యాంకులతో సమానంగా వడ్డీ రేటును 8.5 శాతానికి తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరిందని వివరించారు.

సంస్థల బలోపేతానికి కృషి

ఆర్‌ఈసీ డైరెక్టర్ నారాయణన్ తిరుపతి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని విద్యుత్తు సంస్థలకు, విద్యుత్తు పంపిణీ, ట్రాన్స్‌మిషన్ తదితర మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి ఆర్‌ఈసీ ఇప్పటివరకు దాదాపు రూ.80వేల కోట్లు అందించిందని చెప్పారు. కాగా కొన్ని ప్రాజెక్టులలో ఇప్పటికే ఉన్న రుణాలకు వడ్డీ రేటును ఒక శాతానికి తగ్గించామని, ఇంకా తగ్గించే విషయంలో తమకు అందుతున్న అభ్యర్థనలపై ఆర్‌ఈసీ బోర్డు నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు.

అన్నాడీఎంకే బూత్ కమిటీ సమావేశం

ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే బలరామన్

ఊత్తుకోట, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే తిరువళ్లూరు ఉత్తర జిల్లా బూత్ కమిటీ సమావేశం ఊత్తుకోట సమీపం పోందవాక్కంలో సోమవారం నిర్వహించారు. పూండి యూనియన్ కార్యదర్శి ప్రతాప్ అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్యే బలరామన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ. . వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఎన్నికల పనులను ఇప్పటినుంచే ప్రారంభించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఇంటింటి ప్రచారం చేయాలని సూచించారు. పూండి యూనియన్ మాజీ ఛైర్మన్ వెంకటరమణ, ఊత్తుకోట పట్టణ కార్యదర్శి షేక్‌దావూద్, యువజన విభాగానికి చెందిన సిద్ధిక్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నముద్ద రాయి.. ఏనుగులు నెట్టినా కదల్లేదోయి!

మహాబలిపురంలో ఆకట్టుకుంటున్న అద్భుత శిల

కృష్ణుడి వెన్నముద్ద రాయి

మహాబలిపురం, న్యూస్‌టుడే: శిల్ప కళా సౌందర్యానికి చిహ్నంగా ఉన్న తమిళనాడులోని మహాబలిపురంలో నేటికీ ఇంచు కూడా కదలకుండా కృష్ణుడి వెన్నముద్ద రాయి ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. క్రీ.శ 7, 8 శతాబ్దాల్లో పల్లవ రాజుల కాలంలో మహాబలిపురం గొప్ప శిల్పాకళా సౌందర్యంతో వెలుగొందింది. ప్రస్తుతం ఈ ప్రాంతం పురావస్తుశాఖ పరిరక్షణలో ఉంది. ఇక్కడి కృష్ణుడి వెన్నముద్ద రాయి (కృష్ణాస్ బటర్ బాల్) పర్యాటకులను ఆకట్టుకుంటోంది. దేవుడే అక్కడ పెట్టినట్లు గుండ్రని ఆకారంలో ఓ పీఠానికి అంటిపెట్టుకుని ఉంటుంది. ఈ రాయి సుమారు 20 అడుగుల ఎత్తు, 5 మీటర్ల వెడల్పుతో సుమారు 250 టన్నుల బరువు ఉంటుందని అంచనా. 45 డిగ్రీల ఏటవాలుగా కనిపిస్తుంది. సుమారు 1200 ఏళ్ల దాటినా ఏనుగులు సైతం కదిలించలేని విధంగా రాయి నిలబడి ఉంది. పల్లవ రాజైన నరసింహ వర్మన్ ఈ రాయిని కదిలించడానికి చేసిన ప్రయత్నించారని, 1908లో అప్పటి బ్రిటిష్ గవర్నర్ ఆర్థర్ హేవ్లాక్ 7 ఏనుగులతో కదిలించడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని చరిత్రకారులు చెబుతున్నారు. 2019లో మహాబలిపురాన్ని సందర్శించిన చైనా అధ్యక్షుడు జిన్ పింగ్, భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ రాయి వద్ద నిలబడి ఫొటోలు తీసుకోవడం గమనార్హం.

టాస్మాక్ దుకాణ కార్మికుడి దారుణహత్య

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దిండుక్కల్ జిల్లా తామరైపాడికి చెందిన మురుగన్ (45) కూలీ. ఆయనకు భార్య వెన్నిల, ఇద్దరు పిల్లలున్నారు. భార్యాపిల్లలు దర్గి ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. మురుగన్ తల్లి ఇంట్లో ఉంటూ టాస్మాక్ దుకాణంలో పనికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మద్యం తాగడానికి టాస్మాక్ దుకాణానికి వెళ్లగా అక్కడ మద్యం తాగుతున్న వ్యక్తులతో గొడవ జరిగింది. అవతలి వ్యక్తులు రాయితో మురుగన్ తలపై బలంగా కొట్టి పారిపోయారు. తీవ్రంగా గాయపడిన మురుగన్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐఐటీఎంలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ప్యారిస్, న్యూస్‌టుడే: ఐఐటీఎంలో చదువుతున్న ఓ విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించిన ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల వివరాల మేరకు... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కర్నూలు జిల్లా కర్నూలు పట్టణానికి చెందిన భాస్కర్ రెడ్డి కుమార్తె శివకుమారి(25) చెన్నై కొట్టూర్‌పురంలోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ ఐఐటీఎంలో ఎంటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈమె గత కొన్ని రోజులుగా మానసిక ఒత్తిడిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం హాస్టల్ గదిలోని స్నానాల గదిలో ఉన్న 'డెటాల్' ద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించింది. తర్వాత విషయాన్ని తనతో పాటు గదిలో ఉంటున్న స్నేహితురాలికి చెప్పడంతో ఆమె వెంటనే ఆళ్వార్‌పేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూండి చెరువులో మునిగి ఏసీ మెకానిక్ మృతి

యాసిన్ (పాతచిత్రం)

ఊత్తుకోట: చెన్నై పాతచాకలిపేట డీబీకే వీధికి చెందిన యాసిన్ (22) ఏసీ మెకానిక్. ఈయన తన స్నేహితులు సుభాన్, సమీర్‌తో కలిసి తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట సమీపంలోని పూండి చెరువుకు ఆదివారం సాయంత్రం వెళ్లారు. చెరువులో దిగి స్నానం చేస్తుండగా యాసిన్ లోతులో మునిగిపోయారు. స్నేహితుల సమాచారం మేరకు పెన్నాలూరుపేట పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడటంతో గాలింపు చర్యలు నిలిపేశారు. సోమవారం ఉదయం మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పైనుంచి పడి పెయింటర్...

రెడ్‌హిల్స్: చెన్నై వ్యాసర్‌పాడికి చెందిన పాండ్యన్(50) పెయింటర్. ఈయన తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీపం ఆండార్‌కుప్పానికి చెందిన ఓ వ్యక్తి కొత్తగా నిర్మించిన గృహానికి సోమవారం పెయింట్ వేస్తుండగా ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పొన్నేరి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫైనాన్స్ సంస్థ మేనేజర్...

ట్రిప్లికేన్: అరియలూరు జిల్లా జయంకొండం సమీపం కారైకురిచ్చిలో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందుకుగాను కంకర లోడుతో వచ్చిన టిప్పర్ కుంభకోణం వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న మహేశ్ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక ఉన్న శివ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు శివను జయంకొండం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మహేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేపట్టారు. అతను కారైకురిచ్చిలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నట్లు తెలిసింది. అక్కడకు చేరుకున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు టిప్పర్ డ్రైవర్‌పై దాడి చేసి ఆందోళన చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో ఒకరు...

ఘటనాస్థలి

ప్యారిస్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ఐదుగురు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. తూత్తుకుడి జిల్లా కోవిల్పట్టి వద్ద సాత్తూర్ రోడ్డులోని ఓ ప్రైవేటు పాఠశాల వ్యాను విద్యార్థులను తీసుకెళ్లేందుకు నాలాట్టిన పుత్తూర్‌కి బయలుదేరింది. వాహనాన్ని కరుప్పసామి నడిపాడు. సహాయకురాలు అయ్యమ్మాళ్, ఇద్దరు విద్యార్థులు వ్యానులో ఉన్నారు. వ్యాను మదురై-తిరునెల్వేలి హైవే వద్ద ఉన్న ప్రైవేటు కళాశాల వద్దకు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన జీపు అకస్మాత్తుగా వ్యానుని ఢీకొనింది. ఈ ప్రమాదంలో జీపులో ఉన్న షేక్ అనే వ్యక్తి ఘటనాస్థలిలోనే మృతిచెందాడు. అదేవిధంగా జీపు నడిపిన అగస్టియన్, వ్యానులో ఉన్న వారు అని ఐదుగురు గాయపడ్డారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి బాలుడు...

కిరుణిత్ (పాతచిత్రం)

అరక్కోణం: రాణిపేట జిల్లా అరక్కోణం సమీపం పెరుమాళ్‌రాజపేట పంచాయతీ మంగళాపురం గ్రామానికి చెందిన పునిత కుమారులు జోయ్, కిరుణిత్(3) ఆదివారం సాయంత్రం చేపలు పట్టేందుకు దగ్గరలోని చెరువుకు వెళ్లారు. జోయ్ చేపలు పడుతుండగా కిరుణిత్ కట్టపైన కూర్చొని ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కిరుణిత్ కాలుజారి చెరువులో పడి మునిగిపోయాడు. సమాచారం మేరకు అరక్కోణం తాలూకా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టానికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కలెక్టరేట్‌లో ఆత్మాహుతికి యత్నించిన మహిళ...

ఆర్కేనగర్: తిరుప్పూర్ జిల్లా ఉడుమలైపేట్టైలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ప్రభాకరన్ అనే వ్యక్తి పనిచేస్తున్నారు. ఆయనకు భార్య కౌసల్య(40), ఇద్దరు కుమార్తెలున్నారు. ఆదివారం భర్తతో గొడవపడిన కౌసల్య ఇంటి నుంచి వెళ్లిపోయింది. అనంతరం తిరుప్పూర్ కలెక్టర్ కార్యాలయం ప్రవేశమార్గంలో ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. అక్కడ భద్రతా విధుల్లో ఉన్న పోలీసులు మంటలార్పి ఆమెను తిరుప్పూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి సర్వదర్శనానికి టోకెన్లు లేని భక్తులకు 8 గంటలు, రూ.300 ఎస్‌ఈడీ టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటలు పట్టనుంది. ఆదివారం స్వామివారిని 84,442 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.3.51 కోట్లు హుండీ కానుకలు లభించాయి.

* 18 వేల టోకెన్ల జారీ

సర్వదర్శనానికి సంబంధించి తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు సోమవారం 18 వేల టోకెన్లు జారీ చేశారు. వీరికి మంగళవారం వేకువ జామున మూడు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం జరుగనుంది. అదేవిధంగా శ్రీవారి మెట్టు మార్గం భక్తులకు మరో రెండు వేల టోకెన్లు జారీ చేశారు.

మృత్యుంజయ శివలింగానికి అభిషేకాలు

శివలింగానికి హారతిస్తున్న అర్చకుడు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయంలో కొలువుదీరిన శ్రీమృత్యుంజయ శివలింగానికి విశేష అభిషేకాలు నిర్వహించారు. కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని ఈ విశేష వేడుకలు జరిపారు. గోక్షీరంతో పాటు వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

శ్రీ వానమామలి మఠాధిపతికి తితిదే పెద్దమర్యాద

శ్రీ వానమామలి జీయర్ స్వామీజీకి పవిత్రమాలలను వేస్తున్న శ్రీ పెద్దజీయర్ స్వామి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీ వానమామలి మఠాధిపతి శ్రీ వానమామలి జీయర్ స్వామీజీకి సోమవారం తితిదే పెద్దమర్యాద చేసింది. స్వామీజీ ముందుగా పాత అన్నదాన భవనం వద్ద ఉన్న రావిచెట్టు వద్దకు చేరుకున్నారు. తితిదే అర్చకస్వాములు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఇస్తికఫాల్ స్వాగతం పలికి శ్రీ బేడి ఆంజనేయస్వామివారి దర్శనం చేయించారు. ఈ సందర్భంగా శ్రీ పెద్ద జీయర్ స్వామి పీఠాధిపతికి పవిత్రమాలలను వేశారు. అనంతరం అక్కడ శఠారి సమర్పించి మేళతాళాల మధ్య శ్రీవారి ఆలయంలోకి తీసుకెళ్లి దర్శనం చేయించి, తీర్థప్రసాదాలను అందజేశారు. ముందుగా శ్రీ పెద్దజీయర్ స్వామి మఠంలో స్వామీజీని తితిదే ఈవో కలిసి ఆశీర్వాదం పొందారు.

చెన్నై విమానాశ్రయంలో బంగారం స్వాధీనం

స్వాధీనం చేసుకున్న బంగారం

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై విమానాశ్రయంలో అక్రమంగా విదేశాల నుంచి తీసుకొచ్చిన బంగారాన్ని కస్టమ్స్ విభాగ ఎయిర్ ఇంటెలిజెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారులు సోమవారం పేర్కొన్న మేరకు.. ఈనెల 1వ తేదీ కౌలాలంపూర్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికురాలిపై అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించారు. మరో నలుగురు సాధారణ ప్రయాణికుల వద్ద బంగారాన్ని దాచినట్టు తెలిపింది. వారి నుంచి రూ.2.80 కోట్ల విలువైన 2,460 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు మహిళలు సహా నలుగురిని అరెస్టు చేశారు. అదేవిధంగా గత నెల 31న ఎయిర్ ఏసియా విమానంలో కౌలాలంపూర్ నుంచి వచ్చిన దేశీయ ప్రయాణికుడి వద్ద సోదా చేసి సాక్స్‌లో పేస్టు రూపంలో దాచి తెచ్చిన రూ.87.54 లక్షల విలువైన 768 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకుని ప్రయాణికుడిని అరెస్టు చేశారు. అలాగే గత నెల 31న కౌలాలంపూర్ నుంచి వచ్చిన ఎయిర్ ఏసియా ప్రయాణికుడి నుంచి 61 గ్రాముల రూ.6.95 లక్షల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్టు

పొన్నేరి: తిరువళ్లూరు జిల్లా పొన్నేరి పోలీసులు తాయుమాన్ ప్రాంతంలో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న దేవమానగర్‌కు చెందిన అజిత్, భారతికన్నా, అజయ్, ముత్తుకుమార్ అనే వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించారు. వారి వద్ద సోదా చేసి రూ.లక్ష విలువైన 2 కిలోల గంజాయి, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నలుగురిని అరెస్టు చేశారు.

వడ్డీ వ్యాపారి కిడ్నాప్ కేసులో ముగ్గురు...

ప్యారిస్: చెన్నై నుంగంబాక్కానికి చెందిన సెల్వకణ్ణన్ ఫైనాన్స్ సంస్థ నడుపుతున్నారు. ఈయన వద్ద శరవణన్ అనే వ్యక్తి నాలుగు నెలల క్రితం కారు తాకట్టు పెట్టి రూ.2 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఇదిలా ఉండగా మూడు నెలలుగా వడ్డీ చెల్లించకపోవడంతో సెల్వకణ్ణన్ ఆ కారుని వేరొకరికి విక్రయించాడు. విషయం తెలుసుకున్న శరవణన్.. ట్రిప్లికేన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు అబద్ధం చెప్పి శనివారం మధ్యాహ్నం స్టేషన్‌కి రావాలని సెల్వకణ్ణన్‌తో చెప్పాడు. ఆ తర్వాత మాట్లాడుకుందామని చెప్పి సెల్వకణ్ణన్‌ను బార్‌కి రప్పించాడు. అక్కడ శరవణన్, మరికొందరు కలిసి ఆయన్ను కిడ్నాప్ చేసి, రూ.5 లక్షలు ఇవ్వాలని బెదిరించి దాడిచేశారు. సెల్వకణ్ణన్ కేకలు విన్న స్థానికులు అక్కడకు రావడంతో కిడ్నాపర్లు అక్కడి నుంచి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ట్రిప్లికేన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి శరవణన్, శివానందం, మురళి అనే వ్యక్తులను అరెస్టు చేశారు. ఆదివారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కి తరలించారు.

నగదు మోసానికి పాల్పడిన ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకుడు...

క్రైం కార్నర్

రెడ్‌హిల్స్: తిరువళ్లూరు జిల్లా ఆవడి సమీపం పట్టాభిరామ్‌కు చెందిన సేరలాథన్ సేక్కాడులో ట్రావెల్ ఏజెన్సీ నడుపుతున్నాడు. ఈయనకు పుదుకోట్టై జిల్లా కరంపంగాడుకు చెందిన ఆకాష్ అనే వ్యక్తి దుబాయ్ వెళ్లేందుకు వీసా కోసం కొన్ని నెలల క్రితం రూ.1.30 లక్షలు ఇచ్చాడు. అయితే సేరలాథన్ వీసా అందజేయలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆవడి పోలీసులు నిందితుడిని సోమవారం అరెస్టు చేశారు.

ఆలయానికి దానం చేసిన పశువును చోరీ చేసి వధ

మాంసం అమ్మిన ముగ్గురి అరెస్ట్

టీనగర్, న్యూస్‌టుడే: సేలం నగరంలోని పాత బస్టాండు సమీపంలో ఉన్న కోట్టయ్ మారియమ్మన్ ఆలయానికి భక్తులు బంగారం, వెండి, నగదుతో పాటు పశువులను కూడా మొక్కుగా సమర్పించడం ఆనవాయితీ. ఈ క్రమంలో సేలం అస్తంబట్టి జాన్సన్ నగర్‌కు చెందిన సుమన్(45) 2024 ఆగస్టులో రూ.1.20 లక్షల విలువైన కోడె దూడను ఆలయానికి దానంగా ఇచ్చారు. ఈ క్రమంలో కోడెదూడ వద్దకు ఓ వ్యక్తి ప్రతిరోజూ భక్తుడి వేషంలో వచ్చి అగత్తికీర అనే ఆకులను ఆహారంగా పెట్టేవాడు. దీంతో ఆ పశువు అతడితో చాలా సన్నిహితంగా మెలిగేది. అక్టోబరు 4వ తేదీ కోడెదూడను ఆలయ ప్రాంగణం నుంచి తీసుకెళ్లాడు. తర్వాత దానిని మహమ్మద్‌పురాలోని కబేళాకు తీసుకెళ్లి వధించి మాంసాన్ని విక్రయించాడు. పశువును దానం చేసిన సుమన్ అక్టోబరు 30న ఆలయానికి వచ్చినప్పుడు పశువు కనిపించలేదు. ఆలయ పరిసరాల్లో వెతికి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి కిచ్చిపాళయానికి చెందిన దర్వేష్ మైదీన్ (27)ను అరెస్టు చేశారు. అతనికి సహకరించిన మాంసం దుకాణం యజమాని సలీం, అతని స్నేహితుడు అలావుద్దీన్‌లను కూడా అరెస్టు చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయానికి దానం చేసిన పశువుల సంరక్షణకు గోశాల ఏర్పాటు చేయాలని ఆలయ నిర్వహణ కమిటీకి విజ్ఞప్తి చేశారు.

బ్యాంకు మోసం కేసులో పరారీ నిందితురాలి కోసం గాలింపు

గ్రేస్ రూక్లిన్

ప్యారిస్, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌కి చెందిన గ్రేస్ రూక్లిన్(60), చెన్నైకి చెందిన జోషువా (48) కలిసి 2010లో చెన్నై నార్త్ బీచ్ ప్రాంతంలో ఉన్న సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ కార్యాలయానికి వెళ్లారు. వారు ముంబయిలో ఉన్న బ్యాంకు ప్రధాన కార్యాలయం నుంచి వచ్చామని తెలిపి నకిలీ లేఖ, పత్రాలతో రూ.500 కోట్లు తీసుకోవడానికి యత్నించినట్లు అప్పటి బ్రాంచ్ చీఫ్ మేనేజరు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు వారిద్దరిని అరెస్టు చేశారు. ఈ కేసుని సెంట్రల్ క్రైం బ్రాంచ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్న నేపథ్యంలో వారిద్దరు బెయిల్‌పై బయటకు వచ్చారు. ఈ నేపథ్యంలో 2013 నుంచి గ్రేస్ రూక్లిన్ కోర్టు విచారణకు హాజరుకాకుండా పరారీలో ఉండటంతో పోలీసులు ఆమె ఫొటో విడుదల చేసి, ఆమె కోసం గాలిస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu

జంబుకేశ్వరా.. నమోస్తుతే!

కార్తిక సోమవారం సందర్భంగా నాయుడుపేట మండలంలోని తిమ్మాజీకండ్రిగ సమీపంలో స్వర్ణముఖి తీరంలో వెలసిన మల్లేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని జంబుకేశ్వరునిగా అలంకరించారు. భక్తులు నదిలో స్నానాలు ఆచరించి పూజలు చేసి దీపాలు వెలిగించారు. - న్యూస్‌టుడే, నాయుడుపేట

సత్వర పరిష్కారమే లక్ష్యంగా నోడల్ అధికారులు

డయల్ యువర్ సీఎండీ కార్యక్రమంలో శివశంకర్ లోతేటి

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ లోతేటి అన్నారు. సోమవారం తిరుపతిలోని కార్యాలయంలో తొలిసారిగా నిర్వహించిన డయల్ యువర్ సీఎండీ కార్యక్రమానికి వినియోగదారుల నుంచి మంచి స్పందన లభించింది. డిస్కం పరిధిలోని జిల్లాల నుంచి 87 మంది వినియోగదారులు ఫోన్‌చేసి తమ సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని సత్వరమే పరిష్కరించడమే లక్ష్యంగా తొమ్మిది జిల్లాల పరిధిలో ప్రతి జిల్లాకు సీజీఎం/జీఎం స్థాయివారిని నోడల్ అధికారులుగా నియమించినట్లు సీఎండీ తెలిపారు. వారు జూనియర్ లైన్‌మెన్ల నుంచి ఎస్‌ఈ అధికారుల వరకు పనితీరును పర్యవేక్షిస్తారని వెల్లడించారు. డైరెక్టర్లు అయూబ్‌ఖాన్, గురవయ్య, రామ్మోహన్, సీజీఎంలు జానకీరామ్, రమణాదేవి, ఆదిశేషయ్య, ఉమాపతి, మురళీకుమార్, జీఎంలు రామచంద్రరావు, చక్రపాణి, సురేంద్రరావు, భాస్కర్‌రెడ్డి, జగదీష్, ఎస్‌ఈ చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

వేటు పడుతున్నా.. కాసుల వేట

నిఘా

- దోపిడీకి 'ఎర్త్' పెట్టిన పూర్వ సీఎండీ సంతోషరావు
- రూ.2.50 కోట్ల మాయాజాలం తాజాగా వెలుగులోకి

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: వైకాపా హయాంలో నాటి పెద్ద మంత్రి అండదండలతో ఎస్పీడీసీఎల్‌లో కొందరు ఉన్నతాధికారులు అడ్డగోలుగా వ్యవహరించారు.. వారిలో కీలకమైన ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావును కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు గత నెల 10న తప్పించింది. పదవీ కాలం ఈ ఏడాది ఏప్రిల్ 20తో ముగిసినా పలు కారణాలతో అదే హోదాలో మరో ఆరు నెలలు కొనసాగిన ఆయన తీరు మాత్రం మారలేదు.. ఎస్పీడీసీఎల్‌లో పర్చేజింగ్ సహా అన్ని విభాగాలను తన గుప్పిట్లో ఉంచుకుని అవసరం లేకున్నా ఎర్త్‌వైర్ పైపుల కొనుగోలు ముసుగులో అవినీతికి పాల్పడినట్లు తాజాగా వెల్లడైంది.

అవసరం లేకపోయినా..

కూటమి ప్రభుత్వం తనను తప్పిస్తుందని తెలిసినప్పటికీ సంతోషరావు అడ్డగోలు నిర్ణయాలకు ఏ మాత్రం వెరవలేదు. పదవి నుంచి తప్పించడానికి 10-15 రోజులకు ముందు అడ్డగోలు నిర్ణయాలు తీసుకుని తన అక్రమాలను దర్జాగా కొనసాగించారు. అవసరం లేకపోయినప్పటికీ రూ.కోట్లు దోచుకోవడానికి 25 వేల ఎర్త్ పైపులు కొనుగోలుకు ఆమోదం తెలిపారు. దీంతో ఎస్పీడీసీఎల్‌కు పెద్దఎత్తున నష్టం మిగిల్చారు. ఎర్త్ పైపుల కొనుగోలులో పేరుకే టెండర్లు.. ఆపై అంతా మాయ చేసేశారు. పైపునకు రూ.వెయ్యి చొప్పున రూ.2.50 కోట్లు దోపిడీ చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆరా తీయని పర్చేజింగ్ విభాగం

ఎస్పీడీసీఎల్‌లో పర్చేజింగ్ హెచ్‌వోడీ అనుమతితోనే కొనుగోళ్లు జరగాలి. సీఎండీ తనకు అనుకూలమైన కంపెనీలకు ఈ ఎర్త్‌వైర్ పైపుల సరఫరా కట్టబెట్టాలని హుకుం జారీ చేయడంతో పర్చేజింగ్ విభాగం తలదించేసింది. మూడు కంపెనీలు రూ.3,300 కోట్ చేయగా మిగిలినవి రూ.3,100కే తమ బిడ్ ఈపీసీలో దాఖలు చేశాయి. అయితే సదరు మూడు కంపెనీలు సీఎండీ చెప్పినవి కావడం, అదే రూ.3,100కు తామూ సరఫరా చేస్తామని రాసివ్వడంతో పర్చేజింగ్ విభాగానికి ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. బహిరంగ మార్కెట్‌లో ధర ఎంతనే విషయమై సదరు విభాగం ఆరా తీయకుండా అధిక ధర కోట్ చేసిన, సీఎండీకి అనుకూలమైన కంపెనీలకు కట్టబెట్టడం గమనార్హం.

వీడని వైకాపా వాసనలు

కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టి 17 నెలలు గడిచినా నేటికీ ఎస్పీడీసీఎల్‌లో కొన్ని కీలక స్థానాల్లో వైకాపా హవానే కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం అన్ని శాఖల్లో ప్రక్షాళన దిశగా సాగుతుండగా ఇక్కడ మాత్రం కీలక స్థానాల్లో వైకాపా పాలనలో నాటి మంత్రితో అంటకాగిన అధికారులే కొనసాగుతుండటం గమనార్హం.

ధర, దోపిడీ ఇలా..

- బహిరంగ మార్కెట్‌లో ఎర్త్ పైపు ధర: రూ. 2,000-2,100
- కొనుగోలు ధర: రూ. 3,100
- టెండర్లలో పాల్గొన్న కంపెనీలు: ఏడు
- పని దక్కించుకున్నవి: సెల్‌వెల్, ఎస్ఎస్ ఇన్‌ఫాటెక్, కల్యాణ గారు ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్

త్వరలో ఏడువేల మందికి ఉద్యోగోన్నతి

మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

చిత్తూరు(కొంగారెడ్డిపల్లి) : ఆర్టీసీ అభ్యున్నతికి కృషి చేస్తామని, ఆర్టీసీకి కార్మికులు-ప్రయాణికులు రెండు కళ్లని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో రూ.54.51 లక్షలతో నూతనంగా నిర్మించిన ఆర్టీసీ వైద్యశాల భవనాన్ని ఆయన ప్రారంభించారు. త్వరలోనే ఏడువేల మందికి ఉద్యోగోన్నతులు కల్పించనున్నట్లు వివరించారు. ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్, ఎండీ ద్వారకా తిరుమలరావు, ఆర్టీసీ ఛైర్మన్ నారాయణరావు పాల్గొన్నారు.

శిథిల.. కళ

తిరుచానూరుకు వెళ్లే మార్గంలోని శిల్పారామం కళావిహీనంగా మారింది. నిరుపయోగ వాహనాల విడిభాగాలతో దేవతామూర్తుల నమూనాలు తయారు చేసి సందర్శకులు తిలకించేలా గతంలో ఏర్పాటు చేశారు.. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తుప్పుపట్టి.. కొన్ని నమూనాలు పడిపోయి కళావిహీనంగా మారాయి. సంబంధిత అధికారులు పర్యవేక్షించి నూతన నమూనాలు ఏర్పాటు చేయించాలని సందర్శకులు కోరుతున్నారు. - ఈనాడు, తిరుపతి

కుక్కలున్నాయా.. చిరుతలొస్తాయి జాగ్రత్త

- నగర పరిధిలో పెరిగిన దాడులు
- ఆందోళనలో ప్రజలు

పెరిగిన సంతతి

- ఎస్వీ నేషనల్ పార్కు, ఎస్వీ అభయారణ్యం పరిధి 500 చ.కి.మీ.
- అటవీశాఖ గణనలో గుర్తించిన చిరుతలు 30 పైగా
- ఈ ప్రాంతానికి ఆవలి వైపు ఉన్నవి మరో 20



తిరుపతి నగర పరిధిలో చిరుతల సంచారం కలవరపెడుతోంది. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న వారు మరింత అప్రమత్తంగా ఉండాల్సి వస్తోంది. వీధుల్లో, ఇళ్లలో కుక్కలు పెంచుతుంటే మరింత జాగ్రత్తగా ఉండాల్సిందే. ఎందుకంటే వీధికుక్కలపై చిరుతలు ఇష్టమైన ఆహారం కాబట్టి. ఇంటికి కాపలాగా, మనకు రక్షణగా ఉంటుందనుకుంటున్న కుక్కే చిరుతలను ఆహ్వానిస్తోందన్న విషయాన్ని గుర్తెరగాలి. - న్యూస్‌టుడే,తిరుపతి (జీవకోన)

మనుషులపై ఎప్పుడంటే..

- 8-10 సంవత్సరాల వయసు దాటిన చిరుతల కోర దంతాలు రాలిపోతుంటాయి. ఈ కారణంగా అవి వేటాడి మాంసాన్ని తినే అవకాశం ఉండదు. అలాంటి సమయంలో చిన్నపిల్లలు, సులభంగా దొరికిపోయే మనుషులపై దాడిచేసి తినే ప్రయత్నం చేస్తాయి.
- సాధారణంగా తల్లి చిరుతలు తన పిల్లలను రెండేళ్ల వయసు వచ్చేవరకు సంరక్షిస్తాయి. అలాగే వేటాడటం నేర్పిస్తాయి. కానీ తక్కువ సమయంలో తల్లి నుంచి వేరుపడే పిల్లలు మనుగడ కోసం మనుషులపై దాడి చేసేందుకు యత్నిస్తాయి.

చిరుత కోసం ఏర్పాటు చేసిన బోను

- అటవీశాఖ ఏర్పాట్లు ఇలా.. చిరుతలు, ఎలుగుబంట్లు, ఏనుగుల సంచారంపై సమాచారం అందజేస్తే వెంటనే రక్షణ చర్యలు చేపట్టేలా వైల్డ్‌లైఫ్ పర్యవేక్షణ (మానిటరింగ్) సెల్‌కు సంబంధించిన రక్షణ బృందం రంగంలోకి దిగుతుంది. 15 మంది సుశిక్షితులైన సిబ్బందితో కూడిన బృందాలను అటవీశాఖ ఏర్పాటు చేసింది.

భూపాల్ హౌసింగ్ కాలనీలో ప్రవేశం

మంగళం అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండే భూపాల్ హౌసింగ్ కాలనీలోకి సోమవారం తెల్లవారుజామున చిరుత ప్రవేశించింది. సమీపంలోని ఓ ఇంట్లో కట్టేసి ఉన్న శునకంపై దాడి చేసి హతమార్చింది. ఘటన దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. అటవీశాఖ అధికారులు చిరుత జాడ కోసం గాలిస్తున్నారు. కెమెరా ట్రాప్‌లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

స్థానికులతో మాట్లాడుతున్న అటవీ అధికారులు

సంచారం ఇలా..

- అలిపిరి, శ్రీవారి మెట్టు, అవ్వాచారికోన, పాపనాశనం డ్యామ్ తూర్పు భాగం, మామండూరు, చైతన్యపురం, తలకోన, కల్యాణి డ్యామ్ పరిధిలో ఎక్కువ శాతం చిరుతలు ఉన్నాయి.
- జూపార్కు మొదలుకొని మంగళం వరకు ఉన్న అటవీ దిగువ భాగాన 10 వరకు సంచరిస్తున్నాయి.
- నగర పరిధిలో అటవీ సరిహద్దు ప్రాంతాలైన ఎస్వీయూ, ఎస్వీ వెటర్నరీ, ఎస్వీ అగ్రికల్చరల్, వేదిక్ యూనివర్సిటీల పరిధితోపాటు, సైన్స్ సెంటర్, జూపార్కు, నగరవనం ప్రాంతాలైన జీవకోన, తిమ్మినాయుడుపాలెం దళితవాడ, భూపాల్ హౌసింగ్‌కాలనీ, కేంద్రీయ ఎర్రచందనం గోదాములు, మంగళం వరకు.

తిరుపతి డీఎఫ్‌వో: 94408 10069 రేంజర్: 79815 85207

గోవులకే జీతం.. జీవితం

- ప్రతి లేగదూడకు నామకరణం

గోవుల వద్ద దంపతులు, పిల్లలు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: ఆయనో ప్రభుత్వ చిరుద్యోగి. తిరుమల కొండపై ప్రొటోకాల్ వీఆర్వో. నెలకు వేతనం రూ.57 వేలు. ఈ మొత్తం గోశాలకే కేటాయిస్తున్నారు. ఈయన భార్య నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టులో ప్రాసెస్ సర్వరు. ఈమె నెల జీతాన్ని కుటుంబ పోషణకు ఖర్చు చేస్తున్నారు. వీరి కుమార్తెలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బీబీఏ, బీసీఏ తృతీయ ఏడాది చదువుతున్నారు.

నాయుడుపేట మండలం పుదూరుకు చెందిన అల్లాడి శేషగిరి దంపతులు పదేళ్లుగా గోశాల నిర్వహిస్తున్నారు. కుటుంబ సభ్యులు ఉదయం, సాయంత్రం గోశాలలోని పనుల అనంతరం వారి పనుల్లో నిమగ్నమవుతారు. గోశాల్లోని లేగ దూడలకు దంపతుల కుమార్తెలు సాయి పావని, చంద్రికా మహారాణిలు నామకరణం చేస్తారు.

గోశాల పేరు: మాతా అల్లాడి ట్రస్టు
విస్తీర్ణం: 2.5 ఎకరాలకు పైగా. గోవులు: 85

దూడలే పాలు తాగేలా..

దూడలకు ప్రత్యేక గదుల్లో పంకాలు ఏర్పాటు చేసి సంరక్షిస్తున్నారు. ఆవుల పాలను దూడలే తాగేలా చూస్తారు. దాతల సాయంతో వసతులు కల్పిస్తున్నారు. కార్తిక మాసంలో వన భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు.

చేతివృత్తులకు ఆదరణ-3

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో లక్షమందికి ప్రయోజనం

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: చేతివృత్తులకు ఆదరణ లభించనుంది. 2017-18లో ఆదరణ-2 పథకం కింద నాటి సీఎం చంద్రబాబు పరికరాలు అందజేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ చేతివృత్తులను ప్రోత్సహించేలా, అందుకు నూతన సాంకేతిక పరికరాలు అందించాలనే ఉద్దేశంతో ఉంది. ఈ మేరకు సీఎం చంద్రబాబు ఆదరణ-3 పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు.

12 విభాగాలుగా..

చేతివృత్తుల వారిని 12 విభాగాలుగా విభజించారు. రజక, నాయీబ్రాహ్మణ, పద్మశాలి కులస్థులకు విడివిడిగా పరికరాలు ఇవ్వాలని, మిగిలిన వెనుకబడిన వర్గాల చేతివృత్తుల వారికి ఎంచుకున్న రంగం, కోరుకున్న పరికరాలు ఇవ్వాలని నిర్ణయించారు. సోమవారం బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఆదరణ-3పై ప్రకటన చేయడంతో ఈ పథకం కింద ఉమ్మడి జిల్లాలో లక్ష మందికి పైగా ప్రయోజనం కలగనున్నట్లు అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

ఆదరణ-2లో 64 వేల దరఖాస్తులు..

2017-18లో ఉమ్మడి జిల్లాలో ఆదరణ-2 కింద 64 వేల దరఖాస్తులు అందాయి. అందులో 32 వేల మంది వాటాగా పది శాతం చెల్లించారు. 24 వేల మందికి పరికరాలు పంపిణీ చేశారు. పరికరాలు రాకపోవడంతో ఆరువేల మందికి వాటాధనాన్ని వెనక్కి ఇచ్చారు. బ్యాంకు ఖాతా నంబర్లు లేని మరో రెండువేల మందికి చెందిన రూ.20 లక్షలు బీసీ కార్పొరేషన్ ఖాతాలో ఉన్నాయి.

గురిపెట్టారు.. ప్యాకేజీ పట్టారు

విద్యార్థినులకు నియామకపత్రం అందజేస్తున్న ప్రిన్సిపల్ పద్మావతమ్మ

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: వారందరూ పేద, మధ్య తరగతికి చెందినవారు. తల్లిదండ్రుల కష్టాన్ని చూసి లక్ష్యం నిర్దేశించుకుని ప్రాంగణ నియామకాలపై గురిపెట్టారు. చదువుతుండగానే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించారు. శ్రీపద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాల డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజినీరింగ్ (డీసీఎంఈ) విద్యార్థినులు 12 మంది ఇటీవల చెన్నైకు చెందిన థాట్ వర్క్స్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఏడాదికి రూ.8 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారు.

అదనంగా రెండు గంటలు..

ఉద్యోగ సాధనకు అవసరమైన నైపుణ్యాలపై అధ్యాపకులు ఆరునెలలపాటు శిక్షణ ఇచ్చారు. రోజూ అదనంగా రెండు గంటలపాటు రీజినింగ్, ఆప్టిట్యూడ్, గణితం సాధన చేశాం. ప్రణాళికతో చదవడంతో ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగం సాధ్యమైంది. 19 ఏళ్లకే కొలువు సాధించడం ఆనందంగా ఉంది. - కె.భానువర్షిణి, జి.సుస్మిత

ప్రాథమిక అంశాలపై పట్టు

ప్రస్తుతం బీటెక్ చేసేవారి సంఖ్య పెరగడంతో ఉద్యోగాలు సులువుగా దొరకడం లేదు. డిప్లొమాలో బేసిక్స్ మొత్తం నేర్చుకోవచ్చు. దీంతో మంచి సబ్జెక్ట్ నాలెడ్జ్ ఉంటుంది. అందుకే సులువుగా ఉద్యోగాలు లభిస్తున్నాయి. కళాశాల శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉద్యోగం సాధించాం. - ఎం.రామకీర్తన, ఎం.దీపిక

వెంకటగిరిలో డయాలసిస్ కేంద్రం

- రూ.80 లక్షలతో ఏర్పాట్లు

ఆరోగ్య కేంద్రంలో సిద్ధం చేసిన పడకలు

వెంకటగిరి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని మూత్రపిండాల రోగుల కష్టాలు తీరనున్నాయి. ఇన్నాళ్లూ డయాలసిస్ చేసుకునేందుకు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొనేది. రోగుల కష్టాలు గుర్తించిన ప్రభుత్వం వెంకటగిరిలోనే రూ.80 లక్షలతో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది.

వైద్యుల నియామకం..

నియోజకవర్గం పరిధిలో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి, రాపూరు మండలాల్లో కిడ్నీ బాధితులు ఉన్నారు. వీరు నెల్లూరు, తిరుపతి వెళ్తున్నారు. ఇకపై స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలోనే చికిత్స పొందవచ్చు. డీఎంవో, మేనేజర్‌తో పాటు ముగ్గురు చొప్పున టెక్నీషియన్లు, నర్సులు, శుభ్రత పనులు చేసేందుకు ఇద్దరిని నియమించనున్నారు.

- ఆసుపత్రి: వెంకటగిరి సీహెచ్‌సీ
- పరిధిలో రోగులు: 160 మంది
- అంచనా వ్యయం: రూ.80 లక్షలు
- పడకలు: 30 (అదనంగా 20)
- యంత్రాలు: 5 హీమో డయాలసిస్, శుద్ధి నీటి కేంద్రం

● త్వరలో సేవలు ప్రారంభం.. అపోలో ఆసుపత్రి సౌజన్యంతో రోగులకు సేవలు అందించనున్నాం. చిన్నపిల్లల వార్డులో పడకలు సిద్ధం చేశాం. త్వరలో సేవలు ప్రారంభిస్తాం. - సాయి, వైద్యుడు, సీహెచ్‌సీ

కేవీకేలో పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

రేణిగుంట, న్యూస్‌టుడే: తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన 18 సంవత్సరాలు నిండిన వారికి పుట్టగొడుగుల పెంపకంపై ఈ నెల 13 నుంచి 15 వరకు మూడురోజుల పాటు స్థానిక కేవీకేలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాస్ కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డా.ఎస్.శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నవంబర్ 8వ తేదీ లోగా తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. మరింత సమాచారానికి గృహ విజ్ఞాన విభాగ శాస్త్రవేత్త దివ్య సుధా (9490158595)ను సంప్రదించాలన్నారు.

ఉద్యోగం పేరిట బురిడీ

రూ.17.99 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: ఉద్యోగం పేరిట సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తిని బురిడీ కొట్టించి రూ.17.99 లక్షలు కాజేశారు. అలిపిరి ఎస్సై లోకేష్‌బాబు వివరాల మేరకు.. నగరంలోని మాధవనగర్‌కు చెందిన ఎస్.పవన్ (47)కు ప్రియ అనే ఫేస్‌బుక్ ఖాతా ద్వారా ఒకరు పరిచయం అయ్యారు. వారి టెలిగ్రామ్, వాట్సప్ నంబర్ల ద్వారా 'ఎస్కార్ట్ సర్వీసు, ప్లేబాయ్ జాబ్' పేరుతో ఉద్యోగ ఆఫర్లు వచ్చాయి. మొదట రిజిస్ట్రేషన్ ఫీజు, సెక్యూరిటీ డిపాజిట్, రూమ్ ఛార్జీలు, జీఎస్టీ సాకుతో పలుమార్లు డబ్బులు వేయించుకున్నారు. తర్వాత ఫొటోలు, సంతకం తీసుకుని.. వాటిని ఎడిట్ చేసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తామని బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేశారు. 171 ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా రూ.17.99 లక్షలను వివిధ బ్యాంకు ఖాతాలు, యూపీఐ ఐడీలకు జమ చేయించుకున్నారు. అటు ఉద్యోగం ఇప్పించక.. డబ్బు తిరిగి ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైతేరాజు 6 లో

తండ్రీకుమారుల దుర్మరణం

సుబ్రహ్మణ్యం, రూపేష్

పెళ్లకూరు, న్యూస్‌టుడే: బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమారులు దుర్మరణం చెందిన ఘటన పెళ్లకూరు మండలంలో చోటు చేసుకుంది. శ్రీకాళహస్తికి చెందిన ఉలస సుబ్రహ్మణ్యం (31), కుమారుడు రూపేష్ (11) సోమవారం నాయుడుపేటలోని బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వచ్చారు. తిరిగి వెళ్తుండగా పెసల గురప్పతోట సమీపంలో జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం, ట్యాంకర్ ఢీకొన్నాయి. సుబ్రహ్మణ్యం ఘటనా స్థలంలోనే మృతిచెందారు. తీవ్ర గాయాలపాలైన రూపేష్ శ్రీకాళహస్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సుబ్రహ్మణ్యంకు భార్య, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ చెంచుబాబు, ఎస్సై నాగరాజు తెలిపారు.

అక్రమాల.. పనిపట్టాలని

- రాజీవ్‌నగర్‌లో మరోమారు సర్వే

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: అక్రమాలకు అడ్డాగా.. అక్రమార్కులకు సిరులు పండించే రాజీవ్‌నగర్‌లో మళ్లీ సర్వేకు రెవెన్యూ శాఖ శ్రీకారం చుట్టింది. 2007లో ఇళ్లులేని పేదలకు పక్కా ఇళ్లు నిర్మించుకునేందుకు రాజీవ్‌నగర్‌లో పట్టాలిచ్చారు. విడతల వారీగా 6,500 ఇళ్లు మంజూరు చేశారు. ఇళ్లు నిర్మించుకోలేని పేదల స్థలాలను కబ్జాచేసి అమ్ముకుంటున్నారు అక్రమార్కులు.

ఖాళీ జాగాలతో కాసులే

రాజీవ్‌నగర్‌లో సమస్యంతా ఖాళీ జాగాల విషయంలోనే. వైకాపా హయాంలో ఇక్కడి స్థలాలను అడ్డగోలుగా అమ్ముకున్నారనే విమర్శలున్నాయి. పిచ్చాటూరు-శ్రీకాళహస్తి రహదారి స్థలాన్ని అమ్ముకున్నారు. ఓ ప్రభుత్వ ఉద్యోగి వెయ్యికి పైగా పట్టాలు కలిగి ఉండటంపై కేసులు నమోదయ్యాయి.

కూటమి ప్రభుత్వం వచ్చాక..

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాజీవ్‌నగర్‌లో సర్వే చేపట్టారు. అప్పట్లో సమగ్రంగా నిర్వహించలేదన్న విషయమై మలి విడత సర్వేకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చారు. ఆ ప్రకారం అక్కడున్న వంద ఎకరాల్లోని 6,500 ఇళ్లను 12 బ్లాక్‌లుగా విభజించారు. వీటిని సర్వే చేసేందుకు ఏడు బృందాలు ఏర్పాటు చేశారు. ఖాళీ స్థలాల్లో పట్టాలు పరిశీలించడం, అర్హులైన లబ్ధిదారులను తేల్చేలా సర్వే ప్రారంభమైంది.

- పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలు: 6,500
- నిర్మాణాలు జరిగినవి: 4,700
- ఖాళీగా ఉన్నవి: 1,800
- విభజించిన బ్లాక్‌లు: 12
- సర్వే బృందాలు: 7

అపోహలు వద్దు

సర్వే నేపథ్యంలో ఇళ్లు కూల్చేస్తారన్న అపోహలు వద్దు. ఇళ్లు నిర్మించుకున్న వాళ్ల పట్టాల పరిశీలనతో పాటు ప్రధానంగా ఖాళీగా ఉన్న స్థలాలకు సంబంధించి పట్టాలు తనిఖీ చేస్తాం. అర్హులైతే వాళ్ల పట్టాను అనుమతిస్తూ ధ్రువీకరణ పత్రం ఇస్తాం. ఆధారాలు లేని వాటిని స్వాధీనం చేసుకుని నిజమైన లబ్ధిదారులకు అందజేస్తాం. - భానుప్రకాష్‌రెడ్డి, ఆర్డీవో

104FM Tirupati
ఈ FM 104 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

(c) eenadu

మల్బరీ సాగు.. ఇంటింటా బాగు

మండలం : చౌడేపల్లె
పంచాయతీ: గడ్డంవారిపల్లె
గ్రామం : తెల్లనీళ్లపల్లె
కుటుంబాలు: 100, మల్బరీ సాగు చేసే కుటుంబాలు: 80.. మల్బరీ సాగు విస్తీర్ణం: సుమారు 150ఎకరాలు.. ప్రతి నెలా సరాసరి దిగుబడి: పట్టుగూళ్ల సుమారు 5000కేజీలు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: సాధారణ పంటలకు స్వస్తి పలికి మల్బరీ సాగుతో రైతులు ఆదాయాలను పొందుతున్నారు తెల్లనీళ్లపల్లె రైతులు. ఒకరు కాదు.. ఇద్దరు కాదు గ్రామంలో 100కుటుంబాలు ఉంటే 80శాతం రైతులు సాగు చేస్తున్నారు. ఉన్నత చదువులు చదివిన యువకులు సైతం మల్బరీ సాగులో రాణిస్తున్నారు.

సాగే జీవితం.. మల్బరీ సాగు జీవితాన్ని ఇచ్చింది. బెల్లం, వరి, వేరు సెనగ తదితర పంటలు సాగు చేసి పెట్టిన ఖర్చు రాకపోవడంతో మల్బరీ సాగుకు ప్రాధాన్యతనిచ్చా. సంవత్సరానికి ఎనిమిది పంటలు దిగుబడి సాధిస్తున్నా. **- వెంకట్రమణారెడ్డి**

జీవనంలో మార్పు వచ్చింది

మల్బరీ సాగులో 40సంవత్సరాలు అనుభవం ఉంది. తొలిసారిగా ఆకు కొనుగోలు చేసి 50గుడ్లు పెంచా. కాలక్రమేణ అర్థ ఎకరాలో స్వొంతగా సాగు చేశా. ప్రస్తుతం 2.5ఎకరాల్లో మల్బరీ సాగు చేశా. రెండు వందల గుడ్లు పెంచుతున్నాను. ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువ రావడంతో అదే పంటను నమ్ముకున్నాను. సొంతంగా ఇళ్లు నిర్మించుకున్నా. కుమార్తెకు పెళ్లికి చేసిన అప్పులు తీర్చా. బీఎస్సీ పూర్తి చేసిన కుమారుడు సైతం ఇందులోనే పని చేస్తున్నాడు. ష్టాలు లేని పంట. ఇబ్బందులుండవు. **- తిమ్మారెడ్డి**

పాల దిగుబడి మెరుగుకు తోడ్పాటు

పుత్తూరు, న్యూస్‌టుడే: మేలు జాతి గేదెల ద్వారా పాల ఉత్పత్తి పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పరమేశ్వరమంగళం పశువైద్యాధికారిణి శ్రీదేవి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్ర ప్రభుత్వం ఏబీఐపీ-ఎస్ఎస్ఎస్-ఆర్ జీఎమ్ పథకం అమలు చేస్తోంది. ప్రస్తుత విధానం ద్వారా నల్ల జాతి పశువులు(గేదెలు) ఆడ, మగ రెండు రకాల దూడలకు జన్మనిస్తుంటాయి. వాటిల్లో మగ దూడల పెంపకం పశుపోషణకులకు భారంగా మారుతోంది. వాటి ద్వారా పాల ఉత్పత్తి ఉండదు. ఫలితంగా పాడి పరిశ్రమ దెబ్బతింటోంది. ప్రభుత్వం వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ఈ కొత్త పథకం తీసుకొచ్చింది. దీని ద్వారా గేదెలకు మేలు జాతి ఆడ దూడలు మాత్రమే పుట్టేలా లింగనిర్ధరణ చర్యలు తీసుకున్నారు. గేదె ఎదకు వచ్చిన సమయంలో కృత్రిమ గర్భధారణ ద్వారా లింగ నిర్ధరణ చేయబడిన ఇంజెక్షన్ ఇస్తారు. ప్రభుత్వం 50శాతం రాయితీపై ఒక్కొక్క ఇంజెక్షన్ రూ.150 అందిస్తోంది. ప్రస్తుతం అన్ని పశువైద్యశాలల్లో ఇది అందుబాటులో ఉందని వెల్లడించారు. ఈ విధానం ద్వారా పుట్టిన సంతతి రోజుకు 10 లీటర్ల పైగా పాలిస్తుంది.

రైతేరాజు

ప్రశ్న జవాబు

రేణిగుంట, న్యూస్‌టుడే: ప్రశ్న: ఎకరా వరి పంటకు ఎన్ని యూరియా బస్తాలు వాడాలి? అవి ఎప్పుడెప్పుడు వాడాలి?
- రమేష్‌రాజు, రైతు, కరకంబాడి

జవాబు: స్వల్ప కాలిక రకాలకు ఒక ఎకరాకు రెండు యూరియా బస్తాలు, దీర్ఘకాలిక రకాలకు మూడు యూరియా బస్తాలను మూడు నుంచి నాలుగు దఫాలుగా చల్లుకోవాలి. మొదటిది 20-25 రోజులకు, రెండోది 40-45 రోజులకు, మూడోది 55-60 రోజుల మధ్యలో చల్లుకోవాలి. ఇలా చేస్తే అధిక దిగుబడి వస్తుంది. అధిక మోతాదులో యూరియా వాడకంతో చీడపీడలు ఎక్కువగా ఆశించి పంట నాణ్యత తగ్గడమే కాకుండా రైతుకు పెట్టుబడి ఖర్చు అధిక అవుతుంది. **- సునీల్‌కుమార్, ఏవో**

బొప్పాయి పాలు.. విదేశాలకు

నంద్యాల జిల్లా చాగలమర్రి మండల వ్యాప్తంగా రైతులు అధికంగా బొప్పాయి సాగు చేస్తుంటారు. చిన్నవంగలితో పాటు సమీపంలోని గ్రామాలైన వైఎస్సార్ కడప జిల్లా కానగూడూరు, క్రిష్ణంపల్లె గ్రామాల్లో 1200 ఎకరాల్లో పండిస్తారు. పండ్ల సేకరణ అనంతరం 13 నెలల తర్వాత మినిమిడి, ముదురు కాయలకు గాట్లు పెట్టి పాలను సేకరిస్తున్నారు. తెల్లవారుజాము సమయంలోనే కాయలకు గాట్లు పెడితే కేవలం రెండు గంటల్లోనే పాలు ఊరుతుంటాయి. ఇలా సేకరించిన దాన్ని రాయవోటి, రాజంపేటకు చెందిన వ్యాపారులు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల పాలు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 4 డ్రమ్ముల పాలు సేకరిస్తున్నారు. ఎకరానికి పాల సేకరణ ద్వారా రైతుకు రూ.24 వేల ఆదాయం వస్తుంది. బెంగళూరు, చెన్నైతో పాటు నాణ్యతను బట్టి విదేశాలకు సైతం పాలను ఎగుమతి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, చాగలమర్రి**



జాగ్రత్తలతో వరిని కాపాడుకోవచ్చు

చిత్తూరు ఏరువాక సమన్వయకర్త రామకృష్ణారావు

పుత్తూరు, తిరుపతి (వ్యవసాయం), న్యూస్‌టుడే: మొంథా తుపాన్ కారణంగా విస్తారంగా వర్షాలు కురిసిన నేపథ్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వివిధ దశల్లోని వరి పంటను చిన్న చిన్న జాగ్రత్తలతో కాపాడుకోవచ్చని చిత్తూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త రామకృష్ణారావు పేర్కొన్నారు. ■ పొట్ట దశలో వర్షాల వల్ల పొలంలో నిలిచిన నీటిని అంతర్గత కాలువల ద్వారా తొలగించాలి. గింజలు రంగు మారటంతో పాటు తెగులు సోకే ప్రమాదం ఉందన్నారు. తెగులు వ్యాప్తి చెందకుండా ఎకరాకు 200మి.లీ ప్రొపికోనజోల్ పిచికారీ చేయాలి. గింజ పట్టేదశ ఉంటే నీటిని తొలగించడంతో పాటు పడిపోయిన పంట గిలకల్లో మొలకలు కనిపిస్తే ఐదు శాతం ఉప్పు ద్రావణం (50 గ్రాముల ఉప్పు లీటరు నీటికి) పిచికారీ చేయాలి. మొలక రంగు మారును తగ్గిస్తుంది. ■ అంకురం నాటిన పంట(పిలక దశ) వర్షపు నీరు సాధారణ రకాల్లో అయిదు రోజుల్లో, వరదను తట్టుకునే రకాల్లో 7-10రోజులు నిలిచినప్పటికి నీటిని తీసి పంట పునరుద్ధరణకు ఎకరాకు యూరియా 20 కిలోలు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 20 కిలోలు, బూస్టర్ మోతాదుగా వేయాలి.

తెగుళ్ల నియంత్రణకు చర్యలు.. వర్షాలకు బ్యాక్టీరియా ఎండాకు తెగులు కనిపిస్తే ప్లాంటోమైసిన్ 1.0మి.లీ/లీటరు, కొసైడ్(కాపర్ హైడ్రాక్సైడ్) 2.0గ్రా/లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నీరు తగ్గిన తర్వాత హెక్సాకోనాజోల్ 400మి.లీ/ఎకరాకు లేదా ప్రొపికోనజోల్ 200మి.లీ/ఎకరాకు పిచికారీ చేయాలి.

కోత సమయంలో... గింజ గట్టిపడే దశ లేదా కోత దశలో అకాల వర్షాలతో మొక్క పడిపోయి నేలకు ఒరిగిపోతుంది. పడిపోయిన చేల నుంచి వచ్చే ధాన్యం మిల్లింగ్ సమయంలో విరిగిపోయి నూక ఎక్కువగా వస్తుంది. కోత కోసిన పొలంలోని పనలు తడిసినట్లయితే నీరు పూర్తిగా బయటకు పోవడానికి కాలువలు ఏర్పాటు చేయాలి. గింజ మొలకెత్తకుండా ఉండడానికి ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పిచికారీ చేయాలి. ■ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నారుమడి నీట మునిగిన పరిస్థితిలో వర్షపునీరు ఐదు రోజుల్లో బయటికి పంపి సెంటు నారుమడికి యూరియా ఒక కిలో, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఒక కిలో బూస్టర్ మోతాదుగా వేయాలి. నారుమడి కుళ్లిపోకుండా నివారించడానికి కార్బండిజమ్ 1.0గ్రాములు/ లీటరు లేదా కార్బండిజిమ్, మాంకోజెబ్ 2.0 గ్రా/ లీటరు పిచికారీ చేయాలి.

ఆదరిస్తే మనోళ్లూ ఆల్‌రౌండర్లే..!

■ జిల్లాలో పరిమిత సంఖ్యలో మహిళా క్రికెటర్లు
■ ప్రోత్సాహం లేక సాధనకు దూరంగా..

చిత్తూరు (క్రీడలు), న్యూస్‌టుడే: కపిల్‌దేవ్ జట్టు తరహాలో.. భారత మహిళల జట్టు క్రికెట్‌లో మొదటిసారి విశ్వవిజేతగా నిలవడంతో యావత్ ప్రపంచం మనవైపు తిరిగి చూసింది. ఇతర క్రీడల్లో మహిళల ప్రాతినిధ్యం ఉన్నా.. క్రికెట్ సంగతికి వచ్చేసరికి పెద్దగా కన్పించడం లేదు. ఆడాలన్న ఆసక్తి ఉన్నా.. శిక్షణ లేక క్రికెట్‌పై ఆశల్ని వదిలేసుకుంటున్నారు. ఐదేళ్లలో ఐదారుగురు తప్ప.. పెద్దగా మహిళా క్రికెటర్లు లేకపోవడం గమనార్హం. వీరికీ ఆదరణ కల్పిస్తే.. శ్రీచరణి, జమీమా తరహాలో అదరహో అనిపిస్తారని క్రీడాభిమానులు అంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో అడ్డంకులివీ..

☛ శిక్షణకు క్రీడాప్రాధికార సంస్థ తరపున కోచ్ లేకపోవడం.
☛ శిక్షణార్థుల సంఖ్య ఐదారుగురికి మించకపోవడం.

సరైన ప్రోత్సాహం లేదు

బాలికలు క్రికెట్ ఆడాలని ఎంతో ఆసక్తితో ఉన్నా సరైన శిక్షణ, అవకాశాల్ని చూపించే వారు లేకపోవడం పెద్ద లోటు. నేను ఐదేళ్లుగా క్రికెట్ ఆడా. బౌలింగ్ చేస్తా. యూనివర్సిటీ స్థాయి, జోనల్స్ క్రీడల్లో జిల్లా తరపున తలపడ్డా. రాష్ట్ర స్థాయి ప్రాబబుల్స్‌కు ప్రాతినిధ్యం వహించా. ప్రోత్సాహం లేక తదుపరి స్థాయికి వెళ్లలేకపోయాం. డిగ్రీ చదివి చిత్తూరులోనే ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నా. బాలికలు క్రికెట్‌లో రాణించేలా అవకాశాలు కల్పిస్తే ప్రతిభావంతులను వెలికితీయవచ్చు. **- ఛరీష్మా, చిత్తూరు**

శిక్షణ ఇవ్వలేమని నిరాశపరిచినా సాధన

బాల్యం నుంచి క్రికెట్ అంటే మక్కువే అయినా పదో తరగతి నుంచి ఆడాలన్న ఆసక్తి మరింత పెరిగింది. బాలికలకు శిక్షణ ఇవ్వలేమని మొదట్లో నిరాశపరిచారు. వేసవి శిక్షణ శిబిరాలకు వెళ్లి ప్రాథమిక అంశాల్ని నేర్చుకున్నా. తల్లిదండ్రులు, శిక్షకుల ప్రోత్సాహంతో ఫిట్‌నెస్ మెరుగుపరచుకుని జిల్లాస్థాయి పోటీలకు బ్యాటర్‌గా ఎంపికయ్యా. అండర్-19, ఎస్వీయూ, ఇంటర్ జోనల్ స్థాయి మ్యాచ్‌ల్లో తలపడ్డా. రాష్ట్ర స్థాయి ప్రాబబుల్స్ పోటీల వరకూ వెళ్లగలిగా. ప్రస్తుతం డిగ్రీ పూర్తయింది. బీసీఏ కోర్సు చేశా. శిక్షణకు అవకాశం లేకపోవడంతో హైదరాబాద్‌లో ఉద్యోగాన్వేషణలో ఉన్నా. జిల్లాలో సౌకర్యాలు కల్పిస్తే ప్రతిభావంతులు వెలుగులోకి వస్తారు. **- భవ్య, చిత్తూరు**

ఏపీఆర్‌సెట్‌కు 90% హాజరు

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: పీహెచ్‌డీలో ప్రవేశాలకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ నిర్వహిస్తున్న ఏపీఆర్‌సెట్-2024-25 సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైంది. వర్సిటీ వీసీ ఆచార్య ఉమ, రిజిస్ట్రార్ రజిని ఆన్‌లైన్ ద్వారా పరీక్షను ప్రారంభించారు. సోమవారం నుంచి ఈనెల 7వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 13 కేంద్రాల్లో, తెలంగాణలో మరో కేంద్రంలో పరీక్షలు జరగనున్నట్లు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వర్సిటీల్లో 65 కోర్సుల్లో పీహెచ్‌డీ ప్రవేశాలకు నిర్వహించే ఈ పరీక్షకు 5,752 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. మొదటి రోజు 90శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. ఏపీఆర్‌సెట్ కన్వీనర్ ఉష, కో-కన్వీనర్ జాన్‌సుష్మ పర్యవేక్షించారు.

కలెక్టరేట్ ఎదుట మహిళల ఆత్మహత్యాయత్నం

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: కలెక్టరేట్ ఎదుట ఇద్దరు మహిళలు ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించడం కలకలం రేపింది. తమ భూమిని నగరానికి చెందిన తెదేపా నాయకులు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని తిరుపతికి చెందిన బండి వెంకటసుబ్బమ్మ ఆరోపించారు. పోలీసులు, అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదంటూ వెంకటసుబ్బమ్మ సోదరి లక్ష్మీదేవి, కుమార్తె భారతి ఒక్కసారిగా ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించారు. దాదాపు 30 ఏళ్లుగా కొర్లగుంట సంజయ్‌గాంధీ కాలనీలో హోటల్ పెట్టుకుని నివాసం ఉంటున్నట్లు తెలిపారు. ఇటీవల పాత ఇంటిని కూల్చి నిర్మాణం ప్రారంభించగా... తెదేపా నాయకుడు తన అనుచరులతో వచ్చి అడ్డుకుంటున్నారని.. పోలీసులను పంపించి బెదిరిస్తున్నట్లు వాపోయారు. శిక్షణ కలెక్టర్ సందీప్ రఘువాన్షీ, డీఆర్వో నరసింహులు బాధితులతో మాట్లాడారు. న్యాయం చేస్తామంటూ హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. మహిళలు ఆత్మహత్యకు యత్నించిన సమయంలో అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు అడ్డుకునే యత్నం చేయకపోవడంపై విమర్శలు న్నాయి. ఏఎస్సై బాబు అదే సమయంలో ఫోన్‌లో మాట్లాడుతుండటం గమనార్హం.

మహిళలు ఒంటిపై కిరోసిన్ పోసుకుంటుండగా ఫోన్‌లో మాట్లాడుతున్న ఏఎస్సై బాబు, కానిస్టేబుల్

రాష్ట్రానికి ఘనకీర్తిని తీసుకురండి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: లాన్ టెన్నిస్ క్రీడలో రాష్ట్రానికి ఘనకీర్తిని తీసుకురావాలని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ కోరారు. పట్టణంలోని విక్రం టెన్నిస్ అకాడమీలో మూడు రోజులుగా 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి లాన్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు జరిగాయి. కార్యక్రమ ముగింపు సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశానికి కోలా ఆనంద్ ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శులు కిషోర్, భార్గవిలు మాట్లాడుతూ రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 390 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు వివరించారు. పోటీలు అండర్-14, 17, 19 విభాగాల వారీగా నిర్వహించామన్నారు. **జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు : అండర్-19, బాలుర విభాగం:** తనీష్‌రెడ్డి, జీవన్, వైష్ణవసాయిరెడ్డి **బాలికలు..** మనస్వి, తన్విశ్రీ, **అండర్-17 బాలుర విభాగం:** జయసాయి కుమార్, **బాలికలు:** సాయిసంజనారెడ్డి, సుహేరా అన్సారీ.

జాతీయ స్థాయి లాన్ టెన్నిస్ క్రీడా పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ప్రత్యేక ఆహ్వానితులు, క్రీడా నిర్వాహకులు

జో అచ్యుతానంద.. జోజో

శ్రీవారి దర్శనార్థం రోజూ వేలమంది భక్తులు తిరుమలకు వస్తుంటారు. గంటలతరబడి క్యూలైన్‌లో వేచిఉండి దర్శనం చేసుకున్నాక శ్రీవారి ఆలయం ఎదుట కొంత సేపు సేదతీరుతారు. ఈ సందర్భంగా శ్రీవారి వైభవాన్ని చూస్తూ తనివితీరా ఆధ్యాత్మిక చైతన్యం పొందుతుంటారు. ఇందులో భాగంగా ఓ కుటుంబం ఆలయం ఎదుట సేదతీరుతూ చీరతో బారికేడ్లకు ఊయలు కట్టి బిడ్డను కొంతసేపు జోకొట్టారు. **- న్యూస్‌టుడే, తిరుమల**

ఐసర్ @ ఆరోగ్యం

అధునాతన సదుపాయాలు.. ఆకట్టుకుంటున్న వ్యాయామశాలలు

జ్ఞాపికలు, పతకాలతో విద్యార్థులు

ఐసర్‌లో విద్యార్థుల సంఖ్య: **1432**
ఆచార్యులు, సిబ్బంది: **200**
కుటుంబ సభ్యులు: **300** మంది

ఏర్పేడు, న్యూస్‌టుడే: నిత్యం పుస్తకాలతో కుస్తీపడుతూ ఉండే తిరుపతి భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ విద్యార్థులతోపాటు ఆచార్యులు, సిబ్బంది వ్యాయామం చేస్తూ శారీరక దారుఢ్యాన్ని పొందుతున్నారు. అధునాతన హంగులతో ఇన్‌డోర్, అవుట్‌డోర్ స్టేడియాలు, వ్యాయామశాలలు అందుబాటులో ఉండటంతో ఉదయం, సాయంత్రం వాటిల్లో కొంత సమయం గడుపుతూ శారీరక, మానసిక ఉల్లాసాన్ని పొందుతున్నారు.

అవుట్‌డోర్ గేమ్స్ ఆడేవారికి.. క్రికెట్ ప్రాక్టీస్ నెట్ (చిన్నది), అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రికెట్ మైదానం, ఫుట్‌బాల్ గ్రౌండ్, రెండు వాలీబాల్, లైటింగ్‌తో కూడిన బాస్కెట్ బాల్ కోర్ట్, కబడ్డీ, ఖోఖో కోర్టులు, 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్ అందుబాటులో ఉన్నాయి.

ఇండోర్ క్రీడా సదుపాయాలు

టెబుల్ టెన్నిస్ టేబుల్స్-5, స్క్వాష్ కోర్టులు-2, బ్యాడ్మింటన్ కోర్టులు-5(ప్రత్యేక కోర్టులు-2, మల్టీ పర్పస్ కోర్టులు-3), బాస్కెట్‌బాల్, జిమ్నాసియం, కబడ్డీకోర్టు, యోగా సెంటర్లు ఉన్నాయి. వసతి గృహాల్లోనూ టెబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్ బోర్డులు, ప్రాథమిక జిమ్నాసియంలు, యోగాసెంటర్, డంబెల్స్, మినీ మల్టీజిమ్ స్టేషన్, ట్రెడ్‌మిల్స్ ఉన్నాయి.

ట్రెడ్ మిల్లపై విద్యార్థుల వ్యాయామం

శిక్షకుల పర్యవేక్షణలో..

మహిళలు, పురుషులకు వేర్వేరుగా వ్యాయామశాలలు ఉన్నాయి. నిపుణుల శిక్షణలో ట్రెడ్‌మిల్, క్రాస్‌ట్రైనర్స్ కార్డియో వ్యాయామాలు నేర్పిస్తున్నారు.

విజేతలుగా నిలుస్తూ.. ఇక్కడ పలు రకాల క్రీడల్లో శిక్షణ ఇస్తుండటంతో విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటూ విజేతలుగా నిలుస్తున్నారని ఐసర్ డైరెక్టర్ ఎస్.భట్టాచార్య తెలిపారు.

శ్రీసిటీని సందర్శించిన యూఎన్ విజన్ దౌత్యవేత్త

శ్రీసిటీ(వరదయ్యపాలెం), న్యూస్‌టుడే: మాస్కోలోని ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ ఇన్ఫర్మేషన్ నిపుణుడు, యూఎన్ విజన్ దౌత్యవేత్త జయరాములు లింగుట్ల సోమవారం ఏపీ పర్యటనలో భాగంగా శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ఎండీ డా.రవీంద్రసన్నారెడ్డి ఆయనకు స్వాగతం పలికి శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతల గురించి వివరించారు.

EENADU Classifieds

EDUCATION
TUITIONS
TUTIONS తిరుపతిలో ఖాదీకాలనీ నుండి ఆన్‌లైన్ (ZOOM) ద్వారా పిల్లలకు హింది నేర్పించబడును. Cont: ✆ 94411 88043.

HEALTH & CARE
PAEDIATRIC
శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పురిటి బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

REAL ESTATE
FLAT FOR SALE
GENERAL
తిరుపతి, తిరుచానూరు రోడ్డులోని పద్మావతిపురంలో టెంపుల్ వ్యూ రెసిడెన్సీలో ఫ్లాట్ నెం:102, 1600 sqft 3BHKని అమ్మబడును. ధర: 60 లక్షలు, Negotiable డా॥ నారాయణ రాజు, కోడూరు.90521 60690, వాచ్‌మెన్ 63095 85533.

PLOT FOR SALE
GENERAL
INVESTMENT PLOTS/ Farm House Plots/ Villa Plots for Sale: Lucky Ventures (India's No-1 Real Estate Company). ✆ 91145 61456.

JOBS
PART TIME Jobs for Teachers with Experience and Fresher Wisdom Academy, SV Nagar, Tirupati. ✆ 98660 87500, 83415 54014.
WANTED: Immediately High School English and Social for a Reputed School in Mangalam, Tirupati. Cont: ✆ 81794 67247.
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యూయర్స్. ఏజ్: 22-35. ఫ్రెషర్స్ కూడా కావలెను. ✆ 6281037879.
తిరుపతి, తిరుమల బైపాస్‌రోడ్డు, ప్రముఖ A/c రెస్టారెంట్‌లో అనుభవం గల స్టీవార్డ్స్, క్యాషియర్, రుబ్బింగ్ మాస్టర్, స్టాల్‌బాయ్ కావలెను. ✆ 87901 22006, 76038 68950.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి అక్రమంగా డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU THE WAY CLASSIFIEDS
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290
మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల, తిరుపతి (తితిదే): నేరుగా వచ్చే భక్తులకు 8 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. ఆదివారం శ్రీవారిని 84,442 మంది దర్శించుకోగా రూ.3.51 కోట్ల హుండీ కానుకలు లభించాయి. తిరుపతిలో సోమవారం 18 వేల సర్వదర్శన టోకెన్లు జారీ చేశారు. **రేపు తిరుమలలో పౌర్ణమి గరుడసేవ:** తిరుమలలో బుధవారం రాత్రి కార్తిక పౌర్ణమి గరుడసేవ జరగనుంది.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా నా కక్షిదారులైన **శ్రీమతి ఎన్.రమాదేవి** క్రింద తెలిపిన షెడ్యూలు దాఖలా భూములను భాగపరిష్కారము కోరుతూ సంబంధిత అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు తిరుపతి నందు దావానంబరు OS.No 319/2005 దావా దాఖలు చేసి ప్రిలిమనరీ డిక్రీ పొందియున్నారు. తదుపరి ఫైనల్ డిక్రీ పెండింగ్‌లో ఉన్నది. కనుక క్రింది తెలిపిన షెడ్యూలు దాఖలా భూములను క్రయవిక్రయాలు చేయరాదని తనఖాలు చేయరాదని రిజిస్టరు చేసినా చెల్లనేరదని యావన్మందికి తెలియజేయడమైనది. ఎవరైనా అట్లు అతిక్రమించిన అట్టివారిపై సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకొనబడునని తెలియజేయడమైనది.

షెడ్యూలు

చిత్తూరు డిస్ట్రిక్ట్, బాలాజి సబ్ డిస్ట్రిక్ట్, రేణిగుంట ఎస్ఆర్ఒ **గాజులమండ్యం లెక్క దాఖలా**
1.Sy.No.8/1A-Ac 1.53 Subdivided as Sy.No.8/1B2 A/1-Ac 0.125, Sy.No.8/1B2A/2-Ac 1.095
2.Sy.No.8/2A-Ac 3.40 Subdivided as 8/2A/1A1- Ac 0.65, Sy.No.8/2A/1A2-Ac 0.465, Sy.No.8/2A/1A3- Ac 0.885, Sy.No.8/2A/1B Ac 0.28, Sy.No.8/2A/2- Ac 1.12
3.Sy.No.8/2B-Ac 0.07
చిత్తూరు డిస్ట్రిక్ట్, బాలాజి సబ్ డిస్ట్రిక్ట్, రేణిగుంట SRO, **కొత్తపాళెం గ్రామ లెక్క దాఖలా**
1.Sy.No.311/5 Ac 0.82, Subdivided as Sy.No.311/5A- Ac 0.115, Sy.No.311/5B-Ac 0.19, Sy.No.311/5C-Ac 0.515
2.Sy.No.311/7A-Ac 0.03, 3. Sy.No.311/4B-Ac 0.04
మరియు ఇతర సర్వే నంబరులు.

ఇట్లు
ఎన్.మనోహర్, అడ్వకేట్, తిరుపతి.
Cell No. 9346981333

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
సంక్షిప్త ఇ-టెండర్లు కోరుతూ ప్రకటన
Roc. No. TTD-33021(69)/7/2025-HEALTH-TPT, తేది: 03.11.2025
టెండరు ఐడి: 860651 ప్రకారం "వార్షిక కార్తిక బ్రహ్మోత్సవాలు-2025 సందర్భంగా శ్రీ పద్మావతి అమ్మవారి దేవస్థానం, తిరుచానూరు వద్ద పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపట్టుటకు 2000 నెం.ల అన్‌స్కిల్డ్ వర్కర్స్ (మ్యాన్-డేస్) మరియు 101 నెం.ల సెమి-స్కిల్డ్ వర్కర్స్ సరఫరా" కొరకు ఆరోగ్య శాఖ, తిరుపతి వారు సంక్షిప్త ఇ-టెండర్లు (3వ పిలుపు)(ఆన్‌లైన్) కోరుతున్నారు. సమాచారం కొరకు ఆరోగ్య శాఖ, టిటిడి, తిరుపతిని సంప్రదించండి మరియు వివరాలకు https://apeprocurement.gov.inకు లాగాన్ చేయగలరు.
TTD-40021/10/2025-PRO SEC (Adv.No:274), Dt: 03-11-2025 కార్యనిర్వహణాధికారి

శివయ్యకు జ్యోతిర్లింగార్చన

కార్తికమంటే శివుడికి ఎంతో ప్రీతిపథం. అందులోనూ సోమవారం సందర్భంగా ముక్కంటి ఆలయం తరపున నిర్వహించిన కార్తిక దీపోత్సవం ఆద్యంతం రమణీయంగా సాగింది. ఆలయానికి అనుబంధంగా ఉన్న వైష్ణవ పుష్కరిణిలో జ్యోతులతో శివలింగార్చన చేపట్టారు. పుష్కరిణి చుట్టూ భక్తులు పెద్ద ఎత్తున కార్తిక దీపాలు వెలిగించారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య కార్తిక దీపోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

'సుధీర్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు'

శ్రీకాళహస్తి: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తనకు డిపాజిట్ కూడా రాలేదంటూ వ్యాఖ్యానించడం సరికాదని జనసేన నియోజకవర్గ పూర్వ సమన్వయకర్త వినుత కోటా అన్నారు. సోమవారం సుధీర్‌రెడ్డి వ్యాఖ్యలతో ఉన్న వీడియోను 'ఎక్స్'లో విడుదల చేయడంతో పాటు తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇటీవల ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ 2019లో తనకు డిపాజిట్లు రాలేదంటూ వ్యాఖ్యానించారన్నారు. 2023 నవంబరులో జరిగిన తెదేపా-జనసేన సమన్వయ సమావేశానికి తెదేపా కంటే జనసైనికులు ఎక్కువగా వచ్చారని అదే ఎమ్మెల్యే సభాముఖంగా చెప్పారన్నారు.

'ఆజన్మాంతం పల్లికొండేశ్వరుడికి సేవచేస్తా'

నాగలాపురం: ఆజన్మాంతం పల్లికొండేశ్వరుడికి సేవచేస్తూనే ఉంటానని తెదేపా నియోజకవర్గ కార్యక్రమాల సమన్వయకర్త కూరపాటి శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన పాలకవర్గ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఆలయ ఆవరణలో రథ గమనానికి వీలుగా ఏర్పాట్లకు రూ.15 లక్షల విరాళాన్ని ఈవో లతకు అందించారు. ఛైర్మన్‌గా ప్రమాణం చేసిన పద్మనాభరాజు మాట్లాడుతూ.. స్వామి రథాన్ని మహాశివరాత్రి ఉత్సవాల్లో ఊరేగిస్తామన్నారు. పుష్కరిణిని, అతిథిగృహాలను ఏర్పాటు చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే హేమలత, ఏపీయూఎఫ్ఐడీసీ డైరెక్టర్ చందనస్రవంతి, తెదేపా జాతీయ ఉపాధ్యక్షులు మాధవులునాయుడు, డీసీసీబీ ఛైర్మన్ అమాస రాజశేఖరరెడ్డి, తుడా డైరెక్టర్ అన్నా అనిత, సత్యవేడు జడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, మాజీ ఎంపీపీలు మధుబాల, మస్తాన్‌యాదవ్, బాలాజీరెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కూరపాటి శంకర్‌రెడ్డి

ప్రాణం తీసిన గుంతలు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: రహదారిపై ఉన్న గుంతల కారణంగా ఒకరు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. గూడూరు గ్రామీణ ఎస్సై తిరుపతయ్య వివరాల మేరకు.. కందలికి చెందిన వెంకటరమణయ్య (52) మట్టి కోసం ట్రాక్టరుపై బయలుదేరారు. వెనుక నిల్చొని ప్రయాణం చేస్తుండగా వాహనం గుంతలో దిగడంతో ఆయన కింద పడిపోయారు. పైనుంచి ట్రాక్టర్ వెళ్లడంతో మృతి చెందారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వెంకటరమణయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మృతిపై గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సమీపంలో అక్రమ మైనింగ్ చేస్తున్న ఓ మైన్ వద్దకు కూలి పనులకు వెళ్లి చనిపోయినట్లు ఆరోపిస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఆటో చోదకుడి దుర్మరణం

గజేంద్ర (పాతచిత్రం)

పిచ్చాటూరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ఢీకొని ఆటో చోదకుడు మృతి చెందిన ఘటన పిచ్చాటూరులో చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేష్ కథనం మేరకు.. నింద్ర గ్రామానికి చెందిన గజేంద్ర(57) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఆటోలో ప్రయాణికులతో పిచ్చాటూరు వస్తుండగా టూటౌన్ సమీపంలో ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గజేంద్ర మృతి చెందాడు. మృతదేహాన్ని మరణోత్తర పరీక్షల నిమిత్తం సత్యవేడుకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

(c) eenadu

తిరుపతి

•తిరుపతి • చంద్రగిరి

నిషేధిత జాబితా నుంచి భూములు తొలగించాలి

తిరుపతి (జీకేకోన), న్యూస్‌టుడే: తిరుపతి నగర పరిధి సుబాష్‌నగర్‌లో నివాస సముదాయాలున్న భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని స్థానికులు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విన్నవించుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్కారంపల్లి సర్వే నెంబర్ 110/1లోని 80 సెంట్ల భూమిని గతంలో కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేసుకుని ఇళ్ల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం తమ భూమిని 22ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చిందన్నారు. ఈ కారణంగా ఏళ్లుగా తాము మానసిక వేదనను అనుభవిస్తున్నామని తెలిపారు. డి.ఆనంద, అరుణకుమారి, ప్రభాకర్, మునిరామయ్య, సుబ్రహ్మణ్యం, ఆదిశేషయ్య పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్ల ఎంపిక

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: శ్రీపద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం ఎన్‌సీసీ కేడెట్ల ఎంపికలు నిర్వహించారు. 5వ ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ కమాండింగ్ అధికారి అనూజ్ వాద్వా విచ్చేసి డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థినులకు వివిధ పరీక్షలు నిర్వహించారు. 300 మంది పాల్గొనగా 63 మంది విద్యార్థినులను ఎంపిక చేసినట్లు ప్రిన్సిపల్ నారాయణమ్మ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: సమస్య: తిరుపతిలోని అక్కారంపల్లిలో వీధి దీపం కొన్ని నెలలుగా పని చేయడం లేదు. దీంతో ఇబ్బందులు తప్పడంలేదు. **- మురళీకృష్ణ**

సమాధానం: వీధి దీపాల సమస్యను పరిష్కరిస్తాం. **- శ్యాంసుందర్, ఎస్ఈ, నగరపాలిక**

సమస్య: కరకంబాడి రోడ్డులో అక్కారంపల్లికి వెళ్లే కొత్త రోడ్డులో మురుగు నీటి సమస్యతో ఇబ్బందులు తప్పడంలేదు. **- స్థానికులు**

సమాధానం: మురుగు నీటి సమస్యను పరిష్కరిస్తాం. **- డా.అన్వేష్‌రెడ్డి, వైద్యాధికారి, నగరపాలిక**

మురుగు సమస్య పరిష్కారం

చంద్రగిరి (గ్రామీణ), న్యూస్‌టుడే: ఎ.రంగంపేట పంచాయతీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో మురుగు పైపు పగిలింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 'ఈనాడు'లో సమస్య ప్రచురితం కావడంతో కార్యదర్శి సురేష్ స్పందించి పైపును బాగు చేయించారు.

వ్యర్థాల తొలగింపు

చంద్రగిరి, న్యూస్‌టుడే: రెడ్డివారిపల్లిలో రోడ్డుపక్కన ఉన్న చెత్తా..చెదారాన్ని పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేసి దోమల నివారణకు బ్లీచింగ్ పొడి వెదజల్లించారు. రెడ్డివారిపల్లి రోడ్డుమార్గంలో 'రోడ్డుపైనే వ్యర్థాలు' శీర్షికతో ఆదివారం కథనం ప్రచురితమైంది. స్పందించిన ఈవో చంద్రశేఖర్‌రెడ్డి కార్మికులతో పరిసరాలను పరిశుభ్రం చేయించారు.

ఎస్వీయూలో ర్యాగింగ్.. వేధింపులు

రిజిస్ట్రార్, రెక్టార్ ఎదుట బైఠాయించిన విద్యార్థులు, సంఘాల నేతలు, చిత్రంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రొఫెసర్ విశ్వనాథ్‌రెడ్డి (చేతులు కట్టుకున్న వ్యక్తి)

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: ఎస్వీయూలో ఓ ఆచార్యుడు వేధింపుల అంశం సోమవారం వివాదానికి దారితీసింది. దీంతో విద్యార్థులు రెక్టార్ కార్యాలయాన్ని దిగ్బంధం చేశారు. చివరకు పోలీసులు రంగప్రవేశం చేశారు. సంబంధిత ఆచార్యునిపై కేసు నమోదు చేస్తామని వర్సిటీ రిజిస్ట్రార్, రెక్టార్‌లు ప్రకటించడంతో విద్యార్థులు శాంతించారు. ఈ సమయంలో విద్యార్థులకు, పోలీసులకు మధ్య పెనుగులాట జరిగి ఒకరు గాయపడ్డారు. వర్సిటీలోని సైకాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డి విద్యార్థినులపై వేధింపులకు పాల్పడుతున్నారని, సీనియర్ విద్యార్థుల అండతో వేధిస్తూ ర్యాగింగ్‌లకు పురిగొల్పారంటూ నలుగురు విద్యార్థినులు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడుకు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వర్సిటీ రిజిస్ట్రార్ భూపతినాయుడుకు విషయం తెలియజేశారు. ఈ సందర్భంగా వసతిగృహాల వార్డెన్లతో కలసి ఆరోపణలు ఎదుర్కొంటున్న విశ్వనాథరెడ్డిని పిలిపించి పోలీసులు మాట్లాడుతుండగా విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెక్టార్ కార్యాలయం తలుపులు తోసుకుని లోపలకు ప్రవేశించారు. అక్కడే బైఠాయించి నినాదాలు చేశారు. దీంతో ర్యాగింగ్‌కు పాల్పడిన ముగ్గురు విద్యార్థులను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు రెక్టార్ అప్పారావు ప్రకటించారు. వర్సిటీ వీసీ ఆచార్య నరసింగరావు దిల్లీలో ఉండటంతో ఆయనతో చరవాణిలో మాట్లాడారు. ఈ విషయమై ఎస్పీకి ఫిర్యాదు చేయాలని, సంబంధిత ఆచార్యుడు, విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. రాత్రికి విశ్వనాథ్‌రెడ్డిని సైకాలజీ విభాగాధిపతి పోస్టు నుంచి తప్పించిన అధికారులు ఏడుగురితో కూడిన కమిటీని విచారణకు నియమించారు.

అద్దెల వసూళ్లు ఎలా?

రూ.12 కోట్ల బకాయిలు

గాంధీరోడ్డులోని హాథీరాంజీ మఠం భవనం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: గాంధీరోడ్డులోని అతి పురాతన హాథీరాంజీ మఠం అద్దెలు రూ.కోట్లలో పేరుకుపోయాయి. ఇవి రూ.12 కోట్లకు చేరగా వసూళ్లపై మఠం సిబ్బంది మల్లగుల్లాలు పడుతున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే కొందరికి నోటీసులు జారీ చేసినప్పటికీ వారి నుంచి స్పందన లేనట్లు తెలుస్తోంది.

మరమ్మతుల అంశంలో.. మఠం మరమ్మతులను త్వరితగతిన ప్రారంభిస్తామని కలెక్టర్ ప్రకటించిన విషయం విదితమే. అయితే ఇందుకు అవసరమైన నిధులు ఏ విభాగం మంజూరు చేస్తుందన్న అంశంపై స్పష్టత లేదు. నగరంలోని 62 దుకాణాల్లో చాలామంది నేటికీ అద్దె బకాయిలు ఉన్నట్లు మఠం సిబ్బంది చెబుతున్నారు. ప్రస్తుతం మరమ్మతుల కోసం ప్రభుత్వ సాయం కోరుతుండగా అద్దెల ఆదాయం, తిష్ఠ వేసిన వారిని ఖాళీ చేయించడంపై అధికారులు నోరు మెదపకపోవడంపై శ్రీవారి భక్తులు ఆవేదన చెందుతున్నారు. పైగా కొందరు గతంలో నిర్మించిన గదుల స్థానంలో మార్పులు, చేర్పులు చేసుకొని వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తున్నారు. ఇలాంటి వారి లెక్కలు బయటకు తీసి అద్దెలు వసూలు చేసేలా అడుగులు ముందుకు వేయాలని, ఆ తరువాతే మరమ్మతులు చేయాలని మరికొందరు సూచిస్తున్నారు. అయితే ఈ అంశంలో ఇటు అధికారులను అటు నేతలను మభ్యపెట్టే రీతితో కొందరు దుకాణదారులు మఠం ఆదాయానికి గండి కొట్టేలా చూస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రికార్డు స్థాయిలో 403 వినతులు

అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రికార్డు స్థాయిలో 403 వినతులు వచ్చాయి. సోమవారం కలెక్టరేట్‌లో శిక్షణ కలెక్టర్ సందీప్ రఘువాన్షీ, డీఆర్వో నరసింహులు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, శివశంకర్‌నాయక్, రోజ్‌మాండ్, సుధారాణితో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రెవెన్యూశాఖకు అత్యధికంగా 262 వినతులు వచ్చాయి. **తిరుపతి(నగరపాలిక):** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 33 వినతులు అందాయి. ఉప కమిషనర్ అమరయ్య సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాల ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకున్నారు.

వరకట్ననిషేధ చట్టం పటిష్ఠంగా అమలుచేయాలి

సమావేశంలో పాల్గొన్న ఐసీడీఎస్ పీడీ వసంతబాయి

తిరుపతి (భవానీనగర్), న్యూస్‌టుడే: వరకట్న నిషేధ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని ఐసీడీఎస్ పీడీ వసంతబాయి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఆధర్వంలో వరకట్న నిషేధ చట్టం అమలుపై ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీ మాట్లాడారు. జిల్లాలో ఎక్కడైనా వరకట్న వేధింపులకు గురైన మహిళలకు ఈ కమిటీ సభ్యులు అండగా ఉంటారన్నారు. మహిళలు వేధింపులకు గురైనప్పుడు టోల్ ఫ్రీ నెంబర్ 181లో చంప్రదించి సహాయం పొందాలన్నారు. మహిళా పోలీసు సీఐ తమీర్ అహ్మద్, క్రిష్ణ, రోజా రమణి, మంజరి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

జస్టిస్ ఎన్.నర్సింగ్‌రావు కుటుంబం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.నర్సింగ్‌రావు సోమవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

తిరుమల : శ్రీవారిని పలువురు ప్రముఖులు సోమవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో మూలమూర్తిని తితిదే మాజీ ఈవో ఎల్వీ సుబ్రహ్మణ్యం, నిర్మాత ఏఎం రత్నం, జనసేన నాయకుడు డా.హరిప్రసాద్, ఎమ్మెల్యే గణబాబు, హిందీ నటుడు తుషార్ కపూర్ దర్శించుకున్నారు.

ఆరోగ్య సమస్య.. కరుణించడయ్యా

కలెక్టరేట్‌లో ధర్మరాజు

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: రెండేళ్ల నుంచి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నా.. ఇప్పటికే అనేకసార్లు అధికారులను కలిసి పింఛన్ కోసం వినతులు ఇచ్చా.. ఇప్పటివరకు మంజూరు చేయలేదని ఏర్పేడు మండలం చిల్లూరుకు చెందిన సి.ధర్మరాజు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో పాల్గొని అధికారులకు ఆయన వినతిపత్రాన్ని అందజేశారు. పక్షవాతం రావడంతో నడవలేకపోతున్నానని.. ఇటీవల మెదడుకు సంబంధించి శస్త్రచికిత్స చేయించుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వం పింఛన్ మంజూరు చేస్తే ఆ నగదు మందులకు, వైద్య ఖర్చులకు ఉపయోగపడుతుందన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలంటూ ఆయన వేడుకున్నారు.

తిరుమలలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయండి

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో వివిధ ప్రదేశాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి ఆదేశించారు. సోమవారం స్థానిక శ్రీపద్మావతి విశ్రాంత గృహంలో తితిదే అధికారులతో సమీక్ష నిర్వహించారు.

■ వెంకటాద్రి నిలయం(పీఏసీ-5)లో యాత్రికుల సౌకర్యార్థం వేడినీటి సరఫరా కోసం సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలని, ప్రవేశద్వారం వద్ద స్టెయిన్‌స్టీల్ పాదరక్షల ర్యాక్‌లు ఏర్పాటుచేసి, ప్రతి యాత్రికుడు అందులోంచి వెళ్లేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. లాకర్లు, హాళ్లు, కల్యాణకట్ట, వైద్యసదుపాయాలు, అన్నప్రసాదం, రిసెప్షన్ విభాగాలను సమన్వయం చేసి డైనమిక్ ఇన్ఫర్మేషన్ రూపంలో పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్ ద్వారా ప్రకటించాలని ఆదేశించారు.

■ రెండో ఘాట్‌రోడ్డులో సైన్ బోర్డులు, రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించాలని, అక్కగార్లగుడి వద్ద కొండలపై నుంచి పడే వర్షపు నీటిని మళ్లింపునకు కల్వర్టులు ఏర్పాటుచేసి అటవీమార్గంలోకి మళ్లించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఈ సత్యనారాయణను ఆదేశించారు.

■ తిరుమలలోని ఘనవ్యర్థాల నిర్వహణలో భాగంగా ఐటీసీఎల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో నిర్వహించిన వివిధ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు పరీక్షల కార్యాలయం అధికారులు సోమవారం తెలిపారు. ఎం.ఫార్మసీ ద్వితీయ సెమిస్టర్, 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఫుడ్ టెక్నాలజీ 7, 9వ సెమిస్టర్ల ఫలితాలను విడుదల చేసి ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

734 డిజిటల్ వేయింగ్ యంత్రాల పంపిణీ

పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ తదితరులు

తిరుపతి (భవానీనగర్: టాటా ట్రస్టు సహకారంతో విజయవాహిని ఛారిటబుల్ ఫౌండేషన్ ద్వారా 734 డిజిటల్ వేయింగ్ యంత్రాలను ఐసీడీఎస్ ప్రాజెక్టులకు అందజేయడం అభినందనీయమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. సోమవారం కరెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు.. పిల్లలు, గర్భిణుల పోషకాహారస్థితిని తెలుసుకోవడంలో యంత్రాలు ఉపయోగ పడతాయన్నారు. ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షీ, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వసంతబాయి, టాటా ట్రస్టు జిల్లా కార్యక్రమ అధికారి అమరావతి, ప్రోగ్రామ్ అసోసియేట్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు

పాకాల: ఈనెల 26న భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మొగరాల ఉన్నత పాఠశాల విద్యార్థి జ్యోత్స్న ప్రథమస్థానం దక్కించుకుంది. హెచ్ఎం సుమలత, ఉపాధ్యాయులు వెంకటసిద్ధులు, రామ్మూర్తి, సుల్తాన్, ఆదికేశవులు, విమలావిక్టోరియా తదితరులు సోమవారం అభినందించారు. అమరావతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లోనూ సత్తాచాటాలని వారు ఆకాంక్షించారు.

పీఠాధిపతికి తితిదే పెద్దమర్యాద

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీ వానమామలి మఠం పీఠాధిపతి శ్రీవానమామలి జీయర్‌కు సోమవారం తితిదే పెద్దమర్యాద చేసింది. పాత అన్నదాన భవనం వద్ద ఉన్న రావిచెట్టు వద్దకు చేరుకోగా తితిదే అర్చకులు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఇస్తికఫాల్ స్వాగతం పలకి శ్రీబేడి ఆంజనేయ స్వామి వారి దర్శనం, అనంతరం శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఏఈవో మునిరత్నం, పారుపత్తేదార్ హిమంతగిరి తదితరులు పాల్గొన్నారు.

శెట్టిపల్లి లేఅవుట్ పనులకు సన్నాహాలు

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: శెట్టిపల్లి లేఅవుట్ అభివృద్ధి పనులకు సన్నాహాలు చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి అధికారులకు సూచించారు. రెవెన్యూ, తుడా, రిజిస్ట్రేషన్, సర్వే తదితర శాఖలతో సోమవారం సమీక్షించారు. అనంతరం తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ శెట్టిపల్లి భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని, త్వరలోనే పట్టాల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

తితిదేకు విద్యుత్తు వాహనాల వితరణ

తిరుమల, న్యూస్‌టుడే: తితిదేకు ధర్మవరానికి చెందిన వేణుమోటార్స్ అధినేత డి.వేణుగోపాల్ రూ.1.50 లక్షల విలువైన మూడు ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలను సోమవారం విరాళంగా అందజేశారు. ఆలయం ఎదుట వాటికి పూజలు నిర్వహించి తాళాలను శ్రీవారి ఆలయ ఏఈవో మోహన్‌రాజు, తితిదే ట్రాన్స్‌పోర్ట్ విభాగం ఇన్‌ఛార్జి హరిబాబులకు అందజేశారు.

విద్యార్థులకు విందు భోజనం

పాకాల, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చక్కగా రాణించాలని వారిని ప్రోత్సహిస్తూ మండలంలోని రవణయ్యగారిపల్లి ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన రఘునాథరెడ్డి, అనసూయమ్మ దంపతులు చక్కని రుచులతో సోమవారం శుభదిన్‌భోజన్ ఏర్పాటు చేశారు. ఎంఈవోలు బాబ్జీ, లింగయ్య, ప్రధానోపాధ్యాయుడు కె.జీలానీ, ఉపాధ్యాయులు జి.యువరాజు, ఉదయ్, మధుమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓపీ.. పాట్లు

▸ ఓపీ విభాగం వద్ద రోగుల వాగ్వాదం ▸ క్యూలో నిల్చోలేక బయట ఇలా..

కుటంబ సభ్యుల సాయంతో వస్తూ..

రుయా ఓపీ విభాగం సోమవారం వచ్చిందంటే చాలు కిటకిటలాడుతోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు, రోగుల బంధువులు బారులు తీరుతున్నారు. ఓపీ చీటీ కోసం అడ్డదారుల్లో వస్తుండటంతో రోగుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంటోంది. క్యూలో నిలువలేని రోగులు విభాగం బయట ఉంటున్నారు. వీల్‌ఛైర్లు తగినన్ని లేకపోవడంతో బంధువుల సాయంతో కష్టాలు పడుతూ వస్తున్నారు.

- ఈనాడు, తిరుపతి

రాష్ట్రస్థాయి ఫ్లోర్‌బాల్ విజేత

అండర్-17 బాలికల విభాగంలో విజేత తిరుపతి జట్టు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో నిర్వహించిన అండర్-12, 17 రాష్ట్ర స్థాయి బాల బాలికల ఫ్లోర్‌బాల్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీలను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సుబ్బరాయగుప్తా ప్రారంభించి మాట్లాడారు. అండర్-17 బాలుర విభాగంలో తిరుపతి జట్టు విజేతగా నిలవగా, రెండో స్థానాన్ని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ దక్కించుకుంది. అండర్-17 బాలికల విభాగంలో మొదటి స్థానం తిరుపతి జిల్లా, రెండో స్థానం చిత్తూరు సొంత చేసుకున్నాయి. అండర్-12 బాలుర విభాగంలో మొదటి స్థానం నరసరావుపేట ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్, తిరుపతి 2వ స్థానం, పల్నాడు జిల్లా జట్టు మూడో స్థానం సాధించాయి.

ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కొనసాగింపుపై వివాదం

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: అలిపిరి మార్గంలోని స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్(ఎస్.ఐ.హెచ్.ఎం.) ఉద్యోగులకు 25 నెలలుగా జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్న ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రమణ ప్రసాద్‌ను మరోసారి కొనసాగించడాన్ని నిరసిస్తూ ఉద్యోగులు సోమవారం ఆందోళన చేపట్టారు. పొరుగుసేవల విధానంలో పని చేస్తున్న ఉద్యోగులపట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్న పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్ గత ప్రభుత్వ హయాంలో తీవ్ర వేధింపులకు గురిచేశాడని, కూటమి ప్రభుత్వ హయాంలో ఆయన వేధింపులు ఉండబోవని ఊహించిన ఉద్యోగుల ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లుతూ డిప్యుటేషన్ కాలాన్ని నాలుగో సంవత్సరం కొనసాగిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. డిప్యుటేషన్ కాలాన్ని పొడిగించుకున్నందుకు సత్కారాలు చేయించుకోవడాన్ని నిరసిస్తూ ఉద్యోగులు విధులు బహిష్కరించి కార్యాలయం ముందు ఆందోళన వ్యక్తం చేశారు.

ధోబీఘాట్‌ను రక్షించాలని వినూత్న నిరసన

తిరుపతి (గ్రామీణ) : ఆక్రమణదారుల చెర నుంచి ధోబీఘాట్‌ను కాపాడి ఆ స్థలాన్ని రజకులకు కేటాయించాలని రజకవృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మునిరత్నం, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జయచంద్ర డిమాండు చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద రజకులు దుస్తులు ఉతికి వినూత్నంగా నిరసన తెలిపారు. వేదాంతపురం అగ్రహారంలో సర్వే నంబర్ 214లో రజకులకు 56 సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేయగా. . కొందరు అడ్డుపడి, ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. ఇటీవల కలెక్టర్‌కు విన్నవించగా.. ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టాలని తహసీల్దార్‌కు ఫోన్‌చేసి సూచించినా స్పందన లేదన్నారు. ప్రభుత్వ భూమి అని తేలితే బోర్డు ఏర్పాటుచేస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

చదరంగంలో ప్రతిభ

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: 19వ ఆసియా స్కూల్స్ బ్లిడ్జ్ చదరంగం ఛాంపియన్‌షిప్- 2025లో తిరుపతి క్రీడాకారిణి వంటి త్రిపురాంబిక ప్రతిభకనబరిచింది. అక్టోబరు 24 నుంచి ఈనెల 2 వరకు మంగోలియా వేదికగా జరిగిన ఛాంపియన్‌షిప్‌లో 16 దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా, భారత్ తరపున అండర్- 13 బాలికల విభాగంలో ప్రతినిధ్యం వహించిన త్రిపురాంబిక తృతీయ స్థానంలో నిలిచింది. సంఘం జిల్లా ఛైర్మన్ దివాకర్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస సూరి, సీఏవో బాలాజీ చౌదరి అభినందనలు తెలియజేశారు.

తిరుచ్చిపై శ్రీసుందరరాజస్వామి

తిరుచానూరు, న్యూస్‌టుడే: శ్రీపద్మావతీ అమ్మవారి ఆలయంలో కొలువుదీరిన శ్రీసుందరరాజస్వామి సోమవారం రాత్రి తిరుచ్చిపై తిరుమాడ వీధుల్లో ఊరేగారు. స్వామివారి జన్మనక్షత్రం ఉత్తరాభాద్రను పురస్కరించుకుని కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీసుందరరాజస్వామి తిరుచ్చిపై భక్తులకు అభయం ప్రదానం చేశారు.

తూముగుంట చెరువు పరిశీలన

చెరువును పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

చిన్నగొట్టిగల్లు, న్యూస్‌టుడే: గండి పడిన చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండలోని తూముగుంట చెరువును ఎమ్మెల్యే పులివర్తి నాని సోమవారం పరిశీలించారు. వరదతో పంటలు నష్టపోయిన రైతుల వివరాలు సేకరించాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామాల్లో ద్విచక్ర వాహనంపై తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాగ్యలక్ష్మి, అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

రైలు ఎక్కుతూ జారిపడి వ్యక్తి మృతి

తిరుపతి (నేరవిభాగం): తిరుపతి నుంచి కొల్హాపూర్ వెళ్లే హరిప్రియ ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం రాత్రి స్టేషన్ నుంచి కదులుతుండగా గుర్తు తెలియని వ్యక్తి రైలు ఎక్కేందుకు యత్నించాడు. కాలు జారడంతో రైలుకు, ప్లాట్‌ఫాంకు మధ్య పడి మృతి చెందారు.

ఇరువర్గాల దాడులపై కేసు

తిరుపతి (నేరవిభాగం): గాంధీపురం పంచాయతీలో రాజేశ్వరరావుకు చెందిన స్థలాన్ని 2017లో యశోద అద్దెకు తీసుకుంది. అద్దె సక్రమంగా చెల్లించకపోవడంతో స్థల యజమాని బలవంతంగా ఖాళీ చేయించడంతో ఇద్దరి మధ్య గొడవలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో దాడులకు పాల్పడినట్లు ఇరువురు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపారు.

మరో ఘటనలో..

తిరుపతి (నేరవిభాగం): స్థానిక కాటన్ మిల్లు సమీపంలోని రవీంద్రనగర్‌లో కొల్లాపురి (60) కుటుంబంతో కలసి గేదెలు మేపుకొంటున్నాడు. అతనికి చిత్తూరు సమీప ప్రాంతానికి చెందిన యువకుడు పరిచయమయ్యాడు. ఆదివారం గేదెల వద్ద ఉన్న కొల్లాపురి వద్దకు వచ్చిన యువకుడు వృద్ధుడితో గొడవపడి రాయితో దాడికి పాల్పడ్డాడు. వృద్ధుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి యువకుడి కోసం దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఏడాది జైలు

తిరుపతి(లీగల్): తిరుపతి అటవీ ఫ్లైయింగ్ స్క్వాడ్ పరిధిలో నమోదైన ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో గంగాధర నెల్లూరు మండలం గోవిందరెడ్డిపల్లికి చెందిన ఆదు సంతోష్ కుమార్‌కు ఏడాది జైలుశిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ తిరుపతిలోని రాష్ట్ర స్థాయి ఎర్రచందనం కోర్టు ప్రత్యేక మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి ఎస్.శ్రీకాంత్ సోమవారం తీర్పు వెలువరించినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.శాంతి, కోర్టు లైజన్ అటవీ అధికారులు ఇ.బాబు ప్రసాద్, ఎం.రఘు, ఎం.ప్రసాద్ కుమార్ తెలిపారు.

భద్రతా ప్రమాణాలు విస్మరిస్తే చర్యలు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: మోటారు వాహన చట్టం నిబంధనలను కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సు నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలని జిల్లా రవాణా శాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ పేర్కొన్నారు. సోమవారం డీటీవో కార్యాలయంలో జిల్లాలోని ప్రైవేట్ ట్రావెల్ బస్సు యజమాన్యాలు, నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. బస్సు బాడీ, భద్రతా ప్రమాణాల గురించి చోదకులకు అవగాహన పెంచాలని చెప్పారు. తిరుపతి నుంచి పలు ప్రాంతాలకు ప్రయాణికులను తీసుకెళ్లి.. తీసుకొచ్చే బస్సులపై నిత్యం నిఘా ఉంచుతామని హెచ్చరించారు.

మొదట సమీప స్టేషన్లలో ఫిర్యాదులు ఇవ్వండి

పీజీఆర్ఎస్‌కు వచ్చిన ప్రత్యేక ప్రతిభావంతుడితో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: ప్రజలు ఏదైనా సమస్యకు గురైతే మొదట సమీప పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాలని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. అలా కాదని నేరుగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి రావడం వల్ల.. సమస్యను అధ్యయనం చేయడంలో జాప్యం జరుగుతోందని వెల్లడించారు. సోమవారం డీపీవోలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 123 ఫిర్యాదులు అందాయి. శ్రీకాళహస్తికి చెందిన ప్రత్యేక ప్రతిభావంతుడి వద్దకు ఎస్పీ వచ్చి సమస్య గురించి ఆరా తీశారు. ఓ కేసుకు సంబంధించిన నిందితుల అరెస్టు గురించి విన్నవించగా.. పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

నరసింహయాదవ్‌పై పెట్టిన కేసు కొట్టివేత

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికల్లో దొంగ ఓటర్లను పట్టుకుని అధికారులకు అప్పగిస్తే నాడు వైకాపా నాయకులపై కాకుండా తెదేపా నాయకుడు నరసింహయాదవ్, ఆయన సోదరుడు రామాయాదవ్, ఆయన సతీమణి 3వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి శాంతిపై పెట్టిన అక్రమ కేసులను సోమవారం 4వ అదనపు సివిల్ జడ్జి న్యాయ స్థానం కొట్టేసింది. ఈ సందర్భంగా కోర్టు వద్ద నరసింహయాదవ్ మాట్లాడుతూ గత నాలుగు సంత్సరాలుగా తప్పుడు కేసు కారణంగా కోర్టు చుట్టూ తిరుగుతున్నామని ఎట్టకేలకు న్యాయమే గెలిచిందన్నారు.

వైద్య విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: రుయాలో విధులు నిర్వహిస్తూ ఆదివారం అర్ధరాత్రి అల్పాహారం తీసుకునేందుకు వెళ్తున్న ఇద్దరు జూనియర్ వైద్యులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని వైద్య విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. రుయా సమీపంలో రాత్రి వేళల్లో వైద్యులను గుర్తింపు కార్డు అడగ్గా చూపించారని.. పోలీసులు ముగ్గురు మఫ్టీలో ఉండటంతో మీరు ఎవరంటూ ప్రశ్నించిన వైద్యులపై వారు ఇష్టానుసారంగా దాడి చేశారని ఆరోపించారు.

వైద్యుడి పెన్షన్‌లో కోత

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: తిరుపతి కార్మిక రాజ్య బీమా (ఈఎస్ఐ) ఆస్పత్రి విశ్రాంత స్పెషల్ గ్రేడ్ సివిల్ సర్జన్ డాక్టర్ సీకే రమేష్ కుమార్ పెన్షన్‌లో కోత విధిస్తూ ఆరోగ్య వైద్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన కర్నూలు జిల్లాలో ఈఎస్ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పని చేశారు. ఆ సమయంలో అర్హత లేని వ్యక్తులు వైద్యులుగా నియమితులయ్యారని.. నర్సింగ్ హోమ్‌లు, ఆస్పత్రులు స్థాపించి రోగులకు చికిత్స అందిస్తున్నారని ఫిర్యాదులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ చేపట్టింది. ఆ సమయంలో సాధారణ క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం ఆయన మూడేళ్ల పెన్షన్‌లో 9 శాతం కోత విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

రైతు నేస్తం.. వెంకట్రామిరెడ్డి

వెంకట్రామి రెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కుటుంబ సభ్యులు

తిరుపతి(గాంధీ రోడ్డు), న్యూస్‌టుడే: రైతు బాంధవుడు, రైతు నేస్తం మాగాంటి వెంకట్రామి రెడ్డి అని కుటుంబ సభ్యులు కొనియాడారు. ఆయన 36వ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డులోని వారి స్వస్థలంలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం ఆయన సతీమణి రామలక్ష్మమ్మ ఇతర కుటుంబ సభ్యులు పేదలకు అన్నదానం చేశారు.

రెక్టార్ అప్పారావుకు సత్కారం

అప్పారావును సన్మానిస్తున్న తిప్పారెడ్డి, బిజయకుమార్ బెహరా తదితరులు

తిరుపతి (ఎస్వీయూ): ఎస్వీయూ నూతన రెక్టార్‌గా బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఆచార్యులు సీహెచ్ అప్పారావును సోమవారం అంబేద్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్ ఛైర్మన్ డా.తిప్పారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కళాశాల ప్రిన్సిపల్‌డా.బిజయ కుమార్ బెహారా, సెక్రటరీ ఆర్.లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు

మృత్యుంజయ శివలింగానికి అభిషేకాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయంలో కొలువుదీరిన శ్రీమృత్యుంజయ శివలింగానికి విశేష అభిషేకాలు నిర్వహించారు. కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని ఈ విశేష వేడుకలు జరిపారు. గోక్షీరంతో పాటు వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకాలు చేయడంతో పాటు ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. ఈ విశేషోత్సవంలో పాల్గొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

శ్రీకాళహస్తీశ్వరస్వామి చిత్రపటాలకు పూజలు

దీపాలు వెలిగించిన ఆలయ అధికారులు, ట్రస్టుబోర్డు సభ్యులు

శ్రీకాళహస్తి: కార్తిక మాసం, సోమవారాన్ని పురస్కరించుకుని వైష్ణవ పుష్కరిణిలో ఏర్పాటు చేసిన కార్తిక దీపోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. శ్రీజ్ఞానప్రసూనాంబికా సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి చిత్రపటాలకు విశేష పూజలు జరిపారు. అనంతరం భక్తులందరూ కార్తిక దీపాలు వెలిగించారు. ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్, ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు గుర్రప్పశెట్టి, రాఘవయ్య, ప్రత్యేక ఆహ్వానితులు శైలజ, ఆలయ సూపరింటెండెంట్ నాగభూషణం, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యూలైన్లలో నిరీక్షిస్తున్న భక్తులు

దర్శనం.. ఆలస్యం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయ దర్శనార్థం వచ్చిన భక్తులు దర్శనం ఆలస్యం కావడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కార్తికమాసం, సోమవారం సందర్భంగా వేకువజామున ఆలయం తెరిచే సమయానికి భక్తులు అశేష రీతిలో తరలివచ్చారు. క్యూలైన్లన్నీ నిండిపోయాయి. మహద్వారం నుంచి వెళ్లే వారు ఎక్కువగా ఉన్నా దర్శనం అయ్యాక ఎక్కువ మంది ఆలయంలోనే ఉండిపోవడంతో ఆలయంలో రద్దీ నెలకొంది. దళారుల ఆటకట్టించేందుకు ఆలయ ఈవో బాపిరెడ్డి రద్దీ సమయంలో ఆలయంలో తనిఖీలు జరుపుతూ సర్వదర్శనం క్యూలైన్లు శీఘ్రంగా వెళ్లేలా చర్యలు చేపట్టారు.

పురవీధుల్లో ఉత్సవర్ల శోభ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీజ్ఞానప్రసూనాంబిక సమేత సోమస్కందమూర్తి చతుర్మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని రాత్రి ఈ విశేషోత్సవాన్ని జరిపారు.

పద్మసరస్సులో విహరించిన శ్రీనివాసుడు

నారాయణవనం: స్థానిక శ్రీపద్మావతి సహిత కల్యాణ వేంకటేశ్వరస్వామి కార్తిక తెప్పోత్సవాలలో భాగంగా సోమవారం దేవేరులతో పద్మసరస్సులో భక్తులకు దర్శనం కల్పించారు. మూడు పర్యాయాలు కోనేరులో విహరించారు. ఏర్పాట్లను తితిదే సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారులు నాగరాజు, భరత్, ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, అర్చకులు శ్రీనివాస్ భట్టాచార్య, నరసింహరాఘవ భట్టాచార్య, సిబ్బంది పర్యవేక్షించారు.

ఘనంగా ప్రదోష పూజలు

నాగలాపురం, న్యూస్‌టుడే: నాగలాపురంలోని నాగలింగేశ్వరాలయం, సురుటుపల్లి పల్లికొండేశ్వరాలయం, కారణిలోని కారణేశ్వరాలయాల్లో ప్రదోష పూజలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లోని మూలవర్లకు ఉదయం అభిషేకాలు చేసిన అర్చకులు సాయంత్రం నందీశ్వరుడిని పంచతీర్థాలతో అభిషేకించి అలంకరించారు. పల్లికొండేశ్వరాలయంలో ఏర్పాట్లను ఆలయ ఛైర్మన్ పద్మనాభరాజు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక సోమవారం

రేణిగుంట, న్యూస్‌టుడే: కార్తిక సోమవారం వేడుకలను మండలంలో భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. గాజులమండ్యం లోని శ్రీకామాక్షి సమేత మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో, వెదల్లచెరువులోని జ్యోతిర్లింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

త్రిమూర్తులకు ప్రత్యేక పూజలు

ఏర్పేడు, న్యూస్‌టుడే: బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కొలువుదీరిన గుడిమల్లంలోని శ్రీపరశురామేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్తిక సోమవారం కావడంతో శ్రీఆనంద వల్లీదేవి సమేత శ్రీపరశురామేశ్వరస్వామికి సహస్ర లింగార్చన, మహాప్రదోష అభిషేకం, జ్వాల లింగార్చన నిర్వహించారు. ఈవో రామచంద్రారెడ్డి, మాజీ ఛైర్మన్ గిరినాయుడు, అధికారులు పాల్గొన్నారు.

కదలని నీళ్లు.. కష్టాల లోగిళ్లు

రైల్వే వంతెనలతో తప్పని కష్టాలు

కాపుగున్నేరి మార్గంలో అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన వర్షపు నీరు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: వర్షం వచ్చిందా.. మళ్లీ నిలిచింది. అయినా రైల్వే వంతెన కింద నీటి నిల్వలు అలాగే ఉండటం, చుట్టు పక్కల నుంచి ఇప్పటికీ నీటి ధారలు వచ్చి పడటంతో మడుగులను తలపిస్తున్నాయి. రైళ్ల రాకపోకల సందర్భంగా ఇబ్బందులు తప్పించేందుకు వీలుగా రైల్వే శాఖ ఈ వంతెనలను ఏర్పాటు చేసింది. వర్షాకాలంలో నానా అవస్థలు మాత్రం తప్పడం లేదు.

వర్ష భయం: వర్షా కాలం వస్తోందంటే.. వర్షాలు పడితే రైల్వే అండర్ బ్రిడ్జిల కింద నీటి నిల్వలు తగ్గుముఖం పట్టడం లేదు. వర్షం నిలిచి పోయి రోజులు గడుస్తున్నా నీటి నిల్వలు మాత్రం అలాగే ఉంటున్నాయి.

పొంచి ఉన్న ప్రమాదం: భారీగా వర్షాలు పడితే వంతెనల కింద పెద్ద ఎత్తున నీళ్లు నిల్వ చేరిపోతున్నాయి. ఎంత లోతున్నాయన్నది గుర్తించడం కష్టమే. ఈ పరిస్థితుల్లో ద్విచక్ర వాహన చోదకులు దాటేందుకు ప్రయత్నించడం, మధ్యలో వాహనాలు ఆగి పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కొందరు పిల్లలు లోతు ఉండదని దాటేందుకు ప్రయత్నించి ప్రమాదాల్లో చిక్కుకున్న పరిస్థితులు లేకపోలేదు. వర్షపు నీటి నిల్వలు మళ్లించేందుకు వీలుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తే బావుంటుందని గ్రామస్థులు కోరుతున్నారు.

● రేణిగుంట నుంచి తిరుపతికి వెళ్లే మార్గం టోల్‌గేట్ సమీపంలో రైల్వే వంతెన కింద వర్షం వస్తే నీళ్లు మడుగులా నిలబడిపోతాయి. భారీ వాహనాలకు ఇబ్బందులు ఉండవు. చిన్నపాటి కార్లు, ద్విచక్ర వాహన చోదకులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అందులోనూ గుంతల్లో వాహనాలు ఇరుక్కుపోయి మరిన్ని సమస్యలతో ఇబ్బందులు తప్పడం లేదు.

● రేణిగుంట నుంచి కరకంబాడికి వెళ్లే మార్గంలోను ఇదే పరిస్థితి. అక్కడ వాహన చోదకులకు అవస్థలు తప్పడం లేదు.

● శ్రీకాళహస్తి మండలం కాపుగున్నేరి గ్రామంలోకి వెళ్లాలంటే ఈ మార్గం గుండా వెళ్లాల్సిందే. నీళ్లు నిల్వ చేరి ఉండటంతో గ్రామస్థులకు అవస్థలు తప్పడం లేదు.

● చెర్లోపల్లి గ్రామం నుంచి రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు వీలుగా ఈ మార్గాన్ని ఏర్పాటు చేశారు. వర్షం కారణంగా నిల్వ చేరిన నీటితో రోజుల తరబడి అలాగే ఉండటం, ప్రత్యామ్నాయ మార్గం లేక పోవడంతో రైతులు దుర్గంధం వస్తున్నా ఈ నీటి గుండానే పొలాలకు వెళ్లాల్సి వస్తోంది.

● అక్కుర్తి గ్రామం వద్ద గ్రామస్థులకు రాకపోకలకు ఇదే ప్రధాన మార్గం. వర్షం పడితే ఇక్కడ నీళ్లు చెరువులను తలపిస్తుంటాయి. దీంతో ఇటు వైపుగా వచ్చేందుకు గ్రామస్థులు భయాందోళనలకు గురవుతుంటారు. అందుకని ప్రమాదమని తెలిసినా రైలు పట్టాలు దాటి వెళ్లేందుకు ఆసక్తిని చూపాల్సిన పరిస్థితి.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

సత్యవేడు, న్యూస్‌టుడే: సమస్య: కన్నావరం, జడేరికి వేళ్లే క్రాస్ వద్ద బస్సు కోసం వేచి ఉండే పాఠశాల విద్యార్థులు, ప్రయాణికులు వర్షానికి తడుస్తూ అసౌకర్యానికి గురవుతున్నారు. బస్‌షెల్టర్ నిర్మించాలి. **- రాకేష్**

సమాధానం: కన్నావరం, జడేరిక్రాస్ వద్ద బస్‌షెల్టర్ నిర్మాణానికి గతంలో ఎంపీకి విన్నవించాం. మరోమారు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. **- బుజ్జమ్మ, సర్పంచి, జడేరి**

నారాయణవనం, న్యూస్‌టుడే: సమస్య: పాలమంగలం ఉత్తరం వెళ్లే రహదారి చెత్త నిల్వలు పేరుకు పోవడంతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- నారాయణ**

సమాధానం: రహదారి పక్కన చెత్త నిల్వలు లేకుండా చర్యలు తీసుకుంటాం. **- ఆనంద్, పంచాయతీ కార్యదర్శి**

కేవీబీపురం, న్యూస్‌టుడే: సమస్య: మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనం మీద నుంచి నిత్యం తాగునీరు వృథాగా పోతుంది. వృథా నీటిని నివారించాలి. - రాజేంద్ర

సమాధానం: స్త్రీశక్తి భవనం నుంచి నీటి వృథా అవుతున్న విషయం తనదృష్టికి రాలేదు. రెండు రోజుల్లో సమస్యను గుర్తించి పరిష్కరిస్తాం. **- మాలతి, ఎంపీడీవో**

నారాయణవనం, న్యూస్‌టుడే: సమస్య: మండలంలోని చిరంజీవి ఎస్టీ కాలనీలో కాలువల్లో వ్యర్థాలు పేరుకు పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- విజయ్**

సమాధానం: కాలువల్లో వ్యర్థాలను తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. **- వేనయ్య, ఈవోపీఆర్డీ**

చెత్త కుండీల శుభ్రం

రేణిగుంట, న్యూస్‌టుడే: రేణిగుంట పంచాయతీ లోని పత్నికులం, జ్యోతినగర్, అన్నెనగర్, గణేష్‌నగర్, పాతచెక్‌పోస్ట్ ప్రాంతాల్లో పంచాయతీ సిబ్బంది శుభ్రత చర్యలు చేపట్టారు. వారం రోజులుగా ఇక్కడ పేరుకు పోయిన వ్యర్థాలు తొలగించక పోవడంతో ఈనాడులో సోమవారం పారిశుద్ధ్యం అధ్వానం శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు శుభ్రత చర్యలు చేపట్టారు.

తాగునీటి ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

'పల్లెల ప్రగతితో ప్రజల రుణం తీర్చుకుంటా'

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల ప్రగతితో తన జీవితం సార్థకమయ్యేలా ప్రజల రుణం తీర్చుకోవాలన్నదే తన ఆశయమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మండలంలోని నీర్పాకోటలో రూ.35లక్షలతో నూతనంగా నిర్మించిన తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకును, రూ.20లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమర్థత నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి పథకాలతో ప్రజలు హర్షిస్తున్నారన్నారు. డీవీఎంసీ సభ్యుడు గుత్తి త్యాగరాజు, అధికారులు పాల్గొన్నారు. ఎస్సై హరిప్రసాద్ గైర్హాజరై, ఇద్దరు పోలీసు సిబ్బందిని పంపడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ భద్రత నాకొద్దు.. వెళ్లిపోండి అంటూ సిబ్బందిని కోరారు. ప్రొటోకాల్‌పై పోలీసులు అనుసరిస్తున్న తీరుపై ఆయన మండిపడ్డారు.

ముక్కంటి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటీశుని సేవలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప దంపతులు సోమవారం పాల్గొన్నారు. స్థానిక 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసనాయక్, ఆలయ ఏఈవో మోహన్ తదితరులు పాల్గొన్నారు. ● తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నర్సింగ్‌రావు వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. ఆలయ ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. దర్శనానంతరం వీరికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి దంపతులతో ఆలయ అధికారులు

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నర్సింగ్‌రావుకు జ్ఞాపికను అందజేస్తున్న అధికారులు

జడేరి-అల్లప్పగుంట బీటీ రోడ్డుకు భూమిపూజ

సత్యవేడు, న్యూస్‌టుడే: మండలంలోని కన్నావరం, జడేరి క్రాస్ ప్రధాన రహదారి వద్ద జడేరి సర్పంచి బుజ్జమ్మ ఆధ్వర్యంలో రూ.2.20 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు సోమవారం భూమి పూజ నిర్వహించారు. సుమారు ఐదు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు పనులు చేపట్టనున్నారు. తెదేపా నాయకులు జడేరి బాబు, కనకరాజు, మాజీ సర్పంచులు సిద్ధయ్య, సుబ్రహ్మణ్యం, కాంట్రాక్టర్ చంద్రమోహన్, నాయకులు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

విజేతలతో ఎంఈవో రవి, ప్రధానోపాధ్యాయులు

సత్యవేడు: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి వక్తృత, వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కేవీబీపురం మండలం జడ్పీహెచ్‌ఎస్ చెందిన అన్నిమేరి ప్రథమ స్థానం, ఇరుగుళం జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన కౌషిత ద్వితీయ స్థానం, కాంళంగి జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ప్రశాంతి తృతీయ స్థానం, కలివెట్టు పాఠశాలకు చెందిన ఇషాంత్ నాల్గవ స్థానంలో నిలిచారు. ఎంఈవో రవి, ఎంఈవో-2 ఉష, ప్రధానోపాధ్యాయులు విమల, చినబాబు, పాండురంగయ్య, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వర్షం తగ్గినా.. రొచ్చు తగ్గలే

వర్షం తగ్గినా పలు గ్రామాల్లోని వీధుల్లో మాత్రం రొచ్చు తగ్గలేదు. మండలంలోని శ్రీనివాసపురం, బంగారమ్మకండ్రిగ, జయలక్ష్మీపురం, వేములపూడి, ఆదవరం, దిగువపుత్తూరు గ్రామ వీధుల్లో వర్షపునీరు నిలిచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దోమల బెడద అధికంగా మారి అంటురోగాలు వ్యాపిస్తున్నాయి. **- న్యూస్‌టుడే, కేవీబీపురం**

సగంలో ఆపేసి.. సర్పాలకు దారిచ్చి

మండలంలోని చిట్టత్తూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో తరచూ సర్పాలు చొరబడుతుండటం విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. పాఠశాల చుట్టూ మూడు వైపులా ప్రహరీ నిర్మించినప్పటికీ ఎదురుగా కొంత వరకు నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు. అటువైపు చెరువు ఉండడంతో తరచూ పాముల బెడద తప్పడంలేదు. అసంపూర్తిగా నిలిచిన ప్రహరీ నిర్మాణం పూర్తిచేసే వరకు ప్రమాదం పొంచి ఉందని విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. **- న్యూస్‌టుడే, తొట్టంబేడు**

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యమేల

స్థానిక తపాలా కార్యాలయం ఎదురుగా జరిగే శుభ కార్యక్రమాల వ్యర్థాలను నిర్వాహకులు రహదారిపైనే పడేస్తున్నారు. పారిశుద్ధ్యంపై పంచాయతీ సిబ్బంది పని చేస్తున్నా రహదారి ప్రక్కన చెత్తాచెదారాలు పడవేస్తుండటంతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతోంది. ఈ విషయమై సర్పంచి చిన్నదురైసుధను వివరణ కోరగా తాను గ్రామంలోని అన్ని మండపాల నిర్వాహకులకు సూచనలు చేసి పారిశుద్ధ్యంపై శ్రద్ధ చూపిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, నాగలాపురం**

ట్రస్టుబోర్డు సభ్యుడిగా లక్ష్మీనారాయణ

లక్ష్మీనారాయణతో నారా రోహిత్ దంపతులు, ఆలయ అధికారులు, కూటమి నేతలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పుటపర్తికి చెందిన తెదేపా నేత చిన్నపోల్ల లక్ష్మీనారాయణ ముక్కంటి ఆలయ ట్రస్టుబోర్డు సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. గత నెల 26వ తేదీన నిర్వహించిన ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఈయన గైర్హాజరయ్యారు. దీంతో సోమవారం ఆలయంలోని శ్రీమేధా దక్షిణామూర్తి సన్నిధి వద్ద ఆలయ ఈవో బాపిరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ట్రస్టుబోర్డు సభ్యులు లక్ష్మీనారాయణ నారా రోహిత్ స్నేహితుడి తండ్రి కావడంతో హాజరయ్యారు. ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, ఎంజీఎం అధినేత మల్లికార్జుననాయుడు, రిపబ్లిక్ క్లబ్ అధ్యక్షులు ప్రసాద్, విజయకుమార్, నేతలు పాల్గొన్నారు.

జోరుగా మట్టి అక్రమ రవాణా

వరదయ్యపాలెం: సరిహద్దు ప్రాంతంలో మళ్లీ మట్టి అక్రమరవాణాకు తెరతీశారు. మండలానికి చిట్టచివరన గల కారిపాకం నుంచి కూతవేటు దూరంలోనే సూళ్లూరుపేట, తడ మండలాల పరిధి గ్రామాలున్నాయి. జాతీయ రహదారి మీదుగా గల ఈ రెండు ప్రాంతాల్లో ఇటీవల రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంది. దీంతో భూ అభివృద్ధి పనులకు వందలాది వాహనాల మట్టి అవసరమై ఉంది. ఇటీవల కాలంలో మట్టి అక్రమ రవాణా నిలిచిపోయింది. అదను కోసం చూస్తున్న మట్టిమాఫియా మరోసారి అక్రమ రవాణాకు తెరలేపారు. కారిపాకం చెరువు నుంచి గ్రావెల్‌ను సమీపంలోనే తడ, సూళ్లూరుపేట మండలాలకు తరలిస్తున్నారు.

ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా కారిపాకం నుంచి విరయ్యపాళెం మీదగా జాతీయ రహదారిని కలుపుతూ ఉండే అడ్డదారిలో ట్రాక్టర్ల ద్వారా మట్టిని కొల్లగొట్టి తరలిస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు మౌనం వహించడంతో పలు విమర్శలకు దారి తీస్తోంది.

వసతిగృహ విద్యార్థులకు దుప్పట్ల వితరణ

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న శ్రీసత్యసాయి ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

తొట్టంబేడు, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వసతిగృహ విద్యార్థులకు దుప్పట్లు వితరణగా అందజేశారు. శ్రీకాళహస్తి పట్టణంలోని బీసీ వసతి గృహంలోని సుమారు వంద మంది విద్యార్థులకు ట్రస్ట్ సభ్యులు సోమవారం పంపిణీ చేశారు. శీతాకాలంలో చలికి విద్యార్థులు అవస్థలు పడకుండా దుప్పట్లను వితరణ చేసినట్లు వెల్లడించారు. సహాయ వసతి గృహ సంక్షేమాధికారి మునీంద్రయ్య, వసతి గృహ అధికార్లు కిరణ్, రామయ్య, ఎస్‌బీఐ కోవనూరుశాఖ మేనేజరు ఉమాశంకర్, ట్రస్ట్ సభ్యులు పాండు రంగయ్యశెట్టి, సురేష్‌రెడ్డి, మునికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యం.. ప్రయోగాత్మక చైతన్యం

నూతన ఆవిష్కరణలతో విద్యార్థుల ప్రతిభ

నారాయణవనం, వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: ప్రొఫెసర్లు బోధించే సాంకేతిక పరిజ్ఞాన అంశాలను ఆకళింపు చేసుకుని వివిధ నూతన ఆవిష్కరణలతో వినూత్న ప్రయోగాలు చేపట్టారు కొందరు ఇంజినీరింగ్ విద్యార్థులు. సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించి కొత్త ప్రాజెక్టులను రూపొందించడం ద్వారా ప్రతిభ చాటుతున్నారు.

ఎలక్ట్రిక్ వాహనాల వైర్‌లెస్ ఛార్జింగ్ సిస్టమ్ రూపకల్పన చేసిన విద్యార్థులు

వైర్‌లెస్ ఛార్జింగ్ సిస్టమ్

విద్యార్థులు: భారతి, జోత్స్న, జయకుమార్, నవీన్, కిరణ్ కుమార్

గైడ్: డా.రమేష్, ప్రొఫెసర్ (ఈఈఈ విభాగం)

విధానం: ఎలక్ట్రిక్ వాహనాల కోసం వైర్‌లెస్ ఛార్జింగ్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో పునరుత్పాదక ఇంధనాన్ని, ముఖ్యంగా ఫోటో వోల్టాయిక్ వ్యవస్థను వాడటం ద్వారా రవాణా రంగంలో గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తోంది. పవర్ సిగ్నల్‌లోని హైరిపుల్ కంటెంట్‌ను తగ్గించే అడ్వాన్స్‌డ్ ఫిల్టర్ సిరీస్ కెపాసిటర్, ఇండక్టర్ కెపాసిటర్ నమూనాతో రూపొందించారు.

సౌరశక్తి పర్యవేక్షణ

విద్యార్థులు: సంధ్య, మౌనిక, మహాలక్ష్మి, హితేష్, అనిల్‌కుమార్‌రెడ్డి

గైడ్: ఎస్.స్రవంతి, సహాయ ప్రొఫెసరు(ఈఈఈ)

విధానం: పునరుత్పాదకశక్తి వనరులలో అత్యంత ప్రధానమైన సౌరశక్తిని సేకరించడానికి వినియోగించే సౌరప్యానెల్స్‌ను సూర్యుడి దిశ మేరకు తిరిగే పొద్దుతిరుగుడు పువ్వు తరహాలోనే సూర్యుడు ఏ దిశలో ఉంటే ఆ దిశలో ప్యానెల్స్ తిరిగేలా రూపొందించారు. ఈ విధానం కమ్యూనికేషన్స్, రవాణా రంగాలకు, వాహనాలకు ఉపయోగపడుతుంది. ఈ విధానాన్ని మ్యాట్ ల్యాబ్, సిమ్యులింక్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా సులభతరం చేయవచ్చని తెలిపారు.

సౌర ప్యానెళ్ల పర్యవేక్షణ, నియంత్రణ విధానాన్ని ఆవిష్కరించిన విద్యార్థులు

పవన విద్యుత్తును నియంత్రించే విధానంపై పరిశోధించిన విద్యార్థులు

లోపాలు సరిదిద్దే విధానం

విద్యార్థులు: దిలీప్, రూపేష్, ఉపేంద్ర, చంద్ర, శ్రీనివాసరావు

గైడ్: డా.బాలవెంకటముని, ప్రొఫెసర్(హెడ్)

విధానం: పవన విద్యుత్తు వినియోగంలో వినూత్నమైన యూనిడైరెక్షనల్, కేస్‌కేడెడ్ అప్లికేషన్లకు అవసరమైన హైవోల్టేజీ, స్విచింగ్ లాసెస్ నష్టాలను తగ్గించడంలో ఉపయోగపడుతుంది. విండ్ టర్బైన్‌ల ద్వారా ఉత్పత్తి అయ్యే వేరియబుల్ ఫ్రీక్వెన్సీ, ఓల్టేజీ ఆంప్లిట్యూడ్‌శక్తిని గ్రిడ్‌కు అనుసంధానం చేసేందుకు అడ్వాన్స్‌డ్ కంట్రోల్ సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించారు. గాలి వాతావరణ పరిస్థితుల్లో వ్యవస్థ స్థిరత్వాన్ని నిర్వహించడంలో పరిశోధన ఉపయోగపడుతుందన్నారు.

ముగ్గురు భిక్షకుల మృతి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలోని సన్నిధివీధి పరిసర ప్రాంతాల్లో ఇద్దరు, హౌసింగుబోర్డు కాలనీ వద్ద ఒకరు వెరసి ముగ్గురు భిక్షకులు మృతి చెందారు. వీరిలో ఇద్దరి ఆచూకీ తెలియడంతో వారి కుటుంబీకులు మృతదేహాలను తీసుకెళ్లారు. హౌసింగుబోర్డు కాలనీ వద్ద చనిపోయిన భిక్షకుని ఆచూకీ కోసం మృతదేహాలను ఏరియా ఆస్పత్రిలోని శవాగారానికి తరలించారు.

వ్యక్తి అనుమానాస్పద స్థితిలో..

సత్యవేడు: మండల కేంద్రంలోని గాంధీరోడ్డుకు చెందిన మధు(36) కుటుంబంతో కలిసి కొన్ని సంవత్సరాలుగా అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు. రెండ్రోజుల క్రితం హైదరాబాద్‌కు వచ్చిన మధు వ్యక్తిగత కారణాలతో ఆదివారం ఓ లాడ్జిలో మృతి చెందాడు. ఈ విషయాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు చేరవేయడంతో కన్నీరుమున్నీరవుతున్నారు.

వ్యక్తి మృతిపై సందేహాలు

మురళీ మోహన్‌రెడ్డి (పాత చిత్రం)

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉంటున్న మురళీమోహన్‌రెడ్డి(42) మృతి పట్ల సందేహాలు వ్యక్తమవుతున్నాయి. భవనంపై నుంచి జారి పడ్డాడా.. లేదా అతనే దూకి చనిపోయాడా అన్నది చర్చనీయాంశంగా మారింది. అమ్మపాళెం గ్రామానికి చెందిన మురళీమోహన్‌రెడ్డి శ్రీరాంనగర్ కాలనీలో ఉంటున్నారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఉన్నట్టుండి మొదటి అంతస్తు నుంచి పడి అక్కడి కక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై అనుమానాలు ఉండటంతో కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పంచనామా నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిచ్చి మొక్కలతో తిప్పలు

మంచినీళ్ల గుంతలో పిచ్చి మొక్కలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.20 లక్షలు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపట్టారు. వాకింగ్ ట్రాక్ నిర్మాణం, చిన్నారులు ఆడుకునేందుకు పరికరాలను కల్పించారు. అనంతరం దీని గురించి పట్టించుకోక పోవడంతో పిచ్చి మొక్కలు పెరిగి నడక వారికి ఇబ్బందులు తప్పడంలేదు. తుడా అధికారులు స్పందించాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, రేణిగుంట**

(c) eenadu

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

సమస్యలు పరిష్కరించేలా చర్యలు

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో భానుప్రకాశ్‌రెడ్డి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: డివిజన్‌లోని ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి ఆర్డీవో భానుప్రకాశ్‌రెడ్డి తెలిపారు. గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆర్డీవో మాట్లాడుతూ.. భూ సమస్యలు వేగంగా పరిష్కరిస్తామన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు.

తీరంలో ప్రత్యేక బందోబస్తు

వాకాడు, న్యూస్‌టుడే: విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ ఆదేశాలతో ఈ నెల 5న కార్తిక పౌర్ణమి సందర్భంగా తూపిలిపాలెం, శ్రీనివాసపత్రం సముద్ర తీరాల్లో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు దుగరాజపట్నం మెరైన్ సీఐ వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. పౌర్ణమి రోజు సముద్ర స్నానాలకు వచ్చే వారు జాగ్రత్తలు పాటించేలా రక్షణ చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం: కేజీ రూ. 21 నుంచి రూ. 35 వరకు

రెండో రకం: కిలో రూ. 10 నుంచి రూ. 20 వరకు

పాఠం వినాలా.. ముక్కు మూసుకోవాలా?

సూళ్లూరుపేట మండలంలోని కుదిరి పరిసత్తు ప్రాథమిక ఉన్నత పాఠశాల ముందు దుస్థితి ఇది. గోడ ముందు మురుగు నీరు పేరుకుపోయి ఉండటంతో దుర్వాసన, దోమలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. శుభ్రత పనులు చేపట్టాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సూళ్లూరుపేట గ్రామీణం

కళ్లల్లో ధూళి.. ఇళ్లల్లో దుమ్ము

నాయుడుపేట పురపాలక సంఘం పిచ్చిరెడ్డి తోపు మీదుగా వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. మండలంలోని మేనకూరు సెజ్ నుంచి భారీ వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో గ్రావెల్, ఇసుకతో మట్టి రోడ్డును తలపిస్తోంది. ప్రయాణికులు కళ్లల్లో దుమ్ము పడటంతో ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డును శుభ్రం చేయాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

వ్యర్థాల దారిలో.. విద్యార్థుల అవస్థలు

సూళ్లూరుపేట పట్టణంలోని నాగరాజుపురంలో రహదారికి ఇరువైపులా చెత్త పేరుకుపోయింది. రోజుల తరబడి శుభ్రత కార్యక్రమాలు చేపట్టకపోవడంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు ముక్కు మూసుకొని ప్రయాణాలు చేస్తున్నారు. శుభ్రత పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సూళ్లూరుపేట

తిన్నెలపూడి మార్గంలో రక్షణ కరువు

కోట మండలంలోని తిన్నెలపూడి మార్గంలో పంటకాలువపై ఉన్న కల్వర్టు వద్ద రక్షణ గోడలు పాడయ్యాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో వాహన చోదకులు మరిన్ని ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పరిశీలించి, బాగుకు ప్రతిపాదిస్తామని ఇన్‌ఛార్జి ర.భ.శాఖ ఏఈ మల్లికార్జునరావు తెలిపారు. - న్యూస్‌టుడే, కోట

బస్సులు లేక.. నిరీక్షణ తప్పక

నాయుడుపేట బస్టాండులో ప్రయాణికులకు నిరీక్షణ తప్పడం లేదు. రోజూ 400 బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. కానీ సమయానికి రాకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు మహిళలకు బస్సు ప్రయాణం ఉచితంతో బస్టాండు కిటకిటలాడుతోంది. ఈ నేపథ్యంలో బస్సులు సమయపాలన పాటించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ప్రజా సంక్షేమమే ధ్యేయం

కోట, న్యూస్‌టుడే: ప్రజలు సంతోషంగా ఉండేందుకు పథకాలు అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. కోటలో సోమవారం అభివృద్ధి పనులు ప్రారంభించారు. శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీలో చేపల మార్కెట్, మహిళా బ్యాంకు భవనం, శ్యాంసుందరపురం సమీపంలో శ్మశానవాటికను ప్రారంభించారు. ఎంపీడీవో దిలీప్‌కుమార్, బ్యాంకు అధ్యక్షురాలు శేషమ్మ, మేనేజరు విజయలక్ష్మి, తెదేపా మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, జలీల్ అహ్మద్, మోహన్‌రెడ్డి, సుష్మారెడ్డి. సర్పంచి వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవన విధానాలపై సర్వే

✦ గూడూరు మత్స్యశాఖ ఏడీ రాజేష్

ముఖాముఖి

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని మత్స్యకార కుటుంబాలు, వేటకు వెళ్తున్న వారు, సముద్రంపై జీవించే వారి గురించి తెలుసుకునేందుకు సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఎఫ్‌ఆర్ఐ), ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా సర్వే చేస్తున్నట్లు మత్స్యశాఖ గూడూరు ఏడీ జి.రాజేష్ తెలిపారు. ఆ శాఖ పరిధిలోని కార్యకలాపాలను 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో వెల్లడించారు.

7,333 మందికి తుపాను సాయం..

మొంథా తుపానుతో ప్రజలు నష్టాలు చవిచూశారు. మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం సాయం అందజేస్తోంది. ఇప్పటికే 4,098 కుటుంబాలకు సరకు, నగదు అందజేశాం. తాజాగా మరో 3,235 కుటుంబాలను గుర్తించి నివేదికను కలెక్టర్ కార్యాలయానికి పంపించాం. అనుమతులు లభిస్తే వారికి సాయం చేరవ చేస్తాం.

రూ.2 కోట్లతో పనులు..

వాకాడు మండలం తూపిలిపాలెం మత్స్యకారులకు వసతుల కల్పనకు పీఎం మత్స్య సంపద యోజన పథకం నిధులు రూ.2 కోట్లతో పనులు చేస్తున్నాం. రూ.1.30 కోట్లతో తుపాను రక్షిత భవనం, చేపలు ఎండ బెట్టేందుకు 8 ప్లాట్‌ఫారాలు, 2 సోలార్ పెద్ద దీపాలు, 150 లైఫ్ జాకెట్లు, 55 జీపీఎస్ సెట్లు తదితర వసతులను ఏడాదిలో అందుబాటులోకి తీసుకొస్తాం.

తమిళ జాలర్లపై చర్యలకు లేఖలు..

ఆంధ్రప్రదేశ్ సముద్ర జలాల్లో తమిళనాడుకు చెందిన జాలర్లు పెద్ద పడవలతో వేట సాగిస్తూ స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మత్స్యకారుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు ఆ రాష్ట్ర అధికారులకు లేఖలు రాశాం. వారికి ఆ రాష్ట్రంలో ఇచ్చే రాయితీలు, రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని అక్కడి అధికారులకు సూచించాం.

పెట్రోలు బంకుల్లో తనిఖీలు..

మత్స్యకారులకు ప్రభుత్వం అందజేసే రాయితీ డీజిల్ పక్కదారి పడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. గుర్తించిన పెట్రోలు బంకుల్లో దస్త్రాలు తనిఖీలు చేస్తున్నాం. జిల్లాలో 880 మంది మత్స్యకారులకు డీజిల్ రాయితీ కార్డులిచ్చాం. ఒక్కో లీటరుపై రూ.9 చొప్పున నెలలో 300 లీటర్లు పొందవచ్చు. దీనిలో అక్రమాలకు పాల్పడితే కార్డులు రద్దు చేస్తాం.

విద్యుత్తు సరఫరా ఆపేస్తాం..

జిల్లాలో వాకాడు, కోట, చిల్లకూరు, సూళ్లూరుపేట, తడ తీర ప్రాంతాల్లోని 12వేల మంది వివరాలు ప్రస్తుతం అధికారులు సేకరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం అధికారికంగా 9,446 ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. 6,500 ఎకరాలకు సంబంధించి మాత్రమే మత్స్యకారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 1,500 ఎకరాలు అటవీ పరిధిలో, 1000 ఎకరాలు డీకేటీ భూములున్నాయి. ఇక్కడ 11 నెలల తాత్కాలిక అనుమతులకు వీఆర్వో, తహసీల్దారు నుంచి ధ్రువీకరణ పత్రం పొందాల్సి ఉంటుంది. అది లేకపోతే నోటీసులు ఇచ్చి విద్యుత్తు సరఫరా నిలిపివేస్తాం. అలాంటి వారికి ప్రభుత్వ రాయితీలు సైతం వర్తించవు.

మేమున్నాం.. మీకు తోడుగా సమయం: 10 AM TO 1 PM

గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 88979 08890
వెంకటగిరి: 80085 73966

? కడగుంటలో తాగునీటి పథకాన్ని శుభ్రం చేయడం లేదు. నీరు కలుషితం అవుతోంది. - **చెంచురామయ్య** ✓ ఓవర్ హెడ్ ట్యాంకు పైకి వెళ్లేందుకు దారి లేదు. ప్రత్యామ్నాయం చూస్తాం. - **రామకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో** – న్యూస్‌టుడే, బాలాయపల్లి

? నాయుడుపేట మండలం మేనకూరు సచివాలయం వద్ద రేషన్ దుకాణం పెట్టారు. వృద్ధులు, మహిళలు బియ్యం కోసం వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. - **స్థానికులు** ✓ పరిశీలించి అందరికీ అనువైన చోట దుకాణం ఏర్పాటు చేయిస్తాం. - **రాజేంద్ర, తహసీల్దారు** ? నాయుడుపేట ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న వీధిలో దీపాలు వెలగడం లేదు. - **మోహన్** ✓ దీపాలు వెలిగేలా చర్యలు చేపడతాం. - **ఎస్‌కే.ఫజులుల్లా, కమిషనర్** – నాయుడుపేట పట్టణం

? దొరవారిసత్రం మండలం రోసనూరు వెళ్లే మార్గంలో ప్రమాదకర గుంతలు ఉన్నాయి. - **వి.రవీంద్రబాబు** ✓ గుంతలు పూడ్చి రోడ్డు బాగు చేయిస్తాం. - **చెన్నారాయుడు, ఏఈ ర.భ.శాఖ** – న్యూస్‌టుడే, దొరవారిసత్రం

? అల్లంపాడు- చీకళ్లదిబ్బ మార్గంలో పీఆర్ రోడ్డు రెండేళ్ల క్రితం కోతకు గురైంది. వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. - **రాజారామ్‌రెడ్డి, మాజీ సర్పంచి**
✓ పరిశీలించి మరమ్మతులు చేపడతాం. **- కిరణ్, ఇన్‌ఛార్జి ఏఈ** – న్యూస్‌టుడే, కోట

చిన్నారుల చిత్రాలకు ప్రశంసలు

గూడూరు పట్టణంలోని లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'మీకు ఇష్టమైన పండగ' అనే అంశంపై జరిగిన చిత్రలేఖన పోటీల్లో 7, 8, 9,10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. టి.మౌనిక, బి.చేతన్‌కార్తిక్, ఎస్.తనుశ్రీ విజేతలుగా నిలవగా కరస్పాండెంట్ బి.శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపల్ నమఃశివాయ, ఉపాధ్యాయులు గీతా, మీనా, రాఖీ, గీతాలత, శివరంజని బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. – న్యూస్‌టుడే, గూడూరు పట్టణం

దరఖాస్తుల ఆహ్వానం

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట డివిజన్ పరిధిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టులో అంగన్వాడీ కార్యకర్త, 7 సహాయకుల పోస్టులు భర్తీ చేయనున్నట్లు ప్రాజెక్టు అధికారిణి వి.జ్యోతికిరణ్ తెలిపారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని, ఈనెల అయిదో తేదీ, బుధవారం ఉదయం 10 గంటలకు సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయంలో ముఖాముఖి ఉంటుందన్నారు. ధ్రువపత్రాలు తీసుకొని రావాలని సూచించారు.

మహిళా సాధికారతపై అవగాహన

నాయుడుపేట పట్టణం: నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీడీపీవో ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. చదువు ప్రాముఖ్యం, బాల్య వివాహాలు, మహిళపై దాడుల గురించి వివరించారు. ఆకతాయిలు ఇబ్బందిపెడితే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ప్రిన్సిపల్ ప్రవీణకుమారి, సృజన ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

వాకాడు, న్యూస్‌టుడే: మండలంలోని నిమ్మవానితిప్పలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో డి.వనమ్మకు చెందిన ఇల్లు దగ్ధమైంది. ఇంట్లోని వస్తువులు, దుస్తులు, సామగ్రి, పత్రాలు కాలిపోయినట్లు బాధితురాలు పిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

నగదు వితరణ

నాయుడుపేట పట్టణం: నాయుడుపేటకు చెందిన సారంగం మురళీకృష్ణ అనారోగ్యంతో బాధపడుతున్నారు. బలిజ చేయూత ఫౌండేషన్ అధ్యక్షుడు పి.శివప్రదీప్, సహాయ కార్యదర్శి పృథ్వీచంద్, పెద్దలు రూ.10 వేలు సేకరించి ఆయనకు అందజేశారు. రామారావు, హరికృష్ణ, హరి ఉన్నారు.

తహసీల్దారుకు సన్మానం

కోట, న్యూస్‌టుడే: మొంథా తుపాను సమయంలో ఉత్తమ సేవలు అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా 'మొంథా సైక్లోన్ ఫైటర్' పురస్కారం అందుకున్న తహసీల్దారు జయజయరావును తెదేపా నాయకులు, పలు శాఖల అధికారులు సత్కరించారు. కోట తహసీల్దారు కార్యాలయంలో సోమవారం సన్మానం చేశారు. నాయకులు చంద్రశేఖర్, వెంకటకృష్ణరెడ్డి, కోటేశ్వరరావు, అధికారులు ఉన్నారు.

పేదలకు భూములు పంచాలి

వెంకటగిరి: నిరుపేదలకు నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూములను పంపిణీ చేయాలని ఏపీ వ్య.కా.సం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కలపాడులో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని చదును చేయించారు. ఇక్కడ 1,440 ఎకరాలు ఉందని, గిరిజనులు, దళితులకు పంచాలని కోరారు.

యూరియా పంపిణీ చేయాలి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: రైతులందరికీ యూరియా పంపిణీ చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం నాయకుడు జోగి శివకుమార్ కోరారు. గూడూరు పట్టణంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద సోమవారం పలువురు రైతులతో కలిసి ధర్నా చేశారు. యూరియాను అక్రమంగా రూ.800లకు విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

పందలరాజా అలంకరణలో అయ్యప్ప

వెంకటగిరి పట్టణంలోని కుమ్మరిగుంట అయ్యప్ప ఆలయంలో స్వామివారిని సోమవారం పందలరాజాగా అలంకరించి పడిపూజ చేశారు. – వెంకటగిరి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ, చిత్రంలో సభ్యులు

పనిచేసే వారికే పదవులు

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: దొరవారిసత్రం మండలం నెల్లబల్లి పీఏసీఎస్ అధ్యక్షుడిగా ముప్పాళ్ల శ్రీహరిరెడ్డి, డైరెక్టర్లుగా సంచి విజయకుమార్, మన్నేపల్లి సుబ్రమణ్యం సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. సీఈవో గఫూర్ వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ కోసం పనిచేసే వారికి పదవులు వస్తాయన్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ ఎన్.సుబ్రహ్మణ్యం, చెంగాళమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లురెడ్డి, తెదేపా జిల్లా అధికార ప్రతినిధి టి.సుధాకర్‌రెడ్డి, సూళ్లూరుపేట ఏఎంసీ అధ్యక్షుడు ఎ.రమేష్, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు, కె.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చల్ల కాలువ బాగు చేయిస్తాం

కోట, న్యూస్‌టుడే: కోట మండలంలోని చల్ల కాలువలో ఉన్న ఇసుక గుట్టలను తొలగించి వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు మళ్లిస్తామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. కోటలోని ఇరిగేషన్ కార్యాలయంలో సోమవారం జల సంఘాల అధ్యక్షులతో సమీక్ష నిర్వహించారు. రెండు దశాబ్దాలుగా కాలువలో ఇసుక గుట్టలు పేరుకుపోవడంతో సాగునీరు పారడం లేదన్నారు. ఇరిగేషన్ డీఈ ఆనందబాబు, ఏఈ మునిరత్నం, తెదేపా నాయకులు ఉన్నారు.

ఆర్టీసీలో సిబ్బంది కొరత

వాకాడు డిపోలో టికెట్లు ఇస్తున్న చోదకుడు

గూడూరు గ్రామీణం, వాకాడు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల హామీల అమల్లో భాగంగా భాగంగా స్త్రీశక్తి పథకం తీసుకొచ్చింది. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో మహిళల రాకపోకల సంఖ్య పెరిగింది. కానీ సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఉన్నవారు ఇబ్బందులు పడుతున్నారు.

సమయపాలన పాటించని బస్సులు..

డిపోల్లో డ్రైవర్లు, కండక్టర్ల కొరతతో బస్సులు సమయం పాటించడం లేదు. ఉద్యోగులు లేకపోతే మరొకరిని సిద్ధం చేసి పంపించేందుకు సమయం పడుతోంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గూడూరు డిపోలో 114 మందికి గాను 106 మంది కండక్టర్లు సేవలు అందిస్తున్నారు. వాకాడులో పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. ఇక్కడ 95 మంది చోదకులకు 77, 104 మంది కండక్టర్లకు కేవలం 71 మంది మాత్రమే ఉన్నారు. మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో సమస్యలు ఏర్పడుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

వాకాడు	డిపో	గూడూరు
41	సర్వీసులు	56
77	చోదకులు	99
71	కండక్టర్లు	106
రూ.8.50లక్షలు	ఆదాయం	రూ.12 లక్షలు

కండక్టర్ల స్థానంలో సీనియర్ చోదకులు..

డిపోల్లో ఉద్యోగులు సరిపడా లేకపోవడంతో బస్సులు సక్రమంగా నడపలేని పరిస్థితి ఏర్పడింది. కండక్టర్లు లేకపోవడంతో ఆ స్థానంలో సీనియర్ డ్రైవర్లను పంపిస్తున్నారు. విధులు నిర్వహించే ఉద్యోగులకే డబుల్ డ్యూటీలు వేస్తున్నారు. దీనిపై గూడూరు డిపో మేనేజరు చెంచులక్ష్మి వద్ద ప్రస్తావించగా.. ఆన్‌కాల్ డ్రైవర్ల నుంచి మెడికల్ ఫిట్‌నెస్ ధ్రువపత్రం తీసుకొని ప్రత్యేక శిక్షణ ఇచ్చి విధులకు పంపుతున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

చిల్లకూరు, న్యూస్‌టుడే: చిల్లకూరు ఠాణా సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చెన్నైకి చెందిన లారీ డ్రైవర్ ఏలుమలై (51) మృతి చెందారు. రహదారి పక్కనున్న దుకాణానికి వెళ్లి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఒకరికి గాయాలు.. కోట, న్యూస్‌టుడే: కోట గాంధీ బొమ్మ కూడలిలో సోమవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని దివ్యాంగుడికి గాయాలయ్యాయి. ఎస్సై పవన్‌కుమార్, సిబ్బంది, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని కోట సీహెచ్‌సీకి తరలించారు. వివరాలపై ఆరా తీస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

కుక్క దాడిలో చిన్నారికి గాయాలు

బాలాయపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని కయ్యూరు గ్రామంలో రెండేళ్ల బాలికపై సోమవారం వీధి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. శ్రీనివాసులు, సుప్రియ దంపతుల కుమార్తె మన్విత వీధిలో ఆడుకుంటుండగా ఘటన చోటు చేసుకుంది. ఇదే వీధిలో శనివారం మూడేళ్ల బాలుడిని సైతం కుక్కలు గాయపర్చాయి.

విద్యుత్తు స్తంభాల ఏర్పాటు

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మొంథా తుపానుతో నేలకొరిగిన ప్రాంతాల్లో రూ.1.50 లక్షలతో 7 విద్యుత్తు స్తంభాలను ఏర్పాటు చేశారు. సోమవారం ఆ శాఖ అధికారులు వేనాడు వెళ్లే మార్గంలో పనులు చేపట్టారు. అటవీ అధికారులు అభ్యంతరం తెలిపారు. డీఎఫ్‌వోతో ఎమ్మెల్యే ఎన్.విజయశ్రీ చర్చించి పనులు పూర్తి చేయించారు. సరఫరా పునరుద్ధరించారు.

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్ (రైతు ధర)	137
లేయర్	120
బ్రాయిలర్స్	246
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	270
లేయర్ మాంసం	204

4500 మందికి యూరియా కార్డులు

యూరియా పంపిణీ చేస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

వాకాడు, న్యూస్‌టుడే: మండలంలో 4,500 మంది రైతులకు యూరియా కార్డులు అందించామని వాకాడు పీఏసీఎస్ అధ్యక్షుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం సంఘ కార్యాలయం వద్ద రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేశారు. ఒక్కో కార్డుపై మూడు బస్తాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. మండలంలోని 8 రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంచామన్నారు. ఏవో దీప, తెదేపా నాయకులు మధురెడ్డి, కృష్ణమూర్తి, విజయశేఖర్‌రెడ్డి, నందగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేశారు..

స్పందనకు వందనం

కోట, న్యూస్‌టుడే: స్థానిక శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీకి వెళ్లే మార్గంలో పాడైన రోడ్డును గ్రావెల్‌తో పూడ్చారు. ఇక్కడ సమస్యపై ఇటీవల 'ఈనాడు'లో వార్త ప్రచురించగా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించారు. వర్షం నీరు నిల్వ ఉండకుండా బాగు చేశారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంక్ ఆఫ్ బరోడా / बैंक ऑफ़ बड़ौदा
నెల్లూరు బ్రాంచి, 1వ అంతస్తు, 16-4-426, యస్ఆర్ ఎస్టేట్, ఇందిరా భవన్ రోడ్డు, నెల్లూరు-524001, ఆంధ్రప్రదేశ్. ఫోన్: 0861-2327269 & 0861-2302727

SARFAESI చట్టం క్రింద డిమాండ్ నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ (3)తో చదవబడే, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ లోని సెక్షన్ 13(2) క్రింద దిగువ వివరించబడిన రుణగ్రహీత / హామీదార్ల అభ్యర్థన మేరకు బ్యాంకు పేరున సెక్యూరిటి ఇంటరెస్ట్ క్రియేట్ చేస్తూ వివిధ అసెట్లపై ఆర్థిక సహకారం ద్వారా ఆయా సమయాలలో వివిధ రుణసదుపాయాలను బ్యాంక్ మంజూరు చెయ్యడం జరిగింది. బ్యాంకు పేరున సెక్యూరిటి ఇంటరెస్ట్ క్రియేట్ చేస్తూ టైటిల్ డీడ్స్‌ను డిపాజిట్ చెయ్యడం ద్వారా మీచే తనఖాపెట్టబడిన ఆస్తుల వివరాలు దిగువ ఇవ్వబడినవి. బ్యాంక్‌కు రుణబకాయిని తిరిగి చెల్లించుటలో మీరు విఫలం కావడం చేత రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా జారీ చెయ్యబడిన మార్గదర్శకాల ప్రకారం రుణగ్రహీత ఖాతాలు నిరర్థక ఆస్తులుగా వర్గీకరించబడినవి. బ్యాంకుకు రుణబకాయిని తిరిగి చెల్లించాల్సిందిగా మిమ్మల్ని కోరుతూ రిజిస్టర్డ్ పోస్టు ద్వారా 05.10.2025 తేదీన మీకు పంపబడిన డిమాండ్ నోటీసులు రుణగ్రహీత/ హామీదారు ద్వారా అక్నాలెడ్జ్ చేయబడనందున ఈ నోటీసు ప్రచురించబడినది.

రుణగ్రహీత/హామీదారు యొక్క పేరు: M/s. కీర్తిక ఫిల్లింగ్ స్టేషన్ తరపున యజమాని: శ్రీ చెన్నుపాటి బాలాజీ కుమార్, రిజిస్టర్డ్ ఆఫీస్ చిరునామా: LA సాగరం, అగ్రహారపేట గ్రామము, కాళహస్తి రోడ్డు, నాయుడుపేట టౌన్ & మండలం, నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-517644. శ్రీ చెన్నుపాటి బాలాజీ కుమార్, తండ్రి: శ్రీ చెన్నుపాటి వెంకటరత్నం నాయుడు, యజమాని: M/s. కీర్తిక ఫిల్లింగ్ స్టేషన్, R/o.7-93/a, వడ్డిపాలెం, దుత్తలూరు, నర్రవాడ, నెల్లూరు-524222, ఆంధ్రప్రదేశ్. హామీదారు: శ్రీ చెన్నుపాటి బాలాజీ కుమార్, తండ్రి: శ్రీ చెన్నుపాటి వెంకటరత్నం నాయుడు, R/o.7-93/a, వడ్డిపాలెం, దుత్తలూరు, నర్రవాడ, నెల్లూరు-524222, ఆంధ్రప్రదేశ్.
డిమాండ్ నోటీసు తేదీ: 05.10.2025, NPA తేదీ: 12-07-2025
సదుపాయ స్వభావం మరియు రకం: Overdraft – Dealer Finance (Under Supply chain Finance) A/c. No:09800400000279
బకాయి మొత్తం: ది.05.10.2025 తేదీనాటికి రూ.1,82,19,570.27 పైII (అక్షరాల ఒక కోటి ఎనభై రెండు లక్షల పంతొమ్మిది వేల ఐదు వందల డెబ్బై రూపాయలు మరియు ఇరవై ఏడు పైసలు మాత్రమే)+ ది.06.10.2025 తేదీనుండి వర్తించని వడ్డీ + మొత్తం వసూలు అయ్యేవరకు ఇతర ఛార్జీలు.
స్థిరాస్తుల యొక్క వివరములు: ప్రైమరీ సెక్యూరిటీ: హైపోథికేషన్ చేయబడిన స్టాక్స్ & రిసీవబుల్స్, ప్రస్తుత మరియు భవిష్యత్తు విలువ రూ.3.00 కోట్లు.
కొల్లేటరల్ సెక్యూరిటీ: రూ.30.00 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై తాత్కాలిక హక్కు.

పైన తెలిపిన రుణగ్రహీతలు/ సొసైటీ / ట్రస్టీలు/ హామీదారులు అయిన మీరు ఈ నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా SARFAESI చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద ఈ నోటీసు యొక్క నిబంధనల ప్రకారం పైన వివరించబడిన విధంగా భవిష్యత్తు వడ్డీ మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలతో మీ ద్వారా బ్యాంకుకు బకాయిపడ్డ పైన వివరించబడిన మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో మీరు విఫలమైనచో, SARFAESI చట్టం యొక్క సెక్షన్ 13, సబ్-సెక్షన్ (4) క్రింద వివరించబడిన ఏవేని లేదా అన్ని హక్కుల్ని మరియు సదరు చట్టం యొక్క ఇతర వర్తించబడు నిబంధనలను బ్యాంక్ వినియోగించుకుంటుంది. చట్టం యొక్క ఏవేని ఇతర నిబంధనల క్రింద అవసరమని భావించిన విధంగా సదరు ఇతర చర్యల్ని లేదా చట్టపరమైన ప్రొసీడింగ్స్ ని చేపట్టుటకు బ్యాంక్‌కు గల హక్కులకు ఎటువంటి ప్రతికూలాభిప్రాయం లేకుండా ఈ నోటీసు జారీచెయ్యబడినది.

తేది: 05.10.2025, ప్రదేశము: నెల్లూరు సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా Union Bank of India
సూళ్ళూరుపేట బ్రాంచ్
పొట్టి శ్రీరాములు వీధి, సూళ్ళూరుపేట, తిరుపతి-524121

సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్ 54 ఆఫ్ 2002లోని సెక్షన్ 13(2) క్రింద ప్రకటన (సర్ఫేసి యాక్ట్, 2002)-డిమాండ్ నోటీసు

నుండి : తేది: 25-09-2025
చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, 2002 యొక్క చట్టం 54 ప్రకారం
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సూళ్ళూరుపేట బ్రాంచ్
దిగువ వారికి,
ఋణగ్రహీతలు : 1) మెస్సర్స్ Ecoron ఎనర్జీ ప్రొడక్ట్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ పార్టనర్ శ్రీమతి కొండంరెడ్డి లక్ష్మీ శిరీష, ఫ్లాట్ నెం.యస్-102, సంకల్ప్ రెసిడెన్సీ, బాబా నగర్, వాషింగ్టన్ హోమ్ దగ్గర, నెల్లూరు-524002.
2) మెస్సర్స్ Ecoron ఎనర్జీ ప్రొడక్ట్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ పార్టనర్, శ్రీమతి కొండంరెడ్డి లక్ష్మీ శిరీష, సర్వే నెం.384-1బి, 384-2ఎ, 384-6బి, కోటపోలూరు, సూళ్లూరుపేట, నెల్లూరు జిల్లా-524123
ఋణగ్రహీత(లు)/ హామీదారు(లు) : 1) శ్రీమతి కొండంరెడ్డి లక్ష్మీ శిరీష (మేనేజింగ్ పార్టనర్), భర్త : శ్రీధర్ రెడ్డి, డి.నెం.: 8-2-603/యు/9, యస్2, జాస్మిన్ బ్లాక్, ఫార్చ్యూన్ ఐకాన్, రోడ్ నెం.10, బంజారాహిల్స్, ఖైరతాబాద్, హైదరాబాద్, తెలంగాణా-500034
2) శ్రీమతి గూడాల ప్రభావతి (పార్టనర్), భర్త : హరి ప్రసాద్ రెడ్డి, ఫ్లాట్ నం. 3, కీర్తి ఎన్‌క్లేవ్, జియన్‌టి రోడ్, పాత కాటన్ మిల్స్, కోటపోలూరు పంచాయతీ, సూళ్లూరుపేట మండలం, తిరుపతి జిల్లా - 524123.
ఋణగ్రహీత(లు)/ హామీదారు(లు)/తనఖాదారులు : 1) శ్రీమతి కొండంరెడ్డి శ్రీలత (పార్టనర్), భర్త : కె. శశిధర్ రెడ్డి, ఫ్లాట్ నం. 209, కావ్య బ్లాక్, పూజిత ఎస్టేట్స్, ఎర్రగడ్డ ఫ్రూట్ మార్కెట్ ఎదురుగా, సుందర్ నగర్, అమీర్‌పేట్, హైదరాబాద్, తెలంగాణ - 500038.
హామీదారు(లు)/తనఖాదారులు : కె.శశిధర్ రెడ్డి, తండ్రి : నారాయణ రెడ్డి, ఫ్లాట్ నెం. 209, కావ్య బ్లాక్, పూజిత ఎస్టేట్స్, ఎర్రగడ్డ ఫ్రూట్ మార్కెట్ ఎదురుగా, సుందర్ నగర్, అమీర్‌పేట్, హైదరాబాద్, తెలంగాణ - 500038
అయ్యా / అమ్మా,
ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా మా సూళ్ళూరుపేట బ్రాంచ్ వారి వద్దనున్న మీ మెస్సర్స్ Ecoron ఎనర్జీ ప్రొడక్ట్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ పార్టనర్ శ్రీమతి కొండంరెడ్డి లక్ష్మీ శిరీష డి.నెం.: 8-2-603/యు/9, యస్2, జాస్మిన్ బ్లాక్, ఫార్చ్యూన్ ఐకాన్, రోడ్ నెం.10, బంజారాహిల్స్, ఖైరతాబాద్, హైదరాబాద్ వారి ఋణ ఖాతా బకాయిలను / వడ్డీని చెల్లించుటలో విఫలమైనందున డి.27-08-2025 తేదీన మీ ఋణ ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించబడినది. మీ ఋణ ఖాతా తేది.31-07-2025 నాటికి రూ.79,94,041.88 (అక్షరాలా డెబ్బై తొమ్మిది లక్షల తొంభై నాలుగు వేల నలభై ఒక్క రూపాయల ఎనభై ఎనిమిది పైసలు మాత్రమే) ఉన్న బకాయి వివరములు క్రింద ఇవ్వబడినవి.

ఋణ స్వభావం/ఖాతా నెంబరు	పరిమితి (రూ.)	తేది.31-07-2025 నాటికి బకాయి మొత్తము (రూ.)
CCUNS/107215090000003	రూ.50,00,0000.00	రూ.54,56,322.96
TLP09/107216180000002	రూ.42,24,000.00	రూ.25,37,718.92
మొత్తము	రూ.92,24,000.00	రూ.79,94,041.88

మీకు మేము అనేక మార్లు విన్నపములు చేసినప్పటికి, మీరు మీ ఖాతాలోని బకాయి మొత్తమును ఏ మాత్రము చెల్లించలేదు.
అందువలన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారము మీ యొక్క బకాయి మొత్తము రూ.79,94,041.88 (అక్షరాలా డెబ్బై తొమ్మిది లక్షల తొంభై నాలుగు వేల నలభై ఒక్క రూపాయల ఎనభై ఎనిమిది పైసలు మాత్రమే) ఋణ పత్రములో చెప్పబడిన నియమ నిబంధనలలోనున్న ఒప్పందపు వడ్డీరేటు ప్రకారము నెలవారీ వడ్డీతో సహా ఈ నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసి ఉంటుందని, అట్లు చేయుటలో విఫలమైనచో మీరు మా బ్యాంకుకు హామీ ఇచ్చిన ఆస్తులపై సదరు చట్టప్రకారం లభించు ఏవేని లేదా అన్ని హక్కులను ప్రయోగించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.

సెక్యూర్డు ఆస్తి వివరములు

ఆస్తి 1: నెల్లూరు జిల్లా, ముత్తుకూరు సబ్ రిజిస్ట్రేషన్, నెల్లూరు జిల్లా రిజిస్ట్రేషన్, టి.పి.గూడూరు మండలం, వరిగొండ గ్రామం, సర్వే నెం.లు717(పి) & 718 (పి) లలోని సుందరనగర్ ప్రాజెక్ట్ డిటిసిపి ఎల్.పి.నెం.29/2007/RO/NLR ప్రకారం2400 చ.అ.లు లేదా 266.66 చ.గ.లు మొత్తం విస్తీర్ణంలో ప్లాటు నెం.33 గా గల ఖాళీ స్థలము యావత్తుసకు కొలతలు తూర్పు నుండి పడమర లేదా ఉత్తరం నుండి దక్షిణం వైపు 60 అడుగులు లేదా 18.298 మీటర్లు, ఉత్తరం నుండి దక్షిణం తూర్పు మరియు పడమర వైపులు : 40 అడుగులు లేదా 12.198 మీటర్లు విస్తీర్ణం ఆస్తికు హద్దులు : ఉత్తరం : ప్లాట్ నెం.32 (29/2007/RO/NLR), దక్షిణం : ప్లాట్ నెం.34 (29/2007/RO/NLR), తూర్పు : ప్లాట్ నెం.42(29/2007/RO/NLR), పడమర : 40 అడుగుల వెడల్పు గల రోడ్డు.
ఆస్తి -2 : తిరుపతి జిల్లా - సూళ్లూరుపేట సబ్ రిజిస్ట్రేషన్ - సూళ్లూరుపేట రెవెన్యూ మండలం - కోటపోలూరు గ్రామ పంచాయతీ - పట్టా నెం.1155, 1) సర్వే నెం.382-6బి లోని ఎ.3.66 సెంట్లులోని ఎ.0.08 సెంట్లు, 2) సర్వే నెం.384-1బి ఎ.5.41 సెంట్లులో ఎ.3.60 సెంట్లు, 3) ఎ.384-2ఎ లోని ఎ.1.85 సెంట్లులోని ఎ.0.82 సెంట్లు విస్తీర్ణం మొత్తం ఎ.4.50 సెంట్లు - వ్యవసాయ భూమిని-గూడూరు, సబ్ కలెక్టర్ వారిచే జారీచేయబడిన డి.డిస్.నెం.(బి2) 2864/2012, తేదీ 20.07.2012 ప్రకారం వ్యవసాయేతర భూములుగా మార్చబడిన 317.77 చ.గ.లు ఖాళీ స్థలమునకు హద్దులు : తూర్పు: కె. శశిధర్ రెడ్డి గారి భూమి, దక్షిణం: కె. శశిధర్ రెడ్డి గారి భూమి, పడమర : 25 అడుగుల రోడ్డు వెడల్పు, ఉత్తరం: 40 అడుగుల రోడ్డు వెడల్పు. కొలతలు: తూర్పు: 60 అడుగులు లేదా 18.288 మీటర్లు, దక్షిణం: 54 అడుగులు లేదా 16.459 మీటర్లు, పడమర : 44 అడుగులు లేదా 13.411 మీటర్లు, ఉత్తరం: 56 అడుగులు లేదా 17.069 మీటర్లు.
2860 చదరపు అడుగులు లేదా 317.77 చదరపు గజములు లేదా 265.662 చదరపు మీటర్లు లేదా 39 అంకణములు 52 చదరపు అడుగులు విస్తీర్ణం గల ఖాళీ స్థలం, అన్ని యీజమెంటరీ హక్కులు మరియు ఉమ్మడి నడకమార్గము నందు పడమర వైపు 25 అడుగుల వెడల్పులోని హక్కు, ఉత్తరం వైపున గల రోడ్డులో 40 అడుగులు వెడల్పు హక్కులతో కలదు.
1) మీరు సదరు బకాయిలను 60 రోజులలోగా తిరిగి చెల్లించుటలో విఫలమైనచో, బ్యాంకు వారు సదరు చట్టం ప్రకారం లభించిన అన్ని హక్కులను ఉపయోగించి హామీ ఇవ్వబడిన ఆస్తుల విక్రయముతో బకాయిలు పూర్తిగా చెల్లించబడనప్పుడు, మిగిలిన బకాయిసొమ్ము మీ నుండి రాబట్టుకొనుటకు, న్యాయస్థానము / డెట్ రికవరీ ట్రిబ్యూనల్ ద్వారా మీపై తగు న్యాయ పరమైన చర్యలు తీసుకొనుట మాకు తప్పనిసరి అవుతుంది.
2) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) (సవరణ) రూల్స్ 2002లోని రూల్ 3(5)తో చదవబడే సెక్యూరిటీ ఇంటరెస్ట్ 2002లోని సెక్షన్ 13(8) ప్రకారం బహిరంగ వేలం ద్వారా లేదా ప్రజల నుండి కొటేషన్లు లేదా టెండర్లు కోరడం ద్వారా లేదా ప్రైవేటు ఒప్పందం ద్వారా సెక్యూర్డ్ ఆస్తులు లీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం ద్వారా బదిలీ కోసం నోటీసు ప్రచురణ తేదీకి ముందు ఏ సమయములోనైనా సెక్యూర్డు క్రెడిటర్‌కు అయిన అన్ని వ్యయాలు, ఛార్జీలు మరియు ఖర్చులతో సహా సెక్యూర్డ్ క్రెడిటర్ బకాయి మొత్తాలు మీరు చెల్లించేందుకు సర్ఫేసి చట్టంలోని నిబంధనలు గమనించవలసిందిగా మిమ్ములను కోరడం అయినది. మీకు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడం అయినది. పై తెలిపిన విధంగా బహిరంగ వేలం ద్వారా లేదా ప్రజల నుండి కొటేషన్లు లేదా టెండర్ కోరడం ద్వారా ప్రైవేట్ ఒప్పందం ద్వారా సెక్యూర్డు ఆస్తులు లీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం ద్వారా బదిలీ కోసం ప్రచురణ తేదీకి ముందు సెక్యూర్డ్ క్రెడిటర్‌కు అయిన వ్యయాలు, ఛార్జీలతో సహా బకాయి మొత్తం చెల్లించకపోతే, సెక్యూర్డ్ ఆస్తి / ఆస్తులు విడిపించుకొనేందుకు మీకు హక్కులేదని కూడా మీరు గమనించగలరు.
3) సదరు చట్టం యొక్క 13(13) సెక్షన్ ప్రకారము, ఈ నోటీసు పొందిన అనంతరము మీరు పైన చెప్పబడిన ఆస్తులను సాధారణ వ్యాపార కార్యకలాపాలు తప్ప బ్యాంకు వారి అనుమతి లేకుండా విక్రయించరాదు. మరియు లావాదేవీలు జరుపరాదు. సదరు సెక్షన్ యొక్క ఏ విధమైన ఉల్లంఘన జరిపినా తీవ్ర పరిణామాలకు గురిఅవుతారు.

తేది : 25.09.2025 (సం/-చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి)
ప్రదేశం : సూళ్ళూరుపేట యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సూళ్ళూరుపేట బ్రాంచ్

(c) eenadu

కైలాసగిరిపై నిర్మించిన అద్దాల వంతెన రాత్రి వేళ వెలుగు జిలుగుల్లో ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఆ చెంతనే ఉన్న రాడార్ కేంద్రం కూడా సోమవారం రాత్రి విద్యుద్దీపాల కాంతుల్లో తళుకులీనింది. దూరం నుంచి చూస్తే.. కైలాసగిరి మీదుగా అద్దాల వంతెనను చందమామ చూస్తుందా? అన్నట్లు మెరిసిపోయింది. ఈ రెండింటిని సందర్శకులు ఆసక్తిగా తిలకించారు.

–ఈనాడు, విశాఖపట్నం

ఘుమఘుమలు.. ఆతిథ్య సిరులు..!

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : త్రివిధ (మిలటరీ, నేవీ, వాయుసేన) దళాల్లో సేవలందించి పదవీ విరమణ చేయనున్న రక్షణ రంగ ఉద్యోగులకు ఆతిథ్య రంగంలో శిక్షణ ఇస్తోంది నగరంలోని ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్. ఈ మేరకు వివిధ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. అసిస్టెంట్ క్యాటరింగ్ మేనేజర్, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఆరు నెలలపాటు ఆతిథ్య రంగంలో అన్ని రకాల నైపుణ్యాలు సాధించేలా అభ్యర్థులను తీర్చిదిద్దుతున్నారు.

ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో రక్షణ రంగ ఉద్యోగులకు శిక్షణ

శిక్షణ పొందుతున్న రక్షణ రంగ ఉద్యోగులు

కోర్సుల్లోని ముఖ్య అంశాలు:

1. ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పాటిస్సేరీ
2. బేకరీ అండ్ కన్ఫెక్షనరీ
3. సాఫ్ట్ స్కిల్స్, ఉత్సాహ వ్యాపారం

» కోర్సులు ప్రారంభమైన సంవత్సరం: **2017**

» శిక్షణ పొందిన వారి సంఖ్య : **750**

» ఉద్యోగ, ఉపాధి అవకాశాలు: **80 శాతం**

» ప్రస్తుతం శిక్షణ పొందుతున్న వారు: **104**

ఏమి నేర్పిస్తారు అంటే

క్యాటరింగ్, బేకరీల నిర్వహణ, శాఖాహార, మాంసాహార వంటలు, కేకులు, బ్రెడ్‌లు, పాస్తా, బిస్కెట్లు, సమోస, పిజ్జా, బర్గర్లు, పానీపూరీ, చాట్, పావ్‌బాజీ, శాండ్‌విచ్ తయారీలో మెలకువలు నేర్పిస్తారు. వివిధ హోటళ్లు, బేకరీల నుంచి చెఫ్‌లను రప్పించి శిక్షణ ఇప్పిస్తారు. తర్వాత ప్రఖ్యాత హోటళ్లకు పంపించి అక్కడ ఆహార పదార్థాల తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా చూపిస్తారు.

'ఆహా' అనేలా!

'అతిథులను ఆహ్వానించడం, వారి అవసరాలను గుర్తించటం, ఆహారం ఆర్డరను స్వీకరించడం, సరఫరా చేయడం నేర్పిస్తారు. వస్త్రధారణ, గదుల శుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, సమయపాలన, క్రమశిక్షణ గురించి వివరిస్తారు. కోర్సులో భాగంగా ప్రతి ఒక్కరికి ఆంగ్లం, హిందీ భాషలను నేర్పిస్తారు. 'సొంతంగా వ్యాపారం చేయాలనుకునే వారికి వ్యాపార నిర్వహణలో మెలకువలు తెలియజేస్తారు. ఉద్యోగిగా అయితే సహోద్యోగులు, వినియోగదారులతో ఎలా మెలగాలో, మాట్లాడాలో నేర్పిస్తున్నాం' అని **ప్రిన్సిపల్ వెంకటరమణ** చెప్పారు.

» ప్రాక్టికల్స్ శిక్షణ బాగుంది: నేను 18 ఏళ్లు నేవీలో సేవలందించా. ప్రస్తుతం విశాఖలో ఉద్యోగం చేస్తున్నా. మరో రెండు నెలల్లో ఉద్యోగ విరమణ చేస్తా. ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ పొందుతున్నా. తరగతి గదిలో పాఠాలే కాకుండా వివిధ హోటళ్లకు పంపించి ప్రాక్టికల్స్ శిక్షణ ఇప్పిస్తున్నారు. ఈ శిక్షణ నాకు భవిష్యత్తులో ఉపయోగపడుతుందని భావిస్తున్నా.

– మహమ్మద్ సైఫుద్దీన్, మణిపూర్

» క్యాటరింగ్ సంస్థను ప్రారంభిస్తా..: నేను మిలటరీలో 25ఏళ్లు పని చేశా. మరో ఆరునెలల్లో ఉద్యోగ విరమణ చేయబోతున్నా. అనంతరం క్యాటరింగ్ సంస్థను ప్రారంభించి పది మందికి ఉపాధి కల్పించాలని అనుకుంటున్నా. దాని కోసమే ఇక్కడ శిక్షణ పొందుతున్నా. శాఖాహార, మాంసాహార, ఉత్తర, దక్షిణ భారతదేశం, చైనీస్, పాశ్చాత్య దేశాల వంటల తయారీ నేర్చుకుంటున్నా.

– పేడాడ అశోక్ కుమార్, ఆమదాలవలస

కాసులు ఇచ్చుకో.. దుకాణం పెట్టుకో!

ఆనందపురం, న్యూస్‌టుడే

ఆనందపురం పూల మార్కెట్లో వసూళ్లపర్వం

ఆనందపురం పూల మార్కెట్ ఆ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ఈ మార్కెట్‌ను విస్తరించాలని ఎప్పటి నుంచో ప్రతిపాదనలు ఉన్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో కొంతమంది చోటా నాయకులు వసూళ్లకు పాల్పడుతున్నారు. అక్కడ దుకాణం పెట్టుకోవడానికి స్థలానికో ధర నిర్ణయించి వారి జేబులు నింపుకొంటున్నారు.

» ఉత్తరాంధ్రలోనే అతిపెద్దదిగా ఆనందపురం పూల మార్కెట్ పేరుగాంచింది. ఇక్కడ బాగా గిరాకీ ఉండటంతో లాభాలు వస్తాయని రైతులు, వ్యాపారులు భావిస్తుంటారు. దీంతో జీవనోపాధి కోసం ఎలాగైనా అక్కడ దుకాణం పెట్టుకోవాలని పలువురు ఆసక్తి చూపుతున్నారు. ఇదే అదనుగా భావించిన స్థానిక నాయకులు వసూళ్ల దందా కొనసాగిస్తున్నారు.

ఆనందపురం కొత్త వంతెన వద్ద దుకాణాలు

» **ఇదీ పరిస్థితి..:** కూడలి పరిసర ప్రాంతాల్లో స్థలానికో ధర నిర్ణయించారు. పాత వంతెన కింద ఒక రేటు, కొత్త వంతెన కింద మరో రేటు, పాత పంచాయతీ భవనం వద్ద, ఎన్టీఆర్ విగ్రహం వద్ద మరో ధర ఉంటోంది. బీఎస్ఎన్ఎల్ కేటాయించిన స్థలం ముందు, తగరపువలస సర్వీస్‌రోడ్డులో, బంటుపల్లి వారి కల్లాలు వెళ్లే చోట, వ్యవసాయ మార్కెట్, పేపల మార్కెట్ వద్ద కూడా వేర్వేరు చెల్లింపులు చేయాల్సిందేనని హుకుం జారీ చేస్తున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో వ్యాపారులు రూ.లక్షల్లో చెల్లించుకోవాల్సి వస్తోంది. ఈ మామూళ్లతో పాటు నెలనెలా అద్దెలు చెల్లించుకోవాల్సి ఉండటంతో ఆర్థిక భారం తప్పడం లేదని చిన్నచిన్న వ్యాపారస్థులు వాపోతున్నారు.

కొందరు నేతలు అనుమతి ఉంటే కొంత తగ్గిస్తున్నారు, లేకుంటే వారు డిమాండు చేసినంత ఇచ్చుకోవాల్సిందేనని వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు చెబుతున్నారు.

★ **వెంటాడుతున్న ట్రాఫిక్ సమస్య:** విచ్చలవిడిగా రోడ్డుపై, కూడలిలో దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంతో ఆనందపురం కూడలి వద్ద విపరీతమైన ట్రాఫిక్ ఏర్పడుతోంది. జాతీయ రహదారి కావడంతో నగరం నుంచి విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశాలకు ఇదే మార్గం గుండా అధిక సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ట్రాఫిక్ నిర్వహణ యంత్రాంగం అవస్థలు చెబుతున్నారు. స్థానిక నాయకులు తీరు మార్చుకోవడం లేదు. తరచూ ట్రాఫిక్ సమస్య తప్పటం లేదు. రోడ్డుపై, కూడలిలో ఆక్రమణల దుకాణాలు ఏర్పాటు చేయకుండా నియంత్రించాల్సిన అవసరాన్ని పలువురు గుర్తు చేస్తున్నారు. అలాగే మార్కెట్‌ను విస్తరించి సరైన సదుపాయాలు కల్పిస్తే అన్నింటికీ పరిష్కార మార్గం లభిస్తుందని చెబుతున్నారు.

మత్తు వదిలేదెలా?

★ అందని ఐపీ సేవలు
★ సిబ్బందికి జీతాలు రాక ఇబ్బందులు
★ కేజీహెచ్‌లోని 'వ్యసన విముక్తి కేంద్రం' పరిస్థితి ఇది

ఈనాడు, విశాఖపట్నం: విద్యార్థులు, యువత, మధ్య వయస్కులనే తేడా లేకుండా చాలా మంది మద్యం, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు బానిసవుతున్నారు. వాటి బారిన పడి జీవితాలు సర్వనాశనం చేసుకుంటున్నారు. దీంతో కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయి. అలాంటి వారికి చికిత్స అందించేందుకు కింగ్ జార్జి ఆసుపత్రి (కేజీహెచ్)లో 2020లో వ్యసన విముక్తి కేంద్రం ఏర్పాటుచేశారు. ఓపీతోపాటు ఐపీ సేవలూ అందించాలని నిర్ణయించారు. కానీ, తగినంత సిబ్బంది లేకపోవడం, అక్కడ పనిచేస్తున్న వారికి సమయానికి జీతాలు రాకపోవడంతో సేవలు సక్రమంగా అందడం లేదు.

» మత్తుపదార్థాలకు బానిసైన వారికి డి-అడిక్షన్ కేంద్రంలో ఉచితంగా చికిత్స అందిస్తున్నారు. బాధితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి కృషి చేస్తున్నారు. » ఆ కేంద్రంలో వైద్యులు, సిబ్బంది బాధితులకు వ్యక్తిగత, ఫ్యామిలీ, బృంద కౌన్సెలింగ్ చేపడుతున్నారు.

రోజుకు 15 మంది బాధితులు

» శ్రీకాకుళం, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం మన్యం, పాడేరు తదితర ప్రాంతాల నుంచి రోజుకు కనీసం 15 మంది రోగులు ఇక్కడికి వస్తున్నారు. వారిలో 20 నుంచి 40 ఏళ్ల వయసు వారే ఎక్కువ.

» ఇక్కడ ఐపీ సదుపాయం లేదు. దీంతో వైద్యుల పర్యవేక్షణ అవసరమైన బాధితులను ప్రభుత్వ మానసిక ఆసుపత్రిలోని వ్యసన విముక్తి వార్డుకు పంపిస్తున్నారు.

» ఇక్కడ ఉచితంగా మెరుగైన చికిత్స అందుతుండటంతో క్రమంగా కేంద్రానికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. సరిపడా సిబ్బంది లేకపోవడంతో అందరికీ సేవలందించలేని పరిస్థితి. దీంతో చాలా మంది ప్రైవేటు కేంద్రాలకు వెళ్తున్నారు. అక్కడ చికిత్సకు రూ.20 వేల నుంచి రూ.లక్షల్లో ఖర్చవుతుంది.

విజ్ఞప్తి చేస్తే కొంత...

ఈ కేంద్రంలో ఉద్యోగులు కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్నారు. మొత్తం తొమ్మిది పోస్టులు మంజూరు కాగా.. ప్రస్తుతం ఆరుగురు పనిచేస్తున్నారు. ఒకరు ప్రభుత్వ సెలవులో ఉన్నారు. అయిదు నెలలుగా అక్కడి ఉద్యోగులకు జీతాలు రావట్లేదు. గతేడాది ఏడాదిన్నర జీతం రాకపోవడంతో ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. దీంతో మొత్తం విడుదల చేశారు. తర్వాత ఈ ఏడాది జూన్ నుంచి మళ్లీ అదే పరిస్థితి. ఇప్పటివరకు జీతాలు రాలేదని, ఉన్నతాధికారులు సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

యువతపై డ్రగ్స్ పంజా

ఇతర ప్రాంతాల నుంచి తెచ్చి విశాఖలో విక్రయాలు

వైకాపా విద్యార్థి విభాగం అధ్యక్షుడు కొండారెడ్డి, మరో ఇద్దరికి రిమాండ్

ఈనాడు–విశాఖపట్నం, న్యూస్‌టుడే, జగదాంబకూడలి:

'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ ప్రభుత్వం ఓ వైపు ప్రత్యేక కార్యాచరణ చేపడితే... మరో వైపు కొందరు వైకాపా నేతలు మాత్రం యువతని డ్రగ్స్‌కి బానిసలుగా మార్చే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈగల్, విశాఖ టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా నిర్వహించిన దాడిలో వైకాపా విద్యార్థి విభాగం అధ్యక్షుడు కొండారెడ్డిని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. డ్రగ్స్ రాకెట్‌లో ఇతను కీలకంగా వ్యవహరించినట్లు వెలుగులోకి వచ్చింది.

★ బీటెక్ ఫైనలియర్ విద్యార్థులు హర్షవర్ధన్‌నాయుడు, గీత్‌చరణ్, వైకాపా విద్యార్థి విభాగ అధ్యక్షుడు కొండారెడ్డి స్నేహితులు. ఈ ముగ్గురు కలిసి బెంగళూరులోని శంతన్ బృందంతో మాట్లాడుకొని బెంగళూరు, హైదరాబాద్ నుంచి ఈ డ్రగ్స్ తెస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నిసార్లు ఎంత మోతాదులో డ్రగ్స్ విశాఖకు తెచ్చారు? ఎవరెవరికి సరఫరా చేశారు? ఎవరితో సంబంధాలున్నాయి? అనేదానిపై దృష్టిపెట్టి వాట్సప్ కాల్ డేటాను పోలీసులు పరిశీలిస్తున్నారు.

ఈ డ్రగ్స్ రాకెట్ వెనుక ఎవరున్నారు? అనేది తెలుసుకునేందుకు కొండారెడ్డిని కస్టడీలోకి తీసుకునే అవకాశాలూ ఉన్నాయి. మాజీ సీఎం జగన్‌తోపాటు, వైకాపా నేతలు అమర్‌నాథ్, ఎంవీవీ సత్యనారాయణ, వాసుపల్లి గణేష్ కుమార్‌తో కొండారెడ్డి దిగిన ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

★ కొండారెడ్డి ఇప్పటికే చాలా మంది యువతకు ఎల్ఎస్‌డీ డ్రగ్ అలవాటు చేసినట్లు, చిన్న స్ట్రిప్ ఒక్కొక్కటి రూ.వెయ్యి చొప్పున అమ్మినట్లు సమాచారం. తన వెంట తిప్పుకోవడానికి కొందరు విద్యార్థులకు కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇటీవల ఏయూలో ఓ విద్యార్థి గుండెపోటుతో మరణించిన సమయంలో వీసీ ఛాంబర్‌ను ముట్టడించి.. రాజకీయం చేయాలని కొండారెడ్డి చూశాడు. డ్రగ్స్ తెచ్చేందుకు గీత్‌చరణ్‌కు విమాన, రైళ్ల టికెట్లు తీసి ఇతర ప్రాంతాల పంపినట్లు పోలీసుల విచారణలో తేలింది.

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ మేరీ ప్రశాంతి

ఏమిటీ ఎల్ఎస్‌డీ స్ట్రిప్స్?

ఎల్ఎస్‌డీ అంటే లైసర్జిక్ యాసిడ్ డైథైలామైడ్. మత్తు కలిగిస్తుంది. బ్లాటర్ పేపర్‌పై ఎల్ఎస్‌డీని ద్రవ రూపంలో స్ప్రే చేసి ఆరబెట్టి చిన్న స్ట్రిప్స్, టాబ్స్‌గా విక్రయిస్తారు. ఈ పేపరు స్ట్రిప్స్‌ను నాలుక కింద పెట్టుకుంటే అది కరిగి మెదడులోకి రసాయన ప్రభావం చేరుతుంది. అరగంటలో దాని మత్తు ప్రభావం ప్రారంభమై 8-12 గంటల వరకు ఉంటుంది. ఎల్ఎస్‌డీ డ్రగ్‌ను దేశంలో నిషేధించారు. దీనిని వాడటం వల్ల ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తుతాయి. క్రమంగా మానసిక సమస్యలు ఎక్కువవుతాయి. రక్తపోటు పెరుగుతుంది.

స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ స్ట్రిప్స్

'కొండా రెడ్డి తన స్నేహితుడైన డొంక గణేష్ ద్వారా రూ.25 వేలు శంతన్‌కు ఫోన్‌పే చేయించాడు. 50 ఎల్ఎస్‌డీ స్ట్రిప్స్ కొనుగోలు చేయగా.. వాటిలో 48 గీత్‌చరణ్‌కు ఇచ్చి రెండు గణేశ్ వద్ద ఉంచుకున్నాడు. ఆదివారం గీత్ చరణ్ రైలులో బెంగళూరు నుంచి విశాఖ వచ్చాడు. కొండారెడ్డి, హర్షవర్ధన్ నాయుడు డ్రగ్స్ తీసుకునేందుకు రైల్వేస్టేషన్‌కు వచ్చారు. టాస్క్‌ఫోర్స్, నాలుగోపట్టణ పోలీసులు సంయుక్తంగా వారిని పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. నిందితులు నుంచి 48 ఎల్ఎస్‌డీ స్ట్రిప్స్, మూడు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నాం. కర్ణాటకకు చెందిన శంతన్‌ను పట్టుకోవాల్సి ఉంది' అని కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో **డీసీపీ మేరీ ప్రశాంతి** వివరించారు.

అనుమానమే పెనుభూతమైంది!

దంపతుల మృతి కేసులో వీడిన మిస్టరీ

గురుద్వారా, న్యూస్‌టుడే: నగరంలో ఆదివారం కలకలం రేపిన దంపతుల మృతి కేసు మిస్టరీ వీడింది. భార్యపై అనుమానంతో భర్త గొంతు నులిమి చంపేసినట్లు పోస్టుమార్టం ప్రాథమిక నివేదికలో తేలింది. అక్కయ్యపాలెం 'సంగం ఆఫీసు' సమీపంలో సూరిశెట్టి వాసు(35).. భార్య అనిత(24), తల్లితో కలిసి నివాసముంటున్నాడు. ఎనిమిది నెలల క్రితమే వీరికి వివాహమైంది. పెళ్లి సమయంలో 50 సెంట్లు భూమి, 8 తులాల బంగారం ఇచ్చారు. అనిత ఏడు నెలల గర్భిణి. నెల రోజుల నుంచి అనితను వాసు అనుమానించడం మొదలుపెట్టినట్లు ఆమె తల్లిదండ్రులు చెబుతున్నారు. మధురవాడలోని బంధువుల ఇంట్లో ఓ కార్యక్రమం నిమిత్తం వాసు తన తల్లిని ద్విచక్రవాహనంపై ఆదివారం ఉదయం 10.30 గంటలకు దించి తిరిగి ఇంటికొచ్చేశాడు. మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత అనితకు తల్లి ఫోన్ చేయగా అంతా బాగానే ఉన్నట్లు చెప్పింది. సాయంత్రం 6 గంటల సమయంలో వాసు తల్లి ఇంటికొచ్చి తలుపు కొట్టినా ఎంతకీ తీయకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చింది. తలుపులు పగులగొట్టి చూడగా అనిత కిందపడి చనిపోయి ఉండటం, వాసు ఉరేసుకుని కనిపించారు. ఇద్దరి మధ్య పెనుగులాట జరిగినట్లు అనిత మృతదేహంపై గోళ్ల గాట్లు ఉన్నాయి. దుప్పటితో అనిత గొంతు బిగించి ఊపిరాడకుండా చేయడంతో చనిపోయినట్లు పోస్టుమార్టం నివేదికలో తేలింది. అనిత చనిపోయిందన్న భయంతోనే వాసు కూడా ఉరేసుకొని మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. మృతదేహాలను పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు. అనిత గర్భిణి కావడంతో ఎంతో సంతోషించామని ఇలా విగతజీవిగా కనిపిస్తుందని అనుకోలేదని ఆమె కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

వాసు, అనిత (పాతచిత్రం)

'పర్యాటక కేంద్రం'లో ప్రైవేటు వాహనాలకూ ఛార్జింగ్

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో నడిచే డబుల్‌డెక్కర్ బస్సుల విద్యుత్తు ఛార్జింగ్ కేంద్రంలో ప్రైవేట్ ఎలక్ట్రిక్ కార్లు, బస్సులకు కూడా ఛార్జింగ్ అవకాశం కల్పిస్తున్నారు. ఇందుకు నిర్ణీత రుసుం డిజిటల్ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. సాగర్ నగర్‌లోని ఈపీడీసీఎల్ కార్యాలయం సమీప సంబంధిత ఛార్జింగ్ కేంద్రంలో ఇందుకు తగినట్లు ఏర్పాట్లు చేశారు.

EMMANUEL COLLEGE OF PHARMACY
Affiliated to JNTU GV & Approved by PCI, New Delhi
Thagarapuvalasa, Bheemili, Visakhapatnam
ADMISSION NOTICE
Candidates interested to join
D.Pharm B.Pharm M.Pharm
Course in our Pharmacy college for 2025-2026 are advised to contact college office.
Candidates who wish to change their options to our college from other Pharmacy colleges may also contact.
Note: candidates with or without APEAPCET and APPGECET can contact for admissions.
Principal: 9502784259,9491606933

पीएम श्री केन्द्रीय विद्यालय मल्कापुरम
PM SHRI KENDRIYA VIDYALAYA MALKAPURAM
VISAKHAPATNAM-530005
प्रत्यक्ष साक्षात्कार/WALK- IN- INTERVIEW
सत्र 2025-2026 / के लिए व्यावसायिक शिक्षक प्रशिक्षक (Vocational Teacher/Trainer) के अंशकालिक अनुबंधित शिक्षक पैनल की तैयारी हेतु पी.एम.श्री केन्द्रीय विद्यालय, मलकापुरम में 07-11-2025 प्रातः 10:00 बजे वॉक-इन-इंटरव्यू आयोजित किया जाएगा
A WALK-IN-INTERVIEW will be held on 07-11-2025, 10:00 AM at PM SHRI KENDRIYA VIDYALAYA MALKAPURAM to prepare a panel of part time Contractual teacher for Vocational Teacher/Trainer for the session 2025-26.
Educational Qualifications: B.E/B.Tech. (Electronics & Communication Engineering) Minimum one year experience.
Remuneration: 25,000 per month
Interested candidates fulfilling the specified qualification may appear for the interview with their original mark sheets and certificates along with a set of self attested photocopies of all marksheets and certificates. Registration will be done from 08:00 AM to 09:30 AM on the day of interview. No registration will be entertained after 09:45 AM.
Venue: PM SHRI KV MALKAPURAM, VISAKHAPATNAM

నచ్చినోళ్లకే పదోన్నతులా?

'డీసీసీబీ'లో నిబంధనలు గాలికి?

ఈనాడు, విశాఖపట్నం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో పదోన్నతుల తీరుపై ఆరోపణలొస్తున్నాయి. సీనియార్టీని కాదని నచ్చినోళ్లను అందలమెక్కించినట్లు సమాచారం. డీసీసీబీలో పదోన్నతులకు ఇటీవల ప్రకటన ఇచ్చారు. ఎప్పుడు హాజరవ్వాలనే వివరాలతో కాల్ లెటర్లు పంపారు. గత నెల 23, 24 తేదీల్లో రాత్రి 9 గంటల నుంచి 11.30 గంటల మధ్యలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఏజీఎం నుంచి డీజీఎంకు, చీఫ్ మేనేజర్ నుంచి అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు నలుగుర్ని ఎంపిక చేశారు. మేనేజర్ నుంచి చీఫ్ మేనేజర్ పోస్టులకు నలుగురు, అసిస్టెంట్ మేనేజర్ నుంచి మేనేజర్ పోస్టుకు ఆరుగురికి పదోన్నతి కల్పించారు. స్టాఫ్ అసిస్టెంట్ నుంచి అసిస్టెంట్ మేనేజర్‌గా 12 మందికి పదోన్నతులు ఇచ్చారు. వీటిల్లో చాలా పోస్టులకు బ్యాంకు నిబంధనల ప్రకారం వ్యవహరించలేదని కొందరు ఆరోపిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న వారికి మొండి చేయి చూపినట్లు తెలుస్తోంది. పోటీలేని ఉన్నత స్థాయి పదవులకు తర్వాత రోజే ఆర్డర్లు అందజేసి, మిగిలిన వాటికి వారం రోజుల తర్వాత అందజేయడం గమనార్హం.

★ నిబంధనల ప్రకారం పదోన్నతుల్లో 70 శాతం సీనియార్టీకి ప్రాధాన్యం ఇవ్వాలి. ఇంకా పోటీ ఉంటే ప్రత్యేకంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించాలి. కొన్ని పదోన్నతుల వ్యవహారంలో అలా చేయలేదంటున్నారు.

ఇది మాధవధారలో సింహాచలం కొండ చెంతనే ఉన్న జలధార. కార్తిక మాసంలో ఇక్కడ స్నానాలాచరించి సమీప తోటల్లో భక్తులు వనసమారాధన చేస్తుంటారు. కానీ, ఆ తోటల్లో పరిస్థితి చూసి ఇప్పుడు బెంబేలెత్తుతున్నారు...

6లో

ఎర్రమట్టి దిబ్బల సరిహద్దులు పరిశీలన

ఎర్రమట్టి దిబ్బలకు ఉత్తరం వైపు హద్దులను పరిశీలిస్తున్న కమిటీ

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భీమిలి మండలం నేర్లవలసలో ఎర్రమట్టి దిబ్బల సరిహద్దుల నిర్ధారణ కమిటీ సోమవారం పర్యటించింది. ఎర్రమట్టి దిబ్బల పరిరక్షణకు హైకోర్టులో దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై అయిదుగురి సభ్యులతో కమిటీ ఇటీవల ఏర్పాటైంది. ఎర్రమట్టి దిబ్బలు దాదాపు 450 ఎకరాలకు పైగా విస్తరించినప్పటికీ జియో హెరిటేజ్ సైట్‌గా కేవలం 262 ఎకరాలనే గుర్తించారని పిల్ దాఖలు చేసిన వ్యక్తులు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ప్రైవేటు లేఅవుట్‌లు వేయడంతో పాటు యంత్రాలను వినియోగిస్తూ కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టడంతో అరుదైన చారిత్రక వారసత్వ సంపద అంతరిస్తోందని, దీనిని పరిరక్షించాలని విన్నవించారు. ఈ నేపథ్యంలో న్యాయస్థానం ఆదేశాల మేరకు విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ అథారిటీ (వీఎంఆర్‌ఏ) ప్రత్యేక ఉప కలెక్టరు దయానిధి, భీమిలి రెవెన్యూ డివిజనల్ అధికారి కె.సంగీత్‌మాథుర్, గనుల శాఖ విశాఖ జిల్లా ఉప సంచాలకులు, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) ఏపీ యూనిట్ డైరెక్టర్ పి.దుర్గాప్రసాద్, సీనియర్ జియోలాజిస్టు డాక్టర్ శ్రీకాంత్‌లతో ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. సరిహద్దుల నిర్ధారణ కొలిక్కి వచ్చిందని, తుది హద్దులను ఖరారు చేస్తామని కమిటీ సభ్యులన్నారు. అనంతరం సమగ్ర నివేదిక న్యాయస్థానానికి అందిస్తామన్నారు.

13వ వర్ధంతి

మీరు మమ్ములను వీడి నేటికి 13 సంవత్సరాలు గడిచిననూ మీ మధుర స్మృతులు మా మదిలో ఎప్పటికీ మెదులుతూనే ఉంటాయి.. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ.శే. కొత్తపల్లి మేరి చిట్టెమ్మ
మరణం: 04-11-2012

కుమారుడు: కె. రవికుమార్
కోడలు: కె. ఇందిరా ప్రియదర్శిని
మనుమలు, మునిమనుమలు మరియు కుటుంబ సభ్యులు

అమ్మో పులి!!



ఈ నెల 14, 15 తేదీల్లో జరిగే భాగస్వామ్య సదస్సుకు దేశ, విదేశీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో రానున్నారు. ఈ నేపథ్యంలో నగరాన్ని సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. బీచ్ రోడ్డులో పలు ప్రహరీలపై స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పలు చిత్రాలు అబ్బురపడేలా తీర్చిదిద్దుతున్నారు. జూ వద్ద గోడ మధ్యలో నుంచి పులి దూకి వస్తున్నట్లు, చెట్లు పెరిగిన చోట కొమ్మలపై ఉన్నట్లు వేసిన బొమ్మలు అలరిస్తున్నాయి. –ఈనాడు, విశాఖపట్నం



సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి

80087 09638

(c) eenadu

పీజీఆర్ఎస్‌లో 413 వినతుల స్వీకరణ

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో 413 మంది అర్జీదారుల నుంచి అధికారులు వినతులు స్వీకరించారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, జేసీ మయూర్ అశోక్, జీవీఎంసీ అదనపు కమిషనర్ వర్మ తదితరులు అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ-148, జీవీఎంసీ-126, పోలీసు-32, ఇతర శాఖలకు సంబంధించి 107 వినతులు వచ్చాయి. ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పింఛన్లు, ఉపాధి అవకాశాలు కల్పించాలని పలువురు కోరారు. భూ సంబంధిత సమస్యలపై కొందరు, జీవీఎంసీ పరిధిలో నెలకొన్న వివిధ పనులు, టిడ్కో ఇళ్లకు సంబంధించిన అంశాలపై మరికొందరు వినతులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులతో జిల్లా అధికారులు నేరుగా మాట్లాడాలని ఆదేశించారు. కాలయాపన లేకుండా నిర్ణీత గడువులోగా అర్జీలు పరిష్కరించాలన్నారు. ఈ సమస్యపై పూర్తి అవగాహనతో ఉండాలని, నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. ఫిర్యాదుల స్థితిగతులపై ప్రజలకు వివరించి చెప్పాలన్నారు.

6న జడ్పీ 'స్థాయీ' కమిటీ సమావేశాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్ స్థాయీ కమిటీ సమావేశాలు ఈనెల 6వ తేదీన జడ్పీ సమావేశ మందిరంలో జడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరగనుంది. ఆయా సమావేశాలు ఉదయం 10గంటల నుంచి ఆరంభమవుతాయని, ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన అధికారులంతా హాజరు కావాలని జడ్పీ సీఈఓ నారాయణమూర్తి ఓ ప్రకటనలో కోరారు.

AXIS BANK LIMITED రిటైల్ లెండింగ్ అండ్ పేమెంట్ గ్రూప్ (సౌత్ జోనల్ కార్యాలయం/ శాఖ): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డి.నెం.43-9-141, 4వ అంతస్తు, శ్రీ గాయత్రి టవర్స్, శ్రీ కన్య రోడ్, దొండపర్తి, విశాఖపట్నం, ఆం.ప్ర-530016.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, 3వ అంతస్తు, గిగాప్లెక్స్, ఎన్‌పిసి-1, టిటిసి ఇండస్ట్రియల్ ఏరియా, ముగల్సాన్ రోడ్, ఏరోలి, నవీ ముంబాయి- 400708. **నమోదిత కార్యాలయం:** 'త్రిషూల్', 3వ అంతస్తు, సమర్థేశ్వర్ టెంపుల్ లా గార్డెన్, ఎల్లిస్‌బ్రిడ్జి, అహ్మదాబాద్-380006.

స్థిరాస్తి అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) & 9(1)లోని నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ- వేలం అమ్మకం ప్రకటన.
సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీతలు మరియు గ్యారంటర్లకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టబడిన/ ఛార్జిచేయబడిన మరియు సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారిచే భౌతిక స్వాధీనత చేపట్టబడిన దిగువనీయబడిన స్థిరాస్తి లోన్ **రిఫరెన్స్ నెం.3569లో శ్రీ నాగవోలు శ్రీధర్ మరియు శ్రీమతి నాగవోలు అపర్ణ నుండి సెక్యూర్ క్రెడిటార్‌కు రావల్సిన బకాయిలు 16-07-2025 నాటికి రూ. 18,02,614/- (పద్దెనిమిది లక్షల రెండు వేల ఆరు వందల పధ్నాలుగు రూపాయలు మాత్రమే)లతో పాటు భవిష్యత్ వడ్డీ మరియు వ్యయాలను రాబట్టుకొనుటకు "ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అది అలానే ప్రాతిపదిక" 21-11-2025న విక్రయించబడుతుంది.** అవసరమైన వివరాలను జతపరిచిన వేలం షెడ్యూలులో చూడండి.

తెల్సిన ఎన్‌కంబ్రెన్సులు (ఏవేని ఉంటే)	లేవు.
రిజర్వు ధర (రూ.లలో)	రూ. 20,73,060/- (ఇరవై లక్షల డెబ్బై మూడు వేల అరవై రూపాయలు మాత్రమే)
ధరావతు (రూ.లలో)	రూ. 2,07,306/- (రెండు లక్షల ఏడు వేల మూడు వందల ఆరు రూపాయలు మాత్రమే) విశాఖపట్నం వద్ద చెల్లింపయ్యేలా 'యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్' పేరిట డీడీ/ పిఒ ద్వారా.
బిడ్ పెంపుదల సొమ్ము	రూ. 10,000/- (పది వేల రూపాయలు మాత్రమే)
ధరావతుతో బిడ్స్/ టెండరు దాఖలుకు చివరి తేదీ, సమయం మరియు ప్రదేశం	20.11.2025 సా.5.00 గం.లోగా. శ్రీ ఉద్దంగి రాంబాబును ఉద్దేశించి యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డి.నెం.43-9-141, 4వ అంతస్తు, శ్రీ గాయత్రి టవర్స్, శ్రీ కన్య రోడ్, దొండపర్తి, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530016 చిరునామాతో.
బహిరంగ ఇ-వేలం తేదీ, సమయం మరియు ప్రదేశం	21.11.2025 ఉ. 11.00 గం.ల నుండి మ.12.00 గం. మధ్య ప్రతీసారి 5 నిమిషాల అపరిమిత పొడిగింపులతో వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com వద్ద. ఇ-వేలం బిడ్ ఫారం, డిక్లరేషన్ వగైరా గల ఇ-వేలం టెండరు డాక్యుమెంట్లు పైనతెలిపిన విధంగా సర్వీసు ప్రొవైడరు వెబ్‌సైట్‌లో లభించును.

తనఖా పెట్టిన ఆస్తి వివరము

విశాఖపట్నం జిల్లా, ఆనందపురం సబ్ డివిజన్, భీమునిపట్నం మండలం, తాటితూరి గ్రామం మరియు గ్రామ పంచాయతీలో సర్వే నెం.240/4పి, 8పి, 9పి, 10 & 254/7పిలో ఎక.3.14 సెంట్ల మొత్తం విస్తీర్ణంలో LP No.84/2021/1167/VMRDA/DPMS మరియు 03.04.2022 తేదీ నాటి VMRDA ద్వారా ఆమోదించిన "గూగుల్ రెసిడెన్సీ (OKA-IV)" లేఔట్, 139.60 చ.గజాలు లేదా 116.73 చ.మీటర్ల విస్తీర్ణపు ప్లాట్ నెం.24 ఖాళీ స్థలం. సరిహద్దులు: తూర్పు: 40 అ.వెడల్పు రోడ్, దక్షిణం: లేఔట్ గోడ, **పడమర:** ప్లాట్ నెం.22, ఉత్తరం: ప్లాట్ నెం.23. కొలతలు: **తూర్పు** వైపు: 35'3" అడుగులు లేదా 10.75 మీటర్లు, **దక్షిణం** వైపు: 40'2" అడుగులు లేదా 8.40 మీటర్లు, **పడమర** వైపు: 27'6" అడుగులు లేదా 12.19 మీటర్లు, **ఉత్తరం** వైపు: 40'2" అడుగులు లేదా 12.24 మీటర్లు.
అమ్మకం యొక్క వివరమైన నియమనిబంధనల కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్స్ వెబ్‌సైట్ అనగా https://www.axisbank.com/auction-retail నందు ఇవ్వబడిన లింక్‌ను మరియు బ్యాంక్ ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ M/s సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌వారి వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com ను చూడండి. వేలం బ్యాంక్ ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ M/s సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌వారి వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్‌లో **జరుగును. ఏదేని ఇతర సహాయం కొరకు, ఔత్సాహిక బిడ్డర్లు శ్రీ ఉద్దంగి రాంబాబు (మొబైల్ నెం.7382922383), అధీకృత అధికారిని కార్యాలయ వేళల్లో ఉ. 9.30 గం. నుండి సా. 4.00 గం. మధ్య** సంప్రదించవచ్చును.
ఈ ప్రకటనను సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) & 9(1) క్రింద రుణగ్రహీతలకు 15 రోజుల నోటీసుగా పరిగణించవలెను.

తేది: 04-11-2025
ప్రదేశం: విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి
యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

'జలధార' చెంత చింతలెన్నో?!

మాధవధార, న్యూస్‌టుడే: కార్తిక మాసం వచ్చిందంటే మాధవధారలోని తోటలు వనభోజనాలతో కళకళలాడుతాయి. వందల ఏళ్ల నాటి మర్రి చెట్ల ఊడలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవి. ఏడాది పొడవునా ఒక్కటిగా ఉండే ప్రకృతిని ఆస్వాదించేందుకు ఇక్కడకు వచ్చి ఈ తోటల్లోని ప్రకృతిని ఆరాధిస్తూ వనసమారాధనలు చేసి ఊరట పొందేవారు. ఇదంతా గతం.. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. నిరంతరం ప్రవహించే జలధార వద్ద సరైన సౌకర్యాలు కరవయ్యాయి. తోటల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోయి అధ్వానంగా మారాయి. ఒకప్పుడు నిరంతరం సందర్శకులతో కళకళలాడే ప్రాంతం నేడు కేవలం దంపినీయొద్దుగా మారింది. దీంతో సందర్శకుల తాకిడి ఏటా తగ్గుతూ వస్తోంది.

సింహాచలం అలయ తోటల్లో నిర్వహణ లేక ఇలా

★ **దేవస్థానం అధికారుల నిర్లక్ష్యం..:** మాధవధార ప్రాంతం, చుట్టూ ఉండే తోటలు సింహాచలం దేవస్థానం ఆధీనంలో ఉన్నాయి. ఇక్కడ ఉండే తోటలను ముడిఠేకేదారికి క్రమం తప్పకుండా వేలం వేసి వాటి సంరక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ దేవస్థానం ఇక్కడ ఉన్న తోటలను సకాలంలో వేలం వేయకుండా నిరుపయోగంగా కొన్నేళ్ల పాటు వదిలేయడం, ఎటువంటి సంరక్షణ చర్యలు చేపట్టకుండా వదిలేసింది. దీంతో ఆయా తోటల్లో పెద్ద ఎత్తున పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగి, తోటలన్నీ అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఆదాయమే లక్ష్యంగా కొన్ని తోటలను వేలం వేసి అనుగుణంగానప్పటికీ, వాటిని బాగు చేయలేక, ఎటువంటి పరిశోధన లేకపోవడంతో మధ్యలో వదిలేసి వెళ్లిపోతున్నారు.

★ **అభివృద్ధి పనులు చేపట్టాలి:** ఇక్కడ ఆధ్యాత్మిక ప్రాంతమే కాకుండా, ఎన్నో దశాబ్దాల చరిత్ర కలిగిన మాధవస్వామి, వేణుగోపాల స్వామి, శివాలయాలు ఉన్నాయి. ఇక్కడ ఏటా అక్టోబరు నుంచి మార్చి వరకు అనేక కార్యక్రమాలు చేపడుతుంటారు. ఇక్కడి ఆలయాలు, జలధార వద్ద మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి తోటలను వనభోజనాలకు అనుకూలంగా మారిస్తే సందర్శకులతో కళకళలాడుతుందని ఆ దిశగా దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పవర్‌లిఫ్టింగ్ విజేత బుల్లయ్య కళాశాల జట్టు

విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అంతర్జాతీయ పవర్‌లిఫ్టర్ అనూషగౌడ్ తదితరులు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ఏయూ అంతర్ కళాశాల పవర్‌లిఫ్టింగ్ పోటీలు సోమవారం డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో ముగిశాయి. పోటీల్లో పురుషుల విభాగంలో బుల్లయ్య జట్టు ప్రథమ, అనిట్స్ కళాశాల జట్టు ద్వితీయ, మహిళల విభాగంలో బుల్లయ్య జట్టు ప్రథమ, శ్రీనివాస కాలేజ్ ఆఫ్ ఫార్మసీ జట్టు ద్వితీయ స్థానాల్లో గెలుపొందాయి. విజేతలకు అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ అనూషగౌడ్, దక్షిణ భారత పవర్‌లిఫ్టింగ్ సంఘం కార్యదర్శి ఎస్.కోటేశ్వరరావు, ఏ.పి.పవర్‌లిఫ్టింగ్ సంఘం కార్యదర్శి ఎం.ప్రభాకరరావు ట్రోఫీలు, పతకాలు అందజేశారు. ముగింపోత్సవంలో వెయిట్ లిఫ్టింగ్ కోచ్ డాక్టర్ ఎ.వి.ఎల్.ఎన్.రత్నాకరరావు, బుల్లయ్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఎస్.కె.చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, పీడీ డాక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ ఇంటర్నేషనల్ సేవలు ప్రశంసనీయం

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: లయన్స్ ఇంటర్నేషనల్ చేపడుతున్న విస్తృత సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు. రుషికొండ సమీప రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో సోమవారం లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో పశ్చిమ, దక్షిణ జోన్ల అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 550 మంది కాళ్లు లేనివారికి కృత్రిమ కాళ్లను సమకూర్చడం అభినందనీయమన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్‌లో మన రాష్ట్రానికి చెందినవారు అత్యున్నత స్థాయిలో ప్రాతినిధ్యం వహించడం గొప్ప విషయమన్నారు. కేంద్రం తరఫున సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రధాని మోదీ విశాఖ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. గూగుల్ డేటా సెంటరును విశాఖకు కేటాయించడమే ఇందుకు నిదర్శనమన్నారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఉత్తర, పలాస ఎమ్మెల్యేలు పి.విష్ణుకుమారరాజు, గౌతు శిరీష తదితరులు లయన్స్ ఇంటర్నేషనల్ సేవలను కొనియాడారు. విద్య, వైద్యం, పర్యావరణం, మహిళా సాధికారత, సాంకేతిక విభాగాల్లో సేవలందించిన వారికి అవార్డులు అందజేశారు. లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ పి.సుభాష్‌బాబు, లయన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రెజరర్ వేగేశ్న విజయ్‌రాజు, కృష్ణంరాజు శ్రీనివాస్ తదితర ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉక్కుకు అండగా కేంద్రం

కశింకోట, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెంలో ఎస్ఎల్ఆర్ కర్మాగారం నూతనంగా ఏర్పాటు చేసిన సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌ను కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ప్రారంభించారు. అనంతరం కర్మాగారంలో వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడారు. ఇక్కడి ప్రజల మనోభావాలను గౌరవించి విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయకుండా కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో కొనసాగిస్తున్నామన్నారు. ఉక్కు పరిశ్రమను గాడిలో పెట్టడానికి, పటిష్ఠం చేయడానికి ప్రభుత్వం రూ. 11,400 కోట్ల ప్యాకేజీ అందించిందన్నారు. నక్కపల్లిలో త్వరలో ఏర్పాటు చేసే మిత్తల్ ఉక్కు కర్మాగారం తొలిదశలోనే భారీ ఉత్పత్తి లక్ష్యంతో ఉందని, 2029 నాటికి ప్లాంట్ పూర్తిస్థాయిలోకి అందుబాటులోకి వస్తుందని వివరించారు.

జీవీఎంసీకి 137 వినతులు

అర్జీదారు సమస్య తెలుసుకుంటున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 137 వినతులు వచ్చాయి. మేయర్ పీలా శ్రీనివాసరావు, అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి వాటిని స్వీకరించారు. జోన్-1కు 1, జోన్-2కు 20, జోన్-3కు 16, జోన్-4కు 25, జోన్-5కు 17, జోన్-6కు 34, జోన్-7కు 2, జోన్-8కు 16, ప్రధాన కార్యాలయానికి 6 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో పరిపాలనకు 7, రెవెన్యూకు 13, ప్రజారోగ్యానికి 8, ప్రణాళికకు 58, ఇంజినీరింగ్‌కు 26, ఉద్యానవన విభాగానికి 7, యూసీడీకి 18 ఫిర్యాదులు అందాయి. ఆయా సమస్యలను పరిష్కరించాలని మేయర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

డీజీఎన్‌పీగా వైస్ అడ్మిరల్ శ్రీనివాస్

నేవల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ జనరల్ వైస్ అడ్మిరల్ శ్రీనివాస్

సింధియా, న్యూస్‌టుడే: ఈస్టర్న్ నేవల్ కమాండ్‌కు చెందిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ నేవల్ ప్రాజెక్ట్స్(డీజీఎన్‌పీ)గా వైస్ అడ్మిరల్ కె.శ్రీనివాస్ నియమితులయ్యారని సోమవారం నేవీ వర్గాలు తెలిపాయి. శ్రీనివాస్ ఇదే కమాండ్‌లోని విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డులో అడ్మిరల్ సూపరింటెండెంట్(ఎ.ఎస్.డి)గా ఇప్పటి వరకు సమర్థంగా విధులు నిర్వహించారు. 1990 జనవరి ఒకటిన భారత నౌకాదళంలో చేరారు. కోరుకొండ సైనిక్ స్కూల్, నేషనల్ డిఫెన్స్ అకాడమీ, వెల్లింగ్టన్, న్యూఢిల్లీలో విద్యాభ్యాసం చేశారు. 35 ఏళ్ల సర్వీసులో ఐఎన్ఎస్ విరాట్, ఐఎన్ఎస్ విక్రమాదిత్య వంటి యుద్ధనౌకలు, యుద్ధ విమానాలు, ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్టులు, ఫ్లీట్ నిర్వహణ విధుల్లో పనిచేశారు.

ట్రాఫిక్ కష్టాలు తీరేదెన్నడో..?

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి కూడలిలో ట్రాఫిక్ కష్టాలు ఎప్పటికి తీరుతాయోనని వాహన చోదకులు వాపోతున్నారు. బీఆర్‌టీఎస్ రహదారి నిర్మాణం చేపట్టి పదిహేనేళ్లు పూర్తయినా పెందుర్తి కూడలి విస్తరణ మాత్రం కలగానే మిగిలిపోయింది. వారాంతాలు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి వచ్చే సమయాల్లో కూడలిలో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. సోమవారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎస్సై నరసింగరావు ఆధ్వర్యంలో సిబ్బంది శ్రమించినా గంట పాటు వాహనాలు కదల్లేదు. పెందుర్తి పీహెచ్‌సీ కూడలి నుంచి ఎన్టీఆర్ విగ్రహం కూడలి వరకు రహదారి విస్తరణ పూర్తయితేనే ఈ కష్టాలు గట్టెక్కుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆ దిశగా ఆలోచన చేసి అమలు చేయాలంటున్నారు.

పెందుర్తి బీఆర్‌టీఎస్ రహదారిలో బారులు తీరిన వాహనాలు

AXIS BANK LIMITED రిటైల్ లెండింగ్ అండ్ పేమెంట్ గ్రూప్ (సౌత్ జోనల్ కార్యాలయం/ శాఖ): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డి.నెం.43-9-141, 4వ అంతస్తు, శ్రీ గాయత్రి టవర్స్, శ్రీ కన్య రోడ్, దొండపర్తి, విశాఖపట్నం, ఆం.ప్ర-530016.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, 3వ అంతస్తు, గిగాప్లెక్స్, ఎన్‌పిసి-1, టిటిసి ఇండస్ట్రియల్ ఏరియా, ముగల్సాన్ రోడ్, ఏరోలి, నవీ ముంబాయి- 400708. **నమోదిత కార్యాలయం:** 'త్రిషూల్', 3వ అంతస్తు, సమర్థేశ్వర్ టెంపుల్ లా గార్డెన్, ఎల్లిస్‌బ్రిడ్జి, అహ్మదాబాద్-380006.

స్థిరాస్తి అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) & 9(1)లోని నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ- వేలం అమ్మకం ప్రకటన.
సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీతలు మరియు గ్యారంటర్లకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టబడిన/ ఛార్జిచేయబడిన మరియు సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారిచే భౌతిక స్వాధీనత చేపట్టబడిన దిగువనీయబడిన స్థిరాస్తి లోన్ **రిఫరెన్స్ నెం.7230లో శ్రీ కనిమెరక మాధవ నాయుడు మరియు శ్రీమతి కనిమెరక సరస్వతి నుండి సెక్యూర్ క్రెడిటార్‌కు రావల్సిన బకాయిలు 16-07-2025 నాటికి రూ. 31,89,298/- (ముప్పై ఒక్క లక్షల ఎనభై తొమ్మిది వేల రెండు వందల తొంభై ఎనిమిది రూపాయలు మాత్రమే)లతో పాటు భవిష్యత్ వడ్డీ మరియు వ్యయాలను రాబట్టు కొనుటకు "ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అది అలానే ప్రాతిపదిక" 21-11-2025న విక్రయించబడుతుంది.** అవసరమైన వివరాలను జతపరిచిన వేలం షెడ్యూలులో చూడండి.

తెల్సిన ఎన్‌కంబ్రెన్సులు (ఏవేని ఉంటే)	లేవు.
రిజర్వు ధర (రూ.లలో)	రూ. 30,69,000/- (ముప్పై లక్షల అరవై తొమ్మిది వేల రూపాయలు మాత్రమే)
ధరావతు (రూ.లలో)	రూ. 3,06,900/- (మూడు లక్షల ఆరు వేల తొమ్మిది వందల రూపాయలు మాత్రమే) విశాఖపట్నం వద్ద చెల్లింపయ్యేలా 'యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్' పేరిట డీడీ/ పిఒ ద్వారా.
బిడ్ పెంపుదల సొమ్ము	రూ. 10,000/- (పది వేల రూపాయలు మాత్రమే)
ధరావతుతో బిడ్స్/ టెండరు దాఖలుకు చివరి తేదీ, సమయం మరియు ప్రదేశం	20.11.2025 సా.5.00 గం.లోగా. శ్రీ ఉద్దంగి రాంబాబును ఉద్దేశించి యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డి.నెం.43-9-141, 4వ అంతస్తు, శ్రీ గాయత్రి టవర్స్, శ్రీ కన్య రోడ్, దొండపర్తి, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530016 చిరునామాతో.
బహిరంగ ఇ-వేలం తేదీ, సమయం మరియు ప్రదేశం	21.11.2025 ఉ. 11.00 గం.ల నుండి మ.12.00 గం.మధ్య ప్రతీసారి 5 నిమిషాల అపరిమిత పొడిగింపులతో వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com వద్ద. ఇ-వేలం బిడ్ ఫారం, డిక్లరేషన్ వగైరా గల ఇ-వేలం టెండరు డాక్యుమెంట్లు పైనతెలిపిన విధంగా సర్వీసు ప్రొవైడరు వెబ్‌సైట్‌లో లభించును.

తనఖా పెట్టిన ఆస్తి వివరము

విశాఖపట్నం జిల్లా, మధురవాడ సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా పరిధిలో మధురవాడ గ్రామం వద్ద గల సర్వే నెం.209/బాగంలో ఎల్.ఆర్.ఎస్.ఆర్.సి నెం.3647/10/ఎల్5, తేదీ: 23.03.2017 ప్రకారం వుడా చే ఆమోదించబడిన 1468.67 చ.గజాలు లేదా 1227.29 చ.మీటర్ల (ప్లాట్ నెం.5 కలుపుకొని) విస్తీర్ణపు ఖాళీ స్థలం యావత్తు. పూర్తి స్థలానికి సరిహద్దులు: **తూర్పు:** రస్తా (ఎల్ఆర్ఎస్ ప్రకారం ప్రస్తుతం 30' రోడ్), **దక్షిణం:** పిల్ల అప్పల నరసింహ & ఇతరులకు చెందిన భూమి మరియు ఎల్ల నారాయణమ్మ & ఇతరులకు చెందిన భూమి, **పడమర:** ఇతరులకు పోతిన అప్పడు విక్రయించిన భూమి, **ఉత్తరం:** కొండ భీమ మరియు కోట నూక రత్నంకి చెందిన భూమి. కొలతలు: తూర్పు వైపు: 78.0 అడుగులు లేదా 23.77 మీటర్లు, దక్షిణం వైపు: 178.0 అడుగులు లేదా 54.25 మీటర్లు, పడమర వైపు: 68.0 అడుగులు లేదా 20.72 మీటర్లు, ఉత్తరం వైపు: 183.9 అడుగులు లేదా 56.05 మీటర్లు. అందులో నివాస ఫ్లాట్ నెం.405, మూడవ లెవల్‌తో మూడవ అంతస్తు, భవన విస్తీర్ణం 1120 చ.అ (ప్లింత్ ఏరియా 793 చ.అ + బాల్కని ఏరియా 60 చ.అ + కామన్ ఏరియా 257 చ.అ) మరియు "విశ్వనాథ్ అవెన్యూ-18" స్టిల్ట్ ఫ్లోర్‌లో కార్ పార్కింగ్ విస్తీర్ణం 100 చ.అడుగులలో 46.20 చ.గజాలు లేదా 38.62 చ. మీటర్ల విస్తీర్ణ అనిర్దేశిత మరియు అవిభాజ్య వాటా స్థలం. ఫ్లాట్ నెం.405కి సరిహద్దులు: **తూర్పు: లిఫ్ట్ మరియు ఫ్లాట్ నెం.404, దక్షిణం:** ఖాళీ, **పడమర:** ఫ్లాట్ నెం.406, **ఉత్తరం:** కామన్ కారిడార్.
గమనిక: ఆస్తి పాక్షికంగా నిర్మించబడింది.
అమ్మకం యొక్క వివరమైన నియమనిబంధనల కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్స్ వెబ్‌సైట్ అనగా https://www.axisbank.com/auction-retail నందు ఇవ్వబడిన లింక్‌ను మరియు బ్యాంక్ ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ M/s సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌వారి వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com ను చూడండి. వేలం బ్యాంక్ ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ M/s సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌వారి వెబ్‌పోర్టల్ https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్‌లో జరుగును. ఏదేని ఇతర సహాయం కొరకు, ఔత్సాహిక బిడ్డర్లు **శ్రీ ఉద్దంగి రాంబాబు (మొబైల్ నెం.7382922383), అధీకృత అధికారిని కార్యాలయ వేళల్లో ఉ. 9.30 గం.నుండి సా. 4.00 గం.మధ్య** సంప్రదించవచ్చును.
ఈ ప్రకటనను సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) & 9(1) క్రింద రుణగ్రహీతలకు 15 రోజుల నోటీసుగా పరిగణించవలెను.

తేది: 04-11-2025
ప్రదేశం: విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి
యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

PUBLIC NOTICE

That my client Sri **SINGAMPALLI SURESH**, resident of Visakhapatnam, going to purchase the below schedule mentioned Flat from **Sri Nihaal Maripini**, resident of Visakhapatnam.

That my client going to purchase the schedule mentioned Flat. The Vendor's father **Dr. Maripini Trinadh Veera Venkata Satyanarayana** informed that the Original of Registered Sale Deed Doct. No.1257/1994, dtd 15-06-1994 was lost somewhere and informed us that the Original Sale Deed is not in his possession. Subsequently, he executed Regd. Gift Deed Doct. No. 9208/2025, dated 30-08-2025 in favour of his son Sri Nihaal Maripini for the Flat.

The general public are hereby called upon that anybody having any objections/claims/interest with regard to the schedule mentioned property and for the loss of the Original Sale Deed, submit their written objections within seven days to the below mentioned address. As otherwise, my client will treat that there are no any objections from anybody and will proceed to purchase of the property.

SCHEDULE : Flat No. A-1, Ground Floor of "Raghuveer Apartments", having 1140 S.Ft., Door No. 14-1-13 with Undivided Site 40 Sq.Yds., Plot No.6, Daspalla Hills, Nowroji Road, Covered by T.S.No.1196-1H Part of Waltair Ward, Visakhapatnam.

Visakhapatnam
Dt.04-11-2025

B.TRINADHA RAO,
E.SRINIVASA RAO & D.S.LAKSHMI
ADVOCATES
D.No.29-10-3, Lalitha Colony
Dabagardens, VISAKHAPATNAM-20
Cell No.98482 14117

ఏయూలో కెరీర్ ప్లానింగ్ డెవలప్‌మెంట్ కేంద్రం



ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో కెరీర్ ప్లానింగ్ డెవలప్‌మెంట్ సెంటర్ (సీపీడీసీ)ని సోమవారం ప్రారంభించారు. సాగరతీరంలోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ సీపీడీసీ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆచార్యులు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఉద్యోగాలు కల్పించే సంస్థల ఆలోచనా విధానంలో ఎన్నో మార్పులు వస్తున్నాయన్నారు. వాటికి అనుగుణంగా విద్యార్థుల నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించాల్సి ఉందన్నారు. ప్లేస్‌మెంట్ అధికారి ఎ.ఆర్.రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఇంటర్న్‌షిప్ సమయంలో ఉద్యోగావకాశాలు కూడా లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య పి.కింగ్, ప్రిన్సిపాళ్లు ఆచార్య జి.శశిభూషణరావు, ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్య ఆర్.గిరిజా శంకర్, ఆచార్య ఎంపీవీ రాజు, ఆచార్య కె.సీతామహాలక్ష్మి, ఆచార్య ఆర్.పద్మశ్రీ, ఆచార్య డి.నగరాజ కుమారి, పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాల సందర్శనకు పర్యాటకశాఖ ప్రత్యేక ప్యాకేజీలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: కార్తికమాసం నేపథ్యంలో ఏపీ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో పుణ్యక్షేత్రాల సందర్శన ప్రత్యేక ప్యాకేజీలు అందుబాటులోకి తెచ్చినట్లు ఆశాఖ డివిజనల్ మేనేజర్ జి.వి.జె.జగదీష్ ఒక ప్రకటనలో తెలిపారు. పంచారామాలు, వాడపల్లి వేంకటేశ్వరస్వామి, అన్నవరం దేవాలయాల సందర్శన ఉంటుందన్నారు. పంచారామాల ప్యాకేజీ కింద బస్సు రాత్రి 7.30 గంటలకు బయలుదేరి, రెండో రోజు రాత్రి 8.30 గంటలకు తిరిగి విశాఖ చేరుకుంటుందన్నారు. పెద్దలకు రూ.3,250, పిల్లలకు రూ.2,640 టికెట్ ధరలుగా నిర్ణయించామన్నారు. వాడపల్లి వేంకటేశ్వరస్వామి, అన్నవరం దేవాలయాల ప్యాకేజీ కింద ఉదయం 5 గంటలకు బస్సు బయలుదేరి అదే రోజు రాత్రి 7.30 గంటలకు విశాఖ చేరుకుంటుందన్నారు. పెద్దలకు రూ.1,870, పిల్లలకు రూ.1,540 టికెట్ ధరలుగా నిర్ణయించామన్నారు. వివరాలకు 98480 07022, 98488 13584, 98480 23948 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

హిందూ మహాసముద్రంలో 'సావిత్రి' గస్తీ

సింధియా, న్యూస్‌టుడే : భారత నౌకాదళం ఈస్టర్న్ ఫ్లీట్‌కు చెందిన 'ఐఎన్ఎస్ సావిత్రి' ఆగ్నేయ హిందూ సముద్ర ప్రాంతంలో గస్తీ విధుల్లో పాల్గొంటుందని సోమవారం నేవీ వర్గాలు తెలిపాయి. మారిషస్‌లోని పోర్టు లూయిస్‌ను ఇటీవల నౌక చేరుకుందన్నారు. మారిషస్ రక్షణశాఖకు చెందిన నేషనల్ కోస్టు గార్డు ఈ నౌకకు సాదరంగా స్వాగతం పలికింది.

పోర్టు లూయిస్‌కు చేరుకుంటున్న ఐఎన్ఎస్ సావిత్రి

డిసెంబర్ 19 నుంచి 21 వరకు క్రెడాయ్ ఎక్స్‌పో

మాధవధార, న్యూస్‌టుడే: నగరంలోని వినియోగదారులకు క్రెడాయ్ సౌకర్యవంతమైన సేవలు అందిస్తోందని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. క్రెడాయ్ ఆధ్వర్యంలో డిసెంబర్ 19 నుంచి 21 వరకు గాదిరాజు ప్యాలెస్‌లో నిర్వహిస్తున్న 11వ క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో-2025 కోసం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఒకే వేదికపై వివిధ రకాల ప్రాజెక్టులను అందించే ఈ ఎక్స్‌పో రియల్ ఎస్టేట్ వ్యాపారం మరింత పుంజుకునే అవకాశం ఉందన్నారు. అధిక సంఖ్యలో పెట్టుబడిదారులు, విక్రయదారులు, వినియోగదారులు పాల్గొంటారని వివిధ వాణిజ్య ప్రాజెక్టులకు సంబంధించిన 70 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు క్రెడాయ్ ప్రతినిధులు తెలియజేశారు. కార్యక్రమంలో విశాఖ ఎస్బీఐ జనరల్ మేనేజర్ రాహుల్ సంకృత్య, క్రెడాయ్ విశాఖ చాప్టర్ ఛైర్మన్ వి.ధర్మేందర్, అధ్యక్షుడు ఈ.అశోక్‌కుమార్, కార్యదర్శి వి.శ్రీను, ఎక్స్‌పో కన్వీనర్ సి.హెచ్.గోవిందరాజు, రాజా శ్రీనివాస్, క్రెడాయ్ ఏపీ అధ్యక్షుడు బి.శ్రీనివాస్‌రావు, సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎస్‌బీఐ జీఎం రాహుల్, క్రెడాయ్ ప్రతినిధులు

EENADU Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

BUSINESS OFFER

వైజాగ్ డైమండ్ పార్క్ దగ్గర నెలకు 5-6 లక్షల బిజినెస్ గల రన్నింగ్ రెస్టారెంట్ సామాన్లు అన్నిటితో కలిపి 15లక్షలు మాత్రమే. మంచి అవకాశం. 9849724947, 7799338085.

PERSONAL CLASSIFIEDS

LOST

DOCUMENTS MISSING

I, **MOHAMMAD RUSTAM MOHIDDIN ANWAR**, residing at # 31-33-46/1/6, C2 Neelu Heights, Leelamahal Road, Visakhapatnam-530020, lost / misplaced my original Sale Deed Documents **No.236/2010** dated 11-01-2010, while I was travelling by bike from Madhurawada to Allipuram.

If anybody found, may please handover the said documents to the undersigned.

Ph: **99129 51870**

REAL ESTATE

FLAT FOR SALE

SEETHAMMADHARA

Rs.6999/Sft Luxury 3BHK 2450 Sft New Flat. North East Facing. 100% Vastu, Lift, Generator, 2 Parkings. Ph: 7893126804

HOUSE FOR SALE

SUJATHANAGAR

వేపగుంట BRTS రోడ్డుకి అతి చేరువలో తక్కువ ధరకే Indp. హౌస్ & గ్రూప్ హౌస్‌లు 2BHK, 3BHK ఇళ్లు అమ్మకమునకు కలదు. ✆ 8374373299.

PLOT FOR SALE

BHOGAPURAM

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గర్లో స్విమ్మింగ్‌పూల్, క్లబ్‌హౌస్, బ్యాంక్‌లోన్ సదుపాయంతో VUDA అప్రూవల్ ప్లాట్లు అమ్మకం. ✆ 8686997700.

TO LET

JAGADAMBA

4500sft for rent/lease for just 75k p.m, at jagadamba. Call: 8374816236

JOBS

Wanted Sales Executives Freshers for 2 Whlr Showroom, Tally Computer Operator (Female) Mechanics @ Dondaparthy. ✆ 6301919238, 7702107279.

Wanted Wash Care Laundry & Dry Cleaning Pickup, Delivery, Marketing Boys, Muralinagar. ✆ 9494563814.

WANTED
TELE CALLERS - (F): 10 Nos
Work from Home Opportunity
Qlf : Inter / Any Degree.
Salary : 15k to 30k. PM
Job Location: Vizag.
Kalyani, Nr. NAD Kotha Road.
Contact HR between 10am to 7pm
83096 55089 / 77803 59852

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యూయర్స్. ఏజ్: 22-35. ఫ్రెషర్స్ కూడా కావలెను. ✆ 6281037879.

BPO కాల్ సెంటర్స్‌లో పనిచేయుటకు టెలికాలర్స్, కస్టమర్ సర్వీస్, డేటా ఎంట్రీ, టెక్నికల్ సపోర్ట్ Q.A., టీమ్ లీడర్స్, Qlf: 10th- డిగ్రీ, MBA, జీతం: 18K-30K. ✆ 9121044796, 9573635594.

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ ప్రారంభించబోవు M.V.P కాలనీ ఆఫీసు కొరకు టీం లీడర్లు మరియు మేనేజర్లు కావలెను. ✆ 9701598389.

రైల్వేన్యూకాలనీలో టూవీలర్ సర్వీస్ సెంటర్ నందు పనిచేయుటకు 3 నుండి 5 సం॥ అనుభవం గల టూ వీలర్ మెకానిక్స్ కావలెను. సెల్ ✆ 9393107888.

ప్రముఖ బ్యూటీ సెలూన్ నందు పనిచేయుటకు 30 సం॥లోపు గల ఫిమేల్ అసిస్టెంట్స్ కావలెను. జీతం: 18K. వసతి సౌకర్యం కలదు. Ph: 9347168811.

MARKETING/ SALES

Hyd. based Tissue Mfg. Company needs Sales Marketing Teams 9 Nos. includes PDM/ SE/SO. ✆ 7997990685, abhilash@peaceforever.in

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ట్యాంకు శుభ్రం చేస్తూ ఊపిరాడక మృతి

గణపతిరావు (పాతచిత్రం)

మాధవధార, న్యూస్‌టుడే: మంచినీటి ట్యాంకును శుభ్రం చేసేందుకు లోపలి దిగి ఊపిరాడక ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కప్పురాడ దరి పెద్దకొత్తూరులో నివాసముంటున్న వజ్రగడ గణపతిరావు(43) కూలి పనులు చేస్తుంటాడు. సోమవారం ఉదయం అంబేద్కర్ ఎస్టేట్ కాలనీలో ఒక ఇంటిపైనున్న ప్లాస్టిక్ నీటి ట్యాంకును శుభ్రం చేసేందుకు వెళ్లాడు. ట్యాంకు లోపలకు దిగిన గణపతిరావు ఎంతకీ పైకి రాకపోవడంతో యజమానికి అనుమానం వచ్చి చూడగా అపస్మారక స్థితిలో ఉన్నాడు. వెంటనే స్థానికుల సహాయంతో ట్యాంకును విరగ్గొట్టి బయటకు తీశారు. అప్పటికే మృతి చెంది ఉన్నాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన ప్రాంతానికి చేరుకుని మృతికి గల కారణాలపై ఆరా తీశారు. భార్య వి.మణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

యువకుడి ఆచూకీ కోసం డ్రోన్‌తో గాలింపు

గాజువాక, న్యూస్‌టుడే: పాతగంగవరం సముద్ర తీరంలో ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తూ కెరటాల తాకిడికి గల్లంతైన పెదగంట్యాడ సీతానగరానికి చెందిన రూపక్ సాయి (22) ఆచూకీ సోమవారం కూడా లభించలేదు. ముగ్గురు వ్యక్తులతో కలిసి రాళ్ల గుట్టలు దిగుతుండగా సముద్రంలో జారిపడిపోయాడు. ఉదయం న్యూపోర్టు, మెరైన్ పోలీసులు, గజఈతగాళ్లు తీరం వెంబడి గాలించారు. డ్రోన్ సాయంతో వెతుకులాట చేపట్టారు. ఎస్ఐ శ్యామ్ సుందర్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్ సాయంతో గాలిస్తున్న పోలీసులు

సింహాద్రి ఎన్టీపీసీ నుంచి బూడిద తుంపర్లు

పరవాడ, న్యూస్‌టుడే: సింహాద్రి ఎన్టీపీసీ బూడిద కాలుష్యంతో వాడచీపురుపల్లి, నాయుడుపాలెం పంచాయతీ ప్రజలు సోమవారం ఇబ్బంది పడ్డారు. ప్లాంట్ నుంచి ఫ్లైయాష్ (బూడిద) చిన్న చిన్న తుంపర్లుగా గ్రామాలపైకి వచ్చి పడిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోయారు. రాకపోకలు సాగించే సమయంలో వాహనాలపై, పాదచారుల దుస్తులపై, ఇంటి బయట ఉన్న వస్తువులపై బూడిద పడినట్లు తెలిపారు. బూడిద కారణంగా పంటలు, భూగర్భ జలాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరోగ్య సమస్యలు వస్తాయని భయాందోళన చెందారు. సమస్యను ఎమ్మెల్యే, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	111	105
లైవ్	138	125
డ్రెస్డ్	200	220
స్కిన్‌లెస్	228	230

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు

లక్ష్మీకాంత్ స్క్రీన్-1
మాస్ జాతర

స్క్రీన్-2
కె ర్యాంప్

పి.భోనంగిలో పశువైద్యశిబిరం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం పి. భోనంగి గ్రామంలో సోమ వారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పరవాడ సబ్ డివిజన్ పశు వైద్య సహాయ సంచాలకులు రామకృష్ణ శిబిరాన్ని ప్రారంభించారు. వాడచీపురుపల్లి పశువైద్యాధికారి, తదితరులు పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పాల దిగుబడిని పెంచే మినరల్ మిక్చర్ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆయా సచివాలయాల పశు వైద్య సహాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 93వ వార్డు గొల్లనారాయణపురంలో 7ఎ/1, 7ఎ/2 వీధి దీపాలు నెల రోజులుగా వెలగడం లేదు. – ఆర్.శంకర్రావు. ✓: వెలగని దీపాలకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తాం. – హరిబహదూర్, ఏఈ జీవీఎంసీ

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండలం గొర్లెవానిపాలెం జేఎన్ఎన్‌యూ ఆర్ఎం కాలనీ వద్ద బస్ షెల్టర్ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. – రమణ. ✓: ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బస్ షెల్టర్ నిర్మాణానికి కృషి చేస్తాం. – రమేశ్ నాయుడు, ఎంపీడీవో, పరవాడ.

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం మండలం పెదనాయుడుపాలెం కొత్తరోడ్డుకు సమీపంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసన వస్తోంది. – ఎన్.అర్జున. ✓: వ్యర్థాలను తొలగిస్తాం. – వై.రాజేశ్వరరావు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం

?: సబ్బవరం మండలం రావులమ్మపాలెం ప్రధాన రహదారి నుంచి బీసీ వసతి గృహానికి వెళ్లేందుకు సరైన రహదారి లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. – ఎస్.రాము నాయుడు. ✓: రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. – ఎస్.నారాయణ మూర్తి, గ్రామ సర్పంచి, అంతకాపల్లి.

యూజీడీ ప్రాజెక్టుకు డీపీఆర్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జోన్-2 మధురవాడ ప్రాంతంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ ప్రాజెక్టుతోపాటు, జీవీఎంసీ పరిధిలో అసంపూర్తి యూజీడీ పనులు చేపట్టడానికి డీపీఆర్ (సవివర పథక నివేదిక)ను ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఏపీయూఐఏఎంఎల్)ద్వారా తయారు చేయించుకోవాలని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రాజెక్టుకు ప్రపంచ బ్యాంకు పరిధిలోని ఐఎఫ్‌సీ (ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్) రూ.553 కోట్లు సమకూరుస్తుండగా, అసంపూర్తి పనులకు అమృత్ 2.0 పథకం ద్వారా నిధులు అందనున్నాయి. ఆయా ప్రాజెక్టు, పనులకు సంబంధించి డీపీఆర్ తయారీతోపాటు, ప్రాజెక్టు టెండర్లు పూర్తి చేసే బాధ్యతను ఏపీయూఐఏఎంఎల్‌కు అప్పగించి, ప్రాజెక్టు నిధుల్లో 1.45 శాతం నిధులు ఆ విభాగానికి ఇవ్వాలని సంబంధిత ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడికి రిమాండ్

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం బాటజంగాలపాలెంలో బెల్టు దుకాణం నిర్వహిస్తున్న సుంకర జితేంద్ర పోలీసులు నిర్వహించిన సోదాల్లో పట్టుబడ్డాడు. ఈ మేరకు అతని నుంచి 18 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సునీల్ తెలిపారు. కేసు నమోదు చేసి అనకాపల్లి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

ఇసుకతో దారులు.. ఆగని ప్రమాదాలు

బీఆర్టీఎస్ మార్గం ఇలా..

వేపగుంట, న్యూస్‌టుడే : మట్టి, ఇసుక, బొగ్గులు తరలించే వాహనాలు నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణం సాగిస్తున్నాయి. అధికంగా లోడ్ చేసి సరఫరా చేస్తున్నారు. లోడ్ చేసిన తరువాత వాహనంపై ఏటువంటి టార్పాలిన్‌లు కట్టడం లేదు. దీంతో వాహనంలోని సరకు ఒలిగి రోడ్డుపై కుప్పలుగా పడిపోతుంది. గాలికి వాటి ధూళి దారుల కళ్లల్లో పడి ప్రయాణించలేకపోతున్నారు. కుప్పలుగా పేరుకున్న ఇసుక, మట్టిని తరలించేందుకు పారిశుద్ధ్య కార్మికులు అష్టకష్టాలు పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..: బీఆర్టీఎస్ రహదారి పొడవునా ఎక్కడికక్కడే మట్టి కుప్పలు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం సబ్బవరం- రాయ్‌పూర్

పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నిర్మాణానికి కావాల్సిన డెబ్రిస్, ఇతరత్రా ఇసుక సామగ్రిని రాత్రివేళల్లో ఈ మార్గంలో లారీలతో తరలిస్తున్నారు. ఈ క్రమంలో దారి పొడవునా మట్టి చల్లుకుంటూ వెళ్లిపోతున్నారు. కొద్ది రోజులుగా ఇదే పరిస్థితి ఉండడంతో రహదారి దారుణంగా మారింది. ఈ నేపథ్యంలో పారిశుద్ధ్య కార్మికులు సోమవారం ఓ వాహనాన్ని అడ్డుకున్నారు. డ్రైవర్‌ను నిలువరించి గట్టిగా ప్రశ్నించారు. ఈ మేరకు అతను తనకు ఎటువంటి సంబంధం లేదని.. లోడ్ చేసేవారు ఎక్కువగా చేస్తున్నారని చెప్పడంతో కార్మికులు మిన్నకుండిపోయారు. స్థానిక పెట్రోల్ బంక్ నుంచి వేపగుంట మీదుగా చింతలగ్రహారం రైల్వేగేటు వరకు ఈ మట్టి పడిందని.. తొలగించేందుకు నానా యాతన పడాల్సి వస్తోందని పలువురు పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన చెందారు.

అధిక బరువుతో ఛిద్రం

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి బీఆర్టీఎస్ రహదారిలో సోమవారం పెద్దఎత్తున జిప్సం పొడి పేరుకుపోయింది. ఎన్ఏడీ కూడలి నుంచి సబ్బవరం టిప్పర్‌ల ద్వారా తరలిస్తున్న జిప్సం పొడి వాహనాల నుంచి రోడ్డుపై పడింది. రాత్రివేళ తిరుగుతున్న ఈ భారీ వాహనాల్లో జిప్సం, క్రషర్ పొడి, బిటన్ ఓర్ వంటివి తరలిస్తున్నారు. పోలీసుల పర్యవేక్షణ లేని సమయం కావడంతో ఇష్టారాజ్యంగా లోడ్‌లో నింపుతున్నారు. ట్రాలీని మించి లోడు నింపి దానిపై టార్పాలిన్‌లు కప్పుతున్నారు. వేగంగా వెళ్తున్న వాహనాల నుంచి తరలిస్తున్న లోడు కిందపడి రోడ్లు దారుణంగా తయారవుతున్నాయి.

టిప్పర్ లారీ సీజ్: బీఆర్టీఎస్‌లో జిప్సం పొడి పెద్దఎత్తున ఎగిరిపడిన నేపథ్యంలో పెందుర్తి ట్రాఫిక్ సీఐ నరసింగరాజు తక్షణమే స్పందించారు. ఓ టిప్పర్ లారీని స్వాధీనం చేసుకున్నారు. వాహనం యజమానిని రప్పించి అపరాధ రుసుము వసూలు చేసినట్లు తెలిపారు. పునరావృతం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేసిన టిప్పర్

చక్కని చిత్రాలు.. దక్కెను బహుమతులు

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభ పాటవ పోటీలు

పెందుర్తి, న్యూస్‌టుడే: పిల్లల ఆలోచనా శక్తిని, మానసిక వికాసాన్ని పెంచేందుకు చిత్రలేఖనం ఎంతో ఉపయోగపడుతుందని పెందుర్తి పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్.చిన్నమ్మాయి అన్నారు. సోమవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 'మీకు ఇష్టమైన పండగ' అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. విద్యార్థులు జి.పవిత్ర (ప్రథమ), ఎల్.అక్షిత (ద్వితీయ), కె.సంధ్య (తృతీయ) స్థానాల్లో నిలిచారు. ఈ మేరకు విజేతలకు ప్రధానోపాధ్యాయిని చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

విజేతలకు బహుమతులందిస్తున్న ప్రధానోపాధ్యాయిని చిన్నమ్మాయి, ఉపాధ్యాయులు

ప్రతిభావంతులకు సత్కారం

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: వివిధ రంగాల్లో ప్రతిభ చూపుతున్న పలువురిని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సత్కరించారు. స్థానిక రత్నగిరినగర్‌లోని క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఇటీవల పార్లమెంటులో ప్రసంగించిన యువతి మడుతూరి గానప్రియ, 95 సార్లు రక్తదానం చేసిన కోనేటి ఆదినారాయణ, అంబులెన్సులకు దారి ఇవ్వాలంటూ అవగాహన కల్పిస్తున్న సినిమా స్టంట్ మాస్టర్ బద్రిను దుశ్శాలువతో సత్కరించారు. ★ పెందుర్తి రైల్వేస్టేషన్ రోడ్డులోని పాస్టర్స్ లీడర్స్ అసోసియేషన్ వార్షికోత్సవంలో పాల్గొని కేకు కోసి ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గానప్రియను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

'అభియోగాలకు వివరణ ఇవ్వండి'

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థలో సహాయ ఇంజినీరుగా విధులు నిర్వహిస్తున్న కె.వి. మాధవరావుపై అనిశా నమోదు చేసిన అభియోగాలకు వివరణ ఇవ్వాలని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. 2016లో ఆదాయానికి మించి ఆస్తులున్నాయని ఆయనపై అనిశా కేసు నమోదు చేసింది. ఈ సందర్భంగా సంబంధిత అభియోగాలకు రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలని కోరుతూ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

ఇళ్ల నిర్మాణాలకు సహకరించాలి

ప్రహ్లాదపురం(వేపగుంట), న్యూస్‌టుడే: చిన్న విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకునే వారికి సహకరించాలని రెవెన్యూ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సూచించారు. సోమవారం 93వ వార్డులో మేయర్ పీలా శ్రీనివాసరావుతో కలిసి ఆయన పర్యటించారు. ప్రహ్లాదపురం పల్లినారాయణపురంలో ఓ ఇంటి నిర్మాణానికి రెవెన్యూ, పట్టణ ప్రణాళిక విభాగం, దేవస్థానం అధికారులు అభ్యంతరం చెబుతున్నారని నిర్మాణదారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనికి వెంటనే ఆయన స్పందించి సంబంధిత విభాగాల అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రహ్లాదపురం ప్రధాన రహదారిని ఆనుకొని నిర్మిస్తున్న ఇంటికి ప్లాన్ ఇవ్వడం లేదని.. మరో చోట వితంతు పింఛను ఆపేశారని ఓ వృద్ధురాలు ఎమ్మెల్యే ముందు మొరపెట్టుకున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల, మేయరు పీలా శ్రీనివాసరావు

రేడియాలజీ విభాగ పీజీలకు బంగారు పతకాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రేడియాలజీ వైద్యుల రాష్ట్ర స్థాయి సదస్సులో ఆంధ్ర వైద్య కళాశాల రేడియాలజీ విభాగ పీజీలు రాణించారు. రాష్ట్ర స్థాయిలో 180 పరిశోధన పత్రికలు సమర్పించగా ఏఎంసీ రేడియాలజీ విభాగానికి చెందిన డాక్టర్ జి.పుష్పిత ప్రథమ స్థానంలో నిలిచి ప్రతిష్ఠాత్మక వైజాగ్ సిటీ సబ్‌చాప్టర్ అవార్డు, బంగారు పతకం అందుకున్నారు. సదస్సులో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు మరో 150 పరిశోధన పత్రాలు సమర్పించగా, రేడియాలజీ విభాగ పీజీ డాక్టర్ జయగురు సంబతరాజన్ ద్వితీయ బహుమతి గెలుపొంది డాక్టర్ రాజారెడ్డి బంగారు పతకం కైవసం చేసుకున్నారు. ఇదే కేటగిరీలో డాక్టర్ మేఘన ప్రత్యేక ప్రశంసాపత్రాన్ని పొందారు. ఈ మేరకు సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో విజేతలను ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యాదేవి, కింగ్ జార్జి ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ ఐ.వాణి అభినందించారు.

మరమ్మతు చేసినా షరా మామూలే..!

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి - విశాఖ బీఆర్టీఎస్ సేవా మార్గంలో పెద్ద ఎత్తున మంచి నీరు వృథాగా పోతుంది. ఇక్కడ ఇటీవల పైపులైను లీకేజీకి గురైంది. సిబ్బంది మరమ్మతు చేశారు. కొద్ది రోజులు మాత్రమే లీకేజీని అరికట్టగలిగారు. మళ్లీ సమస్య పునరావృతమైంది. గత కొన్ని రోజులుగా నీరు వృథాగా పోతోంది. మరమ్మతు చేసినా సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారం కాకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పదే పదే రోడ్లు తవ్వడంతో పాడైపోయి వాహనచోదకులు, పాదచారులకు ఇబ్బంది తప్పడం లేదని పలువురు వాపోయారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో మరమ్మతు చేయించాలని కోరారు.

కురిసిన వర్షం.. పొంగిన మురుగు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి పరిసర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వానతో రహదారులన్నీ జలమయమయ్యాయి. పెందుర్తి కూడలిలో పెద్దఎత్తున వరద నీరు నిలిచిపోయింది. రహదారికి ఇరువైపులా డక్ట్‌ల నుంచి పెద్ద ఎత్తున మురుగు పొంగి రావడంతో తీవ్రమైన దుర్వాసన వచ్చింది. దీంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. సేవా మార్గంలో నిలిచిన మురుగు, నడక మార్గంలో ఆక్రమణలు ఉండడంతో పాదచారులు వెళ్లేందుకు తిప్పలు తప్పలేదు. అపరిశుభ్రత నడుమ రాకపోకలు సాగించాల్సి వచ్చింది. వర్షం కురిసిన ప్రతిసారీ ఇదే పరిస్థితి నెలకొంటుందని వాపోయారు.

పీజీఆర్ఎస్‌కు అర్జీల వెల్లువ

వేపగుంట, న్యూస్‌టుడే : వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్) వచ్చిన అర్జీలను ఇన్‌ఛార్జి జెడ్సీ శంకర్రావు స్వీకరించారు. కృష్ణరాయపురం ఎన్ఏడీ పార్కు గేటు సమస్య పరిష్కరించాలని, పశువుల వ్యర్థాలతో అసౌకర్యంగా ఉంటుందని, సచివాలయాల్లో ప్లానింగ్ సెక్రటరీల పనితీరు సక్రమంగా లేదని, వృద్ధాప్య పింఛను అందేలా చర్యలు తీసుకోవాలని, జనతా కాలనీలో మురుగు సమస్యతో దోమలు పెరిగిపోయాయని వంటి పలు అర్జీలు అందాయి. పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సమస్య తెలుసుకుంటున్న ఇన్‌ఛార్జి జెడ్సీ శంకర్రావు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ 28 అర్జీలు వచ్చాయి. తహసీల్దారు బి. చిన్నికృష్ణ వాటిని స్వీకరించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పీజీఆర్ఎస్‌కు ఒక దరఖాస్తు వచ్చినట్లు ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. ఈ మేరకు ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్, ఎంపీడీవో అర్జీదారులకు హామీ ఇచ్చారు. ● సబ్బవరం మండలం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పీజీఆర్ఎస్‌కు పెందుర్తి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ వచ్చారు. ఈ మేరకు పలువురి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్జీదారుల నుంచి దరఖాస్తులు తీసుకొని తహసీల్దార్‌కు అందించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను కోరారు. ప్రతీవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌కు వారానికి ఓ మండలం చొప్పున వెళ్తానని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వచ్చే వారం పరవాడ వెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న సబ్బవరం తహసీల్దార్ బి.చిన్నికృష్ణ

విశాలాక్షీ విశ్వేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే పంచకర్ల

సుజాతనగర్ హరిహర క్షేత్రంలో..

పరవాడలోని మల్లికార్జునస్వామి

ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రంలో..

దేశపాత్రునిపాలెంలోని ఉమారామలింగేశ్వరస్వామి

దేవీపురంలో..

స్వయంభూవరంలో..

తాడి గ్రామంలోని ఉమానీలకంఠేశ్వరస్వామి

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

పెందుర్తి, న్యూస్‌టుడే: కూలి పనికి వెళ్లిన భర్త తిరిగి రాలేదని పెందుర్తి పోలీసులకు ఓ మహిళ ఫిర్యాదు చేసింది. సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బంటా కాలనీకి చెందిన **శిష్ట రమణ (37)** కూలీ పనులు చేస్తుంటాడు. గత నెల 31న ఉదయం పనికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో ఆయన భార్య దేవి సోమవారం పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై సీఐ అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్వతీ మనోహరా.. భక్తజన కృపాకర

జన సందోహంగా శివాలయాలు

శ్రమశక్తినగర్‌లో..

పెందుర్తి, పరవాడ, వేపగుంట, సబ్బవరం, న్యూస్‌టుడే: కార్తిక మాసం రెండో వారాన్ని పురస్కరించుకొని సోమవారం పెందుర్తి నియోజకవర్గంలోని శివాలయాలు భక్తజన సందోహంగా మారాయి. వేకువజాము నుంచి భక్తులు ఆలయాలకు చేరుకొని పార్వతీ మనోహరుడిని ఆరాధించారు. ఆలయ ప్రాంగణాల్లోని ధ్వజస్తంభాలు, రావిచెట్ల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు విశేష ఏర్పాట్లు జరిపారు. సాయంత్రం కార్తిక దీపారాధనలు జరిగాయి. ★ జీవీఎంసీ 95వ వార్డు రత్నగిరినగర్ సమీపంలోని విశాలాక్షీ విశ్వేశ్వర స్వామిని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు దర్శించుకున్నారు. ★ 97వ వార్డు చినముషిడివాడ శ్రమశక్తినగర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు జరిగాయి. ★ 97వ వార్డు సుజాతనగర్ హరిహర క్షేత్రంలో కొలువైన కేదారేశ్వరస్వామిని పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు దర్శించుకున్నారు. ★ వేంకటాద్రి ఘాట్ రోడ్డులోని శ్రీమహాకామేశ్వరి సహిత ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రంలో పన్నెండు శివలింగాలకు భక్తులు స్వయంగా అభిషేకాలు చేశారు. ★ 96వ వార్డు పెందుర్తి ప్రశాంతినగర్‌లోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయానికి భక్తులు తరలివచ్చారు. ★ సరిపల్లిలోని స్వయంభూ మల్లీశ్వరస్వామి, పినగాడిలో చోడేశ్వర స్వామి, దువ్వపాలెంలోని భీమేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిగాయి.

రామలింగేశ్వర స్వామి సన్నిధిలో భక్తులు

ప్రశాంతినగర్‌లో...

పరవాడ మండలంలో.. అప్పికొండ సోమేశ్వరాలయం, మల్లికార్జునాలయం, తాడి నీలకంఠేశ్వరాలయం, భరణికంలోని సోమేశ్వరాలయం, స్వయంభూవరంలోని స్వయంభూలింగేశ్వరాలయం, దేశపాత్రునిపాలెం ఉమారామలింగేశ్వరాలయం, ఫార్మాసిటీలోని శివాలయాలు భక్తులతో నిండిపోయాయి. దాతల సహాయంతో అప్పికొండ సోమేశ్వరాలయం వద్ద భారీ అన్నసమారాధన జరిగింది.

వేపగుంటలోని .. వేపగుంట పరిసర ప్రాంతాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నరవ ఉమానాగలింగేశ్వరస్వామి స్వయంభూదేవాలయానికి నరవ, కోటనరవ, సత్తివానిపాలెం, గవరజగ్గయ్యపాలెం, కొత్తపాలెం, ఇప్పిలివానిపాలెం, నందవరపువానిపాలెం, చింతగట్ల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు గండ్రెడ్డి మహలక్ష్మీనాయుడు పర్యవేక్షణలో భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. వేపగుంట మెట్టపై ఉన్న శివాలయాన్ని, ముత్యమాంబ అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని శివాలయాన్ని శానాతివానిపాలెం, వెంకటసాయినగర్, తదితర ప్రాంతాల ప్రజలు దర్శించుకున్నారు.

అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయం వద్ద..

నరవ స్వయంభూదేవాలయంలో..

సబ్బవరం మండలంలో.. దేవీపురం కొండ దిగువన దక్షవాటిలోను, కొండపై ఉన్న శివాలయంలో పంచామృతాభిషేకాలు జరిగాయి. రామలింగేశ్వస్వామి ఆలయానికి, పెదనాయుడుపాలెం మల్లికార్జునాలయానికి, ఇరువాడ, వంగలి శివాలయాలకు భక్తులు తరలివచ్చారు. లింగాలతిరుగుడు సోమలింగేశ్వర స్వామి ఆలయాన్ని సీఐ రామచంద్రరావు దర్శించుకున్నారు.

PUBLIC NOTICE

Public are hereby informed that this public notice is issued on the instructions of my client Sri Baire Murali Krishna, residing at Rainbow Aistas Cybercity, Opp. IDL Factory, Moosapet, Balanagar, K.V.Rangareddy, Telangana and he is intending to sell the property to Smt. Bandaru Demudamma.

My client acquired the schedule property vide sale deed dated 08.12.2014 Doc.No.5496/2014 executed by Smt. B.Vasanthi, rep. by her GPA holder. Smt.Vasanthi acquired the property vide Sale deed dated 20.06.2013 Doc.No. 2779/2013 executed by Sri N.Chandramouli who acquired the property vide sale deed dated 15.05.2012 Doc.No. 2266/2012. It is to state that original of Doct. No.2266/2012 is misplaced and could not be found inspite of diligent search. A police compliant is also given.

Hence, if any member of the Public got any right, claim, objections of whatsoever nature over the below schedule property they shall come forward with their claims within one week from the date of this publication failing which it will be deemed that the lost document is beyond recovery and future transactions will be done basing on certified copy by my clients.

SCHEDULE

Site measuring an extent of 166.66 sq.yds or 139.349 sq.mts of F Mark, together with R.C.C. Slabbed House with a plinth area 900 sft., bearing Door No.21-68/26, being Inam Patta T.D. No.2700, covered by S.No.107/24 of Pendurthi Village, within the limits of Greater Visakhapatnam Municipal Corporation, Pendurthi Joint S.R.O limits, Visakhapatnam District and property bounded by:
East: Layout of Janachaitanya, **South:** K. Mark of Naveti Chandramouli an extent of 166.66 sq.yds, **West:** G Mark Site, **North:** 20 Feet Road.

I. SATYASAI RAM, Advocate
D.No.17-73, Prahladapuram, Visakhapatnam-27. **Cell: 92907 81381**

రేపు దీపోత్సవ సన్నాహక సమావేశం

పద్మనాభం: దీపోత్సవ సన్నాహక సమావేశం ఈ నెల 5న నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పీఎల్ఎన్.రాజు తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని సామాజిక భవనంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, స్థానిక గ్రామాల నాయకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు హాజరుకావాలని సూచించారు.

5వ వర్ధంతి

మంచిని, మమతానురాగాలను మాకు పంచి, నీవు మా అందరినుండి దూరమై నేటికి 5 సం॥లు గడిచాయి. నిరంతరం నీ జ్ఞాపకాలతో జీవిస్తూ... నీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

కీ॥శే॥ అనంతారపు రమణమ్మ
జననం: 1-1-1976 మరణం: 4-11-2020

భర్త: అనంతారపు నర్సింగరావు
కుమార్తె: Ch. ధనలక్ష్మి
అల్లుడు: Ch. రాంప్రసాద్
మనుమరాలు: Ch. షాన్వి
మనుమడు: Ch. శ్రీయాన్

గ్రామాల్లో నెరవేరనున్న సొంతింటి కల

ఈ నెల 5 వరకు దరఖాస్తుల స్వీకరణ

పరవాడ, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో సొంత స్థలం ఉండి ఇళ్లు కట్టుకోలేని పేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ (పీఎంఏవైజీ) పథకం కింద ఇళ్లు మంజూరుకు గ్రామాల్లో అవగాహన కల్పిస్తోంది. ఈ నెల 5లోపు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హులైన వారు ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లను కలిసి అన్ని ధ్రువపత్రాలను అందించాలి.

నిర్మాణానికి నిధులు ఇలా..

మొత్తం రూ.1.59లక్షలు మంజూరుచేస్తారు. ఇంటి నిర్మాణానికి రూ.1.20వేలు, స్వచ్ఛభారత్ కింద మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12వేలు, ఉపాధిహామీ పథకం కింద రూ.27వేలు అందజేస్తారు. ఇప్పటికే దీని నమోదుకు యాప్‌ను అందుబాటులో ఉంచారు. త్వరలో సర్వే చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి

గ్రామీణ ప్రాంతాల్లో సొంత స్థలం ఉండి ఇళ్లు కట్టుకోలేని వారికి ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారు. పురాతన నివాసాలు, పునాదులు, పెంకిటిళ్లు, పూరిళ్లు ఉన్నవారు కూడా దీనికి అర్హులు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, స్థల ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. గృహ నిర్మాణ పథకంలో భాగంగా గతంలో ఇళ్లు మంజూరు కాని వారు మాత్రమే ప్రస్తుతం దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు.

సద్వినియోగం చేసుకోవాలి..

పేదలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అర్హులైనవారంతా ఆయా గ్రామాల పరిధిలోని సచివాలయాలకు వెళ్లి ఇంజినీరింగ్ సహాయకులను సంప్రదించాలి. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లకు సచివాలయ సిబ్బంది వచ్చి సర్వే చేసి యాప్‌లో వివరాలను పొందుపరుస్తారు.
– ఎంఎస్ ఎస్ఎన్.రెడ్డి, గృహనిర్మాణ శాఖ ఇన్‌ఛార్జి, ఏఈ

హృదయపూర్వక శుభాభినందనలు

ఎగ్రికల్చర్ & సోషల్ సర్వీస్‌లో మీరు చేసిన కృషికి గుర్తింపుగా ఒడిశా న్యాయశాఖ మంత్రివర్యులు గౌ॥ శ్రీ పృథ్వీరాజ్ హరిచందన్ గారి చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ అందుకున్న విశాఖ నగర వాస్తవ్యులు డా॥ వల్లూరి శేషగిరిరావు గార్కి మా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ... మీరు భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పురస్కారాలు అందుకోవాలని కోరుకుంటూ...

డా॥ వల్లూరి శేషగిరిరావు గారు
డాక్టరేట్ అవార్డు గ్రహీత

అభినందనలతో...
మీ.. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

(c) eenadu

భీమిలి

సినిమాలు
చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే
గణేశ్- **బైసన్ కాలామదన్**
రాములమ్మ- **కాంతారా**
తాతా- **కె-ర్యాంప్**
సప్తగిరి- **మాస్ జాతర**

రేపు దీపోత్సవ సన్నాహక సమావేశం

పద్మనాభం, న్యూస్‌టుడే: దీపోత్సవ సన్నాహక సమావేశం ఈ నెల 5న నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పీఎల్ఎన్.రాజు తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని సామాజిక భవనంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధ్యక్షతన ఉదయం పది గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, స్థానిక గ్రామాల నాయకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు హాజరుకావాలని సూచించారు. నవంబర్ 19న జరగనున్న దీపోత్సవాన్ని మరింత వైభవంగా నిర్వహించడానికి విలువైన సలహాలు అందించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

న్యూస్‌టుడే, ఎండాడ, పద్మనాభం: ?: దసపల్లాలేఅవుట్ (ఎండాడ) ప్రధాన దారిలో ఉన్న గొయ్యి ప్రమాదకరంగా ఉంది. - **లేఅవుట్ వాసులు** ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - **కనకమహాలక్ష్మి, జెడీ**

?: బింద్రానగర్(మధురవాడ)లో మౌలిక వసతులు లేక ఇక్కట్లకు గురవుతున్నాం. - **కామేశ్వరరావు** ✓: క్షేత్రస్థాయిలో దృష్టి సారించి చర్యలు తీసుకుంటాం. -**కనకమహాలక్ష్మి, జెడీ**

?: ఆరోవార్డు పరిధి గాయత్రీనగర్(పీఎంపాలెం)లో పదికి పైగా వీధి దీపాలు వెలగడం లేదు. - **పీఎంపాలెం వాసులు** ✓: విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేపడతాం. - **గాయత్రీ, విద్యుత్ ఏఈ**

?: లక్ష్మీవానిపాలెం (పీఎంపాలెం) ఎస్‌బీఐ బ్యాంకు దగ్గర రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. - **పీఎంపాలెం వాసులు** ✓: త్వరలో తారు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. - **కనకమహాలక్ష్మి, జోన్-2 కమిషనర్**

స్పందనకు వందనం

వీధి దీపాలు వెలిగాయి

ఎండాడ, న్యూస్‌టుడే: లక్ష్మీ ప్రసాద్ లేఅవుట్(ఎండాడ)లో వీధి దీపాలు వెలగక శునకాలు, విషసర్పాల బెడదతో స్థానికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని 'ఈనాడు' 'మేమున్నాం..మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన ఏఈ సాయిరాం తమ సిబ్బందితో మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకొచ్చారు.

సృజనకు పట్టం.. ఆవిష్కరణలకు ఊతం

మధురవాడ, న్యూస్‌టుడే: ఒక ఆలోచన జీవితాన్ని మార్చేస్తుంది. అది ప్రయోగమైతే ప్రపంచాన్నే శాసిస్తుంది. అలాగని ప్రయోగాలు చేసేవారు ఆకాశం నుంచి దిగిరారు. మన బడుల్లో చదివిన ఎంతో మంది నేడు తమ ప్రయోగ వీచికలతో ప్రపంచాన్ని ముందుకు నడిపిస్తున్నారు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు తమలో దాగి ఉన్న సృజనకు జీవం పోసి, పరిశోధనకు ఊతం ఇచ్చేందుకు 'స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్-2025' కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భావి శాస్త్రవేత్తలకు ఇదొక చక్కటి అవకాశంగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

ప్రయోగం గురించి ఉపాధ్యాయులకు వివరిస్తున్న విద్యార్థులు

■ **అర్హులు వీరే..:** 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులు ఈ మారథాన్‌లో పాల్గొనే అవకాశం కల్పించారు. ప్రతి పాఠశాల నుంచి సామాన్యశాస్త్ర ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు బృందంగా ఏర్పడి ప్రాజెక్టు రూపొందించాల్సి ఉంటుంది.

■ **గురువుల భాగస్వామ్యంతో..:** ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో విద్యార్థులు చిన్న వయసులో ప్రాజెక్టులు రూపకల్పన చేసేలా 'స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్' అనే కార్యక్రమాన్ని రూపొందించారు. 2025-26 సంవత్సరానికి ఈ ప్రక్రియలో పాల్గొనేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. నీతి ఆయోగ్, ఇన్నోవేషన్ మిషన్, యూనిసెఫ్ విభాగం సహకారంతో ఈ వినూత్న కార్యక్రమానికి ప్రభుత్వం, విద్యా శాఖలు శ్రీకారం చుట్టాయి.

ఈనెల 30 వరకు దరఖాస్తులకు అవకాశం: విద్యార్థులు 'స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ ఓఆర్‌జీ' వెబ్‌సైట్‌లో తమ ఆలోచనలను నమోదు చేయాలి. వారికి ఉపాధ్యాయులు తోడ్పాటు అందించాలి. ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు బృందంగా ఏర్పడాలి. సమకాలీన సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేలా ప్రాజెక్టుల రూపకల్పన ఉండాలి. ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. దరఖాస్తులు సమర్పించిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఈ నెల 31 నుంచి ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తారు. ఎంపికైన వారి వివరాలను 2026 జనవరిలో ప్రకటిస్తారు. దేశవ్యాప్తంగా 27 ప్రాజెక్టులను అతిపెద్ద ఇన్నోవేషన్ ప్రదర్శన కోసం ఎంపిక చేస్తారు. ఎంపికైన వాటికి రూ.50 వేల చొప్పున నగదు బహుమతిగా అందిస్తారు.

చిత్రాలు గీసి.. ప్రశంసలు పొంది

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు

మధురవాడ, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో సృజనాత్మకతను తట్టిలేపేందుకు 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభాపాటవ పోటీలు నిర్విరామంగా కొనసాగుతున్నాయి. సోమవారం మధురవాడ పరిధి పిలకవానిపాలెంలో నారాయణ ఇ-టెక్నో స్కూల్‌లో 'మీకు ఇష్టమైన పండగ' అంశంపై చిత్రలేఖనం పోటీలు జరిగాయి. 7 నుంచి 10వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏడో తరగతి విద్యార్థిని జి.హర్షిత (ప్రథమ), ఎనిమిదో తరగతి విద్యార్థినులు జి.భావజ్ఞ (ద్వితీయ), పి.శ్రుతిప్రణవి (తృతీయ) విజేతలుగా నిలిచారు. పాఠశాల ఏవో సీహెచ్ అవినాష్, ప్రిన్సిపల్ ఎన్.కిశోర్ విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజేతలకు బహుమతులు అందిస్తున్న ఏవో అవినాష్, ప్రిన్సిపల్ కిశోర్

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించాలి

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: గీతం డీమ్డ్ వర్సిటీ ఉమెన్ లీడర్స్ ఫోరమ్, రోటరాక్ట్ క్లబ్, స్టూడెంట్ లైఫ్ విభాగాలు సంయుక్తంగా మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించే దిశగా స్థానిక ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన 'పింక్‌వాక్' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రో-వీసీ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు ప్రారంభించారు. దేశంలో ఎక్కువ శాతం మంది రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రాథమిక దశలో వ్యాధి లక్షణాలపై అవగాహన పెంచుకుని తక్షణమే వైద్యులను సంప్రదించడం ద్వారా క్యాన్సర్‌ను జయించొచ్చన్నారు. అసోసియేట్ డీన్ అరుణ్‌కార్తిక్ తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

తక్షణమే స్పందించి.. రక్షణ గోడ నిర్మించాలి

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: అడివివరం గ్రామంలోని సింహాద్రి అప్పన్న స్వామి వారి వరాహ పుష్కరిణి ప్రహరీ కొండమీద కూలిపోయి ఉంది. ఐదేళ్ల కిందట కురిసిన వర్షాలకు నాసిరకం కొంత కూలిపోయింది. ఆ సమయంలో దేవస్థానం అధికారులు ప్రమాదకరంగా ఉన్న మిగిలిన గోడను కూల్చేశారు. కాగా కొంత మేర విజినిగిరిపాలెం మార్గంలోని శ్మశానవాటిక ద్వారా సమీపంలో ప్రహరీ కూలిపోయింది. అప్పట్లో కూలిన మేరకు పునర్నిర్మించారు. మిగిలిన గోడను యథావిధిగా వదిలేశారు. శిథిలావస్థలో నిర్మాణం కావడంతో విజినిగిరిపాలెం రహదారి వెంబడి ఉన్న గోడ కొంత మేర వాలిపోయి కూలేందుకు సిద్ధంగా ఉంది. వర్షాలు కురిసినప్పుడు బలహీనంగా ఉన్న చోట కూలిపోతోంది. గ్రామస్థులు రాకపోకలు సాగించే సమయంలో కూలితే ప్రమాదాలు సంభవిస్తాయని ఆందోళన వ్యక్తమవుతోంది. అధికారులు తక్షణమే స్పందించి పూర్తిస్థాయిలో రక్షణ గోడను నిర్మించాలని పలువురు కోరుతున్నారు. పుష్కరిణి కూడలి నుంచి విజినిగిరిపాలెం వెళ్లే రహదారిని విస్తరించాలని గ్రామస్థులు 98వ వార్డు కార్పొరేటర్ పీవీ.నరసింహంను కలిసి వినతిపత్రం సమర్పించారు.

విజినిగిరిపాలెం వెళ్లే మార్గంలో కూలిపోయిన పుష్కరిణి చెరువు ప్రహరీ

బీచ్‌రోడ్డులో కూలిన వాల్ ట్రీగార్డు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: బీచ్ రోడ్డు (సాగర్‌నగర్) ప్రధాన కూడలి సమీప రుషికొండ వైపు వంతెన రక్షణ గోడపై ఏర్పాటు చేసిన వాల్ ఇనుప ట్రీగార్డ్ సోమవారం ఉదయం కూలిపోయింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో వాహనాలేవీ రాకపోవడం, జనసంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ముడుగులు వలు కనిపించకుండా జీవీఎంసీ ఉద్యానవన విభాగాధికారుల పర్యవేక్షణలో వంతెన ఇరువైపులా రక్షణ గోడలకు వాల్ ట్రీగార్డులుగా తీర్చిదిద్ది మొక్కలను సంరక్షిస్తున్నారు. మొంథా తుపాను ప్రభావానికి కురిసిన భారీ వర్షాల కారణంగా అది దెబ్బతిని రోడ్డుపై ఒరిగిపోయింది. ఈ మేరకు కూలిన ట్రీ గార్డ్‌ను తొలగించి ట్రాఫిక్ సమస్యలు లేకుండా తక్షణం చర్యలు తీసుకున్నారు. బీచ్‌రోడ్డు ప్రాధాన్యం దృష్ట్యా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కూలిన ఇనుప ట్రీగార్డు

అంతా మా ఇష్టం..!

కొమ్మాది, న్యూస్‌టుడే: పీఎంపాలెం క్రికెట్ స్టేడియం నుంచి కొమ్మాది కూడలి వరకు సేవారహదారుల పక్కన పలుచోట్ల ఇష్టానుసారంగా వాహనాలు నిలిపివేయడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఈ సమస్యను పరిష్కరించాలని పీఎంపాలెం ట్రాఫిక్ సీఐ సాయి నేతృత్వంలో ఎస్ఐలు, సిబ్బంది కలిసి వాహనాలు నిలిపివేసే చోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయని అక్కడ వాహనాలు నిలిపితే చర్యలు తప్పవని హెచ్చరిస్తూ 'నో పార్కింగ్' బోర్డులను ఏర్పాటు చేశారు. అయినా వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా అక్కడే పార్కింగ్ చేస్తున్నారు. అక్కడ అలా చేస్తే ఉల్లంఘనలు ఎక్కువవుతాయని చెబుతున్నా పట్టించుకోవడం లేదు.

నో పార్కింగ్ బోర్డు వద్ద నిలిపిన వాహనాలు

వరిపైర్ల సస్యరక్షణకు సూచనలు

ఆనందపురం, న్యూస్‌టుడే: మొంథా తుపాను ప్రభావంతో ముంపునకు గురైన వరి పైర్ల సస్య రక్షణకు మండల వ్యవసాయ అధికారిణి సంధ్య రత్నప్రభ సోమవారం రైతులకు పలు సూచనలు చేశారు. పిలక దశలో ఉన్న వరిపంట ముంపునకు గురైతే ముందుగా నీటిని పూర్తిగా తొలగించాలన్నారు. ఆ తర్వాత 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్‌ను పైర్లకు అందిస్తే పంట త్వరగా కోలుకుంటుందన్నారు. ఈ పరిస్థితుల్లో గింజ రంగు మారకుండా ఉండటానికి లీటరు నీటికి రెండు గ్రాములు కార్బెండజిమ్ లేదా మాంకోజెబ్ మందును పిచికారీ చేయాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పద్మనాభం, న్యూస్‌టుడే: బోని సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న శిర్లపాలెం ఫీడర్ పరిధిలో మంగళవారం నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ జగన్నాథరావు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అనంతవరం, పెంట, గొల్లలపాలెం, గంధవరం, కొవ్వాడ, తిమ్మాపురం గ్రామాలకు నిలిపివేయనున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

కల్తీ ఆయిల్ నిల్వ చేసిన వ్యక్తిపై కేసు

పద్మనాభం, న్యూస్‌టుడే: అక్రమంగా వైట్ కలర్ వేస్ట్ ఆయిల్ నిల్వ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సి.హెచ్.శ్రీధర్ తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి. రేవిడి పంచాయతీ రౌతులపాలెం గ్రామానికి చెందిన సారిక వారి కల్లాల వద్ద సారిక సైదినాయుడు ఎటువంటి అనుమతులు లేకుండా వైట్ కలర్ వేస్ట్ ఆయిల్ నిల్వ చేసినట్లు వచ్చిన సమాచారం మేరకు భీమునిపట్నం సీఎస్‌డీటీ కె.శ్రీనివాసరావు, రేవిడి వీఆర్వో బి.రమునాథ్ సోమవారం వెళ్లి పరిశీలించారు. 70 లీటర్ల వైట్ కలర్ వేస్ట్ ఆయిల్ గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని పద్మనాభం పోలీసులకు అప్పగించారు. రెవెన్యూ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆ ఆయిల్‌ను డీజిల్‌లో కల్తీకి ఉపయోగిస్తారని చెబుతున్నారు.

బెట్టింగ్ సహాయకుల అరెస్టు

బోనెల మాధవ

హరియాల శ్రీకాంత్

ఎండాడ, న్యూస్‌టుడే: ఢిల్లీ కేంద్రంగా ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాలకు మ్యూల్ బ్యాంకు ఖాతాలు అందించి సహకరిస్తున్న మధురవాడ ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులను సైబర్ క్రైం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఈ తరహా కేసులో గతంలో పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం పోలీసులకు చిక్కిన కొమ్మాది సేవానగర్‌కు చెందిన బోనెల మాధవ (23), హరియాల శ్రీకాంత్(28)లు రెడ్డ్యన్న, స్ప్రింటర్స్, మహదేవ్‌బుక్, స్టేక్786 వంటి నకిలీ బెట్టింగ్ యాప్‌లకు బ్యాంకు ఖాతాలు అందిస్తున్నారు. వీరిరువురు ఏపీజీవీబీ, కర్ణాటక బ్యాంక్, కరూర్ వైశ్యాబ్యాంక్, ఐసీసీ తదితర 35 బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో బిలాయ్‌కి చెందిన ప్రేమ్‌తో పాటు దిల్లీకి కొంత మందికి నగదు చేరవేస్తున్నారు. ఈ కార్యకలాపాలు చేయడం ద్వారా వీరికి కమీషన్ల రూపంలో ప్రధాన ముఠా సభ్యులు నగదు అందిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఎంతో చాకచక్యంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి నిందితులను కనిపెట్టిన సైబర్ పోలీసులను సీపీ శంఖబ్రతబాగ్చీ అభినందించారు.

అభియోగాలకు వివరణ ఇవ్వండి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థలో సహాయ ఇంజినీరుగా విధులు నిర్వహిస్తున్న కె.వి.మాధవరావుపై అనిశా నమోదు చేసిన అభియోగాలకు వివరణ ఇవ్వాలని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. 2016లో ఆదాయానికి మించి ఆస్తులున్నాయని ఆయనపై అనిశా కేసు నమోదు చేసింది. ఈ సందర్భంగా సంబంధిత అభియోగాలకు రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలని కోరుతూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. వివరణపై సంతృప్తి చెందకపోతే, తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో పరమ శివుడికి పూజలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: కార్తిక మాసం రెండో సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని భీమిలిలోని శివాలయాలు భక్తుల తాకిడితో పులకించిపోయాయి. ఆనందవనం ఆశ్రమంలోని శివాలయంలో మహాశివునికి విశేష అభిషేకాలు నిర్వహించారు. కాత్యాయినీ భీమేశ్వర స్వామి, భ్రమరాంబిక చోడేశ్వరస్వామి దేవాలయాలకు తెల్లవారుజాము నుంచి భక్తులు అనేకమంది తరలివచ్చారు.

కొమ్మాది, న్యూస్‌టుడే: మధురవాడ పరిసర ప్రాంతాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మారికవలస కాశీవిశ్వేశ్వర పంచాయతన ఆలయంలో, చంద్రంపాలెం శ్రీదుర్గాలమ్మ ఆలయంలో, అన్నంరాజునగర్‌లోని అష్టలక్ష్మీ దేవాలయాల్లో పంచామృతాభిషేకాలను చేపట్టారు. శ్రీసిద్ధేశ్వరస్వామి పీఠంలో ఉన్న శివాలయంలో ధర్మకర్త నరసింహమూర్తి సారథ్యంలో పూజలు చేశారు.

ఆనందపురం, న్యూస్‌టుడే: గుడిలోవ, పొడుగుపాలెం, మెట్టమీదపాలెం, దుక్కవానిపాలెం, శొంఠ్యాం, గిడిజాల, ఆనందపురం, బోని, శిర్లపాలెం, పేకేరు, పెద్దిపాలెం గ్రామాల్లో కొలువుదీరిన శివాలయాల్లో సోమవారం భక్తులు తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజాదికాలు చేపట్టారు.

మారికవలస కాశీవిశ్వేశ్వర ఆలయంలో..

భీమిలి ఆనందవనం ఆశ్రమం శివాలయంలో..

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో..

మెట్టమీదపాలెంలో..

జోన్-2 పీజీఆర్ఎస్‌కు 23 వినతులు

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 23 వినతిపత్రాలు వచ్చాయి. వీటిని ఈఈ శాంతిరాజు, సూపరింటెండెంట్ అప్పలరాజు నేతృత్వంలో స్వీకరించారు. 7వ వార్డులో కళానగర్‌లో సాయిబాబా ఆలయం వెనుక వీధిలో అంతర్గత రహదారులు, కాలువలు, వీధిదీపాలు ఏర్పాటు చేయాలని, అంగన్‌వాడీ కేంద్రం, సామాజిక భవనం నిర్మించాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ వినతిపత్రం ఇచ్చారు. బొట్టవానిపాలెంలో సామాజిక భవనం శిథిలావస్థకు చేరుకుందని, ఎప్పుడు కూలుతుందోనని భయబ్రాంతులకు గురవుతున్నామని, దానిని తొలగించాలని కోరారు. పీఎంపాలెం ఎఎస్ఆర్ లే-అవుట్‌లో రోడ్లు, కాలువలు నిర్మించాలన్నారు. పీఎంపాలెం హౌసింగ్‌బోర్డుకాలనీలో తాగునీటి పైపులైను మరమ్మతులకు గురికావడంతో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. సాయిప్రియాగార్డెన్స్ సమీపంలో 42 సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారని పిళ్లా వెంకటగణపతి అప్పారావు ఫిర్యాదు చేశారు. డీఈ మణికుమార్, ఏపీడీ శ్రీరామ్, టీపీవో శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జోన్-2 కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందిస్తున్న టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి శివాజీ తదితరులు

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: జీవీఎంసీ నాల్గోవార్డులోని పలు సమస్యలపై తెదేపా వార్డు అధ్యక్షుడు పాసి నర్సింగరావు భీమిలి జోనల్ కమిషనరు అయ్యప్పనాయుడికి సోమవారం వినతిపత్రాన్ని అందించారు. కె.నగరపాలెం, జేవీఅగ్రహారం, చేపలుప్పాడ, నిడిగట్టు, కాపులుప్పాడ విలీన పంచాయతీల్లో సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి నిధులను మంజూరు చేయాలని కోరారు.

వైభవంగా నరహరి నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య కల్యాణోత్సవం సోమవారం సింహగిరిపై వైభవోపేతంగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని చూడముచ్చటగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు.

స్వామి, అమ్మవార్లు

నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తజనం

అయ్యప్పస్వామి పల్లకి ఊరేగింపు

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం మండలం పొడుగుపాలెం గ్రామంలో అయ్యప్పస్వామి పల్లకి ఊరేగింపు సోమవారం నిర్వహించారు. ఈ మేరకు 18 సార్లు అయ్యప్పస్వామి మాలధారణ చేసిన స్వామి కొబ్బరి మొక్కతో స్వామి శరణ ఘోషతో గ్రామ పురవీధుల్లో తిరుగుతూ భజనలు చేశారు. ఈ మేరకు అయ్యప్పస్వామి మాలధారులు మాట్లాడుతూ.. గ్రామంలో ఊరేగించిన కొబ్బరి మొక్కను అయ్యప్పదేవాలయానికి పట్టుకు వెళ్లి పంపానది తీరాన నాటడం జరుగుతుందన్నారు. అనంతరం భారీ అన్నసమారాధన చేపట్టారు. అధిక సంఖ్యలో అయ్యప్పస్వాములు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, భక్తులు పాల్గొన్నారు.

ఊరేగింపులో పాల్గొన్న అయ్యప్పస్వాములు, గ్రామస్థులు

మత్స్యకార బాధితులకు చేయూత

కొమ్మాది, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో నష్టపోయిన మత్స్యకార కుటుంబాలకు మారికవలస రాజీవ్‌గృహకల్పకాలనీలోని చౌకదుకాణంలో సోమవారం నిత్యావసర సరకులను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి హేమలత, భాజపా మధురవాడ మండల అధ్యక్షులు ఎండ అప్పారావు, జనసేన వార్డు అధ్యక్షులు దేవర శివ, తదితరులు పాల్గొన్నారు.

ఈత కొలనులో మునిగి ఇద్దరు చిన్నారుల మృతి

ప్రజ్ఞ

జిన్నారం (అమీన్‌పూర్), న్యూస్‌టుడే: గేటెడ్ కమ్యూనిటీలోని ఈత కొలనులో మునిగి ఇద్దరు చిన్నారులు మృత్యువాత పడిన ఘటన అమీన్‌పూర్ ఠాణా పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ నరేశ్ కథనం ప్రకారం.. అమీన్‌పూర్ అర్బన్ రైజ్ స్ప్రింగ్ ఇన్ ది ఎయిర్ గేటెడ్ కమ్యూనిటీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు షణ్ముఖ కుమార్, విజయ్‌రెడ్డి నివసిస్తున్నారు. ఆదివారం సాయంత్రం షణ్ముఖ కుమార్, కుమార్తె ప్రజ్ఞ (9), విజయ్‌రెడ్డి కుమార్తె ఆద్వికారెడ్డి(8)లు కమ్యూనిటీలోని స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు వెళ్లారు. అయితే పిల్లల ఈత కొలనుకు బదులు పెద్దల కొలనుకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీటి మునిగారు. గమనించిన సిబ్బంది వెంటనే బయటకు తీసి స్థానిక ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి 11 గంటలకు ప్రజ్ఞ, సోమవారం తెల్లవారుజామున ఆద్వికారెడ్డి మృతిచెందారు. షణ్ముఖకుమార్ స్వస్థలం విశాఖపట్నం కాగా, ప్రజ్ఞ మియాపూర్‌లోని ప్రైవేటు పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. విజయ్‌రెడ్డి స్వస్థలం కృష్ణా జిల్లా కాగా, ఆద్వికారెడ్డి చందానగర్‌లో మూడో తరగతి చదువుతోంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడిరామ్మూర్తి జయంతి

కొమ్మాది, న్యూస్‌టుడే: కలియుగ భీముడిగా గుర్తింపు పొందిన దివంగత కోడి రామ్మూర్తినాయుడు జయంతి మధురవాడ శిల్పారామం (జాతర)లో సోమవారం నిర్వహించారు. జాతర వాకర్స్ అసోసియేషన్, డ్రాగన్ ఫిట్‌నెస్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను జాతర వాకర్స్ కార్యదర్శి రఘునాద్, డ్రాగన్ ఫిట్‌నెస్ సెంటర్ నిర్వాహకులు పెద్దిరెడ్ల కనకారావు కొనియాడారు.

కోడిరామ్మూర్తి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న వాకర్స్ బృందం

ఐఐఎం భవనం స్వాధీనానికి విద్యార్థుల యత్నం

రెక్టార్ జోక్యంతో తాత్కాలికంగా విరమణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆవరణలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)కు కేటాయించిన భవనాన్ని ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం(డీసీఎంఎస్) విద్యార్థులు సోమవారం ఆక్రమించేందుకు ప్రయత్నించారు. ఒప్పందం గడువు ముగిసినా భవనాన్ని ఐఐఎం వర్సిటీకి అప్పగించడం లేదని ఆరోపిస్తూ సుమారు 300మంది విద్యార్థులు ఐఐఎం ఆవరణలోకి వెళ్లారు. విషయం తెలుసుకున్న రెక్టార్ ఆచార్య కింగ్ డీసీఎంఎస్ విభాగానికి వెళ్లి విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, ఇతర ఆచార్యులతో మాట్లాడారు. వారి సూచనల మేరకు విద్యార్థులు వెనక్కి వచ్చారు.

★ ఏయూలో డీసీఎంఎస్ విభాగంలో సుమారు వెయ్యిమందికి పైగా విద్యార్థులు ఉన్నారు. వీరికి 21 తరగతి గదులు అవసరం కాగా 12మాత్రమే ఉన్నాయి. ఐఐఎంకి ఇచ్చిన గడువు పూర్తయి మరో చోటుకు వెళ్లినందున ఎంఓయూ కాలపరిమితి పెంచకుండా తమకు భవనాన్ని అప్పగించాలని చాలా కాలంగా విద్యార్థులు కోరుతున్నారు. రెక్టార్ ఆచార్య పి.కింగ్ మాట్లాడుతూ వీసీ ఆచార్య రాజశేఖర్ మంగళవారం విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావులతో సమావేశం నిర్వహించి సమస్యకు పరిష్కారం చూపుతారని చెప్పారు.

ఏయూలోని ఐఐఎం క్యాంపస్ వద్ద డీసీఎంఎస్ విద్యార్థులు

(c) eenadu

విశాఖ తూర్పు

అభియోగాలకు వివరణ ఇవ్వండి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థలో సహాయ ఇంజినీరుగా విధులు నిర్వహిస్తున్న కె.వి.మాధవరావుపై అనిశా నమోదు చేసిన అభియోగాలకు వివరణ ఇవ్వాలని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. 2016లో ఆదాయానికి మించి ఆస్తులున్నాయని ఆయనపై అనిశా కేసు నమోదు చేసింది. ఈ సందర్భంగా సంబంధిత అభియోగాలకు రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలని కోరుతూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. వివరణపై సంతృప్తి చెందకపోతే, తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య
పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769
మద్దిలపాలెం: 9912120229

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ?: ఎంవీపీకాలనీ సెక్టార్-3లో వీధి కుక్కలు అధికమయ్యాయి. రాత్రంతా అరుస్తూ నిద్రలేకుండా చేస్తున్నాయి. ఉదయం హెల్త్ ఎరినాకు నడకకు వచ్చే వృద్ధుల్ని కరిచేస్తున్నాయి. – దివాకరరావు, ఎంవీపీకాలనీ. ✓: వాహనాన్ని పంపించి వీధి కుక్కలకు పట్టుకుని తరలిస్తాం. – డాక్టర్ రాజా రవికుమార్, పశునియంత్రణ అధికారి.

ఇందిరానగర్(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: ?: పదోవార్డు వెటర్నరీకాలనీ, రాజీవ్‌నగర్‌లలో వీధి దీపాలు చాలా వరకు వెలగడం లేదు. కొండచివరి భాగం కావడంతో విషప్రాణులు సంచరిస్తున్నాయి. చీకటి పడితే బయటకు రావాలంటే భయపడుతున్నాం. – గీతా మాధురి, వెటర్నరీకాలనీ. ✓: ఆయా ప్రాంతాల్లోని వీధి దీపాలను పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. – గాయత్రి, ఏఈ

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : ?: 16వ వార్డు కేఆర్‌ఎంకాలనీ పార్కు సమీపంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసన తట్టుకోలేకపోతున్నాం. – కిషోర్, కేఆర్‌ఎంకాలనీ. ✓: తక్షణమే సిబ్బందిని పంపించి వ్యర్థాలను తొలగిస్తాం. – సూరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ?: 11వ వార్డు ఆరిలోవ గాంధీనగర్ పదో లైన్లో మూడు రోజుల నుంచి కొళాయిలు రాక ఇబ్బంది పడుతున్నాం. – నాగలక్ష్మి, స్థానికులు ✓:తక్షణం కొళాయిలను పరిశీలించి నీరు వచ్చేలా చూస్తాం. – చంద్రశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్

ఆరిలోవ, న్యూస్‌టుడే : ?: చినగదిలి కొండవాలు ప్రాంతంలోని రాధాకృష్ణనగర్, నేతాజీనగర్‌లలో వీధి దీపాలు ఇటీవల తుపాను గాలులకు దెబ్బతిన్నాయి. రాత్రుళ్లు వెలగడంలేదు. – పి.భరత్, నేతాజీనగర్ ✓: దెబ్బతిన్న దీపాలకు మరమ్మతులు చేయించి వెలిగేలా చర్యలు తీసుకుంటాం. –ఎం.రామకృష్ణ, వీధి దీపాల విభాగాధికారి

స్పందనకు వందనం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ఎంవీపీకాలనీ మూలపాలెం, మత్స్యకార కాలనీలలో దోమలు అధికంగా వృద్ధి చెందాయని స్థానికులు 'ఈనాడు మేమున్నాం మీకుతోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు సోమవారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనికి జీవీఎంసీ మలేరియా అధికారి బోయిన శ్రీనివాసరావు స్పందించారు. వెంటనే సిబ్బందితో ఫాగింగ్ చేయించి దోమల నివారణ చర్యలు చేపట్టారు.

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 15వ వార్డు దుర్గానగర్, సింహాద్రిపురం, హెచ్‌బీకాలనీ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం సరిగా లేదని సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషోర్ స్పందించారు. వెంటనే సిబ్బందిని పంపించి వ్యర్థాలను తరలించేలా చర్యలు తీసుకున్నారు.

యూజీడీ ప్రాజెక్టుకు డీపీఆర్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థ జోన్-2 మధురవాడ ప్రాంతంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ ప్రాజెక్టుతోపాటు, జీవీఎంసీ పరిధిలో అసంపూర్తి యూజీడీ పనులు చేపట్టడానికి డీపీఆర్ (సవివర పథక నివేదిక)ను ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఏపీయూఐఏఎంఎల్)ద్వారా తయారు చేయించుకోవాలని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రపంచ బ్యాంకు పరిధిలోని ఐఎఫ్‌సీ (ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్) రూ.553 కోట్లు సమకూరుస్తుండగా, అసంపూర్తి పనులకు అమృత్ 2.0 పథకం ద్వారా నిధులు అందనున్నాయి. ఆయా ప్రాజెక్టు పనులకు సంబంధించి డీపీఆర్ తయారీతోపాటు, ప్రాజెక్టు టెండర్లు పూర్తి చేసే బాధ్యతను ఏపీయూఐఏఎంఎల్‌కు అప్పగించి, ప్రాజెక్టు నిధుల్లో 1.45 శాతం నిధులు ఆ విభాగానికి ఇవ్వాలని సంబంధిత ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'కాంగ్రెస్‌తోనే ప్రజాస్వామ్యానికి ఊపిరి'

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని కాంగ్రెస్ తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రియాంక దండి అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో సోమవారం ఆమె పార్టీ నాయకులతో కలిసి 'ఓట్లు చోర్ గద్దె చోడ్'పై సంతకాల సేకరణ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ దేశంలో అన్ని వ్యవస్థలను ఎన్‌డీఏ ప్రభుత్వం నాశనం చేసిందని, కేంద్ర ఎన్నికల సంఘాన్ని కూడా చేతిలో పెట్టుకొని అధికారంలోకి వస్తోందని, ప్రజలు మేలుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. కాంగ్రెస్‌తోనే ప్రజాస్వామ్యం పరిరక్షణ సాధ్యమని పేర్కొన్నారు. నాయకులు మహమ్మద్ అలీ, జగన్ మురారి, భోగవరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రంగు మారిన నీరు..తాగేదెలా!

- పగిలిన పైపులైన్లతో సమస్య
- శుద్ధి విధానంలోనూ లోపాలు

ఆరిలోవ, న్యూస్‌టుడే: జోన్-3 పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీరు మురికిగా వస్తోందని, బురదనీరు సరఫరా అవుతోందని స్థానికులు వాపోతున్నారు. వాటిని తాగిన వారు జ్వరాల బారిన పడుతున్నారని చెబుతున్నారు. ఇటీవలి భారీ వర్షాలకు ముడసర్లోవ రిజర్వాయరులో భారీగా వరద నీరు చేరింది. ఈ నీరు సరిగా శుద్ధి కాకపోవడం, పలు ప్రాంతాల్లో పైపులైన్లు దెబ్బతినడంతో రంగుమారి వస్తోందని తెలిపారు.

★ **50వేల జనాభాకు సరఫరా:** ముడసర్లోవ రిజర్వాయరు నుంచి రోజుకు 0.5 మిలియన్ గ్యాలన్ల(ఎంజీడీ) నీటిని నగర అవసరాలకు ఉపయోగిస్తున్నారు. 12, 13వ వార్డుల్లోని శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, దీనదయాళపురం నుంచి చినగదిలి, సూర్యతేజ నగర్ నుంచి ఆరిలోవ ఆఖరి బస్‌స్టాప్ వరకు సుమారు 50వేల మంది జనాభాకు కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. అయితే కైలాస్‌నగర్, శ్రీహరినగర్, టీపీటీకాలనీ, నెయ్యల వీధి తదితర ప్రాంతాల్లో తాగునీరు కలుషితమవుతోందని స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నారు.

ముడసర్లోవ రిజర్వాయరు వద్ద నీటిని శుద్ధి చేసే గ్యాలరీ

★ **పరిశీలించి చర్యలు తీసుకుంటాం..** ఇటీవల భారీ వర్షాలకు ముడసర్లోవ రిజర్వాయరులో బురదతో కూడిన నీరు చేరింది. ఇక్కడ శుద్ధి చేయడానికి ఆలం ఉపయోగించం. గ్యాలరీలో ఇంకిన నీరు శుద్ధి అవుతుంది. క్లోరినేషన్ తరువాత కొళాయిలు ద్వారా కాలనీలకు సరఫరా చేస్తున్నాం. ఎక్కడైనా కలుషిత నీరు సరఫరా అవుతుంటే మా దృష్టికి తీసుకొస్తే పైపులను పరిశీలిస్తాం. బాగుచేసి శుద్ధి జలం అందజేస్తాం.
– కె.శ్రీనివాసరావు, ఏఈ, జీవీఎంసీ నీటి సరఫరా విభాగం

శుద్ధి విధానం ఇలా..

రిజర్వాయరులోని నీరు పైపుల ద్వారా ముడసర్లోవ పార్కులో ఉన్న గ్యాలరీలోకి చేరుతుంది. గ్యాలరీలో సుమారు 2 అడుగుల మందంతో ఇసుక పొర, 2 అడుగుల మందంతో కంకర పిక్క పొర వేశారు.. ఇలా ఒక దానిపై మరొకటి మూడు పొరలు ఉంటాయి. అందులోకి చేరిన నీరు ఇంకి బావుల్లోకి చేరుతుంది. బావుల్లోని నీటిని ట్యాంకులోకి పంపి తగు మోతాదులో క్లోరిన్ కలుపుతారు. క్లోరినేషన్ అయిన మంచి నీటిని కొళాయిల ద్వారా కాలనీలకు సరఫరా చేస్తున్నారు. ఇక్కడ శుద్ధి విధానం పాతకాలం నాటిది. దీంతో నీటిలోని మట్టి పూర్తిస్థాయిలో తొలగిపోవడం లేదని అంటున్నారు. ఇతర రిజర్వాయర్లలో మాత్రం బురదనీటికి ఆలం కలిపి శుద్ధి చేస్తున్నారు. భారీ వర్షాలు పడితే నీటిలోని బురద శాతం ఎక్కువగా ఉంటుంది. దీన్ని తొలగించాలంటే ఆలం కూడా అదేస్థాయిలో కలుపుతారు. తద్వారా నీటిలో మట్టి కణాలు తగ్గిపోతాయి. ముడసర్లోవలో పాతవిధానం కారణంగా భారీ వర్షాల సమయంలో సమస్య తలెత్తుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పండగ చిత్రం.. సృజన రూపం..!

'ఈనాడు..ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

ఆరిలోవ, న్యూస్‌టుడే: ఆరిలోవ శ్రీ అంజన పాఠశాలలో సోమవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు 'మీకు నచ్చిన పండగ' అంశంపై చిత్రలేఖన పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సృజనాత్మకతతో చిత్రాలు గీసి మెప్పించారు. వారిలో ఎస్.చంద్రమౌళి (8వ తరగతి) ప్రథమ, ఎ.వాత్సల్య (9వ తరగతి) ద్వితీయ, జి.ఉష (9వ తరగతి) తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ ఎన్.గణేష్, ఉపాధ్యాయులు హారిక, సునీత బహుమతులు అందించి అభినందించారు.

పోటీల్లో పాల్గొన్న శ్రీ అంజన పాఠశాల విద్యార్థులు, విజేతలకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: విశాలాక్షినగర్ భారతీయ విద్యాకేంద్రం జూనియర్ కళాశాలలో సోమవారం 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో 'పర్యావరణం- ప్రకతి అందాలు' అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పర్వతాలు, చెట్లు, జంతువులు తదితర ప్రకృతి చిత్రాలను గీసి ప్రతిభ కనబరిచారు. ఎన్.ప్రత్యక్ష (ప్రథమ), కె.ప్రసన్న (ద్వితీయ), వి.దీపక్ (తృతీయ) బహుమతులు గెలుచుకున్నారు. వీరికి ప్రిన్సిపల్ రమ ఆచంట, అధ్యాపకులు బహుమతులందించి అభినందించారు.

చిత్రాలు గీస్తున్న బీవీకే కళాశాల విద్యార్థులు, విజేతలతో ప్రిన్సిపల్ రమ ఆచంట

వ్యాసరచనలో ప్రథమ స్థానం

కె.యోగి

ఆరిలోవ, న్యూస్‌టుడే: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సోమవారం నియోజకవర్గం స్థాయిలో నిర్వహించిన వ్యాస రచన, క్విజ్ పోటీల్లో శ్రీకృష్ణాపురం గురుకుల పాఠశాల విద్యార్థి కోడి యోగి ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడని పాఠశాల ప్రిన్సిపల్ వి.రత్నవల్లి తెలిపారు. యోగి 9వ తరగతి చదువుతున్నాడని చెప్పారు. ఈ మేరకు విద్యార్థిని ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

హరహర మహాదేవ.. శంభో శంకర

ఆరిలోవ నెహ్రూనగర్‌లో..

ఆరిలోవ ముస్తఫాకాలనీలో..

ఆరిలోవ, న్యూస్‌టుడే: కార్తికమాసం రెండో సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పెదగదిలిలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజామున 4 గంటలకు రుద్రాభిషేకాలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ముస్తఫా కాలనీలోని బాలా త్రిపురసుందరి సహిత మల్లేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు నిర్వహించామని ఆలయ ధర్మకర్త ఎం.కృష్ణంరాజు తెలిపారు. నెహ్రూనగర్‌లోని ఉమా నాగలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు, అభిషేకాలు చేశారు.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: పదోవార్డు రవీంద్రనగర్ చివరి బస్‌స్టాపు కొండపై గల కాశీవిశ్వేశ్వరస్వామికి జలాభిషేకం, క్షీరాభిషేకం నిర్వహించారు. ఆదర్శనగర్ శివాలయంలో బిల్వార్చన, హనుమంతువాక రామలింగేశ్వర స్వామి వారికి విభూది అర్చన, కైలాసగిరి కూడలిలోని కైలాసగిరేశ్వరునికి కొండపై ఆలయంలో రుద్రాభిషేకం చేశారు. సాయంత్రం ఆకాశ దీపారాధన, ఆధ్యాత్మిక ప్రవచనం, లింగాష్టకం, బిల్వాష్టకం, శివాష్టకం పారాయణం నిర్వహించారు. ఆలయకమిటీ ప్రతినిధులు కానూరి శశికుమార్, అలుగోలు సత్యారావు, నారాయణరావు, స్వామి పరానంద భారతి పర్యవేక్షించారు.

పీతలవానిపాలెం శివాలయంలో భక్తుల పూజలు

పెదగదిలి శివాలయంలో అభిషేకం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఇసుకతోట శివాలయం, మద్దిలపాలెం ఉమామహేశ్వర పంచాయతన ఆలయం, 22వ వార్డు పీతలవానిపాలెం శివాలయం, కొత్తవెంకోజీపాలెం శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వర ఆలయం, హెచ్‌బీకాలనీ శివాలయం, ఎంవీపీకాలనీ సెక్టార్-6లోని శివాలయంలో అభిషేకాలు, పూజలు జరిగాయి.

ఇసుకతోట శివాలయంలో..

జోన్-3 కార్యాలయానికి 16 వినతులు

వినతులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ శివప్రసాద్

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జోన్-3 జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 16 వినతులు వచ్చాయన్నారు. వాటిలో రెవెన్యూ విభాగానికి 3, ప్రజారోగ్యానికి 4, పట్టణ ప్రణాళికకు 5, ఇంజినీరింగ్ విభాగానికి 3, యూసీడీకి 1 వచ్చాయని తెలిపారు. ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఘనంగా అన్న సమారాధన

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 17వ వార్డు ఆదర్శనగర్‌లోని సాయికృష్ణమందిరం 24వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామికి పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాప్‌రుద్ర పాల్గొని అన్నదానాన్ని ప్రారంభించారు.

పోగేశారు..పట్టించుకోలేదు..!

సంజీవ్‌నగర్ కాలనీ రేషన్‌డిపో ఎదురుగా..

సంజీవ్‌నగర్ కాలనీ రేషన్‌డిపో ఎదురుగా సామాజిక భవనం గోడకు ఆనుకుని ఇటీవల కొందరు భవన నిర్మాణ వ్యర్థాలు పోశారు. నెలరోజులైనా వాటిని తొలగించడం లేదు. వ్యర్థాల్లో విష కీటకాలు చేరుతున్నాయని, రేషన్ డిపోనకు, సామాజిక భవనానికి వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగంలో ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని , ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
– విశాలాక్షినగర్, న్యూస్‌టుడే

ఏడాదిగా..మెట్లు ఈ తీరుగా..!

జోడుగుళ్లపాలెం తీరంలోకి దిగేందుకు ఏర్పాటు చేసిన మెట్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఏడాది క్రితం కురిసిన భారీ వర్షాలకు వర్షపు నీరు తీరంలోకి వెళ్లే సమయంలో మెట్లు కోతకు గురయ్యాయి. అప్పటి నుంచి మరమ్మతులు నిర్వహించ లేదు. తెన్నేటి పార్కు తీరంలోని బంగ్లాదేశ్ నౌక వద్దకు వెళ్లడానికి పర్యాటకులు ఈ మార్గాన్నే ఉపయోగిస్తున్నారు. మెట్లు దెబ్బతిని ఉండటంతో జారిపడిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.
– విశాలాక్షినగర్, న్యూస్‌టుడే

దర్పణం

జోడుగుళ్లపాలెం తీరంలో మెట్లు ఇలా..

బీఆర్టీఎస్ రోడ్లకు రంగుల కళ..

శ్రీకృష్ణాపురం వద్ద విభాగినులకు రంగులు వేస్తున్న కార్మికులు

ఆరిలోవ, న్యూస్‌టుడే: నగరంలో ఈ నెల 14, 15 తేదీల్లో సీఐఐ భాగస్వామ్య సదస్సు నిర్వహించనున్న సందర్భంగా నగరంలోని బీఆర్టీఎస్ రోడ్లను ముస్తాబు చేస్తున్నారు. అడవివరం నుంచి హనుమంతువాక వరకు కూడళ్లలో చెదిరిపోయిన జీబ్రా గీతలను మళ్లీ గీస్తున్నారు. విభాగినులకు నలుపు, తెలుపు రంగులు వేస్తున్నారు. ఈ మార్గంలో సుమారు 1200 వరకు వీధి దీపాలు ఉన్నాయి. అవన్నీ వెలిగేలా మరమ్మతులు చేయిస్తున్నామని విద్యుత్తు విభాగ ఏఈ గాయత్రి శరణ్య తెలిపారు.

రేడియాలజీ విభాగ పీజీలకు బంగారు పతకాలు

పతకాలు, ప్రశంసాపత్రాలు పొందిన వారితో ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యాదేవి, రేడియాలజీ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ ఉమామహేశ్వరరావు తదితరులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రేడియాలజీ వైద్యుల రాష్ట్ర స్థాయి సదస్సులో ఆంధ్ర వైద్య కళాశాల రేడియాలజీ విభాగ పీజీలు రాణించారు. రాష్ట్ర స్థాయిలో 180 పరిశోధన పత్రికలు సమర్పించగా ఏఎంసీ రేడియాలజీ విభాగానికి చెందిన డాక్టర్ జి.పుష్పిత ప్రథమ స్థానంలో నిలిచి ప్రతిష్ఠాత్మక వైజాగ్ సిటీ సబ్‌చాప్టర్ అవార్డు, బంగారు పతకం అందుకున్నారు. పీజీ డాక్టర్ జయగురు సంబత రాజన్ ద్వితీయ, డాక్టర్ రాజారెడ్డి బంగారు పతకం, డాక్టర్ మేఘన ప్రత్యేక ప్రశంసాపత్రాన్ని పొందారు. ఈ మేరకు సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో విజేతలను ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ బుజ్జిబాబు, ప్రొఫెసర్ డాక్టర్ ఉమామహేశ్వరరావు తదితరులు అభినందించారు.

9 మందికి సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి

ఉద్యోగోన్నతి పొందిన వారితో మేయర్ పీలా శ్రీనివాసరావు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థలో జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న 9 మందికి సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ మేరకు సోమవారం మేయర్ పీలా శ్రీనివాసరావు వారికి సంబంధిత ధ్రువీకరణపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరింత బాధ్యతతో విధులు నిర్వర్తించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మేయర్ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ రమణమూర్తి, పరిపాలనాధికారి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు నిత్యావసరాల పంపిణీ

మత్స్యకారులకు నిత్యావసరాలు అందిస్తున్న తెదేపా నాయకులు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: మొంథా తుపానుతో తొమ్మిదోవార్డు పరిధిలో ఉపాధి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు సోమవారం సాయం అందజేశారు. హనుమంతువాక కొండవాలులోని క్రాంతినగర్ రేషన్ డిపో వద్ద వార్డు తెదేపా ఇన్‌ఛార్జ్ బుడుమూరి గోవింద్, సివిల్ సప్లై అధికారులతో కలిసి 50 కిలోల బియ్యం, కిలో ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, అరకిలో నూనె, చక్కెర అందించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు బాదరు బాలరాజు, బుడుమూరి భూలక్ష్మి, నల్ల ఈశ్వరరావు, కందుల దుర్గ తదితరులు పాల్గొన్నారు.

16న శెట్టి బలిజ కార్తిక వనసమారాధన

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అప్పారి శ్రీవిద్య, సంఘం నాయకులు

హెచ్‌బీకాలనీ (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: అమలాపురంలో ఈనెల 16న ఉభయరాష్ట్రాల శెట్టిబలిజ సామాజిక వర్గం కార్తిక వన సమారాధన నిర్వహిస్తున్నట్లు 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య తెలిపారు. సోమవారం హెచ్‌బీకాలనీలోని ఆమె నివాసంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను సామాజికవర్గ నాయకులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. నాయకులు చొల్లంగి వెంకటరమణ, కె.సామ్రాట్, గుత్తుల విజయకుమార్, వాసంశెట్టి సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐఐఎం భవనం స్వాధీనానికి విద్యార్థుల యత్నం

రెక్టార్ జోక్యంతో తాత్కాలికంగా విరమణ

ఏయూలోని ఐఐఎం క్యాంపస్ వద్ద డీసీఎంఎస్ విద్యార్థులు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆవరణలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)కు కేటాయించిన భవనాన్ని ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం(డీసీఎంఎస్) విద్యార్థులు సోమవారం ఆక్రమించేందుకు ప్రయత్నించారు. ఒప్పందం గడువు ముగిసినా భవనాన్ని ఐఐఎం వర్సిటీకి అప్పగించడం లేదని ఆరోపిస్తూ సుమారు 300మంది విద్యార్థులు ఐఐఎం ఆవరణలోకి వెళ్లారు. విషయం తెలుసుకున్న రెక్టార్ ఆచార్య కింగ్ డీసీఎంఎస్ విభాగానికి వెళ్లి విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, ఇతర ఆచార్యులతో మాట్లాడారు. వారి సూచనల మేరకు విద్యార్థులు వెనక్కి వచ్చారు.

★ ఏయూలో డీసీఎంఎస్ విభాగంలో సుమారు వెయ్యిమందికి పైగా విద్యార్థులు ఉన్నారు. వీరికి 21 తరగతి గదులు అవసరం కాగా 12మాత్రమే ఉన్నాయి. ఐఐఎంకి ఇచ్చిన గడువు పూర్తయి మరో చోటుకు వెళ్లినందున ఎంఓయూ కాలపరిమితి పెంచకుండా తమకు భవనాన్ని అప్పగించాలని చాలా కాలంగా విద్యార్థులు కోరుతున్నారు. రెక్టార్ ఆచార్య పి.కింగ్ మాట్లాడుతూ వీసీ ఆచార్య రాజశేఖర్ మంగళవారం విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావులతో సమావేశం నిర్వహించి సమస్యకు పరిష్కారం చూపుతారని చెప్పారు.

ఏయూ సమాచారం

వర్సిటీ రహదారులకు సొబగులు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఈ నెల 14, 15 తేదీల్లో సీఐఐ భాగస్వామ్య సదస్సు నిర్వహించనున్న నేపథ్యంలో వర్సిటీలో రహదారులకు సొబగులద్దుతున్నారు. ఈ మేరకు ఇంజినీరింగ్ కళాశాల మైదానం గుండా మద్దిలపాలెం, పెదవాల్తేరుకు వెళ్లే మార్గంలో కొత్తగా తారు రోడ్డు వేస్తున్నారు. అలాగే ఏయూ చుట్టూ ఉన్న రహదారుల్లో డివైడర్లకు రంగులు వేస్తున్నారు. ప్రహరీలను బొమ్మలతో నింపేస్తున్నారు. దీంతో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల పరిసరాలు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి.

ఏయూ మైదానంలో వేసిన తారు రోడ్డు

ఏయూ ఫెన్సింగ్ జట్ల ఎంపిక

జట్ల సభ్యులతో ఆచార్య ఎన్.విజయమోహన్, ఆచార్య ఎ.పల్లవి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆలిండియా అంతర వర్సిటీల పోటీల్లో పాల్గొనే ఏయూ ఫెన్సింగ్ (కత్తి యుద్ధం) జట్లను సోమవారం ఎంపిక చేశారు. ఈ నెల 5 నుంచి 10వతేదీ వరకు పంజాబ్‌లోని గురునానక్ యూనివర్సిటీలో ఈ పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు పురుషులు, స్త్రీల జట్లను ఎంపిక చేసినట్లు ఏయూ వ్యాయామ విద్యా సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్, విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి తెలిపారు.

న్యాయ విద్యార్థులు సమాజాన్ని చదవాలి..



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆచార్య వై.సత్యనారాయణ

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ న్యాయ కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు సోమవారం ఇండక్షన్, ఓరియంటేషన్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక ఉపకులపతి ఆచార్య వై.సత్యనారాయణ మాట్లాడుతూ న్యాయవిద్యలో చేరిన విద్యార్థులు సమాజాన్ని చదవాలన్నారు. మంచి ఆలోచనాపరులుగా మారాలన్నారు. చట్టాలపై సమగ్ర అవగాహన పెంచుకుంటే న్యాయవాదిగా రాణించవచ్చన్నారు. న్యాయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.సీతామాణిక్యం మాట్లాడుతూ ఇక్కడ చదివిన పలువురు విద్యార్థులు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, రాజకీయ నాయకులుగా ఎదిగారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎస్.పాల్ డగ్లస్, గౌరవాచార్యులు ఎ.పద్మావతి, ఆలిండియా రేడియో న్యూస్ యూనిట్ సాఫ్ట్‌స్కిల్ ట్రైనర్ ఎన్.మణి ఉజ్వల, తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

యూజీడీ ప్రాజెక్టుకు డీపీఆర్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-2 మధురవాడ ప్రాంతంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ ప్రాజెక్టుతోపాటు, ఇతర అనుసంధానిత యూజీడీ పనులు చేపట్టేందుకు డీపీఆర్‌ను ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ద్వారా తయారు చేయించుకోవాలని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రపంచ బ్యాంకు పరిధిలోని ఐఎఫ్‌సీ (ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్) రూ.553 కోట్లు సమకూర్చనుండగా, అనుపూర్తి పనులకు అమృత్ 2.0 పథకం ద్వారా నిధులు అందనున్నాయి. ఆయా ప్రాజెక్టు, పనులకు సంబంధించి డీపీఆర్ తయారీ తోపాటు, ప్రాజెక్టు టెండర్లు పూర్తి చేసే బాధ్యతను ఏపీయూఐఏఎంఎల్‌కు అప్పగించి, ప్రాజెక్టు నిధుల్లో 1.45 శాతం నిధులు ఆ విభాగానికి ఇవ్వాలని సంబంధిత ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796

విశాఖ దక్షిణం: 8008574977

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 37వ వార్డు వెలంపేట వీధిలో వ్యర్థాలు తరలించక ఇబ్బందులు పడుతున్నాం. – రమేష్, స్థానికుడు ✓: వెంటనే కార్మికులతో వ్యర్థాలు తరలిస్తాం. – నవీన్, పారిశుద్ధ్య విభాగం

గురుద్వారా, న్యూస్‌టుడే: ?: టీపీటీకాలనీ పరిసర వినాయకుడి ఆలయం సమీపంలో మద్యం దుకాణం వద్ద బయట మద్యం తాగుతున్నారు. స్థానిక మహిళలు భయాందోళన చెందుతున్నారు. – శంకరరావు. ✓: బహిరంగ ప్రదేశంలో మద్యం తాగితే చర్యలు తీసుకుంటాం. – డి.వి.రమణ, ద్వారా సీఐ

■ ప్రేమసమాజం భూములు సామాజిక అవసరాలకు వినియోగించాలి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రుషికొండ ప్రాంతంలో ప్రేమ సమాజానికి ఉన్న 42 ఎకరాల భూములను సామాజిక అవసరాల కోసం వినియోగించాలని జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. ★ జగదాంబ కూడలిలో కాన్వెక్సుల ఉన్న జనసేన జెండా దిమ్మ తొలగించి, అక్కడ సినీనటుడు దివంగత సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహం ఏర్పాటు చేయడం సరికాదని, దానిపై చర్యలు తీసుకోవాలని మూర్తి యాదవ్ కలెక్టరుకు కోరారు.

■ జ్ఞానాపురంలో ద్విచక్రవాహనం దగ్ధం

జ్ఞానాపురం, న్యూస్‌టుడే: నెల్సన్‌కాలనీలో గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనాన్ని కాల్చి వేసిన ఘటన సోమవారం వెలుగుచూసింది. స్థానికంగా నివాసం ఉండే వంశీ తన ద్విచక్రవాహనాన్ని ఇంటి ముందు నిలిపి ఉంచగా కొందరు దానికి నిప్పు పెట్టారు. వాహనాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు.

■ బాధితులకు పరిహారం అందజేత

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాద బాధితుల సహాయ కేంద్రం ద్వారా పలువురు బాధితులకు పరిహారం అందజేసినట్లు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి అన్నారు. అనకాపల్లి జిల్లాకు చెందిన రాపేటి కోటేశ్వరరావు జీవీఎంసీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతుని భార్య రాపేటి కొండలక్ష్మికి రూ.2లక్షలు, గాయపడిన సీతంపేట ప్రాంతానికి చెందిన చిలుకూరి సురేష్, గాజువాక ప్రాంతానికి చెందిన ఇమంది లక్ష్మణరావులకు ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు సీపీ తెలిపారు.

■ అభియోగాలపై వివరణ ఇవ్వండి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగరపాలక సంస్థలో సహాయ ఇంజినీరుగా విధులు నిర్వహిస్తున్న కె.వి.మాధవరావుపై అనిశా నమోదు చేసిన అభియోగాలకు వివరణ ఇవ్వాలని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. 2016లో ఆదాయానికి మించి ఆస్తులున్నాయని ఆయనపై అనిశా కేసు నమోదు చేసింది. వివరణపై సంతృప్తి చెందకపోతే, తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

■ వినతుల స్వీకరణ

అల్లిపురం, న్యూస్‌టుడే: సూర్యబాగ్‌లోని జోన్-4 కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడు ఆధ్వర్యంలో వినతులు స్వీకరించారు. రెవెన్యూ విభాగానికి-2, టౌన్‌ప్లానింగ్-1, ప్రజారోగ్యం-1, ఇంజినీరింగ్-1 చొప్పున అర్జీలు వచ్చాయి.

■ ఘనంగా లీలా మహోత్సవాలు

అల్లిపురం, న్యూస్‌టుడే: శ్రీగౌరీ పరమేశ్వరుల లీలా మహోత్సవాలు వేంకటేశ్వరమెట్ట వద్ద సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయా ప్రాంత వాసులకు హామీ ఇచ్చారు.

■ సినీనటుడు కృష్ణ విగ్రహం తొలగింపు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహాన్ని జీవీఎంసీ అధికారులు సోమవారం తొలగించారు. జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఫిర్యాదు మేరకు సంబంధిత విగ్రహాన్ని తొలగిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే సంబంధిత విగ్రహాన్ని ఏర్పాటు చేసింది కూడా ఆపార్టీ నాయకులే కావడంతో ఈ ఘటన వివాదాస్పదంగా మారింది. దాంతో స్థానిక జనసేన నాయకుల మధ్య మనస్పర్థలు వచ్చినట్లు పలువురు ఆరోపించారు. ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన 29వ వార్డు జనసేన నాయకుడు మన్యాల శ్రీనివాసరావు ఘటనా స్థలం వద్దకొచ్చి ఇది తనకు తెలిసే జరిగిందని, మరోచోట విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. జనసేనలో మనస్పర్థలు తలెత్తినట్లు వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఈ విగ్రహం ఏర్పాటుకు తాను వ్యతిరేకం కాదని; జనసేన జెండా ఉండే చోటును ఎంపిక చేయడం వల్లే ఫిర్యాదు చేసినట్లు మూర్తియాదవ్ పేర్కొన్నారు.

పనుల్లో జాప్యం.. ప్రజలకు శాపం..

తాటిచెట్లపాలెం - రైల్వేన్యూకాలనీ రోడ్డు దుస్థితి

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే

తాగునీటి పైపులైన్ల ఏర్పాటు కోసం రోడ్లను ఇష్టానుసారంగా తవ్వేసి, వాటిని సక్రమంగా పూడ్చకుండా వదిలేయడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. తాటిచెట్లపాలెం నుంచి రైల్వేన్యూకాలనీకి వెళ్లే రోడ్డును డ్రైనేజీల నిర్మాణం కోసం, పైపులైన్ల కోసం ఎక్కడికక్కడ తవ్వేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గోతుల్లో నీరు చేరి ప్రమాదకరంగా మారాయి. ఇళ్లల్లోని ప్రజలు రోడ్డు మీదకు రావాలంటే భయపడుతున్నారు. రాత్రి సమయాల్లో గోతుల్లో పడి ద్విచక్రవాహన చోదకులు గాయాలపాలవుతున్నారు. పిల్లలు పాఠశాలలకు వెళ్లి వచ్చే సమయాల్లో జారిపడి అందులో పడిపోతారేమోనని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా జీవీఎంసీ అధికారులు మాత్రం పట్టించుకోవడం ఆరోపిస్తున్నారు. కొన్నిచోట్ల స్థానికులు గట్టిగా నిలదీసి, తీవ్ర ఒత్తిడి తీసుకురావడంతో అక్కడక్కడ తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి చేతులు దులిపేసుకుంటున్నారు. మిగిలిన ప్రాంతాల్లో మాత్రం అలానే వదిలేయడంతో రోడ్లన్నీ బురదతో చిత్తడి మారుతున్నాయి. రహదారిపై భవన నిర్మాణ వ్యర్థాల పారబోత: పైపులైన్ల ఏర్పాటు, డ్రైనేజీల నిర్మాణం కోసం కొన్నిచోట్ల అడ్డుగా ఉన్న నిర్మాణాలను తొలగించారు. మట్టిని అక్కడే వదిలేసి భవన నిర్మాణ వ్యర్థాలను శివారులోని రహదారుల పక్కన గుట్టు చప్పుడు కాకుండా పారబోస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. వర్షాలకు మట్టి బురదగా మారి ఇళ్ల ముందు అధ్వానంగా ఉంటోందని స్థానికులు వాపోతున్నారు. దుకాణాల ముందు అడ్డంగా ఉన్న మట్టికుప్పలను తొలగించాలని వ్యాపారులు స్థానిక కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన అధికారులకు చెప్పి వాటిని తక్షణం తొలగించారు. మిగిలిన చోట్ల కూడా వ్యర్థాలను తొలగించేందుకు జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రైల్వేన్యూకాలనీలో రహదారి మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

కొండవాలు ప్రాంతాల్లో వసతులు కల్పించండి

కంచరపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 48వ వార్డు కొండవాలు ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించాలని వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు గంకల కవిత మేయరు పీలా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. వర్షం కురిస్తే ఇందిరానగర్-2 ప్రాంతవాసులు నానా అవస్థలు పడుతున్నారని, కొండపై నుంచి నేరుగా ఇళ్ల పైకి నీరు వస్తోందని ఆ ప్రాంతంలో రక్షణ గోడలు నిర్మించాలని కోరారు. వీధి దీపాలు వెలగడం లేదని కొత్తవి వేయాలన్నారు. ఆమె వెంట జిల్లా భాజపా ఉపాధ్యక్షుడు గంకల అప్పారావు ఉన్నారు. మురళీనగర్, న్యూస్‌టుడే: జీవీఎంసీ 50వ వార్డు సాయిరాంనగర్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు డ్రైనేజీలు మూసుకుపోవడం, వీధి దీపాలు వెలగకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వార్డు తెదేపా అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ ఆధ్వర్యంలో సాయిరాంనగర్ ప్రజలు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. కూటమి నేతలు తమ్మినేని పద్మజ, కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

మేయరు పీలా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కవిత, అప్పారావు

ప్రజాదర్బార్‌తో సమస్యల పరిష్కారం

మాధవధార, న్యూస్‌టుడే: ప్రజలు తెలిపే సమస్యలను ఆయా విభాగ అధికారులకు తెలియజేసి వాటి పరిష్కారానికి అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని ఉత్తరం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు. జీవీఎంసీ 51వ వార్డులోని పీ4 కార్యాలయంలో జోన్-5 అధికారులతో కలిసి సోమవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఇక నుంచి ప్రతి సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అందుబాటులో ఉండి వినతులు స్వీకరించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రెవెన్యూకు ఒకటి, యూసీడీకి రెండు, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 9 ఫిర్యాదులు వచ్చాయన్నారు. తుఫాను కారణంగా కొండవాలు ప్రాంతమైన సాయిరాంనగర్ కాలనీ డ్రైనేజీలు పూడ్చుకుపోవడం, వీధి దీపాలు వెలగడం లేదని కాలనీవాసులు వినతిపత్రం సమర్పించారు. జెడ్సీ బి.రాము, ఈఈ పద్మావతి, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ తిరుపతిరావు, రెవెన్యూ అధికారి బాబూరావు, ఏపీడీ పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు

సహకార సంస్థలతో ప్రజలకు లాభాలు

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-8 వైశాఖి స్పోర్ట్స్ పార్కు వేములపల్లి కళాక్షేత్ర వేదికపై సోమవారం సాయంత్రం విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు మురళీనగర్ శాఖ ఆధ్వర్యంలో సహకార సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బ్యాంకు ఛైర్మన్ జె.వి.సత్యనారాయణమూర్తి పాల్గొని మాట్లాడారు. సహకార సంస్థల వల్ల కలిగే లాభాలను వివరించారు. చాలా రకాల ప్రభుత్వ సేవలు సహకార రంగం ద్వారా ప్రజలకు నేరుగా అందుతున్నాయన్నారు. ఐక్యరాజ్య సమితి 2025ను అంతర్జాతీయ సహకార సంస్థల సంవత్సరంగా ప్రకటించినందున ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు బ్రాంచి మేనేజర్ కల్యాణి పేర్కొన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ పావని, బ్యాంకు కమిటీ సభ్యుడు మళ్ల రామకృష్ణ, ఖాతాదారులు హాజరయ్యారు.

మాట్లాడుతున్న బ్యాంకు ఛైర్మన్ జె.వి.సత్యనారాయణమూర్తి

రేడియాలజీ విభాగ పీజీలకు బంగారు పతకాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రేడియాలజీ వైద్యుల రాష్ట్ర స్థాయి సదస్సులో ఆంధ్ర వైద్య కళాశాల రేడియాలజీ విభాగ పీజీలు రాణించారు. రాష్ట్ర స్థాయిలో 180 పరిశోధన పత్రికలు సమర్పించగా ఏఎంసీ రేడియాలజీ విభాగానికి చెందిన డాక్టర్ జి.ప్రశాంత్ ప్రథమ స్థానంలో నిలిచి ప్రతిష్ఠాత్మక వైజాగ్ సిటీ సబ్‌చాప్టర్ అవార్డు, బంగారు పతకం అందుకున్నారు. పీజీ డాక్టర్ జయగురు సంబతరాజన్ ద్వితీయ, డాక్టర్ రాజారెడ్డి బంగారు పతకం, డాక్టర్ మేఘన ప్రత్యేక ప్రశంసాపత్రాన్ని పొందారు. ఈ మేరకు సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో విజేతలను ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ బుజ్జిబాబు, ప్రొఫెసర్ డాక్టర్ ఉమామహేశ్వరరావు తదితరులు అభినందించారు.

పతకాలు పొందిన వారితో ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యాదేవి, డాక్టర్ ఉమామహేశ్వరరావు తదితరులు

సృజనతో గీసి.. విజేతగా మెరిసి..

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో అక్కయ్యపాలెంలోని జ్ఞానికేతన్ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం 'చిత్రలేఖనం పోటీలు' నిర్వహించారు. తల్లిదండ్రులు విద్యార్థులను పోటీల్లో మరింత పాల్గొనేలా ప్రోత్సహించాలని, అప్పుడే వారిలో నైపుణ్యాలు మెరుగుపడతాయని జ్ఞానికేతన్ పాఠశాల ప్రిన్సిపల్ సునీతకుమారి పేర్కొన్నారు. 'మీకు నచ్చిన పండగ' అనే అంశంపై విద్యార్థులు చిత్రాలు గీశారు. పి.రమ్యశ్రీ(10వ తరగతి-ప్రథమ), సి.హెచ్.షర్మి(8వ తరగతి-ద్వితీయ), బి.అంజలి(10వ తరగతి-తృతీయ) స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ పి.సునీతకుమారి, ఉపాధ్యాయులు జి.అంజనీకుమారి, పి.ఆర్.సూర్యకుమారి చేతులమీదుగా నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

బొమ్మలు గీస్తున్న విద్యార్థులు, విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ సునీతకుమారి

'డేటా సెంటర్‌కు భూములు కేటాయించొద్దు'

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో గూగుల్ డేటా సెంటర్‌కు భూములు కేటాయించవద్దని, ఆయా ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన నిరసనలో సీపీఐ విశాఖ జిల్లా సహాయ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ తర్లువాడ వద్ద దళితుల భూములు తీసుకుంటే వారి ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయన్నారు. పెదగంట్యాడ పరిధిలో అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనను కూడా విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్యనారాయణ, మన్మధరావు, శ్రీనివాసరావు, ఎండీ బేగం తదితరులు పాల్గొన్నారు. ★ జీవీఎంసీ 51వ వార్డు ఏకలవ్యకాలనీ భూముల్లో నివశిస్తున్న పేదల స్థలాలను క్రమబద్ధీకరించాలని ఏకలవ్యకాలనీ గ్రామాభ్యుదయ సేవా సంఘం కోరింది. ఈ మేరకు సంఘం నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

ఫిజియాలజీ విభాగ ప్రొఫెసర్‌గా డాక్టర్ ప్రసాదరావు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వైద్య కళాశాలలో ఫిజియాలజీ విభాగ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ బి.ప్రసాదరావును ఆంధ్ర వైద్య కళాశాల ఫిజియాలజీ విభాగ ప్రొఫెసర్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఏఎంసీలో ఖాళీగా ఉన్న పోస్టులో ఇతన్ని నియమించారు

అలరించిన సాంఘిక నాటిక ప్రదర్శన

మురళీనగర్, న్యూస్‌టుడే: మురళీనగర్ సెక్టార్-8 వాకర్స్ క్లబ్ సభా వేదికపై శ్రీచైతన్య కళాసాగర్ మాధవధార ఆధ్వర్యంలో ప్రదర్శించిన వశీకరణ హాస్య నాటిక ఆద్యంతం అలరించింది. సమాజంలోని కుటుంబ సంబంధాలు, దాంపత్య జీవితం, అపార్థాలు వాటి వెనుక దాగివున్న హాస్యాన్ని ప్రతిబింబిస్తూ రూపొందిన నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. డైరెక్టర్ ఎన్.సుబ్బారావు నాటికలోని ప్రతిపాత్రను సాధారణ కుటుంబ జీవితాల్ని చమత్కార సంభాషణలతో రూపొందించారు. నటీనటులు ఎస్.సత్యనారాయణ, ఎస్.రామాంజనేయులు, ఎ.కొండలరావు, పి.గిరిధర్, ఎస్.హరిబాబు, రమ తమ సహజ నటనతో అలరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.భానుప్రకాశ్, చొల్లంగి ప్రసాదరావు, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాటకంలో ఓ సన్నివేశం

జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 5న బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ అధ్యక్షుడు పి.నారాయణ తెలిపారు. అక్కయ్యపాలెంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, బ్రాడ్‌కాస్ట్ స్మాల్ అండ్ మీడియం న్యూస్‌పేపర్స్ అసోసియేషన్ల కార్యవర్గ సమావేశాన్ని సోమవారం నిర్వహించి మాట్లాడారు. రోటరీ క్లబ్ సహకారంతో రక్తదాన శిబిరంతో పాటు అన్నదానం, దుస్తుల పంపిణీ చేయనున్నామన్నారు.

అదృశ్యమైన వ్యక్తులు కుటుంబీకుల చెంతకు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: ఇంటి నుంచి అదృశ్యమైన వ్యక్తులను కుటుంబసభ్యులకు అప్పగించినట్లు రెండోపట్టణ సీఐ యర్రన్నాయుడు తెలిపారు. ఆ వివరాలిలా.. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన కొండలరావు(35) ఇటీవల భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబీకులు అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న కొండలరావును గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు ★ ఈనెల 1న ఒడిశా నుంచి వంటపనుల కోసం 10 మంది వైజాగ్ వచ్చారు. వారిలో సమాల్ అనే వ్యక్తి రెండు రోజులుగా కనిపించకపోవడంతో సహచరులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు అతడి ఆచూకీ తెలుసుకుని కుటుంబీకులకు అప్పగించారు. ★ పార్వతీపురానికి చెందిన సందీప్‌కుమార్(22) గత నెల ఎంవీపీ కాలనీలోని స్నేహితుని ఇంటికొచ్చాడు. అతడు తిరిగి పార్వతీపురం వెళ్లేందుకు స్నేహితులు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బస్సు ఎక్కించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. అయితే రెండు రోజులు గడిచినా సందీప్ కుమార్ ఇంటికి చేరుకోకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేయగా అతడు తిరుపతిలో ఉన్నట్లు తెలుసుకుని అదుపులో తీసుకుని కుటుంబసభ్యులకు అప్పగించారు.

పరదేశమ్మ సేవా మండలి కార్యవర్గం ఎన్నిక

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: రైల్వేన్యూకాలనీలోని శ్రీపరదేశమ్మ సేవా మండలి(రామాలయం కమిటీ) నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అనంతరం సంస్థ కార్యాలయంలో సభ్యులంతా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సుందరేశ్వరరావు మాట్లాడుతూ రామాలయాన్ని అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యదర్శి దొడ్డి చిరంజీవి, ఉపాధ్యక్షుడు కట్టా సూర్యారావు, కోశాధికారి సూరిశెట్టి అచ్యుతరావు, సహాయ కార్యదర్శి దొడ్డి రమేశ్, ఆడిటర్ కె.వి.రామరాజేశ్, సలహా సభ్యులు బొడ్డేటి జగత్‌రావు, జి.రామకృష్ణ పాల్గొన్నారు.

ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

పవర్ సిస్టమ్ జనరేటింగ్ ఐవోటీ ల్యాబ్ ఏర్పాటు

సీతంపేట, న్యూస్‌టుడే: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 'పవర్ సిస్టమ్ జనరేటింగ్ స్టేషన్స్ మోడల్ ఎక్స్పో - స్కిల్ స్కోప్ ఆధారిత ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ల్యాబ్'ను ఏర్పాటు చేశారు. కళాశాల డైరెక్టర్ జి.మధుకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ దీపక్‌చౌదరి, విభాగాధిపతి ఆనంద్ గొందేసి, అధ్యాపకులు జి.టి.నాయుడు, జే.బాబు, డి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

కళాశాల డైరెక్టర్ మధుకుమార్‌కు ల్యాబ్ పనితీరును వివరిస్తున్న విద్యార్థులు

వనితా వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-8 వైశాఖి స్పోర్ట్స్ పార్కు వనితా భవన్‌లో సోమవారం వనితా వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీనియర్ సభ్యురాలు పూసర్ల శేషు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో సమాజ హిత కార్యక్రమాలు చేపట్టడం సభ్యులందరికీ గర్వకారణమన్నారు. కూచిపూడిలో శిక్షణ పొందిన చిన్నారులకు అర్హతపత్రాలు అందజేశారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పి.ప్రభావతి, ఎం.జయ, రీజనల్ కౌన్సిలర్ యు.శుభ, ఆర్.దుర్గాప్రసన్న, భానుమతి, లీలావతి, ప్రమీలారావు, సురేంద్రకౌర్, శిరీషలత తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యఅతిథి పూసర్ల శేషును సత్కరిస్తున్న వనితా వాకర్స్ సభ్యులు

మాధవధారలోని శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

రామకృష్ణానగర్‌లో..

రెడ్డికంచరపాలెం ఉమారామలింగేశ్వరుడు

సీతంపేట పార్వతీశ్వరాలయంలో..

మురళీనగర్ ఉమారామలింగేశ్వరుడి ఆలయ ధ్వజస్తంభం వద్ద దీపారాధన

భక్తిశ్రద్ధలతో కార్తిక సోమవారం పూజలు

మాధవధార, న్యూస్‌టుడే: కార్తిక మాసం రెండో సోమవారం సందర్భంగా ఉత్తరం నియోజకవర్గంలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మాధవధారలోని మల్లికార్జున స్వామి, గాంధీనగర్ శ్రీ హరహర క్షేత్రంలోని స్ఫటిక శివలింగానికి, మద్రిపాలెం సాయినగర్ వద్ద వెలసిన శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు.

గురుద్వారా, న్యూస్‌టుడే: నక్కవానిపాలెం ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు రామారావు శర్మ, మహేశ్ శివుడికి తొలి పూజ చేశారు. స్వామికి పట్టువస్త్రాలు, ప్రత్యేక హారతులు అందజేశారు.

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: శంకరమఠం రోడ్డు రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వర స్వామి ఆలయంలోని శివలింగాన్ని అర్చకులు వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కంచరపాలెం, న్యూస్‌టుడే: రెడ్డికంచరపాలెం ఉమారామలింగేశ్వర ఆలయంలో స్వామివారికి క్షీరాభిషేకం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మురళీనగర్, న్యూస్‌టుడే: స్థానిక ఉమారామలింగేశ్వర ఆలయంలో సాయంత్రం ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపారాధన చేశారు. ఈ పూజల్లో అధికసంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వరుడు

సీతంపేట, న్యూస్‌టుడే: భక్తులు తెల్లవారుజాము నుంచే సీతంపేటలో పార్వతీశ్వరుల ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. పూజారులు భక్తులతో అభిషేకాలు చేయించారు.

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: రైల్వేన్యూకాలనీలోని శ్రీఉమానీలకంఠేశ్వరస్వామికి, తాటిచెట్లపాలెం బి.ఎన్.వన్.టి.ఎన్.కాలనీలోని కోదండేశ్వర స్వామిని అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: రెండోపట్టణ పోలీస్‌స్టేషన్ సమీప చంద్రమౌళీశ్వరుడి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

వైద్యులు సమాజ సేవకు అంకితమవ్వాలి

ఏఎంసీలో ఘనంగా ఫ్రెషర్స్ డే

వన్‌టౌన్, న్యూస్‌టుడే: వైద్య విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించి సమాజ సేవకు తోడ్పడాలని విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఆంధ్ర వైద్య కళాశాల సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వైద్య రంగానికి ఎంతో ప్రాధాన్యమిస్తోందన్నారు. కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ బాధ్యతతో వైద్య విద్య అభ్యసించి ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఉప ప్రిన్సిపల్స్ డాక్టర్ వి.మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యాదేవి, చిత్రంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు

గంజాయితో నలుగురి అరెస్టు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: గంజాయి రవాణా చేసేందుకు యత్నించిన నలుగురిని అరెస్టు చేసినట్లు జీఆర్పీ సీఐ ధనుంజయనాయుడు తెలిపారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన రకుల ఎస్.కె., కొరాపుట్‌కు చెందిన కార్తీక్ కిల్లో విశాఖ మీదుగా గంజాయి బ్యాగ్‌లతో వెళ్లేందుకు యత్నించి గస్తీలో ఉన్న రైల్వే పోలీసులకు చిక్కారు. వారి నుంచి 10 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కొరాపుట్‌కు చెందిన జగన్, పుణెకు చెందిన వికాస్ రోహిదాస్ బ్యాగులతో రైల్లో వెళ్లేందుకు యత్నించి గస్తీలో ఉన్న పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి 4 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

9 మందికి ఉద్యోగోన్నతి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జీవీఎంసీలో జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న 9 మందికి సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ మేరకు సోమవారం మేయర్ పీలా శ్రీనివాసరావు వారికి సంబంధిత ధ్రువీకరణపత్రాలు అందించారు. ఆయన మాట్లాడుతూ మరింత బాధ్యతతో విధులు నిర్వర్తించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ రమణమూర్తి, పరిపాలనాధికారి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం

నాలుగు కేజీల గంజాయి పట్టివేత

పోలీసుల అదుపులో నిందితులు

కరాస, న్యూస్‌టుడే : మర్రిపాలెం ప్యాసింజర్ రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తుల నుంచి ఆర్పీఎఫ్ పోలీసులు సోమవారం నాలుగు కేజీల గంజాయిని పట్టుకున్నారు. ఒడిశాకు చెందిన జగన్, మహారాష్ట్రకు చెందిన వికాస్‌లు రైలు మార్గం ద్వారా గంజాయిని ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తుండగా వారిని అరెస్టు చేసి విశాఖపట్నం జీఆర్పీ పోలీసులకు అప్పగించామని ఆర్పీఎఫ్ సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మమత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన విజిలెన్స్ వారోత్సవాలు

కార్యక్రమంలో మాట్లాడుతున్న జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ముప్పాల శ్రీనివాస్

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3)న్యూస్‌టుడే : ఉక్కు కర్మాగారం ఎల్ అండ్‌డీసీ ఆడిటోరియంలో నిర్వహించిన నిఘా వారోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం ప్రత్యేక ఆర్థిక మండలి జోనల్ డెవలప్‌మెంటు కమిషనర్ శ్రీనివాస్ ముప్పాల పాల్గొని మాట్లాడారు. అవినీతి ఏ రూపంలో ఉన్నా సమాజాన్ని బలహీనపరుస్తుందన్నారు. కార్యక్రమంలో ఉక్కు సీవీవో డాక్టర్ ఎస్.కరుణ రాజు, ఉక్కు డైరెక్టర్లు డాక్టర్ సలీమ్ జి.పురుషోత్తమన్, జి.వి.ఎన్.ప్రసాద్, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ డి.జితేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

సమస్య: పెదగంట్యాడ, వడ్లపూడి ఉక్కు నిర్వాసిత కాలనీల్లో తాగునీటి పైపులైన్లు లీకులు ఎక్కువగా ఉన్నాయి. కుళాయిలు విప్పేసరికి నీరంతా వృథాగా పోతోంది. -కె.కనకారావు, వడ్లపూడి, -పెంటారావు, పెదగంట్యాడ **సమాధానం:** పైపులైన్ల లీకులపై దృష్టిసారించాం. సమస్య పరిష్కరిస్తాం. -కేదార్‌నాథ్, ఏఈ

గోపాలపట్నం, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 92వ వార్డు అజంతాపార్కు కాలనీలో కాలువలో పూడికలు తీయడం లేదు. - విశ్వనాథ్, అజంతాపార్కు ✔: ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడతాం. - గోపీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: జీవీఎంసీ 89వ వార్డు భగత్‌సింగ్‌నగర్ కూడలి - మేహాద్రినగర్ వరకు వీధిదీపాల నిర్వహణ అధ్వానంగా ఉంది. - లక్ష్మణరావు, కొత్తపాలెం ✔: వీధి దీపాల మరమ్మతులు చేపడతాం. - గోవిందరావు, వీధిదీపాల నిర్వాహకులు

కుక్కల తరలింపు — స్పందనకు వందనం

గాజువాక, న్యూస్‌టుడే: ‘ఈనాడు’లో వీధి కుక్కల బెడదపై వచ్చిన వార్తకు సంబంధిత అధికారులు స్పందించారు. వార్డుల వారీగా స్పెషల్ డ్రైవ్ చేపట్టి శునకాలను పట్టుకున్నారు. వీటికి శస్త్రచికిత్సల అనంతరం తిరిగి అక్కడ వదిలేస్తామని జోన్-6 ఏఎంఓహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : పెదగంట్యాడ ఆటోనగర్ నుంచి కొంగపాలెం ఇంటికి నడిచి వెళ్తున్న ధర్మాల నాగమణి మెడలో సుమారు నాలుగు తులాల బంగారు గొలుసును దొంగ చోరీ చేశాడు. ఈ మేరకు సోమవారం రాత్రి న్యూపోర్టు క్రైం పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్ఐ అప్పలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నాగమణి ఆటోనగర్‌లో స్టీల్‌యార్డులో పని ముగించుకుని కొంగపాలెం వైపు నడిచి వస్తున్నారు. నిర్జన ప్రదేశంలో ఓ వ్యక్తి ఆమెను అనుసరించి మెడలోని గొలుసును తెంపుకొని పరారయ్యాడు. బాధితురాలు క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. న్యూపోర్టు క్రైం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిధుల కేటాయింపునకు వినతి

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: కూర్మన్నపాలెం రావుల చెరువువద్ద యోగా కేంద్రం నిర్మాణానికి చొరవ తీసుకొని నిధులు కేటాయించాలని రావులచెరువు రాయల్స్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ అంశం మేయర్ దృష్టికి తీసుకువెళ్లి యోగా కేంద్రం కార్యరూపం దాల్చేలా కృషిచేస్తానని ఎమ్మెల్యే సమాధానమిచ్చారు. సంఘం ప్రతినిధులు బొండా ఎల్లాజీరావు, కూటికుప్పల జనార్ధన్, మేడిశెట్టి వెంకటరమణ, మహంకాళి రాజేంద్రప్రసాద్, ఎం.దాస్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మెదడుకు పదును.. ఆవిష్కరణలకు అదును.. ఇంజినీరింగ్ విద్యార్థినుల ప్రతిభ..

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : ఇంజినీరింగ్ విద్యార్థినులు తమ మెదడుకు పదునుపెడుతూ కొత్త సాంకేతికను అందిపుచ్చుకొని నూతన ఆవిష్కరణలు రూపొందిస్తున్నారు. పరిశ్రమలు, ఇతర అవసరాలకు అనుగుణంగా తయారు చేస్తున్న నమూనాలు ఆకట్టుకుంటున్నాయి. కాపుజగ్గరాజుపేట విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు చేసిన కొన్ని ఆవిష్కరణలు ఇటీవల జరిగిన ఓ ప్రదర్శనలో పెట్టగా అందరి ప్రశంసలు అందుకున్నాయి.

లోపాలు గుర్తిస్తుంది..

ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) ఆధారంగా రూపొందించిన ఇండక్షన్ మోటారు... పరిశ్రమల్లోని మోటార్ల సామర్థ్యం గుర్తించడానికి ఉపయోగపడుతుంది. అందులో ఏమైనా లోపాలుఉంటే చరవాణి, కంప్యూటర్లలో అవి కనిపించేలా దీన్ని తీర్చిదిద్దారు. దీనివల్ల నష్ట నివారణతో పాటు పని ఆగకుండా వెంటనే రిపేరు చేయవచ్చు. విద్యార్థినులు **గనిశెట్టి విజయలక్ష్మి, లావేటి తేజేశ్వరి, చౌడువాడ శైలజ, కొట్యాడ మౌనిక** దీనిని రూపొందించారు.

పర్యావరణ హితంగా..

ఇంధన వినియోగం తగ్గించడం, పర్యావరణ హిత లక్ష్యంగా ఈ ప్రయోగాన్ని ట్రిపుల్‌ఈ విద్యార్థినులు **ఎ.అరుణ, ఎ..కావ్య, బి.హారిక, ఎ.రామలక్ష్మిలు** తయారుచేశారు. వాహనాలకు అమర్చిన సౌర ప్యానళ్ల నుంచి వచ్చే శక్తిని విద్యుత్తుగా మార్చి బ్యాటరీలకు నిరంతర శక్తి అందేలా వీరు ఓ ప్రయోగం చేశారు. దీన్ని ప్రదర్శనలో ఉంచారు.

శానిటరీ న్యాప్‌కిన్ వెండింగ్ మెషిన్

మహిళలు రుతుక్రమ సమయంలో వినియోగించే శానిటరీ న్యాప్కిన్‌లు గ్రామీణ ప్రాంతాల్లో కూడా అందుబాటులో ఉంచేందుకు **దాసరి సాయిప్రవీణ్, జూరెడ్డి లిఖిత, దువ్వి వైనికలు** వినూత్న వెండింగ్ పరికరం తయారు చేశారు. యంత్రంలో నాణెం వేసిన వెంటనే విలువ గుర్తించి యంత్రం ప్రతిస్పందిస్తుంది. స్టెప్ మోటార్లు మెకానిజాన్ని తిప్పి ఒక శానిటరీ న్యాప్కిన్‌ను బయటకు నెట్టడంలో ఈ యంత్రం సహకరిస్తుంది.

ఆర్థిక మోసాలు పట్టేస్తుంది.

ఆర్థిక వ్యవస్థలో పెరుగుతున్న మోసాలను గుర్తించేందుకు ఇంజినీరింగ్ విద్యార్థినులు **సిరిపురపు అంజని దేదీప్య, బొంతు పల్లవి దుర్గ, కోటపాడు శిరీష, మదాసు స్వాతీలు** హైబ్రిడ్ క్వాంటమ్ మెషిన్ లెర్నింగ్ పరికరం రూపొందించారు. పెద్ద పరిమాణంలో లావాదేవీల సమయంలో డేటాను విశ్లేషించి కష్టమైన, మోసపూరిత నమూనాలను గుర్తిస్తుంది. తక్కువ సమయంలో లావాదేవీలు విశ్లేషించి అనుమానాస్పద వాటిని గుర్తిస్తుంది.

చిత్రలేఖనంలో చిచ్చరపిడుగులు

‘ఈనాడు-ఈటీవీ’ ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న గాజువాక హైస్కూలు హెచ్ఎం విజయప్రశాంతి, తదితరులు

చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గాజువాక, న్యూస్‌టుడే: ‘ఈనాడు-ఈటీవీ’ ఆధ్వర్యంలో గాజువాక హైస్కూల్లో సోమవారం విద్యార్థులకు ప్రతిభ పాటవ పోటీలు నిర్వహించారు. ‘నాకు ఇష్టమైన పండగ..’ అన్న అంశంపై నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన మౌనిక, రేణుక, వెన్నెలకు పాఠశాల హెచ్ఎం విజయప్రశాంతి, ఉపాధ్యాయులు రుసి, విశ్వేశ్వరరావుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి

కాకతీయ గేటు కూడలిలో కార్మికులకు కరపత్రం అందజేస్తున్న అప్పలరాజు

మల్కాపురం, న్యూస్‌టుడే : పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు కార్మిక చట్టాలను అమలు చేయాలని విశాఖ ఇండస్ట్రియల్ ఏరియా కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ (వీఐసీఎల్‌యూ) ప్రధాన కార్యదర్శి దేవర అప్పలరాజు అన్నారు. నేవల్‌డాక్‌యార్డు, కాకతీయ గేటు కూడళ్ల వద్ద సోమవారం యూనియన్ నాయకులతో కలిసి ఆయన సంబంధిత కార్మికులకు కరపత్రాలను అందజేశారు. అనంతరం కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పించారు.

సంఘ సభ్యులకు గుర్తింపు కార్డుల అందజేత

ఎన్ఏడీకూడలి(కాకానినగర్), న్యూస్‌టుడే: జీవీఎంసీ 90వ వార్డు కాకానినగర్ కళాక్షేత్రంలో డాక్‌యార్డ్ కేటీబీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యవర్గసభ్యుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథి, రాష్ట్ర బార్ కౌన్సిల్ మాజీ ఉపాధ్యక్షులు, న్యాయవాది కె.రామజోగేశ్వరరావు చేతుల మీదుగా శాశ్వత సభ్యులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. అనంతరం జ్ఞాపికలతో పలువురిని సత్కరించారు. సంఘం గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

జ్ఞాపికలతో కార్యవర్గ సభ్యులు

ధ్యానంతోనే మానసిక రుగ్మతలు దూరం

గోపాలపట్నం(కొత్తపాలెం), న్యూస్‌టుడే : ధ్యానంతోనే మానసిక రుగ్మతలు దూరమై ప్రశాంతత కలుగుతుందని వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేష్ అన్నారు. కార్తిక మాసం సందర్భంగా స్థానిక వార్డు పరిధిలోని నాగేంద్రకాలనీలో రాజయోగ ధ్యాన కేంద్రంలో కార్తికమాసం విశిష్టతపై అవగాహన కల్పించారు. బ్రహ్మకుమారీస్ సత్యవతి, రూప, పావని, కొత్తపాలెం పీఏసీఎస్ ఛైర్మన్ బొడ్డేటి విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ రమేష్, పీఏసీఎస్ ఛైర్మన్ విజయ్

బాధిత కుటుంబానికి బాసట

పెదగంట్యాడ: ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి మృతిచెందిన వై.ఆకాష్ కుటుంబానికి కూటమి నాయకులు బాసటగా నిలిచారు. భాజపా కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, ములకలపల్లి ప్రకాశ్, పెంటయ్యలు పరామర్శించి నిత్యావసరాలు, కొంత నగదు అందజేశారు.

ఆక్రమణల తొలగింపు

విచారణ జరుపుతున్న ఎస్‌డీసీ సునీత, రెవెన్యూ సిబ్బంది

గాజువాక, న్యూస్‌టుడే: బీసీ రోడ్డు సంజీవకాలనీ రోడ్డులో ఏళ్ల తరబడి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న రెండెకరాల ప్రభుత్వ భూమిని సోమవారం ఉక్కు భూసేకరణ, పెదగంట్యాడ మండల రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థలంలో రేకుల షెడ్డు, ప్రైవేటు బోర్డులను తొలగించి 11 చోట్ల హెచ్చరిక బోర్డులు పాతారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీత, తహసీల్దార్ పి.అమల, వీఆర్వో లక్ష్మీకాంత్, రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షించారు. అలాగే శీకువానిపాలెంలో ఆక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకుని బోర్డుపాతారు.

నివాసిత సంఘాల నిరసన

నిరసన ర్యాలీలో సంఘాల నాయకులు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : పెదగంట్యాడలో కాలుష్యంపై నివాసిత సంఘాలు నిరసన చేపట్టాయి. వాయిస్ ఆఫ్ గాజువాక, వార్వా నివాస్ సంఘాల ఆధ్వర్యంలో హౌసింగ్‌బోర్డుకాలనీ, గంగవరం పోర్టు రోడ్డులో ప్లకార్డులు ప్రదర్శిస్తూ తక్షణం సిమెంటు యూనిట్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. డాక్టర్ రమేష్‌కుమార్, చిక్కా సత్యనారాయణ, త్రినాథస్వామి, గురప్ప, వెంకటేశ్వరరావు, లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

విద్యుద్దీపాలు ప్రారంభం

ఎన్ఏడీకూడలి(కాకానినగర్), న్యూస్‌టుడే : జీవీఎంసీ 52వ వార్డు సంజీవయ్యనగర్ నుంచి మర్రిపాలెం వుడాకాలనీ వరకు సుమారు రూ.1.65 కోట్లతో అభివృద్ధి చేశారు. ఈ రోడ్డులో విభాగినులపై రూ.30లక్షల జీవీఎంసీ నిధులతో వీధి దీపాలను ఏర్పాటు చేశారు. సోమవారం స్థానిక వార్డు కార్పొరేటర్ జియ్యాని శ్రీధర్ చేతుల మీదుగా విద్యుత్తు దీపాలను ప్రారంభించారు.

ఘనంగా నాగదేవత విగ్రహ ప్రతిష్ఠ

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధి కొండయ్యవలస కాలనీలో సోమవారం నాగదేవత విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. అర్చకుడు శ్రీరాముల ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక నాయకులు ఎం.రామచంద్రరావు, బలిరెడ్డి శ్రీను, విందుల రాజు, ఎస్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలయ్యారు.. ‘అసెంబ్లీ’కు వెళ్తారు..

పైడి జయంతి

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: రాజ్యాంగ దినోత్సవంలో భాగంగా ఈనెల 26న అమరావతిలోని అసెంబ్లీని సందర్శించేందుకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలైన వారిని నియోజకవర్గం నుంచి ముగ్గురు చొప్పున ఎంపిక చేశారు. గాజువాకలో మింది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి అమ్మాయి పి.జయంతి ప్రథమ, నడుపూరు పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి వై.రిషి ద్వితీయ, అగనంపూడి పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని ఎం.కుసుమకుమారి తృతీయ స్థానంలో నిలిచి అసెంబ్లీని సందర్శించే అవకాశం దక్కించుకున్నారు.

✦ గోపాలపట్నం, న్యూస్‌టుడే: గోపాలపట్నం నుంచి కె.స్నేహ హాసిని (10వ తరగతి), మల్కాపురం జీవీఎంసీ హైస్కూల్, డి.పవన్ కుమార్ (9వ తరగతి) మల్కాపురం జీవీఎంసీ హైస్కూల్, ఆర్.వైష్ణవి(8వ తరగతి), బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ యూపీ స్కూల్‌కి చెందిన విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు గోపాలపట్నం మండల విద్యాశాఖాధికారి దివాకర్ పేర్కొన్నారు.

తుది పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వనాలు కాదు.. వసతిగృహాలు..

శిథిల భవనాలపై దిగిన చెట్ల ఊడలు..

చెట్లు చుట్టేసి ఇలా..

మల్కాపురం, న్యూస్‌టుడే : మల్కాపురం పోలీసుస్టేషన్ వెనుకభాగంలో ఉన్న పోలీసు వసతిగృహాలు చూస్తూ అడవి మధ్యలో చిక్కుకున్న పాత బంగ్లాల మాదిరిగా ఉన్నాయి. చెట్ల ఊడలు భవనాల మీదకు పాకాయి. కొన్ని రకాల చెట్ల పాదులు వసతిగృహాలను కప్పేశాయి. ఓ వైపు జనావాసాలు, మరోవైపు పోలీసు స్టేషన్ ఉండటంతో వీటి మధ్య.. ఎప్పుడు ఇవి కూలుతాయో అన్నట్లు పరిస్థితి ఉంది. సుమారు 24 మంది పోలీసుల కుటుంబాలు ఇక్కడ ఉండేలా నాడు వీటిని నిర్మించారు. అయితే ఇప్పుడు ఆ భవనాలు శిథిల దశకు చేరుకున్నాయి. విష సర్పాలు చేరుతున్నాయి. ఇప్పటికైన ఉన్నతాధికారులు చొరవ చూపి శిథిలావస్థకు చేరిన భవనాలను కూలక ముందే పట్టించుకోవాల్సిన అవసరం ఉంది.

రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులకు వైద్యసేవలు

క్షతగాత్రుడితో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ఎలమంచిలి కొక్కిరాపల్లి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులకు ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స అందించారు. కొక్కిరాపల్లి కూడలిలో జాతీయ రహదారిపై సోమవారం టాటా మ్యాజిక్ వాహనం ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మృతిచెందగా, 12 మందికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో కూనిశెట్టి కనక (మాకవరపాలెం), విశాఖ నగరంలోని మల్కాపురానికి చెందిన బండి జాస్మిన్, బండి విజయకుమారి, బండి కరుణ, ఎర్రవరానికి చెందిన సీహెచ్ జస్వంత్, సీహెచ్.రమణమ్మ, విశాఖ నగరానికి చెందిన పక్కుర్తి అప్పలరాజు, ఎన్.విజయ, ఎస్.రాజకుమారిలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఆళ్ల రామచంద్రరావు పరామర్శించి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.

విజయోత్సవంలో ఎమ్మెల్యే పల్లా, చిత్రంలో కనకభవానీ, తదితరులు

భారత జట్టు విజయంపై సంబరాలు

గాజువాక, న్యూస్‌టుడే: భారత మహిళా క్రికెట్ జట్టు ప్రపంచకప్ విజయం నేపథ్యంలో తెలుగు మహిళ ఆధ్వర్యంలో గాజువాక తెదేపా కార్యాలయంలో సోమవారం విజయోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కోశారు. గాజువాక తెలుగు మహిళ అధ్యక్షురాలు కనకభవానీ, కార్యదర్శి సన్యాసమ్మ, మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ సూర్ణపూడి రాంబాయి, మహిళా సభ్యులు శ్వేత, యజ్ఞప్రియ, జ్యోతి, దేవి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌సిటీ డిపో కొనసాగించాలని వినతి

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: గత మూడు దశాబ్దాలుగా ప్రజలకు సేవలందించిన విశాఖ స్టీల్‌సిటీ డిపోను యథాతథంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు నగరంలో కేంద్ర ఉక్కుశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందజేశారు. ప్రజా అవసరాల కోసం డిపో కొనసాగించేలా చొరవ తీసుకోవాలని కోరారు.

కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు పల్లా, విష్ణుకుమార్‌రాజు, శ్రీనివాసరావు

గాజువాక, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్‌రాజులు కూడా ఆయన దృష్టికి సమస్య తీసుకెళ్లారు. ఎన్ఎంయూఏ నాయకులు పిల్లా శంకరరావు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

సందడిగా పక్షుల దినోత్సవం

పంతులుగారిమేడ(గాజువాక), న్యూస్‌టుడే: చట్టివానిపాలెం భాస్కర్ విద్యానికేతన్‌లో సోమవారం ప్రీకేజీ చిన్నారులు పక్షుల దినోత్సవం నిర్వహించారు. చిన్నారులు వివిధ పక్షుల రూపాలను ధరించి ఆటపాటలతో అలరించారు. పాఠశాల డైరెక్టర్ పి.భాస్కరరావు మాట్లాడుతూ.. పక్షులు ప్రకృతి సంపదని, వాటిని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న వ్యాను

అక్కిరెడ్డిపాలెం(ఆటోనగర్), న్యూస్‌టుడే: ఆటోనగర్ ఐలా కార్యాలయం రోడ్డులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాను దెబ్బతింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. కంటైనర్ లారీ వెనుక భాగాన్ని వ్యాను ఢీకొట్టడంతో ముందు భాగం దెబ్బతింది. ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. రహదారిపై కొద్ది సమయం వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. వ్యానును తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు.

ప్రమాదంలో కంటైనర్ లారీ వెనుక భాగంలో చొచ్చుకుపోయిన వ్యాను

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

నిందితుడు గణేశ్

గాజువాక, న్యూస్‌టుడే : ఇంటి తాళాలు పగులగొట్టి వెండి ఆభరణాలను దొంగలించిన పాత నేరస్థుడిని గాజువాక క్రైం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక కైలాస్‌నగర్‌లో ఉపాధ్యాయుడు వేణు కుటుంబంతో నివసిస్తున్నారు. గతనెల 24న ఆయన ఇంటికి తాళాలేసి ఒడిశాలో బంధువుల ఇంటికి శుభకార్యానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. తిరిగి 27న వచ్చి చూసుకోగా ఇంట్లో మెయిన్‌డోర్ తాళాలు విరగ్గొట్టి లోపల బీరువా తెరిచి ఉంది. వెండివస్తువులు పోయినట్లు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన క్రైం పోలీసులకు లభించిన ఆధారాల ప్రకారం.. ఇది బర్మాకాలనీకి చెందిన పాత నేరస్థుడు దుంప గణేశ్ పనిగా తేలడంతో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి జత వెండి కుందులు, ఒకవెండి గిన్నె, రెండు ఇనుపరాడ్లను స్వాధీనం చేసుకున్నారు. గాజువాక క్రైం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కిక్కిరిసిన శైవక్షేత్రాలు

అలంకరణలో ఉక్కు శివయ్య

గాజువాకలో విశ్వేశ్వరుడు

62వ వార్డు శ్రీ శివసాయి నిలయం దేవాలయంలో..

పెదమడకకాలనీలోని శ్రీ ఉమామహేశ్వర ఆలయంలో..

శ్రీహరిపురంలో శివలింగార్చన

గోపాలపట్నంలో..

వడ్లపూడి బ్రహ్మసూత్ర శివాలయంలో మంచు లింగాలు

గాజువాక, పెదగంట్యాడ, మల్కాపురం, అగనంపూడి, సింధియా, కూర్మన్నపాలెం, గోపాలపట్నం, అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: కార్తిక సోమవారం పురస్కరించుకుని గాజువాక, పశ్చిమ నియోజకవర్గాల్లో శివాలయాలు కిటకిటలాడాయి. మహారుద్రాభిషేకాలు, క్షీరాభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం ఆయాచోట్ల అన్నదానం నిర్వహించారు. ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. రెండు నియోజకవర్గాల్లో కార్తిక సోమవారం పూజలు పరిశీలిద్దాం..

అలంకరణలో నాతయ్యపాలెంలోని కాశీ విశ్వేశ్వరుడు



(c) eenadu

ఈనాడు
విజయనగరం
మంగళవారం నవంబరు 4, 2025

రూ.52.35 కోట్లు మీవే!!

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: బ్యాంకుల్లో దాచిన నగదును కొందరు తీసుకోవడం లేదు. సకాలంలో క్లెయిమ్ చేసుకోకపోవడంతో రూ.కోట్ల మేర పేరుకుపోయాయి. జిల్లాలో గత పదేళ్లలో 3,35,081 ఖాతాల్లో రూ.52.35 కోట్ల మేర సొమ్ము ఉండిపోయింది. సంబంధిత వ్యక్తులకు అందజేసేందుకు ఆర్‌బీఐ చర్యలు తీసుకుంటోంది. ఇటీవల విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం 'మీ డబ్బు.. మీ హక్కు' కార్యక్రమం కింద ప్రచారం చేస్తున్నట్లు కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టర్‌లో సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు.

పొదుపు ఖాతాల్లోనే ఎక్కువ..

జిల్లాలో 25 గుర్తింపు పొందిన బ్యాంకులు, 302 శాఖలున్నాయి. దాదాపు అన్నింట్లోనూ క్లెయిమ్ చేయని మొత్తాలున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఎక్కువ పొదుపు ఖాతాల్లోనే పేరుకుపోయినట్లు లీడ్‌బ్యాంక్ అధికారి రమణమూర్తి తెలిపారు. ఆధార్, పాన్ అందజేసి, బ్యాంకుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అసలు ఖాతాదారు మరణిస్తే.. నామినీకి అందజేస్తారన్నారు.

జిల్లాలో ఇలా..

డిపాజిట్ల రకం	ఖాతాలు	రూ.కోట్లలో
వ్యక్తిగత	3,32,330	35.17
సంస్థాగత	8,411	7.19
ప్రభుత్వ	4340	9.99

జంగమయ్య.. జగత్తు మురిసెనయ్య!

కార్తికమాసం రెండో సోమవారం సందర్భంగా జిల్లావ్యాప్తంగా శివాలయాలు పంచాక్షరి మంత్రంతో మారుమోగాయి. దీపారాధనలు.. అభిషేకాలు.. అర్చనలతో పరమేశ్వరుడిని భక్తులు కొలిచారు. తుమ్మికాపల్లి ఓంసదనంలో 108 శివలింగాలకు భక్తులు పెద్దఎత్తున పూజలు నిర్వహించారు. విజయనగరంలో పలు ఆలయాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

– న్యూస్‌టుడే, కొత్తవలస

ప్రోత్సహిస్తే.. రాణిస్తాం.. రాణులుగా వస్తాం

న్యూస్‌టుడే, విజయనగరం క్రీడా విభాగం

ఏళ్లుగా ఎదురు చూసిన మహిళల వరల్డ్ కప్ క్రికెట్ ట్రోఫీని భారత మహిళల జట్టు అందుకుంది. అమ్మాయిలను ఆటల దిశగా ప్రోత్సహించమని ఆడ పిల్లల తల్లిదండ్రులకు ఓ శుభ సందేశాన్ని ఇచ్చింది. మన ఉమ్మడి జిల్లాలోనూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే సత్తాగల అమ్మాయిలు ఎందరో ఉన్నారు. వారికి కావాల్సిందల్లా ప్రోత్సాహమే. ఏ ఆటపరంగా మన క్రీడాకారిణులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. వాటి పరిష్కారానికి జిల్లా యంత్రాంగం, తల్లిదండ్రులు ఏం చేస్తే మన ఇంటా గెలుపు పిలుపు వినిపిస్తుందో ఓసారి చూద్దాం రండి.

★ యూత్ ఛాంపియన్‌షిప్‌లో తొలిసారిగా దేశానికి పతకాన్ని తీసుకువచ్చిన బంగారు ఉషా

★ వాలీబాల్‌లో ఈశ్వరి, ఖోఖోలో వీరమణి, కబడ్డీలో భువన, వాలీబాల్‌లో విజయలక్ష్మి, అథ్లెటిక్స్‌లో శ్రీలక్ష్మి, పారా అథ్లెటుగా కె.లలిత

★ వెయిట్ లిఫ్టింగ్‌లో మత్స సంతోషి, వెంకటలక్ష్మి.. రెడ్డి భవాని

వీళ్లంతా మన ఉమ్మడి జిల్లా అమ్మాయిలే. వీరిలో మీ అమ్మాయి ఉందా..? నిన్న మహిళల క్రికెట్ ఫైనల్ మ్యాచ్ భారత్ గెలిచాక.. క్రీడల్లో మన అమ్మాయి ఉంటే బాగున్ను అని మీకూ అనిపించిందా?

రాష్ట్రస్థాయి అండర్-17 క్రికెట్ పోటీలకు ఎంపిక బాలికల జట్టు

కబడ్డీ సాధనలో అమ్మాయిలు

● ప్రతిభావంతులైన క్రీడాకారిణులను తయారు చేసే విధంగా క్రీడా సౌకర్యాలు లేవన్నది వాస్తవం. అన్నీ క్రీడా విభాగాలకు శిక్షకులను నియమించాలి. క్షేత్ర స్థాయి నుంచి తయారు చేసుకుంటూ రావాల్సి ఉంది.

● అమ్మాయిలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు వెళ్లేటప్పుడు వారి వెంట మహిళా కోచ్, మేనేజర్లు ఉండాలి. కొన్ని జట్లు వెంట ఎటువంటి భద్రత చర్యలు తీసుకోకపోవడం వల్ల తల్లిదండ్రులు పిల్లలను పంపించడానికి ఇష్టపడడం లేదు.

● వాలీబాల్, ఫుట్‌బాల్, హాకీ, హ్యాండ్‌బాల్‌లో ప్రత్యేకంగా మహిళా జట్లు జిల్లాలో ఉండేవి. సరైన ప్రోత్సాహం లేక అక్కడక్కడ అమ్మాయిలు వెలుగులోకి వస్తున్నారు. ఆ దిశగా మళ్లీ ప్రయత్నాలు జరగాలి.

● నియోజకవర్గానికి క్రీడా వికాస కేంద్రమని అప్పట్లో తెరిచారు. ఏళ్లు గడుస్తున్నా అందుబాటులోకి రాలేదు.

● గతంలో ఎత్తేసిన ఖోఖో, కబడ్డీ అకాడమీలు, విజ్జీ మైదానంలో నిలిచిన క్రీడా పాఠశాల పనులు ప్రారంభించడం చాలా అవసరం.

అమ్మాయిలు ఆడేందుకు ముందుకు వస్తున్నా క్రీడా పోటీల సమయంలో వారికి వసతి సౌకర్యం కల్పించే విషయంలో నిర్వాహకులు వివక్ష చూపుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

మన జిల్లా నుంచి రాష్ట్రస్థాయిలో 500 మందికి పైగా, జాతీయస్థాయిలో 200 మందికి పైగా సత్తా చాటుతున్న అథ్లెట్లు, ఖోఖో, కబడ్డీ, బాక్సింగ్, వాలీబాల్, ఫుట్‌బాల్, తైక్వాండో, ఫెన్సింగ్, రెజ్లింగ్, చదరంగం, జుడో, స్విమ్మింగ్, హ్యాండ్‌బాల్, బ్యాడ్మింటన్, స్కేటింగ్, ఆర్చరీ, రైఫిల్ షూటింగ్ క్రీడాకారిణులున్నారు. వీరికి సరైన ప్రోత్సాహం అందిస్తే కచ్చితంగా అంతర్జాతీయ వేదిక మీద రాణించి మరిన్ని పతకాలు తెచ్చుకోగలరని క్రీడా వర్గాలు చెబుతున్నాయి.

● సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో విజ్జీ మైదానం, 9 ఎకరాలలో రాజీవ్, ఒకటిన్నర ఎకరంలో డీఎస్‌ఏ, అర ఎకరంలో స్విమ్మింగ్ పూల్ ఉన్నాయి. ఇవి కాకుండా కొండవెలగాడలో వ్యాయామశాల డీఎస్‌ఏ పరిధిలో ఉంది. పురపాలక సంస్థ ఆధీనంలో కోడి రామ్మూర్తి వ్యాయామశాల, మాన్సాస్ ఆధీనంలో అయోధ్య మైదానం, పోలీసు శాఖ పరిధిలో రెండు అథ్లెటిక్సు ట్రాక్‌లు ఉన్నాయి. మైదానాలు పెద్ద సంఖ్యలో ఉన్నా ఆటలకు ఆ స్థాయి ప్రోత్సాహం అందడం లేదు.

రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూత

ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయనంతగా క్రీడాకారులకు కూటమి ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటించింది. అంతర్జాతీయ వేదికలపై రాణించేవారికి కోట్ల రూపాయల నగదు, క్రీడా కోటాతో ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు చేపట్టింది.

పది తప్పారా.. ఉంది మరో అవకాశం

న్యూస్‌టుడే – చీపురుపల్లి

గతంలో రెగ్యులర్ విధానంలో పదో తరగతి పాత సిలబస్‌లో చదివి ఉత్తీర్ణులు కానివారికి ఏపీ సార్వత్రిక విద్యాపీఠం గొప్ప అవకాశాన్ని కల్పిస్తోంది. గతంలో ఉత్తీర్ణులు కాకపోయి, 2025 మార్చిలో పరీక్షలకు హాజరైన విద్యార్థులు మాత్రమే అర్హులు. రెగ్యులర్ విధానంలో తప్పిన సబ్జెక్టులు మాత్రమే 2026 మార్చిలో జరిగే పరీక్షల్లో రాసుకొని ఉత్తీర్ణత పొందొచ్చు.

జిల్లాలో 338 మంది విద్యార్థులను జిల్లా విద్యాశాఖ, సార్వత్రిక విద్యాపీఠం అధికారులు గుర్తించారు. వారి జాబితాలను పాఠశాలల వారీగా పంపారు. హెచ్ఎంలు ప్రత్యేక శ్రద్ధ కనబర్చి ప్రవేశాలు కల్పించాలని సూచించారు. విద్యార్థులు నేరుగా తమ మండలాల్లోని ఓపెన్ స్కూల్ కేంద్రాల్లో ఈనెల 8వ తేదీలోగా సంప్రదించాలి. నామమాత్రపు రుసుము రూ.300 చెల్లించాలి. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సార్వత్రిక విద్య సమన్వయకర్త సన్యాసిరాజు కోరారు.

కమాండెంట్ బాధ్యతల స్వీకరణ

రవిశంకర్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న సహాయ కమాండెంట్

డెంకాడ, న్యూస్‌టుడే: డెంకాడ మండలం చింతలవలస ఐదో పోలీస్ బెటాలియన్ నూతన కమాండెంట్‌గా వై.రవిశంకర్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పల్నాడు జిల్లా ఎస్పీగా పనిచేసి కొన్నాళ్ల పాటు వీఆర్‌లో ఉన్నారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జి కమాండెంట్ పద్మనాభరాజు నుంచి అధికారికంగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బెటాలియన్‌లో శిక్షణ కేంద్రంలో వసతులు, మెస్, బ్యారక్‌లను పరిశీలించారు.

పండ్లు.. ఫర్నీచర్.. ఏదైనా రైలు పార్సిల్‌లో పంపొచ్చు..

ద్విచక్ర వాహనాలు, పెంపుడు జంతువులు, కాయగూరలు, పండ్లు, ఫర్నీచర్, రిఫ్రిజిరేటర్, టీవీ, కూలర్, వాషింగ్ మిషన్.. ప్రమాదకరమైన పేలుడు స్వభావం లేని ఏ వస్తువునైనా రైలు పార్సిల్‌లో తరలించే సౌకర్యం ఉంది. జవాబుదారీతనం, తక్కువ వ్యయం, సమయపాలనతో రైల్వే ఈ సేవలు అందిస్తోంది.

న్యూస్‌టుడే, విజయనగరం రింగురోడ్డు

గతంలో ఎగుమతులు

గతంలో విజయనగరం నుంచి ఎక్కువగా మామిడి పండ్లు రాయపూర్, బిలాస్‌పూర్ వెళ్లేవి. ఉమ్మడి జిల్లాలో పంట దిగుబడి తగ్గడంతో ఎగుమతులు తగ్గాయి. మార్చి నుంచి జూన్ వరకు గతంలో రోజుకు 500 పైనే బస్తాలు వెళ్లేవి. ఇప్పుడు 100 కూడా మించడం లేదు.

పెంపుడు జంతువులు

ప్రస్తుతానికి కుక్క పిల్లలను మాత్రమే తరలించే సౌకర్యం ఉంది. కుక్క ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌తో పాటు వ్యాక్సినేషన్ పత్రం చూపాల్సి ఉంటుంది. దాని కోసం ఒక రిజర్వేషన్ టికెట్ తీసి ఇస్తే రైలు వెనక ఉన్న చివరి బోగీలో గార్డు దగ్గర ప్రత్యేకంగా ఒక బాక్సులో పెట్టి పంపిస్తారు. అలా వద్దనుకుంటే ఫస్ట్ క్లాస్ ఏసీ టికెట్ తీసుకుని.. రెండు బెర్తులు బుక్ చేసుకుంటే అనుమతి ఇస్తారు.

బైక్ పంపాలంటే

విజయనగరం నుంచి విజయవాడకు ద్విచక్ర వాహనం పంపించాలంటే సుమారు రూ.1000 ఖర్చవుతుంది. వాహనాన్ని తరలించే ముందు పెట్రోల్ తీసేయాలి. ఆ వాహనం ఎవరి పేరు మీద ఉందో ఆర్‌సీ బుక్, ఆధార్ కార్డు ఉండాలి. వాహనం విలువ, ఫిట్‌నెస్ పత్రం అవసరం. పంపించాల్సిన చోటుకు బైక్ చేరాక దానిని తీసుకెళ్లడానికి సదరు వ్యక్తి రాకపోతే ఆరు గంటలు ఉచితంగా ఉంచుతారు. ఆ తరువాత గంటకు రూ.10 చొప్పున జీఎస్‌టీతో కలిపి వసూలు చేస్తారు.

★ విజయనగరం నుంచి రోజుకు సుమారు 8 నుంచి 10 వాహనాల వరకు ఇతర ప్రాంతాలకు పంపిస్తున్నారు.

దెబ్బతింటే.. : ద్విచక్ర వాహనాల పార్సిల్.. కౌంటర్ దగ్గరే చేయించుకోవాలి. ఒకవేళ అనుకోని ప్రమాదం ఎదురైతే ఆ వాహనానికి రీ వాల్యూ ఇచ్చిన ధ్రువపత్రం ఆధారంగా పరిహారం చెల్లిస్తారు. మిగిలిన వాటికి మాత్రం బీమా సౌకర్యం సాధ్యమైనంత వరకూ ఉండదు.

రైల్వే స్టేషన్ ప్రాంగణంలో పార్సిల్ విభాగం

గృహోపకరణాలు: ఫర్నీచర్, వంట గదికి సంబంధించిన వస్తువులు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు సైతం పంపించవచ్చు. కిలో గ్రాముల చొప్పున లెక్కించి వీటిని పార్సిల్ చేస్తారు. ఉదాహరణకు వాషింగ్ మిషన్ విజయనగరం నుంచి హైదరాబాద్ తీసుకెళ్లాలంటే రూ.300 నుంచి రూ.500 లోపు ఖర్చు అవుతుంది.

24 గంటలూ సేవలు

విజయనగరంతో పాటు చీపురుపల్లి, పార్వతీపురం నుంచి కూడా పార్సిల్ సర్వీస్ ఉంది. 24 గంటలూ సేవలు అందుబాటులో ఉంటాయి. నేరుగా ఇంటికే వచ్చి పార్సిల్ చేసి తీసుకెళ్లే సౌకర్యం కూడా త్వరలో అందుబాటులోకి రానుంది. పార్సిల్ బుక్ చేసుకున్న దగ్గర్నుంచి డెలివరీ అయ్యే వరకూ ప్రతీ సమాచారం ఎస్ఎంఎస్ వస్తుంది. – శ్రీనివాసరావు, రైల్వే పార్సిల్ విభాగం, విజయనగరం

ఇదే స్ఫూర్తితో ముందుకెళదాం..

కలెక్టర్‌ను సత్కరిస్తున్న జిల్లా అధికారులు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: మొంథా తుపాను సమయంలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సకాలంలో స్పందించి, ప్రజలకు అండగా నిలిచారని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకెళదామని పిలుపునిచ్చారు. విపత్తును సమర్థంగా ఎదుర్కొన్నారని కలెక్టర్‌తో పాటు సంయుక్త కలెక్టర్ ఎస్.సేధు మాధవన్‌ను కలెక్టరేట్‌లో సోమవారం పలువురు అధికారులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముందస్తు చర్యలతో నష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగామన్నారు. ఫైటర్ అవార్డు గ్రహీతలైన నీటిపారుదల శాఖ ఈఈ వెంకటరమణ, వీఆర్వో రాజ్‌మోహన్, ఆశా కార్యకర్త బంగారమ్మకు అభినందనలు తెలియజేశారు. డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, సీపీవో పి.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వారానికి 4 సచివాలయాలకు వెళ్లండి

విజయనగరం అర్బన్,: వారానికి నాలుగు సచివాలయాలను సందర్శించాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి మండల ప్రత్యేకాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్ఎస్ అర్జీల ఆడిట్‌పై నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. వినతులను సకాలంలో పరిష్కరించాలని స్పష్టం చేశారు. ● పీజీఆర్ఎస్‌కు 375 అర్జీలు అందాయి. రెవెన్యూశాఖకు సంబంధించి 223, డీఆర్‌డీఏ 53, పురపాలక 12, గృహనిర్మాణ 11, పంచాయతీ 10, ఇతర శాఖలకు మిగిలినవి అందాయి.

బంగారు కుటుంబానికి వైద్యం..

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు దత్తి గ్రామంలోని బంగారు కుటుంబానికి చెందిన పి.ధనుంజయనాయుడుకు వైద్యం చేయాలని డీఎంహెచ్‌వోకు సూచించారు. విశాఖపట్నంలోని ప్రాంతీయ కంటి ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి తక్షణ చికిత్స అందించాలని ఆదేశించారు. బంగ్లాదేశ్‌లో చిక్కుకున్న మత్స్యకారుల విడుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ● మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో రైతులకు మద్దతు ధరలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు.

రైతేరాజు 6లో

EMMANUEL COLLEGE OF PHARMACY
Affiliated to JNTU GV & Approved by PCI, New Delhi
Thagarapuvalasa, Bheemili, Visakhapatnam
ADMISSION NOTICE
Candidates interested to join
D.Pharm B.Pharm M.Pharm
Course in our Pharmacy college for 2025-2026 are advised to contact college office.
Candidates who wish to change their options to our college from other Pharmacy colleges may also contact.
Note: candidates with or without APEAPCET and APPGECET can contact for admissions.
Principal: 9502784259,9491606933

గుండె గుబిల్లు!

రూ.1,650గా వచ్చిన బిల్లును చూపిస్తున్న కరకవలస సర్పంచి

వేపాడ, న్యూస్‌టుడే: మండలంలోని కరకవలస పంచాయతీలోని గిరిశిఖర గ్రామం మారిక గిరిజనులకు విద్యుత్తు బిల్లులు షాకిచ్చాయి. ఎస్టీలకు ఉచిత విద్యుత్తు పథకం అమలులో ఉండగా, గ్రామంలో ఒక్కొక్కరి ఇంటికి రూ.వేలల్లో బిల్లులు వచ్చాయంటూ గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. వీరంతా సోమవారం వల్లంపూడి విద్యుత్తు ఉప కేంద్రం ఎదుట నిరసనకు దిగారు. అధికారులు స్పందించకపోవడంతో కార్యాలయానికి తాళం వేశారు. ఏఈ సూరిబాబు స్పందించి పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. నిరసనలో కరకవలస సర్పంచి పెంటమ్మ, బాబూరావు, అప్పలనాయుడు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధించాం.. పండగకెళ్తున్నాం..

దిల్లీలో ఏఐ ఫెస్టివల్‌కు మన విద్యార్థులు

న్యూస్‌టుడే – చీపురుపల్లి

చీపురుపల్లి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఈనెల 17, 18 తేదీల్లో కేంద్ర విద్యాశాఖ, ఇంటెల్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో దిల్లీలోని అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో నిర్వహించే ఏఐ ఇంపాక్ట్ ఫెస్టివల్‌కు హాజరు కానున్నారు. ఏఐ సహకారంతో రూపొందించిన ప్రాజెక్టులను అక్కడ ప్రదర్శించనున్నారు. ఆయా ప్రాజెక్టులకు విద్యార్థులు ప్రస్తుతం తుది మెరుగులు దిద్దుతున్నారు.

ఇన్‌టెల్ సంస్థ సౌజన్యంతో గతంలో పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. సదరు సంస్థ నిపుణులు ప్రతి శుక్రవారం విద్యార్థులకు ఆన్‌లైన్‌లో తర్ఫీదు ఇస్తుంటారు. ల్యాబ్‌కు హిందీ ఉపాధ్యాయుడు ఏవీఆర్డీ ప్రసాద్ గైడ్ టీచర్‌గా ఉన్నారు. పలు ప్రాజెక్టుల తయారీలో చురుగ్గా ఉన్నందుకు దిల్లీలో జరిగే కార్యక్రమానికి సంస్థ ప్రతినిధులు ఆహ్వానించారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయుడు, సంరక్షకుడికి రానుపోను ఖర్చులు, వసతి ఇంటెల్ సంస్థ భరించనుంది.



ప్రాజెక్టు తయారీలో నిమగ్నమైన విద్యార్థినులు హర్షిత, పావని

ఇంతకీ ఏం చెప్పారంటే..

విద్యార్థినులు ఆర్.హర్షిత (9వ తరగతి), పీవీఎల్ ప్రణవి (8వ తరగతి) ఏఐ ద్వారా ఎన్‌పవరింగ్ అవర్ శానిటేషన్ హీరోస్ అనే ప్రాజెక్టును రూపొందించారు. కార్మికులు వీధుల్లో పారిశుద్ధ్య పనులు చేసే ముందు, తరువాత చిత్రాలు తీసి పొందుపరిస్తే.. పనులు జరిగాయా లేదా? అనేది నిర్ధారిస్తుంది. దీని ఆధారంగా వారికి మార్కులు కేటాయించి పనితీరు లెక్కిస్తారు.

దర్శనాలకు ఇబ్బందులు తొలగేలా..

రద్దీగా ఉన్న దేవస్థానాల్లో భక్తుల దర్శనాల ఇబ్బందులను తొలగించడానికి తొమ్మిదో తరగతి విద్యార్థి **పైడిశెట్టి తనిష్క్** ఏఐ ద్వారా "పవర్డ్ ఆటోమేటిక్ క్యూ సిస్టమ్" ప్రాజెక్టును తయారు చేశాడు. భక్తులు దర్శనాలకు నమోదైన సంఖ్య ఆధారంగా.. ఏ సమయానికి హాజరుకావాలో తెలియజేస్తుంది. తిరుమల తిరుపతి దేవస్థానాన్ని నమూనాగా తీసుకుని దీన్ని తయారు చేసినట్లు చెబుతున్నారు.

అమ్మాయి.. ఆత్మరక్షణ శిక్షణ నీకోయి..

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో ఝాన్సీ లక్ష్మీబాయి ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. విజయనగరంలోని కంటోన్మెంట్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి సమగ్ర శిక్షా ఏపీసీ ఎ.రామారావు హాజరై మాట్లాడారు. అత్యవసర సమయాల్లో రక్షణతో పాటు ఎదుటవారిని ఎదుర్కోవడంపై తర్ఫీదునిస్తామని చెప్పారు. రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో 285 విద్యాలయాల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకునే బాలికలకు తరగతులు ఉంటాయన్నారు. 30 మంది శిక్షకులు అందుబాటులో ఉంటారని, సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎస్.. విలీనం దిశగా కోట అడుగులు

న్యూస్‌టుడే, శృంగవరపుకోట

శృంగవరపుకోట నియోజకవర్గాన్ని విశాఖ జిల్లాలో విలీనం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. దశాబ్దాలుగా విశాఖ పార్లమెంటు పరిధిలో ఉన్న ఈ నియోజకవర్గాన్ని ఆ జిల్లాలో కలపాలన్న డిమాండు ఉంది. 1979లో విజయనగరం జిల్లా ఏర్పడక ముందు నుంచి ఈ నియోజకవర్గంలోని మండలాలన్నీ విశాఖ జిల్లాలో ఉండేవి. 2008లో నియోజకవర్గ పునర్విభజన తర్వాత కూడా విశాఖ పార్లమెంటు పరిధిలోనే అవి కొనసాగాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పార్లమెంటు పరిధిని జిల్లాగా మారుస్తామని ప్రకటించడంతో ఈ ప్రాంతం విశాఖలో కలుస్తుందని ఆశించారు. అప్పట్లో పునర్విభజన కమిటీకి దీనిపై పలువుర పెద్దఎత్తున వినతిపత్రాలిచ్చినా ప్రభుత్వం విజయనగరంలోనే కొనసాగించింది.

● ఇంజినీరింగ్, మెడికల్ వంటి చదువులతోపాటు ఉపాధిలో 95 శాతానికిపైగా ఆ జిల్లానే ఆధారం. నియోజకవర్గం విశాఖ పార్లమెంటు పరిధిలో ఉండడంతో జిల్లా మంత్రులు ఈ ప్రాంతంపై పూర్తి దృష్టిసారించలేని పరిస్థితి.

ఇదీ ప్రయోజనం

ఈ ప్రాంత ప్రజలు ఎక్కువగా విద్య, వైద్యం, ఉపాధికి విశాఖపైనే ఆధారపడుతున్నారు. అత్యవసర కేసులను ఎస్.కోట ప్రాంతీయాసుపత్రి వైద్యులు విజయనగరం రిఫర్ చేస్తున్నారు. తీరా మహారాజా ఆసుపత్రికి వెళ్లాక అక్కడి నుంచి విశాఖకు పంపిస్తున్నారు. అదే నేరుగా కేజీహెచ్‌కు తీసుకెళ్లమంటే పక్క జిల్లాకు వెళ్లడం నిబంధనలకు విరుద్ధమంటూ 108 వాహన సిబ్బంది నిరాకరిస్తున్నారు.

సీఎం భరోసా ఇచ్చారు ..

ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చాం. నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష తీరుతుందని ఆయన భరోసా ఇచ్చారు. దీనిపై సీసీఎల్ఏ నివేదికను సీఎం కోరడంతో కలెక్టర్ సమగ్ర వివరాలు పంపించారు. – ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే లలితకుమారి

ఏడు రోజుల్లోగా నివేదిక ఇవ్వాలి

విజయనగరం నేరవార్త విభాగం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే వినతులను ఏడు రోజుల్లోగా పరిష్కరించి, సంబంధిత నివేదికను తనకు అందజేయాలని ఎస్పీ దామోదర్ సూచించారు. సోమవారం తన కార్యాలయంలో 54 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిలో భూ తగాదాలపై 8, కుటుంబ కలహాలు 9, మోసాలు 7, నగదు వ్యవహారాలు 2, ఇతర అంశాలపై 28 ఫిర్యాదులున్నాయి. ఏఎస్పీ పి.సౌమ్యలత, ఎస్బీ సీఐ లీలారావు, డీసీఆర్‌బీ సీఐ బి.సుధాకర్, ఎస్సై రాజేష్ పాల్గొన్నారు.

ప్రథమ వర్ధంతి

మీరు మాకుండి భౌతికంగా దూరమై 1 సం॥ గడిచినను మీ జ్ఞాపకాలు, మధుర స్మృతులు మరువలేకున్నాము. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
కుమారులు, కోడళ్ళు, మనుమలు, మనుమరాళ్ళు, మునిమనుమలు మరియు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు
కీ॥శే॥ వేటూరి రత్నావతి గారు
మరణం: 14-11-2024 (93 సం॥లు)
వెన్నె గ్రామం
ప్రథమ వర్ధంతి కార్యక్రమం: తేది. 04-11-2025 మంగళవారం యస్.కోట మం॥, పుణిగిరిలో జరుగును. సెల్: 9959637799

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
9000866020, 8008597609

(c) eenadu

శంబలనగరి.. ఆధ్యాత్మిక విహారి!

కార్తిక పౌర్ణమి వేడుకలకు ముస్తాబు

– న్యూస్‌టుడే, శృంగవరపుకోట

హరిహరులకు ప్రీతికరమైన మాసం కార్తికం. . అందులోనూ ఈ నెలలో వచ్చే పౌర్ణమిని భక్తులు అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన రాజీపేట గ్రామంలోని 'శంబల నగరి ఆధ్యాత్మిక చైతన్య క్షేత్రం' కార్తిక పౌర్ణమి వేడుకలకు ముస్తాబైంది. ఈమేరకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సమాజానికి ఆధ్యాత్మిక చింతన, భక్తి భావం పెంపొందించే సంకల్పంతో గాయత్రీ ఉపాసకుడు మహర్షి 'ధ్యానం నాన్న' 'శ్రీగాయత్రీ తపస్వి శంబలనగరి ఆశ్రమాన్ని' 2014లో రాజీపేటలో ఏర్పాటు చేశారు. కార్తిక పౌర్ణమి, గురు పౌర్ణమి, మాఘ పౌర్ణమి, గాయత్రీ జయంతి, అట్లతద్ది కార్యక్రమాలను ఏటా ఇక్కడ నిర్వహిస్తారు. ఇందులో కార్తిక పౌర్ణమి ప్రధాన వేడుక. దీనికి దేశం నలుమూలల నుంచి శిష్యులు తరలివస్తారు.

ఆలయంలో తల్లి విగ్రహం

333 కిలోల గంట

9 అడుగుల విగ్రహం ప్రత్యేకం

ఆశ్రమంలో ఏర్పాటు చేసిన తొమ్మిది అడుగుల పంచలోహ గాయత్రీ మాత విగ్రహం ప్రత్యేకం. దీనితో పాటు శివుడు, పార్వతి, వినాయకుడు, సరస్వతి, లక్ష్మి, శక్తిపీఠం, వేంకటేశ్వరుని పాదాలు, అశ్వాలతో సూర్యుడి విగ్రహాలు, పశుపతినాథ ఆలయం, 333 కిలోల గంట ఉన్నాయి.

భారీ అఖండ దీపం.. దేశంలో ఎక్కడా లేని విధంగా కార్తిక పౌర్ణమిని ఇక్కడ ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది నవంబరు 5న వేకువజామున మహర్షి ధ్యానం నాన్న నిర్వహించే హోమంతో వేడుకలకు అంకురార్పణ చేస్తారు. సాయంత్రం అఖండ దీపం వెలిగిస్తారు. 300 కిలోల ఆవు నెయ్యి, 300 కిలోల ఒత్తి, 9 కిలోల కర్పూరం వినియోగిస్తారు. నాలుగు రోజుల పాటు నిరంతరాయంగా వెలుగుతుంది.

పల్లకీ సేవ.. గాయత్రీ పల్లకీ సేవలో ధ్యానం అమ్మ, గాయత్రీ కన్యకా దీక్షలో ఉన్న యువతులు పాల్గొంటారు. అమ్మ వారి విగ్రహాన్ని పల్లకీలో మందిరం చుట్టూ ఊరేగిస్తారు.

కబడ్డీ ట్రోఫీ మనదే!!

కొత్తవలస, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్-17 రాష్ట్ర ఛాంపియన్ షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు సత్తా చాటింది. ఈనెల 1న ప్రారంభమైన పోటీల్లో పాత 13 జిల్లాల జట్లు తలపడ్డాయి. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో మనోళ్లు విశాఖ క్రీడాకారులతో తలపడి, పైచేయి సాధించారు. ఈమేరకు ట్రోఫీతో పాటు బంగారు పతకాలను గెల్చుకున్నారని పరిశీలకులుగా హాజరైన నెల్లిమర్ల పీడీ, ఎస్‌జీఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి కె.కృష్ణం రాజు, శిక్షకుడు రమణ, రిఫరీ కుమార్ వెల్లడించారు. అవంతి ఫౌండేషన్ ఛైర్మన్ నాని, భారత వాలీబాల్ క్రీడాకారుడు కృష్ణంరాజు, శాప్ డైరెక్టర్ రవీంద్ర, తూర్పుగోదావరి జిల్లా డీఈవో వాసుదేవరావు నుంచి కప్ అందుకున్నట్లు చెప్పారు.

పతకాలు, ట్రోఫీతో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

● నెల్లిమర్ల మండలంలోని పారసాం ఉన్నత పాఠశాలలో గతనెల 28న తాగునీటి, శౌచాలయాల్లోని కుళాయిల వాల్వ్‌లు చోరీకి గురయ్యాయి. సింహద్వారం వద్దగల విగ్రహాలను సైతం కొందరు ధ్వంసం చేశారు.

● ఆ ముందురోజే 27న విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని బీపీఎం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి గదికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. సెలవు కావడంతో ఎవరికీ ప్రమాదం జరగలేదు. కిటికీల తలుపులు, కొన్ని పుస్తకాలు కాలిపోయాయి. బీరువాలు దెబ్బతిన్నాయి. గది మసిబారింది.

అక్షర కాంతిపై అజ్ఞానపు నీడ

– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

విద్యాలయాలను దేవాలయాలుగా భావిస్తారు. ఎంతో మందికి చదువు నేర్పించే క్షేత్రాలు. కానీ కొందరు ఆకతాయిలు వికృత చేష్టలకు బదులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చేస్తున్నారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పరిసరాలను పాడు చేస్తున్నారు. ఇటీవల విజయనగరం, నెల్లిమర్లలో జరిగిన ఘటనలు ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతున్నాయి.

విజయనగరంలోని బీపీఎం పాఠశాలలో ఆకతాయిలు నిప్పు పెట్టడంతో మసిబారిన గది

పాఠశాలల్లో ఆకతాయిల వికృత చేష్టలు

మందుబాబులే ఎక్కువ..

చాలా పాఠశాలలకు ప్రహరీలు లేవు. కాపలాదారులు కూడా కానరావడం లేదు. దీంతో మందుబాబులు, గంజాయి తాగేవారు తిష్ఠ వేస్తున్నారు. సెలవు రోజుల్లో, విద్యార్థులు ఇళ్లకు వెళ్లాక వారు చేరుకుని నానా హంగామా సృష్టిస్తున్నారు. స్థానికులు ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారు. గదులను అపరిశుభ్రం చేయడం, కిటికీలు, తలుపులు, విగ్రహాల ధ్వంసం, ఫ్యాన్లు, బల్బులను పగలగొట్టడం, బియ్యం, ఇతర సామగ్రి, కంప్యూటర్లు, విలువైన పరికరాలను ఎత్తుకెళ్లడం తదితర చర్యలు కనిపిస్తున్నాయి. గతంలో కుమరాం జడ్పీహెచ్‌ఎస్‌లో కంప్యూటర్లు చోరీకి గురికాగా.. నగరపాలక సంస్థ పరిధిలోని గాజులరేగ విద్యాలయంలో అసాంఘిక కార్యక్రమాలు వెలుగుచూశాయి. దాదాపు అన్నిచోట్లా ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

ప్రహరీలెక్కడ?

విద్యాశాఖ పరిధిలో 1790 పాఠశాలలున్నాయి. వీటిలో 242 బడులకు ప్రహరీలు లేవు. వివిధ పథకాల కింద మంజూరు చేసినా పనులు సాగడం లేదు. కొన్నిచోట్ల ప్రారంభించినా నిధులు రాక నిలిపివేశారు. కంప్యూటర్లు, ఫాల్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు, విద్యుత్తు, ఫర్నిచర్ ఉన్నచోట్ల కాపలాదారులు తప్పనిసరి. ప్రస్తుతం 38 మంది మాత్రమే రెగ్యులర్ సిబ్బంది ఉన్నారు. మరో 194 మంది పొరుగు సేవల కింద పనిచేస్తున్నారు. వీరిలో కొందరు సక్రమంగా ఉండటం లేదన్న ఆరోపణ ఉంది. [illegible] సందర్భాలు సైతం ఉన్నాయి. ఈ నేపథ్యంలో చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. పోలీసుల సహకారంతో నిందితులపై కేసులు పెట్టిస్తామని డీఈవో మాణిక్యం నాయుడు తెలిపారు. తాజా ఘటనలతో మండలాధికారులను అప్రమత్తం చేశామన్నారు.

స్పిల్‌వే గేటుకు మరమ్మతులు.. గంట్యాడ: తాటిపూడి జలాశయం స్పిల్‌వే గేటుకు జలవనరుల శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టారు. 'మొరాయించిన గేట్లు' పేరిట సోమవారం 'ఈనాడు'లో వెలువడిన కథనానికి స్పందించి, బాగు చేశారు. ఇక ఇబ్బంది ఉండదని ఏఈ శంకర్ తెలిపారు.

APS RTC
టెండరు ప్రకటన
పల్లె వెలుగు
విజయనగరం జిల్లాలో గల విజయనగరం, శృంగవరపుకోట డిపోల పరిధిలో ఉన్న ఖాళీ స్టాళ్ళు/ షాపులు, ఖాళీ స్థలములలో వ్యాపారములు చేసుకొనుటకు మరియు డిపోలలో వివిధ పనులకు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన స్క్రాప్ వర్కర్లను సరఫరాచేయుటకు అనుభవం,ఆసక్తి కలిగిన సంస్థలు/వ్యాపారస్తులు/ కాంట్రాక్టర్ల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. (1) టెండరు ఫారములు విజయనగరం, శృంగవరపుకోట డిపో మేనేజర్ల వారి కార్యాలయములలో తేది.04-11-2025 నుండి తేది.17-11-2025 వరకు అన్ని ఆఫీసు పనిదినములలో ఉ॥10.30 గం॥ల నుండి సా॥5.00 గం॥ల వరకు అమ్మబడును. (2) పూర్తి చేసిన టెండరు ఫారములు తేది.18-11-2025న ఉ॥10.30 గం॥ల నుండి మ॥12.00 గం॥ల లోపున జిల్లా ప్రజా రవాణా అధికారి వారి కార్యాలయం, విజయనగరం నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్సులో వేయవలెను. అదేరోజు మ॥3.00 గం॥లకు టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరువబడును. (3) పూర్తి వివరములకు మా వెబ్‌సైట్ :https://www.apsrtc.ap.gov.in లో tenders ను చూడగలరు. (4) ఎట్టి కారణము చూపకుండా టెండర్లు అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు మరియు రద్దుచేయుటకు APSRTC కి పూర్తి అధికారము కలదు.
నెం. P2/437(16)/2025-DPTO/VZM, తేది:01-11-2025 సం/- జిల్లా ప్రజా రవాణా అధికారి, విజయనగరం.

APGB - ANDHRA PRADESH GRAMEENA BANK
Regional Office: Mayuri Junction Vizianagaram, Cell: 9490153759
PREMISES REQUIRED ON LEASE

Sl.No	District Name & Location	Mini. Extent.
1	Cheepurupalli	1600-1900 Sft
2	Kothagraharam	1400-1800 Sft
3	Balajinagar	1400-1800 Sft
4	Sathivada	1500-1700 Sft

Persons having suitable buildings with proper area and parking facility are invited to provide premises on lease. Interested owners should submit their applications within 21 days from the date of this notification along with supporting documents to the concerned authorities
Sd/ - Regional Manager.

9న బాలల ఆహ్వాన నాటక పోటీలు

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 9న జిల్లాస్థాయి బాలల ఆహ్వాన నాటక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ తెలిపారు. నగరంలో సోమవారం సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. గురజాడ పాఠశాలలో ఆరోజు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని చెప్పారు. జేవీవీ జాతీయ నాయకుడు కృష్ణాజీ, సంఘం జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కళావతి, కుసుమంచి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుబ్బారావు, వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్లపూడి సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనేందుకు గానూ ఈనెల 8న కొండవెలగాడలో ఎంపికలు నిర్వహించనున్నట్లు వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి రాము తెలిపారు. ఉదయం 8 గంటలకు హాజరు కావాలని, సందేహాలుంటే 93701 98471ను సంప్రదించాలని కోరారు.

ఆలయాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: కార్తికమాసం నేపథ్యంలో శివాలయాల్లో రద్దీ పెరుగుతుండడంతో పూర్తిస్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష తెలిపారు. సోమవారం నగరంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. ప్రత్యేక సోమవారాలు, పౌర్ణమి, పాడ్యమి తదితర రోజుల్లో బందోబస్తు నిర్వహించాలని పోలీసు శాఖను కోరామన్నారు. ఈమేరకు 9 మంది ఈవోలు, ఆయా ప్రాంతాల్లోని ఎస్సైలు, సీఐలకు సూచనలు చేశామన్నారు. అగ్నిమాపక వాహనాలు, అంబులెన్సులు అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు. జాగ్రత్తలపై మైకుల ద్వారా ప్రచారం చేపడతామన్నారు.

చికెన్ ధరలు

రకం	బ్రాయిలర్ లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	125	220	230

30 సెంట్ల విస్తీర్ణం.. 11 పంటలు

న్యూస్‌టుడే, వీరఘట్టం

తక్కువ పెట్టుబడి, విస్తీర్ణంలో.. వినూత్న పద్ధతులతో విభిన్న పంటలు సాగు చేస్తూ.. లాభాల సిరులు కురిపిస్తున్నారు వీరఘట్టం మండలం కడకెల్ల గ్రామానికి చెందిన బొంగు నారాయణరావు. వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి కేవలం 30 సెంట్ల విస్తీర్ణంలో బహుళ పంటలు కంది, బీర, బెండ, వంగ, బంతి, పచ్చిమిర్చి, జామ, కరివేపాకు, చిక్కుడు, టమాటా, అంగారం సాగు చేసి నిరంతర ఆదాయం పొందుతున్నారు.

పండించిన కూరగాయలను చూపిస్తున్న నారాయణరావు

సస్యరక్షణ ఇలా.. ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అవలంబిస్తూ కూరగాయల సాగుకు అనుకూలంగా తొలుత భూమిని సిద్ధం చేశారు. పంటను చీడపీడల నుంచి రక్షించుకునేందుకు వేరుగా పొలం చుట్టూ బంతి మొక్కలు నాటారు. ప్రధానంగా ఆవు మూత్రం, పేడ ఉపయోగించి ద్రవ, ఘన జీవామృతాలు సొంతంగా తయారు చేసి మొక్కలకు వేస్తున్నారు. తెగుళ్ల నివారణ కషాయాలు తయారు చేసి పంటలపై చల్లుతున్నారు. పంటకు ఎరువులుగా జీవామృతం ఉపయోగిస్తున్నారు. డీఏఓ శ్రావణ్‌కుమార్ నుంచి సందేహాలు నివృత్తి చేసుకుంటున్నారు.

లాభమిలా.. కూరగాయలు, తీగజాతి, మొక్కజొన్న పంటలకు నారు, దుక్కి, మొక్కలు నాటడానికి సుమారు రూ.14,400 వరకు ఖర్చు చేస్తున్నారు. పంటలకు ఎరువులుగా జీవామృతాల తయారీకి రూ.1500 ఖర్చు చేశారు. 10 సెంట్ల విస్తీర్ణంలో కంది వేయగా 100 కిలోల దిగుబడి వచ్చింది. బీర 3 సెంట్లలో వేయగా 30 కిలోలు, బెండ 3 సెంట్లలో వేస్తే 30 కిలోలు, వంగ 4 సెంట్లలో పండించగా 300 కిలోలు, మిగిలిన 10 సెంట్లలో పచ్చిమిర్చి సాగుతో 40 కిలోలు, చిక్కుడు 200 కిలోలు, టమాటా 120 కిలోల వరకు దిగుబడి వచ్చింది. వీటితోపాటు బంతి, చామంతి, కరివేపాకు, జామ పండిస్తున్నారు. ఏడాదికి మూడు పంటలు పండిస్తున్నారు. ఈ సీజన్‌లో పెట్టుబడులు, ఇంటి అవసరాలకు పోనూ సుమారు రూ.70 వేల లాభం అందుకున్నారు.

సేంద్రియంతో మేలు.. ★ సేంద్రియ సాగు వల్ల నాణ్యమైన ఉత్పత్తి వస్తోంది. ★ బహుళ పంటలు వేయడంతో వేర్ల వ్యవస్థ ద్వారా భూమిలో జీవ వైవిధ్యం ఏర్పడుతోంది. ★ భూసారం పెరుగుతుంది. ★ తెగుళ్లు, చీడపీడలు సోకే ప్రమాదం తక్కువ. ★ తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలు వేయడంతో ఇంటి అవసరాలకు ఉపయోగపడుతుంది. ★ మిగిలిన ఉత్పత్తులను విక్రయించి ఆదాయం సంపాదిస్తున్నామని రైతు నారాయణరావు చెబుతున్నారు.

బొప్పాయి పాలు.. విదేశాలకు

నంద్యాల జిల్లా చాగలమర్రి మండల వ్యాప్తంగా రైతులు అధికంగా బొప్పాయి సాగు చేస్తుంటారు. చిన్నవంగలితో పాటు సమీపంలోని గ్రామాలైన వైఎస్సార్ కడప జిల్లా కానగూడూరు, క్రిష్ణంపల్లె గ్రామాల్లో 1200 ఎకరాల్లో పండిస్తారు. విత్తన నాటిన కాలం నుంచి తొమ్మిది నెలలకు పంట చేతికొస్తుంది. పంట సేకరణ అనంతరం 13 నెల తర్వాత మిగిలిన, ముదురు కాయలను గాట్లు పెట్టి పాలను సేకరిస్తున్నారు. తెల్లవారుజాము సమయంలోనే కాయలకు గాట్లు పెడితే కేవలం రెండు గంటల్లోనే పాలు ఊరుతుంది. ఇలా సేకరించిన దాన్ని రాయచోటి, రాజంపేటకు చెందిన వ్యాపారులు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల పాలు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 4 డ్రమ్ముల పాలు సేకరిస్తున్నారు. ఎకరాకి పాల సేకరణ ద్వారా రైతుకు రూ.24 వేల ఆదాయం వస్తుంది. సేకరించిన పాలను పరిశ్రమల్లో మందులు, కాస్మొటిక్స్, సబ్బుల తయారీలో ఉపయోగిస్తున్నారు. బెంగళూరు, చెన్నైలో పాలు నాణ్యతను బట్టి విదేశాలకు సైతం పాలను ఎగుమతి చేస్తున్నారు. బొప్పాయి సాగులో ఎప్పుడైనా ధర పడిపోయినప్పుడు బొప్పాయి పాల సేకరణతో నష్టాల నుంచి రైతులు బయటపడుతున్నారు.

– న్యూస్‌టుడే, చాగలమర్రి

రైతేరాజు

నిమ్మలో తెగుళ్ల నివారణ ఇలా..

నిమ్మలో ఆకు ముడత, వేరుకుళ్లు తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉల్లిభద్ర ఉద్యాన కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.యూన్సీరాణి తెలిపారు.

నిమ్మలో ఆకు ముడత తెగులు

◆ ఆకు ముడత పురుగు లేత ఆకులను ఎక్కువగా, ముదురు ఆకులను అరుదుగా ఆశిస్తుంది. ◆ వెంటనే అజాడిరక్టిన్ (వేప నూనె) 10 వేల పీపీఎం లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ◆ ఉద్ధృతి తీవ్రంగా ఉంటే లీటరు నీటిలో ప్రొఫెనోఫాస్ 2 మి.లీ లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ కలిపి చల్లుకోవాలి. ◆ కొత్త చిగుర్లు వచ్చినప్పుడు పురుగు మందు చల్లాలి. ◆ వేరుకుళ్లు తెగులు ఆశిస్తే పోషక పదార్థాలు, నీరు సక్రమంగా అందక చెట్లు ఎండిపోతాయి. ఇది రాకుండా మాంకోజెట్ 2.5 గ్రా లేదా కార్బండిజమ్ 2 గ్రా. లీటరు నీటిలో కలిపి చెట్టంతా తడిచేలా వేయాలి. ◆ వారం, పది రోజుల తర్వాత పశువుల ఎరువులో అభివృద్ధి చేసిన ట్రైకోడెర్మా కల్చర్‌ను చెట్టుకు 10 కిలోల చొప్పున వేయాలి.

– న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

పంటల్లో పురుగుల నివారణకు సరైన సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించొచ్చని విజయనగరం ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.కె.లక్ష్మణ్ అన్నారు. రైతుల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

?: **ప్రశ్న:** వరి పంట చేతికందే దశలో ఉంది. ఇటీవల వర్షాలకు కొన్నిచోట్ల నీటమునిగాయి, ప్రస్తుతం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? **- శంకరరావు, కొమరాడ**

☛: **సమాధానం:** వర్షాలకు నేలకొరిగిన వరి పైరు, కోసిన పనలు నీట మునిగినప్పుడు గింజలు మొలకెత్తి రంగు మారి బూజు పట్టకుండా జాగ్రత్తలు పాటించాలి. పనలు, కంకులపై 5 శాతం ఉప్పు ద్రావణాన్ని (100 లీటర్ల నీటిలో 5 కిలోల ఉప్పును కరిగించి) చల్లాలి.

?: రెల్లరాల్చు పురుగు నివారణ చర్యలు చెప్పండి? **- చిన్నారావు, పాచిపెంట**

☛: రెల్లరాల్చు, గొంగళి పురుగులు, వరి పంటల్లో గింజ గట్టిపడే దశలో, వెన్నులు కొరికి నష్టాన్ని కలగజేస్తాయి. రాత్రిపూట వీటి ఉద్ధృతి ఎక్కువగా ఉంటుంది. నియంత్రణకు పొలానికి ముందుగా నీరు పెట్టి తీసివేసి, వెంటనే ఒక లీటరు నీటిలో 2.5 మి.లీ.ల క్లోరోఫైరిఫాస్ మందు కలిపి పిచికారీ చేయాలి.

?: అపరాలు వేసి 15 రోజులైంది. మొక్క 2, 3 ఆకుల దశలో ఉంది. ఆకులపై ఎక్కువగా గుండ్రని రంధ్రాలు ఏర్పడ్డాయి. నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలి? **- రామారావు, బలిజిపేట**

☛: పైరుపై చిత్త పురుగులు ఆశించడం వల్ల రంధ్రాలు ఏర్పడతాయి. ఈ పురుగులను సకాలంలో నివారించకపోతే 80 శాతం మొక్కలు చనిపోతాయి. వీటి నివారణకు లీటరు నీటికి 2.5 మి.లీ. క్లోరోఫైరిఫాస్ లేదా 1 గ్రా. ఎసిపేట్ కలిపి వేయాలి.

ఫోన్ కొట్టు.. సలహా పొందు

చలికాలం సమీపిస్తున్న తరుణంలో జీవాల పెంపకంలో ఎలాంటి సంరక్షణ చర్యలు చేపట్టాలి. లేగ దూడలు, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలకు 8919503675 నంబరును సంప్రదించాలని కురుపాం రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం పశువిభాగం శాస్త్రవేత్త డా.అను తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES
BUSINESS OFFER
మీకు మీరే బాస్! ఎలాంటి ఇన్వెస్ట్‌మెంట్ లేకుండా ఖాళీ సమయంలో వెల్‌నెస్ ఇండస్ట్రీలో బిజినెస్ చేస్తూ మంచి ఆదాయం అవకాశం మేము ఇస్తాము 9014039992

EDUCATION
HOME TUITIONS
8th క్లాస్ స్టూడెంట్‌కు అన్ని Subjects క్లాసు చెప్పుటకు విజయనగరం ఉడా కాలనీ నందు హోమ్ ట్యూటర్ (M/F) కావలెను. C: 7207307421.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

HEALTH & CARE
NEURO
నిర్మల న్యూరో & జనరల్ మెడికల్ సెంటర్
Dr.Nirmala Vangapandu M.D.(Gen.Med) DM (Neuro) JIPMER Specialist in Brain & Nerve Problems & General Physician
మెదడు, నరములు & వెన్నెముక వ్యాధి నిపుణులు
R.T.C.కాంప్లెక్స్ ఎదురుగా, INOX మల్టిప్లెక్స్ వెనుక వీధి, VZM
FOR APPOINTMENT : 63054 71147

PERSONAL CLASSIFIEDS
CHANGE OF NAME
CHANGE OF NAME
I, undersigned KOTTURU SAMBAM MURTHY SANYASI RAJU (Old Name) S/o Kotturu Ramakrishna, plot no: 48, Kusuma Gajapathi Nagar, Cantonment, Vizianagaram – 535003, Andhra Pradesh, changing my name from KOTTURU SAMBAM MURTHY SANYASI RAJU to KOTTURU SAMBA MURTHY SANYASI RAJU (New name), shall henceforth be called KOTTURU SAMBA MURTHY SANYASI RAJU (New name) for all purposes.

REAL ESTATE
FLAT FOR SALE
3BHK Flat for sale G2, 1st floor E/F, 1380sft, Bhagyalakshmi enclave easy buy showroom backside, Ring Rd. VZM. ✆9182650432.

JOBS
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యూయర్స్, ఏజ్: 22-35. ఫ్రెషర్స్ కూడా కావలెను. ✆ 6281037879.
గజపతినగరం శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేయుటకు మార్కెటింగ్ అనుభవం కలిగిన యువతి, యువకులు కావలెను. C:7659990665, 9492218996
Solar Companyలో పనిచేయుటకు M/F Accountant కావలెను. Tally Compulsary రావలెను. C: 9492731212, 9494703452.

HOSPITALITY
అరకు రిసార్ట్‌లో పనిచేయుటకు అనుభవం కలిగి ఉన్న హౌస్‌కీపింగ్ బాయ్స్/రెస్టారెంట్ వెయిటర్స్ కావలెను. జీతం: 11,000+భోజనం+వసతి. Ph: 8639009266

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

వ్యాధుల కాలం.. అప్రమత్తతతో కళ్లెం

– న్యూస్‌టుడే, బొబ్బిలి

ఇటీవల కురిసిన వర్షాలకు నదులు, చెరువులు నిండి ఊట బావుల్లో నీరు, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. కొందరు ఆ నీటినే తాగుతుండడం.. వాతావరణంలో మార్పులు.. కలుషిత, నిల్వ ఆహార పదార్థాలను తీసుకోవడం తదితర కారణాలతో అతిసారం, సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ఆసుపత్రులు కిక్కిరిసిపోతున్నాయి. ఇటీవల రామభద్రపురం మండలంలోని ముచ్చెర్లవలస, కొండకెంగువ, ఇట్లామామిడిపల్లి, ఆరికతోట తదితర ప్రాంతాల్లో అతిసారం ప్రబలింది. చాలామంది అస్వస్థతకు గురయ్యారు. జాగ్రత్తలు తీసుకోకుంటే మరి కొంతమంది మంచానపడే ప్రమాదముంది.

బొబ్బిలి మండలంలోని పారాదిలో నీటి నాణ్యత పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రబలడానికి కారణాలివే..

★ కలుషిత, నిల్వ నీరు తాగడం ★ ఇళ్ల ముందు మురుగు పేరుకుపోవడం ★ కాలువల్లో వ్యర్థాలు కదలక పోవడం ★ దోమల విజృంభణ ★ పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటించకపోవడం ★ కలుషిత, జంక్, నిల్వ ఉండే ఆహారం తీసుకోవడం ★ ఆరుబయట మలవిసర్జన ★ పొలాలకు వెళ్లే రైతులు చెరువులు, కాలువల్లోని నీరు తాగడం

ఈ జాగ్రత్తలు పాటించాలి..

★ ఎప్పటికప్పుడు సచివాలయాల సిబ్బంది ద్వారా తాగు నీటి నాణ్యతను తెలుసుకోవాలి. ★ రంగు మారితే తాగకూడదు. ★ వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలి. ★ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. ★ శరీరంలో నీరసం, తలనొప్పిగా ఉంటే వైద్యులను సంప్రదించాలి. ★ శీతలీకరణ యంత్రాల్లో ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన ఆహారం తినొద్దు.

శుభ్రత ముఖ్యం.. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. కొంతమంది ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. కలుషిత నీరు, ఆహారం వల్లే అతిసారం వస్తుంది. వ్యక్తిగత శుభ్రత ముఖ్యం. తినేముందు చేతులు శుభ్రంగా కడగాలి. పీహెచ్‌సీల సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. – కృష్ణమహన్, వైద్యనిపుణుడు

సౌకర్యాలు లేక అవస్థలు

వాతావరణంలో మార్పుల కారణంగా అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. బొబ్బిలిలోని ప్రభుత్వాసుపత్రిలో సోమవారం 400 ఓపీ నమోదైంది. జ్వర బాధితులతో అన్ని విభాగాలు కిక్కిరిశాయి. కొన్ని పడకలను అత్యవసర విభాగం బయట వేశారు. కొంతమంది నేలపై పడుకొని కనిపించారు. ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని ఇన్‌ఛార్జి శశిభూషణ రావు తెలిపారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి

కాశీబుగ్గ ఘటనపై సకాలంలో చర్యలు

మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో ఇటీవల జరిగిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో స్పందించి, బాధితులకు అండగా నిలిచిందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. సోమవారం విజయనగరంలోని అశోక్‌బంగ్లాలో విలేకరులతో మాట్లాడారు. విదేశీ పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేశ్, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు వెంటనే చేరుకున్నారని, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు సైతం ఘటనాస్థలానికి వెళ్లారన్నారు. ఇప్పటికే ప్రభుత్వం పరిహారం ఇచ్చిందని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందుతోందని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం పరామర్శకు రాలేదని, వైకాపా నాయకులు ఘటనను రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు.

ప్రజల్లోనే ఉన్నారు.. ప్రశంస పొందారు

వీఆర్వోను అభినందిస్తున్న తహసీల్దారు

సంతకవిటి, న్యూస్‌టుడే: మొంథా తుపాను సమయంలో ఉత్తమ పనితీరు కనబర్చిన సంతకవిటి మండలం కేఆర్ పురం వీఆర్వో రాజమోహన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రశంసించారు. నాగావళి నదికి ఆనుకుని ఉన్న కొత్తూరు, రామచంద్రాపురం గ్రామాల్లో ఆయన నిత్యం పర్యటిస్తూ.. ఎప్పటికప్పుడు పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేశారు. ముంపు నేపథ్యంలో స్థానికులను అప్రమత్తం చేశారు. సమయస్ఫూర్తితో విధులు నిర్వర్తించినందుకు గానూ ప్రభుత్వం గుర్తించింది. పించన్ల పంపిణీ నేపథ్యంలో అమరావతిలో జరిగిన కార్యక్రమానికి వెళ్లలేకపోవడంతో అంతర్జాలంలో పంపించారు. సోమవారం తహసీల్దారు సుదర్శనరావు తదితరులు అభినందించారు.


ఆండ్ర జలాశయం వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న ఈఈ వెంకటరమణ

అయ్యన్నపేట: ఆస్తి, పంట, ప్రాణ నష్ట తీవ్రతను తగ్గించినందుకుగానూ జలవనరులశాఖ ఈఈ వెంకటరమణకు పురస్కారం లభించింది. తాటిపూడి, ఆండ్ర, చంపావతి ప్రాజెక్టుల పరిస్థితి, ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో, గేట్లు ఎత్తడం, వరద తీవ్రత, ముంపు ప్రాంతాలను అప్రమత్తం చేయడం తదితర అంశాల అమలులో ఆయన ముందు వరుసలో నిలిచారు. దీంతో దాదాపు 4 వేలకు పైగా చెరువులకు గండ్లు పడకుండా అడ్డుకోగలిగినట్లు అధికారులు తెలిపారు.

రీసర్వేతో ఇబ్బందులు రాకూడదు

విజయనగరం అర్బన్: రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా రీసర్వే నిర్వహించాలని సర్వే, భూ రికార్డులశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు సీహెచ్‌వీఎస్ఎన్.కుమార్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో మండల సర్వేయర్లు, తహసీల్దార్లతో సమీక్షించారు. మండలాల వారీగా ప్రగతిని తెలుసుకున్నారు. అన్నదాతలకు ఉపయోగపడేలా ఉండాలని, తప్పులు నమోదు చేయొద్దని కోరారు. జిల్లా సహాయ సంచాలకుడు యజ్ఞేశ్వరరావు, పర్యవేక్షకుడు రాంబాబు పాల్గొన్నారు.

(c) eenadu

బొబ్బిలి

• బొబ్బిలి • రాజాం • గజపతినగరం • చీపురుపల్లి

ఉత్సాహంగా క్రీడా పోటీలు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం డివిజన్‌స్థాయి క్రీడా పోటీలు జరిగాయి. అండర్- 14, 17 విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, చదరంగం, యోగా, అథ్లెటిక్ పోటీలకు చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం, నెల్లిమర్ల మండలాల నుంచి 520 మంది హాజరయ్యారు. జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. పోటీలను తెదేపా రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు ప్రారంభించారు. హెచ్‌ఎం డి.ఉమామహేశ్వరి, డివిజన్ క్రీడ సమన్వయకర్త పీడీ స్వరూప్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

రాజాం రైతుబజారులో సోమవారం కూరగాయల ధరలు (కి.లో రూ.లలో) ★ టమాట: 40 ★ వంకాయలు: 60 ★ దొండ: 40 ★ బీర: 50 ★ బెండ: 50 ★ కాకర: 40 ★ చిక్కుడు: 40 ★ ఆనపకాయ (ఒకటి): 25 ★ అరటి (ఒకటి): 20 ★ మునగ: 70 ★ ఉల్లి: 30 ★ బంగాళదుంప: 30 ★ అల్లం: 55- 80 ★ వెల్లుల్లి: 80 ★ పచ్చిమిర్చి: 50 ★ క్యాబేజీ: 40 – న్యూస్‌టుడే, రాజాం

తెరపై ఈనాడు

★ ఎస్‌వీసీ సీతారామా: మాస్ జాతర ★ ఎస్‌వీసీ సీతారామా మినీ: కె-ర్యాంప్ ★ ఎస్‌వీసీ అప్సర: బాహుబలి ది ఎపిక్ – న్యూస్‌టుడే, రాజాం

★ లక్ష్మీ: బైసన్ ★ వాసవి: మాస్ జాతర ★ టీబీఆర్ ప్రైమ్-1: బాహుబలి ది ఎపిక్ ★ టీబీఆర్ ప్రైమ్-2: కె- ర్యాంప్ – న్యూస్‌టుడే, బొబ్బిలి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి - 80085 74348

? తారాపురం బీసీ కాలనీలో కల్వర్టు పాడైపోయింది. ఇబ్బందులు పడుతున్నాం. - స్థానికులు ★ కల్వర్టు బాగుకు చర్యలు తీసుకుంటాం. - రమేష్, ఏఈ – న్యూస్‌టుడే, రామభద్రపురం

? బుడతనాపల్లి రహదారిలో కాలువలు ఆక్రమించడంతో రోడ్డుపై నీరు పారుతోంది. - స్థానికులు ★ తక్షణమే పరిశీలించి ఆక్రమణలు తొలగిస్తాం. - నీలకంఠేశ్వరరెడ్డి, తహసీల్దారు – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

వంతెన నిర్మిస్తాం

తెర్లాం, న్యూస్‌టుడే: తెర్లాం మండలం పణుకువలస ఎత్తు కాజ్‌వేపై రహదారి బీటలతో కుంగిపోతున్నట్లు కనిపిస్తుండడంతో వాహనదారులు భయపడుతున్నారు. కూలుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఈనెల 3న వార్త ప్రచురితమవడంతో ఆర్‌అండ్‌బీ ఏఈ అప్పలరాజు స్పందించారు. సోమవారం రహదారిని పరిశీలించారు. వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని తెలిపారు.

ప్లాస్టిక్ వ్యర్థం.. పెనుభూతం..!

న్యూస్‌టుడే- రాజాం పట్టణం, గ్రామీణం

పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ నిషేధం చాటింపులకే పరిమితమైంది. పుర, మండలాల అధికారులు ప్రకటనలు చేస్తున్నా.. అమలు మాత్రం పట్టించుకోవడంలేదు. దీంతో రాజాం పట్టణం, నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వినియోగం తీవ్ర స్థాయిలో ఉంది. భూమిలో కలిసిపోయే అవకాశం లేని వ్యర్థాలు ప్రధాన రహదారులు, చెరువుల చెంతనే దర్శనమిస్తున్నాయి.

పట్టణ వీధుల్లో ఆహారం కోసం తిరిగే మూగజీవాలు పాలిథిన్ వ్యర్థాలనే తింటున్నాయి. జీర్ణం చేసుకోలేక మృత్యువాత పడుతున్నాయి. చెరువుల్లో వేస్తుండడంతో నీటి వనరులు కలుషితమవుతున్నాయి. భూమిసారంపై ప్రభావం చూపి, పంటల దిగుబడి తగ్గుతోంది. అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించడం, అవగాహన కల్పించడం ద్వారా కట్టడి చేసే అవకాశం ఉంది.

ఇవీ అనర్థాలు..

★ ప్లాస్టిక్ వ్యర్థాలను మూగజీవాలు తినడం వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మందగిస్తుంది. పొట్టలో బ్యాక్టీరియా వ్యాప్తి చెందుతుంది. మృతి చెందడానికి అవకాశం ఉంది. ★ పొట్ట ఉబ్బిపోయి శ్వాసకోశ సమస్య ఏర్పడుతుంది. ఇటువంటి సమయంలో ఆపరేషన్ చేసి వ్యర్థాలు తొలగించి, బతికిస్తారు. ★ భూమి పైపొరలో చేరడం వల్ల పోషకాలు, నత్రజని స్థాయి తగ్గుతాయి. మొలకలు రాకుండా అడ్డుకుంటాయి. భూమిసారం తగ్గిపోయి పంటకు నష్టం వాటిల్లుతుంది. ★ కాలువలు, చెరువుల్లో పడేయడంవల్ల జలం కలుషితమవుతుంది. పలు వ్యాధుల వ్యాప్తికి కారణమవుతుంది.

రాజాం కూరగాయల వీధిలో వ్యర్థాలు తింటున్న ఆవులు

నియోజకవర్గంలో నెలకు ఉత్పత్తవుతున్న పాలిథిన్ వ్యర్థాలు (టన్నుల్లో)

మండలం	పంచాయతీలు	ప్లాస్టిక్
రాజాం పట్టణం (వార్డులు)	24	120
రాజాం	21	2.5
వంగర	29	1.6
రేగిడి	39	4.5
సంతకవిటి	34	2.4

★ చెరువు, కాలువ గట్లపై కాల్చివేయడం వల్ల గాలి కలుషితమై రోగాలు వచ్చే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..

పాలిథిన్ కవర్లు వాడకూడదని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వస్త్ర సంచులు వినియోగించాలని సూచిస్తున్నాం. ఎప్పటికప్పుడు దుకాణాలపై దాడులు నిర్వహిస్తున్నాం. ప్లాస్టిక్ వినియోగానికి అడ్డుకట్ట వేస్తాం. – శ్రీనివాసరావు, కమిషనర్, రాజాం పురపాలిక

చిత్రం గీశారు.. ప్రశంస పొందారు

గజపతినగరం మండలం జిన్నాం జడ్పీ ఉన్నత, బొబ్బిలి పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల్లో సోమవారం "ఈనాడు" ఆధ్వర్యంలో "ప్రతిభా పాటవ పోటీలు" జరిగాయి. "మీకు ఇష్టమైన పండగ" అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జిన్నాంలో జి.మోహనరావు (10వ తరగతి), ఇ.కీర్తి (8వ తరగతి), ఎ.భార్గవి (7వ తరగతి).. బొబ్బిలిలో పి.చరిత (7వ తరగతి), కె.వాగ్దేవి (8వ తరగతి), ఎ.హాసిని (8వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. జిన్నాం హెచ్‌ఎం కె.సన్యాసినాయుడు, చిత్రలేఖనం ఉపాధ్యాయుడు కృష్ణ, బొబ్బిలిలో హెచ్‌ఎం పి.లక్ష్మణరావు, ఉపాధ్యాయుడు సోమేశ్వరరావు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. – న్యూస్‌టుడే, గజపతినగరం, బొబ్బిలి

జిన్నాంలో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

బొబ్బిలిలో బహుమతులు అందజేస్తున్న గురువులు

జిన్నాంలో పోటీల్లో విద్యార్థులు

శిథిల భవనంతో చింత

గంట్యాడ, జగ్గాపురం గ్రామాల్లో గ్రంథాలయ భవనాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. కూలుతాయేమోనని పాఠకులు భయపడుతున్నారు. కుర్చీలు నిరుపయోగంగా మారాయి. అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. విషయం శాఖ గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

రాకపోకలు నిషేధం

సంతకవిటి, న్యూస్‌టుడే: సంతకవిటి మండలం కొండగూడెం సమీపంలోని సాయన్నగెడ్డపై ఉన్న శిథిల వంతెన మీదుగా వాహనాల రాకపోకలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు బి.సుదర్శనరావు, ఎస్సై ఆర్.గోపాలరావు హెచ్చరించారు. గోతిలో పడిపోయిన ట్రాక్టరును యంత్రాల సాయంతో తీశారు. ర.భ. శాఖ ఏఈ సతీష్‌కుమార్ దారికి అడ్డంగా ఇసుక బస్తాలు ఏర్పాటు చేయించారు. కొత్త వంతెన నిర్మాణానికి రూ.10.70 లక్షలు మంజూరయ్యాయని, టెండర్లు పూర్తి చేశామన్నారు. నీరు తగ్గాక పనులు చేపడతామన్నారు.

దారి లేదు.. వెలుగు రాదు

గరివిడి మండలం కొండలక్ష్మీపురం శివారులో రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన రైతుసేవా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలకు కనీస సదుపాయాలు లేవు. రహదారి లేదు. వర్షం పడితే బురదమయంగా మారుతోంది. విద్యుత్తు సదుపాయం కల్పించలేదు. లైన్ వేయాల్సి ఉంది. సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినట్లు సర్పంచి పి.కామేశ్వరరావు చెప్పారు. చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, గరివిడి

స్తంభం.. ప్రమాదం

రాజాం పట్టణంలోని కొండంపేట గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. స్తంభం ఒకవైపు వాలి ఉండడంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. కొండంపేట నుంచి రాజాం వైపు నిత్యం వాహనాల రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. విషయం విద్యుత్తుశాఖ ఏఈ కుమార్ వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, రాజాం పట్టణం

ప్రాణాలు పణంగా పెట్టాల్సిందేనా?

బడికెళ్లి నాలుగు అక్షరాలు నేర్చుకోవాలన్నా.. ప్రాణాలు పణంగా పెట్టాల్సిన దుస్థితి మెంటాడ మండలం లక్ష్మీపురం, చాకివలస గ్రామాలకు చెందిన విద్యార్థులది. గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లే దారిలో చంపావతి నది ఉద్ధృతంగా ప్రవహిస్తుండడంతో విద్యార్థులు, రైతులు, గ్రామస్థులు నీటిలో దిగి వెళ్లాల్సిన పరిస్థితి. గత్యంతరం లేక చాకివలస గ్రామస్థులు పాఠశాలకు తీసుకెళ్లేందుకు తమ పిల్లలను భుజాన పెట్టుకుని నదిలో నడుము లోతులో దాటుతున్నారు. – న్యూస్‌టుడే, మెంటాడ

తండ్రి హత్య కేసులో కుమారుడి అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి

బాడంగి, న్యూస్‌టుడే: బాడంగి మండలం గొల్లాది గ్రామంలో తండ్రిని హత్యచేసిన కుమారుడ్ని సీఐ నారాయణరావు, ఎస్సై తారకేశ్వరరావు సోమవారం కామన్నవలస సమీపంలో అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను డీఎస్పీ భవ్యారెడ్డి బాడంగి పోలీసుస్టేషన్‌లో వెల్లడించారు. మద్యానికి బానిసైన మామిడి రాము తరచూ భార్య, తల్లిని డబ్బుల కోసం కొట్టేవాడు. తండ్రి సత్యం (62) పక్షవాతంతో మూడేళ్లుగా మంచానికి పరిమితమై ఉండడంతో ఆసుపత్రి ఖర్చులు వృథా అని భావించి గొడవ చేసేవాడు. ఈనెల 1న భార్యను డబ్బులు అడగ్గా.. నిరాకరించడంతో బయటకు వెళ్లి కత్తితో ఇంటికి వచ్చాడు. భయభ్రాంతులకు గురై బయటకు పరుగులు తీశారు. తండ్రి సైగలు చేయడంతో కోపోద్రిక్తుడై మూడు కత్తులతో తండ్రి తలను వేరు చేసి సిమెంటు బేసిన్‌లో పెట్టి పారిపోయాడని డీఎస్పీ పేర్కొన్నారు.

కొండకెంగువలో ముగ్గురికి అతిసారం.. రామభద్రపురం, న్యూస్‌టుడే: రామభద్రపురం మండలం కొండకెంగువ గ్రామానికి చెందిన చింత అప్పలనాయుడు, చింత రమణమ్మ, ఎస్.సంధ్య అతిసారం బారినపడ్డారు. బాడంగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యులు గ్రామంలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. నిల్వ మాంసం తినడంతో అతిసారం సోకినట్లు వైద్యురాలు అపర్ణ తెలిపారు.

514 మంది రైతులు.. 89.73 హెక్టార్లలో నష్టం

న్యూస్‌టుడే- గరివిడి

మొంథా తుపాను ప్రభావం కారణంగా కురిసిన వర్షాలు, ఈదురుగాలులకు చీపురుపల్లి నియోజకవర్గంలో 514 మంది రైతులకు చెందిన 89.73 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లినట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో అధికారులు తేల్చారు. తుపాను నష్టాలను అంచనా వేసేందుకు వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సర్వే జరిపాయి. మండల వ్యవసాయాధికారులు, సహాయకులు, వీఆర్వోలు కలిసి గ్రామస్థాయిలో పర్యటించి వివరాలు నమోదు చేశారు. 33 శాతానికి పైగా నష్టం వాటిల్లిన పంటల వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. ఎక్కువగా వరి 88.88 హెక్టార్లలో నష్టం వాటిల్లగా.. మొక్కజొన్నకు 0.85 ఎకరాల్లో మాత్రమే నష్టం ఉందని గుర్తించారు. గింజ పాలుపోసుకునే దశలో వరిపైరు పడిపోవడం నష్టం కలిగిందని పేర్కొంటున్నారు.

మండలాల వారీగా వివరాలు..

మండలం	గరివిడి	మెరకముడిదాం	చీపురుపల్లి	గుర్ల
రైతులు	317	174	16	07
నష్టం (హెక్టార్లలో)	45.24	37.10	4.66	2.73

గరివిడి మండలం గదబవలసలో నేలమట్టమైన వరిపంట

బీమా చెల్లిస్తే పరిహారం..

పంట నష్టాల వివరాలను ప్రభుత్వానికి పంపుతున్నాం. నష్టపోయిన రైతులు బీమా ప్రీమియం చెల్లించినట్లయితే పరిహారం వస్తుంది. ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తుంది. సర్వేలో గుర్తించిన వివరాలను గ్రామస్థాయిలో ప్రదర్శిస్తాం. – కోటేశ్వరరావు, ఏడీఏ, చీపురుపల్లి వ్యవసాయ సబ్ డివిజన్

ఉపకారాగారం సందర్శన

దస్త్రాలు తనిఖీ చేస్తున్న కృష్ణప్రసాద్

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి ఉపకారాగారాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ సోమవారం సందర్శించారు. ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఒకరిపై ఒకరు వివక్ష చూపకూడదని సూచించారు. న్యాయ క్లినిక్‌లకు సంబంధించిన దస్త్రాలను పరిశీలించి, సూపరింటెండెంట్ పాత్రోకు సూచనలు చేశారు. ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని వెల్లడించారు. అనంతరం పట్టణంలోని మల్లంపేటలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.ప్రసాద్, ఏఎస్సై కొండలరావు పాల్గొన్నారు

మెరుగైన వైద్య సేవలు అందించాలి

సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో

రామభద్రపురం, న్యూస్‌టుడే: రామభద్రపురం మండలం కొండకెంగువలో సోమవారం డీఎంహెచ్‌వో జీవనరాణి పర్యటించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఇంటింటికీ వెళ్లి అతిసారంపై సర్వేచేయాలన్నారు. పూర్తిగా తగ్గేవరకు శిబిరం కొనసాగించాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

గుర్ల, న్యూస్‌టుడే: చింతలపేట ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు కార్తిక్, శ్రావణి, ప్రశాంత్, శ్రావణి రాష్ట్రస్థాయి పెంటథాన్, హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని పీడీ రామకృష్ణ సోమవారం తెలిపారు. ఈనెల 5 నుంచి 7 వరకు గుంటూరులో, 21 నుంచి 23 వరకు ప్రకాశం జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. హెచ్‌ఎం గౌరీదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

బాలల అసెంబ్లీకి శివరాం విద్యార్థిని

గరివిడి, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈనెల 26న అమరావతిలో నిర్వహించనున్న బాలల అసెంబ్లీకి గరివిడి మండలం శివరాం ఉన్నత పాఠశాల విద్యార్థిని మహంతి కల్పన ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎస్.వి.రమణ తెలిపారు.

ఇంటివద్దకే జీవిత ప్రమాణ పత్రాలు

బొబ్బిలి: బొబ్బిలి మాజీ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పలువురు మాజీ సైనిక పింఛనర్లకు ఇంటి వద్దకే వెళ్లి జీవిత ప్రమాణ పత్రాలు అందజేశారు. మాజీ సైనికులు ఇబ్బంది పడకుండా కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధ్యక్షుడు ఆర్.కిరణ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు ఎం.రామినాయుడు తెలిపారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

బొండపల్లి: మద్యం తాగేందుకు భార్య డబ్బులివ్వలేదని పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బొండపల్లి మండలంలో చోటుచేసుకుంది. రోళ్లవాక గ్రామానికి చెందిన బి.సతీష్ (33) మద్యానికి బానిసయ్యాడు. భార్య డబ్బులు ఇవ్వలేదని మనస్తాపంతో పురుగుమందు తాగాడు. గ్రామ సమీపంలో మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. కేసు నమోదు చేశామని ఎస్సై మహేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రామభద్రపురం: రామభద్రపురం వద్ద రహదారి గోతిలో ఆదివారం ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో తీవ్రంగా గాయపడిన బాడంగి మండలం పూడివలస గ్రామానికి చెందిన బి.గౌరమ్మ (45) విశాఖలోని కేజీహెచ్‌లో సోమవారం ఉదయం మృతి చెందారని ఎస్సై ప్రసాదరావు తెలిపారు. ఇదే ఘటనలో గాయపడిన కన్నంనాయుడు బాడంగిలో చికిత్స పొందుతున్నారన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

బాడంగి: బాడంగి మండలం పూడివలసలో పి.చిన్నకు చెందిన ఆవు విద్యుదాఘాతంతో మృతి చెందింది. గ్రామంలోని 11 కేవీ విద్యుత్తు తీగ తెగి ఆవుపై పడటంతో ఘటన జరిగింది. మనుషులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

వంగర: వంగర మండలం మగ్గూరు సమీపంలో ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొని మద్దివలస గ్రామానికి చెందిన తాతామనవలు తిర్లంగి అప్పలస్వామి, వినయ్ గాయపడ్డారు. వినయ్ తాతయ్యను రాజాం ఆసుపత్రికి తీసుకెళ్తుండగా.. అరసాడకు చెందిన ఓ వ్యక్తి ఢీకొనడంతో గాయపడ్డారు. రాజాంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ★ సంగాంలో ఆగివున్న ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో అటుగా నడిచివస్తున్న కె.లక్ష్మమ్మ గాయపడ్డారు.

పిచ్చికుక్క దాడిలో వృద్ధురాలికి..

వంగర: పిచ్చికుక్క దాడిలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం వంగర మండలంలో చోటుచేసుకుంది. బంగారువలసకు చెందిన వృద్ధురాలు కె.సింహాద్రమ్మ గ్రామంలోని శివాలయం వద్ద అన్నదాన కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా.. పిచ్చికుక్కదాడి చేసింది. ఆమె ఎడమకాలి చర్మం ఊడింది. తీవ్ర రక్తస్రావం కావడంతో వృద్ధురాలు కేకలు వేయడంతో స్థానికులు కుక్కను తరిమారు. ఆమెను రాజాం ప్రాంతీయాసుపత్రికి తరలించారు.

36 మందిపై బైండోవర్ కేసులు

రాజాం: గొలుసుకట్టు దుకాణాలు నిర్వహిస్తూ.. గతంలో దొరికిన 36 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు రాజాం అబ్కారీ సీఐ ఆర్.జైభీమ్ తెలిపారు. వీరిలో వంగర మండలంలో 30 మంది, సంతకవిటిలో ఆరుగురు ఉన్నట్లు చెప్పారు. బెల్టు షాపులు నిర్వహించడం నేరమని, ఇలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇంట్లో అగ్నిప్రమాదం

రాజాం: గుయ్యానవలసలో ఎం.నగేష్ ఇంట్లో ఆదివారం రాత్రి విద్యుదాఘాతంతో మంటలు వ్యాపించాయి. కుటుంబసభ్యులు బయటకు పరుగులు తీశారు. గ్రామస్థులు మంటలను అదుపు చేశారు. ఇంట్లో దాచుకున్న రూ.30 వేల నగదు, ఎలక్ట్రానిక్, ఇతర వస్తువులు దగ్ధమైనట్లు బాధితుడు కన్నీరు మున్నీరయ్యారు. రూ.1.50 లక్షల వరకు నష్టం జరిగినట్లు చెబుతున్నారు.

రీసర్వే సమస్యలు పరిష్కరించాలి

గంట్యాడ గ్రామీణం: రీసర్వే చేసినా తప్పులు ఎక్కువగా ఉంటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గొడియాడ సచివాలయంలో అధికారులను ప్రశ్నించారు. రీసర్వే చేసి ఉపయోగమేంటని నిలదీశారు. అన్ని సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దారు నీలకంఠేశ్వరరెడ్డి హామీ ఇచ్చారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన.. బొబ్బిలి గ్రామీణం: బొబ్బిలి మండలం చింతాడలో పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని అధికారులు సోమవారం పరిశీలించారు. పరీక్షల నిర్వహణ సహాయ కమిషనర్ టి.సన్యాసిరాజు, ఎంఈవో వాసుదేవరావు గదులను చూసి, సదుపాయాల విషయం ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీ చేస్తున్నామన్నారు. ★ బాడంగి: బాడంగి జడ్పీ ఉన్నత, రేజేరు రెసిడెన్షియల్ పాఠశాలల పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

నాలుగోసారైనా.. టెండర్ పడేనా?

గరివిడి, న్యూస్‌టుడే: అడుగుకో గుంతతో అధ్వానంగా తయారైన గరివిడి- గర్భాం ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారి అభివృద్ధి పనులను గుత్తేదారుకు అప్పగించేందుకు నాలుగోసారి టెండర్ పిలిచారు. గత మూడుసార్లూ గుత్తేదారులు ముందుకు రాలేదు. ఈసారైనా టెండర్లు వేస్తారా.. పనులకు మోక్షం లభిస్తుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. గరివిడి నుంచి గర్భాం వైపు 7.5 కి.మీ పొడవున దెబ్బతినడంతో రూ.3 కోట్లు కేటాయించారు. ఈనెల 8 వరకు టెండర్ దాఖలు చేయడానికి గడువు ఉందని ఆర్‌అండ్‌బీ ఏఈ జార్జి వెస్లీ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులు సోమవారం మండల విద్యా వనరుల కేంద్రం వద్ద ధర్నా చేశారు. నెలకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలని, మెనూ బిల్లు పెంచాలని కోరారు. ఎంఈవో వాసుదేవరావుకు వినతిపత్రం అందించారు. సీఐటీయూ నాయకులు శంకరరావు, లక్ష్మి, వెంకటలక్ష్మి, హేమ పాల్గొన్నారు.

కార్మికుల సంఖ్య పెంచాలి

రాజాం, న్యూస్‌టుడే: పట్టణ విస్తరణకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని, ఉన్న వారిపై పనిభారం తగ్గించాలని ఆ సంఘం గౌరవాధ్యక్షుడు సీహెచ్ రామ్మూర్తినాయుడు డిమాండు చేశారు. సోమవారం రాజాం పుర కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. 50 వేలకు పైగా జనాభా ఉన్న పట్టణంలో 50 నుంచి 60 మంది కార్మికులతో నెట్టుకురావడం సబబుకాదన్నారు. నాయకులు లక్ష్మి, అనిల్‌కుమార్, గురువులు, బాలరాజు పాల్గొన్నారు.

పట్టాలివ్వాలని గిరిజనుల నిరసన



నినాదాలు చేస్తున్న గిరిజనులు

రామభద్రపురం, న్యూస్‌టుడే: తాము సాగుచేస్తున్న భూములకు పట్టాలివ్వాలని కొట్టక్కి ఎంఎస్‌ఎంఈ పార్కు వద్ద సాగుచేస్తున్న గిరిజనులు సోమవారం రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. సీఐటీయూ జిల్లా నాయకుడు బలస శ్రీను ఆధ్వర్యంలో నినాదాలు చేశారు. కొండకెంగువ, గొల్లపేట గ్రామాల్లో భూములకు పట్టాలివ్వాలని కోరారు. తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. నాయకులు ఎర్రన్నాయుడు, శ్రీను, లక్ష్మి, తౌడమ్మ తదితరులు పాల్గొన్నారు.

త్రివేణి సంగంలో స్నానాలొద్దు

సంగమేశ్వరంలో అర్చకులతో మాట్లాడుతున్న సీఐ

వంగర, న్యూస్‌టుడే: కార్తికమాసం సందర్భంగా ఆలయాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రాజాం రూరల్ సీఐ హెచ్ ఉపేంద్రరావు తెలిపారు. సోమవారం సంగమేశ్వర దేవాలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులతో మాట్లాడారు. త్రివేణి సంగం వద్ద ఎవరూ స్నానాలు చేయకూడదని, లోతట్టు ప్రాంతాలకు వెళ్లొద్దని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఎస్సై షేక్ శంకర్ ఉన్నారు.

రహదారికి మరమ్మతులు

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బొబ్బిలి మండలం కారాడ వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి మరమ్మతులకు గురై గోతులు ఏర్పడ్డాయి. వాహనాలు వాటిల్లో కూరుకుపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఎమ్మెల్యే బేబినాయన స్పందించి, తన సొంత నిధులతో మరమ్మతులు చేయించారు. నీరు నిలిచిపోకుండా కల్వర్టు నిర్మించడానికి పైపులు ఎమ్మెల్యే సమకూర్చారని, ఏర్పాటు చేస్తామని నాయకులు చంద్రశేఖర్, రాము తెలిపారు.

మహిళా రైతులకు యంత్రాల పంపిణీ

పరికరాలతో లబ్ధిదారులు, నాయకులు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి పరిసర గ్రామాలకు చెందిన మంది 15 మంది మహిళా రైతులకు విత్తనాలు విత్తుకునే యంత్రాలను అడ్వాంటా కంపెనీ సీఎస్‌ఆర్ కార్యక్రమం కింద ఏఎంసీ ఛైర్మన్ రేగాన రామారావు, తెదేపా మండలాధ్యక్షుడు రౌతు కామునాయుడు, జనసేన నాయకుడు విసినిగిరి శ్రీనివాసరావు సోమవారం అందజేశారు. కంపెనీ ప్రతినిధులు రోహిత్‌కుమార్, మహేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా పోరాటం

మెంటాడలో మాట్లాడుతున్న కూటమి నాయకులు

మెంటాడ, న్యూస్‌టుడే: మెంటాడ మండలాన్ని విజయనగరం జిల్లాలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కూటమి నాయకులు కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. సోమవారం మెంటాడలో సమావేశమయ్యారు. విజయనగరంలో కొనసాగించేలా రాజకీయాలకు అతీతంగా పోరాడాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈనెల 10న సీఎంను కలిసి వినతిపత్రాలు అందజేయాలని నిర్ణయించారు.

(c) eenadu

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

చిత్రాలు గీశారు.. ప్రశంసలు పొందారు

విజయనగరంలోని బాలాజీనగర్ న్యూసెంట్రల్ పాఠశాలలో సోమవారం ఈనాడు- ఈటీవీ ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'మీకు ఇష్టమైన పండగ' అనే అంశంపై నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఎ.యోషత్ ప్రియ(తొమ్మిదో తరగతి), కె. ప్రణీత్(తొమ్మిదో తరగతి), ఎన్.హర్షిత(తొమ్మిదో తరగతి)కు ప్రధానాచార్యుడు సి.హెచ్.వి.ఎం.రవితేజ, ఉపాధ్యాయుడు డి.శ్రీనివాసరావు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. ★ రాజీవ్‌నగర్ కాలనీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు 'ప్రకృతి అందాలు' అంశంపై నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో జి.వి వర్మ(ఎంపీసీ), అలేఖ్య(బైపీసీ), కె. రాణి(ఓఏఎస్) ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రధానాచార్యుడు కృష్ణారావు, అధ్యాపకులు సుబ్రహ్మణ్యం, రాధిక, కృష్ణ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

బాలాజీనగర్ న్యూసెంట్రల్ పాఠశాలలో..

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ఎస్.కోట, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో తుప్పలు తొలగించి, మొక్కలు నాటారు. అనంతరం సమాచార హక్కు చట్టంపై ఉద్యమకారుడు డి.సూర్యారావు, పరిశుభ్రతపై రసాయనశాస్త్ర అధ్యాపకుడు భాస్కర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మొక్క నాటుతున్న అధ్యాపకుడు, విద్యార్థులు

మాకో ఉద్యోగం కావాలి

★ కౌశలం సర్వేకు స్పందన
★ నగరపాలికలో 7,174 రిజిస్ట్రేషన్లు

న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

నిరుద్యోగులకు ఇంటివద్దే ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా కౌశలం సర్వే చేపట్టింది. ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి అర్హులైన వారి వివరాలు సేకరించారు. అభ్యర్థులు సైతం స్వయంగా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించారు. ఈ ప్రక్రియ ఈనెల 5తో ముగియనుంది. ఇంకెవరైనా అర్హులుంటే సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఇదీ ప్రయోజనం..

ఈ సర్వే ద్వారా యువతకు సంబంధించిన విద్యార్హతలు, నైపుణ్యం, వివిధ రంగాల్లో అనుభవం, భాష, వ్యక్తిగత వివరాలు నేరుగా ప్రభుత్వానికి చేరుతాయి. నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఇతర శాఖలు పరిశీలించి, వర్క్‌ఫ్రం హోంకు అవకాశం కల్పిస్తాయి. ఇప్పటికే 7,174 మంది నమోదయ్యారు.

వివరాలు నమోదు చేస్తున్న సచివాలయ సిబ్బంది

అవసరమైనవి ఇవీ..

★ ఆధార్ కార్డు ★ చరవాణి నంబరు ★ ఈమెయిల్ ఐడీ★ ఏం చదివారు ★ ఉత్తీర్ణత పొందిన సంవత్సరం ★ పాఠశాల/కళాశాల వివరాలు ★ తెలిసిన భాషలు ★ మార్క్‌షీట్లు ★ ధ్రువపత్రాల ఫొటోలు

వీరు అర్హులు..

తొలుత ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ చదువుకున్న వారికి మాత్రమే అవకాశం ఉండేది. ఆగస్టు 15న విడుదలైన కొత్త మార్గదర్శకాల ప్రకారం పదో తరగతి, ఆలోపు చదువుకున్నవారు, ఇంటర్ వారు సైతం నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యాభ్యాసం కొనసాగిస్తున్నవారైతే దరఖాస్తును నవీకరించుకోవచ్చు.

రిజిస్ట్రేషన్ లింకు: ● https: //gsws-nbm.ap.gov.in/BM/kaushalam
● క్యూఆర్‌కోడ్ కూడా అందుబాటులో ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి..

నిరుద్యోగులకు ఇదో మంచి అవకాశం. సద్వినియోగం చేసుకోవాలి. నగరపాలిక పరిధిలో వీలైనంత వరకు సర్వే చేపట్టాం. ఇంకెవరైనా ఉండిపోతే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. సమీపంలోని సచివాలయాన్ని సంప్రదించినా.. స్పందిస్తారు.

– పి.నల్లనయ్య, కమిషనరు, నగర పాలక సంస్థ

నగర పాలక సంస్థలో ఇలా.. విద్యార్హతలు కలిగిన నిరుద్యోగులు: 19,736 | సచివాలయాల ద్వారా నమోదు: 3,587 | స్వచ్ఛందంగా ముందుకొచ్చినవారు: 3,587

తెరపై ఈనాడు

★ ఎన్సీఎస్: డ్యూడ్ ★ శ్రీకృష్ణ: బాహుబలి ★ ఆదిత్య: కర్మణ్యే వాధికారస్తే ★ లీలామహల్: బైసన్ ★ రంజనీ స్క్రీన్–1: బాహుబలి ★ శివరంజనీ స్క్రీన్–2: మాస్ జాతర ★ హిమగిరి: మాస్ జాతర ★ సప్తగిరి: కె ర్యాంప్ – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	80085 74326
భోగాపురం	70959 54646

?: వుడాకాలనీ ఫేజ్-2లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. - జనార్దనరావు, స్థానికుడు
★ అక్కడి కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు నిర్వహిస్తాం. - పి.నల్లనయ్య, కమిషనరు
?: పూల్‌బాగ్ హనుమాన్ నగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. - స్థానికుడు ★ పరిశీలించి, బాగు చేయిస్తాం. - స్రవంతి, ఏఈ
– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం
?: బొడ్డవలస పంచాయతీ కృష్ణాపురంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో ఇబ్బంది అవుతోంది. - స్థానికులు, కృష్ణాపురం ★ స్థానిక పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి పారిశుద్ధ్యం మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటాం. - శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ, డెంకాడ. – న్యూస్‌టుడే, డెంకాడ

మీటర్లు, స్విచ్‌ల ఏర్పాటు

ఈనాడు కథనానికి స్పందన

శృంగవరపుకోట: పట్టణంలోని జగనన్న కాలనీలో విద్యుత్తు దీపాల మీటర్లు, స్విచ్‌లు పంచాయతీ సిబ్బంది ఆదివారం ఏర్పాటు చేశారు. నిరంతరం దీపాలు వెలుగుతుండడంతో దీపాలు తొలగించారు. దీనిపై ఈనాడులో 'చిమ్మచీకట్లు.. వెళ్లాలంటే ఇక్కట్లు' శీర్షికతో వెలువడిన వార్తకు అధికారులు స్పందించారు. ఈవో అనురాధ రెండు చోట్ల సిబ్బందితో పనులు చేయించారు.

ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభం

డెంకాడ: జొన్నాడ లెండి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో దువ్వపేటలో ప్రత్యేక సేవా శిబిరం సోమవారం ప్రారంభమైంది. పీవో డాక్టర్ రవితేజ ఆధ్వర్యంలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల సామాజిక అవసరాలకు సంబంధించి వివిధ అంశాలపై వివరాలు సేకరించారు.

రాత్రికి రాత్రే రూపుమారింది

మంగళపాలేనికి సమీపంలో రహదారికి రైల్వే పట్టాలకు మధ్యనున్న స్థలం రూపురేఖలు రాత్రికిరాత్రే మారింది. ఆదివారం చీకటిపడే వరకు కంచె తుప్పలతో ఉన్న ఈ స్థలం సోమవారం ఉదయం చూసేసరికి మట్టి, కంకరతో చదును చేసి ఉంది. సుమారు 5 సెంట్ల స్థలం చదును చేయడంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇటుగా బైపాస్ రోడ్డు నిర్మిస్తుండడంతో రాత్రి వేళల్లో పలువురు అక్రమంగా బడ్డీలు పెట్టడం, తర్వాత దుకాణాలు నిర్మిస్తున్నా అధికారుల స్పందన లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడ చదును చేసిన స్థలం గురించి మండల రెవెన్యూ పరిశీలకుడి (ఎంఆర్ఐ) దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, కొత్తవలస

ఇది సీసీ రహదారే

లక్కవరపుకోట మండలంలోని కొట్యాడ గ్రామంలో సీసీ రోడ్లపై పారుతున్న మురుగుతో గ్రామస్థులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్లకు ఇరువైపులా కాలువలు లేకపోవడంతో వర్షం నీరు, మురుగు నిల్వ ఉండి బురదగా మారుతోంది. కాలువలు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై డిప్యూటీ ఎంపీడీవో కుమార్ వద్ద ప్రస్తావించగా కాలువలు లేకపోవడంతో సమస్యగా మారిందని తాత్కాలికంగా పనులు చేపడతామన్నారు. తర్వాత 15వ ఆర్థిక సంఘం నిధులతో కాలువల నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. –న్యూస్‌టుడే, ఎల్.కోట

పొంచివున్న ప్రమాదం

ఆరోగ్యం బాగోలేదని చూపించుకుందామని కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాని(పీహెచ్సీ)కి వెళ్లేవారు ఆదమరిస్తే ప్రమాదం బారిన పడినట్లే. ఆసుపత్రి ప్రవేశ దారి ముందు కాలువపై వేసిన సిమెంటు పలకలు కొన్ని విరిగిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. పీహెచ్సీని ప్రస్తుతం ఎన్జీవో భవనంలో నిర్వహిస్తున్నారు. దీంతో ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ సమస్యను ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్, ఎంపీపీ గోపమ్మ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తవలస

రాత్రయితే భయాందోళనే!

విజయనగరం జిల్లా కేంద్రం నుంచి గ్రామీణ మండలంలోని పినవేమలి, రాకోడు పంచాయతీలకు వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు. సాయంత్రం ఆరు గంటలు దాటితే ఆ మార్గంలో కారుచీకట్లు అలుముకుంటున్నాయి. ఎక్కడా దీపాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధాన ఆర్‌యూబీ వద్ద దీపాలు ఏర్పాటు చేయలేదు. అక్కడే మందుబాబులు, గంజాయి తాగేవారు ఉంటుండడంతో వెళ్లలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. పరిశీలించి, చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వెంకటరావు తెలిపారు. – న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

త్వరితగతిన ఆధార్ అనుసంధానం

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: విజయనగరంలోని గాజులరేగ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని సోమవారం డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జున సందర్శించారు. 6,834 మంది సభ్యులు ఉండగా.. 108 మందికే ఆధార్ అనుసంధానం చేయడంపై మండిపడ్డారు. త్వరితగతిన ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. లక్ష్యాలను చేరుకోవాలని చెప్పారు. రూ.5 కోట్ల మేర కొత్త రుణాల మంజూరుకు భరోసానిచ్చారు. సీఈవో సి.హెచ్.ఉమామహేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కోరాడ వెంకటరమణ, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న నాగార్జున

తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

ఎస్.కోట, న్యూస్‌టుడే: మండలంలోని కొండమల్లిపూడి గిరిజనులకు ఇళ్లపట్టాలు, పట్టణ శివారు రేగపుణ్యగిరి రోడ్డు నిర్మాణానికి స్థల సమస్య పరిష్కరించాలని డిమాండు చేస్తూ గిరిజనులు సోమవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, గాడి అప్పారావు, మద్దిల రమణ, సీహెచ్ ముత్యాలు ఆధ్వర్యంలో వీరంతా కార్యాలయం ముందు బైఠాయించారు. తహసీల్దార్ శ్రీనివాసరావు వచ్చి పరిష్కరిస్తామని చెప్పినా ఆందోళన విరమించలేదు. దీంతో రేగపుణ్యగిరి రోడ్డు నిర్మాణానికి అభ్యంతరం చెబుతున్న రైతులను పిలిచి ప్రత్యామ్నాయ స్థలం కోసం కలెక్టరుకు లేఖ రాస్తామని, పనులు అడ్డుకోవద్దని ఒప్పించారు. కొండమల్లిపూడి గిరిజనులు 11 మందికి శుక్రవారం ఎల్పీసీలు ఇస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సతీష్, ఇంజినీరింగు అధికారులు సత్యనారాయణ, ఐశ్వర్య పాల్గొన్నారు.

సీపీఎం నాయకులు, గిరిజనులతో చర్చిస్తున్న అధికారులు

జిందాల్ పారిశ్రామికవాడ పనుల అడ్డగింత

పోలీసుల అదుపులో నిర్వాసితులు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: కిల్తంపాలెంలో జిందాల్ పారిశ్రామిక వాడ పనులు ఆపాలంటూ నిర్వాసితులు సోమవారం ఆందోళనకు దిగారు. తమ సమస్యలపై గ్రీవెన్స్‌లో వినతిపత్రం ఇచ్చేందుకు ఉదయం కలెక్టరేట్‌కు వెళ్లిన వీరంతా సాయంత్రం 4 గంటల సమయంలో పారిశ్రామిక వాడ వద్ద పనులు ఆపేందుకు వెళ్లి నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అడ్డుకుని రెండు ఆటోల్లో 18 మంది మహిళలను ఎస్.కోట పోలీసుస్టేషనుకు తరలించారు. విషయం తెలుసుకున్న బొడ్డవర దీక్షా శిబిరంలోని నిర్వాసితులు స్టేషన్‌కు వెళ్లేందుకు బయలుదేరగా సీఐ నారాయణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు వారిని బయటకు రాకుండా అడ్డుకున్నారు. వారొచ్చేవరకూ ఆందోళన చేస్తామంటూ వర్షంలో నిరసన తెలిపారు. సాయంత్రం ఆ మహిళలను విడిచిపెట్టారు. వారికి స్టేషన్‌లో కౌన్సిలింగ్ చేసి పంపామని సీఐ తెలిపారు.

కిల్తంపాలెంలో నిర్వాసితుల నిరసన

విజయనగరం కాశీవిశ్వేశ్వర గుడిలో..

డెంకాడ శివాలయంలో..

కొత్తవలసలో...

మార్మోగిన శివనామస్మరణ

విజయనగరం కంటోన్మెంట్, గ్రామీణం, నెల్లిమర్ల, డెంకాడ, జామి, వేపాడ, కొత్తవలస: జిల్లాలోని శైవక్షేత్రాలకు సోమవారం వేకువజాము నుంచే భక్తులు పోటెత్తారు. కార్తికమాసం రెండో వారం కావడంతో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. బసవేశ్వర ఆలయాన్ని సందర్శించిన జడ్పీ ఛైర్మన్ శ్రీనివాస్ పూజలు చేశారు. చింతలవలస బెటాలియన్ వద్ద ఉన్న ఉమారామలింగేశ్వర ఆలయం కిటకిటలాడింది. మంగళపాలెం అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వరస్వామి, తుమ్మికాపల్లి ఓంకార ఆశ్రమం ప్రాంగణంలోని ఉమామహేశ్వర ఆలయంలో పూజలు చేశారు.

బాబామెట్ట ఆలయంలో దర్శనాలకు బారులుదీరిన భక్తులు

ముగిసిన గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు

కొత్తవలస, న్యూస్‌టుడే: మంగళపాలెంలో చేపట్టిన గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు సోమవారం రాత్రి ఘనంగా ముగిసాయి. రామాలయం మండపంలో ప్రతిష్ఠించి పూజించిన ఉత్సవ విగ్రహాన్ని వీధుల్లో ఊరేగించారు. గ్రామస్థులు సారెను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు.

1,200 మందికి దుప్పట్ల పంపిణీ

జామి, న్యూస్‌టుడే: జామి పడాలవీధిలోని బసవేశ్వరాలయంలో నీలకంఠేశ్వర దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తిక గణారాధన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. 40 ఏళ్లుగా వీరు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 1200 మంది పేదలకు సుమారు రూ.1.5 లక్షల విలువైన దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం 5వేల మందికి అన్నసమారాధన చేశారు. దాతల సహకారంతో వస్త్రదానం, అన్నదానం చేస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు గోపాలకృష్ణ తెలిపారు. బ్రహ్మానందం, మాజీ సర్పంచి రమణ, అప్పారావు, సూరిదేముడు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు అందిస్తున్న సంఘ సభ్యులు

పోలిపల్లిలో బంగార్రాజు జన్మదిన వేడుకలు

భోగాపురం, డెంకాడ: పోలిపల్లిలో మార్క్‌ఫెడ్ ఛైర్మన్, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం శివాలయం, పైడితల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం కాష్వి ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య, రక్తదాన శిబిరాలు ప్రారంభించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు అనంతరం కేకు కోశారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కె.అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు కళా వెంకటరావు, అదితి, బేబినాయన, నాగమాధవి, మాజీ ఎమ్మెల్సీ రఘువర్మ, తెదేపా జిల్లా అధ్యక్షుడు కె.నాగార్జున, నాయకులు రవిశేఖర్, చిన్నంనాయుడు, చంద్రశేఖర్, అప్పలనారాయణ, కె.సత్యనారాయణ, కె.ఆనంద్‌కుమార్ వచ్చి శుభాకాంక్షలు చెప్పారు. ★ బొడ్డవలస పంచాయతీ తెదేపా నాయకుడు చందక తేజ ఆధ్వర్యంలో సోమవారం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

బంగార్రాజు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

స్వెట్లర్ల పంపిణీ

డెంకాడ: భీమిలికి చెందిన హెచ్.ఎస్.ఫౌండేషన్ ద్వారా డెంకాడ భవిత కేంద్రంలో చదువుతున్న ప్రత్యేకావసరాల పిల్లలకు సోమవారం స్వెట్టర్లు(చలి కోట్లు) పంపిణీ చేశారు. వీటిని జిల్లా ఉప విద్యాశాఖాధికారి, ఎంఈవో-1 కె.వి.రమణ, ఫౌండేషన్ ప్రతినిధులు ఎస్.వి.మూర్తి, రోజారమణి చేతుల మీదుగా పిల్లలకు అందజేశారు.

వినతులకు సకాలంలో పరిష్కారం

విజయనగరం పట్టణం: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే వినతులను సకాలంలో పరిష్కరిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు. సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌ను ఏడుగురు ఆశ్రయించారన్నారు.

మూడేళ్ల జైలు శిక్ష

న్యాయవార్తా విభాగం: జామి మండలంలోని ఓ గ్రామానికి చెందిన వి.శివ అనే వ్యక్తి అదే ప్రాంతానికి చెందిన బాలికతో గతేడాది జూన్‌లో అసభ్యకరంగా ప్రవర్తించాడు. అప్పట్లో పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు, కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు వచ్చింది. బాధితురాలికి రూ.50 వేల పరిహారం అందించాలని కోర్టు ఆదేశించింది.

వక్తృత్వ పోటీలకు స్పందన

కంటోన్మెంట్: గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో నగరంలోని కేంద్ర గ్రంథాలయంలో సోమవారం జరిగిన జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలకు స్పందన వచ్చింది. నలుమూలల నుంచి 500 మందికిపైగా హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

సకాలంలో బిల్లుల చెల్లింపులు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి గుత్తేదారులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నట్లు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని బిల్లులనూ అప్‌లోడ్ చేశామని, ఎప్పటికప్పుడు నిధులు విడుదలవుతున్నట్లు చెప్పారు. గుత్తేదారులు ఆందోళన చెందొద్దని కోరారు.

మహాన్నదానానికి ఏర్పాట్లు

కంటోన్మెంట్: విజయనగరం పైడితల్లి అమ్మవారి మహాన్నదానానికి ఏర్పాట్లు చేసినట్లు ఈవో శిరీష తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మూడులాంతర్లు సమీపంలోని చదురుగుడి వద్ద అన్న ప్రసాదాలు అందజేస్తామని చెప్పారు.

హుండీల చోరీ నిందితుల అరెస్టు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: మండలంలో ఇటీవల ఆలయాల్లో చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. గొర్లెపేట ప్రాంతంలోని రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం, డి.నెలివాడలోని రాజరాజేశ్వరి ఆలయంలో హుండీల చోరీపై నిర్వాహకుల ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. భోగాపురం సీఐ జి.రామకృష్ణ బృందం సీసీ కెమెరాల ఆధారంగా గరివిడి మండలం అర్తమూరుకు చెందిన ఎస్.దుర్గాప్రసాద్, ఎం.పవన్‌లు నిందితులుగా గుర్తించి పట్టుకున్నారు. వారి నుంచి రూ.9 వేల నగదు, బైకును సీజ్ చేసినట్లు ఎస్సై కె.గణేష్ తెలిపారు.

ఒప్పంద కార్మికులకు న్యాయం చేయండి

కొత్తవలస: మండలంలోని జిందాల్ పరిశ్రమను యాజమాన్యం మూసివేసినందున కాంట్రాక్టు కార్మికులకు కనీసవేతనం లేఆఫ్‌గా చెల్లించాలని కోరుతూ ఈ పరిశ్రమ కాంట్రాక్టు కార్మికుల టీఎన్‌టీయూసీ సంఘం సోమవారం కలెక్టర్ రాంసుందర్ రెడ్డిని కోరింది. గౌరవాధ్యక్షుడు శ్రీను, నాయకులు అప్పారావు, సన్యాసి వినతిపత్రం ఇచ్చారు.

ఎస్‌జీఎఫ్ అబ్జర్వర్‌గా ఎంపిక

క్రీడా విభాగం: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 అథ్లెటిక్స్ పోటీలకు రాష్ట్ర అబ్జర్వర్‌గా జొన్నాడ జడ్పీ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు లీలాకృష్ణ ఎంపికయ్యారు. డీఈవో మాణిక్యం నాయుడు, స్కూల్‌గేమ్స్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మి అభినందించారు.

బకాయిలు చెల్లించాలని డిమాండు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో రెండేళ్లుగా చేపట్టిన పనులకు చెల్లింపులు లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని మున్సిపల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు వాపోయారు. సోమవారం సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సకాలంలో బిల్లులు అప్‌లోడ్ చేయాలని, త్వరితగతిన నిధులు విడుదల చేయాలని కోరారు. ట్రెజరీ ద్వారా చెల్లింపులు చేయాలని నినదించారు. రూ.16 కోట్ల బకాయిలున్నాయని చెప్పారు. అసోసియేషన్ అధ్యక్షుడు బి.బంగారురాజు, వివిధ సంఘాల నాయకులు ఎస్.విజయ్‌కుమార్, సాధూరావు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న గుత్తేదారులు

క్రికెట్ జట్లు సిద్ధం

విజయనగరం క్రీడా విభాగం, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-17(బాలికలు), అండర్-14(బాలురు) క్రికెట్ టోర్నమెంట్లకు జిల్లా జట్ల ఎంపిక పోటీలను సోమవారం విజ్జీ మైదానంలో నిర్వహించారు. రెండు జిల్లాల నుంచి క్రీడాకారులు తరలి రాగా, ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేసినట్లు స్కూల్‌గేమ్స్ కార్యదర్శులు కోరాడ గోపాలరావు, ఎస్.విజయలక్ష్మి తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

జరజాపుపేట, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లాలో ఈనెల 7 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు జరజాపుపేట ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.తిరుపతిరావు సోమవారం తెలిపారు.

నైపుణ్యాలు పెంపొందించుకోండి

డెంకాడ: ఇంజినీరింగ్ విద్యార్థులు సృజనాత్మకత, నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ మాజీ సీఈవో దామల్ల తిరుమలరావు అన్నారు. జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో 'టెక్నాలజీ వర్సెస్ హ్యూమన్ ఇంటెలిజెన్స్' అనే అంశంపై ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన తిరుమలరావు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కోవడానికి సృజనాత్మక ఆలోచనలు పెంపొందించుకోవాలన్నారు. ప్రిన్సిపల్ రామారెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న తిరుమలరావు

పంటలకు మద్దతు ధర కల్పించాలి

విజయనగరం అర్బన్, బాబామెట్ట: మొక్కజొన్న, పత్తి పంటలకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతులను ఆదుకోవాలని కౌలు రైతుల సంఘం రాష్ట్ర నాయకులు బి.రాంబాబు, అప్పారావు, పైడినాయుడు డిమాండు చేశారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. ❖ మొంథా తుపాను కారణంగా నష్టపోయిన రైతు కూలీలు, చేతివృత్తుల వారిని ఆదుకోవాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కులాల ఐక్యవేదిక నాయకులు కోరారు. కొత్తధర్మపురిలోని శ్మశాన వాటికను కొందరు ఆక్రమించారని, చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతం వాసులు ధర్నా చేపట్టారు. ❖ తమకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించి, అన్నివిధాలా ఆదుకోవాలని జిందాల్ బాధితులు కోరారు.

సమస్య చెబుతున్న అర్జీదారులు

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కొత్త ధర్మపురి వాసులు

అర్హుల జాబితా ప్రకటించండి

కొత్తవలస: కొత్తవలసలో ఇళ్ల స్థలాలు కోసం విచారణ చేసిన వారిలో అర్హుల జాబితాను ప్రకటించాలని సీపీఐ జిల్లా సమితి కార్యవర్గ సభ్యుడు అప్పలరాజు డిమాండ్ చేశారు. సంబంధిత పట్టాదారులతో కలిసి తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేసి హెచ్‌డీటీ సునీతకు వినతిపత్రం ఇచ్చారు.

అదనపు భవనం పూర్తి చేయరూ

జామి: సుమారు 460 మంది విద్యార్థులు ఉన్న జామి జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో అదనపు భవనాలకు పూర్తి సౌకర్యాలు కల్పించాలని కలెక్టరు ఎస్.రాంసుందర్‌రెడ్డికి విజయనగరంలో ఆ పాఠశాల విద్యా కమిటీ అధ్యక్షుడు శ్రీను, ఉపాధ్యక్షురాలు వి.సత్యవతి, కమిటీ సభ్యులు గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు.

(c) eenadu

నేడు 'ఈటీవీ' కార్తిక దీపోత్సవం

హరిహరులు ఇద్దరికీ ఎంతో ప్రీతికరమైన కార్తిక మాసం. దీంతో సమానమైన మాసం, గంగతో సమానమైన తీర్థం లేదని పురాణోక్తి. విశిష్ట సంపదను ప్రసాదించే ఈ మాసంలో దీపారాధనకు ఉన్న ప్రాధాన్యం అసమానమైనది. 'ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ, ఈటీవీ లైఫ్' చానళ్ల ఆధ్వర్యంలో కార్తిక దీపోత్సవం నిర్వహించనున్నారు. ఈ దీపోత్సవంలో పాల్గొనే మహిళలకు పూజ సామగ్రి నిర్వాహకులే సమకూరుస్తారు. ఎంట్రీ పాసులు కావాల్సిన వారు మంగళవారం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 మధ్యలో తణుకు పట్టణంలోని నూలి గ్రౌండ్స్, జ్యూయల్ హోమ్స్ పక్కన, ఎస్ఎన్వీటీ జూనియర్ కాలేజ్ వద్ద పంపిణీ చేస్తారు. పరిమిత సంఖ్యలోనే పాసులు ఉంటాయి. చిన్నపిల్లలకు అనుమతి లేదు. నేరుగా కార్యక్రమానికి వారు మాత్రమే హాజరు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు. - ఈనాడు, తణుకు

పరిమిత సంఖ్యలో నేడు ఎంట్రీ పాసుల పంపిణీ

సమయం: ఈరోజు (మంగళవారం) సాయంత్రం 5 గంటలకు

స్థలం: నూలి గ్రౌండ్స్, జ్యూయల్ హోమ్స్ పక్కన, ఎస్ఎన్వీటీ జూనియర్ కాలేజ్ వద్ద, తణుకు

ETV ఆంధ్రప్రదేశ్ | ETV తెలంగాణ | ETV Life

ఈ ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారం నేటి సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు.

11న జడ్పీ సమావేశం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ కార్యాలయంలో ఈ నెల 11న ఉదయం 10 గంటలకు ఉమ్మడి జిల్లా ప్రజా పరిషత్తు 1 నుంచి 7 వరకు స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సీఈవో ఎం. శ్రీహరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు సర్వసభ్య సమావేశం ఉంటుందని చెప్పారు.

24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ: మంత్రి

రైతు ఏడుకొండలు నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్న మనోహర్, చిత్రంలో కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యేలు బొలిశెట్టి, పితాని తదితరులు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం తాడేపల్లిగూడెం పట్టణం, గ్రామీణ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు పలువురు ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. పట్టణంలోని ఎస్వీఆర్ సర్కిల్‌లోని హౌసింగ్‌బోర్డు కాలనీ రోడ్డులో రైతుబజార్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మండలంలోని ఆరుగొలనులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ మునుపెన్నడూలేని విధంగా రైతులు ధాన్యం అమ్మిన 24 గంటల్లోగా వారి ఖాతాల్లో నగదు జమవుతుందన్నారు. యాప్ ద్వారా రైతులు ధాన్యాన్ని అమ్ముకోవచ్చన్నారు. ధాన్యం విక్రయించడానికి వచ్చిన రైతు ఏడుకొండలుతో మంత్రి మాట్లాడారు. మంత్రి అక్కడ ఉండగానే ఆ రైతు బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ కావడం గమనార్హం. గ్రామంలో డొక్కా సీతమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించి సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, పితాని సత్యనారాయణ, శ్రీధర్, మద్దిపాటి వెంకటరాజు, రోషన్ కుమార్, చిర్రి బాలరాజు, ఏపీ భవన, ఇతర నిర్మాణ కార్మికుల బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జీ, పౌరసరఫరాల సంస్థ వీసీ, ఎండీ డిల్లీరావు, డైరెక్టర్ ఆర్.గోవిందరావు, ఛైర్మన్ తోట మెహర్ సీతారామ సుధీర్, ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి జడ్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రండి.. పరిశ్రమించండి!

- ఔత్సాహికులకు ప్రోత్సాహం
- యువత ఉపాధికి బాటలు
- ఎఫ్ఎఫ్‌సీ నిర్మాణాలకు టెండర్లు పూర్తి

ఈనాడు డిజిటల్, భీమవరం, నరసాపురం, న్యూస్‌టుడే

వైకాపా ప్రభుత్వం అటకెక్కించిన పరిశ్రమల అభివృద్ధిని పట్టాలెక్కించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతీ నియోజకవర్గంలోనూ ఇండస్ట్రియల్ పార్కులతో పాటు స్థానిక యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా భౌగోళిక పరిస్థితులకనుగుణంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)ను ఏర్పాటుచేసి ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ప్రణాళికలు చేసి, అమలు చేస్తున్నారు. అటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

కొబ్బరికి అనుమతి

భీమవరంలో ఆక్వా వ్యర్థ పదార్థాల ప్రాసెసింగ్ యూనిట్, దువ్వలో ప్రింటింగ్ ఆధారిత పరిశ్రమ, యలమంచిలిలో కొబ్బరి ఉత్పత్తుల మార్కెటింగ్ పరిశ్రమల ఏర్పాటును గుర్తించారు. ఒక్కో క్లస్టర్‌కు రూ.10 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. ఇందులో కొబ్బరి ఉత్పత్తుల మార్కెటింగ్‌కు కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు నుంచి అనుమతులొచ్చాయి. జిల్లాలో 49,500 ఎకరాల విస్తీర్ణంలో కొబ్బరి ఉండగా 8 వేల మంది దింపు, ఒలుపు కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఇది ప్రారంభమైతే ఇతర కార్మికులకూ ఉపాధి లభించనుంది.

ప్రత్యేక నిర్మాణాలు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి, తయారీ రంగానికి ఊతమివ్వాలనే లక్ష్యంతో చేపడుతున్న వీటిని నిర్మాణాలు మొదలుపెట్టాక ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. గతంలో ఎంఎస్ఎంఈలకు స్థలాలు కేటాయిస్తే.. అక్కడ భవనాలు నిర్మించుకుని కార్యకలాపాలు సాగించేవారు. ఇందుకు వ్యయప్రయాసలు పడాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రభుత్వమే జీప్లస్ 2 బహుళ అంతస్తుల భవనం నిర్మించి ప్లగ్ అండ్ ప్లే విధంగా నేరుగా కార్యకలాపాలు ప్రారంభించే వెసులుబాటు కల్పిస్తున్నారు. రోడ్లు, పార్కింగ్, పచ్చదనం, ప్రహరీ, విద్యుద్దీకరణ, భవిష్యత్తు విస్తరణను దృష్టిలో ఉంచుకుని వీటిని నిర్మించనున్నారు.

అంచనాలు సిద్ధం

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించే క్రమంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్(ఎఫ్ఎఫ్‌సీ) నిర్మాణాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉండి నియోజకవర్గంలోని పాలకోడేరు మండలం విస్సాకోడేరులో 9.78 ఎకరాలు, నరసాపురం నియోజకవర్గం నరసాపురం మండలంలోని లిఖితపూడిలో 9.09 ఎకరాలు సేకరించారు. మే నెలలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు చేశారు. తాజాగా వాటికి టెండర్లు పూర్తవడంతో నిర్మాణాల అంచనాలను అధికారులు రూపొందిస్తున్నారు.

అన్నీ ఒకే చోట

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే ఆలోచన, పట్టుదల, సాంకేతిక అంశాలపై అవగాహన ఉన్నవారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళిక చేశారు. బహుళ తయారీ యూనిట్లు అన్నీ ఒకేచోట ఏర్పాటు చేసుకునేలా ఏపీఐఐసీ ద్వారా మౌలిక వసతులు కల్పిస్తోంది. వాటిద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పరిశ్రమల శాఖ అధికారి మంగపతి తెలిపారు.

దొడ్డిపట్లలో మాట్లాడుతున్న మంత్రి రామానాయుడు

తుపాను సన్నద్ధత దేశానికే ఆదర్శం: నిమ్మల

పాలకొల్లు, న్యూస్‌టుడే: మొంథా తుపానును సమర్థంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సాంకేతికంగా అవేర్ 2.0 వ్యవస్థను వినియోగించుకుని దేశానికే ఆదర్శంగా నిలిచిందని మంత్రి రామానాయుడు అన్నారు. దొడ్డిపట్లలో తుపాను బాధిత కుటుంబాలకు ఆయన సోమవారం నిత్యావసర సరకులు, బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విపత్తులో చిక్కుకున్న రాష్ట్రాన్ని ముందస్తు సన్నద్ధతతో గంటల వ్యవధిలో సాధారణ స్థితికి తెచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు.

భారీ వర్షంతో జలమయం

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణంలో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురవడంతో పలు వీధులు జలమయమయ్యాయి. బస్టాండ్ ప్రాంగణం చెరువును తలపించింది.

ఆశలకు ఆయువునిచ్చారు.. ఆటలకు బాటలేశారు!

మహిళా జట్టు విజయం స్ఫూర్తిదాయకం

- న్యూస్‌టుడే, భీమవరం పట్టణం, ఏలూరు నగరం

భారత మహిళా క్రికెటర్లు తమ ఆశలకు ఆయువునిచ్చారు. ఇకపై మరింత ముమ్మరంగా ఆటలాడేందుకు బాటలేశారు. తమ భవిష్యత్తుకు కొంగొత్త ధీమానిచ్చారు. వారి విజయం యావత్తు దేశానికి స్ఫూర్తిదాయకం. ఇప్పుడిప్పుడే అండర్-19, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నాం. ఇదే తరహాలో తాము క్రికెట్‌లో మరింత సాధన చేస్తాం.. గొప్ప విజయాలు సాధిస్తాం అని పలువురు ధీమా వ్యక్తం చేస్తున్నారు. క్రికెట్‌లో సత్తా చాటుతున్న ఉమ్మడి జిల్లాలోని క్రీడాకారిణులపై కథనం.

మరింత బలాన్నిచ్చింది.. మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్ కైవసం చేసుకోవడం నాకు మరింత బలాన్నిచ్చింది. అంతర్జాతీయ మైదానాల్లో భారత జెర్సీ ధరించి.. జట్టుకు విజయాలు అందించాలన్నది నా ధ్యేయం. తదనుగుణంగా కష్టపడి సాధన చేస్తున్నా. తల్లిదండ్రులు, శిక్షకుల ప్రోత్సాహం ఎనలేనిది. అండర్-19 క్రికెటర్‌గా రాణిస్తున్నా. తొమ్మిదో ఏట నుంచే క్రికెట్‌లో శిక్షణ పొందుతున్నా. ఫాస్ట్ బౌలర్‌గా జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయిల్లో సత్తా చాటా. **- మావూరి మోక్షిత శివ, ఏలూరు**

నెరవేరిన కల.. క్రికెట్ మహిళా వన్డే ప్రపంచ కప్‌లో భారత జట్టు క్రీడాకారిణులు చిరస్మరణీయం విజయం సొంతం చేసుకున్నారు. సమష్టిగా రాణించి.. దేశ ప్రజల కల నెరవేర్చారు. నేను పాఠశాల స్థాయి నుంచే క్రికెట్ ఆడుతున్నా. అండర్-15 జట్టు తరఫున గతేడాది గుజరాత్‌లో ఆడా. ఓపెనింగ్ బ్యాటర్‌గా రాణిస్తున్నా. జాతీయ జట్టులో స్థానమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నా. ప్రతి మ్యాచ్ నుంచి కొత్త విషయాలు తెలుసుకుంటూ.. లోపాలు సరిచేసుకుంటా. తాజాగా అండర్-19 జట్టు వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యా. **- ఓరుగంటి సాహితీ, దేవరపల్లి**

పట్టుదల.. ప్రేరణతో.. భారత క్రికెట్ మహిళా జట్టు మైదానాల్లో ఆడుతుంటే ప్రత్యక్షంగా చూస్తుంటాం. వారిలా జాతీయ జట్టులో స్థానం దక్కించుకోవాలన్న లక్ష్యంతో అడుగులేస్తున్నాం. మాకు స్మృతి మంధాన ఆట ప్రేరణ. అంతర్ జిల్లాల పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర జట్టులో స్థానం దక్కించుకున్నాం. ఇక్కడ సత్తా చాటి జాతీయ జట్టులో మెరికల్లా తయారవుతాం. **- కె.వై.ఎం.వల్లీ, తణుకు, పి.రిషి కృష్ణన్, తాడేపల్లిగూడెం**

కలెక్టరేట్ కిటకిట

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టర్ కార్యాలయం ఆవరణ సోమవారం మీకోసం వినతి పత్రాలిచ్చేందుకు వచ్చే అర్జీదారులతో రద్దీగా మారింది. మొత్తం 232 మంది వచ్చారు. వారికి టోకెన్లు జారీతోపాటు అవసరమైన వారికి అర్జీలు రాసేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేశారు. వారికి అల్పాహారం అందించారు.

- ఆభరణాల చోరీ ముఠా అరెస్టు
- అధికారుల చొరవతో మస్కట్ నుంచి మార్టేరుకు

6లో

భజే రుద్రం

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: కార్తిక మాసం రెండో సోమవారం సందర్భంగా పంచారామ క్షేత్రం గునుపూడి సోమేశ్వర జనార్దన స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామికి అభిషేకాలు చేశారు. ఆర్టీసీ పంచారామ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 15 వేల మంది తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. అంతరాలయం ఎదుట, అన్నపూర్ణమ్మవారి దర్శనానికి భక్తులు బారులుతీరారు.

కార్మికునికో కార్డు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ-శ్రమ్ పోర్టల్‌లో ఉచిత నమోదుకు అవకాశం కల్పించాయి. తద్వారా సంక్షేమ కార్యక్రమాలు, బీమా పథకాలను వర్తింపజేయనున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 14 లక్షల మంది కార్మికులు వివిధ రంగాల్లో పని చేస్తున్నారు. ఇప్పటి వరకు వారిలో 8,32,548 మంది మాత్రమే నమోదై గుర్తింపు కార్డులు పొందారు. ఉపాధి హామీ పథకంలో 50 పనిదినాలు పూర్తి చేసిన కార్మికులు కూడా ఇందులో ఉచితంగా రిజిస్టరు చేసుకోవచ్చన్నారు.

ఎవరు అర్హులు

18-59 ఏళ్ల వయసున్న కార్మికులు ఈ-శ్రమ్ కార్డులకు అర్హులు. ఇప్పటి వరకూ కొన్ని పథకాలు కుటుంబంలో ఒక్కరికే వర్తించేవి. ఫలితంగా కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది కార్మికులుంటే నష్టపోయే పరిస్థితి. ఈ-శ్రమ్‌తో ప్రతి అసంఘటిత కార్మికుడికి పథకాలు అందుతాయి.

దరఖాస్తులు ఇలా..

- ఈ-శ్రమ్ గుర్తింపు కార్డు కోసం చరవాణి లేదా కంప్యూటర్‌లో గూగుల్ ద్వారా సొంతంగా దరఖాస్తు చేసుకోవచ్చు.
- కార్మిక శాఖ కార్యాలయాలు, సీఎస్‌ఈ, సచివాలయాలు, మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రయోజనాలు...

- ప్రతి అసంఘటిత రంగ కార్మికుడికి ఏడాదిపాటు సురక్షా బీమా యోజన ద్వారా రూ.2 లక్షలు ప్రమాద, మరణ, అంగవైకల్య బీమా ఉచితంగా వర్తిస్తుంది.
- వలస కార్మికులు ఎక్కడున్నారో గుర్తించి వారికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటారు.
- కార్మికుడు ప్రమాదవశాత్తు చనిపోతే చంద్రన్న బీమా కింద రూ.5 లక్షలు అందజేస్తారు.
- కార్మికుడి కుమార్తె, కార్మికురాలి వివాహ సందర్భంగా రూ.20 వేలను మూడేళ్ల తర్వాత ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో అందజేస్తారు.

ఉమ్మడి జిల్లాలో అసంఘటిత రంగ కార్మికులు: 14 లక్షలు

	పశ్చిమ	ఏలూరు
నమోదు చేయించుకున్న వారు	6,97,157	1,35,391

మాన్‌ధనం

- పీఎం-శ్రమ యోగి మాన్‌ధన్ (పీఎంఎస్‌వైఎం) పథకానికి 18-40 ఏళ్ల వయసున్న కార్మికులు అర్హులు.
- కార్మికులు వయసు ప్రకారం కొంత నగదు చెల్లిస్తే అందుకు సరిపడా డబ్బును ప్రభుత్వాలు చెల్లిస్తాయి. రూ.55 నుంచి రూ.200 వరకు చెల్లించాల్సి ఉంటుంది.
- 61 ఏళ్లు దాటిన తర్వాత వారికి పింఛను వస్తుంది.

సాగదీత.. అన్నదాతల ఎదురీత!

వెంటాడుతున్న వైకాపా సర్కారు వైఫల్యాలు

కొత్తపాలెం వద్ద పునాది స్థాయిలో ఆగిన వంతెన నిర్మాణం

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: నాటి వైకాపా సర్కారు వైఫల్యాలు అన్నదాతలకు శాపాల్లా మారాయి. నరసాపురం నియోజకవర్గ పరిధిలో రెండు మండలాలను అనుసంధానం చేసేలా గొంతేరు డ్రెయిన్‌పై చేపట్టిన వంతెన, అనుసంధాన రహదారుల నిర్మాణం నిలిచిపోవడంతో రైతులు పొలాలకు వెళ్లే దారి లేకుండా పోయింది. ఇది చాలదన్నట్లు కాలువలో వేసిన అడ్డుకట్ట వల్ల భారీ వర్షాలు కురిసినప్పుడు చుట్టు పక్కల ప్రాంతాల్లో పొలాలన్నీ ముంపుబారిన పడుతున్నాయి.

ఏం జరిగిందంటే.. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు చొరవతో మొగల్తూరు మండలం కొత్తపాలెం- నరసాపురం మండలం కె.బేతపూడి గ్రామాల మధ్య వంతెన, అప్రోచ్ రోడ్ల నిర్మాణం చేపట్టారు. దీనికి ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు నిధులు 16.50 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు 2018 డిసెంబరు 5న అప్పట్లో మంత్రి హోదాలో నారా లోకేశ్ భూమిపూజ చేశారు.

ఈనాడు ETV ఆంధ్రప్రదేశ్ కథనం

- తరువాత వైకాపా హయాంలో ఇదే పనికి మరోసారి భూమిపూజ చేశారు. కొవిడ్ ప్రభావం తగ్గాక గుత్తేదారు సంస్థ పనులు పునఃప్రారంభించినా వైకాపా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో నిర్మాణం పునాది దశలోనే ఆగిపోయింది.
- మరోపక్క వంతెన నిర్మాణం కోసం గొంతేరు డ్రెయినులో మూడు వంతుల మేర అడ్డుకట్ట వేశారు. అధిక వర్షాల సమయంలో ఎగువ నుంచి వచ్చే వరద నీటితో ఈ ప్రాంతంలో వరిచేలు, ఆక్వా చెరువులు ముంపులో చిక్కుకుని రైతులు నష్టపోతున్నారు. త్వరలోనే నిర్మాణాన్ని పునఃప్రారంభించేలా చర్యలు చేపడతామని పంచాయతీ రాజ్ ఏఈ ఎస్.గౌరీశంకర్ సూర్యకుమార్ తెలిపారు.

10న ఉండి రైల్వే గేటు మూసివేత..!

ఉండి, న్యూస్‌టుడే: ఆకివీడు వెళ్లే 165 జాతీయ రహదారిపై ఉండి రైల్వే గేటును మరోసారి మూసివేసేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. రైల్వే పైవంతెన పనుల్లో భాగంగా ఈ నెల 10 నుంచి 15 వరకు గేటు మూసివేయనున్నారని అధికార వర్గాల ద్వారా సమాచారం. ఆయా రోజుల్లో మళ్లింపు మార్గాల్లో వాహన చోదకులు, ప్రయాణికులు రాకపోకలు సాగించాల్సి ఉంది.

బడికెళ్తాం.. అక్కడే తింటాం!

- పిల్లలకు రుచించేలా మధ్యాహ్న భోజనం
- హాజరు 97 శాతానికి పైనే..

వైకాపా ప్రభుత్వ విధానాలతో విద్యారంగ ప్రగతి కుంటు పడింది. విద్యార్థుల హాజరుతో పాటు మధ్యాహ్న భోజనం తినేవారి సంఖ్య తగ్గుముఖం పట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ అంశంపై ఆరాతీయగా 2024 అక్టోబరు ఆరంభంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 19 శాతం మంది విద్యార్థులు బడికి గైర్హాజరైనట్లు తేలింది. పాఠశాలల్లో 50 శాతం మంది విద్యార్థులు కూడా మధ్యాహ్న భోజనం తినడం లేదని అప్పటి ఆర్జేడీ ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ప్రస్తావించారు.

యలమంచిలి పాఠశాలలో వడ్డించిన భోజనంతో విద్యార్థులు

పాలకొల్లు, భీమవరం పట్టణం, పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థుల హాజరుతో పాటు మధ్యాహ్న భోజనం తినే వారి సంఖ్య పెరిగింది. నిత్యం సగటున 97 శాతం మంది విద్యార్థులు బడికి హాజరవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

మార్పులు ఇలా.. జూన్ ఆరంభం నుంచి మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం వినియోగించడం, స్థానిక అభిరుచులకు మెనూలో ప్రాధాన్యతనివ్వడంతో పిల్లలు కడుపునిండా తింటున్నారని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. పిల్లలకు అవసరమయ్యే పోషకాల నిమిత్తం పోర్టిఫైడ్ రైస్‌ను కలిపి సరఫరా చేయడంతో భోజనం నాణ్యత పెరిగింది. క్రమం తప్పకుండా కోడిగుడ్లను వడ్డిస్తున్నారు.

కొన్ని పాఠశాలల్లో శతశాతం..

యలమంచిలి మండలం వైవీ లంక, మేడపాడు, చించినాడ, యలమంచిలి, కాజ తూర్పు ఉన్నత పాఠశాలల్లో సోమవారం పరిశీలించగా హాజరైన విద్యార్థులంతా మధ్యాహ్న భోజనం చేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 71 ఉండగా 50 చోట్ల వందశాతం విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిన్నారు.

- భీమవరం పీఎస్ఎం బాలికోన్నత పాఠశాలలో గతేడాది 70 శాతం విద్యార్థినులు మాత్రమే మధ్యాహ్న భోజనం తినేవారు. సోమవారం పరిశీలించగా 940 మందికి 906 మంది, పెనుగొండ మండలం దేవ ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులకు గాను 195 మంది బడి భోజనం తిన్నారు.

జిల్లా	ఏలూరు	పశ్చిమ
మొత్తం పాఠశాలలు	1,710	1,384
విద్యార్థుల హాజరు	84,989	73,281
భోజనం చేసినవారు	83,210	70,949
శాతం	97.9	96.8

మీ డబ్బు.. మీ హక్కు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: దీర్ఘకాలంగా లావాదేవీలు నిర్వహించని బ్యాంకు ఖాతాల పునరుద్ధరణ, వాటిలో నగదు వెనక్కి తీసుకునే వెసులుబాటును ఆర్బీఐ కల్పించిందని కలెక్టర్ నాగరాణి తెలిపారు. ఈ మేరకు 'మీ డబ్బు... మీ హక్కు' పేరుతో నిర్వహించనున్న అవగాహన కార్యక్రమాల కోసం రూపొందించిన గోడపత్రాలను ఆమె సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో పదేళ్లుగా లావాదేవీలు నిర్వహించని ఖాతాల్లో రూ.87 కోట్లు నిరుపయోగంగా ఉన్నాయని వెల్లడించారు. జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ నాగేంద్రప్రసాద్, ఇన్‌ఛార్జి డీఆర్వో శివన్నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతేరాజు

- పండిస్తూ.. పంచి పెడుతూ!
- బొప్పాయి పాలు.. విదేశాలకు

6లో

అంతు లేని బాగోతాలు

ఈనాడు-ఏలూరు

స్థలం ధరకు మించి రుణాలు ఇవ్వటం, వాటి చెల్లింపునకు ఓటీఎస్ సౌకర్యం కల్పించటంతో ఆర్థికంగా సహకార బ్యాంకులకు నష్టం వాటిల్లింది. ఈ అక్రమ, అవినీతి బాగోతాలు వైకాపా హయాంలో తాడేపల్లిగూడెం బజార్, మెయిన్ బ్రాంచుల్లో చోటుచేసుకున్నాయి.

సహకార శాఖలో అక్రమాల బాగోతాలు అంతే లేనట్లు ఉంది. ఇష్టానుసారం రుణాల జారీతోపాటు రికవరీలకు అడ్డదిడ్డంగా ఓటీఎస్ వర్తింపజేయటంతో తాడేపల్లిగూడెం బ్రాంచుల్లో రూ.16 కోట్ల దాకా ఆర్థిక నష్టం వాటిల్లింది. ఈ అక్రమాలపై తాజాగా ఆప్కాబ్‌కు చెందిన అధికారుల బృందం విచారణ చేసి నివేదికను డీసీసీబీ ఉన్నతాధికారులకు, బ్యాంకు ఛైర్మన్‌కు అందజేసింది. యలమంచిలిలో బ్యాంకు గ్యారంటీ లేకుండానే రెండు రైస్‌మిల్లులకు రూ. కోట్లలో రుణాలిచ్చినట్లు తేల్చారు. ఏలూరు ప్రధాన బ్రాంచిలో అక్రమాలపై విచారణ చేస్తున్నారు.

వైకాపా హయాంలో సహకార బ్యాంకుల్లో అక్రమాలు

స్థలం విలువకు మించి రుణాలు

ఏమైతే మాకేం అన్నట్లు..

తాడేపల్లిగూడెం బస్టాండ్ వెనక ఓ ఖాళీ స్థలం విలువ రూ.30 లక్షలు కాగా దానిపై రూ.60 లక్షల రుణమిచ్చారు. ఒక్క రూపాయి చెల్లించలేదు. దాన్ని వేలం వేస్తే రూ.40 లక్షలకు మించి వచ్చే పరిస్థితి లేదని అంచనాకు వచ్చారు. తహసీల్దార్ కార్యాలయం ఎదురు సందులో రూ.50 లక్షల స్థలంపై రూ.90 లక్షల రుణమిచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డులో రూ.30 లక్షల స్థలంపై రూ.50 లక్షలు రుణమిచ్చారు.

మా పేరుపై ఉన్నాయా?.. ఒక్కొక్కరికి రూ.2.50 లక్షల చొప్పున వందల సంఖ్యలో ముద్రా రుణాలిచ్చారు. రుణాలు పొందిన వారిలో చాలా మంది చెల్లించలేదు. వారి గురించి ఆరా తీస్తే వారు ఎక్కడ ఉంటున్నారో తెలియటం లేదు. ఇలా బకాయిలు భారీగా పేరుకుపోయాయి. వారికి నోటీసులు పంపితే కొందరు తమకు రుణం వచ్చిన విషయమే తెలియదని ఇటీవల ఆప్కాబ్ ఛైర్మన్‌ను కలిసి మొరపెట్టుకున్నారు. మరి ఈ రుణాలు మధ్యేమార్గంగా ఎవరు నొక్కేశారన్నది తేలాల్సి ఉంది.

చర్యలు తీసుకుంటాం.. వైకాపా హయాంలో తాడేపల్లిగూడెంలోని ఆ రెండు బ్రాంచిల్లో ఇష్టానుసారం రుణాలిచ్చారు. ఈ అక్రమాలపై చర్చించి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవటానికి మంగళవారం పాలకమండలి సమావేశం కాబోతుంది. **- గన్ని వీరాంజనేయులు, ఆప్కాబ్ ఛైర్మన్**

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు క్లాసిఫైడ్స్

లీగల్ ప్రకటనలు

వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80080 12494

(c) eenadu

పంచారామం చెంతనే.. త్రిలింగ క్షేత్రాలు

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: త్రిలింగ క్షేత్రాలుగా అలరారుతున్న శివదేవుని చిక్కాల, దిగమర్రు శివాలయాలు పంచారామ క్షేత్రం పాలకొల్లుకు సమీపాన ఉన్నాయి. మరో క్షేత్రమైన శివకోడు కోనసీమ జిల్లా రాజోలు మండలంలో ఉంది. కార్తికమాసంలో క్షీరారామానికి వచ్చే భక్తులు ఈ ఆలయాలను కూడా దర్శించుకుంటారు. ఈ క్షేత్రాల్లో కార్తికమాసోత్సవాలతో పాటు మహాశివ రాత్రి వేడుకలను వైభవంగా నిర్వహిస్తారు.

పురాణాల ప్రకారం.. త్రేతాయుగంలో రావణబ్రహ్మ సంహారం అనంతరం దోష నివారణార్థం శ్రీరాముడు కోటి లింగాల ప్రతిష్ఠాపనకు ఉపక్రమించారు. దీని నిమిత్తం రాముడి ఆజ్ఞ ప్రకారం.. భక్తాంజనేయుడు కాశీ వెళ్లి శివలింగాలను చిక్కంలో పెట్టుకుని వస్తుండగా ఈ ప్రాంతం వచ్చే సరికి సూర్యోదయమైంది. సూర్య ఉపాసన కోసం ఆంజనేయుడు చిక్కంలో ఉన్న శివలింగాలను నేలపై ఉంచి

దిగమర్రులో కొలువైన ఉమా సోమేశ్వరస్వామి

అనంతరం సమీప కోనేరుకు వెళ్లారు. తిరిగి వచ్చాక ముహూర్త బలం ప్రభావంతో హనుమ ఇక్కడ శివలింగాన్ని ప్రతిష్ఠించారని.. చిక్కంలో వెలసిన శివయ్యగా ఈ గ్రామానికి శివదేవుని చిక్కాల పేరు స్థిరపడిందని పండితులు చెబుతున్నారు. ఆంజనేయుడుకు దిగమర్రు

శివదేవస్వామి ఆలయం ★ స్వామివారు

ప్రాంతంలో మరో శివలింగాన్ని ప్రతిష్ఠించగా స్వామి ఉమా సోమేశ్వరుడిగా పూజలందుకుంటున్నారు. వాయుపుత్రుడు ప్రతిష్ఠించడంతో ఈ క్షేత్రాలను వాయు త్రిలింగ క్షేత్రాలుగా పిలుస్తారు. శివదేవునిచిక్కాల ఆలయ ప్రాంగణంలో కొబ్బరి మొక్క నాటితే సంతాన యోగం కలుగుతుందని భక్తుల నమ్మకం.

ఇలా చేరుకోవచ్చు.. పాలకొల్లు పరిధిలో నరసాపురం రోడ్డు మీదుగా నాలుగు కిలోమీటర్లు ప్రయాణిస్తే దిగమర్రు చేరుకోవచ్చు. భీమవరం రోడ్డులో ఎనిమిది కిలోమీటర్ల దూరంలో శివదేవునిచిక్కాల ఆలయం ఉంది. ఈ రెండు క్షేత్రాలకు పాలకొల్లు నుంచి బస్సులు, ఆటోల్లో చేరుకోవచ్చు.

పండిస్తూ.. పంచి పెడుతూ!

ఆదర్శంగా నిలుస్తున్న యువ రైతు

వేలేరుపాడు, న్యూస్‌టుడే: ఏడాది పొడవునా సేంద్రియ పద్ధతిలో వివిధ రకాల కూరగాయలు పండిస్తున్నారు వేలేరుపాడు మండలం భూదేవిపేటకు చెందిన యువరైతు బడిగంటి వెంకటేశ్వరరావు. ఇంటి ఆవరణలోని 15 సెంట్ల భూమిలో 12 రకాల కూరగాయలు, ఆకు కూరలు పండించడమేకాక ఉచితంగా పంచి పెడుతున్నారు.

తోట పనిలో వెంకటేశ్వరరావు

వ్యవసాయ కుటుంబానికి చెందిన వెంకటేశ్వరరావు కొన్నేళ్లుగా గ్రామంలో పురుగు మందుల దుకాణం నిర్వహిస్తున్నారు. కొన్నేళ్లపాటు పత్తి, మినుము, కంది, వరి, మిరప పంటలు సాగు చేశారు. ఏటా వరదలతో పంటలు దెబ్బతిని తీవ్ర నష్టం వాటిల్లడంతో పదేళ్ల కిందట ఎరువులు, పురుగు మందుల దుకాణాన్ని ఏర్పాటు చేశారు. అయినా సాగుపై మక్కువతో ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలంలో బోరు ఏర్పాటు చేయించి కాలంతో పని లేకుండా అన్నిరకాల కూరగాయల పాదులు వేయడం ప్రారంభించారు. నిత్యం మొక్కలకు నీరు పెట్టడం, కలుపు మొక్కలు తొలగించడం వంటి పనులు చేస్తుంటారు. రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా పశువుల పెంటతో ఆరోగ్యకరమైన కూరగాయలను పండిస్తున్నారు. ఇంటి అవసరాలకు పోను మిగిలిన వాటిని విక్రయించకుండా బంధువులు, స్నేహితులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

బొప్పాయి పాలు.. విదేశాలకు

నంద్యాల జిల్లా చాగలమర్రి మండల వ్యాప్తంగా రైతులు అధికంగా బొప్పాయి సాగు చేస్తుంటారు. చిన్నవంగలితో పాటు సమీపంలోని గ్రామాలైన వైఎస్సార్ కడప జిల్లా కానగూడూరు, క్రిష్ణంపల్లె గ్రామాల్లో 1200 ఎకరాల్లో పండిస్తారు. విత్తనం నాటిన కాలం నుంచి తొమ్మిది నెలలకు పంట చేతికొస్తుంది. పండ్ల సేకరణ అనంతరం 13 నెలల తర్వాత మిగిలినవి, ముదురు కాయలకు గాట్లు పెట్టి పాలను సేకరిస్తున్నారు. తెల్లవారుజాము సమయంలోనే కాయలకు గాట్లు పెడితే కేవలం రెండు గంటల్లోనే పాలు ఊరుతుంది. ఇలా సేకరించిన దాన్ని రాయచోటి, రాజంపేటకు చెందిన వ్యాపారులు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల పాలు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 4 డ్రమ్ముల పాలు సేకరిస్తున్నారు. ఎకరానికి పాలసేకరణ ద్వారా రైతుకు రూ.24వేల ఆదాయం వస్తుంది. సేకరించిన పాలను పరిశ్రమల్లో మందులు, కాస్మోటిక్స్, సబ్బుల తయారీలో ఉపయోగిస్తున్నారు. బెంగళూరు, చెన్నైలతో పాటు నాణ్యతను బట్టి విదేశాలకు సైతం పాలను ఎగుమతి చేస్తున్నారు. బొప్పాయి సాగులో ఎప్పుడైనా ధర పడిపోయినప్పుడు అన్నదాతలు బొప్పాయి పాలసేకరణతో నష్టాల నుంచి బయటపడుతున్నారు. – న్యూస్‌టుడే, చిన్నవంగలి(చాగలమర్రి)

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలని ధర్నా

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులివ్వాలని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉండుర్తి శ్రీనివాసరావు, మామిడిశెట్టి రామాంజనేయులు కోరారు. సమస్యల పరిష్కారం కోసం కౌలు రైతులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ.20వేలు ఇవ్వాలని, మొంథా తుపాను నష్టం వాస్తవంగా సాగు చేస్తున్న రైతులకు ఇవ్వాలని నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ నాగరాణికి వినతి పత్రం అందజేశారు. కృష్ణ పెద్దిరాజు, కూసంపూడి సుబ్బరాజు, పెన్మెట్స నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా అర్జీలు పరిష్కరించాలి : కలెక్టర్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) అర్జీల విషయంలో నిర్లక్ష్యం తగదని కలెక్టర్ నాగరాణి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె అర్జీలు స్వీకరించి పలువురితో మాట్లాడారు. అనంతరం అధికారులనుద్దేశించి మాట్లాడారు. ప్రతి అర్జీని బాధ్యతగా క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. 232 అర్జీలు వచ్చాయని వెల్లడించారు. ఇన్‌ఛార్జి డీఆర్వో శివన్నారాయణరెడ్డి, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారి డోసిరెడ్డి, డీపీవో రామ్‌నాథ్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు, వయోవృద్ధుల ట్రైబ్యునల్ సభ్యుడు మేకా దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ★ నా వయసు 75 ఏళ్లు. 2021 జులై వరకు పింఛను వచ్చింది. తర్వాత ఆపేశారని. పింఛను ఇప్పించాలని భీమవరం పట్టణం ప్రకాష్‌నగర్‌కు చెందిన తిరుమాని జలాచంద్రుడు అధికారులను కోరారు. ★ నా కుమారుడు పుట్టుకతోనే మానసిక దివ్యాంగుడని.. పింఛను ఇప్పించాలని భీమవరం మండలం గొల్లవానితిప్పకు చెందిన కొయ్యలగడ్డ ఎర్ని రామలక్ష్మి అర్జీ ఇచ్చారు. ★ పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వకుండా వీఆర్వో, తహసీల్దార్ కాలయాపన చేస్తున్నారని కాళ్ల మండలం దొడ్డనపూడికి చెందిన చిన్నం చిరంజీవి ఫిర్యాదు చేశారు. ★ పదేళ్లుగా మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తున్నా ఇప్పటికీ సరైన తాగునీరు, రోడ్డు వసతులు లేవని తణుకు పట్టణం ఏడో వార్డుకి చెందిన పలువురు అర్జీ సమర్పించారు.

యంత్రాంగం కృషి భేష్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: మొంథా తుపానును ఎదుర్కోవడంలో జిల్లా యంత్రాంగం చేసిన కృషి అభినందనీయమని కలెక్టర్ నాగరాణి అన్నారు. తుపాను సమయంలో అంకిత భావంతో పని చేసినందుకు ఈనెల ఒకటో తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా జిల్లాలో నలుగురు అధికారులు రాష్ట్రస్థాయి పురస్కారాలు అందుకున్నారు. వారిలో పంచాయతీరాజ్ ఈఈ సత్యనారాయణ, ఏఈ నాగేశ్వరరావు, మత్స్యశాఖ ఏడీ ఎల్ఎల్ఎన్ రాజు, గ్రామీణ నీటి సరఫరా ఏఈ తాడి లోకేశ్ ఉన్నారు. వారిని సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణి ప్రత్యేకంగా సత్కరించారు. అధికారులంతా సమన్వయంతో పని చేసి నష్టాన్ని నివారించామని కొనియాడారు.

మత్స్యశాఖ ఏడీ ఎల్ఎల్ఎన్ రాజును సత్కరిస్తున్న నాగరాణి

వరి, మొక్కజొన్నలో జాగ్రత్తలు అవసరం

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: అధిక వర్షాల నేపథ్యంలో వరి, మొక్కజొన్న పంటల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి సి.పవన్‌కుమార్ తెలిపారు. వరి పొలాల్లో ముంపు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపాలి. ఎకరాకు 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ ఎరువులను పైపాటుగా వేయాలి. ★ పలోట దుబ్బు చేసే దశ నుంచి ఆకులపై మచ్చలు ఏర్పడి క్రమేణి ఎండిపోయే పాము పొడ తెగులును అధిగమించేందుకు ప్రొపికొనజోల్ 1 మి.లీ లేక వాలిడామైసిన్ 2 మి.లీ లేక హెక్సాకొనజోల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. ★ అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా లేదా కాసుగామైసిన్ 2మి.లీ లేదా వ్యాజి వన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ★ దోమ ఉధృతి ఎక్కువైనప్పుడు నివారణకు ఇథోపెన్ప్రాక్స్ 2మి.లీ లేదా 1.5గ్రా ఎసిపేట్ లేదా 0.25 మి.లీ అమిడాక్లోప్రిడ్ లేదా 0.20 గ్రా థయోమిదో క్సామ్ లేదా 2 మి.లీ. బీపీఎంసీ లేదా మోనోక్రోటోఫాస్ 2.2 మి.లీ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయడంతోపాటు పొలాన్ని ఆరబెట్టాలి. ★ మొక్కజొన్న పైరుకు ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువులను పైపాటుగా వేయాలి. కాండం తొలిచే పురుగు, ఆకు ఎండు తెగులు ఎక్కువ రావడానికి అవకాశం ఉంది. దాని నివారణకు ఎకరాకు 200 లీటర్ల నీటిలో 400 మి.లీ ప్రొఫెనోఫాస్ మరియు ప్రొపికొనజోల్ 200 మి.లీ కలిపి చేను బాగా తడిసేట్లు చల్లాలి. వర్షాలు తగ్గిన 3-4 రోజుల తర్వాత వరసల మధ్య భాగాన్ని గుంటక లేదా గొప్పు ద్వారా సేద్యం చేయాలి.

జంగారెడ్డిగూడెం: రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి

ఉద్యాన విశ్వవిద్యాలయం న్యూస్‌టుడే

ప్రశ్న: అధిక వర్షాలకు అరటి సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు తెలపండి.

- జనార్దనరావు, వేల్పూరు

సమాధానం: అరటిలో సిగటోకా ఆకుమచ్చ తెగులు వృద్ధి చెందకుండా ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. దుంప కుళ్లు తెగులు రాకుండా 25 గ్రాములు బ్లీచింగ్ లీటరు నీటికి కలిపి మొదళ్లలో పోయాలి. సూడోమోనాస్ 50 గ్రాములు, వేప పిండి 250 గ్రాములు కలిపి మొక్క మొదళ్లలో వేయాలి.

డా. పి.విజయలక్ష్మి, ప్రధాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట్రామన్నగూడెం

మీరూ అడగొచ్చు ✆ చరవాణి 73826 33692

రొయ్యను బతికిద్దాం..!

యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: వాతావరణ మార్పులతో ఆక్వా చెరువుల్లోని రొయ్యలకు తెగుళ్లు సోకి మృత్యువాత పడుతున్నాయి. ఈక్రమంలో చెరువుల నిర్వహణలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే నష్టాలు నివారించవచ్చని భీమవరానికి చెందిన ఆక్వా నిపుణుడు అడబాల గోపాలరావు సూచించారు. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతుండటం, అధిక వర్షాలకు నీటిలో మార్పులు సంభవించి ఆక్సిజన్ శాతం తగ్గడం, అమ్మోనియా, నైట్రైట్, హైడ్రోజన్ సల్ఫైడ్‌లు వంటివి తగ్గడంతో విషవాయువులు ఉత్పత్తి అవుతున్నాయి. దీంతోపాటు వైరస్ తెగుళ్లు సోకుతున్నాయి. వీటి ప్రభావంతో చెరువుల్లో రొయ్యలు ఒత్తిడికి గురై మృత్యువాత పడుతున్నాయి.

నివారణ ఇలా.. చెరువు నీటిని ఉదయమే సేకరించి ఆక్వా ల్యాబ్‌లలో పరీక్షలు చేయంచుకోవాలి. అమ్మోనియా, నైట్రైట్, హైడ్రోజన్ సల్ఫైడ్ వంటి విషవాయువులు ఉన్నట్లు గుర్తిస్తే వాటి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి. ఆక్సిజన్ శాతం పెంచేందుకు నిరంతరం ఏరియేటర్లు తిప్పాలి. జియోలైట్, గ్యాస్‌క్యూర్ వంటి పొడులను నీటిలో, ఇసుకలో కలిపి చల్లాలి. ఆక్సిజన్ శాతం పెంచేందుకు చెరువులో ట్యాబ్లెట్లు, పలుకులను రాత్రి 12, తెల్లవారుజామున 4 గంటలకు చల్లాలి. రిజర్వు ట్యాంకుల సౌకర్యం ఉన్న రైతులు వాటిలోని నీటికి శానిటైజ్ చేసి చెరువుల్లో నీటి మార్పిడి చేయాలి. వైరస్ తెగుళ్లు సోకి రొయ్యలు మృత్యువాత పడుతుంటే జాప్యం చేయకుండా పట్టుబడి చేయాలి. ఆ చెరువులోని నీటిని శుభ్రం చేసి బయటకు వదలాలి. అనంతరం చెరువును శుభ్రం చేసి నేల కనపడేలా ఆరబెట్టి తిరిగి సాగుకు సిద్ధం చేయాలని గోపాలరావు రైతులకు సూచించారు.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

[illegible]

స్థిరాస్తి అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

[illegible]

రిజర్వు ధర (రూ.లలో)	రూ.63,92,247/- [illegible]
ధరావతు (రూ.లలో)	రూ.6,39,225/- [illegible]
బిడ్ పెంపుదల మొత్తం	రూ.25,000/- [illegible]
ధరావతుతో బిడ్డు/ టెండరు దాఖలుకు చివరి తేదీ, సమయం మరియు ప్రదేశం	05.12.2025 [illegible]
ఇ-వేలం తేదీ, సమయం మరియు ప్రదేశం	06.12.2025 ఉ.11.00 గం.ల నుండి మ.12.00 గం. [illegible] https://www.bankeauctions.com [illegible]

స్థిరాస్తి షెడ్యూలు

[illegible]

https://www.axisbank.com/auction-retail [illegible] https://www.bankeauctions.com [illegible]

తేది: 04-11-2025 సం/- అధీకృత అధికారి
ప్రదేశం: పశ్చిమ గోదావరి యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

[illegible] సిరిపురం, విశాఖపట్నం

అధీకృత అధికారి వివరములు: పేరు: శ్రీ వై. కిరణ్ చంద్ (చీఫ్ మేనేజర్) మొబైల్ నెం.91609 49910, ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, ఫోన్ నెం. 98482 49289

ఇ-వేలం అమ్మకం ప్రకటన

[illegible]

రిజర్వు ధర : రూ.29,78,000/- ధరావతు : రూ.2,97,800/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేదీ : 23-11-2025 సమయం : ఉ॥ 11.00 గం॥ నుండి సా॥ 04.00 గం॥ వరకు

[illegible]

తేదీ: 01-11-2025, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఆభరణాల చోరీ ముఠా అరెస్టు

660 గ్రాముల బంగారం, 2.63 కిలోల వెండి రికవరీ

నరసాపురం, న్యూస్‌టుడే: ఆభరణాల దుకాణంలో చోరీకి పాల్పడిన ముఠాను అరెస్టు చేసి బంగారు నగలు, వెండి సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ అద్నాన్ నయీంఅస్మి తెలిపారు. ఈ వివరాలను ఆయన నరసాపురంలో సోమవారం విలేకరులకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. మొగల్తూరు పోలీస్‌స్టేషన్ పరిధి తూర్పుతాళ్లులోని దుర్గా ఆభరణాల దుకాణంలో గతేడాది సెప్టెంబరు 14న దుండగులు కిలో బంగారు ఆభరణాలు, రెండు కిలోల సామగ్రి చోరీ చేశారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు పోలీసు అధికారులు పలు కోణాల్లో దర్యాప్తు చేసి నిందితులను గుర్తించారు. ఈ కేసులో సీతారామపురానికి చెందిన చిలకలపల్లి శివాజీ (23), మొగల్తూరు మండలం వారతిప్ప వాసి ముత్యాల వరుణ్ (20), నరసాపురం కోవెలవీధిలో నివసిస్తున్న సోదరులు సిద్ధిరెడ్డి మనోజ్‌కుమార్(22), సంతోష్ కిరణ్(20)లను అరెస్టు చేశారు.

స్వాధీనం చేసుకున్న ఆభరణాలను చూపుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

వారి నుంచి 660 గ్రాముల బంగారు నగలు, 2,638 గ్రాముల వెండి సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన నగలను నిందితులు నరసాపురం, భీమవరం, విజయనగరం ప్రాంతాల్లో వ్యాపారులకు విక్రయించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ వ్యవహారంలో నరసాపురానికి చెందిన ముగ్గురు వ్యాపారులకు నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కేసు ఛేదనకు కృషి చేసిన అదనపు ఎస్పీ భీమారావు, డీఎస్పీ జి.శ్రీవేద అరవింద, సీఐ దుర్గాప్రసాద్, పలువురు ఎస్సైలు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు అందించారు.

సందేహాలెన్నో.. నిందితుల నుంచి బంగారం కొనుగోలు చేసిన వ్యాపారుల్లో కొందరికి మాత్రమే పోలీసులు నోటీసులు ఇవ్వడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మిగిలిన వారితో లోపాయికారీ ఒప్పందాలు జరిగాయని.. రాజకీయ నాయకులతో సంబంధాలు ఉన్న కొందరిని ఈ కేసు నుంచి తప్పించారని పట్టణంలో ప్రచారం జరుగుతోంది.

బాలింత మృతిపై ఆసుపత్రి ఎదుట ఆందోళన

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పాలకోడేరు మండలానికి చెందిన బాలింత మృతిపై ఆమె బంధువులు ఆందోళన చేశారు. సోమవారం రాత్రి పొద్దుపోయే వరకు బాధితులు ఆసుపత్రి దగ్గరే ఉండటంతో పోలీసులు వెళ్లి ఆసుపత్రి వైద్యులు, బాధితులతో మాట్లాడుతున్నారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ కాళీచరణ్ తెలిపారు.

మాతా శిశు మరణాల కారణాలపై సమీక్ష

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో మాతా శిశు మరణాలకు తావివ్వకుండా వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో జి.గీతాబాయి సూచించారు. జిల్లా సబ్ కమిటీ త్రైమాసిక సమావేశం జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. సంబంధిత ఆసుపత్రుల వైద్యాధికారులు, పర్యవేక్షకులు, ఏఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలతో ఆమె సమీక్షించారు.

డిసెంబరు 21న శరీర సౌష్ఠవ పోటీలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: మిస్టర్ ఆంధ్ర రాష్ట్రస్థాయి శరీర సౌష్ఠవ పోటీలు డిసెంబరు 21న నిర్వహిస్తామని న్యూ ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాసిం తెలిపారు. విశాఖపట్నం తగరపువలసలో జరిగే పోటీలకు సంబంధించిన వివరాలతో గల గోడపత్రాన్ని భీమవరంలో సోమవారం ఆవిష్కరించారు.

అధికారుల చొరవతో మస్కట్ నుంచి మార్టేరుకు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: బతుకుతెరువు కోసం మస్కట్ వెళ్లి అక్కడ ఏజెంట్లు చేసిన మోసానికి బలైపోయింది మార్టేరుకి చెందిన ఉండుర్తి కుమారి. ఈ మేరకు ఆమె సోదరుడు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయగా కలెక్టరేట్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు ఇటీవల క్షేమంగా స్వస్థలానికి చేరుకుంది. సోమవారం కలెక్టర్ నాగరాణిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా అక్కడ తాను అనుభవించిన బాధలను 'న్యూస్‌టుడే'కి వెల్లడించింది.

తిరిగొస్తాననుకోలేదు.. నాకు ముగ్గురు పిల్లలు. ఉపాధి కోసం మస్కట్ వెళ్లాను. నన్ను తీసుకెళ్లిన ఏజెంటు 400 రియాళ్లకి మరొకరికి అమ్మేశారు. అలా ముగ్గురు చేతులు మార్చారు. నేను పని చేస్తుంటే వేతనం ఏజెంట్లు తీసుకునేవారు. చివరికి ఇండియన్ ఎంబసీకి వెళ్తే వెంటనే ఆశ్రయం లభించలేదు. ఈలోగా అక్కడ పోలీసులు నన్ను అరెస్టు చేసి 8 నెలలు జైల్లో పెట్టారు. ఆ దేశంలో ఉన్నప్పుడు ప్రత్యక్ష నరకం అనుభవించాను. - **ఉండుర్తి కుమారి**

ఆలయాల వద్ద నిబంధనలు తప్పనిసరి: ఎస్పీ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: కార్తిక మాసంలో ఆలయాల దగ్గర, ప్రయాణ వేళల్లో పోలీసు నిబంధనలు పాటించాలని ఎస్పీ అద్నాన్ నయిం అస్మి తెలిపారు. ఆలయాల దగ్గర క్యూ పాటించాలన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తుల వాహనాలు నిలిపేందుకు ఏర్పాటు చేసిన స్థలాల్లో మాత్రమే నిలపాలన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో ఎస్పీ అస్మి మాట్లాడారు. అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు తెలియజేయాలని ఆదేశించారు. అదనపు ఎస్పీ వి.భీమారావు, అధికారులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

పోటీ పరీక్షార్థులకు శిక్షణ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏపీ టెట్, డీఎస్సీ, ఎస్సై, కానిస్టేబుల్ కొలువులకు నిర్వహించే పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే మైనార్టీ అభ్యర్థులకు సీఈడీఎం ద్వారా ఉచితంగా శిక్షణనివ్వనున్నట్లు మైనార్టీల ఆర్థిక సంస్థ ఇన్‌ఛార్జి కార్యనిర్వాహక సంచాలకుడు ప్రభాకరరావు తెలిపారు. ఔత్సాహికులు www.apcedmmwd.org వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు 0866-2970567 నంబరును సంప్రదించాలని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 8142292071.

REAL ESTATE

ప॥గో॥జిల్లా తణుకులో DTCP అప్రూవుడు లేఅవుట్‌లో Individual Buildings కట్టించి ఇవ్వబడును. సంప్ర॥ ✆ 98662 92016.

LAND FOR SALE

తణుకు, పైడిపర్రు జం., NH రోడ్ సమీపం 41 సెం. (2000 గ॥) అమ్మకం. ఫ్యాక్టరీలకు, గొడౌన్స్, హాస్పిటల్స్, చర్చి, హోటల్స్, ఇండోర్ స్టేడియం, కల్యాణ మండపాలకు అనువైనది. ✆ 94403 37281, 90145 26077

TO LET

COMMERCIAL

తణుకు పట్టణం వైపు ఉన్న రైల్వేగేటు వద్ద గల సురక్షా హాస్పిటల్ ఎదురుగా వున్న భవనంలోని మొదటి అంతస్తులో గల 24 వందల SFT విస్తీర్ణం అద్దెకు ఇవ్వబడును. బ్యాంకులకు, ఆసుపత్రులకు, ఇతర వ్యాపార కార్యాలయాలకు ఉపయోగపడును. Cont: 88863 44499.

SECOND SALE

వాషింగ్‌మిషన్స్, LED TV లు, ఫ్రిజ్‌లు, ఇన్వర్టర్స్, AC లు లేటెస్ట్ మోడల్స్ తక్కువ వాడి ఫుల్ కండీషన్‌తో తక్కువ ధరలో అమ్మకము. ✆ 87121 68544.

JOBS

Wanted English Speaking teachers for 10th Maths. English Speaking teachers for Lower Classes. Rs:15000/- Per month. AYEM High School, Kombotlapalem ✆ 83416 28723.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యూయర్స్. ఏజ్: 22-35. ఫ్రెషర్స్ కూడా కావలెను. ✆ 6281037879.

రామకృష్ణ గ్రూప్ Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషెంట్ల సేవకు ఇంటిపని, వంటపని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు కావలెను. భో+వ+ జీతం: 16-18K ✆ 9704051122, 9010680011.

గుంటూరు జిల్లా వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ హాస్టల్‌లో ఉండి పనిచేయుటకు వార్డెన్స్ కావలెను. (పురుషులు/ స్త్రీలు) డిగ్రీ/ పీజీ అర్హత. కాంటాక్ట్- 9490309033 (F), 9705834803 (M)

భీమవరంలో పద్మప్రియ ఫైనాన్స్‌నందు పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం+ఇన్సెంటివ్స్. ✆ 93924 88877, 99851 61166

ఏలూరు బ్రాంచ్‌లో పనిచేయుటకు స్త్రీ/పు సేల్స్ మేనేజర్స్ కావలెను. విద్యార్హత డిగ్రీ, శాలరీ నెలకు 30000/- + ఇన్సెంటివ్స్. కాంటాక్ట్: 90632 40898.

వంట మనిషి కావలెను ఫర్ గర్ల్స్ హాస్టల్ భార్యాభర్తలు రూమ్ అండ్ ఫుడ్ ఇస్తాము. కాల్ ఇన్ హైదరాబాద్. సంప్రదించండి: 8688823404, 9963880880.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల‌ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.80 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

(c) eenadu

భీమవరం

• భీమవరం • ఉండి

టై యూ-2025లో ప్రథమం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: టై యూ -2025 టోర్నమెంటు గ్రాండ్ ఫినాలేలో భీమవరం విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరుసగా మూడోసారి ప్రథమంలో నిలిచిందని ప్రిన్సిపల్ మంగం వేణు తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ పోటీలో 300 విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఇందులో తమ కళాశాలకు చెందిన స్మార్ట్ సినర్జీస్ ఐవోటీ సొల్యూషన్స్ బృందం మొదటి బహుమతి సాధించిందన్నారు.

ఘనంగా వందేమాతరం వేడుక

మహాత్మాగాంధీ విగ్రహం వద్ద జాతీయ జెండాలు, ప్లకార్డులతో అధికారులు, విద్యార్థులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా విజ్ఞాన వేదిక కన్వీనర్ రంగసాయి ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పురపాలక సంఘ కార్యాలయం ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద జాతీయ జెండాలు, స్వాతంత్ర్య ఉద్యమ నినాదాలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించారు. పురపాలక మేనేజర్ ఎస్.నాగేశ్వరరావు మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమాన్ని కీర్తిస్తూ వందేమాతర గేయాన్ని 1875 నవంబరు 7న బంకించంద్ర కూర్చారన్నారు.

రహదారుల అభివృద్ధికి రూ.17 కోట్లు

మాట్లాడుతున్న శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజు

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: భీమవరంలో రహదారుల అభివృద్ధికి అత్యవసర నిధులు రూ.17 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు తెలిపారు. సోమవారం నిర్వహించిన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్ల కోసం రూ.100 కోట్లతో ప్రతిపాదనలు పంపగా తొలి విడతగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఈ నిధులు మంజూరు చేశారని వెల్లడించారు. వాటితో అత్యవసరమైన రహదారులను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ మాట్లాడుతూ సకాలంలో నివేదికలు రూపొందించి పంపిస్తేనే నిధులు మంజూరవుతాయని.. ఆ దిశగా అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఇళ్ల వద్ద, కార్యాలయాల్లో కూర్చొని తుపాను నష్టం అంచనాలు తయారు చేయొద్దని అధికారులకు స్పష్టం చేశారు. భీమవరం మత్స్యశాఖ అభివృద్ధి అధికారిణి లావణ్యను ఉద్దేశించి ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నిసార్లు ఫోన్లు చేసినా మీరు ఎందుకు తీయరని ప్రశ్నించారు. ఎంపీపీ పేరిచెర్ల విజయనర్సింహరాజు, జడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నర్సింహారావు, ఏఎంసీ ఛైర్మన్ కలిదిండి సుజాతరామచంద్రరాజు, ఎంపీడీవో మురళీగంగాధరరావు, తహసీల్దార్ రావి రాంబాబు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆడేస్తాం.. లక్ష్యం చేరుకుంటాం

న్యూస్‌టుడే, భీమవరం పట్టణం: భారత మహిళా క్రికెట్ జట్టు జగత్ విజేతలుగా నిలవడం యువ క్రీడాకారిణులకు మరింత స్ఫూర్తినిచ్చింది. సెమీస్‌కు చేరుతుందా అనే ఆందోళన నుంచి ఆస్ట్రేలియాను మట్టికరిపించి.. తుది పోరులో దక్షిణాఫ్రికాను ఓడించి భారత ఖ్యాతి విశ్వవ్యాప్తం చేయడం తమలో ఉత్సాహాన్ని నింపిందని యువ క్రీడాకారిణులు అంటున్నారు. అభిప్రాయాలు వారి మాటల్లోనే..

బౌలర్‌గా సత్తా

రైట్ ఆర్మ్ లెగ్ స్పిన్ బౌలర్‌గా సత్తా చాటుతున్నా. శిక్షకులు ఇచ్చే సూచనలు, మెలకువలతో క్రికెట్‌లో ప్రతిభ కనబరుస్తున్నా. అండర్-15 అంతర్ జిల్లాల, రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడాను. ఉత్తమ ఆటతీరు కనబరిచి జాతీయస్థాయికి అర్హత సాధించడమే నా లక్ష్యం. - జి.తాస్య శ్రీ, దేవరపల్లి

మా అందరికీ స్ఫూర్తి

ప్రపంచ క్రికెట్‌లో ఆడిన క్రీడాకారిణులు జట్టు ఎంపికకు ఎంత కష్టపడ్డారో తెలుసుకున్నాం. ఆటల్లో రాణించాలంటే పట్టుదల ఎంతో అవసరమని తెలిసింది. నేను జిల్లా జట్టులో బ్యాటర్‌గా ఆడుతున్నా. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్‌కు ఎంపికయ్యాను. డీఎన్నార్ కళాశాల ఆవరణలోని గన్నాబత్తుల క్రీడామైదానంలో సాధన చేస్తా. భావి భారత క్రీడాకారిణుల్లో ఒకరిగా నిరూపించుకుంటా. - కె.మోనిషా

అండర్-15 జట్టులో..

క్రికెట్ చరిత్రలో మరుపురాని ఘట్టాన్ని భారత మహిళా క్రికెట్ జట్టు సువర్ణాక్షరాలతో లిఖించింది. ఇదే పట్టుదలతో రానున్న రోజుల్లో యువ క్రీడాకారులు ముందుకొస్తారు. ఫైనల్స్‌కు చేరి వెనుదిరగడం గతంలో చాలా బాధించేది. ప్రపంచ కప్పు అందు కోగలమా అనే కలను జట్టు సభ్యులు నిజం చేశారు. అండర్-15 జట్టులో జాతీయ స్థాయికి చేరాలనుకుంటున్నా. - నిత్య

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

భీమవరం పట్టణం:	80085 74471	ఆకివీడు:	800085 74525
భీమవరం మండలం:	80085 74533	ఉండి:	80085 74526
పాలకోడేరు:	80085 74467	కాళ్ల	94401 04042
వీరవాసరం:	80085 74475		

ఉండి, న్యూస్‌టుడే: ? మా ప్రాంతంలో వీధి దీపాలు సరిగ్గా వెలగడం లేదు. చీకటి పడితే రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. - సత్యవతి, బాలాజీరావు పేట

✔ వీధి దీపాలు వెలిగేలా మరమ్మతులు చేయిస్తాం - అప్పారావు, ఇన్‌ఛార్జి గ్రామ కార్యదర్శి, ఉండి

కాళ్ల, న్యూస్‌టుడే: ? కాళ్ల పల్లపువీధిలో ఇళ్ల ముందు బురదమయంగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. నీరు పారుదల లేక ఇళ్ల నుంచి బయటికి రావాలంటే ఇబ్బందికరంగా ఉంటోంది. - శ్రీనివాసరావు

✔ కచ్చా డ్రెయిన్లు తవ్విస్తాం. - సతీశ్, కార్యదర్శి, కాళ్ల

ఆకివీడు, న్యూస్‌టుడే: ? ఆకివీడు మండలం పెదకాపవరంలోని 6వ వార్డు పరిధిలో సీసీ రోడ్డుపై మురుగు, వర్షం నీరు నిలిచిపోయి దుర్వాసన, దోమల బెడదతో అవస్థలు పడుతున్నాం - శివాజీ

✔ సమస్య పరిష్కరిస్తాం - వెంకన్న, పంచాయతీ కార్యదర్శి

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: ? గొల్లవానితిప్పలో ప్రధాన రహదారి వెంబడి ఇష్టారాజ్యంగా చెత్త పారబోస్తున్నారు - సూరి.

✔ చర్యలు తీసుకుంటాం. - శివ, పంచాయతీ కార్యదర్శి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ? పారిశ్రామికవాడలో మురుగుతో ఇబ్బంది పడుతున్నాం. - రామచంద్రరావు

? చినరంగనిపాలెంలో ఎప్పటికప్పుడు చెత్త తరలించడం లేదు. దోమలతో ఇబ్బంది పడుతున్నాం. - బి.సూరిబాబు

✔ చెత్త తొలగించి ఫాగింగ్ చేయిస్తాం. డ్రెయిన్లను శుభ్రం చేయిస్తాం. - ఎ.రాంబాబు, పురపాలక సహాయ కమిషనర్

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: ? పట్టణంలో నల్లంటి వీధి, తోటకు వెళ్లే రహదారి మురుగు కాలువ వెంబడి పరివర్త కాలు, తాడేరు రోడ్డులో విద్యుత్తు స్తంభాలను తీగలతో మొక్కలు అల్లుకున్నాయి. చిన్నపాటి వర్షం వస్తే విద్యుత్తు అంతరాయం ఏర్పడుతోంది. - 12,13వ వార్డుల ప్రజలు

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - ఎ.సునీత, విద్యుత్తు శాఖ ఏఈ

వీరవాసరం, న్యూస్‌టుడే: ? మత్స్యపురిపాలెం - [illegible] పల్లి ఆర్‌అండ్‌బీ రహదారి గుంతలమయంగా తయారైంది. ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. - (త్రిమూర్తులు)

✔ మరమ్మతుల కోసం రూ.20 లక్షలతో అంచనాలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు చేస్తాం. - డీఎన్‌ఎన్. మూర్తి, ఆర్‌అండ్‌బీ ఏఈ, వీరవాసరం

? కొణితివాడ ఎస్సీ బాలికల వసతిగృహం ప్రాంతంలో పిచ్చి మొక్కలు పెరిగి విషసర్పాలకు ఆవాసంగా మారింది. - మణికంఠ

✔ పిచ్చి మొక్కలు తొలగింపజేస్తాం - [illegible], పంచాయతీ కార్యదర్శి, కొణితివాడ

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

వాడపల్లి(ఆత్రేయపురం): కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలం చింతలకోటిగరువుకు చెందిన పంజా జయరామ్ కుటుంబసభ్యులు రూ.50,116 విరాళం సోమవారం సమర్పించారు. వీరికి స్వామివారి చిత్రపటం అందజేసి దేవస్థానం ప్రతినిధి శ్రీనివాస్ అభినందించారు.

ఎన్ఎస్ఎస్ శిబిరం

సిద్ధాపురం (ఆకివీడు), న్యూస్‌టుడే: ఆకివీడు శ్రీవిద్యా వికాస్ డిగ్రీ కళాశాల విద్యార్థుల 'ఎన్ఎస్ఎస్' ప్రత్యేక శిబిరాన్ని సిద్ధాపురం గ్రామంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కళాశాల డైరెక్టర్ కె.సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ కె.నాగలక్ష్మి తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి మూడు చక్రాల సైకిల్ అందజేత

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: [illegible] నర్సింహమూర్తి అనే దివ్యాంగుడికి బ్యాటరీతో నడిచే ట్రైసైకిల్‌ను కలెక్టర్ నాగరాణి సోమవారం అందజేశారు. మావుళ్లమ్మ ఆలయం వద్ద చిరు వ్యాపారం చేసుకునే అతడు కలెక్టర్ ఆలయానికి వెళ్లిన సమయంలో ట్రైసైకిల్ కావాలని విజ్ఞప్తి చేశాడు. ఆ మేరకు స్పందించిన కలెక్టర్ దివ్యాంగుల సంక్షేమశాఖ ద్వారా దాన్ని ఏర్పాటు చేశారు.

డ్రెయిన్ గట్టుపై చెత్త తొలగింపు

పనులు పర్యవేక్షిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో సీహెచ్‌వీ రెడ్డి తదితరులు

ఉండి, న్యూస్‌టుడే: బొండాడ మేజర్ డ్రెయిన్ గట్టుపై వాంద్రం వెళ్లే మార్గంలో ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్త తొలగింపు పనులు అధికారులు చేపట్టారు. సోమవారం 'వామ్మో.. వాంద్రం రహదారి' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై డిప్యూటీ ఎంపీడీవో సీహెచ్‌వీ రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి అప్పారావు, కార్యాలయ సిబ్బంది ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. పంచాయతీ ఆధ్వర్యంలో పొక్లెయిన్‌తో వ్యర్థాలు తొలగించి ముగ్గు, బ్లీచింగ్ చల్లించారు. ఈ ప్రాంతంలో చెత్త వేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామని డిప్యూటీ ఎంపీడీవో రెడ్డి తెలిపారు.

స్పందనకు వందనం

పరిశుభ్రంగా రహదారి.. భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: భీమవరం 11వ వార్డులో వెళ్లే రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ శుభ్రం చేయడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం 'ఈనాడు'లో 'వీధులన్నీ మురుగుమయం' శీర్షికతో ప్రచురితమైన చిత్రవార్తకు అధికారులు స్పందించారు. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలకు వెళ్లే వీధి మలుపులో రోడ్డుపై మురుగు, వర్షం నీరు రోజుల తరబడి నిలిచిపోతోంది. ఉదయం డ్రెయినేజీలో పూడిక తొలగించి మురుగునీరు వెళ్లేలా చేసి పరిసరాలు శుభ్రం చేసే ప్రక్రియ పురపాలక శానిటరీ అధికారి జంపన సత్యనారాయణరాజు పర్యవేక్షించారు.

అధికారులకు సత్కారం

సన్మానగ్రహీతలతో నాయకులు

వీరవాసరం, న్యూస్‌టుడే: మొంథా తుపానును సమర్థంగా ఎదుర్కొనడానికి విశేష కృషి చేసిన మండల అధికారులను ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ [illegible], ఎంపీడీవో [illegible], విద్యుత్తు శాఖ ఏఈ [illegible], ఎస్సై [illegible], వ్యవసాయ, ఆరోగ్య, పంచాయతీ, జలవనరుల శాఖ, ఐసీడీఎస్, వెలుగు శాఖల సిబ్బందిని సత్కరించారు. ఎంపీటీసీ సభ్యులు [illegible], సర్పంచి [illegible], [illegible] తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు కోరుతూ 6న ధర్నా

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 6న జిల్లా ఏపీ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి బూడిద జోగేశ్వరరావు పిలుపునిచ్చారు. నరసాపురం పట్టణంలోని ముద్దాల వారి వీధిలో చల్లా వీరభద్రం అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

పాలిథిన్ సంచులు వాడితే జరిమానా

ఆకివీడు, న్యూస్‌టుడే: పాలిథిన్ సంచుల వాడకం వల్ల పర్యావరణానికి, ప్రజారోగ్యానికి తీవ్ర ప్రభావం చూపుతోందని.. వాటిని విక్రయించినా.. వినియోగించినా జరిమానా విధిస్తామని కమిషనర్ కృష్ణమోహన్ హెచ్చరించారు. సోమవారం ఆకివీడులోని పలు దుకాణాల్లో అధికారులు తనిఖీలు చేశారు. పాలిథిన్ సంచులు వినియోగిస్తున్న పలువురు వ్యాపారులు, సరకులు, పండ్లు తీసుకెళ్తున్న ఇద్దరి వినియోగదారుల నుంచి జరిమానాగా రూ.1700 వసూలు చేసినట్లు మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాకేత్‌బాబు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పరిశుభ్రత మన బాధ్యత

ఏలూరుపాడు(కాళ్ల), న్యూస్‌టుడే: పంచాయతీ పరిధిలోని అంతర్గత రహదారులపైకి మురుగు రాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచి భూపతిరాజు జగ్గరాజు సూచించారు. [illegible] రహదారులపైకి చేరిన మట్టిని జేసీబీ సహాయంతో సోమవారం తొలగించారు. కొద్దిపాటి వర్షాలకు గరువు ప్రాంతంలో సమస్య ఎక్కువగా ఉంటోందన్నారు. త్వరలో శాశ్వత పరిష్కారం చూపిస్తామని చెప్పారు. గ్రామంలో పక్కా మురుగునీటి పారుదల వ్యవస్థ లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు రాంబాబు, కార్యదర్శి అరుణ ఉన్నారు.

అయోడిన్‌పై అవగాహన

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భీమవరంలోని బీవీరాజు పురపాలికోన్నత పాఠశాలలో సోమవారం అయోడిన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మనం రోజువారీ తినే ఆహార పదార్థాల్లో వాడే ఉప్పులో అయోడిన్ ఎంత శాతం ఉందనేది పిల్లలకు ప్రయోగపూర్వకంగా డాక్టర్ కె.ఎం.ఆర్ కిశోర్ వివరించారు.

కమనీయం.. పాండురంగస్వామి గ్రామోత్సవం

ఏలూరుపాడు (కాళ్ల), న్యూస్‌టుడే: స్థానిక మంచినీటి చెరువు వద్ద గల రుక్మిణీసత్యభామ పాండురంగస్వామి వార్షికోత్సవం సందర్భంగా సోమవారం స్వామివారి కల్యాణం అనంతరం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామస్థులు, దాతల సహకారంతో కార్యక్రమాలు జరిగాయని పురోహితుడు పోదిలి నారాయణమూర్తి చెప్పారు. ఈ నెల 6న ఆలయంలో అఖండ అన్న సమారాధన ఉంటుందని తెలిపారు.

మీ కోసంలో 3 అర్జీలు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (మీ కోసం)లో 3 అర్జీలు అందాయని ఎంపీడీవో బాబూరావు తెలిపారు.

హర హర మహాదేవ

ఉండి, న్యూస్‌టుడే: కార్తిక మాసం రెండో సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలొచ్చారు. కలిసిపూడిలో భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయానికి వేకువ జాము నుంచి భక్తులు వరుసల్లో నిలబడి దర్శనం చేసుకున్నారు. ఇక్కడ నిర్వహించిన కార్తిక వన సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ఎన్నార్పీ అగ్రహారంలో పార్వతీ సమేత విశ్వేశ్వరస్వామి, ఉండి రాజులపేటలో పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు చేశారు.

భీమేశ్వరస్వామి

పాలకోడేరు, న్యూస్‌టుడే: పాలకోడేరు, మోగల్లు, వేండ్ర విస్సాకోడేరు, శృంగవృక్షంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రాల్లో వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. కార్తిక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివార్లకు విశేష అభిషేకాలు నిర్వహించారు.

పరమేశ్వరుని ఆశీస్సులు అందరికీ ఉండాలి.. భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పరమేశ్వరుని ఆశీస్సులు అందరికీ ఉండాలని, ప్రకృతి విపత్తుల నుంచి ప్రజలందర్నీ కాపాడాలని సోమేశ్వరస్వామికి పూజలు చేసినట్లు శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు తెలిపారు. కార్తిక మాసం రెండో సోమవారం సందర్భంగా పంచారామక్షేత్రం గునుపూడి సోమేశ్వర జనార్దన స్వామి ఆలయాన్ని దర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ముందుగా ఆయనకు ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయాధికారులు స్వాగతం పలికారు. ఆయనతో ప్రధానార్చకుడు రామకృష్ణ ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి ఆశీర్వాదం అందించారు. మోషేనురాజు తనయుడు సుందరరాజు, ఈవో రామకృష్ణంరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు మాదివాడ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. మల్లేశ్వర స్వామి, భీమేశ్వరస్వామి తదితర అన్ని శివాలయాల్లోనూ సాయంత్రం భక్తులు దీపాలు వెలిగించారు.

సోమేశ్వరుని సేవలో ఎమ్మెల్యేలు పులపర్తి, ధూళిపాళ్ల.. భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పంచారామక్షేత్రం గునుపూడి సోమేశ్వర జనార్దన స్వామిని భీమవరం, గుంటూరు జిల్లా పొన్నూరు ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సోమవారం రాత్రి దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు శేషవస్త్రం అందించారు. ధూళిపాళ్లకు ఎమ్మెల్యే రామాంజనేయులు ఆలయం తరఫున సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు క్యూ లైన్లలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్వామి దర్శనం కల్పించాలని ధర్మకర్తల మండలి ఛైర్మన్, సభ్యులకు, ఆలయాధికారులను సూచించారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్కౌట్ శిక్షకుల సమావేశం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: స్కౌట్ శిక్షణకు సంబంధించి భీమవరంలోని చింతలపాటి బాపిరాజు పాఠశాలలో సోమవారం శిక్షకులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 9 వరకు జరిగే శిక్షణ తరగతుల గురించి జిల్లా కన్వీనర్ ఉంగరాల నాగేశ్వరరావు వివరించారు.

జూద శిబిరంపై దాడి

పెదపుల్లేరు (ఉండి), న్యూస్‌టుడే: పెదపుల్లేరు పరిధి వాండ్రం రహదారిలో సోమవారం తెల్లవారుజామున జూద శిబిరంపై దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపారు. వారి నుంచి రూ.12,500 నగదు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామన్నారు.

మృతదేహం గుర్తింపు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణంలోని చిన్న వంతెనపై నుంచి యనమదుర్రు కాలువలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన కలిదిండి మండలం పెదపుట్లపూడి గ్రామానికి చెందిన నడికుదిటి దేశింగిరాజు(65) మృతదేహం దొరికిందని పోలీసులు తెలిపారు. కొంత కాలం నుంచి క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన భీమవరం ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అక్టోబరు 31న బయటకు వెళ్లిపోయి కాలువలోకి దూకినట్లు అతని కుమార్తె లక్ష్మీపార్వతి ఇచ్చిన ఫిర్యాదుపై హెడ్‌కానిస్టేబుల్ భూషణం కేసు నమోదు చేశారు. సోమవారం మొగల్తూరు మండలం పాతపాడు దగ్గర మృతదేహాన్ని కాలువలో గుర్తించామన్నారు.

బాబూరావుకు నివాళి

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: కార్మిక సంఘాల నాయకుడు చింతకాయల బాబూరావు మృతికి జిల్లా కేవీపీఎస్ నాయకులు సోమవారం నివాళులర్పించారు. పట్టణంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు, బత్తుల విజయ్‌కుమార్, నాగేశ్వరరావు, మాదాసి గోపి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతలేని మాంసం విక్రయించడం నేరం

రేలంగి(ఇరగవరం), న్యూస్‌టుడే: నాణ్యత లేని మాంసం విక్రయించడం శిక్షార్హమని రేలంగి పశువైద్యాధికారి పీవీఎన్‌టీవీ ప్రసాద్ అన్నారు. రేలంగిలో చికెన్, మటన్ విక్రయించే దుకాణదారులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. తణుకు, అత్తిలిలో కబేళాల వద్ద గొర్రెలు, మేకలను పశువైద్యులు పరిశీలించి ధ్రువీకరించిన తర్వాతే వధించాలన్నారు. దుకాణం వద్ద విక్రయించే మాంసంపై అధికార ముద్ర లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆరోగ్యంగా ఉన్న కోళ్లను మాత్రమే కోయాలన్నారు. నిల్వ ఉంచిన చికెన్ విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో కార్యదర్శి కె.సౌందర్య, సిబ్బంది బి.భాను, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఉద్యాన ప్రదర్శన

ప్రారంభిస్తున్న పరిశీలిస్తున్న మనోహర్

ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రాల ఆధ్వర్యంలో స్థానిక హౌసింగ్ బోర్డు ఎస్.వి.ఆర్. సర్కిల్ కొత్త రైతు బజారు వద్ద సోమవారం ఏర్పాటు చేసిన ఉద్యాన ప్రదర్శన ఆకట్టుకుంది. దీనిని ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ నాగరాణి, తాడేపల్లిగూడెం, గోపాలపురం ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, మద్దిపాటి వెంకటరాజులతో కలిసి ప్రదర్శనను తిలకించారు. అరటి, కొబ్బరి, మిరప రకాలు, ఎండు పూలతో తయారైన వివిధ వస్తువులు, తేనెటీగల ద్వారా, చిరు ధాన్యాలతో తయారు చేసిన ఉత్పత్తులను చూశారు. ఉద్యాన పంట ప్రాముఖ్యత, పంటల నిర్వహణ, విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే మార్గాల గురించి శాస్త్రవేత్తలు రామానందం, మధుమతి వివరించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త పి.విజయలక్ష్మి, శాస్త్రవేత్తలు దేవీవరప్రసాదరెడ్డి, రేఖ, అర్చన పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాసరావు

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

కాళ్ల, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలకు బానిసలవడం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు ఎస్సై శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. సోమవారం కాళ్ల జడ్పీ ఉన్నత పాఠశాల, బాలికల జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విలువైన సమయాన్ని విద్యపై ఉంచాలన్నారు. పరిసరాల్లో గంజాయి, డ్రగ్స్ వాడుతున్న వ్యక్తులెవరినైనా గుర్తిస్తే 1972 ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

5న సమన్వయ సమావేశం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో ఈ నెల 5న బ్యాంకు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహిస్తామని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.ముక్కంటి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ సామాజిక యువ వ్యాపారవేత్తలకు బ్యాంకు సహకారంతో అమలు చేస్తున్న పథకాలపై అవగాహన, సహకారం అందించేందుకు ఉదయం 10.30 గంటలకు ఏర్పాటు చేసిన ఈ సమావేశాన్ని ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముంచెత్తిన వాన

నవుడూరు (వీరవాసరం), న్యూస్‌టుడే: సోమవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి నవుడూరు కూడలిలో రహదారులపై పెద్ద ఎత్తున వర్షపునీరు నిలిచిపోయింది. సుమారు అరగంటపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి రాకపోకలు స్తంభించాయి. ఉదయం నుంచి ఎండ వేడిమితో అల్లాడిపోయిన ప్రజలకు వర్షం ఊరటనిచ్చినా.. వాతావరణ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టెట్ నుంచి ఉపాధ్యాయులను మినహాయించండి

వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో ప్రతినిధులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: మూడు దశాబ్దాలుగా బోధనలో ఉన్న గురువులు ఇప్పుడు ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) రాయాలని విద్యాశాఖ చెప్పడం భావ్యం కాదని ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ పి.ఎస్.విజయరామరాజు, ప్రధాన కార్యదర్శి జి.ప్రకాశం తెలిపారు. ఫ్యాప్టో రాష్ట్ర సంఘం పిలుపు మేరకు టెట్ నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని కోరుతూ కలెక్టర్, విద్యాశాఖ అధికారుల కార్యాలయాల్లో సోమవారం వినతిపత్రాలు అందించామని వారు తెలిపారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

తణుకు, న్యూస్‌టుడే: వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా సోమవారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కిల్ కాంపిటీషన్ 2025-26లో అదే పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి టి.మణిదీప్ ప్రతిభ చాటి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని కె.పద్మావతి తెలిపారు. ఎలక్ట్రికల్ వాహనానికి ఎకో ఫ్రెండ్లీ ఛార్జింగ్ స్టేషన్ తయారు చేసి ప్రదర్శన ఇచ్చారన్నారు. ఇది సోలార్ ప్యానల్‌తో బ్యాటరీని ఛార్జి చేసి దానితో వాహనాన్ని కూడా ఛార్జి చేయవచ్చని మణిదీప్ వివరించినట్లు తెలిపారు.

ఆర్థిక చేయూత

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: గుండె సమస్యతో బాధ పడుతున్న ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలకి చెందిన కోలా దేవి అనే మహిళకు కృష్ణబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ గంటా త్రిమూర్తులు అండగా నిలిచారు. ఆమెకు వైద్య ఖర్చుల కోసం రూ.35 వేలను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు చేతుల మీదుగా ఆమె కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. తెదేపా పట్టణాధ్యక్షుడు మద్దుల రాము, ప్రధాన కార్యదర్శి చెల్లబోయిన గోవింద్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణలే అవరోధాలు

కాలువల్లా రోడ్లు.. ప్రజలకు తప్పని తిప్పలు

న్యూస్‌టుడే, ఆకివీడు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఉండి, భీమవరం నియోజకవర్గాల పరిధిలో అనేక గ్రామాలను కలుపుతున్న ప్రధాన రహదారులపై, గ్రామాల్లోని అంతర్గత రోడ్లపై అనేక చోట్ల మురుగు, వర్షం నీరు నిలిచిపోయి కాలువల్ని తలపిస్తున్నాయి. చిన్నపాటి వర్షం కురిస్తేచాలు రోజుల తరబడి నీరు నిల్వ ఉండిపోతోంది. దీంతో అయా గ్రామస్థులు, వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. దుర్వాసన, దోమల బెడదతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీరు తగ్గిన తర్వాత మరికొన్ని రోజులు బురదతో జారుడుబల్లలా ఉంటున్నాయని.. దీని వల్ల తరచూ ప్రమాదాలకు గురవుతున్నామని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెదకాపవరం ఆరో వార్డులో అంతర్గత రోడ్డు దుస్థితి

దృష్టి సారిస్తేనే సత్ఫలితాలు

అనేక గ్రామాల్లో పూర్తిస్థాయిలో పక్కా డ్రెయినేజీ వ్యవస్థ లేదు. ఉన్న చోట్ల నిర్వహణ కొరవడింది. కనీసం కచ్చాడ్రెయిన్లు కూడా ఏర్పాటు చేయలేదు. ముఖ్యంగా అనేక చోట్ల ప్రధాన, అంతర్గత రోడ్లకు ఇరుపక్కలా ఆక్రమణలు పెరిగాయి. నివాసాల ముందు ఎత్తుగా సిమెంట్ నిర్మాణాలు చేయడంతో నీరు వెళ్లే మార్గాలు లేక నిల్వ ఉండిపోతోంది. కొన్ని చోట్ల కచ్చాడ్రెయిన్లు తవ్వేందుకు యత్నించినా ఆక్రమణదారులు సహకరించకపోగా అభ్యంతరం చెబుతూ అవరోధం కలిగిస్తున్నారని అయా గ్రామస్థులు వాపోతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, పంచాయతీ, ఆర్అండ్‌బీ ఉద్యోగులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడం లేదనే విమర్శలున్నాయి.

ఆకివీడు నుంచి గుమ్ములూరు వెళ్లే రహదారిపై వర్షపు నీరు

ఆకివీడు మండలంలో.. ఆకివీడు మండలంలోని పెదకాపవరం, చినకాపవరం, అప్పారావుపేట, గుమ్ములూరు, తరటావ, కోళ్లపర్రు, రాజులపేట, చినమిల్లిపాడు, కాళింగగూడెం, సిద్ధాపురం, దుంపగడప, మందపాడు, చెరుకుమిల్లి, అయిభీమవరం, కుప్పనపూడి, అజ్జమూరు గ్రామాల పరిధిలోని ప్రధాన రహదారులపై, పలు నివాసిత ప్రాంతాల్లోనూ ఇదే దుస్థితి.

(c) eenadu

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

నేడు చెకుముకి సంబరాలు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలను పెనుమంట్ర మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కన్వీనర్ సీహెచ్ ఉదయ్‌కిరణ్ తెలిపారు. పాఠశాల స్థాయిలో జరిగిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

ముంచెత్తిన భారీ వర్షం

పెనుమంట్ర, న్యూస్‌టుడే: పెనుమంట్ర మండలం పొలమూరు గ్రామ పరిధిలో సోమవారం మధ్యాహ్నం వేళ అకస్మాత్తుగా భారీ వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. తక్కువ సమయంలోనే ఇటీవల ఎన్నడూ లేనిస్థాయిలో వర్షం కురవడంతో వ్యాపారం, ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

సీసీ కెమెరాలకు రూ.3 లక్షల విరాళం

ఎస్పీ అద్నాన్ నయీం అస్మీకి చెక్కు అందజేస్తున్న కాశీవిశ్వేశ్వరరావు

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు విశాఖపట్నంలో స్థిరపడిన కేపీపాలెం వాసి అంబటి కాశీవిశ్వేశ్వరరావు రూ.3 లక్షల విరాళం ఇచ్చారు. దీనికి సంబంధించిన చెక్కును ఎస్పీ అద్నాన్ నయీం అస్మీకి సోమవారం అందించారు. ★ పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమును ఎస్పీ ప్రారంభించారు. అనంతరం డీఎస్పీ కార్యాలయంలో దస్త్రాలు తనిఖీ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం :80085 74504	ఆచంట :90631 44737
పాలకొల్లు :80085 74510	పెనుగొండ :80085 74469
పోడూరు :90631 44741	పెనుమంట్ర: 91212 29087

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? పట్టణంలోని బ్యాంకు వీధిలో చెత్త పేరుకుపోయి పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. - ఎం. కోటేశ్వరరావు, నరసాపురం
✔ చర్యలు తీసుకుంటాం. - ఎం. అంజయ్య, పురపాలక కమిషనర్

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: ? పింతపర్రు వీవర్స్ కాలనీలో ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. రాత్రి వేళ విష పురుగులు, పాములు సంచరిస్తున్నాయి. - నారాయణ, స్థానికుడు
✔ ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తాం. - శశికుమార్, పంచాయతీ కార్యదర్శి

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ? 19వ వార్డులో కొద్ది రోజులుగా డ్రెయిన్లను శుభ్రం చేయడం లేదు. మురుగు నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. - రాజు, స్థానికుడు
✔ డ్రెయిన్లను శుభ్రం చేయిస్తాం. - లక్ష్మీ, ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య అధికారి

వ్యర్థాల తొలగింపు — స్పందనకు వందనం

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండలోని ఆలయ వీధిలో డ్రెయిన్‌లో చెత్త పేరుకుపోయిన తీరుపై గత నెల 31న 'ఈనాడు- మేమున్నాం..మీకు తోడుగా'లో ప్రచురితమైన వార్తకు సర్పంచి నక్కా శ్యామలసోని, ఎంపీడీవో టి.సూర్యనారాయణ మూర్తి స్పందించారు. పంచాయతీ సిబ్బందితో ఆ ప్రాంతంలో డ్రెయిన్‌ను శుభ్రం చేయించారు.

హర హర మహాదేవ

పాలకొల్లు: క్షీరారామలింగేశ్వరస్వామి

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: కార్తిక సోమవారం సందర్భంగా పంచారామక్షేత్రమైన పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంతో పాటు పలు ప్రాంతాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారిని పూలు, రుద్రాక్షలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

పెనుమంట్ర, న్యూస్‌టుడే: జుత్తిగలోని శ్రీ ఉమావాసుకీ రవిసోమేశ్వర స్వామి ఆలయంలో పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు.

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండలోని నగరేశ్వర స్వామి, ఏకాంబరేశ్వర స్వామి, చెరుకువాడలో ఉమా నీలకంఠేశ్వర స్వామి, వడలిలో అగస్త్యేశ్వర స్వామి ఆలయాల్లో పూజలు, అభిషేకాలు చేశారు.

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట ఉమా రామలింగేశ్వర ఆలయంలో తెల్లవారుజామున నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో, ధ్వజస్తంభం వద్ద కార్తిక దీపాలు వెలిగించారు.

ఆచంట: శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

బిల్వ పత్రం.. వెలుగుల మంత్రం!

యలమంచిలి, న్యూస్‌టుడే: శివ పూజలో బిల్వ పత్రాలకు ఎంతో ప్రత్యేకత ఉంది. కార్తికమాసంలో బిల్వ పత్రాల విశిష్టతను చాటేలా యలమంచిలి శివాలయం ప్రాంగణంలో ఈ ఆకృతిని తీర్చిదిద్ది చుట్టూ ప్రమిదలు వెలిగించారు.

నిలిచి గెలిచి.. స్ఫూర్తి నింపి!

జగజ్జేతల బాటలో నడుస్తామంటున్న క్రీడాకారిణులు

పెనుమంట్ర, పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ఏకంగా 47 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత మహిళా క్రికెటర్లు సాధించిన స్ఫూర్తిదాయక విజయం క్రీడాకారుల్లో నూతనోత్తేజం నింపింది. క్రికెట్ ప్రపంచ కప్ టోర్నీ ఆరంభం నుంచి క్లిష్ట పరిస్థితుల్లోనూ భారత జట్టు చూపిన పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకొని రాబోయే పోటీల్లో ముందడుగు వేస్తామని జిల్లాకు చెందిన పలు విభాగాల క్రీడాకారులు చెబుతున్నారు. భారత మహిళా క్రికెట్ జట్టు విశ్వవిజేతగా నిలిచిన సందర్భంలో జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన పలువురు జిల్లా క్రీడాకారులు తమ అభిప్రాయాలను ఇలా వ్యక్తీకరించారు.

దేశానికి పతకం తెస్తా..

నాకు బాక్సింగ్ అంటే ఇష్టం. ఆడపిల్లలకు బాక్సింగ్ ఎందుకు అనకుండా తల్లిదండ్రులు ప్రోత్సహించారు. నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించి స్వర్ణ పతకం సాధించా. జాతీయ స్థాయి పోటీల్లోనూ రెండు చొప్పున స్వర్ణ, రజత పతకాలు సాధించా. మహిళా క్రికెట్ జట్టు టోర్నీ చూపిన పోరాట పటిమ చిరస్మరణీయం. వారి స్ఫూర్తితో మరింత సాధన చేస్తా. ఒలింపిక్స్ పాల్గొని దేశానికి పతకం తేవడమే నా ఆశయం. - కండిబోయిన మాధవి

నమ్మకం పెంచిన విజయం

మాది వ్యవసాయ కుటుంబం. నాకంటూ ప్రత్యేక గుర్తింపు ఉండాలనే యోచనతో బాక్సింగ్‌లో శిక్షణ పొందా. గతంలో నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ స్థాయి టోర్నీలో రాణించి పతకం సాధించా. జాతీయ స్థాయి పోటీల్లోనూ రెండు స్వర్ణ, మూడు రజత పతకాలు అందుకున్నా. ప్రపంచ కప్ క్రికెట్ టోర్నీలో మన జట్టు విజయం మహిళా క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసం నింపింది. - కోడి తేజస్వీని వెంకట శైలజ

మరవలేని క్షణాలు

అపజయాల తర్వాత పోరాట పటిమతో సాధించిన విజయాన్ని ఎన్నటికీ మరవలేం. 47 ఏళ్ల తర్వాత మన మహిళల జట్టు ప్రపంచ కప్ దక్కించుకోవడం శుభ పరిణామం. మహిళా క్రీడాకారుల్లో ఈ విజయం నూతనోత్తేజం నింపింది. బాక్సింగ్‌లో రాణించి అంతర్జాతీయ క్రీడాకారిణి మేరీకోమ్ స్థాయికి ఎదగాలన్నదే నా ఆశయం. ఈ దిశగా మరింత సాధన చేస్తా. జాతీయ స్థాయి పోటీల్లో రజత పతకం, రాష్ట్ర, జిల్లా స్థాయి టోర్నీల్లో 13 స్వర్ణ, మూడు కాంస్య పతకాలు సాధించా. - కప్పల శరణ్య

శ్రమకు దక్కిన ఫలితం

క్లిష్ట పరిస్థితులు ఎదురైనా నిరాశ చెందకుండా తుది వరకు శ్రమిస్తే విజయం వరిస్తుందనడానికి మన మహిళా క్రికెట్ జట్టే ప్రత్యక్ష నిదర్శనం. ప్రపంచ కప్ సాధనకు జట్టు సభ్యులు ఎంత శ్రమించి ఉంటారో ఒక క్రీడాకారిణిగా నాకు తెలుసు. నిత్య సాధనతో కరాటేలో జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి గుర్తింపు తెచ్చుకున్నా. ప్రయత్న లోపం లేకుండా కష్టపడితే మంచి ఫలితాలు వస్తాయన్నది గ్రహించా. - సాయి సాహితి

సత్తెమ్మకు కుంకుమ పూజలు

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: ఇలపర్రు శివారు గుడిపాడు లంక పొలం వద్ద కొలువైన సత్తెమ్మ ఆలయ వార్షికోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పిండి వంటలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

పూజశ్రీని అభినందిస్తున్న విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు

నమూనా అసెంబ్లీకి ఎంపిక

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నవంబరు 26న అమరావతిలో నిర్వహించే మాక్ అసెంబ్లీకి నరసాపురం నియోజకవర్గం నుంచి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని టి.పూజశ్రీ ఎంపికైనట్లు మండల విద్యాశాఖాధికారులు పి.పుష్పరాజ్యం, జి.జానీ ప్రభాకరరావు తెలిపారు. పట్టణంలో ఎస్ఎన్ఎస్ పురపాలక ఉన్నత పాఠశాలలో ఎం.నాగేశ్వరరావు న్యాయనిర్ణేతగా సోమవారం నియోజకవర్గ స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి పూజశ్రీని ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు యు.పెద్దిరాజు పాల్గొన్నారు.

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట నియోజకవర్గం నుంచి నమూనా అసెంబ్లీకి మణుగుల సాయిశ్రీ చైత్రిక మేఘ వర్షితను ఎంపిక చేసినట్లు ఎఈవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈమె పెనుమంట్ర జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది.

వినతులన్నీ పరిష్కరిస్తాం: ఆర్డీవో

సమస్య తెలుసుకుంటున్న రాజు

నరసాపురం, న్యూస్‌టుడే: ప్రజల నుంచి వచ్చిన వినతులన్నింటినీ సకాలంలో పరిష్కరించేలా చర్యలు చేపడతామని నరసాపురం ఆర్డీవో దాసి రాజు అన్నారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా వినతుల పరిష్కార వేదిక'లో ఆయన పాల్గొని అర్జీలు స్వీకరించారు. మొత్తం 48 మంది వినతులు అందినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. పాలకొల్లుకు చెందిన స్పెషల్ సీపీ స్థలం ఆక్రమణకు గురైందని ఫిర్యాదు చేశారు. తన భూముల బంధువులు ఆక్రమణ రిజిస్ట్రేషన్ చేయించుకొనేందుకు యత్నిస్తున్నారని పసలపూడి చెందిన పుల్లయ్య రామాంజనేయులు వినతిపత్రం అందించారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని ఆర్డీవో తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

నరసాపురం, న్యూస్‌టుడే: లింగ నిర్ధారణ పరీక్షలు చేసే కేంద్రాల నిర్వాహకులు, వాటిని ప్రోత్సహించే వైద్యులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో దాసి రాజు హెచ్చరించారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన లింగ నిర్ధారణ నిరోధక కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని సభ్యులకు పలు సూచనలు చేశారు. స్కానింగ్ కేంద్రాల వద్ద నిరంతర నిఘా ఉంచాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించాలని సూచించారు.

మొక్కుబడిగా మండల సమావేశం

వేదికపై ఎంపీపీ, ఇన్‌ఛార్జి ఎంపీడీవో తదితరులు

యలమంచిలి, న్యూస్‌టుడే: యలమంచిలి మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించగా మొక్కుబడిగా సాగింది. ఎంపీపీ వినుకొండ ధనలక్ష్మి అధ్యక్షత వహించారు. వైకాపాకు చెందిన పెనుమర్రు, చించినాడ, ఆర్యపేట, కాజతూర్పు, యలమంచిలిలంక గ్రామాల సర్పంచులు ఇన్‌ఛార్జి ఎంపీడీవో తమకు సరైన సమాధానం చెప్పడం లేదంటూ సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. అనంతరం శాఖలవారీగా సమీక్ష నిర్వహించారు. వైస్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు చిలుకూరి రాజ్యలక్ష్మి, డేగల సూర్యప్రభ, జల్లి రత్నంరాజు, సర్పంచులు తాళ్ల నాగరాజు, బుడితి జయరాజు పాల్గొన్నారు.

హామీల అమలు కోరుతూ 6న ధర్నా

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 6న జిల్లా ఏడీ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి బూడిద జోగేశ్వరరావు పిలుపునిచ్చారు. నరసాపురం పట్టణంలోని ముద్దాల వారి వీధిలో చల్లా వీరభద్రం అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

గైర్హాజరైతే సమస్యల పరిష్కారమెలా?

మాట్లాడుతున్న విజయభాస్కర్

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశానికి హాజరుకాకపోతే ప్రజా సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ఏఎంసీ ఛైర్మన్ కోడి విజయభాస్కర్ అన్నారు. పాలకొల్లు మండల పరిషత్తు కార్యాలయంలో చిట్టూరి కనక మహాలక్ష్మి అధ్యక్షతన సోమవారం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుపాను సమయంలో విద్యుత్తు, రెవెన్యూ శాఖల సిబ్బంది అందుబాటులో ఉండటంతో ఎలాంటి సమస్య ఏర్పడలేదన్నారు. చింతపర్రు సర్పంచి గుమ్మాపు పెద్దిరాజు మాట్లాడుతూ గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని.. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.

డబ్బాలే రక్షణ గోడలు!

ఆచంట, న్యూస్‌టుడే: మార్టేరు-కోడేరు రహదారిలో కొడమంచిలి వద్ద తాడేరు కాలువపై వంతెన దెబ్బతిని ప్రమాదస్థితిలో ఉంది. దీనికి ఒక వైపు రక్షణ గోడ లేదు పోయింది. వంతెనపై పెద్ద గాడి కూడా ఏర్పడింది. అధికారులు హెచ్చరిక సూచికగా ఈ వంతెనపై రెండు డబ్బాలు అడ్డుగా పెట్టి వదిలేశారు. ఈ మార్గం బస్సులతో పాటు, భారీ వాహనాలు కూడా తిరుగుతుంటాయి. ప్రమాదాలు జరగకముందే ఇక్కడ రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ అంశంపై ఆర్అండ్‌బీ ఏఈ ప్రసాద్ స్పందిస్తూ వంతెనల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

శివయ్యా.. దారి చూపు!

రావిపాడులో శివాలయం రోడ్డు దుస్థితి

పోడూరు, న్యూస్‌టుడే: పోడూరు మండలం రావిపాడులో శివాలయానికి వెళ్లే రహదారి ఇటీవల వర్షాలకు మురికి కూపంలా మారింది. ఈ రోడ్డు పల్లంగా ఉండటంతో వర్షం కురిసినప్పుడల్లా నీరు నిలిచిపోతోందని. కార్తికమాసంలో చించినాడ పంట కాలువలో పుణ్యస్నానాలకు, శివాలయానికి వెళ్లే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు చెబుతున్నారు. అక్కడి గృహ యజమానులు గోడ కట్టడంతో వాననీరు బయటకు వెళ్లే మార్గం లేకుండా పోయిందని.. 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ రహదారి నిర్మాణానికి చర్యలు చేపడతామని పంచాయతీ కార్యదర్శి మణికంఠ తెలిపారు.

కల్వర్టు.. కూలేట్టు!

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం- మత్స్యపురి రహదారిలో మురుగు కాలువపై ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరి ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఈ మార్గం నిత్యం సుమారు 15 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. వందల సంఖ్యలో ఆర్టీసీ, విద్యా సంస్థల బస్సులు, లారీలు, ఆటోలు ప్రయాణిస్తున్నాయి. కొన్నేళ్ల కిందటే ఈ కల్వరు శిథిలావస్థకు చేరగా మరమ్మతులు కూడా చేపట్టడం లేదని పలు గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఈ సమస్యపై ఆర్అండ్‌బీ డీఈ జీవీఎస్ కిరణ్‌కుమార్ స్పందిస్తూ ఇక్కడ పుష్కర నిధులతో వంతెన నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు.

అంధకారంలో బస్టాండ్

చీకట్లో నిరీక్షిస్తున్న విద్యార్థులు

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండ బస్టాండ్ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం విద్యుత్తు దీపాలు వెలగకపోవడంతో విద్యార్థులు, ప్రయాణికులు అవస్థలు పడ్డారు. వాతావరణ మార్పుల కారణంగా సాయంత్రం 6 గంటలకే చీకటి పడింది. ఇదే సమయంలో పెనుగొండ నుంచి స్వగ్రామాలకు వెళ్లే వివిధ కళాశాలల విద్యార్థులు బస్టాండుకు చేరుకోగా ఆ ప్రాంతమంతా అంధకారం అలముకొంది. చీకట్లో ఏ బస్సు వస్తుందో గుర్తించలేక, మరోపక్క దోమల బెడదతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు.

కవిటంలో నేడు ఎమ్మెల్యే పర్యటన

పోడూరు, న్యూస్‌టుడే: 'పల్లె పల్లెకు మన పితాని' కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ కవిటం గ్రామంలో పర్యటిస్తారని ఎంపీడీవో బీఎస్ఎల్ మంగాకుమారి తెలిపారు. స్థానిక సచివాలయం వద్ద నిర్వహించే సభలో ప్రజలు తమ సమస్యలపై ఆయనకు అర్జీలు అందజేయవచ్చన్నారు.

వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా గ్రంధి

పెనుగొండ, న్యూస్‌టుడే: అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్‌గా పెనుగొండకు చెందిన వాసవీమిత్ర క్లబ్ అధ్యక్షుడు గ్రంధి అజయ్ చంద్రక్య నియమితులయ్యారు. ఈ నెల 2న హైదరాబాద్‌లో నిర్వహించిన ఫెడరేషన్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కోన శ్రీనివాసరావు, కార్యదర్శి గొంట్ల మోహనరావుల నుంచి నియామక పత్రం అందుకున్నట్లు అజయ్ సోమవారం తెలిపారు.

రూ.7 లక్షలతో సీసీ రహదారి నిర్మాణం

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తోందని తెదేపా మండలాధ్యక్షుడు గుత్తుల లోకేశ్వరరావు అన్నారు. ములపర్రు శివారు పెదగరువులో రూ.7 లక్షల మండల పరిషత్తు నిధులతో చేపట్టిన సీసీ రహదారి నిర్మాణాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరాలు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ఆర్టిస్టులు, పెయింటర్ల సంఘం ఆధ్వర్యంలో పాలకొల్లు సామాజిక భవనంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 150 మంది సంఘ సభ్యులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. వైద్యుడు ఎండీ అహ్మద్ అలీ, సంఘం సభ్యులు సేవలందించారు.

పాలకొల్లు, న్యూస్‌టుడే: పాలకొల్లు ఛాంబర్స్ డిగ్రీ కళాశాల ఛైర్మన్ కేవీఆర్ నరసింహారావు జన్మదినం సందర్భంగా సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు ఉచితంగా నేత్ర, దంత పరీక్షలు చేయించారు. డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు 100 జతల ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు.

పాలక మండలితో ప్రభుత్వ విప్ నాయకర్

ఆలయాల అభివృద్ధికి కృషి చేద్దాం

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఆలయాల అభివృద్ధికి, భక్తులకు అవసరమయ్యే సదుపాయాల కల్పనకు సమష్టిగా కృషి చేద్దామని ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ పిలుపునిచ్చారు. నరసాపురం పట్టణంలోని కపిల మల్లేశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి ప్రమాణస్వీకారోత్సవం సోమవారం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆలయ ఈవో కె. రామచంద్రరావు పాలకమండలి ఛైర్మన్ ఉద్దగిరి అచ్యుత రామయ్య, సభ్యులు చిట్టవర్జుల మురళీకృష్ణ శర్మ, కొమ్మని వనజాక్షి, మామిడిశెట్టి రమాదేవి, కట్టుంగ నరేశ్, నిప్పులేటి శ్రీనివాస్, తిరుమాని ఏడుకొండలు, పాకర్ల రోజా, కనగళ్ల రామలీల కుమారిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రాయితీతో పాడి రైతులకు లబ్ధి

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: పశు వైద్యుల సూచనలకు అనుగుణంగా పశు పోషణలో రైతులు జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే నాయకర్, మాజీ కొత్తపల్లి సుబ్బారాయుడు సూచించారు. ఎల్బీచర్లలో పశువుల ఆసుపత్రి వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని పాడి రైతులకు 50 శాతం రాయితీపై దాణా అందజేశారు. పశు వైద్యాధికారి ఇంజేటి సురేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పిస్తేనే ప్రగతి

ఆచంట, న్యూస్‌టుడే: అందరికీ ఉన్నత విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తేనే ప్రగతి సాధ్యమయని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎస్వీఎస్ శర్మ అన్నారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య ఆవిర్భావ దినోత్సవాన్ని ఆచంటలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులతో కలిసి ప్రదర్శన నిర్వహించి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ప్రదర్శనలో విద్యార్థులు

తుపాను బాధితులకు అండగా ప్రభుత్వం

సిద్ధాంతం: నిత్యావసర సరకులు అందజేస్తున్న పితాని

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: తుపాను బాధితులకు ప్రభుత్వం తగిన చేయూత ఇస్తూ అండగా నిలుస్తోందని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. సిద్ధాంతం ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని తుపాను బాధితులకు బియ్యం, నిత్యావసర సరకులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను సమయంలో యంత్రాంగం సమర్థంగా సేవలందించిందని.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ముందస్తు చర్యలతో నష్ట నివారణ సాధ్యమైందని పేర్కొన్నారు. మండల, గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేశారని కొనియాడారు. అనంతరం పెనుగొండ మండలంలోని సిద్ధాంతం, దొంగరావిపాలెం, వడలి, పెనుగొండ గ్రామాలకు చెందిన 365 కుటుంబాలకు సరకులు అందించారు. సర్పంచులు చింతపల్లి గనిరాజు, కోన రామలింగేశ్వరరావు, మండలాధ్యక్షుడు గుత్తుల లోకేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు పితాని శేఖర్ పాల్గొన్నారు.

పోడూరు, న్యూస్‌టుడే: పోడూరు పంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం రాత్రి 'పల్లె పల్లెకు మన పితాని' కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. అనంతరం 142 చేనేత, మత్స్యకారుల కుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యం, 5 రకాల నిత్యావసర సరకులు అందజేశారు. రూ.16 లక్షలతో పెదపేటలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని, సొసైటీ గోదామును ప్రారంభించారు. తెదేపా మండల అధ్యక్షుడు రుద్రరాజు రమేశ్‌రాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి, ఉప సర్పంచి సీహెచ్ జయ రామకృష్ణ, నాయకులు రవిరాజు, గణపతినీడి రాంబాబు, దొమ్మేటి పురుషోత్తం పాల్గొన్నారు.

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట మండలం అయోధ్యలంక, భీమలాపురం గ్రామాల్లో తుపాను బాధితులకు ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సోమవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. గ్రామాలు, పేదల కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు.

దారులు ఛిద్రం.. ప్రయాణం నరకం

ఆచంట- పాలకొల్లు రహదారిలో గోతులు

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట ప్రాంతంలో ప్రధాన రహదారులు సైతం నిండా గోతులతో అధ్వానంగా మారాయి. సోమవారం అకస్మికంగా కురిసిన భారీ వర్షానికి మరోసారి రోడ్లన్నీ మునిగి ఛిద్రమయ్యాయి. అరేళ్లుగా గుంతలతోనే ఉన్న పాలకొల్లు-ఆచంట రహదారి నామరూపాలు లేకుండా పోయింది. ఈ మార్గానికి ప్రత్యామ్నాయమైన మినీ బైపాస్ కూడా ఛిద్రమై అడుగుతీసి అడుగేయలేని స్థితికి చేరింది. గుంతల కారణంగా ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించుకొనే అవకాశం లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు ఉన్నా పనులు పూర్తి చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఆర్అండ్‌బీ ఏఈ టీఆర్వీ ప్రసాద్‌ను సంప్రదించగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని.. వారి సూచనల మేరకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్కాట్ శిక్షకుల సమావేశం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: స్కాట్ శిక్షణకు సంబంధించి భీమవరంలోని చింతలపాటి బాపిరాజు పాఠశాలలో సోమవారం శిక్షకులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 9 వరకు జరిగే శిక్షణ తరగతుల గురించి జిల్లా కన్వీనర్ ఉంగరాల నాగేశ్వరరావు వివరించారు.

చేనేత కుటుంబాలను ఆదుకుంటాం

మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: భారీ వర్షాల కారణంగా చేనేత మగ్గాలు దెబ్బతిని ఉపాధి కోల్పోయిన కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు, భగ్గేశ్వరం గ్రామాల్లో 490 చేనేత కుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యం, నిత్యావసర సరకులను ఆయన సోమవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని 20 ఏళ్ల వెనక్కి తీసుకువెళ్లారని, మళ్లీ వైకాపా నాయకుల మాటలు నమ్మితే భావితరాల భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, నాయకులు పాముల రజినీకుమార్, కలిదిండి రామచంద్రరాజు, కామిశెట్టి రంగరావు, నెక్కంటి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి జన్మదిన వేడుక

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడ మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ జన్మదిన వేడుకలను నరసాపురంలోని జక్కం బాబ్జీ నివాసంలో నాయకులు, అభిమానుల సమక్షంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. డీసీఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ, నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు తదితరులు రాధాకృష్ణను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పల్లెలకు నిధులొచ్చాయ్!

పోడూరు, నరసాపురం గ్రామీణ, పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: మండల పరిషత్తులు, పంచాయతీలకు ఇటీవల 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. దీంతో నిర్వహణ, అభివృద్ధి పనులకు ఇబ్బందులు తప్పుతాయని పాలకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఆర్థిక సంఘం నిధులను ఇతర పథకాలకు మళ్లించారు. దీంతో కనీసం పారిశుద్ధ్య నిర్వహణ, ముగ్గు, బ్లీచింగ్, తాగునీటి క్లోరినేషన్, విద్యుత్తు బిల్లుల చెల్లింపులకు పంచాయతీల అధికారులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. అభివృద్ధి పనులకు అవకాశం లేకపోవడంతో పాలకులు ప్రజలకు సమాధానం చెప్పలేక సతమతమయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీలకు జమ చేస్తున్నారు. గతంలో నిధులు లేక తాగునీటి సరఫరా, ఇతర నిర్వహణ పనులకు ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఇప్పుడు ఆర్థిక సంఘం నిధులు మంజూరు కావడంతో కాస్త ఊరట లభించిందని పెనుమదం సర్పంచి తానేటి బాబూరావు చెప్పారు.

మండలాల వారీగా మంజూరైన నిధులు (రూ. కోట్లలో)

మండలం	గ్రామాలు	నిధులు
ఆచంట	12	1.06
యలమంచిలి	30	1.08
మొగల్తూరు	17	1.14
నరసాపురం	28	1.35
పాలకొల్లు	22	0.86
పెనుగొండ	15	1.14
పెనుమంట్ర	18	1.01
పోడూరు	16	0.46

(c) eenadu

తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

టై యూ-2025లో ప్రథమం



భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: టై యూ-2025 టోర్నమెంట్ గ్రాండ్ ఫినాలేలో భీమవరం విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరుసగా మూడోసారి ప్రథమంలో నిలిచిందని ప్రిన్సిపల్ మంగం వేణు తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ పోటీలో 300 విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఇందులో తమ కళాశాలకు చెందిన స్మార్ట్ సినర్జీస్ ఐవోటీ సొల్యూషన్స్ బృందం మొదటి బహుమతి సాధించిందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
10 AM to 1 PM
తాడేపల్లిగూడెం : 99488 53114
తణుకు : 85558 50851
తణుకు గ్రామీణం: 63005 79402
అత్తిలి : 91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? యాగర్లపల్లిలో పందుల సంచారంతో పరిసరాలు కలుషితం అవుతున్నాయి - రవి
✔ పందుల సంచారాన్ని అరికట్టేలా చర్యలు చేపడతాం. - సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్
? మామిడితోట శివారులో పురపాలక ట్యాంకర్ నీరు వాలక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. -విజయ్, స్థానికుడు
✔ ట్యాంకర్ నీరు సమృద్ధిగా అందేలా చర్యలు చేపడతాం. - ఎం.ఏసుబాబు, పురపాలక కమిషనర్

శ్రమించి.. సత్తా చాటి

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే

భారత మహిళా క్రికెట్ జట్టు దక్షిణాఫ్రికాతో జరిగిన తుది పోరులో సమష్టి కృషితో విర సృజనీయ విజయం సాధించి వరల్డ్ కప్ ను తొలిసారి కైవసం చేసుకుంది. ఇదే స్ఫూర్తితో మహిళా క్రీడాకారులు నిరంతర కృషితో ప్రపంచ స్థాయిలో సత్తా చాటాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో మండపాక జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు క్రీడాకారిణులు 'న్యూస్‌టుడే'తో తమ మనోగతాన్ని వెల్లడించారు.

జాతీయ స్థాయికి ఎదగాలని..

నా పేరు ఎం.దీపిక. ఎనిమిదో తరగతి చదువుతున్నా. జిల్లాల రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచా. బాక్సింగ్, పరుగు పోటీల్లో జాతీయ స్థాయికి ఎదగాలని నా లక్ష్యం. ఇందుకు పీడీ సూర్యనారాయణ తర్ఫీదునిస్తున్నారు.

వ్యాయామ ఉపాధ్యాయినివవుతా..

నా పేరు ఎల్ పూజాదివ్య దుర్గ. ఏడో తరగతి చదువుతున్నా. మహిళా క్రికెట్ జట్టు స్ఫూర్తిదాయకమైన విజయం సాధించింది. జిల్లాల వీరవాసరంలో జరిగిన జిల్లా స్థాయి సెప్లింగ్ పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎన్నికయ్యా. గతంలో నాగార్జున యూనివర్సిటీలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొన్నా. భవిష్యత్తులో వ్యాయామ ఉపాధ్యాయిని కావడమే నా లక్ష్యం.

పోలీసు అధికారి కావాలని..

నా పేరు ఎం.సత్యశ్రీ. పదో తరగతి చదువుతున్నా. ఇటీవల పెదవేగిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నా. సమష్టి కృషితోనే మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్‌ను సొంతం చేసుకుంది. భవిష్యత్తులో పోలీస్ అధికారిగా ఎంపికై ప్రజలకు సేవ చేయాలని నా లక్ష్యం.

పేదలకు సేవ చేస్తా

నా పేరు బి.భవానీ ఏడో తరగతి చదువుతున్నా. జిల్లాల తణుకు జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన నరసాపురం డివిజనల్ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని అండర్ 14 క్యాటగిరీలో జిల్లా స్థాయికి ఎంపికయ్యా. భవిష్యత్తులో వైద్యురాలినై పేద ప్రజలకు సేవ చేస్తా.

భారీ వర్షంతో అవస్థలు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో సోమవారం మధ్యాహ్నం ఆకస్మాత్తుగా కురిసిన భారీ వర్షంతో ప్రజలు అవస్థలు పడ్డారు. పట్టణంలో శివారు ప్రాంతాలైన కడకట్ల, సవిత్యపేట, యాగర్లపల్లి, మహాలక్ష్మీనగర్, సత్యవతినగర్‌లతో పాటు ప్రధాన రహదారులైన కేఎన్ రోడ్డు, శేషమహల్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాలు జలమయమయ్యాయి. చెరువులు, కాలువలను తపించాయి. దీంతో ఆయా మార్గాల్లో ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం రామన్నగూడెం, పెంటపాడు మండలం వల్లూరుపల్లి గ్రామాల్లో ఎస్సీ కాలనీల్లో నివాసాల చుట్టూ వర్షపునీరు చేరి వరదలను తలపించింది. వాహనదారులు, పాదచారులు ఇక్కట్లు పడ్డారు.

వల్లూరుపల్లి ఎస్సీ కాలనీలో నివాసం చుట్టూ చేరిన వర్షపునీరు

నేలకొరిగిన చెట్టు

ఘనంగా వందేమాతరం వేడుక

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా విజ్ఞాన వేదిక కన్వీనర్ రంగరాజు ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పురపాలక సంఘ కార్యాలయం ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద జాతీయ జెండాలు, స్వాతంత్ర్య ఉద్యమ నినాదాలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించారు. పురపాలక మేనేజర్ ఎస్.నాగేశ్వరరావు మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమాన్ని కీర్తిస్తూ వందేమాతరం గేయాన్ని 1875 నవంబరు 7న బంకించంద్ర ఛటర్జీ రాశారన్నారు.

మహాత్మాగాంధీ విగ్రహం వద్ద జాతీయ జెండాలు, ప్లకార్డులతో అధికారులు, విద్యార్థులు

చిత్రం గీసి.. ప్రతిభ చాటి

తణుకు, న్యూస్‌టుడే: స్థానిక ఎస్‌కేఎస్‌డీ మహిళా జూనియర్ కళాశాలలో సోమవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ప్రకృతి అందాలు' అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్వతాలు, నదులు, చెట్టు, పక్షుల అందాలను చిత్ర రూపంలో మలిచి ప్రతిభ చాటారు. ఎస్.గ్రేస్సీ, జి.ధరణి, పి.చరితాప్రియ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చిట్టూరి ఉషారాణి, ప్రిన్సిపల్ బి.హెచ్.హిమబిందు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.గృహలక్ష్మి, ఆర్.సుధారాణి పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న విజేతలు

టెట్ నుంచి ఉపాధ్యాయులను మినహాయించండి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ముప్పై దశాబ్దాలుగా బోధనలో ఉన్న గురువులు ఇప్పుడు ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) రాయాలని విద్యాశాఖ చెప్పడం భావ్యం కాదని ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ పి.ఎస్.విజయరామరాజు, ప్రధాన కార్యదర్శి జి.ప్రకాశం తెలిపారు. ఫ్యాప్టో రాష్ట్ర సంఘం పిలుపు మేరకు టెట్ నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని కోరుతూ కలెక్టర్, విద్యాశాఖ అధికారుల కార్యాలయాల్లో సోమవారం వినతిపత్రాలు అందించామని వారు తెలిపారు.

వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో ప్రతినిధులు

ఆకట్టుకున్న ఉద్యాన ప్రదర్శన

ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రాల ఆధ్వర్యంలో స్థానిక హౌసింగ్ బోర్డు ఎన్.వి.ఆర్.సర్కిల్ కొత్త రైతు బజారు వద్ద సోమవారం ఏర్పాటు చేసిన ఉద్యాన ప్రదర్శన ఆకట్టుకుంది. దీనిని ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ నాగరాణి, తాడేపల్లిగూడెం, గోపాలపురం ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, మద్దిపాటి వెంకటరాజులతో కలిసి ప్రదర్శనను తిలకించారు. అరటి, కొబ్బరి, మిరప రకాలు, ఎండు పూలతో తయారైన వివిధ వస్తువులు, తేనెటీగల ద్వారా, చిరు ధాన్యాలతో తయారు చేసిన ఉత్పత్తులను చూశారు. ఉద్యాన పంట ప్రాముఖ్యత, పంటల నిర్వహణ, విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే మార్గాల గురించి శాస్త్రవేత్తలు రామానందం, మధుమతి వివరించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త పి.విజయలక్ష్మి, శాస్త్రవేత్తలు దేవీవరప్రసాదరెడ్డి, రేఖ, అర్జున పాల్గొన్నారు.

రైతుబజారు స్టాల్‌ను ప్రారంభిస్తున్న మనోహర్

మంత్రికి సత్కారం..

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: మండలంలోని ఆరుగొలనులో దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను సోమవారం జాజాపా రాష్ట్ర అధ్యక్షురాలు బోగిరెడ్డి అరిలక్ష్మి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు యలయనపూడి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం: ఆరిమిల్లి

తణుకు, న్యూస్‌టుడే: సమాజానికి ఉపయోగపడే ఎన్నో మంచి సేవా కార్యక్రమాలను తణుకు మానవత సంస్థ చేస్తుండటం అభినందనీయమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గమిని ఫంక్షన్ హాలు వద్ద కె.రాజారాజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆనంద మస్కార్‌వడ్డ ఆర్థిక సహకారంతో సమకూర్చిన రూ.3.50 లక్షల విలువైన నూతన శాంతి రథం వాహనాన్ని ఆయన రిబ్బను కత్తిరించి ప్రారంభించారు. జిల్లా శాంతి ర్యాలీ ఛైర్మన్ గమిని రాంబాబు, జిల్లా కన్వీనర్ బి.రామలక్ష్మి, ఎస్.వి.సతీష్, రాష్ట్ర కన్వీనర్ కె.రాధాపుష్పావతి తదితరులు పాల్గొన్నారు.
● తణుకు నియోజకవర్గంలో అంధత్వ నివారణకు ఏడాదికి రెండు, మూడు పర్యాయాలు కంటి వైద్య శిబిరాలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. ఇటీవల ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న వారందరికీ స్థానిక కూటమి పార్టీ కార్యాలయంలో ఉచితంగా కళ్లజోళ్లను అందజేశారు. 228 మందికి త్వరలోనే శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు చెప్పారు.
మహిళా ప్రపంచ కప్ గర్వకారణం.. మహిళా క్రికెట్‌లో మొదటి సారి భారత జట్టు ప్రపంచకప్ సాధించడం గర్వకారణమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక కూటమి కార్యాలయంలో రాధాకృష్ణ ఆధ్వర్యంలో విజయోత్సవాలు నిర్వహించి మాట్లాడారు. ప్రపంచ కప్ ఫైనల్లో మహిళా క్రీడాకారులు చూపిన ప్రతిభ భవిష్యత్తు తరాలకు ఆదర్శనీయమన్నారు. ఈ సందర్భంగా కేకు కోసి వేడుకలు నిర్వహించారు.

శాంతి రథం వాహనాన్ని రిబ్బను కత్తిరించి ప్రారంభించిన రాధాకృష్ణ

కిటకిటలాడిన శివాలయాలు

ఇరగవరం, న్యూస్‌టుడే: కార్తిక సోమవారం పర్వదినం సందర్భంగా తణుకు, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో సందడి నెలకొంది. భక్తులు కార్తిక దీపం వెలిగించి పరమేశ్వరుడిని దర్శించుకున్నారు. ఇరగవరం మండలం కె.ఇల్లింద లపర్రు బోడేశ్వర స్వామి, కంతేరు సోమేశ్వర, ఐతంపూడి పాతేశ్వర, రేలంగిలో తాటకేశ్వర, మల్లేశ్వర స్వామి, కత్తవపాడు సోమేశ్వర స్వామి ఆలయాల్లో అభిషేకాలు చేశారు.
వీరభద్రునికి.. తణుకు, న్యూస్‌టుడే: పైడిపర్రు శివాలయంలో భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు శివుడు, పార్వతి, కుమార స్వామి వేషధారణలు, కోలాట భజనతో పురవీధుల్లో స్వామి వారి పల్లకి సేవ నిర్వహించారు.
వీరేశ్వరస్వామికి.. కొండ్రుప్రోలు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలులోని భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరణ చేశారు.
లక్షపత్రి పూజ.. తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు మండలం తేతలిలో పార్వతి సమేత రాజేశ్వర స్వామి దేవస్థానంలో స్వామికి లక్షపత్రి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారికి విశేష అలంకరణ చేశారు.

అలంకరణలో సోమేశ్వరస్వామి

వేషధారణలో చిన్నారులు

వీరేశ్వర స్వామి

తేతలిలో..

గంగానమ్మ జాతరకు ముడుపు

ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: స్థానిక లక్ష్మీవారపు పేటలో గంగానమ్మ జాతర ప్రారంభ సూచిగా సోమవారం ముడుపు ఉత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే బడేటి చంటి, మీనా దంపతులు, మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులు, ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్ అప్పలనాయుడు తదితరులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం చంటి శిరస్సుపై అమ్మవారి ముడుపు తీసుకొచ్చి.. అర్చకులకు అందజేశారు.

వరిచేలను పరిశీలించిన కారుమూరి

ఇరగవరం, న్యూస్‌టుడే: మొంథా తుపాను కారణంగా మండలంలోని ఓగిడి, పేకేరు గ్రామాల్లో దెబ్బతిన్న వరి చేలను మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సోమవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులందరినీ ఆదుకోవాలని, పూర్తి స్థాయిలో పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు కొప్పిశెట్టి దుర్గా ప్రసాదు, వెలగల సాయిబాబా రెడ్డి, సత్తి వెంకట రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురి మహిళా దొంగల అరెస్టు

పరకాల, న్యూస్‌టుడే: చోరీకి పాల్పడిన ఐదుగురు మహిళా దొంగలను సోమవారం అరెస్టు చేసినట్లు పరకాల సీఐ క్రాంతికుమార్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా పరకాలకు చెందిన ఇద్దరు యువతులు ఆదివారం హనుమకొండకు వెళ్లేందుకు స్థానిక బస్టాండులో బస్సు కోసం ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో ఆమె పర్సును, చరవాణిని గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదుతో సోమవారం ఉదయం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా.. అనుమానాస్పదంగా కనిపించిన ఐదుగురు మహిళలు పారిపోయేందుకు యత్నించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా.. తాడేపల్లిగూడెంలోని యాగర్లపల్లికి చెందిన పట్నాల పూలమ్మ, కుంబ నాగమణి, యారసాని నాగమల్లి, యురుయుల సాయికుమారి, యారసాని దేవిలుగా గుర్తించారు. వారిని అరెస్టు చేసి అపహరించిన చరవాణులతో పాటు పర్సులోని రూ.4,560 నగదును సీజ్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఐదుగురిపై గతంలో కైకలూరు, దెందులూరు, చల్లపల్లి, భద్రాచలం టౌన్, అశ్వారావుపేట, గూడూరు టౌన్, నూజివీడు, విజయనగరం, సత్తుపల్లి పోలీస్‌స్టేషన్లలో కేసులున్నట్లు సీఐ తెలిపారు.

విద్యార్థిని ఆచూకీ గుర్తింపు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మాదేపల్లికి చెందిన పన్నెండేళ్ల బాలిక సోమవారం వేకువజామున 3 గంటల నుంచి కనిపించడం లేదంటూ బాధిత తల్లిదండ్రులు ఉదయం 9.59 గంటలకు కంట్రోల్ రూం నంబరు 112కు ఫోన్ చేశారు. గ్రామీణ ఎస్సై నాగబాబు అప్రమత్తమై తన సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకున్నారు. మాదేపల్లి శివారులో బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. వసతి గృహంలో చేరుస్తామని తల్లిదండ్రులు చెప్పడంతో బాలిక మనస్తాపానికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

తణుకు.. వానరాలతో వణుకు

గాయాలపాలవుతున్న పుర ప్రజలు

తణుకు, న్యూస్‌టుడే: పట్టణ ప్రజలను వానరాలు వణుకు పుట్టిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో కోతులు దాడులు చేస్తుండటంతో గడప దాటి కాలు బయట పెట్టాలంటే మహిళలు, చిన్నారులు, వృద్ధులు భయభ్రాంతులకు గురవుతున్నారు. వానరాల నుంచి విముక్తి కల్పించాలని పైడిపర్రుకు చెందిన పలువురు సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారంటే వాటి తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

పైడిపర్రులో బాత్‌రూం మిద్దెపై తిష్ఠ వేసిన కోతులు

మీదకు దూకేస్తున్నాయ్.. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇళ్లపైకి, అపార్టుమెంట్లోకి వచ్చి తిష్ఠ వేస్తున్నాయి. దీంతో ఉదయం చిన్నారులను పాఠశాలకు తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు భయపడిపోతున్నారు. మహిళలు దుస్తులు ఉతికి ఆరబెట్టుకునేందుకు, వస్తువులు కొనుగోలు చేసేందుకు బయటకు వస్తుంటే చాలు మీదకు దూకేస్తున్నాయి. ఇటీవల సజ్జాపురంలోని తోట రామలక్ష్మి అనే వృద్ధురాలు సాయంత్రం ఇంటి బయట కూర్చునేందుకు రావడంతో ఒక్కసారిగా ఆమెపైకి దూకడంతో గాయాలపాలయ్యారు.

నెల రోజులు మంచం దిగకూడదు

నా వయసు 85 సంవత్సరాలు. 20 రోజుల కిందట నేను బాత్‌రూంకు వెళ్లి ఇంట్లోకి వెళ్తుండగా ఒక్కసారిగా నాలుగు కోతులు నాపైకి దూకేశాయి. ఒళ్లంతా రక్త గాయాలు కావడం, కాలు సైతం బెణకడంతో చనిపోతానేమోనని అనిపించింది. ఆసుపత్రిలో ఎక్స్‌రే తీసి నెల రోజుల పాటు మంచం దిగకూడదని వైద్యులు చెప్పారు. **- మహంకాళీ సరోజిని, తణుకు**

తొమ్మిది కుట్లు పడ్డాయి

వారం రోజుల క్రితం రెండు కోతులు కొట్టుకుంటూ నాపైకి దూకడంతో తలకు పెద్ద గాయమైంది. తొమ్మిది కుట్లు పడ్డాయి ఆసుపత్రిలో రూ.23 వేలు ఖర్చయ్యింది. **- దుద్దుపూడి పోసిరత్నం, పైడిపర్రు**

ఆయా ప్రాంతాల్లో... ప్రధానంగా గోస్తని కాలువ వెంబడి ఉన్న సంతమార్కెట్ వెంట్రామా థియేటర్, సజ్జాపురం, హౌసింగ్ బోర్డు, కొమ్మాయి చెరువు గట్టు, లక్ష్మీథియేటర్ ఎదుట వీధి, వెంకటకృష్ణ థియేటర్ ఎదుట వీధితో పాటు పైడిపర్రు ప్రాంతాల్లో అధికంగా కోతులు ఉంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు రెండు సార్లు కోతులను పట్టించి అటవీ ప్రాంతాల్లో వదిలాం. మళ్లీ రప్పించి పట్టిస్తామని మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ తెలిపారు.

యువతకు విద్యానైపుణ్యాభివృద్ధి అవసరం

కొమ్ముగూడెం(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: యువతలో విద్యానైపుణ్యాభివృద్ధి, ఉపాధిపై అవగాహన పెంపొందించడం సమాజాభివృద్ధికి కీలకమని వక్తలు సూచించారు. శశి ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం ఎన్‌సీసీ క్యాడెట్స్ నిర్వహించిన ఎన్ఎస్ఎస్ శిబిరంలో పాల్గొని మాట్లాడారు. జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా కొమ్ముగూడెం గ్రామంలో నిరుద్యోగం, నిరక్షరాస్యత, ప్రజల సమస్యలు అనే అంశంపై సర్వే నిర్వహించారు. సర్పంచి తాడేపల్లి బేబి, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి వాణి, జిల్లా పరిషత్తు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డీవీవీ సత్యనారాయణమూర్తి, ఎ.గోపాలకృష్ణ, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి షేక్ సల్మాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులు, కళాశాల సిబ్బంది

పోరాటాల ముద్దు బిడ్డ బాబూరావు

రైల్వేస్టేషన్‌కూడలి(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పోరాటాల ముద్దు బిడ్డ బాబూరావు అని రైల్వే గూడ్స్‌షెడ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి అన్నారు. అధ్యక్షుడు సత్తి కోదండరామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో సీఐటీయూ ఆవిర్భావంలో బాబూరావు కీలక పాత్ర పోషించారని తెలిపారు. కార్యక్రమంలో కర్రి సాయిరెడ్డి, ఎస్ఎస్ రెడ్డి, కర్రి శ్రీనివాస్‌రెడ్డి, అడపా ఆంజనేయులు, గాది వెంకట్రావు, మద్దాల పుత్రయ్య, ఆకుల నారాయణ, బుద్దాల నాని తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న పుల్లారెడ్డి

నాణ్యతలేని మాంసం విక్రయించడం నేరం

రేలంగి(ఇరగవరం), న్యూస్‌టుడే: నాణ్యత లేని మాంసం విక్రయించడం శిక్షార్హమని రేలంగి పశువైద్యాధికారి పీవీఎన్‌టీవీ ప్రసాద్ అన్నారు. రేలంగిలో చికెన్, మటన్ విక్రయించే దుకాణదారులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. తణుకు, అత్తిలిలో కబేళాల వద్ద గొర్రెలు, మేకలను పశువైద్యులు పరిశీలించి ధ్రువీకరించిన తర్వాతే వధించాలన్నారు. దుకాణం వద్ద విక్రయించే మాంసంపై అధికార ముద్ర లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆరోగ్యంగా ఉన్న కోళ్లను మాత్రమే కోయాలన్నారు. నిల్వ ఉంచిన చికెన్ విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో కార్యదర్శి కె.సౌందర్య, సిబ్బంది బి.భాను, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.
తణుకు, న్యూస్‌టుడే: జబ్బుపడి మృతిచెందిన మాంసాన్ని విక్రయాలు చేయడం చట్టరీత్యా నేరమని దీనికి శిక్ష తప్పదని మండల పశువైద్యాధికారి డా కె.అశోక్‌రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం వేల్పూరు పశువైద్యశాలలో మాంసం విక్రయదారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనారోగ్యంతో మృతి చెందిన మాంసాన్ని విక్రయించినట్లు ఫిర్యాదు వస్తే ఉపేక్షించమన్నారు. ఈ సందర్భంగా కొనుగోలు, విక్రయాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

రేలంగిలో మాంసం విక్రయదారులకు సూచనలిస్తున్న పశువైద్యాధికారి ప్రసాద్

మురుగు ముందుకు పారేదెలా..?

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు మండలం కొమరవరం ప్రధాన డ్రెయినేజీలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో మురుగు ముందుకు పారడం లేదు. గ్రామంలో కొందరు స్థానికులు, వ్యాపారులు వ్యర్థాలను రహదారి అంచుల్లో, డ్రెయిన్లలో పడేస్తుండటంతో పారిశుద్ధ్య నిర్వహణ భారంగా మారుతోందని పారిశుద్ధ్య కార్మికులు వాపోతున్నారు. రోజుల తరబడి మురుగు నిల్వ ఉండటంతో పరిసరాలు దుర్వాసన రావడంతో పాటు దోమలు విజృంభించి తరచూ జ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి ఎస్‌కేమ్ చిష్టి మాట్లాడుతూ డ్రెయిన్లలో పూడిక తీత పనులు చేపట్టామని తెలిపారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

తణుకు, న్యూస్‌టుడే: వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా సోమవారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కిల్ కాంపిటీషన్ 2025-26లో అదే పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి టి.మణిదీప్ ప్రతిభ చాటి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని కె.పద్మావతి తెలిపారు. ఎలక్ట్రికల్ వాహనానికి ఎకో ఫ్రెండ్లీ ఛార్జింగ్ స్టేషన్ తయారు చేసి ప్రదర్శన ఇచ్చారన్నారు. ఇది సోలార్ ప్యానల్‌తో బ్యాటరీని ఛార్జి చేసి దానితో వాహనాన్ని కూడా ఛార్జి చేయవచ్చని మణిదీప్ వివరించినట్లు తెలిపారు. ముఖ్యంగా అటవీ, కొండ ప్రాంతాల్లో, విద్యుత్తు అందుబాటులో లేని ప్రాంతాల్లో ఇది ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దీనివల్ల పర్యావరణానికి హాని ఉండదని వివరించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రెటరీ కె.సోమేశ్వరరావు, శిక్షకులు దిశేంద్ర, మూర్తి పాల్గొన్నారు.

మణిదీప్

మహాసభల విజయవంతానికి పిలుపు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 10, 11 తేదీల్లో అత్తిలి షాదీఖానాలో 32వ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం అత్తిలిలో విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు కౌరు పెద్దిరాజు, సహ కార్యదర్శి బళ్ల చినవీరభద్రుడు మాట్లాడుతూ మహా సభలకు జిల్లా నలుమూలల నుంచి 200 మంది ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ మహాసభలకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు.

దుకాణదారులకు కరపత్రాన్ని అందిస్తున్న కార్మిక సంఘం నాయకులు

తాగునీటి సీసాల పంపిణీ

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: పెంటపాడు మండలం మోడల్ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం పూర్వ విద్యార్థి గాదాపు సతీష్ కుమార్, రామలక్ష్మి దంపతులు తాగునీటి సీసాలు పంపిణీ చేశారు. సతీష్‌కుమార్ గతంలో పాఠశాలకు తన తల్లి సరస్వతి పేరిట బీరువా అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిరిమావిళ్ల పెద్దిరాజు, ఉపాధ్యాయురాలు ఎం.పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్లుగా అన్నదానం

నీలాద్రిపురం(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: మండలంలోని నీలాద్రిపురంలో శ్రీ ఉమాచంద్రశేఖర్ స్వామి, ఉమాదేవి అమ్మవార్ల ఆలయంలో సోమవారం కొడవటి హనుమంతరావు కుమారుడు ఈశ్వరరావు ఆర్థిక సహకారంతో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆయన గత ఆరేళ్లుగా తన సొంతఖర్చులతో ప్రతి సోమ, శుక్రవారాల్లో ఉచిత అన్నదానం నిర్వహిస్తున్నారు.

ఇంట్లో దాచిన బంగారం మాయంపై కేసు

పెదవేగి(పెదపాడు), న్యూస్‌టుడే: పెదవేగికి చెందిన కొనకళ్ల మహేశ్వరరావు కిరాణా దుకాణం నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈయన భార్య సెప్టెంబరు 30న ఇంట్లోని సుమారు రూ.3 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు శుభ్రం చేసి.. దసరా పండగ రోజు వేసుకోవచ్చన్న ఉద్దేశంతో డ్రస్సింగ్ టేబుల్ సొరుగులో దాచారు. అక్టోబరు 2న ఆభరణాలు వేసేకునేందుకు సొరుగు తీసి చూడగా కనిపించలేదు. భర్తకు భయపడి విషయం చెప్పలేదు. 20న దీపావళి రోజు భార్య బంగారు ఆభరణాలు వేసుకోకపోవడంతో మహేశ్వరరావు ఆమెను ప్రశ్నించారు. భార్య అసలు విషయం చెప్పడంతో.. ఓ వ్యక్తిని అనుమానించి పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. అక్కడా విషయం తేలకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు.
తాళం వేసినా.. పెదవేగి: న్యాయంపల్లికి చెందిన ముంద్రు రాంబాబు ఈ నెల 2న ఇంటికి తాళమేసి కుటుంబంతో కలిసి భీమడోలులోని బంధువుల ఇంటికెళ్లారు. తిరిగి రాత్రి ఇంటికి చేరుకోగా, తలుపు తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించారు. లోపలికెళ్లి చూడగా.. బీరువా తెరచి ఉంది. 4 గ్రాములు బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించారు.

(c) eenadu

కడప: మృత్యుంజయకుంట శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

దర్శనం కోసం బారులుదీరిన భక్త జనం

కార్తికం.. దీప శోభితం

పవిత్ర కార్తిక మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా శైవాలయాలు దీప శోభితంతో ప్రకాశించాయి. భక్తులు వేకువజామునే ఆలయాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దీపాలు వెలిగించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. శైవ క్షేత్రాలు శివ నామ స్మరణతో మార్మోగాయి. **- న్యూస్‌టుడే, ఒంటిమిట్ట, మారుతీనగర్(కడప)**

ఆధ్యాత్మిక శాంతి శిఖరం అమీన్ పీర్ దర్గా



కడప చిన్నచౌకు, బిల్టప్, న్యూస్‌టుడే: వైఎస్సార్ కడప జిల్లాలోని అమీన్ పీర్ దర్గా(పెద్ద దర్గా) ఉరుసు ఉత్సవాలు ఏటా నవంబరు మాసంలో నిర్వహించడం ఆనవాయితీ. ఈ నెల 5వ తేదీ నుంచి అయిదు రోజుల పాటు ఉరుసు కొనసాగుతుందని దర్గా నిర్వాహకులు తెలిపారు. 5న గంధం, 6న ఉరుసు, 7న ముషాయిరా ఉంటాయని, 8న పెద్ద ఎత్తున ఖవ్వాలీ, 9న నగరంలో పీఠాధిపతి ఊరేగింపు వైభవంగా నిర్వహించనున్నట్లు వివరించారు. ఉత్సవాలకు దేశంలోని నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. ఊరేగింపుతో ఉరుసు ముగుస్తుంది.

● **16వ శతాబ్దంలో పునాది:** 16వ శతాబ్దంలో కర్ణాటకలోని బీదర్ ప్రాంతం నుంచి ఖ్వాజాయే ఖాజుగా నాయబే రసూల్ అతాయే రసూలుల్లా హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా పీరుల్లా మాలిక్ సాహెబ్ తన సతీమణి, ఇరువురు కుమారులు, పకీర్లు, ఖలీఫాలతో కలిసి ఆధ్యాత్మిక బోధనలు చేస్తూ కడప ప్రాంతానికి వచ్చారు. అప్పట్లో నవాబు నేక్‌నామ్‌ఖాన్ స్వయంగా దర్శించుకుని ప్రియ భక్తుడిగా మారారు. అమీన్ పీర్ దర్గా వ్యవస్థాపకుడు హజరత్ పీరుల్లా మాలిక్. ఇక్కడ పెద్ద ఉరుసును మాత్రం సూఫీ సర్ మస్తానీ ఆరీపుల్లా మొహమ్మద్ మొహమ్మదుల్ హుస్సేనీ చిష్టివుల్ ఖాద్రి పేరిట నిర్వహిస్తారు. కాలక్రమేణా అమీన్ పీర్ దర్గాగా పేరొందింది.

ప్రముఖుల సందర్శన

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, ఎన్టీఆర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, సినీ నటులు అమితాబ్‌బచ్చన్, రజనీకాంత్, ఆమిర్‌ఖాన్, రాంచరణ్, ప్రముఖ సంగీత దర్శకుడు రెహమాన్‌తో పాటు ఎంతో మంది ప్రముఖులు, సినీనటులు, రాజకీయ నాయకులు దర్గాను ఇప్పటి వరకు సందర్శించారు.

ఉరుసుకు ప్రత్యేక బస్సులు

పెద్ద దర్గా ఉరుసుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్ఎం గోపాల్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, పాత బస్టాండ్, మాచుపల్లె బస్టాండ్ మీదుగా పెద్దదర్గాకు ఈ బస్సులు వెళ్తాయని పేర్కొన్నారు.

● కార్తిక పౌర్ణమి సందర్భంగా బుధవారం జిల్లాలోని శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు ఆర్ఎం తెలిపారు. పొలతల, నిత్యపూజకోన, పుష్పగిరి, కన్యతీర్థం, అగస్త్యేశ్వరకోనతో పాటు ఇతర శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సులన్నీ ఆయా డిపోల నుంచి బయలుదేరుతాయని వివరించారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న జేఈవో వీరబ్రహ్మం, ఎస్ఈ, డీఈ తదితరులు

త్వరలో నిత్యాన్నదాన కేంద్రం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయం దర్శనం కోసం వస్తున్న భక్తుల ఆకలి తీర్చడానికి త్వరలో నిత్యాన్నదానం కేంద్రాన్ని ప్రారంభిస్తామని తితిదే సంయుక్త కార్యనిర్వహణాధికారి వల్లూరు వీరబ్రహ్మం తెలిపారు. రామయ్య క్షేత్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. సీతారామలక్ష్మణమూర్తులను దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కేంద్రం కోసం ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈవో వీరబ్రహ్మం 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. ఇక్కడ పనులు చేపట్టడానికి కేంద్ర పురావస్తు శాఖ అధికారుల నుంచి సానుకూలత వ్యక్తం చేశారని తెలిపారు. తిరుమల తరహాలో ఇక్కడ కూడా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి అన్నం అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ఒకేసారి 200 మంది కూర్చుని భోజనం చేసేలా తాత్కాలిక సౌకర్యాలు కల్పించాలని సివిల్ విభాగం ఎస్ఈ మనోహరం, డీఈ నాగరాజును ఆదేశించారు. ప్రమాద రహిత జర్మనీ షెడ్డును పొడవు 60 అడుగులు, వెడల్పు 40 అడుగుల వైశాల్యంతో ఏర్పాటు చేయాలని సూచించారు. వంటశాలకు కావాల్సిన అదనపు సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. ఏర్పాట్లలో రాజీపడొద్దని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.

రైతేరాజు 6లో

ఇంతింతై.. ప్రపంచ కప్ అంతై

ఈనాడు, కడప: కడప క్రీడలు, న్యూస్‌టుడే

శ్రీచరణి.. ఎక్కడా తగ్గిందే లేదు

పుట్టి పెరిగింది చిన్న పల్లెటూరు. ఆడేందుకు మౌలిక సదుపాయాల్లేవు. ఆ బాలికకేమో క్రికెట్ అంటే ఎనలేని మక్కువ. ఆడేందుకు అడుగులేస్తే తొలుత తండ్రి నుంచి వ్యతిరేకత ఎదురైంది. ఒప్పించి.. అమ్మ, మామల ప్రోత్సాహంతో బంతి చేతబట్టింది. కలిసి ఆడేందుకు ఆ పల్లెల్లో ముందుకొచ్చిన బాలికల్లేరు. అయినా ఎక్కడా వెనక్కి తగ్గలేదు. గ్రామంలోని బాలురతో క్రికెట్ ఆడుతూ వచ్చింది. ఆటపై మక్కువ.. అకుంఠిత దీక్ష.. పట్టుదల వెరసి ఇప్పుడు ఆ యువతిని క్రీడా శిఖరాగ్రాన నిలిపాయి.

వెన్ను తట్టిన కుటుంబం

వైఎస్సార్ కడప జిల్లా వీరపునాయునిపల్లె మండలం యర్రమల్లపల్లె గ్రామానికి చెందిన నల్లపురెడ్డి శ్రీచరణిది మధ్య తరగతి కుటుంబం. నాన్న చంద్రశేఖర్‌రెడ్డి ఆర్టీపీపీ ఉద్యోగి. అమ్మ రేణుక గృహిణి. అక్క వైష్ణవి చరిత ఎంఎస్ పూర్తి చేసి యూఎస్‌లో ఉద్యోగం చేస్తున్నారు. శ్రీచరణికి ఆటలంటే చాలా ఇష్టం. పాఠశాల స్థాయిలో ఖోఖో, బ్యాడ్మింటన్ ఆడిన ఆమె ఆ తర్వాత క్రికెట్ వైపు దృష్టి సారించింది. నాన్న ఒప్పుకోలేదు. అయినా ఆమె క్రికెట్ ఆడాలని గట్టిగా పట్టుబట్టింది. అమ్మ రేణుక, మామ కిశోర్‌కుమార్‌రెడ్డిలతో కలిసి తండ్రిని ఒప్పించింది. తొలుత ప్రొద్దుటూరులో, ఆపై హైదరాబాద్‌లో శిక్షణ పొందింది.

ఇదీ క్రికెట్ ప్రస్థానం

● 2017-18లో జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక కావడంతో క్రికెట్ ప్రస్థానం మొదలైంది. ● 2022లో ఆంధ్ర సీనియర్ జట్టులో చోటు దక్కించుకుంది. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ రాణించింది. ● 2024లో ఉమెన్స్ ఐపీఎల్‌లో దిల్లీ జట్టు కొనుగోలు చేసింది. ● 2025లో భారత జట్టులో చోటు దక్కించుకుంది. ఇదే ఏడాది ఉమెన్స్ వరల్డ్ కప్‌లో తన ఆట తీరుతో జట్టు ఛాంపియన్‌గా నిలిచేందుకు కృషిచేసింది.

● ప్రాథమిక విద్య ఆర్టీపీపీ అనుబంధ డీఏవీ పాఠశాలలో సాగింది. ● ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో చదివింది. ● ప్రస్తుతం డిగ్రీ వీరపునాయునిపల్లెలోని వీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో చదువుతోంది. ● భారత జట్టు ప్రపంచ కప్‌ను ముద్దాడడం, ఆ జట్టులో తమ కుమార్తె ఉండటం చూసి తల్లిదండ్రులు, గ్రామస్థులు సంబరాలు చేసుకున్నారు. ● కడప జిల్లాకు చెందిన తొలి మహిళా క్రికెటర్ శ్రీచరణి. ● జట్టు కప్ గెలవగానే కుటుంబ సభ్యులంతా మిఠాయిలు పంచుకుని సంతోషం పంచుకున్నారు. జిల్లా వాసులు కూడా తమ ఇంటి యువతే ఆడి గెలిచినంత ఆనందం వ్యక్తం చేశారు.

నవ్విన చోటే పువ్వులు

శ్రీచరణికి ఉమెన్స్ వరల్డ్‌కప్‌లో చోటు దక్కినప్పుడు జిల్లా వాసులు ఎంతో సంబరపడ్డారు. చాలా మంది క్రికెట్ పెద్దలు మాత్రం అనుభవం లేని ఆమెకు చోటు కల్పించడంపై పెదవి విరిచారు. వారి అంచనాలను తలకిందులు చేస్తూ... శ్రీలంకతో సాగిన మ్యాచ్‌లో అద్భుతంగా బౌలింగ్ చేసింది. కేవలం 37 పరుగులే ఇచ్చి 2 వికెట్లు పడగొట్టి సత్తా చాటింది. లెఫ్ట్ ఆర్మ్ బౌలర్ అయిన ఆమె చక్కటి లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేస్తూ పరుగులను నియంత్రించడమే కాకుండా కీలక సమయాల్లో ప్రత్యర్థుల వికెట్లు తీస్తూ వచ్చింది. వరల్డ్ కప్‌లో ఇప్పటి వరకు 9 మ్యాచ్‌లు ఆడి 14 వికెట్లు తీసింది.

పోలీస్ స్టేషన్ స్థలానికే ఎసరు

2005 వరకు కొన్ని దశాబ్దాల పాటు కడప నగరంలోని ఈ స్థలంలో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కొనసాగింది. శిథిలావస్థకు చేరుకోవడంతో తదనంతరం నేకనామ్ ఖాన్ కళాక్షేత్ర పక్కన గల భవనంలోకి, ఆ తర్వాత పాత కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్మించిన అదనపు భవనంలోకి స్టేషన్ మారింది. ఈ నేపథ్యంలో పాత వన్ టౌన్ పోలీస్ స్టేషన్ భవనాలు ఖాళీ. ఈ స్థలాన్ని వాహనాలు నిలుపుదలకు కేటాయించారు. తదనంతర కాలంలో అత్యంత జనసమ్మర్దమైన ఈ ప్రాంతంలో మరుగుదొడ్ల ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ నిర్మాణ పనులు మొదలుపెట్టింది.

కుయుక్తులు పన్నిన అక్రమం: విలువైన ఈ స్థలాన్ని కొట్టేసేందుకు కొందరు కుయుక్తులు పన్నారు. ప్రణాళిక ప్రకారం మరుగుదొడ్ల నిర్మాణ పనులకు ఆటంకాలు కల్పించి నిలిపేయించారు. స్టేషన్ స్థలం ప్రహరీ గోడకు ఆవల ఒక వాణిజ్య సముదాయ నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో స్టేషన్ స్థలం చుట్టూ ఉన్న ప్రహరీ గోడను కొన్ని మీటర్ల మేర పగలగొట్టారు. నిర్మాణం పనులు పూర్తయిన తర్వాత పోలీస్ స్టేషన్ స్థలంలోకి మెట్లు నిర్మించి దారిగా మార్చారు. తీవ్ర విమర్శలు రావడంతో ప్రణాళికా విభాగం అధికారులు మెట్లు తొలగించారు.

వన్ టౌన్ స్టేషన్ వద్ద కూల్చివేతకు గురైన ప్రహరీ

ఏదీ పునర్నిర్మాణం?: వాణిజ్య సముదాయ నిర్మాణదారులు తీరుతో రాకపోకలకు వీలుగా పడమర దిశగా రోడ్డు చూపారు. ఆ ప్రకారమే నగరపాలక సంస్థ నుంచి అనుమతులు పొందారు. ఈ విషయాన్ని విస్మరించి ఆ పోలీస్ స్టేషన్ స్థలం మీదుగా దారిని ఏర్పాటు చేసుకున్నారు. కూల్చిన ప్రహరీ గోడను కూడా పునర్నిర్మించలేదు. **- న్యూస్‌టుడే, కడప నగరపాలక**

ప్రభుత్వ భూముల అక్రమ రిజిస్ట్రేషన్ల రద్దు

ఈనాడు, కడప: కడప నగరానికి ఆనుకుని ఉన్న సీకేదిన్నె మండలం లోని ప్రభుత్వ భూముల్ని కమలాపురం, కడప వైకాపా నేతలు కలిసి కాజేశారు. నిషేధిత జాబితాలోని భూముల్ని వైకాపా హయాంలో తమ పేరిట దర్జాగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇందుకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు కొందరు సహకరించారు. ఇటీవల చెర్లోపల్లి, కృష్ణాపురం గ్రామాల పరిధిలో రూ. 20 కోట్ల విలువైన భూములకు సంబంధించిన వాటిని కలెక్టర్ రద్దు చేయించారు. మరో 68 తాజాగా గుర్తించారు.

విలువ రూ. 500 కోట్లు: కడప గ్రామీణంతో పాటు బద్వేలు, పులివెందులలో అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసినట్లు వెలుగులోకి వచ్చాయి. ఈ భూములన్నీ సీకే దిన్నె మండలంలోని తాడిగొట్ల, మామిళ్లపల్లె, రామచంద్రాపురం, కృష్ణాపురం, కొప్పర్తి, ఊటుకూరు, విశ్వనాథపురం గ్రామాల పరిధిలో ఉన్నట్లు తేలింది. మొత్తం 68 దస్తావేజుల కింద దాదాపు రూ. 500 కోట్ల విలువైన భూములను వైకాపా నేతలు తమ పేరిట రాయించుకున్నట్లు గుర్తించారు. ఇంకా దాదాపు 300 దస్తావేజుల్లో వివాదం ఉంది. గ్రామాల వారీగా రద్దు చేయనున్న పత్రాల జాబితాను సీకే దిన్నె తహసీల్దార్ కార్యాలయం విడుదల చేసింది. ఇందులో తాడిగొట్ల రెవెన్యూ గ్రామానికి సంబంధించి 14, మామిళ్లపల్లె 30, రామచంద్రాపురం 1, కృష్ణాపురం 2, కొప్పర్తి 8, ఊటుకూరు 11, విశ్వనాథపురం 2 దస్తావేజులు ఉన్నాయి.

ఇంతకీ భూబకాసురులెవ్వరు?

అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకున్న వ్యక్తుల పేర్లను మాత్రం రెవెన్యూ అధికారులు బయట పెట్టడం లేదు. ఇది వరకు వెలుగులోకి వచ్చిన వ్యవహారంలో ముగ్గురు వైకాపా నేతల బినామీలున్నారు. ఇప్పుడు కీలక వ్యక్తుల పేర్లు ఉన్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో 2019-2022 మధ్య పని చేసిన రెవెన్యూ అధికారులు, కడప రూరల్, బద్వేలు, పులివెందుల సబ్ రిజిస్ట్రార్ హస్తం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. రిజిస్ట్రేషన్ల రద్దుతో సరిపెట్టకుండా ప్రభుత్వానికి అధికారులు, రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు అవకాశాలున్నాయి.

మొంథా తుపానుకు దెబ్బతిన్న వరి పంట (పాత చిత్రం)

మొంథా మిగిల్చిన నష్టం రూ. 14.61 కోట్లు

ఈనాడు, కడప: న్యూస్‌టుడే, కడప వ్యవసాయం: మొంథా తుపానుతో జిల్లాకు రూ. 14.61 కోట్ల నష్టం వాటిల్లిందని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ విభాగానికి రూ. 10 లక్షలు, ఎస్పీడీసీఎల్‌కు రూ. 41.21 లక్షలు చొప్పున మొత్తంగా రూ. 14.61 కోట్ల నష్టం చోటుచేసుకుందని చెప్పారు. పునరుద్ధరణకు నిధులు కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. కడపలో 'ఈనాడు'తో ఆయన సోమవారం మాట్లాడారు. ఇవీ ఆ వివరాలు...

● మొంథా తుపాను 25 మండలాల్లోని 222 గ్రామాలకు చెందిన 63,237 మందిపై ప్రభావం చూపింది.
● 8,875 హెక్టార్లలోని వాణిజ్య, 229 హెక్టార్లలోని ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లేలా చేసింది.
● 98 ఇళ్లు దెబ్బతిని రూ. 46.85 లక్షల నష్టం చేకూరింది. వివిధ ప్రాంతాల్లో 34 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయగా 218 మంది ఆశ్రయం పొందారు.
● 59 ఆర్అండ్‌బీ రహదారులు 230 కి.మీ పొడవున దెబ్బతినడంతో రూ. 9.97 కోట్ల మేర నష్టం చోటుచేసుకుంది.
● 4 పురపాలక సంఘాలపై ప్రభావం చూపడంతో రూ. 2.59 కోట్ల నష్టం వాటిల్లింది.
● 34 సాగునీటి వనరులు దెబ్బతినగా నష్టం రూ. 1.06 కోట్లుగా ఉంది.

బీడు భూముల్లో సౌర వెలుగులు

రూ. 695 కోట్ల పనులు.. 139 మెగావాట్లు

● **లక్ష్యం:** వ్యవసాయ కనెక్షన్లకు పగటి వేళల్లో సరఫరాతో పాటు విద్యుత్తు కొనుగోలు వ్యయాన్ని తగ్గించుకోవడం.

● **పథకం:** ప్రధానమంత్రి కిసాన్ ఉర్జా సురక్షా ఉత్థాన్ మహాభియాన్(పీఎం కుసుమ్) కేంద్ర ప్రాయోజిత పథకం

● **అమలు:** ప్రభుత్వ, ప్రైవేట్ బీడు భూముల్లో మినీ సోలార్ ప్లాంట్ల ఏర్పాటు.

● **ఇదీ ఒప్పందం:** వైఎస్సార్ కడప జిల్లాలో రూ. 600 కోట్లతో 120 మెగావాట్లు, అన్నమయ్య జిల్లాలో రూ. 95 కోట్లతో 19 మెగావాట్లు సౌర విద్యుత్తు ఉత్పత్తి ప్రాజెక్టులను వేర్వేరుగా మేఘ ఇంజినీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ, ఇగ్నోర్ కంపెనీలు చేపట్టేలా ఎస్పీడీసీఎల్‌తో పని ఒప్పందం.

● **రూ. 5 కోట్లు కానున్న వ్యయం:** 1 మెగావాట్ సౌర విద్యుత్తు తయారీకి రూ. 5 కోట్లు చొప్పున వ్యయం కానుంది. 2026 మార్చిలోపు పనుల పూర్తికి గడువు నిర్దేశించారు.

దువ్వూరులోని గుట్ట కింద సమీపంలో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు చేపట్టిన డ్రిల్లింగ్ పనులు

● అన్నమయ్య జిల్లా పరిధిలోని పుల్లంపేటలో 9 మెగావాట్లకు 45 ఎకరాలు, నందలూరులో 10 మెగావాట్లకు 50 ఎకరాల భూముల్లో సోలార్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రభుత్వ బీడు భూములను రెవెన్యూ అధికారులు ఎన్ఓసీ ఇచ్చారు. దీంతో ఆయా చోట్ల మినీ సోలార్ ప్రాజెక్టు పనుల్లో నిమగ్నమయ్యారు. ● కడప జిల్లా పరిధిలో 300 ఎకరాల ప్రభుత్వ భూముల్లో, 301 ప్రైవేట్ బీడు భూముల్లో మొత్తం 120 మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తికి ఆమోదం మంజూరైంది. ● న్యాయస్థానాల్లో, వివాదం లేని సర్కారు బీడు భూములను త్వరితగతంగా అప్పగించాలని తహసీల్దార్లకు కలెక్టరు ఆదేశాలు జారీ చేశారు. ● కడప జిల్లా దువ్వూరులోని గుట్ట కింద కేటాయించిన 25 ఎకరాల పరిధిలోని నిరుపయోగ భూములను గత నెల 17న ఎస్పీడీసీఎల్ సీఎండీ లోతేటి శివశంకర్ ఇటీవల పరిశీలించారు. ఇక్కడి రాతి గుట్టలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు యంత్రంతో డ్రిల్లింగ్ పనులు చేపడుతున్నారు. ● ప్రభుత్వ పరిధిలోని బీడు భూములను నేరుగా కాకుండా నెడ్‌క్యాప్ సంస్థ పర్యవేక్షణలో గుత్తేదారుకు బదలాయింపు ప్రక్రియ చేపడుతున్నారు. **- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు గ్రామీణ**

గ్రామం	దువ్వూరు	చెర్లోపల్లి	పాడదుర్తి	చిలమకూరు	వేముల	వేముల	వేముల
మండలం	దువ్వూరు	పోరుమామిళ్ల	కమలాపురం	ఎర్రగుంట్ల	మీదిపెంట్ల	వేముల	వేల్పుల
విస్తీర్ణం (ఎకరాల్లో)	25	30	25	25	25	25	11

అవును.. నకిలీ మద్యానికి స్పిరిట్ తెచ్చాం

ఈనాడు, కడప, న్యూస్‌టుడే- ములకలచెరువు, మదనపల్లె నేరవార్తలు: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన నకిలీ మద్యం తయారీ కేసులో మరో ముగ్గురు నిందితులను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని మదనపల్లెలో గుట్టుగా విచారిస్తున్నట్లు సమాచారం. గత నెల 26న తంబళ్లపల్లె ఎక్సైజ్ పోలీసులు బాలాజీ(15), సుధాకర్(3), జయచంద్రారెడ్డి(20)ను ములకలచెరువు ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గోవాలో ఉన్న జితిన్ అనే వ్యక్తి బెంగళూరులోని బాలాజీకి స్పిరిట్ సరఫరా చేసినట్లు వాంగ్మూలంలో తెలిపారు. ఈ మేరకు జితిన్‌తో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

● **కేరళలో అదుపులోకి...:** నకిలీ మద్యం తయారీకి అవసరమైన స్పిరిట్ సరఫరాకు జితిన్ అంగీకరించాడు. బాలాజీ ఇబ్రహీంపట్నంలోని తన వాహనంలో 15 క్యాన్ల స్పిరిట్‌ను సరఫరా చేశాడు. ఆ తర్వాత ఈ కేసులో ఏ1 జనార్దన్‌రావు ఆదేశాల మేరకు కట్టా రాజు, సయ్యద్ హాజీల సాయంతో ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ ప్రారంభించారు. బాలాజీ వాంగ్మూలంతో కేరళలో రెండు రోజుల కిందట జితిన్‌తో పాటు మరో ఇద్దరిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఆదివారం రాత్రి మదనపల్లె తీసుకొచ్చారు. మదనపల్లె ఎక్సైజ్ కార్యాలయంలో రహస్యంగా వీరి ముగ్గురిని విచారిస్తున్నారు.

ecoren WALK-IN INTERVIEWS
Ecoren Energy is looking for experienced professionals for Wind and Solar Power Projects in Kurnool, Anantapur and Kadapa.
: Positions :
Civil Engineers, Electrical Engineers, Site Managers
: Experience :
2–12 years in Wind/Solar Project Execution
Interview Dates :
08th November 2025 — 09:00 AM to 06:00 PM
09th November 2025 — 09:00 AM to 01:00 PM
Venue : HOTEL ALEXANDER, Saptagiri Circle, Anantapur
Contact : 7331122450, Email: hr@ecorenenergy.com

వక్కల పేటను వీడని వణుకు

న్యూస్‌టుడే, కడప నగరపాలక

మొంథా తుపాను తీరం దాటి వెళ్లిపోయింది. అంతటా సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. అయినప్పటికీ కడప నగరంలోని బుగ్గవంక పరీవాహక ప్రాంత ప్రజలు ఇంకా బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఇప్పుడు ముప్పు తప్పినా భవిష్యత్తులో బుగ్గవంకలో మునగక తప్పదనే భయమే అందుకు కారణం.

బుగ్గవంక నది చెంత రక్షణ గోడ కట్టాల్సిన ప్రాంతం

ఆ ప్రాంతాలకు ఏదీ రక్షణ!

బుగ్గవంక నగరంలోకి ప్రవేశించే చోటు రైల్వే బ్రిడ్జి. ఇక్కడి నుంచి అల్మాస్‌పేట వరకు 4 కి.మీ పొడవు ఉంటుంది. రైల్వే బ్రిడ్జి - అల్మాస్‌పేట మధ్య బుగ్గవంకకు ఇరువైపులా రక్షణ గోడ కట్టారు. ఈ పరిధిలోని ప్రాంతాలకు ముప్పు తప్పినట్టే. కానీ అల్మాస్‌పేటకు దిగువన ఉన్న 37వ డివిజన్‌లోని వక్కల పేట, దుర్గా వెస్సీ కాలనీ, సాయిపేట, 50వ డివిజన్లోని పలు ప్రాంతాలు, 49వ డివిజన్‌లోని కొన్ని ప్రాంతాలు ముంపు ముప్పును ఎదుర్కొంటూనే ఉన్నాయి. ఈ ప్రాంతాల వద్ద బుగ్గవంకకు ఇరువైపులా రక్షణ గోడ నిర్మించలేదు.

నిర్మాణానికి ఇంకా ప్రతిపాదనలే

అల్మాస్‌పేట నుంచి సుమారు వంద మీటర్ల వరకు గతంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ రక్షణ గోడ చేపట్టాల్సి ఉన్నా ఆ పనులను పూర్తి చేయలేదు. ఈ ప్రాంతాలతో పాటు రైల్వే బ్రిడ్జికి ఎగువన కొత్తగా వెలసిన కాలనీలు బుగ్గవంక వల్ల ప్రమాదంలో పడ్డాయి. ఆకస్మిక వరదలు వస్తే రక్షణ గోడ లేని ప్రాంతాలు జలమయమవుతాయని అక్కడి వాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై నీటిపారుదల శాఖ ఈఈ వెంకట్రామయ్య మాట్లాడుతూ.. రూ.100 కోట్లతో రక్షణ గోడ, రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించామని చెప్పారు. ముఖ్యమంత్రి కార్యాలయానికి ఈ ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు.

ట్రిపుల్ ఐటీల్లో ఆహార నాణ్యతపై అభిప్రాయాల సేకరణ

నూజివీడు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీల అభివృద్ధికి ఈ ఏడాది రూ. 200 కోట్ల బడ్జెట్ రూపొందించినట్లు ఉప కులపతి ఎం.విజయకుమార్ తెలిపారు. నూజివీడులో ఆయన విలేకరులతో సోమవారం మాట్లాడారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు బయాలజీ సబ్జెక్ట్‌ను ఈ ఏడాది నుంచి కలుపుతున్నామన్నారు. ఏకరూప దుస్తులు సిద్ధం అవుతున్నాయని, త్వరలోనే విద్యార్థులకు అందిస్తామని చెప్పారు. ఆహారం నాణ్యత లేకపోవడం, మెనూ పాటించకపోవడంపై ఆన్‌లైన్‌లో విద్యార్థుల అభిప్రాయాలు సేకరిస్తామన్నారు. నాణ్యత విషయంలో రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్ సంద్ర అమరేంద్రకుమార్‌కు సూచించారు. ప్లేస్‌మెంట్స్ విషయంలో 40 శాతం భర్తీ చేస్తున్నామని, దీనిని 50 శాతానికి తీసుకుని రావాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.

పూలరైతుకు పండగొచ్చింది

కార్తిక మాసం పూల రైతులకు కలిసొచ్చింది. ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నిన్నటి వరకు కిలో రూ.800గా ఉన్న కదిరి మల్లెపూల ధర ఇప్పుడు రూ. 1200కు చేరింది. కగడాలు కిలో రూ. 800, చామంతి రూ. 300, బంతిపూలు రూ.70 పలుకుతున్నాయి. కమలాపురం నియోజకవర్గంలో వందల ఎకరాల్లో చామంతి సాగు చేస్తున్నారు. ఇవన్నీ పూలతో కళకళలాడుతున్నాయి. **- ఈనాడు, కడప**

జ్ఞాపకాల మదిలో..
జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృత్యస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి
మీరు చూపిన ఆత్మీయత ..
అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట
మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.
ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని
భావాలను అక్షర రూపంలో
నివేదించడం తప్ప
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం
స్మృతి, వర్ధంతి, జయంతి
ప్రకటనల వివరాలకు
ఈనాడు కార్యాలయము, ఆలంఖాన్‌పల్లి, కడప.
కడప : 99899 97626

(c) eenadu

సత్వర పరిష్కారం లక్ష్యంగా నోడల్ అధికారులు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ లోతేటి అన్నారు. సోమవారం తిరుపతిలోని కార్యాలయంలో తొలిసారిగా నిర్వహించిన డయల్ యువర్ సీఎండీ కార్యక్రమానికి వినియోగదారుల నుంచి మంచి స్పందన లభించింది. ఇందులో భాగంగా డిస్కం పరిధిలోని జిల్లా నుంచి 87 మంది వినియోగదారులు ఫోన్‌చేసి తమ సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని సత్వరమే పరిష్కరించడమే లక్ష్యంగా తొమ్మిది జిల్లాల పరిధిలో ప్రతి జిల్లాకు సీజీఎం/జీఎం స్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియమించినట్లు సీఎండీ తెలిపారు.

మహారాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో, కడప

I.A. No.524/2024
O.S. No.385/2013

1. యన్.రవిచంద్ర, తండ్రి యన్.టి.సిద్దప్ప, హిందూ, వయస్సు 38 సం॥లు, వ్యాపారం, నివాసం వాల్మీకి వీధి, డి.నెం.15/2-164, రాయదుర్గం, అనంతపురం జిల్లా. 2. పి.శ్రీనివాసులు, తండ్రి పి.శ్రీరాములు, వయస్సు 44 సం॥లు, హిందూ, వ్యాపారం, డి.నెం.1/1838-1-ఏ, శ్రీరామనగర్, యర్రముక్కపల్లి, కడప జిల్లా. ...పిటీషనర్లు/వాదులు

వర్సెస్

R5: రెస్పాండెంట్/ప్రతివాది: కామినేని సుబ్బారావు, తండ్రి కామినేని వెంకటస్వామి, వయస్సు 42 సం॥లు, హిందూ, డి.నెం.26/244, నేతాజీ రోడ్డు, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా.
R6: రెస్పాండెంట్/ప్రతివాది: ఆవుల రవికుమార్, తండ్రి ఆవుల రామచంద్రయ్య, వయస్సు 42 సం॥లు, హిందూ, డి.నెం.2/540, నెహ్రూనగర్, చిన్నచౌక్ మజరా, కడప జిల్లా. ...రెస్పాండెంట్స్/ప్రతివాదులు

రెస్పాండెంట్స్ నెం.5 & 6 / ప్రతివాదుల నెం.5 & 6లకు నోటీసులు

పై కనిన పిటీషనర్లు/వాదులు పై కనిన కేసులోని షెడ్యూలు దాఖలా భూమిని రిజిస్ట్రేషన్ కొరకు పై కనిన రెస్పాండెంట్స్/ప్రతివాదులపైన మరియు ఇతరులపైన సివిల్ వ్యాజ్యం దాఖలు చేసినారు. పై కనిన కేసులో రిలీఫ్ సవరణ చేయుటకుగాను పై కనిన రెస్పాండెంట్స్ నెం.5 & 6 వారికి ఏదైన అభ్యంతరములు వున్న యెడల పై కనిన కోర్టులో తేదీ: 17.11.2025న ఉదయం 10.30 గంటలకు స్వయంగా హాజరు కావడం గాని లేదా అడ్వకేట్ ద్వారా గాని హాజరు అయి అభ్యంతరములు తెలుపుకొనవలయును. మీరు హాజరు కాని యెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడునని ఇందుమూలంగా తెలియజేయుచున్నాము.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

సం/- యం.సుధాకర్ బాబ్జీ
అడ్వకేట్, కడప.

సమస్యలివే.. పరిష్కరించండి

గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు వెల్లువెత్తాయి. ఎక్కువగా రెవెన్యూ అంశాలపైనే ఎక్కువగా అర్జీలు వచ్చాయి. కలెక్టర్ శ్రీధర్ వినతులు స్వీకరించి తక్షణమే పరిష్కరిస్తామని చెప్పారు. అర్జీలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

ఉత్తర్వులిచ్చినా ఫలితం లేదు

నేను మునక ప్రాంతం నుంచి వచ్చి మాధవరంలో నివాసం ఉంటున్నారు. 13 ఏళ్ల నుంచి భూమి కావాలని కోరుతూనే ఉన్నాం. కానీ ఇంత వరకు ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పటికే స్పందనలో నాలుగు అర్జీలు ఇచ్చాను. కలెక్టర్, ఆర్డీవోలు లెటర్లు ఇచ్చినా సిద్దవటం అధికారులు పట్టించుకోవడం లేదు. **- ఈశ్వరయ్య, ఎస్‌కేఆర్ నగర్, సిద్దవటం**

పిల్లలకు జీవనాధారం కల్పించండి

ఏడాది కిందట నా భర్త చనిపోయారు. మాకు ముగ్గురు బిడ్డలున్నారు. వారిని పెంచి పోషించడం కష్టంగా ఉంది. వితంతువు పింఛనుతో పాటు బిడ్డలకు వాత్సల్య పథకంలో పరిహారం అందించేలా చూడాలి. నేనే పిల్లలకు ఆధారం. నాకు మరే ఇతర ఆదాయ మార్గాలు లేవు. ప్రభుత్వం స్పందించి పింఛన్ సౌకర్యం కల్పించాలి. **- గౌసియా పర్వీన్, ఖాజీపేట**

బాధితులకు సత్వర న్యాయం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: న్యాయం కోసం ఠాణాలకు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 223 మంది భారీ సంఖ్యలో బాధితులు హాజరయ్యారు. ఎస్పీ వారి నుంచి వినతులు స్వీకరించారు. ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించరాదని సిబ్బందికి సూచించారు. కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. న్యాయపరంగా కేసులను పరిష్కరించాలని చెప్పారు.

బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ బదిలీ

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: డీఆర్‌డీఏ సంస్థలో పనిచేసే ప్రాజెక్టు మేనేజర్ హోదాను మార్పు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఏపీడీగా పేరు మార్పు చేసి స్థాన చలనం కల్పించారు. ఈ మేరకు గత నెలాఖరున సెర్ప్ సీఈవో నుంచి ఆదేశాలు వచ్చాయి. జిల్లా డీఆర్‌డీఏ కార్యాలయంలో ప్రాజెక్ట్ మేనేజర్‌గా పనిచేసే నీలకంఠారెడ్డిని ప్రకాశం జిల్లా డీఆర్‌డీఏ కార్యాలయానికి బదిలీ చేశారు.

ప్రత్యేక అభివృద్ధి నిధులు మంజూరు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: వైఎస్సార్ కడప జిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా రూ. 39.49 లక్షలు మంజూరు చేసిందన్నారు.

బొప్పాయిలో చీడ పీడ వదిలిద్దాం

రైతేరాజు

కడప, న్యూస్‌టుడే: బొప్పాయిలో ఔషధాలు మెండుగా ఉంటాయి. ఈ ఫలం ఆరోగ్యదాయిని. ఈ ఏడాది రైతులు సాగు చేసిన పంటను తెగుళ్లు ఆశించి నష్టాన్ని కలిగిస్తున్నాయి. రసం పీల్చే పురుగులు, రింగ్ స్పాట్ వైరస్, మొదలు కుళ్లు, నులి పురుగులు, పిండినల్లి, పండు ఈగ పంట ఎదుగుదల, దిగుబడికి ప్రతిబంధకంగా మారాయి. సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎస్.మానస సూచించారు.

పండు ఈగ: కాయలు పక్వానికి వచ్చిన తర్వాత ఆశిస్తే నష్టం కలుగుతుంది. తోటలను శుభ్రంగా ఉంచాలి. చెట్ల కింద రాలిపోయిన, చెట్లపైన పండుబారిన వాటిని ఏరి వేయాలి. మిథైల్ యూజినాల్ ఎర బుట్టలను ఏర్పాటు చేయాలి. ఆకర్షించిన మగ పురుగులను నాశనం చేయాలి. ఈ బుట్టను 15 రోజులకు ఒకసారి మార్పు చేయాలి.

నులి పురుగులు: నులి పురుగుల నివారణకు నారు సంచుల్లో 1 గ్రాము కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను విత్తనాలు మొలకెత్తిన తర్వాత వేయాలి. నులి పురుగులు సోకిన తోటల్లో మొక్కకు 240 గ్రాముల వేప పిండి, నులి పురుగుల బెడద ఉన్న ప్రాంతాల్లో ఒక్కొక్క మొక్కకు 250 గ్రాములు వేపపిండి, కార్బోఫ్యూరాన్ 3 గుళికలు 25-30 గ్రాములు, సుడోమోనాస్ ఫ్లోరిసెన్స్ 4 గ్రాములు ఒక్కో చెట్టుకు చొప్పున వేయాలి.

పూత రాలిపోవడంతో మధ్యలో ఖాళీగా ఉన్న కాండం

తామర పురుగులు: రాతి మంగు, పిందె రాలడానికి కలుగజేస్తాయి. ఎకరాకు 10-20 నీలం రంగు జిగురు అట్టలు పెట్టుకోవాలి. ఫిప్రోనిల్ 2 మి.లీ లేదా థయోమిథాక్సామ్ 0.4 గ్రాముల లీటరు నీటికి పూలు బాగా తడిచేలా పిచికారీ చేయాలి.

కాండం మొదలు కుళ్లు: నర్సరీల్లో ఎక్కువగా నష్టాన్ని కలిగిస్తాయి. వేర్లు, మొదలు మొత్తగా మారి కుళ్లిపోతాయి. కాయలున్న చెట్లకు ఆశిస్తే నష్టం అధికంగా ఉంటుంది. నివారణకు మొక్కల మొదళ్ల వద్ద నీరు నిల్వ లేకుండా చూడాలి. బోర్డో మిశ్రమం 1 శాతం లేదా అలియేట్ 2 గ్రాములను ఒక లీటరు నీటిలో తడపాలి. తెగులు ఉద్ధృతి ఎక్కువగా ఉంటే రిడోమిల్ ఎం.జడ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి చెట్ల మొదళ్లలో, కాండాన్ని మందుతో తడపాలి.

ఆ పాలు.. విదేశాలకు

నంద్యాల జిల్లా చాగలమర్రి మండల వ్యాప్తంగా రైతులు అధికంగా బొప్పాయి సాగు చేస్తుంటారు. చిన్నవంగలితో పాటు సమీపంలోని గ్రామాలైన వైఎస్సార్ కడప జిల్లా కానగూడూరు, క్రిష్ణంపల్లె గ్రామాల్లో 1200 ఎకరాల్లో పండిస్తారు. విత్తనం నాటిన కాలం నుంచి తొమ్మిది నెలలకు పంట చేతికొస్తుంది. పండ్ల సేకరణ అనంతరం 13 నెలల తర్వాత మిగిలినవి, ముదురు కాయలకు గాట్లు పెట్టి పాలను సేకరిస్తున్నారు. తెల్లవారుజాము సమయంలోనే కాయలకు గాట్లు పెడితే కేవలం రెండు గంటల్లోనే పాలు ఊరుతుంది. ఇలా సేకరించిన దాన్ని రాయచోటి, రాజంపేటకు చెందిన వ్యాపారులు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల పాలు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 4 డ్రమ్ముల పాలు సేకరిస్తున్నారు. ఎకరానికి పాల సేకరణ ద్వారా రైతుకు రూ.24 వేల ఆదాయం వస్తుంది. సేకరించిన పాలను పరిశ్రమల్లో మందులు, కాస్మోటిక్స్, సబ్బుల తయారీలో ఉపయోగిస్తున్నారు. బెంగళూరు, చెన్నైతో పాటు నాణ్యతను బట్టి విదేశాలకు సైతం పాలను ఎగుమతి చేస్తున్నారు. బొప్పాయి సాగులో ఎప్పుడైనా ధర పడిపోయినప్పుడు బొప్పాయి పాల సేకరణతో నష్టాల నుంచి రైతులు బయటపడుతున్నారు. **- న్యూస్‌టుడే, చాగలమర్రి**

అరటిలో సిగటోక, ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు మార్గాలివి

చిట్కా

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వాతావరణంలో వచ్చిన మార్పులతో అరటి తోటలను సిగటోక ఆకుమచ్చ తెగులు ఆశించినట్లు ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మానస చెప్పారు. జీ9 రకంలో ఎక్కువగా ఈ చీడ కనిపిస్తుంది. గాలిలో తేమ ఉంది. పొగ మంచు కురుస్తుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతల్లో తేడా ఉంది. ఆకుమచ్చ తెగులు బాగా వ్యాప్తి చెందుతుంది. పొలంలో వర్షపు నీరు నిల్వ లేకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. తోటలో కలుపు లేకుండా చెట్లు, సాళ్ల మధ్యలో శుభ్రం చేయాలి. తెగులు లక్షణాలు కనిపిస్తే మ్యాంకోజెబ్ 2.5 గ్రాములు లేదా క్లోరోథలోనిల్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తోటలో తెగులు వ్యాప్తి చెందినట్లు గమనించిన వెంటనే ప్రొఫికొనజోల్ మందును 1 మి.లీ లీటరు నీటికి కలిపి 10 మి.లీ మినరల్ ఆయిల్‌తో కలిపి 25 రోజుల వ్యవధిలో మూడు సార్లు పిచికారీ చేసుకోవాలి. పైన సూచించిన మందులను గెలల కోత 45 రోజులకు ముందు పిచికారీ చేయాలి. **- న్యూస్‌టుడే, ఒంటిమిట్ట**

రైతు ప్రశ్న - శాస్త్రవేత్త సమాధానం

ప్రశ్న : అరటి పంటకు తెల్లదోమ ఆశించింది. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుపగలరు?
- రామచంద్రరాజు, రైతు, చెర్లోపల్లి గ్రామం

సమాధానం: అరటిలో తెల్లదోమ నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా థయోమిథాక్సమ్ 0.2 గ్రాములను లీటర్ నీటిలో కలిపి ఆరు రోజుల వ్యవధిలో రెండు లేదా మూడు సార్లు పిచికారీ చేయాలి.
- సునీల్, ఉద్యాన శాఖ అధికారి రాజంపేట - న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

గుమ్మడి.. లాభాలు దండి

స్ఫూర్తి

రైతు సాగు చేసిన గుమ్మడి తోట

రామసముద్రం, న్యూస్‌టుడే: రామసముద్రం మండలం దిన్నిపల్లెకు చెందిన యువ రైతు పృథ్వీరాజ్ గుమ్మడి సాగులో లాభాల పంట పండిస్తున్నారు. తనకున్న నాలుగు ఎకరాల విస్తీర్ణంలో గుమ్మడి సాగు చేపట్టారు. అయిదు ట్రాక్టర్ లోళ్ల పశువుల ఎరువును దుక్కిలో కలిపారు. దుక్కిని పదిహేను రోజుల పాటు ముగ్గబెట్టారు. అనంతరం 3×3 అడుగుల వెడల్పుతో బెడ్లు ఏర్పాటు చేశారు. అనంతరం బిందు సేద్యం పరికరాలు అమర్చారు. అందులో 0.5 కిలోల హైబ్రిడ్ రకం గుమ్మడి విత్తనాలు విత్తారు. వారం రోజులకే మొలకెత్తాయి. మొక్కల ఎదుగుదలకు 50 కిలోల పోషక ఎరువులను బిందు సేద్యం ద్వారా అందించారు. కేవలం నెల వ్యవధిలోనే పూత ప్రారంభమైంది. పూత దశలో తోటకు క్రిమి కీటకాలు ఆశించకుండా ఒక్కసారి క్రిమి సంహారక మందు పిచికారీ చేశారు. పిందె ఎదుగుదలకు తిరిగి మరో మారు 50 కిలోల పోషక ఎరువులు అందించారు. మూడు నెలలకే దిగుబడులు వచ్చాయి. సాగుకు కేవలం రూ.లక్ష ఖర్చు చేశారు. నాలుగు ఎకరాలకు 45 టన్నుల దిగుబడి వచ్చింది. తోట వద్దే కిలో రూ.14 చొప్పున ధర పలికింది. మొత్తంగా సాగు వ్యయం రూ.లక్ష పోనూ రూ.5.30 లక్షల రాబడి సమకూరింది.

అందుబాటులో వ్యవసాయ యంత్ర పరికరాలు

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు ఎంజీ ఆటో నగర్‌లో శ్రీ విజయదుర్గా ఆగ్రో పరిశ్రమ దుకాణం ఏర్పాటు చేశారు. దీనిని సోమవారం ఆ దుకాణ యజమాని బి.సుబ్రహ్మణ్యం దంపతులు ప్రారంభించారు. మొదట దేవతా పటాలకు పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పరికరాలైన రోటావేటర్, హార్వెస్టర్ టిల్లర్, బేలర్, స్ప్రేయర్లు, సీడ్ డ్రిల్, పవర్ టిల్లర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కత్తార్ హార్వెస్టర్ రాయలసీమ డిస్ట్రిబ్యూటర్‌గా తాము సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రోటో కింగ్ రోటావేటర్ ఎండీ ఎంఎం పటేల్, ధీరజ్‌రెడ్డి, హార్వెస్టర్ వైస్ ప్రెసిడెంట్ ఐ.మనోహర్, వెలవలి మౌళాలి, బనగానపల్లె బయన్న, హరివరం హుస్సేన్ తొండలదిన్నె భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాల దుకాణాన్ని ప్రారంభిస్తున్న యజమాని సుబ్రహ్మణ్యం

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

కమలాపురం, న్యూస్‌టుడు: గత నెల 30న మండలంలోని అప్పారావుపల్లెలో జరిగిన హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు స్థానిక పోలీసు కార్యాలయంలో సీఐ రోశన్ సోమవారం సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. అదే గ్రామానికి చెందిన మూల చెన్నారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి(45) అన్నదమ్ములు. తమ్ముడు విశ్వనాథ్‌రెడ్డి మద్యానికి బానిస కావడంతో పాటు గ్రామస్థులు, కుటుంబ సభ్యులతో నిత్యం గొడవ పడేవాడు. విశ్వనాథ్‌రెడ్డికి వివాహం కాలేదు. ఈ నేపథ్యంలో ఇటీవల ఆస్తి పంపకాలు జరిగాయి. దీంతో చెన్నారెడ్డి సోదరుడి ఆస్తిలో కొంత ఇవ్వమని తరుచూ అడిగి ఇబ్బంది పెట్టేవాడు. దీనికి అతను అంగీకరించకపోడంతో కోపోద్రిక్తుడైన చెన్నారెడ్డి తమ్ముడిని ఎలా అయినా చంపాలని అనుకున్నాడు. ఈ క్రమంలో అదును కోసం వేచి చేస్తున్న చెన్నారెడ్డి ద్విచక్రవాహనంపై వెళ్తున్న విశ్వనాథ్‌రెడ్డిని కర్రతో బలంగా కొట్టాడు. దీంతో తీవ్రగాయాలు కావడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. సి.గోప్లాపురం క్రాస్ వద్ద నిందితుడు ఉండటంతో పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు.

వివరాలు వెల్లడిస్తున్న సీఐ రోషన్

సచివాలయ ఉద్యోగిని మృతికి కారణమైన పూర్వ వాలంటీర్ అరెస్టు

బద్వేలు, న్యూస్‌టుడే: వీడియో రికార్డింగ్ బయట పెడతానని పూర్వ వాలంటీర్ భీముని పీరయ్య బెదిరించినందుకే బి.కోడూరు మండలం తంగేడుపల్లె సోషియల్ వెల్ఫేర్ ఉద్యోగిని మన్యం మల్లేశ్వరీ (29) ఆత్మహత్యకు పాల్పడినట్లు బద్వేలు పట్టణ సీఐ లింగప్ప తెలిపారు. ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేశామని చెప్పారు. సోమవారం స్థానిక పట్టణ సీఐ కార్యాలయంలో ఆయన విలేకరులకు వెల్లడించారు. బద్వేలు కోటిరెడ్డి నగర్‌లో భర్తతో కలిసి ఉంటున్న మల్లేశ్వరిని గత నెల 26వ తేదీన 'ఉంటే నాతో ఉండాలి, లేకుంటే చావాలని.. మీ భర్తకు నా వద్ద ఉన్న వీడియో రికార్డింగ్, సన్నితంగా మనం మెలిగిన ఫొటోలు, వాట్సాప్ ఛాటింగ్‌లను పెడతా'నని పీరయ్య పలుసార్లు బెదిరించినట్లు తెలిపారు. దీంతో భయపడిన మల్లేశ్వరి బలవన్మరణం చెందారన్నారు. ఆమె ఆత్మహత్యకు కారణం తానేనని నేరం అంగీకరించి భీముని పీరయ్య దిరసవంచ వీఆర్వో మహేశ్వరరెడ్డి వద్ద సోమవారం లొంగిపోగా అరెస్ట్ చేసినట్లు సీఐ చెప్పారు.

పోక్సో కేసులో ఒకరి నిర్బంధం

కలసపాడు, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థినిపై లైంగిక దాడి ప్రయత్నం చేసిన గోపవరంపల్లెకు చెందిన మారే శ్రీను వ్యక్తిని సోమవారం కలసపాడులో అరెస్టు చేసి బద్వేలు కోర్టులో హాజరుపరిచామని ఎస్సై తిమోతి తెలిపారు. గత నెల 31న ఓ పాఠశాలకు చెందిన విద్యార్థిని (15)పై ఇతను లైంగిక దాడికి ప్రయత్నించడం తెలిసిందే.

పోలీసుల అదుపులో క్రికెట్ బుకీలు.!

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరులో క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో పలువురు బుకీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. శివాలయం కూడలి సమీపంలోని ఓ హోటల్ నిర్వాహకుడు పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో అతన్ని అదుపులోకి తీసుకుని రహస్యంగా విచారణ చేస్తున్నారు. సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఫోన్ కాల్స్, అతను జరిపిన డబ్బుల లావాదేవీలపై ప్రశ్నిస్తున్నారు. అతనితో ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయి. ఎన్ని రోజుల నుంచి బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. డబ్బుల లావాదేవీలు ఏ మేరకు జరిగాయనే కోణంలో విచారిస్తున్నారు. అతను చెప్పిన వివరాలతో పలువురు అనుమానితులపై నిఘా పెట్టారు. ప్రొద్దుటూరులోని ఓ వైకాపా నాయకుడి వద్ద పనిచేసే డ్రైవర్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. వ్యవహారం బయటకు పొక్కకుండా పోలీసు అధికారులు రహస్యంగా ఉంచారు. ప్రొద్దుటూరులోని బడా బుకీలతో సంబంధాలు ఏమైనా ఉన్నాయా..? అనే కోణంలోనూ ఆరా తీస్తున్నారు.

కార్తిక దీపోత్సవానికి ఎస్పీకి ఆహ్వానం

వల్లూరు, న్యూస్‌టుడే: పవిత్ర పుణ్యక్షేత్రం పుష్పగిరి కొండపై పౌర్ణమి సందర్భంగా ఈ నెల 5న నిర్వహించే కార్తిక దీపోత్సవానికి సందర్శించాలంటూ జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌ను పుష్పగిరి క్షేత్ర ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు నట్టి, భారవి సభ్యులు ఆహ్వానించారు. ఈ మేరకు ఆయన కార్యాలయంలో సోమవారం వారు కలిసి ఆయనకు ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు భాస్కర, మల్లికార్జునరెడ్డి, వరప్రసాదులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి ముఖాముఖి 6న

మారుతీనగర్, న్యూస్‌టుడే: వైవీయూ కళాశాల బయో టెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగానికి గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి ఈ నెల 6వ తేదీ సర్ సీవీ రామన్ సైన్స్ కాంప్లెక్స్‌లోని బయో టెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్ శాఖలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వైవీయూ ప్రధానాచార్యులు శ్రీనివాస్ తెలిపారు.

మిగిలిన మద్యం దుకాణాలకు 12న లాటరీ

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో మిగిలిపోయిన ఏడు మద్యం దుకాణాలకు ఈ నెల 12న లాటరీ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ పర్యవేక్షణాధికారి రవికుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనరల్ విభాగంలో అయిదు దుకాణాలు, గీత కులాల వారికి రెండు దుకాణాలున్నాయన్నారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు.

ఏపీఐఐసీకి స్థలం అప్పగింతపై ఆదేశాలు

కడప నగరపాలక, న్యూస్‌టుడే: పుట్లంపల్లి సమీపంలో సీపీ బ్రౌన్ ఐటీ పార్క్ స్థలాన్ని నగరపాలక సంస్థ నుంచి ఏపీఐఐసీకి అప్పగిస్తూ రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 52.76 ఎకరాల ఈ స్థలాన్ని గతంలో ఐటీ పార్కుకు కేటాయించారు. 2024 జనవరి 28న ఈ స్థలంపై ఉన్న అధికారాలను ఏపీఐఐసీకి అప్పగిస్తూ నగరపాలక సంస్థ పాలకవర్గం తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని పరిగణలోకి తీసుకుని 52.76 ఎకరాల స్థలాన్ని ఏపీఐఐసీకి అప్పగిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్, ఖోఖో ఎంపికలు

స్కూల్ గేమ్స్ ఎంపికలకు 550 మంది హాజరు

హైజంప్ విభాగంలో సత్తాచాటుతున్న క్రీడాకారిణి

కడప క్రీడలు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్‌లో భాగంగా సోమవారం నిర్వహించిన అథ్లెటిక్స్, ఖోఖో కడప డివిజనల్ స్థాయి ఎంపికలకు 550 మంది హాజరయ్యారు. వైఎస్సార్ క్రీడా పాఠశాలలో అథ్లెటిక్స్, కడప మున్సిపల్ ఉర్దూ హైస్కూల్‌లో ఖోఖో ఎంపికలు జరిగాయి. ఎస్‌జీఎఫ్ కడప డివిజనల్ కోఆర్డినేటర్ షేక్ సాజిద్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఈ ఎంపికలకు సెలెక్షన్ కమిటీ సభ్యులుగా జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు బి.శివశంకర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, చరణ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తిరుమలయ్య, సతీష్‌రెడ్డి, ఓబులేసు, మహబూబ్‌బాషా, పవన్‌కుమార్, ఏజాజ్ అహ్మద్, గణేష్‌లు వ్యవహరించారు. ఈ సందర్భంగా కడప డివిజనల్ కోఆర్డినేటర్ సాజిద్ మాట్లాడుతూ.. స్కూల్ గేమ్స్‌లో భాగంగా అండర్-14, 17 వయసు విభాగాల వారికి కడప డివిజనల్ స్థాయిలో అథ్లెటిక్స్, ఖోఖో ఎంపికలకు చేపట్టామన్నారు. కడప డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లో ఎంపికైన వారు డివిజనల్ స్థాయి ఎంపికలకు వచ్చారన్నారు. ప్రతిభ కనబరచిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేశామన్నారు. ఎంపికలను పూర్తి పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు.

ముగిసిన అంతర జిల్లాల ఎస్‌జీఎఫ్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్

కొవ్వూరు పట్టణం: శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంచి ఉజ్వల భవితకు క్రీడా ప్రావీణ్యం పునాదిగా నిలుస్తుందని అవంతి సంస్థల అధినేత అల్లూరి ఇంద్రకుమార్ అన్నారు. 69వ ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల ఎస్‌జీఎఫ్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు సోమవారంతో ముగిశాయి. కొవ్వూరులోని అల్లూరి వెంకటేశ్వరరావు క్రీడా మైదానంలో 13 ఉమ్మడి జిల్లాల పరిధిలో అండర్-17 విభాగంలో బాలికలు, బాలుర జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. జాతీయస్థాయి పోటీలకు బాలురు, బాలికల జట్లను ప్రతిభ ఆధారంగా ఎంపిక చేశారు. జాతీయస్థాయిలో వాలీబాల్ ఆడే అండర్-17 బాలికల జట్టులో తొండవరపు భువనేశ్వరి (కడప), బూడి భార్గవి (కడప), ఉప్పు నోమిత (కడప) తదితరులున్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్. బ్రాంచ్
కెవిసి ఆర్కేడ్, 3వ అంతస్తు, 13-1 ఆర్‌సి రోడ్డు, వాణి నగర్, అవిలాల, తిరుపతి-517501. ✆ 7901626759

స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని రూలు 8(6) & 9(1) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్ వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/హామీదారులు చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే భౌతికంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ఛార్జ్ చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 21.11.2025న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది & సమయం: 21.11.2025, ఉ॥ 10.30 గం.ల నుండి ఉ॥ 11.30 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)
రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet.com) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములుకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 20.11.2025, సా॥ 4.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఋణగ్రహీత(లు)/హామీదారు(లు): 1) శ్రీమతి నంద్యాలంపేట ఇమామ్‌బీ, భర్త : నంద్యాలంపేట గౌస్ పీర్, 4/47, ఎమ్ఆర్‌డి స్ట్రీట్, చెన్నూర్, కడప, ఆంధ్రప్రదేశ్-516162. 2) శ్రీ నంద్యాలంపేట గౌస్‌పీర్, తండ్రి : షంషీర్ అహమ్మద్, 4/47, ఎమ్ఆర్‌డి స్ట్రీట్, చెన్నూర్, కడప, ఆంధ్రప్రదేశ్-516162. 3) శ్రీ షేక్ షేక్షావలి, తండ్రి: హుస్సేన్ సాబ్, 3/46, ముత్తరాయపల్లి, ధంబన్ పల్లి, అన్నలూరు, కడప, ఆంధ్రప్రదేశ్-516172.

బకాయి మొత్తం: తేది 31.10.2025 నాటికి రూ. 47,49,650/- + తేది. 01.11.2025 నుండి తదుపరి వడ్డీ, వ్యయాలు & ఇతర ఛార్జీలు.

బ్యాంకుకు తెలిసిన సమాచారం ప్రకారం ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్‌లు లేని స్థిరాస్తి వివరములు :

కడప జిల్లా, కడప మున్సిపల్ కార్పొరేషన్ పద్ద గూడూరు గ్రామ పొలాలు, అల్మాస్‌పేట ఇంటీరియర్ పరిధి, వార్డు నెం.08, స్థలం సర్వే నెం.527 & 360, ప్లాట్ నెం.41, డోర్ నెం.8/726-30-4-2 వద్ద మొత్తం స్థలం విస్తీర్ణం: మొత్తం విస్తీర్ణం 2.42 సెంట్లు లేదా 117.14 చ॥గ॥లు, స్థలం నికర విస్తీర్ణం: 2.27 సెంట్లు లేదా 109.86 చ॥గ॥ల విస్తీర్ణంలో రెసిడెన్షియల్ బిల్డింగ్ యావత్తు ఆస్తి. హద్దులు : ఉత్తరం : షేక్ నిసార్ అహ్మద్ గారి ఇల్లు, దక్షిణం : గయాస్ భాషా, ఎస్. ముస్సీర్ అహ్మద్ గార్ల ప్లాట్ నెం.41 (భాగం), ప్లాట్ నెం.42, మొత్తం 4 సెంట్లు 880 లింకులు స్థలం, తూర్పు: 1 అడుగు సొంత సందు ఆ తర్వాత షేక్ రసూల్ ప్లాట్ నెం.22 ఇల్లు, పడమర : రోడ్డు.

రిజర్వు ధర: రూ. 46,53,000/-	ధరావత్తు సొమ్ము: రూ. 4,65,300/-

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, తిరుపతి స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్ బ్రాంచ్, అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 7901626759, 9901574353.

ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (BAANKNET), వెబ్‌పోర్టల్ https://www.baanknet.com/ ఫోన్ నెం: 7046612345 / 6354910172 / 8291220220 / 9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.BAANKNET@psballiance.com

తేది: 03.11.2025, ప్రదేశం: తిరుపతి సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

EDUCATION

కడప & ప్రొద్దుటూరులో గల కళాశాలలో మెడికల్, డిప్లొమా కోర్సులు DMLT, DOA, DOM, DECG, DRGA, DMST (ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్), DMIT-(CT/MRT టెక్నీషియన్), DMPHA (M) శానిటరీ ఇన్‌స్పెక్టర్ అడ్మిషన్లు జరుగుచున్నవి. అర్హత: ఇంటర్ (ఏదైనా గ్రూప్), Cell: 7416623777, 74165 23777. అర్హత గల వారికి స్కాలర్‌షిప్ కలదు. చివరి తేదీ: 10-11-2025.

JOBS

Wanted Experienced Drivers and Security persons for a Reputed Educational Institution in Rayachoty. Contact: 8217200025, 7093473533.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యూయర్స్, ఏజ్: 22-35. ఫ్రెషర్స్ కూడా కావలెను. ✆ 6281037879.

FACULTY/ TEACHERS

Wanted Teachers: Pre-Primary & Primary (All Subjects). Qua: Any Degree. Receptionist (Lady), Driver. 8074875926, 8074511299.

HOSPITALITY

కడప నగరం, హిమాలయ ఆసుపత్రి సందు పడమరలోని సర్విస్ స్టాఫ్, వార్డుబాయ్‌లు, ఆయమ్మలు కావలెను. సెల్: 9100745905.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ. 350/- మాత్రమే
Contact: KDP: 9989997626, 8008514248 PDTR: 8008597620
ప్రకటనలకు జి.ఎస్.టి 5% అదనం

SECURITY GUARDS

కడప, పులివెందుల రోడ్, సాక్షి ఎదుట గల ద్విచక్ర వాహనాల కంపెనీలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. డ్యూటీ 12 గంటలు, జీతం: 10,000, ప్రతిఫ్: 7997661292.

గమనిక: [illegible]

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని వినతి

తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న భాజపా నాయకులు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పురపాలక పరిధిలోని స్వరాజ్యనగర్, సంజీవయ్యనగర్ ఎస్సీ ప్రజలు శ్మశానానికి స్థలం లేక అంత్యక్రియలకు నరక ప్రాయంగా ఉందని భాజపా ఎస్సీ మోర్చా సీనియరు నాయకుడు చలపతిరావు తెలిపారు. ఎక్కడ ఖననం చేసుకోవాలో తెలియనివిధంగా ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఈ సమస్యపై సోమవారం తహసీల్దారు గంగయ్యకు వినతి పత్రాన్ని అందజేశారు.

విజయోత్సవ ర్యాలీ

విజయోత్సవ ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: భారతదేశ మహిళా క్రికెట్ ప్రపంచ కప్పు సాధించడం, శ్రీహరికోట నుంచి శాటిలైట్ నింగిలోకి విజయవంతంగా ఎగరడంపై వెంగమాంబ పాఠశాల విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో పాఠశాల కరస్పాండెంట్ పుల్లపనాయుడు, అడ్మినిస్ట్రేటర్ నాగలింగేశ్వరరెడ్డి, ప్రిన్సిపల్ దిలీప్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీచరణి విజయం.. జిల్లాకే గర్వకారణం

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: మహిళల క్రికెట్ వన్డే ప్రపంచ కప్ గెలుచుకున్న టీం ఇండియా జట్టులో వీరపునాయునిపల్లె మండలం ఎర్రమలపల్లె గ్రామానికి చెందిన శ్రీచరణి ఉండడం జిల్లాకే గర్వకారణమని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఒక వికెట్‌ను పడగొట్టి ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలపడంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ మారుమూల గ్రామం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి మన రాష్ట్రం నుంచి ప్రపంచ కప్‌లో ఆడిన మొదటి మహిళా క్రికెటర్‌గా ఘనతకెక్కారన్నారు. ఫాస్ట్ బౌలింగ్‌తో మొదలైన ఆమె ప్రయాణం లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్‌గా సక్సెస్ అయిందన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు ఆట వస్తువుల వితరణ

కలసపాడు, న్యూస్‌టుడే: మండలంలోని కరణంవారిపల్లె ప్రాథమిక పాఠశాలకు సోమవారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకుడు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి పలు రకాల ఆట వస్తువులను వితరణ చేశారు. క్యారంబోర్డు, వాలీబాల్, చెస్ వంటి ఆట వస్తువులను ప్రధానోపాధ్యాయుడు జి.రమణారెడ్డి, విద్యార్థులకు అందించారు. అనంతరం హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయుడు ఇ.బాలజోజిలను విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

రాయితీ శనగల పంపిణీ

రాజుపాళెం, న్యూస్‌టుడే: ప్రభుత్వం రైతులకు రాయితీ శనగలను పంపిణీ చేస్తున్నట్లు ఏవో శివరామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలో గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు రాయితీ శనగలు చేరాయని తెలిపారు. మండలానికి 2800 క్వింటాలు కేటాయించినట్లు చెప్పారు. అయితే ప్రభుత్వ ధర క్వింటా రూ.7,800 కాగా రూ.1950 రాయితీ పోను రూ. 5,850 ధరకు రైతులకు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.

భక్తులతో పోటెత్తిన శివాలయాలు



ప్రొద్దుటూరులో శాకంబరిగా రాజరాజేశ్వరిదేవి దర్శనం

పవిత్ర కార్తీకమాస రెండో సోమవారాన్ని పురస్కరించుకుని ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, మైదుకూరు నియోజకవర్గ పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. మహిళలు, భక్తులు అభిషేకాలు, పూజలు, దీపారాధనలు చేశారు. ఉదయాన్నే ఏకాదశ రుద్రాభిషేకాలు, క్షీరాభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని దీపోత్సవంతో పాటు పరమ శివునికి భక్తిశ్రద్ధలతో అభిషేకాలు చేసి మొక్కులను తీర్చుకున్నారు.

-న్యూస్‌టుడే, బృందం

మైదుకూరు: మాధవరాయస్వామి ఆలయంలో..

ప్రొద్దుటూరు ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

చాపాడు: వీరభద్రస్వామి ఉత్సవ విగ్రహ ఊరేగింపులో భక్తులు

కన్యతీర్థానికి తరలివచ్చిన భక్తులు

మెగా డీఎస్సీపై విచారణకు డిమాండ్

పోరుమామిళ్ల: మెగా డీఎస్సీలో పలు అక్రమాలు జరిగాయని వీటిపై విచారణ జరిపించాలని సీపీఐ మండల కార్యదర్శి రవికుమార్, సహాయ కార్యదర్శి కేశవ అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండలానికి చెందిన వారు అధికంగా కర్నూలు జిల్లాలో డీఎస్సీ పరీక్ష రాశారని చెప్పారు. అక్కడ స్థానికతను చూపించి, మరికొంతమంది చెప్పడం ఉన్నట్లు తప్పుడు ధ్రువీకరణ పత్రాలను డీఎస్సీలో పెట్టి ఉద్యోగాలు పొందారని ఆరోపించారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

దువ్వూరు: దువ్వూరు, చింతకుంట విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేష్‌కుమార్ తెలిపారు.

ముగిసిన వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి మహోత్సవాలు

దీపార్చన పూజలో పూర్వపు మఠాధిపతి కుమారులు

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి సుప్రభాతం, వేద స్వస్తి, పారాయణం, మండల పూజలు, శాంతిహోమం పూర్ణాహుతి పలు పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. రాత్రి కార్తీక సహస్ర దీపార్చన పూజ మంత్రపుష్పం మంగళ హారతిని స్వామి వారికి పూర్వపు మఠాధిపతి కుమారులు వెంకటాద్రిస్వామి, భద్రయ్యస్వామి, వీరంబట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి ఆధ్వర్యంలో పండితులు ఇడమకంటి జనార్దన శివాచార్య బృంద సభ్యులు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. సప్తాహ దీపార్చనతో జయంతి మహోత్సవాలు ముగిశాయని మేనేజర్ ఈశ్వరయ్యాచారి తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక భద్రత

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: కార్తీక సోమవారం సందర్భంగా శైవ క్షేత్రాలకు భక్తులు పెద్దఎత్తున వచ్చే అవకాశం ఉందని ఆలయాల వద్ద పోలీసులు ప్రత్యేక భద్రత ఏర్పాటు చేశారు. సోమవారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన కన్యతీర్థంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ నరేష్‌బాబు, పోలీసు సిబ్బందితో ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తుల రద్దీ నియంత్రణ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.

కన్యతీర్థంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ నరేష్‌బాబు

ప్రొద్దుటూరులో షూ కంపెనీ ఏర్పాటు

షూ కంపెనీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, చిత్రంలో నిర్వాహకులు, నాయకులు

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు మైదుకూరు రోడ్డులో ఏర్పాటు చేసిన ఆజంతా షూ కంపెనీని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. పూజా కార్యక్రమాలు నిర్వహించి వ్యాపారాభివృద్ధి కోరుకున్నారు. మాజీ కౌన్సిలర్ కామిసాని ఆనంద్, నాయకులు ఎం. సురేష్, కొండారెడ్డి, ప్రసాద్, అజంతా షూమార్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రయాణికుల రక్షణే లక్ష్యం

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో ప్రయాణికులు, పాఠశాల బస్సుల్లో విద్యార్థులు సురక్షితంగా గమ్యస్థానం చేరేవిధంగా బస్సుల్లో అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పాటించాలని ఎంవీఐ నారాయణ నాయక్ తెలిపారు. సోమవారం స్థానిక ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో వాటి యజమానులతో సమావేశం నిర్వహించారు. ఎలాంటి లోపం కనిపించినా బస్సులను సీజ్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు రమేంద్రనాయక్, హేమకుమార్, ఏవో కరిముల్లా, ఎంవీఐ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బస్సుల్లో అత్యవసర తలుపులు తప్పనిసరి

బద్వేలు, న్యూస్‌టుడే: ప్రైవేట్ స్కూళ్లకు సంబంధించిన బస్సుల్లో ఎమర్జెన్సీ డోర్స్, జీపీఎస్, ఫైర్ అలారం తప్పనిసరి అని ఎంవీఐ శేఖర్‌రావు సూచించారు. బద్వేలు ఎంవీఐ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రైవేట్ స్కూళ్ల యజమానుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఎవరు ఉల్లంఘించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు, కాలువల నిర్మాణాలకు భూమి పూజ

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధులతో మోడంపల్లె, ఖాదర్‌హుస్సేన్ మసీదు వీధుల్లో సిమెంటురోడ్డు, కాలువల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి భూమి పూజ చేశారు. కమిషనర్ రవిచంద్రారెడ్డి, మాజీ ఛైర్మన్ ముక్తియార్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండ లాగుడు ప్రదర్శన

ఖాజీపేట, న్యూస్‌టుడే: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం నాగనాథేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీలను ఆలయ ఛైర్మన్ వెంకటసుబ్బయ్య నరెడ్డి ప్రారంభించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సీఐ వంశీధర్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు

బద్వేలు గ్రామీణ: వైకాపా ప్రభుత్వంలో మంజూరైన మెడికల్ కాలేజీలను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ ప్రైవేట్ పార్టనర్ షిప్ లో చేర్చడం తగదని అఖిల భారత విద్యార్థి సంఘం కడప జిల్లా కన్వీనర్ బండి అనిల్ పేర్కొన్నారు. సోమవారం సిద్దవటం రోడ్డు లో బైపీసీ విద్యార్థులతో కలసి మానవహారం నిర్వహించారు. నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభినందనలు

అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగిన మహిళల వన్డే ప్రపంచకప్ విజేతగా నిలిచిన భారత మహిళా జట్టుకు అభినందనలు. ఈ విజయంలో కీలకపాత్ర పోషించిన మన జిల్లా వాసి శ్రీచరణికి ప్రత్యేక అభినందనలు.

విజ్ఞాన్ A/c Campus బాలికల జూనియర్ కాలేజి
గౌతమ్ హైస్కూల్ దగ్గర, వై.యం.ఆర్. కాలని, ప్రొద్దుటూరు.
సెల్: 9705796063. 9030476125

688 హెక్టార్లలో పంటల నష్టం

రాజుపాళెం: మండలంలోని గ్రామాల్లో గత వారం కిందట మొంథా తుపాను ప్రభావంతో రైతులు సాగు చేసిన వివిధ రకాల పంటలు 688 హెక్టార్లలో నష్ట పోయినట్లు ఏవో శివరామకృష్ణారెడ్డి తెలిపారు. మినుము, కంది, వరి, పత్తి, జొన్న దెబ్బతిన్నాయన్నారు. ఈ వివరాలను ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు చెప్పారు.

ఎగ్జిబిషన్ బకాయి ఎగవేత తగదు

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పురపాలక సంఘానికి బకాయిపడ్డ ఎగ్జిబిషన్ సొమ్ము రూ.కోటి ఎగవేసేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనిపై పురపాలక అధికారులు పట్టించుకోకపోవడం తగదని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదురెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎగ్జిబిషన్ స్థలంలో ఉన్న పరికరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తాను పురపాలక కార్యాలయం ఎదుట మంగళవారం నుంచి రిలే నిరాహారదీక్షలు చేస్తానని ప్రకటించారు.

తిప్పలూరులో ఇరువర్గాల ఘర్షణ.. కేసు నమోదు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని తిప్పలూరు గ్రామంలో జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు సోమవారం ఎర్రగుంట్ల పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. పని నిమిత్తం ఒక వర్గానికి చెందిన వారు గ్రామ సచివాలయం వద్దకు వచ్చారు. మరొక వర్గానికి చెందిన వ్యక్తులు అక్కడికి చేరుకోవడంతో వాట్సప్‌లో మెసేజ్ విషయంలో వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం మాటలు పెరిగి ఘర్షణ జరిగి రెండు వర్గాలకు రక్తగాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు

బద్వేలులో కోటి సంతకాల సేకరణ

సంతకం చేస్తున్న ఎమ్మెల్యే సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, తదితరులు

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణంలోని 26వ వార్డు భావనారాయణనగర్‌లో సోమవారం వైకాపా ఆధ్వర్యంలో కోటి సంతకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధ, ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి మాట్లాడుతూ వైకాపా అధికారంలో ఉన్నప్పుడే ఐదు మెడికల్ కళాశాలలు అందుబాటులోకి వచ్చాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ పేరిట ప్రైవేటీకరణ చేస్తున్నారని ఆరోపించారు. ఇది ప్రజలకు వైద్య విద్యను దూరం చేయడమేనన్నారు. నాయకులు రాజగోపాల్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, రమణారెడ్డి, సాయికృష్ణ, సుందర రామిరెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

జమ్మలమడుగులో నినాదాలు చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

బద్వేలులో జెండాను ఆవిష్కరిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

జమ్మలమడుగు గ్రామీణ, బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోవచ్చని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ అన్నారు. సోమవారం డీవైఎఫ్ఐ 46వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జమ్మలమడుగు పట్టణంలో డీవైఎఫ్ఐ నాయకులు ర్యాలీ నిర్వహించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన హామీల సాధన కోసం, కడప జిల్లాలో ఉక్కు సాధనే లక్ష్యంగా ముందుకెళ్తామన్నారు. దోపిడీ రహిత సమాజ స్థాపనకు డీవైఎఫ్ఐ పోరాడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు ఎల్లయ్య, సుబహాన్, కృష్ణారెడ్డి, సుదర్శన్, అరుణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణమే లక్ష్యంగా పోరాడుదామని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పిలుపునిచ్చారు. బద్వేలులోని భగత్‌సింగ్ విగ్రహం దగ్గర ఆయన భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు మంజూరును అమలు చేయాలని కోరారు. నాయకులు మస్తాన్, షరీఫ్; ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక

విజేతలను అభినందిస్తున్న హెచ్‌ఎం సుమలత

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: వివిధ విభాగాల్లో నిర్వహించిన క్రీడా పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారని వెంకటాపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుమలత అన్నారు. 200, 400 మీటర్ల పరుగుపందెంలో అండర్-14 విభాగంలో జశ్వంత్ ప్రథమ స్థానం, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం, లాంగ్ జంప్‌లో లావణ్య మూడో స్థానం, అండర్ -17 విభాగంలో లాంగ్‌జంప్‌లో సోమనాథచారి మూడో స్థానం, 800 మీటర్ల పరుగుపందెంలో వెంకటచరణ్ మూడో స్థానం సాధించారని హెచ్‌ఎం వివరించారు. విజేతలను అభినందించారు. పీఈటీ కరీష్మాను హెచ్‌ఎం అభినందించారు.

సెంట్రల్ కిచెన్ భవనానికి శంకుస్థాపన

ఎస్.వెంకటాపురంలో శంకుస్థాపన పూజల్లో పాల్గొన్న తెదేపా నాయకులు చిన్నగంగయ్య, రాజశేఖర్‌రెడ్డి, శివశంకర్

అట్లూరు: మండలంలోని ఎస్.వెంకటాపురంలో సోమవారం సెంట్రల్ కిచెన్ భవనానికి బద్వేలు మార్కెట్ యార్డు డైరెక్టరు శివశంకర్, ఎంపీటీసీ సభ్యుడు చిన్నగంగయ్య, తెదేపా నాయకులు రాజశేఖర్‌రెడ్డి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. మండలంలోని అన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజనం సరఫరా చేసేందుకు రూ.38 కోట్లతో సెంట్రల్ కిచెన్ మంజూరైంది. పనులు వేగవంతంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెదేపా నాయకులు తెలిపారు.

విద్యుత్తు కేంద్రాల ఏర్పాటుకు గ్రహణం

• ప్రొద్దుటూరులో లభ్యంకాని స్థలాలు • నిరంతర సేవల కల్పనకు విఘాతం

–న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు గ్రామీణ

ప్రొద్దుటూరు ఎస్పీడీసీఎల్ డివిజన్ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వార్షికంగా కరెంటు వినియోగం పెరిగిపోవడంతో అదనంగా 33/11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రాల ఏర్పాటుకు స్థలాల కొరత తీవ్రంగా వేధిస్తోంది. నిధులు పుష్కలంగా ఉన్నా 50 సెంట్ల చొప్పున భూముల లభ్యత లేక గత వైకాపా ప్రభుత్వంలో వీటి ప్రతిపాదనలను బుట్టదాఖలు చేశారు. స్థిరాస్తి వ్యాపారులకు కొమ్ముకాస్తున్న స్థానిక సంస్థల అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్వాకంతో వందలాది ఎకరాల్లో ఏర్పాటైన అనధికారిక లే-అవుట్ కాలనీల నుంచి 10 శాతం చొప్పున సామాజిక స్థలాలకు గండిపడింది. ఫలితంగా ప్రజాప్రయోజిత కట్టడాలకు ఖాళీ జాగాలు లేని దుస్థితి నెలకొంది. ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో అడ్డంకులను అధిగమించి 50 సెంట్ల చొప్పున భూములను అప్పగిస్తే రూ. 2.50 కోట్లతో ఉప కేంద్రాలను ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

ఏటా పెరుగుతున్న కనెక్షన్లు

పురపాలక, శివారు గ్రామాల పరిధిలోని రామేశ్వరం, పవర్‌హౌస్‌వీధి, ఐడీఏ, హెచ్‌బీ కాలనీ, మోడంపల్లె బైపాసు రోడ్డు, ఖాదరాబాదు, అమృతానగర్, మీనాపురంలో 33/11 కేవీ ఉప కేంద్రాలు ఉన్నాయి. గృహ, వాణిజ్య, పరిశ్రమలు, తాగునీటి పథకాలు/ప్రభుత్వ కార్యాలయాలు, వ్యవసాయ సర్వీసులకు సంబంధించి 2022లో 1,01,883 కనెక్షన్లు ఉండగా 2023లో 1,05,731, 2024లో 1,09,861, 2025 అక్టోబరు వరకు 1,15,208 కనెక్షన్లు నుంచి కరెంటు వినియోగిస్తున్నారు. వేసవిలో 60 మెగా వాట్స్ అదనపు లోడు నియంత్రణకు కొత్తగా 33/11 కేవీ ఉప కేంద్రాలు లేక విద్యుత్తు ఇంజినీర్లు ఆపసోపాలకు గురవుతున్నారు.

కాగితాలకే పరిమితం : బొల్లవరం మున్సిపల్ లే-అవుట్, పాలకర్మాగారం (పీఎంఎఫ్), ఆర్టీసీ బస్టాండు, మూడో కాలనీ, రామేశ్వరంలోని పేదలందరికీ ఇళ్లు కాలనీలో కొత్తగా విద్యుత్తు ఉప కేంద్రాలకు 50 సెంట్ల చొప్పున స్థలాలివ్వాలని గత వైకాపా ప్రభుత్వంలో ఎస్పీడీసీఎల్ అధికారులు ప్రతిపాదించారు. కానీ రూ. 2.50 కోట్లతో పని ఒప్పందం ఉన్నా పీఎంఎఫ్‌లో భూమి లేక టెండరు రద్దు చేశారు. ఈ విషయమై విద్యుత్తు ఈఈ రమణారెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా గత మార్చిలో నియోజకవర్గ సమీక్ష సమావేశంలో ఐదు చోట్లు స్థలాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనరుకు కలెక్టరు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వీటిని అప్పగిస్తే కొత్తగా ఉప కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు.

బొల్లవరంలోని పురపాలక లే-అవుట్‌లో విద్యుత్తు ఉపకేంద్రానికి ప్రతిపాదిత స్థలం ఇదే

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032, వెబ్‌సైట్: www.shriramfinance.me, బ్రాంచ్ కార్యాలయము: 4/620, 1వ అంతస్తు, గాంధీరోడ్డు, ప్రొద్దుటూరు- 516360, కడప జిల్లా

డిమాండ్ నోటీసు

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా ఉండి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిటెడ్‌తో విలీనమైన తరువాత ఎన్‌సిఎల్‌టి బెంచ్-2 చెన్నై తేదీ: 09.11.2022వారి ఆదేశాలతో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా రూపాంతరం చెందిన తర్వాత కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ తేదీ: 30.11.2022 ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరు మార్పునకు ఆమోదము లభించినది) ఈ కంపెనీ కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టరు కాబడినది మరియు ఆర్‌బిఐ నందు కూడా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుటకు రిజిస్టరు కాబడి వారి రిజిస్టరు కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 నందు నమోదు కాబడినదని తెలియజేయడమైనది. బ్రాంచ్ కార్యాలయము: ప్రొద్దుటూరు (ఇకపై కంపెనీ / లెండర్‌గా వ్యవహరించబడతారు)

ఈక్రింద పేర్కొన్న రుణగ్రహీత /సహరుణగ్రహీతలు / గ్యారంటీదారులు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్) వారి వద్ద రుణ సౌకర్యము పొంది ఉన్నారు. రుణ సౌకర్యము పొందిన తర్వాత సదరు రుణగ్రహీతలు/ గ్యారంటీదారులు రుణము మరియు దానిపై వడ్డీని తిరిగి చెల్లించుటలో పలుమార్లు విఫలమైనారు.కావున సదరు అకౌంట్ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నియమ నిబంధనలు అనుసరించి నిరర్ధక ఆస్తులుగా వర్గీకరించబడినది. తదుపరి శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్) యొక్క అధీకృత అధికారి గారు సెక్యూరిటీ మరియు ఆర్థిక ఆస్తుల పునర్నిర్మాణం మరియు భద్రతా చట్టం, 2002 నిబంధన క్రింద సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (సదరు యాక్ట్) మరియు దాని ద్వారా ఆపాదించబడిన అధికారాలను బట్టి రూలు 3తో చదువబడిన సెక్షన్ 13(2) ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నియమాల (పేర్కొన్న నియమాలు) ను అనుసరించి ఋణగ్రహీత / గ్యారంటీదారులు /తనఖాదారులకు డిమాండ్ నోటీసును మరియు దానిపై అంగీకరింపబడిన వడ్డీ రేటుతో పాటు ఉత్పన్నమగు ఖర్చులు, ఇతర ఛార్జీలను నోటీసు అందుకున్న 60 రోజులలోపు చెల్లించవలసినదిగా కోరి వున్నారు.

వారు చివరగా తెలిపిన అడ్రసుకు జారీ చేసిన సదరు నోటీసు వారికి చేరక రిటర్న్ అయినది. కావున ఇందుమూలముగా పబ్లిక్ నోటీసు ద్వారా వారికి సదరు విషయము తెలియజేయడమైనది. సదరు చట్టములో సెక్షన్ 13 యొక్క సబ్‌సెక్షన్(8) ద్వారా రుణగ్రహీతకు తెలియజేయడమేమనగా సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు గల అవకాశమును వారి దృష్టికి తీసుకురావడమైనది.

రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు, గ్యారంటీదారుల పేర్లు మరియు చిరునామా
1) ఎం.వీరప్రతాప్‌రెడ్డి,తండ్రి ఎం.రామిరెడ్డి, డి.నెం.141-196, విరాట్‌నగర్, గోపవరం, ప్రొద్దుటూరు, కడప జిల్లా
2) జి.క్రిష్ణమోహన్‌రెడ్డి, తండ్రి జి.చెన్నారెడ్డి, డి.నెం.1/12, సర్వరాజుపేట గ్రామం, వీరపునాయునిపల్లి మండలం, కడప జిల్లా
3) కె.వీరారెడ్డి, తండ్రి కె.నారాయణరెడ్డి, డి.నెం.7-826, వైఎంఆర్ కాలనీ ప్రొద్దుటూరు, కడప జిల్లా

ఎన్‌పిఏ తేదీ: 30.11.2013 డిమాండ్ నోటీసు తేదీ: 22.10.2025
ఋణ మొత్తం రూ.10,00,000 (పది లక్షల రూపాయలు మాత్రమే) & రూ.10,00,000 (పది లక్షల రూపాయలు మాత్రమే)
రుణఅగ్రిమెంట్ నెం. PRDTRTF07050013 & PRDTRTF1205310023
బకాయి అమౌంట్: రూ.28,77,815/- (ఇరవై ఎనిమిది లక్షల డెబ్బై ఏడు వేల ఎనిమిది వందల పదహైదు రూపాయలు మాత్రమే) + రూ.24,44,977/- (ఇరవై నాలుగు లక్షల నలభై నాలుగు వేల తొమ్మిది వందల డెబ్బై ఏడు రూపాయలు మాత్రమే వెరశి మొత్తం బకాయి రూ.53,22,792/- (యాభై మూడు లక్షల ఇరవై రెండు వేల ఏడు వందల తొంభై రెండు రూపాయలు మాత్రమే)

స్థిరాస్తి వివరములు

జి.క్రిష్ణమోహన్‌రెడ్డి పేరున వున్న ఆస్తి: కడప జిల్లా, ప్రొద్దుటూరు రిజిస్ట్రేషన్ జిల్లా, ప్రొద్దుటూరు సబ్‌జిల్లా, గోపవరం పంచాయతీ, వార్డునెం.17, ప్రొద్దుటూరు గ్రామలెక్క దాఖలా, కాలువకట్ట ఏరియా, సర్వేనెం.262/2లో ఎ.0.02 సెంట్లు లేదా 300 చ.లింకుల స్థలానికి కొలతలు: తూర్పు నుండి పడమర: 100 లింకుల లేదా 20.100మీటర్ల అర్ధభాగం రోడ్డుతో సహా. ఉత్తరం నుండి దక్షిణం: 23 లింకులు లేదా 4.623మీ., 111.3 చ.గ. హద్దులు: తూర్పు 30లింకుల వెడల్పు గల రోడ్డు, దక్షిణం: ప్లాటు నెం.22 స్థలం, పడమర: సావిత్రి స్థలం, ఉత్తరం: మెట్టుపల్లి వెంకటసుబ్బారెడ్డి స్థలం

ఈ పరిస్థితులలో రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు మరియు గ్యారంటీదారులకు తెలియజేయడమేనగా ఈ పత్రికా ప్రకటన వెలువడిన రోజు నుండి 60 రోజులలోపు పైన పేర్కొన్న ఋణ మొత్తము భవిష్యత్ వడ్డీతోపాటు మరియు ఇతర ఖర్చులను చెల్లించవలెను. 60 రోజుల వ్యవధి దాటిన తర్వాత సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(4)ను అనుసరించి రుణగ్రహీత, తనఖాదారుకు చెందిన సెక్యూర్డ్ ఆస్తులను స్వాధీనపరచుకొనుటకు చర్యలు చేపట్టబడునని తెలియజేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్13(13) ను అనుసరించి రుణగ్రహీతకు చెందిన సెక్యూర్డ్ ఆస్తులపై మా సంస్థ ముందస్తు అనుమతి లేకుండా ఇతరులకు బదలాయించుట, అమ్మకము మరియు లీజుకు ఇవ్వడం ఇంకా ఏ ఇతర లావాదేవీలు చేయరాదని తెలియజేయడమైనది.

ప్రదేశం: కడప సం/- అధీకృత అధికారి,
తేది: 03.11.2025 శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్‌టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

కడప
•కడప •పులివెందుల •కమలాపురం

భక్తుల రక్షణ అందరి బాధ్యత

మాట్లాడుతున్న దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్

మారుతీనగర్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం అన్ని ఆలయాల్లో కార్తిక మాస పూజలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించి, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవోలు అన్ని ఏర్పాట్లు చేయాలని దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ సిబ్బందికి తెలియజేశారు. ఆర్టీసులు గోపాలకృష్ణస్వామి పాల్గొన్నారు. **పెండ్లిమర్రి:** కార్తిక మాసోత్సవాల్లో భాగంగా శివాలయాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టాలని దేవాదాయ శాఖ కర్నూల్ ఉప కమిషనర్ పి. గురు ప్రసాద్ అన్నారు. పొలతల క్షేత్రాన్ని ఆయన సందర్శించారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి భాజపా శ్రేణులు సమాయత్తం కావాలని శ్రీశైలం ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు అన్నారు. ఒంటిమిట్ట హరిత హోటల్లో పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. స్వదేశీ ఉత్పత్తులను వాడాలని దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారని గుర్తు చేశారు. అనంతరం పలువురు భాజపాలో చేరారు. వారికి కండువా కప్పి ఆహ్వానించారు. భానుప్రకాశ్‌రాజు, గంగిరెడ్డి, శివరాజు, జగదీష్ పాల్గొన్నారు.

భాజపాలో చేరుతున్న కార్యకర్తలకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న శ్రీశైలం ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ రమేష్‌నాయుడు

ఆదర్శ పుత్రుడు సంపత్‌కుమార్

మారుతీనగర్, న్యూస్‌టుడే: సీపీ బ్రౌన్ నివసించిన బంగ్లా స్థలాన్ని బ్రౌన్ స్మారక గ్రంథాలయం ఏర్పాటుకు ఇస్తానని సీఆర్ కృష్ణస్వామి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఆదర్శపుత్రుడు సంపత్‌కుమార్ అని వైవీయూ వీసీ రాజశేఖర్ అన్నారు. సీపీబ్రౌన్ స్మారక గ్రంథాలయ స్థల దాత సంపత్‌కుమార్ జయంతి సందర్భంగా సీపీ బ్రౌన్ భాషాపరిశోధన కేంద్రంలో సోమవారం స్మారకోపన్యాసం చేసే ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన వీసీ వెంకటేశ్వర్లును సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పద్మ, సీపీబ్రౌన్ సంచాలకులు ఆచార్య పార్వతి, సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, వైవీయూ పాలకమండలి సభ్యుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, కేంద్ర సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సంపత్‌కుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైవీయూ వీసీ రాజశేఖర్

స్వస్తిక్ చిహ్నం ఆకారంలో లక్ష దీపాలను వెలిగిస్తున్న మహిళలు

మోక్షంపేట: శివాలయంలో ప్రత్యేక అలంకరణలో

ప్రత్యేక పూజలందుకుంటున్న మిట్టమల్లేశ్వరస్వామి

వేంపల్లె: కాశీఅన్నపూర్ణాదేవిగా గౌరీదేవి

పుణ్య దీపం.. ధన్య రూపం

శివాలయంలో అన్నదానం చేస్తున్న కడప ఎమ్మెల్యే మాధవి

పవిత్ర కార్తిక మాసంలోని రెండో సోమవారం సందర్భంగా కడప, కమలాపురం, పులివెందుల నియోజకవర్గంలోని శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామునే భక్తులు ఆలయాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించారు. పలు చోట్ల మహిళలు సామూహిక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆయా ఆలయాల వద్ద నిర్వాహకులు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా శైవాలయాలు శివ నామ స్మరణంతో మార్మోగాయి. - న్యూస్‌టుడే, బృందం

పొలతల మల్లేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో స్వామి వారి ఊరేగింపు

టెట్ నుంచి మినహాయించాలని వినతి

కడప విద్య, న్యూస్‌టుడే: టెట్ నుంచి ఉపాధ్యాయులను మినహాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఫ్యాప్టో జిల్లా నాయకులు కోరారు. ఆ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకి ఫ్యాప్టో నాయకులు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం టెట్ రాయాలని విద్యాశాఖ చెప్పడం భావ్యం కాదన్నారు. అనంతరం డీఈవో కార్యాలయంలో ఏడీ రామకృష్ణకి నాయకులు వినతిపత్రం సమర్పించారు.

ప్రతిభావంతమైన క్రీడాకారులకు ప్రోత్సాహం

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: నగరంలోని ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ప్రోత్సాహం అందించి వారు జాతీయ స్థాయిలో రాణించేందుకు దోహదపడతామని ఎమ్మెల్యే మాధవి స్పష్టం చేశారు. కడపలోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో మన దేశం చారిత్రాత్మక విజయం సాధించడం ప్రపంచానికి గర్వకారణమని పేర్కొన్నారు. జిల్లాకు చెందిన శ్రీచరణి ప్రపంచ జట్టులో ఆడి సత్తా చాటడం గర్వకారణమన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వ వైఫల్యం

వేంపల్లె, న్యూస్‌టుడే: హామీల అమలులో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో సోమవారం ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17 నెలలు అవుతున్నా నిరుపేదలకు ఒక్క ఇల్లు కట్టించలేదన్నారు. ఉద్యోగాలు చేసే మహిళలకు హాస్టల్ వసతి, అంగన్‌వాడీ కార్యకర్తలకు సుప్రీంకోర్టు తీర్పు మేరకు వేతనాలు పెంచుతామని చెప్పి ఇప్పటి వరకు చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో దర్గా ఉరుసు

దర్గాకు విచ్చేస్తున్న మురాదియా దర్గా పీఠాధిపతి మహమ్మద్ జమాలుల్లాబాషా సాహెబ్

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: చారిత్రాత్మకమైన ఆస్థాన ఏ మురాదియా దర్గా ఉరుసు ఉత్సవాలు సోమవారం రాత్రి కడప నగరంలో భక్తిశ్రద్ధలతో జరిగాయి. దర్గా పీఠాధిపతి మహమ్మద్ జమాలుల్లాబాషా సాహెబ్ దర్గాలో పూలచాదర్ సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలువురు భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

మేము సైతం పర్యావరణహితులం

పులివెందుల, న్యూస్‌టుడే: పర్యావరణహిత సమాజంకోసం మనమంతా పాటుపడదామని జన విజ్ఞాన వేదిక జాతీయ కార్యదర్శి ఉపాధ్యాయులు సూర్యుల్లా అన్నారు. ఉర్దూ పాఠశాల నుంచి పులివెందుల పూల అంగళ్ల కూడలి వరకు ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులతో కలిసి పర్యావరణ పరిరక్షణపై సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవునికి ప్రాణాధారమైన నీరు, గాలి, నేల కాలుష్యం అవుతున్నాయన్నారు. దీంతో రానున్న రోజుల్లో మానవుని మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉన్నత శిఖరాలకు

పులివెందుల, న్యూస్‌టుడే: మహిళా క్రికెట్ ప్రపంచ కప్‌లో భారత్ సత్తా చాటి కప్‌ను కైవసం చేసుకోవడం అభినందనీయమని పట్టణ ఎస్ఐ సుభాన్ అన్నారు. సోమవారం మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు, స్నేహిత ఆత్మీయ హస్తం సేవా సమితి, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు చేపట్టిన విజయోత్సవ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. బాలికలు క్రీడా రంగంలో రాణించాలంటే తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే సాధ్యమన్నారు. ఈ సందర్భంగా కడప జిల్లా వాసి శ్రీచరణికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

పులివెందులలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీసు: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032. www.shriramfinance.in

బ్రాంచ్ కార్యాలయం: డి.నెం.42/107-1, ఓబులరెడ్డి కాంప్లెక్స్, అప్సర సర్కిల్, కడప

డిమాండ్ నోటీసు

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా ఉండి శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైన తరువాత ఎన్‌సిఎల్‌టి బెంచ్-2 చెన్నై తేదీ: 09.11.2022నాటి ఆదేశంలో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా రూపాంతరం చెందినది) [illegible]

రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు, గ్యారంటీదారుల పేర్లు మరియు చిరునామా
1) నీలం నాగేంద్రకుమార్ తండ్రి నీలం సుబ్బారాయుడు, డి.నెం.3/11, మెయిన్ బజార్, కమలాపురం (విలేజ్ & తాలూకా & పోస్ట్), కడప జిల్లా
2) నీలం విజయలక్ష్మి భర్త నీలం నాగేంద్ర కుమార్, డి.నెం.3/11, మెయిన్ బజార్, కమలాపురం (విలేజ్& తాలూకా & పోస్ట్), కడప జిల్లా
3) పసుపులేటి వెంకట రమేష్ తండ్రి వెంకటరమణ, డి.నెం.2/145-1, గడ్డంగి వీధి, కమలాపురం, కడప జిల్లా

ఎన్‌పిఏ తేది: 07.08.2023 డిమాండ్ నోటీసు తేది: 22.10.2025
ఋణ మొత్తం రూ.18,00,000 (పద్దెనిమిది లక్షల రూపాయలు మాత్రమే)
రుణఅగ్రిమెంట్ నెం. CUDP4TF2011300002
బకాయి అమౌంట్: రూ.21,05,450 /- (ఇరవై ఒక్క లక్షల ఐదు వేల నాలుగు వందల యాభై రూపాయలు మాత్రమే)

స్థిరాస్తి వివరములు
కడప జిల్లా, ప్రొద్దుటూరు రిజిస్ట్రేషన్ జిల్లా, కమలాపురం సబ్ జిల్లా, కమలాపురం మండలం, కమలాపురం గ్రామ పంచాయతీ మరియు గ్రామలెక్కదాఖలా సర్వేనెం. 404/11ఎ1, మెయిన్‌బజార్ సెగ్మెంట్-1, డి.నెం.3/9 గల స్థలానికి కొలతలు తూర్పు నుండి పడమర: 90 అ. లేదా 27.4 మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: 15అ. లేదా 4.5 మీ. వెరశి 150 చ.గ.లు ఇందున తూర్పు నుండి పడమర: 87అ. లేదా 26.5 మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: 15అ. లేదా 4.5మీ. వెరశి 1305 చ.అ. ఆర్.సి.సి బిల్డింగ్, ద్వారములు, ద్వారబందనములు, కిటికీలు, ఎలక్ట్రికల్ వైరింగ్, ఫిట్టింగ్స్, హెచ్.ఎస్.సి.నెం.0113 అన్ని డిపాజిట్లతో సహా, కొళాయి కలనెక్షన్, ఉత్తరం మరియు దక్షిణ గోడలలో అర్ధభాగం, అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో సహా. హద్దులు: తూర్పు: సందు రాస్తా, పడమర: పబ్లిక్ రోడ్డు, ఉత్తరం: జాయింట్ గోడ మరియు రెడ్డి సురేష్ యొక్క డి.నెం.3/8-1గల ఇల్లు. దక్షినం: జాయింట్ గోడ మరియు డి.నెం.3/10 గల నీలం లక్ష్మీదేవి ఇల్లు.

ఈ పరిస్థితులలో రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు మరియు గ్యారంటీదారులకు తెలియజేయడమేనగా ఈ పత్రికా ప్రకటన వెలువడిన రోజు నుండి 60 రోజులలోపు పైన పేర్కొన్న ఋణ మొత్తము భవిష్యత్ వడ్డీతోపాటు మరియు ఇతర ఖర్చులను చెల్లించవలెను. 60 రోజుల వ్యవధి దాటిన తర్వాత సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(4)ను అనుసరించి రుణగ్రహీత, తనఖాదారుకు చెందిన సెక్యూర్డ్ ఆస్తులను స్వాధీనపరచుకొనుటకు చర్యలు చేపట్టబడునని తెలియజేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్13(13) ను అనుసరించి రుణగ్రహీతకు చెందిన సెక్యూర్డ్ ఆస్తులపై మా సంస్థ ముందస్తు అనుమతి లేకండా ఇతరులకు బదలాయించుట, అమ్మకము మరియు లీజుకు ఇవ్వడం ఇంకా ఏ ఇతర లావాదేవీలు చేయరాదని తెలియజేయడమైనది.

ప్రదేశం: కడప
తేది: 03.11.2025
సం/- అధీకృత అధికారి,
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

జనసేనలో చేరిక

మారుతీనగర్, న్యూస్‌టుడే: నగరంలోని 32 వ డివిజన్‌లోని బీసీ సామాజిక వర్గానికి చెందిన 50 కుటుంబాలు జనసేన పార్టీలోకి చేరినట్లు ఆ పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ రాయలసీమ జోన్-1 కో కన్వీనర్ పండ్రా రంజిత్‌కుమార్ తెలిపారు. స్థానిక జిల్లా కార్యాలయంలో సోమవారం నగర ఇన్‌ఛార్జి సుంకరశ్రీనివాస్, నాయకులు తుంగా రమణయ్య సమక్షంలో బీసీ నేత నవీన్‌కుమార్ అతని అనుచరగణాన్ని కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

జనసేనలో చేరిన యువతతో పార్టీ నగర ఇన్‌ఛార్జి సుంకర శ్రీనివాస్, నాయకులు రమణయ్య

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: జమ్మలమడుగు నియోజకవర్గంలోని మైలవరం మండలంలో నిర్మించిన ఓ పరిశ్రమతో తీవ్రంగా నష్టపోయామని నవాబ్‌పేట వాసులు ఆరోపించారు. కడపలో సోమవారం ఆయన మాట్లాడారు. ఇప్పటికే నిర్మించిన ఆ కర్మాగారంతో సమీప గ్రామాల అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఇప్పుడు మళ్లీ రెండో ప్లాంట్ నిర్మాణానికి పనులు చేపడుతున్నారని, అధికారులు ఆ ప్లాంట్ నిర్మాణానికి ఎన్‌వోసీ ఇస్తే ఆందోళనలు చేస్తామన్నారు. పరిశ్రమ సమీపంలో వారు చేస్తున్న బ్లాస్టింగ్‌తో నవాబుపేట ప్రాంతంలోని ఇళ్లు దెబ్బతింటున్నాయన్నారు. కాలుష్యంతో పరిసర ప్రాంతంలో పలువురు దీర్ఘ కాలిక వ్యాధుల బారిన పడ్డారన్నారు.

10 నుంచి విద్యార్థి భరోసా యాత్ర

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 10 నుంచి ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థి భరోసా యాత్ర నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్లికార్జున్ అన్నారు. కడప ప్రెస్‌క్లబ్‌లో సోమవారం దీనికి సంబంధించిన గోడపత్రాలు ఆవిష్కరించారు. అద్దె భవనాల్లో ఉన్న వసతి గృహాలను సొంత భవనాల్లోకి మార్చాలన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలని నిరసన

కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి, ప్రజా సంఘాలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పేద మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేస్తోందని.. అందులో భాగంగానే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపేలా చర్యలు తీసుకోవాలని లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ హెచ్చరించారు. కడప కలెక్టరేట్ ఎదుట జీవో నంబరు 290ని రద్దు చేయాలని, మెడికల్‌కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలని కోరుతూ సోమవారం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్బరాయుడు, అంజి, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గుర్రప్ప, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నైపుణ్యం వెలికి తీసేందుకే బాలోత్సవం

కడప విద్య, న్యూస్‌టుడే : ప్రతి పిల్లవాడిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుందనీ వాటిని వెలికితీసేందుకు కడప మూడో బాలోత్సవం నిర్వహించనున్నామని జిల్లా అధ్యక్షుడు గోపాల్ అన్నారు. కడప నగరంలో సోమవారం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 29, 30 తేదీల్లో స్థానిక మరియాపురం బాలికల ఉన్నత పాఠశాలలో బాలోత్సవం సందర్భంగా పిల్లల సంబరాలు జరగనున్నాయని తెలిపారు. గౌరవాధ్యక్షుడు నాగమునిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రాహుల్ పాల్గొన్నారు.

పులివెందులలో గొర్రెల అపహరణ

పులివెందుల, న్యూస్‌టుడే: మందలో ఉన్న గొర్రెలు అపహరించారని ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశామని పోలీసులు సోమవారం తెలిపారు. వెంకటాపురంలో రంగనాథ గొర్రెలను మేపుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం రాత్రి గొర్రెలను షెడ్డులో ఉంచగా దుండగులు తీసుకెళ్లారు. ఉదయం నిద్రలేచి చూసేసరికి మందలోని 15 గొర్రెలు కనిపించకపోవడంతో అపహరించారని గుర్తించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించారు.

పీబీఆర్ జలాశయానికి జల హారతి

లింగాల, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం సహకారంతో శ్రీశైలం నుంచి కృష్ణాజలాలను తీసుకొచ్చి జిల్లాలోని కీలక ప్రాజెక్టులను నింపామని తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ ఛైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి అన్నారు. పెంచికల బసిరెడ్డి జలాశయం(పీబీఆర్) నిండిన నేపథ్యంలో జలాశయానికి ఆయన సోమవారం జలహారతి ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడారు. జలాశయంలో 9.15 టీఎంసీల నీటిని నిల్వ చేశామన్నారు. ప్రస్తుతం చెరువులు, కుంటలు నింపడానికి చర్యలు చేపట్టామన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ ఆందోళన

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేసే రిసోర్సు పర్సన్లకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలంటూ ఏఐటీయూసీ నేతృత్వంలోని ఆర్పీలు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. సోమవారం జరిగిన నిరసనలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, ఆర్పీల సంఘం ప్రతినిధులు విజయలక్ష్మీ, కళావతి, విజయ, క్రాంతి, చంద్రకళ మాట్లాడారు. పలు సమస్యలపై కలెక్టరేట్ అధికారులకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ప్రతినిధులు గాయత్రి, వెంకటసుబ్బమ్మ, సుజాత, ఇందిర, చాందిని, వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న మెప్మా ఆర్పీలు

తప్పుడు కేసులు బనాయించడం సరికాదు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: కడప కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ జహీర్‌పై తప్పుడు కేసులు బనాయించడం సరి కాదని 27వ డివిజన్ మహిళలు అన్నారు. కడప ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు మాట్లాడారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కేసు ఎలా నమోదు చేస్తారని వారు ప్రశ్నించారు. విచారించి తప్పుడు కేసును రద్దు చేయాలని డిమాండు చేశారు.

డిసెంబరు నాటికి స్మార్ట్ కిచెన్లు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో అమలవుతున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ల నిర్మాణ పనులు డిసెంబర్ నాటికి అన్ని మండలాల్లో అమల్లోనికి తీసుకురావాలని కలెక్టర్ శ్రీధర్ ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సెంట్రలైజ్డ్ కిచెన్ షెడ్స్ భవననిర్మాణాలపై రెవెన్యూ, సంబంధిత అధికారులతో సోమవారం దృశ్య మాధ్యమంలో సమీక్ష చేశారు.

డీఎస్సీకి ఎంపికైన ఉద్యోగులను రిలీవ్ చేయాలి

కడప విద్య, న్యూస్‌టుడే: మెగా డీఎస్సీ-2025కి ఎంపికైన సచివాలయ ఉద్యోగులను తక్షణమే రిలీవ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా కమిటీ కోరింది. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకి యూటీఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెంమహేష్‌బాబు మాట్లాడుతూ డీఎస్సీకి ఎంపికైన వారిని నెలరోజులైనా సంబంధిత అధికారులు రిలీవింగ్ ఆర్డర్స్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

గూగుల్ డేటా కేంద్రంతో ఒరిగేదేమీ లేదు

కడప నగరపాలక, న్యూస్‌టుడే: గూగుల్ డేటా కేంద్రంతో 1.80 లక్షల ఉద్యోగాలు వస్తాయని సీఎం చంద్రబాబు చేస్తున్న ప్రచారం అవాస్తవం అని.. ఆ సంస్థతో 200 ఉద్యోగాలు రావడమే కష్టమని వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి ఆరోపించారు. కడపలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంస్థకు రూ.22 వేల కోట్ల వనరులను కల్పించారన్నారు. ప్రతి అంశానికి విపరీత ప్రచారం కల్పించడం మినహా వారు రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించారు.

పదవులకు వన్నె తెస్తేనే గుర్తింపు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నామినేటెడ్ పదవులు పొందిన తెదేపా, జనసేన, భాజపా నాయకులు వన్నె తీసుకురావాలని తెదేపా రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. ఒంటిమిట్టలో ఉన్న చెర్లోపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ఛైర్మన్ మాడా జయకృష్ణ, సభ్యులు గగ్గుటూరి మౌలాలి, బొడిచర్ల శ్రీనివాసులు సోమవారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా చమర్తితో పాటు, జనసేన రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త అతికారి కృష్ణ హాజరయ్యారు. అనంతరం త్రిసభ్య కమిటీ ప్రతినిధులను కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు. డిప్యూటీ రిజిస్ట్రార్ గోపీనాథ్, జడ్పీటీసీ సభ్యుడు అద్దలూరు ముద్దు కృష్ణారెడ్డి, తెదేపా మండల శాఖ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రిసభ్య కమిటీ ప్రతినిధులతో జగన్‌మోహన్‌రాజు

యువకుడిపై ఇంజినీరింగ్ విద్యార్థుల దాడి

కడప, నేరవార్తలు, చింతకొమ్మదిన్నె(న్యూస్‌టుడే): చింతకొమ్మదిన్నె ఠాణా పరిధిలో ఓ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థిపై మరి కొంత మంది విద్యార్థులు దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన బాధితుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఎర్రగుంట్ల మండలం చిలమకూరుకు చెందిన హేమంత్‌కుమార్(22) కెఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 1వ తేదీ రాత్రి కడపలోని వసతి గృహంలో ఉన్న తన స్నేహితుడిని కలిసేందుకు వచ్చాడు. అంతలోనే వసతి గృహం వద్ద ఉన్న పలువురు విద్యార్థులు అతని వద్దకు వెళ్లి ఉద్దేశపూర్వకంగా గొడవకు దిగారు. వారిలో సమీర్, సుభాన్, దీపక్‌తో పాటు మరి కొంతమంది సెల్‌ఫోన్ ఛార్జింగ్ వైరు, ల్యాప్‌ట్యాప్ వైర్‌తో దాడికి పాల్పడి చంపుతామంటూ బెదిరించారు. స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వరద కాలువల నిర్మాణానికి ప్రణాళికలు

కడప నగరపాలక, న్యూస్‌టుడే: కడప నగరంలోని 50 డివిజన్ల పరిధిలో వరద నీటి ప్రవాహానికి ఓపెన్ కాల్వల నిర్మాణం చూపట్టాల్సిన అవసరం ఉందని ఇన్‌ఛార్జి మేయర్ ముంతాజ్‌బేగం అన్నారు. నగరపాలక కార్యాలయంలో ఆమె ఆధ్వర్యంలో జరిగిన స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. వరద కాల్వల నిర్మాణ ప్రతిపాదనలను సిద్ధం చేయడానికి అర్హత కలిగిన సంస్థతో సర్వే చేయించాలని నిర్ణయించారు. రవీంద్ర నగర్‌లోని షహమీరియా శ్మశానం ప్రహరీకి రూ.18 లక్షలు, సైనిక్‌నగర్ వద్ద మదరసాకు వెళ్లే రహదారి నిర్మాణానికి రూ.20 లక్షలు, 4వ డివిజన్‌లోని చంద్రవర్ధిని నగర్ రోడ్డుకు రూ.20 లక్షలు, 2వ డివిజన్ తిలక్‌నగర్లోని గంగమ్మ ఆలయం రోడ్డుకు రూ.18 లక్షలు మంజూరు చేసి పనులు చేపట్టాలని తీర్మానించారు. నగరంలో కుక్కల నియంత్రణ కోసం ఏబీసీ కార్యక్రమాన్ని అమలు చేసే పనిని స్నేహ అనే సంస్థకు ఇచ్చారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు, కంటింజెంట్ వర్కర్ల వేతనాలపై పలు తీర్మానాలు చేశారు. కమిషనర్ మనోజ్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పంచమ వర్ధంతి



మంచితనానికి మారుపేరుగా నిలచి అందరినీ
ఆప్యాయంగా పలుకరిస్తూ ఎంతోమంది విద్యార్థినీ,
విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్ది అందరికీ
ఆదర్శంగా నిలచిన శ్రీ అంపాబత్తిని విశ్వనాధం గారు
మాకు దూరమై 5 సంవత్సరములు గడిచిననూ
వారి తీయని జ్ఞాపకాలు ఎన్నటికీ మరువలేము. వీరి పవిత్రాత్మకు
శాంతి చేకూర్చాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ అంపాబత్తిని విశ్వనాధం గారు
కరస్పాండెంట్ : శ్రీ వెంకటేశ్వర ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, రవీంద్రనగర్, కడప.
జననం : 01.07.1952 మరణం : 04.11.2020

ఇట్లు... భార్య : C.భాగ్యమ్మ
కుమార్తెలు అల్లుళ్లు
డా॥ A.గౌరి డా॥ బైన శ్రీనివాసరావు
మనుమరాలు : Dr. BYNA VAISALI, (MBBS)
మనుమడు : BYNA ASHISH
డా॥ A.జ్యోతి డా॥ P.గీతాకుమార్
మనుమరాలు : P.LASYA మనుమడు : P.VEDANSH
A.వీణ అంకిత్‌కిషోర్
మనుమడు : HARICHARAN
కుమారుడు : డా॥ శశిధర్ కోడలు : జ్యోతిర్మయి మరియు కుటుంబసభ్యులు